# శ్రీ
# ప్రసాద
# మహాభారతము

రెండవ భాగం : శాంతి సప్తకము, వ్యాస మహాభారతము, విశేష వ్యాఖ్యానము



డా॥ లంకా శివరామప్రసాద్

# శ్రీ
# ప్రసాద మహాభారతము

## రెండవ భాగము



## శాంతి సప్తకము

12) శాంతి పర్వము
13) అనుశాసనిక పర్వము
14) అశ్వమేధ పర్వము
15) ఆశ్రమవాస పర్వము
16) మౌసల పర్వము
17) మహాప్రస్థానిక పర్వము
18) స్వర్గారోహణ పర్వము

**వ్యాస మహాభారతము** **విశేష వ్యాఖ్యానము**

డాక్టర్ లంకా శివరామప్రసాద్

**Dr. LANKA SIVA RAMA PRASAD**

# శ్రీ ప్రసాద మహాభారతము

**రెండవ భాగము : శాంతి సప్తకము, వ్యాస మహాభారతము, విశేష వ్యాఖ్యానము**

by

**Dr. Lanka Siva Rama Prasad**

2024

Copyright @ 2024

**Dr. Lanka Siva Rama Prasad**

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**

**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 6305677926
Email: lankasrprasad@gmail.com
**www.anuvaadham.com**
**www.prosetry.in**

**వెల : అమూల్యము**

Cover Design & Post Script :

**Prakash Pula**

Printed at :

**Vasavi Printers**

J.P.N. Road, Warangal. Ph : 0870-2426364



# శ్రీ ప్రసాద మహాభారతము

## అయిదవ వేదము - శాంతి సప్తకము

# 12. శాంతి పర్వము

ఆ. శాంతిమంతులైన సౌమ్యుల కెయ్యది నిష్ఠ దానియందు నిరతిశయ స
మాదరంబు గలదు నాదు చిత్తంబున వినుము తద్విధంబు విస్తరింతు (శాంతి. **5-21**)


క. శాంతి పరినిష్ఠనకు నేకాంతిక ధర్మంబు గరతలామలక మగుం
జింతా తంతు త్రుటనాత్యంత విదగ్ధంబు సూవె యది మనుజేంద్రా! (శాంతి. **5-503**)

- సోహం తస్య ప్రసాదేన దేవస్య హరిమేధ సః
అపాంతర తమా నామ తతో జాతోజ్ఞయా హరేః
పునశ్చజాతో విఖ్యాతః వసిష్ఠకుల నందనః-

- తదే తత్కథితం జన్మ మయా పూర్వక మాత్మనః
నారాయణ ప్రసాదేన తథా నారాయణాంశజమ్ (సం.శాంతి. **349-59,60**)

- అతః పరం శాంతిపర్వ ద్వాదశం బుద్ధి వర్ధనమ్
శాంతి పర్వణి ధర్మాశ్చ వ్యాఖ్యాతాః శరతల్పికాః (సం.ఆది. **2-325**)





| సంస్కృత మహాభారతము | కవిత్రయ మహాభారతము | శ్రీ ప్రసాద మహాభారతము |
|---|---|---|
| **12. శాంతి పర్వము**<br>(ఉప పర్వాలు-అధ్యాయాలు) | **12. శాంతి పర్వము**<br>(గద్య పద్యములు) | **12. శాంతి పర్వము (170)**<br>(పద్య శీర్షికలు) |
| 1. రాజధర్మానుశాసన పర్వము (130)<br>2. ఆపద్ధర్మ పర్వము (43)<br>3. మోక్షధర్మ పర్వము (192) | 1. ప్రథమాశ్వాసము (306)<br>2. ద్వితీయాశ్వాసము (410)<br>3. తృతీయాశ్వాసము (456)<br>4. చతుర్థాశ్వాసము (457)<br>5. పంచమాశ్వాసము (631)<br>6. షష్ఠమాశ్వాసము (624) | 1. ప్రథమాశ్వాసము (25)<br>2. ద్వితీయాశ్వాసము (33)<br>3. తృతీయాశ్వాసము (29)<br>4. చతుర్థాశ్వాసము (24)<br>5. పంచమాశ్వాసము (27)<br>6. షష్ఠమాశ్వాసము (32) |

(Traditional Edition: ఉప పర్వాలు-3, అధ్యాయాలు-365; Critical Edition: 3-353)

# ✤ 12. శాంతి పర్వము - ప్రథమాశ్వాసము ✤

## 1. అంగనా జనమ్ములకు రహస్య రక్షణశక్తి లేకుండును గాక

'అగ్నిలా మండే నిజాన్ని నీ కొంగున కట్టుకుని ఎలా భరించినావమ్మా ఇన్నేళ్లు?
అంతా ముగిసినాక ఈ విషయం చెప్పగా మా మనసులు కలత చెందాయిప్పుడు'
అని ధర్మజుడు పలుకగా కుంతీదేవి అన్నది కన్నీరు కారుస్తూ నెమ్మదిగా
'అప్పుడు నేను చిన్నపిల్లను, అమాయకురాలిని, అభం శుభం తెలియదు.

గోప్య విషయాలపై మంత్రాలపై ఆసక్తి ఎక్కువ, మంత్రం పఠించగానే
సూర్యుడు వచ్చాడు, ప్రేమ వ్యక్తపరచాడు, నేను తగదన్నాను, వినలేదు.
సహజ కవచకుండలములున్న పుత్రుని కని నదిలో వదిలి వచ్చాను.
లోకాపవాద భయం నా మాతృప్రేమను నోరు మూయించింది.

కృష్ణ రాయబార సమయంలో కర్ణుడిని కలిసి పుట్టుక తెలిపాను.
-మిగతా నలుగురు దొరికినా వదిలేస్తాను, అర్జునుడిని మాత్రం చంపుతాను-
అన్నాడు కర్ణుడప్పుడు- ఎప్పుడైనా పాండవులైదుగురే -అన్నాడు కఠినంగా.
అట్టి కర్ణుడి గురించి నీవు మనోవ్యథ పొందుటెందుకు, నాయనా!

ఆ మాటలకు ధర్మరాజు బాధపడుతూ అన్నాడు- 'ఈ విషయాన్ని ఉంచావు
రహస్యంగా, అందుకే ఇంత అనర్థం జరిగింది. నాకు ముందే తెలిస్తే
ఈ యుద్ధమే జరిగేది కాదు. ఇకనుంచి ఎల్లలోకములలోని
స్త్రీలకు రహస్యాలను కాపాడే శక్తి లేకుండా పోవునుగాక!' -అని శపించాడు.

---

క. హర సురపతి యమ వరుణులు । గురుకృపులును దివ్యబాణకోటు లొసఁగుటన్
నరుశక్తి కర్ణుతేజ । స్ఫురణము నార్పంగఁ జాలెఁ జువ్వె నృపాలా!' (శాంతి. 1-37)

చ. 'జననముఁ దెల్పి యేఁ బిలువ 'సత్యము సుమ్మిర కుంతి భాషణం'
బని తనుజత్వజాతకృప నంబుజమిత్రుఁడు వల్కె; నేమిటన్
గొనకొన నేరఁడయ్యె నినుఁ గూడ సుయోధనుఁ బట్టి; యట్టి క
ర్ణున కయి నీవు నేటికి మనోవ్యథఁ బొందఁగ నిట్లు పుత్రకా!' (శాంతి. 1-39)

తే. 'అంగనాజనమ్ములకు రహస్య రక్ష । ణంబునందలి శక్తి మనంబులందుఁ
గలుగకుండెడు మెల్లలోకముల' నని శ । పించె నా ధర్మదేవతాప్రియసుతుండు. (శాంతి 1-41)

క. 'మన కేటిరాజ్య? మొండొక । జనపదమున కేఁగి భైక్షచర్యావిధి జీ
వనము నడిపికొనియుండుద । మనఘా! యట్లయిన సుఖుల మవుదుము సుమ్మీ!' (శాంతి. 43)

- శశాప చ మహాతేజాః సర్వలోకేషు యోషితః
న గుహ్యం ధార యిష్యంతీత్యేవం దుఃఖ సమన్వితః (సం.శాంతి. 6-11)

# 2. శౌరి విధియయ్యె, నరుండనిన్ చంపె కర్ణునిన్-

కుంతీదేవి తన రహస్యాన్ని దాచడం వలన కర్ణవధ జరిగిందని బాధపడుతున్న
ధర్మజుడితో నారద మునీంద్రుడు వివరించాడు కర్ణుని జీవిత ఘట్టాలను
-సూర్యవర ప్రసాదియై పుట్టి, సూతుడి కుమారుడిగా పెరిగి, విలువిద్య
నభ్యసించి, ద్రోణునిచే తిరస్కరించబడి, పరశురాముడి దగ్గరకు వెళ్లి

బ్రాహ్మణ పుత్రుడిగా చెప్పుకుని శిష్యుడై పలు దివ్యాస్త్రములను పొంది
పరశురాముడు తన తొడపై నిద్రిస్తుండగా గ్రస్తుడనే కీటకరూప రాక్షసుడు
తొడను తొలవగా రక్తం కారి, నెత్తుటి తడికి గురువు నిద్రలేచి
తన శిష్యుడు సూతపుత్రుడని తెలిసి శపించగా- అవసర సమయాల్లో

అస్త్ర మంత్ర ప్రయోగములు గుర్తుకురానివాడై, హస్తినాపురికి చేరి
కుమార అస్త్ర విద్యా ప్రదర్శనలో అర్జునుని నెదిరించి, దుర్యోధనుని
మనసు గెలిచి అంగరాజై, కళింగ రాకుమార్తె స్వయంవరంలో
రాజులందరిని ఓడించి ఆ 'శుభాంగి'ని రాజరాజుకు అప్పగించి

తనపై ద్వంద్వయుద్ధానికి వచ్చిన జరాసంధుని గెలిచి మాలినీ నగరాన్ని పొంది
దుష్టచతుష్టయంలో ఒకడై చివరకు పొందినాడు దుర్మరణాన్ని-
విప్రుని శాపము, పరశురాముని కోపము, ఇంద్రుడి మోసము, శౌరి విధి రూపము,
కుంతి కోరిన వరము, భీష్ముడి అగౌరవము, శల్య సారథ్యము చంపాయతడిని.

---

**చ. 'వినుము నరేంద్ర! విప్రుఁ డలిగెన్, జమదగ్నిసుతుండు శాప మి**
**చ్చె, నమరభర్త వంచనము సేసె, వరం బని కోరి కుంతి మా**
**న్పె నలుక, భీష్ముఁ దర్ధరథుఁ జేసి యడంచెఁ, గలంచె మద్రరా**
**జనుచిత మాడి, శౌరి విధి యయ్యె, నరుం డనిఁ జంపెఁ గర్ణునిన్. (శాంతి. 1-35)**

**సీ. ఎక్కటెక్కటిపోరి యిద్ధదివ్యాస్త్ర సం । చయవంతుఁ డగు జరాసంధు బాణ**
**ధనురాది వివిధసాధనములు దనచేతఁ । దన యస్త్రశస్త్రసంతాన మెల్ల**
**నాతనిచే మడియంగ రథంబులు । డిగ్గి పెంపారెదు నగ్గలికల**
**నాతండుఁ దాను బాహాసంగరమునకుఁ । జొచ్చి పెనంగఁగ నొచ్చి యతని**

**ఆ. యంగసంధి వికల మగుటయుఁ బోరు సా । లించి యతఁడు గారవించి తనకు**
**మహితవిభవ మైన మాలినీ నగర మీ । నధికతేజ మెసఁగ నరుగుదెంచె. (శాంతి. 1-33)**

**- బ్రాహ్మణ స్యాభిశాపేన రామస్య చ మహాత్మ నః**
**కుంత్యాశ్చ వరదానేన మాయయాచ శతక్రతోః-**

**భీష్మావ మానాత్సం ఖ్యాయాం రథస్యార్ధాను కీర్తనాత్**
**శల్యాతేజో వధాచ్చాపి వాసుదేవ నయే నచ (సం.శాంతి. 5-11,12)**

# 3. రాజ్యామిషంబునకు కుక్కలభంగి తమలోన కాటులాడి-

'ఆ ఆరుగురి వల్ల శ్రీకృష్ణునికి అర్జునునిపై ఉన్న ప్రేమ వల్ల, కిరీటి
తాను సంపాదించుకున్న దివ్యాస్త్రాల వల్ల కర్ణుడనే అగ్ని ఆరిపోయింది'
-అని నారదుడు చెప్పగా కుంతి అన్నది- 'నేనతడి పుట్టుక చెప్పాను.
సూర్యభగవానుడు ఈమె చెప్పింది నిజం అని సాక్ష్యం పలికాడు, కాని

మన దురదృష్టవశాత్తు కర్ణుడు తన పథాన్ని, శపథాన్ని మార్చుకోలేదు,
ఇప్పుడు నీ శాపంతో మా ఆడవారికి రహస్యాన్ని దాచే శక్తి పోయింది'-
అని పలికింది కుంతీదేవి తన కుమారుడు ధర్మరాజు పడుతున్న వ్యాకులత చూసి
ధర్మజుడన్నాడు- 'తిలోదికాలిచ్చాం కర్ణుడికి, మనకెందుకు పార్థా, ఈ రాజ్యసంపదలు?

ఇంకో రాజ్యానికి పోయి భిక్షమెత్తుకుని బ్రతికితేనే సుఖమేమో!
సగోత్రీకులను చంపి ఆత్మవధ నొనరించాము, ఈ క్షాత్రధర్మాన్ని కాల్చ!
అహింస, సత్యం, సహనం, అనసూయ ఇవి వనవాస ధర్మాలు కాదా!
సుఖాన్నివ్వని రాజ్యమనే మాంసఖండం కోసం కొట్లాడుకున్నాం కుక్కల్లా!

దుర్మార్గపు బుద్ధి కలిగిన దుర్యోధనుడిని చంపడం వలన చల్లారింది కోపం
కాని, మనసంతా శోకంతో నిండి బ్రతుకు అయ్యింది కడు దుర్భరం.
రాజ్య స్వీకార దోషం రాజ్యపరిత్యాగం వలన కాని పోనేరదు.
నేను తపోవనానికి పోతాను, మీరు రాజ్యపాలన చేబట్టి ధర్మరక్షణ చేయండి!'-

---

**సీ. 'జ్ఞాతుల నందఱఁ జంపితి, మది యాత్మ । వధమ కాదే! రాజవర్తనంబుఁ**
**గాల్పు; మహింస నిక్కము దాల్మి మత్సర । వర్జన మిది వనవాసజనుల**
**కాగమ విహితంబు లటె; యింత యొప్పునే? । వనమున వసియింపవలయు వింటె;**
**యసుఖదంబైన రాజ్యామిషంబునకుఁ గు । క్కల భంగిఁ దమలోనఁ గాటులాడి**

**తే. కులము నెల్లను బొలియింపఁ గుత్సితంపు । బ్రదుకు వచ్చెనె యను వగపాలు వడఁగఁ**
**బ్రమద మొసఁగదు త్రైలోక్యరాజ్య మైనఁ; । గాన నే నొల్ల మహి; మీర కైకొనుండు. (శాంతి. 1-45)**

**మ. ధృతరాష్ట్రుండు దనూజుకీడు సమబుద్ధిం జూడ కన్నీచుఁ దే**
**గతిఁ జన్నం జననిచ్చెఁ గాని మగుడంగాఁ దివ్వఁ డయ్యెన్; నిరా**
**కృతశీలుండగు నా సుయోధనుఁడు సంక్షీణంబు సేసెం గులం;**
**బతనిం జంపఁగఁ గోపమాఱె; మది శోకాక్రాంత మయ్యెం దుదిన్. (శాంతి. 1-46)**

**క. 'ఓహో! యిట్టివి గలవే? । బాహాదర్పమునఁ బరులఁ బరిమార్చి తుదిన్**
**మాహాత్మ్యం బెడలఁగ భి । క్షాహారత నొందఁ దలఁప నగునె నరేంద్రా! (శాంతి. 1-48)**

# 4. సారహీనములగు సంసార సుఖములు విడిచి-

అర్జునుడన్నాడు– ఓహో ఇట్టివి గలవె? వాళ్లను చంపేదాకా ఒక గొడవ
వాళ్లను చంపినాక ఇప్పుడు సన్యాసినవుతాననడంలో ఏమిటా ఘనత?
ఏదైనా పాపం చేసానన్న శంక ఉంటే అశ్వమేధయాగం చేయవచ్చును కదా!
నహుష చక్రవర్తి చెప్పలేదా– 'ధనం లేనివాడు నడయాడే పీనుగని'–

దరిద్రుడు, పతితుడు, కృతఘ్నుడు, మూర్ఖుడూ సమమంటారు విజ్ఞులు.
ధనముంటేనే పురుషార్థాలు సిద్ధిస్తాయి, సంపదయే సద్బుద్ధి, వెలుగు
సంపద లేని వాడు బలహీనుడౌతాడు, బంధుమిత్రులేని ఒంటరవుతాడు.
సగోత్రీకులు చావడం వల్లనే కదా అమరులంత అభివృద్ధి చెందినది.

దిలీపుడు, నృగుడు, సగరుడు, నహుషుడు, అంబరీషుడు, మాంధాత లాంటి రాజులు
రాజ్యాలను గెలుచుకుని సంపదలు గడించి యజ్ఞాలు చేసారు, స్వర్గాధిపతులైనారు.
అశ్వమేధంబు చేసి అవబృధస్నానం చేసి పవిత్రుడవై నీవును కీర్తి గడించుము–
–అర్జునుని మాటలు విన్నాడు కాని ధర్మరాజు ఆలోచనలో మార్పు రానట్లున్నది.

–సారహీనములగు సంసార సుఖాలను వదలి అడవికి పోయి చేస్తాను తపస్సు.
మునుల బోధామృతాన్ని వింటూ, నింద ప్రశంసలను సమానంగా చూస్తూ బ్రతికి
గాయం చేసినా, మంచిగంధం పూసినా సమంగా స్పందిస్తూ, భిక్షార్థినై–
మూగవాడైన మూర్ఖుడిలా బతకడం మేలు, ఈ అధికారాలకన్నా –అన్నాడు ధర్మరాజు.

---

**సీ. ధర్మపథంబున ధరణి సేకుతినఁ బా । లింపక సత్త్వంబు పెంపు మాలి**
**విడుచుట యొప్పునే; విను; మిట్టులైన ము । న్నేల భూపాలుర నెల్లఁ జంపి?**
**తడలి రాజ్యము దక్కి యడవికిఁ జనిన బే । లందురు గాక, మే లంద్రె జనులు?**
**కిల్బిషశంక గల్గిన నశ్వమేధాది । పుణ్యకర్మంబులఁ బోదే? వంశ**

**ఆ. ధర్మ మెడలఁ గృపణకర్మంబుఁ గోరి; త । ర్థంబు సువ్వె సకలధర్మకారి;**
**'యొడమి లేనివాఁడ నడపీనుఁ' గను నహు । షోక్తి వినమె? దాని నూఁద వలదె? (శాంతి. 1-49)**

**సీ. 'సారహీనము లగు సంసారసుఖములు । విడిచి, యేకాకి నై యడవి కేఁగి,**
**తాపస వాక్యామృతములు వీనులఁ గ్రోలి, । చెలిమి వేర్పాటను చిరమరలకుఁ**
**జొరక, నిందాస్తుతుల్ సరిగాఁ గొనుచుఁ గత్తి । నొకఁడు వ్రేసినను వేఱొక్కరుండు**
**చందనం బలఁదిన దెంద మయ్యిరువుర । యెడ సమంబుగ మూఁగజడుఁ డనంగ**

**తే. మెలఁగి, తగువేళఁ బర్ణశాలలకు నరిగి । యెత్తఁగా భిక్ష యెవ్వార లెట్టు లేమి**
**యిడినఁ గైకొని నాలుగే నెడల మాత్రఁ । గన్నదానఁ దృప్తుండనై యున్న మేలు. (శాంతి. 1-58)**

## 5. అడలున రాజధర్మముల యందు జనించె అసూయ నీకు-

భీముడన్నాడు విషాదయోగంలో ఉన్న ధర్మరాజుతో– 'వేదవిహిత కర్మలను
ఆచరించడానికి తగినవాడివైన నీకు మునుల ఆచారాలపై ఎందుకు వెంపర్లాట?
ఈ తాత్కాలిక దుఃఖం నీకు రాజ ధర్మాలపై విరక్తి కలిగించింది కాని
యుద్ధం ముందు నీకీ ఆలోచన వస్తే మన శత్రువులు, మనవాళ్లు బ్రతికి ఉండేవారు.

మనం ఎంచక్కా బిచ్చమెత్తుకుంటూ, అస్త్ర జీవన గర్వోన్నతిని వదిలి ఉండేవాళ్లం!
అంత తీవ్రంగా, క్రూరంగా యుద్ధం చేసి గెలిచి అడవికి పోతానంటే లోకులు నవ్వరా?
నీటికోసం బావి తవ్వి నీటిని తాగని వాడిలా, అన్నం వండి తిననివాడిలా,
తేనెపట్టును కొట్టి తేనెను తాగనివాడిలా, వనితను వశం చేసుకుని ఆనక

ఆమెను కూడని వాడిలా, యుద్ధంలో గెలిచి సామ్రాజ్యాన్ని వద్దంటావేమిటి ధర్మజా?
నీవు అడవికి పోతుంటే మేము నీ వెనకే వస్తాము జనం మనలను వెర్రివాళ్లుగా చూస్తుంటే.
అయినా ఫలితాన్ని ఆశించకుండా బ్రహ్మార్పణ భావంతో కర్మలను చేయాలి'
–అని భీముడు పలుకగా విని ధర్మరాజుతో అర్జునుడు చెప్పాడొక ఇతిహాసం.

–'కొందరు బ్రహ్మచారులు కులాచారాలు వదలి అడవులకు వెళ్తే ఇంద్రుడు చూసాడు.
పక్షిరూపంలో అన్నాడు వారితో– 'చతుష్పాదులలో గోవు, లోహాల్లో స్వర్ణం
అనంత శబ్దరాశిలో మంత్రం, మానవులలో వేదవిదుడు గొప్పవారు'– అని పలుకగా
వారు ఆ మాటల అంతరార్థం గ్రహించి ధర్మాచరణకై ఇళ్లకు తిరిగి వెళ్లినారు'–

---

**చ.** **అడలున రాజధర్మములయందు జనించె నసూయ నీకు ని**
**ప్పుడు; మును నిస్పృహుండ వయి పోవఁగఁ గన్నఁ గులంబువారు ని**
**ప్పుడమి నృపాలురున్ బ్రతికిపోదురు నెమ్మది; నట్టులైన నే**
**ముడుగుదు మస్త్రజీవన సముద్ధతిఁ, జొత్తుము భైక్షవృత్తికిన్. (శాంతి. 1-62)**

**క.** **వాఁడి యగు నలుక లోకము । పోఁడిమి సెడఁ గయ్య మట్లు పొడిచి వనటమై**
**నేఁ డింక నడవికిం జను । వాఁడం గా కనినఁ బుడమివారలు నగరే! (శాంతి. 1-63)**

**సీ.** **పనివడి త్రవ్వి కూపమునందు నుదకంబు । పానంబు సేయని వాని భంగి,**
**యున్నతతరు వెక్కి జున్ను సేకుఱఁ గొని । తేనియ యానని వాని భంగి,**
**యాఁకొని యొడఁగూర్చి యన్నంబు తఱియకు । వచ్చినఁ గుడువనివాని భంగి,**
**తమకించి యొకభంగిఁ దనవశంబుగఁ జేసి । మానినిఁ గవయని వాని భంగి,**

**ఆ.** **గాదె కురువరేణ్య! ఘనశక్తి శౌర్య సం । పన్నులైన పగఱ భండనమున**
**నోర్చి పూజ్యరాజ్య మొల్లక యడవికి । నేఁగు; టీవ యెఱుఁగు దిత్తెఱంగు. (శాంతి. 1-64)**

# 6. నరరూపంబున పరిగెడు పరదేవతగాక నృపుడు

నకులుడు అన్నాడు– 'దేవతలు వేదవిధి ప్రవర్తకులు. బ్రాహ్మణులు
వేదకింకరులు; న్యాయంగా సంపదలు గడించాలి దానధర్మాలు చేయాలి.
క్రోధ శోక హర్షాది భావాలను విడిచి యోగాశ్రితుడై వృక్షమూలంలో
నివసించి తపస్సు చేసేవాడు సంపరిత్యాగి, రాజులకెందుకు ఆ గొడవ?

బ్రహ్మచర్య వానప్రస్థ సన్యాస ఆశ్రమాలు ఒక ఎత్తు, గృహస్థాశ్రమమొక ఎత్తు
అంధకార బంధురమైన ఈ విశ్వంలో వెలుగునిచ్చేది ఈశ్వరుడే కదా!
అతడే ఏర్పరచాడు వర్ణ సముదాయాన్ని, ఎవరి పని వారు చేయాలన్న నియమాన్ని.
నీలో పొంగిన శోకం వలన ఈశ్వరాజ్ఞ అతిక్రమించడం న్యాయమేనా?'

సహదేవుడన్నాడు– 'పైపై విషయాలు ఎన్ని వదలినా కర్మ చెయ్యాల్సిందే!
మమకారం వల్ల బంధాలు, నిర్మోహం వలన మోక్షప్రాప్తి కలుగుతాయి.
అడవికి వెళ్లినా మమకారం పెరగదా కావలసిన ద్రవ్యాలపై జీవనాధారాలపై,
మమత్వ బంధాలే కాదా సంసార చక్రానికి ఆధారం, నా మాటలనంగీకరించు'

ద్రౌపది అన్నది– 'శోకాగ్నితో బాధపడుతున్న నీ సోదరులను ఓదార్చుము.
ప్రభువు మానవరూపంతో ఉన్న దైవం, సామాన్యమైన అగ్నికన్నా రాజాగ్ని తీవ్రమైనది.
అది వంశాన్నే కాల్చివేస్తుంది; రాజునందు ప్రతిష్ఠించాడు దండనీతిని విధాత–
నన్ను నిండు సభలో అవమానించిన దుర్యోధన దుశ్శాసన కర్ణులను దండించుట కాదు పాపం.

---

**క.** పరుల వధింపక యెవ్వఁడు । ధర యేలెం జెపుమ పూర్వ ధరణీశులలోఁ?
బొరయదు పాపము సుగతిక । యరిగిరి వా; రీవు నట్ల యగు టొప్పు నృపా! (శాంతి. 1-81)

**తే.** నీవ చుట్టంబుఁ బక్కంబు, నీవ చెలియు, । నీవ తల్లియుఁ దండ్రియు, నీవ గురువు,
నీవ దైవంబుఁ గావున నా విషాద । భాషణంబులు సైరింపు భరతముఖ్య! (శాంతి. 1-86)

**క.** గరదుని, గృహదాహకు, మం । త్రరహస్య విభేది, వధవిధాయిఁ, బరసతీ
హరు, బంధుఘాతిఁ, బరధన । హరణ పరునిఁ, జంపి పుణ్యుఁ డగు నృపుఁ డనఘా! (శాంతి. 1-95)

**ఉ.** 'వైదిక ధర్మచారి జనవత్సల! నీ మదిఁ బట్టుకొన్న యు
న్మాదము హీనమానవు మనంబునఁ బుట్టిన వెఱ్ఱివోలె న
స్యాదులఁ దీర్చు టొప్పదు; నిజానుజ వర్గము మీఁదఁ గల్గున
త్యాదర సాంద్రసార కరుణామృత మానఁగ నిమ్ము నెమ్మదిన్.' (శాంతి. 1-101)

– ధనంజయ కృతం పాపం కళ్యాణే నోపహన్యతే
ఖ్యాప నేనాను తాపేన దానేన తపసాపి వా
వనమా మంత్ర్య వః సర్వాన్ గమిష్యమి పరంతప
నహి కృత్స్న తమో ధర్మః శక్యః ప్రాప్తుమితి శ్రుతిః (సం.శాంతి. 7-36,40)

# 7. నృపతుల్ సుఖులే? ఉపశాంతి ఒప్పదే?

ద్రౌపది అంటున్నది ధర్మజునితో– 'విషం పెట్టేవాడిని, ఇల్లు తగులబెట్టేవాడిని
మంత్ర రహస్య విభేదిని, వధ విధాయిని, పరసతీ హరుని, బంధుఘాతిని
ఇతరుల సంపదలు దొంగిలించేవాడిని శిక్షించి రాజు పుణ్యుడౌతాడు కదా!
పాపాత్ములను దండించి ప్రజలను రక్షించే బాధ్యత కల రాజు మునిగా మారడమేల?

నీ మనసులోని శోకపు ఉన్మత్తత మామూలు నస్యాలతో పోదు, దయామృతంతో పోగొట్టు దానిని.
నాలా కష్టాలు పడిన వనితలెవరైనా ఉన్నారా, నీకోసమే కదా నేనున్నది గృహిణిలా
కౌరవులు పాపం పండి నశించారు, వారి మరణాలకు వారే కారకులు, అది నీకు తెలుసు
శుక్రుడు బృహస్పతి దండనీతిని రాజులకు పరిపాటిగా పలికారు, దానిని ఆచరింపుము.

అప్పుడు అర్జునుడన్నాడు– దండనీతి జనులను సక్రమ మార్గంలో నడుపుతుంది.
ఉచితమైన హింస తప్పుకాదు, కాయలలో పండ్లలో సూక్ష్మ జీవులుండవా
కందమూలాలు తవ్వడం హింసకాదా, ఒక ప్రాణి మరొక ప్రాణిని తినడం ధర్మమే కదా
యోగ్యమైన హింస అహింసగానే అంగీకరించబడింది యజ్ఞబలుల్లా!–

భీముడన్నాడు– యుద్ధము ముగించాము, ఇప్పుడు మనం చేయాల్సింది రాజ్యపాలన
శోకాన్ని వర్జించి కీర్తి, ధనాన్ని సంపాదించి యజ్ఞ యాగాదులు చేయుట ఉచితం
ధర్మజుడన్నాడు– రాజులకు సుఖముండదు, ఆరు ఊర్మిలు– క్షుత్ తృష్ణ
శోక మోహ జర మరణాలు ఎవ్వరినీ శాంతిగా బ్రదుకనీయవు తెలుసుకో!'–

---

ఉ. **కాయలఁ బండ్ల నీళులను గల్గవె సూక్ష్మపు జంతువుల్? మునుల్**
**సేయరె హింస వాని? నుపజీవితఁ ద్రవ్వరె కందమూలముల్?**
**నీ యెడఁ జూడు! ప్రాణములు నిల్వఁగ నేర వహింస నేరికిన్;**
**వేయును నేల? భక్ష్యముగ వేధ విధింపఁడె ప్రాణిఁ బ్రాణికిన్? (శాంతి. 1–110)**

మ. **కపటద్యూతమునం బరాభవము రాఁగా సూనృతం బూఁది భూ**
**మిప! మమ్ముం జులుకంగఁ జేసి నినుఁ బేర్మిం బాపికొంచున్ దురం**
**తపు దుఃఖంబుల కోర్చి పోయి; తది యుద్ధక్రీడ నప్పాపక**
**ర్మపు జాతిం దెగటారఁ జేయఁగఁ బ్రకీర్త్యం బయ్యె లోకంబులన్. (శాంతి. 1–118)**

చ. **'మదమును రాగమున్ భయము మానము లోనగు కిల్బిషంబులన్**
**హృదయముఁ జొన్పి భూజనుల నేలుట మేలని పల్కె; దార్తికా**
**స్పదమని రార్య లామిషముపై తగు; లిమ్మహియెల్ల నేలినం**
**దుది నరకం బొకండ; నృపతుల్ సుఖులే? యుపశాంతి యొప్పదే! (శాంతి. 1–123)**

– **య స్యార్థా స్తస్య మిత్రాణి యస్యార్థా స్తస్య బాంధవాః**
**యస్యార్థాః స పుమాన్ లోకే యస్యార్థాః స చ పండితః (సం.శాంతి. 8–19)**

# 8. కాలజొచ్చె మిథిల కాలదు నాకు-

–మిథిలా నగరం తగలబడుతున్నా అందులో ఏదీ తగలబడుతున్నట్లుండదు,
తృష్ణ లేనపుడు సంపద ప్రయోజనాల ఉనికి ఉన్నా లేకున్నా ఇబ్బంది లేదు–
అని జనక మహరాజు అనలేదా! ఎరుక కలవారు వికారాలకు లోనుకారు.
అర్జునుడన్నాడు– ఆ జనక మహరాజు భిక్షాటనకు పోదలుచుకున్నపుడు

అతడి భార్య అన్నది– భిక్షాటన నీకు ఉచితమనిపించినా ఇంటిలో చేయల్సిన
అతిథి పూజలెవరు చేస్తారు? దేవతలు పితృదేవతలకు తర్పణాలెవరు విడుస్తారు?
దానాలన్నింటిలోనూ గొప్పదైన అన్నదానమెవరు చేస్తారు? నీ తల్లిని నన్ను రక్షించేదెవరు?
చలిపందిరిలా, పండ్లతో నిండుగా ఉన్న చెట్టు లాంటి గృహస్థాశ్రమాన్ని వీడకు–

రాజ్యత్యాగము ధర్మవిరోధము, దీనివలన మోక్షప్రాప్తి కలుగుతుందని అనుకోను–
–అని జనకుని భార్య పలికిందని అర్జునుడు వివరించాడు ధర్మజునికి
ధర్మరాజన్నాడు– మీరిద్దరూ పలికిన మాటలు ధర్మబద్ధాలు, నిజాలు సుమా!
కాని కర్మమార్గం మంచిది కాదు కదా, శాంతి, మనశ్శాంతి కదా మనిషికి అవసరం.

అప్పుడు దేవస్థానుడనే ముని అన్నాడు ధర్మరాజుతో– రాజా, ధనంజయుడు చెప్పినది
సరైన మాట. యోగ సమారోహణమునకు చక్కని మెట్లున్న దారి ఉన్నది.
యజ్ఞం ఒక నిచ్చెనలా బ్రహ్మపదానికి ఉపయోగపడుతుంది. శివుడు చేసినాడు
సర్వమేధమనే యజ్ఞం, బ్రహ్మ, ఇంద్రుడు, చక్రవర్తులెందరో చేసారు యజ్ఞాలు.

---

**ఆ.** **'ఒకటి దెసను దృష్ట యొలయదు గావున । నేమి యర్థములును లేమి లేదు?**
**కాలఁ జొచ్చె మిథిల గాలదు నాకు నం । దొక్కఁ డైన; నింత నిక్కువంబు.' (శాంతి. 1–127)**

**క.** **చలిపందిరి చందంబున । ఫలభరితంబైన తరువుభంగిఁ బ్రజల ద**
**ప్పులు దీర్ప నమరియుండెడు । నలఘుచరిత్రునకు లఘుత యగునే కోరన్. (శాంతి. 1–136)**

**చ.** **హరుఁడును సర్వమేధ మను యాగమునం బ్రచుర ప్రకాశతం**
**బొరయఁగ వేడ్కఁ జేసి విధిపూర్వ దిగీశముఖామరుల్ మహా**
**ధ్వరములఁ గాదె పేర్కొనుట ధాత్రి సధర్మత నేలి యజ్ఞ త**
**త్పరత వెలుంగరే నృపులు, పార్థివముఖ్య! మరుత్త ముఖ్యులున్. (శాంతి 1–145)**

**క.** **నీ వార్యబోధితుండవు । గావే! వర్ణాశ్రమ ప్రకారములు వినం**
**గావలయునె ధర్మంబులు । భూవరునకు దండనీతిఁ బోలంగలవే! (శాంతి. 1–157)**

**–** **అనంత బతమే విత్తం యస్యమే నాస్తి కించన**
**మిథిలాయాం ప్రదీప్తాయాం న మే దహ్యతి కించన (సం.శాంతి. 17–19)**

**–** **నిపానం సర్వ భూతానాం భూత్వా త్వం పావనం మహత్**
**అథ్యో వనస్పతి ర్భూత్వా సో న్యాంస్త్వం పర్యుపాసనే (సం.శాంతి. 18–17)**

## 9. శంఖ లిఖితుల కథ

జయాపజయాలు కలిగినపుడు కృంగిపోకుండా నీ ధర్మాన్ని నీవు నిర్వర్తించు
పూర్వపు రాజులందరూ ఈ విధంగానే చేసారు– అన్నాడా దేవస్థానుడు.
వ్యాసమహర్షి అన్నాడు ధర్మజునితో– రాజుకు దండనీతిని మించిన ధర్మం లేదు.
బాహుదానదీ తీరంలో శంఖుడు, లిఖితుడు అనే సద్బ్రాహ్మణులుండేవారు.

ఆ సోదరుల ఆశ్రమాలు ఫలపుష్ప వృక్షాలతో అలరారుతూ ఉండేవి సమృద్ధిగా.
ఒకరోజు శంఖుడు ఇంటిలో లేనప్పుడు లిఖితుడు ఏదో పనిమీద వచ్చాడు.
శంఖుడు లేడని వెళ్లబోతూ చెట్టున ముగ్గిన పళ్లను కోసుకుని తిన్నాడు లిఖితుడు.
కొద్దిసేపటికి వచ్చిన శంఖుడన్నాడు– సోదరా ఇది దొంగతనం, రాజు దగ్గరకు వెళ్లు!

లిఖితుడు దానికంగీకరించి సుద్యుమ్నుడనే రాజుకు విన్నవించి దండించమన్నాడు.
సుద్యుమ్నుడు, అతడి మంత్రులు ధర్మసూక్ష్మాలు తెలిపి అది నేరం కాదన్నారు.
లిఖితుడు అంగీకరించకపోవడంతో దొంగతనానికి శిక్ష విధించాడు రాజు.
రాజాజ్ఞతో లిఖితుడి రెండు చేతులు ఖండించబడినాయి, లిఖితుడు సంతోషించినాడు.

నా నేరమునకు సరైన శిక్ష విధించబడినదని పలికి రాజును ఆశీర్వదించి వచ్చాడు
లిఖితుడు తన ఆశ్రమానికి; అప్పుడు శంఖుడన్నాడు– నీ వలన పవిత్రమైనది మన వంశం,
వెళ్లి బాహుదానదిలో పితరులకు తర్పణాలు విడువుము –అనగానే లిఖితుడు
నదిలో దిగి, ఖండితకరములను నీటిలో ఉంచగానే, మొలిచాయి హస్తాలు అద్భుతంగా–

సీ. వారి యాశ్రమముల భూరిపుష్ప ఫలాభి । వృద్ధి నొప్పారెడి వివిధ భూరు
హంబులు గల; నొకయపుడు శంఖుండు గృహమ్మున లేకుండ ననుజుఁ డచటి
కరిగి యందొక మ్రాన నారఁబండిన పండ్లు । గని వేడ్కమై గోసికొని తినంగ,
నయ్యన్న యేతెంచి 'యనుజ! యీ ఫలము లె । క్కడివయని చెప్పు' నావుడును వార్చి

తే. ప్రణతుఁడై 'యిచ్చుటివ'యని పలికె లిఖితుఁ; । డాతఁ 'డనుమతి లేక కోయంగఁ దగునె?
ముచ్చిమియ కాదె యది? పాప మచ్చుపడియె; । నృపతిచే దండితుండవై నీఁగికొనుము. (శాంతి. 1–160)

తే. ధర్మమార్గ ముల్లంఘింపఁ దగదుగాన । వలసె నిష్కృతి కులమెల్ల వెలసె నీ క
తమున సురముని పితృ తర్పణములు సేయు । మరిగి బాహుదాపుణ్యతోయముల ననఘ. (శాంతి. 1–166)

తే. బాహుదానదియం దవగాహనంబు । సేయఁ బ్రభవించె నాతని చేతు లపుడ
విస్మయం బంది యతఁడు వేవేగ వచ్చె । నన్నపాలికి మగుడఁ బ్రహర్షమెసఁగ. (శాంతి. 1–170)

– ప్రాదురాస్తాం తతస్తస్య కరౌ జలజ సన్నిభౌ
తతః స విస్మితో భ్రాతుః దర్శయామాసతౌ కరౌ (సం.శాంతి. 23–41)

# 10. అపప్రతిభులైన జనులు దుఃఖార్తులు-

వ్యాసమహర్షి చెబుతున్నాడు- ప్రజల ఆదాయం నుండి ఆరవవంతు పన్నుగా తీసుకో. పక్షపాతం లేని న్యాయపాలనను అందజేయుము అలా కాకుండా నీవొకవేళ రాజుననే అహంకారంతో కామ క్రోధాలతో ప్రవర్తిస్తే నీకు చెందుతుంది ప్రజలు చేసే పాపాలలో నాలుగవ వంతు అనే విషయాన్ని గ్రహించుము.

శత్రు సంహారం రాజుల విద్యుక్త ధర్మం. హయగ్రీవుడనే రాజు స్థాపించాడు విశాల సామ్రాజ్యం, యజ్ఞాలు చేసి శత్రు రక్తాన్ని హోమద్రవ్యంగా సమర్పించి కీర్తినందినాడు. ధర్మరాజన్నాడు- పతులు మృతులై సతులు చేస్తున్న విలాపాలు బాధిస్తుండగా నేను భూమిని పాలిస్తూ మనశ్శాంతితో ఉండగలనా, న్యాయపాలన చేయగలనా?

వ్యాసమహర్షి అన్నాడు- సంపదలు ఊరకనే రావు. కాలం కలిసిరావాలి. గాలివాన ఎండ వెన్నెల కాల కల్పితములే, మంత్రాలు, శిల్పాలు, ఔషధాలు ఫలించి పనిచేసేది సకాలములోనే, తామర కలువ పూల వికాసము, వృక్షాలు పూలతో పళ్లతో నిండడం, పక్షులు మృగాలు సంతానోత్పత్తికి సిద్ధమవడం కాలకల్పనలే.

చావు పుట్టుకలు, బాల వృద్ధులు, సకల చర్యలు కాలాధీనములేనని తెలుసుకో! పూర్వం సేనజిత్తు అనే రాజు పుత్ర మరణంతో శోకిస్తూ జ్ఞానబోధను తనలోనుండే పొందినాడు. జ్ఞాని మనసులో భయశోకాలకు తావులేదని గ్రహించినాడు. ఏమీ తెలియనివారు, అన్నీ తెలిసినవారు సుఖిస్తారు, అటూ ఇటూ కానివారే దుఃఖపీడితులు.

---

**సీ. 'దుఃఖంబుఁ బొమ్మని త్రోవ, సుఖంబు ర । మ్మని తెచ్చికొన వశమయ్య? వానిఁ**
**దొలుబామునందలి దుష్కృతంబును సుకృ । తంబు హేతువులుగఁ దగిలి చేయుఁ**
**బురుషుని కాలంబు; దిరములు గా వవి; పొరిఁ । బొరి వచ్చుచుఁ బోవుచుండు;**
**నర్థముల్ దుర్బుద్ధికైనను సిద్ధించు । నగు కాలమున; నార్యులయ్యుఁ గాని**

**ఆ. కాలమున ఘటింపఁగా నేర; వనిల వ । ర్షాతపేందురుచులు నధిప! కాల**
**కల్పితములు; మంత్రశిల్పౌషధంబులు । మేలుసేఁత కాలకీలితంబు. (శాంతి. 1-185)**

**సీ. 'తారు గొందఱకు బాధకు లయి నడచుట । పరులచే బాధలఁ బడుట గలుగు;**
**నివి కాలభావ్యంబు; లెఱుక కల్గిన నొరుఁ । బఱిచితి నొరులచేఁ బడితి ననుచుఁ**
**బురుషుండు ప్రియశోకములఁ బొందఁ; దర్థ దా । రాపత్య బాంధవహాని కాత్మఁ**
**గుందంగ నడలుట మందబుద్ధిత్వంబు; । వగఁ గీడు మానునే? వలవ దడల;**

**తే. శోకభయకారణంబులు లోకమున న । నేకములు; దానఁ దలసూపు శోకములకు**
**భయములకు బుద్ధిధ నెడయీఁడు పండితుండు । మూఢుఁడవి త్రోవనేరండు మునుఁగు వగల. (శాంతి. 1-188)**

# 11. మరవవచ్చునె నాకభిమన్యు ద్రౌపదేయులను-

ధర్మజుడన్నాడు వ్యాసమహర్షితో- ఎలా మరచిపోగలను అభిమన్యుడిని,
ద్రౌపదేయులను, కర్ణుడిని, విరటుడిని, ద్రుపదుడిని, ధృష్టద్యుమ్నుడిని నేను?
నన్ను తొడలపై కూర్చుండబెట్టుకుని లాలించిన భీష్మ పితామహుడిని, అతడు శిఖండిపై
బాణాలు వేయక అలా చూస్తూ ఉంటే అర్జునుని బాణాలు తగిలి నేలకూలిన దృశ్యాన్ని?

ఎలా మరచిపోగలను- అశ్వత్థామ హతః కుంజరః అని ఆపద్ధర్మ అసత్యంతో
గురువును, నేనసత్యమాడనని నమ్మిన ద్రోణాచార్యుని చంపించిన పాపాన్ని మరువగలనా?
కర్ణుడు చనిపోయే వరకు నిద్రపట్టని నాకు ఇప్పుడు అతడు నా సోదరుడని
తెలిసాక, అతడి వధ నాకు నిద్రపట్టనిస్తుందా, సుఖాన్ని రానిస్తుందా దగ్గరకు?

ఎలా మరచిపోతాను ద్రోణనిర్మిత, పద్మవ్యూహంలోకి అభిమన్యుడిని పంపిన సంగతిని?
ఆ పసిబాలుడి మరణానికి కారణమైన నాకు రాజ్య పాలనార్హత ఉంటుందా?
ఎలా మరచిపోతాను ద్రౌపదీ కుమారుల మరణాన్ని, ద్రౌపది దుఃఖాన్ని?
ప్రాయోపవేశంతో చనిపోవాలన్న ఆలోచన నన్ను చంపివేస్తున్నదిపుడు-

వ్యాసుడన్నాడు ధర్మజుని దుఃఖ తీవ్రత నెరిగినవాడు కనుక గొప్ప సహనంతో-
జనకుడు తత్వజ్ఞాన పరిపూర్ణుడు కాకమునుపు బంధువులను కోల్పోయి
నీలా విషాద స్థితిలో ఉండగా అశ్మకుడనే బ్రాహ్మణుడతడిని ఓదార్చినాడు.
-సుఖదుఃఖాలు జరామరణ క్లేశాలు జీవులకు సహజం, కర్మఫలితాలవి-

---

**తే. మఱవవచ్చునె నా కభిమన్యు ద్రౌప । దేయులను గర్ణు మత్స్య భూనాయకుండు**
**ద్రుపద నృపతియు ధృష్టకేతుండు మాన । సమునఁ బాయుదురే యెట్లు శాంతి గలుగు? (శాంతి. 1-195)**

**సీ. తొడలపై నర్మిలి నిడికొని న న్నుప । లాలించుచుండు బాల్యమున నట్టి**
**భీష్మునిఁ జంపితి; భీభత్సు భల్లముల్ । దనువు సెక్కంగ నాతఁడు శిఖండిఁ**
**జూచుచు నుండుటఁ జూచితి; నది యుల్ల । మలమటఁ బెట్టెడి; నట్లుగాక**
**యా భంగి నున్నప్పు డాతఁ డాద్రుపదజు । నేయమిఁ దలఁచిన నెరియు మనసు;**

**తే. పరశురాముని నోర్చిన బల్లిదుండు, । కాశిరాజ కన్యకలకుఁ గాఁగఁ బుడమి**
**నరపతుల నెల్ల గెలిచిన బిరుదు గలన । నాఅడియ పడు టూహింప నడలు గదురు. (శాంతి. 1-196)**

**ఆ. అల్పకాల భోగ్యమైన రాజ్యమునకుఁ । గా ననల్పకీర్తిఘనుని జరత**
**సింహకల్పు వంశశేఖరజున్మఁ ద్రుం । చితి మనంబు వగలఁ జివుక కున్నె. (శాంతి. 1-197)**

**- దుఃఖమే వాస్తి న సుఖం తస్మాత్త దుప లభ్యతే**
**తృష్ణార్తి ప్రభవం దుఃఖం న నిత్యం లభతే సుఖమ్ (సం.శాంతి. 25-22)**

# 12. నరుడనిత్యత నూహించుటరయ నురవు-

వ్యాసుడు చెబుతున్నాడు ధర్మరాజుతో- మిత్రుల వల్ల సుఖాలు, శత్రువుల వల్ల దుఃఖాలు
సద్బుద్ధికి ధనం, భోగాలకు ధనం సాధనం అనడం- నీటీమీద వ్రాసిన వ్రాతలు-
గాలి మేఘాన్ని చెదరగొట్టినట్లు సుఖదుఃఖాలు చెదరగొడ్తాయి ఆత్మను
సమస్త భూమండలానికి చక్రవర్తి అయినా వార్ధక్య మరణాలు ప్రాప్తిస్తాయి కదా!

మంచి ఆహార పదార్థాలు, సుగంధభరిత వస్తువులు, శయ్యలు, ఆసనాలు
కాలానుగుణంగా దొరుకుతాయి, వాటిని నమ్మనవసరం లేదు, అవి అస్థిరాలు.
వైద్యులు రోగాల పాలబడరా? నరుడి నేర్పు విధి వైపరీత్యాన్ని తొలగించలేదు.
సద్వంశం, చక్కదనం, బలం, అదృష్ట భోగాలు సకృత సంపాదితములు.

పేదలకు పిల్లలెక్కువ, ధనవంతుడికి సంతానం కలుగదు, పేదలకు అరుగుతాయి రాళ్లు
కడుపునిండా తినలేరు సంపన్నులు; స్త్రీ జూదము వేట మధువు వ్యసనాలు-
విధికృతాలను మానవ ప్రయత్నం ఆపలేదు, జనన మరణ చక్రరూప సంసారమిది.
ఈ శరీరమే అప్పు తెచ్చుకున్నది, అటువంటప్పుడు శాశ్వతమా బంధుమిత్రులు?-

అని పలికాడు అశ్మకుడు జనక మహరాజుతో- ఆ విధంగా జనకుడు
అడవికి వెళ్లే ఆలోచన మాని తన విద్యుక్త ధర్మమైన రాజ్యపాలన నిర్వహించాడు-
అని వ్యాసుడు పలికాడు ధర్మరాజుతో- అప్పటికీ మౌనంగా ఉన్న అన్నను చూసి
అర్జునుడు కృష్ణునివేపు చూడగా, శ్రీకృష్ణుడన్నాడు చింతాక్రాంతుడైన ధర్మజునితో-

**చ.** **వల నధికంబుగాఁ గలుగు వైద్యులు శాస్త్రము లభ్యసించి మం**
**దుల నొడఁగూర్ప నేర్చి తనదోషము లారయ బుద్ధి గల్గి యా**
**ర్తులకుఁ జికిత్స సేసెదరు; రోగము వాయమి లేదె? వారు రో**
**గు లగుట గానమెట్లు ప్రతికూలవిధిన్ నరునేర్పు ద్రోచునే? (శాంతి. 1-215)**

**సీ.** **సద్వంశ జన్మంబు సౌందర్యమును బలం । బును సుభగతయును భోగములును**
**భవితవ్యతానురూపంబులు పేదలై । పెంచుట కలయంగఁ బెల్లు పుట్టు**
**దురు ప్రజ లెంతయు సిరిగలవారు గో । రంగఁ బుట్టరు; దరిద్రపు జనంబు**
**లాఁకటం దిని ఱాలు నఱిగించు కొందరు; । భోజ్య సంపన్నులు భోజనంబుఁ**

**తే.** **బూర్ణముగఁ జేయఁజాలరు భూపవర్య! వెలఁది జూదంబు పానంబు వేఁట యతిని**
**షేవితములు గాఁదగ దని చెప్ప వినుచు । వలను గలవార చెడుదురు వానివలన. (శాంతి. 1-216)**

**-** **వ్యాధి రగ్నిర్జలం శస్త్రం బుభుక్షాశ్చాపదో విషమ్**
**జ్వరశ్చ మరణం జంతోః ఉచ్చాచ్చ పతనం తథా**
**నిర్మాణే యస్య యద్దిష్టం తేన గచ్ఛతి సేతునా (సం.శాంతి. 28-25,36)**

# 13. మనోభావాలు దాచకుండా ఒకరికొకరు తెలియజెప్పాలి-

శ్రీకృష్ణుడన్నాడు ధర్మరాజుతో నారద, వ్యాసమహర్షుల సమ్ముఖాన-
-నీకు ఇంతకు ముందు తెలియజెప్పినారు సువర్ణష్ఠీవి-సృంజయుల కథను
షోడశ మహరాజులైన సంవర్త, సుహోత్ర, అంగ, శిబి, శ్రీరామ, భగీరథ,
దిలీప, మాంధాత, యయాతి, అంబరీష, శశిబింద, గయ, రంతిదేవ

భరత, పృథు, పరశురాముల చరిత్రను- అంతటి చక్రవర్తులిప్పుడెక్కడున్నారు?
అంతేకాక మన నారదమహర్షి, చెల్లెలి కుమారుడైన పర్వతుడితో చేసుకున్నాడు
ఒప్పందం- తమ మనోభావాలను దాచకుండా ఒకరితో ఒకరు చెప్పుకోవాలని.
దాచినట్లయితే శాపార్హులౌతారని- ఒకనాడు వారిరువురూ వెళ్లారు సృంజయునింటికి.

అతడు తన కుమార్తె 'సుకుమారి'ని పిలిపించి నీవు వీరిరువురిని ఆరాధించుము
షోడశ ఉపచారములతో అని ఆజ్ఞాపించిన ఆమె ఎంతో అణుకువతో సేవ చేయగా
-ఆమె నడక తెచ్చిన శోభ ఆమె అందాన్ని ద్విగుణీకృతము చేయ, ఆమె
దేహం పైని నూగారు త్రివళులలో వ్యాపించ విస్తరించి కొత్త హద్దుల నేర్పరచ

తెలుపు నలుపుల కనుల మనోహరత్వము, పాదాలు, నడుము, వక్షోజాలు, నేత్రాలు
యౌవన సౌందర్యాన్ని అతిశయింపచేయగా నారద మహర్షి ఆకర్షితుడైనాడు.
అంతటి మనోవ్యాకులతతో బాధపడుతూ ఆ సంగతి మేనల్లుడైన పర్వతుడికి చెప్పలేదు.
దానితో పర్వతుడన్నాడు- సుకుమారితో పాణిగ్రహణం కాగానే వస్తుంది నీకు వానర ముఖము-

**సీ. అల్లఁదనంబున యనువు మైకొనఁజూచు । నడపు కాంతికి వింత తొడవు గాఁగ,**
**వెడవెడ నూఁగారు వింతయై యేర్పడఁ । దారనివళులలో నారు నిగుడ,**
**నిట్టలు ద్రోచుచు నెలవులకల మేర । లెల్లను బిగియెక్కి యేర్పడంగఁ,**
**దెలుపును గప్పును వెలయంగ మెఱుఁగెక్కు । తారకంబులఁ గల్కితనము దొడరఁ**

**ఆ. జరణములును నడుముఁ జన్నులుఁ గన్నులు । జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు**
**చునికిఁ దెలుప సృంజయుని పుత్రి మెలఁగు వి । ధంబు నారదునకుఁ దగు లొనర్చె. (శాంతి. 1-248)**

Ballade des dames du temps Jadis - (Ballad of Ladies of Time gone by) అనే కవితను ఫ్రాంకాయిస్ విల్లాన్ (Francois Villon) - Where are those who were before us? - ఏమైనారు వెనకటి మహాత్ములు, మహరాజులు, వారెక్కడున్నారిప్పుడు? అనే ఆలోచనతో వ్రాసాడు. Ubi sunt qui ante nos fuerunt? అనేది జిజ్ఞాసాపరమైన వేదాంత ప్రశ్న. సెయింట్ ఆగస్టిన్ (క్రీస్తుశకం 354-430) ఈ ప్రశ్న లేవనెత్తాడని అంటారు. మహాభారతంలో క్రీస్తుపూర్వమే ఈ ప్రశ్న అడగబడింది- షోడశ మహరాజుల గురించి.

డాంటి గాబ్రియేల్ రొజెట్టి దానిని 'Where are the snows of yester year?' అని ఆంగ్లానువాదం చేసాడు. మహాకవి శ్రీశ్రీ 'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు' అని ఒక కవితను వ్రాసాడు.

**(షోడశ మహరాజులు- పదహారుమంది గురించి వర్ణనలు తరువాత పేజీలలో చూడవచ్చును)**

# 14. పాణిగ్రహణానంతరంబు వానర వదనుండవగుము-

పర్వతుడన్నాడు తన మేనమామ నారదునితో- నాకు చెప్పకుండా దాచావు
రాచకూతురి మీద అనురాగము పుట్టిన విషయాన్ని. నీవామెను పెళ్లాడతావు
కాని, నేను శపిస్తున్నాను, నీవామెను పాణిగ్రహణం చేసుకున్న మరుక్షణం
వస్తుంది నీకు కోతిముఖము- అని పర్వతుడు శపించగా నారదుడన్నాడు-

-ఓరి మేనల్లుడా, కోతిలా ప్రవర్తించి నాకు కోతి ముఖాన్ని అంటగట్టావు,
ఇక నీకు ఆకాశ గమన సామర్థ్యముండదు గాక -అని ప్రతి శాపమిచ్చినాడు.
సుకుమారి నారదుల వివాహమైన క్షణమే నారదుడు వానర వదనుడైనను
ఆ పతివ్రత అతడిని ఆరాధించింది ఎంతో ఇష్టంగా, అలా కొంతకాలమైనాక

పర్వత నారదులు వెనక్కి తీసుకున్నారు పరస్పర శాపాల్ని, దానితో వచ్చాయి
పర్వతుడికి స్వర్గలోక గమనమూ, నారదుడికి కోతి ముఖం పోయి నిజవదనము.
ఇంటికి పోయిన నారదుని అంగీకరించలేదు ఇంతి సుకుమారి అతడు పరాయివాడని.
పర్వతుడు నవ్వుతూ ఆమెకు చెప్పినాడు పరస్పర శాపాల సంగతిని.

సుకుమారి మనసులోని కలత తొలగింది; నారద పర్వతుల స్నేహం శాశ్వతమయ్యింది.
నారద పర్వతుల ఆశీస్సులతో సృంజయునికి కలిగాడు సువర్ణష్ఠీవి.
అది సృంజయుడి కోరిక- తన కుమారుడి ఉమ్మి మూత్ర మలములు బంగారంగా మారాలనేది.
తొలుత దొంగలు, తరువాత ఇంద్రుడు సువర్ణష్ఠీవిని చంపినా బ్రతికించాడు నారదుడతడిని.

---

శా. శాప ప్రాప్తికి నోర్చి తా నడిగి యా చంద్రాస్య నన్నారదుం
దా పృథ్వీపతి యీఁ బ్రియంబున వివాహం బయ్యె నమ్మాత్రలో
భూపా! యమ్ముని వానరాననతమైఁ బొల్పేద నక్కాంత త
ద్రూప ప్రాప్తి విరక్తగాక తగఁ బ్రీతుం జేయుచుండెం బతిన్. **(శాంతి. 1-254)**

---

**షోడశ మహారాజులు- మరుత్తుడు (సంవర్తుడు):-**

సీ. 'సంవర్తుఁ డను మహాసంయమి దేవతా । గురుతోడి యీసున నురుగుదెంచి,
పూని యుపద్రష్టయై నడపంగ హి । మాచలపాదంబునందు శక్ర
వరుణ ప్రభృతులైన సురలు మహామునీం । ద్రులును సహాయులై మెలఁగుచుండ
శాలా ప్రముఖ భవ్యసాధనమ్ములు గన । కనకమయంబులుగ వస్త్రకాంచనాజ్య

ఆ. దధిపయః ఫలాది తర్పణ ద్రవ్యస । మృద్ధి సకలజనులు మెచ్చఁ బెక్కు
లధ్వరములు సేసె; నట్టి మరుత్తుండు । నిత్యపదవి నుండ నేర్చెనయ్య?' **(శాంతి. 1-229)**

# 15. నద్దంభోళి వంచన నయ్యెడ బొంచి నిలిచి వ్యాఘ్రమై-

అతడు కక్కినా ఉమిసినా బంగారమే, మూత్ర మలములూ, స్వేదమూ స్వర్ణమే!
సువర్ణష్ఠీవి అతడు, దానితో సృంజయుడనే రాజుకు ప్రాప్తమయ్యింది
'పట్టిందల్లా బంగారమే' -ఇంద్రుడిని మించిన ధనవంతుడయ్యాడా నరేంద్రుడు.
ఇటువంటి విషయాలు వింటే ఇంద్రుడికి భయం, క్రోధం ఉబుకుతాయి.

అప్పటికే ఒకసారి దొంగలెత్తుకుపోయి బంగారు బాతును కోసినట్లు కోసినారు.
సువర్ణష్ఠీవిని చంపి లోపలంతా వెదికినారు, ఏమీ దొరకలేదు.
కొట్లాడుకుని వాళ్లలో వాళ్లు తన్నుకుని చచ్చారు ఉన్మత్తత ఆవరించి.
నారదుడు బ్రతికించాడు సువర్ణష్ఠీవిని సృంజయునిపై కరుణతో.

ఈసారి ఇంద్రుడికి వచ్చింది వంతు- అప్సరసలను పంపే వ్యవహారం కాదిది,
అందుకే వజ్రాయుధాన్ని పంపినాడు వ్యాఘ్రరూపంలో, సువర్ణష్ఠీవిని చంపమని.
గంగానదీ తీరాన ఆ బాలుడిని చంపింది వ్యాఘ్రరూప వజ్రాయుధం.
నారదుడు మరల బ్రతికించాడు సువర్ణష్ఠీవిని, అనునయించాడు ఇంద్రుడిని.

సృంజయుడికి పుత్రశోకం తొలిగింది; ఆ తరువాత సువర్ణష్ఠీవి
శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేస్తూ అనేక సంవత్సరాలు పాలించాడు రాజ్యాన్ని-
ఆ విధంగా ధర్మరాజును అనునయించారు భీమార్జున నకుల సహదేవులు,
నారద వ్యాస మహర్షులు, శ్రీకృష్ణుడు విషాదయోగాన్ని అభినయిస్తున్న ఆ మెత్తని పులిని.

---

**సీ.** **సృంజయుం డుజ్జ్వల శ్రీసముల్లాస ప్ర । హర్ష మొప్పంగఁ బ్రియాంగనలును**
**దానుఁ గుమార యుక్తముగ భాగీరథీ । తీరకాంతార ప్రదేశనిత్య**
**వసనేచ్ఛమెయి నుండి కుసుమాపచయముఖ । బహువిధ కేళితత్పరత నొంది**
**యొండుదలంపు లేకుండ నద్దంభోళి । వంచన నయ్యెడఁ బొంచి నిలిచి**

**తే.** **తెఱపి గాంచి శార్దూలమై యుతికి వార । ణేంద్రసమయాను నమ్మానవేంద్ర తనయు**
**వ్రచ్చి యంతర్హితం బయ్యెఁ; జచ్చె వాఁడు; । దాది యాక్రోశమున నార్తనాద మెసఁగ. (శాంతి. 1-269)**

---

**షోడశ మహారాజులు- సుహోత్రుడు:-**

**సీ.** **'సన్మార్గమున రాజ్య సంపద నొంది భూ । సురపూజ లొనరించి సువ్రతముల**
**బృందారకులఁ బ్రీతిఁ బొందింపఁ, దన కర్థిఁ । బర్జన్యుఁ డేఁటేఁటఁ బసిఁడిఁ వాన**
**కనకమయములైన కర్కట ఝుష నక్ర । కూర్మచయముతోడఁ గురియుచుండ**
**నయ్యర్థ మెల్ల ధనార్థుల కిచ్చుచుఁ । గురుజాంగలంబునఁ బరమనిష్ఠ**

**ఆ.** **నశ్వమేధ ముఖములైన రాజార్హయ । జ్ఞములు పెక్కు సేసి సకల జనులు**
**పొగడునట్టి పాట నెగడె సుహోత్రుఁ; డ । విభుఁడు దెగియె ననుట వినమె యధిప!' (శాంతి. 1-230)**

# 16. సమస్తమును ఈశ్వరునాజ్ఞ చెల్లెడున్-

ధర్మజుడన్నాడు- చంపకూడని వారినెంతోమందిని చంపాను కదా
ఆ అంతులేని క్రూరత్వం నా అంతరాత్మను దహించివేస్తున్నది.
అంతేకాని మీరంతా ఇంతగా చెప్పినాక నాకింకా సందేహమెక్కడున్నది?
వ్యాసుడన్నాడు- కర్మలు ఆచరించటానికి మనుషులెవరు?

ఈశ్వరునాజ్ఞ లేకుండా విశ్వంలో ఏదీ జరగదు; అతడి చేతి ఉపకరణాలు జనులు
గొడ్డలి చేతపట్టిన వాడు చెట్టు నరికితే ఆ పాపం గొడ్డలిదవుతుందా!
కర్తృత్వం కర్మఫలం రెండూ భగవంతునివే; నీవు నీ కులధర్మం నిర్వర్తించు-
ఆ పలుకులు విని ధర్మరాజన్నాడు- నా కారణంగా ఇందరు చనిపోయారు.

వారి భార్యలు, స్త్రీలు దుఃఖాతిశయంతో మరణిస్తే స్త్రీవధకు కారణమవుతాను.
అంతటి బాధతో నేను రాజ్యభారాన్ని వహించగలనా, అనేది నా సంశయం.
వ్యాసుడన్నాడు- నీవు అనుకుంటున్నదేమిటంటే ఇదంతా నీవల్ల జరిగిందని;
అది నీ గర్వాన్ని తెలుపుతున్నది, వారు చనిపోయింది వారి పాపకర్మల వల్ల.

నీవు నిమిత్తమాత్రుడవు. ఆ విషయాన్ని పక్కకునెట్టి పదేపదే
అంతా నీవల్లనే జరిగింది అనుకుంటున్నావు. నీవు చెబితేనే జరిగాయా
భీష్మ ద్రోణ కర్ణ శల్య అభిమన్య ఘటోత్కచ ఉపపాండవాది వీరుల మరణాలు!
పరోక్ష కారణమైన నీవు పరితపించడం ఇప్పటి నీ దురవస్థలకు కారణాలు!

---

చ. 'మనుజులు సేయ నెవ్వరు సమస్తము నీశ్వరునాజ్ఞఁ జెల్లెడు
న్వినుము కుఠారపాణి ధరణీరుహముల్ నఱకంగఁ బాప మొం
దునొకొ! కుఠారమున్ జనులు దోసముఁ బొందరు కర్త యీశ్వరుం
డనియెడి నిశ్చయంబు దృఢమై మది నిల్చినఁ జాలు భూవరా! (శాంతి. 1-277)

\- ప్రజానాం పాలనం ధర్మః రాజ్ఞాం రాజీవలోచన
ధర్మః ప్రమాణం లోకస్య నిత్యం ధర్మాను వర్తినః (సం.శాంతి. 32-2)

---

**షోడశ మహారాజులు-అంగమహారాజు :-**

సీ. 'కాంచనాలంకార కాంతంబులై రూఢి । కెక్కిన గజములు పెక్కు వేలు,
జవసత్త్వ రూపాది సకల గుణములఁ । బెం పెసఁగిన హయము లనేక లక్ష,
లమలిన స్వర్ణమయములగు కొమ్ములం । గొమరారు పశువులు గోటు, లూర్జి
తాంగక విలసదజావికంబులు గణ । నాతీతములు గన్య లప్రమేయ,

ఆ. లఖిల రత్న విరచితాభరణంబు ల । నల్పములు మహీసురావళులకు
నిచ్చి చేసెఁ గ్రతువు లెన్నియేనియు నంగుఁ । డతఁడు నన్యలోకగతుఁడు గాఁడె!' (శాంతి. 1-231)

# 17. తొలిదొలి అశ్వమేధ యాగమాచరింపు-

'ఈ మారణకాండనంతా నీవే చేసావని నీవనుకుంటే అది పెద్ద తప్పు
దీనిలో నీ పాత్ర అత్యల్పం. నిన్ను నీవు నిందించుకుంటున్నట్లే పైకి కనబడినా
అది నీలో మాసిపోని గర్వాన్ని తెలుపుతున్నది. అన్నీ భగవంతుడి లీలలని అంటూనే
ఆ లీలావిశేషాల్ని నీకంటగట్టుకుంటున్నావు, తాత్కాలిక శోక భారంతో!

ఆ సంశయ నివారణకై అర్జునుడు సూచించాడు అశ్వమేధయాగం
ఆ విధంగానే మరణించిన రాజులకు సైనికులకు వారి రాజ్యాలను
వారి కొడుకులకు, కూతుర్లకు, సంబంధీకులకు ఇచ్చి సంతసము కలిగించు.
నీకు వస్తున్న అధికారాన్ని సద్వినియోగం చేసి అందరి నష్టాన్ని ఏదో రకంగా పూడ్చు.

దేవతలు రాక్షసులు దాయాదులు కాదా! యుద్ధంలో ప్రవహించలేదా
నెత్తుటేర్లు, పరస్పర హననానికి పాల్పడలేదా? ఎన్ని సమరాలు?
ఎన్ని జగన్మోహినీ పంపకాలు, ఎన్ని జయాలు పరాజయాలు?
ఇష్టమైతే ఇంద్రుడిలా యజ్ఞాలు చేయి, ప్రాయశ్చిత్తాలు చేయి.

చిత్తాన్ని కల్మషరహితంగా ప్రకాశింపచేసుకో, కర్తవ్యపాలన చేయుము-
అర్థం చేసుకో- సంధ్యాకాలపు నిద్ర, అతిధిసేవ చేయకపోవడం,
పరభార్యాగమనం, పెద్దలకెదురాడడం, ఊరిని నాశనం చేయడం; వేదాలను,
ఉప్పు, బెల్లాన్ని అమ్ముకోవడం, జంతుహింస, అటవీ నాశనం పాపకార్యాలు.

---

**శా. నీవున్ ధర్మవిరోధులైన జనతా నింద్యాత్ములం బుణ్యమా**
**ర్గావష్టంభము దేజరిల్ల నృపవంశాచార మొప్పారఁ దో**
**డై వీరానుజు లుల్లసిల్లఁగ మహోగ్రాజిం దెగం జూచి తా**
**దేవాధీశుఁడ పోలె శిష్టపరిషత్సేవ్యుండ వై తా పనిన్. (శాంతి. 1-288)**

**ఆ. వలయునేని యధిప! వాసవుచాడ్పునఁ । గ్రతుపరుండ వగుము; రాజధర్మ**
**కలితమైన పుడమిఁ గైకొమ్ము; తొలిదొలి । యశ్వమేధయాగ మాచరింపు.' (శాంతి. 1-289)**

---

**షోడశ మహారాజులు - శిబి :-**

**సీ. 'ఏడు దీవులయందుఁ గ్రీడాగతులఁ దన । రథము చరింప, నరాతు లనఁగ**
**వినియు నెఱుంగక విభవ మార్జించుచోఁ । బ్రజల నొప్పింపని పరమపుణ్య**
**కర్మంబునకు మెచ్చి గారవంబునఁ దన । కక్షయ సాధనము ఫాలాక్షుఁ డొసఁగ**
**నశ్వమేధములు జాహ్నవిపొంత శిష్ట జ । నాకీర్ణములుగఁ బె క్కాచరించెఁ;**

**ఆ. దారకములు వృష్టిధారలు లెక్కింప । వచ్చుఁ గాని యతని యిచ్చుగోవు**
**లెన్నఁ గొలఁది గాదు; సన్నుతిపాత్ర మా । శిబికి నుర్వి నునికి సెల్లె నెట్లు?' (శాంతి. 1-232)**

# 18. పాపాలవలె ఉండి దూష్యములు కానివి-

వ్యాసుడు చెబుతున్నాడు ధర్మరాజుకు ఆపత్కాల పాప కార్యములు అనింద్యములు
-తనను సంహరించ వచ్చిన పండితుడినైనా చంపవచ్చు - పాపమంటదు.
బ్రాహ్మణుల ధనాన్ని దొంగిలించేవాడిని చంపినా ఏ పాపమూ కాదది.
అన్నపానములు దొరకనపుడు కల్లు తాగవచ్చు, ఆ పాపం పోతుంది పుణ్యకార్యాలు చేస్తే.

ప్రాణనష్టాన్ని తప్పించడానికి, వివాహ సమయాన, స్త్రీలతో మాట్లాడేటప్పుడు
సంపద కోల్పోయే సమయంలో అసత్యం పలకవచ్చు, అది తప్పుకాదు.
కలలో వీర్యస్ఖలనం జరిగితే బ్రహ్మచర్యం చెడదు, అగ్నిలో నేతిని వేల్చితే పాపం పోతుంది.
అన్న అధర్మవ్రతుడైనా, సన్యాసి అయినా అతడి భార్యను తమ్ముడు పెండ్లాడవచ్చు.

గోవుల కొరకు వనాన్ని తగలబెట్టడం, యజ్ఞంలో జంతుబలి నివ్వడం
తెలియక చేసే అపాత్రదానం, అనర్హుడైన సేవకుడిని రక్షించకపోవడం
ఇవేమీ పాపాలు కావు; తపస్సు, దానం, సత్కర్మల వల్ల తగ్గుతాయి పాపాలు
బ్రహ్మ హత్యాపాతకం పోవాలంటే అశ్వమేధయాగం గొప్ప ఉపాయం.

గురుపత్నీ గమనం చేసినవాడు గురువు కోసం ప్రాణాలర్పించాలి.
కాల్చిన ఇనుప స్త్రీమూర్తిని కౌగిలించుకోవాలి, శిశ్నాన్ని ఖండించుకుని చావాలి.
బంగారం దొంగిలిస్తే అంతే బంగారాన్ని ఇవ్వాలి; అబద్ధమాడితే
అపచారం కలిగిన వాడికి సంతోషం కలిగించాలి- ఇవి కొన్ని ప్రాయశ్చిత్తాలు.

---

**సీ. ఆదిత్యు నుదయాస్తమయ కాలముల నిద్రఁ । బొందుటయును, బాత్రభూతుఁ డింటి**
**కరుగుదెంచినఁ బూజ యాచరింపమియును, । బరదారగమనంబు, గురుల కెదురు**
**సేఁతయు, గ్రామంబు సెఱుచుటయును, వేద । విక్రయంబును, రసవిక్రయంబు,**
**భృత్యుఁ బ్రోవమియు, నసత్యోపచారంబు, । గహనదాహము, నన్యకర్మకృతియుఁ**

**తే. దనదుకర్మంబు విడుచుటయును, వృథాప । శు ప్రహరణంబు, మేదినీసురుల కలిమిఁ**
**గొనుటయును, శరణార్థిఁ జేకొనమి, విప్ర । వధయుఁ బాపంబు లందురు బుధజనములు. (శాంతి. 1-293)**

---

**షోడశ మహారాజులు - దశరథ రాముడు:-**

**సీ. 'యౌవనంబునఁ దప మాచరింపఁగఁ దండ్రి । పంపున నరిగిన పెంపుకలిమి,**
**సేతువు జలధిఁ బ్రఖ్యాతంబుగా నొన । ర్చిన మర్త్యలోక పావన విభూతి**
**త్రైలోక్యకంటకు దశముఖు బంధు యు । క్తంబుగాఁ జంపిన కలితనమ్ము,**
**బాలుర మరణంబు వాటిల్లకుండఁగఁ । జేసిన యత్యంత చిత్రమహిమ,**

**ఆ. గలిగి యశ్వమేధములు మున్నుగా ననే । కాధ్వరము లొనర్చి యఖిల జనులఁ**
**దల్లివోలె నరసి దశరథరాముండు । కాలవశత నొందెఁ గాదె యధిప! (శాంతి. 1-233)**

# 19. పునుక కుక్కతిత్తి పోసిన పాలు-

ఇతరుల భార్యను పొందినవాడు ఏడాదిపాటు కఠోర వ్రతం చేయాలి నియమబద్ధుడై
వావివరుసలు లేక వనితను కూడినవాడు పడుకోవాలి ఆరునెలలు బూడిదలో
పరపురుషుడిని పొందిన స్త్రీని వదిలివేస్తే ఆమె మాలిన్యం పోతుంది
నరకకూడని చెట్టును కొట్టినా, చంపదగని జంతువును చంపినా

ఆ పాపం పోతుంది మూడు రోజుల నిరాహారదీక్షతో నిష్ఠగా ఉంటే.
ఆహారం మితంగా తీసుకుంటూ ఉదయసంధ్యలో గాయత్రీమంత్ర జపం చేస్తే
నశిస్తాయి పాపాలన్నీ; భగవంతుడి పట్ల విశ్వాసం, శ్రద్ధ ఉండాలి వారికి-
అని వ్యాసుడు చెప్పగా ధర్మరాజు అడిగాడు తాగకూడనివి, తినకూడనివి ఏవి?

వ్యాసుడన్నాడు- గుర్రం, గాడిద, ఒంటె పాలు నిషిద్ధాలు, ఈనిన పదిరోజుల
లోపు ఆవుపాలు, మానవ క్షీరము త్రాగరాదు. ప్రేత సూతకాన్నములు,
తలారి, కులట, వనితోపజీవన శీలుడు, జూదగాడు, పనీపాట లేనివాడు,
జూదగాడు, పూలమ్మేవాడు, వెలివేసినవాడు, పొగిడేవాడు ఇచ్చిన ఆహారం తినరాదు.

పాచిపోయినది, ఎండిన ఆహారం వదిలేయాలి; కల్లుతో కలిపింది తినరాదు.
అతిథి, పిత్ర, దేవతాపూజలనంతరం మిగిలిన ఆహారాన్ని స్వీకరించవచ్చు.
అపాత్ర దానం కపాలంలో, కుక్కతోలు సంచిలో పోసిన పాలు వంటివి-
అని పలికి నారద, వ్యాసులన్నారు- నీవు భీష్ముడి దగ్గర రాజనీతి తెలుసుకొనుము.

---

సీ. వినుము! కర్మము దెల్పుచును గపాలంబున । నెత్తిన భైక్షాన్న మేకకాల
మశనంబు గొనుచు ఖట్వాంగ చిహ్నము బ్రహ్మ । చర్యంబునై యధశ్శయన మాచ
రించుచు నిట్లు పంద్రెండు వర్షంబులు । వ్రతవృత్తి నడపంగ బ్రహ్మహత్య
కిల్బిషంబు దొఱంగుఁ; గృచ్ఛ్రముల్ నడపిన । నాఱు వత్సరముల నడఁగు మూఁడు

తే. హాయనంబులు నడపఁ జాంద్రాయణములఁ । బోవు నిష్ఠానిరతి మాస భోజియైన
నబ్దమునఁబాయు; నటుగాక యశ్వమేధ । యాజి యగునేని వలదు భిక్షాదు లధిప! (శాంతి. 1-304)

\- పునుకఁ గుక్క తిత్తిఁ బోసినపాలు నీల్లధిక నింద బొరయునట్లు దుష్ట
మై య పాత్ర విషయమగు నీగి వృథవోవు నిచ్చుచోటఁ బాత్ర మెరుగవలయు (శాంతి. 1-331)

---

**షోడశ మహారాజులు-భగీరథుడు :-**

సీ. 'పూర్వవంశుల్యఁ గావఁ బూని వియద్గంద । నవని భాగీరథి యనఁగఁ బఱపి,
శక్రుండు మెచ్చఁ బరాక్రమంబునఁ బేర్చి । యప్రతిహతముగ నశ్వమేధ
యాగంబు లొనరించు నప్పుడు వేయి వే । ల రదంబులందుఁ గన్యల నలంకృ
తలఁ జేసి యునిచి, రథంబు రథంబున । కిభములు నూఱు నూటేసి యేనుఁ

తే. గేనుఁగునకు గుఱ్ఱములు వేయేసి పాటి । హయముహయమున కట్ల గోచయ మమర్చి
భూరి భూరి యుతంబుగ భూసురులకు । నొసఁగినట్టి భగీరథుం డున్నవాఁడె?' (శాంతి. 1-234)

# 20. సారథ్యంబు వహింప భీముడు-

నారద వ్యాస మునీంద్రులతడిని భీష్ముడి వద్దకు వెళ్లమనగా ధర్మజుడు
-నేనా మహాత్ముడిని ధర్మోపదేశం చేయమని ఎట్లా అడగను-
ముఖం చెల్లదు కదా! అనగా కృష్ణుడన్నాడు- నిర్బంధమేమీ లేదు.
ఇప్పుడు నగరానికి వెళ్లు, నీకోసం ఎదురుచూస్తున్న వారిని ఆదరించు.

మునులందరూ ఇలా పలుపలు విధాల బోధించి వెళ్లిపోయారు వారి స్థానాలకు.
ధర్మరాజు ప్రశాంత మనస్కుడై చక్కగా అలంకరించుకుని రాజుగా ప్రకాశిస్తూ
పండితులు, హతశేషులైన రాజులు, బంధుమిత్రులు వచ్చి అభినందించగా
వారికి తగిన కానుకలిచ్చి వెలుగొందినాడు చుక్కల మధ్య చంద్రుడిలా!

మరుసటి రోజు ఉదయాన కొత్త రథానికి పదహారు తెల్లని గుర్రాలు పూన్చి
చంద్రుడు వెన్నెల రథమెక్కినట్లు అధిరోహించి, భీముడు సారథిగా
అర్జునుడు తెల్లగొడుగు పట్టుకోగా, నకుల సహదేవులు వింజామరలు వీచగా
పంచాగ్నులు యజ్ఞవేదికపై ప్రకాశించినట్లు కానవచ్చారు పంచపాండవులు.

ధృతరాష్ట్రుడు, గాంధారి తన రథం ముందు పల్లకిలో కూర్చుని ఉండగా
శైబ్య సుగ్రీవ మేఘపుష్ప వలాహక అశ్వాలున్న రథంపై శ్రీకృష్ణుడు, సాత్యకి అనుసరించగా
ప్రక్కనే యుయుత్సుడు తన రథంలో, కుంతీదేవి ఇతర స్త్రీలు పల్లకిలలో
విదురుడు వెనక భాగాన రథంలో, ఇతర రాజులు సైనిక సమేతులై రాగా ధర్మజుడు

---

క. నవమగు రథమున షోడశ। ధవళహరులఁ బూన్పఁ బనిచి ధరణీపుఁడు విధుం
దవిరళ సుధారథం బె। క్కువిధము దోఁపంగ నెక్కెఁ గురువంశనిధీ! (శాంతి. 1-348)

శా. సారథ్యంబు వహింప భీముఁడు, సితచ్ఛత్రంబు గాండీవి సె
ల్వారం బట్టఁగఁ, జామరల్ గవ లిడన్ హారిప్రభంబయ్యె; న
త్తేరం దేవురు నగ్నిపంచకము వేదిం బొల్చునట్లొప్పి రం
భోరాశిధ్వనివోలెఁ దూర్యనికరంబుల్ మ్రోసె నొక్కుమ్మడిన్. (శాంతి. 1-349)

---

**షోడశ మహారాజులు- దిలీపుడు :-**

సీ. 'అర్థి విశ్వావసుం దాదిగాఁ గలుగు గం। ధర్వులు హృద్య వాదన మొనర్ప,
నప్సరో నికురంబ మాటలుఁ బాటలు। నై వినోదింపఁగ, నమర గణము
బహు విధాలంకార భంగుల విన్నాణు। వులు సూప దివ్యమునులు నుతింప,
మనుజ లోకంబెల్లఁ గన కాన్క వస్త్ర భూ। షణ దానములఁ దృప్తి సనఁగ నశ్వ

ఆ. మేధ సమితిఁ జేసి మెప్పించె నింద్రుని। శతతమాధ్వరమున; నతఁడు హయము
నాసపడిన నిచ్చె; నాదిలీపునిఁ జూపు। మా! ధరిత్రి నిపుడు మనుజనాథ!' (శాంతి. 1-235)

# 21. దిగ్విజయంబున తేజస్వి అయ్యున్-అజాతశత్రుడు

సముద్రఘోష వలె వాద్యాలు మోగుతుండగా, పదహారు తెల్లగుర్రాల రథంలో
తమ్ములు తన పక్కనే ఉండగా, శ్రీకృష్ణ, సాత్యకి, యుయుత్స, విదుర సమేతంబుగా
గాంధారి ధృతరాష్ట్రులు, కుంతీదేవి ఇతర అంతఃపుర స్త్రీలు వెంటరాగా
హస్తినాపురిలో ప్రవేశించాడు యుధిష్ఠిరుడు వైభవంగా, అట్టహాసంగా

ధ్వజస్తంభాలకు కలువపూల దండలు, మంగళ తోరణాలు కట్టి
పోక అరటిబోదెలు, పూర్ణకలశాలు స్థాపించి, కస్తూరి కలయంపి చల్లి,
కర్పూరపు రంగవల్లులలరించి, పూలగుత్తులు, పూమాలలతో అలంకరించగా
నూతన వధువులా ఒప్పుతున్న నాగ నగరంలోకి వచ్చాడు ధర్మజుడు.

కొత్త దుస్తులు ధరించి నగరవాసులు జయజయ ధ్వానాలు పలుకగా
పణ్య పుణ్యాంగనలు ముత్యాలతో కూడిన నలగని పూలను జల్లుతుండగా
కల్పవృక్షాలు పూలవానను కురిపించినట్లు కానవచ్చి, జనులందరూ 'ఆహో!'
ఇతడే అజాతశత్రుడు, రాజసూయ యాగం చేసినవాడు, సత్యసంధుడు

ధర్మైక నిరతుడు, శత్రువులను నిశ్శేషము చేసిన మహావీరవరుడు,
బలం, ఉపాయం, ఓర్పు, సామర్థ్యమనే గుణాలున్న సోదరులు కలిగినవాడు
అదుగో ఆమె- రాజపత్ని ద్రౌపది- వ్రతచర్య, భాగ్యము, ధృతి, మతి
కలిగిన ఇల్లాలు- అని ప్రజలందరూ మెచ్చుకుంటూ ఉండగా చేరుకున్నాడు రాచవాకిలి.

**సీ. 'దిగ్విజయంబునం దేజస్వి యయ్యు న । జాతశత్రుం దనc జను నితండె;**
**రాజసూయ మహాధ్వరము సేసి విప్రులc । గనక రత్నాదులc దనిపె నితcడె;**
**నిత్యవ్రతంబుగా సత్యంబు పాలించు । నిష్ఠ యస్ఖలితగా నెఱపె నితcడె;**
**ధర్మైక నిరతుc డీతం డొక్కరుcడ చువ్వె । యని పల్కుటకుc బాత్ర మయ్యె నితcడె;**

**తే. బలముc దగవును ధర్మంబు వెలయc బగఱ । నవశేషంబుగాc దెగటార్చె నితcడె'**
**యనcగ మతియును వివిధ కీర్తనల హర్ష । వచనముల నుల్లసిల్లు రవంబు మిగిలె. (శాంతి. 1-357)**

**షోడశ మహారాజులు-మాంధాత :-**

**సీ. 'జననమాదిగc బాకశాసను కరమునc । బ్రభవించు నేయును బాలు ద్రావి,**
**ద్వాదశదినము లాతcడు గారవింపంగ । వర్ధిల్లి పంద్రెండు వత్సరముల**
**ప్రాయమై రాజ్యసంప్రాప్తికి నేతెంచి । యర్కుని యుదయంబు నస్తమయము**
**నగుపట్లు పొలిమేరలైన మహాక్షేత్ర । మంతయు నొక్కండ యనుభవించె;**

**ఆ. నన్నపర్వతముల నాజ్యనదుల విప్ర । భోజనము లొనర్చి రాజసూయ**
**ములును నశ్వమేధములుc జేసె మాంధాతృc । డింద నిలిచెనే నరేంద్రముఖ్య!' (శాంతి. 1-236)**

# 22. చార్వాకుడి ప్రశ్న-సమాధానం చావు

హస్తిన నగరం అప్పుడు ఉప్పొంగిన మహాసముద్రం వలె ఉన్నది.
మంగళాశీస్సుల మధ్య నగరిలో ప్రవేశించి గజశాల వద్ద రథం దిగి
ధర్మరాజు తనముందు ధౌమ్యుడు ధృతరాష్ట్రుడు నడుస్తుండగా
అంతఃపురం ప్రవేశించి ఇలవేల్పులను అర్చించి, దానధర్మాలు చేసినవేళ

బ్రాహ్మణుల ఆశీస్సులతో, శంఖభేరీ కాహళ మంగళవాద్యాల ఘోషలతో
ఆకాశం మారుమ్రోగుతుండగా అక్కడ ఉన్న బ్రాహ్మణ జనసమూహం మధ్యన
దుర్యోధనుని మిత్రుడైన చార్వాకుడనే రాక్షసుడు బ్రాహ్మణ వేషధారియై
సన్న్యాసిగా గొంతెత్తి అన్నాడు– విప్రజనం తరపున నేనడుగుతున్నాను నిన్ను–

–'గొప్ప పాపం చేసిన నీవెట్టి రాజువు? తండ్రి కొడుకు గురువు సోదరుడు
అని కూడా సందేహించకుండా అందరినీ చంపినవాడివి కదా నీవు?
అందరూ నిన్ను అసహ్యించుకుంటున్నారు, నీకెందుకయ్యా రాజ్యం?
బంధువులనందరినీ చంపి ఏ భోగాలు అనుభవిద్దామనుకుంటున్నావు?'–

ఆ మాటలు వినగానే ధర్మజుడు మ్రాన్పడిపోయాడు, విప్రులు నిశ్చేష్టులైనారు
వాళ్లన్నారు– ఇవి మా మాటలు కావు, ఇతడెవరో నీచుడు– అని వాళ్లు
ఎర్రబడిన కళ్లతో హుంకరించేసరికి భయంకర రూపంతో నేలకూలినాడు ఆ చార్వాకుడు
కృష్ణుడన్నాడు– ఈ చార్వాకుడు బ్రాహ్మణ ద్వేషంతోనే చావాల్సిన రాక్షసుడు, అలాగే చచ్చాడు.

---

**చ.** **'వినుము నరేంద్ర! సర్వమగు విప్రజనంబును గూడి నన్నుఁ బం**
**చిన విధ 'మీతఁ డేటిపతి? సేసిన పాపము పెద్ద; చంపుచో**
**జనకుఁడు భ్రాత పుత్రుఁడను శంక యొకించుక లేదు; సద్గురుం**
**డనియెడి కొంకు బుద్ధి నిసుమంతయుఁ బుట్టదు; వీనిఁ గాల్పనే!' (శాంతి. 1-361)**

**క.** **ఆ రాక్షసుఁ గనుఁగొని కో । పారంజిత నేత్రు లగుచు నవ్విప్రులు హుం**
**కార ముఖరు లగుటయు, నతి । ఘోరాకృతితోడ వాఁడు గూలెం బుడమిన్. (శాంతి. 1-367)**

---

**షోడశ మహారాజులు-యయాతి :-**

**సీ.** **'అనిమిషాసురయుద్ధమున నసురావళి । సమయించి, వర్ణాశ్రమముల నేర్ప**
**రించి, భూమి యలంకరించి యగ్నిష్టోమ । హయమేధ వాజపేయాతి రాత్ర**
**పౌండరీకము లనఁ బరఁగిన యధ్వరం । బు లనేకములు సేసి, భూసురులకు**
**నఖిల భూములఁ గల యర్థంబు లెల్లను । దనకని యేమియు నునుప కిచ్చె;**

**ఆ.** **శుక్రు నల్లుఁ డనఁగ శోభిల్లి తనయందు । ధర్మతత్త్వ మూర్జితముగ నియమ**
**నిష్ఠుఁడై యయాతి నెగడె; శాశ్వతుఁ డయ్యె । నే నృపాల యమ్మహీశ్వరుండు?' (శాంతి. 1-237)**

# 23. కొలువు తీరిన ధర్మరాజు

శ్రీకృష్ణుడన్నాడు– 'మారుకొన్నవారి నీరుసేయుము, ప్రజలను కాపాడుము.
నీ గొప్పతనం ప్రకటితమయ్యేలా బంధుమిత్రుల నాదరించుము.
రాజ్యాభిషేక శోభన మనుభవింపుము' –అని ధర్మరాజుతో పలికి
మహోన్నత హేమమయ సింహాసనంబు పెట్టించి, ఇతరులకు

సముచిత పీఠములను ఏర్పాటు చేయగా ధర్మజుడు కూర్చున్నాడు సింహాసనంబుపై
అతడికి ఎదురుగా బంగరు పీఠంపై సాత్యకి, శ్రీకృష్ణులు కూర్చునగా
ధర్మరాజుకు కుడి ఎడమల భీమార్జునులు, నకుల సహదేవులు
కృష్ణుడికి కుడిపక్క కుంతీదేవి, పక్కనే గొప్ప పీఠంపై ధృతరాష్ట్రుడు

అతడి వెనుక గాంధారి, యుయుత్సుడు, సంజయుడు, తూర్పున విదురుడు
ధౌమ్యుడు, కృష్ణుని ఆశీస్సులతో కరుణతో వచ్చిన కృపాచార్యుడు కూర్చుండగా
ధర్మరాజు తెల్లని పూలను, అక్షతలను, స్వర్ణరజతాలను, భూదేవిని స్పృశించాడు
పండిత పామరులు, రాజులు సేవకులు యావన్మందీ దర్శించుకున్నారు వారిని.

ఈశాన్య దిక్కున పల్లంగా ఉన్న వేదికపై నవరత్న ఖచిత స్వర్ణపీఠాన్ని ఉంచి
దానిపై పులితోలు పరచి, పూజించి, గొప్ప శంఖాన్ని అలంకరించి
దానిచుట్టూ మట్టివి, బంగారు, వెండి, మణి కలశాలలో గంగాజలాన్ని నింపి
ఆ గంగాజలంలో ఓషధులు, చిగుళ్లు, పూలు, పంచగవ్యాలు కలిపి చేసారు మంత్రపూతం.

---

**సీ. విద్వత్సమూహంబు, వివిధ దేశాధీశ। సంఘంబుఁ, గార్యవిచారపరులు**
**నర్థార్జనాది కృత్యంబుల వారలు, । బహుపరిచర్యలఁ బరఁగు జనులు,**
**వైశ్యప్రముఖ పౌరవర్గంబులును, ముఖ్య । హలికాది జానపదావలులును,**
**వైణిక గాయక వాంశికాది వినోద । కరులును, వారసుందరులు లోను**

**ఆ. గాఁగఁ దగినవారు గాంచి యవ్విభుని స । త్కారములఁ బ్రమోదితాత్ము లగుచు**
**భావములు దలిర్ప సేవించియుండ న । క్కొలువు సాల నొప్పెఁ గురువరేణ్య! (శాంతి. 1-372)**

---

**షోడశ మహారాజులు-అంబరీషుడు :-**

**సీ. 'ఓర్వక పెక్కండ్రు రుర్వీశు లొక్కటఁ । బైనెత్తి వచ్చిన భండనమున**
**వారిహేతిచ్ఛత్ర వాహనధ్వజములు । నఱకిన నడునడ నడిఁకి వార**
**లభయంబు వేఁడిన నందఱఁ గృపఁగాచి । యేచి యీపెన్నెల యెల్లఁ దాన**
**కొని యధ్వరములు పె క్కొనరించి వేడుకఁ । బాయసంబులు నపూపములు మోద**

**ఆ. కములు లోనుగాఁగఁ గల వంటకముల ను । ర్వీసురావళులకుఁ బ్రీతిఁ జేసి,**
**దక్షిణలుగ మణివితానంబు లిచ్చిన । యంబరీషుఁ డేమి యయ్యెఁ జెపుమ!' (శాంతి. 1-238)**

# 24. ధర్మరాజ పట్టాభిషేక మహోత్సవం

శక్తిమంతాలైన అనేక మంత్రాలతో, సద్బ్రాహ్మణ గణంతో పరివేష్ఠితుని చేసి
ధర్మరాజును తీసుకుని వెళ్లి ఆ స్వర్ణ మణిమయ సింహాసనంపై కూర్చుండబెట్టి
మంగళాలంకార శోభితయై మనోహరంగా ఉన్న ద్రౌపదిని ధర్మజునికి
ఎడమపక్క కూర్చుండబెట్టి, అగ్నిని ఎదురుగా ఉంచి దేవయజ్ఞ తంత్రము పూర్తిచేసి

నిర్ణయించిన శుభముహూర్తాన శ్రీకృష్ణుడు, అంతకుముందు పూజించిన శంఖాన్ని తీసి
దానితో 'పృథివి కధిపతివగుము' అని ప్రీతిగా పలికి ధర్మరాజును అభిషిక్తుని చేయగా-
ధృతరాష్ట్రుడు కూడా ధౌమ్యుని సాయంతో మేలైన కలశపు జలాలతో
అభిషేకించాడు ధర్మరాజును, మార్మోగినాయి మంగళవాద్యాలు, వేదఘోషలు.

ధర్మజుడన్నాడు- మాకు తండ్రి, గురువు, దైవం ఈ ధృతరాష్ట్రుడే
మీరందరూ ఇంతకు పూర్వం వలెనే ఈతడి ఆజ్ఞలను అమలు చేయగలరు.
భూమిపై ఉన్న ఐశ్వర్యానికి, మనకు విభుడీ ప్రభువే అని మరవవద్దు-
అని పలికి ధర్మరాజు యువరాజ పదవిలో నిలిపినాడు భీమసేనుడిని.

షడ్గుణ విచారానికి విదురుని, పనుల వరుస క్రమాన్ని, ఆదాయ వ్యయ నిర్వహణకు సంజయుని,
సేవకుల జీతభత్యాల నిర్వహణకు నకులుని, శత్రురాజుల నణచడానికి అర్జునుడిని,
బ్రాహ్మణుల సేవకు ధౌమ్యుడిని, తన రక్షణకై సహదేవుని నియమించి ధర్మరాజు
అందరినీ వారివారి ఇండ్లకు పంపి, తాను తుమ్మెదగా చూసాడు పుండరీకాక్షుని వేపు

---

**సీ.** **వీర్యవంతములగు వివిధ మంత్రంబుల । తోఁ గూడ సద్ద్విజస్తోమ పరివృ**
**తునిఁ జేసికొని రాజుఁ దోడ్కొనియేఁగి యా । వినుత పీఠంబున నునిచి, శోభ**
**నాలంకరణమున నభిరామ యైన పాం । చాలిఁ దద్వామపార్శ్వమున సహస**
**మాసీనఁ గావించి, యగ్నిముఖము సేసి । కొని హోమ తంత్ర వర్తన మొనర్చె;**

**తే.** **నంత నూర్జిత శుభవేళ యగుడు శంఖ । చక్రధరుఁ డా సమర్చిత శంఖ మెత్తి**
**'పృథివి కధిపతి వగు' మని ప్రీతి నా పృ । థాసుతుని నభిషిక్తునిఁ జేసె నధిప! (శాంతి. 1-374)**

---

**షోడశ మహారాజులు-శశిబిందుడు :-**

**సీ.** **'లక్ష భార్యల నుపలాలించి, యొక్కొక్క । వెలఁదికి వేవురు వేవురాత్మ**
**జులు గాఁగఁ బదికోటు లలఘుమూర్తులఁ గాంచె; । వారును దోర్బలోజ్జ్వలులు నార్య**
**చరితులునై పేర్చి తురగ మేధంబు లం । దఱు బహు దక్షిణోదాత్త భంగిఁ**
**జేయుచుఁ దనపంపు సేసి వర్తింపంగఁ । దానును విశ్రుతాధ్వరము లొప్పఁ**

**తే.** **బెంపు సొంపును సువ్రత సంపదయును । నిర్మల శ్రద్ధయును గర్మ నిపుణతయును**
**నెఱయ శశిబిందుఁ డొనరించి నెగడె నతఁడు । వడయఁ జాలెనె యెన్నఁడుఁ జెడనియొడలు?' (శాంతి. 1-239)**

# 25. దామోదర! నీపెంపెరుంగ నొరుల కలవియే!

బంధువులకు స్నేహితులకు ఉత్తర క్రియలు చేసి ఋణం లేనివాడై ధర్మరాజు శ్రీకృష్ణునితో అన్నాడు- నేను రాజునయ్యానంటే అదంతా నీ అచ్చమైన అనుగ్రహమే! మమ్మల్ని బావలు, మరదులు అంటూ ఎంతో ప్రేమతో గౌరవించావు, రక్షించావు. నీవిటువంటి వాడివని ఇదమిత్థంగా చెప్పడానికి వేదాలే భయపడుతున్నాయి.

పురుషోత్తమా, నీవు విశ్వత్‌వ్యాపకుడైన విష్ణుదేవుడివి, జయశీలియైన జిష్ణుడివి విశ్వాత్ముడివి, సర్వప్రాణుల సంహరించే శర్వుడివి; ఉచ్ఛ్వాస నిశ్వాస రూపహంసుడివి మాల ఉదరమునందున్న దామోదరుడివి, భక్తులకు సుఖాన్ని కలిగించే శంభుడివి- అని గొప్ప నామములతో ప్రస్తుతించగా శ్రీకృష్ణుడు అభినందించాడు ధర్మజుడిని.

సోదరులారా! రాజ్యాంగ సప్తకములైన- ప్రభువు, మంత్రము, ధనాగారము, దుర్గము, సైన్యము, రాష్ట్రము, మిత్రబృందము -వీటిని జాగరూకతతో గమనించండి. ఎన్నో కష్టాలనుభవించిన మీరు, కృష్ణప్రసాద లబ్ధమయిన రాజ్య వైభవాన్ని, మీమీ ఇష్టాలతో కూడిన సుఖాలతో హద్దులు మీరని విధంగా అనుభవించండి!

-అని పలికి దుర్యోధనుడి భవనాన్ని భీమునికి, దుశ్శాసన మందిరం అర్జునుడికి దుర్మర్షణుడి గృహాన్ని నకులుడికి, దుర్ముఖుడి నికేతనం సహదేవుడికిచ్చి, ధృతరాష్ట్ర, యుయుత్స, సంజయ, విదుర, ధౌమ్యులకు వారివారి మందిరాలనిచ్చినాడు. ధర్మరాజు కూడా తనకు నచ్చిన విధంగా ఉంటూ ప్రారంభించినాడు హస్తినాపుర పాలన.

---

సీ. బహురత్నమయ ఘనప్రాసాదమండప । దాసదాసీ జనోద్భాసితంబుఁ,
దత్తుల్య వైభవ తదధిక ధనధాన్య । ముఖవస్తు సంచయ సుఖకరంబుఁ,
గిన్నర వల్లభ గృహసమానత్వ మ । హావిభూతి స్ఫురణాంచితంబు,
సర్వసంపత్స్ఫూర్తి చారు వామాక్షీ ప్ర । చార సంశోభిత స్థలచయంబు,

తే. నైనవాని రారాజుని ల్లనిలజునకు, । దుస్ససేను మందిరము పార్థునకు, వరుస
తోడ దుర్మర్షణునియును దుర్ముఖునియు । నిండ్లు గవలకు సంప్రీతి నిచ్చె నృపతి. (శాంతి. 1-396)

---

**షోడశ మహారాజులు-గయుడు :-**

సీ. 'అధిక తపంబున నగ్ని నారాధించి । ప్రత్యక్షమగుటయు బ్రహ్మచర్య
వృత్తంబు దమమును వేదవిత్త్వము నహిం । సయుఁ బాత్రదానంబు శమము వరము
గాఁ గోరికొని వేదికాస్థలి మణికన । కాత్మిక యై ముప్పదాఱు యోజ
నముల దైర్ఘ్యము నంత కమరు విస్తారంబుఁ । గలుగంగ నొనరించి క్రతువు సేసి

తే. విప్ర తతికి దాని నతి ప్రియమున । నిచ్చెఁ; దనపేర గయ నుతి కెక్క వటము;
పొగడు వడయంగఁ బుణ్యుఁడై నెగడె గయుఁడు । భూవరోత్తమ! యతఁ డెందు బోయెఁ జెపుమ!' (శాంతి. 1-240)

# ✧ 12. శాంతి పర్వము - ద్వితీయాశ్వాసము ✧

## 26. నూతనోదితర విద్యోతితో దయగిరినిభున్-

సమధిగత సామ్రాజ్యుండైన ధర్మజుడు ఆశ్రిత జనరక్షకుడై, స్నేహబాంధవుడై
ధృతరాష్ట్ర గాంధారి విదురులకు రాజ్యాన్ని సమర్పించి- వారిని ప్రభువులుగా పలికి
ప్రతిరోజూ వారి అనుమతి తీసుకుని, పాలనా విషయాలను చర్చించి, శ్రద్ధగా
ప్రజలకు పూర్వంకన్నా అధికమైన జీవనభృతులను కలిగించి, సహాయం చేస్తూ

భర్తలను పోగొట్టుకున్న స్త్రీలకు దుఃఖం కలగకుండా దయతో గమనిస్తూ
యుయుత్సు సంజయ కృపాచార్యులను గౌరవిస్తూ, తల్లి కుంతీదేవిని సేవిస్తూ
ద్రౌపదికి సంతోషాన్ని కలిగిస్తూ, పితృదేవతలకు పూజాదికాలు నిర్వర్తిస్తూ
అతిథులను గౌరవిస్తూ, అభ్యాగతులను సంరక్షిస్తూ నగర గ్రామ ప్రజలనందరిని

కన్నబిడ్డల్లా చూసుకుంటూ సోదరుల సాయంతో దివ్యంగా సాగిస్తున్నాడు పాలన.
ఒకరోజున తెల్లవారుజాముననే లేచి అర్జునుడి భవనంలో కృష్ణుడున్న
విడిదింటికి వెళ్లి ధ్యాన నిమగ్నుడైన శ్రీకృష్ణ పరమాత్మను చూసినాడు
-మణిహేమ పర్యంక మహితోపవేశుని, సురుచిరాభరణ విస్ఫురితగాత్రుని

కౌస్తుభ రత్నాన్ని హారంగా రొమ్ముపై ధరించినవాడిని, పచ్చని వస్త్రాన్ని హారంగా
వేసుకుని, మేరు పర్వతంపైని మేఘంలా, చుక్కల సమూహంతో ఉన్న గగనంలా
ఉదయసూర్యకాంతితో ఒప్పారు ఉదయగిరిలా, బంగారంలో పొదిగిన ఇంద్రనీలంలా
స్వర్ణశయ్యపైన చక్కగా కూర్చున్న శరణాగత రక్షకుడైన కృష్ణుని చూసి అన్నాడు-

---

**సీ. మణిహేమ పర్యంక మహితోపవేశుని సురుచిరాభరణ విస్ఫురితగాత్రుఁ,**
**గౌస్తుభరత్న వికాసి వక్షస్థులుఁ, బీతకౌశేయ సంవీతమూర్తి,**
**మేరు తటీగత మేఘసంకాశు నక్షత్రగణావృత గగన సదృశు,**
**నూతనోదిత రవి ద్యోతితోదయ గిరి నిభు రుక్మ బద్ధేంద్రనీల తుల్యు,**

**ఆ. నమ్మురారిఁ గని కృతాంజలి యై భక్తిఁ జిత్తవృత్తి గరము జొత్తిలంగ**
**నంతకంత కాననాంబుజ మలరంగ। నిట్టు లనియెఁ దియ్య మెసక మెసఁగ. (శాంతి. 2-3)**

---

**షోడశ మహారాజులు-రంతిదేవుడు :-**

**సీ. 'ఇరువది వేవురు పరిణతపాచకు। లభ్యాగతులకును నతిథులకును**
**బాటించి క్రొత్తగాఁ బవలును రేయును। వలయు నన్నము లిడ వెలసి పశువు**
**లర్థి నుత్తమ గతికై తార చనుదేర। విశొసించు చమరులు వేద్కతోడఁ**
**బొడసూపి కడుపారఁ గుడువ హవిర్భాగ। ములు వెట్టు నివ్విధంబున మహోద్ధు**

**తే. తముగ నొనరించె సత్త్రయాగము తదుత్స। వంబు గొనియాడ వచ్చిన వార లెల్లఁ**
**బ్రచుర పుణ్యాత్ముఁ డన నొప్పె రంతిదేవుఁ;। డవ్విభునకును వలసె లోకాంతరంబు.' (శాంతి. 1-241)**

# 27. సంతసమందు నీదయిన సన్నిధిగాంచిన భక్తవత్సలా-

ధర్మరాజు చూసాడు ధ్యాన నిమగ్నుడైన శ్రీకృష్ణుని, అతడు కనులు తెరిచాక
అన్నాడు- 'పంచాత్మకమైన పవనంబు నిగ్రహించబడి, దశేంద్రియములు
మనసులో నిలిపి, మనసును బుద్ధియందు చేర్చి ధ్యానమార్గంలో
లోలనారహితం చేసి క్షేత్రజ్ఞుడైన జీవునియందు చేర్చినావెందుకు కృష్ణా!

ఆద్యంతములు లేనివాడా, నివాత నిశ్చల దీపములా నిలిచినావేల తెలుపుమా!'-
అని ధర్మజుడు ప్రార్థించ పాంచజన్యధరుడైన శ్రీకృష్ణపరమాత్మ అన్నాడు-
'సురగంగ సుతుడు, భార్గవుని శిష్యుడు, పరశురాముడితో ఇరవైమూడు రోజులు
పోరాడినవాడు, కాశీరాజ పుత్రికల స్వయంవర సందర్భాన రాజులందరిని గెలిచినవాడు,

చతుర్వేద ధనుర్వేదములు మహాస్త్రములుగా తనలో వెలిగినవాడు, భీష్ముడు
నన్ను స్మరిస్తున్నాడు, శరతల్పగతుడై, జ్ఞాన కర్మేంద్రియాలను నిగ్రహించి
స్మరిస్తున్నాడు నన్ను తన అస్తమయ కాలాన; వెళ్లి తెలుసుకో నీవు సమస్త ధర్మాలను
చేసుకో సంశయ నివృత్తిని'- అనగా ధర్మజుడన్నాడు గద్గద కంఠంతో-

'ఏమని అడుగను, ఎలా నా ముఖం చూపించను నా ప్రియ పితామహుడికి?
అతడి ఒడిలో ఆటలాడుకున్న నేను అతడిని శరతల్పంపై పడవేయించాను.
ఉత్తరాయణ పుణ్యకాలం కోసం ఎదురుచూస్తున్న ఆ మహనీయుడు భీష్ముడు
పరబ్రహ్మ స్వరూపుడవైన నీ సాన్నిధ్యాన్ని అభిలషిస్తున్నాడేమో, అనుమతిస్తే నేనూ వస్తాను'-

---

సీ. 'పంచాత్మకంబైన పవనంబు నిగృహీత మైనది, భవదింద్రియములు మనము
నందాఁగఁ బద్దవి, యవియును నదియును । బుద్ధియం । దొదిఁగించి శుద్ధమైన
నాలవ తెరువున లోలతారహితముల్ । గాఁగ నిన్నియును సంకలితములుగ
నంచిత క్షేత్రజ్ఞునందుఁ గూర్చినవాఁడ । వీ పరమధ్యాన మేమి కతన

తే. నొలసెనొకొ! లోకములకు నొండొక్క వింత । లేక నెమ్మది యున్నదియే? కరంబు
విస్మయముఁ బొందె నా మది; వినఁగ నర్హ । మేని వినిపింపవే నాకు నిత్తెఱంగు.' (శాంతి. 2-8)

---

**షోడశ మహారాజులు-భరతుడు :-**

సీ. 'శరభ సింహోత్యుగ్ర సత్త్వచయంబుల । నేడిక లెట్లట్ల యెక్కియాడి,
కట్టుచు విడుచుచుఁ గణ్వాశ్రమంబున । దమియింపఁగా సర్వదమన నామ
మిడియె నమ్మునిః పదంపడి మహారాజ్య । పదస్థుఁడై కాళిందితటమునందు
భాగీరథీ తీరభాగంబునను సర । స్వతి సమీపమునను వాజిమేధ

తే. రాజసూయాది వివిధాధ్వరము లొనర్చి । కనక నిర్మిత కరితురంగమ రథంబు
లసదృశ ప్రీతి విప్రుల కొసఁగె భరతుఁ; । డన్నరేంద్రచంద్రుండును జన్నవాఁడ.' (శాంతి. 1-242)

# 28. పెద్దలకు చాలా పెద్దయగు దయాళు కొలుతు-

శ్రీకృష్ణ ధర్మజులు భీష్ముని వద్దకు వెళ్లడానికి దారుకుడు సిద్ధం చేస్తున్నాడు రథం.
అదే సమయాన శరతల్పగతుడైన గాంగేయుడు స్తుతిస్తున్నాడు దేవదేవుని.
అతడి చుట్టూ పరివేష్ఠించి ఉన్నారు వ్యాస, నారద, దేవల, దేవస్థాణుడు
వాత్స్య దేవరాతాది మునులు, గ్రహపరివేష్ఠితుడైన చంద్రుడిలా ఉన్నాడతడు.

శరశయ్యపై సందర్శనీయ గభస్తి వితానుండగు అస్తమయ సూర్యుడిలా ఉండి
ప్రార్థిస్తున్నాడు సురగంగ పుత్రుడు– నేను అర్చిస్తున్నాను ఆ భగవానుని–
–శుచియు, హంసుడు, శుచిషత్తు, పరముడు, పరమేష్ఠి, శ్రీహరి
సర్వవిదుడు, పుణ్యమూర్తి, సృష్టి స్థితి లయములకు కారణభూతుడిని.

పక్షి పంజరాన్ని, రత్న సమూహం దారాన్ని, పూలు సన్నటి దారాన్ని
ఆశ్రయించినట్లు విశ్వమునకు ఆధారమైన ఆ పుండరీకాక్షుని అర్చిస్తాను.
సహస్రశీర్షుడు, సహస్రాక్షుడు, వేదమయుడు, సహస్రపాదుడు
చిన్నవారికంటే చిన్నవాడు, పెద్దవారికంటే పెద్దవాడైన శ్రీకృష్ణుని స్మరిస్తాను.

అమృతమయుడు, వేద ఉపనిషత్తుల వాక్యాలతో స్తుతింపదగినవాడు
సత్యస్వరూపుడు, భక్తిగమ్యుడు, యజ్ఞవేద రక్షకుడు,
ద్వాదశ సూర్యాత్మకుడు, వామన–త్రివిక్రముడు, ఓషధీరూపుడు
గరుత్మంతుడిని ఆత్మగా కలవాడు ఆ క్షేత్రాత్ముడిని స్మరిస్తాను.

---

**సీ.** **'శుచియును హంసుండు శుచిషత్తుఁ బరముండుఁ । బరమేష్ఠియును నగు భవ్యుఁ గొలుతు;**
**మునులును సురలు నెవ్వనియున్నరూపెఱుం । గరు సర్వవిదుని నప్పురుషుఁ గొలుతు;**
**శ్రుతులు సెప్పఁగ మహామతులు దుఃఖౌషధం । బుగ నెఱింగెడు పుణ్యమూర్తిఁ గొలుతు;**
**లోకంబు లెల్లఁ గల్గుట నిల్చు టొదుఁగుట । తనయంద యగు మహోత్తరునిఁ గొలుతు;**

**తే.** **బక్షి రత్నచయంబు బుష్ప వజ్రంబుఁ । బంజరము త్రాడు నార యుపాశ్రయముగ**
**నుండు చాడ్పున విశ్వంబు నుండుటకు సు । ఖాస్పదం బగు పుండరీకాక్షుఁ గొలుతు. (శాంతి. 2–20)**

---

**షోడశ మహారాజులు-పృథుడు :-**

**సీ.** **'మిఱ్ఱు పల్లంబునై మెలఁగంగఁ దనరథ । ప్రముఖ వాహనములఁ బఱప ననువు**
**గాకున్న మేదినిఁ గని సమస్థలియుగ । వెరవున నొనరించి విశ్రుతముగఁ**
**దనపేరఁ బృథివి నాఁ జనఁజేసి గోరూప । మైన యివ్వసుమతి నమరనగముఁ**
**బనిచి యోషధులును బహురత్నములుఁ । బిదికించి జనంబుఁ బోషించెఁ బృథుఁడు;**

**తే.** **సేసె నానాధ్వరము లవి సెప్ప నేల? । సకల ధాత్రి బ్రాహ్మణులకు సత్కరించె;**
**నమ్మహానుభావునకును నతులయశము । కాక సుస్థిరమయ్యెనే కాయ మనఘ! (శాంతి. 1–243)**

# 29. సర్వాత్మకు నట్టి వృష్ణి సత్తము తలతున్-

సాంఖ్యాత్ముడు, యోగనిద్రా ముద్రితుడైన శేషశయనుడు, మోక్షప్రదాత,
బ్రహ్మానందస్వరూపుడు, భూమి పాదాలుగా, నాభి ఆకాశంగా,
తల స్వర్గంగా ఉన్న మహాంగుడు, సూర్యుడు ముఖంగా ఉన్నవాడు, లోకాత్ముడు
వటపత్రశాయి, మేఘాలను కురులలో, నదులను సంధులలో

సముద్రాలను కడుపులో దాచుకున్న దేవకీదేవి పుత్రుడిని స్మరిస్తాను.
ముఖం నుంచి జ్ఞానులను, భుజాల నుంచి ప్రజా రక్షకులను
ఊరువుల నుండి వ్యాపారవేత్తలను, పాదాల నుంచి కర్మచారులను -నాలుగు
వర్ణాల నేర్పరచిన శ్రీమహావిష్ణువును నేను మనసారా స్తుతిస్తాను.

నెలలు ఋతువులు ఆయనాలు సంవత్సరాలు తానే అయిన కాలస్వరూపుడిని,
యోగి భోగి అయినవాడు, ఆదిశేషుని ఆత్మగా కలిగిన అనంతుడు,
ద్వాదశాదిత్యులు మరుత్తులు అష్టవసువులు ఏకాదశ రుద్రులకు
స్థానమై మహాదేవుడైనవాడు, సర్వాత్మకుడిని నేను అర్చిస్తాను.

స్మరిస్తాను నేను మీనావతారాన సోమకుడిని చంపి వేదరక్షణ చేసిన వాడిని,
కూర్మావతారాన మందర పర్వతానికి ఆధారమై నిలిచినవాడిని
వరాహావతారాన ఏకదంష్ట్రచే భూమినెత్తి నిలిపినవాడిని
నరసింహావతారాన హిరణ్య కశిపుని చంపి ప్రహ్లాద రక్షణ చేసినవాడిని.

---

**ఆ.** హరి సహస్ర శీర్షుఁ బరము సహస్రాక్షు । వేదమయు సహస్రపాదు నలఁతు
లైన వారి కంటె నలఁతి పెద్దలకును । జాలఁబెద్ద యగు దయాళుఁ గొలుతు. **(శాంతి. 2-21)**

**క.** సర్వము నందును దానున్ । సర్వముఁ దనయందు నుండు సంచారంబున్
సర్వమునకుఁ దన వలనన । సర్వాత్మకు నట్టి వృష్ణిసత్తముఁ దలఁతున్.

**క.** మీనయి తా నతలగతం । బైన నిగమ చయముఁ దెచ్చి యజునకు నొసఁగం
గా నేర్చిన సుమనస్స । మ్మానిత విగ్రహు భజింతు మత్స్యాత్మ హరిన్. **(శాంతి. 2-39)**

---

**షోడశ మహారాజులు-పరశురాముడు :-**

**సీ.** 'బ్రహ్మ విద్వేషంబుఁ బరికించి కోపించి । యవిజేయుఁడైన సహస్రబాహుఁ
బరిమార్చి నృపతులఁ దరమిడి తునుమాడె । నిరువదియొక్క మా ఱెల్లచోట
నందఱయేలెడు నన్ని భూములుఁ దాన । యేలె ధర్మోజ్జ్వల పాలనమున;
రాజయోగ్యములు ధరామరార్హంబులు । నగు నధ్వరములు పె క్కాచరించెఁ;

**ఆ.** గశ్యపునకు నిచ్చి కాశ్యపి యను పేరఁ జనఁగఁ జేసె నుర్వి జామదగ్న్యు
వినమె యామహాత్ముఁడును ససంతోష వి । భ్రాంతి గలిగెనేని బ్రదుక లేఁడు.' **(శాంతి. 1-244)**

# 30. 'నమః కృష్ణాయ' అనుచు మ్రొక్కె విశ్రుత భక్తిన్-

వామనావతారమెత్తి బలిచక్రవర్తిని మూడడుగులడిగి త్రివిక్రముడైన వాడిని
పరశురామావతారమెత్తి ఇరవై ఒక్కసార్లు క్షత్రియ నాశనం చేసినవాడిని
రామావతారమెత్తి రావణ సంహారము చేసి క్షత్రాత్ముడైనవాడిని
బలరాముడిగా నాగలి రోకలి ఆయుధాలుగా, కృష్ణుడిగా చక్రాయుధుడైన వాడిని,

కలియుగంలో విచలితమయ్యే ధర్మాన్ని నిలబెట్టే కల్కిని నేను స్మరిస్తాను.
సమస్త బుద్ధి వ్యాపారాలకు సాక్షీభూతుడైన ముకుందుడిని పూజిస్తాను.
పరమేశ, పుణ్య, సుబ్రహ్మణ్య, భక్తవత్సల, మహదేవ, హృషికేశ,
విశ్వ ప్రకాశ కరణ, వరద, నారాయణ, రాజీవ నయన, హిరణ్యనాభ

అఖిలలోక నమస్కృత అంఘ్రి సరోరుహ, యజ్ఞాంగ, అచ్యుత
అమృతరూప, శ్రీకృష్ణా –నీకు మ్రొక్కెద కరుణింపవే తండ్రీ నన్ను నీవు!
మధురిపా, అంభోజాక్షా, విహంగమ ధ్వజా, శుభంకరా
పరబ్రహ్మ, మోక్ష, అత్యున్నత సత్య, తపస్సులధీనమై ఉన్నవాడా!

అగ్ని, హవిస్సు, సమస్త స్వరూపా, కల్మషము లేని నాకు కానవస్తున్నావు
నీ పరమ భక్తుడనైన నాకు మోక్షమును ప్రసాదించుము తండ్రీ!–
సమస్త విద్యలకు, సర్వతపస్సుల పుట్టుకకు స్థానమైనవాడు, యజ్ఞ స్వరూపుడు
విష్ణువును పూజించాను స్తవరాజంతో, అతడు నాకు మోక్షమొసగును గాక!

---

క. అమృత మథనమున మంథన । గము లీలోద్ధరణకేళిఁ గైకొని సురసం
ఘమునకుఁ బ్రియ మొనరించిన । యమేయుఁ గూరాత్మ నంబుజాక్షుం గొలుతున్. (శాంతి. 2-40)

క. వారాహ రూపమునఁ బెం । పారిన తన దంష్ట్ర నొకట నవని సగిరికాం
తారంబుగ నెత్తిన యా । శౌరిం గ్రోడాత్ముఁదలఁతు సమ్యగ్భక్తిన్. (శాంతి. 2-41)

ఆ. నారసింహవపు రుదార భావము నొంది । ఘను హిరణ్యకశిపు ఖర నఖముల
వ్రచ్చి దీప్తమూర్తి వఱలు నృసింహాత్ము । నాత్మభవుని భక్తి నాశ్రయింతు. (శాంతి. 2-42)

క. వామన రూపంబున ను । ద్దామ బలున్ బలి నడంచి త్రైలోక్యాతి
క్రామితఁ బేర్చిన యద్భుత । ధాముం గ్రాంతాత్ముఁ దలఁతు దామోదరునిన్. (శాంతి. 2-43)

ఆ. పరశురాముఁ డనఁగ భవ్యుఁడు జమదగ్ని । కుద్భవించి యిరువదొక్కమాఱు
మనుజపతుల నెల్లఁ దునిమిన క్రోధాత్ము । నధిక భక్తి శౌరినాశ్రయించు (శాంతి. 2-44)

క. క్షత్రాత్ముఁ గొలుతు దశరథ । పుత్రున్ శ్రీరాముఁ డనఁగఁ బొలిచిన దేవున్
శత్రుభయదు రావణు నొక । మాత్రం దునుమాడినట్టి మధుసూదనునిన్. (శాంతి. 2-45)

– యధా విష్ణుమయం సత్యం యధా విష్ణుమయం జగత్
యధా విష్ణుమయం సర్వం పాప్మామే నశ్యతాం తథా (సం.శాంతి. 47-97)

# 31. పరశురాముని చరిత్ర

స్తవరాజంతో తనను స్తుతించిన శాంతనవుడిని మనసులో ఆశీర్వదించి
ధర్మజునితో కలిసి బయల్దేరినాడు శ్రీకృష్ణుడు భీష్ముడున్న చోటుకు.
సాత్యకి శ్రీకృష్ణులొక రథంలో, ధర్మజ ధనంజయులింకొక తేరులో,
భీమ నకుల సహదేవులింకొక వాహనంలో, కృప యుయుత్స సంజయులు

వారొక రథంలో రాగా, తగిన పరివారంతో కూడి, యుద్ధభూమి
అస్థికేశ బహుళంబై, బహు ద్విప కుంభ ఖండ నర కపాలపాళి
నిబిడంబుగా, ప్రేతపతి తాగి తిని వదిలేసిన పానశాలలా కనిపించగా
శమంత పంచక సరస్సులను దాటుతూ ఉండగా కృష్ణుడు వివరించాడు-

'ధర్మరాజా, జహ్నుడనే రాజుకొడుకు ఉజహ్నుడు, అతడి పుత్రుడు వల్లభుడు
వల్లభుని కుమారుడు కుశికుడు, కుశికుని పుత్రుడు కౌశికుడు
ఇతడే ప్రసిద్ధుడైనాడు గాధి పేరుతో; గాధి పుత్రిక సత్యవతి
సత్యవతి భర్త ఋచీకుడు, మామా అల్లుళ్లు వాంఛించారు సంతతి

ఋచీకుడు రెండు చరువులను హవిర్భాగాలుగా ఇచ్చాడు తన భార్యకు
మొదటి భాగం వలన ఉత్తమ క్షత్రియుడు జన్మిస్తాడు- దీనిని మీ మాతృమూర్తికిమ్ము
రెండవ భాగాన్ని నీవు ఆరగించు- తపస్సంపన్నుడైన బ్రాహ్మణుడు నీకు జన్మిస్తాడు
అని పలికి నదీ స్నానానికి వెళ్లగా, అప్పుడే వచ్చారు ఆమె తల్లిదండ్రులు.

---

**క.** **హల ముసల ధరునిఁ గరుణా । నిలయ హబుదయు రాము రౌహిణేయు సితాంగున్**
**జలద నిభాంబరుని శుచిం । దలఁతును గోవిందు శౌర్యధను భోగాత్మున్. (శాంతి. 2-46)**

**మ.** **యదువంశంబున వాసుదేవుఁ డనఁ గ్రీడార్థంబు జన్మించి, దు**
**ర్మద దైత్యావలిఁ గూల్చి, పార్థునకు సారథ్యంబు త్రైలోక్య స**
**మ్మద మారంగ నొనర్చి, దేవముని సమ్మానోద్ధృతిన్ భూభరం**
**బు దొలగించిన చక్రి నంబురుహనాభుం గొల్తుఁ గృష్ణాత్మునిన్. (శాంతి. 2-47)**

**క.** **కలికాల చలిత ధర్మము । నిలుపంగల యట్టి విష్ణునిం గల్యాత్మున్**
**దలఁతుఁ దురగ వాహను మ్లే । చ్ఛుల నెల్లం గీటడంచు శుభచారిత్రున్. (శాంతి. 2-48)**

**ఆ.** **క్షరము లైన భూత సంఘంబులం దెల్ల । నక్షర స్వరూపుఁడై వెలుంగు**
**సకల బుద్ధివృత్తి సాక్షి సాక్ష్యాత్ము న । స్పందబోధఘను ముకుందుఁ దలఁతు. (శాంతి. 2-49)**

**క.** **మంగళము విష్ణుదేవుఁడు । మంగళ మెమ్మెఁ దలంప మధురిపుఁ డుద్య**
**న్మంగళ మంభోజాక్షుఁడు । మంగళ మఖిలము విహంగమ ధ్వజుఁ డరయన్. (శాంతి. 2-51)**

**క.** **స్తవరాజం బనఁగ ముని । స్తవనీయం బైన యా వృషాకపి భవ్య**
**స్తవనామృతార్ణవము సం । స్తవనంబున నిచ్చు సుగతి జగతీనాథా! (శాంతి. 2-58)**

# 32. నీ బాహువులు రాముండు నరకువాడు-

అక్కడ ఉన్నాయి రెండు హవిర్భాగాలు, సత్యవతి మరచిపోయింది ఏది ఎవరికి అన్నది.
తాను తినాల్సింది తల్లికిచ్చి, తల్లికివ్వాల్సిన దానిని తాను తీసుకుని ఇద్దరూ తిన్నారు భక్తితో
నది నుంచి వచ్చిన ఋచీకుడన్నాడు- తప్పు జరిగింది మీవలన
సత్యవతీ, నీ గర్భంలో పరమక్రూరుడు పుడతాడు, అర్థం చేసుకో!

నీ తల్లికి బ్రహ్మజ్ఞాని తపస్సంపన్నుడైనవాడు జన్మిస్తాడు -అన్నాడు.
సత్యవతి తన భర్త కాళ్లావేళ్లా పడితే అతడన్నాడు- మన పుత్రుడు
క్రూరుడు కాదు కాని అతడి పుత్రుడు క్రూరుడై ఖ్యాతినొందుతాడు.
ఋచీక సత్యవతులకు పుట్టినాడు జమదగ్ని. జమదగ్ని భార్య రేణుక.

గాధి దంపతులకు జన్మించినాడు బ్రహ్మర్షి సదృశుడైన విశ్వామిత్రుడు.
జమదగ్ని రేణుక దంపతులకు పుట్టినాడు అగ్ని సమానుడైన పరశురాముడు.
ఆ కాలంలో హైహయ వంశ తిలకుడు వేయి చేతులు కలిగినవాడు
కార్తవీర్యార్జునుడు సప్త ద్వీపాలతో కూడిన భూమిని పాలిస్తున్నాడు.

అగ్నికి ఆకలి ఎక్కువై రాజును వేడుకోగా పెద్ద ప్రాంతాన్ని
అరణ్యాలు, పట్టణాలు, పల్లెలున్న దానిని ఇవ్వగా దానిని భక్షించాడగ్నిదేవుడు
ఆ దహనకాండలో వసిష్ఠుడి తపోవనమూ కాలి భస్మమయ్యింది.
అతడు శపించాడు కార్తవీర్యార్జునుడిని- 'నీ వేయి చేతులు నరుకుతాడు పరశురాముడు'-

---

సీ. కలఁడు జహ్నుం డనఁగాఁ దొల్లి యొక మహీ । పతి యుజహ్నుండు దత్సుతుఁడు; వాని
కుదయించె వల్లభుం డుర్వీశ! యాతని । కొడుకు తపోనిష్ఠఁ గుశికుఁ డింద్రు
మెచ్చించి జగముల మేటినాఁ దగుపుత్త్రు । వేఁడిన దాన నవ్విభున కుద్భ
వమ్మయి కౌశికుఁ డిమ్మహి గాధి నా । మమ్మునఁ బరగె నమ్మనుజశిభుఁడు

తే. సత్యవతి యను తన కన్య సంప్రమోద । మున ఋచీకున కిచ్చె; నమ్ముని సుకర్మ
నిరతి సంతాన వాంఛమైఁ జరు యుగంబుఁ । దనకు మామకునై కల్పితముగఁ జేసి. (శాంతి. 2-68)

ఉ. దుర్జయ విక్రమోజ్జ్వలుఁడు దోష వివర్జిత బుద్ధి కార్తవీ
ర్యార్జునుఁ డేడుదీవులు నయాన్విత శూరత నేలుచుండ ధ
ర్మార్జనలోల బుద్ధియు మహాస్త్రబలంబు సహస్ర బాహుతా
స్ఫూర్జనమున్ వెలుంగఁగ నృపుల్ దన యాజ్ఞఁ దలన్ వహింపఁగన్ (శాంతి. 2-74)

- ఆపవస్తు తతో రోషాత్ శశాపార్జున మచ్యుత
దగ్ధే శ్రమే మహాబాహో కార్తవీర్యేణ వీర్యవాన్-

- త్వయాన వర్జితం యస్మాత్ మమేదం హి మహద్వనమ్
దగ్ధం తస్మాద్రణే రామః బాహూం స్తే ఛేత్స్యతేర్జున (సం.శాంతి. 49-42,43)

# 33. రౌద్రమొప్ప ఇలన్ రక్తస్యంద సంసిక్తగన్-

దుర్జయ విక్రమోజ్జ్వలుడు దోష వివర్జిత బుద్ధిగల కార్తవీర్యార్జునుడు
వసిష్ఠుని శాపమును విని విషాదము పొంది, విధికి ధర్మ నిర్ణయాన్ని వదిలి
ధర్మకార్యములను నిర్వహిస్తుండగా, అతడికి శాప ఫలితంగా జన్మించారు
నీతిలేనివారు, వేగిరపాటు కలవారు సింహ పరాక్రములైన పుత్రులనేకురు.

వారొకనాడు జమదగ్ని లేని సమయాన అతడి తపోవనంలో ప్రవేశించి
హోమధేనువును, దూడతో సహా తెచ్చి కట్టివేసారు తమ అంతఃపురంలో.
పరశురాముడు కోపంతో ధనుర్బాణాలు గండ్రగొడ్డలి తీసుకుని వెళ్లాడచటకు
ఇద్దరి మధ్య వాగ్యుద్ధం యుద్ధం కాగా కార్తవీర్యార్జుని చంపినాడు పరశురాముడు.

పగతో రగిలిన కార్తవీర్యుని పుత్రులు పరశురాముడు లేని సమయాన
జమదగ్ని తల నరికిపోగా రాముండుద్ధత రోషపావక శిఖాప్రస్ఫీతుడై
సమస్త క్షత్రియ సమూహాన్ని ఇరవై ఒక్కసార్లు దండెత్తి చంపివేసినాడు
వెదకి వెదకి మరీ బాలురు వృద్ధులని లెక్కచేయక, ఆనక చేసాడు అశ్వమేధయాగం.

సమస్త రాజులను చంపి ధరణీతలాన్ని దానంగా ఇచ్చాడు కశ్యప మహర్షికి
పరశురాముని దక్షిణ సముద్ర తీరానికి పొమ్మని కశ్యపుడు ఆనతిచ్చి, ధరణిని
బ్రాహ్మణ సమూహానికివ్వగా భూమి పిలువబడింది 'కాశ్యపి'గా అప్పుడు.
బ్రాహ్మణులు ధర్మపథం తప్పగా క్రుంగిన భూమిని పైకెత్తినాడు తన ఊరువుల ఆధారంగా.

---

**క. అట రాముఁ డెఱిఁగి పరమో । ద్భట మగు కోపమునఁ జాప పరశుముఖ మహో**
**త్కట శస్త్రాస్త్రంబులతోఁ । బటుగతి వచ్చెను సహస్రబాహుని మీఁదన్. (శాంతి. 2-79)**

**ఆ. వచ్చి ముట్టి కయ్య మిచ్చిన నవ్విభు । నొంచి బాహు వనముఁ జంచ దుగ్ర**
**పరశు ఘోరధారపాల్ సేసి పోయి ని । జేచ్ఛ నుండె మేదినీశవర్య! (శాంతి. 2-80)**

**చ. అతఁడు సమిత్కుశాభిహరణార్థము గానకు నేఁగియుండఁగా**
**నతి కుపితాత్ము లై కడఁగి యర్జునసూనులు వోయి ముట్టి త**
**త్పితృశిరమున్ వెసం దునిమి ప్రీతిమెయిం జనుదెంచి; రమ్మహో**
**ద్ధతుఁ డట వచ్చి వారి చరితం బెఱిఁగెం దమ తల్లి సెప్పఁగన్. (శాంతి. 2-81)**

**శా. రాముం దుద్ధత రోషపావక శిఖాప్రస్ఫీతుఁడై తున్ముదున్**
**భూమీశాలిఁ గుఠారధార నని విస్ఫూర్జద్గతిన్ హైహయ**
**స్తోమం బాదిగఁ జొచ్చి రాజకులముం దున్మాడి చేసెన్ సము**
**ద్దామ క్రీడను రౌద్ర మొప్ప నిల రక్తస్యంద సంసిక్తఁగన్. (శాంతి. 2-83)**

# 34. ఆ నృపుల వంశముల నానా నృపతులు పుట్టిరి

పద పడి విప్రులు పథము తప్పి వధంబు, మద్యపానంబు, ధనాపహరణంబు చేయ పాపభారంతో క్రుంగిన భూమిని లేవనెత్తినాడు కశ్యపుడు తన ఊరువుల నాధారంగా చేసికొని, అప్పటి నుంచి భూమి 'ఉర్వి' అని పిలవబడుతున్నది. అందుచేత భూమి అడిగింది కశ్యపుని క్షత్రియ వంశోద్ధారణ చేయమని.

చావు నుంచి తప్పించుకున్న రాజులలో కురువంశపు విదూరథుడి కుమారుడు రక్షింపబడినాడు ఋక్షవంతమనే పర్వతంలో కరుణగల ఎలుగుబంట్ల చేత. సుదాసు వంశజుడొకడు పరశురాముని యాగశాలలో బ్రతికాడు 'సర్వకర్ముడిగా' శిబి చక్రవర్తి మనుమడిని రక్షించాయి గోవులు; ప్రతర్ధనుడి కుమారుడు వత్సుడు

గోశాలలో దూడల మధ్య బ్రతికాడు, అంకుడనేవాడు గౌతమ మునిచే రక్షింపబడినాడు. బృహద్రథ వంశపు 'భూరి' కొండముచ్చుల రక్షణలో బ్రతికినాడు, మరుత్తుని సంతతి వలన పుట్టిన ముగ్గురు నాలుగేళ్ల వయసున్న పిల్లలు పెరిగారు సముద్రుడి రక్షణలో –వారిని భూపతులుగా చేయమని భూదేవి కోరగా కశ్యపుడా విధంగా చేసాడు.

అలా బ్రతికిన రాజులు తామరతంపరగా పెరిగి భారతయుద్ధంలో చంపబడి కుప్పలుగా కూలిపడి ఉన్నారు. అయినా కొందరింకా బ్రతికే ఉన్నారు అక్కడక్కడ –అని శ్రీకృష్ణుడు చెప్పగా ఆశ్చర్యచకితుడైన ధర్మజుడు పరశురాముని పరాక్రమమును స్తుతిస్తూ ఉండగా చేరుకున్నారు ఓఘవతి నదీతీరంలోని భీష్ముని అంపశయ్య వద్దకు.

---

**సీ.** **పదపడి విప్రుల పథము దప్పి వధంబు । మద్యపానంబు సన్మార్గ వర్తు**
**లైన సాధుల ధన మపహరించుటయును । మొదలుగాఁగ నకృత్యములకుఁ జొచ్చి**
**రధ్వరాదిక సత్క్రియల్ ప్రవర్తింపక । తెక్కలిబంది యే దిక్కులందు**
**దఱచయ్యె నిమ్మెయి ధర్మంబు సెడి యధ । ర్మంబు వర్తించి యరాజకత్వ**

**ఆ.** **దోష జాతమైన దురిత బాహుళ్యంబు । గుతిలపెట్ట భూమి యతలమునకుఁ**
**బోవ నెతింగి కశ్యపుఁడు నిజోరువు వెతి । గ్రుచ్చి దాపు గాఁగ నిచ్చి యెత్తె. (శాంతి. 2-89)**

**క.** **ఆ నృపుల వంశముల నా । నా నృపతులు పుట్టి; రిట్లు నరవర! నృప సం**
**తానములు పెక్కు గలిగి మ । హీనాథత్వమున వ్రాలె నెందును గలయన్. (శాంతి. 2-95)**

**క.** **అప్పరుసునఁ బెరిఁగిన నృపు । లిప్పుడు భారత రణోపహృతులై పలువుర్**
**గుప్పలు గొనఁబడి; రనికిం । దప్పిన వాఁడొకఁ డొకండ ధర నంతంతన్. (శాంతి. 2-96)**

**–** **గోభిః సముద్రేణ తథా గోలాంగూలర్ క్ష వానరైః**
**గుప్తా రామ భయోద్విగ్నాః క్షత్రియాణాం కులోద్వహాః (సం.శాంతి. 50-3)**

# 35. జన్మము లిట్టివి ఎందు గల్గునే?

వ్యాసాది మునుల మధ్య శరశయ్యపై శయనించి ఉన్న శాంతనవుడిని దర్శించిన
శ్రీకృష్ణాదులు, మునివర్యులకు నమస్కరించి భీష్ముని చుట్టూ కూర్చున్నారు.
భీష్ముని స్పర్శించి శ్రీకృష్ణుడన్నాడు- అవార్యతేజ! బహుసాయక కీలిత అంగములు
బాధిస్తున్నాయా? నీ తండ్రి వరం నీకు గాయాలనెప్పి తెలియనీయడం లేదుకదా!

బుధులు మనఃపీడకన్నా దేహపీడ ఎక్కువంటారు, అది నీకు లేకుండును గాక!
ప్రాణికోటుల జీవనరీతులు నీకు తెలియనిదేమున్నది, కరతలామలకమే నీకు!
రాజువై రాగహీనుడవై రాజితసుందరమూర్తివై విభ్రాజిత సంపదున్నతి
విభాసిత వర్తనుడవై, కామినీ రాజి మనోజ్ఞ భంగి చతురత్వధనుడవై నీవు

బ్రహ్మచర్య దీక్షా జితమన్మథుడివై చరితార్థుడవైనావు దేవరాతా, భీష్మా!
దమము సత్యము తపము దానము వేదధనుర్వేద నైపుణ్యము జ్ఞానము
పరాక్రమము సహజసిద్ధంగా కలవారు నీవుకాక ఇంకెవ్వరునూ లేరు.
శరతల్పగతుడివై కూడా స్వచ్ఛంద మరణ వరమున్న వారింకెవరు ఈ లోకాన?

అష్ట వసువులలో పెద్దవాడివి, అఖిల ధర్మాలు తెలిసినవాడివి నీవు,
బాధాతప్తుడై ఉన్న ధర్మరాజును నీదైన తపస్సు, పుణ్యంతో కూడుకున్న
హితోక్తులతో ఇతడి దుఃఖాన్ని పోగొట్టవలసిందిగా ప్రార్థిస్తున్నాను నేను
-అని కృష్ణుడు పలుకగా తలకొంచెం పైకెత్తి గాంగేయుడు అన్నాడు గోవిందునితో-

---

**ఉ. 'రా జటె! రాగహీనుఁ డటె! రాజిత సుందరమూర్తి యట్టె! వి**
**భ్రాజిత సంపదున్నతి విభాసిత వర్తనుఁ డట్టె! కామినీ**
**రాజ మనోజ్ఞభంగి చతురత్వ ధనుండటె! బ్రహ్మచర్యదీ**
**క్షా జిత మన్మథుండు నటె! జన్మము లిట్టివి యెందు గల్గునే? (శాంతి. 2-103)**

**చ. దమమును సత్యముం దపము దానము వేదములందుఁ జాపవే**
**దమునను గల్గు నైపుణియు, ధర్మవిధిజ్ఞతయున్, విరోధి భూ**
**రమణ విమర్దన క్రమ విరాజిత శౌర్యము నీకుఁ బోలె నై**
**జము లగువాఁడు వేఱొకఁడు శంతనునందన! పుట్టఁ డెన్నఁడున్. (శాంతి. 2-105)**

**ఉ. 'నీవు తపో విశేష మహనీయతఁ జేసి జగంబు లన్నియున్**
**భావమునం గనుంగొని నృపాల మహోత్తర! చాలు; దీతఁ ద**
**త్యావిల చిత్తుఁడయ్యె సుహృదాప్తమృతిన్ దురటిల్లు నెవ్వగం**
**బోవగఁ ద్రోవు నీ దయిన పుణ్యతమస్ఫుట వాక్య పద్ధతిన్. (శాంతి. 2-109)**

# 36. నన్ను నేమి అడుగదలచె నా ధర్మజుండడుగు గాక!

–'ఎల్ల జగములకు కర్త భర్త సంహర్తవు నీవు, ఆశ్రితజన సంరక్షకుడివి,
శివ, నారాయణ, అచ్యుత, వాగ్విభుడవైన నీ సన్నిధిని నేనేమి పలుకగలను?'–
అని పలికిన భీష్ముని ఆదరించి శ్రీకృష్ణుడన్నాడు– 'పాపరహితుడవైన భీష్మా!
ఇప్పటి నుంచి యాభై ఆరు దినాలలో రానున్నది ఉత్తరాయణ పుణ్యకాలం.

నీకు నేను మూడు వరాలనిస్తున్నాను– శరతల్పం వలన ఏ శరీర బాధ ఉండదు.
ఆకలిదప్పుల పీడ ఉండదు, ప్రాణుల నడవడికల ప్రభావము నీకంటదు.
భీష్మాచార్యా, సూర్యాస్తమయ సమయమవుతున్నది, సూర్యతాపానికి కందిపోయిన
ఓషధుల సమూహానికి, చకోరాలకు వెన్నెల శీతల కిరణాలనిస్తూ వస్తున్నాడు అమృతాంశుడు'–

అని పలికి కృష్ణుడు ధర్మరాజాదులు, మునివర్యులు సెలవు తీసుకున్నారు భీష్ముని వద్ద.
మరునాడు ఉదయం మరల అందరూ చేరుకున్నారు అమ్ముల పాన్పుపై ఉన్న
సురగంగ సుతుని వద్దకు, శ్రీకృష్ణుడన్నాడు భీష్మునితో– 'మానవోత్తమా!
నీవు చెప్పే మాటలన్నీ వేదవాక్యాలతో సమానమై ప్రకాశిస్తాయి సుమా!'

భీష్ముడన్నాడు– 'నాకు కీర్తినివ్వాలని నీవు నాకీ అవకాశాన్నిస్తున్నావు దేవా!
అది నాకు అవగతమైనది, నీ ఆనతితో నీవు నా మనసులో ప్రవేశపెట్టిన
జ్ఞానాన్ని నేను ధర్మజుని కందజేస్తాను' –అని పలికి; తన పాదాలకు తల ఆన్చి
నమస్కరించిన ధర్మజునితో– 'శంకింపక నన్నేమియైన అడుగు'– అన్నాడు భీష్ముడు.

---

**క.** **'కర్తయును భర్తయును సం । హర్తయు జగములకు నీవ! యాశ్రిత జన ఘో**
**రార్తి నిరాస నిపుణ సం । కీర్తన! యోగీశ్వరేశ! కృష్ణ వరేణ్యా!' (శాంతి 2–111)**

**క.** **'శివ! నారాయణ! యచ్యుత! భవదీయము లైన మధుర భాషణములు నా**
**చెవు లానిన నమృత రస । ప్లవనంబునఁ బోలెఁ బ్రమద భరితుఁడ నైతిన్. (శాంతి. 2–118)**

**తే.** **వాగ్విభుఁడ వైన నీ వచో వైభవంబు । లో సమస్తంబు నుండుట లోకనాథ!**
**నీదు సన్నిధిఁ బలుకంగ నేర రాదు । పద్మభవునకు; నే నెట్లు పలుకువాఁడ? (శాంతి. 2–119)**

**క.** **శరముల వలనను మూర్ఛం । బొరయక యొక్కింత దప్పిబొరయక నొప్పిం**
**బొరయక యవిద్ధ గాత్రుని । కరణి సుఖాత్ముఁడవు గమ్ము కౌరవనాథా! (శాంతి. 2–122)**

**ఆ.** **అనఘ! నీరువట్టు నాఁకలియును నెప్డుఁ । బొరయకుండునట్టి భూరి శక్తి**
**నీకుఁ గలుగ నేను నెమ్మనంబునఁ దలం । చితిఁ; దదీయ పీడఁ జెందకుండు. (శాంతి. 2–123)**

**–** **యావద్ధి పృథివీ పాల పృథ్వీయం స్థా స్యతి ధ్రువా**
**తావత్త వాక్షయా కీర్తిః లోకానను చరిష్యతి (సం.శాంతి. 54–28)**

# 37. నృపధర్మము లన్నియు నీకుపదేశించెద-

ధర్మరాజు శ్రీకృష్ణుడికి నమస్కరించి నారదవ్యాసాది మునిశ్రేష్ఠులకు తన గోత్రనామాదులు చెప్పి వారి పాదాలనంటి ఏటికోళ్లు పట్టి భీష్ముడికి అభివాదము చేసి ఎదురుగా కూర్చుండి అన్నాడు- 'పితామహా! జీవలోకానికి ఆధారం ధర్మము, అది గుర్రానికి పగ్గము, ఏనుగుకు అంకుశము వలె శాసిస్తుంది లోకాన్ని.

సూర్యోదయం రాత్రి చీకట్లను తొలగించినట్లు పాపాలను తొలగించే రాజధర్మము గురించి తెలుసుకొన గోరుతున్నాను' -అని పలుకగా భీష్ముడు ఆదర రసప్లుత దృష్టితో ధర్మజుని చూచి, మనసులో కృష్ణుని తలచి -'నమో ధర్మాయ మహతే నమః కృష్ణాయ వేధసే' అనుకుని -'ధర్మరాజా,

దైవత పురుష కార్యాలలో పురుష కార్యం గొప్పది. మానవ ప్రయత్నమెంత చేసినా ఫలించకపోతే దైవోపహతమైనదిగా భావించాలి. అంతేకాక ఇంద్రియ నిగ్రహమైన దాంతి, ఆత్మజయము, శాంతి, శీలములు కలిగిన రాజు శ్రీమంతుడు, యశస్వి అవుతాడు; సప్తాంగములు, దండనీతి తెలియుట ముఖ్యం.

కామందకుడనే ముని అంగరిష్ఠుడనే రాజుకు చెప్పినట్లు రాజుకు రక్ష దండనీతి. రాతి వలన ఇనుము, నీటి వలన అగ్ని, బ్రాహ్మణుల వలన రాజులు జన్మించారు. అవి పుట్టిన చోటుకన్నా ఇతర స్థానాలలో ప్రకాశించడం సత్యమన్నది మనువు మాట రాయిని ఇనుము, నీటిని అగ్ని, బ్రాహ్మణులను రాజు నశింపచేయబోయి నాశనమౌతారు.

---

**చ. 'అరయఁగ రాజధర్మము సమాశ్రయ మై నడపుం ద్రివర్గమున్**
**గురుతర మోక్షధర్మమునకుం దలఁపం దనప్రాప యూఁత భూ**
**వర! విను ఘోటకంబునకు వాగెయు, దంతికి నంకుశంబు నే**
**కరణి నివారకంబులు జగంబుల కట్టుల తాను నెమ్మియిన్. (శాంతి. 2-158)**

**ఆ. అనఘ! నీదు బుద్ధి యతిలోక మగుటయుఁ । దెలిసికొనఁగ నాకు వలయునట్టి**
**ధర్మకోటి నీవ తగఁ జెప్ప వినవల । యుటయుఁ జెప్పె నంబుజోదరుండు. (శాంతి. 2-161)**

**మ. విను ముద్యోగము రెంటి యందుఁ బర మూర్వీనాథ! యుద్యోగవం**
**తునకున్ దైవము దోడ్పడంగ ఫలసిద్ధుల్ సేకుఱున్; మానుషం**
**బున కొక్కొక్కెడ సిద్ధి దప్పిన వగల్ వొందంగరానీక య**
**ప్పని దైవోపహతంబుగాఁ గనుట భూపాలార్హ వృత్తంబగున్. (శాంతి. 2-167)**

**- సాధారణం ద్వయం హ్యేతద్ దైవము త్థానమేవ చ**
**పౌరుషం హి పరం మన్యే దైవం నిశ్చిత ముచ్యతే (సం.శాంతి. 56-15)**

# 38. సకల వర్ణ ధర్మ సంకర రక్షయు-

యుద్ధంలో శస్త్రాస్త్రాలు ధరించిన బ్రాహ్మణ వీరుడిని చంపవచ్చును, పాపం లేదు.
అయితే గురుభార్యా గమనుడు, శిశు హంతకుడు, రాజద్వేషి, బ్రాహ్మణ హంతకుడయిన
బ్రాహ్మణుని చంపకుండా చేయవలెను దేశ బహిష్కారం. ఇది శుక్రాచార్య బోధితం
బృహస్పతి చెప్పిన రాజధర్మాలు కొన్ని వివరిస్తాను- వినుమిది ముఖ్యమైనవి.

రాజధానికి దుర్గమవసరం- ధన్వ, మహీ, వృక్ష, జల, గిరి, నరదుర్గాలివి ఆరు
శ్రేష్ఠమైనది చతురంగ బలసమేతమై ఉన్న నరదుర్గం; రాజు కఠినంగా ఉండాలి.
లేకుంటే భయముండక జనులు చెడుమార్గాల కలవాటు పడతారు.
వసంత ఋతువులో సూర్యుడిలా ప్రభువు సమభావంతో పాలించాలి ప్రజలను.

తన కోపాన్ని ప్రజలపై ప్రదర్శించరాదు, గర్భిణీస్త్రీ తన ఆహార పథ్యాల
విషయంలో జాగ్రత్తగా ఉన్నట్లు రాజుకూడా చాలా జాగరూకతతో వ్యవహరించాలి.
సేవకులతో పరాచకాలాడరాదు, సప్తాంగ విరోధిని క్షమింపరాదేనాడూ; ప్రభువు, మంత్రి,
మిత్రుడు, కోశాగారం, రాష్ట్రం, దుర్గం, బలం –వీటికి నష్టం కలిగిస్తే సహించరాదు.

తప్పు చేసినవాడెవడైనా శిక్షార్హుడే, సగరుడు వదిలేసాడు తన పుత్రుడు
అసమంజసుడిని; ఉద్దాలక మహర్షి విడిచిపెట్టినాడు శ్వేతకేతువుని వాళ్లు
క్షమించరాని నేరాలు చేస్తున్నారని –ఆ విధంగానే రాజు దుష్టుల సాహచర్యం మాని
సకల వర్ణ ధర్మరక్షణ, సంధి విగ్రహయాన ఆసనద్వైధ ఆశ్రయగుణ పరిశీలన చేయాలి.

---

**సీ. మేదినీపతి యతిమృదువైన, మావంతుఁ । డేనుంగు నెట్లట్ల యెక్కి యాడఁ**
**జూచుఁ దేఁకువ సెడి నీచపుఁ బ్రజః క్రూరుఁ । డగునేని లోకంబు బెగడు గుడుచుఁ**
**గాన వసంతంబుభానుని చాడ్పునఁ । దగియెడు పాటితో ధరణి ప్రజల**
**నుచితవర్తనముల నొందించునది; యిది । రాజ ధర్మములకు రాజు సుమ్ము;**

**ఆ. కౌరవేంద్ర! యదియుఁ గాక దండము పరీ । క్షా విశుద్ధి పూర్వకముగ వలయుఁ**
**దనతలంపు వెంటఁ దమకించి ప్రజకు నొ । వ్వఁగ జరించుటయును దగదు పతికి. (శాంతి. 2-178)**

**మ. పరిహాసంబునఁ దేలి భృత్యులయెడం బ్రహ్లాదముం బొందు భూ**
**వరునాజ్ఞం జన; రీగి మెచ్చరు పనిన్ వంచింతు రెగ్గాడఁ జొ**
**త్తురు; కౌతూహల వేష భూషణములం దుల్యత్వముం బొంది యే**
**తురు; వా రెల్లపదంబు వేఁడుదురు; సింతుర్ భూమి మాటొడ్డులన్. (శాంతి. 2-180)**

---

**దుర్గం కోటలు–ఆరు రకాలు :** 1) ధన్వదుర్గం– నాలుగు పక్కలా అయిదామడల మైదానం ఉండాలి. 2) మహీదుర్గం– మట్టి దిబ్బలున్న కోట; 3) వృక్షదుర్గం, 4) నరదుర్గం– చతురంగబల సమన్వితం; 5) జలదుర్గం– చుట్టూ నీరున్న కోట; 6) గిరి దుర్గం– చుట్టూ కొండలున్న కోట.

# 39. లక్ష అధ్యాయాల నీతిశాస్త్రం-

ఇచ్చకాలకు పొంగరాదు, ఎవరినీ ఎక్కువగా నమ్మరాదు, జాగ్రత్త ముఖ్యం.
పరదేశ, స్వదేశ ధనాపహరణ లుబ్ధునిపై తన దేశపౌరులే తిరగబడతారు.
ధర్మరతులు, అర్థ నిర్మాణ చతురులు, లౌల్య రహితులు, ఆజ్ఞ దాటని వారు
ఉత్తమ నీతి నిపుణులు, ఉత్తమ కుల సంజాతులున్న పరివారం రాజుకుండాలి.

కపటము లేక, వైభవము కప్పక, ప్రజలను కన్నబిడ్డలవలె పాలించే రాజు
పరాక్రమోపేతుడైన ప్రజారక్షకుడైనవాడు గొప్ప రాజని బృహస్పతి, భారద్వాజ,
ఇంద్రులు ప్రవచించి ఉన్నారు, శత్రు సంహారిగా ఉండాలి లేకుంటే శత్రువు
అత్యల్పుడైన అగ్నిలా, విషంలా నొప్పిస్తాడు' -అని పలికాడు భీష్ముడు.

మరుసటి రోజు దండనీతి గురించి చెబుతున్నాడు భీష్ముడు ధర్మరాజాదులకు
-పరస్పరం ఒకరికొకరు రక్షకులుగా ఉంటున్నవారు అధర్మ మార్గావలంబకులై
మానవలోకం ధర్మాన్ని మరచి వేదజ్ఞానాన్ని కుంటుపరచి సంక్షోభపరుస్తున్నపుడు-
బ్రహ్మ రచించాడు లక్ష అధ్యాయాల నీతిశాస్త్రాన్ని, దానిని చదివినాడు శివుడు.

అంతటి నీతి శాస్త్రాన్ని చదివేంత ఆయుస్సు, బుద్ధి మానవులకు లేవని తలచి
విరూపాక్షుడు సంగ్రహ నీతిశాస్త్రమును విశాలాక్షుడి రూపంలో రచించగా
అది పదివేల అధ్యాయాల వైశాలాక్షమై ఉండగా, దానిని మహేంద్రుడు అయిదువేలకు
దానిని బృహస్పతి మూడువేలకు, శుక్రాచార్యుడు వేయి అధ్యాయాలకు కుదించాడు.

---

**క. 'విను! తొల్లి కృత యుగంబున । మనుజులయెడ దండనీతిమంతుం డై రా**
**జన నొకఁడు గలిగి యరయుట । మనుజేశ్వర! లేదు ధర్మమత మంద్రు తగన్. (శాంతి. 2-199)**

**క. ఒండొరులకు రక్షకులై । యుండుదు; రట్లుండ దైన్య మొదవిన లోభం**
**బొండొండు పెరిఁగి ధర్మము । ఖండితమై మొదలుకొని రకార్యంబులకున్. (శాంతి. 2-200)**

**క. క్రమమునఁ గామము రాగము । దమ మనముల నొదవఁగా మదం బెక్కిన వి**
**భ్రమ మొందుచు విచ్చల విడి । విమార్గ చరితముల వేదవిధ్వంసకులై. (శాంతి. 2-201)**

**క. మనుజులు ధర్మముఁ బొడవడఁ । చిన వేదముఁ గర్మములును జెడుటకు భయ మం**
**దిన యింద్రాదులు గమలా । సనుఁ గానఁగ మునులుఁ దారుఁ జనిరి నరేంద్రా! (శాంతి. 2-202)**

---

లక్ష అధ్యాయాలతో బ్రహ్మ వ్రాసిన దండనీతిని కుదించాడు శివుడు పదివేల అధ్యాయాలున్నది శివుడు సంగ్రహం చేసిన వైశాలాక్షం. అయిదువేల అధ్యాయాలకు ఇంద్రుడు కుదించినది బాహుదంతకం. మూడువేల అధ్యాయాలతో బృహస్పతి సంక్షిప్తీకరించినది బార్హస్పత్యం. వేయి అధ్యాయాలతో శుక్రాచార్యుడు తగ్గించినది శుక్రనీతి.

# 40. వైన్యుడు తొలి రాజు, క్షత్రియుడు

మహర్షులు ఆ మహానీతి శాస్త్రాన్ని మానవుల శక్తికనుగుణంగా సంక్షిప్తం చేసారు.
దేవతలు ప్రార్థించ ఆ నీతిశాస్త్రాన్ని ఆచరణలో పెట్టేందుకు విష్ణువు సృజించాడు
మానసపుత్రుడు విరజుడిని, విరజుడి కుమారుడు కర్దముడు, కర్దముని పుత్రుడు
అనంగుడు దండనీతిపరుడు, అనంగుడి పుత్రుడు నీతి; నీతి పెండ్లాడినాడు

మృత్యు పుత్రికయైన 'సునీథ'ను – వారి పుత్రుడు వేనుడు ప్రజా విరుద్ధుడు కాగా
మహామునులతడిని పవిత్ర మంత్రపూరిత దర్భలతో ఉపశమింపచేసి
కుడితొడను మథించగా నల్లని, పొట్టివాడు, ఎర్రనికళ్లతో జన్మించాడు అరుచిగా
అతడిని 'నిషీద' అని మునులు పిలిచారు – అతడి సంతానము నిషాదులైనారు.

మరల వేనుడి కుడిభుజాన్ని మథించగా జన్మించాడు వేదధనుర్వేద విశారదుడు
వైన్యుడు, దండనీతి ఎంచుకున్నవాడు, బ్రాహ్మణ సహకారమభిలషించినవాడు.
అతడిని సమస్త భూమికి రాజుగా అభిషేకించారు మునులు, ఆ వైన్యుడికి
శుక్రాచార్యుడు పురోహితుడు, సారస్వతగణం మంత్రులు, గర్గుడు జ్యోతిష్కుడు

ప్రజలను వినాశనం నుంచి రక్షించడం వలన వైన్యుడు క్షత్రియుడైనాడు
సర్వ ప్రజలను రంజింపజేయడం వలన 'రాజు'గా కీర్తి పొందినాడు
అతడి సంతానమంతా రాజులై 'దండనీతి'తో ప్రజలను చక్కగా పాలించారు
విష్ణు తేజమున్నవారుగా, –నా విష్ణుః పృథివీ పతిః –అన్న నానుడితో రజోగుణులైనారు.

---

**క. సురపతి విభవము, మేరువు । హిరణ్యమును, గిన్న రేశుఁ డీడిత సంప**
**ద్గురుతయు నొసఁగిరి రథ కరి । తురగ భటావళులు తలఁపుతో నొడఁగూడెన్. (శాంతి. 2–212)**

**క. ఉరగాదులవలని భయముఁ । బొరయక యొండొరులతోడఁ బొసఁగి రుజలుఁ జి**
**త్తరుజలు లేక యతని తతి । ధరణీప్రజ సస్యసంపదయుఁ గల్గి మనున్. (శాంతి. 2–214)**

**తే. బ్రాహ్మణ క్షత సంత్రాణ పరతఁ జేసి । క్షత్రియాభిధానంబు, రంజనము నెల్ల**
**ప్రజకుఁ జేయుట కతమున రాజనామ । మును బ్రవర్తిల్లె నా నృపాలునకు నధిప! (శాంతి. 2–215)**

**– తపసా భగవాన్విష్ణుః ఆదివేశ చచ భూమి పమ్**
**దేవవన్నర దేవానాం నమతే యం జగన్నృపమ్ (సం.శాంతి. 60–128)**

---

స్వయంభువ మనువు– ఉత్తానపాదుడు – ధృవుడు – శిష్టి – రిపు – చాక్షుష – చాక్షుష మనువు (కుమారులు కురు, పురు, శతద్యుమ్న, తపస్వి, సత్యవాన్, శుచి, అగ్నిష్టోమ, అతిరాత్ర, సుద్యుమ్న, అభిమన్యు)– పురు– (అంగ, సుమనస, ఖ్యాతి, క్రతు అంగీరస, శిబి–అంగ–వేన–వైన్య (పృథుడు).

చాక్షుష మన్వంతర కాలంలోనే ధర్ముని పుత్రులుగా నర నారాయణులవతరించారు. అత్రి మహాముని భార్య అనసూయకు బ్రహ్మ అంశతో చంద్రుడు, విష్ణ్వాంశతో దత్తాత్రేయుడు, శివుడి అంశతో దుర్వాసుడు జన్మించారు.

# 41. చాతుర్వర్ణ ధర్మములు

కోప రాహిత్యము, సత్యభాషణము, నిజ భార్యాప్రియత్వము
రహస్య రక్షణము, ద్రోహచింతన లేకుండుట అను సద్గుణములు
ఉండాలి ప్రతివర్ణము నందు -అని భీష్ముడు వివరిస్తున్నాడు
ధర్మరాజాదులకు సర్వ వర్ణ నియత నిర్దేశిత గుణ విశేషములను-

-'మేథోబుద్ధి వికసితుడై బ్రహ్మజ్ఞానం కలిగినవాడికి ఇంద్రియ నిగ్రహం
పరమధర్మం; వేదాధ్యయనము, వేదవిహిత కర్మలు కావాలి నిత్యకృత్యం.
భుజ బలముతో సర్వజన రక్షణాసక్తి కలిగినవాడికి మహా పరాక్రమము
వేదాధ్యయనము, పాలనము, చోరులను దండించడము, దానధర్మాలు సుధర్మము.

ఉర్వి సంచారముతో వ్యాపారబుద్ధి కలిగినవాడికి పశుగణ రక్షణము
దానధర్మాలు, వేదాధ్యయన యజ్ఞాలలో ఆసక్తి శుద్ధ సంపాదన ముఖ్యము.
పాదముల బలముతో ప్రవర్తిల్లిన వాడికి త్రివర్ణ త్రికరణ శుద్ధి సేవనము
వారి ఆజ్ఞలను ప్రశ్నించకుండా విధేయతతో చేయుట విహిత ధర్మము.

త్రైవర్ణికులకు ముఖ్యమైనది యజ్ఞవిదులపై ఆసక్తి కలిగి ఉండడం
యజ్ఞ కార్యాన్ని మించినది లేదు, యజ్ఞకర్తను మించినవాడు లేడు-
అని భీష్మాచార్యుడు చాతుర్వర్ణ ధర్మములను ధర్మరాజుకు తెలిపి
ఆశ్రమములు- బ్రహ్మచర్య, గృహస్త, వానప్రస్థ, సన్యాసములను వివరిస్తున్నాడు.

---

**మ. హరిఫాలంబునఁ బుట్టి ధర్మమున కాలై యర్థమన్పుత్రకున్**
**సిరి కాంచెన్ దగ వారు ముప్పురును సుస్థేమోన్నతిన్ సంశ్రయిం**
**తురు భూపాలకు నాతఁ డన్యజనతా తుల్యోద్భవుం డెట్లు ని**
**ర్జర లోకార్ష సమగ్ర పుణ్య వితతి ప్రాప్తుండు గా కారయన్. (శాంతి. 2-217)**

**ఆ. బ్రాహ్మణునకు దమము పరమ ధర్మం బవ । శ్యంబుఁ గృత్య మధ్యయనము; దాన**
**సర్వ కర్మములును, శాసితంబులు; వాని । నడపవలయు నిష్ఠ యెడప కతఁడు. (శాంతి. 2-222)**

**చ. యజనము దాన కర్మమును నధ్యయనంబును దస్యుహింసయుం**
**బ్రజ కనురాగ మొందఁ బరిపాలన చేఁతయు సంగరంబున**
**న్విజిత విభీతిమై నురవణించుటయున్ నృపధర్మముల్; కురు**
**వ్రజ తిలకాయమాన! సమరంబు సుధర్మువు వీనిలోపలన్. (శాంతి. 2-224)**

**తే. అధ్యయన దాన యజ్ఞంబు లధిప! వైశ్యు । నకును గృత్యముల్; శుద్ధార్జనమున ధనము**
**సంచితవ్యంబు పసుల రక్షించువాఁ డ । తండు; వానికి నిది మహా ధర్మ మనఘ!**

# 42. నాలుగు ఆశ్రమాలు

గురుశుశ్రూష, వేదాధ్యయనము, గోష్ఠులపై నిరాసక్తత, భిక్షాన్న జీవనము
రాగ ద్వేషములు లేక, అలంకార ప్రియత్వము లేక చరించడం బ్రహ్మచర్యం.
సజ్జన సాంగత్యం, స్వభార్యాసక్తి, దయ, సత్యనిష్ఠ, సహనం, అగ్నిపూజ
దేవ పితృ అతిథిదేవతార్చనము, ఆశ్రమ ధర్మ నిర్వాహకుల పోషణం గృహస్థ ధర్మం.

సంతాన మమకార వర్జితుడై, అభిమాన అహంకారాలను వదలి, దమము కలిగి,
అరణ్యానికి ఒంటరిగా లేక భార్యతో వెళ్లి ధర్మచర్చలు చేయుట వానప్రస్థం.
ఎక్కడైనా ఉంటాడు, ఆకలైతే తింటాడు, ఏ మమకారాలు లేనివాడు
దేనినీ కోరడు, అగ్నికార్యాలు చేయడు, ఇంద్రియ జయుడుగా సన్యాసి జీవనం

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు నాలుగు ఆశ్రమాలకు అర్హులై ఉన్నారు.
శూద్రులు రాజానుమతితో సన్యాసము తప్ప మిగతా మూడిటికి అర్హులు.
ఉత్తమ బ్రాహ్మణుడు మాత్రమే యజ్ఞయాగాదులలో దానాన్ని స్వీకరించగలడు
నాలుగు వర్ణాల వారిని, నాలుగు ఆశ్రమాల వారిని నడిపించేవాడు రాజు.

ఏనుగు పాదముద్రలో మిగతా జంతువుల పాదముద్రలు చిన్నవైనట్లు
రాజధర్మానికి అణకువగా ఉంటాయి ఇతర ధర్మాలు; దండనీతి చెడితే
భూమి సంస్కార రహితమై హీనత పొంది, ప్రజలకు కలుగుతుంది కీడు.
రాజంటే ధర్మదేవతా స్వరూపం, రాజధర్మంబది సర్వశ్రేష్ఠం నాడూ నేడు!

---

**సీ. ఏనుంగు హజ్జలో నెల్ల సత్త్వంబుల । హజ్జలు నడcగిన యట్ల పోలె;**
**రాజిత క్షేత్ర ధర్మమునకు లోనయి । సర్వ ధర్మంబులుc జను మఖములు;**
**వేదంబులును శుభవృత్తంబులును దండ । నీతి మాసినc జెడు భూతలంబు;**
**సంస్కార రహితమై చాల హీనతc బొందు । నట్లైనc బ్రజకుc జే టావహిల్లు;**

**తే. రాజు లరసిన నెమ్మది బ్రదుకుc గాన । రాజు సర్వోత్తముcడు; ధర్మరాజియందు**
**రాజధర్మంబ యెక్కుడు; రా జనంగ । దర్మదేవత యన వేఱె ధర్మతనయ! (శాంతి. 2-239)**

---

**దశధర్మాలు:** 1) ధైర్యం, 2) ఓర్పు, 3) ఇంద్రియ నిగ్రహం, 4) దొంగతనం చేయకపోవడం, 5) ఆచారం, 6) మనోనిగ్రహం, 7) జ్ఞానం, 8) విద్యార్జన, 9) సత్యవచనం, 10) కోపం విడనాడడం.

---

అయోధ్యను పాలించే యువనాశ్వుడనే రాజు వేటకు వెళ్లి దాహంతో బాధపడుతూ ఓ యజ్ఞవాటిక వద్ద కనిపించిన పవిత్ర మజ్జిగను, నేతిని తాగగా గర్భవతి అయినాడు. అశ్విని దేవతలు కానుపు చేసి శిశువును బయటకు తీసారు. ఆ మగశిశువు గుక్కపెట్టి ఏడుస్తుంటే ఇంద్రుడు తన చేతివేలును ఆ శిశువు నోటిలో ఉంచి అమృతాన్ని కురిపించ ఆ శిశువు మామ్‌ధాత-మాంధాత అయినాడు. ఒక్కరోజులో ధరణిని మొత్తం జయించి ధరణీశుడై, ముల్లోకాలను గెలిచినాడు. పెద్దపెద్ద బంగరు చేపలను, పదివేల పద్మాల సంఖ్యగల గోవులను దానమిస్తూ నూరు అశ్వమేధ, నూరు రాజసూయ యాగాలు చేసాడు.

# 43. మనువు క్షితిన్ పాలించె, సుఖులైరి అశేష జనముల్-

భీష్ముడు చెబుతున్నాడు- మునుపు మాంధాత చక్రవర్తి చేసాడు మహాయాగం
విష్ణు దర్శనం కోసం, అయితే, ఇంద్రుడు ప్రత్యక్షమై ఏమి కావాలని అడిగితే
-'సంసార జీవితాన్ని వదలి భిక్షాటన చేయదలుచుకున్నాను' -అన్నాడా మహీపతి.
ఇంద్రుడు నవ్వి- 'ప్రజలను కాపాడతాను' -అనే సంకల్పాన్ని వహించు

అనగా విని మాంధాత తన ఉద్దేశాన్ని ఉపసంహరించుకుని 'ప్రజారక్షణ'
స్థిర సంకల్పముగా నెంచుకుని అనేక సంవత్సరాలు పాలించాడు భూమిని.
అంతేకాక, ధర్మరాజా, ఒకానొక సమయంలో మానవలోకంలో
జనులలో క్రూరత్వం, దొంగతనం, వ్యభిచారము అతిశయించాయి.

తమవంటివాడు తమకు రాజుగా ఉండడం ఇష్టపడక బ్రహ్మను అడిగితే
'మనువు'ను సూచించాడు విధాత. మనువు ఇష్టపడలేదు
వక్రగతులలో నడుస్తున్న మానవులకు రాజుగా ఉండేందుకు-
అప్పుడు వాళ్లన్నారు- పశువులు బంగారంలో సగం నీ సొత్తు,

పంటలలో పదవభాగం తీసుకో, భుజబలమున్నవారిని నీవారిగా
చేసుకుని దుష్ట శిక్షణ, శిష్టరక్షణ చేయుము, ధర్మాత్ములు చేసే ధర్మంలో
ఆరవవంతు నీకు చెందుతుంది- అన్నారు, ఆ విధంగా మొదలైంది
ప్రజలకు మనువుకు మధ్య ఒప్పందం, దాల్చింది కార్యరూపం, రాజైనాడు మనువు.

---

**సీ. జను లొక్కతతిఁ దొల్లి సమయంబుఁ దమలోనఁ । జేసి క్రూరతయు ముచ్చిమియు అంకు**
**సైఁపక యట్టి దుర్జను నందఱును గూడి । శాసించువారుగాఁ జాలి తమకు**
**నధిపతియుఁగ నొరునాసపడక యుండి । నడవడి బహుకారణములఁ జిక్కు**
**వడిన, విషణ్ణులై బ్రహ్మఁగానఁగఁ బోయి । మాకు రక్షకుఁడుగ మహిపుఁ దొకఁడు**

**తే. వలయు రూపింపు; మాతని గొలిచి బ్రదుకు । వార మనుటయు, నజుఁడును వారి వలని**
**కరుణ మనువు నిరూపించె; నరు లసత్య । చరితు లని పాలనమునకుఁ జొరఁడ యతఁడు. (శాంతి. 2-257)**

**క. అతఁ డొడఁబడి యత్తెఱఁగున । నతిబలవంతుఁ డయి నీతి సంచిత మగు ను**
**ద్ధత విక్రమమునఁ దగ నీ । క్షితిఁ బాలించె; సుఖులై రశేష జనములున్. (శాంతి. 2-259)**

**- యే ధర్మ కుశలా లోకే ధర్మం కుర్వంతి భారత**
**పాలితాయస్య విషయే ధర్మాం శస్తస్య భూపతేః (సం.శాంతి. 66-32)**

---

మాంధాత రావణుడికి సరిసమానమైన బలం కలవాడు. ఇద్దరికి జరిగిన యుద్ధంలో ఫలితం ఎటూ తేలలేదు. త్రసదస్యుడు, యౌవనాశ్వుడు అనేవి మాంధాత ఇతర పేర్లు. యాదవుల ప్రభువు శశబిందువు కుమార్తె బిందుమతిని వివాహమాడగా వారికి ముగ్గురు కుమారులు, యాభైమంది కుమార్తెలు జన్మించారు. పురుకుత్సుడు, అంబరీషుడు, ముచుకుందుడు అతడి పేరెన్నికగన్న కుమారులు. మాంధాత కుమార్తెలు సౌభరి మహర్షిని వివాహం చేసుకున్నారు.

# 44. చార చక్షుడై కనునెల్ల జగము-

భీష్ముడు చెబుతున్నాడు- రాజుకు-వాహనాలు, సింహాసనాలు,
శయన మందిరాలు, భోజ్య గంధ మాల్యాంబర భూషణాలు, రక్షణ,
కావాలన్న సద్భావన ప్రజలకుండాలి. అదేవిధంగా రాజుకూ
తనకున్న భోగభాగ్యాలన్నీ ప్రజలవే అన్నది గుర్తుండాలి ప్రతిక్షణమూ!

చిరునవ్వుతో మాట్లాడాలి, సత్యం పలకాలి, అందరిని సమానంగా చూడాలి.
సక్రమంగా విభజించాలి, కృతజ్ఞత, ఇంద్రియ నిగ్రహము, ప్రసన్నత ఉండాలి.
ప్రజలకు తండ్రిలా ఉండి, విరోధులకు భయంకరుడై ప్రకాశించాలి.
అలా ఉన్న ప్రభువును ప్రజలు ప్రత్యక్ష దైవంగా భావిస్తారు.

వసుమనుడు అనే రాజుకు బృహస్పతి చెప్పినాడు కొన్ని రాజధర్మములు
-రాజులేని రాజ్యము నీరింకిపోయిన మడుగులాంటిది ప్రజలకు,
సూర్యచంద్రులు కానరాని ఆకాశం వంటిదై వెలుగు కోల్పోతుంది ధరణి.
గృహ శయ్య వస్త్ర ఆభరణ స్త్రీ పుష్ప గంధ తాంబూల భోగాలు రాజుచే రక్షితం.

రాజు ఉంటే నిర్భయం. రాజు కుబేరుడి రూపమని, గూఢచారులు
కన్నులుగా చారచక్షుడని, సూర్యుడని; దుర్మార్గులను చంపినపుడు
యముడని, ఆ విధంగా దైవ స్వరూపుడని చెబుతారు పెద్దలు.
-రాజా భోజా విరాట్ సమ్రాట్ క్షత్రియో భూపతి నృపః -అంటాయి వేదాలు.

**క. ఒకరునికి నలిగి యాతని । సకల హిరణ్యంబు రత్న సంచయమును బు**
**చ్చుకొనుం, దనవలచిన వా । నికి నిచ్చు ధనేశుఁ డింద్రు నృపు నట్టితఱిన్. (శాంతి. 2-270)**

**తే. చారచక్షుఁడై కను నెల్ల జగము; నపుడు । సూర్యుఁ డంద్రు నకార్యకరులఁ**
**దునుము నయ్యెడ జముఁడు నాఁజను; నతండు । దేవతాత్మకుఁ డగుట సందియయె యధిప! (శాంతి. 2-271)**

**క. విను నృప! సమ్రాట్టు విరా । ట్టనియెడు శబ్దములఁ బొగడు నాగమములు నె**
**ట్టన భూపాలకునన నా । తనిఁ దగ నర్చింపకుండఁ దగునె యొరులకున్? (శాంతి. 2-272)**

---

మాంధాతకు వయసుతో పాటు గర్వం, అహంకారం పెరిగాయి. ఇంద్రుడన్నాడు- 'ఎందుకు నీకీ గర్వం? ముందు భూలోకంలో రావణుడి సోదరి కుంభీనసి భర్త లవణాసురుడిని గెలిచి ఆ తరువాత స్వర్గాన్ని మొత్తం గెలుద్దువుగాని!'

ఆగ్రహించిన మాంధాత లవణాసురుడి మధుపురిపై దండెత్తగా, లవణాసురుడు శివుని వరంతో పొందిన త్రిశూలంతో మాంధాతను ససైన్యంగా భస్మం చేసాడు.

ఆ లవణాసురుడు చివరకు మాంధాత వంశస్థుడైన శతృఘ్నుడి చేతిలో కన్నుమూసాడు. కైలాస పర్వతం-మానస సరోవరానికి వెళ్లే దారిలో ఉన్న హిమాలయ పర్వత శిఖరం పేరు- గుర్లా మాంధాత (చైనా-టిబెట్-బురాంగ్ ప్రాంతంలో నలకంకర పర్వత శ్రేణిలో ఎత్తైన శిఖరం.)

# 45. కయ్యమునకు వలదు కాలుత్రవ్వన్ అధిప!

రాజునకు ప్రజలు శరీరము, రాజు ప్రజలకు ఆత్మ; అందుచేత
రాజు ప్రజలు పరస్పరం విద్యుక్త ధర్మాలను నెరవేరుస్తూ రాజిల్లాలి
అని బృహస్పతి వివరించినాడు వసుమనుడనే ధరణీ పతికి.
ఈ విషయాన్ని ధర్మరాజుకు చెబుతూ ధర్మశ్రేష్ఠుడైన భీష్ముడన్నాడు–

ధర్మరాజా! రాజు తొలుదొలుత తనను తాను గెలుచుకోవాలి.
ఇంద్రియ నిగ్రహం, అరిషడ్వర్గాలపై విజయం అంతశ్శత్రువులపై గెలుపు,
ఆ తరువాత ఉద్యానవనాలు, అంతఃపురాలు, పురద్వారాలు, రాజ్య సరిహద్దులు
కాపాడేందుకు సంరక్షకులను నియమించి జాగరూకతో మెలగాల్సి ఉన్నది.

సమర్ధులైన వేగుల వారితో శత్రు రహస్యాలను తెలుసుకోవాలి,
తన బలహీనతను శత్రువు గమనించకముందే సంధి చేసుకోవాలి
విరోధి బలవంతుడైతే, అవసరమైతే ధనమిచ్చి అయినా దానమిచ్చి అయినా–
సామదానములు కుదరనప్పుడు నిప్పు, విషాలు, దండోపాయం మేలు.

అనవసరంగా యుద్ధం చేయరాదు, భేదోపాయంతోనైనా,
భయపెట్టి అయినా యుద్ధం నుంచి తప్పించుకునే మార్గం చూడాలి.
ఆదాయాన్నిచ్చే అరణ్యం, పశుసంపద, గనులను కాపాడుకోవాలి.
ప్రజలను కన్నబిడ్డల్లా పరిపాలిస్తూ తెలుసుకోవాలి కష్టసుఖాలు ఎల్లప్పుడూ.

---

**క. రాజునకుఁ బ్రజ శరీరము; । రాజు ప్రజకునాత్మ; కాన రాజుం బ్రజయున్**
**రాజోత్తమ! యన్యోన్య వి । రాజితు లై యుండవలయు రక్షార్చనలన్.' (శాంతి. 2–274)**

**ఆ. వినుము! తన్ను గెలుచు టన వేఱొకండె? పం । చేంద్రియములఁ దూలనీక కొలఁది**
**నాఁగుటయ జితేంద్రియత్వంబు గల రాజు । రిపులఁ జెఱుపఁజాలు నృపవరేణ్య! (శాంతి. 2–277)**

**క. ఆరామాదిక నిజ సం । చార స్థలములకు, దేశ సంధులకుఁ, బురీ**
**ద్వారములకు, నగరికిని ధ । రా రమణుఁ డొనర్ప వలయు రక్షలు నియతిన్. (శాంతి. 2–278)**

**– రాజాప్రజానాం హృదయ గరీయః గతిః ప్రతిష్ఠా సుఖముత్తమం చ**
**సమాశ్రితా లోకమిమం పరం చ జయంతి సమ్య క్పురుపా నరేంద్ర (సం.శాంతి. 68–59)**

---

**బృహస్పతి–** తొలి వెలుగులో పుట్టినవాడు, చీకటిని పారద్రోలుతూ, విశ్వ ప్రకారము (Cosmic order) అనే అల్లెత్రాడున్న విల్లు ధరించినవాడు, దేవగురువు, బుద్ధికి బృహస్పతి అని పేరు పొంది, బ్రామణస్పతి, పురోహితుడు, అంగీరస పుత్రుడు, వ్యాసుడు, అగ్నిస్వరూపుడు అనే పేర్లున్నవాడు. ఇతడి భార్య తార. అనేక ధర్మశాస్త్రాల కర్త బృహస్పతి. బృహస్పతి స్మృతికర్త. బార్హపత్య సూత్రాలు భౌతికవాదాన్ని దేవతారహిత భావనలను తెలుపుతూ చార్వాక మతానికి మూలాధారాలైనాయి.

నవగ్రహాలలో బృహస్పతి గురుగ్రహంగా (Jupiter - ద్యుపితర–వెలుగు దేవర); వారాలలో గురువారం (బృహస్పతి వారం – Thursday) అతడి పేరున స్థిరమైనవి. చంద్రుడు తారను అపహరించగా వారికి బుధుడు (Mercury) పుట్టాడనేది ఓ పురాణ గాథ.

# 46. కోట ఏమరకెపుడు పాటించి-

కోటలో నిల్వ ఉంచాలి పశువుల కవసరమైన గడ్డి ఉలవలు ఆహారము
ప్రజలకు అవసరమైన ధాన్యాదులు కట్టెలు నెయ్యి, నూనెలు, ఆయుధాలు, మందులు-
భయంకర యంత్ర సామాగ్రి, నీటిబావులు ఉండాలి, సమర్థులైన సైనికులు
నిందారహితులైన ఆప్తులు నాయకులుగా ఉండేలా చూడడం చక్కని రాజనీతి.

శత్రువు వచ్చే దారిలో నీరు, గడ్డి, ఆహార పదార్థాలు లేకుండా చేస్తే మంచిది
మనకు మిత్రులైన మండలాధిపతులతో కలిసి వ్యూహం రచించాలి.
సప్తాంగాలైన- ప్రభువు మంత్రి కోశం జనపదం సైన్యం మిత్రులు దుర్గాలనూ,
ఆరు రాజ్యతంతాలైన- సంధి విగ్రహ యాన ఆసన ద్వైదీభావ సమాశ్రయాలనూ

మూడు పురుషార్థాలైన ధర్మ అర్థ కామములను నిర్వర్తిస్తూ- శక్తిత్రయమైన
మంత్రాంగం, ప్రభువు, ఉత్సాహములతో, త్రిగుణాలైన సత్వరజస్తమో
గుణాలతో ధర్మాన్ని నిర్వహించినపుడు పాలన సుస్థిరమవుతుంది-
ఇవి అంగిరసుడు, భార్గవుడు మొదలగు మునులు తెలిపిన విషయాలు.

చర్మం, కళ్లు, చెవులు, నాలుక, నాసిక అనే అయిదు జ్ఞానేంద్రియాలు
మాట, చేతులు, కాళ్లు, పాయువు, ఉపస్థ అనే అయిదు కర్మేంద్రియాలు
మనసు కలిసి పదకొండు ఇంద్రియాలను జయించి, కామజనిత వ్యసనాలు
ద్యూతం, వేట, స్త్రీలోలత, మద్యపానం, నిరర్థక ధన వ్యయంను అదుపులో ఉంచాలి.

---

**సీ. కోట యేమఱ కెప్డుఁ బాటించి గడ్డియు । ఖాణంబుఁ గొల్చును గట్టియలును**
**నేయు నూనియయును నాయుధమ్ములు నౌష । ధములు నాభీల యంత్రములుఁ గూప**
**ములు లోనుగా నందు వలయువాని సమగ్ర । ములుగ సంపాదించి భూరి ధైర్య**
**శౌర్యాది గుణముల సడిసన్న యాప్త యో । ధులఁ బె ల్లమర్చుట యలఘునీతి;**

**ఆ. పగతుఁ డలిగి నడచు పథమునఁ దృణ కాష్ఠ । ములును ధాన్యతోయములును లేక**
**యుండఁ జేసి మిత్రమండలేశుల నెత్తి । యరుగుదేరఁ బనుచునది విభుండు. (శాంతి. 2-284)**

---

**దండింపదగినవారు:** 1) మత్తులు, 2) ఉన్మత్తులు, 3) దస్యులు, 4) దొంగలు, 5) ప్రతారకులు, 6) శదులు, 7) లంపటులు, 8) జూదరులు, 9) కృత్రిమ లేఖకులు, 10) లంచగొండులు.

---

**అంగిరసుడు-** మండుతున్న అగ్ని కణికలు - అంగారాల నుంచి పుట్టిన అగ్నికుమారుడు. తొలి ఋషులలో ఒకడు. అధర్వణుని మిత్రుడు, బ్రహ్మ కుమారుడు. అంగిరసుడి భార్యలు స్మృతి (Memory) స్వాధ (తర్పణం); ఇంకో భార్య శుభ కుమారుడు బృహస్పతి. శుభ-అంగీరసాగ్ని పుత్రికలు- సప్త జిహ్వలు - అగ్ని ఏడు నాలుకలు. అంగిరసుడు బ్రహ్మర్షి, సప్తర్షులలో ఒకడు.

జొరాస్టర్ మతంలో అంగ్రామైన్యు - దుష్టాగ్ని (ఋగ్వేద కాలంలో అధర్వుడిని శౌచాగ్నిగా, అంగీరసాగ్నిని దుష్టమంత్రాలకు లోనైన అగ్నిగా భావించేవారు). ఇవన్నీ వేదకాలంలో ప్రజలు దర్శించిన అగ్నిరూపాలు.

# 47. కోరి తోటవాడు కుసుమ ఫలంబులు కోయునట్లు-

క్రోధం వలన జనించే వాక్పారుష్యం, దండపారుష్యాలు కలిసిన
సప్త వ్యసనములకు లొంగక యజ్ఞాలు, వేదాధ్యయనం, దానంలో
ఆసక్తుడై, దుర్మంత్రుల కుటిల వాక్యాలకు దూరంగా ఉండి, దైవ మానుష
చింతన చేస్తూ, దేవుని కొలుస్తూ ఉంటే కలుగుతుంది ఇహపర సిద్ధి

ధర్మరాజా! కృతయుగంలో ధర్మం నడుస్తుంది నాలుగు పాదాలతో
వేదాధ్యయనం, కర్మలు వర్ధిల్లుతాయి, సంతోషాన్నిస్తుంది ప్రతి ఋతువూ
ప్రజల ఆయువు పెరుగుతుంది; దున్నకుండానే భూమి పంటలనిస్తుంది-
త్రేతాయుగంలో మూడు, ద్వాపరంలో రెండు పాదాలతో నడుస్తుంది ధర్మం.

కలియుగంలో రాజుకు ధర్మంపట్ల శ్రద్ధ ఉండదు, నశిస్తుంది ధర్మజ్ఞానం.
అంతటా వ్యాపిస్తుంది అధర్మం; పద్ధతులు గతి తప్పుతాయి.
యధారాజా తధా ప్రజా -అన్నట్లు రాజునుబట్టి ప్రజలు నడుస్తారు
రాజు అనుసరించే దండనీతిని బట్టి ధర్మం నశిస్తూ ఉంటుంది.

పరాక్రమవంతుడు, నిగర్వి, స్త్రీలౌల్యం లేనివాడు, క్రోధరహితుడు
సామంతులను పీడించనివాడు, సుబుద్ధి అయిన రాజు తేజోవంతుడవుతాడు.
పాలకోసం పొదుగు కోయని పసులకాపరిలా, పుష్ప ఫలాలను తీసుకోవడానికి
బదులుగా చెట్లను నరికి నిప్పుపెట్టని తోటమాలిగా రాజుండాలి.

**ఆ.** **కోరి తోఁటవాఁడు కుసుమ ఫలంబులు । కోయునట్లు రాజు కొనఁగవలయు**
**నప్పనములు; నతికి యంగారములు చేయు । భంగి యైన భూమి పాడు గాదె? (శాంతి. 2-300)**

**క.** **దయఁ బ్రజ రక్షించుటకు, నె । నయె తపములు నధ్వరములు నరవర దానన్**
**జయమును లక్ష్మియునుం గీ । ర్తియు సుగతియుఁ గలుగు వసుమతీనాథునకున్. (శాంతి. 2-301)**

**రాజుకుండే ఆరు గుణాలు-షాడ్గుణ్యాలు :** 1) సంధానాసనం (సంధి), 2) దండయాత్ర, 3) విగృహ్యం (వైరం), 4) యాత్రాం సంపరిగృహ్య-దండయాత్ర ప్రకటనం, 5) ద్వైధీభావం (శత్రువులను విడదీయడం), 6) అన్యేషాం పరిశ్రమం- ఇతరులను ఆశ్రయించడం.

అంగిరసుడి కుమారుడు దీర్ఘతమసుడు (అగ్ని పుత్రుడు పుట్టుగుడ్డి కావడం విశేషం). దీర్ఘతముడి భార్య కోపిష్ఠి. భర్తను నదిలో పారవేయిస్తుంది కొడుకులకు చెప్పి. ఆ కుమారులలో ఒకడు గౌతముడు. గౌతముడి భార్య అహల్య. ఇంద్రుడు మోసం చేసింది ఈమెనే. రాయిలా పడి ఉండింది గౌతముని శాపాన రామపాదం తగిలేంత వరకూ. గౌతముడు సృష్టించాడు గోదావరి నదిని, అందుకే ఆ నదికి గౌతమి అని పేరు వచ్చింది. గౌతముడి పుత్రులు- చిరకారి, శరద్వంతుడు. శరద్వంతుడు 'జనపది' అనే అప్సరసను చూసి రెల్లు పొదలలో వీర్య స్ఖలనం కాగా అక్కడ ఇద్దరు శిశువులు పుట్టారు. శంతనుడు ఆ శిశువులను కృపతో ఆదరించినాడు గనుక కృప, కృపిల పేరుతో పెరిగినారు వారు. కృపుడు ఆచార్యుడైనాడు కౌరవ పాండవులకు. కృపిని ద్రోణుడు వివాహం చేసుకున్నాడు. అశ్వత్థామ వారి కొడుకు. కృపాచార్యుడు చిరంజీవి.

# 48. కలసి ఉండవలయు నృపుడు పురోధయు వసుమతీశ!

వాయుదేవుడు చెప్పాడు పురూరవునికి– వసుధ ఎవరికి చెందుతుంది?
అన్న ప్రశ్నకు సమాధానం– తొలినాళ్లలో మానవులందరూ బ్రాహ్మణులే!
తరువాత విశ్వపురుషుని మోము నుంచి బ్రహ్మజ్ఞానులు, భుజాల నుంచి క్షత్రియులు,
ఊరువుల నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు జనించారు క్రమ విభజనగా–

కాబట్టి వసుధ బ్రాహ్మణులకు చెందినది. భర్త చనిపోయిన స్త్రీని భర్త సోదరుడు
దేవర న్యాయాన పరిగ్రహించినట్లు, బ్రాహ్మణులు శాంతికాముకులైనందువల్ల
దండనీతి అవసరమైన రాజ్యస్త్రీ పాలన చేయలేక పోవడంతో ఆ బాధ్యత రాజుకు
అప్పగించారు జనులు; కావున భూమిని పురోహితుడి తరపున పాలిస్తున్నాడు రాజు.

ఈ విషయాన్నే శుక్రుడు వివరించాడు– పురోహితుడు చేయిస్తాడు యజ్ఞయాగాదులు
రాజుతో, భూత రాక్షస పిశాచగణాల్ని పారద్రోలుతాడు మంత్రవిధులతో,
దివ్య, అంతరిక్ష, భౌమ ఉత్పాతాలకు శాంతి కార్యాలు చేయించి శుభం కలిగిస్తాడు.
బృహస్పతి కూడా చెప్పాడు మంత్రవేత్త అయిన పురోహితుడు శత్రు నాశనానికి తోడ్పడతాడని.

కశ్యపుడు చెప్పినాడు ఐలునకు– బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలు పరస్పరాధారాధేయాలు
కలిసి పనిచేస్తే అభ్యున్నతి, విడిపోతే వినాశన స్థితి; పురోహితుని గౌరవించిన
రాజు పురోగమిస్తాడు; వ్యతిరేకించినవాడు వ్యర్థుడౌతాడు, ఇద్దరి అన్యోన్యతతో
జీవన యాత్ర మహోన్నతమవుతుంది, రాజ్యం సుభిక్షమై వర్ధిల్లుతాయి సుఖశాంతులు.

---

**ఆ. 'క్షత్రమునకుఁ బుట్టఁగాఁ బట్టు బ్రహ్మంబు । బ్రాహ్మణునకు యోని రాజు గాన**
**యుభయ వర్ధనంబు నొండొంటి విడువమి । వెలుఁగు రెండు మాయు విడిచెనేని. (శాంతి. 2-314)**

**క. తమలోనఁ బొందుగల వి । ప్రమహీశులఁ బ్రజయుఁ బొదువుఁ బ్రజచే మాన్య**
**త్వము వడయఁగ నేరరు భే । దము గలిగిన నలఁతు రొలసి దస్యులు ప్రజలన్. (శాంతి. 2-315)**

---

**1) షడ్వర్గం:** కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యం; **2) పంచవర్గం:** పంచేంద్రియాలు; **3) దశదోషాలు (కామజనితాలు):** 1. వేట, 2. జూదం, 3. పగటి నిద్ర, 4. మద్యం, 5. ఇతరులను నిందించడం, 6. స్త్రీలపై ఆసక్తి, 7. నాట్యం, 8. గానం, 9. వాదిత్రం, 10. వ్యర్థంగా తిరగడం.

---

అహల్యను పరాభవించిన ఇంద్రుడి శరీరం సహస్రయోనులతో నిండిపోయింది. గణేశుడి దయవల్ల ఇంద్రుడికి స్వస్వరూపం లభించింది. అయితే గౌతముడి శాపంతో ఇంద్రుడి వృషణాలు రాలిపోతే మేక వృషణాలనతికించారు దేవ వైద్యులు.

బృహదారణ్యకోపనిషత్తులో– గౌతముడు జనకుని సభలో యాజ్ఞవల్క్య, గార్గి, ఉద్దాలక అరుణి, కురు పాంచాల ఋషులతో శాస్త్ర చర్చలలో పాల్గొని యాజ్ఞవల్క్యుని పాండిత్య ప్రతిభను పరీక్షించాడు. జాబాలి, శ్వేతకేతులు, ఉద్దాలక అరుణితో సంభాషించినాడు. రామాయణం ప్రకారం గౌతముని కుమారుడు శతానందుడు.

# 49. నిన్నొత్తి చెప్పటకు పాండు విచిత్రవీర్య శంతనులున్నవారే?

-ముచుకుందుడనే రాజు కుబేరుడిపై యుద్ధం చేసి చావుదెబ్బతిని
తన ఓటమికి పురోహితుని నిందించ అతడు బ్రహ్మశక్తితో చేసినాడు
రాజ్యసైన్యమునతి శక్తివంతముగా, ఈసారి గెలుపు ముచుకుందుని వేపు
నిలువ, సంగతి గ్రహించి కుబేరుడు సంధి ప్రతిపాదించి, రాజ్యాన్నివ్వబోగా

దానం స్వీకరించనన్న ముచుకుందుని, నీవు నాకన్నా అధికుడవని కుబేరుడనగా
సంతోషించి పరిపాలించాడు పరాక్రమంతో సమస్త భూమండలాన్ని ముచుకుందుడు
కావున ఓ ధర్మరాజా, రాజుకు అవసరం బ్రహ్మశక్తి కలిగిన పురోహితుడు-
నీవుకూడా ఇంద్రుడు ప్రాణకోటిని వర్షంతో రక్షించినట్లు, ఫలభరితమైన

వృక్షము పక్షులనేకమును సంరక్షించినట్లు నీవు నీవాళ్లను రక్షించుము-
రాజుకున్న బాధ్యత నానా వర్ణాలవారు స్వజాతి ధర్మాలను పాటించేలా చూడడం.
వర్ణహీనులైన వారు ఉత్తమ కార్యాల నాచరించలేరు; ప్రజలు చేసే పుణ్యాలలో
నాలుగవ వంతు, పాపాలలో నాలుగవ వంతు లేదా మొత్తం రాజుకు చెందుతుంది.

ధర్మరాజన్నాడు- నేనీ రాజ్యపాలన చేయగలనా లేదా అనే భయం నాకున్నది.
దండనీతి నేను నిర్వహించలేను, ప్రశాంతంగా తపోవనంలో తపస్సు చేస్తాను-
భీష్ముడన్నాడు- నీకు గట్టిగా చెప్పుటకు పెద్దవాళ్లు లేరుకదా! పూర్వ రాజులు ఈగకాలు
అంత వెలితిరాకుండా ధర్మపాలన చేసారు, నీవుకూడా వారి అడుగుజాడలలో నడువుము.

**ఆ. ఈఁగ కాలి యంత యేనియు వీసర । పోవకుండ ధర్మమునన నడచి**
**రయ్య! తొంటి రాజుల క్రోధ కామ ప్ర । యుక్త దండధరణ మొప్పుఁ గాక. (శాంతి. 2-335)**

**క. దానాధ్యయన యజనముల । తో నుర్వీజనులఁ గావఁ దొడఁగుట పతికిం**
**దా నజ కల్పిత ధర్మము; । దీని విడుపు నరకమునకుఁ దెరు వగు నధిపా! (శాంతి. 2-336)**

**- నాహం రాజ్య సుఖాన్వేషీ రాజ్య మిచ్ఛా మ్య పిక్షణమ్**
**ధర్మార్థం రోచయే రాజ్యం ధర్మశ్చాత్ర న విద్యతే**
**తదలం మమ రాజ్యేన యత్ర ధర్మో న విద్యతే**
**వనమేవ గమిష్యామి తస్మాద్ధర్మ చికీర్షయా (సం.శాంతి. 75-15,16)**

---

**ముచుకుందుడు-** సూర్యవంశపు రాజు. మాంధాత కుమారుడు. అంబరీషుని సోదరుడు. ఒక కాలంలో దేవతలు అసురులతో యుద్ధం చేసి ఓడిపోయి ముచుకుందుని రక్షణలో ఉన్నారు. తరువాత కార్తికేయుని సాయంతో అసురులను చంపినారు. ముచుకుందుని తమతో పాటు స్వర్గలోకంలో అతిథిగా ఉంచుకున్నారు. ముచుకుందుడు భూలోకానికి వెళ్తానంటే ఇంద్రుడన్నాడు- 'త్రేతాయుగం గడిచి భూమిపై ద్వాపరయుగం నడుస్తున్నది. నీ చుట్టాలు బంధువులు ఎప్పుడో చచ్చిపోయారు'. దుఃఖిస్తున్న ముచుకుందుని ఓదార్చి ఇంద్రుడు అతడికి దీర్ఘనిద్రను వరంగా ఇచ్చాడు. ఎవరైనా అతడి నిద్రకు భంగం కలిగిస్తే కాలి భస్మమవుతారని తెలిపాడు ఇంద్రుడు.

# 50. పంజరంలో కాకి

వేదాధ్యయనం చేస్తూ కేకయరాజు అరణ్యానికి పోగా రాక్షసుడు పట్టుకున్నాడతడిని.
ఏ దోషం వల్ల నన్నిలా పట్టుకున్నావు, ఎక్కడా వర్ణ సంకరం లేదు నా రాజ్యంలో
అని అడగగా- నిన్ను చూడాలనిపించి బంధించాను, నీ స్నేహం కోరి వదులుతున్నాను-
అని పలికి ఆ రాక్షసుడు కేకయరాజును వదలి తన స్థానానికి వెళ్లిపోయినాడు.

బ్రాహ్మణుడికి స్వకీయ జీవనం సాగనప్పుడు వైశ్యవృత్తి అవలంబించవచ్చును.
అయితే ధనాశతో ఉప్పు, నువ్వులు, మాంసం, మహిషం, గోవు, వృషభం
అన్నం, కల్లు, నేయి, నూనె, తేనె, కేసరాలున్న జంతువులను అమ్మరాదు సుమా,
వీటిని విక్రయించినవాడికి నరకప్రాప్తి కలుగుతుందన్నది పెద్దల మాట!

యజ్ఞయాగాదుల కన్నా అహింస, సత్యం, దయ, దమమున్న తపస్సు శ్రేష్ఠమైనది,
రాజుకు హితము చేసేవాడు మంత్రి. పురానికి రాజ్యానికి హితుడు పురోహితుడు,
గౌరవ అవమానాలను ఒకేరీతిగా భావించేవాడిని మంత్రిగా నియమించుకోవాలి రాజు,
అన్నదమ్ముల బంధువుల బలగం ఉన్నవాడికి అందరూ భయపడతారు.

కాలకవృక్షీయుడనే ముని కోసల రాజైన క్షేమదర్శి అనే రాజు వద్దకు వెళ్లినాడు
ప్రభువుకు బహుకరించాడు పంజరంలో ఓ కాకిని పెట్టి- రాజా, ఈ కాకి త్రికాలవేది
నీ రాజ్యంలోని దొంగలను పట్టిస్తుంది -అని; ఆ రాత్రే రాజాధికారులు దానిని చంపివేసారు.
ముని అన్నాడు- నేను నీ తండ్రి మిత్రుడిని. ఆ కాకి మామూలు కాకి. నీ చుట్టూ దొంగలున్నారు జాగ్రత్త!

క. **ఆ రాత్రి యవ్విభుని యధి । కారులు సంపి రొక భంగిఁ గాకము; మఱునాఁ**
**దా రాజున కవ్విప్రుఁడు । గోరి రహస్యంబుఁ జేసికొని యెఱిఁగించెన్. (శాంతి. 2-365)**

క. **ఆ రాజు నట్ల చేసి మ । హారాజ్య స్థితికి నెల్ల నవ్విప్రు మహో**
**దారగుణు మంత్రిఁగాఁ గొని । సారధనప్రీతి సుఖ యశంబులు వడసెన్.' (శాంతి. 2-367)**

- **ఏకచ్ఛత్రాం మహీం కృత్వా కౌసల్యాయ యశస్వినే**
**మునిః కాలకవృక్షీయః ఈజే క్రతు భిరుత్త మైః (సం.శాంతి. 82-69)**

---

ముచుకుందుడు భూలోకానికి వచ్చి ఒక పెద్ద గుహలో నిద్రపోతున్నాడు. త్రేతాయుగ కాలపు దేహం. పరిమాణంలో అతిపెద్దది. హాయిగా దీర్ఘనిద్ర పోతున్నాడు ముచుకుందుడు. మధురా నగరపు ప్రభువు ఉగ్రసేనుడు. అతడి కొడుకు కంసుడు. అతడి వరుస చెల్లెలు దేవకి. దేవకి-వసుదేవుల పుత్రుడు వసుదేవ శ్రీకృష్ణుడు. కంసుడి భార్యలు తృప్తి, ప్రాప్తి జరాసంధుని కుమార్తెలు. తమ భర్తను శ్రీకృష్ణుడు చంపాడని తండ్రి జరాసంధుడితో చెప్పగా అతడు మధురపై దండెత్తినాడు. కాలయవనుడు గర్గ్యుడనే మునికి యాదవ స్త్రీకి పుట్టినవాడు, జరాసంధుని మిత్రుడు. జరాసంధుడు 17 మార్లు మధురపై దండెత్తి ఓడిపోయాడు. శివుని వరం పొందిన కాలయవనుడు మూడు కోట్ల సైన్యంతో మధురపై దండెత్తిరాగా కృష్ణుడు తనవారి నందరిని కొత్తగా నిర్మించిన ద్వారకాపురికి పంపి, కాలయవనుడిని ద్వంద్వయుద్ధానికి పిలిచాడు.

# 51. విశాల బుద్ధి కావలయు మంత్రి ముఖ్యుండు-

'త్రికాలవేది ఈ పంజరంలో కాకి' -అని కాలకవృక్షీయుడనే మునివర్యుడు
క్షేమదర్శికి బహుకరించగా, అది తమ గుట్టు బయటపెడుతుందేమోనని
భయపడిన రాజాధికారులు ఆ రాత్రే ఆ కాకిని చంపివేసారు ఆతృతగా.
ముని అన్నాడు రాజుతో- నేను నీ తండ్రి స్నేహితుడిని, తపోవనంలో ఉంటున్నాను.

నీవిపుడు దొంగలతో కూడిన కావేరి నదీ ప్రాంతంలా ఉన్నావని గ్రహించి
నేనీ పని చేసాను. మోసకారులైన అధికారులకు వారిలో వారికి విరోధాలు
కలిగించి, వాళ్ల సంతోషాన్ని భంగపరచి ఒక్కొక్కరిని శిక్షించుము-
అతడు చెప్పిన విధంగా క్షేమదర్శి ప్రభువు వ్యవహరించి దుష్టులను శిక్షించి

కాలక వృక్షీయుడిని తన మంత్రిగా నియమించుకుని రాజ్యపాలన చేసి
ధనం, సంతోషం, సుఖం, కీర్తి పొందినాడు -అని భీష్ముడు వివరించగా
మంచి మంత్రి లక్షణములు తెలియజేయమని ధర్మరాజు అడిగాడు వినమ్రంగా.
-జ్ఞానపరుడు, పౌర జాన పద ఆప్తుడు, కార్యజ్ఞుడు, ధైర్య శౌర్యఘనుడు

క్రూరత్వం లేనివాడు, విశుద్ధాత్ముడు, ప్రభుభక్తి కలవాడు, గౌరవ అవమానములను
సమదృష్టితో చూసేవాడు, తమ దోషాలను కానరాకుండా, శత్రువుల లోపాలను
గుర్తించి వారిని చిక్కుల పాలు చేయగలవాడు, విశాలబుద్ధి కలవాడు మంత్రిగా
ఉండేందుకు అర్హుడు - రాజు కూడా తన మంత్రులతో గౌరవంగా మెలగాలి సుమా!

---

**సీ.** **'జ్ఞానపరుఁడుఁ బౌర జానపదాప్తుండుఁ । గార్యజ్ఞుఁడును ధైర్యశౌర్యఘనుఁడు**
**నక్రూరుఁడును విశుద్ధాత్ముండుఁ బతియెడ । భక్త్యను రాగ సంభ్రమము లెసఁగ**
**సమ సుఖదుఃఖుఁడై చెమరు నెత్తురు గాఁగఁ । దలఁచుచు నరయక తప్పు మీఁదఁ**
**బెట్టిన నలుకమైఁ దిట్టినఁ గలఁక దా । నొందక తేర్చుచోఁ బొందు సెడక**

**తే.** **మెలఁగు వాఁడును నిజరంధ్రములకు మాటు । సేయఁ బరరంధ్రములు గని చిక్కువఱుపఁ**
**జాలు నిపుణుండు నైన విశాలబుద్ధి । గావలయు మంత్రిముఖ్యుండు గౌరవేంద్ర! (శాంతి. 2-369)**

**-** **మంత్ర గూఢా హి రాజ్యస్య మంత్రిణో యే మనీ షిణః**
**మంత్ర సంహానో రాజా మంత్రాంగా నీ తరే జనాః (సం.శాంతి. 83-50)**

---

కాలయవనుడు తరుముతుంటే అందకుండా శ్రీకృష్ణుడు పరుగెత్తుతుంటే దుర్భాషలాడుతూ వెంటబడినాడతడు. శ్రీకృష్ణుడతడిని ముచుకుందుడున్న గుహలోకి తీసుకువెళ్లి అదృశ్యమైనాడు. ఆగ్రహంతో గుహలోకి ప్రవేశించిన కాలయవనుడు అక్కడ నిద్రిస్తున్న ముచుకుందుని తన్నగా అతడు మేల్కొని కళ్లు తెరచి చూసేసరికి ఆ కోపాగ్నిలో కాలి బూడిదైనాడు కాలయవనుడు. శ్రీకృష్ణుని అనుమతితో ముచుకుందుడు గంధమాదన పర్వత ప్రాంతంలోని బదరికాశ్రమం చేరుకుని గొప్ప తపస్సు చేసి ముక్తినొందినాడు.

## 52. తనయులనైనను నమ్మిన జనపతి సిరిన్ కోలుపోవును-

-'మృదు మధుర వాక్యములతో, ఇంపైన చిరునవ్వుతో ప్రభువు పలుకరిస్తే
మంత్రులు ప్రజలు అమందానందంతో పొంగిపోతారు, ధర్మరాజా!'
అన్నాడు భీష్ముడు -అంతేకాక వ్యవహార శుద్ధి, వాక్శుద్ధి,
మనోశుద్ధి కలిగిన మహరాజుకు లభిస్తాయి ధర్మాధికారము, కీర్తి.

పక్షపాత బుద్ధితో తీర్పు చెప్పితే, డేగను చూసిన పక్షుల్లా చెల్లాచెదరవుతారు.
ప్రజలు, రాజాశ్రయాన్ని వదిలేస్తారు. న్యాయబద్ధమైన తీర్పును
కఠినంగా అమలుపరిస్తే నేరాలు తగ్గుతాయి, కరచరణ శిరచ్ఛేదములు,
ధనం గ్రహించడం, కారాగారవాసం, కట్టిపడేయడం శిక్షలు నేరాన్ని బట్టి విధించాలి-

దూతను చంపరాదు, మనవేపు నుంచి దూతను పంపేటప్పుడు
మంచి నడవడి, కులము, హితవాక్యము, నేర్పు కార్యవదిత్వము
సమయస్ఫూర్తి, దక్షత - ఈ ఏడు గుణాలు ఉన్నవాడిని ఎన్నిక చేయాలి
వ్యూహ నిర్మాణము, యంత్ర నైపుణ్యము, ఆయుధ విన్యాసము, సామర్థ్యము

సాహసియైన సైన్యాధిపతికి ఉండవలసిన సహజ గుణములు.
సమస్త ప్రజలను నమ్మినట్లు నటిస్తూ రాజ్యపాలన చేయాలి రాజు
తన పుత్రులనైనా మిక్కిలిగా నమ్మితే సంపదలను కోల్పోతాడు ప్రభువు
-అని గాంగేయుడు చెప్పగా విని మిక్కిలి సంతోషించాడు ధర్మరాజు.

**సీ. 'వ్యవహారశుద్ధి సర్వ ప్రజా ప్రియకారి; । యదియ భూపతికి ధర్మాతిశయముఁ**
**గీర్తియుఁ జేయు; నక్షీణసత్యులు ధర్మ । పరులును నైన భూసురులు నీవు**
**ద్రాసులుం బోని చిత్తంబుల తోడుత । బ్రజ వివాదము లెడఁ బక్ష ముడిగి**
**విని ధన వాంఛమై ధనికుల దెస వ్రాలి । తీర్పక ధర్మంబు తెరువు దప్ప**

**ఆ. కుండఁ బాడిఁ దీర్చి దండింపఁ దగునెడ । ననుగుణంపు దండ మాచరింపు**
**మొఱగఁ బలికితేని నుండదు ప్రజ దేగఁ । గనిన పులుఁగుపిండు కరణిఁ జెదరు. (శాంతి. 2-374)**

**క. తనయులనైనను నమ్మిన జనపతి సిరి గోలుపోవుఁ జతురతమై న**
**మ్మిన వాడ పోలె నమ్మక యునికి సకల జనుల యెడల నురవై యుండున్ (శాంతి. 2-381)**

---

**కుబేరుడు:** పులస్త్య బ్రహ్మ-హవిర్భుక్కు (మానిని)ల కుమారుడు విశ్రావసుడు. ఇతడి భార్యలు ఇళబిళ, కైకసి, రాక; ఇళబిళ కుమారుడు వైశ్రావసుడనబడే కుబేరుడు. కైకసి కుమారులు- రావణ, కుంభకర్ణ, విభీషణ, శూర్పణఖలు; రాక కుమారుడు ఖరుడు. కుబేరుడి భార్య భద్ర; సంతానం- నలకూబరుడు, మణిభద్రుడు, మయూరజ, మీనాక్షి. లంకా రాజ్యం, పుష్పక విమానాలను రావణుడు లాక్కున్నాడు. ప్రస్తుత రాజధాని అలకాపురి. యక్షుల నాయకుడు. పెద్ద పొట్ట, ధనపు సంచి, గద ధరించి ఒక్కోసారి ధనాశ కలిగిన నరులపై ఎక్కి నరవాహనుడై సంచరిస్తాడు. లోకపాలకుడు, దిక్పాలకుడు. శ్రీవేంకటేశ్వరునికే ధనం ఋణమిచ్చి వడ్డీ తీసుకుంటున్నవాడు.

## 53. పులి కూనల తిను చందము-

లోతూ విశాలంగా ఉన్న అగడ్త, పొడవూ దిట్టమూ అయిన కోట
దీటైన వాకిళ్లు, దిట్టమైన కాపలా, మనోహర భవనాలు, ఫలపుష్ప వనాలు,
కొమరారు వీధులు, పెద్దపెద్ద దుకాణాలు, ఎల్ల వస్తువులు ధాన్యములు
నెయ్యి, నూనె మొదలగు రస ద్రవ్యాలు, పలు యంత్రాలు, ఆయుధాలు

ధీరులైన యోధులు, పండితులు, విలాసినులు, పరివారము ఉండి
పరమోత్సవములు కనుల పండుగగా ఉన్న రాజధాని కీర్తినిస్తుంది-
చోరులచే చెడకుండా, క్రూరులచే చావకుండా, జారుల వలలో పడకుండా
ధరారమణుడు తన నగర ప్రజలను సంరక్షించాలి జాగరూకతతో

పశు సంపద, ధన సంపద, రత్న సంపద కలవారికి రక్షణ కల్పించాలి
పన్నులు అధికంగా తీసుకొనుట దూకుడు పాలు లేకుండా చేయడం
అందుకని రైతులు, వర్తకులు, గోపాలురను నొప్పించక పన్నులు వేయాలి.
ఆకలితో పులి తన పిల్లలను తానే తిన్నట్లు రాజు ప్రవర్తించరాదు.

తగిన సమయంలో శిక్షించవలసిన వారిని దండించి, వారి సంపదలను
గ్రహించి కోశాగారాన్ని నింపుకోవాలి; అతిగా ప్రవర్తించడం అనర్థం
అపాత్ర దానం చేయరాదు, సంపాదనకు చేసే ఆలోచన ఖర్చులోనూ ఉండాలి.
ధర్మరాజా! ఈ రకంగా చేస్తే వృద్ధిచెందును కోశమిత్ర రాష్ట్ర బలములు.

---

**సీ.** **'పరపు లోఁతును గల పరిఖతోఁ' బొడవును । ఘనమును నగుకోట గలిగి, తగిన**
**వాకిళ్ళు బలుపుఁ, గావలి నొప్ప రమ్య గృ । హవ్రాతములు గొమరారు వీథు**
**లందంబు లగు మేటి యంగళ్ళ నెల్ల వ । స్తువులును శోభిల్లు సుజన బహుళ**
**మై ధాన్యములును ఘృతాది రసద్రవ్య । ములును నానాయంత్రములును బహువి**

**ఆ.** **ధాయుధములు బిరుదు లగు యోధులును బండి । తులు విలాసినులును దూతముఖ్య**
**పరిజనము నెఱయఁ బరమోత్సవంబులు । మెఱయఁ బురము చెలువు మిగుల వలయు. (శాంతి. 2-383)**

**క.** **పులిఁగూనల దినుచందము గలిగిన నంతటన నిలుచుఁ గాక ధనంబుల్**
**గలుగునె మీఁదం గావున జలగ దిగిచినట్లు గొనఁగఁ జను నిల సొమ్ముల్ (శాంతి. 2-393)**

---

**అప్సరసలు :** దైవిక, లౌకికమని రెండు వర్గాలు. ఇంద్ర సభలోని అప్సరసలు ఘృతాచి, మేనక, రంభ, పూర్వచిత్తి, స్వయంప్రభ, ఊర్వశి, మిశ్రకేశి, దండగౌరి, వరూధిని, గోపాలి, సహజన్య, కుంభయోని, ప్రజాగర, సహ, మధురస్వన, చిత్రలేఖ, చిత్రసేన, జలపద, తిలోత్తమ, పుంజికస్థల.

**నాట్యశాస్త్రంలో చెప్పబడినవారు-** సుకేశి, మంజుకేశి, మిశ్రకేశి, సులోచన, సౌదామిని, దేవదత్త, దేవసేన, మనోరమ, సుదతి, సుందరి, విగగ్ధ, వివిధ, బుధ, సుమల, సంతతి, సునంద, సుముఖి, మాగధి, అర్జుని, సరళ, కేరళ, ధృతి, నంద, సుపుష్కల, సుపుష్పమల, కలభ.

# 54. అర్థ సిద్ధి కంటె నరయ నెక్కుడు ధర్మ సిద్ధి-

ఉతథ్యుడనే మహర్షి మాంధాత మహరాజుతో ముచ్చటించిన విషయాలివి
-ధర్మం వలన ప్రాణికోటి వృద్ధి చెందుతుంది, ధన లాభములు కలుగుతాయి.
ధర్మ సంరక్షణకే రాజు జన్మించాడు కనుక అతడికి ఉండాలి ధర్మాసక్తి.
ధర్మానికి జన్మస్థానమైన బ్రహ్మజ్ఞానులను పూజించి గౌరవించాలి.

విరోచన పుత్రుడైన బలిచక్రవర్తి సైతం బ్రాహ్మణుల ధర్మ ప్రవర్తనకు
అసూయపడి కోల్పోయాడు సమస్త సంపదలను, ఉన్నత పదవిని-
మరల పొందినాడు దృఢమైన భక్తి ప్రపత్తులతో సౌఖ్య విభూతి
ధర్మానికి సంపదకు పుట్టిన దుర్గుణమే దర్పం. అది నాశనకారి.

పరనారీ గమనాది దోషములతో రాజులు వేగంగా పతనమౌతారు.
వర్షాలు కురవవు, రోగాలు వ్యాపిస్తాయి, తేజస్సు నశించి కీడు కలుగును.
పరిపూర్ణ ధర్మమార్గంలో నడుచుకునే రాజు కలకాలం జీవిస్తాడు సంతోషంగా
-అని ఉతథ్యుడు పలుకగా మాంధాత ఆచరించి సుఖంబునొందె.

వామదేవుడనే ముని వసుమనుడనే రాజుతో ఈ విధంగా చెప్పినాడు
ధర్మ ప్రవర్తనతో ధనం కీర్తి ఇహపర లోకాలలో సిద్ధి కలుగును.
ధనమే ధ్యేయమైనచో అపకీర్తి, ధన నాశనం, నరకప్రాప్తి సంభవించును.
అంతేకాక శత్రువులను సామ దాన భేద దండోపాయాలతో గెలవడం ముఖ్యం.

**మ. పరనారీగమనాదిదోషములు భూపాలుండు సేయంగఁ ద**
**ద్ధరకున్ వర్షము లేకయుండుఁ; బ్రజకున్ దైన్యంబు వాటిల్లుఁ; బె**
**క్కు రుజల్ పైకొను; నెందునుం గలయ నుక్కుం దేజముం దక్కు; ను**
**ద్ధుర సైన్యంబుల శత్రు లొత్తుదురు; బంధుశ్రేణికిం జే టగున్. (శాంతి. 2-405)**

**ఆ. అర్థసిద్ధి కంటె నరయ నెక్కుడు ధర్మసిద్ధి దాన సకల సిద్ధులును బ్ర**
**శస్త భంగిఁ జేరు; శాశ్వత కీర్తియు సంభవించుఁ గలుగు సద్గతియును-**

**క. ధనమునకై ధర్మము దెస ననాదరము సేసెనేని నా నృపతికి న**
**ద్ధనమును జెడు; దుర్యశముం బనుగొనుఁ దుది దుర్గతియును బాటిలు ననఘా- (శాంతి. 2-408,409)**

**అప్సరసలు :** ఇంద్రసభలో అప్సరసలు 26 గురు ఒక్కొక్కరు ఒక్కొక్క కళలో ఆరితేరినవారు. నీటిపై, నీటి దగ్గర ఉండేవారు, నీటి అలల మధ్య (మేఘాల) చరించేవారు. వీరు గంధర్వుల భార్యలు. మహాభారతంలో 45 మంది అప్సరసలు పేర్కొనబడినారు. అప్-అనగా నీరు; సరస= సరస్సు. నీటి సరస్సుల దగ్గర ఉండేవారు, జలకన్యలు. ఋగ్వేదంలో అయిదుసార్లు ప్రస్తావించబడినారు. అప్సరసలు లౌకికులు 24 మంది, అలౌకికులు పదిమంది ప్రసిద్ధులు. సముద్ర మంధన సమయంలో జనించి సంగీత రసజ్ఞులైన గంధర్వులను పతులుగా స్వీకరించారు. వీరిలో ఊర్వశి, రంభ, మేనక, తిలోత్తమ, ఘృతాచిలు ప్రసిద్ధికెక్కిన అప్సరసలు.

# 55. రాజు శయ్య జచ్చుట కొరగాదు గాన-

శత్రువు బలహీనుడై తన సైన్యం బలమైనదైతే దండోపాయాన్ని,
ఎదుటి రాజు తనంతటి బలవంతుడైతే వినియోగించాలి సామోపాయాన్ని
తన సైన్యంలో అంతఃకలహాలు చెలరేగితే శత్రువుకు ధనమిచ్చి దానోపాయాన్ని
సామ దాన దండోపాయాలు పనిచేయనప్పుడు భేదోపాయం మంచిది.

శుక్రాచార్యుడు తెలిపిన అయిదో ఉపాయం 'ఉపేక్ష' - చూస్తూ ఉండడం.
ఆ వామదేవుడు చెప్పిన విషయాలను పాటించి విజయం చెందాడు వసుమనుడు
ధర్మరాజా! వినుము యుద్ధనీతిని- శత్రువు సైన్యంతో వస్తే
సైన్యంతో, ఎక్కటి కయ్యమని వస్తే ద్వంద్వ యుద్ధంతో ఎదుర్కోవాలి.

మాయోపాయాలకు మాయోపాయాలు వాడాలి. శత్రువు పారిపోయినా
పడిపోయినా, ఆయుధం భగ్నమైనా, శరణు వేడుకున్నా, కాలు మొక్కినా
గుర్రాలు కూలినా, వేరొకడితో యుద్ధం చేస్తున్నా చంపరాదతడిని.
అధర్మంగా చంపడం కంటే ధర్మయుద్ధ విహారంలో చావడం మేలు.

రాజు మరణించరాదు మంచంపై, అందుకనే ఓడిపోరాదు యుద్ధంలో
అగ్రభాగంలో ములికిని ఉంచిన ఆయుధాన్ని, విషం పూసిన దానిని వాడరాదు.
తనకు సాయం చేయడానికి వచ్చి చిక్కులలో పడినవాడిని రక్షించాలి.
శత్రువులపై దండెత్తినపుడు వాళ్ల పట్టణాల్ని చేయరాదు నాశనం.

**సీ.** **పగవాఁడు బలములఁ బన్ని త్రోచినఁ దాను । సబలుఁడై యొంటిమై సంగరంబు**
**గోరిన నమ్మెయి గొనకొని మాయ లొ । నర్చిన మాయలఁ బేర్చి గెలుపు**
**గొనునది; వెన్నిచ్చినను బ్రమాదంబునం । బడినను గైదువు భగ్నమైన**
**శరణన్న మ్రొక్కినఁ దురగాళి యెడలిన । నొరుతోడఁ బోరుచచునున్న నెట్టి**

**ఆ.** **పగతునైనఁ జంపఁ దగ దధర్మంబునఁ । జంపు కంటె ధర్మసమర కేళిఁ**
**జావు మేలు; రాజు శయ్యఁ జచ్చుట గొఱ । గాదు గాన యోడఁ గాదు పోర. (శాంతి. 2-420)**

**శంఖలిఖిత సిద్ధాంతం:** నుదుటి ఎముకను 'శంఖం' అంటారు. దానిపై వ్రాస్తాడు విధి లేదా బ్రహ్మ రాత. విధిరాత లేదా తలరాతను తప్పించుకోలేమంటారు విశ్వాసులు.

**ఊర్వశి-** నారాయణ ముని ఊరువు నుంచి పుట్టినది. ఊర్వశి-పురూరవుల ప్రేమకథ లోక ప్రసిద్ధం.

**తిలోత్తమ-** సుంద-ఉపసుందులను చంపడానికి తిలల ప్రమాణ రత్నాలతో విశ్వకర్మ నిర్మించిన అతిలోకసుందరి.

**మేనక-** విశ్వామిత్ర-మేనకల కుమార్తె- శకుంతల; శకుంతల కుమారుడు భరతుడు.

**ఘృతాచి-** భరద్వాజుడికి ద్రోణుడిని, వ్యాసుడికి శుకుడిని, విశ్వకర్మకు నలుడిని కొడుకులుగా ఇచ్చింది.

**రంభ-** రావణుడు రంభను బలాత్కారం చేయగా, నలకూబరుడు శపించాడు రావణుని ఏ స్త్రీనైనా బలాత్కారం చేస్తే శిరస్సు వేయి వక్కలవుతుందని. అందుకే రావణుడు సీతకు ఏ అపకారమూ చేయలేదు.

# 56. చనునే సాహసమిట్లు సేయ? నిది కర్జంబే?

భీష్ముడు చెప్పినదంతా విని ధర్మరాజన్నాడు– ఎటు చూసినా రాజుకు తప్పదు నరకప్రాప్తి–
గాంగేయుడన్నాడు– శరణాగతులను రక్షించి, యజ్ఞాలను నిర్వహించి
అతిథి అభ్యాగతులకు సేవచేసి పాపాలను పరిహరించుకోవచ్చు ప్రభువు–
ఒకసారి ఇంద్రుడు అంబరీషులకు మధ్య సంవాదం తలెత్తింది స్వర్గంలో

అంబరీషుడు తనకన్నా ముందుగా స్వర్గానికి వచ్చి విమానంలో విహరిస్తూ ఉన్న
సుదేవుడిని చూసి ఇంద్రుడినడిగాడు– ఇతడు నా సేవకుడు, జన్మలో
ఏ యాగాలూ చేయలేదు, మరి అంత ఉన్నతంగా వెలుగొందడానికి కారణమేమిటి?
ఇంద్రుడన్నాడు– శతశృంగుడనే రాక్షసుడికి సదమ, దమ, విదములనే ముగ్గురు కొడుకులు

వాళ్లు నీపై దండెత్తడానికి వస్తుంటే నీవు పంపావు సుదేవుడిని సైన్యసమేతంగా–
నీవన్నావు– గెలిస్తేనే తిరిగి నగరానికి రా, లేకుంటే ఓటమి మృత్యు సమానమే!
అతడనుకున్నాడు– ఈ యుద్ధమెందుకు, సర్వనాశనమెందుకు, శివుని పూజిస్తాను
నా తలను నరికి ఆ మహదేవుడికి కానుకగా ఇస్తాను –అనుకుని వెళ్లాడు స్మశాన భూమికి.

ఈశ్వరుడి గురించి తపస్సు చేసి తల నరుక్కోవడానికి కంఠంపై కత్తిని సంధింప
శివుడు ప్రత్యక్షమై– ఈరీతి సాహసం చేయతగునా? దివ్యాస్త్రములను ఇస్తున్నాను
ఎలాంటి శత్రువులనైనా గెలువుము, కాని, యుద్ధంలో నేలమీద కాలు పెట్టవద్దు–
అని అంతర్హితుడు కాగా– సుదేవుడు ఎదుర్కొన్నాడు రాక్షససేనను గొప్ప పరాక్రమంతో–

**శా. బాహాగర్వము సూపఁగోరి పటుదర్పం బొప్ప నుగ్రాహవో**
**త్సాహం బూర్జితభంగిగా భయద ఘోషస్ఫీత నానావిధ**
**వ్యూహంబుల్ ధరణీప్రకంపనము లై యుద్దామ సర్వాంగ స**
**న్నాహత్వంబునఁ బేర్చి తోడ నడవ న్సంరంభ శుంభద్గతిన్. (శాంతి. 2–431)**

**మ. చనునే సాహసమిట్లు సేయ? నిది కర్జంబే? కతంబేమి? యి**
**ప్పని? కన్నంగని చక్కఁజాగి ధరయున్ ఫాలంబునుం బొంద వం**
**దనముం జేసి, యితండు నీ పలుకులున్ దైతేయులం దాఁక నొ**
**ల్లని వాఁడైన తెరంగుఁ జెప్పె శిశునుల్లంబార్ద్రతం బొందఁగన్ (శాంతి. 2–436)**

---

**రంభ–** కశ్యప ప్రజాపతి–ప్రథలకు (ముని) జన్మించినవారు రంభ, అలంబుస, మిశ్రకేశి, విద్యుత్పర్ణ, తిలోత్తమ, అరుణ, రక్షిత, మనోరమ, సుబాహు, కేశిని, సురత, సురజ, (క్షీరసాగర మధన సమయంలో జనించినవారు). విశ్వామిత్రుడు మేనకతో తపస్సు చెడి శకుంతలను కని వదిలేసి పోయి మరల తపస్సు చేయగా ఈసారి రంభను పంపినాడు ఇంద్రుడు. దానితో అతడు రంభను పదివేల ఏళ్లు శిలగా మారమన్నాడు. అయితే ఆమెకు శాపవిమోచనం కలిగింది బ్రాహ్మణ శక్తి వలన; రావణుడామెను బలాత్కారం చేయగా నలకూబరుడతడిని శపించాడు– మరల ఏ స్త్రీనైనా బలవంతంగా పొందాలని ప్రయత్నిస్తే తల వేయి వక్కలవుతుందని. అందుకే రావణుడు సీతను బలాత్కారం చేయలేదు.

శృంగార జ్ఞాన నిర్ణయమనే కావ్యంలో రంభకు, శుకుడనే మునికి మధ్య వాదోపవాదాలు జరుగుతాయి– శృంగారం గొప్పదా, జ్ఞానం గొప్పదా అనే విషయంపై. అరటి బోదె మరో పేరు రంభ. అంతటి సౌకుమార్యం ఆమెది.

## 57. దనుజుం దాకి కృపాణ ఖేలనము చిత్రంబై వెలుంగొంద-

సుదేవుడి ధాటికి రాక్షస సైన్యం తట్టుకోలేకపోయింది, శవాల గుట్టలే ఎక్కడ చూసినా
ఎదిరించిన సదముడు, దముడు అనే రాక్షసులను చిటికెలో సంహరించగా
విదముడు కోపంతో బాహా సముల్లాసిత ఘన రుచిరాసి ప్రభాభాసురుండై
ఖడ్గపాణియై రాగా సుదేవుడు శివుడి హెచ్చరిక మరచిపోయి రథం దిగాడు.

ఇద్దరి మధ్య ఖడ్గయుద్ధమతి భయంకరమై ఒకరినొకరు చీల్చి ఖండించి నేలకొరిగారు
రాక్షస సేన పారిపోయింది, నీవు గెలిచావు, అందుకే సుదేవుడికి
అంతటి గౌరవం లభించింది స్వర్గంలో; ఎన్ని యజ్ఞ యాగాదులైనా సరిరావు
యుద్ధ యజ్ఞానికి; వీరుల శిరస్సుల రాశులే యజ్ఞవేదిక కాగా

ఖడ్గ బాణాది ఆయుధాలు సమిధలు స్రువములుగా, రక్తమే నేయిగా,
మాంసం పురోడాశంగా, వీరమనే వ్రతం పూనిన వాడు యుద్ధమనే
యజ్ఞాన్ని సలిపి, రక్తమనే జలం, మెదళ్లనే బురద, వెండ్రుకలనే పాచి,
పేగులనే నురుగు, యుద్ధభేరీలనే కప్పలు, ఖడ్గాలనే చేపలు కలిగి

ఏనుగుల మృత కళేబరాలు ఇసుక దిబ్బలుగా, రక్తగంగలో తడిచినవాడై
ఆనక స్వర్గ గంగలో యజ్ఞాంత స్నానం చేసి, స్వర్గలోకంలో కీర్తించబడి
శాశ్వత స్థితిలో అత్యున్నత స్థానాన్ని పొందాడు -అని ఇంద్రుడు చెప్పగా
అంబరీషుడు ఎంతో గౌరవించాడు సుదేవుడిని గొప్ప పుణ్యాత్ముడిగా.

---

స్రగ్ధర- **వీరాదారోగ్రలీలన్ విదముడు సమరోర్విన్ బలోల్లాస మొప్పం**
**జేరెన్ బాహా సముల్లాసిత ఘనరుచిరాసి ప్రభా భాసురుండై**
**యారక్షోనాథుపైఁ బేరలుక మరపుఁ జేయంగ నీండు డిగ్గెం**
**దేరుద్యత్ఖడ్గ దీప్తుల్ దెసల నిగుడ దైతేయ వీరుల్ చలింపన్ (శాంతి. 2-440)**

మ. **దనుజుం దాఁకి కృపాణ ఖేలనము చిత్రంబై వెలుంగొందఁ ద**
**త్తను సంఛేదన కేలిసల్ప నతఁడుం దన్నుం బటుప్రస్ఫుర**
**ద్ఘన కౌక్షేయక ధారఁ జీరఁ బడియెం దా నాతనిం గూల్చెఁ ద**
**క్కిన దైత్యావలి విచ్చె నల్గడఁ బరిక్షీణోద్యమత్వంబునన్. (శాంతి. 2-442)**

---

**ఘృతాచి-** ఘృతము అంటే నెయ్యి. అద్భుతమైన సౌందర్యవతి. నేతి రుచి, పరిమళం. వ్యాసుడి వలన శుకుడిని, భరద్వాజుడి వలన ద్రోణుడు, శ్రుతవతిని; కుశనాభుడి వలన గాధిని, వందమంది పుత్రికలను; రౌద్రాశ్వుడి వలన పదిమంది కొడుకులను, పర్జన్యుడి వలన వేదవతి (దేవవతిని), ప్రమతి వలన రురుడిని, విశ్వకర్మ (వానర రూపంలో ఉన్నపుడు) నలుడికి జన్మనిచ్చింది.

నలుడు రామసేతు నిర్మాత.

ఘృతాచి- కుంభరాశి (Aquarius) అధిష్ఠాన దేవత.

ఘృతాచిని చిలుక రూపంలో చూసిన వ్యాసుడి రేతస్సు మండుతున్న సమిధలపై పడగా శుకుడు జన్మించాడు. (శుక-చిలుక). ఘృతాచిని చూసిన భరద్వాజుడికి రేతః పతనం కాగా ఆ రేతస్సును నేతికుండలో భద్రపరిస్తే (ఘృత ద్రోణం) ద్రోణుడు జన్మించాడు.

## 58. దూర బందల చోటిది దుఃఖమయమీ నరకము-

భీష్ముడు వివరించాడు ధర్మరాజుకు సమరానివర్తనంబు వలన కలిగే ఫలాన్ని-
జనక మహరాజుకు ప్రతర్థనుడికి యుద్ధం జరిగినపుడు తన వీరులకు
చూపించాడు జనకుడు స్వర్గ నరకాలెలా ఉంటాయో- అధిక పుణ్యాన్ని
అందించేది, సమస్త భోగాలకు నెలవైనది, మనోహరాంగనలతో ఉన్నది స్వర్గం.

పిరికిపందలు చేరుకునేది దుఃఖమయమైన నరకం- దానితో వీరులు
విజృంభించి వైరి వీరుల నోడించి జనకునికి అందించారు ఘన విజయాన్ని
యుద్ధంలో ప్రదర్శించే సాహసం ప్రకాశించే సంపదను ఉత్తమ లోకాలను ప్రసాదిస్తుంది
వీరుడు పుణ్యవంతుడై విశిష్ట భోగాలను ఉన్నతిని పొందుతాడు -అని పలికాడు భీష్ముడు.

జన్మతః పులికి వేటాడడంలోని ధర్మసూక్ష్మాలు తెలియవని కాదు
పెద్దలను చూసి నేర్చుకోవడం చిన్నాపెద్ద దెబ్బ తినడం తెలియదని కాదు
పులిబిడ్డలన్నీ ఒకేరకంగా ఉన్నా లావూ ఎత్తూ ఎత్తుగడలలో తేడా లేదని కాదు
పులి చారలలో తేడా ఎంత జాగ్రత్తగా చూసినా ఎదుటివారికి తెలిసేది కాదు.

పులి ధర్మం, పులి న్యాయం, పులి జూదం, పులి హింస, పులి శాంతి పులికే తెలుసు.
పులి ప్రతిజ్ఞ, పులి పెంపకం, పులి వేగం, పులి శక్తి, పులి శయ్య పులికే తెలుసు.
పులికి పాలన నేర్పించాలని అన్నీ తెలిసిన పులి ఇచ్చిన అవకాశాన్ని తీసుకుంది వృద్ధ పులి
పులిపాలు తాగి పెరిగినా ధర్మంపాలు తెలిసీ తెలియనట్లుండేదే మెత్తటి పులి.

**క. జనకుఁడు ప్రతర్దనునకుం । దనకును రణమైన యపుడు తన యోధులకున్
విను నాకంబును నరకముఁ । గనుఁగొనుఁ డని చూపి చెప్పెఁ గౌరవముఖ్యా! (శాంతి. 2-444)**

**తే. పుణ్యతమము భోగాస్పదంబును మనోహ । రాంగనా జనబహులంబు నైనయది ర
ణంబు బిరుదులై చేసిన నరుల నెలవు; । దూరఁ బందలచో టిది దుఃఖమయము. (శాంతి. 2-445)**

**- యస్మిన్యథా వర్తతే యో మనుష్యః తస్మింస్తథా వర్తితవ్యం స ధర్మః
మాయాచారో మాయయా బాధితవ్యః సాధ్వాచారః సాధునా ప్రత్యుపేయః (సం.శాంతి. 109-30)**

**ఊర్వశి:** నరనారాయణులు తపస్సు చేస్తుంటే వారి తపస్సు చెడగొట్టమని ఇంద్రుడు యధావిధిగా మేనక, రంభాది అప్సరసలను, కామదేవ, రతి, వసంతులను పంపినాడు. నారాయణ ముని ఒక అందమైన పువ్వును తన తొడపై ఉంచి స్పృశించగానే జన్మించింది అపూర్వ జగదేకసుందరి. ఊరువు నుంచి పుట్టి 'ఊర్వశి'గా కానవచ్చింది. ఆమెను దేవేంద్రుడికే కానుకగా నిచ్చి అతడి గర్వభంగం చేసి పంపినారు నర నారాయణులు. ధరుమడు-అహింస (మూర్తి)ల పుత్రులు నర-నారాయణులు.

ఆ నరనారాయణులు పార్థుడు, కృష్ణుడిగా జన్మించారు. నరనారాయణులు ప్రత్యక్షమైన చోటు గుజరాత్-అహ్మదాబాద్-సబర్మతి నది-స్వామి నారాయణ మందిరం; దుర్వాసుడి శాపంతో నారాయణముని స్వామి నారాయణుడిగా జన్మించాడని ప్రజల విశ్వాసం. ఉత్తరాఖండ్‌లోని ఛమొలి జిల్లా బదరికాశ్రమం నర నారాయణులు తపస్సు చేసిన స్థలం.

## ✤ 12. శాంతి పర్వము - తృతీయాశ్వాసము ✤

### 59. మొన నడపించి పొడువ సంభవించు జయము-

మహాయుద్ధాన్ని గెలిచిన ధర్మజుడడిగాడు పోరుకు పోవడానికి వీలైన
కాల నిరూపణాది విషయాలను, పితామహుడైన భీష్ముడు చెబుతున్నాడు–
–వానాకాలం, శీతాకాలం, బాగా ఎండలు కాసేప్పుడు కాక పంటలు పండే
కాలంలో సేనను నడిపించాలి దండయాత్రకు, అది శుభప్రదం

శత్రువులు భయపడేట్లు జెండాలు, కవచాలు, డాళ్లు, కత్తులు, ధనుర్బాణాలు
రథాలు ఏనుగులు గుర్రాలు కనీవినీ ఎరుగని రీతిలో సమకూర్చుకోవాలి.
శంఖ కాహళ పటహ నిస్సాణ ముఖములైన వాద్యఘోష హోరెత్తాలి.
సైన్యం విడిది చేసే చోట ఎత్తు పల్లాలుండక చదునుగా ఉంటే మంచిది.

గూఢచారులను పంపి విరోధి వచ్చే మార్గాలు తెలుసుకోవాలి, వాళ్లు
ఇరుకు త్రోవలలో వస్తున్నపుడు, అలసినపుడు, దండు విడిసినపుడు దాడి చేయాలి.
నీళ్లు లేని చోట, నిద్రా సమయం, తిండి లేనప్పుడు, సేన చెల్లాచెదురైనపుడు
శత్రువులను చంపడం సులభం; ధర్మరాజా– పదాతి దళానికి సరైనది

చెట్లు, రాళ్లు, ఎత్తు పల్లాలున్న చోటు; గుర్రాలకు నీళ్లు, బురద లేనిది,
నీటిగుంటలు చెట్లు ఉన్న ప్రదేశం ఏనుగులకు అనుకూలమైన ప్రదేశాలు
సేనను బట్టి ఎన్నుకోవాలి రణభూమిని; ఎండ, చలి తక్కువ ఉంటే గెలుపు సులభం
డాలులు కత్తులున్నవారు ముందు, తరువాత విలుకాండ్లు, గుర్రాలు, ఏనుగులు, రథాలుండాలి

---

**సీ.** **చెట్టును ఱాయియు మిట్టయుఁ బల్లంబుఁ । గలిగినచోటు గాల్బలము నేల**
**వినుము నీళ్ళును రొంపియును లేక సమవిశా । లమునైన చోటు గుఱ్ఱముల నేల**
**కమ్మి గ్రుంగక గదుగదుప రొంపులు గలు । గమి నొప్పుచోటు రథముల నేల**
**యెడనెడ మ్రాఁకులు మడువులుఁ గల చోటు । కురునాథ! యెఱుఁగుము; కరుల నేల**

**ఆ.** **యే బలంబు దనకు నెక్కుడుఁ గలిగె న । బ్బలమునేల పోరుగలను గాఁగ**
**నినుఁడు సీతుగాలి వెనుకగా మొన నడ । పించి పొడువ సంభవించు జయము. (శాంతి. 3-6)**

**ఆ.** **నిదురపోవు చోట నీరు దవ్వై వడబడిన యెడను గూడు దడసి సొలసి**
**నపుడుఁ జెదరియున్న యవసరమునఁ బగవారిఁ బొడిచి చెరుపవలయు నధిప (శాంతి. 3-8)**

---

**ఊర్వశి:** అప్సర శిరోమణి. అద్భుత నాట్య కళాకారిణి, జన మనోహరిణి, నారాయణ ముని ఊరువు నుంచి జనించిన అప్సరస. ఋగ్వేదం పదవ మండలం– 95 సూక్తంలో పేర్కొనబడినది (1900–1200 B.C.). ఆమెకు పురూరవుడికి జరిగిన వాగ్వాదం కాళిదాసు–విక్రమోర్వశీయం (400-500 A.D.), రబీంద్రనాథ టాగోర్–ఊర్వశి కవితకు ప్రేరణ– ఈ అప్సరోకన్య. ఈమెను చూసిన వరుణ–మిత్రుల ద్వయానికి వీర్య స్ఖలనం కాగా– వీర్యాన్ని దానిని కుండలో ఉంచగా అగస్త్యుడు పుట్టినాడు. (మిత్రుడికి దేహాన్ని, వరుణుడికి మనసును ఇచ్చింది ఊర్వశి) మిత్రుడి శాపాన మానవుడైన పురూరవుడిని వివాహమాడింది. వారి పుత్రులు ఆయువు, ధీమతుడు, అమావాసు, దృఢాయుసు, వనాయుసు, శతాయుసులు. పాండవ వనవాస సమయంలో ఇంద్రలోకంలో అర్జునుడిని 'పేడి'వి కమ్మని శాపమిచ్చింది ఊర్వశి.

# 60. పలకలవార లగ్రమున బన్నగ-

పలకలవారు, విండ్లు వారు, గుర్రాలవారు, ఏనుగులు, రథములు ముందు నుంచి
వెనకకు క్రమపద్ధతిలో, అక్కడక్కడా ఏరి పేర్చినట్లు వీరులుండగా
పోరు ప్రారంభం కాగానే పెనుబొబ్బలు పెడుతూ 'శత్రువులు పారిపోయారు'
పోయారని కేకలు పెడుతూ, రాజు కూడా సముద్ధతితో విజృంభించాలి.

ఏనుగులా కండబలం, పులి-సింహాల భీకరత్వం, శౌర్యం చాకచక్యం ఉన్న
మేటి బంట్లు విజయాన్ని తెచ్చిపెడతారు; గాంధార సింధు సౌవీరులు ఈటెలతో
ఔశీనరులు అన్ని ఆయుధాలతో, తూర్పు దేశాలవాళ్లు ఏనుగుల నెక్కి చేసే యుద్ధం,
గదాయుద్ధాలలో; మధుర యవన కాంభోజులు అశ్వికులుగా, ఘూర్జరులు విలుకాండ్లుగా

కత్తులు కటార్లు తిప్పడంలో, మాళవులు రజగజ అశ్వ పదాతి దళాల పోరులో
ఇలా ప్రతి దేశమూ ఒక ప్రత్యేకత గల సేనతో ఉంటుంది, దానిని బట్టి
వ్యూహరచన చెయ్యాలి. ఉత్సాహంగా ఉన్న సైనికులు, చెవికి ఇంపుగా
సకిలించే గుర్రాలు, విజృంభించే ఏనుగులున్న సేన సాధిస్తుంది విజయం.

జంతువులు పక్షులు అనులోమ గతిలో చరిస్తాయి, చల్లని చిరుగాలులు వీస్తాయి
మేలు మాటలు వినవస్తాయి, అగ్నిజ్వాలలు కుడివేపు మెరిసి, భేరీలు మ్రోగుతాయి.
అయితే, నడిగట్టు తెగిన చెరువు నీళ్లను, బెదిరిపోతున్న క్రూరమృగాలను,
వెన్నిచ్చి పారిపోతున్న సేనను అడ్డుకోవడం ఎంతటి వీరుడికైనా మంచిది కాదు.

---

**చ. పలకలవార లగ్రమునఁ బన్నఁగ విండులవారి ఘోటకం**
**బులఁ గరులన్ రథంబులను భూవర! వెన్వెనుకం గ్రమంబునన్**
**నిలిపినఁ గూడి నిల్చిన యనీకమునం గడుమంచి యోధులం**
**గలయఁగ నెందు నయ్యయి ప్రకారము వారల నిల్ప బల్పగున్. (శాంతి. 3-7)**

**క. చెరువు నడుమలిసినను బెనువెర మెకములు సెదరినను వివేకనిధీ! యు**
**క్కరి బహుళ సైన్య మరి మురిఁ బరచిన నాఁగంగ రాదు బలియుర కైనన్. (శాంతి. 3-16)**

---

**మేనక-** సాటిలేనిది. విశ్వామిత్రుడికి శకుంతలను కని అడవిలో వదిలేసి పోయింది. తండ్రి విశ్వామిత్రుడు తన తప్పేమీ లేదని తన దారిన తాను పోయాడు. శకుంతలాలనే పక్షులు కాపాడగా శకుంతల కణ్వాశ్రమంలో పెరిగి, దుష్యంత మహారాజును గాంధర్వ వివాహమాడి భరతుడిని కన్నది. ఆ భరతుడి పేరున మన దేశం భరతదేశమయ్యింది. మహాభారత పౌలోమ పర్వంలో- మేనకకు గంధర్వుడైన విశ్వావసుడికి ఆడపిల్ల జన్మించగా ఆ పసిపాపను స్థూలకేశుడి ఆశ్రమం ముందు వదలి వెళ్లిపోయింది మేనక. ఆమె ప్రమద్వరగా పెరిగి పెద్దది కాగా రురుడుని పెళ్లి చేసుకునే ముందు పాము కరచి ప్రమద్వర చనిపోగా తన ఆయుర్దాయం సగమిచ్చి ఆమెను బతికించుకుని పెళ్లి చేసుకున్నాడు రురుడు.

పాల కడలి మధన సమయంలో జన్మించిన మేనకను చూసి పృషతుడనే పాంచాల రాజుకు వీర్యపతనమై నేలపై పడగా, అతడు తన పాదాలతో కప్పిపెట్టి ఆనక కుండలో ఉంచితే ద్రుపదుడు పుట్టాడని ఓ కథనం.

# 61. సిరి విడుచును పురుషుని విను-

బృహస్పతి ఇంద్రుడికి చెప్పాడు- శత్రువును చంపేందుకు వేచి ఉండాలి
సరైన సమయం కోసం, నమ్మినట్లు నటించాలి, వ్యర్థ భాషణం కూడదు.
పక్షిని పట్టుకోవాలని బోయవాడు పక్షిలా అనుకరించి కూస్తాడు
శత్రువును కూడా అంతే వాడికిష్టమైన మాటలాడి రప్పించి మరీ చంపాలి.

చేజిక్కిన వాడిని మరీమరీ అవమానించరాదు, పగతో ప్రవర్తించడం
సరిహద్దులను నామరూపాలు లేకుండా చేయడం అనేవి తగని పనులు
శత్రువుకు కాలం అనుకూలమైతే సామరస్యంగా లొంగి, అణకువగా ఉండి,
తనకు కాలం అనుకూలించగానే తడబాటు లేకుండా శత్రువును చంపాలి.

కోసల రాజు క్షేమదర్శి విదేహరాజు చేతిలో ఓడిపోయి వెళ్లాడు అడవులకు
ఒకప్పటి తన మంత్రి కాలకవృక్షీయుడు మునిగా ఉన్న తపోవనం చేరినాడు.
ముని అన్నాడు- ధనం ఉన్నా లేకపోయినా చింత ఉండరాదు, నిర్లిప్తత అవసరం
చనిపోతున్న తల్లిదండ్రులను, ఆప్తులనే బ్రతికించుకోలేము, ధనం శాశ్వతమా?

పెద్ద మడుగులో నీళ్లు కలకబారినా కాసేపటిలో తేటబడినట్లుగా
గుండె దిటవు కలవాడు తెప్పరిల్లుతాడు తనకు తానుగా త్వరలోనే!
నీవును విదేహరాజుతో వియ్యమందుము అని పలికి తానే స్వయంగా
ఇద్దరికి పొత్తు కలిపి ఇరుపక్షాలకు మేలొనర్చినాడు కాలకవృక్షీయుడు.

**చ. అరిపయి వీఁకనెత్తి చనునప్పుడుఁ దేనియ లుట్టు నట్లుగా**
**నరపతి వాని వారలు వినం బ్రియమాడుట మేలు; పక్షిఁ దాఁ**
**దిరముగఁ జేయఁగా మృగము తేఁకువ వాపను వేఁటకాఁడు త**
**త్స్వరములు సూపికాదె తుదిఁ జంపఁ దెగుం దనబారిఁ బాఱినన్. (శాంతి. 3-21)**

**క. సిరివిడుచును బురుషుని విను । పురుషుఁడు సిరిఁ దొరఁగు నిది యపూర్వమె ఫల మూ**
**లరతుండై వాఙ్నియతిం । బొరసియునికి యట్టి చోటఁ బురుషున కమరున్. (శాంతి. 3-33)**

**తిలోత్తమ-** సుందోపసుందులనే రాక్షసులను చంపడానికి బ్రహ్మ ఆజ్ఞాపించగా విశ్వకర్మ ముల్లోకాలలోని మణులను నువ్వు గింజంత పరిమాణంలోకి తెచ్చి వాటితో నిర్మించాడు తిలోత్తమను. ఆమెను చూసి ఇంకెవరితోనూ చావులేని సుందోపసుందులు ఒకరినొకరు కొట్టుకుని చచ్చారు. ఆమెను చూడడానికి శివుడికి అయిదు ముఖాలు, బ్రహ్మకు అయిదు ముఖాలు వచ్చాయని పుక్కిట పురాణ కథనాలున్నాయి.

దుర్వాసుడి శాపంతో తిలోత్తమ బాణాసురుడి కుమార్తె 'ఉష'గా జన్మించి శ్రీకృష్ణుడి మనవడు అనిరుద్ధుడిని వివాహం చేసుకుంటుంది (బ్రహ్మ వైవర్త పురాణం). ఎంత ప్రేమగల సోదరులైనా స్త్రీ వలన కొట్టుకుచస్తారు కనుక పాండవులు కూడా ద్రౌపది గురించి కొట్లాడుకోకుండా ఉండటానికి, ఏడాదికి ఒకరింట్లో ద్రౌపది ఉండే నియమమేర్పరచుకున్నారు.

# 62. ఎట్లాంటి వారు తమ పాపాలను దాటగలరు?

గెలుపొందినపుడు గర్వం, ఓడినపుడు దుఃఖం రాజులకుండరాదు ఎక్కువ కాలం!
గణ జనమైన కోశాధికారులు, మంత్రులు, సైనికులను ఆదరంగా చూసుకోవాలి.
వీళ్లు పరిజనులే కాని ఒకరంటే ఒకరికి పడదు. ఈవిభేదాలను శత్రువులు
వినియోగించుకుంటారు- అందుకే జాగ్రత్త పడాలి వారితో చీలికలు రాకుండా.

ఆగమత్రయం, అగ్నిత్రయం, లోకత్రయం, దేవతాత్రయం లాంటివారు తల్లిదండ్రులు,
గురువు, వీరు సేవనీయులు, వీరిని ఆదరించినవాడు ఆనందాన్ని పొందుతాడు.
ఉత్తమ ధర్మం సత్యం పలకడం; పాపాలలోకెల్లా మహాపాపం అబద్ధాలాడడం
సాటి జీవులను వేధించే ధర్మాలన్నీ పాపాలవుతాయి, మేలు చేసే అసత్యాలు పుణ్యాలవుతాయి.

వర్ణాశ్రమ ధర్మ నిరతులు, దమము కలవారు, ఉదారులు, క్రోధము లేనివారు, వీరులు
అతిథుల నాదరించేవారు, వేద పారాయణులు, ఏ దేవతలనైనా ఒకే విధంగా చూస్తూ
మనసుకు నచ్చిన రూపాన్ని కొలిచేవారు పాపాలనే కొండలను దాటుతారు అనాయాసంగా;
ధర్మరాజా, నీకు కృష్ణుడు మిత్రుడు, ఆత్మీయుడు, అందుకే పాపం నీ దరిదాపుల్లోకి రాదు.

అని భీష్ముడు చెప్పగా ధర్మరాజన్నాడు- ఎందుకు ఒక్కోసారి సౌమ్యులు
అసౌమ్యులుగా, అసౌమ్యులు సౌమ్యులుగా కనిపిస్తారు, అర్థం కాదు నాకు!
భీష్ముడన్నాడు- పురిక నగరాన్ని పాలించిన పౌరికుడు బహు క్రూరుడు.
చనిపోయాక నక్కగా జన్మ ఎత్తాడు పూర్వజన్మ జ్ఞాపకాలు వదలలేదతడిని.

---

**సీ. 'విను తల్లియును దండ్రియును గురుండును సేవ । నీయులు సద్భక్తి నిత్యనిరతి**
**వారలఁ గొలుచుచు వా రెద్ది సెప్పిన । నది యాచరించుట యధిక ధర్మ;**
**మాగమత్రయమును నగ్నిత్రయంబు లోక । త్రయంబును దేవతాత్రయంబు**
**ననువస్తువులు వార లందును జనని గౌ । రవమున నెక్కుడు రాజవర్య!**

**తే. యీ జగంబున దివమునం బూజ వడయు । మాతృభక్తుండు పితృభక్తి మానసుండు**
**నట్ల యవ్యయానందసంప్రాపణంబు । గురు పదాబ్జ సమారాధకుండుఁ గాంచు. (శాంతి. 2-43)**

**క. 'సౌమ్యు లసౌమ్యుల భంగి న । సౌమ్యులు సౌమ్యుల విధమున జనవర! చిత్తా**
**గమ్యతఁ దోఁతురు; వారిని । నమ్యక్స్నిశ్చయతఁ గాంచు చందము సెపుమా! (శాంతి. 2-52)**

**- పురిక యనగ నెగడు పురిఁబౌరికుండను నృపతి క్రూరకర్మ నిష్ఠ బరగు**
**నవ్విభుండు సచ్చి యధిప! గోమాయువై పుట్టెఁ బుట్టెరుంగు బుద్ధితోడ (శాంతి. 3-54)**

---

**దీర్ఘతముడు-** పుట్టుకతో గుడ్డివాడు. తల్లి కడుపులోనే వేదవేదాంగాలు నేర్చుకున్నవాడు. ఇతడి కథ బహు విచిత్రమయినది. ఋగ్వేదంలో ప్రథమ మండలంలో 140-164 సూక్తాల రచయిత ఇతడు. గోతమ వంశీకుల మూలపురుషుడు. భరతుడి ప్రధాన పురోహితుడు.

# 63. పులి-నక్క సంవాదం

పూర్వజన్మ జ్ఞాపకాలు పురికాపురపు నక్కను ముప్పిరిగొనగ తాను మాంసం
ముట్టనని ఆ గోమాయువు బతుకుతున్నది ఆకులలములు భుజిస్తూ
ఆ సంగతి తెలిసి అడవినేలే పులిరాజు అడిగాడు నక్కను సంగతేమిటని?
-ఓ సౌమ్యుడా, లోకం నన్ను క్రూరుడనుకుంటున్నది, నీవు నాతో కలిసి ఉంటే

తొలగిపోతుంది నాకు ఆ అపవాదు! -అప్పుడు నక్క అన్నది వినయంగా పులిరాజుతో
తమరు ఆశ్రయించదగినవారు కాని నా మనసు విషయవాంఛలపై లేకున్నది
అంతేకాక నేను తమరితో స్నేహం చేస్తే తమరి మూలభృత్యులు సహింపరు
వారి మాటలకు చెవి ఒగ్గకుండా ఉంటానని బాసచేస్తే నేను ఉంటాను తమకు ఆశ్రితుడనై

ఇద్దరూ అలా సఖ్యంగా ఉండడం పులిరాజు మూల భృత్యులకు నచ్చలేదు
అందుకని వాళ్లు ఆలోచించి పెద్దపులి తినే మాంసాన్ని తీసి దాచారు నక్క గుహలో
నక్క కనిపెట్టింది వాళ్ల దురుద్దేశాన్ని అయితే మాంసం దొరికిన గుహ తనది.
మూలభృత్యులన్నారు- నక్కకు వ్రతమేమిటి? ఇది దొంగ నక్క, పాపి.

పులిరాజు వెంటనే నక్కను బంధించి చంపాలనుకున్నపుడు పులితల్లి అన్నది
-ఇది నీ సేవకుల కుట్ర, నేరమెవరు చేసారో నెమ్మదిగా ఆరా తీయుము-
పులిరాజుకు నిజం చెప్పారు మూలభృత్యులలో ఒకరంటే ఒకరికి పడనివాళ్లు.
నక్క అన్నది- 'రాజా, జరిగిందేదో జరిగిపోయింది, నాకీ పదవి వద్దు' అని వెళ్లిపోయింది.

---

ఆ. **'నక్క కేటి వ్రతము? స్రుక్కక యిమ్మాంస । మపహరించినపుడ యబ్బె నేని**
**నేమి యైనఁ జేయు నిది పాపశీలంబు । గపట ధర్మకంచుకంబు సువ్వె! (శాంతి. 3-65)**

క. **తా నటె మాంసముఁ దినదటె! । యీ నక్కయు బేలుపెట్టె నిన్నాళ్ళును నీ**
**యాన మఱుమాట వలుకం । గా నోడితి మిదియ నడపఁ గార్యములయెడన్.' (శాంతి. 3-66)**

క. **అనుటయు మృగపతి మనమున గనలడరిన నక్కబట్టగాఁ బంచి వధిం**
**పనుబుచ్చె, దాని నంతయు విని యప్పులి తల్లి గరము వెస జనుదెంచెన్ (శాంతి. 3-67)**

ఆ. **ఎరిగియైన నెరుగకేనియు నొక్కని భంగపెట్టి పిదప సంగతుఁడుగఁ**
**జేసికొనుట మేలె సిరి గలవారికి? నట్టి నిలుపు వాని కగునె హితము? (శాంతి. 3-78)**

---

**దీర్ఘతముడు-** ఉతథ్యుడు-మమతల ప్రేమ దాంపత్య జీవనంలోకి ఓ రోజున బృహస్పతి వచ్చాడు పెద్ద ఆపదగా. బృహస్పతి ఉతథ్యుడి చిన్నతమ్ముడు. అప్పటికి అతిథులకు గృహయజమానురాలు అన్ని సుఖాలనిచ్చే సంప్రదాయమున్నది. ఉతథ్యుడు లేని సమయాన బృహస్పతి వారింటికి వచ్చాడు. అప్పటికే మమత గర్భవతి. ఆమె అన్నది- 'నా కడుపులో బిడ్డ వేదవేదాంగ పారీణుడు. నీవు నన్ను వాంఛించకు'. ఆమె కడుపులో ఉన్న శిశువు అన్నాడు- 'లోపల నాకే స్థలం సరిపోదు. మా అమ్మనేమీ చేయకు'. బృహస్పతి అన్నాడు- 'సృష్టికార్యాన్ని ఆపకు, ఆపినా చూడకు. గుడ్డివాడివై పో!' దానితో అతడు పుట్టుగుడ్డివాడిగా పుట్టినాడు.

# 64. పొడుగు మెడ ఒంటె-

వ్యాఘ్ర గోమాయువు సంవాదం తెలుపుతుంది మూలభృత్యుల మనోభావాలను
గణజనులు, పరిజనులలోని స్వార్థపు పోకడలను, కుతంత్ర కుయుక్తులను
కోట రహస్యాలు, ఇంటిగుట్టు చెప్పి లంకకు చేటు తెచ్చిన విభీషణులను
స్వార్థం అసూయలతో కొందరు, ధర్మం న్యాయం పేరిట కొందరి పోకడలను

రాజయినవాడు తొందరపడకుండా, ఇతరుల ప్రభావానికి లోనుకాకుండా
కీడు మేలు పరికించి సౌమ్యుడెవరొ అసౌమ్యుడెవరో స్వయంగా తేల్చుకోవాలి
-ఒక ఒంటె గొప్ప తపస్సు చేస్తే బ్రహ్మ ప్రత్యక్షమై 'నీకేమి కావాలో కోరుకో' అన్నాడు.
కదలకుండా ఒకచోట కూర్చుని ఆకులలములు అందుకునే వీలుండాలి.

అందుకే నా మెడ నూరామడలు సాగాలన్నది ఒంటె. సరేనన్నాడు బ్రహ్మ.
సోమరి ఒంటె పొడుగాటి మెడతో ఎంచక్కా మేస్తున్నది ఎంత దూరమైనా మెడ చాపి.
ఒకరోజున పెనుగాలి వర్షం రాగా తలదాచుకున్నది ఓ గుహలో ఒంటె
ఆకలితో ఉన్న నక్కలు ఒంటె పీక పట్టుకుని తినడం మొదలెట్టినాయి.

నెప్పికి నిద్రలేచిన లొట్టిపిట్ట మెడలాగే సరికి మెడనరాలు కొరికాయి నక్కలు
పాపం, గిలగిలా కొట్టుకుంటూ ప్రాణాలు విడిచింది ఒంటె పెద్దగా అరుస్తూ.
ఇంకో కథ విను ధర్మరాజా! సముద్రం అడిగింది నదిని- నీ ఉరవడికి చెట్లు కూలతాయి
గంగా, మరి తుంగకేమీ కాదెందుకు? నది అన్నది- తుంగకు మొండితనం లేదు-

**సీ.** **'ఆలస్యమును నసహాయత్వమును నొప్పు; । వవిలేని పతి సుఖియై చరించు;**
**విను తొల్లి యొక యుష్ట్ర మనితరసాధ్య త । పంబు సేయఁగ మెచ్చి బ్రహ్మ వచ్చి**
**యర్థించినది 'యేమి?' యనిన నా లొట్టియ । యొప్ప 'నా మెడ శతయోజన ప్ర**
**మాణం బగుట కోర్కి వాణీశ!' నావుడు । న ట్లగుంగా కని యతఁడు సనియె;**

**తే.** **నదియు వరగర్వమున సహాయంబు నొల్ల । కలసభావంబుతో నుండి వలచియొక్క**
**నాఁడు దన యఋసాఁచి కాననములోన । దీను కొని మేయఁగాఁ బెనువాన వచ్చె. (శాంతి. 3-83)**

**క.** **వచ్చినఁ దనమెడ సాగిన యచ్చటి గుహలోన నుత్తమాంగం బిడి తా**
**నిచ్చ మెయి నిదురపోవగ విచ్చల విడి నొక్కనక్క వెలఁదియుఁ దానున్ (శాంతి. 3-84)**

దీర్ఘతముడికి అందాల కన్య ప్రద్వేషిణితో వివాహమయ్యింది. భర్త అంటే ఏమాత్రం ఇష్టంలేని ఆమె మొక్కుబడి సంసారం చేసి భర్తను ద్వేషిస్తూనే పిల్లలను కన్నది. 'నీవేమి భర్తవయ్యా! నన్ను రక్షించే పతివి కావు, భరించే భర్తవు కావు' అని దీర్ఘతముడిని గంగానదిలో పడవేయించింది ఓ దుంగకు కట్టి. అతడిని బలి అనే రాజు రక్షించాడు. అతడికి పిల్లలు లేరు. బలి అనే రాజు భార్య సుధేష్ణ. నియోగపద్ధతిలో సుధేష్ణ ధాసికి దీర్ఘతముడి వలన కక్షివతుడు, ఇంకా పదిమంది పిల్లలు కలిగారు. భర్త ఆజ్ఞతో (ఇష్టం లేకున్నా) సుధేష్ణ, దీర్ఘతముడి వలన ఆరుగురు కుమారులను కన్నది. వారు- అంగ, వంగ, కళింగ, పుండ్ర, కుంభ, ఓఢ్ర రాజ్యాలకు రాజులైనారు.

## 65. ఇతనిని వధింతు వెరవున్ బలమున్-

గంగ అన్నది సముద్రుడితో- చెట్లు తలవంచి మా వేగాన్ని చూడవు
అందుకే నిట్టనిలువునా కూలిపోతాయి, తుంగగడ్డి తలొంచుతుంది
ఉరవడి తగ్గాక తలెత్తి బతుకుతుంది- రాజు తన బలాన్ని గ్రహించి
పగవాడి మిడిసిపాటును యుక్తిగా దాటవేస్తే ఎటువంటి చెరుపూ కలగదు.

భీష్ముడన్నాడు ధర్మరాజుతో- స్వశక్తిని అంచనా వేసినట్లే గ్రహించాలి
సేవకుల బుద్ధి ఏమిటో- ఈ కథ ముని దగ్గర పెరిగిన కుక్క గురించి-
ముని ఎక్కడకు వెళ్లితే అక్కడకు వెళ్లే కుక్కను పులి ఒకటి చూసింది.
ఒంటరిగా కనిపించిన కుక్కను భయపెట్టేసరికి కుక్క దాక్కున్నది ముని చాటున.

ముని జాలిపడి కుక్కను భయంకరమైన బెబ్బులిగా మారిస్తే పారిపోయింది పులి.
అయినా బుద్ధి మారక ఏనుగును చూసి భయపడితే మదగజంగా,
సింహాన్ని చూసి భయపడితే పెద్ద సింహంగా, శరభాన్ని చూసి భయపడితే
గొప్ప శరభంగానూ మార్చాడు ముని, అప్పుడు కుక్క అనుకున్నదీ విధంగా-

నా మీద జాలిపడి కుక్కనైన నన్ను శరభంగా మార్చాడు, రేపు ఇంకెవరి మీదైనా
జాలి చెంది నాకన్నా భయంకర మృగంగా మారిస్తే నా పరిస్థితి ఏమిటి?
కాబట్టి శరభ రూపంలో ఉన్నాను గనుక మునిని తినేస్తాను -అనుకున్నది
అది గమనించిన ముని దానిని మరల కుక్కగా మార్చివేసాడు మరుక్షణం.

**సీ.** **అట్లు బెబ్బులి వచ్చి యదరిన బెబ్బులిఁ । గాఁ జేసి గెలిపించెఁ గరుణ మెఱయ,**
**నొక మత్తకరిఁ జూచి యోటమై నొదిఁగిన । నుద్ధతకరిఁ జేసి యొసఁగె జయము**
**సింహంబు దెస భీతిఁజెడి పాఱుతెంచిన । ఘనసింహముగఁ జేసి గర్వమిచ్చె,**
**శరభంబు ధాటికిఁ జకితమైన నుదగ్ర । శరభంబుఁ జేసి యుత్సాహిఁ జేసె**

**తే.** **నిట్లు దివసక్రమంబున నెక్కుడైన । సత్త్వముగఁ జేయఁగాఁ గుక్క శరభభావ**
**మందితరంబయి తిరుగుచునుండి పూర్వ । వాసనా నీచమగు మనోవర్తనమున. (శాంతి. 3-93)**

**తే.** **అను విచారంబు దివ్యబోధాఢ్యుడైన యమ్మునీశ్వరుడెరిగి యాయధమ జాతి**
**యున్నతస్థితి యెరుగునే మున్నపోలె గుక్కయయి యుండుగాక న్నఁ గుక్కయయ్యె (శాంతి. 3-96)**

దీర్ఘతముడి శ్లోకాలలో ప్రసిద్ధమైనది- అస్య వామాస్య సూక్తం (ఋగ్వేదం 1-164). భచక్రాన్ని 360 డిగ్రీలుగా వైదిక కాలంలోనే విభజించినవి దీర్ఘతముని శ్లోకాలలో కానవస్తాయి (ఋగ్వేద 1-140/164). గుడ్డివాడైన దీర్ఘతముడి మనోదృష్టి ఆకాశచక్రానికి 360 ఆకులున్నట్లు వర్ణించింది. బాబిలోనియన్లు ఈ విషయాన్ని 700 B.C.లో కనుగొన్నారు.

దీర్ఘతముడి కథ లాంటిదే అష్టావక్రుడి కథ. దీర్ఘతముడు గుడ్డివాడిగా జన్మించాడు. అష్టావక్రుడు ఎనిమిది వంకరలతో పుట్టినాడు.

# 66. వినుము మయూరంబు విధమున-

ఇటువంటి కుక్కబుద్ధి ఉండేవాళ్లు అన్నిచోట్లా ఉంటారు, జాగ్రత్త అవసరం
సింహం తనకు తోటి సింహాల నుంచుకుని సాధించగలిగిన విజయాన్ని
తోడుగా కుక్కల్ని తీసుకువెళ్లి తాననుకున్నవి నెరవేర్చ లేదు, ఇది స్పష్టం.
ధర్మరాజా! రాజు ఒక వనమయూరంలా చిత్రవిచిత్ర గతులతో ప్రకాశించి

మృదు వాక్యాలు పలుకుతూ, తన మంత్రాంగాన్ని పైకి పొక్కనీయకుండా
నెమలి నెత్తిమీద సిగలా ధర్మాన్ని నెత్తికెత్తుకుని, దాని రెక్కల తళతళల్లా
ఉత్సాహంతో ఉరికే సేనతో దండయాత్రకు వెళ్లాలి, జనాకర్షణ చేయాలి.
వర్షాకాలంలో విజృంభించే నెమలిలా పగవాడి మీద పడి యుద్ధం చేసి

విషం కక్కే పామును నెమలి ముక్కలు ముక్కలుగా చేసినట్లు, ప్రభువు
తన శత్రువును ఖండఖండాలు చేసి వీర విహార నాట్యమాడి వెలుగొందాలి.
పరిజనులు, గూఢచారులతో పరజన రహస్యాలు తెలుసుకుని ప్రవర్తిస్తూ
చిన్ని కంతలలోకి కూడా చొరబడే కాంతులలా, సూర్యుడిలా ప్రకాశించాలి.

వైరం, స్నేహం ఇస్తూనే ఉంటాయి మంచిదో చెడ్డదో ఏదో ఒక ఫలితాన్ని
తాను చేసిన, చేయబోయే పనులలో మంచి చెడ్డలు విమర్శనాత్మకంగా చూసి
ఆదాయ వ్యయములపై దృష్టి సారించి బొక్కసాన్ని సంపదలను స్వయంగా గమనించి
తగు జాగ్రత్తలు, చర్యలు తీసుకోవడం రాజధర్మమని –భీష్ముడు పలికినాడు ధర్మరాజుతో.

---

**సీ. 'వినుము మయూరంబు విధమున బహు చిత్ర । భంగులఁ బ్రజ యంతరంగ మాత్మ**
**వశము సేయుచు, మృదువాక్యముల్ వలుకుచు । మంత్రంబునెడఁ దనమాట వెడల**
**కునికి శరత్సమయోచిత క్రియ చాడ్పు । గాఁగ ధర్మంబు శిఖా ప్రకార**
**మొంది తనర్చ, సముల్లాస పక్షమై । యానంబు గైకొంచు నధిక తర స**

**తే. మున్నతత్వంబు సంశ్రయ యోగ్య మగుటఁ । గాంచుచును దటివచ్చినఁ గారు కాల**
**మేఁచు తెఱఁగున నేచుచు నీచ కుటిల । గతులఁ దునుముచు నెగడుట పతికి నీతి. (శాంతి. 3–105)**

**క. కిరణముల భంగిఁ జతురపుఁ బరిజనముల నెందుఁ జొనిపి పరకృత్యంబుల్**
**నిరతంబును గనుఁ గొనుచును దరణి కరణి వెలుఁగు టొప్పు ధరణీశునకున్ (శాంతి. 3–106)**

---

**అష్టావక్రుడు–** ఛాందోగ్య ఉపనిషత్తులో పేర్కొనబడిన ఔద్దాలక అరుణి ఆశ్రమంలో విద్యాభ్యాసం చేస్తున్న అనేకమంది శిష్యులలో కహోధుడు వివాహం చేసుకున్నాడు అరుణి కుమార్తె సుజాతను. అప్పటికి 'గురుపుత్రి సహోదరి' అన్న నిబంధన లేనట్లున్నది. ఆమె గర్భవతిగా ఉన్నపుడు గర్భస్థ శిశువు– ఆశ్రమంలో శిష్యులను వల్లె వేయించే పద్ధతిని, వేదోచ్చారణను తప్పుపట్టగా కహోధుడు– నా విద్యావిధానాన్నే వక్రంగా ఉందన్నావు కనుక అష్టవంకరలతో పుట్టుమని శపించి, కొన్నాళ్లకు జనకుడి సభకు వెళ్లాడు పండిత సభలో పాల్గొనేందుకు. అక్కడ వరుణుడి కుమారుడు 'వంది'తో వాగ్వాదం చేసి ఓడిపోయి నీళ్లలోకి నెట్టవేయబడినాడు.

## 67. విష్ణుండు దండమై యావహిల్లు-

భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు దండనీతి ఆకార ప్రభావములను
-నల్లటి దేహం, నాలుగు కోరలు, నాలుగు చేతులు, ఎనిమిది కాళ్లు
అనేకాలైన కళ్లూ చెవులూ, రెండు నాలుకలు, ఎర్రటి ముఖం
గోరోజనం రంగు శిరోజఛాయ, నిక్కబొడుచుకున్న వెండ్రుకలు

కత్తి, గద, తోమరం, విల్లమ్ములు, ముసలం, చక్రం, ప్రాసం, శరం
త్రిశూలం, పరశువు, కొరడా మొదలైన ధర్మనీతికి పనిముట్లు
పట్టుకుని యజ్ఞరూపధారి విష్ణువే ఉంటాడు దండరూపంలో
ఈ విష్ణువు ఉత్తముడు, అసంగుడు, ధర్మపాలుడు, ధర్ముడు

విజయుడు, శిక్షించేవాడు, చంపేవాడు, లోకధారియైన గ్రహరూపుడు,
అక్షరుడు, జాగరూకత కలవాడు, దురాసదుడు, సత్యవంతుడు
నిత్యుడు, శాస్త, ప్రాగ్వచనుడు, శస్త్రము, బ్రహ్మము, మనువు
కవచధారి, శివంకరుడు, శివకుమారుడు, శ్రీగర్భుడు

వ్యవహార తంత్రుడు, సంరక్షకుడు, మంత్రరూపుడు, అన్ని రూపాలతో
ఒప్పువాడతడు విష్ణువు. శిష్టదండనీతిని శ్రీ, సరస్వతి అనియూ పిలుస్తారు.
ధర్మాధర్మాలు, సుఖ దుఃఖాలు, నీతి అవినీతులు, లాభ నష్టములు
బలాబలాలు, ప్రమత్తత అప్రమత్తతలు ఏర్పడినది దండనీతి వల్లనే.

**సీ.** **'అసితోత్పల చ్ఛాయమై దంష్ట్రికాచతు । ష్టయమును, భుజ చతుష్టయము, జిహ్వా**
**కలు రెండుఁ, బాదాష్టకంబును, శంకు క । ర్ణములును, బహునయనములుఁ గల్గి**
**యూర్ధ్వ రోమంబులు నుగ్రారుణాస్యంబుఁ । గపిల జటాజాలకంబు నొప్ప**
**నసి గదా శక్తి శరాసన ముసల చ । క్ర ప్రాస శర తోమర త్రిశూల**

**తే.** **పరశు ముఖ సాధనంబులఁ బాపజనులుఁ । దరతరంబ సంభేదన తాడనాదు**
**లైన వివిధ ప్రహతుల నే పడఁచుచును జ । రించు దండంబు సుజనులు ప్రియము నొంద. (శాంతి. 3-109)**

**క.** **సత్యప్రకార ధర్మము నిత్యానుష్ఠేయ మది సునీత మగుచు నా**
**దిత్య పతిఁ బ్రీతుఁ జేయఁగ నత్యున్నతి నెసగు నాతడన్న ప్రదుడై (శాంతి. 3-112)**

**అష్టావక్రుడు-** ఔద్దాలక అరుణి కుమారుడు శ్వేతకేతు. అష్టావక్రుడు శ్వేతకేతుకు మేనల్లుడు. ఎనిమిది వంకరలతో పుట్టిన అష్టావక్రుడు తన జన్మరహస్యం తెలుసుకుని జనకుడి సభకు వెళ్లి పదేళ్ల పిన్న వయస్సువాడైనా, మహా పండితుడైన 'వంది'ని ఓడించి తండ్రితో పాటు ఇతర పండితులను విడిపించి, తండ్రిని తీసుకుని ఇంటికి వస్తూ 'సమంగ' నదిలో స్నానం చేయగా అన్ని అంగములు సమమై అష్టావక్రుడైనాడు అత్యంత సుందరుడిగా. అష్టావక్రుడి అష్టావక్ర గీత, అష్టావక్ర సంహిత ఎంతో ప్రసిద్ధికెక్కిన రచనలు.

# 68. దండనీతి రహస్యము

భీష్ముడు చెబుతున్నాడు దండదేవుడి ఎనిమిది పేర్లను–
పురుషుడు, ఈశ్వరుడు, భూతాత్మకుడు, జీవుడు, ప్రాణుడు
అక్షయుడు, సత్త్వము, ప్రజాపతి –దీనికో ఇతిహాసమున్నది, వినుము–
అంగదేశపు రాజు వసుహోముడు ముంజపృష్ఠమనే మంచుకొండ శిఖరాన

కొన్నాళ్లుండగా, అతడిని కలిసాడు మాంధాత, దండనీతిని తెలుసుకోవాలని
వసుహోముడు చెప్పినాడు– బ్రహ్మయజ్ఞం చేయ సంకల్పించి
వేయేండ్లు తపస్సు చేసినాక, ఒక తుమ్ము వచ్చింది, దాన్నుంచి బయటపడ్డాడు
క్షుతుడు; క్షుతుడు ప్రజాపతి ఋత్విజుడిగా పూర్తయ్యింది యాగం

కాని మాయమయ్యింది యజ్ఞ దండం. దానితో యుక్తాయుక్త విచక్షణ మాయమై
ప్రపంచం అల్లకల్లోలం కాగా బ్రహ్మ విష్ణువుల అభ్యర్థనతో
శివుడు దండాన్ని సృజించి తానే దానికి ఆధారమైనాడు
ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేదాలు; శిక్ష, వ్యాకరణం, ఛందస్సు

నిరుక్తం, జ్యోతిషం, కల్పం అనే ఆరు వేదాంగాలు; పురాణ ధర్మ న్యాయ మీమాంసా
శాస్త్రాలు నాలుగు ఆయుర్వేద, ధనుర్వేద, గాంధర్వ వేద, నీతిశాస్త్రము
మొత్తం పదునెనిమిది విద్యలను ముల్లోకాల మేలుకోరి సృష్టించాడు ఈశ్వరుడు
వీటిని దండనీతిని శివుడు విష్ణువుకివ్వగా అతడు ఇచ్చాడు అంగిరసుడికి.

**సీ. వినుము; ఋగ్వేదాది వేదముల్ నాలుగుఁ, । గల్పాదులైన యంగంబు లాఱు,**
**బెరసి విద్యలు పది పేర్చు; పురాణంబు । లనియును నొక విద్య యధిప! ధర్మ**
**విదులు సెప్పెడు శాస్త్ర వితతియంతయు నొక । విద్య; సర్వన్యాయ విస్తరంబు**
**నొకటి, మీమాంస దానొక్కటి; యిట్టులు । వివరింపఁ బదునాల్గు విద్య లయ్యె**

**తే. వైద్య కోదండ గాంధర్వ విద్య, లర్థ । శాస్త్రమగు నీతివిద్య, తత్సహిత వృత్తి**
**వెలయఁగాఁ బదునెనిమిది విద్య లభవుఁ । డేర్పరించె జగత్త్రయహితము పొంటె. (శాంతి. 3–119)**

**శ్వేతకేతు–తత్త్వమసి :** శ్వేతకేతు పన్నెండేళ్ల వయసులో విద్యా సముపార్జనకై వెళ్లి వివిధ గురువుల వద్ద జ్ఞానాన్ని బడసి తండ్రి ఔద్దాలక అరుణి వద్దకు వచ్చాడు కాస్త గర్వంతో. తండ్రి అడిగాడు– 'నాయనా! అది ఉన్నది కాని చూడలేము, స్పృశించలేము, ఇంద్రియాలతో తెలుసుకోలేము. ఏమిటది?'. శ్వేతకేతు తలదించుకున్నాడు. 'అవును, ఏమిటది?'. తండ్రి అన్నాడు– 'మట్టిబెడ్డను చూడగానే మట్టితో చేసిన వస్తువులు, ఘటములు గుర్తుకు వస్తాయి కదా, వెళ్లి ఆ మర్రిపండును ఏరుకునిరా! దానిలో ఏమున్నది?' శ్వేతకేతు అన్నాడు 'విత్తనములు'; తండ్రి అన్నాడు– 'విత్తనాన్ని పగలగొట్టు, లోన ఏమున్నది?'. శ్వేతకేతు అన్నాడు– 'ఏమీలేదు'. తండ్రి అన్నాడు– 'విత్తనంలో మర్రిచెట్టు ఉన్నదా లేదా?', 'ఉన్నది తండ్రీ!', తండ్రి అన్నాడు– 'కుమారా! ఈ మట్టి చషకంలో నీరు నింపు, కాస్త ఉప్పు వేయుము. ఉప్పు కనిపిస్తున్నదా?' 'లేదు తండ్రీ!', 'కుమారా రుచిచూడుము', 'ఉప్పగా ఉన్నది'. 'అవునా' అన్నాడు ఉద్దాలకుడు. 'మట్టిలో సమస్త పాత్రలను, మర్రివిత్తనంలో మర్రిచెట్టును, ఉప్పునీటిలో ఉప్పును చూడడమే ఆత్మదర్శనం– తత్త్వమసి'.

# 69. నీ శీలము నాకు అనఘా దయనొసగవే!

దండము, దండనీతిని శివుడు, విష్ణువుకిచ్చిన అతడు దానిని అంగిరసుడికి
అంగిరసుడు దేవేంద్రుడికి, దేవేంద్రుడు మరీచికి, మరీచి భృగువుకు ఇవ్వగా
భృగుమహర్షి ఉపదేశించాడు ఇతర మునులకు అది సర్వ వ్యాప్తమవ్వగా,
శివుని పూజించారు కపర్ది, శంకర, రుద్ర, శివ, స్థాణ, ఉమాపతి పేర్లతో-

అంగరిష్ఠుడనే రాజుకు కామందకుడనే ముని వివరించినాడు
ధర్మార్థ కామములను గురించి- ఎప్పుడూ కోరికలతో కొట్టు మిట్టాడే
రాజుకు హరించుకుపోతాయి ధర్మార్థాలు. కీడు జరుగుతుంది.
చావూ మూడుతుంది దుష్టజన సాంగత్యం, అపమార్గావలంబనం వలన

అర్థం పట్ల నిష్ఠతో ధర్మాపేక్ష విడవకుండా ఉండే రాజు గొప్పవాడవుతాడు.
శీలసంపదతో మాంధాత, నృభాగుడు, ప్రహ్లాదుడు చక్రవర్తులైనారు.
ఇంద్రుడి రాజ్యాన్ని లోబరచుకున్న ప్రహ్లాదుని దగ్గరకు వెళ్లాడు
బ్రాహ్మణ వేషంతో ఇంద్రుడు శిష్యరికం చేసాడు, వరమడిగాడు.

ప్రహ్లాదుడి శీలసంపదను దానమడిగి పుచ్చుకుని వెళ్లిపోయాడు.
అతడి వెనకనే, ప్రహ్లాదుడి శరీరం నుంచి వెలువడిన శీలం, ధర్మం,
సత్యం, సద్వర్తనం, బలం తేజోరూపాలు వెళ్లిపోగా ఆఖరున
ఓ అందమైన స్త్రీరూపం-సిరి వెళ్లిపోతూ అన్నది- బలమున్న చోటునే నేను.

**చ. అనిన భయంబు నొంది యతఁ డా సతితోఁ బరమేశ్వరీ! మహా**
**వినయమతిన్ ననుం గొలిచె విప్రవరుం; దతఁ డెవ్వఁ?' డన్న న**
**వ్వనిత 'సురాధినాథుఁడు భవద్ఘన రాజ్యవిభూతి యింతయుం**
**గొనుటకు నిన్నుఁ జెందె; నిటు గోల్పడి తీవును నీదు శీలమున్. (శాంతి. 3-145)**

**- అనవుడు నీ శీలము నా కనఘా! దయ నొసగ వే! మహాత్ములఁ దగఁ జెం**
**దినవారు బ్రదుకవలదే? యని దీనత దోప ననిమిషాధిపుడడిగెన్. (శాంతి. 3-139)**

**ప్రహ్లాదుడు:** హిరణ్యకశిపుడు- కాయధ (లీలావతి)లకు అయిదుగురు కుమారులు- ప్రహ్లాద, సంహ్లాద, అనుహ్లాద, శిబి, బాస్కలుడు. ప్రహ్లాదుడి భార్య ధృతి. ప్రహ్లాదుడి సంతానం- విరోచనుడు, కుంభుడు, నికుంభుడు; నికుంభుని కొడుకులు సుందోపసుందులు (వీరి సంహారం కోసం సృష్టించబడింది తిలోత్తమ).

విష్ణుమూర్తి నరసింహావతారం ఎత్తి హిరణ్యకశిపుని సంహరించి అతడి కుమారుడు గొప్ప విష్ణుభక్తుడైన ప్రహ్లాదుని రక్షిస్తాడు. ప్రహ్లాదుని కొడుకు విరోచనుడు.

విరోచనుడు-విశాలాక్షిల కుమారుడు బలి. బలి చక్రవర్తి భార్య వింధ్యవల్లి. బలి-వింధ్యవల్లిల కుమారులు బాణాసురుడు, రత్నమాల, వజ్రజ్వాల. బాణాసురుడి భార్య అంబావతి. వీరి కుమార్తె ఉష. ఉష భర్త శ్రీకృష్ణుని మనవడు అనిరుద్ధుడు. వీరి పిల్లలు మృగకేతన, వజ్రుడు. వజ్రుడు శ్రీకృష్ణ నిర్యాణం తరువాత ఇంద్రప్రస్థానికి రాజవుతాడు.

# 70. ధనములు మూలము రాజ్యంబునకు-

మనసు, వాక్కు, శరీరం ఈ మూడిటితోనూ హాని చేయకపోవడమే శీలం
మంచి నడవడి ఇంద్రియాలననుసరించి పోతే ప్రహ్లాదుడి నుంచి కూడా
వెళ్లిపోతాయి – ధర్మం, సత్యం, సద్వర్తనం, బలం, సిరిసంపదలు–
ధర్మరాజా, నీకు జన్మతః మంచి శీలమున్నది, దానిని కాపాడుకో!

సుమిత్రుడనే హైహయరాజు మృగము వెంట దగిలి అది పారిపోగా
అలసిపోయి ముని ఆశ్రమానికి చేరుకోగా వారతడికి ఇచ్చారు పళ్లూ నీరు
దప్పిక తీరి తేరుకున్న అతడితో ఋషభుడనే ముని అన్నాడు
వేటాడిన జంతువు లాంటిదే ఆశ, ఒక్కోసారి నెరవేరదు.

నేనొకసారి బదరికాశ్రమంలో చూసాను ఒక ముని వద్దకు వీరద్యుమ్నుడనే రాజు వచ్చి
తన కుమారుడు తప్పిపోయాడని కన్నీరు కారుస్తూ పలుకగా, 'తనుదు' అనే–
ముని అన్నాడు– ఇస్తానని ఇవ్వని వాడిమీద, కృతఘ్నుడి మీద,
నీచస్త్రీ మీద ఆశ తగ్గదు – తప్పిపోయిన కొడుకు లాంటిదే ఆశ!

అని పలికి అతడి కుమారుడైన భూరిద్యుమ్నుడిని ఆశ్రమంలోకి
తన మహిమతో రప్పించి అప్పగించినాడు. అందుకే ఆశ గొప్పది.
పేరాశ, దురాశ ప్రాణాంతకమైనవి. అర్థం సుఖాలనిస్తుంది
అందుకే రాజు తన దృష్టిని కోశాగారం నిండుగా ఉంచడంపై ఉంచాలి.

**చ. తనయుఁ డొకండ; వాఁడు గుణధాముఁడు; క్రీడనవాంఛ సాంద్రకా**
**ననమున కేఁగి కాడుపడినం దడవం జనుదెంచి యెందుఁ గా**
**నను మది యాశ ద్రిప్పికొనినన్ వెగడందుచు వచ్చినాఁడ' న**
**న్న, నతఁడు వల్కకుండె వదనం బొకయించుక వాంచి చింతతోన్. (శాంతి. 3–158)**

**క. తనభూమిఁ బరుల భూమిని ధనము లుపార్జిం పవలయు ధరణీశునకున్**
**ధనములు మూలము రాజ్యంబునకును మూలమగు ధర్మమునకు నరేంద్రా (శాంతి. 3–169)**

---

**బదరికాశ్రమం (బదరీనాథ్)–** ఉత్తరాఖండ్–ఛమోలి జిల్లాలోని నగర పంచాయితి బదరినాథ్ పుణ్యస్థలం. ఒకప్పుడు నరనారాయణులు, ముచుకుందుడు తపస్సు చేసిన ప్రాంతం. బడా ఛార్ధామ్, ఛోటా చార్ధామ్‌లలో ఉన్న పుణ్యతీర్థం. అలకానది ఒడ్డున శ్రీ శంకరాచార్యునిచే మరల ప్రారంభించబడి, పాలిగ్రామాలతో విష్ణు పూజలందుకునే వైష్ణవక్షేత్రం. 1918–20 ప్రాంతాలలో కేవలం ఇరవై ఇళ్లున్న ప్రాంతం. ఇప్పుడు 2438 జనాభా (పురుషులు– 2054, స్త్రీలు–384). ఆరేళ్లలోపు పిల్లలు 68. ప్రతి ఏటా ఆరు లక్షలమంది తీర్థయాత్రికులు ఈ పుణ్యతీర్థాన్ని దర్శిస్తారు. సాలగ్రామం (శాలిగ్రామం)– కాళి గండకి నదీ ప్రవాహంలో దొరికే అమ్మొనైట్ (Ammonite) శిలలు– (6–40 కోట్ల సంవత్సరాల నాటి) శిలాజాలు. బదరీనాథ్‌లోని గర్భగుడిలో ఒక అడుగు ఎత్తున్న నారాయణుడు బదరి (రేగు) వృక్షం నీడన బంగరు ఛత్రం క్రింద వెలసి పూజలందుకుంటాడు.

# 71. కాపవ్యుడి కథ

పారియాత్రం అనే కొండమీద ఉండే కాపవ్యుడనే బోయవాడు
విలువిద్యలో నేర్పరి, జంతువుల తీరుతెన్నులు బాగా తెలిసినవాడు.
తల్లిదండ్రులకు, మునిస్వాములకు ధర్మబుద్ధితో సేవ చేసేవాడు.
పోరాటమే వస్తే పగవారిని వెయ్యిమందినైనా ఎదిరించి చంపేవాడు.

కొండమీద ఉండే దొంగలంతా అతడిని తమ నాయకుడిగా ఉండమన్నారు.
అతడన్నాడు- పసివాళ్లను, ఆడవాళ్లను, మునులను చంపరాదు.
మనపై పోరాటానికి రానివాడి జోలికి వెళ్లవద్దు, స్త్రీలను చెరపట్టవద్దు.
ఆడజంతువు ప్రాణం తీయవద్దు, గో బ్రాహ్మణ రక్షణ చెయ్యాలి.

పంట పొలాల్ని నాశనం చేయరాదు, ప్రజల్ని బాధించి సంపాదించేవాడు
శవం డొక్కలో దూరి తింటున్న పురుగు వంటివాడు, శవంతో
పాటు నశిస్తాడు' -అలా బోధిస్తూ దొంగలను క్రమేపీ ధర్మమార్గంలోకి మళ్లించి
తానూ వాళ్లూ సాధించారు ఇహ పరలోక సౌఖ్యాలు, మంచి కీర్తి.

ధర్మరాజా, నేనిప్పుడు చెప్పబోతున్నది మూడు చేపల కథ.
దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు వాటి పేర్లు.
వేసవికాలం రాగానే దీర్ఘదర్శి అన్నాడు మిగతా రెండు చేపలతో
మనముండే మడుగు ఎండిపోతున్నది, ఇంకోచోటుకు వెళ్లిపోదాం.

---

**సీ. శిశుజన మునిజన స్త్రీజనంబులఁ । జంపఁగా; దెట్టివాఁడైనఁ గడఁగి మీఁదఁ**
**గవియక పొడుచుట కల్మషం; బంగనఁ । జెఱపట్టఁ దగదు; విశేష మొకఁడు**
**వినుఁ; డెల్ల సత్త్వంబులను బెంటిఁ జంపుట । పాపంబు; గోవుల బ్రాహ్మణులను**
**సంకటపెట్టంగఁ జనదు; తదీయ హి । తము గోరి పూని యుద్ధంబు సేఁత**

**తే. యధిక పుణ్యంబు సస్యక్రియావిఘాత । మాచరించుట గడుదోష; మవని ప్రజకు**
**బాధ గావించి కుడిచి శవంబు దొలుచు । ప్రువ్వుగతి నది వొలియంగఁ బొలియు నతఁడు. (శాంతి. 3-182)**

**- ఇహైవ ఫలమాసీ నః ప్రత్యా కాంక్షేత సర్వశః**
**యేయే నోన ప్రదాస్యంతి తాంస్తాం స్తేనాభియాస్యసి (సం.శాంతి. 135-19)**

---

**సాలగ్రామం (శంఖచూడుడు-తులసి కథ)-** అరుదుగా దొరికే శిలలపై అద్భుత గాథలు రచింపబడతాయి. వృషధ్వజుని కిద్దరు కొడుకులు- ధర్మధ్వజుడు, కుశధ్వజుడు. లక్ష్మిదేవి అంశతో ధర్మధ్వజునికి తులసి, కుశధ్వజునికి వేదవతి కుమార్తెలుగా జన్మించారు. తులసికి క్రితం జన్మలో శ్రీకృష్ణుని బాల్యస్నేహితుడైన సుదాముడు రాధాదేవి శాపంతో శంఖచూడుడనే రాక్షసుడిగా పుట్టి తులసిని వివాహం చేసుకుంటాడు. ఇద్దరూ విష్ణుభక్తులే, కాని, తప్పనిసరి పరిస్థితులలో మారువేషంలో విష్ణువు శంఖచూడుని రూపంలో తులసి పాతివ్రత్యాన్ని భంగపరచగా శివుడు శంఖచూడుడిని సంహరిస్తాడు. నిజం తెలిసిన తులసి విష్ణువును శిలగా మారమని శపిస్తుంది. ఆమె గండకీనదిగా, ఆమె శిరోజాలు తులసి మొక్కలుగా రూపు దాలుస్తాయి. వజ్రకీటమనే పురుగు సాలగ్రామ శిలలను కొరికి విష్ణువు శిలారూపాన్ని శంఖు, చక్ర ఆకారాలనిస్తుంది.

# 72. మూడు చేపల కథ

దీర్ఘదర్శి అన్నాడు– నీళ్లింకా పారుతున్నపుడే వేరే చెరువుకు వెళ్దాం.
చిన్నకాలువ ఎండిపోతే ఇరుక్కుపోతామిక్కడే, ఇది ముఖ్యం
ప్రాప్తకాలజ్ఞుడన్నాడు– ఎప్పుడో ఎండిపోయే దాని గురించి ఇప్పుడే
కంగారెందుకు? ఆపద వచ్చినప్పుడు ఆలోచిద్దాం ఏం చెయ్యాలో–

దీర్ఘసూత్రుడన్నాడు– ఈ మడుగు ఒక సముద్రంలా ఉన్నది.
ఇది ఎండదు, నేనైతే రాను, నాకిది స్వర్గం కన్నా ఎక్కువ, ఇక్కడే ఉంటాను–
దీర్ఘదర్శి వారివేపు విచారంగా చూసి నీటి జాలు వెంట వెళ్లి
మరో పెద్ద చెరువు చేరుకుని జీవనం సాగిస్తున్నది హాయిగా.

ఎండలు ముదిరాయి, చెరువులో నీళ్లింకుతుంటే చూసారు జాలరులు.
చేపలు పట్టే బుట్టలు, అడ్డు వలలు వేసి చేపలను పట్టుకుంటుంటే
ప్రాప్తకాలజ్ఞుడు ఆలోచించి తాళ్లలో గుచ్చిన చేపల మధ్య పడుకున్నాడు
చచ్చిన చేపలా తాడు నోటికి కరచుకుని, జాలరులు వెళ్లే సమయంలో

జాలరి మంచినీళ్లలో జాడిస్తున్నపుడు తాడు వదిలి తప్పించుకుని
నీటి జాలువెంబడి పెద్ద చెరువుకు వెళ్లాడు ప్రాప్తకాలజ్ఞుడు–
'బ్రతుకు జీవుడా' అనుకుంటూ; పాపం, దీర్ఘసూత్రుడు
దొరికిపోయాడు ఓ జాలరికి, కదులుతుంటే తలమీద కొట్టి చంపాడా జాలరి.

**క. 'మడు వింకఁగఁ బాఱెడు; నీ । రెడ త్రెవ్విన నొండు సోటి కేఁగఁగ రా దె**
**ప్పుడు నింకని నీళ్ళులు గల । మడువునకుం బోవవలదె మన కిట్టి యెడన్?' (శాంతి. 3–186)**

**తే. అనినఁ బ్రాప్తకాలజ్ఞుఁ డిట్లనియె 'నేది । ప్రాప్తమయ్యె నక్కార్యంబు భంగి నెఱిఁగి**
**యప్పటికిఁ దగునట్లు సేయంగవలయు । మానితోపాయవృత్తి నేమఱుట లేక. (శాంతి. 3–187)**

**క. 'జడనిధి చందంబున ని । మ్మడు వొప్పఁగ నిప్పు డేమి మాఁడెనె? యిమ్మై**
**నడిచిపడ రిత్త నెవ్వగ । లుడుగుఁడు; మఱి చూచికొంద మొయ్యన తఱితోన్.' (శాంతి. 3–189)**

**– పరీక్ష్య కారీ యుక్తశ్చ స సమ్యగురు పాదయేత్**
**దేశకాలావభి ప్రేతౌ తాభ్యాం ఫలమావాప్నుయాత్ (సం.శాంతి. 137–24)**

**మూడు చేపల కథ–** భారతంలో వీటి పేర్లు– దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు; పంచతంత్రంలో– అనాగత విధాత, ప్రత్యుత్పన్నమతి, యధాభవిష్యుడు. విష్ణుశర్మ లేదా వసుభాగుడు (200 B.C.) రచించిన పంచతంత్ర కథలు క్రీస్తుశకం 570 నాటికి పర్షియన్ భాషలోకి బొర్జుయా అనే వైద్యుడి వలన, అబ్దుల్లా ఇబిన్ అల్ ముఖఫ్ఫా (750 A.D.)– కలిలా–దిమ్నాగా అరబిక్ భాషలోకి, 1600 A.D. నాటికి గ్రీకు, లాటిన్, స్పానిష్, ఇటాలియన్, జర్మన్, ఇంగ్లీషు, చెక్, స్లావొనిక్ భాషలలోకి అనువదించబడి జావా నుంచి ఐస్‌ల్యాండ్ వరకు విస్తృత ప్రచారాన్నందుకున్నాయి.

# 73. ఎలుక-పిల్లి-గుడ్లగూబ-ముంగిసల కథ

రాబోయే ఆపదను గ్రహించి తరుణోపాయం చూసుకున్నవాడు
దీర్ఘదర్శిలా సుఖంగా ఉంటాడు; ప్రాప్తకాలజ్ఞుడు బుద్ధిబలంతో
అదృష్టవశాత్తు బయటపడ్డాడు, దీర్ఘసూత్రుడు దీనావస్థలో చనిపోయాడు–
అని పలికి భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు– ఎంతోమంది

శత్రువులకు చిక్కి చాకచక్యంగా తప్పించుకున్న పలితుడనే ఎలుక కథ–
ఒక అడవిలో ఉన్న పెద్ద మర్రిచెట్టు కింద కలుగులో పలితుడనే ఎలుక,
తొర్రలో రోమశుడనే పిల్లి నివసిస్తూ ఉండేవి. పరిఘుడనే వేటగాడు
ఉచ్చులు పన్ని చిక్కుకున్న పక్షులను తెల్లవారే తీసుకుపోతూ ఉండేవాడు.

ఒకరోజున పిల్లి చిక్కుకున్నది ఉచ్చులో, అది చూసి ఎలుక నిర్భయంగా
తిరుగుతుంటే దానికి ముంగిస, గుడ్లగూబ కనిపించాయి తననే చూస్తూ–
ఎలుక ఓ క్షణం ఆలోచించి పిల్లితో అన్నది– కాసేపు నేను నీ పక్కనే
ఉంటాను, ఆ గుడ్లగూబ, ముంగిసా వెళ్లిపోయేంత వరకూ; దానికి కృతజ్ఞతగా

వలతాళ్లు కొరికి నిన్ను కాపాడుతాను– పిల్లి సరే అన్నది. పిల్లి పక్కనే ఉన్న
ఎలుకను తాకడానికి భయంవేసి చంద్రకుడనే గుడ్లగూబా, హోలికుడనే ముంగిస
చాలాసేపు చూసి చూసి వెళ్లిపోయాయి, ఎలుకకు భయం తగ్గి నెమ్మది నెమ్మదిగా
వలతాళ్లు కొరుకుతుంటే పిల్లి అన్నది– చేసిన మేలు మరచిపోవటం న్యాయమేనా?

**చ. అనవుడుఁ బిల్లి యిట్టులను 'నార్తశరణ్యుఁడ వయ్యె; దిట్టి నీ**
**కనఘ! హితంబు సేయ వలదయ్య? జగత్పతిసాక్షిగాఁగ ని**
**ప్పని దగఁ బూనితిన్; వెఱపుఁ బాచి ననుం గదియంగ రమ్ము; వ**
**చ్చిన నకులంబు గూబయును జేరఁగ నేరవు నాకు నోడుటన్.' (శాంతి. 3-207)**

**– అమిత్రో మిత్రతాం యాతి మిత్రంచాపి ప్రదుష్యతి**
**సామర్థ్య యోగత్కార్యాణామ్ అనిత్యావై సదాగతిః (సం.శాంతి. 138-13)**

**– సతాం సాప్తపదం మైత్రం ససఖా మేసి పండితః**
**సాం వాస్యకం కరిష్యామి నాస్తి తే భయమద్య వై (సం.శాంతి. 138-56)**

---

**బృహత్కథ-గుణాఢ్యుడు** (200 BC - 500 CE)– పైశాచి భాషలో వ్రాసిన 7,00,000 శ్లోకాలను రాజాదరణకు నోచుకోలేదని తగలబెడ్తుంటే వాటిలో మిగిలిన లక్షశ్లోకాల కాశ్మీర సంస్కృత అనువాదాలు, క్షేమేంద్రుడి బృహత్కథామంజరి (1037 CE), సోమదేవుడి కథాసరిత్సాగరం (1070 CE) గా ఇప్పుడు లభ్యమవుతున్నాయి. సంఘదశగణుడు జైనమహారాష్ట్ర భాషలో వ్రాసిన వాసుదేవుని ప్రయాణం (600 CE) కొంకువెలిర్ వ్రాసిన 'పెరుంకతాయి' గొప్ప కథ (1000 CE)– దాని సంక్షిప్త అనువాదాలు ఉదితోదయా కావ్యం, ఉదయన కుమార కావ్యం; బుధస్వామి వ్రాసిన బృహత్ కథా శ్లోకసంగ్రహ (నేపాల్ సంస్కృతం)– కొంతభాగం ఇప్పుడు లభ్యమవుతున్నాయి.

పంచతంత్ర కథలు, బేతాళ కథలు ఇవన్నీ ఆనాటి జానపదుల, రాజుల కథల జ్ఞాపకాలు

# 74. రాకుమారుడి కళ్లను పీకిన గోరువంక కథ

ఎలుక అన్నది– మన ఇద్దరిది జాతివైరం, నా జాగ్రత్తలో నేనుంటున్నాను.
తెల్లవారుతుండగా వేటగాడు రావడాన్ని చూసి వేగంగా ఉచ్చు తాళ్లు కొరికి
కలుగులోకి పారిపోయింది ఎలుక, చెట్టుపైకి ఎక్కింది పిల్లి చకచక
వేటగాడు ముక్కలైన వలను చూసి తనను, అందరిని తిట్టుకుంటూ వెళ్లాడు.

మనమిప్పుడు స్నేహితులం కదా, రా, కలసిమెలసి బ్రతుకుదాం –అన్నది పిల్లి.
ఎలుక అన్నది– నీకు ఆకలివేస్తున్నట్లున్నది, వేరే మార్గం చూసుకో, మనకు
స్నేహం కుదరదు. నేను నీ వలలో పడను, నీవు వేటగాడి వలలో పడకు–
అని పలుకగా ఇరువురూ వేర్వేరు చోట్లకు పోయి సుఖంగా జీవించారు.

ధర్మరాజుకు భీష్ముడు చెబుతున్నాడు మరో కథ– నమ్మడం, నమ్మకపోవడం గురించి
బ్రహ్మదత్తుడనే రాజు ఇంటిలో, పూజని అనే గోరువంక గూడు కట్టుకుని
పిల్లను కని, తీయని పండ్లతో పెంచుతూ కొన్ని పండ్లను ఇచ్చేది ప్రేమగా
బ్రహ్మదత్తుని కుమారుడికి, చిన్ని గోరువంక చిన్ని కుమారుడు ఆడుకునేవారు ఎంచక్కా.

ఒకరోజున రాకుమారుడు ఎవరూ లేనపుడు గోరువంక తల పగలగొట్టి చంపడం
చూసి పూజని, అమితమైన దుఃఖంతో, కోపంతో వేగంగా వెళ్లి
ఆ రాకుమారుడి రెండు కళ్లూ పొడిచి ఊడబీకి ఎగిరిపోయింది నింగిలోకి.
దాదులు పెట్టిన కేకలకు, కుమారుడి ఏడ్పులకు పరిగెత్తుకు వచ్చాడు బ్రహ్మదత్తుడు.

---

**చ.** **అనవుడు బ్రహ్మదత్తుఁ 'డది యట్టిద; నీ దెసఁ గీడు లేదు; నీ**
**చనుటకు నా మనం బతివిషాదముఁ బొందెదుఁ; దొంటి యట్ల నె**
**మ్మిన నిలు 'మన్నఁ బూజని' శమించునె యొండొరుచేతఁ బడ్డ యీ**
**పెనుపగ నొంచి మాటపస బేల్పడి క్రమ్మఱఁ జేరు టొప్పునే?' (శాంతి. 3–252)**

**–** **న విశ్వసేద విశ్వస్తే విశ్వస్తే నాతి విశ్వసేత్**
**విశ్వాసాద్భయ ముత్పన్నమ్ అపిమూలం నికృంతతి**
**కామం విశ్వాసయే దన్యాన్ పరేషాం చ న విశ్వసేత్ (సం.శాంతి. 139–29)**

---

విక్రమార్క బేతాళ కథలు, పంచతంత్ర కథలు, సింహాసన ద్వాత్రింశిక కథలు ప్రపంచ కథాచరిత్రలోనే గొప్ప సంచలనాన్ని కలిగించాయి. వీటినాధారంగా చేసుకుని 1001 అరేబియన్ రాత్రుల కథలు వ్రాయబడినాయనేది ఒక భావన. కథలోని కథలోని కథలు ఎంతో ఆసక్తికరంగా ఉండి చదువరులను విస్మయపరుస్తాయి. అరేబియన్ రాత్రుల కథలలో జంతువులు మాట్లాడే కథలు దాదాపుగా పంచతంత్ర కథల్లా ఉంటాయి.

క్రీస్తుశకం 786–809 మధ్యకాలంలో బాగ్దాద్‌ను పాలించిన హరూన్ అల్–రషీద్ ముఖ్యపాత్రగా లేదా శ్రోతగా ఉన్న అపూర్వమైన కథలు '1001 అరేబియన్ రాత్రుల కథ'లై ఆ కాలంలో ఇరాక్–ఇండియాల మధ్య ఉన్న వాణిజ్య, రాజకీయ, స్నేహ సంబంధాలను కూడా ప్రస్తావిస్తాయి. హిందూ దేశంలో అత్యంత ప్రసిద్ధికెక్కిన రామాయణ మహాభారత గాథలు 1001 అరేబియన్ రాత్రుల కథలలో కానరాకపోవడానికి కారణం తెలియదు. అయితే హోమర్ రచనలు ఇలియాడ్, ఒడిస్సీలకు రామాయణ, భారత కథలకు కానవచ్చే సామ్యభేదాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

# 75. అప్పు అగ్ని పగ పెరిగి పెరిగి వాటిల్లును కీడు

బ్రహ్మదత్తుడితో అన్నది పూజని అని పేరుగల శారిక- మహాప్రభూ!
నీ కుమారుడు నా ఏకైక కుమార్తెను చంపివేసాడు, అందుకే అతడి కళ్లు
పీకి ప్రతీకారం తీర్చుకున్నాను, నన్ను క్షమించు!- బ్రహ్మదత్తుడన్నాడు
ఇది విధి కృతం, నీమీద నాకు కోపం లేదు, నీవు వెనకటిలానే ఉండవచ్చు ఇక్కడ.

గోరువంక అన్నది- నా పగ తీరింది, నీ పగ తీరలేదు; పగ అయిదు రకాలు-
-'భూమి దురాక్రమణ వలన, దాయాదుల వలన, ఆడవారి వలన, అడ్డు
ఆపులేని చెడు తలపెట్టడం వలన, మాటామాటా పెరగడం వలన పుడ్తుంది పగ.
చెట్టులో దాగిన నిప్పు అది. సముద్రంలో దాగి ఉన్న బడబాగ్ని అది'-

అని పలికి బ్రహ్మదత్తుడిని వదిలి పూజని అనే గోరువంక వెళ్లింది యథేచ్ఛగా.
ధర్మరాజుకు ఈ కథ చెప్పి అన్నాడు భీష్ముడు- పూర్తిగా తీర్చని అప్పు
సాంతం చల్లారని నిప్పు, సమూలంగా నాశనం చేయని పగ, క్రమేపీ
పెరుగుతాయి కాని తగ్గవు. మృదుత్వంతో తగ్గించ ప్రయత్నం చేయవచ్చును.

మార్దవమున మృదువు మర్దింపగా వచ్చు, శత్రువులను చంపవచ్చు
అన్నిటికన్నా వాడి అయిన మృదుత్వం వలన సాధించరానిదేమీ లేదు-
అని పలికి భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు- కరువు కాటకాల కాలంలో
ద్విజుడు ప్రాణాలు కాపాడుకున్న విషయాన్ని విశ్వామిత్ర చండాల సంవాదంగా.

---

**క. తెగఁ దీర్పక తగ నార్పక । తెగటార్పక కడమ కొంత ద్రిక్కఁగ నున్నన్**
**జగతీశ! యప్పునగ్నియుఁ । బగయును గడుఁ బెరుఁగుఁ గీడు వాటిల్లు దుదిన్. (శాంతి. 3-276)**

**ఆ. మార్దవమున మృదువు మర్దింపగా వచ్చు । మార్దవమున పర విమర్దనంబుఁ**
**జెల్లు మార్దవమునఁ జెల్లనియది లేదు । గాన మృదువ తలఁప ఖరము సువ్వె. (శాంతి. 3-277)**

**- సర్వత్ర రమతే ప్రాజ్ఞం సర్వత్ర చ విరాజతే**
**న విభీషయతే కశ్చిద్ భీషితో న బిభేతి చ (సం.శాంతి. 139-87)**

---

**కుక్కమాంసం-** మెక్సికో లోయలోని అజ్టెక్‌లు (1300-1521) కుక్క మాంసాన్ని తినేవారు. దానికోసం వాళ్లు ప్రత్యేకంగా మాంసం కోసం కుక్కలకు వృషణ విచ్ఛేదనం చేసి పెంచేవారట. ఉత్తర అమెరికాలో సియోక్స్, చెయెన్నె, కికాపూ తెగలు కుక్కమాంసం తినేవారు. ఐర్లాండ్ ఇతిహాస వీరుడు కు కులెయినిన్ ప్రతిజ్ఞ చేసాడు కుక్కమాంసం తిననని, ఆతిథ్యాన్ని కాదనని- అయితే ఆతిధ్యమిచ్చిన వారు పెట్టిన కుక్క మాంసం తిని ప్రతిజ్ఞను శక్తిని కోల్పోయి మరుసటి యుద్ధంలో మరణించాడు. ఓవిడ్, ప్లుటార్క్, ప్లినీలు తమ రచనలలో- కుక్కపిల్లలను పాతాళలోక దేవతలకు బలి ఇచ్చి ఆ తరువాత వాటి మాంసాన్ని తినే ఆచారాల గురించి వర్ణించారు. తహితి, హవాయి దీవులలో కుక్కమాంసం తినేవారు. కంబోడియా, ఇండొనేషియా, చైనా, మలేసియా, దక్షిణ కొరియా, వియత్నాం, ఇండియాలో నాగాలాండ్, మిజోరాం, మణిపూర్, మేఘాలయ, త్రిపుర, అరుణాచల ప్రదేశ్‌లలో కుక్కమాంసం తింటారు.

# 76. విశ్వామిత్రుడు కుక్కమాంసం తినుట

త్రేతా ద్వాపరయుగ సంధికాలంలో పన్నెండేళ్ల కరువు పీడించింది ప్రజలను.
ఏరులు చెరువులు ఎండి, సేద్యం చెట్టూ చేమలూ మండి, నేల బీడుగా ఉండి
గొడ్డుగోదా చచ్చి, రాజులు పాప కార్యాల చొచ్చి, ధర్మం న్యాయం నొచ్చి
యజ్ఞయాగాదులు కట్టిపెట్టి, బలవంతులు బలహీనుల కొట్టి, కులధర్మాలు మట్టుపెట్టి

తిండి తిప్పలు లేక, మాన మర్యాదలు లేక, బతికున్నవాళ్లు చావలేక చస్తూ బతకలేక
ఉన్న ఆ సమయంలో విశ్వామిత్రుడికి కూడా తినడానికి ఏమీ దొరకక, పాపం,
మంత్రశక్తి, మంత్రాలు గుర్తురాక దప్పికతో తూలిపోతూ నడవలేక నడవలేక
గొడ్ల ఎముకలు, పందుల డొక్కలు, కుక్క పుర్రెలు దాటుకుంటూ దాటుకుంటూ

చేరుకున్నాడొక వెలివాడ– అక్కడ ఒక ఇంటిముందు చూసాడు అప్పుడే
చంపి తోలు తీసి గాలిలో ఆరబెట్టిన కుక్కమాంసాన్ని– ఆకలి అన్నది
మునితో– తిను, కుక్కమాంసమేమి కాదది– అది మాంసం–అది ఆహారం –అంతే!
ప్రాణం కాపాడుకో, తప్పులేదు దొంగతనం, తప్పులేదు నీచమైన ఆహారం తినడం–

గుంజకు పట్టిన మాంసాన్ని గుంజేసరికి నిద్రపోతున్న చండాలుడు నిద్రలేచాడు
'దొంగవెధవా నిన్ను చంపేస్తాను' –అని అరిచాడతడు. 'నేను దొంగను కాదు
విశ్వామిత్రుడిని' –అన్నాడు ముని; 'మహాత్మా, ఇదేమి పని?' అన్నాడు చండాలుడు.
'ఆకలి అనే అగ్ని నన్ను దహిస్తున్నది, అగ్ని సర్వభక్షకుడు కదా – అందుకే దీనిని తింటాను'.

---

**చ.** **పసరపు టెంప ప్రోవులును, బందుల డొక్కలుఁ గుక్కపుఱ్ఱలున్**
**ముసుఁగువడంగ భూమితలముం దఱచారఁగఁ గప్పుచున్ మదిం**
**బస యొకయింత లేక పెఱప్రాణులనుం బొరిగొంచు నెప్పు దు**
**ర్వ్యసనతఁ గూరియున్న వెలివాండ్రుర పల్లియఁ జేరి యయ్యెడన్. (శాంతి. 3–284)**

**చ.** **'దరికొను నాఁకలిం దనువిదాహము పుట్టినఁ బ్రాణహానికిం**
**బరిహరణంబు సేఁత కిది పాపమ యైనను గుక్కనంజుఁడే**
**భరపడి ముచ్చిలించెద; విభావసుఁ డెంత శుచిత్వ సంపదం**
**బొరసియు సర్వభక్షకతఁ బొందును; నన్నును జూడు మట్లుగన్.' (శాంతి. 3–289)**

**క.** **అని ముని పల్కిన నంత్యజుఁ । డను 'మాంసము విడువ నోప కనుటగఁ దలఁపం**
**జనునె? భవదీయ తేజో । ధన హానికిఁ గరుణ పుట్టదా యెవ్వరికిన్?' (శాంతి. 2–298)**

**తే.** **'కరుణ గలవేని బ్రాణంబు గాచికొనఁగఁ । దలఁచు నాకు నిమ్మాంస మి మ్మలఘుచరిత**
**యట్టు లైన ముచ్చిమియు లే దనృతమెడలి । పడయు వస్తువు సేయదు పాతకంబు.' (శాంతి. 2–300)**

# 77. ఓయన్న! డస్సినాడవు! మా ఇంటికిన్ అతిధివైతివి-

అంత్యజుడన్నాడు– 'అతి నీచమైన జంతువు కుక్క, అతినీచమైన పాపం
దొంగతనము, నీవంటివారికి ఇది తగదు, ఇది చేయకూడని కార్యం'–
విశ్వామిత్రుడన్నాడు– 'బొందిలో ప్రాణముంటే గొప్ప ప్రాయశ్చిత్తం చేసుకుంటాను.
అగస్త్యుడు తినలేదా దైత్యమాంసం, దేహాన్ని నిలుపుకోవడమిప్పుడు ప్రధానం'

అని పలుకగా అంత్యజుడిచ్చిన సారమేయ మాంసం తిని ఆకలి తీర్చుకుని
అతడినాశీర్వదించి, తన ప్రాణములు రక్షించుకుని వెళ్లిపోయాడు విశ్వామిత్రుడు.
పితామహుడైన భీష్ముడీ కథను మనుమడైన ధర్మరాజుకు చెప్పి అన్నాడు–
ధర్మరాజా, నేను చెప్పబోయే కథ శుక్రాచార్యుడు ముచుకుందునికి చెప్పినది.

–బోయవాడొకడు అడవిలో ఉచ్చులు పన్నగా పడిన పక్షులను బుట్టలో వేసుకుని
వస్తుండగా పెద్ద గాలివానకు అడవంతా నీటిమయమై వాగులుప్పొంగ
అతడొక గుట్ట మీద పెద్ద చెట్టుకిందకు చేరి రాతిమీద నిద్రిస్తున్నాడు వణుకుతూ.
చెట్టుమీద పావురమొకటి మేతకు వెళ్లిన తన భార్య వాన తగ్గినా రాలేదని

దుఃఖిస్తుంటే బుట్టలో ఉన్న పావురం విన్నదా మాటలు– 'నాథా, దుఃఖించవలదు.
ఇతడు మన అతిథి, ఆదరించుము' – ఆ మాటలు విని పావురం అడిగింది
బోయవాడిని – 'అన్నా నీవు మా అతిథివి, నీకేమి కావాలి?' అనగా వాడన్నాడు–
'చలిగా ఉన్నది, ఆకలిగా ఉన్నది'. అప్పుడా పావురం పోగుచేసింది ఎండు చిదుగులు.

**సీ. ఎచట నున్నది యెక్కొ యింత ప్రొ? ద్దొకచోట । నుండునే నను౯ బాసి యుజ్జ్వలాంగి?**
**యమ్మేను లేకున్న నిమ్మేని కలిమి ని । ర్ధకం బధికానురాగయుక్త**
**యగు సతిగుణముల యైహికాముష్మిక । సుఖసాధనంబులు సువ్వె! పతికి**
**యేకారణంబున నే మయ్యెనో వాన । యేపున౯ దెగియె౯ గానోపు నకట!**

**తే. నేమి సేయుదు? మందిరం బిపుడు పాడు । వాఱుచున్నది' యన౯గ నప్పలుకు లెల్ల**
**బోయవలలోన నున్న కపోతి విని మ । నంబు సంతోషపూరమగ్నంబు గా౯గ. (శాంతి. 3-310)**

**శుక్రాచార్యుడు–** బ్రహ్మ మానసపుత్రుడు భృగుమహర్షి సప్తర్షులలో ఒకడు. భృగునికి ఖ్యాతి వలన ధాత, విధాత, భార్గవి; కావ్యమాత వలన శుక్రుడు; పులోమ వలన చ్యవనుడు సంతానంగా జనించారు. శుక్రుడి భార్య జయంతి (ఇంద్రుడు–శచీదేవిల కుమార్తె). (ఇంద్రుడి భార్య శచీదేవి (పౌలోమి) రాక్షసరాజు కుమార్తె). శుక్రుడు–జయంతిల కుమార్తె దేవయాని. రాక్షసుల గురువైన శుక్రాచార్యుడి కుమార్తె దేవతల గురువైన బృహస్పతి కుమారుడు కచుడు, తన తండ్రి దగ్గర మృతసంజీవని విద్య కోసం వచ్చినపుడు వలచి భంగపడింది. తరువాత యయాతిని వివాహమాడి యదు, తుర్వసులనే పుత్రులను కన్నది దేవయాని. శుక్రాచార్యుడి ఇతర భార్యలు ఊర్జస్వతి, శతపర్వ. శుక్రాచార్యునికి దేవయాని కాక అర, త్వష్టాధర, చండ, మార్కులు సంతానం. ఊర్జస్వతి–జయంతి ఒకరేనన్నది పెద్దల అభిప్రాయం. శతపర్వకు సంతానం కలగలేదు. భీష్ముడికి రాజనీతి నేర్పినవాడు శుక్రుడు (దండనీతి). శుక్రగ్రహం, శుక్రవారం హిందూ దేశపు ఆచార వ్యవహారాల్లో, జ్యోతిష శాస్త్రంలో భాగమైనాయి.

# 78. పక్షి గురువై సంధించె సద్బోధమున్-

పక్కనే ఉన్న పల్లెకు వెళ్లి నిప్పున్న పుల్లను తెచ్చి ఎండు చిదుగులపై వేసి
రెక్కలార్చి గాలినిచ్చి మంట రాజేసిన ఆ బోయవాడు చలికాచుకుని ఆకలి వేస్తుందనగా,
అతడి ఆకలి తీర్చే మార్గం కానరాక ఒకింత ఆలోచించి మంటచుట్టూ
ప్రదక్షిణం చేసి తన భార్యను స్మరించి, బోయవాడు నిశ్చేష్టుడై చూస్తుండగానే

తన శరీరాన్ని తినమని పలికి మంటల్లో దూకి కాలిపోయింది, తన భర్త
మంటల్లో పడి కాలిపోవడానిని బుట్ట సందుల్లోంచి చూస్తున్న కపోతస్త్రీ
దుఃఖంతో మూర్ఛతప్పింది. బోయవాడు కపోత ప్రాణత్యాగానికి మనసు
చలించినవాడై ఒక నిశ్చయానికి వచ్చి ఆయుధాలను, వలలను పారవేసి

బుట్టలోని పక్షుల్ని స్వేచ్ఛగా వదిలేయగా, అప్పటికే తేరుకున్న ఆడపావురం
తన పెనిమిటి గురించి విలపిస్తూ- 'చిగురుటాకుల పొదలు, కొండకాల్వలు
మామిడి తోపులు, తామరపూలున్న దిగుడు బావుల మెట్ల వద్దకు
నన్ను తీసుకువెళ్లి లాలించేవాడివి, ఎలా నిన్ను మరచిపోగలను, నేనూ వస్తున్నాను'-

అని పలికి తానూ ఆ మంటల్లో దూకి చనిపోయింది ఆ కపోతపు పెంటి-
అది చూసిన బోయవాడు అమితంగా ఆక్రందిస్తూ అడవిలో అడ్డదిడ్డంగా
పరిగెత్తి, రక్తం కారుతున్న దేహంతో, పశ్చాత్తాపం రగుల్తున్న మనసుతో
అడవిని దగ్ధం చేస్తున్న కార్చిచ్చులో ప్రవేశించి ప్రాణాలు వదిలాడు ఆ బోయవాడు.

---

**సీ.** **'ఇగురు జొంపంబుల నింపారు విరులను । బలుపైన పొదల క్రేవలకుఁ దార్చి,**
**సెలయేఱులందలి తెలినీటఁ దనువు సోం । పెలసిన గిరుల తెప్పలకుఁ జేర్చి,**
**మావిమ్రోకల నెలదీవలఁ జెన్నొందు । తోటలకడ నలితోడఁ జెంది,**
**యలరు నెత్తమ్ముల కలిమిఁ జెల్వగు డిగ్గి । యల తీరభూముల నల్లఁ బొంది,**

**తే.** **నన్ను మనమునఁ దేల్చి యానంద మొందఁ । గేలి సలిపెడు నీ దగు లీల మఱవ**
**నావశంబె ప్రాణేశ! ప్రాణంబు లిపుడ । నిన్న కూర్చి యేతెంతు నీ సన్న కడకు. (శాంతి. 3-332)**

**-** **నాస్తి భార్య సమో బంధుః నాస్తి భార్య సమా గతిః**
**నాస్తి భార్య సమోలోకే సహాయో ధర్మ సంగ్రహే (సం.శాంతి. 144-16)**

---

**వేటగాడు-పావురాల కథ:** ఇదే కథ పంచతంత్రం-కాకోలూకీయం (విగ్రహం)లో కనిపిస్తుంది. మూడు చేపల కథ పంచతంత్రం-మిత్రభేదంలో ఉన్నది. కాకోలూకీయంలో యుధిష్ఠిరుడి గురించి, గూఢచారికి ఉండవలసిన లక్షణాల గురించి నారదుడు ధర్మరాజుకు చెప్పినట్లు సంభాషణలున్నాయి. మహాభారతం సౌప్తిక పర్వంలో అశ్వత్థామ నిద్రపోతున్న కాకులను గుడ్లగూబ (ఉలూకం) చంపడాన్ని చూసి ఉత్తేజితుడై పాండవశిబిరంలో నిద్రిస్తున్న ధృష్టద్యుమ్న, శిఖండి, ఉపపాండవులను తదితరులను చంపుతాడు. కాకోలూకీయంలో దెబ్బతిన్న కాకులు ఉలూకాలపై పగ తీర్చుకోవడం ప్రధాన కథ.

# 79. గ్రద్ద-నక్క కథ

ఆ కపోతాల జంటకు, బోయవాడికి సద్గతి లభించింది –అని చెప్పి భీష్ముడు–
విదిశానగరంలో ఒక పిల్లవాడు చచ్చిపోగా అతడి శవాన్ని ప్రేతభూమికి తెచ్చారు.
అక్కడ ఎగుర్తున్న గ్రద్ద ఒకటి అన్నది బంధువులతో– ఈ సమయంలో
ఇక్కడ ఏడుస్తూ ఉండడం మంచిది కాదు. ఇది భూతప్రేతాల సమయం.

చీకటి పడిందా మీకు ప్రమాదమే, త్వరగా పీనుగును పాతిపెట్టి పొండి.
గ్రద్ద మాట్లాడేసరికి వాళ్లు భయపడి పీనుగునక్కడే పడవేసి పోబోతుంటే
బొరియలోంచి బయటకు వచ్చిన నక్క అన్నది– అన్నలారా!
గ్రద్ద మాటలకు భయపడుతున్నారా! ఇంకా చీకటి పడలేదు.

ఇంతమంది బంధువులు ఏడుస్తూ పిలిస్తే పిల్లవాడు బతుకుతాడేమో!
అప్పుడు గ్రద్ద అన్నది– ఈ నక్క మందమతి! ఏడిస్తే మాత్రం
పోయిన ప్రాణాలు వస్తాయా? యముడు కఠినాత్ముడు, జాలి లేనివాడు.
దానధర్మాలు చేసి ఆ పిల్లవాడికి కలిగించండి పుణ్యగతులు.

నక్క అన్నది– ఈ గ్రద్దది రాతిగుండె, ఈ పిల్లవాడిని చూస్తే
నా కళ్లు చెమ్మగిల్లుతున్నాయి, బతుకుతాడేమో కాసేపు ప్రార్థనలు చేస్తే.
గ్రద్ద అన్నది– నేను పుట్టి పదిహేను వందల సంవత్సరాలయ్యింది.
చచ్చి బతికి వచ్చిన బాలయవ్వన పౌఢ వృద్ధులెవరినీ నేను చూడలేదు.

---

**సీ. ‘గ్రద్ద మాటల కేల కడు భీతిఁ బొందితి । రక్కటా! బాలుని నబ్జవదను**
**నిటు వైచి పోవఁ గా ళ్ళెట్లాడె నేడ్వుఁడు । శోకంబు వోవ నిచ్చోటఁ గొంత**
**ప్రొ ద్దంతలో విధి క్రూరుండు గాకున్నఁ । బ్రాణంబు గ్రమ్మఱ రాక గల్గు**
**నో యెఱుంగుదురే; యినుండును నస్త్రాద్రిఁ । జేరఁడు; వెఱవక మీరు నిలువుఁ’**

**తే. దనిన వారును మనమున నాసపుట్టి । మగిడి వచ్చిన గ్రద్ద ‘యిమ్మందబుద్ధి**
**యైన నక్కమాటలు విననగునె? వికృత । మయ్యెఁ బీనుంగు; వచ్చునే యసువు లింక? (శాంతి. 3-369)**

**– యత్నో హి సతతం కార్యః తతో దైవేన సిద్ధ్యతి**
**దైవం పురుషకారశ్చ కృతాంతే నోప పద్యతే (సం.శాంతి. 153-50)**

---

**నారదుడు–** గాయకుడు, ఋషిరాజు, త్రికాలవేది, ముల్లోక సంచారి. బ్రహ్మ-సరస్వతి పుత్రుడు. మహతి అనే వీణ, కరతాళ్ అనే చిడతలు చేత ధరించి నారాయణ నామస్మరణ చేస్తూ లోకోపకార కలహభోజనుడై, భక్తియోగ తత్పరుడైన భాగ్యశాలి. నారద పురాణ, నారద భక్తిసూత్ర, నారదస్మృతి రచించినవాడు. (గ్రీకుల Hermes, రోమన్ల Mercury లా దేవతలకు వార్తలనందించేవాడు, నార్డిక్‌ల ఓడిన్‌ను పోలినవాడు). వేద వేదాంగ సాంఖ్యయోగములు తెలిసినవాడు. రాజనీతి యుద్ధనీతి కుశలుడు. కర్ణాటక-చిగతేరిలో నారదుడి దేవాలయమున్నది.

# 80. ఏనుబుట్టి వేయు నిన్నూరు మున్నూరు గలవు వత్సరములు-

గ్రద్ద అన్నది- జిత్తులమారి నక్కకు ఇదేమి బుద్ధి? పీనుగు బ్రతికేనా!
నక్క అన్నది- వలవల ఏడుస్తూ ఎంతమాట అన్నది ఈ అవివేకి గ్రద్ద-
రఘురాముడు బ్రతికించలేదా చనిపోయిన భూసుర కుమారుడిని,
నారదుడు ప్రాణం పోయలేదా సృంజయపుత్రుడు సువర్ణష్ఠీవికి?

అనేసరికి బంధువులంతా పెద్దపెట్టున ఏడ్చి కాలుడికి మొక్కినారు.
పగటిపూట గ్రద్దకు అనుకూలం కాబట్టి గ్రద్ద మాట్లాడింది ఆ విధంగా.
చీకటి పడితే గ్రద్ద వెళ్లిపోతుంది కనుక పీనుగు మొత్తం తనదే కదా!
అనుకుని నక్క తన కనువుగా మాట్లాడింది – అది ఆ జంతువుల రీతి.

అప్పుడు ఆ స్మశానంలో ప్రత్యక్షమైనాడు మహాకాలుడు అద్భుతరూపంలో.
ఆ బాలుడికి ప్రాణం పోసి 'నూరేళ్లు బ్రదకమని' దీవించినాడు.
గ్రద్ద నక్కలను కనికరించి వాటికి ఆకలి లేకుండా వరమిచ్చాడు.
అందరూ ఆదిదేవుడికి మ్రొక్కగా వారినాశీర్వదించి అదృశ్యమైనాడు.

గ్రద్ద నక్కల ముఖాలుగా కనిపిస్తాయి మనుషుల ముఖాలు మనసనే అద్దంలో
ముసుగులు తగిలించుకుని మెసలడం మనుషుల కలవాటే ఈ లోకంలో.
ఎవరి స్వార్థం వారికి ఎలా మాట్లాడాలో, సమర్ధించుకోవాలో చెబుతుంది.
ఇతిహాసాలలోని కథలు తెలిసాక నీ కథేమీ కొత్తకథ కాదని నీకు అర్థమవుతుంది.

---

**సీ. అనవుడు నెగవెక్కి యా బిడ్డవైచి పో । యెడు వారలకు నడ్డపడుచు నక్క**
**'వినుఁడు రాఘవుఁడు నేర్పున బ్రదికింపఁడే । మృతుఁడైన భూసుర సుతుఇశ్రీన మగుడ?**
**సృంజయు కొడుకు సచ్చిన నారదుఁడు ప్రభా । వంబునఁ గ్రమ్మఱ వానిఁ దేఁడె?**
**యట్టుల యొక సిద్ధుఁ డమరుండు మీ యేడ్పు । లాలించి దయ బాలు నసువు లొసఁగె**

**ఆ. నేని మేల కాదె! యిది యేల పోయెద?' । రనిన వారు మగిడి యరుగుదెంచి**
**శిశువు శవము చుట్టుఁ జేరి పెల్లేడ్చిరి । పనవిపనవి యంత నినుడుఁ గ్రుంకె. (శాంతి. 3-377)**

**- ఏనుబుట్టి వేయు నిన్నూరు మున్నూరు గలవు వత్సరములు గాన నెందు**
**బాలు యౌవనస్థుఁ బ్రౌఢుని వృద్ధునిఁ జచ్చిపోయి మగిడి వచ్చువాని (శాంతి. 3-375)**

---

**మహాకాలుడు–** రౌద్రరూప శివుడు. హిందూ శైవమతం, తాంత్రిక, వజ్రయాన, టిబెటన్ బౌద్ధ మతాలలో, కాళికుల శక్తి ఆరాధనలలో ప్రముఖంగా కానవస్తాడు. మహాకాలుడు-మహాంకాళి భార్యాభర్తలు. త్రిశూలధారి, స్మశానవాసి. నాలుగు చేతులు, మూడు కళ్లు, కోటి ప్రళయకాలాగ్నుల కాంతితో ఎనిమిది దిక్కుల స్మశానాల మధ్య ప్రళయతాండవం చేస్తాడు. అష్టమానవ కపాలధారి. పంచశవాలపై కూర్చుని, త్రిశూలధారియై, ఢమరుకం, ఖడ్గం, కొడవలి చేతబట్టి, దేహానికి స్మశానపు బూడిద పూసుకుని చుట్టూరా భూతప్రేత పిశాచగణాలు, రాబందులు, నక్కలు తిరుగుతూ ఉండగా, కల్పాంతాన సృష్టిని అంతం చేసి దేవాంతక కాలాంతకులై ప్రవర్తిస్తాడు. నల్లనివాడు, నిర్గుణుడు. ఉజ్జయినిలోని కాలభైరవ రూప మహాకాలుని దేవాలయం అత్యంత ప్రసిద్ధికెక్కినది.

# 81. పెనుగాలి - పెద్ద బూరుగు చెట్టు కథ

హిమాలయాల్లో ఒకచోటున్న పెద్ద బూరుగుచెట్టును చూసి నారద మహర్షి
అడిగాడు- ఓ శాల్మలీ వృక్షమా, నీకు వాయుదేవుడికి ఏదన్నా చుట్టరికమా?
పెనుగాలికి పెద్దపెద్ద చెట్లు కూలుతున్నా నీవు ఉన్నావెలా స్థిరంగా?
బూరుగుచెట్టు అన్నది- నా శక్తిలో పద్ధెనిమిదవ వంతు కూడా ఉండదు

వాయుదేవుడికి; ప్రభంజనుడనే అతడి పేరు నా దగ్గర చెల్లదు.
కలహభోజనుడైన నారదుడు ఆ మాట గాలిదేవుడి చెవిన వేసాడు.
అతడు బూరుగుచెట్టు వద్దకు వచ్చి అన్నాడు- శాల్మలీ, పొగరు వద్దు-
ఒకరోజున బ్రహ్మ నీ నీడలో విశ్రాంతి తీసుకున్నాడన్న గౌరవం నాకున్నది.

రేపు నేను వస్తాను చూస్తాను నీవెంతో, నీ బలమెంతో, సిద్ధంగా ఉండు-
అని వాయుదేవుడు కోపంగా వెళ్లిపోగా- భయపడిన శాల్మలి
తన కొమ్మల్ని, రెమ్మల్ని తానే విరగగొట్టుకుని మోడుగా ఉన్నది.
తెల్లవారగానే వచ్చిన గాలిదేవుడన్నాడు- చూసావా, ఏమయ్యిందో!

నేను చెయ్యాల్సిన పనిని నీవే చేసుకున్నావు, అణిగిందా నీ గర్వం!
నీకు నీ చుట్టుపక్కాలకు ఇదే తగిన శాస్తి, మిడిసిపడితే అధోగతి'-
అని పలికి వెళ్లిపోయాడు, వైభవం కోల్పోయిన బూరుగుచెట్టును చూసి-
బలవంతుడితో బలహీనుడు తలపడరాదనేదీ కథ తాత్పర్యం.

---

**చ. 'మనుగడ దప్పు నొక్కొ! మునిమాటలు గైకొన నైతి; నా బలం**
**బన నది యెంత? యుగ్రత మహాబలురాకకు నోర్వఁ జాల; నా**
**తని నొక భంగి గెల్తు'నని తాఁ దలపోసి హరించె నాకులుం**
**గొనలును జొంపముల్ నిడుదకొమ్మలు రే యగుడున్ రయంబునన్. (శాంతి. 3-394)**

**చ. ప్రతినకు నీడుగా భయదభంగిఁ బ్రభంజనుఁ డేఁగుదెంచి యా**
**క్షితిరుహముం గనుంగొని 'యిసీ! యిది నా పని నీవ చేసి తీ**
**ధృతి మతి సంతసింపు మిట తేజముఁ బొందుము నీదు బాంధవ**
**ప్రతతికి నిర్విధంబు సదుపాయము మే లెఱిఁగింపు పెంపునన్.' (శాంతి. 3-396)**

---

**వాయుదేవుడు-** గాలులకు అధిపతి. దేవతలకు వార్తాహరుడు. విశ్వపురుషుడి ఊపిరి. అందరికన్న ముందుగా అమృతపానం చేసినవాడు. ప్రాణరూపుడు, దిక్పాలకుడు, అనిలుడు, పవనుడు, వ్యాన, వాత, ముఖ్యప్రాణ, భీమనామధేయుడు. అతడి అంశలో పుట్టినవారు హనుమంతుడు, భీముడు. వాయుదేవుని ఆయుధాలు- గద, అంకుశములు. పంచభూతాలలో ఒకడు. మధ్వాచార్యుడు వాయుదేవుని అంశగా, మూడవ అవతారంగా భావించబడుతున్నాడు. బౌద్ధమత ప్రభావం వలన వాయువు, కాలుడు ఇత్యాది దేవతలు తూర్పు ఆసియా దేశాలలో, చైనా, జపాన్ దేశాలలోని దేవతలలో భాగమైనారు.

# 82. కుదురు సమస్త ధర్మములకున్ విను సత్యము-

భీష్ముడు చెబుతున్నాడు ధర్మజునితో- పాపాలకు స్థావరం లోభము.
అత్యాశ పేరాశ దురాశ అన్ని పాపాలకు మూలము- లోభాన్ని వర్జిస్తే లాభం.
కోపము, దుఃఖము, ప్రేమ, పగ, అహంకారము, గర్వము, తొందరపాటు
ఆలస్యముల కలయిక దారితీస్తుంది అజ్ఞానానికి అని విజ్ఞులు చెబుతారు.

ఇంద్రియ నిగ్రహమనే దమము ముక్తిదాయకము, అది అరిషడ్వర్గాలను
జయించే గొప్ప సాధనం, పరమ బ్రహ్మ పదానికి అది చక్కని పథం.
ధర్మరాజా! ధర్మాలన్నిటికి తపస్సే మూలం. ఆహార నియమమే తపస్సు
తపస్సు వల్ల పంచమహా పాతకాలు పోతాయి, కార్యసిద్ధులు కలుగును.

సమత, దమము, తితిక్ష, అమత్సరము, హ్రీ, ధృతి, అనసూయ
ప్రాణులకు మేలుచేయుట, అహింస, దానము, క్షమ, యజ్ఞం
సూనృతము- ఇవి సత్య స్వరూపాలు. అన్ని ధర్మాలకు మూలం సత్యం.
ఒక్క సత్యవాక్కు వెయ్యి అశ్వమేధ యాగాలతో సమానమంటారు పెద్దలు.

సంకల్పంతో 'కామం' పుట్టి దాని రూపం తెలిసిన అది తొలగిపోవును.
ఇతరులు చేసిన తప్పు వలన 'క్రోధం' జనించి ఓర్పు వలన తగ్గిపోవును.
అంతా శాశ్వతమనుకుంటే పుట్టే 'లోభం' అర్థం తెలిసాక మాయమగును
అవివేకం వలన కలిగే 'మోహం'. అధర్మమాచరించకపోతే నశించును.

**సీ. 'వినుము పాపముల కెల్లను నధిష్ఠానంబు । లోభంబ; యది గామలోలతయును**
**గ్రోధంబు మత్సర ద్రోహంబులును బర । ధన దార వాంఛలు దైన్యపాటు**
**వ్రీడాక్షమాసత్య విముఖ భావంబును । గలిగించి ధర్మంబు గలఁచి నరునిఁ**
**బ్రయి మాలి యేమిటి కయినను గర్దించు । వానిఁగా సమకట్టుఁ గాన లుబ్ధ**

**ఆ. జనులఁ దొఱఁగి లోభ మను తిరిం బడని స । త్యవ్రతులను బరమధార్మికులను**
**బాపభీతమతులఁ బనిగొను లోభంబుఁ । జెంద నీకు నీదు చిత్త వృత్తి.' (శాంతి. 3-399)**

**- లోభాత్క్రోధః ప్రభవతి లోభాత్ కామః ప్రవర్తతే**
**లోభాన్మోహశ్చ మాయా చ మానః స్తంభః పరాసుతా (సం.శాంతి. 158-4)**

మహాభారత యుద్ధం అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రాజసూయ యాగం సర్వపాప నివారణ అశ్వమేధ యాగాల మధ్య జరిగిన గొప్ప సన్నివేశం. సమస్త రాజుల సమక్షంలో స్నేహపూరిత వాతావరణంలో శిశుపాలుడి బలితో జరిగింది నిర్విఘ్నంగా రాజసూయ యాగం. సమస్త రాజులు, వీరులు, బంధువులు మరణించాక ఆ పాప నివారణకు అంత్యక్రియలలో భాగమా అన్నట్లు జరిగింది అశ్వమేధ యాగం. నాలుగు దిక్కుల గెలిచి అత్యంత వైభవంగా ఇంద్రప్రస్థంలో జరిగింది రాజసూయ యాగం. నాలుగు దిక్కుల వీరులు చనిపోగా ఎవరో దాచిన నిధిని తెచ్చుకుని వైభవంగానే జరిగినా ముంగిస అపహాస్యానికి గురైె హస్తినాపురంలో జరిగింది అశ్వమేధయాగం. ఇంద్రప్రస్థం దినదిన ప్రవర్ధమానమై న్యూఢిల్లీగా వెలుగుతున్నది దేశ రాజధానిగా. ఉత్తరప్రదేశ్‌లో మీరట్‌గా (మయరాష్ట్ర-మండోదరి తండ్రి మయుడు) ఉన్నది హస్తినాపురం.

# 83. అరిషడ్వర్గములవి ఆరు తోడేళ్లు-

కులం, చదువు, సంపదల వలన ఏర్పడే 'మదం' అవి తగ్గితే అదీ తగ్గుతుంది.
సాత్త్విక గుణం కొరవడితే 'మాత్సర్యం' జనించి మంచివారిని సేవిస్తే తొలగుతుంది.
ఈ ఆరు తోడేళ్లులా మీద పడతాయి ధైర్యం తగ్గినపుడు
ధైర్యవంతుడివైన ధర్మరాజా, నీవు గెలుస్తావు ఈ అరిషడ్వర్గాలనూ.

యాగం చెయ్యని వైశ్యుడి సొమ్ము మొత్తాన్ని, శూద్రుడి ధనం సగాన్ని
రాజు సంగ్రహించి వినియోగించాలి పుణ్యకార్యాలకు, ఇది ధర్మం.
స్వయంపాకం, మణి, స్త్రీ పవిత్రమైనవి కనుక దానంగా గ్రహించవచ్చు.
అమృతం, విద్య- విషంలో పుట్టినా, అధముల దగ్గర ఉన్నా నేర్చుకోవచ్చు.

పాపాత్ముడితో కలిసి పయనించినవాడు పతనం చెందుతాడు.
తల్లిదండ్రుల పోషణ చూడనివాడు పరమ పాపాత్ముడు -అని పలికి
భీష్ముడు ఖడ్గ మహిమ గురించి అడిగిన నకులుడికి చెప్పాడిట్లు
బ్రహ్మ సృష్టించి ఓ భయంకరమైన రాక్షసిని దానికిచ్చాడు ఖడ్గరూపం-

దానిని శివుడికిచ్చినాడు, దనుజ సంహారం చేసి శివుడు-
ఆ ఖడ్గాన్ని విష్ణువుకు, విష్ణువు మరీచికి, మరీచి భార్గవునకు
భార్గవుడు మునులకు, మునులు ఇంద్రునికి, ఇంద్రుడు లోకపాలురకు
ఇవ్వగా దానిని దుష్యంతుడు భరతునికివ్వగా అది ఖడ్గ సాంప్రదాయమైనది.

---

**సీ. అతనికి నాతఁ డిట్లను 'బ్రహ్మ జగములు । సృజియించి భూతసంసృష్టి సేయ**
**దివిజమర్త్యాది జంతువు లమ్మహాత్ము వి । ధించిన తెరువులఁ దిరిగి బ్రదుకు**
**చుండ దైత్యులు సముద్దండత నన్యాయ । వర్తులై సురమునివ్రాతములకు**
**బాధ లొనర్ప నప్పరమేష్ఠి హిమశైల । తటమున వేయువత్సరము లధిక**

**తే. నియతిమెయిఁ దప మొనరించి నిష్ఠఁ గ్రతువు । సేసె నేయ్యగ్నిఁ బుట్టె నశేష లోక**
**భీతికర మగు నుగ్రంపుభూత మొకటి । ప్రాంశుకృష్ణమై దంష్ట్రలు ప్రజ్వరిల్ల. (శాంతి. 3-442)**

**- అసి ర్విశసనః ఖడ్గః తీక్ష్ణ ధారో దురాసదః**
**శ్రీగర్భో విజయశ్చైవ ధర్మపాల స్తథైవ చ (సం.శాంతి. 166-84)**

---

**ఖడ్గం-** పిడిబాకు నుంచి రూపాంతరం చెంది కరవాలంగా, ఖడ్గంగా మారిన ఆయుధం. 3300 B.C. నాటికే కత్తులు రక్షణాయుధాలు. కత్తి డాలున్న వారిని భారతంలో పలకలవారు అని పిలిచేవారు. సైన్యానికి ముందుండేవారు వీరు. కంచుతో చేసిన ఖడ్గాలు 1300 BC నుండి ఇనుముతో నిర్మితం కాసాగినాయి. భారతదేశపు ఖడ్గాలు గ్రీసు దేశాలకు ఎగుమతి అయ్యేవి. డమాస్కస్ స్టీల్ ఖడ్గ నిర్మాణ పద్ధతి దక్షిణ భారతదేశంలో పుట్టింది. Xiphus, Gladius, Spatha, Long sword, అకినాక, డావో, జియాన్, జన్ మిదావొ, ఉల్ఫ్‌బెర్ట్, అరువల్ (కొడవలి), అసి, చంద్రహాస (రావణ), ఖండ (శివుడు), నందక (విష్ణువు), నిస్త్రంష (ప్రద్యుమ్న), పట్టాయుధ (వీరభద్ర)- ఖడ్గాలు చరిత్రలో పేరెన్నికగన్నవి.

# 84. మోక్షమెదగోరుట మేలు-

ఆ ఖడ్గం మునుల నుంచి ద్రోణునికి, ద్రోణుడి నుంచి కృపుడికి
కృపుడి నుంచి మీ అయిదుగురికి లభించింది ఖడ్గవిద్యగా-
నీకు ఖడ్గయుద్ధంలో పేరు వచ్చింది. ఈ ఖడ్గానికి నక్షత్రం కృత్తిక.
అధిదేవత అగ్ని, గురువు శివుడు; ఖడ్గమే ఆయుధాలన్నిటిలో ప్రధానం.

ఖడ్గం, అసి, విశసనం, తీక్ష్ణధారం, దురాసదం, శ్రీగర్భం, విజయం
ధర్మపాలనం -అనే ఎనిమిది పేర్లుండి ఖడ్గం విజయ సూచకమైనది
అని పలికిన భీష్మునికి నమస్కరించి ఆశీస్సులు గైకొని ధర్మరాజాదులు
ఇంటికి చేరుకుని ఆ రాత్రి కాసేపు ముచ్చటించారు ధర్మార్థ కామాల గురించి.

ధనంజయుడన్నాడు- ధర్మ, కామాల స్థితికి మూలం ధనం, శుక్రుడు కణ్వుడు చెప్పారిది.
నకుల సహదేవులన్నారు- ధర్మార్థాలు ఒకదాని మీద ఒకటి ఆధారపడి ఉంటాయి.
ధనానికి ఫలరూపం కామం. డబ్బులేనివాడి కోరికలు తీరవు కదా!
భీముడన్నాడు- పెరుగులో ఉండే వెన్నలా ధర్మార్థాలలో ఉంటుంది కామం.

తుమ్మెదలు పూలలోని తేనెను సంగ్రహించినట్లు ఎక్కువ సౌఖ్యాన్ని పొందాలి.
ఒక్కటిని అధముడు, రెండిటిని మధ్యముడు, మూడిటిని ఉత్తముడు అవలంబిస్తాడు.
ధర్మరాజన్నాడు- ధర్మార్థ కామాలు కలిగించే వేదనలను కాదని మోక్షాన్ని కోరుకోవాలి.
విదురుడి మాట దీనికి ప్రమాణము అని పలుకగా మెచ్చుకున్నారు అందరూ.

---

**క. 'దధిసారము చందంబున । నధిపా! ధర్మార్థ సారమగు కామరసం**
**బధమ మను తలఁపు సుఖసం । విధానబాహ్య మని నీ వివేకము యెఱుఁగున్. (శాంతి. 3-459)**

**క. విను మఱి యలరునఁ దేనియఁ । గొనుగతి నత్యంత సుఖము గొననగుఁ; గామం**
**బున నధిక సుఖము లొందని । జను సిరి తాఁ గొల్చులేని సస్యమ కాదే! (శాంతి. 3-460)**

**- ధర్మేణై వర్షయస్తీర్ణాః ధర్మేలోకాః ప్రతిష్ఠితాః**
**ధర్మేణ దేవా వ వృధుః ధర్మేచార్థః సమాహితః (సం.శాంతి. 167-7)**

**- ధర్మం సమాచారేత్పూర్వం తతో ర్థం ధర్మ సంయుతమ్**
**తతః కామం చరేత్పశ్చాత్ సిద్దార్థః సహి తత్పరమ్ (సం.శాంతి. 167-27)**

---

**కృత్తిక-** పిల్లల కోడి అని పిలువబడే నక్షత్రరాశి (Pleiades). వృషభరాశిలో ఉంటుంది. దక్షుడు-పాంచజనిల కుమార్తె. 27 నక్షత్రాలలో మూడవది. ఈ జన్మనక్షత్రంలో పుట్టినవారి పేర్లు అఇఉఎ లతో మొదలవుతాయి. మాట మీద నిలబడే వ్యక్తులు. కష్టించి పనిచేస్తారు. గొప్ప సలహాదారులు. సుందరులు. సంగీతం, కళలలో అభిరుచి ఉంటుంది. ఉపాధ్యాయ వృత్తి వీరికి అనుకూలం. వినయగుణ సంపన్నులు. హుందాగా జీవిస్తారు. కాస్త కోపం ఎక్కువ. అగ్ని అధిష్ఠాన దేవత. కృత్తికలు ఆరుగురు పెంచడం వలన కుమారస్వామి కార్తికేయుడు, ఆరు ముఖాలవాడు, షణ్ముఖుడైనాడు. కుమారస్వామిని పెంచిన కృత్తికలు ఆరుగురు- శివ, సంభూతి, ప్రీతి, సన్నతి, అనసూయ, క్షమ. ఆయుధాలలో మొదట ఉత్పన్నమైనది- అసి (ఖడ్గం); ధనుస్సును తొలుదొల్త తయారు చేసినవాడు పృథు చక్రవర్తి.

# 85. నాడీ జంఘుడి కథ

గౌతముడనే బ్రాహ్మణుడొకడు బోయవనితను పెండ్లాడి, తానూ వేటకు పోతూ
మాంసాహారం తింటూ, సుఖాలకు మరిగి ధనసంపాదనకు మార్గం వర్తకమనుకుని
కోమట్ల గుంపుతో కలిసి కొండా కోనల్లో మరొక దేశానికి పోతుండగా
మదగజమొకటి వర్తక జన సమూహపు శిబిరాన్ని ధ్వంసం చేయగా

అందరూ పరిగెత్తారు తలోదిక్కుకు, ఈ బ్రాహ్మణుడు కూడా పరిగెత్తి అలసిపోయి
కూర్చున్నాడొక మఱ్ఱిచెట్టు కింద, అడవి పూలవాసన నిముడ్చుకున్న సుడిగాలి
అతడి అలసటను పోగొట్టగా అతడు గమనించాడు ఒక పెద్ద కొంగను
అది తనవేపే నడచి రావడానిని- ఆ కొంగపేర్లు నాడీజంఘుడు, రాజధర్ముడు

బ్రహ్మ దయను నోచుకున్న ఆ మహా బకము అతడికి ఆతిథ్యమిచ్చి
గంగానదిలోని చేపలను తెచ్చి కాల్చి తినబెట్టి, చిగురుటాకుల, పూల శయ్య
నమర్చగా హాయిగా నిద్రపోయాడతడు. ఉదయాన నాడీజంఘుడన్నాడు
–మనిషి పేదరికం పోవాలంటే స్నేహితుడు, వెండి, బంగారము,

ఆలోచన అనేవి ముఖ్యమని బృహస్పతి ఉవాచ. మధువ్రజములో నా మిత్రుడు
విరూపాక్షుడున్నాడు, ఆ రాక్షసరాజు నీకు సహాయం చేయగలడు–
అని నాడీజంఘుడు పలుకగా మూడామడల దూరంలో ఉన్న మధువ్రజం
చేరుకున్నాడు గౌతముడు. అయితే విరూపాక్షుడికి నచ్చలేదు గౌతముడు.

---

**క. 'కులమును విద్యయు వృత్తముఁ । గల రూ పెఱిఁగింపు' మనినఁ గలఁగక తన్నుం**
**దెలియంగఁ జెప్పె విప్రుం । డలఘుం డగు నసురపతియు నవికృతుఁ డగుచున్. (శాంతి. 3-491)**

**క. ఇతఁ డెట్టిఁ డైన నేమగు? । నతనికి సుఖుఁ డట్టె బకమహత్తర సఖ్యం**
**బితనిం బాత్రముఁ జేయదె! యితనికిఁ దృప్తి యగునట్టు లిత్తు ధనంబుల్.' (శాంతి 3-492)**

**– చతుర్విధా హ్యర్థసిద్ధిః బృహస్పతి మతం యధా**
**పారంపర్యం తథా దైవం కామ్యం మైత్ర మితి ప్రభో (సం.శాంతి. 170-12)**

---

**కొంగ–** మహాభారతంలో కొంగల పాత్ర అక్కడక్కడా కనిపిస్తుంది. పొడుగాటి కాళ్లు, పొడుగాటి మెడతో మూడు నుంచి ఆరడుగుల ఎత్తు, 12 కిలోల వరకు బరువు తూగుతాయి. ఎగిరే పక్షులలో పెద్దవి కొంగలు. 15 ఉపజాతులున్న కొంగలు అంటార్కిటికా, దక్షిణ అమెరికాలలో తప్ప మిగతా అన్ని ప్రాంతాలలో ఉన్నాయి. జంటలుగా ఉంటాయి. కేవలం రెండు గుడ్లు పెడతాయి. తల్లిదండ్రుల సమిష్టి బాధ్యత పొదగడం, పెంచడం. కొంగ పిలుపు, కేక, అరుపు చాలా కిలోమీటర్ల దూరం వినిపిస్తుంది. వ్యాస మహాభారతంలో- యక్షప్రశ్నల ఘట్టం, కౌశికుడు-పతివ్రత-ధర్మవ్యాధుడి వృత్తాంతం, నాడీజంఘుడి కథలో కొంగ (బక) పాత్ర కనిపిస్తుంది.

రామాయణ తొలి శ్లోకం, వాల్మీకి శోకానికి కారణమై- 'మానిషాద ప్రతిష్ఠాత్వమాగమ్' - క్రౌంచ పక్షులు (Sarus Cranes) శాశ్వత కీర్తిని దక్కించుకున్నాయి.

# 86. నేడిచ్చటికేల రాడు మత్సఖుండు?

గౌతముడు తనకు నచ్చలేదు కాని నాడీజంఘుడు పంపినాడన్న ఒకే ఒక కారణంతో
అతడికి అనేక సేవలు చేసి భోజనం పెట్టి మొయ్యలేనంత బంగారం,
మణులు ఇచ్చి, అన్నం తిన్న బంగరు పళ్లెమునూ ఇచ్చి సాగనంపినాడు,
ఆనందంతో ఆ మూటనెత్తుకుని గౌతముడు చేరుకున్నాడు నాడీజంఘుడున్న చోటుకు.

ఆ గొప్ప కొంగ అతడికి ఆహారం పెట్టి, దొప్పలవంటి రెక్కలతో గాలి విసరగా
గాఢంగా నిద్రపోయి అర్ధరాత్రి లేచిన గౌతముడు, తనకు కాస్త దూరంలో
నిద్రిస్తున్న కొంగను చూసి– ఇది బాగా కొవ్వెక్కి ఉన్నది, దీనిని చంపితే
రేపు ప్రయాణంలో కాల్చుకు తినవచ్చు –అనుకుని, చీర బిగించి కట్టుకుని

రెండు చేతులతో పెద్ద కర్రను గట్టిగా పట్టుకుని, కొంగ మెడమీద
తలమీద బాది, చచ్చిందని నిర్ధారణ చేసుకుని, ఈకలు పీకి, పేగులు లాగి
మాంసాన్ని వేరుచేసి మూట కట్టుకున్నాడు. అక్కడ నాడీజంఘుడి
మిత్రుడైన విరూపాక్షుడికి అశుభ శకునాలు తోచి, మనసు కలత చెందగా

ప్రతిరోజూ ఉదయాననే వచ్చే నాడీజంఘుడు రాలేదేమని చూసి రమ్మని
సేవకులను పంపగా, వారు కొంగ డొక్కను చూసి గుర్తుపట్టి రాజుకు తెలియజేసి
తన దారినపోతున్న గౌతముడిని పట్టి రాజుముందుంచారు. అతడన్నాడు–
వీడు మిత్రఘాతకుడు. వీడిని చంపి తినండి ఈ కృతఘ్నుడిని–

---

క. అందంద మెడయుఁ దలయు న । మందాటోపమునఁ బెక్కు మాఱు లడిచి చావుం
దెలియఁ జూచి యలరెడు । డెందముతో నీఁకలన్నిటిని వెస నూడ్చెన్. (శాంతి. 3–498)

తే. ఊడ్చి బొందువు వ్రచ్చి ప్రేవులివి నంజు । దంతయును బుచ్చి పొదుకగా నమరఁ గట్టి
కొనుచు వేగుఁ బోకగుటయుఁ జనియె; నట్టి । సమయమున మేలుకని దనుజప్రభుండు. (శాంతి. 3–499)

క. 'పొల వలచె నేమి గీడొకొ । కలిగెడు!' నని తలఁచి మనసు గలఁగఁగఁ దనవా
రలతోడ నుగ్గడించుచుఁ । జలియించుచునుండఁ బ్రొద్దు జామెక్కుటయున్. (శాంతి. 3–500)

ఉ. నిచ్చలు వచ్చు రేపకడ నెయ్య మెలర్పఁగ మత్సఖుండు; నేఁ
డిచ్చటి కేల రాఁడు? గుణహీనత విప్రునియందుఁ గల్మి నా
యిచ్చఁ దలంచితిం; దులువ యేమి దలంచెనొ? యక్కటా! మదిం
బొచ్చెము లేదు నమ్ము బకపుంగవుఁ; డెట్లగు నొక్కొ దైవమా! (శాంతి. 3–502)

– మిత్రద్రోహీ నృశంస సశ్చ కృతఘ్నశ్చ నరాధమః
క్రవ్యా దైః కృమిభిశ్చైవ న భుజ్యంతే హి తాదృశాః (సం.శాంతి. 172–26)

## 87. కృతఘ్నుడి మాంసాన్ని కుక్కలు కూడా ముట్టవు-

'వీడిని చంపి తినండి' -అని తన సేవకులకు చెప్పగా వాళ్లన్నారు- 'ప్రభూ
ఈ పాపిష్ఠివాడిని తింటే వీడి పాపాలు మాకంటుకుంటాయి కదా!'
విరూపాక్షుడన్నాడు- 'తింటే తినండి లేకపోతే లేదు, వీడిని శిక్షించండి
మీ ఇష్టం వచ్చినట్లు' -అనగా వాళ్లు ఆ గౌతముడిని ఖండఖండాలుగా నరికి

ఆకలితో ఉన్న కుక్కల మందకు వేయగా అవికూడా వాడిని ముట్టలేదు.
-'కృతఘ్నుడి మాంసాన్ని కుక్కలు కూడా ముట్టవు' అని వేదాల మాట.
విరూపాక్షుడు వలవల ఏడుస్తూ తన మిత్రుడైన నాడీజంఘుడి దొక్కకు
శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరిపించగా సాక్షాత్తూ ఇంద్రుడు వచ్చి

'నీ మిత్రుడు బ్రహ్మకు సన్నిహితుడు, దుఃఖించకు'-మని పలుకగా
చితిమంట దగ్గరలో సురభియైన గోవు తన దూడకు పాలిస్తుండగా
దూడ నోటినుండి నురగ తుంపర జారి చితిమీద పడిన వెంటనే
నాడీజంఘుడు తిరిగి బ్రతికాడు, విరూపాక్షుడెంతో సంతోషించాడు.

తన ఆతిథ్యం పొందిన గౌతముడికి పట్టిన దురవస్థను విన్న నాడీజంఘుడు
ఇంద్రుని వరమడిగి ఆ బ్రాహ్మణుడిని బ్రతికించి ధనమిప్పించి పంపగా
అతడు వెనక్కి తిరిగి చూస్తూ చూస్తూ తత్తరపడుతూ వెళ్లిపోయాడు తన ఇంటికి.
నాడీజంఘుడిని, విరూపాక్షుడిని ఆశీర్వదించి ఇంద్రుడు వెళ్లిపోయాడు స్వర్గలోకానికి.

---

**చ.** **పరిమెయిఁ బాతి వానిఁగని పట్టి వడిం బెడగేలు గట్టి తె**
**చ్చి రసురభర్త సూచి 'యిటు సేరఁగఁ దేవల దీ కృతఘ్నునిం;**
**బొరిగొని వే తినుం' డనినఁ బోకడ మాలిన వార మయ్య! యి**
**ద్దురిత శరీరముం దినఁగ దోసము మా' కని వార లొల్లమిన్. (శాంతి. 3-505)**

**క.** **'విను మది యట్టిద; కుక్కలుఁ । దినగా రోయుం గృతఘ్ను దేహము మాంసం**
**బని చెప్ప నాగమంబులు । మనుజేశ్వర! తెల్లమయ్యె మన కిచ్చోటన్.' (శాంతి. 3-510)**

**క.** **ఆరయ మిత్ర ద్రోహము । దారుణమగు పాతకము గృతఘ్నత కంటెన్;**
**వైరము గొని విడువవలయు । నా రెండు దెఱఁగుల వారి నాప్తుల నైనన్. (శాంతి. 3-525)**

**క.** **మిత్రుం దైహికములు నా । ముత్రికములు నైన భద్రములు దలకొలుపున్;**
**మిత్ర ధనంబులలోనను । మిత్రుఁడ యెక్కు డనుమాట మెత్తురు ప్రాజ్ఞుల్. (శాంతి. 3-526)**

**-** **కృతజ్ఞేన సదా భావ్యం మిత్ర కామేన చైవ హ**
**మిత్రాచ్చ లభతే సర్వం మిత్రాత్పూజాం లభేత చ (సం.శాంతి. 173-22)**

# ✦ 12. శాంతి పర్వము - చతుర్థాశ్వాసము ✦

## 88. ఇంటి వాకిలులు తొమ్మిదియు నెరయమూసి నిదురవోదు

ధర్మరాజన్నాడు భీష్ముడితో– పితామహా, రాజోచిత ధర్మాలు తెలిపావు
వివరంగా నాకు, కృతజ్ఞుడిని, మరి సకల భూజన పరమహిత ధర్మమేది?
భీష్ముడన్నాడు– ముక్తిని ప్రసాదించగలిగినదే శ్రేష్ఠ ధర్మము, కుమారా!
సేనజితుడనే రాజు పుత్ర మరణంతో శోకార్తుడై ఉన్నపుడు మిత్రుడన్నాడు–

ప్రభూ, పారుతున్న నదిలో కాష్ఠాలు కలుస్తాయి, కొద్దిసేపటికి విడిపోతాయి.
బాంధవ్యాలంతే, కలయికలు ఎడబాటులు యాదృచ్ఛికాలుగా గ్రహింపుము.
మనసు సుఖ దుఃఖాలను, ప్రియ అప్రియాలను అనుభవంలోకి తెస్తుంది.
'ఇది నాది' అన్న భావం కలిగినాక బంధమేర్పడి శోక కారణమవుతుంది.

పూర్వ కర్మల ఫలితాలు ఈ జన్మలో అనుభవించాల్సిందే ఎవరైనా, తప్పదు.
పింగళ అనే వేశ్య ప్రియుడి కోసం ఎంతోసేపు వేచి ఉన్నది, అతడు రాలేదు.
ఆమె అనుకున్నది– ఎందుకు నాకీ వెర్రితనం. ఈ ఒంటిస్తంభపు మేడకున్న
తొమ్మిది వాకిళ్లు మూసుకుని నిశ్చింతంగా నిద్రపోతాను, వచ్చినవాడే ప్రియుడు.

అతడు వస్తాడన్న ఆశను జయించి ఇంద్రియ నిగ్రహంతో నిద్రపోతాను హాయిగా!–
అనుకుని పింగళ తృప్తిగా నిద్రపోయింది; ఆ మాటలతో సేనజితుడు
పుత్ర మరణ శోకం నుంచి విముక్తుడై శాంతిని పొందినాడు –అన్నాడు భీష్ముడు.
ధర్మరాజు అడిగాడు– జీవరాశులు నశించే కాలం వస్తే ప్రజలేమి చెయ్యాలి?

---

క. వినుము, పురాతన జన్మం । బునఁ జేసిన యట్టి కర్మముల ఫలములు ప్రా
జ్ఞునినైనఁ బొందు వానికి । మనుజేశ్వర! మందు ధైర్యమహిమయ చుమ్మీ. (శాంతి. 4-14)

క. పరమ సుఖము దృష్ణ యుడుగు । టరయఁగ ని ట్లగుట పింగళాలాపములం
బరిబోధితమగు ధరణీ । శ్వర! చెప్పెదఁ దెలియ వినుము వాని తెఱంగున్. (శాంతి. 4-15)

ఆ. 'ఏను వేఁదు ఱగుడు వాని నిర్వేదుఱ । పట్టఁ జదురుగలదె! భ్రాంతి దొఱఁగి
యొంటి కంబ మొప్పు నింటి వాకిళులు దొ । మ్మిదియు నెఱయమూసి నిదురవోదు. (శాంతి. 4-17)

క. పొంతకు వచ్చిన వానిన । కాంతునిగాఁ గొనుచు నొరునిఁ గాంక్షింపక యే
నెంతయు నూఱడి మనమునఁ । జింత యొకఁడు లేకయున్నఁ జెందు సుఖంబుల్. (శాంతి. 4-18)

క. ఆశయ యింద్రియ జయము వి । నాశముఁ బొందించుఁ గావునం దొఱఁగెద నే
నాశను; సౌఖ్యము నిచ్చు ని । రాశయ' యని పలికి యట్టిదై నిద్రించెన్.' (శాంతి. 4-19)

– నాస్తి విద్యాసమం చక్షుః నాస్తి సత్య సమం తపః
నాస్తి రాగసమం దుఃఖం నాస్తి త్యాగ సమం సుఖమ్ (సం.శాంతి. 175-35)

# 89. ఎచ్చోటనైన నధనుడు విచ్చలవిడి నుండు-

మేధావి అనే విప్రకుమారుడు తన తండ్రిని ప్రశ్నించాడు- నాయనా,
ఆయువు చంచలము, ప్రాణి గర్భములో ప్రవేశించినప్పటి నుంచి
కొనిపోవుటకు మృత్యువు ఎదురుచూస్తూ ఉంటుంది కదా!
ప్రాణి బ్రతుకు ఇగిరిపోయే నీటిలో చేప బ్రతుకు. మృత్యువు వస్తుంది

అడవిలో ఆదమరచి నిద్రపోతున్న వాడిని ఎత్తుకుపోయే పెద్దపులిలా.
మరి నీ ఉద్దేశమేమిటి? -అనగా తండ్రి అన్నాడు- మనము గృహస్థులం.
గృహస్థాశ్రమ ధర్మాలు నిర్వహించి ఆనక వానప్రస్థమవలంబించి ముక్తిని పొందాలి.
కుమారుడన్నాడు- గృహస్థుడనుకుంటాడు సంతతి ద్వారా అమృతత్వం వస్తుందని

'ఆత్మావైపుత్ర నామసి' -సంతతి ద్వారా తనను తాను జన్మింపచేసుకుని, కాని,
దాని నుంచి మోక్షాన్ని పొందలేడు కదా! యజ్ఞంతో ముక్తి వస్తుందా?
అది హింసకు కారణమవుతున్నది; నిజమైన యజ్ఞం వాక్కును, మనసును
నిగ్రహించడం; ఏకాంత ప్రదేశాన నిశ్చల మనస్కుడవై నిన్ను నీవు అన్వేషించుకొనుము-

ఈ ఇతిహాసాన్ని విని ధర్మరాజన్నాడు భీష్మునితో- నాలో సందేహమేర్పడినది
ధనమే సుఖశాంతులకు మూలమా? - భీష్ముడన్నాడు- ఈ కథ వినుము
శమ్యాకుడనే నిర్ధనుడు నాతో అన్నాడు- ధనం లేనివాడికి స్వేచ్ఛ ఎక్కువ
ధనం కలిగి ఉండడం దుఃఖహేతువు అని తెలిసినవాడు పొందును సుఖశాంతులు.

---

క. విను పశుయజ్ఞము హింసన । మనంతఫలదంబు గా; దహంకృతిసహితం
బనఘా! వాఙ్మనసనియమ । మను యాగం బిచ్చు నవ్యయానందంబున్. (శాంతి. 4-28)

క. కామ క్రోధాద్యములగు । నీ మానస వికృతు లుడిపి యేకాంత గుహా
రాముఁడవై నిను వెదకుట । సూ మేఁ; లొండెల్ల నుడుగు సులభవివేకా!' (శాంతి. 4-30)

క. ఎచ్చోటనైన నధనుఁడు । విచ్చలవిడి నుండు; లేదు వెఱ పించుకయుం;
బొచ్చెపుఁజందం బొల్లఁడు; । మెచ్చురె సురలైనఁ? బలుకు మృదువై యుండున్. (శాంతి. 4-36)

క. లోకము చందము గనికొని । యీ కానఁగ నగు ధనాదు లెల్లను గాల
వ్యాకులతఁ బొందఁ గలయవి । గాకుండమి యెఱిఁగి విడుపు గడుఁ జదు రెందున్. (శాంతి. 4-37)

క. ధనవత్త్వము దుఃఖకరం । బని కని తత్కాంక్ష విడుచు నతని కధనతా
జనితాత్మాధీనత్వం । బనుపమ సౌఖ్యంబు సేయు నక్షీణముగన్.' (శాంతి. 4-38)

- ఆకించన్యే చ రాజ్యే చ విశేషః సుమహానయమ్
నిత్యోద్విగ్నో హి ధనవాన్ మృత్యో రాస్య గతో యథా (సం.శాంతి. 176-11)

# 90. చిత్ సుఖాన భవము ప్రచురమగుట అజగర వ్రతము

ధనార్జన చేసే ఉద్దేశంతో 'మంకి' అనే విప్రుడు కొన్నాడు రెండు కోడెదూడలను
రెండిటికి ఒకే పలుపుతాడు కట్టినాడు, అవి చెంగుచెంగున ఎగుర్తూ
దారిలో పడుకున్న ఒంటెకు అటు ఒకటి ఇటు ఒకటి పరిగెత్తబోగా
ఒంటెకూడా పైకి లేచి పరిగెత్తేసరికి, కోడెదూడలకున్న పలుపుతాడు బిగిసి

అది ఉరితాడు కాగా క్షణాల్లో రెండు కోడెదూడలూ శవాలుగా మారిపోయాయి.
అప్పుడు 'మంకి' అనే బ్రాహ్మణుడనుకున్నాడు– నా మనసులో కోరిక పుట్టింది
ధనార్జన చేయాలని, కొన్నాను కోడెదూడలను, పోగొట్టుకున్నాను వాటిని.
ఇప్పుడు నాలో దుఃఖమేర్పడింది. నాలోని ఈ కోరిక సంకల్పజనితం–

ఈ కోరికను, సంకల్పాన్ని తిరస్కరించి అతడు జీవించాడు హాయిగా–
అజగరుడనేవాడు ప్రహ్లాద చక్రవర్తికి చెబుతున్నాడు– బంధాలు
ఏర్పడతాయి, ఎప్పుడైతే మనం మన ప్రమేయం లేకుండా జరిగేవాటికి
మనమే కారణమని అనుకున్నపుడు; ఇంద్రియ నిగ్రహంతో వాటిని జయించాలి.

మేలు కీడు, సుఖదుఃఖాలు, పరమాన్నము తెలికపిండి, మృదుల శయ్య
రాతి పడక, నారచీర పట్టువస్త్రము ఇవన్నీ నాకు సమానమే, అందుకని పెద్దగా
కదలిక లేక చావుపుట్టుకలు, కలిమిలేములు పట్టించుకోకుండా కొండచిలువలా
అజగర వ్రతం చేస్తున్నాను నిత్యతృప్తి, శుచి, ఓర్పు, సమభావాలతో–

---

సీ. మంకి నాఁ బరఁగు బ్రాహ్మణుఁడు ధనేచ్ఛమై। వర్తించు శిక్షింపవలయునట్టి
గుజ్జుదోయిని జట్టిగొని ప్రీతి లంకించి। యుండ లంకియతోన గుండు మీఁటి
పాఱె నక్కోడియల్ పడియున్న గనపలొ। ట్టేనుంగు పై నది యెగసి పఱవ
నుభయ పార్శ్వంబుల నురిపోసిన ట్లవి। వ్రేలి చచ్చినఁ జూచి విప్రుఁ డడలి

తే. 'రత్నములుఁ బోని వత్సతరంబు లకట!। వ్రేలుచున్నవి లొట్టేన్గు వెంటఁ దవిలి'
యనుచు నిర్వేద మొంది యిట్లనియెఁ దన్నుఁ। గరుణతోడఁ గనుంగొని నరులతోడ. (శాంతి. 4–40)

ఆ. చలనమేది పుట్టుఁ జావునుం బిరువెట్టి। యామిషార్థిజనుల నపహసించు
చెలిమితోడ లేమికలిమి వాటింపని। రమణ నునికి యజగరవ్రతంబు. (శాంతి. 4–62)

– సర్వసామ్య మానాయాం సం సత్యవాక్యం చ భరత
నిర్వేదశ్చా విధిత్సా చ యస్య స్యాత్స సుఖీ నరః–

– ఏతాన్యేవ పదా న్యాహుః పంచ వృద్ధాః ప్రశాంతయే
ఏష స్వర్గశ్చ ధర్మశ్చ సుఖం చానుత్తమం మితమ్ (సం.శాంతి. 177–2,3)

# 91. అతని తలపున ప్రభవించె నాకసంబు-

బంధువుల కలిమి, కర్మం, ధనం, బుద్ధిబలములందు ప్రధానమైనది బుద్ధిబలం.
ప్రజ్ఞవలన కార్యనిర్వహణ సులభమవుతుంది; పుణ్య పాపకర్మలు తెలుస్తాయి
పాప పుణ్యాలు పరిపక్వమై సుఖ దుఃఖాలను కలిగిస్తాయి చెట్లు ఫలించినట్లు.
పాపాత్ములు కానవస్తారు గుడ్లలో తాలుగుడ్లలా, ధాన్యంలో తాలుగింజల్లా

ఇప్పుడు నేను చెప్పబోయేది భరద్వాజునికి భృగుమహర్షి చెప్పినది–
–నారాయణుడు అవ్యయుడు, అనంతుడు, సృష్టి చేయ సంకల్పించినవాడై
తనలోని వెయ్యవవంతుతో సృష్టించాడు అవ్యక్తుడిని, ప్రకృతి తత్త్వమున్న వాడిని
అజరామరుడైన అవ్యక్తుడి నుంచి పద్మము, పద్మము నుంచి పుట్టినాడు బ్రహ్మ

బ్రహ్మదేవుడి సంకల్పం వలన ఆకాశం, ఆకాశం నుంచి నీరు, నీరు నుంచి
నిప్పు గాలి, నిప్పుగాలి కలిసి భూమి జనించాయి. ఆ బ్రహ్మ అఖిల భూతాత్మకుడు
అతడికి పర్వతాలు ఎముకలు, భూమి కొవ్వుమాంసము; సముద్రాలు రక్తం
ఆకాశము పొట్ట; గాలి ఊర్పు; అగ్ని వెలుతురు, నదులు రక్త వాహకాలు, నరాలు

ఊర్ధ్వలోకమే శిరస్సు, పాతాళము పాదాలు; దిశలు బాహువులు; విశ్వమే విష్ణువు
పంచభూతాలు హద్దులు లేనివి. అవి కార్యరూపాలు; కర్తనారాయణుడు
బ్రహ్మకు పీఠం పద్మం. బ్రహ్మ విష్ణువుకు మానసపుత్రుడు, పద్మమే భూమి
మేరు పర్వతం దాని కర్ణిక, బ్రహ్మ చరాచర సృష్టి చేసేది అక్కడినుంచే!

**సీ.** **'కైలాసశైలశిఖరమునఁ దేజో వి । రాజితు భృగు భరద్వాజుఁ దధిక**
**వినయంబుమైఁ జేరి, 'మునినాథ! భూత సృ । ష్టి ప్రకారము నాకుఁ జెప్పు' మనిన**
**నమ్మహితాత్ముఁ డిట్లను 'విను నారాయ । ణుం దవ్యయుం దనంతుండు భూత**
**సృజనంబు దలఁచి మున్ సృజియించెఁ దనదు స । హస్రాంశకమున నవ్యక్తుఁ దనఁగ**

**తే.** **మనసునన యజరామరు ననుపమాను । నతనివలన మహత్తత్త్వ మావహిల్లె;**
**నతఁడు దివ్యతేజోమయం బైన పద్మ । మొకటి గలిగింప బ్రహ్మ యం దుద్భవించె. (శాంతి. 4-81)**

**-** **అచోద్యమానాని యథా పుష్పాణి చ ఫలాని చ**
**స్వం కాలం నాతి వర్తంతే తథా కర్మ పురాకృతమ్ (సం.శాంతి. 181-12)**

**పురుష-** అన్ని మతాల్లోనూ- సృష్టి ఎలా సంభవించింది, నేనెక్కడి నుంచి వచ్చాను, ఇంత వైవిధ్యంగా ప్రపంచం ఎలా ఏర్పడింది - అన్న ప్రశ్నలకు సమాధానాల అన్వేషణ కానవస్తుంది. కాల, రాగ, నియతి, విద్యా, కళా తొడుగులున్న పరమాత్మ స్వరూపం పురుషతత్త్వమని కాశ్మీరి శైవం బోధిస్తుంది. విశ్వాంతరాత్మ ఋగ్వేదం-10వ మండలం-90వ శ్లోకం వర్ణోత్పత్తిని తెలియబరుస్తుంది. ఈ విశ్వ పురుషుడి నుంచే వ్యక్తావ్యక్త చరాచర సృష్టి జరిగిందని వేదాంతులు భావిస్తారు. ఈ విశ్వపురుషుడు చైనీయులకు 'పాంగు', గ్రీకులకు గెయియా (Gaia) నింగికి తల్లి; బాబిలోనియన్ క్వింగు, హిందువుల మనువు, ప్రాచీన గ్రీకుల ప్రొటొప్లాస్ట్, వియత్నాం- Than Tru Troi (ఖౌంగ్ లొ), అజ్టెక్‌ల Tlaltecuhtli (తలాల్‌తెకుత్లి) వీరి శరీర భాగాల నుంచి సమస్త సృష్టి ఏర్పడింది.

# 92. సత్యం బన్నృతంబు చేత సంపిహితమగున్-

చైతన్యం గాలి వలన, శబ్దం ఆకాశం వలన, ద్రవము నీటివలన, వేడిమి
నిప్పు వలన, గట్టితనం భూమివలన కలిగాయి; ఈ పంచభూతాల వలన
చరాచర సృష్టి లేదా జంగమస్థావర సృష్టి ఏర్పడింది కాలరేఖలో
చెట్టు, గుట్ట, పిట్ట, జంతువు ఇలా అన్ని ప్రాణులూ పంచభూత నిర్మితులే.

పదార్థాలు, ఇంద్రియాలు, మనసు అనుభవ క్రియకు సాధనాలు; అనుభోక్త
క్షేత్రమనే శరీరంలో ఆ అంతరాత్మ పురుషుడిగా క్షేత్రజ్ఞుడిగా ఉంటాడు.
ఆ అంతరాత్మను అన్వేషించినవాడు పరమ సుఖాన్ని పొందగలుగుతాడు.
ఆత్మాన్వేషణ ఆ విధంగా అత్యంత గొప్పది, ముక్తిప్రదమైనది -అంటారు పెద్దలు.

బ్రహ్మ మొదట సృజించాడు బ్రాహ్మణులను- తొలికాలంలో అందరూ బ్రాహ్మణులే.
తెలుపు వర్ణం బ్రాహ్మణులది, తరువాత ఎరుపురంగులో క్షత్రియులను,
పసుపురంగులో వైశ్యులను, నలుపురంగులో శూద్రులను సృష్టించాడు బ్రహ్మ.
వృత్తులు మారిన వారికి ప్రవృత్తులు మారడం వలన సంకర స్థితి ఏర్పడ్తుంది.

సత్యమే వేదం, సత్యమే తపస్సు. అది ధర్మం, కాంతి, జ్ఞానం, స్వర్గం, సుఖం;
అసత్యమంటే పాపం, చీకటి, తెలివితక్కువతనం, నరకం, దుఃఖం;
అసత్యం కప్పుతుంది సత్యాన్ని, కనిపిస్తుంది సత్యంలా పామరజనులకు
ఆ ఆకర్షణను భ్రాంతిని తొలగిస్తారు సుధీజనులు సత్యవ్రత దీక్షతో.

---

**క. సత్యమ బ్రహ్మము దపమును । సత్యమ ప్రజలను సృజించు సత్యము లోక**
**స్థిత్యాధానముఁ జేయును । సత్యం బనృతంబుచేత సంపిహిత మగున్. (శాంతి. 4-100)**

**క. ఒలయు జరావ్యాధి ప్రభృ । తులు శారీరములు గాధ తోదక శోకా**
**దులు మానసములు; దుఃఖం । బులు రెండు విధముల నిట్లు పురుషు నలంచున్. (శాంతి. 4-103)**

**క. శారీర మానసములగు । నీ రెండు విధములు దన్ను నేఁపక యుండం**
**గోరికొని నియమములఁ బ్రతి । కారం బొనరింపఁగా సుఖం బొందు నరున్. (శాంతి. 4-104)**

---

**భృగుమహర్షి-** మొట్టమొదటి జ్యోతిష్య రచయిత, భృగుసంహిత కర్త, నవబ్రహ్మలలో ఒకడు. బ్రహ్మ హృదయం నుంచి పుట్టినవాడు. 1) దక్షప్రజాపతి కుమార్తె ఖ్యాతి భృగువు భార్య. వీరి కుమారులు ధాత, విధాత. ధాత-అయతిల కుమారుడు ప్రాణుడు. విధాత-నియతిల కుమారుడు మృఖండుడు; మృఖండ-మనస్వినిల కుమారుడు మార్కండేయుడు; మార్కండేయ-ధూమ్రావతిల కొడుకు భావనారాయణుడు (వేదశీర్షుడు); భావనారాయణుడు-భద్రావతి సంతానం 101 పద్మశాలి ఋషులు; 2) భృగుమహర్షి-పులోమల కొడుకు చ్యవనుడు; చ్యవన-సుకన్యల కొడుకు రురుడు; రురుడు-ప్రమద్వరల కుమారుడు- ఋచీకుడు; ఋచీకుడు-సత్యవతి పుత్రుడు- జమదగ్ని; జమదగ్ని-రేణుకల కుమారులు- కమణ్వత, సుశేన, వసు, విశ్వావసు, పరశురాముడు. 3) భృగు-ఉషనల (కావ్యమాత)లకు శుక్రాచార్యుడు మరో పదకొండుమంది సంతానం; శుక్రాచార్యుడికి జయంతి వలన దేవయాని జన్మించింది.

# 93. సదాచార విధులు

భృగు మహర్షి చెబుతున్నాడు భరద్వాజునికి- ఆశ్రమ ధర్మాలు నాలుగు
బ్రహ్మచర్యం మొదటిది- గురుభక్తి, వేదాభ్యాసం, త్రికాల సూర్యాగ్ని ఆరాధనం
గృహస్థుడు- ధనధాన్యాలు నిందారహితంగా పొందును, అతిథి సత్కారం పరమధర్మం
వానప్రస్థము నందు కందమూలాలు, కూరలు, పండ్లు మాత్రమే ఆహారం.

సన్న్యాస జీవనంలో అనాసక్త ప్రవృత్తి భిక్షాటన శాంతితో వెలుగు నొందడం
ఇహలోకం కర్మభూమి, పరలోకం కర్మఫలితాల అనుభవ భోగభూమి
ఈలోకం దుఃఖ వేదనా భూమి, ఆ లోకం ఖేదరహిత సుఖ భూమి
ఇహలోకం దోమలాంటిది, పరలోకము ఏనుగులా ఉత్కృష్టమైనది.

'ఇది నాది' అన్న మమకారం తొలిగితే నరుడు కేవల భావంతో కైవల్యం పొందుతాడు-
ఆ విధంగా భృగుమహర్షి ధర్మాది విషయాలను భరద్వాజునికి వివరించాడు.
ధర్మరాజా, ఆచారప్రభవో ధర్మః -అన్నట్లుగా- శుచి శుభ్రత, సంధ్యావందనం,
అన్నాన్ని నిందించకుండా ఉండడం, సంధ్యా సమయాన మెలకువగా ఉండడం,

తడికాళ్లతో నిద్రపోకపోవడం, రాజమార్గంలో, సభలో, పశువుల మందలో
మలమూత్ర విసర్జన చేయకుండా ఉండడం -ఇవన్నీ సదాచారాలు సుమా!
గురు శుశ్రూష, గుప్త సంభోగము, సత్యధర్మ పాలనము, సత్పురుష సేవనము-
ఇవి లక్ష్మీకరములు, ఊర్ధ్వలోకములకు చేర్చెడి సోపానములంటారు విజ్ఞులు.

---

**క. ఇది కర్మభూమి భోగా । స్పద; మా లోకంబు ధర్మపరులకు సులభం;**
**బది సత్యశౌచ సౌజ । న్య దయాదులు లేనివారి కప్రాప్య మగున్. (శాంతి. 4-110)**

**క. ఈ లోకము దుఃఖబహుళ, । మా లోకము భూరిసుఖ నిరంతర; మం దే**
**జాలియును లేక యొండొరు । తో లెస్సగఁ బొంది యుండుదురు జను లనఘా! (శాంతి. 4-111)**

**తే. హస్తి మశకాంతరము గల దరసి చూడ । వాస గృహ శయనాసన వసన గంధ**
**మాల్య తౌర్యత్రికారామ మానినీజ । నాది సుఖసాధనములకు నందు నిందు. (శాంతి. 4-112)**

**- న జీవనాశోస్తి హి దేహ భేదే మిథ్యైత దాహుర్మృత ఇత్య బుద్ధాః**
**జీవస్తు దేహాంత రితః ప్రయాతి దశార్థ తైవాస్య శరీర భేదః (సం.శాంతి. 187-27)**

---

భృగుమహర్షి భార్య పులోమ నిండు గర్భిణిగా ఉన్నపుడు పులోముడనే రాక్షసుడు పందిరూపంలో ఎత్తుకు పోతుంటే ఆమె గర్భం నుంచి వెలువడిన శిశువు చ్యవనుడు తన కాంతి, వేడిమిలతో రాక్షసుడిని కాల్చివేసాడు. అగ్నిదేవుడు ఆమె గురించి రాక్షసుడికి చెప్పాడన్న కారణంతో భృగువు అగ్నిని సర్వభక్షకుడివి కమ్మని శపించినాడు. అగ్నికి కోపం వచ్చి వెలగడం మాని అదృశ్యం కాగా అతడి స్థానంలో అంగిరసుడు ద్వితీయాగ్ని అయినాడు. త్రిమూర్తులను పరీక్షించి విష్ణువు భూలోకంలో శ్రీ వెంకటేశ్వరుడిగా వెలిసేందుకు కారణభూతుడైనాడు భృగువు. దక్షయజ్ఞంలో పాల్గొన్నాడు. శ్రీకృష్ణుడంటాడు భగవద్గీతలో- ఋషులలో నేను భృగువును.

# 94. జలధి తరంగల చాడ్పున పొడముచు-

సముద్ర కెరటాల వలె జీవాత్మ వచ్చిపోతూ ఉంటుంది, పంచభూతాలైన భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, వాటి స్వభావాలైన వాసన రుచి వేడి చలనం శబ్దం అవి గ్రహింపుకు వస్తాయి ఇంద్రియాలైన ముక్కు నాలుక చర్మం కన్ను చెవులు అవి ఉపకరణాలు కాగా వాటికి ఆధారమైన మనసుతో విషయజ్ఞానం ఏర్పడి

మానవుడి ప్రవృత్తిని రేకించగా జీవి జనన మరణ సంసారచక్రంలో పడతాడు. ఇంద్రియ నిగ్రహంతో బయటపడవచ్చు ఈ చక్ర భ్రమణం నుంచి నరుడు. ఆత్మ జీవనంతో చేరి భూతాత్ముడిగా, శరీరాన్ని ఎరిగి క్షేత్రజ్ఞుడిగా, శరీరం తాను కానని తెలిసి పురుషుడిగా, బుద్ధికి దూరంగా నిలిచి బుద్ధిసాక్షిగా,

తత్త్వ దర్శనంతో జనన రహితుడిగా పిలువబడుతుంటాడు జీవాత్మ. ఆత్మ పురుషుడిగా, పరమాత్మగా ఉన్నపుడు సృష్టి అంతా గోచరిస్తుంది. జీవాత్మగా క్షేత్రజ్ఞుడైనపుడు ఇంద్రియానుభవంతో దృశ్యం చిన్నదవుతుంది. పరమాత్మగా చూసినవన్నీ మాయతో కప్పబడి జీవాత్మకు ఇంద్రియ గోచరం కావు.

మిథ్యాజ్ఞానమే మాయ. మాయకు నరుడిలోని సత్త్వరజస్తమో గుణములు శరీరం తమస్సు, రజస్సులను విడిచి సత్త్వగుణాన్నీ వర్జిస్తే ఆత్మ పరమాత్మవుతుంది. సత్త్వగుణం సుఖనిలయం, రజస్సు దుఃఖక్షేత్రం, తమస్సు అజ్ఞానరూపం గుణత్రయ రాహిత్యమే మాయానాశనం, ముక్తి ప్రదాయకం, జన్మరాహిత్యం.

---

**సీ.** **'జలధి తరంగల చాడ్పునఁ బొడముచు । నడఁగుచు నుండు భూతాత్మునందు**
**భూమి ప్రభృతిభూతములు వాని గుణములు । గంధాదు లింద్రియ గ్రాహ్యకోటి**
**యనఘ! శ్రోత్రం బాదియగు నింద్రియశ్రేణి । దర్వియుఁ బోలె సాధనత నొందు**
**మనసింద్రియములకుఁ బెనుఁ బ్రాపు బుద్ధి త । న్ముఖమున నిశ్చయంబునకుఁ దేరఁ**

**తే.** **బురుషుఁ డవ్విషయంబులఁ బొందు నిట్లు । గాకయుండ నింద్రియములఁ గ్రమ్మఱించి**
**మనసుతోఁ గూర్చి బుద్ధిలోనన యడంప । బుద్ధి నిర్విషయస్థితిఁ బురుషు నొందు. (శాంతి. 4-121)**

**క.** **తనయంద తోఁచు విషయము । లనుభవగోచరము లగుట యవి మాయాసం**
**జనిత స్వప్నంబై యా । త్మునికిం దను గాన లేమి మోసము దెచ్చున్. (శాంతి. 4-123)**

**క.** **విను గుణములు మాయకు నొడ । లని యెఱిఁగి, తమోరజస్సు లడఁచి, సుసత్త్వం**
**బున నిలిచి సద్వివేకం । బున నదియుం ద్రోచి విమల బోధాత్ముఁ డగున్. (శాంతి. 4-124)**

**తే.** **అరసి చూడ సత్త్వంబు సుఖాత్మకంబు । సాంద్రదుఃఖమయంబు రజస్సు, బోధ**
**మాంద్యమూర్తి తమస్సు, సమత్వ మూఁది । యీ యవస్థలఁ బొరయమి మాయపోక. (శాంతి. 5-125)**

# 95. వేదవేదాంగ సంవేది కౌశికుడు-

స్థిరమైనదేదైనా చలించడానికి ప్రాణమో ప్రాణవాయువో ఉండాలి.
మబ్బులో మెరుపులా, తామరాకుపై నీటి బిందువులా మనసులో ఉంటుంది
ఆలోచన; మనసును స్థిరంగా ఉంచాలంటే అంతర్ వాయు నిరోధం కావాలి.
యమ నియమాది ఎనిమిది సాధనాలతో క్రమబద్ధం చేయాలి వాయుగతిని.

క్రమబద్ధమైన వాయువు అంతర్నాడుల ద్వారా చేరుకుంటుంది బ్రహ్మస్థానం.
మనసు శాంతిపూర్ణమై బ్రహ్మానంద స్థితిని పొంది లీనమవుతుంది ఆనందంలోనే!-
భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుతో- శుచి శుభ్రతలు కలిగినవాడై
సమతలంపై దర్భలు పరచి జితేంద్రియుడై నిష్ఠతో జపం చేసినవాడు

మోక్షప్రాప్తికి అర్హుడౌతాడు. ఆ విధంగా కౌశికుడు శ్రద్ధగా జపం చేయగా
సావిత్రీ దేవి ప్రత్యక్షమై అతడడిగిన జపకర్మలోని 'శ్రద్ధ'ను ఇచ్చింది వరంగా.
అతడు ఎంతో నిష్ఠగా తపమాచరించ ధర్మదేవత వచ్చి ఆహ్వానించింది
ఊర్ధ్వలోకాలకు, శరీరాన్ని విడిచి రమ్మని- కౌశికుడు రానన్నాడు దేహాన్ని విడిచి.

అప్పుడు వచ్చారక్కడకు యముడు, అతడితో కాలపురుషుడు, మృత్యువు
నీ జప ఫలితం సిద్ధించింది, కాలం తీరింది, నిన్ను తీసుకువెళ్తున్నాము -అన్నారు.
అదే సమయాన ఇక్ష్వాక మహరాజు తీర్థయాత్రలు చేస్తూ అక్కడకు వచ్చాడు.
కౌశికుడతడిని అతిథిగా ఆదరించి- నాకున్నది ఇస్తాను, నీకేమి కావాలి? అన్నాడు.

---

సీ. **'వేద వేదాంగ సంవేది గౌశికుఁ డను । ధరణీసురుఁడు సంహితాజపంబు**
**విహితశీలతఁ జేయ వేయి వత్సరములు । సనిన సావిత్రి యమ్మునివరునకుఁ**
**బొడసూపి తనుఁ జెప్పఁ గడుభక్తితో నతం । డెఱఁగిన 'నిచ్చెద నిష్ట' మడుగు**
**మనిన నాతండు జపాతినిష్ఠయ కోర । నది యిచ్చి, దేవి 'నీ కత్యుదాత్త**

తే. **గతియు నగు; ధర్మ మర్థి నీకడకు వచ్చు; । యముఁడు గాలుండు మృత్యువు నరుగుదెంతు**
**రనఘ! నీకును వారికి నావహిల్లు । వాద' మని చెప్పి చనియె భూవరవరేణ్య! (శాంతి. 4-133)**

---

**సవిత్ర-సూర్యదేవుడు (ఋగ్వేదం) :-** సవిత్రుడికి అంకితమిచ్చిన గాయత్రి మంత్రం-సావిత్రి ఛందస్సు. గాయత్రి త్రిసంధ్యలలో పఠించాలి (బ్రాహ్మి- ప్రాతఃసంధ్య; మహేశ్వరి- మధ్యాహ్న సంధ్య; వైష్ణవి- సాయం సంధ్య).

**ఓం భూర్భువస్వః తత్సవితుర్వరేణ్యం - భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్** (ఋగ్వేదం 3-62-10)

**గాయంత్రి మంత్రం:** గయ-ప్రాణములు; త్రాయతే-రక్షించేది; ప్రాణములు రక్షించేది గాయత్రి.

నగాయత్ర్యాః పరమ మంత్రం; నమాతుః పరదైవతమ్- గాయత్రిని మించిన మంత్రం లేదు; తల్లిని మించిన దైవం లేదు. వాల్మీకి మహర్షి గాయత్రి మంత్రంలోని ఒక్కొక్క అక్షరాన్ని ప్రతి వేయి శ్లోకాలకు మొదట చేర్చి 24 అక్షరాలతో 24000 శ్లోకాలతో శ్రీమద్రామయణమును రచించినాడు. గాయత్రీ మంత్రాన్ని విశ్వామిత్రుడు రచించాడని ప్రతీతి.

# 96. కౌశిక-ఇక్ష్వాక సంవాదము

ఇక్ష్వాక రాజన్నాడు- రాజులు దానశీలురే కాని దాన గ్రహీతలు కారు కదా!
నీవు అడుగు నేనిస్తాను; కౌశికుడన్నాడు- నేను సంసార నివృత్తిని;
నాకు దానం అవసరం లేదు, నేను కోరను, నీకేదన్నా కావాలంటే ఇస్తాను నేను.
ఇక్ష్వాకుడన్నాడు- నీకంత పట్టుదలగా ఉంటే నీ సకల జపఫలము నాకు ఇమ్ము-

కౌశికుడన్నాడు- సగమిస్తాను తీసుకో లేదా మొత్తం కావాలన్నా తీసుకో!
ఇక్ష్వాకుడన్నాడు- నీ జపఫలమేమిటి? కౌశికుడన్నాడు- నాకు కోరికలు లేవు;
అందుకని జపఫలమేమిటో నాకు తెలియదు, ఎవరినీ అడగనూ లేదు నేను.
రాజు అన్నాడు- ఫలమేమిటో తెలియకుండా తీసుకుని నేనేమి చేస్తాను, నాకు వద్దు.

కౌశికుడన్నాడు- నీవడిగావు నేనిచ్చాను, ఇప్పుడు వద్దంటే కుదరదు కదా!
ఇక్ష్వాకుడన్నాడు- నేను రాజును, అందుకే తగవులాట అనే యుద్ధాన్ని చేసాను.
అందుకనే సత్యపాలన చేస్తూ నీవిచ్చిన జపఫలాన్ని నేను తీసుకుంటున్నాను.,
అప్పుడు యమాదులన్నారు- కౌశికుడికి దానఫలం, ఇక్ష్వాకుడికి సత్యఫలం లభిస్తాయి.

అప్పుడు స్వర్గం మానవరూపంలో వచ్చి ఇద్దరికి సమాన ఫలితాలు వస్తాయన్నది.
ఇక్ష్వాకుడన్నాడు- అలా అయితే కౌశికుడు నేనిచ్చే దానాన్ని స్వీకరించాలి.
కౌశికుడన్నాడు- నాకు తపస్సు, అధ్యయనం చాలు, దాన పరిగ్రహణంపై ఆసక్తి లేదు.
ఇక్ష్వాకుడన్నాడు- నా పుణ్యఫలాన్ని దయతో స్వీకరించుము, ఇది మంచిపని.

---

**ఆ. 'శ్రద్ధయును బలంబు జపవిధియందు సా । విత్రి నాకు నిచ్చె వేఱజపము**
**నాచరింపఁ దగునె? యైనను నిందఱ । యెదుర నీవు గోరి తివ్విధంబు. (శాంతి. 4-160)**

**క. కావునఁ బ్రార్థన సెఱుపం । గా వెఱచెద నట్ల కాక! గైకొంటి ధరి**
**త్రీవల్లభ! నీ సుకృతం । బే వెంటం దిగిచె నరుగు మీ వగ్గతికిన్. (శాంతి. 4-161)**

**తే. 'అనఘులార! సంసిద్ధుల రయితి రింక! దదయనేటికి? నిర్మలోదాత్తగతికి**
**నుత్సహింతురుగా' కన్న మత్సరాది । బంధకంబులఁ బోఁ ద్రోచి బ్రాహ్మణుండు. (శాంతి. 4-163)**

---

**పంచయజ్ఞాలు:** వేదాధ్యయనం (బ్రహ్మ యజ్ఞం), 2) హోమం (దేవయజ్ఞం), 3) అతిథిపూజ (మానవ యజ్ఞం), 4) పితృతర్పణం (పితృయజ్ఞం), 5) భూతబలి (భూతయజ్ఞం)

**సత్యేన చాగ్ని ర్దహతి స్వర్గః సత్యే ప్రతిష్ఠి తః**
**సత్యం యజ్ఞ స్తపో వేదాః స్తోభా మంత్రాః సరస్వతీ** (సం.శాంతి. 199-68)

---

గణేశ, విష్ణు, శివ, బ్రహ్మ, రామ, కృష్ణ, ఇంద్ర, హనుమాన్, సూర్య, చంద్ర, యమ, వరుణ, నారాయణ, నృసింహ, దుర్గ, లక్ష్మి, రాధ, సీత, సరస్వతి, అగ్ని, పృధ్వి, తులసి, హంస, హయగ్రీవ- 24 గాయత్రి మంత్రాలున్నాయి. 'ఓం' అక్షరాన్ని భూర్ భువః స్వః వ్యాహృతుల ముందు చేర్చడం వలన మహా వ్యాహృతి అవుతున్నది (తైత్తిరీయ అరణ్యకం).

# 97. బ్రహ్మ రంధ్ర నిర్గతులై... బ్రహ్మ వదనంబు నిచ్చిరి-

వారిద్దరు అలా వాదులాడుకుంటూ ఉండగా ఇద్దరు వికృత వేషులు వచ్చారక్కడకు.
రాజును చూసి- ప్రభూ మా సమస్యకు పరిష్కారం చెప్పమని అర్థించారు.
వారిలో ఒకడు గోదానమిచ్చినాడు, మరొకడు గోదాన ఫలితం కావాలన్నాడు.
దానకర్త అతడడిగినట్లే దానఫలాన్ని ఇచ్చాడు. దానస్వీకర్త ఏమాలోచించాడో

మంచి ఆవులజంటను కొని మొదటివాడికి దానంచేసి ఆ దానఫలాన్ని
ఆవులజంటతో పాటు ఇవ్వబోగా మొదటివాడు తప్పించుకు తిరుగుతున్నాడు.
కౌశికుడు, ఇక్ష్వాకుడు ముఖముఖాలు చూసుకున్నారు. వాళ్ళ కర్థమయ్యింది సమస్య.
కౌశికుడు రాజుకు జపఫలాన్ని ధారపోసినాడు తన చెయ్యి పైన ఉండగా.

అప్పుడు ఇక్ష్వాకుడన్నాడు- నేను తీసుకున్నాను, ఇప్పుడు నీవు తీసుకో!
కౌశికుడన్నాడు- ఇందరి ఎదుట అర్థించావు, నీ పుణ్యాన్ని నేను గ్రహించాను.
అప్పుడు వికృత వేషధారులన్నారు- మేము కామక్రోధులమనే అంతశ్శత్రువులము-
తాము, ధర్మదేవత, యముడు, కాలపురుషుడు, మృత్యుదేవత, స్వర్గము -వారిద్దరిని

పరీక్షించడానికి వచ్చామని పలుకగా- కౌశికుడు బ్రహ్మపదానికి పోవ
నిశ్చయించి వాయువులను నియంత్రించి మనసును నిగ్రహించి చేష్టలుడిగి
బ్రహ్మరంధ్రము నుండి నిర్గమించేట్లు చేయగా లొడితెడు కాంతిరూపుడై ఆత్మ
చేరుకున్నది బ్రహ్మైక్యమవుతూ, ఇక్ష్వాకుడు కూడా ఆ విధంగానే పొందినాడు బ్రహ్మైక్యము.

---

**క. వాయువుల నియతవృత్తి మ । నో యంత్రణ బొమలనడుమ నూల్కొల్పి విచే**
**ష్టాయిత శరీరుఁడై మూ । ర్థా యోజితములుగఁ జేసి యత్తలఁ జేర్చెన్. (శాంతి. 4-165)**

**తే. బ్రహ్మరంధ్ర నిర్గతుఁడైన బ్రాహ్మణుండు । బ్రహ్మవదనంబు సొచ్చె భూపతియు నట్ల**
**వెడలి తద్వక్త్ర మెప్పటి వికసనంబుఁ । బొంద నందుఁ బ్రవేశించె భూపవర్య! (శాంతి. 4-169)**

**క. దేవత లచ్చెరువడి య । ద్దేవుని నయ్యిరువురను నుతించి రజుఁడు సం**
**భావించె ధర్మమును నవ । నీవర! యప్పరమ విభుఁడు నిరుపమలీలన్. (శాంతి. 4-170)**

**- చతుర్భిర్లక్షణైర్హీనం తథా షడ్ భిః సషోడశైః**
**పురుషం తమతిక్రమ్య ఆకాశం ప్రతిపద్యతే (సం.శాంతి. 199-125)**

---

**ఆత్మ పరిమాణం ఎంత?-** అంగుష్ఠ మాత్రః పురుషోంతరాత్మా సదా జనానాం హృదయో సన్నివిష్ఠః బొటనవేలంత ఉంటాడు అంతరాత్మ. (కఠ 2-3-17) అని కఠోపనిషత్తు చెబుతున్నది. మహాభారతం శాంతిపర్వం చతుర్థాశ్వాసంలో 166 వచనం చెబుతుంది. పురుషుడు-మహాజ్యోతిర్ జ్వాలాకృతియు, ప్రాదేశమాత్రుడు నిర్గమిస్తాడు బ్రహ్మరంధ్రం నుంచి (కౌశిక-ఇక్ష్వాక సంవాదం) - సంస్కృత భారతం (12-193-18).

ప్రాదేశమాత్రుడు- చూపుడు వ్రేలిని, బొటనవ్రేలిని చాచిపెట్టిన కొలత మాత్రం కలవాడు (లొడితెడు).

# 98. అనలము దోచునే తరువు నందు?

యోగమంటే కలుపుట, ఇతిహాసమనగా ఇలా జరిగింది
–'అనికదా ఉండెను' అని అన్న వాటిని, విన్నవాటిని ఇప్పుడు చెప్పడం.
ఒకనాడు మనువు అడిగాడు బృహస్పతిని జ్ఞానయోగం గురించి చెప్పమని
బృహస్పతి చెబుతున్నాడు– అంతశ్శత్రువులు ఆరుగురున్నారు కదా

కామ క్రోధ లోభ మద మోహ మాత్సర్యములు వారిని గెలవడం ముఖ్యం.
కర్మఫలం ఆశించకుండా కర్మలు చేసి సిద్ధించిన జ్ఞానం
తెలుపుతుంది ముక్తిమార్గం. పరబ్రహ్మను చేరే పథమిది.
ఇంద్రియాలకు అలభ్యమై, జ్ఞానమనే దేహంతో వెలుగుతుంది పరబ్రహ్మం.

ఈ జ్ఞానజ్యోతి వెలిగిస్తుంది ఇంద్రియాలను, ఉంచుతుంది మనసును స్వచ్ఛంగా–
చెట్టులో ఉన్న అగ్ని కానరాదు, గొడ్డలితో నరికినా పెకలించినా–
కొమ్మతో కొమ్మ రాపిడి కాగా పుడుతుంది అగ్ని, రాపిడి అవసరం.
వల, ఉచ్చు, గుంటలతో జంతువు పక్షి ఏనుగును పట్టుకున్నట్లు

పరతత్వాకారమైన పరమపురుషుడిని దర్శించడానికి కావాలి జ్ఞానజ్యోతి
పాముకే తెలుసు పాము కాళ్లు, జ్ఞానవంతుడికే తెలుసు జ్ఞానం
అమావాస్య నాడు చంద్రుడు కనిపించలేదని చంద్రుడు లేడనగలమా
గ్రహణం నాడు సూర్యబింబం కానరాలేదని సూర్యుడు రాడనగలమా!

---

**చ. 'అనలము దోఁచునే తరువునందుఁ గుఠారముఖంబు లైన సా**
**ధనములఁ ద్రెవ్వ? సజ్జనహితా! తగఁ ద్రచ్చినఁ గాక; యట్ల యి**
**త్తనువు నలంగఁ జేసి పరతత్త్వముఁ గాంతు మనంగ రాదు; వి**
**న్నునువున నాగమోక్తమథనం బొనరించినఁ గాని యారయన్. (శాంతి. 4–179)**

---

**నాలుగు లక్షణాలు–** ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం (ప్రమాణాలు)
**ఆరు లక్షణాలు–** ఆకలి, దప్పిక, శోకం, మోహం, జర, మృత్యువు
**పదహారు లక్షణాలు–** 5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు, 5 ప్రాణాలు, మనస్సు

---

**ఆత్మబరువు** (21 గ్రాముల ప్రయోగం)– 1907లో డంకన్ మాక్ డౌగాల్ (Duncan Mac Dougall) మసాచ్యుసెట్స్ వైద్యుడు హేవర్‌హిల్ తన రోగులు చనిపోయే ముందు, చనిపోయిన తరువాత వాళ్ల బరువులు కొలిచాడు. ఈ ప్రయోగానికి ఆరుగురు రోగుల అనుమతి తీసుకున్నాడు. వారిలో ఒక రోగి బరువు 21.3 గ్రాములు తగ్గింది. వారిలో నలుగురు క్షయవ్యాధితో, ఒకరు డయాబెటిస్‌తో, ఒకరు కారణం తెలియని వ్యాధితో బాధపడుతున్నారు. 15 కుక్కలను కూడా బరువు తూచినాడు. ఆరోజుల్లో జంతువులకు ఆత్మలుండవు. కేవలం మనుషులకే ఆత్మలుంటాయని జనులు నమ్మేవారు. ఈ ప్రయోగం Twenty one grams experiment గా ప్రసిద్ధికెక్కింది. ఎన్నో విమర్శలకు గురైనదీ ప్రయోగం.

21 గ్రాములు (21 grams) పేరిట అనేక పాటలు, సినిమాలు వచ్చాయి. మళయాళంలో కూడా ఒక సినిమా Twenty one grams పేరున 2022లో విడుదలైంది.

# 99. పెక్కుపూసలందు త్రాడున్నట్లు-

జ్ఞానయోగమొక మానసిక ప్రక్రియ, తేటనీటిలో ముఖం చూసుకోవడం
ఇంద్రియాలనే దొంగలు ఆత్మను కట్టిపడేయకుండా జాగ్రత్త పడాలి
చలనశీలి అయిన అంతరంగాన్ని ధ్యానం ద్వారా నిశ్చలనం చేసి
త్రిగుణాలను విడిచిపెట్టిననాడు ఆత్మ చేరుతుంది పరమాత్మను.

త్రిగుణాలైన సత్త్వ రజ తమోగుణాలు శరీరంగా కలిగినది మాయ
అది నరుడిలో భాగం. అది ఆత్మను ఆవరించి ఉంటుంది స్థిరంగా
ఆ గుణాలనే మూడుముళ్లు తెగవేయాలంటే కావాలి వైరాగ్యమనే కొడవలి.
ఆత్మ అనేది మణిమయ హారంలోని దారం, సంధానకర్త.

బుద్ధి ఒకటే అయినా కర్మలు కోకొల్లలు; పొలంలో నీరు ఒక్కటే
కాని, ఆ నీటితో పెరిగిన చెట్లు చేమల ఔషధ రసాలు పెక్కులు.
పంచభూతాలలో కూడా నేలకంటే నీరు, నీరుకంటే కాంతి,
కాంతికన్నా గాలి, గాలికంటే ఆకాశం, వీటన్నిటిని మించింది మనస్సు

ఈ మనస్సును మించింది బుద్ధి; బుద్ధిని మించింది కాలం.
కాలాన్ని మించినవాడు దేవుడు; అతడిని మించినదేదీ లేదు.
ఆదిమధ్యాంత రహితుడు, అన్ని రకాల జ్ఞానాలకు ఆధారభూతుడు
పరతత్వం గొప్ప వెలుగు, మృతి, చ్యుతి, మలినం, కొలతలేని పరమాత్మ అతడు.

---

**ఆ.** **'మణిమయములుఁ గనకమయములు రజతమ । యములు మఱియు మృణ్మయాదికములు**
**నైన పెక్కుపూసలందుఁ ద్రాడున్నట్లు । భూతకోటియందుఁ బురుషుఁ డుండు. (శాంతి. 4-194)**

**క.** **ఏకరసమయ క్షేత్ర మ । నేకౌషధి రసమయం బయినయట్లు సుమీ**
**యేకవిధమైన బుద్ధి య । నేకము లగు కర్మములమెయిం బోక నృపా! (శాంతి. 4-195)**

**ఆ.** **జలము పృథివికంటె, జలముకంటెను దేజ, । మంతకంటె వాయు, వాకసంబు**
**దానికంటెఁ బెద్ద; వాని కెల్లను బెద్ద । మనసు; బుద్ధి పెద్ద మనసుకంటె. (శాంతి. 4-196)**

**తే.** **ధరణి మొదలయిన పంచభూతములకంటె । మనసుకంటెను బుద్ధికంటెను మహత్త**
**రంబు గాలంబు; గాలతత్త్వంబు మిగిలి । యుండు విభుఁ డిజ్జగంబుల కొడయుఁ డతఁడు. (శాంతి. 4-197)**

**క.** **ఆదియు మధ్యము నంతము । నా దేవేశునకు లేమి నవ్యయుఁ డతఁ డీ**
**వేదములకు నానావిధ । వాదములకుఁ జేరుగడ భవక్షేపి నృపా! (శాంతి. 4-198)**

**-** **సుఖ దుఃఖ యోశ్చ గ్రహణాత్ ఛిన్నస్య చ విరోహణాత్**
**జీవం పశ్యామి వృక్షాణామ్ అచైతన్యం న విద్యతే (సం.శాంతి. 184-17)**

# 100. కృష్ణుడు ప్రభవిష్ణుండగు విష్ణుండు-

భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు శ్రీకృష్ణ పరమాత్మ గురించి
విష్ణువు క్రియా నిష్ఠా తత్త్వ వినోదన తృష్ణతో పంచభూత సృష్టి చేసి
జలములందు భవ్య తల్పగతుడైన అతడి నాభియందు జనించె
పద్మము, దానియందు బ్రహ్మ, బ్రహ్మకు కలిగారు మానసపుత్రులేడుగురు-

మరీచి, అత్రి, అంగీరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు-
ఆ ఏడుగురు మానస పుత్రులు; వారిలో మరీచికి జన్మించాడు ప్రజాపతి కశ్యపుడు-
కశ్యపుడి వలన దేవతలు, దైత్యులు, గరుడులు, నాగులు
సూర్యుడు జన్మించగా, అత్రి మహామునికి పుట్టాడు చంద్రుడు.

సూర్య చంద్రులిద్దరూ క్షత్రియ వంశాలకు మూలపురుషులు కాగా
భిన్నభిన్న దేశాలలో శాఖోపశాఖలుగా వర్ధిల్లిన క్షత్రియులతో
రాజధర్మాన్ని నిర్వహింపజేస్తూ, భూభారం పెరిగినపుడు యుద్ధాల్ని
కలిగించి తాను నిమిత్తమాత్రుడై, శ్రీకృష్ణ బలరామ ప్రద్యుమ్న అనిరుద్ధ

రూపాలు దాల్చి ఈ జగత్తును భరిస్తూ వినోదిస్తుంటాడు భగవంతుడు,
భక్తులకు సేవకుడు, గనక గొప్ప నడక గలవారికి ఆరాధనీయుడు
భోగభాగ్యాలను, ముక్తిని తన కరుణాకటాక్షాలతో ఇవ్వగలవాడు-
అని భీష్ముడు తెలియపరచాడు ధర్మరాజుకు కృష్ణ స్వరూపాన్ని.

---

**క. 'కృష్ణుఁడు ప్రభవిష్ణుం డగు । విష్ణుం; డనిలాగ్నితోయవియదిలలఁ గ్రియా**
**నిష్ఠాతత్త్వ వినోదన । తృష్ణం గల్పించెఁ దనదు దివ్యవిభూతిన్. (శాంతి. 4-204)**

**తే. అట్లు కల్పించి జలములయందు భవ్య । తల్పగతుఁ డైన నాభిఁ బద్మంబు దోఁచె;**
**నం దజుఁడు పుట్టి సృజియించె నందనుల మ । నంబునన సప్తసంఖ్యుల నరవరేణ్య! (శాంతి. 4-205)**

**- ప్రణవ పూర్వకమగు నమః పదము పొంత షడ్గుణై శర్య వాచక సర్వవసన**
**నిర్వచన శబ్దములు గ్రమనిష్ఠమెయిఁ జతుర్థిఁ గూర్పంగ మంత్రంబుతోచు బెరసి (శాంతి. 4-213)**

---

**సూర్యవంశం:** వైవస్వత మనువు (సత్యవ్రత/నాభి) → ఇక్ష్వాకుడు (రిషభనాధుడు/ఒక్కాకుడు) → కుక్షి (వికుక్షి/శశాదుడు) → బాణ → కకుస్థ (పురంజయ/అనారణ్య) → అనీన → పృథు → విశ్వగంధి → చంద్ర → యువనాశ్వ → శ్రావస్త → బృహదాశ్వ → కువలయాశ్వ (ధుంధుమార) → భద్రాశ్వ → ప్రమోద → హర్యాశ్వ → నికుంభ → బహరణాశ్వ → గిరితాశ్వ → అమితాశ్వ → కృశాశ్వ → ప్రసేనజిత్తు → యువనాశ్వ → మాంధాత → పురుకుత్స → అంబరీష → త్రసదస్యు → సంభృత → అనారణ్య → ప్రీశదస్వ → హర్యాశ్వ → హస్య → సుమన → సోదరుడు త్రిధన్వ → త్రయ్యరుణి → త్రిశంకు → హరిశ్చంద్ర → లోహితాస్య → హరిత → చంచు (దుష్యంతుని సమకాలికుడు) → చాక్షు (సుదేవుడు - చంద్రవంశ భరతుని సమకాలికుడు) → విజయ → బ్రహుక → ప్రతాపేంద్ర → బృక్ → సుసంధి → బాహుక → వృక → అసిత → సాగర → అంశుమంత → దిలీప → భగీరథ → సుహోత్ర → శృతి → కకుస్థ → రఘు → నాభాగ → అంబరీష → సింధుద్వీప →

# 101. ఎవ్వడు సరాచర గురుడు-

నిరంతర మననమనే అనుస్మృతి ద్వారా విష్ణు దయను పొందాలి.
ప్రణవపూర్వకమగు నమః పదము పొంతన షడ్గుణైశ్వర్య శబ్దాలు
మాహాత్మ్య, ధైర్య, యశో, శ్రీ, జ్ఞాన, వైరాగ్య భావములతో కూడినవైన
మంత్రాలను నిశ్చలమనస్కుడై జపిస్తూ- అనుస్మృతిని స్మరించాలి.

అవ్యక్తుడు, శాశ్వతుడు, అఖిల ప్రభవ భూమికుడు, భక్తవత్సలుడు
విష్ణుడు, పరమపురుషుడు, అక్షయుడు, నిత్యుడు, పుండరీకాక్షుడు
భువనసాక్షి, పురాణుడు, పరమాత్మ, సహస్రాక్షుడు, అక్షరుడు
లోకైకనాధుడు, భవ్యుడు, త్రికాలవేదుడు, సర్వతోముఖుడు

భూత సంప్రవర్తి, అమృతుడు, అచ్యుతుడు, అనంతుడు, హృషీకేశుడు
రవి సహస్రనిభుడు, హిరణ్యగర్భుడు, అబ్జనాభుడు, సత్యుడు
ఆదిమధ్యాంత రహితుడు, భూగర్భుడు, ప్రభువు, భక్తిగమ్యుడు
అచలుడు, సూక్ష్ముడు, వరేణ్యుడు, సహస్ర శీర్షుడు, అభయకారి

అశీర్షుడు, నారాయణుడు, సనాతనుడు, యోగమూర్తి, ధ్రువుడు
లోకాతిరిక్తుడు, ఈశ్వరుడు, శ్రీహరి, చరాచర గురుడు, సత్యుడు
శాశ్వతుడు, సుకుమారుడు, కాలము, మేఘుడు, నేల, పంట
క్రియ, నిష్క్రియ, ధర్మానికి వెలుతురు అయిన శ్రీకృష్ణుని సేవిస్తాను నేను.

---

**సీ. 'అవ్యక్తు శాశ్వతు నఖిల ప్రభవ భూమి । భక్తివత్సలు విష్ణుఁ బరమపురుషు**
**నక్షయుఁ బ్రాంజలియై యాశ్రయించెదఁ । బుండరీకాక్షుని భువనసాక్షి**
**నిత్యుఁ బురాణు వర్ణించెదఁ బరు సహ । స్రాక్షు నక్షరుని లోకైకనాథు**
**భవ్యుఁ గొల్చెద భూతభవ్య భవత్ప్రభు । సర్వతోముఖు భూతసంప్రవర్తి**

**ఆ. నమృతు నచ్యుతుని ననంతు హృషీకేశు । రవిసహస్రనిభు హిరణ్యగర్భు**
**నబ్జనాభు సత్యు నాద్యంతరహితు భూ । గర్భుఁ బ్రభువు భక్తిగమ్యుఁ దలఁతు. (శాంతి. 4-216)**

**- ఎవ్వడు సచరాచర గురు డెవ్వని నాభీ సరోజ మీనె విధాతన్**
**నివ్వటిలు జగములన్నియు నెవ్వనిచే నమ్ముకుందు నెప్పుడు గొలుతున్ (శాంతి. 4-218)**

---

ఆయుతాయు → ప్రతాయు → ఋతుపర్ణ → సర్వకర్మ → సుదాస → కల్మాషపాద → అశ్మక → మూలక → దశరథ → విషమసహ (హస్తి ప్రభువు సమకాలీనుడు) → నిధన → అనామిత్ర → ద్విలిద → దిలీప (ఖట్వాంగ) → రఘు → అజ → దశరథ (నిమి) → భరత (14 ఏళ్లు) → శ్రీరామచంద్ర → కుశ (దక్షిణ కోసల) → లవ (ఉత్తర కోసల);

భరతుడి పుత్రులు→ తక్ష (తక్షశిల); పుష్కర (పుష్కలావతి) (పెషావర్); లక్ష్మణుడి పుత్రులు- అంగద (కరుపాద), చంద్రకేతు (మల్లరాజ్యం); శత్రుఘ్నుడి కొడుకులు- సుబాహు (మధుపురి), శత్రుఘాతి (విదిష)లకు రాజులైనారు.

# 102. కల్మషవ్రజ ధ్వంసిని ఈ అనుస్మృతిని-

అశ్రావయ, అస్తు శ్రౌషట్, వషట్, యేయజామహే, వషట్
మంత్రాలతో అర్చించి యజనం చేసేవారు ఆరాధించే విష్ణుని,
తేజోమయుడిని, యజ్ఞధరుడు, పంచయజ్ఞుడు – వేదపఠనం
వైశ్వదేవం, అతిథిపూజ, పితృతర్పణం, భూతబలి కలవాడు–

లక్ష్మికి ఉనికిపట్టు, యోగాలకు నెలవు, వరదాత, ఆగమనుడు, పాంథుడు
అఖిల జగత్ భరణుడు, అమూర్తి, సాగరనిభబోధ గరిష్ఠుడు
పంచకాలజ్ఞుడు, గుణాత్ముడు, నిర్గుణత్వ శోభితుడు, భవ్యుడు
భక్త పరాధీనుడు, వ్యక్తావ్యక్తములకు ఆవల ఉండే అత్యంత గంభీరుడు

ముక్తినిచ్చేవాడు, లోక నిర్వాహకుడు, కర్తభోక్త వినాశకర్త, క్షేత్రజ్ఞుడు
అయిదు ముఖాలవాడు, సర్వతేజస్సులకు తేజస్సు, గుణాద్యుడు
పరమాత్మ, సర్వగతుడు, సాకారుడు, నిరాకారుడు, విశ్వరూపుడు
ద్రష్ట దృష్టి దృశ్యము, హేతురహితుడు, భూతస్రష్ట, సమస్త భోక్త–

ఓ దేవా, బుద్ధియును ప్రాణమును నిన్ను బొరయజేయ భక్తిని నాకిమ్ము!
పరమాత్మా, నారాయణా, చిరంతనుడా, భక్తులననుగ్రహించేవాడా,
నిన్ను నెప్పుడు తలచె, నన్నును నీవు దయతో నావాడు అనుము–
ఇది నారదముని చెప్పినది, నీకు నేను ఉపదేశించాను అన్నాడు భీష్ముడు ధర్మజునితో–

---

**తే.** **నిన్ను నెప్పుడుఁ దలఁచెద; నన్ను నీవు । వత్సలుఁడ వయి వీఁడు నావాఁ డనంగ**
**వలయుఁ జుమ్మయ్య! మఱవక వాసుదేవ! । దేవ దేవ! మునీశ్వర భావనీయ! (శాంతి. 4–246)**

**తే.** **అని జపించి సర్వావస్థలందు నను వి । శిష్టభక్తి ననుస్మరించిన యతండు**
**సకల పాపంబులను బాసి శాంతి నొంది । యవ్యయానంద పదమున నతిశయిల్లు. (శాంతి. 4–249)**

**తే.** **వైష్ణవియుఁ గల్మషవ్రజధ్వంసినియును । నైన యీ యనుస్మృతి ప్రాజ్ఞుఁ డైన నుజ్ఞుఁ**
**డైన నెవ్వాఁడు పఠియించు యజ్ఞదాన । సమయముల వాఁడు తత్ఫలశతము వడయు. (శాంతి. 4–250)**

**క.** **వినుపించునది యనుస్మృతి నను భక్తిం గొలుచు బహుజనముల కమావా**
**స్యను బున్నమ బారసిని సవినయంబుగ దాననెల్ల విభవము గలుగున్ (శాంతి. 4–252)**

---

కుశ → అతిథి → నిషాద (నిషాద రాజ్యం) → నల → నభస → పౌండరిక → క్షేమధన్వ → దేవానీక → అహీనాగ → రురు → పారియాత్ర → శల → దళ → బల → ఉక్త → సహస్రాశ్వ → పర → చంద్రవలోక → రుద్రాక్ష → చంద్రగిరి → భానుచంద్ర → శ్రుతాయు → ఉలూక → ఉన్నవ → వజ్రనాభ → శంఖణ → వ్యుజితాశ్వ → విశ్వసహ → హిరణ్యానాభ → పర → బ్రహ్మస్థ → పుత్ర → పుష్య → అర్థసిద్ధి → ధ్రువసంధి → సుదర్శన → అగ్నివర్ణ → శీఘ్రగ → మారు → పరశుశ్రుత → సుసంధి → అమర్శన → మహస్వన → సహస్వన → విశ్రుత్వన → విశ్వభావ → విశ్వసహ్య → నగ్నజిత్ (సత్యభామ తండ్రి) → తక్షక → బృహద్బల (అభిమన్యుడి చేతిలో మరణించాడు).

# 103. పురుషుండే తద్విధ సాక్షితాసమిద్ధుడు-

వార్షణేయుడనే ముని తన శిష్యుడికి మోక్షమార్గం చెబుతున్నాడు
-కాలచక్రం హద్దులు లేనిది. సర్గ ప్రళయములతో పరిభ్రమిస్తుంది.
ప్రళయకాలంలో సృష్టి అంతా నష్టమైనాక, పరమాత్మ మరల
సృష్టిని ప్రారంభించి కల్పిస్తాడు అన్ని లోకాలనూ, భూతాలనూ.

ప్రకృతి పురుషుల కలయికతో చైతన్యం జనించి, దానివలన బుద్ధి
బుద్ధి నుంచి 'నాది' అనే అహంకారం, అహంకారం వలన ఆకాశం
ఆకాశం వలన వాయువు, వాయువు వలన అగ్ని, అగ్ని వలన నీరు,
నీరు వలన భూమి- ఇలా ఏర్పడినాయి పంచభూతములును.

బుద్ధినే మహత్తు అంటారు తాత్వికులు. ఆ విధంగానే షోడశ వికృతులు
కర్మేంద్రియాలైదు, జ్ఞానేంద్రియాలైదు, వాటికి గోచరమయ్యేవి పంచభూతాలైదు.
ఈ పదిహేనుకు- మనసు తోడై పదహారు వికృతులనబడతాయి.
ఈ శరీరం తొమ్మిది ద్వారాలున్న పుణ్యపురం, దానిలో నివసించే

పరమాత్మను 'పురుషుడు' అంటారు. అతడు చెట్టును మధిస్తే
కనిపించే నిప్పులా, యోగమధనం చేసిన వారికి కానవస్తాడు.
ఆ తేజోరూపమైన పరమాత్మ నుండే పుడుతుంది సర్వ ప్రాణకోటి
సృష్టి స్థితి లయలకు సాక్షీభూతుడుగా మిగులును దేహస్థుడైన పురుషుడు-

---

**క.** **కలిగె వినుమహంకారము వలన నభము, దాన జేసి వాయువు గ్రమ సం**
**కలిత జననముల దేజము జలము నిలయుఁ దత్త దాత్త జన్యత్వమునన్ (శాంతి. 4-271)**

**క.** **వికృతులు మహదాదిక స । ప్తక ముభయ విధేంద్రియములు పదియు విషయ పం**
**చకమును మనసును గూడఁగ । వికారషోడశక మిది వివేకాభ్యర్థీ! (శాంతి. 4-273)**

**క.** **ఈ సర్వము దేహత్వా । భాసిత; మిది దేహియైన పరమాత్ముని వి**
**న్యాసమునకుఁ గా నొదవి యు । పాసించుం గరణరూపమై యా కర్తన్. (శాంతి. 4-274)**

**తే.** **పుత్ర! వినుము నవద్వార పుణ్యపురము । నం దచింత్య సంవ్యాపకుఁ డై శయించు**
**నీ సమస్త భావంబుల నెనసి యట్టు । లగుటఁ బురుషుండు నాఁ జను నవ్విభుండు. (శాంతి. 4-275)**

**క.** **భూతము లవ్యక్తంబున జాతములగు; నంద పెరుగు సమయుఁ దదీయ**
**స్ఫీతత్వమున పురుషుం డే తద్విధ సాక్షితా సమిద్ధుడు వత్సా! (శాంతి. 4-278)**

**ఆ.** **వ్యక్త సప్తధార మవ్యక్త నాభంబు । షోడశవికార సుపరిమండ**
**లంబు ధ్రువ మధిష్ఠితం బాత్మచేతఁ జ । క్రంబు దిరుగుచుండుఁ గాలవశత. (శాంతి. 4-279)**

# 104. ఈ చక్రంబున సకల చరాచరమైన లోకము-

భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు కాలచక్ర ప్రభావమును-
-కాలం ఒక చక్రం, ఏడంచులు కలిగినది, ప్రకృతి నాభిస్థానం,
పదహారు వికారాలు వలయాలు; ఆ చక్రం మీద ఉంటుంది ఆత్మ
శాశ్వతమై, భ్రమణశీలము కలిగి గుండ్రంగా తిరుగుతుంది కాలచక్రం.

ఈ చక్రంలోనే సకల చరాచర జగత్తు అవశానిష్ఠాగోచరమై
చరిస్తూ ఉంటుంది; ఆ పరిశుద్ధుడైన అంతరాత్మకు ధూళిలా
సత్త్వరజ స్తమోగుణాలు చేరడానికి ప్రయత్నిస్తాయి, విజ్ఞుడు
దూరంగా ఉంటాడు వాటికి; లేకుంటే దుఃఖాన్ని తెస్తాయవి.

ఈ సంసారమొక అరణ్యం, దానిలో పడి తిరుగుతూనే ఉంటాడు
ఒక దశ నుంచి మరొక దశకు పోతూ; సుఖం, శాంతీ లభించదు.
శరీర వ్యామోహమనే రోగంతో సతమతమవుతున్నపుడు, వాడికి కావాలి మందులు
సత్యం, శుచి, నిగ్రహం, శాంతి అవి కలిగిస్తాయి రోగవిముక్తి.

సత్త్వగుణంతో స్మరణ సంతోషాలు, కల్మషారాహిత్యం-
రజోగుణంతో ఆసక్తి, పేరాస, క్రోధం, తామసంతో పొగరు, ఏడ్పు
కలుగుతాయి; అహంకారమే జీవుల సకల కార్యాలకూ మూలం;
కర్మలు చేస్తూ జీవుడు భోగలాలసుడౌతాడు ఆశాలత ఆధారంగా.

---

క. ఈ చక్రంబున సకల చ । రాచరమయ మైన లోక మవశానిష్ఠా
గోచరమై చరియించుట । సూచికొనన్ వలయుఁ దత్త్వశోధన దృష్టిన్. (శాంతి. 4-280)

క. ఇంతకు మూలము దృష్ణా । తంతులతయ వత్స! వినుము దానికి నదరం
గాంతాజనంబు దొలు ప్రాఁ । కింత యెఱిఁగి తృష్ణ తొఱఁగు టిచ్చు విముక్తిన్. (శాంతి. 4-293)

క. జ్ఞానాజ్ఞానంబులకుం । దాన యుపాశ్రయము బుద్ధి తత్త్వాహంకా
రానూన లక్షణాఢ్యం । బైన యెఱుక దాని జీవుఁ డని చెప్పు శ్రుతుల్. (శాంతి. 4-294)

ఆ. అతఁడు కాలకలిత మైన కర్మమున సం । సార వర్తనంబు సల్పుచుండు
స్వప్న సంప్రవృత్తి సలిపెడు నరుమాడ్కి । నింద్రియములతోడ నెనయ బెరసి. (శాంతి. 4-295)

క. రాగ పరిలిప్తమానస । యోగంబున నింద్రియంబు లుల్లసితము లై
భోగు లగుట యుడిపిన నప । రాగత సంసార దుర్విరామము సేయున్. (శాంతి. 4-296)

క. పురుషు లఖిల భూతములను । బురుషులలో భూమిసురులు భూమిసురులయం
దరయంగ మంత్రవేదులు । వరు లధికులు బోధయుతులు వారలకంటెన్. (శాంతి. 4-297)

# 105. మేల్కొని యుండుట, కలలు, నిద్ర-

అఖిల భూతములలో మానవుడు, అఖిల మానవులలో విద్యావేత్త,
విద్యావేత్తలలో మంత్రోపాసకుడు, మంత్రోపాసకులకన్నా జ్ఞాని ఉత్తముడు.
మానవుడికి నిజమైన చూపు జ్ఞానం. జ్ఞానహీనుడి నడత గుడ్డివాడి నడక
బ్రహ్మచారి ముఖ్యంగా అందగత్తెలున్న చోట జాగ్రత్తగా మెసలుకోవాలి.

ఈ శరీరం మాంసాస్థిమయమని గ్రహించి నాడుల పరిశుద్ధత తెలుసుకోవాలి.
స్థూల నాడులు పది, వాటికి తోడవుతాయి పంచేంద్రియాలకు ఆధారమైనవి.
సూక్ష్మ నాడులు అయిదు, ఇంద్రియాలు ఉద్రేకానికి లోనైనపుడు శుక్లం
జనిస్తుంది కనుక దానిని ఇంద్రియమని అంటారు. దీని సూక్ష్మరూపం మనస్సు.

పరిశుభ్రమైన శరీరం, అహంకారం లేని శీలం, కోరికలు లేని మనస్సు
భూతదయ ఉన్నవాడికి జ్ఞానం లభిస్తుంది. జ్ఞానాన్ని వంట చెరకుగా వాడి
విజ్ఞానాగ్నిని ప్రజ్వలింపచేస్తే అతడికి అమృతత్వసిద్ధి కలుగుతుంది.
ఇంద్రియాలు అలసట చెందినపుడు వస్తుంది నిద్ర, ఇంద్రియపూర్వానుభవం

మిథ్యా విషయంగా వచ్చి చేరటం స్వప్నావస్థ, దానికి కూడా దేహి సాక్షియే
జాగ్రదవస్థలోని తలపులు, దోషాలు, త్రిగుణ వికారాలు కలగా కానవస్తాయి.
జాగ్రత్ నిద్రా స్వప్నావస్థలను దాటగా జీవునికి లభిస్తుంది తురీయావస్థ.
అది విజ్ఞాన నిర్మల సత్యబోధ రూప నిర్భరానంద స్వరూపావస్థగా నెరుంగుము.

---

క. **శారీరస్థితికిఁ బ్రథమ । కారణమై యుండు నాడికాదశకము; సం**
**చారిక లగు నింద్రియముల । కారయ నాడికలు మఱియు నై దమలమతీ! (శాంతి. 4-302)**

తే. **స్థూల భంగులు పదియును సూక్ష్మభంగు । లైదు నివి; వీనికంటె నత్యంత సూక్ష్మ**
**భంగి హృదయంబు నడుముగాఁ బరఁగియున్న । నాడియది సర్వగత యగుఁ జూడఁ జూడ. (శాంతి. 4-303)**

క. **ఆ చూపు మఱిగి చిత్తం । బే చవికిం బోదు; పోయె నేని మరలుపన్**
**గోచరమగు వెలిచవులం । బాచిన లోచవిన నిలిచి పరమాత్మఁ గనున్. (శాంతి. 4-304)**

క. **శ్రమమున నింద్రియములు లీ । నము లగునది నిద్ర కలయనం దత్సంస్కా**
**రము మిథ్యావిషయ ప్రా । ప్తమగుట యప్పుడును దేహి దా సాక్షి యగున్. (శాంతి. 4-324)**

తే. **అనిలముఖ దోషములను సత్త్వాదిగుణ వి । కారముల జాగరంబునఁ గలుగునట్టి**
**తోఁపు బెరయంగఁ గల యయి తోఁచు; నది శు । భాశుభములకు సూచక మనియుఁ గలదు. (శాంతి. 4-325)**

క. **కట్టిన చీరయునుం బైఁ బెట్టిన చీరయును, మౌళి బిగి యారంగాఁ**
**జుట్టిన చీరయుఁ బోలెను నెట్టన పొదివినది దేహిని గుణత్రయమున్- (శాంతి. 4-331)**

# 106. వినుము బ్రహ్మోదితంబు ప్రవృత్తి ధర్మము-

వ్యక్తమనగా మృత్యువు, అవ్యక్తమనగా అమృతం, అవ్యక్తమనేది
ముల్లోకాలకూ ఆధారం; లక్షణం నివృత్తి అనేది శాస్త్ర నిశ్చయం
నివృత్తి మార్గమంటే సంసారచక్రం నుండి మరలడం, ప్రవృత్తి మార్గం
సంసారంలో పాల్గొనడం- ప్రవృత్తి అనగా కర్మలు చేయడంగా గ్రహించాలి.

దేహస్థుడు ఆత్మ- ఒక వస్త్రాన్ని వంటికి, ఒకటి తలకు, ఒకటి భుజాన
వేసుకునగా అవి ఆత్మ నిజస్వరూపాన్ని కానరాకుండా మరుగుపరుస్తాయి.
ఈ సత్త్వ రజ స్తమోగుణాల కావలనున్న నాలుగో తత్త్వవస్త్రం అదియే
పరబ్రహ్మతత్వం; బ్రహ్మచర్యం, అహింసా నేత్రాలతో చూడవచ్చును ఆత్మను.

లోకంలోని జీవన వ్యవహారాలలో వికసిత 'తృష్ణ' అనే లత ఆకర్షిస్తుంది
నరుడిని, దానిని నరకడానికి బ్రహ్మచర్య-అహింసల రూపమైన తపశ్చర్య అనే
కొడవలి కావాలి. అప్పుడే అతడు గుర్తించగలుగుతాడు అంతరాత్మ రూపుడైన
పురుషుడిని -అని పలికాడు వార్షణేయుడనే ముని తన శిష్యుడితోనని

భీష్ముడు పలుకగా విని ధర్మరాజు ఆనందించాడు - అప్పుడు భీష్ముడు
చెబుతున్నాడు- ధర్మరాజా, జనక మహరాజుకు ఆచార్యులున్నారు వందమంది
ఏకం సత్ విప్రా బహుధా వదన్తి- అన్నట్లు నూరుగురూ నూరు రకాలుగా చెప్పినా
జనక మహరాజు వాటిని ఆమోదిస్తుండగా వచ్చాడు పంచశిఖుడనే పండితుడు.

---

**క.** స్వాపావస్థం బ్రకృతి క । దీపిత వాటిల్లు నపుడుఁ దెలి వెడలక తా
దీపించుఁ బురుషుఁ డిమ్మెయి । చూపు ప్రబోధంబు పరమసూక్ష్మత పుత్రాఁ (శాంతి. 4-326)

**తే.** తెలియ మేల్కని యుండుట, గలలు, నిద్ర । యను నవస్థాత్రయంబును, నవులఁబెట్టఁ
జాలు విజ్ఞాననిర్మల సత్యబోధ । రూప నిర్భరానందస్వరూపుఁ డనఘ! (శాంతి. 4-327)

**తే.** వినుము బ్రహ్మోదితంబు ప్రవృత్తి ధర్మమది గతాగత వ్యాప్తుల నావహించు
బ్రహ్మమందు; నివృత్తి ధర్మంబు నమ్మహాశ్రయము మోక్ష దంబను నాగమములు (శాంతి. 4-330)

**క.** వాకును మనసును గాయము । నేకాయన వృత్తి శౌచ మెడలని తపముం
జేకొనునది యది బోధ । శ్రీకి ఘృతంబునకు వెన్నక్రియ జనక మగున్. (శాంతి. 4-333)

**తే.** బ్రహ్మచర్య మహింస నాఁ బరఁగు పరమ । ధర్మములు రెండు సువ్వె యుత్తమ తపంబు;
దానిఁ గలవాఁడు నిర్మల జ్ఞానయోగ । వంతుఁడై చూడనేర్చు సర్వంబు ననఘ! (శాంతి. 4-334)

**క.** వికసిత తృష్ణాలతికకు । న కుటిలమగు తపము దాత్రమై నఱకంగా
వికృతులఁ బ్రకృతినిఁ బురుషుని । నకలంక జ్ఞాన దృష్టి నవలోకించున్. (శాంతి. 4-336)

# 107. మిథిల కాలినా ఆ దుఃఖము నన్నంటదు-

పంచశిఖుడు వచ్చి తన వాక్పటిమతో జనకుడి ఆస్థానంలో ఉన్న
వందమంది ఆచార్యులను ఓడించి, జనకుని కోరికపై తత్త్వోపదేశం చేస్తున్నాడు.
త్రిగుణ నిర్మిత వస్త్రం మాయ, కోరికకు కారణం మాయ, ఆ కోరిక
కర్మకు కారణం, కర్మ పాపపుణ్యాలకు మూలం, దానివలన వస్తుంది పునర్జన్మ.

మాయకు తోడ్పడుతాయి లోభమోహాలు, మాయవలన పడతాడు
సంసార చక్రంలో నరుడు; సంపదలు, చుట్టుపక్కాలు, భోగములు
చుట్టుముట్టగా శాంతిని కోల్పోతాడు, ముక్తిమార్గానికి దూరమవుతాడు
సంతోషం, ఆనందం, నిశ్చల శాంతి ఇవి సత్త్వగుణ జనిత భావాలు.

దుఃఖం, అసూయ, అభిమానం, సంతోషించకపోవడం రజోగుణ లక్షణాలు
పీడకలలు, చెడు ఆలోచనలు, సోమరితనం, స్తబ్దత తమోగుణ ప్రభావాలు
కర్మ సంపర్కము వదిలిన ఆత్మ కుబుసం విడిచిన పాములా ప్రకాశిస్తుంది
ఆత్మలో చేర్చబడిన మనసు, నీళ్లలో చేర్చిన ఉప్పుగల్లులా, కలిసిపోతుంది మనసులో.

పంచశిఖముని ఉపదేశమును పొందిన జనకుడు పూర్తి వైరాగ్యాన్ని పొందినవాడై
తన నగరం మిథిల కాలిపోతూ ఉన్నా తనకేమీయూ దుఃఖమంటదని పలికినాడు-
అని పలికి భీష్ముడన్నాడు ధర్మరాజుతో ఇంద్రియ నిగ్రహమన్నిటికన్నా గొప్పది
దమము కలవాడు శాంతి మంగళనిధి బోధ సౌమ్యమూర్తి అవుతాడు-

**సీ.** **శౌచ, మక్రోధంబు, సంతోష, మార్జవ, । మనసూయ, విగతదైన్యత్వవృత్తి,**
**యప్రమాదంబు, దురభిమానరాహిత్య । మతివాదవర్జన, మఖిలభూత**
**దయ, గురుపూజ, నిందాస్తుతి ప్రవణతా । త్యాగం, బపైశునత్వంబు, సాధు**
**జనసంగమం, బమృషాభాషణంబు, ని । స్పృహత, యహింస, సుశీలభావ,**

**తే.** **మింద్రియగ్రామజయ మివి యెల్ల దమము । నాకృతులు; వీనిఁ గల పుణ్యుఁ డభయుఁ డైహి**
**కములవలనను నాముష్మికముల వలన । శాంతిమంగళ నిధి బోధ సౌమ్యమూర్తి.' (శాంతి. 4-364)**

'మిథిలా నగరం కాలిపోతున్నా దుఃఖం తనకంటదన్న జనకుడి మాట భారతంలో రెండు మూడుసార్లు ప్రస్తావించబడింది. తనకు ధన సంపదలవసరం లేని నిస్సంగత్వాన్ని అవలంబించాడతడు.

రోమ్ నగరం కాలిపోతుంటే 'నీరో' (Nero) ప్రభువు ఫిడేలు వాయిస్తూ కూర్చున్నాడని అంటారు. 18 జులై 64 AD నాడు మొదలైన అగ్ని దావానలంలా తొమ్మిది రోజులు మండి 71 శాతం రోమ్‌ను కాల్చివేసింది. 14 జిల్లాలలో పది జిల్లాలు తగలబడి పోయాయి. నీరో (Nero) లేదా అతడి భటులు రోమ్‌కు నిప్పంటించారని; ఆ సమయంలో 'నీరో' అక్కడ లేడు- 35 కిలోమీటర్ల దూరంలో Antium లో ఉన్నాడనేది మరో వాదన. రోమ్‌ను తగలబెట్టి నెపాన్ని క్రైస్తవుల మీదకు నెట్టి, ప్రజలపై మరిన్ని పన్నులు వేసాడు నీరో.

# 108. మమున్ 'కానీ'కి గొనువప్పుడు, ఇపుడు గాడిదవైతే!

భీష్ముడు చెబుతున్నాడు– రోజుకు రెండుపూటలే తినేవాడు సదోపవాసి; ఋతుకాలాన మాత్రమే భార్యతో సంగమించేవాడు సదా బ్రహ్మచారి; దేవ పిత్ర అతిథులు భుజించాక తినేవాడు అమాంస భోజి; పంక్తిభోజనం చేసేవాడు విఘశాసనుడు; సేవకులు కూడా తిన్నాక తినేవాడు అమృతాశి; పగటిపూట నిద్రపోడు –అస్వప్నుడు.

ఒకసారి ఇంద్రుడు అహంకార రహితుడైన ప్రహ్లాదునితో ముచ్చటించాడు– –ప్రహ్లాదా! సంపదలు లేకున్నా శోకించవు, శత్రువులకు లొంగుతానని భయపడవు, ఉపేక్ష మంచిదని ఊరకుంటావు, ఈ నిష్క్రియత్వమెందుకు? ఇది మంచి విధమేనా?– అని ఇంద్రుడడుగ ప్రహ్లాదుడన్నాడు– సంపదలు విధికి లొంగి ఉంటాయి.

కష్టసుఖాలు, జయాపజయాలు విధి విలాసాలు; అయినా, దాంతి, శాంతి, ప్రజ్ఞ కలిగినవాడి మనసుకు అలసట లేదు; జ్ఞానము, శాంతి సద్యోజాతములు కావు. అవి స్వయంభువులు; కనుక నాకు వీటి గురించి చింతలేదు అన్నాడు– –అని ధర్మరాజుతో చెప్పి భీష్ముడన్నాడు– ఇంద్రుడొకసారి బలిచక్రవర్తి నడిగాడు

అప్పుడతడు గాడిద రూపంలో ఉన్నాడు– ఓ బలిచక్రవర్తీ, ఒకప్పుడు నీవు ఏనుగులు చుట్టి వస్తుండగా పట్టపు టేనుగుపై కూర్చుని మణిమయ ఛత్రచామరాలు వెలుగులు చిమ్ముతుండగా వచ్చేవాడివి. మమ్మల్ని 'చిల్లుకాని'కి పనికిరాని వాళ్లుగా చూసేవాడివి, ఇప్పుడేమిటి గాడిదవైనావు? ఏమైంది నీ ఉజ్జ్వల భూతకాల వైభవం?

---

**క. 'ఏనుఁగులు సుట్టిరాఁ బే । రేనుఁగుపై మణిమయంపుటెల్లులు మెఱయం**
**గా నీ వే తెంతువు మముఁ । గానికిఁ గొన వప్పు డిపుడు గాడిదవైతే! (శాంతి. 4-389)**

**క. కనకమయయూప మొప్పఁగ । ననూన విభవమున నీవు యాగం బొనరిం**
**చిన యొప్పును నిప్పటి నీ । యునికియునుం జూచి నాకు నుమ్మల మయ్యెన్. (శాంతి. 4-390)**

**ఆ. ఉముక దినుచు నిట్టులుండి నీ తొల్లింటి । లీలఁ దలఁచి యుమ్మలింతొ? లేదొ?**
**యున్నరూపు సెప్ప వన్న! గార్దభరూప । దారుణైకనిపుణ! దానవేంద్ర! (శాంతి. 4-391)**

**క. పొరి నర్థంబు ననర్థము మరణము జీవితము సుఖ సమాగమమును దు**
**స్తర దుఃఖ సంగమంబును దొరకొన నేనెపుడు సమత తోడన నిలుతున్ (శాంతి. 4-394)**

---

**జనకుడు–నీరో :** జనకుడు ధనసంపదలపై మోహాన్ని తొలగించుకున్నాడు. మిథిలా నగరం మండుతున్నా అంటే సంపదలు కాలిపోతున్నా అతడికి దుఃఖం లేదు. నీరో– స్వార్థపరుడు. క్రైస్తవులతో క్రిక్కిరిసి ఉన్న ఆ ప్రాంతాన్ని తగలబెట్టి అక్కడ రాజభవనం తనకోసం నిర్మించదలుచుకున్నాడతడు. అందుకని రోమ్ నుంచి Antium కు వెళ్లి అక్కడ కొన్ని రోజులుండి రాత్రికి రాత్రి వచ్చి రోమ్ నగరానికి నిప్పంటించాడని కొందరి వాదం. రోమ్ నగరం తగలబడడానికి క్రైస్తవులు కారణమని నిందిస్తూ అనేకమందిని నిర్బంధించి చిత్రహింసలు పెట్టించాడు. ఆ స్థలంలో Domus Aurea - స్వర్ణ గృహం నిర్మించుకున్నాడు.

# 109. ఏమి కతము, దీని నెరుగ చెపుము!

బలిచక్రవర్తి అన్నాడు– గాడిద రూపు దాల్చి ఊక తింటూ బతుకుతున్నానని
హేళన చేయకు. నీవూ దాక్కున్నావు తామరతూడులో మరచిపోయావేమో!
విధి నడకలు మనకర్థమవుతాయా? సిరి నన్ను వదిలి వెళ్లిందిపుడు
అదుగో చూడుము ఆ స్త్రీని, ఆమె నన్ను వదిలి నీవేపు వస్తున్నది కాదా!

ఆమె అన్నది– నాపేరు శ్రీ, భూతి, లక్ష్మి – అందరూ తెలుసుననుకున్నా
ఎవరికీ తెలియని దానిని నేను. సత్యం ధర్మం దమం దానం ఉన్నచోట ఉంటాను.
ప్రతాపవంతులున్న చోటుకు నా నివాసం మారుస్తాను –అని పలికి
ఆమె అదృశ్యమయ్యింది; బలి దక్షిణానికి, ఇంద్రుడు ఉత్తరానికి వెళ్లారు.

ఇదే విధంగా ఇంద్రుడు ఒకసారి సర్వసంపదలు కోల్పోయిన 'నముచి'
అనే రాక్షసరాజు చీకూచింతా లేకుండా అలలు లేని సముద్రంలా ఉండగా
కారణమేమని ఇంద్రుడడుగ నముచి అన్నాడు– మేలు కీడు విధి నిర్ణయాలు
నీళ్లు పల్లానికి వచ్చినంత సులభంగా సకల భూతశాసకుడు అన్ని ఏర్పాట్లు చేస్తాడు.

దేవాసురుల యుద్ధంలో విష్ణువు సహాయంతో గెలుపు కలిగింది దేవతలకు
ఐరావతాన్ని అధిరోహించి విజయగర్వంతో ఊరేగుతున్న దేవేంద్రుడికి కనిపించాడు
బలిచక్రవర్తి ఓ కొండ గుహ దగ్గర ఎటువంటి తొట్రుపాటు లేకుండా–
ఈ నిర్వికార స్థితికి కారణమేమని అడిగితే అతడన్నాడు– విధి లిఖితమిది

---

**క. 'శ్రీయును భూతియు లక్ష్మియు । నా యభిదానములు మీరు న న్నెఱుఁగమి పె**
**ద్దే? యింద్ర! యెజ్జగంబుల । నే యుగములయందు నెఱుఁగ రెవ్వరు ననినన్.' (శాంతి. 4-401)**

**క. అనవుడు నతండు 'నీ వీ । దనుజేశ్వరుఁ బాయుటకుఁ గతం బేమి యొకో!'**
**యనిన విని లక్ష్మి 'సత్యం । బును ధర్మము దమము దానమును నా యిక్కల్. (శాంతి. 4-402)**

**క. అవి గలిగి పరాక్రమయుతుఁ । దవు పురుషునిపాల నిలుతు నమరాధిప! యా**
**దివిజారి దొల్లి యట్టిఁడ । యవినీతత నిపుడు బ్రాహ్మణాసూయ మెయిన్. (శాంతి. 4-403)**

**క. తొల్లిటి సచ్చారిత్రము । లెల్లను దిగవిడిచెఁ గాన యీతనికడ నే**
**నొల్ల నిలువ, వచ్చెద సుర । వల్లభ! నీ పాల నెలమి వసియింపంగన్. (శాంతి. 4-404)**

**ఆ. ఆ గుణములు మఱియు నాగమోదిత సమా । చారములును గలిమిఁ గోరి యింద్ర!**
**నిన్నుఁ బొంది యేను నిల్చెద; నేమిట । నేమఱంగ వలవ దెపుడు నీవు.' (శాంతి. 4-405)**

**– నాహం తదనుశోచామి నాత్మభ్రంశం శచీ పతే**
**ఏవం మే నిశ్చితా బుద్ధిః శాస్తుస్తిష్ఠామ్యహం వశే (సం.శాంతి. 224-31)**

# 110. కాలగతి కనుట శాంతికి మూలము-

బలి చక్రవర్తి అన్నాడు ఇంద్రుడితో- పూర్వం నేను దండెత్తి
వస్తే నీవు ఓడిపోయావు; నేడు నేనున్నానీ దైన్యస్థితిలో-
మనకు కలిగే శుభాశుభాలకు కాలమొక్కటే కర్త, నరుడు కాదు
నన్ను గెలిచానని నీకు గర్వంగా ఉంది, అది పతనానికి తొలి అడుగు.

కాలప్రవాహంలో ఇంద్రులెందరో గతించారు, బ్రహ్మలూ అంతే
ఇప్పుడు రాక్షస సమాజం కాలానికి లొంగి ఉన్నది, నీకు కాదు
కాల స్వరూపాన పెద్ద ముక్క సంవత్సరం, చిన్నముక్క కళ
పద్ధెనిమిది రెప్పపాట్ల కాలం కాష్ఠ; ఇది పెరిగి పెరిగి కబళిస్తుంది జగత్తును.

కాలం ఒక వడ్డీవ్యాపారి వంటిది. కళ అంటే ముప్పై కాష్ఠల కాలం
కాష్ఠలతో మొదలై కళగా పెరిగి పెరిగి అందరిని వశం చేసుకుంటుంది.
కాలం అనేది ఒక నది, నిరంతర ప్రవాహశీలి, కొండలను కోసి
నది ప్రవహించినట్లు, కాలం ప్రవహిస్తుంటే గమనించడు నరుడు.

కాలగతిని కనుగొన్నవాడు మనశ్శాంతి పొంది సుఖపడతాడు –
అని బలిచక్రవర్తి పలికిన ఇంద్రుడతడిని మెచ్చుకుని సెలవు తీసుకున్నాడు.
ఆ వాగమృతంతో కలిగిన అనుభూతితో అతడు చేరుకున్నాడు అమరావతి
–అని భీష్ముడు ఇంద్ర బలి సంవాదాన్ని వినిపించాడు ధర్మరాజుకు.

---

తే. చెప్పుచున్నాఁడఁ గాలంబుచేత నెల్ల । విధముఁ జొప్పడు జనులకు వినుము కాల
మప్రమాదవర్తన మధిక ప్రమాద । సంగమత్తులు వా రెట్లు భంగపడరు? (శాంతి. 4-442)

క. కళలుం గాష్ఠలు లోనుగఁ । గల చిదురులఁ గూర్చుకొనుచుఁ గాలంబు జనం
బుల వడ్డికిచ్చు నాతని । వల నలవడఁ బొదివి తనకు వశ్యులఁ జేయున్. (శాంతి. 4-443)

క. కాల మడఁగించుఁ జనుఁ గ । ల్లోలిని గిరిఁ ద్రెంచుకరణి లోభక్రోధా
శీలత్వ కామ భయములఁ । దేలు జనుఁడు కాలవృత్తి తెలఁగు నెఱుఁగునే? (శాంతి. 4-444)

క. ఇంతకు మును సూచితి నతఁ । డెంతయు నొప్పుగొని యుండె; నిది గడుఁ జిత్రం;
బింత వెసఁ జచ్చె ననుఁ దనుఁ । జింతింపఁడు జనుఁడు మూఢచిత్తత్వమునన్. (శాంతి. 4-445)

క. విను భావాభావంబులు । గని యత్యుత్తమ తపంబు గైకొను విద్వ
జ్జనుఁడు గనుఁ గాలగతి యె । ల్లను గరతలశోభితామలకముం బోలెన్. (శాంతి. 4-446)

– గంభీరం గహనం బ్రహ్మ మహత్తో యార్ణవం యథా
అనాది నిధనం చాహుః అక్షరం క్షరమేవ చ (సం.శాంతి. 224-48)

## ✣ 12. శాంతి పర్వము - పంచమాశ్వాసము ✣

### 111. వాని విడిచి గర్వులగుట వారి విడిచితిన్-

ఆకాశగంగలో స్నానం చేసి ఆనందిస్తూ ఉన్న ఇంద్రుడిని చూసి
నారదుడు అనేక విషయాలు మాట్లాడుతూ ఉండగా కనిపించిందో కాంతిరాశి.
వాళ్లు చూస్తూ ఉండగానే ఓ అందాలరాశి విమానం దిగి వారికి నమస్కరించి
ఇంద్రుడితో అన్నది– నేను బాలార్కబోధిత పద్మజాతను.

నన్ను శ్రీ, లక్ష్మి, భూతి అని పిలుస్తారు. పూర్వకాలంలో నేను
స్వాహా, స్వధ, మతి, శ్రద్ధ, ధృతి, స్మృతి, మేధ –అనే గుణాలున్న
రాక్షసుల చెంత ఉన్నాను. వారిపుడు అపమార్గాలపాలైనారు.
దానం, అధ్యయనం, అతిధి పూజలు చేసే వారింట్లో నేనుంటాను.

గురుభక్తి నిరతులు, సుర పితృ పూజనపరులు; సత్యసంభాషణులు
దానశీలురు, పరధన పరదారా పరాఙ్ముఖ చిత్తులు, బ్రాహ్మణ ప్రియులు
పగటిపూట నిద్ర పోనివారు, వృద్ధ దుర్బల దీన యోషిత్ కృపారతులు
శౌచులు, అతిధ భోజన శిష్ట భోజులు అయిన వారింట నేనుంటాను.

ధర్మహీనులు, కామక్రోధ గర్వితులు, భిక్షమివ్వనివారు, పరుషవాక్కు
పలికేవారు, క్రూరమైన నడవడి కలవారిని నేను ఇష్టపడను.
బుద్ధి, ధృతి, నీతి, శ్రద్ధ, సన్నతి, క్షమ, శాంతి అనే దేవతలు
నా వృద్ధికి తోడ్పడతారు, నేను ఎనిమిదో దేవతను –అన్నదామె.

---

**సీ. గురుభక్తి నిరతులు, సురపితృపూజన । పరులును, సత్యసంభాషణులును,**
**దానశీలురుఁ, బరధన పరదార ప । రాఙ్ముఖచిత్తులు, బ్రాహ్మణ ప్రి**
**యులు, దివానిద్రా వియుక్తులు, వృద్ధదు । ర్బల దీన యోషిత్కృపారతులును,**
**శౌచులు, నతిథిభోజనశిష్టభోజులు । నేను మెచ్చు జనంబు; లిట్లుగాక**

**తే. ధర్మ మెడలి, కామంబు క్రోధంబుఁజాలఁ । గలిగి, గర్వులై బలియు భైక్షంబు నిడక**
**పరుష వాక్కులఁ గ్రూరంపుఁ జరితములను । మిగిలి వర్తించువారు నా మెచ్చు గారు. (శాంతి. 5–11)**

---

కాల విభజన :

**సూర్య సిద్ధాంతం :** తృటి – అత్యంత సూక్ష్మకాలం;

100 తృటి = 1 తత్పర; 30 తత్పర = 1 నిమేష; 18 నిమేష (కనురెప్పపాటు) = 1 కాష్ఠ, 30 కాష్ఠ = 1 కళ; 30 కళలు= 1 ఘటిక (24 Minutes); (1 కళ = 48 సెకండ్లు; 1 ఘడియ = 24 నిముషాలు).

**చంద్రమానం:** తిథి (19–26 గంటలు); 15 తిథులు=పక్షము; శుక్ల+కృష్ణ పక్ష = 29.5 రోజులు. 2 మాసములు = 1 ఋతువు (60 రోజులు); 3 ఋతువులు = 1 ఆయనం; 2 ఆయనములు = 1 వర్షము.

1 సంవత్సరము (354.36707 రోజులు)

1 ఘడియ (ఘటిక) = 24 నిముషాలు; 7.5 ఘడియలు = 1 యామం (3 గంటలు); 8 యామాలు = అహోరాత్రం

# 112. కాలవిధము... నాకును ఎరిగింపవే-

భీష్ముడన్నాడు ధర్మజునితో- లక్ష్మి నీవద్ద స్థిరంగా ఉండాలంటే
ఎనిమిది దేవతలు అష్టలక్ష్ములుగా నీచేత పూజలందుకోవాలి!
జైగీషవ్యుడనే ముని దేవల మునితో ఈ విషయాన్ని చెప్పినాడు
-స్థిత ప్రజ్ఞత, సంతృప్తి, ఇంద్రియ నిగ్రహం, నిర్వికారం కలవాడు

హృదయశాంతిని పొందుతాడు, అతడితో చెలిమి దేవతలకు కూడా ఇష్టం-
ఆ విధంగానే ఉగ్రసేన శ్రీకృష్ణులు నారదుడి విషయమై చర్చించారు.
శ్రీకృష్ణుడన్నాడు- నారదుడు అహంకారము లేనివాడు, సుశీలుడు
శాస్త్రజ్ఞానం సదాచారం కలవాడు, శఠత్వం దీనం కోపం లోభం లేనివాడు

ఈర్ష్య గర్వం అసూయ తిరస్కార భావం తెలియనివాడు, ధీరుడు
వేషంలో ఏరకమైన వికారమూ లేనివాడు, అతడి పుట్టుక
తపస్సు, తేజస్సు, బుద్ధి, వినయం, నీతి చాలా ప్రసిద్ధి పొందాయి.
అట్లాంటి మునిశ్రేష్ఠుడైన నారదుడు త్రిలోకాలలోనూ కీర్తించబడుతున్నాడు.

ఇప్పుడు నేను నీకు వేదవ్యాసుడు శుకమహర్షితో చెప్పిన
కాలపు విభాగాలను, యుగ ప్రమాణాలను చెబుతాను, వినుము-
పదునెనిమిది కనురెప్పపాటులు (నిమేషములు) ఒక కాష్ఠ-అనబడును.
ముప్పది కాష్ఠలు ఒక కళ; మూడువందల అరవై కళలు ఒక ముహూర్తం.

---

**సీ. 'శ్రుతము నాచారంబు నతిశయవంతంబు । లెడ నహంకార మొక్కింతయేని**
**లేదు, శీలము గడు లెస్స, వేషము నిర్వి । కారం, బమత్సర గర్వమదుఁడు,**
**జననంబుఁ దపము దేజంబును బుద్ధియు । వినయంబు నయమును విశ్రుతములు,**
**ధైర్యంబు వచనమాధుర్యంబు శాఠ్యదై । న్య క్రోధలోభ నిరాసకత్వ**

**ఆ. మోజ యతనియందు నైజంబు; లీర్ష్యయు । నుద్ధతియు నసూయయును నవజ్ఞ**
**యును నెఱుంగఁ దట్టి మునివరు నారదు । నఖిలజనులుఁ బొగడు టరుదె యధిప!' (శాంతి. 5-32)**

**క. కాలములకు భూతములకు నాలంబన భూతమగు మహా మహిమఁ గ్రియా**
**లీల వెలింగెడు నప్పర మాలోకం బెందు నిష్క్రియాత్మక మయ్యెన్ (శాంతి. 5-37)**

---

**శ్రీకృష్ణ నిర్యాణం :** 17/18 ఫిబ్రవరి 3102 B.C.; **మహాభారత యుద్ధం =** 3138 BC
**చతుర్యుగాలు :** కలి = 4,32,000; ద్వాపర = 8,64,000; త్రేతా = 12,96,000; కృత = 17,28,000 సంవత్సరాలు
**మన్వంతరం** = 30,67,20,000 సంవత్సరాలు; **కల్పం (ప్రళయం) =** 4,32,00,00,000 సంవత్సరాలు
**71 చతుర్యుగాలు** = 1 మన్వంతరం; 14 మన్వంతరాలు = ఒక కల్పం (బ్రహ్మకు పగలు లేదా రాత్రి)
**పరార్థం (అర్ధ మహాకల్పం) =** 155520,00,00,00,000; మహాకల్పం = 311040000000000 సంవత్సరాలు.

# 113. దేవ సంవత్సరాలు - మానవ సంవత్సరాలు

ఒక కనురెప్పపాటు ఒక నిమేషము, పదునెనిమిది నిమేషములు ఒక కాష్ఠ
ముప్పది కాష్ఠలు ఒక కళ, మూడువందల అరవై కళలు ఒక ముహూర్తం
ముప్పై ముహూర్తాలు ఒక అహోరాత్రం (రేయిపగలు); ముప్పై అహోరాత్రులు ఒక నెల.
రెండు నెలలు ఒక ఋతువు, ఆరు ఋతువులు ఒక సంవత్సరం, మూడు ఋతువులు ఒక ఆయనం

ఉత్తరాయణమును 'అగ్ని' అని; దక్షిణాయమును 'ధూమ'మని పిలుస్తారు.
ఉత్తరాయణము పుణ్యకాలము, దక్షిణాయనము దుర్గతి, కృష్ణకాలము
మానవుల మాసము పితరులకు దినము, మానవ సంవత్సరము దేవతలకు దినము
దేవతల పండ్రెండు వేల సంవత్సరాలు నాలుగు యుగాలకు సమానము.

కృతయుగం నాలుగు వేల ఎనిమిది వందల దేవ సంవత్సరాలు –అనగా
పదిహేడు లక్షల ఇరవై ఎనిమిదివేల మానవ సంవత్సరాల పరిమాణముగా
త్రేతాయుగం మూడువేల ఆరువందల దేవ సంవత్సరాలు అనగా పన్నెండు
లక్షల తొంబది ఆరువేల మానవ సంవత్సరాలుగా; ద్వాపరయుగ పరిమాణం

రెండువేల నాలుగు వందల దేవ సంవత్సరాలు అనగా ఎనిమిది లక్షల అరవై నాలుగు
వేల మానవ సంవత్సరాలు; కలియుగం పన్నెండు వందల దేవ సంవత్సరాలు
అనగా నాలుగు లక్షల ముప్పైరెండు వేల మానవ సంవత్సరాల పరిమాణము.
వీటిలో కొంతకాలం లెక్కించబడతాయి సంధ్యలుగా, సంధ్యాంశాలుగా.

---

**సీ.** **విబుధుల పండ్రెండు వేలేండ్లు సనునంత । నాలుగు యుగములు నోలి నడచుఁ**
**గృతయుగమ్మున కందుఁ జతురంశకములుఁ, ద్రే । తకు మూఁడు పాళ్ళును, ద్వాపరంబు**
**భాగద్వయంబునఁ బర్యవసిత మగుఁ; । గలియుగ మంశ మొక్కటన తీఱు;**
**నిబ్భంగిపాళ్ళగు నిన్నియుగముల కం । బరయుగ్మ వసువార్ధి పరిమితములు**

**తే.** **ఖద్వయర్తు గుణంబులు గగన యుగళ । వేద నేత్రంబులును నభోద్వితయకరసు**
**ధాంశులును వచ్చు మున్నూటయఱువదింటఁ । బెంప మానుషాబ్దంబులై పేర్చి యుండు. (శాంతి. 5–46)**

---

ప్రస్తుత బ్రహ్మ వయస్సు (సృష్టి కాలము) – శ్వేత వరాహకల్ప ద్వితీయ పరార్ధ వైవస్వత మన్వంతర 28వ చాతుర్యుగ కలియుగ 5126 సంవత్సరం = 1972949124 సంవత్సరాలు. ఇది ప్రస్తుత కల్పం (బ్రహ్మ పగలు); ప్రస్తుత మనువు వైవస్వత మనువు (సూర్యపుత్రుడు.

**బ్రహ్మ వయస్సు =** 15552197,29,49,124 (155.52 ట్రిలియన్ సంవత్సరాలు)

మరో 15551802,70,50,876 (155.52 ట్రిలియన్ సంవత్సరాలకు) ప్రస్తుత బ్రహ్మ పదవీకాలం పూర్తవుతుంది. బ్రహ్మ ఆయుర్దాయం – 311040 బిలియన్ సంవత్సరాలు.

**ఒక్కో మన్వంతర కాలం =** 30,67,20,000 సంవత్సరాలు; ప్రస్తుత మనువు వయస్సు = 12,05,33,122 ఏళ్లు.

# 114. సంధ్యలు - సంధ్యాంశాలు

కృతయుగానికి సంధ్య కాలం నాలుగు వందలేళ్లు, సంధ్యాంశం నాలుగు వందలేళ్లు
త్రేతాయుగానికి సంధ్యకాలం మూడు వందలేళ్లు, సంధ్యాంశం మూడు వందలేళ్లు
ద్వాపరయుగానికి సంధ్యకాలం రెండువందలేళ్లు, సంధ్యాంశం రెండువందలేళ్లు
కలియుగానికి సంధ్యకాలం వందేళ్లు, సంధ్యాంశం వందేళ్లు – దేవసంవత్సరాలలో

కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో జ్ఞానస్ఫూర్తి, ద్వాపరంలో యజ్ఞం
కలియుగంలో దోషాచరణములు వర్ధిల్లుతాయి యుగస్వభావాలుగా.
న్యాయం, ధర్మం, ఆయువు, శరీరబలం ఇవి నాలుగు యుగాలలో క్రమేపీ
తగ్గుతూ కలియుగాంతానికి చేరుకుంటాయి అత్యంత అల్పస్థితికి.

యుగములు నాలుగు కలిస్తే ఒక మహాయుగం, వెయ్యి మహాయుగాలు బ్రహ్మకు
ఒక పగలు, మరో వెయ్యి మహాయుగాలు అతడికి రాత్రితో సమానం
రాత్రివేళ నిద్రించిన బ్రహ్మ సమయం లోకాలకు ప్రళయ కాలమవుతుంది.
పగటివేళ అతడు ప్రాణికోటి సృష్టికి పూనుకుంటాడు. ఇది జరిగిపోతూనే ఉంటుంది.

మహత్తు మనసు ఆకాశం వాయువు అగ్ని జలం భూమి – సప్త రూపాలు
జనిస్తాయి బ్రహ్మతత్వం నుంచి; ఆకాశానికి శబ్దం, వాయువుకు స్పర్శ
అగ్నికి తేజస్సు, జలానికి రసము, పృధివికి వాసన గుణములై ఉంటాయి.
తేజోరూపమే బ్రహ్మము, ప్రాజాపత్యము; వ్యాపకుడు, స్రష్ట, ప్రజాపతి అతడు.

---

**క.** **న్యాయంబులు, ధర్మంబులు, । నాయువులుఁ, దనూబలములు నంతంతకు వ**
**త్సా! యెంతయుఁ దఱుఁగుం ద్రే । తాయుగముఁ దొడంగి మనుజతతి కరయంగన్. (శాంతి. 5–53)**

**తే.** **ఆ యుగంబులు నాల్గు మహాయుగంబు । నాఁగఁ జనుఁ దత్సహస్రంబు నలువ పగలు**
**దాని కొలఁదియ రేయును దీని నెఱుఁగు । ప్రౌఢ జనములు సు మ్మహోరాత్ర విదులు. (శాంతి. 5–54)**

**తే.** **అతఁడు రాత్రి నిద్రించు; నిద్రావసరమ । ప్రళయ మగు లోకములకు; ప్రభాత మగుడు**
**మేలుకను; దివమున భూతజాలసృష్టి । పరతఁ బొందుఁబర్యాయ మిప్పాటఁ జెల్లు.' (శాంతి. 5–55)**

**–** **తేజోరూపము బ్రహ్మము ప్రాజాపత్యం బనగ బరగి పురుషుడు**
**ద్ర్భా జిష్ణు సత్యనిత్యా వ్యాజ మహిమ వెలుగుచుండు నకిలంకమతిన్ (శాంతి. 5–63)**

---

ఆరోజుల్లో కొలతలు అంగుళ, ప్రాదేశ, బెత్త, జాన, మూర, బార ఇలా చేతుల పొడవుతో; దూరాన్ని గవ్యూతి (గోవు ఒకరోజులో పోయిన దూరం) క్రోసులలో, ధనుస్సులతో, ఆమడలతో కొలిచేవారు. కృతయుగంలో మానవుల ఎత్తు 21 హస్తాలు (హస్తమంటే ఆ కాలంలో రెండడుగులు). త్రేతాయుగంలో 14, ద్వాపరంలో 7, కలియుగంలో 3 హస్తాల ఎత్తుంటారని ఒక అంచనా. సూర్యపుత్రుడు వైవస్వతుడు (శ్రాద్ధదేవుడు) ప్రస్తుత మనువు. ఇతడు వివస్వతుడనే సూర్యుడికి శరణ్య అనే సంజ్ఞకు పుట్టినవాడు; సూర్యుడు–సంధ్యల కవలపిల్లలు యముడు–యమి; సూర్యుడు–ఛాయ కుమారుడు శని. యముడు తొలి మానవుడు. మరణించి ధర్మరూపంతో యమధర్మరాజైనాడు. (ఇరాన్ పురాణాలలో వివస్వంతుడి కుమారుడు– జంషెడ్–యమ)

# 115. విలయమొందిన ఘటపృష్ఠ విధము దాల్చు-

సర్వజనులకు తపస్సు మంగళకరమైనది, స్వాధ్యాయము తపస్సుకు బలాన్నిస్తుంది
బ్రహ్మము శబ్ద బ్రహ్మము, పరబ్రహ్మమని రెండు విధాలుగా ఉంటుంది.
పరబ్రహ్మము శబలత్వము పొంది భూతసృష్టి సంహారాలు చేస్తుంది.
సృష్టి క్రమం తెలిసిన నీకు చెబుతున్నాను సృష్టి సంహార క్రమమును.

చరాచర జగత్తు భూమిలో కలిసి కుండ మట్టిగా మారినట్లు కాగా
భూమిని మింగుతుంది జలం; జలాన్ని అగ్ని, అగ్నిని వాయువు, వాయువును
ఆకాశం కబళిస్తాయి. ఆకాశాన్ని మనసు హరించివేస్తుంది; మనస్సును
చంద్రుడు, చంద్రుడిని సంకల్పం, సంకల్పాన్ని జ్ఞానం, జ్ఞానాన్ని కాలం మింగుతాయి.

కాలం కూడా నశించాక వేదజ్ఞానమొక వెలుగుగా భాసిల్లుతుంది అదే బ్రహ్మం
ఇది తెలిసినవాడు బ్రహ్మజ్ఞానిగా వెలుగొందుతాడు, ప్రశంసించబడతాడు
బ్రాహ్మణులకు యజ్ఞం చేయడం, చేయించడం, అధ్యయనం, అధ్యాపనం
ప్రతిగ్రహం, దానం అనే షట్కర్మలు ముఖ్యమైన కార్యాలని చెబుతారు విజ్ఞులు.

దానం అనేది ఉత్తమ ధర్మం- కాశ్యుడు ప్రాణాలనిచ్చాడు, శిబి తొడమాంసమిచ్చాడు
ప్రతర్ధనుడు నేత్రాలనిచ్చాడు, జనక, పరశురామ, గయులు భూమండలాన్నిచ్చారు
బ్రహ్మదత్తుడు శంఖనిధిని, ఇంకా అనేకమంది మణులు, బంగారం, కన్యలు, గోవులను
దానం చేసి సద్గతులను పొంది వేదధర్మాన్ని లోకహితాన్ని ఎంతగానో కాపాడినారు.

**తే.** **స్థావరములు జంగమములుఁ దన్నుఁ గలయ । విలయ మొందిన ఘటపృష్ఠ విధము దాల్చు;**
**భూమి నంబువుల్ మ్రింగు; నంబువుల నగ్ని, । యగ్ని ననిలుం, దనిలుఁ ద్రావు నాకసంబు. (శాంతి. 5-74)**

**ఆ.** **ఆకసమును మనసు హరియించు, గంధాది । యగు గుణాళితోడ నఖిల భూత**
**ములును నిట్లు లయముఁ బొందిన గ్రసియించు । మనసు నాత్మగుణము నెనసి విధుఁడు. (శాంతి. 5-75)**

**క.** **అతనిఁ బొదువు సంకల్పం । బతుల జ్ఞానంబు దాని నడఁచును విజ్ఞా**
**నితఁ దద్బలముఁ బురుషదే । హితనుం గాలంబు వరుస నెడలం జేయున్. (శాంతి. 5-76)**

**క.** **కాలం బెడలిన విద్యో । న్మీలిత మగు బోధ మన్యమిశ్రత్వంబుం**
**దూలించి వెలుఁగుచుండు వి । శాలమతీ । బ్రహ్మ మది ప్రశస్తము శ్రుతులన్. (శాంతి. 5-77)**

**రేవతి కథ :** విష్ణు పురాణం ప్రకారం- కకుద్మి కుమార్తె అయిన రేవతికి సరైన భర్త భూలోకంలో కనిపించక కకుద్మి ఆమెను తీసుకుని బ్రహ్మలోకం వెళ్లినాడు. అక్కడ గంధర్వులు సంగీత కచేరి చేస్తుంటే అది అయిపోయినాక బ్రహ్మదేవునికి తాను వచ్చిన పని చెప్పాడు కకుద్మి. బ్రహ్మ నవ్వి అన్నాడు- 'లోకానికి లోకానికి కాల వ్యత్యాసముంటుంది. పరిమాణంలో భూమిమీద నీవు వచ్చినప్పటి నుంచి ఇప్పటికి 27 చతుర్యుగాలు గడచిపోయాయి. నీవాళ్లెవరూ ఇప్పుడక్కడ జీవించిలేరు. ఇప్పుడు భూమిపై ద్వాపర యుగాంతం నడుస్తున్నది. ఆదిశేషుడి అంశతో జన్మించిన బలరాముడు ఈమెకు తగిన జోడు' అన్నాడు.

# 116. ఎవడు అసలైన బ్రాహ్మణుడు?

జరామరణ మహాంభోరాశిని దాటడానికి పండితులైనవారు జ్ఞానసిద్ధిని కోరి
నిగ్రహిస్తారు వాక్కును, మనస్సును; ఆత్మనిగ్రహం పాటించి పొందుతారు శాంతి
ఆచారమనే చక్రపుటంచుగలది, ప్రాణమనే కాడి, అపానమనే ఇరుసు
సిగ్గు అనే ఆచ్ఛాదనము కలది, ఉపాయ అపాయములనే నొగలు కలది.

సర్వతంత్ర ప్రతోదంబును, త్యాగరశ్మి అనే పగ్గాలున్న యోగరథము నెక్కి
ఉపాయశాలి అయిన రథికుడనే ఆత్మ ప్రవేశిస్తుంది అక్షర పద స్థానాన్ని.
ఆ రథంపై వెళ్లిన ఆత్మారథికుడు పంచభూతాలపై విజయం సాధించి
అహంకారాన్ని నెట్టి, బుద్ధిని అడగించి, అరికడతాడు ప్రకృతి చేష్టలను.

అహంకారంపై విజయం సాధించడం, పంచభూతాలపై, త్రిగుణాలపై
మాయపై విజయం సాధించినట్లే కావున అతడి తేజస్సు క్రమేపీ
ధూమమై, మిణుగురుల కాంతి సమానమై జ్వలిస్తుంది చివరకు మహాగ్ని రూపమై.
మమకారము, అహంకారము త్యజించడం వలన సాధ్యమవుతుంది విజయం

స్థావర జంగమాలలో జంగమములు గొప్పవి- మావి నుంచి, గుడ్డు నుంచి, స్వేదము
నుంచి భూమిని చీల్చి పుట్టే జంగమ జీవులలో కొన్ని బహుపాదులు, కొన్ని ద్విపాదులు
ద్విపాదులలో ఉత్తముడు మానవుడు, మానవులలో విప్రులు, విప్రులలో వేదజ్ఞులు
వేదజ్ఞులలో ప్రవచకులు, ప్రవచకులలో ఆత్మజ్ఞుడు గొప్పవాడు- అతడే బ్రాహ్మణుడు.

**క. వరుసన ధరణీపవనాం । బరజలతేజముల గెలుచు, బల మెక్కి యహం
కరణంబు ద్రోచు, బుద్ధిం । బరువడి నడఁగించుఁ బ్రకృతి పనిఁ బెడఁబాపున్. (శాంతి. 5-93)**

**ఆ. భూమిజయము దొడఁగి పురుషుఁ డంతంతకు । వృద్ధిఁ బొంది యోగసిద్ధిఁ బొందుఁ
బొగయు మిడుఁగుఱులును బొనుఁగు లేని శిఖియు । బహులశిఖలు నైన పగిది ననఘ! (శాంతి. 5-94)**

**తే. విను మహంకారజయము పృథ్వీ ముఖంబు । లైనవానిని బుద్ధి ప్రధానమును జ
యించునట్టి సంస్కారంబు నిచ్చు; దాన । నగు మహానుభావంబు సంయమివరులకు. (శాంతి. 5-95)**

---

కకుద్మి, రేవతిలు భూలోకం వచ్చి చూసేసరికి మనుషుల ఎత్తు, పరిమాణాలు తగ్గిపోయాయి. తన కుశస్థలి నగరం ఇప్పుడు ద్వారకగా మారింది. వెళ్లి బలరాముడిని చూసారు. అతడికంటె రేవతి ఎన్నోరెట్లు పొడుగు, లావూ ఉన్నది. అప్పుడు బలరాముడు తన నాగలి-హలాయుధంతో రేవతిని తనకు తగ్గ ఎత్తు లావుకు సరిచేసి వివాహం చేసుకున్నాడు. వీరికిద్దరు పుత్రులు నిషాత, ఉల్ముకుడు.

క్రైస్తవుల గ్రంథంలో, నార్డిక్ ప్రజల గ్రంథాలలో, పర్షియన్, అరేబియన్, గ్రీకు కథలలో, అన్ని ప్రాచీన గాథలలోనూ మహాకాయుల ప్రసక్తి ఉన్నది.

అయితే కాలాన్ని, యుగాన్ని, లోకాన్ని బట్టి జీవరాశుల పరిమాణంలో మార్పులను వ్రాసినవి హిందూ ఇతిహాస, పురాణ గ్రంథాలే.

## 117. కామంబున్ పెడబాచు పండితుడు-

స్థావర జంగమములన్నిటిలో ఉన్నాడు పరమాత్మ, అన్ని ప్రాణులు
పరమాత్మలో ఉన్నాయన్న భావన సమకూరుస్తుంది బ్రహ్మపదాన్ని
విప్రాదులలో కనిపించే పరమాత్మను చూసే పండితులు గోవు, ఏనుగు
పోక విలువ చెయ్యని కుక్క, కుక్కమాంసం తినే చండాలుని లోనూ దర్శిస్తారు.

ఆత్మకు క్షరము, అక్షరము అనే రెండు రూపాలున్నాయి, క్షరము మృతమై
అక్షరము అమృతమై స్వర్గంలో ఉంటుంది, అన్ని లోకాలను పచనం చేసే
కాలాన్ని పచనం చేయగలిగితే అక్షర దర్శనమవుతుంది, వినుము-
నవద్వార పురంలో ఉండే హంసుడనే ఆత్మ అక్షరుడూ, అమృతుడూ

కామ క్రోధ లోభ భయ నిద్రలు యోగులకు నిందితములు, కావున వర్జించాలి
సంకల్పాన్ని వదలి కామాన్ని, సత్వ గుణ చింతనతో నిద్రా మోహాన్ని
ప్రాజ్ఞసేవనంతో లోభాన్ని, శమముతో కోపాన్ని, జాగరూకతో భయాన్ని జయిస్తాడు
ఏమరుపాటు లేనివాడు ధీరతతో శిశ్నోదరాలను, చూపుతో కరచరణాలను

శుద్ధ చిత్తంతో నేత్రశ్రవణాలను, నిర్మలమైన విద్యతో మనోవాక్కులను కాపాడుకుంటాడు.
ఇంద్రియాలలో ఏ ఒక్క దానిపైనైనా పట్టుజారితే ఆ రంధ్రం ద్వారా
ప్రజ్ఞ మొత్తం జారిపోతుంది, అందుకే నిరోధించాలి మనసును ముందు
ఆ తరువాత పంచేంద్రియాలను నిరోధించినవాడు పొగలేని అగ్నిలా ప్రకాశిస్తాడు.

---

**తే.** **క్షరము నక్షరమునునవం గలవు రెండు । మూర్తు; లాత్మ కఖిలభూతములను బూర్వ**
**మొలయు మృత మన దివమున నుండు నమృత । మనఁగ నపరంబు రెంటిని గను బుధుండు. (శాంతి. 5-111)**

**క.** **ఈ లోకంబుల నెల్లం । గాలము పక్వంబు సేయఁగా నెవ్వాఁ డ**
**క్కాలము పక్వము సేయం । జాలు నతం దమృతు నజరు సత్యుఁ గనుటకున్. (శాంతి. 5-112)**

**తే.** **విను నవద్వారపురమున వెలుఁగుచుండు । హంసుఁ; డతనిన యక్షరుఁ డమృతుఁ డంద్రు**
**పరమయోగు లాతత్త్వంబు భంగిఁ గాంచు । యోగ్యసత్క్రియాభ్యాసవైరాగ్యపరుఁడు.' (శాంతి. 5-113)**

**ఉ.** **గుమ్మడిపువ్వుఁ దేనియయుఁ గూపము నైందవరేఖకాంతియున్**
**జు మ్మరయంగఁ గర్మఫల శోభనసంపద; జున్ను నేఱుఁ బూ**
**ర్ణమ్మగు చంద్రబింబము నవం దగు నిర్మలవిద్య గాథపా**
**కమ్ము ఫలోదయం బది యఖండసుఖాత్మ పదంబు పుత్రకా! (శాంతి. 5-128)**

**క.** **వినుఁ రేఖామాత్రపుఁ జంద్రుని యట్టుల జీవుఁడతని దుష్పక్షముఁ బో**
**లిన యజ్ఞానము నపగమమున బోధానంద సాంద్రపూర్ణతఁ బొలుచున్ (శాంతి. 5-130)**

# 118. ఎందేని శయనించు నతనిని బ్రాహ్మణుడండ్రు-

మనసులో ఏకాగ్రత పొందడానికి జనుల మధ్య ఉండకుండా ఎవడైతే
శూన్యనికేత అద్రిగుహ వివిక్త వన దేవా గార ముఖ్యంబులయిన చోట వసించి
రాయిని బంగారాన్ని సమదృష్టితో చూస్తూ సమాధిలో గడిపితే ఆరు నెలలలో
జయించవచ్చు శబ్ద బ్రహ్మాన్ని; దానిని దాటినవానికగును పరమాత్మ దర్శనం.

కర్మమార్గం ప్రవృత్తి, కర్మరహిత మార్గం నివృత్తి; మొదటిది కలిగిస్తుంది
బంధాన్ని, రెండవది విడుదల చేస్తుంది; నిష్కర్మ మార్గం ఆనందాన్నిస్తుంది
గుమ్మడిపువ్వులో తేనె స్వల్పం తేనెపట్టుతో పోల్చి చూసినప్పుడు, బావిలో నీరు
తక్కువ నదితో పోల్చితే, ఏకరేఖ చంద్రుని కాంతి స్వల్పం పూర్ణచంద్రబింబంతో సరిచూస్తే

ఏక రేఖామాత్ర చంద్రుడు జీవుడు, అజ్ఞానం కృష్ణపక్షం అది గడిస్తే
పరిపూర్ణత గల చంద్రుడు వచ్చినట్లు కర్మమార్గం గడిస్తే విద్యా పరిపూర్ణత కలుగును.
బ్రహ్మచర్య వ్రతం వలన ఆధ్యాత్మ విద్య పెరుగుతుంది, కర్మను వదిలేందుకు
నాలుగు మెట్ల నిచ్చెన ఉన్నది- బ్రహ్మచర్య గృహస్థ వానప్రస్థ సన్న్యాసాశ్రమమది

జీవితంలో నాలుగవ వంతు బ్రహ్మచారిగా, స్వాధ్యాయనం గురుశుశ్రూష చేసి
గురుదక్షిణ చెల్లించి, గృహస్థుడై అతిథిపూజ, స్వభార్యయందు నిరతి, సంతానం కలిగి
మరో పాతిక కాలం గడిపి, వానప్రస్థం ధర్మాచరణంలో, సన్న్యాసం ధర్మానుష్ఠానంలో గడపాలి
ముండిత శిరస్కుడై ఓ చెట్టు మొదట్లో నివసిస్తూ ఉండే యతినే బ్రాహ్మణుడంటారు.

---

**సీ.** **ఆత్మయం దగ్ని సమరోపణము సేసి । యజన మాంతరముగ నకృతసంధి**
**విగ్రహం దగుచుఁ బరిగ్రహ విముఖుఁడై । ముందుండు ననికేతనుండు వృక్ష**
**మూలవాసియును గపాలధారుండు నే । కాకియు నక్రోధకామశోకుఁ**
**డును గాఁగవలయు; భిక్షునకు నిందా స్తుతుల్ । దనయంద యడఁగంగఁ దాను బరుల**

**తే.** **దిక్కు వలుకక దివియెల్లఁ బిక్కటిలఁగఁ । దాన యున్నట్లు గనుచు నేమేనిఁ గుడిచి**
**యెద్దియేనియుఁ గట్టి యెందే శయించు । నతని దేవతల్ బ్రాహ్మణుఁ దండ్రు పుత్ర! (శాంతి. 5-142)**

**తే.** **హృదయవేదికయందు సమిద్ధమూర్తి । వెలుఁగుచుండు తేజమునందు వేల్చుఁ బ్రాణ**
**ములను యాజి య ట్లంతరమున నొనర్చు । యాగమున వీతకల్మషుఁడై వెలుంగు. (శాంతి. 5-149)**

**క.** **విను మాఱంచులుఁ బంద్రెం । డనుపమధారలును నై నిజాస్యము విశ్వం**
**బును బొదువఁ దిరుగు కాలం । బను చక్రము దురవబోధ మది యడఁగు గుహన్. (శాంతి. 5-152)**

**తే.** **సర్వసంకల్ప రహితుడై సత్త్వమున వినిశ్చలంబుగఁ జిత్తంబు నిలుపవలయు**
**సత్వసక్త చిత్తంబు ప్రసాదమొసగు దానఁ గాలంబు నడపుటుత్తమ విధంబు (శాంతి. 5-155)**

## 119. ఊర్ణనాభి తంతువు జనియింపగ చేసినట్లు-

మనస్సులో యాగక్రియ చేస్తూ, జనంతో కలవక, ఒకచోట నిలువక
ఘటకపాలం చేతబట్టి భిక్షాటన చేస్తూ నిందాస్తుతులను విడనాడి
ఏదైనా ధరించి, ఎక్కడైనా శయనించే స్వభావం కలవాడే బ్రాహ్మణుడు.
అతడు దేనినీ అంటనివాడై గగనములా ఉంటాడు గణనకు అందనివాడై-

ఆత్మ అనే చిన్మయమైన పక్షి భూమిని స్పృశించదు, ఆకాశాన గోచరం కాదు
పిండమనే గ్రుడ్డు మధ్యలో ఉజ్జ్వలమైన కాలమనే రెక్కలతో ప్రకాశిస్తుంది.
కాలచక్ర రథంలో, ఇంద్రియాశ్వ నియంత్రణతో సాగువాడికి లభిస్తుంది ముక్తి.
గాలి లేని చోట ఉన్న దీపంలా, ఉంటుంది మనోచాంచల్యం లేని ఆత్మ.

తాబేలు తన అవయవాలను వెలికి చూపి మరలా లోపలికి లాక్కున్నట్లు
పరమాత్మ భూతాలను సృష్టించి మరల తనలోకి ఉపసంహరించుకుంటాడు.
నీటిలో ఉన్నా మునగదు నీటిపక్షి, అత్తిపండులో ఎన్ని పురుగులున్నా
బాధింపబడదది, అన్ని విషయాలు ఆత్మలో ఉన్నా, ఆత్మలో అన్ని విషయాలున్నా

ఆత్మకు కలుగదు వికారం; సాలెపురుగు తన శరీరం నుంచే తంతువులనిస్తుంది-
సత్త్వగుణము కారణమవుతుంది జ్ఞానానికి. సత్త్వ రజ స్తమో గుణాలను వదిలి
ఆది నిధన రహితుడగు నిరంజనుని చేరి మనస్సు నశించ పొందును ముక్తి
చిత్తనిగ్రహం, ఆత్మజ్ఞానం అనే సంపదలు చూపుతాయి మోక్షమార్గాన్ని.

---

**ఆ.** జలములందు నిలిచి జలపక్షి మునుఁగదు; । మేడిపండు మశకపీడఁ బొరయ;
దట్ల విషయసమితియందుఁ దానది దన । యందు నుండి వికృతి నొంద దాత్మ.' (శాంతి. 5-172)

**క.** 'విను మూర్ణనాభి తంతువు । జనియింపఁగఁ జేసినట్లు సత్త్వగుణము సం
జనకం బగు నది పురుషుఁడు । గనుట యుదాసీనతన వికారము గలదే? (శాంతి. 5-174)

**చ.** 'తన కుసుమంబులన్ ఫలవితానము మూర్కొన నాన మ్రాను నే
రని క్రియఁ గాన నేరదు పరం బగు తత్త్వము నైజభంగి వి
న్ననువున నంతరాత్మ గను నైష్ఠికతం గను; మింతవట్టుఁ బా
మెనసిన తోలు వాయుక్రియ నీవు దొఱంగుదు పాపపుంజమున్. (శాంతి. 5-183)

**తే.** బంధనంబులలో నెల్లఁ బరమబంధ । నంబు గామంబు; దద్వర్జనమున నాత్మ
యభ్రపటలంబు వాసిన యమృతకిరణ । పూర్ణమండలమును బోలెఁ బొలుచు ననఘ! (శాంతి. 5-190)

**క.** పరతత్త్వోపాసన తత్పరుడై సంక్షీణ కామ భావత నున్నం
బురుషు సుఖమొందు వృద్ధిం బొరయుచు వపు వమృత కిరణుఁ బొందిన మాడ్కిన్ (శాంతి. 5-191)

# 120. పురము శరీరంబు - బుద్ధి తత్ స్వామిని-

చెట్టు తన పూల వాసన తాను చూడలేదు, తన పండ్లను తాను తినలేదు
తత్త్వం తన స్వరూపాన్ని తానెరుగలేదు, నిష్ఠతో అంతరాత్మను సాక్షాత్కరింప
చేసుకుంటే పాము కుబుసాన్ని వర్జించినట్లు, పాప సంచయాన్ని విడువవచ్చు.
లోభమనే నదికి సంకల్పాలు గట్లు, క్రోధము బురద, ఇంద్రియాలు మొసళ్లు

కోరికలు పాములు, అది మోహమనే గడ్డితో కప్పబడి ఉంటుంది, సంసార
సాగరంలో ప్రవేశిస్తుంది, వివేకులు సత్యమనే ఉపాయంతో దానిని దాటుతారు.
శాండిల్యముని చెప్పినాడు- మోహమనే బీజం నుంచి మొలుస్తుంది కామవృక్షం
ఏమరుపాటు అనే నీటిలో పెరుగుతుంది, అజ్ఞానం దాని వేళ్లు-

అసూయ దానికి ఆకులు, ఆ చిత్రమైన చెట్టు అభిమానమైన బోదెతో
దృఢపడి పెరిగి శోకమే కొమ్మలుగా, చింతలే రెమ్మలుగా, పూర్వ
కర్మఫలితం చేవగా, ఆశలనే తీగలతో చుట్టబడగా లోభులు
ఆ చెట్టు పండ్ల కాశించి చెట్లెక్కి పతనమౌతారు; పండితుడైనవాడు

త్యాగమనే కత్తితో ఆ చెట్టును తెగనరికి దుఃఖాలకు దూరమౌతాడు,
ఆ శరీరమొక నగరం, బుద్ధి దానికి ప్రభువు, మనసు మంత్రి, ఇంద్రియాలే ప్రజలు
దానిని అనుభవించేది సత్త్వ రజ స్తమోగుణాలున్న దొరలు; వారిని శిక్షించాలి
బుద్ధి తక్కువైతే వారిది గెలుపు; బుద్ధి మనసు ఏకమైతే ఓడించవచ్చు వారిని.

---

సీ. విను మోహబీజ సంజనితంబు గామద్రు । మంబు ప్రమాదజలంబు దనకుఁ
బరిషేచనంబుగఁ బెరుఁగు నజ్ఞాన స్థి । రాధారకలితమై యందసూయ
పత్త్ర సంపద యది చిత్ర తరంబు మా । నస్కంధ దృఢత నున్నతి వహించు
శోక శాఖంబు ననేక చింతోప శా । ఖంబు బురాకృత కర్మ సార

తే. ఘనముఁ దృష్ణాలతా పరిగతము నగుచుఁ । బొలుచుఁ దత్ఫలములకు లుబ్ధులు గడంగి
ప్రాఁకి పడుదురు విడుపు శస్త్రముగ నది వి । ఖండితము సేసి బుధుఁడు దుఃఖములఁ దొఱఁగు. (శాంతి. 5-199)

సీ. పురము శరీరంబు; బుద్ధి తత్స్వామిని; । సర్వార్థచింతన సచివపదవి
నడచుచు నుండు మనంబు శబ్దాద్యంబు । లై చెల్లు విషయంబులైదుఁ దగు పు
రోహితవర్గంబు శ్రోత్రాదులగు నింద్రి । యంబులు పౌరజనంబు; లిట్లు
పరఁగెడు రాజ్యంబు పరిభోగమునకు దూ । షకులైన దొరలు రజస్తమములు

తే. వారి ఖరపులఁ బడు బుద్ధి నేరకుండి । మనసుతోడ వేర్పడినఁ దానును మనంబు
నేకముఖతఁ గార్యము సూచునేని దుష్టు । లడఁగుదురు భోగ మవ్యయ మగుఁ గుమార!' (శాంతి. 5-200)

## 121. మృత్యుదేవతా! నీ అశ్రు జలములే నానావ్యాధి రూపములు-

అకంపనుడనే రాజు యుద్ధంలో మరణించిన తన కుమారుడి గురించి
చింతాక్రాంతుడైనపుడు నారదుడు చెప్పాడతడికి మృత్యుదేవతా స్వరూపం
-పూర్వం బ్రహ్మ లోకాలు సృష్టించి ప్రాణికోటితో నింపగా అవి
దినదినాభివృద్ధి చెంది ఊపిరి సలపనంత పరిస్థితిగా జనసమ్మర్థమైనపుడు-

ఆలోచనతో అతడి మనసు వేడెక్కి ఆ క్రోధం నుంచి పుట్టింది మహాగ్ని
అది ఎల్లలోకాలను దహించి వేస్తుండగా శివుడు బ్రహ్మను శాంతింపచేయగా
బ్రహ్మ నుంచి పుట్టింది ఎర్రని వదనం కలిగిన అద్భుతమైన కన్య.
ఆమెను జనసంహారం చేయమని బ్రహ్మ అడుగగా ఆమె కన్నీరు పెట్టుకున్నది.

ఆ కన్నీళ్లను దోసిలి పట్టిన బ్రహ్మ అన్నాడు- ఓ మృత్యుదేవతా, నీ కన్నీరు
రోగములను సృజిస్తాయి, నీవు వెళ్లి జీవకోటిని సంహరించుము
నీవు నిమిత్తమాత్రవు, నీకే పాపమూ అంటదు, నీకు పురుష స్త్రీ నపుంసక
రూపములుంటాయి, అనగా ఆమె అంగీకరించి ప్రాణాపహరణం చేయసాగింది.

అని మృత్యుదేవత జన్మవృత్తాంతాన్ని ధర్మరాజుకు తెలిపాడు భీష్ముడు
-వేదాలపై భక్తి, విశ్వాసం, ఆచారం, ధనం అనేవి నాలుగు ఆకారాలు.
ఇతరులు ఏమి చేస్తే తనకు అప్రియంగా ఉంటుందో ఆ పనులను
తాను ఇతరులకు చేయరాదు- అనే విషయం అన్ని ధర్మమార్గాలకు ఆలంబన.

---

**క.** **'మనుజుల హరించి బాంధవ । జనమున శోకంబుఁ జూడఁ జాలుదునె? తపం**
**బున కేఁగెద సదయంబుగ । ననుజ్ఞ సేయంగవలయు' నని ప్రణమిల్లెన్. (శాంతి. 5-206)**

**తే.** **'ప్రజల హరియించు టిది నీకు పరమధర్మ; । మేను బొంకెదనే? దీని నెల్ల భంగి**
**నాచరింపన వలయు; మత్ప్రార్థనంబు । భగ్న మొనరించు టొప్పదు పద్మనయన! (శాంతి. 5-210)**

**తే.** **పురుషుఁడును నంగనయును నపుంసకుండు । నగుము పుత్రిక! పురుషుని నంగనను న**
**పుంసకుని జంపువేళలఁ బొందకుండు । పాపమును నిది ధర్మమై పరఁగు నీకు.' (శాంతి. 5-212)**

**-** **భీమ నాదుండు భీముఁడుద్దాముఁడప్ర తర్క్య తేజోమయుఁడు జగత్ప్రాణుఁడొడలు**
**మనుపఁ జెరుపంగ నొడయండు సనుట మగుడ నరుగుదెంచుట వింతగా దతనికెందు. (శాంతి. 5-214)**

**క.** **ఒరు లేమేమి యొనర్చిన । నరవర! యప్రియము తన మనంబున కగుఁ దా**
**నొరులకు నవి సేయకునికి । పరాయణము పరమధర్మపథముల కెల్లన్.' (శాంతి. 5-220)**

**తే.** **'వేద మాచారములఁ జెప్పు వివిధగతుల; । సకలహిత మగునట్టి యాచార మరయ**
**ననఘ! వేఱొండు గలదె? మహాత్ము లెద్ది । యాచరించిరి దానిఁ జేయంగవలయు.' (శాంతి. 5-222)**

# 122. జాజలి-తులాధారుల కథ - బ్రహ్మగీత

చలనంబు లేక జాజలి ముని తపోనిష్ఠలో కూర్చుని ఉండగా అతడి తలపై గూడు
నిర్మించాయి పిచ్చుకలు- గుడ్లుపెట్టాయి, పిల్లల్ని పొదిగాయి. పిల్లలు పెద్దవై
ఆ పిచ్చుకలు ఆహారానికై బయటకు వెళ్లి వస్తూ ఆ గూటిలోనే ఉంటున్నాయి.
అప్పుడు జాజలి తనను తానే మెచ్చుకున్నాడు- ఇంతటి ధర్మనిష్ఠ ఎక్కడైనా ఉంటుందా?

అప్పుడు ఆకాశవాణి పలికింది- తులాధారుడూ ధర్మనిష్ఠ కలవాడే కాని
ఇలా ఏనాడూ ఆత్మప్రశంస చేసుకోలేదు- జాజలి ముని అన్నాడు
అతడెక్కడుంటాడని- ఆకాశవాణి చెప్పింది అతడు వారణాసి వాస్తవ్యుడని.
వారణాసి వెళ్లి వ్యాపార వృత్తిలో ఉన్న తులాభారుడిని సందర్శించాడు జాజలి.

తులాధారుడన్నాడు- 'మహాత్మా నీవు గొప్పవాడివి, తలపై పిచ్చుకలు
గూడుకట్టినా చలించని ధర్మనిష్ఠాపరుడివి!' అప్పుడు జాజలి అన్నాడు
నీకెలా వచ్చింది ఈ ధర్మనిష్ఠ? - తులాధారుడు సమాధానమిచ్చాడు- నిస్సంగత్వం వల్ల.
మట్టిపెళ్లను బంగారాన్ని సమంగా చూస్తాను, తగిన లాభాన్ని ఆర్జిస్తాను.

సత్యమే యజ్ఞం నాకు' -అప్పుడు జాజలి తలపైనున్న పక్షులు గాలిలో కెగిరి అన్నాయి-
-ధర్మదేవత పంపగా వచ్చిన వారం మేము, నీ తలపై గూడులో ఉండి గమనించాము నిన్ను-
శ్రద్ధగా దోషం లేని వ్యాపారం చేస్తున్నాడితడు, తనపనిపై శ్రద్ధగలవాడి
మనసులో మత్సరము, ఆత్మశ్లాఘ పరత్వముండదు -అని అదృశ్యమయ్యాయా పక్షులు.

---

**ఆ.** **దానగుణము శ్రద్ధ లేనివానికి లేదు । గాన యివ్విధమునఁ గమలభవుఁడు**
**నిశ్చయించె; నీవు నిర్మలశ్రద్ధాభి । పూతమతివి గమ్ము పుణ్యచరిత! (శాంతి. 5-250)**

**ఆ.** **వినుము శ్రద్ధ గలుగు మనుజుండు పాపంబుఁ । దొలఁగఁ ద్రోవనేర్చుఁ; దోలు డిగ్గ**
**నూద్వ వెరవు గలుగు నురగంబు చాడ్పునఁ । గాన మేలు శ్రద్ధధానుఁ దగుట.' (శాంతి. 5-251)**

**ఆ.** **'మత్సరాది చిత్తమాలిన్యములు శ్రద్ధ । గల మనంబునందు నిలువనేర'**
**వనినఁ దేటి యిట్టులనియె జాజలి తులా । ధారుతోడ నిభృతిఁ గౌరవేంద్ర! (శాంతి. 5-253)**

**క.** **మునులవలనఁ దత్త్వం బే । వినకుండుటఁ జేసి యిట్టివిధము గలిగె నా**
**కనఘా! నీ వాక్యంబుల । మనంబు దెలివొందె శాంతి మరగెద నింకన్.' (శాంతి. 5-254)**

**క.** **తన తన తెరువునఁ గర్మం బనుష్ఠితంబైన మేల యనఘ! నివృత్తిం**
**గని శ్రద్ధగూర్పగా నేర్పె నయంగా వలయు దాని యెడయం దతడున్ (శాంతి. 5-256)**

**ఆ.** **అట్లకాక యని ప్రియంబుమై వీడ్కొని । జాజలియును జనియె రాజవర్య!**
**యిహపరముల నెసకమెసఁగ సౌఖ్యము తులా । ధారుఁడును సమున్నతత్వ మొందె. (శాంతి. 5-257)**

# 123. చంపదగిన తప్పకు చంపుటయు వలయు-

జాజలికి ఆ విధంగా అహంకారం నశించి గొప్ప తపస్సు చేసి ముక్తినందినాడు
అని పలికి భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు- మేధాతిథి
అనే మునికి కుమారుడు చిరకారి. ఏ పనైనా ఆలోచించి చేస్తాడు
మేధాతిథికి ఎందుకో భార్యపై కోపం వచ్చి - 'ఈమెను చంపుము'

అని పలికి వెళ్లిపోయాడెక్కడికో! చిరకారి ఆలోచించాడు చాలాసేపు
-తల్లిని చంపలేను, తండ్రి ఆజ్ఞ మీరలేను- అని తర్కిస్తూనే ఉన్నాడు.
ఇంతలో పశ్చాత్తాపపడుతూ తండ్రి వచ్చి ఖడ్గపాణుడై కూడా తల్లిని చంపనివాడు
తన ఆజ్ఞ పాటించేందుకు ఆలోచిస్తున్న కుమారుడిని చూసి సంతోషించాడు.

ఆ విధంగా చిరకారి సార్థకనామధేయుడై చిరకాలం హాయిగా జీవించాడు
అని మరల భీష్ముడు చెబుతున్నాడు- నేను చెప్పబోయేది ద్యుమత్సేనుడు
అతడి కుమారుడు సత్యవంతుల మధ్య జరిగిన చర్చ- నేరం చేసినవారు
మరణశిక్షకు అర్హులు అని ద్యుమత్సేనుడనగా సత్యవంతుడన్నాడు వినయంగా-

మరణశిక్షకు బదులు మరొక దండన విధిస్తే బాగుంటుంది కాదా -అన్నాడు.
ద్యుమత్సేనుడన్నాడు- ఎవరైనా నేరం చేస్తే చురచుర చూడవచ్చు, తీవ్రంగా
మందలించవచ్చు, ధనం గ్రహించవచ్చు, అంగ విచ్ఛేదన చేయవచ్చు.
వధార్హమైన నేరానికి మరణదండన విధించాలి, లేకుంటే ప్రబలుతుంది అరాచకం.

---

చ. 'చిరముగ గర్భవాసమునఁ జెందితి పుత్ర చిరంబుగాఁగ ని
న్నరసె గదయ్య తల్లి; యనయంబును నేఁబనుపంగఁ బూనియుం
జిరమగునట్టి యిత్తెఱఁగుసేఁత దలంచితయేని సత్కృ పా
పర! చిరకారి నాబరఁగు భాసితనామము సార్థకం బగున్. (శాంతి. 5-285)

సీ. వధము ధర్మంబుగా బుధులు సెప్పుదు రని । యనుశాసనము సేయు జనకుతోడ
సత్యవంతుఁడు 'హింస కృత్యకర్మంబగు । నేని యకృత్య మిం కేది?' యనుడు
'మ్రుచ్చులు ప్రల్లదుల్ సచ్చువారల యట్లు । గాకున్న బాధలు లోకమునకుఁ
బుట్టవె?' యనిన నబ్భూపతి యమ్మాట । కతఁడు 'సంపుటదక్క నన్యదండ

తే. విధిన శిక్ష సెల్లించుట వెరవుగాదె?' । నావుడును బతి 'య ట్లేల నడచు? దృష్టి
దండ వాగ్దండ ధనదండ తనువికార । దండములు సేయునది తప్పు దర మెఱింగి. (శాంతి. 5-294)

క. విను చంపఁ దగిన తప్పున । కనఘా! చంపుటయు వలయు; నాప్పుఁడు బంధుం
డనుజుఁడు దనుజుఁడు ననుమ । న్ననయును దుష్టునెడ రాజునకుఁ బాప మగున్. (శాంతి. 5-295)

# 124. కపిల-గో సంవాదము

ధర్మరాజు అడిగాడు గృహస్థ సన్న్యాసాశ్రమ ధర్మాలలో ఏది గొప్పది?
భీష్ముడు చెప్పసాగినాడు కపిల-గోవు సంవాదమును ఈ విధంగా-
-నహుషుడి చేత పోషింపబడిన గోవును చూసి కపిలముని అన్నాడు
నీవు వేదస్వరూపిణివి కదా! -అక్కడే ఉన్నాడు స్యూమరశ్మి ముని.

అతడు సూక్ష్మాకృతితో గోవులో ప్రవేశించి- వేదాలు డంబాన్ని కలిగిస్తాయా?
అనగా కపిలుడన్నాడు- వేదాలంటే ఆదరము, అనాదరము రెండూ లేవు నాకు.
దేవయానాలైన బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాశ్రమాలు నాలుగూ
ఆత్మప్రాప్తికి సాధనాలే! అయితే యజ్ఞంలో హింస గురించి నా అభిప్రాయం నాది.

దేవతలకు సైతం చేతులు, ఉపస్థ, పొట్ట, వాక్కు అనేవి మూయరాని వాకిళ్లు.
ఆత్మజ్ఞుడైన పండితుడు మూసివేస్తాడు ఈ నాలుగు వాకిళ్లనూ
ఎదురుగా స్వర్ణరాశి ఉన్నా తనది కానిది పరిగ్రహించడం, కోపంతో ఇతరులను
కొట్టడం చేయనివాడు 'చేయి' అనే వాకిలిని మూసివేస్తున్నాడు, అదే విధంగా

భార్యతో తప్ప ఇతర స్త్రీలతో రమించనివాడు ఉపస్థను, శరీరధారణకు
అవసరమైనంత మాత్రమే తినేవాడు పొట్టను, అసత్యం పలకనివాడు
వాక్కును అలా నాలుగు వాకిళ్లను మూసివేసినవాడు అసలైన బ్రాహ్మణుడు
అతడికి తపస్సులు, యాగాలు, దానాలు, వ్రతాలు, వేదదాస్యం -అక్కర్లేదు.

---

తే. పుచ్చికొనఁడు ముందటఁ బైఁడిప్రోక యున్న; । నలుక నొడమియుఁ బొడువను నడువఁ దొడఁగ;
దట్టి యా నైష్ఠికుని చేత నడఁగకున్నె । పాణి యనియెడు వాకిలి బంధురముగ. (శాంతి. 5-319)

క. ఏ విధము కాంతనైనన్ । దా విహరణమునకు నెపుడుఁ దార్పఁడు తనయం
దావిష్టము భార్యావ్రత । మావెర వద్దం బుపస్థ మనువాకిటికిన్. (శాంతి. 5-320)

క. తనుయాత్రకుఁగా నశనము । గొనుఁ; భూర్ణముగాఁ గొనండు; గోరఁడు లౌల్యం
బున రాని దాని; నమ్మెయి । ముని యుదరద్వార మోపి మూసెన కాదే? (శాంతి. 5-321)

క. పలుకఁ దసత్యము, దూఱం । బలుకఁడు, బెట్టిదముగాఁగఁ బలుకఁడు, వాదం
బులకుఁ జొరఁడు వాణి యనం । గలవాకిలి యట్టి బుధుఁడు గప్పం జాలున్. (శాంతి. 5-322)

తే. ద్వారములు నాల్గు మూయంగ దక్షుఁడైన । వాఁడ చూవె బ్రాహ్మణుఁ; దట్టివాని కేల
తపములును యజనంబులు దానములును । వ్రతములును వేదకింకరత్వంబు దొడఁకు (శాంతి. 5-323)

క. జ్ఞానంబు నాశ్రయించిన వానికి నే పనులఁ గీడు వాటిల్లదు ప్ర
జ్ఞాన రహితుండు గా మాధీనత మెయిఁ గర్మసమితి త్రిప్పునఁ జిక్కున్ (శాంతి. 5-326)

# 125. ధనమా! ధర్మమార్గమా!

సర్వత్రా ఏకాత్మ భావనా ప్రాప్తి కలవాడు సంసారచక్రంలో చిక్కడు.
కర్మఫల త్యాగం చేసి మనసును నిగ్రహించి సంతోషంగా ఉన్నవాడు
మోక్షాన్ని పొందుతాడు. తెలిసికొనదగినది, తెలియబడినది
ఋతము, సత్యము, చరాచర జగత్తును భరించేది, సర్వాత్మకము

శుభము, అవ్యక్తము, బ్రహ్మము, ఉత్తరము, శివము, ప్రభవము
అవ్యయము, శాంతి, తేజము, క్షమ, అంబరము, ధ్రువము, అనామయము
అయి ఉండి బుద్ధికి మాత్రమే గోచరమయ్యే పరతత్వానికి
వేదవిజ్ఞానంతో పూజితులైన విప్రులకు నేనూ నమస్కరిస్తాను, ధ్యానిస్తాను-

అని కపిలుడు పలుకగా విని స్యూమరశ్మి సంతోషించాడు -అనగా
ధర్మజుడడిగాడు భీష్ముని- ధర్మార్థ కామాలలో ఏది గొప్పది?-
భీష్ముడు చెబుతున్నాడు కుండధారుడనే దేవసేవకుని కథను
-ఒక విప్రుడు యజ్ఞం చేస్తున్న చోటుకు వచ్చాడు కుండధారుడు

ఆ బ్రాహ్మణుడినడిగాడు- ఎందుకు చేస్తున్నావయ్యా యజ్ఞం.
అతడన్నాడు- ధనం కావాలి! అందుకే! - అప్పుడు కుండధారుడు
కుబేరుడి సేవకుడైన మణిభద్రుని తలచగా అతడు వచ్చినపుడు
ధనమిద్దామా, ధర్మమార్గమిద్దామా అని తర్కించి ధర్మమార్గాన్నిచ్చాడు.

---

క. **నను నెవ్వ రాశ్రయించిన । ధన మొసఁగుదు, రాజమిత్తుఁ; దద్దురితములం**
**దునుముదు; నను నగ్గలికలు । మనమున జనియింపఁజొచ్చె మనుజాధీశా! (శాంతి. 5-355)**

తే. **ఆతఁ డతిభక్తిఁ దలఁచె దేవానుచరుని; । నపుడ యక్కుండధారుండు నరుగుదెంచె;**
**నరుగుదెంచిన నతఁడు నిజానుభావ । జనితగంధ పుష్పములఁ బూజన మొనర్చె. (శాంతి. 5-357)**

ఉ. **చక్కఁగఁ జాగి మ్రొక్కుటయుఁ జయ్యన నెత్తి మనం బెలర్పఁగా**
**నక్కునఁజేర్చి యిట్లనియె నద్దివిజానుచరుండు 'శంక దాఁ**
**దక్కి ధనంబుఁ గామమును ధర్మముతోఁ గలయంగ నెన్నునే**
**యక్కట! యిట్లు వేదమని యప్పురుషార్థమునూఁద మే లగున్.' (శాంతి. 5-358)**

క. **'ఆ సుకృతముఁ గడయెయ్యి మ । హాసత్త్వా యోగసేవ నారామత ను**
**ద్భాసితుఁడ వగుచు నిష్ఠా । వ్యాసంగ విహారి వగు మనామయలీలన్.' (శాంతి. 5-360)**

క. **అని యతఁడు నిజనివాసం । బున కరిగెను విప్రవరుఁడు మునిజనములు పూ**
**జనము లొనరింప ఖేచరు । లనుమోదింప విహరించె నప్రతిహతుఁడై.' (శాంతి. 5-361)**

# 126. అపాయం లేని ఉపాయం

కుండధారుని ఆశీస్సులతో ధర్మమార్గాన్ని అనుసరించాడా విప్రుడు
అని పలికి భీష్ముడు– యజ్ఞ సమయాలలో చేసే హింస పాపం కాదు.
అది అహింసగా పరిగణించబడుతుందని నారదుడు దృష్టాంతం
చూపించాడని ధర్మజుడితో పలికి ధర్మాన్ని అనుసరించమని పలికినాడు.

అదేవిధంగా సహనంతో క్రోధాన్ని, సంకల్పం లేకపోవడంతో కామాన్ని
సత్త్వగుణాభ్యాసంతో నిద్రను, జ్ఞాన వైరాగ్యాలతో మోహభ్రాంతులనూ
మితభోజనంతో రోగాలను, అంతరాత్మ సందర్శనంతో ప్రాణ చేష్టనూ
అంత విరసతావేక్షణాన శబ్దాది విషయాలను, సంతృప్తితో లోభాన్ని

దయతో అధర్మాన్ని, తగిన సమీక్ష చేత కర్మమును తొలగించుకుని
ముక్తి మార్గాన్ని పొందుతాడు మునివర్యుడు –ఇది అపాయం లేని ఉపాయం.
ఒకసారి జనక మహరాజును అడిగాడు మాండవ్య మహాముని
'ఆశ' లేకుండా ఉండాలంటే ఏమి చెయ్యాలని!– అప్పుడు జనకుడన్నాడు

–'సంపదలు దుఃఖ నిలయాలు. మిథిల తగులబడుతున్నా అది నన్ను బాధించదు.
ఆశ వలన మమకారం పెరుగుతుంది, మమకారం తొలిగితే తృష్ణ ఎండిపోతుంది.
'ఇది నాది' అనే చింతన అన్ని ఆశలను పెంచి పోషిస్తుంది.
ఆశ లేమి వలన నిత్య సుఖం లభిస్తుంది' అన్నాడు జనకుడు.

---

**సీ.** క్షమఁ గ్రోధ, మకృత సంకల్పతఁ గామంబు, । చిరనిద్ర సత్త్వసంసేవనమున
గాఢధైర్యమున రాగద్వేషములు, భయ । మప్రమాదమున, మోహంబు భ్రమము
వినివర్తనాభ్యాసమున రోగములు నుప । ద్రవములు హితము మితంబు గాల
యోజితంబును నగు భోజనంబున జీవ । సందర్శనమున నిశ్శ్వాస మఖిల

**తే.** విషయములు నంతవిరసతా వేక్షణమున । నిత్యసంతోషమున లోభనిరతి కృప న
ధర్మ ముచిత కృతావేక్ష ధర్మ మవులఁ । ద్రోవనేర్పుట ముక్తికిఁ ద్రోవ యధిప! **(శాంతి. 5–370)**

**సీ.** 'అర్థముల్ దుఃఖదోషాకరంబులు విను । మేమిటిపై నాశ లేమిఁ జేసి
పొరయవు నను దుఃఖములు మునినాయక! । మిథిల గాలంగ నేమియును నాకుఁ
గాలని య ట్లుండెఁ; గామసుఖంబును । దివ్య సుఖంబునుఁ దృష్ణ విడుచు
సుఖముఁ బోలునె? యర్థసులభత తోడన । గోవుతోఁ బెరిఁగెడు కొమ్ములట్లు

**తే.** తృష్ణ దానును పెరుఁగుఁ; దదీయ శక్తి । మమత గలుగు మా బంధులు మా ధనములు
మా నివాసంబు లనమి మమత్వ మెదఁ ది । రంబు గాకున్న నింకుఁ దృష్ణాంబురాశి. **(శాంతి. 5–375)**

# 127. పరమమగు పదంబు తంగేటి జున్ను

మేధావి అనే విప్ర కుమారుడు తన తండ్రితో చర్చిస్తున్నాడు ఆయువు గురించి
తండ్రి అన్నాడు– బ్రహ్మచర్యం, వేదాధ్యయనం, సంతానం పొందడం
యజ్ఞం చేసి ఆ పిమ్మట వానప్రస్థం, సన్న్యాస వ్రతం చేబట్టడం మేలు.
అప్పుడు మేధావి అన్నాడు– పుట్టిన నాటి నుంచి ముదిమి, మరణం వెంటబడుతూంటాయి.

అందుకని ఎప్పటి పనులు అప్పుడే చేసివేయాలి. ఈ శరీరంలోనే
మృత్యువు, అమృతత్వం ఉన్నాయి– సంసార వ్యామోహమే మృత్యువు.
తత్త్వజ్ఞానమే అమృతత్వం– అంతేకాక నేను హింసతో కూడిన
ద్రవ్యయజ్ఞం చేయను, శాంతియజ్ఞంతో నియమంగా చేస్తాను బ్రహ్మయజ్ఞం.

యోగం, తపస్సు, ఇంద్రియాసక్తిని త్యజించడం శ్రేయో విషయాలు.
విషయాసక్తి దుఃఖకరం, త్యాగం అత్యంత సుఖప్రదాయకం
తండ్రీ నేను నీకు సంతతిని, నాకు సంతతి అక్కర్లేదు, నేను
గృహస్థ ధర్మం స్వీకరించను –అని పలికాడు మేధావి తన తండ్రితో.

ఆ విషయాన్ని భీష్ముడు చెప్పగా ధర్మరాజడిగాడు పితామహుని–
ఏ విధమైన స్వభావం కలవాడు మోక్షప్రాప్తికి అర్హుడౌతాడు?
భీష్ముడన్నాడు– మితాహారం స్వీకరిస్తూ, ఇంద్రియాలను గెలిచి
ఉత్తమ ధర్మాలను పాలించేవాడికి బ్రహ్మపదమందుతుంది తంగేటి జున్నులా.

---

**క.** ‘కృత మిది యకృతం బిది యిది । కృతాకృతంబనుచు నరుఁడు కింకర్తవ్య
త్వతిరోహితాత్మహిత సం । స్మృతియైనఁ గృతాంతుఁ డతనిఁ జేర్చుఁ దనపురిన్. (శాంతి. 5–383)

**క.** అనఘా! మృత్యువు నమృతం । బును దేహమునంద కలవు; మోహము మృత్యు
త్వనిరూఢ మున్నరూపుం । గనుటమృతత్వోపహితము గాఁగ నెఱుఁగుమీ. (శాంతి. 5–384)

**ఉ.** కావున లోకసంక్షయము గన్గొని యెల్లెడ నిర్మముండ వై
నీవును శాంతియున్ సమత నిష్ఠయుఁ బూని గుహాప్రవేశ సం
భావన నాత్మదర్శన విభాసివి గమ్మనినం దదీయ వి
ద్యావచనంబులం జనకుఁ డట్టిఁడ యై వెలిఁగెం గృతార్థతన్. (శాంతి. 5–388)

**తే.** అధిప! లఘ్వాశియై యింద్రియప్రపంచ । జయము గలిగి మోక్షార్థోక్త సారధర్మ
నిరతి నుండెడి వానికిఁ బరమ మగు ప । దంబు తంగేటిజున్ను చందంబు నొందు.’ (శాంతి. 5–391)

**–** అమృతం చైవ మృత్యుశ్చ ద్వయం దేహే ప్రతిష్ఠితమ్
మృత్యురాపద్యతే మోహాత్ సత్యేనా పద్యతేఽ మృతమ్ (సం.శాంతి. 277–29)

# 128. హారీత గీత - వృత్రగీత

ధర్మరాజా, నేనిపుడు– 'హారీత గీత' అనబడిన ధర్మాలు చెబుతాను.
హారీతుడనే ముని సన్న్యాస ధర్మాలివి అని పలికినాడు– ఆత్మ నిష్ఠ
కలిగి సన్న్యాసి ఇల్లు వదలి, ఏకాంతంగా గుడిలోనో, చెట్టు వద్దనో
కొండ గుహలోనో నివసించాలి. తన చూపులు, మాటలు, పనులు

ఎవరికి ఇబ్బంది కలిగించరాదు; మిత్రుత్వం, సమత్వం, దయ కలిగి ఉండాలి.
భిక్షాటనతో జీవించాలి, గృహస్థులను నొప్పించరాదు. తనను
ఎక్కువగా అభిమానించే ప్రజలున్న చోట ఉండరాదు. ఎల్లప్పుడూ
ఆత్మదర్శనాభిలాషియే మనస్సు కల్మషం లేకుండా శుద్ధిగా ఉండాలి.

ధర్మజుడన్నాడు– నాకూ సన్న్యాస వృత్తిపై అభిలాష పెరుగుతున్నది.
భీష్ముడన్నాడు– నీవు రాజువు, చిత్త దోషాన్ని తొలగించుకుని
కాలక్రమేణా వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలు స్వీకరించుదువులే!
– వృత్ర గీత గా పేరుపొందిన వృత్రుడి సూక్తులు వినుము నీవు–

వృత్రాసురుడు యుద్ధంలో ఓడి, పడిపోయి నిర్వికారంగా ఉండగా అతడిని
శుక్రాచార్యుడు అడిగాడు– నీ మనశ్శాంతికి కారణమేమిటని?
వృత్రుడన్నాడు– నేను గెలిచాను, నేను ఓడాను; నాకు సంపదలు
ఉన్నాయొకప్పుడు, ఇప్పుడు లేవు, అనిత్యమైన దానికెందుకు విచారం?

---

**సీ.** వారి కి ట్లనియె 'నిష్కారంభమతి నిలు । వెడలి కోర్కుల కెల్ల విముఖుఁ డగుచు
జనములకీడు వాక్చక్షుర్మనోవర్త । నములఁ గూర్పక మైత్రి సమతఁ గరుణ
గలిగి, నిందాప్రశంసల ఖేదమును నుబ్బు । లేక పాడింటను నేకతంపు
గుడి మ్రాని పొంతను గుహలోన నుండుచు । దంపకములకు వంటకములకును

**తే.** భోజనములకుఁ దఱియైన ప్రొద్దు గడపి । భిక్ష గొనుఁ బ్రీతి మన్నన పెద్దవెట్టు
నట్టియెడఁ దక్కి క్రొత్తగా నరుగు యతి ని । రంతరంబు నాత్మారాముఁ డై చరించు. (శాంతి. 5-393)

**తే.** కలిమియును లేమియును విను కాలవశగ । తములు; బోధవిహీనుల దర్ప దైన్య
కలితసుఖదుఃఖములఁ బెట్టుఁగాక యర్థ । ముల యనిత్యత యెఱిఁగినఁ గలదె వికృతి? (శాంతి. 5-398)

**వ.** అర్థంబుల యస్థిరత్వంబ కా దాకర్ణింపుము. (శాంతి. 5-399)

**క.** దైవతమానుష తిర్య । గ్భావంబులఁ బొందుచును వికారిణియై భూ
తావలి దిరిగిన వెంటన । వే విధములఁ దిరుగుఁ గర్మవివశత్వమునన్. (శాంతి. 5-400)

**క.** ఏ నిది యంతయు నెఱుఁగుదుఁ । గాన వగపు నుబ్బు నాకుఁ గలుగ' వనుడు ని
మ్మాన విహీనపు మాటలు । దానవకులనాథ! నీకుఁ దగునే యాడన్.' (శాంతి. 5-401)

## 129. భూత విక్షేప సంహారాలతడి మానస స్వైరలీలలు-

వృత్రుడన్నాడు- నేను ఇంద్రుడితో యుద్ధం చేసినపుడు లీలగా చూసాను
ఆద్యుడు, అనంతుడు అయిన విష్ణువును; అతడి మహిమ ఎటువంటిది?
అప్పుడు అటుగా వచ్చిన సనత్కుమారుడు శుక్రుడి అభ్యర్థనపై
విష్ణుని మహిమ చెబుతున్నాడు- అతడికి పాదాలు భూమి-

శిరస్సు స్వర్గం, భుజాలు దిక్కులు, సృష్టి సంహారాలు అతడి లీలలు,
జీవావస్థలు ఆరు వర్ణములు- నలుపు, జేగురురంగు, ఆకుపచ్చ,
పసుపు, ఎరుపు, తెలుపు ఇవి కర్మవిశేషం వలన కలిగే అవస్థా భేదాలు
దేవత్వ, మానుషత్వాది అవస్థలు కర్మఫలంగా జీవికి చెందుతాయి.

రసవాద క్రియ తెలిసినవాడు దారాన్ని బంగారం చేయడానికి శుద్ధి చేసినట్లు
నువ్వుల వాసన తొలగించడానికి మంచి వాసన పూలతో కలిపి ఉంచినట్లు
పుణ్యకర్మలు, పాప కర్మలను బట్టి వర్ణం మారుతూ వచ్చి
శుక్ల వర్ణ రూపుడైనపుడు విష్ణు ధ్యానం చేసి ముక్తుడౌతాడు-

వృత్రుడు అదేవిధంగా విష్ణుధ్యానం చేసి పరిశుద్ధుడై ప్రాణాలు వదలినాడు.
ఆ విధంగా అతడు విష్ణు సన్నిధికి చేరినాడు ప్రకాశమానుడై-
అని భీష్ముడు తెలపగా ధర్మజుడన్నాడు- ఇంద్రుడికి, వృత్రుడికి
యుద్ధానికి కారణమేమిటి, ఎలా చేసారు వారిద్దరూ సమరం?

---

**తే.** **తన్ను నుత్తమ మధ్యమాధమము లైన । ఛాయ లొందంగఁ బ్రచ్చుర పర్యాయవృత్తి**
**జీవుఁ దమరత్వ ముఖ్యనానావిధముల । నొంది యెక్కుచు డిగ్గుచు నుండుఁ జూవె. (శాంతి. 5-414)**

**క.** **మే లొనరింపఁగ దొరకొను । మేలిమి గలచాయ కీడు మెయికొని చేయన్**
**లోలత్వరహిత! చాయకుఁ । జాలం గీడ్పాటు వొలయు చందము వచ్చున్. (శాంతి. 5-415)**

**క.** **రసకర్మజ్ఞుఁడు దారము । పసిండి సేఁతకుఁ బ్రయత్నపరుఁడై శుద్ధ**
**త్వసమగ్రము సేయుక్రియ । న్విసువక పరిశుద్ధి జీవునికిఁ జేయు టురున్. (శాంతి. 5-417)**

**క.** **విను కుసుమంబుల వాసిం । చిన నొప్పని కంపు విడిచి చెందును సౌర**
**భ్య నిరూఢిం దిలలట్టుల । యనఘా! సుకృతముల జీవుఁ డకలంకుఁ డగున్. (శాంతి. 5-418)**

**క.** **అంతంతకు సత్కర్మము లెంతయుఁ బెనుపొంద జీవుఁడెక్కుడు చాయన్**
**జింతాకలుషము వాయఁగ సంతోషామృతము నాని సంశుద్ధుఁడగున్ (శాంతి. 5-419)**

**క.** **జీవుఁడు శుక్లచ్ఛాయా । భావితుఁడైనపుడు విష్ణు భావించుటకున్**
**దా వెరవరి యగుఁ దద్గత । భావ మొసఁగు గుఱుము లేని పండగునెలవున్. (శాంతి. 5-421)**

# 130. ఇంద్ర వృత్రాసురుల యుద్ధం

ఇంద్రుడు ఉజ్జ్వల రథమెక్కి దేవతల సైన్యంతో దండెత్తినాడు వృత్రునిపై.
వృత్రుని ధాటికి ఇంద్రుడు మూర్ఛపోగా వసిష్ఠుడతనిని తేరుకునేట్లు చేసినపుడు
మునులందరూ ప్రార్థించగా రుద్రుడి తేజస్సు మహోద్ధత జ్వరమై
వృత్రుడిని ఆక్రమించ, విష్ణువు ఇంద్రుడి వజ్రాయుధంలో ప్రవేశించగా

అప్పుడు ఇంద్రుడు కొట్టిన దెబ్బకు నేలకూలినాడు వృత్రాసురుడు.
ఆ విధంగా పడిపోయిన వృత్రుడు సనత్కుమారుడు చెప్పిన
విష్ణు మహిమను గ్రహించి, అతడినే ధ్యానిస్తూ ప్రాణాలు వదిలాడు.
అయితే, వృత్రుడిని చంపినందుకు బ్రహ్మహత్యా పాతకం కలిగి

ఇంద్రుడినది వేధించగా, అతడు వెళ్లి దాక్కున్నాడు తామరతూడులో
చిన్న కీటకంలా– అక్కడకు కూడా బ్రహ్మహత్యా దోషం వెంబడించ
బ్రహ్మ చెప్పిన విధంగా ఇంద్రుడా దోషాన్ని పంచినాడు ఓషధులకు
స్త్రీలకు, నీటికి, అగ్నికి సమానంగా, ప్రాయశ్చిత్తాన్ని కూడా చెప్పినాడు.

చెట్లను ఓషధులను పండుగనాడు నరికిన, పెరికిన వారికి ఆ దోషం,
రజస్వల కాలంలో సంగమించిన పురుషునకు స్త్రీలకు చెందిన దోషం
మలమూత్రాలు నీళ్లలో వదిలేవాడికి జలంలోని బ్రహ్మహత్యా దోషం,
అగ్ని మండనప్పుడు దానిలో హవిస్సు వేసేవాడికి చేరుతుంది దోషం.

---

**చ.** **హరునకు మ్రొక్కి 'మీ కరుణ నార్తి దొఱంగి యనూన సౌఖ్యముం**
**బొరసితి' నంచు వీడుకొని పోయె మహేంద్రుఁడు బ్రహ్మహత్య యా**
**సురపతి నప్డు వెన్కొనియెఁ జొచ్చె బిసాంతర మాతఁ డందునుం**
**బరిగొని యుగ్రవృత్తి నది పట్టెఁ జలంబున నమ్మహాత్మునిన్. (శాంతి. 5-430)**

**తే.** **ఒదవు వృత్రురక్తమున బుద్బుదము లెసఁగి । పుట్టకొక్కులై యవి జనభోజ్యభావ**
**మొంది విప్రాదికద్విజ యోగ్యతాభి । పన్నములు గావు ధర్మసంపన్న చరిత! (శాంతి. 5-433)**

**చ.** **అతఁడు గడంగ దేవగురుఁ డప్డు మునీంద్రులుఁ దాను నమ్మరు**
**త్పతి విజయంబు గోరి హరుఁ బ్రార్థన సేయఁ దదీయతేజ ము**
**ద్ధత చటులజ్వరం బగుచు దైత్యపతిం బొదివెన్ సురేశ్వరో**
**ద్యతకులిశంబుఁ బొందె హరి దత్సమయంబునఁ గౌరవేశ్వరా! (శాంతి. 5-434)**

**–** **వ్యజృంభత తతః శక్రః తస్మై వజ్రమవా సృజత్**
**ప్రవిశ్య వజ్రం వృతం చ దారయమాస భారత (సం.శాంతి. 283-59)**

# 131. శివ జ్వర స్వరూపం

అగ్నిలో ధూమం, చెట్ల జిగురు, స్త్రీల రజస్సు, నీళ్లలోని మురికి
వృత్రుని చంపగా ఇంద్రుడికంటిన బ్రహ్మ హత్యాదోషపు భాగాలు-
బ్రహ్మ అనుగ్రహంతో బ్రహ్మహత్యా దోషం పోగొట్టుకుని ఇంద్రుడు
అశ్వమేధ యాగం చేసి స్వర్గాధిపతిగా మరల పూజలనందుకున్నాడు.

అని వృత్రాసుర సంహారాన్ని చెప్పగా విని ధర్మజుడడిగాడు భీష్ముని
ఈ జ్వరమేమిటి? శివుని వలన ఎలా పుట్టింది? ఇది ఎటువంటిది?
అప్పుడు భీష్ముడు చెప్పినాడు- దక్షుడు యజ్ఞం చేస్తూ తన కుమార్తె
సతీదేవిని, శివుడిని ఆహ్వానించలేదు - శివునికి యజ్ఞభాగం లేదు కనుక

ఈశ్వరుడు వెళ్లలేదు. తన భర్తను పిలవలేదని సతీదేవి
ముభావంగా ఉండడంతో శివుడు దక్షయజ్ఞ ధ్వంసం చేసాడు.
అతడి నుదుటి నుండి పడిన చెమటచుక్క మహాగ్ని కాగా
పుట్టిన 'జ్వర' రాక్షసుడి వేడిని లోకాలు భరించలేకపోవడంతో ఆ వేడిని

ఏనుగులకు తలనెప్పిగా, పాములకు కుబుసంగా, జంతువులకు గిట్టలలో నెప్పిగా
గుర్రాలకు పక్కలు శుష్కించుటగా, జింకలకు స్వస్వరూప దర్శన నిరోధంగా
నెమళ్లకు ఈకలు ఊడునట్లుగా, కోకిలలకు నేత్రవ్యాధిగా, చిలుకలకు వెక్కిళ్లుగా
మేకలకు తిక్కగా, పులులకు శ్రమగా, మనుషులకు జనన మరణ వేదనగా పంచినాడు.

---

**సీ. రజతాచలంబున రత్నతటంబున । నంబికాసహితుఁడై హరుఁడు పేర్మి**
**సమరమునీంద్ర యక్షాదులు గొలువంగ । నుండు; నట్లుండంగ నొక్కనాఁడు**
**దేవర్షికోటు లతిప్రమదంబునం । జనఁ జూచి 'వీ రేమిపనికి నెచటి**
**కరిగెద?'రని పతి నడిగె భవాని; యా । తఁడు 'దక్షుచేయు నధ్వరమునందుఁ**

**తే. దమహవిర్భాగములు గొనుదాని' కనినఁ । 'బొలఁతి నీ వేల పో?' వను పలుకు పలికె;**
**'నాకు మును భాగపరికల్పనంబు లేమి । నతఁడు బిలువఁ; దేసును బోవ' ననియె భవుఁడు. (శాంతి. 5-437)**

**సీ. దేవిచిత్త మెఱింగి దేవుండు ప్రమథసం । ఘంబులు దాను నా క్రతువు సెఱుప**
**నరిగె; యజ్ఞాంగంబు లన్నింటిఁ బ్రమథులు । గాసి సేయుచును రక్తములు సల్లి**
**యార్పంగ మృగరూపమై గగనంబున । కెగసె; నధ్వరము మున్నీశునుదుట**
**నలుకఁ బుట్టిన ఘర్మజల కణ మిలఁ బడ్డఁ । బెనుమంట లెగసిన జనితుఁ డయ్యె**

**ఆ. నందుఁ బురుషుఁ డొకరుఁ దరుణ నేత్రకము నీ । లంబు నూర్ధ్వరోమకంబు ఘోర**
**భంగికంబు నైన యంగంబుతో సప్త । తంతుదాహి యగుచు ధరణినాథ! (శాంతి. 5-439)**

# 132. భార్గవుడు శుక్రుడగుట-

ఆ విధంగా ఈశ్వర జ్వరం వేర్వేరు రూపాలు పొంది బహిర్గతమౌతూ ఉంటుంది-
అని పలికి భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు మానవుడెలా జీవించాలి
అన్న ధర్మజుని ప్రశ్నకు సమాధానంగా నారద, గాలవ మునుల చర్చను.
-దుర్జన సాంగత్యము, కపట వృత్తి విడనాడి అలవరచుకోవాలి మధురవాక్ వృత్తి.

అహంకారము తగ్గించుకుని, ఇంద్రియాలను నియంత్రించుకుని, అతిధులను
గౌరవిస్తూ, వేద వేదాంగ అభ్యసనం, యజ్ఞాచరణం చేస్తూ జీవించాలి-
సగరుడనే రాజుకు అరిష్టనేమి చెప్పాడు- భవబంధాలు అతి గట్టివి,
వృద్ధాప్యంలో ముక్తిమార్గం ఆలోచించుకుని బంధాలను తెంచుకోవాలి.

మోక్షకాంక్ష శ్రేయోమార్గం, లోక ప్రవృత్తి గల సంసారచక్రం ప్రేమోమార్గం-
సమదృష్టితో జీవించాలి. అంతిమ గమ్యం మోక్షమై దానికై ప్రయత్నించాలి-
ఈ విషయాలన్నీ శ్రద్ధతో విన్న ధర్మరాజుకు భీష్ముడు చెబుతున్నాడు-
భార్గవుడు యోగబలంతో కుబేరుడి సంపదలనన్నిటినీ వశం చేసుకోగా

నొచ్చుకున్న కుబేరుడా విషయాన్ని త్రిపురాసుర సంహారకర్త తన మిత్రుడైన
శివుడికి చెప్పగా, శివుడు త్రిశూలాన్నెత్తి భార్గవుడున్నవేపుకు వస్తుంటే
అతడు పొదల్లో దాగి ఉంటే శివుడు గమనించి అతడిని పట్టుకుని మింగివేసాడు, దానితో
ఎటూ పోవడానికి దారిలేక తెరచి ఉన్న ఒకే వాకిలి పురుషాంగం ద్వారా బయటపడ్డాడు.

---

తే. శూల ముగ్రత నెత్తి 'యెచ్చోట నున్న । వాఁడు భార్గవుఁ?' డనుచు దుర్వారకోప
నివశుఁ డగుటయు? నాతఁడు వెఱచి చాల । దూరముగఁ బోయి తుప్పలఁ దూలియుండె. (శాంతి. 5-470)

ఆ. కడుపులోన నుండి కలగొనఁ బాఱెడు । విబుధవైరిగురుఁడు వెడలకుండు
నట్లుగాఁగఁ దెరువులన్నియు మూసి శి । శ్నంబు మూయ కంగజన్మరిపుఁడు. (శాంతి. 5-472)

క. వెడలుమని తెరువు సూపిన వెడలెను భృగునందనుండు; వెండియుఁ గోపం
బడరగ నాతని గనుగొని యెడు రుద్రుని జూచి దేవి యిట్లనియె నృపా (శాంతి. 5-473)

క. 'నీ కడుపున జన్మించుట । నాకుం గొడుకయ్యె నితఁడు; నా సుతునకు సు
శ్లోకా! యలుగం దగునే । నీకు? సుఖిం జేయు మీతనిం గృపతోడన్.' (శాంతి. 5-474)

తే. అనినఁ దేజస్విఁ జేసి చంద్రార్ధ మౌళి । శిశ్నమున నిర్గమించుటఁ జేసి యితఁడు
శుక్రుఁ డనుపేర వర్తించు; సుదతి! నీకుఁ । బ్రియ మొనర్చితి ననియె సంప్రీతితోడ. (శాంతి. 5-475)

తే. 'అనఘ! యిది భార్గవుఁడు శుక్రుఁడైన తెఱఁగు' । నావుడును ధర్మజుఁడు శాంతనవునితోడ
'నీదు వాక్యామృతమున నా నెమ్మనంబు । తృప్తి సనదు; సద్ధర్మంబుఁ దెలుపు' మనియె. (శాంతి. 5-476)

# 133. పరాశర గీత

అలా బయటపడిన భార్గవుడు శుక్రుడుగా పిలువబడి రాక్షస గురువైనాడు.
కుబేరుడి సంపదలు కుబేరుడికి దక్కినాయి. శుక్రనామం భార్గవుడికి దక్కింది.
భీష్ముడు చెబుతున్నాడు– పరాశరుడు జనకునికి బోధించిన విషయాలు
–ఇహపర సుఖాలు కర్మఫలితాలు, సత్యం, దమం, అహింస సన్మార్గాలు.

పాపరహితుడైన రాజు తెలివి అనే పగ్గాలతో ఇంద్రియాలనే గుర్రాలతో
లాగబడే 'కోరిక' అనే రథాన్ని అపమార్గంలో పోనీయకుండా చేస్తాడు కట్టడి.
శరీరానికి దుర్లభమైన ఆయువు దొరికినపుడు పుణ్యకార్యాలతో కాపాడుకోవాలి.
స్తోత్రం, తపస్సు, ధర్మాచరణం, వేదం, అగ్నిహోత్రం శుభాలను కలిగిస్తాయి.

మనోనిగ్రహమైన శమము, బాహ్యేంద్రియ నిగ్రహమైన దమము లేకున్న
హింస ప్రబలుతుంది. మనస్సుకు శమదమాలు అలవాటు చేయడమే –అహింస
నిస్సంగత్వము మేలు, మంచి జ్ఞానము పరమగతి, తపోఫలం ఉత్కృష్టము
లక్కరసము డండాదులను పట్టుకున్నట్లు మనసును ఇంద్రియ విషయాలు పట్టుకుంటాయి.

కదళీగర్భ సారము సంసారము; తామరతూడుకు అంటిన బురద సంసారము
కామావేశమున్నవాడు బరువైన పడవలా సంసార సాగరంలో మునిగిపోతాడు.
గుహ్యేంద్రియ తృప్తి, కుక్షింభరత్వమును పరిత్యజించుట శుభప్రదము
అని పరాశర మహర్షి చెప్పగా ఎంతో సంతోషించినాడు జనక చక్రవర్తి.

---

**క.** **విను సుమతి విషయములయం । దునికి గలిగె నేనిఁ బొందఁ దుదకంబులఁ బొం**
**దని బిసరుహపత్త్రము చా । డ్పున నది విజ్ఞానఫలము భూపవరేణ్యా! (శాంతి. 5-527)**

**తే.** **అనఘ! మూఢాత్ము చిత్తంబునందు విషయ । జాల మత్యంత గాఢసంసక్తి నొందు**
**లక్కరసము దండాదుల జిక్కఁబట్టు । చందమున దీనిఁ గనుట ప్రశాంతికరము. (శాంతి. 5-528)**

**క.** **ఇనరుచిఁ బాషాణము ర । శ్మి నిరూఢం బైనయట్ల చిత్తము సద్భా**
**వనమున సదాత్మకం బగు । ననామయ స్థితికి మూల మది మనుజేంద్రా! (శాంతి. 5-529)**

**క.** **ఆరయఁ గదళీగర్భా । సారము సంసార; మిట్టిచంద మెఱిఁగినం**
**జేరవు జనన మరణములు; । గారించును దీని భంగిఁ గానక యున్నన్. (శాంతి. 5-530)**

**క.** **నరనాయక! శిశ్నోదర । పరాయణుం డగుచు నొందు పరికింపని దు**
**ర్నరుఁ డెలుకఁ బిల్లి వొదివిన । పరుసున జర వొదువ ముక్తిఁ బడయక పొలియున్. (శాంతి. 5-534)**

**–** **వ్యవసాయం సమాశ్రిత్య సహాయాన్యో ధిగచ్ఛతి**
**న తస్య కశ్చిదారంభః కదాచి దవ సీదతి (సం.శాంతి. 298-42)**

# 134. హంసగీత

ధర్మరాజు అడిగాడు దమము, సత్యము, సహనముల గురించి భీష్ముడిని.
భీష్ముడు చెబుతున్నాడు– బ్రహ్మ ఒకనాడు బంగారు హంస రూపంలో
స్వేచ్ఛగా సంచరిస్తూ ఉండగా సాధ్యులు చూసారు కుతూహలంగా
వాళ్లడిగారు హంసను– నీకు అనేక ధర్మాలు తెలుసని అనుకుంటున్నారందరూ.

పరమహంసా! ఈలోకంలో ఉత్తమమైనదేది? కర్మబంధాలనెలా తెంచుకోవాలి?
ఆ హంస ఇలా పలికింది– క్షమ, దమ, సత్యములు అజ్ఞానం వలన
ఏర్పడిన ముడులను తెగగొడ్తాయి. 'ఇది నాది' అనే తత్వాన్ని విడగొడతాయి.
సత్యమనేది వేదసారము; సత్యసారము ఇంద్రియ నిగ్రహ రూప దమము.

సహనం నా లక్షణం, ఇంద్రియ నిగ్రహసారం ముక్తి అని నాకు తెలిసిన నిజం.
తగిన మాటలు, సత్యపూర్వకమైన మాటలు, ధర్మపద్ధతిలో మాట్లాడే మాటలు,
అందరికి ప్రీతిగా మాట్లాడే మాటలు ఇవి మౌనంకన్నా ఎంతో మేలైనవి.
అవివేకంతో ఆవరించబడిన లోకంలో లోభ మాత్సర్యాలు మానవుడి వెలుగు తగ్గిస్తాయి.

ఆత్మజ్ఞాన సంపన్నుడైనవాడు కలహాలకు దూరంగా ఉంటాడు, వేదాధ్యయన శీలి
దేవత్వాన్ని పొందుతాడు, పుణ్యకర్మలతో సాధువుగా పొందుతాడు ప్రశస్తి.
నిందాశీలముతో దుర్జనుడిగా, శౌచవిహీనతతో మరణభీతితో దీనుడై
మనిషిగా రూపొందుతాడు దివ్యత్వాన్ని కోల్పోయి– అని పలికాడు హంసరూప బ్రహ్మ.

---

**చ.** **పలుకక యుండుకంటెఁ దగఁ బల్కుట మేలు; వినుండు! సత్యముం**
**బలుకుట ధర్మమార్గమునఁ బల్కుట సర్వజన ప్రియంబుగాః**
**బలుకుట యోలి నెక్కుడగు భంగులు; వీని నెఱింగి యొండుమైఁ**
**బలుకక నాల్గుచందములఁ బల్కఁగ మెత్తురు వాని దేవతల్. (శాంతి. 5-555)**

**ఉ.** **ఆనతవైరి! యిట్టులను హంసము వారలతోడ 'లోక మ**
**జ్ఞానముచేత నావృతము సంభృతమత్సరుఁడైన వే ఱగుం**
**దాను బ్రకాశసంపదకుఁ దన్ విడిచుం దెగి మిత్రకోటిలో**
**భానుగతిన్ విమోక్షపద మందదు సంగముకల్మి నెమ్మెయిన్. (శాంతి. 5-560)**

**చ.** **అనుటయు హంస మిట్టులను 'నధ్యయనంబున దేవభావముం**
**గను; వ్రతవృత్తి సాధువనఁగాఁ జరియించు; జనం బసాధు నాఁ**
**జనుఁ బరివాదశీలమున; శౌచవిహీనత మృత్యుభీతి వొ**
**దిన మదిలోన నెక్కొనిన దీనత విప్రుఁడు మానుషం డగున్.' (శాంతి. 5-567)**

# 135. యోగమార్గం

ప్రత్యక్ష హేతువాదులు యోగులు, శాస్త్రార్థ నిపుణులు కదా సాంఖ్యవాదులు
భూతదయ, వ్రత నిర్వహణ, శుచిత్వం రెండిటికి సమానమే కదా, మరి
శాస్త్ర దర్శనము వేరు వేరుగా ఎలా ఉన్నది? -అని ధర్మజుడడుగగా చెబుతున్నాడు
భీష్ముడు- రాగమోహ కామక్రోధ దీర్ఘ కాలిక స్నేహ నిరోధమైనది యోగం.

పెద్ద చేప వలను చింపినట్లు, పెద్ద మృగం కట్టుతాడును తెంపినట్లు
యోగి పాపబంధాలను తొలగించి సంచరిస్తాడు సన్మార్గము నందు.
అల్పమైన అగ్నిపై కట్టెలు పడవేస్తే ఆరిపోతుంది; మహాగ్నిలో కట్టె కాలిపోతుంది.
బలమైన నదీ ప్రవాహం బలహీనుడిని లాగివేస్తుంది, అజ్ఞానిని లాగేస్తాయి ఇంద్రియాలు.

మదించిన ఏనుగు నదీ ప్రవాహాన్ని దాటుతుంది, యోగి దాటుతాడు సంసారాన్ని
విలుకాడు లక్ష్యాన్ని ఛేదించినట్లు, మనిషి నేతికుండను నెత్తిపై మోసుకుంటూ
మెట్లెక్కినట్లు, రథసారధిలా, పడవ కర్ణధారిలా యోగధారణ తెలిసినవాడు
ధీరచిత్తుడై ఆత్మను నడిపిస్తాడు మంచిమార్గంలో; ఆత్మను సందర్శిస్తాడు.

మితాహారిగా, నిస్సంగుడిగా, అసిధారావ్రతమాచరిస్తూ యోగి చరిస్తున్నపుడు
సరిత్ సముద్ర క్షితిపర్వత ద్వీపాలు క్రీడాస్థానాలవుతాయి, గుహలు, గుడులు
నివాస స్థానాలవుతాయి. యోగి విముఖుడైతే ప్రజలకు కలుగును అశుభాలు.
ఆదియోగి శివునియట్ల సమకూరును శుభములు సుముఖుడైన యోగితో.

---

**చ.** **ఘనరుషమున్ సముద్ధతమృగంబును జాలము వ్రచ్చి వాగురా**
**వినిహతిఁ జేసి యిష్టపదవిం జను చాడ్పున యోగతంత్రరో**
**ధనమగు లోభ జాత దురితవ్రజముం బెడఁబాచి సత్పథం**
**బునఁ జరియించు యోగి సుఖమూర్తిత సుస్థితగా వహించుచున్. (శాంతి. 5-577)**

**సీ.** **అనవుడు నతనితో నతఁడు 'సుస్నిగ్ధంబు । లైన యాహారముల్ మానువాఁడు**
**యోగి; నీరసముల నుదకంబులను జాల । నాఁకలి పుచ్చుచు నవియు నుదర**
**మధికపూర్ణంబగు నట్లుగాఁ గొనక వ । ర్తించుట బలము వర్ధింపఁజేయు'**
**నని చెప్పి వెండియు నమఁ 'గామమును గ్రోధ । మును నిద్రయును దృష్ణయును భయంబు**

**తే.** **రతియు నరతియుఁ బవనంబుగతియు నుడిపి । ధారణా నిశ్చలుం డయి తన్నుఁ దాన**
**కనుచునుండెడు యోగి దుర్గంపుఁజోటు । వెడల నరిగి సుఖస్థానవిభవ మొందు. (శాంతి. 5-592)**

**-** **కథా చమేయం నృపతే ప్రసక్తా దేవే మహావీర్యమతౌ శుభేయమ్**
**యోగీ స సర్వానభిభూయ మర్త్యాన్ నారాయణాత్మా కురుతే మహాత్మా (సం.శాంతి. 300-62)**

# 136. సాంఖ్య స్వరూపం

సత్త్వరజస్ తమోగుణ మిశ్రిత సామ్యావస్థ ప్రకృతి. పదహారు వికృతులకు
ఆధారమిది. ఆత్మతేజోసంపన్నమై ప్రకృతి కాదు వికృతి కానిది.
జీవాత్మ పరమాత్మలుగా ఉన్న ఆత్మ అవిద్యకు లోనై ఉంటుంది జీవాత్మగా.
జ్ఞానం కలిగి పరమాత్మను చేరుకుంటుంది ఆత్మదర్శనం ద్వారా

పాయువు ఒక్కటే కాని అది ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములని
అయిదు విధాలు– హృదయంలో ప్రాణం, గుదంలో అపానం, నాభిలో సమానం
కంఠంలో ఉదానం, సర్వశరీరంలో ఉండేది వ్యానం –ప్రాణాయామాది
క్రియలతో వాయు నిరోధం చేసి, మనస్సును నిశ్చలం చేస్తే కానవస్తుంది పరమాత్మ.

పుణ్యకార్యాల వలన దైవత్వాన్ని, పాపకార్యాల వలన పశువుగానో పురుగు గానో
పుణ్య పాపములు సమంగా చేస్తే మానవుడిగా జన్మిస్తాడు. వెయ్యిమందిలో ఒక్కడు
–మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్య దతితి సిద్ధయే –అన్నట్లుగా
కామక్రోధ భయ నిద్ర నిశ్వాస దోషాలను తొలగించుకుని చేస్తాడు మోక్ష ప్రయత్నం.

కోపానికి ఓర్పు, కామానికి సంకల్ప రహితము, భయానికి జాగరూకత, నిద్రకు
సత్త్వగుణ సేవనము, శ్వాసకు మితాహారము విరుగుళ్లు. ఈ లోకాలన్నీ
విష్ణుమాయా ప్రభావంతో గోడమీద బొమ్మలుగా, నురుగులా, నీటిబుడగల్లా
కానవస్తాయి; వివేకి వీటిని లక్ష్యపెట్టక నిశ్చల చిత్తుడై అన్వేషిస్తాడు మోక్షమార్గాన్ని.

---

**క.** **వినుఁ! గర్భవాస దుఃఖం । బును జన్మవ్యథయు బాల్యము విమూఢత్వం**
**బును రాగక్లేశ జరా । జనితకృపణతలును జూపు, సంగముఁ బాపున్. (శాంతి. 5-606)**

**ఉ.** **చెందుచునుండుఁ బుణ్యములు సేసి సురత్వము, మధ్యకర్ముఁడై**
**యొందు నరత్వమున్, దురితయోగమునం బశుకీటభావమున్**
**బొందు, సుఖంబు దుఃఖమును బొందఁగ జీవుఁడు దీనిభేదశ**
**క్తిం దెలియంగ నేర్చినమతిం గల యాతఁడు గోరు మోక్షమున్. (శాంతి. 5-607)**

**సీ.** **క్షమ క్రోధమునకు, సంకల్ప వర్జనము గా । మమునకు, నప్రమాదము భయంబు**
**నకు, సత్త్వసంసేవనము నిద్రకును, లఘు । భోజిత నిశ్వాసమునకు వైరు**
**లని చెప్పి, వెండియు నను నసేకములగు । దోషముల్ దొలఁగంగఁ ద్రోచువెరవు**
**లును బెక్కు లవి గనికొను వివేకము గల । పురుషుండు దన్మార్గ పరిచయమున**

**తే.** **విష్ణుమాయను దోఁచు నీ విష్టపములు । భిత్తి చిత్రంబు విధమున ఫేనభంగి**
**బుద్బుదాకృతిగాఁ గను బుధుఁడు; దీని । సరకు సేయక మోక్షంబు తెరువు వెదకు. (శాంతి. 5-612)**

# 137. సాంఖ్య మార్గం

బాహ్య స్పర్శలను 'తపస్సు' అనే కఱ్ఱతో నెట్టి, 'ప్రజ్ఞ' అనే కర్ణధారి
నైపుణ్యంతో 'సంసారమనే' - సముద్రాన్ని దాటుతాడు వివేకవంతుడు.
ఆ సముద్రంలో 'దుఃఖ'మనేది నీరు, 'వ్యాధులు, మరణం' అనేవి మొసళ్లు
'భయ'మనేది పాములు, 'హింస' అనేది ప్రవాహం, 'విషయాసక్తి' అనేది బురద

'ఆశ'లనేవి సుడిగుండాలు, సంతోషాలు అనేవి రత్నాలు; సత్యమనేది గట్టు
ఆ సముద్రాన్ని దాటిన పుణ్యాత్ముడిని సూర్యుడు తీసుకువెళ్తాడు తన కిరణాలతో
అక్కడ నుంచి తామర తూడులోని దారంకన్నా సన్నని దారిలో పయనించి వెళ్లగా
సూక్ష్ముడు, చల్లని స్పర్శ కలిగిన ప్రవహుడనే పవనుడు ఎదురువచ్చి ఆకాశంలో

చేరుస్తాడు పరమగతికి. అక్కడ పరమాత్మతో కలిసి శాశ్వతస్థితిని పొందుతాడు-
అని భీష్ముడు చెప్పగా విని ధర్మజుడు తన సందేహాన్ని అడిగాడు వినయంగా,
శాశ్వతుడైనవాడికి తన పూర్వస్థితి తెలుస్తుందా, అతడి ప్రత్యేకత ఉంటుందా?
భీష్ముడన్నాడు- ముక్తినొందిన వాడికి ఇంద్రియ జ్ఞానమేమీ ఉండదు.

సముద్రంలో కలిసిన ఉప్పుగల్లుకు, పరమాత్మలో కలిసిన ఆత్మకు ఉనికి ఉండదు.
పునర్జన్మ, ఇంద్రియానుభూతి రాహిత్యము, ఉనికి లేకపోవడమే మోక్షము
అని పలికి భీష్ముడన్నాడు సాంఖ్యంలో యోగమున్నది; యోగంలో సాంఖ్యమున్నది.
ఈ రెండూ పేర్లలో కనిపించే తేడానే కాని, అంతిమలక్ష్యం మోక్షమే! -అంటారు తత్త్వజ్ఞులు.

---

**సీ.** పురుషుని నింద్రియంబు లెఱుఁగ; వవి మనస్ । స్థములు గావున మనస్సంగమమునఁ
గనువాని నతఁడు ముక్తత్వంబు లేని య । ప్పుడుఁ గల్గినను నది పురుషునందు
సమమ నిర్విషభుజంగములట్ల నిశ్చేష్ట । నున్న యింద్రియములఁ గన్నఁ గాన
కున్నను నేమి యయ్యుదిత విజ్ఞానామృ । తస్వరూపునకు నాతండు దొఱఁగఁ

**తే.** గాష్ఠకుడ్యకుసులాదికముల చంద । మొందునట్టు గాకయు నింద్రియోత్కరంబు
శరధిఫేననిభం బయి విరియు నవ్వి । భూతి యీశ్వరుతెఱఁ గాత్మఁ బొందకున్నె? (శాంతి. 5-616)

**ఆ.** యోగి చూచుభంగి నుర్వీశ! సాంఖ్యుండుఁ । జూచు; సాంఖ్యుఁ దరయు చొప్పు యోగి
వరుఁడు నరయుఁ; గాన వారిద్దఱును నొక్క । తెరువువార యంద్రు పరమమునులు. (శాంతి. 5-625)

**క.** విను! సాంఖ్యమ్మును యోగము । నను పేళుల కాని దీనియం దదియును దా
న నిదియుఁ దోఁచుచునుండుం । గనుఁ దత్త్వవిచారి యొకఁడ కా నీ రెంటిన్. (శాంతి. 5-626)

**క.** ఈ తెరువునఁ జరియించుచు । నే తెఱఁగున నైనఁ దప్పెనేనియుఁ బురుషుం
డాతత నాక సుఖము గనుఁ; । దోఁతెంచును మగుడ సద్బుధుల వంశమునన్. (శాంతి. 5-627)

# ✤ 12. శాంతి పర్వము - షష్ఠాశ్వాసము ✤

## 138. అక్షర తత్త్వం

ప్రజ్ఞాఘృత ప్రదీపితంబగు దీపములా మాకు వెలుగు ప్రసాదిస్తున్న పితామహా!
అక్షరమేది? క్షరమేది? – తెలుపుమని ధర్మజుడు ప్రార్థించగా భీష్ముడు
చెబుతున్నాడు– ధర్మరాజా! వసిష్ఠుడు కరాళ జనకుడు చర్చించారీ విషయం–
'కరచరణాది అవయవాలు, ఆద్యంత క్షయవృద్ధి లేని ఏకైక తత్త్వమే –అక్షరం'

అక్షరతత్త్వం రూపుమారి విక్రియగా ఉన్నపుడు– ప్రకృతి, ప్రధానం, అవ్యక్తం
అనే పేర్లతో పిలువబడుతుంది. విక్రియ నుండి మహత్ తత్త్వం, అహంకారం
పంచభూతాలు, పంచగుణాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు
మనసుతో కలిసి ఇరవై నాలుగు క్షరతత్త్వాలు పుట్టినాయి, గ్రహింపుము.

ఈ ఇరవై నాలుగు క్షరతత్త్వాలు విజ్ఞానానికి అందుతాయి. ఇరవై అయిదవది
అక్షరమైన పరతత్త్వం విజ్ఞానానికి గోచరం కాదు, నాశనం కాదు, మృతి దానికి లేదు.
త్రిగుణాలను అనుసరించే అక్షరం జారిపోతుంది జన్మ పరంపరలలోకి
తనను తాను తెలుసుకోలేక అవే తాను అనుకుని నివాసం సాగిస్తూ ఉంటుంది.

సత్త్వగుణంతో కలిసి అక్షరం తెల్లగా ఉండి దివ్యత్వ సుఖాలను పొందుతుంది.
రజోగుణంతో కలిసి అక్షరం ఎర్రగా ఉండి పుణ్య పాపాలను చెరిసగం పొందుతుంది.
తమోగుణంతో కలిసి అక్షరం నల్లగా ఉండి పాపాలతో చేరుతుంది నరకం.
తనను తాను తెలుసుకోలేక అక్షరం కఠోర వ్రతాలు, తపస్సులు చేస్తూ ఉంటుంది.

---

**క.** జననాథ! యక్షరం బెం । దును గ్రీడఁ జరించుఁ ద్రిగుణ దోహలపరమై
తనకుఁ బ్రబోధము లేకు । న్నను నానాయోనిగత జననముల వెంటన్. (శాంతి. 6-11)

**క.** విను సత్త్వరజస్తమముల । యనుసరణమువలన వివిధమగు యోనిగణం
బున వెలసిన యా తత్త్వము । దనుఁ జూడఁగలేక యవియ తానని యుండున్. (శాంతి. 6-12)

**ఉ.** సత్త్వరజస్తమోగుణవశస్థితి నక్షర మర్థధర్మ సం
గిత్త్వము మధ్యకర్మతయుఁ గిల్బిషకృత్యమునొంది యొంది ది
వ్యత్వనరత్వగోమృగఖగాదిక తిర్యగనేక హీనజం
తుత్త్వములన్ సుఖంబులును దుఃఖములున్ నరకంబులుం గనున్. (శాంతి. 6-13)

**క.** జనవర! శుక్లము లోహిత । మును గృష్ణమునైన వర్ణముల నక్షర మొం
దును సత్త్వరజస్తమముల । యనుసారంబున సవర్ణమయ్యు వికృతమై. (శాంతి. 6-14)

**క.** అగుణంబయ్యును నిమ్మెయిఁ । బ్రగుణతఁ బ్రాపించు నక్షర మహంకార
స్థగుణంబూఁదిన, విడిచినఁ । దెగు నన్నియు నిర్వికారదీప్తంబునగున్.' (శాంతి. 6-15)

# 139. పొత్తి నూలుకాయ పురువు భంగి-

తనను తాను తెలిసికొనలేక అక్షరం- తపజపాలతో శరీరాన్ని సంకటపెట్టి
క్రతువులు, తీర్థయాత్రలు, ఏకభుక్తాలు, భూమి శయ్యలు, వ్రత పరినిష్ఠలు
జడలు, నారచీరలు, రకరకాల దండములు ధరించి నానా కష్టాలు పడుతుంది.
చావుపుట్టుక ముసలితనం లేని అక్షరతత్త్వం ఉపాధి వలన అవన్నీ ఉన్నాయంటుంది.

నిర్గుణమైన అక్షరతత్త్వం వికృతి అయిన ప్రకృతి గుణాలు తనకే ఉన్నాయనుకుని
సగుణత్వాన్ని పొంది, తననుంచి వచ్చిన దారాలతో గూడు అల్లి సాలెపురుగులా
తానే బందీ అవుతుంది. అఖండ శాంతి బోధతో గాలివలన మబ్బులు
తొలగి, పదారు కళలతో చంద్రుడు ప్రకాశించినట్లు మరల విరాజిల్లుతుంది.

స్త్రీ పురుష కలయికలో మరొక రూపం పుడుతున్నది, విడిగా ఇద్దరికీ ఆ నేర్పు లేదు.
చర్మం మాంసం రక్తం స్త్రీ నుంచి, మజ్జ ఎముకలు స్నాయువులు పురుషుడి నుండి
లభిస్తాయి బిడ్డకు; పశు పక్షి మానవాదులలో జరిగే విధానమిదే!
స్త్రీ పురుష సంబంధం వంటిదే ప్రకృతి పురుషుల పరస్పరాకర్షణ

ప్రకృతి లింగరహితము, దానినుంచి పుట్టినవి లింగాలు వికృతి రూపాలు
ఋతువులకు రూపం లేకపోయినా ఫలపుష్పాదుల వలన ఋతువులను గుర్తించినట్లు
గుణాలన్నీ ప్రకృతివే, పరమాత్మవి కావు; క్షరము- అనేకము, అదర్శనము
తత్త్వము, వర్గము; అక్షరము-ఏకము, దర్శనము, తత్త్వరహితము, అపవర్గము.

---

**చ. 'క్రతువులఁ దీర్థయాత్రలను రాత్ర్యశనంబుల భూమిశయ్యలన్**
**వ్రతపరినిష్ఠలన్ జడలు వల్కలముల్ వివిధంపు దండముల్**
**సతతముఁ దాల్చుటన్ వపువు సంకటపాటునఁ బెట్టు నాద్యమ**
**చ్యుత మమలంబు దాను దనుఁ జూడక యక్షరమప్రబుద్ధమై. (శాంతి. 6-17)**

**ఆ. తనకుఁదాన బంధమొనరించుకొనియెడు । పొత్తినూలికాయ పురువు భంగి**
**నగుణమయ్యు సగుణతావాప్తిఁ బొందు న । క్షరము ప్రకృతి గుణము సంక్రమించి. (శాంతి. 6-19)**

**- పంచవింశతి తమో విష్ణుః నిస్త త్త్వ స్తత్త్వ సంజ్ఞితః**
**తత్త్వ సంశ్రయణా దేతత్ తత్త్వమాహుర్మనీషిణః (సం.శాంతి. 302-38)**

మహాభారతంలో చెప్పబడిన ఈ విషయం చర్చనీయాంశం- స్త్రీకి చెందిన శోణితం-అండం నుంచి చర్మం, మాంసం, రక్తం పిండంలో ఏర్పడతాయని; మజ్జ, ఎముకలు, కీళ్లు, శుక్లం - శుక్ర కణాల నుంచి ఏర్పడతాయనేది. నవీన శాస్త్రం ఈ విషయాన్ని ధృవీకరించలేదు. ముత్యాల గర్భిణీగా పిలుచుకునే (Hydatidiform Mole)లో అండంలోని కేంద్రకం (న్యూక్లియస్-జెనెటిక్ మెటీరియల్) జన్యు పదార్థం అదృశ్యం కాగా, స్పెర్మటోజోవా లేదా ఇంద్రియకణం రెండుగా చీలి లేదా రెండు స్పెర్మ్‌లు అండంతో ఫలదీకరణం చెందగా పిండము పెరగదు. కాని ట్రోఫొబ్లాస్ట్ వేళ్లువేళ్లుగా పెరిగి గర్భసంచి పొరలలోకి చొచ్చుకునిపోయి నీటిబుగ్గలు ద్రాక్షపళ్లు లేదా ముత్యాల ఆకారంలో ఏర్పడి రాలుతూ ఉంటాయి.

# 140. అనఘా! మోక్షము తెరగిది-

మితాహారుడై, నిస్సంగుడై, జితేంద్రియుడై, బుద్ధితో, మనసును ఆత్మలోకి మరల్చి
రాయివలె సంకల్ప రహితుడై, గాలిలేనపుడు నిశ్చలంగా ఉండే దీపంలా, నిరంతరం
ఆత్మస్వరూప దర్శనం చేసుకుంటూ ఆనందిస్తాడు, యోగి తనదైన యోగ మార్గాన-
ప్రకృతివాదులైన సాంఖ్యులు ప్రకృతిని 'అవ్యక్తము'గా భావించి, ప్రసవస్థితి ఉన్నది

కనుక అది బుద్ధి, అహంకారం పంచభూతాలు, జ్ఞాన కర్మేంద్రియాలుగా విస్మరించి
అనులోమంబున సృష్టి, ప్రతిలోమంలో సంహారం కావిస్తూ సృష్టి సమయాన అనేకత్వం
సంహార సమయాన ఏకత్వంతో ప్రకాశించగా, ప్రకృతిలో ఉండి ప్రకృతి
నెరిగిన పురుషుడు క్షేత్రజ్ఞుడిగా, ప్రకృతి గుణసహితంగా, పురుషుడు నిర్గుణుడిగా

ఇరవై నాలుగు వికృతి తత్త్వాలను, ఇరవై అయిదవ తత్త్వమైన అక్షరరూపు పురుషుడిని
దర్శించడమే సాంఖ్య దర్శనం, అదే సాంఖ్య యోగమని- వశిష్ఠుడు తెలిపాడు
జనక మహరాజుకు -అని ధర్మరాజుకు వివరించాడు భీష్మ పితామహుడు.
ఆ ఇరవై అయిదో తత్త్వమైన అక్షరమే విద్య, ప్రకృతియే అవిద్య.

అక్షరమే పురుషుడు, పురుషుడే జీవుడు; జీవుడు క్షరమైన ప్రకృతితో కలిసి
అనేకత్వాన్ని పొందుతున్నాడు. ప్రకృతికున్న అహంకారం, మమకార గుణాలు
తనతో కలిసిన పురుషుడికి అంటగడుతుంది. వాటిని విడిచిపెట్టి పురుషుడు
ఇరవై ఆరవ తత్త్వమైన పరబ్రహ్మంలో కలిసి పొందుతాడు పరబ్రహ్మ లక్షణాలను.

---

**క.** **వనితగుణంబులు చర్మం । బును మాంసము శోణితంబుఁ బురుషగుణతతిన్**
**విను మజ్జాస్థిస్నాయువు । లనఘతపోవిభవ! యిట్లయని శ్రుతి సెప్పున్. (శాంతి. 6-23)**

**చ.** **ప్రకృతి యలింగ, తజ్జనితభంగులు లింగము, లట్టులయ్యు రం**
**జకగుణశీల లింగచయసంగతిఁ దాను సలింగమయ్యె, మూ**
**ర్తికలన లేక యుండియుఁ బరిస్ఫుట పుష్పఫలాదిసూచక**
**ప్రకరముచేత మూర్తమయి రంజిలదే ఋతువేళ సూడఁగన్. (శాంతి. 6-32)**

**క.** **అనులోమంబున సృష్టియు । జనవర! ప్రతిలోమవృత్తి సంహారముఁ గ**
**ల్గును జనన ప్రళయంబులఁ । దనకు బహుత్వంబు నేకతయు శోభిల్లున్. (శాంతి. 6-42)**

---

వైద్య పరీక్షల ద్వారా ఈ వ్యాధిని కనుగొని అబార్షన్ చేస్తారు. 15 శాతం స్త్రీలలో ఇది క్యాన్సర్‌గా మారి ప్రాణాంతకమవుతుంది. పురుషుడి ఇంద్రియ కణం స్త్రీకి ప్రాణం మీదకు తేవడం ఈ వ్యాధిలో గమనించవచ్చు. ప్రతి కానుపులోనూ తల్లి ప్రసవ వేదననుభవించి శిశువును కంటుంది. ఒక్కోసారి మృత్యుగృహపు ద్వారం వద్దకు వెళ్లి వెనక్కి వస్తుంది. అత్యంత సూక్ష్మరూపంలో కూడా పురుషుడు స్త్రీని వేదనకు గురిచేయడానికి ప్రయత్నిస్తాడనేది దీనివలన మనకు అర్థమవుతుంది. మామూలుగా వేయి కాన్పులలో ఒకటి ముత్యాల గర్భిణి అయితే ఇండోనేషియాలో ఇది నూటికి ఒకటిగా ఉన్నది. ఆహారంలో ఫోలిక్ ఏసిడ్ లోపం వలన కావచ్చునేమో!

# 141. హైరణ్యమైన మహాండమున విధాత పుట్టించు-

జనకుని కుమారుడు వసుమంతుడు అడవిలో చూసాడు భృగువంశ మునిని-
ముని అన్నాడు- హితాహిత కార్యాలన్నీ సుఖాన్నో దుఃఖాన్నో ఇస్తాయి.
మానవులు తేనెకోసం కొండ ఎక్కుతున్నాం అన్న దృష్టితో పోతుంటారు,
జారిపడతామన్న విషయాన్ని తలచుకోరు. మనసు నిర్మలంగా ఉంచుకో.

ధర్మాన్ని, జ్ఞానాన్ని అభ్యసించు, ధార్మిక సాంగత్యం పెంపొందించుకో
దాన ధర్మాలపై శ్రద్ధ చూపుము. ధైర్యం ముఖ్యం, ధృతి తరగడం చేత
మహాభిషుడనే రాజు స్వర్గభ్రష్టుడైనాడు; ఆపద నుంచి బయట పడినాడు యయాతి-
అని పలుకగా వసుమంతుడు కామక్రోధ వర్జితుడై పెంపొందించుకున్నాడు ధృతి ధర్మాలను.

జనక మహరాజుతో యాజ్ఞవల్క్య ముని చెప్పినాడు- అవ్యక్తము నుంచి
సర్గము-ప్రళయము పుడతాయి; బ్రహ్మకు పదికల్పాలు ఒక పగలు
పది కల్పాలు ఒక రాత్రి. పగటిపూట సృష్టి, రాత్రిపూట ప్రళయం
విధాత సృష్టించిన పంచభూతాలు, వాటి గుణాలు, ఇంద్రియాలు వీటికి ప్రభువు మనసు.

రాత్రి అయ్యేసరికి అవ్యక్త బోధనతో పరమాత్మ పంద్రెండు సూర్యుల
వేడిమితో జీవరాశిని నశింపచేసి, విశ్వాన్ని తాబేటి చిప్పగా మార్చగా
జలప్రళయం వచ్చి భూమిని ముంచగా, కాలాగ్ని ఆ నీటిని ఆవిరి చేస్తుంది.
వాయువును ఆకాశం, ఆకాశాన్ని మనసు, మనసును పరమాత్మ గ్రహించుట ప్రళయం.

---

సీ. 'అధిప! సర్గముఁ బ్రళయంబు నవ్యక్తంబు । దానొనరించుఁ దత్కాల సంఖ్య
విను-కల్పములు పది దినమున, కంతియ । రజనికాలంబు, సర్గంబు పగలు
సేయు, రే ప్రళయంబు సెల్లించుఁ దొలుత న । శేషభూతములకు జీవనముగ
నోషధికల్పన మొనరించు, దానికై । హైరణ్యమైన మహాండమున వి

తే. ధాతఁ బుట్టించు, నతఁడు భూతములనెల్ల । జనన మొందించు, భూమ్యాది సారభూత
గంధముఖ్య గుణోత్కరగ్రాహకములు । శ్రోత్రముఖములు, దత్స్వామి సూవె మనసు. (శాంతి. 6-82)

క. వినుటకును గనుటకును సా । ధనములయిన చెవియుఁ గన్నుఁ దనతనయంతన్
వినను గానను నేర్చునె । మనఃప్రభావమునఁ గాక? మనుజాధీశా! (శాంతి. 6-84)

తే. ఇంద్రియములెల్ల నట్టిన యెలసి యొందు । వలన మనసున్నఁ దమతమ వర్తనముల
నిగుడ నేరమి తెల్లంబు నృపవరేణ్య! । యిట్లు లగు టజ్ఞులకునైన నెఱుఁగవచ్చు. (శాంతి. 6-85)

- తతః శత సహస్రాంశుః అవ్యక్తే నాభి బోదితః
కృత్వా ద్వాదశ ధా త్మానామ్ ఆదిత్యో జ్వల దగ్నివత్ (సం.శాంతి. 312-4)

# 142. ఆధ్యాత్మ అధిభూత అధిదేవతలు

ఇంద్రియాలను నియంత్రిస్తుంది మనస్సు; కాళ్లు, గుదము, చేతులు,
ఉపస్థ నాలుక – ఈ అయిదు ఆధ్యాత్మాలు– కాళ్లకు గమ్యం
గుదమునకు విసర్జనం, చేతులకు కర్తవ్యం; ఉపస్థకు ఆనందం
నాలుకకు వక్తవ్యం అనేవి అధిభూతాలు; కాళ్లకు విష్ణువు అధిదేవత.

గుదమునకు సూర్యుడు, చేతులకు ఇంద్రుడు, ఉపస్థకు ప్రజాపతి,
నాలుకకు అగ్ని అధిదేవతలు– కన్ను, నాలుక, ముక్కు, చెవి, చర్మం
–ఇవి ఆధ్మాత్మాలు; వీటికి అధిభూతాలు వరుసగా రూప, రస, గంధ, స్పర్శ, శబ్దాలు.
వీటికి అధిదేవతలు వరుసగా అగ్ని, జలం, భూమి, వాయువు, ఆకాశం.

మనసు ఆధ్యాత్మం, దానికి మననం అధిభూతం; దానికి అధిదేవత చంద్రుడు
బుద్ధి ఆధ్యాత్మం, బోద్ధవ్యం అదిభూతం; అధిదేవత క్షేత్రజ్ఞుడైన జీవుడు
అహంకారం ఆధ్యాత్మం, అభిమానం అధిభూతం; అధిదేవత రుద్రుడు
చిత్తము ఆధ్యాత్మం, చేతయితవ్యం అధిభూతం; అధిదేవత పరబ్రహ్మం.

పురుషుడికి నానా వికారాలను, రూపాలను కలిగించేది ప్రకృతి
ఒక దీపం నుంచి అనేక దీపాలు వెలిగినట్లు ప్రకృతి కలిగిస్తుంది గుణరూపాలు
సంతోషాదులు సత్త్వ; అహంకార కామక్రోధాదులు రజో; తిండిపోతుతనం
చాడీకోరుతనం, మెతక తనం, బద్దకం తమోగుణ లక్షణాలుగా గ్రహింపుము.

---

**సీ.** పాదపాయూపస్థపాణివాక్కులు విను । మధ్యాత్మములు దత్క్రమానుయుక్తి
గంతవ్యమును విసర్గంబు నానందంబుఁ । గర్తవ్యవక్తవ్యకములు నయ్యె
నధిభూతములు వాని కధిదైవములు వరు । సన విష్ణుమిత్రప్రజాపతులును
శక్రపావకులును జక్షువు జిహ్వయు । ఘ్రాణంబుఁ ద్వక్కు శ్రోతంబుఁ జూవె

**తే.** యనఘ! యధ్యాత్మములు రూపమును రసంబుఁ । జాలుపడ గంధసంస్పర్శ శబ్దములును
దదధిభూతంబు లధిదైవతములు సూర్య । జలమహీ వాయు దిశలంద్రు శాస్త్రవిదులు (శాంతి. 6–90)

**క.** మన మధ్యాత్మము దానికి । ననఘా! మంతవ్యమందు రధిభూతము చం
ద్రుని నధిదైవతముగ బుధ । జనములు చెప్పుదురు శ్రుతివచఃప్రతిపత్తిన్. (శాంతి. 6–91)

**తే.** బుద్ధి యధ్యాత్మమనఁ జను భూతవర్య! । దాని కధిభూత మంద్రు బోద్ధవ్యమైన
దానిఁ బొల్చు తదీయాధిదైవతంబు । వినుము క్షేత్రజ్ఞుఁడని చెప్పు వేదచయము. (శాంతి. 6–92)

**తే.** ధరణివల్లభ! చిత్తమధ్యాత్మ మనఁగ । బరఁగుఁ జేతయితవ్యంబు భావితాత్ము
లైన మహనీయు లధిభూతమంద్రు బ్రహ్మ । మంచితాధిదైవతమను నాగమములు.' (శాంతి. 6–94)

# 143. సాంఖ్యానుభవము

పురుషుడు చైతన్య సహితుడు, ప్రకృతి చైతన్యరహితమై జగద్భారం
వహిస్తుంది పురుషుడి ప్రకాశంలో, తన వెంట తిప్పుకుంటుంది
జీవాత్మ సత్త్వగుణ ప్రధాన ప్రకృతితో ఊర్ధ్వలోకాలను రజోగుణంతో
మిశ్రకర్మల మానవలోకాన్ని, పాపకర్మలు చేసి పొందును రౌరవాది నరకాల్ని.

జీవుడు తనను తాను తెలుసుకున్నపుడు అచ్యుతుడై అక్షరుడవుతాడు
ప్రకృతిని విడిచి శాశ్వతం, నిరంజనం, నిర్మలం, జరా విరహితుడై శాశ్వతుడగును
ఇరవై అయిదు తత్త్వాలున్నవాడు తనను తాను తెలుసుకుంటే ఇరవై ఆరవ తత్త్వమౌతాడు.
పురుషుడు తన ఇరవై నాలుగు వికృతులను వదుల్చుకుని పరబ్రహ్మమును చేరును.

పురుషుడు ప్రకృతిలో ఉంటాడు, ప్రకృతిని తనలో నిలుపుకుంటాడు
తాను మాత్రం ఏ వికృతినీ పొందదు, చేప నీళ్లలో ఉన్నట్లు, మశకాలు
మేడిపండులో ఉన్నట్లు– లీనత్వంలో అలీనత్వం ప్రకృతితో పురుషుడి సాంగత్యం.
తామరాకు పూవు నీళ్లను తాకుతూ నీళ్లలో ఉన్నా ఆకులకు రేకలకు తడి అంటదు.

జీవాత్ముడు ప్రకృతిలో ఉన్నా దాని వికారాలు అంటవు ఇతడికి –ఇది సాంఖ్యము
ఈ విషయాలను తెలిపేవి సాంఖ్య యోగాలు, రెండూ సమ జ్ఞానాలే.
తనను తాను తెలుసుకోవడం, ప్రకృతి వికారాలను వదలి స్వేచ్ఛనొంది
పరబ్రహ్మంలో లీనమవడమనే ముక్తిమార్గాన్వేషణమే సాంఖ్యానుభవం.

---

క. **సగుణం బగుణం బగునే? । యగుణము సగుణమగు నెట్టు? లవ్యక్తము ని**
**త్యగుణసమవేతమై జడ । త గలిగియుండంగఁ బురుషధర్మము గలదే? (శాంతి. 6-104)**

క. **పురుషుని కల రూపెఱిఁగెడు । పరిబోధము లేకయుండుఁ బ్రకృతికిఁ బ్రకృతిం**
**బురుషుఁ డెఱుంగును దనకుం । బరంబు లేదనియుఁ గను శుభస్థిర దృష్టిన్. (శాంతి. 6-105)**

ఆ. **తాను బ్రకృతిఁ బ్రకృతి తనయందు నిల్చు ని । ల్చినను దాన వికృతిఁ జొందకుండుఁ**
**బురుషుఁ డుదకమత్స్యముల యుదుంబరమశ । కముల సంగమంబు కరణి గలుగ. (శాంతి. 6-108)**

ఆ. **జలముఁ గదిసియుండ జలముచే నార్ద్రంబు । గాక యుండునట్టి కమలదళము**
**భంగి నంతరాత్మ ప్రకృతిఁ బొందియును ద । ద్వికృతిఁ బొందకుండు వీతదోష! (శాంతి. 6-109)**

– **ఆత్మా హ్యే వాత్మనోహ్యేకః కోన్యస్త స్మాత్పరో భవేత్**
**ఏవం మన్యస్వ సతతమ్ అన్యథా మా విచింతయ (సం.శాంతి. 318-104)**

– **యే త్వవ్యక్తాత్పరం నిత్యం జానతే శాస్త్రతత్పరాః**
**జన్మ మృత్యు విముక్తం చ విముక్తం సద సచ్చయత్ (సం.శాంతి. 318-108)**

# 144. యోగానుభవం

నిర్గుణమైన మనోధారణలో మనసును ఏకాగ్రం చేయుట ధ్యానం
సగుణ ప్రాణాయామంలో శరీర ధర్మానికి ఇబ్బంది లేకుండా చేయాలి వాయు నిరోధం
ఇంద్రియాలను మనస్సులో, మనస్సును అహంకృతిలో; అహంకృతిని బుద్ధిలో
బుద్ధిని ప్రకృతిలో సంలీనం చేయడం ధ్యానం– అదే మనోధారణ.

ధ్యాననిష్ఠ కలిగిన వ్యక్తి– అజరుడు, నిర్మలుడు, నిత్యానందమయుడు,
సత్యశుద్ధ జ్ఞానమయుడు, పరముడు, అచలుడు, శాశ్వతుడైన శివుడిని దర్శిస్తాడు.
పరిపూర్ణమైన యోగి ఉంటాడు నిశ్చలదీపంలా, నిర్మలాకాశంలా, శాంత సముద్రంలా
తన చుట్టూ భేరీ భాంకారాలు మోగినా చలించడు, నిర్వికారుడు, నిశ్చలుడై ఉంటాడు.

తేనెకుండ నెత్తిమీద పెట్టుకుని ఏమరుపాటు లేకుండా మెట్లు ఎక్కినవాడిలా
ఆత్మానంద రసం ఒక్క బొట్టు కూడా చిందకుండా చేరుకుంటాడు ముక్తి గమ్యం.
ఇది యోగమార్గం – ఏకాగ్రత ఎంతో అవసరం– జాగరూకుడై పయనిస్తే
కృతార్థుడవుతాడు, పరబ్రహ్మ దర్శనాన్ని పొందుతాడు, ప్రకాశితుడవుతాడు.

ప్రాణవాయువు బ్రహ్మరంధ్రం నుంచి నిష్క్రమిస్తే యోగి శతానంద బ్రహ్మను,
పాద–విష్ణుపదము; జంఘ–వసువులు; జాను–సాధ్యులు; గుదము–సూర్యుడు;
రహస్యాంగం–వసుధ; ఊరువు–ప్రజాపతి; పార్శ్వాలు–మరుత్తులు; నాభి–చంద్రుడు;
భుజాలు–ఇంద్రుడు; రొమ్ము–స్థాణుడు; గళం–నరుడనే మునీశ్వర స్థానం పొందుతాడు.

---

**క.** భేరీ శంఖాదిక నా। నారవములు వొడమెనేని నాతఁడు దానం
గారింపఁబడఁడు వీతవి। కారస్థితిఁ బొలిచియుండు గగనముభంగిన్. (శాంతి. **6–120**)

**క.** తేనియకుండఁ గొనుచు సో। పానము లేమఱుట లేక ప్రాఁకిన క్రియ నా
త్మానందరసంబొక కణ। మైనఁ జిలుకనీక తుదికి నాతం డెక్కున్. (శాంతి. **6–121**)

**క.** అనఘ! యిది యోగ పథమిం దలనసుడై చనగజాలు నతడు కృతార్థుం
డనితర సులభ పదప్రాప్తినిరూఢుఁడనామ యుండభిష్టుతుఃడెందున్ (శాంతి. **6–122**)

**సీ.** నరనాథ! యుత్క్రమణప్రదేశంబులు। పాదజంఘాజానుపాయు గుహ్య
ములు నూరుపార్శ్వనాభులు బాహువక్షోగ। ళాననశ్రోత్ర నాసాంబకములు
భ్రూఫాలమస్తకంబులు నోలి విష్ణుండు। వసుసాధ్యమిత్రులు వసుధయును బ్ర
జాపతి మరుదిందు సంక్రందనస్థాణు। లును నరుం డను మహామునియు విశ్వ

**తే.** దేవదిగ్గంధవహులును బావకుండు। నశ్విపితృ శతానందులు నందు వెలుఁగు
చంద్రు హృన్మయ పవనక్రమోత్క్రమముల। నొందు నద్దైవతంబుల యోగివరుఁడు.' (శాంతి. **6–124**)

# 145. ప్రాణవాయు ఉత్క్రమణం - అరిష్ట సూచనలు-

ప్రాణవాయు ఉత్క్రమణ ప్రదేశం ముఖం నుంచి-విశ్వదేవత్వాన్ని, చెవులు-దిక్కులు
నాసిక-వాయువును, నేత్రాలు-అగ్నిని; కనుబొమలు-అశ్వినీదేవతలను
నుదుటి నుంచి-పితృదేవతలను చేరుతాడు జీవుడు యోగ విధానమందు.
యాజ్ఞవల్క్యుడు చెబుతున్నాడు జనక మహరాజుతో- రాజా! ప్రాణోత్క్రమణ వేళ

ధ్రువ మండలంలో అరుంధతి కానరాకున్న ఆయుస్సు ఏడాది మాత్రమే; నాసిక
కుడివేపు ఊడినట్లున్నా, పూర్ణచంద్రునికి మకిలి పట్టినట్లున్న ఏడాది లోపు
ముఖవర్ఛస్సు పెరిగినా తరిగినట్లు కనిపించినా ఆరునెలల లోపు, సూర్యచంద్ర
బింబాలలో తొర్రలు పగుళ్లు కనిపించినా అతడు వారం రోజులలోపు మరణిస్తాడు.

గుడిలో గంధపుష్పాదుల సుగంధం దుర్వాసనగా అనిపిస్తే ఆరునెలలే ఆయుస్సు
చెవులు ముక్కు వాలిపోవడం, దంతాల రంగు మారడం, కనులు నిర్జీవమవడం
శరీరం నల్లబడడం, హృదయస్పందనమాగడం-సద్యోమృత్యు లక్షణములు
కారణం లేకుండానే ఎడమకన్ను నుంచి కన్నీరు, నెత్తిమీద పొగ మరణపు చివరి దశలు.

ఈ మరణ సూచకాలను గమనించిన యోగి అరిష్టాన్ని గుర్తించినవాడై
యోగమార్గం విడువక జీవాత్మను పరమాత్మతో అనుసంధానం చేసి
కాలాన్ని స్వాధీనపరచుకొని, శీలంతో మృత్యువును జయించినవాడై
శాశ్వతాది లక్షణాలు కలిగిన అవ్యయ పదాన్ని పొందుతాడు, గ్రహింపుము-

---

**సీ.** **'ధ్రువమండలమున నరుంధతిఁ గనుశక్తి । గంటికిఁ గలుగంగఁ గానకున్న**
**ముక్కున వలపటఁ జెక్కవాసినయట్లు । దోఁచినఁ బూర్ణచంద్రుండు మలినుఁ**
**డై కానవచ్చిన నాయువు సంవత్స । రంబునఁ గడచను రాజముఖ్య!**
**కాంతి దొల్లిటియట్లుగాక యంతకు నెక్కు । డైనను గడుఁజెడ్డ నట్లు ప్రజ్ఞ**

**తే.** **క్రొత్తగాఁ బెద్దయైనను గొంచెమైన । నాఱునెలల మరణదశ యగుట గలుగు**
**నిందుమండలమున రవి యందు నడుమఁ । దెఱపి గాంచినఁ దెగు నేడు దివసములకు. (శాంతి. 6-126)**

**క.** **విను గుడిలోనున్న సమయ । మున సురభిద్రవ్యములను బొల వల్చుట గ**
**ల్గిన నాఱు దివసములఁ గ । ల్గును మృత్యుసమాగమంబు గుణరత్ననిధీ! (శాంతి. 6-127)**

**తే.** **ముక్కువాలుట కర్ణముల్ మొగ్గఁబడుట । రదనవైవర్ణ్యమక్షి విరాగభావ**
**మంగ మతికృష్ణ మగు టుల్ల మదరఁ జెడుట । సూచకములు సద్యోమృత్యు గోచరతకు. (శాంతి. 6-128)**

**తే.** **కారణము లేక దాపలి కను ద్రవించు నెత్తి చక్కటి ధూమంబు నెగయు నపుడ**
**మరణ దశ యావహిల్లెడు మానవునకు జనక నృప! యివి బ్రహ్మ సెప్పిన విధములు (శాంతి. 6-129)**

# 146. ముక్తి మార్గం

యాజ్ఞవల్క్య మహర్షి చెబుతున్నాడు జనక మహరాజుతో– నేనొకసారి
మెప్పించాను సూర్యుడిని మహనీయమైన తపస్సు చేసాను యజుస్సుల కొరకు.
అతడు ప్రత్యక్షమై– 'వాగ్దేవినిస్తాను నోరు తెరువు'– నోరు తెరిచాను నేను
సరస్వతి ప్రవాహమై ప్రవేశించింది నాలో– నేను తల్లడిల్లిపోయాను తట్టుకోలేక.

కాసేపటికి అంతటి ఉష్ణతా చల్లబడింది– ఓంకారం అగ్రభాగంలో ఉండగా
అచ్చులు హల్లులతో అలంకరించబడిన సరస్వతీమాత నాకు ప్రత్యక్షమైనది.
అప్పుడు నాకు స్ఫురించింది పదిహేను శాఖల యజుర్వేదం, అది నేర్పాను శిష్యులకు.
ఒకనాడు విశ్వావసువు అనే గంధర్వుడు వచ్చి పదిహేను ప్రశ్నలు వేసాడు.

నేనతడికి చెప్పాను ఇరవై నాలుగు వికృతులు, ఇరవై అయిదవ తత్త్వమైన
పురుషుడు, ఇరవై ఆరవ తత్త్వమైన పరబ్రహ్మం గురించి విపులంగా.
ఇరవై అయిదు, ఇరవై ఆరవ తత్త్వాలకు భేదం లేదని– ఆత్మ పరమాత్మల అభేదాన్ని.
అదే నిష్కలం, నిరంజనం, ఆనందం, జ్ఞానం, అదే నిత్యమని తెలిపాను.

నేనే ప్రకృతిని అన్న భావం విడిచిపెట్టిన పురుషుడికి ప్రకృతి నీరుగా
తాను చేపగా అర్థమవుతుంది. అప్పుడే గోచరిస్తుంది నిస్సంగ పరతత్త్వం.
జీవాత్మ పరమాత్మల ఏకత్వ మహిమను వెల్లడి చేసేది విద్య
అహంకార మమకారాలను విడిస్తే మనశ్శాంతి కలిగి లభిస్తుంది పరబ్రహ్మానందం.

---

సీ. 'మహనీయతపమున మార్తాండు నాకుఁ బ్ర । సనుఁగాఁ జేసితి సదయదృష్టి
ననుఁజూచి యద్దేవుఁ డనఘ! వరంబు నీ । కిచ్చెద నీ కోర్కి యెద్ది? సెప్పు
మనవుడుఁ బ్రణతుండనై యజుస్సంప్రాప్తి । గోరెద ననిన నవ్వారిజాప్తుఁ
డట్లేని వాగ్దేవి నావహించెద విప్ప । తంబుగాఁ జేయు మాస్యంబు విప్ర!

తే. యనియె నవ్వచనము విని యాననమ్ము । సంతసమున విచ్చితి సరస్వతియు నాదు
తనువుఁ జొచ్చెఁ బదంపడి దాహమొంది । తన్ను నెఱుఁగక వెగడొందు నన్ను నినుఁడు. (శాంతి. 6-134)

క. వినుము వినుతస్వరవ్యం । జనభూషిత యగ్రభాగ సంస్ఫురదోంకా
రనితాంత హృద్యమధుగ । ర్భనిజాకృతి విశదముగ సరస్వతి దోఁచెన్. (శాంతి. 6-139)

క. పురుషోత్తమ షడ్వింశక । పరమేశ్వర నామకములు వరఁగును విను మా
పరమునకు నదియ నిష్కళ । నిరంజనానంద బోధనిత్యం బనఘా!' (శాంతి. 6-147)

తే. ప్రకృతి పురుషునిఁ గానదు ప్రకృతి గనుచు నునికిఁ బురుషుండు పరమముని గనుట లేక
యుండుఁ గనుఁ దద్ద్వయముఁ బరముండు, పరమవీక్షణము పురుషున కగు వెరవు వినుము (శాంతి. 6-153)

# 147. జనక మహరాజు-సులభ యోగిని

భీష్ముడన్నాడు ధర్మజునితో– యాజ్ఞవల్క్య ముని జనకుడికి చెప్పిన గొప్ప విద్యను
చెప్పాను నీకు నేను, ఇప్పుడు జనకుడికి సులభకు జరిగిన చర్చ చెబుతాను.
–సులభ అనే యువతి యోగధర్మ నిష్ణాతుడని పేరుగాంచిన జనక మహరాజును
పరీక్షించదలుచుకుని భిక్షుకిలా వెళ్లి స్వాగతాన్నందుకుని నెమ్మది నెమ్మదిగా

తన అందం చేష్టలతో మన్మథ సామ్రాజ్యానికి చక్రవర్తివి కమ్మన్నట్లు
తన మెరుపు చూపులతో అతడి హృదయాన్ని తాకీ తాకనట్లు ప్రవర్తిస్తుండగా
–సుదతీ, నేను పంచశిఖ మహర్షి శిష్యుడను, సాంఖ్య, యోగ, రాజ్యపాలనలో
ముక్తిమార్గాన్ని అన్వేషిస్తున్నవాడిని, విరాగిని, నిష్కామ, నిస్సంగత్వుడిని.

కర్మ నిష్ఠ, జ్ఞాన నిష్ఠలతో పాటు ముక్తినిష్ఠ కలవాడను, రాగద్వేషాలు లేవు.
స్వతంత్రించి నీవు నా హృదయాన్ని మనసును అల్లకల్లోల పరచాలనుకుంటున్నావు.
నన్ను పరీక్షించి గెలవడం కన్నా, నన్ను మరింత ఉన్నతంగా మార్చాలన్నది
నీ ఉద్దేశమైతే నీ ప్రయత్నాలను మాని, నీకింత యోగశక్తి ఎలా అలవడిందో వివరించుము.

ఆమె అన్నది– ధూళికణాలు నీటితో, లక్కరసం కర్రతో అతికినట్లుగా
పంచభూతాలకు సాంగత్యం ఉన్నా పరస్పరాధీనాలు కావు; ఎవరూ ఒకరివారు కారు.
నీలో నిన్ను చూసుకున్నట్లే ఇతరులలోనూ చూసుకోవాలి కదా, నీకు
అందరూ ఒకటే అయినప్పుడు– నన్ను–నీవు ఎవరివి? ఎవరిదానివి? అంటావేల!

---

**సీ. పంచశిఖుండను పరమమునీశ్వరు । శిష్యుండ నతనిచే శిక్షితంబు**
**గమలాక్షి సాంఖ్యయోగక్షితి పాలనం । బులఁ ద్రివిధంబగు మోక్షధర్మ**
**మట్లుగావున సంశయము లేక ముక్తకా । మస్థితి నమ్మూఁడు మార్గములను**
**నడచి పరంబున కెడపడకుండుదు । ముక్తి వైరాగ్యైకమూల సూవె**

**తే. విను విరక్తి దృఢ జ్ఞానజనిత గాన । దీపిత జ్ఞానమును విరక్తియు ధరింపఁ**
**బడిన బుద్ధి నిర్ద్వంద్వత బరఁగు నింటి । యంద నిల్చి నిస్సంగుఁడనై చరింతు. (శాంతి. 6-174)**

**తే. 'సకలలోకములను సదశ్వంబు కరణి । ధావనము సేయుచుండుఁ బ్రధాన మింత**
**యెఱిఁగి జననాథ! యెవ్వరి నెచటనుండు । వార లనువార మమ్మాటవలను సెపుమ! (శాంతి. 6-195)**

**తే. నీవు నీయందు నినుఁగను నెఱియ యొరుల । యందుఁ గానంగవలవదే యధిప! తన్ను**
**నొరులనొక్కటిగాఁ జూచు పురుషుఁ డెచట । మీరలుండుదు రెవ్వరివార లనునె? (శాంతి. 6-196)**

**- కాషాయ ధారణం మౌంఢ్యం త్రివిష్ట బ్ధం కమండలుమ్**
**లింగాన్యు తృథ భూతాని న మోక్షాయేతి మే మతిః (సం.శాంతి. 320-47)**

# 148. నీ సుభాషలనసత్యమొకండును లేదు-

నీవు ముక్తుడివి కాదు, రాజువు కనుక నీలో వర్గత్రయ కాంక్ష, సప్తాంగాల
పట్ల జాగరూకత ఉంటాయి. నీ పనులన్నీ ఇతరులు గుర్తు చెయ్యాల్సిందే,
నీవు ముక్తుడవైతే నేను నీ హృదయంలోకి ప్రవేశించినా చలించరాదు కదా!
యోగులు శూన్య ప్రదేశాలలో నివసించినట్లే వారి హృదయాలు, మనస్సులు.

రాగద్వేషాది భావ శూన్యాలై ఉంటాయనుకుని నీ మనస్సులోకి ప్రవేశించాను.
అది శూన్యంగా లేదని తెలిసినపుడు నేనెందుకు ఉంటానక్కడ? నాకెందుకు నింద?
నేను నిన్ను తాకనే లేదు, ఏం అపచారం జరిగిందని నన్ను నిందిస్తున్నావు.
నీవెట్లా తామరాకుపై నీటిబొట్టువవుతావు? నీ ముక్తత అబద్ధమే కదా!

-నీవు బ్రాహ్మణ కాంతవు-నేను క్షత్రియుడిని; నీవు యోగినివి-నేను గృహస్థుడను
నీవు పరుని భార్యవు-పొందదగని దానవు; నీ గోత్రమేమిటో నాకు తెలియదు.
ఈ వర్ణ, ఆశ్రమ, గోత్ర, ధర్మ సాంకర్యములకు అంగీకరించను అన్నావు-
నేను ప్రధన నృపతి కులంలో పుట్టిన క్షత్రియకన్యను, బ్రాహ్మణిని కాను.

నా పూర్వీకులు అనేక యజ్ఞాలు చేసారు, పరమార్థ గోష్ఠులు చేసేవారు.
నాకు సాటివచ్చే పురుషుడు కానరాక నేను మోక్షధర్మంతో చరిస్తున్నాను.
కాబట్టి మన సాంగత్యంలో ఎటువంటి వర్ణ ఆశ్రమ గోత్ర ధర్మ సంకరముండదు -అని
నవ్వి సులభ అన్నది- నీవు ముక్తుడివే- నీ హృదయంలో ప్రవేశించినా చలించలేదు నీవు.

---

**సీ. నిఖిలజన శ్రోత్రసుఖకరం బగు చరి । త్రమునఁ బెంపొరెడు ప్రధన నృపతి**
**కులమునఁబుట్టితి, సులభ నా పేరు, మ । త్పూర్వులు శతశృంగమునను ద్రోణ**
**మునను శక్రద్వారమున మహాధ్వరములు । సేసిరి, విను పాకశాసనుండు**
**దమ పాలి కేతేరఁ దద్గోష్ఠిఁ బరమార్థ । చింత సేయుదురు, భూకాంత! యేను**

**తే. నాకు నెనయైన పురుషుండు లేకయునికి । మోక్షధర్మ ప్రవర్తనమునఁ జరింతుఁ,**
**గాన నీ చూచు వర్ణసాంకర్య మస్మ । దీయ సాంగత్యమున లేమి దెల్లమరయ. (శాంతి. 6-213)**

**చ. జనవర! నీ సుభాషల నసత్యమొకండును లేదు నీవు స**
**న్మునిగణకీర్తనీయుఁడవు మోక్షము నీ కఱచేతిలోనిదై**
**యునికి దృఢంబుగాఁ గనియు నొండొక చందము మాటలాడితిన్**
**నిను నగుపింపఁగా వలసి నీదగు మన్నన శంక వాసినన్. (శాంతి. 6-217)**

**క. సులభానామము సంస్మృతి । పొలమొల్లక తిరుగుటయును భూలోకవరా!**
**కలరూప నేఁటి కిచ్చట । నిలిచెద నీవు మునిసేవనీయుఁడ వగుటన్. (శాంతి. 6-219)**

# 149. అతుల ధైర్య పోత పాత్రిక నిస్తరింపుము-

భీష్ముడన్నాడు ధర్మజునితో- సులభ తనవాదంతో జనక మహరాజును
సులభంగా ఓడించగలిగినదే, అయినా ఆమె లక్ష్యం వాదంలో గెలుపు కాదు.
అతడి మనస్సు చంచలమైనదా కాదా అన్నదే, అందుకే ఆమె యోగిని.
ధర్మరాజా- ఇప్పుడు నేను వ్యాసుడు తన కుమారుడికి ఉపదేశించినట్టి

వైరాగ్యం గురించి చెబుతాను- తన పుత్రుడైన శుకుడు పామరజనుల
సాంగత్యంలో కాలం వృధా చేస్తున్నాడని గమనించి అన్నాడు వ్యాసుడు
-నాయనా! నురుగుతో చేసిన పంజరం వంటిదైన ఈ దేహంలో
పక్షిలా ఉంటున్నది ప్రాణం. ఏమరుపాటు తగదు. ఆయుస్సు స్వల్పం.

మనస్సును ఇంద్రియాలను స్వాధీనపరచుకుని, తప్పుడు దారులలోకి పోనివ్వక
క్రోధత్యాగం, సత్యం, నిగ్రహం, ఋజుత్వం, తపస్సు, అహింస ధర్మరూపాలుగా
దేవతలు, పితరులు, అతిధులు భుజించగా మిగిలిన అన్నాన్ని భుజిస్తూ
మాంసశోణిత వివర్ధనమగు ఐహికమును విడిచి చరించుము కుమారా!

సంసారమిది సముద్రం, ఇంద్రియాలు జలాలు, అరిషడ్వర్గాలు మొసళ్లు
దీనిని దాటడానికి 'నావ' లాంటిది ధైర్యం. జీవుడు ఏమరి ఉంటే
గొర్రెను ఎత్తుకు పోయే పులివలె, మృత్యువు తన్నుకుపోతుంది జీవుడిని.
నాకు నేనే ఉన్నాను, మరెవ్వరూ లేరు- అనుకుని నడువుము ముక్తిమార్గంలో-

---

**తే.** **అస్థిరేంద్రియ సలిలమయంబుఁ గామ । రోషదారుణ గ్రాహ ప్రదూషితంబు**
**నైన సంసారసాగర మతులధైర్య । పోతపాత్రిక నిస్తరింపుము కుమార! (శాంతి. 6-228)**

**చ.** **ధన మది యేల భోగమును దానము లేదగునేని? శత్రు మ**
**ర్దన మొనరింపఁడేని బలదర్పము లేల? సధర్మవృత్తికిన్**
**గొనకొనఁడేని విన్కి మునికుంజర! యేల జితేంద్రియుండు గాఁ**
**దనఁ జనునేని నాత్మవిధ మారయు నా క్రమమేల చెప్పుమా! (శాంతి. 6-243)**

**సీ.** **అనవుడు నతఁడిట్టులను నాతనికిఁ గర్ణి । కారవనం బనఁ గలదు మేరు**
**తటమున నం దద్రితనయయుఁ దానును । పశుపతి లీలమైఁ బ్రమథగణము**
**గొలువనుండఁ దనూజుఁగోరి వేదవ్యాస । సంయమి దత్ప్రదేశమున యోగ**
**బలమూర్జితముగఁ దపంబొనరించె యో । గమునకు రాజసూయములు నశ్వ**

**తే.** **మేధములును నపరిమితములైనను సరి । గావు సూవె వినుము కౌరవేంద్ర!**
**తత్తపోవిశిష్టతకు మెచ్చి శివుఁడు ప్ర । త్యక్షమై యభీష్టమడుగు మనిన. (శాంతి. 6-247)**

# 150. శుక మహర్షి జన్మవృత్తాంతము-

పరాశర సత్యవతులకు కృష్ణ ద్వైపాయనుడైన వ్యాసుడు సద్యోగర్భాన
జన్మించినాడు, కదా, ఇతడికి శుకుడు జన్మించిన విధమేది? అని
ధర్మరాజు అడుగగా భీష్మపితామహుడు చెబుతున్నాడా వృత్తాంతాన్ని
-మేరు పర్వత సానువులలో ఉన్న కర్ణికార వనం పార్వతీ పరమేశ్వర నిలయం.

వ్యాసుడక్కడ తపస్సు చేయగా శివుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మనగా
పంచభూతాలైన జల పవనాంబర వసుధానల సమవీర్యుడగు పుత్రుడిని
కోరుకొనగా- తథాస్తు! అని పలికి ఈశ్వరుడు అంతర్హితమైనాడు.
వరం పొందిన వ్యాసుడొకనాడు అరణిని మథిస్తూ నిప్పు రాజేస్తుండగా

ఘృతాచి అనే అప్సరస అతడిలో నిప్పు రాజేసింది, నెయ్యిలాగ మండించింది.
దానితో అతడికి వీర్యస్ఖలనమై అది అరణిలో పడింది, నిప్పు పుట్టింది.
అతడే శుకుడు, వ్యాస మహర్షి తేజస్సుతో పుట్టి అతడిలా ప్రకాశిస్తున్నాడు.
గంగానది వచ్చి అతడికి మంగళస్నానం చేయించగానే కృష్ణాజినదండంబులు

ఆకాశం నుంచి వచ్చి శుకుడి ముందు పడ్డాయి, దేవతలు కురిపించారు పూలవాన
దేవదుందుభులు మ్రోగినాయి, పార్వతీ పర్వమేశ్వరలు ఉపనయనం చేసారు.
దేవేంద్రుడు ఇచ్చాడు శుకుడికి ఉజ్జ్వల కమండలం, దేవతలిచ్చారు దివ్య వస్త్రాలు
బృహస్పతి దగ్గర వేదవేదాంగాలు చదివి, ఇంటికి వచ్చి పామరులతో ఆటలాడుతున్నాడు.

---

**క. 'జల పవనాంబరవసుధా । నల సమవీర్యుఁడగు పుత్రు నా కొసఁగంగా**
**వలయు' ననుడు నిచ్చితి నని । పలికి చనియె నమ్మహాకృపామూర్తి నృపా! (శాంతి. 6-249)**

**తే. అయ్యరణిఁ బుట్టి జనకసమాకృతియును । భూరి కాంతియు వెలుఁగంగఁ బొలిచె శుకుఁడు**
**యాగకాల సుసంభృత హవిరవాప్తి । మహితతేజస్కుఁడగు హుతవహుని మాడ్కి. (శాంతి. 6-251)**

**సీ. అపుడు మందాకిని సాకారయై వచ్చి । మంగళస్నాన సమన్వితుఁడు గ**
**నొనరించె నాకసంబుననుండి పడియెఁ గృ । ష్ణాజినదండంబు లతని యెదుర**
**దివ్యదుందుభులును దేవాంగనాగాన । ములును వీతెంచె నద్భుతముగాఁగఁ**
**గుసుమవర్షంబులు గురిసె నింద్రాది దే । వతలు గారవమున వచ్చి రంబి**

**తే. కాసమేతుఁడై యేతెంచి కామవైరి । యతని నుపనీతుఁ గావించె నమరనాథుఁ**
**దుజ్జ్వలంపుఁ గమండులు వొసఁగె నిచ్చి । రమరు లెన్నండు మాయని యంబరములు. (శాంతి. 6-252)**

**- ఉత్పన్నమాత్రం తం వేదాః సరహస్యాః స సంగ్రహాః**
**ఉప త స్థుర్మహరాజ యథాస్య పితరం తథా**
**బృహస్పతిం చ వవ్రే సః వేదవేదాంగ భాష్యవిత్ (సం.శాంతి. 324-22,23)**

# 151. వినుము ఉపనీతుండై విప్రుండు-

వ్యాసుడు తన కుమారుడికి తెలియజేసాడు సాంఖ్యయోగ విధానాలను.
దానితో అహంకార మమకారాలను వీడి శుకుడైనాడు విరాగి.
తండ్రి కోరినట్లు జనక మహరాజు వద్దకు వెళ్లాడు శుకయోగి.
మేరు పర్వతం నుంచి అనేక దేశాలు దాటి చేరుకున్నాడు భరతఖండం.

పాదచారిగా వచ్చిన శుకుడిని పూజించుటకు అర్ఘపాత్రను
తన శిరస్సుపై పెట్టుకుని వచ్చి అతడిని చంద్రశాలకు తీసుకువెళ్లి
రత్నాలు పొదిగిన బంగరు ఆసనంపై కూర్చోబెట్టి కాళ్లు కడిగి అర్చించి
గోవును కానుకగా ఇచ్చినాడు సమస్త పరివారం వినమ్రులై చూస్తుండగా!

అప్సరసలను మించిన వేశ్య కన్యకలతడి ముందు నర్తించారు.
ముగ్ధమనోహరంగా గానం చేసారు, శుకుడు చలించలేదు.
మరునాటి ఉదయం చర్చలో కూర్చున్నపుడు మోక్షమార్గమడిగాడు శుకుడు.
జనకుడు చెప్పినాడు- ఉపనయనం, బ్రహ్మచర్యాశ్రమం

వివాహం, గృహస్థాశ్రమం, సంతానం, యజ్ఞయాగాది కార్య నిర్వహణం
నిత్యాగ్నిహోత్ర సహిత అరణ్యవాస వానప్రస్థం, వైరాగ్య
పూరిత మనః ప్రవృత్తితో సన్యాశ్రమ స్వీకరణం - తపస్సు
చేయడం ముక్తిమార్గం -అనగా శుకుడన్నాడు- మొదటి మూడు అవసరమా?

---

చ. శిరమున నర్ఘ్యపాత్రఁగొని చెచ్చెర వచ్చి ప్రియం బెలర్ప న
గ్గురుసుతుఁగాంచి యంతిపురి కోటకు లోనగు నొక్క సౌమ్యమం
దిరమున కమ్మునిం గొనుచు దేవసమప్రతిపత్తి నేఁగి ర
త్నరుచిర కాంచ నాసనమునం దగనుంచి సునీతపాద్యుఁడై. (శాంతి. 6-266)

క. లలితాక్షతములఁ గుసుమం। బులఁ బూజితుఁ జేసి యర్ఘ్యమును గోవును న
క్కులపతికి నిచ్చె విధిపరి। కలనజ్ఞుండైన యతఁడుఁ గైకొనియెఁ దగన్. (శాంతి. 6-267)

చ. అతనికి నన్నపానముల నంచితభక్తి నొనర్పఁగాఁ బురో
హితు నియమించి యవ్వసుమతీశ్వరుఁ డద్దినశేషయామినుల్
చతురము భక్తియుక్తమును సంప్రమదంబునుఁ గా నయించె స
మ్మితమృదు సారభాషణసమీరణతం దదుపాంతవర్తియై. (శాంతి. 6-270)

తే. జ్ఞాన విజ్ఞాననములు మోక్ష సాధనములు గురుని యుపదేశమున నవి దొరకొనంగ
వాన మోక్షంబు గాంచినవాడు విడుచు నయ్యుపాయ ద్వయమును నతుల బుద్ధి (శాంతి. 6-277)

# 152. ఇనుమును కనకము, నిందయు వినుతియు-

జ్ఞానోదయమైనాక మరల మూడు ఆశ్రమాలలో ఉండడం అవసరమా?
అని శుకయోగి అడుగగా జవాబిస్తున్నాడు జనక మహారాజు
-లోక వినాశము, కర్మసాంకర్యము కలుగకుండా ఏర్పరచారు
పూర్వ మహర్షులు ఈ ఆశ్రమ ధర్మాలను, ఇవి నిర్బంధాలు కావు.

యయాతి మహారాజు అన్నాడు- పరంజ్యోతి ఆత్మలో ఉన్నది
సత్త్వగుణ సంపన్నుడైన సాధకుడు ఆ జ్యోతిని దర్శించగలుగుతాడు
సర్వావయవాలను బయటకు తెచ్చి లోపలకు లాక్కునే
తాబేలులా, ఇంద్రియ జితుడైనవాడు ముక్తిని పొందగలడు.

'పశ్యామి త్వాం మహాభాగ తుల్య లోష్టాశ్మ కాంచనమ్' -అన్నట్లు
నీకు అంతశ్శత్రువులు లేరు బహిశ్శత్రువులు లేరు, మోక్షజ్ఞానివి
-నిశ్చయింపుము నీకన్న నెలవు శాశ్వతంపు నెలవుగ విషయ అవికంపితాత్మ!-
అని జనకుడు పలుకగా అంతర్దర్శనము నొంది శుకుడింటిదారి పట్టినాడు.

వాయువేగంతో ఈసారి ఆకాశమార్గాన చేరుకున్నాడు హిమగిరి
శివుడు, విష్ణువు, షణ్ముఖుడు, ఇంకా అనేకులు తపస్సు చేసిన చోటు
పార్వతిని శివుడికిచ్చి పర్వతరాజు వివాహం చేసిన ప్రదేశమిది.
యజ్ఞావసర వస్తువులకు పుట్టినిల్లు ఆ హిమవత్పర్వతము.

**క.** ఇనుమును గనకము నిందయు । వినుతియు సమములుగఁ గొనుచు వివిధాంగకముల్
దనలోన నడఁచు కమఠము । ననువున నింద్రియము లడఁచునతఁడు గను శివున్.' (శాంతి. 6-286)

**తే.** మారుతముతో సమానధర్మత్వమొంది । యతఁ డుదఙ్ముఖుడై నిఖిలామరులును
మునులు గరుడగంధర్వాదులును గుతూహ । లమున వసియించు శిశిరశైలమున కరిగె. (శాంతి. 6-293)

**సీ.** కురువంశముఖ్య! యగ్గిరి పుణ్యవిభవస । మేతంబు విను మమ్మహీధరమునఁ
బరమేశ్వరుండు దపం బేకపాదస్థుఁ । డై బహువర్షంబు లాచరించెఁ,
బుత్రలాభార్థిత్వమునఁ గృష్ణుఁ దుత్కృష్ట । నియమాచారణములు నిష్ఠ సలిపె,
షణ్ముఖుం డాత్మీయశక్తి ప్రభావంబుఁ । దెలిపి దేవాధికతేజుఁ డయ్యె,

**తే.** మఱియుఁ బెక్కంద్రు మునులు సమర్థులును సు । చరితములఁ బెంపునొంది, రా శైల మా వృ
షాంకునకుఁ గూఁతునిచ్చె, యాగాంగయోని । యగుట నజుఁడు దదాత్మత్వమర్థిఁబొందె. (శాంతి. 6-294)

**క.** అమ్మునియును శిష్యులతో నమ్మహి తాత్ము నుసుచు కొని యధ్యాపన శీ
లమ్మగు చిత్తము తోడ సుఖమ్ముండగ నొక్కనాడు గౌరవమొప్పన్ (శాంతి. 6-296)

# 153. పంచప్రాణాలు - సప్త వాయువులు

అప్పటికే అక్కడ ఉన్నాడు వ్యాసుడు, వేదం నేర్పుతున్నాడు శిష్యులకు
సుమంత, వైశంపాయన, జైమిని, పైలులకు; ప్రకాశిస్తున్నది అశ్రమం
సూర్యకాంతిలో, శుకుడు వచ్చి తండ్రికి పాదాభివందనం చేసి, తనకు
జనక మహరాజుకు జరిగిన సంభాషణ వివరించాడు సవిస్తరంగా.

శుక, సుమంత, వైశంపాయన, జైమిని, పైలులు వేదాధ్యయనం
పూర్తిచేసాక, వ్యాసుని కోరి శిష్యులు వేద ప్రచారానికి వెళ్లగా
నారదుని కోరికపై వ్యాస–శుకులు వేదాధ్యయనం చేయసాగినారు.
ఒకరోజున భయంకరమైన పెనుగాలి వీచగా ఆరోజుకు

వేదాధ్యయనాన్ని ఆపి, ఆ పెనుగాలి విష్ణు, సూర్య విమానముల వలన
ఏర్పడిందని పలికి; వ్యాసుడన్నాడు– సమానుడనే వాయువు దేవగణంలో పుట్టినాడు,
సమానుడి కొడుకు ఉదానుడు, ఉదానుడి పుత్రుడు వ్యానుడు.
వ్యానుడికి అపానుడు, అపానుడికి ప్రాణుడు –వీళ్లు శరీరంలో ఉంటారు.

అదితి పుత్రులైన వాయుదేవతలు ఏడుగురు– ప్రవహుడు,
ఆవహుడు, ఉద్వహుడు, సంవహుడు, వివహుడు, పరివహుడు
పరావహుడు –వీరు, ప్రాణవాయువులు కలిసి సంచరించినపుడు
వానలు కురవడానికి విమానాలు ఎగరడానికి వీలు కుదుర్తుంది.

---

**చ. అనవుడు 'మున్న యిట్టు లన రైతిరి వోవఁగనీను మిమ్ము నెం**
**దును గడు వెడ్డువెట్టితిరి దోహల మిమ్మెయినుండ జాణలై**
**నను నిటు వేతొకం డడిగి నా వచనంబులు మీ మనోరథం**
**బున కిటు సాధనంబులుగఁ బోకలఁ బోయితి' రంచు నవ్వుచున్. (శాంతి. 6–301)**

**– విష్ణోర్నిః శ్వాస వాతో యం యదా వేగ సమీరితః**
**సహసోదీర్యతే తాత జగత్ప్ర వ్యథతే తదా–**
**తస్మా ద్బ్రహ్మ విదో వేదాన్ నాధీయంతే తివాయతి**
**వాయోర్వాయుభయం హ్యుక్తం బ్రహ్మ తత్పీడితం భవేత్ (సం.శాంతి. 328–55,56)**

---

**శుకమహర్షి :** పరీక్షిత్తు మహరాజుకు భాగవత పురాణాన్ని వినిపించింది శుకమహర్షి. ఇతడి తండ్రి వ్యాసుడు, తల్లి వాటిక (పింజల) లేదా ఘృతాచి. శుకుడి భార్య పివరి. పుత్రులు– కృష్ణగౌరుడు, శంభుడు, మరో ఇద్దరు పుత్రులు; కుమార్తె కృత్తి. వ్యాసుడి నూరేళ్ల బ్రహ్మచరిత్వం, చిలుక రూపంలో ఉన్న ఘృతాచి ఆకర్షణలో వీర్యపాతమై మండుతున్న సమిధలపై పడగా కుమారుడు శుకుడు జన్మించాడు. ఇంకో కథనం ప్రకారం జాబాలి కుమార్తె వాటిక (పింజల)ను పరిణయమాడగా జన్మించిన బాలుడు తాను విన్న ప్రతి విషయాన్ని చిలుకలా అప్పజెబుతుంటే అతడిని శుకుడని పిలిచారు. సర్వసంగపరిత్యాగిగా శుకుడు నగ్నంగా సంచరిస్తున్నా స్నానం చేస్తున్న అప్సరసలు తమను తాము వస్త్రాల మాటున దాచుకోలేదు, కాని తన కుమారుడిని అనుసరించి వస్తున్న వ్యాసుడు వస్త్రధారుడై ఉన్నా అప్సరసలు వస్త్రాలు కప్పుకుని మరుగున దాక్కున్నారు.

# 154. నగ్నలై అప్సర స్త్రీజనములు-

–విశ్వరూపుడైన విష్ణువు నిట్టూర్పు సప్త పవనాలను కలచివేస్తే
ఇటువంటి పెనుగాలులు పుడతాయి, హిమగిరులే కదుల్తాయి–
అని వ్యాసుడు తెలిపినాడు నారద మహర్షి, శుకులకు పెనుగాలి గురించి.
ఆ పెనుగాలి సద్దుమణిగాక నారదుడు చెబుతున్నాడు శుకుడితో.

సనత్కుమారుడు మునులతో చెప్పిన విషయమిది, వినుము–
–నాస్తి విద్యాసమం చక్షుః నాస్తి విద్యాసమం తపః
నాస్తి రాగ సమం దుఃఖం నాస్తి త్యాగ సమం సుఖమ్–
సత్యమే తపస్సు, జ్ఞానమే కన్ను, త్యాగమే సుఖం, రాగమే దుఃఖం.

కామక్రోధాలు ముక్తికి శత్రువులు, వాటిని జయిస్తే సంసారమవుతుంది
రూపరహితం; అపరిగ్రహం, సర్వారంభ పరిత్యాగం ఉంటే ఉండదు దుఃఖం.
అహింస, ఇంద్రియ నిగ్రహం, నిరాశ, అచపలత్వం ఉన్నవాడికి
కరతలామలకం అవుతుంది అంతరాత్మతత్త్వం –అతిసులభం–

ఆ విధంగా సనత్కుమారుడు చెప్పగా మునులు సంతోషించారని–
నారదుడు శుకునికి తెలియజేసి నిష్క్రమించాడు, శుకుడు తన తండ్రిని
వదలి కైలాసపర్వతం వచ్చి అక్కడ నుండి తక్కువ ఎత్తులో వెళ్తుంటే
గంగానదిలో దిగంబరంగా జలక్రీడలాడుతున్నారు అప్సరసలు ఆనందంగా!

---

**తే.** **నగ్నలై యప్సరస్త్రీజనములు సలిల । కేళి సలుపుచునుండి శంకింప కమ్మ**
**హాత్ముఁ గనుఁగొను చెప్పటియట్ల నిర్వి । కారవృత్తి వర్తించిరి కౌరవేంద్ర! (శాంతి. 6-331)**

**తే.** **వెనుక నరుగుచునున్న యవ్వేదమూర్తి । తోడ సిద్ధచారణులు దత్సుతుఁడు శైల**
**శృంగ విధ్వంసియై పోక సెప్ప నెలుఁగు । పెంపు మిగుల 'శుకా!' యని పిలిచె నతఁడు. (శాంతి. 6-333)**

**తే.** **సకలజంగమ స్థావర సమితు లెల్ల । నో యనిన నద్భుతం బెద్ద నుద్భవింప**
**సత్యవతి కొడ్కు - కొడుకు విశాల మహిమఁ । దెలిసి యప్పర్వతముమీఁద నిలువఁబడియె. (శాంతి. 6-335)**

**–** **అంతర్హితః ప్రభావం తు దర్శయిత్వా శుక స్తదా**
**గుణాన్సంత్యజ్య శబ్దాదీన్ పదమ భ్యగ మత్పరమ్ (సం.శాంతి. 333-26)**

---

వ్యాసుడి కర్థమయ్యింది శుకుడు అన్ని ఐహిక బంధాలను పరిత్యజించి ప్రకృతిలో భాగమైనాడని. భవబంధాలను తెగగొట్టి ముక్తుడైనాడని. మహారాష్ట్రలోని మహదేవ కొండల్లో– సాంగ్లి జిల్లా అత్పడి– ఖానాపూర్ మధ్య చిలుకల గుట్ట శుకచరి గుహలో అతడు అదృశ్యమైనాడని ప్రజలు విశ్వసిస్తున్నారు.

బృహస్పతి వద్ద సర్వ విద్యలను, జనకుడి వద్ద జీవన్ముక్త జ్ఞానాన్ని పొందిన శుకమహర్షి రంభ ఆహ్వానాన్ని తిరస్కరించినవాడు. పరీక్షిన్మహరాజు శృంగి శాపంతో చింతాక్రాంతుడై ఉన్నపుడు ఎవరింటిలోనూ పాలు పితికిన సమయమంతసేపు కన్నా ఎక్కువసేపు ఉండనివాడు ఏడు రోజులు వ్యాస భాగవతాన్ని చెప్పి మోక్షభావనను పెంపొందింపచేసినవాడు. సాటిలేని అవధూత శుక మహర్షి.

# 155. పుత్ర సదృశ ఛాయ నిన్ను అనుగమించు-

తన కుమారుడైన శుకుడు గగనమార్గాన వెళ్లగానే వ్యాసుడు
అతడి వెనుక వస్తుండగా నా కుమారుడిటు వెళ్లాడా అని పిలిస్తే
శుకుడు తమకు చెప్పిన విధంగా, 'ఓ' -అని సమాధానమిస్తున్నాయి
మృగపక్షి శైల సరిత్ సరసీ తరు గుల్మలతలు- 'ఓ' అను ధ్వని

ఆకాశమంతా వ్యాపించగా ఆశ్చర్యపోయిన వ్యాసుడు ఆగినాడు
గంగానది వద్ద, అక్కడ జలకాలాడుతున్న అప్సరసలు సిగ్గుచెంది
వెంటనే వెళ్లి బట్టలు కట్టుకున్నారు, తన కుమారుడిని చూసి
పట్టించుకోనివారు తనని చూడగానే ఎందుకలా వస్త్రధారిణులయ్యారో

గ్రహించి, తన ఆసక్త స్థితిని, కుమారుడి విముక్తస్థితిని అర్థం చేసుకుని
తదేక ధ్యానంతో మహాశివుడిని తలచగా అతడు ప్రత్యక్షమై
-నీవు కోరినట్లే పంచభూత సమవీర్యుడిని కుమారుడిగా ఇచ్చాను కదా!
ఈ నేల, కొండలు, ఈ సముద్రాలు ఉన్నంత కాలం నిలిచి ఉంటాయి

నీ పుత్రుడి కీర్తి, నీ యశోవిభూతి; జనుల వీనులకు పండుగ చేస్తాయి.
నీవు అంతగా నీ కుమారుడిని చూడదలిస్తే అతడు కనిపిస్తాడు
నీ నీడలో, నిన్ననుసరిస్తూ- అని వ్యాసుడిని సంతోషపరచి
నిష్క్రమించినాడు అదృశ్యరూపాన నీలకంఠుడైన విశ్వేశ్వరుడు.

---

**క. సుర ముని సిద్ధగణంబులు । పరివేష్టింపంగ నతని పాలికి గంగా**
**ధరుఁ డేఁగుదెంచి నెవ్వగఁ । బొరయు నతనితోడఁ గరుణ వొంపిరివోవన్. (శాంతి. 6-337)**

**క. 'జలపవనాంబర వసుధా । నల సమవీర్యుఁడగు పుత్రు నాకొసఁగంగా**
**వలయు'నని యడిగి తిచ్చితి । నలఘు తపోవిభవఁ యేను నట్టికుమారున్. (శాంతి. 6-339)**

**తే. 'ఇలయు గిరులును శరధులు నెంతదాఁకఁ । గలుగు నంతకాలంబును వెలయుచుండు**
**శుకుని కీర్తియు నీదు యశోవిభూతి । యును జనంబుల వీనుల కుత్సవముగ.' (శాంతి. 6-341)**

**- ఛాయాం స్వ పుత్ర సదృశీం సర్వతోనపగాం సదా**
**ద్రక్ష్యసే త్వం చలోకేస్మిన్ మత్ప్రసాదాన్మహామునే (సం.శాంతి. 334-38)**

---

**విశ్వేశ్వరుడు :** హిందూ దేశపు ప్రాచీన నగరం వరుణ-అసి నదుల సంగమస్థానం, వారణాసి, కాశి, బెనారస్‌గా పిలువబడుతున్న పుణ్యక్షేత్రం. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన విశ్వేశ్వర జ్యోతిర్లింగం కాశీలో ఉన్నది. కాశ్యాన్తు మరణాన్ ముక్తి- కాశీలో మరణిస్తే ముక్తి లభిస్తుందని ప్రజల విశ్వాసం. గంగానది, హిందూమతం, హిందూస్తాని సంగీతం, పట్టువస్త్రాలు, హిందీ-సంస్కృత పీఠాలు కాశీనగర సాంస్కృతిక చిహ్నాలు. భారతదేశపు ఆధ్యాత్మిక రాజధాని కాశి. జలఖడ్గమైన వారణాసి- అవిముక్తక, ఆనందకానన, మహాస్మశాన, సురధాన, బ్రహ్మవర్ధ, సుదర్శన, రమ్య, కాశి పేర్లతో విలసిల్లుతూ 5000 సంవత్సరాల క్రితం శివుడిచే స్థాపించబడిందని స్థానికుల అభిప్రాయం. కాశీనగర రక్షకదేవుడు విశ్వేశ్వరుడు. పార్వతీదేవి అన్నపూర్ణగా దర్శనమిస్తుంది కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో.

# 156. ఆ మూలాకృతి ఎట్లుండునో-

ఆ విధంగా సర్వభూతాత్మకుడై అదృశ్యమైన తన కుమారుడు శుకుడిని
తన నీడలో చూసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాడు వ్యాసుడు-
అని భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు నారాయణ-నారదుల సంవాదమును,
-బదరీకాశ్రమంలో నివసిస్తున్న నారాయణుడిని నారదుడడిగాడు

లోకేశా! నీ మూలాకారం ఎలా ఉంటుంది? అవతార రూపాలకది భిన్నమా?
అని నారదుడు అడుగగా నారాయణుడతడికి ఇచ్చాడు తన మహత్తు.
దానితో నారదుడికి కలిగాయి అనేక మహిమలు దివ్యదృష్టి.
-వసువు అనే రాజు విమానంలో తిరుగుతూ భూమిని పాలించేవాడు.

అందుకే అతడిని 'ఉపరిచర వసువు' అని పిలిచారు. అంగీరసుడి
కుమారుడైన బృహస్పతి వద్ద- చిత్తుడు, శిఖండి, మరీచి, స్వయంభువుడు
మొదలైనవారు మథించి వ్రాసిన ధర్మశాస్త్రాన్ని నేర్చుకున్నాడు వసువు.
అతడు చేసిన ఒక గొప్ప యాగం జరిగింది బృహస్పతి అధ్వర్యంలో.

బ్రహ్మ మానస పుత్రులు ఏకతుడు, ద్వితుడు, త్రితుడు సదస్యులు
సప్తర్షులు ఋత్విక్కులు; వసువు జీవహింసకు వ్యతిరేకి
మేకకు బదులు ఓషధులను హవిస్సులో వేయగా విష్ణువు
అదృశ్య రూపంలో తన భాగం తీసుకుని వెళ్లిపోవడం గమనించాడు బృహస్పతి.

---

**చ.** **అలఘు తపంబుఁగోరి వసుధాధిపతిత్వము డిగ్గఁద్రావి కా**
**నలఁ జరియించుచుండ సురనాయకుఁ డాతని పాలికేఁగి 'నె**
**చ్చెలివయి నా కడం దగ వసింపుము వచ్చుచుఁ బోవుచున్న మే**
**లిలయును నేలు దివ్యతయు నిచ్చితి మెచ్చితి నీదు నిష్ఠకున్. (శాంతి. 6-357)**

**తే.** **దేవభావంబునకుఁ దగ దీనినెక్కి । తిరుగు మెల్లెడ' నని రత్నదీప్తమైన**
**యొక విమానంబు సంప్రీతి నొసఁగె నతఁడు । నతని మాటకు మిగులక యట్ల చేసె. (శాంతి. 6-358)**

**తే.** **'ఉపరిచరవసు వను నొక్క నృపతి పుట్టు । నాతఁ డర్థుఁ డా శాస్త్రంబు నధిగమింప**
**నా బృహస్పతి సెప్పెంగ నధిగమించి । తత్సమాచార నాయకత్వము వహించు. (శాంతి. 6-360)**

**తే.** **అన్నరేంద్రుం డహింసకుం డగుటఁ జేసి । పశు విశసనంబు లేకుండఁ బరమనిష్ఠ**
**నాతఁ డారణ్యకోద్గీత మైన వాక్య । సంచయము విష్ణుగుఱిచి పఠించె నధిప! (శాంతి. 6-362)**

**క.** **కరుణావిధేయుఁ డగు నా । హరి యతనికిఁ గానవచ్చు నట్టులుగాఁ జె**
**చ్చెర వచ్చి హవిర్భాగా । హరణం బొనరించి చనుడు నతికుపితుండై. (శాంతి. 6-363)**

# 157. ఉపరిచర వసువు కథ

బృహస్పతి దుఃఖితవదనుడై ఉండగా ఏకత ద్వితి త్రితులతడిని
ఊరడించి అన్నారు– మేము ఆ దేవుని మూలాకృతి చూడాలని
అశరీరవాణి చెప్పగా క్షీరసాగరం మధ్యలో ఉన్న శ్వేతద్వీపం వెళ్లి
అక్కడ శ్వేతవర్ణులు, చెమటపట్టనివారు, జితేంద్రియులు

సురభిదేహులు, ఆహార రహితులు, హరిభక్త పరాయణుల
చెంత నిలబడి ఉండగా వేయి సూర్యబింబాల వెలుగుతో
ప్రత్యక్షమయ్యింది ఒక దివ్యమైన కాంతి స్వరూపం– ఆ ద్వీపవాసులు
–హే పుండరీకాక్షా, విష్ణూ, హృషీకేశా, విశ్వభవనా జయ జయ జయ!

అంటున్నారు కాని మా ముగ్గురికి చూడసాధ్యం కాలేదు ఆ వెలుగు
అప్పుడు అశరీరవాణి అన్నది– మీరు విష్ణుభక్తులను చూసారు కదా!
సంతృప్తి చెందండి– మేమూ విష్ణుభక్తుల ఆశీస్సులు పొంది
సంతోషంగా తిరిగి వచ్చాము –అందుచేత ఓ బృహస్పతీ

యజ్ఞం పూర్తి చేయుము! నీ పుణ్య ఫలాన విష్ణుదర్శనమవుతుంది.
బృహస్పతి యజ్ఞం పూర్తి చేసాడు అత్యంత శ్రద్ధాభక్తితో.
పూర్వం దేవతలు మునులు చర్చిస్తున్నపుడు–దేవతలు అన్ని కాలాల్లో
యజ్ఞ సమయాన మేకను బలివ్వాలన్నారు, మునులు అక్కర్లేదన్నారు.

---

**క. మా నయనంబులు దత్తే । జోనిహతము లగుదుఁ దెలియుఁ జూడ నశక్యం**
**బైనం జేద్పడి యుండం । గా నొక భూతంబు వలికె గగనతలమునన్. (శాంతి. 6–368)**

**క. ఈ దేవునిఁ గన్నట్టుల । కాదే? యిప్పురుషవరులఁ గాంచుట మీకున్**
**ఖేదంబు వలదు నియమ త । పోదానము లితనిఁ జూపఁ బూఁటవడియెనే? (శాంతి. 6–369)**

**క. ఏకాంతిక భక్తిరతి న । నేకములగు వత్సరముల కివ్విష్ణుని నా**
**లోకింపంగా దొరకొనుఁ । గా కిటు వేగపడ మీకుఁ గానఁగ వశమే? (శాంతి. 6–370)**

**– ఏతాన్బహు విధా స్వర్ణాన్ రూపై ర్బి భృత్స నాతనః**
**సహస్ర నయనః శ్రీమాన్ శతశీర్షః సహస్రపాత్ (సం.శాంతి. 339–6)**

---

**ఉపరిచర వసువు :** చేదిదేశపు ప్రభువు కృతి కుమారుడు. దేవతలకు, మునులకు మేకను యజ్ఞాల్లో బలి ఇవ్వాలా వద్దా అన్న విషయంలో 'ఇవ్వాలి' అని దేవతలకు అనుకూలంగా పలికినాడు ఉపరిచర వసువు. మునులు కోపించి అతడిని భూలోకానికి పంపివేసారు స్వర్గం నుంచి. ఇతడి రాజ్యంలోనే ఉన్న కోలాహలకొండ, పక్కనే ఉన్న నది శుక్తిమతిని ప్రేమించగా గిరిక, వసుపాదులు జన్మించారు. గిరికను పెండ్లి చేసుకున్నాడు వసువు, వసుపాదుడిని తన సేనానిగా నియమించుకున్నాడు. ఉపరిచరవసువు వీర్యం వలన అద్రిక అనే చేపకు ఇద్దరు పిల్లలు కలిగారు. మగపిల్లవాడు మత్స్యరాజు, ఆడపిల్ల దాశరాజు దగ్గర పెరిగిన మత్స్యగంధి–సత్యవతి. ఈమె కుమారుడు వ్యాసుడు (పరాశరుని వల్ల). తరువాత శంతనుడిని పెళ్లి చేసుకునగా విచిత్రవీర్యుడు, చిత్రాంగదుడు జన్మించారు.

# 158. మహాద్భుతమైన నిజ దివ్యరూపంబు!

మునులన్నారు– కృతయుగంలో మేకకు బదులు ఓషధులిస్తే చాలు,
అయితే మధ్యవర్తిగా ఉన్న వసువు అన్నాడు అన్ని కాలాల్లోనూ మేకనే బలి ఇవ్వాలి.
అందుకని వారు కోపించి వసువును నివసించమన్నారు భూమిపై.
అందువల్ల వసువు భూమిపై రాజ్యమేలుతూ ఉపరిచర వసువైనాడు.

తాను తన యాగాన్ని ఓషధులతోనే చేసాడానాడు ఉపరిచర వసువు.
విష్ణువు దయతో, వసువు మరల సశరీరంగా బ్రహ్మలోకాన్ని చేరుకున్నాడు.
నారదుడి మనసులో ఆ శ్వేత ద్వీపం కనిపించింది, ద్వీపవాసులూ
కనిపించారు, ఊర్ధ్వబాహుడై నిలబడి విష్ణు నామాలను ఉచ్ఛరిస్తున్నాడు.

అప్పుడు ప్రత్యక్షమైనాడు నారదుడి మనోఫలకాన దేవదేవుడు
–తెలుపు నలుపు పసుపు ఎరుపు గోరోజనవర్ణం, ఆకుపచ్చ రంగులతో
సహస్ర శిరస్సులు, సహస్ర బాహువులు, సహస్ర పాదాలు, యజ్ఞవేదిక
కమండలము, చెక్కగరిటెలు– స్రుక్కుస్రువములు, హోమాగ్ని

ఓంకారాన్ని ఉచ్చరిస్తూ వేదాలు, గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ, దివ్యరూపంతో
ప్రత్యక్షమై నారదుడిని ఆశీర్వదించి అన్నాడు– 'అనఘా
నీవు ఏకాగ్రచిత్తుడవు, అహంకార రహితుడవు, అందుకే చూడగలిగావు నన్ను!'
ఆనందంతో నిండిపోయింది నారదుడి మనో ప్రపంచం.

---

**సీ.** **ఇంద్రియంబుల కందఁ డెల్ల భూతంబులుఁ । దెగినను దెగకుండుఁ ద్రిగుణరహితుఁ**
**దఖిలంబునకు నాత్మ యన సర్వసాక్షినా । నజుఁ దన నిష్కళుండన వెలుంగు**
**క్షేత్రజ్ఞుఁ డాతండు జీవుండు వాసుదే । వుండును సంకర్షణుండుఁ జూవె**
**వారు మనం బహంకారంబు వరుసఁ బ్ర । ద్యుమ్నానిరుద్ధనామోపహితము**

**తే.** **లింతయును మన్మయంబ యే నిరువదియును । నాల్గునగు తత్త్వకోటికి నాథుఁడైన**
**పంచవింశకాభిఖ్యుండఁ బరమపురుషుఁ । దనియు నాపేరు మఱి పర మరయ లేదు. (శాంతి. 6–381)**

– **ఓంకార ముద్గిర న్వక్త్రాత్ సావిత్రీం చతదస్వయామ్**
**శేషేభ్య శ్చైవ వక్త్రేభ్యః చతుర్వేదాన్గిరన్ బహూన్**
**అరణ్యకం జగౌ దేవః హరిర్నారాయణో వశీ (సం.శాంతి. 339–8)**

---

చిత్రాంగదుడు తన పేరున్న గంధర్వుడితో యుద్ధం చేసి మరణించాడు. విచిత్రవీర్యుడు అంబిక అంబాలికలతో సుఖ సంసారం చేస్తూ కన్నుమూసాడు. తన వంశం అంతటితో ముగియడం ఇష్టంలేక సత్యవతి వ్యాసుడిని నియోగించగా అంబికకు ధృతరాష్ట్రుడు, అంబాలికకు పాండురాజు, అంబికా దాసి పరిశ్రమకు విదురుడు జన్మించారు. ధృతరాష్ట్రుడు–గాంధారికి కౌరవులు నూరుగురు, దుశ్శల; పాండురాజుకు కుంతి వలన ధర్మరాజు, భీముడు, అర్జునుడు, మాద్రి వలన నకుల సహదేవులు జన్మించారు; పుట్టుకతోనే అంధుడైన ధృతరాష్ట్రుడి సంతానానికి, హస్తినాపుర రాజ్యాన్ని తన వీరత్వంతో సంపన్నం గావించి మునిశాపంతో సంపదలను ధృతరాష్ట్రుడికిచ్చి శతశృంగానికి వెళ్లిపోయిన పాండురాజు సంతానానికి మధ్య వారసత్వ సంపదలు, అధికారం కోసం జరిగిన యుద్ధమే మహాభారత కథావృత్తాంతం.

# 159. పరమ పురుషుడనియు నాపేరు-

క్షీర సముద్ర మధ్య శ్వేతద్వీప వాసియగు నారాయణుడంటున్నాడు
–నారదా! క్షేత్రజ్ఞుడు, జీవుడు, వాసుదేవుడు, సంకర్షణుడు నేనే.
వాసుదేవుడు మనస్సు, అదే ప్రద్యుమ్నం; అహంకారమే సంకర్షణుడు
అదే అనిరుద్ధం; ఇరవై నాలుగు తత్త్వాలకు ప్రభువైన ఇరవై అయిదవ తత్త్వం నేనే.

అందుకే నేను పంచవింశకుడిని; పరమ పురుషుడిని, పరంధాముడిని.
సకల ప్రాణికోటిలోని ధాతుశక్తి నేనే. జీవుడు నాకంటే భిన్నుడు కాదు.
ఆదిత్యులు, మరుత్తులు, వసువులు, రుద్రులు ఇత్యాది దేవగణాలు
బ్రహ్మ, చతుర్వేదాలు గౌరవం పొందుతున్నది నా మహిమ వలననే!

నివృత్తి మార్గం నాది; లోకహితం కొరకు జన్మలెత్తుతాను నేను.
వరాహరూపంలో హిరణ్యాక్షుడిని, నరసింహమై హిరణ్యకశిపుడిని
పరశురాముడనై క్షత్రియలోకాన్ని, రాముడిగా రావణుడిని సంహరించాను.
కృష్ణుడినై భూభారాన్ని తొలగిస్తున్నాను, నరుడైన అర్జునుడితో కలిసి–

అని పలికి నారాయణుడు నారదుని ఆశీర్వదించి అంతర్హితుడు కాగా
నారదుడు తాను స్వామి నుండి గ్రహించిన ఉపదేశామృతాన్ని
మహర్షులందరికీ కర్ణ రసాయనంగా అందించి ధన్యులను చేసినాడు
–అని పలికి భీష్ముడు ధర్మరాజుకు విష్ణురూపం గురించి వివరించాడు.

---

**క. జీవశరీరములు పృథ । గ్భావాకలితములు గాఁగఁ గనుటయు వలయున్**
**జీవునిఁ గంటి ననుట మా । యావిలసన మస్మదీయ మది మునివర్యా! (శాంతి. 6–384)**

**క. జీవుఁడు మత్సముపేతుఁడు । గావు టెఱుఁగవలయు దృఢముగా భక్తిమయం**
**బై వఱలు నాశ్రయంబున । నేవాఁ డొందు నను వాని కిత్తు విముక్తిన్. (శాంతి. 6–385)**

**క. ఆదిత్య మరు ద్వసురు । ద్రాది దివిజగణము నంబుజాసనుఁడుఁ జతు**
**ర్వేదములు మదాత్మకతం । గాదే తత్తద్విశేష గౌరవమొందున్! (శాంతి. 6–386)**

**తే. కమలగర్భు సృజించి సకలజగద్ధు । రానియుక్తునిఁ గావించి యే నివృత్తి**
**పరత నేకాకినై దివ్యభవ్య మగు స । హాయముగ సంచరింతు మధ్యస్థవృత్తి. (శాంతి. 6–387)**

**తే. భక్తి వీడ్కొని చని మునిప్రతతి కెందు । నచ్యుతాననోద్గతము వేదార్థమయము**
**యోగసాంఖ్యాత్మకమునైన వాగమృతముఁ । గర్ణపుటపేయముగఁ జేయు గారవమున. (శాంతి. 6–389)**

---

**వ్యూహములు–** పంచభూత నిర్మిత శరీరం–వాసుదేవం; జీవాత్మ–శేషుడు–సంకర్షణుడు; జీవి మనస్సు – ప్రద్యుమ్నుడు; జీవి–అహంకార తత్త్వం–అనిరుద్ధుడు; అనిరుద్ధ తత్త్వం నుంచి కారణము–మహత్తు–కార్యములతో ఉత్పన్నమవుతుంది సమస్త చరాచర జగత్తు.

# 160. మొదల గలిగించి జగములు-

భీష్ముడు చెబుతున్నాడు– మునులందరూ కలిసి వైష్ణవయాగం నిర్వహించారు.
విష్ణువు వారితో అన్నాడు– మరీచి, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు
పులహుడు, క్రతువు వసిష్ఠుడు – వీరు యజ్ఞ భాగాలు స్వీకరిస్తారు.
సన సనక సనందన సనాతన కపిల సనత్కుమారులు సాంఖ్యయోగ మార్గాలను

ప్రచారం చేస్తారు. బ్రహ్మ సర్వశాసకుడిగా, నా నుదుటి నుంచి పుట్టిన
రుద్రుడు లోకాలకు ఆరాధనీయుడవుతాడు. కృతయుగంలో
జంతుబలి కూడదు– అని ఆనతివ్వగా అందరూ వెళ్లిపోయారు.
అక్కడే ఉన్న బ్రహ్మకు కనిపించాడు విష్ణువు హయగ్రీవుడి రూపంలో.

చేతులలో దండ కమండలాలు, అశ్వశిరంతో శోభిల్లుతున్న
హయగ్రీవుడు బ్రహ్మను ఆలింగనం చేసుకుని– బ్రహ్మదేవా!
నీవు సర్వంబునకు విధాతవు, గురుడవు; ప్రభువువై నడుపుము.
నీకు కష్టమైనపుడు నేను ప్రత్యక్షమై కార్యభారం వహిస్తాను–

అని పలికి విష్ణుమూర్తి అంతర్ధానమైనాడని వ్యాసుడు పలికి ప్రార్థిస్తున్నాడు
–అజ, అమర, అమరాధినాధ, ఆద్య, ఆత్మవేద్య, అవ్యయ, ఈశాన
విశ్వరూప, వేదవేద్య, తపః ఫలాత్మ, ఓ విష్ణుదేవా! లోకాలను
సృష్టించి, పోషించి, లీనం చేసుకునే నిన్ను సేవిస్తున్నాను, ప్రభూ!–

**తే.** **హయశిరోభాసితుండును హస్తకలిత । లలిత దండకమండలూజ్జ్వలుఁడు సాంగ**
**వేదముఖరముఖుండునై యాదరార్ద్ర । దృష్టి నిగుడంగ నిలిచి యద్దివిజముఖ్యు. (శాంతి. 6–412)**

**క.** **మొదలఁ గలిగించి జగములఁ । బదిలంబుగ నునిచి వానిఁ బదపడి తనయం**
**దొదిఁగించి మఱియు నెమ్మెయి । నుదారగతి నడపు చిన్మయుని గొలుతు హరిన్. (శాంతి. 6–414)**

**ఆ.** **అజుని విశ్వరూపు నమరుని సర్వామ । రాధినాథు నాద్యు సాంగవేద**
**వేదితవ్యు నాత్మవేద్యు నీశాను । న । వ్యయుఁ దపఃఫలాత్ము నాశ్రయింతు. (శాంతి. 6–415)**

అన్నం, వేదం, నీరు, అమృతాలకు పృశ్ని అని పేరు. అవి గర్భంలో కల భగవానుడు పృశ్నిగర్భుడైనాడు. సమస్త ప్రాణాలు నివసించే వసువులకు దేవుడు వాసుదేవుడు.

**హయగ్రీవుడు :** జ్ఞానసంపదకు అధిపతి, అశ్వముఖుడు. తెల్లని శరీరం, తెల్లని వస్త్రాలు, తెల్లటి పద్మంపై ఆసీనుడై ఉంటాడు. చేతుల్లో చతుర్వేదాలు, శంఖుచక్రాలు కలవాడు, స్వచ్ఛమైన స్ఫటికంలా మెరుస్తున్నవాడు హయగ్రీవుడు. వేయి గుర్రాల రథంపై విహరించే వీరుడు. ఫాలభాగాన రుద్రుడు, హృదయంలో బ్రహ్మ, సూర్యకిరణాలు జూలుగా, సూర్యచంద్రులు నేత్రాలుగా, వసువులు–సాధ్యులు కాళ్లుగా, అగ్ని–నాలుకగా, సత్యదేవత వాక్కుగా, వరుణుడు, వాయువులు (మరుత్తులు) మోకాళ్లుగా, ఆగ్రహించగా ఎరుపెక్కిన నేత్రాలతో భయంకరంగా కానవస్తూ దానవ సంహారం చేసాడు హయగ్రీవుడు. వ్యాఖ్య ముద్ర, అక్షమాల, వేదాలు ధరించి యోగ హయగ్రీవుడిగా కానవస్తాడు. మధుకైటభ రాక్షస సంహారియైన విష్ణు స్వరూపం హయగ్రీవుడు.

# 161. భగవన్నామ నిర్వచనాలు

నారములనగా నీళ్లు- నీళ్లలో నివసించేవాడు నారాయణుడు. జగములలో
తానుండి, తనలో జగములు వసించగా వాసుదేవుడు, వ్యాపనశీలుడుగా
రోదసిలో జగత్తులో ఉండడం చేత విష్ణువు, ఇంద్రియ నిగ్రహము
అనగా దమము ఉన్నవారు ధ్యానించుట వలన, ఊర్ధ్వ భూలోకాలు ఉదరంలో

ఉండి దామోదరుడు, అమృతము జలము అన్నము వేదము అను పృశ్ని గర్భమై
ఉన్న పృశ్నిగర్భుడు, కిరణాలు కేశాలుగా కేశవుడు, అగ్నిషోముడుగా
సూర్యచంద్ర రూపాలు; వరదుడు, లోక భావనుడు, ఇంద్రియాలను జయించి
హృషీకేశుడు, యాగ భాగాలను అపహరించే హరి, గోవులను కాపాడే గోవిందుడు

రోమరహితుడై శిపివిష్టుడు, నల్లగా ఉండి కృష్ణుడు, సత్తు అసత్తుగల సత్యుడు.
పుట్టుక లేక అజుడు, క్షయము లేక అధోక్షజుడు, సత్త్వగుణమున్న సాత్వతుడు
చ్యుతి లేదు కనుక అచ్యుతుడు, వాత పిత్త శ్లేష్మ ధారకుడు- త్రిధాతువు
జంతువుల ఘృతమునకు కారణమై ఘృతార్చి, ధర్మమయుడిగా వృషుడు

ఆది మధ్య అంతము లేక అనాది, అమధ్యుడు, అనంతుడు; శుచిగల మాటలు
హితము గనుక శుచి శ్రవసుడు, వరహావతారంలో ఒంటికొమ్ముతో
భూగోళాన్నెత్తడం వలన ఏకశృంగుడు; లోకాన్ని రేచనం- ఉత్తేజం చేయడం వలన
విరించుడు, జ్ఞానరూపంలో సూర్యుడితో ఉండడం చేత కపిలుడుగా-

---

**క.** **నారము లనఁగా జలముల । పే రయనం బనఁగ నెలవు ప్రీతిగ నాకున్**
**నారము లయనం బగుటను । నారాయణుఁ డండ్రు జనులు నన్నుఁ గిరీటిఁ (శాంతి. 6-421)**

**క.** **వసియింతు నే జగములన్ । వసియించున్ జగములెల్ల నాయం దిమ్మై**
**పొసఁగి వెలుంగుచునుండుట । నసదృశగుణ! వాసుదేవుఁ డనఁగఁ బరఁగుదున్. (శాంతి. 6-422)**

**క.** **వ్యాపించి రోదసీకుహ । రాపూర్ణత్వమున నునికి నధికక్రమణ**
**శ్రీ పొలుపున విష్ణుండను । దీపితనామంబునను బ్రతీతుఁడ నగుదున్. (శాంతి. 6-423)**

**తే.** **దమమునాఁ గల యుత్తమధర్మ మెడఁద । నలవఱిచి నన్నుఁ గామించు నార్యజనము**
**దివియు భువియు నా నడుమన తేజరిల్లు । నట్టు లగుట దామోదరుఁ డండ్రు నన్ను. (శాంతి. 6-424)**

**ఆ.** **అన్నమును జలంబు నమృతంబు వేదంబుఁ । బృశ్ని యనఁగ నొప్పుపేరఁ బరఁగు,**
**నది మదీయగర్భ మగుట విద్వజ్జను । లనఘ! పృశ్నిగర్భుఁ డండ్రు నన్ను. (శాంతి. 6-425)**

**క.** **ఇనరశ్ములుఁ జంద్రాంశులు నసల శిఖలు గేశసంచయము నాకుంగా**
**వునఁ గేశవాభిధానం బున గొనియాడుదురు ననుఁ బ్ర బుద్ధ జనంబుల్ (శాంతి. 6-426)**

# 162. మీ చందమ యాతని కడగంటి మిమ్మును-

యోగాన్ని గర్భంలో కలిగి యోగగర్భుడు, హిరణ్యగర్భుడిగా; లోకరక్షణార్థం
నారాయణుడిగా, ధర్మరక్షణార్థం పుట్టినపుడు ధర్మజుడిగా, దక్షయాగం సమయాన
యజ్ఞం భయపడి వక్షస్థలాన్ని ఆశ్రయించ రోమాలు ముంజగడ్డిగా
మారగా ముంజకేశుడిగా, పరశురూప బాణాన్ని శివుడు ఖండించ ఖండపరశువుగా

శర్వుడి త్రిశూలం విష్ణువు గుండెలపై శ్రీవత్సమనే పుట్టుమచ్చతో కలవగా,
శివుడి కంఠం మీది నలుపు విష్ణువు చేతిముద్రగా శివుడు శ్రీకంఠుడైనాడు-
ఈ విధంగా విష్ణువు నానారూపాలలో జగత్తులన్నింటా సంచరిస్తాడు.
భారతయుద్ధంలో అర్జునుడి ముందు రుద్రుడు నిలబడి శత్రు సంహారం చేసాడు.

-నారదుడు ఈవిధంగా విష్ణువు మూలరూపాన్ని దర్శించి చేసినాడు విష్ణుస్తోత్రం
తరువాత బదరికాశ్రమం వెళ్లి కలిసినారు మునులైన నరనారాయణులను.
-శ్వేత దీపంలో నేను శ్రీమహావిష్ణువును దర్శించాను, భగవానుని
రూపం, శ్వేత ద్వీపవాసుల రూపం మీ రూపంవలె ఉన్నది; నాకర్థం కాలేదు.

మీరు ఆ శ్వేత ద్వీపవాసులలోనూ ఉన్నారు, ఇక్కడా ఉన్నారు, ఇదెలా సాధ్యం?-
అని నారదుడు పలుక నరనారాయణులన్నారు- శ్రీవిష్ణువును దర్శించావు
అతడితో మాట్లాడినావు, మేమూ విన్నాము మీ ఇద్దరి సంభాషణను
నీవు మా దగ్గర ఉంటానంటే నిశ్చింతగా ఉండి దీక్షతో సాగించుము తపస్సు.

---

క. **'శివుఁడవు నీవు జగములకు । శివ మొనరింపంగ వలదె? చేయుము క్రోధ
ప్రవిహతి, విష్ణుండనఁగా । శివుఁడన నొకఁడౌట దివ్యచిత్తమ యెఱుఁగున్. (శాంతి. 6-446)**

క. **'నిను నెవ్వఁ డెఱిఁగె నాతఁడు । నను నెఱిఁగినవాఁడ, నిన్ను నమ్మిక సేవిం
చిన నదియ నన్నుఁ గొల్చుట । యను వాసిగ లేదు భేద మరయఁగ మనకున్. (శాంతి. 6-451)**

క. **శ్రీవత్సము శూలాంకిత । మై వెలయుంగాక యిప్పు డాదిగ నాకున్
నీవును మత్పాణ్యంకో । ద్భావన శ్రీకంఠుఁడనఁగఁ బరఁగుము శర్వా!' (శాంతి. 6-452)**

క. **'అరుదే సర్వేశ్వరుఁ డగు । హరి తోడుగ జయము గొనుట యర్జునునకు? న
ప్పురుషోత్తము బాంధవులై । పరఁగిరి; పెఱ వినుతు లేల పాండుసుతులకున్?' (శాంతి. 6-459)**

క. **శ్వేతద్వీపంబున భవ । దాతతకృపఁ గానఁ బోలె నచ్యుతుఁ దద్రూ
పాతిశయము మీ చందమ । యాతని కడఁ గంటి మిమ్ము నద్భుత మెసఁగన్. (శాంతి. 6-465)**

క. **శ్వేతులు నింద్రియ వర్జిత చేతస్కులునైన నరులఁ జెలువుగ మౌనో
పేతులఁ గంటి నచట వారాతేజోమూర్తికిని దయా పాత్రంబుల్ (శాంతి. 6-466)**

# 163. హయగ్రీవ దేవ మాహాత్మ్యము

ప్రళయ కాలమున యోగనిద్ర నుంచి మేల్కొన్న విష్ణుమూర్తి, చెయ్యాలనుకున్నాడు
లోక సృష్టి, సంకల్ప మాత్రాన జనించె అహంకారము- అదియే బ్రహ్మ
నాభి కమలం నుంచి పుట్టిన బ్రహ్మ సృష్టించాడు వేదాలు నాలుగు
ప్రళయ కాలమున విష్ణువులో లీనమైన సత్త్వగుణం నుంచి జనించె బ్రహ్మ.

రజస్సు తమోగుణముల నుంచి పుట్టినవారు రాక్షసులు కాగా, మధుకైటభులు
వేదాలను అపహరించి పారవేసారు కట్టగట్టి పాతాళ గహ్వరమందున.
బ్రహ్మ దుఃఖించాడు- నాకు బలము చూపూ ఆధారమూ వేదాలే కదా!
అవే లేకుంటే ఏ విధిని సృజింతు లోకములు, దిక్కెవ్వరు నాకు?

ప్రళయ జలధిలో నిద్రిస్తున్న విష్ణువు విన్నాడు బ్రహ్మ తనను వేడుకోవడానిని.
గుఱ్ఱపుతల, వివిధ వర్ణాలతో ప్రకాశించే శరీరంతో వెళ్లాడు పాతాళానికి.
హయగ్రీవుడి సుదీర్ఘ ప్రణవ ధ్వని విని మధుకైటభులు క్రోధులై రాగా
వేదాల కట్లు తీసి విడిపించి బ్రహ్మకు అప్పగించి శేషశయనుడైనాడు.

మధుకైటభులకు ఓంకార ధ్వని వినిపించిన చోట కనిపించలేదెవరూ.
వేదాలు దాచిన చోటుకు వచ్చి చూస్తే కనిపించలేదు వేదాలు కూడా.
దానితో వెళ్లి శేషతల్ప శాయిని యుద్ధానికి ఆహ్వానించి చేసారు ఘోరయుద్ధం.
వారినిద్దరిని వేడుకగా సంహరించగా, ఆటంకాలు లేక బ్రహ్మ చేసినాడు భూతసృష్టి.

---

**సీ.** **ప్రళయకాలంబున జలముల విష్ణుండు । యోగనిద్రారతి నొంది మేలు**
**కాంచి లోకంబులు గావింపఁ దలఁప న । హంకార మెసఁగె బ్రహ్మాభిధాన**
**కలితమై తన్నాభికమలంబునం దిట్లు । జనియించి యా బ్రహ్మ సకలసృష్టి**
**కాదిభూతములుగ వేదముల్ నాలుగు । గలిగించె నప్పు డక్కమలనాభు**

**తే.** **నందు మును లయించినట్టి గుణంబులు । మూఁటఁ దొలుత సత్త్వమునకుఁ దోఁపు**
**కలిమి దాననుండెఁ గమలోద్భవుఁడు రజ । స్తమము లసురలయ్యె ధరణినాథ! (శాంతి. 6-479)**

**ఆ.** **విష్ణు బహువిధముల వినుతింప నజ్జల । శాయి హయశిరంబు సకలవర్ణ**
**భాసురంబునైన పరమాద్భుతంపు రూ । పంబు దాల్చి వేదపరత నొంది. (శాంతి. 6-484)**

**క.** **ఆ నాదము దెసకుం జన । దానవరిపుఁ డొందువలనఁ దా నరిగి తదీ**
**యానూనబంధపీడిత । లైన శ్రుతులు విడిచి తెచ్చి యజునకు నిచ్చెన్. (శాంతి. 6-486)**

**ఆ.** **అరిగి యచట వాని నరసి కానక రభ । సమునఁ గలయఁ దిరిగి శార్ఙ్గిఁ గాంచి**
**యుద్ధమునకుఁ బిల్వ నద్ధరణీధరుం । డదరి సమయఁ జూచె నసురయుగము. (శాంతి. 6-488)**

# 164. ఏకాంతిక తత్త్వము

జీవుడికి నివాసం శరీరము గనుక అది 'ఉపాధి' అనబడ్తుంది.
ఇంద్రియ గోచరం కాని విష్ణువు భక్తులకు కనిపిస్తాడు నాలుగు వ్యూహాలలో
వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలవి క్రమానుసారాన
ఈ ఏకాంతిక తత్త్వము చింతా తంతు త్రుట నాత్యంత విదగ్ధంబు

సాత్విక భావం కలవారు ఏకాంతికులు, వారి రక్షణ విష్ణుని బాధ్యత
వారికి హరికి అభేదమే. రజస్తమో ధర్మాలను విడుచుట ముక్తినడత
వేద సాంఖ్యాది శాస్త్రాల కన్నింటికి పరమగమ్యం ఆశ్రయం నారాయణుడు
వేదాలకు ఉపదేశకుడు అపాంతరతముడనే పేరుకల వేదవ్యాసుడు.

సాంఖ్య కర్త కపిలుడే, యోగానికి హిరణ్యగర్భుడు; పాశుపతానికి శివుడు
పాంచరాత్రానికి విష్ణువు ప్రవర్తకులు. శ్రీమన్నారాయణుని ఆజ్ఞతో
అపాంతరతముడైన కృష్ణ ద్వైపాయనుడు వేద విభజన చేసి వేదవ్యాసుడైనాడు.
అతడిని ఆదరించి విష్ణువు తన పుత్రుడిగా స్వీకరించి చేసినాడు ధన్యుడిగా.

భీష్ముడు చెప్పగా నారాయణీయమైన గాథలను విన్నాడు ధర్మజుడు–
పితామహా! రాజనీతితో పాటు అనేక ధర్మాలు బోధించినావు
వీటిలో ఏది ఉత్తమ ధర్మం? –అని ధర్మజుడడుగగా భీష్ముడన్నాడు
–పనికి రానిది ఒక్కటీ లేదు, ఎవరికి నచ్చిన దానిని వారు అనుసరిస్తారు.

---

**సీ.** ఆదికాలమునఁ బ్రజాభిసర్గమునకు । నారాయణుఁడు నిజనాభిపద్మ
మున బ్రహ్మఁ గల్పింప భూతసంఘమ్ముల । నెల్ల నాతఁడు సృజియించె నతని
ముఖమున బహువేదములు ప్రసరింపఁగఁ । జేసి వానికి మేలుసేఁత బుద్ధిఁ
దలఁచి యవ్విష్ణుండు నలఘుబోధుని నపాం । తరతముం డనియెడు తనయుఁ జిత్త

**తే.** మునన కల్పించి యతిభక్తి మ్రొక్కి నిలిచి । యున్న యక్కుమారుని శ్రుతు లన్నియును దృ
ఢావధానుండవై విని నీవు వాని । నంచితవ్యాస మొందింపు మనియెఁ బ్రీతి. (శాంతి. 6-520)

**ఆ.** అనిన నట్లకాక యని యయ్యపాంతర । తముఁడు వేదభేదనము నొనర్చె
దాని కవ్విభుండు దద్దయుఁ బ్రీతుఁడై । వత్సలత్వ గౌరవం బెలర్ప. (శాంతి. 6-521)

**క.** వేదవ్యాసుఁడ! రమ్మని । యాదరమునఁ బిలిచి నాకు నాత్మజుఁడై సం
పాదించువాఁడ వధికా । హ్లాదము మన్వంతరంబు లన్నిటియందున్. (శాంతి. 6-522)

**క.** ఏకాంతికధర్మము సు । శ్లోకుండగు నాతఁ డడుగ లోకోత్తర! యా
లోకారాధ్యుఁడు సెప్పె ద । యాకరమతి కృష్ణధర్మజాదులు వినఁగన్. (శాంతి. 6-538)

# 165. కాంతురు మోక్షపదము వేర్వేర జనుల్-

త్రిలోక సంచారి నారదుడొకనాడు ఇంద్రుడిని దర్శించి అన్నాడు
-గంగానది దక్షిణ తీరాన మహాపద్మ నగరంలో నివసించే భృగుడు
ధర్మనిత్యుడు, సత్యవ్రత పరాయణుడు, అహింసాశాలి, ఇంద్రియ
నిగ్రహం కలవాడు, క్రోధము లేనివాడు, తన కర్మలలో తృప్తి కలిగినవాడు.

అతడికెప్పుడూ ఒకటే ఆలోచన- ఏవి మంచిపనులు?
వేటిని ఆచరించాలి? నాకు ఆత్మనిష్ఠ ఎలా అలవాటవుతుంది?
ఒకరోజున అతడింటికి సద్వర్తనుడైన అతిథి వచ్చాడు.
అతడికీ అదే సమస్య, ఇద్దరూ వెదికారు ధర్మ ద్వారాలను-

ఆశ్రమ జీవనము, నిష్కర్మత్వము, యజ్ఞము, దానధర్మములు
జనన జనకారాధన, తపస్సు, భక్తి, శీలసంపద, శాంత స్వభావం
ఇంద్రియ నిగ్రహం, సత్యవాక్య నియమం, అహింసావ్రతం -ఇటువంటివి
అనేక ధర్మ ద్వారాలు, ఎవరి దారిన వారు పోతున్నారు, ఏది మంచి దారి?

నైమిశారణ్యంలో గోమతీనదీ తీరాన మహా పద్మ సరోవరం ఉన్నది.
మాంధాత లాంటివారు తపస్సు చేసి ఇహపర శ్రేయస్సులు పొందిన చోటది.
ఆ పుణ్యక్షేత్రంలో ధర్మపరుడైన నాగరాజు పేరు పద్ముడు
అతిథులంటే ప్రేమ- భృగూ, వెళ్లి పద్ముడిని దర్శించు -అన్నాడు అతిథి.

---

ఉ. కొందఱు బ్రహ్మచర్యమునఁ గొందఱు భవ్యగృహస్థధర్మముం
బొందుటఁ గొంద ఱిద్ధ తపమున్ వనభూమిఁ దగం జరించుటం
గొందఱు నిష్క్రియత్వమునఁ గొందఱు యజ్ఞవిధాన శాలితం
గొంద ఱనూనదానములఁ గోరి యొనర్తురు నిత్యసౌఖ్యమున్. **(శాంతి. 6-552)**

తే. నైమిశారణ్యమునయందు గోమతి యనఁ । బరఁగు నుత్తమనది, మహాపద్మ మనఁగఁ
గలదు పుణ్యహ్రదము దాని యలఘుతటత । లంబు నెలవుగానుండు నాగం బొకండు. **(శాంతి. 6-555)**

క. ఆ తీర్థోత్తమమున మాం । ధాతృఁడు లోనుగ విశిష్టతపముల నిహలో
కాతిశయముఁ బరలోక । ద్యోతనముం బడసినారు దొల్లి యనేకుల్. **(శాంతి. 6-556)**

తే. పద్ముఁడను పేరి యన్నాగపతి యుదాత్తుఁ । డఖిల ధర్మజ్ఞుఁ డతుల దయాన్వితుండు
సుజన సంభావ్యమానుఁ డస్తోకపుణ్య । నియతి నిత్యుఁ డాగంతుకప్రియతముండు. **(శాంతి. 6-558)**

\- నిగ్రహేణ చ పాపానాం సాధూనాం ప్రగ్రహణచ
ఇయం తపస్వినీ సత్యా ధారయిష్యతి మేదినీ **(సం.శాంతి. 349-34)**

# 166. నాగరాజు పద్ముడి గర్వం

నాగరాజు పద్ముడింటికి వెళ్లాడు భృగువు, అతడింట్లో లేదు.
అతడి భార్య అతిథిని ఆదరించి అన్నది– తమకు తెలుసు కదా
సూర్యరథానికి సర్పాలే రజ్జువులు– తనవంతు వచ్చి నా భర్త వెళ్లినాడు.
ఏడు, ఎనిమిది రోజులలో వస్తాడు– తమ రెందుకు వచ్చారో తెలపండి.

భృగుడు అన్నాడు– అమ్మా నేను వచ్చింది నీ భర్త దర్శనానికి.
అతడు వచ్చేవరకు ఆ వనంలో ఉంటాను, అని వెళ్లి భృగువు
సమీప అరణ్యంలో నిరాహారుడై ఉండగా, నాగరాజు బంధువులు
అతడున్న చోటుకు వచ్చి తమను పరిచయం చేసుకుని ప్రార్థించారు–

–అయ్యా, తమరు మాకు అతిధులు, అన్నమో పండ్లో కందమూలాలో తిని
మాకు ధర్మలోపం లేకుండా అనుగ్రహించండి –అని వేడుకోగా
భృగువు అన్నాడు– ఆరురోజులు పూర్తయినాయి, మరో రెండు
రోజుల్లో నా వ్రతం ముగుస్తుంది; ఎనిమిదవ రోజుకు సర్పరాజు

రాకపోతే నేను మీరు చెప్పినట్లు హాయిగా ఇష్టపడి భోజనం చేస్తాను–
ఎనిమిదవ రోజున వచ్చిన సర్పరాజుకు ఈ విషయం చెప్పింది
నాగరాజు భార్య– వెళ్లి నిరాహారుడై ఉన్న అతడిని ఆహ్వానించండి.
కోపం వచ్చింది నాగరాజుకు– నేను వెళ్లి అతడిని దర్శించడమా?

---

ఉ. 'ఇంతన నేల? యేను భుజగేశ్వరు రాకయ వార్చినాఁడ, నా
కం తవునంతకుం గుడువ నాఁకలి నీళ్ళు ద్రావఁ దృష్ణ యొ
క్కింతయు లేదు గా కలిగి యే యటవీస్థలి కేఁగుదెంచి యే
కాంతమ యున్నవాఁడ? నియమాభిరతున్ నను నేఁపనేటికిన్? (శాంతి. 6–569)

ఉ. వచ్చిన సంభ్రమంబు గరువంపు టెలర్పును నుల్లసిల్లి మే
నచ్చు పడంగఁ జేయఁ జెలు వా భుజగేశ్వరుపత్ని యాతనిం
జెచ్చెరఁ దా నెదుర్కొని విశిష్టసమాదరయై యుపాయనం
బిచ్చి తదీయచిత్తమునకిం పెసలారఁగఁ బాద్య మిచ్చినన్. (శాంతి. 6–574)

ఉ. ఆతనితోడ నిట్లనియె 'నంత యెఱుంగమి రాదు నీదు శి
క్షాతిశయంబు గల్మి భుజగాధిప! నాకుఁ దగన్ సమస్తదే
వాతిథి పూజనంబులు సమగ్రములై నడచెన్ సుహృజ్జన
ప్రీతియు మున్నపోలె నవిభేదత యొప్పఁగ నిర్వహించితిన్.' (శాంతి. 6–577)

# 167. భృగువును కలిసిన నాగరాజు

నాగరాజు అన్నాడు– దేవతలు రాక్షసులు నన్నెంతో గౌరవిస్తారు.
సూర్య రథానికి తాడును నేను, నన్ను వెళ్లి అతడిని కలవమంటావా?
అతడి భార్య అన్నది– అతడు అతిథి, నిరాహారుడై ఉన్నాడు.
నీవు అతడిని నిరాశ పరిస్తే నీకు చుట్టుకుంటుంది బ్రహ్మహత్యా దోషం.

తొలకరి వానకోసం చాతకపక్షి ఎదురుచూస్తున్నట్లు అతడు
నీకోసం ఎదురుచూస్తున్నాడు; అతడి ఆశను విచ్ఛేదం చేయవద్దు.
ఆ పాపాగ్నిలో నీ ముక్తిని, ఔచిత్యాన్ని, దయను, ధార్మికతను
తగులబెట్టవద్దు, రోషముడుగుము ధర్మనిరూఢ హృదయ!–

భార్య మాటలతో అతడిలో జ్ఞాన వివేకాలు మేల్కొన్నవి–
–'క్రోధం వలన కార్తవీర్యార్జునుడు పరశురాముడి చేతిలో,
రావణుడు రాముడి చేతిలో మరణించారు, నీవు నన్ను కాపాడినావు.
నీవంటి భార్య దొరకడం నా పూర్వజన్మ సుకృతం, నేను వెళ్లి వస్తాను'–

అని వెళ్లి నాగరాజు పద్ముడు తనకై ఎదురుచూస్తున్న భృగువును
కలిసి కుశల సమాచారాలు మాట్లాడుకున్నాక, నాగరాజు అడిగాడు
–'పావనుడా! నీవే కోరిక అడిగినా తీరుస్తాను' –అని ప్రేమగా పలుకగా
భృగువు అడిగాడు– నీవు సూర్యరథాన్ని మోయడానికి వెళ్లావు కదా!–

---

**చ.** **అనయముఁ దేఁటి నాగపతి యక్కమలానన మోము సూచి యి**
**ట్లను 'నొరుఁ గానఁ బొమ్మనిన యంతన రోషము వచ్చి యిట్టు లొ**
**ప్పని పలుకుల్ సగర్వమునఁ బల్కితి దానికి శంకలేక చె**
**ప్పిన జతనంపు ధర్మమునఁ బేర్మియు నాకు నొనర్చి తుగ్మలీ! (శాంతి. 6–588)**

**క.** **నీయట్టి భార్య కలుగుటఁ । దోయజదళనయన! యిట్లు దొలఁగితి దురితా**
**పాయంబునఁ బొరయక, యేఁ । బోయెద నవ్విప్రు కోర్కి పూర్ణము సేయన్. (శాంతి. 6–590)**

**సీ.** **'ఆశ్చర్యములకెల్ల నాస్పదం బాదిత్యుఁ । డాతని వలనన భూతజాల**
**మఖిలంబుఁ జరియించు నది యచ్చెరువు గాదెఁ । యద్దేవు నంశువులందుఁ బ్రీతి**
**నమరులు వాలఖిల్యాదిమునీంద్రులు । సిద్ధులు శాఖలఁ జెంది యుండు**
**విహగకులంబుల విధమున వసియింతు । రంతకంటెను నెక్కు డద్భుతంబు**

**తే.** **గలదె! యమ్మహాత్మువలనన వాయువు । వెడలి యతని నడిమి విపుల రశ్మిఁ**
**బొంది వృష్టి గురియు నెందును నట్టి చో । ద్యములు గలవె? భూసురాగ్రగణ్య! (శాంతి. 6–598)**

# 168. గగనమున ఒక్కడేతెంచె వడిన్-

భృగువు అన్నాడు– నా కోరిక తరువాత చెబుతాను, ముందుగా
నీవిది చెప్పుము– నీవు సూర్యరథాన్ని మోయడానికి వెళ్లినపుడు
నీవు చూసిన, విన్న అద్భుతాలేవైనా ఉన్నాయా? ఉంటే చెప్పగలవా?
సర్పరాజు అన్నాడు– ఆశ్చర్యాలన్నిటికి నిలయం ఆ సూర్యుడే!

అతడి నుండే భూతజాల మఖిలంబు చరియించును. అంతేకాక
వాలఖిల్యాది ఋషులు, సిద్ధులు, దేవతలు అందరూ అతడి కిరణాలలో
–చెట్టుకొమ్మల మీద పిట్టలున్నట్లు– నివసిస్తూ ఉంటారు సుమా!
సూర్యగోళం నుండి వెలువడే వాయువు, గోళం మధ్యలో ఉన్న

దట్టమైన కాంతితో కలిసి వర్షం కురుస్తుంది –ఇది అద్భుతం కాదా?
వర్షాన్ని కురిపించేది సూర్యుడే, మరల వెనక్కు లాక్కునేదీ అతడే.
సూర్యుడి వేడిమి తగ్గిపోతే జనులలో ఆత్మనిష్ఠ శాశ్వతంగా
ప్రకాశిస్తుంది, విత్తనాలు భూమిలో మొలకెత్తుతాయి, వర్షం వలన–

పరాత్పరుడైన శ్రీమన్నారాయణుడు సూర్యమండలంలోనే ప్రకాశిస్తుంటాడు.
ఒక రోజున మధ్యాహ్నం ఆకాశంలో ఎదురయ్యాడొక దివ్యపురుషుడు
అతడి తేజస్సు పోటీ పడుతున్నది సూర్యుడి తేజస్సుతో
ఆకాశాన్ని పగులగొట్టేస్తాడా అన్నంతటి తేజస్సు ఆ దివ్యుడిది.

---

చ. కదియఁగఁ బాఱుతెంచిన వికాసవిభాసిముఖారవిందుఁడై
యెదురుగఁ జేయి సాఁచె దివసేశుఁ డతండును లీలఁ గేలు నొ
ప్పిదముగఁ బట్టి రూపము లభిన్నతఁ బొందఁగఁ జొచ్చె బింబమున్
సదనముఁ జొచ్చునట్ల విలసద్గతి నింకిట యేమి సెప్పుదున్? **(శాంతి. 6-606)**

చ. అరదముమీఁద మున్ పొలుచునాతఁడొ? యిప్పటియాతఁడో? దివా
కరుఁ డను సందియంబు భుజగంబుల చిత్తము లందుఁ బుట్టి యొం
డొరువులతోడ వారు గడు నొయ్యనఁ బల్కఁగ నే వినీతసు
స్థిరమృదుభాషినై యడిగితిం బ్రభువున్ ధరణీసురోత్తమా! **(శాంతి. 6-608)**

క. ఇతఁ డెవ్వం?డని యమ్మెయి । నతిచకితాత్ముండ నగుచు నడుగుటయు నహః
పతి నా మీఁదఁ గృపాసం । గతమగు తన చూడ్కి వొలయఁగా వత్సలుఁడై. **(శాంతి. 6-609)**

క. ఇవి యన్నియు నాశ్చర్యము లవుఁ దెరువును నాకు జూపి తన్వర్థత నొ
ప్పు వివిధ శబ్దంబుల బోధవరేణ్యా! పోయి వచ్చెదం బ్రియమొందన్ **(శాంతి. 6-611)**

# 169. ఉంఛ వృత్తి మహిమ

ఆ దివ్య తేజస్విని చూడగానే సూర్యుడి ముఖంలో వెల్లివిరిసింది ఆనందం
సాదరంగా చేయి చాపగా అతడు దానిని ఒయ్యారంగా అందుకున్నాడు.
ఇద్దరి ఆకారాలు క్రమంగా కలిసిపోయి, ఇంటిలోకి ప్రవేశించినట్లు
ఆ తేజస్వి ప్రవేశించాడు జ్వాజ్వల్యమానమైన సూర్యబింబంలోకి

వీరిలో ఎవరు సూర్యుడు? ఇప్పటిదాకా రథం మీద ఉన్నవాడా?
లేక ఇప్పుడు రథమెక్కినవాడా? -మాకందరికీ వచ్చింది సందేహం.
'ఇతడెవ్వడని' అడిగాను నేను- సూర్యుడన్నాడు దయతో నన్ను చూసి
ఉంచవృత్తితో జీవించే మానవుడు, నిశ్చలమైన నియమాలు ఉన్నవాడు.

కందమూల ఫల ఉదక మారుతాలు మాత్రమే స్వీకరించేవాడు
నిరాకాంక్షుడు, సర్వభూత హితుడు, మునీశ్వరుడీ మహానుభావుడు
ఓ భృగూ- ఇది అద్భుతం కాదా! నాకైతే ఇంకా ఆశ్చర్యంగానే ఉన్నది
అన్నాడు నాగరాజు. భృగువు అన్నాడు- నాకు దారి చూపించావు.

ఓ పద్మడా, నేను నీ శిష్యుడిని అనే భావం నాలో ఏర్పడింది.
నాగరాజు పద్మడన్నాడు- నీ కోరిక చెప్పలేదు ఇలా వచ్చావు
అలా వృక్షమూల వాసునిలా లేచిపోవడం తగునా, మహాత్మా!
భృగువు అన్నాడు- నాకేది తెలవాలో అది తెలిసింది, సర్వ సమతాదృష్టి ఇక నా వ్రతం-

---

**సీ.** **'సురయక్ష గంధర్వ గరుడోరగాదుల । లోన నెవ్వఁడు గాఁ దలోలుపాత్ముఁ**
**దుంఛవృత్తి మహీసురోత్తముం దస్థల । నియముండు ఫలమూల నీరమారు**
**తాహారుఁడగు ముని యాకాంక్ష సేయఁడు । ప్రాప్తంబు గాని పదార్థములకు**
**సర్వభూత హితత్వశాలి యిమ్మెయి సిద్ధిఁ । బ్రాపించె నని చెప్పెఁ బ్రకటఫణితి**

**తే.** **ననఘ! యిట్టి విశేషంబు గనుఁగొనంగ । వినను గాంచితి' నవిన నవ్విప్రవరుఁడు**
**ప్రమద మెద నిండి పొంగారఁ బాపతేని । యాననము సూచి యిట్లను మానవేంద్ర! (శాంతి. 6-610)**

**చ.** **అన విని, నన్నుఁ గాంచితి ప్రయత్నమునన్, వినిపింపు మీవు వ**
**చ్చిన పని నాకు, నీ కొకటి సేసితినే? యిటు వృక్షమూల వా**
**సుని క్రియ లేచిపోక తగుచొ ప్పగునే? భవదీయవాంఛ సె**
**ప్పిన నది యేను దీర్తు, మతి పెం పెసఁగం జను భుసురోత్తమా!' (శాంతి. 6-613)**

**-** **నైషదేవో నిల సఖః నా సురో న చ పన్నగః**
**ఉంఛ వృత్తి వ్రతే సిద్ధః మునిరేష దివం గతః (సం.శాంతి. 363-1)**

# 170. సర్వ సమతా సముపాహితంబైన అనాకాంక్షిత్వము-

భృగువు అన్నాడు సర్పరాజు పద్ముడితో- నీవూ నేనూ, ఈ ప్రాణికోటి
పంచభూతాలు ఏ భేదమూ లేనివాళ్లం, అభిన్నులం, సమానులం.
నాకు తత్త్వదర్శనమయ్యింది. నా యందు నీవు, నీయందు నేనున్నాను.
మనకు ఈ సర్వ ప్రపంచమూ ఉన్నది, అందరం సమానులమే!

నీ దయావిశేషం వలన నాకు ఈ పరిణితి వచ్చినది, ధన్యుడను
నీవు చరితార్థుడవు; సుజన సేవితా, నేను వెళుతున్నాను-
అని పలికి భృగువు తన ఆశ్రమానికి వచ్చాడు సంతృప్తి చెందినవాడై.
అతడికిప్పుడు ఆత్మ సందర్శనం కలిగి అఖండమైన ఆనందం లభించింది.

భీష్ముడీ కథను చెప్పి అన్నాడు- ధర్మరాజా! నీవడిగావు కదా
'పరమధర్మం ఏది?' అని- అదే దీనికి సమాధానం గ్రహించావుగా.
సమస్త భూతాలను సమదృష్టితో చూసే నిష్కామత్వమే ఉత్తమధర్మం.
ఉత్తమమైన అఖండమైన ఆనందానికి నిలయం- అని వివరించాడు.

ఉంఛవృత్తి ఎందుకు గొప్పదో, సూర్యుడి తేజస్సునెలా ఇస్తుందో తెలిసింది.
సకల జంతువులను, వృక్షాలను లతలను చంపి నరికి తింటున్నారు జనం.
ప్రకృతి సమతుల్యత నశిస్తే వస్తుంది కాదా అకాల ప్రళయం.
సమతా దృష్టితో సకల జీవులను చూసేవాడికి లభిస్తుంది సూర్య సమాన ప్రకాశం.

---

**తే. 'అనఘ! నాయందు నీవు నీయందు నేనుఁ । గలము నీకు నీ సర్వలోకంబుఁ గలదు**
**చింత కవకాశ మెద్ది? నిశ్చింతభావ । మొందు' మనియె నా దందశూకోత్తముండు. (శాంతి. 6-615)**

**తే. భోగివర! యిది యిట్టిద భూతములును । నీవు నేనును సర్వగతావిశిష్ట**
**విధములము వేదితవ్యంబు విదితమయ్యె । నిట్టి సందర్శనము వ్రతమింక నాకు. (శాంతి. 6-617)**

**క. ఈ విధము నిశ్చయము నే । భావింపఁగఁ గంటి నీ కృపారతివలనన్**
**నీవు కృతార్థుఁడవు సుజన । సేవిత! యామంత్రణంబు సేసినవాఁడన్.' (శాంతి. 6-618)**

**ఉ. ఆగమపుష్ప సౌరభశుభాంగ! నివాస బుధాంతరంగ! వి**
**ద్యా గృహమేధితా సుభగతా మహనీయ! సురార్చనీయ! ని**
**ర్భోగ సభోగ సంపదనిరూప్య! । సుసంవిదవాప్య! భక్తి ల**
**క్ష్మీగురునిత్య యోగిజన సేవిత! శాంతిసుఖైకభావితా! (శాంతి. 6-622)**

**- స ఏవ త్వం స ఏవాహం యోహం సతు భవానపి**
**అహం భవాంశ్చ భూతాని సర్వే యత్ర గతాః సదా (సం.శాంతి. 364-8)**



# శ్రీ ప్రసాద మహాభారతము

## అయిదవ వేదము - శాంతి సప్తకము

# 13. అనుశాసనిక పర్వము

ఆ. సర్వశాస్త్ర వాక్య సమితి నాలోకించి మరియు దృఢ విచారమహిమ దెలిసి
నిశ్చయింపబడియె నిష్ఠ నారాయణు నెపుడు దలప వలయు నిది యొకండ (అను. 4-368)

ఆ. దంతి యడుగులోనఁ దక్కిన జంతు చయంబు నడుగులెల్ల నడగియుండు
నట్ల ధర్మకోటు లన్నియులోనగు నిద్ధగుణ! యహింస కింత నిజమ. (అను. 4-383)

ఆ. బలము నీవ నాకు, భక్తుండు నీయెడ నాలుబిడ్డలేని యట్టివాడ
గావునన్ను నధిక కారుణ్యమున నిమ్మనుజ్ఞ గమలదళ మనోజ్ఞనయన! (అను. 5-463)

క. ఒనరుఁ ద్రయోదశ పర్వం బనగా నను శాసనాద్య మగు పర్వయు గం
బున మేలై విబుధశ్రేణి నుతంబై యానుశాసనిక పర్వమిలన్ (ఆది. 1-60)

- ఇదం పవిత్రమాఖ్యానం పుణ్యం వేదేన సమ్మితమ్
యః పఠేన్మామకం ధర్మమ్ అహన్యహని పాండవ (సం.అను. 92)

- అత ఊర్ధ్వంచ విజ్ఞేయం అనుశాసన ముత్తమమ్-



| సంస్కృత మహాభారతము | కవిత్రయ మహాభారతము | శ్రీ ప్రసాద మహాభారతము |
|---|---|---|
| **13. అనుశాసనిక పర్వము** (ఉప పర్వములు-అధ్యాయాలు) | **13. అనుశాసనిక పర్వము** (గద్య పద్యములు) | **13. అనుశాసనిక పర్వము (102)** (పద్య శీర్షికలు) |
| 1. దానధర్మ పర్వము (166) | 1. ప్రథమాశ్వాసము (388) | 1. ప్రథమాశ్వాసము (25) |
| | 2. ద్వితీయాశ్వాసము (478) | 2. ద్వితీయాశ్వాసము (23) |
| | 3. తృతీయాశ్వాసము (347) | 3. తృతీయాశ్వాసము (19) |
| | 4. చతుర్థాశ్వాసము (451) | 4. చతుర్థాశ్వాసము (16) |
| 2. భీష్మ స్వర్గారోహణ పర్వము (2) | 5. పంచమాశ్వాసము (484) | 5. పంచమాశ్వాసము (19) |

(Traditional Edition: ఉప పర్వాలు-2, అధ్యాయాలు-168; Critical Edition: 2-154)

# ✤ 13. అనుశాసనిక పర్వము - ప్రథమాశ్వాసము ✤

## 1. కడున్ చెడుగు ఈ పొడపాప పురుగు-

ధర్మరాజంటున్నాడు భీష్ముడితో– పితామహా! నాకు మనశ్శాంతి నిచ్చే
సకల ధర్మోపదేశములు చేసావు కాని, పట్టుదలతో చుట్టాలను చంపాను
అన్న భావన ఒక ప్రక్క, నిన్ను కోపంతో శరతల్పగతుడిని చేసానన్నది మరొక ప్రక్క
నన్ను పీడిస్తూ శాంతి లేకుండా చేస్తున్నాయి, ఇక నేనేమి చేయగలను?

రాజ్యం చెరిసగం పంచుకుందామంటే రారాజు లోభత్వంతో పడనివ్వలేదు.
వాడు తింటే తిన్నాడులే అనుకుని వాదులాట, యుద్ధం నేనూ మానలేదు.
మా ఇద్దరి వల్లనే ఇంత చేటు పుట్టింది, ఎంత ఏడ్చినా ఏమి లాభమున్నది?
అప్పుడు భీష్ముడన్నాడు– మీవల్లనే జరిగిందా, కాదా అన్నది ఆలోచించతగినదే!

గౌతమి అనే కోపతాపాలు లేని స్త్రీ కుమారుడు పాము కరచి మరణించాడు.
మేటి కిరాతుడు ఆ పామును పట్టితెచ్చి అన్నాడు– 'అమ్మా, ఈ పామే చంపింది
నీ కుమారుడిని, కర్రతో దీని తల పగలగొట్టనా, లేక కత్తితో నరకనా?'–
అంత దుఃఖంలోనూ ఆమె అన్నది– 'అన్నా, ఈ పామును వదిలిపెట్టుము.

ఆపదలు మన పూర్వజన్మ కర్మ ఫలితాలు. నీవు పామును చంపినా
నా కుమారుడు తిరిగి రాడుకదా, హింసను నేను సహించను'–
ఆమె మాటలు విని వేటగాడు అన్నాడు– 'అమ్మా, ఇది విషసర్పం,
మనకు శత్రువు'. ఆమె అన్నది– 'నాయనా, శత్రువు మనకు చిక్కినా చంపరాదు'–

---

సీ. హింసకు నొడఁబడ నే నెట్లు? 'ననవుడు, । 'జనబాధకము లైన జంతువులను
జంపినఁ బాపంబు సమకూర' దని పల్కె । బోయ; 'పట్టిన రిపుఁ బొరిగొనంగ
వల' దని చెప్పె నవ్వనిత; వాఁ డహిఁ దెగఁ । జూచి జనంబులఁ గాచు టఱదె?
వృత్రుఁ జంపఁడె దేవవిభుఁడు? యజ్ఞధ్వంస । నము సేయఁడే? ఫాలనయనుఁ డట్ల

తే. కావె? ధర్మువు హింసలు నీవు దీని । కియ్యకొను' మని తఱిమె; నట్లెంత దఱిమి
నను దయావతి యైన యన్నాతి పాప । మునకుఁ జొరదయ్యె; బోయ కిట్లనియెఁ బాము. (అను. 1-13)

క. 'ఏ నేమి తప్పు సేసితిఁ? గానవు । నెఱి నీవు లెస్సగా, మృత్యుపరా
ధీనత బాలునిఁ గఱచితిఁ । గాని, వినుము! లేవు రోషకామాదు లెదన్'. (అను. 1-14)

క. 'విను! మృత్యువునకుఁ దగు సా । ధనమ వగుటఁ జేసి నిన్ను దండింపంగాఁ
జను' ననవుడుఁ' గుమ్మరికో । లను సారెం బోలితిం దలఁచి చూడు మెడన్. (అను. 1-16)

చ. వగచుచుఁ జూడ నయ్యురగ వల్లభు రజ్జున గట్టి తెచ్చి య
మ్మగువకుఁ జూపి దీనిఁ దల ద్రుంగడ మోదెదఁ గోలనొండె, రెం
డుగ నెరగత్తి వ్రేసెదఁ; గడుంజెడు గీ పొడపాప పుర్వు, నే
మిగతి వధింతు? నంచునొక మేటి కిరాతుడు రోషదీప్తుడై (అను. 1-6)

# 2. గౌతమి లుబ్ధక సర్ప మృత్యు కాల సంవాదము

వేటగాడు అన్నాడు– ఇంద్రుడు వృత్రుడిని చంపాడు, శివుడు ధ్వంసం చేసాడు
దక్షయజ్ఞం, అవి హింసలే కదా! దీనిని చంపుట నా ధర్మం, చంపేస్తాను–
అప్పుడు పాము అన్నది– నేను మృత్యుదేవత ఆజ్ఞ పాటించాను.
నేను మృత్యుదేవత చేతి కరవాలాన్ని అంతే నాకేమి కరవాలనే కోరిక లేదు.

బోయవాడన్నాడు– నా చేతిలోనూ ఆయుధాలున్నవి, నేనిప్పుడు మృత్యుదేవత
చేతి ఆయుధాన్నవుతాను, నిన్ను చంపి నేనూ సాకు చెబుతాను –అన్నాడు.
పాము అన్నది– అయ్యా, ఘట నిర్మాత కుమ్మరి సారె తిప్పుతున్నాడు
తిరిగే సారెది దోషమా, కర్రతో తిప్పిన కుమ్మరిదా దోషం?

కిరాతకుడన్నాడు– విలుకాడు బాణం వేసి చంపితే విల్లుది తప్పా లేక
విలుకాడిదా? ఎవరో పంపించారని పసివాడిని చంపుతావా? నీకు
బుద్ధి ఉన్నది కదా, ఆడుకుంటున్న పిల్లవాడిని కాటువేసేముందు ఆలోచించవా?–
పాము అన్నది– బుద్ధి ఉన్నవాళ్లే కదా యజ్ఞాలు చేయించే పురోహితులు

యజ్ఞ ఫలితం యజమానికే పోతున్నది కాదా పురోహితులకు రాకుండా!
అప్పుడు మృత్యుదేవత వచ్చి అన్నది– యముడి ఆజ్ఞను నేను పాము ద్వారా
నిర్వర్తించాను, నేను కాని, పాము కాని ఈ పసివాడి చావుకు కారణం కాదు.
సూర్యచంద్రులు, అగ్ని, భూమి, నింగి, నీరు, జీవుడు, దేవుడు –అష్టమూర్తులు కాదా!

---

**క. నీవును, మృత్యువుఁ బాప స । మావేశితమతుల రొఱగ నాడినయంతం
బోవునె మీపై దోషము, లే । వెఱతునె యిట్టు లనిన యింతన మీకున్'. (అను. 1-29)**

**క. 'ఘనుఁ డగు కాలుని వశమునఁ । జనియెడుమా, కరయ దోష సంగతి గలదే?'
యనునెడఁ గాలుం డచటికిఁ । జనుదెంచెం, బ్రీతి ధర్మ సంశయ ముడుపన్. (అను. 1-31)**

**క. 'పామును, మృత్యువు, నేనును । గా మీదారకుని మృతికిఁ గారణ, మీతం
డేమేఁ గర్మముఁ జేసెం దా । మృతిఁ బొందించె నదియ, తలకొని, యితనిన్. (అను. 1-33)**

**క. విను కర్మం బొనరించును । జననము, మరణంబు, నదియ సౌఖ్యము, దుఃఖం
బును గావించుం, దనచే । సిన దానిం బడకపోవ శివునకు వశమే?' (అను. 1-34)**

**క. 'కావున, నిందఱు, నుడుగుం డీ । వాదం' బనుడు, బోయ కిట్లను, ధరణీ
దేవాంగన దన యెఱుకయు । దేవాలాపములు నొక్క తెరువై యున్నన్. (అను. 1-36)**

**– యధా మృత్పిండతః కర్తా కురుతే యద్ యదిచ్ఛతి
ఏవ మాత్మ కృతం కర్మ మానవః ప్రతి పద్యత (సం.అను. 1-74)**

## 3. తను చేసిన దానింబడకపోవ శివునికి వశమే!

అష్టమూర్తుల శరీరమే కాలుడి శరీరము, వస్తువుల కదలికలన్నీ దైవ కార్యాలు.
శివుడాజ్ఞ లేకుండా పాము కరుస్తుందా? మనది పాపం కాదు -అన్నది మృత్యుదేవత.
పాము అన్నది- మనది తప్పులేదు, యముడిపై మనం తప్పు మోపలేము,
ఈ పాపం నాదికాదు, బోయవాడా, ఈ పాపం నాకంటగట్టవద్దు-

బోయవాడు నవ్వాడు- నేనేమీ జడవను. నిన్ను చంపకుండా వదలను,
నిన్నిప్పుడు వదిలానని రేపు నన్ను మృత్యుదేవత జాలిపడి వదలదు కదా!
అప్పుడు యముడు వచ్చి అన్నాడు- నేనూ, మృత్యుదేవత, పామూ కాదు
ఈ పసివాడి చావుకు కారణం వీడి పూర్వజన్మ కర్మ, గౌతమి మాట నిజం.

సుఖదుఃఖాలకు కారణం పూర్వజన్మ కర్మలు; శివుడికైనా సాధ్యం కాదు కర్మ
ఫలాన్ని అనుభవించక తప్పుకుని పోవడం - తెలిసిన తల్లి క్షమించింది.
విధి నిర్ణయం వేరుగా ఉంటే నీవీ పామును ఈ తల్లిముందుకు తెచ్చేవాడివి కావు.
కిరాతకా! పామును విడిచి శాంతిని పొందుము -అని పలుకగా వెళ్లిపోయాడతడు,

యముడే స్వయంగా చెప్పాడన్న సంతోషంతో, గౌతమి కూడా పొందింది కాస్త మనశ్శాంతి.
ఈ కథ చెప్పి భీష్ముడన్నాడు- తూనీగలను చిన్నతనంలో సూదులతో
గుచ్చానేమో ఇప్పుడు అంపశయ్యపై పరుండినాను. అదేవిధంగా నీ చుట్టాల
మరణానికి నీవు కాని, దుర్యోధనుడు కాని కారణం కాదు; దుఃఖం విడిచిపెట్టుము.

---

**క.** **'సకల జనంబులుఁ గర్మము । నకు ననుగుణమైన తెరువునం బోదురు దీ**
**నికి రోష విషాదము లే । టికి విడువుము పాము, సంఘటింపుము శమమున్. (అను. 1-39)**

**క.** **అన విని తెలిసి విడిచె, న । ర్జునకుఁడు భుజగము, నపాస్తరోషుం డగుచుం**
**జని రెలమిఁ బొంది, కాలుం । డును, మృత్యువుఁ గావునను విడువు మీ వడలున్. (అను. 1-40)**

**తే.** **కారు దుర్యోధనుఁడు నీవుఁ గారణములు । బాంధవుల రణ మరణ సంప్రాప్తి కనఘ!**
**వారు, దమతమ కర్మముల్ కారణములు । గాఁగ నిట్లయి; రేల శోకంబు నీకు? (అను. 1-41)**

**మ.** **మనువంశంబునఁ బుట్టి, సర్వజనతామందారమై నేలయె**
**ల్లను బాలించి, జగత్త్రయీప్రణుతలీలం బొల్చె దుర్యోధనుం**
**డను రా జవ్విభు నొప్పు నర్మదకుఁ గామావేశముం జేసినన్**
**వనితారూపము దాల్చి పొందె నతనిన్ వైదగ్ధ్య హృద్యంబుగన్. (అను. 1-44)**

**-** **దుర్జయస్యేంద్ర వ పుషః పుత్రోశ్విస దృశ ద్యుతిః**
**దుర్యోధనో నామ మహాన్‌రాజా మహర్షి సత్తమః (సం.అను. 2-12)**

# 4. అర్చించు నప్పు డయ్యంగన కెంగేలి జిగిసొంపు-

ధర్మరాజు అడిగాడు భీష్ముని– తాతా! గృహస్థాశ్రమంలో ఉండి మృత్యుభయం
పోగొట్టుకొనగలడా? భీష్ముడన్నాడు– ధర్మానికి స్థిరంగా నిలబడగలగాలి.
నీకు వేరే దుర్యోధనుడు పూర్వకాలం వాడి ప్రేమకథ చెబుతాను, వినుము–
మనువంశములో పుట్టిన దుర్యోధనుడిపై మనసు పారేసుకున్నది నర్మదానది.

అందమైన నర్మదకు, సుందరుడైన రాజుకు అమరపురంధ్రీ శ్రీరామణీయకమైన
అందాలరాశి 'సుదర్శన' పుట్టి, దినదిన ప్రవర్ధమానం కాగా ఆమెను నియోగించాడు
అగ్నిశాలలో అగ్నిహోత్ర పరిరక్షణకు తండ్రి; ఆమెను చూసి సాక్షాత్తూ
అగ్నిదేవుడే మోహంలో పడిపోయాడు – ఆమె ఎర్రని వ్రేళ్లకాంతి ఎదను తాక.

ఆమె కనుల అందం తన అగ్నిశిఖను ప్రజ్వలింప, ఆమె తియ్యని పలుకులు
నెయ్యి తేనెల మధురతను మించిపోవ, పొయ్యి నూదినపుడు కదిలే ఆమె పెదాలు
అతడి ప్రేమ వేడిని మరింత పెంచగా క్షణక్షణానికి విరహవేదన ఎక్కువై
ఏకాంత సమయాన అన్నాడామెతో– చిగురుటాకులను కాదనే నీ పాదాల సొగసు

నా చూపులను వశం చేసుకున్నది, మారేడు పండ్లను తిరస్కరించే నీ చనుగవ
నాకు కలిగించింది కనులపండువ, లేత తీగలను కాలదన్నే నీ శరీరం, లతాంగీ,
నాకు మరుల తీగైనది; నిండు జాబిల్లిని సిగ్గుపరచే నీ వదనం కూల్చింది నా గుండె ధైర్యాన్ని
నన్ను మన్మథుడు హింసిస్తున్నాడు, నామీద దయతో నాకు రాణివి కమ్ము, నారీమణీ!

---

క. ఆ రమణికి నతనికిఁ గ । న్యారత్నం బుద్భవించె నమరపురంధ్రీ
శ్రీరామణీయకము ని । స్సారం బగునట్లు గాఁగ జగతీనాథా! (అను. 1-45)

వ. విను! దానికిఁ బేరు సుద । ర్శన, యన్నరనాయకుండు సంప్రీతి మెయిం
బెనిచి, తన యగ్నిహోత్రం । బున పరిచర్యలకుఁ బనిచె బుజ్జవ మొప్పన్. (అను. 1-46)

సీ. అర్చించునప్పు డయ్యంగన కెంగేలి । జిగిసొంపు, చిత్తంబు దిగిచి కొనఁగ
నరసి కన్గొనునప్పు డయ్యింతి కనుఁగొవ పొలపంబు రాగంబు వొదలఁజేయ,
నన్యులఁ బని పంచునప్పు దమ్ముద్దియ । పలుకుల తీపు గోర్కులఁ గెరల్ప
నల్లన యూఁదెడు నప్పు డక్కొమ్మ వా । తెఱతావి ధైర్యంబు ద్రిప్పుకొలుప.

తే. మరుఁడు దోడ్తోఁ దేఁకువ మాలి కదిసి । తూపుగముల క్రొవ్వాఁడిమి సూప నంత
కంత కగ్గల మగు వలవంతఁ దూలి । పోయెఁ బావకుఁ; దేమి సెప్పుదు నరేంద్రఁ (అను. 1-48)

– తాన్ దర్శయామాస తదా భగవాన్ హవ్యవాహనః
స్వం రూపం దీప్తిమత్ కృత్వా శరదర్క సమద్యుతిః (సం.అను. 2-27)

# 5. చిగురుటాకుల గాసి సేయు నీ యడుగుల చెలువంబు-

అగ్నిదేవుడు అందాలరాశి సుదర్శనతో తన మనసులో మాట చెప్పినాడు.
ఆమె అన్నది వినయంగా- ఈ విషయాన్ని పెద్దవారితో మాట్లాడవచ్చును కదా!
అగ్ని సరేనన్నాడు- అదే సమయాన దుర్యోధనుడు తలపెట్టినాడు గొప్ప యజ్ఞం
అగ్నిదేవుడు తానొక బ్రాహ్మణుడై వచ్చి- 'నీ కుమార్తెను నాకు దానమివ్వు' అన్నాడు.

అతడివ్వలేదు, హోమంలో అగ్ని మండలేదు; ఋత్విజులు నెయ్యిపోసారు
మహా మంత్రాలు చదివారు, విసనకర్రలు, పొగగొట్టాలతో గాలిని ఊదినారు
అగ్ని మండలేదు - భవ్యమంత్రాలతో స్తుతిస్తుండగా అగ్ని ఊదినాడు
ఋత్విజుల మనసులో అసలు విషయం, వాళ్లు రాజుకు చెప్పినారు-

అప్పుడు అగ్ని అందమైన విప్ర కుమారుడై వివాహమాడినాడు సుదర్శనను.
అగ్ని ప్రజ్వలించింది, యజ్ఞం పూర్తయ్యింది, అదొక అద్భుత విషయమైనది.
అగ్ని సుదర్శనల కుమారుడు సుదర్శనుడు, సుదర్శనుడి కొడుకు ఓఘవంతుడు
ఓఘవంతుడి కుమారుడు ఓఘరథుడు, కుమార్తె ఓఘవతి - నది లాంటిది.

తాత మనవరాలిని వివాహం చేసుకునే ఆచారంలో సుదర్శనుడు పెండ్లాడామెను
-'గృహస్థ ధర్మం పాటిస్తూ మృత్యువును జయిస్తాను' అని కురుక్షేత్రం వచ్చాడు.
పర్ణశాలలో ఉంటున్నారు సుదర్శనుడు-ఓఘవతి అతిథి మర్యాదలు పాటిస్తూ
ఆ కాలంలో అతిధికి యజమానురాలు అన్ని సౌకర్యాలను కలిగించేది.

---

**సీ. 'చిగురుటాకుల గాసి సేయు నీ యడుగుల । చెలువంబు సూద్కులఁ జేర్చికొనియె,**
**మారేదు పండుల గారాము సెఱుచు నీ । యెలచన్నుఁగవ వేడుకలఁ బొనర్చె**
**నునుఁదీవఁ జీరికిఁ గొనని నీ మైఁదీవ । మురిపంబు డెందంబు మరలుకొలిపె,**
**నెఱచందురుని సిగ్గువఱుపంగఁ జాలు నీ । నెమ్మోము దాలిమి వమ్ముసేసె.**

**తే. నాతి నీకునై పెక్కుబన్నములు వడితి । నంగజునిచేత; వల్లభ వగుము, నాకు'**
**నావుడును సిగ్గు గదిరి, యాననము వాంచి । యలఁతి యెలుఁగున నిట్లను నా లతాంగి. (అను. 1-50)**

**క. 'కులకన్యకలకు వేడుకఁ । దలవీడులఁ బరులతోడి తగుమాటలకుం**
**దలకొనఁ దగునే? గురుజన । ముల కా కర్తెఱఁగువారు పురుషార్థనిధీ!' (అను. 1-51)**

**తే. 'అన్యవర్ణుండు, దీనుఁ డీయనకు నెట్లు । గూఁతు నీవచ్చు?' నని మదిఁ గుత్స వుట్టి,**
**యీఁడ ప్రార్థన మఫల మై యేఁగి యజ్ఞ । సమయమున నగ్ని తనమూర్తి సంహరించె. (అను. 1-55)**

---

సంస్కృత మహాభారతంలో ఓఘవతి, నృగుని తాతగారైన ఓఘవంతుడి కుమార్తె. తాత మనవరాలి వివాహం తిక్కన భారతంలో ఉన్నది. ఈ అతిథి మర్యాద శ్వేతకేతుడి నియమంతో ఆగింది (గృహస్థుడి భార్య అతిథితో శయనించడం).

# 6. అతిథి మర్యాదలో అదీ భాగమే!

సుదర్శనుడు సమిధల కొరకు అడవికి వెళ్లాడు అతిథి మర్యాదలనాచరించమని
తన భార్య ఓఘవతికి చెప్పాడు పదేపదే! రానే వచ్చాడు అతిథి, పొందినాడు
అతిథి మర్యాదలు; అతడి చూపు, ఆకలి ఆమెపై నిలిచాయి, నీ ధర్మం నీవు చేయి–
ఆతిథ్య ధర్మానికి, శీల పరిరక్షణకు పెద్ద ఘర్షణ లేదు, పట్టింపులూ లేవప్పట్లో–

వచ్చినవాడు అతిథి, అతిథి దేవోభవ, వచ్చినవాడు సంతానాన్నిస్తే
అదో గొప్ప గౌరవం. అయినా ఆమె మనసు డోలాయమానమై చివరకు
భర్త మాటను గౌరవించాలనుకున్నది. తనకిష్టం లేదన్న విషయాన్ని స్పష్టం చేసింది.
ఇంతలో భర్త వచ్చాడు. అతిథి ఆమెను మాట్లాడవద్దని సంజ్ఞ చేసాడు.

భర్త మరింత ప్రేమగా పిలిచేసరికి అతిథి అన్నాడు– 'అతిథిని ఉన్నానిక్కడ'
నీవు ధర్మం తెలిసినవాడివి, కోపించకు! –ఆ మాట విని భర్త వెనుదిరిగాడు.
పర్ణశాలలో మెరుపు మెరిసింది, అతిథి దివ్యకాంతితో ప్రకాశించాడు.
యజమానిని పిలిచాడు– అతడు లోనికి వచ్చి ధర్మదేవతను చూసాడు.

అతిథి అన్నాడు– ధర్మదేవతను నేను, కాలంతోపాటు ధర్మం మారుతుంది.
నీ ప్రతిజ్ఞకు భంగం కలిగితే చంపాలని మృత్యువు నీ వెనకే తిరుగుతున్నది.
నీ భార్య తనకిష్టం లేకున్నా అంగీకారం తెలిపి నిన్ను కాపాడింది. నీకు ముక్తి లభిస్తుంది.
ఈమె ఓఘవతి నదిగా మారి లోకాన్ని పావనం చేస్తూ చిరకాలం ప్రవహిస్తుంది.

---

**సీ.** **పేర్కొని, పలుమాఱుఁ బిలిచి, యో! యనుట లే । కున్న నయ్యింటిలోఁ గన్ను వఱపి,**
**వల్లభుఁ గానక, వహ్నితనూజుండు । దలఁకొంది ప్రేముడి పలుకు వలుక,**
**నతని నుద్దేశించి యతిథి 'నాకాతిథ్య । మొనరించుచున్నది వనిత, నీవు**
**గృహధర్మవిధుఁడవు; కినియకుమయ్య మ' । మ్మనుడు, నప్పరమపుణ్యాత్మకుండు**

**తే.** **'నీదుకతమున నేను సమ్మోదమగ్న । మానసుఁడ నైతి, నతిథులు మహితపూజ**
**నములు గాంచిన గృహములు విమల తరము । లండ్రు బుధు లింత యెఱుఁగుదు; నట్ల నడతు'. (అను. 1-76)**

**సీ.** **'ధర్మదేవత నేను; దగ నీదుచిత్తంబు । నారయ వచ్చితి ననఘ! నీవు**
**నిశ్చలవ్రతుఁడవు, నీప్రతిజ్ఞకు హాని గలిగినఁ । దెగఁజూడఁ దలఁచి, తిరుగు**
**వెనువెంట మృత్యువు, విను జయించితి దానిఁ । గామరోషాదివికారసహిత**
**ముగ నంతరంగంబు మున్ను గెల్చితి, భవ । త్సతియుఁ బవిత్ర, యస్ఖలితచరిత.**

**తే.** **యొడలితోడ నీకు నూర్ధ్వ లోకమునకు । నరుగవచ్చు నెప్పుడరుగు తలఁపు**
**దోఁచె నప్పు డిదియుఁ దోడిదయై ప్రీతి । నరుగుదెంచు' ననియెఁ గురువరేణ్యుఁ (అను. 1-80)**

# 7. బ్రాహ్మణత్వంబు కడు దుర్లభం

తండ్రి యజ్ఞం చేస్తుంటే కొన్ని వస్తువులవసరంబడి వెళ్తూ మతంగుడు
దారిలో కనబడిన గాడిదపిల్లను దారుణంగా కొట్టాడు అకారణంగా.
గాడిద పిల్ల ఏడుస్తూ తల్లికి చెబితే 'అతగాడిది చండాలబుద్ధి అంతే'
మతంగుడికి పశుపక్షి భాష తెలుసు గాడిద మాటలు విని గాభరా పడ్డాడు.

పొరబాటు జరిగింది ఒకరాత్రి మన్మధుడి పోరెక్కువై నీ మాత కలిసింది మంగలితో.
మతంగుడనుకున్నాడు– నా స్వభావం నాది కాదు, కాని సాధిస్తాను బ్రాహ్మణత్వం.
అడవికి పోయి అతడు చేసిన తపస్సుకు ఇంద్రుడు ప్రత్యక్షమై 'ఇచ్చ' చెప్పమన్నాడు.
బ్రాహ్మణత్వమివ్వమంటే అది నీకందేది కాదని అంతర్హితుడైనాడతడు.

ఏకపాదం మీద నిల్చి మతంగుడు ఏకధాటిగా తపస్సు చేసాడు నూరేళ్లు
ఇంద్రుడు మరల వచ్చి అన్నాడు– ఇలా తపస్సు చేస్తే చచ్చిపోతావు, చాలించు.
మతంగుడన్నాడు– ఇవ్వలేనివాడివి వచ్చి నాకెందుకు హితవు చెబుతున్నావు?
ఇంద్రుడన్నాడు–ఇలాంటి తపస్సు పదిరెట్లు చేస్తే చండాలుడు శూద్రుడవుతాడు,

శూద్రుడు వందరెట్లు తపస్సు చేసి క్షత్రియుడు, క్షత్రియుడు పదివేల రెట్లు
తపస్సు చేస్తే దుర్‌బ్రాహ్మణుడు, దుర్ బ్రాహ్మణుడు లక్షరెట్లు తపం చేస్తే
బ్రాహ్మణుడవుతాడు, కాని నిలుపుకోలేదు, అది తెలుసుకో నీవు–
మతంగుడన్నాడు– నీవు దారి చూపించావు, తపస్సు చేసి సాధించవచ్చుని.

---

**తే.** **'బ్రాహ్మణత్వంబు గడుదుర్లభం; బనేక । జన్మములఁ బొంది తిరుగంగ సంభవించి**
**నపుడు గనునది; యున్నతమైన యప్ప । దంబు విను మెఱిఁగించెద దాని తెఱఁగు. (అను. 1-87)**

**క.** **తనకుం జండాలత వ । చ్చిన కారణ మడిగి, దానిచేతం గంద**
**ర్భుని చెయిది మంగలికి నిజ । జననికిఁ బొందగుట విని విషాదముతోడన్. (అను. 1-91)**

**క.** **పరమ తపమాచరింపఁగ । సురపతి వొడచూపి యడుగు సువ్రత! నీకున్**
**వర మిచ్చెద' ననిన; 'ధరా । మరత్వ మి' మ్మనియె; నతఁడు మది ముద మెదవన్. (అను. 1-93)**

**చ.** **అనవుడు 'బ్రాహ్మణత్వము మహత్త్వ మెఱుంగవ? యన్యజాతి కం**
**దునె యది? యొండు వేఁడు; మది దోఁచిన మే' లనియెన్ బలారి; వాఁ**
**'డనితరసాధ్య మైన తప మస్ఖలితంబుగఁ జేయుచుండెదం;**
**జనుము మహాత్మఁ నీ' వనిన, సస్మితుఁడై యతఁ డేఁగె; నేఁగినన్. (అను. 1-94)**

**తే.** **ఏను వలదని చెప్పిన మానవెట్లు? పరమదుర్లభ పదమాసపడి కరంబు**
**మేలి తప మాచరించి చండాలుడిట్టి దాన నశియించు; నిదినీకుఁ గదదు, విడువు (అను. 1-96)**

## 8. మరి విశ్వామిత్రుండెట్లు వొందె బ్రాహ్మణ్యంబు?

నూరేళ్లు కాలి బొటనవ్రేలిపై నిలిచి అంగము తోలు అస్థులు కానరాగా
శక్తి తగ్గి నేలపై పడబోతున్నపుడు ఇంద్రుడు పట్టుకున్నాడు మతంగుడిని.
నేను ముందే చెప్పాను గదా ఆడవద్దు బ్రాహ్మణత్వమనే పులితో ఈ ఆటలు.
నీవు చండదేవుడనే పేరుతో గొప్పవాడివై కామరూపంతో పక్షిభావం పొంది

కీర్తిశాలివై స్త్రీల పూజలందుతూ సంతోషంగా విహరించుము –అన్నాడింద్రుడు.
మతంగుడన్నాడు– నీవిచ్చిన వరమేమిటి? చండాలుడిని చండదేవుడిని చేసావు.
నా తల్లి కామప్రవృత్తిని నాకంటగట్టి స్త్రీలు నా వెంబడి పడేలా చూసావు.
బ్రాహ్మణత్వం ఇలా తపస్సుతో పొందరానిదన్నదొక్కటే అర్థమయ్యింది నాకు.

మతంగుడింకా తపస్సు చేస్తూనే ఉన్నాడు మంచికాలం వచ్చేవరకు ఆశతో.
ధర్మరాజడిగాడు– మరి ఏ విధంగా విశ్వామిత్రుడు బ్రాహ్మణుడయ్యాడు?
భీష్ముడు చెబుతున్నాడు– గంగానదికి తండ్రి అయిన జహ్నుడి కొడుకు గాధి,
గాధి కుమార్తె సత్యవతి, ఆమెను భార్యగా ఇమ్మన్నాడు ఋచీకముని.

'ఒక చెవి నల్లగా ఉన్న వెయ్యి గుర్రాలు కన్యాశుల్కం తీసుకునిరా' అనగా
వరుణుడి వరంతో గంగానది తీరాన వేయి అశ్వాలను పొందినాడు
ఆ ప్రాంతమే అశ్వతీర్థమైనది, ఋచీకుడిచ్చిన వేయి గుర్రాలను తీసుకుని గాధి
సత్యవతినిచ్చి పెండ్లి చేసాడు ఋచీకునికి అత్యంత వైభవంగా, వేడుకగా!

---

క. అంగుష్ఠ మొకటి మోపి, మ । తంగుఁడు నూఱేండ్లు సేసెఁ దపము నియతిమై.
నంగము తో లస్థులతో । సంగతముగఁ దోఁప, వెక్కసముగా నరముల్. (అను. 1–98)

ఆ. ఇట్లు సేసి శక్తి యెల్లను గడచన్న । నతఁడు, నేల వ్రాలె; నతిరయమున
వచ్చి, యమరఁ బట్టి వాసవుఁ 'దక్కటఁ నీకుఁ జెప్పనయ్యఁ నెమ్మి నేను. (అను. 1–99)

ఆ. చండదేవుఁ డనఁ బ్రశస్తి వహించి, సు । స్త్రీలు, పూజనంబు సేయఁ గామ
రూపధారివై, నిరూపింప విహగభా । వంబుగల్గి, ప్రమదవర్తి వగుము'. (అను. 1–101)

సీ. 'జాహ్నవీదేవికి జనకుఁడై వెలసిన । జహ్నుని కులమున సంభవించె
గాధినాఁ బ్రకట భూకాంతుఁ ; డాతనిపుత్రి । యగు సత్యవతిఁ దన కాలి గాఁగ
నిమ్మని యర్థించె నమ్మహీశ్వరు ఋచీ । కుం దనుముని; భృగుకులవరేణ్యుఁ
డతని కీ నొల్ల కప్పతి దనకూఁతున । కుంకువగాఁ, జెప్పెనొక్క కర్ణ

తే. మసితమై తెలుపారెడు హరులు వేయి । మానియై భార్గవుఁడు దేరఁబూని వరుణుఁ
గానఁ జని యవ్విధము ఘోటకముల వేఁడె । నాతఁ డిచ్చుట కొడఁబడి యతనితోడ. (అను. 1–104)

# 9. తారుమారైన చరువు, తరువు

తపశ్శక్తితో సృష్టించాడు ఋచీకుడు రెండు చరువులనే హవ్యములను
భార్యతో అన్నాడు- ఆ భాగం ఉజ్జ్వలమైన బ్రాహ్మణత్వాన్నిస్తుంది; ఈ రెండవ చరువు
ఇస్తుంది క్రూరమైన క్షత్రియత్వాన్ని, ఆ భాగం నీకు, ఈ భాగం మీ అమ్మకు.
ఋతుకాలంలో నీవు మేడిచెట్టును, నీ మాత రావిచెట్టును కౌగిలించుకోవాలి-

ఋచీకుడు చెప్పినది సరిగా గుర్తులేని సత్యవతి పొరబాటుతో మారినాయి.
చరువులు, చెట్లు- బ్రాహ్మణభాగం మేడిచెట్టు క్షత్రియురాలైన తల్లి పరమైనాయి.
క్షత్రియ భాగం, రావిచెట్టు తాను తీసుకున్నది బ్రాహ్మణస్త్రీ సత్యవతి; ఋచీకుడన్నాడు
భార్యతో- విధి నిర్ణయం విచిత్రంగా ఉంటుంది- చరువులు తరువులు మారాయి.

నీకు క్షత్రియుడైన కొడుకు పుడతాడనగా ఆమె దుఃఖితురాలై ఉండగా
ఋచీకుడామెను ఆశీర్వదించి మనకు పుట్టబోయేకొడుకు బ్రాహ్మణుడౌతాడు.
కాని వీడి కొడుకు తీవ్రమైన క్షత్రియ లక్షణాలు కలిగి ప్రసిద్ధుడవుతాడు.
హవిస్సులో పదార్థాలు, చెట్ల పరిమళాలు పిండలక్షణాలను మారుస్తాయి-

ఋచీకుడు చెప్పినట్లే గాధి భార్యకు జన్మించాడు విశ్వామిత్రుడు
సత్యవతికి జన్మించాడు జమదగ్ని, జమదగ్ని కుమారుడే పరశురాముడు.
రాజై ఉన్నా విశ్వామిత్రుడికి చరువు తరువు ప్రభావంతో బ్రాహ్మణత్వం కావాలనిపించింది.
ముని కుమారుడైనా రాముడు పరశువు చేబట్టి క్షత్రియ సంహారం చేయాల్సి వచ్చింది.

---

**తే.** **రెండు చరువు లొనర్చి, యొక్కండు బ్రాహ్మ । ణత్వ మత్యుజ్జ్వలముగ నొనర్ప, నొకటి**
**రాజభావంబు నధిక తీవ్రముగఁ జేయఁ । జాలునట్లుగ నిజతపశ్శక్తిఁ జేసి. (అను. 1-109)**

**క.** **చరువులు, నమ్ముని చెప్పిన । తరువులు, వీడ్వడియె సుతకుఁ దల్లికి; నట్ల**
**య్యిరువురు నుపయోగింపఁగఁ । గురువులు దత్తత్ప్రకార కలితము లయ్యెన్. (అను. 1-111)**

**ఆ.** **చ్యవననందనుండు సత్యవతీ గర్భ । భంగి సూచి, 'యకట! బ్రాహ్మణుండు**
**గాఁడు, తరుణి! నీదు కడుపులోపలి బిడ్డ । క్రూరుఁడైన రాచకొడుకు గాని.' (అను. 1-113)**

**క.** **'నీకుం బుట్టెడు కొడుకు వి । వేకనిధీ! బ్రాహ్మణత్వ విరహితుఁ డైనన్**
**లోకము మెచ్చునె? యట్టులు । గాకుండఁగఁ జేయు తపము గౌరవ మొప్పన్. (అను. 1-115)**

**తే.** **నాకు నివ్వర మి 'మ్మని నమ్ర యగుడు, । 'వీడు బ్రాహ్మణుఁ డగుఁ గాక, వీని కొడుకు**
**నందు రాజత్వ సంపద యతిశయిల్లు' । ననియెఁ గరుణార్ద్రచిత్తుఁడై యత్తపస్వి. (అను. 1-116)**

---

'అత్యయిక స్థితి (Emergency) అనుశాసనిక పర్వమ్' అని ఆచార్య వినోభా భావే గారు, మౌనవ్రతంలో ఉన్నందువలన, పలకపై వ్రాసి తన అభిప్రాయం తెలిపారని అప్పట్లో ప్రచారం విస్తృతంగా జరిగింది.

# 10. వీతహవ్యుడు బ్రాహ్మణత్వాన్ని పొందుట

భీష్ముడు చెబుతున్నాడు– వీతహవ్యుడనే రాజు మరోపేరు హైహయుడు
ఇతడు మనువుకు పుట్టిన శర్యాతి వంశం వాడు, వత్సదేశానికి ప్రభువు.
పదిమంది భార్యలు, వందమంది కొడుకులు, మహా పరాక్రమవంతులు.
కాశీరాజు హర్యశ్వుడిని యుద్ధానికి పిలిచి చంపారు, ఆ తరువాత రాజైన

సుదేవుడినీ చంపివేసారు, సుదేవుడి కొడుకు దివోదాసుడు రాజుకాగా
అతడినీ ఓడించారు, కానీ అతడు ప్రాణాలతో పారిపోయి ఆశ్రయించాడు భరద్వాజ మునిని
ముని ఆశీస్సులతో పుట్టిన దివోదాసుడి కుమారుడు ప్రతర్ధనుడు యువరాజై
ధనుర్వేదంలో గొప్ప నేర్పున్నవాడు కనుక వీతహవ్యుడి కొడుకులందరినీ చంపాడు.

వీతహవ్యుడు తన పుత్రుల మరణాన్ని చూసి భయపడి భృగువు శరణు జొచ్చినాడు.
ప్రతర్ధనుడు అతడిని వెంబడిస్తూ చేరుకున్నాడు భృగుమహర్షి ఆశ్రమానికి–
భృగు మహర్షి అన్నాడు– ఇక్కడ క్షత్రియులెవరూ లేరు, సరిచూసుకో!
ప్రతర్ధనుడన్నాడు– క్షత్రియుడైన వీతహవ్యుడిని అతడి జాతికి దూరం చేసాను. నాకది చాలు!

భృగుమహర్షి ఆశీస్సులతో వీతహవ్యుడికి జన్మించాడు గృత్యమదుడు
అతడికి పుత్ర పౌత్ర క్రమంబున సుతేజస, వర్చస, నిహవ్య, వితత్య, సత్య, సంత
శ్రవస, దమస, ప్రకాశ, వాగీంద్ర, ప్రమతి, రురుడు, సముద, శునక, శౌనకులను
మహాద్విజులు జన్మించి అనేక విద్యలను ముత్యాలుగా ఫలింప చేసినారు.

---

**క. తనయులఁ దెగటార్చి వడిం । దనమీఁదం గవిసినం బ్రతర్దను శౌర్యం
బున కలికి వీతహవ్యం । దనయము వెసఁ బాఱె భృగువునాశ్రమమునకున్. (అను. 1-124)**

**క. 'విను మిచ్చట నృపకుల సం । జనితుఁడు, లేఁ; డింతయుం బ్రశస్త మహీదే
వ నికాయమ; కనుఁగొను'మని । తన శిష్య ప్రతతిఁ జూపె దయ చిగురొత్తన్. (అను. 1-128)**

**ఆ. అతఁడు నగుచు, భృగుని యడుగుల కెఱఁగి, మ । హాత్మ! దీన నేఁ గృతార్థవృత్తి
నైతిఁ బగతు నిట్లు జాతికిం బెడఁ బాపి । గాసి గాఁగఁ జేయఁగంటిఁ గాన. (అను. 1-130)**

**క. కలుగునె యమోఘ మగు నీ । పలుకున, కన్నతత్త్వ? మేను బనివినియెద, న
న్నలఘు కృపఁ జూడు మని తగఁ । బలికిన, ముని ప్రీతి నానృపతి వీడ్కొలిపెన్. (అను. 1-131)**

**ఆ. వీతహవ్యుఁడును మహాతపస్సందీప్తుఁ । డైన యమ్మునీంద్రు నప్రతర్క్య
భంగి భాషణముల బ్రాహ్మణుఁ డై గృత్స । మద సమాఖ్యుఁ గాంచె మహితసుతుని. (అను. 1-132)**

**తే. పౌరుషమ్ము దైవంబు తోడ్పాటు లేక ఫలము బొందంగ నేరదు పార్థివేంద్ర!
విత్తు సహకారి గాకున్న రిత్తనేల వంధ్యమగుగాక, తా ఫలవంతమగునె? (అను. 1-136)**

# 11. సత్కార్య ఫలితాలు

రాజైన విశ్వామిత్రుడు గొప్ప తపస్సు చేసి రాజర్షి నుండి మెట్లెక్కినాడు బ్రహ్మర్షిగా
రాజైన వీతహవ్యుడు భయంతో మారినాడు బ్రాహ్మణుడిగా భృగువు ఆశ్రయమివ్వగా,
పుట్టుకతో బ్రాహ్మణుడైనా మతంగుడు చండాల స్వభావంతో ఉన్నవాడైనందుకు
బ్రాహ్మణత్వం కోల్పోయాడని, తపస్సులక్కరకు రాలేదన్న ఈ ధ్వని ఏమిటి?

నూనె పూసిన మెట్లెక్కడం ఎంత కష్టం? పాప పుణ్యాలనిచ్చెన పొడవెంత?
ఎవరి వర్ణం వారికేమి నేర్పిస్తుంది? వర్ణ సంకరం వ్యక్తికారకమా, విధి ప్రేరితమా?
భీష్ముడు చెబుతున్నాడు– పౌరుషం చేను, దైవం విత్తు– కలిస్తే మంచి ఫలితం.
దైవ సహాయం లేని పౌరుషం వ్యర్థం; పురుష ప్రయత్నం లేకుండా రాదు దైవ సహాయం.

గాలికి అగ్ని ప్రజ్వలిస్తుంది, మంచి పనులకు దేవుడి అనుకూలత పెరుగుతుంది.
నేయి తగ్గితే దీపకాంతి తగ్గుతుంది, పవిత్రత లోపిస్తే దైవానుకూలత తగ్గుతుంది.
పరశురాముడు, భృగువు, బలిచక్రవర్తి మహనీయ పురుషులే కాని దుష్కర్మల వలన
దూరమైనారొక్కోసారి దేవుని కరుణకు, అనుభవించారు కష్టాలు, ఓటమి

అలసి వచ్చిన బాటసారికి అన్నం పెట్టడం, అగ్ని ఆరాధనం, భవ్యదానం,
మౌనం, తపస్సు, అహింస, బ్రహ్మచర్యం, ఉపవాసం, ఫల జల సేవనం,
వలన లభిస్తాయి– వరుస క్రమంలో– గొప్ప పుణ్యం, ప్రయత్న సిద్ధి, వస్తు సిద్ధి
జ్ఞానశక్తి, భోగభాగ్యాలు, రూప బల జ్ఞానాలు, దీర్ఘాయువు, చిత్తశుద్ధి, రాజ్యపాలన, స్వర్గం.

---

**సీ. ‘అధ్వపరిశ్రాంతుఁ డగు వింతవానికి । నన్నం బిడిన ఫల మట్టి దిట్టి**
**దనఁ బెద్ద యగ్ని సమారాధనమునకుఁ । బౌరుష శ్రేష్ఠత భవ్యదాన**
**ములకుఁ, దత్తద్వస్తువులమహామహిమలు । మౌనంబునకుఁ బరిజ్ఞానశక్తి**
**యతుల తపంబున కధికభోగము లాహిం । సకు రూప, బల, చిదైశ్వర్య, సిద్ధి**

**తే. బ్రహ్మచర్యమునకుఁ బరమాయు వుపవాస । ములకుఁ జిత్తశుద్ధి ఫలజలంబు**
**లాహరించి యునికి కాధిరాజ్యము, పత్ర । భక్షతకు, దివంబు ఫలము లధిప! (అను. 1-143)**

**క. శ్రుతిపఠనమునకు, నర్థ । ప్రతి బోధంబునకు, వరుస ఫలములు సౌఖ్య**
**స్థితియును, సుగతియు; సత్య । వ్రతమునకు ఫలంబు ముక్తి వసుధాధీశా! (అను. 1-144)**

**క. ద్రుమముల దళకుసుమఫలో । ద్గమములక్రియఁ గర్మముల నొదవుఁ దత్ఫలముల్**
**దమ తమ తతిఁ గర్తకు భో । గ్యములై నియతిని శుభాశుభాకారములన్’. (అను. 1-145)**

**– యథాగ్నిః పవనోద్ధూతః సుసూక్ష్మోపి మహాన్ భవేత్**
**తథా కర్మ సమాయుక్తం దైవం సాధు వివర్ధతే (సం. అను. 6-43)**

# 12. వేటగాడు-చెట్టు-చిలుక-ఇంద్రుడి కథ

వేద పఠనం సౌఖ్యం, అర్థం గ్రహిస్తే సుగతి, సత్యవ్రతానికి ముక్తి
మంచి చెడు పనులకు కాలానుగుణంగా చెట్లకు ఆకులు పూలు కాయలు పండ్లు
వచ్చినట్లు వస్తాయి ఫలితాలు; ప్రాణాలున్నంత వరకు పోని రోగం కోరిక-
అని పలికి భీష్ముడన్నాడు ధర్మరాజుతో-ఆశ్రయమెప్పుడూ అపరిత్యాజ్యం.

కాశీదేశంలో ఒక వేటగాడు విషం పూసిన బాణంతో లేడిని కొట్టబోగా
అది గురితప్పి ఫలపుష్పభరితమైన చెట్టుకు తగిలింది, కొద్దిరోజుల్లోనే
చెట్టు ఎండిపోయింది. దాని తొర్రలో ఆశ్రయమున్న గొప్ప చిలుక అనుకున్నది
-'నేను ఈ చెట్టును విడిచిపోను'; ఇంద్రుడది చూసి చిలుకతో అన్నాడు-

'ఇన్ని చెట్లున్నాయి ఫలపుష్పములు సమృద్ధిగా ఉన్నవి, నీవేల ఈ ఎండిన చెట్టు వీడవు?'
చిలుక అన్నది- 'ఇంద్రదేవా! ఎన్నో ఏళ్లుగా ఆశ్రయమిచ్చిన చెట్టును వదలిపోలేను'
ఇంద్రుడు సంతోషించి అమృతం కురిపించి ఆ చెట్టును బ్రతికించాడు.
ఆ వృక్షం మరల పూర్వ వైభవం కన్నా గొప్ప వైభవంతో కళకళలాడింది.

అందుకే ధర్మరాజా! ఆశ్రితులైన విప్రులను రాజు కొడుకులా కాపాడాలి.
గురువు వలె గౌరవించాలి, అగ్నివలె పూజించాలి, విముక్తిని ప్రసాదించే
జ్ఞానమైన విద్యను స్వాధ్యాయనం చేయాలి, మంచిని కోరి తపస్సు చేసేవారిని
మనఃపూర్వకంగా ఆదరించిన వారికి కలుగుతాయి అధిక పుణ్యం, శుభం.

**ఉ. దాని యుదాత్త వృత్తము శతక్రతుఁ డాత్మ నెఱింగి వచ్చి, 'ఏం**
**డైనది యిమ్మహీజము; మహాతరువుల్ ఫలవృద్ధి నొంది యి**
**క్కాన ననేకముల్ గలుగఁగా, నిటు లేటికి నిందు నిల్వ నో**
**మానితకీరమా!' యనియె మానుష భంగికరూప మొప్పఁగన్. (అను. 1-153)**

**వ. అనిన విని యా శుకంబు. (అను. 1-154)**

**చ. 'అనయము పండుచుండు నెడ నాశ్రయ మొప్పిన నిల్చి, యెండి పో**
**యినతఱిఁ బాసి పోక తగ వెట్లు? కృతఘ్నత గాదె యివ్విధం**
**బనిమిషనాథ!' యన్న నతఁ డచ్చెరువంది 'పురాకృతోప సం**
**జనిత విశేష మీ ఖగము జానుగ నన్ను నెఱింగె, దీనికిన్. (అను. 1-155)**

**- వరం వృణీష్వేతి తదా సచ వవ్రే వరం శుకః**
**అనృశం స్వపరో నిత్యం తస్య వృక్షస్య సంభమ్-**

**- విదిత్వా చ దృఢాం భక్తిం తాం శుకే శీల సంపదమ్**
**ప్రీతః క్షిప్ర మథో వృక్షమ్ అమృతేనా వసిక్తవాన్ (సం.అను. 6-28,29)**

# 13. లోకనయన పర్వ నిర్వహణకారి సుపర్ణుడు పుట్టె-

బ్రాహ్మణత్వ సిద్ధికి ఫలం- 'శ్రీకృష్ణుడు వేదమయుడు, వేద వేద్యుడు
వేదార్థం తెలిసిన పండితులకిష్టుడు, అతడే సుపర్ణుడైన గరుత్మంతుడని
తెలియడం' -అని పలికి భీష్ముడు అన్నాడు ధర్మరాజుతో-
-కశ్యపుని భార్యలు కద్రువ, వినత; కోరుకున్నారు సంతానం-

వేయి కొడుకులు కావాలన్నది కద్రువ. అలాగే అన్నాడు కశ్యపుడు.
ఇద్దరు చాలు నాకు, వేయిమంది బలముండాలి -అన్నది వినత.
సరేసరే, అన్నాడు కశ్యపుడు సవతులిద్దరిని సావధానంగా చూసి-
కద్రువకు వేయిగుడ్ల నుంచి నేతికుండల్లో పుట్టాయి వేయి పాములు.

వినత గుడ్లు నేతికుండల్లో ఎట్లా ఉంచినవి అట్లాగే ఉన్నాయి, మార్పు లేదు.
వీరులైన తన పుత్రులు వేయిమందితో వెలిగిపోతున్నది కద్రువ ముఖం.
అసూయతో మనసూగిపోగా ఒక గుడ్డును పగలగొట్టింది వినత.
ఊర్ధ్వ శరీరం బాగా తయారైన పక్షి వెలువడింది, తల్లిని చూసింది.

అమ్మా ఎంత పని చేసావు? సవతిపై మత్సరంతో చాలా తొందరపడ్డావు.
సగం బలిష్ఠుడిని నేను అనూరుడనైనాను, నీ చపలత్వానికిదే నా శాపం-
నీ సవతికి దాసిగా కొన్నాళ్లు బతుకు; నీ రెండో కొడుకు
నీకు దాస్య విముక్తి కలిగించేంత వరకూ -అని పలికినాడు కోపంగా.

---

**చ.** **'ఇరువుర మేము పుట్టుదు మహీనపు మేనులతో, మహాబల**
**స్ఫురణ వెలుంగ నప్పెనుపుఁ బొందఁగ నీ కవియించి తిట్లు మ**
**త్సరమునఁ జాపలంబునను దత్ఫల మందుము, నీ సపత్నికిన్**
**వరవుడవై చరింపు మని, వారని నెవ్వగ శాప మిచ్చినన్. (అను. 1-172)**

**క.** **వెలవెలఁ బాఱుచు, వడఁకుచు । నలుకుచుఁ, దనమోముఁ జూచు నయ్యంగన న**
**వ్వులుఁగు కృపఁ జూచి, తల్లీఁ వలవ దడల నిది విధాతృ వశమయి వచ్చెన్. (అను. 1-173)**

**శా.** **'ఏనూఱేండ్లకుఁ బుట్టు నాయనుజుఁ; డిం కీయున్న యండంబు నె**
**ట్లైనన్ ధైర్యము గల్గి కావుము ప్రయత్నాసక్తిమై వాఁడు ద**
**ర్పానూనుండు బలాభిరాముఁడు మదీయస్ఫూర్తి మన్మూర్తి నీ**
**కానందంబుగ నీఁగు దాస్యము త్రిలోకాశ్చర్య సంపాదియై. (అను. 1-175)**

**చ.** **ఘనతర కధరుండు, దృఢకాయుడు, దీప్తముఖుండు, రక్తలో**
**చనుడు, మహోత్త మాంగకుడు, చారు సుసంగత పక్ష సారమం**
**దనుడు, పరిస్ఫుర ద్ద్యుతి విడంబిత బాలదివాకరుండు, లో**
**క నయన పర్వ నిర్వహణకారి సుపర్ణుడు పుట్టె భూవరా! (అను. 1-177)**

# 14. అపరాంగంబున నీలిమ దోచె ననియె-

అయిదు వందలేళ్లు గడిచాయి, వికలాంగుడైన ప్రథమ పుత్రుడు
సూర్య రథానికి సారధిగా అనూరుడై, అరుణుడై వెళ్దామనుకున్నాడు.
రెండవ గుడ్డు పగిలి– బలిసిన మెడ, బలిష్ఠమైన శరీరం
కాంతితో వెలిగే ముక్కు ముఖం, ఎర్రటి కళ్లు, గొప్ప రెక్కలు

పరిస్ఫురద్యుతి విడంబిత బాల దివాకరుడు, లోకాల కనులకు
పండుగ కల్పించేవాడు సుపర్ణుడు జన్మించాడు తల్లికి సంతోషం కలిగిస్తూ.
మహా బలవంతుడైన తమ్ముడికి తల్లి బాధ్యతల నప్పగించి
ఎర్రటి కాంతిగల అరుణుడు ఎగిరిపోయాడు సూర్యుడి దగ్గరకు.

సుపర్ణుడంటే అందరికీ ఇష్టమే, అందరూ ముద్దు చేసేవారతడిని.
ఒకరోజున సవతులు కద్రువ వినతలు విహరిస్తున్నారు.
సముద్రతీరంలోని చెట్ల తోపులలో నడుస్తూ కదిలే కడలి అలలను చూస్తూ
మదించిన మగ కోయిలలు చిగురాకులను చీలుస్తూ పాడే పాటలు వింటూ,

పూలతేనెలు తాగి ఝుంకారం చేస్తున్న తుమ్మెదలను గమనిస్తూ
పండ్లరసం తాగి అరుస్తున్న చిలుకల గుంపు ధ్వనులను ఆనందిస్తూ
హంసల నడకల అందాలను, పరిమళ లేత గాలుల చల్లదనాన్ని
ఆస్వాదిస్తూ ఉన్నారు సర్పమాత కద్రువ, పక్షుల తల్లి వినతలు.

---

**సీ.** చంచలఁ జిగురాకుఁ జించియాడుచు నలి । నెలుఁగించు గండుఁగోయిలలసొంపు,
నలరుఁ దేనియఁ గ్రోలి, యన్ను సోలంబుల । మరియు తేఁటుల నునుమ్రోఁత యింపుఁ,
దమిఁ బండ్ల రసమాని తమలోనఁ జెలఁగుచుఁ । బలికెడు రాచిల్క పటురవంబు,
గొలఁకుల కెలఁకులఁ గూడి క్రీడించుచుం । దెడు నంచతండంబు నడబెడంగుఁ,

**తే.** దురఁగఁ దేలుచుఁ బూఁదీవఁ దగులఁ బడుచు । వచ్చు చిఱుగాలి సోఁకును, మెచ్చి మెచ్చి,
తగిలి కొనియాడుచును, వినతయును గద్రు । వయును మున్నీటి చేరువ వనమునందు. (అను. 1-181)

**చ.** కరువునఁ బోసిరో! విధుని కాంతి, సుధాబ్ధి తరంగఁ దచ్చి, గం
దరు వొనరించిరో! హరుజటాస్థలికిం దొడ వైన యేటి పె
న్నురువునఁ జేసిరో! యన మనోజ్ఞ సితచ్ఛవి నుల్లసిల్లు సుం
దర తురగోత్తమంబు దవుదవ్వులఁ గాంచిరి చారులోచనల్. (అను. 1-182)

**క.** వినత 'హయ మింత యొప్పునె యనూన ధవళ ప్రభాఢ్యమై' యని పలుకన్
విని కద్రువ 'యుపరాంగంబున నీలిమ దోఁచె ననియె భూపవరేణ్యా! (అను. 1-185)

## 15. కుటిలంపుఁ దలపునఁ గొడుకుల రావించి-

కద్రువ వినతలకపుడు కనిపించె కనుల ముందొక తెల్లని గుర్రము
వెన్నెలను మూసలో పోసి చేసినట్లు, పాలసముద్రపు తరంగాన్ని పట్టి
శిల్పంగా చెక్కినట్లు, సురగంగ నురుగును పోత పోసినట్లు
అల్లంత దూరంలో అటూ ఇటు తిరుగుతున్నదా ఉచ్చైశ్రవము.

వినత అన్నది- హయమింత యొప్పునె, యనూన ధవళ ప్రభాఢ్యమై
కద్రువ అన్నది- తోక కాస్త నల్లగా ఉన్నది, కాస్త పరికించి చూడు.
వినత అన్నది- తెల్లటి గుర్రానికి లేని నలుపుందంటావేల నీవు?
కద్రువ అన్నది- వ్యర్థ వివాదమెందుకు, పందెం కాసి చూద్దాము.

వినత అన్నది- నేను సిద్ధమే. కాని, పందెమేమిటి, షరతులేమిటి?
కద్రువ అన్నది- నీవు గెలిస్తే నేను నీ దాసిని; నేను గెలిస్తే నీవు నా దాసివి.
కద్రువకు తెలుసు తాను చేస్తున్నది తప్పని- అయినా తప్పదు.
పెదవి జారిన మాట పృథివి దాటుతుందనుకుని అన్నది-

ఈరోజు చీకటి పడుతున్నది, రేపు ఉదయం చూద్దాం గుర్రాన్ని.
ఇద్దరూ ఇంటికి వెళ్లారు. కద్రువ అన్నది కొడుకులను పిలిచి-
తెల్లగుర్రం-ఉచ్చైశ్రవానికి నల్లతోక ఉందని పందెం కాసాను,
సవతితో పందెం ఓడిపోవడం చావుతో సమానం నాకు.

---

**సీ.** **కుటిలంపుఁ దలఁపునఁ గొడుకుల రావించి । కద్రువ యిట్లనుఁ గన్నునీరు**
**దొరఁగంగ వారలతో 'నబ్ధి పొంతకు । వినతయు నేనును వేడ్క నరిగి**
**యచ్చు తెల్పునఁ గడునభిరామ మగునొక్క । యశ్వంబు గాంచితి; మవ్వధూటి**
**గేవలధవళంబు నా విని, యొద్దార । మునకు నే నదె నల్లదనముఁ గంటె**

**తే.** **వెనుకదెస 'నన్న వాదయ్యెఁ, గనలి పన్ని । దంబు సఱచితి; మోడిన దాస్యవృత్తి**
**వచ్చు సవతికి; నే నెట్లు వరవుడంబు । సేయఁ దగు?; దోఁక నల్లగాఁ జేయరయ్య! (అను. 1-193)**

**చ.** **అనవుడు వాసుకి ప్రభృతు లక్కట! ధర్మువు గాదు; నీవు సూ**
**చినతెరు వట్టి గెల్పు శుభసిద్ధి యొనర్చునె? యట్లుగాక య**
**వ్వనితయుఁ దల్లి గాదె? గరువంపుఁ దనంబునఁ జూడ మాకు ని**
**ట్లనఁ దగునమ్మ? యెట్లయిన నయ్యెడు; బాపము సేయవచ్చునే? (అను. 1-194)**

**క.** **ఈవిధ మెమ్మెయి నైనం గావింపగ వలయు ననుట గల్గినఁ బరదే**
**శావాసుల మగుదుము; మము నీ వింకం దగదు తల్లి! నిర్బంధింపన్ (అను. 1-195)**

# 16. చింతవంత లేక నీవిట్లు తిరుగుట లెస్సయగునె?

తెల్లగుర్రం తోకకు వేలాడి నల్లగా చేయమని తల్లి ప్రార్థించ
వాసుకి ప్రభృతులన్నారు- అమ్మా ఇది ధర్మం కాదు, ఆమెకూడా మాకు తల్లి కదా!
మేమీ పని చేయలేము, కాదు కూడదని అంటే ఇల్లు వదిలి పోతాము-
అని వెళ్లిపోవడానికి సిద్ధం కాగా కద్రువ కోపించి అన్నది-

శత్రుభయంకరుడైన అర్జునుడి మనమడు జనమేజయుడు చేసే
సర్పయాగంలో- తత్ దహన భీకర భూరి శిఖా ప్రవేశ సంజాత
దురంత తాపమున- చావండీ మీరంతా; తల్లిమాట వినని తనయులారా!-
అనగా భయపడి కొన్ని పాములు ఉచ్చైశ్రవపు తోకను చుట్టుకోగా

తెల్లవారే స్పష్టంగా కానవచ్చింది తోకకున్న నలుపు వినతకు
సవతి వంచన గుర్తించని వినత దాసిగా మారింది కద్రువకు.
ప్రథమ తనయుడు అరుణుడిచ్చిన శాపమలా వాస్తవమైంది.
రెండో తనయుడు దాస్య విముక్తి చేస్తాడని ఆశతో ఉన్నది వినత

రెండో గుడ్డు నుంచి బయల్వెడలిన సుపర్ణుడు యవ్వన మదంతో
లోకాలన్నిటా యథేచ్ఛగా విహరిస్తుంటే నారదుడన్నాడు
-'దాసియై సవతాలికి తల్లి పనులు చేస్తూ నానా అవస్థలు పడుతుంటే
అది పట్టించుకోకుండా లోకమంతా తిరుగుతున్నావా వినతాపుత్రా!'

---

**ఉ.** **ఆతఁడు సర్పయాగమను నధ్వరముం గుపితాత్ముఁడై పితృ**
**ప్రీతిగఁ జేయుఁ; దద్దహనభీకర భూరి శిఖా ప్రవేశసం**
**జాతదురంతతాపమునఁ జావఁగలా' రని శాప మిచ్చెఁ; ద**
**త్పాతన వృత్తికిన్ వెఱచి తక్కటి నాగము లా భుజంగితోన్. (అను. 1-198)**

**తే.** **నల్లగాఁ జేయువార, మే మెల్లభంగి । నాతురంగమపతివాల। మని, రయమునఁ**
**బోయి, వాలధి రోమముల్ వొదివి, నీల । రోమసంచయమైరి కురుక్షితీశ! (అను. 1-199)**

**తే.** **'దాసియై సవతాలికిఁ దల్లి పనులు । సేసి నలఁగంగ, నద్దెసఁ జింత వంత**
**లేక నీ విట్లు దిరుగుట లెస్స యగునె? । యద్భుతోజ్జ్వలతేజ! కశ్యపతనూజ!' (అను. 1-205)**

**చ.** **అనుడు, విహంగనాథుఁడు 'మదంబకు దాస్యము రాకకుం గతం**
**బనఘవిచార!యెద్ది? తెలియన్ వినిపింపవె!' యన్నఁ జెప్పి న**
**మ్మునివరుఁ డున్నరూపు, హయముం గను టాదిగఁ గల్గు కశ్యపాం**
**గనల చరిత్ర మాతని కఖండ పరిస్ఫుట భాషణంబులన్. (అను. 1-206)**

# 17. అనుమానంబదియేల - తెత్తును అమృతం

అమాయకురాలు వినత, తెల్లగుర్రం తోక కాస్త నల్లగా కనిపించేసరికి
తర్కమేమీ చేయకుండా తలవంచి దాస్యం చేస్తున్నది సవతి కద్రువకు.
గడుసుపిండం కద్రువ, తెల్లగుర్రం తోకను కాస్త నల్లగా చేసి
కడుపులో చల్ల కదలకుండా తల ఎత్తి పనులు చేయించుకుంటున్నది వినతతో.

నారదుడి ప్రశ్నకు బిక్కముఖం పెట్టి సుపర్ణుడడిగాడు వినయంగా.
గరుత్మంతుడి వేపు జాలిగా ముఖంపెట్టి నారదుడు చెప్పాడు కథ వివరంగా–
వెంటనే గరుడుడు వేగంగా వెళ్లి– 'నీ చెల్లెలిని విముక్తి చేయుము
దాస్యం నుంచి అన్నాడు' –కద్రువ ముఖంబు మురకటించుచు–

బలవంతుడివి కదా, పోయి అమృతం తీసుకురా, దాస్య విముక్తి అవుతుంది–
తండ్రి కశ్యపుడు ఆడవాళ్ల తగాదాలో తలదూర్చడేమో పాపం–
దాస్య విముక్తి  గురించి కాక అమృతముండే చోటు గురించి చెబుతున్నాడు–
ఉదకం మధ్యలో ఉజ్జ్వలంగా మండే అగ్ని, అనేకమంది రాక్షసులు కాపలా

కృపాణాలు, శక్తులు ధరించి మహోగ్ర కోపులై ఉన్నవారు రక్షిస్తుండగా
ఇనుప వల లోపల సంరక్షింపబడి ఉంటుందా అమృతభాండం.
దేవతల అమృతభాండాన్ని రాక్షసుల రూపంలో దేవతలు రక్షిస్తున్నారేమో!
గరుత్మంతుడన్నాడు– అయినా సరే, నేను వెళ్లి అమృతం తెస్తాను.

---

**చ.** **పరమ వినీతిమై నెఱఁగి, బాంధవ మారఁగ నల్ల నిట్లనున్**
**గరుడుఁడు దారితారి వగఁ గందుచు 'నీ చెలియల్ చరించు ని**
**వ్వరవుడపుం జరిత్రమున వచ్చునె నీ కొక పేర్మి? యీసతిం**
**గరుణ యెలర్పఁగా విడువ గౌరవ సంపదఁ జేయు నెంతయున్. (అను. 1–209)**

**మ.** **'బలవంతుండవు, నేర్పు చందములఁ జెప్పంజాలి యీరిత్త ప**
**ల్కులఁ దేర్పం బనిలేదు; తల్లికి మదిం గూర్తేని వే పోయి లో**
**కులు నిన్నుం బ్రణుతింపఁ దె మ్మమృతమున్; ఘోరంపు దాస్యంబు నేఁ**
**డొలఁగం బెట్టెద మీ కనంతమగు సంతోషంబు సంధిల్లఁగన్. (అను. 1–212)**

**మ.** **అనుమానం బది యేల? తెత్తు నమృతం 'బన్నం గడుం బొంగి, యా**
**తనిఁ దాఁ గౌఁగిటఁ జేర్చి కశ్యపుఁడు, పుత్రా! నిశ్చయం బట్లయే**
**ని, నిభంబుం గమఠంబునుం గలవు; వానిం దిన్న లావెక్కు; నా**
**ఘనజంతు ద్వితయంబు నీకు నెరగాఁ గల్పించితిం బోవనా!' (అను. 1–218)**

# 18. గరుత్మంతుడు - గజ కచ్ఛపములు

కశ్యపుడన్నాడు తన కుమారుడు వైనతేయుడితో– నాయనా!
అతిదూర ప్రయాణం, ముందు నీకు కావాలి అమితశక్తి బలం
తూర్పు సముద్రతీరాన ఉన్నాయి తాబేలు, ఏనుగు చాలా పెద్దవి.
ఉరగ పర్వతం పక్కన ఏనుగు, పక్కనే ఉన్న సరస్సులో తాబేలు.

నీరు తాగడానికి ఏనుగు వస్తే, తాగనీయకుండా అడ్డుపడుతుంది తాబేలు.
ఇరువురి మధ్యన భీకరమైన పోరు, రోషం, రోజురోజుకూ ఎక్కువ కాగా
వాటిని విడివిడిగా ఎవ్వరూ పట్టుకోలేరు, రెండిటిని పట్టుకోవాలి ఒకేసారి.
నిజానికవి పూర్వకాలంలో మధు కైటభులనే రాక్షస శ్రేష్ఠులు, మిత్రులు.

ప్రస్తుతం పరమ శత్రువులు, వాటిని చంపి తిన్నావంటే చాలు
అపరిమితమైన శక్తి నీకు వస్తుంది కుమారా, విజయోస్తు –అన్నాడు.
గరుత్మంతుడు వెళ్లాడు ఉరగ పర్వతం దగ్గరకు, చిన్న రూపుతో–
ఏనుగు వచ్చింది కొలను దగ్గరకు, దాని మదజలవాసన పసిగట్టింది తాబేలు.

తాబేలును కొట్టింది గట్టిగా తన ముందుకాలితో ఆ గొప్ప ఏనుగు,
నీళ్లలోనే ఉండి తాబేలు ఏనుగు కాలు చీరి, పళ్లతో కొరికింది.
ఏనుగు తొండంతో కొట్టింది తాబేలును, అది గట్టిగా రక్కింది. పోట్లాడుకుంటూ
అవి ఒడ్డుకు వచ్చాయి, అదే సమయమనుకున్నాడు గరుత్మంతుడు.

---

**ఉ.** **దంతి సనంగ, భూరిమదధారల గాలి యెఱింగి, కూర్మ మ**
**త్యంత సముద్ధతిం గొలని కడ్డపడన్ వెసవచ్చె; వచ్చినన్,**
**దంతియు నీరువట్టున నుదగ్రపుఁ గోపము సందడింప, దు**
**ర్దాంతసముద్యమం బెసఁగ దాని పయిన్ గవిసెన్ మహోగ్రమై. (అను. 1–231)**

**చ.** **కవిసి, ఖరంబులైన మునికాళ్ళను వ్రేయఁగ, సాము నీరిలో**
**ను వెడలకుండి కూర్మ మతను స్థిర తీవ్రనఖంబులం బదా**
**గ్ర విదళనంబు సేయఁగఁ గరంబున మోఁదఁగ వారణంబు దం**
**తివిహతి నొంపఁ గచ్ఛపము, దారుణ మయ్యె రణంబు భూవరా! (అను. 1–232)**

**మ.** **విని యుత్సాహము గందళింపఁగ వియద్వీథీగతుం డై, విమా**
**న నికాయంబులు దూలఁ బక్షతివితానస్ఫార దీప్తి వ్రజం**
**బినరశ్మి ప్రకరంబుఁ గీడ్పఱుపఁ బక్షీంద్రుండు చంచద్గతిం**
**జనియెం దానురగాభిధాన మగు నా శైలంబు పెందిప్పకున్. (అను. 1–229)**

# 19. అమరేంద్రుండు సముద్ధతిన్ వెడలి-

మహారూపంతో మహాబలశాలి అయిన వైనతేయుడు మహా వేగాన వచ్చి
కుడికాలితో కూర్మమును, ఎడమకాలితో ఏనుగును తన కాలిగోళ్లతో గ్రుచ్చి
పట్టుకోగా భయంతో అవి మూర్ఛనొంద ఎగిరిపోయాడు నింగిలోకి.
రెండు నల్లటి మేఘాలు బంగరు కొండపై వాలగా ఎర్రకొండ ఎగుర్తున్నట్లుగా-

సుపర్ణుడు చూసాడు రోహిణమనే పెద్ద వృక్షాన్ని, దాని అయిదు యోజనాల
పొడవైన శాఖపై వాలేసరికి ఫెళఫెళా విరిగింది కొమ్మ, వెంటనే
ఆ కొమ్మను ముక్కున కరచుకుని, దానికి వేలాడుతున్న వాలఖిల్యులకు
ఏ ఆపదా రాకుండా చూడగా వెళ్లిపోయారు వారతడిని ఆశీర్వదించి.

ఆకాశవాణి పలుకులు విని ఆ కొమ్మను పడవేసాడు దురాచారులున్న
కులింద దేశంలో, ఎందరో దుర్మార్గులు చచ్చారా గొప్ప కొమ్మ మీదపడగా
అతడలా ఎగుర్తూనే వెళ్లి సమతలంగా ఉన్న కొండశిఖరంపై వాలి, విలాసంగా
గజ కచ్ఛపాలను సంతృప్తిగా భుజించి ఆపరాని వేగంతో వెళ్లాడు అమృత స్థావరం వేపు

బ్రహ్మను ప్రార్థించి ఆ మహాగ్నిలో, కొండంత వెన్న తెచ్చి వేసి దాని నార్పి
నీళ్లు పారబోసి, ఇనుప వలను తెంపి కాపలా రాక్షసుల కండకావర మణచి
అమృతభాండాన్ని అపహరించి ఆకాశమార్గాన పోతుండగా అడ్డుకున్నాడు
అమరేంద్రుడు, తన సైన్యమంతా సుపర్ణుడి రెక్కల గాలికి చెల్లాచెదురైపోగా.

---

**ఉ.** ఇమ్మెయిఁ బోరి పోరి, మది నేపున గోపము నగ్గలింపఁ, గూ
ర్మమ్ము గడంగి, నీ ర్వెదలి మత్తకరిన్ వడి నాక్రమింపఁగా,
గ్రమ్మన రెంటినిం బొదివి, కచ్ఛపమున్ వలకాల వామపా
దమ్మున వారణంబును ముదమ్మునఁ బట్టి తగిల్చె గోళ్ళలన్. (అను. 1-233)

**మ.** పెలుచన్ గోళుల నొత్తి, యగ్గజముఁ దాఁబేలున్ వసం బేది మూ
ర్ఛల నొందన్ వెస నెత్తి, మేఘయుగళీసక్తోల్లసద్గైరికా
చలవైహాయసకేళియో యన నభస్సంచారియై, యుబ్బు న
గ్గలికన్ దవ్వుగఁ బాఱి, యొక్క ఘనవృక్షం బయ్యెడం దోఁచినన్. (అను. 1-235)

**తే.** అవనిఁ బడనీక, శాఖఁ జంచువునఁ బట్టి । పట్టి వారల సుస్థితుల్ పల్లటిలక
యుండ, వెరవున ధరియించి, యొయ్య నెగయఁ । జూచి యవ్వాలఖిల్యులు చోద్య మంది. (అను. 1-238)

**మ.** అమరేంద్రుండు సముద్ధతిన్ వెడలి దేవానీకముల్ దోడ్పడన్
సమరక్రీడకు జొచ్చి పక్షిపతిచే సైన్యంబు లెల్లన్ విధూ
తములైనం గనుగ్రేవ గెంపెసగ రౌద్రంబైన చిత్తంబుతో
డ మహోదగ్రతఁ బొల్చు వజ్రము నవష్టం భోగ్రుడై వైచినన్. (అను. 1-257)

# 20. తల్లి దాస్యంబు తన బాస తప్పకుండా-

అమరేంద్రుడు అవష్టంభోగ్రుడై మహోదగ్రత బొల్చు వజ్రాయుధం వేయగా
పర్వతాల రెక్కలను నరికిన దంభోళి, గరుడుడిని తాకలేక దంబాన్ని కోల్పోయి వెనుదిరగ
ఇంద్రుడు కాలగతినర్థం చేసుకుని దిగులుతో వెళ్లాడు అమరావతీ నగరానికి
అమృతభాండము తెచ్చి కద్రువకు చూపించి, తన తల్లి దాస్యాన్ని పోగొట్టి

'అమ్మా! తెల్లగుర్రం ఉచ్చైశ్రవం తోకకు నీ కొడుకులను వేలాడమని చెప్పి
తోకను నలుపు చేసి నా తల్లితో దాసీ పనులు చేయించుకున్నావు దయలేక.
దానికి నన్ను అమృతం తెమ్మన్నావు కాని ఇమ్మనలేదు; తెచ్చాను, తీసుకుపోతున్నాను
అమృతాన్ని, అమ్మను కూడా; ఇంకెప్పుడూ, ఎవరినీ ఇలా మోసం చేయకు!-

-అని పలికి తల్లిని ఇంటికి పంపి అమృతభాండాన్ని తీసుకువెళ్లి
అమరేంద్రునకిచ్చి అన్నాడు- నా సవతితల్లి కద్రువకు సాయంచేసి
నా తల్లి వినతను మోసం చేసిన పాములను వేటాడి చంపుతాను ఇకనుంచీ-
అని పలుకగా అందరూ పొగిడారతడిని, విష్ణువుగా గుర్తించారా సుపర్ణుడిని.

బ్రహ్మదేవుడిచే లాలించబడినవాడు, మహా గజకచ్ఛపాలను తిన్నవాడు,
వాలఖిల్యులను రక్షించినవాడు, కులింద దేశపు దురాచారులపై రోహిణపు కొమ్మను
పడవేసిన వాడు, ఇంద్రుని జయించినవాడు, అమృతాన్ని తెచ్చి అమ్మకు
దాస్యవిముక్తి చేసినవాడు, అమృతాన్ని ఇంద్రుడికి తిరిగిచ్చినవాడు- ఈ గరుత్మంతుడే!

---

**మ.** 'జననీ! నీ వమృతంబు తె'మ్మనిన, యా సత్యోక్తి పాటించి యేఁ
జని నానావిధ కర్మకర్మఠుఁడ నై సాధించి, వే తెచ్చితిన్
విను, నా నీయొడఁబాటు సెల్లె జనులన్ విన్పించితిం దెల్లఁగా
వినతం దోడ్కొని పోయెదన్ మనమునన్ విభ్రాంతి లే కుండుమీ!' (అను. 1-263)

**క.** వినుఁడట్టులు పాపము సేసిన కద్రువ సుతులఁ బొదివి చెండుదు, మత్తుం
డ నితాంతోగ్ర విహారంబునఁ దంద్రియు మీరు ధర్మమును సాక్షులుగన్ (అను. 1-268)

**సీ.** 'అజుఁ డుపలాలింప నద్దేవు కావించు । వరభోజనంబులఁ బెరిఁగె నితఁడె!
ఘనకాయజవసత్త్వ గజకచ్ఛపముల నొ । క్కెత్తువ లీలమై నెత్తె నితఁడె!
విపులభూరుహశాఖ విఱిగిన మునిహితా । ర్థంబుగాఁ జంచునఁ దాల్చె నితఁడె!
సురసేనతోఁ బురందరుని నిర్జించి యు । ద్దీప్తుఁడై యమృతంబుఁ దెచ్చె నితఁడె!

**తే.** తల్లిదాస్యంబు దనబాస దప్పకుండఁ । బాపి యాసుధ మరల నప్పాకశాస
నునకు దయ నిచ్చె నీతఁడె!' యనుచు సిద్ధ । సాధ్యు లగ్గింప, గరుడుఁడు సనియె మగిడి'. (అను. 1-270)

# 21. కొన్ని తెలుసుకోదగిన విషయాలు

విప్రునకు ఇస్తానని ఇవ్వనివాడు నక్కగా పుట్టి పీనుగుల్ని తింటాడు.
విప్రునకు ఇచ్చి మళ్లివ్వమనేవాడు కోతిగా పుట్టి చెట్టుకొమ్మల్లో ఊగుతాడు.
గొప్ప గుణాలున్న హీనవర్ణుడికి మంత్రతంత్రాలు బోధిస్తే పురోహితుడై పుడతాడు.
మంత్రతంత్రాలు వేదకర్మలు తెలుసుకున్న హీనవర్ణుడు పురోహితుడికి రాజవుతాడు.

ధర్మరాజా! గుర్తుంచుకో, లక్ష్మి ఎక్కడబడితే అక్కడ ఉండడానికిష్టపడదు.
నిత్యసత్యులు, శౌచనిరతులు, గురుభక్తులు, అప్రమత్తులు, దక్షులు
అమలమతులు, సత్కర్మపరులు, విజ్ఞాన తప దాన బ్రహ్మచర్యావలంబకులు,
ఇంద్రియ నిగ్రహం కలవారు ఉన్నచోటున ఉంటుంది లక్ష్మి సంతోషంగా!

క్రూరులు, నాస్తికులు, కృతఘ్నులు, కుబుద్ధులున్న చోట్ల; అవినీతిపరులు
శుచి లేనివారు, కఠిన మనస్కులు, చెడుబుద్ధిగల స్త్రీలున్న చోట్ల సిరి ఉండదు.
అందమైన వనాలు, పద్మాకరములున్న చోట్లు సముద్రరాజ తనయ కిష్టము-
ఇవి గుర్తుంచుకుని లక్ష్మీదేవిని నిలుపుకున్నవాడు ఆనందంగా జీవిస్తాడు.

ధర్మజుడడిగితే భీష్ముడు చెప్పాడు రతి సౌఖ్యం స్త్రీలకెక్కువ అని ఓ కథ-
భంగాస్వనుడనే రాజు ఇంద్రుడికిష్టంలేని పుత్రకామేష్ఠి చేసి పొందాడు పుత్ర శతము.
ఒకరోజున వేటకు వెళ్లి సరసులో మునిగి లేచేసరికి స్త్రీగా మారిపోయి,
కామపీడితుడైన ఓ ముని వలన కన్నాడు వందమంది పుత్రులను భంగాస్వనిగా.

---

సీ. **'నిత్యసత్యులు, శౌచనిరతులు, గురుభక్తు, । ల ప్రమత్తులు, దక్షు లమలమతులు,**
**సత్కర్మపరులు, విజ్ఞానముఁ దపము దా । నము బ్రహ్మచర్యంబు శమముఁ గల్గు**
**వారలు, ప్రీతి నా వసియించు నిక్కలు । క్రూరు, నాస్తికుఁ, గృతఘ్నునిఁ, గుబుద్ధి**
**వర్జింతు; నెంగిలి వర్జించి, యిలవాడి । ఘటశుద్ధి గలిగిన కాంతలందు**

తే. **నిల్తు; వల్లభ ప్రతికూల, నిష్ఠురాత్మ । నన్యమందిరగామిని, నధికనిద్ర**
**యైన మానినిఁ దొఱఁగుదు; నబ్జినీ త । టాక తరుషండ పుష్ప వాటముల నిలుతు'. (అను. 1-285)**

సీ. **'అనఘ! భంగాస్వనుం డనురాజు పుత్రార్థి । యై వజ్రి కప్రియం బగుమఖంబు**
**సేసి, పుత్రుల సవిశేషుల నూర్వురఁ । గని, సంతసంబునఁ గ్రాలుచుండు;**
**నాతఁడు వేటకై యరిగినచో వజ్రి । దిగ్భ్రాంతి పుట్టించి తేరకాఁడు**
**సనునట్లు సేయ నుజ్జనపతి యెక్కిన । తురగంబుతో నొంటి దూరమైన**

ఆ. **కాన కేఁగి, తృష్ణ గదిరిన, నలుగడ । నరసి, యొక్క పద్మసరసి గాంచి**
**వెన్ను మునుఁగ హయము నన్నీరఁ దిగిచి, తాఁ । దనివు సొంపు మిగుల మునిఁగి లేచి. (అను. 1-287)**

# 22. భంగాస్వనుడు స్త్రీగా మారిన కథ

ఇంద్రుడి మాయతో ఇబ్బందులలో పడిన భంగాస్వనుడికి కలిగింది
పుత్ర సమృద్ధి. ఇంద్రుడు నేర్పుగా ఆ, ఈ పుత్రుల మధ్య రగిలించాడు వైరం.
ఒకరినొకరు చంపుకుని రెండువందల మంది పుత్రులూ విడిచారు ప్రాణాలు.
గుండెలు బాదుకుంటూ శోకిస్తున్న భంగాస్వనుడిని చూసి ఇంద్రుడన్నాడు–

'నాకిష్టంలేని యజ్ఞం చేసి నీవింతమందిని కన్నావు, అందుకే భంగపడినావు'–
భంగాస్వనుడన్నాడు– నేనేనాడూ నిన్ను ధిక్కరించలేదు, ఇప్పుడూ అంతే,
నేను కోరుకున్నది సంతానాన్ని, అది నాకు లభించింది, వేకువ మంచులా కరిగిపోయింది'.
ఇంద్రుడన్నాడు– 'నీవు మగవాడిగా ఉన్నప్పుడు పుట్టిన పుత్రులు కావాలా?

లేక స్త్రీగా ఉన్నపుడు నీకు పుట్టిన పిల్లలు కావాలా?' అనగా భంగాస్వని
కోరుకున్నది– తనకు పుట్టిన పిల్లలను, స్త్రీకి పిల్లల మీద ప్రేమ ఎక్కువని.
ఇంద్రుడన్నాడు– 'నీవు నిజం చెప్పావు కనుక రెండు వందల మందిని బతికిస్తాను,
నీ స్త్రీరూపం పోగొట్టి నిన్ను వెనకటి మగవాడు భృంగాస్వనుడిగా చేస్తాను.

భంగాస్వని అన్నది సిగ్గుపడుతూ– నాకు స్త్రీరూపమే ఉండనివ్వండి.
స్త్రీత్వంలో అనేక కోణాలున్నాయి. రతిసుఖమూ ఎక్కువే, గర్భిణీ క్లేశాలున్నా
తల్లిగా పొందే ఆనందమూ ఎన్నోరెట్లు ఎక్కువ; మగపుట్టుక, రూపం కన్నా!'
ఇంద్రుడామెను ఆశీర్వదించి పుత్రులందరిని బ్రతికించి వెళ్లిపోయాడు.

---

సీ. 'ఇచ్చెదఁ గొందఱ; నెత్తఱిఁ గాంచిన । తనయుల నొసఁగుదు' ననిన నతఁడు
'కాంతనై యుండి యేఁ గనిన వారల నిమ్ము । దేవ!' నావుడుఁ దొల్లి నీవు గన్న
ప్రజల నే లడుగవు? నిజము సెప్పుము నాకు' । ననియెఁ బురందరుం డవ్విభుండు
వెడసిగ్గుపాటుతోఁ 'పడఁతుల కర్మిలి । బిడ్డలదెసఁ గడుఁ బెద్ద' యనిన

తే. 'సత్యవాది వైతి సకలతనూజులు । బ్రదికి నెగడువారు భూమినీత్వ
దైన్య ముడిపి పురుషతయు నిత్తు నీ' కని । పాకశాసనుండు పల్కె నధిప! (అను. 1-304)

క. 'సురతంబునఁ గడు నెక్కుడు । పురుషులకంటెను సుఖంబు పొలఁతులకు, సురే
శ్వర! యట్లగుటను నాకీ । వెరవున రమియించి నిలువ వేడుక గలిగెన్.' (అను. 1-307)

ఆ. అనిన, నట్టులేని నౌఁ గాక, యిమ్మెయి । విపుల సౌఖ్య మొంది, విహరణంబు
సలిపి నిలువు' మనుచు, శక్రుండు సనియె భం । గాస్వనుండుఁ బ్రీతి నట్ల యుండె'. (అను. 1-308)

– రమి తాభ్యధికం స్త్రీత్వే వై దైవసత్తమ
స్త్రీ భావేన హి తుష్యామి గమ్యతాం త్రిదశాధిప (సం.అను. 12-53)

# 23. మరొక్కసారి సాంఖ్యమార్గం

భీష్ముడు చెబుతున్నాడు- శాశ్వత సుఖం పేరే మోక్షం, అదే నిర్వాణం.
పురుషుడు ఇరవై అయిదవ తత్త్వం - పరతత్త్వం ఇరవై ఆరవది.
పరతత్త్వాన్ని ప్రకృతిగా, శివుడిగా భావించినారు కొందరు తత్త్వవేత్తలు.
'ఎవరు గొప్ప' అని వాదించేందుకు తమ దైవమే పరతత్త్వమంటారు ఎవరికి వారు.

బ్రహ్మకుమారులు సనక సనంద సనత్కుమార సనత్సుజాత వశిష్ఠ
శంకరులు; ఆ తరువాత మరీచి, భృగుడు, అంగిరసుడు, అత్రి,
పులహుడు, పులస్త్యుడు క్రతువు మానస పుత్రులై జన్మించారు.
అంగుష్ఠ ప్రమాణముండి, అగ్నిలా జ్వలిస్తున్న సనత్సుజాతుడు

మేరు శిఖరాన చరిస్తున్నపుడు అతడిని కలిసాడు నారదముని-
యోగనిద్రలో విష్ణువు పదివేల కల్పాలు మేలుకొని పదివేల కల్పాలు ఉంటాడు.
నిద్రలేచేసరికి ఆయన తేజస్సు గొప్ప బంగరు గుడ్డులా కానవస్తుంది.
బ్రహ్మను దానికి పతిగా నియమించ అతడు అహంకారియై

'నేను' అనే భావాన్ని పొంది మనసు, బుద్ధి, పంచభూతాలు, గుణాలు
దశేంద్రియాలు, మహత్తు అహంకారంతో కలిపి ఇరువది నాలుగు తత్త్వాలై
దేవ దానవాది జాతులు సృష్టింపబడతాయి. అవ్యక్తమైన
మూల ప్రకృతిలోకి పురుషుడు ప్రవేశించగా సంభవిస్తుంది సృష్టి.

---

**క. దశకల్ప సహస్రంబులు । నిశ, యింతియ దివస, మిది సునిద్రారతికిన్.**
**విశదప్రబోధమునకున్ । వశగతకాలములు విష్ణునకు విమలమతీ! (అను. 1-319)**

**క. అవ్యక్తం బనఁగాఁ దన । దివ్యాత్మన కలిగియుండు ధీసారనిధీ!**
**భవ్యాత్ము లభేదస్థితి । సవ్యాహతదృష్టిఁ గాంతు రయ్యమళమ్మున్. (అను. 1-320)**

**క. రే నిద్రించు, ప్రభాతం । బైనన్ మేల్కని సృజించు నంబువులఁ దగం**
**దా నం దిడుఁ దనవీర్యము । దాన మహాండ మగు హేమతాస్ఫురితంబై. (అను. 1-322)**

**తే. బ్రహ్మఁ గల్పించి, దానికిఁ బతిగఁ జేయు, । నమ్మహాత్ముఁ డహంకార మావహించి,**
**మనసుఁ బదియింద్రియములు, బుద్ధిని ఘటించి । చదలు మొదలగు భూత పంచకముఁ జేయు. (అను. 1-324)**

**క. విభుఁ డావిష్టం దేతత్ । ప్రభవస్థితి విలయముల, శుభము నశుభంబుం**
**బ్రభువై తగఁ గాంచి, నడపి । విభవోజ్జ్వలకేలి సల్పు, వినుము, మహాత్మా! (అను. 1-326)**

**తే. అంబరాదిభూతములు శబ్దాది గుణము । లింద్రియంబు, లహంకార, మిద్ధతేజ!**
**మనము, బుద్ధి, యవ్యక్తంబు, మహితవేద । వేద్యతత్త్వంబు లీ చతుర్వింశతియును. (అను. 1-327)**

# 24. విష్ణుని మహిమను వర్ణించిన సుపర్ణుడు

అమరేంద్రుని జయించి అమృతం తెస్తున్నపుడు అశరీరవాణి వినిపించింది
సుపర్ణునికి– 'పక్షిరాజా! నీవు నాకు వాహనమ్మువు కమ్ము' –అని.
సుపర్ణుడన్నాడు, ఆ తేజస్సు కనులకు మిరుమిట్లు గొలుపుతుండగా,
'నేను నీకు వాహనాన్నవుతాను, నీ రథానికి కేతనాన్నవుతాను'–

గరుత్మంతుడన్నాడు– నేను ఈ విషయాన్ని నా తండ్రి కశ్యపుడికి చెప్పగా
అతడు నన్ను బదరికాశ్రమానికి వెళ్లమనగా, నాకు ఆ ఆశ్రమంలో కనిపించాడు
పీతాంబరుడు అష్టభుజుడు, శంఖ చక్ర గదాఖడ్గ శారంగధరుడు
అతడితో నేను ఈశాన్య దిక్కున ఉన్న అగ్నిలో ప్రవేశించాను.

అగ్నిని దాటి అంధకారంలో ప్రవేశించి, అతడి గొంతు వింటూ వెళ్లగా
కొంతదూరాన తేజోమయుడై కనిపించీ కనిపించక అదృశ్యుడైనాడు.
వెలిగాయప్పుడు వందలాది అగ్నిహోత్రాలు, వినిపించాయి వేదమంత్రాలు.
వేల క్రూరమైన గరుత్మంతులు నాపై దూకినట్లై నేను భయంతో వణికాను.

అచ్యుత, శివ, సహస్రాక్ష, వేదమయ, అనాది నిధన, త్రినయన
త్రిభువనైక నాథ, గోవింద, పద్మనాభ, హర, కృపావిధేయ–
అని ప్రార్థించగా మరల నన్ను నేను కనుగొన్నాను బదరికాశ్రమంలో.
అక్కడ మరల కనిపించాడు అష్టభుజుడైన ప్రసన్న విష్ణుమూర్తి.

---

సీ. అమరేంద్రు నిర్జించి యమృతంబు గొనిపోవు । నప్పుడు వీతెంచె నాకసమున
'మెచ్చితి విహగేంద్ర! యిచ్చెద వరము నీ' । కనుమాట యది విని, హర్షమెసఁగ
'నెవ్వరోఁ యెఱుఁగ ని న్నెఱిఁగించి మఱి వర । మి' మ్మంటి, దానికి నెలమి నగుచుఁ
'గాలంబుతోఁ గూడఁగా నెఱింగెదవు, వా । హనమవు గమ్ము నా' కనుచుఁ బురుషుఁ

తే. డొక్కఁ, డుజ్జ్వల తేజోమయుండు తోఁచి । 'జరయు మరణంబు లేక యసురుల సురల
నోర్వఁ జాలిన బలముతో నుల్లసిల్లు' । మనివరం బిచ్చె; నిచ్చిన నధికభక్తి. (అను. 1–351)

సీ. అచట నారాయణు, నచ్యుతహరిఁ బుండ । రీకాక్షుఁ, గోవిందు, లోకజనకుఁ
గని, భక్తిఁ బ్రణమిల్లి వినుతిసేయంగఁ, బీ । తాంబర కలితమై యష్టభుజము
శంఖ చక్రగదా సిశార్ఙ్గ ధరంబును । నైనరూపము దాల్చి యవ్విభుండు
సిఱునవ్వుతోడ 'వచ్చితి మేలు సేసితి । ర' మ్మంచుఁ దా నుత్తరంపుఁ దూర్పు

తే. దెసకు నల్లన పోవఁ బెంపెసఁగఁ గడఁగి । పాఱ వలయు; నా కెమ్మెయి బహుసహస్ర
యోజనంబులునని వితతోజ్జ్వలాగ్ని । యద్భుతముగ ననింధన మై వెలుంగ. (అను. 1–355)

# 25. విష్ణువు గరుడునికి ఉపదేశించిన ఆత్మతత్త్వం

సుపర్ణుడనే గరుత్మంతుడికి విష్ణువు ఉపదేశించాడు ఆత్మతత్త్వాన్ని
-నా స్వరూపం దేవ గంధర్వ రాక్షసాదులకెవ్వరికీ తెలియనిది.
సమస్త ప్రాణికోట్లు నాయందే పుట్టి వృద్ధిచెంది నాలోనే లయిస్తాయి;
సత్యము, అహింస, శాంతి, భక్తి, సంతృప్తి కలవారికి నేనందుతాను.

అంతర్‌దృష్టి లేనివారికి నేను కనిపించను. వ్రతాలు, ఉపవాసాలు
ఆచారాలు సంజ్ఞారూపాలే కాని అవి నా తత్త్వాన్ని తెలియజేయలేవు.
సర్వజీవులలోనూ ఆత్మ (వాసుదేవుడు), బుద్ధి (సంకర్షణుడు),
అహంకారం (ప్రద్యుమ్నుడు), మనస్సు (అనిరుద్ధుడు) కాగా

నాలుగు రూపాలుగా వ్యాపించి ఉంటాను, ఇదీ నా స్థూల రూపం
అని విష్ణుమూర్తి తనకు వాహనమైన గరుత్మంతుడికి చేసాడు తత్త్వోపదేశం.
అది విన్న మునులందరూ సుపర్ణుని ఆశీర్వదించి దీవించినారు.
ఈ విషయాన్ని ధర్మరాజుకు భీష్మాచార్యుడు ప్రేమతో వివరించాడు.

వివిధ సంకల్ప యజ్ఞముల్ విడిచి, ఆత్మయందు నిష్ఠమై
అగ్ని సన్నిధిలో జితేంద్రియుడై, వివిధ తత్త్వ విరక్తుడై
విష్ణువు నందు మనస్సును లయం చేసినవాడు పొందును మోక్షం!-
ఈ అద్భుత కథనాన్ని విని ధర్మరాజు లగ్నం చేసినాడు మనసును దేవునిలో-

---

ఉ. అ పురమేశ్వరుండు లలితాష్టభుజం బగు రూపుఁ దాల్చి, తా
నెప్పటియట్ల నిల్చెఁ; గని యేను మనంబున నద్భుతంబుతో
ముప్పిరి యైన కౌతుకము మోదము నెక్కొన, నాకు సత్కృపం
జెప్పెడుఁ, గాక యెట్లు నని చేరితి నంజలి మౌళిఁ జేర్చుచున్. (అను. 1-376)

సీ. 'అనిమిష గంధర్వదనుజు లాదిగ నెవ్వ । రును విను, నాయున్న రూ పెఱుంగ;
రఖిలభూతములు నాయం దుద్భవించు, వ । ర్తించు, లయించు, వర్తింప నేను
వాని వశంబున వసియింతు సర్వంబు । నందును, నాతత్త్వ మధిగమింప
నగు నగ్ని యాత్మ సమాహితంబుగఁ జేయఁ । గామవర్జిత మహంకారవిముఖ

తే. మజడ, మపరిగ్రహం బహింసానుమోది । క్రోధరహితంబు నిర్మలబోధయుతము
నిత్యతృప్తంబు, శాంతంబు, సత్యభక్తి । యైన చిత్తంబు గల నియతాత్మకులకు. (అను. 1-378)

- స్తవ్యం స్తవం స్తుత వతః తత్ తమో మే ప్రణశ్యత
శృణోమి చ గిరం దివ్యామ్ అంతర్ధాన గతాం శివామ్ (సం.అను. 13)

# ✧ 13. అనుశాసనిక పర్వము - ద్వితీయాశ్వాసము ✧

## 26. అష్టావక్రుడి మనో నిగ్రహం

ధర్మరాజు అడిగాడు భీష్ముడిని- వరుడెట్లాంటివాడైతే కన్యాదానం చేయవచ్చు?'
భీష్ముడు చెబుతున్నాడు అషావక్రుడి పెండ్లి విశేషాల గురించి-
వదాన్యుడి కుమార్తె సుప్రభను పెండ్లి చేసుకుందామనుకున్నాడు అష్టావక్రుడు.
ఉత్తరదిక్కుగా పార్వతీదేవి తపస్సు చేసిన కదంబవనం దర్శించిరా! అన్నాడు వదాన్యుడు.

అష్టావక్రుడు ఉత్తర దిక్కుగా వెళ్లి బహుదా నదీతీరంలోని కుబేరుడి
నగరానికి వెళ్లి అతడికి అతిథిగా ఏడాది ఉన్నాడు అప్సరసల అందానికి చలించకుండా.
అక్కడ నుంచి హిమాలయ ప్రాంతంలోని కదంబ వనానికి వెళ్లగా అతడిని
ఆహ్వానించారు కన్యకలనేకురు, అతడిని తీసుకువెళ్లారో ప్రౌఢకాంత వద్దకు.

ఆమె ఆర్యమూర్తి, ధవళవసనాంగ రాగ, రుచిరాభరణ భూషితయై
అతడికి అర్ఘ్యపాద్యాలనిచ్చి ఉచితాసీనుడిని చేసి ప్రియంగా సంభాషిస్తూ
ఆరాత్రి చలిగా ఉన్నదని పలుకుతూ శయనించింది అతడి పక్కనే.
కాసేపటికి అతడిని కౌగలించుకున్నది గట్టిగా, కాని చలించలేదతడు.

-ఇదేమి విపరీతం? అన్నదామె- పురుషులకు తొందర, స్త్రీలకు ఓర్పు
సహజ గుణాలు కదా, నన్నెందుకు నిరాకరిస్తున్నావు, ఏమిటి కారణం?
అష్టావక్రుడన్నాడు- నేను బ్రహ్మచారిని, పైగా పరసతి పొందు కోరను.
ఆమె అన్నది- నాకు కోరిక ఉన్నది, అది అధికమైతే నేను దేనినీ లెక్కచెయ్యను.

---

సీ. హిమశైలతట మెక్కి, యీశ్వర క్రీడన । స్థలిఁ గాంచి మ్రొక్కి ప్రదక్షిణముగఁ
జని, యట యరుగంగ మునివరు చెప్పిన । కడిమిలేమ్రాఁకుల యడవి దోఁచె;
దానిఁ బ్రవేశింపఁగా, నందు మణిహేమ । మయ చిత్రరమ్య హర్మ్యము లనేక
ములు గానవచ్చె; నుజ్జ్వల సమున్నతరమ్య । హర్మ్యంబు వానిలో నధిక విభవ

ఆ. సారమై యున్నఁ జూచితద్వారభూమిఁ । జేరి, లోనికిఁ దనపేరు సెప్పి పుచ్చఁ
గన్యకలు పఱతెంచిరి, కాంతిరూప । విలాసనము లొప్పఁ గొందఱు, వినయ మెసఁగ. (అను. 2-9)

సీ. అనిన నష్టావక్రుఁ 'డతిదూష్యమగు పర । దారాభిగమనంబు దగదు; శూద్ర
సతి యైన నధిక దోషంబు, బ్రాహ్మణపత్ని । యగునేనిఁ బాతక మప్రమేయ;
మదియును గాక, నే నస్ఖలిత బ్రహ్మ । చర్యంబునం దుండి భార్యఁ గోరి
యున్నాఁడ 'ననుడు; 'నీ యొప్పునం దగిలితి । వనితలు గామార్తి వశతఁ బొంది

తే. వంశహాని దలంపరు, వరుస కలుక; । రాత్మజులఁ జూడ; రగ్రజు ననుజుఁ గొనరు
పురుష శతకంబు సంగమంబునను దృప్తి । సనరు; దీని విచారింపు మనియె' నువిద. (అను. 2-17)

# 27. అష్టావక్రుడు - సుప్రభ వివాహం

అష్టావక్రుడన్నాడు– ఇదేమన్నా గొప్ప ఘనకార్యమా? నీకు కామమున్నది
నీకు అనుకూలుడైన వారితో నీ ఇష్టం వచ్చినట్లు చరింపుము, నేను పోతున్నాను.
ఆమె అన్నది నవ్వుతూ– కార్యమైనాక నీవు ఎంచక్కా పోవచ్చు, కాసేపుండు.
అష్టావక్రుడన్నాడు– నన్ను తాకకు, ధర్మంగా ప్రవర్తించు, నన్ను నిద్రపోనీ!

మనసులో అనుకున్నాడు– ఏదో శాపవశాత్తూ ముదిరిపోయిన దేవకన్య ఈమె.
అతడు చలించలేదు, మరుసటి రోజు ఆమె స్వయంగా స్నానం చేయించింది.
అన్నపానాదులనిచ్చి, మంచి మాటలతో కాలం గడిపి రాత్రి కాగానే రమ్మన్నది.
అష్టావక్రుడు చలించలేదు సరికదా అన్నాడు నీవు ఎవరో నాకు తెలియదు.

కాని నన్ను పరీక్ష చేస్తున్నావు. చెప్పు తల్లీ! అనగా ఆమె బదులిచ్చింది–
నేను ఉత్తర దిక్కాంతను, వదాన్యుడు నన్ను పంపించాడు, నీవు మంచివాడివి.
వెళ్లి సుప్రభను వివాహం చేసుకో, నీకు శుభం కలుగుతుంది –అన్నదామె.
అష్టావక్రుడు ఆమెకు నమస్కరించి ఇంటికి వెళ్లి, వివాహమాడినాడు సుప్రభను.

భీష్ముడు చెబుతున్నాడు అనులోమ ప్రతిలోమ వివాహాల గురించి–
అనులోమమనగా ఆరోహణ; ప్రతిలోమమనగా అవరోహణ క్రమం.
బ్రాహ్మణుడు నాలుగు కులాల వారిని, క్షత్రియుడు మూడు కులాల వారిని
వైశ్యుడు రెండు కులాల వారిని, శూద్రుడు తన కులంవారిని వివాహమాడవచ్చు.

---

**సీ.** **అనవుడుఁ బ్రీతయై 'యనఘ! ని న్నారయు । తలఁపునఁ జూవె వదాన్యుఁ డిందుఁ**
**బుత్తెంచె; నేను నీ యుత్తరదిశఁ జుమ్ము; । నీ నిష్ఠ గాంచితి; దీన నతఁడు**
**నిను మెచ్చు; నాదెస మనమునఁ బ్రియమొందు; । మరుగుము సుప్రభా పరిణయమున'**
**కనిన నద్దేవికి వినతుఁడై, వీడ్కొని । యరిగి, యమ్మునిపతి, యాత్మఁ గనియుఁ**

**తే.** **దన్ను నడుగంగ సకలవృత్తంబుఁ జెప్పి । యతని పుత్త్రికఁ బెండ్లియై యతుల ధర్మ**
**భోగ గౌరవకీర్తులఁ బొంది జగతి । నతిశయిల్లె నష్టావక్రుఁ డధిపముఖ్య!'** (అను. 2–25)

**సీ.** **నాలుగు జాతుల నాతులు, విప్రున । కాంద్రుగాఁ గైకొన నగు; నృపునకుఁ**
**దనకులంబున నట తక్కువ కులములు । రెంటను బరిణయశ్రీ వహింపఁ**
**జను; వైశ్యునకు నాత్మజాతి, శూద్రన్వ యం । బునఁ బెండ్లి గాఁ దగు భూపవర్య!**
**శూద్రున కర్హంబు శూద్రకన్యకఁ బెండ్లి । యగుటయు; నిది వివాహ ప్రకార**

**ఆ.** **కథిత ధర్మ; మిట్టిగతిఁ దప్పి ప్రతిలోమ । సరణి యైనఁ, గల్గు సంకరంబు;**
**తల్లి యెట్టి కులము దాని కులంబ యౌ । సన్నుతానులోమ సంభవునకు.** (అను. 2–27)

# 28. వివాహాలు, దానధర్మాలు-

అనులోమ వివాహంలో తల్లి కులమే సంతానానికి చెందుతుందని తెలియుము.
మునులైన బ్రాహ్మణులు, ఉత్తమ క్షత్రియులు తమ కులాన్ని సంతానానికివ్వగలరు.
వశిష్ఠ, ఋశ్యశృంగ, అగస్త్య, వ్యాస, ద్రోణ, కృప, మందపాలుడి సంతానం జన్మ కథలు
పశుపక్ష్యాదులకు బ్రాహ్మణులు, క్షత్రియులు పుట్టిన కథలను తెలుసుకొనుము.

ఏరుల జన్మంబు, వీరుల జన్మంబు, మునుల, సిద్ధుల పుట్టుకలవి ప్రత్యేకాలు.
అదేవిధంగా తన కులానికి తగిన ఆచార వ్యవహారాలతో బ్రతుకుతూ
బాహ్య వేషధారణాదులున్నా విరక్తి చిత్తంతో గొప్పవాడైతే దానార్హుడౌతాడు.
అహంకారంతో తన విద్యతో పోల్చి ఇతరులను కించపరచేవాడు దుర్మార్గుడు.

వేయి అశ్వమేధాలు ఒకప్రక్క, సత్యవ్రతం మరొక ప్రక్క పెట్టి తూస్తే
సత్య నిష్ఠలోని సగం బరువుకూడా తూగవా సమస్త అశ్వమేధాలు.
అర్థాన్ని తెల్లవారుజామున, ధర్మాన్ని పగలు, రాత్రివేళ కామాన్ని ఆచరించాలి.
ధర్మమందు ఆసక్తితో అర్థకామాలను అనుభవించడం ధర్మవిహితం.

ధర్మం చేసేవారు, అక్రోధనులు, సత్యరతులు, దాంతులు, ధీరులు
నిజకర్మ నిరతులు, ఇంద్రియ నిగ్రహం కలవారు, భూతదయ కలవారు
లోభం లేనివారు, శుచులు దానయోగ్యులు. ఉత్తమ బ్రాహ్మణులకు చేసే
దానం ఫలిస్తుంది వేయిరెట్లు; ఉత్తమ శీలురకు చేసే దానం విస్తరిస్తుంది వంశాన్ని.

---

**క.** **మునిజనుల, నదుల, సిద్ధుల । జననంబులు బుద్ధి వృత్తిఁ జర్చింపఁగ నె**
**వ్వనికిన్ వశంబు గా; వవి । తనతన యైనట్ల యై యుదాత్తతఁ బొందున్.' (అను. 2-29)**

**సీ.** **అనుటయు, ధర్మనందనుఁడు 'దానంబుల । కెవ్వరు పాత్రంబు లేర్పరింపు'**
**మనిన 'సద్ధర్ములు, నక్రోధనులు, సత్య । రతులు, దాంతులును, ధీరత్వ యుతులు,**
**నిజకర్మ నిరతులు, విజితేంద్రియులు సర్వ । భూతహితులు, నలుబ్ధులును, శుచులు**
**దానపాత్రములు, వేదంబు సాంగంబుగాఁ । జదివి షట్కర్మ నిష్ఠలఁ దొడంగి**

**తే.** **తత్త్వవిదులైన బ్రాహ్మణోత్తముల కీగి । విను సహస్రగుణంబగు, విశ్రుత శ్రు**
**తంబుఁ బ్రజ్ఞయు, శీలవృత్తములుఁ గలుగు । వారి కిచ్చుట వంశవిస్తారకంబు'. (అను. 2-50)**

**-** **పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే**
**పుత్రాశ్చ స్థావిరే కాలే నాస్తి స్త్రీణాం స్వతంత్రతా (సం. అను. 20-21)**

**-** **యస్తు పుష్పవతీం కన్యాం న బాంధవో న ప్రయచ్ఛతి**
**మాసి మాసి గతే బంధుః తస్యా బ్రౌణ ఘ్ను మాప్నుతే (సం.అను. 20-22)**

# 29. దేవ పితృ మనుష్య పూజల కాలంబులు-

శిష్టబ్రాహ్మణుడికి దానం చేస్తే సంతోషిస్తారు దేవ పితృ మునిజనులు.
ఉదయాన దేవతలను, మధ్యాహ్నం మనుషులను, సాయంకాలం పితృదేవతలను
ఆరాధించు సమయాలని నిర్దేశించాడు విధి -అని పలికి భీష్ముడు
ధర్మరాజా! కాలనియమం లేనిది, శుచి లేనివాడు ముట్టుకున్నది,

ఎంగిలి చేసినది, మంత్రపూతం చెయ్యనిది, పురుగులు వెంట్రుకలు ఉన్నది,
పూజాతంత్రం లేనిది రాక్షసతిండి. మనుషులు, పితృదేవతలకు ఉంచినవి
దుష్టబుద్ధులు గ్రహించనీయరాదు; మత్తుని, జడుని, ఉన్మత్తుని
పతితుని, నపుంసకుడిని, కుష్ఠురోగిని, పూజారిని, వైద్యుడిని

నియమం లేనివాడిని, మూర్ఛరోగిని, బొల్లి వ్యాధి కలవాడిని, క్షయ రోగిని
నర్తకుడిని, గాయకుడిని, సోమరస విక్రేత, వేద విక్రయునికి దానమివ్వరాదు.
అగ్నిహోత్రం, సంధ్యోపాసన చేయనివాడు, వడ్డీ వ్యాపారస్తుడు, ప్రాణులను అమ్మువాడు
దైవ పితృ కార్యములలో దానమునకు తగరని -పలికాడు భీష్ముడు.

భోజనార్థులకు సంతృప్తిగా భోజనం పెట్టేవాడు, దొంగలు దోచుకున్నవాడు,
వ్రతం ముగింపులో యాచించేవాడు, గురువు తల్లిదండ్రులు భార్య పోషణకై
కష్టాలు పడుతున్నవాడు, దీర్ఘవ్యాధిని పోగొట్టుకోవాలనుకునేవాడు,
భిక్షాటనతో జీవించే పాపరహితుడు - ఉత్తమ దానయోగులీ ఆరుగురు.

---

**సీ. 'నరనాథ! కాలహీనంబును, నశుచిసం । స్పృష్టంబుఁ, బరిభుక్తశేషమును, న**
**మంత్రకంబును, వీతతంత్రంబుఁ, గీటకే । శ ప్రదుష్టంబు, రాక్షసులు గొంద్రు;**
**మానవీయ ద్రవ్యమేనియు సురపితృ । క్రియల దురాత్మకు లయినవారు**
**గుడిచిన నట్ల యక్కుడుపులఁ జొనుపక । మత్తుని, జడుని, మన్మత్తుఁ బతితుఁ**

**తే. గ్లీబుఁ గుష్ఠి, దేవలకుఁ, జికిత్సకునిని; వీతనియము, నపస్మారి, శ్విత్రి రాజ**
**యక్ష్మయుతుని, నర్తకుని, గాయకుని, సోమ । విక్రయుని, వేదవిక్రయ విడువ వలయు. (అను. 2-56)**

**సీ. 'భోజనార్థులఁ దుష్టిఁ బొందించునతఁడును, । దెరువాటువలనఁ దస్కరులచేతఁ**
**జే టొంది ధనము వాంఛించు నతండు, వ్ర । తంబున కుద్యాపనంబు సేయఁ**
**దలఁచి యర్థించునతండును, గురుఁ దల్లి । దండ్రుల సంక్లిష్ట దారపుత్రు**
**లను బ్రోవఁ బడునతండును, మహావ్యాధి ని । రాసంబు సేయంగ నాస చేయు**

**తే. నతఁడు, నిష్పాపుఁడైన ధరామరుండు, । నెపుడు భిక్షయ బ్రదుకగునేని నట్టి**
**యతఁడు, దైవపిత్యములకు నతిశయంబు । గల్గు పాత్రంబు లగుదురు కౌరవేంద్ర!' (అను. 2-59)**

# 30. నరక ద్వారాలు - స్వర్గ సోపానాలు

సత్రములు, సభాశాలలు, చలిపందిళ్లు, రచ్చకొట్టాలు కూల్చుడు; వేదనింద,
గురుదూషణ, వేద విక్రయం, వేద లిఖనం, కొండెం చెప్పడం, సంధి ఉల్లంఘన
ఇతర వర్ణముల పని తాను చేయడం, కృతజ్ఞత లేకపోవడం, వ్యభిచారం
మంత్రశాస్త్ర ధ్వంసం, భయపెట్టడం, ఇతరులకు పెట్టకుండా తినడం –నరక ద్వారాలు.

విష, ఆయుధ, శిరోజ విక్రయం, ఆయుధ తయారి, కన్యలు, విప్రులు, గోవులను
దాటి పోవడం, గురువును, సేవకుడిని విడిచిపెట్టడం, దారిలో ముళ్లకంపలు వెయ్యడం
–నరకమార్గాలు; పన్నులనవసరంగా వేసి, ప్రజల కష్టాలు పట్టించుకోని ప్రభువు
మాట తప్పినవాడు, ఆవు ముక్కు, ఎద్దు వృషణాలు కుట్టేవాడు అధోగతి పాలౌతాడు.

ధర్మభీతి కలవాడు, ఉత్తమ తపస్సు గురు శుశ్రూష చేసి దానం ముట్టనివాడు,
దైవప్రీతి కొరకు పశుహింస చేసినవాడు, దారిద్ర్యాన్న రోగాలను పాపాలను తొలగించుకున్నవాడు,
మద్యమాంస పరవనితా సంగమిచ్ఛగించనివాడు, తన వారికి దానధర్మాలు చేసినవాడు
దీనులకు ఆశ్రయమిచ్చినవాడు, హింస మానినవాడికి లభిస్తాయి సముచిత స్వర్గభోగాలు.

రచ్చకొట్టము, తోట, చలిపందిరి కల్పించడం, భయపీడితులను రక్షించడం
కన్యలు గోవులు దాసుల దాసిలనివ్వడం, పరులను రక్షించడం, అపకారిని క్షమించడం,
పెక్కుమందికి హితం చేసే కార్యక్రమాలకు ధనం వెచ్చించడం, దుర్మార్గ
ప్రవర్తన లేకపోవడం – స్వర్గలోక ప్రాప్తికి సోపానాల వంటివి –అన్నాడు భీష్ముడు.

---

**సీ.** **ధర్మంబు భయమున, దారిద్ర్య సంబాధ । మున రోగమునుఁ బాపములుఁ దొలఁగఁ**
**జేఁతకునైనఁ జేసిన దేవకార్యార్థ । పశుహింసనంబును, బరమ తపము**
**శుశ్రూషయును గల్గి శ్రుతము సంపాదించి । యప్రతిగ్రాహకుఁ డైన, మద్య**
**మాంస పరస్త్రీ సమాగమ వైముఖ్య । మున నాశ్రమస్థులఁ దనకులంబు**

**తే.** **వారి భరియించినను, హేమవస్త్ర మంది । రాన్నపానంబు లొసఁగిన, నాశ్రయంబు**
**దీనులకు నిచ్చినను, హింస మానినను, స । మంచిత స్వర్గలక్ష్మి సిద్ధించు నంద్రు. (అను. 2-63)**

**సీ.** **రచ్చకొట్టంబు, నారామంబుఁ గూపంబుఁ । బ్రపయుఁ గావించుట, భయభరార్త**
**కోటిఁ గాచుట, కన్య, గోవు, వాహనము, దా । సుని దాసి నిచ్చుట, దనకుఁ గీడు**
**సేసిన సైఁచుట, చెలులఁ జుట్టంబులఁ । బ్రోచుట, పెక్కండ్ర పొంటెఁ గార్య**
**మునఁ బరాక్రమమున ధనమునఁ దా నల । జడిపాటు, దుష్కర్మ సరణిఁ బొరయ**

**ఆ.** **కునికి, నాకలోకమునకు నిచ్చెన లగు । నెక్కులమునఁ బుట్టిరేని బహు సు**
**తుండు, నతికృపాన్వితుఁడు, వేయు నెలలపై । బ్రతికినతఁడుఁ గంద్రు త్రిదశపదము'. (అను. 2-64)**

# 31. పాపకర్మలు-తీర్థ స్నానములు

ఇంటికి ఆహ్వానించి అన్నం పెట్టకపోవడం, జీవనాధారమైన వృత్తి చెడగొట్టడం
నీరు త్రాగడానికి వచ్చిన ఆలమందలను చెదరగొట్టడం, వికలాంగుల ధనం
దొంగిలించడం, వేద శాస్త్రాది నింద, కోపంతో నగరానికి, తోటకు నిప్పు పెట్టడం
అబద్ధమాడి దుఃఖం కలిగించడం, యోగ్యుడికి పిల్లనివ్వకపోవడం బ్రహ్మహత్యా సమానాలు.

ధర్మరాజా! పాప పరిహార్థం దర్శించవలసిన పుణ్యతీర్థములివి, గ్రహించుము
చంద్రభాగ, వితస్త, ఊర్మిమాలిని, కాశ్మీర ప్రాంత నదులు, పుష్కర, ప్రభాస
నైమిశ, ఇంద్రభాగ, దేవిక, స్వర్గబిందు, హిరణ్యబిందు, కుశేశయములు
ఇంద్రతోయ, కురంగతోయ నదులు; కనఖలము, గంగాద్వారము, నీలపర్వతం

కుశావర్తము, బిల్వకము, కైలాస శిఖరం వద్ద గంగానది, భృగతుంగ సరస్సు
కన్యాకూపం, సుందరీకం, వైమానికం, కాళికాశ్రమం, విపాశనది, కృత్తికాశ్రమం
ద్రోణశర్మములోని తీర్థ శరస్తంబ దేవదారువనం; చిత్రకూటం, జనస్థానం
శ్యామాశ్రమము, కౌశికవాలము, మతంగవాపిక, నైమిశారణ్యం, ఉత్పలావనం

కాలాంజనం, వైవస్వతం, ప్రయాగ, బ్రహ్మశిరము, అష్టావక్రము, కలవింకము
దేహహ్రదము, లౌహిత్యము, రామహ్రదం, మహాహ్రదం, వింధ్యం, నర్మదానది
జంబూనది, కోకాముఖం; తండులికాశ్రమం, కుల్యానది, అరష్టిసేనాశ్రమం,
ఉజ్జానకం, పిండారకం, ధర్మారణ్య బ్రహ్మసరస్సు, హిమాలయం -గొప్ప తీర్థములు.

---

సీ. 'దివ్యబోధాఢ్య, వేదవ్యాసమునినాథు । నడిగితి నొక్కనా! డధిక భక్తి
నిట్లని; యా సంయమీంద్రుండు గృప నాకు । నెఱిఁగించె, ననఘ! నా యెఱిఁగినట్టి
విధము లెఱింగింతు వినుము; విప్రునిఁ గృశు । నామంత్రితునిఁ జేసి యతఁడు, గుడువ
వచ్చినఁ బెట్టమి, వరకులంబును, సార । విద్యయుఁ, గల, విప్రవృత్తి గొనుట

తే. నీరు ద్రావంగ గోవు లేతేర, విఘ్న । మాచరించుట, బధిర పంగ్వంధ ధనము
లపహరించుట, వేదశాస్త్రాదినింద, । బ్రహ్మహత్య లెట్టట్టుల పౌరవేంద్ర! (అను. 2-68)

తే. అలుకఁ బురి నూర వనమున నగ్ని యిడుట । పాపశీలతమై బొంకి బ్రాహ్మణునకు
నధికతర మగు శోకంబు నావహించు । టంచితాచార! బ్రహ్మహత్యా సమములు. (అను. 2-69)

తే. రూప గుణ శీలముల ననురూపుఁ డైన । వరుని కీక కన్నియఁ దన వలసినట్లు
తగని వానికి నిచ్చుట ధర్మదేవ । తాతనూభవ! బ్రహ్మహత్యాసమంబు. (అను. 2-70)

క. దొరకొనని వానిఁ గోరక దొరకొనినందున మమత్వతుష్ట హృదయ తం
బొరయక విగత స్పృహులగు పురుషులు శుచు; లేల తీర్థములు వారలకున్ (అను. 2-92)

# 32. గంగానదీ మహాత్మ్యము

ఆయా తీర్థాలకు ఆయా పుణ్యాలుంటాయి, తీర్థదర్శనం ముక్తిదాయకం–
అయినా అరిషడ్వర్గాలు లేని మనసుతో తీర్థాలను సేవించాలి, అది శుభం
వాంఛలను జయించిన ప్రతివాడూ పవిత్రుడే, అతడికి తీర్థాలవసరం లేదు.
పోవడానికి వీల్లేనివి, దూర ప్రదేశాల్లో ఉండే తీర్థాలను భక్తితో స్మరిస్తే చాలును–

అని భీష్ముడు ధర్మరాజుకు సకల తీర్థ మహాత్మ్యములను చెప్పినాడు
శరతల్పం మీద శయనించి ఉన్న శాంతనవుడిని చూడడానికి, అత్రి,
వసిష్ఠ భృగువు పులహుడు పులస్త్యుడు క్రతువు అంగిరసుడు, అగస్త్యుడు
కణ్వుడు గౌతముడు విశ్వామిత్రుడు జమదగ్ని మొదలైన మునులు శిష్యులతో

వస్తుండగా భూమి ఆకాశాల మధ్య ప్రదేశం వారి తపోకాంతులతో విరాజిల్లింది.
భీష్ముడినాశీర్వదించి వారదృశ్యమైపోయినారు. గాంగేయుని అడిగాడు ధర్మరాజు–
గంగానదీ మహాత్మ్యమును తెలుపమని– భీష్ముడు చెబుతున్నాడు సంతోషంగా–
–సర్వ పాపాలను పోగొడ్తుంది గంగా స్నానం, ప్రాప్తిస్తుంది స్వర్గలోక జీవనం.

సోమం లేని యాగం, చంద్రుడు లేని రాత్రి, సూర్యుడు లేని పగలు; స్వధర్మం
లేని ఆశ్రమం, పూలు లేని చెట్లు శోభను కోల్పోయినట్లు, గంగ లేని దేశం
పొందుతుంది దైన్యం. అమృతం లాంటిది గంగ నీరు, మూడు మార్గాలలో
ప్రవహిస్తూ ముల్లోకాలకు గొప్ప అలంకారమైనదీ సురగంగ, అవనిగంగ, పాతాళగంగ.

---

**సీ. అనఘ! సోమము లేని యధ్వరంబును, శశి । లేని రాత్రియు, రవి లేని నభము**
**నాత్మధర్మము లేని యాశ్రమంబును, బుష్ప । సంపద లేని భూజమును బోలె,**
**హీనత నొందు, గంగానది లేని దే । శంబు, చాంద్రాయణ శతము లైన**
**గంగాపయః పానకరణంబు గావించు । నిర్మలత్వముఁ జేయ నేర; వగ్ని**

**ఆ. యందుఁ బడిన దూది యట్లగు గంగావ । గాహనమునఁ బాతకంబు లఖిల**
**భూతములకు దుఃఖములు వాపి కొనుటకు । నేవిధములు గంగ కీడు గావు. (అను. 2–106)**

**సీ. అనఘ! చూడ సమర్థుఁ డగువాఁడు జాహ్నవిఁ । జూడకయున్నఁ బశుప్రతిముఁడు**
**నంధ సమానుండు నగు; నింద్రుఁ డాదిగాఆ । సురలు గోరెదు గంగ నరులు గోర**
**వలదె? చేకుఱు నపవర్గ ముత్క్రమణ కా । లంబున గంగఁ దలంచి రేని;**
**రాజభయంబుఁ, జోరభయంబుఁ బాప భ । యంబును, భూతభయంబు, లోను**

**ఆ. గాఁగఁ గలుగు భయనికాయంబు, గంగా ప్ర । శంసనమునఁ బాయు; శంభుఁ డర్థి**
**నతులపుణ్య యైన యద్దేవి దివినుండి । రా ధరింపఁడే శిరస్తలమున. (అను. 2–113)**

# 33. పూజనీయులెవరు?

ఆకాశము నుండి శివుడి శిరస్సుపై కురికిన సురగంగ, శివుని జటాజుటము
నుండి నేలకు దూకి ధరణి గంగగా నడయాడి, పాతాళానికి ప్రవహించి
సగర పుత్రులకు మోక్షమిచ్చి పాతాళగంగయైన పవిత్ర నదీమతల్లి
దక్షిణపు అలకనంద, తూర్పున సీత, పడమర సుచక్షువు, ఉత్తరాన విష్ణుభద్ర

నాలుగు దిక్కుల ప్రవహించి మానవ పాప ప్రక్షాళన చేయు పుణ్యగంగ
నిజ ధర్మనిరతుడై తనను పూజించు సజ్జనునికిచ్చును శాశ్వత సుఖములు.
రత్నపాదుకలు కలది, మకర వాహనమైనది, తెల్లని వెన్నెల వంటి శరీరం కలది
పంచసింధు ప్రవాహమై ప్రపంచ సృష్టికి మూలమైనది పుణ్య గంగానది.

ధర్మరాజు అడుగగా భీష్ముడు చెబుతున్నాడు- వరుణుడు, వాయువు
సూర్యుడు, మేఘుడు, అగ్ని, ఈశానుడు, కుమారస్వామి, లక్ష్మి, విష్ణువు
బ్రహ్మ, బృహస్పతి, చంద్రుడు, జలములు, భూమిని నిత్యమూ సేవించువారిని
వేదవిదులు, తపోధనులు, దేవతలను పూజించేవారు, దానశీలురు

అతిథి పూజ చేసేవారు, తల్లిదండ్రులను పూజించేవారు, భిక్షాటన చేసేవారు
సత్యవ్రతులు, త్రివర్గ నిరతులు, అహంకార మమకార వ్యామోహాలు లేనివారు
సువర్తనులు -వీరందరూ పూజార్హులు -అని నారదుడు శ్రీకృష్ణునితో చెప్పాడని
ధర్మరాజుకు వివరించినాడు అంపశయ్యపై కాలం గడుపుతున్న భీష్మ పితామహుడు.

---

**తే.** దేవతలఁ జిత్రతపమునఁ దెలచి, గంగఁ । బ్రచుర పౌరుషుఁ దగు భగీరథుఁడు దనదు
పూర్వులైన సగర నృపపుత్రులకు ను । దాత్త గతికయి తెచ్చె నిద్ధరణి కనఘ! (అను. 2-117)

**ఆ.** విష్ణుపదము వలన, విధుని వలన, సూర్య । వలన, మేరురూపకలితుఁ డైన
విష్ణువలనఁ, ద్రిపుర విజయి మౌళివలన । నుండి హిమనగమున నొలసె గంగ. (అను. 2-118)

**క.** విను, తత్పర భావంబున । మనంబు నిశ్చలత వొంద మనుజుఁడు శరణం
బని యాశ్రయింప జాహ్నవి । సనాతన పదోపలబ్ధి సంపద నొసఁగున్. (అను. 2-119)

**తే.** మూఁడు పథములఁ జని, లోకములకు మూఁటి । కుజ్జ్వలాలంకృతియుఁ బెంపు నొసఁగినట్టి,
యమలతరమూర్తి యగు దేవి నాశ్రయించు । వాఁడు కృతకృత్యుఁ డిది నిక్కువము కృతాత్మ! (అను. 2-114)

**ఆ.** సగరనృపతి పుత్త్రచయము, మునీంద్ర శా । పమున భస్మమై యపారదురిత
కల్మషంబుఁ బొందఁగా గంగ నిజజల । సేక మొసఁగి యనిచె నాకమునకు. (అను. 2-116)

**ఆ.** విష్ణుపదము వలన, విధుని వలన, సూర్యువలన, మేరు రూప కలితుడైన
విష్ణు వలనఁ ద్రిపుర విజయమౌళి వలన నుండి హిమనగమున నొలసె గంగ. (అను. 2-118)

# 34. యోషిజ్జనంబులు దోషంబులకు నెల్లమూలంబు-

విప్రులంటే శ్రేష్ఠులు, బ్రాహ్మణ అంటే బ్రహ్మమునకు నిత్యానుసంధాని.
నిప్పును తాకవచ్చు, హిమగిరిని కదల్చవచ్చు, గంగను మూటకట్టవచ్చును కాని
అవమానించరాదు విప్రుని; దేవాసుర యుద్ధంలో దేవతలను గెలిపించారు,
వారు అనేక విద్యలను ఎంత దూరదేశమైనా, ఎన్ని కష్టాలపాలైనా నేర్చుకుంటారు

విద్యార్జనకై దూరదేశం పోని బ్రాహ్మణుడిని, యుద్ధ విద్య నేర్వని క్షత్రియుడిని
భూమి మింగివేస్తుంది, పాములను పుట్టలో, బొక్కలలో చంపినట్లు-
అప్పుడు ధర్మరాజడిగాడు- పాపాలకు మూలం స్త్రీ అంటారెందుకు?-
భీష్ముడన్నాడు- నారదుడొకసారి చూసాడు పంచచూడ అనే చక్కని స్త్రీని.

అయిదు కొప్పులు గల స్త్రీ అన్నది- నిప్పు కట్టెలతో, సముద్రం నదులతో,
మృత్యువు జీవులతో తృప్తిపడదో అదేవిధంగా స్త్రీలు పురుషులతో తృప్తిపడరు.
చాలామంది స్త్రీలకు కామదాహముంటుంది, వ్యభిచారేచ్ఛ ఉంటుంది.
వాళ్లు మాయ శంబరాది రాక్షసుల మాయలకన్నా మించిన మాయావులు.

స్త్రీలకు కామము ఎక్కువగా చేసి వారి ఆకర్షణతో పతనం చెందించాడు
మానవులను బ్రహ్మ, అదీ దేవతలు కోరగా; వారి ఆలోచనల నెరుగలేరెవ్వరూ.
దేవశర్మ అనే మునిభార్య జగదేకసుందరి, ఆమెపేరు రుచీదేవి
ఆమెపై శచీదేవి భర్త ఇంద్రుడికి కోరిక కలిగింది, ఎదురు చూస్తున్నాడు అతడు.

---

**సీ. 'యోషిజ్జనంబులు దోషంబులకు నెల్ల । మూలంబు; వారల నేల చెప్ప**
**నడిగితి గానఁ గన్నంత సెప్పెద విను, । పురుషులమేలిమి పొలఁతు లెఱుఁగ;**
**రదిగాక నిర్లజ్జలై కుత్సితుల భజి । యింతురు కదిసినయంతఁ జేసి,**
**వర్జనీయులు లేరు వారల కెవ్వరు । దండభీతిన పాడి దప్పకునికి,**

**తే. యగ్ని కాష్ఠముల మహాంబుధి యేఱుల । నంతకుండు భూతసంతతులను**
**వనజముఖులు పురుషులను దృప్తిఁ బొందుట । గలుగదుండ్రు కోవిదులు మునీంద్ర! (అను. 2-174)**

**క. 'రుచి నెపుడు వేచి తిరుగును । శచీవిభుఁడు, దాని నెఱిఁగి సంరక్షణ మే**
**నుచితంబుగ నొనరింతు, వి । కచకమలనిభాస్యఁ జేరఁ డతండున్. (అను. 2-185)**

**తే. నాకుఁ గ్రతువు సేయింపఁ జనంగ వలసి । యున్నయది; పరదారసముత్సుకుండు**
**శక్రుఁ; డటుగాన, రుచికి రక్షావిధాన । మాచరింపుము నీవు దృఢావధాన!' (అను. 2-186)**

**క. అనుటయు ననేక మాయలు పొనరుపగా నేర్చు రూపములు పెక్కులు గై**
**కొను పక్షి మృగాదిత్వము లొనరగ నవి నియతి నరసి యుండఁగ వలయున్ (అను. 2-188)**

# 35. ఇంద్రుడికి దక్కని రుచి-

ఇంద్రుడు వేచి చూస్తున్నాడు తగిన సమయం కోసం తన అభిరుచి తీర్చుకోవాలని.
దేవశర్మ శిష్యుడు విపులుడు; దేవశర్మ యజ్ఞం చేయడానికి వెళ్తూ
ఇంద్రుడి బారిన పడకుండా రుచి బాధ్యతనప్పగించాడు విపులుడికి
-ఇంద్రుడు మహా మాయావి, పక్షి మృగాది రూపాలలో చరిస్తాడు, జాగ్రత్తగా ఉండుము.

యోగశక్తితో విపులుడు తన ఆత్మను రుచి శరీరంలో ప్రవేశబెట్టాడు.
ఇంద్రుడు సుందరాకారుడై వచ్చి, కాస్త దూరంలో పడుకుని ఉన్న విపులుడు
నిద్రపోతున్నాడని తలచి రుచి దగ్గరకు వచ్చినాడు కామాతురుడై
నేను ఇంద్రుడిని, నీవంటే ఇష్టం నాకు, అంగీకరించు స్వర్గాన్నిస్తాను నీకు.

రుచి శరీరంలో ఉన్న విపులుడన్నాడు- కోడై కూసి సంపాదించుకున్న
యోని గుర్తులున్న శరీరం కలవాడా, అవి మానిపోయాక మొదలెట్టావా మళ్లీ!-
అనేసరికి ఇంద్రుడు గమనించాడు ఆమెలోని విపులుడి యోగ బలాన్ని.
వెంటనే ఇంద్రుడంతర్ధానమైనాడు; తరువాత వచ్చిన గురువుకు చెప్పాడంతా శిష్యుడు.

రుచి సోదరి వంగదేశపు రాజు చిత్రరథుని భార్య కావడంతో
దేవశర్మ, రుచి బయల్దేరినారు చంపా నగరానికి వారింట్లో జరిగే ఉత్సవానికి.
తనకు ఆశ్రమంలో దొరికిన దివ్య పూలహారాన్ని ధరించింది రుచీదేవి.
రుచి సోదరి తనకటువంటి పూలదండ కావాలంటే విపులుని పంపించాడు దేవశర్మ.

---

ఉ. అమ్మునిశిష్యుఁ డయ్యువిద యంగము వాసి, నిజాంగవర్తియై
యమ్మరుదీశుతో 'మఱచితా మును మూఁడిన యబ్భగాంకిత
త్వ మ్మొకభంగి నీఁగు టిది, దైవతసంయమి సేవనీయ భా
వమ్ము గలట్టి నీకుఁ దగవా? యిసిరోఁ' యని పల్కి వెండియున్. (అను. 2-200)

తే. 'అవిజితేంద్రియబల! కుత్సితాత్మ। నీచ!, యెట్లు పాపంబు దొడరుట కియ్యకొంటి?
నాదు గురుని కోపాగ్నిచే నీదుదేవ। గణ విభుత్వ మహోన్నతి గ్రాఁగి పోదె?' (అను. 2-201)

క. 'ఏ నొల్లఁ గాక! భస్మము। గా, నిన్నుం జూతునే వికారీ!' యనుడుం
దా నెదురు పలుక కంత। ర్ధానము వెసఁ జేసె నతఁడు ధరణీనాథా! (అను. 2-203)

తే. 'నాకపతి యిచ్చటికి వచ్చి, నాకతమునఁ। జిక్కువడి, మది భయమున సిగ్గు గదురఁ
జనియె' ననవుడు నాతఁడు సంతసిల్లి। యభిమతం బగు వరమిచ్చె నధిపవర్య! (అను. 2-205)

ఆ. దివ్య పరిమళంబు, నవ్య వికాసంబు నుల్లసిల్ల వచ్చి యుర్విఁ బడినఁ
గాంచి రుచి యుదీర్ణ కౌతుక చిత్తయై దానిఁ బుచ్చి కొనియె మానవేంద్ర (అను. 2-207)

# 36. ప్రత్యక్ష సాక్షులు-

విపులుడు యోగదృష్టితో ఆ పూలమాల లభించే చోటుకు వెళ్లి చూసినాడక్కడ-
ఒక మిధునం, ఆరుగురు జూదరులూ మాట్లాడుకుంటున్నారు, ఆ పూలదండ
తీసుకుని వస్తున్నపుడు- నేను తప్పు ఆడితే విపులుడు చేసినంత తప్పు అది!
అన్నాడొక జూదరి- విని కూడా చలించకుండా విపులుడు చేరాడు చంపానది.

గురువుకు పూలదండనివ్వగా అతడు తన మరదలికివ్వ సంతోషపడిందామె.
గురువు దేవశర్మ అన్నాడు శిష్యుడైన విపులుడితో- పాపం లేనివాడా!
నీకు కనిపించిన మిధునం అహోరాత్రులు, జూదరులు ఆరు ఋతువులు.
రుచిని ఇంద్రుడి నుంచి కాపాడినావు, అది నాకు, వారికి తెలుసు అన్నాడు.

మనం చేసే ప్రతి పనిని చూసేది అహోరాత్రాలు, ఋతువులు
నింగి దీపాలు- మౌనంగా ఉండే ప్రత్యక్ష సాక్షులు; సద్గురువు, తల్లిదండ్రులు
దైవం సమయాన్ని బట్టి స్పందించేవారు, సన్మార్గంలో ప్రవర్తింపజేస్తారు.
సద్భార్య వలన లభిస్తాయి పురుషార్థసిద్ధి, ధర్మార్థాలు, సుఖం, కీర్తి.

కన్యను, సద్వర్తనుడైన వరునికి కన్యాదానం చేయడం వేదోక్త బ్రహ్మ వివాహం
కన్య వరుల మధ్య అనురాగమేర్పడగా జరిగే ప్రేమవివాహం క్షాత్ర వివాహం
కన్య కోరుకున్నవాడితో వివాహం గాంధర్వం; వరకట్నమిస్తే అసురం
కన్య నెత్తుకుపోయి పెళ్లి చేసుకుంటే రాక్షసం -చివరి రెండు ధర్మ దూరాలు.

---

క. **'తెరువున నొక మిథునము, జూ । దరులను గనుఁగొంటి, నీ వధర్మము నీయం**
**దరసి కనిన వారై పలి । కిరి వారల నెఱుఁగుదే యకిల్బిషచరితా! (అను. 2-211)**

తే. **నీవు రుచిఁ గాచు నప్పటి నిపుణ వృత్తి । నాకు నెఱిఁగింపకునికి యన్యాయముగఁ ద**
**లంచిరో? లేక దానిఁ గల్మషము గాఁగ । నేను దలఁచిన శాప మీ నెట్లు నీకు? (అను. 2-212)**

తే. **దినము, రాత్రియు, ఋతువులు, మనుజు చేయు । సుకృతమును దుష్కృతంబును జూచుచుండుఁ**
**గాని, యెంత రహస్యపుఁ గార్యమైన । నొరు లెఱుంగరు న న్నని యునికి మోస.' (అను. 2-214)**

క. **'పలువురు గ్రీడింతురు, భూ । వలయాధిప ! యరయ మంచివారును గల; ర**
**క్కులధర్మ సతులకతమున । నిల నిరపాయత్వ మొంది, యెసకం బెసఁగున్. (అను. 2-218)**

క. **పాతివ్రత్యము గలిగిన । నాతి యనఁగ దైవ మన జనస్తుత! వేతే?**
**యాతత ధర్మార్థ సుఖ । ఖ్యాతులు, సద్భార్యవలనఁ గాదే కలుగున్.' (అను. 2-219)**

క. **'కులమును, శీలము, విద్యయు । గలవానిం బిలిచి, ప్రీతిఁ గన్నియ నీఁ గా**
**వలయు, నుదక ప్రదానా । కలితంబుగ; బ్రాహ్మ కర్మ గతి యిది యధిపా! (అను. 2-221)**

# 37. ఆస్థి పంపకాలు-

బ్రాహ్మణుడికి మొదటి మూడు కులాల స్త్రీలతో పుట్టినవారు బ్రాహ్మణులే!
శూద్ర స్త్రీని చేసుకోకపోవడం ఉత్తమం; సంతానం లేకపోవడం మంచిది.
క్షత్రియ, వైశ్యులు అనులోమ వివాహాలకు అర్హులు, జాతి సంకరం కాదు.
శూద్రులు తమ కులం వారిని వివాహమాడడం ఉత్తమ ధర్మం.

బ్రాహ్మణుడి ఆస్థి పదిభాగాలు చేసి నాలుగు బ్రాహ్మణస్త్రీ కుమారుడికి
మూడు క్షత్రియస్త్రీ కుమారుడికి, రెండు వైశ్యస్త్రీ కుమారుడికి
ఒకభాగం శూద్రస్త్రీ కుమారుడికివ్వాలి. పోట్లాట పనికిరాదు.
క్షత్రియుడి ధనం ఎనిమిది భాగాలు చేసి క్షత్రియ స్త్రీ కుమారుడికివ్వాలి

నాలుగు భాగాలు, వైశ్యస్త్రీ కుమారుడికి మూడు, శూద్రస్త్రీ కొడుకుకు ఒక భాగమివ్వాలి.
వైశ్యుడు ఆస్థి అయిదు భాగాలు చేసి నాలుగు వంతులు వైశ్యస్త్రీ కొడుకుకు
ఒకపాలు శూద్రస్త్రీ కొడుకుకు ఇవ్వాలి; శూద్రుడి ఆస్థిని సమభాగాలుగా
పంచుకోవాలి శూద్ర పుత్రులందరూ - ధర్మరాజా! ఇది ఈ కాలపు ధర్మం.

వైదిక కర్మల నిర్వహణ అంతా బ్రాహ్మణస్త్రీ చేయాలదీ నియమం.
ధర్మరాజా, ఇప్పుడు నేను చెబుతున్నది కుమారుల గురించి-
తండ్రి తన ఆత్మను భార్యాగర్భంలో ఉంచగా పుట్టిన కొడుకు ఔరసుడు
కొడుకులు లేని తండ్రి తన కూతురి భర్తను దత్తత తీసుకుంటే దౌహిత్రుడు.

---

ఆ. క్షాత్ర మంద్రు బుద్ధులు, గన్య పురుషుఁ గోర । నతఁడు గన్య మీఁద నాస సేయ,
నచల మగు పరస్పరానురాగము గని । ప్రమదమెసఁగఁ జేయు పరిణయంబు. (అను. 2-222)

క. కన్ను మనంబును దనిసిన । గన్నియ యెవ్వానిఁ గోరు గాంధర్వం బా
యన్ను నతని కిచ్చుట, వెల । వన్నుట యాసురము సూవె పౌరవముఖ్యా! (అను. 2-223)

క. బలిమి మెయి వరుడుఁ గన్నెకు గలవారిం బొడిచి కరము క్రౌర్యంబున, న
ప్పోలతుక దుఃఖింపగ వారలు వొగులగ దెచ్చికొనుట రాక్షసము నృపా! (అను. 2-224)

సీ. 'విను, జనమేజయ మనుజేంద్ర! యమ్మేది । నీశ్వరుతో భీష్ముఁ డిట్టులనియెఁ;
బ్రాహ్మణు నర్థంబు పది పాళ్ళుగాఁ జేయ । నాలుగు బ్రామ్మని నందనుండు,
క్షత్రియాత్మజుఁడు భాగములు మూఁడును, వైశ్య । తనయుండు రెండు, శూద్రాతనూజుఁ
డొక పాలు గొనుటకు నొడయులు; తుదివాఁడు । వలచి పెట్టఁగఁ గొనువాఁడు గాని

తే. తండ్రితోడఁ ద్రివిధ తనయులతోడను । దనదు భాగమునకుఁ బెనఁగి కొనఁగఁ
దగదు వారలకును దగదు నిర్దయతఁ ద । ద్దశమభాగ మీక తార కుడువ.' (అను. 2-235)

# 38. కొడుకులలో రకాలు-

తన భార్యకు తన అంగీకారంతో ఇతరుల వలన కలిగినవాడు క్షేత్రజుడు
దానరూపంగా లభ్యమైనవాడు దత్తుడు; తల్లిదండ్రులు లేనివాడిని
తన కొడుకుగా అంగీకరిస్తే కృత్రిముడు; తన భార్యకు అంతకు
ముందే రహస్యంగా పుట్టినవాడు గూఢజుడు; తల్లిదండ్రులు

వదిలేస్తే తన పంచన చేరినవాడు- అపవిద్ధుడు, పెళ్లి కాకముందు
తండ్రి ఇంట కన్యకు జన్మించినవాడు కానీనుడు; పెళ్లికాకముందే
గర్భవతి అయినా తెలిసి వివాహం చేసుకున్నాక పుట్టినవాడు సహోఢుడు.
భర్తను విడిచిన భార్య, భర్త విడిచిన భార్య, విధవ -వీరు

కన్యాత్వం చెడకుండా ఉండి పెండ్లి చేసుకున్నవాడికి కలిగిన పుత్రుడు
పౌనర్భవుడు; తనంతట తానే వచ్చి నేను నీ పుత్రుడిననేవాడు-
స్వయందత్తుడు; తల్లిదండ్రులమ్మగా కొనుక్కున్నవాడు క్రీతుడు
ఈ పన్నెండుమందిలో ఔరసుడు ముఖ్యుడు -వైదిక కర్మలకు తగినవాడు.

ఔరసుడు, దౌహిత్రుడు, క్షేత్రజుడు, దత్తుడు, కృత్రిముడు,
గూఢజుడు, అపవిద్ధుడు, కానీనుడు, సహోఢుడు, పౌనర్భవుడు
స్వయందత్తుడు, క్రీతుడు - వీరిలో ఔరస, దౌహిత్ర క్షేత్రజ
పౌనర్భవుడు, కానీన, సహోఢులకుండును ఆస్థి హక్కులు-

---

తే. **పరమసంస్కృత యగు నాత్మభార్యయందు । ధర్మవిధిఁ గలిగించిన తనయుఁ డనఁగఁ**
**దాన యౌరసుఁ డను నభిదాన మొప్పుఁ । బరఁగు నుత్తముఁ డాతఁడు ప్రథముఁ డధిప! (అను. 2-243)**

తే. **తగిన వరునకు నిచ్చిన తనదు దుహిత గనిన పుత్రు నయ్యిరువురు వినగ నియ్య**
**కొనగ వీడు నా కొడుకన గొడుకు వానిపేరు పుత్రికా పుత్రుడు పౌరవేంద్ర (అను. 2-244)**

క. **అని భీష్ముఁడు వెండియు ని । ట్లను 'నా పన్నిరువురును ధరాధిప! యోగ్య**
**త్వ నిరూఢు లెల్ల కర్మం । బున; కౌరసుఁ డందులోన ముఖ్యుం డరయన్. (అను. 2-255)**

ఉ. **వానిన పోలు నండ్రు బుధవర్యులు కౌరవనాథ! పుత్రికా**
**సూనునిఁ దక్కునీ వినిన సూనులు, యోగ్యత గాంతు రుత్తమం**
**బైన కులద్వయంబును, సమాగతమై, విధివత్ప్రయోగతా**
**నూనతఁ గల్గెనేని, నిగమోదిత కర్మకలాప యుక్తికిన్.' (అను. 2-256)**

# 39. నహుష-చ్యవన సంవాదం

భృగువంశ సంజాతుడైన చ్యవనుడు గంగా యమునా సంగమ ప్రాంతాన
తపోనిష్ఠతో కదలకుండా కూర్చున్నపుడు ఒక చేపలగుంపు అతడితో ఉండేది.
ఎంతో స్నేహంగా, అతడి దగ్గరే తిరుగుతూ- ఒకనాడు జాలరులు వల విసరగా
చేపలతో పాటు వలలో వచ్చాడు చ్యవనమహర్షి; జాలరులు భయకంపితులు కాగా.

చ్యవనముని అన్నాడు- చేపలతో పాటు నన్నూ అమ్ముకోండి ఏ రాజుకైనా-
జాలరులు వెళ్లారు నహుషుడి వద్దకు పరుగు పరుగున, వివరించారీ ఘటన
రాజు అన్నాడు- తమరే సెలవియ్యాలి నేనేమి చేయడం న్యాయమో!
చ్యవనుడన్నాడు- సరైన వెలకట్టి నన్నూ, చేపలను నీవే కొనుక్కో!

-సరే వేయి మాడలు -అన్నాడు రాజు, 'అంతేనా?' అన్నాడు చ్యవన మహర్షి
పదివేలు-లక్ష-కోటి-అర్ధరాజ్యం-రాజ్యం మొత్తం ఇస్తానన్నాడు రాజు నహుషుడు.
చ్యవనుడు ఒప్పుకోలేదు, రాజుకేమి చెయ్యాలో బోధపడలేదు.
నహుషుడి వద్దకు అప్పుడు గవిజాతుడనే ముని వచ్చి అన్నాడు-

కామధేనువు లాంటి గోవునివ్వు, ప్రభూ! రాజు అదే విషయం అన్నాడు.
చ్యవనుడితో; మహాముని సంతోషంగా ఒప్పుకున్నాడు- గోవు సురభి.
అమృతమయం, అగ్నిప్రకాశం, యజ్ఞ విధానానికి పవిత్ర నదీరూపం
అని పలికి జాలరులకు వలసిన ధనమిప్పించి, గోవును తీసుకున్నాడు చ్యవనుడు.

---

తే. 'గోవునకు బ్రాహ్మణులకును గుల మొకండ । కమలజుఁడు రెండు దెఱఁగులుగా నొనర్చె;
హవికిఁ బూర్వంబు గారణ మఖిల మంత్ర । ములకధిష్ఠాన మపరంబు భూపవర్య! (అను. 2-273)

క. మునినాథ! గోవు నిచ్చెద । ననవుడు వికచముఖుఁ డగుచు 'ననుగుణ మూల్యం
బున సంప్రీతిం బొందితి' । నని భృగుకులముఖ్యుఁ డిట్టు లను నహుషునితోన్. (అను. 2-276)

క. 'గో వగ్ని మయ మమృతమయ । మో వసుధాధీశ । వినుము హోమ విధాన
శ్రీవాహిని, నిచ్చెన త్రిద । శావాసంబునకుఁ బూజ్య మమరుల కైనన్.' (అను. 2-277)

చ. అని యిటు లేర్పడం బలికి, 'యా తలఁ పెంతయు మేలు; గోవు ని
మ్మనఘచరిత్ర! యన్న, విభుఁడట్టుల చేసిన, బోయ లప్డు నె
మ్మనములు, మోద మంద గరిమంబున భార్గవుఁ జేరి 'మమ్ముఁ గ
న్గొనినది యాదిగాఁ గరుణ గూరెద వొక్కటి విన్నవింతుమే?' (అను. 2-278)

- ఉత్తిష్ఠోత్తిష్ఠ విప్రర్షే గవా క్రీతో సి భార్గవ
ఏ తన్మూల్య మహం మన్యే తవ ధర్మభృతాం వర (సం.అను. 51-25)

# 40. చ్యవనముని - కుశికరాజు

చ్యవనుడికి తెలిసింది కుశికుడి వలన తన వంశం సంకరమవుతుందని
రాజైన కుశికుడు మునీంద్రుడైన చ్యవనుడిని గౌరవించి అన్నాడు–
మహర్షీ, నీవు రాజువై మేము సేవకులుగా ఉంటాం, అనుగ్రహించు'.
చ్యవన మహర్షి అన్నాడు– 'నాకు రాజునవ్వాలన్న కోరిక లేదు–

నేనొక వ్రతం చేస్తున్నాను, నీవు నీ భార్యాబంధువులు సేవచేయండి
కొన్నాళ్లు, అది చాలు'– కుశికుడు ఆ మునికి తగిన ఏర్పాట్లు చేసాడు.
సాయంకాలం సంతృప్తిగా చ్యవనుడు భోజనం చేసి శయ్యపై పరుండి–
'మీ భార్యాభర్తలిద్దరూ నా కాళ్లు వొత్తుతూ ఉండండి, అయితే లేపవద్దు నన్ను'–

ఇరవై ఒక్కరోజులు అలా నిద్రపోయాడు, వీళ్లు పరిచర్యలు చేస్తూనే ఉన్నారు.
ఇరవై రెండో రోజున ముని లేచి వెళ్లిపోతుంటే వెనకనే వెళ్లారు.
అడవిని చేరిన ముని అదృశ్యమైనాడు రాజదంపతులు చూస్తూ ఉండగానే.
చాలాసేపు వెదికి వెదికి అతడు కానరాక ఇంటికి వచ్చేసరికి, ఆశ్చర్యం!

ముని మంచం మీదనే హాయిగా నిద్రపోతూ కనిపించాడు, ఆ దంపతులకు.
ఈసారి ముని ఇంకో దిక్కుకు తిరిగి పడుకుని నిద్రపోతూనే ఉన్నాడు.
రాజదంపతులతడికి పరిచర్యలు చేస్తూనే ఉన్నారు అవిశ్రాంతంగా.
మరల ఇరవై ఒక్కరోజులు గడిచాయి, చ్యవనుడు నిద్రలేచాడు.

– **బ్రహ్మ క్షత్రవిరోధే న భవితా కుల సంకరః**
**పౌత్రస్తే భవితా రాజన్ తేజోవీర్య సమన్వితః**
**తతస్తే కులనాశార్థమ్ అహంత్వాం సముపాగతః**
**చికీర్షన్ కుశికోచ్ఛేదం సంధిధక్షుః కులం తవ (సం.అను. 55–12,13)**

**నహుషుడు :** చంద్రవంశపు రాజు. పురూరవుడు–ఊర్వశీ సంతానమైన ఆయువు కుమారుడు నహుషుడు. ఇతడి తల్లి రాహువు కుమార్తె ప్రభ. నహుషుడి భార్యలు విరజ, అశోకసుందరి. నహుషుడి కుమారులు యతి, యయాతి, సంయతి, అయితి, వియతి, కృతి.

పార్వతీ పరమేశ్వరుల మానసపుత్రిక అశోకసుందరి. హుండుడనే రాక్షసుడి నుంచి తప్పించుకున్నది. ఆయువు–ప్రభల కుమారుడైన నహుషుడు దత్తాత్రేయ వరప్రసాదుడు. వశిష్ఠుడి వద్ద విద్యలు నేర్చిన నహుషుడు హుండుడుని సంహరించి అశోకసుందరిని వివాహమాడినాడు. వృత్రుడి వధ వలన కలిగిన బ్రహ్మహత్యా దోషంతో ఇంద్రుడు మానస సరోవరంలోని సరస్సులో తామరతూడు యందు దాగి ఉన్న కాలంలో మునులు నహుషుడికి ఇంద్రపదవిని కట్టబెట్టినారు అనేక శక్తులనిచ్చి. దానితో అతడు గర్వాంధుడై శచీదేవిని పొందగోరి సప్తర్షులు మోస్తున్న పల్లకిలో కూర్చుని, సర్ప–సర్ప – త్వరగా, త్వరగా అని అగస్త్యుడిని కాలితో తన్నగా నహుషుడి శక్తులు నశించాయి, అగస్త్య శాపంతో అజగరమై (పాము)గా భూమిపై పడినాడు.

ద్వాపరయుగంలో పాండవులు వనవాసమందున్నపుడు భీముని బంధించగా ధర్మజుడితో సంభాషించి శాపవిముక్తుడైనాడు.

జాలరులకు వలలో దొరికిన చ్యవనుడికి బదులు గోవునిచ్చి చ్యవనుడిని కొనుక్కుని సద్బ్రాహ్మణుడు గోవు సమానమైన విలువ కలవారని తెలుసుకున్నాడు నహుషుడు.

# 41. స్వర్గం లాంటి వనం-

నిద్రలేచిన చ్యవనముని నూనెతో తలంటు స్నానమడిగాడు రాజును
పరిమళ తైలంతో తల, శరీరం మర్దన చేస్తే నానా తిట్లు తిట్టి అలిగాడు.
అయినా వాళ్లు కోపగించుకోకపోవడం చూసి స్నానం చేసాడు.
అన్నం సిద్ధం చేయమన్నాడు, అన్నీ సిద్ధం కాగానే తినకుండా వెళ్లిపోయాడు.

తెల్లవారేసరికి కనిపించి రథం సిద్ధం చేయమని ఎక్కి కూర్చున్నాడు.
గుర్రాలను విప్పి తోలేసి రాజు-రాణిని లాగమన్నాడు రథాన్ని.
వాళ్లు లాగుతూ ఉండగా రథంలో ఉంచిన బంగారం, రత్నాలను దానం చేస్తూ
ములుకోలతో చ్యవనముని రాజదంపతులను పొడుస్తూ ఉన్నాడు.

అప్పటికే చాలా రోజుల్నుంచి నిద్ర లేకపోవడం వలన తూలుతున్న
రాజదంపతుల శరీరాలు మునికోల పోట్లకు రక్తమోడ్చి మోదుగచెట్లయినాయి.
వారి ముఖాలలో ఎటువంటి కోపతాపాలూ కనిపించకపోయేసరికి
చ్యవనముని వారిని ప్రేమతో స్పర్శించగానే మాయమైనాయి, అలసటా గాయాలు.

ముని అడవిలోకి వెళ్లిపోయాడు రాజదంపతుల్ని రేపు ఉదయం రమ్మని.
మరునాడు వాళ్లు వెళ్లేసరికి అక్కడ కనిపించిందో అద్భుత భవనం.
వేదమంత్ర ఘోష, హంసల కొంగల నెమళ్ల అరుపులు, చక్కటి వనం,
ఇంపైన తామరపూలున్న చెరువులు, తోటలు- స్వర్గంలా ఉన్నదా ప్రదేశం.

---

**సీ.** **స్వాధ్యాయ సంగీత సాహిత్య వర్తన । మాననీయము లగు మండపములఁ,**
**గోకిల శుకభృంగ కులనాదముల నభి । రామంబు, లైన యారామములును**
**హంస సారసరవాత్యంత మనోజ్ఞంబు । లై సొంపు మిగులు పద్మాకరములఁ,**
**జారుమయూర కేకారుత కలితంబు । లగుచు నొప్పారు క్రీడాచలములు;**

**తే.** **వీనులకుఁ జూడ్కులకు నింపు వెల్లి గొల్ప । నేర్పు గలిగిన విభవంబు నెఱయ మెఱయఁ**
**గరము విలసిల్లుచునికి నాకంబు వేడ్క । నయ్యెడకుఁ గాపు వచ్చిన యట్టు లుండె. (అను. 2-318)**

**క.** **'ఉత్తర కురు భూమియొ? లో । కోత్తర మగునట్టి నాకమొకొ? తనువులతో**
**నిత్తాపసవరుని కరుణ । నిత్తఱిఁగున సంభవించె నిచ్చోటు సొరన్.' (అను. 2-322)**

**తే.** **'ఒకటి యడిగెదఁ గృప చిగురొత్తఁ జెప్పు । వలయు; మీరు మా యింటికి వచ్చి యొక్క**
**ప్రక్కక్రిందుగ నిరువది యొక్క దినము । లనఘ! నిద్రించి; తది మొదలైన నీదు. (అను. 2-329)**

**క.** **చరితం బద్భుతము మునీ । శ్వర! దీనికిఁ గారణము విచారమున కగో**
**చర; మెఱిఁగింపు 'మనుడు నా । ధరణీవల్లభునితో నతం డిట్లనియెన్. (అను. 2-330)**

# 42. విశ్వామిత్రుడు-పరశురాముడు

దేవతలు, గంధర్వులు, అప్సరసలతో ఉన్నదా వనం అత్యంత రమణీయంగా.
లోపలకు వెళ్లి చూసారు రాజదంపతులు, లోన కనిపించాడు
చ్యవన మునీంద్రుడు రత్నతూలికా తల్పంపై గాఢనిద్రలో అక్కడ.
కొద్దిసేపటిలోనే ఆ భవనం, వనం అన్నీ అదృశ్యమైపోయాయి.

అడవిలో ఒకచోట దర్భచాపపై కూర్చుని తపస్సులో ఉన్నాడు మునీంద్రుడు.
కుశికుడన్నాడు– చూడు రాణీ, ఇతడి తపోబలం–ఇతడి మనోనిష్ఠ.
చ్యవనుడు కనులు తెరిచి రాచదంపతులను ఆశీర్వదించినాడు
తాను అలా ప్రవర్తించడానికి కారణం చెప్పినాడు– కుశిక మహారాజా!

బ్రహ్మ అన్నాడొకసారి భవిష్యత్తులో భృగు కుశిక వంశాల మధ్య ఏర్పడ్తుంది
బంధుత్వమని; నేను దానిని ఆపగలనా లేదా అని ఆలోచించి
మీ ఇంటికి వచ్చాను, మిమ్మల్ని నానా ఇబ్బందులు పెట్టాను.
నేను గ్రహించిందేమిటంటే మీకు రాచరికం కన్నా బ్రాహ్మణ్యంపై మక్కువ.

నా వంశంలో ఋచీకుడనేవాడు నీ కుమారుడు 'గాధి'–కుమార్తె
సత్యవతిని వివాహమాడతాడు. అతడికి జమదగ్ని, జమదగ్నికి
పరశురాముడు జన్మిస్తారు; గాధి దంపతులకు తపోధనుడైన
విశ్వామిత్రుడు జన్మిస్తాడు – ఈ కులాల కలయిక లోకకల్యాణ కారకమవుతుంది.

---

**చ.** **అనునెడ నిందు రండని సమాదర మొప్పఁగ వారిఁ బిల్చె న
మ్మునిఁ; నరనాథుఁడున్, సతియు, మోడ్చిన చేతులతోడఁ జేరఁగాఁ
జని, ధరఁ జాఁగి మ్రొక్కుటయు, సంయమి దీవన లిచ్చి, రాజు నా
ననమున సుప్రసన్న నయన ప్రభ పర్వఁగ నెమ్మి నిట్లనున్. (అను. 2-325)**

**ఆ.** **'మనసు నింద్రియములు మనుజేంద్ర! యింత వ । శ్యంబు లగునె నీకు? నరయఁ గీ డొ
కింత యైన లేదు సంతసమందితి; । నిత్తు వరము వేఁడు మెద్దియైన.' (అను. 2-326)**

**క.** **అనిన విని యగ్ని కల్పుఁడ । వనఁ జను 'నీమది ప్రసన్నమగునట్టులుగా
మునిజనవంద్యా ! కొల్వం । గను కంటెను మిగులమేలు గలదే కోరన్.' (అను. 2-327)**

**తే.** **'ఒకటి యడిగెదఁ గృప చిగురొత్తఁ జెప్ప । వలయు; మీరు మా యింటికి వచ్చి యొక్క
ప్రక్కక్రిందుగ నిరువది యొక్క దినము । లనఘ! నిద్రించి; తది మొదలైన నీదు. (అను. 2-329)**

---

కుశుడి కుమారుడు కుశనాభుడు. కుశనాభుడు ఘృతాచిల కుమారుడు గాధి. గాధి కుమారుడు విశ్వామిత్రుడు; గాధి కుమార్తె సత్యవతి; సత్యవతి–ఋచీకుల పుత్రుడు జమదగ్ని; జమదగ్ని–రేణుకల కుమారుడు పరశురాముడు. పరశురాముడి భార్య ధరణి; విశ్వామిత్రుడి సంతానం– మధుచ్ఛంద, అష్టక, శునశ్శేప, శ్రుశ్రుత, శకుంతల.

# 43. ఉద్గీత - భూగీత

'ఏది కోరి యాచకుడు తన దగ్గరికి వస్తాడో దాన్నే ప్రేమతో ఇవ్వడం-
దానాలలో గొప్పది- దీనికన్నా గొప్పది సర్వజీవులకు అభయ ప్రదానం.
యుద్ధంలో మరణించడం ప్రాణత్యాగమై సర్వ పుణ్య కర్మలలోనూ గొప్పది,
శత్రువు శరణు వేడినపుడు రక్షించి, మేలు చేసేవాడు పురుషోత్తముడు.

అడగనివాడికి అవసరార్థమిచ్చే దానం, దానికన్నా భూదానం చాలా గొప్పది.
రాజు రణ మరణమైనా పొందాలి, లేదా, అర్హులకు భూదానమన్నా చెయ్యాలి-
భూదేవి జనహితార్ధం చెప్పిన మాటలు 'భూగీత'లుగా లోక ప్రసిద్ధికెక్కాయి.
తనను దానం చేయమని నేలతల్లి చెప్పిన మాటలనెన్నడూ మరవరాదు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది, తాను మానుకునైనా అతిధులకు పెట్టాలి.
అన్నము పెట్టడానికి కులము, విద్య, నడవడిక అడగరాదు, చూడరాదు.
అప్పుడు ధర్మరాజడిగాడు భీష్ముని- ఏ నక్షత్రంలో ఏది దానం చెయ్యాలి?
అంపశయ్యపైనున్న భీష్ముడు చెబుతున్నాడు- కృత్తికలో పాయసం

బ్రహ్మ అధిదేవతగా గల అభిజిత్-రోహిణి నక్షత్రంలో మినుములు,
చంద్రతార-మృగశిరలో మాంసాన్నం; ఆర్ద్రలో గోవును; అదితి-పునర్వసులో
తియ్యని పులగం; గురుతార-పుష్యమిలో బంగారం; ఆశ్లేషలో వెండి;
మఖలో ఉప్పు-నువ్వులు; భగుని తార-హస్తలో చెరకురసంతో ఉన్న అన్నం.

---

**సీ. భూమి కెంతాయువు భూదానకర్తయు । నంతకాలము సుఖ మందుచుండు**
**నమరలోకంబున; నల్పమైనను భూమి । యిచ్చిన బహుభూమి యేలు నతఁడు;**
**రాజు విశేషించి రణమృతి యొండెను । భూదాన కర్తృత్వ పుణ్య మొండెఁ**
**బడయంగవలయుఁ బాపఁగ నోపు బ్రహ్మ హ । త్యాది పాతకముల నైన భూమి**

**తే. దాన మెంత పాపాత్ముచే నైన భూమిఁ । గొనిన గల్మష మొందదు; వినుము మహిత**
**మైన భూదానవిధియును నశ్వమేధ । యాగమును సదృశంబులం డ్రాదిమునులు. (అను. 2-352)**

**చ. ఇతరుల దాన మేనిఁ దమ యాగియ యేనిని నన్ను మార్తురే**
**మతి నరకాధివాసగతి మాన్పఁ దలంచుట గల్గినన్ సమం**
**చితముగ భక్తి నిచ్చుట కుశీలత మార్చుట నాకు హర్ష భా**
**సితయుఁ; బరాభవ వ్యథయు జేఁత సుఁడీ! యిదె చాటి చెప్పితిన్.' (అను. 2-359)**

**- అన్నం ప్రాణా నరాణాం హి సర్వమన్నే ప్రతిష్ఠితమ్**
**అన్న దః పశుమాన్ పుత్రీ ధనవాన్ భోగవానపి**

**ప్రాణ వాంశ్చాపి భవతి రూపవాంశ్చ తథానృప**
**అన్నదః ప్రాణదో లోకే సర్వ దః ప్రోచ్యతే తు సః (సం.అను. 63-25,26)**

# 44. నక్షత్రదాన విశేషాలు

ఉత్తర ఫల్గునిలో పాల అన్నం; సూర్య నక్షత్రంలో ఏనుగు, రథం; చిత్తంలో
మంచిగంధపు చెక్క, స్వాతిలో తనకిష్టమైనది– దానానికి మంచిది –అని
భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు– అదేవిధంగా –విశాఖలో ఎద్దు, అనురాధలో
ఉత్తరీయం, పై కండువా; జ్యేష్ఠలో కరివేపాకుతో కూడినట్టి ముల్లంగి;

మూలానక్షత్రంలో–మంచి పండు, పూర్వాషాఢలో పెరుగు, ఉత్తరాషాఢలో
తేనెతో తడిసిన అన్నం; శ్రావణంలో కంబళి; ధనిష్ఠలో వసి కొయ్యలు గల బండి,
శతభిషంలో యవలు, పూర్వాభాద్రలో క్రొవ్విన మేక నంజుడు, మాంసం;
ఉత్తరాభాద్రలో గొర్రెమాంసం; రేవతిలో కంచుకుండతో పాటు గోవును

అశ్వనిలో గుర్రపు బండి, భరణిలో మంచి నువ్వులు, ఆవులు దానం చేయుట మేలు–
సద్గతులను కలిగిస్తాయి అన్ని నక్షత్రదానాలు –అని పలికాడు భీష్ముడు.
బంగారం, జలదానం ఉత్తమమైనవి. చెరువులు బావులు నూతులు, కొలనులు
తవ్వించుట గొప్ప పుణ్యం; ఘృతదానం గొప్పది, కుండల దానం మేలైనది.

గొడుగు, చెప్పులు, బండి, పితృదేవతలకు ఆహారమైన నువ్వులు,
అడవి, కొండలు, నదులు, తీర్థాలు దానధర్మాలు చేయడానికి మంచి స్థలాలు
గోదానం ప్రాణదానమంత గొప్పది; అన్నదానం అతిగొప్పది –అన్నాన్ని స్వర్గంలో అమృతమని
నాగలోకంలో సుధ అని, పితృలోకంలో స్వధ అని, మహాత్ములు ప్రాణమని అంటారు.

---

సీ. ప్రాణంబులకు విధారక మన్న మింటి జ । నంబుల కుడిగి యైనను సుభక్తి
నతిథికిఁ బెట్టుట యధిక పుణ్యము శ్రాంతు । వృద్ధుఁ దాపసు బాలు వికలు వనితఁ
గడపఁగా దాఁకలి గదిరి యర్థించిన । గృహమేధి కవమతి గినుక దగదు
కాలంబుతోఁ గుక్క మాలఁడు దుదిగాఁగ । నాఁకొని వచ్చిన ననుగుణముగ

ఆ. నాచరింపవలయు నాహార కల్పన । మునుల దేవ పితృ సముత్క రముల
నన్నదాన విధుల నాదరంబుగఁ బ్రియ । మొందఁ జేఁతఁబోల వొండు విధులు. (అను. 2–371)

క. కులమును, విద్యయు, వృత్తము । నలఘుమతీ! యన్న మిడుటకై యడుగంగా
వలవదు; విప్రుని నాదర । మలరంగా నిడుట లెస్స యడిగిన మాత్రన్.' (అను. 2–372)

తే. అజుఁడు కల్పాదియం దన్న మమృత మనియె । నన్న హాని బలాధికు నైన దుర్బ
లాత్ముఁగాఁ జేయుఁ, గావున నన్న భుక్తి । సకలధాతు వృద్ధికినయి జనము గోరు.' (అను. 2–374)

– సర్వకా మానవాప్నోతి కీర్తిం చైవ హి శాశ్వతీమ్
ప్రేత్య చా నంత్యమశ్నాతి పాపేభ్యశ్చ ప్రముచ్యతే

తోయదో మనుజ వ్యాఘ్ర స్వర్గం గత్వా మహాద్యుతే
అక్షయాన్ సమవాప్నోతి లోకానిత్య బ్రవీన్మనుః (సం.అను. 67–18,19

# 45. తొండగా మారిన నృగ చక్రవర్తి

గోదానాన్ని సరిగా చేయాలి లేకుంటే కలుగుతుంది కీడు -అన్నాడు భీష్ముడు.
-దుష్టమైన గోదానంబు కష్టవృత్తి తెచ్చింది 'నృగుడు' అనే గొప్ప రాజుకు.
పరోక్ష కారణమైన అతడు పెద్ద తొండగా పడరాని కష్టాలు పడినాడు-
ద్వారకలోని ఒక నూతిలో పెద్ద తొండ ఉన్నది, దానిని చూసిన వాళ్లు

పెద్ద పెద్ద మోకులు దానికి తగిల్చి ఎంతమంది లాగినా అది కదల్లేదు కాస్తైనా-
శ్రీకృష్ణుడికా విషయం తెలిసి అతడు లాగగా అది బయటకు వచ్చి అన్నది
-'నా పేరు నృగుడు - అనేక వేల గోవులను గోదానం చేసి పేరుపొందిన మహరాజును.
నేనొక గోవును దానం చేసాను ఒక విప్రుడికి; అది కొన్నాళ్లతడి దగ్గర ఉండింది.

తరువాత వచ్చి రాచమందలో కలిసింది. అది గుర్తించక నేను దానమిచ్చాను
మరొక బ్రాహ్మణుడికి; కొన్నాళ్ల తరువాత ఇద్దరు బ్రాహ్మణులు కలిసినపుడు
ఇద్దరూ పోట్లాడుకున్నారు రాజు ఇచ్చింది నాకంటే నాకని- ఇరువురూ వచ్చారు
నా దగ్గరకు- నేనన్నాను మొదటి విప్రుడితో- లక్ష గోవులనిస్తాను పరిహారంగా!

మొదటివాడు ఒప్పుకోలేదు, రెండవవాడూ రాజ్యమిస్తానన్నా ఒప్పుకోలేదు.
నాకు మృత్యువు సంభవించి యముడి వద్దకు వెళ్లగా- ఏది ముందు అనుభవిస్తావు
సద్గతులా దుర్గతియా? -అని అడిగాడు. నేను దుర్గతిని కోరుకునగా మరుక్షణం
తొండనై భూమిపై పడ్డాను. యముడన్నాడు- శ్రీకృష్ణుడు నిన్ను అనుగ్రహిస్తాడు.

---

**సీ. ఉత్తమ బ్రాహ్మణుం డొకనికి నొక్కనాఁ । డొక గోవు నిచ్చితి నుల్ల మలర**
**నతఁడును గొనిపోయె; నది మేఁత కర్థి మా । కదుపుల లోపలఁ గలసి వచ్చె**
**గోవుల మఱియును గోపాలకులు దాన । విధికినై తెచ్చుచో విధివశమున**
**వానిలో నదియును వచ్చిన నెఱుఁగక । దానంబు సేసితి; దాని మున్న**

**ఆ. గొనినయతఁడు దడవి కని 'యిది నాదు గో' । వనియెఁ బిదపఁ గొనిన యతఁడు పెనఁగి**
**'నాకు నృపతి యొసఁగె' నా నిద్దఱకును వా। దైన నన్నుఁ గాన నరుగుదెంచి. (అను. 2-422)**

**చ. 'కనకము ధేనువుల్ మణి నికాయము లిచ్చెద; నేమి యైనఁ ద**
**క్కును మది కిష్టమైన యది గోరుము గోవున' కంచుఁ జేరి త**
**క్కిన ధరణీసుపర్వునకుఁ గీడ్పడి యెమ్మెయి వేఁడికొన్న 'నేఁ**
**గొన భవదీయ రాజ్యమును; గుత్సితవృత్తికి నియ్యకొందునే?' (అను. 2-429)**

**- కూపే త్మాన మధః శీర్షమ్ అపశ్యం ప్రతితశ్చహ**
**తిర్యగ్యోని మను ప్రాప్తం న చ మామ జహాత్ స్మృతిః-**

**- త్వయాతు తారితో స్మ్య ద్య కిమన్యత్ర తపో బలాత్**
**అనుజానీహి మాం కృష్ణ గచ్ఛేయం దివమద్యవై (సం.అను. 70-27,28)**

# 46. ఔద్దాలకి-నచికేతుడు

'సరీసృపంలా పెద్దతొండగా ఉన్న నృగుడన్నాడు- నేలమీద పడి
తొండలా తిరుగుతూ ఈ బావిలో నీటిని తాగగానే వచ్చింది నాకీ పెద్ద ఆకారం.
శ్రీకృష్ణా, శరణాగత రక్షకా! నన్ను కాపాడు' అని ప్రార్థించాడు నృగుడు.
కృష్ణుని హస్తస్పర్శతో తొండరూపం అదృశ్యమై, నిజరూపంతో స్వర్గానికేగినాడు నృగ మహారాజు.

భీష్ముడన్నాడు- ఒకసారి ఉద్దాలకుడి పుత్రుడైన ఔద్దాలకి మహర్షి
గోదానం చేస్తూ ఏటి రేవు దగ్గర మరచిన కుశలు, సమిధలు, కమండలం
తెమ్మని తన కొడుకు నచికేతుడిని పంపినాడు, ఇంతలో నది పొంగి
అవన్నీ కొట్టుకుపోయాయి, వట్టి చేతుల్తో వచ్చిన కొడుకును- 'పో యముడి దగ్గరకు'

అని కసురుకున్నాడు తండ్రి; కుమారుడదేక్షణంలో చనిపోయి నేలపై పడినాడు.
కొడుకును చూసి కన్నీరు మున్నీరుగా ఏడుస్తుంటే ఆ కన్నీటి తడి తగిలి
కళ్లు తెరచాడు నచికేతుడు- అతడి శరీరం నుండి ప్రసరించాయి అతిలోక పరిమళాలు-
నచికేతుడన్నాడు- నీవు వెళ్లమన్నావని యముడి దగ్గరకు వెళ్లాను కదా!

యముడు నన్ను ఆదరించి- నీవు చనిపోలేదు, అక్కడ నీ తండ్రి దుఃఖిస్తున్నాడు
అని పలికి అందమైన గుర్రాలు పూన్చిన గొప్ప రథంలో నాకు చూపించాడు పుణ్యలోకాలను
-మణిసౌధాలు, దిగుడు బావులు, తోటలు, కొండల్లా భక్ష్యాలు, పెరుగు, పాలు
నెయ్యి ప్రవాహాలు; యముడు చెప్పాడవన్నీ గోదానం చేసినవారి లోకాలని.

---

**సీ.** **'అనఘుఁ డౌద్దాలకి యను మహాముని । దన తనయునిఁ బిలిచి యిధ్మములు దర్భ**
**కట్టయు జలపూర్ణ కలశంబుఁ బువ్వులు । మఱచి వచ్చితి నేటి మడఁ గుమార!**
**గొని రమ్ము వేగంబ చని' । యన్ననాచికేతాహ్వయుం డగు నతం డరుగునంత**
**వాహిని పొంగిన వట్టోడి యవి వోయెఁ । గానక యాతండు క్రమ్మఱంగ**

**ఆ.** **నరుగుదెంచి కాన ననుటయు నాఁకలి । దనదు కర్మవైకృతంబు సైఁపఁ**
**జాలకలిగి 'యోరి! జముఁ జూడఁ బొ'మ్మని । శాప మిచ్చెఁ దండ్రి భూపవర్య! (అను. 2-446)**

**సీ.** **'నీ యాజ్ఞఁ జని కమనీయ విశాలమై । మణిమయత్వంబున మహిత మగుచు**
**వెలిఁగెడు సమవర్తి కొలువు కూటముఁ బ్రవే । శించితి నాతఁడు సేరఁ బిలిచి**
**యంచితాసనము వెట్టించి భవద్గౌర వాతిశయంబున నర్ఘ్య ముఖ్య**
**పరిపూజనముల సంభావించె నతనితో । 'నే లోకమున వసియించువాఁడ**

**తే.** **ననఘ! యానతి యిమ్ము నా కంటి 'ననిన । 'నీవు సావవు; నీ తండ్రి నిన్ను జమునిఁ**
**జూడఁ బొమ్మని పనిచినఁ జూచి; తంద । యరుగు మమ్ముని వగ పేద' ననియె నతఁడు (అను. 2-454)**

# 47. నీవును అవధానముతో గోవుల మన్నింపుము-

నచికేతుడు తన తండ్రి ఔద్ధాలకితో చెబుతున్నాడు- సూర్య కిరణాలవంటివి
గోవులు; గోదానం చేసేవారు సూర్యుడిలా ప్రకాశిస్తారు. తండ్రీ, జాగ్రత్త
గోదానం చేసేప్పుడు మంచి గోవులనే దానం చెయ్యాలి -అని పలికాడు.
యముడి దగ్గరకు వెళ్లి వచ్చిన తన కుమారుడిని చూసి సంతోషించాడు ఔద్ధాలకి.

భీష్ముడన్నాడు- గోదానం చేసినవారు వెళ్లే ఆ గొప్ప లోకం అద్భుతమైనది.
అక్కడ కాలక్రమముండదు, ఋతువులుండవు; దప్పిక, రోగాలుండవు.
ముసలితనం దరిజేరదు; అంతా ఆనందదాయకమే అక్కడ ఎన్నటికీ.
అక్కడ గోదానం చేసినవారితో పాటు నివసిస్తారు సత్యవ్రతులు, జితేంద్రియులు.

గోలోకాన్ని మించిన పుణ్యలోకం కానీ, గోదానాన్ని మించిన గొప్ప దానం కాని లేదు.
గోవులను దానం చేయడానికి కావలసిన ధనం పవిత్రంగా సంపాదించినదై ఉండాలి.
యుద్ధంలో గెలిచినది, దాయాదిధనం, ధర్మ పద్ధతులలో సంపాదించినది
శుభవృత్తులు, పవిత్ర కార్యాల ద్వారా లభించిన ధనంతో చేసే గోదానం గొప్పది.

ఆగమాధ్యయనంబు, వ్రతాభిరత, కర్మలు చేసే స్వభావము, గురుపూజ
మాతృ పితృ రక్షణము చేసినవారికి గోదానం చేసే అర్హత లభిస్తుంది-
బ్రహ్మ చెప్పిన ఈ దివ్యవాక్యాలు విని ఇంద్రుడు నిర్వహించాడు గోయజ్ఞం
-అని భీష్ముడు ఉపదేశించాడు గోదాన మహాత్మ్యాన్ని ధర్మరాజుకు.

---

**ఉ. 'దాయధనంబు సంగరవిధా సముపార్జితమున్ సధర్మ కో**
**పాయసమాహితంబును శుభప్రతిపాదనలబ్ధమున్ మరు**
**న్నాయక! వెండియుం గలుగు నాయపుఁ జొప్పుల సొమ్ములుం దగన్**
**గో యజనార్థ సత్క్రియలకుం బెఱసొమ్ముల నైనఁ గీడగున్. (అను. 2-469)**

**క. విను గోలోకంబును గడ । చిన లోకము గలుగ; దూఁది చెప్పెదఁ బుణ్యం**
**బును గోప్రదాన విధి మిగి । లిన యట్టిది వత్స! యొందు లే దరయంగన్. (అను. 2-470)**

**తే. ఆగమాధ్యయనంబు, వ్రతాభిరతియు, । నైజకర్మ శీలము, గురుపూజనంబు,**
**మాతృపితృ రక్షణముఁ, బాత్ర మహిమ లప్ర । తర్క్య ఫలదాయి యైన గోదానవిధికి. (అను. 2-471)**

**క. నీవును నవధానముతో । గోవుల మన్నింపు పాత్రకోటి కొసఁగు స**
**త్సేవిత పుణ్య చరిత్రము । లా వెరవునఁ బోల వెన్నియైనఁ గుమారా!' (అను. 2-473)**

**- గామప్యేకాం కపిలాం సంప్రదాయ న్యాయోపేతం కలుషాద్ విప్రముచ్యేత్**
**గవాం రసాత్ పరమం నాస్తి కించిద్ గవాం ప్రదానం సుమహద్ వదంతి (సం.అను. 71-51)**

# ✤ 13. అనుశాసనిక పర్వము - తృతీయాశ్వాసము ✤

## 48. గోదాన విధులు

ధర్మరాజు అడిగాడు భీష్ముడిని– శ్రద్ధతో చేయవలసిన పనులేవి?
భీష్ముడు చెబుతున్నాడు– వేదాలను చదవడం, ఇతరులకు నేర్పడం
వాటిని హృదయంలో నిలుపుకోవడం; మనస్సును అదుపులో ఉంచడం
కర్మనిష్ఠ, సకలేంద్రియ జయము, సత్యనిరతి, శ్రుతదాన పరత

బ్రహ్మచర్యము, మాతృ పితృ గురు శుశ్రూష, దయ కలిగి ఉండడము
గోదాన కార్యములు – ఇవన్నీ ఉత్తమ మానవుడు నిష్ఠతో చేసే కార్యాలు.
బృహస్పతి మాంధాతకు తెలిపిన గోదాన విధి ప్రకారం– గోదానం
చేయదలుచుకున్నవాడు పురోహితుడు చెప్పినట్లు ఒకరోజు గోశాలలో ఉండి

ఉషస్సు–సంగవం–మధ్యాహ్నం–అపరాహ్ణం–సాయంకాలం–నిశాముఖం
అని ఆరు భాగాలుగా ఉన్న పగలులో సంగవ సమయాన– ఆవును
పేరు పెట్టి పిలిచి– ఆవు నా తల్లి, ఎద్దు నా తండ్రి, వీరి గర్భప్రదేశం స్వర్గం
గోవు ఉన్న చోటు నాకు ధరణి –అని పలికి గోదానం చెయ్యాలి యోగ్యుడికి.

ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం అష్టమి మొదలుకొని మూడు రోజులు
గొడ్లచావిడిలో వ్రతనిష్ఠలో ఉండి పంచగవ్య స్వీకరణ మిచ్చును శుభము.
గోవులలోకెల్ల 'పుల్లావు' –కపిలగోవు; దాని ఎరుపురంగుకు కారణం
శివుడి మూడవ కంటినుండి వెలువడిన అగ్ని వాటిని తాకడం –అన్నాడు భీష్ముడు.

---

**ఉ.** **మానవుఁ డోపి యాశ్వయుజ మాసము రెండవు నష్టమిం దగం**
**బూని దినత్రయంబు పరిపూజిత గోష్ఠతలంబునన్ వ్రతా**
**ధీనతఁ బెండ యన్నమును ధేనువు మూత్రముఁ బాలుఁ బానముం**
**గా నియతిన్ వసించి బహు కామ్యఫలంబులఁ బొందు భూవరా! (అను. 3–16)**

**సీ.** **'దేవత లాఁకొని దేవతాజ్యేష్ఠునిఁ । గానంగఁ బోవ నా కమలజన్ముఁ**
**దమృత మిచ్చిన ముదమారఁగాఁ ద్రావఁ ద । త్సురభిత్వ సంపద సురభి పుట్టె;**
**నది సౌరభేయుల నధిప! యుత్పాదించె; నొక యప్డు హిమగిరి యుపరితల మ**
**లంకరించుచు నవి శంక యించుక లేక । యున్నెడ వానిలో నొకటి లేఁగ**

**ఆ.** **చన్ను గుడువఁ దదాస్య నిష్యంద మాన । మైన దుగ్ధ ఫేనము పవమాన నిహతిఁ**
**దూలి తప ముగ్రముగఁ జేయు శూలి మౌళిఁ । బడిన నద్దేవుఁ దధికకోపంబు గదుర. (అను. 3–21)**

**క.** **చిచ్చఱకన్నదరు లెగయ । విచ్చినఁ గపిలత్వ మొందె విబుధప్రకరం**
**బచ్చెరు వందుచుఁ గన్గొన । నచ్చెరువ సౌరభేయు లమలచరిత్రా! (అను. 3–22)**

# 49. కపిలగోవు ప్రశస్తి-

తెల్లటి మంచు వర్ణం గల ఆవులు తిరుగుతున్నాయి హిమాలయ ప్రాంతాన
ఆవుదూడ తల్లిపాలు తాగుతుంటే నురగ ఎగిరి ధ్యాన సమాధిలో ఉన్న
శివుడిపై పడగా, మూడవ కన్ను తెరచాడు కోపంతో ఈశ్వరుడు
ఆ అగ్ని వేడి తగిలిన ఆవులన్నీ గోరోజనం రంగు గలవి అయినాయి.

శివుడి కోపం పోగొట్టి బ్రహ్మ ఇచ్చినాడు ఓ మహావృషభాన్ని కానుకగా
వృషభ వాహనుడై, వృషభకేతనుడై సంతోషించినాడు పరమశివుడు.
గోవులన్నిటిలోనూ ఎరుపురంగు కపిలగోవులు గొప్పవని ఆశీర్వదించినాడు.
గోవు హోమద్రవ్యాలనిస్తుంది, తోడ్పడుతుంది వ్యవసాయానికి, పాడిపంటలకు.

పది ఆవులున్నవారు ఒక ఆవును, నూరున్నవారు పదిని; వేయి గోవులున్నవారు
వంద ఆవులను దానం చేయడం అనేది అత్యంత పుణ్యప్రదం, శుభకరం.
ఎరుపు, తెలుపు, నలుపు, ధూసర వర్ణపు ఆవుల దానమిస్తుంది వరుస క్రమాన
సూర్య ఇంద్ర అగ్ని వాయు లోక సుఖాల్ని గోదానమిచ్చిన గొప్పవాడికి.

విశ్వకర్మ సురభి అనే గోవును, మార్తాండుడు అనే వృషభాన్ని సృష్టించగా
వారిరువురికి కలిగినారు ఏకాదశ రుద్రులనే పుత్రులు– అపజాదుడు
అహిర్బుధ్న్యుడు, త్ర్యంబకుడు, వృషాకపి, శంభుడు, కపాలి, రైవతుడు
హరుడు, బహురూపుడు, ఉగ్రుడు, విశ్వరూపుడు –ఆనక జనించాయి ఆలమందలు.

---

**సీ.** ఏతెంచి నిభృతిమై నీశ్వరు చరణాంబు । జములకు నెఱఁగి హస్తములు మొగిచి
యమృతసిక్తుఁడ వైతి వఖిలేశ! గోవుల । కెంగిలి లే; దిందుఁ డెట్టు లమృత
మొసఁగు నట్టుల గోవు లొసఁగు దుగ్ధంబులఁ । దద్వత్స పీత దుగ్ధంబు శుచియ
కాన కోపము దక్కి కరుణింపు' మని యొక్క । కమనీయ వృషభంబుఁ గప్పు మిచ్చె;

**ఆ.** శివుఁడు ప్రియమంది దానిఁగేతువును వాహ । నంబుగాఁ జేసి సకలజనంబు నెలమి
వృషభకేతనుఁ డనియును, వృషభవాహ । నుం డనియుఁ బేర్కొనఁగ నొప్పియుండె నధిప! (అను. 3–24)

– తతో దైవైర్మహా దేవః తదా వృషభాంకః కృతః
ఈశ్వరః స గవాం మధ్యే వృషభాంకః ప్రకీర్తితః

ఏవమవ్యగ్ర వర్ణానాం కపిలానామ్ మహౌజ సామ్
ప్రదానే ప్రథమః కల్పః సర్వా సామేవ కీర్తితః

లోకజ్యేష్ఠా లోకవృత్తి ప్రవృత్తా రుద్రోపేతః సోమ విష్యంద భూతాః
సౌమ్యాః పుణ్యాః కామదాః ప్రాణదాశ్చ గావై దత్త్వా సర్వకామ ప్రదఃస్యాత్ (సం.అను. 77–29,30,31)

# 50. ఫేనవుడి కథ-

ఆవు ముఖం, నాలుక, కొమ్ములలో ఇంద్రుడు; ఇంద్రియ ద్వారాలలో వాయువు, మూపురంలో శివుడు, పాదాలలో దేవతలు; కడుపులో అగ్ని; పొదుగులో సరస్వతి; పేడలో లక్ష్మి; మూత్రంలో కీర్తి; రక్తంలో చంద్రుడు, హృదయంలో భగుడు, పాలలో బ్రహ్మ; వెంద్రుకలలో ఆచారాలు; తోకలో యముడు ఉన్నారు.

గోవు కనులలో సూర్యుడు, చర్మంలో తపస్సు సిద్ధి తేజమూ ఉన్నాయి. కీళ్లలో అష్టసిద్ధులు- అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం ఈశత్వం, వశిత్వం -ఉన్న గోమహిమ మాటలకందనిది; మహిమ కలది. త్రిఖర పర్వతం దగ్గర 'కూలహ' అనే చక్కని నది పక్కన ఉన్న అడవిలో

ముని జనులున్న చోట సుమిత్రుడనే ముని వద్ద పెద్ద ఆవులమంద ఉండేది. వాటిని మేతకు తిప్పుతూ ఆవులు దూడలకు పాలిస్తుంటే ఆ అద్భుత దృశ్యాన్ని చూసి ఆనందపడుతూ, దూడల నోటినుండి ఎగిరి వచ్చిన ఫేనాన్ని తాగుతూ ఉండేవాడు కనుక అతడికి 'ఫేనవుడు' అనే పేరు వచ్చింది.

రంతిదేవుడు చేసే యజ్ఞంలో బలిపశువులుగా పోయి గోలోకం పొందాలని కొన్ని కపిల గోవులు ఫేనవుడిని కుమ్మి తొక్కి చంపివేసాయి, ఆ తరువాత వెళ్లి యాగంలో బలిపశువులుగా వధించబడి చేరుకున్నాయి గోలోకానికి, తాము చంపిన ఫేనవుడితో పాటు; ఆ గోవుల నుంచి పుట్టింది చర్మణ్వతి నది.

**సీ.** **ఆననంబునను జిహ్వను శృంగముల బల । వైరి, రంధ్రంబుల మారుతుండు,**
**కకుదంబునందు శ్రీకంఠుండు, పదముల । యందు మరుద్గణ మనఘ! కుక్షి**
**వహ్ని, చన్నుల సరస్వతి, పెండఁ బంచిత । మున లక్ష్మి యును, గీర్తియును గ్రమమున**
**రుధిరంబునందుఁ జంద్రుఁడు, హృదయంబున । భగుఁడను దేవత, పాల వేధ**

**తే.** **వెంద్రుకలయం దనుష్ఠాన వితతి, దోఁక । ధర్ముఁ డక్షుల సూర్యుండు, చర్మమునఁ ద**
**పంబు సిద్ధి తేజము సంధిపట్ల సిద్ధు । లునికి గల దటె; గోవు నేమనఁగవచ్చు! (అను. 3-60)**

**క.** **'ఈ లోకం బేటికి? మన । గోలోకంబునకు రమ్ము కులవర!' యనుడుం**
**'జాలుదునే మద్గో ర । త్నాలి విడిచి యందు రాక' కని ముని పల్కెన్. (అను. 3-77)**

**క.** **విని యా ధేనువు లాతని । తను వాకసమునకు నెత్తి తమ యోగబలం**
**బునఁ జైతన్యముఁ బాపి య । వని మీఁదఁ గళేబరంబు వైచి రయమునన్. (అను. 3-78)**

**క.** **కొమ్ములఁ గాళ్ళం బిండిగఁ । గ్రుమ్మి మగిడిపోయి పూసగ్రుచ్చిన గతి మున్**
**తమ్ముం బనిచిన గోవుల । కమ్ముని తెఱఁ గెల్లఁ జెప్పి హర్ష మొనర్చెన్. (అను. 3-79)**

# 51. సువర్ణమ సదృశ పావనతాస్పదము-

ఫేనవుడిని చంపిన గోవుల్ని రంతిదేవుడు చంపడం యజ్ఞమై ఉండవచ్చు,
అందరూ గోలోకానికి పోయి సుఖంగా ఉండడమనేది అంతరార్ధమూ కావచ్చు,
ఆవులు బ్రహ్మకు తొలిబిడ్డలు- సిద్ధులు సాధ్యులనే దేవగణాలకు తల్లులు ఆవులు.
కాలితో, పిడికిలితో, కర్రతో, మాటతో, మనసుతో ఆవును నొప్పించుట అశుభం.

చెవులు కొమ్ములు కన్నులు గిట్టలు ముక్కులు మెడ అందాలు ఎరుపు రంగులో
లేదా కొద్దిభాగమైనా, శరీరం మొత్తమైనా ఎరుపురంగులో ఉన్న అది కపిలగోవు.
కపిలగోవు పాలుపిండి తాగరాదు, గోవును బలికి వధించరాదు, బరువులు మోయించరాదు.
బ్రాహ్మణులు, గాయత్రి, వసంతకాలం, సత్యం, గోవులు, బంగారం -ఇవన్నీ

ఒకేచోటున పుట్టినాయందుకే భూమి, బంగారం, ఆవూ దానయోగ్య శ్రేష్ఠములు.
చంచలమైన సిరి కూడా గోవుల అనుమతితో వసిస్తున్నది వాటి పెండ యందు
భూమికి గోవులకు బదులుగా పిండప్రదాన సమయంలో సువర్ణదానం శుభకరం.
పరశురాముడు ఇరవై ఒక్కసార్లు క్షత్రియవధ చేసిన పాపాలు పోయాయి సువర్ణదానంతో.

ఆది గృహస్థుడైన పరమేశుని వీర్యం అగ్నితో కాల్చబడి మారింది బంగారమై-
అని, -అనిమిషితటినీ ప్రియ తనయుడైన గాంగేయుడు ధర్మరాజుకు చెప్పినాడు.
బంగారం తయారైన క్రమాన్ని, బంగారాన్ని దానం చేసి పరశురాముడు
క్షత్రియ వధా పాపం నుంచి విముక్తుడైన విషయాన్ని సవివరంగా-

---

క. 'భూమికి గోవులకునునై । హేమమిడుట యస్మదీయ హితమును దేవ
స్తోమ ప్రియముం బావన । తా మహనీయంబుఁ జుమ్ము ధర్మవిధిజ్ఞా! (అను. 3-134)

సీ. పరశురాముఁడు గిన్క నిరువది యొక్క మా । ఱదయుఁడై రాజుల వెదకి వెదకి
వధియించి, కృపపుట్టి వాజిమేధంబు । ప్రా । యశ్చిత్తముగఁ జేసి, యంతఁ దనివి
సనక వసిష్ఠాది మునివరేణ్యులఁ గూర్చి । 'కల్మష పంకంబు గడిగి పురుషు
నత్యంత విమలుఁ జేయంగ నెయ్యది యోపు?' ననిన వసిష్ఠుఁ డిట్లనియె నతని

ఆ. 'కనఘఁ విను సువర్ణ మగ్నిమయంబు దే । వతలు నగ్నిమయత నతిశయిల్లు
వారు గావునను సువర్ణదానంబు దే । వతల నీగి యట్ల శ్రుతులు సెప్పు. (అను. 3-138)

తే. కావున సువర్ణ మసదృశ । పావనతాస్పదము; దాని భక్తిమెయిన్ వి
ప్రావలి కిచ్చిన యతనికిఁ బావనతం గొఱఁత గలదె పావనమూర్తీ? (అను. 3-139)

- సువర్ణ మేవ సర్వాసు దక్షిణాసు విధీయతే
సువర్ణం యే ప్రయచ్ఛంతి సర్వదాస్తే భవంత్యుత (సం.అను. 84-55)

# 52. కప్ప, ఏనుగు, చిలుకలకు శాపమిచ్చిన అగ్నిదేవుడు-

గిరిజయు గిరీశుడు ఒండొరులకై తపమొనర్చి ఒక్కటైనారు.
ఆది గృహస్థుడి వీర్యతేజమొకనాడు అగ్నియందు దాచినాడతడు.
తారకాసురుని ధాటి కోర్వలేని దేవతలకు తరుణోపాయము చెప్పినాడు శివుడు.
వారు వెదుకుతూ వెళ్లినారు అగ్నికొరకు, అతడి దగ్గర నిక్షిప్తమైన తేజస్సు కొరకు

అగ్నిదేవుడు పాతాళాన దాగున్నాడని కప్ప ఒకటి దేవతలకు చెప్పగా
అగ్ని శపించినాడు- కప్ప నాలుకకు కదలిక ఉండదు, రుచులు తెలియరావు.
దేవతలు వరమిచ్చారు- వాన పడగానే, నీరు తగలగానే ఎండిన కప్పలూ బతుకుతాయని.
ఏనుగు కనుసైగతో చూపింది, రావిచెట్టులో అగ్ని దాగున్నాడన్న సంగతిని.

అగ్ని శాపమిచ్చాడు- ఏనుగులకు నాలుక తిరుగబడాలన్నాడు ఉక్రోషంగా.
అన్ని రుచులూ తెలుస్తాయని అభయమిచ్చారు ఏనుగుకు దేవతలంతా దీవించి
రావిచెట్టు నుంచి వెళ్లి జమ్మిచెట్టులో దాగున్న విషయం చిలుక చెప్పింది.
అగ్నికి కోపం వచ్చింది- ఎన్నిసార్లు చెడగొడతారు వీళ్లు నా నిద్రను -అని ఆగ్రహించి

'నీకూ నాలుక తిరగబడుతుందిలే చిలుకా!' అన్నాడు; దేవతలన్నారు చిలుకతో
-'నీ మాటలు వినసొంపుగా ఉంటాయిలే!' అని వరమిచ్చారు చిలుకకు.
అగ్ని అన్నాడు దేవతలతో- శివుడి రేతస్సును గంగలో వదుల్తున్నాను-
గంగ ఆ వెలిగే భారాన్ని మేరు పర్వతం దగ్గర, రెల్లువనంలో వదిలింది.

---

సీ. ఆతని యున్నెడ యారసికొని చను । నప్పు డాతంతడు నిద్రాతిశయము
నూని ప్రచ్ఛన్నుఁడై యుండుట వారలు । గానక యున్నంతఁ, గప్ప యొకటి
యగ్ని పాతాళంబునం దున్కి యెఱిఁగింప । నప్పావకుఁడు డాఁగి పిప్పలమున
కేఁగెడు నెడ శాపమిచ్చె జిహ్వాస్ఫూర్తి । లేక రసాలి వివేక మెడలి

తే. యుండెడుమ కప్ప లని బొక్కలెండ నెండి । చచ్చియును నీరు వచ్చినఁ జావు బొంకు
సేసి యెలుఁగులు సెలఁగఁగఁ జెలఁగ వరము । వారు కప్పల కిచ్చి రవార్యతేజ! (అను. 3-143)

క. అనలుని నన్వేషింపఁగ । వనగజ మొక్కండు రావివలను చతురతం
గనుగీటి చాపవార । వ్వనస్పతిం జేరఁజనఁగ వారని యలుకన్. (అను. 3-145)

ఆ. జిహ్వా మరలఁ బడఁగఁ జిలుకల నగ్ని శ । పించె; సురలు సెవుల కించునట్టి
పలుకు వాని కొసఁగి చిలుక నానందింపఁ । జేసి యా కృశానుఁ జేరఁ జనిన. (అను. 3-147)

- తయాచార్య్ భవన్మిశ్రః గర్భం చాస్యా దధే తదా
వవృధే స తదా గర్భః కక్షే కృష్ణగతిర్యథా (సం.అను. 85-56)

# 53. కుమార జననం-

ఆ తేజోరూప గర్భం నుంచి శరవణమనే రెల్లుతోటలో పుట్టినాడు
ప్రకాశవంతుడైన బాలుడు, ఆ బాలుడిని చూసిన ఆరుగురు కృత్తికలు
ఈ కుమారుడు నా కొడుకంటే, నా కొడుకని ముద్దుగా ఎత్తుకోగా
ఆరు ముఖాలవాడై, ఆరుగురి చనుబాలు త్రాగి పెరిగాడా బాలుడు.

అగ్నిపుత్రుడు, గంగా పుత్రుడు, కృత్తికాపుత్రుడు అనే పేర్లతో ప్రసిద్ధుడై
దేవతల సేనాధిపతిగా మహా శక్తి ఆయుధంతో చంపాడు తారకుడిని.
అనేక పర్యాయాలు గర్భరూపంగా జారినవాడు కనుక స్కందుడైనాడు.
ఎప్పుడూ కుమార రూపంతో కానవస్తాడు కనుక కుమారస్వామి –ఆ షణ్ముఖుడు.

బంగారమే స్వరూపంగా కలవాడు, తానే కుమారస్వామిగా పుట్టినవాడు
అగ్నిలో తన రేతస్సును భద్రపరచి వహ్నిరేతుడైనాడు శివుడు
బంగారమలా ఆదిదేవుని వీర్యమై అగ్నిలో జలంలో శుద్ధిచేయబడి
కృత్తికలచే ఆశీర్వదించబడి జాతరూపమన్న పేరు కాంచింది.

–'సువర్ణ దానం వలన నరుడు పొగలేని నిప్పులా ప్రకాశిస్తాడు' అని పలికిన
వసిష్ఠుని మాటలు విని పరశురాముడు అనేక సువర్ణదానాలు చేసి
పరిశుద్ధుడై విరాజిల్లినాడు అపార శుచిత్వ సంపదలతో చిరకాలం.
ధర్మజా! నీవుకూడా బంగారాన్ని దానం చేసి కీర్తిని సంపాదించుము –అన్నాడు భీష్ముడు.

---

**సీ.** **అనినఁ బ్రసన్నత 'నట్టులు చేసెద । నూఱడుం' డని వారి నూఱడించి**
**తనయందు వెలుఁగు శంభుని వీర్య మిడియె గం । గా గర్భరూపంబు గాఁగ నాతఁ;**
**దది యతి పరివృద్ధ మగుటయు ధరియింప । నోర్వక నిర్జర పర్వతంబు**
**తటమున శరవణస్థంబుగా యు । త్సృష్ట మొనర్ప నా శిఖరి సతరు**

**తే.** **వల్లరీగుల్మకముగ సువర్ణమయత । వెలుఁగ బాలుఁడై వెలిఁగె నవ్వీరగర్భ;**
**మచ్చటికి వచ్చి కృత్తిక లార్వురును మ । దీయ పుత్రకుఁ డనుచు నెత్తికొని రనఘఁ (అను. 3-150)**

**క.** **మహితాత్మక! యేతాదృశ । మహిమంబు సువర్ణ మది సమంచిత తేజో**
**మహనీయము తద్దానము । మహత్త్వ మా శివుఁడ యెఱుఁగు మాకుం జూడన్. (అను. 3-152)**

**క.** **ఆ రాకముందు శుచిత్వ । శ్రీ రాజితుఁడయ్యె; నట్లు సేయుము నీవుం**
**గౌరవముఖ్యా! యది భవ । పారావారఘన యానపాత్రము సుమ్మీ!' (అను. 3-154)**

**–** **అగ్ని మిత్యేవ తత్ ప్రాహుః ప్రదానం వై సుఖావహమ్**
**యథేష్టగుణ సంవృతం ప్రవర్తకమితి స్మృతమ్ (సం.అను. 85-161)**

# 54. శ్రాద్ధ విధి - పిండప్రదానం

భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు పితృయజ్ఞం గురించి
-మానవుడు తీర్చుకోవాల్సిన ఋణాలు అయిదు- బ్రహ్మయజ్ఞం
పితృయజ్ఞం, దేవయజ్ఞం, మనుష్య యజ్ఞం, భూతయజ్ఞం-
పితృయజ్ఞం ప్రతిదినమూ చేయాలి - అమావాస్య నాడు చేస్తే

ప్రతిరోజూ చేసినంత పుణ్యం. దీనిలో శ్రాద్ధవిధి ముఖ్యం.
చనిపోయిన వారికి ఉత్తమ గతులు కలగాలని కోరుతూ
చేస్తూ పిండప్రదానం -అన్నపు ముద్దలను దర్భలపై ఉంచడం
చనిపోయిన వ్యక్తి తండ్రి అయినట్లయితే మూడు అన్నపు ముద్దలు

చనిపోయిన వ్యక్తికి, అతడి తండ్రికి, తండ్రికి తండ్రికి చెందేలా
తల్లి చనిపోతే, ఆమె అత్తగారికి, అత్తగారి అత్తగారికి చెందేలా
వీరిలో ఎవరన్నా బతికి ఉంటే వారికి మాత్రం పిండం పెట్టకూడదు.
ఒకటి వసువు, రెండోది రుద్రుడు, మూడవది సూర్యరూపం

శ్రాద్ధవిధికి సరైన తిథులివి - పాడ్యమి నాడు శ్రాద్ధవిధి నిర్వహిస్తే
అందమైన అతివకు భర్తగా, విదియనాడు చేస్తే కన్యకల తండ్రిగా,
తదియ-అశ్వధనం, చవితి గోధనం, పంచమి-పుత్రధనం,
షష్ఠి-బుద్ధి ధనం, సప్తమి-రైతు ధనం; అష్టమి-వ్యాపార ధనం

---

సీ. పాడ్యమిఁ బితృయజ్ఞపరుఁడైనఁ జారుకాం । తాపతి; విదియఁ గాంతలకుఁ దండ్రి'
తదియను జవితిని దా వాజిధనికుండు । పశుభాగి పంచమి బహుసుతుండు,
షష్ఠి భానాత్ముండు, సప్తమిఁ గృషిభాగి, । యష్టమి వాణిజ్య పుష్టుఁడు, వసు
గజ ధర్మవిష్ణు చిత్తజ తిథులం । దేకశత జంతువులను గోచయముఁ గుప్య

తే. ములును దగ బ్రహ్మ వర్చస్వి పుత్రకులును । ధనము గలవాఁడు విను చతుర్దశి రణైక
భాగి పున్నమ నమవస భవ్య సర్వ । కామ్య ఫలభాగి యగుఁ జువ్వె కౌరవేంద్ర! (అను. 3-161)

క. అపరంబగు పక్షంబును । నపరాహ్ణము మేలు పితృసమర్చనమున కా
ద్యపుఁ విథి దశమి చతుర్దశి । నృపవర! యప్పక్షమునను నింద్యతఁ బొరయున్.' (అను. 3-162)

క. 'తిలపాయస ఘృతములు పితృ । కలనములకు నుత్తమములు; గవ్యంబు మహా
ఫల; మెదియైనన్ మత్స్యం । బులు మాంసము విహితవిధిఁ బ్రభూత ఫలంబుల్. (అను. 3-165)

- అపో మూలం ఫలం మాంసమ్ అన్నం వాపి పితృక్షయే
యత్ కించిన్మధు సమ్మిశ్రం తదానంత్యా య కల్పతే (సం.అను. 88-10)

# 55. శ్రాద్ధవిధి ఫలితాలు

నవమినాడు శ్రాద్ధ విధి నిర్వహిస్తే ఒంటిగిట్టలు గల పశుధనం,
దశమి నాడు ఆలమందలు; ఏకాదశినాడు–లోహ సంపదలూ,
ద్వాదశి నాడు–బ్రహ్మతేజస్సు గల పుత్రులు, త్రయోదశి–భాగ్యవంతుడు
చతుర్దశినాడు–యుద్ధం పొందేవాడు, పూర్ణిమ–అమావాస్యలకు సిద్ధిస్తాయి అన్ని కోర్కెలు.

కృష్ణ పక్షము, అపరాహ్ణము శ్రాద్ధానికి మంచివి; కృష్ణపక్షంలో
పాడ్యమి, దశమి, చతుర్దశి తిథులు మంచివి కావు.
నువ్వులు, పాయసము, నేయి, గవ్యములు, చేపలు, మాంసం
గొర్రె, ఖడ్గమృగం, గండభేరుండం, మేక మాంసాలు శ్రాద్ధకర్మకు మంచిది.

పితృకర్మ కృత్తికలో చేస్తే పగవారుండరు; రోహిణి–పుత్రలాభం,
మృగశిర–దేహబలం; ఆర్ద్ర–క్రూరత్వం; పునర్వసు–సేద్యఫలం
పుష్యమి–మంచి పుష్టి; ఆశ్లేష–గొప్ప కుమారుల ప్రాప్తి;
మఖ–వంశాభివృద్ధి; పుబ్బ–సౌభాగ్య విస్ఫూర్తి సిద్ధి; ఉత్తర–సంతానసిద్ధి.

హస్త–కార్యసిద్ధి; చిత్త–అందమైన పుత్రులు; స్వాతి–వర్తకాభివృద్ధి,
విశాఖ–మంచి పుత్రులు; అనూరాధ–పాలన; జ్యేష్ఠ–అధికార లాభం,
మూల–ఆరోగ్యం; పూర్వాషాఢ–అభివృద్ధి; ఉత్తరాషాఢ–శోక నివృత్తి
అభిజిత్తు–విద్యాభివృద్ధి; శ్రావణం–మోక్షం; ధనిష్ఠ–రాజ్యం

---

**సీ.** **కార్తెఁ బైతృక మగు కర్మ మొనర్ప ని । ష్కృత్రుత, రోహిణిఁ బుత్ర లబ్ధి,**
**శశితారకమున నోజఁ ప్రాప్తి యార్ద్రఁ గ్రూ । రపు వర్తనము, పునర్వసువు నందుఁ**
**గృషి ఫలోదయ, మనిమిష గురుతార సు । పుష్టి, యాశ్లేష నుత్కృష్ట వీర**
**తనుజ లాభము, మఖం దనకులమున పెంపు, । పుబ్బ సౌభాగ్య విస్ఫూర్తి సిద్ధి,**

**తే.** **యర్యమునితారఁ బెక్కపత్యములు పుట్టు, । హస్తమునఁ గర్మసఫలత, యవులతార**
**సుందరాకార యుతులగు సుతులఁ గనుట, । యనిలతార వాణిజ్య వర్ధనము గలుగు. (అను. 3–168)**

**సీ.** **వినుము విశాఖ సత్తనయ బహుత్వ మ । నూరాధ రాజాధికార, మైంద్ర**
**మునఁ బ్రభుత్వము పెంపు; మూలఁ బూర్వాషాఢ । నారోగ్యమును నుత్తమాతిశయము,**
**నుత్తరాషాఢ శోకోదయ రహితత్వ, । మభిజిత్తునందు విద్యాభియుక్తి,**
**శ్రవణ కాలమునఁ బరమ గతి సిద్ధి, ధ । నిష్ఠ రాజ్యము, జలనిధిపతార**

**తే.** **మొదలుగాఁ దారకంబులు మూఁట నఖిల । కార్యఫలములు, సదజావికములు గోవు,**
**లవుల మూఁటను గుప్య వృద్ధ్యశ్వకాయు । వులు శుచి శ్రాద్ధకర్తకుఁ గలుగు నధిప!' (అను. 3–169)**

# 56. పంక్తి భోజనాలు

శతభిషలో కార్యఫలం; పూర్వాభాద్ర–మేక, గొర్రెల వృద్ధి;
ఉత్తరాభాద్ర–గోసంపద; రేవతి–లోహ సమృద్ధి; అశ్వని–గుర్రాలు;
భరణిలో ఆయువు లభిస్తాయి నిర్మలుడైన శ్రాద్ధకర్తకు.
దైవిక కృత్యాలలో భూసుర శోధన అక్కర్లేదు కాని పితృయజ్ఞంలో అవసరం.

కుల వయో రూప శీల విద్యలలో ఉదాత్తమైనవారు పంక్తి పావనులు
జూదరి, విషం పెట్టేవాడు, వేదం చదవనివాడు, వడ్డీవ్యాపారి
గాయకుడు, కరణం, ఇళ్లు కాల్చేవాడు, కుష్ఠురోగి, క్షయరోగి
అన్ని వస్తువులు అమ్మేవాడు, సోమం అమ్మేవాడు, సముద్ర వ్యాపారి

రాజోద్యోగి, భార్య తాను కొడుకులను పంచుకున్నవాడు; పశువుల
వ్యాపారి; మోసం–దొంగతనం–శిల్పపు పనులతో బ్రతుకు సాగించేవారు
–పంక్తి దూషకులు; అంతేకాక– తలకు వస్త్రం చుట్టుకుని, చెప్పులు
తొడుక్కుని భోజనం చేద్దామనుకునేవారు పంక్తి భోజనాలకు అనర్హులు.

శాంతుడు, వ్రతశీలుడు, దాంతుడు, వేదం బోధించేవాడు,
దయామయుడు, జ్ఞాని, వ్యాకరణ, ధర్మ, పురాణ, పరమాత్మ జ్ఞానులు
వీరందరూ పితృకర్మలో పంక్తిభోజనాలకు తగినవారు–
అత్రి మహర్షి కూడా కొన్ని శ్రాద్ధ నియమాలను చెప్పాడొక సందర్భంలో

---

**సీ.** **జూదరి గరదుండు వేదంబు సదువని । వాఁడు వడ్డికి నిచ్చువాఁడు గాయ**
**కుండు గ్రామము పనిఁ గుడుచునాతఁడు గృహ । దాహి కుష్ఠము గల తనువు నాతఁ**
**డఱుఁ దెవుల్ గొన్నాతఁ డఖిల వస్తువులును । నమ్మెడు నతఁడు సోమమ్ము విక్ర**
**యించిన యతఁ డబ్ధి సంచార లాభోప । జీవకుం దుర్వీశ సేవకుండు**

**తే.** **భార్యయును దాను బుత్రులఁ బంచికొన్న । వాఁడు పసులఁ బెక్కెలెడువాఁడు కపట**
**కృత్యముల ముచ్చిమిని శిల్పకృతుల బ్రదుకు । వారు పంక్తిదూషకు లంద్రు పౌరవేంద్ర!' (అను. 3–175)**

**క.** **'తలఁ జీరసుట్టియును జె । ప్పులు దొడిగియుఁ జేసినట్టి భోజనము ఫలం**
**బలఘుచరిత! జద్మజుఁ దసు । రల భాగం బని విధించెఁ బ్రకటఫణితులన్. (అను. 3–177)**

**తే.** **పలుదెఱంగుల వంటకంబులఁ బ్రమాద । జాతమై యశుచిత్వంబు సంభవించి**
**నప్పు డసురులు గొంద్రు క్రియా ఫలంబుఁ; । దిలలు పైఁ జల్ల నశుచిత దొలఁగు నండ్రు. (అను. 3–178)**

**క.** **శాంతుడు సువ్రతశీలుడు దాంతుండధ్యాపకుండు దయగలవాఁ డ**
**త్యంత ప్రబోధ సంపద్వంతుడు పావనులు భూపవర! పంక్తులకున్ (అను. 3–179)**

# 57. అత్రి మహర్షి చెప్పిన శ్రాద్ధ విధులు

బ్రహ్మదేవుడి మానస పుత్రుడు అత్రి మహర్షి; అత్రి పుత్రుడు దత్తాత్రేయుడు.
దత్తాత్రేయుడి కుమారుడు నిమి; నిమి కుమారుడు శ్రీమంతుడు.
శ్రీమంతుడికి శ్రాద్ధం పర్యవేక్షించేందుకు వచ్చాడు అత్రి మహర్షి.
దర్భ ఆసనాలు కుడివేపు మలిగి ఉన్నాయి, విస్తారంగా వాడినారు నువ్వులు.

-మునగ, ఉల్లి, అడవి మునగ, చెదుమాంసాలు, సొరకాయ, జీలకర్ర
మలినమైన ఉప్పు, కరివేపాకు, గురజాకు, ఇంగువ వాడలేదనీ గమనించాడు.
చుట్టుపక్కల కుక్క, ముట్టుత, భ్రష్టుడు, శూద్రుడు లేకపోవడం
చూసి, నిమికి తెలియజేసాడు పితృదేవతల పేర్లు వరుస క్రమంలో-

విశ్వదేవతలు, పితృదేవతలకు శ్రాద్ధకర్మ ఫలాలలో భాగాలనేర్పాటు చేసి
శ్రాద్ధసమయంలో తుమ్మడం, ఏడ్వడం నియంత్రించాలని పలికాడు.
గడ్డి పంటల ధాన్యాలు, నేరేడుపండు, ఆరుగలు శ్రాద్ధానికి వాడకూడదు.
జంధ్యాన్ని సంధ్యావందనం, యజ్ఞ సమయాల్లో ఎడమభుజం మీద,

ఉపవీతస్థితిలో, శ్రాద్ధకర్మల సమయంలో కుడిభుజం మీద
ప్రాచీనావీతస్థితిలో, దేహధర్మాలప్పుడు దండలా, నివీతస్థితిలో
ఉంచుకోవాలి; చనిపోయిన జీవికి ప్రేతభావం నశిస్తుంది
పిండం పెట్టినపుడు; గయాక్షేత్రంలో పిండప్రదానం అత్యంత పుణ్యదాయకం.

---

**క. కావున సాగ్నికుఁడయి తగ । నే వాఁడొనరించు శ్రాద్ధ మీద్యం బది; సం**
**భావింతురు పెద్దయుఁ బితృ । దేవత లసురులకు రాదు తేఁటియుఁ జూడన్. (అను. 3-198)**

**ఆ. అనఘ! పితృపితామహ ప్రపితామహ । పూజనములు శిష్ట పూర్వకముగఁ**
**జేయవలయు నియతి దాయ దొడ్డిన జన్ని । దంబుతోడ భక్తిధామ మగుచు. (అను. 3-199)**

**తే. పిండ సంబంధమునఁ బాయుఁ బ్రేతభావ । మది సుగతి నిచ్చు; గయఁ బిండ మట్టు గాన**
**నరుగునో గయ కొకఁ డైన నని కదా య । నేక పుత్త్రులఁ గోరుదు రిద్ధచరితఁ (అను. 3-200)**

**క. గౌరి యగు కన్య వరదా! నా రూఢం జేఁత; నీలమైన వృషభమున్**
**గారవమున విడుపు ముదం । బారంగాఁ జేయుఁ బితృచయము చిత్తములన్. (అను. 3-201)**

**క. శ్రాద్ధంబు ప్రకారంబును । వృద్ధా చార్యోక్తభంగి వివరించితి; నీ**
**బుద్ధిం దోఁచినదాని స । మిద్ధ గుణోదార! యడుగు మెయ్యది యైనన్.' (అను. 3-202)**

**- వర్జయే ల్లవణం సర్వం తథా జంబూ ఫలాని చ**
**అవక్షుతా వరుదితం తథా శ్రాద్ధేషు వర్జయేత్ (సం.అను. 91-41)**

# 58. సప్తర్షులు-వృషాదర్భి రాజు

భీష్ముడన్నాడు- ఎన్నో రోజులు పస్తులుండడం తపస్సు కాదు
అది ఆత్మహింస. తపస్సంపద ఆకారాలివి- బ్రహ్మచర్యం, సత్యం
శుచి, మౌనం, నిష్ఠ, భూతదయ, మచ్చలేని త్యాగం. ధర్మరాజు అడిగాడు-
దానశీలుడి విశేషమూ, దానం పుచ్చుకోనివాడి ప్రత్యేకత చెప్పమని-

భీష్ముడు చెబుతున్నాడు- సప్తర్షి గణంతోపాటు వసిష్ఠుని
భార్య అరుంధతి, 'గండ' అనే పరిచారిక, ఆమె భర్త పశుసఖుడు
ఎల్లప్పుడూ కలిసి వన సంచారం చేస్తుండేవారు, తపస్సు చేసేవారు.
ఒక ఏడాది భయంకరమైన కరువు వచ్చింది అనావృష్టి వలన.

శిబి కొడుకు యాజ్యుడు ఒకప్పుడు ఋత్విక్కులకు దానమిచ్చాడు
యాజ్యపుత్ర నీలుడిని, ఆ నీలుడు మరణించాడు కరువుకాలంలో.
చితి మీద ఉన్న శవాన్ని చూసి అక్కడున్నవారి ఆకలి ఎంత
ఎక్కువైందంటే వాళ్లు శవాన్ని తిని ఆకలి తీర్చుకోవాలనుకున్నారు.

ఇంతలో వేటకు వెళ్లి అటుగా వచ్చిన వృషాదర్భి అనే రాజు
ఋషులతో అన్నాడు- రుచికర పదార్థాలు, గుర్రాలు, బండ్లు,
ఆవులు, ధాన్యాలు అధికంగా ఉన్న ఊళ్లిస్తాను; తీసుకుని ఆకలి తీర్చుకోండి.
వాళ్లన్నారు- రాజు నుంచి తీసుకోవడం మాకు విషంతో సమానం.

---

**తే. వేఁట వోయి మరలి విభుఁ డొక్కరుఁడు వృషా । దర్భినాముఁ డతుల దానపరుఁడు**
**పోయి పోయి కాంచి, పోవక నిలిచి, య । మ్మునులతోడ నధిక వినయ మొసఁగ. (అను. 3-211)**

**క. 'మీ రాఁకలి పెల్లున నా । హారంబుగ శవముఁ గొనుట కడరితి; రిట్లే**
**లా? రం డిచ్చెద మీ కా । హారంబులు వలసినట్టి' వని తా మతియున్. (అను. 3-212)**

**క. బహువిధముల ధాన్యములును । బహు రసవర్గములు మీకు భక్తి నొసఁగెదన్**
**బహుతురగ శకట గోగణ । బహుళ బహుగ్రామములును బహుమతి నిత్తున్.' (అను. 3-213)**

---

**నరమాంస భక్షణ :** ప్రతిమనిషి ఒకప్పటి నరమాంస భక్షకుల వంశస్థుడే. యుద్ధకాలంలో, కరువు కాటకాల సమయంలో, తెగల ఘర్షణలలో, విమాన ప్రమాదాలలో బతకడానికి వేరే దారి లేనప్పుడు జనులు అన్ని దేశాల్లోనూ నరమాంస భక్షణ చేసారు. 1199-1202లో ఈజిప్టు కరువుతో అల్లల్లాడగా జనులు నరమాంసం తిన్నారు. ఫిజి ద్వీపాల్ని Cannibal Isles అనేవారు. పాపువా న్యూగినిలో 2012లో కూడా ఆచార మంత్రతంత్రాలతో నరమాంస భక్షణ చేసారు. మెలనోషియన్ తెగలలో సర్వసాధారణం. 1972లో ఉరుగ్వే విమానం-571 కూలిపోయినపుడు బతికినవాళ్లు చనిపోయినవాళ్లను తిని బ్రతికారు. కరువు కాలంలో పిల్లల్ని చంపి వండుకుతినడం యూరప్ రికార్డులలో ఉన్నది. మహాభారతంలో నరమాంస భక్షణ అనేక ఘట్టాలలో కనిపిస్తుంది.

# 59. అగ్నిగుండంలోంచి పుట్టిన కృత్తి రాక్షసి

వృషాదర్భి రాజు బాధపడినాడు, అయినా కాస్త ఆలోచించి పంపినాడు
కృత్రిమ ఫలాలను, లోపల బంగరు కణికల నుంచి, సువర్ణ దానంగా-
అన్నదానమే వద్దన్నవాళ్లు, సువర్ణ దానం తీసుకుంటారా, పళ్లబుట్ట
బరువు చూసి, కాయల్లో బంగారం ఉందని అనుమానించి తిప్పి పంపినారు రాజుకు.

వృషాదర్భి రాజుకు రాజసంతో కోపం వచ్చింది- యాగం చేయించాడు,
కృత్తియాగం - హోమంలో పుట్టుకొచ్చిందో భయంకర రాక్షసి.
'కశ్యపాదులను ముక్కలు ముక్కలుగా నరుకుము' -అని ఆజ్ఞాపించాడు రాజు.
ఈలోగా ఆ పదిమందితో కలిసాడు శునస్సఖుడనే మునివర్యుడు.

అందరూ శవభక్షణ వద్దనుకుని ఓ కొలను వద్దకు వచ్చారు తామర తూండ్లు
తిందామని, వారి కడ్డువచ్చింది కృత్తిరాక్షసి, కత్తి తీసింది, పెద్దగా అరిచింది-
ఈ చెరువు నాది, లోపలకు వెళ్లాలంటే మీ పేరు చెబితే పంపుతాను.
వాళ్లు పదిమందీ తమ పేరునే మార్చి చెప్పారు, శునస్సఖుడు తనపేరే చెప్పాడు.

రాక్షసి అతడిని ఆపి చావగొట్టబోయింది, శునస్సఖుడు మంత్రాలు చదువుతూ
మంత్రదండాన్ని ప్రయోగించి కృత్తి రాక్షసిని భస్మీపటలం చేసాడు.
అందరూ సరస్సులోకి ప్రవేశించి తామర తూదులు పెరికి కట్టకట్టి ఒడ్డుపై ఉంచి
స్నానం చేసి వచ్చేసరికి అక్కడ తామర తూండ్ల కట్ట కనిపించలేదు.

---

క. విని యతఁడు రాజసంబున । గనలు వొడమి కృత్తి వేల్వఁగాఁ దగువారిం
బనిచిన నప్పుడు హోమం । బున రాక్షసి యోర్తు పుట్టె భూపవరేణ్యా! **(అను. 3-219)**

తే. బిసము లాదట నందఱుఁ బెఱికి రొంపి । వోవ నీటఁ దెమల్చి మోపుగ నమర్చి
తీరమునఁ బెట్టి నియమముల్ దీర్పఁజొచ్చి । తీర్చి యాఁకలి దముఁ గోసి తినఁగఁ గూడి. **(అను. 3-223)**

క. కొలను వెడలి బిసము లిడిన । నెలవునకుం బోయి యచట నిగిడించిన చూ
డ్కుల కవి దోఁపక యున్నను । గలయం బరికించి యెట్లుఁ గానక తమలోన్. **(అను. 3-224)**

తే. 'మొదవుఁ దన్నుట, రవియభిముఖత దనకుఁ । గలుగు మూత్ర పురీష మోక్షణము సేఁత,
యధ్యయన మనధ్యయనమునందు నడపు । టగు బిసంబులు ముచ్చిలి నట్టు లైన.' **(అను. 3-226)**

క. శ్రుతి సదువమి; సన్న్యాస । స్థితిఁ గాముకుఁ దగుట; గుక్కఁ జేకొని తిరుగన్
మతి రోయమి నయ్యెడు దు । ర్గతి తూఁడులు ముచ్చిలించు కష్టునకు నగున్.' **(అను. 3-228)**

క. 'సుత నమ్మికొనుట, శరణా । గతుఁ జేకొనకునికి నిచ్చు కారుణికు దరి
ద్రతఁ జూచియు వేఁడుట నగు । గతి బిసములు దాఁచికొనుట గల్గినఁ గల్గన్.' **(అను. 3-230)**

# 60. తామర తూండ్ల దొంగతనం

పదిమంది పది ఒట్లు వేసుకున్నారు మధ్యవర్తిగా శునస్సఖుడి నుంచి-
అత్రి అన్నాడు- తామరతూండ్లను దొంగిలించినది నేనైతే నాకు
ఆవును తన్నిన పాపం, సూర్యుడికెదురుగా నిలబడి మూత్రపురీషాలు
విడిచిన పాపం, చదవకూడని రోజున వేదాలు చదివిన పాపం తగులు గాక!

వసిష్ఠుడన్నాడు- వేదం చదవనివాడి, కాముకుడి పాపం, శునక సావాసం,
కన్న కూతుర్ని అమ్మినవాడు, శరణాగత రక్షణం చేయనివాడి పాపం తగులు గాక!
కశ్యపుడన్నాడు- మాంసం వ్యర్థంగా తినడం, తప్పుడు సాక్ష్యం పలకడం
చెడు దానం, పగటి రతి, లోభి, వ్యాపారమోసాల దోషం తగులు గాక!

భరద్వాజుడన్నాడు- ధర్మం తప్పినవాడు, ఇతరులను పట్టించుకోనివాడు
హవిస్సును పారబోయడం, గురువును తక్కువ చేసేవాడి దోషం తగులుగాక!
జమదగ్ని అన్నాడు- ముట్టైన భార్యను కలవడం, నీళ్లలో విసర్జించడం
పగతో రగలడం, పాడి ఆవును కొట్టడం వలన వచ్చే పాపం తగులు గాక!

గౌతముడన్నాడు- వేదవిద్య, అగ్నిహోత్రాలను వదలివేయడం, సోమం
అమ్మడం, శూద్ర స్త్రీని పెండ్లాడడం, చెడ్డ ఊరిలో జీవించడమనే పాపాలు తగులు గాక!
విశ్వామిత్రుడన్నాడు- పనికి వచ్చే సేవకులను పారద్రోలి, పనికిరాని
పరిచారకులను కాపాడడమూ, కపట వర్తన దోషాలు తగులు గాక!

---

**చ.** **'పలలవృథోపభుక్తి, సభఁ బక్షముఁ బల్కుట, దుష్టదాన, ము**
**గ్మలి దివసంబునం గవయు కష్టత, విప్రజనంబు లుబ్ధతా**
**కులితముఁ జేఁత, యెల్లసరకుం గొని యమ్ముట కాదె తూఁడు తీఁ**
**గలపొది ద్రుచ్చిలించు' టని కశ్యపసంయమి వల్కె భూవరా! (అను. 3-232)**

**క.** **జ్ఞాతులయెడ గోవులయెడ । గోతులయెడ ధర్మ మెడలి క్రూరుఁ డగుట కా**
**ర్యాతుర విప్రోపేక్షా । నీతి బిసము లపహరించు నిపుణత యరయన్. (అను. 3-234)**

**క.** **అని పలికి భరద్వాజుం । డను మఱియు 'హవిస్సు గ్రంప నగ్ని నిడుట, యొ**
**జ్ఞ నధఃకరించి చదువుట । యను నివి సరియౌ బిసాపహరణంబునకున్.' (అను. 3-235)**

**క.** **అని జమదగ్ని మఱియు ని । ట్లను 'నన్యోన్యాతిథిత్వ మసహాయపువై**
**రనిరూఢి, పాఁడి మొదవుం । గనలి యడుచు టీడె బిసనికర చోరతకున్. (అను. 3-238)**

**క.** **'తగు భృత్యులఁ బ్రోవకునికి । దగని భటులఁ బ్రోపు కపటధార్మికవృత్తిన్**
**జగతీపతిఁ గొల్చుట లె । స్సగఁ బోలఁగ నేర్చునే బిసస్తైన్యంబున్?' (అను. 3-242)**

# 61. లోభగుణం లేకుంటే వచ్చే లాభాలు

అరుంధతి అన్నది- అత్తను తిట్టేది, భర్తను అనుమానించేది, మంచి
భోజనం తాను తినేది అటువంటి వాళ్ల పాపాల ఫలం తగులు గాక!
'గండ' అన్నది- వంచకురాలు, అబద్ధాల కోరు పాప ఫలితం తగులు గాక!
పశుసఖుడన్నాడు- సంతానం లేనివాడిగా, గర్భదాసుడిగా పాపాలు తగులు గాక!

శునస్సఖుడన్నాడు- ఈ తామర తూడుల దొంగతనం నిజానికి
తన కూతురుని వేదవేత్తకో, యజ్ఞవేత్తకో ఇవ్వడానికి సమానమగును గాక!
ఆ పదిమంది అన్నారు- మేము పాపాల మీద ఒట్టుపెట్టుకున్నాము,
నీవు పుణ్యంతో సమానం చేసావు దొంగతనాన్ని, నీవు మామూలు వాడివి కావు!

శునస్సఖుడన్నాడు- అవును, నేను ఇంద్రుడిని; మీమీదకు వృషాదర్భి రాజు
కృత్తి రాక్షసిని పంపగా దానిని భస్మం చేసాను. మీరు పరీక్షలో నెగ్గారు.
మీకు లోభగుణము లేనందువల్ల సిద్ధించాయి గొప్ప పుణ్యలోకాలు-
అని పలికి దేవేంద్రుడు వారినందరిని తనతో తీసుకువెళ్లినాడు.

ధర్మరాజడిగాడు- తాతా! శ్రాద్ధాదులలో గొడుగులు, చెప్పులు
దానం చేయడం చాలా మంచి విషయంగా చెబుతారు కదా!
దానికేమన్నా పూర్వ వృత్తాంతం ఉన్నదా అనగా శరతల్పగతుడైన
శాంతనవుడు చెబుతున్నాడు సూర్య జమదగ్నుల సంవాదము.

---

క. 'సతతంబు నత్త దూఱుటఁ, బతియెడ దుశ్చిత్త యగుటఁ, బరమాన్నము నొ
కృత సేవించుట నగు దు । ర్గతి బిసములు డాఁచికొన్న కష్టకుఁ గలుగున్.' (అను. 3-244)

క. 'ఛందోజ్ఞున కైనను, దన । నందన నధ్వర ధురీణునకు నైనను నా
నందముగ నిచ్చుటం బో । లుం దూఁడులకట్ట ముచ్చిలుట దలపోయన్.' (అను. 3-247)

సీ. అనిన 'నిక్కం బిది యందఱు నొండొరు । నేమనియెదరొ? వీ రీబిసముల
పొది యేను డాఁచి చూచెద నని డాఁచితి; । నిదె కొనుఁ' డని దాని నిచ్చి, మీకు
నలిగి వధించుటకై హోమవహ్నిఁ బు । ట్టించి వృషాదర్భి పంచెఁ గృత్తి;
నది మున్న కాంచి రక్షార్థినై వచ్చి యా । రక్కసిఁ జంపితి; నిక్కమునకు

ఆ. వాసవుండ; లోభవర్జనముఖ భవ । త్స ద్గుణములఁ జేసి శాశ్వతంపు
నెలవు గలిగెఁ; రండు నెగయుండు పుణ్యలో । కముల' కని సమాదరమునఁ బలికె. (అను. 3-249)

- మహర్షే శిరసస్త్రాణం ఛత్రం మద్రశ్మివారణమ్
ప్రతి గృహ్ణీష్వ పద్భ్యాం చ త్రాణార్థం చర్మపాదుకే (సం.అను. 96-14)

# 62. గొడుగు-చెప్పల కథ

జమదగ్ని తన భార్య రేణుకతో కలిసి అడవికి వెళ్లాడు.
అతడు బాణాలు వేసి కాయలు రాలగొడ్తున్నాడు, ఆమె వెళ్లి
కింద పడిన బాణాలు, కాయలు, పండ్లు తీసుకుని వస్తున్నది.
ఈసారి అతడు వేసిన బాణం చాలా దూరంగా వెళ్లి పడింది.

అప్పటికే సూర్యుడు చేరుకున్నాడు నడినెత్తికి, ఎండలో, ఇసుకలో
నడుచుకుంటూ బాణాన్ని తీసుకువచ్చేప్పటికి ఆమె పాదాలకు బొబ్బలెక్కాయి.
కందిన ఆమె పాదాలను, చెమటలు కక్కుతూ అలసి ఉన్న రేణుకను
చూసాడు జమదగ్ని, అతడికి అంత ఎండ కాసిన సూర్యుడిపై వచ్చింది కోపం.

మామూలు బాణాల ఆట మాని దివ్యాస్త్రాలు స్మరించి సూర్యుని గర్వమణచాలని
అతడు ధ్యాన సమాధిలోకి పోయేసరికి భయపడినాడు సూర్యుడు
బ్రాహ్మణ రూపంలో వచ్చి అన్నాడు జమదగ్నితో- నీవు అగ్నివే కదా
సూర్యుడి వెలుగు వేడి లేకుంటే వర్షాలు రావు, ఓషధులుండవు సుమా!

జమదగ్ని కోపం తగ్గలేదు- అవును నేను జమదగ్నినే, సూర్యాగ్ని
తగ్గకపోతే ఊరుకోను; అప్పుడు సూర్యుడు సంకల్పమాత్రాన సృష్టించాడు
ఆతపత్రమనే గొడుగును, ఉపానత్ ద్వంద్వమనే చెప్పులను.
జమదగ్ని-రేణుకలు ఆనందపడినారు వాటిని చూసి, అవి వ్యాపించాయి జగమంతా.

---

**చ.** **అనినఁ బ్రశాంతుఁడై తపను నా భృగుముఖ్యుఁడు ప్రీతి గారవిం**
**చినఁ బ్రమదంబునన్ గొడుగుఁ జెప్పులు మానసవృత్తిఁ దెచ్చి య**
**మ్ముని కడఁ బెట్టి, యత్తరణి ము న్నివి లేవని పల్కి దీన మైఁ**
**దనుకదు, వీనఁ బాదములఁ దాఁకదు నాదగు వేఁడి యేమియున్. (అను. 3-263)**

**మ.** **నయ మిట్లారఁగ నాతపత్రము నుపానద్ద్వంద్వముం జూపి చె**
**ప్పి యపూర్వంబగు సృష్టిఖేలనమునం బెంపారు నవ్వస్తువుల్**
**దయ సద్విప్రున కీగి యైహిక సుఖౌదాత్త్వంబు నాముష్మిక**
**ప్రియమున్ దాతకు సుస్థిరంబులుగఁ గల్పించున్ మునీంద్రోత్తమా! (అను. 3-264)**

**మ.** **అనినన్ మో మలరన్ దినేశ్వరునిఁ దా నామంత్రితుంజేసి య**
**మ్మునిశార్దూలుఁడు వల్లభాసహితుఁడై మోదంబునం దేలుచుం**
**జనియెన్ నాఁడు జనంబు లెల్లను బ్రహర్షం బందుచున్ వానిఁ గై**
**కొని రవ్వస్తువు లిట్టి వేర్పడఁగ నీకుం జెప్పితిన్ భూవరా! (అను. 3-265)**

# 63. శుచి - శుభ్రతలు

దినకర చిత్త స్పష్టములు, దివ్యమునీశ్వర లాలితంబులయినటువంటి
ఈ గొడుగు–చెప్పులను అవసరమున్నవారికి దానం చేస్తే లభించును పుణ్యము
–అని భీష్ముడు చెప్పగా ధర్మజుడు అడిగాడు– శూద్ర ధర్మమేది?
భీష్ముడన్నాడు– బ్రాహ్మణుడికి అధ్యయనము, రాజుకు శౌర్యము

వైశ్యునకు వాణిజ్యము, శూద్రునకు సేవకత్వము గొప్ప ధనాలు.
స్వధర్మాన్ని విడిచిన వారికి ఇహ పరాల్లోనూ, కలుగుతాయి దుర్గతులు.
మానవులు పాటించాల్సిన ధర్మాలలో ముఖ్యమైనవి శుచి శుభ్రతలు.
మలమూత్రాలు వదిలేప్పుడు రాత్రివేళ దక్షిణ దిక్కుగా, పగటివేళ

ఉత్తర దిక్కుగా; సంధ్యా కాలాల్లో ముఖం ఉంచాలి ఉత్తర దిక్కు వేపు
తరువాత మట్టితో తుడుచుకుని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి.
బ్రాహ్మణుడికి జపమే యజ్ఞం, అధ్యయనమే బ్రతుకు తెరువు
క్షత్రియుడికి దండనీతి, వైశ్యుడికి అమ్మకం, శూద్రుడికి సేవకావృత్తి

బ్రతుకు తెరువులుగా గ్రహించి నడుచుకొనుట ధర్మవిదితం.
ఇతరుల సొమ్ముకాశపడరాదు, అహింస పరమ ధర్మంగా పాటించాలి.
జంతు హింసకు, వధకు ప్రాయశ్చిత్తాలు చేసుకోవడ మావశ్యకం.
మద్యపానము, గురుతల్ప గమనము ఘోర పాపములు, ప్రాయశ్చిత్తం లేనివి.

---

**సీ.** **కరుణాఢ్యుఁడగు పరాశరమునివరుఁడు శి । ష్యులకు నిట్లను నింద్రియోత్కరంబు**
**గెలిచి యంతశ్శత్రుకులమైన కామాది । వర్గంబు నోర్చి గర్వంబు వదలి**
**త్రైవర్ణికులయెడ భావంబు భక్తిమ । యంబుగా శుశ్రూష యాచరించి**
**శూద్రుఁ డైహిక సుఖసుగతులఁ బడయు వే । దాధీతితపముల నాచరించె**

**ఆ.** **నేని నుభయలోక హీనాత్ముఁడగు భూమి । సురనృపాల వైశ్య శూద్రులకును**
**నధ్యయనము, బలసమగ్రత, వాణిజ్య । మనుచరత్వ మధిక ధనము లరయ. (అను. 3-272)**

**ఆ.** **అస్థి కలిగి హీనమగుజంతు వైనఁ ద । ద్విగుణవృత్తి వలయుఁ బ్రగుణజంతు**
**వునకు నలుమడించుకొనునది నరమాత్ర । హింస యష్టగుణ కృతీహఁ బాయు. (అను. 3-298)**

**–** **సాగర స్యోర్మి సదృశాః విజ్ఞా తవ్యా గుణాత్మకాః**
**విద్యాదేవం హి యో ధీమాన్ తత్త్వవిత్ తత్త్వ దర్శనః**
**న సలిప్యే త పాపేన పద్మపత్ర మి వాంభ సా (సం. అను. 96)**

# 64. పక్వఫలము తొడిమ బాయు పగిది-

పరాశరుడు చెప్పిన అరిష్టాల గురించి భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు
-దక్షిణం వేపు చూస్తూ ఉత్తరాన నిలబడ్డ బంగారు రంగు మనిషిని చూసినవాడు
చనిపోతాడు మూడేళ్లలో; సూర్యబింబం కాంతి తప్పినట్లు కానవస్తే
మృతి నొందుతాడు రెండేళ్లలో; తన నీడలో రంధ్రాలున్నట్లు వెన్నెలలో

కనబడినవాడు సంవత్సర కాలంలో చనిపోతాడు; తల లేని తన నీడను-
చూస్తే ఆరు నెలలలో, చెవులను చేతుల్తో గట్టిగా మూసుకున్నపుడు
నాదం వినరాకపోతే నెలనాళ్లలో పొందుతాడు చావు. చెవులు ముక్కు
పట్టు కదలి వికృత వర్ణాలు పండ్లలో కళ్లలో కానవస్తే మరణిస్తాడు ఆరోజే!-

అనిత్యత, జనన మరణ క్లేశాలు, దుఃఖ బహుళత, సుఖ స్వల్పత్వంతో కూడినది
ఈ సంసార సముద్రం, దీనిపై మమకారం ఉండదు వివేకవంతుడికి.
పంచ మహాయజ్ఞాలైన బ్రహ్మ, భూత, మనుష్య, దేవ, పిత్ర యజ్ఞాలు చేసి
బంధాలను తెగగొట్టుకుని, సాంఖ్యయోగాల సాయంతో ముక్తినొందుట ముఖ్యం.

భిక్షాటన చేస్తూ, రాగద్వేషాలు వదలి, ద్వంద్వ విముక్తుడై, అహంకార
మమకారాలను రూపుమాపి, గమ్యం లేకుండా తిరుగుతూ, బాగా పండిన పండు
తొడిమ నుండి రాలిన విధంగా, త్రిగుణాలకు నెలవైన దేహాన్ని వదిలివేసి
శుద్ధ భావ సచ్చిదానందాత్మక శాశ్వత పదాన్ని పొందుతాడు సన్న్యాస జీవనుడు.

---

సీ. పుణ్యంబులైన యరణ్యంబులను శూన్య । గృహముల దేవతాగృహములందు
గుహలను నిలుచుచుఁ గుడుపు భిక్ష నొనర్చి । యొకచోట మరగక యొల్లమియును
వలపును నెడలి నిర్ద్వంద్వత పాటించి । మమత యహంకృతి మాని నిత్య
తృప్తాత్ముఁడును జనాధీనత్వరహితుండు । నై గమ్యదిశ యొక్కఁ డనఁగ లేక

ఆ. మెలఁగుచుండి పక్వఫలము తొడిమఁ బాయు । పగిది గుణచయంబుఁ బాసి యక్ష
యంబు నచలమును నిరామయంబును నగు । పదముఁ జెందు శుద్ధభావ మెసఁగ. (అను. 3-312)

సీ. బోధ మక్షీణపాపునకుఁ గల్గదు సద్గు । రుండు సెప్పంగ సంశ్రుతములైన
పనులఁ బాపంబులు వాసిన నిర్మల । జ్ఞానోదయం బగు దాన గర్వ
ముదయింప వచ్చిన నుడుపంగవలయు గ । ర్వంబున గురుసమారాధనంబు
వదలిన నా బోధవైభవ మెడలిన । యంతటఁ బోక కీ డావహిల్లుఁ

ఆ. బరమబోధమునకు ఫల ముపశాంతిగా । నెఱిఁగి యెంతబోధ మెక్కు డయ్యె
నంతశాంతుఁ డగుచు ననవరతంబును । గురునిఁ గొలిచి మేలు పురుషుఁ డొందు. (అను. 3-321)

# 65. పరాశరుడు చెప్పిన పరమపద మార్గం

పరమపదము మీద వాంఛ జనులందరికి సమాన విషయమే.
సన్న్యాసిని సేవించిన శూద్రునికి బంగరు కొండ వద్ద కాకి మెరసినట్లు
పరమ జ్ఞానుల దగ్గర పరగిన అజ్ఞుడు కూడా జ్ఞానపూర్ణుడవుతాడు.
స్త్రీలు వైశ్యులు శూద్రులు ఇంద్రియాలను జయిస్తే పొందుతారు బ్రహ్మపదం.

పదహారు వికృతులైన- పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు
పంచ తన్మాత్రలు, మనస్సు; ప్రకృతి సప్తకం- పంచభూతాలు, మహత్తు
అహంకారం - మొత్తం ఇరువది మూడు - బుద్ధితో ఇరవై నాలుగు తత్త్వాలు.
పురుషుడు హిరణ్యగర్భుడు ఇరవై అయిదవ తత్త్వం - పరబ్రహ్మం ఇరవై ఆరవది.

సాంఖ్యానమనగా చక్కని తెలివి. కేవలుడంటే స్వతంత్రుడు, శుద్ధుడు
బుద్ధుడు, ఆనంద స్వరూపుడైన పరమాత్మ - కేవలుడిని చేరడం కైవల్యం.
ఈ జీవ బ్రహ్మైక్య రూపమైన పరమగతిని చూపించే గురువును మరవరాదు.
సన్న్యాసార్హత ద్విజులకున్నది, వారి సేవవలన లభిస్తుంది పరమపదం శూద్రునికి.

ధర్మార్థ కామ పురుషార్థాలను ధర్మం తప్పని ప్రవర్తనతో ఆచరించేవారు,
కామవర్జితులు, గర్వరహితులు, జితేంద్రియులు, తాపసులు
సత్యనిష్ఠ కలవారు, శుచులు, ధర్మాచార పరాయణులు, సన్న్యాసులు
వీరిని ప్రస్తుతిస్తారు దేవతలు సైతం -అని తెలిపాడు ధర్మరాజుకు భీష్ముడు.

---

**సీ.** **రక్షించునది యుదరంబు శిశ్నము ధృతిఁ । బాణిపాదములు దృక్పాటవములు**
**వినుఁ డింద్రియంబుల మనమును మనమున । బుద్ధి నిల్పైనఁ బ్రబోధవికచ**
**హృదయస్థుఁడై ధూమ మెడలిన శిఖివోలె । వెలుఁగు దేవునిఁ జూచు వెరవు గలుగు**
**యుక్తుండు గాకేల యొదవు మహీశ్వరుఁ । గనుట? యుక్తాత్ముండు గనును భక్తి**

**తే.** **నట్టి భంగికిఁ జాలిన యట్టిఁడైన । వికృతిషోడశకంబును ప్రకృతి సప్త**
**కంబు మూలప్రకృతిఁ జిత్తకలన నరయ । వికృతియును బ్రకృతియుఁ గాని విభునిఁ గాంచు. (అను. 3-322)**

**క.** **ఇది సాంఖ్యానము దీనిని । మది కలవడఁ జేసికొనుచు మఱవక గురు ని**
**ర్మదుఁడై కొలువఁగఁ గేవల । పదము నతని కరుణ పెంపు ప్రకటము సేయున్. (అను. 3-323)**

**తే.** **భిక్షుభావంబుఁ బొంది యీ శిక్ష యూఁది । మెలఁగు నర్హత త్రైవర్ణికులకుఁ గలదు**
**శూద్రునకు భిక్షుసంసర్గ సులభ మమల । పదము వానికి భిక్షుతఁ బరఁగఁ జనదు. (అను. 3-324)**

**క.** **పరమజ్ఞానుల యొద్దను । బరఁగిన నజ్ఞుఁడును బోధభరితుఁడగు నిరం**
**తర మేరుసమీపస్థితి । హిరణ్యరుచిఁ గాక మెసకమెసఁగిన పగిదిన్. (అను. 3-325)**

# 66. చెరువు తవ్విస్తే వచ్చే పుణ్య విశేషాలు

భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు– తటాక నిర్మాణమొక గొప్ప కార్యం.
చెరువు స్థావరం దేవతలకు, పశువులకు, పక్షులకు, రాయిరప్పలకు.
పశువులు, జంతువులు నీళ్లు తాగి సంతృప్తి నొందగా తటాకకర్తకు, అతడి వంశానికి
పుణ్యలోకాలు కలుగుతాయి, దక్కుతాయి మహాయజ్ఞ ఫలితాలు.

కట్టమీద పెరిగే చెట్ల వలన పక్షులకు, ప్రాణికోటికి నీడ లభ్యమై
చెరువు నిర్మించినవాడికి కలుగుతాయి ఇహపర సుఖాలు ఇన్నింతలుగా.
పితృదేవతలు పుణ్యలోకాలకు పోతారు, దేవతలు ఎంతో సంతోషిస్తారు.
తటాక నిర్మాణం, చెట్లు నాటడం అత్యుత్తమ కార్యాలై ఇస్తాయి పుణ్యఫలాలు.

అగ్ని ఆరాధన చేసిన గృహస్థుడు భూతదయతో బలులు సమర్పించాలి.
అన్నం పాలు పండ్లు దుంపలు చల్లని నీరు –వీటిని తర్పణం చేయాలి.
ప్రతిరోజూ పితృదేవతలకు, వైశ్వ దేవయజ్ఞంతో దేవతలను తృప్తిపరచాలి.
భిక్షాటన చేసే పండితులకు భిక్షలివ్వాలి. వారు రాకపోయిన రోజు

పక్షులకు, పశువులకు కొంత భాగమిచ్చి తరువాత అతిధులకు పెట్టాలి.
శ్రౌతబలిలో ధర్మానికి ఓషధులకు, అడవులకు ఆహారాన్నిచ్చి తరువాత
స్మార్తబలిగా పశువులకు పక్షులకు పేదలకు ఇవ్వాలి సరైన ఆహారం–
భూదేవి శ్రీకృష్ణునికి చెప్పిన ఈ విషయాన్ని వివరించాడు ధర్మరాజుకు భీష్ముడు.

---

**సీ.** **దేవ తిర్యఙ్న రస్థావరాశ్రయము త। టాకంబు విను మట్లుఁ గాక యందు**
**గోకులంబులు నీరు గొని దాని కర్తకు। లము నెల్లఁ బుణ్యలోకమున కనుచు**
**నీ లోకమున శ్రీయు నెక్కుడు కీర్తియు। నతనికిఁ జేయు వర్షాగమమున**
**సీతున వేసవిఁ జెఱువులో నీరున్న। నగ్నిహోత్రాదిమయజ్ఞ వాజ**

**ఆ.** **పేయఫలములోలి నాయన కగుఁ గట్టఁ। దగిన తరువు లిడిన సుగతి గలుగు**
**నిహసుఖంబుఁ బొందు విహగాది బహుభూత। వాససౌఖ్య మతఁడు సేసెఁ గాన. (అను. 3–330)**

**క.** **సలిలాశయములు చేసిన। నలఘుప్రియ మందుఁ బితృచయము లూర్ధ్వగతుల్**
**గలుగును దానం దమ కను। తలఁపున నది గోరుచుండు ధర్మతనూజా! (అను. 3–331)**

**తే.** **ఛాయ నతిథి వర్గంబుఁ బుష్పముల సురగ। ణంబుఁ బండులఁ బితృనివహంబుఁ బ్రమద**
**మందఁ జేయు వృక్షంబు లట్లగుట వృక్ష। రోపణ క్రియ మేటి ధర్మువు కుమార! (అను. 3–332)**

**–** **ఏతే స్వర్గే మహీ యంతే యే చాన్యే సత్యవాదినః**
**తస్మాత్ తటాకం కుర్వీత ఆరామాంశ్చాపి యోజయేత్**
**యజే చ్ఛ వివిధైర్య జ్ఞైః సత్యం చ విధివద్ వదేత్ (సం.అను. 96–175)**

# ✤ 13. అనుశాసనిక పర్వము - చతుర్థాశ్వాసము ✤

## 67. పూలు ధూప దీప నైవేద్యములు

ధర్మరాజు అడుగుతున్నాడు భీష్ముని– ధూప దీప నైవేద్యముల గురించి.
భీష్ముడు చెబుతున్నాడు– ఔషధములు అమృతము వంటివి. ఔషధీలతలలో
పూలనిచ్చేవి మరింత గొప్పవి. పూలతో అర్చిస్తున్నప్పుడు మనసు మంచిగా
ఉంటుంది కనుక పూలను అన్నారు– సుమనస్సులు; పూలను స్వీకరించి మంచి

చేస్తారు కనుక దేవతలు 'సుమనస్కులు' అని పలికాడు భీష్ముడు.
తామరపూలు, జాజులు, తులసీ దళములు దేవతలకు ఆనందదాయకములు.
ఎఱ్ఱనివి, ముళ్లచెట్ల పూలు, ఘాటైన వాసనకల పూలు క్షుద్రపూజార్హములు.
నలుపు తెలుపు రంగులతో సువాసన, కాంతి కలవి మనుషుల కిష్టములు.

దేవాలయాల్లో వల్లకాటిలో పుట్టిన పూలను– పెళ్లిళ్లలోనూ, శాంతి కర్మలలోను
స్త్రీలను ఆనందపరచేందుకు, పౌష్ఠిక క్రియలలోనూ వాడరాదు.
పూల పరిమళాలకు దేవతలు, వాటి దర్శనమున యక్షులు, వాటి
అనుభవమున మనుష్యులు మనో ఉల్లాసముల నందెదరు. ధర్మరాజా!

ధూపమునకు గొప్పది అందుగు చెట్టు పొడి, దానికంటె మంచిది గుగ్గిలము
అగరు ప్రీతికరమైనది గంధర్వ, యక్ష, నాగులకు; కర్పూరమతి శ్రేష్ఠము
తియ్యని వాసన దేవతలకు, కారం యక్షులకు, ఘాటు రాక్షసులకు ప్రీతి నిచ్చును.
ధూపమిచ్చినవాడు పుష్టిని, ఆయువును పొందును దేవయక్ష రాక్షస మెప్పు వలన.

---

**సీ. 'ఓషధు లమృత మయ్యుత్తమ వస్తు సం । తతిలోనఁ బుష్పవంతములు మేలు;**
**పుష్పముల్ గొని సురపూజ లొనర్చిన । మానవులకు మంచి మనసు గలుగు;**
**నట్లు గావున సుమనోఽ భిధానము పుష్ప । ములకయ్యెఁ ద ద్ద్రవ్యపూజ లిచ్చు**
**నరుల కోర్కులు సుమనస్కతఁ దీర్చుట । నమరులు సుమనస్కు లనఁగఁ జనిరి;**

**ఆ. కంపు రూపుఁ దెలుపుఁ గలిగి యకంటక । భూరుహాదులందుఁ బుట్టినట్టి**
**పుష్పములఁ బ్రియంబుఁ బొంది కైకొంద్రు, ని । ర్జరులు పూజనములఁ గురువరేణ్య! (అను. 4-5)**

**క. నలినంబులు జాజులునుం । దులసీదళములుఁ బ్రభూతతోషము గీర్వా**
**ణులకుం జేయును, యక్షా । దులకు జలోద్భవము లెల్లఁ దుష్టి యొనర్చున్. (అను. 4-6)**

**క. అరుణంబులును సకంటక । తరుభవములుఁ గటుకగంధధామములు నొన**
**ర్తురు శాత్రవాభిచారిక । కరణమున నధర్వమాంత్రికతఁ గుసుమంబుల్. (అను. 4-7)**

**తే. భూతరగోగణములకు భూపవర్య! తీక్ష్ణగంధపుష్పంబులు తృప్తిఁజేయు**
**నలుపుఁదెలుపుఁ గలిగి పరిమళసుకాంతి । భరితములు నగు పువ్వులు నరుల మెచ్చు. (అను. 4-8)**

# 68. అర్చన, నివేదనా ఫలితాలు

దీపం వలన తమోగుణ భూతాలు, చీకటి తొలగి లభ్యమవుతుంది
అంతర్ బాహిర కాంతి, శాంతి; హృదయం లగ్నమవుతుంది పరమాత్మపై
వెలుగు గట్టి జ్వాలగా ఉండాలి- నేయి తక్కువ, బలహీనమైన వత్తి ఉండరాదు.
ఇతరులు దేవుడికిచ్చిన దీపాన్ని దొంగిలించినవాడు గుడ్డివాడవుతాడు.

చావడిలో, దేవాలయాలలో, కొండల మీద పెట్టిన దీపాలు ఐశ్వర్యదాయకాలు.
ఆవుల నెయ్యి గొప్పది, బర్రె గొర్రె నువ్వుల నూనె మధ్యరకం, మాంస, రక్తం,
అస్థి మెదడు నుంచి చేసిన నూనె, కొవ్వు వత్తిలు అధమమంటారు.
దీపదానం వంశాన్ని వెలిగించి ప్రసాదిస్తుంది మహా జ్ఞానాన్ని, దివ్యుల ఆశీస్సులను.

దేవతలకు భక్తి, గౌరవాలలో నైవేద్యం పెట్టి తరువాత భుజించాలి తాను.
అలా చేయనివాడు రాక్షసుడవుతాడు, అర్చనలో నువ్వులపిండి, పాలు
పెరుగు, సువాసనలు కల వస్తువులు కలిగిస్తాయి దేవతలకు ప్రీతిని.
నైవేద్యాన్ని సమర్పించే వ్యక్తికి గృహదేవతలు కలిగిస్తారు సమస్త శుభాలు.

రక్తం, మాంసమున్న అన్నపు ముద్దలు, బాగా మెరిసే ఎరుపు దనమున్న పేలాలు
కల్లు నైవేద్యమిస్తే యక్ష రాక్షస నాగులు భూతాలు చేస్తాయి మేలు.
సౌమ్య బలినిచ్చేవాడు- బలం, బుద్ధి, వన్నె, సమర్ధత, నిష్ఠ కలిగినవాడవుతాడు.
రౌద్ర బలినిచ్చేవాడు- క్రోధం, ఆగ్రహం, తామసచిత్తుడై ఉగ్రుడిగా ఉంటాడు.

---

**క. జ్యోతి స్సాలోక్య కులోద్ద్యోతన మహిత ప్రకాశయోగంబులు పు**
**త్రా! తెచ్చు దీపదానము దాతకొసగు నమరపూజిత సుఖత్వంబున్ (అను. 4-23)**

**క. తిలపిష్టము దధిదుగ్ధం । బులు మఱియును ధూపములును బుణ్యపరిమళం**
**బులునగు పదార్థములు విబు । ధులకుం బ్రియ మొసఁగు బలివిధులఁ గురుముఖ్యా! (అను. 4-28)**

**క. ఉపహారసమర్చకుఁడగు । సుపురుషు గృహదైవతములు శుభములఁ గూర్చున్**
**నృపవరఁ తత్కర్మరహితుఁ । గృపలేక నితాంతవిఫలకృత్యుం జేయున్. (అను. 4-29)**

**ఆ. రక్తమాంస సహిత భక్త పిండముల ను । ల్లసితలోహితాక్త లాజములను**
**సురను బలియొనర్ప నురగయక్షాసుర । ప్రముఖ భూతములు శుభంబు లొసఁగు. (అను. 4-30)**

**క. సౌమ్యాసౌమ్యబలులు విను । సౌమ్యాసౌమ్య ప్రకార జనకృత్యంబుల్**
**సౌమ్యనృపోత్తమ । యయ్యై । కామ్యముఁ దత్తత్ప్రపూజ్య కరణిం జేయున్. (అను. 4-31)**

**క. అగ్రప్రదాయి వర్ణస । మగ్రుఁడు బలయుతుఁడు బుద్ధిమంతుఁడు లోకా**
**నుగ్రహ పాత్రము శాత్రవ । నిగ్రహశక్తుండుఁ దత్త్వనిష్ఠుండు నగున్.' (అను. 4-32)**

# 69. గౌతముడి ఏనుగు

నహుషుడు ప్రతిదినం చేసేవాడు పూలు ధూపదీప నైవేద్యాలతో పూజలు.
దేవ రాక్షస యక్ష నాగుల ప్రేమను పొంది దేవరాజ్య పదవిని పొందినాడు.
మహా తేజస్సు కల మునులు అతడెక్కిన పల్లకి మోసినవారు కొద్దిసేపు
ఇంద్రుడి సతిని పొందగోరి భ్రష్టుడై పెద్ద పామైనాడు పాపశాప భారమున.

బ్రహ్మలోకానికి స్వంత ఇంటికి వెళ్లినట్లు వెళ్లగలిగిన శక్తి లభించిందతడికి.
నహుషుడికి శాప విమోచనమూ లభిస్తున్నది ఆ పుణ్యఫలంతోనే!
ధర్మరాజా! ధూప దీప నైవేద్యము, పుష్పార్చన అంత గొప్ప ఫలాన్నిస్తాయి.
అదేవిధంగా విప్రుని ధనం దొంగిలిస్తే వంశ నాశనము, నీచజన్మ లభిస్తాయి.

గౌతముడనే బ్రాహ్మణుడు పెంచాడొక తల్లిలేని గున్న ఏనుగును.
అది మునికి సాయపడుతూ, పర్ణశాలను కాపాడుతూ పెరిగి పెద్దదైనది.
దేవేంద్రుడు దానిని తీసుకుపోబోయినాడు ధృతరాష్ట్రుడనే రాజు రూపంలో.
పదివేల గోవులను, కోటి బంగారు నాణేలనిచ్చినా ఇవ్వనన్నాడు గౌతముడు.

యమలోకం రా– అని గౌతముడంటే– అది పాపులుండే చోటు అన్నాడింద్రుడు.
గంగా తీరానికి రా ఏనుగునిస్తానంటే– అక్కడ దానాలు ముట్టరు, నేను రాను;
మేరువనంలో ఇస్తాను అంటే సత్యవ్రతులు, దయగలవారుంటారు –అన్నాడు,
నారదుని తోటలోకి రా అంటే– అక్కడ అప్సరసలు, కిన్నరులుంటారు అన్నాడు.

---

**సీ.** **నహుషుఁడు భూపాలనము సేయుచుండి రా। జస మించుకయు లేక సత్త్వనిష్ఠఁ**
**బుష్పంబులను ధూపముల దీపముల నివే। ద్యంబుల నమరుల కర్చ లిచ్చుఁ**
**బితృసంతతికి దీనఁ బ్రీతి యొనర్చు రా। క్షస యక్షభూతభుజంగమాది**
**తర్పణంబులు నర్థానిరూఢములు గా। నివి గొని యొనరించు నిట్లు నిత్య**

**తే.** **నిరతిఁ జెల్లించి తత్ఫలపరిణతి ప్ర। దీప్త తేజోవిశేష సంప్రాప్తదేవ**
**రాజ్యుఁడై సురమునిగణ పూజ్యభావ। మహిమఁ బొందియు దీనిఁదా మఱవఁ దధిప! (అను. 4–34)**

**చ.** **'మునులకు నేనుఁ గేటికి? నమూల్యపుగోవులఁ బుచ్చికొమ్ము వే**
**యనఘ! పసిండి నీ వలసినంతయు నిచ్చెద' నన్న 'శైశవం**
**బున నిది తల్లి లేకునికిఁ బుట్టిన యక్కటికంబు పెంపునం**
**బెనుచుటఁ జేసి దీనిపయిఁ బ్రేము నామదిఁగల్గు భూవరా! (అను. 4–57)**

**క.** **కావున నొల్లను బదివే। ల్గోవుల నిచ్చినను నిష్కకోటి యొసఁగినం**
**బోవయ్య యేను మొఱయిడఁ। గా వావిరిఁ గొనఁగఁ దగునె కరిపతి నీకున్?' (అను. 4–58)**

# 70. బ్రహ్మలోకం వెళ్లిన భగీరథుడు

ఉత్తర కురు భూములలో ఇస్తాను అంటే– కామము హింస లేని వారి ప్రాంతమది నేను రాను;
చంద్రుడి ఇంటిదగ్గరకు రాగలవా అనగా– అపరిగ్రహులుంటారక్కడ నేను రాను.
సూర్యుడి దగ్గర ఇస్తాను అంటే– వేదాధ్యయనులు, తాపసులుంటారు నేను రాను.
వరుణుడి దగ్గర ఇస్తాను అనగా– యజ్ఞాలు చేసే వాళ్లుంటారు నేను రాను.

ఇంద్రుడి దగ్గర ఇస్తాను రావయ్యా అంటే అక్కడ శూరులు, శతాయుష్కులుంటారు.
ప్రజాపతి లోకంలో ఇస్తాను రా అనగా అశ్వమేధాలు చేసినవాళ్లుంటారు నేను రాను;
గోలోకంలో ఇస్తాను రా అంటే శోకం మోహం లేని గోలోకానికి నేను రాను;
బ్రహ్మలోకంలో ఇస్తాను రా అంటే ద్వంద్వాలు లేని తావుకు నేను రాను అన్నాడు.

గౌతముడన్నాడు– నీవు ఇంద్రుడివన్నది తెలిసింది నాకు, కరుణించు నన్ను.
ఇంద్రుడన్నాడు– ప్రేమతో నిన్ను వదలనంటున్నది ఈ ఏనుగు, దీనిని నిన్ను
ఎలా విడదీస్తాను మునివర్యా! అని పలికి వారిద్దరిని అతిథులుగా ఆహ్వానించాడు
ఇంద్రుడు స్వర్గలోకానికి; వారు చేసుకున్న పుణ్యం ఇచ్చింది శాశ్వత లోకాన్ని.

భగీరథుడనే రాజు విప్రుల యజ్ఞానికి కలుగుతున్న ఆటంకాలను తొలగించాడు
గొప్ప యుద్ధం చేసి, అందుకే అతడికి లభించింది బ్రహ్మలోక సందర్శనం.
ఆకలి దప్పులను లెక్కచేయకుండా అతడు విప్రకార్యానికి సాయం చేసాడు.
ధర్మరాజా! నీవు కూడా భగీరథుడిలా, గౌతముడిలా నిష్ఠ, ప్రేమలతో వ్యవహరించుము.

---

**చ. అనువుడు మ్రొక్కి యింద్రుఁడు 'మహాత్మ! మతంగజ హేతు వాదవ**
**ర్తను ననుఁ బంపు నీ పనుపు దక్కొని చేసెద' నన్నఁ 'బుత్త్రుఁ డీ**
**వనకరి నాకు సాధుజనవత్సల! యిమ్ము కరంబు నెమ్మి దీ**
**ని' ననియె సాంత్వనంబుగ మునిప్రవరుండు గులప్రదీపకా! (అను. 4-75)**

**తే. 'కరి చెలంగి నీమీఁదఁ బుష్కరము సాఁచి । మూరుకొనియెడు నడుగుల మ్రోల నిల్చి**
**ముద్దు గురియుచుఁ బలుమఱు మ్రొక్కు నిట్టి । దాని నిన్నేల పాపుదు మాననీయ! (అను. 4-77)**

**మ. ననునే డాఁచెద నన్న నేబుధులుఁ గానంజాల రక్షీణబో**
**ధన సంపత్తి నెఱింగి తేర్పడ మునీంద్రాఁ రండు నీవున్ భవ**
**త్తనయుండీ కరియున్ నితాంతసుఖ నిత్యంబైన నాకంబునం**
**దనపాయస్థితి మత్సఖత్వమునఁ బెంపారం బ్రవర్తింపఁగన్. (అను. 4-78)**

**– నాస్తి వేదాత్ పరం శాస్త్రం నాస్తి మాతృసమో గురుః**
**న ధర్మాత్ పరమో లాభః తపోనాన శనాత్ పరమ్ (సం.అను. 106-65)**

# 71. అరయన్ గృహ మంగళంబు లాదర్శములున్-

గురు ధిక్కారము, పరదారాగమనము, అశుచి, అసత్యం పాపకర్మలివి.
ఉత్తములు, గోవులు, క్షత్రియులు, వృద్ధులు, బలహీనులు, గర్భవతులు
బరువు మోస్తున్నవారు వస్తున్నపుడు తాను తప్పుకుని దారినివ్వాలి వారికి.
పూర్ణిమ అమావాస్యలలో, చతుర్దశి, ద్వాదశి, అష్టమి, జన్మతిథి నాడు పాటించాలి బ్రహ్మచర్యం.

పెండ్లికి ముందు రతి సౌఖ్యాన్ని పొందడం 'అవకీర్ణ'మని పిలవబడుతుంది.
పగటివేళ భార్యను కలియరాదు, కన్యను, శీలవతికాని స్త్రీని కూడరాదు.
రజస్వలను, నగ్నంగా ఉన్న స్త్రీని, పతితను చూడడం అశుభాన్ని కలిగిస్తుంది.
ధర్మవిధిన పాణిగ్రహణం చేసిన భార్యతో చక్కని మేలైన సంతానాన్ని పొందాలి.

స్నానం చేసిన భార్యతో అయిదవ రోజున కలిస్తే ఆడపిల్ల, ఆరవనాడు
పొందితే మగపిల్లవాడు; సరిరోజులలో కలిస్తే మగపిల్లవాడు,
బేసి రోజుల్లో కలిస్తే ఆడపిల్ల కలుగుతుందనేది శాస్త్రం. పదహారవ
రోజు వరకూ కలిస్తే వ్యర్థం కాదు స్త్రీ ఋతువు, పెరుగును ఆయువు

పావురాలు, చిలుకలు, గోరువంకలు, పుష్పలతలు, బంగరు తీగల వస్తువులు
అద్దాలు, మంగళ వస్తువులు గృహము నందు; కలతలు లేని గృహం గొప్పది.
అడవి పావురం, గ్రద్ద, దీపం ఆర్పే పురుగు, గుడ్లగూబ ఇంటిలో ప్రవేశిస్తే
చేయించాలి శాంతి. సంధ్యాకాలాలలో చదవడం, తినడం చేయకూడనిది.

---

**సీ.** **వైరనిర్బంధంబు వలవదు గురునితో । నతఁడు కోపించిన ననుసరించి**
**తేర్చుట మేలు నిందించుట గురునెడ । నన్నృతమాడుట మాయు వపహరించు**
**విప్రగోక్షత్రియ వృద్ధ దుర్బల భార । వహ గర్భిణులకు నీవలయుఁ దెరువు**
**మాన్యభూదేవుని మంగళంబుల వన । స్పతులను వలగొని చనఁగవలయుఁ**

**తే.** **బంచదశిని జతుర్దశిఁ బద్మమిత్ర । వసుతిథుల జన్మతిథులందు వలయు బ్రహ్మ**
**చర్య మడుగు లొండొంటితోఁ జనదు తోమ । దోషములు గొండియముఁ గ్రూరభాషణంబు. (అను. 4-103)**

**సీ.** **అధిప! రజస్వల నంటుట కల్మష । మాచరితస్నాన యైన సతిఁ జ**
**తుర్థదినంబున దోషాసమయమునఁ । జెందంగఁ దగు నంద్రు గొంద ఱార్య**
**లేనవునాఁ డొంద నింతియు షష్ఠాహ । మునఁ బొంద మగవాఁడు బుట్టు వినుము**
**మఱియును సమవిషమములగు దివసంబు । లందోలిఁ బురుషుండు నంగనయును**

**తే.** **సంభవింతు రిట్టులు షోడశంబు దాఁక । నెల్లనాఁడును ఋతుశక్తి యెడలకుండ**
**నెట్టి కార్యము గల్గిన ఋతుమతీస । మాగమము దప్పనీకున్న నాయు వెక్కు. (అను. 4-126)**

# 72. విను తంగేటి జున్నగును ఊర్ధ్వలోకముల్-

ఉపాధ్యాయుడికన్నా పదిరెట్లెక్కువ మాన్యుడు తండ్రి; తండ్రికన్నా
పదిరెట్లెక్కువ మిన్నయైనది తల్లి; ఆచార్యుడందరికన్నా మిన్న.
మూడు అహోరాత్రాలు ఉపవసించవచ్చును బ్రాహ్మణులు క్షత్రియులు,
నాలుగు భోజనాల వరకు మానవచ్చును వైశ్యులు, శూద్రులందురు విజ్ఞులు.

శుక్లపక్ష అష్టమి, చతుర్దశి, పూర్ణిమనాడు, శుక్ల కృష్ణ పక్షాలలో షష్ఠి
పంచమి తిధులలో ఉపవాసం సర్వవిధాల శ్రేయోదాయకం; గొప్పదైన
ఏకభుక్త వ్రతం నెలరోజులు చేస్తే లభిస్తాయి రూపం, సంతానం, సౌఖ్యం.
ఏడాది పాటు చేస్తే ఇహపర సుఖాలు ప్రార్తించి శుభకరమవుతుంది.

విశ్వామిత్రుడు వేయి సంవత్సరాలపాటు ఏకభుక్త వ్రతం చేసి పొందాడు బ్రాహ్మణత్వం.
అంగీరసుడు చెప్పినాడు- పగలు ఒకసారి, రాత్రి ఒకసారి భుజిస్తూ
మధ్యలో ఏమీ తినకుండా, పాపమంటకుండా హోమకార్యాలు నిర్వహిస్తుంటే
పుణ్యలోకాలు అందుతాయి తంగేటి జున్నులా ఇలా ఉపవాసం చేసినవారికి.

ధర్మరాజా! ఏక విజ్ఞానేన సర్వవిజ్ఞానమే అన్నట్లు ఎవరిని తెలిసికొంటే
సృష్టిలోని సంగతులన్నీ తెలుస్తాయో అతడే శ్రీకృష్ణుడు; అతడే లక్ష్యం
జ్ఞానం బోధించే వాక్యాలకు; గొప్ప మహిమకు స్థానం శ్రీకృష్ణుడు
-అని పలికి భీష్ముడు హరసనత్కుమార సంవాదమును చెబుతున్నాడు ధర్మజునికి-

---

**సీ.** ఏకభుక్తవ్రత మెంతయు నిష్ఠ మా । సం బెల్ల నడపిన సద్ద్విజుండు
సుభగాకృతియు రూపశోభితాంగనయు స । త్సుతులును ధనధాన్యతతులు భోగ
ములు సద్గుణంబులు భూరియశంబును । మొదలైన బహుశుభంబులకుఁ బాత్ర
మగు నేఁడుకాల మయ్యతులవ్రతము సల్పి । యఖిల భూలోకసౌఖ్యములుఁ ద్రిదివ

**తే.** మోదమును గండ్రు రెండును మూఁడు నాల్గు । నీ క్రమంబున నోపిన ట్లెక్కినట్టి
దినము లెడ పెట్టి కుడుచుచు ధృతి నొకేఁడు । నడపువారల తెఱఁగు లేర్పడఁగ వినుము. (అను. 4-148)

**చ.** పగలును రేయుఁ గుడ్చి జలపానము లోనుగఁ గుడ్చునప్పు తు
ష్టిగ నొనరించి మర్త్యుఁ డొకటిన్ నడుమన్ మఱి యెప్డు నంటకే
మిగతిని బాపముం బొరయమిం దలకొల్పుచు హోమకార్యముం
దగుమెయిఁ జేయుచున్న విను తంగెటిజున్నగు నూర్ధ్వలోకముల్. (అను. 4-164)

– దివ్య వర్ష సహస్రాణి విశ్వామిత్రేణ ధీమతా
క్షాంతమేకేన భుక్తేన తేన విప్రత్వ మాగతః (సం.అను. 106-68)

# 73. సాంఖ్య పునశ్చరణం

భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుతో- రుద్రుడు ఒకసారి దర్శించాడు
సనత్కుమారుడిని- ఇరువురూ చర్చించారు సాంఖ్యరూప తత్త్వాల గురించి.
సనత్కుమారుడన్నాడు- తత్త్వాలు ఇరవైమూడు అనే వారి దృష్టిలో
మనసు, బుద్ధి ఒకటే; ఇరవై నాలుగనేవారు- మనసు పరిశుద్ధతను బుద్ధి అంటారు.

అధిష్ఠానం అనే రూపంలో పంచ వింశతి- ఇరవై అయిదవ తత్త్వమున్నది
ఇరవై నాలుగు తత్త్వాలను పట్టి నిలుపుతుంది- ఇదే పరతత్త్వము, పరమాత్మ.
నేల, నీరు, నిప్పు, గాలి, నింగి -పంచభూతాలు- అనాదిగా ఉన్న తత్త్వాలు
గంధం, రసం, రూపం, స్పర్శ, శబ్దం -పంచభూతాలకున్న పంచ గుణాలు.

వాక్కు చేతులు కాళ్లు గుదము జననేంద్రయం - కర్మలు చేసే కర్మేంద్రియాలు.
త్వక్కు కన్ను చెవి నాలుక ముక్కు -ఇవి జ్ఞానేంద్రియాలు- ఇవీ అయిదే.
మనసు, బుద్ధి, 'నేను' అనే అహంకారం; వీటన్నిటికీ మూలకారణమైన తత్త్వం
అదే ప్రకృతి లేదా మాయ - ఇరువది నాలుగో తత్త్వం; ఇవన్నీ కలిసి ఉన్నది దేహం.

కట్టెలో నిప్పు ఉన్నట్లు ఈ ఇరవై నాలుగు తత్త్వ సముదాయమైన శరీరంలో ఉంటాడు
పురుషుడు, లేదా, జీవుడు లేదా ఆత్మ - అది తెలుసుకోవడం పురుష తత్త్వం.
ఇదే అమృతార్థతత్త్వం, ఇదే బ్రహ్మతత్త్వం. అనులోమంలో సృష్టిని,
ప్రతిలోమంలో లయను సృష్టిస్తాయి తత్త్వాలు; బ్రహ్మమొక్కటే ఉండే స్థితి ఏకత్వము.

**క.** **దేహం బనియెడ నెరవున । నూహించును బుధుఁడు దాననుండుం గాష్ఠ**
**స్వాహాప్రియు క్రియఁ బురుసుఁడు । సోऽహ మనిన కాన్పు రుద్రఁ యతనిఁ గను టగున్. (అను. 4-180)**

**క.** **ఈ నెఱి నిలుచుట గలుగదు । మానేర్ష్యావంతు లైన మానవులకు ని**
**ష్ఠానూన తపోవర్తకు । లైనను గార్హస్థ్యబహుముఖాత్మకు లగుటన్. (అను. 4-181)**

**క.** **అనఘ! యనులోమమునఁ దోఁ । పును బ్రతిలోమమున లయము వొందుటయును గ**
**ల్గును సర్వతత్త్వముల కవి । యెనయిక బ్రహ్మమును గలయు టేకత్వ మగున్. (అను. 4-184)**

**తే.** **ఉత్తమశ్రద్ధ లేకున్నఁ జిత్త మేక । ముఖము గాకున్న నింద్రియముల జయింప**
**కున్న వేదంబు చదువకయున్న నతని । కీ పరిజ్ఞాన మీఁ దగ దిద్ధచరిత! (అను. 4-185)**

**ఆ.** **సకల జంతువులకు సామాన్య మధ్యాత్మ । మాదిగాఁగఁ గల్గు నంతవట్టు**
**నిట్లు గాఁగ నెఱుఁగు టెఱుఁగుట యొండుమైఁ । గనుట యెఱుక గాదు కామదమన! (అను. 4-187)**

**క.** **విను మధ్యాత్మ ప్రభృతులు గనిరే? మున్నమర దనుజ గంధర్వులునుం**
**గనుటయు గల్గెనె? బ్రహ్మంబున నున్న నిజంబు తత్త్వబోధంబసదే? (అను. 4-188)**

# 74. ఓంకార వాచ్యమది-

ఓంకారము చేత చెప్పబడేది, అహంకార నిరూఢ భావనారాధ్యము, నిష్పంకము
అశీతము, అనుష్ణము, శంకరము, తృషాహారము –అదే పరమాత్మ
అప్రమేయము, అచలము, అవిజ్ఞేయము, ఆది విరహితము, విమలము
నితాంతము, అవ్యయము, పుండరీకాక్షము, అనక్ష విషయము

అచ్యుతము, సదసత్పరమైక్యభాసి – ఈ ఆత్మతత్త్వం అనాది విద్య
అహంకారాన్ని వదలిన జీవుడిలో లీనమవుతాయి ఇంద్రియాలు.
మనస్సు బుద్ధి – జీవుడు లీనమవుతాడు పరతత్త్వంలో చివరకు.
జీవుడు తనను తాను చూస్తూ ఏవిధమైన అంటులేని వెలుగవుతాడు.

నాలుక యందు చంద్రుడు వాక్కు–అగ్ని, ప్రాణవాయువులో వాయువు
ఉదానంలో మెరుపులు, వ్యానంలో వర్షదేవత, రొమ్ములో
ఆకాశం, బలంలో ఇంద్రుడు, బుద్ధిలో ఈశానుడు, అపానంలో
ద్వాదశాదిత్యులు, సమానంలో అప్సరసలు; కన్నులలో సూర్యుడు

దేహమంతా భూమి, పాదాలలో విష్ణువు, చెవిలో దిక్కులన్నియు,
జననేంద్రియంలో ప్రజాపతి, బుద్ధియందు బ్రహ్మ ఉంటారు.
వీటికి అధికారి ఆత్మ, అతడు ప్రబుద్ధుడూ, అబుద్ధుడూ
వ్యక్తా అవ్యక్తములను బుధ్యమాన, ప్రబుద్ధ, అబుద్ధ దశలలో చూస్తాడు.

---

క. ఓం కారవాచ్య మది యన । హంకార నిరూఢ భావనారాధ్యము ని
ష్పంక మశీత మనుష్ణము । శంకర మఖిలంబునకుఁ దృషాహరము శివా! **(అను. 4–189)**

తే. అప్రమేయ మవిజ్ఞేయ మచల మాది । విరహితంబు నితాంతంబు విమల మవ్య
యంబు పుండరీకాక్ష మనక్షవిషయ । మచ్యుతము సదసత్పరమైక్యభాసి. **(అను. 4–190)**

క. అది నారాయణుఁ డొకనికి । విదిత మతనివలన సురలు వివిధమునులు ని
ర్మదసిద్ధసాధ్యగణములు । మొదలగు సర్వుల సుబోధముల పొలమయ్యెన్. **(అను. 4–191)**

చ. స్మరహర! పొందు నింద్రియసమాజయుగంబు మనంబు బుద్ధియుం
బరువడిమై నహంకరణబంధము వాసిన జీవుఁ దత్సము
త్కరసహితంబుగా నతఁడు దాఁ బరతత్త్వమునందు లీనతం
బొరయును, దాని నెవ్వరు ప్రబోధముగాఁ గనువారు? సెప్పుమా! **(అను. 4–193)**

క. భూతము లన్నియు నడగిన యా తఱిఁ దనుఁ దాన కనుచు నంజనరహిత
త్వాతిశయమెసగ వెలిగెడు నా తెలివా తత్త్వమునకు నమరు మహేశా! **(అను. 4–194)**

# 75. ఇరవై ఆరవ తత్త్వం

ఆత్మతత్త్వము క్షర, అక్షర, పర నామాలతో ఉంటుంది వేర్వేరు దశలలో.
ఇరువది అయిదవ తత్త్వం ప్రబుద్ధుడు; ఇరవై ఆరవది- అబుద్ధుడు.
'క్షర'మనగా సర్వభూతాలు; అక్షరమనగా కూటస్థం, మూలము
పరమనగా క్షర, అక్షరములకు అతీతమైన పురుషోత్తమ తత్త్వం.

పురుషుడనగా పరమాత్మ; ప్రకృతి అనగా మాయ, వికృతులన్నీ
ప్రకృతి సంగమున్న పురుషుడు పరమేశ్వరుడు, లేనివాడు సదాశివుడు.
ఇరవై అయిదవ ప్రబుద్ధుడు, ఇరవై ఆరవ అబుద్ధుని తానుగా
గుర్తించడమే రెండూ ఒకటైన కైవల్యం లేదా అద్వైత స్థితి.

ప్రబుద్ధుడు జీవాత్మ, అబుద్ధుడు పరమాత్మ - జీవాత్మ-పరమాత్మలు
వేరువేరు -అనుకోవడం అజ్ఞానం; అది దారితీస్తుంది బంధాలకు
రెండూ ఒకటే అనుకోవడం సుజ్ఞానం, అది దారితీస్తుంది మోక్షానికి
బుధ్యమాన, ప్రబుద్ధ, అబుద్ధ దశలే ఆత్మలోని వేర్వేరు అవస్థలు.

జీవుడు ప్రకృతితో కలిసి ఉన్నపుడు కానవస్తాయి అనేక అవస్థలు.
అదే అవిద్య, విద్య కలిగి ఉన్న ఇరవై అయిదవ తత్త్వ జీవుడి దశలు
విద్యయే స్వరూపమైన ఇరవై ఆరవతత్త్వమే పరమాత్ముడు.
ఆదిమధ్యాంత రహితుడు, అచ్యుతుడు, కేవలుడైన ఏక స్వరూపుడు.

**క. గుణములఁ బొందఁడు పురుషుఁడు । గుణమహితా! ప్రకృతి యిచ్చు గుణముల కేమే**
**గుణములు దానను గుణులై । గుణిత్వ మా నిర్గుణాత్మకున కొలయించున్. (అను. 4-222)**

**క. వీనినెల్ల సత్కోటిగా నెరింగి కొనుచు బ్రకృతి నుపేక్షించి తనకుఁ దాన**
**కాని యొండెద్దియును లేమి గాంచినపుడు పురుషుడపగత ధూమాగ్ని బోలి వెలుగు (అను. 4-223)**

**క. సత్త్వాశ్రయమునఁ బురుషుఁడు । దత్త్వాశ్రయముననను సత్త్వతత్త్వముల వివే**
**కిత్వాలేపత్వములన । విత్త్వముఁ జిత్తంబు నొందు విశ్వాధారా! (అను. 4-227)**

**క. నానా త్త్వైకత్వము ల । జ్ఞానజ్ఞానజము లనపజయ! కంద్రు బుధుల్**
**వాని నవిద్యయు విద్యయుఁ గా నివి విను పంచవింశకస్థావస్థల్. (అను. 4-228)**

**క. విద్యామయషడ్వింశుఁడు । విద్యావిద్యావిభేదవిరహితుఁ డజరుం**
**దాద్యుఁ డనంతుం డచ్యుతుఁ । డదృతనుఁ డనాది కేవలాత్మకుఁ డరయన్.' (అను. 4-229)**

**క. జలమున మీను నుదుంబర । ఫలమున మశకములుఁ బోలెఁ బ్రకృతిం దా ని**
**మ్ముల నునికి తెలిసి వేర్పా । టలవతిచిన పురుషుఁ డవ్యయత్వము పొందున్. (అను. 4-232)**

# 76. ప్రకృతి నిట్లు వాసి పంచవింశుండు

ప్రకృతితో పాటున్న ఇరవై నాలుగు తత్త్వాలను వదలిన జీవాత్ముడు
పంచవింశతి తత్త్వపురుషుడై, విమలత్వం, శివత్వం
నిరంజనత్వం కల ఇరువది ఆరవ తత్త్వాన్ని-పరమాత్మను
పొందడమే 'ముక్తి' -అని కపిల మహర్షి వివరించాడు మునులకు.

జీవుడు క్రింది తత్త్వాల వేపు ప్రవహించడమనేది బంధం
పరమాత్మ వేపు ప్రకృతిని, మాయను వదలి పైకెగయడం మోక్షం
అని పలికి భీష్ముడు చెబుతున్నాడు ఎక్కువ పవిత్రత
కలిగిన గొప్ప తీర్థం గురించి తన మనుమడైన ధర్మరాజుతో

-'ధర్మరాజా! ధృతి అనే జలాశయంలో విరాజిల్లే మానస తీర్థమే
సత్యము - రజస్తమో గుణాలను తొలగించుకున్నవాడు
దానిలో ప్రవేశించి సత్యాన్ని ఊతకర్రగా తీసుకుని నడుస్తూ
సత్త్వగుణ సంపన్నుడై పరిశుద్ధుడై ప్రకాశిస్తాడు అద్భుతంగా.

మానవుడు మృతిచెందాక పంచభూత గుణాలు, బుద్ధి, ధర్మం
వెళ్తాయి జీవుడి ననుసరించి; అదేవిధంగా పంచభూతములు
మనస్సు, అన్నం కలిసి ఏర్పడిన రేతస్సు జీవుడిగా పుడుతుంది
తానొనర్చిన పుణ్యపాపాల కనుగుణంగా గడుపుతాడు సుఖదుఃఖ జీవనం.

---

**తే.** **కమలదళమున నున్న జలము విధమునఁ । బ్రకృతినుండి తదీయసంబంధవికృతి**
**లేని తనుఁ గని వెలుఁగ నిర్లేపనిశ్చ । లాజరామరపదవి జీవాహ్వయుండు. (అను. 4-233)**

**ఆ.** **ప్రకృతి నిట్లు వాసి పంచవింశుండు ష । డ్వింశభావమొంది విమలశివ ని**
**రంజన స్వరూపుఁడై వెలుఁగొందు న । త్తెఱఁగు ముక్తియండ్రు దేవదేవ! (అను. 4-234)**

**క.** **సంగము బంధ మఖిల ని । స్సంగత మోక్షంబు బహువిచారము లేలా?**
**పింగజటాజూట కలిత! గంగాబాలేందు మహిత! గౌరీసహితా!' (అను. 4-238)**

**క.** **దమమును దపము నహింసయు । శమమును దీర్థముల వాన శౌచాతిశయం**
**బమలగుణ! కలుగు రిత్తజ । లములం దోఁగిన శుచిత్వలాభము గలదే?' (అను. 4-242)**

**క.** **'దొరకొననివానిఁ గోరక । దొరకొనినందును మమత్వతుష్టహృదయతం**
**బొరయక విగతస్పృహులగు । పురుషులు శుచు లేల తీర్థములు వారలకున్?' (అను. 4-244)**

**క.** **ఉత్తమ పథంబు ధర్మాయత్తము ధర్మంబు మృతులకధిప! సహాయం**
**బెత్తెరగున ధర్మక్రియఁ జిత్తంబునఁ జేర్పవలయు జీవించు తరిన్ (అను. 4-251)**

# 77. పాపాలు-జన్మలు

ఎక్కువ పాపాలు చేసినవాడు పురుగు, గాడిదల్లాంటి పుట్టుకలు పుడతాడు.
ధాన్యం దొంగిలించినవాడు ఎలుక, పంది, కుక్కగా; పరభార్యా గమనంతో
తోడేలు, రాబందు, గ్రద్ద, కోతి, పురుగులుగా పుట్టి దుఃఖిస్తాడు.
ఒకడికి తన బిడ్డను కన్యాదానం చేసి మనసు మార్చుకుంటే కీటకంగా,

దేవతారాధన చేసి పితృకార్యం చేయకుండా అన్నం తిన్నవాడు కాకిగా,
అన్నను నిందించినవాడు క్రౌంచపక్షిగా, బ్రాహ్మణస్త్రీని పొందిన శూద్రుడు
బురదగుంటలో పురుగుగా పుడతాడు; కృతఘ్నుడిని యమకింకరులు
కట్టి కోసి కాల్చి ముండ్లకంపల మీద వేసి నొక్కి నానా బాధలు పెడతారు.

ధనం మీద ఆశతో ఆయుధం లేనివాడిని చంపినవాడు గాడిదగా
నీచజంతువుగా పుట్టి మాటిమాటికి తింటుంటాడు చావుదెబ్బలు.
స్త్రీని చంపితే ఇరవై ఒక్క నరకాల దుఃఖం (తామిస్రము,
లోహ శంకువు, మహా నిరయము, శాల్మలి, రౌరవము, కుంభలము

పూతి మృత్తికము, కాలసూత్రము, సంఘాతము, లోహితోదము,
సవిషము, సంప్రపాతనము, మహా నరకము, కాకోలము, సంజీవనము
మహాపథము, అవీచి, అంధతామిస్రము, కుంభీపాకము, తాపసము,
అసిపత్ర వనము) –అనుభవిస్తాడు దుర్మార్గుడైన స్త్రీ హంతకుడు.

---

**క. ధనవాంఛ నిరాయుధుఁ జం । పిన గాడిద మొదలు గాఁగఁ బెక్కులు తిర్య**
**గ్జననంబులఁ బొందును శ । స్త్ర నిహతిఁ దోఁదోఁ మరణదశ వాటిల్లున్. (అను. 4–264)**

**ఆ. ఆఁడుదానిఁ జంపినతఁ డేక వింశతి । దూష్య నరకవాసదుఃఖ మొందు**
**నన్నదధిపయోఘృతాపూపహరణముల్ । మక్షికాదికీటమయత సేర్చు. (అను. 4–265)**

**ఆ. ఫలము నినుము వెండిఁ బసిఁడి ముచ్చిలికొన్నఁ । గ్రోఁతి వాయసంబు గ్రువ్వ నీచ**
**కృమియు నగు సదంబరము హరించిన శశ । జనన మొందు నరుఁడు మనుజనాథ! (అను. 4–266)**

**తే. నమ్మి యిల్లడవెట్టిన సొమ్ముఁ గొనిన । మీను లోనగు నీచపు యోనులందుఁ**
**బుట్టు; గంధవస్తువులు గొన్నట్టివాఁడు । వినుము మఱి పుట్టువునఁ జుంచుతనము నొందు. (అను. 4–267)**

**తే. వనిత లీపాపము సేసి వానివాని । పత్నులై జనియింతురు; పాపభీతిఁ**
**దెరువు తప్పక నడచిన నరులు సౌఖ్య । మందుదురు రెండు లోకంబు లందు నధిప!' (అను. 4–268)**

**క. విను దానంబుల పాపము లనఘా! చెడు దానములకు నన్నిటికిని స**
**జ్జన సేవ్య! యన్న దానము మును లధికంబంద్రు పాపములఁ బాపునెడన్ (అను. 4–270)**

# 78. తను నమలిన వాని నమలునని మాంసము

ఆహార పదార్థాలు దొంగిలిస్తే ఈగ, పురుగులుగా, పండ్లు
దొంగిలిస్తే కోతిగా, ఇనుము, వెండి, బంగారం దొంగిలిస్తే వరుస క్రమాన
కాకి, గువ్వ, పురుగుగా; బట్టలు దొంగిలిస్తే కుందేలుగా పుడతాడు.
తన దగ్గర నమ్మకంతో దాచుకున్న సొమ్ము అపహరిస్తే చేపగా

పరిమళ ద్రవ్యాలను అపహరిస్తే చుంచెలుకగా, స్త్రీలు కూడా
ఇదే దొంగపనులు చేస్తే, దొంగపనులు చేసినవారి భార్యలై జన్మిస్తారు.
పాపాలు దానాలతో నశిస్తాయి, ఈ విషయంలో అన్నదానం గొప్పది.
నాలుగు వర్ణాలవారూ అన్నదానం చేయడం వలన పాపముక్తులౌతారు.

ధ్యానం, ఇంద్రియ నిగ్రహం, అహింస, గురుపూజ, నిత్య
కర్మాచరణ, తపస్సు; -ఈ ఆరు దారుల్లో ఉత్తమం అహింస.
ఏనుగు అడుగులోపల మిగతా జంతువుల అడుగులు ఇమిడినట్లు
అహింసా ధర్మంలో లోబడి ఉంటాయి సర్వ ధర్మాలు సుమా!

మనసు చేత, మాట చేత, దేహం చేత హింస చేయడం,
మాంసాహారం తినడం నాలుగవ హింసగా చెబుతారు పెద్దలు.
మాంసం తననెవరు నములుతారో వారినే నములుతుంది.
వర్షాకాలంలో మాంసం తినకపోవడం మరింత మంచిది.

---

తే. 'వాజిమేధంబుకంటెను బూజనీయ । కర్మ మందురు మాంస భక్షణము విడుపు
వినుము చంపుటయును జంపఁ బనుచుటయును । గల్మషంబుల కెల్ల నగ్గలము లధిప! (అను. 4-290)

క. పితృకార్యయజ్ఞముఖముల । శ్రుతిచోదిత హింసఁ గీడు సొరనేరదు వి
శ్రుతగుణ మాంసము చవిగో । రి తినం బ్రాణిఁ దెగటార్చు క్రియఁ బాపమగున్. (అను. 4-291)

క. తను నమలిన వాని నమలు । నని మాంసము తెలుఁగు సెప్పు నాగమములు గా
వునఁ దద్భక్షణ ముడిగిన । ననఘ! తపంబునకుఁ జాలు నది యొక్కండున్. (అను. 4-292)

ఉ. మ్రానను ఱాతనుం గలదె మాంసము ప్రాణుల మేనఁగాక? య
మ్మేనుల నొంచునప్డు తమ మేనులు సోఁకినమాత్ర నెట్లగున్
దానిఁ దలంపఁగా వలదె? తానది మానిన హింసలన్నియున్
మానవె? యంచు నుత్తముఁడు మాంసము మాను దయార్ద్రచిత్తుఁడై. (అను. 4-294)

- అహింసా పరమో ధర్మః తథాహింసా పరం తపః
అహింసా పరమం సత్యం యతోధర్మః ప్రవర్తతే (సం.అను. 115-23)

# 79. వ్యాసుడు-కీటకుడు

బాదరాయణ వ్యాసుడు చూసాడొక పురుగు బండ్లు నడచే దారిలో బహువేగంగా
పరిగెత్తడం, అన్నీ తెలిసినవాడే అయినా, ఆ పురుగునాపి అడిగాడు కారణం
ప్రాణభయం ఉంటుంది కదా నేను కీటకాన్నయినా, నీకు తెలుసు క్రితం జన్మలో
శూద్రుడిని నేను, గొప్పవారికి సేవ చేసాను, ఎక్కువ పాపాలు చేసాను కూడా.

పాపాలకు ఫలితంగా కీటకాన్నయ్యాను, సేవ ఫలితంగా పుర్వజన్మ జ్ఞానమున్నది.
కీటకాన్నయ్యానన్న పూర్వజన్మ జ్ఞాపకం మరింత బాధపెడుతున్నది నన్ను-
వ్యాసుడన్నాడు- నీమీద నాకు సదభిప్రాయం కలిగింది, నీకు మానవజన్మ
ఇస్తున్నాను, ధర్మ పరాయణుడివై జీవించుము' -అనగానే ఆ పురుగు వదిలింది ప్రాణం.

కొన్నాళ్లకు వ్యాసుడి ఆశ్రమం ముందు ఆగిందో రథం- దిగాడొక రాజు.
ఏనుగునెక్కి పెక్కేనుంగులిరుగడ రాగా, తురంగ సమేతుడై వైభవంగా
దేవేంద్రుడిలా సామంతకవిజన సీమంతినీ ముఖ పరివారంతో కూడి
వ్యాసుని చేరి అతడి పాదపద్మాలపై వాలి మొక్కినాడు భక్తి శ్రద్ధలతో.

క్షత్రియుడై అతడు వ్యాసుని బోధనలననుసరించి ప్రజాక్షేమంకై
యుద్ధాలు చేసి, బ్రాహ్మణ జన్మ పొంది, గొప్ప గొప్ప దానాలు చేసినాడు.
మరల వ్యాసుని సందర్శించి ఆశీస్సులనొంది దేవేంద్రునికి మిత్రుడై పొందినాడు
అమర అర్చిత సంస్తుత భవ్య పదస్థితిని, అవ్యయ పరమ సౌఖ్యసిద్ధిని.

---

**సీ.** **ఏనుంగు నెక్కి పెక్కేనుంగు లిరుగడ । రా! దురంగంబుల రమణ యొప్ప**
**గొడుగులుం బడగలు ముడివడ గాయక । వందిపాఠకుల రవంబు లెసఁగ**
**భూషణంబుల రత్నపుంజంబు దీప్తులు । దిక్కుల నెల్లను దీఁటుకొనఁగ**
**సామంతకవిజన సీమంతినీముఖ । పరివారవైభవస్ఫురణ మలర**

**తే.** **దేవపతి వోలె సాత్యవతేయు నాశ్ర । మమున కేతెంచి తత్పాదకమల మాత్మ**
**ముకుట సంగతముగఁ జాఁగి మ్రొక్క గరుణ । నాతఁ డెత్తి తన్మస్తక మక్కుసేర్చె. (అను. 4-333)**

**క.** **రాజన్య సముచితంబగు । పూజావిధి యాచరించి పురుషోత్తమ! నీ**
**వీజన్మంబున సన్ముని । రాజికి వెఱఁ గగు తపశ్చరణ మొందవనా! (అను. 4-335)**

**క.** **గోవులకై యొండెను వి । ప్రావలికై యొండె నిర్భరాహవకేలీ**
**ప్రావీణ్యము మెఱసి విడువు । నీ వసువులు దాన నధిక నిర్మలత యగున్. (అను. 4-336)**

**-** **రాజపుత్ర సుఖం ప్రాప్య క్రతూంశ్చైవాప్త దక్షిణాన్**
**అథమోదిష్యసే స్వర్గే బ్రహ్మ భూతో వ్యయః సుఖీ (సం.అను. 118-23)**

---

విరాట పర్వంలోని 'ఏనుంగు నెక్కి పెక్కేనుంగు లిరగడ రా' పద్యాన్ని గుర్తు చేస్తుంది. (విరాట. 5-204)

# 80. శాండిలి - సుమన

ధర్మరాజుకు భీష్ముడు చెబుతున్నాడు కైకేయి–శాండిలి సంభాషణను
–కేకయ రాజపుత్రిక సుమన అమరావతిలో చూసింది శాండిలిని
నీకిన్ని దివ్యభోగాలెలా కలిగాయో చెప్పమని అడిగింది సుమన
శాండిలి చెప్పింది–మామకు అత్తకు మారు పలకను, పకపకా నవ్వను,

దేవపూజలు, శ్రాద్ధములు, అతిథి సపర్యలలో ఎడముఖం పెట్టనేనాడూ
భిక్షకులకు భిక్ష వేస్తాను, భర్తకు అనుకూల భావంతో మెలగుతాను
బిడ్డలను తీర్చిదిద్దుతాను, పిల్లలకు భర్తలకు కావాల్సినవన్నీ చేస్తాను ప్రేమతో.
'గృహిణీ గృహ ముచ్యతే' –అన్నట్లు ప్రవర్తిస్తాను, అగ్నిహోత్రం కాపాడుతాను

అని సుమనకు చెప్పింది శాండిలి– తన నడవడిక ఉన్నతికి కారణమని.
అప్పుడు ధర్మజుడడిగాడు– అన్ని శాస్త్రాల సారమేమిటో తెలపమని–
భీష్ముడు చెబుతున్నాడు– ఇరవై నాలుగవ తత్త్వమయిన ప్రకృతి,
ఇరువది అయిదవ తత్త్వమైన జీవాత్మగా పిలువబడే నరుడు –జీవాత్మ.

ఈ నారములకు స్థానమైనవాడు నారాయణుడే కదా పరమాత్మ
పరబ్రహ్మము, పరతత్త్వము, పరమపదము, ఈశ్వరుడు, విష్ణువు అతడి పేర్లు.
మరణకాలంలో 'నమో నారాయణాయ' అనే మంత్రాన్ని పలికితే
ప్రణవానికి అర్థమైన పరమ పదాన్ని పొందుతాడు నరుడు–

---

**సీ. 'మామకు నత్తకు మార్పల్క, దేవ పి । త్రతిథిపూజనములయందు సొలయ,
నిలువడిఁ దలవాకి లెప్పుడు నెఱుఁగక । పెలుచ నవ్వక శుద్ధి వెలయ విప్ర
భిక్ష యోపిక కల్గి పెట్టుచు వర్తింతు । వలయు కార్యములకు వెలఁది! మగుడ!
బలివచ్చునపుడు భక్తియు వేడ్కయుఁ । బొదల నాసనపాద్యములను సుముఖ**

**ఆ. భావమునను సేవ వాటింతు, బిడ్డల । శిక్ష వదలఁ, దిట్టఁ గనియు,
నాకు వేళ ప్రియ మనఁగ లేదు; పతిమెచ్చు । వంటకములు చవిగ వండి యిడుదు. (అను. 4–358)**

**చ. వరుఁ డొక వెంట నెన్నఁడు ప్రవాసగుతం దగు నాఁటఁ గోలె న
ప్పురుషుఁడు వచ్చునంతకును బూవులు పూఁతలు మేలిచీర లా
భరణము లెక్కుడుం జవులపాకవిశేషము లాదరింప నె
ప్పురుసునఁ గొల్చుఁ గూడురువ బంధులకున్ దగ నెమ్మి సల్పుదున్. (అను. 4–359)**

**– ఇమం ధర్మపథం నారీ పాలయంతీ సమాహితా
అరుంధతీవ నారిణాం స్వర్గలోకే మహీయతే (సం.అను. 123–20)**

# 81. శ్రీకృష్ణుడు-శ్రీకంఠుడు

ధర్మరాజుకు వివరించాడు భీష్ముడు బ్రాహ్మణుడిని పట్టి తినబోయిన
రాక్షసునికి మంచిమాటలు చెప్పి బయటపడిన బ్రాహ్మణుడి గురించి,
ఆ తరువాత చెబుతున్నాడు శ్రీకృష్ణ చరితాన్ని- రుక్మిణీ సమేతుడై
శ్రీకృష్ణుడు కుమారుడిని పొందగోరి వెళ్లాడు హిమవత్పర్వత ప్రాంతానికి.

పన్నెండేళ్లు గొప్ప వ్రతం చేసిన కృష్ణుని నుదుటి నుంచి పుట్టిన అగ్ని
సమీపంలో ఉన్న కొండ, అడవులను కాల్చివేసింది, అక్కడ ఉన్న మునులందరూ
ఆశ్చర్యంతో చూస్తూ ఉండగానే కృష్ణుడు ఆ మంటను మరలింప చేసినాడు.
అడవి మరల మామూలుగా కనిపించసాగింది- నిశ్చేష్టులైనారు మునిసంఘం.

అటువంటి అగ్నినే ముక్కంటి ఒకసారి మూడోకన్ను తెరచి కొండను
దహించి, పార్వతీదేవి వేడుకోగా మరల దానిని తెచ్చాడు యధారూపుకు.
శివుడన్నాడు- నీవు నా కన్నులు మూసావు వేడుకగా, లోకాలనావరించింది చీకటి
అందుకే నేను మూడవ కన్ను తెరచాను, ఆ కాసేపూ వెలుగునిచ్చాను లోకాలకు.

నీకెన్ని ముఖాలు పరమేశ్వరుడా అన్నది పార్వతి- అయిదు ముఖాల శివుడు
అన్నాడు ప్రేమగా- సద్యోజాతం, వామదేవం, అఘోరం, తత్పురుషం, ఈశానం-
సుందోపసుందులను చంపేందుకు విశ్వకర్మ లోకంలోని అందచందాలన్నీ
నువ్వుగింజంతకు తెచ్చి సృష్టించాడు తిలోత్తమను- ఆమెను చూస్తూ పంచముఖుడనయ్యాను.

---

**సీ.** **పుణ్యాంగనాకారములు దాల్చి పుణ్య న । దీ నివహంబులు దిశలు గొల్చి**
**చనుదేర శంకరసదృశ పరిష్కార । కల్యాణతను వైన గౌరి వచ్చి**
**వెనుక దిక్కున మెలుపునఁ జేరి మోమున । కలఁతిన వ్వినుమడి చెలువు నొసఁగఁ**
**దమ్మితేకుల నుల్లసమ్మాడు తన మృదు । కర యుగ్మమునను శంకరుని నేత్ర**

**తే.** **యుగ్మ మల్ల మూసి యున్నంత లోక మ । నర్క చంద్రతారకాగ్నియై మ**
**హాంధకారమగ్న మగుటయు సంక్షోభ । మందె భూతసముదయంబు లెల్ల. (అను. 4-419)**

**సీ.** **నిటలంబుకను దెఱచుటకుఁ గారణమేమి । సర్వేశ! యిది రహస్యంబు గాక**
**యున్నేనిఁ జెప్పవే!' యన్న నద్దేవుండు । 'కాంత! నీ కెఱిఁగింపఁగాని యట్టి**
**పని యెందుఁ గల్గునే? వినుము లోకాత్మక । త్వము నాకుఁ గల్గుట వలనఁ జేసి**
**నన్నేది వొందిన నన్నిలోకంబుల । నది వొందుఁ గాన నాయంబకములు**

**తే.** **నీవు మూయఁగఁ దిమిరంబు నిఖిలలోక । చయముఁ గప్పిన భూతముల్ భయముఁ బొందె**
**నీ కరంబులు ద్రోవక చీఁకటియును । జెఱుచుటకు ఫాలనేత్రంబు దెఱవవలసె.' (అను. 4-422)**

# 82. పరమశివ పరమేశ్వరీ సంవాదము

పార్వతి అడిగింది శివుడిని– పినాకపాణీ, నీకీ ధనుస్సు ఎలా వచ్చింది?
నీవెందుకు స్మశానాల్లో తిరగడానికి ఇష్టపడతావు? భవుడన్నాడు–
కృతయుగంలో కణ్వుడు తపస్సు చేసినపుడు అతడిపై పెరిగింది పెద్ద పుట్ట.
దానిమీద పెరిగింది గొప్ప వెదురు చెట్టు. బ్రహ్మ ఆ చెట్టును తీసుకున్నాడు.

మూడు ముక్కలు చేసి మొదటి ముక్కతో పినాకాన్ని చేసి నాకిచ్చాడు.
రెండవ ముక్కతో శారంగాన్ని చేసి విష్ణువుకు, మూడవ ముక్కతో చేసాడు
గాండీవాన్ని, దానిని తీసుకుని తనలోకం వెళ్లాడు – అది చివరకు
అగ్నిని ఆ తరువాత అర్జునుడిని చేరుతుంది ద్వాపర యుగాంతాన!–

క్రూర భూతాలు జనులను ఘోరంగా వధించినపుడు బ్రహ్మ ప్రార్థించగా నేను చేరాను–
సర్వభూతాలుండేది, చివరకు చేరుకునేదైన భూమిని–స్మశానాన్ని భావిస్తాను పవిత్రంగా.
జగత్తులోని సౌమ్య స్వరూపాన్ని విష్ణువు, అగ్ని స్వరూపాన్ని నేను భరిస్తాము.
భసితాంగ రాగము, అస్థి ఫణిధర ఆభరణములు, పరశు శూలాయుధములు

ధరించి లయకారుడినై జగత్సంహారము చేస్తాను తాండవమొనరిస్తూ,
నీవు నాతో లాస్య నృత్యము చేస్తుండగా అదే సృష్టికి ముగింపు కాగా.
దక్షయజ్ఞ సమయాన చంద్రుడిని అడ్డదిడ్డంగా తొక్కినందుకు జాలిపడి
అతడిని నెలవంక రూపాన ధరించాను నా జటాజూటంపైన –అన్నాడు శివుడు.

---

**సీ.** **ఆదియుగంబున నబల! కణ్వుం డను । సంయమి తపము నిష్ఠానిరూఢి**
**మెయిఁ జేయఁ బెరిఁ గె వల్మీకంబు దనువు ము । నుంగ నప్పుట్ట వేణువును బుట్టె**
**విను లోకసామాన్యఘనత గాకుండ మ । హాద్భుతాయామంబు నధికమైన**
**పరిణాహమును గల్గె బ్రహ్మ యమ్మునికిఁ బ్ర । త్యక్షమై వరమిచ్చె నతనిమీఁదఁ**

**ఆ.** **బెరిఁగియున్న వెదురు గరమర్థిఁ దాఁ బుచ్చి । కొని జగద్ధితంబు గోరి చేసె**
**నాకు విష్ణునకుఁ బినాకశార్ఙ్గము లగ్ర । ఖండమున నొనర్చె గాండివంబు. (అను. 4–429)**

**సీ.** **'లోకస్వరూపంబు లోలాక్షి! రెండు వి । ధమ్ములు శీత ముష్ణమ్ము నాఁగఁ**
**జనునివి రెంటను సకలంబు గ్రథితమై । యుండు సౌమ్యాగ్నేయయోగకలిత**
**మఖిలజగంబు సౌమ్యము విష్ణుఁ డాగ్నేయ । మేను వహింతు మయ్యిరుదెఱంగు**
**లెనయుటఁ గొని భరియింతు నీ విశ్వంబుఁ । గావున నాగ్నేయ భావరూఢ**

**తే.** **యైన యాకృతి లోకహితార్థముగ వ । హించినాఁడ నింకెయ్యది యీవు నన్ను**
**నడిగె దడుగుము' నావుడు నార్య 'సోముఁ । దలఁ బ్రియంబున నేటికిఁ దాల్చి? తనియె. (అను. 4–441)**

# ✢ 13. అనుశాసనిక పర్వము - పంచమాశ్వాసము ✢

## 83. పూర్వజన్మ కర్మ ఫలితాలు-

శివుడు వివరించాడు పార్వతీదేవికి- వర్ణాశ్రమ ధర్మాలైన,
బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర ధర్మాలను, ఆశ్రమ ధర్మాలైన
బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలను, తపస్సు
స్వరూపమును, సత్యాహింసల ప్రశస్తిని, అతిథి పూజను,

గురువు తల్లిదండ్రులపై చూపే భక్తిశ్రద్ధలకు కలిగే ఫలితాలను
రంతిదేవుడి యజ్ఞాన్ని, చర్మణ్వతీ నది పుట్టుకను, కుల ధర్మాలను
దాన ధర్మాల ప్రాముఖ్యతను -చెబుతున్నాడిప్పుడు ఈశ్వరుడు
ఎక్కువ శ్రమ పడకుండా డబ్బు లభిస్తున్నవాళ్లు క్రితం జన్మలో-

యోగ్యులకు పిలవకుండానే దానం చేసినవాళ్లు; ఆ జన్మలో
వార్ధక్యంలో దానధర్మాలు చేసినవాళ్లకు ఈ జన్మలో సంపదలు వస్తాయి
ముసలితనంలోనే; అవసాన కాలంలో అప్పుడు దానధర్మాలు
చేసిన వారికి ఈ జన్మలోనూ చివరిదశలో లభిస్తాయి సంపదలు.

క్రితం జన్మలో మాంసాహారము ముట్టనివారు ఈ జన్మలో సుందర రూపులు
పూర్వజన్మలో భార్యను ప్రేమించినవాడు ఈ జన్మలో పొందుతాడు సౌభాగ్యవతిని.
క్రితం జన్మలో కోపం, దురాశ, నాస్తికత్వంతో చెలరేగిన వాళ్లు
ఈ జన్మలో మూర్ఖులై, రోగాలతో అల్లల్లాడుతూ అనుభవిస్తారు కష్టాలను.

---

**సీ.** **దివియలోఁ బడుఁ బ్రువ్వు, దివియ యెత్తినవారిఁ । బాపంబు వొందునే, యోపి దున్న**
**నాఁగేటిమొనఁ జచ్చు నానావిధ ప్రాణు । లన్నరుఁ బొందునే యఘము? వారు**
**తమపనుల్ సేయ విధాతృవశమున నా । యువు దెగినట్టి జంతువులు సచ్చు;**
**నేము సంపితి మని యించుకేనియు నహం । కారంబు వారికిఁ గలుగ; దట్లు**

**తే.** **గానఁ జూవె వారిఁ గల్మష మొందదు; । పుణ్యపాపములకు బుద్ధి మూల'**
**మని శివుండు మఱియు నను 'హింసవోలెనై । యధిక ధర్మమైన విధము వినుము. (అను. 5-58)**

**సీ.** **ఆయాసపడకుండ నర్థంబు చేరెడు । వారు ప్రాతజనంబుఁ దార పిలిచి**
**తొలుమేనఁ బెట్టిన యలఘు దయాఢ్యులు; । ధనసిద్ధి బహులయత్నమునఁ గలుగు**
**మనుజులు పూర్వజన్మమున నర్థులు దమ్ము । నడుగ దాఁపక యిచ్చినట్టి వార;**
**లాయాసముననను విత్తాగమం బెడలెడు । జనులు ముందరి పుట్టువునఁ గృపా వి**

**తే.** **హీనులై యాచకుల నలయించి పిదప । నిడని లోభులు; ముదిసి ధనేశుఁడగు న**
**రుండు ప్రాయంబునాఁ డీక గం డడంగి । తొంటి భవమున నీగికిఁ దొడఁగి నతఁడు. (అను. 5-91)**

# 84. కర్మోద్భావిత ఫలమీ యర్థము-

క్రితం జన్మలో ఇతరుల అందాన్ని చెడగొట్టినవాడు ఇప్పుడు కుష్ఠరోగి.
వెనకటి జన్మలో సజ్జనులను కొట్టినవాళ్లకు ఇప్పుడు కణుతులు, చర్మరోగాలు,
గతజన్మలలో దేవాలయాల మెట్లెక్కని వాళ్లకు కాళ్లనెప్పులు, కీళ్లవాతాలు,
కడుపులో రోగాలు, మహోదరాలు – గురు దూషణ, జంతు హింస చేసినవారికి;

గూనివాడు, వికలాంగుడు, మరుగుజ్జులు – తప్పుడు తూనికలు చేసేవాళ్లు;
ఇప్పుడు పిచ్చివాళ్లు క్రితం జన్మలో వంచకులు, ధన గ్రాహకులు;
ఈ జన్మలో సంతతి లేనివాళ్లు గతజన్మలో తల్లిదండ్రులకు శ్రాద్ధం పెట్టనివాళ్లు;
ఇప్పుడు నపుంసకులుగా ఉన్నవాళ్లు పూర్వజన్మలో ఎద్దుల వృషణాలు కత్తిరించినవారు;

నేటి విధవరాలు మునుపటి జన్మలో పెనిమిటిని మోసం చేసినది;
ప్రస్తుతం రోతపనులు చేస్తున్నవాళ్లు గత జన్మలో అహంకారులు;
గత జన్మలో అధికారం చెలాయించినవారు, ప్రస్తుతం సేవకులుగా–
ప్రస్తుత కష్టసుఖాలకు కారణం గత జన్మ కర్మలని గ్రహించాలి.

నరులకు నరకలోక శిక్షలు, జన్మ జన్మల కర్మఫలాలుంటాయి.
మునీశ్వరులు యక్షగరుడ గంధర్వ కిన్నర కింపురుషాది దేవయోగులు
తాము సలిపిన దేహఫలాలను అనుభవిస్తారు ఆ దేహము నందే.
తెలియక చేసిన కర్మలకు ప్రాయశ్చిత్తంతో లభిస్తుంది విముక్తి.

---

**సీ.** **వెఱ్ఱులు తొలుమేన వెడ్డున సాధుజ । నము మోసపుచ్చి ధనంబు గొన్న**
**జను లనపత్యులు విను తొల్లి పితృకార్య । దూరులు బాలఘాతులును జువ్వె;**
**పొలఁతి! నపుంసకుల్ పూర్వభవంబున । నెద్దుఁ బట్టిన వారు నేమి తప్పుఁ**
**బొరయకుండఁగఁ గోపమునఁ ద్రికచ్ఛేదంబు । గావించినారును, గామ సుఖము**

**తే.** **విఘ్నపతిచిన తులువలు, విధవ తొంటి । జన్మమునయందు భర్తృవంచన మొనర్చి**
**ధనము గూర్చిన యదియు మదంబు పేర్మి । నోర్తుమగని హరించిన యుగ్మలియును. (అను. 5–105)**

**సీ.** **'ఇంతి! నా చెప్పిన యిప్పాపకర్ములం । దఱకును నరకంబు దప్పు; దండుఁ**
**బడుపాటు లెల్లను బడివచ్చి నరులైన । యప్పుడు వాటిల్లునట్టి తెఱఁగు**
**లివి; యట్లు గాకయు నెక్కుడుగాని పా । పంబుల మానుషభవము గలుగు**
**నిట్లైన నమ్మేన నే కర్మమున ఫల । మైనను మానవు లనుభవింప;**

**ఆ.** **రోపి మునులు దేవయోనులు నత్తను । పునన తపము ఫలము లనుభవింతు'**
**రనిన దేవి 'యెఱుఁగ నయ్యె మీదయఁ బెక్కు । లర్థములు గృతార్థ నైతి' ననియె. (అను. 5–111)**

# 85. శ్రుతము లేకున్న అతడు పశువు-

సహనం, సత్యం, దయ, పరిశుద్ధత, గురుభక్తి ఆయుస్సు పెంచుతాయి.
క్రోధం, అబద్ధం, క్రూరత్వం, అపరిశుద్ధత, గురుద్వేషం ఆయుస్సు తగ్గిస్తాయి.
తపస్సు, బ్రహ్మచర్యం, మితాహారం, ఔషధ సేవనం ఆయుర్వృద్ధికి
శక్తికి మించిన పనులు, హితం కాని తిండి ఆయువును హరించివేస్తాయి.

పుణ్యపురుషులు స్వర్గ సుఖాలనుభవించి వచ్చి దీర్ఘకాలం
గడుపుతారు భూలోకంలో కర్మలు ధర్మవిహితంగా చేస్తూ.
పాపులు నరకలోకంలో శిక్షలనుభవించి వచ్చి నరులై
కర్మ ఫలాన్ననుభవించి అల్పాయుష్కులై త్వరగా మరణిస్తారు.

తాత్త్వికములైన పురుష స్త్రీత్వములు లేవు, అహంకారము వలన
జీవుడికి కర్మ సంబంధము కలిగి జన్మిస్తారు స్త్రీపురుష రూపాలలో.
జరాయుజములు, అండజములు సకలేంద్రియాలతో ఉంటాయి.
ఉద్భిజ్జములకు స్పర్శజ్ఞానం, స్వేదజములకు స్పర్శ దర్శనాలుంటాయి.

జరాయుజులలో శ్రేష్ఠుడు మానవుడు, విద్య లేకుంటే వింతపశువవుతాడు.
తమస్సు రెండు విధాలు, రాత్రి చీకటి వెలుగుతో నశిస్తుంది.
దేహమున పుట్టిన చీకటి ధర్మాచరణ వలన, శాస్త్ర చర్చలతో తొలగుతుంది.
మానవులలో మహనీయులైనవారు దేవతలలా ప్రకాశిస్తారు.

---

**క. 'తాత్త్వికములైన పురుష । స్త్రీత్వంబులు లేవు పార్వతీ । జీవున; కా**
**తత్త్వమున కహంకృతిఁ గ । ర్మిత్వ మొలసి భావ్యవిధమ మెయికొను చుందున్.' (అను. 5-137)**

**క. నరుఁడు జరాయుజములలో । తరుణీ! విను ముత్తముఁడు; శ్రుతము లేకున్నన్**
**సరి నతఁడు పశువుఁ; గావున । వరిష్ఠ మగునట్టి వినికి వలయు నరునకున్. (అను. 5-145)**

**క. ఇరుదెఱఁగు విను తమము శా । ర్వరమును దేహజము శార్వరము దేజస్సం**
**స్ఫురణమునఁ బాయు శ్రుతమునఁ । బరిహృతమగు దేహజంబు పర్వతపుత్రీ! (అను. 5-146)**

**తే. క్రోధకామాదులైన దుర్గణము లెల్ల । వాయుహతి మేఘపటలంబు వాయు పగిది**
**శ్రుతముచేఁ బాయు; నరులలో సురల కరణి । శ్రుతయుతులు దేజరిల్లుదు రతిశయిల్లి. (అను. 5-148)**

**తే. శ్రుతము నరునిఁ బరిజ్ఞానయుతునిఁ జేయు । వాని సుకృత మల్పమును ననూన ఫలము**
**నిచ్చు; నజ్ఞాని సత్కర్మ మెంతయైన । నఫల మగుఁగాన శ్రుతవంతుఁ దగుట వలయు.' (అను. 5-149)**

---

**జీవరాశులు :**

1) **జరాయుజములు:** మావి నుండి, గర్భాశయము నుంచి పుట్టినవి-మనుష్యులు, పశువులు...
2) **అండజములు:** గ్రుడ్డు నుంచి పుట్టినవి- పక్షులు, చేపలు, బల్లులు, పాములు...
3) **ఉద్భిజ్జములు:** భూమిని భేదించుకుని పుట్టినవి- వృక్ష, లతా, గుల్మములు
4) **స్వేదజములు :** చెమట వలన పుట్టేవి- క్రిములు, ఈగలు, దోమలు, చీమలు...

# 86. పూర్వజన్మ-పూర్వజన్మ జ్ఞానం

మరణించి వెంటనే జన్మిస్తే పూర్వజన్మ జ్ఞానముంటుంది–అతడు జాతిస్మరుడు
చనిపోయాడనుకున్నవాడు యముడు పంపివేయగా బతికిన ఘటనలెన్నో!
అని శివుడు చెప్పగా గౌరీదేవి అడిగింది– కల అనునది ఏమిటి?
శివుడన్నాడు– స్వప్నమనగా సుప్తజనము మనశ్చేష్ట; కలలొక్కోసారి

చెబుతాయి భావి శుభ అశుభములను; అంతియుగాక మానవుడు
చేసే కర్మ వ్యవసాయం వంటిది. క్రితం జన్మ కర్మ దైవరీతి, ఈ జన్మ
కర్మ పౌరుషం; మానవ ప్రయత్నం ఉంటేనే అందుతుంది దైవ సహాయం
స్త్రీ పురుష సంగమ కార్యంలో శుక్లశోణిత కలయిక దైవం తోడ్పాటూ

జీవుడు గర్భంలోకి ప్రవేశించడానికి కారణభూతాలు; పూర్వకాలం
మానవులందరూ జాతిస్మరులే, పూర్వజన్మ జ్ఞానముండి పుణ్యాలే చేసేవారు.
స్వర్గలోకంలో జన సమ్మర్ధమెక్కువ కాగా దేవతలు, బ్రహ్మ ఆలోచించారు
పూర్వజన్మ జ్ఞానాన్ని తొలగించి చొప్పించాడు అరిషడ్వర్గాలనే అంతశ్శత్రువులను.

దానితో నరులకు పరలోక స్థితిగతులు శాస్త్ర విషయాల వల్లనే తెలియరాగా
విద్యావిషయక జ్ఞానం, గురు శుశ్రూష, శాస్త్ర వ్యాఖ్యానాలవసరమైనాయి.
పునర్జన్మ గురించి అందరికీ సందేహమే ఉన్నా, అది ఉన్నది నిశ్చయంగా!
–అని శివుడు పలుకగా గౌరీదేవి అడిగింది– ఆత్మ నిరాకారం కదా, శిక్షలెట్లా?

---

**సీ.** **'మృతిఁ బొంది వేగ జన్మించినఁ బూర్వదై । హికము లన్నియు బుద్ధి నెలయువాఁడు**
**జాతిస్మరుం డనఁ జను; నయ్యెఱుక పెద్ద । వాఁడు గాఁగాఁ జెడు; వనిత! వినుము**
**పుట్టెఱుంగుట కల్మి బోధించుటకు నాస్తి । కులమును జన్మంబు గలుగు తెఱఁగుఁ;**
**జచ్చిపోయిన వారు వచ్చి యత్తను వొంది । మెలఁగు టొక్కొక చోటఁ గలిగియుండు;**

**తే.** **నట్టి తెఱఁగు వెంగలు లైన యమునిదూత । లొరులఁ జని కొనిపోయినఁ గరుణతోడ**
**న మ్మహాత్ముండు మగిడి పొమ్మన్న నరుగు । దెంచుటని నీ వెఱుంగు; సందియము లేదు.' (అను. 5-151)**

**ఆ.** **'స్వప్న మనఁగ సుప్తజనము మనశ్చేష్ట । యదియుఁ గాంచు నొగి ననాగతములఁ**
**గానఁ గలలు సూచకము లగు భావి శు । భాశుభోదయముల కనుచుఁ జెప్పె. (అను. 5-153)**

**క.** **మాయారహితుఁ దహంకా । రాయత్తతఁ జూవె పుట్టువను చెఱఁబడి నా**
**నాయాసంబులఁ బడు నా । జ్ఞాయుతుఁడై యాత్ముఁ డింత చర్చింపు మదిన్.' (అను. 5-158)**

**–** **యే మృతాః సహసా మర్త్యాః జాయంతే సహసా పునః**
**తేషాం పౌరాణికో భ్యాసః కంచిత్ కాలం హి తిష్ఠతి (సం.అను.145)**

# 87. తరియైన మనుజుల తనువులు విడిపించి-

గౌరీదేవి అడిగింది గంగాధరుని- ఆకార రహితులైన ఆత్మలను ఎలా
తీసుకువెళ్తారు యమకింకరులు గాని, యముడు కాని? ఎలా శిక్షిస్తాడు?
శివుడు చెప్పినాడు- ఆయువు తీరిన జనుల ఆత్మలను పాశాలతో లాగి
మాయాదేహాలలో ప్రవేశబెట్టి- పుణ్యాత్ములను పరిమళభరిత మార్గాలలో,

మధ్యములను అంతగా కష్టాలు లేని దారిలో, పాపాత్ములను దుర్గంధ
భరితమై కఠినమైన త్రోవలో నడిపించి తీసుకువెళ్తారు యముడి వద్దకు.
యముడు పుణ్యాత్ములను పుణ్యలోకాలకు, మధ్యములను మనుజలోకానికి,
పాపాత్ములను నరకలోకానికి పంపుతాడు; అయిదు రకాల నరకాలున్నాయి.

భూమికి అధో భాగంలో- రౌరవం, మహా రౌరవం, కంటకారణ్యం,
అగ్నిగుండం, పంచకష్టం అనేవి -అయిదు ఘోరమైన నరకాలవి.
యముడు విధించిన శిక్షలను అమలు జరుపుతారక్కడ, కుక్కలు కరిచి
పురుగులు తొలిచి, గ్రద్దలు పొడిచి నానా బాధలు పెడ్తాయి పాపులను-

యమభటులు పెట్టిన నానా బాధలను అనుభవించి, కొలిమిలో కాగిన
ఇనుము తుప్పును వీడిన విధంగా జీవుడు శుద్ధుడై పురుగులుగా,
పక్షులుగా, మృగాలుగా, అనంతరం మనుష్యులుగా జన్మలెత్తుతారు చివరకు-
అని వివరించాడు ఈశానుడు ఉమాదేవికి నరకలోకపు శిక్షలను, లోకాలను.

---

సీ. 'తఱియైన మనుజులఁ దనువులు విడిపించి । మాయాశరీర సమన్వితులుగ
నొనరించి దూతలు గొనిపోదు; రందును । ధర్మవర్తుల సుగంధంబు మృదువు
నైన మార్గమున, మధ్యపువారి నిర్బాధ । సరణిఁ, బాపాత్ముల బరుసఁదనము
ముఱికియుఁ గల పథంబున నడపింతు, రి । ప్పురుసునఁ జని పితృపతికిఁ జూప

ఆ. నతఁడు పుణ్యలోక గతియును మానవ । త్వంబు ఘోరనరక వాసమును వి
ధించి పుచ్చు వారిఁ దెలచి మన్నించి భ । ర్జించి వరుసతోడఁ జిగురుఁబోఁడి!' (అను. 5-167)

సీ. 'రౌరవం బనఁగ ధరాస్థలిక్రింద మ । హారౌరవం బన నవుల దాని
కావల విను కంటకావనంబన నుండుఁ । గ్రమవృత్తిఁ బేర్చు దుఃఖములు గలిగి
యగ్నికుండంబునా నటఁ బంచకష్టంబు । నాఁగల విట్లున్న నరకతలము
లై దండుఁ బాపక్రియా తారతమ్యంబు । లూహించి యంతకుం డునుపఁ బనుచుఁ

తే. దగిన యెడలఁ బాపాత్ములఁ దద్భటాలి । దహన కర్తన బంధన తాడనములఁ
బఱుప వారలఁ గుక్కలు గఱచు!' గ్రిములు । దొలుచు' గ్రద్దలు నొప్పించుఁ దండనిహతి. (అను. 5-170)

# 88. మూడు రకాల పాపములు-త్రివిధ పుణ్యములు

త్రివిధ పాపములివి– మనసుతో, నోటితో, శరీరంతో చేసే మూడు రకాలు
పరద్రవ్యాపహరణం, దుష్కృత్యాలు, ధర్మద్వేషం మనసుతో చేసేవి.
అసత్యం, పరుషవాక్కు, మాటలతో నొప్పించడమనేవి వాక్కుతో చేసేవి.
తినకూడనివి తినడం, జారత్వం, కల్లు తాగడం శరీరంతో చేసే పాపాలు.

పుణ్యం ఔపరమికం, నిరుపకరణం, సోపకరణమనే త్రివిధములు
పాప కార్యాలను వర్జించడం ఔపరమికం; ఇది అత్యంత సులభమైనది.
శుచి, సత్యం, శాంతి, దాంతి, నిష్కాపట్యం, వ్రతం, బ్రహ్మచర్యం–నిరుపకరణం.
నిరుపకరణములే నియమములు– తీర్థ సందర్శనాదులు కూడా నియమాలే!

దానధర్మాలు చేయడమనేది సోపకరణం; అన్నదానం, భూదానం
కన్యాదానం, విద్యాదానం, తిలాదానం, వస్త్ర ఛత్ర దాసదాసీజన దానం
దీపదానం; తటాక నిర్మాణం, దారి డొంకల నిర్మాణం, బాగు చేయడం
చెట్లు నాటడం, సత్రాలను కట్టించడం, ఇవన్నీ పుణ్యఫలాలనిస్తాయి.

యజ్ఞాలు వైదికములు, లౌకికములు అని రెండు విధములు –బ్రాహ్మణాది జాతులు
న్యాయంగా సంపాదించిన ధనంతో వేదోక్తంగా జరిపించేవి వైదికాలు.
దేవుళ్లకు తిరునాళ్లు, ఉత్సవాలు, షోడశోపచారాలు చేయడం లౌకికాలు.
రెండూ దేవతలకు ఇష్టమైనవే, యజ్ఞం చేసినవాడు నరులలో ఉత్తముడు.

---

సీ. ఔపరమిక మనునది పాపవర్జన; । మకట! కానఁగ నేర రజ్ఞజనులు;
యత్నంబు వలదు; వ్యయం బేమియును లేదు । పరలోకభీతిఁ బాపములఁ దొఱఁగి
నంతన సుగతి సౌఖ్యం బొడఁగూడెదు; । నదియు నాత్మాధీన; మట్టిదాని
సుకరత్వ మెఱుఁగక చొత్తురు నరకంబు; । వెరవరుల్ శ్రుతమున వృద్ధయోగ

తే. మునను ధృతికల్మి నింద్రియ వినియమమున । నది దమకుఁ గలిగింతురు; యమ మనంగఁ
బరఁగు నది దాన నాకంబుఁ బడయవచ్చు । ననినఁ జెప్పంగ నేల ధర్మాభియుక్తి. (అను. 5–179)

సీ. ఆభ్యంతరంబు బాహ్యము ననఁగా శౌచ । మిరు దెఱఁగై యుండు హృదయసుకృత
మాభ్యంతరము విను మాహారశుద్ధియు । నంగశోధనము బాహ్యంబు సత్య
మన్నది గన్నది విన్నది యున్న రూ । పున నుక్త మగుట యంభోజవదన!
శాంతి బుద్ధీంద్రియ సన్నివారణ దాంతి । కర్మేంద్రియముల యోగ్యప్రవృత్తి;

తే. యార్జవము గుటిలుఁడు గామి యగు వ్రతంబు । మంచిపని పూని నడపుట యంచితోప
వాస మశననిగ్రహ మనవద్యమైన । బ్రహ్మచర్యంబు గామునిబారిఁ బడమి. (అను. 5–181)

# 89. పితృకర్మలు

గయ, కురుక్షేత్రం, గంగ వంటి పవిత్ర ప్రదేశాలు పితృకర్మలకు ఫలప్రదాలు.
మాఘ భాద్రపదాలు బహుళ పక్షం (కృష్ణపక్షం) అపరాహ్ణ సమయం
అమావాస్య, ద్వాదశి, నవమి అనే తిథులు సంతృప్తినిస్తాయి పితృదేవతలకు.
కుతపకాలం, దౌహిత్రుడు, నువ్వులు పితృకర్మలకు మిక్కిలి అర్హములు.

పూర్ణిమతో చేరిన పాడ్యమి, విదియ ఇలా పదిహేను రోజులు-శుక్ల పక్షము.
పూర్వాహ్ణము, సరిదినాలు, పుట్టిన రోజులలో చేయరాదు పితృకర్మలు.
నెయ్యి పెసరపప్పు పరమాన్నం మినప వడలు, అప్పాలు, నువ్వుల ఉండలు
శ్రాద్ధాది విధులలో ముఖ్య పదార్థాలు. కుతపకాలం ప్రశస్తమైన కాలం.

ఉత్తర దిక్కున దేవతలు, దక్షిణ దిక్కున పితృదేవతలుంటారు.
దేవతా పూజనానికి హవ్యమని, పితృదేవతా పూజనానికి కవ్యమని పేర్లు.
పితృదేవతలు సంతోషిస్తే కర్మలు చేసినవాడికి ఇహపర సుఖాలు దక్కుతాయి.
శ్రాద్ధాది కర్మలు నిర్వహించేప్పుడు శక్తిననుసరించి చెయ్యాలి దానధర్మాలు.

ధర్మములు అయిదు రకములు- వర్ణ ధర్మం, దేశధర్మం, కులధర్మం,
సామాన్య ధర్మము, ఆపద్ధర్మము - వీటిని అనుసరించాలి వివిధ జనులు.
స్వర్గలోకం అందరికి వాంఛనీయము, అమృతమే ఆహారము, నిత్యయవ్వనం.
రోగాలు, ముసలితనం, క్రోధాది దుర్గుణాలు లేవు, సుఖంగా జీవిస్తారందరూ.

**సీ. 'అన్నంబుఁ దోయంబు నఖిలజంతువులకుఁ । బ్రాణముల్ గాన య పురమవస్తు**
**వులు మేలు దాతవ్యములలోన నెల్లను; । నతిథుల కవి యిచ్చు టమరలోక**
**చిరమహాసౌఖ్యంబుఁ జేయుఁ; గాంచన మగ్ని । యగుటఁ దద్దాన మత్యంతపావ**
**నము సర్వకామప్రదము; గోవు సద్విప్రు । నకు నీగి తద్రోమ నికరసంఖ్య**

**ఆ. వరుస నాకలోక వాసంబు గావించు; । నందుఁ గపిల నిచ్చునాతఁ డిరువ**
**దొక్క తరము వారి నూర్ధ్వలోకమునకు । ననుపఁ జాలు వికచవనజవదన! (అను. 5-191)**

**సీ. 'విను మింతి । వైదికంబును లౌకికంబును । నన రెండు దెఱఁగులు యజ్ఞవిధులు;**
**వర్ణయోగ్యార్జన వర్ధనాంచిత ధన । ధాన్యముల్ గొని దేవతలకుఁ దృప్తి**
**యగునట్లుగా ఋత్వి గర్చన మొప్పఁగాఁ । గావించునది వైదికంబు; దేవ**
**తలకు మహోత్సవంబులు సేయుటయు గీత । వాద్యనృత్యము లనవద్యములుగ**

**ఆ. సంఘటించుటయును సద్గంధమాల్య ధూ । ప ప్రదీప భోజ్యభక్ష్యములు స**
**మాదరంబుతో నివేదించుటయు లౌకి । కంబు; రెండు నమరగణహితములు. (అను. 5-198)**

# 90. ఆ వెరపున మత్ సాయుజ్యము దొరకును-

శౌచము, బ్రహ్మచర్యము, శాంతి, మితాహారం పాటిస్తూ 'ఇడా' నాడి ద్వారా
ఆత్మావలోకనం చేస్తూ, మధ్యలో కలిగే ఆటంకాలను పారద్రోలుతూ
గురువు ఆశీస్సులతో అతడి పర్యవేక్షణలో మెలిగిన లభించును మోక్షానందం.
చింతా వివర్జనము, భూత అస్థిరత్వజ్ఞానం, తృష్ణారాహిత్యం ఇవి సరిపోవు ముక్తికి-

చింతా పరిగ్రహమే చాలనుకున్నవాడు పట్టుకాయలోని పురుగులా తనను
తన దారాలతోనే బంధించుకుని ఉంటాడు. అన్నీ అశాశ్వతమని
తెలిసినంత మాత్రాన సరిపోదు; సరైన పుణ్యకర్మలు చెయ్యాలి నియమిత కాలంలోనే.
కోరికలపై ఆశ లేదనగానే పూర్తి కాదు- అది నడవడిలో కనబడాలి ప్రత్యక్షంగా.

రేపటి పనులు ఈరోజు, సాయంకాలం పని ఉదయం చేయగలిగితే మంచిది.
వైరాగ్యము ప్రశాంతికి కారణము, ప్రశాంతి ముక్తినిచ్చును, మోక్షానందము
కలవాడిని సమీపించలేవు జరామృత్యువులు. అందుకే వైరాగ్యమతి గొప్పది.
యోగమార్గాన ప్రాణాపాన దేహాగ్నులతో శిరస్థానమును భేదించుట కపాల మోక్షం.

చతుర్విధ మోక్షాలలో సాయుజ్యం- దేవునిలో ఐక్యం, లయం కావడం
సారూప్యమనగా సమాన రూపాన్ని పొందడం, సాలోక్యమంటే అదే లోకంలో ఉండడం
సామీప్యమంటే- సాన్నిధ్యంలో ఉండడం; చాతుర్వర్ణ ప్రజలు ధర్మాచరణతో
సాంఖ్యయోగ మార్గాలలో చరించి, నిస్సంగులై సముపార్జించగలరు ముక్తిని-

---

**మ. రసగంధాది గుణాలి లేమి నవికారత్వంబునన్ సర్వ సం**
**వసనవ్యాప్తి నణుత్వభంగిని మహత్త్వ స్ఫూర్తిఁ జక్షుః ప్రభు**
**త్వసమాలంబితఁ దేజరిల్లు పరమాత్మాఖ్యంబు షడ్వింశకం**
**బు సమత్వంబునఁ జూచు శాంతు డతివా! పొందున్ విమోక్షస్థితిన్. (అను. 5-254)**

**చ. అలసతయున్ విచిత్తతయు నత్యశనాదరణంబు రోగముం**
**గలయును లోభమున్ భయముఁ గామముఁ గ్రోధము లౌల్యమున్ విరో**
**ధులు విను యోగసేవకు; నదుష్టతఁ బేర్చిన యోగ మిచ్చు సి**
**ద్ధు లెనిమిదింట నప్రతిహతుం డయి యోగి చరించు నెల్లెడన్. (అను. 5-262)**

**క. చరియించు భక్త జనులకుఁ బరమానందైక తానుభవ మొసగుదు; న**
**వ్వెరవున మత్సాయుజ్యము దొరకును వారలకు వికచతోయజ వదనా (అను. 5-270)**

**క. శివలింగ స్థాపనముఁ ద్రి । భువనములం బరమహితము పొంటెం గరుణన్**
**ధవళాక్షి! చేసెతిం ద । త్ప్ర విమల లింగమున నన్ను భావించు టుఋన్. (అను. 5-272)**

# 91. పతివ్రతా లక్షణములు

శివుడన్నాడు గౌరీదేవితో- ముల్లోకాల మేలుకొరకు నేనే నిర్ణయించాను
శివలింగ స్థాపనం నా స్వరూపంగా- క్షీరం, ఘృతం, జలంతో
అభిషేకం చేసి భక్తితో గంధ దూప దీప నైవేద్యములిడి నన్ను దర్శించిన
భక్తులకు లభిస్తుంది ముక్తి -అత్యంత సులభమైన మార్గమిది.

పార్వతీదేవి చెబుతున్నది గంగాది నదీ వాహినులు వింటుండగా శివునితో-
పుష్పవతి కాక పరిశుద్ధురాలుగా ఉండే చిన్నపిల్లను 'కన్య' అంటారు.
తల్లి తండ్రి పినతండ్రి మేనమామ అన్నదమ్ములు ఆ పిల్లకు పెళ్లిచేయాలి
తగిన వరుడితో; పరిణయం తరువాత ఆమె తన పెనిమిటిని దైవంగా

సర్వాధికారిగా, దైవంగా భావించి అతడి ఇష్టానుసారం దేవతల, పితృపూజలు
అతిథి పూజలు సద్బుద్ధితో సలుపుతూ మగని మేలు కోరుతూ ఉండాలి.
అలా సంసారయాత్ర చేసిన పతివ్రతా ఇల్లాలు పొందుతుంది ఇహపర సుఖాలు.
ఒక విప్రుడికి ఇద్దరు భార్యలుండిరి. మొదటి భార్య, భర్త అడగకుండానే

అతడు చెప్పకపోయినా అన్ని పుణ్యకార్యక్రమాలు చేసేది. రెండోభార్య
పెనిమిటి అనుమతితో ధర్మ కార్యాలు సలిపేది. ముగ్గురూ ఒకేసారి
చనిపోయారు. రెండోభార్య పుణ్యలోకాలు వెళ్లింది భర్తతో.
మొదటి ఇల్లాలు వెనక్కి మళ్లింది- కావున భర్తకు అనుకూలంగా ఉండాలి భార్య.

---

**చ.** **కలమెయిఁ బాల నేత నుదకంబులనేని వరాభిషేక మం**
**గళము నొనర్చి భక్తి రతి గంధము మాల్యము ధూప దీప సం**
**కలనములన్ నివేద్యమును గాఢ సమర్పణ మొందఁ జేసి లిం**
**గలసితమూర్తియందు ననుఁ గాంచి భజించిన ముక్తి చేకుఱున్.' (అను. 5-273)**

**సీ.** **'ఋతుమతి గాక శుద్ధతయుఁ గల్గినయింతి । కన్య తత్పరిణయ కరణమునకు**
**నొడయులు విను తల్లియును దండ్రియును దండ్రి । తోఁ బుట్టినతఁడు మాతులుఁడు సోద**
**రుండును యోగ్యవరునిఁ జూచి వారిలో । నెవ్వరైనను బ్రీతి నిచ్చువారు;**
**పతి యంతనుండియుఁ బ్రభువు దానికి; నట్లు । గావున నాతండ దైవ మనుచు**

**తే.** **నతని మత మూఁది దేవతా పితృ సమర్చ । నములు నతిథి పూజనము సన్మతి సమాచ**
**రించుచును బతిహితము వాటించి నడపు । సతి పతివ్రత యిహపరసౌఖ్యమహిత. (అను. 5-285)**

**క.** **గతి పతియ చువ్వె భార్యకు; నతనిఁ గడచినట్టి సత్పరాయణము కృపా**
**యుత కలదే? కావున దానతనికి భక్తయగు టిచ్చు నఖిల శుభంబుల్ (అను. 5-297)**

# 92. ఆసురి, పైశాచి, రాక్షసి-

ఇష్టమైన వంటకములు, ఇష్టంగా పొందును అడిగినపుడు సమర్పించాలి.
భర్త కావించే పనులకు అడ్డు పడరాదు, సవతితో కలిసి మెలిసి ఉండాలి.
అసూయ చెందరాదు, భర్త ఇచ్చిన వస్తువులను అడిగినప్పుడు ఇవ్వాలి.
భర్త ఎటువంటివాడైనా ఆదరించాలి గౌరవించాలి ఆడుది తన పెనిమిటిని.

భూతములకు బలులివ్వడం, యాచకులకు భిక్షం పెట్టడం
దేవతలను పితృదేవతలను పూజించే వేళలందు భర్తకు సాయపడడం
అతడి అభిలాషకు అనుగుణంగా ప్రవర్తించడం ఉత్తమ ఇల్లాలి ధర్మం.
భార్యకు భర్తయే దిక్కు. అతడికి సేవకురాలిగా ఆమెకు లభిస్తాయి సర్వశుభాలు.

అధర్మ మార్గంలో వర్తించే ఆడవాళ్లు- ఆసురి, పైశాచి, రాక్షసి రంకుటాళ్లు
ఆసురి-క్రూరురాలు, భోగాపేక్ష ఎక్కువ, అసూయాపరురాలు, ధన నాశిని
పైశాచి- కోపిష్ఠి, పెనిమిటి బిడ్డలందు దానికి ఇసుమంత ప్రేమ లేదు.
రాక్షసి- కయ్యానికి కాలు దువ్వుతుంది, అబద్ధాల పుట్ట, నిద్రపోతుందెప్పుడూ

అటువంటి పాపిష్ఠి స్త్రీలు మనసైనా మర్చుకోవాలి, లేదా సహగమనం చెయ్యాలి.
సంతానం కలిగిన స్త్రీ సతీ సహగమనం చేయనక్కర లేదు.
ఇవి నాకు తెలిసిన కొద్ది విషయాలు, కాలగతిలో మార్పు చెందవచ్చును
ఈ నియమాలు- అని పలికింది గౌరీదేవి పరమేశ్వరునితో మృదుమధురంగా.

---

**సీ.** **'పరమేశ! యాసురి పైశాచి రాక్షసి । యను పేళ్ళు గల వధర్మాంగనలకు;**
**వ్యభిచారతత్పరత్వంబు వారికి నెల్లఁ । గల; దసురాంశజ క్రౌర్యనిరత,**
**తనయిచ్చఁ బొలియించు ధనధాన్యములు, చల । హృదయ, భోగపరాత్మ, యీర్ష్య గలదు;**
**పైశాచి క్రోధన, భర్తృ పుత్రులయందు । నిఃస్నేహ, గృహకార్యనిపుణ గాదు,**

**తే.** **కలహశీల; రాక్షసి సయికంబు లేదు, । బొంకువల్కు, నెప్పుడు నిద్రవోవు, వీత**
**లజ్జ; యిందఱు నాథుకులంబువారి । దురిత మొందించి పోదురు నరకమునకు. (అను. 5-299)**

**క.** **ద్విజభామినికి నధర్మము । ప్రజఁ గాంచిన పిదప నయ్యపత్యము శోకో**
**ద్విజితయుఁ బతిభక్తయునై । త్యజించి యనుమరణ నియత యగుట మహేశా!' (అను. 5-302)**

**క.** **అని చెప్పి గౌరి పతి కి । ట్లను 'నాదగు చాపలమున నఖిలేశ్వర! నిన్**
**వినిపించితి నేఁ గొన్నివ । చనముల; నీతప్పు నాకు సైఁపుము కరుణన్.' (అను. 5-303)**

**-** **వ్రతం చరతి యానిత్యం దుశ్చరం లఘు సత్త్వయా**
**పతిచిత్తా పతిహితా సా పతివ్రత భాగినీ (సం.అను. 146-53)**

# 93. అంతిమ జపం

ధర్మరాజు అడుగగా భీష్ముడు చెబుతున్నాడు పరప్రాప్తినిచ్చే జపమును
-త్రిమూర్తులను, గణపతి కుమారస్వామిని, అగ్ని వాయువులను, సూర్యచంద్రులను
ఇంద్ర వరుణ యమ కుబేరులను, కామధేనువును, సప్త సముద్రాలను
గంగాది తీర్థాలను, సప్త వాయువులను, అశ్వినిదేవతలను, అష్ట వసువులను

ఏకాదశ రుద్రులను, ఆర్యముడు మొదలైన పితృదేవతలనూ, వాలఖిల్యులను
వ్యాస వాల్మీకి నారద అగస్త్య గౌతమ కశ్యప అత్రి కణ్వాది మునీశ్వరులను
రంభాది అప్సరసలను, ధర్మము తపము సత్యములను, అహోరాత్రములగు
తారలు నవగ్రహములను, అశ్వినాది ఇరువది ఏడు నక్షత్రాలనూ, కాలమును

గరుత్మంతుడు మొదలైన వైనతేయులను పక్షులనూ; వాసుకి, ఆదిశేషుడు
లాంటి కద్రువ పుత్రులనూ, కాశీ కురుక్షేత్రాది పుణ్యక్షేత్రాలనూ,
నైమిశం దండకారణ్యం కురుక్షేత్రం కాశి పవిత్ర వనాలు, స్థలాలనూ
మేరు శైలం, హిమగిరి, కైలాస పర్వతం వంటి గొప్ప కొండలను, దిక్కులను

ఆకాశాన్ని, ధరణిని, కల్పవృక్షాది వనస్పతులను, బ్రాహ్మణులు, రాజులను
భక్తితో స్మరించి, స్తుతించి, నమస్కరించి - వీరంతా నన్ను కాపాడుదురుగాక
దీర్ఘాయుస్సు, ఆరోగ్యం, ఐశ్వర్యం, సంతోషం మెచ్చుతూ ఇస్తారు గాక అనుకుని
జపించాలి- నారాయణాయ విద్మహే, వాసుదేవాయ ధీమహి, తన్నో విష్ణుః ప్రచోదయాత్-

---

**చ.** **'అతఁ డొకరుండ లోకముల కన్నిటికిన్ మహనీయమైన దై**
**వతముఁ బరాయణంబు నను వైభవ మెవ్వని కొప్పు? నర్చన**
**స్తుతి రతి నెవ్వనిం గొలిచి శోభన మొందు జనంబు? మేలు నా**
**నతిశయ మొంది నీకు మతమై చను నెయ్యది ధర్మకోటిలోన్? (అను. 5-317)**

**సీ.** **'అఖిలజగత్ప్రభు వగు దేవదేవు న । నంతునిఁ బురుషోత్తమాభిదాను**
**నంచితనామ సహస్రకంబున సంస్తు । తించుచు సంతతోత్థిత మనస్కుఁ**
**డై యజమానుఁ డవ్యయుఁడైన యాతని । నర్చించుచును దృఢ ధ్యాన నిరతుఁ**
**డగుచు నమస్కృతి యాచరించుచు ననా । ద్యంతు న విష్ణు నధ్యక్షు నెల్ల**

**తే.** **లోకములకు బ్రహ్మణ్యుఁ ద్రిలోక కీర్తి । వర్ధనుని సర్వధర్మజ్ఞు వరదు లోక**
**నాథు భూతభవోద్భవు నమ్మి భక్తిఁ । గొలిచి సర్వదుఃఖంబులఁ దొలఁగఁ ద్రోచు. (అను. 5-320)**

**-** **వాసుదేవాశ్రయో మర్త్యః వాసుదేవ పరాయణః**
**సర్వపాప విశుద్ధాత్మా యాతిబ్రహ్మ సనాతనమ్ (సం.అను. 149-130)**

# 94. ఓం నమో భగవతే వాసుదేవాయ!

వాసుదేవా, పురుషోత్తమా, సమస్త జగద్గురూ, సమస్త లోకాలకు తండ్రీ!
సమస్త లోకాలకు పితామహా, సమస్త లోకాలకూ ముత్తాత అయినవాడా!
సమస్త లోకాలకు ప్రభూ, సుఖప్రదాయకా, లోకనాయకా, లోకకర్తా
లోకభర్తా, లోకమే తానైనవాడా, లోకహారీ, ఆధారభూతుడా, నిధీ

చెలికాడా, సకల లోకాలకూ మేలు చేకూర్చేవాడా, ఉత్పత్తిస్థానమైనవాడా
సర్వ లోకాలను జన్మింపజేసేవాడా, అంతటా వ్యాపించువాడా, ప్రభావం కలవాడా
నీకు వందనం, అభివందనం – ఓం నమో నారాయణాయ, ఓం నమో విష్ణవే
ఓం నమో భగవతే వాసుదేవాయ! –అని జపం చేస్తే కలుగుతుంది మోక్షం.

శంఖ చక్ర గదాధరుడు, శారంగ పుండరీక దళ సన్నిభాక్షుడు, కిరీట
కుండలాభిరాముడు, శ్రీవత్స సంశోభివక్షుడు, కౌస్తుభ ఉజ్జ్వలుడు
అయిన ఆ దివ్య పురుషుడిని మనసనే గుడిలోంచి భక్తి శ్రద్ధలతో పూజిస్తూ
దర్శిస్తూ, విష్ణుమంత్రం జపించే వానికి కలుగుతాయి సమస్త శుభాలు.

అతడొకరుండ లోకములకన్నిటికిన్ మహనీయమైన దైవతము
పరమ తేజము, పరమపదము, పరబ్రహ్మము, పరపరాయణము
పవిత్రములకు పవిత్రము, శుభములకు శుభము, చరాచర సృష్టికి ఆధారము
విశ్వలోక ప్రధానుడు– విష్ణుడు, వషట్కారుడు – సర్వ ప్రహరణాయుధుండతడే!

---

సీ. పరమతేజంబును బరమ పదంబును । బరమైన బ్రహ్మంబుఁ బరపరాయ
ణముఁ బవిత్రంబులు నాఁ దగువానికి । నెల్లఁ బవిత్రంబు, నెల్ల మంగ
ళంబులకును మంగళంబును, నెల్ల దే । వతలకుఁ బరమదైవతము, భూత
సమితికి నవ్యయజనకుండు నగునట్టి । వాఁ డెవ్వఁ; డెవ్వాని వలనఁ దోఁచు

తే. నాదియుగము నాగమమున; నంత్యవేళ । నడఁగు నెవ్వానియందుఁ జరాచరములు,
విశ్వలోక ప్రధానుఁ డవ్విష్ణు వేయు । భవ్యనామంబులును బాపభయహరములు. (అను. 5–322)

తే. భూరిగుణయోగ విఖ్యాతములును ఋషి స । మాజ పరిగీతములను నై మహిమఁ దనరు
నమ్మహాత్ముని నామంబు లధికతర వి । భూతికై చెప్పెదను విను భూపవర్య!' (అను. 5–323)

ఆ. కీర్తనీయుఁడైన కేశవు దివ్యనా । మంబు లివి భవద్ధితంబుఁ గోల
తరతరంబ కీర్తితంబు లయ్యె నశేష । భంగి వేయుఁ గురునృపాలవర్య! (అను. 5–325)

– ఏకోవిష్ణుర్మహ ద్భూతం పృథగ్భూతా న్యనే కశః
త్రీన్ లోకాన్ వ్యాప్య భూతాత్మా భుంక్తే విశ్వభుగ వ్యయః (సం.అను. 149–140)

# 95. భుజశక్తి - బ్రహ్మశక్తి

వ్యాస సంప్రణీతమైన విష్ణు సహస్రనామ స్తోత్రమును అమలిన బుద్ధితో
పఠించిన వానికి కలుగును సమస్త సన్మంగళాలు, ఇహపరలోక సౌఖ్యాలు
ఓం నమో నారాయణాయ! నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి,
తన్నో విష్ణుః ప్రచోదయాత్! ఓం నమో విష్ణుః, ఓం నమో భగవతే వాసుదేవాయ!

ఒకప్పుడు కార్తవీర్యార్జునుడు తన వేయి బాహువుల బలం గొప్పదని గర్వించగా
వాయుదేవుడన్నాడు– ఇంద్రుడు గౌతముడి శాపానికి గురియైనాడు,
అగస్త్య మహర్షి సముద్రాన్ని పుక్కిట పట్టినాడు, భృగుమహర్షి
శాపానికి గురైనాడు అగ్ని; 'కార్తవీర్యార్జునా! చంద్రుడు తన పుత్రికను

ఉచథ్యుడనే వాడికిచ్చి వివాహం చేసాడు. ఆమెను కామించిన వరుణుడు
ఉచథ్యుడు లేని సమయాన ఆమెను అపహరించి తీసుకుని పోవడానిని
నారదముని చూసి వలదని చెప్పినా వినలేదు వరుణుడు. ఆగ్రహంతో
సముద్రజలాలను ఇంకింపచేయగా వరుణుడు వచ్చాడు కాళ్లబేరానికి,

ఉచథ్యుని శరణువేడి మ్రొక్కి ఆమెను అప్పగించి వెళ్లిపోయాడు.
వసిష్ఠుడు, అత్రి, చ్యవనుడు దేవతలకు సాయం చేసారు, పొగరు అణచారు;
దత్తాత్రేయుడికి సేవ చేసి కదా నీవింత శక్తి సంపాదించావు –అని చెప్పగా
కార్తవీర్యార్జునుడు తన అహంకారాన్ని మానుకుని మెలిగాడు వినయంగా.

---

**సీ.** **విష్ణునామంబులు వేయును నిత్యంబు । వినినఁ బఠించిన మనుజుఁ డిహము**
**నందుఁ బరమ్మున నశుభంబు నొందక । యత్యంత శుభముల ననుభవించు;**
**విప్రుండు వేదాంతవిదుఁ డగు, రాజు వి । జయ మొందు, వైశ్యుఁ డక్షయ ధనంబుఁ**
**బడయు, శూద్రుఁడు సుఖభాగిత వెలయు, ధ । ర్మార్థకామ ప్రజాభ్యర్థి జనులు**

**తే.** **గాంతు రయ్యె తెఱంగు; లేకాంత భక్తి । శౌచియై విని కీర్తించి సారయశము**
**నచల లక్ష్మియు వంశ వర్యతయు మేలి । పెంపుసొంపును గలిగి శోభిల్లు నరుఁడు. (అను. 5-326)**

**సీ.** **'ఇంతిఁ దా విడువనియంతియ కాదు, నన్ । బెడతల వట్టి త్రోపించె వరుణుఁ'**
**డని చెప్పుటయు నల్గి యతఁడు సర్వజలంబు । ద్రావిన వరుణపురంబు ధూళి**
**మయమైన భయమంది మానినిఁ గొనివచ్చి । యొప్పించి ప్రణమిల్లి తప్పు వాపి**
**కొని మునికృపఁ గాంచి చనియె నాదికృతి; । ధరణీశఁ రాజులొ ధరణిసురులొ**

**ఆ.** **యెక్కు?' దనిన వినియు నక్కిళ్ళు వడియున్న । యతనితోడ ననిలుఁ డమరు లసుర**
**సమితికోడి వచ్చి శరణుసొచ్చిన నగ । స్త్యుండు విజయలక్ష్మి నొసఁగుటయును. (అను. 5-345)**

# 96. దుర్వాసుడి పరీక్ష

దుర్వాసుడొకసారి కృష్ణుని మందిరానికి వచ్చి నవ్వుచు, కోపించుచు
అనుకూలుడుగా, ప్రతికూలుడిగా; అలుగుతూ, ఆనందిస్తూ, ఒక్కోసారి
భోజనం చేయక, ఇంకోసారి అందరకూ వండినది తానొక్కడే తింటూ
ఒక్కోసారి పరుపులపై, ఇంకోసారి దర్భలపై శయనిస్తూ, చెప్పకుండా

వెళ్లడం, తిరిగి తనకు తానే రావడం -ఇలా ప్రవర్తిస్తూ ఒకరోజున
అన్నాడు- తనకు పాయసం తినాలని ఉన్నదని. రుక్మిణిదేవి వండి వడ్డించిందతడికి.
కొంచెం తిని, కృష్ణుడితో పాయసం తన వంటికి రాయించుకుని
కొంత రుక్మిణిదేవి ముఖానికి, చేతులకు పులిమి రథం తెమ్మన్నాడు.

రుక్మిణిని రథానికి గుర్రంలా కట్టేసి తాను రథంలో కూర్చుని లాగమన్నాడు.
ఆమెను ముల్లుగర్రతో పొడుస్తూ 'చొ చొ' అంటూ, నన్ను రథాన్ని
తొయ్యమని వీధుల్లో కాసేపు తిరిగాడు. యాదవులందరికీ కోపమూ
ఆశ్చర్యము, భయం జనించినా కృష్ణుడు, రుక్మిణి సంతోషంగా చేస్తున్నారు.

రుక్మిణి అలసిపోయి క్రింద పడిపోయింది, దుర్వాసుడు కోపించి విసురుగా
వెళ్లిపోయాడు దక్షిణ దిక్కుకు; కృష్ణుడతడిని తీసుకువచ్చాడు బ్రతిమలాడి.
దుర్వాసుడన్నాడు- అమ్మా రుక్మిణీ, సౌందర్య సౌభాగ్యాలలో నీకు సాటి ఎవ్వరూ ఉండరు.
కృష్ణుడితో అన్నాడు- పాయసం నా వంటికంతా పులిమి వదిలేసావు ఎడమ పాదాన్ని.

---

**తే.** **బొడ్డుతామరయం దొక్క పురుషుఁ దుద్భ । వించినట్లుగఁ జేసి తద్విరచనా ని**
**భమున నఖిలచరాచర ప్రభవ మయ్యె; । నరయ సామాన్యమే కృష్ణ పరమలీల? (అను. 5-359)**

**క.** **విను మెత్తఱి ధర్మంబులు । దనుజులచే బాధఁ బొందుఁ దత్సమయమునన్**
**జనియించి య ద్దురాత్ములఁ । దునుముం గృష్ణుండు ధర్మధుర్యులఁ గాచున్. (అను. 5-360)**

**ఆ.** **రథముఁ దివిచి డస్సి రమణి మేదిని మీఁద । మ్రొగ్గ తిలఁగఁ బడిన డిగ్గ నుఱికి**
**దానిమీఁద ధూళి దాఁ జల్లి వెసఁ బాఱె । నమ్మునీశ్వరుండు యామ్యదిశకు. (అను. 5-372)**

**క.** **పాఱిన నాతని వెనుకన । పాఱితి; సంప్రార్థనా ప్రభాషణములతోఁ**
**దేఱి మరలి యమ్ముని 'మిముఁ । గాఱియ వెట్టితిఁ గదే యకట!' యనుచు దయన్. (అను. 5-373)**

**క.** **'నాయంగంబుల నెల్లం । బాయస మతిభక్తిఁ బూసి పాదతలమునం**
**బూయవు గావునఁ గలుగు న । పాయం బఱకాల నీకు నవిలంఘ్యంబై. (అను. 5-377)**

**-** **న తు పాదతలే లిప్తే క స్మాత్తే పుత్రకాద్య వై**
**నై తన్మే ప్రియమిత్యే వం సమాం ప్రీతో బ్రవీత్ తదా (సం.అను. 159-44)**

# 97. సర్వ జగన్నిత్యసాక్షి శివుడు

దుర్వాసుడన్నాడు- నాకు వళ్లంతా పులిమినావు పాయసం, కాని,
ఎడమకాలి పాదానికి, బొటనవేలికి ఇసుమంతయినా అంటలేదు-
అక్కడే నీకు ఆపద కలిగే చోటు, మిగతా దేహమంతా వజ్రతుల్యం.
నీకు వైకుంఠప్రాప్తికి అనుకూలంగానే ఉంటుంది -అని పలికి అదృశ్యమైనాడు.

అతడు వెళ్లిపోయినాక చూడగా శ్రీకృష్ణునికి, రుక్మిణిదేవిలకు
అందచందాలు మరింత శోభిల్లినాయి, ఇల్లు మరింత ఐశ్వర్యంతో వెలుగొందింది.
కృష్ణుడన్నాడు- శివుడు త్రిపురాలను ఒక్క బాణంతో భస్మీపటలం చేసి
తిరిగి వచ్చిన బాణాన్ని తొడపై పెట్టుకోగా ఆ బాణం బాలుడి రూపాన్ని పొందింది.

ఆ బాలుడే దుర్వాసుడు, ముక్కోపి, నన్ను ఆశీర్వదించ వచ్చినాడిటకు,
శివుడు పంపగా; ఆ పరమేశ్వరుడు- రౌద్రుడై, పరాక్రమం కలవాడై రుద్రుడని-
పాపహరుడై, హరుడిగా, మహాదేవుడిగా, శుభంకరుడై శివుడిగా
సుస్థిరమైన కాంతితో స్థాణుడిగా; బహురూపుడిగా, జటాజూటం

పొగవన్నెలో ఉండి దూర్జటిగా, విశ్వరూపుడిగా, సర్వత్‌చక్షుడు, ముక్కంటి
పశుపతి, వృషభ వాహనుడు, శ్రీకంఠుడు, నీలగళుడు, సదాశివుడిగా
సకల జగత్తులకు నిత్యసాక్షిగా, నిరామయుడిగా, పంచభూతాల కన్నా
ముందున్న ఆదిభూతమూ, ఆదిదేవుడైన శివుడు అందరినీ రక్షించును గాక!

---

సీ. ఉగ్రత్వమునఁ బ్రతాపోన్నతి రుద్రనా । మము దాల్చె; దేవసంఘమున కెల్ల
మహతినాఁ బొలుపారు మహనీయ దేవత । గావున విను మహాదేవుఁ డయ్యె;
నఖిలసత్కర్మ ఫలాకారశుభములు । సేయు వేడుక కల్మి శివుఁ డనంగఁ
జనియె; సుస్థిరతేజమున వెలుఁ గొందుట । నంచిత స్థాణు సమాఖ్యఁ బరఁగె;

తే. జంగమస్థావరాత్మక సకలభూత । రూపబహుత నొందుట బహురూపనామ
ధేయుఁడై యొప్పె; ధూమ్రపుఁజాయ జటల । వలన ధూర్జటి యనుపేర వఱలె హరుఁడు. (అను. 5-398)

సీ. బహునేత్రములు మేనఁ బ్రజ్వరిల్లుట సర్వ । తశ్చక్షు రాహ్వయోదాత్త కీర్తిఁ
బరఁగు; భూతము లెల్లఁ బశువులు దాఁ బతి । గావునఁ బశుపతి నా వెలుంగుఁ
వృషభస్థుఁడై యున్కి వృషవాహనుఁడు; మృత్యు । వనఁ జనుఁ బ్రాణ పాలాఖ్య సమత
నొంది; వహించు వేదోక్తాభిధానముల్ । మఱియుఁ బెక్కులు; వాని మహిమ వేద

ఆ. వేత్త లైనవారు వివరించి యన్యోన్య । బోధకత్వమునఁ బ్రభూత సౌఖ్య
లగుచు సంతతము శివారామతా నిరూ । ఢాత్ములై చరింతు రధిపముఖ్య! (అను. 5-400)

# 98. సర్వంబు నందు విజయుడవగుము

ధర్మములకు సంజ్ఞార్థములను ధర్మవేదులు మాత్రమే చెప్పగలరు యుక్తంగా
కాలపరిణామం వలన ధర్మం స్పష్టత కోల్పోయి గోచరిస్తుంది భిన్నంగా
సూక్ష్మబుద్ధి లేనప్పుడు 'గడ్డితో కప్పబడిన బావి'లా అధర్మం
కానరావచ్చును ధర్మరూపాన; అందువలన కార్యాచరణలో కలుగును దుఃఖం.

కామము అర్థము కలుగుతాయి మోహాతిరేకంతో; క్రోధ లోభ
మద మోహ మాత్సర్యములనే అంతశ్శత్రువులను విడనాడుట మంచిది.
ఆగమోక్త విధం, ప్రత్యక్షం, ఆచరణ అనే భిన్న విధాలుగా కానవస్తుంది ధర్మం.
అహింస, దానం, సత్యం, కోపరాహిత్యం అనే గుణాలు ధర్మానికి పరమావధులు.

రజస్తమోగుణ వికారులు ధర్మద్వేషులు; వారికి నరకలోకమే గతి.
ధర్మం బ్రహ్మదేవుడి ప్రథమ పుత్రుడు, సుబుద్ధులు ధర్మాశ్రయులు.
ఇంద్రియ భ్రాంతిని నిర్మూలిస్తారు, దయామయులు సాధు సత్పురుషులు
ఈ జన్మకర్మలన్నీ గతజన్మ కర్మ ఫలితాలే– ఈ జన్మ వచ్చే జన్మను శాసిస్తుంది.

భీష్ముడన్నాడు ధర్మరాజుతో– వేదవ్యాసుడు నీకంటికి వెలుగు,
వాసుదేవుడు నీకు ఆరాధ్యదైవం. ఈ చింతలు వదలి రాజ్యపాలన చేయుము.
హస్తినకు వెళ్లి సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన శుభకాలంలో
నా దగ్గరకు రాగలవు –అని పలికినాడు అంపశయ్యపై ఉన్న భీష్ముడు

---

**తే.** 'కను వెలుంగు వేద వ్యాస మునివరుండు । నధిప! కృష్ణుండు నీకుఁ బరాయణంబు
చింత దిగఁ ద్రావి పాలింపు శాంతవృత్తిఁ । బ్రజల; సర్వంబునందును విజయి వగుము.' (అను. 5–438)

**సీ.** 'నీ బుద్ధి ధర్మైకనిష్ఠ గావుతను; స । మగ్ర దక్షిణ బహుయజ్ఞములు య
యాతి చందమున శ్రద్ధాన్వితంబుగఁ జేయు; । రాజ ధర్మంబునఁ బ్రకృతి రంజ
నము నాచరింపు; చుట్టములును జెలులును । బండిన వృక్షంబుఁ బక్షి కులము
లెట్లట్ల నిన్నాశ్రయించి సుఖించువా; । రర్కుని యుత్తరాయణము వచ్చు

**తే.** టరసి కొనియుండి నాకడ కరుగుదెమ్ము । పొమ్ము; తల్లియుఁ దమ్ములు భూవరుండు
నీవు సుఖులరై యుండుఁడు నృపవరేణ్య!' । యనుడు నానంద మొంది ధర్మాత్మజుండు. (అను. 5–442)

**తే.** తమ్ములును గృష్ణుఁడును బ్రమోదమునఁ దేల । నమ్మహీశ్వరుఁ డపుడు రాజ్యాభిషేక
మంగళము నొందినట్లు నెమ్మదిఁ దలంచి । గట్టియైన యూఱట పెంపుఁ గాంచి పొలిచె. (అను. 5–448)

– ఆగంతవ్యం చ భవతా సమయే మమ పార్థివ
వినివృత్తే దినకరే ప్రవృత్తే చోత్తరాయణే (సం.అను. 166–14)

# 99. ఇమ్ము అనుజ్ఞ కమలదళ మనోజ్ఞ నయన-

యాభై రోజులు గడిచాయి, దినాధిపతి సూర్యుడు ప్రవేశించాడు
ఉత్తరాయణంలో, ధర్మజుడు తనతో గాంధారి, ధృతరాష్ట్రులను
కుంతీదేవి, కృష్ణ, సాత్యకి, భీమార్జున నకుల సహదేవులను,
విదుర సంజయ యుయుత్సులను, కృపాచార్య ధౌమ్యులను, ఋత్విక్కులను

నూతన వస్త్రాలు, చందన కట్టెలు, అగరు చెక్కలు, పూలు పండ్లు
నేతికుండలను, మణిమాణిక్య సువర్ణాలనూ, పవిత్రాగ్నిని తీసుకుని
పరిజన సేవక గణాలతో గాంగేయుడి వీరశయన స్థానానికి వచ్చారు,
రథాలు దిగి, వ్యాస నారద దేవల మునిప్రభృతులు సేవిస్తున్న భీష్ముని వద్దకు.

'మాఘమాసం, శుక్లపక్షం మేమంతా వచ్చాము పితామహా!' అని పలికి
ధర్మరాజు భీష్ముని ఆశీస్సులు పొందగా కురుపితామహుడన్నాడు-
-అందరికీ నా కడపటి ఆశీస్సులు, కాలమెలా గడుస్తుందో కనులారా చూసాను.
వసుడనై, ప్రభాసుడనై, గాంగేయుడనై, శాంతనవుడినై, దేవరాతుడనై,

భీష్ముడినై అనేక తరాల చావు పుట్టుకలు చూసాను, నేను వెళ్లిపోతున్నాను.
శ్రీకృష్ణా, దేవదేవ, జీవాత్మక, దేవవంద్య, శంఖ చక్ర గదా పద్మ చారుహస్త
వాసుదేవ త్రివిక్రమ వరద పరమపురుష; నా బలము నీవె, నేను నీ భక్తుడను
ఆలుబిడ్డలు లేనివాడిని, ఈ శరీర యాత్ర ముగించడానికి అనుజ్ఞనిమ్ము!

---

తే. **'దేవదేవ! జీవాత్మక! దేవవంద్య! । శంఖ చక్ర గదా పద్మ చారుహస్త!**
**వాసుదేవ! త్రివిక్రమ! వరద! పరమ । పురుష! ప్రణతి యొనర్చెద! గరుణఁ జూడు.' (అను. 5-461)**

ఆ. **'బలము నీవ నాకు, భక్తుండ నీయెడ, । నాలుబిడ్డ లేని యట్టివాఁడఁ,**
**గావు నన్ను నధిక కారుణ్యమున నిమ్మ । నుజ్ఞఁ గమలదళమనోజ్ఞనయన!' (అను. 5-463)**

సీ. **'మాధవ! పాండుకుమార వర్గమునకు । గతి నీవ; రక్షింపు కరుణ మెఱయ;**
**దుర్బుద్ధియైన యా దుర్యోధనుని తోడఁ । గృష్ణుఁ డెక్కడ నుండు గెలుపు గలుగు**
**నక్కడి కంటి నేఁ బెక్కుమాఱులు; నట్లు । చెప్పఁగా నా పంపు సేయ కతఁడు**
**దమవారి నెల్లను సమయించి తానును । సమసె; ని న్నెఱుఁగుదు; నమిత మహిమ**

తే. **నరుఁడు నారాయణుఁడు నను పరమమునులు । జగము రక్షించుటకుఁ గేలి జన్మ మొంది**
**సంచరించెద రని పరాశరసుతుండు । నారదుండును జెప్పిరి నాకుఁ దొల్లి.' (అను. 5-465)**

ఆ. **'కీ డొకప్డు లేదు, కృతపుణ్యుఁ డవు, తండ్రి । వలని భక్తి పెంపు గలవు; దానఁ**
**గాదె బంటుఁ బోలె గాంగేయ! మృత్యువు । నీవశమున నిలిచె నిర్భరముగ. (అను. 5-467)**

# 100. భీష్మ నిర్యాణం

వాసుదేవుడు అత్యంత ఆదరంతో దేవవ్రతుడైన భీష్ముని వదనాన్ని చూసి
-గాంగేయ! ఏనాడూ నీ వలన దోషం జరుగలేదు, పరమ పుణ్యుడివి నీవు.
తండ్రియందు పరమభక్తి కలవాడివి; అందుకే మృత్యువు నీకు బంటుగా
నీ అధీనంలో నిలిచి నీకు స్వచ్ఛంద మరణ స్వేచ్ఛనిచ్చింది. పుణ్యాత్ముడా!

నీకు నేను అనుజ్ఞనిచ్చితిని, వసువులను పొందుము -అని నమస్కరించినాడు
శ్రీకృష్ణుడు. పరమానందభరితుడైన భీష్ముడు తనను చూడవచ్చిన
వారినందరిని స్పృశించి, తన ధన సంపదల యావత్తూ దానం చేసి
అందరి వద్ద సెలవు తీసుకుని- యోగధారణచే మనసును నిగ్రహించి

ప్రాణాపానాది వాయువులను అడ్డగించగా, అవి ఊర్ధ్వముఖమున
ప్రయాణించి చేరాయి శిరస్సును- అప్పుడా మహనీయుడు ఒక్కొక్క అంశము నుండి
ప్రాణాన్ని తొలగించుకుంటూ స్థానములను శల్యరహితముల గావించగా
బ్రహ్మరంధ్రమును భేదించి ఆత్మ, అగ్నికణంలా వెలుగుతూ అదృశ్యమైనది నింగిలో.

ఆ విధంగా మహనీయుడైన భీష్ముడు శరీరం విడిచి చేరినాడు స్వర్గానికి.
ధర్మరాజు, ఆయన తమ్ములు, విదురుడు, యుయుత్సుడు చితిని గొప్పగా పేర్చినారు.
గాంగేయునికి గంగాజలాలతో స్నానం చేయించి, పట్టువస్త్రం కట్టి, పూలమాలలు
ఆభరణాలతో అలంకరించి, చేసినారు సామవేద పఠనం, గొప్ప హోమం.

---

సీ. ధర్మపుత్త్రుండును దమ్ములు విదుర యు । యుత్సులు నగరు కాష్ఠోత్కరంబుఁ
జందన దారు సంచయమును గొని సమ । స్థలి సమంచిత చితి యలఘు భంగి
విరచించి; రయ్యుధిష్ఠిరుఁడును ధృతరాష్ట్రుఁ । డును న మ్మరున్నదీ తనయు పుణ్య
గాత్రంబు సుస్నాన కలితంబు విహితాను । లేపంబుఁ బుష్పదామోపశోభి

తే. తంబు నుత్తమ క్షౌమావృతంబు నుజ్జ్వ । లాభరణ భూషితంబుఁగా నధికభక్తిఁ
జేసి; రప్పుడు సామంబు సెలఁగ హోమ । మాచరించిరి యాజకు లగ్ని యలర. (అను. 5-469)

క. కనకములు మణులు భూసుర । జనసం ఘంబున కజాతశత్రుఁడు శ్రద్ధా
వినయప్రీతి యుతంబుగ । ననేకములు వేడ్క నొసఁగె నవహిత మతియై. (అను. 5-470)

క. తలదిక్కు గవలుఁ బాదం ।బుల దెస ధృతరాష్ట్ర పాండు భూపాగ్రతనూ
జులుఁ బట్టి యధిక విభవో । జ్జ్వల మగు పాడె పయి నిడిరి శవరత్నంబున్. (అను. 5-472)

- మహోల్కేవ చ భీష్మస్య మూర్ధదేశ జ్జనాధిప
నిః సృ త్యాకాశ మావిశ్య క్షణే నాంతర ధీయత (సం.అను. 168-8)

# 101. అలుపెరుగని యోధుడి ఆఖరి యాత్ర

అంపశయ్యపై అసువులు విడిచినవాడికి అగరు చందన కాష్ఠ చితివేపు ప్రయాణం
భీష్ముడి పార్థివ శరీరం తలవేపు పట్టుకున్నారు నకుల సహదేవులు,
కాళ్లతట్టున ధృతరాష్ట్ర ధర్మజులు - జాగ్రత్తగా ఉంచినారు శవవాహనంపైన.
భీమార్జునులు వింజామరలతో విసుర్తుండగా, యుయుత్సుడు గొప్ప గొడుగు పట్టినాడు.

కౌరవస్త్రీలలో వృద్ధురాళ్లు ధరించారు ఆలవట్టములు, కర్మకాండ జరిపించాడు ధౌమ్యుడు.
భీష్ముడి శరీరాన్ని చితిపై ఉంచి వేదవిహితమైన అగ్నికి ఆహుతినిచ్చారు.
లెక్కలేనన్ని నేతికుండలు చితాగ్ని నింగినంటేట్లు చితిపై క్రుమ్మరించారు.
శవదహనానంతరం చితిచుట్టు అప్రదక్షిణంగా మరలి వెళ్లారు గంగా స్నానాలకు.

కౌరవులందరూ పత్ని సహితంగా గంగలో మునిగి నువ్వులు నీళ్లు వదిలారు భీష్ముల వారికి.
వ్యాస, నారద, దేవలాది మునులు దివ్య మంత్రాలు పఠించారు భీష్ముని ఆత్మశాంతికై.
ఆ సమయాన పుత్ర శోకభారంతో ప్రత్యక్షమైంది గంగానది స్త్రీరూపాన
-గొప్ప వీరుడు, పితృభక్తి కలవాడు, గట్టి పట్టుదల కలవాడు, భీష్ముడు

కదనరంగంలో సామాన్యుడైన శిఖండిచే కూలినాడు- నా హృదయం
రాతితోనో వజ్రంతోనో చేయబడిందేమో ఇంకా బద్దలు కాకుండా ఉన్నది-
అని దుఃఖితయై శోకిస్తున్న గంగను ఓదార్చినారు వ్యాసుడు, శ్రీకృష్ణుడు
-అమ్మా, అతడిని అమరేంద్రుడే జయింపలేడని నీకు తెలియును, శోకము వీడుము-

---

సీ. ఉదకంబులందుండి యుత్థితయై శోక । విహ్వలత్వంబున వికల గమన
యగుచు నెమ్మోముపై నశ్రులు గ్రమ్మగాఁ । జనుదెంచి కౌరవసమితి యెదుర
నిలిచి భాగీరథి 'యలఘుండు తన కొడు । కిలఁ బరికింపఁగా నెట్టిభంగి
వాఁడయ్యెఁ? జరితంబుపోఁడిమి మీరెల్ల । నెఱుఁగుదు; రైనను నేను గొంత

తే. సెప్ప వినుఁడు! దృఢ వ్రత శీలుఁ, డమల । బుద్ధి రాజవృత్తాఢ్యుఁడు, భూరికృపుఁడు,
కార్యసంవేది, పితృభక్తి ధుర్యుఁ డార్య । సమ్మతుండు, విద్యా పరిశ్రమ ఘనుండు. (అను. 5-474)

తే. కాశిరాజ కన్యకలకుఁగాఁ బెనంగి । వానిచే గాసియైరి భూవరులు పలువు
రంబకై పూని వానిమహోబలంబు । జామదగ్న్యుండుఁ దెరలుపఁ జాల కరిగె.' (అను. 5-475)

తే. 'అంతవాఁడు శిఖండిచే నట్టు లగుట । గనియుఁ బెక్కులు పఱియలు గాక యునికి
కతనఁ జేసి వజ్రమయంబు గాఁగ నోపు । నని తలంచెద నాడెంద మన్నలార!' (అను. 5-477)

- ధనంజయేన నిహతః నైష దేవి శిఖండినా
  భీష్మం హి కురు శార్దూలమ్ ఉద్యతేషుం మహారణే-

- నశక్తః సంయుగే హంతుం సాక్షాదపి శతక్రతుః
  స్వచ్ఛంద తస్తవ సుతః గతః స్వర్గం శుభాననే (సం.అను. 168-33,34)

# 102. వసువు కలిసెను వసువులను-

నీవు శోకంబు దక్కుము, నీ సుతుడు పరమపదాన్ని పొందినాడు.
శాప కారణాన ప్రభాసుడనే వసువు నీ పుత్రుడై జన్మించినాడు,
ఇప్పుడు తనవారైన వసువులలో చేరి శాపవిముక్తుడైనాడు.
నిమిత్తమాత్రుడైన శిఖండి వలన నిర్జింపబడినవాడు భీష్ముడు

అంతే! స్వచ్ఛంద మరణం వరంగా కలవాడు, అంపశయ్యపై ఉన్నాడు
యాభై ఎనిమిది దినములు ఉత్తరాయణ కాలాన్ని అపేక్షిస్తూ అతడు
అధికమైన యశస్సును పొందినాడు, అందరిని గౌరవించిన పుణ్యమూర్తి–
శోకమును విడువుమని –శ్రీకృష్ణుడు వచింప ఆమె అదృశ్యమైనది.

పదిరోజులు యుద్ధం చేసి తన పరాక్రమంతో హడలెత్తించాడు పాండవులను
ఆయుధం పట్టనన్న శ్రీకృష్ణునితో ఆయుధం పట్టించిన వీరవరుడు
శిఖండిని చూసి శరసంధానమాపి అర్జునుడి బాణాలకు అప్పగించాడు శరీరం
శరశయ్యపై పరుండి దిండుగా శరాలను, తాగడానికి దివ్యజలాలను

శరములతో అర్జుననితోనే ఏర్పరచుకున్నవాడు, తన మరణ
రహస్యాన్ని ధర్మపరులకు తానై తెలిపినవాడూ, స్వచ్ఛంద మరణంతో
తనకెంతో ఇష్టుడైన శ్రీకృష్ణుని అనుజ్ఞతో శరీరాన్ని విడిచినవాడు
అలుపెరుగని మహావీరుడు కురు పితామహుడి ఆఖరి యాత్ర ఇది.

---

తే. 'నీవు శోకంబు దక్కుము; నీ సుతుండు । పరమగతి నొందె; శాప సంప్రాప్తిఁ జేసి
వసువు మర్త్యుఁడై వర్తించె; నసదృశప్ర । భావుఁ డాతఁడు; వగపేల దేవిఁ నీకు? (అను. 5-479)

చ. అతని శిఖండి యేల? యమరాధిపుఁడున్ సమయింపఁ జాలునే
యతఁడు నిజేచ్ఛఁ జేసి నరు నంచిత దివ్య శరంబు లంగసం
గతములు చేసి పొన్పుగ సుఖస్థితి మృత్యువు మాన్చియుండి కీ
ర్త్యతిశయ మొంది తా వలచినప్పుడు వోయె విషాద మేటికిన్?' (అను. 5-480)

చ. సకరుణ దివ్యచిత్త! పరిశాంత మహత్త్వ విధానవిత్త! ని
ర్వికృత విలాస హృద్య! శ్రుతి విస్తర విస్ఫురణైక వేద్య! పా
వక బహుభవ్యనామ! పరివర్ధన సంక్షయ దూరధామ! వి
శ్వకలిత తోషణా! సుభగ సాత్యవతేయవచో విభూషణా! (అను. 5-482)

– నశక్తా విని హంతుం హి రణే తం సర్వదేవతాః
తస్మాన్మా త్వం సరిచ్ఛ్రేష్ఠే శోచస్వ కురునందనమ్
వసూనేష గతో దేవి పుత్రస్తే విజ్వరా భవ (సం.అను. 168-35)



# శ్రీ ప్రసాద మహాభారతము

## అయిదవ వేదము - శాంతి సప్తకము

# 14. అశ్వమేధ పర్వము

ఆ. అశ్వమేధ మఖము నండట్ల యనఘ! య లోలుపత్వగుణ విశాలబుద్ధి
శాలివై ఫలాభి సంధి లేకక్కాముధర్ముగాఁ బొనర్పు ధర్మతనయ! (అశ్వమేధ 1-135)

ఆ. అశ్వమేధమునకు నార్యులు దక్షిణ ధరణి యంద్రు; గాన నరుని చేత
విజితయైన ధరణి ప్రజనిత ప్రీతిమై ఋత్విగర్చనముగ నిచ్చినాడ (అశ్వమేధ. 4-190)

- పవిత్రం పరమం చైతత్పావనం చైతదుత్తమమ్
యదాశ్వమేధావ భృథం ప్రాప్స్యసే కురునందన (సం.అశ్వ. 88-16)

తతోయజ్ఞం మహాబాహుః వాజిమేధం మహాక్రతుమ్
బహ్వన్న దక్షిణం రాజా సర్వ కామ గుణాన్వితం (సం.అశ్వ. 88-18)

- సంస్థా ప్యైవం తస్య రాజ్ఞః తం యజ్ఞం శక్రతేజసః
వ్యాసః సశిష్యో భగవాన్ వర్ధ యామాస తం నృపమ్ (సం.అశ్వ. 89-6)

- అశ్వమేధే మహాయజ్ఞే నకులాఖ్యాన మేవ చ
ఇత్యాశ్వమేధికం పర్వవ ప్రోక్తమే తన్మహాద్భుతమ్ (సం.ఆది. 2-342)



| సంస్కృత మహాభారతము | కవిత్రయ మహాభారతము | శ్రీ ప్రసాద మహాభారతము |
|---|---|---|
| **14. అశ్వమేధిక పర్వము**<br>(ఉప పర్వాలు–అధ్యాయాలు) | **14. అశ్వమేధ పర్వము**<br>(గద్య పద్యములు) | **14. అశ్వమేధ పర్వము (57)**<br>(పద్య శీర్షికలు) |
| 1. అశ్వమేధ పర్వము (15)<br>2. అనుగీతాపర్వము (77)<br>3. వైష్ణవ ధర్మ పర్వము (22) | 1. ప్రథమాశ్వాసము (235)<br>2. ద్వితీయాశ్వాసము (228)<br>3. తృతీయాశ్వాసము (228)<br>4. చతుర్థాశ్వాసము (287) | 1. ప్రథమాశ్వాసము (14)<br>2. ద్వితీయాశ్వాసము (13)<br>3. తృతీయాశ్వాసము (15)<br>4. చతుర్థాశ్వాసము (15) |

(Traditional Edition: ఉప పర్వాలు–2, అధ్యాయాలు–96; Critical Edition: 1–92)

# ✣ 14. అశ్వమేధ పర్వము - ప్రథమాశ్వాసము ✣

## 1. అశ్వమేధ యాగం అధిక దక్షిణాన్వితం

అపరిమిత శోకంతో దుఃఖిస్తున్న హృదయం కలవాడైన ధర్మరాజు
గంగానది ఒడ్డునే, బాణాల దెబ్బకు నేలకూలిన ఏనుగులా
నేలమీదికి ఒరుగుతుండగా కృష్ణుడి సైగతో భీముడు
పట్టుకున్నాడు ధర్మరాజును, అంగవస్త్రాన్ని పరచి కూర్చోబెట్టాడు.

శ్రీకృష్ణుడు ఓదార్చినాడు ధర్మరాజును తగిన మాటలతో ప్రేమగా.
ధృతరాష్ట్రుడన్నాడు– గతం గతః, అయ్యిందేదో అయ్యింది,
మేమిద్దరం ఒంటరివాళ్లం. మమ్మల్ని నీవే చూసుకోవాలి, ధైర్యం వహించు.
శ్రీకృష్ణుడన్నాడు– ఇప్పుడు దైన్యం తగదు, ధర్మనీతిని గుర్తు తెచ్చుకో!

భీష్ముడు నీకుపదేశించిన ధర్మాలు, తత్త్వాల భావాన్ని తెలుసుకో.
వ్యాసుడన్నాడు– భీష్ముడు, శ్రీకృష్ణుడు, నేను చెప్పినవన్నీ ఏమైనాయి.
అవన్నీ వరదలో కలిసాయా లేక నీ బుద్ధి వాటిని అంగీకరించలేదా?
కావాలంటే బాగా దానాలు చేయి, లేకుంటే అశ్వమేధయాగం చేయుము.

ధర్మరాజన్నాడు– అశ్వమేధ యాగం చెయ్యాలంటే గొప్పగా
దానధర్మాలు చెయ్యాలి, యుద్ధం తరువాత నా దగ్గర ధనమేమీ లేదు కదా!
వ్యాసుడన్నాడు– మరుత్తుడనే రాజు యజ్ఞం చేసి గొప్ప ధనరాశుల్ని
దానం చేయగా చాలామంది గ్రహీతలు వాటిని భూమిలో దాచినారు.

---

**సీ.** **'నిష్ఠించి యిబ్బంగి నీ కేము చెప్పిన । వాక్యంబు లెల్లను వరదఁ గలిసి**
**పోయెనే? నీ దగు బుద్ధి యిం తొప్పదో । కాక మర్త్యుండు గాఁడు కర్త యీశ్వ**
**రు నియోగమునను మేలును గీడు నొనరించుఁ । గాన నీ మదిఁ బాపకర్మ శంక**
**గలిగె నేనియును యాగముల దానంబుల । నది వాపికొనరాదె? యశ్వమేధ**

**తే.** **మధికదక్షిణాన్వితముగ ననఘ । చేయు; । మంతతో భవదీయచిత్తానుతాప**
**మంతయును బాయు; రఘురాము నట్లు పూరు । భరతులును బోలె దానతత్పరుఁడ వగుము.' (అశ్వమేధ. 1-12)**

**సీ.** **'అనఘ! మరుత్తుండు యజ్ఞంబు సేసి మ । హాధనరాసుల నవనిసురుల**
**కిచ్చె; వా రవి కడు నెక్కుడై యుండుటఁ । ద్రవ్యితండంబులు దమ గృహముల**
**నిడికొని పెఱధన మెల్లను నిధియుఁగా । నిమ్మైన నెలవున నిడుచు నుండి**
**యందఱు నేకవాక్యత దీని నెవ్వరు । గనినను నిది వారి ధనమ యనిరి**

**ఆ.** **మానవేంద్ర! యమ్మహానిధానము దెచ్చి । వలసినట్లు నీవు వ్యయము సేయు**
**మనిన ధర్మతనయుఁ 'దతఁ డె ట్లు పార్జించె । నంత కాంచనము? మహాత్మ! చెపుమ.' (అశ్వమేధ. 5-15)**

---

ప్రసంధి మనువు → క్షుపుడు → ఇక్ష్వాకుడు → వింశుడు → వివింశుడు → ఖనీనేత్రుడు → సువర్చసుడు (కరంధముడు–చేతిని శంఖంలా చేసి ఊదిన సువర్చనుడు) → అవిక్షితుడు → మరుత్తుడు

# 2. కరంధముడి కథ

మరుత్తుడు దానం చేసిన ధనమెంత ఎక్కువ అంటే దానిని దాచిపెట్టారు
గొప్ప నిధిగా ఒకచోట మంత్రబలంతో ఆనాటి బ్రాహ్మణులు
'ఈ నిధిని ఎవరు కనుక్కుంటే వారిదేనని' -పలికారప్పుడు
అది తెచ్చుకుని నీ అవసరాలకు వాడుకో, అది ధర్మబద్ధమే!

కృతయుగంలో దండనీతితో పరిపాలించిన మనువు కొడుకు ప్రజాని
ప్రజానికి క్షుతుడు, క్షుతుడికి ఇక్ష్వాకుడు, ఇక్ష్వాకుడికి
నూరుగురు కుమారులు- వారిలో పెద్దవాడు వింశుడు -అతడి
కుమారుడు వివింశుడు, ఇతడికి పదిహేనుమంది పుత్రులు.

వారిలో పెద్దవాడు ఖనీనేత్రుడు - మిగతా పద్నాలుగురిని చంపి
రాజ్యపాలన చేబట్టి క్రూరకృత్యాలు చేస్తూ ఉండగా మంత్రులతడిని
పదవీభ్రష్టుడిని చేసి, అతడి కుమారుడికి కట్టినారు పట్టం.
సత్యశీలుడై అతడు దానధర్మాలు చేస్తూ పెద్దవాడైనాడు.

సైన్యం బలహీనమయ్యింది, శత్రువులతడిని ఓడించి తరిమివేసారు.
అడవికి పోయి అతడు గొప్ప తపస్సు చేసి శరీరాన్ని దమింపచేయగా
చతురంగ బలాలు సేవకులు, బంగరు రాసులు వెలువడినాయి.
శత్రువులపై దండెత్తి వారిని నిశ్శేషం గావించి కరంధముడైనాడతడు.

క. కరదమనంబున నాతఁడు । కరంధముఁ డనంగఁ బరఁగి గౌరవమున వి
స్ఫురణము విభవము శౌర్యముఁ । గరుణయు ధైర్యంబు వెలయఁగా నిల యేలెన్. (అశ్వమేధ. 1-26)

తే. శమము దమమును సత్యశౌచములుఁ గలిగి । యజనశీలత నశ్వమేధాధ్వరంబు
లంగిరసుఁ డుపదర్శకుండై నయింపఁ । బెక్కొనర్చె లోకములు సంప్రీతిఁ బొగడ. (అశ్వమేధ. 1-27)

క. అతని మనుమఁడు మరుత్తుం । డతులయశుఁడు విష్ణుసదృశుఁ డనఁ దగు నాగా
యుతబలుఁడు ధర్మతత్త్వ । స్థితివిదుఁడు సమిద్ధబహుళతేజుం డధిపా! (అశ్వమేధ. 1-28)

చ. హిమగిరిసానుదేశమున నెక్కుడు వైభవ ముల్లసిల్ల య
జ్ఞము తగఁ జేసి భూమిసురసంఘము లెల్లను దృప్తిఁ బొంద హే
మ మొసఁగెఁ గుప్పఁ గూరలు సమగ్రకుతూహలుఁడై కనత్సువ
ర్ణమయగృహక్రియోపకరణప్రకరంబులు నిచ్చె భక్తితోన్.' (అశ్వమేధ. 1-31)

- తతో విత్తం వివిధం సన్నిధాయ యథోత్సాహం కారయిత్వా చ కోషమ్
అనుజ్ఞాతో గురుణా సన్నివృత్య శశాస గామఖిలాం సాగరాంతమ్ (సం.అశ్వ. 10-35)

# 3. మరుత్తుడి యజ్ఞం

కరంధముడు అనేక అశ్వమేధ యాగాలు చేసి గొప్ప పేరు పొందినాడు.
అతడి మనుమడు మరుత్తుడు విష్ణువు అంశ కలవాడు; ధర్మపరుడు
వేయి ఏనుగుల బలం కలవాడు, విమలకీర్తి, మహాతేజోవంతుడు
అతడు బంగరు పాత్రలనేకం తయారు చేయించాడు యజ్ఞ సందర్భంగా.

హిమగిరి సానువులలో యజ్ఞం జరిపి బంగారు పాత్రలు, పళ్లేలు
కుప్పలు తెప్పలుగా దానమిచ్చాడు అర్హులైన వారందరికీ, విశేషంగా.
కరంధముడు బొందితో స్వర్గానికి వెళ్లగా అతడి కుమారుడు
అవిక్షిత్తు గొప్ప సామర్థ్యంతో పరిపాలన చేయగా, అసూయ చెంది ఇంద్రుడు

బృహస్పతితో ఒట్టు వేయించుకున్నాడు- అగ్ని చల్లనైనా,
అబ్జమిత్రుడు మైలపడినా, భూమి క్రిందుమీదైనా, మేరు పర్వతం
కదలాడినా బృహస్పతి ఇంకెవరి యజ్ఞానికి ఉపద్రష్టగా ఉండరాదని-
ఇంద్రుడనుకున్నట్లే మరుత్తుడు అడిగాడు బృహస్పతిని- రాలేను అన్నాడతడు.

ముఖం చిన్నబుచ్చుకుని ఉన్న మరుత్తుడితో నారదుడన్నాడు
-మీ తాతగారు బృహస్పతితో చేయించారు యజ్ఞం, అతడు రానన్నాడిప్పుడు
అంతేకదా, ఎవరి పనులు వాళ్లకుండవా, పోయి సంవర్తుడిని అడుగు
అతడు కాశీపురంలో ఉంటాడు, పిచ్చివాడిలా తిరుగుతూ ఉంటాడు.

---

**చ. అతని సుతుండు సూవె మనుజాధిపసత్తమ! యమ్మహాత్ముఁ డా
పతి తన తండ్రి పిమ్మటఁ గృపారతుఁ డార్యుఁడు దండనీతి వి
శ్రుతమతి దానశీలుఁ డన రూఢికి నెక్కి తదీయరాజ్య సు
స్థితి వెలుఁగొందె వాసవునిఁ జీరికిఁ జేకొనఁ డీసు పెంపునన్. (అశ్వమేధ. 1-33)**

**క. వాసవుఁడును నవ్విభునెడ । నీసు గలిగి తన్ను మిగులనీనని తచ్చిం
తాసక్తుండై మంత్రి ని । వాసమునకుఁ జనియెఁ బూరువంశప్రవరా! (అశ్వమేధ. 1-34)**

**సీ. 'అనఘ! మరుత్తుండు నిను వరింపఁ దలంచుఁ । దన యజ్ఞమున కుపద్రష్ట గాఁగ
నమరాధిపతి యగు నట్టి నాకును జేసి । యుపదర్శనం బింక నొక్క మర్త్య
నకుఁ జేఁత నీ పెంపునకు హాని గాదె! నన్ । విడిచి యాతని యజ్ఞవిధులు నడపుఁ;
దాతనిఁ దొఱఁగి మదాప్తత మెఱయు పె । క్కాడంగ నేటికి?' ననుడు నతని**

**తే. పలుకులకు నవ్వి యా బృహస్పతి 'మహాత్మ! । యెఱుఁగనే నిన్ను? నన్ను నీ వింత సెప్ప
నేల! సర్వలోకముల కధీశుఁడైన । నీ గురుం డొరు నాసించునే మహేంద్ర!' (అశ్వమేధ. 1-36)**

# 4. సంవర్తకుడి సంవాదం

నారదుడన్నాడు మరుత్తుడితో– కాశీపురం వెళ్లి పురద్వారం ముందు
శవాన్ని ముందు పెట్టుకుని కూర్చో. ఎవరైతే అటువచ్చి చూసి
వెంటనే వెనక్కి తిరిగి వెళ్లిపోతారో అతడే సంవర్తుడు.
అతడి వెనకనే వెళ్లి ఒంటరిగా ఉన్నపుడు శరణు వేడుకొనుము.

ఎవరు పంపించారని అడిగితే నాపేరు చెప్పు! –అన్నాడు నారదుడు.
మరుత్తుడు కాశీపురం ద్వారం ముందు కూర్చున్నాడు శవాన్ని ముందు పెట్టుకుని.
సంవర్తకుడు వచ్చాడు, వెనక్కి తిరిగాడు, రాజు అతడి వెనక నడిచాడు.
పిచ్చివాడిలా అతడు ఊగుతూ తూగుతూ అడవిలోకి వెళ్లాడు.

పెద్ద మర్రిచెట్టు నీడలోకి వెళ్లి తనను అనుసరించిన మరుత్తుడిపై
దుమ్ము చల్లాడు, ఉమిసాడు, తిట్టాడు, కొట్టబోయినాడు.
మరుత్తుడు మౌనంగా ఉన్నాడు; సంవర్తకుడడిగాడు– ఎవరు పంపారు నిన్ను!
'నారదుడు పంపినాడు' –అన్నాడు మరుత్తుడు అతడిని స్మరిస్తూ.

సంవర్తుడన్నాడు– మా అన్న బృహస్పతి నన్నూ నిరాకరించాడు.
అయినా అతడు పూజార్హుడు, అతడు కాదంటే అప్పుడు చూద్దాం!
మరుత్తుడన్నాడు– అతడు కాదన్నాడనే తమవద్దకు వచ్చాను.
సంవర్తుడన్నాడు– నాతో గొడవ నీవు తట్టుకోగలవా, ఆలోచించు!

---

**సీ.** ఇప్పుడు నారదుం డెందున్న వాఁడని । యడిగినయట్లైన నతఁడు నాకు
ని న్నెఱింగించి యగ్నిప్రవేశము సేసె । ననుము శంకింపక' యనుడు నమ్మ
హీపతి వారాణసీపురంబున కేఁగి । దిక్కుమాలిన పీనుఁ గొక్కచోటఁ
బడియున్నఁ గని దానిఁ బట్టించుకొని పుర । ద్వారప్రదేశంబు సేర నరిగి

**తే.** యచట నక్కుణపము నిడి యంతనంత । వేచికొని యుండఁగా నొక్క వెఱ్ఱివాఁడు
వచ్చి శవముఁ గనుంగొని వాటువడ్డ । పసరమును బోలెఁ గ్రమ్మఱి పాఱుటయును. (అశ్వమేధ. 1-36)

**సీ.** అది యంతయును విని యమ్మరుత్తుఁడు త్రిద । శాచార్యు కడ కేఁగి యతనితోడ
'నీకు నెఱిగించి నీ పంపునన యేను । సంభారముల నెల్ల సంఘటించి
యజ్ఞాచరణమున కమరియున్నాఁడ నీ । వుపదర్శనంబు సేయుటకు రమ్ము'
నావుడు 'నింద్రుండు ననుఁ దన యాగము । నకు మున్న వరియించినాఁడు; నాకు

**తే.** నెట్లు రావచ్చు?' ననియె నా యింద్రమంత్రి । యట్లు పలికిన 'మా తాత కనఘ! నీదు
తండ్రి సంప్రీతితో నుపద్రష్ట యయ్యె; । నట్ల కృపసేయు' మని పల్కె నవ్విభుండు. (అశ్వమేధ. 1-40)

# 5. ముంజవంత పర్వత ప్రాంతము

సంవర్తకుడన్నాడు- మా అన్న బుద్ధికి బృహస్పతి, నేనేమో
ప్రళయ కాల సంవర్తక మేఘంలా కోపిష్టివాడిని. జాగ్రత్త!
యజ్ఞ దీక్షలో కూర్చున్నాక కదిలావంటే శపిస్తాను నిన్ను-
దానికి తోడు ఇంద్రుడు, బృహస్పతి విఘ్నాలు కలిగిస్తారు తప్పకుండా-

మరుత్తుడన్నాడు- తమ దయ లభించింది నాకు! అది నాకు చాలు.
నేనేమీ ఇంద్ర బృహస్పతులతో గొడవ పడలేదు, అది నా బలం.
విఘ్నాలు కలిగించాలని వాళ్లనుకుంటే అది వాళ్ల బలహీనత.
తమ స్నేహం నాకు ముఖ్యం ఆచంద్రతారార్కం వరకూ, మునిచంద్రమా!

సూర్యుడు, కులపర్వతాలు- మహేంద్ర, మలయ, సహ్య
శక్తిమంత, గంధమాదన, వింధ్య, పారియాత్రములు -ఉన్నంతకాలమూ
తమరినే కొలుస్తాను నేను -అన్నాడు మరుత్తుడు నిశ్చయంగా-
సంవర్తుడన్నాడు- మనం ముంజవంత పర్వతానికి వెళ్లి సేవిద్దాం శివుడిని.

పరమశివుడక్కడ పార్వతితో విహరిస్తూ ఉంటాడు పరిజన సేవలనందుకుంటూ.
బంగరు రాళ్లు, బంగరు ఇసుక, అద్భుత లతలు చెట్లకు ప్రసిద్ధి ఆ ప్రాంతం.
జరామరణ రోగాలు లేని ప్రదేశమది, సమస్త భూతజాలానికి నివాస స్థలమది.
అక్కడకు వెళ్లి పరమశివుడి అనుమతితో తెచ్చుకుందాము అనంత స్వర్ణరాశి.

---

**సీ. 'నీ కృపగాంచితి నాకు నింకొండు వి । చారంబు లేటికి? సంయమీంద్ర!**
**యా దివస్పతియు బృహస్పతియును నేల? । పశుపతి విద్వేషపరతఁ గలఁచె**
**నేనియుఁ గలఁగుదునే?' యని పలికి 'మీ । సంగతి వాసిన సరసిజాప్త**
**చంద్రతారకకులాచలములు గల యంత । కాలంబుఁ బుణ్యలోకములు లేక**

**తే. పోవు' నని శపథము శుద్ధభావవృత్తిఁ । బలుకుటయు, మెచ్చి యమ్మునిపతి 'మహీంద్రు**
**కంటె నిను ధనవంతునిగా నొనర్చి । క్రతువు నడపుదు ' నని చెప్పి ప్రమద మెసఁగ. (అశ్వమేధ. 1-58)**

**సీ. శ్రీకంఠు రుద్రుని శివుఁ బూషదంతఘ్ను । హరునిఁ గపర్ది శంకరుని నంత**
**కాంతకు వరదుని నాదిదేవునిఁ ద్రిలో । చను సహస్రాక్షుని శాంతమూర్తిఁ**
**జీరవాసుని ధన్వి సిద్ధు దండధరు మృ । గవ్యాధు నుష్ణీషిఁ గనకబాహుఁ**
**బశుపతి వృషు భూతపతి మాతృభక్తుని । నజు నగ్నివక్త్రుని నభవు భవుని**

**ఆ. భక్తిఁ బ్రస్తుతించి ప్రణతులఁ దేల్చి త । త్కరుణ వడసి పసిఁడి ద్రవ్వి తండ**
**ములు నృపాల! పెక్కుమోపులు దెత్తము । రమ్ము భారవహులఁ దెమ్ము చాల.' (అశ్వమేధ. 1-63)**

# 6. ఇంద్రుడి కోపం

–శ్రీకంఠ రుద్ర శివ పూషదంతఘ్న హర కపర్ధి శంకర అంతకాంతక
వరద ఆదిదేవ త్రిలోచన సహస్రాక్ష శాంతమూర్తి చీరవాస ధన్వి
సిద్ధ దండధర మృగవ్యాధ ఉష్ణీష కనకబాహు పశుపతి వృష భూతపతి
మాతృభక్త అజ అగ్ని వక్త్ర అభవ భవ – మహేశ్వరా మాంపాహి పాహి, దేవా!

అని శివుని ప్రార్థించి బంగారు శిలలను, బంగారు రాశులను పనివారితో
మోయించుకుని నగరాన్ని చేరి, యజ్ఞవాటికను, కుండలు, యోగసాధనాలు
శయ్యలు, ఆసనాలు తయారు చేయించుకుని దివ్యంగా యాగం ప్రారంభించాడు
మరుత్తుడు ధన కొరత లేనివాడవడంతో; బృహస్పతి ముఖం వెలవెల పోయింది.

అది తెలిసి ఇంద్రుడు అగ్నిని పిలిచి అన్నాడు– నీవు మధ్యవర్తిగా వెళ్లి
సంవర్తకుని స్థానంలో బృహస్పతి యాజకుడిగా ఉంటాడని తెలియజెప్పు–
ఆ మాటను మరుత్తుడికి చెప్పాడు అగ్ని; మరుత్తుడంగీకరించలేదు.
సంవర్తకుడన్నాడు– అగ్నీ మధ్యవర్తిగా వచ్చావు, మరుత్తుని మాట విన్నావు–

మరలి వెళ్లు మారు మాటాడక – లేకుంటే నేను తపో అగ్నిని ప్రయోగిస్తాను నీపై–
అగ్ని భయపడి వెళ్లి ఇంద్రుడికా మాట చెప్పగా, ఇంద్రుడు ఆగ్రహించాడు
'వజ్రాయుధంతో మరుత్తుడి పొగరణుస్తా!' అని చిందులు తొక్కినాడు.
'ఇతరులను నీవు దహిస్తావు, నిన్ను దహిస్తానని –అనగానే పారిపోయి వస్తావా?'

---

**సీ.** **'ఇంక వచ్చిన దారుణేక్షణదగ్ధుఁ గా । వింతుఁ జుమ్మీ! యని విపులకోప**
**మూర్తియై పలికె సంవర్తుండు గావున । వెఱతు నే నట వోవ; వేఁటొకండు**
**పోవుఁ గా' కనవుడు దేవేంద్రుఁ 'డన్యుల । నీవు దహింతు గా కే విధమున**
**నొరులు నిన్ను దహింతురో! పేదమాట యి । ట్లాడుదే?' యనుటయు నగ్ని పలుకు**

**ఆ.** **మూఁడులోకములును వాఁడి మగంటిమి । నేలుచున్నవాని నెట్లు వృత్రుఁ**
**డాక్రమించె నిన్ను? నదియును గాక ప । ర్జన్య! మఱియు వినుము బ్రహ్మబలము. (అశ్వమేధ. 1-84)**

**సీ.** **సయ్యాతి క్రతువున నయ్యాశ్వినుల సోమ । పానంబు నీ కొడఁబాటు గాక**
**పాయంగఁ బెట్టిన భార్గవచ్యవనుండు । వారికిఁగా సురవర్గసహిత**
**ముగ నిన్ను బాధితుండగఁ జేసె నిజమంత్ర । బలమున; దాని కీ వలిగి వజ్ర**
**మేడ్తెఱఁ గొని యమ్మునీశ్వరు సాధింపఁ । గడఁగిన నగుచు బెట్టడఁచెఁ గాదె!**

**తే.** **యతఁడు పుడిసెఁడు నీరన యప్పు డతనిఁ । దెలచి సోమ మాశ్వినులకుఁ గలుగఁ జేసి**
**తరయ నెందును బ్రహ్మ బలాతిశయముఁ । గడచినట్టి బలంబులుఁ గలవె? యనఘ! (అశ్వమేధ. 1-85)**

# 7. సంభజనపరాత్ముడై యొసగె

అగ్ని అన్నాడు- ముల్లోకాలను ఏలుతున్న నిన్ను వృత్రుడు పెట్టలేదా ముప్పుతిప్పలు.
చ్యవన మహర్షి మంత్రశక్తి తెలిసినాకే గదా నీవు అశ్వినీదేవతలకు పంచావు సోమాన్ని,
బ్రహ్మబలము గొప్పదని ఎరిగిన ఇంద్రుడు పంపినాడీసారి గంధర్వరాజు ధృతరాష్ట్రుని
గంధర్వపతితో అన్నాడు మరుత్తుడు- సంవర్తుడే నా యాగాన్ని నిర్వహిస్తున్నాడు.

ఇంతలో వజ్రాయుధం భీకరంగా వస్తున్న చప్పుడైంది, మరుత్తుడు భయపడగా
సంవర్తుడు సంస్తంభ మంత్రం ప్రయోగించాడు- వజ్రాయుధం ఆగిపోయింది.
యజ్ఞం ప్రారంభమై నిర్విఘ్నంగా పూర్తయ్యింది; మరుత్తుడి కోరికను మన్నించి
సంవర్తకుడాహ్వానించాడు ఇంద్రాది దేవతలను, అందరూ స్వీకరించారు వారి వారి భాగాలను.

ముంజవంతం నుంచి తెచ్చిన బంగారం మొత్తాన్ని, యజ్ఞవాటికలోని
సమస్త వస్తువులను దానం చేసినాడు మరుత్తుడు- సంవర్తుడి
ఆశీస్సులతో మరుత్తుడు గొప్పగా, ధర్మంగా చేసినాడు రాజ్యపాలన.
బ్రాహ్మణులందరూ తాము మోయగలిగినంత బంగారం తీసుకున్నారు.

మిగతా బంగారాన్ని కాంచనరాశిగా ఒకచోట ఉంచి, మంత్రప్రోక్తం చేసి
ఒకచోట దాచి -'ఎవరికి దొరికితే వారికి'- అని అన్నారందరూ ఒకేసారి.
ధర్మరాజా! ఆ కాంచన మహారాశిని తెచ్చి గొప్పగా అశ్వమేధ యాగం చేయి
-అని పలికాడు వ్యాసమహర్షి తెరలు తెరలుగా దుఃఖంలో మునుగుతున్న ధర్మజునితో.

**సీ. 'ఇంద్రునిదెస భయం బించుకేనియు వల; । దతఁడు నన్నెఱుఁగఁడే యధిప! వినుము**
**సంస్తంభవిద్యా ప్రశస్తవైభవమున । వజ్రంబు నడఁతు నవ్వాసవాది**
**దైవతంబుల యాయుధంబులు నాచేతఁ । బ్రతిహతం బొందు; దుష్ప వనచండ**
**వృష్టిప్రముఖమహా వికృతుల బాధింతు' । ననుడు 'మ్రోయుచు నిదె యరుగుదెంచె**

**ఆ. భిదుర మెవ్విధమున భీతి దొఱంగుదు?' । ననియె నృపతి; యాతఁ డల్ల నగుచు**
**దాని సరుకుగొనకు 'తగు వర; మడుగు నా । తపము పేర్మి నిత్తు ధరణినాథ!' (అశ్వమేధ. 1-95)**

**చ. యజనము సెల్లుకాలము సమాప్తతఁ బొందిననాఁడు తద్ద య**
**క్కజమగు భంగిఁ బ్రస్ఫురితకాంచన రాసు లనేకముల్ బహు**
**ద్విజులకు భక్తియుక్తియును వేడుకయున్ వినయంబు నొప్ప సం**
**భజనపరాత్ముఁడై యొసఁగెఁ బౌరవవంశపయోధిచంద్రమా! (అశ్వమేధ. 1-106)**

ఆ బంగారం ఎవరిది? సంస్కృత మహాభారతంలో- మరుత్తుడు అశ్వమేధ యాగం చేసి బ్రాహ్మణులకు దానమివ్వగా మిగిలిన బంగారాన్ని ఒక ధనాగారంలో దాచి ఉంచాడని వ్రాసినాడు (అశ్వమేధ. 10-35). తిక్కన-భారతంలో బ్రాహ్మణులు తాము మోయగలిగినంత బంగారం తీసుకుని మిగతా బంగారాన్నంతా ఒకచోట ఉంచి "ఎవరికి దొరికితే వారికి" అని నిక్షిప్తం చేసారని వ్రాసినాడు. (అశ్వ. 1-108)

# 8. మిథ్యా యుద్ధం - సత్యయుద్ధం

మరల శోకంలో మునిగిపోయి పొగకమ్మిన నిప్పువలె ఉన్నాడు ధర్మరాజు.
అతడిని చూసి శ్రీకృష్ణుడన్నాడు– మృత్యు పదానికి దారితీస్తాయి
వంకర ఆలోచనలు; ఏడుస్తూ కూర్చోవడమెందుకా ఆలోచనలతో?
నీవు నిర్మలంగా ఏ పనీ చేయవు? కనీసం దుఃఖాన్ని ఆపుకోవు–

వృత్రాసురుడు భూమినంతా ఆక్రమించుకుని లాగేసాడు భూమి గంధాన్ని.
ఇంద్రుడు అతడిమీద ప్రయోగించాడు దంభోళి వజ్రాన్ని.
వృత్రుడు క్రమంగా భూమిని వదలి ఆశ్రయించాడు తక్కిన నాలుగు భూతాల్ని.
నీటిలోని రసాన్ని, అగ్నిలోని రూపాన్ని, వాయువులోని స్పర్శను

ఆకాశంలోని శబ్దాన్ని సంపూర్ణంగా గ్రహించగా, ఇంద్రుడు
మరల ప్రయోగించాడు వజ్రాయుధాన్ని; భూతాల్లో దాగి ఉన్న
వృత్రుడు వచ్చి ఇంద్రుడిలోనే దూరగా మూర్ఛపోయాడింద్రుడు.
వసిష్ఠ మహర్షి మంత్ర ప్రయోగంతో ఇంద్రుడు తెలివి పొందినాడు.

తనలో ఉన్న వృత్రుడిని కనిపించని వజ్రంతో చంపాడు ఇంద్రుడు.
వాత పిత్త కఫాలు, సత్త్వరజస్ తమోగుణాలు తగుపాళ్లలో లేక
నిష్కల్మషంగా నీవే పనినీ చేయలేకున్నావు, ధర్మరాజా,
బాహ్యశత్రువులను ఓడించావు, ఇప్పుడు ఓడించు అంతశ్శత్రువులను–

సీ. 'శారీరమును మానసంబును నా రెండు । దెఱఁగులై వ్యాధి వర్తించు; నందు
విను వాతమును బిత్తమును సమ । త్వంబుఁ బొందిన యప్డు స్వస్థుఁ డగు న
రుం; డవి మూఁట నొక్కండైన వికృతి నొం । దిన శరీరవ్యాధి యనఁగ బరఁగు;
సత్త్వరజస్తమస్సమత సుస్థిత; విష । మత మనోవ్యాధి; యీ ద్వితయమునకు

ఆ. నొంటి దోఁచు టెపుడు నొదవ; దన్యోన్య సం । జనకజన్యభావసత్త్వఁ జేసి
వికృతికాల మొకట నొకటి దోఁచునది వా । తాదులందు గుణములందు నధిప! (అశ్వమేధ. 1-114)

సీ. అమ్మెయి 'గాక వాతాదులు సత్త్వము । ఖ్యములును దివిచిన గలఁగు దేని
నది నీ స్వభావ మేమనఁగల? దింకను । జెప్పెద నవధాన మొప్ప వినుము
సభ కేకవస్త్ర రజస్వలఁ బాంచాలిఁ । గొని రాక మఱవు కాననములోన
నిడుమలు గడుచుట నెడ్డఁ బెట్టకు జటా । సుర సైంధవాదుల దురితకృతులు

తే. తలఁపకుము మాత్స్యపురమున దైన్యపడుట । బుద్ధి సేయకు భీష్మాది యుద్ధతంత్ర
మారయంగ యుద్ధంబు గా దందుఁ బుట్టు । కీడు మే లేమియును జిత్తగింపకుండు. (అశ్వమేధ. 1-117)

# 9. కామగీత

'మమ' అనే రెండక్షరాలు మృత్యువు; నమమ-మూడక్షరాలు బ్రహ్మము
అవి పోట్లాడుకుంటాయి. ఏ భూతరాశికీ కనిపించకుండా ఎప్పుడూ
దేహం ఒక ఖండం-అశాశ్వతం, ఆత్మ అఖండం-శాశ్వతం
శరధి పరివేష్ఠిత క్షితిని పాలించినా దానిపై మమకారముండరాదు.

అడవులలో కందమూలాలు తిన్నా, ధనకనకాదులపై మోహం పోలేదా?
బయలు ఉన్న శత్రువును గెలిచావు, అంతశ్శత్రువును గెలువుమిప్పుడు.
కాముడనే అంతశ్శత్రువు అంటున్నాడు- నాకు దగ్గరగా ఉన్నవాడిపై
నాదే విజయం- కనుక నేను అజేయుడను- గెలుపు నాదే!

నన్ను దెబ్బ కొట్టాలని చూసేవాడిలోనే నేనుంటాను అతడికి తెలియకుండా!
నన్ను తపస్సుతో భంగపరచాలని చూస్తే, వాడికి తపోఫలానికి
చెందిన కోరికగా నన్ను నేను మలుచుకుంటాను, గెలుపు నాదే!
నన్ను మోక్షముతో చెరుద్దామనుకుంటే మోక్షార్థమవుతాను.

శ్రద్ధ, స్థిరబుద్ధి, ఫలాపేక్ష లేకపోవడం, మోక్షాన్ని ఆశించడంలోనూ
కోరిక లేకుంటే మనస్సును మధించేవాడు మాయమవుతాడు-
ఏ తీవ్రమైన కోరికా లేకుండా కాముడినే మనస్సాక్షిగా చేసి
అశ్వమేధ యాగం చేయుము- నీకు లభిస్తుంది విజయం.

---

క. 'అనపాయుం డగు నెవ్వం। డును నను బాధింపఁ జాలఁడు ప్రయత్నము సా
ధన మగునె వేదవేద్యుం। డనయి పరఁగుచున్న నా యెడను విహతికిన్నై. (అశ్వమేధ. 1-128)

క. ధృతి నెవ్వఁడు నన్నుం బ్రవి। హతుఁజేయఁగఁ జూచు భావ మగుదు నతని; కే
నతఁ డది యెఱుఁగుఁడు గాన వి। హతి బొంకై పోవఁగా జయము లేకుండున్. (అశ్వమేధ. 1-129)

క. ననుఁ దపమునఁ బ్రహరించెద। నని యెవ్వఁడు దొడఁగు నతని కా తపము ఫలం
బున దెసఁ గోరికనై యే। జనియింతుం; జెఱుపఁగా వశమె యెవ్వనికిన్? (అశ్వమేధ. 1-130)

క. నను మోక్ష మూఁది చెఱిచెద। నని యెవ్వఁడు దలఁచు వానియందే మోక్షా
ర్థనమై యునికి నవధ్యుఁడ। సనాతనుఁడ ద్రోవ నొకఁడఁ జాలఁడు నన్నున్.' (అశ్వమేధ. 1-131)

క. 'అని యివ్విధమునఁ గాముఁడు। దనుఁజెఱుపఁగరామిఁజెప్పు తలఁపొందినఁ జె
ప్పిన భంగి నెదను దోఁచెను। విను మవధానమునఁ బాండవేయప్రవరా! (అశ్వమేధ. 1-132)

- ద్వ్యక్షరస్తు భవేన్మృత్యుః త్ర్యక్షరం బ్రహ్మ శాశ్వతమ్
మమేతి చ భవేన్మృత్యుః న మమేతి చ శాశ్వతమ్ (సం.అశ్వ. 13-3)

# 10. వినుత వచస్సుధా రసము వీనులనింకొకమారు నింపవే!

మెత్తని పులి ధర్మరాజును మెత్తమెత్తగా మందలించాడు శ్రీకృష్ణుడు
కాస్త ధైర్యం తెచ్చుకున్న ధర్మరాజు రాజ్యపాలనలో లీనమవ్వగా
నరనారాయణుల్లాంటి పార్థకృష్ణులు కాలం గడిపినారు హాయిగా
ఇద్దరూ కలిసి మయసభను దర్శించారు, ఎన్నో జ్ఞాపకాలను కూడా.

కృష్ణుడన్నాడు అర్జునుడితో– సమరమును ధర్మవిజయ పరికీర్త్యముగా చేసి
పాలించుచున్నాడు ధర్మరాజు సర్వజనులు సంతోషంగా ఉండగా.
అర్జునా! నీ వలన నా మనసు మిక్కిలిగా సంతోషించింది, నాకు ఈ తృప్తి చాలు!
ద్వారకకు వెళ్లి నా అన్నను, తల్లిదండ్రులను చూడాలని మనసు ఆరాటపడుతున్నది.

ధర్మజుని అనుమతి తీసుకుని వెళ్లాలనేది నా అభిప్రాయం.
నా దేహం, ప్రాణం, సంతతి, స్నేహితులు, బంధువులు, సంపద, అన్నీ
అతడి సొత్తే! ఆయన మాటను పాలించడం నాకు వ్రతదీక్ష
అర్జునుడన్నాడు దిగులు కూడిన ముఖంతో –వెళ్లువుగానీలే!

యుద్ధం ముందు కొన్ని తత్త్వబోధన మహనీయ వాక్యాలు చెప్పావు.
మనసు కలత చెంది ఉన్నదేమో మరచిపోయాను కొన్నిటిని
నరుడిని కదా, నాపై కృపతో మరలా చెప్పు, వింటాను ప్రశాంతంగా!–
కృష్ణుడన్నాడు– నీకు బుద్ధి శ్రద్ధ రెండూ లేకుండా పోయాయిలే, బావా!

---

**చ.** **'అనికిఁ దొడంగు నప్పుడు మదాత్మ గలంగినఁ గొన్ని తత్త్వబో**
**ధన మహనీయవాక్యము లుదాత్తకృపం దగ నీవు సెప్పి; తే**
**మనమున వాని యర్థములు మాధవ! నిల్పఁగఁ జాల నైతి; న**
**వ్వినుతవచస్సుధారసము వీనుల నింకొకమాఱు నింపవే.' (అశ్వమేధ. 1-155)**

**క.** **అనిన నగుచు నొక కేల న । తనిఁ గౌఁగిఁట జేర్చి 'బుద్ధితత్త్వవిహీనుం**
**దును శ్రద్ధారహితుఁడు నై'। తని దూఱి ముకుందుఁ డిట్టు లను నాతనితోన్. (అశ్వమేధ. 1-156)**

**తే.** **'బ్రహ్మపదవేదనమునకుఁ బరమహేతు । భూతములు నాఁటి వాక్యముల్ బుద్ధిఁ దన్మ**
**హార్థములు నిల్పవైతి శక్యంబె యింక । నవ్వచనములు సెప్పంగ? నలఘుశౌర్య! (అశ్వమేధ. 1-157)**

**ఆ.** **అట్లు భక్తిఁ దన్ను నాశ్రయించిన శుచి । త్వాధికుండు నిర్మలాత్మకుండు**
**నతులవినయపరుఁడు నగు విప్రవరుని వీ । క్షించి యిట్టులనియె సిద్ధవరుఁడు (అశ్వమేధ. 1-159)**

**-** **యత్ తద్ భగవతా ప్రోక్తం పురాకేశవ సౌహృదాత్**
**తత్ సర్వం పురుష వ్యాఘ్ర నష్టం మే భ్రష్టచేతసః (సం.అశ్వ. 16-6)**

# 11. వాయు పిత్త కఫ దోషములు

మహా వాక్యాలను మనసులో నిలుపుకోలేని మహావీరుడవైన అర్జునా!
మంచి వాక్యాలను మరల మరల చెప్పడానికి వీలుకాదయ్యా, అయినా విను,
కాశ్యపుడనే బ్రాహ్మణుడికి సిద్ధుడు బోధించిన విషయాలు చెబుతాను
–ఎన్నో పుణ్యకర్మలు చేసి స్వర్గలోక ప్రాప్తిని పొందినవాడిని నేను

త్రుటి కాలంలో భ్రష్టుడినై కామక్రోధాది కల్మషాలకు లోనై,
జనన మరణ చక్రంలో తిరుగుతూ, ఎంతమంది తల్లుల చనుబాలు తాగానో,
ఎందరు తల్లులు తండ్రులు అన్నదమ్ములు కొడుకులు, ఎన్నిజాతులు,
ఎందరు స్నేహితులు, ఎంత ధననాశనం, ఎన్ని కష్టాలు పడ్డానో చెప్పలేను.

ఎన్నిసార్లు దెబ్బలు తిన్నానో, ఎన్నిసార్లు చంపబడ్డానో లెక్కలేదు.
చివరకు విరక్తి చెంది, లోక వ్యాపారాన్ని వదిలిపెట్టి సిద్ధుడనైనాను.
సిద్ధ సమాధి నాకు దశలవారీ ఏర్పడి నాకు బ్రహ్మానందస్థితిని ఇవ్వగలదు.
–శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్' –అన్నట్లు ధర్మసాధనంబు తనువు.

మితాహారం మాని ఇష్టం వచ్చినట్లు భుజించేవాడిలో పైత్య వికారాలు పుట్టి
వాత పిత్త కఫముల అసాధారణస్థితి దెబ్బతీస్తుంది మర్మావయవాలను,
శ్లేష్మము ఊపిరినాపి ప్రాణాంతకమగును; కఫం అడ్డుపడుతుంది నవరంధ్రాలకు
వాతము కొవ్వును కరిగించి సంధిస్థానాలను బలహీనపరుస్తుంది, తెస్తుంది చావు.

---

**సీ.** **'పుణ్యంబు లగు కర్మముల నెప్పుడును జేసి । యింపారుచుండు నైహికసుఖంబుఁ**
**త్రిదినంబుఁ బడసితి ధీయుత! యత్యంత । యత్నలబ్ధం బైన యట్టి పదము**
**పదపడి యొక మాత్ర భ్రంశంబు నొంది కా । మక్రోధ ముఖచిత్తముల విశేష**
**ములఁ బొరిఁబొరి జన్మమును మరణంబును । గలుగంగ నేను దల్లులను దండ్రు**

**తే.** **లను సహోదరులను బుత్త్రులను ననేక । జాతి కలితులఁ గాంచితి జున్నుఁ బాలు**
**వివిధభంగుల వానిఁ ద్రావితి సుహృద్వి । యోగధననాశ దుర్దశ లొందెఁ బెక్కు' (అశ్వమేధ. 1-160)**

**సీ.** **తన సత్త్వమును బలంబును దన కయ్యెడు । కాలంబు నారయఁగాఁ దలంపఁ**
**దాహారముల గొను నవియును నగునవి । గానివి యను వివేకంబు బుద్ధిఁ**
**జొనుపఁడు బహుళభోజన మొక మరి సేయు । నొక మరి దుర్వష్ట నుపవసించు**
**గతకాలమును నపక్వంబును గురుదుష్ట । విషమవిరుద్ధము విపులరసము**

**తే.** **నైన యన్నము దా నరయక భుజించుఁ । గడుపుపైఁ గుద్దు దినని ద్ర గూరు సురత**
**పరత నొందుఁ బె ల్లాయాసపడు విమూఢుఁ । డతని బాధించు దోషత్రయంబుఁ గెరలి.' (అశ్వమేధ. 1-168)**

# 12. బ్రహ్మోపాసన

జీవుడు దేహంలో ఉన్నపుడు జీవిగా, జీవి బయటకు వెడలగానే శరీరంగా
పాపపుణ్య కర్మల ఫలాన్ని సంపూర్ణంగా అనుభవించి తగిన జన్మను పొంది
'పునరపి జననం, పునరపి మరణం' అన్నట్లు జనన మరణ చక్రంలో పరిభ్రమిస్తాడు-
శుక్లశోణిత సంయోగం బీజమై, బ్రహ్మసృష్టి సామర్థ్యాల శక్తిచే నిలిచి

గర్భస్థపిండమై తల, చేతులు, పొట్ట, రొమ్ము, వీపు లాంటి
అవయవాల నేర్పరుచుకుంటూ బీజశక్తి ప్రాణశక్తిగా చైతన్య స్వరూపమై
జననార్హవేళ బయటపడి పూర్వజన్మ కర్మలననుసరించి జీవించి
కర్మలు తెగగా చనిపోయి మరల జన్మనెత్తుతాడు తదనుగుణంగా.

మోక్షం దొరికే వరకు జనన మరణ చక్రం కొనసాగుతూనే ఉంటుంది.
పుణ్యవర్తనుడైనవాడు- దాన శమ దయ దమ బ్రహ్మచర్య నియమ నిష్ఠలతో
పెద్దలను పూజిస్తూ, సత్యవ్రతుడై, శుచిగా, ధృతితో జీవించి, ధర్మాన్ని
ఆచరిస్తూ, బ్రహ్మోపాసనలో తరిస్తూ, బ్రహ్మమే అగ్ని, యాగమూ

సమిధలు, నీరు, మంత్రము ఉపద్రష్ట కాగా, ఉత్తమ స్థిరత్వాన్ని కలిగి
సంతోష-దుఃఖాల పెను గాలులకు దెబ్బతినక, మోహమనే చీకటిలో పడక
కాలక్రమమున అతడు కాంచగలుగుతాడు సంసార బంధవిముక్తి-మోక్షాన్ని.
నియమబద్ధమైన ధార్మిక జీవితాన్ని వ్రతంలా నిష్ఠతో గడిపిన వారికవుతుందది సాధ్యం.

---

**వ.** కావున ముక్తికిఁ గారణంబగు దాని । నేర్పడఁ జెప్పద నెఱిఁగికొనుము;
దానంబు శమమును దమమును బ్రహ్మ । చర్యంబును వ్రతపరిరక్షణంబు
దయయును బరధనదారవర్జనమును । నియమయమేంద్రియనిగ్రహములు
జననీజనకగురు జనపూజలును దేవ । తాతిథిపితృదేవతార్చనములు

**తే.** సత్యమును శౌచమును శుభసంవిధాన । నిరతియును ధైర్యమును గ్రౌర్యనిరసనమ్ముఁ
గలిమి పుణ్యవృత్తం బిది గలుగు నరుఁడు । మొనయు దీని నూఁతఁగ గొని మోక్షమునకు. (అశ్వమేధ. 1-194)

**సీ.** వ్రతపరినిష్ఠమై వర్తించుచుండి యిం । ద్రియవిజయమును శాంతియును గలిగి
బ్రహ్మైకభజనతత్పరుఁ డగుచుండెడు । నతనికి బ్రహ్మంబు హుతవహుండు
సంస్తరంబును యోగ్యసమిధలు జలమును । మంత్రంబు గురుఁడు బ్రహ్మంబ యిట్టి
సచ్చరణంబు సూక్ష్మబ్రహ్మచర్యంబు । దీనియం దుత్తమ స్థిరత గలుగు

**తే.** వాఁడు హర్షశోకోద్దామ వాయుహతుఁడు । గాఁడు మేదుర మోహాంధకారమున వె
డంగుపడఁడు సంసారనిస్సంగసిద్ధిఁ । బొందుఁ గాలక్రమమున నప్పురుషవరుఁడు. (అశ్వమేధ. 1-197)

# 13. తత్త్వజ్ఞాన చింతన

బ్రహ్మ సృష్టి చేసేప్పుడు 'ప్రధాన'మనే తత్వాన్ని కల్పించి పోసాడు ప్రాణం.
అదే 'క్షరం'; దానికి అతీతమైనది అక్షరం; అక్షరమే అమృతం
క్షర అక్షరాల వల్ల జీవకోటికి కావాల్సిన బీజమేర్పడి గమన ఆగమన
చావు-పుట్టుకలేర్పడి బీజం పరిభ్రమిస్తుంది జనన మరణ చక్రంలో.

సకల పదార్థచయమూ అశాశ్వతమని గ్రహించినవాడు అన్వేషిస్తాడు ముక్తికై
ఇంద్రియ సంయమనం, కామక్రోధాదులను జయించిపొందే సమదర్శనం
అన్నిటిలోనూ ఆత్మదర్శనం చేసుకోగలిగిన ఆత్మజ్ఞానం-యోగి లక్షణాలు
యోగి పొందే ఆత్మదర్శనమే పరమాత్మ దర్శనం-పరమానందానుభవం.

ద్వంద్వ మోహరాహిత్యం, సమదర్శనం, నిష్కామకర్మ, అకర్తృత్వ భావన
వైరాగ్య భావనలో సుస్థిరత్వం, తాపత్రయ రాహిత్యం ఇస్తాయి మోక్షం.
అసమాలంబం, అశబ్దము, రసగంధ స్పర్శ రూపరహితము, అగుణము
అయిన అత్యున్నతమైన వెలుగును దర్శించగలుగుతాడు నిష్ఠగల యోగి.

ముంజగడ్డిలోని అతి సూక్ష్మమైన ముల్లును చూసినట్లు, శరీరం నుండి
జీవుడిని వేరుచేయడం నేర్చుకున్న యోగి, తనలోని పరమాత్మను
చూడడాన్ని అభ్యసించి, బయట పడతాడు జనన మరణ చక్రం నుంచి.
శస్త్రాలు, నీరు, అగ్ని వలన బాధపడడు, ఇంద్రపదవిని కూడా ఆశించడతడు.

---

**ఆ. అనఘ! ముంజగర్భ మగు నిషీకనిదర్శ । నంబు గాఁగఁ గనుఁగొనంగ వలయుఁ**
**దనువు ముంజ యాత్మ దదిషీక నిష్కర్ష । విధము సుమ్ము! యోగవిదుని వెరవు. (అశ్వమేధ. 1-209)**

**క. తనువువలన నిష్కర్షం । బొనర్చి జీవాత్ముఁ గాంచు యోగివరుం డ**
**య్యను వొదవి యట్లు దన్నుం । గనినప్పుడు జననమరణగతులం దొఱఁగున్. (అశ్వమేధ. 1-210)**

**క. విను యోగయుక్తునకు శ । స్త్రనిహతి జలబాధ యగ్నిదాహము మొదలై**
**చను నవ్వికారములు లే । వనఘ! యతఁడు గోరఁ డైంద్ర మగు పదమైనన్. (అశ్వమేధ. 1-213)**

**క. తన యెఱిఁగిన తెరువున నె । మ్మన మంతర్వృత్తిఁ జేసి మఱి బాహ్యగతిన్**
**జన నీ కుండఁగ నది యెం । దనువునఁ బడు నిలుపవలయు నచ్చట దానిన్. (అశ్వమేధ. 1-216)**

**తే. దంతములు జిహ్వ గుత్తుక తాలుతలము । కంఠనాళంబు హృదయంబు గణ్యచరిత!**
**మఱియు లోపల నెచటికి మనసు మెలఁగెఁ । దాఁ గదల్పకయచటన యాఁగ వలయు.' (అశ్వమేధ. 1-218)**

**- ఇషీకాం చ యథా ముంజాత్ కశ్చిన్నిష్కృష్య దర్శయేత్**
**యోగి నిష్కృష్య చాత్మానం తథా పశ్యతి దేహతః (సం.అశ్వ. 19-22)**

# 14. మోక్షసాధనలో సూక్ష్మ మార్గం

సిద్ధుడు చెబుతున్నాడు- పశువుల మందను మేతకు తోలుకుని వెళ్లిన
గోపాలుడు పాలకుండను ఒకచోట ఉంచి తాను చుట్టూ తిరుగుతున్నా
ధ్యాసనెట్లా కుండమీద ఉంచుతాడో, సుఖ దుఃఖాలలో పరిభ్రమిస్తున్నా
జీవుడు జ్ఞానాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి -పశు ప్రవృత్తి తొక్కివేయకుండా-

ఆ అనాదితత్త్వం ఇంద్రియాలతో దర్శింపగలినది కాదు; అన్ని మలినాలను
క్షాళనం చేయడమనే నేయి వలన వెలిగే 'మనస్సు' అనే గొప్ప దీపం
చూపగలుగుతుంది బ్రహ్మపదాన్ని; అన్ని వేపులా తలలు, కళ్లు, కాళ్లు
చేతులు కలిగిన - సహస్ర శీర్షాపురుషః సహస్రాక్షః, సహస్రపాత్ -అన్నట్లు

ఆ మహాతత్త్వం ఉజ్జ్వలంగా వెలుగుతుండగా దర్శిస్తాడు మహాయోగి.
శరీరాన్ని వేరుచేసి ఏకైకమూ, శాంత స్వరూపమూ అయిన పరమ తత్త్వాన్ని
నిరంతరం దర్శించే యోగి క్రమక్రమంగా చేయగలుగుతాడు ఆత్మదర్శనాన్ని-
లోపల చీకటి తొలగి అతడికి సంప్రాప్తమవుతుంది పరమకాంతి.

బ్రహ్మవిద్యలోని రహస్యాన్ని సిద్ధుడు బోధించాడు కాశ్యపుడికి
ఆ విషయాన్ని చెబుతూ శ్రీకృష్ణుడన్నాడు విజయుడైన అర్జునుడితో
-ఆనాడు యుద్ధభూమిలో రథం మీద నిలిచి, అస్త్రసన్యాసం చేసి నీవు
విషాదయోగంలో ఉన్నపుడు చెప్పానిది -నరుడివి కదా మరల మరల గుర్తు చెయ్యాలి.

---

**ఆ. 'పాలకడవ పెక్కు పసులలో డించిన । యాతఁ డెట్లు దాని నరసికొనుచు**
**నుండు నట్లు లోన నునిచిన మనసు నే । మఱక యాత్మ వెదకు తెఱఁగు మేలు. (అశ్వమేధ. 1-222)**

**క. కలయంగ నెల్ల యెడలం । దలలును లోచనములును బదంబులు హస్తం**
**బులునై యా తత్త్వం బు । జ్జ్వలభంగి వెలుంగ యోగవంతుఁడు గాంచున్. (అశ్వమేధ. 1-225)**

**క. తను వేర్పరించి కేవల । మును శాంతము నైన తత్త్వమును సంతతమున్**
**గనుచున్నఁ దన్ను నెఱుఁగం । గనుఁజీఁకటిఁ బాపు వెలుఁగు గలుగుం బుత్రా! (అశ్వమేధ. 1-226)**

**- సర్వ సంస్కార నిర్ముక్తః నిర్ద్వంద్వో నిష్పరిగ్రహః**
**తపసా ఇంద్రియ గ్రామం యశ్చరేన్ముక్త ఏవ సః**

**విముక్తః సర్వ సంస్కారైః తతో బ్రహ్మ సనాతనమ్**
**పరమాప్నోతి సంశాంతమ్ అచలం నిత్యమక్షరమ్**

**అతః పరం ప్రవక్ష్యామి యోగశాస్త్రమనుత్తమమ్**
**యుంజం తః సిద్ధమాత్మానాం యథా పశ్యంతి యోగినః (సం.అశ్వ. 19-13,14,15)**

## ❖ 14. అశ్వమేధ పర్వము - ద్వితీయాశ్వాసము ❖

### 15. అభయ జ్ఞానం

ఏకాంతంగా ధ్యాన నిమగ్నుడై ఉన్న భర్తను అడిగింది ఓ బ్రాహ్మణి
–ఎటువంటిది ఈ ఆధ్యాత్మ జ్ఞానం? ఎలా తెలుసుకోవాలి దీనిని?
బ్రాహ్మణుడు చెబుతున్నాడు– అక్షర పరబ్రహ్మతత్త్వం తెలియబడదు
ఇంద్రియాలతో; బుద్ధివలన మాత్రమే దానిని దర్శించవచ్చును–

హృదయంలో ప్రాణం, గుదస్థానంలో అపానము, నాభిలో సమానం
కంఠంలో ఉదానం, దేహమంతటా వ్యాపించి ఉంటుంది వ్యానం.
నోటి ద్వారంలో నాగం, కనురెప్పలలో కూర్మం, తుమ్ములో కృకరం
ఆవులింతలో దేవదత్తం, దేహమంతటా వ్యాపించి ఉంటుంది ధనుంజయం.

జీవుడు ప్రాణాపానాలలో ఉండి నిద్రిస్తే కలిసిపోతాయి సమాన వ్యానాలు.
ఉదానంలో జీవుడు నిద్రిస్తే ప్రాణ అపానాలు జీవుడిని వదిలిపెట్టవు.
పంచ ప్రాణాలు మనసు బుద్ధి – వైశ్వానరుడి ఏడు నాలుకలు
అన్ని జీవులలో ఉండే ఆత్మతత్త్వం వైశ్వానరుడిగా తెలుసుకొనుము.

శరీరంలో ఎప్పుడూ జరుగుతూ ఉంటాయి రెండు గొప్ప హోమవిధులు.
మొదటిది సప్తహోతృవిధి– వాసన చూడతగినది, తినదగినది, చూడదగినది,
తాకదగినది, వినదగినది, ఆలోచించదగినది, తెలుసుకొనదగినది–
రెండవది దశహోతృవిధి– జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలు చేసే హోమం.

---

సీ. 'వినను గానను జేయ వెరవైన యవి కర్మ । ములు; వానిఁ గర్మకర్తలు సమస్త
సిద్ధిప్రదము లని చెప్పుదు రజ్ఞాన । తిమిరాంధులై విను ధీరచిత్త!
జగమున లేదు నిష్కర్మత్వ మెందేనిఁ । గలిగె నేనియును మౌర్ఖ్యముగ దాని
నిందింతు రెక్కుడు నెల వది యాత్మ నేఁ । గందు బ్రహ్మంబు నిష్కలత నందు

తే. వెలుఁగు నగ్నితో సోముండు గలసి మిథున । ధర్మమం దెప్పు నడపి భూతములఁ దాల్చు
నజుఁడు మొదలుగ నక్షరోపాస్తియందుఁ । జేయుదురు శాంతి నింద్రియజిత్త్వ మొంది. (అశ్వమేధ. 2-8)

సీ. స్పర్శంబు రసము రూపంబును శబ్దంబు । గంధంబుఁ గాకున్కి కారణముగఁ
ద్వక్కున జిహ్వ నేత్రమున శ్రోత్రంబున । ఘ్రాణంబునను బరిగ్రహవిధాన
మాచరించుటకు లోనై యుండ దాతత్త్వ । మమలిన బుద్ధ్యవగమము దానిఁ
బ్రాపించుఁ బ్రాణాది పంచవాయువులును । విను దానివలన వర్తనముఁ బొందు

తే. నంద డిందుఁ బ్రాణంబు నపానమును స । మాననామకవ్యానమధ్యమున నడచు
మెలఁగుచుండుఁ బ్రాణాపానములకు నడిమి । దెస నుదానంబు శ్రుతి యిట్లు దేటపఱిచె. (అశ్వమేధ. 2-10)

# 16. వాక్కు-మనసు-ఎవరు గొప్ప?

వైశ్వానరుడు దశముఖుడై– దిక్కు, వాయువు, సూర్యుడు, చంద్రుడు, భూమి
అగ్ని, ఇంద్రుడు, విష్ణువు, ప్రజాపతి, మిత్రుడు అనే ముఖాలతో ఉంటాడు.
జీవాత్మను ఉపద్రష్టగా ఈ అంతర్యాగాన్ని జరిపే వారికి కలుగును ముక్తి–
సాధారణ బాహ్య యజ్ఞాలు జరిపేవారు జనన మరణ చక్రంలో భ్రమిస్తారు.

శరీరంలో వైశ్వానరుడు అగ్నిరూపంగా ప్రాణ అపానాలతో కూడి
పచనం చేస్తాడు భక్ష్య భోజ్య లేహ్య చోష్యాలనే నాలుగు రకాల ఆహారాలు
ఓంకార మంత్రరూపంగా పుట్టిన వాక్కుననుసరించి పరిగెడ్తుంది మనస్సు
వాగ్దేవి కదుల్తుంది అందుకనే కదిలే వాక్కుకన్నా స్థిరచిత్తం గొప్పది.

ప్రాణాన్ని పొంది వాక్కు అపానుడిని చేరి, శబ్దరూపాన్ని వదలి
భూతాలలో కలిసి, వ్యానుడి వలన దేహమంతటా వ్యాపించినదై
సమానుడిలో ప్రవేశించినపుడు మనసు ప్రశాంత స్థితిని పొందుతుంది.
మనసు ప్రశాంతతను పొందడమే ముక్తికి కారణం అని గ్రహించుము.

వాక్కు రెండు రకాలు– శబ్దించే ఘోషిణి లేదా వైఖరి, శబ్దం లేని
అఘోషిణి (పరా–పశ్యంతి–మధ్యమరూపిణి)– అఘోషిణి ఆవులా
వర్షిస్తుంటే అమృతాన్ని స్మరిస్తాము 'బ్రాహ్మీ తు భారతీ భాషాగీర్వాగ్వాణీ సరస్వతీ–
వాక్కు, వాణి, సరస్వతి, గీః, భాషా, భారతి, సరస్వతి –వాక్కు పేర్లు.

---

**సీ.** 'ఘోషిణి నాఁగ నఘోషిణి యన రెండు । దెఱంగులు గలిగి వాగ్దేవి పరఁగు
నం దఘోషిణి గరీయసి యుత్తమరసంబు । గోవు చందంబునఁ గురియుచుండు
నవ్యయరూప దివ్యప్రభావోజ్జ్వల । బ్రహ్మవాదిని యిట్లు బ్రాహ్మివిధము
గనుట మహానందకర' మని చెప్పి య । వ్విప్రుండు మఱియు నవ్వెలఁది తోడ

**తే.** 'వినుము ఘ్రాణాదికము లైదు మనసు బుద్ధి । యొక యధిష్ఠానమున నుండియును నెఱుంగ
వబల! యొండొంటి విషయంబు నలమికొనఁగ' । ననిన 'వివరింపు మా తెఱం' గనియె నింతి (అశ్వమేధ. 2–27)

**సీ.** 'గంధంబు ఘ్రాణంబ కాన తక్కిన యాఱు । నధిమింపఁగ నోప, వధిగమించు
రసము జిహ్వయ యితరము లాపనికిఁ గావు; । రూపంబుఁ జక్షుస్స యోపు నెఱుఁగఁ
బెఱయని యెఱుఁగవు తెఱవ! సంస్పర్శంబుఁ । గాంచుఁ జర్మంబ తక్కటివి గానఁ
జాలవు; శబ్దంబుఁ జాలుఁ బట్టంగ శ్రో । త్రంబ; యన్యములు దత్కరణమునకు

**తే.** వెరవులేవు; సంశయిత సంవేదనంబు । మనసు కృత్యంబ యిక్కార్యమునకు నొండ్లు
సొరవు; నిష్ఠ బుద్ధిన యగుఁ జొరఁగ నేర; । విత్తెఱంగున కపరంబు లెఱిఁగి కొనుము. (అశ్వమేధ. 2–29)

# 17. మనసు-ఇంద్రియాలు ఎవరు గొప్ప?

మనస్సు అన్నది- నేను లేకుంటే మీ ఇంద్రియ వ్యవహారాలన్నీ వ్యర్థం.
ఆరిపోయిన నిప్పు, ఎవరూ లేని ఇల్లులా మీ ఉనికికే లేదు అర్థం.
ఇంద్రియాలన్నాయి- సరే, గొప్పవాడివి నీవు. మాలో ఎవరో ఒకరు
లేరనుకుందాం- ఆ సుఖాన్ని నీవనుభవించగలవా? అంతా ఊహ నీ ఉనికి.

అయినా మేమనుభవించాక నీవు వాటి విలువలు లెక్కకడతావు, అంతే!
నీవెక్కడున్నవో భౌతికంగా నీకు తెలియునా? నీవు నశించినా నిన్ను
చైతన్యపరచేది మేమే; మేము లేని నీ విషయానుభవం అసత్యం.
అందుచేత నీవెక్కువా? మేమెక్కువా అనే వాదులాట వ్యర్థమని గ్రహించు.

ఒకసారి ఇలాగే పంచప్రాణాలు వెళ్లి బ్రహ్మనడిగాయి- 'మాలో ఎవరు గొప్ప?'
బ్రహ్మ అన్నాడు- ఎప్పుడు ఎవరి వలన ఏ తీరుగా ఒక పని జరుగునో
అప్పుడు మాత్రమే వారధికులు. మీరందరు గొప్పవారే? వాదులాట వద్దు-
ఇటువంటి ప్రశ్న దేవమతుడడిగాడు నారదుడిని- ఏ వాయువు గొప్ప?

నారదుడన్నాడు- సమాన వాయువు పురుషుడిలో వీర్యాన్ని ప్రభవింపచేయగా
వ్యాన వాయువు స్త్రీలో రజస్సును పుట్టించగా, శుక్ల శోణిత సంగమం
గర్భంగా మారే సమయాన ఆ గడ్డలో ప్రవేశిస్తాడు ప్రాణ వాయువు-
ప్రాణ, అపానాలు క్రిందికి పైకి పోగా వ్యాపిస్తాయి ఉదానవ్యాన సమానాలు.

---

సీ. 'ప్రాణప్రభృతులగు పవను లంభోరుహ । గర్భుని నొక్కటఁ గానఁబోయి
'యెక్కుడు మాలోన నెవ్వరు?' నావుడు । నవ్విభుం 'డెవ్వార లడఁగ నడఁగు
దురు పెఱవార? లెవ్వరికిఁ బ్రవర్తన । మొందిన నెల్లవారును జరింతు
రధికు లందఱకును నట్టి వారలు మీరు । సనుఁ'డని పలికినఁ జనక నిలిచి

ఆ. ప్రాణుఁ డాది గాఁగ బవనులందఱుఁ దమ । వలన నవ్విధంబు గలుగఁ దెలుప
నాతఁ 'డే నెఱుంగనా? యది యట్టిద । వినుఁడు మీ విశేషవృత్తిభంగి'. (అశ్వమేధ. 2-40)

తే. పురుషునందు సమానంబుఁ బొలఁతియందు । వ్యానమును జువ్వె పొడమించు వరుస ననఘ!
శుక్లమునకు శోణితమునఁ జూలు గల్గు । నయ్యుగంబును విధి చెయ్ది నమరఁ బొంద. (అశ్వమేధ. 2-45)

క. విను సృష్టశోణితంబునఁ । బనుగొను శుక్లంబువలనఁ బ్రాణుఁడు దగ వ
ర్తన మొందుఁ బ్రాణశుక్లము । లనూనహేతువులుగా నపానుఁడు నడచున్. (అశ్వమేధ. 2-46)

క. చనుఁ బ్రాణుఁ డధోగతి నూ । ర్ధ్వనిరూఢి నపానుఁ డివ్విధము గల యీ రెం
టను నగ్నిమయోదానం । బును వ్యానంబును సమానమును వర్తించున్. (అశ్వమేధ. 2-47)

# 18. జీవాత్మ స్వరూపం

కారక త్రయాలైన కరణం-కర్మ-కర్తలతో జీవాత్మ చేస్తుంది సప్తహోతృవిధి
తాను కర్తననే భావాన్ని వదలి, విషయాలను నేతి గరిటెలో వేసి, నిష్ఠతో
ఆత్మాగ్ని మండునట్లు చేసిన ఆత్మ ప్రకాశిస్తుంది 'అవిద్య' అనే పొగ లేనిదై.
తాను 'భోక్త' ననుకుంటే ఆ విషయానుభవమవుతుంది బంధకారకం.

అక్షరోపాసన అనగా అక్షరుడైన జీవాత్మను దర్శించి పరమాత్మను
చేరుకుంటాను సంసారమనే దుర్గమారణ్యంలో- దానిలోని క్రోధమనే చీకటిని
లోభమనే మహాసర్పాన్ని, కామమనే రాక్షసుడిని దాటి ప్రవేశించాను
అందమైన వనంలోకి, పంచరంగుల పూలు, మధురమైన పండ్ల చెట్లున్న చోటుకు.

అక్కడ చెట్లు కూడా ఉన్నాయి దీక్షలో, ఋషులున్నారు బ్రహ్మానంద స్థితిలో,
అతిథులు సాక్షాత్తు బ్రహ్మస్వరూపులు; ఆ అడవికి యజమాని సూర్యుడు
అక్కడి నదులలో బ్రహ్మసంభవ జలాలు ప్రవహిస్తున్నాయి, పావన గిరులున్నాయి
ఆ అడవిలోకి చేరుకుంటారు శాంతి సహనం వైరాగ్యం ఉన్న యోగులు.

పశు యజ్ఞం కన్నా తపోయజ్ఞం గొప్పదనేది పండితుల వాక్యం
కార్తవీర్యార్జునుడిని, క్షత్రియులను చంపిన పరశురాముడు క్రోధాన్ని విడిచి
శాంతుడై గొప్ప తపస్సు చేసి జితేంద్రియుడై కీర్తినార్జించినాడు కాదా!
అలర్కుడనే రాజు కూడా ఆయుధాలు విడిచి తపస్సు చేసి పొందినాడు ముక్తి.

---

**ఉ.** అంతకుఁ బిన్నలున్ వెదక నంతకుఁ బెద్దలు లేవు దుఃఖ మ
త్యంతముఁ జేయ సౌఖ్య మెసలార నొనర్పఁగ నొం డొకంటి యం
దంతటి నేర్పు లేదు వెఱ పన్నది యేమియు నవ్వనంబు ని
శ్చింతతఁ జొచ్చియున్న నరుఁ డెందరు నిర్వృతి సెందు నుగ్మలీ! (అశ్వమేధ. 2-55)

**తే.** కొన్నిటికిఁ బంచవర్ణముల్ గుసుమఫలము; । లందుఁ గొన్నిటి కేకవర్ణాంచితంబు
లవనిజములు కొన్నిటికి నవ్యక్తవర్ణ । కములు సౌరభ్యమాధుర్యసమధికములు. (అశ్వమేధ. 2-56)

**ఆ.** మాననీయనియతి మహితతపోధన । వంతులైన యట్టివారు శాంతి
దాంతి నిస్పృహతలు దలకొన సుసమాహి । తాత్ములై వసింతు రందు సాధ్వి!' (అశ్వమేధ. 2-62)

**తే.** 'భాగ మిది యరయంగ నాశంబు బొంద । దూర్ధ్వలోకసుఖంబుల నొందుఁగాని
శ్రుతుల వాక్యముల్ నీ కెక్క సూనృతంబు । లగున యేని నీ విట్లంట యనుచితంబు.' (అశ్వమేధ. 2-66)

**క.** 'భూతములు నింద్రియంబులు । నాతతగుణ! యాత్మ యోనులందుఁ గలయఁ బిం
దేతరుఁ డగు జీవుఁడు సౌ । ఖ్యాతిశయం బొందు నధ్వరాతిశయమునన్.' (అశ్వమేధ. 2-68)

# 19. అంబరీష గీత - జనకుని ఆలోచన

గుణాలు తొమ్మిది– వీటిలో స్థిరత్వం, ఆత్మగౌరవం, సంతోషం సాత్త్వికాలు
కోపం, ఉద్రేకం, దుఃఖం అనేవి రాజసాలు; భ్రాంతి, బడలిక, నిద్ర తామసాలు
అంబరీషుడనే రాజు శత్రువులనందరినీ జయించినా పగ చల్లారలేదు.
–'అటువంటి లోభాన్ని గెలవకపోతే శాంతి ఎక్కడిది?' –అనుకుని అయినాడు విరాగి.

జనకుడికి కోపం వచ్చింది ఒక బ్రాహ్మణుడిపై, అన్నాడు– నా రాజ్యం విడిచిపో!
అతడన్నాడు– అలాగే ప్రభూ! నీ రాజ్యానికి ఎల్లలేవో చెబితే దాటి వెళ్లిపోతాను.
జనకుడు నిశ్చేష్టుడయ్యాడు– మిథిలా నగరంలో నేనున్నా ఇది నాది
అని నేననుకోలేదేనాడూ! అటువంటి నేను నిన్నెలా ఆ మాట అనగలిగాను?

అశాశ్వతాలైన రాజ్యం, ధనం, శరీరం ఏవీ నావి కావు. అది నాకు తెలుసు.
అనాసక్తితో ఇంద్రియాల ఆకర్షణలను, బంధాలను తెంచుకుని ఉన్నాను.
అయినా, ఒక్క క్షణం పాటు మనసు నన్ను బంధస్థితికి తెచ్చింది.
అన్నది ఇది నా రాజ్యమని, మన్నించు, నా ఆజ్ఞను వెనక్కి తీసుకుంటున్నాను.

బ్రాహ్మణుడన్నాడు– జనక మహారాజా! నేను యమధర్మరాజును. నిన్ను
పరీక్షించాలనే కోరిక కలిగి ఇలా వచ్చాను. ఈ వివేకం పరిపక్వమై
నీ హృదయంలో శాశ్వతంగా శాంతినిస్తూ గాఢమై స్థిరమై నిలుచును గాక!–
ఆ విధంగా యమధర్మరాజు జనకుని ఆశీర్వదించి అంతర్హితుడైనాడు.

---

**చ. అనవుడు బ్రాహ్మణప్రవరుఁ దల్లన నవ్వుచు 'నిన్ను నారయ**
**న్మనమున వేడ్క పుట్టి నరనాయక! వచ్చితి నేను ధర్ముఁడం**
**బనుపడు నివ్వివేకపరిపాకము గాఢనిరూఢభావ మొం**
**ది నిలుచుఁ గాత! నీ దగు మదిన్ సతతంబును శాంతికారియై. (అశ్వమేధ. 2–95)**

**– నాధిగచ్ఛం యదా పృధ్వ్యాం మిథిలా మార్గితామయా**
**నాధ్య గచ్ఛం యదా తస్యాం స్వప్రజా మార్గితా మయా**

**నాధ్య గచ్ఛం తదా తస్యాం తదామే కశ్మలో భవత్**
**తదామే కశ్మల స్యాంతే మతిః పునరుపి స్థితా**

**తదాన విషయం మన్యే సర్వోవా విషయో మమ**
**ఆత్మాపి చాయం న మమ సర్వావా పృధివీ మమ (సం.అశ్వ. 32–9,10,11)**

---

**అంబరీషుడు–** అయోధ్యలో అంబరీషుడు అశ్వమేధ యాగం చేస్తున్నపుడు యాగాశ్వాన్ని ఇంద్రుడు దొంగిలించాడు. యాగాశ్వం దొరకకపోయేసరికి ఋత్విజులు నరమేధం చేసి దాని దుష్ఫలితాలు పోగొట్టుకొమ్మన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఓ పేద బ్రాహ్మణుడికి అంతులేని ధనమిచ్చి శునశ్శేపుడిని కొనుక్కువచ్చి బలి ఇవ్వాలనుకున్నపుడు, విశ్వామిత్రుడి దయతో బ్రతికి అతడికి పుత్రుడైనాడు శునశ్శేపుడు (రామాయణం).

# 20. సనాతన ధర్మమార్గం

ఆ వృత్తాంతాన్ని చెప్పి బ్రాహ్మణుడన్నాడు తన భార్యతో–
నేను సంసార బంధాల్ని వదలివేసి ఇక్కడ ఏకాంతంగా ఉంటున్నాను.
నీవు దొంగగా వచ్చి నన్ను మరల సంసార లంపటంలోకి
లాగాలని చూస్తున్నావు, నీ ఆలోచన నాకు తెలిసినా నీకు గురువునయ్యాను.

నీవు కూడా నేను చెప్పిన ఆధ్యాత్మిక వాక్యాల అర్థాన్ని గ్రహించు
–బ్రాహ్మణుడు అరణి, గురువు ఉత్తరారణి; అదే విధంగా
విప్రుడి తపస్సు గురువు గారి వేదం అనే రెండు కొయ్యలను మధిస్తే
పుట్టే జ్ఞానం ముక్తిసాధకం –అని పలికాడు బ్రాహ్మణుడు.

క్షేత్రజ్ఞుడు నిర్గుణుడు, ఇంద్రియాలచే గుర్తింపుబడనివాడు
'అహం' –అనే తత్త్వం లేనివాడతడు –అని పలుకగా
శ్రీకృష్ణుని అడిగాడు అర్జునుడు– 'ఎవరీ గొప్ప దంపతులు?'
–'నా మనసు బ్రాహ్మణుడు, బుద్ధి బ్రాహ్మణి, పరమాత్మను నేను'–

అని వివరించాడు శ్రీకృష్ణుడు. సత్త్వానికి వేదము, తపస్సు
ప్రజాపతి అని మూడు పేర్లు; సత్త్వాన్ని ఉపాసిస్తూ, నాలుగు
ఆశ్రమాలు, నాలుగు ధర్మాలు నాలుగు పాదాలుగా అనుసరించబడే
సనాతన ధర్మం –అందరికీ శ్రేయోదాయకం –అన్నాడు శ్రీకృష్ణుడు.

**ఆ. 'అతనిఁ దోఁపఁ జేయునట్టి సాధనము లే; । దింద్రియముల కందఁ; దేమి లక్ష**
**ణములు లేవు; నిర్గుణత్వనిరూఢుం డ । హంత లేమిఁ దోఁచుఁ గాంత! కనుము.' (అశ్వమేధ. 2-100)**

**క. 'నా మనమును బుద్ధియును గృ । పా మహితా! బ్రాహ్మణుండు బ్రాహ్మణియు హృషీ**
**కామేయమైన క్షేత్ర । జ్ఞానుల వస్తువును నేన యనియె నరేంద్రా!' (అశ్వమేధ. 2-102)**

**తే. 'సత్త్వమునను భూతంబులు సంభవించు, । నంద వర్తించు, దానన యడఁగు; నిది గు**
**ణత్రయాత్మకసత్త్వచరిత్ర మమల । బుద్ధులార! సత్త్వంబు ప్రసిద్ధి వినుఁడు. (అశ్వమేధ. 2-105)**

**క. శ్రుతియనఁ దపమనఁగఁ బ్రజా । పతియన సత్త్వంబునకు సపర నామంబుల్**
**వ్రతులార సత్త్వమన న । వ్వితత మహిమమైన పరమవేద్యము సుండీ! (అశ్వమేధ. 2-106)**

**భాగవతం ప్రకారం–** అంబరీషుడు వైకుంఠ ఏకాదశినాడు ఉపవాసం చేస్తున్నపుడు ద్వాదశి రోజున ముగింపు సమయంలో తాను రాకుండా కాసిని నీళ్లు తాగాడని దుర్వాసముని కోపించి కృత్య రాక్షసుని అంబరీషుడిపై పంపగా, తన భక్తుడిని రక్షించ విష్ణువు పంపిన సుదర్శన చక్రం, ఆ రాక్షసిని చంపి దుర్వాసుడి వెంట పడింది. బ్రహ్మ విష్ణు పరమేశ్వరులను వేడుకున్నా ఫలితం దక్కక విష్ణువు సూచించినట్లు మరల అంబరీషుని వద్దకు వెళ్లి క్షమాపణ వేడుకున్నాక దుర్వాసుడిని విడిచిపెట్టి చక్రం.

## 21. గుణ త్రయంబునుం ద్రోచుట మేలది-

పంచభూతాలైదు, గుణాలైదు, జ్ఞానేంద్రియాలైదు, కర్మేంద్రియాలైదు
మనసు, బుద్ధి, అహంకారము, ప్రకృతితో తత్త్వములు ఇరవై నాలుగు
జీవుడు-అక్షరుడై ఇరవై అయిదు; పరతత్వం ఇరవై ఆరు.
నవద్వార పురాన్ని జయించి జీవుడు పరతత్వాన్ని గ్రహించుటయే ముక్తి.

పాములు, తేళ్లు, పశువులు, పందులు, కుక్కలు, చేపలు, కోళ్లు
చీమలు, కాకులు, పురుగులు, జింకలు, నక్కలు, దోమలు, చెట్లు
పొదలు, బాధలు, కష్టాలు పొందే వారందరూ తామసగుణ రూపులే.
ఆహార నిద్రా భయ మైధునాలు పశువులకు నరులకు సమానమే.

బలము, పరాక్రమము, గర్వము, వైభవము, సుఖదుఃఖాలు, స్నేహం
కోరిక, ఆశ, వ్యాజ్యం, అసూయ, తిట్లు, అసత్యం, మితిమీరిన ప్రేమ
అసహనం - ఇవన్నీ రజోగుణ సంభూతములు; వీరికి ఉంటుంది విచక్షణ.
కోరికలు తీర్చుకునే సామర్థ్యం, ప్రకాశిస్తారు మానుష భావంతో.

రజోగుణమున్నవారు గురు శుశ్రూషతో పొందగలరు సత్త్వాన్ని.
రజోగుణ జనులకు సత్త్వం పైకి; తమస్సు క్రిందకు లాగుతాయి.
త్రిగుణాలను తొలగించాలంటే నశించాలి తృష్ణ లేదా దురాశ
ప్రాణమే సత్త్వము, అపానమే రజస్సు; ఉదానమే తమస్సు.

**సీ.** **సంయమివరులార! సత్త్వరజస్తమో । నామరూఢములు గుణంబు; లవియు**
**నన్యోన్య మిథునత్వ మన్యోన్య సంశ్రయ । మన్యోన్య సంకలితాను వృత్త**
**భావ మన్యోన్యోప జీవనాచరణంబు । గలిగి దుర్భేధత్వ గాఢ భంగు**
**లైయుండుఁ; దమము నియమితమైన రజస్సుఁ । దన్నియమమున సత్త్వంబు నడచు;**

**తే.** **సత్త్వ మడఁగినచోఁ దమశ్చరిత మెసఁగు । లోభశోక సమ్మోహ నిద్రాభయములు**
**వికృతి దుర్మాన మౌఢ్య పాపకృతి కోప । శాఠ్య మాత్సర్యములు తమస్సంభవములు. (అశ్వమేధ. 2-116)**

**ఉ.** **పాములుఁ దేళ్ళునుం బసులుఁ బందులుఁ గుక్కలు మీలుఁ గోళ్ళలుం**
**జీమలుఁ గాకులుం గ్రిములు జింకలు నక్కలుఁ గొంకనక్కలు**
**న్దోమలు మ్రాఁకులుం బొదలు నోవులఁ బొందువారు మున్**
**తామసభాగు లట్ల మతి తద్విధ జంతువు లెన్ని యన్నియున్. (అశ్వమేధ. 2-117)**

**క.** **ఇవి తామసంబు లని గుణ । నివహములోఁ గీడు వాప నేర్చునతఁడు త**
**ద్వివిధ వికృతి నిరసన హే । తువివేకము గలుగఁ గా నధోగతిఁ దలఁగున్. (అశ్వమేధ. 2-118)**

# 22. పరంజ్యోతి స్వరూపం

ఎక్కువ తక్కువలు లేక ఎల్లప్పుడూ కలిసిన గుణత్రయమే
'అవ్యక్త' మహాతత్త్వం, ఇది సత్తు–అసత్తులకు అతీతమైనది.
ఆ తత్త్వాన్ని తెలిసినవాడు గుణత్రయానికి అతీతుడు, పొందుతాడు మోక్షం.
'అవ్యక్త' జనితం మహత్తు–అదే బుద్ధి, మతి, ధృతి, సంవిత్తు, ఉపలబ్ధి.

అవ్యక్తము నుండి అహంకారము, అహంకారం నుంచి పంచభూతాలు
పంచభూతాల నుంచి పంచగుణాలు, వీటి నుంచి జ్ఞానేంద్రియ
కర్మేంద్రియ జ్ఞానం, ఇంద్రియాల నుంచి విషయ వాంఛలు,
వాటి వలన జీవుడు జనన మరణ చక్రంలో చిక్కుకుంటాడు.

శాస్త్రజ్ఞానమే 'పండ'; శాస్త్ర జ్ఞానమున్నవాడు పండితుడు
పంచప్రాణాలు వాక్కు మనస్సు బుద్ధి కలిసినది అంతరాత్మ
కుండకు మన్ను ఉపాదానమైనట్లు లోకానికి ఆత్మ ఉపాదానం
అలా జన్మించిన స్వేద, ఉద్భిజ, అండ, జరాయువులలో జరాయుజన్మ ఉత్తమం.

అధ్యాత్మ, అధిభూత, అధిదేవతములనే మూడు తీరులుగా ఉన్న
భూతరాశి–ప్రకృతితో సంబంధం తెలియడమే ఆత్మజ్ఞానం.
ఎన్నో దీపాలను వెలిగించే దీపంలా ఆత్మ పొందుతుంది ఎన్నో రూపాలు.
వరుణుడు, అగ్ని, వాయువు, సోముడు, బ్రహ్మ, విష్ణువు, శివుడు ఆ పరంజ్యోతి పేర్లు.

---

**ఆ.** మనసు మనసునంద మడఁచి, యాత్మని నాత్మ। యంద కాంచనట్టి యతఁడు సర్వ
విదుఁడు; సకల భూత వితతి యందును దనుఁ। గమచునుండు నిర్వికల్పకముగ. **(అశ్వమేధ. 2-154)**

**తే.** ఆ పరంజ్యోతి పేళ్ళు లర్యముఁడు వరుణుఁ। డనిలుఁ డగ్ని సోముఁడు విష్ణుఁ డజుఁడు శివుఁ డ
నంగఁ బరఁగు శబ్దములు సన్మతులు దానిఁ। బ్రయతులయి భజియింతురు నియతులార!' **(అశ్వమేధ. 2-156)**

**సీ.** అవ్యక్త నామకం బగు తత్త్వ మరయ స। లింగంబు పురుషుఁ డలింగుఁ డతఁడు;
క్షేత్రంబు నెఱఁగుట క్షేత్రజ్ఞుఁడనఁ జనుః। క్షేత్రంబు నాఁగఁ బ్రకృతియనంగ
నవ్యక్తమునకు నామాంతరములు; గుణ। ప్రభవ మాతత్త్వ మా ప్రభువు గుణము
లెఱుఁగవు చేతనా హీనముల్ గాన య। య్యంతరాత్ముఁడు దత్క్రియా ప్రపంచ

**ఆ.** మెఱుఁగు; నిట్టులగుట యెఱిఁగి గుణమ్ముల। విడిచి నిలిచి తత్త్వవేది యంత
రాత్మ వేశమునన నచల నిరామయా। వ్యయపదంబు నందు ననఘులార! **(అశ్వమేధ. 2-159)**

– ప్రసాదే చైవ సత్త్వ స్య ప్రసాదం సమవాప్నుయాత్
లక్షణం హి ప్రసాదస్య యధాస్యాత్ స్వప్న దర్శనమ్ **(సం.అశ్వ. 51-36)**

# 23. జ్ఞానము సవిశేష స్థితి-

అవ్యక్తమనేది క్షేత్రము, ప్రకృతి, సలింగరూపం, అశాశ్వతం
పురుషుడు క్షేత్రజుడు, జీవుడు, అంతరాత్మ, శాశ్వతుడు
ఎగువకు పోయి పరమాత్మలో లీనమైతే మోక్షప్రాప్తి కలిగేను.
దిగువకు దిగి ప్రకృతితో కలిస్తే సంసారచక్రంలో చిక్కుకునేను.

గొప్ప వెలుగులందు సూర్యుడు, పంచ భూతాలలో అగ్ని
విద్యలలో సావిత్రి, దేవతలలో ప్రజాపతి, మంత్రాలలో ఓంకారం
వాయువులలో ప్రాణవాయువు, ఛందస్సులలో గాయత్రి
పశువులలో మేక, జంతువులలో ఆవు, మనుషులలో బ్రాహ్మణుడు

పక్షులలో డేగ, యజ్ఞవిధిలో హవిస్సు, యుగాలలో కృతయుగం
ధాతువులలో బంగారం గొప్పవి. పండిన వెంటనే నశించే
మొక్కలైన ఓషధులలో యవలు, భోజ్యాలలో అన్నం, పానీయాలలో
నీరు, గిరులలో మేరువు, తరువులలో జువ్వి, దిక్కులలో ఊర్ధ్వం

నదులలో గంగ, సరస్సులలో సముద్రం, ఆశ్రమాలలో గృహస్థాశ్రమం
ప్రజాపతులలో బ్రహ్మ, బ్రహ్మకన్నా విష్ణువు, విష్ణువు కన్నా
శివుడు పెద్ద అయినా త్రిమూర్తులలో భేదమేమీ లేదు.
జ్ఞాని గుర్తిస్తాడు ద్వంద్వాలను, నిర్మలుడై అవలంబిస్తాడు మోక్షమార్గం

---

**సీ.** **యవ లోషధులలోన, నన్నంబు భక్ష్యభో । జ్యములందు, జలము పేయములలోన,**
**నమలాచలము పర్వతములలోఁ బ్లక్షంబు । దరువులలోన, మార్ధ్వంబు దిశల,**
**జాహ్నవి నదులందు, సాగరంబు సరస్సు । లందు, గృహస్థత్వ మాశ్రమముల**
**నెక్కు డారయ; నెక్కు డేను బ్రజాపతు । లంద; చింత్యాత్మకుండైనయట్టి**

**తే.** **విష్ణుఁ డెక్కుడు నాకంటె; వినుఁడు తెలియ । నీశ్వరుఁడు దేవతావలికెల్ల నెక్కు;**
**డతఁడు నా నే ననఁగ విష్ణుఁ డనఁగ వస్తు । వొకఁడ మూర్తి త్రయంబున నుల్లసిల్లు. (అశ్వమేధ. 2-162)**

**సీ.** **'గురునకుఁ బ్రియహితకరుఁ డయి వేదాధ్య । యన మొనరించుచు నశన మమల**
**భిక్ష నొనర్చుచు బిల్వపలాశదం । డములలో నొకటి ధార్యముగఁ జేసి**
**స్నానశీలుఁడు బ్రహ్మచర్యపరుండును । నియమితేంద్రియుఁడును నిత్యశుచియు**
**యజ్ఞోపవీతియు నబహుభాషియు మేఖ । లాఢ్యుండు నై శయనాసన ప్ర**

**తే.** **చారవిధములు సముచితాచరితములుగ । సత్యధర్మ నిరూఢుఁడై శాంతి గలిగి**
**వేల్మి యిరుప్రొద్దు నడుపుచుఁ గల్మషంపుఁ । బనుల కెలయక వర్తించు బ్రహ్మచారి. (అశ్వమేధ. 2-168)**

# 24. ఆశ్రమ విధాలు

బ్రహ్మచారి– బిల్వ, మోదుగ కొమ్మనొకదానిని చేతబూని, భిక్షాటన చేసి
త్రి సంధ్యలలో స్నానం చేసి బ్రహ్మచర్య నిష్ఠ కలిగి జితేంద్రియుడై
జంధ్యము, మొలత్రాడు ధరించి, అధికంగా మాట్లాడక, తిరగక, తినక
సత్యధర్మ శాంతి ప్రవృత్తి కలవాడై, అగ్నిహోత్రాలు నిర్వహిస్తూ చేస్తాడు గురు శుశ్రూష

గృహస్థుడు– అర్థ ప్రకార సమావర్తనుడు, నిజదారా నిరతుడు
నిర్మల ప్రవర్తనము, పంచయజ్ఞ నిష్ఠ, అతిధి తర్వాత తినువాడు
తెల్లబట్టలు ధరించి, శక్తిని బట్టి దానం చేస్తూ, పవిత్రుడు, స్నేహశీలిగా
వేదాధ్యయనం, యాగం, అధ్యాపనం చేస్తూ గడుపుతాడు గృహస్థుడు జీవనం.

వానప్రస్థుడు– ఉన్న ఊరు వదిలి అడవిలో పర్ణశాలలో నివసిస్తూ
రెండుపూటలా స్నానం చేస్తూ, తృణధాన్యాలు, పండ్లు, గడ్డలు తింటూ
జంతువుల చర్మాన్నో నారచీరనో ధరిస్తూ, అతిధులను ఆదరిస్తూ
అధ్యయనం, అగ్నిహోత్రం చేస్తూ ఇంద్రియాలను గెలిచి జీవిస్తాడతడు.

సన్న్యాసి– నియతి కలిగిన యతిగా, భగవంతుడిలో సర్వం
దాచిన సత్ న్యాసము కలవాడిగా, ఏకభుక్తుడై, అన్నవస్త్రాలు తప్ప
ఇంకేదీ దానంగా గ్రహించక, స్తుతి నిందలను పట్టించుకోక
సత్య అహింశ శమదమాది గుణములతో ప్రవర్తిస్తాడు సన్న్యాసి.

---

**సీ.** **అర్థప్రకార సమావర్తనుం డయి । నిజదార నిరతుండు నిర్మల ప్ర**
**చారుండుఁ బంచయజ్ఞపరుండు నతిథి శి । ష్టాశియు శుక్ల వస్త్రాన్వితుండు**
**శక్త్యనుగుణదాన శాలియు నచపలేం । ద్రియుఁడును శుచియు మైత్రీపరుండు**
**స్వాధ్యాయశీలుండు సద్వ్రత నిష్ఠుండు । నై యాజనంబు నధ్యాపనంబు**

**ఆ.** **శక్యమైనఁ జల్పి, క్షమ గల్గి సత్ప్రతి । గ్రహ మొనర్చి, మిత్రులహితు లనక**
**మాట కార్యమునను మధ్యస్థుఁడై గృహ । స్థుండు నడచు దురితదూరుఁ డగుచు. (అశ్వమేధ. 2-169)**

**సీ.** **గ్రామంబు దొలఁగి యరణ్యస్థలంబునఁ । బర్ణశాలా పరత నొంది**
**స్నానతంత్రము రెండు సంధ్యల నడపుచు । బ్రహ్మచర్యవ్రత భాసి యగుచుఁ**
**బూరిపంటలు ఫలంబులు మూలములు శాక । సముదయంబును నశనముగఁ గొనుచు**
**నజినంబు వల్కల మంబరంబుగఁ గొని । శయన కృత్యంబు భూస్థలి నొనర్చి**

**తే.** **యతిథులకు నెడ మిచ్చి యాహారములను । భక్తి నాత్మీయములలోనఁ బంచిపెట్టి**
**యధ్యయన హోమశీలుఁడై యన్ని యింద్రి । యముల గెలిచి వానప్రస్థుఁ డతిశయిల్లు. (అశ్వమేధ. 2-170)**

# 25. సంసార వృక్షం

అవ్యక్తమనే బీజం, బుద్ధి అనే కాండం, అహంకారమనే కొమ్మ
మహాభూతాలనే రెమ్మలు, ఇంద్రియాలనే తొర్రలు, ఆశలనే చిగుళ్లు
మంచి చెడులనే ఫలాలతో ప్రకాశిస్తుంది సంసారమనే చెట్టు.
జ్ఞానమనే కత్తితో ఆ చెట్టును నరికివేస్తాడు యోగి, తపోబలంతో.

'అసంగ శస్త్రేణ దృఢేన చిత్వా'- అభిమానము, అహంకారము
నశించినాక ఆత్మదర్శనమై లభిస్తుంది పరమపద బ్రహ్మానంద స్థితి
ప్రాణవాయు నిరోధరూపమైన యోగసాధన క్రమంగా చేస్తూ ఉండగా
కలుగుతుంది భగవత్ ప్రసాదరూపమైన సిద్ధి యోగికి.

సత్యం అహింస సంతోషం ధృతి క్షమ ఋజుత్వం సన్న్యాసం
త్యాగబుద్ధి, విజ్ఞానయుక్తి అనే సాత్త్విక గుణాలు పనికివస్తాయి
పురుష తత్త్వాన్ని గుర్తించడానికి; నీటిలో చేప, మేడిపండులో
పురుగులున్నట్లే, సత్త్వగుణంలో పురుషుడున్నాడంటారు పెద్దలు.

నదిని దాటేంత వరకు పడవలో వెళ్లి తీరాన వదిలినట్లుగా
పురుషుడి దర్శనమయ్యేంత వరకు సత్త్వాన్ని వినియోగించాలి.
ఆ తరువాత సత్త్వగుణాన్ని కూడా వదిలి, విషయవాంఛలు వదలి
ఆత్మ దర్శనమైనాక, ఆత్మను పరతత్త్వంలో లీనం చేయటమే మోక్షం.

---

సీ. **సర్వభూత దయానుషంగంబు గలిగి య । తీత వస్తువులఁ జింతింప కెద న
నాగతంబులమీఁద నాస సేయక వర్త । మాన లబ్ధము లుపేక్షా నిరూఢిఁ
గూర్చు చంగంబులఁ గూర్మ మెట్లట్ల యిం । ద్రియముల లోనికిఁ దిగిచికొనుచు
సముచితకాల భిక్షా చర్య దొరకొన్న । యంతన నిజదేహ యాత్ర నడపి**

తే. **గ్రాస మాచ్ఛాదనంబు దక్కంగ నెవ్వఁ । డర్థి నెయ్యది యిచ్చిన నంద కేక
వార భోజ యగుచు నమస్కార సఖ్య । నుతి నిరాకృతి సహితుఁడై యతి వెలుంగు.' (అశ్వమేధ. 2-172)**

సీ. **'సకల ధర్మములలో సర్వభూతాహింస । మేటి; యహింసా సమేతుఁ డైన
వానికి నుత్తమ జ్ఞానోదయం బగు; । నది మోక్షమొనరించు ననఘులార!
కోరిక మెయిఁ గర్మకారి యయ్యెడు వాఁడు । వొందు గతాగతంబులు ఫలాభి
లాషంబు లేక నిర్దోషత మే లాచ । రించిన ముక్తి సిద్ధించు వినుఁడు!**

తే. **విషయి పురుషుండు, సత్త్వంబు విషయ; మిట్లు । భోక్తృ భోజ్యత్వ సంబంధమునఁ బొసంగి
యుండియును బద్మపత్త్రపయోలవంబు । కరణి నతఁడు తత్సంగంబుఁ బొరయకుండు. (అశ్వమేధ. 2-188)**

# 26. విషయ వాంఛలు

అవ్యక్తం నుంచి మహత్తు, మహత్తు నుండి అహంకారము, దాని నుంచి
పంచభూతోత్పత్తి – ఆకాశమునకు శబ్దము – మృదువు, కఠినముగా;
వాయువుకు శబ్దము స్పర్శ శీతోష్ణస్థితులను కలిగి ఉండగా;
అగ్నికి–శబ్ద స్పర్శ రూపము తెలుపు నలుపు వివిధ వర్ణ భేదాలతో;

జలముకు శబ్ద స్పర్శరూప రస గుణములు తీపి చేదు మొదలైన రీతులలో;
పృధివికి శబ్ద స్పర్శరూప రస గంధము–సువాసన ఘాటు తీరులతో;
ఉండి 'విషయము'లై వాటిపై కోరిక విషయ వాంఛలుగా
జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలను వశపరచుకుని జీవుడిని సంసారచక్రంలో

పడవేయగా, పూర్వజన్మ కర్మ ఫలితాలననుభవించి, ఈ జన్మలో
పుణ్యకార్యాలు చేయగా మనస్సు అనే సారధి, ఇంద్రియాలు
అనబడే అశ్వాలను నియంత్రిస్తూ, దేహమనే రథాన్ని ఎక్కి
సంసారమనే వలలో చిక్కుకోకుండా ఉంటే పొందుతాడు ముక్తిని.

సముద్రం నుంచి వచ్చే అలల్లా దేవమానవ వృక్ష తతులు, అచరాలు
అవ్యక్తం నుంచి పుడుతూ లీనమవుతాయి అవ్యక్తంలోనే
మమకార అహంకార విముక్తులైనవారు సాయుజ్య, సారూప్య
సామీప్య ముక్తులను పొందుతారు స్వధర్మానుసారం తపస్సుతో–

---

క. శరనిధి తరఁగల భంగిం । బొరిఁబొరి నవ్యక్తమునన పుట్టు నడంగున్
సురనరధరణీరుహ ముఖ । చరాచరానేక భూతజాలము లెల్లన్. (అశ్వమేధ. 2-200)

క. మమతాహంకార విము । క్తముశుద్ధమునైన యచలిత ధ్యానముతో
సమవేతంబగు తపమున । యమి గను సకలోత్తరావ్యయ పదప్రాప్తిన్. (అశ్వమేధ. 2-205)

క. 'కోరికలకుఁ జొరక యసం । గారూఢత గలిగి యెల్లయందును సమతం
గూరిన చిత్తంబులు గల । సారాత్మకు లీ పథమునఁ జనుటకు శక్తుల్. (అశ్వమేధ. 2-215)

సీ. కర్మముల్ మేలండ్రు కర్మతత్పరులు బు । ద్ధాత్ములు విద్య వర్యత నుతింతు
రవి షోడశ వికార యగు మూర్తిఁ గల్పించు । నది నిత్యుఁ దగ్రాహ్యుఁ దన వెలుంగు
పురుషునిఁ దోఁపించు నరయంగఁ గర్మమ । యత్వంబు లేమి విద్యామయత్వ
మతనికి నైజమై యతిశయిల్లుట శ్రుతి । పాటు నిత్తెఱఁగు సుజ్ఞాన మే మ

తే. హాత్మునకుఁ గల్గియుండు నయ్యార్యవర్యుఁ । దఖిల సంకల్పములఁ బాచి యాత్మ నాత్మ
యంద కాంచి యనామయ మజర మమృత । మను పదమ్ముఁ బ్రాపించుఁ గృతాత్ములార! (అశ్వమేధ. 2-211)

# ✤ 14. అశ్వమేధ పర్వము - తృతీయాశ్వాసము ✤

## 27. శ్రీకృష్ణుడిని శపించాలనుకున్న ఉదంక మహర్షి

అర్జునుడికి తత్త్వబోధలు చేసి శ్రీకృష్ణుడు, ద్వారకకు వెళ్లదలచగా
ఇంద్రప్రస్థం నుండి బయలుదేరారు అర్జునుడు శ్రీకృష్ణుడు హస్తినాపురికి
అక్కడ ధర్మరాజు అనుమతి గైకొని కుంతీదేవి ద్రౌపదీదేవికి చెప్పి
సుభద్రను తీసుకుని సాత్యకితో కలిసి బయల్దేరాడు శ్రీకృష్ణుడు.

నరనారాయణ బంధమైన పార్థ కృష్ణుల ప్రేమానుబంధం అద్వితీయమై
ఒకరినొకరు వదలలేక చూసుకుంటూనే ఉన్నారు రథం కనుచూపు మరుగయ్యే వరకూ
దారిలో ఉదంకాశ్రమం వద్ద ఆగి శ్రీకృష్ణుడు సందర్శించాడు మహర్షిని
ఏమీ తెలియనట్లు అడిగాడు ఉదంకుడు- సంధి చక్కగా జరిగిందా?

అది తెలిసి కూడా తెలియనట్లు చెప్పాడు శ్రీకృష్ణుడు- సంధి కాలేదు
యుద్ధమే జరిగింది, పద్దెనిమిది అక్షౌహిణిల సైన్యం, వీరులలో మిగిలారు
పదీ-పద్దెనిమిదిమంది. కాల నియమం, విధివ్రాత ఎవరు తప్పించగలరు?
ఉదంక మహర్షి కళ్లు చింతనిప్పులయ్యాయి- 'సంధి కుదర్చలేదా?

మిథ్యాచార్యుడివి నీవు, ఇంత హింసకు కిల్బిషానికి కారణం నీవు.
ఘటనా ఘటన సమర్థుడవైయుండి ఇలా దుర్ఘటన జరగనిస్తావా?
నీకు ఘోర శాపమిస్తాను' -అని మండిపడుతున్న ఉదంకుడిని శాంతపరచి
శ్రీకృష్ణుడన్నాడు- నన్ను శపించి నీ ఘోర తపస్సునెందుకు చేసుకుంటావు వ్యర్థం-

---

- యస్మా చ్ఛ క్తేన తే కృష్ణ న త్రాతాః కురుపుంగవాః
  సంబంధినః ప్రియాస్తస్మాత్ శప్స్యే హం త్వామ సంశయమ్ (సం.అశ్వ. 53-20)

క. 'కౌరవ కులమును మిథ్యా । చారుఁడవై త్రుంచి తకట!; శక్తుఁడ వయ్యున్
నేరిమిమైఁ జేయవ పొం । దారఁగ; నిక్కిల్బిషమున కంతటికిఁ దగన్. (అశ్వమేధ. 3-33)

క. 'అగుఁ గాక; నీవు సెప్పెడు । తగ వెయ్యది సెపుమ; వినియెదం; బోలిన నే
మగిడించెద శాపోన్ముఖ । బగు మన్మానసము' ననుడు నల్లన నగుచున్. (అశ్వమేధ. 3-37)

ఆ. 'అతులమైన నీ దయా మహిమకు నేను । బాత్ర మగుదు నేనిఁ బద్మనాభ!
యనుపమాన తావకాకృతిఁ జూపవే । నాకుఁ జూడ్కియును మనంబు నలర.' (అశ్వమేధ. 3-47)

చ. అనుడు దయాళుఁడైన హరి యర్జును చూచిన దివ్యమూర్తిఁ జూ
పినఁ గని, సంప్రమోదమును భీతియు విస్మయముం బెనంగొనన్
మునిపతి పాణిపద్మములు మోడ్చి 'నమః పురుషోత్తమాయ తే'
యనుచు, వినీతి నమ్ర మగునంగము నివ్వెఱ నిశ్చలంబుగన్. (అశ్వమేధ. 3-48)

# 28. ఉదంకునికి విశ్వరూపము చూపిన శ్రీకృష్ణుడు

శ్రీకృష్ణుడన్నాడు– నీ తపో మహాత్మ్యమును నన్ను శపించి వృధా చేయనేల?
దివ్య దృష్టినిస్తున్నాను, తెలుసుకో యుద్ధమెందుకు జరిగిందో, అసలు సంగతి–
సందర్శించు నా విశ్వరూపమును– అప్పుడర్థమయ్యింది ఉదంకుడికి విషయం.
చేతులు జోడించినవాడై అర్ధనిమీలిత నేత్రాలతో, తలవంచుకుని అన్నాడు–

పుండరీకాక్ష! ఈ పుడమి అంతటా నీ పాదపంక్తి సంవ్యాప్తమై ఉన్నది
ఆకాశాన్ని కప్పివేసాయి మనోజ్ఞంగా నీ శిరస్సులు; భూమ్యాకాశాల
మధ్య భాగాన్ని ఆక్రమించాయి నీ ఉదరభాగాలు; నీ భుజాలు సర్వ
దిక్కులకు వ్యాపించ, అనేక పాదాలు, శిరస్సులు, ఉదరాలు, భుజాలతో అంతటా నీవే!

నన్ను క్షమించి మహా తేజోవంతమైన ఈ విశ్వరూపాన్ని మరలించుము, దేవా!–
అప్పుడు శ్రీకృష్ణుడు నిజరూపానికి వచ్చి వరం కోరుకొమ్మని అడిగాడతడిని
ఉదంకుడడిగాడు– ఈ నిర్జల ప్రాంతంలో నీళ్లు సమృద్ధిగా ఉండేలా అనుగ్రహించు–
శ్రీకృష్ణుడు వెళ్లాక ఉదంకుడు నీళ్లు కావాలని కోరుకున్నాడు భక్తితో

అతడికి తనవేపు వస్తున్న నగ్నదేహుడైన మాతంగుడు కనిపించాడు.
కుక్కలు చుట్టూ మూగి అనుసరిస్తుండగా విల్లమ్ములు ధరించి నగ్నంగా
శరీరం నుండి చెమట నీళ్లలా కారుతుండగా ఉదంకుడితో అన్నాడతడు
ఓ ఉదంకుడా! ఉదకము కావాలా! దోసిలి పట్టు ఈ సుధాస్వేదాన్ని–

సీ. 'పుండరీకాక్ష! యీ పుడమి యంతయును భ। వత్పాద పంక్తి సంవ్యాప్త మయ్యె;
నంబరం బెల్లను నావృత మయ్యె నీ। మహిత సముజ్జ్వల మస్తకముల;
నంతరిక్షము దావకాద్భుత కుక్షిదే। శంబులచేత సంఛన్నమయ్యె;
భవదీయ మహనీయ బాహార్గళా నిచ। యాపిహితము లయ్యె నన్ని దిశలు

తే. బహుచరణముల, బహుశిరోభాగములను। బహుజఠరముల, బహు భుజాప్రకరములను
దేవ! యిట్లు సర్వంబును నీవ యై త। నర్చి; తిది నాదు కన్ను మనంబుఁ దనిపె.' (అశ్వమేధ. 3-50)

సీ. కుక్కలు చుట్టిరా నొక్కమాతంగుండు। బాణ బాణాసన పాణియును ది
గంబరుండును, మలినాంగుండు, నగువాఁడు। దోఁచె నచ్చుజలంబు దొరఁగుచుండు
మేనితో; నమ్ముని వానిఁ దప్పకచూడ; వాఁ 'డోయుదంక! యవ్వారి దప్పి
వోఁ ద్రావు' మనుడు, నాభూసురోగ్రణి యొల్ల। నని పల్కెఁ; బల్కిన 'వినుము నీవు

ఆ. నీరువట్టు శ్రమముఁ గూరిన నీ మీఁది। కరుణ వచ్చినాఁడఁ, గాదు నాక
యర్థిఁ ద్రావు టొప్పు 'ననియె; నా చండాలు। నలుకమెయి నదల్చె నత్తపస్వి. (అశ్వమేధ. 2-56)

# 29. ఉదంకుడి కన్నీళ్లు

తల తిప్పుకున్నాడు ఉదంకుడు, ఆ మాతంగుడు నవ్వుతూ వెళ్లిపోయాడు.
ఉదంకుడనుకున్నాడు- కృష్ణుని జలమడిగాను, ఇదా అతడిచ్చింది? అంతా మాయ!
కృష్ణుడతడి మనోవీధిలో కనిపించి అన్నాడు- వచ్చినవాడు ఇంద్రుడు
తెచ్చినది స్వేదజలరూప అమృతం - నీవు వద్దన్నావు, అంతా మాయ!

ఉదంక మహర్షీ! నీవెప్పుడు స్మరిస్తే అప్పుడు వస్తాయి ఉదంక మేఘాలు
కావాల్సినంత వర్షాన్ని కురిసి వెళ్లిపోతాయి. హాయిగా తపస్సు చేసుకొనుము-
శ్రీకృష్ణుని దయతో ఉదంక మేఘాలు వర్షిస్తాయక్కడ పుణ్య తిథులలో.
ఉదంకుడు గౌతమ మహర్షి శిష్యుడు, ఎంతోకాలం నిష్ఠగా చేసాడు గురు శుశ్రూష.

ఒకరోజు కట్టెల మోపు తలపై మోసుకుని వచ్చి వేగంగా పడవేసాడు నేలపై.
మోపులో చిక్కుకున్న తల వెంట్రుకలు ఊడిపడ్డాయి; తెల్లగా, పొడుగ్గా ఉన్నాయవి-
తెల్ల వెంట్రుకలను చూసి దుఃఖిస్తుంటే- గౌతముడడిగాడు కారణమేమిటని?
నేను వచ్చాక ఎందరో శిష్యులు వచ్చారు వెళ్లిపోయారు దశలు దశలుగా

నేను ఒక్కడినే మిగిలిపోయాను, శిరోజాలు తెల్లబడిపోయినాయి
-అని కన్నీళ్లు కారుస్తుంటే గౌతముడు చెప్పగా గౌతముడి కుమార్తె
ఆ కన్నీళ్లను దోసిలిలో పట్టి వాటి వేడిమి భరించలేక వదిలిపెట్టింది.
ఆమె చేతుల్తో పాటు ఆ కన్నీళ్లు పడిన నేలకూడా కాలింది, క్షోభించింది.

---

**చ.** **అనఘ! జలంబు నీవలసినప్పుడు మేఘము లీమరుస్థలం**
**బున నొసఁగున్; భవదృశము వొంపిరివోవ నుదంక మేఘనా**
**మ నుత విహారముల్ గలిగి మాన్యత నెప్పుడు నియ్యెడం జరిం**
**చును జలదంబు; లింక నను సువ్రత! దూఱకు; పోయి వచ్చెదన్.' (అశ్వమేధ. 3-67)**

**ఆ.** **'మనుజనాథఁ యెప్పుడును మరుదేశంబు । నందు నియతవృత్తి, నద్భుతంబు**
**దలకొనంగ, నయ్యుదంక మేఘంబు లొ । క్కొక్క పుణ్యతిథుల నొలసి కురియు.' (అశ్వమేధ 3-70)**

**సీ.** **అతనికి గురుభక్తి కతనఁ జొప్పడియె న । త్తెఱఁగు పెం; పది విను తెలియ; నతఁడు**
**తన గురుండైన గౌతమునకు శుశ్రూష । నియతిమైఁ జేయ సస్నేహ భక్తి**
**కంబుగఁ బెద్దయుఁ గాలంబు చనిన, నా । సంయమిపతి శిష్య సమితి కెల్ల**
**వివిధవరము లిచ్చి, వీడ్కొల్పి, పుచ్చి, యు । దంకుని దిక్కును దలఁప కుండె;**

**ఆ.** **అత్తపఃపరాత్ముఁ దతినిష్ఠఁ బరిచర్య । నడపు, చొక్కనాఁడు కదును వ్రేఁగు**
**గలుగునట్టి వంటకట్టియమో పట్టు । గుదియ మోచి తెచ్చెఁ గురువరేణ్య! (అశ్వమేధ. 3-72)**

# 30. మిత్రసహాఖ్యుదేవి కుండలములు తెమ్ము-

గౌతముడన్నాడు దయతో- నీవు మహాత్ముడివి, నీకు యవ్వనాన్నిస్తున్నాను.
నా కూతురికి మరో రూపాన్నిచ్చి, గురుపుత్రి దోషం లేకుండానూ,
నీ తేజాన్ని భరించే శక్తిని ఇచ్చి, వివాహం చేస్తున్నాను నీకిచ్చి-
వివాహమైంది, ఉదంకుడు గౌతముడితో గురుదక్షిణ ఇస్తానన్నాడు.

-పుణ్యాత్మా! నాకు విద్య నేర్పావు, యవ్వనాన్నిచ్చావు, కన్యాదానం చేసావు.
గురుదక్షిణ కోరుకో, సాధించి తెచ్చి ఇస్తాను -అన్నాడు ఉదంకుడు.
గౌతముడు ఒప్పుకోలేదు, ఉదంకుడు వెళ్లి గురుపత్ని అహల్యనడిగాడు.
ఆమె అన్నది- నీవు పరాయివాడివి కాదు, గురుదక్షిణ ఇవ్వనవసరం లేదు.

ఉదంకుడు బ్రతిమలాడగా అన్నది- మిత్రసహుడి భార్య మదయంతి
కుండలాలను ధరించి వ్రతం చెయ్యాలని నాకెప్పటినుంచో కోరిక-
అది వినగానే ఉదంకుడు ఆ పని మీద వెళ్లాడు. గౌతముడు చెప్పినాడు-
మిత్రసహుడిప్పుడు సౌదాసుడనే రాక్షసుడై ఉన్నాడు, నరమాంస భక్షకుడతడు-

ఉదంకుడు వెళ్లివెళ్లి సౌదాసుడిని చూసాడొక భీకరమైన కొండగుహలో.
మానవరక్తంతో తడిచి దుర్వాసన కొడుతున్న ఆ భయంకరాకారుడు
ఉదంకుడిని పట్టుకుని అన్నాడు- మంచి ఆకలిమీద ఉన్నపుడు వచ్చావు,
తినేముందు నీ ఆఖరి కోరిక అడుగు, నాకిష్టమైతే తీరుస్తాను-

---

**క.** **ముని యిట్లు నెమ్మిఁ గాంచినఁ । గని యతఁ 'డాఁకొనుటఁ జేసి గాసిలి యెచ్చోఁ**
**గను వాఁడనొ? తగు భక్ష్యం? । బనుచుండఁగ వచ్చితివి ప్రియంబుగ' ననుడున్. (అశ్వమేధ. 3-88)**

**క.** **'గురుకార్యంబునకై భూ । వర! నిన్నుం గాన నేను వచ్చితి; గుర్వ**
**ర్థ రతులు హింస్యులు గా; రి । ట్లరయక యాడుదె యధర్మ మగు మాట నృపా! (అశ్వమేధ. 3-90)**

**క.** **'దినమున మూఁడవ యామం । బున నపరార్ధంబు యోగ్యముగ నాహారం**
**బునకుం గల్పించిరి నా । కనిమిషు, లటు గాన మాన; నాఁకలి పుత్తున్.' (అశ్వమేధ. 3-92)**

**సీ.** **అని పల్కె సౌదాసుఁ; డమ్ముని 'యట్లేని । నధిప! మద్గురు కార్య మాచరించి,**
**వచ్చెద మగుడ నవశ్యంబు; నా మాట । నన్నృతంబు చొరదు; నీ వర్థికోటి**
**కిష్టపదార్థంబు లిత్తు; పాత్రమ యేను; । గురులకుఁ గాఁగ నా కోరు కోర్కి**
**నీవ తీర్తని కృత నిశ్చయత్వంబున । నరుగుదెంచిన వాఁడ' ననుడు నృపతి**

**ఆ.** **'యట్లకాక; యేమి యర్థించి వచ్చితి; చెప్పు 'మనిన నతఁడు చిత్త మలర**
**'ననఘ! నీదు పత్ని యర్థిమై ధరియించు । కుండలంబు' లని యతండు సెప్పె. (అశ్వమేధ. 3-93)**

# 31. భర్త పనుపున నిచ్చెద కుండలములు-

ఉదంకుడన్నాడు- నేను వెళ్తున్నది గురుకార్యం మీద, నాకు కావాలి
మిత్రసహుడి పట్టపురాణి కుండలములు, వ్రతం పూర్తైనాక
తెచ్చి ఇస్తాను మరల- ఆమె ఎక్కడ ఉన్నది, అవెలా లభిస్తాయి?
సౌదాసుడన్నాడు- అదిగో, కనబడే భవనమే ఆమె ఉండే చోటు-

ఉదంకుడక్కడకు వెళ్లాడు, ఆమె అన్నది- రాజునుంచి ఏదైనా గుర్తు తీసుకురా-
సౌదాసుడి దగ్గరకు వచ్చి ఉదంకుడన్నాడు- రాజునుంచి ఏదైనా
గుర్తు తీసుకు రమ్మన్నది మహరాణి, తెరచాటు నుంచి, రాజెవ్వరిక్కడ?-
సౌదాసుడు నవ్వాడు- నేనే మిత్రసహుడిని, శాపవశాన రాక్షసుడినైనాను.

ఆమెతో ఈ మాటలనుము- 'ఈ గతిసేమమగునని నిష్టింపరాదు
ఇది వెలిగాగ లేదు వేరు గతియును' - ఉదంకుడు వెళ్లి ఆ మాటలే
చెప్పగా మహరాణి ఇచ్చింది దివ్యకుండలములను- మునీశ్వరా!
జాగ్రత్త, గంధర్వులు, నాగులు, దేవతలు వీటిని దొంగిలించాలని చూస్తున్నారు.

నీ ఎంగిలి అంటుకున్నా, నిద్రించినా, నేలమీద పెట్టినా దొంగిలిస్తారు.
వీటిని భక్తితో పూజించి ధరిస్తే ఆకలి దప్పిక అగ్ని భయము
విషం వలన వ్యాధి, భూత పిశాచాల పీడలుండవు, ఎవరికైనా
సరిగా సరిపోతాయి- బంగారాన్ని కురిపిస్తాయి, క్షేమంగా వెళ్లుము-

---

**సీ. 'సురులు గంధర్వులు నురగులు నిక్కుండ । లములకుఁ బెక్కుపాయముల వేచి**
**తరుగుదు; రెంగిలి పొరసిన, నేమఱి । నీవు నిద్రించిన, నేల నిడిన**
**నపహరింతురు; భక్తి నర్చించి యివిదాల్ప । నాఁకలి నీరువ ట్టగ్నిభయము**
**విషవికారము, భూతబేతాళ బాధలు । పొరయవు; వినుము, బాలురకు నైనఁ**

**ఆ. బెద్దవారి కైనఁ బెట్టిన నయ్యయి । కొలఁది నమరియుండుఁ । గురియుఁ బసిఁడి;**
**వీని నప్రమత్త వృత్తిమైఁ గొని చను । మయ్య! గురులు నిన్ను నభినుతింప.' (అశ్వమేధ. 3-97)**

**ఉ. 'ఏమిటనైన నొప్పమి నరేంద్ర! సుచిత్తులఁ బొందె నేనియున్**
**వే మరలున్; భవద్గుణమ వీతకళంకునిఁ జేసి నిన్ను; సాం**
**ద్రామలకీర్తి గౌతమ మహాముని చల్లని చిత్తవృత్తి నీ**
**పై మలఁగించెఁ గావలయుఁబ బార్థివసత్తమ! పొందు మున్నతిన్. (అశ్వమేధ. 3-102)**

**క. అని పలికి, మఱియుఁ బలుదీ । వన లిచ్చి యతండు గారవమున నతనిమేన్**
**దన కరముల నివిరి, ప్రియం । బొనర్చె; నిర్దురితుఁ డైన యుర్వీపతియున్. (అశ్వమేధ. 3-103)**

# 32. పాతాళంబున నున్నను వేతెత్తుం కుండలములు-

పట్టపురాణి మదయింతి ఇచ్చిన కుండలాలను తీసుకుని వచ్చాడు
ఉదంకుడు రాక్షసుడైన సౌదాసుడి వద్దకు, అడిగాడు శాప కారణం.
అతడన్నాడు- ఎక్కడో జరిగింది వ్రతభంగం, నాకు కలిగింది శాపం.
నీకు కుండలాలివ్వడం వలన మేలు కలుగుతుందో లేదో తెలియదు.

ఆ మాటలు నీవు పట్టపురాణికి చెప్పావు, సంతోషము-
అయినా, చంపెడు నట్టి నాకడకు వస్తారా మరల ఎవరైనా!
నీవు వెళ్లి గురు కార్యము పూర్తి కావించుము -అని పలుకగా
ఉదంకుడు సౌదాసుడికి నమస్కరించి ఇంటిదారి పట్టినాడు.

కుండలాలను లేడిచర్మంలో మూటగట్టి త్వరత్వరగా వెళ్తుండగా
దారిలో పండ్లతో నిండిన బిల్వవృక్షము కనిపించగా
చెట్లెక్కి మాగిన వెలగపండ్లు కోస్తుంటే చెట్టు ఊగి
కుండలాల సంచి కిందపడింది, ఒక పాము దానిని నోటకరచి దూరింది పుట్టలోకి

హతాశుడైన ఉదంకుడు చెట్టు దిగివచ్చి కర్రతో తవ్వుతున్నాడు పుట్టను-
ఇంద్రుడు వచ్చాడు బ్రాహ్మణవేషంలో- 'ముల్లుగర్రతో తవ్వితే
వేయి యోజనాల దూరంలో ఉన్న పాతాళలోకం చేరుకుంటావా? అన్నాడు.
దానికి సమాధానమిచ్చాడు ఉదంకుడు- ప్రాణాలు పోయినా పట్టువదలను-

---

సీ. 'గాలి నవ్విటప మాలోల మగుడుఁ దగు । లెడలి, యయ్యజినంబు పుడమిఁ బడినఁ
గని, యొక్కనాగంబు గ్రక్కునఁ జనుదెంచి । వెసఁ బుచ్చికొని కడు వేగ పఱవఁ
గాంచి యుదంకుండు గ్రమ్మన దిగదాఁటి । వెనుకొనునంతకు గనపపుట్టఁ
జొచ్చె నయ్యురగ, మా సువ్రత పరుఁడు దీ । వ్రముఖ కాష్ఠము గొని త్రవ్వఁదొడఁగె;

తే. దాని సైరింపఁ జాలక ధరణి తలరె; । విప్రుఁడై వచ్చి గీర్వాణవిభుఁడు గొయ్య
కోలఁ ద్రవ్విన మాత్రఁ బాతాళయాన । మేల సిద్ధింపనేర్చు మునీంద్ర! వినుము. (అశ్వమేధ. 3-105)

చ. పలికిన నత్తపస్విదృఢభావ మెఱింగి సురేంద్రుఁ డొండు ప
ల్కుల పని నిల్పి, కాష్ఠమునకుం గులిశంబునఁ గల్గువాఁడియున్
బలువును నిచ్చి వజ్ర చనె బాంధవ మేర్పడఁ జెప్పి; భీతిమై
నిల దెరు విచ్చె; నమ్మునియు నేడ్తెఱఁ జొచ్చె భుజంగలోకమున్. (అశ్వమేధ. 3-108)

- స తేన మార్గేణ తదా నాగలోకం వివేశహ
దదర్శ నాగలోకం చ యోజనాని సహస్రశః

నాగలోక ముత్తంకస్తు ప్రేక్ష్య దీనో భవత్ తదా
నిరాశ శ్చాభవత్ తత్ర కుండలాహరణే పునః (సం.అశ్వ. 58-37,41)

# 33. తెచ్చితి నివె కుండలంబులు-

ఇంద్రుడు మెచ్చుకున్నాడు ఉదంకుడి పట్టుదలను, గురుభక్తిని.
ముల్లుగర్రకు ప్రసాదించాడు వజ్రానికుండే వాడిని, గట్టితనాన్ని
భూమి దారి ఇచ్చింది తవ్వుతుంటే, ఉదంకుడు చేరాడు పాతాళానికి.
పాతాళలోక ద్వారమున్నది పదియోజనాల పొడవుగా.

అయిదు యోజనములు వెడల్పుగా, అధైర్య పడినాడు ఉదంకుడు.
ఇంతలో అక్కడకు వచ్చిందొక అశ్వరాజం- ముఖం ఎర్రగా,
శరీరం నల్లగా, తోక తెల్లగా. ఆ గుర్రం మాట్లాడింది-
రోత అని అనుకోక నా అపాన రంధ్రంలో ఊది చూడుము-

నేను నీ గురువు గౌతముడికి గురువునైన అగ్నిదేవుడిని.
-ఉదంకుడు వెనక రంధ్రంలో ఊదేసరికి గుర్రం ఒళ్లువిరిచింది.
దాని రోమరంధ్రాల నుంచి ముందు రంధ్రాల్లోంచి పొగపుట్టింది.
ఆ పొగ దెబ్బకు పాతాళలోకమంతా తల్లడిల్లి, వినవచ్చాయి ఆక్రందనలు.

వాసుకి లాంటి ప్రముఖులు కలవరపడినారు. కుండలాలు దొంగిలించిన
ఐరావతుడి కుమారుడు పరుగు పరుగున వచ్చి వాటిని అప్పగించాడు.
ఉదంకుడు ప్రీతుడై కుండలాలను తీసుకునివెళ్లి గురుపత్నికిచ్చాడు.
అహల్యాదేవి సంతోషంతో వ్రతం పూర్తి చేసింది, గురువు ఆశీర్వదించాడు.

---

**సీ. ఘోటకోత్తమ రోమకూపంబులం దెల్ల । నొక్కట ఘనధూమ ముద్గమించి,**
**కవిసి, పాతాళ లోకంబంతయును గప్పి । వాసుకి ప్రభృతి నివాస భూము**
**లుపరుద్ధ భావంబు నొందె; నైరావతా । వాసంబు హాహారవంబు తోడ**
**నాకులంబయ్యె; న ట్లతిదారుణంబైన । పెనుఁబొగ నెంతయు బీతి నొంది**

**ఆ. యమ్మునీంద్రు కడకు నహివరుల్ రయమున । వచ్చి, భక్తి నర్చలిచ్చి, వినతు**
**లై తదీయ కార్య మడిగి యెఱింగి, వే । తెచ్చి కుండలంబు లిచ్చి రధిప! (అశ్వమేధ. 3-112)**

**చ. అతఁడును వారిఁ బోఁబనిచి, యగ్నికి భక్తిఁ బ్రదక్షిణంబు చే**
**సి, తగ నమస్కరించి, విలసిల్లఁగఁదేజము, ప్రీత చిత్తుఁడై**
**యతలము నిర్గమించి రయ మారఁగ వచ్చి యహల్యఁ గాంచి 'తె**
**చ్చితి నివె కుండలంబు' లని చే నిడి, భూస్థలిఁ జాఁగి మ్రొక్కినన్. (అశ్వమేధ. 3-113)**

**- స గత్వా త్వరితో రాజన్ గౌతమస్య నివేశనమ్**
**ప్రాయచ్ఛత్ కుండలే దివ్యే గురుపత్న్యాస్త దానఘ (సం.అశ్వ. 58-58)**

# 34. ద్వారకకు చేరిన శ్రీకృష్ణుడు

ఉదంకుడు తానన్నమాట నిలబెట్టుకున్నాడు, గురుదక్షిణ నిచ్చాడు.
కుండలములు తెచ్చి అహల్యాదేవికిచ్చి, మరల మదయంతి
కందజేసి సౌదాసుని ముందు నిలబడినాడు; ఉదంకుడి
స్పర్శతో, గౌతముడి ఆశీస్సులతో సౌదాసుడైనాడు మిత్రసహుడిగా–

ఉదంక మహర్షిని ఆశీర్వదించి శ్రీకృష్ణుడు చేరుకున్నాడు ద్వారక.
రైవతక పర్వతం జాతరకై అలంకరించబడిన నగరం
శ్రీకృష్ణుని రాకతో మరింత శోభనందింది, ఉప్పొంగింది
బలరాముడిని, దేవకీ వసుదేవులను సందర్శించాడు కృష్ణుడు.

వారికందరికీ సంక్షిప్తంగా తెలియజేసాడు సంధి ప్రయత్నాలను
పదునెనిమిది రోజులు జరిగిన కురుపాండవ సంగ్రామాన్నీ–
పాండవుల వేపు మిగిలింది పంచ పాండవులు, నేను, సాత్యకి
కౌరవుల వేపు బ్రతికింది అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యుడు

అభిమన్యుడి మరణం విని అందరూ పెద్దగా శోకించారు.
శ్రీకృష్ణుడు వర్ణించాడు అభిమన్యుడి పరాక్రమం గురించి గొప్పగా
అతడు మహావీరుడు, ఉత్తమ గతులనందినాడు, కీర్తి పొందినాడు
అందరూ అభిమన్యుడి జ్ఞాపకాలలో మునిగిపోయారు ద్వారకాపురిలో.

---

**సీ.** **ఆ భార్గవోత్తము నట్లు వీడ్కొని కృష్ణుఁ । డరిగి యలంకృత మైన నిజపు**
**రము సొచ్చునప్పుడు రైవత కాచల । యాత్రామహోత్సవ మఖిలజనులుఁ**
**గొనియాడుచుండి, యగ్గోవిందు సందర్శ । నంబున నుత్సవోన్మత్త భావ**
**మిమ్మడియై ప్రమోదమ్మునం దేలి; ర । ద్దేవదేవుఁడు వసుదేవుఁ గాంచి**

**తే.** **దేవకీదేవ బలభద్రదేవుఁ దక్కుఁ । గలుగు వృద్ధ బాంధవులను గని వినీతిఁ**
**దత్తదుచిత మనోజ్ఞవిధాసమంచి । తాచరణములు నడపెఁ బ్రియం బలర్ప.** (అశ్వమేధ. **3–119**)

**సీ.** **చుఱచుఱఁ దనచెవుల్ సూఁడిన యట్లుగ । నభిమన్యు సంస్తుతి యైన వాక్య**
**యము ప్రసంగాధీనమై బంధుజనులందుఁ । బొడముటయును, ధృతి యెడలి తలరి**
**యుత్తర విలపింప, నత్తన్వియలమట । గనుఁగొని, పాండునందనులు వనటఁ**
**గూరిన, నచటికిఁ గారుణ్యమూర్తి వే । దవ్యాసుఁ డేతెంచి తగినమాట**

**తే.** **లాడి, వారలవగ మాన్చి, యశ్వమేధ । విషయవిధులు ప్రసంగించి వేగ తొడఁగుఁ**
**డని నియోగించి, వా రెల్ల నట్లకాక । యనిన నాతఁ డంతర్హితుం డయ్యె నధిప!** (అశ్వమేధ. **3–134**)

# 35. రాజసూయం నుంచి అశ్వమేధం వరకూ

ధర్మరాజు చేసిన రాజసూయయాగం రారాజుకు అసూయను కలిగించింది.
అసూయ అగ్నిపర్వతంలా పెరిగి పాచికల రూపంలో పొగలు కక్కింది.
వనవాసాలూ, అజ్ఞాతవాసాలూ పగలు, ప్రతిజ్ఞలు నిప్పులు కురిసాయి.
చివరకు విస్ఫోటించి యుద్ధ జ్వాలాముఖి మృత్యు పర్వతమై విస్ఫోటించింది-

పదునెనిమిది రోజులు ప్రళయాన్ని సృష్టించి, చేసింది క్షత్రియ నాశనం
యుద్ధం గెలిచిన యుధిష్ఠిరుడికి దక్కింది రాజ్యంతోపాటు వల్లకాడు-స్మశానం.
తన వాళ్లందరినీ తానే చంపానేమోనన్న ధర్మచింతనతో ఏదో కలవరపాటు
ఖాళీ కోశాగారం, కొండంత దుఃఖంతో చేయాల్సి వచ్చింది అశ్వమేధయాగం.

రాజసూయ యాగం నాటి రాజసం, సార్వభౌమత్వ వెలుగు ఆరిపోయింది.
పాచికల గాలిదెబ్బకు, పదమూడేళ్ల కష్టాలు, రాయబారాలు
బేరాలు కుదరనివ్వలేదు రారాజు, యుద్ధం ముగిసింది
ఏదీ, ఎవ్వరూ మిగల్లేదు; ధర్మరాజు మిగిలాడు హస్తినకు రాజుగా.

ధర్మరాజుకిప్పుడు కావాల్సింది కాస్త మనశ్శాంతి, సార్వభౌమత్వం
పాండవుల సంపాదనంతా కౌరవుల పిండాకూళ్లకు చాలడం లేదన్న చేదు నిజం.
వ్యాసుడి సలహాతో దొరికింది మరుత్తుడి స్వర్ణనిధి రహస్యం.
నిధి దక్కితే దిగ్విజయంగా చేయవచ్చు అశ్వమేధ యాగం.

---

సీ. 'వ్యాసమహాముని వత్సలత్వంబున । నానతి యిచ్చిన మాననీయ
వాక్యంబు వింటిరె? వసుధ యిత్తఱి వసు । హీనయై యున్నది; దానఁ జేసి
భూదేవ నిహిత ధనాదాన మావశ్య । కంబయ్యె; దాని శక్యత్వమును హి
మాచల యాత్రా సమాచరణ ప్రకా । రమును విచారణీయములు గావె?

ఆ. యనుడుఁబవన తనయుఁ డతనితో నీశ్వరుఁ । బరమ నియతిఁ గొలిచి, కరుణ వడసి
ప్రమథగణము నెల్ల భక్తిఁ బూజించి, య । త్తలమునందు భూతబలు లొనర్చి. (అశ్వమేధ. 3-137)

చ. వెడలెదు నమ్మహీవిభుని వేడ్క యెఱింగి, వృకోదరుండుఁ గ
వ్వడియును బిన్నతమ్ములును వైభవ మొప్ప నలంకరించి యె
క్కుడు మెఱయం, బ్రధాన భట ఘోటక దంతి రథ ప్రతానముల్
దడిగలుఁ గుంచెలుం గొడుగు తండములున్ విలసిల్ల వచ్చినన్. (అశ్వమేధ. 3-144)

క. కని యా నృపుఁ డలఁతి నగవు । నినుపారెడు చూడ్కివారి నెమ్మొగములపైఁ
దనుపారుచుఁ బొలయం, జనఁ । జన రాజులు గూడుకొనిరి సైన్యంబులతోన్. (అశ్వమేధ. 3-145)

# 36. వారలు త్రవ్విరన్నిధానదే

గాంధారీ ధృతరాష్ట్రుల, కుంతీదేవి ఆశీస్సులను పొంది ధర్మరాజు
యుయుత్సుడిని, విదురుడిని నిలిపాడు హస్తిన నగర రక్షణకు.
ఇంద్రుడికి, దేవతలకు, పితృదేవతలకు, అగ్నికి పూజలు సలిపాడు.
తెల్లని బట్టలు ధరించి, పదహారు తెల్లటి గుర్రాల రథంలో

విజయఘోషలు, మంగళవాయిద్యాలు, స్తోత్రాలు, దీవెనల మధ్య
నలుగురు సోదరులు వెంటరాగా పలుదినములు ప్రయాణించి
చేరుకున్నారు హిమవత్పర్వత ప్రాంతం, చేసారక్కడ విడిది.
అక్కడకు వచ్చాడు వేదవ్యాస మహర్షి- బాలార్కద్యుతిపుంజ

పింజర జటాభారంబుతో, వర్షమేఘ వర్ణంతో, కాంతివంతమైన
దండము, మృగజినాంబరము ధరించి, మోక్షప్రదాతయై-
ఉదయాన నిర్వహించారు అత్యంత భక్తిప్రపత్తులతో పాండవులు
వ్యాసుని ఆధ్వర్యంలో గొప్ప శివపూజను మంత్రపూర్వకంగా.

ప్రమథగణాలను, నిధుల రక్షకులైన యక్షులను, కుబేరుడిని
మణిభద్రుడిని, భూతనాయకులను విశేషంగా కొలిచినారు.
నిధులున్న చోట ఎర్రని గంధపుష్పాలతో, మాంసం, అప్పాలు
పేలాలుంచి శాస్త్రోక్తంగా భూతతృప్తి చేసి తవ్వారు ఆ ప్రదేశాన్ని-

---

**శా.** బాలార్కద్యుతి పుంజ పింజర జటాభారంబుఁ బ్రావృడ్ఘన
శ్రీలీలం బ్రహసించునంగమును, రోచిస్స్ఫార దండంబు ను
న్నీలస్నిగ్ధ మృగాజినాంబరము నై, నిర్వాణదాన క్రియా
శీలుం డైన పరాశరాత్మజుఁడు విచ్చేసిం గృపాలోలుఁడై. (అశ్వమేధ. 3-147)

**ఆ.** భూతతృప్తిఁ జేసి భూరి బలాఢ్యులఁ । బరిజనములఁ ద్రవ్యఁ బనుచుటయును
నతి కుతూహలమున నార్చి వారలు త్రవ్వి । రన్నిధానదేశ మధిపముఖ్య! (అశ్వమేధ. 3-153)

**సీ.** శకట ఖరోష్ట్ర ఘోటక కుంజరంబు ల । నేక సహస్రంబు లెలమి సంఘ
టించి, భారంబు లెత్తించి భారవహత్వ । దక్షజనుల్ పెక్కులక్ష లర్థిఁ
గదిసి యే నే నని కడఁగి మోపఁగ యాగ । నిలయంబు కలపయుఁ గలశములును
నలఁకులు గాఁగులు నాదిగాఁగల భాండ । ములును బీఠములు శయ్యలును తోళ్ళు

**తే.** రోఁకళులుఁ జట్టువంబులు స్రుక్స్రువాజ్య । పాత్ర దండకమండలు దాత్రములును
లోనుగాఁ గల వస్తువుల్ శుద్ధి హేమ । మయము లొక్కట నడపించె మనుజనాథ! (అశ్వమేధ. 3-156)

# 37. బంగారు నిధి

'త్రవ్విన ప్రభలెల్ల నివ్వటిల్లగ వెలుగుచుండె నిధి" -అందరూ
మొక్కినారు, పూజలు చేసినారు, ఆశ్చర్యానందాలతో ఉబ్బితబ్బిబ్బైనారు.
వ్యాసుని ఆశీస్సులతో బంగరు నిధులను పేర్చినారు మూటలుగా.
వేలకొలది బళ్లు, గాడిదలు, ఒంటెలు, గుర్రాలు, ఏనుగులు

లక్షలాది మంది బరువులు మోసేవాళ్లనూ నియోగించినారు
యాగశాలకు అవసరమైన కలప, బంగారం, కలశాలు, కాగులు
అలుకుకుండలు, పీటలు, మంచాలు, రోళ్లు, రోకళ్లు, దండాలు
నేతిగిన్నెలు, కమండలాలు, కొడవళ్లు, బారువులకొద్ది బంగారాన్ని

మోసుకుంటూ ప్రతి రెండు కోసులకు మజిలీలు చేస్తూ
వస్తున్నారు హస్తినకు పాండవులు ఉత్సాహానందాలతో.
విషయం తెలిసిన శ్రీకృష్ణుడు చేరుకున్నాడు బలరామ సాత్యకిలతో
ద్వారకాపురి నుంచి హస్తినకు బంధుమిత్ర సమేతంగా-

సుభద్ర వెళ్లింది అంతఃపురంలోకి, అందరూ వారికిచ్చిన చోట్ల
విడిది చేసారు, పురిటింట్లో నెప్పులు పడుతున్నది ఉత్తర.
ముందుగా వార్త వచ్చింది పుత్రుడు జన్మించాడని, అందరూ
హర్షధ్వానాలు చేస్తుండగానే వార్త వచ్చింది-పుట్టింది మృతశిశువు.

---

క. త్రవ్వినఁ బ్రభలెల్ల దెసల । నివ్వటిలఁగ వెలుంగుచుండె నిధి; యనిలజుఁడుం
గవ్వడియుఁ గవలు నలరఁగ । నవ్వసుధాధిపుఁడు దాని కర్చన లిచ్చెన్. **(అశ్వమేధ. 3-154)**

చ. మఱియును సన్నిధిం గల సమంచిత కాంచనరాశి బండులం
బెఱికల మోపులం గొలఁది వెట్టఁగఁ బెక్కగు బారువుల్, జనుల్
వెఱఁగుపడంగ ఖేచరులు వెక్కస మందఁగ, శత్రుకోటికిన్
వెఱ పొనరించువార్త పృథివిం బరఁగన్ నడపించె భూవరా! **(అశ్వమేధ. 3-157)**

ఉ. ఉత్తర పుణ్యగర్భముననుండి భవజ్జనకుండు పూరువం
శోత్తరుఁ డాది రాజగుణయోగి పరిక్షితుఁ డుద్భవించినన్
జిత్త మెలర్పఁ బుత్త్రుఁడని చెప్పిరి వెల్పలివారి కింటిలో
నత్తఱి నున్న వృద్ధ సతు; లార్చె జనం బఖిలంబు నుబ్బునన్. **(అశ్వమేధ. 3-166)**

క. బాలుఁడు మృతజాతుం డని । యాలోనన యేడ్పు బెరయ, నలమట నచ్చో
నాలలన లుగ్గడించినఁ । దేలిరి శోకమున జనులు ధీరవిచారా! **(అశ్వమేధ. 3-167)**

# 38. ఇబ్బాలునకు జీవమిపుడ వచ్చు-

జనులందరూ దుఃఖంలో మునిగిపోయారు పుట్టింది మృతశిశువని.
శ్రీకృష్ణుడి మనసు కూడా బాధకులోనై అతడు వెళ్లాడు పురిటింటికి.
సుభద్ర ఏడుస్తూ వచ్చింది ఎదురుగా- అన్నా- అశ్వత్థామ ఇషీకాస్త్రాం
-రెల్లుపుల్ల బ్రహ్మశిరోనామకాస్త్రమై చంపింది నీ మేనల్లుడి కొడుకును-

ద్రౌపది అన్నది ఉత్తరను ఓదారుస్తూ- వచ్చాడు తల్లీ కృష్ణుడు!
అతడే మనకిక దిక్కు, అన్నా, వంశాన్ని ఉద్ధరించవయ్యా కృష్ణా!'-
ఉత్తర ప్రార్థిస్తూ అన్నది- నీ మనవడు చూడు తండ్రీ ఎలా ఉన్నాడో!
అతడి తండ్రి ఉంటే ఆ అశ్వత్థామ ఇంత ఘోరం చెయ్యగలిగేవాడా?

ఆ శిశువును తన ఒడిలో ఉంచుకుని ఏడ్చింది ఉత్తర -కన్నకొడుకా!
నీ తాత లోకగురుడు దామోదరుడు వచ్చాడు నాయనా, లేచి పలకరించు.
-కనువిచ్చి గొంతిజూడుము, నను చూడుము, ద్రుపద నృపతనయను
నీ జనకుని తల్లి సుభద్రను చూడుము, తలెత్తి దరహాసముతోన్

లీలామానుష విగ్రహుడైన శ్రీకృష్ణుడు కరిగిపోయాడు- 'మహా సత్యమూ,
ఉత్కృష్ఠ ధర్మమూ, అస్ఖలిత బ్రహ్మచర్యమూ నాయందు చక్కగా ఉన్నట్లయితే
ఈ మగబిడ్డకు ఇప్పుడే ప్రాణం వచ్చునుగాక! -అని కృష్ణుడు పలికి
ఆ శిశువు నుదుటిపై చేయి ఉంచగానే, ప్రాణం వచ్చి కదిలాడు బాలుడు.

---

**క.** **'గతి నీవె నాకు, మత్సం । తతికిని; నీ యల్లుఁగుఱ్ఱతనయుఁడు పుట్టెన్**
**మృతుఁడై క్రూరుండగు గురు । సుతుని యిషీకాస్త్ర వహ్నిఁ జూఁడిన కతనన్. (అశ్వమేధ. 3-169)**

**సీ.** **దేవకీపుత్ర! సంజీవితుఁ జేయవే । యబ్బాలు; నద్దారుణాస్త్ర సంప్ర**
**యోగంబు నపుడు కృపాగరిష్ఠుండ వై । చేసితి ప్రతిన 'గాచెద నవశ్య**
**మును నుత్తరాగర్భజనితు నే' నని; బాలు । బ్రదుకుతోడిద నాదు బ్రదుకు; ద్రుపద**
**తనయా సుభద్రలు, ధర్మజుం డనుజు, లా । శిశువు సంజీవితుఁ జేయకున్న**

**ఆ.** **బ్రదుక; రన్వయమున కుదక పిండ ప్రదా । నంబు లెడలు; మత్స్యనందనయును**
**నూఱడింపఁ బడియె నొకనాఁడు నీ చేత; । దాని యార్తి కరుణఁ దలుఁగవయ్య! (అశ్వమేధ. 3-170)**

**క.** **కనువిచ్చి గొంతిఁ జూడుము. । ననుఁ జూడుము, ద్రుపద నృపతనయఁ జూడుము; నీ**
**జనకుని తల్లి సుభద్రం । దనయా! చూడు తల యెత్తి దరహాసముతోన్.' (అశ్వమేధ. 3-185)**

**చ.** **అని పలవించి యా సరసిజానన మూర్ఛ మునింగి నేలవ్రా**
**లినఁ గరుణంబు పెంపున విలీనతఁ బొందు మనంబులున్ సబా**
**ష్పనయన యుగ్మకంబులును, బాడఱు మోములు నైన కౌరవాం**
**గనల యలంతఁ గాంచిన వగల్ మిగులుం బగవారి కేనియున్. (అశ్వమేధ. 3-186)**

# 39. పరీక్షిత్తు జననం

బాలుని శరీరమునకు ప్రాణములు రాగా కదిలాయి అతడి కరచరణాలు.
అతడు కనులు విచ్చి చూడగానే పరమానందం పొందారు కౌరవస్త్రీలు.
ఆనందంతో వారి మనస్సులనే చెరువులు నిండాయి, ఆనందబాష్పాలు జాలువారాయి.
బిడ్డను ఎత్తుకువచ్చి శ్రీకృష్ణుని పాదాలచెంత ఉంచింది భక్తితో ఉత్తర.

'తన వంశమంతా నశించిపోయినపుడు జన్మించాడు కాబట్టి
ఈ బాలుడి పేరు 'పరీక్షిత్తు' –పరీక్షింపబడినవాడుగా
ప్రసిద్ధికెక్కును గాక!' –అన్నాడు శ్రీకృష్ణుడు; 'తథాస్తు' అన్నారందరూ.
వచ్చిన చుట్టాలు ఆ బాలుడికి అనేక ఆభరణాలనిచ్చారు.

పరీక్షిత్తు పుట్టిన నెలరోజులకు చేరుకున్నారు పాండవులు హస్తినకు.
కృష్ణుని ఆజ్ఞలతో యుయుత్సుడు విదురుడు హస్తినాపురిని అలంకరించారు.
కస్తూరి నీళ్లతో కలయంపి చల్లి, ముత్యాల ముగ్గులు, రత్నాల తోరణాలు
పూలదండలు, స్వర్ణ పూర్ణకుంభాలు, మరకతమణిమయ అరటి స్తంభాలు

హస్తినాపురం కానవచ్చింది అత్యంత శోభాయమానంగా, ప్రజలందరూ
వేడుకలలో పాల్గొనడానికి ఉత్సాహపడుతుండగా ఆ నగరం
కానవచ్చింది చంద్రోదయవేళ తరంగాలతో ఉప్పొంగే సముద్రంలా
బలరాముడు శ్రీకృష్ణుడు ఇతరులు ఎదురువెళ్లి కలుసుకున్నారు పాండవులను.

---

క. **నరునియెడ నామనంబున । విరోధ మెన్నఁడును నేమి విధమున నైనం**
**బొరయమి నిజమేనియు సు । స్థిరముగ నిబ్బాలుమేన జీవము సెందున్. (అశ్వమేధ. 3-192)**

తే. **మహిత సత్యంబుఁ బరమధర్మంబు గాథ । నిర్మల బ్రహ్మచర్యంబు నిత్య సుప్ర**
**తిష్ఠితంబులై నాయందుఁ దేజరిల్లు । నేని నిబ్బాలునకు జీవ మిపుడ వచ్చు.' (అశ్వమేధ. 3-194)**

సీ. **బాలుని మేనికిఁ బ్రాణముల్ వచ్చిన । నల్లన కదలెఁ దదంగకములు;**
**మఱి కనువిచ్చె; నత్తెఱఁగు తెల్లంబుగాఁ । గని గొంతి మొదలైన కౌరవాంగ**
**నలు మనంబులు నిండి, యలువులఁ బాఱెడు । నానందపూరంబు లనఁగఁ బొల్చుచ**
**హర్ష బాష్పములు రోమాంచ కంచుకిత దే । హంబులు నై యలరార, నఖిల**

తే. **జన సమూహమ్ములును సంతసమునఁ దేలి । గగనమున దివ్యవాణి యక్కమలనాభుఁ**
**బొగడె; మీ తండ్రి యున్న యప్పుణ్య గృహము । కరము శోభిల్లె నపుడు కౌరవేంద్ర! (అశ్వమేధ. 3-196)**

- **పరిక్షీణే కులే యస్మాత్ జాతో యమభిమన్యుజః**
**పరిక్షిదితి నామాస్య భవత్వి త్య బ్రవీత్ తదా (సం.అశ్వమేధ. 70-11)**

# 40. అశ్వమేధ యాగ సన్నాహాలు

ధర్మరాజాదులు మొదట సందర్శించారు గాంధారీ ధృతరాష్ట్రులను, కుంతిని.
ప్రేమతో పలకరించారు యుయుత్సుడిని, విదురుడిని ఇతర బంధువులను-
పాండవులకు చెప్పారు పరీక్షిత్తు జన్మవృత్తాంతాన్ని, శ్రీకృష్ణుడి మహిమతో
బ్రతికిన పరీక్షిత్తు గురించి- వారు స్తుతించి మ్రొక్కారు దేవదేవుడిని.

కొద్దిరోజులకు వచ్చాడు జ్ఞానతేజో విరాజితుడైన వ్యాస మహర్షి
పాండవులు శ్రీకృష్ణుడు అతడికెదురేగి ఎంతగానో గౌరవించగా
వ్యాసుడన్నాడు- అశ్వమేధ యాగం సర్వపాపాలను నశింపజేస్తుంది.
నీకిప్పుడు ధనం లేదన్న చింతలేదు, కావున యాగం చేసి కీర్తి బడయుము.

శ్రీకృష్ణుడన్నాడు- వ్యాసులవారు చెప్పినట్లుగా చేద్దాం అశ్వమేధం
నీ సోదరులు, నేను నిర్వహణ బాధ్యతను తీసుకుంటాము నిష్ఠతో.
వ్యాసుడన్నాడు- నేను యాజ్ఞవల్క్యుడు, పైలుడు యాగకర్మలు చేస్తాము.
ఈరోజు చైత్రమాసం పూర్ణిమాదినం, యజ్ఞానికి పనికివచ్చే అశ్వాన్ని తెప్పించుము.

తురంగ పరీక్షావిదులు ఎన్నిక చేస్తున్నారు ఉత్తమజాతి అశ్వాన్ని.
యజ్ఞశాల నిర్మాణం, యజ్ఞానికి కావాల్సిన వస్తువుల సేకరణకు
నియమించబడినారు అధికారులు; యజ్ఞాశ్వపు ఎన్నిక కాగానే ధర్మరాజు
అశ్వరక్షకుడిగా నియమించినాడు దివ్యాస్త్రవేత్త అయిన అర్జునుడిని.

---

**ఉ. 'వ్యాసులు పంచినట్ల నియమాధ్యతఁ జేయుద మశ్వమేధముం;**
**జేసి కృతార్థతం బొరసి చిత్తము నెవ్వగ యెల్లఁ బాచికొ;**
**మ్మాసుకృతంబు ధర్మనిచయ ప్రవరం బని యేన చెప్పి కా**
**దే సుగుణాభిరామ! నిను దీనికిఁ జొన్పితి దృఢంబుగన్. (అశ్వమేధ. 3-212)**

**- అనుజానామి రాజంస్త్వాం క్రియతాం యదనంతరమ్**
**యజస్వ వాజిమేఘేన విధివద్ దక్షిణావతా**
**అశ్వమేథో హి రాజేంద్ర పావనః సర్వ పాప్మనామ్**
**తేనే ష్ట్వా త్వం విపాప్మా వై భవితా నాత్ర సంశయః (సం.అశ్వ. 71-15,16)**

---

**అశ్వమేధ యాగం :** ఈ మహత్తర యజ్ఞం క్షత్రియోచితమై కీర్తిని, అధికారాన్ని ఇస్తుంది.

**యజ్ఞాశ్వం :** తెల్లగా ఉండి అక్కడక్కడా నల్లటి మచ్చలుండాలి.

యాగాశ్వం బయల్దేరే ముందు రాజు, రాణి ఋత్విజుల సమక్షంలో హోమాగ్నికి పూజలు చేస్తారు. మరుసటి రోజు ఉదయాన యాగాశ్వాన్ని అలంకరించి పవిత్రోదకాన్ని పైన జల్లి యాగాన్ని సూర్యుడిగా పూజించి అశ్వం చెవిలో పవిత్ర మంత్రాలు చదువుతారు. యాగాశ్వం కాళ్లవద్ద, కళ్ల చుట్టు తెల్లటి మచ్చలున్న నల్లకుక్కను సిద్రక కొయ్యతో కొట్టి చంపి దిష్టి తీస్తారు. దానిని గుర్రపు కాళ్ల మధ్య నుంచి లాగి నదివద్దకు లాక్కుపోతారు. గుర్రంపై చల్లిన నీళ్లు దక్షిణానికి పారేట్లు జాగ్రత్త పడతారు.

# 41. యజ్ఞాశ్వం బయల్దేరింది-

దివ్యాస్త్రవిదుడు, ధిషణాభవ్యుడు, శౌర్యోత్తరుడు, పార్థుడు అశ్వ రక్షణకు,
భీమసేన నకులులు రాష్ట్ర రక్షణకు, సహదేవుడు కుటుంబ నిర్వహణకు
నియమితులు కాగా, ధర్మరాజు అన్నాడు అర్జునుడితో- ఏ ఆటంకము
లేకుండా ఈ యజ్ఞాశ్వాన్ని నడిపించుట - సోదరా నీదే బాధ్యత!

చిన్నచిన్న పనులను చేయడానికి పరిజనులను నియోగించి
గాంధారీ ధృతరాష్ట్రుల అనుమతి తీసుకుని, కుంతీదేవి ఆశీస్సులతో,
ద్రౌపదిని ఒప్పించి, అశ్వమేధ యాగాన్ని చేయడానికి సిద్ధమైనాడు
ధర్మరాజు, తన సార్వభౌమత్వ ప్రకటనకు, పాపభీతి తొలిగేందుకు-

యజ్ఞాశ్వం సంచరిస్తుంది స్వేచ్ఛగా, నిర్భీతిగా, సరిహద్దులు దాటుతుంది.
ఆపినవాడితో యుద్ధం, ఆపనివాడు చెల్లిస్తాడు కప్పం శాంతితో.
అందుకుంటాడు ఆహ్వానం హస్తినాపురిలో అశ్వమేధ యజ్ఞానికి.
అన్ని అక్షౌహిణీల సైన్యం, వీరులూ చనిపోయాక యజ్ఞాశ్వాన్ని ఆపేవారెవరు?

వీరులు చనిపోయినా వీరకుమారులున్నారు కౌరవ పక్షానికి చెందినవారు.
శత్రుశేషమింకా ఉన్నది. అది అశ్వమేధయాగంతో నిశ్శేషమవుతుంది.
మంచి మాటలు విననివాళ్లు, మదమాత్సర్యాలున్నవాళ్లు ఆపుతారు గుర్రాన్ని.
నరుడు మంచివాడే కాని అతడి బాణాలు అగ్నికణాలు, మృత్యుకిరణాలు.

---

**సీ. అమ్మహీవల్లభుఁ డర్జునుఁ బిలిచి 'య । ధ్వరయుక్త మయిన యిత్తురగరత్న**
**మనఘ! సంరక్షణీయంబు నీ; కొరులకు । నిప్పని శక్యంబె? యెల్లభంగి**
**నిక్కార్యమునకు నీ వేఁగంగవలయు; నీ । యంచితాశ్వము చరియించుచుండ**
**నెడనెడ రాజుల కేనశ్వమేధ దీ । క్షితుఁడనై యుండుట సెప్పు; ముచిత**

**తే. కరణనియతి నిరోధంబు గాకయుండ । నడపు' మని చెప్పి, భీముని నకులు రాష్ట్ర**
**గోపనమునకు, సహదేవుఁ గులకుటుంబ । సమితిరక్షకుఁ బనిచె నుత్సాహ మెసఁగ. (అశ్వమేధ. 3-224)**

**- హయశ్చ హయమేధార్థం స్వయం స బ్రహ్మవాదినా**
**ఉత్సృష్టః శాస్త్ర విధినా వ్యాసే నామిత తేజసా (సం.అశ్వ. 73-3)**

---

యాగాశ్వం ఈశాన్య దిక్కుగా వెళ్తుంది యజ్ఞస్థలం నుండి. దానినెవరూ అదిలించరు. దానికి కాపలాగా ఒక మహావీరుడి నాయకత్వాన అనేకమంది వీరులు అనుసరిస్తారు. ఆరునెలలు లేక ఏడాది పాటు ఆ గుర్రం వెళ్లినంత దూరం వెళ్తుంది. ఎవరైనా యాగాశ్వాన్ని ఆపితే వారితో యుద్ధం చేసి విడిపించుకోవాల్సిన బాధ్యత రక్షణ కోసం నియమించబడిన వీరుడిది. యాగాశ్వాన్ని వృషణ విచ్ఛేదనం చేయబడిన మరో వంద గుర్రాల గుంపు, నాలుగు వందల మంది వీరులు, అనుసరిస్తుంటారు. యాగాశ్వం ఏ గుర్రంతో నన్న సంభోగిస్తే వాయుదేవుడికి పాలు సమర్పించి దోషం పోగొడతారు.

# ✧ 14. అశ్వమేధ పర్వము - చతుర్థాశ్వాసము ✧

## 42. త్రిగర్త దేశంలో మొదటి యుద్ధం

చైత్రమాస కలిత పౌర్ణమాసి నాడు మంగళకరమైన ముహూర్తంలో
పట్టుబట్టయు, కృష్ణజింక చర్మధారియై యజ్ఞదండము చేత ధరించి
ఋత్విక్కులు వెంటరాగా యజ్ఞాశ్వాన్ని పూజించి విడిచిపెట్టినాడు ధర్మజుడు.
అర్జునుడు అశ్వరక్షకుడిగా పదకొండు నెలలది తిరుగుతుంది దేశమంతా.

పన్నెండో నెలలో ఫాల్గున మాసంలో రావిచెట్ల తోపులో ఉన్న అశ్వాన్ని తెచ్చి
అమావాస్య నాడు సార్వభౌముడు యజ్ఞశాలలో ప్రవేశించి, రెండో సంవత్సరం
మొదటి పాడ్యమి మొదలు అశ్వమేధ యాగం ప్రారంభించి ఏడురోజులు
హోమం చేసి పూర్ణాహుతి కావించి, సోమలతకు పూజలు జరిపి సోమపానం చేస్తాడు.

ధర్మరాజు వద్ద వీడ్కోలు పొంది అర్జునుడు గాండీవాన్ని, అక్షయ తూణీరాన్ని
ధరించి తేజోవిశేషంబు విరాజితముగ యజ్ఞాశ్వాన్ని అనుసరించగా
ధరిత్రి ప్రతిధ్వనించింది ప్రజల ఆశీస్సులు విజయ నాదాల జలధి ఘోషతో
ధనంజయుడు తనవెంట యాజ్ఞవల్క్య శిష్యులు రాగా ప్రవేశించాడు

త్రిగర్త దేశంలో యజ్ఞాశ్వం వెనకనే- అతడి మనసులో ప్రతిధ్వనిస్తున్నాయి
ధర్మరాజు మాటలు- భారతయుద్ధంలో రాజులందరూ నశించారు, నీవు
తొందరపడి వారి కొడుకులను చంపవద్దు, దయతో ప్రవర్తించు-
అర్జునుడు ఎంతో వినయంగా బ్రతిమలాడినాడు త్రిగర్త వీరులను-

---

**సీ.** **ఉద్ధతులై త్రిగర్తోర్వరాపతి పుత్త్ర । పౌత్త్రు లయ్యశ్వంబుఁ బట్టువారు**
**గాఁ బూని తేరులు గదురయంబునఁ దోలి । కొని యద్దముగ వచ్చు కోలుతలకు**
**నలుగక, నరుఁ డన్నయానతిఁ దలఁచి యా । రాజ కుమార వర్గంబుతోడ**
**'ధర్మజు నశ్వమేధంబున కపకార । మాచరించుట పాప; మదియుఁ గాక**

**తే.** **యేము మీరును బాంధవ మెసక మెసఁగ । నడచు టొప్పదె; పగ యే?' లనంగ వారు**
**సూర్యవర్మ నామకుఁ డగు శూరతమ కు । మారుఁ డగ్రణి గాఁగ నుదారలీల. (అశ్వమేధ. 4-5)**

**-** **తమూచుః పురుష వ్యాఘ్ర సంశప్తక నిషూదనమ్**
**తవాస్మ కింకరాః సర్వే సర్వే వై వశ గాస్తవ (సం.అశ్వ. 74-32)**

---

యాగాశ్వం గాయపడితే పూషుడికి పూజలు చేస్తారు. గాయపడకుండా జబ్బుపడితే అగ్నిని అర్చిస్తారు. యాగాశ్వానికి నేత్ర వ్యాధివస్తే సూర్యుడికి, నీటిలో మునిగితే వరుణుడికి మొక్కుతారు. గుర్రం పోయినా, చనిపోయినా దేవతలకు బలులు సమర్పించి ఇంకో గుర్రాన్ని యాగాశ్వంగా నడిపిస్తారు. యజ్ఞం చేసే యజమాని గృహంలో ప్రతిరోజూ సవిత్రేష్టి, ధృతి హోమాలు చేస్తూనే ఉంటారు. తొలిరోజున 4,000 గోవులు, 400 బంగరు నాణాలు యజమాని ఋత్విజులకు దానమిస్తాడు.

# 43. ప్రాగ్జ్యోతిషపురంలో రెండో యుద్ధం

సూర్యవర్మ నాయకత్వాన త్రిగర్త వీరులు అడ్డుకున్నారు యజ్ఞాశ్వాన్ని.
వీరులకు రుచించవు వినయపూర్వకమైన మాటలు, అది వారి దేశం,
అర్జునుడి మీద పుంఖానుపుంఖాలుగా వేసాడు బాణాలు సూర్యవర్మ.
అర్ధచంద్ర బాణాలతో వాటిని ముక్కలు ముక్కలుగా చేసాడు సవ్యసాచి.

సూర్యవర్మ, కేతువర్మ, ధృతవర్మలు ఒకరి తరువాత ఒకరు వస్తూనే ఉన్నారు.
ధృతవర్మ వాడి బాణాలతో అర్జునుడి చేతిని కొట్టగా భూమిపై పడింది గాండీవం.
త్రిగర్త సైన్యం విజయనాదాలు చేస్తూ ఒక్కుమ్మడిగా దూసుకువచ్చారు.
కోపంతో కన్నులు ఎఱ్ఱబడగా అర్జునుడు గాండీవాన్ని వేగంగా అందుకుని

ఎన్నో పిడుగులు ఒక్కసారే పడుతున్నట్లు భూమి కనబడకుండా కప్పేసాడు
బాణాలతో, సర్వనాశనమైంది త్రిగర్తసేన, చచ్చినవాళ్లు చావగా
మిగిలినవారు వచ్చి అర్జునుడి శరణు వేడి విడిచిపెట్టారు యజ్ఞాశ్వాన్ని.
అశ్వం చేరుకున్నది ప్రాగ్జ్యోతిషపురం, భగదత్తుడి నగరమది.

భగదత్తుడి కుమారుడు వజ్రదత్తుడు బాల్యచాపల్యంతో ఆపాడు అశ్వాన్ని
అర్జునుడి బాణపు దెబ్బలకు హడిలి వెంటనే నగరంలోకి పోయి
ఏనుగునెక్కి వచ్చాడు ఈసారి; నాలుగు రోజులు అద్భుత పోరాటం చేసినాడు.
ఆ సాయంకాలం అర్జునుడు వజ్రం లాంటి బాణాలతో కూల్చినాడు ఆ యుద్ధపుటేనుగును.

---

**సీ. భగదత్తతనయుండు బాహుగర్వంబున । బాల్యసిద్ధం బగు లౌల్యమునను**
**బురి నిర్గమించి యత్తురగంబు వెలిపించి । కొని పోవఁ గాంచి యర్జునుఁడు గాండి**
**వము సజ్యముగఁ జేసి వాలమ్ము లొక్కట । నక్కుమారునిమీఁదఁ బెక్కు గురియ**
**నవ్వజ్రదత్తుండు నొవ్వు దన్కిన దాని । నచ్చుట దిగఁ ద్రావి చొచ్చెఁ బురము**

**తే. సత్వరంబుగ నటు సొచ్చి సామజంబుఁ । బన్నఁగాఁ బంచి వెస నెక్కిబలముఁ జలము**
**వీఁకయును నొప్ప నన్నరుఁ దాఁకి శాత । ఘన శరంబులు పరఁగించెఁ గౌరవేంద్ర! (అశ్వమేధ. 4-21)**

**- సర్వమే తన్నర వ్యాఘ్ర భవత్సేతావతా కృపమ్**
**యోధాశ్చాపి న హంతవ్యాః ధనంజయ రణే త్వయా (సం.అశ్వ. 76-22)**

---

సాయంకాలం వేళ ధృతి హోమమయినాక పరిప్లావన కార్యక్రమంలో వీరగాథలు చెబుతారు సూతులు, పండితులు, గాయకులు. పది గాథలను 36 సార్లు 360 రోజుల్లో వ్యాఖ్యానిస్తూ శ్రోతలకు వినిపిస్తారు. శ్రోతలను ఉపద్రష్టలుగా గౌరవిస్తారు.

యాగాశ్వం తిరిగి వచ్చాక నెలరోజుల పాటు వేడుకలు, హోమాలు జరుగుతాయి. పన్నెండు రోజుల దీక్ష మొదలవుతుంది. రాజు కృష్ణజింక చర్మం ధరించి, కృష్ణజింక చర్మంపై కూర్చుని ఉపవాస దీక్షలో ఉంటాడు. రాత్రుళ్లు అక్కడే నిద్రిస్తాడు నేలపై. 25వ రోజున అగ్నిస్తోమం, సోమరస అర్పణ, పాలు, అన్నం, ప్రసాదాలు అర్పిస్తారు.

# 44. సింధుదేశంలో మూడవ యుద్ధం

వజ్రదత్తుడి అహంకారం నశించింది, అర్జునుడన్నాడు– కుమారా, కోపమేల
అద్భుతమైన వీరుడివి, ధర్మరాజు రాకుమారులకు హాని చేయవద్దన్నాడు.
రాబోయే చైత్రమాసంలో పూర్ణిమ నాటికి అతిథిగా రమ్మ హస్తినకు–
అని పలుకగా వజ్రదత్తుడు వినయంగా నమస్కరించినాడు విజయునికి.

యజ్ఞాశ్వం ఇప్పుడు చేరుకున్నది సింధు దేశాన్ని, అక్కడి వీరులు అనేకులు
అర్జునుడిపై పరాక్రమించి అస్త్ర శస్త్రాలు ప్రయోగించ ఎర్రబడింది
సూర్యబింబం, అలిసిపోయాడు అర్జునుడు అనేకమందితో యుద్ధం చేసి.
ఓ క్షణం గాండీవం మరల నేలపై పడింది, వెంటనే తేరుకున్నాడు కిరీటి.

ఇక సహించలేదు భీభత్సుడు ఇనుప బాణాలు వేసి సింధు వీరులను
చావగొట్టినాడు, యుద్ధభూమి నిండిపోయి పీనుగుల పెంటగా మారింది.
అయినా తగ్గక వచ్చిన వీరులందరినీ చంపుతుంటే వచ్చింది దుశ్శల
–'అన్నా, ఈ బాలుడు నీ మేనల్లుని కొడుకు, నీవు ఇటు వచ్చావని తెలిసి

అతడు ప్రాణభయంతో మరణించాడు, ఇతడినైనా రక్షించుము' –అని
కన్నీరు పెట్టగా, అర్జునుడామెను ఊరడించి– సోదరీ, మన దురదృష్టం
పంతాలకు పోయి అందరమూ నష్టపోయాము. నీ అన్నను నేనున్నాను.
నీకే భయమూ లేదు, అశ్వమేధ యాగానికి నా మనవడిని తీసుకునిరా' అన్నాడు.

**సీ.** **వచ్చి కన్నీళులు వాదనంబుపై వెల్లి । గొన రోదనంబు చేసిన నతండు**
**దయ నిల నిడియెఁ గోదండ మప్పడఁతుక । పౌత్త్రునిఁ జూపి 'యిబ్బాలుఁ గావు**
**మితఁడు మీ యల్లుని సుతుఁ; దన్న నప్పార్థుఁ । డిప్పుడు నా యల్లుఁ డెచట నున్న**
**వాఁ?'డని యడిగిన వనిత వెక్కుచు 'నతం । డాత్మీయ జనకుఁ దుగ్రాహవమున**

**తే.** **ననఘ! నీచేతఁ దెగుట దా విని నితాంత । శోకమగ్నుఁడై యుండి నీ రాక బిట్టు**
**వినుట బెగ్గిలి ప్రాణముల్ విడిచె 'ననుచు । నెలుఁగు గడలుకొనంగఁ బెల్లేడ్చె నధిప! (అశ్వమేధ. 4–45)**

**–** **ప్రాప్తో భీభత్సు రిత్యేవ నామ శ్రుత్వై తేన ఘ**
**విషాదార్తః పపాతోర్వ్యాం మమార చ మమాత్మజః (సం.అశ్వ. 78–31)**

---

అగ్నికి మేకను బలిస్తారు. యాగం పరిసమాప్తి అయినాక రాజు, రాణి అవభృత స్నానం చేస్తారు. పశుబలి చేస్తారు (వంధ్యగోవు, ఇతర జంతువులు).

ఇరవై ఆరవ రోజున యాగాశ్వంతో పాటు మరో మూడు గుర్రాల్ని రథానికి కట్టి ఉంచుతారు. యాగాశ్వానికి నెయ్యితో, నీటితో స్నానం చేయిస్తారు– రాజుగారి పట్టమహిషి, వావాత (ప్రియరాణి), పరివృక్తి (రాజు వదిలేసిన పూర్వరాణి) ముగ్గురూ; గుర్రపు మెడకు 101, 109 ముత్యాలున్న బంగరు హారాల్ని అలంకరిస్తారు. కొమ్ములేని నల్లని మెడ ఉన్న మేకపోతును, గోమృగాన్ని యూపస్తంభాలకు కట్టి, 17 ఇతర జంతువులను తాళ్లతో గుర్రానికి కట్టి ఉంచుతారు.

# 45. మణిపూర పట్టణంలో నాలుగవ యుద్ధం

అర్జునుడు పినాకపాణిలా యజ్ఞాశ్వం వెంట వస్తుండగా అది చేరుకున్నది
మణిపూర పట్టణం, బభ్రువాహనుడు తన తండ్రి వచ్చాడన్న ఆనందంతో వచ్చి
కాళ్లు మొక్కినా అర్జునుడతడిని ఆదరించలేదు, పైపెచ్చు అన్నాడు-
'నీవేమి వీరుడివి? యజ్ఞాశ్వాన్ని ఆపాలి, యుద్ధం చెయ్యాలి, పోరా, పో!'

బభ్రువాహనుడి వద్దకు వచ్చి ఉలూచి అన్నది- 'కుమారా యుద్ధం చేయి'
హంస ధ్వజ రథంలో వీరోచితంగా వచ్చి అడ్డుకున్నాడు యజ్ఞాశ్వాన్ని బభ్రువాహనుడు-
నెమ్మదిగా మాటలతో మొదలైన యుద్ధం తీవ్రస్థాయికి చేరుకున్నది.
అద్భుతంగా యుద్ధం చేస్తున్న కుమారుడిని చూసి పొంగిపోయాడు తండ్రి.

అగ్ని బాణాలు, నారాచాలు, ములుగోలలు, అర్ధచంద్రాకార బాణాలు
అసంఖ్యాకంగా వెలువడ్తున్నాయి, ముక్కలవుతున్నాయి, నేల పడుతున్నాయి.
అర్జునుడిని నేలపై పడగొట్టి తానుకూడా మూర్ఛిల్లినాడు బభ్రువాహనుడు.
అయ్యో దేవుడా అని ఆర్తనాదాలు చేస్తూ వచ్చింది చిత్రాంగద శోకిస్తూ-

బభ్రువాహనుడు మూర్ఛనుంచి తేరుకుని నేలపై నిశ్చలంగా పడి ఉన్న
తన తండ్రి అర్జునుడిని చూసాడు, పక్కనే దుఃఖిస్తున్న తల్లిని చూసాడు.
-తండ్రీ! నన్ను రెచ్చగొట్టి మరీ యుద్ధం చేసావు, ప్రశంసించావు మరీమరీ.
యుద్ధపోరలు కనులకు కమ్మి వాడి బాణాలతో నిన్ను నేలకూల్చానా?

---

**సీ. 'నాథ! నీ వెప్పుడు నన్ను మన్నింతువు; । కనువిచ్చి చూడక యునికి దగునె;**
**హయమున కెవ్వరు నడ్డంబు రాకుండ । నాఁగితి వగ్రజు నధ్వరంబు**
**వమ్మయిపోకుండ; లె మ్మిత్తురంగంబు । వెనుకొన వలవదే యనఘ! నీకు'**
**నని యార్తిఁ బలవించి యహిపుత్త్రి దెసఁ జూచి । 'సుతుఁ డెట్టులుండినఁ బతికి నిమ్ము**

**తే. జీవ; మాంద్రురఁ బెక్కండ్రఁ జేసికొనుట । పురుషులకుఁ దప్పె; భార్య లిత్తెరువునందు**
**నడవరే; యోర్చి నీదుమనమున నింత । యెఱింగి కలిగింపు వరు; వేయు నేల తల్లి!' (అశ్వమేధ. 4-69)**

**- భర్తారం నిహతం దృష్ట్వా పుత్రంచ పతితం భువి**
**చిత్రాంగదా పరిత్రప్తా ప్రవివేశ రణాజిరే (సం.అశ్వ. 79-38)**

---

మగమేకను అగ్నికి బలి ఇచ్చి గుర్రపు ఛాతీకి కడతారు. ఆడగొర్రెను బలి ఇచ్చి సరస్వతికి అర్పణ చేసి గుర్రపు నోటి దగ్గర ఉంచుతారు. పొట్ట దగ్గర నల్లగా ఉన్న రెండు మేకపోతుల్ని అశ్విసీ దేవతలకు బలి ఇచ్చి యాగాశ్వం ముందు కాళ్ల వద్ద ఉంచుతారు. గుర్రం కాళ్లమధ్యన నల్ల మేకపోతును వధించి సోమ-పూషుల కర్పిస్తారు. ఓ నల్లమేకను సూర్యుడికి, తెల్ల మేకను యముడికి అర్పించి గుర్రానికి అటు ఇటు ఉంచుతారు. త్వష్టకు మరో రెండు మేకపోతులను, వాయువుకు తెల్లమేకను బలి యిచ్చి, వెనక కాళ్లవద్ద, తోకవద్ద ఉంచుతారు.

# 46. అర్జునుడిని బ్రతికించిన ఉలూచి

బభ్రువాహనుడు శోకిస్తూ అన్నాడు అందరూ వింటుండగా, తన తల్లి
చిత్రాంగద, నాగరాణి ఉలూచిలతో- అమ్మలారా! తండ్రిని చంపిన పాపం
నాకు చుట్టుకున్నది, నేనిపుడు ప్రాయోపవేశం చేస్తాను అనుమతి ఇవ్వండి-
నాగరాణి ఉలూచి అన్నది- నాయనా! నీ తండ్రి చనిపోతాడా!

అతడు కన్నకొడుకు పరాక్రమం చూడాలనుకున్నాడు, చూసి ఆనందించాడు-
అని పలికి నాగమణిని స్మరించి ప్రత్యక్షమైన ఆ సంజీవమణిని
బభ్రువాహనుడికిచ్చి అర్జునుడి హృదయస్థానాన ఉంచమన్నది.
అలా చేయగానే అర్జునుడు బ్రతికి లేచికూర్చుని నాలుగు దిక్కులా చూచాడు.

పక్కనే ఉన్న చిత్రాంగద, ఉలూచిలను చూసి ఆశ్చర్యపోయాడు
-'మీరెందుకు వచ్చారు రణభూమికి? దుఃఖం, సంతోషం కానవస్తున్నది
మీ ముఖాలలో!' -అని పలికిన అర్జునుడితో అన్నది నాగరాణి ఉలూచి
భారత యుద్ధంలో శిఖండిని ముందు పెట్టుకుని భీష్మవధ చేసినావు.

ఆ పాపం పోగొట్టడానికి ప్రాయశ్చిత్తంగా నేను ఇలా చేయాల్సి వచ్చింది.
నీవు భీష్ముని కూల్చినపుడు వసువులు, గంగాదేవి నిన్ను చంపాలనుకున్నారు.
నా తండ్రి నేను వారిని శరణువేడగా బభ్రువాహనుని బాణాలకు
అర్జునుడు నేలకూలితే పాపవిముక్తి జరుగుతుందన్నారు -అదీ సంగతి.

**సీ.** **విజయుండు చచ్చునే వేఁదురులార! యిం । ద్రునిచేత నైన; నీతనికి నొక్క**
**ప్రియము సేయంగఁ గోరియును నీ కొలఁది యా । రయు బుద్ధి నీతండు రణ మొనర్పఁ**
**దలఁచిన నివ్వీరుతలఁపు సిద్ధింపంగఁ । జేయుటకును నింత సేయవలసె**
**నాకుఁ; గావున మోహనంబగు మాయా ప్ర । యోగంబు నడపితి నుజ్జ్వలాత్మ!**

**తే.** **నరుఁడు నారాయణుఁడు; మహత్తరము సువ్వె । యితని తేజ; మెవ్వరికిని నెట్లు దాని**
**నార్పవచ్చు; మీ వగ పెల్లఁ దీర్ప నిపుడ । యుత్థితుం డగు నీ కౌరవోత్తముండు. (అశ్వమేధ. 4-82)**

**-** **తస్మిన్న్యస్తే మణౌ వీరః జిష్ణురుజ్జీవితః ప్రభుః**
**చిరసుప్త ఇవోత్తస్థౌ మృష్ట లోహిత లోచనః (సం.అశ్వ. 80-52)**

---

చూడి ఆవును ఇంద్రుడికి, పొట్టి ఆవును విష్ణువుకు ఇలా దాదాపు 609 జంతువులను బలి ఇచ్చాక యాగాశ్వానికి ఊపిరాడకుండా పట్టుకుని ప్రాణాలు వదిలేలా చేస్తారు. రాణులు దుఃఖించి చచ్చిన గుర్రం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. ఆ రాత్రి పట్టమహిషి గుర్రం పక్కనే శయనిస్తుంది.

మరుసటి రోజు ఉదయం వేదమంత్రాలు చదువుతారు అశ్వ పునరుజ్జీవానికై, శాస్త్ర ప్రకారం గుర్రాన్ని ముక్కలుగా కోసి వస, సోమరసాన్ని అగ్నిలో వేలుస్తారు. వధించబడిన గుర్రాన్ని, ఇతర జంతువుల మాంస ఖండాలను శాస్త్రోక్తంగా అగ్నిజ్వాలలో వేలుస్తారు. మూడవరోజు అతిరాత్రం.

# 47. రాజగృహంలో అయిదవ యుద్ధం

అర్జునుడన్నాడు ఉలూచితో- ఇరావంతుడిని కోల్పోయాము మనం, అయినా
నీవేది చేసినా నా ప్రతిష్ఠ పెరిగే పనే చేస్తావు, దేవీ, కృతజ్ఞుడిని.
రానున్న పవిత్ర చైత్రమాస పూర్ణిమ పుణ్యప్రదమైన అశ్వమేధ సమయం.
నీవు, చిత్రాంగద, బభ్రువాహనుడు బంధుమిత్ర సమేతంగా రావలెను హస్తినకు'

గొప్ప వీరుడైన తన కుమారుడిని ఆనందంతో కౌగిలించుకుని అర్జునుడు
పుత్రోత్సాహముతో బభ్రువాహనుడిని ఆశీర్వదించి అనుసరించాడు యజ్ఞాశ్వాన్ని.
రాజగృహం వద్ద అర్జునుడిని అడ్డుకున్నాడు జరాసంధుడి మనమడు మేఘసంధి.
ధర్మరాజు చెప్పిన మాటలను మేఘసంధికి చెప్పి యుద్ధం వద్దన్నాడు పార్థుడు.

'మాటలు లేవు నీతో' -అని పలికి బాలుడైనా వీరుడైన మేఘసంధి పౌరుషంతో
బాణవర్షం కురిపించాడు శ్వేతవాహనుడిపై ఆ సహదేవుని కుమారుడు-
అతడికి దెబ్బలు తగలకుండా అర్జునుడు మేఘసంధి సారధిని చంపి
అశ్వాలను, రథాన్ని కూల్చివేస్తే గదను చేబట్టి ఉరికాడు అర్జునుడిపై

వాడి బాణాలతో గదను ముక్కలు చేసేసరికి, ఒంటరివాడైన మేఘసంధి
భయపడి కూలబడినాడు. అర్జునుడతడిని లేవనెత్తి నీవు వీరుడివి
మనకు యుద్ధమేల! ఇప్పటికి జరిగిన నష్టం చాలదా? నా అతిధివిగా
వచ్చే చైత్రమాసంలో అశ్వమేధ యాగ సమయానికి హస్తినకు రమ్ము- అని ఆహ్వానించినాడు.

**ఉ. సారథిఁ గూల్చి యశ్వములఁ జంపి రథంబుఁ బగిల్చి కేతువుం**
**జీరి శరాసనంబుఁ బొడిసేసిన నమ్మగధుండు ధీరతో**
**దారగతిన్ సముజ్జ్వల గదా భ్రమణంబున బాహు వొప్ప న**
**వ్వీరవరేణ్యుపైఁ గవిసె విక్రమ మాకృతి దాల్చి పొల్చె నాన్. (అశ్వమేధ. 4-104)**

**- పర్యాప్తః క్షత్రధర్మో యం దర్శితః పుత్ర గమ్యతామ్**
**బహ్వో తత్సమరే కర్మ తవ బాలస్య పార్థివ (సం.అశ్వ. 82-23)**

---

మూడవ రోజున రాత్రి- అతిరాత్రం నాడు అందరూ సోమరసాన్ని సేవిస్తారు. 21 వంధ్య గోవుల్ని బలియిస్తారు. ఋత్విక్కులకు గొప్పగా దక్షిణలివ్వబడతాయి.

సముద్రగుప్తుడు (350-370 AD), కుమారగుప్తుడు (415-455) అశ్వమేధ యాగాలు చేసారు. నాణెములు ముద్రించారు ఆ వేడుకను పురస్కరించుకుని. ఈమధ్య కాలంలో జైపూర్ మహరాజా రెండవ జయసింగ్ 1741 సంవత్సరంలో అశ్వమేధయాగం చేసినాడు. 16-20, ఏప్రిల్ 1994 నాడు జంతువధ లేని సాత్విక అశ్వమేధ యాగం, యాగాశ్వంగా అశ్వపు విగ్రహంతో- పదిలక్షల మంది ప్రజల సమక్షంలో మధ్యప్రదేశ్, చిత్రకూటంలో గాయత్రి పరివార్ నిర్వహించింది. చార్వాకుడు, మధ్వాచార్యులు, అంబేద్కర్‌లు జంతువధను నిరసించారు. కలికాలంలో అశ్వమేధ యాగాన్ని చేయరాదనేది ఒక వాదన.

# 48. శకుని కుమారుడితో యుద్ధం

జరాసంధుడి మనమడు మేఘసంధిని సగౌరవంగా హస్తినకు ఆహ్వానించి
వంగ పుండ్ర మ్లేచ్ఛ దేశాల రాజులను జయించి చేది దేశానికి చేరుకున్నాడు.
శిశుపాలుడి కుమారుడు శరభుడు అర్జునుడితో యుద్ధం చేసి
ఓడిపోయి, ఆశ్రయించినాడు; టేంకణాధిపతి, కిరాతరాజులు ఓడిపోయారు.

కోసల, కాశ, దశార్ణ రాజులను గెలిచి నిషాదరాజ్యం చేరుకున్నాడు ఫల్గునుడు.
ఏకలవ్యుడి కుమారుడైన నిషాదరాజు ధనంజయుడి ధాటికి ఓడిపోయాడు.
దక్షిణ దిక్కుగా వెళ్లి పౌండ్ర, ఆంధ్ర, ద్రావిడ, కేరళ, కర్ణాట భూపతుల నోడించి
సౌరాష్ట్రలోని గోకర్ణం చేరి, ద్వారక దగ్గర యాదవులచే పూజింపబడి

పాంచాల దేశం మీదుగా చేరినాడు గాంధార రాజ్యం– శకుని కుమారుడు
పెద్ద బలంతో వచ్చి అర్జునుడి నెదుర్కొనగా అతడితో గొప్ప యుద్ధం చేసి
అతడిని ప్రశంసించి– రాజుల చంపవద్దని మా రాజానతి ఇచ్చాడు–
అని పలికినా వినక అర్జునుడిని తన బాణాలతో నొప్పించగా, నవ్వుతూ విజయుడు

వెడల్పు మొన గల బాణంతో శకుని కుమారుడి శిరస్త్రాణం ఎగరగొట్టినాడు.
తలచుకుంటే తల నరకగలిగినవాడు అర్జునుడు– అని పలికినా వినకుండా–
అతడు త్రుళ్లిపడగా భీభత్సుడీసారి అతడిపై భీకరంగా దాడి చేయగా
వచ్చి బ్రతిమలాడింది శకుని కుమారుడి తల్లి, అతడిని రక్షించాడు అర్జునుడు.

---

**ఉ. 'నీ విట వన్ని నాపయి ననింద్యపరాక్రమ! రాక చూచి మ**
**ద్భావము ఖేద మొందుటయు 'ధర్మజుపం పిది రాజకోటి నే**
**నే విధినైనc జంప' నని యెల్లజనంబు వినంగc జెప్పనే!**
**కావున నీ బలంబులన కాని నినుం దెగటార్ప కుండితిన్. (అశ్వమేధ. 4-125)**

**– గాంధారీం మాతరం స్మృత్వా ధృతరాష్ట్ర కృతేన చ**
**తేన జీవసి రాజంస్త్వం నిహతాస్త్వను గాస్తవ**

**మైనం భూః శామ్యతాం వైరం మాతే భూద్బుద్ధిరీ దృశీ**
**గచ్ఛే థా స్త్వం పరాం చైత్రీమ్ అశ్వమేధే నృపస్యనః (సం.అశ్వ. 84-23,24)**

---

**ఇతర నాగరికతలలో అశ్వమేధం :** ప్రాటొ ఇండొ యూరొపియన్ తెగలలో చనిపోయిన వీరుడితో పాటు అతడి గుర్రాన్ని, ఆయుధాలను, రథాన్ని పాతిపెట్టే ఆచారముండేది. కొన్ని నాగరికతలలో భార్యలను, సేవకులను కూడా ఖననం చేసేవారు. ఐర్లాండ్, సెల్టిక్ నాగరికతలలో బలి ఇచ్చే గుర్రంతో వివాహం చేసేవారు కన్యతోగాని, రాణితో గాని. రోమన్ల October Horse Sacrifice ప్రతి ఏడాది వైభవంగా జరిగేది. ప్రాచీన జర్మన్లు, ఆర్మేనియన్లు, ఇరానియన్లు, చైనీయులు, గ్రీకుల నాగరికతలో అశ్వమేధం నరమేధానికి ప్రత్యామ్నాయమై ఉండవచ్చునని పరిశోధకుల అభిప్రాయం.

# 49. హస్తిన చేరుకున్న అర్జునుడు

శకుని కుమారుడిని సమాధానపరచి ఫల్గునుడు వారికాహ్వానమందజేసి
తిరుగు ప్రయాణం మొదలెట్టినాడు అర్జునుడి హస్తినాపురానికి ఆనందంగా.
మాఘమాస పౌర్ణమాసి నాడు ధర్మరాజు సోదరులను సమావేశ పరచి
-చైత్రమాసం సమీపిస్తున్నది కనుక యాగానికి తగిన ఏర్పాట్లు చేయమన్నాడు.

భూమండలంలోని రాజులు తమ సైన్యాలతో, మునులు తమ శిష్యులతో వచ్చారు.
వచ్చినవారిని తానే స్వయంగా ఎదురేగి ఆహ్వానించి విడిది ఏర్పాట్లు
శయన, భోజన సదుపాయాలు కల్పించాడు - యజ్ఞశాల నిర్మాణాలు సాగుతున్నాయి.
అన్నరాసులు కొండలై, నేతి ప్రవాహాలు నదులైనాయి భోజన శాలల దగ్గర.

లక్షమంది భోజనం చేయగానే మోగే గంట మోగుతూనే ఉన్నది నిరంతరంగా.
ఎందరో రాజులు పనులలో పాల్గొన్నారు స్వచ్ఛందంగా, అరమరికలు లేకుండా.
శ్రీకృష్ణుడన్నాడు ధర్మరాజుతో- అర్జునుడు ద్వారక దాటి వెళ్లాడని.
ధర్మరాజన్నాడు- ఇన్ని కష్టాలు అర్జునుడికెందుకు వస్తున్నాయి, కారణం నేనా?

శ్రీకృష్ణుడన్నాడు- అర్జునుడి సర్వావయవాలు శుభలక్షణ సంపన్నములే.
ఆజానుబాహుడు కదా అతడి పిక్కలు ఒడ్డూ పొడవులను మించి ఉన్నాయి.
ఆ మాటలు విని ద్రౌపది ఆనందమయమైన చూపుతో తలవాల్చింది.
ఇంతలో దూత వచ్చి- అర్జునుడు హస్తిన సమీపించాడు- అన్నాడు ధర్మరాజుతో.

---

**చ. శరధిపరీత భూమిఁ గలసర్వజనంబును దోఁచె; నమ్మహా**
**ధ్వరమున భూపతుల్ మకుట పంక్తులు భూషణరాజిఁ జక్కఁగాఁ**
**బొరిఁబొరిఁ ద్రోచి కొంచు మదిఁ బొంపిరి వోయెడు వేడుకం బనుల్**
**వెరవులు లావులున్ మెఱయ వేయు విధంబులఁ జేయు టొప్పఁగన్. (అశ్వమేధ. 4-142)**

**తే. సర్వగాత్రంబులందును సవ్యసాచి కధిక శుభలక్షణంబుల యతిశయిల్లు**
**దనువు మాత్రకు నించుక ధరణినాథ యెక్కుడై యుండుఁజిరుదొడ లిదియ కొరత**

**క. అలజళ్లు దీని వలనం కలిగెడునో కాని తక్కు గలుగ దరిష్టం**
**బలఘు శుభలక్షణాన్విత విలసిత తనుడైన గాండివికి నియ్యెడలన్ (అశ్వమేధ. 4-154,155)**

---

**అశ్వమేధం చేసిన రాజులు:** భరత చక్రవర్తి నూరు అశ్వమేధాలు చేసాడు యమున ఒడ్డున; 300 సరస్వతి నది ఒడ్డున; 400 గంగానది ఒడ్డున; అవికాక వెయ్యి అశ్వమేధాలు, వంద రాజసూయ యాగాలు చేసాడని చెప్పబడింది. గుప్తులు, చాళుక్యులు అశ్వమేధ యాగాలు చేసారు, నాణెములు ముద్రించారు. పుష్యమిత్రుడు రెండు అశ్వమేధ యాగాలు చేసాడు.

అశ్వమేధ యాగం కేవలం ఓ ప్రతీక. అశ్వం సూర్యుడిగా, గోవులు, ఇతర పశువులు ఇతర దేవతలుగా పూజలందుకునే కార్యక్రమం అంతే కాని పశువధ జరగదు -అని ఆర్య సమాజంలో దయానంద సరస్వతి భావించాడు.

# 50. వచ్చినవాడు ఫల్గునుడు-

అదుగో యజ్ఞాశ్వము, అతడె అర్జునుడు, మత్స్యయంత్రము భేదించి
ద్రౌపదిని వివాహమాడినవాడు, ఇంద్రుడిని జయించి ఖాండవ వన
దహనమొనర్చినవాడు, శివుని మెప్పించి పాశుపతం పొందినవాడు
ఉత్తర గోగ్రహణంలో కౌరవులనోడించి గోవులను మళ్లించినవాడు

ప్రతిజ్ఞ చేసి ప్రొద్దు క్రుంకక మునుపె సైంధవుని సంహరించిన వీరుడు
అర్జున, ఫల్గున, పార్థ, కిరీటి, శ్వేతవాహన, భీభత్స, విజయ, జిష్ణుడు
సవ్యసాచి, ధనంజయుడు, అనే పది పేర్లున్న సార్థక నామధేయుడతడే.
ఇప్పుడు ధరణిలోనున్న రాజులను జయించి వస్తున్నాడు యజ్ఞాశ్వం వెంట!-

అని పొగుడుతున్న ప్రజల మాటలను వింటూ యజ్ఞశాలకు వచ్చాడు అర్జునుడు.
అతడికి ఎదురేగి ఆహ్వానించారు ధర్మజ భీమ నకుల సహదేవులు
బలదేవ కృష్ణులు, ధృతరాష్ట్రుడు, అందరికి నమస్కరించి పార్థుడు
గాంధారి, కుంతీదేవులను పరామర్శించి ఒడ్డుకు చేరిన ఈతగాడిలా విభవమొప్పగా-

అతడి వెంట వచ్చినారు చిత్రాంగద, ఉలూచి, బభ్రువాహనుడు
అందరూ ఆ వీరపుత్రుడిని ఆదరించి పలు ఆభరణాలతో సత్కరించినారు.
చిత్రాంగద ఉలూచిలు వెళ్లి గాంధారి, కుంతీదేవిలను దర్శించి, ఆశీస్సులంది
ద్రౌపదీ, సుభద్రలతో ప్రేమ సత్కారాలనంది ప్రియనెచ్చెలులైనారు.

---

సీ. **నృపు లోహటింప జంత్రపుమీను నేసి చే । కొనియెఁ బాంలుని కూఁతు నితఁడె!**
**సురసేనతోఁ బురందరుఁ గెల్చి భుజగర్వ । మేపార ఖాండవం బేర్చె నితఁడె!**
**యెక్కటి బవరాన నీశాను మెప్పించి । పాశుపతాస్త్రంబుఁ బడసె నితఁడె!**
**యొంటిమై భీష్మాది యోధుల కురుపతి । ధృతిఁ బాపి గోవులఁ దెచ్చె నితఁడె!**

తే. **ప్రతిన సేసి విషమ సమరమునఁ బ్రొద్దు । గ్రుంకనీ కాఁగి సైంధవుఁ గూల్చె నితఁడె!**
**యనుచు సందడిగాఁ గ్రమ్మి యఱ్ఱులెత్తి । చూచె జనలోక మాసవ్యసాచిఁ బ్రీతి. (అశ్వమేధ. 4-165)**

సీ. **బభ్రువాహనుఁడు వైభవ మొప్పఁ జిత్రాంగ । దయు నులూపి(చి)యుఁ బ్రమదంబుతోడఁ**
**దోడ రా ధర్మపుత్త్రుని మందిరమునకు । నరుగుదెంచుటయు, నక్కురువరేణ్యుఁ**
**దును దమ్ములును గృష్ణుఁడును బలభద్రాది । యాదవులును బ్రీతులై తదీయ**
**సందర్శనము నర్థసత్కార చరితార్థ । ముగఁ జేసి; రతఁడును దగిన విధుల**

తే. **నందఱకుఁ బ్రియ మొనరించి యాంబికేయు । నతని భార్యను గని నమస్కృతు లొనర్చి,**
**గొంతిఁ గాంచి యాయమయడుగులకు నెఱఁగి । పలుదెఱఁగు దీవనలును గౌఁగిలియుఁ బడసి. (అశ్వమేధ. 4-168)**

# 51. యజ్ఞవేదిక నిర్మాణం

వ్యాసుడన్నాడు ధర్మరాజుతో- అన్ని చింతలూ తొలిగే సమయం వచ్చింది.
మూడింతలు దక్షిణలిచ్చి మూడు యజ్ఞాలు చేసిన ఫలితాన్ని పొందుము.
దాయాదులను యుద్ధంలో సంహరించడం పాపమనే వ్యథ పుట్టింది నీ మనసులో
అటువంటివన్నీ యజ్ఞాంతస్నానం వలన తొలగి నీ మనసు నిర్మలమవుతుంది.

బృహస్పతితో సమానులైన ఋత్విజులు శాస్త్రోక్తంగా నడిపారు యాగాన్ని
మంత్రపఠన దోషాలు లేకుండా, హోమ ద్రవ్యాలను వేల్చడం క్రమపద్ధతి మీరకుండా
సావధానులై ప్రవర్గ్యమనే యజ్ఞాంగాన్ని పూర్తిచేసి, సోమరసాన్ని పిండి
సవనకర్మం చేసి యజ్ఞవిధులను సంతృప్తికరంగా చేసారు, శ్రీకృష్ణుని సన్నుతించారు.

భీముడు యజ్ఞానికి వచ్చిన వారందరికీ భూరి దక్షిణలనిచ్చినాడు.
-తినండి, ధరించండి, కోరిన వస్తువులు తీసుకోండి, అడగండి-
అంటూనే ఉన్నాడు; యజ్ఞశాలలో ఎక్కడ చూసినా వేదాంగవేత్తలే
నృత్యగానాలు, బ్రాహ్మణ దీవెనలతో షోడశ మహరాజుల యజ్ఞాలను తలపించగా

ఋత్విజులు నిర్మించారు యజ్ఞవేదిని బంగరు ఇటుకలతో నాలుగు వరుసలుగా
పదమూడు మూరల పొడవు, గ్రద్ద ఆకారం; యూప ప్రతిష్ఠ చేసారు.
ఇరవై యొకటి  యూపాలు, చంద్రకొయ్యలతో ఆరు, మారేడు ఆరు
మోదుగు కర్రలు ఆరు, దేవదారువి రెండు, విరివి చెట్టుతో చేసినది ఒకటి.

---

**సీ.** **కనుఁగొను కౌతుకంబునఁ గూడి చనుదెంచి । దివ్యమునీంద్రు లతిప్రియమున**
**నభినందనము సేయ నఖిల గంధర్వులు । నానందనము లగు గానములను**
**నప్సరః స్త్రీలు హృద్యము లైన నృత్య వి । శేషంబులను నుల్లసిల్లుచుండ**
**సిద్ధ విప్రజనంబు సేసలు చల్లుచు । బహువిధాశీర్వాద పరతఁ బరఁగ**

**తే.** **నాద్యులై పేరు గలుగు పదార్వు రవని । వరుల యాగంబులకు సరివచ్చు మిగులుఁ**
**గాని యిది వజ్రపడ దనఁగా వెలుంగు । ధర్మతనయుని యశ్వమేధము నరేంద్ర! (అశ్వమేధ. 4-179)**

**క.** **నలుగాలివానిఁ బక్షుల, । జలచరముల, విధియుతముగ సంయోజింపం**
**బొలిచెం బశువులు మున్నూ । ఱలఘు యశోమహిత! యమ్మహాయజ్ఞమునన్. (అశ్వమేధ. 4-181)**

**క.** **వరయూప సుయోజిత మగు । తురంగమము చుట్టుఁ బశుతతుల నిల్పిన సుం**
**దర భావము దక్ష మఖ । స్ఫురణం బిట్టిదని చూపుఁబోలిక మెఱసెన్. (అశ్వమేధ. 4-182)**

**-** **యూపేషు నియతా చాసీత్ పశూనాం త్రిశతీ తథా**
**అశ్వరత్నోత్తరా యజ్ఞే కౌంతేయస్య మహాత్మ నః (సం.అశ్వ. 88-35)**

# 52. కోటి కోట్ల టంకాలిచ్చి రాజ్యాన్ని కొనుక్కున్న ధర్మరాజు

అలంకారార్థం అనేక స్వర్ణ యూపాలు నిలిపారు శాస్త్ర ప్రకారంగా, చక్కగా
యూపాలకు కట్టినారు చతుష్పాద జంతువులను, పక్షులను, చేపలను
ఆ విధంగా బంధించిన ప్రాణుల సంఖ్య మూడు వందలు; అప్పుడు తెచ్చారు
యజ్ఞాశ్వాన్ని- ఉత్తమ యూపానికి దానిని కట్టి చుట్టూ నిలిపారు పశు సమూహాన్ని.

యజ్ఞశాల శోభాయమానంగా ఉన్నది ఋత్విజుల బృందంతో, వారికి
వన్నె తెచ్చేట్లుగా వ్యాసుని శిష్యుల సమూహం ఉన్నది అత్యంత మనోజ్ఞంగా
బలికి తెచ్చిన జంతువులను వధించి వండినారు ఋత్విజులు శాస్త్రోక్తంగా
పట్టపురాణి ద్రౌపదీదేవి యజ్ఞవేదిక దగ్గరనే ఉన్నది హోమవిధులు చేస్తూ

యజ్ఞాశ్వపు వసను వేల్చి ఆ గంధాన్ని అందరూ పీల్చి ఆనందించారు.
వ్యాసుడు ఆశీర్వాదమివ్వగా సకలలోక శ్రేయస్సుకై ధర్మరాజు ప్రార్థించాడు.
వేయికోట్ల టంకాలు దక్షిణగా సదస్యులకిచ్చి కురువంశాగ్రణి ధర్మజుడు
సమస్త భూమండలాన్ని ధారపోసాడు బ్రహ్మజ్ఞాని వేదవ్యాస మహర్షికి.

'నీవు మాకు భూమినిచ్చావు, మాకు బంగారాన్నిచ్చి భూమిని తీసుకో'-
అన్నాడు వ్యాసమహర్షి - అప్పుడు ధర్మజుడు కోటి కోట్ల టంకాలు కుప్పపోసి
ఆ అసమాన ధనరాశిని వేదవ్యాసునికి సమర్పించగా, అతడు పంచిపెట్టినాడు;
ఋత్విజుల బృందానికి; అంతేకాక యజ్ఞవాటికను సమస్తం వారికిచ్చినాడు ధర్మజుడు.

---

**తే.** కోటి కోటులు మాడలు కుప్పవోసి । ధరణి వెల యని చెప్పి యప్పరమసంయ
మాధిపతికి సమర్పించె; నతఁడు ఋత్వి । గావలికిఁ బంచిపెట్టె నయ్యతులధనము. (అశ్వమేధ. 4-197)

**తే.** అతుల కనకమయములైన యజ్ఞవాట । వేదికా యూప తోరణ వివిధ భాండ
దండ శయ్యాసనాదులఁ ధరణినాథుఁ । డొసఁగె విప్రచయంబుల కుల్ల మలర. (అశ్వమేధ. 4-199)

**క.** ఇమ్మెయి సకలజనులు హే । మమ్మునఁ బరితృప్తులై యమంద మ్మగు మో
దమ్మునఁ దేలుచు నిజవా । సమ్ములకుం జని రజాతశత్రుఁ బొగడుచున్. (అశ్వమేధ. 4-201)

**క.** రెండవ మరుత్తుఁడై య । ప్పాండవముఖ్యుండు చేయు పరమ వితరణం
బొండొకయెడఁ గల్గునె యె । న్నండును జూడ విన సజ్జనస్తుతచరితా! (అశ్వమేధ. 4-202)

**క.** తనయంశ మైన కనకము । విను కుంతీదేవి కిచ్చె వేదవ్యాసుం;
డనఘా! యది యంతయు న । వ్వినుతచరిత ధర్మకృతుల వినియోగించెన్. (అశ్వమేధ. 4-203)

**తే.** సకల బాంధవ భూపతి సంయుతముగ । నా నరేశ్వరుఁ డవభృథస్నాన పూత
గాత్రుఁడై చిత్తగత సర్వ కల్మషములఁ । బాసి నిర్జితస్వర్గత్వభాసి యయ్యె. (అశ్వమేధ. 4-204)

# 53. దాన ధర్మములు - కానుకలు

బంగారంతో చేసిన యజ్ఞవేదిక, యజ్ఞశాల భాగాలు, యూపాలు, పాత్రలు
బహిర్ద్వారాలు, దండములు, శయ్యలు, ఆసనాలు బ్రాహ్మణులకిచ్చాడు.
క్షత్రియ, వైశ్య, శూద్రులకు, ఇతర జాతులవారికి, విదేశీయులకు
కోకొల్లలుగా ఇచ్చి రెండవ మరుత్తుడిగా పేరు పొందినాడు ధర్మజుడు.

వేదవ్యాసుడు తనవంతు బంగారాన్ని కుంతీదేవికిచ్చినాడు, ఆమె దానిని
వినియోగించింది ధర్మకార్యాలకు; అందరూ సంతృప్తి చెందేలా
దానధర్మాలు చేసి, సంతృప్తిగా యాగం పూర్తిచేసి ధర్మరాజు,
అవబృధ స్నానం చేసి తొలగించుకున్నాడు మనసులోని సర్వ దోషాలు.

పవిత్రుడై, ప్రకాశవంతుడై ఒప్పుతున్న ధర్మరాజు అత్యంత భక్తి శ్రద్ధలతో
వ్యాసుడి పాదాలకు తన నొసలు తాకేటట్లుగా సాష్టాంగ నమస్కారం చేసి
కులపతిని అనేక విధాలుగా ప్రస్తుతించ అతడు సంప్రీతుడై
ధర్మరాజును ఆశీర్వదించి అదృశ్యుడైనాడు తన శిష్యగణంతో కలిసి.

యజ్ఞానికి అతిధులుగా వచ్చిన సమస్త రాజులను విశేషంగా సత్కరించి
మణులు, నగలు, ఏనుగులు, గుర్రాలు, వేశ్యాబృందాలను కానుకలుగా ఇచ్చాడు.
అందరితోనూ విశేషంగా ఆదరింపబడిన బభ్రువాహనుడు తండ్రి వద్ద
ఉలూచి, చిత్రాంగదల నుంచి తాను వెళ్లినాడు మణిపుర నగరానికి.

---

తే. క్రతువుఁ జూడ నేతెంచిన రాజవరుల । కందఱకు మణిభూషణ హస్తి వాజి
వారకాంతాచయముల నవ్వసుమతీశుఁ । డొసఁగె ధనదుని కైవడి నెసక మెసఁగ. (అశ్వమేధ. 4-207)

ఆ. బభ్రువాహనునకుఁ బరమ విశేషంబు । మెఱయ గారవించి మేలివస్తు
కోటు లొసఁగి ప్రీతిఁ గూరిన మనముతో । నతనిఁ దత్పురమున కరుగఁ బనిచె. (అశ్వమేధ. 4-208)

తే. మున్న చనుదెంచి ప్రీతిమై నున్న యట్టి । దుశ్శలకుఁ బెంపుఁ గలుగఁ దత్పుత్త్ర పుత్త్రు
సింధుదేశంబునకు నభిషిక్తుఁ జేసె । దోహలమున నజాతశత్రుఁడు నరేంద్ర! (అశ్వమేధ. 4-210)

క. తమ తమ దేశంబుల భూ । రమణుల నెల్లను విభక్తరాజ్యులు గా నె
య్యము నెఱయ నిలిపెఁ బాండు । క్షమారమణు పెద్దకొడుకు గౌరవముఖ్యా! (అశ్వమేధ. 4-211)

ఆ. 'అనఘ! మత్పితామహుని యశ్వమేధ యా । గంబు సమయమునఁ గరంబు విస్మ
యంబుఁ జేయఁ జాలునట్టిది యే మేనిఁ । గలిగెనేని వినఁగ వలతుఁ జెపుమ!' (అశ్వమేధ. 4-213)

\- సకృదుత్సృజ్య తన్నాదం త్రాసయానో మృగ ద్విజాన్
మానుషం వచనం ప్రాహ ధృష్టో బిలశయో మహాన్ (సం.అశ్వ. 90-6)

# 54. ముంగిస ఆక్షేపణ-

తమ సోదరి దుశ్శలకు ఉన్నత స్థితినిచ్చి ఆమె మనమడిని సింధుదేశానికి
పట్టాభిషిక్తుడిని చేసారు; రాకుమారులందరికీ ఎవరికి దక్కాల్సిన
రాజ్యాలను వారికిచ్చి అందరి మన్ననలను పొందినాడు ధర్మజ సార్వభౌముడు.
బలరామకృష్ణ సాత్యకి మొదలైన యాదవ ప్రముఖులను సత్కరించాడు ఘనంగా.

ఆ యాగాన్ని చూసిన ముంగిస ఒకటి అక్కడున్న బ్రాహ్మణులతో అన్నది–
సక్తుప్రస్థుడి ధర్మంతో పోలిస్తే వీసమంత చెల్లదీ అశ్వమేధ యజ్ఞం!
కురుక్షేత్రంలో ఓ బ్రాహ్మణుడు కోపతాపాలు లేనివాడు, తపస్సు
అతడి సంపద, అతడూ అతడి భార్య కొడుకు కోడలు అతడికి సాయం.

ఒక ఏడాది వానలు కురవక పంటలు పండక నివ్వరిధాన్యం ఏరుకుని
తినాల్సి వచ్చింది. ఒకరోజున ఏరితెచ్చిన తృణధాన్యాలతో నాలుగు
మానికల పేలపిండిని దంచి పంచుకున్నారు తలా ఒక మానెడు.
తినబోయేంతలో అతిథి రాగా అతడికి వడ్డించాడు తనవంతు పిండి.

అతిథి ఆకలి తీరకపోతే అతడి భార్య, కొడుకు, కోడలు తమవంతు
తెచ్చిచ్చారు అతిథికి; అతిథి సంతోషించి తాను యమధర్మరాజునని పలికి
వారిని బొందితో స్వర్గానికి తీసుకుని వెళ్లాడు – ఆ సమయాన కొంత పేలపిండి
నీళ్లు నాపై పడి నా తల, శరీరం సగభాగం బంగారమయ్యాయి –అన్నది ముంగిస

---

**సీ.** ఒక్కబిలంబుననుండి వెల్వడి యొక్క । నకులంబు విప్రజనంబు నడుమ
నిలిచి 'సక్తుప్రస్థు నలఘు ధర్మంబు నే । మియుఁ బోల దీ యశ్వమేధ' మనిన
నవ్విప్రు లతివిస్మయంబంది యమ్ముంగిఁ । గనుఁగొని 'మంత్రవర్తనముఁ దంత్ర
గమనికయును వివిధములైన దాన వి । ధులు బహుళ త్యాగములును లోక

**తే.** సంస్తుతము లయ్యె; భక్తియు శ్రద్ధయును బ్రీ । యంబు వినయంబు సురముని హర్ష మావ
హిల్లఁ జేసె; నీ వేమిట నిమ్మహాధ్వ । రంబుఁ గీ డంటి; చెప్పుమ! ప్రస్ఫుటముగ!' (అశ్వమేధ. 4-218)

**సీ.** 'వినుఁడు ధర్మక్షేత్ర మన రూఢమైన కు । రుక్షేత్రమునయందు రోషకామ
విరహితుం డొక మహాద్విజుఁ డుంఛవృత్తిమై । నుండు; భార్యయుఁ దనయుండు నతని
పత్నియు సహచరభావంబు నొంది వ । ర్తింతు; రట్టులు తప శ్రీ వెలుంగ
నున్నెడఁ బులుపంట లన్నియు నత్యంత । వికలంబుగా ననావృష్టిదోష

**తే.** మావహిల్లిన నతని కాహార మొనరఁ । జేసికొనుట దుర్ఘటమయి చెల్లుచుండఁ
దారు నలువురుఁ జని తృణధాన్య మల్ప । మేతికొనివత్తు; రాఁకలి దీఱకుండు. (అశ్వమేధ. 4-220)

# 55. ఎవరా ముంగిస?

సక్రుప్రస్థుడు అతడి కుటుంబం ఆకలితో మాడుతున్నా తమ దగ్గర ఉన్నదంతా
అతిధికి పెట్టి ప్రాణం కాపాడినారు నిరాపేక్షతో. ముంగిస దృష్టిలో
హింసాయుతమైన అశ్వమేధ యాగంకన్నా అహింసతో కూడిన యజ్ఞం
గొప్పది, అయినా లోక క్షేమం కొరకు చేసే యజ్ఞంలో అనుమతించబడింది హింస.

ఇంద్రుడు మునుల మధ్య సంవాదం జరుగగా ఉపరిచరవసువు
సమర్ధించినాడు ఇంద్రుడి వాదాన్ని, యజ్ఞంలో జంతువధ చేయవచ్చుని;
అందువల్లనే అతడికి అథోగతి కలిగింది హింసను సమర్ధించగా.
అగస్త్యుడొకసారి పన్నెండేళ్ల యజ్ఞం చేసాడు ఎంతో గొప్పగా, అయినా,

ఇంద్రుడు వర్షాలు కురిపించలేదు, మరి అన్నదానమెలా, అనుకున్నారు
ఋత్విజులు; అగస్త్యుడన్నాడు- తపోబలంతో యజ్ఞ ద్రవాలు తెస్తాను.
లేదా ఉత్తర కురు భూముల్లో పండిన ధాన్యాన్ని ఇక్కడకు రప్పిస్తాను
మంచి విత్తనాలతో నేను యజ్ఞం చేస్తే లోకం అనావృష్టికి గురవుతుందా?-

అని కోపించేసరికి వర్షాలు కురిసాయి, ఇంద్రుడు భయపడుతూ వచ్చాడు.
బృహస్పతిని ముందుంచుకుని; సమస్య తొలిగింది, సంతోషించారందరూ.
ఇంతకీ ఆ ముంగిస ఎవరో కాదు పితృదేవతలచే శపించబడిన ధర్ముడు-
ధర్మాన్ని అధర్మంగా నిరూపిస్తే అతడికి అవుతుంది శాపవిముక్తి!-

---

ఉ. 'న్యాయము గల్గి యధ్వరమునందు విఘాతము పుట్టకుండఁ దాఁ
దోయదకోటిఁ బన్చి హరి తుష్టిగ వృష్టి యొనర్పకున్న నే
నా యమరేంద్రతం గొని మహాద్భుత వృత్తి జగంబుఁ బ్రోచెదన్;
మీయెదఁ జింత దక్కుఁడు సమిద్ధతపఃపరులార! నా దెసన్. (అశ్వమేధ. 4-263)

మ. అని సల్లాపము సేయుచుండఁగ ననేకాంభోదజాలంబులన్
బనిచెం బెల్లుగ వర్షముల్ గురియఁగాఁ బర్జన్యుఁ డా ప్రొద్దు; తా
నును నాచార్యుఁ బురస్కరించికొని నన్నుం గావవే యంచు న
మ్మునిశార్దూలునిఁ గానవచ్చె వినయంబున్ భక్తియుం దోఁపఁగన్. (అశ్వమేధ. 4-269)

ఉ. వచ్చిన గారవించి, యనవద్యపు టర్చన లిచ్చి సంయముల్
మెచ్చుఁగ శాంతసద్వచనలీలఁ బ్రమోద మొనర్చి యాతనిం
బుచ్చె సురేజ్యయుక్తముగఁ బోఁడిగఁ గ్రమ్మఱ వేల్పువీటి కా
సచ్చరితుండు; లోకమును సంతస మందె; వెలింగె జన్నమున్. (అశ్వమేధ. 4-270)

# 56. ఇంతకీ పాలు పారబోసిందెవరు?

నకులం అంటే ముంగిస, ఆక్షేపించింది అంతగొప్ప అశ్వమేధాన్ని.
ఎందుకు అని జ్ఞానులు విస్తుపోయి 'ఎవరా ముంగిస' అని ఆరాతీసారు.
–ఒకరోజున జమదగ్ని శ్రాద్ధకర్మ చెయ్యాలని హోమధేనువు పాలుపిండి
చక్కని కొత్తకుండలో పోసి ఎంతో జాగ్రత్తగా ఉంచాడొక పక్కన.

క్రోధభూతంగా ధర్ముడు దానిని చూసి జమదగ్నిని పరీక్షించాలని పడదోసినాడు
పాల కుండను; అయినా కోపించలేదు జమదగ్ని; అప్పుడన్నది
క్రోధభూతం– భృగుమహర్షి సంతతులు క్రోధనులంటారు, అది అసత్యం–
నేను ఓడిపోయాను, నీ తపస్సుకు భయపడతాను నేను–

శ్రాద్ధ సంకల్పం భగ్నమయ్యిందని పితృదేవతలు కోపించారు ధర్ముడిపై–
'పాలు పారబోసి ముంగిలా కూర్చున్నావు, ముంగిసవై ఉండుము'–అన్నారు.
ధర్ముడు ప్రార్థించగా ప్రసన్నులై– ధర్మాన్ని అధర్మంగా ఋజువు చేస్తే
నీకు శాపవిముక్తి అవుతుంది –అన్నారు క్రోధం పోని పితృదేవతలు.

ధర్ముడికి అవకాశం చిక్కింది ధర్మరాజు చేసిన అశ్వమేధ యాగాన్ని చూసాక
శాపవిమోచనమయ్యింది ధర్ముడికి, కాని అతడు లేవనెత్తిన ప్రశ్న?
పద్దెనిమిది రోజుల భారతయుద్ధంలో మరణించిన వీరులెందరు?
ఏనుగులెన్ని, గుర్రాలెన్ని? మరల అశ్వమేధం చేస్తేనే పుడుతుందా శాంతి?

**తే.** **'అనఘ! నకులరూపంబున నట్లు దోఁచి । బ్రాహ్మణులతోడ మానవ భాషణముల**
**నెవ్వఁడేనియు నొక్క యహీన బోధ । ఘనుఁడు సల్లాప మొనరించె నని తలంచి. (అశ్వమేధ. 4-273)**

**తే.** **ఆతఁ డెవ్వఁడో? యని నిన్ను నడుగఁ జూచి । వెండియును బ్రస్తుతోక్తుల విందు మను మ**
**నంబుతో నూరకుండితి; నాకు నతనిఁ । జెప్పఁ దగు నేని బోధనశీల! చెపుమ!' (అశ్వమేధ. 4-274)**

**సీ.** **జమదగ్ని పితృకార్య సంకల్ప మత్యంత । నియతాత్ముఁడై చేసె; నిష్ఠ యొప్పఁ**
**జారు నూతన కలశంబున హోమ ధే । నువుఁ దాన పిదికి గారవముతోడ**
**నిమ్మైనయెడఁ బదిలమ్ముగా డించిన । నతని చిత్తము తెలం గరయు బుద్ధి**
**సాకారవృత్తిఁ గ్రోధాధిదైవము వచ్చి । ప్రామాదికం బను భంగి దోఁపఁ**

**ఆ.** **గుండతోడిపాలు గూల్చినఁ గినియక । యూరకుండె నా సముజ్జ్వలాత్ముఁ;**
**దప్పు దాత్మ మెచ్చి యద్దైవ మతనికి । నిట్టు లనియెఁ గురుమహీశవర్య! (అశ్వమేధ. 4-276)**

**ఆక్షేపణలు:** ధర్మరాజు పట్టాభిషేకానికి సిద్ధమైనపుడు చార్వాకుడు ఆక్షేపించాడు. ధర్మరాజు చేసిన అశ్వమేధ యాగాన్ని ముంగిస ఆక్షేపించింది. మెత్తటి పులి లాంటి ధర్మరాజు వ్యక్తిత్వం రాజసూయ యాగం నుంచి అశ్వమేధ యాగ సమాప్తి వరకూ ఆక్షేపణలకు గురి అవుతూనే ఉన్నది. ధర్మరాజు ధర్మ ప్రవృత్తిని దుర్యోధనుడు నమ్మలేదెప్పుడూ. దుర్యోధనాక్షేపణా రూపాలే చార్వాకుడు, నకులమనే ముంగిసా కావచ్చును.

ధర్ముడు తన కుమారుడు ధర్మరాజు చేసిన యాగాన్నే అధిక్షేపించాడు ముంగిస రూపంలో– ధర్మరాజు దానమంతా మరుత్తుడి నిధి కావడం వలన.

# 57. ఏ యజ్ఞం గొప్పది?

-కాస్త పేలపిండి, సువాసనా, అతిథి కాళ్లు తడిపిన నీళ్లు తగిలి
నా తల, మెడ, శరీరం ఒకపక్క బంగారుమయమయ్యింది.
ఇక్కడ ఇంత బంగారం, ఇన్ని జంతువుల రక్తం, ఇంత గంధము
ఉన్నది కదా, నా శరీరమంతా బంగారమవుతుందని ఆశపడ్డాను-

అన్నది ముంగిస. ఏమార్పూ రాలేదు. అందుకని నేననుకున్నాను
సక్తుప్రస్థుడి అహింసాపూరిత యజ్ఞమే ఎంతో మహిమగలదని.
దానితో పోలిస్తే ఇదేమంత గొప్పది? ఇంత హింస, ఇన్ని యుద్ధాలు,
మహాయుద్ధంలో జరిగిన నరమేధం, జంతుమేధం, దేనికోసం, ఎందుకు?

వాళ్లు నివ్వరి గింజలతో పేలపిండి చేసి అతిథిగా వచ్చిన ధర్ముడికి పెట్టారు.
తమ ఆకలి గురించి కాదు వాళ్ల చింత, అతిథి ఆకలి తీరిందా లేదా?
అన్నదే వాళ్ల ఆలోచన, చింతన! ఇక్కడ యజ్ఞమంతా స్వర్ణమయమే
మరుత్తుడి నిధిని సంపాదించి మర్త్యులందరికీ పంచి ఇచ్చారు, మంచిదే!

భూమిని గెలుచుకున్నారు యుద్ధంలో; దానం చేసారు యజ్ఞంలో.
మరల కొనుక్కున్నారు ధనంతో, ఎవరి సంతృప్తి కోసం, ఎందుకు?-
ఎక్కడో పాపభయం బుసలుకొడుతూ ఉంటుంది, నిద్రపట్టనివ్వదు.
ముంగిసకు శాపవిమోచనమయ్యింది ధర్మాన్ని అధర్మంగా ఆక్షేపించినందుకు.

---

క. భృగువులు క్రోధను లనఁగా । జగతిఁ బరఁగు వాద; మది మృషాపరికలితం
బగుట దెలిసె; నోడితి నీ; । కగణిత మగు నీ తపమున కలికెద ననఘా! (అశ్వమేధ. 4-277)

క. 'నా దెసఁ బ్రసన్నుఁడవు గ; । మ్మాదరమునఁ జూడు; సైఁపు మపరాధము; వి
ద్యాదయిత!' యనిన నమ్ముని । యా దైవముఁ జూచి శాంతి యలవడ నెమ్మిన్. (అశ్వమేధ. 4-278)

ఆ. తప్పు సైఁచి నన్ను దయఁ జూచి శాపమో । క్షము ననుగ్రహింపుఁ డమితతేజు
లార!' యని వినీతిలంపటుం డగుచుఁ బ్రా । ర్థించుటయును వారు తెలివి నొంది. (అశ్వమేధ. 4-283)

శా. భక్తి స్మేర మునీంద్ర చిత్తకమల ప్రస్ఫీత సౌరభ్య సం
యుక్తారూఢ తర ప్రకాశ తనురూపోల్లాస! రాగాది ని
ర్ముక్తైకాంతి జనైకతా రసిక! చిన్ముద్రాసదోన్నిద్ర! ధీ
శక్తిస్వైర విహారదూరలసితా! సద్భావనోన్మీలితా! (అశ్వమేధ. 4-285)

\- విముక్త పాపాః పూతాస్తే సంవృత్తాస్తత్ క్షణేనతు
ప్రణమ్య శిరసా విష్ణుం ప్రతి నంద్య చ తాః కథాః (సం.అశ్వ. 92)





# శ్రీ ప్రసాద మహాభారతము
## అయిదవ వేదము - శాంతి సప్తకము
## 15. ఆశ్రమవాస పర్వము

క. కని గారవంబునం దోడ్కొని చని యర్ఘ్యాది విధులకుంఠిత వినయం
బున నడపిన న య్యాశ్రమమున నతడు వసింపగోరె భూవరేణ్యా!

సీ. సంయమివరుఁడైన శతయూప మునిపతి యాశ్రమంబున దదుపాంత భాగ
మున గదలీశోభియును మృగాకీర్ణంబునగు ధృతరాష్ట్రుని యాశ్రమంబు
నెరిగిన వారదె యదె యంచుఁ బేర్కొని చూపి చెప్పిన ధర్మసుతుడు దేరు
డిగిన భీమాదులు డిగ్గిరి; వాహనంబులు సర్వజనులు నప్పురుష వరుల

ఆ. ననుసరించి; రజ్జనాధిపుఁ డయ్యాంబికేయు నాశ్రమంబు డాయఁ జనుచు
నచటి జనుల నడిగె 'నయ్య వేఁడి?' యని గద్గదిక నెలుంగు గడలు కొనగ (ఆశ్రమ. **2-31**)

- తాను పృచ్ఛత్ తతో రాజా క్వాసౌ కౌరవ వంశ భృత్
పితాజ్యేష్ఠో గతో స్మాకమ్ ఇతి బాష్ప పూర్ణితః (సం.ఆశ్రమ. **24-5**)

- నారదా ఛ్చైవ శుశ్రావ వృష్ణీనాం కదనం మహత్
ఏతదాశ్రమవాసాఖ్యం పర్వోక్తం మహదద్భుతమ్ (సం.ఆది. **2-351**)



| సంస్కృత మహాభారతము | కవిత్రయ మహాభారతము | శ్రీ ప్రసాద మహాభారతము |
|---|---|---|
| **15. ఆశ్రమవాసిక పర్వము** (అధ్యాయాలు) | **15. ఆశ్రమవాస పర్వము** (గద్య పద్యములు) | **15. ఆశ్రమవాస పర్వము (33)** (పద్య శీర్షికలు) |
| 1. ఆశ్రమవాస పర్వము (28)<br>2. పుత్ర దర్శన పర్వము (8)<br>3. నారదాగమన పర్వము (3) | 1. ప్రథమాశ్వాసము (186)<br>2. ద్వితీయాశ్వాసము (176) | 1. ప్రథమాశ్వాసము (23)<br>2. ద్వితీయాశ్వాసము (10) |

(Traditional Edition: ఉప పర్వాలు-3, అధ్యాయాలు-39; Critical Edition: 3-47)

## ✤ 15. ఆశ్రమవాస పర్వము - ప్రథమాశ్వాసము ✤

### 1. ధర్మజుడా నరపతి నతనిదేవి నతులిత భక్తిన్-

వైశంపాయన మహర్షి చెబుతున్నాడు జనమేజయ మహరాజుతో-
-తమకు పెద్ద దిక్కైన ధృతరాష్ట్రుడు, గాంధారిని ఎంతో గౌరవంతో
ప్రేమాభిమానాలతో సేవించేవాడు ధర్మరాజు. వారికి ఏ ఇబ్బందీ
రాకూడదని అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు సార్వభౌముడు.

విదురుడు, యుయుత్సుడు, సంజయుడు ఎప్పటిలానే వస్తున్నారు.
ఏం కావాలో అడిగి చిన్నా పెద్దా పనులన్నీ చేసి పెడుతున్నారు.
ధృతరాష్ట్రుడు కూడా అందరి మీదా ప్రేమ వాత్సల్యంతో ఉండేవాడు.
కుంతీదేవి కూడా వచ్చి గాంధారిని పలకరించేది గౌరవంగా.

సుభద్ర, ద్రౌపది, ఉలూచి, చిత్రాంగదలు ప్రతి నిత్యమూ వచ్చి
పలకరించేవారు గాంధారిని; అంతఃపుర స్త్రీలందరూ వారికి
ఏమి కావాలో అవి తెచ్చిపెట్టేవాళ్ళు, సపర్యలు చేసేవారు.
ధృతరాష్ట్రుడు చెప్పగా గుళ్లుగోపురాలు అగ్రహారాలు ఏర్పరచేవాడు ధర్మరాజు.

సామంతరాజులు కూడా వచ్చి ధృతరాష్ట్రుని సందర్శించే పద్ధతిని ప్రవేశపెట్టాడు.
తన సోదరులెవరూ ఎత్తిపోటు మాటలనకుండా జాగ్రత్త పడినాడు ధర్మరాజు.
ఎవరూ ధృతరాష్ట్రుడి దగ్గర దుర్యోధనాదుల దుష్ప్రవర్తన, పాండవులు పడిన
కష్టాల ఊసు ఎత్తకుండా చేసాడతడు, గడిచాయి పదిహేనేళ్లు.

---

సీ. **వంశవృద్ధులు పుత్త్రవర్గ వియుక్తులై । యున్నవా రేమిట నుమ్మలింతు**
**రో యను పుయిలోట నా యుధిష్ఠిరుఁడు ద । మ్ములకును దగునమాత్యులకు నిష్ట**
**భృత్యులకును మీరు ప్రీతియు భక్తియు । నాంబికేయునిదెస నతిశయిల్ల**
**నారాజు పంచినయట్ల చేసి చరింపుఁ । డతని నారాధించు టస్మదీయ**

ఆ. **చిత్తమునకుఁ బ్రియము సేయుట యతనికి । మనసు గాని యట్టిపని యొనర్చు**
**టగ్గలంపు దుఃఖ మావహించుట యని । యనుదినంబుఁ జెప్పు మనుజనాథ! (ఆశ్రమ. 1-10)**

సీ. **అతులభోగంబును నంచితత్యాగంబుఁ । దొల్లింటియట్టుల చెల్లఁజేయు**
**ధృతరాష్ట్రునకు ధర్మసుతుఁడు గాంధారికిఁ । బూర్వప్రకార సంపూజ్యదాన**
**నిరతిఁజెల్లించు; నక్కురువృద్ధుఁ డిమ్మెయిఁ । బాండుపుత్త్రులు దన్నుఁ బరమభక్తి**
**శిష్యవర్తనమున సేవింపఁ దానును । గురునట్ల వాత్సల్యపరత నెపుడు**

తే. **వారలకు శ్రీయు నాయువు వైరిజయము । మానసమున నాశాసించు మానవేంద్ర!**
**యతని తొంటివర్తనముఁ దత్సుతుని కీడు । నాత్మఁ దలఁపఁ డెన్నండు ధర్మాత్మజుండు! (ఆశ్రమ. 1-14)**

## 2. పులుల రాజ్యం

అదొక గొప్ప అడవి. అధికారం చేతులు మారింది చారలు మారినట్లు.
మెత్తని పులి గద్దెనెక్కింది, వృద్ధపులి ముఖం చిన్నబోయింది.
అంధత్వం, వృద్ధత్వం, సంతాన నాశనం కృంగదీసాయి పులి దంపతులను.
తమ్ముడి కొడుకుల పంచన పాయసంతాగుతున్నా ఏదో సలుపుతున్న బాధ.

మెత్తని పులి మెత్తమెత్తగా ఉండడం కన్నా మొత్తితే బాగుండేదేమో!
అతి మంచితనం పులుల వంశాచారం కాదు, పాడవుతాయి చారలు కోరలు.
అయిదు పుల్లుల్లో రెండో పులి వచ్చినప్పుడల్లా గుర్తుకువస్తాయి
గుడ్డి పులులకు తమ కొడుకుల విరిగిన తొడలు, చీల్చిన రొమ్ము.

రెండో పులి రావడమే తడవుగా ఆ ప్రాంతమంతా గంభీరమవుతుంది.
మెత్తని పులి కాస్త కనుమరుగు కాగానే సన్నగా మొదలవుతాయి గాండ్రింపులు
పదునైన గునపంతో, ఖచ్చితమైన లెక్కతో పొడిచినట్లుంటాయి
వృకోదరమున్న బెబ్బులి బలంగా వదిలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు.

శత వ్యాఘ్ర సంభావిత ప్రియ వాక్యాలకన్నా ఒకే ఒక పెద్దపులి
తగిలీ తగిలినట్లు విసిరే పంజా దెబ్బలకు భయపడేవి వృద్ధపులులు.
నల్లపులి, కవల పులులు ఏమనకున్నా ఎక్కడో గుండెల్లో పోటు
పరాయి కూడు తింటున్నామన్న భావన కలిగాక గుడ్డిపులులకేది చోటు?

---

**సీ.** రాజ్యాధిపత్య సంపూజ్యత్వమున ధృత । రాష్ట్ర పాండుసుతాంతరంబు గాన
రొకలులు జానపదోత్కరమునఁ బౌర । వర్గంబునందును వసుమతీశ!
యమ్మెయి నడపెడు నప్పాండవాగ్రజు । వలన నిజాత్మజువలని కంటె
నక్కురురాజు ప్రియం బందు; న ట్లున్న । యక్కాలమునఁ । బవనాత్మజుండు

**తే.** సన్నిహితుఁ డైనయప్పు డజ్ఞనవిభుండు । తన తనూజులఁ దలఁచి సంతాప మందు;
నతనిఁ గనుఁగొని యబ్భీముఁ డతనిసుతులు । తమ్ముఁ బటిచిన పాటులు దలఁచి యలుగు. (ఆశ్రమ. 1-16)

**సీ.** 'అంధుని కొడుకులయం దొకరునిఁ దప్పి । పోనీక త్రుంచితి భూరిశక్తి
దర్పితం బైన మద్బాహుపంజరము సొ । చ్చిన రిపురాజన్య సింహములకు
వెడలంగ వచ్చునే? వెంగలు లై వారు । కయ్యంబు సేసిరి గాక నన్ను
నెఱిఁగినఁ దొడరుదు రెట్టులు? దుర్యోధనాదుల ననిఁ దెగటార్చినట్టి

**తే.** నాదు దోర్దండములఁ జందనం బలంది । కుసుమదామముల్ సుట్టి మ్రొక్కుడు మహోప
కారు లరయంగ దైవముల్ గావె?' యనుఁ ద । దీయ మర్మంబు లెల్ల భేదిల్ల నధిప! (ఆశ్రమ. 1-19)

# 3. ధృతరాష్ట్రుడి నిర్ణయం

ఎవరూ లేనప్పుడు భీముడు గాంధారీ ధృతరాష్ట్రులకు వినబడేట్లు
అంటాడు- కౌగిళ్ళు ఇనుప రాళ్లనే పొడిపొడి చేస్తాయేమో
గొడ్డళ్లు చెట్టు మొదళ్లను చీల్చినట్లు, గదలు బోదెల్ని విరగగొట్టినట్లు
ఏవేవో ఊహలు, గుడ్డి ఊహలు, అంధ ప్రతిజ్ఞలు కదా!

నా బాహువులేమన్నా తక్కువా, ఈ పంజరంలో ఇరుక్కుని
బయటపడ్డ సింహాలు, పులులు లేవు కదా, ఏమిటి కత!-
అని వినబడి వినబడనట్లు, తనలో తాను మాట్లాడుకుంటున్నట్లు
తగిలీ తగలని వాగ్బాణాలతో వాళ్ల ప్రాణ స్థానాలు చీల్చేస్తాడు భీముడు.

అర్జునుడు, కుంతీదేవి, ద్రౌపది, కవలలు గౌరవంగా చూసుకుంటున్నారు
గాంధారీ ధృతరాష్ట్రులను; నకుల సహదేవులు భీముడి మాటలు విన్నా
ధర్మరాజు పట్ల ఉన్న భయం వలన వారు మారు పలికేవారు కాదు.
అయినా ఒకరోజున ధృతరాష్ట్రుడు ధర్మరాజాదులతో అన్నాడు-

కొడుకుల మీద నాకున్న వల్లమాలిన ప్రేమ చివరకు వాళ్ల నాశన కారణమైంది.
వ్యాసుడు, కృష్ణుడు, భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, సంజయుడు చెప్పినా
వినిపించుకోలేదు. నా తప్పు ఇప్పుడు కఠిన శల్యమై
బాధపెడుతున్నది నన్ను భయంకరంగా, నిద్ర పోనీకుండా!

---

**సీ.** **నాకతంబునఁ జేసి యా కౌరవులకు నా । శంబు వాటిలుట దెల్లంబు మీకు**
**జడుఁగ్రూరు నతిలోభి జ్ఞాతి జనద్రోహ । కరు రాజుఁ జేసితిఁ గురుధరిత్రి**
**కచ్యుతు చెప్పిన యమలవాక్యంబులు । విననేరనైతి నా తనయువలని**
**ఘనతరస్నేహంబునను మొగమోటను । దగియెడుమాటలఁ దఱిమి యొత్తి**

**తే.** **యాడకుండితి; భీష్ముండు నస్త్రగురుఁడు । విదురుఁడును సంజయుండును వే విధముల**
**నాకుఁజెప్పిరి; గాంధారి నన్ను దూఱి । చెప్పె; న మ్మాట లేఁ బెడచెవుల నిడితి. (ఆశ్రమ. 1-21)**

**సీ.** **నీ వరయంగ సుఖావాప్తిఁ గొఱఁత లే । కుండితిఁ జనవును నుజ్జ్వలంపుఁ**
**దేజంబుఁ గలిగి వర్తించితి దానంబు లంచితములుగఁ బె క్కాచరింపఁ**
**గంటి శ్రాద్ధంబులు గాంధారిసుతులకుఁ । బలుమాఱుఁ జేసితిఁ; బరమధర్మ**
**శీల పాంచాలికిఁ జెట్ట చేసి రగణ్య । పుణ్యుండ వగు నీదు భూరిలక్ష్మి**

**తే.** **నపహరించి రద్దుర్యోధనాదు లట్టి; కష్టచరితులఁ బాడిమైఁ గయ్యమునన**
**నిహతులుగఁ జేసి తక్కురునికర మూర్ధ్ని; భువనగతిఁ గాంచి సుఖ మందె భూపవర్య! (ఆశ్రమ. 1-25)**

# 4. విధి ఎవ్వరి హీనుల జేయడకట వక్రుండైనన్

ధృతరాష్ట్రుడంటున్నాడు– రాజుకు చెప్పి ఏ పనైనా చెయ్యాలనేది
నియమం. నేను తపస్సు చెయ్యాలనుకుంటున్నాను; వృద్ధాప్యంలో
క్షత్రియుడు యుద్ధంలోనైనా మరణించాలి లేదా తపస్సుతోనైనా.
విడిచిపెట్టాలి శరీరం. అడవులకు వెళ్లేందుకు నాకు అనుమతి ఇవ్వు.

ధర్మరాజన్నాడు– నాకు ఈ రాజ్యంకంటే నీవే ఎక్కువ, తండ్రీ.
నీవిలా బాధపడుతూ అరణ్యానికి వెళ్లి అక్కడ బాధపడుతుంటే
నేనిక్కడ ఎలా సుఖంగా పాలన చేయగలను? యుయుత్సుడికి
పట్టాభిషేకం చేసి నేనూ నీతోపాటు అడవులకు వచ్చి నీకు సేవ చేస్తాను.

ధృతరాష్ట్రుడన్నాడు– నీవరయంగ సుఖావాప్తి కొరత లేకుండ
పదిహేను సంవత్సరాలు కాలం గడిపాను. నీవలన గొప్ప దానాలు చేసాను.
నా పుత్రులకు శ్రాద్ధక్రియలు పలుమార్లు మేలుగా చేయగలిగాను. గడిచాయి పదిహేనేళ్లు;
కుమారా, నేనొక నిర్ణయం తీసుకున్నాను, నీవు అనుమతివ్వగలవు.

గాంధారి అన్నది– మీ పెదతండ్రి గాఢ తపస్సు గురించి ఆలోచిస్తూ
తిండి తినడం మానేసి ఉండడం వలన ఇలా సోలిపోతున్నారు.,
ధర్మరాజన్నాడు– పదివేల ఏనుగుల బలం కలిగిన ధృతరాష్ట్రుడు
అయ్యో బలహీన పడిపోతున్నాడు –అంటూ ముఖంపై చిలకరించాడు చల్లని నీరు.

---

**సీ.** ఏ కార్యమైనను నెవ్వఁడేనియుఁ జేయఁ । దొడఁగునప్పుడు విను పుడమితేని
చే ననుజ్ఞాతుఁ డై కాని తొడంగఁ గా । దట్లు గావున వార్ధకాభిలీఢ
మైన మదీయకాయమునకు సంస్కార । మాచరింపఁగఁ దప మాచరించు
పనికి భూపాల! నీయనుమతి వడయంగ । వలసి చెప్పెద రాజవంశజునకు

**ఆ.** సమరమరణ మొండె, విమలతపమునకుఁ । జొచ్చి యందు నిలిచి చచ్చు టొండె
వలయు; నస్మదీయకులముఖ్యు లిట్టుల । నడపి రనుపు నన్ను నడవి కనఘ! (ఆశ్రమ. 1-27)

**క.** రాజు గురుఁ డెల్లవారికి; । రాజోత్తమ! గురునియాజ్ఞ రంజిల్లఁగఁ బే
రోజం జేసిన కృత్యము । సూ జగములు రెంటియందు శోభన మిచ్చున్. (ఆశ్రమ. 1-28)

**తే.** ఏను గాంధారియును దపోమాననీయ । మునుల చేరువ వల్కలములు ధరించి
కందమూల ఫలముల నాఁకలి హరించి । నిన్ను దీవించుచుండెద మన్న నతఁడు. (ఆశ్రమ. 1-29)

**క.** ధరణీరాజ్యము నాకును । నరవర! సౌఖ్యంబుఁ జేయునా! నీ విమ్మై
దురపిల్లి దుష్కరం బగు । నరణ్యవాసమున కేఁగినట్టిది యైనన్. (ఆశ్రమ. 1-30)

# 5. ధృతరాష్ట్రుడు ధర్మజునికి చెప్పిన రాజనీతి-

-తపస్సు చేసుకోవడానికి నీవు సెలవిచ్చేవరకు భోజనం చెయ్యను-
అన్నాడు ధృతరాష్ట్రుడు; ఆ సమయంలో వచ్చాడక్కడకు వ్యాసుడు.
ధర్మరాజా! ధృతరాష్ట్రుడిది ధర్మమైన కోరిక. వారిని వెళ్లనివ్వు.
ధర్మజుడన్నాడు- తమరి మాట నాకు శిరోధార్యం. నేను అంగీకరిస్తున్నాను.

వ్యాసుడన్నాడు- కేవల తపః క్రియాసంసేవన తాత్పర్యమే ఉన్నది
ధృతరాష్ట్రుడి మనసులో, అది ధర్మం, ఆచరణీయం, అనుసరణీయం-
అని పలికి ధర్మరాజు అంగీకరించగా వెళ్లిపోయాడు వ్యాసమహర్షి.
ధర్మరాజు అనుమతి ఇవ్వగా సంతోషించిన ధృతరాష్ట్రుడు కాస్త ఎంగిలిపడినాడు.

భోజనాలవీ అయినాక ధృతరాష్ట్రుడు అనేక రాజనీతి అంశాలను
ప్రస్తావించాడు ధర్మజునితో- సప్తాంగాలను రక్షించుకో,
మంచి మంత్రులను ఎన్నిక చేసుకో; గూఢచారులను ఏర్పాటు చేసుకో-
పుర రక్షణము, నవద్వార పుర రక్షణంలా పటిష్ఠంగా ఉండాలి.

తెల్లవారక మునుపే దేవతార్చనమూ, ఉదయాన జమాఖర్చులు,
బాగా పొద్దెక్కినాక భోజనము, సాయంకాలం వీరులతో సమావేశం,
సంధ్యాకాలంలో దూతలు, వేగులవాళ్లతో చర్చలు, రాత్రివేళ
కాంతా భోగము శ్రేయస్కరము; కొన్ని సమస్యలను పరిష్కరించుము వెంటనే.

---

**సీ. తదనంతరమ ధర్మతనయుండు ధృతరాష్ట్రు । తోడ నీ కెట్టుల సూడఁ బోలె**
**విదురుండుఁ గృపుఁడు నెయ్యది కృత మని విని । శ్చయ మొనరించిరి సంజయుని యు**
**యుత్సుని మనముల నొలసిన కర్తవ్య । మెద్ది దానిన చేయు టెంత యేని**
**నాకుఁ బ్రియంబు భూనాథ యానతుఁడ నై । వేఁడెద నొకటి నీ విశదబుద్ధి**

**ఆ. నేమి సేయఁదలఁచి తేని నీ వక్కట । యారగించి చేయు మయ్య!' యనుడు**
**నరిగె నా నృపాలుఁ డభ్యంతరావాస । మునకుఁ దోన సుబలతనయ సనఁగ (ఆశ్రమ. 1-54)**

**సీ. 'నీవు నిచ్చలును విద్యావృద్ధజనములఁ । దగ నుపాసింపు, మర్థముల వారిఁ**
**బ్రీతులఁ జేయుము; నీతులు వా రుప । దేశింప వాని నూఁదినమనంబు**
**గలిగి నిర్వర్తింపు; కార్యంబు నింద్రియం । బుల రాజ్యతంత్రంబుఁ బోలె నరసి**
**రక్షింపు; మప్పిండు రక్షితం బైన శు । భంబులం గావించు; భావశుద్ధి**

**ఆ. ధామములును బితృపితామహక్రమసమా । గతులు విశదమతులుఁ గాఁగవలయు**
**సచివు; లతివిదగ్ధ చారులఁ బనుపుము । పరుల యాప్తజనుల భంగు లరయ. (ఆశ్రమ. 1-56)**

# 6. నేను కొన్ని యిటుపోలిన భంగి నెరుంగ చెప్పితిన్-

ధృతరాష్ట్రుడు చెబుతున్నాడు- న్యాయసంవాదనము, సేవా దురంధరులకు
సత్కారము, అధికార దుర్వినియోగం చేసేవారికి కఠిన శిక్షలు,
అత్యంత విశ్వాసపాత్రుడైన వీరునికి సేనాధిపతి పదవి, సమయోచిత
జ్ఞానం మంత్రాంగం తెలిసిన మంత్రులు, చతురత గల రాయబారులు

మానుష బలంతో పాటు దైవబలం ఉండేందుకు మంచి పురోహితులు
రాజకీయ తంత్రాలు, శత్రురాజుపై అవలంబించాల్సిన వ్యూహాలు తెలిసిన
సలహాదారులు, శుభముహూర్తాలు గణన చేసే నిపుణులైన జ్యోతిష్కులు
సుశిక్షితులైన అధికారులను సప్తాంగ నిర్వహణకై నియమించుకోవాలి.

శత్రురాజ్యాలపై దండెత్తడం లేదా నగరాన్ని ముట్టడించడం;
పొడుగాటి తాడు కట్టి కపిలగోవును వదిలినట్లు వదలి, అనుకూల సమయాన
కావలసినంత కప్పాన్ని కక్కించడం; దండయాత్ర సమయంలో
మూలశ్రేణి మిత్ర శత్రు కానన భృత్య బలాలను సమీకరించడం

ధర్మబద్ధంగా ప్రజలను రక్షించడం, గెలిచిన రాజ్యాన్ని సంపన్నం చేసి
ప్రజాభిమానాన్ని పొందడం, అనేక యాగాలు చేసి దానధర్మాలు చేయడం
ధర్మరాజా! ఇవన్నీ నీకు భీష్ముడు, కృష్ణుడు, వ్యాసుడు మొదలైనవారు
నీకింతకు ముందు చెప్పి ఉన్నారు - నేను నాకు తోచినంత చెప్పాను వాత్సల్యంతో-

---

**సీ.** **ధర్మమార్గంబున ధరణిఁ బాలించిన । నైహిక సుఖములు నగ్గలంపుఁ**
**బొగడును బరలోక భూరి సౌఖ్యములును । సిద్ధించు; విపుల దక్షిణలు పెట్టి**
**యశ్వమేధ ప్రముఖాధ్వరంబులు పెక్కు । లాచరించుట కంటె నధిక మంద్రు**
**మేదినీ ప్రజల నత్యాదరంబును గరు । ణాతిశయంబు మధ్యస్థతయును**

**తే.** **గలిగి బిడ్డల నరసిన కరణి గాధ । రక్షణం బొనరించుట రాజవర్య!**
**వినుము తమ్ముల నీగి మన్ననల ననుది । నంబుఁ గొనియాడు మానందనంబు గాఁగ. (ఆశ్రమ. 1-77)**

**చ.** **నరవర! రాజనీతుల జనస్తుతుఁడైన నదీ తనూజుఁడున్**
**హరియుఁ బరాశరాత్మజుఁడు నాదిగఁ గల్గిన పెద్ద లెల్ల నీ**
**కరయఁగఁ బెక్కు సెప్పిరి; మదాత్మయు నీదెసఁ బ్రీతి పెద్దయుం**
**బొరయుట నేనుఁ గొన్ని యిటు పోలిన భంగి నెఱుంగఁ జెప్పితిన్. (ఆశ్రమ. 1-78)**

**-** **ఏ తత్ సర్వం యథాన్యాయం కుర్విథా భూరి దక్షిణ**
**ప్రియస్తథా ప్రజానాం త్వం స్వర్గే సుఖమ వాప్స్యసి (సం.ఆశ్రమ. 7-22)**

# 7. నన్నున్ గారవమున కనుపరయ్య కాననమునకున్-

ధర్మరాజుకు రాజనీతిని తెలిపాడు ధృతరాష్ట్రుడు ఆశ్రమవాసానికి వెళ్లేముందు,
తాను అరణ్యాలకు పోయేముందు పౌరుల అనుమతి కోరుతానని చెప్పగా
ధర్మరాజు హస్తినలోని ప్రజలలో అర్హులైన వారినందరినీ పిలిపించాడు.
వాకిట ముందు నిలిచిన ప్రజలతో గాంధారీ సహితుడై వచ్చి ధృతరాష్ట్రుడన్నాడు-

ప్రజలారా! వ్యాసుని అనుమతి, ధర్మజుని అనుమతితో పాటు మీ అనుమతి
తీసుకుని నేను నా శేషజీవితాన్ని అడవుల్లో గడపదలుచుకున్నాను.
ఈ రాజ్యాన్ని మొదట శంతనుడు, తరువాత భీష్ముడి రక్షణలో
విచిత్రవీర్యుడు, అటుపిదప నన్ను రాజుగా ఉంచి పాండురాజు రాజ్యం చేసారు.

పాండురాజు కాలం చేసాక నేను రాజుగా ఉన్నాను, ఇప్పుడు ధర్మరాజు మీ రాజు
సోదరుల మధ్య ధర్మరాజు దేవేంద్రుడిలా భాసిల్లుతూ మిమ్మల్ని
కాపాడగలడు. అందుకే రాజ్యపాలనా బాధ్యత అప్పగించాను ఇతడికి.
విధివశాత్తు జరిగిన కొన్ని ఘటనల వలన నా ఉపేక్ష వలన దుఃఖం కలిగింది.

మాలో మాకెన్ని స్పర్థలున్నా హస్తిన ప్రజలకేనాడూ కష్టం రానివ్వలేదు.
మీరు కూడా మా కపకారం కలిగే విధంగా ఏనాడూ ప్రవర్తించలేదు.
పుత్రులను కోల్పోయిన మేము అరణ్యంలో తపస్సు చేసుకునేందుకు
మీ అనుమతి కోసం ఎదురుచూస్తున్నాను, అనుమతి ఇవ్వగలరు దయతో-

---

**సీ. 'సాధుచరిత్రయు శాంతయు నైన యి । గ్గాంధారియును నేను గాఢ వినయ**
**మార మీ తెలి విట్లు గోరుచు నున్నార । మఖిల ధర్మాభిజ్ఞుఁ డగు పరాశ**
**రాత్మజుండును ధార్మికాగ్రణి పాండవా । గ్రజుఁడును నాకు నరణ్య గమన**
**మునకు నిచ్చి రనుజ్ఞ; మోద్పుఁగే లౌదలఁ । గదియించి మిమ్ము వేఁడెదఁ గృపాధ్యు**

**తే. లార! యనుమతి సేయుఁడు మీరు' ననుడు । వార లుత్తరీయంబులు వదన వినిహి**
**తములుగాఁ జేసికొని రోదనము రవంబు । లెసఁగఁ జేసిరి విను ధరణీశవర్య! (ఆశ్రమ. 1-96)**

**సీ. 'భరతవంశోత్తమ । పౌరజనంబులు తమ మాటలుగ భవత్సన్ని ధాన**
**మున న న్నుపన్యాస మొనరింపఁ బంచిన । యట్టిభాషణము లేకాగ్రబుద్ధి**
**నవధరింపుము! మీ మహాన్వయంబున మహీ । విభులయం దొప్పమి వెదకి యైనఁ**
**గానము మము మీరు గన్నట్టి ప్రజల నె । ట్లట్ల రక్షించితి రాదరమున**

**తే. వినుము! దుర్యోధనుండు చేసిన యనర్థ । మొక్కటియు లేదు; నినుఁ ద్రిలోకోత్తరుండు**
**సత్యవతి కొడు కే మని సమ్మతించి । పంచె దానిన చేయుము పరమనియతి. (ఆశ్రమ. 1-98)**

# 8. స్వర్గమైనను పాలింప జాలువారు-

గాద్గదికమైన గొంతుతో ధృతరాష్ట్రుడు పౌరులతో అలా పలికేసరికి
వచ్చిన వారంతా వెక్కివెక్కి ఏడ్చారు; పురజనుల తరపున 'శంబువు'
అనే బ్రాహ్మణుడు దుఃఖాన్ని దిగమింగుకుంటూ అన్నాడు- మహరాజా!
పౌరులందరి తరపున మాట్లాడేందుకు నియమింపబడిన నేను చెబుతున్నాను-

మీ వంశంలోని రాజులందరు మమ్మల్ని కన్నబిడ్డల్లా చూసుకున్నారు.
దుర్యోధనుడు కూడా మాకు చేసిన అకృత్యమేమీ లేదు, మాకు దుఃఖంగా ఉన్నది
నీవు మమ్మల్ని విడిచి వెళ్తున్నందుకు, నీ గుణాలు తలుచుకుంటూ మేము
మరచిపోవడానికి ప్రయత్నిస్తాము ఈ దుఃఖాన్ని; నీకు మేలు జరుగుతుంది.

వీరులందరూ యుద్ధంలో మరణించి వీరస్వర్గ మనుభవిస్తున్నారు
ఇప్పుడు మమ్మల్ని పాండవులు పాలిస్తున్నారు, దేవలోకాన్నైనా
పాలించే సామర్థ్యం ఉన్నవారికి ఈ భూమిని పరిపాలించడమేమి కష్టం?
ఈ రాజ్యాన్ని పాండవుల కప్పగించి, మమ్మల్ని రక్షించావు అన్ని విధాలా.

పాండవులూ, వారి స్త్రీలు పట్టణ ప్రజలను, పల్లెజనులను ఎంతో ఆదరిస్తారు.
శూరులు, శాంతస్వాంతులు, మృదువులకు చాలా మృదువులు, దుర్మార్గుల
విషయంలో చాలా కఠినులు; మదలోభిత్వాలు మందుకు కూడా లేనివారు-
అని శంబువు ద్వారా పురప్రజల మాటలు విని సంతోషమొందినాడు ధృతరాష్ట్రుడు.

---

**క.** **మృదువులకుఁ జాల మృదువులు; । విదితయశా! వినుము పాండవేయులు కడు బె**
**ట్టిదులు బెడిదంపు వారికి । మదలోభిత్వములు లేవు మందున కైనన్. (ఆశ్రమ. 1-104)**

**క.** **శూరులు, శాంత స్వాంతులు, । పౌరజన ప్రకర జానపదచయ నిత్యా**
**పార ప్రమదాపాదన । పారగు లతుల గురుభక్తి పరతంత్రాత్ముల్. (ఆశ్రమ. 1-105)**

**వ.** **వీర లెప్పుడు మము నీవు గారవించు । టెఱిఁగి మన్నింతు రమలినహృదయ! కలఁక**
**దక్కి ధర్మజుపై రాజ్యతంత్రభార । మిడి మనంబున నూఱడి యిచ్చ సలుపు.' (ఆశ్రమ. 1-107)**

**సీ.** **'మీ తండ్రి సురనదీసూతి బాహ్లికులకు । సోమదత్తునకుఁ, దత్సూనునకును,**
**దుర్యోధనాదిసుతులకును; దక్కను । గలుగు బంధులకు నుత్కర్ష మెసఁగ**
**శ్రాద్ధముల్ సేయు విచారంబు దోఁచిన । మసలెఁ గార్తికపౌర్ణమాసి దాఁక**
**వనమున కరుగ కప్పుని నీకుఁ బోలిన । యట్టులు గావింపు' మనిన నాతఁ**

**తే.** **డెంతయును వేడ్క నమ్మాట కియ్యకొనియె; । నర్జునుండును బ్రీతుఁ డై యర్థమనియె;**
**భీముఁ డపుడు కమర్చిన మోముతోడ । విదురు వదనంబు సూచుచుఁ బెదవు లదర. (ఆశ్రమ. 1-109)**

# 9. భీముడి కోపం

పౌరుల అనుమతి లభించాక ధృతరాష్ట్రుడు తన మందిరానికి వెళ్లగానే
అతడికి వచ్చింది మరో ఆలోచన– ఆఖరుసారిగా కాస్త వైభవంగా
మరణించిన బంధువులకు శ్రాద్ధకర్మలు చెయ్యాలన్నది– గాంధారి
సరేనన్నది, విదురుడిని పిలిపించి ఈ విషయం ధర్మరాజుకు చెప్పమన్నాడు.

విదురుడు వెళ్లి ధర్మరాజుకు విషయమంతా చెప్పాడు– 'మీ తండ్రి
కార్తీక పూర్ణిమ వరకు ఇక్కడే ఉండి చేస్తానంటున్నాడు శ్రాద్ధ విధులు'.
ధర్మరాజు సంతోషంగా సరే అన్నాడు, అర్జునుడు ఒప్పుకున్నాడు.
కాని భీముడి ముఖం ఎర్రబడింది– 'మన సంపాదన సరిపోయేట్లుంది

వీళ్ల పిండాకూళ్లకు' –అని గొణుగుతుంటే వారించాడు అర్జునుడు.
అడవులకు వెళ్లబోతూ అడిగింది చిన్నపని, అది చేసిపెట్టలేమా మనం!
భీముడన్నాడు– ధృతరాష్ట్రుడు ఇంతవరకు చేసిన శ్రాద్ధాలు చాలలేదా?
మీరే మరచిపోయారు మనలను పెట్టిన బాధలను, పరాభవాలను.

అర్జునుడతడిని శాంతపరచి అన్నాడు– నేను ఇస్తాను ధనాన్ని,
ధర్మజుడన్నాడు– నేనూ అర్జునుడు ఇచ్చే ధనంతో శ్రాద్ధకర్మలను
ఘనంగా చేయమనుము. భీముడి మనసులో బాధ తొలగలేదు,
కనుక అలా అన్నాడు– అని పలికి విదురుడిని పంపినాడు ధృతరాష్ట్రుని వద్దకు.

---

సీ. 'రాజు వృద్ధుఁడు ధృతరాష్ట్రుండు భీష్మము । ఖ్య జ్ఞాతులకు శ్రాద్ధకర్మ మాచ
రింపఁ దలంచి యర్థించె; భవజ్జిత । ధనధాన్యములు నీవు దాని కియ్య
కొనమి యశంబునకును ధర్మమునకు వి । ధ్వంసంబు సేయదే? ధర్మతనయు
తలఁచినపని విఘ్నితము సేయఁదగునయ్య? । మనకు నయ్యంబికాతనయుఁ దొల్లి

ఆ. వేఁడికొండు మతఁడు వేఁడెడుఁ గానకు । నేఁగుచుండి మనల నిప్పు డింత
సూడవలదె? యొందులాడక యప్పని । సలుపు టొప్పు బాహుశాలి! నీకు. (ఆశ్రమ. 1-111)

సీ. 'పాంచాలి నవమానపతిచిన తెఱఁగును । నయ్యింతి వెనుక రా నడవిఁ గలయ
ధర్మజుచన్న చందంబును మది గీటి । యుండక మఱ పెట్టు లొలసె నీకు
నాంబికేయుఁడు తండ్రి యగుట నాఁ డెటఁబోయె । భీష్ముండు మొదలగు పెద్దవారి
బాంధవం బేమయ్యెఁ బార్థ! యీవిదురుఁ డె । ఱుంగఁడే వారల భంగి?' యనిన

ఆ. ధర్మజుండు భీముఁ దగువచనముల న । దల్చె నరుఁడు మరియుఁ దగఁడె పూజ
కాంబికేయుఁ? డిట్టు లనకుము మనకు న । గ్రజుని పనుపు సేఁత వ్రతము గాదె!' (ఆశ్రమ. 1-118)

# 10. పులి జూదం

వృద్ధపులి పుట్టుగుడ్డిదే కాని వచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోలేదు.
ఏదోరకంగా పంచవ్యాఘ్రాల చారల రహస్యం బయటపెట్టాలనుకుని
కరినగరంలోని సమస్త జీవుల ప్రతినిధుల ముందు అడిగాడు అనుమతి.
వాళ్లు గనక వెళ్లవద్దంటే ఆగేవాడే కాదో ఆ పులికే తెలుసు.

తాను గుడ్డివాడు కనుక లోకం గుడ్డిదనుకున్నాడు ఆ వృద్ధపులి.
దొరికితే బెబ్బులిని ధృతరాష్ట్ర కౌగిలిలో నలపబోయాడు.
ఆ కోరిక తీరలేదు, పౌరులూ ఒప్పుకునేసరికి ఈ కోరికా తీరలేదు.
శయన మందిరంలోకి వెళ్లేసరికి, శ్రాద్ధాలు గుర్తుకు వచ్చాయి అతడికి.

పంచ వ్యాఘ్రాలను నాలుగు మంచం కోళ్లులా విడదీసి మూడు లెక్కబెట్టి
రెండు వేళ్లు చూపి ఉన్న ఒక్కటి మడిచేస్తే మిగిలేది శూన్యం–
అనుకుంటే ఈ కోరికా తీరలేదు. శ్రాద్ధకర్మలకు ఒప్పుకున్నారు వాళ్లు.
తమ శత్రువుల శ్రాద్ధాలు, అభిమన్యుడిని చంపినవాళ్ల శ్రాద్ధాలు చేయడానికి.

మెత్తని పులి అంతా గమనిస్తూనే ఉన్నది, ఎక్కడా సందివ్వడం లేదు.
రాజనీతి చెబితే విన్నది, గొంతెమ్మ కోర్కెలు తీరుస్తున్నది.
పాండుపులి ఉన్నపుడూ శ్రమ పడలేదు, మెత్తని పులితోనూ కష్టంలేదు, గుడ్డిపులికి.
కడకు, పుట్టుగుడ్డి పెట్టుగుడ్డి పులిదంపతులకు తప్పలేదు ఆశ్రమవాసం.

---

**సీ.** కనకాది వస్తువుల్ గడువేడ్క ధర్మనం । దనుఁడు పుత్తేర సుదాత్త భంగి
బాహ్లికునకు, గంగపట్టికి, సోమద । త్తునకుఁ దదీయపు త్రునకుఁ దొలుత
నంచిత శ్రాద్ధంబు లాచరించె సుయోధ । నాది కుమారుల కందఱకును
వేర్వేర క్రియలు నీప్సిత విధంబులఁ దగ । నొనరించె సింధురాజునకుఁ దక్కఁ

**ఆ.** గలుగు బంధులకును వలయు రాజులకును । ద్రోణునకును బుద్ధిఁ దోఁచినట్టి
యిష్టజనములకు నహీన భవ్యప్రకా । రములఁ బారలౌకికము లొనర్చి. (ఆశ్రమ. 1-134)

**చ.** అతులితరత్న కాంచన గవాశ్వ విభూషణ వస్త్రకన్యకా
క్షితిముఖ వస్తుదానములు గీర్తన కెక్కఁగ నవ్విభుండు సు
వ్రతుఁ డయి చేసెఁ బంచదశవాసరముల్ నిజదానలౌల్య మ
ప్రతిహత వృత్తిఁ జెల్ల విని పాండుసుతాగ్రణి ప్రీతిఁ బొందఁగన్. (ఆశ్రమ. 1-135)

**ఆ.** భూమి దాన విధులు భూవర యొక మాత్ర । నంబికాతనూజుఁ డాచరింప
నంతఁ బోక యూఱు లగ్రజన్ములకు నీ నతనిఁ బనిచెఁ బాండవాగ్రజుండు. (ఆశ్రమ. 1-136)

# 11. వాళ్లు బయల్దేరినారు ఆశ్రమవాసానికి-

కార్తీక మాసంలో పూర్ణిమ దినం నాడు శ్రాద్ధకర్మలు చేసాడు ధృతరాష్ట్రుడు.
బాహ్లికుడు, సోమదత్తుడు, భూరిశ్రవసుడు, భీష్ముడు, తన కొడుకులు,
కొడుకులు, అల్లుడు, మనమళ్లు, ద్రోణుడికి ఇలా పేరుపేరునా దానాలు చేసాడు.
బంగారం, రత్నాలు, గోవులు, భూములు, ఊళ్లు, అగ్రహారాలు అర్హులైనవారికి.

ధృతరాష్ట్రుడడిగిన దానికన్నా ఎక్కువ ఊళ్లు ధనం ఇచ్చాడు ధర్మరాజు.
వాటితో గాంధారరాజు శకునికి ఇంకా ఎందరికో శ్రాద్ధకర్మలు నిర్వహించి
తన కోర్కె నెరవేర్చుకుని, సంతృప్తుడై, ధర్మరాజును ఆశీర్వదించి
మార్గశిర శుద్ధ పాడ్యమి ఉదయాన బయల్దేరినాడు అరణ్యానికి.

గాంధారీ దేవి తనవెంట రాగా జింక చర్మాలు ధరించి, ఇంటిని పూజించి
గృహస్థాశ్రమ వస్తువులనన్నీ విడిచిపెట్టి దాటి వచ్చాడు మందిరం.
ఆ విధంగా గాంధారీ ధృతరాష్ట్రులు వెళ్తుంటే కురువంశపు స్త్రీలు
పరిజనులు, పురజనులు, పాండవులు, ఇతరులు మునిగారు దుఃఖసముద్రంలో.

కుంతీదేవి, ద్రౌపది, చిత్రాంగద, ఉలూచి, తన కొడుకుతో ఉత్తర,
అంతఃపుర స్త్రీజనమంతా, నగరంలోని పౌరులంతా దుఃఖిస్తుంటే
జూదం ఆడిన రోజున పాండవులు నగరం విడిచివెళ్తున్న దృశ్యం కనిపించింది.
విదురుడు, సంజయుడు వెళ్తున్నారు, అప్పుడన్నది కుంతీదేవి -నేను వెళ్తున్నాను-

---

**చ.** **అనుటయు గొంతి యక్కురుకులాగ్రణి కి ట్లను 'నీవు తోడఁ గా**
**ననమున కేఁగుదెంచుట జనస్తవనీయచరిత్రుఁ డివ్విభుం**
**దనుమతి చేయునే? యుడుగు మా పని; యియ్యమ యత్త నాకు, నీ**
**మనుజవిభుండు మామ; గరిమంబుగ వీరలఁ గొల్చి పోయెదన్. (ఆశ్రమ. 1-147)**

**తే.** **ఇతని కియ్యమకును విను మేన చువ్వె । వలఁతి శుశ్రూష సేయంగ వత్స! మీర**
**లాపనికి నేర్తురే? వీర లడవి కరుగ । నింట నుండఁగ నా మన మియ్యకొనునె? (ఆశ్రమ. 1-148)**

**క.** **'వీరలయెడఁ గొడుకా! యప । చారంబులు పలుకుదునె? విచారము విడు; మే**
**నే రూపంబున నిలువన । గారవమున నిది వ్రతంబుగాఁ గైకొంటిన్.' (ఆశ్రమ. 1-150)**

**క.** **'నీ వేమియు ననకుము సహ । దేవుని నేమఱక యరయు; దినకరసుతునిన్**
**భావమునఁ దలఁపు; మే నా । దేవసముని పుట్టు వడఁచితిం గపటమునన్. (ఆశ్రమ. 1-152)**

**క.** **అది పాపము దానికి నా । మది నెప్పుడు వగతు విమలమానస! యక్కీ**
**డు దొలంగునట్లుగా స । త్పదార్ధ దానములు చేయు తాత్పర్యమునన్. (ఆశ్రమ. 1-153)**

# 12. నా మది నొండు లేదు-

పురద్వారం దగ్గర అందరినీ వెళ్లిపొమ్మన్నాడు ధృతరాష్ట్రుడు.
విదురుడు, సంజయుడు, ఆ దంపతులతోనే వెళ్లాలని నిశ్చయించుకోగా
కృపుడు, యుయుత్సులను ధృతరాష్ట్రుడు వారించి అప్పజెప్పాడు ధర్మజునికి.
ద్రౌపది మొదలైన స్త్రీజనమంతా వెనక్కి మళ్లబోయారు వెక్కివెక్కి ఏడుస్తూ.

ధర్మరాజు అన్నాడు– అమ్మా ఆగుము, కోడళ్లను తీసుకుని వెళ్లుము ఇంటికి.
కుంతి అన్నది– నాకు ధృతరాష్ట్రుడు బావ, గాంధారీదేవి అక్క
నేను వెళ్తున్నాను, సహదేవుడిని జాగ్రత్తగా చూసుకో, కర్ణుడు
నా కుమారుడన్న సంగతి మరచిపోకు, నా నిశ్చయం మారదు.

ధర్మరాజు అన్నాడు– మాకు అండగా ఉండాల్సిన నీవు వెళ్లవద్దమ్మా?
భీముడన్నాడు– నీకోసం మేమింత శ్రమిస్తే ఇప్పుడు వెళ్తానంటావా?–
కుంతి అనుకున్నది వీరితో కఠినంగా మాట్లాడకపోతే వెళ్లరనుకుని
–జూదము, అపకీర్తి, ద్రౌపదీ పరాభవము నన్ను మిమ్మల్ని రెచ్చగొట్టేలా చేసాయి.

జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు చూసాను, కొడుకుల విజయాన్ని
కళ్లారా చూసాను, రాజసూయ, అశ్వమేధ యాగాలు చేయడం చూసాను
గొప్పగొప్ప దానాలు చేసాను, అపురూపమైన కోడళ్లను పొందాను.
తృప్తి చెందాను గృహస్థ జీవితంతో, ఇప్పుడు వెళ్తున్నాను ఆశ్రమ వాసానికి.

---

**ఉ. 'నామది నొండు లేదు; విను నవ్విభి నీతనితోడ; నీదు ల**
**క్ష్మీ మహిమన్ మనం బలరఁ జేసితి నుత్తమదానముల్; జన**
**స్తోమ నుతంబుగా నడపఁజూచితి జన్నము గన్నులార; నిం**
**కేమి కొఱంత నా; కుడుగ; నెట్లును బోదు నరణ్యవృత్తికిన్. (ఆశ్రమ. 1-170)**

**క. కురు రాజునకును దేవికిఁ। బరిచర్య లొనర్చుచుం దపంబునఁ గృశతం**
**బొరయు తనువుతోఁ గడపెదఁ। గరము నియతి నింకఁ గలుగు కాలము వత్సా! (ఆశ్రమ. 1-172)**

**క. హృదయములు దలర నందఱుఁ। బ్రదక్షిణము గాఁగ నేడ్పుఁ గ్రందుటెలుఁగు లె**
**ల్ల దెసలఁ జెలఁగఁ దిరిగి త। త్పదంబులకు నెఱఁగి నంతఁ దనువులు దూలన్. (ఆశ్రమ. 1-174)**

**తే. పొగులుచును నల్ల నల్లన పురికి నరిగి। రదియు నుమ్మలికంబు ప్రోవైన యట్లు**
**చూడఁ గూడక యుండంగఁ జొచ్చి రాత్మ। మందిరము లందఱును బుధమాన్యచరిత! (ఆశ్రమ 1-176)**

**– శ్వశ్రూశ్వశు రయోః కృత్వా శుశ్రూషం వనవాసినోః**
**తపసా శోష యిష్యామి యుధిష్ఠిర కలేవరమ్ (సం.ఆశ్రమ. 17-20)**

# 13. తపోదీక్షలో ధృతరాష్ట్రుడు

అందరూ ఆగిపోయారు పురద్వారం వద్ద, పొరలివచ్చే కన్నీరు తుడుచుకుంటూ.
పాండవులు కుంతీదేవిని తీసుకువెళ్లి గాంధారి ధృతరాష్ట్రులకు అప్పజెప్పి
-'అమ్మ మీతోనే వస్తానంటున్నది' -అని పలికి అప్పగింతలు చెప్పి
ఆశీస్సులనంది, వెనకకు మరలి అంతఃపుర స్త్రీలను కలుపుకొని

దుఃఖంతో కుమిలిపోతూ హస్తిన నగరానికి వచ్చి తమతమ ఇండ్లలోకి వెళ్లారు.
విచారమంతా పోగుపడినట్లు నిశ్శబ్దంగా కానవచ్చింది కరినగరం.
పాండవులు ఇళ్లకు మరలినాక ధృతరాష్ట్రుడు, విదురుడు,
సంజయుడు, గాంధారి, కుంతీదేవి చేరుకున్నారు గంగాతీరానికి.

పుణ్యస్నానాలవీ చేసి, అగ్నులనారాధించి, అందరూ భోజనం చేసి
దర్భశయ్యలపై కూర్చున్నారు. ఆ పగలు, రాత్రి అక్కడే కాలం గడిపి
మరుసటిరోజు ఉదయాన గంగానది దాటి ఆవలి తీరానికి చేరుకుని
కురుక్షేత్రంలో ప్రవేశించి, కూర్చున్నారు దగ్గరలో ఉన్న చెట్టునీడన.

సమీపాన నివసిస్తున్న కేకయ వంశపు రాజర్షి శతయూపుడు
ధృతరాష్ట్రుని ఆహ్వానించాడు తన ఆశ్రమానికి. ఆ ఆశ్రమంలో
తమకై విదురుడు, సంజయుడు నిర్మించిన పర్ణశాలలో ఉండి
ధృతరాష్ట్రుడు తీవ్రమైన తపస్సు చేస్తూ పొందినాడు నూతన కాంతిని.

---

క. స్నానాదిక విహితాను । ష్ఠానంబులు నడపి శ్రుతి విశారద భూదే
వానీక ప్రణయనమున । మానిత రుచి వెలుఁగుచున్న మహితాగ్నులకున్ (ఆశ్రమ. 1-178)

క. కని గారవంబునం దో । డ్కొని చని యర్ఘ్యాది విధు లకుంఠితవినయం
బున నడపిన నయ్యాశ్రమ । మున నతఁడు వసింపఁగోరె భూపవరేణ్యా! (ఆశ్రమ. 1-181)

క. కోరిన విదురాదులు నా । కౌరవపతితలఁపు మేలుగాఁ గొని తగ న
చ్చేచరువను బర్ణశాలలు । వే రచియించి రుచితంపు విధమున నధిపా! (ఆశ్రమ. 1-182)

శా. ఆశాపాశ విమోచనోపకరణ వ్యాకోచహృద్ధామ! సం
క్లేశో త్తారక దివ్యనామ! వర దృగ్లీలాప్త నిస్సీమ ల
క్ష్మీ శుంభ త్సురలోక చక్రపరశుచ్ఛిన్నా సురానీక! వి
ద్యాశోభా స్ఫురణాకృతీ! శమదమానంతర్య భాస్వత్కృతీ! (ఆశ్రమ. 1-184)

- కథాంతరేతు కస్మింశ్చిద్ దేవర్షి ర్నారదస్తతః
కథామిమామకథయత్ సర్వ ప్రత్యక్ష దర్శివాన్ (సం.ఆశ్రమ. 20-5)

# ✤ 15. ఆశ్రమవాస పర్వము - ద్వితీయాశ్వాసము ✤

## 14. ధృతరాష్ట్రుని దర్శించిన నారదాది మునులు

తీవ్రమైన తపస్సు చేస్తున్న ధృతరాష్ట్రుడిని చూడడానికి వచ్చారు
నారదుడు, పర్వతుడు, దేవలుడు, మౌంజాయనుడనే మహర్షులు.
కుంతీదేవి వారికి అతిథి సత్కారాలు చేసి గౌరవించింది గొప్పగా.
నారదుడన్నాడు ధృతరాష్ట్రునితో– సహస్రచిత్యుడు శతయూపుడి తాత

సహస్రచిత్యుడు, పృషధ్రుడు, భగదత్తుడి తాత శైలాలయుడు
మాంధాత కొడుకు పురుకుత్సుడు ఈ ఆశ్రమంలోనే తపస్సు చేసారు.
నీవు, గాంధారి ఉత్తమ గతులను పొందుతారు; కుంతీదేవి
చేరుకుంటుంది తన భర్త పాండురాజును; విదురుడు ప్రవేశిస్తాడు

ధర్మరాజు దేహంలో; సంజయుడు చేరుకుంటాడు స్వర్గలోకం–
నారదాది మునులు అందరినీ ఆశీర్వదించినారు; ప్రశంసించినారు.
అంతటి తీవ్రమైన తపస్సు చేస్తున్నందుకు ధృతరాష్ట్రుడిని,
నీకు కుబేరుడితో మైత్రి దక్కుతుందని పలికి వెళ్లిపోయారు–

అక్కడ పాండవులు హాయిగా ఉండలేకపోతున్నారు హస్తినలో.
సమస్త సంపదలున్నా సంతాపం ఎక్కువై నశించింది సంతోషం.
పాండవులలో రాజతేజం క్షీణించి, మానసిక వ్యధ ఎక్కువైంది
ఆ విషాదపు చీకటి మధ్య వారికున్న ఆశాదీపం 'పరీక్షిత్తు'

---

సీ. పాండుపుత్త్రులు తల్లిఁ బలుమఱుఁ దలఁతురు । వగతురు, ధృతరాష్ట్రువలన సుబల
నందన దెసను మనంబిడి; చింతింతు । రట్ల పౌరులు వంత నారఁ గూరి
'వృద్ధుండు ధృతరాష్ట్రవిభుఁడు సుఖార్హుఁడు । విగతజనం బైన విపినభూమి
నెత్తెఱంగున వసియించు? గాంధారియుఁ । గుంతియు నత్యంత కోమలాంగు

తే. లడవి నుండంగ నెట్లోర్తు రకట! యిట్టి కొడుకులను రాజ్యసౌఖ్యంబు విడిచి యట్లు
సనునె యక్కుంతిభోజుని తనయ? జనని । దొఱఁగిపోవుట కెంత గుందుదురొ వీరు! (ఆశ్రమ. 2-12)

ఉ. వారలఁ జూడఁ బోఁ దగు నవశ్యము దుర్దశ పుట్టకుండ మున్
మీ'రని చెప్ప నప్పుడు సమీపమునం జెవి దార్చి నెవ్వగం
గూరుచు నున్న ద్రౌపది యగుం గరణీయము బంధు దుఃఖ సం
తారక! మీకు నీతఁ డుచితంబుగఁ జెప్పిన కార్య మెమ్మెయిన్. (ఆశ్రమ. 2-24)

తే. గొంతి కోడండ్రు రెల్లను గురువరేణ్య! । యెత్తినడుగుల నున్నవా రత్తపస్వి
నీ వరిష్ఠ దర్శింపంగఁ బోవఁ గోరి । యనియె నట్టు లయ్యిరువురు నాడుటయును. (ఆశ్రమ. 2-25)

# 15. యుధిష్ఠిర సార్వభౌముడి ఆశ్రమ సందర్శనం

అందరి మనస్సులలో– గాంధారీ ధృతరాష్ట్రులెలా ఉన్నారో, అమ్మ కుంతీదేవి
ఎన్ని కష్టాలు పడుతున్నదో, విదుర సంజయులు ఎలా ఉన్నారో అన్న వేదనే!
సహదేవుడన్నాడు– 'అమ్మని చూడాలని ఉంది' –అతడి మాటతో
అందరిలో చలనం వచ్చింది, బంధుజన సహితంగా బయల్దేరినారు

నగర బాధ్యతలు యుయుత్సుడు, కృపుడు, ధౌమ్యులకు అప్పజెప్పి.
భీముడు గజబలంతో, అర్జునుడు రథబలంతో, నకులుడు
అశ్వసేనతో, సహదేవుడు కాల్బలంతో బయల్దేరగా
గొడుగులు జెండాలు ధ్వజాల కాంతులతో కళ్లు చెదిరే విధంగా.

ద్రౌపదీ ప్రముఖ వధూజనములు పల్లకీలలో, బంగరు బండ్లలో రాగా,
ధర్మరాజు వివిధ మణులతో ప్రకాశించేది, నల్లని తోకలు
కలిగిన తెల్లటి గుర్రాలు పదహారు లాగుతున్న గొప్ప రథంలో
ముత్యాల మాలలు కలిగిన గొడుగులు ప్రకాశిస్తూ ఉండగా

వేణు వీణా రవంబులు, వివిధ గాన నాదములు, పాఠకారావ
మేదురంబులు, వంది బృందముల స్తోత్ర గానములు నలుదిక్కుల
వ్యాపించ, పౌరులు రకరకాల వాహనాలెక్కి అనుసరించగా ప్రవేశించాడు
గంగానదిని దాటి కురుక్షేత్రంలోని శతయూప ఆశ్రమం వద్దకు.

---

**సీ. ఏనికగములతో నేతెమ్ము నీ వని । బాహుదర్పోజ్జ్వలుఁ బవనతనయుఁ**
**దేరులగమి చెలువారు నీచే నని । దేవసమాను గాండీవధరుని,**
**గుఱ్ఱపు దళముల కొమరు వీ కలవడు । నని చారుతను మనోహారు నకులు!**
**గాల్బల మమరు నీ కలిసి వచ్చుట నని । సన్నుతచేష్టితుఁ బిన్నతమ్ము!**

**తే. బనిచె; వార లమ్మెయిఁ దూర్య నినద మెసఁగ । నాతపత్రావళి ధ్వజవ్రాత కలిత**
**రత్నరోచులు రోదోంతరంబు నిండ । నురుగుదెంచిరి వైభవ మతిశయిల్ల. (ఆశ్రమ. 2-27)**

**తే. వేణువీణారవంబులు వివిధ గాన । నాదములుఁ బాఠకారావ మేదురంబు**
**లగుచు వంది బృందముల వాక్యాలి బెరసి । దిశలు దీటుకొనంగఁ బ్రదీప్తలీల. (ఆశ్రమ. 2-29)**

**వ. వెడలెఁ వివిధ వాహనారూఢు లయి పౌరు లప్పూరువంశవరు ననుగమించిరిత్తెఱంగున మెఱయు మహిమ సుజ్జ్వలుం డగుచుం జని భాగీరథి యుత్తరించి పాండవోత్తముండు కురుక్షేత్రంబు ప్రవేశించి చనుచుండ. (ఆశ్రమ. 2-30)**

**– తతస్తే పాండవా దూరాత్ అవతీర్య పదాతయః**
**అభిజగ్ముర్నరపతేః ఆశ్రమం వినయాన తాః (సం.ఆశ్రమ. 24-1)**

# 16. వచ్చిన వారెవరు?

అరటిచెట్లతో అందంగా ఉన్నది, వివిధ మృగాలతో నిండి ఉన్నది
ఆ శతరూప ఆశ్రమం వద్ద రథం దిగి 'మా తండ్రి ఎక్కడ' అని అడుగుతూ
వెళ్తుండగా, యమునా నదిలో స్నానం చేసి వస్తున్న ధృతరాష్ట్రుడిని,
గాంధారిని, కుంతీదేవిని చూసారు, సహదేవుడు పరిగెత్తుకుని వెళ్లి

కుంతీదేవి పాదాలపై పడి ఏడ్వగా అతడిని లేవదీసి గట్టిగా పొదుపుకుని
సహదేవుడు వచ్చాడని గాంధారి ధృతరాష్ట్రులతో చెప్పింది కుంతీదేవి
ధర్మజ భీమ అర్జున నకులులు వెళ్లి తల్లికి, గాంధారి ధృతరాష్ట్రులకు ప్రణమిల్లారు.
పాండవ స్త్రీలందరూ కుంతీదేవి, గాంధారిలకు నమస్కరించి ఆశీస్సులు పొందినారు.

ధర్మరాజు సతీసోదర సమేతంగా వచ్చాడని తెలిసి ఆశ్రమవాసులు రాగా
సంజయుడు వర్ణిస్తున్నాడు– మేలిమి బంగరు శరీరం, సన్నగా ఉండి
సింహంలా కానవస్తున్నది ధర్మరాజు; ఎరుపు రంగు శరీరం, ఎత్తూ దృఢంగా
విశాల వక్షస్థలుడైనవాడు భీముడు; నల్లటిశరీరం పద్మాల కనుదోయి

గజేంద్రుడిలా ఉన్నవాడు అర్జునుడు; అత్యంత సుందరులు కుంతీదేవికి
ఇరువేపులా విష్ణువు, ఇంద్రుడిలా ఉన్నవారు నకుల సహదేవులు.
నల్లకలువ రంగు పద్మనయని ద్రౌపది, ఎర్రని శరీరం పద్మవదని సుభద్ర
మేలిమి బంగరు రంగున్న యువతి ఉలూచి, ఇప్పపూవులా ఎర్రనిది చిత్రాంగద.

---

**ఉ. తారక శోభితాంబర విధంబునఁ బొల్పెసఁగంగ నాశ్రమో**
**దారతలంబు బంధుజనతాకలనంబునఁ దాను జంద్రు నొ**
**ప్పార వహించి విస్ఫురితుఁడై తనరెం గురుభర్త వచ్చి ర**
**చ్చేరువఁ గల్గు తాపసులు చెచ్చెరఁ బార్థులఁ జూచు వేడుకన్. (ఆశ్రమ. 2-38)**

**సీ. 'జాంబూనదచ్ఛాయ చందంబు వర్ణంబు । గలిగిన పలుచని గనప మేను,**
**నుచిత దీర్ఘత్వ సమున్నత ఘ్రాణంబు । నిడుదలైన విశాల నేత్రములును,**
**గంటీరవంబు రేఖయు నొప్పఁ జూడ్కికి । నెంతయు వ్రేఁగైన యితఁడు ధర్మ**
**తనయుఁ; డెఱ్ఱదనంబుఁ దనరిన మూఁపులు । నాయత స్ఫీతంబు లైన బాహు**

**తే. వులును వెడందయురంబు నై పొలుచు నితఁడు । భీముఁ; డుజ్జ్వల సుందర శ్యామ తనువు**
**వారణేంద్రు కైవడియును, వారిజముల । యట్టి కనుదోయిఁ గల యితం డర్జునుండు. (ఆశ్రమ. 2-40)**

**- తతస్తే బాష్ప ముత్సృజ్య గాంధారీ సహితం నృపమ్**
**ఉపత స్థుర్మహాత్మానః మాతరం చ యథావిధి (సం.ఆశ్రమ. 24-14)**

# 17. విదురుడి దర్శనం

సంజయుడు చెబుతున్నాడు- నల్లకలువల కాంతితో కనబడుతున్నది
భీముడి భార్య వలంధర కాశీరాజు కుమార్తె; కొత్తసంపెంగ వర్ణంతో
అలరారే పద్మాక్షి సహదేవుడి భార్య విజయ-మద్రభూపతి కూతురు;
నీలికలువలా ప్రకాశిస్తున్నది నకులుడి భార్య 'కరేణుమతి'-శిశుపాలుడి పుత్రిక.

తెల్లటి వస్త్రాలు ధరించినవారు ధృతరాష్ట్రుని కోడళ్లు; ఆమె ఉత్తర
అభిమన్యుడి భార్య- సుభద్ర పక్కనే ఒదిగి కూర్చుని ఉన్నది తన కొడుకుతో-
ధృతరాష్ట్రుడు ఆప్యాయంగా అందరినీ పలకరించాడు, ఆదరించాడు.
ధర్మరాజును హస్తినాపుర విషయాలను అడిగి తెలుసుకున్నాడు.

ధృతరాష్ట్రుడన్నాడు- కుంతీదేవి మా దంపతులకు అమరుస్తున్నది కావలసినవన్నీ.
సంజయుడు బుద్ధిమంతుడు, తపస్సు చేస్తాడు, మమ్మల్ని కాపాడతాడు.
విదురుడు నీళ్లు గాలి మాత్రమే సేవిస్తూ ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు.
ఒక్కోసారి ఇక్కడా కనబడతాడు అనగా అల్లంత దూరంలో కనిపించాడు-

కాంతారధూళి మలినాంగుడు, జటీభూత కేశపాశుడు, దిగంబరుడు-
విదురుడటు వచ్చి జనముల జూచి వెనక్కి వెళ్లిపోతుండగా, ధర్మరాజు
అతడి వెనక పరిగెత్తాడు తన వెంట ఎవరూ రావద్దని చెబుతూ.
-'ఓ విదురా! నిలునిలు, నేను యుధిష్ఠిరుడను, నిన్ను గాన వచ్చితిని'-

**తే.** **సుందరాకారమునఁ దమ కెందు సదృశు । లొరులు లేమి తెల్లంc బగుచుండ గొంతి**
**యుభయ పార్శ్వంబు లందుఁ గూర్చున్న విష్ణు । శతమఖోపముల్ వినయభూషితులు కవలు.** (ఆశ్రమ. 2-41)

**సీ.** **నీలోత్పల చ్ఛాయఁ బోలు మై చాయయు, । నవపద్మదళములఁ దెవడు మెఱుఁగుఁ**
**గనుదోయి, మధ్యాత్వమునకుఁ బ్రవేశించు । ప్రాయంబు, నత్యభిరామ మూర్తి**
**యలవడఁ గైకొన్న యతులిత సంపద । చందంబు దోఁపించు చారుగౌర**
**వంబును గలుగు నివ్వనిత పాంచాలి; యి । య్యింతి పార్శ్వమునఁ గట్టెట్టి మేను**

**తే.** **వనజ సన్నిభ ముఖమునై యినుని మహిమ । యజ్జ్వలాకృతి దాల్చినట్లున్న యీ ల**
**తాంగి నారాయణుని చెలియలు సుభద్ర । నరుని వల్లభ సంయమినాథులార!** (ఆశ్రమ. 2-42)

**ఆ.** **వీరి కెలనఁ గనక గౌర మధూకాభ । తనువు లొప్పుచున్న వనిత లురగ**
**పాండ్య సుతలు, నరుని భార్య; లులూపి చి । త్రాంగద యనఁ బరఁగ నాహ్వాయములు.** (ఆశ్రమ. 2-43)

కురుక్షేత్ర యుద్ధం తరువాత 15 సంవత్సరాలు హస్తినలో, మూడేళ్లు ఆశ్రమవాసంలో గడిపారు ధృతరాష్ట్రుడు, గాంధారి దంపతులు.

# 18. కోరుదురు యుద్ధ మృత బంధుకోటిన్ చూడ-

అతడు వస్తాడనే ఇతడు వచ్చాడు, ఇతడు వచ్చాక అతడు ఆగినాడు
అతడు ఆగిన చోటుకు ఇతడు వెళ్లాడు, ఇతడు వెళ్లగానే అతడు చూసాడు.
ఇతడిప్పుడు సర్వంసహా సార్వభౌముడు, అతడు సర్వం త్యజించిన యోగి
అతడు నిజశరీరాన్ని త్యజించి ఇతడి శరీరంలోకి ప్రవేశించాడు తేజోమయుడై

ధర్మరాజు శరీరానికి కాంతి శక్తి బుద్ధి అధికమై మరింత వెలిగాయి.
విదురుడి శరీరం చలించలేదు, నిద్రలో వాలినట్లున్నది, ఏ మార్పూ లేదు.
అగ్నికార్యం చేద్దామనుకున్నాడు ఆ పార్థివ శరీరానికి, వినిపించింది ఆకాశవాణి-
'యతి శరీరానికి దహన సంస్కారాలు చేయరాదు. అక్కడే వదిలి వెళ్లుము'-

ధర్మరాజు ఆశ్రమానికి తిరిగి వచ్చి ఆ అద్భుత ఘటన వివరించాడందరికీ.
అందరూ కందమూలాలు పండ్లూ తిని శయనించారు కటిక నేలపై హాయిగా
ఉదయాన లేచి ధర్మరాజు తన సోదరులతో కలిసి ఆశ్రమం అంతా తిరిగి
ప్రాతః కాల విధులొనర్చి ధృతరాష్ట్రుని సందర్శించి కూర్చున్నాడు శాంతిగా.

పాండవులా ఆశ్రమంలో ఉన్నప్పుడే వ్యాసమహర్షి వచ్చాడు- మాండవ్యముని
శాపంతో యమధర్మరాజు శూద్ర యోనిలో జన్మించి విదురుడైనాడని పలికి
జ్యోతిరూపంగా ధర్మరాజులో ప్రవేశించాడని తెలిపి ఆశ్చర్యపరచాడు-
ధృతరాష్ట్రుడిని వరం కోరుకొమ్మనగా- యుద్ధంలో మరణించినవారిని చూపుము, తండ్రీ!

---

**సీ.** ధర్మతనూజుండు తత్సమీపంబున । కేఁగి యయ్యోగి కట్టెదుర నిలిచి
యాతండు నయనంబు లర్ధమీలితములై । యుండంగ నూరక యున్నఁ గాంచి
'నిర్మలాత్మక! యేను ధర్మసూనుఁడ; నన్నుఁ । గనువిచ్చి చూడవే!' యనుడు నతఁడు
ఱెప్పల నెగయించి యప్పాండవోత్తముఁ । దప్పక చూచి యుదాత్త యోగ

**తే.** బలము గైకొని యింద్రియములను బ్రాణ । ములను నింద్రియములుఁ బ్రాణములను గలిపి
నిజశరీరంబు విడిచి యా నృపతి తనువు । సొచ్చెఁ దేజోమయత్వవిస్ఫూర్తి మెఱయ. (ఆశ్రమ. 2-60)

**ఆ.** వినుము ధర్మపుత్రు తనువునఁ గాంతియు । లావు నప్పు దగ్గలంబు లయ్యె,
నొలసె బుద్ధి యధిక బల; మట్టు లగు టతఁ । డెఱిఁగి చోద్యమంది యెలమి నొందె. (ఆశ్రమ. 2-61)

**క.** తదనంతరంబ యప్పతి । విదురశవము ద్రాను సెంది వికృతరహితమై
నిదురమెయి నొఱిగియున్న ప । గిది నుండం జూచి యగ్నికృత్యము నడపన్. (ఆశ్రమ. 2-62)

**-** విదురస్య శరీరం తు తథైవ స్తబ్ధలోచనమ్
వృక్షాశ్రితం తదా రాజా దదర్శ గత చేతనమ్ (సం.ఆశ్రమ. 26-28)

# 19. ఎవరు ఎవరి అంశ?

గాంధారి అడిగింది, కుంతీదేవి గుర్తు చేసింది కర్ణుని కథను వ్యాసమహర్షికి
–'లోకము ఆశ్చర్యము పొందగా చూపవే మృతులను విచిత్రపు మహిమతో మాకు'
వ్యాసుడన్నాడు– 'భారతయుద్ధం కొరకే పుట్టి గిట్టినవాళ్లు వీళ్లందరూ.
ధృతరాష్ట్రుడనే గంధర్వరాజు ధృతరాష్ట్రుడిగా, మరుత్తుల అంశతో పాండురాజు;

ధర్ముడు–ధర్మరాజుగా, వాయువు భీముడిగా, నరుడు అర్జునుడిగా,
నారాయణుడు కృష్ణుడిగా, అశ్వినిదేవతలు నకుల సహదేవులుగా
ద్వాపరం శకునిగా, కలిపురుషుడు దుర్యోధనుడిగా, సూర్యుడు కర్ణుడిగా
అభిమన్యుడు చంద్రుడిగా, రాక్షసుల అంశతో దుశ్శాసనాదులుగా

అగ్ని ధృష్టద్యుమ్నుడై, వాయువు అంశతో శిఖండి, బృహస్పతి ద్రోణుడిగా
అష్టమ వసువు గాంగేయుడైన భీష్ముడిగా, రుద్రాంశతో అశ్వత్థామ
ఇలా దేవతల రాక్షసుల అంశలతో అనేకురు జన్మించారు, మరణించారు.
మీ మనసులో దుఃఖం పోయేట్లు చేస్తాను, గంగానది వద్దకు రాగలరు'–

నగర వాసులు, పల్లెవాసులు, మునులు, ధృతరాష్ట్రాదులూ చేరుకున్నారు
గంగాతీరం. మరుసటిరోజు ఉదయం 'మృతుల సందర్శన దినం'గా వ్యాసమహర్షి
ప్రకటించగా ఆ రాత్రి ఎవరూ సరిగా నిద్రపోలేదు, వంద సంవత్సరాల పెట్టుగా
నిరీక్షించారు, తెల్లవారింది, అందరూ శుచులై వచ్చి గంగానదీ తీరాన నిలబడినారు.

**సీ.** **ధృతరాష్ట్రుఁ డనఁగ వర్తిల్లెడు మేటి గం । ధర్వుఁడీ ధృతరాష్ట్రధరణివిభుఁడు**
**తన్వి! పాండుఁడు మరుద్గణ మయజని; ధర్మ । దేవత సూవె యుధిష్ఠిరుండు;**
**పవనుండు భీముఁడై ప్రభవించె; నరుఁ డను । ముని యర్జునుం డయి జనన మొందె.**
**నారాయణుఁడు గృష్ణనాముఁడై జనియించెఁ; । గనుఁగొను కవల నాశ్వినులు గాఁగ;**

**తే.** **ద్వాపరంబుగ నెఱుఁగు గాంధార రాజు; । గలి సుయోధనుఁ డయ్యె; రాక్షసులు పుట్టి**
**రతని యనుజులై; కర్ణుని నరుణకిరణుఁ । గాఁగ; నభిమన్యుఁ జంద్రునిఁ గాఁగఁ గనుము. (ఆశ్రమ. 2-111)**

**సీ.** **సాత్యవతేయుండు జాహ్నవీసలిలావ । గాహన మొనరించి గారవమున**
**నింపారు నెలుఁగున 'నిందు రం' డనవుడు । నీ కేమి సెప్పుదు? నీటియందు**
**రవ మగ్గలముగ రారాజుఁ దమ్ములుఁ దత్కు । మారవర్గము నభిమన్యుఁ డాది**
**యగు పాండుపౌత్రులు నర్కజుండును బాహ్లి । కప్రముఖాఖిల కౌరవులును**

**తే.** **ద్రుపదమాత్స్యులు వారి బంధులును శకుని । యును దదీయానుజులును నాతని తనూజ**
**రాజియును భీష్మగురులఁ బురస్కరించి । కొనుచుఁ దమదివ్యదేహముల్ కొమరు మిగుల. (ఆశ్రమ. 2-118)**

# 20. మృతుల దర్శనం

వ్యాస మహర్షి గంగానదిలో దిగినాడు, జలంలో మునుకవేసి మంత్రిస్తూ-
'భారత యుద్ధంలో మృతులైన వీరులారా! రండి' -అన్నాడు తియ్యని గొంతుతో.
నీళ్లలో వినబడసాగింది పెద్ద చప్పుడు- అందరికి కనిపిస్తున్నారు స్పష్టంగా.
వారివారి బంధువులు, దుర్యోధనుడు అతడి సోదరులు, ధృతరాష్ట్రుని కుటుంబం.

అభిమన్యుడు, ఉపపాండవులు, పాండురాజు కుటుంబం, కర్ణుడు, బాహ్లికుడు
ద్రుపదుడు, విరాటుడు, ధృష్టద్యుమ్నుడు, ఉత్తరుడు, శకుని, అతడి
కొడుకులూ, సోదరులూ, భీష్ముడు, ద్రోణుడు అందరూ ఆ పవిత్ర జలాల్లో-
వారిని చూసేందుకు ధృతరాష్ట్రునికిచ్చాడు వ్యాసమహర్షి దివ్యదృష్టిని

గాంధారి కూడా తన కన్నులకు కట్టుకున్న వస్త్రాన్ని తొలగించి చూసింది.
దివ్య స్వరూపాలతో వెలుగొందుతున్న తన కుమారులను చుట్టాలను మిత్రులను
ఆ రోజల్లా వాళ్లందరూ వీళ్లందరితో కలిసి తిరిగారు, ముచ్చట్లాడినారు
దివ్యదేహులు, మానవ శరీరాలున్నవారూ, మెలిగారు పరస్పర మైత్రితో.

మరుసటిరోజు ఉదయం వ్యాసుడన్నాడు - భర్తలను అనుసరించదలచిన
వారు నీటిలో దిగండి అనగా వాళ్లు పెద్దల అనుమతి తీసుకుని గంగలో మునిగి
దివ్యదేహులై తమతమ భర్తలననుసరించగా అందరూ ఆశ్చర్యపడినారది చూసి.
మిగిలినవారందరూ ఆశ్రమానికి చేరుకున్నారు, అక్కడ నెలరోజులున్నారు పాండవులు.

---

**ఆ.** **దివ్య మాల్యములును దివ్యాంబరంబులు । దివ్య భూషణములు దివ్యలేప**
**నములుఁ జెన్నుఁ జేయఁ దమ మిత్త్ర సుభటసం । దోహములును దారుఁ దోఁచి రధిప! (ఆశ్రమ. 2-119)**

**క.** **తగ నా కురువృద్ధునకు నా । సఁగె నాఁటికి నెల్లదృష్టి సాత్యవతేయుం**
**డగణితతపఃప్రభావం । బు గని యధిక విస్మయంబుఁ బొందఁగ జనముల్. (ఆశ్రమ. 2-121)**

**క.** **అవ్విధమునఁ దోఁచిన మతి । నవ్వుచుఁ దెగడుచును బెరసి నరవర! పగ లే**
**కవ్వీరవరులు నెయ్యము । నివ్వటిలఁగ విలసనములు నెఱయ మెఱయఁగన్. (ఆశ్రమ. 2-123)**

**-** **తదద్భుత మచింత్యం చ సుమహల్లో మహర్షణమ్**
**విస్మితః స జనః సర్వః దదర్శా నిమిషే క్షణః-**

**-** **తదుత్సవ మహోదగ్రం హృష్ట నారీ నరాకులమ్**
**ఆశ్చర్య భూతం దదృశే చిత్రం పటగతం యథా (సం.ఆశ్రమ. 32-19,20)**

---

**మృతుల దర్శనం :** భారతంలోనే కాక హోమర్ వ్రాసిన ఒడిస్సీ (Odyssey)లో, వర్జిల్ వ్రాసిన ఈనీడ్ (Aeneid)లో కనిపిస్తుంది. వ్యాసమహర్షి దీనిని ప్రియసంగమోత్సవంగా వర్ణించాడు.

# 21. దావాగ్ని మధ్య ఆ ముగ్గురూ

ప్రియ సంగమోత్సవానంతరం పాండవులు, ధృతరాష్ట్రాదులు వెళ్లారు ఆశ్రమానికి
మొత్తం నెలరోజులుండి వారు పెద్దల ఆశీస్సులతో చేరుకున్నారు హస్తినకు,
కొన్నాళ్లు గడిచాయి ప్రశాంతంగా పాండవులకు హస్తినాపురిలో హాయిగా
ఒకరోజున వచ్చాడు నారదమునీంద్రుడు ధర్మరాజు వద్దకు, కుశలమడిగాడు.

పాండవులచే పూజలనందినవాడై అన్నాడు- పుణ్యతీర్థాలు సేవించి
కురుక్షేత్రం వెళ్లాను, అక్కడ ధృతరాష్ట్రాదుల గురించి విన్నాను-
ధర్మరాజా, ఒకరోజున ధృతరాష్ట్రుడు నియమనిష్ఠలతో, సంజయుడు
గాంధారీ, కుంతీ వెంటరాగా, అగ్నులు తీసుకుని ఋత్విక్కులు వస్తుండగా

-నారదుడు అలా చెబుతున్నపుడే ధర్మరాజు, అతడి సోదరుల ముఖాలు
కళ తప్పినాయి, శరీరాలు కంపిస్తున్నాయి- పెదాలు వణకసాగినాయి-
నారదుడు చెబుతున్నాడు- ధృతరాష్ట్రుడు ఆశ్రమాన్ని వదిలి ప్రవేశించాడు
అరణ్యంలో, గాలి ఆహారంగా ధృతరాష్ట్రుడు, నీళ్లు ఆహారంగా గాంధారి

నెలకొకసారి భోజనం చేస్తూ కుంతి, ఏడుపూటలకొక పర్యాయం తింటూ
సంజయుడు తపస్సు చేశారు. ఒకరోజున వాళ్లందరూ గంగాస్నానం
చేసి వస్తుంటే చెలరేగింది దావానలం. అగ్ని చుట్టుముట్టింది వాళ్లను
సంజయుడిని పంపివేసి ఆ ముగ్గురూ తూర్పు ముఖంగా కూర్చున్నారు యోగముద్రలో-

---

**సీ.** ఆ రాజు నియతి గాంధారియు గొంతియు । సంజయుండును దోన చనఁగ నగ్ని
హోత్రంబు గొని యాజకోత్కరం బగ్రేస । రంబయి పో నిజాశ్రమము విడిచి
యరిగి గంగాద్వార పరిసరారణ్య భా । గమునకు; నందు దుష్కరతపంబు
వాయుభక్షతఁ బూని చేయఁ దొడంగె; గాం । ధారియు నీళ్ళ నాహారకలన

**తే.** మోపి యొనరించె; గొంతి మాసోపవాస । నియమ మూఁది వర్తించె; సంజయుఁడు సప్త
భోజనాంతరితం బగు భోజనంబు । వ్రతము గాఁగఁ జరించెఁ గౌరవముఖ్య! (ఆశ్రమ. 2-148)

**సీ.** పటుతరం బగు ఛటచ్ఛటరవ మెసఁగంగ । బ్రాఁకులుఁ బొదలును గాఁచికొనుచుఁ
గమరున నార్తనాదంబును బెల్లుగ । నఖిలమృగంబుల నాఁచికొనుచు
లాఁగలఁ బుట్టల లోఁగిన శిఖల భు । జంగమ కులముల మ్రింగికొనుచు
వెగడొంది యఱచుచు నెగయు బల్పులుఁ గులఁ । బొగ నూర్ధ్వకీలలఁ బొదివి కొనుచు

**తే.** దెసల నన్నిటఁ దన సముదీర్ణగతులు । దారుణ స్ఫురణమున విస్తార మొంద
ఖేచరులకును భయముగ నేచి పరఁగె । నద్భుతోద్భవం బైన మహానలంబు. (ఆశ్రమ. 2-151)

# 22. తిలోదక ప్రదానం

పటుతరంబగు చటచ్చటరవ మెసగంగ, మ్రాకులు పొదలు మండగా
సమస్త జంతువులను కాలుస్తూ, పాములను బొరియలలోనే మింగుతూ
భయంతో పారిపోతున్న పక్షులను జ్వాలానాలుకలతో మంటలలోకి లాక్కుంటూ
భీకరంగా శబ్దిస్తూ దావానలం చుట్టుముట్టింది వారిని అత్యంత వేగంగా.

ధృతరాష్ట్రుడి ఆజ్ఞతో సంజయుడు వీలు చేసుకుని అడవి దాటి వెళ్లాడు మంచుకొండ వేపు.
గాంధారి, కుంతి యోగముద్రలో కూర్చున్నారు ధృతరాష్ట్రుడు సూచించినట్లు
-మనోవ్యాపారాలను నిరోధించి జీవాత్మను పరమాత్మతో కలిపారు వాళ్లు.
దావాగ్ని వాళ్లను తనతో కలుపుకున్నది, వారు మరణించారు యోగులుగా.

ధృతరాష్ట్రాదుల మరణ వార్త విని హస్తినాపురం శోకసముద్రమైనది.
ధర్మరాజాదులు గాంధారి ధృతరాష్ట్రులను, తమ మాతృమూర్తి కుంతిని
తలచుకుని మిక్కిలిగా దుఃఖించారు; అంతఃపురం నిండిపోయింది
శోకాలతో; క్రమేపీ దుఃఖముపశమించగా తేరుకున్నారు పాండవులు.

-ధృతరాష్ట్రుడు అగ్నుల నుంచి సెలవు తీసుకునగా వాటిని ఋత్విక్కులు
అడవిలో వదిలి వెళ్లిపోయారు. అవి ప్రజ్వలించి దావాగ్నిని సృష్టించాయి.
ధృతరాష్ట్రుడు స్వీయాగ్నిలోనే దగ్ధమైనాడు -అన్నాడు నారదుడు.
ధర్మరాజు ధృతరాష్ట్రాదులకు తిలోదక ప్రదానం చేసి శ్రాద్ధక్రియలు చేసాడు గొప్పగా.

---

సీ. 'ఒక్కింత దెలిపి నీ వెక్కడ నైనను । గనుఁగొని పా మ్మగ్ని దనుకకుండ'
నని చెప్పి తలఁగిపోఁ దనకు గాంధారికిఁ । గుంతిభోజాత్మజకును నశక్య
మగుటయుఁ జెప్పిన నడలొంచి యా సూత । సుతుఁడు 'మీరును నొకచోట వెడలి
పోవుట గలిగినఁ బోదు గా కే దవా । గ్నికి మిమ్ము నెర చేసి యకట పోదు

ఆ. నే మహాత్మయనుడు 'నిలువాసి యిట్లున్న । జనుల కివ్విధమున సమయు టెగ్గు
గాదు; నీకుఁ బోవఁగా వచ్చి యుండంగఁ । బోవ కునికి పాపమునకుఁ బట్టు.' (ఆశ్రమ. 2-153)

ఆ. ఒక్కతెఱపి సంజయుఁడు సని హిమశైల । మెక్కె; నంత వారి నెల్ల నగ్ని
వొదివికొనియె; నిట్లు వోయి రమ్మువ్వురుఁ । బుణ్యలోకమునకు భూపవర్య! (ఆశ్రమ. 2-155)

క. విని పౌరజనసమూహము । లనయంబును వనట మునిఁగి హాహారవముల్
వినువీథి ముట్ట రోదన । మొనరిచె నవ్వేళఁ గరుణ ముత్కట మయ్యెన్. (ఆశ్రమ. 2-158)

- తతః స పృథ్వీ పాలః దత్త్వా శ్రాద్ధా న్యనే కశః
ప్రవివేశపురం రాజా నగరం వారణాహ్వయమ్ (సం.ఆశ్రమ. 39-21)

# 23. అంత్యక్రియలు

నియమానుగుణంగా పాండవులు ఏకవస్త్ర ధారణ చేసి పురప్రజలు వెంటరాగా
గంగలో స్నానం చేసి, నివాసం చేస్తున్నారు పట కుటీర ప్రకరంబులలో
హస్తినాపురం వెలుపల మృతశౌచం తొలగేంత వరకూ అందరూ ఉండి
ధృతరాష్ట్రాదుల అస్థికలను గంగాద్వారంలో జల నిమజ్జనం చేసారు.

ధర్మరాజు పంపగా ఉత్తములైన వ్యక్తులు, అంత్యక్రియలవీ చేసినారు మృతదేహాలకు
పండ్రెండవ రోజున ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతీదేవిలనుద్దేశించి
రత్నాలూ బంగారము గోవులు గుర్రాలు ఏనుగులు కన్యలు భూమి ఇళ్లూ
మొదలైన దానాలతో పరలోక సాధనాలైన ఉత్తర క్రియలను చేసాడు శ్రద్ధగా ధర్మజుడు.

శ్రాద్ధం రోజున శతయూపాది మునులు, చుట్టాలు వచ్చారు అనేకులు
కొండలంతటి అన్నరాసులతో, నేతి ప్రవాహాలతో ప్రకాశించింది పితృమేధం.
ఆ పండ్రెండు రోజులూ నారద మహర్షి అక్కడే ఉన్నాడు వారికి అండగా.
పారలౌకిక క్రియలు పూర్తయినాక పాండవుల నాశీర్వదించి వెళ్లినాడు.

భారత యుద్ధం ముగిసాక హస్తినాపురంలో పదిహేనేండ్లు, ఆశ్రమంలో
మూడేళ్లూ మొత్తం పదునెనిమిది సంవత్సరాలు గడిచాయి.
తానే సర్వంసహా సార్వభౌముడైనా, ధర్మరాజు తన పెదతండ్రి ధృతరాష్ట్రుడే
రాజుగా ప్రజలు ప్రశంసించే విధంగా గొప్పగా పాలించాడు రాజ్యాన్ని.

---

**సీ.** **ఆంబికేయాదుల యస్థిపుంజముల గం। గాద్వార సలిల సంగమ విశిష్ట**
**సంస్కారమునఁ గూర్పఁ జాలెడు సంశుద్ధ। జనముల రావించి సబహుమాన**
**ఫణితుల వారి కప్పని యేర్పడఁగఁ జెప్పి। పనిచె నక్కౌరవ జనవిభుండు;**
**శ్రాద్ధార్హదినమున వృద్ధానుమతి నతం। డక్కురువృద్ధున కతని సతికి**

**తే.** **గొంతికిని రత్నకాంచన గోతురంగ। హస్తి కన్యా ధరిత్రీ గృహాది దాన**
**విధుల సర్వజనంబులు విస్మితులుగ। నియతిమెయిఁ బారలౌకిక క్రియ లొనర్చె. (ఆశ్రమ. 2-170)**

**ఆ.** **మునిజనములు వచ్చి యనుమోద మందంగ। సకల బంధుజనులు సంతసిల్ల**
**నన్న పర్వతముల నాజ్యనదులఁ బితృ। మేధ ముల్లసిల్లె మేదినీశ! (ఆశ్రమ. 2-171)**

**క.** **ద్వాదశ దినములు నారదుఁ। డాదరమున నొద్ద నుండి యంతయుఁ గని స**
**మ్మోదంబుతోడ నాశీ। ర్వాదం బొనరించెఁ బాండవ ప్రవరునకున్. (ఆశ్రమ. 2-172)**

**-** **యుధిష్ఠిరస్తు నృపతిః నాతిప్రీతమ నా స్తదా**
**ధారయా మాస తద్ రాజ్యం నిహత జ్ఞాతి బాంధవః (సం.ఆశ్రమ. 39-27)**





# శ్రీ ప్రసాద మహాభారతము
## అయిదవ వేదము - శాంతి సప్తకము
# 16. మౌసల పర్వము

క. అంబుజనాభుని కొడుకీ సాంబుడు గను యాదవక్షయాపాదన క
ల్యంబగు ముసలము; మావచనంబున కనృతంబులేదు; నమ్ముడు మీరల్ (మౌసల. 1-9)

క. కాలంబగుట యుఁ గురుభూపాలోత్తమ! యాదవేంద్రు పట్టణమున హృ
త్కాలుష్య సమాపాదన శాలి మహోత్పాతముల్ ప్రజాతము లయ్యెన్ (మౌసల 1-16)

తే. అరుణములు ఘూర్ణితంబులునైన లోచనములు మెరయ మహోగ్రదండము ధరించి
తిరుగు నొక్కొక్క చోటను దృశ్యుడగుచు నంతకుండి దెయదె తోచెననగ నధిప! (మౌసల. 1-17)

- వృష్ణ్యంధక వినాశయ ముసలం ఘోర మాయసమ్
వాసుదేవస్య దాయాదః సాంబో యం జనయిష్యతి (సం.మౌసల. 1-19)

- కృతాంత మన్యథా నైచ్ఛత్ కర్తుం స జగతః ప్రభుః
శ్వోభూతే థ తతః సాంబః ముసలం తదసూతవై (సం.మౌసల. 1-25)

"అతః పరం నిబోధేదం మౌసలం పర్వదారుణమ్"



| సంస్కృత మహాభారతము | కవిత్రయ మహాభారతము | శ్రీ ప్రసాద మహాభారతము |
|---|---|---|
| **16. మౌసల పర్వము**<br>(అధ్యాయాలు) | **16. మౌసల పర్వము**<br>(గద్య పద్యములు) | **16. మౌసల పర్వము (22)**<br>(పద్య శీర్షికలు) |
| అధ్యాయాలు (8) | ఏకాశ్వాసము (226) | ఏకాశ్వాసము (22) |

(Traditional &Critical Edition: ఉప పర్వాలు లేవు, అధ్యాయాలు–9)

# ✧ 16. మౌసల పర్వము - ఏకాశ్వాసము ✧

## 1. పుడుతుందిలే ముసలం-

ధర్మరాజుకు పట్టాభిషేకమై గడచాయి ముప్పై అయిదు సంవత్సరాలు
ముప్పది ఆరవ సంవత్సరంలో కానవచ్చాయి భయంకరమైన ఉత్పాతాలు.
ఉదయకాలంలో ఇసుక తుఫానులు వచ్చి నింగిని కప్పగా చీకటి ఏర్పడి
కనిపించాయి తలలేని మొండాలు సూర్యబింబమును పరివేష్ఠించి-

మబ్బులు లేని పిడుగులు, అన్ని దిక్కులలోనూ రాలాయి అసంఖ్యాక ఉల్కలు
సూర్యచంద్రుల చుట్టూ గాలిగూడులేర్పడినాయి అతిభయంకర కాంతులతో
దట్టమైన పొగమంచు విస్తరించింది మండువేసవిలో ఆకాశమంతటా.
మునుల శాపం, గాంధారీ శాపం వాస్తవరూపం ధరించి నశించింది యాదవ కులం.

జనమేజయుడడిగాడు వైశంపాయన మహర్షిని- మునులెందుకు శపించారు
యాదవ కులాన్ని? అటువంటి పరిస్థితి ఎలా ఏర్పడింది?- మహర్షి చెబుతున్నాడు-
ద్వారకకు చాలాకాలం క్రితం కణ్వుడు, నారదుడు, విశ్వామిత్రుడు
తమ శిష్యులతో కలిసి వచ్చారు శ్రీకృష్ణుని చూడాలన్న కోరికతో

విధివశాన వృష్ణి వంశానికి చెందిన యువకులు మునులను ఆటపట్టించ తలచి
సాంబుడనే వాడికి ఆడవేషం వేసి మునుల దగ్గరకు తీసుకునివెళ్లి అడిగారు
-'అయ్యా, తమరు అన్నీ తెలిసినవారు. ఈమె బభ్రుడి భార్య, ఈమెకు పుట్టేది
మగపిల్లవాడా, ఆడపిల్లా?' మునులన్నారు కోపంతో- 'పుడుతుందిలే రోకలి'.

---

**సీ.** భారత సంగ్రామపారీణుఁడై జయ । రమ యుల్లసిల్ల సామ్రాజ్యమునకుఁ
బాండవముఖ్యునిఁ బట్టంబు గట్టిన । యది యాది గాఁగ ముప్పదియునైదు
సంవత్సరంబులు సన ననంతర వత్స । రంబునఁ బ్రజకు భయం బొనర్చు
నుత్పాతములు పుట్టె నుర్వీశ! విను మహా । వాయువు శర్కరావర్షి యగుచు

**ఆ.** వీచు, నర్కునుదయవేళల బింబంబు । బలసి తోఁచు, ఘనకంధసమితి
నీరదములు లేక నిర్ఘాతపాతముల్ । గలుగు నుల్క లెల్లకడల దుల్లు.' (మౌసల. 1-3)

**సీ.** చనుదెంచి పురవీథిఁ జనునవసరమున । వృష్ణి కుమారులు విధివశమున
మనముల నవినీతి జనియింప సాంబున । కంగనాలంకార మమరఁజేసి
కొనివచ్చి యమ్మహామునివర్గమునకు మి । థ్యావినయమున వందన మొనర్చి
నిభృతులై కారుణ్యనియతాత్ములార! యీ । భూమిని బభ్రునిభార్య ప్రజలఁ

**తే.** గనునె యిది? యని యడిగిన కౌరవేంద్ర! । యత్తపోధనవర్యు లయ్యాగడమున
కాత్మలందుఁ గ్రోధానల మగ్గలముగ । నెలయ నక్కుమారులతోడ నిట్టు లనిరి. (మౌసల. 1-8)

# 2. మహోత్పాతాలు

మునులకు చాలా కోపం వచ్చింది యాదవ కుమారుల కొంటె కోణంగి పనికి.
–'మాకు తెలుసు కృష్ణుడు కొడుకీ సాంబుడు, స్త్రీవేషం ధరించి వచ్చాడు.
వీడికి పుట్టునుగాక యాదవ క్షయా పాదన కల్యంబగు ముసలము–
యాదవులంతా చస్తారు రోకలి శక్తికి, ఇది మీకు మూడడానికే వచ్చింది'

–అని శాపమిచ్చి మునులు శ్రీకృష్ణుని దర్శించకుండానే వెళ్లిపోయారు.
శ్రీకృష్ణునికి తెలిసిందీ విషయం, త్రికాలవేది కనుక ఉన్నాడు స్థిమితంగా.
మరునాడు సాంబుడి కడుపు నుండి పుట్టింది యమదూతలా ముసలం
బంధువులు ఆశ్చర్య భయాలతో ఆ విషయాన్ని శ్రీకృష్ణునికి విన్నవించారు.

రోకలిని పొడిపొడిగా చేసి సముద్రంలో కలిపివేయమన్నాడు కృష్ణుడు.
ద్వారకలో కనిపించాయి మహోత్పాతాలు– సూర్య చంద్ర గ్రహణాలు
దివ్యాలు; ఉల్కాపాతం అంతరిక్ష ఉత్పాతం; భూకంపం భౌమం–
ఈ ప్రకృతి వైపరీత్యాలతో భయకంపితమయ్యింది యాదవ వంశం.

అరుణములు ఘూర్ణితంబులై ఎర్రని కళ్లు ప్రకాశిస్తుండగా యముడు
మహోగ్ర దండము ధరించి కనబడుతున్నాడు అక్కడక్కడ అప్పుడప్పుడు.
నలుపు పసుపు కలిసిన వన్నెకల యముడు తిరుగుతున్నాడు అటూ ఇటూ
చిలుకలు కూస్తున్నాయి గుడ్లగూబల్లా రాత్రుళ్లలో భయం గొలిపేట్లుగా–

---

**క.** అంబుజనాభుని కొడు కీ । సాంబుఁడు గను యాదవక్షయాపాదన క
ల్యంబగు ముసలము; మావచ । నంబున కన్నృతంబు లేదు; నమ్ముఁడు మీరల్. (మౌసల. 1-9)

**సీ.** దామోదరుఁడు హలధరుఁడును దక్కంగ । యాదవులెల్లరు నమ్ముసలము
నద్భుతశక్తి గీటడఁగుదు రబ్బుల । దేవుండు దనదైన దేహ మధిక
నిష్ఠమై విడిచి వార్నిధిఁబ్రవేశించు । భూశయ్య నుండంగ నాచక్రధరుని
జర యను రాక్షసి వెరవునఁ బట్టి క్ర । మించుఁ బొం'దని చెప్పి, మెచ్చు గాదు

**ఆ.** మనము కృష్ణు నింకఁ గను టనియెడుబుద్ధి । నమ్మహామునీంద్రు లపుడు మరలి
యాత్మవాసములకు నరిగిరి; తదనంత । రంబ కృష్ణుఁ డవ్విధంబు వినియె. (మౌసల. 1-10)

**క.** నీలపింగళ దేహమాభీల భంగి । కముగ నమ్మెయి వర్తించు జముఁడు సకల
వృష్ణి భోజాంధకోత్సాది విహరణమున । మునుల శాపంబు ప్రేరేఁప మనుజనాథ! (మౌసల. 1-18)

**–** చతుర్దశీ పంచదశీ కృతేయం రాహుణా పునః
ప్రాప్తేవై భారతే యుద్ధే ప్రాప్తా చాద్య క్షయాయ నః (సం.మౌసల. 2-19)

# 3. జాతర సేయగా వలయు నంబురాశికిన్-

పగటిపూట మేకలరుస్తున్నాయి నక్కల్లా; ఆవులకు పుడుతున్నాయి గాడిదలు,
ముంగిసలకు ఎలుకలు, కుక్కలకు పిల్లులు జన్మిస్తున్నాయి. యాదవులు
అడ్డూ అదుపు లేకుండా ప్రవర్తిస్తున్నారు, గురువులను అవమానిస్తున్నారు.
యాదవ స్త్రీలు భర్తలను లెక్కచేయకుండా మదించి తిరుగుతున్నారు ఇష్టారాజ్యమై

హోమకాలంలో అగ్ని నానా వర్ణాలతో ప్రకాశిస్తున్నది నాలుకలు చాస్తూ
జ్వాలలు అప్రదక్షిణంగా వెలుగుతూ కలుగచేస్తున్నాయి దుర్గంధాన్ని
అప్పుడే దింపిన అన్నం కూరలలో పురుగులు మిలమిలా మెరుస్తూ తిరుగుతున్నాయి
కృష్ణుడనుకున్నాడు- గాంధారీ శాపం ఫలించే రోజు దగ్గర పడింది-

మధ్యాహ్నం ప్రకటించాడు రాజసభలో- సముద్రతీరాన జాతర
చేస్తే శుభం కలుగుతుంది- అందరూ పాల్గొనాలని చాటింపు వేయించాడు.
ఆ రాత్రి స్వప్నాలందు భయంకరమైన దౌడలు, నల్లటి రూపం గల స్త్రీ
జ్యేష్ఠాదేవి ఇళ్లలోకి చొరబడి స్త్రీలను లాక్కుపోయింది వేగంగా

యాదవుల శస్త్రాస్త్రాలను జెండాలను ఆభరణాలను ఎత్తుకుపోయారు రాక్షసులు
మరుసటిరోజున శ్రీకృష్ణుని సుదర్శన చక్రం ఎగిరిపోయింది నింగిలోకి
కృష్ణుడి గరుడ ధ్వజం, బలరాముడి తాటిచెట్టు జెండా చేరాయి స్వర్గం
సుగ్రీవ శైబ్య వలాహక మేఘపుష్ప అశ్వాలు పూన్చిన కృష్ణరథమూ ఎగిరిపోయింది.

---

**సీ.** **చిలుకలు గూబల యెలుఁగుల చందంబు । దోఁపంగ నఱచు రాత్రులను దినము**
**లందును నక్కల యట్లు మేఁకలు గూయు । మొదవు పిండునకు గాడిదలు పుట్టు;**
**ముంగుల కుదయించు మూషికంబులు గుక్క । లెల్లను బిల్లుల నీను; బలుఁడు**
**హరియును దక్కంగ యాదవ నివహంబు । బ్రాహ్మణప్రతతికి బాధసేయు**

**తే.** **గురుల కవమాన మొనరించుఁ దిరుగు లజ్జ । విడిచి యభిలాషముల వెంట విభుల పంపు**
**సేయ కున్మార్గములఁ దమ చిత్తములకు । వచ్చినట్ల వర్తింతురు వనిత; లధిప! (మౌసల. 1-19)**

**సీ.** **ఆ రేయిఁ గల నెల్లవారును గోరదౌ । దలును నల్లని మేను గల నెలంత**
**యొక్కత యిలు సొచ్చి యువిదల నీడిచి । కొని పోవ శస్త్రాస్త్రకోటి కేతు**
**చయమును భూషణ సమితియు రాక్షసు । లపహరింపఁగఁ గని రపరదినము**
**నందగ్నిదత్తంబు నబ్జనాభంబును । నైన కృష్ణుని చక్ర మద్భుతముగ**

**ఆ.** **నెగసి యఖిలజనులు నీక్షింప దివమున । కరిగె; నమ్మహాత్ము గరుడకేత**
**నంబుఁ దోన చనియె నరవర! రోహిణీ । తనయు తాటిసిడము ననుసరించె. (మౌసల. 1-25)**

# 4. కోతుల కన్నియు పంచిపెట్టిరి ఉద్దామ విహారలీలన్-

'వెడలుడు తీర్థయాత్రకు' -అన్న శబ్దాలు వినరాగా యాదవులు ఉత్సాహంగా
ఇంపైన మద్యాలు మాంసాలు వాహనాద్యాభరణాలు సమకూర్చుకుని వేడుకగా
భోజ్యములు భక్ష్యములు క్షీర శర్కరలు నెయ్యి కూరలు అన్నపానీయాలు
అక్షత గంధ పుష్పములు కావిళ్లపై, బండ్లపై వేసి రంగురంగుల బట్టలు

నగలు, మైపూతలతో అలంకరించుకుని వింత శోభలతో బయల్దేరినారు
అంతిమ జాతరకు, సహజ కార్యకలాపాలు, కోరికలు కొట్టుమిట్టాడగా
దారుకుడు తెచ్చిన మరో రథంలో కృష్ణుడు బయల్దేరినాడు నిర్లిప్తంగా
బలరాముడు బయల్దేరినాడు పాదచారిగా ఏ వికారమూ లేని మనసుతో.

యాదవ స్త్రీలు బయల్దేరినారు బాగా అలంకరించుకుని పల్లకీలలో శోభాయమానంగా
మహాజ్ఞాని ఉద్ధవుడు తపస్సు చేసుకోడానికి వెళ్తానన్నాడు అడవికి.
భవిష్యత్తు తెలిసిన శ్రీకృష్ణుడు ఏమీ పలుకలేదు, బలరాముడు వెళ్లి
అడవిలో దిగబెట్టి వచ్చాడతడిని; వెళ్లి ఒంటరిగా కూర్చున్నాడు తానూ ఓ చెట్టుకింద

అతడిలో మోహమనే చీకటి నశించింది, ప్రకాశించింది జ్ఞానజ్యోతి
బలరాముడక్కడ యోగసమాధిలోకి వెళ్లినప్పుడే యాదవులు చేరారు
సముద్ర తీరానికి, ఉత్సాహాలు హద్దులు దాటినాయి, బ్రాహ్మణ భోజనాలను
కోతులకు పెట్టినారు యాదవులు, గెంతుతున్నారు, ఆడుతున్నారు, పాడుతున్నారు.

---

**చ. భూమిసురావళీమహిత భోజనతంత్రముఁ దీర్పఁ బూని హృ**
**ద్యామలరాజితంబులగు నట్లొనరించిన కూడుగూర లా**
**కోమలు లాఁగఁగా గడఁగి క్రోఁతుల కన్నియుఁ బంచివెట్టి రు**
**ద్దామవిహారలీల వసుధావర! యాదవు లేమి సెప్పుదున్? (మౌసల. 1-37)**

**చ. పదపడి గీత వాద్యగతిబంధురనృత్యము లుల్లసిల్లఁగా**
**నుదధికి నంచితాక్షత మహోత్తరగంధవిశిష్టపుష్ప సం**
**పదలు బహుప్రకారములఁ బ్రస్తుతి కెక్కఁగఁ బూజసేసి పెం**
**పొదవ నివేద్య మిచ్చిరి సముజ్జ్వలహృద్య పదార్థకోటులన్. (మౌసల. 1-38)**

**చ. విను తదనంతరంబ మదవిహ్వలభావము చేయఁ జాలి యిం**
**పొనరిన యాసవంబులు సముత్సుకతం గనకంపుఁ గోరలం**
**గొని హరి సన్నిధానమునఁ గ్రోలిరి యాదవు లంతరంగ మో**
**దనకరణంబులైన యుపదంశములం గొనుచున్ మహీశ్వరా! (మౌసల. 1-39)**

# 5. యాదవుల మహాజాతర

రమ్యగీతాల కనుగుణంగా చేసారు మనోహర నృత్యాలు, అక్షతలు, పుష్పాలు
మనోజ్ఞాలైన భక్ష్య భోజన పదార్థాలతో వేడుకగా పెట్టారు నైవేద్యం
మదవిహ్వల భావము కలిగించే మత్తు పానీయాలను బంగరు పాత్రలలో
తాగుతున్నారు, నంజుళ్లు తింటున్నారు, పేలుతున్నారు, తూలుతున్నారు విశృంఖలంగా.

శ్రీకృష్ణుడి ఎదురుగానే, విధికి వశులై సాత్యకి కృతవర్మ చారుదేష్ణుడు
గదుడు, ప్రద్యుమ్నుడు ఇతరులు వృష్టి భోజ అంధకులు యాదవులందరూ
కేకిసలాడుచు, పొంతన లేకుండా మాట్లాడుతూ, వెకిలిగా నవ్వుతూ, ఉన్మాదులై
సాత్యకి అన్నాడు కృతవర్మను చూసి నత్తినత్తిగా ప్రద్యుమ్నుని చేయి తట్టి–

–శత్రువులు నిద్రలో ఉంటే చచ్చినట్లా కాదా, నీవే చెప్పు– వాళ్లని చంపి
చంపినవాడు మహావీరుడా? ఛీఛీ, అదీ ఒక వీరశూర పరాక్రమమా?–
ప్రద్యుమ్నుడన్నాడు– ఆ సంగతి ఇప్పుడెందుకు వదిలేయి, ప్రజలు ఇతడిని
పుచ్చిపోయేలా తిడుతున్నారు, అది చాలదా ఏమిటి ఈ వీరుడికి!–

కృతవర్మకు పొంగుకు వచ్చింది రోషం– అబ్బో పుట్టుకొచ్చాడు మహావీరుడు
ఇతరుల యుద్ధం సంగతి అట్లా వుంచు, నీవు చచ్చే క్షణంలో, అర్జునుడు,
సోమదత్తుడి కొడుకు చేతిని నరికితే బయటపడి అతడి తల నరికావు–
చెప్పుకో గొప్పలు, యుద్ధ న్యాయాలు, వీర శూర పరాక్రమ విశేషాలు!–

---

**సీ.** **ఉన్మార్గ వర్తులై యుండిరి వినుమట్టి । యవసరంబున ఘూర్ణితారుణంబు**
**లయిన నేత్రముల సాత్యకి కృతవర్మని । వదనంబు గనుఁగొని మద మెలర్ప**
**నొద్ద నిల్చున్న ప్రద్యుమ్ను చే సఱచుచు । నవమాన మేర్పడునట్టి భంగిఁ**
**బెలుచ నవ్వి 'యరాతిబృందంబు నిద్రావ । శత్వంబుఁ బొందుటఁ జావువోని**

**తే.** **దుష్టదశ నొంది యుండఁగఁ దుచ్ఛుఁడేని । నదరి వధియింపఁగాఁ జొరఁ దనిన రాజ**
**తనయుఁ డంత పాపంబు సేయునె యితండు । పొడిచెనటె యిస్సిరో యిట్టి పోటుఁ బోటె.' (మౌసల. 1-42)**

**తే.** **అనినఁ బ్రద్యుమ్నుఁ 'డిది నీచు లయిన వారి । తెరువు వృష్ణివంశోత్తమ! దీని నిట్లు**
**నీవు వాక్రువ్వ నేటికిఁ? బోవ విడువు; । జను లితనిఁ బ్రువ్వఁ దిట్టుట చాలదెట్లు? (మౌసల. 1-43)**

**చ.** **అన విని రోషచిహ్నవికృతాననుఁడై కృతవర్మ సాత్యకిం**
**గనుఁగొని 'సిగ్గులేక యొరుకయ్యము నీకిటు లుగ్గడింపఁగాఁ**
**జనునె? కిరీటి చే నఱక శాంతత నొందిన సోమదత్తనం**
**దను తల ద్రుంపవే మఱచితా యిసిరో యిది పోరిపాడియే?' (మౌసల. 1-44)**

# 6. కృతవర్మ తల నరికిన సాత్యకి

కృష్ణుడికి కోపం వచ్చింది భోజుల వేపు ఎర్రగా కాలిపోయేట్లు చూసాడు.
సాత్యకి అన్నాడు– కృతవర్మ తమ్ముడు శతధన్యుడు చంపలేదా
సత్రాజిత్తును శమంతక మణికోసం? అందుకే వీడూ కౌరవులతో కలిసాడు–
సత్రాజిత్తు పేరు తలవగానే సత్యభామకు దుఃఖం పొంగుకు వచ్చింది.

సత్యభామ ఏడుస్తూ తన దగ్గరకు వచ్చేసరికి కృష్ణుడు మరింత ఆగ్రహించాడు.
దానిని గమనించి సాత్యకి, మధువు కలిగించిన రణోత్సాహంతో– వీడు
సహకరిస్తేనే కదా ఆ నీచుడు అశ్వత్థామ అర్ధరాత్రి చంపినాడు కాదా
ధృష్టద్యుమ్ను, ఉపపాండవులను, ఇతరులను నిద్రలోనే, నికృష్టుడు!

అంటూ సంయమి శాపజాత ముసలాత్యంతాద్భుత స్ఫీత శక్తి వ్యాపించ
తన కత్తిని ఒరనుంచి లాగి, కృతవర్మ చూపులు విహ్వలతను పొంద
నరికినాడు దారుణంగా కృతవర్మ గొంతును రక్తం నలుదిక్కులా చిమ్మగా
అప్పటికీ తగ్గని కోపంతో విరుచుకుపడినాడు భోజకులంపై ఆవేశంతో

భోజాంధకులు చుట్టుముట్టినారు సాత్యకిని, కృష్ణుడు నిర్లిప్తంగా చూస్తున్నాడు
ప్రద్యుమ్నుడు భీకరంగా అరుస్తూ సాత్యకికి సాయం చేయాలని వెళ్లాడు
వాళ్లను చూసి వృష్ణివీరులంతా పెద్దపెట్టున అరుస్తూ భోజాంధకులపై దూకినారు.
ఆయుధాలుగా దొరికినాయి వాళ్లకు మూడంచుల తుంగ పరకలు.

---

**మ.** అనుచున్ సంయమి శాపజాత ముసలాత్యంతాద్భుత స్ఫీత శ
క్తినిరూఢంబుగ నూనినట్టి నిజ నిస్త్రింశంబు శీఘ్రంబునం
గొని తద్దీధితి రాజిచే నతని చూడ్కుల్ విహ్వలత్వంబు నొం
ద నుదగ్రోద్ధతిఁ ద్రుంచెఁ దద్గళము రక్తంబుల్ ప్రసారంబుగన్. (మౌసల. 1-48)

**తే.** అట్లు కృతవర్మఁ దెగటార్చి యాతఁ డంత । నిలువ కుద్ధతుఁ డయి భోజకులముమీఁదఁ
గవిసె బాహావిలాసంబు ఖడ్గదీప్తి । చయము మెఱయంగ సంరంభసత్వరముగ. (మౌసల. 1-49)

**చ.** కవిసినఁ జూచి యాఁగుటకుఁ గా నలినాక్షుఁడు వోవునంత నా
హవఖరులైన భోజులును నంధకవీరులు నొక్కఁడై దెసల్
సెవుడుపడంగ నార్చి యతిశీఘ్రత సాత్యకిఁ జుట్టుముట్టి; ర
ప్లు విమల బోధుఁ డాహరి కడుం గనలొందియుఁ గాలవేదితన్. (మౌసల. 1-50)

**క.** అయ్యిరు దెఱఁగున కప్పుడు । కయ్యమునకుఁ బరమసాధకంబుగఁ గలిగెన్
ముయ్యంచు తుంగ యచ్చట; । దయ్యము నేర్పు విను సెప్పెదం గురునాథా! (మౌసల. 1-54)

# 7. తుంగ పరకలే ఆయుధాలుగా-

మునివర శాప సంభవమై అమోఘంగా ముసలపు శక్తి తుంగలో
ప్రవేశించగా రెల్లు పరకలు మారినాయి ప్రాణాంతక ఆయుధాలుగా
ప్రతి తుంగ పరకలోనూ రోకటి పొడి ప్రవేశించినట్లు, మృత్యుదండమై
యాదవ వీరులు చచ్చేంత వరకూ కొట్టుకున్నారు, చచ్చి నేలపై కూలినారు.

పెనుగాలి దెబ్బకు నేలకూలిన చెట్లలా అందరూ చస్తూనే ఉన్నారు.
భోజులు, అంధకులు అధిక సంఖ్యలో ఉండగా వృష్టి వంశజులైన
సాత్యకి, ప్రద్యుమ్నాదులతో పాటు ఆ వంశమూ పూర్తిగా నశించింది.
అనిరుద్ధ ప్రద్యుమ్న సాంబ సాత్యకి గదుడు చచ్చిపడి ఉండడం చూసాడు కృష్ణుడు.

మునుల శాపంతో శ్రీకృష్ణుడిలో పెరిగింది క్రోధం, విజృంభించి కృష్ణుడు
తుంగపరకలే సుదర్శన చక్రంగా దునిమినాడు యాదవ కులాన్ని
మిగిలిందల్లా దారుకుడు బభ్రుడు వారితో కలిసి వెళ్లాడు కృష్ణుడు
బలరాముడున్న చోటుకు- శ్రీకృష్ణుడన్నాడు దారుకుడితో- వెళ్లుము,

వెంటనే హస్తినకు వెళ్లి యాదవకుల నాశనం గురించి చెప్పి తీసుకురా
అర్జునుడిని, అనగానే దారుకుడు వెళ్లిపోయాడు వేగంగా గొప్ప రథంపై.
స్త్రీలను ద్వారకకు చేర్చమని బభ్రుడిని పంపగా అల్లంత దూరం
పోగానే బభ్రుడిని తుంగ పరకతో కొట్టిచంపాడొక బోయవాడు.

---

**సీ.** కాంచి దారుకు దెసఁ గనుగొని 'నీవు వే । పాండురాజ తనూజుల పాలి కరిగి
వారికి యాదవవర్గ సంక్షయవిధ । మెఱిఁగించి యర్జును నిందుఁ దెమ్ము'
నావుడు నతఁడు మహావేగవంతంబు । లగు రథ్యములఁ బట్టి యలఁతియరద
మునఁ బూన్చికొని రయంబున నేఁగె నప్పు డ । మ్మురవైరి బభ్రుని మోముఁ జూచి

**ఆ.** 'అతివపిండుఁ గుంజరాదులఁ బురిఁ జేర్చి । యరుగుదెమ్ము వేగ' మనిన నాతఁ
డట్ల చేయు పనికి నయి చన నొకబ్రోయ । త్రుంగఁ జేసె నతనిఁ దుంగ వ్రేసి. (మౌసల. 1-66)

**సీ.** అందఱ నూరార్చి 'యర్జునుం డిప్పుడ । వచ్చు నిచ్చటికి మీవంత లెల్లఁ
దీర్చు నక్కురు కులదీపకుం' దని యుప । శమవాక్యములఁ దేర్చి జనకుపాల
నాసీనుఁ డయి తదీయాంఘ్రిపద్మంబులు । తన చారుపాణిపద్మముల మెత్త
మెత్తన యొత్తుచు మెలుపొందఁ గర్జంపుఁ । బలుకులఁ జిత్తవిభ్రమము మాన్చి

**తే.** మఱియుఁ బార్థుని రాక పల్మఱును జెప్పి । యన్నయాధ్యుఁడు పనిసేయ నున్నవారిఁ
'గరితురంగాదికముల మీ రరసికొనుఁడు;' । వినుఁడు కర్తవ్యమిట్టిది వేయునేల?' (మౌసల. 1-73)

# 8. బలరాముడి నిష్క్రమణం

బభ్రుడు నేలకూలగా ఆశ్చర్యపడి కృష్ణుడు తానే స్వయంగా వెళ్లాడు
బలరాముడికి చెప్పి, స్త్రీలను ద్వారకా నగరానికి చేర్చాలన్న తలపుతో
ఆ విధంగానే ఏనుగులు, గుర్రాలపై స్త్రీలను తీసుకువెళ్లి ద్వారకకు చేర్చి
తండ్రి వసుదేవుడితో అన్నాడు- అక్కడ కౌరవ నాశనం, ఇక్కడ యాదవకుల

నాశనం చూసాను తండ్రీ, మీకు సహకరించడానికి అర్జునుడు వస్తున్నాడు.
నేను అడవికి పోయి అన్న బలరాముడితో కలిసి తపస్సు చేసుకుంటాను-
అని పలికి వసుదేవుడికి ప్రణమిల్లి, యాదవ వంశ నాశనాన్ని చెప్పినాడు కృష్ణుడు.
నిశ్చేష్టుడైన వసుదేవుడిని చూసి యాదవస్త్రీలు గొల్లుగొల్లున ఏడ్చారు.

శ్రీకృష్ణుడన్నాడు- అర్జునుడు వస్తున్నాడు, మిమ్మల్నందరినీ తీసుకువెళ్తాడు
హస్తినకు అని స్త్రీలను ఊరడించి, వసుదేవుడికి ప్రియోక్తులు చెప్పి
తండ్రికి వీడ్కోలు చెప్పి బలరాముడి దగ్గరకు వచ్చి అన్నాడు నెమ్మదిగా
-మహాత్మా, మన తండ్రిగారి అనుమతితో వచ్చాను, నిష్క్రమణ సమయమిది-

కృష్ణుడికి కనిపించింది బలరాముడి ముఖం నుంచి పెద్ద పాము-
ఎర్రటి కాంతితో ప్రకాశించే వేయి నోళ్లు, మణులతో ప్రకాశించే పడగలు
పర్వతమంత పెద్దదైన మహాసర్పం యోగబలంతో బయటకు రాగా అనంతుడై
బలరాముడు తన దేహాన్ని వదలి ఆకాశమార్గాన ప్రవేశించాడు సముద్రంలోకి.

---

సీ. **తదనంతరంబ యద్దామోదరుఁడు రాము । వదనసరోజంబువలన వెడలఁ**
**గనియె మహాభుజంగము నరుణచ్ఛాయ । యై పొల్చు వక్త్రసహస్రకంబు**
**మణుల వెలింగెడు ఫణములుఁ దెలుపారి । పర్వతాభోగ నిభంబు నైన**
**మేని పెంపును గలదాని నట్లా బల । భద్రుండు నిజయోగబలముపేర్మిఁ**

ఆ. **దనదుతనువు విడిచి చనియె వియద్వీథి । నంబునిధికి నమ్మహాత్ము నెదురు**
**కొనియె వరుణుఁ డధిక వినయంబుతో నాగ । కులము లెల్ల వచ్చి కొలిచె భక్తి. (మౌసల. 1-75)**

సీ. **అ ట్లగ్రజుఁడు చన్న నచ్చటువాసి యం । తంతఁ గ్రుమ్మరుచు మురారి సకల**
**లోకపాలనకు భూలోకంబునందుఁ దాఁ । బుట్టంగ వలసిన యట్టి మేటి**
**పనులెల్లఁ దీఱుట మనమునఁ దలపోసి, । తనువిముక్తికి నిమిత్తంబుఁ దలఁచి,**
**మునులవాక్యము తెఱంగును దొల్లి దుర్వాసు । నవయవసమితిఁ బాయసము పూయు**

తే. **నప్పు డఱకాలఁ బూయమి నత్తపస్వి । యచట నవిలంఘ్యమై యపాయంబు గలుగు**
**ననిన మాటయుఁ జర్చించి, మనసు నింద్రి । యములు నడఁగించి గాఢసమాధి నొంది. (మౌసల. 1-80)**

# 9. ఏణంబనునట్లు చేసి మాయ ఆవహించె-

ఆదిశేష స్వరూపుడైన ఆ బలరాముడికి స్వాగతం చెప్పాడు వరుణుడు
వాసుకి, కర్కోటకుడు, తక్షకుడు, వారుణుడు, కుంజరుడు, కుముదుడు
దుర్ముఖుడు, పృథుశ్రవుడు, హ్రాదుడు, వక్రదంతుడు, క్రోధుడు, శంఖుడు,
పుండరీకుడు, మిశ్రి, అజేయుడు, ధృతరాష్ట్రుడు వంటి నాగులు వచ్చి పూజించారు.

అంతయును దివ్యదృష్టి క్రాంతియగు శ్రీకృష్ణుడు చూస్తూ ఉండగానే
అనంతుడైన ఆదిశేషుడు తన మూర్తిభేదమైన బలరాముడిని కలుపుకున్నాడు
తన శ్రేష్ఠమైన మహారూపంలో, ఉత్తుంగ తరంగ పడగల సముద్రం వలె-
బలరాముడు అలా అవతారం చాలించగా శ్రీకృష్ణుడు ఆలోచిస్తున్నాడు-

దుర్వాసమునికి ఒడలంతా పాయసం పూసి, ఎడమకాలి అరిపాదానికి
వ్రాయని సంగతి, శరీరమంతా వజ్ర అభేద్యమైనా, ఆ అరికాలిలోనే
నీకు ప్రాణాపాయం జరుగుతుందని అన్న సంగతి జ్ఞప్తికి రాగా
జితేంద్రియుడై గాఢ సమాధిలోకి చేరుకున్నాడు నేలపై శయనించాడు.

ఆ సమయంలో ముసలితనానికి అధిష్ఠాన దేవత 'జర' ప్రవేశించింది
నేలను కాలితో రాస్తూ నెమ్మదిగా అడవిలోకి, వచ్చి భ్రాంతిలో పడవేసింది
ఓ వేటగాడిని, కృష్ణుడి దేహాన్ని దూరంగా చూసి వాడనుకున్నాడు 'జింక' అని.
వాడి బాణం హరి అరిపాదంలో దూరి పొడుచుకువచ్చింది రెండోవేపుకు.

---

క. జలనిధిశయనుండు మహీ । స్థలశయనుం డయ్యె; నట్టి సమయమునం దా
నలుకుచుఁ దత్కాంతార । స్థలి కల్లన నరుగుదెంచె జర కురుముఖ్యా! (మౌసల. 1-81)

ఆ. అరుగుదెంచి యచటఁ దిరిగెడు నొక వేఁట । కానిఁ గాంచి వాఁడు కమలనాభు
నొడలు చూచి లెంకి నున్న యేణం బను । నట్లు సేసి మాయ యావహించె. (మౌసల. 1-82)

మ. ధరణీనాథ! యతండు శాతశర ముద్యద్వృత్తి సంధించి యు
ద్ధురభంగిం దెగ నిండఁగాఁ దిగిచి యత్యుగ్రంబుగా నేసె; నా
హరి శ్రీపాదతలంబుఁ దూరఁగొని యయ్యస్త్రంబు మీఁగాల ని
ష్ఠుర వేగంబున నుచ్చిపోయె వెస వాఁడుం జేరెఁ గైకొంటకున్. (మౌసల. 1-83)

క. చేరి తెలియఁ గనుఁగొని పెం । పారు పురుషుఁ డగు టెఱింగి యత్యంతార్తిం
గూరి వడఁకి తచ్చరణాం । భోరుహములఁ దన శిరంబు వొందం బడియెన్. (మౌసల. 1-84)

తే. పడి యేడ్చినఁ గృష్ణుఁడు తగు । నొడవుల నూరార్చి తన మనోరథ మిమ్మె
నొడఁగూడిన మానుషమగు । నొడలు విడిచి నిజపదంబు నొందుట కరిగెన్. (మౌసల. 1-85)

# 10. శ్రీకృష్ణ నిర్యాణము

ఆ వేటగాడు శాతశరము ఉద్యత్ వృత్తి సంధించి ఉద్ధురభంగిన్
నారి సారించి లాగి అత్యుగ్రంగా బాణమువేయ, ఆ అస్త్రము హరి
పాదమున దూరి, బొటనవేలును చీల్చి ఆవలివేపుకు వచ్చి బాధ కలిగించ
ఆర్తనాదంబు చేసె మిక్కిలిగా ఆర్తత్రాణ పరాయణుండా క్షణంబునందు

వేటగాడు భయపడుతూ వచ్చాడా కేక విని, శ్రీకృష్ణుని గాంచి గజగజ వణక
శ్రీకృష్ణుడతడిని ఓదార్చి, తన దేహాన్ని విడిచి చేరినాడు నిజపదంబు
ఊర్ధ్వలోకమునకు ఊర్జిత తేజస్సు గలవాడైన కృష్ణుడు వెళ్లగా
మునులు సిద్ధులు రుద్రులు వసువులు మరుత్తులు విశ్వదేవతలు, ఇంద్రుడు

ఎదురువచ్చి, కాళ్లకు మొక్కి, స్తుతించి, అనేక రీతుల ప్రార్థించారు-
లీలామానుష విగ్రహా, కంసాది దేవ శత్రుకోటిని సంహరించిన దేవా!
భరతవంశ కసటును తొలిగింది ధర్మాన్ని నిలిపిన జగన్నాటక సూత్రధారీ!
అమృతం, అజరం, అవ్యయం, అమలం, అవితర్క్యము అచలము నీతత్త్వము

మహాత్మా! అగమగమ్యము, అమేయము నీ తత్త్వమును నీవే పొందుము
యజ్ఞపురుష! ప్రతియుగంలోను దుష్టశిక్షణ, శిష్టరక్షణకై ఇట్లే అవతరించుము-
-బ్రహ్మ అరుదెంచి స్తుతించాడు- అప్పుడు దేవదేవుడన్నాడు- నా రూపం
అనిరుద్ధ, ప్రద్యుమ్న, సంకర్షణ, వాసుదేవ వ్యూహాలతో ప్రకాశించును గాక!

---

క. అమృతం బజరం బవ్యయ । మమలం బలితర్క్య మచల మాగమగమ్యం
బు మహాత్మ! భవత్పద మ । య్యమేయ తత్త్వంబుఁ బొందు మనిరూప్యగతిన్. (మౌసల. 1-88)

క. కృప నిట్ల యవతరింపుము । ప్రపన్నులగువారి యార్తిఁ బాపుటకై య
జ్ఞపురుష! యుగయుగమున న । తృపరిమిత గుణాఢ్యరూప మభినుతి నొందన్.' (మౌసల. 1-89)

క. అని నిభృతిఁ బలుక నా సువ । చనముల నత్యాందరం బెసఁగ వినిన ముకుం
దునిపైఁ బెల్లు గురిసె న । య్యనిమిషపతి పుష్పవర్ష మతులితభక్తిన్. (మౌసల. 1-90)

ఉ. అప్పుడు బ్రహ్మ వచ్చి హరియంఘ్రులకుం బ్రణమిల్లి భక్తిమైఁ
దప్పక చూచుచున్ మది ముదంబునఁ దేల సలక్షణస్వరం
బొప్పి చెలంగ నాగమిక సూక్తులఁ బ్రస్తుతి సేసెఁ బ్రీతుఁడై
యప్పురుషోత్తముండు కరుణార్ద్ర నిరీక్షణమున్ నిగుడ్పఁగన్. (మౌసల. 1-91)

- జరా థ తం దేశముపాజగామ లుబ్ధస్తదానీం మృగవిప్పురుగ్రః
సకేశవం యోగయుక్తం శయానం మృగాసక్తో లుబ్ధకః సాయకేన (సం.మౌసల. 4-22)

# 11. వ్యూహ చతుష్టం

సనాతన వాసుదేవ వ్యూహమిది నిర్గుణము, నిష్క్రియము, నిష్కళము
నిర్ద్వంద్వ పురుషతత్త్వము, పరతత్త్వమిది, పంచభూత నిర్మిత శరీరమై
జీవుడై అవతరించిన మానవ వసుదేవ పుత్ర శ్రీకృష్ణుని రూపము
రెండవ వ్యూహము- సంకర్షణ లేదా 'కర్షతీతి ఆకర్షణ', శేషతత్త్వము

సంకర్షణ తత్త్వ జనితమే ప్రద్యుమ్న వ్యూహం విశ్వమానస స్వరూపం
ప్రద్యుమ్న జనిత తత్త్వం అనిరుద్ధ వ్యూహము, అహంకార స్వరూపం,
నాలుగు వ్యూహాలు నారాయణ తత్త్వరూపాలు - అనిరుద్ధ భావ అహంకారం
ప్రద్యుమ్నకాంతి, సంకర్షణ శక్తి, వాసుదేవ పరరూపం నారాయణీయం.

శ్రీమన్నారాయణుడన్నాడు దేవతలతో- చతుర్వ్యూహ జనితమైన
సమాధి సిద్ధి వలన ఆనందరూప జ్ఞానమై పరిశుద్ధమైనది.
అమేయమైనది అయిన నా స్థాన ప్రాప్తిని నేనే కలిగించుకున్నాను.
పరమ మంగళానుభూతిని నేను స్వీకరిస్తున్నాను, మీకు శుభమగును గాక!-

దేవదేవుని మృదుమధుర వాక్యాల చేత సంతృప్తులై దేవతలు సంతోషించగా
శ్రీమన్నారాయణుడు ఆది అంతము లేని తన స్థానంలో ఆసీనుడై ఉండగా
ఆ ఆనంద స్వరూపుడిని జ్ఞాన నేత్రాలతో తిలకిస్తూ అద్భుతములైన
మహాతత్త్వగుణములను ప్రశంసిస్తూ దేవతలు వెళ్లారు వారివారి స్థానాలకు.

---

**సీ.** **అప్పరమేశ్వరుం డయ్యందఱను జూచి । 'యనిరుద్ధ నామకంబైన యదియుఁ**
**బ్రద్యుమ్నతాప్రతిభాసమానమును సం । కర్షణభావ వికాసితంబు**
**వాసుదేవాత్మక వరరూపమున నేక । తా విభవత్సమాధానసిద్ధి**
**నొందించుకొంటి నానందబోధ నిరం జ । నామేయ మత్పదప్రాప్తి పరమ**

**ఆ.** **మంగళానుభూతి నంగీకరించెద । సుఖుల రగుఁడు మీరు సుకృతులార!'**
**యనిన వచనసమితి యతిమృదుమధురత । నింపు నొసఁగ నలరి రెల్లవారు. (మౌసల. 1-92)**

**క.** **ఆ దేవదేవుఁ డత్యం । తాదరసంభాషణంబు లమ్మెయి బ్రహ్మేం**
**ద్రాదులతోడ నొనర్చి య । నాది నిరవసాన నిజపదాస్థితుఁ డయ్యెన్. (మౌసల. 1-93)**

**తే.** **ఇంద్రియాగోచరుం డైన యీశు నపుడు । బుద్ధిఁ జూచుచు నిర్భరాద్భుతకరంబు**
**లగు తదీయగుణమ్ముల నభినుతించు । చరిగి రాత్మవాసముల కజాదులెల్ల. (మౌసల. 1-94)**

---

**నారాయణ వ్యూహతత్త్వం (నారాయణీయం)-** పరబ్రహ్మ నుంచి సృష్టి నాలుగంచెలుగా ఏర్పడడం.
1) వాసుదేవ- నిష్క్రియ, నిర్గుణ; నిష్కళ, నిర్ద్వంద్వ స్థితి- పరతత్త్వం.
2) సంకర్షణ- పరతత్త్వం వేపు పాంచభౌతిక శరీరాన్ని ఆకర్షించేవాడు.
3) ప్రద్యుమ్న- సంకర్షణుడి నుంచి పుట్టే సనత్కుమార, విశ్వమనస్సు తత్త్వం. లయస్థితి.
4) అనిరుద్ధ- ప్రద్యుమ్నుడి నుంచి పుట్టే స్థావర జంగమాత్మక కారకుడు.

# 12. ద్వారకను చేరుకున్న అర్జునుడు

హస్తినకు చేరుకున్న దారుకుడు పాండవులను దర్శించి తెలియజేసాడు
యాదవ వంశ నాశన ఘటనను, మునిశాపం, గాంధారీ శాపం ఎలా
పరిణమించాయో తెలుపగా, సర్వయాదవ సంఘపు, చావు విన్నట్టి
అంతఃపుర స్త్రీలందరూ హాహాకారాలు చేసి శోకించారు హస్తిన దుఃఖమయం కాగా.

దారుకుడు చెప్పాడు అర్జునుడితో– శ్రీకృష్ణుడు నిన్ను వెంటనే ద్వారకకు
చేరుకుని యాదవ స్త్రీల రక్షణ చేయమన్నాడు– ఆ మాటలు విని
అర్జునుడు అతిరయాన చేరుకున్నాడు దారుకుడితో కలిసి ద్వారకకు.
ద్వారక ఉన్నది చంద్రుడు లేని రాత్రిలా, కృష్ణుడు లేడు, ఉన్నదల్లా దైన్యం.

రాజసౌధంలో కానవచ్చారు శ్రీకృష్ణుని పదహారువేల మంది ప్రియభార్యలు,
దీన వదనులై సంక్షోభిస్తూ, వారిని చూసి ఏడుస్తూ నేలపై పడినాడు
అర్జునుడు శోకభారంతో, నారాయణుడు లేని నరుడతడు, అయ్యో, అని విలపిస్తూ
అటుగా వచ్చారు రుక్మిణి సత్యభామలు, మిగతా రాణులు– 'మాకు దిక్కెవ్వరు' అని ఏడుస్తూ.

వారిని ఓదార్చి దారుకుడు అర్జునుడు వెళ్లారు వసుదేవుడి వద్దకు
వీరిని చూడగానే అతడిలో దుఃఖం పొంగుకు వచ్చింది మరల తెరలు తెరలుగా
అర్జునా! సురమాన్య పరాక్రములు అకారణ రోషంతో పరస్పరం
చంపుకుని మరణించారు, మునిశాపం విషపు ముల్లై గుచ్చుకున్నది కాదా!

---

**సీ.** **'యాదవుల్ సమసిన నయ్యేడు నడలు చం । దమ కాక యివ్వనితాజనంబు**
**నందు దైన్యముతోడి యత్యంత శోకస । మాకులత్వముఁ దోఁచె నస్మదీయ**
**మగు చిత్తమున వీరియాతురత్వము గన్న । యంతన కొందల మతిశయిల్లెఁ**
**గాని విశేషంబు గల్గదు కృష్ణుని దశ యెట్టిదో? యనుతల్లడంబు**

**ఆ.** **నెవ్వరొక్కొ దీని నెఱిఁగించువారను నెవ్వగయును గదిరెఁ గవ్వడికిని**
**నధిప! దారుకునకు నట్టయ్యు నా నృపు । కడ నెఱుంగు వారు గాఁగఁ దారు. (మౌసల. 1-105)**

**చ.** **'మనుజుల మాత్ర గాక సురమాన్యపరాక్రమ ముల్లసిల్లఁగా**
**దనుజులఁ దాఁకి గీటడఁచు దర్పమునం బెనుపొంది మాఋలే**
**క నెగడి రట్టిబిడ్డల కకారణరోషమునం బరస్పరా**
**హననము గల్గి చావలసె నందఱ కక్కట! దైవ మిల్లనన్. (మౌసల. 1-109)**

**క.** **విను నీ శిష్యులు సాత్యకి । యును ప్రద్యుమ్నుండు నిమ్మహోగ్రపుసమరం**
**బునఁ దొలుపీనుఁగు లైరని । వినియుఁ బ్రదికినాఁడ నేన వీరుఁడ జగతిన్. (మౌసల. 1-110)**

# 13. వసుదేవ విలాపం

వసుదేవుడంటున్నాడు- మునిశాపం పుట్టింది ముసలమై, దానిని
పొడిపొడి చేసి సముద్రంలో కలిపితే చేరింది తుంగ పరకలలో శక్తి రూపమై.
ఒక్కొక్క తుంగపరక ఒక్కొక్క రోకలి కాగా యాదవులు చంపుకున్నారు
పరస్పరం మధుపానం చేత ఇనుమడించిన మహా క్రోధావేశాలతో.

అందరూ చావగా కృష్ణుడే స్వయంగా వచ్చి అంతఃపుర స్త్రీలను ద్వారకలో వదలి
తాను వెళ్లాడు అడవిలోకి బలరాముడున్న చోటుకు, నీవు వస్తావని
నాతో చెప్పి, 'కొద్దిరోజులలోనే సముద్రం ముంచివేస్తుంది ద్వారకను
అర్జునుడు వచ్చి యాదవులకు చేస్తాడు అంత్యక్రియలు, అగ్ని సంస్కారము'-

పీనుగు పెంటగా పడిన పిల్లలనెల్ల తలంచ, నాకు అన్నపానములెలా
సహిస్తాయి, అర్జునా, ఈ ద్వారకా ప్రజలకు నీవే దిక్కు, వెళ్లి
శ్రీకృష్ణుడు చెప్పినట్లు అతడి ఆజ్ఞను పాటించుము, అనగా-
అర్జునుడు అన్నాడు- వీరినందరిని ఇంద్రప్రస్థము చేరుస్తాను

రాజా, నీవు ముందు బయల్దేరగా నీవెంట ద్వారకా నగర వాసులంతా వస్తారు
-అని పలికి నగరంలోని అష్టాదశ వర్గీయులను పిలిచి అన్నాడు అర్జునుడు-
-ఇంకో ఏడు రోజుల్లో ద్వారకను సముద్రం ముంచివేయబోతున్నది
నేను మిమ్మల్ని ఇంద్ర ప్రస్థానికి తీసుకువెళ్తాను, వజ్రుడు మీ రాజుగా ఉంటాడు.

---

**సీ.** అని మదిఁ జర్చించె నప్పు డవ్వసుదేవుఁ । డతనితో ననియె 'సమస్తయాద
వులును మహామునీంద్రుల ఘోరశాపంబు । ఘనశక్తి నుద్భవించిన మహోగ్ర
ముసలంబు విలసనమున ముసలాయమా । నము లైన తుంగల నమదవృత్తి
నన్యోన్యవినిహతి యాచరించి గతాసు । లగుటయు నొక్కఁడు నతివపిండుఁ

**ఆ.** గరులఁ దురగములను నరదంబులను గొని । యరుగుదెంచెఁ గృష్ణుఁ దనిన నా ధ
నంజయుండు తన మనంబు దల్లడపడ । 'నమ్ముకుందుఁ డెచటి కరిగె నధిప!' (మౌసల. 1-115)

**తే.** అరుగుదెంచి యా ప్రజ లుచితాసనమున । నున్న యయ్యింద్రనందనుఁ గన్న నతఁడు
గరము నెమ్మి నయ్యందఱఁ గలయఁ జూచి । యిట్లనియె మోమునను దైన్య మెసకమెసఁగ. (మౌసల. 1-129)

**క.** 'వననిధి నేఁటికి నేడవు । దినమున నిప్పురము ముంచు దివిజులు గగనం
బుననుండి చెప్పఁగా నే । విననది యిది వెడలవలయు వేగమ మనకున్. (మౌసల. 1-130)

**క.** వినుఁ డింద్రప్రస్థపురం । బునకు నధీశుఁడుగ వజ్రుఁ బోఁడిమితో నే
నునిచెద మీరెల్ల నతఁడు । మనుపంగాఁ దొంటి యట్ల మనుఁ డచ్చోటన్. (మౌసల. 1-131)

# 14. వసుదేవుడి అంతిమయాత్ర

దారుకుడిని పంపి అర్జునుడు నగర ప్రముఖులను, మంత్రులను రావించి
రాజసభ సుధర్మలో ప్రకటించాడు- ఇంకో ఏడు రోజుల్లో
సముద్రం ఉప్పొంగి ద్వారక మునిగిపోబోతున్నది, తగు ఏర్పాట్లతో
ప్రజల్ని తరలించాలి ఇంద్ర ప్రస్థానికి, ధర్మరాజు అండలో జీవించడానికి.

సామాన్లు మోయడానికి వీలుగా మూటలు కట్టుకోండి, స్త్రీలు పిల్లలు
వృద్ధులు ప్రయాణం చెయ్యడానికి బండ్లు సిద్ధం చెయ్యండి, మీకు
ద్వారకలో ఉన్న అన్ని సౌఖ్యాలూ లభిస్తాయి ఇంద్రప్రస్థంలో -అని
ధైర్యవచనాలు పలికి పురజనులను, మంత్రులను పంపించివేసి

ఆ రాత్రి కాస్త విశ్రాంతి తీసుకున్నాడు అర్జునుడు; మరుసటి రోజు
తెలతెలవారుతూ ఉండగానే వసుదేవుడు యోగనిష్ఠలో ప్రాణాలు వదలి
తరలిపోయాడు పుణ్యలోకాలకు, ఆ మందిరంలో మిన్నుముట్టాయి రోదనలు.
అతడి నలుగురు భార్యలూ సిద్ధమైనారు సహగమనానికి భర్తపై అనురాగంతో.

అర్జునుడు వసుదేవుడి మందిరానికి వచ్చి- పూలదండల వరుసలతో
అరటి స్తంభాలతో, స్వర్ణ కలశాలతో శవరథాన్ని వైభవంగా తయారు చేయించి
వసుదేవుడి కళేబరానికి స్నానం చేయించి, పట్టుబట్టలు కట్టించి
రథంపై ఉంచగా, వెనకనే పల్లకీలలో అనుసరించారు దేవకి, రోహిణి, భద్ర, మదిరలు

---

**సీ.** **ఆ సమయంబున నర్జునుఁ డచటికి । నేతెంచి మెసకమెసఁగఁ**
**బ్రాలంబమాలికాపంక్తులఁ గదళికా । స్తంభంబులను శాతకుంభకలశ**
**శిఖరంబులను బెంపుఁ జెలువును విలసిల్ల । యానంబు గల్పించి యాదవేంద్రు**
**శవము సుస్నాతంబుఁ జందనచర్చిస । మేతంబుఁ జీనాంబరాతి శోభి**

**తే.** **తంబు నాభరణస్ఫురితంబు మాల్య । యోజితంబునుగాఁ జేసి యాజక ప్ర**
**యుక్తమంత్రతంత్రస్ఫుటయోగ మింపొ । నర్ప నేతెంచె సామగానంబు చెలఁగ. (మౌసల. 1-141)**

**క.** **విను దేవకియును రోహిణి । యును భద్రయు మదిరయును సముచితవిధానం**
**బున నొనరించిన యానము । లనూన పరికర్మరుచిరలయి యెక్కి తగన్. (మౌసల. 1-142)**

**క.** **చెలులుం జుట్టలు దాపట । వలపట నేతేరఁ దెలిసి వదనసరోజం**
**బులనొప్పం దగియెడు మా । టల వారల వగలు మాన్పుటలు నుతికెక్కెన్. (మౌసల. 1-143)**

**క.** **ఆ నృపుని వల్లభలు శవయానంబు పిరుంద నిట్ల యరిగిరి విధి స**
**న్మానితగతి ముందట విప్రానీకము చనియె నుజ్జ్వలాగ్నులు గొనుచున్ (మౌసల. 1-144)**

# 15. అగ్ని సంస్కారం

వేదమంత్రాల మధ్య, సామవేద పారాయణ ఘోషల మధ్య
బంధుమిత్రుల మధ్య, పురజనులు, పరిజనులు వెంటరాగా
శవ దహనానికి అవసరమైన ఉజ్జ్వల అగ్నులను తీసుకుని
బ్రాహ్మణులు ముందు నడవగా మొదలైంది శవ రథయాత్ర.

వసుదేవుడు విహరించిన ఉద్యానవనంలోనే చందన అగరు కాష్ఠాలతో
అవురు గడ్డితో ఏర్పరచిన చితిపై వసుదేవుని శరీరాన్ని ఉంచి
నేతి ప్రవాహంతో అగ్నులను మండించగా, ఆ అగ్నులలోకి
ప్రవేశించారు దేవకి, రోహిణి, భద్ర, మదిరలు వేగంగా.

మంటల సవ్వడి, మంత్రోచ్చారణల వాడి, హాహాకారాల అలజడుల
మధ్య గమన సహగమనాలు పూర్తై అగ్ని చల్లారి మిగిలాయి అస్థికలు.
అక్కడకు చేరిన వారందరూ చేసారు భక్తిశ్రద్ధలతో జలతర్పణం
అందరినీ ఓదార్చి సముద్ర తీరానికి చేరుకున్నాడు అర్జునుడు.

భోజులు, అంధకులు, వృష్ణుల శవాలతో భయంకరంగా ఉన్నదా తీరం.
వారి స్త్రీలు బంధువులు తమతమ వారిని గుర్తిస్తూ శోకిస్తుంటే
అర్జునుడు కూడా పొందినాడు అమిత దుఃఖం; తెప్పరిల్లి
దారుకుని సాయంతో నిర్వహించినాడు యదువీరులకు అగ్ని సంస్కారం.

---

సీ. ఇమ్మెయిఁ గొని చని యమ్మహీశుఁడు వేడ్క । మెలఁగెడు తోఁటలోపల సమగ్ర
చందనాగురు కాష్ఠచయముల మున్న కా । వించిన సొదకు సద్విధియుతముగ
నప్పాడె సేర్పించి యర్జునుఁ డయ్యాద । వేంద్రుని పితృమేధ మెల్ల జనులు
నభినుతి సేయంగ నచ్చితియం దా శ । వంబు నారోపింపఁ బనిచి యగ్ని

తే. దీప్త మగునట్లు సేయింప దేవకీ ప్ర । ముఖులు నలువురు నప్పు డా శిఖిఁ బ్రవేశ
లీల నంగీకరించి రాబాలవృద్ధ । మైన సకల జనంబులు నార్తి నొంద. (మౌసల. 1-146)

క. ఘృతములు పైఁ జల్లఁగ న । చ్చితిఁ బేర్చిన సప్తజిహ్వ శిఖల రవము నూ
ర్జిత సామగాన నాదో । ద్గతియును హాహారవంబుఁ గలసి చెలంగెన్. (మౌసల. 1-147)

క. తదనంతరంబ వజ్రుఁడు । మొదలగు పురుషులు సతీసమూహముఁ దగుమై
నుదకప్రదానవిధి య । య్యదుముఖ్యున కాచరించి రన్వయముఖ్యా! (మౌసల. 1-148)

తే. అప్పుడందర బంధుల నాదరమునఁ దనదు సముచితాలాప సంతాన కలన
ననునయించి పురంబున కరిగెఁ దాను వారు వగ మదిఁగదుర విప్పచ్చుఁ దధిప! (మౌసల. 1-149)

# 16. నిప్పును చెదలంటు నొక్కో?

బంధువులకు, చనిపోయిన వారందరికి తిలోదక ప్రదానాలు చేసేందుకు
తగిన బ్రాహ్మణులను పంపించి అర్జునుడు గొప్పగా కార్యం నడిపించాడు.
అందరినీ ద్వారకకు పంపి తాను బయల్దేరాడు బలరామ కృష్ణులను
వెదికేందుకు, తన వెంట కొందరు ఆప్తులు అనుసరించగా–

–ఆ రాజు సచ్చుట నారాయణునకేల చెప్పుట, చెప్పి వ్యధ కలిగించుటేల?
వెళ్లి చూసెద బలరామకృష్ణులను, వారు చెప్పింది నేను చేయుదును–
అనుకుంటూ– గాంధారీదేవి శాపాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు –శ్రీకృష్ణా!
–ఎవ్వరూ లేనిచోట దిక్కెవ్వరూ లేకుండా చనిపోతావు –అన్న మాటలను.

అయ్యో, నిప్పును చెదలు తాకగలవా? అనుకుంటూ అడవిలో
అటూ ఇటూ తిరిగాడు కొన్నిరోజులు అన్యమనస్కంగా, ఒకనాడు
వాళ్లను చూసిన బోయవాడొకడు కృష్ణుడున్న చోటు చూపించాడు.
నేలపై పడి ఉన్న శ్రీకృష్ణుని కళేబరాన్ని చూసి మూర్ఛిల్లినాడు అర్జునుడు.

కాసేపటికి తెప్పరిల్లినాడు కాని మనసులో మనసు లేదు.
ఇదివరకటి ఓర్పు నిగ్రహం లేవు, కన్నీళ్లను ఆపే శక్తి లేదు.
తెరలు తెరలుగా దుఃఖం ముంచుకువస్తున్నది, కనుల నుంచి
కన్నీరు ధారలు ధారలుగా కురుస్తున్నది – అర్జునుడిప్పుడు సామాన్య నరుడు.

---

**సీ.** ఆ రాజు సచ్చుట నారాయణున కేల । సెప్పఁ? దపోనిష్ఠఁ జెందియున్న
యమ్మహాత్ముని హృదయమునకు మెరమెర । పుట్టింప నేటికిఁ? బోయి కాంచి
పంచినపని యాచరించెదఁ గాక స । వినయభక్తికముగ' ననుచు మఱియు
వివిధ చింతారూపవిధులు చిత్తమ్మునఁ । బాఱ గాంధారిశాపంబు తెలఁగుఁ

**తే.** దలఁచి 'యయ్యవ్వ యతఁ డెగ్గతంపుఁ జోట । నరయ ది క్కెవ్వరును లేనియట్టి తెగుట
నొందఁగలవాఁడుగాఁ బల్కనొద్దనుండి । వింటి నకట! నిప్పును జెద లంటు నొక్కొ?' (మౌసల. 1–157)

**ఉ.** 'ఏమిట నిట్టులయ్యె నొకొ? యిమ్మహితాత్మకుఁ' డంచు నున్మిష
ద్ధామములైన యంగములఁ దాఁ గలయం బరికించి యోగిహృ
ద్యామల పాదపద్మగత మైన విశేషము చూచి రుద్రతే
జోమయుఁ డైన సంయమి వచోగతి గాంచి సువిస్మితాత్ముఁడై. (మౌసల. 1–165)

**క.** అవికృతమును రుచిరమునై । యవయవములు నిదుర వోయినప్పటి క్రియ నుం
డ వఱలు కృష్ణుని దేహం । బవిరత చక్షురభిముఖత నాలోకించెన్. (మౌసల. 1–166)

# 17. రామకృష్ణులకు అగ్ని సంస్కారం చేసిన అర్జునుడు

ఏమయ్యింది ఈ దేవుడికి అనుకుంటూ పార్థుడు పరీక్షించాడు
శ్రీకృష్ణుని పార్థివ శరీరాన్ని, అప్పుడు గమనించాడు- యోగి హృద్యామల
పాద పద్మగతమైన గాయాన్ని చూసి, ముని శాపఫలితాన్ని చూసి
నిద్రపోతున్నట్లున్న ఆ నిర్వికారుడి దేహకాంతిని చూసి నమస్కరించి

ఈ పవిత్రుడి దేహాన్ని ద్వారకకు తీసుకువెళ్లడమా లేక ద్వారకాపురి
నివాసుల్ని ఇక్కడకు రమ్మనడమా అని ఆలోచించాడు అర్జునుడు.
అప్పుడు గుర్తుకు వచ్చిందతడికి, ద్వారక సముద్రంలో మునిగి పోతుందని.
అడవిలో తిరిగిన రోజులన్నీ లెక్కకట్టినాడు- రేపు ఉదయమే గడువు.

అప్పటికే సూర్యాస్తమయం కావచ్చింది. అర్జునుడన్నాడు
-శ్రీకృష్ణుడు చనిపోయాడన్న సంగతి ద్వారకా వాసులకు తెలిస్తే
అలజడి మొదలై అంతరాయమేర్పడ్తుంది ప్రయాణాలకు-
ఉదయం కాకమునుపే ద్వారకను వదలాలి మనమందరం. లేకుంటే

ప్రాణనష్టం మిక్కిలిగా జరిగి ఆపద, వ్యధ, నింద, పాపం కలుగుతాయి మనకు-
అనుకుని శ్రీకృష్ణునికి దహన సంస్కారాలు చేసాడు అర్జునుడు శాస్త్రోక్తంగా
ఆ తరువాత బలరాముడి శరీరానికై వెదకగా కాస్త దూరంలో కనిపించింది.
అర్జునుడు ఆ కళేబరాన్ని కూడా ఆహుతి చేసాడు చితాగ్నిలో.

---

క. మఱునాఁడ యగుట లెస్సగ । నెఱిఁగె; నినుం దపుడు వేఁడి యెడలిన దీప్తుల్
దుఱఁగొలిగొనఁ బశ్చిమగిరి । చఱికి ననతి దూరమున విశదుఁడై తోఁచెన్. **(మౌసల. 1-169)**

ఉ. కావున వేగ మగ్నియును గాష్ఠములున్ సమకూర్చి సద్విధి
శ్రీవిలసిల్లఁ గృష్ణుని శరీరము సంస్కృతిఁ గూర్చి క్రమ్మఱం
బోవుట బుద్ధి' యంచు మఱి భూసురకోటియుఁ దాను గాఢసం
భావనతోడఁజేసె దృఢభక్తికుఁడై పితృమేధభద్రమున్. **(మౌసల. 1-171)**

చ. హలధరునిం దలంచి మునులాడిన మాట తెఱంగు దప్పదం
చలయక తత్ప్రదేశమున నారసి కాంచి తదీయదేహమున్
వలయు తెఱంగునం బరమవహ్నికి నాహుతి సేసె నయ్యనా
కులహృదయుండు భూమిసురకోటియుఁ దానును సత్వరంబుగన్. **(మౌసల. 1-172)**

తే. అనుచు నరిగి తాదలచిన యట్లయెల్ల తెరగు పనులు నా రాత్రిలోఁ దీర్చిప్రొద్దు
పొడుపునకు మున్న వెడలించె బురము సకల జనములను జీవధనముల సరకునతడు **(మౌసల. 1-174)**

# 18. అతడు అందనివాడు, అందరివాడు

ఆర్తత్రాణ పరాయణుడు ఆదిమధ్యాంత రహితుడు అనాధరక్షకుడు
అనాధగా, అడవిలో ఒంటరిగా దిక్కెవ్వరూ లేక అరికాలిలో గుచ్చుకున్న
బాణం నెప్పికి అల్లల్లాడుతూ ఆఖరిశ్వాస తీసుకుని అస్తమించాడు.
అది విధి లిఖితమా, గాంధారి శాపమా, పూర్వజన్మ కర్మ ఫలితమా?

అమావాస్య అర్థరాత్రి పుట్టి, తండ్రి నెత్తిన బుట్టలో యమునా నదిని దాటి
పుట్టుక మునుపు నుంచి గిట్టేవరకూ ఎన్నో హత్యా ప్రయత్నాలనధిగమించి
భగవద్గీతకు, విష్ణు సహస్ర నామాలకు కర్తయై, ఆయుధం పట్టకుండా
భూభారాన్ని తగ్గించి, స్నేహబంధంలో సాటిలేనివాడైన శ్రీకృష్ణుడు

మాయతో కప్పబడిన కనులకు ఒక విధంగా భక్తులకు మరోవిధంగా
దివ్యదృష్టితో విశ్వరూపుడిగా, యశోదమ్మ కనులలో పసిబాలుడిగా
తాపసుల దృష్టిలో యజ్ఞపురుషుడిగా, యోగులకు మహాయోగిగా
ప్రేమికులకు మహా ప్రేమికుడిగా, బ్రహ్మచారులకు అస్ఖలిత బ్రహ్మచారిగా.

దుష్టులకు కాలాంతకుడిగా, శిష్టులకు ధర్మరక్షకుడిగా
నోటిలో ముల్లోకాలను చూపించినవాడు, ముల్లోకాలూ తానైనవాడు
అన్నీ తెలిసినవాడూ, ఏమీ తెలియనట్లుండేవాడు, నిర్బంధంలో
జనించి స్వేచ్ఛగా దేహాన్ని విడిచిన దేవదేవుని శరణు వేడుతున్నాను.

---

సీ. అప్పుడు కృష్ణుని యంతఃపురాంగనా । జనము షోడశ సహస్రమ్ము నతని
మహిషీజనుల రాముమహిళల నుచితవా । హనముల నిడికొని యర్జపురుష
లేతేరఁ దేరుల నేనుంగులను గుఱ్ఱ । ములను దత్పరిచారకులు ప్రయత్న
మున సవరణ తోడఁ గొని రా నగరి సర । కులుఁ దదీయాధికారులు బహు ప్ర

ఆ. కారశకటములను గావళ్ళ నెత్తించి । యరసికొని కడంక నరుగుదేర
విగతనాథ లైన మగువల గారాము । సెడక యుండునట్లు నడపికొనుచు. (మౌసల. 1-175)

క. విను వజ్రముఖ్య యాదవ । జనము నుచితవృత్తి నడపి సర్వంబున క
య్యనఘుండు దాన దిక్కయి । చనియె నరదమునను మది విషాదము గదురన్. (మౌసల. 1-176)

క. ఇమ్మెయి నరుండు సకల జ । నమ్ము వెడల నిను౦డు పూర్వనగ మెక్కెను వే
గమ్మున ముంచుకొనియె నగ । రమ్ము పయోరాశి భరతరాజవరేణ్యా! (మౌసల. 1-177)

– యద్ యద్ధి పురుష వ్యాఘ్రః భూమేస్త స్యా వ్యముంచత
తత్ తత్ సంప్లావయామాస సలిలేన స సాగరః (సం.మౌసల. 7-42)

# 19. సముద్రంలో మునిగిన ద్వారకాపురి

త్వరత్వరగా అగ్నిని కర్రలను సిద్ధం చేసి సత్ విధిశ్రీ విలసిల్ల
శ్రీకృష్ణుని శరీరాన్ని చితిపై ఉంచి అగ్నికాహుతి చేసి తరువాత
అడవిలో వెదకగా కనిపించిన బలరాముడి కళేబరానికి
అగ్ని సంస్కారం చేసినాడు అర్జునుడు తనతో వచ్చినవారు సాయపడగా.

ఆవిధంగా శ్రేష్ఠమైన పితృమేధాల్ని రామకృష్ణులకు నిర్వహించి
ద్వారకను చేరి సూర్యోదయం కాకమునుపే ప్రజలను
జీవములను, సరకులను పురము దాటించినాడు అర్జునుడు.
సూర్యోదయం కాగానే ఒక్కుమ్మడిగా సముద్రం పొంగి ముంచివేసింది ద్వారకను.

అది చూసి ద్వారక ప్రజలందరూ ఆశ్చర్య దుఃఖభరితులైనారు.
అటు జలసముద్రం, ఇటు జనసముద్రం, గొప్ప అలజడి అటూ ఇటూ
అర్జునుడు ఆ పెద్దగుంపును విడిది చేయించాడు పంచవటమున
అభీరుల చోరుల గుంపు విరుచుకుపడింది వారిపై, క్రూరులైన ఆ దుర్మార్గులు

అర్జునుడు వారిని బెదిరించినా భయపడక వాళ్లు కురిపించారు అమ్ముల వర్షం
శస్త్రాలు పనిచేయక పోయేసరికి అస్త్రాలను తలచాడు అర్జునుడు
ఏ మంత్రమూ గుర్తు రాలేదు, గాండీవం పనిచేయలేదు, ఖాళీ అయ్యాయి
తూణీరాలు, బోయలదే పైచేయి కాగా బిక్కముఖం పెట్టాడు భీభత్సుడు.

---

**క.** వననిధి పురంబు ముంపఁగ । మనుజేశ్వర! యెల్లజనులు మరలఁబడి కనుం
గొని రద్భుత రసపూరం । బునఁ బెన్నిట్టఁ దమ చిత్తములు మునుఁగంగన్. (మౌసల. 1–178)

**తే.** అపుడు రెండవ జలనిధి యనఁగఁ జాలి । యద్భుతోద్భూత వాక్యచయంబు పేర్మి
మ్రోయు నా జనసంఘంబు మురవిరోధి । మఱఁది నడిపించె దర్శితమార్గుఁడగుచు (మౌసల. 1–179)

**క.** నడిపించి పంచవటమున । విడియించెను; వీడు చోరవీరులు గని 'యె
క్కుడు ధనములు గల వీ ప్రము । క్కడి ప్రజలో లేరు దీనిఁ గావఁగ యోధుల్. (మౌసల. 1–180)

**క.** కవ్వడి యొక్కడ కంటిరె? జివ్వనఁ జేరుద మితండు సేద్పడఁ గా నిం
దెవ్వరుఁ గడంగ లే రివి । ద్రెవ్విపడిన ధనము లెతిఁగితిమి లోఁతెల్లన్.' (మౌసల. 1–181)

**క.** అని వా రొండురువులతో । మనముల నుత్సాహ మెసఁగ మానితధనముల్
గొను నగ్గలికం బలుకుచు । ననేక బలకోటులగుట నలుకేది వడిన్. (మౌసల. 1–182)

**క.** 'బాలురు వృద్ధులుఁ జుండీ । యాలమునకుఁ గడఁగ నొక్కఁ డయినను లేఁడీ
స్త్రీలం బొదువుద మనుచును । నేల యవిసి మూఁగినట్లు నిర్భరభంగిన్. (మౌసల. 1–183)

# 20. కిరాతుల చేతిలో ఓడిన అర్జునుడు

విధికి తల ఒగ్గినాడు విజయుడు, అతడికర్థమయ్యింది తన బలమంతా
శ్రీకృష్ణుడున్నప్పుడే ఉంటుందని, మరోసారి తెలిసింది నరుడికి
మనసులో ఆశ్చర్యం దుఃఖం అతిశయించగా చేతనైనంత వరకూ
కిరాతుల విజృంభణాన్ని అరికట్టి కాపాడగలిగాడు కొంతమందిని.

శ్రీకృష్ణుని అష్టభార్యలను, బలదేవుడి సతీమణులను, ఇంకా కొంతమందిని
కాపాడినా, మిగతా స్త్రీలను కిరాతకులు పట్టుకున్నారు, ధనాన్ని
దోచుకున్నారు, విడిదిని సర్వనాశనం చేసారు, విధ్వంసం చేసి
విజయ నాదాలు చేస్తూ వచ్చినవాళ్లు వచ్చినట్లే అదృశ్యమైనారు.

కిరాతులకు వశం కాగా మిగిలిన జన సమూహాన్ని నడిపించుకుంటూ
అర్జునుడు చేరుకున్నాడు కురుక్షేత్రం. అందరినీ కాపాడలేకపోయిన
తన అసమర్థతకు కారణంగా గాంధారీ శాపాన్ని ఉదహరించుకుని
కాస్త ఊరట చెందినా కాలశక్తికి లొంగినవాడై దీనుడైనాడు.

కృతవర్మ కుమారులకు మృత్తికావతపురాన్ని, సాత్యకి కుమారుడికి
సరస్వతీ నగరాన్ని, ఇంద్రప్రస్థానికి వజ్రుడిని రాజులుగా చేసి
అక్రూరుడి భార్యాబిడ్డలను ఇంద్రప్రస్థంలో ఉండమనగా వెళ్లిపోయారు వారు.
వారికేదో మనస్తాపం కలిగిందని ఊరుకున్నాడు ధనంజయుడు.

సీ. కనుఁగొని జంభారితనయుఁ డోరీరి యా । ప్రజ కేన చుండు సంరక్షకుండఁ
దొలఁగి పొం డడియాస నొద్దకు వచ్చినఁ । దలలేఱి యుర్వికి బలియొనర్తు
నని యదల్చినను వా రణవాయిగొనక య । ప్పలుకులన్నియును రజ్జులుగఁ గొనుచుఁ
జామల నచట నచ్చట నొల్చికొనఁగ నా । లోకించి యవ్వీరలోకవరుఁడు

తే. గాండివం బెక్కువెట్టి ప్రచండబాణ । నికర మక్కిరాతుల మీఁద నిగుడఁ జేయ
నలఘుచర్మసంవృతగాత్రు లగుచుఁ దుచ్ఛ । బాణపాషాణలగుడముల్ పరఁగఁ జేసి. (మౌసల. 1-185)

సీ. అప్పుడు కాలపర్యయమున కాశ్చర్య । మును విషాదముఁ దన మనములోనఁ
బరిగొన బహువిస్ఫురణకోదండ దం । డమున నా బోయల సమదవృత్తి
నెట్టకేలకు నొకయెడ మాన్చి రుక్మిణి । యాదిగాఁ గల కృష్ణు నగ్రమహిషు
లెనమంద్ర బలదేవు వనితల మఱియును । గతిపయ యాదవాంగనలఁ గాచెఁ;

తే. దక్కుఁ గల యింతిగముల నా దస్యులదరి । పట్టికొని యేచి వీ డెల్ల బన్నపడఁగ
దొడ్డగొని రథకుంజరతురగతతులు । దమకు వలవకునికి దిగఁ ద్రావి చనిరి. (మౌసల. 1-188)

# 21. సహగమనం చేసిన రుక్మిణి, జాంబవతి

ఆ విధంగా మూడు నగరాలలో మూడు యాదవ సమూహాలను నిలిపి
వారు కాస్త స్థిరపడినాక, అర్జునుడు తన ఆప్తులతో కలిసి వెళ్లి
రామకృష్ణుల స్త్రీజనంతో విన్నవించాడు రామకృష్ణుల నిర్యాణాన్ని.
ద్వారక సముద్రంలో మునిగే స్థితిలో సమయం చాలని పరిస్థితులలో

అగ్ని సంస్కారాలు పితృమేధాన్ని నిర్వహించానని అర్జునుడు తెలిపి
తల్లులారా! ఇది తప్పుగా అనిపించి నా హృదయాన్ని బాధ పెడుతున్నది.
బలరాముడు, శ్రీకృష్ణుడు మనకు లేరు, మన్నించండి నన్ను-
-అని సాష్టాంగపడిన అర్జునుడిని సముదాయించారు వారు.

మేము వీరపత్నులం, మేము నిర్ణయించుకుంటాం ఏమి చెయ్యాలో
అని పలికి- రుక్మిణి జాంబవతి సహగమనం చేసినారు
శ్రీకృష్ణుని స్మరిస్తూ, బంధువుల హాహాకారాల మధ్యన వారు.
సత్యభామ మొదలైన స్త్రీలు తపస్సు చేసేందుకు నిశ్చయించుకున్నారు.

ఆ తరువాత అర్జునుడు వెళ్లి కలిసాడు వేదవ్యాస మహర్షిని,
అర్జునుడన్నాడు- మునీశ్వరా, నన్ను ఓడించింది సాధారణ కిరాతులు.
నా మానవశక్తి నిరుపయోగమై, మంత్ర, దైవశక్తులు సాయం చేయలేదెందుకని?
వ్యాసుడన్నాడు- సృష్టిలో అంతా కాలాధీనము, కాలాయ తస్మై నమః-

---

**సీ. అని పల్కి రప్పించునందు రుక్మిణియు జాం । బవతియులోనగు పద్మముఖులు**
**గొందఱు గోరిరి కురునాథ! యనుమర । ణమునకు బంధుజనంబులెల్ల**
**శోకార్తులై రోదనాకులత్వము నొంది । రనుమృతికలనకు నమరియున్న**
**యా బలదేవ మురాంతక మహిషుల । కతి విభవం బైన యానకల్ప**

**తే. నంబు నాకల్పరచనంబు నడపి నరుఁడు । చందనాగురుమయచితాసంవిధాన**
**మాచరించి యర్హప్రకారాగ్ని విధి యొ । నర్చె మహనీయవిప్రజనంబుఁ బనిచి. (మౌసల. 1-204)**

**క. విను సత్యభామలోనగు । వనితాజను లధిక నియతి వనములకుఁ దపం**
**బొనరింపఁ బూని కొందఱు । చని రవ్విధమున నలుప్తసత్కర్ముండై. (మౌసల. 1-205)**

**తే. అఖిలబంధు జనంబుల నాప్తజనుల । నర్థవాక్యప్రయుక్తి నూరార్చి యుచిత**
**మార నామంత్రితులఁ జేసి యశ్రు లురులఁ । బోయె నా క్రీడి సాత్యవతేయుగుతిచి. (మౌసల. 1-206)**

**- రథస్య పురతో యాతి యః స చక్ర గదా ధరః**
**తవ స్నేహాత్ పురాణర్షిః వాసుదేవశ్చతుర్భుజః**
**కృత్వా భారావతరణం పృథివ్యాః పృథులోచనః (సం.మౌసల. 28-29)**

# 22. కాలాయ తస్మై నమః

నరుడంతే, ఎన్నిసార్లు గీతాబోధ చేసినా మరచిపోతూనే ఉంటాడు.
తాత్కాలిక ఉద్వేగాలు అతడి మనసనే అద్దాన్ని మసక బారుస్తాయి.
ఎప్పటికప్పుడు అద్దాన్ని తుడిచి ఖాళీ పలకలా ఉంచితే మంచిది.
మరల రాసుకుని చెరిపేస్తూ ఉంటాడు చిన్నపిల్లాడిలా గీతలు గీస్తూ.

దివ్యాస్త్రాలు దైవబలం ఉన్నప్పుడు చెలరేగి అంతా నేనే అనుకుంటాడు.
ఆ ఆసరా తీసేసిన మరుక్షణం అవనిపై వెల్లకిలాపడి దీనుడవుతాడు.
రెల్లు పరకను బ్రహ్మాస్త్రంలా ప్రయోగించగలిగినవాడు భయంతో వణుకుతుంటాడు.
తెల్లటి గుర్రాలు, అగ్నిరథము, కపిధ్వజము, గాండీవము, అక్షయ తూణీరము

అనుకూలంగా ఉన్నంత కాలమూ అది తన బలమే అనుకుని లెక్కచేయడు దేవుడిని.
అన్ని బాణాలు ఖాళీ అయిపోయాక ఆఖరున వదిలేస్తాడు అహంకారం.
అయిన కాలంలో బలమూ బుద్ధీ శక్తీ ప్రకాశిస్తాయి, నశిస్తాయవన్నీ
కాలం అడ్డు తిరిగితే, ఏ మంత్రమూ గుర్తురాదు, ఏ ఆయుధమూ పనిచేయదు.

అన్నీ తెలిసినవాడు ఆపద్బాంధవుడై వచ్చి అన్నీ పూర్తయ్యాక వెళ్లిపోయాడు.
అతడు లిఖించిన వాక్యాలను చదివి, అతడు చెప్పమన్నవి చెబుతాడు నరుడు
ప్రశ్న, జవాబు అతడే అయినా, నీవు ప్రశ్నలడిగితే అతడు జవాబు చెబుతాడు.
విల్లు అతడే, బాణమూ అతడే, లక్ష్యమూ అతడే, విలుకాడూ, కాలమూ అతడే!

---

**మ.** **అవనీభారము వాపి తా హరికిఁ దోడై భీమ సాహాయ్యగౌ**
**రవదుర్దాంత పరాక్రమంబునఁ గృతార్థత్వంబునం జేసి య**
**స్త్రవితానంబును నిన్నుఁ బాసి చనియెన్ దైవప్రకారజ్ఞ! నీ**
**దువరిష్ఠాచరణంబునన్ సురలు సంతోషించి రప్పోరులన్. (మౌసల. 1-220)**

**తే.** **కాలమూలంబు సర్వంబుఁ గాన దీని । కొండు తలఁపులు దక్కిమీ రుత్తమంపు**
**గతికిఁ జనుఁడు నిశ్చింత వికారతనులు । విడిచి యార్యజనంబులు వినుతి సేయ.' (మౌసల. 1-222)**

**సీ.** **అన విని శోకమోహంబులు వాసిన । డెందంబు నిర్భరానంద మొంద**
**నధికభక్తియు వినయంబును దలకొన । నర్జునుఁ దమ్మహితాత్ము వీడు**
**కొని వారణపురికిఁ జనుదెంచి ధర్మజుఁ । గని తన పోయివచ్చిన తెఱంగు**
**వినిపించె సర్వంబు నని యిట్లు సంయమి । నుతుఁడు వైశంపాయనుండు రామ**

**తే.** **కృష్ణ లాదిగఁ గల్గిన వృష్ణిచయము । భోజసంతతి యంధకరాజి నూత్న**
**వృత్తములు జనమేజయ విభున కింపు । సెవులఁ దళుకొత్త నేర్పడఁ జెప్పుటయును. (మౌసల. 1-223)**

**-** **కాలమూలమిదం సర్వం జగద్బీజం ధనంజయ**
**కాల ఏవ సమాదత్తే పునరేవ యదృచ్ఛయా (సం.మౌసల. 8-33)**



# శ్రీ ప్రసాద మహాభారతము

## అయిదవ వేదము - శాంతి సప్తకము

# 17. మహా ప్రస్థానిక పర్వము

సీ. అర్జునుండమ్మెయి నచ్యుతరామాది యాదవ జనుల వృత్తాంతములును
దనదు తెరంగు సత్యవతీ తనూభవు హితభాషణంబులు నేర్పడంగ
జెప్పిన విని యుధిష్ఠిరుడు ప్రస్థానంబునకు మది యొలయ నన్నరుని తోడ
నఖిల భూతంబుల ననఘ! పాకంబు బొందించుఁ గాలుండు మదీయ బుద్ధి

తే. కర్మ సంత్యాగ కలనంబు కార్యమిప్పుడను వినిశ్చయ మొందె; నీ మనము నరయ
నిదియ మేలుగ గనుచున్కి విదితమయ్యె నాకు ననవుడు నయ్యింద్రనందనుండు.
(మహాప్రస్థానిక. 1-4)

- యుధిష్ఠిర మతం జ్ఞాత్వా వృష్ణిక్షయ మవేక్ష్యచ
భ్రాతరః పంచ కృష్ణా చ షష్ఠీ శ్వా చైవ సప్తమః-

- పాండవాశ్చ మహాత్మానః ద్రౌపదీ చ యశస్వినీ
కృతోపవాసాః కౌరవ్య ప్రయయుః ప్రాంగ్ముఖాస్తతః- (సం.మహా.1-29)

- యత్ర రాజ్యం పరిత్యజ్య పాండవాః పురుషర్షభాః
ద్రౌపద్యా సహితా దేవ్యా మహాప్రస్థాన మాస్థితాః (సం.ఆది. 2-365)



| సంస్కృత మహాభారతము | కవిత్రయ మహాభారతము | శ్రీ ప్రసాద మహాభారతము |
|---|---|---|
| **17.** మహా ప్రస్థానిక పర్వము<br>(అధ్యాయాలు) | **17.** మహా ప్రస్థానిక పర్వము<br>(గద్య పద్యములు) | **17.** మహా ప్రస్థానిక పర్వము **(8)**<br>(పద్య శీర్షికలు) |
| అధ్యాయాలు (3) | ఏకాశ్వాసము (79) | ఏకాశ్వాసము (8) |

(Traditional & Critical Edition: ఉపపర్వాలు లేవు; అధ్యాయాలు-3)

# ✤ 17. మహా ప్రస్థానిక పర్వము - ఏకాశ్వాసము ✤

## 1. కాలము నేమన వచ్చును?

కాలపురుషుడు అన్ని భూతాలను కాల్చి పరిపక్వం చేస్తాడు, అర్జునా!
అన్నాడు ధర్మరాజు- నాకూ కర్మను పూర్తిగా త్యజించాలనిపిస్తున్నది.
నరుడన్నాడు- ఈ కాలాన్ని ఏమనగలం? ఎట్లా వర్ణించగలం? కాలాన్ని
కాలంతో మాత్రమే పోల్చగలం కాని వేరే లీలలే లేవుకదా, అదే మంచిదేమో!-

ధర్మరాజు, అర్జునుడు ఏకాభిప్రాయానికి వచ్చినవారై భీమ నకుల సహదేవులను
అడిగారు వారి అభిప్రాయాలను, అందరికీ నచ్చింది కర్మత్యాగం.
యుయుత్సుడికి చెప్పారు తమ నిర్ణయం, నేర్పించారు రణతంత్రం,
రాజ్యపాలనా వ్యవహారం, గృహాంతశ్చరితం, ప్రేమానుభవేక మంత్రం

యుయుత్సుడిని నియమించారు కురు సామ్రాజ్యానికి మహా నాయకునిగా.
ఆర్యులు కీర్తించ పరీక్షిత్తును చేసారు భరత భూమికి మహరాజుగా
సుభద్రను పిలిచి అన్నారు- అమ్మా, నీ కుమారుడు హస్తినకు రాజు
యాదవ వంశ శ్రేష్ఠుడైన వజ్రుడు- అనిరుద్ధుని కొడుకు ఇంద్రప్రస్థానికి రాజు.

కురు యాదవ వంశాల పరిరక్షణను నీకు అప్పజెబుతున్నాను, వీరికి నీవే దిక్కు
అని పలికి సుభద్రకు హస్తిన, ఇంద్రప్రస్థ బాధ్యతలను అప్పజెప్పినారు.
అంతేకాక భారత యుద్ధంలో, యాదవ కలహంలో మృతి నొందినవారికి
పుణ్యగతులు కలిగేందుకు ఏనుగులు గుర్రాలు ధనం గోవులను చేసారు దానం.

---

క. 'కాలము నే మన వచ్చును? । గాలముఁ గాలంబ పోలుఁగా కొంటికి నీ
లీలలు గలవే? లెస్సగ । నాలోకించి; తిది హితము నభిమతము నగున్.' (మహాప్రస్థానిక. 1-6)

మ. భవదీయాత్మజు నాత్మజుండు కురుభూభారోద్వహుం డయ్యె యా
దవవంశోత్తరుఁడైన వజ్రునకు నింద్రప్రస్థ రాజ్యంబు గౌ
రవ దీప్తంబుగ నిచ్చినాఁడ సుచరిత్రా! రక్షణీయంబు లై
నవి యీ యిండులు రెండు నీవు దృఢధైర్యం బొప్ప రక్షింపుమా! (మహాప్రస్థానిక. 1-11)

క. విను! శేషించిన యాదవ । జనులకు నా వజ్రనృపతి సంరక్షకుఁ డా
తనిఁ బోషించుట ధర్మం । బనఘా! యది లేమి ధర్మహాని యగుఁ జుమీ!' (మహాప్రస్థానిక. 1-12)

చ. పదపడి భారతాజి మృతబాంధవకోటికి మౌసలాజి ను
న్మదు లయి పడ్డ యాదవజనంబులకుం బరలోకసౌఖ్య సం
పద కయి చేసె నక్కురునృపాలవరిష్ఠుఁ డనేకదానముల్
రదని తురంగ గోకనక రత్నమయంబులుగా ముదంబునన్. (మహాప్రస్థానిక. 1-14)

## 2. ప్రజలప్పడే వాదులాడుకుంటున్నారు కూర్చునే చోటుకోసం-

ధౌమ్యాది విప్రులకు తృప్తి కలిగేలా అనేక ధనవాస్తు వాహనాల నిచ్చి
మిగతా ధనాన్ని పరీక్షిన్మహరాజుకు ఇచ్చి, అతడిని కృపాచార్యునికి
శిష్యుడిగా అప్పగించి, పట్టణ గ్రామ ప్రజలకు పరీక్షిన్మహరాజును
పరిచయం చేసి, తాము మహా ప్రస్థానానికి పోతున్న విషయాన్ని తెలిపాడు.

ధర్మరాజు ఆ మాటలు అనగానే పౌరుల వదనాలు చిన్నబోయాయి.
వారన్నారు– 'మీరు వెళ్లిపోవడమేమిటి ధర్మరాజా! రాజు అవసరం పడకుండా
పాలించినావు నీవు. మేము అడగకుండానే సమకూర్చినావు సకలాన్నీ
మమ్మల్నిలా వదిలేసి వెళ్లడం భావ్యమా!' వాళ్లు దుఃఖిస్తుంటే ఓదార్చి

తమ ప్రయాణానికి సమ్మతింపచేసినపుడు ప్రజలను గమనిస్తున్న సహదేవుడు
ధర్మరాజుతో అన్నాడు నవ్వుతూ– అన్నా! చూడు కలికాలం వచ్చింది కదా, ప్రజలు
వాదులాడుకుంటున్నారు కూర్చునే పీఠాల కోసం, కాసింత చోటుకోసం–
ధర్మరాజు నవ్వి అన్నాడు– మన యుగం ముగిసింది, మనకీ జీవితాలు చాలు!–

ప్రజలను పంపివేసి మందిరంలోకి వెళ్లి నారచీరలు, జింక చర్మాలు ధరించారు.
నగలన్నీ తీసివేసారు, ధార్మిక విధులను పూర్తిచేసి, అగ్నులను కలిపారు నీటిలో.
రాజభవనం నుంచి బయటకు వచ్చారు వరుసగా ధర్మజ భీమార్జున నకుల సహదేవులు.
వారి వెనక ద్రౌపది; వారికన్నా ముందు వచ్చి వారిననుసరిస్తున్నది ఓ కుక్క!

---

క. భూదానంబులునుం గ। న్యాదానంబులును జేసె నన్నరపతి వా
సోదానంబులు నత్యం। తాదరమున నాచరించి యరదము లిచ్చెన్. (మహాప్రస్థానిక. 1-15)

తే. ఇట్లు ధౌమ్యాది విప్రులకెల్లఁ దృప్తి। యెసఁగ బహువస్తుకోటుల నొసఁగి కృపుని
ధనమునను బహుమానంబునను బ్రమోద। భరితుఁగాఁ జేసెఁ గురుపతి కురువరేణ్య! (మహాప్రస్థానిక. 1-16)

సీ. ఆ పార్థపౌత్రునిఁ జూపి 'మా యేవుర। మాఱుగా మీ రిక్కుమారవరునిఁ
గైకొని తగ నెల్లకార్య జాతంబును। నడపుచు ననురక్తి నాఁడునాంటి
కెక్కుడగుచు నుండ నీతని యుల్లంబు। రంజిల్ల సమ్యగారాధనంబు
నందు సంప్రవణుల రగుఁడయ్య!' యని పల్కి। తమ నిశ్చయంబు నుదాత్తభంగిఁ

తే. జెప్పుటయు వారు మొగములు చిన్నఁబోవ। 'మము నుపేక్షించి యిటుసేఁత సముచితంబె?
నీదు చిత్తంబు కారుణ్య నిలయ; మేము। దరతరంబ యాశ్రితులము ధర్మశీల!' (మహాప్రస్థానిక. 1-18)

– యుధిష్ఠిర మతం జ్ఞాత్వా వృష్ణి క్షయ మవేక్ష్య చ
భ్రాతరః పంచ కృష్ణా చ షష్ఠీ శ్వా చైవ సప్తమః (సం. మహాప్రస్థానిఇక. 1-24)

# 3. సహదేవుడి నవ్వు!

అందరికి దిక్కైనవాడు, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, అనాధ రక్షకుడు
ఎవ్వరూ లేని చోట, దిక్కెవ్వరూ లేని విధంగా, పడి ఉన్నాడు అనాధ ప్రేతమై.
ఒక్క నిముషంలో భారతయుద్ధాన్ని ముగిస్తానన్న నరుడికి ఆ సంగతి గుర్తురాలేదు,
ఏ మంత్రాలు, విద్యలు, గీతలూ, గాండీవమూ, దివ్యాస్త్రాలూ పనిచేయలేదు.

బోయలు నిర్భయమతులై యాదవాంగనల బాలల వృద్ధులను నిర్దయులై బాధించి
సర్వం దోచుకుపోతుంటే సవ్యసాచికి కనిపించి ఉండాలి ఏకలవ్యుడి బొటనవ్రేలు.
సార్వభౌముడు కావాల్సినవాడు సూతపుత్రుడై అడుగడుగునా ఆక్షేపించబడి,
ఆరుగురి చేత తలవాల్చినపుడు కర్ణుడికి కనిపించిందేమో వర్ణ ధర్మాలపై విధివ్రాలు

మెత్తని పులి ఆడిన అసలు జూదంలో పాచికల దెబ్బ తగిలి అవాక్కైన
దుష్ట చతుష్టయ పిల్లులకు కనిపించి ఉండాలి మాయాజూదపు పాచికలు.
అవే ప్రాణాంతక బాణాలై, గదలై, ఖడ్గాలై తమనే చావ చితకగొడ్తున్నపుడు, దుర్యోధన
దుర్యోధన దుశ్శాసన సైంధవ జరాసంధ కీచకాదులకు కనిపించే ఉంటాయి భవిష్యత్ కాలసూచికలు.

పరీక్షిత్తుకు పట్టంకట్టి హస్తినాపుర పౌరులకు పరిచయం చేస్తున్నాడు ధర్మరాజు
వచ్చినవాళ్లు తగవులాడుకుంటున్నారు తీవ్రంగా తమకు నచ్చిన పీఠాలకోసం.
'కలియుగం మొదలైంది' -అన్నాడు సహదేవుడు నవ్వుతూ- ధర్మరాజు అన్నాడు
-'ఇక మన జీవితాలు చాలు'. కాలజ్ఞానియైన సహదేవుడు నవ్వుతూనే ఉన్నాడు.

**సీ.** **పౌరజనంబు లాబాలవృద్ధంబుగా । వచ్చి రక్కురువంశవరులఁ జూడఁ;**
**దత్సమయంబు జూదమునాఁడు వెడలి వా । రరిగెడు నయ్యవసరముఁ బోలె;**
**భటసమేతముగ నప్పాండుతనూజుల । తోన యుయుత్సుండు దాను నరిగె;**
**భవదీయ జనకుఁ దభ్యంతరసతు లెల్ల । ననుగమించిరి వారి మనుజనాథ!**

**తే.** **యిట్లు కరిపురి వెలువడి యేఁగె ధర్మ । తనయుఁ డందఱు నెంతయు దవ్వు గాఁగ**
**సొలయకేగి రొకళ్లను జూచి నిలువు మనడు తలవాంచి యారాజు సనుచునుండె. (మహాప్రస్థానిక. 1-20)**

**చ.** **తనువులు దూల నందఱుఁ బ్రదక్షిణముల్ వినుత ప్రణామముల్**
**వినయసమేతులై నడపి వీడ్కొని రా నృపతిం గ్రమక్రమం**
**బున; నిటు లుమ్మలంబు మనముల్ పొగిలింపఁగ వచ్చి చొచ్చి ర**
**జ్జనములునుం బరీక్షితుఁడు సామజపట్టణ మస్ఫురద్గతిన్. (మహాప్రస్థానిక. 1-21)**

సంస్కృత మహాభారత మహాప్రస్థానిక పర్వంలో "సహదేవుడి నవ్వు" ఘట్టం లేదు. పౌరులు, జానపదులు ధర్మజుని మాటలు విన్నారు. కలవరపడి "అలా చేయవద్దు, వెళ్లవద్దు" -అన్నారంతే.

# 4. దిక్కులు మేఘ పథంబును బిక్కటిలగ-

రెండు పాదాల ద్వాపర ధర్మంతో నడుస్తున్నాడు ధర్మరాజు
నాలుగు పాదాల సత్యయుగ ధర్మంతో నడుస్తున్నది కుక్క.
ఒంటికాలి మీద లేస్తారు క్రోధబుద్ధి గలవారందరూ
అందరూ ఇష్టపడేది, అందరూ అసహ్యించుకునేది సారమేయమే

ధర్మమనేది విశ్వాసం, విశ్వాసమనేది కృతజ్ఞతా లక్షణం
నీకంటే ముందు వచ్చి, నిన్ననుసరించి, నీతో నిలిచేది ధర్మమే
ఆ ఏడుగురూ అలా పురవీధుల్లో వెళ్తుంటే పురజనులు గుర్తు తెచ్చుకున్నారు
ఆనాడు జూదంలో ఓడి, ఈరోజు జీవితంలో గెలిచి వెళ్తున్నారు.

వీళ్లు మహానుభావులు -అనుకుంటూ అనుసరిస్తున్నారు కొందరు ఆ ఏడుగురినీ
ఆ శునకాన్ని చూడండి, తోక ఊపుకుంటూ ఎలా వెళ్తున్నదో వారి వెంట.
వారిలో ఒక్కడన్నాడు, మనమూ అంతే, కాని, మనకు విశ్వాసం తక్కువ.
అందుకే వాళ్లు ఆగిపోయారు పొలిమేరలో, చివరకు ఇంటిముఖం పట్టినారు.

పరీక్షిన్మహారాజుకిదొక కొత్త పరీక్ష! అల్లారు ముద్దుగా
పెరిగినవాడిపై పడింది రాజ్యభారం; ఒకప్పుడు హస్తినను
శతసోదరులు, తరువాత పంచపాండవులు పాలించారు.
ఇప్పుడు తాను మహరాజు, కలియుగంలో తొలి ధరణీపతి.

---

**సీ.** కృపుండు ధౌమ్యుండు నా నృపతినిఁ దగువారి । నర్థభాషణముల ననునయించి
యెలమి చిత్తంబులఁ దలకొల్పి పౌరులఁ । దగఁ జేర్చి పనుల నుత్సాహ మెసఁగ
వర్తింపఁ జేసిన వారణపురి పూర్వ । భంగి సంపత్పరిభరిత మయ్యె;
నట ధర్మజుండు ముందటఁ జనఁ గ్రమమున । ననుగమించిరి పవనాత్మజుండు

**తే.** నర్జునుండు నకులుఁడుఁ దదవరజుండు । ద్రౌపదియు నిట్లు సనుచుండఁ దగిలి వారి
వెనుక విడువక శునకంబుఁ జనియె; నవ్వి । ధమున వారు మహాపథగమనమునకు. (మహాప్రస్థానిక. 1-25)

**క.** దిక్కులు మేఘపథంబును । బిక్కటిలఁగ నవయవములు భీషణములుగా
నొక్కయెడ నగ్నిదేవుం । డక్కౌరవవంశవరుల యగ్రతలమునన్. (మహాప్రస్థానిక. 1-27)

– గాండీవం తు ధనుర్దివ్యం న ముమోచ ధనంజయః
రత్నలోభాన్ మహారాజ తే చాక్షయ్యే మహేషుధీ–

– వరుణా దాహృతం పూర్వం మయైతత్ పార్థకారణాత్
గాండీవం ధనుషాం శ్రేష్ఠం వరుణా యైవ దీయతామ్ (సం.మహాప్రస్థానిక. 1-34,41)

# 5. మహాప్రస్థానం ప్రారంభం

ధర్మరాజు ఆశీస్సులనంది అందరూ హస్తినకు మరలినారు.
దుఃఖితుడై ఉన్న పరీక్షిన్మహారాజును ఓదార్చినారు ధౌమ్యుడు, కృపుడు.
అక్కడ ధర్మజ భీమార్జున నకుల సహదేవులు ద్రౌపది గంగను దర్శించి
పుణ్య స్నానాలు చేసి తూర్పు సముద్ర తీరం చేరగా ప్రత్యక్షమైనాడు అగ్నిదేవుడు.

అగ్నిదేవుడన్నాడు- అర్జునా! గాండీవముపై మమకారము వీడుము.
సుదర్శన చక్రమెప్పుడో నన్ను చేరినది, వరుణుడిదీ గాండీవము-
అని పలుకగా అర్జునుడు ఆ మహా ధనుస్సును ఉంచినాడు సముద్రంలో-
అక్కడ నుంచి వారు ప్రదక్షిణ దిశలో దక్షిణ దిక్కుకు వెళ్లారు.

దక్షిణ దిక్కు నుండి పడమటి దిక్కున ఉన్న ద్వారకవేపు వెళ్లి
సముద్రంలో మునిగిపోయిన ఆ నగరం వేపు చూసి మరల
మళ్లినారు ఉత్తర దిక్కున ఉన్న హిమవత్పర్వతాన్ని దాటి
మేరు పర్వత భూభాగాన్ని చేరి యోగశక్తితో పయనిస్తున్నారు వేగంగా.

కాస్త దూరం వెళ్లేసరికి ద్రౌపది నేలకూలింది యోగశక్తి సడలగా
భీముడు కారణమడిగితే ధర్మజుడన్నాడు- ఈ స్త్రీకి అర్జున పక్షపాతమెక్కువ,
మరికాస్త దూరం వెళ్లేసరికి సహదేవుడు చనిపోయి నేలపై పడినాడు.
-తనకంటే ప్రాజ్ఞుడు లేడని తలుస్తాడు హృదయంలో- అన్నాడు ధర్మజుడు.

---

**సీ.** **నిలిచి భీభత్సుండు నిర్భర స్నేహంబు । కతమున విడువక గాండివంబు**
**గొనివచ్చుచున్న నాతనితోడ నవ్వాయు । సఖుఁ ।డో ధనంజయ! శౌరిచక్ర**
**మొన్నఁడే దివమున కేఁగె; నీ వేల గాం । డీవంబు విడువవు? దేవకార్య**
**మునకుఁగా వరుణదేవునిచేత నేను దె । చ్చినయది యీ ధనుశ్రేష్ఠ మమ్మ**

**తే.** **హానుభావుని కొప్పింపు' మనిన 'లెస్స । యట్లు సయుదుఁగా'కని యక్కిరీటి**
**యగ్రజానుజులకుఁ జెప్పి యాదరమున । నాతఁ డచ్చాప మంబుధియందుఁ బెట్టె. (మహాప్రస్థానిక. 1-28)**

**సీ.** **చనునప్పు డయ్యేద్వురును నతిస్థిరయోగ । సాధనపరు లయి సత్వరముగఁ**
**బోవంగఁ బాంచాల భూపపుత్రిక యోగ । మెడలిన మేదినిఁ బడియె నధిప!**
**పడిన సమీరణుకొడుకు కనుంగొని యన్నతోఁ జెప్పి 'యయ్యతివవలనఁ**
**గాన మెన్నఁడు ధర్మహాని; యి ట్లగుటకు । నరయంగఁ గత మేమి?' యని విషణ్ణుఁ**

**తే.** **డగుచు నడిగిన నాతఁ 'డిమ్మగువ యింద్ర । తనయుదెసఁ బక్షపాతిని; దానఁ జేసి**
**సుకృతములు ఫలియింపమిఁ జూవె దీని । కిట్టి దురవస్థ వాటిల్లె నీద్యచరిత!' (మహాప్రస్థానిక. 1-34)**

# 6. చనుదెంచె నీ భవ్య సారమేయమిది-

ఈసారి తూలి పడిపోయాడు నకులుడు భీముడది చూసాడు.
ధర్మజుడన్నాడు- తానే అందగాడినన్న రూపగర్వం నకులుడిది.
కాసేపటికి పార్థుడు పడిపోయాడు తన వాళ్ల గురించి చింతిస్తూ
-ఇతడు కౌరవులందరినీ ఒక్కరోజులో చంపేస్తానని మాట తప్పినాడు-

మరికొంత దూరం పోయేసరికి భీముడు నేలవాలుతూ కారణమడుగగా
ధర్మజుడన్నాడు- నీవు తిండిపోతువు, వాచాలుడివి, అదే కారణం-
అని పలికి నిర్వికార నిశ్చల చిత్తంతో ధర్మరాజు ముందుకు పోతున్నాడు.
అతడి ననుసరించి శునకం భక్తిపూర్వకంగా వస్తూనే ఉన్నది.

దివ్య దేహోద్ధత దీప్తి సంతానంబు దిశలు పదింటను దీటుకొనగ
రథం వస్తున్న ధ్వని మేరు పర్వత గుహలందు మారుమ్రోగగా
సిద్ధ సాధ్యగణముల స్తోత్ర పఠనముల మధ్య, కల్పవృక్షపు పూల మధ్య
ఇంద్రుడు వచ్చి నిలబడినాడు ధర్మరాజు ముందు ఆహ్వానం పలుకుతూ

ధర్మరాజన్నాడు- నాతో వచ్చిన నా సోదరులు, భార్య చనిపోయారు.
వారు లేకుండా నేను స్వర్గానికి రాలేను. ఇంద్రుడన్నాడు- ధర్మరాజా!
వారెప్పుడో స్వర్గానికి చేరుకున్నారు, నీవు నాతోరా వెళ్దాం!
ధర్మజుడన్నాడు కుక్కవేపు చూపి- ఈ కుక్క నాతో రావాలి!

---

**సీ.** **భూవర! యమ్మెయిఁ బోవంగ సహదేవుఁ డపగతప్రాణుఁడై యవనిఁ బడిన**
**గని వాయుజుఁడు ధర్మతనయున కెఱిఁగించి। యితఁ డనహంకారుఁ డెపుడు నీకు**
**నతిభక్తి శుశ్రూష యాచరించుచునుండు। మాలోన నెల్ల సన్మార్గ వర్తిఁ**
**యితనికి నేలోకో యిద్దెస వాటిల్లె?' ననిన నమ్మనుజేంద్రుఁ డతనితోడ**

**తే.** **'వీఁడు దనకంటెఁ బ్రాజ్ఞుండు లేఁడు జగతి। నెందు నని సంతతమ్ముఁదా నెద్దఁ దలఁచు;**
**దాన నిట్లయ్యె' నం చుపేక్షానిరూఢ। బుద్ధి నరుగుచునుండె నప్పురుషవరుఁడు. (మహాప్రస్థానిక. 1-36)**

**సీ.** **అనిలసూనుఁడు ధర్మతనయున కెఱిఁగించి। యవ్విభుతో 'సుందరాకృతియును**
**శౌర్యంబు ధైర్యంబు సౌజన్యమునకుఁగురు। సంఘమునన కాదు జగతి నెందు**
**నితనికిఁ బోలె నహీనత మెఱయునే। యెవ్వరి కైనను నిట్టి పుణ్యుఁ**
**గుత్సితదశ యె ట్లొకో పొందె నక్కట!'। యనవుడు నక్కౌరవాగ్రగణ్యుఁ**

**తే.** **డతని కిట్లను 'నీతండు నాత్మసదృశుఁ। డఖిల జగముల లేఁడు రూపాతిశయము**
**తనక కల దని యెపుడుఁ జిత్తమునఁ దలఁచు;। నయ్యహంకృతి నిట్టి కీడయ్యెఁ జువ్వె!' (మహాప్రస్థానిక. 1-39)**

# 7. స్వర్గంలో కుక్కలకు చోటులేదు-

ఇంద్రుడన్నాడు- పుణ్యాత్మా! కుక్క అత్యంత నీచమైన జంతువు.
కుక్కకు దివ్యత్వమెట్లా కలుగుతుంది? కుక్కలకు స్వర్గంలో చోటులేదు.
ధర్మజుడన్నాడు- భూలోకంలోనూ అటువంటి నియమాలున్నాయి.
అయినా ఈ శునకం భక్తిగల సేవకుడి వంటిది, దీనిని వదిలి నేను రాను.

ఇంద్రుడన్నాడు- భీమార్జున నకుల సహదేవులను ద్రౌపదిని
విడిచిపెట్టి వచ్చావు, అంటరాని ఈ కుక్కను వదలివేయలేవా?
ధర్మరాజన్నాడు- వాళ్లు చనిపోయారు స్వర్గానికి చేరుకున్నారని నీవే అన్నావు.
నేనూ, ఈ కుక్క బతికే ఉన్నాము, వస్తే ఇద్దరమూ వస్తాము-

అంతేకాక శరణాగత రక్షణం చేయకపోవడం, మిత్రద్రోహం
కుల వధువును చంపడం, బ్రాహ్మణ ధనాపహరణం లాంటి ద్రోహమే
అనుసరించి వచ్చిన సేవకుడిని అర్ధాంతరంగా వదిలి వేయడం.
స్వామీ! నిన్ను స్మరిస్తూ నేను అడవుల్లో తపస్సు చేసుకుంటాను.

నాకిప్పుడు స్వర్గ సుఖాలెందుకు? నాకు నీ దయ ఉంటే చాలును -అన్నాడు.
ఆ క్షణాన సారమేయ రూపాన్ని వీడి ప్రత్యక్షమై అన్నాడు యమధర్మరాజు-
ద్వైతవనంలోనూ నీవు నకులుడిని బతికించమని నెగ్గావు పరీక్షలో
ఇక్కడ కూడా ధర్మబుద్ధిని వీడలేదు. బొందితో స్వర్గం లభించింది వెళ్లుము-

**సీ.** ద్రౌపదిపాటును దన యనుజన్ముల । పడుటయుఁ గనుఁగొని పార్థుఁ డాత్మ
యలమట మునిఁగిన నిల విగతాసుఁడై । పడినఁ గుందుచుఁ జూచి బకవిరోధి
యన్నకుఁ జూపె 'యీ యమలచరిత్రుని । యం దెన్నఁడును నసత్యంబుఁ గాన;
మిటు వడుటకుఁ గత మేమి?' నావుడు నీతఁ । డక్కౌరవుల నెల్ల నొక్కనాఁడ

**తే.** యాహవంబునఁ దెగటార్తు ననియె; నట్లు । సేయఁ డయ్యెఁ; బల్కొక్కటి సేఁత యొకటి
యగుట చాల దోషము; విను మదియుఁగాక । యెల్లకోదండ ధరుల గర్వించుచుండు. (మహాప్రస్థానిక. 1-41)

**చ.** అన విని యాతఁ డిట్లనియె నాతనితో 'భవదీయ మైన భో
జన మతిమాత్ర ముద్ధతిఁ బ్రచండుఁడ వై భుజశక్తి నెవ్వరిం
గొనక కడంగి రజ్జుపలుకుల్ గడుఁ బెక్కులు పల్కుదెప్డు నీ
వనుపమశౌర్య! యిప్పుడుట కత్తెఱఁగుల్ గత; మెల్లఁ జెప్పితిన్. (మహాప్రస్థానిక. 1-44)

**క.** అని పలికి నిరీక్షింపక । చనుచుండె, నితండు ధైర్యసారోదారుం
డును నిశ్చయమహితుఁడు నయి । వెనుక శునక మధికభక్తి విడువక చనఁగన్. (మహాప్రస్థానిక. 1-45)

# 8. వారల జూచి క్రమ్మరగ వచ్చి-

ఇంతటి పెంపు గలుగుట మహేంద్రుడు నీ దెసగాంచె! నీవు
నిశ్చింతగా వెళ్లుము పుణ్యలోకములకు సశరీరముగా, ధర్మరాజా!
నీకు లభించును గాక ఉదార సౌఖ్యము అత్యంతము అవ్యయమగును-
అప్పుడు గంధర్వులు, మునులు, దేవఋషులు, మరుత్తులు, అశ్వినులు

వసువులు ఆనందంతో వచ్చి యమధర్మరాజు, ఇంద్రుడు, తామూ
అందరూ కలిసి పరమాదరంతో ధర్మరాజును కూర్చుండబెట్టినారు
దివ్యరథంలో, కదిలింది దివ్యరథం, ఇరుపక్కలా వారివారి విమానాలలో
దేవతలు అనుసరిస్తుండగా ధర్మరాజు బయల్దేరినాడు స్వర్గానికి.

నారదుడన్నాడు- దానములందు తపంబులందు పేరు పొందిన
ఎందరో రాజుల గురించి విన్నాము, నీ కీర్తి మించింది వారి కీర్తులను
వారెవ్వరూ ఇలా సశరీరులై రాలేదు స్వర్గానికి, ఇది నీ కీర్తి వెలుగు-
దర్మజుడన్నాడు- నా వాళ్లను చూసేంత వరకూ నాకు స్వర్గసుఖాలపై ఇచ్ఛలేదు-

ఇంద్రుడన్నాడు- నీకు మునుపటి స్నేహబంధాల స్మరణ తగదు
అహంకార మమకారాలను వదిలినప్పుడే కదా ఆనందప్రాప్తి.
ధర్మరాజన్నాడు- మహేంద్రా, ఒక్కసారి నేను నావాళ్లను చూసే
అవకాశం కల్పించు, ఆ తరువాత నేను అనుభవిస్తానీ స్వర్గలోక సుఖాల్ని-

---

సీ. అన విని ధర్మజుం 'డఖిలలోకములకుఁ । బతివి, ధర్మమునకుఁ బ్రభువ విట్టి
నీకంటె నెఱుఁగుదునే సదసత్ప్రకా । రము లట్లుఁగాక వాదము మహాత్ము
లయిన వారలతోడ నగునె చేయంగ? నై । నను విన్నవింపఁదగిన తెఱంగు
విన్నవించుట దోష విధము గా దనియెదు । బుద్ధిఁ జేసెద నేను బూని విన్న

తే. పంబు భీమముఖ్యులును ద్రౌపదియుఁ జచ్చి; । రేను వారల విడువక యేడ్చుచున్న
వత్తురే? తోడ వచ్చి చావని శునకము । విడువకుండుట తప్పుగా నుడువఁ దగునె? (మహాప్రస్థానిక. 1-57)

ఉ. 'మీ రిటు లేమి సెప్పిన నమేయభుజాబలభగ్నదైత్య! యే
గారవ మొప్పఁ దమ్ములను గాంతను బుత్త్రుల మిత్ర కోటిఁగ
న్నారఁగఁ జూడ కుండుటకు నక్కట యోర్తునె? యెల్లభోగముల్
వారలఁ జూచి క్రమ్మఱఁగ వచ్చి సుఖస్థితిమై భుజించెదన్. (మహాప్రస్థానిక. 1-75)

- అతస్త్వాక్షయా లోకాః స్వశరీరేణ భారత
ప్రాప్తోః సి భరత శ్రేష్ఠ దివ్యాం గతిమనుత్తమామ్ (సం.మహాప్రస్థానిక. 3-22)



# శ్రీ ప్రసాద మహాభారతము

## అయిదవ వేదము - శాంతి సప్తకము

# 18. స్వర్గారోహణ పర్వము

- స్వర్గం త్రివిష్టపం ప్రాప్య ధర్మరాజో యుధిష్ఠిరః
  దుర్యోధనం శ్రియాజుష్టం దదర్శా సీన మాసనే (సం.స్వర్గారోహణ. 1-4)

- సమాగచ్ఛ యధా న్యాయం రాజ్ఞా దుర్యేధనేన వై
  స్వర్గో యం నేహ వైరాణి భవంతి మనుజాధిప (సం.స్వర్గారోహణ. 1-18)

- కిం మే భ్రాతృవిహీనస్య స్వర్గేణ సురసత్తమాః
  యత్రతే మమ స స్వర్గః నాయం స్వర్గః మతో మమ (సం.స్వర్గారోహణ. 2-12)

- అవశ్యం నరకాస్తాత ద్రష్టవ్యాః సర్వరాజభిః
  తత్త్స్వయా ప్రాప్తమిదం ముహూర్తం దుఃఖముత్తమమ్ (సం. స్వర్గారోహణ. 3-37)

తే. వినుము ధర్మనందను పుణ్య తనువునందు దగ బ్రవేశించియున్న విద్యామయాత్ము
డైన విదురుండు నమ్మహితాత్మ బోధశాలియును ధర్మగూడిరి సచ్చరిత్ర! (స్వర్గారోహణ. 1-70)

- స్వర్గ పర్వ తతో జ్ఞేయమ్ దివ్యం యత్ తద మానుషమ్
  ప్రాప్తం దైవరథం స్వర్గాత్ నేష్టవాన్ యత్ర ధర్మరాట్ (సం.ఆది. 2-370)



| సంస్కృత మహాభారతము | కవిత్రయ మహాభారతము | శ్రీ ప్రసాద మహాభారతము (19) |
|---|---|---|
| **18. స్వర్గారోహణ పర్వము**<br>(అధ్యాయాలు) | **18. స్వర్గారోహణ పర్వము**<br>(గద్య పద్యములు) | **18. స్వర్గారోహణ పర్వము**<br>(పద్య శీర్షికలు) |
| అధ్యాయాలు (5) | ఏకాశ్వాసము (97) | ఏకాశ్వాసము (19) |

(Traditional Edition: ఉప పర్వాలు లేవు, అధ్యాయాలు-6;
Critical Edition: ఉప పర్వాలు లేవు, అధ్యాయాలు-5)

# ✦ 18. స్వర్గారోహణ పర్వము - ఏకాశ్వాసము ✦

## 1. యే నిట్టివాని తోడ కలసి మెలగుదునె?

ఇంద్రుడన్నాడు– ధర్మరాజు మన అతిథి, అతడికి తనవారిని
చూడాలన్న కోరిక మనసులో అతిశయించింది, ఓ దూతా! నీవు
ఇతడిని తీసుకువెళ్లి బంధువులనందరినీ చూపించుము–
అనగా ఆ దూత ధర్మజుని తీసుకువెళ్తుంటే ఆసక్తిగా వచ్చారు అతడి వెంట

నారదాది మునులు; ఆశ్చర్యం– వారికి తొలుదొల్త కనిపించినవాడు
పెద్ద సింహాసనం మీద కూర్చుని ఉదయ సూర్యునిలా ప్రకాశిస్తున్నవాడు
అప్సరః ప్రభృతి దేవకాంతా పరివృతుడు, శౌర్యలక్ష్మీ విరాజితుడు
ఎడతెగని సుఖాలనుభవిస్తున్న దుర్యోధనుడు– అదిచూసి అవాక్కయ్యాడు ధర్మజుడు.

–ఇతడతి లోభోపహత మానసుడు, దురాలోచనాపరుడు.
ఇతడి వలన ఎందరో రాజులు మరణించారు చతురంగ బలాలతో సహా.
ఇతడు అవమానించాడు ఉత్తమ ఇల్లాలైన ద్రౌపదిని నిండు సభలో.
ఇతడికి స్వర్గలోక సుఖాలా; అయితే ఇవి నాకక్కర్లేదు, పోదాం పదండి!

అని మెత్తని పులి ధర్మజుడు వెనక్కి మళ్లగా నవ్వుతూ నారదుడన్నాడు– ధర్మరాజా,
ఇది వీరుల స్వర్గం, ఇతడు తన శరీరాన్ని వదిలేసాడు యుద్ధభూమిలో.
ఈ పుణ్యలోకంలో వెనకటి పాపకర్మల గురించి ఆలోచనలవసరమా?
నీ మనసులో ఇంకా ఈర్ష్య, క్రోధం వంటి వికారాలుండరాదు కదా!

---

సీ. 'ఇతఁ డతిలోభోపహతమానసుఁడు, దీర్ఘ దర్శిగాఁ డితని కుతమునఁ జేసి
నిఖిల దేశంబుల యఖిల నృపాలురుఁ । ద్రుంగిరి దంతి తురంగ సహిత
ముగ, ననవద్యాంగి విగతకల్మష ధర్మ । చారిణి సాధ్విఁ బాంచాలి నార్య
జనములు గనుఁగొని సభలోన నవమాన । పెట్టిన తులువ; యే నిట్టివాని

ఆ. తోడఁ గలసి మెలఁగుదునె? మహితాత్మకు । లార! యెచట నున్నవారు భీమ
ఫల్గునులును గవలుఁ బాంచాలియును నన్ను । నచటి కనుపవలయు'ననుచు మరలె. (స్వర్గారోహణ. 1-5)

సీ. 'ఓ ధర్మనందనఁ యీ ధరణీవిభుం । డాహవ సంపరిత్యక్త తనుఁడు
దేవతాసంభావ్యుఁడై వెలింగెడుఁ । బుణ్య । కర్ము లెల్లను గడు గారవింతు
రితని; నితండు మహీశుల నుజ్జ్వల । క్షత్త్రధర్మంబునఁ గాదె త్రుంచె;
నది పాప మే లగు? ననఘ! పాంచాలి యీ । తనిచేతఁ బడుటయుఁ దక్కుఁ గలుగు

తే. నెగ్గులును నింక నిచ్చట నేల తలఁప? నిచొటు పుణ్యలోకము మది నీసు రోష
మను మనోవికృతులు దగునయ్య! వాని । విడిచి సమత నొందుము లోకవినుతచరిత!' (స్వర్గారోహణ. 1-7)

# 2. ఇది స్వర్గం - ఇది నరకం

పాపశాలి, సజ్జన సతతాపకారి, కులసంక్షయ కారణ రోషభాగి
ఇతడు దేవతలకు పూజనీయుడైతే ఈ స్వర్గం నాకెందుకయ్యా?
నన్ను నా తమ్ములున్న చోటుకు తీసుకుపో, నేను చూడాలి నా వారిని,
సంగ్రామ మృతులైన సకల బంధువులను, నా సోదరుడు కర్ణుడిని.

అతడెవరో తెలియనపుడు అర్జునుడి చేత కర్ణుడిని చంపించాను,
అందుకే అడుగుతానతడి క్షమాపణను, నన్నక్కడకు తీసుకువెళ్లు!
ద్రుపద విరాట యుధామన్యులు శంఖ ప్రభృతులు వారి చుట్టాలు, మిత్రులు
రణాగ్నిలో ప్రాణ హవిస్సులను వేల్చిన నా వాళ్ల దగ్గరకు తీసుకువెళ్లు నన్ను!

భీమ, అర్జున, నకుల, సహదేవులను, ద్రౌపదిని చూడాలి, తీసుకువెళ్లు–
ఇంద్రుని దూత, దేవమునులన్నారు– ఇంద్రుడు ఆజ్ఞాపించాడు, మీకు
ఎవరిని చూడాలని ఉంటే వారిని చూపించమని, వెళ్దాము మీరు కోరిన చోటుకు.
ఇది స్వర్గలోకం, మీ ఆలోచనలే మీకు కానవస్తాయి సాంద్ర రూపాలలో.

ఇంద్రదూతను అనుసరించాడు ధర్మజుడు తన సోదరులుంటారన్న ప్రదేశానికి.
కేశాస్థి సాంద్రమై, దుర్గంధ భూయిష్ఠమై, దోమలు ఈగలతో నిండినదై
చీకటి కమ్మి క్రిములు కీటకాలు, రక్త మాంసపు గుట్టలు, కుళ్లిన శవాలతో
భీషణమైన ముక్కులున్న కాకులతో నిండిన, అసహ్యంగా ఉన్న ప్రదేశానికి వచ్చారు.

---

**సీ.** అని దేవదూతునిఁ గనుఁగొని 'యిమ్మహి । తాత్ముని భీమసేనార్జునాదు
లున్నచోటికి నన్ను 'మన్న నప్పురుషుఁ డా । దర మెసఁగంగ నా ధర్మతనయు
నిందు ర మ్మనుచుఁ దా ముందటఁ జన నమ్మ । హానుభావుఁడు వాని ననుగమించె;
నట్లు సనంగఁ గేశాస్థిసాంద్రంబు దు । ర్గం ధంబుఁ బరుషతరంబు దంశ

**ఆ.** మశక నిబిడమును దమఃకలితముఁ గ్రిమి । కీట రక్తమాంస కూట కుణప
ఘోరవిధము శాత దారుణ చంచు వా । యసరవాన్వితంబు నయ్యెఁ బథము. (స్వర్గారోహణ. 1–17)

**సీ.** ధర్మనందనుఁడు చిత్తమ్మున నుద్వేగ । మావహిల్లఁగ 'దైవ మకట! యిట్లు
సేసెనే? కీ డేమి చేసిరొకో వీర । లిన్నరకమునకు నేఁగుదేర
వలసినయట్టిది? వాసవాద్యమరులు । నీచులు వో వీరి నే విచార
మించుకయును లేక యిట్టి కష్టపుటిడు । మలఁ బెట్టెడిదె? ధర్మమా! తెఱంగు

**తే.** మాలితే నీవు సజ్జనమాన్య లలఘు । సత్యపరులు దయాఢ్యులు నిత్యదాన
రతులు బహుదక్షిణాంచిత క్రతువితాన । పావితాత్ము లనర్హంపుఁబాటు వడిరి. (స్వర్గారోహణ. 1–24)

## 3. ఈగ కాలి యంత యేనియు పాపంబు-

ధర్మరాజు ఆశ్చర్యపడుతూ ఆ దారిలో వెళ్లి వెళ్లి సమీపించాడు వైతరణి నదిని-
బాగా మరగ గాచిన నూనెవలె తెర్లుతున్న నీళ్లు, ఇనుపముళ్లతో
వాడి కత్తుల్లా ఉన్న ఆకులతో కూడిన అడవి, ఆ నదివద్ద నానా విధాలైన
శిక్షలననుభవిస్తున్న పాపకర్ములను చూసి, ధర్మజుడు

-'ఇంకెంత దూరం ఉన్నది మనం వెళ్లాల్సిన చోటుకు?' -అని అడిగి
ఆ దుర్గంధ ప్రదేశంలో ఉండలేక వెనుదిరగగా అతడికి వినిపించాయి
పరిచిత స్వరాలు- ఓ పుణ్యచరిత్రుడా! వెళ్లవద్దయ్యా నీవు!
నీ పవిత్ర దేహం నుంచి వీచిన సుగంధాలు తగ్గించాయి మా బాధలను.

నిన్ను చూడటం వలన మా దుఃఖాలు పటాపంచలయ్యాయి,
నీవెల్లప్పుడూ ఇక్కడే ఉండిపోరాదా! మేము హాయిగా ఉంటాము-
ధర్మరాజన్నాడు- మీ గొంతులు నేను ఇదివరకు విన్నవే, మీరెవరు?
నేను కర్ణుడు, భీముడు, నకులుడు, సహదేవుడు; నేను ద్రౌపదిని.

నేను ధృష్టద్యుమ్నుడిని, మేము ఉపపాండవులం, మేమీ నరకంలో ఉన్నాము.
ధర్మరాజు ఆశ్చర్యపోయాడు- ఒకటను మేలుసేయని దుర్యోధనుడు
దేవపూజ్యుడై సకల సుఖాలు పొందుతుంటే, ఈగ కాలంత పాపం
చేయని నావాళ్లు నరకంలో బాధలు పడుతున్నారా? ఇది స్వర్గ న్యాయమా?

---

**చ.** ఒకటను మేలు సేయని సుయోధనుఁ డమ్మెయి దేవపూజ్యుఁడై
సకలసుఖానుభూతియు నజస్రము పెంపు వహిప నొప్పి దృ
ష్టికిఁ గడు వ్రేఁకనై తనదు చెల్వలుఁ జుట్టలుఁ దాను సంతసం
బు కలిమి నేచి మి న్నడిచి పుణ్యపదావృతుఁడై వెలింగెడున్. (స్వర్గారోహణ. 1-25)

**ఆ.** ఈఁగకాలియంత యేనియుఁ బాపంబు । వీరివలనఁ గనుట వినుట గలుగ
దొక్కనాఁడు; నట్టి యుత్తములకు విధి । పాడి మాలి యిట్టి పాటు దెచ్చె.' (స్వర్గారోహణ. 1-26)

**సీ.** అని యగ్గలపుఁజింత మునిఁగి కలంక మ । నోవికారము నాకు నావహిల్లఁ
గత మేమి యొకొ! యిది ఘనమాయయో కల । గనుటయో యరయ నిక్కంబొ చిత్త
విభ్రాంతిఁ జేసి వివేకింప నేర రా । దయ్యెడు'నని పరమాకులేంద్రి
యుఁడు శోకదుఃఖమయుండు నై కొండొక । ప్రొ ద్దూరకుండి సద్బుద్ధిఁ దలఁచి

**తే.** యలుక యింద్రుపైఁ బొడమిన నమ్మహాత్ముఁ । డప్పురుషుఁ జూచి మగుడ నీ వరుగు మౌర్య
వర్య! యెవ్వరి దూతవు వారికడకు । ననుచుఁ బలికి వెండియు నిట్టు లనియె నధిప! (స్వర్గారోహణ. 1-27)

# 4. నా యనుజులు దుఃఖార్దితులై ఉన్నారు-

ధర్మజుడి కర్థం కాలేదు- ఇది దేవతలు పన్నిన మాయా లేక నా స్వప్నమా-
దూతతో అన్నాడు- నీవు ఎవరి దూతవో వారి వద్దకు మరలిపొమ్ము.
ఇక్కడ నా సోదరులు దుఃఖపీడితులై ఉన్నారు, నేనక్కడకు రాను,
ఇక్కడే ఉండిపోతానన్నానని దయానిధియైన ఇంద్రుడికి చెప్పుము-

ఇంద్రుడి దూత వెళ్లి ధర్మరాజు నిశ్చయాన్ని చెప్పగానే వచ్చాడు ఇంద్రుడు
ఋషులతో, దేవతలతో, అత్యంత ఆనందంగా వచ్చాడు యమధర్మరాజు
ఆ సమయంలో అప్పటివరకు అంధకార బంధురమై అసహ్యంగా ఉన్న
ఆ ప్రదేశంలో శిక్షలనుభవిస్తున్న పాపకర్ములు కానరాలేదు.

దుర్గంధముతో కూడిన మాంసాన్ని తింటున్న పక్షులు గ్రద్దలు కాకులు,
శవాల గుట్టలు కనిపించడం లేదు, మాంసం నెత్తురు వెంద్రుకలు
ఎముకల పోగులు మాయమై పోయాయి; క్రూరమైన ఆకులున్న
అడవి అదృశ్యమైంది, మలమల మాడే నూనె జలాలు ప్రవహించే

వైతరణీ నది లేకుండా పోయింది. ఎక్కడ చూసినా సుందర దృశ్యాలే!
సురుచిర సురభిళ పరిమళాలే, చల్లని గాలులు వ్యాపించాయి చక్కగా
వెన్నెల కాంతులతో, అమృత శోభలతో అత్యంత మనోహరంగా
మారింది ఆ ప్రదేశమంతా, ఆశ్చర్యంతో యుధిష్ఠిరుడు చూస్తూ ఉండగానే!

---

**క.** నా యనుజులు దుఃఖార్దితులై యున్నారట్టు లగుట నచటికి రా నిం
కీ యెడన నేను నిలిచెదఁ బాయక యని చెప్పు మాకృపానిరతునకున్ (స్వర్గారోహణ. 1-28)

**సీ.** వివిధ పాపాత్ములు వికృతశరీరు లై। యాతనా బాధితు లగుట మానె
దుర్గంధమును గృధ్రవర్గాది పలలాశి। పక్షి పంక్తులుఁ గుణప వ్రజంబుఁ
దోఁపన యెఱచి నెత్తురు కేశ పటలంబు। లస్థిపుంజము లదృశ్యంబు లయ్యెఁ;
గ్రూరాసిపత్ర ఘోరారణ్యయుక్త వై। తరణి లేకుండె; సత్పరిమళంబు

**తే.** నింపుఁ జేయు సోఁకును సొగియించు తనుపు। నార వీతెంచి సమ్మోద మావహించె;
నమృతమయ మిది యనఁదగి యనిల మధిక। విశదభావంబుఁ బ్రాపించె దిశలు పదియు. (స్వర్గారోహణ. 1-32)

**మహాస్రగ్ధర: (స త త న స ర ర గ) 1-9-16 యతి.**
వసురుద్రాదిత్య గంధర్వ గరుడ భుజగ వ్రాతముల్ వైభవం బు
ల్లసనం బొందంగ సిద్ధు ల్మనముల ముదము ల్పల్లవింపంగ సాధ్యుల్
హసితస్వాంతంబులం బె ల్లలమికొనఁగ నత్యాదరోత్కర్షముల్ పాం
దుసుతో పొంతమ్ము నం బిండు గొని నిలిచి చూడ్కుల్ తదంగంబు గప్పన్. (స్వర్గారోహణ. 1-34)

# 5. అట్టి అల్ప దుఃఖమనుభవించితివి-

ఇంద్రుడితో వచ్చిన వసు రుద్ర ఆదిత్య గంధర్వ గరుడ సర్పతతులు
సిద్ధులు సాధ్యులు సంతోషంగా ఆశీర్వచనములు పలుకుతుండగా
ఇంద్రుడన్నాడు- నీకు యోగం ప్రాప్తించింది. నీకీ అనుభవమూ
సిద్ధించింది - రాజ్యాంతే నరకం ధ్రువమ్- రాజుకు పాపమంటక తప్పదు.

పుణ్యము పాపము జంట భోగాలు; పుణ్యం చేత స్వర్గం, పాపం చేత
నరకం కలుగుతాయి, తొలుత స్వర్గంలో సుఖాలనుభవించినవాడు
తరువాత నరకంలో చాలా బాధలు పడతాడు; ముందే నరకయాతన
పడ్డవాడు తరువాత స్వర్గ సుఖాలనుభవిస్తాడు - ఇవి జీవుడు చేసుకున్న

పాప పుణ్యాలను బట్టి ఉంటుంది; నీవు చిన్న అబద్దం చెప్పావు
-అశ్వత్థామ హతః కుంజరః -అందుకే నరకలోక సందర్శనం కలిగింది.
నీ పాపకర్మ ఫలితానుభవమైనది, ఇక స్వర్గసుఖాలే లభిస్తాయి నీకు.
అడుగో కర్ణుడు ఉత్తమస్థాన ప్రాప్తిని పొందినాడు, చూసి ఆనందించుము.

భీమార్జున నకుల సహదేవులు ద్రౌపది ఉపపాండవులు, నీకోసం
పోరాడి మరణించిన వీరులందరూ స్వర్గంలో సుఖాలనుభవిస్తున్నారు.
నీవు చేసిన రాజసూయ, అశ్వమేధ యాగాల ఫలము, దానఫలముల ననుభవించుము.
మాంధాత, నల, హరిశ్చంద్ర, దిలీప, దుష్యంత, భరతుల ఉన్నత స్థితిని పొందుము.

---

**సీ.** **పుణ్యంబులును బాపములు రెండు జోకలై । యుండుఁ బుణ్యంబుల నొదవు నాక**
**సుఖము పాపంబులఁ జొప్పదు నరకదుః । ఖము విను మున్ను నాకంబు సుఖము**
**ననుభవించిన యట్టి యతఁడు పదంపడి । యధిక నారక పీడ ననుభవించు;**
**మున్ను నారక దుఃఖమునఁ బడ్డవాఁ డనం । తరమ నాకమునఁ దాఁ బొరయు సౌఖ్య;**

**తే.** **మల్పపుణ్యుండు తొలి తొలి యమరతా సు । ఖంబు గయికొని మఱియు దుఃఖముల నొందు;**
**భూరిపుణ్యుండు మునుమును ఘోర నిరయ । యాతనల నొంది వెండి సౌఖ్యంబు లొందు. (స్వర్గారోహణ. 1-39)**

**సీ.** **కర్ణుఁ డుత్తమసిద్ధిఁ గాంచి వెలింగెడు । నమ్మహాభుజునకు నై కరంబు**
**దుఃఖింతు నీ వెప్డు; దుది ముట్టి యున్నాఁ డి । తండు నిజోజ్జ్వలస్థాన మొంది**
**సర్వాస్త్రవిదుని నా జలజాప్త నందనుఁ । గనుఁగొని చిత్తంబు కలఁక విడువు;**
**మనిలనందనుఁడు నర్జునుఁడును నకులుండు । సహదేవుఁడును భవత్సైన్యరూప**

**తే.** **వర్తి సర్వమహీపతివర్గములును । ద్రౌపదియు ద్రౌపదేయులు రాజవర్య!**
**దీప్త నిజధామ సంప్రాప్తిఁ దేజ మలరి । యుండఁగాఁ జూచి సమ్మోదయుతుఁడ వగుము. (స్వర్గారోహణ. 1-41)**

# 6. ధర్మజునకు దివ్యదేహంబు కలుగుట-

మనోహరాకారుడూ, ప్రసన్నవదనుడైన యమధర్మరాజన్నాడు ధర్మజునితో.
కుమారా, నిన్ను ద్వైత వనంలో పరీక్షించాను అరణి విషయంగా
రెండవసారి సారమేయుడనై నిన్ననుసరించాను మేరు పర్వతాన
నీ సోదరుల స్వర్గప్రాప్తి విషయంపై పరీక్షించానిక్కడ మూడోసారి.

నీ మనసులో ఏ ఒక్కసారీ కొంచెమైనా కదలికలేదు, ధర్మరాజా
నీకు దమ శమ సత్య గుణాలూ, నాపైన అత్యంత భక్తీ ఉన్నాయి.
నీవు బాగా పరిశోధింపబడినావు, వ్యధను వదలి సుఖించుము.
నీవు చూసిన నరక బాధలన్నీ మేము పన్నిన స్వల్ప మాయాదృశ్యాలు-

నీవు ఈ ఆకాశగంగలో మునుగుము, నీ మనసు నుండి తొలగుతాయి,
మనుష్య సంబంధమైన భావ వికారాలు, నశిస్తాయి శోకబంధాలు-
ఆ విధంగానే ధర్మరాజు ఆకాశగంగలో స్నానం చేసి మానుష్య దేహాన్ని త్యజించి
దివ్యమైన పూజ్యదేహాన్ని పొంది ప్రకాశించాడు పొగలేని అగ్నిదేవుడివలె.

దివ్యుడైన ధర్మజుడికి కనిపించాడు- విస్ఫురత్ బహురత్న వితతి కనత్కనక
ఆత్మకంబైన మహా సింహాసనంపై దేదీప్యమానంగా వెలుగుతూ, శంఖ
చక్ర గదాయుధాలు దివ్యరూపులై కొలుస్తుండగా, ఆ సమీపంలోనే
నరుడు వినయంగా నమస్కరిస్తున్న దివ్యరూపుడైన శ్రీమన్నారాయణమూర్తి.

---

సీ. అని పల్కి ధర్ముఁ డత్తనయునిఁ దోడ్కొని । యయ్యందఱును దోడ నరుగుదేర
నాకాశ గంగ యుపాంతమునకుఁ బోవ । నప్పుణ్యనది నమ్మహానుభావుఁ
డార్య సంస్తవన వాక్యంబులు చెలఁగ భ । వ్యవస్నానమంగళ మాచరించి
మానుష తనువు నమ్మాత్రన విడిచి ది । వ్యం బగు మహితదేహంబు దాల్చి

తే. వైరమత్సర స్నేహ సంవాసలౌల్య । గర్వశోకాదులైన హృద్గత వికార
ములఁ దొఱంగి నిర్ధూమత్వమున వెలుంగు । పావకుఁడుఁబోలె శోభిల్లెఁ బౌరవేంద్ర! (స్వర్గారోహణ. 1-52)

సీ. విస్ఫుర ద్బహురత్న వితతి కనత్కన । కాత్మకం బయిన మహాసనమున
దేదీప్యమాన మై దివ్యావయవదీధి । తి ప్రతానం బెల్ల దిశల వెలుఁగఁ
జక్రగదాద్యస్త్రసంతతి నుజ్జ్వలా । త్యంత సుందర పురుషాకృతులును
జారుమౌళి స్థలీ సమవేత నిజరూప । ములుఁ గల్గి భక్తిమై బలసి కొలువఁ

తే. దనదు చూడ్కికి నెంతయుఁ దగు లొనర్చి । మున్ను చూచిన యట్లగుమూర్తి యొప్ప
నరుఁడు కేవల సవినయ పరత వెలుఁగఁ । గొలుచు నారాయణునిఁ గాంచె భూపవర్య! (స్వర్గారోహణ. 1-54)

# 7. ఎవరెవరి అంశలు!

దివ్యుడైన ధర్మరాజు చూసాడు పదమూడవ ఆదిత్యుడై వెలుగుతున్న కర్ణుడిని
మరుద్గణాల మధ్య భీముడిని, అశ్వినీ దేవతల పక్కన నకుల సహదేవులను
తాను గుర్తించలేనంత దివ్యకాంతితో ద్రుపదుడింట మహాలక్ష్మి అంశతో
జన్మించిన ద్రౌపదిని, గంధర్వులుగా ప్రకాశిస్తున్న ఉపపాండవులను

చంద్రాంశతో పుట్టిన అభిమన్యుడిని, కుంతీ మాద్రిలతో విమానంలో
విహరిస్తున్న పాండురాజును, వసువుల వద్ద నిలిచిన భీష్ముడిని,
బృహస్పతి సమీపంలో ఉన్న ద్రోణుడిని, గంధర్వ యక్ష గుహ్యకులలో
చేరిన ద్రుపద విరాట ప్రభృతులను, కేకయ పాండ్యాది నానా రాజులను

సనత్కుమారుడితో కలిసిన ప్రద్యుమ్నుడిని, కుబేర లోకం చేరిన గాంధారీ
ధృతరాష్ట్రులను, ద్వాపర యుగాధి దేవతలో కలిసిన శకునిని, చివరకు
కలిపురుషుడిలో లీనమయ్యే దుర్యోధనుడిని, రాక్షస గణాలలో
కలిసిన దుశ్శాసనాదులను, అగ్నిలో కలిసిన ధృష్టద్యుమ్నుడిని.

యమధర్మరాజులో కలిసిన విదురుడిని, విశ్వదేవతలలో కలిసిన వీరులను
ఆదిశేషుడితో కలిసిన బలరాముడిని, గుహ్యక దేవతలలో లీనమైన
యదు వీరులను, సరస్వతీ జలములందు మునిగి శ్రీకృష్ణుని చేరిన
పదహారు వేలమంది గోపాంగనలను, అందరినీ చూసాడు ధర్మజుడు.

---

**సీ.** **కమలగర్భుని నియోగంబున నిజయోగ । బలము గైకొని బలభద్రదేవుఁ**
**దంబుధి కరిగి యనంతుఁ బరమమూర్తి! । గలసె; నత్తెఱఁగు ము న్నలఘుకీర్తి**
**ధన! నీకుఁ జెప్పితిఁ దక్కటి వృష్ణిభో । జాంధకు లెల్ల గుహ్యక గణంబుఁ**
**గూడిరి; కృష్ణు సంక్రీడకుఁ బాత్రంబు । లైన షోడశ సహస్రాంగనలును**

**తే.** **విధినియుక్త కాలంబున విను సరస్వ । తీ జలంబుల మునిఁగి యుత్కృష్ట మగు ని**
**జాప్సరోభావ మొంది నారాయణుని యు । పాంతచారిణు లైరి ప్రహర్ష మెసఁగ. (స్వర్గారోహణ. 1-71)**

**చ.** **అనుమరణంబునం దగ మురాంతకు రుక్మిణి సెందె; లక్ష్మి య**
**వ్వనరుహనేత్ర; తక్కుఁగల వామవిలోచన లేద్వురుం దదీ**
**యనుత తను ప్రవేశన సమాచరణం బొనరించి రవ్వరాం**
**గనలును లక్ష్మి యంశముల కావునఁ; గౌరవ వంశవర్ధనా! (స్వర్గారోహణ. 1-72)**

**తే.** **'వినుము పాండవ కౌరవ విషయ మైన । యట్టి యితిహాస మే నుపాఖ్యానజాత**
**సహిత మగునట్లుగా సమస్తంబు మహిత । విస్తరంబుగఁ జెప్పితి విశదభంగి. (స్వర్గారోహణ. 1-74)**

# 8. పాండవ విజయ కథ

శ్రీకృష్ణుని అష్ట భార్యలు అష్టలక్ష్ములై - ఆది ధాన్య ధైర్య గజ
సంతాన విజయ విద్యాధన రూపాలై చేరుకున్నారు శ్రీమన్నారాయణుని-
అని వేదవ్యాస మహర్షి చెప్పిన భారత కథను నేను వివరించాను.
కొన్ని ఉపకథలను చేర్చి వివరణాత్మకంగా, స్పష్టంగా -అన్నాడు

వైశంపాయనుడు జనమేజయ మహరాజుతో సర్పయాగ సమయాన
ఆ వృత్తాంతాన్ని విన్నాడు శ్రద్ధగా సూతుడి కొడుకు ఉగ్రశ్రవుడు
నైమిశారణ్యంలో శౌనకుడనే కులపతి సత్రయాగం చేస్తున్నపుడు
ఉగ్రశ్రవుడు వారికి వినిపించాడు హృదయంగమమై, అపూర్వమై

-సమగ్ర జ్ఞానదాయకమై, పాప నాశకంగా ఉండే మహాభారత కథను.
ఉగ్రశ్రవుడు భారత కథను చెప్పి ఇట్లా అన్నాడు- ఆస్తీకుడు
చెప్పగా జనమేజయుడు అంగీకరించి ముగించాడు సర్పయాగాన్ని.
కథకుడైన వైశంపాయనుడితో కలిసి ప్రవేశించాడు హస్తినాపురం

అని పలికి ఉగ్రశ్రవుడు చెబుతున్నాడు వేదవ్యాస మహర్షి గురించి
సత్యదర్శి, సర్వ విధిజ్ఞాత, సర్వవిజ్ఞాన భవ్యాత్ముడు, సర్వేంద్రియ
ప్రబోధశాలి, సర్వజ్ఞుడు, శౌచ శాంతి క్షమా దాంతి తపోనిత్యతో విభాసి
అఖిల సాంఖ్యయోగ భేదవిదుడు మూడు సంవత్సరాలలో రచించాడు భారత సంహితను.

---

**సీ.** **అని చెప్పి యా శౌనకాది మునీశ్వర । గణముతో మఱియు నక్కథకుఁ డింపు**
**మిగులంగ నిట్లను 'మేటి మునీశ్వర । సంఘంబులో నెల్ల సత్యదర్శి**
**సర్వవిధిజ్ఞాత సర్వవిజ్ఞాన భ । వ్యాత్ముండు సర్వేంద్రియ ప్రబోధ**
**శాలి సర్వజ్ఞుండు శౌచశాంతి క్షమా । దాంతి తపోనిత్యతావిభాసి**

**తే.** **యాప్తసర్వవిద్యైశ్వర్యుఁ డఖిల సాంఖ్య । యోగ భేద విదుండు ధర్మోపదేశ**
**చతుర వాగ్విలాసుండు నిస్తత్త్వ వస్తు । వేది సాత్యవతేయుండు వేదమయుఁడు. (స్వర్గారోహణ. 1-80)**

**సీ.** **'పుణ్యాత్ములార! యీ పుణ్యేతిహాసంబు । జనమేజయుఁడు సేయు సర్పముఖము**
**కాలంబునం దట్లు కారుణికోత్తముఁ । డైన వేదవ్యాసుఁ డాదరమున**
**నాజ్ఞాపనము సేయ నతని శిష్యుఁడు లోక । నుతుఁడు వైశంపాయనుండు సెప్పు**
**నన్నరేంద్రుఁడు విని నా సభ నిలిచి స । వినయభక్తికముగ వినినవాఁడఁ**

**తే.** **గథనశక్తియు నమ్ముని కరుణవలనఁ । గలిగె నా కిత్తెఱంగున గారవించి**
**మీరు వినుచుండఁ జెప్పెడి మేటి పదము । గంటి; మంటి మీ దయ పెంపుకతనఁ జేసి.' (స్వర్గారోహణ. 1-83)**

# 9. మహా భారత విశిష్టత

వ్యాసుడు ధర్మోపదేశ చతుర వాగ్విలాసుడు, నిస్తత్వ వస్తువేది
వేదమయుడైన సత్యవతీ కుమారుడు, పాండవుల కీర్తి ప్రకటించడానికి
మరికొందరు రాజుల చరిత్ర చెప్పడానికి, దేవదేవుడైన వాసుదేవుడి
లీలా విశేషాలను వివరించడానికి, సర్వదేవతా గణాల పుట్టుకను

సాయుజ్య, సామీప్య, సారూప్య, సాలోక్య ముక్తులను తెలియజేయడానికి
సకల ధర్మాలను తెలపడానికి- పంచమ వేదము లేదా అయిదవ వేదముగా
ప్రసిద్ధి పొందిన మహాభారత సంహితను నిర్మించాడు మూడేళ్లలో-
దీని వైశిష్ట్యం చెబుతాను వినండి సావధాన చిత్తులై అందరూ.

ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ, భరతర్షభ; యదిహాస్తి
తదన్యత్ర యన్నే హాస్తి న తత్ క్వచిత్ - పవిత్రమైన ధర్మార్థ కామ మోక్షాలకు
సంబంధించి ప్రవర్తించే ధర్మం ఏదైతే ఈ భారతంలో చెప్పబడిందో
అది మరొకచోట కూడా ఉండవచ్చును, కాని దీనిలో లేనిది ఇంకెక్కడా ఉండదు-

వేదవ్యాస మహర్షి వ్రాసిన ఈ మహాభారతాన్ని సర్పయాగ సమయంలో
వైశంపాయన మహర్షి చెప్పినాడు పరీక్షిన్మహరాజు కుమారుడైన
జనమేజయ మహరాజుకు. అది విన్న నేను- ఉగ్రశ్రవుడను
నైమిశారణ్యంలో శౌనకాది మునులకు వివరించాను సవిస్తరంగా-

---

తే. అమల ధర్మార్థ కామ మోక్షముల గుఱిచి । యొలయు తెరు వెద్దియును నిందుఁ గలుగునదియ
యొం డెడలఁ గల్గు దీన లేకుండు చొప్పు । దక్కొకంటను లేదు వేదజ్ఞులార!' (స్వర్గారోహణ. 1-82)

ఉ. భ్రాజిత వృత్తిమైఁ బరఁగు భారత సంహిత సంయమీంద్రులా
రా! జయనామకంబునను రాజితభంగి జగ త్త్రయంబునం
బూజిత కీర్తియై నెగడు భూరిజయోన్నతిఁ గంద్రు దీనిచే
రాజు; లిలాసురుల్ మఱి యరాతుల గెల్తురు విన్న యంతటన్. (స్వర్గారోహణ. 1-89)

ఉ. భారతమర్థితో వినిన భక్తిఁ బఠించిన శ్రీయు నాయువున్
భూరియశంబునుం బ్రమదమున్ దృఢ విద్యయుఁ గల్గు; వారి కే
కోరికలైన వేగ మొనఁగూడు; సుపుత్త్రునిఁ గాంచు సద్వరున్
గారవ మొప్పఁగాఁ బడయు గర్భిణియున్ వరుసన్ గుమారియున్. (స్వర్గారోహణ. 1-90)

- అజ్ఞాన తిమిరాంధస్య లోకస్యతు విచేష్టతః
జ్ఞానాంజన శలాకాభిః నేత్రోన్మీలన కారకమ్

ధర్మార్థకామ మోక్షార్థైః సమాస వ్యాస కీర్తనైః
తథా భారత సూర్యేణ నృణాం వినిహితం తమః (సం.ఆది.1-84,85)

# 10. ఫలశ్రుతి

ప్రకాశించే ధర్మం కలిగిన ఈ భారతేతిహాసం 'జయము' అనే పేరుతో
మూడు లోకాల్లోనూ ప్రఖ్యాతమై వ్యాపించి పొందినది మన్ననలను.
వ్యాస మునీంద్రుని సాంద్ర కరుణాతిశయం చేత మహాభారత తాత్పర్యం
ఎవరికి స్ఫురిస్తుందో అతడికి కరతలామలకమవుతుంది సకల వేదోపనిషత్ సారమూ.

జయము భారతమై మహాభారతమై లక్ష శ్లోకిగా విస్తరించి వ్యాపించి
విశ్వ కావ్యమై విశ్వ శ్రేయోదాయకమై విశ్వఖ్యాతి నార్జించి ప్రకాశించి
అజ్ఞాన భావనలను తొలగించే మహాద్భుత చంద్రకాంతి దీపమై వెలుగ
ఆ వెన్నెల వెలుగు కిరణాలను చాతకపక్షులై గ్రోలి సుఖించిరెందరో-

తెనిగించిరి కవిత్రయము నన్నయ, తిక్కన, ఎర్రాప్రెగ్గడలు
హృద్యంగమముగ పదునెనిమిది పర్వములను ప్రతిభామూర్తులై
తెలుగు నాడిని పట్టి తెలుగు నాట తమ కవిత్వ ధీధితులొప్ప రచించిరి-
-తింటే గారెలే తినాలి వింటే మహాభారతమే వినాలన్నంత- కమనీయంగా.

సాహసించితిని నేను ఈ మహాభారతమును- వ్యాస, వైశంపాయన,
ఉగ్రశ్రవ సూతి, కవిత్రయ పరంపరకు మొక్కి ఆశీస్సులంది
-నాదైన శైలిలో లిఖించి నన్నయ తిక్కన ఎర్రనల పదాలనే వాడి,
వ్రాసితిని లంకా శివరామ ప్రసాదునై వాడి మయూఖాక్షరంబులుగా!

---

**ఉ. వ్యాసమునీంద్ర సారకరుణాతిశయంబున భారతార్థ ము**
**ద్భాసితమైనయట్టి సుతభాగ్యునకున్ సకలాగమార్థ సం**
**వాసన మావహిల్లు జనపంక్తులు గీర్తనసేయ శశ్వదు**
**ల్లాస సుఖానుభూతి నచలస్థితి నొప్పు నతం డుదాత్తుఁడై. (స్వర్గారోహణ. 1-92)**

**లం**బోదర సుముఖెలుకరౌతు పిళ్లారి । సింధూర వదనుడ శూర్పకర్ణ
**కా**వగ రావయ్య కంటకంటుడ నీవు । పార్వతీనందన పుష్టికాంత
**శి**వకుమార గజాస్య శైలజ కొమరుడ । ఓ భవాత్మజ ఒంటికొమ్ము వేల్పు
**వ**రవిఘ్ననాయక వక్రతుండుడ హస్తి । మల్లుడ వెనకయ్య మంద గమన

**రా**జశేఖర పుత్ర హేరంబ దేవ ।
**మ**లయవాసిని ప్రేమకుమార ధీర
**ప్ర**మథనాథుడ పార్వతి ప్రేమతనయ ।
**సాదు** గణపతి హేరకసామి నీవు

# 11. అయిదుగురు సేనాధిపతులు

ఆఖరి కురువంశస్థుడు, ఆజన్మ బ్రహ్మచారి, అత్యంత ప్రకాశవంతుడు
పితామహుడు, ప్రభాసుడు, పదిరోజులలో పదివేలమంది రధికుల్ని చంపినవాడు
తన చావు రహస్యం మనవళ్లకు చెప్పి వారి బాణాలతో, అంపశయ్య నెక్కినాడు
పడవేసిన వారికే రాజనీతి చెప్పి ఇచ్ఛామృత్యువుతో దివికేగినాడు.

అందరికి గురువు, కుంభసంభవుడు, సహాధ్యాయుడితో అవమానించబడినాడు
ప్రియశిష్యుడి కోసం, శిష్యుడు కాని శిష్యుడి బొటనవ్రేలు గురుదక్షిణగా అడిగినవాడు
అసత్యమాడని వాడొచ్చి నీ కొడుకు హతః - కుంజరః అని అర్థసత్యమాడగా
ప్రాయోపవేశాన శరీరాన్ని వదిలినా శత్రువు కొడుకుతో తల నరకబడినవాడైనాడు.

అన్ని శాపాలూ, అన్ని బాణాలూ ఒకేసారి తగిలినపుడు కృంగిపోయాడు తన రథంలా,
సహజ కవచకుండలాలను శత్రువు తండ్రికి దానమిచ్చి శక్తిని పొందినా
లాభం లేక, ఆశలు పెట్టుకున్న నాగాస్త్రం కొద్దిలో గురితప్పి, భార్గవాస్త్రం గుర్తురాక
రారాజు కావాల్సినవాడు ప్రతిక్షణం అవమానించబడి రాలిపోయాడు స్నేహమార్గాన

మల్లయుద్ధం, రథసారధ్యంలో ఉన్న నేర్పుకన్నా ఎక్కువ అహంకారమున్నవాడు
రధికుడినే అవమానిస్తూ ఒకరోజు, తానే రధికుడిగా అర్ధదినం, పోరాడి కూలినాడతడు.
నిజధర్మాన్ని విడిచి క్షాత్రధర్మం చేబట్టి, అర్ధరాత్రి రుద్రోన్మత్తతో వెర్రెక్కినట్లు
తన తండ్రి హంతకుడితో సహా అందరినీ హతమార్చి రారాజును సంతోషపెట్టినవాడు ఇతడు.

**కాల ప్రభావం - కాల మహాత్మ్యం :**

ప్రాణులు, ప్రాణుల భావాలు కాలనిర్మితాలు. జీవసృష్టి, సంహారం, పునఃసృష్టి సంహారాలను చేస్తూ కాలం చక్రంలా పరిభ్రమిస్తుంది.

- **విధాతృ విహితం మార్గం న కశ్చిదతి వర్తతే**
  **కాలమూల మిదం సర్వం భావాభావౌ సుఖాసుఖే-**
- **కాలః సృజతి భూతాని కాలః సంహరతే ప్రజాః**
  **సంహరతః ప్రజాః కాలం కాలః సమయతే పునః-**
- **కాలోహి కురుతే భావాన్ సర్వలోకే శుభాశుభాన్**
  **కాలః సంక్షిపతే సర్వాః ప్రజా విసృజతే పునః-**
- **కాలః సుప్తేషు జాగర్తి కాలోహి దురతి క్రమః**
  **కాలః సర్వేషు భూతేషు చరత్య విధృతః సమః-**
- **అతీతా నాగతా భావాః యే చ వర్తంతి సాంప్రతమ్**
  **తాన్ కాలనిర్మితాన్ బుద్ధ్వా న సంజ్ఞాం హాతుమర్హసి-**

# 12. నలుగురు దుష్టులు (దుష్టచతుష్టయం)

అన్న చెప్పిన మాట వేదమతడికి, అన్నకు అంగరక్షకుడు, వార్తాహరుడతడు
ఆమెను గుంజుకురా అంటే ఆలోచించలేదొక్క క్షణం, దూసుకుపోయాడామెవేపు
అంతటి అయోనిజ భయపడింది, అన్నా కాపాడవా అని తన అన్నను తలచుకున్నది.
ఆనాడు అతడు చేసిన తప్పుకు ప్రతిగా అనిల పుత్రుడతడి రొమ్ము చీల్చి తాగాడు రక్తం.

తండ్రి ఎముకలను పాచికలు చేసి తగవులాట పెంచాడా మాయావి
మేనల్లుడి పక్షాన ఉన్నట్లు కనిపించినా మేకవన్నెపులి దతడి తెలివి.
పరమాత్మనే ఉలిక్కిపడేట్లు చేయగలిగిన పలు విద్యలతడి సొత్తు
చివరకు సహదేవుడి చేతి ఖడ్గమే ఆపిందతడి పాచికల మత్తు.

రెండు ముఖాలు, రెండు జీవితాలు, రెండు మనస్సులతో బాధపడినవాడితడు
అనయంగా ఆరుగురి చేత వంచింపబడి అన్నీ కోల్పోయి పేదయైనవాడు
స్నేహహస్తాన్ని అందించిన మిత్రుని దుష్టాలోచనాగ్నికి ఆజ్యం పోసి
రక్తబంధాన్ని తెంపి స్నేహబంధమే జీవితంగా ప్రాణాల నొడ్డినాడు.

అభిమానమే ధనంగా, అసూయ ఇంధనంగా ద్వేషాగ్నితో మండినవాడు
ఆఖరి క్షణం వరకూ రాజసాన్ని ప్రదర్శించి ఆత్మీయులకండగా ఉన్నవాడు
మానవ ప్రయత్నాన్ని బలాన్ని నమ్మి మాధవుడిని నిర్లక్ష్యం చేసినవాడు
తొడలు విరిగి కూలినా తొణకని ఆత్మాభిమానంతో తోకచుక్కలా వెలిగినాడు.

**సమంత పంచకం - కురుక్షేత్రం :**

సమంత పంచకము– శ్యమంత పంచకము– సమ ప్రదేశంలో అయిదు మడుగులు కలిగి ఉన్న ప్రదేశం. సమేతులైన వారికి అంతం కలిగించిన ధర్మక్షేత్రం– కురుక్షేత్రం.

- **తేషాం సమీపే యో దేశః హ్రదానం రుధిరాంభసామ్**
  **సమంత పంచకమితి పుణ్యం తత్ పరికీర్తితమ్ (సం.ఆది. 2–11)**
- **అహాని యు యుధే భీష్మః దశైవ పరమాస్త్రవిత్**
  **అహాని పంచ ద్రోణస్తు రరక్ష కురువాహినీమ్–**
- **అహాని యుయుధే ద్వేతు కర్ణః పర బలార్దనః**
  **శల్యోర్థ దివసం చైవ గదాయుద్ధ మతః పరమ్–**
- **తస్యైవ దివసస్యాంతే ద్రౌణి హార్దిక్య గౌతమాః**
  **ప్రసుప్తం నిశి విశ్వస్తం జఘ్ను రౌ్యధిష్ఠిరం బలమ్ (సం.ఆది. 2–30,31,32)**
- **సమేతా స్తత్ర వైదేశే తత్రైవ నిధనం గతాః**
  **కౌరవాన్ కారణం కృత్వా కాలేనా ద్భుత కర్మణా (సం.ఆది. 2–29)**

# 13. ఆ ముగ్గురూ

అంతా అయిపోయిందని రారాజు వెళ్లి దాక్కున్నాడు ద్వైపాయన మడుగులో
అంతా అయిపోయినా అశ్వత్థామ వెదుకుతున్నాడు తండ్రి హంతకుడి కోసం
అశ్వంలా సకిలించాడు పుట్టినప్పుడు, కాలాశ్వంలా పొగలు కక్కుతున్నాడిపుడు
అర్ధరాత్రి అతడికేం చెయ్యాలో చెప్పిందొక గుడ్లగూబ ఆ క్షణం

నిద్రించే వాళ్లను చంపడం నిందార్హం వద్దన్నాడు కృపతో అతడి మేనమామ
నిద్ర చావుతో సమానం, చచ్చినవాళ్లను చంపడం పెద్ద పాపం సుమా!
నీవీ పూటకు నిద్రపో, రేపు వెళ్లి యుద్ధం చేద్దాం నీకు నచ్చినట్లే,
నీకిది తగదన్నా, వినలేదు మేనల్లుడు, అనుసరించాడు విధిలేక ఇతడు.

మహాయోధుడతడు అక్షౌహిణీ సేనతో చేరినాడు కౌరవుల పక్షాన
రాయబార సమయంలో అన్న కృష్ణుడికున్నాడు కొండంత అండగా
లోపల గురుపుత్రుడు నరమేధం చేస్తుంటే వాళ్లున్నారు కాపలాగా
సాటి యాదవుడి సరసోక్తులు విరసోక్తులై శిరసును కోల్పోయినాడు.

అయిదవ సేనానిగా అతడొక్కడే మెరిపించాడు రారాజు కళ్లలో విజయకాంతి
అర్ధరాత్రి గుడ్లగూబలా వెళ్లి ప్రతిపక్ష కాకుల్ని చంపినాడు నిద్రపోతున్నవాటిని;
పాండవుల ప్రతీకారంలో సహజ శిరోరత్నాన్ని కోల్పోయి పోగొట్టుకున్నాడు ఠీవి.
శ్రీకృష్ణుని శాపంతో ఒడలంతా క్రిమిభూయిష్ఠ గాయాలతో కృశిస్తున్న చిరంజీవి.

**వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం-**

అభ్యుదయాన్ని కోరుకునేవారు సహృదయుడైన రాజును ఆశ్రయించినట్లు వ్యాస భారతాన్ని కవులందరూ ఆశ్రయించి ధన్యులౌతారు.

- **విచిత్రార్థ పదాఖ్యానమ్ అనేక సమయాన్వితమ్**
  **ప్రతిపన్నం నరైః ప్రాజ్ఞైః వైరాగ్యమివ మోక్షి భిః**
- **ఆత్మ న వేది తవ్యేషు ప్రియే ష్వివ హి జీవితమ్**
  **ఇతిహాసః ప్రధానార్థః శ్రేష్ఠః సర్వాగమే ష్వయమ్**
- **అనాశ్రిత్యై దమాఖ్యానం కథా భువి న విద్య తే**
  **ఆహార మన పాశ్రిత్య శరీర స్యేవ ధారణమ్**
- **తదే తద్ భారతం నామ కవిభి స్తూ జీవ్యతే**
  **ఉదయ ప్రేప్సు భిర్భృత్యైః అభిజాత ఇవేశ్వరః**
- **ఇతిహాసోత్తమే యస్మిన్ అర్పితా బుద్ధిరుత్తమా**
  **సర్వ వ్యంజన యోః కృత్స్నా లోక వేదాశ్రయేవ వాక్ (సం.ఆది. 2-35-39**

# 14. వాళ్లు అయిదుగురు

స్వయంవర మండపంలో కూర్చున్నారు నల స్వరూపులు అయిదుగురు
ఎలా గుర్తుపట్టాలి వాళ్లను? – ఇంతి దయమంతికి అంతుపట్టడం లేదు
నలుగురి కాళ్లు నేలకంటడం లేదు, అనిమిషులుగా కానవస్తూన్నారా అమరులు
నలుడిని గుర్తుపట్టింది వరమాల వేసింది, ఆ తరువాత మొదలయ్యింది అసలు కథ.

ఆ గుహలో కానవచ్చారు అచ్చం ఒకేలా ఉన్న దివ్యులు అయిదుగురు.
పంచేంద్రియాలు పంచ ఇంద్రులై ప్రకటిస్తున్నారు తమ ప్రభావాలను
మౌద్గల్యుడి భార్య ఇంద్రసేన తపిస్తున్నది తన పంచరూప భర్తకోసం
అయిదుసార్లు 'పతి', 'పతి', 'పతి', 'పతి', 'పతి' అని పలవరించింది శివుని దర్శించి

దుర్వాసుడి వరం ఒక్కోసారి శాపం కన్నా చేస్తుంది ఎక్కువ కీడు.
కన్యకకది శాపమై కర్ణుని పుట్టుక, వరమై ధర్మజ భీమ అర్జున జననం
అశ్వినీ దేవతల వలన మాద్రికి కలిగారు కవలలు నకుల సహదేవులు
పంచపాండవులుగా భారతయుద్ధంలో దక్కించుకున్నారు కీర్తిప్రఖ్యాతులు.

ఒకే రోజున ఒకే నక్షత్రంలో జన్మించారు అయిదుగురు మహావీరులు
ముందుగా ఎవడు వారిలో ఒకడిచేత చస్తాడో వాడే ఇతరులకు మృత్యువు
బకుడు, జరాసంధుడు, కీచకుడు బలైనారు భీముడి దెబ్బకు
ఆఖరున తొడలు విరిగి దుర్యోధనుడు అరిగినాడు స్వర్గపురికి.

**ఇతిహాసోత్తమం – మహాభారతం:**

మోక్షానికి దారితీసే ధర్మార్థ కామ విషయాలను పుంస్కోకిల వ్యాసుడు కమనీయంగా వర్ణించి కవులకు మార్గదర్శకుడైనాడు.

- **అష్టాదశ సమాజ గ్ముః అక్షౌహిణ్యో యుయుత్సయా
  తన్మహా దారుణం యుద్ధం అహన్య ష్టా దశాభవత్–**
- **యో విద్యా చ్చతురో వేదాన్ సాంగో పనిషద్ ద్విజః
  న చా ఖ్యాన మిదం విద్యాత్ నైవ స స్యాద్ విచక్షణః–**
- **అర్థశాస్త్రమిదం ప్రోక్తం ధర్మశాస్త్ర మిదం మహత్
  కామ శాస్త్రమిదం ప్రోక్తం వ్యాసేనామిత బుద్ధినా–**
- **శ్రుత్వా త్విదము పాఖ్యానం శ్రావ్య మన్యన్న రోచతే
  పుంస్కోకిల రుతం శ్రుత్వా రూక్షా ధ్వాంక్షస్య వాగివ–**
- **ఇతిహాసోత్తమాదస్మాత్ జాయంతే కవి బుద్ధయః
  పంచభ్య ఇవ భూతేభ్యః లోకసంవిధయస్త్రయః– (సం.ఆది. 2–381–385)**

# 15. నలుగురు కృష్ణులు

ఆమె అగ్నిలో పుట్టింది, అతిలోక సౌందర్యవతి, అపూర్వ శక్తి రూపిణి
అయిదుగురు మహావీరులు భర్తలున్నా అవమానాల పాలైనానని దుఃఖించింది.
నా భర్త శైలూషుడే కాదు జూదరి కూడా అన్నది ఆగ్రహం పట్టలేకోనాడు
తన కొడుకుల్ని చంపిన గురుపుత్రుడిని క్షమించి వదిలివేసింది.

ఇతడు ఇంద్రుడి పుత్రుడు, విలువిద్యలో సాటిలేనివాడు, నరుడతడు కదా
మాధవుడు చెప్పిందంతా వింటాడు, మరచిపోయి అడుగుతూ ఉంటాడు మరల
పరమశివుడినే మెప్పించి పాశుపతాన్ని, ఇంద్రుని అర్ధసింహాసనాన్ని పొందినవాడు.
నారాయణుడు నిష్క్రమించినాక మామూలు వేటగాళ్లతో వేధించబడి చిన్నబోయినాడు.

జగన్నాటక సూత్రధారి, లీలామానుష విగ్రహుడు; అన్నీ తెలిసినవాడు
నమ్మినవారికి విశ్వరూపుడు, నమ్మనివారికి గోకులంలో పెరిగినవాడు
చక్రం అడ్డువేసి సైంధవవధతో అర్జునుడిని, బ్రహ్మాస్త్ర ప్రభావాన్ని ఆపి పరీక్షిత్తును
బ్రతికించినవాడు, గతజన్మ పాపం ముసలపు ములుకై చాలించాడు తనువు

దారే పోయే ముని, దారిలో పడవ నడిపే కన్యతో ప్రేమాయణం సాగించ పుట్టినాడు
యమునా ద్వీపంలో పుట్టి అఖిలశాస్త్ర కోవిదుడై వేదవిభజన చేసినాడు
తన వంశ కథను జయంగా మలచి జనాలకు చేసినాడు హితబోధ
భారతమై, మహాభారతమై విస్తరించిన పారిజాతవృక్షమైనది ఆ అపూర్వ గాథ.

**పాపహరణం శుభప్రదం :**

భారత కథాశ్రవణం, పఠనం- వ్యాస హిమగిరి నుంచి జాలువారిన అమృతలహరి, సాటిలేనిది, పుణ్య ప్రదమైనది భారతం.

- **అస్యాఖ్యాన స్య విషయే పురాణం వర్తతే ద్విజాః**
  **అంతరిక్షస్య విషయే ప్రజా ఇవ చతుర్విధాః-**
- **క్రియాగుణానాం సర్వేషాం ఇదమాఖ్యాన మాశ్రయః**
  **ఇంద్రియాణాం సమస్తానాం చిత్రా ఇవ మనః క్రియాః-**
- **అనాశ్రియ త్యైతదాఖ్యానం కథాభువి న విద్య తే**
  **ఆహార మన పాశ్రిత్య శరీర స్యేవ ధారణమ్-**
- **ఇదం కవి వరైః సర్వైః ఆఖ్యాన ముప జీవ్యతే**
  **ఉదయ ప్రేప్సు బీర్భృత్యైః అభిజాత ఇవేశ్వరః-**
- **అస్య కావస్య కవయః నసమర్థా విశేషణే**
  **సాథోరివ గృహస్థస్య శేషాస్త్రయ ఇవాశ్రమాః- (సం.ఆది. 2-386-390)**

# 16. ముగ్గురు రాముళ్లు

కృతయుగపు రాముడు బ్రాహ్మణాంశతో పుట్టి చేబట్టినాడు పరశువు
కార్తవీర్యుని, అతడి పుత్రులను, క్షత్రియులనందరికి అతడు ధూమకేతువు
శమంతక పంచకాన్ని రాజుల రక్తంతో నింపి భూమిని దానమిచ్చాడు కశ్యపునికి
శివుని విల్లు విరిచాడని శ్రీరాముడితో తగవుపడి తరలినాడు అవతార సమాప్తికి.

తండ్రిమాట జవదాటక తరలివెళ్లినాడు అడవులకు పదునాలుగేళ్లు
సీత నెత్తుకుపోయిన రావణుడిని చంపి దిగ్విజయంతో వచ్చాడు అయోధ్యకు
తార శాపం తగలగా జానకిని వదిలిపెట్టాడు భరించలేక అపవాదు భారం
త్రేతాయుగపు క్షత్రియుడితడు కోదండరాముడై స్థాపించాడు రామరాజ్యం

ద్వాపరయుగపు రాముడు హలాయుధుడు, మల్లయుద్ధ వీరుడు
భారతయుద్ధంలో తటస్థుడై తరలివెళ్లాడు తీర్థయాత్రలకపుడు
భీమ దుర్యోధన యుద్ధం చూసి ఆక్షేపించాడు భీముడి యుద్ధరీతిని
అనుజుడు గోపాలుడి మాటలకు శాంతించిన ఆదిశేషాంశ రూపుడా బలరాముడు

కలియుగపు రాముడి జననం ఖచ్చితంగా శ్రామిక కులంలోనే
ఆ కలికాలంలో అతడికి పరశువు, బాణం, నాగలి సరిపోతాయా
కులానికొక రాముడు పుడితేనే కుదుర్తుందా సయోధ్య జనుల మధ్య
చక్రం అడ్డువేసేవాడు ఏ రూపాన వస్తాడో తెలుసా ఎవరికైనా?

**భారత కథాశ్రవణ ఫలం :**

ముక్తి మార్గాన్ని చూపే కాంతిదీపమూ, పరలోకం వెళ్లేవారికి మనశ్శాంతినిచ్చి, సమస్త పాపహరణమూ చేసే దివ్య జ్ఞానం మహాభారతం.

- **ధర్మే మతిర్భవతు వః సతతోత్థి తానాం**
  **సహ్యేక ఏవ పరలోక గతస్య బంధుః**
  **అర్థాః స్త్రియశ్చ నిపుణైరపి సేవ్యమానాః**
  **నైవాప్త భావముపయాంతి న చ స్థిరత్వమ్–**
- **ద్వై పాయనోష్ఠ పుట నిఃసృతమ ప్రమేయం**
  **పుణ్యం పవిత్ర మథ పాపహరం శివం చ**
  **యో భారతం సమధిగచ్ఛతి వాచ్యమానం**
  **కిం తస్య పుష్కర జలై రభిషే చనేన–**
- **శ్రుత్వా దౌ భవతి నృణాం సుఖావగాహం**
  **విస్తీర్ణాం లవణజలం యథా ప్లవేన (సం. ఆది. 2–391–392,396)**

# 17. మిగిలిన ఇద్దరు

సహగమనాలు, తపస్సులు నిర్ణయించుకున్నారు సతులు వారికి నచ్చినట్లుగా
పరీక్షిత్తును రాజుగా చేసిన విషయాన్ని ప్రజలకు చెబుతున్నాడు ధర్మరాజు
ప్రజలప్పుడే వాదులాడుకుంటున్నారు కూర్చునే కుర్చీల కోసం అసహనంగా
సహదేవుడి నవ్వు ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నది హస్తిన, ఇంద్రప్రస్థాలలో

అందరినీ ఆదుకునే అన్న అడవిలో కన్నుమూసాడు దిక్కెవ్వరూ లేనిచోట
ఆ అన్నకు ఎంతో ఇష్టమైన సోదరి కృష్ణ అప్పగింతలు చెప్పింది తనకప్పుడే!
అన్నాడు ధర్మరాజు- అమ్మా సుభద్రా! ఇప్పుడు మిగిలింది ఇద్దరు- హస్తినకు రాజు-
నీ మనవడు పరీక్షిత్తు; ఇంద్రప్రస్థానికి రాజు నీ మునిమనమడు వజ్రుడు.

రాజమాతవై రక్షించు పాండవ, యదువంశ వారసులనిద్దరినీ.
అభిమన్యుడిని తలచుకుని కుమిలి కుమిలి ఏడుస్తూనే ఉన్నది అక్కడే ఉన్న ఉత్తర
నర్తనశాల, గోగ్రహణం, బొమ్మ పొత్తికలు, అభిమన్యుడితో వివాహం
ఇదంతా కలకాదని చెబుతూ ఎదురుగా కానవస్తున్నాడు కుమారుడు పరీక్షిత్తు.

కుమారుడిని చూసింది, ఇప్పుడతడు పరీక్షిన్మహరాజు, కురుసార్వభౌముడు.
అడుగో- వెళ్లిపోతున్నాడు తన నాట్యగురువు, మామగారైన అర్జునుడు తనవారితో.
వెళ్లిపోయాడెప్పుడో తన భర్త, అతడి మేనమామ శ్రీకృష్ణదేవుడూ-
ఇక మిగిలింది ఇద్దరు- రాజమాతలుగా సుభద్ర, ఉత్తరలు.

---

**మహాభారత వృక్షం :**

మహాకవులందరికీ ప్రధానాశ్రయం ఈ భారత మహావృక్షం.

- **సంగ్రహాధ్యాయ బీజో వై పౌలోమాస్తీక మూలవాన్**
  **సంభవ స్కంధ విస్తారః సభారణ్యా విటం కవాన్-**
- **అరణీ పర్వ రూపాఢ్యః విరాటోద్యోగ సారవాన్**
  **భీష్మ పర్వ మహాశాఖః ద్రోణపర్వ పలాశవాన్-**
- **కర్ణ పర్వ సితైః పుష్పైః శల్యపర్వ సుగంధి భిః**
  **స్త్రీ పర్వై షీక విశ్రామః శాంతిపర్వ మహాఫలః-**
- **అశ్వమేధామృత రసస్త్వా శ్రమస్థాన సంశ్రయః**
  **మౌసలః శ్రుతి సంక్షేపః శిష్టద్విజ నిషేవితః-**
- **సర్వేషాం కవి ముఖ్యానామ్ ఉపజీవ్యో భవిష్యతి**
  **పర్జన్య ఇవ భూతానామ్ అక్షయో భారత ద్రుమః (సం. ఆది. 1-88-92)**

# 18. ఒకే ఒక్కడు

పరీక్షిన్మహారాజు కత్తి దూసినాడు ధర్మవృషభాన్ని, గో భూదేవిని తన్నిన కలిపై
కలి అన్నాడు– 'నేను కాలపు అంశను, నేనెక్కడుండాలో నీవే నిర్ణయించుము'
రాజు అన్నాడు– 'ద్యూతము, ప్రాణి వధ, స్త్రీలు, తాగుబోతులు విచ్చలవిడిగా చరించే చోట ఉండు'–
అందుకే కలికాలంలో జనులు ఎక్కువగా మూగి ఉంటారు ఆ పాప ప్రదేశాలలో.

ఒకరోజున రాజు విధిప్రేరితుడై ధ్యానసమాధిలో ఉన్న శమీకుని మెడలో వేసాడు చచ్చిన పామును.
ముని కుమారుడు శృంగి శపించాడు రాజును– 'ఏడు రోజుల్లో చస్తావు తక్షక పాముకాటుతో'
ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కుదర్లేదు. తక్షకుని కాటుకు చనిపోయాడు మహారాజు పరీక్షిత్తు.
అసలు కారణం తెలిసింది ఉదంకుడి వలన జనమేజయుడికి, ప్రారంభించాడు సర్పయాగం.

–'తన విషవహ్ని మజ్జనకు దక్షకుడెట్లు దహించెనో' –అట్లే నేనూ దహిస్తాను నాగ కులాన్ని–
ఒక్కొక్క విష సర్పమూ వచ్చి పడుతున్నది పేరుబెట్టి పిలవగానే హోమగుండంలో
తక్షకుడు దాక్కున్నాడు ఇంద్రుడి పీఠం వెనుక,– 'సహేంద్రు తక్షకా యాను బ్రూహి'–
మంత్రాలు చదివారు ఋత్విక్కులు– ఇంద్రపీఠం కదిలింది– ఆకాశంలో ఇంద్రుడూ, తక్షకుడూ

ఖాండవ వన దహన సమయాన అర్జునుడు తన తల్లిని చంపినందుకు పగబట్టినాడు
తక్షకుని కొడుకు అశ్వసేనుడు. కర్ణుని నాగాస్త్రంలో పామై అర్జునుని చంపబోయి తానే చచ్చినాడు.
అర్జునుని మనమడు పరీక్షిత్తును కాటువేసి చంపి, పగతీర్చుకున్నాడు తక్షకుడు; అశ్వత్థామ అస్త్రంతో
మృతశిశువుగా పుట్టి కృష్ణ స్పర్శతో బ్రదికి, తక్షక కాటుతో మరణించిన ఒకే ఒక్కడు– పరీక్షిత్తు.

**నరుడి శివస్తుతి :**

కిరాతరూపంలో వచ్చిన శివుడిని ఎదిరించి యుద్ధం చేసి ఓడి శరణుజొచ్చి భవుడిని స్తుతించాడు పార్థుడు. దేవుడితో మల్లయుద్ధం చేసిన నరుడితడు.

– **కపర్దిన్ సర్వ దేవేశ భగనేత్ర నిపాతన**
**దేవ దేవ మహాదేవ నీలగ్రీవ జటాధర–**

– **కారణానాం చ పరమం జానే త్వా త్ర్యంబకం విభుమ్**
**దేవానాం చ గతిం దేవత్వ త్ప్రసూత మిదం జగత్–**

– **అజేయస్త్రం త్రిభిర్లోకైః స దేవాసుర మానుషైః**
**శివాయ విష్ణురూపాయ విష్ణవే శివరూపిణే–**

– **దక్షయజ్ఞ వినాశాయ హరిరుద్రాయ వైనమః**
**లలాటక్షాయ శర్వాయ మీఢుషేశూలపాణయే–**

– **పినాక గోప్త్రే సూర్యాయ మంగల్యాయ చ వేధసే**
**ప్రసాదయే త్వాం భగవన్ సర్వభూత మహేశ్వరః (సం. వన. 40–74–78)**

# 19. నిర్గుణుడే, కాని, విశ్వరూపుడు

అతడు అర్ధరాత్రి పుట్టినాడు అంధకారంగా ఉన్న కారాగారంలో దేవకి అష్టమ గర్భాన
తండ్రి వసుదేవుడతడిని తలపై బుట్టలో పెట్టుకుని వెళ్తుంటే దారినిచ్చింది యమున
పెంపుడు తల్లిదండ్రుల ప్రేమలో గోవుల మధ్య, గోప గోపికల మధ్య పెరిగాడతడు
అనుక్షణం అతడిపై జరిగాయి అసంఖ్యాకమైన విఫల హత్యాప్రయత్నాలు.

సామవేదాన్ని వేణువుపై పలికించాడు, గోపికజనంతో ఆడినాడు రాసక్రీడలు
చిన్నతనంలోనే చేసినాడు ఎన్నో సాహస కార్యాలు, ముద్దులొలికే చిలిపి పనులు
అటువంటి కొడుకు కావాలని తల్లులు, అటువంటి ప్రియుడు కావాలని కన్యలు
అటువంటి చెలికాడు కావాలని మిత్రులు, అటువంటి గురువు కావాలని మునులు.

అందరూ కోరుకున్నా అందనివాడు అతడు, అయినా, భక్తసులభుడా నీలమేఘశ్యాముడు
ఆపద్బాంధవుడు, అనాధ జనరక్షకుడు, ఆర్తత్రాణపరాయణుడు, యదువంశ సోముడు
అర్జునునికి నెచ్చెలి, ద్రౌపది-సుభద్రలకు అన్న, పాండవులకు పరమదైవరూపుడు
పసిబాలుడిగా ఉన్నపుడు తల్లి యశోద చూసింది అతడి నోటిలో విశ్వమెల్ల వెలసి యుండుట.

భూభారం తగ్గించడానికి అవతరించినా శాంతి ప్రయత్నం ఆపలేదతడు
భగవద్గీతను నరుడు మరచినా భక్తిగలవాడికి గుర్తుచేయడం మరచిపోని విశ్వరూపుడు,
ఆయుధం పట్టకుండానే అన్నీ తాననుకున్నట్లు చేస్తాడా జగన్నాటక సూత్రధారి.
విశ్వమంతటా తానే నిండి, తనలో విశ్వాన్ని దాచిన శ్రీహరి, అతడు రాక్షసగుణ వైరి.

**సర్వం విష్ణుమయం జగత్- ఈ జగత్తంతా విష్ణుమయం**

- బ్రహ్మభూత స్తదాత్మానం బ్రహ్మాణమ సృజత్ స్వయమ్
  సోధ్యక్షః సర్వభూతానాం ప్రభూతః ప్రభవో చ్యుతః-
- సనత్కుమారం రుద్రం చ మనుం చైవ తపోధనాన్
  సర్వమేవా సృజద్ బ్రహ్మ తతోలోకాన్ ప్రజాస్తథా-
- తే చతద్ వ్యసృజంస్తత్ర ప్రాప్తే కాలే యుధిష్ఠిర
  తే భ్యో భవన్మహాత్మ భ్యః బహునా బ్రహ్మ శాశ్వతమ్-
- కల్పానాం బహుకోట్య శ్చ సమతీతాహి భారత
  ఆ భూత సంప్లవాశ్చైవ బహు కోట్యో తి చక్రముః-
- మన్వంతర యుగే జస్రం సకల్పా భూత సంప్లవాః
  చక్రవత్ పరివర్తంతే సర్వం విష్ణుమయం జగత్- (సం.సభా. 38 అధ్యాయము)



# ✣ వ్యాస మహాభారతము - ఆదిపర్వము ✣

శ్లో॥ నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్

- వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధమ్

- ధర్మేమతిర్భవతు వః సతతోత్థి తానామ్
సహ్యేక ఏవ పరలోక గతస్య బంధుః

- అర్థాః స్త్రియశ్చ నిపుణైరపి సేవ్యమానాః
నైవార్తుభావ ముపయాంతి న చ స్థిరత్వమ్

పరలోకానికైనా మన వెంట వచ్చేది ధర్మమే. ఇంకేవీ మనవెంట రావు.

## ఆదిపర్వము


1) అనుక్రమణికా పర్వము-1
2) పర్వసంగ్రహ పర్వము-1
3) పౌష్య పర్వము - 1
4) పౌలోమ పర్వము - 9
5) ఆస్తీక పర్వము - 46
6) అంశావతరణ పర్వము - 6
7) సంభవ పర్వము - 75
8) జతుగ్రహ పర్వము - 11
9) హిడింబ వధ పర్వము - 5
10) బక వధ పర్వము - 8
11) చైత్రరథ పర్వము - 19
12) స్వయంవర పర్వము - 9
13) వైవాహిక పర్వము - 7
14) విదురాగమన రాజ్యలంభ పర్వము - 13
15) అర్జున వనవాస పర్వము - 6
16) సుభద్రాహరణ పర్వము - 2
17) హరణాహరణ పర్వము - 1
18) ఖాండవ దహన పర్వము - 6
19) మయదర్శన పర్వము - 7


## 1. ఆదిపర్వము

### 1) అనుక్రమణికా పర్వం (అధ్యాయాలు-1)

#### (యదాశ్రౌష పర్వము)

పృధు మహారాజు చేస్తున్న యజ్ఞకుండంలోంచి ఆవిర్భవించి అక్కడున్నవారికి రోమాంచం-ఆశ్చర్యం కలిగించివాడు వ్యాసుని శిష్యుడు అయిన రోమహర్షణుడి కుమారుడు ఉగ్రశ్రవస సూతుడు. శౌనకుడనే కులపతి (పదివేల మంది శిష్యులకు విద్యాబుద్ధులు గరపేవాడు) నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్నపుడు అక్కడ ఉన్న మునులందరికి వ్యాసప్రోక్త మహాభారతాన్ని చెప్పనారంభించాడు.

వ్యాసుడు ఒక గుహలో కూర్చుని తపస్సు చేస్తున్నపుడు ధ్యానంలో అతడికి సృష్టి రహస్యం కరతలామలకం అయ్యింది.

చీకటి → బ్రహ్మాండం → బ్రహ్మాండాన్ని సృష్టించి దానిలోకి ప్రవేశించిన అంతర్యామి (మహత్తు) → హిరణ్యగర్భుని పుట్టుక (దేహధారి) → త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణువు, పరమేశ్వరుడు), మనువు, ప్రజాపతి, పరమేష్ఠి, ప్రాచేతసుడు, దక్షుడు, దక్షపుత్రులు ఏడుగురు (క్రోధుడు, తముడు, దముడు, విక్రీతుడు, అంగిరసుడు, కర్దముడు, అశ్వుడు), ప్రజాపతులు 21 మంది- సప్తర్షులు, చతుర్దశ మనువులు, అప్రమేయుడైన పురుషుడు, విశ్వదేవులు, ఆదిత్యులు, వసువులు, అశ్వినీ దేవతలు, యక్షులు, సాధ్యులు, పిశాచులు, గుహ్యకులు, పితృదేవతలు, బ్రహ్మర్షులు, రాజర్షులు, పంచభూతాలు,

సంవత్సరాలు, ఋతువులు, మాసాలు, పక్షాలు, దివారాత్రాలు అన్నీ పుట్టాయి. 33000 లేదా 3300, 33 మంది దేవతలు (ద్వాదశాదిత్యులు, ఏకాదశ రుద్రులు, అష్టవసువులు, అశ్వినీ దేవతలు).

దివఃపుత్రుడు, బృహద్భానుడు, చక్షుడు, ఆత్మ, విభావసుడు, సవిత, ఋచీకుడు, అర్కుడు, భానుడు, ఆశావహుడు, రవి అనే పేరుగల సూర్యుడు మహ్యుడైనాడు (మహిలో గర్భస్థాపన చేసేవాడు).

రవికి పుత్రుడు దేవభ్రాట్టు. ఇతడి కుమారుడు సుభ్రాట్టు. సుభ్రాట్టుకు ముగ్గురు కుమారులు– దశజ్యోతి, శతజ్యోతి, సహస్రజ్యోతి. దశజ్యోతికి పదివేలమంది, శతజ్యోతికి పదిరెట్లు అనగా లక్షమంది, సహస్రజ్యోతికి పది లక్షల మంది కొడుకులు. వీరి నుంచి పుట్టినవారు తపతీ–సంవరణుల పుత్రుడు కురుడు (కురు వంశ స్థాపకుడు). యయాతి–దేవయానుల పుత్రుడు యదువు (యదువంశ స్థాపకుడు). ఇక్ష్వాకుడు–మనువు పుత్రుడు–సూర్య వంశ స్థాపకుడు. ఇతడి వంశంలో శ్రీరాముడు జన్మించాడు.

వ్యాసమహర్షి తన జ్ఞానదృష్టితో ప్రాణుల ఉనికి, ధర్మ అర్థ కామ విశేషాలను వేదాది విద్యల రహస్యాలను లోకయాత్రా విధానాలను పరిశీలించి ఆ మహా విజ్ఞానాన్ని సంక్షిప్తంగానూ, వివరంగానూ చెప్పినాడు.

విప్రులు కొందరు ఈ మహాభారతాన్ని మనువు అధ్యాయం నుంచి, కొందరు ఆస్తీక చరిత్ర నుంచి, కొందరు ఉపరిచర వసువు దగ్గర నుంచి చదివేవారు. అనేకమంది వ్యాఖ్యానాలు చెప్పినారు.

బ్రహ్మ ఇచ్చిన ప్రోత్సాహంతో వ్యాసమహర్షి అప్పటి వరకు తన మనసులో మధించబడిన మహాభారతాన్ని గ్రంథ రూపంలోకి తేవడానికి సంకల్పించి, హిరణ్యగర్భుడైన బ్రహ్మ సలహాతో గణేశుడిని సంప్రదించాడు తనకు లేఖకుడిగా ఉండమని.

వ్యాసుడన్నాడు– నేను చెబుతాను, నీవు వ్రాయాలి.

గణేశుడన్నాడు– నా లేఖిని ఆగకుండా నీవు చెప్పాలి.

వ్యాసుడన్నాడు– అర్థం తెలియకుండా వ్రాయరాదు.

ఒక్కోసారి వ్యాసుడు గూఢార్థాలు కలిగిన గ్రంథ గ్రంథిని ముడులతో ఉండే విధంగా చెబుతుంటే ఓ క్షణం గణేశుడు ఆలోచించేవాడు, ఈలోగా వ్యాసుడు మరిన్ని శ్లోకాలు చెప్పేవాడు. అటువంటి శ్లోకాలు– గూఢార్థాలు, యోగార్థాలు, యోగరూఢాలు కలవి 8800. వీటినే 'వ్యాస ఘట్టాలు' అంటారు.

**అజ్ఞాన తిమిరాంధస్య లోకస్య తు విచేష్టతః**
**జ్ఞానాంజన శలాకాభిః నేత్రోన్మీలన కారకమ్**
**ధర్మార్థ కామ మోక్షార్థైః సమాస వ్యాసకీర్తనైః**
**తథా భారత సూర్యేణ నృణాం వినిహితం తమః**

ఈ మహాభారత వృక్షానికి సంగ్రహాధ్యాయం విత్తనం. పౌలోమ, ఆస్తీక పర్వాలు మూలం; సంభవ పర్వం విస్తరించిన మాను; సభారణ్య పర్వాలు– పక్షులుండే తొర్ర; అరణీ పర్వం– అందమైన రూపం; విరాటోద్యోగ పర్వాలు– ఈ చెట్టుకు సారభూతమైనవి; భీష్మపర్వం– మహాశాఖ; ద్రోణపర్వం– ఆకుల గుబురు; కర్ణపర్వం– తెల్లని పూలు; శల్యపర్వం– సుగంధం; స్త్రీ, ఇషీక పర్వాలు– చెట్టునీడలు; శాంతి పర్వం– గొప్ప ఫలం (మోక్షం).

అశ్వమేధ పర్వం– అమృత రసం; ఆశ్రమవాస పర్వం– స్థిరమైన ఆశ్రయం; మౌసల పర్వం– సంక్షిప్త వేదం.

**సర్వేషాం కవి ముఖ్యానామ్ ఉపజీవ్యో భవిష్యతి**
**పర్జన్య ఇవ భూతానామ్ అక్షయో భారతద్రుమః**

ప్రాణులన్నిటికీ మేఘం జీవన దాత అయినట్లు కవులందరికీ ఈ భారత మహావృక్షం ఆశ్రయమవుతుంది.

ఆ వృక్షపు పుష్పం ధర్మం; ఫలం– మోక్షం. ఈ రెండూ కలిసి సత్యమవుతాయి.

| | | |
|---|---|---|
| సంక్షిప్త మహాభారతం | – | 150 శ్లోకాలు |
| ఉపాఖ్యానాలు లేనిది | – | 24,000 శ్లోకాలు |
| శిష్యులకు ఇచ్చినది | – | 60,000 శ్లోకాలు |

ఉపాఖ్యానాలతో కూడినది - 1,00,000 శ్లోకాలు
గంధర్వ లోకం (శుకుడు) - 14 లక్షల శ్లోకాలు
పితృలోకం (దేవలుడు) - 15 లక్షల శ్లోకాలు
దేవలోకం (నారదుడు) - 30 లక్షల శ్లోకాలు

మనుష్యలోకంలో వైశంపాయనుడు చెప్పినది లక్షశ్లోకి. దానినే ఉగ్రశ్రవస సౌతి నైమిశారణ్యంలో మునులకు చెప్పినాడు.

కురువంశపువాడు హస్తినాపుర ప్రభువు, పుట్టుగుడ్డి అయిన ధృతరాష్ట్రుడి సంతానం కౌరవులకు, అతడి తమ్ముడు దివంగతుడైన పాండురాజు కుమారులైన పాండవులకు మధ్య కురుక్షేత్రంలో ఘోర యుద్ధం జరిగింది. ఆ యుద్ధ విశేషాలను ధృతరాష్ట్రుడికి నమ్మకస్తుడైన సంజయుడు వివరిస్తున్నపుడు ధృతరాష్ట్రుడు చెప్పిన శ్లోకాలు (65) 'యదాశ్రౌషం' అని ప్రారంభ మవుతాయి (ఆదిపర్వం. 1-150 to 215). అందుకే ఈ పర్వానికి యదాశ్రౌష పర్వమని పేరు వచ్చింది.

(యదాశ్రౌష పర్వంలానే, రామాయణంలో 'తత్ క్వచిత్' అన్న పర్వంలో అనేక శ్లోకాలున్న పర్వానికీ పేరు అలానే వచ్చింది).

కాలోహి కురుతే భావాన్ సర్వలోకే శుభాశుభాన్
కాలః సంక్షిప్తతే సర్వాః ప్రజావి సృజతే పునః
కాలః సుషేప్తు జాగర్తి కాలోహి దురతి క్రమః
కాలః సర్వేషు భూతేషు చరత్య విధృతః సమః

అనుక్రమణ కాధ్యాయం భారతస్యేమ మాదితః
ఆస్తికః సతతం శృణ్వన్ న కృచ్ఛే ష్య వసీదతి

## 2) పర్వ సంగ్రహ పర్వం (అధ్యాయాలు-1)

**శ్రుత్వా త్విద ముపాఖ్యానం శ్రావ్య మన్యన్న రోచతే**
**పుంస్కోకిల రుతం శృత్వా రూక్షాధ్వాంక్షస్య వాగివ**

**ఇతిహాసోత్తమా దస్మాత్ జాయంతే కవి బుద్ధయః**
**పంచభ్యః ఇవ భూతేభ్యః లోకసంవిధయ స్త్రయః**

ఈ కోకిల పాట విన్నాక కాకి మాటలు ఎవరూ వినరు. ఈ భారతాన్ని ఆశ్రయించకుండా ఏ కథా భూమిమీద వినబడదు. ఈ కావ్యాన్ని మించి కవులెవరూ గొప్ప కథ చెప్పలేరు.

## 3) పౌష్య పర్వం (అధ్యాయాలు-1)

సరమ కుమారుడైన సారమేయుడనే కుక్కపిల్లను జనమేజయుని తమ్ముళ్లు కొట్టారు. ఆమె కోపించి- "ఏ తప్పు చేయని నా కొడుకుని కొట్టారు కనుక మీకు అనుకోని భయం కలుగుతుంద"ని శపించింది.

జనమేజయుడు ఈ భయాన్ని తొలగించగల వ్రతం చేయించగల పురోహితుడి కోసం అన్వేషించి, శ్రుతశ్రవసుడనే మునిని కలిసాడు. ఆ ముని వీర్యం తాగి ఓ సర్పిణి గర్భం దాల్చి సోమశ్రవసుడిని కన్నదట. (ముని, నాగకన్యల కుమారుడు సోమశ్రవసుడు) అతడు జనమేజయుని పురోహితుడైనాడు. సోమశ్రవసుడు, జనమేజయుడు యజ్ఞం చేస్తున్న సమయంలో జనమేజయుడు తక్షశిలపై దండెత్తి దానిని స్వాధీనం చేసుకున్నాడు.

ఉద్దాలకుడి కథ- అయోద ధౌమ్యుడనే ఋషికి ఆరుణి, ఉపమన్యువు, వేదుడనే ముగ్గురు శిష్యులున్నారు. ఒకరోజున ఆరుణి (పాంచాల దేశపువాడు)ని గురువు పొలానికి కంత కట్టమని పంపగా ఆరుణి ఎంత ప్రయత్నించినా నీటిని ఆపలేకపోయాడు. నీటి ఉధృతి తగ్గేవరకు అతడు కాలువ కట్ట తెగినచోట అడ్డంగా పడుకున్నాడు. బురద, మట్టి అతడి దేహాన్ని కప్పివేసింది. ఎంతసేపటికీ శిష్యుడు రాకపోయేసరికి, గురువు మిగతా శిష్యులు పొలం వద్దకు వచ్చి గట్టిగా పిలిచేసరికి మట్టిని వదిలించుకుంటూ పైకి లేచాడు పాంచాల ఆరుణి. మట్టిని పెకలించుకుని పైకి లేచాడు

కాబట్టి అతడిని 'ఉద్దాలకుడు' అని పిలిచారందరూ. అతడికి సర్వ విద్యలూ కరతలామలకమై గురువు అనుమతి పొంది స్వదేశానికి వెళ్ళిపోయాడు.

ధౌమ్యుడి రెండవ శిష్యుడు ఉపమన్యుడు. ఉద్దాలకుడు వెళ్ళిపోయినాక గోవుల్ని సంరక్షిస్తూ కూడా బలంగా లావుగా ఉన్న ఉపమన్యుడిని చూసి గురువు అడిగాడు కారణమేమిటని. "భిక్షాటన చేస్తున్నాను" అన్నాడు. "అయితే అలా సంపాదించింది నాకు ఇవ్వాలి" అన్నాడు గురువు. అయినా శిష్యుడు బలంగానే ఉన్నాడు. ఎలా అంటే– "మొదటిసారి భిక్షాటనకు వెళ్లి తెచ్చింది తమకు ఇస్తున్నాను. రెండోసారి వెళ్లి తెచ్చుకున్నది నేను తింటున్నాను" అన్నాడు శిష్యుడు. దానిని నిషేధించాడు గురువు. అయినా శిష్యుడిలో మార్పు లేదు. ఎలా? అంటే "ఆవుల పాలు తాగుతున్నాను" అన్నాడు శిష్యుడు. "పాలు తాగవద్దు" అన్నాడు గురువు. అయినా శిష్యుడు బలంగా, ఆరోగ్యంగానే ఉన్నాడు. ఎలా? అంటే "లేగదూడలు పాలు తాగుతుంటే నురుగు ఎగిరి వస్తున్నది. దానిని తాగి ఆకలి తీర్చుకుంటున్నా" అన్నాడు శిష్యుడు. అదీ చేయకూడదన్న గురువు మాట కాదనలేక, ఆకలి తాళలేక ఉపమన్యుడు జిల్లేడు ఆకులు తిన్నాడు. దానితో కళ్లు పోయి అంధుడై దారితప్పి పాడుబడిన బావిలో పడినాడు. గురువు వెదుక్కుంటూ వచ్చి శిష్యుడిని బయటకు లాగి రక్షించినాడు. గురువు చెప్పినట్లు ఉపమన్యుడు అశ్వనీదేవతలను ప్రార్థించినాడు. రేయింబవళ్లు అనే దారాలతో సంవత్సర వస్త్రాన్ని నేస్తున్నవారు, కాలచక్రాన్ని నడుపుతున్న వారు అయిన గొప్ప దేవతలుగా వారిని స్తుతించగా వారు ప్రత్యక్షమై ఉపమన్యుడికో 'అప్పం' ఇచ్చినారు. 'గురువు అనుమతి లేకుండా తినను' అని పలికిన అతడి గురుభక్తిని మెచ్చుకుని అతడికి చూపు మరలివచ్చేలా అశ్వనీదేవతలు అనుగ్రహించారు. గురువు అతడికి సర్వ విద్యలు వచ్చేలా ఆశీర్వదించాడు.

మూడవ శిష్యుడు వేదుడు. ఉపమన్యుడు వెళ్లిపోయాక వేదుడిని ఎద్దులా పనిచేయించాడు గురువు. చాలాకాలం పని చేసాక గురువు సంతోషించి అతడికి అన్ని విద్యలూ నేర్పగా, గురువు అనుమతితో స్వదేశం వెళ్లాడు.

వేదుడికి అతడి ఆశ్రమంలో ముగ్గురు శిష్యులుండేవారు. తాను పడిన కష్టాలు తన శిష్యులు పడకూడదని వారికి పెద్దగా పనులు చెప్పేవాడు కాదు వేదుడు. జనమేజయుడు, పౌష్యుడు అనే రాజులకు పురోహితుడైనాడు వేదుడు (గౌతముడు). రాచకార్యంపై వెళ్తూ ఉత్తంకుడనే శిష్యుడి (ఉదంకుడు)కి తాను వచ్చేవరకు ఇంటి కార్యాలు చూసుకోమని చెప్పినాడు. అతడు వెళ్లిన కొద్దిరోజులకు గురుపత్ని ఋతుమతి అయ్యింది. ఆ రోజుల్లో ఋతుకాలాన్ని వ్యర్థం చేయడం భ్రూణహత్యతో సమానం. గురువు లేరు కాబట్టి శిష్యుడిని ఆ లోటు తీర్చమని ఆశ్రమంలోని స్త్రీలు ఉత్తంకుడిని అడిగారు. అతడు ఒప్పుకోలేదు.

కొన్నాళ్లకు గురువు వచ్చి ధర్మబద్ధమైనా, ఆ కార్యం చేయని శిష్యుడిని అభినందించాడు. విద్యాభ్యాసం పూర్తయ్యింది. ఉత్తంకుడు గురుదక్షిణ చెల్లిస్తానని పదేపదే అడుగుతుంటే గురుపత్నిని అడగమన్నాడు గురువు. ఆమెకు ఎప్పటి నుంచో పౌష్యమహారాణి కుండలాలు ధరించి వ్రతం చెయ్యాలని కోరిక. "ఆ కుండలాలు తీసుకురా" అన్నదామె.

ఉత్తంకుడు బయల్దేరాడు పౌష్య మహరాజు రాజధాని వేపు దారిలో ఓ దివ్యపురుషుడు ఎద్దునెక్కి ఎదురువచ్చాడు. అతడు ఆదేశించినట్లు గోమూత్ర, మయ భక్షణం చేసి పౌష్యమహరాజును సందర్శించినాడు. పౌష్య మహరాణి కనిపించలేదు. మహరాజు చెప్పినట్లు శుచుడై ఆమెను దర్శించి 'కుండలాలను' అడిగి తీసుకున్నాడు. తక్షకుడనే నాగరాజు కుండలాలను దొంగిలించాలని ఉత్సుకతతో ఉన్నాడన్నదామె. ఆమె చెప్పినట్లుగానే తక్షకుడు దొంగిలించాడు కుండలాలు. అతడిని వెంటాడి నాగలోకం పోయినాడు ఉదంకుడు. అక్కడ వింతలను చూసి, ఇంద్రాగ్నుల సాయంతో నాగులను భయపెట్టగా తక్షకుడు ఆ కుండలాలను తెచ్చి ఇచ్చాడు. వాటిని తీసుకువెళ్లి గురుపత్నికివ్వగా, గురుపత్ని వ్రతం పూర్తిచేసింది.

అప్పటి నుంచి ఉదంకుడికి నాగులపై కోపం ఏర్పడింది. తక్షశిలపై దండెత్తి విజయం పొంది జనమేజయుడు తిరిగి వచ్చాడు. అతడి వద్దకు వెళ్లి ఉత్తంకుడన్నాడు– "తక్షకుడనే నాగకుల దుర్మార్గుడు, ధర్మాత్ముడైన నీ తండ్రి పరీక్షిన్మహరాజును కాటువేసినాడు. నీ తండ్రిని రక్షించాలని వస్తున్న కశ్యపుడనే మంత్రవేత్తను వెనక్కి పంపివేసి నీ తండ్రి మరణానికి కారణమైనాడు. ఆ తక్షకాధముడిని సమూలంగా నాశనం చేయడానికి నీవు సర్పయాగం చెయ్యాలి".

అప్పటి వరకు తనతో ఎవ్వరూ ముచ్చటించని విషయాన్ని విన్న జనమేజయుడు నిశ్చేష్టుడై మంత్రుల వలన, ఉత్తంకుడి వలన తండ్రి మరణాన్ని ధృవపరచుకుని తక్షకుడిని, నాగవంశాన్ని నాశనం చేయడానికి సర్పయాగాన్ని చెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

# 4) పౌలోమ పర్వం (అధ్యాయాలు-9)

తక్షశిలను జయించి విజయోత్సాహంతో ఉన్న జనమేజయుడిని సర్పయాగం చేసి తక్షకాది నాగులను సంహరించ మన్నాడు ఉత్తంకుడు.

నైమిశారణ్యంలో మునులందరూ కూర్చుని ఉండగా కులపతి శౌనకుడి కోరికపై ఉత్తంకుడు భృగువంశం గురించి చెబుతున్నాడు–

వరుణుని యజ్ఞంలోని అగ్ని నుంచి బ్రహ్మదేవుడు భృగువును సృష్టించాడు. భృగువు కుమారుడు చ్యవనుడు. చ్యవనుని కొడుకు ప్రమతి. ప్రమతి–అప్సరస ఘృతాచిల కుమారుడు రురుడు. రురుడు, ప్రమద్వరల కుమారుడు శునకుడు శౌనక మహాముని ముత్తాత.

## భృగుని ఆశ్రమంలో పులోముడనే రాక్షసుడు

భృగుమహర్షి భార్య పులోమ. ఆమెకు అగ్నిహోత్ర సంరక్షణా బాధ్యతనప్పగించి భృగువు నదీ స్నానానికి వెళ్లాడు. పులోమ తల్లిదండ్రులు ఆమె చిన్నప్పుడు అల్లరి చేస్తుంటే– "ఓ రాక్షసా, ఈమెను ఎత్తుకుపో!" అనేవారు. వారి ఆశ్రమం చుట్టుపక్కల తిరిగే రాక్షసుడు ఆమెను తనకు ఇచ్చేసారని అనుకుని ఆమె ఒంటరిగా దొరికితే ఎత్తుకుపోవాలని నిశ్చయించుకున్నాడు. ఈలోగా ఆమెకు భృగువుతో వివాహమయ్యింది.

ఆమెను వెదుకుతూ వచ్చిన రాక్షసుడికి ఆమె ఒంటరిగా ఆరోజున అగ్నిహోత్రాన్ని సంరక్షిస్తూ కనబడింది.

అభ్యాగతుడిగా వచ్చిన రాక్షసుడిని ముని కుమారుడిగా పొరబాటుపడి ఆదరించిందా భృగుపత్ని.

పులోముడు జ్వలిస్తున్న అగ్నినడిగాడు– "ఈమె నేను ప్రేమించిన 'పులోమ' కదా!"

అగ్ని అన్నాడు– "ఈమె పులోమ. కాని ఈమె భృగుపత్ని. నేనసత్యమాడను".

పులోముడు వెంటనే పందిరూపం దాల్చి 'పులోమ'ను ఎత్తుకుని పోబోయినాడు.

## చ్యవనుడు జన్మించుట

ఆ రాక్షసుడు పందిరూపంలో కనిపించేసరికి పులోమ భయపడి ఆడపక్షిలా ఏడ్వసాగింది. వాడు ఆమెను ఎత్తుకుని ఆశ్రమం బయటకు పరిగెత్తాడు. ఆ ఒత్తిడికి గర్భస్థశిశువు జారి నేలపైపడి అగ్నిలా జ్వలించగా ఆ రాక్షసుడు కాలి నేలపై పడినాడు.

ఆ శిశువు నెత్తుకుని పులోమ తన మామగారైన బ్రహ్మవద్దకు వెళ్లింది. ఆమె వెళ్తున్న మార్గంలో రక్తధార, నీటిధార నదిగా ప్రవహించగా ఆ నదికి 'వధూసర' అని పేరుపెట్టాడు బ్రహ్మ. జారి నేలపై పడిన శిశువుకు చ్యవనుడని నామకరణం చేసాడు.

బ్రహ్మ ఆశీస్సులనంది ఆశ్రమానికి వచ్చింది పులోమ. అప్పుడే వచ్చి వధూసర నదిని, రాక్షసుడి కాలిన శరీరాన్ని చూస్తున్న భృగువుతో జరిగిన సంగతి చెప్పింది పులోమ.

భృగువుకు కోపం వచ్చింది– "అగ్నీ, నీవు ఈ దుష్టకార్యాన్ని చూస్తూ ఊరుకున్నావు. పైపెచ్చు ఆ రాక్షసుడికి నా భార్య పులోమ గురించి చెప్పావు. ఇన్నాళ్లూ నీవు పవిత్ర హవిస్సులను తింటూ పావకుడిగా, పరిశుద్ధుడిగా ఉన్నావు కదా, ఇప్పుడు సర్వభక్షకుడివై చరించు. శుచి, శుభ్రత, శుద్ధాశుద్ధాల తేడా తెలియకుండును గాక!" అని శపించాడు అగ్నిని భృగువు.

## అగ్ని కోపం

"నీవు సర్వభక్షకుడివికా!" అని భృగువు అనగానే అగ్నికి కోపం వచ్చింది.

"నేను దేవతలకు, పితృదేవతలకు నోరు వంటివాడిని. నీవు చాలా పొరపాటు చేసావు నన్ను శపించి. నేనూ నిన్ను శపించగలను. కాని నేనలా చెయ్యను" అని అన్నిరకాల అగ్నిక్రియల నుంచి తన రూపాన్ని ఉపసంహరించుకునే సరికి ముల్లోకాలు అల్లకల్లోలమయ్యాయి. బ్రహ్మ అన్నాడు–

"అగ్నీ! నీకు దివ్యరూపం ఉన్నది. నీ దిగువ భాగంలో అశుచిని, జ్వాలలలో శుచిభాగాల్ని దహించు. అంతేకాక నీవు దేనిని దహించినా నీకు మాలిన్యం అంటదు. నిత్య శుచివై వర్ధిల్లు" అన్నాడు బ్రహ్మ.

దానితో అగ్ని జ్వాలతో దగ్ధమైన ప్రతి వస్తువూ శుచిగా, శుద్ధంగా మారుతున్నది.

## రురు - ప్రమద్వర

చ్యవనుడి భార్య సుకన్య. చ్యవనుడు తపస్సు చేస్తుంటే అతడి చుట్టూ పుట్ట పెరిగింది. ఒకరోజున సుకన్య అనే యువరాణి ఆ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ పుట్టలో మిణుగురు పురుగుల్లా మెరుస్తూ కానవస్తున్న చ్యవనుడి కళ్లను కుతూహలంతో పుల్లతో పొడిచింది. సైనికులకు మూత్రపురీషాలు స్తంభించగా పుట్టను తవ్వి చూడగా కన్నీరు కారుస్తూ, శాంతంగానే ఉన్న చ్యవనుడు కనిపించాడు. తాను చేసిన తప్పుకు ప్రతిక్రియగా ఆమె చ్యవనుడిని వివాహం చేసుకున్నది. చ్యవనుడు-సుకన్యలకు జన్మించాడు ప్రమతి. ప్రమతికి ఘృతాచి అనే అప్సరసకు జన్మించినవాడు రురుడు.

విశ్వావసువు అనే గంధర్వుడు, మేనక అప్సరసకు కలిగిన ఆడపిల్ల ప్రమద్వర. ఆడపిల్ల పుట్టగానే ఆమెను స్థూలకేశుడనే ముని ఆశ్రమం దగ్గర వదిలి వెళ్లిపోయిందా కఠినాత్మురాలు మేనక (శకుంతలను వదిలేసినట్లు). స్థూలకేశు డామెను కణ్వుడు శకుంతలను పెంచినట్లు పెంచి పెద్దజేసినాడు.

ప్రమద్వరను ప్రమతి, ఘృతాచిల కుమారుడు రురుడు ప్రేమించాడు. ఇద్దరి తండ్రులు అంగీకరించారు. ఉత్తర ఫల్గుని నాడు వివాహం.

వివాహదినం ఇంకా కొద్దిరోజుల్లో ఉందనగా ప్రమద్వర తోటలో విహారం చేస్తూ, కాలప్రేరితురాలై పాముతోక తొక్కింది. పాము కాటువేయగా ఆ అందాలరాశి విగతజీవురాలయ్యింది. చుట్టుప్రక్కల ఆశ్రమాలలో ఉన్న తాపసులందరూ ఆమెను చూసారు. మంత్రాలు పఠించారు. రురుడు ఏడుస్తూ మొత్తుకుంటూ అడవిలో పిచ్చెక్కినట్లు తిరుగుతున్నాడు.

## ప్రమద్వరకు తన ఆయుస్సునిచ్చిన రురుడు

తాను ఎంతో గాఢంగా ప్రేమించిన ప్రమద్వర పాముకాటుతో చనిపోవడంతో శోకిస్తూ రురుడు అడవిలో తిరుగుతూ అనుకుంటున్నాడు- "నేనే గనక తపస్సు, దానం, బ్రహ్మచర్యాది వ్రతాలు నిష్కల్మషమైన భక్తితో చేస్తూ ఉంటే నా ప్రియురాలు జీవించును గాక!"

అప్పుడు దేవదూత కంఠం వినిపించింది- "భృగునందనా, రురూ, నీ ఆయుర్దాయంలో సగం ఇస్తే నీ ప్రియురాలు బ్రతుకుతుంది. దేవతలు అలా నిశ్చయించారు" అన్నాడు దేవదూత. అతడు విశ్వావసువు అనే గంధర్వుడు.

విశ్వావసువు, దేవదూత ఇద్దరూ కలిసి యమధర్మరాజును కలిసి అతడి అనుజ్ఞ పొందినారు. వెంటనే ప్రమద్వర అప్పుడే నిద్రలేచిన దానిలా మేలుకున్నది. అందరూ ఎంతో సంతోషంగా రురుడు-ప్రమద్వరల వివాహం జరిపించారు.

రురుడి మనసులో పాములపై కోపం పోలేదు. పెద్ద దుడ్డుకర్ర పట్టుకుని కనిపించిన పామునల్లా చంపుతూ పోతున్నాడతడు ఒక ఉద్యమంలా.

ఒకరోజున అడవిలో డుండుభ జాతికి చెందిన సర్పాన్ని చూసాడు. అది ముసలిపాము. కదలక మెదలక పడుకుని ఉన్నది. దానిని చంపేందుకు దుడ్డుకర్ర పైకెత్తినాడు రురుడు.

## రురుడు - డుండుభుల సంవాదం

డుండుభ పాము అన్నది- "మునీ! నన్నెందుకు చంపుతావు? నేను నీకేమి అపకారం చేయలేదే!"

రురుడు ఆశ్చర్యపోయాడు- "ఎవరు నీవు? సర్పానివా? లేక శాపం పొందిన మునివా? మాట్లాడుతున్నావు చక్కగా!"

డుండుభ సర్పము అన్నది- "రురూ! నాపేరు సహస్రపాదుడు. ఒక బ్రాహ్మణుడి శాపంతో సర్పంగా మారాను".

## అహింసా పరమో ధర్మః

డుండుభ సర్పం అన్నది- "నేనూ ఖగముడు అనే ముని మిత్రులం. ఒకరోజున అతడు ధ్యానంలో ఉన్నపుడు ఆటపట్టించాలని అతడి మెడలో గడ్డిపామును వేసాను. అతడు ఉలిక్కిపడి లేచి భయంతో మూర్ఛపోయి, తేరుకున్నాక కోపించాడు.

నేను నవ్వుతూ అన్నాను– "అది గడ్డిపాము, నిర్వీర్యమైనది".

అతడి కోపం మరింత పెరిగింది– "అవునా, నీవు కూడా నిర్వీర్యమైన గడ్డిపామువై, రురుడు అనే ప్రమతి పుత్రుడిని చూసేంతవరకు పాములా పడి ఉండు" అని శపించాడు.

రురుడు చూస్తూ ఉండగానే దుండుభ సర్పం మారింది సహస్రపాదుడిగా. అతడన్నాడు రురుడితో–

**అహింసా పరమోధర్మః సర్వ ప్రాణభృతాం వర**

**తస్మాత్ ప్రాణభృతః సర్వాన్ న హింస్యాద్ బ్రాహ్మణః క్వచిత్**

"అహింస యే పరమధర్మం" –అన్నాడు సహస్రపాదుడు.

## సర్పయాగం - ఆస్తీకుడు

సహస్రపాదుడు చెప్పాడు– "నీకు పాములపై కోపం వచ్చినట్లే ఉత్తంకుడికి కోపం వచ్చింది. అతడు జనమేజయ మహరాజును సర్పయాగం చేయ పురికొల్పినాడు. గొప్పదైన ఆస్తీక చరితాన్ని మునులు చెబుతుంటే విందువుగాని– నాగులను సర్వనాశనం చేయబోయిన సర్పయాగాన్ని ఆపినాడు ఆస్తీకుడు" అని పలికి సహస్రపాదుడు (దుండుభ సర్పం) అదృశ్యమైనాడు.

## 5) ఆస్తీక పర్వము (అధ్యాయాలు-46)

రురుడు తన ఇంటికి వెళ్లి తన తండ్రి ప్రమతిని సర్పయాగం– ఆస్తీకుడి వివరాల గురించి అడిగి తెలుసుకున్నాడు. ఆ కథనే ఉగ్రశ్రవసుడు మునులకు చెబుతున్నాడు– "జరత్కారువు అనే ముని ఎంతో దీక్షతో నిష్ఠగా తపస్సు చేస్తున్నాడు. అతడు బ్రహ్మచారి. ఒకరోజున అతడు– ఒకే ఒక వేరుతో ఎప్పుడు పడిపోతుందా అనిపించే చెట్టుకొమ్మకు తలక్రిందులుగా వేళ్లాడుతున్న తాతముత్తాతలను చూసాడు.

వాళ్లన్నారు– "మేము ఒక్కొక్క గ్రామంలో ఒక్కరోజు మాత్రమే ఉండే యాయవార బ్రాహ్మణులం. మా వంశంలో జరాత్కారువు అనే మూర్ఖుడు పెళ్లి చేసుకోకుండా వ్రతాలు, తపస్సు చేస్తున్నాడు. ఈ చెట్టు మా వంశవృక్షం. వేర్లను కొరికివేస్తున్న ఎలుక యముడు".

నిశ్చేష్టుడై జరత్కారువు అన్నాడు– "నేనే ఆ జరత్కారువును; మిమ్మల్ని ఈ దుస్థితి నుంచి తప్పించాలంటే నేనేమి చెయ్యాలి?"–

వాళ్లన్నారు– "నీవు వివాహం చేసుకోవాలి"

జరత్కారువు అన్నాడు– "మంచిది. అయితే నేను నా పేరుగల కన్యను మాత్రమే చేసుకుంటాను. అలా ఎవరైనా నాకు కన్యాదానం చేస్తారేమో చూస్తాను".

### జరత్కారుని వివాహం

నాగరాజు వాసుకి చెల్లెలి పేరు జరత్కారువు. ఆమెకు వివాహం కాలేదు. జరత్కారుడి విషయం తెలిసిన 'వాసుకి' ఆమెను జరత్కారునికిచ్చి వివాహం చేసాడు. ఎందుకంటే పూర్వకాలంలో నాగమాత అయిన కద్రువ తన కుమారులను శపించింది– "జనమేజయుడు చేయబోయే సర్పయాగంలో మీరు భస్మమయ్యెదరు గాక!"

శాపానికి విరుగుడు– జరత్కారువు దంపతులకు పుట్టే ఆస్తీకుడొక్కడే సర్పయాగాన్ని ఆపగలిగినవాడు. ఆస్తీకుడు జన్మించి భృగుమహర్షి కుమారుడైన చ్యవనుడి దగ్గర వేదవేదాంగాల నభ్యసించాడు. అనేక వ్రతాలు, పూజలు చేసి జరత్కారువు పితృదేవతలు స్వర్గానికి చేరేలా పుణ్యకార్యాలు చేసినాడు.

### కద్రువ - వినత

దక్షప్రజాపతి తన కుమార్తెలలో ఇద్దరు– కద్రువ–వినతిలను కశ్యప ప్రజాపతికి ఇచ్చి వివాహం చేసాడు. వారిద్దరిని వరం కోరుకొమ్మన్నాడు కశ్యప ప్రజాపతి.

దీర్ఘ శరీరం మహాబలం కలిగిన వేయిమంది కొడుకులు కావాలన్నది కద్రువ. కద్రువ పుత్రులకంటే బలమైన ఇద్దరు కుమారులు కావాలన్నది వినత.

కద్రువకు వేయిగుడ్లు, వినతకు రెండుగుడ్లు పుట్టాయి. వాటిని నేతికుండలలో పెట్టి అయిదువందల సంవత్సరాలు జాగ్రత్తగా సంరక్షించేసరికి కద్రువ గుడ్ల నుంచి వేయి సర్పాలు జనించాయి.

వినత గుడ్లలో మార్పు లేదు. అసూయతో వినత ఒక గుడ్డును పగలగొట్టేసరికి దానినుంచి సగం పూర్తిగా సగం అసంపూర్తిగా తయారైన దేహంతో అనూరుడు జన్మించి, తన తల్లి వేగిరపాటును దుయ్యబట్టినాడు– "నీ అసూయ వలన నేను ఇలా పుట్టాను, అందుకే నీవు నీ సవతికి దాసివై 500 ఏళ్లు కాలం గడుపు, 500 ఏళ్ల తరువాత రెండవ గుడ్డు నుంచి పుట్టే కుమారుడు నీకు దాస్య విముక్తి చేస్తాడు".

ఆ తరువాత కొద్దిరోజులకు వినత, కద్రువలు సముద్రతీరాన దూరంగా విహరిస్తున్న ఇంద్రుడి ఉచ్ఛైశ్రవాన్ని చూసారు. వినత అన్నది– ఇది పూర్తిగా తెల్లని గుర్రం. కద్రువ అన్నది– ఈ గుర్రం అంత తెల్లగానే ఉన్నది, కాని, తోక కాస్త నల్లగా ఉన్నది.

పందేలు కాసుకున్నారు– "ఓడిపోయినవాళ్లు దాసీగా పనిచెయ్యాలి" అని.

ఆ రాత్రి కద్రువ తన కుమారులను బతిమలాడింది– "వెళ్లి తెల్లగుర్రపు తోకకు వేలాడి నల్లగా కనిపిస్తే తాను పందెం నెగ్గుతాను" అన్నది. కద్రువ పుత్రులు ఒప్పుకోలేదు. ఆమెకు కోపం వచ్చింది– "భవిష్యత్తులో జరగబోయే జనమేజయ యాగంలో మంటలలో పడి చావండి" అని శపించింది.

భయపడిన కొద్దిమంది వెళ్లి తెల్లగుర్రం తోకకు వ్రేలాడినారు. తెల్లవారే వినత–కద్రువ తెల్లగుర్రాన్ని చూసారు. తోక నల్లగా ఉన్నది అక్కడక్కడా. కద్రువ గెలిచింది. వినత ఓడిపోయి దాసిగా మారింది.

## అమృత మధనం

మేరు పర్వతం మీద దేవతలంతా సమావేశమై అమృతాన్ని పొందాలని ఆలోచించారు. శ్రీమన్నారాయణుడు వారికి సలహా ఇచ్చాడు– "పాలసముద్రం చిలికితే ముందు ఔషధాలు, రత్నాలు లభిస్తాయి. ఆ తరువాత అమృతం వస్తుంది. ప్రయత్నించండి" అన్నాడు.

## మోహినీ పంపకాలు

విష్ణుదేవుని ఆజ్ఞతో అనంతుడైన ఆదిశేషుడు మందర పర్వతాన్ని ఎత్తి పాలసముద్రంలో ఉంచితే అది మునిగిపో సాగింది. దానితో ఆదికూర్మం పర్వతం అడుగున మట్టుగా ఉండింది. మందర పర్వతం కవ్వంగా, వాసుకి సర్పం తరితాడుగా, దేవదానవులు చెరొకపక్క తరిత్రాడు లాగేందుకు నిలబడినారు. తోక మాకెందుకని దానవులు వాసుకి తలవేపు, దేవతలు తోకవేపు పట్టుకున్నారు. సముద్ర మధనం ప్రారంభమయ్యింది.

అలా తరచగా తరచగా ముందుగా చంద్రుడు, లక్ష్మి, సురాదేవి (వారుణి), ఉచ్ఛైశ్రవము, కౌస్తుభరత్నం, కల్పవృక్షం, పారిజాతం, కామధేనువు, ఐరావతమనే తెల్లని ఏనుగు పుట్టాయి. అదేవిధంగా పుట్టిన కాలకూట విషాన్ని శివుడు లోకకళ్యాణార్థం మింగి గరళకంఠుడైనాడు. ఆఖరున అమృతం లభ్యమయ్యింది.

పంపకాల సమయంలో విష్ణుమూర్తి 'మోహిని'గా ప్రత్యక్షమై దానవులను మభ్యపెట్టి, వాళ్లు చూస్తూ ఉండగానే అమృతాన్ని దేవతలకు పంచిపెట్టినాడు. దైత్యులు గొడవపెట్టారు.

## దేవ దానవ యుద్ధం

దైత్య, దానవ, రాక్షసులేకమై దేవతలపై దండెత్త నిశ్చయించుకున్నారు. అప్పుడు మోహినీరూపంలో అమృతాన్ని పంచుతున్న విష్ణువుకు రాహువు అనే రాక్షసుడు తమమధ్య కూర్చున్న విషయాన్ని చెప్పగా సూర్యచంద్రులు, విష్ణువు తన చక్రాయుధంతో రాహువు మెడ తెగగొట్టినాడు. కంఠంలో అమృతం ఉండడంతో రాహువు తల సజీవంగా ఉండింది. రాహువు మొండెం భూమిపై పడగా పర్వతాలు, అడవులు, భూమి కంపించాయి.

రాహువు తల సూర్య, చంద్రులను మింగినపుడు గ్రహణాలు ఏర్పడతాయి.

తమను మోసం చేసిన దేవతలపై విరుచుకుపడ్డారు దానవులు. నరనారాయణులు కూడా యుద్ధంలో పాల్గొన్నారు. నారాయణుడి సుదర్శన చక్రం మంటలు గ్రక్కుతూ వస్తుంటే చూసి భయకంపితులైన దైత్య దానవులు భూమిలోకి, సముద్రంలోకి దూరి పారిపోయారు. దేవతలదే విజయం.

## కద్రువ శాపం

పాలసముద్ర మధన సమయంలో జనించిన తెల్లగుర్రం ఉచ్ఛైశ్రవం. కద్రువ పుత్రులలో కర్కోటకుడు తల్లి శాపానికి భయపడి ఉచ్ఛైశ్రవం తోకకు చుట్టుకుని నల్లగా కనిపించేట్లు చేసి తల్లిని గెలిపించాడు.

అయిదు వందల ఏళ్ల తరువాత రెండవ గుడ్డు పగలగొట్టుకుని బయటపడినాడు గరుడుడు. అతడి తేజస్సును చూసి అందరూ రెండవ సూర్యుడేమోనని భయపడినారు. బానిస కొడుకు బానిస కాబట్టి అతడు కూడా కద్రువకు బానిసగా, ఆమె కుమారులైన సర్పాలకు సేవకుడిగా పనిచేస్తున్నాడు.

ఇదిలా ఉండగా సూర్య చంద్రులను పట్టి అప్పుడప్పుడూ పీడిస్తున్నాడు రాహువు. అయినా తన బాధ దేవతలు పట్టించుకోవడం లేదని సూర్యుడికి కోపం వచ్చింది. అస్తాద్రి నుంచి అర్ధరాత్రి సమయంలో అధిక వేడిని పుట్టిస్తున్నాడు సూర్యుడు.

బ్రహ్మ ఆదేశంతో కశ్యప-వినతల కుమారుడైన అరుణుడిని సూర్య రథసారధిగా చేసారు. అతడి విశాలమైన శరీరం సూర్యుడి కాంతిని, వేడిని కాస్త అడ్డగించి లోకాలకు శుభాన్ని కలిగిస్తున్నది. సూర్యుడు కూడా కాస్త శాంతించాడు దేవతల వినతితో.

ఒకరోజున గరుడుడు తన సవతి సోదరులైన సర్పాలను వీపుపై ఎక్కించుకున్నాడు. వినత తన సవతిని మోస్తూండగా ఓ నిర్జన ద్వీపం వేపు వెళ్లారు. కుర్ర సర్పాలు ఇంకా పైకెగరమని గరుడుని ప్రోత్సహించి తీరా పైకెగిరినాక సూర్యుడి వేడిమికి స్పృహతప్పి నేలకూలినాయి. కద్రువ ఇంద్రుడిని ప్రార్థించగా అమృత వర్షాన్ని కురిపించి సర్పాలను సెదదీర్చి బ్రతికించాడు.

కద్రువ సూటిపోటి మాటలతో గరుడుడిని నిందించగా బాధపడిన గరుడుడు తన తల్లిని ఆమె దాస్యానికి కారణమడిగి తెలుసుకున్నాడు.

సర్పములన్నాయి- "మాకు ఆహారంగా అమృతాన్ని తీసుకురా! నీ తల్లికి దాస్యవిముక్తి కలుగుతుంది". సవతి తల్లి కద్రువ కూడా సరేనన్నది.

మాతృదాస్య విముక్తికై బయల్దేరినాడు వైనతేయుడు. దేవలోకం వెళ్లి గొప్ప కాపలాలో ఉన్న అమృత కలశాన్ని తేవడానికి కావలసిన బలం కోసం నిషాదుల్ని తిన్నాడు. సరిపోలేదు. పూర్వజన్మలో మునులుగా ఉన్న విభావసుడు, సుప్రతీకుడు అనే అన్నదమ్ములు ఉమ్మడి ధనం దగ్గర తగాదాపడి బద్ధశత్రువులైనారు. ఈ జన్మలో వారు పెద్ద ఏనుగు, తాబేలుగా జన్మించి ఒకే మడుగులో ఉంటూ కొట్లాడుకుంటున్నారు. ఆ గజ కచ్ఛపాలను ఎత్తుకుపోయి రోహిణము అనే పెద్ద మర్రిచెట్టు కొమ్మపై వాలినాడు, ఆ కొమ్మ తట్టుకోలేకపోయింది అతడి బరువును. అది విరుగుతున్నపుడు చూసాడు దానికి తలక్రిందులుగా వేలాడుతున్న వాలఖిల్యులనే మహామునులను. సూర్య కిరణాలను ఆహారంగా తీసుకుంటూ బ్రతికేవాళ్లను. కశ్యపుడి కుమారుడిగా అతడిని గుర్తించారు. అప్పుడా వైనతేయుడు గజ కచ్ఛపాలను కాలిగోళ్లతో, వటవృక్ష శాఖను ముక్కుతో పట్టుకుని ఎగుర్తుంటే- అధిక భారాన్ని మోసుకుంటూ ఎగుర్తున్నాడు కనుక 'గరుడుడు' అన్నారు. కశ్యపుడు అర్థించగా వాలఖిల్యులు వృక్షశాఖను వదలి హిమాలయ పర్వతాలకు వెళ్లిపోయారు. అప్పుడు గరుడుడు తండ్రి సలహాతో ఆ కొమ్మను గంధమాదన పర్వతానికి దూరంగా ఉన్న మంచు కొండలపై పడవేసి, ఆ కొండశిఖరంపై గజ కచ్ఛపాలను భుజించి సంతృప్తి చెందాడు.

ఆ మర్రికొమ్మ చుట్టుకొలత నూరు పశువుల చర్మపు తాడు అంత ఉన్నది. (వర్ధి అంటే ఒక పశువు చర్మాన్ని సన్నగా చీల్చి పొడుగాటి తాడుగా చేస్తే ఎంతదూరం వస్తుందో అంత పొడుగు అన్నమాట). (Dido - Bursa - Carthage Story).

కశ్యప ప్రజాపతి పుత్రకామేష్టి చేస్తున్నపుడు ఇంద్రుడు, వాలఖిల్యులు, మరికొందరు దేవతలు సమిధలు తెస్తున్నారు. ఇంద్రుడు తన బలానికి తగ్గట్టు పెద్ద కట్టెలమోపు తెస్తుంటే, అంగుష్ఠమాత్ర శరీరులైన వాలఖిల్యులు ఒక్కొక్కరు ఓ చిన్న కట్టెపుల్లను తెస్తుంటే ఇంద్రుడు వారిని చూసి ఎగతాళి చేసాడు. వాలఖిల్యులు కోపించి అన్నారు- "మా తపశ్శక్తిని వినత సంతానానికిస్తున్నాం. వాళ్లు నీకంటే బలం కలిగినవారగుదురు గాక!"

దానితో ఇంద్రుడు భయపడి కశ్యపుడిని శరణువేసినాడు. కశ్యపుడన్నాడు- "బ్రహ్మ ఆజ్ఞతో నీవు ముల్లోకాలకు ఇంద్రుడివైనావు. వినత కుమారులు పక్షులకు ఇంద్రులవుతారు. గుర్తుంచుకో, మునుల వాక్కు అనే ఆయుధం నీ వజ్రాయుధం కన్నా గొప్పది. నీ వజ్రాయుధం కూడా దధీచి ముని వెన్నెముక కాదా!"

మహా గజ కచ్ఛపాలను భుజించినాక గరుడుడు అమృతకలశ రక్షకుడైన భౌమనుడి (విశ్వకర్మ)తో రెండు ఘడియల పాటు యుద్ధం చేసి సంహరించాడు. ఆ ప్రదేశాన్ని తన రెక్కలల్లాల్లాడ్చి దుమ్ముతో కప్పివేయగా వాయుదేవుడు ఆ ధూళిని తొలగించాడు.

యక్ష, రాక్షస, సాధ్య, గంధర్వ, రుద్ర, వసు, ఆదిత్యులను ఓడించి, అమృత కలశం చుట్టు ఉన్న అగ్నులను 8100 ముఖాలతో నీటిని తెచ్చి పుక్కిలించి ఆర్పి, ప్రచండ వేగంతో తిరుగుతున్న చక్రం గుండా సూక్ష్మ రూపంతో ప్రవేశించి, రక్షణగా ఉన్న రెండు మహా సర్పాల కళ్లలో దుమ్ముకొట్టి వాటిని, చక్రయంత్రాన్ని ముక్కలు చేసి అమృత కలశం చేతిలో ఉన్నా తాగకుండా వస్తుంటే శ్రీమన్నారాయణుడతడిని గరుడధ్వజంగానూ, అమృతం తాగకుండానే జరామరణాలు లేకుండానూ దేవదేవుని వాహనంగానూ ఉండేట్లు వరాలు ఇచ్చినాడు.

అయినా అతడిని అడ్డగించాడు ఇంద్రుడు, విసిరాడు వజ్రాయుధాన్ని. దాని తాకిడికి రాలిన ఈకను చూపించి అన్నాడు గరుడుడు– "దధీచి వెన్నెముకతో తయారైనదీ వజ్రాయుధం. అందుకే కనీసం ఈక అయినా రాలనిచ్చాను".

అందమైన ఆ ఈకను చూసి జనులు గరుడుడిని 'సుపర్ణుడు' అని పిలిచారు.

ఇంద్రుడు, ఖగేంద్రుడి మధ్య స్నేహం ఏర్పడింది. గరుడుడన్నాడు– "నేను అమృత కలశాన్ని నా సవతితల్లి కద్రువకు, నా సవతి సోదరులు సర్పాలకు ఇస్తాను. దానితో నా మాతృమూర్తికి దాస్యవిముక్తి కలుగుతుంది. ఆ తరువాత అమృత కలశాన్ని నీవు అదృశ్యరూపంలో తీసుకుపోవచ్చు" అన్నాడు గరుడుడు.

కద్రువ, సర్పాలు చూస్తూ ఉండగానే గరుడుడు అమృత కలశాన్ని దర్భలపై ఉంచి, మాతృమూర్తి వినతకు దాస్య విముక్తి గావించి తనతో తీసుకువెళ్లిపోయినాడు. సర్పాలు, కద్రువ చూస్తూ ఉండగానే అదృశ్యరూపంలో ఇంద్రుడు అమృత కలశాన్ని తీసుకుపోయాడు, సర్పాలు బుసలు కొడ్తుండగానే. ఒకచుక్క అయినా దర్భలపై ఒలికి ఉండకపోతుందా అని సర్పాలు దర్భలను నాకినాయి. దర్భ అంచు కోసుకుని నాలుక చీలి ద్విజిహ్వులైనాయి సర్పాలు.

కద్రువ ఇచ్చిన శాపభయంతో శేషుడు (అనంతుడు) భూభారాన్ని మోస్తున్నాడు బ్రహ్మ వరంతో. వాసుకి సర్పకులాన్ని సమావేశపరచి అందరి సలహాలు విన్నాడు. ఏలాపుత్రుడు అన్నాడు– "విషనాగులమైన మనపై ఎవరికీ మంచి అభిప్రాయం లేదు. అంతేకాక మన కోపం లోకప్రసిద్ధం. తల్లి కద్రువ ఇచ్చిన శాపం అమోఘం. అయితే ఆ భయంకర యాగం జనమేజయుడి కాలంలో జరుగుతుంది. దానిని ఆపగలిగినది ఒకే పేరుగల భార్యాభర్తలు. యాయావర వంశపు జరత్కారుడు, నాగకులపు వాసుకి సోదరి జరాత్కారువులకు జన్మించే ఆస్తీకుడు సర్పయాగాన్ని ఆపగలుగుతాడు" అన్నాడు. జరత్కారుడంటే శరీరాన్ని కృశింపచేసుకున్నవాడు (జర–క్షీణత్వం, కారు–భయంకరం).

అనేక వందల, వేల సంవత్సరాలు గడిచాయి. దేవతలు, దానవుల మధ్య అనేక యుద్ధాలు జరిగాయి. కృతయుగం గడిచింది. రామ రావణ యుద్ధంతో త్రేతాయుగం గడిచింది. దశరాజయుద్ధం, ఆ తరువాత కురుక్షేత్ర యుద్ధం గడిచాయి.

మృతశిశువుగా పుట్టిన పరీక్షిత్తు శ్రీకృష్ణుని మహత్తుతో బ్రతికి అరవై ఏళ్లు హస్తినను పాలించాడు. ఒకరోజున అతడు వేటకు వెళ్లి దాహంతో బాధపడుతూ ధ్యానినిమగ్నుడై ఉన్న శమీక మునిని చూసి, తాను ప్రశ్నించినా ముని జవాబివ్వలేదని కోపంతో దగ్గర్లో చచ్చి పడిఉన్న పామును వింటికొనతో లేపి ముని మెడలో వేసి తన దారిన తాను పోయాడు.

కృశుడనే శిష్యుడు ఆ విషయాన్ని శమీకుని కుమారుడు శృంగికి చెప్పాడు. శృంగి కోపోద్రిక్తుడై– "ఈ అపచారం చేసిన పరీక్షిత్తు ఇప్పటి నుంచి ఏడురోజుల లోపున తక్షకుడి కాటుతో విషదగ్ధుడై మరణించును గాక!" అని శపించాడు.

ధ్యాన సమాధి నుంచి బయటకు వచ్చిన శమీక మునికి విషయం తెలిసి తన శిష్యుడు గౌరముఖుడి ద్వారా పరీక్షిన్మహరాజుకు వర్తమానం పంపినాడు. తన కుమారుడు శృంగిని మందలించాడు.

**క్రోధోహి ధర్మం హరతి యతీనాం దుఃఖ సంచితమ్**
**తతో ధర్మవిహీనానాం గతిరిష్టా న విద్యతే–**
**శమయవ యతీనాం హి క్షమిణాం సిద్ధి కారకః**
**క్షమావతామయం లోకః పరశ్చైవ క్షమావతామ్**

పాముకాటు వైద్యంలో నిపుణుడైన కాశ్యపుడు హస్తినాపురికి వస్తున్నపుడు అతడిని దారిలో కలిసాడు తక్షకుడు. ఇద్దరూ తమ విద్యల్ని ప్రదర్శించారు. తక్షకుడు కాటువేస్తే చెట్టు భస్మమై బూడిదరాశి మిగిలింది. కాశ్యపుడు తన మంత్రబలంతో

ఆ చెట్టును అంకుర దశ నుంచి చెట్టుదశకు తెచ్చి మునుపటిలా ఉండేట్లు చేసాడు. అంతేకాక పరీక్షిత్తు ఆయువు సమాప్తి అయ్యిందని గ్రహించి తక్షకుడిచ్చిన ధనాన్ని తీసుకుని తన ఊరు వెళ్లిపోయాడు.

తక్షకుడు తన వాళ్లైన నాగులను బ్రాహ్మణ కుమారులుగా మార్చి, వారు రాజుకు సమర్పించనున్న ఫలాలలో నల్లని క్రిమిగా దాక్కున్నాడు. ఏడు రోజులు గడిచాయని సంతోషంగా పరీక్షిన్మహరాజు, ఆ తాపసులందరు వెళ్లాక, అక్కడ ఉన్న తన మంత్రులు, స్నేహితులతో ఫలములారగించబోగా, అతడి చేతిలో ఉన్న ఫలంలోని నల్లని క్రిమి, మహాసర్పమై పరీక్షిత్తును కాటువేసింది. ఆ తక్షకుడి విషాగ్ని జ్వాలల్లో రాజున్న ఒంటిస్తంభం మేడ దగ్ధమైంది. రాజు చనిపోయాడు. అతడికి అంత్యక్రియలు జరిపించి అతడి పుత్రుడు ఇంకా శిశువుగానే ఉన్న జనమేజయుడికి పట్టం గట్టారు. అతడికి యుక్తవయసు రాగా కాశీరాజు సువర్ణ కుమార్తె వపుష్టమ నిచ్చి వివాహం చేసినారు.

## జరత్కారుడు-జరత్కారువు

"ఈమెను పెళ్లి చేసుకోవాలంటే ఈ నిబంధనలు పాటించాలి– 1) ఈమె పోషణాభారం నేను వహించను; 2) ఈమె నాకు ఇష్టంలేని పని చేయకూడదు. చేస్తే ఆమెను విడిచిపోతాను నేను" అన్నాడు జరత్కారువు.

వాసుకి అన్నాడు– "మాకిష్టమే!"

జరత్కారువు అన్నది– "నాకిష్టమే!"

వివాహమయ్యింది.

**తథైవ సా చ భర్తారం దుఃఖ శీలముపాచరత్**

**ఉపాయైః శ్వేత కాకీ యైః ప్రియకామా యశస్వినీ**

పెంపుడు కుక్కవలే జాగ్రత్తగా, లేడివలె భయభయంగా, కాకివలె ఇంగితజ్ఞానంతో భర్తకు ఇష్టంగా వ్యవహరిస్తున్నది.

ఆమె గర్భవతి అయ్యింది. శుక్లపక్ష చంద్రుడిలా ఆమె గర్భస్థశిశువు క్రమక్రమంగా పెరుగుతున్నాడు.

ఒకరోజున జరత్కారుడు అలసినవాడై తన భార్య జరత్కారువు ఒడిలో తల ఉంచి నిద్రపోతున్నాడు. సూర్యాస్తమయం కావస్తున్నది. సంధ్యాసమయంలో సూర్యుడికి అర్ఘ్యమివ్వాలి. లేకుంటే ధర్మలోపం. భర్తను లేపితే కోపిస్తాడేమో! అనిఆలోచించి ఆమె ధర్మలోపం కారాదని, నిద్రలేపకపోతే ఎందుకు నిద్ర లేపలేదని అంటాడేమోనని భయపడి అతడిని నిద్ర లేపింది.

దానికే కోపించి జరత్కారుడు ఆమెను వదిలి వెళ్లిపోతూ– "నీవు దుఃఖించకు. నీకుదయించబోయే పుత్రుడు నాగకుల రక్షకుడవుతాడు 'ఆస్తీకుడు' అతడు.

అందువలన వాసుకి తన చెల్లెలికి పుట్టిన పిల్లవాడికి ఆస్తీకుడు అని పేరు పెట్టాడు.

## సర్పయాగం

కాశ్యపుడనే మంత్రవేత్త తక్షక నాగు భస్మం చేస్తానన్న చెట్టును చూసాడు. ఆ చెట్టుపై ఆకుల గుబురు మధ్య ఓ బ్రాహ్మణుడున్నాడు. తక్షకుడి విషాగ్ని జ్వాలలలో అతడు కూడా కాలి బూడిదైనాడు చెట్టుతోబాటు. కాశ్యపుడి మంత్ర ప్రభావంతో చెట్టు, చెట్టుపైనున్న బ్రాహ్మణుడు యధావిధిగా బ్రదికారు. ఆ బ్రాహ్మణుడు చూసాడు కాశ్యపుడికి అడిగినంత బంగారాన్నిచ్చి తక్షకుడు పంపివేయడం. అతడు ఆ విషయాన్ని తన ఊరి బ్రాహ్మణులకు చెప్పాడు. ఆ విషయం అందరికి తెలిసింది.

మంత్రులాసంగతి చెప్పగానే జనమేజయ మహరాజన్నాడు– "ఈ నాగకులం దుర్మార్గమైనది. వీరిని తుదముట్టించ డానికి ధర్మసమ్మతమైన యాగమేదైనా ఉంటే తెలియజేయండి" అన్నాడు తన రాజ్యంలోని మంత్రవేత్తలయిన బ్రాహ్మణులతో. వాళ్లు సర్పయాగాన్ని చేద్దామన్నారు.

ఆ స్థలాన్ని, వాస్తు మండపాన్ని చూసిన ఒక శిల్పి దానిలోని దోషాన్ని పసిగట్టి "ఈ యాగం అసంపూర్తిగా ముగుస్తుంద"న్నాడు. దానితో రాజు అపరిచితులెవరినీ తన అనుమతి లేకుండా యజ్ఞశాల వేపు రానివ్వవద్దని ఆజ్ఞలు జారీచేసాడు.

సర్పయాగం ప్రారంభమయ్యింది. రంగురంగుల సర్పాలు, చిన్నాపెద్దా పాములు హోమాగ్నిలో పడి కాలిపోతున్నాయి. లక్షలు, కోట్లు నాగులు భస్మమైపోతున్నారు.

అప్పుడు ఆస్తీకుడు హుటాహుటిన యజ్ఞశాలకు చేరుకుని స్తోత్రపాఠాలు చదివాడు జనమేజయుని కీర్తిస్తూ. జనమేజయుడు సంతోషించి వరం కోరుకొమ్మన్నాడు.

అప్పటికే మంత్రవేత్తలు తక్షకుడిని పిలుస్తున్నారు. అతడేమో ఇంద్రుడి మిత్రుడు గనుక అతడి ఉత్తరీయంలో దాక్కున్నాడు.

**'అథో మహేంద్రః స్వయమాజగామ'**

ఇంద్రుడు తప్పనిసరి పరిస్థితుల్లో తక్షకుడిని వదిలాడు.

తక్షకుడు గింగిరాలు తిరుగుతూ హోమాగ్నిలో పడబోతున్నపుడు ఆస్తీకుడు తన వరమడిగాడు– "సర్పయాగాన్ని ఆపుజేయుము" అని జనమేజయుడిని.

సర్పయాగం ఆగింది. తక్షకుడు బ్రదికాడు. వాసుకి, తక్షక, ఐరావత, కౌరవ్య, ధృతరాష్ట్ర వంశపు నాగులు అనేకమంది ఈ సర్పయాగంలో మరణించారు.

అయినా జనమేజయుడి మాట వలన, ఆస్తీకుడి బోధ వలన నాగులు రక్షింపబడినారు.

అసితుడు, ఆర్తిమంతుడు, సునీధుడు, జరత్కారుడు పేర్లను స్మరించిన వారికి నాగులు అపకారం చెయ్యరు.

## 6) అంశావతరణ పర్వము (అధ్యాయాలు-6)

**మనః సాగర సంభూతాం మహర్షేర్భావి తాత్మనః**
**కథ యస్వ సతాం శ్రేష్ఠ సర్వరత్న మయూమిమామ్**

సముద్రంలానే ఈ కథ కూడా రత్నగర్భ.

వేదవ్యాసుడు జనమేజయుని సభలోకి వచ్చి రాజు, సభికులతో పూజింపబడినవాడై ఉండగా జనమేజయుడడిగాడు

**కరూణాం పాండవానాం చ భవాన్ ప్రత్యక్ష దర్శివాన్**
**తేషాం చరితమిచ్ఛామి కథ్యమానం త్వయా ద్విజ–**

నా పూర్వీకుల కథను చెప్పుము తండ్రీ!

వ్యాసుడు ఆ కథను చెప్పే బాధ్యతను తన శిష్యుడైన వైశంపాయనుడికి అప్పగించినాడు.

వైశంపాయనుడు మహాభారత కథను సంక్షిప్తంగా చెప్పి అన్నాడు–

**ధర్మేచ అర్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్**

### ఉపరిచర వసువు

మహా నిష్ఠాగరిష్ఠుడు, ధర్మాన్ని ఆచరించేవాడు, తపోనిష్ఠలో ఉన్న వసువు తనకు సమానుడవుతాడని ఇంద్రుడు, ఇతర దేవతలతో కలిసి ఉపరిచర వసువుతో తపస్సు మాన్పించి అతడికి చేది రాజ్యాన్ని, స్ఫటిక విమానాన్ని, వాడని పద్మాల వైజయంతిమాలను (శత్రువుల ఆయుధాల నుండి రక్షిస్తుంది), వేణుయష్టిని (కోరికలను తీరుస్తుంది, మంచివారిని రక్షిస్తుంది) ఇవ్వగా ఆ రాజు వేణుయష్టి (వెదురుకర్ర)ని భూమిమీద ప్రతిష్ఠించి పూజించాడు మహేంద్రుని. అతడు సంతుష్టుడై ఆ పూజను హంసరూపంలో స్వీకరించాడు. ఈ ఆచారాన్ని తదుపరి కాలంలో రాజులందరూ పాటించారు.

వసువుకు అయిదుగురు కుమారులు– 1) బృహద్రథుడు (మగధ రాజు), 2) ప్రత్యగ్రహుడు, 3) కుశాంబుడు (మణివాహనుడు), 4) మావేల్లుడు, 5) యదువు.

వసువు ఎప్పుడూ తన విమానంలో ఆకాశంలో సంచరిస్తూ ఉండే వాడు కనుక అతడి పేరు ఉపరిచర వసువుగా స్థిరపడింది.

చేది రాజ్యంలో ప్రవహించే శుక్తిమతి అనే ఉపనదిని కోలాహలం అనే కొండ అడ్డగించగా వారికి గిరిక అనే కుమార్తె, వసుపదుడనే పిల్లలు కలిగారు.

ఉపరిచరవసువు తన కాలితో కోలాహలుడిని తన్ని శుక్తిమతిని అతడి నిర్బంధం నుంచి విడిపించాడు. అందుకు కృతజ్ఞతగా శుక్తిమతి తన పిల్లలను ఉపరిచర వసువుకు ఇచ్చింది. గిరికను వివాహం చేసుకుని, వసుపదుడిని తన సేనాధిపతిగా నియమించాడు ఉపరిచర వసువు.

ఒకరోజు తండ్రి ఆనతితో వేటకు వెళ్లిన ఉపరిచర వసువు ఊహల్లో ఋతుమతియైన గిరిక మెదిలి, వీర్యపతనం కాగా వీర్యాన్ని ఆకు దోనెలో పెట్టి తన పెంపుడు డేగకిచ్చి గిరిక వద్దకు పంపినాడు ఉపరిచర వసువు. దారిలో మరో డేగ దానిని వెంబడించగా రెండింటి మధ్య యుద్ధం జరిగి వీర్యం జారి యమునానదిలో పడింది. దానిని స్వీకరించింది చేపరూపంలో ఉన్న అద్రిక అనే శాపగ్రస్త అప్సరస. కొన్నాళ్లకు ఆ చేప జాలరులకు చిక్కింది. దాని పొట్ట నుంచి ఇద్దరు పిల్లలు– ఆడపిల్ల, మగపిల్లవాడు బయటపడినారు. ఆడపిల్లను దాశరాజు, మగపిల్లవాడిని వసువు పెంచినారు. మగపిల్లవాడు పెద్దవాడై మత్స్యరాజైనాడు. ఆడపిల్ల మత్స్యగంధి–సత్యవతిగా పెరిగింది. యమునా నదిలో నావ నడుపుతున్న సత్యవతిని చూసాడు వశిష్ఠుని కుమారుడు శక్తి కుమారుడైన పరాశరుడు.

ఆమె శరీరాన్ని సుగంధమయం గావించి, ఆమెకు కన్యగా ఉండే వరమిచ్చి ఆమెతో సంగమించాడు ఆ ముని. వారికి పుట్టిన కుమారుడు నల్లగా ఉండి యమునా నదీ ద్వీపంలో పుట్టినవాడు కనుక కృష్ణద్వైపాయనుడు అని పిలువ బడినాడు. సత్యవతి చేపలవాసన పోయి యోజనగంధిగా పిలువబడింది.

కృష్ణద్వైపాయనుడు వేదాలను విభజించి విస్తరింపజేసి వేదవ్యాసుడిగా పేరు పొందినాడు.

సత్యవతిని శంతనుడు వివాహం చేసుకున్నాడు. శంతనుడికి అంతకు ముందే గంగ వలన అష్టవసువులు జన్మించారు ఒకరి తరువాత ఒకరు. పుట్టిన వారిని పుట్టినట్లే నదిలో పడవేసింది ఆమె. చివరగా ప్రభాసుడు మిగిలాడు. అతడు దేవవ్రతుడనే పేరుతో అన్ని విద్యలు నేర్చినవాడై, సత్యవతీ సంతానానికి రాజ్యార్హత కోసం తాను రాజ్యాన్ని కోరనని, వివాహం చేసుకోనని, బ్రహ్మచారిగా ఉంటానని ప్రతిజ్ఞ చేసి భీష్ముడైనాడు.

సత్యవతి–శంతనులకు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు జన్మించారు. చిత్రాంగదుడు తన పేరుగల గంధర్వుడు చిత్రాంగదుడితో యుద్ధం చేసి మరణించాడు. విచిత్రవీర్యుడికి యుక్త వయస్సు రాగానే భీష్ముడు, కాశీరాజ కుమార్తెలకు స్వయంవరం ప్రకటించబడిందని తెలిసి వెళ్లి అక్కడున్న రాజులు అందరినీ ఓడించి కాశీరాజ కుమార్తెలైన అంబ, అంబిక, అంబాలికలను తనతో తీసుకువచ్చాడు. అంబ అంతకుముందే సాల్వుడు అనే రాజును ప్రేమించింది. అతడినే స్వయంవరంలో వరిద్దామనుకున్నది. ఆ మాట చెప్పగానే ఆమెను సగౌరవంగా సాల్వుడి దగ్గరకు పంపినాడు భీష్ముడు. అంబిక, అంబాలికలను విచిత్రవీర్యుడికిచ్చి వివాహం చేసినాడు.

సాల్వుడి దగ్గరకు వెళ్లిన అంబను సాల్వుడు తిరస్కరించాడు. వెనక్కి తిరిగివచ్చిన అంబను భీష్ముడు తిరస్కరించాడు. రెంటికీ చెడి అంబ అడవికి పోయి తపస్సు చేసింది. ఆమెకు సాయం చేస్తానని వచ్చిన పరశురాముడు తనకు గురువై నప్పటికీ ఒప్పుకోలేదు భీష్ముడు. ఇద్దరి మధ్య గొప్ప యుద్ధం జరిగింది. పరశురాముడు ఓడిపోయి తప్పుకున్నాడు. అంబ తపస్సు చేసి మరుసటి జన్మలో ద్రుపద మహరాజుకు శిఖండినిగా జన్మించింది.

విచిత్రవీర్యుడు వ్యాధిగ్రస్తుడై మరణించగా, సత్యవతి ఆజ్ఞతో కృష్ణద్వైపాయనుడు అంబికతో కలిసి ధృతరాష్ట్రుడిని, అంబాలికతో పాండురాజును, అంబిక దాసి పరిశ్రమకు విదురుడికి జన్మనిచ్చాడు. అణిమాండవ్యుడనే ముని శాపంతో దాసీపుత్రుడై శూద్రుడై జన్మించాడు ధర్ముడు విదురుడిగా.

మునివంటి సంజయుడు సూతుడిగా గవల్గణునికి జన్మించాడు. కుంతీభోజుడికి పెంపుడు కూతురైన కుంతి (శూరసేనుడు–మారిషల పుత్రిక)కి దుర్వాసుడి వర ప్రభావంతో సూర్యుడి వలన వసుసేనుడనే కర్ణుడు సహజ కవచ కుండలాలతో జన్మించాడు.

**అనుగ్రహార్థం లోకానాం విష్ణుర్లోక నమస్కృతః**
**వసుదేవాత్తు దేవక్యాం ప్రాదుర్భూతో మహాయశాః**

విష్ణుమూర్తి అంశతో వసుదేవ–దేవకిదేవీలకు శ్రీకృష్ణుడు, వసుదేవ–రోహిణిలకు బలరాముడు, సుభద్ర జన్మించారు.

నారాయణుని అనుచరులుగా సత్యకునికి సాత్యకి, హృదికునికి కృతవర్మ జన్మించారు.

భరద్వాజ మహర్షి వీర్యాన్ని ద్రోణమునందుంచగా ద్రోణుడు, గౌతమ గోత్రీయుడైన శరద్వంతుని వీర్యం రెల్లుపొద లందు పడగా కవలలు జన్మించి, శంతనుని కృపతో కృపుడు, కృపిగా పెరిగారు. ద్రోణుడు-కృపిని వివాహమాడగా వారికి అశ్వత్థామ పుట్టినాడు.

పాంచాల రాజైన వృషతుడికి ద్రుపదుడు, ద్రుపదుడికి యజ్ఞవాటిక యందు అగ్నిసంభూతులైన ధృష్టద్యుమ్నుడు, తేజోవతి, శుభస్వరూప అయిన ద్రౌపది జన్మించారు.

ప్రహ్లాదుని శిష్యుడు నగ్నజిత్తుకు గాంధార రాజైన సుబలుడు జన్మించాడు. అతడి కుమార్తె గాంధారి, కుమారులు శకునితో కలిపి నూరుగురు.

గాంధారిని ధృతరాష్ట్రుడికిచ్చారు. వారికి కౌరవులు నూరుగురు కుమారులు, దుస్సల కుమార్తె.

పాండురాజుకు కుంతి వలన నియోగపద్ధతిలో ధర్మజ, భీమ, అర్జునులు; మరో భార్య మాద్రికి నకుల సహదేవులు జన్మించారు.

ధృతరాష్ట్రుడికి వైశ్యపత్ని యందు యుయుత్సుడు కరణుడిగా జన్మించాడు (క్షత్రియ పురుషుడు, వైశ్యస్త్రీ సంతానం= కరణుడు).

భీముడికి హిడింబ వలన ఘటోత్కచుడు, అర్జునుడికి సుభద్ర వలన అభిమన్యుడు, ద్రౌపదికి పాండవుల వలన ఉపపాండవులు జన్మించారు.

కౌరవ పాండవ యుద్ధం తరువాత అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్ర ప్రభావంతో మృతశిశువుగా పుట్టిన పరీక్షిత్తు శ్రీకృష్ణుని కరుణతో బ్రదికినాడు. అరవై ఏళ్లు రాజ్యమేలి తక్షకుడి కాటుతో కన్నుమూసినాడు. ఆ పరీక్షిత్తు కుమారుడే జనమేజయ మహరాజు.

జనమేజయ మహరాజుకు వివరిస్తున్నాడు వ్యాసుడు గ్రంథస్థం చేసిన వంశ చరిత్రను, వ్యాసుని శిష్యుడు వైశంపాయనుడు.

తొలినాళ్లలో మానవులందరూ బ్రాహ్మణులే. కామ ప్రవృత్తి ఉండేది కాదు. ఋతుకాలంలో మాత్రమే భార్యలతో సంగమించేవారు. దానివలన నిష్ఠాగరిష్ఠులు, ధర్మాచరణ గల సంతానం జన్మించేది.

కాలం గడిచింది. సంపదలు పోగుపడుతున్నాయి. ఆహారపుటలవాట్లలో మార్పు వచ్చి కామం ప్రధాన ధర్మమైంది. గణనాయకులు భుజబలులు గణరక్షకులై క్షత్రియవంశమేర్పడింది.

కామప్రవృత్తితో చరించడంతో ధర్మం వెనకడుగు వేయగా అర్థకామాల ఆసక్తితో క్షత్రియకులం అహంకార పూరితమై బ్రాహ్మణులను ధిక్కరించగా, పరశురాముడు 21 సార్లు దండెత్తి క్షత్రియ మేధం చేసినాడు.

క్షత్రియ కాంతలకు బ్రాహ్మణ మునులకు సంతానం కలిగి గొప్ప రాజులు జన్మించి క్షితినేలినారు. కాలం గడిచినకొద్దీ అధర్మం పెరిగి కామేచ్ఛ పెరిగి క్షత్రియ కాంతలకు అసురులు జన్మించారు. ఆదిత్యులచే ఓడింపబడిన దైత్యులు భూలోకం చేరినారు. అదే విధంగా దానవులు, దైత్యులు, అసురులు భూమిపైనున్న అన్ని జీవులలోనూ చేరి మానవులను హింసిస్తూ భూభారాన్ని ఎక్కువ చేసినారు.

బ్రహ్మను శరణు వేడింది భూమి. భూభారాన్ని తగ్గించమని కోరింది. అప్పుడు దేవతల అంశలతో మానవులై జన్మించేందుకు శ్రీహరి అనుమతినిచ్చినాడు దేవతలకు.,

## 7) సంభవ పర్వము (అధ్యాయాలు-75)

బ్రహ్మ మానసపుత్రులు- మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు

బ్రహ్మకుమారుడు- దక్షుడు;

మరీచి కుమారుడు- కశ్యపుడు

దక్షుని కుమార్తెలు- పదముగ్గురు- అదితి, దితి, దనువు, కాల, దనాయువు, సింహిక, క్రోధ, ప్రాధ, విశ్వ, వినత, కపిల, ముని, కద్రువ - వీరిని కశ్యపునికిచ్చి వివాహం చేసినాడు.

## కశ్యపుని సంతానం

**1) అదితి :** ఆదిత్యులు (12)– ధాత, మిత్రుడు, ఆర్యముడు, శక్రుడు, వరుణుడు, అంశుడు, భగుడు, వివస్వంతుడు, పూష, సవిత, త్వష్ట, విష్ణువు.

**2) దితి :** హిరణ్యకశిపుడు : ఇతడికి అయిదుగురు పుత్రులు– ప్రహ్లాద, సంహ్లాద, అనుహ్లాద, శిబి, బాష్కలుడు. ప్రహ్రాదుని కుమారులు విరోచనుడు, కుంభుడు, నికుంభుడు; విరోచనుని కుమారుడు బలి; బలి కుమారుడు బాణుడు. బాణుడు రుద్రుని అనుచరుడు. మహాకాలుడిగా ప్రసిద్ధుడు.

**3) దనువు (34) :** దానవులు– వీరి వంశాలలో పదిమంది దానవులత్యంత ప్రసిద్ధులు.

**4) సింహిక :** రాహువు, సుచంద్రుడు, చంద్రహర్త, చంద్రప్రమర్దనుడు.

**5) క్రోధ (క్రూర) :** క్రూరకర్ములు, క్రోధవశులు

**6) దనాయువు :** విక్షరుడు, బలుడు, వీరుడు, వృత్రుడు

**7) కాల :** కాలకేయులు, వినాశనుడు, క్రోధుడు, క్రోధహంత, క్రోధశత్రువు

**8) వినత :** వైనతేయులు– అనూరుడు, గరుడుడు

**9) కద్రువ :** శేషుడు, అనంతుడు, వాసుకి, తక్షకుడు, కూర్ముడు, కులికుడు

**10) ముని (14) :** దేవగంధర్వులు

**11) ప్రాధ :** ఎనిమిదిమంది పుత్రికలు, పదిమంది పుత్రులు, అప్సరసలు, అతిబాహువు, హాహా, హూహూ, తుంబురుడు.

**12) కపిల :** అమృతం, బ్రాహ్మణులు, గోవులు, గంధర్వులు, అప్సర కన్యలు

**13) విశ్వ :** అనేకమంది పుత్రులు, పుత్రికలు

**బ్రహ్మమానస పుత్రుడు– స్థాణువు :** స్థాణువు కుమారులు ఏకాదశ రుద్రులు– మృగవ్యాధుడు, సర్పుడు, నిరృతి, అజైకపాదుడు, అహిర్బుధ్న్యుడు, పినాకి, దహనుడు, ఈశ్వరుడు, కపాలి, స్థాణువు, భవుడు.

**బ్రహ్మమానస పుత్రులు–** అత్రి, అంగిరసుడు, మరీచి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు.

**అంగిరసుడు:** బృహస్పతి, ఉతథ్యుడు, సంవర్తకుడు

**పులస్త్యుడు :** రాక్షసులు, యక్షులు, వానరులు, కిన్నరులు

**పులహుడు :** శరభ, సింహ, వ్యాఘ్ర, ఋక్ష, ఈహామృగ, కింపురుషులు

**క్రతువు:** వాలఖిల్యులు

**బ్రహ్మ కుడిచేతి బ్రొటనవ్రేలు :** దక్షుడు

**బ్రహ్మ ఎడమచేతి బొటనవ్రేలు :** దక్షకన్య (ధరణి)

వీరిద్దరికి పుట్టిన 50 మంది కన్యలలో పదిమందిని ధర్మునికి, 27 మందిని చంద్రునికి, కశ్యపునికి 13 మందిని ఇచ్చినాడు.

**ధర్మద్వారములు (10) :** కీర్తి, లక్ష్మి, ధృతి, మేధ, పుష్టి, శ్రద్ధ, క్రియ, బుద్ధి, లజ్జ, మతి (ధర్ముని భార్యలు–దక్షకుమార్తెలు)

27 నక్షత్రములు – కాల సంచాలకులు

బ్రహ్మ వక్షస్థలం నుంచి పుట్టినవాడు ధర్ముడు.

**ధర్ముడి కుమారులు:** అష్టవసువులు– ధరుడు, ధ్రువుడు, సోముడు, అహస్సు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు.

**ధర్ముడి భార్యలు :** 1) ధూమ్ర - ఈమె పుత్రులు ధరుడు, ధ్రువుడు; 2) మనస్విని కి సోముడు (చంద్రుడు); 3) రతకు అహస్సు; 4) శ్వాసకు అనిలుడు; 5) శాండిల్యకు హుతాశనుడు (అనలుడు); 6) ప్రభాతకు ప్రత్యూషుడు, ప్రభాసుడు కుమారులు.

ధరునికి ద్రవిణుడు, హుతహవ్యవముడు; ధ్రువునికి కాలుడు; చంద్రుడు (సోముడు)-మనోహరకు వర్చసుడు, శిరుడు, ప్రాణుడు, రమణుడు.

అహస్సుకు జ్యోతిస్సు, శముడు, శాంతుడు, ముని; అనలుడు (అగ్ని)కి స్కందుడు, శాఖుడు, విశాఖుడు, నైగమేయుడు; శ్వసనుడు లేదా అనిలుడికి భార్య శివ వలన మనోజవుడు, అవిజ్ఞాతగతి;

ప్రత్యూషుని కుమారుడు దేవలుడు;

అంగిరసుని కుమారుడు బృహస్పతి. బృహస్పతి సోదరి ప్రభాసుడి భార్య.

ధర్ముడికి కుమారులు శముడు, కాముడు, హర్షుడు. శముని భార్య ప్రాప్తి, కాముడి భార్య రతి; హర్షుని భార్య నంద.

**త్వష్ట కుమార్తె సంజ్ఞ :** ఈమె సూర్యుడి భార్య. సంజ్ఞ ఆడగుర్రంగా ఉన్నపుడు అశ్వినీదేవతలకు జన్మనిచ్చింది.

అదితికి పన్నెండు (12) మంది కుమారులు. ఇంద్రుడు విష్ణువు (ఉపేంద్రుడు) వారిలో ముఖ్యులు - ఆదిత్యులు వీరు.

బ్రహ్మ హృదయం నుంచి పుట్టినవాడు భృగువు. భృగువు కుమారుడు కవి; కవి పుత్రుడు శుక్రుడు గ్రహరూపాన సంచరిస్తాడు. ఇతడు రాక్షసుల గురువు.

బ్రహ్మమానసపుత్రుడు అంగిరసుడి కుమారుడు బృహస్పతి. ఇతడు దేవతల గురువు. ఇతడికీ గ్రహరూపం ఉన్నది.

భృగువు పులోమల కుమారుడు చ్యవనుడు. చ్యవనుడి వలన సూర్య-సంజ్ఞల కుమారులైన అశ్వనీదేవతలకు హోమభాగం దక్కింది.

మనువు కుమార్తె ఆరుషి. ఈమె చ్యవనుడి భార్య. ఆమె తొడలో పెరిగాడు ఓ పుత్రుడు. ఊరువు నుంచి పుట్టి ఔర్వుడైనాడు. ఔర్వుని కుమారుడు ఋచీకుడు. ఋచీకుని కొడుకు జమదగ్ని. జమదగ్ని కుమారుడు పరశురాముడు.

ఔర్వుడికి నూరుగురు పుత్రులు. వారికి వేయిమంది కొడుకులు కలిగి విశ్వమంతా విస్తరించారు.

బ్రహ్మ కుమారులు ధాత, విధాత. వారి సోదరి లక్ష్మి.

వరుణుడి భార్య జ్యేష్ఠ- బలుడు, సుర వీరి సంతానం.

అధర్ముడి భార్య నిర్బతి- భయ, మహాభయ, మృత్యువు వీరి పుత్రులు

తామ్రకు- కాకి, శ్యేని, భాసి, ధృతరాష్ట్రి, శుకి పుత్రికలు. కాకికి ఉలూకాలు, కాకులు; శ్యేనికి డేగలు; భాసికి మృగాలు, గ్రద్దలు; ధృతరాష్ట్రికి హంసలు, కలహంసలు, చక్రవాకాలు; శుకి- చిలుకలకు జన్మనిచ్చాయి.

క్రోధవశకు మృగి (మృగాలు), మృగమంద (ఎలుగుబంట్లు, చమరీ మృగాలు), హరి (గుర్రాలు, వానరాలు, కొండముచ్చులు), భద్రమనస్విని (ఐరావతం); మాతంగి (ఏనుగులు); శ్వేత (తెల్లని దిగ్గజాలు); శార్దూలి (సింహాలు, వ్యాఘ్రాలు); సురభికి గంధర్వి (గుర్రాలు), రోహిణికి విమల, అనలలు జన్మించారు. అనలకు పిండఫలాలు గల ఏడువృక్షాలు- ఖర్జూర, తాళ, హింతాలము, తాలి, ఖర్జూరిక, గువాకము నారికేళము. సురసకు కంకపక్షి పుట్టింది.

అరుణుని భార్య శ్యేని- వీరికి పుత్రులు జటాయువు, సంపాతి. సురస నాగుల తల్లి; కద్రువ సర్పమాత; వినతకు అరుణుడు, గరుడుడు పుత్రులు.

సురకు కుమార్తెలు వనస్పతులు (పువ్వులు లేకుండా కాయలు కాసే చెట్లు) - అనల, రుహ, వీరుధములు.

లతలు, గుల్మాలు, తీగలు, తృణాలు - వీరుధమ సంతానం.

దుర్మార్గులు, అధర్మ ప్రవర్తకుల భారం తాను భరించలేకపోతున్నానని భూమి బ్రహ్మదేవుడికి విన్నవించుకోగా, విష్ణుదేవుని ఆనతితో దేవతల అంశతో వీరులు జన్మించారు. వీరు రాక్షసుల అంశతో పుట్టినవారితో యుద్ధం చేస్తారు. ఆ యుద్ధంలో అధర్మ వర్తనులు నశించి భూభారం తగ్గుతుందని బ్రహ్మ చెప్పినాడు.

ప్రభాసుడనే వసువు భీష్ముడిగా, రుద్రగణాల అంశతో కృపుడు, ద్వాపరాంశతో శకుని, కలిపురుషుడు దుర్యోధనుడిగా, సూర్యపుత్రుడు కర్ణుడిగా, పులస్త్యుని పుత్రులు కౌరవులుగా, హంసుడనే గంధర్వుడు ధృతరాష్ట్రుడిగా, ధర్ముడి అంశతో విదురుడు జన్మించారు. మరుద్గణాల అంశతో పాండురాజు, ధర్మ, అనిల, ఇంద్రుల అంశతో ధర్మజ, భీమ అర్జునులు, అశ్వనీ దేవతల అంశతో నకుల సహదేవులు, శచీదేవి అంశతో ద్రౌపది, చంద్రుడి కుమారుడు వర్చసుడి అంశతో అభిమన్యుడు, నారాయణుని అంశతో శ్రీకృష్ణుడు అప్సరసల అంశతో పదహారువేలమంది గోపికలు జన్మించారు.

## దుష్యంతుడు-శకుంతల-భరతుడు

చతుః సముద్ర వలయిత భూమిని పరిపాలిస్తున్న దుష్యంతుడు ఒకరోజున వేటకు వెళ్లి కణ్వాశ్రమంలో శకుంతలను చూసి గాంధర్వ విధిలో వివాహం చేసుకుని ఆమెతో సుఖము బడసి తన రాజధానికి వెళ్లిపోయాడు.

ఆమె మేనక-విశ్వామిత్రుల కుమార్తె; పసిగుడ్డును తల్లిదండ్రులిద్దరూ విడిచి వెళ్లగా శకుంతలాలనే పక్షులు రక్షించాయి. కణ్వుడనే ముని ఆమెను శకుంతలగా పెంచాడు. దుష్యంతుడి వలన గర్భవతియై ఆమె చక్కని పుత్రుడిని కన్నది. రేపే మంత్రులను సేవకులను పంపుతానన్న మహరాజు మాటను, శకుంతలను మరచిపోయాడు.

ఎదురుచూపులతోనే పన్నెండేళ్లు గడిచాయి. శకుంతల కుమారుడు వట్టిచేతుల్తో క్రూరమృగాల పొగరణిగిస్తూ సర్వదమనుడై, భరతుడిగా పిలువబడినాడు. పన్నెండేళ్ల వయసున్న కుమారుడిని తీసుకుని దుష్యంతుని కొలువులో తన కుమారుడిని యువరాజును చేయమన్నది శకుంతల. "నీవెవరో నాకు తెలియదు, పొమ్మన్నా"డు దుష్యంతుడు.

"నా ఖర్మ ఇంతే కాబోలు, పుట్టినపుడే తల్లిదండ్రులు వదిలేసారు. ఇప్పుడు గాంధర్వ వివాహం చేసుకున్న భర్త వదిలేసాడు" అని వెళ్లిపోతున్నపుడు ఆకాశవాణి పలికింది-

**తస్మాద్ భరస్వ దుష్యంత పుత్రం శాకుంతలం నృప**
**అభూతి రేషాయత్ త్యక్త్వాజీవే జ్జీవంత మాత్మజమ్**
**తస్మాద్ భవత్వయం నామ్నా భరతో నామతే సుతః**

మా మాటలను భరించు. శకుంతల భర్తవైన దుష్యంతుడా నీ పుత్రుడిని భరించు. అందువల్ల నీ కుమారుడు భరతుడనే పేరుతో ప్రసిద్ధికెక్కుతాడు.

**భరతాద్ భారతీ కీర్తిర్యే నేదం భారతం కులమ్**
**అపరే యే చ పూర్వే వై భారతా ఇతి విశ్రుతాః**

## దక్షుడు-కశ్యపుడు-మనువు

ప్రచేతనుడనే తేజస్వికి పదిమంది పుత్రులు. వీరిని పుణ్యజనులు అని పిలిచేవారు. వీటి నోటినుండి వెలువడే అగ్ని వృక్షాలను దహించివేసింది. ఈ పదిమంది అగ్నిరూపులై బ్రహ్మ కుడిచేతి బొటనవ్రేలు నుండి దక్షుడిగా పుట్టినారు. దక్షుడు లోకానికి పితామహుడు. ఇతడే ప్రాచేతసుడు.

దక్షుడికి, దక్షకన్యకు వేలాదిమంది పుత్రులు. 50 మంది పుత్రికలు. వీరిలో పదిమందిని ధర్ముడికి, పదముగ్గురిని కశ్యపుడికి, 27 మందిని చంద్రుడికి ఇచ్చాడు.

కశ్యపుడు అదితికి ద్వాదశాదిత్యులు, వివస్వంతుడు (సూర్యుడు) జన్మించారు. వివస్వంతుడికి యముడు, మనువు జన్మించారు. మనువుకు మానవజాతి జన్మించింది.

మనువుకు పదిమంది పుత్రులు- వేనుడు, ధృష్టుడు, నరిష్యంతుడు, నాభాగ ఇక్ష్వాకువు, కారూషుడు, శర్యాతి, పృషధ్రుడు, నాభాగ అరిష్టుడు - ఇంకా నలభై ఇద్దరు, పరస్పర భేదభావంతో నశించారు. ఇల మనువు కుమార్తె.

బృహస్పతి భార్య తార. తార ప్రేమికుడు చంద్రుడు. తారాచంద్రుల కుమారుడు బుధుడు.

బుధుడు-ఇల కుమారుడు పురూరవుడు.

పురూరవుడు-ఊర్వశిని ఇష్టపడినాడు. వారికి ఆరుగురు కుమారులు- ఆయువు, ధీమంతుడు, అమావసువు, దృఢాయువు, వనాయువు, శతాయువు.

ఆయువు–స్వర్భానువులకు నహుషుడు, వృద్ధశర్మ, రజి, గయుడు, అనేనసుడు అనేవారు అయిదుగురు పుత్రులు.

వృత్రుడిని చంపి బ్రహ్మహత్యా పాతకంతో ఇంద్రుడు పీడింపబడుతున్నపుడు నహుషుడు ఇంద్రుడైనాడు. తరువాత మహర్షులతో శపించబడి పెద్ద పామై భూమిమీద పడి ఉన్నాడు.

నహుషుడి కుమారులు– యతి, యయాతి, సంయాతి, ఆయాతి, ఆయతి, ధ్రువుడు. యయాతికి దేవయాని యందు యదు, తుర్వసులు; శర్మిష్ఠ యందు ద్రుహ్యుడు, అనుద్రుహ్యుడు, పూరుడు జన్మించారు.

## కచుడు-దేవయాని

ఇంద్రుడి భార్య శచీదేవి. ఈమె పౌలోమి. పులోముడి కుమార్తె. పులోముడు కశ్యపుడు–దనువుల కుమారుడు. ఇంద్రుడు–శచీదేవిల కుమార్తె జయంతి.

దేవతల గురువు బృహస్పతి – ఇతడు అంగీరసుడి కుమారుడు. బృహస్పతి భార్య తార. వీరి కుమారుడు కచుడు.

రాక్షసుల గురువు శుక్రుడు. ఇతడు భృగువు, కావ్యమాతల కుమారుడు. శుక్రుడి భార్య ఇంద్రుడి కుమార్తె జయంతి. శుక్రుడు–జయంతిల కుమార్తె దేవయాని.

మృతసంజీవని విద్య నేర్చుకోవడం కోసం దేవతలు కచుడిని శుక్రుడి దగ్గరకు పంపినారు. దేవతల గురువు కుమారుడు తమ గురువు వద్ద విద్య నేర్చుకోవడం రాక్షసులకు నచ్చలేదు. అందుకని వాళ్లు సమయం దొరకగానే మొదటిసారి కచుడిని చంపి ముక్కలు చేసి కుక్కలకు, తోడేళ్లకు వేసారు.

శుక్రుడతడిని బ్రతికించాడు కుమార్తె దేవయాని ఏడుస్తుంటే. రెండవసారి చంపి ముద్దచేసి సముద్ర జలాల్లో కలిపారు. మృతసంజీవని విద్యతో మరల కచుడిని బ్రతికించాడు శుక్రుడు. మూడోసారి రాక్షసులు కచుడిని చంపి కాల్చి బూడిద చేసి 'సుర'లో కలిపి శుక్రుడికివ్వగా అతడు తాగినాడు.

దేవయాని హృదయవిదారకంగా శోకిస్తుంటే శుక్రుడు దివ్యదృష్టితో చూసాడు తన కడుపులో వున్న కచుడిని శుక్రుడు. వేరే మార్గం లేక కచుడికి మృతసంజీవని విద్య బోధించాడు. శుక్రుడి పొట్ట చీల్చుకుని వచ్చి కచుడు మృతసంజీవిని విద్యతో గురువును బ్రతికించాడు.

విద్యాభ్యాసం అయినాక కచుడు వెళ్లిపోతుంటే తన ప్రేమను వ్యక్తం చేసింది దేవయాని. కచుడు అంగీకరించలేదు. దేవయాని శపించింది– "నీకు మృతసంజీవని పనిచేయకుండును గాక!". కచుడన్నాడు– "నీవు గురుపుత్రివి. సోదరి సమానురాలివి. నాకు మృతసంజీవని పనిచేయకపోయినా నేను బోధించినవారికి అది పనిచేయును గాక! నిన్ను ఋషి పుత్రుడెవడూ వివాహమాడకుండును గాక!" అని శపించి అతడు దేవలోకం వెళ్లిపోయాడు.

శుక్రాచార్యుడు అప్పుడు వృషపర్వుడనే రాక్షసరాజు వద్ద ఆచార్యుడిగా ఉన్నాడు. ఆ రాక్షసరాజు కుమార్తె శర్మిష్ఠ.

దేవతలు కచుడి వలన మృతసంజీవని నేర్చుకున్నారు. ఇప్పుడు రాక్షసులతో పోరాడాలనుకున్నారు. వారికి అడ్డంకి వృషపర్వుడు–శుక్రాచార్యుల మధ్య ఉన్న రాజు–పురోహితుల మైత్రి, అనుబంధం. అందుకని ఇంద్రుడు వారి కుమార్తెల మధ్య చిచ్చురేపి తన పబ్బం గడుపుకోవాలనుకున్నాడు.

ఒకరోజున శర్మిష్ఠ తన చెలికత్తెలు, దేవయానితో కలిసి వనవిహారానికి వచ్చింది. అందరూ వస్త్రాలు గట్టుపై ఉంచి సరస్సులో జలక్రీడలాడుతున్నారు. ఇంద్రుడి ఆజ్ఞతో సుడిగాలి వచ్చి వారి బట్టల్ని కలగాపులగం చేసింది. వస్త్రాలు తారుమారు కావడం గమనించని రాకుమార్తె శర్మిష్ఠ, తొందరలో దేవయాని వస్త్రాన్ని ధరించింది. దేవయాని అన్నది– "రాక్షస కన్యా! నా వస్త్రం ధరించడం నీకు తగదు". శర్మిష్ఠకు కోపం వచ్చింది– "నా తండ్రి రాజు. నీతండ్రి పురోహితుడు. అయినా చూడలేదన్నా వినవేమి!" అని ఆగ్రహంతో తన చెలికత్తెలతో దేవయానిని పాడునూతిలో పడవేయించి ఇంటికిపోయింది శర్మిష్ఠ.

అటుగా వచ్చిన యయాతి రాజు నూతిలో పడిఉన్న దేవయానిని బయటకు తీసినాక దేవయాని అన్నది– "నా పాణిగ్రహణం చేసావు. నేను శుక్రాచార్యుల వారి కుమార్తెను".

యయాతి అన్నాడు– "నీవు బ్రాహ్మణ కన్యవు. నేను క్షత్రియుడిని. మన వివాహం ధర్మసమ్మతం కాదు" అని అతడు వెళ్లిపోయాడు.

ఘూర్ణిక అనే దాసి ద్వారా ఈ జగడాన్ని విని శుక్రుడు అక్కడకు వచ్చాడు. కుమార్తెకు జరిగిన అవమానానికి బాధపడినాడు.

ఈలోగా విషయం రాక్షసరాజైన వృషపర్వునికి తెలిసింది. తనపై కోపంగా ఉన్న శుక్రుడిని కాళ్లావేళ్లా పడితే, దేవయాని ఏం చెబితే దానికి అంగీకరించాలన్నాడు శుక్రాచార్యుడు. వృషపర్వుడు "సరే"నన్నాడు.

**దాసీం కన్యా సహస్రేణ శర్మిష్ఠా మభికామయే**
**అను మాం తత్ర గచ్ఛేత్ సాయత్ర దద్యాచ్చమే పితా**

ఆ విధంగా శర్మిష్ఠ, దేవయానికి దాసి అయ్యింది తన సహస్ర పరిజనంతో పాటు.

**త్యజే ద్యేకం కులస్యార్థే గ్రామస్యార్థే కులం త్యజేత్**
**గ్రామం జనపద స్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్**

-వంశం కోసం వ్యక్తిని విడిచిపెట్టాలి, గ్రామం కోసం వంశాన్ని, జనపదం కోసం గ్రామాన్ని, తనను రక్షించుకోవడం కోసం భూమిని (రాజ్యాన్ని) వదిలేయాలి.

శర్మిష్ఠ తన రెండువేల మంది చెలికత్తెలతో దేవయానికి దాసి అయ్యింది.

రెండోసారి యయాతి వేట నిమిత్తం అదేచోటుకు వచ్చాడు. తాను రక్షించిన దేవయాని వేయిమంది పరిచారికల మధ్య వెలిగిపోతున్నది. అయినా అతడి దృష్టిని ఆకర్షించింది దేవయాని పక్కనే ఉన్న అందాలరాశి రాజసమొలకబోస్తున్న శర్మిష్ఠ.

దేవయాని తన తండ్రికి చెప్పి తమ వివాహాన్ని ధర్మసమ్మతం కావించింది. యయాతికి తన కుమార్తెనిచ్చి వివాహం చేస్తూ శుక్రాచార్యుడన్నాడు- "ఈ శర్మిష్ఠ రాచకూతురు, నా కుమార్తెకు దాసి. ఈమెకు అన్ని సదుపాయాలూ కలుగజేయి. శయన విషయంలో పరిహరించు"-

దేవయాని అంతఃపురానికి వెళ్లింది. శర్మిష్ఠకు అంతఃపురం దగ్గర్లోని అశోకవనంలో గృహం ఇవ్వబడింది. దేవయానికి పుత్రుడు జన్మించాడు.

శర్మిష్ఠ ఋతుమతి అయ్యింది - అటుగా వచ్చిన యయాతితో తన మనసులోని కోర్కెను చెప్పింది. ఎంతోసేపు తర్కించి ఒకరి అభిప్రాయాల్నొకరు గౌరవించుకున్నారు. శర్మిష్ఠకూ పుత్రుడు పుట్టాడు.

"ఎవరివల్ల?" అడిగింది దేవయాని.

"ఋషిశ్రేష్ఠుడి వలన" అన్నది శర్మిష్ఠ.

యయాతికి దేవయాని వలన యదువు, తుర్వసుడు జన్మించారు. యయాతికి శర్మిష్ఠవలన ద్రుహ్యుడు, అనుద్రుహ్యుడు, పూరువు జన్మించారు.

ఒకరోజున శర్మిష్ఠ కుమారులను అడిగింది -మీ తండ్రి ఎవరని?- దేవయాని. వాళ్లు అటుగా వస్తున్న యయాతిని చూపించారు. కోపంతో దేవయాని తన తండ్రికి చెప్పిందా విషయం.

శుక్రుడన్నాడు- "అధర్మమాచరించిన రాజా! నీకు వెంటనే నీ యవ్వనం పోయి వృద్ధాప్యం సంక్రమించును గాక!"

యయాతి అన్నాడు- "నాకింకా కోరికలు తీరలేదు. అంతేకాక తమ శాపం వలన బాధపడేది తమ కుమార్తె కూడా!"

శుక్రుడాలోచించి అన్నాడు- "నీ పుత్రులలో ఎవరైనా సరే తమ యవ్వనాన్ని నీకు ధారపోస్తే నీకు యవ్వనకాలం లభిస్తుంది".

యదువు ఒప్పుకోక రాజ్యార్హత కోల్పోయాడు, తన వారసులతో సహా.

తుర్వసుడు ఒప్పుకోక మాంసభక్షకులకు, చండాలురకు రాజైనాడు.

ద్రుహ్యుడు ఒప్పుకోక నావలు తిరిగేచోట 'భోజులై' రాజ్యార్హత కోల్పోయాడు.

అనుద్రుహ్యుడు ఒప్పుకోకపోవడంతో అతడి వారసులు యవ్వనంలో మరణించే శాపం పొందాడు.

పూరుడు ఒప్పుకుని తన యవ్వన కాలాన్ని తండ్రికిచ్చినాడు. వేయి సంవత్సరాలు ఆనందించి అతడి యవ్వనాన్ని అతడికిచ్చివేసాడు. దానితోపాటు పూరుడికి పట్టాభిషేకం చేసినాడు.

యదువుకు జన్మించినవారు యాదవులు

తుర్వసునికి జన్మించినవారు యవనులు

ద్రుహ్యునికి జన్మించినవారు భోజులు

అనుద్రుహ్యునికి జన్మించినవారు మ్లేచ్ఛులు

పూరునికి జన్మించినవారు పౌరవులు– ఈ వంశంలోనే కౌరవ పాండవులు జన్మించారు.

## యయాతి - అతడి కుమార్తె మాధవి

యయాతి కుమార్తె మాధవి. ఒకప్పుడు గరుడుని మిత్రుడైన గాలవ్యుడనే ముని విశ్వామిత్ర మహర్షికి గురుదక్షిణ చెల్లించే నిమిత్తం, గరుడుడి సలహాతో యయాతిని అడిగాడు 800 తెల్లగుర్రాలు, ఒక చెవి నల్లగా ఉన్నవి కావాలని. తనవద్ద ఆ గుర్రాలు లేవని తన కుమార్తె మాధవిని ఇచ్చాడు యయాతి.

ఆమెను మొదట ఇక్ష్వాకు ప్రభువు, సూర్యవంశరాజు హర్యాశ్వుడి దగ్గర ఒక సంవత్సరం ఉంచగా 'వసుమానుడు' జన్మించాడు. అతడి దగ్గర 200 గుర్రాలు తీసుకున్నాడు గాలవ్యుడు.

ఇంకో సంవత్సరం పాటు కాశీరాజు దివోదాసుడి దగ్గర ఉంచగా ఆమెకు 'ప్రతర్ధనుడు' జన్మించాడు. మరో 200 గుర్రాలు లభించాయి గాలవ్యుడికి.

మరో సంవత్సరం పాటు భోజుల ప్రభువు ఉశీనరుడి దగ్గర మాధవిని ఉంచగా ఆమెకు 'శిబి' జన్మించాడు. 200 గుర్రాలు లభించాయి గాలవ్యుడికి.

అటువంటి గుర్రాలు మరిన్ని లేవని దుఃఖిస్తూ ఆ గుర్రాలను, మాధవిని తీసుకుని విశ్వామిత్రుడి వద్దకు వెళ్లి ఆ విషయం చెప్పాడు గాలవ్యుడు. విశ్వామిత్రుడు అన్నాడు– "ముందే ఈమెను నాకిచ్చి ఉంటే గుర్రాలను తేవాల్సిన అవసరం ఉండేది కాదు. ఈ 600 గుర్రాలు, మాధవితో నీ గురుఋణం తీరింది" అని పలికి అతడిని పంపించివేసాడు. విశ్వామిత్రుడి వద్ద ఒక్క ఏడాది ఉండగా ఆమెకు 'అష్టకుడు' జన్మించాడు.

తనవల్ల కలిగిన కుమారులను తండ్రుల వద్ద వదిలి మాధవి తపోవనానికి వెళ్లి తపస్సు చేసుకోసాగింది.

ఈలోగా యయాతి తన కుమారుడు పూరుడు ఇచ్చిన యవ్వనంతో కొన్నాళ్లు సుఖించి మరల పూరుడికి యవ్వనాన్నిచ్చి, తన వృద్ధాప్యాన్ని తీసుకుని అడవులకు వెళ్లి గొప్ప తపస్సు చేసాడు. ఆ తరువాత స్వర్గానికి వెళ్లాడు.

అక్కడ తన పుణ్యకాలాన్ని గడిపి పుణ్యం క్షీణించాక ఒకరోజున ఇంద్రుడితో మాట్లాడుతూ తనలాంటి తపస్వి లోకంలో ఎవరూ లేరని గర్వంగా అన్నాడు. అప్పుడు అతడికి 'ధ్వంసేత్యు చ్ఛై' 'క్రిందికి పడు' అను మాట మూడుసార్లు వినిపించింది. అతడు దివిలోనే సత్పురుషుల మధ్య పడినాడు. వాళ్లు కూడా దివ్యతేజస్సుతో వెలుగుతున్నారు. వారు అష్టకుడు, ప్రతర్ధనుడు, ఉశీనరుడు, శిబి. వారితో ధర్మ విషయాలను మాట్లాడుతూ ఉండగా మాధవి వచ్చి యయాతికి నమస్కరించింది.

వాళ్లు ఆశ్చర్యపోయారు. తమ మాతృమూర్తిని అడిగారు– "ఎవరితడని". ఆమె అన్నది– "ఇతడు నహుషుని కుమారుడైన యయాతి. నా తండ్రి. మీకు తాతగారు".

వాళ్ళన్నారు– "నిన్ను నలుగురు రాజుల దగ్గరకు పంపాడు, అతడిపై కోపం లేదా?". లేదన్నదామె.

ఆమె అన్నది– "తండ్రీ, నీవు స్వర్గానికి పోవడానికి నా పుణ్యాన్నిస్తాను". మనవళ్లైన ఆ నలుగురూ తమతమ పుణ్యాల్ని కొంత యయాతికిచ్చారు. దానితో యయాతికి మరల స్వర్గప్రాప్తి లభించింది.

అప్పుడు యయాతి అన్నాడు– "తాత, కుమార్తె, మనమడు –వీరి బంధుత్వం పవిత్రమగును గాక! పితృకర్మలలో దౌహిత్రుడు పరమ పవిత్రుడిగా చరించును గాక!"

**త్రీణి శ్రాద్దే పవిత్రాణి దౌహిత్రః కుతపస్తిలాః**
**త్రీణి చాత్ర ప్రశంసంతి శౌచమక్రోధ మత్వరామ్**

ఆ విధంగా యయాతి తన కుమారుడు పూరువు వలన యవ్వనాన్ని, కుమార్తె మాధవి వలన, ఆమె కుమారుల వలన పుణ్యాన్ని పొందినాడు (Yayati Complex).

## పూరు వంశానుక్రమణిక

యయాతి + శర్మిష్ఠ → పూరుడు

పూరుడు + పౌష్టి → ప్రవీరుడు, ఈశ్వరుడు, రౌద్రాశ్వుడు

ప్రవీరుడు + శూరసేని → మనస్యుడు

మనస్యుడు + సౌవీరి → శక్తుడు, సంహననుడు, వాగ్మి

యయాతి → పూరుడు → రౌద్రాశ్వుడు+మిశ్రకేశి (అప్సరస) → అన్వగ్భానుడు + 9 మంది పుత్రులు - ఋచేయువు + 9 మంది

ఋచేయువు (అనాధృష్టి) → మతినారుడు → తంసువు → ఈవి+రథంతరి → దుష్యంతుడు+శకుంతల → భరతుడు

భరతుడికి ముగ్గురు భార్యలు; వారికి ముగ్గురేసి పుత్రులు కలిగినా వారిపై అనుమానం వ్యక్తం చేసేసరికి ఆ భార్యలు తమ పిల్లల్ని చంపివేసారు. తరువాత భుమన్యుడనే పుత్రుడు పుట్టాడు.

భుమన్యువు → సుహోత్రుడు → అజమీఢుడు

అజమీఢునికి ముగ్గురు భార్యలు. ధూమిని వలన ఋక్షుడు; నీలి వలన దుష్యంతుడు, పరమేష్ఠి; కేశిని వలన జహ్నువు, వ్రజనుడు, రూపి అనే కుమారులు కలిగారు.

దుష్యంత, పరమేష్ఠుల వారసులు → పంచాలురు

జహ్నువు సంతానం → కుశికులు

ఋక్షుడు → సంవరణుడు (కరువు కాటకాలతో ప్రజానాశనం జరిగింది సంవరణుడి కాలంలో. పాంచాల రాజు సంవరణుని ఓడించాడు).

సింధునది దగ్గర ఈ భారత వంశీయులు నివసిస్తున్నారు. వారికి వశిష్ఠుడు పురోహితుడయ్యాడు. సంవరణుని అతడు రాజుగా భరతుడి నగరంలో అభిషేకించాడు. అతడు మళ్లీ తన రాజ్యాల్ని గెలుచుకున్నాడు. సంవరణుని భార్య తపతి. వీరి కుమారుడు 'కురుడు'.

ఇతడి పేరుమీద 'కురుజాంగాల' రాజ్యం ప్రసిద్ధికెక్కింది.

కురురాజు + వాహిని → అశ్వంతుడు, అభిష్యంతుడు, ముని, చైత్రరథుడు, జనమేజయుడు అను అయిదుగురు పుత్రులు.

అశ్వవంతుడు → పరీక్షిత్తు → ధృతరాష్ట్రుడు → ప్రతీపుడు → శంతనుడు.

## పూరు-భరత-పాండు వంశములు

దక్షుడు → అదితి → వివస్వంతుడు → మనువు → ఇల → పురూరవుడు → ఆయువు → నహుషుడు → యయాతి.

యయాతి + దేవయాని → యదువు, తుర్వసుడు, మాధవి

యయాతి + శర్మిష్ఠ → ద్రుహ్యువు, అనుద్రుహ్యువు, పూరువు

యదువు సంతానం యాదవులు; పూరువు సంతానం పౌరవులు.

పూరువు + కౌసల్య → జనమేజయుడు

జనమేజయుడు + అనంత → ప్రాచిన్వంతుడు

ప్రాచిన్వంతుడు + అశ్మకి → సంయాతి

సంయాతి + వరాంగి → అహంయాతి

అహంయాతి + భానుమతి → సార్వభౌముడు
సార్వభౌముడు + సునంద → జయత్సేనుడు
జయత్సేనుడు + సుశ్రవ → అవాచీనుడు
అవాచీనుడు + మర్యాద → అరిహుడు
అరిహుడు + అంగరాణి → మహాభౌముడు
మహాభౌముడు + సుయజ్ఞ → ఆయుతనాయి
ఆయుతనాయి + కామ → అక్రోధనుడు
అక్రోధనుడు + కరంభ → దేవాతిధి
దేవాతిధి + మర్యాద → అరిహుడు
అరిహుడు + సుదేవ → ఋక్షుడు
ఋక్షుడు + తక్షకపుత్రి జ్వాల → మతినారుడు
మతినారుడు + సరస్వతి నది → తంసుడు
తంసుడు + కాలింగి → ఈవి
ఈవి + రథంతరి → దుష్యంతుడు
దుష్యంతుడు + శకుంతల → భరతుడు
భరతుడు + సునంద → భుమన్యువు
భుమన్యుడు + విజయ → సుహోత్రుడు
సుహోత్రుడు + సువర్ణ → హస్తి
హస్తి + యశోధర → వికుంఠనుడు
వికుంఠనుడు + సుదేవ → అజమీఢుడు
అజమీఢుడు + కైకేయి, గాంధారి, విశాల, ఉక్ష → 124 పుత్రులు, సంవరణుడు
సంవరణుడు + తపతి → కురుడు
కురుడు + శుభాంగి → విదూరుడు
విదూరుడు + సంప్రియ → అనశ్వుడు
అనశ్వుడు + అమృత → పరీక్షిత్తు
పరీక్షిత్తు - సుయశ → భీమసేనుడు
భీమసేనుడు + కైకేయి → ప్రతిశ్రవుడు (ప్రతీపుడు)
ప్రతీపుడు + సునంద → దేవాపి, బాహ్లికుడు, శాంతనుడు.
(శాంతనుడు ఏ వృద్ధుని తాకినా అతడికి యవ్వనం వస్తుంది).
శాంతనుడు + గంగ → భీష్ముడు (దేవరాతుడు)
శాంతనుడు + సత్యవతి (గంధకావి) → విచిత్రవీర్యుడు, చిత్రాంగదుడు
విచిత్రవీర్యుడు + అంబిక, అంబాలిక
నియోగ పద్ధతిన వ్యాసుడు + అంబిక → ధృతరాష్ట్రుడు
వ్యాసుడు + అంబాలిక → పాండురాజు
వ్యాసుడు + అంబికా దాసి → విదురుడు
ధృతరాష్ట్రుడు + గాంధారి → కౌరవులు నూరుగురు, దుస్సల
పాండురాజు + కుంతి, మాద్రి
నియోగ పద్ధతిన- ధర్ముడు + కుంతి → ధర్మరాజు
వాయువు (అనిలుడు) + కుంతి → భీముడు
ఇంద్రుడు + కుంతి → అర్జునుడు
అశ్వనీదేవతలు + మాద్రి - నకుల, సహదేవులు
భీముడు + హిడింబ → ఘటోత్కచుడు

పాండవులు + ద్రౌపది; ధర్మరాజు + ద్రౌపది → ప్రతివింధ్యుడు
భీముడు + ద్రౌపది → శ్రుతసోముడు
అర్జునుడు + ద్రౌపది → శ్రుతకీర్తి
నకులుడు + ద్రౌపది → శతానీకుడు
సహదేవుడు + ద్రౌపది → శ్రుతకర్మ

ధర్మరాజు + దేవిక → యౌధేయుడు
భీముడు + వలంధర → సర్వగుడు
అర్జునుడు + సుభద్ర → అభిమన్యుడు
నకులుడు + కరేణుమతి → నిరమిత్రుడు
సహదేవుడు + విజయ → సుహోత్రుడు
అభిమన్యుడు + ఉత్తర → పరీక్షిత్తు
పరీక్షిత్తు + మాద్రవతి → జనమేజయుడు
జనమేజయుడు + వపుష్ట → శతానీకుడు, శంకుకర్ణుడు
శతానీకుడు + వైదేహి → అశ్వమేధ దత్తుడు.

## గంగానదితో వసువుల ఒప్పందం

ఇక్ష్వాకు వంశం వాడైన మహాభిషుడనే రాజు స్వర్గంలో గంగానదిని దేవకన్యరూపంలో చూసి మనసు పడినాడు. గంగ కూడా అతడిని అభిలషించింది.

అతడు భూలోకంలో ప్రతీపుడిని తన తండ్రిగా ఎన్నుకున్నాడు. శంతనుడిగా పుట్టినాడు. గంగ దేవలోకం నుండి దిగివస్తూ దిగాలుగా ఉన్న అష్టవసువులను చూసింది. వాళ్లు వసిష్ఠుని హోమధేనువును తమతో తీసుకుపోబోయి మానవులుగా పుట్టమని శపించబడినారు.

ఆ శాప విముక్తి కోసం వాళ్లు గంగను ప్రాధేయపడినారు. వాళ్లు శంతనుడిని తండ్రిగా అంగీకరించారు.

ఒకరోజున ప్రతీపుడు నదీతీరాన సమాధి నిష్ఠలో ఉండగా గంగ దివ్యరూపంతో వచ్చి అతడి కుడితొడపై కూర్చున్నది. అతడన్నాడు– "సుందరీ! కుడితొడపై కూర్చునే అర్హత సంతానానికి, కోడలికి ఉంటుంది. ఎడమ తొడపై కామినులు ఆరోహిస్తారు. నీవు నా కోడలిగా ఉండడానికి అర్హురాలివి".

ఆమె నవ్వి అన్నది– "ఇది దైవసంకల్పం. అయితే నీ కుమారుడికి తెలియజేయుము. నన్ను వ్యతిరేకించిన రోజున అతడిని విడిచి వెళ్లిపోతాను".

శంతనుడు జన్మించాడు. అనేక విద్యలు నేర్చుకున్నాడు. యుక్తవయస్కుడై గంగాతీరంలో తిరుగుతూ ఉన్నపుడు తనకు తారసపడిన దివ్యకాంతను చూసి మోహించాడు.

ఆమె అన్నది– "నిన్ను వివాహమాడతాను కాని, నేను చేసేపని శుభమైనా, అశుభమైనా నన్ను అడ్డగించరాదు సుమా! నాకు కష్టం కలిగేట్లు మాట్లాడకూడదు".

వారికి ఏడుగురు పుత్రులు కలిగారు ఒకరి తరువాత ఒకరు. పుట్టిన ప్రతిబిడ్డను నీటిలో పడవేసేది ఆమె. ఏడుగురు కొడుకులట్లా గంగపాలయ్యారు.

ఎనిమిదో కొడుకును కూడా నీటిలో పడవెయ్యబోతుంటే శంతనుడు అడ్డుకున్నాడు– "ఓ పుత్రఘాతినీ! ఇకచాలు! వీడిని చంపకు!"

ఆమె అన్నది– "ఎనిమిది మంది వసువుల పరాక్రమం ఇతడిలోనే ఉన్నది. ఇతడి పేరు గంగాదత్తుడు. వరుణుడు తన కుమారుడిగా స్వీకరించిన వసిష్ఠుడి (ఆపవుడు) వద్ద కశ్యప–సురభిల సంతానమైన 'నందిని' అనే కామధేనువు ఉండింది. అద్భుతమైన గోవు అది.

దానిని చూసి ప్రభాసుడనే (ద్యోవు) వసువు భార్య, ఆ గోవును తన నెచ్చెలి అయిన మానవ రాజకుమార్తెకు కానుకగా ఇవ్వాలని ముచ్చటపడింది. భార్య ముచ్చట కాదనలేక వసువు తన సోదరులతో కలిసి ఆ గోవును తీసుకుపోబోతుంటే వసిష్ఠుడు వారిని శపించాడు.

'ఏడుగురు వసువులు ఏడాదిపాటు, ఆఖరి వసువు ద్యో-ప్రభాసుడు- ఎక్కువకాలం భూమిపై ఉంటాడు. అతడికి సంతానం కలగదు' అన్నాడు వసిష్ఠుడు.

అందుకని- ఓ శంతనా! నీ పుత్రుడు దేవవ్రతుడు, గాంగేయుడు, గంగాదత్తుడిగా నావద్ద పెరుగుతాడు. అన్ని విద్యలూ నేర్చుకున్నాక నీవద్దకు పంపుతాను" అన్నది గంగ.

## శంతనుడు - సత్యవతి

ఉపరిచర వసువు వీర్యంతో చేపరూపంలో ఉన్న అద్రిక అనే అప్సరస కడుపులో పుట్టినవాళ్లు మత్స్యరాజు, మత్స్యగంధి. మత్స్యగంధి పరాశరుడి వర ప్రభావంతో వ్యాసుడికి జన్మనిచ్చింది. మత్స్యగంధి యోజనగంధిగా మారింది.

యమునా నది వద్ద ఆమెను శంతన మహరాజు చూసి మనసుపడ్డాడు. ఆమె పుత్రులకు రాజ్యాధికారం ఇస్తానంటేనే పెండ్లి జరుగుతుందని ఆమె పుంపుడు తండ్రి దాశరాజు అన్నాడు. గాంగేయుడు- "తనకు రాజ్యాధికారం అక్కర్లేదని" అన్నాడు. దాశరాజన్నాడు- "నీవు అడగకపోవచ్చు, నీ సంతానం అడిగితే?". "నేను బ్రహ్మచారిగా ఉండిపోతాను, నా తండ్రి రాజ్యంపై హక్కును త్యజిస్తున్నాను" అని భీష్మ ప్రతిజ్ఞ చేసాడు దేవవ్రతుడు, అతడిని భీష్ముడిగా కొనియాడినారందరూ.

తండ్రి కోసం తన యవ్వనాన్ని ధారపోసాడు పూరువు. తమ పుణ్యాన్ని ధారపోసినారు మాధవి, ఆమె కుమారులు. తండ్రి వివాహం కోసం తన రాజ్యాధికారాన్ని, వివాహ ధర్మాన్ని త్యాగం చేసినాడు భీష్ముడు.

శంతనుడు, సత్యవతిలకు చిత్రాంగదుడు, ఆ తరువాత విచిత్రవీర్యుడు జన్మించారు. కొన్నాళ్లకు శంతనుడు మరణించాడు. సత్యవతి అనుమతితో భీష్ముడు చిత్రాంగదుడిని రాజుని చేసాడు.

అతడి పేరే ఉన్న చిత్రాంగదుడనే గంధర్వరాజుతో తగాదా ఏర్పడి, కురుక్షేత్రంలో యుద్ధమై, ఆ గంధర్వుడి మాయా యుద్ధంలో ఓడిపోయి మరణించాడు.

చిత్రాంగదుడి మరణానంతరం అప్పటికి బాలుడిగానే ఉన్న విచిత్రవీర్యుడిని రాజుగా చేసాడు భీష్ముడు. విచిత్రవీర్యుడికి యుక్తవయసు రాగానే కాశీరాజ కుమార్తెల (అంబ, అంబిక, అంబాలిక) స్వయంవరానికి వెళ్లి తనకడ్డువచ్చిన రాజులనందరినీ ఓడించి వస్తుంటే శాల్వుడనే రాజు అడ్డుతగిలాడు. అతడిని ఓడించి హస్తినకు వచ్చిన భీష్ముడితో అంబ తాను శాల్వుడిని ప్రేమించినట్లు తెలియజేయగా ఆమెను సగౌరవంగా శాల్వుడి దగ్గరకు పంపినాడు.

విచిత్రవీర్యుడికి అంబిక, అంబాలికలకు వైభవంగా వివాహం జరిగింది. ఏడేళ్లపాటు తన భార్యలతో సుఖాల ననుభవించిన విచిత్రవీర్యుడు క్షయవ్యాధితో మరణించాడు.

శాల్వుడి దగ్గరకు వెళ్లి తిరస్కరింపబడిన అంబ భీష్ముడి వద్దకు తిరిగివచ్చింది. ఆమె అభ్యర్థనను భీష్ముడు తిరస్కరించడంతో ఆమె ఆమె అతడి మీద పగ తీర్చుకోదలచి అడవికి వెళ్లింది తపస్సు చేయడానికి.

సత్యవతీదేవి భీష్ముడిని కోరింది వివాహం చేసుకుని వంశాన్ని ఉద్ధరించమని. అతడు ఒప్పుకోకపోవడంతో తన మొదటి కుమారుడైన వ్యాసుడిని తలచుకోగా అతడు వచ్చాడు.

తల్లి నియోగించగా అతడు ఆ రాత్రి అంబిక వద్దకు వెళ్లగా ఆమె భయంతో కళ్లు మూసుకున్నది. అందువలన ఆమెకు పుట్టుగుడ్డి అయిన ధృతరాష్ట్రుడు జన్మించాడు.

రెండవ ప్రయత్నంగా వ్యాసుడు అంబాలిక వద్దకు వెళ్లగా ఆమె పాలిపోయింది భయంతో. ఆమెకు పాండురాజు జన్మించాడు.

మూడవసారి వ్యాసుడు వచ్చినపుడు అంబిక తన స్థానంలో తన దాసి 'పరిశ్రమ'ను ఉంచింది. ఆమెకు ధర్మాత్ముడైన విదురుడు జన్మించాడు.

## ఆణి మాండవ్య ముని కథ

మాండవ్యుడనే ముని తన ఆశ్రమ ద్వారం వద్ద ఊర్ధ్వబాహుడై మౌనవ్రతంలో తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఒకరోజున దొంగలు దొంగిలించిన సొమ్ముతో సహా వచ్చి ఆశ్రమంలో దాక్కున్నారు. రాజభటులు వారిని వెంబడించి వచ్చి ఆశ్రమంలో దాక్కున్న దొంగలను, మునిని పట్టుకుని రాజువద్దకు తీసుకువెళ్లారు. రాజు అందరికీ శూలప్రోత శిక్ష విధించాడు. దొంగలందరూ చనిపోయారు కాని మాండవ్యుడికి దించిన శూలం కొంతదూరం అతడి శరీరంలోకి దిగి ఆగిపోయింది. ఋషులు కొందరు అతడిని చూసారు. మాండవ్యుడన్నాడు– "ఎవరూ నాకు అపకారం చేయలేదు. నాకు కీడు చేసినవాడెవ్వడూ లేడు".

రాజుకు ఆ సంగతి తెలిసింది. తాను చేసింది తప్పని గ్రహించి ముని కాళ్లావేళ్లాపడినాడు. మాండవ్యుని శూలంపై నుంచి దించి, శూలాన్ని లాగి తియ్యడానికి ప్రయత్నిస్తే అది రాలేదు. దానితో బయట ఉన్న భాగాన్ని నరికించారు. శూలం కొంత అతడి శరీరంలో ఉండిపోయింది. అందువలన అతడు 'అణి మాండవ్యుడి'గా పిలువబడినాడు. అనేక సంవత్సరాలు అలాగే బ్రతికి తీవ్ర తపస్సు చేసినాడు.

చనిపోయినాక యమధర్మరాజునడిగాడు– "ఎవరికీ ఏ తప్పూ చేసి ఎరుగను. నాకెందుకు శూలప్రోతం జరిగింది?"

ధర్ముడన్నాడు– "తూనీగలకు కొర్రులు గుచ్చావు నీ చిన్నప్పుడు. అందుకే శూలప్రోత శిక్షను అనుభవించావు".

"పన్నెండేళ్ల వయసు వరకు పిల్లలు ఏ పని చేసినా తప్పు కాదు కదా! నేను నిర్ణయిస్తున్నాను– ఇకనుంచి పధ్నాలుగేళ్ల లోపు పిల్లలు చేసే తప్పులకు శిక్షలుండరాదు. నీవు నన్ను అకారణంగా శిక్షించావు గనుక నీవు శూద్రుడవై మానవలోకంలో జన్మించు" అని శపించాడు మాండవ్యుడు.

ఆ శాపఫలితంగా ధర్ముడు అంబికాదాసి 'పరిశ్రమ'కు, వ్యాసుడి వలన విదురుడిగా జన్మించాడు.

## ధృతరాష్ట్రుని వివాహం

ఆరోజుల్లో అన్ని రాజ్యాల ప్రజలూ చెప్పుకునేవారిలా–

**వీరసూనాం కాశిసుతే దేశానాం కురు జాంగలమ్**<br>
**సర్వధర్మవిదాం భీష్మః పురాణాం గజ సాహ్వయమ్**<br>
**ధృతరాష్ట్రస్య చక్షుష్ట్వాద్ రాజ్యం న ప్రత్య పద్యత**<br>
**పారశవత్వాద్ విదురః రాజా పాండు ర్బభూవ హ** (ఆది. 108–24,25)

ధృతరాష్ట్రుడు అంధుడు కావడం వలన, విదురుడు దాసీపుత్రుడు కావడం వలన రాజ్యార్హత లేదు. అందుచేత పాండుడు రాజైనాడు.

గాంధార రాజైన సుబలుని కుమార్తె గాంధారి శంకరుని ఆరాధించి నూరుగురు పుత్రులు కలిగేట్లు వరం పొందిందని తెలిసి భీష్ముడు ఆ విషయం సత్యవతితో చెప్పాడు.

సుబలుడు తన అభ్యంతరం తెలపాలనుకున్నాడు కాని, కురువంశపు ప్రతిష్ఠ, బలం, ప్రవర్తన తెలిసినవాడు గనుక తన కుమార్తెకు ఆ విషయం చెప్పినాడు. గాంధారి అనుకున్నది– "నా తండ్రికోసం నేను ధృతరాష్ట్రుడిని వివాహమాడతాను. అతడిని చూసి అతడిలోని దోషాన్ని ఎంచకుండా కనులకు గంతలు కట్టుకుని వివాహమాడతాను".

ఓ రకంగా ఆ వివాహంలో గాంధారి ధృతరాష్ట్రుడిని చూడలేదు. ధృతరాష్ట్రుడు గాంధారిని చూడలేదు. వివాహమైంది వైభవంగా. ఆ దంపతులు వాళ్ల పిల్లలనూ చూడలేదు.

**వృత్తే నారాధ్య తాన్ సర్వాన్ గురూన్ పతిపరాయణా**<br>
**వాచాపి పురుషానన్యాన్ సువ్రతా నాన్వ కీర్తయత్** (ఆది. 109–19)

సత్ప్రవర్తనతో గాంధారి అత్తవారింట్లో అందరి మన్ననలను అందుకున్నది.

## పాండురాజు-కుంతీదేవి వివాహం

యదు వంశస్థుడైన శూరసేనుడు, నాగకన్య మారిషను వివాహం చేసుకున్నాడు. వారికి వసుదేవుడనే పుత్రుడు, పృథ అనే కుమార్తె కలిగారు. శూరసేనుడి మిత్రుడు కుంతీభోజుడు. సంతానం లేని కుంతీభోజుడికి 'పృథ'ను దత్తత ఇచ్చాడు శూరసేనుడు. అందువలన పృథ పేరు 'కుంతి' అయ్యింది.

ఒకరోజున దుర్వాసుడు తమ ఇంటికి రాగా కుంతిభోజుడు ఆ యతి సేవకై కుంతీకన్యకను నియోగించాడు. సంవత్సరం పాటు వారింట్లో ఉన్న దుర్వాసముని వెళ్లిపోతూ 'కుంతి'కి ఒక మంత్రాన్నుపదేశించాడు. ఆ మంత్రాన్ని చదివి దేవతలను ఆహ్వానిస్తే వారు ఆమెకు వశులవుతారు. బాల్య చాపల్యంతో ఆమె సూర్యుడిని ఆహ్వానించింది. మంత్రబద్ధుడై వచ్చిన సూర్యుడు ఆమెకు పలువిధాల నచ్చచెప్పి ఆమెతో కలిసాడు. తత్ఫలితంగా కుంతి పెళ్లి కాకముందే పిల్లవాడిని కన్నది.

ఆ పుత్రుడు సూర్యకాంతితో వెలుగుతున్నాడు. సహజ కవచకుండలధారి; కుటుంబ సభ్యులు, లోకులు ఏమనుకుంటారో నన్న భయంతో ఆమె ఆ పసికందును బుట్టలో పెట్టి నీటిలో వదిలివేసింది.

ఆ శిశువును అతిరథుడనే సూతుడు రక్షించి తన భార్య రాధకు ఇచ్చినాడు. వారింట కర్ణుడు వసుసేనుడిగా పెరిగినాడు. (రాధేయుడు, వైకర్తనుడు, కర్ణుడు అతడి పేర్లు).

ఆ తరువాత కొన్నాళ్లకు పాండురాజుకు కుంతికి వివాహం నిశ్చయింపబడింది.

**సింహదర్పం మహోరస్కం వృషభాక్షం మహా బలమ్**
**ఆదిత్యమివ సర్వేషాం రాజ్ఞాం ప్రచ్ఛాద్య వై ప్రభాః**

మరొక దేవేంద్రుని వలె ఉన్న పాండురాజును ఎంతగానో ఇష్టపడింది కుంతీదేవి.

**సంప్రాప్య నగరం రాజా పాండుః కౌరవ నందనః**
**న్యవేశయత తాం భార్యాం కుంతీం స్వభవనే ప్రభుః**

## పాండురాజు దిగ్విజయ యాత్ర

భీష్ముడు వెళ్లి మద్రరాజు శల్యుడిని కలిసి అతడి సోదరి మాద్రిని పాండురాజుకిచ్చి వివాహం చేయమని అడిగాడు. వారి వంశాచారం ప్రకారం కన్యాశుల్కమిచ్చి 'మాద్రి'తో పాండురాజుకు వివాహం చేసాడు.

ఇద్దరు భార్యలతో నెలరోజులు సుఖంగా కాలం గడిపి పాండురాజు భూవిజయం చెయ్యాలని ససైన్యంగా తరలివెళ్లాడు. కురు ప్రముఖుల ఆమోదంతో.

దశార్ణ రాజును ఓడించాడు. మగధరాజు దీర్ఘుని 'రాజగృహ'లోనే సంహరించాడు. కాశి, సుహ్మ, పుండ్ర రాజ్యాలు ఇంకా అనేక దేశాలు అతడికి దాసోహమని ధనం, రత్నరాశులు, వెండి బంగారాలు, పశువులను సమర్పించారు.

తాను తెచ్చిన సంపదలను సత్యవతికి, భీష్ముడికి, అన్న ధృతరాష్ట్రునికి, తల్లి అంబాలికకు ఇచ్చినాడు. ఆ ధనంతో ధృతరాష్ట్రుడు వంద అశ్వమేధ యాగాలు చేసినాడు. ప్రతి యాగంలో లక్ష సువర్ణ ముద్రికలను దానం చేసాడు.

పాండురాజుకు వేట అంటే ఇష్టం, వ్యసనం కూడా. ఇద్దరు భార్యలను తీసుకుని హిమాలయ పర్వత దక్షిణ ప్రాంతంలో గిరిశిఖరాల్లో, వనాల్లో విహరిస్తున్నాడు రెండు ఆడ ఏనుగుల మధ్య శ్రీమంతమైన ఐరావతంలా.

దేవక మహారాజు వద్ద ఉన్న అందమైన పారశవికన్యను (సులభ) విదురునికిచ్చి వివాహం చేసాడు భీష్ముడు.

## పాండురాజుకు కిందమ ముని శాపం

వేట తమకంలో పాండురాజు అడవిలో సంచరిస్తున్నాడు. దూరంగా జింక మిధునం కనిపించింది. బంగరు రెక్కలు గల అయిదు బాణాలతో మైథున కర్మలో ఉన్న జింకల జంటను కొట్టాడు.

చనిపోతూ మగజింక అరచింది– "నేను కిందముడనే మునిని. మృగరూపంలో నేనూ నా భార్య మైథున సుఖాన్ని అనుభవిస్తున్నాము. నీవు దయతో కాస్త ఆగాల్సి ఉండింది. మమ్మల్ని ఆ సమయంలో చంపావు కనుక నీవు స్త్రీతో కూడిన వెంటనే మరణించెదవు గాక!" అని పలికి ప్రాణం వీడింది.

చనిపోయిన ఆ రెండు జింకలను చూడగానే పాండురాజులో తీవ్రమైన దుఃఖం, పశ్చాత్తాపం, వైరాగ్యం కలిగాయి.

కామాసక్తితో నా తండ్రి విచిత్రవీర్యుడు చనిపోయాడు. అతడి భార్యకు వ్యాసుని వలన నేను జన్మించాను. వేటమీద ఆసక్తితో నేను మృగాన్నె మృగ మిధునాన్ని చంపాను. ఇక నాకు మోక్షమార్గమే దిక్కు.

**మోక్షమేవ వ్యవస్యామి బంధోహి వ్యసనం మహత్**
**సువృత్తి మను వర్తిష్యే తామహం పితురవ్యయామ్**

అలా నిశ్చయించుకుని పాండురాజు తన భార్యలైన కుంతీ, మాద్రిలతో చర్చించి వానప్రస్థాశ్రమం స్వీకరించాడు. ఈ విషయం చెప్పమని తన పరిజనుల్ని హస్తినకు పంపివేసి తాను భార్యలతో నాగశత పర్వతానికి, ఆ తరువాత చైత్రరథమనే అరణ్యంలో కాలకూట, హిమవత్పర్వతాలను దాటి గంధమాదన పర్వతం, ఆ తరువాత ఇంద్రద్యుమ్న సరస్సు, హంసకూటాన్ని దాటి శతశృంగ పర్వతం చేరి అక్కడ తపస్సు చేయసాగినాడు. అయినా అతడి మనసులో ఏదో కలత.

మనిషి నాలుగు ఋణాలతో జన్మిస్తాడు. దేవఋణాన్ని యాగాలతో స్వాధ్యాయం, తపస్సులతో ఋషి ఋణం, దయగా ప్రవర్తించడంతో మానవ ఋణాలు తీర్చుకున్నాను. పితృఋణం తీర్చాలంటే సంతానం, శ్రాద్ధకర్మలు చేయాలి. నాకు పితృఋణం తీరే పరిస్థితి లేకుండా పోయింది.

**మృగాభి శాపాన్నష్టం మే జననం హ్య కృతాత్మనః**
**నృశంస కారిణో భీరు యద్దైవో పహతం పురా-**

మృగశాపం వలన నాకు సంతానం కలిగే పరిస్థితి లేదు. ఇప్పుడేమి చేయడం?

## ద్వాదశ పుత్రులు

(ఆది. 119-32,33,34)

**ఇమైవై బంధు దాయాదాః షట్ పుత్రా ధర్మ దర్శనే**
**షడేవా బంధు దాయాదాః పుత్రాస్తాన్ శృణుమే పృథే**

ఆరుగురు బంధు దాయాదులు, ఆరుగురు అబంధు దాయాదులు

**స్వయంజాతః ప్రణీతశ్చ తత్సమః పుత్రికాసుతః**
**పౌనర్భవశ్చ కానీనః భగిన్యాం యశ్చ జాయతే-**

సొంత కొడుకు, తన భార్యకు ఇతరుల వలన పుట్టినవాడు; దౌహిత్రుడు (కూతురి కొడుకు); మారు మనువు చేసుకున్న స్త్రీ కొడుకు; కానీనుడు (తాను వివాహం చేసుకున్న స్త్రీ కన్యగా ఉన్నపుడు వివాహానికి ముందు పుట్టినవాడు), సోదరి కొడుకు - ఈ ఆరుగురు బంధుదాయాదులు.

**దత్తః క్రీతః కృత్రిమశ్చ ఉపగచ్ఛేత్ స్వయం చయః**
**సహోఢో జ్ఞాతిరేతాశ్చ హీనయోని ధృతశ్చ యః**

దత్తపుత్రుడు, కొనబడినవాడు, స్వయంగా నేను నీ కుమారుడిని అని వచ్చినవాడు, సహోఢుడు (వివాహానికి పూర్వం ఎవరివల్లనో గర్భవతి అయి, వివాహానంతరం పుట్టినవాడు), తన వంశంలో పుట్టినవాడు, తనకన్న తక్కువ వంశం గల స్త్రీకి తనవల్ల పుట్టినవాడు - అబంధు దాయాదులు.

(పరికీతుడు - అన్యుల రేతస్సుకు వెల చెల్లించి తద్వారా భార్యకు పుట్టిన కొడుకు; స్వైరిణికి వివాహమైనాక ఉత్తముడి ద్వారా పుట్టినవాడు కుండుడు - నీలకంఠీయం).

పాండురాజు అన్నాడు- "కుంతీ! మానవుడు తన ద్వారా కాకపోయినా మరొక ఉత్తముడి వలన పుత్రులను పొందవచ్చు. ఇది స్వయంభువ మనువు నిర్ణయించాడు. నేను పిల్లల్ని కనలేను కాబట్టి నిన్ను మరొకరి దగ్గరకు పంపుతాను. ఆ విధంగా సంతానాన్ని పొందు-

**తస్మాత్ ప్రహేషామ్యద్య త్వాం హీనః ప్రజననాత్ స్వయమ్**
**సదృశా చ్ఛ్రేయ సోవా త్వం విద్ధ్య వత్యం యశస్విని!**

## వృషితాశ్వుడు - భద్ర

కుంతీదేవి అన్నది పాండురాజుతో– “ధర్మజ్ఞా! నీవు నాతో ఇటువంటి మాటలనవచ్చునా? పూర్వం వృషితాశ్వుడనే మహరాజు మితిమీరిన కామప్రవృత్తితో క్షయవ్యాధికి గురైనాడు. అతడి భార్య భద్ర అతిలోకసుందరి. ఇద్దరికి ఒకరంటే ఒకరికి ఎంతో ఇష్టం.

వృషితాశ్వుడు క్షయవ్యాధి వలన మరణించగా ఆమె ఎంతగానో విలపించి, శవాన్ని కౌగిలించుకుని అపస్మారక స్థితిలోకి పోతున్నపుడు అశరీరవాణి పలికింది–

‘చారుహాసినీ, ఋతుస్నానం తరువాత ఎనిమిదవరోజు రాత్రి గాని, 14వ రాత్రి గాని శవంతో శయనించు’–

ఆమె అదేవిధంగా చేసి ఏడుగురు పుత్రులను కన్నది. వారిలో ముగ్గురు సాల్వదేశాన్ని, నలుగురు మద్రదేశాన్ని పరిపాలించారు”

అని పలికి కుంతి అన్నది– “నాకు దుర్వాస మహర్షి ఒక మంత్రాన్ని చెప్పాడు. దాన్ని జపిస్తే దేవతలు నా వశమవుతారు. ఎవరిని ఆహ్వానించమంటావు?”

గాంధారి అప్పటికే సంవత్సర కాలంగా గర్భాన్ని మోస్తూ ఉన్నది. ఆమెకింకా ప్రసవం కాలేదు.

ఈలోగా భర్త పాండురాజు అనుమతితో కుంతీదేవి ధర్మదేవతను పూజించి చంద్రుడు జ్యేష్ఠా నక్షత్రం, సూర్యుడు తులా రాశిలో, శుక్లపక్షపంచమి – ఎనిమిదవ లగ్నం – అభిజిత్‌లో ధర్మరాజుకు జన్మనిచ్చింది.

ఈసారి వాయుదేవుడిని ఆహ్వానించగా అతడి వలన భీముడు జన్మించాడు. భీముడు జన్మించిన పదవ రోజున కుంతి సరస్సులో స్నానం చేసి పర్ణశాల నుంచి భీముడిని ఒడిలో ఉంచుకుని వస్తున్నపుడు పెద్దపులి ఆమెపై దూకబోయింది. పాండురాజు బాణాలు వేసి ఆ పులిని చంపాడు. ఆ సమయంలో ఆమె ఒడిలోని భీముడు జారి కొండపై పడ్డాడు. ఆ కొండ నూరు ముక్కలైంది.

చంద్రుడు ‘మఘా’ నక్షత్రంలో, గురువు సింహరాశిలో, సూర్యుడు నడినెత్తిన ఉండగా త్రయోదశి నాడు మైత్ర ముహూర్తంలో భీముడు జన్మించాడు. అదేరోజున కొద్దిగంటల తరువాత హస్తినలో దుర్యోధనుడు జన్మించాడు.

మూడవసారి కుంతి ఇంద్రుడిని ఆహ్వానించింది పాండురాజు చెప్పగా. ఇంద్ర వరంతో ఫాల్గున మాసంలో ఉత్తర ఫాల్గుని, దక్షిణ ఫాల్గుని నక్షత్రాల సంధికాలంలో పగటిపూట ఫల్గునుడైన అర్జునుడు జన్మించాడు.

ఇంద్రుడి కొడుకు కదా దేవగణాలు, సర్పాలు, వైనతేయులు, గంధర్వులు, అప్సరసలు, ప్రజాపతులు, సప్తర్షులు వచ్చి ఆశీర్వదించారు. తుంబురుడు గానం చేసాడు.

అనూచాన, అనవద్య, గుణముఖ్య, గుణావర, అద్రిక, సోమ, మిశ్రకేశి, అలంబుష, మరీచి, శుచిక, విద్యుత్పర్ణ, తిలోత్తమ, అంబిక, లక్షణ, క్షేమ, దేవి, రంభ, మనోరమ, అసిత, సుబాహువు, సుప్రియ, వపుష, పుండరీక, సుగంధ, సురస, ప్రమాథిని, కామ్య, శారద్వతి, మేనక, సహజన్య, కర్ణిక, పుంజికస్థల, ఋతుస్థం, ఘృతాచి, విశ్వాచి, పూర్వచిత్తి, ఉమ్లోచ, ప్రమ్లోచ అనే ప్రసిద్ధ అప్సరసలు నాట్యం చేసారక్కడ. ఉర్వశి గానం చేసింది వారితో కలిసి.

ఇంకా పుత్రులను కనమని పాండురాజు అడిగితే కుంతి అన్నది–

**నాతశ్చతు ర్థం ప్రసవమ్ ఆపత్స్వపి వదంత్యుత**
**అతః పరం స్వైరిణీ స్యాద్ బంధకీ పంచమే భవేత్–**

ఆపత్కాలంలో కూడా ముగ్గురుని మించి కనడానికి శాస్త్రాలు అంగీకరింపవు. నాలుగవ సంతానం కోరితే దానిని ‘స్వైరిణి’ అని, అయిదవ సంతానాన్ని కోరితే బంధకి అని వ్యవహరిస్తారు.

కుంతికి ముగ్గురు పుత్రులు జన్మించారు శతశృంగంలో, అక్కడ హస్తినలో నేతికుండల నుంచి గాంధారికి నూరుగురు పుత్రులు, కుమార్తె జన్మించింది. మాద్రికి దుఃఖమాగలేదు.

## మాద్రి పుత్రులు

పాండురాజుతో అన్నది- "మరి నా పరిస్థితి ఏమిటి?".

పాండురాజు కుంతినడిగాడు- "మరి మాద్రి పరిస్థితి ఏమిటి?"

కుంతి అన్నది మాద్రితో- "ఈ మంత్రం జపించి నీకిష్టమైన దేవతను స్మరించు. వ్రతం ఫలిస్తుంది"

మాద్రి అశ్వినీదేవతలను స్మరించింది. వారి అనుగ్రహంతో కవల పిల్లలు కలిగారు మాద్రికి. వారు నకులుడు, సహదేవుడు.

పాండురాజన్నాడు కుంతీదేవితో- "మాద్రికి మరొక్కసారి మంత్రం చెబుతావా! ఆమెకింకా సంతానం కలిగితే మంచిదేమో!"

కుంతి అన్నది- "నేను ఒక బిడ్డను కనమని ఆమెకు మంత్రం ఉపదేశిస్తే ఆమె తెలివిగా ఇద్దరిని కన్నది. ఇప్పుడు మరలా చెబితే నన్ను దాటిపోతుంది. ఈ ప్రయత్నం ఇంతటితో చాలు". ఆ విధంగా పాండురాజు కుమారులు పంచ పాండవులైనారు.

కుంతీదేవి సోదరుడైన వసుదేవుడు తన మేనల్లుళ్ల సుఖసంతోషాలతో ఉండాలని కుంతి, మాద్రిలకు అవసరమైన దాసదాసీ జనాల్ని, ఆభరణాలను, గోవులను, వస్తువులను పంపినాడు. వాటినన్నిటిని వృష్ణి వంశస్థుల పురోహితుడు కాశ్యపుడు తీసుకువెళ్లి పాండురాజు కిచ్చినాడు. చౌలోపనయనాలు, ఉపాకర్మలు, వేదాధ్యయనాలు, క్షత్రియోచిత విద్యలు పృషత్కుని కుమారుడైన శకుడి వద్ద నేర్చుకున్నారు. **అర్జునుడికి పధ్నాలుగేళ్లు నిండాయి.** బ్రాహ్మణ భోజనాల ఏర్పాట్లు చేస్తూ కుంతీదేవి తీరిక లేకుండా ఉన్నది.

విధి ప్రేరితుడై, కామమోహితుడైన పాండురాజు తన భార్య మాద్రిని బలవంతంగా కలిసాడు. అతడి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసాయి. మాద్రి పాండురాజుతో సహగమనం చేసింది.

ఆ అస్థికలను తీసుకుని శతశృంగ నివాసులు కుంతిదేవిని, పంచ పాండవులను వెంటబెట్టుకుని కురుజాంగాలపు వర్ధమాన మను పేరుగల నగర ద్వారం వద్ద ఆగి కురుప్రభువునకు వర్తమానం పంపారు.

## హస్తినకు చేరిన పాండు కుమారులు

పాండురాజు, మాద్రి చనిపోయిన 17 రోజులకల్లా హస్తినాపురికి చేరుకున్నారు శతశృంగ నివాసులైన చారణులు, మహర్షులు వేలాదిగా కుంతీదేవిని, పాండవులను వెంటబెట్టుకుని. విషయం తెలిసిన రెండు ఘడియలలోపే హస్తినాపుర వాసులూ, భీష్మ, సోమదత్త, బాహ్లిక, ధృతరాష్ట్ర, విదుర, సత్యవతి, కౌసల్య, గాంధారి, కౌరవులు నూరుగురు పురోహితులతో సహా వచ్చి మునులకు నమస్కరించారు.

**పృథాం చ శరణం ప్రాప్తాం పాండవాంశ్చ యశస్వినః**
**యధా వదను గృహ్ణంతు ధర్మోహ్యేష సనాతనః**

పాండురాజు-మాద్రి అస్థికలను, కుంతీదేవిని, పాండవులను ధృతరాష్ట్రాది పెద్దల కప్పగించి శతశృంగ నివాసులు అదృశ్యమైనారు.

తన కుమారుడి అస్థికలను చూసిన అంబాలిక దుఃఖానికి అంతులేదు. ఔర్ధ్వ దైహిక క్రియలు, జలాంజలులు పూర్తిచేసి పాండవులు పన్నెండు రోజులు నేలమీదనే శయనించారు. హస్తినాపురమంతా శోకసాగరంలో మునిగి అస్వస్థతకు లోనయ్యింది.

వ్యాసుడు దుఃఖ శోకాతురయై నిశ్చేతనలో ఉన్న తన మాతృమూర్తి సత్యవతితో అన్నాడు-

**అతిక్రాంత సుఖాః కాలాః పర్యుపస్థితి దారుణాః**
**శ్వః శ్వః పాపిష్ఠి దివసాః పృథివీ గతయో వనా** (ఆది. 127-6)

అమ్మా! గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్

**బహు మాయా సమాకీర్ణః నానా దోష సమాకులః**
**లుప్తధర్మ క్రియాచారః ఘోరః కాలో భవిష్యతి** (ఆది. 127-7)

సత్యవతీదేవి తన కోడళ్లయిన అంబిక, అంబాలికలతో చర్చించి ముగ్గురూ కలిసి అరణ్యాలకు వెళ్లి ఘోర తపసు చేసి శరీరాలను విడిచి అభీష్టగతులను పొందినారు.

## వీళ్లు అయిదుగురు - వాళ్లు నూరుగురు

నూటొక్కమంది ధార్తరాష్ట్రులను (వందమంది కౌరవులు, యుయుత్సుడు) భీముడొక్కడే లొంగదీసేవాడు. ఆటలలో అతడే మేటి. పదిమందిని ఒక్కడే పడవేసి లాగేవాడు. జలక్రీడలప్పుడు నీళ్లలో ముంచేవాడు. చెట్లెక్కితే కాలితో తన్నేవాడు, మొదలు పట్టుకు ఊపితే పళ్లు రాలినట్లు కౌరవులు రాలిపడేవారు. అన్ని ఆటలలోనూ అతడిదే పైచేయి. ఇది రోజులు గడచినకొద్దీ కౌరవులకు కంటగింపుగా మారింది. ద్రోహచింతన లేని బాల్యచేష్టలను విరోధి చేష్టలుగా భావించి దుర్యోధనుడు ఒక నిశ్చయానికి వచ్చాడు. భీమసేనుడు నిద్రించే సమయంలో పట్టుకుని గంగానదిలో పడవేసి, తరువాత యుధిష్ఠిరుడిని, అర్జునుడిని బంధిస్తే ఈ భూమి అంతా నాపరమవుతుంది -అనుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నాడు.

గంగా తీరంలో ప్రమాణకోటి అని పేరుగల తీర్థంలో గుడారాలు వేయించి, భోజనాలు ఏర్పాటుచేసి, రాకుమారు లందరూ 'ఉదకక్రీడన' ఉత్సవాలకు బయల్దేరారు. ఆ ఉద్యానవనం చేరుకుని ఎంతో ఉల్లాసంగా కాలం గడిపారు.

భీముడిని చంపదలచిన దుర్యోధనుడు భక్ష్యాలలో కాలకూట విషాన్ని కలిపి తానే స్వయంగా భీముడికి అందించాడు.

**స్వయముత్థాయ చైవాథ హృదయేన క్షురో పమః**
**స వాచామృత కల్పశ్చ భ్రాతృ వచ్చ సుహృత్ యథా**

కత్తిలాంటి మనసు, అమృతం లాంటి వాక్కుతో దుర్యోధనుడు భీముడి చేత విషాహారాన్ని తినిపించాడు.

ఆ తరువాత ఆటపాటలాడి విశ్రమించిన భీముడి కాళ్లూ చేతులు కట్టి నీళ్లలో పడవేశాడు దుర్యోధనుడు తన సోదరులతో కలిసి.

ఆ నిశ్చైతన్యస్థితిలోనే భీముడు నీటిలో మునిగి పాతాళలోకం చేరినాడు. అతడి శరీరపు బరువుకు నాగకుమారులు నలిగిపోయి కోపంతో అతడిని కరిచారు. భీముడి శరీరంలోని స్థావర విషం, నాగుల జంగమ విషం వల్ల నశించగా భీముడు మేల్కొని కట్లు తెంపుకున్నాడు. అతడికి నాగులకు మధ్య కొట్లాట జరుగుతుంటే వాసుకి, ఆర్యకుడు అనే నాగుల పెద్దలు చూసారు.

ఆర్యకుడు భీముని గుర్తుపట్టినాడు. ఆర్యకుడు పృథ (కుంతి) తండ్రి శూరసేనుడికి తాత (మాతామహుడు). శూరసేనుడి తల్లి, భార్య నాగకన్యలే. (ఆర్యకుడు→కుమార్తె→శూరసేనుడు→కుంతి). వాసుకి ప్రేమతో భీమునికి వేయి ఏనుగుల బలమిచ్చే రసాయనాన్ని ఎంత తాగగలిగితే అంత తాగనిచ్చాడు. ఎనిమిది కుండల రసాన్ని త్రాగి సుఖంగా నిద్రపోయాడు భీముడు. ఎనిమిదవ రోజున నిద్రలేచి విషహరమైన పరమాన్నాన్ని తిని నాగులందరూ ఆశీర్వదించగా, నాగుల సాయంతో భూమిపైకి వచ్చి, వాళ్లు వెళ్లిపోయినాక వనం నుంచి ఇంటికి వచ్చి తనకోసం దుఃఖిస్తున్న తల్లిని, సోదరులను చేరుకున్నాడు భీముడు.

విదురుడి సలహాతో ఏమీ ఎరుగనట్లే కౌరవులతో యథావిధిగా ప్రవర్తిస్తున్నారు పాండవులు. మరోసారి కాలకూట విషం కలిపిన భోజన పదార్థాలు తినిపించాడు దుర్యోధనుడు. యుయుత్సుడు ముందే హెచ్చరించినా తిన్నాడు భీముడు. విషం అరిగిపోయింది.

అప్పటికే దుర్యోధనుడికి తోడైనారు కర్ణుడు, శకుని.

ధృతరాష్ట్రుడు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడానికి గౌతమ గోత్రీయుడైన కృపాచార్యుడిని నియమించాడు.

## రెల్లుపొదలలో దొరికిన కవలలు

గౌతమ మహర్షి కుమారుడు శరద్వంతుడు. ఇతడికి ధనుర్వేదంపై మక్కువ ఎక్కువ. తపస్సు చేత, ధనుర్విద్య చేత ఇంద్రుడికే భయం కలిగేట్లు చేసాడు. దానితో ఇంద్రుడు 'జానపది' అనే అప్సరసను పంపినాడు. ఆమెను చూసేసరికి రేతం పతనమైంది రెల్లుపొదలలో శరద్వంతుడికి. ఆ వీర్యం రెండు భాగాలై ఇద్దరు పిల్లలు పుట్టారు.

శంతన మహరాజు వేటకు వచ్చి ఆ పిల్లలను చూసి కృపతో పెంచినాడు. అందుకే వారి పేర్లు కృపుడు, కృపి. కృపుడు కాస్త పెద్దవాడైనాక శరద్వంతుడు అతడిని కలిసి జన్మరహస్యాన్ని, ధనుర్విద్యను (ముక్త, అముక్త, ముక్తాముక్త, మంత్రముక్తమనే భాగాలున్న ధనుర్వేదం) తెలిపినాడు.

కృపాచార్యుడు ఆ విధంగా ధనుర్వేద విద్యావిశారదుడై కౌరవ పాండవ యాదవులకు గురువైనాడు. తన సోదరి 'కృపి'ని ద్రోణునకిచ్చి వివాహం చేసాడు. ద్రోణుడు-కృపిల కుమారుడు అశ్వత్థామ. పుట్టగానే గుర్రం సకిలించినట్లు ఏడవడం చేత అతడికి 'అశ్వత్థామ' అనే పేరు వచ్చింది.

ఒకప్పుడు గంగాతీరంలో పూజనీయుడైన భరద్వాజుడు వ్రతదీక్షలో ఉన్నపుడు 'ఘృతాచి' అనే అప్సరసను చూసాడు. అతడికి వీర్యపతనం కాగా వీర్యాన్ని కలశంలో ఉంచి సంరక్షించగా కలశజుడై జన్మించాడు ద్రోణుడు. భరద్వాజుడు, అగ్నివేశునికి, అగ్నివేశుడు ద్రోణుడికి ఆగ్నేయాస్త్రాన్ని బోధించారు.

పృషతుడనే పాంచాలరాజు భరద్వాజుని మిత్రుడు. ఆయన కుమారుడు ద్రుపదుడు. ద్రుపదుడు, ద్రోణుడు చిన్నప్పుడు కలిసి చదువుకున్నారు, ఆడుకున్నారు. భరద్వాజుడు మరణించాక ద్రోణుడు ఆ ఆశ్రమంలోనే ఉండి తపస్సు చేసినాడు. పృషతుడు చనిపోయాక ద్రుపదుడు పాంచాల రాజైనాడు.

ద్రోణుడు పరశురాముని వద్దకు వెళ్లి ధనాన్ని యాచించాడు. ధనం లేనందువల్ల పరశురాముడు ద్రోణునికి దివ్యాస్త్రాలనిచ్చినాడు.

## ద్రోణుడు - ద్రుపదుడు

ధనుర్విద్యా విశారదుడు, దివ్యాస్త్ర సంపన్నుడు అయినప్పటికీ ద్రోణుడు నిరుపేదగా ఉన్నాడు. అశ్వత్థామకు ఆహారంగా పాలు కూడా కొనలేని పరిస్థితి. గంపెడాశతో వెళ్లి తన పూర్వమిత్రుడైన ద్రుపదుడిని అర్థించాడు. ఇప్పుడు ద్రుపదుడు రాజు. మిత్రుడిని కదా సాయం చేయమంటే ద్రుపదుడన్నాడు

**న దరిద్రో వసుమతః నా విద్వాన్ విదుషః సఖా**
**న శూరస్య సఖా క్లీబః సఖిపూర్వం కిమిష్యతే** (ఆది. 130-9)

గత మైత్రి ఇప్పుడెందుకు? పేదలు, ధనికుల మధ్య స్నేహముండదు అని తిరస్కరించేసరికి దుఃఖితుడై ద్రోణుడు హస్తినకు వచ్చాడు తన భార్య సోదరుడైన కృపాచార్యుడి వద్దకు.

ఆ సమయంలో హస్తినాపురం బయట కౌరవ పాండవులు గూటి-బిళ్ల ఆడుతుంటే 'బిళ్ల' నూతిలో పడిపోయింది. అటుగా వచ్చిన ద్రోణుడు, తన ఉంగరాన్ని కూడా నూతిలో పడవేసి ముందుగా బిళ్లను, తరువాత ఉంగరాన్ని బాణాల తరువాత బాణాలు వదిలి తాడుగా చేసి పైకి లాగినాడు.

ఆ విషయం తెలిసి భీష్ముడు స్వయంగా వచ్చి ద్రోణుని అర్థించాడు కౌరవ పాండవులకు గురువుగా ఉండమని.

అంగీకరించిన ద్రోణుడు కౌరవ పాండవులకు ధనుర్విద్య నేర్పుతున్నాడు. ఆ విషయం తెలిసి వృష్ణి, అంధక వంశస్థులు, అనేక దేశాల రాకుమారులు, సూతపుత్రుడైన కర్ణుడూ ద్రోణుడికి శిష్యులైనారు. కర్ణుడు ఎప్పుడూ అర్జునుడితో పోటీపడుతూ, దుర్యోధనుని పక్షాన చేరి పాండవులను అవమానపరుస్తూ ఉండేవాడు.

ఒకరోజున ద్రోణుడడిగాడు శిష్యులందరినీ- "మీ అస్త్రవిద్యలు ముగిసిన పిమ్మట నాకు ఓ పని చేసిపెట్టాలి. ఎవరు చేస్తారు?" అని అడిగాడు. కౌరవులు మౌనంగా ఉండిపోయారు. అర్జునుడు గురుకార్యాన్ని నెరవేరుస్తానని ప్రతిజ్ఞ చేసాడు. ఆ విధంగా మొదలైంది ద్రోణార్జునుల గురుశిష్య బంధం.

అప్పుడే మొదలయ్యింది ద్రోణ-ద్రుపద వైరం.

## అర్జునుడు-ద్రోణుడు-ఏకలవ్యుడు

తన కుమారుడితో పాటు రాకుమారులందరికీ ధనుర్విద్య నేర్పుతున్నాడు ద్రోణుడు. అయితే స్వంత కొడుకు కదా అశ్వత్థామ అందుకే అతడికి కొన్ని మెలకువలు ఎక్కువ నేర్పేవాడు ద్రోణుడు.

అర్జునుడు వాటిని కూడా నేర్చుకోవడానికి తన ప్రయత్నాలు తాను చేసేవాడు. ద్రోణుడు శిష్యులందరికి కమండలాల నిచ్చేవాడు నీరు తేవడానికి. అశ్వత్థామకు కుండనిచ్చేవాడు. త్వరగా కుండ నింపుకుని వచ్చిన అశ్వత్థామకు కొత్త విషయమేదో నేర్పేవాడు ద్రోణుడు. అర్జునుడు దానిని గమనించి వారుణాస్త్రంతో తన కమండలం నింపుకుని అశ్వత్థామతో పాటే ద్రోణుని వద్దకు వచ్చేవాడు. కాబట్టి అశ్వత్థామ, అర్జునుడు సమానంగా నేర్చుకున్నారు ధనుర్వేద రహస్యాలు.

ద్రోణుడు వంటవాడిని పిలిచి ఆజ్ఞాపించాడు అర్జునుడికి చీకటిలో అన్నం పెట్టవద్దని. అయినా ఒకరోజున అర్జునుడు అన్నం తినేప్పుడు దీపం ఆరింది. చీకట్లో అన్నం తినగలుగుతున్నపుడు బాణాలు ఎందుకు వేయకూడదు –అనుకుని అర్జునుడు కటిక చీకటిలో కూడా గురితప్పకుండా బాణాలు వేయడం సాధన చేసాడు. అది చూసి ద్రోణుడు మరింత సంతోషించాడు.

**ప్రయతిష్యే తథా కర్తుం యథా నాన్యో ధనుర్ధరః**
**త్వత్సమో భవితా లోకే సత్యమేతద్ బ్రవీమితే**

"విలువిద్యలో మరెవ్వరూ నీకు సమానులుగా కూడా నిలువరు" అన్నాడు ద్రోణుడు. అని పలికి అర్జునుడికి నేర్పాడు– గుర్రాలపై, రథాలపై, ఏనుగులపై ఉండి ఎలా బాణాలు వేయాలో, ఆయుధాలు ప్రయోగించాలో.

ద్రోణుడి కీర్తి నలుదిక్కులా పాకి అనేక వేలమంది రాకుమారులూ, రాజులూ ధనుర్విద్య నేర్చుకోవడానికి వచ్చారు. ఒకరోజున నిషాదరాజైన హిరణ్యధన్వుని కొడుకు ఏకలవ్యుడు ద్రోణుని దగ్గరకు వచ్చాడు. అతడు బోయవాడన్న కారణంగా ద్రోణుడు అతడిని శిష్యుడిగా అంగీకరించలేదు.

అయినా, ఏకలవ్యుడు అడవిలో ద్రోణుడి మట్టిప్రతిమను చేసి, దానిని ఆచార్యుడిగా భావించి ధనుర్విద్యను అభ్యాసం చేయసాగినాడు.

కౌరవ పాండవులొకనాడు వేటకు వెళ్లారు. వారితోపాటు వచ్చిన కుక్క ఒకటి ఒకచోట ఆగి మొరుగుతున్నది. దానిని చూసి ఏకలవ్యుడు ఒకేసారి 7 బాణాలు వేసి దాని ముఖాన్ని గాయపరచాడు. అది ముఖం నిండా బాణాల్తో రాకుమారుల వద్దకు వచ్చింది. వారు బాణాలు వేసిన వ్యక్తిని ఏకలవ్యుడిగా గుర్తించారు.

అర్జునుడు ఆ విషయాన్ని గురువుతో చెప్పాడు– "అతడు నన్నూ, లోకాన్నీ మించిన వీరుడు".

అర్జునుడిని వెంటబెట్టుకుని అడవిలో ధనుర్విద్య అభ్యాసం చేస్తున్న ఏకలవ్యుడి దగ్గరకు వెళ్లాడు ద్రోణుడు. గురువుకు పాదాభివందనం చేసి నిలబడినాడు ఏకలవ్యుడు.

"నీవు నిజంగా నా శిష్యుడివే అయితే నీ కుడిచేతి బొటనవ్రేలు నాకు దక్షిణగా ఇమ్ము!" అన్నాడు ద్రోణుడు. ఇచ్చాడు ఏకలవ్యుడు ఏమాత్రం సంకోచించకుండా. బొటనవ్రేలు లేకున్నా బాణాలు విడిచే పద్ధతి నేర్పినాడు ఏకలవ్యుడికి ద్రోణుడు. ఇప్పుడిక అర్జునుడికి పోటీ లేదు. ద్రోణుడు సత్యవచనుడైనాడు.

దుర్యోధన భీములు గదాయుద్ధంలో, నకుల సహదేవులు కత్తియుద్ధంలో, ధనుర్విద్యా రహస్యాలలో అశ్వత్థామ, రథం మీద నిలబడి యుద్ధం చేయడంలో యుధిష్ఠురుడు, అన్ని విద్యలలో అర్జునుడు, నేర్పు గడించారు.

ఒకరోజున ఓ చెట్టుపై గ్రద్ద బొమ్మనుంచి ద్రోణుడు తన శిష్యుల లక్ష్యశుద్ధిని పరీక్షించాడు. అర్జునుడు ఒక్కడే గ్రద్ద కంటిని మాత్రం చూసాడు. అతడు బాణం విడవగా అది గ్రద్ద బొమ్మను నేలకూల్చింది. ద్రోణునికి నమ్మకం కలిగింది అర్జునుడు తన శత్రువైన మిత్రుడు ద్రుపదుడిని ఓడించగలడని.

ఒకసారి ద్రోణుడు మొసలిబారిన పడితే మిగతా శిష్యులు దిక్కుతోచనివారైనారు. అర్జునుడు అయిదు వాడి బాణాలతో మొసలిని చంపి ద్రోణుడిని రక్షించాడు.

అప్పుడు ద్రోణుడు అర్జునుడికి బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ఇచ్చి దాని ప్రయోగ ఉపసంహారాలను నేర్పినాడు. ప్రబలుడైన శత్రువు మీదనే ఈ అస్త్రాన్ని ప్రయోగించాలి. అల్పులపై ప్రయోగిస్తే ఆ అస్త్రం లోకసంహారం చేస్తుంది.

ఆ విధంగా అర్జునుడు లోకంలో మేటి విలుకాడైనాడు.

## రాజకుమారాస్త్ర విద్యా ప్రదర్శనం

రాకుమారుల విద్యాభ్యాసం పూర్తి అయ్యింది. పెద్దలందరూ కూర్చుని ఉన్నపుడు ద్రోణుడు ధృతరాష్ట్ర మహరాజుతో అన్నాడు–

**రాజన్ సంప్రాప్త విద్యాస్తే కుమారాః కురుసత్తమ**
**తే దర్శయే యుః స్వాం శిక్షాం రాజన్ననుమతే తవ!**

రంగస్థలం, ప్రేక్షాగృహం, మైదానం సిద్ధమయ్యింది. భీష్మ, బాహ్లిక, సోమదత్త, భూరిశ్రవసులు, గాంధారి, కుంతీదేవి తదితర అంతఃపుర స్త్రీలు, మంత్ర సామంతులు, హస్తినాపుర ప్రజలు తమకు కేటాయించిన స్థానాల్లో కూర్చున్నారు. ధృతరాష్ట్రుడు వచ్చి సువర్ణమణిపుష్పాలను, వివిధ వస్త్రాలను దక్షిణగా ద్రోణ కృపులకిచ్చాడు.

**తతః శుక్లాంబరధరః శుక్లయజ్ఞోపవీతవాన్**
**శుక్లకేశః సితశ్మశ్రుః శుక్ల మాల్యాను లేపనః–**

తెల్లని దుస్తులు ధరించిన ద్రోణుడు తన కుమారుడైన అశ్వత్థామతో రంగస్థలం మధ్యన నిలబడినాడు. రాకుమారులు వచ్చారు

**తతో బద్ధాంగులి త్రాణాః బద్ధ కక్షా మహారథాః**
**బద్ధతూణాః స ధనుషః వివిశుర్భరతర్షభాః** (ఆది. 133–23)

ఆ వీరులంతా వ్రేళ్ల తొడుగులను ధరించి, నడుం బిగించి, అమ్ములపొదులను ధరించి, ధనుస్సులు చేతబట్టి, పెద్దపెద్ద రథాల్లో రంగస్థలానికి వచ్చారు. గురువులకు నమస్కరించారు.

రక్తచందనంతో కూడిన పూలతో అస్త్రశస్త్రాలను అర్పించారు.

రాకుమారులందరూ అద్భుతంగా తమతమ విద్యలను ప్రదర్శించారు. ధృతరాష్ట్రుడికి విదురుడు, గాంధారికి కుంతీదేవి క్రీడావిశేషాలను వివరిస్తున్నారు.

సుయోధనుడు, భీమసేనుడు గదాయుద్ధంలో తమ ప్రతిభను చూపిస్తుంటే ప్రేక్షకులు కూడా రెండు వర్గాలుగా చీలిపోయారు. వారిలో పొంగుతున్న ఉద్రేక, ఆవేశాలను గమనించి ద్రోణుడు, అశ్వత్థామతో చెప్పి ఇరువురిని శాంతింపచేసి, ఇద్దరినీ మెచ్చుకున్నాడు.

అప్పుడు అర్జునుడు వచ్చి దివ్యాస్త్ర ప్రదర్శన చేసి సభికులను సమ్మోహనపరచాడు. జనులంతా సమ్మోహితులై చూస్తున్న క్షణాన ద్వారదేశం వద్ద జబ్బ చరచిన చప్పుడైంది. అందరూ అటువేపు చూసారు.

**సహజం కవచం బిభ్రత్ కుండలోద్యోతి తాననః**
**సధనుర్బద్ధనిస్త్రింశ పాదచారీవ పర్వతః**

కదిలివస్తున్న కొండలా ఉన్నాడు– ఇతడెవరు? అని అందరూ చూస్తుండగానే కర్ణుడు అర్జునుడితో అన్నాడు– "నీవు చేసినవి, వీటికన్నా గొప్ప విన్యాసాలు, విశేషాలు నేను ప్రదర్శించగలను. నీవు గర్వపడకు".

భీముడికి తాను జవాబు చెప్పగలడు. అర్జునుడి పోటీగా తనవాళ్లలో ఎవరూ లేరే అని చింతిస్తున్న దుర్యోధనునిలో ఆనందం వెల్లువలా ప్రవహించింది.

ద్రోణుని అనుమతితో కర్ణుడు కూడా అర్జునుడు ప్రదర్శించిన విద్యలన్నిటినీ ప్రదర్శించి 'భేష్' అనిపించుకున్నాడు. దుర్యోధనుడు కర్ణుని కౌగిలించుకుని అన్నాడు–

**స్వాగతం తే మహాబాహో దిష్ట్యా ప్రాప్తో సి మానద**
**అహం చ కురు రాజ్యం చ యథేష్ట ముపభుజ్యతామ్**

కర్ణుడన్నాడు– "ప్రభూ నేను కోరేది తమతో మైత్రి. అర్జునుడితో ద్వంద్వయుద్ధం".

## అర్జునుడు-కుంతి-కర్ణుడు

అర్జునుడన్నాడు–

**అనాహుతోప సృష్టానామ్ అనాహుతోప జల్పినామ్**
**యే లోకాస్తాన్ హతః కర్ణ మయాత్వం ప్రతిపత్స్యసే** (ఆది. 135–18)

"పిలవని పేరంటానికి వచ్చేవారు, అడగకుండా మాట్లాడేవారు ఏ లోకాలకు పోతారో నీవూ ఆ లోకానికే పోతావు".

కర్ణుడన్నాడు– "ఈ రంగస్థలం వీరులందరికీ చెందినది. ఆకాశంలో మేఘాలు, ఇంద్రధనుస్సు, సూర్యుడిని కప్పివేసాయి. సూర్యుడు కూడా తన దగ్గరకు వచ్చిన మేఘాలను నశింపచేసాడు".

కర్ణుడివేపు ధృతరాష్ట్రుడి కొడుకులంతా నిలిచారు.

అర్జునుడి వేపు పాండవులు, భీష్మ, ద్రోణ, కృపులు నిలిచారు.

ప్రేక్షకులు, స్త్రీలతో సహా రెండు వర్గాలుగా చీలిపోయారు. కుంతీదేవి ఆ ఇద్దరూ తన కుమారులేనన్న వాస్తవాన్ని గుర్తించి మూర్ఛపోయింది. విదురుడు నీళ్ల చిలకరించి ఆమెను తెప్పరిల్లజేసినాడు. వారిమధ్య పోరాటాన్ని తానెలా ఆపగలదు?

కృపుడన్నాడు– "ఇతడు కుంతి చిన్నకొడుకు పాండునందనుడు, కురువంశస్థుడు. నీవు నీ తల్లిదండ్రుల పేర్లు, వంశ నామం చెప్పి ద్వంద్వయుద్ధం చేయవచ్చు".,

కర్ణుడు తలవంచుకునేసరికి దుర్యోధనుడన్నాడు– "ఉత్తమకుల సంజాతుడు, శూరుడు, సేనాధిపతి ముగ్గురూ రాజులే. ఈ అర్జునుడు రాజు కాని వానితో యుద్ధం చేయకపోతే నేను ఇప్పుడే ఇతడిని అంగరాజుగా అభిషేకిస్తాను" అన్నాడు. వెంటనే అవసరమైన సామాగ్రి తెచ్చి కర్ణుడిని అంగరాజుగా చేసాడు.

అది చూసి కర్ణుడి పెంపుడు తండ్రి అతిరథుడు ఎంతో ఆనందంతో వచ్చి కర్ణుడిని కౌగిలించుకుని "కుమారా!" అని పిలిచాడు.

భీముడన్నాడు– "సూతపుత్రా! అర్జునుడి చేతిలో చావడానికి కూడా నీకు అర్హత లేదు. అంగరాజ్యం నీకెందుకు? యాగంలో అగ్నికి దగ్గరున్న పురోడాశం కుక్కకెందుకు?"

దుర్యోధనుడన్నాడు– "వృకోదరా, ఇలా మాట్లాడడం నీకు తగదు.

**క్షత్రియాణాం బలం జ్యేష్ఠం యోద్ధవ్యం క్షత్ర బంధునా**
**శూరాణాంచ నదీనాం చ దుర్విదాః ప్రభవాః కిల**

## శూరుల పుట్టుక, ఏరుల పుట్టుక ఎరుగ తగునే!

దుర్యోధనుడన్నాడు భీమసేనుడినుద్దేశించి–

క్షత్రియులకు బలమే ప్రధానం. ఎవరితోనైనా పోరాడవలసిందే. శూరుల పుట్టుక, ఏరుల పుట్టుక తెలియడం చాలా కష్టం.

అగ్ని నీటి నుంచి, వజ్రాయుధం వెన్నెముక నుంచి పుట్టినాయి.
స్కందుడు– అగ్ని, కృత్తిక, రుద్రుడు, గంగల కొడుకు
బ్రాహ్మణులు క్షత్రియులకు, క్షత్రియులు బ్రాహ్మణులకు పుట్టారు.
ద్రోణుడు కలశజుడు, కృపాచార్యుడు రెల్లుపొదలో జన్మించాడు.
మీ సోదరుల పుట్టుకలు మీకు, మాకూ తెలుసు

కర్ణుడు సూతకులంలో పుట్టలేదు. ఇతడు పెంపుడు కొడుకు.

ఇతడు అంగ దేశానికి కాదు, భూమి మొత్తానికి రాజు కావాల్సినవాడు. ఎవరికైనా నేను చేసిన ఈ పని నచ్చకపోతే రథమెక్కి విల్లు ఎక్కుపెట్టవచ్చు. పాదచారులుగా యుద్ధం చేయవచ్చు.

ఇంతలో సూర్యుడస్తమించాడు.

కర్ణుడి చేతివేళ్లను పట్టుకుని దుర్యోధనుడు రంగస్థలం నుంచి నిష్క్రమించాడు తన సోదరులు వెంటరాగా.

కర్ణుడి చేరికతో దుర్యోధనుడి భయం పోయింది.

కర్ణుడిని చూసాక ధర్మరాజులో భయం పెరిగింది.

కర్ణుడిని, అర్జునుడిని ఆ స్థితిలో చూసాక కుంతి మనసులో ఆనందం, భయం రెండూ కలిగాయి. ఆమె కర్ణుడిని గుర్తించి ఆనందించింది.

**కుంత్యాశ్చ ప్రత్య భి జ్ఞాయ దివ్యలక్షణ సూచితమ్**
**పుత్రమంగేశ్వరం స్నేహాత్ ఛన్నా ప్రీతి రజాయత** (ఆది. 136-23)

## ద్రుపదుని ఓటమి - ద్రోణుడు గెలిచిన రాజ్యం

"ద్రుపదుని బంధించి నాకప్పగించడమే మీరు నాకిచ్చే గురుదక్షిణ" అన్నాడు ద్రోణుడు తన శిష్యులతో.

"అలాగే" అని పలికి దుర్యోధన, కర్ణ, యుయుత్స, దుశ్శాసన, వికర్ణ, జలసంధాదులు ద్రుపదుని రాజధాని వేపు దూసుకుపోయారు సమస్త సైన్యంతో. ద్రుపదుడు తన సోదరులతో కలిసి కౌరవుల నెదుర్కొన్నాడు. యుద్ధం తీవ్రమైంది. ద్రుపదుడి దెబ్బకు కౌరవుల కాంతి తగ్గిపోయింది. కర్ణుడు, కౌరవులు వెనుకంజ వేసారు.

ధర్మరాజును ఆపి భీమార్జున నకుల సహదేవులు రంగంలోకి దిగారు. భీముడు తన గదతో వీరవిహారం చేసి ద్రుపదుడి ఏనుగులు, రథాలను తుక్కుతుక్కు చేసాడు. అర్జునుడు ద్రుపదుడిని బాణాలతో కప్పివేసాడు. అతడి సోదరుడు సత్యజిత్తును పారద్రోలి, ద్రుపదుడి రథంపైకి దూకి 'పామును పట్టిన గరుత్మంతుడిలా' అర్జునుడు ద్రుపదుడిని బంధించి తెచ్చి ద్రోణుని ముందు పడవేసినాడు.

ద్రుపదుడిని చూసి ద్రోణుడన్నాడు- "యజ్ఞసేనా, రాజు కానివాడు రాజుకు మిత్రుడు కాలేడన్నావు కదా! అందుకే నేను నీ రాజ్యాన్ని పొందాను. ఇకనుంచి భాగీరథి నదికి దక్షిణ భాగానికి నీవు రాజువు. ఉత్తర భాగానికి నేను రాజును. నాతో స్నేహంగా ఉండు. అందుకే నేను నీకు అర్ధరాజ్యమిస్తున్నాను".

ద్రుపదుడన్నాడు- "నీ ఔదార్యం గొప్పది. నీతో శాశ్వత మైత్రిని అభిలషిస్తున్నాను" అన్నాడు కాని అహంకారం ఒప్పుకోలేదు.

ఆ తరువాత ద్రుపదుడు చర్మణ్వతీ నదికి దక్షిణ తీరాన ఉన్న మాకందీపురాన్ని, కాంపిల్య నగరాన్ని నివాసంగా ఏర్పాటు చేసుకుని, ద్రోణుడిని ఓడించే శక్తిమంతుడైన పుత్రుడికోసం యోగం చేయ సంకల్పించాడు.

ద్రోణుడు గంగానదికి ఉత్తరము వేపున్న అహిచ్ఛత్ర రాజ్యాన్ని తన పాలనలో నిలుపుకున్నాడు. అలా మొదలయ్యింది ద్రుపద-ద్రోణుల వైరం.

## యుధిష్ఠిరుని యోవ రాజ్యాభిషేకం - ధృతరాష్ట్రుని శోకం

**సంవత్సరం గడిచాక** ధృతరాష్ట్రుడు యుధిష్ఠిరుని యువరాజుగా చేసాడు. యుధిష్ఠిరుడు తన సత్ప్రవర్తనతో ప్రజలందరి ఆదరాభిమానాలు చూరగొన్నాడు.

భీముడు బలరాముడి వద్ద గద, కత్తి, రథ యుద్ధాలు అభ్యాసం చేసాడు.

అర్జునుడు అన్నిరకాల బాణాలను ప్రయోగించడంలో నేర్పరి అయ్యాడు. శిష్యుడికి బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ఇచ్చి ద్రోణుడు గురుదక్షిణ అడిగాడు- "ఒకవేళ నేనెప్పుడైనా నీకెదురు నిలిచి యుద్ధం చేయాల్సి వస్తే నీవు నాతో పోరాడాలి సుమా!". అర్జునుడు మాట ఇచ్చాడు.

నకులుడు కత్తి యుద్ధంలో, చిత్రయుద్ధంలో ప్రసిద్ధికెక్కినాడు.

సహదేవుడు యుద్ధవిద్యలే కాక నీతిశాస్త్రంలో నిష్ణాతుడైనాడు.

యుధిష్ఠిరుడు యువరాజైనాక అర్జునుడు సౌవీర, యవన రాజుల్ని ఓడించాడు. తూర్పు, దక్షిణ దిక్కులనున్న రాజుల్ని ఓడించి కురు రాజధానికి ధనరాశుల్ని తెచ్చాడు.

పాండవుల దినదినాభివృద్ధి తెలిసి ధృతరాష్ట్రుని మనసులో అణచరాని కల్లోలమేదో చెలరేగింది.

అతడు కణికుడనే రాజనీతివేత్తను పిలిచి సలహా అడిగాడు. కణికుడన్నాడు– "నాది కుటిల నీతి. ఇష్టమైతేనే ఆచరించవచ్చు. నన్ను తప్పుపట్టవద్దు. రాజు బాగా వినయశీలుడిలా కనిపించాలి. మనసు కత్తిలా ఉండాలి. ఎంత భీకర కార్యాన్ని తలబెట్టినా చిరునవ్వు నవ్వుతూనే మాట్లాడుతూ ఉండాలి.

**అంజలిః శపథః సాంత్వం శిరసా పాద వందనమ్**
**ఆశాకరణ మిత్యేవం కర్తవ్యం భూతి మిచ్ఛతా** (ఆది. 139–67)

అవసరమైతే చేతులు జోడించాలి, కాళ్లు మొక్కాలి, ఆశ చూపాలి, ఐశ్వర్యాన్ని పొందగోరిన రాజుకు ఇవన్నీ కర్తవ్యాలే!

శత్రువు చిన్నవాడని ఉపేక్షించరాదు. వాడు తాడిచెట్టులా పెరిగి, అడవిలో పుట్టిన అగ్నిలా మహా వినాశనం కలిగిస్తాడు.

## కణిక నీతి - దుష్టచతుష్టయ రీతి

చురకత్తికి పదునుబెట్టి చర్మపు ఒరలో దాచి ఉంచి అవసరమైనపుడు వాడాలి. అదేవిధంగా రాజు సర్వసన్నద్ధుడై ఉండి తగిన సమయం రాగానే శత్రువులను సమూలంగా నాశనం చెయ్యాలి.

**పాండవేషు యథాన్యాయమ్ అన్యేషు చ కురూద్వహ**
**వర్తమానో న మజ్జేస్త్వం తథా కృత్యం సమాచర** (ఆది. 139–90)

పాండవులయినా, వేరే వారయినా ఇది కూట నీతి–కణిక నీతి" అన్నాడు కణికుడు.

## 8) జతు గృహ పర్వము (అధ్యాయాలు-11)

పురజనులు పాండవుల గుణ గణాలను ప్రశంసిస్తూ ధర్మరాజుకు రాజ్యాన్ని అప్పగించే కాలం దగ్గర్లో ఉందని చెప్పుకోసాగినారు. ఆ మాటలు విని తట్టుకోలేక దుర్యోధనుడు వెళ్లి తండ్రితో అన్నాడు– "తండ్రీ! భీష్ముడికి రాజ్యాధికారం అక్కర్లేదు. నీకేమో రాజ్యాధికారం లేదు. ఇప్పుడు ధర్మరాజు రాజైతే నాకెప్పటికీ రాజ్యాధికారం రాదు. ఆ తరువాత నా పిల్లలు, వారి పిల్లలు, వారివారి పిల్లలూ ఇలా మేము రాజ్యాధికారాన్ని కోల్పోతాము. నీవు ముందుగానే రాజ్యాన్ని పొందగలిగితే మాకు రాజ్యం వస్తుంది. ఆ తరువాత లోకులేమీ చేయలేరు".

ధృతరాష్ట్రుడి మనసు రెండు విధాలుగా చీలింది. ఒకపక్క పాండురాజుపై తనకున్న ప్రేమ, అభిమానం, రెండోపక్క కణిక నీతి, కుమారుడి భవిష్యత్ రీతి ధృతరాష్ట్రుడు ఆలోచిస్తుంటే దుర్యోధనుడన్నాడు–

"భీష్ముడు మధ్యస్థుడు; అశ్వత్థామ నా పక్షం అందుచేత ద్రోణుడు తన కుమారుడున్నచోటునే ఉంటాడు. వారున్న చోటునే కృపాచార్యుడుంటాడు. విదురుడు పాండవ పక్షపాతి. అయినా ఆర్థిక ప్రయోజనాల వల్ల మనతోనే ఉంటాడు. అతడొక్కడే ఏమి చేయలేడు. నీవు పాండవులను ఏదో ఒక మిష మీద వారణావతం పంపు. మిగతాది నేను చూసుకుంటాను" అన్నాడు దుర్యోధనుడు.

**పాండవేభ్యో భయం న స్యాత్ తాన్ వివాసయతాం భవాన్**
**నిపుణే నాభ్యుపాయేన నగరం వారణావతమ్** (ఆది. 141–4)

వారణావతం పరమశివుని పుణ్యక్షేత్రమని, అక్కడ జరుగనున్న ఉత్సవాలను చూడడం అదృష్టమని మంత్రులు, ధృతరాష్ట్రుడు చెప్పగా యుధిష్ఠిరుడు కూడా అక్కడకు వెళ్లాలని ఆలోచించి పెద్దల అనుమతి తీసుకున్నాడు.

ఈలోగా దుర్యోధనుడు తనకు నమ్మకస్తుడైన పురోచనుని పంపి నగర సమీపంలో అద్భుత గృహాన్ని జనుము, మద్దిచెట్టు జిగురు, నెయ్యి, నూనె, కొవ్వు, లక్క, వెదురు, గడ్డి, జమ్ము వంటి వస్తువులతో కట్టించి, సకల సౌకర్యాలు ఏర్పరచాడు.

అయితే ప్రజలు ఈ విషయం గురించి రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. విదురుడు పౌరులు వెళ్లిపోయాక పాండవులతో అన్నాడు–

**ప్రాజ్ఞః ప్రాజ్ఞ ప్రలాపజ్ఞః ప్రలాపజ్ఞమిదం వచః**
**ప్రాజ్ఞం ప్రాజ్ఞః ప్రలాపజ్ఞః వచో బ్రవీత్–**

కొత్తచోట జాగ్రత్తగా ఉండాలి. అరణ్యాన్ని దహించే అగ్ని వలన కలుగులో ఎలుకకు భయంలేదు. ఆప్తులు కానివారు ఇచ్చినవి స్వీకరించినపుడు ఏమరుపాటు పనికిరాదు. జాగిలంలా తక్కువ నిద్ర మంచిది. తిరుగుతూ ఉంటే నక్షత్రాలు రాత్రివేళ మార్గాన్ని చూపిస్తాయి–

ధర్మరాజుకు అర్థమయ్యింది విదురుడు చెప్పిన విషయం.

పాండవులు, కుంతీదేవిని తమ నగరంలోకి ఎంతో ఆనందోత్సాహాలతో ఆహ్వానించారు వారణావత ప్రజలు.

పురోచనుడు వారిని లక్క ఇంటిలో ప్రవేశింపజేసినాడు.

ఆ ఇంటిని పరిశీలించి యుధిష్ఠిరుడు భీముడితో అన్నాడు– "ఇది లక్క ఇల్లు. మన సోదరుడు దుర్యోధనుడు మంచి ప్రణాళిక రచించాడు

**జిఘ్రాణో స్య వసాగంధం సర్పిర్జతు విమిశ్రితమ్**
**కృతం హి వ్యక్త మాగ్నేయమ్ ఇదం వేశ్మ పరంతప–** (ఆది. 145–14)

**సంవత్సర కాలం వారణావతంలో ఉండి** పుణ్య కార్యాలు చేస్తూ వేటకు వెళ్లి సురక్షిత ప్రదేశాలను, మార్గాలను అన్వేషిస్తూ కాలం గడిపారు.

ఇంతలో విదురుడు పంపగా ఖనకుడనే వాడు వచ్చి ఇంటి నుంచి సొరంగ మార్గాన్ని నిర్మించాడు ఆవరణాన్ని పరిశుభ్రం చేసే నెపంతో. పాండవులుండే ఇంటి ఎదురుగా పురోచనుడున్నాడు తన జాగ్రత్తలో తాను.

లక్క ఇల్లు పక్కనే దుర్యోధనుని ఆయుధాగారం ఉంది. ఏదైనా అగ్నిప్రమాదం జరిగినా అది ప్రమాదవశాత్తు జరిగిందని చెప్పడానికి వీలైనట్లుగా లక్క ఇల్లు కట్టబడింది.

**కృష్ణపక్షే చతుర్దశ్యాం రాత్రావస్యాం పురోచనః**
**భవనస్య తవద్వారి ప్రదాస్యతి హుతాశనమ్–** (ఆది. 146–4)

కాలచోదితురాలై ఒక బోయస్త్రీ వచ్చింది ఆరోజున కుంతి పెట్టిన భోజనం తిన్నది తన కుమారులు అయిదుగురితో సహా. బాగా మద్యం తాగి ఒడలెరుగని స్థితిలో ఆ గృహంలోనే ఓ పక్కన నిద్రించింది. ఎవరూ చూడలేదు వారిని. భీముడు ముందు పురోచనుడి ఇంటికి నిప్పు పెట్టి, తరువాత లక్క ఇంటి ద్వారానికి మంట అంటించాడు. అగ్నికి వాయువు తోడు కావడం చూసి వెంటనే పాండవులు, కుంతి సొరంగ మార్గాన అడవిలోకి వెళ్లిపోయారు త్వరత్వరగా.

కొద్దిసేపట్లోనే పురోచనుడి ఇల్లు, లక్క ఇల్లు, ఆయుధగృహం మంటల్లో కాలిపోయాయి. చుట్టుపక్కల ప్రజలు మేల్కొని అక్కడకు చేరుకునేసరికి పరిస్థితి చెయ్యిదాటిపోయింది.

పాండవులు అలా అరణ్యాన్ని దాటుతుంటే నిద్ర వచ్చింది భీముడికి తప్ప మిగతావాళ్లకి. వారినందరినీ మోసుకుంటూ భీముడు గంగానదీ తీరాన్ని చేరుకున్నాడు. విదురుడు చెప్పిన చోట వారికోసం ఒక నౌక వేచి ఉన్నది.

అక్కడ ఉన్న నావికుడన్నాడు– "ఇవి విదురుడి మాటలు–

**కక్షఘ్నశ్శిశిరఘ్నశ్చ మహా కక్షే బిలౌకసః**
**న హంతీ త్యేవ మాత్మానాం యోరక్షతి సజీవతి**

అరణ్యాన్ని దహించే అగ్ని వలన కలుగులో ఎలుకకు భయం లేదు" -అని పలికి ఆ నావికుడు పాండవులను నది దాటించి తన దారిన తాను పోయాడు.

వారణావత ప్రజలు దుఃఖహృదయాలతో హస్తినకు కబురు పంపించారు- లక్క ఇల్లు కాలి పాండవులు, కుంతి చనిపోయారు. తానున్న ఇల్లు కాలి పురోచనుడూ మరణించాడు. ఆయుధాగారమూ కాలి బూడిదయ్యింది. అంతా మీరనుకున్నట్లే జరిగింది-

ధృతరాష్ట్రుడు దుఃఖిత హృదయంతో శ్రాద్ధ కర్మలు చేయించి తిలోదకాలిచ్చాడు. విదురుడు కాస్త నటించాడు. భీష్ముడు కూడా దుఃఖిస్తుంటే అతడిని పక్కకు పిలిచి విదురుడు అసలు సంగతి చెప్పినాడు. భీష్ముడు మనశ్శాంతి పొందినాడు.

గంగ ఆవలి ఒడ్డుకు చేరినాక భీముడు మరల నలుగురు సోదరులను, తల్లి కుంతిని మోస్తూ నక్షత్రాల తీరుతెన్నులు చూస్తూ దక్షిణ దిశగా ప్రయాణం సాగించాడు. అడవిలో పోయి పోయి ఉదయం, మధ్యాహ్నం నడుస్తూనే ఉన్నాడు భీముడు. కొద్దిసేపు వారిని మోస్తున్నాడు, కొద్దిసేపు వాళ్లు నడుస్తున్నారు. సాయంకాలమయ్యేసరికి అందరూ అలసిపోయారు. అందరూ వటవృక్షం కింద విశ్రమించారు. కుంతీదేవి అన్నది దాహాన్ని తట్టుకోలేక-

**మాతా సతీ పాండవానామ్ పంచానాం మధ్యతః స్థితా**
**తృష్ణయా హి పరీతాస్మి పుత్రాన్ భృశమథా బ్రవీత్**

"నాకు అయిదుగురు పుత్రులు. వారి మధ్యనే ఉన్నాను. అయినా దాహంతో అలమటిస్తున్నాను". అప్పుడు భీముడన్నాడు-

"అమ్మా! అదుగో అటు కొంగల అరుపులు వినవస్తున్నాయి. ఖచ్చితంగా అక్కడ సరస్సు ఉండే ఉంటుంది" అని పలికి యుధిష్ఠిరుని అనుమతితో చెరువు దగ్గరకు వెళ్లి, నీటిలో స్నానం చేసి, తామరాకుల దోనెలలో నీటిని పట్టి, ఉత్తరీయంలో పెట్టుకుని రెండు క్రోసుల దూరం నడచి వచ్చేసరికి కటిక నేలపై గాఢంగా నిద్రపోతున్నారు సోదరులు, తల్లి కుంతీదేవి.

అతడికి దుఃఖం ముంచుకొచ్చింది.

**ఏకో వృక్షో హి యో గ్రామే భవేత్ వర్ణ ఫలాన్వితః**
**చైత్యో భవతి నిర్జాతిః అర్చనీయః సుపూజితః**

గ్రామంలో ఫలపుష్పభరితమైన ఆకుపచ్చని చెట్టు ఒక్కటే ఉంటే అది పూజింపబడుతుంది. జ్ఞాతులులేని వాడికే గౌరవం దక్కుతుంది.

**బలవంతః సమృద్ధార్థాః మిత్రబాంధవ నందనాః**
**జీవంత న్యోన్య మాశ్రిత్య ద్రుమాః కాననజా ఇవ**

బలవంతులు, వస్తు సంపదలున్నవాళ్లు అరణ్యంలోని చెట్లలా ఒకరినొకరు ఆశ్రయించుకుని కలిసి బ్రతుకుతారు.

అనుకుంటూ భీముడు నీళ్లను జాగ్రత్తగా పక్కనే ఉంచి మెలకువగా కూర్చున్నాడు రావిచెట్టుకింద.

**వయం తు ధృతరాష్ట్రేణ సపుత్రేణ దురాత్మనా**
**వివాసితాన దగ్ధాశ్చ కథంచిత్ దైవ సంశ్రయాత్** (ఆది. 150-36)

ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు జరిపిన కుట్రలో చిక్కుకుని దైవానుగ్రహం వలన తగలబడకుండా బయటపడ్డాము -అనుకున్నాడు భీముడు.

## 9) హిడింబ వధ పర్వము (అధ్యాయాలు-5)

పాండవులు నిద్రిస్తున్న రావిచెట్టుకు దగ్గర్లోనే ఓ మద్దిచెట్టు మీద ఉన్న హిడింబుడనే రాక్షసుడు ఆ ఆరుగురిని చూసాడు. అతడు క్రూరుడు, నరమాంసభక్షకుడు.

**ప్రావృట్ జలధరశ్యామః పిశితేప్సు క్షుధార్దితః**
**లంబస్ఫిక్ లంబ జఠరః రక్తశ్మశ్రు శిరోరుహః**
**మహావృక్ష గల స్కంధః శంకుకర్ణో విభీషణః** (ఆది. 151-2,3,4)

వాడు తన సోదరిని పిలిచి "చాలా కాలానికి నరమాంసం దొరికింది. నిద్రపోతున్నారు వాళ్లు. వాళ్లను చంపి వేడిరక్తం తాగుతాను. వీరిని చంపి తీసుకురా, సుష్టుగా తిని నృత్యం చేద్దాం".

అన్న ఆజ్ఞతో కదిలింది హిడింబ. కాపలాగా నిలుచున్న భీమసేనుడిని చూసింది. గున్నమద్ది చెట్టులా, అందంగా ఉన్నవాడిని చూడగానే అన్న ఆజ్ఞ మరిచి మోహంలో మునిగిపోయింది. అడవిలో ఉండేవారి ఆలోచనలు, అవసరాలు వేరు. అక్కడ బలము ఉన్నవాడిదే రాజ్యం. ఇంతటి బలవంతుడు తనకు భర్త అయితే బాగుండును కదా –అని ఆలోచించింది. మనుష్య రూపంలో భీముడిని సమీపించింది. అతడికి తన మనసును తెలియపరచింది.

ఆలస్యం తాళలేక, ఆకలికి ఆగలేక హిడింబుడు చెట్టు దిగి వచ్చాడు. మానవరూపంలో ఉన్న సోదరిని చూసాడు. అన్నాడు– "దుర్మార్గురాలా! మనిషిని ప్రేమించి మన రాక్షస వంశానికి మచ్చతెస్తావా? కామంతో కళ్లు మూసుకుపోయాయా? వీళ్లను, నిన్ను ఇప్పుడే చంపేస్తాను" అంటూ వారి మీదకు దూసుకువచ్చాడు.

భీముడు హిడింబకు ధైర్యం చెప్పి, తనమీదకు వేగంగా వచ్చిన హిడింబుడిని ఒడిసి పట్టుకుని ఎనిమిది ధనుస్సుల దూరం ఈడ్చుకుపోయాడు నిద్రపోతున్న తల్లికి, సోదరులకు నిద్రాభంగం కలిగించరాదని. ఇద్దరి మధ్య యుద్ధం భయంకరంగా సాగింది.

**తయోః శబ్దేన మహతా విబుద్ధాస్తే నరర్షభాః**
**సహ మాత్రా చ దదృశుః హిడింబా మగ్రతః స్థితామ్** (ఆది. 152–45)

ఆ గర్జనలకు భీముని సోదరులు, తల్లి కుంతీదేవి మేల్కొని తమపక్కనే భయంతో వణుకుతున్న అందమైన కన్యను చూసి ఆశ్చర్యపడినారు. హిడింబ అన్నది– "ఇది హిడింబాసురుడి వనం. నేను అతడి సోదరిని. మిమ్మల్ని చంపి భక్షించాలని నేనిక్కడకు వచ్చి ఆ యువకుడి అందచందాలకు, బలానికి ఆకర్షితురాలినై అతడిని ప్రేమించాను"?

అక్కడ భీమసేనుడు హిడింబుడి మధ్య యుద్ధం అత్యంత భీకరంగా సాగుతున్నది. అర్జునుడన్నాడు– "భీమసేనా! తూరుపు ఎర్రబడుతోంది. పూర్వసంధ్యలో రాక్షసబలం ఇనుమడిస్తుంది. జాగ్రత్త!"

భీముడు అసాధారణమైన బలంతో ఆ రాక్షసుడిని పైకెత్తి గాలిలో తిప్పి నేలపైకి విసిరికొట్టి, మధ్యకు విరిచి చంపినాడు.

హిడింబాసుర వధ అనంతరం పాండవులు అక్కడ నుంచి బయల్దేరినారు. హిడింబ వారిని అనుసరిస్తూ వస్తుంటే భీముడు పొమ్మని గద్దించినాడు. కుంతీదేవిని శరణు వేడింది హిడింబ.

"అమ్మా! నేను రాక్షసబుద్ధి కలదానిని కాను. నాపేరు సాలకటంకటి. నావలన మీకు లాభమే కాని నష్టం ఉండదు". (తెలుగు భారతంలో– కమలపాలిక)

**ఆపత్సు యో ధారయతి ధర్మం ధర్మ విదుత్తమః**
**వ్యసనం హ్యేవ ధర్మస్య ధర్మిణా మాపదుచ్యతే–** (ఆది. 154–14)

**పుణ్యం ప్రాణాన్ ధారయతి పుణ్యం ప్రాణద ముచ్యతే**
**యేన యేనాచరేద్ ధర్మం తస్మిన్ గర్హాన విద్యతే–**

ధర్మానికి అపాయం ధర్మాత్ములకు ఆపద, చేసుకున్న పుణ్యమే ప్రాణాన్ని కాపాడుతుంది. అందుకనే పుణ్యాన్ని 'ప్రాణదం' అన్నారు.

కుంతి ఒప్పుకుంది. యుధిష్ఠిరుడు అంగీకరించాడు కాని అన్నాడు– "పగలంతా భీముడితో విహరించు. కాని, సూర్యాస్తమయం కాకుండా భీముడిని మా దగ్గరకు తీసుకురావాలి".

భీముడన్నాడు– "సుందరీ, నీకు కొడుకు పుట్టేవరకూ మాత్రమే నేను నీతో ఉంటాను".

హిడింబ వారికి శాలిహోత్రుని ఆశ్రమం వద్ద పర్ణశాలలు నిర్మించింది. శాలిహోత్రుడు వీరినాదరించాడు.

హిడింబ భీముని వలన పుత్రుడికి జన్మనిచ్చింది. పెద్దపెద్ద కళ్లు, పెద్ద నోరు, శంకువుల్లాంటి చెవులు, భయంకరమైన స్వరం, వాడి కోరలు, పొడవైన ముక్కు, విశాలమైన వక్షస్థలంలో శత్రుమర్దనుడిగా ఉన్నాడా బాలుడు.

రాక్షసస్త్రీలు గర్భాన్ని ధరించిన వెంటనే ప్రసవిస్తారు. వారు కామరూపులు. ఆకాశగమనం తెలిసినవారు.

**ఘటో హ్యాస్యోత్కచ ఇతి మాతా తం ప్రత్యభాషత**
**అబ్రవీత్ తేన నామాస్య ఘటోత్కచ ఇంతి స్మహ.**

వీడి శిరస్సు జుట్టు లేకుండా ఘటంలా ఉన్నది -అన్నది హిడింబ. దానితో ఆ పిల్లవాడికి ఘటోత్కచుడని పేరు వచ్చింది.

తాను వెళ్లిపోవాల్సిన సమయం వచ్చిందని పలికి హిడింబ ఎప్పుడు స్మరించినా వస్తానని పలికి తన కుమారుని తీసుకుని వెళ్లిపోయిందామె.

**కృత్యకాల ఉపస్థాస్యే పితౄనితి ఘటోత్కచః**
**ఆమంత్ర్య రక్షసాం శ్రేష్ఠః ప్రతస్థే చోత్తరాం దిశమ్‌–** (ఆది. 154-45)

"మీరు పిలిచిన వెంటనే వస్తాను" అని పలికి ఘటోత్కచుడు తన తండ్రుల వద్ద సెలవు తీసుకుని తల్లితో ఉత్తర దిక్కుగా వెళ్లిపోయాడు.

పాండవులు అక్కడ నుంచి అరణ్యాలు దాటుతూ మత్స్య, త్రిగర్త, పాంచాల, కీచక దేశాలు దాటిపోగా ఒకరోజున వ్యాసమహర్షి వారికి కనిపించి ధైర్యాన్నిచ్చాడు. అక్కడ నుంచి పాండవులు ఏకచక్రాపురానికి బయల్దేరినారు.

**ఇహమానం ప్రతీక్షధ్వం ఆగమిష్యామ్య హం పునః**
**దేశకాలౌ విదిత్వైవ లప్స్యధ్వం పరమాం ముదమ్‌** (ఆది. 155-8)

ఇక్కడ ఓ నెలరోజులు గడపండి. తరువాత మళ్లీ కలుద్దామని వ్యాసమహర్షి వెళ్లిపోయాడు.

## 10) బక వధ పర్వము (అధ్యాయాలు-8)

ఏకచక్రపురంలో పాండవులు ఒక బ్రాహ్మణుని ఇంట ఉండి మౌనవ్రతులై భిక్షాటన చేసేవారు. వారిని చూసిన ప్రజలు ఎవరో దివ్యులు ఏదో పనిమీద ఇలా సంచరిస్తున్నారనుకుని పాండవులు భిక్షాటనకు వచ్చే సమయానికి రకరకాల భక్ష్యాలు, భోజ్య పదార్థాలు సిద్ధంగా ఉంచేవారు. వారు తెచ్చిన పదార్థాలను రెండు భాగాలు చేసి ఒక భాగాన్ని భీముడికిచ్చి మిగతా సగాన్ని తల్లితో కలిసి మిగిలిన నలుగురూ తినేవారు.

ఒకరోజున నలుగురు సోదరులు బయటకు వెళ్లారు. భీముడు, కుంతీదేవి ఇంటిలో ఉన్నారు. వారున్న ఇంటి నుంచి రోదనలు వినిపించాయి. ఇంటి యజమాని, యజమానురాలు, కొడుకు, కోడలు, వారి మనమడు (బాలుడు) రోదిస్తూ మాట్లాడుకుంటున్నారు. "నేనంటే నేను వెళ్తా"నంటున్నారు.

కుంతీదేవి కారణమడిగింది– ఏకచక్రాపురాన్నిపుడు బకుడనే రాక్షసుడు తన బంధుమిత్రులతో ఆక్రమించుకున్నాడు. అసలు రాజు బలహీనుడు. అతడు వేత్రకీయ గృహమనే చోట తలదాచుకున్నాడు. దానితో బకుడిని ఏకచక్రాపుర వాసులు ప్రార్థించి ఒక ఒప్పందానికి వచ్చారు. బకుడికి ప్రతిరోజూ బండెడు భోజనం, రెండు దున్నపోతులు, వాటిని తీసుకుపోయే మనిషి ఆహారంగా నిర్ణయించబడినారు. ఈరోజు ఆ ఇంటివారి వంతు వచ్చింది. ఎవరికి వాళ్లు తామే రాక్షసుడికి ఆహారంగా వెళ్తానంటున్నారు. కుంతీదేవి అన్నది భీముడితో

**ఏతావాన్‌ పురుషస్తాత కృతం యస్మిన్‌ న నశ్యతి**
**యావచ్చ కుర్యాదన్యో స్య కుర్యాద భ్యధికం తతః** (ఆది. 156-14)

భీముడిని పంపుతానన్నది కుంతీదేవి ఆ ఇంటి యజమానితో. అతడంగీకరించలేదు. "మీరు మా అతిథులు" అన్నాడు.

**ఆగతస్య గృహం త్యాగః తథైవ శరణార్థినః**
**యాచమానస్య చ వధః నృశంసో గర్హితో బుధైః** (ఆది. 160-10)

కొంతరాత్రి గడిచాక భీముడు ఆహారపు బండి తీసుకుని దున్నపోతుల్ని అదిలిస్తూ ఊరికి రెండు క్రోసుల దూరంలో యమునా నదికి దగ్గర్లో ఉన్న బకుడి గుహవేపు వెళ్లి ఆ రాక్షసుడిని పేరుపెట్టి పిలుస్తూ వాడికి తెచ్చిన తిండిని భీముడే తినసాగినాడు. ఆకలితో కోపంగా ఉన్న రాక్షసుడు మిక్కిలి క్రోధంతో వచ్చాడు. తన ఆహారాన్ని తింటున్న భీముడిని చూస్తే అతడిలో ఆగ్రహం పెల్లుబుకింది.

**మహాకాయో మహావేగః దారయన్నివ మేదినీమ్**
**లోహితాక్షః కరాలశ్చ లోహితశ్మశ్రు మూర్ధజః**

అంతటి భయంకరాకారుడు, చెవుల వరకు నోరు వ్యాపించినవాడు పెదవుల్ని కొరుక్కుంటూ వచ్చి భీముని తిట్టసాగినాడు.

**కో యమన్న మిదం భుంక్తే మదర్థముప కల్పితమ్**
**పశ్యతో మమ దుర్బుద్ధిః యియాసు యమ సాదనమ్** (ఆది. 162-10)

"ఎవడ్రా నువ్వు, నా అన్నం తింటున్నావు" అని భీముడిని చేత్తో కొట్టాడు, పిడికిలి బిగించి గుద్దాడు. భీముడు నింపాదిగా భోజనం ముగించి చేతులు కడుక్కుని యుద్ధరంగంలో నిలబడినాడు.

ఇద్దరూ చెట్లతో, రాళ్లతో కొట్టుకున్నారు. ఇక మల్లయుద్ధం మొదలైంది. కొద్దిసేపటికల్లా బకుడి బలం సన్నగిల్లింది. భీముడు వాడిని భూమి మీదకు విసిరికొట్టి మోకాళ్లతో గట్టిగా పొడిచి నడుం విరగగొట్టి చంపినాడు. రక్తం కక్కుతూ భయంకరంగా అరుస్తూ మరణించిన వాడి శవాన్ని లాక్కువచ్చి ఏకచక్రపురం నగర ద్వారం ముందు పడవేస్తుంటే చూసిన బకాసురుడి బంధుమిత్రులు పారిపోయారు ప్రాణభయంతో. వారిని నరమాంస భక్షణ చేయరాదని హెచ్చరించాడు భీముడు.

**తమద్రికూట సదృశం వినికీర్ణం భయానకమ్**
**దృష్ట్వా సంహృష్ట రోమాణః బభూ వుస్తత్ర నాగరాః** (ఆది. 163-11)

ఏకచక్రపుర ప్రజలు రాక్షసుల బాధ తొలగించినందుకెంతో ఆనందించారు.

## 11) చైత్రరథ పర్వము (అధ్యాయాలు-19)

పాండవులున్న ఇంటికి అతిథిగా వచ్చిన బ్రాహ్మణుడు పాంచాలదేశంలో యజ్ఞసేన కుమారి ద్రౌపదికి స్వయంవరం జరగబోతోందని, ఆమె అగ్నిసంభూత అని చెప్పాడు.

**శ్యామా పద్మపలాశాక్షీ నీలకుంచిత మూర్ధజా**
**తామ్రతుంగ నఖీ సుభ్రూః చారుపీన పయోధరా-**

**మానుషం విగ్రహం కృత్వా సాక్షాదమర వర్ణినీ**
**నీలోత్పల సమో గంధః యస్యాః క్రోశాత్ ప్రధావతి** (ఆది. 166-45,46)

"ఆ అందాల కన్య కృష్ణను అర్జునుడికిచ్చి వివాహం చెయ్యాలనేది పాంచాలరాజు ద్రుపదుడి ఆలోచన. తనను ఓడించిన అర్జునుడిని అల్లుడిగా చేసుకుందామనుకుంటే, పాండవులు లక్కఇల్లు కాలిపోయి మరణించారని తెలిసి ఎంతో దుఃఖపడినాడు" అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

పాంచాల దేశానికి వెళ్దామని కుంతీదేవి అనడంతో పాండవులు తమ ఇంటి యజమానికి కృతజ్ఞతలు తెలిపి ఏకచక్రపురం నుండి కాంపిల్య నగరంవేపు బయల్దేరినారు.

వారు బయల్దేరే ముందు వ్యాసుడు వచ్చి ద్రౌపది పూర్వజన్మను, ఆమె శివుడిని ప్రార్థించి అయిదుసార్లు 'పతి' కావాలనగా వచ్చేజన్మలో నీకు అయిదుగురు భర్తలు లభిస్తారని శివుడు వరమిచ్చాడని -వ్యాసుడు చెప్పినాడు.

వ్యాస మహర్షి వెళ్లిపోయాక పాండవులు ఒక పగలు ఒక రాత్రి ప్రయాణం చేసి సోమాశ్రయ తీర్థాన్ని చేరారు. దానిలో ఒక గంధర్వరాజు తన కాంతలతో జలక్రీడలాడుతున్నాడు. అతడన్నాడు పాండవులతో- "పగటిదినమంతా మానవులు పనులు చేసుకోవడానికి ఇవ్వబడింది. పడమట సంధ్యారాగం ఏర్పడినప్పుడు ఎనభై లవాల కాలం (ఒక లవ = 0.14 సెకండు. ఎనభై లవాలు=11.2 సెకండ్లు) వదలగా మిగిలిన కాలం యక్ష గంధర్వ రాక్షసులది. ఎవరైనా మానవులు మా కాలాన్ని ఆక్రమించదలిస్తే వారిని మేము బంధిస్తాము" అన్నాడు గర్వంతో కూడిన కోపంతో. "నేను గంధర్వరాజు అంగారపర్ణుడను. ఇది గంగాతీరం".

అర్జునుడన్నాడు- "మేము శక్తిసంపన్నులం. ఎప్పుడైనా ఎక్కడికైనా వస్తాం. ఇది గంగానది. ఈ పవిత్రనది ఏడు పాయలుగా- గంగ, యమున, సరస్వతి, రథస్థ, సరయు, గోమతి, గండకిగా చీలి కడలిలో కలుస్తుంది. అయినా నదులపై నీ పెత్తనమేమిటి?"

అంగారపర్ణుడు ధనుస్సు సంధించి బాణాలు వేయగా అర్జునుడు తన చేతిలోని కొరివితో ఆ బాణాలను అడ్డుకుని– బృహస్పతి నుంచి భరద్వాజునికి, భరద్వాజుడి నుంచి అగ్నివేశ్యునికి, అగ్నివేశ్యుడి నుంచి ద్రోణునికి, ద్రోణుడి నుంచి అర్జునుడికి చేరిన ఆగ్నేయాస్త్రాన్ని అభిమంత్రించి అంగారపర్ణుని రథంపైకి ప్రయోగించాడు అర్జునుడు.

రథం కాలి నేలపై పడిన అంగారపర్ణుడి జుట్టు పట్టుకుని లాక్కువస్తుంటే అర్జునుడిని, ధర్మరాజును శరణువేడింది అంగారపర్ణుడి భార్య కుంభీనసి.

అంగారపర్ణుడన్నాడు– "నా గర్వం నశించింది. చిత్రరథుడనైన నేను దగ్ధరథుడనైనాను. ఇకనుంచి అంగారపర్ణుడనే నాపేరు వదలివేస్తున్నాను. అర్జునా! నీ మైత్రి నాకు అందజేయుము. నీకు నేను మూడు లోకాలలోని వస్తువులను చూడగల 'చాక్షుషి' విద్యను, మీ సోదరులకొక్కొక్కరికి వంద మేలిమి గుర్రాలనిస్తున్నాను. అశ్వాలు శూరులతో సమానం.

అంతేకాక వృత్రాసురుడికి, ఇంద్రుడికి యుద్ధం జరిగినపుడు వజ్రాయుధంతో ఇంద్రుడు వృత్రుడి తలపై కొట్టినప్పుడు అది అనేక ముక్కలయ్యింది. అవన్నిటిని దేవతలు ఉపాసిస్తున్నారు. బ్రాహ్మణుని చేయి, క్షత్రియుని రథం, వైశ్యుని దానం, శూద్రుని పని వజ్రం"

**వజ్రపాణిర్బ్రాహ్మణః స్యాత్ క్షత్రం వజ్రరథం స్మృతమ్**
**వైశ్యా వైదాన వజ్రాశ్చ కర్మ వజ్రా యవీయసః** (ఆది. 169–52)

అప్పుడు అర్జునుడు, గంధర్వుడు ఆగ్నేయాస్త్రం, చాక్షుషి విద్యలను ఇచ్చిపుచ్చుకున్నారు.

గంధర్వుడన్నాడు– "స్త్రీలతో ఉన్నాను, రాత్రివేళ కనుక నేను కాస్త గర్వంగా మాట్లాడాను. నా గర్వం తొలిగింది. నేను నీ మిత్రుడనైనాను. అది నాకు మంచినే చేసింది.

మీరు తాపత్యులు. సూర్యుని పుత్రిక తపతి. ఈమె సావిత్రికి చిన్నచెల్లెలు. ఋక్షుని కొడుకైన సంవరణుడు, సూర్యుడినారాధించి, వసిష్ఠుడి దీవెనలతో తపతిని భార్యగా పొందినాడు. మీరు తాపత్యులు, కురు కుమారులు, పౌరవులు, అజామీఢులు, భారతులు" అని వివరించాడు గంధర్వరాజు.

మీకు పురోహితుడి అవసరం ఉంది. మీ పూర్వీకులకు పురోహితుడైన వశిష్ఠుడు ఎన్నో గొప్ప కార్యాలు చేయించాడు.

## వశిష్ఠుడు - విశ్వామిత్రుడు

కుశికుని కుమారుడైన గాధి కుమారుడు విశ్వామిత్రుడు. ఇతడు కన్యాకుబ్జానికి రాజు. ఒకరోజు విశ్వామిత్రుడు వేటకు వచ్చి కీకారణ్యంలో దప్పికగొని వశిష్ఠుని ఆశ్రమానికి వచ్చాడు. అతడిని ఎంతో గౌరవంగా ఆదరించి అతిథి సత్కారాలు చేసాడు వశిష్ఠుడు. రాజుకు రాజపరివారానికి ఘనంగా భోజనాలు పెట్టాడు వశిష్ఠుడు. వశిష్ఠుడి వద్ద ఉన్న కామధేనువు వంటి 'నందిని' మహాత్మ్యం అది. విశ్వామిత్రుడన్నాడు– "మహర్షీ, తమకు పదికోట్ల ఆవులనిస్తాను, లేదా నా రాజ్యాన్నిస్తాను. ఈ ఆవును ఇవ్వండి"

వశిష్ఠుడు అంగీకరించలేదు. విశ్వామిత్రుడు తన సైనికులతో ఆవును చుట్టుముట్టి కొడుతూ నగరానికి తరలించ బోయినాడు. వశిష్ఠుడు మాట్లాడలేదు. 'నందిని' వచ్చి మహర్షి ముందట నిలబడింది. వసిష్ఠుడన్నాడు– "బ్రాహ్మణులకు సహనం, క్షత్రియులకు తేజస్సు బలం. నీకిష్టమైతే వెళ్ళు!"

నందిని అడిగింది– "నన్ను మీరు వారికి ఇచ్చారా?"

వశిష్ఠుడన్నాడు– "ఇవ్వలేదు. వాళ్లు నీ దూడను లాక్కుపోతున్నారు, చూడు". నందిని పెద్దగా అంబారవాలు చేసింది. దాని శరీరం నుండి పహ్లవులు, ద్రవిడులు, శకులు, యవనులు, శబరులు, పౌండ్రులు, కిరాతులు, యవనులు, సింహళులు, హూణులు, కేరళులు – ఇలా అనేక మ్లేచ్ఛగణాలు ఆయుధాలు చేబట్టి విశ్వామిత్రుడి సేనలను చెదరగొట్టినాయి.

విశ్వామిత్రుడు ఆగ్రహించి వశిష్ఠుడిపై ప్రయోగించిన దివ్యాస్త్రాలనన్నిటినీ వశిష్ఠుడు తన బ్రహ్మదండంతో బూడిదగా చేసాడు. బ్రహ్మతేజోబలమే బలం, క్షత్రియబలం నిరుపయోగమని అర్థం చేసుకుని అక్కడ నుంచి వెళ్లిపోయి రాజ్యాన్ని విడిచి తపస్సు పైన మనసు లగ్నం చేసాడు విశ్వామిత్రుడు. బ్రాహ్మణత్వాన్ని పొందినాడు. ఇంద్రునితో కలిసి సోమపానం చేసాడు.

## కల్మాషపాదుడి కథ

ఆరోజుల్లో ఇక్ష్వాకు వంశపు రాజు కల్మాషపాదుడు (మిత్రసహుడు). అతడికి వశిష్ఠుడి కుమారుడు శక్తి ఇరుకు మార్గంలో ఎదురుపడ్డాడు. "ఎవరు దారి ఇవ్వాలి?" అన్న అంశంపై వివాదం తలెత్తగా రాజు కొరడాతో శక్తి మునిని కొట్టినాడు.

శక్తి ముని రాజును శపించాడు– "రాక్షసుడివై అరణ్యాలలో తిరుగుతూ నరమాంస భక్షకుడివై బ్రతుకు".

విశ్వామిత్రుడికి, వశిష్ఠుడికి వైరమున్న రోజులవి. విశ్వామిత్రుడి ప్రోత్సాహంతో కల్మాషపాదుడిలో కింకరుడనే రాక్షసుడు ప్రవేశించాడు. దానితో ఉన్మత్తుడయ్యాడు రాజు.

ఒకరోజున బ్రాహ్మణుడెవరో మాంస సహిత భోజనం కావాలని అభ్యర్థిస్తే రాజు తన వంటవాడికి చెప్పాడు భోజనం సిద్ధం చేయమని. వాడికి మిగతా మాంసాలేవీ లభ్యం కాకపోవడంతో రాజు అనుమతితో వధ్యస్థలానికి వెళ్లి నరమాంసం తెచ్చి వండి బ్రాహ్మణుడికి వడ్డించాడు. ఆ బ్రాహ్మణుడు రాజును శపించాడు– "రాక్షసుడివై నరమాంసం తిని బ్రతుకు". దానితో రాజర్షి అయిన కల్మాషపాదుని శక్తి నశించి పూర్తిగా రాక్షసుడై కింకరుడి శక్తికి లొంగినాడు.

ఒకనాడు శక్తి ముని కనిపించగా అతడిని పట్టుకుని– "నీవు నన్ను నరమాంస భక్షకుడైన రాక్షసుడివి కమ్మని శపించావు. నీతోనే నరమాంస భక్షణ మొదలెడ్తున్నాను" అని పలికి శక్తి మహామునిని చంపి తినివేసాడు. అది చూసి తనపైకి వచ్చిన వశిష్ఠుని కుమారులందరినీ తినివేసాడు కల్మాషపాదుడు.

పుత్రశోకంతో వశిష్ఠుడు ప్రాణత్యాగం చెయ్యాలని భావించి కొండపైనుంచి దూకాడు, దావాగ్నిలోకి ప్రవేశించాడు, సముద్రంలో మునిగాడు కాని మరణం అతడి దరిని చేరలేదు. ఇంటికి వస్తూ దారిలో కనిపించిన నదిలో దూకాడు తనను తాను తాళ్లతో కట్టుకుని. తాళ్లు ఊడగొట్టి అతడిని ఒడ్డున పడవేసింది నది. ఆ నదికి 'విపాశ' అని పేరు పెట్టినాడు.

ఈసారి మొసళ్లతో నిండి ఉన్న హైమవతి నదిలో దూకగా ఆ నది వంద పాయలుగా చీలిపోయి 'శతద్రువు' అని పేరు పొందింది. అప్పటికే శక్తి భార్య అదృశ్యంతి గర్భవతి. పన్నెండు సంవత్సరాల నుంచి గర్భవతిగా ఉన్నది. ఆమె గర్భస్థశిశువు వల్లె వేస్తున్న వేదాధ్యయన ధ్వని వశిష్ఠుడికి వినిపించింది. మనవడి కోసం బ్రతికాడు వశిష్ఠుడు.

ఆ సమయంలోనే కల్మాషపాదుడు పెద్ద దుడ్డుకర్ర పట్టుకుని వస్తుండగా వశిష్ఠుడతడిని హుంకార మంత్రంతో ఆపి మంత్రజలాన్ని చల్లి శాపవిముక్తి కలిగించాడు. శాపకాలంలో కల్మాషపాదుడు బ్రాహ్మణజంటను చంపినపుడు శాపమిచ్చింది బ్రాహ్మణుడి భార్య అంగీరస– "నీవు నీ భార్యతో కలిస్తే చస్తావు" అని. దానితో కల్మాషపాదుడు తన భార్య మదయంతిని, వశిష్ఠుడి వద్దకు పంపగా ఆమె గర్భం దాల్చి పన్నెండేళ్లు మోసి, చలువరాతి కత్తితో పొట్ట కోసుకోగా అశ్మకుడు జన్మించాడు.

వశిష్ఠుడి ఆశ్రమంలో శక్తి భార్య అదృశ్యంతికి పరాశరుడు జన్మించాడు. అతడు రాక్షస మేధంతోపాటు ముల్లోకాలను నాశనం చేయ సంకల్పించినపుడు వశిష్ఠుడు వారించాడు.

## ఔర్వుడి కథ

వశిష్ఠుడు చెప్పాడు– "ఒకానొక కాలంలో కృతవీర్యుడనే రాజు భృగువంశస్థులకు యజమాని. సోమయాగం సమాప్తి చేస్తూ భృగువంశస్థులకు అంతులేని ధనాన్ని దానం చేసాడు. కాలం గడిచింది. కృతవీర్యుడి వంశస్థులకు ధనం అవసరం పడింది. వారు భృగు వంశస్థులనడిగారు. కొందరు ఇచ్చారు. కొందరు లేదన్నారు. దానితో కోపించిన రాజులు భృగు వంశస్థులను చంపి వాళ్ల భూమిలో పాతిపెట్టిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత వాళ్ల భృగువంశస్థులను నిర్మూలనం చేసే ప్రయత్నంలో గర్భస్థ శిశువులను కూడా చంపుతుంటే భృగుపత్ని ఒకామె (చ్యవనుడి భార్య ఆరుషి) తన గర్భాన్ని తొడలో దాచుకున్నది. ఆ విషయం తెలిసిన క్షత్రియులు ఆ గర్భాన్ని నాశనం చేయడానికి రాగా తొడనుంచి బయటకు వచ్చాడు మధ్యాహ్న సూర్యుడిలా వెలుగుతూ ఆ శిశువు. అతడిని చంపాలని వచ్చిన వారి కళ్లు పేలి అంధులై తిరగసాగినారు.

ఊరువు నుంచి పుట్టిన ఆ శిశువును 'ఔర్వుడు' అని పిలిచినారందరూ. క్షత్రియులందరూ ఔర్వుడిని ప్రార్థించి తమ కంటిచూపును పొందారు. తమ వంశస్థులకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్న ఔర్వుడు ఘోరతపస్సు చేసి క్షత్రియులను, అన్ని లోకాలను భస్మం చేయదలుచుకున్నాడు.

ఔర్వుడన్నాడు– "పాపకృత్యమని తెలిసీ, నిరోధించగలిగిన శక్తి ఉండీ నిరోధించకపోతే – అతడికి పాపకర్మ ఫలమంటుతుంది".

అప్పుడు పితృదేవతలన్నారు– "నీ క్రోధాగ్ని అత్యంత శక్తివంతమైనది. దానిని నీటిలో విడిచిపెట్టు. లోకాలు జలమయాలు కదా. నీటిని దహించడం ద్వారా లోకాలను దహించడం వలన నీ ప్రతిజ్ఞ నెరవేర్తుంది"

ఔర్వుడు తన క్రోధాగ్నిని సముద్రంలో వదిలివేసాడు. ఇప్పటికీ ఆ అగ్ని పెద్దదిగా ఉన్న అశ్వముఖాకృతితో సాగర జలాలను తాగుతూ ఉంటుంది.

**తతస్తం క్రోధజం తాత ఔర్వోగ్నిం వరుణాలయే**
**ఉత్ససర్జస చైవాప ఉపయుంక్తే మహోదధౌ–** (ఆది. 179–21)

## పరాశరుడు - రాక్షసమేధం

ఔర్వుడు తన క్రోధాగ్నిని సముద్రంలో విడిచిపెట్టగా అది అశ్వముఖంతో సముద్రజలాల్ని తాగుతూ ఉంటుందిప్పుడు.

పరాశరుడు రాక్షసమేధాన్ని తలపెట్టినపుడు అత్రి వశిష్ఠాది మహర్షులు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు ఎంతో ఉద్వేగంగా చెప్పగా పరాశరుడు సర్వరాక్షస సంహారం కోసం ప్రోదిచేసిన అగ్నిని ఉత్తరదిక్కున హిమాలయాలకు దగ్గరగా ఉన్న మహారణ్యంలో విడిచిపెట్టినాడు. ఆ అగ్ని ఇప్పటికీ పండుగవేళలలో రాక్షసులను, చెట్లను, రాళ్లను మండిస్తూ కనిపిస్తుంది.

## ధౌమ్యుడు పాండవులకు పురోహితుడగుట

గంధర్వరాజు అర్జునుడితో అన్నాడు– "క్షత్రియ ప్రభువులైన మీకు పురోహితుడు ఉండడం అవసరం. అగ్నులను రక్షించడానికి, ముహూర్తాల నిర్ణయానికి, మంత్రాంగానికి వశిష్ఠుడు లాంటి పురోహితుడుండడం వలన మీకు మేలు జరుగుతుంది. ఉత్కోచక తీర్థంలో దేవలమహర్షి చిన్నతమ్ముడు ధౌమ్యుడు తపస్సు చేస్తున్నాడు. ఆయనను పురోహితుడిగా నియమించుకోగలరు" అని పలికి గంధర్వరాజు వెళ్లిపోయాడు.

గంధర్వుడు చెప్పినట్లే పాండవులు ధౌమ్యుని సందర్శించి అతడిని తమ పురోహితుడిగా నియమించుకున్నారు.

దారిలో వారికి పాంచాలదేశం వెళ్తున్న బ్రాహ్మణులు కలిసారు. వారితో కలిసి అందరూ దక్షిణ పాంచాల దేశానికి ప్రయాణమైనారు. దారిలో వ్యాసమహర్షి కలవగా ఆయన ఆశీస్సులు తీసుకుని పాండవులు కాంపిల్య నగరానికి చేరుకుని ఒక కుమ్మరి ఇంటిలో ఆశ్రయం పొందినారు.

# 12) స్వయంవర పర్వము (అధ్యాయాలు-9)

## మత్స్య యంత్రం

స్వయంవర మండపం రాజులు, బ్రాహ్మణులు, కాంపిల్య నగర వాసులతో కళకళలాడుతున్నది. గత పదిహేను రోజులుగా నగరంలో అనేక ఉత్సవాలు జరిగాయి. పదహారవ రోజున స్వయంవర మండపంలోకి ధృష్టద్యుమ్నుడు తన సోదరి ద్రౌపదిని తీసుకుని వచ్చాడు. అతడన్నాడు– "ఇది మత్స్యయంత్రం. ఇది విల్లు. ఇవి బాణాలు. అయిదు బాణాలతో లక్ష్యసాధన చెయ్యాలి.

అమ్మా వీరు వివిధ దేశాల నుంచి వచ్చిన మహావీరులు. ఎవరు లక్ష్యాన్ని భేదిస్తారో అతడిని నీవు వివాహమాడెదవు గాక!".

ద్రౌపది అందాన్ని చూడగానే అప్పటివరకు స్నేహితులుగా ఉన్నవారు కూడా పరస్పరం ద్వేషించుకోసాగినారు.

రాజుల మధ్యలో బలరాముడు, వృష్ణి, అంధక, యదు వీరులున్నారు, కాని, కృష్ణుని ఆజ్ఞమేరకు వారు పోటీలో పాల్గొనలేదు. బ్రాహ్మణుల మధ్య ఉన్న పాండవులను గుర్తుపట్టి కృష్ణుడు వారిని బలరాముడికి చూపించాడు.

అనేకమంది రాజులు మత్స్యయంత్రాన్ని భేదించ ప్రయత్నించి విఫలులైనారు. కర్ణుడు ధనుస్సు ఎత్తి, బాణాలు సంధించాడు. అది చూసి ద్రౌపది అన్నది–

**దృష్ట్వాతు త్వం ద్రౌపదీ వాక్యము చ్చైః**
**జగాద నాహం వరయామి సూతమ్**

“నేను సూతుడిని వరించను” అనగానే కర్ణుడు కోపంగా నవ్వుతూ ధనుస్సును కింద పడేసాడు. శిశుపాలుడు, జరాసంధుడు, దుర్యోధనుల ప్రయత్నాలు ఫలించలేదు.

అప్పుడు బ్రాహ్మణుల మధ్యలోంచి అర్జునుడు బయల్దేరినాడు. కొందరతడిని ప్రోత్సహించారు. కొందరు నిరుత్సాహ పరచినారు. కొందరు సందేహించారు.

అర్జునుడు మత్స్యయంత్రం వద్దకు వచ్చి, ధనుస్స అందుకుని, అయిదు బాణాలను గ్రహించి లక్ష్యాన్ని కొట్టాడు. అదిచూసి ద్రుపదుడు సంతోషించాడు. శ్రీకృష్ణ బలరాములు సంతోషించారు. ధృష్టద్యుమ్నుడు సంతోషించాడు. ద్రౌపది సంతోషించి వరమాల చేతబూని వచ్చి అర్జునుని మెడలో వేసింది.

**విన్యస్య మాలాం వినయేన త స్థౌ**
**విహాయ రాజ్ఞః సహసా నృపాత్మజా** (ఆది. 187)

అది చూసిన రాజులకు కోపం వచ్చింది. ఇంతమంది రాజులుండగా తన కుమార్తెను బ్రాహ్మణుడికిచ్చిన ద్రుపదుడు రాజే కాదు. వీడిని చంపివేద్దాం అనుకున్నారు వాళ్లు.

ధర్మరాజు నకుల సహదేవులతో ఇంటికి వెళ్లిపోయాడు. రాజులందరూ ద్రుపదుడి మీదకు రావడంతో అతడు బ్రాహ్మణుల చాటుకు వచ్చాడు. భీమార్జునులు రాజులనడ్డుకున్నారు. బ్రాహ్మణులు విసుర్తున్నారు కృష్ణాజినాలూ, కమండలాలూ, పెడుతున్నారు శాపనార్థాలు; అర్జునుడు నవ్వి “మీరు చూస్తూ ఉండండి, వీరి పొగరు మేమణుస్తాం” అన్నాడు.

అర్జునుడు కర్ణుడిని, భీముడు శల్యుడిని ఎదుర్కున్నారు. కర్ణుడు వెనక్కి తగ్గాడు బ్రాహ్మణతేజం ఓడింపరానిదంటూ; శల్యుడిని ఎత్తి నేలమీద పడేసాడు భీముడు. బ్రాహ్మణుల నవ్వుల మధ్య ఒళ్లు దులుపుకుని శల్యుడు వెళ్లిపోయాడు. రాజులకు అనుమానం వచ్చింది. ఖచ్చితంగా వీళ్లు బ్రాహ్మణులు కాదు.

కృష్ణుడన్నాడు– “అంతా అయిపోయినాకెందుకీ హడావుడి. ద్రౌపది అతడి మెడలో వరమాల వేసింది. అది ఆమె స్వయంవరం. ఇప్పుడు మీ ఆవేశాల వల్ల ప్రయోజనమేమిటి?” అని రాజుల్ని అనునయించగా అందరూ రకరకాలుగా మాట్లాడుకుంటూ ఎవరి రాజ్యాలకు వారు తిరుగుబాట పట్టినారు.

భీమార్జునులు ద్రౌపదిని తీసుకుని తామున్న ఇంటికి వెళ్లారు. భిక్షాకాలం దాటినా కుమారులు రాకపోయేసరికి కుంతీదేవి చింతించసాగింది.

## అమ్మా భిక్ష తెచ్చాము

భీమార్జునులు తామున్న కుమ్మరి ఇంటివద్దకు వెళ్లి తల్లితో– “అమ్మా, భిక్ష తెచ్చాము” అన్నారు. ఆమె అన్నది– “అందరూ కలిసి భుజించండి”. అప్పుడు చూసిందామె పెళ్లికూతురు ద్రౌపదిని. ఇలా అన్నానేమిటి అని బాధపడింది. ధర్మరాజుతో అన్నదిలా కుంతీదేవి–

**ఇయంతు కన్యా ద్రుపదస్య రాజ్ఞః**
**తవానుజాభ్యాం మయి సం నివిష్టా**
**యధోచితం పుత్ర మయాపి చోక్తం**
**సమేత్య భుంక్తేతి నృప ప్రమాదాత్–** (ఆది. 190–4)

ధర్మజుడన్నాడు– “అర్జునా, నీవే ఈమెను గెలిచావు. నీవు పెండ్లి చేసుకో! అయితే ఆమెను చూస్తుండగా పాండవులందరి హృదయాల్లోనూ ఆమె కల్లోలం సృష్టించింది. వ్యాసమహర్షి అన్నమాటలను ధర్మరాజు గుర్తుకు తెచ్చుకున్నాడు–

**అబ్రవీత్ సహితాన్ భ్రాతౄన్ మిథోభేదభయాన్నృపః**
**సర్వేషాం ద్రౌపదీ భార్యా భవిష్యతి హి నః శుభా!**

"ఈ కళ్యాణి ద్రౌపది మన అందరికీ భార్య అవుతుంది" అన్నాడు.

ఈలోగా కృష్ణుడు, బలరాముడు వచ్చి పాండవులను పలుకరించి వెళ్లిపోయారు. తమను గుర్తుపట్టినందుకు పాండవులు ఆశ్చర్యపడినారు.

ధృష్టద్యుమ్నుడు కూడా రహస్యంగా భీమార్జునులను అనుసరించి వచ్చి కుమ్మరి ఇంట్లో దాక్కున్నాడు. ఆ రాత్రి పాండవులు భిక్షాన్నం తెచ్చుకున్నాక కుంతీదేవి ద్రౌపదికి చెప్పి దానిని ముందు రెండు సగాలు చేయించి ఒక సగాన్ని భీముడికి, మిగతా సగాన్ని ఆరుభాగాలు చేసి ధర్మరాజు అర్జున నకుల సహదేవులకు, తనకు, ద్రౌపదికి సమభాగాలు చేసింది. అందరూ భోజనం చేసి దర్భలతో శయ్యల నేర్పరచుకుని కృష్ణాజినాలు పరుచుకుని విశ్రమించారు. పాండవులు నిద్రపోయే ముందు దివ్యాస్త్రాలు, రథాలు, వ్యూహాలు, ఆయుధాలు, చతురంగ బలాల గురించి మాట్లాడుకున్నారు. వాటిని వింటూ ద్రౌపది హాయిగా నిద్రపోయింది. ఈ విషయాలను ధృష్టద్యుమ్నుడు తండ్రికి తెలియజేసాడు.

## 13) వైవాహిక పర్వం (అధ్యాయాలు-7)

ద్రుపదుడికి అర్థమయ్యింది. వారు బ్రాహ్మణ వేషాల్లో ఉన్న క్షత్రియులని, పాండవులని. సందేహ నివృత్తి కోసం తన పురోహితుడిని పంపినాడు. అతడు మాట్లాడుతూ ఉండగానే రథాలు, వివిధ వస్తు సామాగ్రితో మరొక దూత వచ్చి విందుకు ఆహ్వానించాడు.

రథాలనెక్కి పాండవులు, కుంతీదేవి, ద్రౌపది ద్రుపదుడి అంతఃపురానికి వెళ్లినారు. విందు భోజనాల తరువాత వివరాల నడిగాడు ద్రుపదుడు.

యుధిష్ఠిరుడు తమను పరిచయం చేసుకునేసరికి ద్రుపదుడి కనులవెంట ఆనందబాష్పాలు కురిసాయి.

ఇప్పుడు సమస్య– ఎవరితో ద్రౌపదికి వివాహం చెయ్యాలన్నది. "మేము అయిదుగురం ఈమెను వివాహమాడతాము" అన్నాడు యుధిష్ఠిరుడు.

ద్రుపదుడు సంశయించాడు– "లోక విరుద్ధమైనది మీరు అడుగుతున్నారు" అన్నాడు; ధృష్టద్యుమ్నుడు అంగీకరించలేదు.

యుధిష్ఠిరుడన్నాడు– "జటిల' (గౌతమ గోత్ర కన్య) ఏడుగురిని వివాహమాడింది; కండు మహర్షి పుత్రిక వార్షి ప్రచేతసుని పుత్రులు, ఒకే పేరుగలవారు పదిమందిని చేసుకున్నది" అన్నాడు.

అప్పుడు వ్యాసుడు వచ్చి ద్రుపదుడిని పక్కకు తీసుకువెళ్లి ద్రౌపదీ పాండవుల పూర్వజన్మ వృత్తాంతాన్ని చెప్పాడు. సూర్యపుత్రుడైన యముడు యజ్ఞం చేస్తూ ఉండడంతో మానవుల మరణాలు ఆగిపోయాయి. అందుకని దేవతలు భయపడి బ్రహ్మతో చెప్పి యముడిని రెండు భాగాలు చేసి ఒక భాగం మరణ కార్యాన్ని కొనసాగించేలా చేసారు. అప్పుడు దేవతలు గంగానది వద్ద దుఃఖిస్తున్న యువతిని చూసారు. ఆమె కన్నుల నుండి వెలువడిన కన్నీళ్లు గంగానదిలో పడగానే బంగారు కమలాలయ్యాయి. ఇంద్రుడు ఆమెను వెంటబెట్టుకుని హిమాలయ పర్వత శిఖరాన పాచికలాడుతున్న యువతీ యువకులను చూసాడు.

లోకాధిపతినైన నన్నే లెక్కచెయ్యడం లేదని ఇంద్రుడు వారివేపు క్రోధంతో చూసాడు. ఆ యువకుడు (రుద్రుడు) ఇంద్రుడి గర్వాన్ని అణచేందుకు, ఇంద్రుడితో వచ్చిన యువతిని ఇంద్రుడిని తాకమన్నాడు. ఇంద్రుడు శక్తి క్షీణించి నేలపై పడినాడు.

ఇంద్రుడు అక్కడ ఉన్న గుహలో మరో నలుగురు ఇంద్రులను చూసాడు. రుద్రుని ఆదేశంతో ఆ అయిదుగురు ఇంద్రులు– విశ్వభుక్కు, భూతధామ, శిబి, శాంతి, తేజస్వి – వీరి అంశతో పాండవులు జన్మించారు. శచీదేవి అంశతో ద్రౌపది జన్మించింది.

వ్యాసుడిచ్చిన దివ్య చక్షువులతో ద్రుపదుడు ఇంద్రాత్మజుడైన అర్జునుడిని, మిగతా నలుగురు ఇంద్రుల అంశతో జన్మించిన పాండవులను, అయిదుగురు ఇంద్రులను పోల్చి చూసుకున్నాడు. సంతృప్తి చెందాడు.

కౌరవ కులోన్నతికై మొదటిరోజున యుధిష్ఠిరుడు తరువాత ఒక్కొక్కరోజున ఒక్కొక్కరు ద్రౌపదిని పాణిగ్రహణం చేసారు.

తరువాత ద్రౌపది అత్త కుంతిని చేరుకుని దోసిలి ఘటించి నమస్కరించింది.

వివాహం చేసుకున్న పాండవులకు శ్రీకృష్ణుడు అసంఖ్యాకమైన ఆభరణాలు, వస్త్రాలు, కంబళిలు, తివాచీలు, రత్నాలు, తల్పాలు, వాహనాలు, దాసదాసీ జనం, కోట్లకొలది స్వర్ణ నాణేలను, ఏనుగులను, గుర్రాలను కానుకలుగా పంపినాడు.

## 14) విదురాగమన రాజ్యలంభ పర్వము (అధ్యాయాలు-13)

స్వయంవరంలో పాల్గొన్న రాజులందరికీ ఈ విషయం తెలిసింది. మత్స్యయంత్రాన్ని ఛేదించింది బ్రాహ్మణవీరుడు కాదు అతడు అర్జునుడు. మద్రదేశపు రాజును ఎత్తి పడవేసింది భీముడు. పాండవులు, కుంతి లక్క ఇంటి దహనంలో చనిపోలేదు. వారు బ్రతికే ఉన్నారన్న వార్త తెలిసేసరికి రాజలోకంలో కల్లోలం చెలరేగింది.

అందరూ ధృతరాష్ట్రుడిని, భీష్ముడిని నిందించారు. ద్రౌపదీ స్వయంవరం తరువాత కర్ణ, శకునిలతో సమావేశమైనారు ధార్తరాష్ట్రులు.

శకుని అన్నాడు– "రాజులందరూ పాండవుల పక్షాన చేరితే ఆ తరువాత మనం చేయగలిగిందేమీ లేదు".

భూరిశ్రవుడన్నాడు– "పాండవులతో సంధి మంచిది".

దుశ్శాసనుడన్నాడు– "అదృష్టం వాళ్లవేపున్నది". తనను ద్రౌపది వరించలేదని దుర్యోధనుడు తన మిత్రువైన అశ్వత్థామ, శకుని, కర్ణుడు, కృపులతో హస్తినకు తిరిగి వచ్చాడు వికలమైన మనస్సుతో.

విదురుడన్నాడు ధృతరాష్ట్రుడితో– "మన కౌరవ వంశం వృద్ధిపొందుతోంది". ధృతరాష్ట్రుడన్నాడు– "అవునా! ద్రౌపదికి ఆభరణాలు తీసుకురండి". అప్పుడు నింపాదిగా విదురుడు చెప్పాడు. పాండవులు లాక్షాగృహ దహనంలో చనిపోలేదని, వారు ద్రుపదుని కుమార్తె ద్రౌపదిని వివాహం చేసుకున్నారని – వివరించగా.

"ఆకారచ్ఛాదనార్థం, తుదిష్ట్యా దిష్ట్యేతి చాబ్రవీత్"

"అదృష్టం, అదృష్టం! విదురా, నాకు పాండవులంటే చాలా ఇష్టం. వారు జీవించి ఉన్నారన్న వార్త చెప్పిన నీకు శుభమగును గాక!"

విదురుడన్నాడు– "రాజా, నీకు పెక్కేండ్లు ఇట్టి బుద్ధి నిలుచును గాక!"

విదురుడు వెళ్లిపోయాక దుర్యోధనుడు, కర్ణుడు వచ్చి ధృతరాష్ట్రుని కలిసారు.

దుర్యోధనుడన్నాడు– "తండ్రీ, సమయానికి తగిన కర్తవ్యం మనం ఆచరించాలి. మనం ఇప్పుడు కుంతీపుత్రులను, మాద్రీ పుత్రులను విడదీయాలి. లేదా ద్రుపదుడిని పాండవులను విడదీయాలి. లేదా పాండవులను ద్రౌపదిని విడదీయాలి.

మొత్తానికి వారు హస్తినాపురంలో ఉండడం శ్రేయస్కరం కాదని తెలియజెప్పాలి.

ఏదో ఒక ఉపాయంతో భీముడిని వధిస్తే అర్జునుడు కర్ణునకు నాలుగోవంతుకు కూడా సాటిరాడు. మొత్తం మీద పాండవులను చంపించాలి. స్త్రీలను ప్రయోగించో, విషం ప్రయోగించో, అగ్నివల్లనో"?

కర్ణుడన్నాడు– "వీరుడా! ఇంతకు ముందెన్నోసార్లు విషాన్ని ప్రయోగించావు. అగ్నిని వినియోగించావు. రెక్కలు రాని పక్షిపిల్లలుగా ఉన్నపుడే బాధించలేకపోయావు. ఇప్పుడు వారికి రెక్కలొచ్చాయి. అండదండలేర్పడినాయి. పాండవుల బలం మరింత గట్టిపడకమునుపే వారిని నాశనం చేస్తే మనకు శుభమవుతుంది".

ధృతరాష్ట్రుడు పిలవనంపగా భీష్ముడు, ద్రోణుడు మున్నగువారు వచ్చారు.

భీష్ముడన్నాడు– "పాండవులకు కౌరవులకు ఈ రాజ్యంలో సమానమైన హక్కు ఉన్నది. వారికి అర్ధరాజ్యమివ్వడం ఉచితం. సంధి శ్రేయస్కరం. ధృతరాష్ట్రా! లాక్షాగృహ దహనాన్ని నీ కార్యంగా ప్రజలు భావిస్తున్నారు"

ద్రోణుడన్నాడు– "అర్ధరాజ్యం పాండవులకివ్వడం న్యాయం".

కర్ణుడన్నాడు– “అంబువీచుడనే మగధరాజు శ్వాసకోశ వ్యాధితో బాధపడుతుంటే మహాకర్ణి అనే మంత్రి రాజ్యాన్ని వశం చేసుకోబోయినాడు. రాజుకు అదృష్టం కలిసివచ్చింది, లేకుంటే, రాజ్యం మంత్రిపాలయ్యేది”.

ద్రోణుడన్నాడు– “దుష్టుడా, నా మాటలలో లేని దోషాన్ని ప్రస్తావిస్తున్నావు. నీవు చెప్పే హితమేమిటో నీవు చెప్పుకో!”

విదురుడన్నాడు– “ఎవరి అభిప్రాయం వారు నిష్కర్షగా చెప్పడంలో తప్పులేదు. ఇప్పుడు తప్పుచేస్తే అది సర్వనాశనానికి దారితీస్తుంది”.

ధృతరాష్ట్రుడన్నాడు– “నా పుత్రులకు ఈ రాజ్యం ఎలా చెందుతుందో పాండవులకూ అలాగే చెందుతుంది

**యథైవ మమ పుత్రాణామ్ ఇదం రాజ్యం విధీయతే**
**తథైవ పాండు పుత్రాణామ్ ఇదం రాజ్యం న సంశయః** (ఆది. 205–3)

విదురా! నీవు పోయి ద్రుపదుడి అనుమతి గైకొని పాండవులను సతీసమేతంగా, కుంతీదేవితో సహా హస్తినకు ఆహ్వానించు”

విదురుడు వెళ్లేసరికి శ్రీకృష్ణుడు, పాండవుల వద్దనే ఉన్నాడు. శ్రీకృష్ణుడన్నాడు– “ద్రుపదుని మాటే నామాట”.

ద్రుపదుడన్నాడు– “కృష్ణుని అభిప్రాయం నాకు సమ్మతం”.

కుంతీదేవి అన్నది– “విదురా, పాండవులకు నీవే రక్షకుడివి”.

వెయ్యి ఏనుగులు, వెయ్యి రథాలు, అయిదు వందల గుర్రాలు, పదివేలమంది దాసదాసీజనం, వెయ్యిమంది ధానుష్కులు, కోటి సంఖ్యలో గోధనం విడివిడిగా, వంద పల్లకీలు, అయిదువందల బోయీలతో పాంచాలరాజు, తన కుమార్తెను ఆమె భర్తలు, అత్తగారితో హస్తినకు పంపినాడు. ధృష్టద్యుమ్నుడు స్వయంగా ద్రౌపదిని రథమెక్కించి ఆశీర్వదించినాడు. మంగళవాయిద్యాల ధ్వనుల మధ్య వారు హస్తినకు బయల్దేరారు.

ధృతరాష్ట్రుడు వారిని ఆహ్వానించడానికి వికర్ణుని, చిత్రసేనుని, ద్రోణుడిని, కృపుడిని పంపినాడు. పాండవులు ధృతరాష్ట్ర, భీష్మ, ద్రోణాదులకు పాదాభివందనాలు చేసారు. కుంతీ, ద్రౌపది గాంధారిని కలిసి నమస్కరించారు. ఎందుకో తెలియదు కాని గాంధారికి పాంచాలి తన పుత్రులపాలిట మృత్యుదేవతలా అనిపించింది.

## అర్ధరాజ్యం - ఇంద్రప్రస్థం

గాంధారి అన్నది– “విదురా, వెంటనే నీకిష్టమైన రాకుమారి కుంతీదేవిని, ద్రౌపదిని పాండురాజు భవనానికి చేర్చు. అక్కడ పాండవులు క్షేమంగా ఉండాలి”.

కొంతకాలం గడిచింది. ధృతరాష్ట్రుడు, భీష్ముడు పాండవులను పిలిపించినారు. ధృతరాష్ట్రుడన్నాడు ధర్మరాజుతో– “పాండురాజు ఈ రాజ్యాన్ని వృద్ధిచేసాడు, పరిపాలించాడు. నా ఆజ్ఞ పాటించాడు. నా పుత్రులు నా మాట వినరు. వారికి, మీకు మధ్య యుద్ధం రాకుండా ఉండాలంటే మీరు ఖాండవప్రస్థంలో నివసించాలి. అర్ధరాజ్యంగా ఖాండవప్రస్థాన్ని పొంది సోదరులతో అక్కడ నివసించు”.

వాసుదేవుడు అన్నాడు– “ధృతరాష్ట్ర మహారాజా, నీ ఆలోచన ఉత్తమం”.

వెంటనే ధర్మరాజును అర్ధరాజ్యానికి పట్టాభిషిక్తుడిని గావించారు. వాసుదేవుడు తలచుకోగానే ఇంద్రుడు విశ్వకర్మను పంపి ఖాండవప్రస్థంలో ఇంద్రప్రస్థమనే నగర నిర్మాణం కావించాడు.

గొప్ప భవనాలు, విశాలమైన మార్గాలు, నగరానికి నలువేపులా అగాధాలు, దుర్గరక్షణ సామాగ్రి, అందమైన వనాలు, తియ్యమామిడి, కదంబ, అశోక, చంపక, పున్నాగ, నాగపుష్ప, లకుచ, పనస, మద్ది, తాడి, చీకటిచెట్లు, పొగడ, మొగలి చెట్లు, పెద్ద ఉసిరి, లొద్దుగు, అంకోలం, నేరేడు, పాటలం, కుంజకం, అతిముక్తకం, కరివీరం, పారిజాతం లాంటి చెట్లతో ఉన్న వనాలు, ఉద్యానవనాలు, క్రీడాలతాగృహాలు, సరోవరాలు, దిగుడుబావులు, నాలుగు వర్ణాల జనాలు, పశు సంపదతో ఇంద్రప్రస్థ నగరం 32 ద్వారాలతో, వర్ధమానమనే ప్రధానద్వారంతో శోభిల్లగా శ్రీకృష్ణుడు, వేదవ్యాసుడు, ధౌమ్యుల అంగీకారంతో మంగళవాయిద్యాల ఘోషల మధ్య పాండవులు ఇంద్రప్రస్థ నగర ప్రవేశం చేసారు.

## నారదుడు చెప్పిన సుందోపసుందుల కథ

ఖాండవ ప్రస్థ వాసులై సత్యధర్మ పరాయణులుగా, ప్రజ్ఞావంతులుగా కీర్తింపబడుతున్న పాండవుల వద్దకు వేదవిద్యా పారంగతుడు, పాపరహితుడు, సామగాన విద్వాంసుడు, అనేక శబ్దాలను ఒకే అర్థంలో, ఒకే అర్థాన్ని విభిన్న శబ్దాలలో చెప్పగలిగిన ప్రతిభాశాలి నారదుడు వచ్చాడు.

అర్ఘ్య పాద్యాదులూ, కుశల సమాచారాలు పూర్తయినాక పాండవులతో నారదుడన్నాడు–

**పాంచాలీ భవతామేకా ధర్మపత్నీ యశస్వినీ**
**యథావో నాత్ర భేదః స్యాత్ తథా నీతిర్విధీయతామ్**

ద్రౌపది వలన మీమధ్య వైరం రాకూడదు. పూర్వకాలంలో సుందోపసుందులు తిలోత్తమ కారణంగా మరణించారు. హిరణ్యకశిపుని వంశం వాడైన నికుంభుని కుమారులు సుందోపసుందులు. ఎంతో అన్యోన్యంగా ఉండేవారు.

**వినాన్యోన్యం న భుంజాతే వినాన్యోన్యం న జల్పతః**
**అన్యోన్యస్య ప్రియకరౌ అన్యోన్యస్య ప్రియంవదౌ–** (ఆది. 208–5)

వాళ్లు గొప్ప తపస్సు చేయగా బ్రహ్మ ప్రత్యక్షమైనాడు. మాలో మేము తప్ప మమ్మల్నెవరూ చంపకుండా వరమివ్వమన్నారు. బ్రహ్మ వరమివ్వగా వాళ్లిద్దరూ చెలరేగిపోయారు.

**భక్ష్యతాం భుజ్యతాం నిత్యం దీయతాం రమ్యతామితి**
**గీయతాం పీయతాం చేతి శబ్దశ్చాసీత్ గృహే గృహే** (ఆది. 208–31)

తిండి, క్రీడ, పాట, కొల్లగొట్టడం, అనుభవించడం సుందోప సుందులకు నిత్యకృత్యాలైనాయి. అహంకారం గర్వం పెరిగి అమరులను, ఋషులను చావగొట్టసాగినారు. అన్ని దిక్కులు జయించి చివరకు కురుక్షేత్రంలోని తమ భవనంలోకి ప్రవేశించారు.

వారి ఆగడాలను భరించలేక ఋషులు, దేవతలు బ్రహ్మదేవుడి శరణుజొచ్చినారు. బ్రహ్మ ఆజ్ఞాపించగా విశ్వకర్మ ముల్లోకాల్లోని అత్యంత శ్రేష్ఠమైన పదార్థాలతో ఉత్తమ రత్నాలను నువ్వుగింజ పరిమాణంలోకి తీసి అపురూప సౌందర్యవతిని సృష్టించాడు. అందుకే ఆమెను 'తిలోత్తమ' అన్నారందరూ.

ఆమెను చూసి స్థాణువైన శంకరుడే చతుర్ముఖుడైనాడు. ఇంద్రుడు సహస్ర నేత్రుడైనాడు.

సుందోపసుందులు ఒకరోజున వింధ్య పర్వత శిఖరాన ఉన్న వనంలో విహారానికేగగా వారికి కనిపించింది తిలోత్తమ ఒకే ఒక ఎర్రటి వస్త్రాన్ని ధరించి.

ఆమెను చూసిన మరుక్షణంలో వారిద్దరి మధ్య ఉండే అన్యోన్యత నశించసాగింది.

సుందుడన్నాడు– "ఈమె నా భార్య, నీకు తల్లితో సమానం".

ఉపసుందుడన్నాడు– "ఈమె నా భార్య, నీకు కోడలితో సమానం".

ఇద్దరూ ముందు మాటలతో, తర్వాత చేతులతో, తర్వాత గదలతో కొట్టుకుని రక్తమోడుస్తూ నేలపైపడి మరణించారు.

మీరు అటువంటి పరిస్థితిలోకి వెళ్లకుండా నియమ నిబంధనలు ఏర్పరుచుకోవాలి" అన్నాడు నారదుడు.

పాండవులు ఒక ఒప్పందానికి వచ్చారు. ద్రౌపది పాండవులలో ఒక్కొక్కరి వద్ద ఒక్కో సంవత్సరం నివసించాలి. ఏకాంతంలో ద్రౌపదితో కలిసి ఉన్నవానిని మరొక సోదరుడు చూస్తే పంద్రెండు సంవత్సరాలు వనవాసం చెయ్యాలి.

**ద్రౌపద్యా నః సహాసీ నానన్యోన్యం యోభిదర్శయేత్**
**స నో ద్వాదశ వర్షాని బ్రహ్మచారీ వనే వసేత్** (ఆది. 211–29)

## 15) అర్జున వనవాస పర్వము (అధ్యాయాలు-6)

కొంతకాలం ప్రశాంతంగా గడిచింది. ఒకరోజున ఓ బ్రాహ్మణుని గోవును దొంగలు అపహరించుకుపోయారు. అతడు ఖాండవ ప్రస్థానికి వచ్చి కోపంగా అన్నాడు అర్జునుడితో–

"బ్రాహ్మణుని హవిస్సును కాకులు దొంగిలించాయి. నక్క పెద్దపులి శూన్యగుహను ఆక్రమించింది. తపస్సులో ఆరవవంతు గైకొని లోకాన్ని రక్షించని రాజు పాపి అని లోకులు అంటారు. బ్రాహ్మణుని సొత్తు దొంగలపహరించారు. ధర్మార్థాలు లోపించాయి. నాకు దుఃఖంగా ఉంది. తమరు దొంగలను శిక్షించండి"

అర్జునుడు "భయం వలదు" అని ఆయుధాగారం వేపు వెళ్లాడు. అది ధర్మజుని మందిరం. అతడక్కడ ద్రౌపదితో ఏకాంతంగా ఉన్నాడు. ఒకప్రక్క వ్రత నియమం, మరోవేపు ధర్మాచరణ అతడి మనసును కల్లోలపరచాయి. ధర్మ నిర్వహణకే ప్రాధాన్యతనిచ్చి ధనుస్సు, కవచం, రథాన్ని, ఆయుధాల్ని తీసుకుని, బ్రాహ్మణుడితో పాటు వేగంగా దొంగలు వెళ్లినవేపు వెళ్లి దొంగలను నిశ్శేషం చేసి ఆవుల్ని అప్పగించి అభినందనలు పొందినాడు.

తరువాత ధర్మరాజుకు చెప్పి నియమానుసారం– "వనవాసానికి వెళతాను" అని పలికి అన్న తన భార్యతో ఏకాంతంలో ఉన్నపుడు చిన్నవాడు వెళ్లడం తప్పుకాదు. మరిది కుమారుడితో సమానం కనుక అధర్మం జరగలేదని అన్నా వినలేదు అర్జునుడు.

**న వ్యాజేన చరేద్ ధర్మమితి మే మహతః శ్రుతమ్**
**న సత్యాత్ విచలిష్యామి సత్యే నాయుధ మాలభే** (ఆది. 212-34)

ఆ విధంగా అర్జునుడు పన్నెండేళ్ల వనవాసానికి బయల్దేరినాడు అన్న యుధిష్ఠిరుని అనుమతి తీసుకుని.

అప్పుడు అర్జునుడిని చూసింది నాగకన్య ఉలూచి.

### నాగకన్య ఉలూచి - మణిపురం రాకుమారి చిత్రాంగద

ఐరావత వంశానికి చెందిన కౌరవ్యుడి కుమార్తె ఉలూచి. ఆమె అర్జునుడిని చూసి మోహించి కామరూపంలో అతడిని తమ లోకానికి తీసుకుపోయింది.

ప్రేమదానం, ప్రాణదానం చేయమని పోరుపెట్టి ఆమె అర్జునుడి పొందు కోరింది. ఆ రాత్రి ఆమెతో గడిపాడు అర్జునుడు. అతడి వలన ఆమెకు మహావీరుడైన ఇరావంతుడు జన్మించాడు.

గంగాద్వారం నుంచి అగస్త్యవటం, వసిష్ఠ పర్వతం, భృగుతుంగం, హిరణ్యబిందు తీర్థం, నైమిశారణ్యంలోని ఉత్పలినీ నది, నంద, అపరనంద, కౌశికి, మహానది, గయాతీర్థం, గంగానదులను దర్శించాడు. అంగ, వంగ, కళింగ దేశాల్లోని కొన్ని పవిత్ర తీర్థాలను దర్శించి కళింగ నగరం చేరుకోగానే అతనితో వచ్చిన బ్రాహ్మణులు వెనక్కి తిరిగి వెళ్లిపోయారు.

అక్కడ నుంచి అర్జునుడు అనేక దేశాలు దాటి మహేంద్ర పర్వతాన్ని దాటి మణిపురం చేరాడు. మణిపురం రాజు చిత్రవాహనుడు. అతడి కుమార్తె చిత్రాంగద సౌందర్యరాశి. ఆమెను వివాహమాడ దలచి అర్జునుడు రాజునడిగితే– అతడి వంశంలో ప్రభంజనుడనే రాజు కాలం నుంచి వారికి ఒకరే సంతతి కలుగుతున్నారు. అందుకని కుమార్తె పుత్రుడు కొడుకుతో సమానం కనుక అర్జునుడికి చిత్రాంగదకు పుట్టే సంతానాన్ని తనకివ్వాలని అడిగాడు చిత్రవాహనుడు.

వివాహమైనాక **మూడు సంవత్సరాల పాటు** చిత్రాంగదతో మణిపురంలో ఉన్నాడు. వారికి బభ్రువాహనుడనే కుమారుడు కలిగాడు.

ఆ తరువాత అర్జునుడు భార్యాబిడ్డలకు వీడ్కోలు చెప్పి తీర్థయాత్రలు చేస్తూ ఎవరూ వెళ్లని అగస్త్య, సౌభద్ర, పౌలోమ, కారంధమ, భారద్వాజ తీర్థాలను చూసి మొసళ్ల వలన అక్కడకు ఎవరూ వెళ్లడంలేదని గ్రహించాడు. ఆ మొసళ్లను లాగి బయటపడేసేసరికి వారు వర్గ, సౌరభేయి, సమీచి, బుద్బుద, లత లనే అప్సరసలుగా మారి బ్రాహ్మణుడి శాపం నుంచి విముక్తులైనారు.

## 16) సుభద్రాహరణ పర్వము (అధ్యాయాలు-2)

## సుభద్రార్జునీయం

బ్రాహ్మణుడి శాపంతో మొసళ్లుగా మారి పంచతీర్థాలను నిర్మానుష్యంగా చేసిన అప్సరసలకు శాపవిముక్తి కలిగించి అర్జునుడు మణిపురం చేరుకుని చిత్రాంగదకు చిత్రవాహనుడికి వీడ్కోలు చెప్పి, ఈశ్వరునికి మొదటి నివాస స్థానమైన గోకర్ణం చేరుకున్నాడు. అభయప్రదానమైన గోకర్ణాన్ని దర్శించి అక్కడనుంచి పశ్చిమ సముద్ర తీర తీర్థాలను సేవించి ప్రభాస తీర్థం చేరుకున్నాడు అర్జునుడు.

అర్జునుడు ప్రభాసతీర్థంలో ఉన్నాడని తెలిసిన శ్రీకృష్ణుడు అతడిని కలిసాడు. ద్వారకా నగరానికి ఆహ్వానించాడు.

ద్వారకలో వృష్ణి భోజ అంధక వంశ పురుషుల ఆతిథ్యాన్ని స్వీకరించాడు అర్జునుడు. రైవతక పర్వతాన జరిగిన ఉత్సవ సంబరాల్లో బలరామ శ్రీకృష్ణుల సోదరిని చూసాడు అర్జునుడు. మోహంలో మునిగిపోయాడు. శ్రీకృష్ణుడది గమనించి స్వయంవరం కన్నా ఆమెను అపహరించి వివాహం చేసుకోవడం మంచిదన్నాడు.

సుభద్రను అపహరించి అర్జునుడు తీసుకుపోతుంటే యాదవ వీరులు బలరాముడి నాయకత్వంలో అడ్డుపడబోయారు. కృష్ణుడు వారిని శాంతపరచాడు. అర్జునుడిని వెనక్కి మరల్చి సుభద్రతో వివాహం చేయగా సంవత్సరం పైగా అతడు ద్వారకలోనే ఉన్నాడు.

పండ్రెండేళ్లు పూర్తయ్యాయి. అర్జునుడు ఇంద్రప్రస్థానికి వచ్చాడు. ద్రౌపది అన్నది– “సుభద్ర దగ్గరకే పో! కొత్త బంధం ఏర్పడినాక పూర్వబంధం వదులవుతుంది”.

ఎఱ్ఱటి పట్టు వస్త్రాలు ధరించి సుభద్ర గోపిక వేషంలో ద్రౌపది శరణువేడింది. మిగతా పాండవ పత్నులను తన అంతఃపురం వేపు రానివ్వని ద్రౌపది శ్రీకృష్ణుడి చెల్లెలు సుభద్రను ఆదరించింది. బలరాముడు, శ్రీకృష్ణుడు, ఇతర యాదవ ప్రముఖులు అర్జునుడికి అనేక సంపదలనిచ్చారు. సుభద్రార్జునులకు నిర్భయంగా క్రోధంతో యుద్ధం చేసేవాడైన అభిమన్యుడు జన్మించాడు.

## 17) హరణాహరణ పర్వము (అధ్యాయాలు-1)

అభిమన్యుడు తన తండ్రి నుంచి ధనుర్వేదాన్ని నాలుగు భాగాలుగా, పది అంగాలుగా నేర్చుకున్నాడు.

నాలుగు భాగాలు– మంత్రముక్తం, పాణిముక్తం, ముక్తాముక్తం, అముక్తం; ధనుర్వేదాంగాలు– ఆదాన, సంధాన, మోక్షణ, నివర్తన, స్థాన, ముష్టి, ప్రయోగ, ప్రాయశ్చిత్త, మండల, రహస్యం.

ధర్మరాజుకు ద్రౌపది వలన పుట్టిన కుమారుడు ప్రహారజనిత వేదన సహించడంలో వింధ్య పర్వత సమానుడు కావాలని అతడికి ‘ప్రతివింధ్యుడు’ అని పేరు పెట్టినారు.

భీముడికి ద్రౌపదికి వేయి సోమయాగాలు ఆచరించిన తరువాత జన్మించిన పుత్రుడికి ‘శ్రుతసోముడ’ని పేరు పెట్టారు. ఇతడు గొప్ప ధానిష్ఠుడైనాడు.

అర్జునుడికి ద్రౌపదికి ప్రసిద్ధ కర్మలను ఆచరించడం వలన పుట్టినవాడు కావడంతో అతడికి ‘శ్రుతకర్మ’ అని పేరు పెట్టినారు.

నకులుడికి ద్రౌపదికి పుట్టిన కుమారుడికి కౌరవవంశ రాజర్షి ‘శతానీకుడి’ పేరు పెట్టారు.

సహదేవుడికి ద్రౌపదికి పుట్టిన పుత్రుడికి అగ్నిదేవత ప్రధానంగా గల కృత్తికా నక్షత్రంలో పుట్టినందు వల్ల అగ్ని (శ్రుతసేనుడు) పేరు శ్రుతసేనుడని నామకరణం చేసారు.

## 18) ఖాండవ దాహ పర్వము (అధ్యాయాలు-6)

వేసవి కాలం వచ్చింది. అర్జునుడు, శ్రీకృష్ణుడు, అంతఃపుర స్త్రీలు, యమునా నదిలో జలవిహారానికి బయల్దేరి వెళ్లారు. అందరూ హాయిగా కాలక్షేపం చేస్తున్నారక్కడ.

శ్రీకృష్ణార్జునులు ఒకచోట కూర్చుని ముచ్చటిస్తున్నపుడు బ్రాహ్మణుడొకడు దివ్యకాంతితో వెలిగిపోతూ వచ్చాడక్కడికి. అతడన్నాడు- "కృష్ణార్జునులారా! నాకాకలి ఎక్కువ! నా ఆకలి తీరే భిక్ష యాచిస్తున్నాను".

వచ్చినవాడు అగ్నిదేవుడు. పూర్వకాలంలో శ్వేతకి అనే రాజు గొప్ప యజ్ఞాలు చేసి దుర్వాసుని అధ్వర్యంలో హోమాగ్నిలో నేతి ధారలు ప్రవహించేట్లు చేసాడు. దానితో అగ్నికి అజీర్తి ఏర్పడింది. అది తగ్గడానికి మూలికలతో ఉన్న ఖాండవ వనాన్ని దహించమని బ్రహ్మ సలహా ఇచ్చాడు.

ఖాండవ వనం ఇంద్రుడి మిత్రుడైన తక్షకుడి నివాసం. అగ్ని ఆ వనాన్ని దహించడానికి వెళ్లినప్పుడల్లా ఇంద్రుడు వర్షమేఘాల్ని పంపి మంటల్ని ఆర్పివేస్తున్నాడు. నరనారాయణులు పార్థ కృష్ణులుగా అవతరించినాక అగ్ని కోరిక నెరవేరుతుందని చెప్పబడింది. అయితే, ఇంద్రుడిని నిలువరించాలంటే దివ్య ఆయుధాలు అవసరం. అందుకని అగ్ని వరుణుడి దగ్గర ఉన్న గాండీవధనుస్సును, అక్షయ తూణీరాన్ని అడిగి తెచ్చాడు. అంతేకాక కపిధ్వజమున్న గొప్ప రథాన్ని, దివ్యాశ్వాలు లాగే రథాన్ని ఇచ్చాడు. శ్రీకృష్ణునికి సుదర్శన చక్రాన్ని, కౌమోదకి అనే గదను ఇచ్చాడు.

కృష్ణార్జునులు రక్షణగా ఉండగా అగ్ని ఏడు నాలుకలతో ఖాండవ వనాన్ని దహించ పూనుకున్నాడు. పక్షులు, జంతువులు, చెట్లు, సరోవరంలోని చేపలు ఇలా ఆ వనంలోని సమస్త జీవజాలం అగ్నిమంటలలో ఆహుతి అవుతుంటే ఇంద్రుడు గొప్ప వర్షమేఘాలతో వర్షధారలను కురిపించాడు. అర్జునుడు దివ్యాస్త్రాలతో ఖాండవ వనంపై బాణాల కప్పు నిర్మించాడు. ఒక్కచుక్క వర్షం కూడా అగ్నిని తాకలేదు. వనంలో పడలేదు.

ఆ సమయంలో నాగులరాజు తక్షకుడు కురుక్షేత్రంలో ఉన్నాడు. తక్షకుని కుమారుడు అశ్వసేనుడు అర్జునుడి బాణాలతో బందీ కాగా అశ్వసేనుడి తల్లి 'సర్పిణి' అతడిని విడిపించగా, ఇద్దరూ కలిసి ఆకాశంలోకి ఎగిరారు. అదిచూసి అర్జునుడు సర్పిణి తలను ఖండించాడు. ఇంద్రుడు కురిపించిన గాలివాన మధ్య అశ్వసేనుడు తప్పించుకున్నాడు.

అదిచూసి కోపించి అర్జునుడు కదిలిన ప్రతి ప్రాణినీ చంపడం మొదలెట్టాడు. ఇంద్రుడు ప్రయోగించిన ఐంద్రాస్త్రాన్ని, వాయువ్యాస్త్రంతో ఆపినాడు. తనపైకి వచ్చిన గరుడజాతి పక్షులు, కాలకూట విషమున్న సర్పాలు, రాక్షస గంధర్వ యక్ష అసురులను తరిమికొట్టినాడు అర్జునుడు.

**అయఃకణప చక్రాశ్మ భుశుండ్యుద్యత బాహవః**

ఇనుప చక్రాలతో వదిలే లోహపు ప్రేలుడు ఉండలను ప్రయోగించగా వాటిని నిర్వీర్యం చేసారు కృష్ణార్జునులు. ఇంద్రుడు, తదితర దేవతలు తమ తమ ఆయుధాలు చేబట్టి శ్రీకృష్ణార్జునులను చంపాలని వచ్చారు. వారినందరినీ నిలువరించారు శ్రీకృష్ణార్జునులు. అర్జునుడి దివ్యాస్త్రాలు, శ్రీకృష్ణుని సుదర్శన చక్రం అప్రతిహతంగా దేవతల దాడులను ఎదుర్కున్నాయి.

ఆ ఖాండవ వన దహన సమయంలో అగ్ని ఆరుగురిని దహించలేదు- అశ్వసేనుడు, మయుడు, నాలుగు శారంగకాలు (పక్షులు).

అర్జునుని శరణు వేడిన నముచి సోదరుడు మయుడిని శ్రీకృష్ణుడు చంపకుండా వదిలేసాడు, అగ్నికూడా దహించలేదు.

## 19) మయ దర్శన పర్వము (అధ్యాయాలు-7)

## జరిత - మందపాలుడు - లపిత

అర్జునుడి వలన మయుడు రక్షింపబడినాడు.

మందపాలుడనే ముని గొప్ప తపస్సు చేసినా సంతానం లేకపోవడంతో పుణ్యలోకాలు పొందలేకపోయాడు. అందుకని భూలోకానికి మరలి వచ్చి త్వరగా అధిక సంతానాన్ని పొందాలని తాను శారికుడై, జరిత అనే శారికతో నలుగురు కుమారులకు జన్మనిచ్చాడు.

వాళ్లు అండదశలో ఉండగానే అతడు వేరొకచోట 'లపిత' అనే పక్షితో జీవిస్తున్నాడు. ఈలోగా అండాల నుంచి చిన్ని పిట్టలు పుట్టాయి. వాటికింకా రెక్కలు రాలేదు.

అగ్ని ఖాండవ వనాన్ని దహిస్తున్నపుడు మందపాలుడు అగ్నివద్దకు వెళ్లి "నా పుత్రులను విడిచిపెట్టు" అని ప్రార్థించాడు.

వనాన్ని దహిస్తున్న కార్చిచ్చును చూసి జరిత దుఃఖించింది. "ఈ పిల్లలు ఎగరలేవు. నేను వీరిని వదిలిపోలేను" అనుకుని అగ్నిజ్వాలలు తగలకుండా పిల్లలపై (జరితారి, సారిసృక్కుడు, స్తంబమిత్రుడు, ద్రోణుడు) తన రెక్కల్ని కప్పింది.

పిల్ల పిట్టలన్నాయి– "అమ్మా నీవు ఎగిరిపో! నీవు బతికుంటే మరల పిల్లల్ని కనవచ్చు".

జరిత అన్నది– "తల్లిని నేను. నా హృదయం దానికి అంగీకరించదు. అదుగో, అక్కడ ఎలుక నివసించే బిలం, ఎలుకను ఇందాక డేగ ఎత్తుకుపోయింది. మిమ్మల్ని దాంట్లోకి చేర్చి బిల రంధ్రాన్ని మూసివేస్తాను. కార్చిచ్చు తగ్గాక మీరు బయటకు రావచ్చును".

పిల్లలు ఒప్పుకోలేదు. తల్లిని వెళ్లమని గట్టిగా పోరగా ఆమె ఖాండవ వనాన్ని వీడి సురక్షిత ప్రాంతానికి చేరింది. జరతారి, సారిసృక్కుడు, స్తంబమిత్రుడు, ద్రోణుడు అగ్నిని స్తుతించి అతడిని ప్రసన్నం చేసుకుని రక్షింపబడడమే కాక తమను ప్రతినిత్యమూ వేధిస్తున్న పిల్లి పిల్లలను అగ్నిలో దహింపచేసారు.

తన పిల్లల గురించి ఎంతగానో దుఃఖిస్తున్న మందపాలుని విడిచి వెళ్లిపోయింది 'లపిత'.

అగ్ని తామున్న చోటును విడిచి ముందుకు పోయాక తన పిల్లల మీద ప్రేమతో 'జరిత' వెనక్కి వచ్చి తన పిల్లలు సురక్షితంగా ఉండడం చూసి ఆనందపడింది.

మందపాలుడు వచ్చినా పిల్లలు అతడిని పట్టించుకోలేదు. జరిత అన్నది– "నీవు నా దగ్గరకెందుకు వచ్చావు? ఆ 'లపిత' వద్దకే వెళ్లు!"

మందపాలుడనుకున్నాడు– "ఈ సవతి పోరు లోకప్రసిద్ధం. అరుంధతి లాంటి పతివ్రత వశిష్ఠుడిని శపించింది సవతి కారణంగా– నేను అగ్నిని ప్రార్థించాను మిమ్మల్ని సురక్షితంగా ఉంచమని. అందుకే ఇప్పుడు మీ వద్దకు వచ్చాను. మీరు ఋషులని అగ్నికి తెలుసు.

జరితా, నీవు ధర్మం తెలిసిన దానివి" అని భార్యాపుత్రులను ఊరడించి మందపాలుడు ఆ ప్రదేశం నుంచి వేరొక ప్రదేశానికి చేరినాడు.

ఖాండవ వన దహనం పూర్తయ్యింది. ఇంద్రుడు కూడా శాంతించాడు. అర్జునుడికి దివ్యాస్త్రాలనిస్తానని వాగ్దానం చేసాడు. అర్జునుడిపై ప్రేమ దినదిన ప్రవర్ధమానమయ్యేలా కృష్ణునికి వరమిచ్చి ఇంద్రుడు వెళ్లిపోయాడు.

అగ్నిదేవుడి అజీర్తి తగ్గింది.

అర్జునుడి దయతో బ్రదికిన మయుడు కృష్ణార్జునుల వద్దకు వచ్చాడు.

✣✣✣✣✣

# ✤ 2. సభాపర్వము ✤


1) సభాక్రియా పర్వము - 4
2) లోకపాల సభాఖ్యాన పర్వము-8
3) రాజాసూయారంభ పర్వము-7
4) జరాసంధ వధ పర్వము-5
5) దిగ్విజయ పర్వము-8
6) రాజసూయ పర్వము-7
7) అర్ఘాభిహరణ పర్వము
8) శిశుపాల వధ పర్వము-6
9) ద్యూత పర్వము-28
10) అనుద్యూత పర్వము-8


## 1) సభాక్రియా పర్వము (అధ్యాయాలు-4)

పదివేల జానల పొడవు, వెడల్పు ఉండే చతురస్రాకార మయసభను, విమానంతో సమానమైన దానిని, దేవ, మానవ, రాక్షస మనోవృత్తులను వ్యక్తపరచేది, అపురూపమైన సభను నిర్మించేందుకు మయుడు సంసిద్ధుడైనాడు.

శ్రీకృష్ణుడు పాండవుల వద్ద సెలవు తీసుకుని ద్వారకకు వెళ్లాడు. మయుడు అర్జునుని అనుమతితో కైలాస పర్వతానికి ఉత్తరదిశలో ఉన్న మైనాక పర్వతానికి దగ్గర, హిరణ్యశృంగ పర్వతం వద్ద బిందుసరస్సు సమీపంలో వృషపర్వుని సభలో భద్రపరచిన మణిమయ భాండాన్ని, భీముడి కోసం లక్షగదల సాటిరాగల వృషపర్వుని గదను, అర్జునుడి కోసం వరుణుడి దేవదత్త శంఖాన్ని తీసుకురావడానికి వెళ్లాడు. ప్రజాపతి నూరు యజ్ఞాలు చేసిన ఆ ప్రదేశానికి వెళ్లి సభా నిర్మాణానికి కావాల్సిన మహానిధిని మణిమయ ద్రవ్యాన్ని తీసుకుని వచ్చాడు. వృషపర్వుని గదను భీముడికిచ్చాడు. దేవదత్త శంఖాన్ని అర్జునునికిచ్చాడు.

ఎనిమిది వేలమంది కింకరులు ఆ సభను ఒకచోట నుంచి మరొకచోటకు తరలించగలరు. ఆ సభలో మణులతో నిర్మించబడి తటాకంలా కనిపించని పుష్కరిణి ఉన్నది. మామూలు నేలలా కనిపిస్తుంది. అలా భ్రమపడి పడిపోతారు పరాకుగా ఉన్నవారెవరైనా.

ఆ మయసభా భవనాన్ని అర్జునుడి కప్పగించి కానుకలందుకుని వెళ్లిపోయాడు మయశిల్పి.

మంచి ముహూర్తాన ఆ సభలోకి ప్రవేశించాడు ధర్మరాజు తన సోదరులు బంధుమిత్రులతో, అనేక మంది మహర్షులు, మునుల ఆశీర్వాదాల మధ్య. యుధిష్ఠిరుని కీర్తి రాజలోకంలో అత్యంత గొప్పగా వెలుగొందసాగింది.

**తస్యాం సభాయ మాసీనాః సువ్రతాః సత్యసంగరాః**
**దివీవ దేవా బ్రహ్మాణం యుధిష్ఠిర ముపాసతే** (సభా. 4-40)

## 2) లోకపాల సభాఖ్యాన పర్వము

ధర్మరాజు సభలో కొలువైనప్పుడు నారద మహర్షి వచ్చాడు. ఎంతో ప్రేమతో వినయంగా అతిథి సత్కారాలు చేసారు ధర్మరాజు, అతడి సోదరులు. ధర్మ, అర్థ, కామాలను దృష్టిలో పెట్టుకుని కచ్చిత్- అంటూ అనేక ప్రశ్నలడిగాడు ధర్మరాజును ప్రశ్నలలోనే నీతిని బోధిస్తూ నారదుడు.

**కచ్చిదర్థాశ్చ కల్పంతే ధర్మేచ రమతే మనః**
**సుఖాని చానుభూయంతే మనశ్చ న విహన్యతే** (సభా. 5-17)

**కచ్చిత్ తే సఫలా వేదాః కచ్చిత్ తే సఫలం ధనమ్**
**కచ్చిత్ తే సఫలా దారాః కచ్చిత్ తే సఫలం శ్రుతమ్**

అని ప్రశ్నలడిగి నారదుడే సమాధానం చెప్పినాడు. నిత్యాగ్ని హోత్రాల వల్ల వేదాలు, దానం వల్ల ధనం, భార్య వలన రతి సంతానం, శాస్త్రజ్ఞానం వల్ల సదాచారం ఫలాలుగా లభిస్తాయి.

**షడనర్థా మహారాజ కచ్చిత్ తే పృష్ఠతః కృతాః**
**నిద్రాలస్యం భయం క్రోధో మార్దవం దీర్ఘసూత్రతా** (సభా. 5-126)

నిద్ర, ఆలస్యం, భయం, కోపం, కాఠిన్యం, దీర్ఘాలోచనమనే దోషాలను విడిచిపెట్టావు గదా - అని నారదుడు అడిగాడు ధర్మరాజును.

ఏ రాజైనా నాలుగు వర్ణాల వారిని వారివారి వర్ణాశ్రమ ధర్మాలను కాపాడుతూ రాజ్యాన్ని పరిపాలిస్తారో అతడు ఇహపరలోక సుఖాలను పొందుతాడు -అని పలికి నారదుడు ధర్మరాజును ఆశీర్వదించాడు.

## దివ్యసభల గురించి ధర్మజుడి జిజ్ఞాస

"ఈ మయసభలాంటి సభలింకెక్కడన్నా ఉన్నాయా?" అని అడిగాడు ధర్మరాజు నారదుడిని.

"కమలశోభితమైన ఇంద్రసభను, సూర్యతేజస్సు గల యమసభను, పుష్కరాది తీర్థాలతో విలసిల్లే వరుణ సభను, శ్వేతకాంతితో మెరిసే, గగన సంచారిణి అయిన కుబేర సభను, ఆధార స్తంభాలు లేనిది, అనంత కాంతులతో వెలిగే బ్రహ్మసభను చూసాను. అవి దేనికవే ప్రత్యేకమైనవి. మానవలోకంలో నీ మయసభ సర్వశ్రేష్ఠమైనది" -అన్నాడు నారదుడు.

ధర్మజుడన్నాడు- "యముని సభలో రాజ సమూహం; వరుణసభలో నాగులు, దైత్యులు, నదులు, సముద్రాలు; కుబేర సభలో యక్షులు, గుహ్యకులు, రాక్షసులు, గంధర్వులు, అప్సరలు, శంకరుడు; బ్రహ్మదేవుని సభలో మహర్షులు, దేవతలు, సర్వ శాస్త్రాలు ఉన్నాయన్నావు. మరి రాజులలో హరిశ్చంద్రుడు ఒక్కడే దేవేంద్రుడి సభలో ఉన్నాడెలా? అతడే పుణ్యకార్యాలు చేసాడు? మా తండ్రి పాండురాజు పితృలోకంలో ఉన్నాడు కదా? ఆయనను నీవు కలిసినపుడేమన్నాడు?"

నారదుడన్నాడు- "హరిశ్చంద్రుడు సత్యవాక్య పాలన, దానధర్మాలు, రాజసూయ యాగం చేసాడు. మీ తండ్రి పాండురాజు మిమ్మల్ని కూడా రాజసూయ యాగాన్ని ఆచరింపమని కోరినాడు. తద్వారా తానుకూడా ఇంద్రలోకంలో ఉండవచ్చునని తెలిపాడు. అయితే ఈ యాగం చేసిన తరువాత సర్వక్షత్ర వినాశకరమైన యుద్ధం సంభవించే అవకాశం ఉన్నది. నీకు క్షేమమనిపించింది ఆచరించు".

## 3) రాజసూయారంభ పర్వము

రాజసూయ యాగం చెయ్యాలన్న కోరిక ధర్మరాజు మనసులో స్థిరపడింది. ఆ విషయాన్ని ఋత్విక్కులతో, మంత్రులతో, ధౌమ్య వ్యాసాది మహర్షులతో ఆలోచించాడు. శ్రీకృష్ణుడికి కబురు పంపి అతడు వచ్చాక తన మనోభావం వెల్లడించగా ధర్మరాజు

**ప్రార్థితో రాజసూయోమే న చాసౌ కేవలేప్సయా**
**ప్రాప్యతే యేనతత్ తేహి విదితం కృష్ణ సర్వశః** (సభా. 13-46)

శ్రీకృష్ణుడన్నాడు- "నీవు రాజసూయం చేయదగినవాడివే, అయితే నాకు తోచింది నీకు చెబుతాను.

పరశురాముడు క్షత్రియులందరిని సంహరించినాక మిగిలింది నామమాత్రమే. చంద్రవంశంలో పురూరవుడు, ఇక్ష్వాకు వంశీయులు- సూర్యవంశ నాబాగులు 101 వంశాలైనారు. యయాతి వారసులలో భోజ వంశీయులు 18 కులాలై ఉన్నారు.

రాజా! ఎవరైతే క్షత్రియులు అందరినీ ఓడిస్తాడో అతడే సమ్రాట్టు- అని ఒక కులనియమం ఏర్పరచుకున్నారు. ఈ విషయం నీకు తెలుసు.

మాంధాత శత్రువులను గెలిచి, భగీరథుడు చక్కని ప్రజాపాలన చేసి, కార్తవీర్యుడు తపోబలంతో, భరతుడు భుజబలంతో, మరుత్తుడు సమృద్ధి బలంతో సమ్రాట్టులయ్యారు.

ఇప్పుడు జరాసంధుడు సమస్త క్షత్రియులను ఓడించి సమ్రాట్టు అయినాడు. జరాసంధుని అనుచరులు హంస-డింభకులు. హంసుడు యుద్ధంలో మరణించాడన్న పుకారు విని డింభకుడు యమునా నదిలో మునిగి మరణించాడు. డింభకుడు లేని బ్రతుకు నాకెందుకు అని హంసుడూ యమునలో మునిగి చనిపోయాడు. మాపై 17వ సారి దండెత్తినపుడు జరిగిన పరిణామమిది.

మీకు తెలుసు నేను నా మేనమామ కంసుడిని చంపడం, కంసుడి భార్యలు అస్తి, ప్రాప్తి జరాసంధుడి కుమార్తెలు. అందుకే అతడు మాపై అన్నిసార్లు దండెత్తినాడు.

మేము కూడా మధురను వదిలి ద్వారకలో ఉంటున్నాము. ఈ జరాసంధుడి సేనాపతి శిశుపాలుడు. అతడి మిత్రుడు దంతవక్త్రుడు (కరూష దేశాధిపతి). వీరందరికీ నాపై ద్వేషమున్నది.

జరాసంధుడు రాజులందరిని గెలిచి గిరివ్రజపురంలో బంధించాడు. వారందరిని బలి ఇచ్చి యాగం చెయ్యాలనేది అతడి సంకల్పం. ఇప్పుడా గిరివ్రజం పురుషవ్రజమయ్యింది. జరాసంధుని ఓడిస్తే సకల రాజులనూ ఓడించినట్లే".

ధర్మజుడన్నాడు– "నీవు, బలరాముడు, భీముడు, అర్జునుడు – మీలో ఎవ్వరూ జరాసంధుని చంపలేరా?"

భీముడన్నాడు– "శ్రీకృష్ణునిలో నీతి, నాలో బలం, అర్జునుడిలో విజయం ఉన్నాయి. మేము త్రేతాగ్నులలా జరాసంధుని జయిస్తాం".

**కృష్ణేన యోమయి బలం జయః పార్థే ధనంజయే**
**మగధం సాధ యిష్యామః ఇష్టింత్రయ ఇవాగ్నయః** (సభా. 15-13)

శ్రీకృష్ణుడన్నాడు– "జరాసంధుడు ఇప్పటికి 86 మంది రాజులను బంధించాడు. ఇంకో 14 మంది దొరికితే చాలు యాగం ప్రారంభిస్తాడు. అతడి ప్రయత్నాన్ని అరికట్టిన వారికి ఉజ్జ్వలకీర్తి లభిస్తుంది. 'సమ్రాట్టు' గౌరవం దక్కుతుంది".

ధర్మరాజుకు నీరసం, నిరుత్సాహం, నిరాశ వచ్చాయి. భీమార్జునులు నాకు కళ్లు, శ్రీకృష్ణుడు మనస్సు. వీళ్లను జరాసంధుడి దగ్గరకు పంపి, కోల్పోతే పరిస్థితి ఏమిటి? రాజసూయ యాగపు ఆలోచనను విరమించుకుంటేనే మంచిదేమో!

అర్జునుడన్నాడు– "బలవంతునిలో దైన్యం, బలహీనునిలో మోహం వినాశ కారణాలు. వీటిని వదిలి విజయాన్ని సాధించాలి. జరాసంధ వధ వలన రాజులను రక్షించవచ్చు, రాజసూయ యాగం చేయవచ్చు. అలా చేయకపోతే నా గాండీవం, దివ్యాస్త్రాలు ఉండీ ఏమి ఉపయోగం?"

## 4) జరాసంధ వధ పర్వము

### జరాసంధుని కథ

ధర్మరాజు అడగగా శ్రీకృష్ణుడు చెబుతున్నాడు– మగధ రాజ్యానికి రాజు బృహద్రథుడు. అందగాడు, బలవంతుడు. మూడు అక్షౌహిణీల సేనకు అధిపతి. అతడు కాశీరాజు కుమార్తెలిరువురిని వివాహం చేసుకున్నాడు. వారు కవలలు.

బృహద్రథుడికి సంతానం కలగనప్పుడు ఆతడు తన భార్యలతో కలిసి వెళ్లి గౌతమ గోత్రీకుడైన కాక్షీవంతుని కుమారుడు చండకౌశికుని దర్శించి ఆశీస్సులు పొందుతున్న సమయంలోనే మామిడిచెట్టు నీడలో కూర్చున్న ముని ఒడిలో మామిడిపండు పడింది. దానిని ముని మంత్రించి పుత్రసంప్రాప్తి కోసం వచ్చిన రాజుకు ఇచ్చాడు– "రాజా! నీకు కుమారుడు జన్మిస్తాడు. అతడికి బ్రాహ్మణభక్తి, యుద్ధంలో ఓటమి లేకపోవడం, యుద్ధాసక్తి నశించకపోవడం, అతిథులను ప్రేమగా చూడడం, దీనులను కాపాడడం, మహాబలం, లోకంలో శాశ్వతకీర్తి, ప్రజానురాగం – అనే వరాలనిస్తున్నాను" అని ఆశీర్వదించాడు చండకౌశికుడు.

ఆ మామిడి పండును రెండు సగాలుగా కోసి బృహద్రథుడి భార్యలు చెరోముక్క తిన్నారు. తరువాత వారు గర్భవతులై చెరొక్క ముక్క (అర్ధశిశువు)కు జన్మనిచ్చారు. దానితో దుఃఖితులైన ఆ రాణులు చెప్పగా వారి దాదులు ఆ ముక్కలను గుడ్డతో చుట్టి నగర కూడలిలో విసిరివేసారు.

'జర' అనే రాక్షసి ఆ రెండు ముక్కలను చూసి ఆశ్చర్యపడి వాటిపై ఉన్న వస్త్రాలను తొలగించి దగ్గరకు చేర్చింది. మరుక్షణం ఆ రెండు భాగాలు కలిసి మగశిశువు ఏర్పడి గుక్కపెట్టి ఏడ్వసాగినాడు. ఆ ఏడ్పు విని రాజు, అంతఃపుర కాంతలు అటు వచ్చారు.

'జర' మానవ కాంత రూపం ధరించి రాజుకు ఆ శిశువునందజేసి– "నేను రాక్షసిని. నాపేరు 'జర'. మానవలోకంలో ఇంటింటా ఉంటాను. నన్ను గృహదేవి అంటారు. నీ పూర్వీకులు నన్ను బహుపుత్రవతిగా గోడలపై చిత్రించి పూజలు జరిపేవారు. నేను ఈ రెండుముక్కలను కలిపాను. నేను నిమిత్తమాత్రమే. ఈ బాలుడు గొప్పవాడవుతాడు" అన్నదామె. ఆ బాలుడిని ఆశీర్వదించి అదృశ్యమయ్యింది.

బృహద్రథుడు ఆ బాలుడికి తగిన సంస్కారాలు జరిపించాడు. 'జర' రాక్షసి పేరిట మహోత్సవాలు నిర్వహించాడు. 'జర' చేత కలుపబడినవాడు కనుక 'జరాసంధుడు' అని పిలిచారతడిని. జరాసంధుడికి యుక్తవయసు వచ్చాక వివాహమై

అస్తి, ప్రాప్తి అనే కుమార్తెలు కలిగారు. వారిని ఉగ్రసేనుడి కుమారుడు కంసుడికిచ్చి పెళ్లి చేసాడు జరాసంధుడు. జరాసంధుడికి పట్టాభిషేకం చేసి బృహద్రథుడు అడవికి పోయి తపస్సు చేసి స్వర్గానికి వెళ్లినాడు.

శ్రీకృష్ణుడు కంసుడిని చంపినాక ఇద్దరికీ వైరమై పదిహేడు సార్లు మధురపై దండెత్తాడు జరాసంధుడు. వాడి పీడ భరించలేక ద్వారకకు వెళ్లిపోయారు యాదవులు. హంసడింభకులు చనిపోయాక జరాసంధుడు కాస్త తగ్గినా యాదవులపై పగ తగ్గలేదు.

జరాసంధుడి కథ విన్నాక భీమార్జునుల ముఖాలు వికసించాయి. శ్రీకృష్ణుడు తమ వెంట ఉంటే విజయం తథ్యమని భావించారు. యుధిష్ఠిరుడన్నాడు– "జరాసంధుడు ఇక చనిపోయినట్లే, రాజులందరికి విముక్తి లభిస్తుంది. నీ ఆధ్వర్యంలో నేను రాజసూయ యాగం చెయ్యటం తథ్యం".

యుధిష్ఠిరుడి అనుమతితో ముగ్గురు వీరులూ గిరివ్రజం వేపు బయల్దేరినారు– స్నాతకులైన బ్రాహ్మణుల వస్త్రాలు ధరించారు.

**వర్చస్వినాం బ్రాహ్మణానాం స్నాతకానాం పరిచ్ఛదమ్**
**ఆచ్ఛాద్య సుహృదాం వాక్యైః మనోజ్ఞైరభినందితాః** (సభా. 20–22)

## జరాసంధ - భీమసేనుల యుద్ధం

త్రేతాగ్నులవలె శ్రీకృష్ణ భీమార్జునులు జరాసంధుడి నగరం గిరివ్రజం చేరుకున్నారు.

విపులం, వరాహం, ఋషభం, ఋషిగిరి, చైత్యకం అనే పర్వతాల మధ్య సంరక్షింపబడుతున్నది గిరివ్రజం.

కాముకులకు హాయినిచ్చే లొద్దుగ చెట్లున్నాయి ఎక్కడ చూసినా. గౌతమ మహర్షి దయతో ఉశీనరదేశపు శూద్రస్త్రీ కన్యగా ఉన్నపుడు ఆమెకు కాక్షీవంతుడు మొదలగు పుత్రులను జనింపచేసాడు. కాక్షీవంతుని కుమారుడు చండకౌశికుడు.

అక్కడ పిప్పల, లోధ్రాది వృక్షాలు, అర్బుదం, శుక్రవాపి, స్వస్తికం, మణినాగము, మణిమంతుడనే ఏనుగులు, చండ కౌశికముని ఈ నగరానికి రక్షకులై ఉన్నారు.

బృహద్రథ కుటుంబీకులు గిరిపూజలు చేస్తారు. చైత్యక పర్వత శిఖరాన బృహద్రథుడు నరమాంస భక్షకుడైన రాక్షసుడు 'ఋషభుడు' (వృషభుడు) అనే వాడిని చంపి అతడి చర్మంతో మూడు ఢక్కలు (నగారా) చేయించాడు. వాటిని ఒకసారి మ్రోగిస్తే నెలవరకూ అలా మ్రోగుతూనే ఉంటాయి.

శ్రీకృష్ణ భీమార్జునులు గిరివ్రజపు ప్రధాన ద్వారం నుండి కాకుండా, అక్కడి ప్రజలకు పూజనీయమైన చైత్యక శిఖరం మీదుగా వెళ్తూ, మూడు ఢక్కలను తమ భుజాలతో చీల్చి, గిరివ్రజంలో ప్రవేశించి, మాలాకారుల నుంచి మాలలను బలవంతంగా తీసుకుని, రంగురంగుల వస్త్రాలు పైన ధరించి, మెడలో హారాలు, మాలలు వేసుకుని జరాసంధుడి వద్దకు చేరుకున్నారు. పూజలు, వ్రతాలు చేస్తున్న జరాసంధుడు వారిని స్వాగతించాడు. శ్రీకృష్ణుడన్నాడు– "వీరిద్దరు వ్రతంలో ఉన్నారు. అర్ధరాత్రి సమీపించాక నీతో మాట్లాడతారు".

అర్ధరాత్రి దాటినాక జరాసంధుడు అతిథులున్న చోటుకు వచ్చాడు – "క్షత్రియ తేజమున్న మీరు స్నాతకుల వేషంలో శత్రువుల్లా వెనక వేపునుంచి వచ్చిన కారణమేమిటి?" అన్నాడు.

శ్రీకృష్ణుడన్నాడు– "నేను నీకు ప్రసిద్ధుడైన శత్రువును. నేను శ్రీకృష్ణుడిని. వీరిద్దరు భీమార్జునులు"

జరాసంధుడన్నాడు– "నీవు నా అల్లుడైన కంసుడిని చంపావు. నేను నిన్ను ఓడించి నా పుత్రిక కుమారుడిని మధురా నగరానికి రాజును చేసాను. నీవు పారిపోయి ద్వారకలో దాక్కున్నావు. ఇప్పుడు కొత్త ఉపాయంతో వచ్చావు. మంచిదే!"

శ్రీకృష్ణుడన్నాడు– "మాలో ఎవరితో యుద్ధం చేయాలనుకుంటున్నావు".

జరాసంధుడు భీమసేనుడిని కోరుకున్నాడు. తన కుమారుడు సహదేవుడిని పట్టాభిషేకం చేసి వచ్చాడు.

మల్లయుద్ధం మొదలైంది. చేతులు కలిసాయి, పాదాభివందనాలు చేసుకున్నారు. భుజాలు చరిచారు. వాళ్లు ఒకరినొకరు కొడుతుంటే పిడుగులు పడిన శబ్దాలు వచ్చాయి. భూమి కంపించింది.

ఛాతీలపై కొట్టుకున్నారు (ఉరోహస్తం); పిడికిళ్లు, చేతివేళ్లతో పొడుచుకున్నారు (పూర్ణకుంభం), వీపును నేలపై ఆనించి తొక్కిపట్టారు (పృష్ఠభంగం); కాళ్లుచేతులు బంధించుకున్నారు (పూర్ణయోగం, తృణాపీడం), శత్రువు మెడ పట్టి క్రింద పడవేసారు (ప్రగ్రహం), ప్రకర్షణ, ఆకర్షణ, అనుకర్షణ, వికర్షణలతో మోకాళ్లతో పొడుచుకున్నారు.

కార్తీక మాసపు మొదటి రోజున మొదలై త్రయోదశి ముగిసింది. చతుర్దశి నాటి రాత్రి అలిసిపోయినట్లు కనిపించాడు జరాసంధుడు. భీముడికి చెప్పాడు ఇదే మంచి అవకాశం అని శ్రీకృష్ణుడు.

గడ్డిపరకను తీసి రెండుగా చీల్చాడు. అది గమనించి భీముడు జరాసంధుడిని పైకి లేవనెత్తి గాలిలో గిరగిరా తిప్పి, నేలపై పడవేసి నడుము విరిచి, ఒక పాదంపై పాదంపెట్టి రెండుగా చీల్చాడు. రెండు శరీర భాగాలు మరల ఏకమై జరాసంధుడు లేచి దొమ్మియుద్ధం చేసాడు. ఈసారి శ్రీకృష్ణుడు గడ్డిపరకను చీల్చి రెండు భాగాలను విపరీత దశలో పడవేసాడు. అది గమనించి భీముడు మరల జరాసంధుని దేహాన్ని చీల్చి విపరీత దిశలో పడవేసేసరికి కాసేపు కొట్టుకుని అతడి దేహభాగాలు నిశ్చలమైనాయి. జరాసంధుని చంపి భీముడు సింహగర్జన చేసినాడు.

## 5) దిగ్విజయ పర్వము

జరాసంధుడి రథం పేరు సోదర్యవంతం. ఒక్కసారే ఇద్దరు మహారథులు ఆ రథంపై నుండి యుద్ధం చేయవచ్చు. ఇంద్రుడి రథం అది. వసువుకు, బృహద్రధుడికి, అతడి నుంచి జరాసంధుని చేరింది.

కారాగారంలో బందీలైన రాజులందరిని విడిపించారు శ్రీకృష్ణ భీమార్జునులు. ధర్మరాజుకు విధేయులైనారు రాజులందరూ. జరాసంధుని కుమారుడు సహదేవుడు గజగజ వణుకుతూ వారి ముందు నిలబడినాడు. అతడిని గౌరవించి జరాసంధుడి దహన సంస్కారాలు, అంత్యక్రియలను ఘనంగా చేయించారు.

ఆ తరువాత ముగ్గురు వీరులూ ఇంద్రప్రస్థానికి చేరుకుని ధర్మజునికి విజయవార్త నందజేసారు.

యుధిష్ఠిరుడి అనుమతితో నలుగురు సోదరులు నాలుగు దిక్కులకు దిగ్విజయ యాత్రకు బయల్దేరినారు.

ఉత్తర దిక్కుకు వెళ్లిన అర్జునుడు పుళింద, ప్రతివింధ్య, ద్వీపమండలేశ్వర, ప్రాగ్జ్యోతిష (భగదత్తుడు), శబర, సాగరతీర, అంతర్గిరి, బహిర్గిరి, ఉపగిరి భూపతులు, ఉలూక దేశరాజు బృహంతుడు, ఉత్తర ఉలూక, దేవప్రస్థ, విష్వగశుడు, పార్వతేయులు, బర్బర, శబర, తురుష్కులు, మాళవ, పౌండ్ర, కాశ్మీర, త్రిగర్త, లోహిత, సుధన్య, గాంధారా, కాంభోజ, కోసల, సింహపుర చిత్రాయుధుడు, వనచరదస్యులు, శ్వేత పర్వతం తరువాత కాంభోజ కటకుడనే రాజును, హాటక దేశం, మానససరోవర ఋషికుల్య ప్రాంతపు రాజులు, హేమకుడి నిషధా చలాలను దాటి గంధర్వ నగరాన్ని, జంబూవృక్ష-జంబూనది-మేరువు-గంధమాదనం-సిద్ధ విద్యాధరం, చారణ గంధర్వులు, మాల్యవంతం, నీలపర్వతం దాటి ఉత్తర కురుదేశాలు - హరివాసర నగరం - వీటిని జయించాడు అర్జునుడు.

తూర్పుదిక్కుకు వెళ్లిన భీముడు - పాంచాల, విదేహ (జనకుడు), దశార్ణ (సుధన్వుడు), అశ్వమేధేశ్వర (రోచమానుడు); చేది (శిశుపాలుడు), పుళింద (సుకుమార, సుమిత్రులు), కుమారవిషయ (శ్రేణిమంతుడు), కోసల (బృహద్బలుడు), అయోధ్య (దీర్ఘప్రజ్ఞుడు), కాశీరాజు (సుపార్శ్వుడు), రాజపతి (సుధన్వుడు), మత్స్య మలదపతులు, కర్ణాట దక్షిణ మల్లులు, మగధ (సహదేవుడు), హిమవత్పర్వత ప్రాంత జలోద్భవము, భల్లాట దేశం, ఇంద్రపర్వత సమీపంలోని ఏడుగురు కిరాతులు, శర్మక, వర్మకులు; ఇంద్రసేన సముద్రసేనులు, కర్ణవత్స పుండ్ర పౌండ్రక వాసుదేవుడిని జయించాడు.

దక్షిణ దిక్కుకు వెళ్లిన సహదేవుడు- సుమిత్ర, శూరసేన, దంతవక్త్ర, యవనుల, గోశృంగగిరి, కుంతిభోజుడు, భూరిబలుడి పుత్రుడు (జంభకుడు), నర్మదానదీ ప్రాంత అవంతీదేశపు విందానువిందులు, మాహిష్మతిపుర నీలుడు, సౌరాష్ట్ర-రుక్మి భీష్మక శూర్పారక దండకపతుల నుంచి దూతల ద్వారా కప్పాలు తీసుకున్నాడు. సాగర ద్వీపవాసులైన నిషాద, పురుషాద, ఏకపాద, కాలముఖ, కర్ణప్రావరణ, నరరాక్షస జాతులు, రామశైల, కోలశైల, తామ్రద్వీప, సంజయంతపుర నివాసులు, తాళవన పాండ్య కేరళ ఆంధ్ర, కాళింగ ద్రవిడ యవన కరహాటక; లంకాధిపతి-విభీషణుడు (దూతలద్వారా) మొదలైన రాజుల వద్ద కప్పాన్ని గైకొన్నాడు సహదేవుడు.

పశ్చిమ దిక్కుకు వెళ్లిన నకులుడు– మహితక, దత్తక, మయూర; మరు, మాళవ, బర్బర, కర్బర, శైరీషిక, దశార్ణ; పుష్కరారణ్య (అభీరులు), సరస్వతి–సింధు (స్తువణీయులు), పంచనద అమర పర్వత నివాసులు; ద్వారవతి–వాసుదేవుడు, మద్రవతి–శల్యుడు (శాకలపురం) – పశ్చిమ సముద్రగర్భ నివాసులు – బర్బర, కిరాతవీరులు–వీరిని జయించాడు.

ఎవరైనా రాజు రాజసూయయాగం చేసేప్పుడు తక్కిన రాజులు సహాయ సహకారాలందించేవారు. రాజసూయ యాగమనేది గొప్ప ఉత్సవం కనుక రాజులందరూ పాల్గొనేవారు. కానుకలను కప్పంగా ఇచ్చేవారు. రాజులందరూ కలిసే అవకాశం వస్తుంది కనుక దానిని ప్రోత్సహించేవారు. ఆ విధంగా సమ్రాట్టును ఎన్నుకునేవారు.

(సహదేవుడు విభీషణుడి వద్దకు ఘటోత్కచుడిని పంపినాడన్నది దాక్షిణాత్య భారత పాఠం)

భీష్మ, ధృతరాష్ట్ర, ద్రోణ, విదుర, కృప, దుర్యోధన, దుశ్శాసనాది కౌరవులను ఆహ్వానించడానికి నకులుడు హస్తినాపురానికి వెళ్లినాడు.

## 6) రాజసూయ పర్వము

### రాజసూయ యాగం

ధర్మరాజు రాజసూయ యాగం చేస్తున్నాడని తెలిసిన యజ్ఞవేత్తలు, క్షత్రియులు, సమస్త జనులు ఇంద్రప్రస్థానికి విచ్చేసారు. ధర్మరాజు అర్హమైన అధికారాలను అప్పగించాడు అర్హులకు.

భక్ష్యభోజ్యాల పంపకానికి దుశ్శాసనుడు, బ్రాహ్మణులను స్వాగతించడానికి అశ్వత్థామను, రాజన్యుల సత్కారానికి సంజయుడిని, కృతాకృత పరిజ్ఞానానికి భీష్మ ద్రోణులను, రత్నాల రక్షణ దానధర్మ బాధ్యతను కృపుడికి, ఇంటి యజమానుల అధికారులను బాహ్లిక సోమదత్త ధృతరాష్ట్ర జయద్రథులకు అప్పగించినాడు. ధనవ్యయం విదురుడికి, కానుకల స్వీకరణ దుర్యోధనుడికి, బ్రాహ్మణుల పాదప్రక్షాళనం శ్రీకృష్ణుడికి అప్పగించినాడు. వచ్చిన అతిధులు కనీసం వేయి సువర్ణ నాణేలకు తక్కువ తేలేదు, తమకూ యజ్ఞఫలం లభించాలన్న కోరికతో.

యజ్ఞం ప్రారంభమయ్యింది. ముందుగా అర్ఘ్యం ఎవరికివ్వాలి? భీష్ముడన్నాడు– "యుధిష్ఠిరా! ఆచార్యుడు, ఋత్విక్కు సంయోక్త, స్నాతకుడు, ప్రియమిత్రుడు, రాజు – ఈ ఆరుగురు పూజింపదగినవారు. నీకిష్టమైనవారికి ముందుగా అర్ఘ్యమివ్వు"

యుధిష్ఠిరుడన్నాడు– "నీవే నిర్ణయించు పితామహా!"

భీష్ముడన్నాడు– "శ్రీకృష్ణుడు దీనికి తగినవాడు".

సహదేవుడు అర్ఘ్యం తీసుకునివచ్చాడు.

శిశుపాలుడికి కోపం వచ్చింది– "ఈ కృష్ణుడు ఆచార్యుడు కాదు, ఋత్విక్కు కాదు, సంయోక్త కాదు, స్నాతకుడు కాదు. ప్రియమిత్రుడు కావచ్చునేమో, రాజు కూడా కాదు. అతడు పూజింపదగిన వాడని ముందే నిశ్చయమైతే ఇంతమందిని ఎందుకు ఆహ్వానించడం? ధర్మరాజా! ఇది మాకు అవమానం. అయినా రాజు కానివాడికి రాజోచితమైన పూజ ఏమిటి?

**క్లీ బే దారక్రియా యాదృక్ అంధే వా రూపదర్శనమ్**
**అరాజ్ఞో రాజవత్ పూజా తథాతే మధుసూదన!**

## 7) అర్ఘాభిహరణ పర్వము

భీష్ముడన్నాడు– "శ్రీకృష్ణుడు పూజార్హుడు.

**కృష్ణ ఏవ హి లోకానామ్ ఉత్పత్తిరపి చాప్యయః**
**కృష్ణ స్యహి కృతే విశ్వమ్ ఇదంభూతం చరాచరమ్** (సభా. 38–23)

వివిధ అవతారాలనెత్తి రాక్షస సంహారం చేస్తున్న విష్ణుమూర్తి స్వరూపం కృష్ణుడు.

ఈ బాలుడైన శిశుపాలుడు కృష్ణుడి గొప్పతనాన్ని గ్రహించక తన బంధువేనని భావిస్తూ దూషిస్తూ ఉంటాడు".

అప్పుడు సహదేవుడన్నాడు– "మేము శ్రీకృష్ణునికి అర్ఘ్యమిస్తున్నాము. కాదనే వాళ్లుంటే నా పాదంతో జవాబు చెబుతాను" అనేసరికి సభ నిశ్శబ్దమయ్యింది.

శిశుపాలుడు తన మిత్రులైన రాజులను రెచ్చగొట్టేసరికి సభలో కల్లోలం చెలరేగింది. శిశుపాలుడన్నాడు భీష్ముడిని నిందిస్తూ

**న గాథా గాథినం శాస్తి బహుచేదపి గాయతి**
**ప్రకృతిం యాంతి భూతాని భూలింగశకు నిర్యథా!**

"చెప్పేవారు ఆచరించరు భూలింగ పక్షిలా! నీవలన ధర్మరాజు కూడా చెడిపోయాడు. నీకు తెలుసు నాకిష్టుడైన జరాసంధుడిని భీమార్జునుల సాయంతో చంపినాడీ పిరికివాడు. నీవు స్త్రీ సమాన ధర్ముడివి. నీమాటలు వీళ్లు వినాల్సిందే!"

భీముడికి కోపం వచ్చింది. పళ్లు పటపట నూరుతూ ముందుకు వస్తుంటే భీష్ముడు అడ్డుకున్నాడు-

"చేది వంశంలో ఈ శిశుపాలుడు మూడుకళ్లు, నాలుగు చేతులతో పుట్టి గాడిదలా అరిచాడు. తల్లిదండ్రులు ఇతడిని పారవేద్దామనుకున్నపుడు అశరీరవాణి చెప్పింది. ఎవరు ఎత్తుకున్నపుడు ఇతడి వికృతరూపం పోతుందో, అతడి చేతిలోనే ఇతడు చస్తాడు అని. శిశుపాలుడి తల్లి శ్రుతశ్రవ (దేవకీ సోదరి), తండ్రి దమఘోషుడు. ఆ పసివాడిని శ్రీకృష్ణుడి చేతుల్లో ఉంచగానే అతడి వికృతరూపం పోయింది. అప్పుడు మేనత్త శ్రుతశ్రవ అడిగింది శ్రీకృష్ణుని వరం- నూరు తప్పుల వరకు క్షమించమని. అందుకే శ్రీకృష్ణుడు సహనంగా ఉన్నాడు" అన్నాడు భీష్ముడు.

## 8) శిశుపాల వధ పర్వము

శిశుపాలుడన్నాడు- "ఈ భీష్ముడు భూలింగపక్షి వంటివాడు. 'సాహసం చేయకు' అని ఇతరులకు చెబుతూ తానుమాత్రం సింహం నోట్లో ఇరుక్కున్న మాంసం ముక్కల్ని లాక్కుతింటూ ఉండేది ఆ పక్షి"

ఆ మాటలకు భీష్ముడికి కోపం వచ్చింది- "అల్పుడా! నేను రాజుల దయవలన జీవిస్తున్నానా? నాకు వీళ్లు గడ్డిపరకతో సమానం. ఏం చేస్తారో చేసుకోండి. నేను మీ నెత్తిమీద నా పాదం మోపుతున్నాను".

శిశుపాలుడన్నాడు- "అవునా, జనార్ధనా! రా యుద్ధానికి! ఈ భీష్ముడిని, నిన్నూ, పాండవులందరినీ ఇప్పుడే చంపుతాను".

శ్రీకృష్ణుడన్నాడు- "వీడు మూర్ఖుడు. ఇంతకు పూర్వం రుక్మిణిని కోరినాడు. పొందలేకపోయాడు. ఇప్పుడు మరణం కోరుతున్నాడు. దానిని పొందుతాడు. ఇతడు క్షమార్హుడు కాడు. నూరు తప్పులూ పూర్తయినాయి వీడికి".

శిశుపాలుడన్నాడు- "నీకిష్టమైతే క్షమించు, లేకపోతే మానుకో! నీ ఇష్టాయిష్టాలెవడికి లెక్క?"

శ్రీకృష్ణుడు స్మరించగానే చక్రం అతడి చేతిలోకి వచ్చింది. నూరు తప్పుల్లాగే శిశుపాలుడికి నూరేళ్లు నిండాయి. చక్రంతో శిశుపాలుడి శిరస్సు ఖండింపబడింది. తేజస్సు శిశుపాలుడి శరీరం నుంచి వచ్చి కృష్ణునిలో కలిసిపోయింది.

ధర్మరాజు ఆజ్ఞతో శిశుపాలుడికి అంత్యక్రియలు జరిగాయి. ఆ తరువాత రాజసూయ యాగం నిర్విఘ్నంగా ముగిసింది.

శ్రీకృష్ణుడు ద్వారవతికి వెళ్లాడు. మిగతా రాజులు ధర్మరాజుతో సన్మానింపబడి వారివారి రాజ్యాలకు సంతోషంగా వెళ్లారు. దుర్యోధనుడు, శకుని మాత్రం ఆ దివ్యసభలో మిగిలారు విశేషాలు చూద్దామని.

## 9) ద్యూత పర్వము

రాజసూయ యాగం పూర్తైనాక వ్యాసుడితో ధర్మరాజు అన్నాడు- "పితామహా! ఉత్పాతాలు దివ్యాలు (పిడుగులు పడుట), అంతరిక్షాలు (తోకచుక్కలు, ఉల్కలు), పార్థివాలు (భూకంపాలు) అని మూడు రకాలని నారదుల వారన్నారు. ఇప్పటి ఉత్పాతాలు శాంతించాయా?"

వ్యాసుడన్నాడు- "మహోత్పాతాల ఫలితం 13 ఏళ్లుంటుంది. నీవలన, దుర్యోధనుని అపరాధం వలన, భీమార్జునుల పరాక్రమం వలన భూమిమీది రాజులందరూ నాశనం అవుతారు యుద్ధంలో. నీకు కలలో వృషభారూఢుడైన శివుడు దక్షిణ దిక్కుకు చూస్తూ కనిపిస్తాడు.

**ఏవ మీదృశకం స్వప్నం ద్రక్ష్యసి త్వం విశాంపతే**
**మా తత్కృతే హ్యాను ధ్యాహి కాలోహి దురతి క్రమః**

కాలం దాటరానిది. ఇంద్రియ నిగ్రహంతో భూమిని పాలించు".

వ్యాసుడు వెళ్లినాక ధర్మరాజు తన సోదరులతో అన్నాడు– "పదమూడేళ్లు నేను ఎవరితోనూ పరుషంగా మాట్లాడను. జ్ఞాతులు ఏవడిగినా ఇస్తాను. నాతో ఎవరికీ భేదభావం రాకుండును గాక!" అన్నాడు.

## మయసభలో భంగపడిన దుర్యోధనుడు

దుర్యోధనుడు శకునితో కలిసి మెల్లమెల్లగా ఆ సభనంతటిని చూడసాగినాడు.

ఒకమారు స్ఫటిక మణులు పొదిగిన చోట నీరు ఉన్నదని వస్త్రాన్ని పైకి పట్టుకుని నడిస్తే అక్కడ నీరు లేదు. తూలి పడినాడు. లేచి ఇంకోచోట ఇక్కడ నీరు లేదులే అనుకుని అడుగువేసి నీటిలో పడినాడు. అదిచూసి భీముడు నవ్వినాడు. పరిచారకులూ నవ్వినారు. అతడికి పొడిబట్టలు ఇస్తూ భీమార్జున నకుల సహదేవులు నవ్వినారు. దుర్యోధనుడు ఈ పరిహాసాన్ని భరించలేకపోయినాడు. నీటిలో ఈదుతున్నట్లు నడిచి గట్టుపైకి వచ్చి ద్వారంలా కనబడిన వేపు వెళ్లబోయి గోడ తగిలి తలకు దిమ్మెక్కి నిలబడినాడు. ఇంకోచోట తలుపు మూసి ఉంది అనుకుని తలుపు లేని చోట బలంగా నెట్టబోయినాడు. అక్కడ తలుపు లేదు. దానితో ముందుకు పడిపోయాడు. కాస్త ముందుకు వెళ్లి ద్వారమున్న చోట ద్వారం లేదనుకుని వెనుదిరిగాడు.

అతడి మనసు అల్లకల్లోలమయ్యింది. ఇది కావాలనే చేసారా అన్నంత అనుమానం ప్రవేశించింది అతడిలో. అంతేకాక వారికి నచ్చిన కానుకలు సంపదలను చూసి మరింత అప్రసన్నుడై హస్తినకు బయల్దేరినాడు దుర్యోధనుడు.

నిట్టూర్పులు విడుస్తూ దుర్యోధనుడు వెళ్తుంటే కారణమేమిటని శకుని అడిగాడు.

దుర్యోధనుడన్నాడు– "చూసావా వారి వైభోగం, సంపదలూను. గొప్పగొప్ప రాజులు పన్నులు చెల్లించే వైశ్యుల్లా రత్నాలు తెచ్చి ఇచ్చి ధర్మరాజును సేవించారు. కృష్ణుని చేతిలో శిశుపాలుడు మరణించినా నోరెత్తినవారు లేరు. వారి సంపదలను చూస్తుంటే నాలో అసూయ ఇంతింతై పెరుగుతున్నది. ఇది చూస్తూ నేను జీవించి ఉండలేను. అగ్నిలో ప్రవేశిస్తాను, విషం తింటాను, నీటిలో మునుగుతాను కాని బ్రదుకను. శత్రువుల వృద్ధిని ఆత్మహానిని ఏ మానధనుడు సహించి ఉండగలడు?

**వహ్నిమేవ ప్రవేక్ష్యామి భక్షయిష్యామి నా విషమ్**
**అపోవాపి ప్రవేక్ష్యామి న హి శక్ష్యామి జీవితమ్–**

**కోహి నామ పుమాంల్లోకే మర్షయిష్యతి సత్త్వవాన్**
**సపత్నా వృద్ధ్యతో దృష్ట్వా హీనమాత్మాన మేవచ–** (సభా. 47–31,32)

నేను పూర్వం యుధిష్ఠిరుని నాశనం కొరకు ప్రయత్నం చేసాను. అదంతా దాటుకుని అతడు నీటిలోని తామరలా వృద్ధి చెందినాడు. దైవమే గొప్పది, పౌరుషం నిరర్థకమనిపిస్తున్నది.

**తేన దైవం పరం మన్యే పౌరుషం చ నిరర్థకమ్**
**ధార్తరాష్ట్రాశ్చ హీయంతే పార్థా వర్ధంతి నిత్యశః** (సభా. 47–38)

## శకుని-దుర్యోధనుల మంత్రాంగం

శకుని అన్నాడు– "యుధిష్ఠిరుడు స్వయంగా ఎలా పరాజితుడవుతాడో ఆ ఉపాయం నాకు తెలుసు".

దుర్యోధనుడన్నాడు– "మామా! స్నేహితులకు, మహాత్ములైన ఇతరులకు కూడా ఏ ప్రమాదం జరగకుండా ఉండే ఉపాయమైతే చెప్పు!"

శకుని అన్నాడు– "ధర్మరాజు ద్యూతప్రియుడు. కాని గొప్పగా జూదమాడడం వచ్చినవాడు కాదు. జూదమాడడంలో నేను ముల్లోకాల్లోనే నేర్పరిని. నీ తండ్రిని ఒప్పించడం నీవంతు. ధర్మరాజును ఓడించడం నావంతు".

శకుని, దుర్యోధనుడు వెళ్లి ధృతరాష్ట్రుని కలిసారు. శకుని అన్నాడు ధృతరాష్ట్రునితో– "దుర్యోధనుడు కాంతి తగ్గి పాలిపోయి దీనుడై ఉన్నాడు. కారణం తెలుసుకో!"

ధృతరాష్ట్రుడు హతాశుడైనాడు. కుమారుడిని దగ్గరకు పిలిచి తడిమి తడిమి చూసి అన్నాడు– "నాయనా, గొప్ప సంపద, సౌఖ్యాలు నీకందుబాటులో ఉన్నాయికదా, మరి ఈ దీనత్వమెందుకు?"

దుర్యోధనుడన్నాడు– "సంతుష్టి సంపదను, గర్వాన్ని హరిస్తుంది. దయ, భయం కూడా అటువంటివే. ఈ రెండూ ఉన్నవాడు ఉన్నత పదవి పొందలేడు. యుధిష్ఠిరుడి సంపదలు చూసినాక నా సంపదలు, భోగాలు నాకు తృప్తినివ్వడం లేదు. నా మనసు దహించుకుపోతున్నది. ఆ ఐశ్వర్యాన్ని నేను చేజిక్కించుకోకపోతే నాకు మనశ్శాంతి ఉండదు. యుద్ధం చేసైనాసరే ఆ సంపదను చేజిక్కించుకుంటాను లేదా శత్రువుల చేతిలో మరణిస్తాను".

శకుని అన్నాడు– "యుద్ధం లేకుండా జూదంలో ధర్మరాజును ఓడించవచ్చు ప్రభూ! మోసం చేసి అయినా సరే అతనిని తప్పక గెలుస్తాను. ఆ దివ్యసంపదనంతా తెచ్చి పెడతాను".

ధృతరాష్ట్రుడన్నాడు– "నేను విదురునితో మాట్లాడతాను".

దుర్యోధనుడన్నాడు– "అతడు నిన్ను కార్యం నుండి మరలిస్తాడు. నీవు అలా మరలితే నేను చనిపోతాను. ఇది నిశ్చయం".

## దుర్యోధన - ధృతరాష్ట్రుల సంభాషణ

దుర్యోధనుడన్నాడు– "నేను చనిపోయాక నీవూ, నీ విదురుడూ ఈ రాజ్యాన్ని ఎంచక్కా పాలించుకోండి! నాతో నీకు పనేమిటి?"

ధృతరాష్ట్రుడు సేవకులను పిలిపించి అన్నాడు– "వేయి స్తంభాలతో, వంద ద్వారాలతో చూడచక్కని సభాభవనాన్ని అపూర్వమైన సభాభవనాన్ని నిర్మించండి. రత్నాలతో భవనం మెరిసిపోవాలి. భవనం పూర్తయినాక నాకు తెలియపరచండి".

కలహానికి ద్వారభూతమైన జూదం జరుగనున్నదని తెలిసి విదురుడు పరుగెత్తుకువచ్చాడు ధృతరాష్ట్రుని వద్దకు.

"రాజా! జూదం కారణంగా పుత్రుల మధ్య కలహం రాకుండా చూడండి!"

ధృతరాష్ట్రుడన్నాడు– "ఇది సుహృద్ద్యూతం. దైవనిర్ణయం. నేను, ద్రోణుడు, భీష్ముడు, నీవు దగ్గరలో ఉండగా కలహం ఎలా జరుగుతుంది? ఏ అన్యాయమూ జరుగదు.

నీవు ఖాండవప్రస్థం వెళ్లి యుధిష్ఠిరుడిని తీసుకునిరా!" అని విదురుడిని పంపించివేసాడు.

ధృతరాష్ట్రుడన్నాడు– "నాయనా! జూదం వద్దు. విదురుడు చెప్పింది పరమహితం".

దుర్యోధనుడన్నాడు– "హితమే కావచ్చు. కాని మయసభలో నాకు జరిగిన అవమానం నన్ను అణువణువునా దహించివేస్తున్నది. అక్కడ మాయాపుష్కరిణి వద్ద నా తడబాటును చూసి భీముడు నవ్వినాడు, పరిచారకులు నవ్వినారు. నీళ్లలో పడితే అర్జునునితో కలిసి కృష్ణుడు నవ్వినాడు. ద్రౌపది తనతో కూడిఉన్న స్త్రీలతో కలిసి నవ్వింది. పొడిబట్టలు తెచ్చి ముందుకు నడుస్తూ లేని ద్వారాన్ని ద్వారమనుకుని గోడ తగిలి బొప్పికడితే నకుల సహదేవులు నవ్వినారు. వాళ్లు నవ్వుతూ ద్వారం చూపిస్తేగాని ఏది ద్వారమో కాదో నాకు తెలియలేదు. వాళ్ల సంపదలు, మణులు, గుర్రాలు, రథాలు, ఏనుగులు ఓహ్ రాజులు సమర్పించినవి అనంతం. ధర్మజునికి అందరూ కప్పం చెల్లించారు. బంధుత్వం కారణంగా అంధకవృష్ణులు తప్ప.

తండ్రీ! యుధిష్ఠిరుని పట్టాభిషేక మహోత్సవం ఎలా జరిగిందో తెలుసా! మహాత్ములు మహర్షులైన ద్విజులు వేదమంత్రాలు చదువుతున్నారు. సాత్యకి ఛత్రాన్ని, భీమధనంజయులు వ్యజనాలను, నకుల సహదేవులు తెల్లని చామరాలను పట్టుకున్నారు. సముద్రుడు పంపిన శంఖంతో కృష్ణుడు విశ్వకర్మ నిర్మిత కలశంలోని చతుస్సముద్ర జలాలతో ధర్మరాజును అభిషేకించాడు. తండ్రీ! రంతిదేవుడు, నాభాగుడు, మాంధాత, మనువు, పృథు మహరాజు, భగీరథుడు, యయాతి, నహుషుడు వీరెవ్వరు కూడా యుధిష్ఠిరుని వలె మహా సమ్రాట్టులు కారు.

ఈ రాజసూయ యాగం చేసి కౌంతేయుడు హరిశ్చంద్రుని వలె చక్రవర్తి అయ్యాడు. ఇది చూసిన నేను జీవించి ఉండడం వృధా. కాలం అస్తవ్యస్తంగా ఉన్నది. చిన్నలు వృద్ధి చెందుతున్నారు. పెద్దలు క్షీణిస్తున్నారు.

ధృతరాష్ట్రుడన్నాడు– "నాయనా! ద్వేషం మంచిది కాదు. కావాలంటే నీవు అంతకన్నా గొప్ప యజ్ఞం చేయి. యుధిష్ఠిరుడు కల్లాకపటం లేనివాడు. నిన్ను ద్వేషించనివాడతడు. సోదరుల సంపదను ఆశించకు".

దుర్యోధనుడన్నాడు– "తండ్రీ! ఓడతో కట్టిన ఓడవలె నీవు విదురుడి మాటతో కదులుతున్నావు. మా దీనావస్థను చూడనివాడవైనావు. పాండవుల సంపద వలన నాకు దీనత్వం, బాధ కలుగుతున్నది. నన్ను బాధించే వారు నాకు శత్రువులు. నా శత్రువుల సంపదలను ద్యూతంలోనైనా, యుద్ధంలోనైనా పొందుతాను లేదా మరణిస్తాను".

శకుని అన్నాడు– "ద్యూతంలో హరించే బాధ్యత నాది. పాచికలలోని రహస్యమే నా వింటి నారి; జూదపు బల్ల రథం".

ధృతరాష్ట్రుడన్నాడు– "వైరం అనేది లోహంతో చేయబడని ఆయుధం. అత్యంత ప్రమాదకరం. జాగ్రత్త!"

## తోరణ స్ఫాటికమనే ద్యూతసభ

**సభేయం మే బహురత్న విచిత్రా**
**శయ్యాస నైరుప పన్నా మహార్హైః**
**సా దృశ్యతాం భ్రాతృభిః సార్ధమేత్య**
**సుహృద్ ద్యూతం వర్తతా మాత్ర చేతి** (సభా. 57-22)

విదురుడన్నాడు ధృతరాష్ట్రునితో– "రాజా! ద్యూతం కలహ కారణమవుతుంది. దీనికి నేనంగీకరించలేను".

ధృతరాష్ట్రుడన్నాడు– "దైవం ప్రతికూలమైతేనే కలహం బాదిస్తుంది. నీవు వెళ్లి పాండవులను తీసుకునిరా!"

విదురుడు వెళ్లాడు. పాండవుల ఆదరాన్ని పొందినాడు. ధృతరాష్ట్రుని మాటలను చెప్పాడు.

యుధిష్ఠిరుడన్నాడు– "ద్యూతం వలన కలహం కలుగుతుంది. నీవు దీనిని ఆడమంటున్నావా?"

విదురుడన్నాడు– "నేను వారించడానికి ప్రయత్నించాను. రాజు నన్ను నీ దగ్గరకు పంపినాడు. నిర్ణయం నీ ఇష్టం"

యుధిష్ఠిరుడన్నాడు– "అక్కడ మోసగాళ్లున్నారు. నాకు ద్యూతం ఇష్టంలేదు. కాని తండ్రి ఆజ్ఞను కాదనలేను".

విదురుడితో కలిసి పాండవులు, ద్రౌపది తమ పరివారంతో హస్తినకు చేరుకున్నారు. పెద్దలకు నమస్కరించారు. అంతఃపుర కాంతలు ద్రౌపది అందాన్ని, ఐశ్వర్యాన్ని చూసి అసూయ చెందారు.

మరుసటి రోజు ద్యూత సభలోకి అందరూ ప్రవేశించారు.

యుధిష్ఠిరుడు అన్నాడు– "ద్యూతం పాపం. సప్తవ్యసనాలలో ఒకటి అది".

శకుని అన్నాడు– "పాపం పాచికలది. ఆడేవాడు నిమిత్తమాత్రుడు. నీవు భయపడితే ద్యూతం ఆడకు"

యుధిష్ఠిరుడన్నాడు– "ద్యూతానికి పిలిచింది మీరు. ఇప్పుడు నేను వెనక్కి మరలలేను. విధి బలీయం. ఎవరు ఆడేది?"

దుర్యోధనుడన్నాడు– "నేను పందెం ఒడ్డుతాను. శకుని ఆడతాడు"

యుధిష్ఠిరుడన్నాడు– "ఒకరి ఆట ఇంకొకరు ఆడడం విషమం. ఇచ్ఛానుసారంగా జూదం ప్రారంభమగును గాక!"

రాజులందరూ కూర్చున్నారు ఉచితాసనాలపై. భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, విదురుడు అయిష్టంగా వచ్చారు.

జూదం ప్రారంభమయ్యింది.

యుధిష్ఠిరుడన్నాడు– "సాగరావవర్త సంభవ మణిర్హారోత్తర కనకోత్తమ భూషణం నా పందెం" అని పాచికలు విసిరాడు.

అది చూసి శకుని పాచికలు విసిరాడు– "ఓడిపోయావు" అన్నాడు.

యుధిష్ఠిరుడు– "వేయి నిష్కాలభాండాలు, అక్షయ హిరణ్యం నా పందెం".

శకుని పాచికలు విసిరాడు– "ఓడిపోయావు"

యుధిష్ఠిరుడు– "మమ్మల్ని మోసి తెచ్చిన రాజరథం, ఎనిమిది అశ్వాలు నా పందెం"

శకుని– "ఓడిపోయావు"

యుధిష్ఠిరుడు– "లక్షమంది దాసీలు – నా పందెం!"

శకుని– "ఓడిపోయావు".

యుధిష్ఠిరుడు– "సహస్ర సంఖ్యా నాగా–వేయి ఏనుగులు నా పందెం!"

శకుని– "ఓడిపోయావు"

యుధిష్ఠిరుడు– "వేయిరథాలు – నా పందెం!"

శకుని– "ఓడిపోయావు"

గంధర్వ అశ్వాలు–ఓడిపోయావు; పదివేల రథాలు, యోదులు – ఓడిపోయావు; నాలుగు వందల రాగిపాత్రల నిండా ఉన్న బంగారం – ఓడిపోయావు;

విదురుడన్నాడు "రాజా! ఈ ద్యూతాన్నిక్కడితో ఆపు!"

దుర్యోధనుడన్నాడు– "ఇతరుల పనులలో చొరబడకు!"

యుధిష్ఠిరుడన్నాడు– "నా దగ్గరున్న ధనమంతా పందెం ఒడ్డాను"

శకుని అన్నాడు పాచికలు విసిరి "చూసావా ఓడిపోయావు"

యుధిష్ఠిరుడన్నాడు– "నా రాజ్యం, రాకుమారుల ఆభరణాలు పందెం కాస్తున్నాను"

శకుని అన్నాడు– "ఓడిపోయావు"

నకులుడు నా పందెం – ఓడిపోయావు; సహదేవుడు నా పందెం – ఓడిపోయావు; అర్జునుడు నా పందెం – ఓడిపోయావు; భీముడు నా పందెం – ఓడిపోయావు;

యుధిష్ఠిరుడన్నాడు– "నన్ను నేనే పందెంగా పెట్టుకున్నాను"

శకుని అన్నాడు– "ఓడిపోయావు".

శకుని అన్నాడు– "నీవు నిన్ను ఓడిపోయావు. నీ సోదరులను, నీ రాజ్యసంపదలను ఓడిపోయావు. అయినా నీవింకా ఓడని సంపద ఒకటుంది. నీ ప్రియసతి ద్రౌపది. పందెమొడ్డు"

యుధిష్ఠిరుడన్నాడు– "ద్రౌపది నా పందెం. అది నీ ఆజ్ఞ"

శకుని అన్నాడు– "ఓడిపోయావు"

ఆ మాట వినగానే సభలో అయ్యో, అయ్యో అన్న మాటలు వెలువడినాయి. సభ క్షోభకు గురయ్యింది. భీష్మ, ద్రోణ కృపాదులకు ముచ్చెమటలు పోసాయి. విదురుడు తలవంచుకున్నాడు.

ధృతరాష్ట్రుడు ఆనందంతో "గెలిచామా, గెలిచామా!" అని పదేపదే అడిగాడు.

దుశ్శాసనాదులతో కలిసి కర్ణుడు ఆనందించాడు.

దుర్యోధనుడన్నాడు– "ఆ పాపాత్మురాలు ద్రౌపదిని తీసుకునిరా! ఆమె మా అంతఃపురాన్ని శుభ్రం చెయ్యాలి. ఆమె అక్కడ దాసీలతో పాటు ఉండాలి. విదురా! వెళ్లి ద్రౌపదిని తీసుకునిరా!"

విదురుడన్నాడు– "మూర్ఖుడా! నీవంటివాడే ఇలా అనగలడు. యుధిష్ఠిరుడు ముందు ఓడిపోయాడు. ఆ తరువాత ద్రౌపదిని పందెమొడ్డినాడు. ఇది నీకు నాశనకాలం"

దుర్యోధనుడన్నాడు– "ఈ విదురుడు పిరికివాడు. ప్రాతికామీ! నీవు వెళ్లి ద్రౌపదిని తీసుకునిరా!"

ప్రాతికామి అంతఃపురంలోకి వెళ్లి విషయం చెప్పాడు.

ద్రౌపది అన్నది– "వెళ్లి జూదగాడైన మహరాజును అడుగు– ముందు నిన్ను ఓడిపోయావా లేక నన్ను ఓడిపోయావా?"

ప్రాతికామి సభకు వచ్చి ద్రౌపది అడగమన్న మాట అడిగాడు. ధర్మరాజు చెప్పలేకపోయాడు.

దుర్యోధనుడన్నాడు– "ద్రౌపదినే వచ్చి ఆ ప్రశ్నను అడగమను!"

ప్రాతికామి వెళ్లి ద్రౌపదికి చెబితే ఆమె అన్నది– "ఈసారి నా ప్రశ్నను సభను అడుగు. వారే సమాధానమిస్తారో వచ్చి తెలియజేయి".

ప్రాతికామి వచ్చి సభను అడిగాడు. ఎవరూ నోరెత్తలేదు.

ధర్మరాజు పంపాడు దూతను– సభకు వచ్చి మామగారి ముందు నిలవమని –దూత వెళ్లాడు ద్రౌపది దగ్గరకు.

దుర్యోధనుడన్నాడు– "ప్రాతికామీ మరల వెళ్లు!"

ప్రాతికామి నీళ్లు నములుతుంటే సహనం కోల్పోయిన దుర్యోధనుడన్నాడు– "దుశ్శాసనా! ప్రాతికామి భీముడిని చూసి భయపడుతున్నాడు. నీవు వెళ్లి ద్రౌపదిని తీసుకునిరా!"

దుశ్శాసనుడు వెళ్లి ద్రౌపదితో అన్నాడు– "పాంచాలీ, రా, జూదంలో నిన్ను గెలుచుకున్నాం. సిగ్గు విడిచి దుర్యోధనుని చూడు. దర్మబుద్ధితో నిన్ను గెలుచుకున్నాం! రా!"

ద్రౌపది దుఃఖిస్తూ కౌరవ అంతఃపుర కాంతలున్న వేపు పరిగెత్తింది. దుశ్శాసనుడు రోషంతో గర్జిస్తూ ఆమె వెంటబడి ఆమె దీర్ఘకేశాలను పట్టుకుని పెనుగాలి అరటిని ఊపినట్లు దుశ్శాసనుడు ఆమెను లాగినాడు.

ద్రౌపది మొత్తుకున్నది– "నేను రజస్వలను, ఏకవస్త్రను. బుద్ధిహీనుడా, నేను సభలోకి రాకూడదు".

దుశ్శాసనుడన్నాడు– "నీవు రజస్వలవు కావచ్చు, ఏకవస్త్రవు కావచ్చు, వివస్త్రవైనా కావచ్చు. జూదంలో నిన్ను గెలుచుకున్నాం. నీవు మా దాసివి. నీవు దాసీజనం మధ్య ఉండాలి"

ద్రౌపది అన్నది– "దుర్మార్గుడా! నా జుట్టు పట్టుకుని ఈడ్చుకుపోతున్నావు సభలోకి. ఇది తగని పని. వదిలిపెట్టు" అన్నదామె తనని తాను రక్షించుకుంటూ–

**దిగస్తు నష్టః ఖలు భారాతానాం**
**ధర్మస్తథా క్షత్రవిదాంచ వృత్తమ్...**

"ఛీ! భరతవంశపు రాజుల ధర్మం, క్షత్రియధర్మవేత్తల నడవడి రెండూ చెడ్డాయి. ఒక స్త్రీకి ఇక్కడ జరుగుతున్న అన్యాయం సహించరానిది కదా!"

అంటూ అచేతనయై తన భర్తల వంక దీనంగా చూస్తూ ఉన్నపుడు దుశ్శాసనుడు ఆమెను వేగంగా లాగి 'దాసి' అని అరిచాడు. కర్ణుడు బిగ్గరగా నవ్వి ఆమెను సమర్థించాడు. శకుని దుశ్శాసనుని అభినందించాడు.

సిగ్గు, కోపం నిండిన ద్రౌపది చూపుతో పాండవులకు కలిగిన బాధ రాజ్యాన్నీ, ధనాన్నీ, గొప్పగొప్ప రత్నాలను కోల్పోయినప్పుడు కూడా కలుగలేదు.

## ద్రౌపదీ వస్త్రాపహరణం

భీష్ముడన్నాడు– "ధర్మరాజే ఓడిపోయాను అని అంగీకరించాడు కాబట్టి నీ ప్రశ్నకు నేను సమాధానమివ్వలేను".

ద్యూతనిపుణుడైన శకుని యుధిష్ఠిరుని రెచ్చగొట్టి తాను ఓడిపోయాక నిన్ను పందెంలో ఒడ్డేట్లు చేసాడు కనుక నేను జవాబు చెప్పలేను.

ద్రౌపది అన్నది– "మీరందరూ సభలో ఉన్నారు. ఈ జూదగాళ్లు ధర్మరాజును ముందుగా జూదంలో గెలుచుకున్నారు. ఓడిపోయినవాడు గెలిచినవాళ్లు చెప్పినట్లు చెయ్యాలి గనుక తరువాత నన్ను పందెంగా పెట్టడానికి అంగీకరింపజేసారు. మీరందరూ కొడుకులూ, కోడళ్లు కలవారే. ధర్మం చెప్పండి

**న సా సభాయాత్ర న సంతి వృద్ధా**
**న తే వృద్ధాయే న వదంతి ధర్మమ్**
**నాసౌ ధర్మోయత్ర నసత్య మస్తి**
**న తత్ సత్యం యచ్ఛలేనాను విద్ధమ్–**

పెద్దలు లేని సభ సభకాదు. ధర్మం చెప్పని పెద్దలు పెద్దలే కాదు. సత్యహీనమైన ధర్మం ధర్మం కాదు. కపటత్వంతో కూడిన సత్యం సత్యమే కాదు".

భీముడికి చాలాకోపం వచ్చింది. ధర్మరాజు వేపు చూస్తూ తీవ్రంగా అన్నాడు– "యుధిష్ఠిరా! ఏ జూదగాడూ నీలా ప్రవర్తించడు. ధనసంపదలను, మమ్మల్ని ఓడిపోయావు, మాకు బాధలేదు. కాని ద్రౌపదిని పందెమొడ్డావు. ఆ పాచికలు విసిరిన నీ చేతుల్ని తగలబెడ్తాను. సహదేవా, అగ్నిని తీసుకురా!"

దుఃఖిస్తున్న పాండవులను, దుశ్శాసనుడితో లాగబడ్తున్న ద్రౌపదిని చూసి ధృతరాష్ట్రుని కొడుకు వికర్ణుడు అన్నాడు– "యాజ్ఞసేని సభలో ప్రశ్న అడిగింది. సమాధానం చెప్పాల్సిన బాధ్యత సభికులది... చెప్పరెందుకు ఇందరుండీ!" అని పదేపదే అడిగినా ఎవరూ మాట్లాడకపోయేసరికి వికర్ణుడన్నాడు– "రాజులకు నాలుగు వ్యసనాలు చెప్పబడినాయి– వేట, మదిరాపానం, విషయాసక్తి, జూదం –వీటితో చిక్కినవాడు ధర్మాన్ని వీడి చరిస్తాడు. జూదంలో రెచ్చగొట్టబడి యుధిష్ఠిరుడు ద్రౌపదిని పణంగా పెట్టినాడు. ధర్మరాజు ముందు ఓడిపోయి, తరువాత శకుని ఆజ్ఞతో ద్రౌపదిని పందెం కాసాడు కాబట్టి ద్రౌపది గెలువబడలేదు".

వికర్ణుడి చేయి పట్టుకుని కర్ణుడన్నాడు– "అరణిలో పుట్టిన అగ్ని దానినే దహించినట్లు ఏ వంశంలో పుట్టినవాడు ఆ వంశాన్నే దహిస్తాడంటారు. ఇక్కడున్న వాళ్లకు ధర్మం తెలియదు. నీకు తెలుసనుకుంటున్నావా? వాళ్లు ద్రౌపది ధర్మవిజిత అని భావిస్తున్నారు.

ఒకవేళ ఆమె ఏకవస్త్ర కాబట్టి సభలోకి తీసుకురావడం అధర్మమంటే ఈ విషయం తెలుసుకో! దేవతలు స్త్రీకి ఒక్క భర్తనే విధించారు. ఈ ద్రౌపది అనేకురికి భార్య. ఈమె ప్రస్తుతం బానిస. అంతే! దుశ్శాసనా, నీవు ఈ పాండవుల, ద్రౌపది వస్త్రాలను ఊడదీయి"

ఆ మాటలు వినగానే పాండవులు తమతమ ఉత్తరీయాలను తీసి సేవకులవలె నేలపై కూర్చున్నారు.

తన వస్త్రాలను లాగుతుంటే ద్రౌపది శ్రీకృష్ణుని స్మరించింది.

**–గోవింద ద్వారకావాసిన్ కృష్ణ గోపీజన ప్రియ!**
**కౌరవైః పరిభూతాం మాం కిం న జానాసి కేశవ**

**హేనాథ హే రమానాథ వ్రజనాథార్తి నాశన**
**కౌరవార్ణవ మగ్నాం మామ్ ఉద్ధర స్వ జనార్ధన!**

**కృష్ణ కృష్ణ మహాయోగిన్ విశ్వాత్మన్ విశ్వభావన**
**ప్రపన్నాం పాహి గోవింద కురుమధ్యేవ సీదతమ్** (సభా. 68-41,42,43)

దుశ్శాసనుడు ద్రౌపది ఏకవస్త్రాన్ని లాగుతున్నాడు. ఆమె వంటిపై చీరలాంటివి అనేకం వస్తూనే ఉన్నాయి. ఆమె శరీరం వస్త్రంచే కప్పబడి ఉన్నది. లాగిలాగి వస్త్రాల కుప్పపై కూలబడినాడు దుశ్శాసనుడిక లాగలేక. సభలో భయంకరమైన కోలాహలం చెలరేగింది.

భీముడి కోపం ఆకాశాన్నంటింది– "ఈ దుశ్శాసనుడిని యుద్ధంలో చంపి గుండెలను చీల్చి నెత్తురు తాగుతాను. అలా చెయ్యకపోతే నాకు ఉత్తమగతులుండవు గాక!"

**అస్య పాపస్య దుర్బుద్ధే ర్భారతాప సదస్య చ**
**న పిబేయం బలాద్ వక్షః భిత్త్వా చేద్ రుధిరం యుధి–** (సభా. 68-53)

సభాసందులందరూ ధృతరాష్ట్రుని నిందించసాగినారు. విదురుడు సభికులను శాంతపరచి అన్నాడు– "పూర్వకాలంలో ప్రహ్లాదుడు ఒక ధర్మసందేహం వచ్చినపుడు తన కొడుకు విరోచనుడిని కాదని అంగిరసుని కుమారుడు సుధన్వుని వేపు తీర్పు చెప్పాడు. ఇక్కడ కూడా మనం ధర్మం పలకాలి".

కర్ణుడన్నాడు– "ఈమె ఈ ఇంటికి దాసి".

దుశ్శాసనుడామెను సాహసించి సభలోకి లాక్కువచ్చాడు. ద్రౌపది తనను తాను రక్షించుకుంటూనే అడిగింది సభను– "నేను దాసినా? కాదా?"

భీష్ముడన్నాడు– "ఈ ప్రశ్నకు జవాబు ధర్మరాజే చెప్పాలి".

దుర్యోధనుడన్నాడు– "నీ భర్తలనే చెప్పమను ధర్మమేమిటో! ధర్మరాజు తప్పు చేసాడని నీ భర్తలను చెప్పమను. అప్పుడు నీకు దాస్యవిముక్తి కలిగిస్తాను. లేదా ధర్మరాజునే చెప్పమను".

సభ్యులు దుర్యోధనుని మెచ్చుకున్నారు.

భీముడన్నాడు– "ధర్మజుడు ఆదేశిస్తే ఈ పాపాత్ములనిక్కడే చంపివేస్తాను".

కర్ణుడన్నాడు– "ద్రౌపదీ! దాసుడు, పుత్రుడు, అస్వతంత్ర స్త్రీ –ముగ్గురూ నిర్ధనులే. నీకిప్పుడు ధార్తరాష్ట్రులే యజమానులు. నీవు వెంటనే మరొకరిని భర్తగా ఎన్నుకో! దాస్యంలో స్వేచ్ఛ ఉంటుంది. జూదం ద్వారా మరల ఓడిపోయే పరిస్థితి రాదు. ఓడిపోయిన పాండవులు నీ భర్తలు కారు. జీవితానికి పరాక్రమము, పౌరుషం పరమార్థమని తెలియనివాడు యుధిష్ఠిరుడు. అందుకే నిన్ను పణంగా పెట్టినాడు".

భీముడు కోపంగా అన్నాడు యుధిష్ఠిరుడి వేపు చూస్తూ– "సూతపుత్రుడైన కర్ణుడు దాసధర్మం మేరకు మాట్లాడినాడు. ద్రౌపదిని పణంగా పెట్టి నీవు జూదమాడడం వలన మనకీ తలవంపులు వచ్చాయి".

దుర్యోధనుడన్నాడు ధర్మరాజుతో– "ఆమె ఓడిపోలేదని నీవు భావిస్తున్నావా?" అని అంటూ దుర్యోధనుడు ద్రౌపదిని చూసి నవ్వుతూ, కర్ణునికి సైగలతో చూపిస్తూ, తన వస్త్రాన్ని పైకెత్తి– అరటి బోదెవలె, ఏనుగు తొండం వలె, వజ్రం వలె దృఢంగా ఉన్న తన ఎడమ తొడను ద్రౌపదికి చూపించాడు.

అది చూసి భీముడు ఆగ్రహోదగ్రుడై అరిచాడు–

**పితృభిః సహసాలోక్యం మా స్మ గచ్ఛేద్ వృకోదరః**
**యద్యేత మూరుం గదయా న భిం ద్యాం తే మహాహవే!**

"యుద్ధంలో నీ తొడను విరగగొట్టకపోతే ఈ వృకోదరుడు పితరులతో కలిసి పుణ్యలోకాలకు దూరమౌతాడు".

విదురుడన్నాడు– "ధృతరాష్ట్ర పుత్రులారా! హద్దులనతిక్రమించి జూదమాడారు. స్త్రీని సభకు తెచ్చి వివాదం సృష్టించారు. ధర్మం నశిస్తే సభ దుష్టమౌతుంది. ధర్మరాజు తానోడకముందు ద్రౌపదిని పణంగా పెట్టి ఉంటే ధర్మవిజిత అయ్యేది ద్రౌపది. అధికారం లేనివాడు పణంగా పెట్టిన ధనం గెలిచినా ఓడినా అది కలలోని గెలుపు ఓటముల వంటిది".

అర్జునుడన్నాడు– "ధర్మరాజు మమ్మల్ని పందెంగా పెట్టినపుడు స్వతంత్రుడు. తనను ఓడిపోయాక అస్వతంత్రుడిగా శకుని చెప్పగా ద్రౌపదిని పందెం కాసాడు. ఆమె అధర్మవిజిత".

ధృతరాష్ట్రుడికి పరిస్థితి అర్థమయ్యింది– "పాంచాలీ! నీకు ఇష్టమైన వరం కోరుకో!"

ద్రౌపది అన్నది– "యుధిష్ఠిరునికి దాస్యవిముక్తి కలిగించండి!"

ధృతరాష్ట్రుడన్నాడు– "అమ్మా! మరొక వరమిస్తాను, కోరుకో!"

ద్రౌపది అన్నది– "భీమార్జున నకుల సహదేవులకు రథ ధనుస్సులతో పాటు దాస్యవిముక్తిని కలుగజేయి".

ధృతరాష్ట్రుడన్నాడు– "మూడవ వరం కోరుకో!"

ద్రౌపది అన్నది– "లోభం ధర్మాన్ని నశింపచేస్తుంది. నాకు మీరిచ్చిన రెండు వరాలు చాలు.

**లోభో ధర్మస్య నాశాయ భగవన్ నాహముత్సహే**
**అనర్హా వరమాదాతుం తృతీయం రాజసత్తమ!** (సభా. 71–34)

నా భర్తలకు దాస్యవిముక్తి లభించింది. అది నాకు చాలు".

కర్ణుడన్నాడు– "నేను ఎందరో అందగత్తెలైన స్త్రీలగూర్చి విన్నాను. ఇటువంటి కార్యాన్ని సాధించిన వారెవరూ లేరు. ఈమె పాండవులకు ప్రశాంతిని కలిగించింది. వారు నీళ్లలో మునిగిపోతుంటే తరించడానికి నౌక అయ్యింది".

భీముడనుకున్నాడు– "చివరకు పాండవులకు స్త్రీ గతి అయ్యింది. సంతానం, కర్మ, జ్ఞానం అనే జ్యోతులు పురుషునకు పరలోకంలో ఉపయోగపడతాయి. దుశ్శాసనుడు ద్రౌపదిని తాకి ఆమెను అపవిత్రం చేసాడు. పరపురుషుడు తాకిన స్త్రీకి పుట్టిన సంతానం దేనికుపయోగపడ్తుంది?"

అర్జునుడన్నాడు– "హీనుడు పరుషంగా మాట్లాడినా, మాట్లాడకపోయినా ఉత్తమ పురుషులు వాటికి సమాధానం చెప్పరు".

భీముడన్నాడు– "ఈ శత్రువులనందరినీ ఇక్కడే చంపేస్తాను".

ధృతరాష్ట్రుడన్నాడు– "ధర్మరాజా! ఇది సుహృద్ద్యూతం అన్నాను. అందుకే మీరు ఓడిపోయిన మీ ధన సంపదలను తీసుకుని మీ రాజ్యానికి పోయి క్షేమంగా పరిపాలించుకోండి".

అందరి మనసులూ కుదుటపడినాయి. ప్రశాంత మనస్సులతో పాండవులు ఇంద్రప్రస్థానికి వెళ్లారు.

## 10) అనుద్యూత పర్వము

పాండవులు వెళ్లిపోవడానికి ధృతరాష్ట్రుడు అనుమతి ఇచ్చాడని తెలియగానే దుఃఖార్తితో ఉన్న దుర్యోధనుడి దగ్గరకు దుశ్శాసనాదులు వెళ్లారు.

దుశ్శాసనుడు అన్నాడు– "మనం కష్టపడి ధనాన్ని సంపాదించాం. కానీ ఈ ముసలాయన అంతా నాశనం చేస్తున్నాడు".

దుర్యోధనుడన్నాడు శకుని, కర్ణుడు, దుశ్శాసనాదులతో ఆలోచించి. ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లి అన్నాడు– "తండ్రీ! నాకు ఒకప్పుడు భీముడంటే భయం ఉండేది. అది ఇప్పుడు అర్జునుడంటే భయం వేస్తోంది. అశ్వ–అర్ధ–అజ పదాలను విన్నా నాకు భయం కలుగుతున్నది".

ధృతరాష్ట్రుడన్నాడు– "పాండవులతో వైరమెందుకు నాయనా!"

దుర్యోధనుడన్నాడు– "మనం వారిని పరాభవించాం. దానిని వారెన్నటికీ క్షమించరు. ద్రౌపదికి చేసిన అవమానాన్ని వారు మరచిపోతారని నేననుకోను. ఈసారి మరల జూదమాడిద్దాము. పందెంగా వనవాసం పన్నెండేళ్లు, అజ్ఞాతవాసం ఏడాది"

ధృతరాష్ట్రుడన్నాడు– "పాండవులు ఎంతదూరం వెళ్లి ఉన్నా వారిని వెనక్కి పిలిపించు. వాళ్లు వచ్చి ఈ కొత్త పందెంతో జూదమాడాలి"

ద్రోణుడు, సోమదత్తుడు, బాహ్లికుడు, కృపుడు, విదురుడు, అశ్వత్థామ, యుయుత్సుడు, భూరిశ్రవుడు, భీష్ముడు, వికర్ణుడు జూదాన్ని వ్యతిరేకించారు. అయినా వారి మాటలను లెక్కచేయకుండా ధృతరాష్ట్రుడు పాండవులను అనుద్యూతానికి పిలవడానికే నిశ్చయించాడు.

గాంధారి అన్నది– "శాంతించిన కౌంతేయులను రెచ్చగొట్టడమెందుకు? పుత్రవాత్సల్యంతో తమరు తప్పు చేస్తున్నారు".

ధృతరాష్ట్రుడన్నాడు– "ఈ వంశం నాశనమైనా సరే నేను దుర్యోధనుని వారించలేను. మరల జూదమాడాల్సిందే!"

ప్రాతికామి వెళ్లాడు పాండవులను తీసుకురావడానికి.

ధర్మరాజు అన్నాడు ప్రాతికామితో– "విధిని తప్పించుకోలేము. మరల నేను జూదమాడాల్సి వస్తున్నది".

మరల వెనక్కి వచ్చారు పాండవులు. ద్యూతసభ వారిని ఆహ్వానించింది. ఒక్కటే పందెం.

శకుని అన్నాడు– "మీరు జూదంలో గెలిస్తే మేము 12 సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేస్తాము. అజ్ఞాతవాసం భంగమయితే మరల పన్నెండేళ్ల వనవాసం. పదమూడవ సంవత్సరం కూడా ముగిస్తే మీరైనా, మేమైనా యథోచితంగా స్వరాజ్యాన్ని పొందవచ్చు".

**త్రయోదశే చ నిర్వృత్తే పునరేవ యథోచితమ్**
**స్వరాజ్యం ప్రతిపత్తవ్యమ్ ఇతరై రథ వేతరైః** (సభా. 76-14)

అంతా తెలిసి కూడా యుధిష్ఠిరుడు 'కురుకుల వినాశనం' సమీపించింది అనుకుంటూ జూదానికి సిద్ధపడినాడు.

శకుని పాచికలు విసిరాడు- "నేనే గెలిచాను" అన్నాడు.

దుశ్శాసనుడన్నాడు- "పాండవులు అడవిమార్గం పట్టినారు. దుర్యోధనుని తేజస్సు పెరిగింది. ద్రౌపదీ! వారిని వదిలి కౌరవులలో ఎవరినైనా వరించు. ఈ కాలవైపరీత్యం నిన్ను పీడించదు".

**యథా ఫలాః షండ తిలా యథా చర్మమయా మృగాః**
**తథైవ పాండవాః సర్వే యథా కాకయవా అపి** (సభా. 77-13)

మొలవని నువ్వులు వీళ్లు, పతితులు పాండవులు అని నిందిస్తుంటే సింహం నక్కమీదకు వచ్చినట్లు భీముడు దుశ్శాసనుడిపై కురికి- "మాటల బాణాలతో మా మర్మస్థానాలను పీడిస్తున్నావు. యుద్ధంలో నీ మర్మస్థానాలను బద్దలు చేస్తూ, ఈ మాటలను నీకు గుర్తుచేస్తాను, కాచుకో!" అన్నాడు ఉగ్రంగా.

భీముడలా మాట్లాడుతుంటే దుశ్శాసనుడు కౌరవుల మధ్యలో నిలిచి "ఎద్దు, ఎద్దు" అని పిలుస్తూ నృత్యం చేయసాగినాడు.

"యుద్ధంలో నీ గుండెలు చీల్చి నెత్తురు తాగుతూ నేనూ చేస్తాను మృత్యునృత్యం" అని భీముడుగ్రంగా పలికి సింహంలా నడుస్తుంటే దుర్యోధనుడు అతడిని అనుకరించాడు హేళన చేస్తూ.

భీముడన్నాడు వెనక్కి తిరిగి- "బాగానే అనుకరిస్తావు! నిన్ను సబాంధవంగా యమలోకానికి పంపేప్పుడు కాలితో తన్నిమరీ నీ హేళనను గుర్తుచేస్తాను" అని సభవేపు తిరిగి అన్నాడు- "నేను దుర్యోధనుడిని, అర్జునుడు కర్ణుని, సహదేవుడు శకునిని చంపుతాము. యుద్ధంలో దుర్యోధనుని గదతో పడగొట్టి ఈ పాపాత్ముని తలను కాలితో తన్నుతాను. ఈ దుశ్శాసనుడి రొమ్ము చీల్చి నెత్తురు తాగుతాను".

అర్జునుడన్నాడు- "పధ్నాలుగో సంవత్సరం ఇవన్నీ చూద్దురు గాని! కర్ణుని రణరంగంలో దారుణంగా వధిస్తాను".

సహదేవుడన్నాడు- "శకునీ, ఏ పాచికలను అస్త్రాలుగా వాడి మమ్మల్ని అడవికి పంపుతున్నావో, నేను ఆ అస్త్రాలనే పాచికలుగా వాడి నిన్ను చంపుతాను".

నకులుడన్నాడు- "యాజ్ఞసేనిని అనరాని మాటలన్న వారెవరూ మిగలరు. ఈ భూమిని ధార్తరాష్ట్ర రహితంగా చేస్తాను".

యుధిష్ఠిరుడన్నాడు- "భరత వంశస్థులందరి దగ్గర సెలవు తీసుకుంటున్నాను. తిరిగి వచ్చి దర్శనం చేసుకుంటాను".

విదురుడన్నాడు- "పాండవులారా! కుంతీదేవి అరణ్యవాసం చేయలేదు. మా ఇంటిలోనే ఉంటుంది. ధర్మరాజా! సహనంతో వనవాస, అజ్ఞాతవాసాలు పూర్తిచేయి. నీకు శుభమగునుగాక!"

కుంతీదేవి అన్నది ద్రౌపదితో- "పుట్టినింటికి మెట్టినింటికి శోభ తెచ్చినదానివి. నీ ధర్మాచరణమే నిన్ను రక్షిస్తుంది. నా కుమారుడు సహదేవుడు సుకుమారుడు. అరణ్యవాసంలో అతడిని కాస్త కనిపెట్టి ఉండు".

ద్రౌపది అప్పుడు ఒకే వస్త్రాన్ని ధరించి ఉన్నది. అది కూడా దుమ్ముకొట్టుకుని ఉన్నది. జుట్టు విరబోసుకుని ఉన్న ద్రౌపది దుఃఖభారంతో ఉండీ అందరికీ నమస్కరించి నిష్క్రమించింది.

పాండవులు జింక చర్మాలు ధరించి, సిగ్గుతో ముఖాలు దించుకుని ఉన్నారు. కుంతీదేవి అన్నది- "మీ కిటువంటి పరిస్థితి వస్తుందని తెలిసి ఉంటే శతశృంగం విడిచి హస్తినకు వచ్చేదానినే కాదు. మీ తండ్రి ధన్యుడు. మిమ్మల్ని ఈ స్థితిలో చూడకుండా ముందే పుణ్యలోకాలకు వెళ్లిపోయాడు".

పాండవులు వెళ్తుంటే హస్తినాపుర ప్రజలు మేడలు, గోపురాలు, చెట్లు ఎక్కి చూసారు. వీధులు జనసమ్మర్ధాలైనాయి. ఎవరికీ కనిపించని ద్రౌపది అందరికీ కనిపిస్తున్నది.

ప్రజలనుకున్నారు– "మనం పాండవులను అనుసరిద్దాం. పాండవులు వెళ్లిన అరణ్యమే నగరమౌతుంది. మనం విడిచిన నగరమే అరణ్యమవుతుంది".

ధృతరాష్ట్రునితో విదురుడన్నాడు– "యుధిష్ఠిరుడు తన వదనాన్ని వస్త్రంతో కప్పుకుని వెళ్లాడు. భయంకరమైన చూపులకు నిరపరాధులు మండిపోకూడదని.

భీముడు తన భుజాలను కదిలిస్తూ వెళ్లాడు– తన బాహుబలంతో శత్రువులను సర్వనాశనం చేస్తానని.

అర్జునుడు ఇసుక చల్లుతూ యుధిష్ఠిరుని అనుసరిస్తున్నాడు– శత్రువలపై శరవర్షాన్ని అలా కురిపిస్తానని తెలియజేస్తున్నాడు.

నకులుడు ఒళ్లంతా దుమ్ముకొట్టుకున్నాడు– తన అందాన్ని చూసి ఏ స్త్రీ మనసుపడకూడదని.

సహదేవుడు తన ముఖానికి మట్టి పూసుకున్నాడు– తన ముఖాన్ని ఎవరూ తెలుసుకోకూడదని.

ద్రౌపది ఏకవస్త్రయై జుట్టు విరబోసుకుని విలపిస్తూ వెళ్తున్నది, సరిగా 14వ సంవత్సరంలో కౌరవ కాంతలు తానున్న స్థితిలో ఉంటారని ప్రకటిస్తూ–

పాండవుల పురోహితుడు ధౌమ్యుడు– తన చేతిలోని దర్భలను నైఋతి వేపు చూపిస్తూ యమసంబంధి సామగానం చేస్తున్నాడు కౌరవులు మరణించాక వారి గురువులు ఈ విధంగానే సామగానం చేస్తూ నడుస్తారని సూచిస్తున్నాడు".

విదురుడన్నాడు– "మహరాజా! నీ దురాలోచనతో అనేక ఉత్పాతాలు సంభవిస్తున్నాయి".

అప్పుడు క్షణకాలం నారదుడు ప్రత్యక్షమై– "నేటికి పదునాలుగవ సంవత్సరంలో దుర్యోధనుని తప్పు వలన భీమార్జునుల బలం వలన కౌరవులు నశిస్తారు" అని పలికి అదృశ్యమైనాడు.

విదురుడన్నాడు– "సీతారామ లక్ష్మణులు అడవికి పోయినపుడు అయోధ్యా నగరమెంత దుఃఖించిందో అదే అవస్థను ఇప్పుడు హస్తినాపురి అనుభవిస్తున్నది".

ఆ సమయంలో దుర్యోధనుడు, కర్ణుడు, శకుని ఆలోచించి ద్రోణుడే తమకు ఆలంబన అనుకుని సమస్త రాజ్యాన్ని ఆయనకు సమర్పించారు.

ద్రోణుడన్నాడు–

**గంతా సర్వాత్మనా భక్త్యా ధార్తరాష్ట్రాన్ సరాజకాన్**
**నోత్సహేయం పరిత్యక్తుం దైవం హి బలవత్తరమ్** (సభా. 80-39)

"నన్ను చంపడానికే ధృష్టద్యుమ్నుడు, ద్రౌపది జన్మించారు. పధ్నాలుగు సంవత్సరాలకు పెద్ద యుద్ధమే రానున్నది" అన్నాడు ద్రోణుడు.

విదురుడన్నాడు– "పాండవులతో శాంతియే తగినది".

పాండవులు వనవాసానికి వెళ్లిపోయాక ధృతరాష్ట్రుడిలో ఆలోచన మొదలయ్యింది. సంజయుడన్నాడు– "వినాశకాలంలో అర్థాలు అనార్థాలుగా, అనర్థాలు సార్థకాలుగా కనిపిస్తాయి. కాలం దండాన్ని ఎత్తి ఎవరి తలనూ నరకదు. విపరీతార్థ దర్శనమే కాలపు బలం".

ధృతరాష్ట్రుడన్నాడు– "పాండవులతో శాంతి మంచిదని విదురుడు సూచన చేసాడు. పుత్రుల హితాన్ని కోరుతూ కూడా దానిని స్వీకరించలేదు నేను".

*****

# ✢ 3. వన పర్వము ✢


1) అరణ్య పర్వము (అధ్యాయాలు 10)
2) కిర్మీర వధ పర్వము (1)
3) అర్జునాభిగమన పర్వము (26)
4) కైరాత పర్వము (4)
5) ఇంద్రలోకాభిగమన పర్వము (10)
6) నలోపాఖ్యాన పర్వము (28)
7) తీర్థయాత్రాపర్వము (77)
8) జటాసుర వధ పర్వము (1)
9) యక్ష యుద్ధ పర్వము (7)
10) నివాచ కవచ యుద్ధ పర్వము (11)
11) అజగర పర్వము (6)
12) మార్కండేయ సమస్యా పర్వము (51)
13) ద్రౌపదీ సత్యభామా సంవాద పర్వము (3)
14) ఘోషయాత్రా పర్వము (22)
15) మృగ స్వప్నోద్భవ పర్వము (1)
16) వ్రీహి ద్రౌణిక పర్వము (3)
17) ద్రౌపదీ హరణ పర్వము (10)
18) జయద్రథ విమోక్షణ పర్వము (1)
19) రామోపఖ్యాన పర్వము (20)
20) పతివ్రతా మహాత్మ్య పర్వము (7)
21) కుండలాహరణ పర్వము (11)
22) ఆరణేయ పర్వము (5)


## 1) అరణ్య పర్వము

పాండురాజు చనిపోయాక శతశృంగం నుంచి కుంతీదేవి తన కుమారులతో వర్ధమానపుర ద్వారం నుంచే హస్తినాపురిలోకి ప్రవేశించింది. పాండవులు జూదంలో ఓడిపోయాక కుంతీదేవి హస్తినలో ఉండిపోయింది. పాండవులు అదే ద్వారం గుండా అడవులలోకి వెళ్ళిపోయారు.

ఈ ప్రవేశ నిష్క్రమణాల మధ్య కురు కుమారుల విద్యాభ్యాసం, శస్త్రాస్త్ర ప్రదర్శన, ధర్మరాజుకు యువరాజ పట్టాభిషేకం, వారణావతంలో లాక్షాగృహ దహనం, హిడింబ వధ, భీముడికి హిడింబకు ఘటోత్కచుడు జన్మించడం, ఏకచక్రపురంలో బకాసురుడి వధ, అంగారపర్ణుడితో యుద్ధం, ధౌమ్యుడిని పురోహితుడిగా నియమించుకోవడం, కాంపిల్య నగరంలో మత్స్యయంత్రాన్ని భేదించి అర్జునుడు ద్రౌపదిని గెల్చుకోవడం, పంచపాండవులకు ద్రౌపదితో వివాహం, ధృతరాష్ట్రుడు పాండవులకు ఖాండవ ప్రస్థాన్ని ఇవ్వడం, ఇంద్రప్రస్థ నిర్మాణం, ఖాండవ వన దహనం, రాజసూయ యాగపు ఆలోచన, జరాసంధ వధ, రాజసూయ దిగ్విజయ యాత్రలు, శిశుపాల వధ, రాజసూయ యాగ సమాప్తి, మయసభలో దుర్యోధనునికి భంగపాటు, ద్యూత సభ నిర్మాణం, ద్యూతంలో శకుని చేతిలో ధర్మజుని ఓటమి, ద్రౌపదీ వస్త్రాపహరణం, అనుద్యూతంలో ఓటమి, వనవాసం, అజ్ఞాతవాసం పూర్తి చేయడానికి పాండవులు హస్తినాపురిని వదిలి వెళ్లడం లాంటి సంఘటనలు జరిగాయి.

ధౌమ్యుడు, పంచపాండవులు, ద్రౌపదితో పాటు ఇంద్రసేనాది సేవకులు పదునాలుగురికంటే ఎక్కువమంది ఉత్తరాభిముఖులై నగర ద్వారాన్ని దాటినారు. కొందరు పౌరులన్నారు– "పూలయొక్క సంసర్గము చేత వస్త్రము, నీరు, నువ్వులు, భూమి పూలవాసనను పొందుతాయి. ఆ విధంగానే మేమూ మీతో ఉంటాము" అన్నారు వాళ్లు.

యుధిష్ఠిరుడన్నాడు– "మామీద మీకున్న ప్రేమ వలన మాలో లేని గుణాలు మీకు కనిపిస్తున్నాయి. అరణ్యవాసం మీకు తగినది కాదు".

### శౌనక-ధర్మజ సంవాదం

పౌరులు వెళ్లిపోయాక పాండవులు రథాలనెక్కి గంగానదీ తీరంలో ఉన్న ప్రమాణం అనే వటవృక్షం దగ్గరకు వచ్చారు. ఆ రాత్రి అక్కడ గడిపినారు. వారితో వచ్చిన బ్రాహ్మణులు వినోదపూర్వక పరస్పర సంవాదాలతో యుధిష్ఠిరునికి ఊరట కలిగించారు.

పాండవులు వనంలోకి వెళ్తున్నపుడు ఆ బ్రాహ్మణులు కూడా, వారితో రావడానికి సిద్ధమయ్యారు. "మా అన్నాదికాలు మేము సమకూర్చుకుంటాము" అన్నారు వాళ్లు. "ధ్యానం, జపం, కథాకాలక్షేపాలను మీతోపాటు ఆనందిస్తాం" అన్నారు. ధర్మరాజు దుఃఖభరితుడై కనిపించగా వారిలో విద్వాంసుడు, యోగ-సాంఖ్యశాస్త్ర పండితుడైన శౌనకుడన్నాడు ధర్మరాజుతో-

"శోకింపదగిన సందర్భాలు వేలకొద్దీ ఉంటాయి. భయపడదగిన సందర్భాలు వందలకొద్దీ ఉంటాయి. అవి నిత్యం మూఢుడైన మానవుని మాత్రమే ఆవేశిస్తాయి. పండితుని అవేమీ ప్రభావితం చేయలేవు.

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, అధ్యయనం, సమాధి అనే అష్టాంగాలు లేదా శుశ్రూష, శ్రవణ, గ్రహణ, ధారణ, ఊహ, అపోహ, అర్థవిజ్ఞానం, తత్త్వజ్ఞానం అనే బుద్ధి అష్టాంగాలు కలిగిన బుద్ధిమంతుడవు నీవు.

వ్యాధి, అనిష్ట సంఘటనం, శ్రమ, ఇష్టమైనా దానిని విడవడం వలన శారీరక దుఃఖం కలుగుతుంది. మానసిక దుఃఖానికి మూలం స్నేహం (సంసారానురక్తి). విషయ సుఖం వలన అనురాగం ఏర్పడ్తుంది. రాగమనే దోషం ధర్మార్థాలను రెండిటినీ నాశనం చేస్తుంది. రాగానికి వశుడైన వాడిని కామం ఆకర్షిస్తుంది. దాని వలన తృష్ణ (కోరిక) వృద్ధి చెంది పాప ప్రవృత్తిని కలిగిస్తుంది.

ప్రాణులందరికి మృత్యు భయమున్నట్లు, ధనవంతులందరికి రాజు వల్ల, నీటివల్ల, నిప్పు వల్ల, దొంగల వల్ల, తనవారి వల్ల ఎల్లప్పుడూ భయం కలుగుతూనే ఉంటుంది".

ధర్మరాజు అన్నాడు- "అతిథిని గౌరవించడం సనాతన ధర్మం. అగ్నిహోత్రం, ఆబోతు, జ్ఞాతులు, అతిథులు, బాంధవులు, పుత్రులు, భార్య, సేవకులు -వీరిని గృహస్థుడు గౌరవించాలి.

కుక్కలకు, శ్వపాకులయిన చండాలురకు, పక్షులకు కొంత అన్నాన్ని నేలపై విడిచిపెట్టాలి. ఉదయం, సాయంకాలం ఇలా ఇవ్వడానిని 'వైశ్వదేవం' అంటారు. ఇంటిలో అందరికీ పెట్టగా మిగిలిన అన్నాన్ని 'విఘసం' అంటారు. వైశ్వదేవం చేసాక ఉన్న అన్నాన్ని 'అమృతం' అంటారు. గృహస్థుడు నిత్యమూ విఘసాశి అమృత భోజనుడు కావాలి.

అతిథిపై దృష్టి పెట్టడం, మనసు పెట్టడం, సత్యమైన మధురభాషణలాడడం, వెళ్లేటప్పుడు అతడిని అనుసరించడం, ఇంటిలో అతిథి ఉన్నపుడు అతడిని సేవించడం -అయిదు దక్షిణలతో కూడిన అతిథియజ్ఞం".

శౌనకుడన్నాడు- "కర్మను చెయ్యి, విడిచిపెట్టు' అని వేదవచనం. 'నేను చేస్తున్నాను' అనే భావంతో ఏదీ చేయరాదు. యజ్ఞం, అధ్యయనం, దానం, తపస్సు, సత్యం, క్షమ, ఇంద్రియ నిగ్రహం, లోభం లేకుండుట- ఇవి ఎనిమిది ధర్మ మార్గాలు.

యజ్ఞ, అధ్యయన, దాన, తపస్సులు -పితృయాన మార్గాలు

సత్యం, క్షమ, ఇంద్రియ నిగ్రహం, లోభం లేకుండుట -దేవయాన మార్గాలు"

శౌనకుడు చెప్పిన మాటలు విని ధర్మరాజు ధౌమ్యుడితో చర్చించాడు. ధౌమ్యుడతడికి 108 సూర్యనామాలను తెలిపి ఆదిత్యుని పూజించాడు. సూర్యస్తవాన్ని జపించాడు ధర్మరాజు.

ఆదిత్యుడు ప్రత్యక్షమై 'రాగిపాత్ర'ను ఇచ్చాడు. "ఇది అక్షయపాత్ర. నీకు పన్నెండు సంవత్సరాల పాటు కోరిన ఆహారాన్ని ఇస్తుంది. చతుర్విధ పదార్థాలు నీకు అక్షయంగా లభిస్తాయి" అని పలికి సూర్యుడు అదృశ్యమైనాడు.

ఆ తరువాత పాండవులు, ధౌమ్యుడు, ఇతర బ్రాహ్మణులతో కలిసి కామ్యక వనానికి వెళ్లారు.

## విదురుడిని పొమ్మనిన ధృతరాష్ట్రుడు

అక్కడ హస్తినాపురంలో ధృతరాష్ట్రుడికి విదురుడికి మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయి. విదురుడన్నాడు- "పాండవులకు సంతుష్టిని కలిగించడం, శకునిని తిరస్కరించడం ముఖ్యం. కులక్షేమం కోసం నీ కుమారుడిని త్యజించు. లేదా అదుపులో ఉంచడం మంచిది. దుశ్శాసనుడు ద్రౌపదిని, భీమసేనుని సభామధ్యంలో క్షమించమని కోరాలి. ధర్మజునికి రాజ్యాధిపత్యం ఇవ్వాలి" అన్నాడు విదురుడు.

ధృతరాష్ట్రుడన్నాడు– "ఎప్పుడూ ఇదేమాట అంటావు. నా దేహం నుంచి పుట్టిన కుమారుడిని నేనెలా త్యజిస్తాను? నీ కుటిలమైన ఉపదేశాలు నాకు రుచించడం లేదు. నీవు స్వేచ్ఛగా వెళ్లవచ్చు లేదా ఉండవచ్చు. నీ వలన నాకు ప్రయోజనం లేదు. కులట అయిన స్త్రీ ఎంత అనునయించినా యజమానిని విడిచిపెడ్తుంది కదా!"

విదురుడు బాధపడినాడు– "ఇక ఈ కురువంశం నిలవదు" అనుకుంటూ పాండవులున్న చోటుకు వేగంగా వెళ్లిపోయాడు.

## పాండవులను కలిసిన విదురుడు

పాండవులు గంగానదీ తీరం నుంచి కురుక్షేత్రానికి, సరస్వతి, దృషద్వతి, యమునా నదులను సేవించి, మరుభూములు, వన్య ప్రదేశాలు దాటి కామ్యక వనం చేరుకున్నారు. అక్కడ అనేకమంది మునులున్నారు. వారి బోధనలతో ఊరట చెంది ఉండగా విదురుడు వారిని వెదుక్కుంటూ కామ్యక వనం వెళ్లాడు.

విదురుడిని చూసిన ధర్మరాజుకు లోలోపల భయం వేసింది– "శకుని మాటపై ఇతడు మరల జూదానికి ఆహ్వానించ డానికి వస్తున్నాడా! ఈసారి మన ఆయుధాలను పందెం కట్టమంటాడేమో, భీమసేనా!" అన్నాడు భీముడితో.

విదురుడన్నాడు– "నా మాటలు ధృతరాష్ట్రుడికి రుచించడం లేదు. రోగికి పథ్యాహారంలా నా మాటలు అతడు ఇష్టపడడం లేదు".

విదురుడు వెళ్లిపోయాక ధృతరాష్ట్రుడికి అతడి లేని లోటు తెలిసివచ్చింది. అంతేకాక విదురుడి సంధి విగ్రహాది నీతిజ్ఞతల వల్ల పాండవులకు అభివృద్ధి కలుగుతుందని ఇలా రకరకాలుగా ఆలోచించి సంజయుడిని పంపాడు విదురుని తీసుకురమ్మని.

సంజయుడు కామ్యకవనం వచ్చేసరికి ధర్మరాజు వేలకొద్దీ బ్రాహ్మణుల మధ్య, దేవతల మధ్య ఇంద్రుడిలా కనిపించాడు. సంజయుడు తాను వచ్చిన పని చెప్పి విదురుడిని ధృతరాష్ట్రుడు రమ్మంటున్నాడని, వచ్చి నీ సోదరుడిని బ్రతికించుకో అనగానే ధర్మజుడి వద్ద సెలవు తీసుకుని ధృతరాష్ట్రుడి వద్దకు చేరుకున్నాడు విదురుడు.

## దుష్ట చతుష్టయం

ధృతరాష్ట్రుడు రమ్మనగానే విదురుడు వచ్చాడని తెలియగానే దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణులు మంతనాలు సాగించారు. పాండవులను చంపాలని నిశ్చయించుకుని నగరం బయటకు వెళ్లారు వేర్వేరు రథాలలో.

దివ్యదృష్టితో ఆ విషయాన్ని గ్రహించిన వ్యాసమహర్షి సరాసరి వచ్చి ధృతరాష్ట్రునితో అన్నాడు– "ఈ మూఢుని నివారించు. నీ కుమారుడు శాంతించును గాక. వనంలో ఉన్నవారిని చంపాలనుకుని ఇతడు తన ప్రాణాలను కోల్పోతాడు".

ధృతరాష్ట్రుడన్నాడు– "నా పుత్రప్రేమ తగ్గదు. అతడి పాండవ ద్వేషం తగ్గదు".

వ్యాసుడన్నాడు– "ఒకప్పుడు గోవులమాత సురభి దేవేంద్రుడి దగ్గరకు వెళ్లి 'కర్షకులు నా కుమారుడైన వృషభాలను కొడుతున్నాడు. ఆ బక్కవాడైన ఎద్దును కొడుతున్నపుడల్లా నా మనసు క్షోభిస్తున్నది' అన్నది ఏడుస్తూ సురభి.

ఇంద్రుడు కుంభవృష్టి కురిపించి కర్షకుడి పనికి విఘ్నాన్ని కలిగించాడు. నీవు కూడా భూమిలేని పాండవుల పట్ల దయగా మెలుగు. నీ పుత్రుడిని శాసించు" అని చెప్పి వెళ్లిపోయాడు వ్యాసుడు.

ఆ తరువాత మైత్రేయుడు వచ్చి ధృతరాష్ట్రుని కలిసాడు. అతడు కామ్యకవనంలో ధర్మరాజును కలిసి హస్తినాపురికి వచ్చాడు. అతడు కూడా ధృతరాష్ట్రుడితో అన్నాడు– "భీముడు కిమ్మీరుడనే రాక్షసుడిని చంపినాడు సుమా! పాండవులతో విరోధం వద్దు. శాంతిపూర్వక స్నేహాన్ని వృద్ధి చెందించు".

అలా మైత్రేయుడు హితవు చెబుతుంటే దుర్యోధనుడు చిరునవ్వు నవ్వి, కాలితో నేలను రాస్తూ, ఏనుగు తొండం వంటి తన తొడను చేతితో చరిచాడు.

మైత్రేయుడికి కోపం వచ్చింది. నీటిని స్పృశించి అన్నాడు– "నీకు నీ తొడలపై నమ్మకం ఉన్నట్లుంది. నీ శత్రువు గదాఘాతాలతో తొడలు విరిగినాక చిరునవ్వు నవ్వుదువు గానిలే!" అని శపించాడు.

# 2) కిమ్మీర వధా పర్వము

## కిమ్మీరుని వధ

మైత్రేయుడు వెళ్లిపోయాడు. దుర్యోధనుడు కూడా ఉద్విగ్నుడై బయటకు పోయాడు. విదురుడు చెప్పసాగినాడు కిమ్మీర వధ ధృతరాష్ట్రునితో.

"జూదంలో ఓడిపోయిన పాండవులు మూడు రోజులలో కామ్యక వనాన్ని చేరుకున్నారు. వారి దారికడ్డంగా నిలబడినాడు కిమ్మీరుడు. విద్యున్మండలాన్ని ఆక్రమించి, బెగ్గురు పక్షులతో కూడిన నల్లటి మేఘంలా ఉన్నాడతడు.

**పంచానాం పాండుపుత్రాణామ్ అవిజ్ఞాతో మహారిపుః**
**పంచానా మింద్రియాణాం తు శోకావేశ ఇవాతులః** (వన. 11-14)

అయిదు ఇంద్రియాలను దుఃఖం ఆవరించినట్లు అతడు పంచ పాండవులపై దూసుకువచ్చాడు.

అతడు బకుడి సోదరుడు, హిడింబుడి ప్రియమిత్రుడు. భీముడి పేరు వినగానే మండిపడుతూ కిమ్మీరుడు అతడిపై లంఘించాడు. ఇద్దరి మధ్యా ఘోర యుద్ధం జరిగింది. రాళ్లు, చెట్లు నుగ్గునుగ్గయ్యాయి. ఆ రాక్షసుడు అలసిపోయినట్లు గ్రహించగానే భీముడతడిని గాలిలోకి లేపి గిరగిరా తిప్పి నేలపై పడవేసి కటి ప్రదేశంపై కూర్చుని మోకాలితో పొడిచి కంఠాన్ని నొక్కేసరికి ఆ రాక్షసుడి కనుగుడ్లు వెలుపలికి పొడుచుకువచ్చి చచ్చాడు" అని చెప్పాడు విదురుడు.

కౌరవులు తమ ప్రయత్నాలను తాత్కాలికంగా విరమించారు.

# 3) అర్జునాభిగమన పర్వము

పాండవులు వనవాసానికి వెళ్లారని తెలిసి భోజ, వృష్ణి, అంధక వీరులు వారిని కామ్యకవనంలో కలుసుకున్నారు.

శ్రీకృష్ణుడన్నాడు- "ఇతరులను మోసగించి సుఖపడేవాడు చంపదగినవాడు. ఈ దుష్టచతుష్టయాన్ని చంపి ధర్మరాజును రాజ్యాభిషిక్తుని చేయడం ఉచితం".

అర్జునుడు తన మాటలతో శ్రీకృష్ణుని శాంతింపచేసినాడు. ద్రౌపది అన్నది దుఃఖంతో పూడుకుపోయిన తన కంఠాన్ని మాటిమాటికీ సవరించుకుంటూ, ధారాపాతంగా వర్షిస్తున్న కన్నీళ్లను తుడుచుకుంటూ- "మధుసూదనా! నన్ను రక్షించడానికి నా కొరకు నా భర్తలు లేరు, పుత్రులు లేరు, బంధువులు లేరు, సోదరులు లేరు, తండ్రీ లేడు, నీవూ లేవు. అయినా నీతో నాకున్న బంధుత్వం, నా పుట్టుకపై నీకున్న గౌరవం, నీపై నాకున్న సఖ్యభక్తి, రక్షింపగల సామర్థ్యంతో నన్నెపుడూ రక్షిస్తూనే ఉన్నావు".

శ్రీకృష్ణుడన్నాడు- "అమ్మా! నీవు దుఃఖించకు. నీ ప్రతిజ్ఞ వృధాకాదు. కౌరవుల నాశనం తప్పదు".

ధృష్టద్యుమ్నుడన్నాడు- "నేను ద్రోణుని చంపుతాను. శిఖండి భీష్ముడిని చంపుతాడు. అర్జునుడు కర్ణుని చంపుతాడు, దుర్యోధన దుశ్శాసనాదులను భీముడు చంపుతాడు. ఇది తథ్యం!"

శ్రీకృష్ణుడన్నాడు- "ద్వారకలో నేనుండినట్లయితే నీకీ కష్టాలు వచ్చేవి కావు (నవ ద్వారాలు గల దేహం ద్వారక). నీవు నన్ను తలుచుకోలేదు ఓడిపోయావు. ద్రౌపది తలుచుకున్నది కాపాడబడింది. జూదంలో సాతత్యమనే దోషం ఉంది. జూదమాడుతున్నపుడు ఈసారి గెలుస్తాం, ఈ సారి గెలుస్తాం అని 'సతతమూ' అనుకుంటూనే ఉంటాడు జూదరి. నేనా సమయంలో సాల్వుడితో యుద్ధం చేస్తున్నాను".

## సాల్వుడి వధ

శ్రీకృష్ణుడు చెబుతున్నాడు- "నేను శిశుపాలుడిని చంపినందుకు అతడి మిత్రుడు సాల్వుడు సౌభకమనే విమానంలో ద్వారకపై దండెత్తినాడు. ఈ సాల్వుడు మార్తికావతక దేశపు రాజు. సాల్వుడి సైన్యం ద్వారకను పూర్తిగా చుట్టుముట్టింది. జాంబవతి కుమారుడు సాంబుడు, రుక్మిణి కుమారుడు చారుదేష్ణుడు గొప్ప యుద్ధం చేసారు. ప్రద్యుమ్నుడు వీరవిహారం చేసాడు. శాల్వుడు మూర్ఛపోయి లేచి ప్రద్యుమ్నుడిని మూర్ఛపోయేట్లు కొట్టినాడు. ప్రద్యుమ్నుడి సారథి రథాన్ని దూరంగా తీసుకువెళ్లినా, ప్రద్యుమ్నుడు తెప్పరిల్లి మరల యుద్ధరంగానికి వచ్చి శాల్వుడి నెదుర్కొన్నాడు. అలసిపోయిన శాల్వుడు ద్వారకను విడిచి అంతరిక్షంలోకి వెళ్లాడు సౌభక విమానంలో.

రాజసూయయాగమైనాక నేను ద్వారకకు వెళ్లేసరికి అనార్త ప్రాంతమంతా ముట్టడించబడి ఉంది. నేను శాల్వుడిని వెదుకుతూ మార్తికావత నగరానికి వెళ్లగా అతడు మాయాయుద్ధం చేసాడు. నూర్గురు సూర్యులు, నూరుగురు చంద్రులూ, పదివేల తారకలు కనిపించాయి అంతరిక్షంలో. నేను ప్రజ్ఞాస్త్రంతో ఆ మాయను తొలగించి శాల్వుడిని తీవ్రంగా దెబ్బకొట్టాను. నా సారథి దారుకుడూ గాయపడినాడు.

అంతలో అంతరిక్షంలోని సౌభక విమానం నుంచి నా తండ్రి వసుదేవుడు క్రిందకు పడడం చూసి ఓ క్షణం నేను అచేతనుడిని కాగా నా చేతిలోని 'శారంగ' ధనుస్సు జారిపడింది. ముహూర్తకాలం తరువాత మేలుకుని శబ్దవేధి బాణం ప్రయోగించాను వెంటవెంటనే. రాక్షసులు చచ్చిపడుతూ ఉండగా, శాల్వుడు నాపై రాళ్లవర్షం కురిపించాడు. నా గుర్రాలు కూడా కంపించాయి. నేను నా సేనకు కనిపించలేదు.

దానితో నేను ఆగ్నేయాస్త్రాన్ని-సుదర్శన చక్రంతో మంత్రించి వదలగా అది సౌభక విమానాన్ని రెండుముక్కలు చేసింది. మరల నా చేతిలోకి వచ్చిన సుదర్శన చక్రాన్ని 'శాల్వుని కొరకు' అని ప్రయోగించగా అది శాల్వుని రెండు ముక్కలుగా నరికివేసింది. ఆ విధంగా శాల్వుడి కథ ముగిసింది. ఈ యుద్ధం కారణంగా నేను హస్తినకు రాలేకపోయాను".

ఆ తరువాత శ్రీకృష్ణుడు పాండవులను, ద్రౌపదిని ఊరడించి సెలవు తీసుకున్నాడు.

సుభద్రను, అభిమన్యుడిని శ్రీకృష్ణుడు తీసుకువెళ్లాడు. ఉపపాండవులను ధృష్టద్యుమ్నుడు తీసుకువెళ్లాడు.

చేదిరాజు ధృష్టకేతువు తన సోదరి నకులుడి భార్య కరేణుమతిని శుక్తిమతీ నగరానికి తీసుకువెళ్లాడు.

ఆ తరువాత పాండవులు ద్వైతవనానికి బయల్దేరారు. కురుజాంగల దేశంలో కొంతకాలమున్నారు. ద్వైత వనంలోనే పన్నెండేళ్లు ఉండాలని పాండవులనుకున్నారు. సరస్వతీనది తీరాన సాలవనంలో విహరించారు. అక్కడ మార్కండేయ మహర్షి పాండవులను చూసి శ్రీరామచంద్రుని స్మరించి చిరునవ్వు నవ్వి అన్నాడు- "వనవాసం, అజ్ఞాతవాసం విజయవంతంగా చేసి నీవు నీ రాజ్యాన్ని పొందుతావు".

దల్బుడి కుమారుడైన బక మహర్షి ధర్మరాజుకు బ్రాహ్మణ ప్రభావమును చెప్పాడు. విరోచనుని కుమారుడైన బలి రాజ్యాన్ని, అక్షయమైన ఐశ్వర్యం పొందడానిని వివరించాడు.

తరువాత ఒకరోజున ద్రౌపది అన్నది- "ధర్మరాజా! నీవు నారబట్టలు కట్టుకుని వనవాసానికి బయల్దేరినప్పుడు జనులందరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. దుర్యోధన, కర్ణ, శకుని, దుశ్శాసనుల కనుల నుండి కన్నీటిచుక్క రాలలేదు. ఈలోకంలో కోపం లేని క్షత్రియుడు లేడు. కాని, నీలో కోపం లేదు. అది మంచిది కాదు.

బలి చక్రవర్తి తన పితామహుడైన ప్రహ్లాదుని అడిగాడు- "పరాక్రమం శ్రేయస్కరమైనదా? సహనం శ్రేయస్కరమైనదా? -అని. ప్రహ్లాదుడు అన్నాడు- తగిన సమయంలో సహనం, కోపం అవసరం.

**కాలే మృదుర్యోభవతి కాలే భవతి దారుణః**

సహనానికిప్పుడు సమయం కాదు" అన్నది ద్రౌపది.

## క్రోధం-క్షమ-ధర్మం

ధర్మరాజు అన్నాడు- "క్రోధం ప్రజానాశనకరమైనది.

**క్రోధోహంతా మనుష్యాణాం క్రోధోభావయితాపునః**
**ఇతి విద్ధి మహా ప్రాజ్ఞే క్రోధమూలౌ భవా భవౌ** (వన. 29-1)

ద్రౌపదీ! నాకు కోపం రాదు. అది మంచిది కాదని నేను నమ్ముతాను. సహనమే మంచిది.

**క్షమా ధర్మః క్షమా యజ్ఞః క్షమావేదః క్షమా శ్రుతమ్**
**య ఏత దేవం జానాతి స సర్వం క్షంతు మర్హతి** (వన. 29-36)

**క్షమా బ్రహ్మ క్షమా సత్యం క్షమా భూతం చ భావిచ**
**క్షమా తపః క్షమా శౌచం క్షమ యేదం ధృతం జగత్** (వన. 29-37)

ఈ జగత్తంతా క్షమ చేతనే ఆవరింపబడి ఉన్నది. లోకమంతా క్రోధానికి వశమైతే ప్రపంచంలో శాంతి ఎక్కడా ఉండదు. ప్రజలలో సంధికి మూలం శాంతి.

ద్రౌపది అన్నది– "నీకు రావాల్సిన రాజ్యాన్ని వదిలేసి విధి, ప్రారబ్ధాల గురించి మాట్లాడుతున్నావు నీవు. ధర్మం కొరకే నీకు రాజ్యం. నీ జీవితం కూడా ధర్మం కొరకే. నీవు భీమార్జున నకుల సహదేవులను, నన్ను కూడా ధర్మం కొరకే విడిచిపెడతావు.

**రాజానాం ధర్మగోప్తారం ధర్మో రక్షతి రక్షితః**
**ఇతిమే శ్రుత మార్యాణం త్వాం తు మన్యే నరక్షతి** (వన. 30–8)

ధర్మాచార పరాయణుడవైన నీవు ఇలా విపత్తులో ఉండడం, సుయోధనుడు భోగభాగ్యాలతో ఉండడం చూసి నేను విషమదృష్టితో చూస్తున్న విధిని నిందిస్తున్నాను" అన్నది ద్రౌపది.

ధర్మజుడన్నాడు– "ద్రౌపదీ! స్వర్గానికి వెళ్లేవారికి ధర్మమే నావ. ధర్మం నిష్ఫలమైతే జగత్తు చీకటిలో మునిగిపోతుంది.

**ఫలదం త్విహ విజ్ఞాయ ధాతారం శ్రేయసి ధ్రువమ్**
**ధర్మం తే వ్య చరన్ కృష్ణే తద్ధి శ్రేయః సనాతనమ్** (వన. 31–30)

ధర్మమే సనాతన శ్రేయస్సు. ధర్మఫలం తొందరగా కనబడలేదని ధర్మాన్ని, దేవతలను నిందించరాదు".

## ధర్మం - సత్యం

ద్రౌపది అన్నది– "నేను ధర్మాన్ని నిందించడం లేదు. కాని ధర్మం పేరు చెప్పి కర్మ చేయకుండా ఉండడాన్ని వ్యతిరేకిస్తున్నాను. పురుషార్థములు– ధర్మ అర్థ కామ మోక్షములను సాధించాలి పురుష ప్రయత్నంతో. కాలం, అవస్థ ఈ రెండిటిని అనుసరించి కార్యం సిద్ధిస్తుంది".

భీముడన్నాడు– "సింహాల ఆహారాన్ని నక్క లాక్కున్నట్లు దుర్యోధనుడు 'గోమాయువు'లా మాయాద్యూతంతో మన సంపదలు వశం చేసుకున్నాడు. మన రాజసూయ యాగ వైభవం క్షణాల్లో మంచుతెరలా కరిగిపోయింది. ధర్మకామాల వల్ల పుట్టిన అర్థాన్ని–రాజ్యాన్ని విడిచిపెట్టి స్వల్పభాగమైన ధర్మాన్ని కప్పుకుని దుఃఖాలలో పరితపించడమెందుకు? కేవలం ధర్మం కోసమే ధర్మాన్ని అనుసరిస్తూ కష్టాలు పడేవాడెటువంటి బుద్ధిమంతుడు?

**ధర్మం పూర్వే ధనం మధ్యే జఘన్యే కామ మాచరేత్**
**అహన్యనుచరే దేవమ్ ఏష శాస్త్ర కృతో విధిః**

రోజులో ఉదయం ధర్మాన్ని, మధ్యాహ్నం అర్థాన్ని, చివరి భాగంలో కామాన్ని సేవించాలి. జీవితం కూడా అంతే!"

ధర్మరాజు అన్నాడు– "నా అనైతికమైన జూదం వల్లనే మనకీ కష్టాలు వచ్చాయి. అది సత్యం. మాయావి పాచికలను తన ఇచ్ఛానుసారంగా పడేట్లు చేయగలిగాడు. అనుద్యూతంలో మనం ఒక ఒప్పందానికి వచ్చాం. దానిని పాటించాలి కదా! జూదం సమయంలో నా చేతుల్ని తగలబెట్టాలనుకున్నావు. అర్జునుడు ఆపినాడు. శత్రువులను చంపడానికి గదపై చేయివేసావు. ఎంత అనర్థము జరిగేదప్పుడు? పురుషార్థాన్ని తెలిసినవాడివి ముందే నన్నెందుకు ఆపలేదు? ప్రతిజ్ఞానుసారం వనవాసానికి నా వెనకే వచ్చి ఇప్పుడు ఇంత కఠినంగా మాట్లాడ తగునా?

నేను మోక్షం కంటే, జీవితం కంటే కూడా ధర్మాన్నే కోరుకుంటాను. రాజ్యం, పుత్రులు, యశస్సు, ధనం –అన్నీ కలిసినా ఇవి సత్యంతో పదహారోవంతుతో కూడా సమానం కావు" అన్నాడు ధర్మరాజు.

భీమసేనుడన్నాడు– "మహరాజా! నీవు కాలం బంధించిన మరణధర్మం గల మనుష్యుడివి. నీటిలో నురగలా, చెట్టునున్న పండులాంటి వాడివి. కాలం జలప్రవాహంలా కదిలిపోతుంది. ఆయువు క్షీణిస్తుంది. పదమూడేళ్ల కాలప్రవాహంలో మిగిలేది ఎవరికి ఎవరు? మనం మృత్యువుకు దగ్గరవుతున్నాము కాదా?

అజ్ఞాతవాసంలో మనల్ని గుర్తించకుండా ఎలా కాలం గడపగలం? మాసం సంవత్సరానికి ప్రతినిధి అంటారు. ఈ పదమూడు మాసాలను పదమూడు సంవత్సరాలుగా గుర్తించు. అందుకని రాజా! శత్రుసంహారానికి నిశ్చయం చెయ్యి. క్షత్రియుల ధర్మం యుద్ధమే!"

ధర్మజుడన్నాడు– "నీవన్నట్లు యుద్ధానికే వెళ్దాం. మనం యుద్ధరంగంలో ఎవరెవరిని ఎదుర్కోవాలి? భీష్మ ద్రోణ కృపులకు మనపై సానుభూతి ఉన్నా యుద్ధం వస్తే వాళ్లు దుర్యోధనుడి పక్షానే ఉంటారు. కర్ణుడు మహారథుడు. వీరినందరిని చంపకుండా నీవు దుర్యోధనుడినెలా సమీపించగలవు?"

భీముడికి అర్థమయ్యింది, కౌరవ పాండవ యుద్ధమనేది రాక్షసులతో ద్వంద్వ యుద్ధం కాదని.

అటుగా వచ్చిన వ్యాసుడు అన్నాడు ధర్మరాజుతో– "నేను నీకు ప్రతిస్మృతి అనే విద్యను ఉపదేశిస్తాను. అది నీ మనసులోని సందేహాలను తొలగిస్తుంది.

ఒకే వనంలో నీవు నీ పరివారం, బ్రాహ్మణులు ఎక్కువచోట ఉండడం వలన వనరుల, ఓషధుల కొరత ఏర్పడ్తుంది" అని చెప్పి వ్యాసుడు వెళ్లిపోయాడు.

ధర్మరాజు కూడా ఆ తరువాత ద్వైత వనాన్ని విడిచి సరస్వతీ నదీ తీరాన ఉన్న కామ్యక వనంలో నివసించసాగినాడు.

## ఇంద్రకీలాద్రికి వెళ్లిన అర్జునుడు

యుధిష్ఠిరుడన్నాడు– "ధనుర్వేదం ఈనాడు భీష్మ ద్రోణ కృప కర్ణ అశ్వత్థామల యందు ప్రతిష్ఠితమై ఉన్నది. దైవ మానుష పద్ధతులకు చెందిన దివ్యాస్త్ర ప్రయోగ ఉపసంహారాలు, గ్రహణ ధారణలు, నివారణలు వారికి తెలియును. అదేవిధంగా వృత్రాసురుని సంహరించిన ఇంద్రుడి దగ్గర అన్ని దివ్యాస్త్రాల విజ్ఞానమూ ఉంది. దానిని నీవు సంపాదించుకోవాలి. దేవతలను ఏకాగ్రచిత్తంతో ధ్యానించి వారిని ప్రసన్నం చేసుకోవాలి. నాకు వ్యాసుడు ప్రతిస్మృతి అనే విద్యను ప్రసాదించాడు. దానివలన సమస్త జగత్తు ప్రకాశిస్తుంది, దేవతల అనుగ్రహమూ లభిస్తుంది".

కవచ, తలత్ర, అంగుళిత్రాలను ధరించి, గాండీవాన్ని అక్షయ తూణీరాల్ని తీసుకుని అర్జునుడు ఇంద్రకీలాద్రికి బయల్దేరినాడు. సోదరులందరితో, ద్రౌపదితో ముచ్చటించాడు. ద్రౌపది అన్నది– "కుంతీ కుమారా! నిన్ను కన్నపుడు నీతల్లి నీగురించి మనసులో ఏమి కోరుకున్నదో అవన్నీ నీకు లభించును గాక! మన క్షత్రియ కులంలో ఎవరూ పుట్టకూడదేమో! బ్రాహ్మణులకు నమస్కారం! వారు భిక్షాటనచే కూడా జీవించవచ్చును. పాపాత్ముడైన దుర్యోధనుడు సభలో బిగ్గరగా నవ్వుతూ 'గౌ' అని పరిహసించాడు. ఆ మాట నన్ను మిక్కిలిగా బాధిస్తున్నది. ధనంజయా క్షేమంగా, ఆరోగ్యంగా వెళ్లిరా! హ్రీ, శ్రీ, కీర్తి, ద్యుతి, పుష్టి, ఉమ, లక్ష్మి, సరస్వతి –ఈ దేవతలందరూ ప్రయాణంలో నిన్ను రక్షింతురు గాక!"

అర్జునుడు వేగంగా నడుస్తూ హిమవత్పర్వత ప్రాంతం, గంధమాదనం దాటి చాలాదూరం వెళ్లి ఇంద్రకీలాద్రి చేరుకున్నాడు. అక్కడ ఒక తపస్వి అతడిని వెనక్కి మళ్లించాలని ప్రయత్నించాడు. అర్జునుడి పట్టుదలకు ముగ్ధుడై ఆ ముని అన్నాడు– "నాయనా! నేను ఇంద్రుడిని. ముందుగా నీవు పరమేశ్వరుని దర్శించిరా! ఆ తరువాత నీకు నేను అన్ని విధాలైన దివ్యాస్త్రాలను ఇస్తాను" అని ఇంద్రుడు అదృశ్యుడైనాడు.

## 4) కైరాత పర్వము

హిమవత్పర్వతం పృష్ఠభాగంలోని ఒక పర్వతం దగ్గర వనంలో దర్భవస్త్రం, దండం, మృగచర్మాలు ధరించి ఎండుటాకులు తింటూ, ఒక నెలవరకు మూడేసి రాత్రులకోసారి ఫలాలు భుజిస్తూ, రెండో నెలలో ఆరురాత్రుల కోసారి ఫలాహారం తీసుకుంటూ, మూడవ నెలలో 15 రోజులకోసారి భుజించేవాడు. తరువాత కేవలం వాయుభక్షకుడై చేతులు పైకెత్తి ఆసరా లేకుండా కాలి బొటనవ్రేలి కొనమీద నిలిచి తపస్సు చేసాడు. ఆ ఉగ్రమైన తపస్సుతో తపింపబడిన మహర్షులు శివుడిని దర్శించారు.

మహాశివుడు కిరాత వేషాన్ని ధరించి పార్వతి కిరాతికలా తన చెలికత్తెలతో వెంటరాగా అర్జునుడు తపస్సు చేస్తున్న చోటుకు వచ్చాడు. అప్పుడు మూకుడనే రాక్షసుడు పందిరూపంలో అర్జునుడిపైకి దూకబోతున్నపుడు అర్జునుడు గాండీవానికి బాణం సంధించి వదిలాడు. అదే సమయంలో కిరాతుడు బాణం వేసాడు. ఇరువురి బాణాలు తగిలి పంది నేలకూలి రాక్షసుడిగా మారి అదృశ్యమైంది. కిరాతుడు, అర్జునుడి మధ్య గొడవ మొదలైంది.

అర్జునుడు ఎన్ని బాణాలు వేసినా అవి ఆ కిరాతుడిపై వ్యర్థమవుతున్నాయి. దానితో అర్జునుడు ఆ కిరాతుడిని సమీపించి ధనుస్సుతో లాగి పిడికిళ్లతో కొట్టినాడు. కిరాతుడు అర్జునుడి ధనుస్సును లాక్కున్నాడు. అర్జునుడు ఖడ్గం పట్టుకుని

కిరాతుని శిరస్సుపై కొట్టాడు. ఖడ్గం ముక్కలయ్యింది. చెట్లు పెరికి, శిలలు ఎత్తి కిరాతుని కొట్టాడు. అన్నీ వృధాకాగా ముష్టియుద్ధం మొదలెట్టాడు అర్జునుడు. ఇరువురి మధ్య పోరు తీవ్రమై తన వక్షస్థలంతో 'ఢీ'కొట్టాడు అర్జునుడు. కిరాతుడు మరింత బలంతో అర్జునుడిని పీడించగా అర్జునుడు నిశ్చేష్టుడై నేలమీద పడ్డాడు.

క్రిందపడిన అర్జునుడు తన రక్తంతో తడిచిన మట్టితో పార్థివ శివలింగాన్ని చేసి పుష్పమాలతో పూజించాడు.

ఆ పుష్పమాల కిరాతుని శిరస్సుపై కనిపించింది. కిరాతుడే పరమశివుడని గ్రహించిన అర్జునుడు శివుడి పాదాలపై పడి ప్రార్థించాడు.

## పాశుపతాన్ని, దివ్యాస్త్రాలను పొందిన అర్జునుడు

"కపర్దీ! సర్వదేవేశా, భగనేత్రనిపాతనా, దేవదేవా, మహాదేవా నీలగ్రీవా, జటాధరా, త్ర్యంబకా, లలాటనేత్రా, శర్వుడా, శూలపాణీ! నా అజ్ఞానాన్ని క్షమించు. సర్వభూత మహేశ్వరా నన్ను కరుణించు".

పార్థుని ప్రార్థనకు సంతుష్టుడై కిరాత రూపాన ఉన్న మహేశ్వరుడు స్వస్వరూపాన్ని పొంది అర్జునుడిని ఆశీర్వదించి, "నీవు నాతో చేసిన యుద్ధాన్ని ఆనందించాను. ఇదుగో పాశుపతాస్త్రము. దీనిని మనస్సు, దృష్టి, వాక్కు, ధనుస్సులతో ప్రయోగించి శత్రు సంహారం చేయవచ్చును" అని పలికి పాశుపతాస్త్రపు ప్రయోగ సంహారాలు ఉపదేశించాడు భక్తసులభుడైన ఈశ్వరుడు అర్జునుడికి. శివుడి స్పర్శతో అర్జునుడిలోని అశుభం తొలగింది. గాండీవం, ఖడ్గం యధావిధిగా అర్జునుడి చేతికి వచ్చాయి. అర్జునుడిని ఆశీర్వదించి పార్వతీ పరమేశ్వరులు తమ గణాలతో అదృశ్యమైనారు.

శివుడు అదృశ్యమైనాక అర్జునుని చూసేందుకు వరుణుడు, యక్షులతో కలిసి కుబేరుడు, పితృదేవతలతో యముడు, ఐరావతాన్నెక్కి ఇంద్రుడు దేవగణాలతో వచ్చాడు. యముడు దండాస్త్రాన్నిచ్చాడు, వరుణ పాశాలను వరుణుడిచ్చాడు. కుబేరుడు అంతర్ధానాస్త్రమును ఇచ్చాడు. ఇంద్రుడన్నాడు– "నీకోసం మాతలి ఇంద్రరథాన్ని తెస్తున్నాడు. నేను నీకు ఇంద్రలోకంలో దివ్యాస్త్రాలను ఇస్తాను". దేవతలందరూ అదృశ్యమైనారు.

ఇంద్రరథమెక్కి అర్జునుడు ఇంద్రలోకం వెళ్లాడు. దారిలో అతడికి అనేక దివ్య విమానాలు కనిపించాయి. యుద్ధంలో మరణించిన వీరులు, సిద్ధులైన రాజర్షులు స్వర్గాన్ని పొంది వారివారి స్థానాల్లో ప్రకాశిస్తున్నారు. అన్నిటినీ చూస్తూ నందన వనాన్ని దాటి, అమరావతి చేరుకున్నాడు అర్జునుడు. తన కుమారుడిని కౌగిలించుకుని తన సింహాసనం మీద కూర్చోబెట్టు కున్నాడు దేవేంద్రుడు.

ఘృతాచి, మేనక, రంభ, పూర్వచిత్తి, స్వయంప్రభ, ఊర్వశి, మిశ్రకేశి, దండగౌరి, వరూధిని, గోపాలి, సహజన్య, కుంభయోని, ప్రజాగర, చిత్రసేన, చిత్రలేఖ, సహ, మధురస్వర మున్నగు వేలాది అప్సరసలు కటినితంబాలతో, కంపించే పయోధరాలతో, కటాక్ష హావభావాలతో మనోబుద్ధులను ఆకర్షిస్తూ నర్తించారు.

# 5. ఇంద్రలోకాభిగమన పర్వము - ఊర్వశి శాపం

అమరావతిలో దేవేంద్రుడు అర్జునుడికి వజ్రాస్త్రాన్ని, అశన అస్త్రాలను (మేఘాస్త్రాలు) ఇచ్చాడు. అమరావతిలో అయిదేళ్లుండి వివిధ దివ్యాస్త్రాలను పొందినాడు అర్జునుడు. అంగారపర్ణ–చిత్రసేనుడి నుండి నృత్యగీతాలను నేర్చుకున్నాడు.

చిత్రసేనుడు ఇంద్రుడి ఆజ్ఞతో ఊర్వశిని కలిసి అర్జునుడి గురించి చెప్పాడు. స్త్రీ సాంగత్యంలో కూడా నిపుణుడిగా చేయమని కోరినాడు. ఆమెకూడా అర్జునుడితో సాంగత్యాన్ని కోరుకున్నది. దానికి సంబంధించిన ఊహలలో తేలిపోతూ వెన్నెల వేళ అర్జునుడున్న భవనానికి వెళ్లింది.

మృదువుగా పొడవుగా ఉన్న ఉంగరాల జుట్టును సవరించుకొని నల్లకలువలను అలంకరించుకుని, భ్రూవిక్షేపాలు, తియ్యని మాటలు, ఉజ్జ్వల కాంతితో అలరారే ముఖచంద్రునితో, అంగరాగ దివ్యచందన మైపూతలున్న వక్షోజాలు గంతులు వేస్తున్నట్లు కదులుతుండగా, వక్షోజభారంతో వంగుతున్న నడుము త్రివలీ రేఖలతో శోభిల్లుతుండగా సూక్ష్మవస్త్రంతో ఆమె జఘన మండలం సౌందర్యంతో ప్రకాశిస్తుండగా మన్మథుని ఉజ్జ్వల నివాసమైన కటిస్థలంపై అందమైన మొలత్రాడు కదులుతుండగా ఆమె పాదాలు చక్కటి మడమలు, ఎర్రటి పొడవైన వేళ్లతో తాబేటివీపులా ఎత్తుగా కింకిణులతో అలంకరింపబడి శోభనిస్తుండగా, కొంచెం మధువు సేవించడం వలన, సంతోషం వలన, మదనభావ వివిధ విలాసాల వలన ఆమె చాలా అందంగా చూడముచ్చటగా కదులుతున్న చంద్రరేఖలా చిరునవ్వులు చిందిస్తూ అర్జునుని భవనానికి చేరుకున్నది.

అర్జునుడన్నాడు– "దేవీ! నేను శిరసు వంచి అభివాదం చేస్తున్నాను. నీ సేవకుడిని నేను".

ఊర్వశి అన్నది– "మహోత్సవంలో నీవు నన్ను రెప్పవేయకుండా చూసావు. అందుకనే ఇంద్రుడు చిత్రసేనుడిని నా వద్దకు పంపినాడు నిన్ను సేవించమని".

అర్జునుడన్నాడు– "నీవు నాకు గురుపత్ని లాంటిదానివి. నా తల్లి కుంతీదేవిలా, ఇంద్రుని భార్య శచిలా మాతృ సమానురాలివి. నిన్ను రెప్పవేయకుండా చూడడానికి కారణం– ఈమె మా పూరువంశానికి తల్లి (పురూరవుడి భార్య) కదా అని చూసాను. నీవు మా వంశ వర్ధకురాలవు. అత్యంత పూజనీయురాలివి".

ఊర్వశి అన్నది– "మాకు కట్టుబాట్లుండవు. స్వర్గమిది. ఎంతో కోరికతో నీ దగ్గరకు వచ్చాను. కాదనకు".

అర్జునుడన్నాడు– "తల్లిలాంటిదానివి, నన్ను పుత్రునిలా రక్షించు".

ఊర్వశికి కోపం వచ్చింది.

**తస్మాత్ త్వం నర్తనః పార్థ స్త్రీ మధ్యే మాన వర్జితః**
**అపుమానితి విఖ్యాతః షండవద్ విచరిష్యసి** (వన. 47-50)

"నపుంసకుడివైపో! నాకు పనికి రాని నీ మగతనం నీకు లేకుండా పోవును గాక!" అని శపించి వెళ్లిపోయింది.

చిత్రసేనుడు, ఇంద్రుడు ఈ విషయాన్ని తెలుసుకున్నారు. ఇంద్రుడు అన్నాడు– "నీ నిగ్రహం మెచ్చుకోదగినది. అర్జునా! నీవు నరనారాయణ మునులలో నరుడివి. నారాయణుడి ఊరువు నుంచి పుట్టినది ఊర్వశి. ఓ రకంగా ఆమె నీకు పుత్రికా సమానురాలు. వంశరూపంగా తల్లితో సమానురాలు. ఈ శాపం నీమంచికే! అజ్ఞాతవాస కాలంలో ఒక్క సంవత్సరం నీవు నపుంసకుడిగా ఉంటావు. ఆ తరువాత నీ పుంస్త్వాన్ని పొందుతావు. అంతా నీ మంచికే!"

అర్జునుడు ఇంద్రలోకంలో ఉన్నపుడు ఇంద్రుని దర్శించిన లోమశ మహాముని భూలోకానికి తిరిగి వచ్చి కామ్యక వనంలో ఉన్న ధర్మరాజాదులకు అర్జునుడి క్షేమసమాచారాలు తెలిపాడు.

వ్యాసమహర్షి చెప్పడం వలన ధృతరాష్ట్రుడికి తెలిసింది పార్థుడు ఇంద్రలోకంలో ఉన్నాడని. పరమేశ్వరుడి నుంచి పాశుపతాస్త్రాన్ని, వివిధ దేవతల నుంచి దివ్యాస్త్రాలను సంపాదించాడని. ధృతరాష్ట్రుడిలో దుఃఖం మొదలైంది. బలాబలాలను ఎన్నిసార్లు, ఎంతగా బేరీజు వేసినా పాండవుల పైచేయి, దినదినాభివృద్ధి స్పష్టంగా కనిపిస్తున్నది.

అర్జునుడు లేకుండా పాండవులు కామ్యకవనంలో అయిదేళ్లు స్వాధ్యాయ, జప, హోమాలతో కాలం గడిపారు. ఒకరోజున బృహదశ్వుడనే మహర్షి అక్కడకు రాగా యుధిష్ఠిరుడు, ఆ మహర్షికి మధుపర్కమిచ్చి (పెరుగు, నేయి, నీరు, తేనె, పంచదార) శాస్త్రోక్తంగా పూజచేసి ముచ్చటిస్తూ– "నాకంటే అదృష్టహీనుడూ, దుఃఖితుడూ అయిన పురుషుడెక్కడైనా ఎప్పుడైనా ఉన్నాడా?" అని ప్రశ్నించాడు ధర్మరాజు.

## 6) నలోపాఖ్యాన పర్వము

నిషధ భూపాలుడు వీరసేన మహరాజు పుత్రుడు, అందగాడు, బలవంతుడు, అశ్వశాస్త్ర కోవిదుడు, తేజస్వి, జూదప్రియుడు, ఉదారుడు, వేదవిదుడు.

అదేకాలంలో విదర్భ దేశాధిపతి భీమ మహరాజు అతడికి దమన మహర్షి వరప్రభావంతో ఒక కుమార్తె ముగ్గురు కుమారులు కలిగారు. అందుకని మహరాజు తన కుమార్తెకు దమయంతి అని, కొడుకులకు వరుసగా దముడు, దాంతుడు, దమనుడు అని పేర్లు పెట్టాడు. దమయంతి మహా సౌందర్యవతి.

నల దమయంతులు ఒకరి గుణాలు ఒకరు వినడం వలన పరస్పర అనురాగం కలిగింది. ఒకరోజున నలుడు తన ఉద్యానవనంలో సంచరిస్తున్న బంగరు హంసలను చూసి ఒకదానిని పట్టుకున్నాడు. తనను వదిలిపెడితే దమయంతితో ద్యూతం చేస్తానన్నది హంస. నలుడు వదిలిపెట్టాక హంస ఆకాశమార్గాన ఎగిరి దమయంతిని చేరుకుని అతడి గుణగణాలను పొగిడింది. తరువాత మరల నలుడి వద్దకు వచ్చి దమయంతికి నలుడిపై ఉన్న ప్రేమను వెల్లడించింది. ఇలా 'హంస రాయబారం'తో నలదమయంతులిరువురూ ప్రేమ జ్వరానికి లోనైనారు.

దమయంతి చెలికత్తెల ద్వారా విషయం గ్రహించిన విదర్భరాజు దమయంతీ స్వయంవరాన్ని ప్రకటించినాడు. దేశదేశాల రాజులు విదర్భకు చేరుకున్నారు. నారదుడు చెప్పగా విని లోకపాలురైన ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణులు భూలోకానికి వచ్చారు. వారికి నలుడు కనిపించాడు.

నలుడినే దూతగా పంపారు దమయంతి వద్దకు. "తమలో ఎవరినైనా భర్తగా వరించమని". నలుడు దేవతల శక్తివ లన అంతఃపురంలోకి వెళ్లి దమయంతికి దేవతల దూతగా వారి సందేశాన్ని వినిపించాడు. ఆమె అన్నది– "అందరూ స్వయంవరంలో పాల్గొనండి". మరుసటి రోజున స్వయంవరం.

**దమయంతీ తతో రంగం ప్రవివేశ శుభాననా**
**ముష్ణంతీ ప్రభయా రాజ్ఞాం చక్షూంషి చ మనాంసి చ** (వన. 57–8)

దమయంతి చూసింది ఆ స్వయంవర మండపంలో పక్కపక్కనే కూర్చున్న అయిదుగురు నల రూపులను. వారిలో అసలైన నల మహరాజు ఎవరు? దేవతలను శరణువేడింది.

**మనసా వచసా చైవ యథా నాభి చరామ్యహమ్**
**తేన సత్యేన విబుధాః తమేవ ప్రదిశంతు మే** (వన. 57–18)

"నలుడిని సత్యపూర్వకంగా ప్రేమించాను. అతడిని నాకు ప్రసాదించండి".

దేవతలు తమ రూపాలతో నిలిచారు. అస్వేదగాత్రులు, అనిమిష నేత్రులు, వాడని పూలదండలు ధరించినవారు, ధూళి రహితులై, భూమిని పాదాలు తాకనివారు, నీడ పడనివారు నలుగురు దేవతలని గుర్తించి నలుని మెడలో వరమాల వేసింది దమయంతి.

నలుడన్నాడు– "ఈ దేహంలో ప్రాణమున్నంత వరకు నీపై ప్రేమతో ఉంటాను"

**యావచ్ఛమే ధరిష్యంతి ప్రాణాదేహే శు చిస్మితే**
**తావత్ త్వయి భవిష్యామి సత్యమే తద్ బ్రవీమితే** (వన. 57–32)

దేవేంద్రుడు నలుడికి ఉత్తమగతులను, ప్రత్యక్ష దర్శనాన్ని; అగ్ని తన ఉనికిని, యముడు అన్నరసాన్ని, ఉత్తమ ధర్మస్థితిని; వరుణుడు జలసమృద్ధిని; అందరూ కలిసి పరిమళాలతో కూడిన పూలదండలను ఆ దంపతులకు ఇచ్చి ఆశీర్వదించి వెళ్లారు. దారిలో దేవతలకు ద్వాపరునితో కలిసి వస్తున్న 'కలి' కనిపించాడు. కలి అన్నాడు– "నేను దమయంతీ స్వయంవరానికే వెళ్తున్నాను". దిక్పాలకులన్నారు– "ఆ స్వయంవరం ముగిసింది. మేమక్కడినుంచే వస్తున్నాము".

కలికి కోపం వచ్చింది– "నలుని రాజ్యభ్రష్టునిగా చేస్తాను. దమయంతితో సుఖపడకుండా చేస్తాను. ద్వాపరా! నీవు నాకు సాయం చేయి. పాచికల నావహించు" అన్నాడు.

'కలి' నిషధ నగరం చేరి పన్నెండేళ్లు వేచిచూసాడు. పంద్రెండవ సంవత్సరంలో ఒకరోజున నలుడు మూత్రవిసర్జన చేసి కాళ్లు కడుక్కోకుండా అశుచిగా సంధ్యోపాసన చేసాడు. ఆ సమయంలో కలి పురుషుడు నలుడిలో ప్రవేశించాడు.

నలుడి దాయాది పుష్కరుడు వచ్చి జూదమాడదాం రమ్మని మూడుసార్లు ఆహ్వానించగా, కాదనలేక నలుడు జూదమాడినాడు. ప్రజలు మంత్రులు వద్దని బ్రతిమలాడినా నలుడు వినలేదు. పాచికల నావహించిన ద్వాపరుడు పుష్కరుడికి అనుకూలంగా పాచికలను పడవేస్తున్నాడు. ఎన్నో నెలలు సాగిన పాచికలాటలో నలుడు రాజ్యంతో సహా సర్వం పోగొట్టుకున్నాడు.

దమయంతి తమ కుమారులైన ఇంద్రసేన, ఇంద్రసేనుడిని తన పుట్టింటికి (విదర్భ) పంపివేసింది. పాచికలాటలో నలుడు సమస్తమూ కోల్పోయాడు. పుష్కరుడు నవ్వుతూ అన్నాడు– "నీకు మిగిలిందల్లా దమయంతి మాత్రమే. ఆమెను పందెమొడ్డేట్లయితే ఆట కొనసాగించు".

నలుడు ఆభరణాలతో సహా అన్నీ అక్కడ పడవేసి ఒకే వస్త్రం చుట్టుకుని నగరాన్ని విడిచి వెళ్తుంటే దమయంతి అనుసరించింది.

మహరాజైన పుష్కరుడు– "నలుడితో ఎవరైనా స్నేహంగా ఉన్నా ఆశ్రయమిచ్చినా వధార్హులౌతారు" అని చాటింపు వేయించాడు.

దానితో నలుడు నగరానికి వెలుపల మూడు రాత్రుళ్లు గడిపాడు. ఒకనాటి చక్రవర్తిని పౌరులెవ్వరూ ఆదరించలేదు.

అడవిలో నడుస్తూ ఫలాలు తింటూ వెళ్తున్న నలుడికి బంగరు రెక్కలున్న పక్షులు కనిపించగా వాటిని పట్టుకోవాలని ఉత్తరీయాన్ని విసిరాడు. పక్షులు ఉత్తరీయంతో సహా ఎగిరిపోతూ– "మేము నీ వస్త్రాన్ని అపహరించాలని వచ్చిన పాచికలం" అని అదృశ్యమయ్యాయి వస్త్రంతో సహా.

దిగంబరుడైన నలుడు, తన భార్య వస్త్రాన్ని సగం తనకు చుట్టుకుని అర్ధాంగితో పాటు నడుస్తూ ఒకచోట ఆగాడు. అప్పుడు దమయంతితో అన్నాడు నలుడు– "ఈ త్రోవలన్నీ దక్షిణాపథానికి పోయేవే! ఋక్షవంతాన్ని దాటి అవంతీ నగరాన్ని దాటాలి. ఇది వింధ్యపర్వతం. ఇది పయోష్ణీ నది. ఇది మహర్షులుండే చోటు. ఇది మీ విదర్భకు మార్గం. ఇది కోసలకు పోతుంది. నీకిష్టమైన దేశానికి వెళ్లు".

## దమయంతిని అడవిలో వదిలివెళ్లిన నలుడు

ఆ మాట అతడు పదేపదే అనేసరికి దమయంతి దుఃఖిస్తూ అన్నది– "సమస్త దుఃఖ సమయాల్లో భార్యను మించిన మందు లేదని వైద్యులంటారు. నన్నెందుకు విడిచి పోదామనుకుంటున్నావు?"

నలుడన్నాడు– "నన్నైనా నేను విడుస్తానేమోకాని నిన్ను నేను విడువను". ఆమెను ఓదార్చినాక వారు ఒకచోట విశ్రమించారు. దమయంతి నిద్రపోగానే నలుడు దమయంతి చీరను సగం చించి ఆ చీర ముక్క కట్టుకుని వెళ్లిపోబోతూ ఆమెను చూసి కన్నీళ్లు పెట్టుకున్నాడు. కలి ప్రభావమెక్కువైన నలుడు తన భార్యను వదిలి వెళ్లిపోయాడు. మెలకువ వచ్చి చూసిన దమయంతికి భర్త కనిపించలేదు.

**హా నాథ హా మహారాజ హా స్వామిన్ కిం జహాసిమామ్**
**హా హతాస్మి వినష్టాస్మి భీతాస్మి విజనే వనే** (వన. 63-3)

"నన్ను విడువనని పలికి, నిద్రిస్తున్న నన్ను విడిచి వెళ్లావు" అని అటూ ఇటూ పరుగులిడుతూ ఏడ్చింది దమయంతి. అటువంటి దీనస్థితిలో ఉన్న దమయంతిని ఆకలితో ఉన్న కొండచిలువ పట్టుకున్నది. ఆమె అరుపులు విని అటుగా వచ్చిన బోయవాడు కత్తితో కొండచిలువను చీరి ఆమెను రక్షించాడు. ఆ తరువాత ఆమెను చూసి కామపరవశుడైనాడు.

**తామర్థవస్త్ర సంవీతాం పీనశ్రోణి పయోధరామ్**
**సుకుమార నవద్యాంగీం పూర్ణచంద్ర నిభాననామ్**
**అరాలపక్ష్మ నయనాం తథా మధుర భాషిణీమ్**
**లక్షయిత్వా మృగవ్యాధః కామస్య వశమీ యివాన్** (వన. 63-32,33)

అతడి ప్రవర్తనను చూసి భయపడిన దమయంతి అతడిని శపించింది.

**య ద్యహం నైషధాదన్యం మనసాపి న చింతయే**
**తథాయం పతతాం క్షుద్రః పరాసుర్మృగ జీవనః** (వన. 63-38)

"నేను నలుని తప్ప మరొకరిని మనసులో సైతం భావించని దానినైతే ఈ వనచరుడు మరణించును గాక!"

ఆ వ్యాధుడు అగ్నిచే బూడిదైన వృక్షంలా నేలపై కూలి మరణించాడు.

ఈల పురుగుల రొదతో నిండిన అరణ్యం నుంచి బయల్దేరింది దమయంతి వనచరుడి బారినుంచి తప్పించుకుని. సింహాలు, ఏనుగులు, దుప్పులు, పెద్దపులులు, అడవి దున్నలు, ఆబోతులు, రకరకాల పక్షి సమూహాలు, మ్లేచ్ఛులు, దొంగలకు నిలయమైన ఆ అరణ్యంలో మద్ది, వెదురు, చంద్ర, రావి, తుమికి, ఇంగువ, మోదుగ, ఏరుమద్ది, వేప, తినిశ, బూరుగ, నేరేడు, మామిడి, లొద్దుగ, మునుగుదామర, మద్ది ప్రబ్బలి, పద్మక, ఉసిరిక, జువ్వి, కడిమి, అత్రి, రేగు, మారేడు, మర్రి, అడవి మామిడి, తాడి, ఖర్జూర, కరక్కాయ, తాండ్ర చెట్లతో, గైరికాది ధాతువులున్న కొండలతో, నదులు, సరస్సులు, దిగుడు బావులు, సర్పాలు, పిశాచాలు, రాక్షసులతో నిండి ఉన్న వనాలను చూసింది దమయంతి. ఆమె నలుని వెదుకుతున్నది. పర్వతాలను, వృక్షాలను, కొండా కోనలను అడుగుతున్నది నలుని జాడ తెలపమని. అలా మూడు రాత్రింబవళ్లు నడిచి తాపసుల ఆశ్రమాన్ని చేరుకున్నది. ఆ మునులు ఆమెకు ధైర్యం చెప్పి అదృశ్యమయ్యారు. అక్కడ నుంచి వెళ్లి ఆమె కొంతదూరంలో రథాలు, ఏనుగులు, గుర్రాలతో కూడిన వ్యాపారుల సమూహాన్ని చూసి ఆ జన సమూహంలో ప్రవేశించింది.

ఆ సార్థవాహానికి నాయకుడు 'శుచి'. వాళ్లు చేదిదేశపు రాజైన సుబాహు మహారాజుకు చెందిన వ్యాపారులు. ఆ రాత్రి వాళ్లంతా ఒక చెరువు ఒడ్డున విశ్రాంతి తీసుకున్నారు. అర్ధరాత్రి పూట వ్యాపారస్తులంతా గాఢనిద్రలో ఉన్నపుడు ఏనుగుల గుంపు దాడిచేయగా ఎందరో చనిపోయారు. చావగా బ్రతికినవాళ్లు కొందరు దమయంతిని నిందించారు. రాక్షసి అని రాళ్లతో కొట్టబోయారు. వారి నుంచి తప్పించుకుని కొద్దిమందితో కలిసి శరత్కాలపు చంద్రరేఖలా సాయంకాలానికి సుబాహుపురం చేరింది.

ఆమెను పిచ్చిదానిగా భావించి పిల్లలు, జనులు ఆమెను చుట్టుముట్టినారు విచిత్రంగా వింతగా చూస్తూ.

ఆ సమయంలో మేడమీద నుంచి రాజమాత చూసి చెలికత్తెలను పంపింది. రాజమాత వద్దకు వచ్చిన దమయంతి తాను సైరంధ్రినని, జూదంలో భర్త ఓడిపోయి మనసు చెడి, వనంలో తనను ఒంటరిగా వదిలి వెళ్లాడని చెప్పి ఆశ్రయం కోరింది.

రాజమాత కరుణతో అన్నది– "నా దగ్గరే ఉండు తల్లీ!"

దమయంతి అన్నది– "అమ్మా, నేను ఎంగిలి తినను, పరపురుషులతో మాట్లాడను, ఎవరికీ పాదసేవ చేయను. నన్నెవరైనా కోరితే వారికి మరణశిక్ష విధించాలి".

రాజమాత తన కుమార్తె సునందకు దమయంతిని సైరంధ్రిగా అప్పజెప్పగా ఎంతో గౌరవంగా బ్రతుకుతున్నదామె.

## నలుడు - కర్కోటకుడు

దమయంతిని వదిలి వెళ్లిన నలుడు అరణ్యంలో ఒకచోట కార్చిచ్చును చూసాడు. ఆ మంటల మధ్య చుట్టలు చుట్టుకుని ప్రాణభయంతో వణుకుతున్న సర్పరాజును చూసాడు. మంటల మధ్యకు దూకి సర్పరాజును రక్షించాడు. ఆ సర్పం కర్కోటకుడు. నారద మహర్షిని కాటువేయగా– "కదలకుండా పడిఉండు" అని శపించాడు నారదుడు. కర్కోటకుని రక్షించి కార్చిచ్చుకు దూరంగా పది అడుగులు వేయగానే కర్కోటకుడు నలుడిని కాటువేసాడు. వెంటనే నలుడు వికృత రూపుడైనాడు.

కర్కోటకుడన్నాడు– "ఏ తప్పూ చేయని నిన్ను ఎవడు శిక్షించాడో అతడిని శిక్షిస్తున్నాను నేను. నీకు ఈ విషం నుంచి ఎటువంటి బాధ ఉండదు. నీకు మంచికాలం రాగానే నీకు నీ రూపం వస్తుంది. నన్ను స్మరించి ఈ వస్త్రం కప్పుకోగానే నీకు యధారూపం వస్తుంది. అప్పటి వరకు బాహుకుడి పేరుతో వ్యవహరిస్తూ అక్ష విద్యా నిపుణుడైన అయోధ్య ప్రభువు ఋతుపర్ణ మహారాజు వద్దకు రథసారధిగా వెళ్లు. అతడి నుంచి అక్ష హృదయాన్ని స్వీకరించి అతడికి అశ్వ హృదయాన్నివ్వు" అని పలికి అదృశ్యమైనాడు కర్కోటకుడు.

## బాహుకుడు - ఋతుపర్ణుడు

పదిరోజులకు అయోధ్య చేరుకుని ఋతుపర్ణుడిని సందర్శించి తాను బాహుకుడనని అశ్వహృదయం, పాకశాస్త్రం తెలిసినవాడినని చెప్పుకున్నాడు.

ఋతుపర్ణుడన్నాడు– "శీఘ్రయాన రహస్యం తెలుసుకోవాలనేది నా కోరిక. నా గుర్రాలను దానికనుగుణంగా తయారుచేయి. నీకు వార్ష్ణేయుడు, జీవలుడు అనే అశ్వరక్షకులు సేవకులుగా ఉంటారు. ఋతుపర్ణుని సేవిస్తూ నలుడు, దమయంతిని తలుచుకుంటూ కాలం గడుపుతున్నాడు.

దమయంతి తండ్రి భీమరాజు తన కుమార్తె అల్లుడు అరణ్యంలో ఏం కష్టాలు పడుతున్నారో, ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి బ్రాహ్మణులను నియమించాడు. వారిలో సుదేవుడనేవాడు చేదిపురాన్ని చేరి దమయంతిని గుర్తించాడు.

**పూర్ణచంద్ర నిభాం శ్యామాం చారువృత్త పయోధరామ్**
**కుర్వంతీం ప్రభయా దేవీం సర్వా వితిమిరా దిశః–**

దమయంతితో అన్నాడు– "అమ్మా! నేను సుదేవుడనే బ్రాహ్మణుడను. మీ తండ్రి గారి ఆజ్ఞతో నిన్ను వెదుకుతూ ఇటు వచ్చాను".

దమయంతి దుఃఖిస్తూ తన వారందరిని గురించి అడిగింది సుదేవుడిని; దుఃఖిస్తున్న దమయంతి గురించి రాకుమారి సునంద చెప్పగా రాజమాత వచ్చి వివరాలడిగి దమయంతి ముఖంపై ఉన్న దుమ్ము తుడిచేసరికి దమయంతి భ్రూమధ్యంలో ఉన్న పుట్టుమచ్చ కనిపించింది. రాజమాత అన్నది– "దమయంతీ, నీవు నా చెల్లెలి కుమార్తెవు. నేను మీ అమ్మ దశార్ణదేశపు రాజు సుదాముని కుమార్తెలం. నీవు పుట్టినపుడు నిన్ను నా పుట్టింట్లో చూసాను. అమ్మా, ఇది నీ ఇల్లే! ఈ ఐశ్వర్యము నీదిగానే భావించి ఉండు తల్లీ!" అన్నది రాజమాత.

కొద్దిరోజులుండి దమయంతి విదర్భకు వెళ్లింది. క్షేమంగా ఉన్న తన పిల్లలను, తల్లిదండ్రులను చూసి ఆనందపడింది. భీమరాజు సంతోషించి తన పుత్రికను గుర్తించి తీసుకువచ్చిన సుదేవునికి వేయి గోవులు, ఒక గ్రామం, కొంత ధనాన్ని ఇచ్చి గౌరవించాడు.

దమయంతి కోరికతో భీమరాజు నలుడిని వెదకడానికి బ్రాహ్మణులను నలువేపులా పంపినాడు. వారు వెళ్లేముందు దమయంతి అన్నది– "మీరు మీకు నలుడిగా అనిపించినవారితో ఈ మాట అనండి– 'నిన్ను ప్రాణప్రదంగా ప్రేమించిన భార్యను అడవిలో ఒంటరిగా వదిలి, సగం చీర చింపుకుని వెళ్లిన జూదరివి. అలా ఎందుకు చేసావు?' ఎవరు దానికి సమాధానం చెప్పినా అతడిని గుర్తించి మాకు తెలియజేయండి" అన్నదామె.

చాలాకాలం గడిచింది. ఒకరోజున పర్ణాదుడనే బ్రాహ్మణుడు వచ్చి నేను అయోధ్య వెళ్లి ఋతుపర్ణుడి సభలో ఈ విషయం చెప్పినపుడు ఋతుపర్ణుడేమీ మాట్లాడలేదు. కాని బాహుకుడనే కురూపి నన్ను రహస్యంగా పిలిచి అన్నాడు. 'భర్త తనను అగౌరవపరచినా, రాజభ్రష్టుడైనా, దరిద్రుడైనా, ఆర్తుడైనా, వ్యసనపరుడైనా సరే భార్య అతడిపై కోపాన్ని చూపరాదు. ఎటువంటి పరిస్థితిలో అతడలా చేసాడో తెలుసుకోవాలి' అన్నాడు. అమ్మా, నా కనుమానం అతడే నలుడని. కాని అతడు కురూపి".

దమయంతి తన తల్లితో అన్నది– "ఈసారి సుదేవుడిని అయోధ్యకు పంపి ఋతుపర్ణ మహారాజుకు దమయంతి రెండో స్వయంవరానికి ఆహ్వానం అందజేయించాలి" అని తన ఆలోచనను చెప్పింది.

పర్ణాదుడికి కానుకలిచ్చింది విశేషంగా దమయంతి. సుదేవుడు అయోధ్యకు వెళ్లి ఋతుపర్ణుడితో అన్నాడు బాహుకుడు వింటుండగా– "దమయంతీ స్వయంవరం రేపు. రేపు సూర్యోదయ సమయంలో ఆమె భర్తను వరిస్తుంది. మహారాజా! మీరు వెళ్లదలుచుకుంటే వెంటనే బయల్దేరగలరు".

ఋతుపర్ణుడన్నాడు– "బాహుకా! మనం రేపు ఉదయానికల్లా విదర్భ వెళ్లగలమా?"

## అశ్వ హృదయం - అక్ష హృదయం

బాహుకుడి రూపంలో ఉన్న నలుడి మనసు అల్లకల్లోలమైంది. వెంటనే ఋతుపర్ణుని రథాన్ని సిద్ధం చేసాడు. తేజస్సు, బలం కలిగి ఉత్తమజాతిలో పుట్టి, ముక్కు రంధ్రాలు పెద్దవిగా గల అశ్వాలు పదిసుడులతో (ఒకటి రెండు నుదుటి మీద, రెండు తలపై, రెండేసి పార్శ్వ ఉపపార్శ్వాలలో, రెండు రెండు వక్షస్థలమందు) ఉన్న గుర్రాలను రథానికి పూన్చి వాటిని వాయువేగంతో నడిపించేసరికి ఋతుపర్ణ మహారాజు సందేహం తొలిగిపోయింది. వార్ష్ణేయుడు (ఒకప్పుడు నలుడి అశ్వశిక్షకుడు) ఆశ్చర్యపోయాడు. ఇతడు నలుడేమో అని సంశయించాడు.

బాహుకుడు రథాన్ని నడుపుతుంటే అది నదులను పర్వతాలను అరణ్యాలను సరస్సులను వేగంగా దాటిపోతున్నది. ఋతుపర్ణుడి ఉత్తరీయం జారిపడింది. "ఆపు బాహుకా!" అన్నాడు ప్రభువు. "అప్పుడే యోజన దూరం దాటాము ప్రభూ!" అన్నాడు బాహుకుడు. ఈలోగా కాస్త దూరంలో తాండ్రచెట్టు కనిపించింది. "దీనినుంచి రాలిపడిన ఆకులు 101. పండు ఒకటి. రెండు కొమ్మలకు అయిదుకోట్ల ఆకులున్నాయి. రెండు శాఖలకు 2095 ఫలాలున్నాయి" అన్నాడు ఋతుపర్ణుడు. రథాన్ని ఆపి పండ్లను లెక్కించాడు. ఋతుపర్ణుడి అక్షశాస్త్ర జ్ఞానానికి ఆశ్చర్యపోయాడు.

బాహుకుడన్నాడు– "నేను తమకు అశ్వహృదయాన్నిస్తాను. నాకు అక్షహృదయం, సంఖ్యాకథనముపదేశించండి"

ఋతుపర్ణుడంగీకరించాడు. ఇరువురూ విద్యలు గ్రహించారు. అక్ష హృదయాన్ని నలుడు గ్రహించేసరికి కలి నోటివెంట నురగలు కక్కుతూ, కర్కోటక విషం బాధపెడ్తుంటే నలుడి శరీరం నుంచి బయటపడి శరణు వేడి వెళ్లి తాండ్రచెట్టులో ప్రవేశించినాడు.

కలి విడవగానే నలుడిలో చింత తొలిగింది. సూర్యాస్తమయ సమయానికే విదర్భ చేరినాడు బాహుకుడు. వార్ష్ణేయుడు, ఋతుపర్ణ మహరాజు.

బాహుకుడు రథసారథిగా రథాన్ని తోలుతుండగా వర్షాకాలపు మేఘధ్వనులతో రథం కుండిన నగరానికి చేరుకున్నది. ఆ నగరంలోనే ఉన్న నలుని గుర్రాలు ఆ రథఘోషను విన్నాయి. నలుడి సాన్నిధ్యంలో ఉన్న ఆనందాన్ని పొందాయి. దమయంతి కూడా ఆ రథఘోషను విన్నది. ఏనుగులు నెమళ్లు విని ఘీంకార క్రేంకారాలు చేసాయి. దమయంతి ఆనందపడింది. మేడమీద నుంచి ఋతుపర్ణ, వార్ష్ణేయ, బాహుకులను చూసింది. నలుడు కనిపించలేదు.

తన చెలికత్తె కేశినిని పిలిచి– "ఆ పొట్టి చేతులు, వికృత రూపంలో ఉన్నదెవరో తెలుసుకో!"

కేశినితో మాట్లాడినాడు బాహుకుడు. తాను ఋతుపర్ణుడి రథసారథినని చెప్పినాడు. కేశిని సమాచారాన్ని దమయంతికి చెప్పి రహస్యంగా బాహుకుడు చేస్తున్న పనులను గమనించింది. వంట చేసేప్పుడు అతడు చేసిన అద్భుతాలను చూసి దమయంతికి చెప్పింది. అతడు వండిన మాంసాన్ని కేశిని తెచ్చివ్వగా రుచి చూసింది. సందేహం లేదు అతడు నలుడే. దమయంతి తన పుత్రుడు, పుత్రికను కేశినితో వంటగదికి పంపింది. వారిని చూడగానే బాహుకుడు వారిని ఒడిలోకి తీసుకుని పెద్దగా ఏడ్చినాడు. మాటిమాటికి రావద్దని కేశినిని మందలించాడు.

తల్లిదండ్రులకు చెప్పి దమయంతి బాహుకుడిని పిలిపించింది అంతఃపురానికి. బాహుకుని రూపంలో ఉన్న నలుడికి దుఃఖమాగలేదు. "కలిపురుషుడు నాలో చేరి జూదమాడించాడు, వనవాసం చేయించాడు, నీనుంచి దూరం చేసాడు, ఇప్పుడు నన్ను వదిలిపోయాడు" అన్నాడు నలుడు. దమయంతి అన్నది– "నిన్ను రప్పించాలని స్వయంవరం నాటకం ఆడాము. ఒక్కరోజులో అయోధ్య నుంచి విదర్భకు రథం మీద రాగలిగింది నీవొక్కడివే కదా! దేవతలు నాకు రక్షణగా ఉన్నారు. సూర్యచంద్ర వాయువులు నా రక్షకుల"న్నదామె.

బాహుకుడు వస్త్రాన్ని కప్పుకుని కర్కోటకుని స్మరించగానే నలుడి రూపం వచ్చింది. నల దమయంతులిరువురూ ఒకరి కౌగిలిలో ఒకరు ఒరిగిపోయారు. మూడు సంవత్సరాల తరువాత నలుడు తన భార్యాబిడ్డలను కలిసాడు. నలుడి నుంచి అశ్వవిద్యను గ్రహించి ఋతుపర్ణుడు అయోధ్యకు వెళ్లిపోయాడు.

## పుష్కరుని ఓడించిన నలుడు

నలుడు ఒక నెలరోజుల పాటు విదర్భలో గడిపి ఒక రథం, 16 ఏనుగులు, 50 గుర్రాలు, 600 మంది పదాతిదళంతో తన దేశాన్ని చేరి పుష్కరుని జూదానికి పిలిచాడు– "నా దగ్గర ధనముంది. దమయంతి ఉంది. నీ దగ్గర రాజ్యం ఉంది. నీ ప్రాణాలున్నాయి. రా పందెం ఒడ్డు!"

పుష్కరుడన్నాడు– "నిన్ను జయిస్తాను జూదంలో, దమయంతిని జయిస్తాను, ఖచ్చితంగా గెలుస్తాను".

జూదం మొదలయ్యింది. అక్ష హృదయ నిపుణుడైన నలుడు వరుసగా పందేలు గెలుస్తూనే ఉన్నాడు. సమస్త రత్న ధనాగారాలు, రాజ్యం, ప్రాణం అన్నీ పణంగా పెట్టి ఓడిపోయాడు.

నలుడన్నాడు– "ఇప్పుడు ఈ రాజ్యమంతా నాది. నీవు దమయంతికి సేవకుడివి. కలిపురుష కృతం వలన అప్పుడు నేనోడిపోయాను. ఇతరులు చేసిన తప్పుకు నిన్ను శిక్షించను.

**నాహం పరకృతం దోషం త్వయ్యాదాస్యే కథంచన**
**యథాసుఖం వైజీవ త్వం ప్రాణానవ సృజామితే–**

పుష్కరా, నీవు నాకు సోదరుడివి. సుఖంగా నూరేళ్లు జీవించు. నా సంపదలో నీకు కూడా కొంతభాగమిస్తున్నాను".

పుష్కరుడు నలుడికి నమస్కరించి ఎంతో సంతుష్టుడై తన నగరానికి వెళ్లాడు. నలమహరాజు ఎంతో వైభవంతో తన రాజధానిలో ప్రవేశించాడు. జంబూద్వీపమందలి రాజులలో ప్రఖ్యాతినొంది రాజ్యాన్ని పాలించాడు.

**–కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్య చ**
**ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కలి నాశనమ్–**

**–ఇతిహాస మిమం చాపి కలినాశన మచ్యుత**
**శక్యమాశ్వసితుం శ్రుత్వా త్వద్విధేన విశాంపతే–** (వన. 79–10,11)

ఈ 'అక్ష హృదయము' అనే విద్యను బృహదశ్వుడు ధర్మరాజుకుపదేశించినాడు.

# 7) తీర్థయాత్రా పర్వము

అందరి ఆలోచనలూ అర్జునుడు ఎలా ఉన్నాడనే. అర్జునుడు లేకపోతే ఈ వనం సుందరంగా లేదు. అలా పాండవులు, ద్రౌపది పరితపిస్తున్న సమయంలో నారద మహర్షి వచ్చాడు. భీష్మునికి పులస్త్య మహర్షి చెప్పిన తీర్థయాత్రా మహాత్మ్యాలను నారదుడు ధర్మరాజాదులకు వివరిస్తున్నాడు. పేదవాళ్లు యజ్ఞాలు చేయలేరు కనుక తీర్థయాత్రలు చేయడం మంచిది. సమస్త దేవతలలో విష్ణువు ఎట్లా మొదటివాడో అట్లే సర్వ తీర్థాల్లో పుష్కరమే మొదటిది. పుష్కరం, జంబూమార్గం, ధర్మారణ్యంలోని కణ్వాశ్రమం, యయాతి పతనం, మహాకాల తీర్థం, కోటితీర్థం, శివతీర్థం, నర్మద, చర్మణ్వతీ తీరం, అర్బుదం, వసిష్ఠాశ్రమం, పింగతీర్థం, వరుణ తీర్థం, వరదాన తీర్థం, ద్వారవతీ తీర్థం, పిండారక తీర్థం, దమీ తీర్థం, వసుధారాతీర్థం, పంచనద తీర్థం, విమల తీర్థం, వితస్తాతీర్థం (కాశ్మీరంలో తక్షకుని నివాసం), అక్షయతీర్థం, దేవికాతీర్థం, చమనోద్భేధ, శివోద్భేధ, నాగోద్భేధ, శశయాన తీర్థం, కుమారకోటి తీర్థం, రుద్రకోటి తీర్థం, సరస్వతీ సంగమతీర్థం, కురుక్షేత్రం, సతతక్షేత్రం, వరాహతీర్థం, సోమతీర్థం, ముంజవట తీర్థం, యక్షిణి క్షేత్రం, పరశురామ కుండం, రామహ్రదం, కాయశోధన, లోకోద్ధార కపిల, సూర్య, గోభవన, శంఖినీ, అరంతుక, బ్రహ్మోదర్త, కాశీశ్వర, మాతృ, శ్వావిల్లోమాపహ, దశాశ్వమేధిక, మానుష, బ్రహ్మ, ఉదుంబర, సప్తర్షికుండ, కపిష్ఠల కేదార, సరక, నారద, పుండరీక, త్రివిష్టప (వైతరణి), ఫలకీవన, మిశ్రక, వ్యాసస్థలి, అహస్సు, సుదిన, మృగధూమ, వామనక, శ్రీకుబ్జ, నైమిషకుంజ, సారస్వత, ఔశానస, కపాలమోచన, అగ్ని, విశ్వామిత్ర, బ్రహ్మయోని, పృధూదక, తైజస, కురు, స్థానువట, బదరీపాచనం, సోమతీర్థం, దధీచి ఆశ్రమం, సంనిహతి, గంగాతీర్థం, భూమిపై నైమిశం, ఆకాశంలో పుష్కరం గొప్పవి. మూడు లోకాల తీర్థాల్లోనూ కురుక్షేత్రం గొప్పది. తరంతుక, అరంతుక, రామహ్రద, మచక్రుకాల మధ్యభాగం కురుక్షేత్రం, సమంత పంచకం, అది బ్రహ్మ ఉత్తరవేది స్థానం.

ఆ విధంగా భీష్మునికి పులస్త్యుడు చెప్పిన తీర్థాల గురించి నారదుడు ధర్మరాజాదులకు వివరించాడు. నారదుడు వెళ్లిపోయాక ధౌమ్యుడు పుణ్యతపోవనాశ్రమాల గురించి, తూర్పు, దక్షిణ, పడమర, ఉత్తర దిక్కులలోని తీర్థాలను వర్ణించి చెప్పినాడు.

ఇంతలో లోమశుడు ఇంద్రలోకాన్నుంచి వచ్చి ధర్మరాజుకు ఇంద్ర సందేశము, అర్జునునికి దివ్యాస్త్రాలు లభించిన విషయాలను చెప్పినాడు. ఇంద్రార్జునులు అభ్యర్థించిన కారణంగా లోమశుడు ధర్మరాజాదులను వెంటబెట్టుకుని తీర్థయాత్రలకు వెళ్లాలని నిశ్చయమయ్యింది.

తనతో ఉన్న అనేకమందిని హస్తినా పురానికి పంపగా ధృతరాష్ట్రుడు వారినందరిని గౌరవించాడు.

ధర్మరాజు కొంతమంది బ్రాహ్మణులు లోమశ మహర్షి, ద్రౌపది, భీముడు, నకులుడు, సహదేవుడు, ధౌమ్యుడు తీర్థయాత్రలకు ప్రయాణ సన్నాహాలు చేసారు. మూడు రోజులు కామ్యక వనంలో ఉండి యాత్రకు బయల్దేరినప్పుడు వ్యాసుడు, నారదుడు, పర్వతాది మునులు వారినాశీర్వదించారు. ఇంద్రసేనాది సేవకులు, వంటవాళ్లూ, కొందరు కామ్యక వన మహర్షులు వారితో ఉన్నారు.

యుధిష్ఠిరుడడిగాడు లోమశ మహర్షిని– "నేను సాత్విక గుణ హీనుడిని కాదు. మరి నాకెందుకీ దుఃఖ పరంపర? నావలె ఇలాంటి దుఃఖాలు పొందినవారెవరైనా ఉన్నారా?"

లోమశ మహర్షి అన్నాడు– "తొలిదశలో దైత్య దానవ దేవతలు ధర్మాన్ని అనుసరించేవారు. తరువాత దైత్య దానవులు అధర్మం వేపు మొగ్గుచూపారు. దానివల్ల దైత్య దానవ రాక్షస అసురులలో గర్వం, అహంకారం, క్రోధం, నిర్లజ్జ, సదాచారహీనత వృద్ధిచెందడంతో ఓర్పు, లక్ష్మి వారిని విడిచిపెట్టిపోగా జ్యేష్ఠాదేవి, కలి వారిలో ప్రవేశించాడు. దేవతలు తీర్థయాత్రలు చేసి పునీతులయ్యారు. దానవులు శుచిశుభ్రతలు మరచి రాక్షసులైనారు.

నృగుడు, శిబి, భగీరథుడు, గయుడు, పూరుడు, పురూరవుడు, వసుమనుడు, ఇక్ష్వాకుడు, ముచుకుందుడు, మాంధాత, మరుత్తుడు తీర్థయాత్రలు, పుణ్యకార్యాలు చేసి కీర్తినొందారు. నీవు కూడా దేవతల అనుగ్రహంతో నీ లక్ష్యాన్ని, పునర్వైభవాన్ని సాధిస్తావు".

"పాండవులు నైమిశారణ్యాది తీర్థాలు సేవిస్తూ గోమతీ నదీతీర్థం, బాహుదానది, గంగా యమునా సంగమం, ప్రయాగ నుంచి గయాతీర్థం చేరారు. అక్కడ నీటిప్రబ్బలి చెట్లున్న మహానది ఉన్నది. అక్కడ ఉన్న బ్రహ్మసరోవర ప్రాంతాన

ప్రాచీనుడైన యమధర్మరాజు నివసించేవాడు. నదుల ఆవిర్భావం అక్కడే జరిగింది. అక్కడే అగస్త్యముని యముడిని కలవడానికి వెళ్లాడు.

అక్కడ గయుడు చేసిన యజ్ఞం, చేసిన దానధర్మాలు, దక్షిణలు అసంఖ్యాకం. ఆ యజ్ఞంలో చేసిన వేదధ్వని స్వర్గం దాకా వినబడింది. అన్న పర్వతాలు, నెయ్యి పెరుగుల సరస్సులు, నదులు, శాకపాకాల ప్రవాహాలు అసంఖ్యాకం. జనులు భుజించగా మిగిలిన అన్నపర్వతాలు ఇరవై అయిదు" అని చెప్పాడు శమఠుడు అనే స్నాతకుడు అమూర్తరయసుని పుత్రుడు గయుడి గురించి.

గయాక్షేత్రం నుంచి బయల్దేరి అగస్త్యాశ్రమాన్ని చేరి దుర్జయమణీమతీ నగరం దగ్గర నివసించసాగినారు.

వాతాపి ఇల్వలుడు అన్నదమ్ములు. వీరు దితి కుమారులు. ఇల్వలుడు దైత్యుల రాజు. వాతాపికి తనకిష్టమైన రూపాలు ధరించగల సామర్థ్యం ఉండేది. ఇల్వలుడు ఒక తాపస బ్రాహ్మణుడిని తనకు ఇంద్ర సమానుడైన కుమారుడి నిమ్మన్నాడు. అది సాధ్యం కాలేదు. దానితో ఇల్వలుడికి కోపం వచ్చి బ్రాహ్మణులను పిలిచి భోజనం పెట్టేవాడు. వాతాపి గొర్రెగానో, మేకగానో మారినాక దానిని చంపి వండి వడ్డించేవాడు బ్రాహ్మణులకు. వాళ్లు తిని కాస్త దూరం పోయాక

## జీర్ణం! జీర్ణం! వాతాపి జీర్ణం

"వాతాపీ రా!" అనేవాడు. భోజనం తిన్న బ్రాహ్మణుల కడుపు చీల్చుకుని వాతాపి బయటకు వచ్చేవాడు జంతువు రూపంలో. ఆ తరువాత రాక్షస రూపం ధరించేవాడు. ఇలా అనేకమందిని చంపారు ఆ దుష్టసోదరులు.

అగస్త్య మహర్షి ఒకరోజున తన పితరులు ఒక గోతిలో తలకిందులుగా వేలాడడం గమనించాడు. కారణమడిగితే అగస్త్యుడికి సంతానం లేకపోవడమన్నారు. దానితో అగస్త్యుడు ఒక్కొక్క ప్రాణి యొక్క ఉత్తమ అవయవాలన్నిటిని మేళవించి వాటితో ఓ సుందరమైన బాలికను తయారుచేసాడు. ఆమెను విదర్భరాజ గృహంలో ఉంచగా ఆమె దినదిన ప్రవర్ధమాన మయ్యింది. విదర్భ రాజు ఆమెకు 'లోపాముద్ర' అని పేరు పెట్టినాడు.

ఆమెకు యుక్తవయసు వచాచ్చక అగస్త్యుడు ఆమెను వివాహం చేసుకున్నాడు. ఋతుసమయంలో ఆమెతో సంగమానికి ఇష్టపడగా ఆమె అన్నది– "నేను రాకుమారిగా పెరిగాను. అటువంటి వసతులు కలిపిస్తే మన సమాగం అత్యంత ఆనందకరంగా ఉంటుంది".

అగస్త్యుడికి తన తపశ్శక్తిని వినియోగించి ధనాన్ని పొంద దలుచుకోక, మహాధనవంతుడైన దైత్యరాజు ఇల్వలుడి వద్దకు వెళ్లదలుచుకున్నాడు. అగస్త్యుడితో పాటు బ్రధ్నశ్వుడు, శ్రుతర్వుడు, త్రసదస్యువు ఇల్వలుడి వద్దకు వచ్చారు. ఇల్వలుడు యథావిధిగా వాతాపిని మేకగా మార్చి చంపి వండి వడ్డించాడు. ఆ సంగతి తెలిసి ముగ్గురు రాజులు వెనకంజ వేయగా, అగస్త్యుడు వారిని అనునయించి తానొక్కడే మొత్తం తినేసి 'బ్రేవ్' మని తేన్చాడు. ఇల్వలుడు అన్నాడు– 'వాతాపీ, రా!, వాతాపి రా!' రాలేదు. ఇల్వలుడంటూనే ఉన్నాడు– 'వాతాపీ రా!".

అగస్త్యుడు నవ్వి అన్నాడు– "ఇంకెక్కడి వాతాపి? జీర్ణం! జీర్ణం! వాతాపి జీర్ణం!" అని పొట్ట తడుముకున్నాడు.

**వాతాపే నిష్క్రమస్వేతి పునః పునరు వాచహ**
**తం ప్రహస్యాబ్రవీద్ రాజన్ అగస్త్యోముని సత్తమః** (వన. 99-8)

వాతాపి జీర్ణమైపోయాడు. ఇల్వలుడు దీనుడైపోయాడు. అగస్త్యుడు తనకు, ముగ్గురు రాజులకు కావాల్సిన ధనం దక్షిణగా తీసుకుని వెళ్లిపోయాడు ఇరావం, సురావం అనే గుర్రాలను పూన్చిన రథంలో.

అగస్త్యుడిని చంపాలని వెంబడించాడు ఇల్వలుడు. ఒక్కసారి వెనక్కి తిరిగి హుంకరించాడు అగస్త్యుడు. ఆ హుంకారాగ్నికి భస్మమైనాడు ఇల్వలుడు.

రాజులను పంపి అగస్త్యుడు లోపాముద్రకు కావలసిన వసతులను కలిగించి సంతోషపరచాడు. ఏడు సంవత్సరాలు గర్భాన్ని మోసి లోపాముద్ర కన్నది 'దృఢస్యువు' అనే కుమారుడిని. అతడు సమిధలను తలపై మోసుకుని తెచ్చేవాడు కనుక 'ఇధ్మవాహుడు' అన్నారతడిని. ఇది అగస్త్యాశ్రమ విశేషం. దీని పక్కనే ప్రవహిస్తున్నది భాగీరథి.

భృగుతీర్థంలో స్నానం చేసి పరశురాముడు రాముడితో యుద్ధం చేసి పోగొట్టుకున్న తేజస్సును మరల పొందినాడు. యుధిష్ఠిరుడు కూడా తన వాళ్లతో కలిసి దేవతలకు పితృదేవతలకు తర్పణాలు వదిలి, స్నానం చేసిన వెంటనే గొప్ప తేజోవంతుడైనాడు. శ్రీరాముడు శివధనుస్సును విరిచాడన్న కోపంతో పశురాముడతడిపై కోపించి వైష్ణవ ధనుస్సును బాణాన్నిచ్చి ఎక్కుపెట్టమన్నాడు. శ్రీరాముడు వైష్ణవ ధనుస్సును ఎక్కుపెట్టి బాణాన్ని వదిలి పరశురాముడి తేజస్సును గ్రహించేసరికి మూర్ఛిల్లినాడు పరశురాముడు. శ్రీరాముడిలో విష్ణురూపాన్ని దర్శించి మహేంద్ర పర్వతానికి వెళ్లిపోయాడు పరశురాముడు. ఆ తరువాత పితృదేవతల సలహాతో వధూసరం అనే పుణ్యనదీ తీరాన తపస్సు చేసి దీప్తోదకం అనే తీర్థంలో స్నానంచేసి తన తేజస్సును తిరిగి పొందినాడు. ఇక్కడే భృగుమహర్షి గొప్ప తపస్సు చేసాడు కనుక దీనికి భృగుతీర్థమని పేరు వచ్చింది.

## దధీచి వెన్నెముక - వజ్రాయుధం - అగస్త్యుడు

సత్యయుగంలో కాలకేయులనే దైత్యగణం వృత్రుడి నాయకత్వాన దేవతలను క్రూరంగా హింసించారు. బ్రహ్మ చెప్పిన విధంగా దేవతలు దధీచి మునిని ప్రార్థించి అతడు ప్రాణత్యాగం చేయగా, అతడి వెన్నెముక నుంచి ఆరంచుల వజ్రాయుధాన్ని తయారు చేసాడు త్వష్ట ప్రజాపతి. విష్ణుశక్తి చేరిన వజ్రాయుధం దెబ్బకు వృత్రుడు చనిపోయేసరికి కాలకేయులు పారిపోయి సముద్రంలో దాక్కుని రాత్రివేళల్లో వచ్చి పవిత్ర ప్రదేశాల్లోని మునులను భక్షించసాగినారు. మునులు, దేవతలు విష్ణుమూర్తిని శరణువేడగా దేవదేవుడన్నాడు–

"ఈ కాలకేయులు సముద్రంలో దాగి ఉన్నారు. మీరు మిత్రావరుణుల కుమారుడైన అగస్త్య మహామునిని ప్రార్థిస్తే అతడు సముద్రాన్ని పుక్కిట పట్టి తాగేస్తాడు. బయటపడిన కాలకేయుల్ని మీరు సులభంగా చంపగలరు".

దేవతలు అగస్త్యుడిని ప్రార్థించారు– "నహుషుడి గర్వభంగం కావించి ఇంద్రపదవి నుంచి తొలగించి అజగరంగా మార్చినావు; మేరు పర్వతం చుట్టూ తిరుగుతూ సూర్యుడు తనను నిర్లక్ష్యం చేసాడని సూర్యుని రాకపోకలను అడ్డగించేలా పెరిగిన వింధ్య పర్వతపు ఎత్తు తగ్గించినావు. కాలకేయుల పీడ వదిలించేందుకు సముద్రాన్ని తాగాలి" అని ప్రార్థించగా అగస్త్యుడు వారి ప్రార్థనలను మన్నించి సముద్రాన్ని ఔపోసన పట్టి తాగగా కాలకేయులు బయటపడ్డారు. వారిని దేవతలు చంపివేసారు.

మరల సముద్రాన్ని జలాలతో నింపమని దేవతలు ప్రార్థించగా అగస్త్యుడు– "జీర్ణం, జీర్ణం, సముద్రజలం జీర్ణం" అన్నాడు. అప్పుడు ఖాళీ అయిన సముద్రాలు భగీరథుడి ప్రయత్నంతో అపార జలరాశులతో నిండాయి.

## భగీరథుడు - గంగావతరణం

ఇక్ష్వాకు వంశంలో పుట్టిన సగరుడు మహా ప్రతాపవంతుడు. అతడికి పుత్రసంతానం లేదు. అతడికిద్దరు భార్యలు– వైదర్భి, శైబ్య. శివుని గురించి తపస్సు చేయగా శివుడు ప్రత్యక్షమై వరమిచ్చాడు. వైదర్భికి సొరకాయ వంటిది పుట్టింది. దానిలోని గింజలు తీసి వేడి నేతి పాత్రలలో ఉంచగా అరవై వేలమంది పుత్రులు జన్మించారు.

శైబ్యకు ఒకే ఒక కుమారుడు కలిగాడు.

సొరకాయ లాంటి పిండం నుంచి పుట్టిన అరవై వేలమంది కఠినులు, ఆకాశ భూ సంచారులు, అందరినీ బాధిస్తున్నారు.

సగరుడు అశ్వమేధయాగం చేసాడు. ఆ అశ్వం అదృశ్యమయ్యింది. సగర పుత్రులు భూమి అంతా వెదికి, సాగరాన్ని తవ్వుకుంటూ ఈశాన్య దిక్కున పాతాళం చేరి అక్కడ కపిలముని ఆశ్రమంలో యాగాశ్వాన్ని చూసి కపిలుని లెక్కచేయకుండా ప్రవర్తించి, కపిలుడి కోపాగ్నిలో భస్మమైనారు.

ఈ సంగతి నారదుడి వలన సగరుడికి తెలిసింది. శైబ్య పుత్రుడైన అసమంజసుడు పౌరుల బిడ్డలను నదిలోకి విసిరి వేస్తూ పైశాచికానందాన్ని పొందేవాడు. పౌరుల విజ్ఞప్తిపై సగరుడు తన కుమారుడిని నగర బహిష్కారం చేసాడు.

అసమంజసుని కుమారుడు అంశుమంతుడు. అతడు కపిలుని ఆశ్రమానికి వెళ్లి కపిలుడికి నమస్కరించి యాగాశ్వాన్ని తీసుకువచ్చి సగరుడితో అశ్వమేధ యాగం పూర్తిచేయించాడు.

సగరుడి తరువాత అంశుమంతుడు రాజైనాడు. అంశుమంతుని కుమారుడు దిలీపుడు. తన పితరులైన సగరుడు, సాగరులు, అసమంజసుడు, అంశుమంతులకు ఉత్తమ గతులు కలిగించడానికి గంగను భూమిపై దింపడానికి గొప్ప ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు.

దిలీపుని కుమారుడు భగీరథుడు. తపస్సు చేసి గంగను ప్రసన్నం చేసుకోగా, ఆమె వేగాన్ని భరించగలిగిన శంకరుడి కరుణను పొందమన్నది. భగీరథుడు శంకరుని మెప్పించగా అతడు అంగీకరించాడు. గంగ దూకింది శివుని జటాజూటంలోకి, అక్కడ నుంచి మూడు పాయలుగా ఆకాశం నుంచి నేలకు జారింది. నేలనుంచి పాతాళానికి వెళ్లి సగరపుత్రుల భస్మరాశులను తడిపి వారికి ఉత్తమ గతులనిచ్చింది. అగస్త్యుడు ఖాళీచేసిన సముద్రాన్ని నింపింది. ఆకాశగంగను నేలకు దింపే ప్రయత్నం చేసి కృతకృత్యుడైనాడు భగీరథుడు.

## ఋష్యశృంగుడు

పాండవులు హేమకూట పర్వత ప్రాంతానికి చేరుకున్నారు. ఋషభుడనే ఋషి ప్రభావంతో ఆ పర్వతం ఎవరికి కనిపించదు. దేవతలు యాగాలు చేసిన ప్రదేశమిది. రాళ్లు జారిపడుతుంటాయి. మేఘాలు ఏర్పడతాయి. వేదస్వాధ్యాయ ధ్వని వినిపిస్తుంది కాని ఎవరూ కనిపించరు. గడ్డి దర్భల రూపంలో, వృక్షాలు యూపస్తంభాల్లా కనిపిస్తాయి. ఇక్కడి నదులు నంద, ఉపనంద.

అక్కడ స్నానాలు చేసి పాండవులు కౌశికి నది చేరి విశ్వామిత్రుడి ఆశ్రమం దర్శించారు. దగ్గర్లో విభాండకుని 'పుణ్య' ఆశ్రమం ఉంది. కశ్యప గోత్రీయుడైన విభాండకుడు చాలా అందగాడు. తపస్వి ఊర్వశిని చూసి రేతః స్ఖలనమై అది నీటిలో పడింది. అది నీరుతాగుతున్న ఆడలేడి (శాపం పొందిన అప్సరస) గర్భాన చేరింది. ఆ లేడికి పుట్టిన కుమారుడి శిరస్సుపై కొమ్ము ఏర్పడడంతో ఋష్యశృంగుడని పిలువబడినాడు. అతడు తండ్రిని తప్ప వేరెవరిని చూసినవాడు కాదు.

అదేకాలంలో దశరథుని మిత్రుడు లోమపాదుడు అంగరాజ్య పరిపాలకుడు. అతడి మీద బ్రాహ్మణులు కోపించి అంగరాజ్యం విడిచి వెళ్లడంతో దేవతాపూజలు సక్రమంగా జరుగక కరువు ఏర్పడింది. బ్రాహ్మణులను ప్రసన్నం చేసుకోగా వాళ్లన్నారు– "విభాండకుడి కుమారుడు ఋష్యశృంగుడు నీ రాజ్యంలో అడుగుపెడితే వర్షాలు కురుస్తాయి".

మంత్రులతో మాట్లాడి లోమపాదుడు వేశ్యలను పంపినాడు ఋష్యశృంగుని వద్దకు. వారిలో ఒక తెలివైన నెరజాణ శాపభయం లేకుండా ఉపాయమాలోచించి నావపై ఆశ్రమాన్ని నిర్మింపజేసి, తాను వెళ్లి ఋష్యశృంగుని ఆటపాటలతో మైమరపు కలుగజేసింది. ఆమె వెళ్లిపోయాక ఋష్యశృంగుడు పరధ్యానంలో ఉండి, తండ్రి తరచి తరచి అడుగగా తన కొత్త స్నేహితుడి స్పర్శలోని మాధుర్యాల్ని, రూపాన్ని వర్ణించాడు. అది రాక్షసమాయగా చెప్పాడు విభాండకుడు.

మరుసటి రోజు ఆ వేశ్య ఋష్యశృంగుని నావ ఆశ్రమంలోకి తీసుకువచ్చి ఆటపాటలతో అలరిస్తూ ఉండగానే నావ అంగరాజ్యం చేరింది. ఋష్యశృంగుడు నావ దిగి నేలపై అడుగుపెట్టగానే వర్షాలు కురిసాయి. రాజు తన కుమార్తె 'శాంత'ను ఋష్యశృంగుడికిచ్చి పెళ్లి చేసాడు.

విభాండకుడికి ఆశ్రమంలో ఋష్యశృంగుడు కానరాక సమీప ప్రాంతాలన్నీ వెదికి చంపా నగరానికి బయల్దేరినాడు నది ఒడ్డునే నడుస్తూ. అతడు వచ్చిన దారిలో అందరూ అతడికి స్వాగతం చెప్పారు. అతడడగకుండానే అన్ని వసతులూ కలిపిస్తున్నారు. ఇవన్నీ తమ పుత్రుడివే అన్నారు వాళ్లు.

విభాండకుడు రాజమందిరంలో లోమపాద రాజును, ఋష్యశృంగుడిని, శాంతను చూసి సంతోషపడినాడు. వారిని ఆశీర్వదించి ఆశ్రమానికి మరలినాడు.

శాంత దశరథుడి కుమార్తె, లోమపాదుడు ఆమె పెంపుడు తండ్రి. వర్షిణి ఆమె పెంపుడు తల్లి.

ఋష్యశృంగుడు ఇంద్రయాగం చేయడంతో అంగరాజ్యంలో వర్షాలు కురిసాయని, ఆ తరువాత అతడు దశరథుడితో పుత్రకామేష్టి యాగం చేయించగా రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు జన్మించారని రామాయణంలో చెప్పబడింది.

ఆ తరువాత పాండవులు వైతరణి నది ఉన్న కళింగ దేశం చేరారు. ఇక్కడ రుద్రుడు యజ్ఞంలో ముఖ్యభాగానికి అర్హుడైనాడు. అక్కడ నుంచి మహేంద్ర పర్వతం చేరారు. చతుర్దశి నాడు తాపసులతో కలిసి పరశురామ దర్శనం చేసుకున్నారు ధర్మరాజాదులు.

## పరశురాముని కథ

హైహయ వంశపు రాజు కార్తవీర్యార్జునుడు. మహా పరాక్రమవంతుడు. వేయి భుజాలు కలవాడు. దత్తాత్రేయుడి వరంతో బంగారు విమానాన్ని, భూమి మీద అధికారాన్ని పొందినాడు. అహంకారం పెరిగి దేవ మానవ యక్ష గంధర్వ ఋషి, భూత గణాలను పీడించడంతో అందరూ విష్ణుమూర్తిని ప్రార్థించారు.

ఆ కాలంలోనే గాధి అనే రాజు వనవాసానికి వెళ్లాడు. అతడి కుమార్తె సత్యవతి. ఆమెను ఋచీకుడు వివాహం చేసుకోవాలనుకుంటే తెలుపు ఎరుపు రంగు, ఒక చెవి పూర్తిగా నలుపుగా ఉన్న వెయ్యి గుర్రాలు ఇవ్వాలన్నాడు గాధిరాజు. వరుణుడి అనుగ్రహంతో వేయి గుర్రాలను పొందినాడు ఋచీకుడు. ఆ గుర్రాలు వెలువడిన ప్రాంతమే అశ్వతీర్థం –అని పరశురాముడి అనుచరుడు అకృతవ్రణుడు చెప్పాడు.

వేయి అశ్వాలను గాధిరాజుకిచ్చినాక కన్యాకుబ్జంలో భృగుమహర్షి పుత్రుడు ఋచీకుడికి సత్యవతికి వివాహం జరిగింది. భృగుమహర్షి ఆశీస్సులతో వారు పుత్రసంతానాన్ని పొందగోరినారు. సత్యవతి తల్లి గాధి భార్య కూడా సంతానాన్ని అభిలషించింది.

భృగువు అన్నాడు– "ఋతుమతులైనాక సత్యవతీ నీవు రావిచెట్టును, నీ తల్లి మేడిచెట్టును కౌగిలించుకోవాలి. నీకు బ్రాహ్మణుడినిచ్చే చరువును, నీ తల్లికి క్షత్రియుడినిచ్చే చరువు (ప్రసాదం)ను ఇస్తున్నాను" అని చరువులనిచ్చి వెళ్లిపోయాడు భృగువు. ఆ తరువాత వారి పొరపాటు వలన చరువులు, తరువులు తారుమారైనాయి.

భృగుమహర్షి అన్నాడు– "సత్యవతీ నీ పుత్రుడు బ్రాహ్మణుడై క్షత్రియ కర్మ చేస్తాడు. నీ తల్లికి క్షత్రియుడై పుట్టి బ్రాహ్మణుడిగా ప్రవర్తించే పుత్రుడు కలుగుతాడు– అతడు విశ్వామిత్రుడు".

సత్యవతి తన మామను బ్రతిమలాడగా కొడుకు బ్రాహ్మణుడే అవుతాడు కాని మనవడు క్షత్రియ స్వభావం కలిగి ఉంటాడని వరమిచ్చాడు. కొడుకు జమదగ్ని; మనవడు– పరశురాముడు. జమదగ్ని ప్రసేనజిత్తు రాజు కుమార్తె రేణుకను కోరి వరించాడు. ఆమెకు అయిదుగురు పుత్రులు. ఆఖరివాడు పరశురాముడు.

ఒకరోజు రేణుక నది నుంచి నీళ్లు తెస్తూ నదిలో జలకాలాడుతున్న మార్తికావతపు రాజు చిత్రరథుని, అతడి భార్యలను చూసి క్షణకాలం రాజును మనసులో కోరుకున్నది. జమదగ్ని ఆ విషయాన్ని గ్రహించాడు. కొడుకుల్ని పిలిచాడు రుమణ్వంతుడు, సుషేణుడు, వసువు, విశ్వావసువులను ఒక్కొక్కరిని పిలిచి రేణుకను వధించమన్నాడు. వారు ఒప్పుకోలేదు. వారిని జడులుగా బ్రతకండి అని శపించాడు జమదగ్ని. అప్పుడు పరశురాముడు వచ్చాడు. తండ్రి ఆజ్ఞ శిరసా వహించాడు. తండ్రి ప్రసన్నుడై వరం కోరుకో అనగా– "తల్లిని బ్రతికించు. మానసిక పాపం ఆమెకంటకుండును గాక! నా సోదరులు యధాపూర్వకం ఉండనీ! యుద్ధంలో నన్ను జయించువాడు లేకుండును గాక! నాకు దీర్ఘాయువును ఇవ్వండి" అని వరముల నడిగాడు పరశురాముడు. జమదగ్ని ప్రసాదించాడు.

కొంతకాలానికి అనూప దేశపు రాజు హైహయ వంశస్థుడైన కార్తవీర్యార్జునుడు జమదగ్ని ఆశ్రమానికి వచ్చాడు. ఋషిపత్ని రేణుక అతడికి ఆతిథ్యమిచ్చినా స్వీకరించక హోమధేనువు దూడను అపహరించాడు. అక్కడి చెట్లను నాశనం చేసాడు. రాముడికి కోపం వచ్చి కార్యవీర్యార్జునునిపై యుద్ధం చేసి అతడి వేయి చేతుల్ని నరికి చంపాడు.

కార్తవీర్యార్జునుడి పుత్రులు సమయం కోసం వేచిచూసి పరశురాముడు లేని సమయాన తపస్సులో ఉన్న జమదగ్నిపై దాడిచేసి చంపివేసారు. దానితో ఆగ్రహం చెందిన పరశురాముడు సమస్త క్షత్రియకులాన్ని నాశనం చేయ సమకట్టి కార్యవీర్యుని పుత్రులను, బంధువులను చంపి ఇరవై ఒక్క మార్లు క్షత్రియులపై దండెత్తి భూమిని క్షత్రియ రహితం చేసి ఆ రక్తంతో సమంతపంచక క్షేత్రాన అయిదు మడుగులు నింపాడు.

గొప్ప యజ్ఞం చేసి భూమిని ఋత్విక్కులకు దక్షిణగా ఇచ్చాడు. కశ్యపుని ఆజ్ఞచే బ్రాహ్మణులు భూమిని ఖండఖండాలుగా చేసి తీసుకుని ఖాండవాయనులుగా ప్రసిద్ధిపొందారు. ఆ తరువాత అతడు మహేంద్రగిరిపై ఉంటూ భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, రుక్మి మొదలగు వారికి ధనుర్విద్య నేర్పినాడు.

ఆ మహానుభావుని దర్శించి ఆశీసులనొందినారు ధర్మరాజాదులు. ఆ తరువాత అర్జునుడి వలన శాపవిముక్తులై మొసళ్ల రూపాల నుంచి అప్సరసలుగా మారిన నారీతీర్థాలను దర్శించారు. గోదావరి నదివేపు వచ్చి స్నానాలు చేసి సాగర తీర్థాల మార్గంలో ప్రభాసక్షేత్రానికి చేరుకున్నారు. అక్కడ వారికి యాదవ ప్రముఖులైన శ్రీకృష్ణ బలరాములు కలిసారు. ఆ తరువాత పయోష్ణి నదీ తీరానికి వెళ్లి ధర్మరాజాదులు అక్కడే నివసించారు.

పయోష్ణి నదీతీరంలో నృగుడు యజ్ఞం చేసి సోమరసంతో ఇంద్రుడిని తృప్తిపరచాడు. అమూర్తరయుని పుత్రుడు గయుడు ఏడు అశ్వమేధాలు చేసాడక్కడ.

**చషాల యూప చమసాః స్థాల్యః పాత్ర్యః స్రుచః స్రువాః**
**తషేవ్వ చాస్య యజ్ఞేషు ప్రయోగాః సప్త విశ్రుతా** (వన. 121-5)

చషాలమనే గోళాకార కాష్ఠం, యూపస్తంభం, పాత్రలు, గిన్నెలు, వండిన సామాగ్రిని ఉంచే పాత్రలు, స్రుక్కులు, స్రువాలు– ఈ ఏడింటిని కూడా బంగారంతోనే చేయించాడు గయుడు. ఒక్కొక్క యూపస్తంభంపై ఏడేసి చషాలాలుంచారు.

ఇంద్రుడికి సోమరసం, బ్రాహ్మణులకు దక్షిణలు లభించాయి. గయుడి వితరణ అన్ని లోకాలలో ప్రసిద్ధికెక్కింది.

## చ్యవనుడు - సుకన్య

భృగుమహర్షి కుమారుడు చ్యవనుడు తపస్సు చేస్తుంటే అతడి చుట్టూ చీమలు పుట్టను పెట్టాయి. దానిమీద లతలు అల్లుకున్నాయి. ఆ ప్రాంతానికి శర్యాతి అనే రాజు విహారానికి వచ్చాడు. అతడి కుమార్తె సుకన్య. ఆమె తన చెలికత్తెలతో అటుయిటు మెరుపుతీగెలా తిరుగుతూ ఉండడం చూసిన చ్యవనుడికి ప్రసన్నత కలిగింది.

ఆమెను పిలిచాడు కాని ఆమెకు వినబడలేదు. మిణుగురు పురుగులనుకుని కర్రపుల్లతో అతడి కళ్లను పొడిచింది. కోపంతో పైకిలేచి అతడు శర్యాతి సైన్యానికి మలమూత్రాలు స్తంభింపజేసాడు.

విషయం తెలిసిన శర్యాతిరాజు చ్యవనుడి కాళ్లపై పడి క్షమాపణ కోరుకుని తన కుమార్తెనిచ్చి వివాహం చేసాడు. సైనికుల దురవస్థ తొలిగింది.

ఒకరోజున అశ్వినీదేవతలు సుకన్యను చూసారు. దేవవైద్యులైన వారు చ్యవనుడిని యువకుడిగా మార్చి ముగ్గురూ ఒకే రూపంలో ఆమె ముందు నిలబడినారు. సుకన్య తన భర్త చ్యవనుడినే కోరుకున్నది. వారు ఆమెపట్ల ప్రసన్నులై వరాలిచ్చారు. చ్యవనుడు ఇంద్రుడిని ధిక్కరించి యజ్ఞం చేసి అశ్వినీదేవతలకు యజ్ఞంలో హహిర్భాగాలనిచ్చాడు.

ఇంద్రుడు ఆగ్రహంతో వజ్రాయుధాన్ని చ్యవనుడిపై ప్రయోగించబోగా అతడి చేతిని స్తంభింపజేసి యజ్ఞాగ్ని నుంచి కృత్యరూపంలో భయంకరుడైన మదుడిని సృష్టించాడు. ఇంద్రుడు భయపడి అశ్వినీదేవతలకు యజ్ఞభాగం ఇవ్వడానికి అంగీకరించాడు. చ్యవనుడు మదాసురుని నాలుగు భాగాలు చేసి స్త్రీలు, మద్యపానం, ద్యూతం, వేట విచ్చలవిడిగా జరిగేచోట ఉండమని నిర్దేశించాడు.

ఆర్చీక పర్వతం దగ్గర మాంధాత యజ్ఞం చేసాడు. అక్కడ యమునానది ప్రవహిస్తుంది. కృష్ణుడు తపస్సు చేసిన ప్రదేశమది.

## మాంధాత చరిత్ర

ఇక్ష్వాకు వంశపురాజు యువనాశ్వుడు. సంతానం లేనివాడు. చ్యవన మహర్షి అతడికి సంతానం కలగడం కోసం ఇష్టియాగం చేసి మంత్రపూరితమైన జలాన్ని ఒక కలశంలో ఉంచాడు, దానిని యువనాశ్వుని భార్యతో తాగించాలని. ఆ రాత్రి యువనాశ్వుడికి దాహం వేసి మంత్రజలాన్ని తాగేసరికి యువనాశ్వుడికి గర్భం వచ్చింది. వంద సంవత్సరాలు గడిచాక యువనాశ్వుడి ఎడమ పక్కను చీల్చుకుని మగపిల్లవాడు పుట్టాడు. రాజు కూడా బ్రతికాడు. ఇంద్రుడు ఆ పిల్లవాడిని చూడడానికి వచ్చేసరికి ఆ పిల్లవాడు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. ఇంద్రుడు పిల్లవాడి నోటిలో తన చూపుడు వేలు ఉంచి 'మాంధాతృ' –ఇతడు నన్ను తాగుతాడు –అని వేలు ద్వారా అమృతం తాగించాడు. దానితో ఆ పిల్లవాడి పేరు 'మాంధాత'గా స్థిరపడింది.

పదమూడేళ్లకే వేదాలు, ధనుర్వేదం, దివ్యాస్త్రాలు అతడి పరమయ్యాయి. అజగవం అనే విల్లు, కొమ్ముతో చేసిన బాణాలు, దుర్భేద్య కవచం అతడికి లభించాయి. అతడి యజ్ఞమండపాలు లేని భూమి కొంచెం కూడా లేదు. తన తపోబలంతో ప్రకృతిని రక్షించాడు మాంధాత.

## సోమకుడు - జంతుడు

సోమకుడనే రాజుకు వందమంది భార్యలు. అందరూ ఒకే స్థాయి కలవారు. వారికి ఒకడే పుత్రుడు. అతడి పేరు జంతుడు.

ఒకరోజు పిల్లవాడిని చీమ కుట్టింది. దానితో అతడు గుక్కపెట్టి ఏడుస్తుంటే వందమంది రాణులు విలవిల లాడిపోయారు. రాజుకూడా గడగడలాడిపోయాడు.

రాజు అనుకున్నాడు– "ఒకే కుమారుడు ఉండడం కన్నా అసలు పుత్రులు లేకపోవడమే మంచిది!"

పురోహితుడిని సంప్రదిస్తే అతడు ఒక యజ్ఞకర్మ గురించి చెప్పాడు– "యాగం చెయ్యాలి, దానిలో బలిపశువు జంతుడే. అగ్నిలో కాల్చబడి అతడి 'వప' వల్ల వచ్చే పొగ ఆఘ్రాణించినవారికి సంతానం కలుగుతుంది".

యజ్ఞం నిర్విఘ్నంగా పూర్తయ్యింది. నూరుగురు రాణులూ గర్భవతులయ్యారు. పూర్వం జంతుడిని కన్న తల్లి జంతుడిని కన్నది. మిగతా రాణులు పిల్లల్ని కన్నారు. ఈ నవజంతుడి కుడివేపు బంగరు రంగు మచ్చ ఉంది.

కొన్నాళ్లకు యజ్ఞం జరిపించిన సోమకుని పురోహితుడు పరలోకానికేగినాడు. కొన్ని దినాల తరువాత సోమకుడు చనిపోయాడు. ఘోర నరకంలో అగ్నిలో వేగుతున్న పురోహితుని చూసి యమధర్మరాజుతో అన్నాడు సోమకుడు, "ఇతడిని విడిచిపెట్టండి, అతడి బదులు నేను నరకాగ్నిలో ప్రవేశిస్తాను. నా పుణ్యకర్మలలో ఇతడికీ భాగమున్నది".

యమధర్మరాజు అన్నాడు– "ఇతడితో పాపఫలాన్ని అనుభవించు. తరువాత ఇద్దరూ స్వర్గసుఖాలనుభవించగలరు".

ఆ విధంగా సోమకుడు పురోహితుడితో పాటు నరక బాధలు, స్వర్గసుఖాలు అనుభవించాడు.

## శిబి చక్రవర్తి

యమునా నదికి ఇరుపక్కల జల, ఉపజల అనే నదులు ప్రవహించే చోట ఉశీనరుడిగా పిలవబడే 'శిబి' చక్రవర్తి యజ్ఞం చేసాడు. అతడిని పరీక్షించడానికి ఇంద్రుడు డేగగా, అగ్ని పావురంగా– డేగ తరుముతుంటే పావురం వచ్చి యజ్ఞం చేస్తున్న శిబి తొడలమాటున దాగింది.

డేగ అన్నది– "మాకు పావురం ప్రకృతి నిర్ణయించిన ఆహారం, దీనిని రక్షించకు. విడిచిపెట్టు".

శిబి అన్నాడు– "ఈ పావురం నన్ను శరణువేడి రక్షణ కోరింది. శరణాగత రక్షణం పరమధర్మం. దీనిని విడువలేను".

డేగ అన్నది– "నాకు చిక్కిన పావురాన్ని నీవు రక్షించడం వలన నా కుటుంబం, నేను ఆకలితో మరణించాల్సి వస్తుంది. ఒక్క పావురాన్ని రక్షించి అనేకమంది చావుకు కారణం కావద్దు. పరస్పర ప్రతికూల ధర్మాలు ఎదురుపడినపుడు ఎక్కువ నష్టం–తక్కువ నష్టం, దేనివల్ల ఎక్కువ పుణ్యం అనే దానిపై దృష్టి పెట్టాలి".

శిబి అన్నాడు– "నీకు కావాల్సింది ఆహారం. గోవు, ఆబోతు, పంది, లేడి, దున్న –దేనినైనా కోరుకో! దానికి సమానం అయిన దానినైనా సరే! నేనిస్తాను".

డేగ అన్నది– "ఈ పావురం మాంసానికి సమానమైన నీ శరీరమాంసం ఇవ్వు"

శిబి వెంటనే తూనిక తెప్పించి ఒకవేపు పావురాన్ని ఉంచి రెండోవేపు తన కుడితొడ మాంసం కోసి వేసాడు. ఎంత వేసినా పావురం వేపే మొగ్గు ఉండడంతో తానే త్రాసులో కూర్చున్నాడు రక్తమోడుస్తూ.

ఇంద్రుడు, అగ్ని స్వరూపాలలో ప్రత్యక్షమైనారు. శిబి గాయాలు మానాయి. శిబిని ఆశీర్వదించి అదృశ్యమైనారు.

**యావల్లోకే మనుష్యాస్త్వాం కథ యిష్యంతి పార్థివ**
**తావత్ కీర్తిశ్చ లోకాశ్చ స్థాస్యంతి తవ శాశ్వతాః** (వన. 131–31)

అగ్ని అన్నాడు– "పావురంగా నన్ను రక్షించడానికి నీ కుడితొడ నుంచి మాంసం కోసి తూసావు. నీకు కుడితొడ నుంచి కుమారుడు కపోతరోముడు పుడతాడు. అతడు ఔద్భిదుడుగా వ్యవహరింపబడి గొప్ప కీర్తినందుతాడు".

# అష్టావక్రుడు

ఉద్ధాలక మహర్షి శిష్యుడు కహోడుడు. అతడికి తన కుమార్తె సుజాతనిచ్చి పెళ్లి చేసాడు ఉద్దాలకుడు. సుజాత గర్భవతి అయ్యింది.

కహోడుడు తన శిష్యుల మధ్య కూర్చొని వారితో వేదమంత్రాలు పలికిస్తున్నాడు. సుజాత గర్భంలోని శిశువు అన్నాడు– "ఉచ్చారణ శుద్ధంగా లేదు. అలా వల్లెవేయడం వల్ల ఉపయోగం లేదు".

కహోడుడికి కోపం వచ్చింది– "పొట్టలో ఉండి వక్రంగా మాట్లాడుతున్నావు. అష్టవంకరలతో పుట్టు" అని శపించాడు.

ప్రసవ కాలంలో ధనం అవసరాన్ని గుర్తించి కహోడుడు జనక సభకు వెళ్లి ఆస్థాన విద్వాంసుడు 'బంది'తో వాదించి ఓడిపోగా, నీటిలో ముంచివేయబడినాడు.

ఉద్దాలకుడు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దన్నాడు సుజాతతో. ఆ తరువాత అష్టవంకరలతో అష్టావక్రుడు జన్మించాడు. ఉద్దాలకుని కొడుకు శ్వేతకేతు.

శ్వేతకేతు, అష్టావక్రుడు ఇద్దరూ ఉద్దాలకుడి వద్ద విద్యనభ్యసిస్తున్నారు. అష్టావక్రుడు ఉద్దాలకుడే తన తండ్రి, శ్వేతకేతు తన సోదరుడు అనుకున్నాడు. ఒకరోజు ఉద్దాలకుడి ఒడిలో కూర్చుంటే శ్వేతకేతు అతడిని క్రిందికి లాగి– "ఇది నీ తండ్రి ఒడి కాదు" అన్నాడు.

శ్వేతకేతు తల్లిని అడిగి అసలు విషయం తెలుసుకున్నాడు. అష్టావక్రుడు, శ్వేతకేతు జనకుడి సభకు వెళ్లారు. ద్వారపాలకుడు వాళ్లు బాలురని లోనికి వెళ్లనివ్వలేదు.

ద్వారపాలకుడన్నాడు– "ఏకాక్షర బ్రహ్మను బోధించే అనేక రూపాలుగల సరస్వతీ రూపమైన వాక్కు నీకు తెలిస్తే చెప్పు, బాలకుడా!"

అష్టావక్రుడన్నాడు– "కాయలు ఎక్కువగా ఉండే చెట్టు, అదే పెద్ద చెట్టు".

ద్వారపాలకుడన్నాడు– "రాజును ప్రసన్నం చేసుకో, నీ రాకను తెలియజేయి"

అష్టావక్రుడన్నాడు– "బంది'ని ఓడించడానికి నేను వచ్చాను, రాజా!"

రాజు అన్నాడు– "ఎవడు 30 అవయవాలు, 12 అంశాలు, 24 పర్వాలు, 360 అరల పదార్థాల గురించి తెలుసుకుంటాడో అతడే జ్ఞాని"

అష్టావక్రుడన్నాడు– "కాలచక్రమే నిన్ను రక్షించేది".

రాజు అన్నాడు– "రెండు గుర్రాలవలె కలిసి ఉండి డేగలా హఠాత్తుగా ఆకాశం లోంచి దిగుతాయో ఆ రెండిటి గర్భాన్ని ఏ దేవతలు ధరిస్తారు? దేన్ని పుట్టిస్తారు?"

అష్టావక్రుడన్నాడు– "ఆ రెండు నీ శత్రువుల ఇండ్లపై కూడా పడవు. వాయువు సారథిగా మేఘం ఈ రెండిటి గర్భాన్ని ధరించి మేఘాన్ని పుట్టిస్తారు".

రాజు అన్నాడు– "నిద్రించేప్పుడు కళ్లు మూయనిదేది? పుట్టినా నడవలేనిదేది? దేనికి హృదయం ఉండదు? ఏది వేగంగా పెరుగుతుంది?"

అష్టావక్రుడన్నాడు– "చేప, గుడ్డు, శిల, నది"

రాజు అన్నాడు– "యజ్ఞమండపంలోకి ఆహ్వానం, ఇతడే 'బంది".

బంది అన్నాడు– "నిద్రించే పెద్దపులిని లేపకు, సర్పం తోక తొక్కకు, గర్వంతో పర్వతాన్ని అరచేతితో కొట్టకు"

అష్టావక్రుడన్నాడు– "మైనాకుని కంటె పర్వతాలు, ఆబోతు ముందు లేగదూడలు, జనకుని ముందు రాజులు తక్కువవారే!"

బంది– "ఒకే అగ్ని అనేక రకాలు; ఒకే సూర్యుడు అనేక రకాలు; ఇంద్రుడొక్కడే వీరుడు; పితృదేవతల ప్రభువు యముడూ ఒక్కడే".

అష్టావక్రుడు– "ఇంద్రాగ్నులు, పర్వత నారదులు, అశ్వినీదేవతలు, రథచక్రాలు, దంపతులు ఇద్దరిగా బ్రహ్మచే సృష్టింపబడినారు".

బంది– "ప్రజలు దేవ, నర, పశుపక్ష్యాదులు; వేదాలు మూడు; యజ్ఞాలు మూడు; స్వర్గ నరక పాతాళలోకాలు మూడు; సూర్య అగ్ని చంద్రులు మూడు జ్యోతిలు"

అష్టావక్రుడు– "నాలుగు ఆశ్రమాలు, నాలుగు వర్ణాలు, నాలుగు దిక్కులు; నాలుగు పదాలు (పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ)".

బంది అన్నాడు– "అగ్నులు అయిదు (గార్హపత్య, దక్షిణ, ఆహవనీయ, సభ్య, ఆవసథ్య). యజ్ఞాలు అయిదు (అగ్నిహోత్ర, దర్శపూర్ణమాస, చాతుర్మాస్య, పశు, సోమ యజ్ఞాలు); నదులు అయిదు (శతద్రువు, విపాశ, ఇరావతి, చంద్రభాగ, వితస్తి)".

అష్టావక్రుడన్నాడు– "దక్షిణ ఆరుగోవులు; ఋతువులు ఆరు, జ్ఞానేంద్రియాలు ఆరు, కృత్తికా తారలు ఆరు; సాద్యస్కం అనే యజ్ఞం ఆరు రకాలు".

బంది– "గ్రాస పశువులు ఏడు, వన్యమృగాలు ఏడు, ఛందస్సులు ఏడు, ఋషులు ఏడు, ఉపచారాలు ఏడు (గంధ, పుష్ప, దూప, దీప, నైవేద్య, ఆచమన, తాంబూలాలు)".

అష్టావక్రుడన్నాడు– "త్రాసులో 8 రాళ్లుంటాయి; సింహాన్ని చంపే శరభానికి ఎనిమిది కాళ్లు; వసువులు 8; యూపస్తంభాలు 8 కోణాల్లో ఉంటాయి".

బంది అన్నాడు– "పితృయజ్ఞంలో అగ్నిని ప్రజ్వలింపజేసే సామిధేనులు 9, సృష్టి తొమ్మిది పదార్థాల సంయోగంతో (ప్రకృతి, పురుషుడు, మహత్తు, అహంకారం, పృధివి, వాయువు, తేజస్సు, అప్పు, ఆకాశం); బృహతీ చందానికి అక్షరాలు 9; గణనకు మూలం ఒకటి నుంచి 9 అంకెలు".

అష్టావక్రుడన్నాడు– "సంసారంలో పురుషుని నిర్దేశించబడిన దశలు 10, పది వందలు సహస్రం; శిశువు తల్లి గర్భంలో పది మాసాలుంటుంది; నిందింపతగినవారు పదిమంది. శరీర అవస్థలు పది; పూజనీయులు పదిమంది. దశనిందకులు– రోగి, దరిద్రుడు, శోకార్తుడు, రాజదండుతుడు, శరుడు, ఖలుడు, వృత్తి కోల్పోయినవాడు, ఉన్మత్తుడు, ఈర్షాదువు, కాముకుదు; దశావస్థలు– గర్భవాసం, జన్మ, బాల్య, కౌమార, పౌగండం, కైశోరం, యవ్వనం, ప్రౌఢం, వార్ధక్యం, మృత్యువు. దశ పూజారులు– గురువు, తండ్రి, అన్న, రాజు, మేనమామ, మామ, తాత, మాతామహుడు, బాబాయి/పెదనాన్న, తనకన్న పెద్దలున్న గృహస్థుడు".

బంది– "పక్వేకాదశిని కి పదకొండు పశువులు, పదకొండు యూపాలు, ఏకాదశ వికారాలు (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్య, హర్ష, శోక, రాగ, ద్వేష, అహంకారాలు); ఏకాదశ రుద్రులు– మృగవ్యాధ, కపాలి, సర్ప, నిఋతి, అజైకపాద, అహిర్బుధ్న్య, పినాకి, దహన, ఈశ్వర, స్థాణు, భవులు"

అష్టావక్రుడు– "సంవత్సరానికి 12 నెలలు; జగతీఛందానికి 12 అక్షరాలు; ద్వాదశాహం ప్రాకృతయజ్ఞం; ద్వాదశాదిత్యులు (ధాత, మిత్రుడు, ఆర్యముడు, ఇంద్ర, వరుణ, అంశ, భగ, వివస్వంత, పూష సవిత, త్వష్ట, విష్ణువు)"

బంది– "త్రయోదశి తిథుల్లో గొప్పది. భూమిపై 13 ద్వీపాలు" అని పలికి బంది ఆగిపోయాడు.

అష్టావక్రుడు అన్నాడు– "శ్రీమహావిష్ణువు కేశి అనే రాక్షసుడితో 13 రోజులు యుద్ధం చేసాడు; అతిఛందస్సులో 13 అక్షరాలు, అంతకంటె ఎక్కువ ఉంటాయి" అనేసరికి బంది (వంది) మాట్లాడలేదు.

అష్టావక్రుడిదే విజయం. "ఇతడిని నీటిలో ముంచండి" అన్నాడు అష్టావక్రుడు.

బంది అన్నాడు– "నేను వరుణుడి పుత్రుడను. ఇంతకు ముందు నీటిలో పడవేసిన వాళ్లు నా తండ్రి నిర్వహిస్తున్న వరుణయాగంలో ఉన్నారు. అక్కడా యాగం పూర్తయ్యింది" అనగానే వందితో ఓడింపబడిన వారందరూ వచ్చారు.

బంది నీటిలో మునిగి బయటకు వచ్చాడు. అష్టావక్రుడి తండ్రి కహోడుడు కూడా నీటిలో నుంచి వచ్చినవారిలో ఉన్నాడు. జనకుడు వారినందరిని సత్కరించాడు.

కహోడుడు, శ్వేతకేతు, అష్టావక్రుడు ఇంటికి వచ్చారు. తండ్రి ఆజ్ఞతో అష్టావక్రుడు సమంగా నదిలో మునిగేసరికి అతడి శరీరవయవాలన్నీ సమంగా మారియి– అష్టవంకరలూ పోయాయి. సమంగా నది బాహుదానదిలా పుణ్యనదిగా పూజలందుకున్నది. సమంగా నది (మధువిల) – కర్దమిల క్షేత్రం వద్ద భరతుడు పట్టాభిషిక్తుడైనాడు. ధర్మరాజాదులు సమంగా నదిలో పుణ్యస్నానాలు చేసారు.

## భరద్వాజుడు - రైభ్యుడు

భరద్వాజుడు, రైభ్యుడు ప్రాణ స్నేహితులు. రైభ్యునికి అర్వావసువు, పరావసువు అను ఇద్దరు కుమారులు. భరద్వాజునికి యవక్రీతుడొక్కడే పుత్రుడు.

భరద్వాజుడు తపోసంపన్నుడు. రైభ్యుడు అతడి కుమారులు విద్వాంసులు. అందుకని వారికి సత్కారాలు గౌరవం ఎక్కువగా ఉండేది.

యవక్రీతుడు గొప్ప తపస్సు చేసి అధ్యయనం చేయకుండా వేదాలు భాసించాలని కోరుకున్నాడు. ఇంద్రుడు రెండుసార్లు నచ్చచెప్పినా వినక మూడోసారి ఘోర తపస్సు ప్రారంభించాడు యవక్రీతుడు.

ఇంద్రుడు బ్రాహ్మణవేషం ధరించి యవక్రీతుడు చూస్తున్నపుడు పిడికిళ్లతో ఇసుక తీసి గంగలో పోస్తున్నాడు. యవక్రీతుడడిగాడు ఏం చేస్తున్నావని. గంగకు ఇసుకతో ఆనకట్ట కడుతున్నాన్నాడు. ఇది సాధ్యం కాదు అన్నాడు యువక్రీతుడు; అవునా స్వాధ్యాయనం లేకుండా వేదజ్ఞానమూ సాధ్యం కాదు అన్నాడు ఇంద్రుడు. అయినా అతడి తపస్సును మెచ్చి వేదార్థాలు తోచేలా వరమిచ్చాడు యువక్రీతుడికీ, భరద్వాజుడికి. ఇద్దరికీ వేదజ్ఞానం సంపూర్ణంగా కలిగింది.

భరద్వాజుడన్నాడు కుమారుడితో– “నీ పట్టుదల శ్లాఘనీయమే కాని నీవు అనుసరించిన దారి సరైనది కాదు. ఇలా పొందే వరాలు అహంకారానికి దారితీస్తాయి.

ఒకప్పుడు బాలధి అనే తాపసి దేవతా సమానుడైన పుత్రుడు కావాలని తపస్సు చేసాడు. పుత్రుడు జన్మిస్తాడు కాని అతడు అమరుడు కాలేడు అన్నారు దేవతలు. అయితే ఈ పర్వతాలు చీలనంత వరకు అతడు బతికి ఉండాలి అన్నాడు బాలధి పర్వతాలు చీలవన్న నమ్మకంతో. బాలధి కుమారుడు ‘మేధావి’. తాను చిరంజీవిని అనుకుని అందరిని అవమానించ సాగినాడు. ఒకరోజున మేధావి విద్వాంసుడయిన ధనుషాక్షుని అవమానించాడు. ధనుషాక్షుడు మేధావి మరణ రహస్యాన్ని గ్రహించి దున్నపోతులతో పర్వతాన్ని చీల్చగా మేధావి మరణించాడు”

అని పలికి భరద్వాజుడు– “నీవు రైభ్యుడి జోలికి పోవద్దు” అన్నాడు యవక్రీతుడితో.

యవక్రీతుడొకనాడు రైభ్యుడి ఆశ్రమానికి పోయి రైభ్యుని కోడలిని చూసి కామించి ఆమెను బెదిరించి కోరిక తీర్చుకున్నాడు. ఆమె పరావసుడి భార్య. ఆమె జరిగినదంతా చెప్పింది.

రైభ్యుడు మండిపడినాడు. తన జటను పెరికి మంత్రాలు చదువుతూ హోమాగ్నిలో పడవేసే సరికి ‘కృత్య’ ఆవిర్భవించింది. ఇంకో జట పడవేసే సరికి రాక్షసుడు పుట్టాడు. వారిని పంపాడు యవక్రీతుడిని చంపమని. ‘కృత్య’ అందమైన స్త్రీగా మారి యవక్రీతుడి కమండలాన్ని అపహరించింది. రాక్షసుడు యవక్రీతుడి వెంటబడితే తన తండ్రి భరద్వాజుడి అగ్నిహోత్రం దగ్గరకు పరిగెత్తాడు. అక్కడ అంధుడైన శూద్రుడు కాపలాగా ఉన్నాడు. రాక్షసుడు అటువచ్చి దాక్కున్న యవక్రీతుడిని త్రిశూలంతో పొడిచి చంపేసాడు.

భరద్వాజుడు వచ్చి తన ఏకైక కుమారుడు చంపబడడంతో మనస్తాపం చెంది– “ఓ రైభ్యుడా, నీవూ నీ ప్రథమ పుత్రుడి చేతిలో మరణించెదవు గాక!” అని పలికి పుత్రునికి దహన సంస్కారాలు చేసి, ఆ అగ్నిలో తానూ ప్రవేశించాడు.

అదేరోజుల్లో బృహద్యుమ్నుడనే రాజు గొప్ప యజ్ఞాన్ని రైభ్యుడు యాజకుడిగా చేస్తున్నాడు. యజ్ఞ సమాప్తికి అర్వావసు, పరావసులను సహాయకులుగా నియమించాడు. తండ్రి ఆజ్ఞ గైకొని అర్వావసు, పరావసువులు యజ్ఞవాటికకు వెళ్లారు. ఇంటిలో రైభ్యుడు, పరావసువు భార్య మాత్రమే ఉన్నారు. చీకటి పడుతున్న సమయంలో రైభ్యుడు నల్లజింక చర్మం కప్పుకుని అడవిలో నడుస్తున్నాడు. ఆ సమయంలో ఇంటికి వస్తున్న పరావసువు తండ్రిని క్రూరజంతువుగా భావించి చంపినాడు.

తీరా దగ్గరకు వెళ్లి చూస్తే తండ్రి శవం. దానికి ప్రేత కార్యాలన్నిటిని పూర్తిచేసి యజ్ఞవాటికకు వెళ్లి “యజ్ఞాన్ని నీవు పూర్తిచేయలేవు. నేను తండ్రిని చంపాను కనుక ఆ బ్రహ్మహత్యా పాతకాన్ని తొలగించే వ్రతం నీవు ఆచరించు. నేను మహరాజు యజ్ఞాన్ని పూర్తిచేస్తాను” అన్నాడు.

అర్వావసువు సోదరుడి కోసం బ్రహ్మహత్యా పాతకం తొలిగే ప్రాయశ్చిత్త వ్రతం చేసి యజ్ఞవాటిక వద్దకు వెళ్లాడు. పరావసువుకే బుద్ధిపుట్టిందో అతడు మహరాజు బృహద్ద్యుమ్నునితో "ఇతడు బ్రహ్మహత్య చేసాడు, ఇటు రాకూడదు" అన్నాడు. రాజసేవకులు అతడిని లోపలకు అడుగు పెట్టనివ్వలేదు– "నీవు బ్రహ్మహత్య చేసావని నీ సోదరుడు అంటున్నాడు, వెళ్లిపో!" అని తీవ్రంగా హెచ్చరించారు.

అర్వావసువు ఆశ్రమానికి వెళ్లి సూర్యుని ఉద్దేశించి సూర్య అష్టాక్షరి (ఘృణి స్సూర్య ఆదిత్యః) జపిస్తూ తపస్సు చేయగా సూర్యుడు, దేవతలు ప్రత్యక్షమై వరాలు కోరుకొమ్మనగా– "తన తండ్రి బ్రతకాలని, తన సోదరుడు నిర్దోషి కావాలని, తండ్రికి తన చావు గుర్తుండకూడదనీ" కోరినాడు. భరద్వాజుడు యవక్రీతుడు కూడా బ్రతకాలని, సౌరమంత్రం ప్రతిష్ఠింప బడాలని కోరగా దేవతలు ఆ వరాలనిచ్చారు.

మునులందరూ బ్రతికారు. యవక్రీతుడన్నాడు– "నేను తపస్సు చేసాను, వేదజ్ఞానం ఉంది. నన్ను రైభ్యుడెలా చంపగలిగాడు?"

దేవతలన్నారు– "ఏది నీ జ్ఞానం? ఒంటరి స్త్రీని భయపెట్టినపుడే నీ తపశ్శక్తి, జ్ఞానం అంతరించాయి. నీవిప్పుడు అర్వావసుడి దయవలన బ్రతికావు" అని పలికారు.

రైభ్యుడి ఆశ్రమాన్ని దర్శించారు తీర్థయాత్రికులందరూ.

## గంధమాదన పర్వతానికి ప్రయాణం

లోమశ మహర్షి అన్నాడు– "మనమిప్పుడు ఉశీరబీజం, మైనాకం, శ్వేతం, కాలశైకం పర్వతాలను దాటి ఏడుధారలతో ప్రవహించే గంగానదిని చూసాము. కైలాసం మందరాచల ప్రాంతాలలో యక్షులు నివసిస్తారు. ఈ ప్రాంతం యక్ష రాక్షసులకు ప్రసిద్ధి. ఇది దుర్గమ ప్రదేశం. ద్రౌపదిని రక్షించుకుంటూ ముందుకు వెళ్లాలి".

కొంతదూరం వెళ్లాక కుళింద దేశం వచ్చింది. ఆ రాజ్యపు ప్రభువు సుబాహుడు సరిహద్దులో కలిసి వారిని ఆదరించాడు. ఇంద్రసేనాది సేవకులను, వంటవారిని, వస్తుసామాగ్రిని సుబాహు ప్రభువుకు అప్పగించి– ధర్మజుడు, భీముడు, ద్రౌపది, నకులుడు, సహదేవుడు, లోమశుడు, ధౌమ్యుడు, ఇతర బ్రాహ్మణులు గంధమాదన పర్వతం వేపు దారితీసారు. అప్పటికి అర్జునుడు వెళ్లి అయిదేళ్లు గడిచాయి.

అర్జునుడి గురించి మాట్లాడుకుంటూ, చుట్టూ ఉన్న ప్రకృతిని పలకరిస్తూ అలకనంద, ఆకాశగంగను దాటి తెల్లని గుట్ట–పర్వత సమానమైన దానిని – నరకాసురుడి ఎముకల గుట్టను చూసారు.

లోమశుడు చెప్పాడు– "భూమి సముద్రజలంలో మునిగి ఉన్నపుడు విష్ణువు ఏకదంత వరాహరూపం దాల్చి భూమిని పైకెత్తినాడు. భూమి ఒరిగి కల్లోలం సంభవించగా దేవతలు మునులు బ్రహ్మ శరణుజొచ్చారు. బ్రహ్మ అన్నాడు– 'శ్రీమహావిష్ణువు ఆదివరాహ రూపంలో భూమిని పైకె లేవనెత్తుతున్నాడు. అతడి వక్షస్థలంపై శ్రీవత్సం అనే పుట్టుమచ్చ ఉంటుంది'. దేవతలు వెళ్లి భగవంతుని సందర్శించారు. భూమి, ఆదివరాహ సమాగమం వలన నరకుడు జన్మించాడు. నరకుడిని శ్రీకృష్ణుడు చంపినాడు. నరకుడి ఎముకలు ఇలా పర్వతంలా పోగుబడినాయి".

పాండవులు గంధమాదన పర్వతానికి వెళ్లేసరికి పెనుగాలితో కూడిన వర్షం కురిసి చెట్లు విరిగాయి. రాళ్లు పడ్డాయి. అంతా గాడాంధకారం. వేర్వేరు చోట్ల తలదాచుకున్నారు. గాలీవాన తగ్గాక మరల ప్రయాణం ప్రారంభించారు.

క్రోసు దూరం నడిచేసరికి ద్రౌపది అలసిపోయి మూర్ఛపోగా, భీముడు ఓ క్షణం ఆలోచించి తన కుమారుడైన ఘటోత్కచుని తలుచుకున్నాడు. ఘటోత్కచుడు, తన పరివారంతో వచ్చి అందరినీ మోసుకునివచ్చి బదరీ వనానికి చేర్చాడు. అది నరనారాయణులు తపస్సు చేసిన ప్రదేశం.

**శరణ్యం సర్వ భూతానాం బ్రహ్మఘోషి నినాదితమ్**
**దివ్యమాశ్రణీయం తమ్ ఆశ్రమం శ్రమనాశనమ్** (వన. 145–31)

సమస్త ఋతువులలోని పుష్పాలు వికసించి ఉన్నాయక్కడ. సరస్సులు నిర్మల జలాలతో నిండి ఉన్నాయి. వికసించిన కమలాలు, కలువలు అద్భుతంగా కానవచ్చాయి. ఫలపుష్ప వృక్షాలు, కోకిలల పాటలతో వనమంతా రమ్యంగా ఉన్నది. అక్కడ ఆరు రాత్రులు గడిపారు వాళ్లు.

అప్పుడు ఈశాన్య దిక్కు నుంచి గాలిలో ఎగిరివచ్చింది వేయి దళాల దివ్యకమలం. సుగంధ స్వరూపంగా ఉన్నదా పుష్పం. "భీమసేనా! ఈ పుష్పాలను చాలా తీసుకునిరా! వీటిని నేను కామ్యక వనంలోని మన ఆశ్రమానికి తీసుకువెళ్తాను" అన్నది ద్రౌపది.

చిన్నపిల్లలా పరిగెత్తింది ద్రౌపది ఆ సౌగంధికా కమలాన్ని ధర్మరాజుకు చూపించాలని. మహోత్సాహంతో బయల్దేరాడు భీమసేనుడు తన భార్య కోరిక తీర్చాలని.

బంగారు తొడుగు కల విల్లు, విష సర్పాల్లాంటి బాణాలు తీసుకుని కోపించిన సింహంలా, మదపుటేనుగులా బయల్దేరినాడు. ఆ గంధమాదన పర్వతం నీలి శిలలతో, కిన్నరులతో, రంగురంగుల పక్షులు, చెట్లు, మృగాలతో శోభిల్లుతున్నది.

**సర్వాభూషణ సంపూర్ణం భూమేర్భు జమివోచ్ఛ్రితమ్**
**సర్వత్ర రమణీయేషు గంధమాదన సానుషు** (వన. 146-16)

అన్ని ఋతువుల పూలవాసన గాలితో కలిసి వీస్తుంటే, తండ్రికి పుత్ర సంస్పర్శ కలిగినట్లు, ఆ పరిమళభరిత వాయు వీచికలు భీమసేన కుమారుడిని స్పర్శిస్తున్నాయి.

**ప్రాంశుః కనక వర్ణాభః సింహ సంహననో యువ**
**మత్త వారణ విక్రాంతః మత్తవారణ వేగవాన్** (వన. 146-28)

సౌందర్యానికి నూతన అవతారంలా సౌగంధికా కమలాలున్న చోటుకు వెళ్తున్నాడు భీమసేనుడు.

అతడు గర్జిస్తుంటే పులులు గుహలను వీడి పరుగులు తీసాయి, వనప్రాణులు పొదల్లో దాక్కున్నాయి. పక్షులు ఎగిరాయి ఆకాశంలోకి. ఎలుగుబంట్లు, మృగాలు, సింహాలు, ఏనుగులు, అడవిపందులు, గవయ వృషభాలు, నక్కలు, చిలుకలు, చక్రవాకాలు, చాతక, హంస, కారండవ, ప్లవ, కోకిల, క్రౌంచాదులు అరుస్తూ తలకో దిక్కుకూ పారిపోయాయి.

మహాబలుడైన వాయుపుత్రుడు ఏనుగులను, సింహాలనూ చంపుతూ, భయపెడుతూ అందమైన అరటితోట వద్దకు చేరుకున్నాడు. అక్కడ ఉన్న సరస్సులో జలక్రీడలాడి అరటితోపులోకి వచ్చి బలంగా శంఖాన్ని ఊదినాడు.

తన సోదరుడు భీమసేనుని రాకను గుర్తించి హనుమంతుడు, అతడు వెళ్లే దారిలో ఇరుకైన చోట నిద్రాసక్తుడై కూర్చుని తోకను నేలపై చరుస్తుంటే అది ఆబోతు రంకెలా, ఏనుగు ఘీంకారంలా ఉండి నలుదిక్కులా మ్రోగి ప్రతిధ్వనించగా విని భీముడు అటుగా వచ్చాడు.

## హనుమంతుడు - భీమసేనుడు

**కదలీవన మధ్యస్థమ్ అథపీనే శిలాతలే**
**దదర్శ సుమహాబాహుః వానరాధిపతిం తదా-**

అరటి తోపులో విశాలమైన రాతిపలకపై కూర్చుని ఉన్నాడా వానరశ్రేష్ఠుడు.

**విద్యుత్ సంపాత దుష్ప్రేక్షం విద్యుత్సంపాతి పింగలమ్**
**విద్యుత్ సంపాత నినదం విద్యుత్సంపాత చంచలమ్** (వన. 146-75,76)

మెరుపుకాంతి, కృశించిన నడుము, పొడవైన తోక చివర వంగి జెండాల ఉన్నది. చిన్ని పెదవులు, నాలుక, ముఖం ఎర్రగా, చంచల నేత్రాలు, తెల్లని దంతాలు - బంగారు అరటిచెట్ల మధ్య బంగారు రంగులో

**కేసరోత్కర సమ్మిశ్రమ్ అశోకా నామి వోత్కరమ్**
**హిరణ్మయీనాం మధ్యస్థం కదలీనం మహాద్యుతిమ్** (వన. 146-81)

భయం ఎరుగని భీముడు తన మార్గానికి అడ్డంగా పర్వతంలా పడుకుని ఉన్న హనుమంతుడిని చూసి సింహగర్జన చేసాడు.

ఆ వానరుడు కొద్దిగా కళ్లు తెరచి తిరస్కారంగా చూస్తూ- "ఏ కారణం వల్ల నీవు, హాయిగా నిద్రిస్తున్న నన్ను నిద్రలేపినావు? నీకు ధర్మం తెలిసినట్లు లేదు. దారి తెలిసినట్లు లేదు. ఇకపై ముందుకు వెళ్లడం చాలా కష్టం. ఇక్కడ పండ్లు అమృతసమానం. వాటిని తిని వెనక్కి వెళ్లిపో!" అన్నాడు.

భీముడన్నాడు– "నేను చంద్రవంశ రాజును. కుంతీ కుమారుడిని. కురువంశం మాది. వాయుదేవుని అనుగ్రహంతో పుట్టాను. నన్ను భీమసేనుడంటారు. నీవు ఎవడవు? నాకు దారి ఇవ్వు?"

హనుమంతుడన్నాడు– "నేను వానరుడను. నీకు దారి ఇవ్వలేను".

భీముడన్నాడు– "అనవసరంగా ప్రాణం మీదకు తెచ్చుకోకు, దారి ఇవ్వు!"

హనుమంతుడన్నాడు– "నాకు పైకిలేచే శక్తి లేదు. కావాలంటే దాటివెళ్లు".

భీముడన్నాడు– "నా అన్న హనుమంతుడు సముద్రాన్ని దాటిన విధంగా నేను ఈ పర్వతాన్ని, మిమ్మల్ని దాటివేస్తాను"

హనుమంతుడన్నాడు– "ఇంతకీ ఆ హనుమంతుడెవరు?"

భీముడన్నాడు– "అతడు నా అన్న. నూరు యోజనాలు ఒక్క అంగలో దాటినాడు".

హనుమంతుడన్నాడు– "కావాలంటే నా తోకను కాస్త పక్కకు తొలగించి ముందుకు సాగు. నాపై దయచూపు".

భీముడనుకున్నాడు– "ఈ ముసలి కోతి తోక పట్టుకుని యమలోకానికి విసిరివేస్తాను" అనుకుని ఎడమచేత్తో తోకను పట్టుకుని లేపబోయాడు. తోక కదలలేదు. రెండు చేతుల్తో ప్రయత్నించాడు, కనుబొమలు ఎగరవేసి గట్టిగా ప్రయత్నం చేసాడు. కుదరక మౌనంగా ఉండి– నమస్కరించి "అనుగ్రహించు, వానరశ్రేష్ఠా, నన్ను క్షమించు" అన్నాడు భీమసేనుడు.

"నా పేరు హనుమంతుడు" అన్నాడు హనుమంతుడు.

"శ్రీరామచంద్రుడి భార్య సీతను రావణుడు ఎత్తుకుపోయినపుడు నేను సముద్రం లంఘించి లంకకు వెళ్లి జాడ తెచ్చాను. రామరావణ యుద్ధంలో పాల్గొన్నాను. అయోధ్యలో శ్రీరాముడికి పట్టాభిషేకం అయినాక నేను రాముని వరం అడిగాను. రామకథ లోకంలో ఉన్నంత వరకు నేను జీవించే ఉండాలని. రాముడు అంగీకరించాడు. ఆ సీతాదేవి కృపతో నేనిక్కడ హాయిగా ఉన్నాను.

నీవు వెళ్లాలనుకున్న సరోవరానికి దారి ఇదే!"

భీముడన్నాడు– "సముద్రం దాటినప్పటి నీ మహారూపాన్ని చూడాలనేది నా కోరిక".

హనుమంతుడన్నాడు– "యుగాల్ని బట్టి సమయాలు, రూపాలు మారతాయి. కాలాన్ని అతిక్రమించరాదు.

కృతయుగంలో ధర్మం పరిపూర్ణంగా ఉండింది. ప్రజలు ఎవరి పనులు వాళ్లు పూర్తిచేసారు. చెయ్యాల్సిన పనులు మిగల్లేదు కనుక అది కృతయుగం. దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, నాగులు ఉన్నా పరస్పర భేద భావం లేదు. అమ్మట–కొనుట లేదు. వేద విభాగం లేదు. వ్యవసాయాదులు లేవు. ధ్యానమొక్కటే ఆలంబన. త్యాగమే ధర్మం. సన్యాసమే వృత్తి. యుద్ధాలు, సోమరితనం, ద్వేషం, అసూయ, భయం లేదు. నారాయణుడు శుక్లవర్ణుడు. నాలుగు వర్ణాలు ఎవరి ధర్మాలు వాళ్లు ఆచరించారు. ప్రత్యగాత్మ ఒక్కడే దైవం. ప్రణవమొక్కటే మంత్రం. వేదాంత శ్రవణమొక్కటే విధి. ధ్యానాదులే క్రియ. ధర్మం నాలుగు పాదాలపై నడిచింది.

త్రేతాయుగంలో యజ్ఞాలు ప్రారంభమయ్యాయి. నారాయణుడు ఎరుపురంగులో ఉంటాడు. ధర్మం యొక్క ఒక్క పాదం నశించింది. వేదోక్త కర్మలు, దానం ద్వారా అభీష్టాలను పొందారు.

ద్వాపరయుగంలో ధర్మం రెండు పాదాలపై నడిచింది. విష్ణువు పసుపురంగులో ఉన్నాడు. వేదవిభజన జరిగింది. శాస్త్రాలు క్రియలు ఎక్కువయ్యాయి. తపస్సు, దానం ప్రాముఖ్యత పెరిగింది. వ్యాధులు పుట్టాయి. సత్యం పలకకపోవడంతో వ్యాధులు, కోరికలు, ఉపద్రవాలు ఎక్కువైనాయి.

కలియుగంలో ధర్మం ఒక్కపాదంపై నడుస్తుంది. నారాయణుడు నల్లబడతాడు. ఈతిబాధలు, వ్యాధులు, సోమరితనం, మనోవ్యథలు, ఆకలి బాధలు విజృంభిస్తాయి.

యుగాలు మళ్లీ మారుతూ ఉండగా ధర్మం పెరుగుతుంది, తరుగుతుంది. ధర్మం క్షీణిస్తే లోకం క్షీణిస్తుంది. నీవు నా పురాతన రూపాన్ని చూడాలనుకోవడం సరికాదు. తెలివైనవాడికి నిష్ప్రయోజన విషయాలపై ఆసక్తి ఉండదు.

భీముడన్నాడు– "కాని, సోదరా, ఎందుకో నా మనసును విడిచి ఆ కోరిక పోవడం లేదు".

అప్పుడు దయామయుడైన హనుమంతుడు తన సోదరుడి విన్నపాన్ని మన్నించి సాగర లంఘన సమయంలోని తన రూపాన్ని చూపించాడు.

**సముచ్ఛ్రిత మహాకాయః ద్వితీయ ఇవ పర్వతః**
**తామ్రేక్షణ స్త్రీవ్రదం ష్ట్రః భృకుటి కుటిలాననః**
**త తద్భుతం మహారౌద్రం వింధ్యపర్వత సన్నిభమ్**
**దృష్ట్వా హనూమతో వర్ష్మ సంభ్రాంతః పవనాత్మజః** (వన. 150-10)

ఆ మహాద్భుత రూపాన్ని చూసి భీమసేనుడు కంగారుపడ్డాడు. యథా రూపానికి రమ్మని ప్రాధేయపడినాడు. మామూలు రూపానికి వచ్చిన హనుమంతుడు భీమసేనుడికి ఆచరించవలసిన ధర్మాలు చెప్పాడు.

**ఆచారసంభవో ధర్మో ధర్మే వేదాః ప్రతిష్ఠితాః**
**వేదైర్యజ్ఞాః సముత్పన్నాః యజ్ఞైర్దేవాః ప్రతిష్ఠితాః** (వన. 150-28)

సదాచారం వలన ధర్మాలు, ధర్మంలో వేదాలు, వేదాల వల్ల యజ్ఞం, యజ్ఞాల వల్ల దేవతలు ప్రతిష్ఠింపబడతారు.

**త్రయీ వార్తా దండనీతిః తిస్రో విద్యా విజానతామ్**
**తాభిః సమ్యక్ ప్రయుక్తాభిః లోకయాత్రా విధీయతే**

వేదత్రయం బ్రాహ్మణులకు, దండనీతి క్షత్రియులకు, వార్త వైశ్యులకు జీవికను నిర్వహిస్తాయి.

"సోదరా! నీ కోరిక ధార్తరాష్ట్రుల నాశనం అయితే నేను వెళ్ళి వారిని చంపివేస్తాను. కావాలంటే దుర్యోధనుని బంధించి తెస్తాను"

భీముడన్నాడు- "మీరు ఎల్లప్పుడూ నాపట్ల దయతో ఉండండి"

హనుమంతుడన్నాడు- "నేను అర్జునుని రథంపై కపిధ్వజంగా ఉంటాను" అని పలికి హనుమంతుడు భీమునికి సరోవరానికి వెళ్ళే మార్గం తెలిపి అంతర్ధానమైనాడు.

## సౌగంధిక వనంలో భీముడు, ధర్మరాజాదులు

హనుమంతుడు అదృశ్యమైనాక భీముడు అతడినే తలుచుకుంటూ బంగారు పద్మాలు కల విశాలానదిని చూసాడు. ఆ నదిలో గొప్ప సౌగంధిక వనం కనబడింది భీమసేనుడికి. ఇంకా కొంతదూరం పోయేసరికి పర్వతజలాలతో నింపబడుతున్న అత్యంత రమణీయమైన సరోవరం కనిపించింది. దానిలోనే బంగరు రంగు తామరపూలు కనిపించాయి. అతడు పూలు కోస్తుంటే ఆ సరస్సుకు కాపలాగా ఉన్న క్రోధవశులనే రాక్షసులడ్డగించారు. వారికి భీమసేనుడికి మధ్య గొప్ప యుద్ధం జరిగింది. వాళ్లు పారిపోయి కుబేరుడికా విషయం చెప్పారు. "అతడు మహావీరుడు. ఎన్ని సౌగంధికాపుష్పాలు కావాలంటే అన్నిటిని తీసుకుని పోనివ్వండి" అన్నాడు కుబేరుడు.

ఎంతసేపటికీ భీముడు రాకపోయేసరికి ఘటోత్కచుని సాయంతో అందరూ సౌగంధికా సరోవర తీరానికి చేరుకున్నారు. అక్కడ కొన్ని రోజులుండి అశరీరవాణి పలుకులతో అక్కడ నుండి వెనక్కి మరలి బదరికాశ్రమానికి వెళ్లారు.

**తతో యుధిష్ఠిరో రాజా ప్రతిజగ్రాహ తద్ వచః**
**ప్రత్యాగమ్య పునస్తం తు నరనారాయణాశ్రమమ్** (వన. 156-20)

# 8) జటాసుర వధా పర్వము

## జటాసుర వధ

ఘటోత్కచుడు తన పరివారంతో వెళ్లిపోయాడు. గంధమాదన పర్వతం మీద పాండవులంతా నిరీక్షిస్తున్నారు అర్జునుడి రాకకోసం. వారితో ఉన్న బ్రాహ్మణులు శాస్త్రచర్చలు చేస్తున్నారు. వారి మధ్య ఒక బ్రాహ్మణుడు తాను మంత్ర నిపుణుడనని చెబుతూ అనేక విద్యలు ప్రదర్శించాడు. అందరికీ సేవలు చేస్తున్నాడు.

భీముడు లేని రోజు చూసి అతడు ధర్మరాజును, నకుల సహదేవులను, ద్రౌపదిని, పాండవుల ఆయుధాలతో సహా ఎత్తుకుపోతుంటే బ్రాహ్మణులు హాహాకారాలు చేసారు. వాడి పోషణాభారమంతా ధర్మరాజే చూసాడు అప్పటివరకు. వాడు జటాసురుడనే రాక్షసుడు. తగిన సమయం కోసం ఎదురుచూసాడు.

సహదేవుడు తప్పించుకుని ఆయుధాల్లోంచి కత్తిలాగి భీముడు వెళ్లినవేపు కేకలు పెట్టాడు.

ధర్మరాజు అన్నాడు– "నీ ధర్మం తరిగిపోతోంది. గుర్తించు.

**ధర్మస్య రాక్షసామూలం ధర్మంతే విదురుపత్తామమ్**
**ఏతత్ పరీక్ష్య సర్వం త్వం సమీపే స్థాతుమర్హసి** (వన. 157–14)

మా అన్నం తిని మమ్మల్నే ఎత్తుకుపోతున్నావే? దీని వలన నీకు చావు మూడింది" అని ధర్మరాజు అంటూ క్రమంగా ఆ రాక్షసుడికి భారంగా వృద్ధిచెందాడు. వాడి నడక వేగం తగ్గింది. సహదేవుడు వాడిని అడ్డుకున్నాడు. ఈలోగా భీముడు చూసాడు వాడిని.

భీముడన్నాడు– "నీమీద నాకు ఇదివరకే అనుమానం కలిగింది. బ్రాహ్మణవేషంలో ఉండి బ్రతికిపోయావు. కాలమనే దారానికి వ్రేలాడే గాలాన్ని మింగిన చేపవు. దొరికావిప్పుడు"–

**బడిశోయం త్వయా గ్రస్తః కాలసూత్రేణ లంబితః**
**మత్స్యోంభసీవ స్యూతాస్యః కథమద్య భవిష్యసి–** (వన. 157–45)

యుద్ధం మొదలయ్యింది. ధర్మరాజును, ద్రౌపదిని, నకులుడిని పడవేసి జటాసురుడు భీముడితో యుద్ధానికి దిగాడు. ముష్టియుద్ధం, బాహుయుద్ధం, చెట్లయుద్ధం, రాళ్లయుద్ధం, అరుపుల యుద్ధం ఘడియలకొద్దీ సాగింది. భీముడు వాడి అవయవాల్ని తన పిడికిటి పోట్లతో పొడిపొడి చేసి తలను శరీరం నుండి వేరుచేయగా చెట్టునుంచి జారిన పండులా నేలమీద పడింది జటాసురుడి శిరస్సు.

**పపాత రుధిరాదిగ్ధం సందష్ట దశనచ్ఛదమ్**
**తం నిహత్య మహేష్వాసో యుధిష్ఠిరముపాగమత్**

రక్తంతో తడిసిన జటాసురుడి తల నేలరాలింది. అందరూ వచ్చి ధర్మరాజు పక్కన నిలబడి చూసారు. జటాసురుడి వధానంతరం అందరూ నారాయణాశ్రమానికి చేరుకున్నారు. కైలాస, మైనాక, గంధమాదన పర్వతాలను చూస్తూ వృషపర్వుని ఆశ్రమం చేరి అక్కడ నుండి శ్వేత (హిమాలయ పర్వతం) పర్వతాన్ని, మాల్యవంత పర్వత పాదాల వద్ద నడుస్తూ గంధమాదన పర్వతానికి దగ్గర ఉన్న వనం చేరుకున్నారు.

## గంధమాదన పర్వత వనశోభ

ఎక్కడ చూసినా ఫలభారంతో వంగిన చెట్లే... పక్షుల మధురమైన అరుపులు, శబ్దాలే. ఎన్నిరకాల చెట్లు! మామిడి, అంబాళ, గజనిమ్మ, కొబ్బరి, తుమికి, ముంజాతక, జీర, దానిమ్మ, మాదీఫల, పనస, మునగ, ఖర్జూర, అమ్ల, ప్రబ్బలి, పారావత, క్షౌద్ర, కడిమి, మారేడు, నేరేడు, గుమ్మడి, రేగు, జువ్వి, మేడి, మర్రి, రావి, పాల, భల్లాతక, ఉసిరి, కరక, విభీతక, గార, కలివె, సంపెంగ, అశోక, మొగలి, కొడిసె, మందార, నల్లకలువ, పారిజాత, ఎర్రకాంచనం, దేవదారు, శాల, మద్ది, చీకటి, పిప్పల, హింగుక, బూరుగ, మోదుగ, సరళ, ఇరుగుడు చెట్లను చూసారు. నెమళ్లు, వెన్నెల పులుగులు, బెగ్గురు పులుగు, భృంగరాజ, శుక, కోకిల, పిచ్చుక, పచ్చపిట్ట, వన్నెపులుగు, ప్రియక, చాతక పక్షులను, రకరకాల చేపలున్న సరస్సులను, కలువలు, కొంగలు, తెల్ల తామరలు, ఎర్రతామరలు, నల్లకలువలు, ఎర్ర కలువలు, హంసలు, కొంగలు, మద్గువులున్న సరోవరాలను చూసారు. కొండ గోగుపూలు, ఎర్రని ముళ్ల గోరింటపూలు, కొండచరియలపై మద్ది, కానుగ, పాటల, పొగడల బారులుగా చెట్లు, దేవతావృక్షాలు, వివిధ రకాల లతలు వీటితో గంధమాదన పర్వతపుటడవి శోభాయమానంగా కానవచ్చింది.

అక్కడ ఉన్న జలపాతాలు, నాలుగు దంతాల ఏనుగులు, రంగురంగుల ఛాయలున్న కొండలు, లోయలను చూసి వారు ఆర్ష్టిషేణుని ఆశ్రమం చేరుకున్నారు.

# 9) యక్ష యుద్ధ పర్వము

## ఆర్ష్టిషేణుని ఆశ్రమనివాసం - మణిమంతుని వధ

ఆర్ష్టిషేణుని ఆశ్రమంలో అనేక మాసాలున్నారు పాండవులు. ఒకరోజున బుద్ధిమంతం అనే మహాసర్పాన్ని గరుడుడు పట్టుకున్నప్పుడు కొండ కంపించింది, చెట్లు నేలకూలాయి. అందరూ ఆ అద్భుతాన్ని చూసారు. ఆ కొండపై నుండి పవిత్ర పరిమళయుక్త పూలు పాండవుల వేపు గాలిలో కొట్టుకువచ్చాయి. ఆ అయిదు రంగుల పూలను చూడగానే ద్రౌపది వాటిని భీముడికి చూపించింది– "నేను ఆ కొండ శిఖరాన్ని చూడాలనుకుంటున్నాను. ముందు నీవు వెళ్లి ఆ ప్రాంతాన్ని సురక్షితం చేసిరా!"

ఆయుధాలను ధరించి భీముడు ఆ కొండ శిఖరాన్ని చేరాడు. అది కుబేరుని పట్టణం. ఎంతో అందంగా ఉన్నది.

గద, కత్తి, వింటిని ధరించిన భీముడు శంఖాన్ని పూరించాడు, అల్లెత్రాటిని మీటి గొప్ప శబ్దం చేసాడు.

దానితో యక్షరాక్షస గంధర్వులు గదలు, తోమరాలు, కత్తులు, శూలములు, శక్తి, గండ్రగొడ్డలి, పరశ్వధాలు ధరించి వచ్చారు.

గొప్ప యుద్ధం జరిగింది. దెబ్బలు తిని పారిపోయినవాళ్లు తమ అధిపతి మణిమంతుడికి చెప్పారు. అతడు వేగంగా వచ్చి భీముడితో గదాయుద్ధం చేసాడు. శక్తిని విసిరాడు. భీముడు విసిరిన గద దెబ్బకు మణిమంతుడు నేలకూలి మరణించాడు.

అప్పుడు యక్షరాక్షసులు వెళ్లి కుబేరుడితో మొరపెట్టుకున్నారు. ఇంతలో ధర్మజ నకుల సహదేవులు భీముడున్న చోటుకు వచ్చారు. కుబేరుడు తన అనుచరులతో రాగా పాండవులతడికి నమస్కరించారు.

కుబేరుడన్నాడు– "అగస్త్యముని శాపం వలన మణిమంతుడు అతడి అనుచరులు మరణించారు. ఒకప్పుడు అగస్త్యుడు సూర్య నమస్కారం చేస్తున్నపుడు మణిమంతుడు విమానంలో వెళ్తూ ఉమ్మినాడు. అది అగస్త్యుడి తలపై పడింది. అగస్త్యుడు శపించాడు– 'నీవు చూస్తుండగానే నీ మిత్రుడు నా తలపై ఉమ్మివేసాడు నిర్లక్ష్యంగా. ఇతడు మానవుడి చేతిలో మరణిస్తాడు నీవు దగ్గర్లో ఉండగానే' –ఆ శాపం ఇలా పరిణమించింది.

కుబేరుడు వెళ్లిపోయాక ధర్మరాజాదులు కొండదిగి వచ్చారు. తరువాత సూర్యోదయ కాలంలో ధౌమ్యుడు ధర్మరాజుకు తూర్పుదిక్కును చూపించి– "ఇది మందర పర్వతం. తూర్పుదిక్కులో ఇంద్రుడు, కుబేరుడు నివాసముంటారు. దక్షిణ దిక్కు యముడి నివాసం– సంయమనం. పడమటి దిక్కున అస్తాచల పర్వతం, వరుణుని నివాసం; ఉత్తర దిక్కున మేరు పర్వతం– బ్రహ్మదేవుని సభ, దక్షుని నివాసం.

తూర్పున మేరు పర్వతంపై నారాయణుడుంటాడు. నక్షత్రాలు, సూర్యచంద్రులు ప్రతి దినమూ మేరువుకు ప్రదక్షిణం చేస్తాయి. సూర్యుడు సంధ్యాకాలం తరువాత ఉత్తర దిక్కుకు చేరుకుని ఉదయకాలంలో తూర్పున ఉదయిస్తాడు. చల్లదనం సృష్టించదలచి దక్షిణ దిక్కుకు ఒరిగినపుడు శీతాకాలం ఏర్పడుతుంది. దక్షిణాయనము నుండి ఉత్తరాయనముతో వేసవి, వర్షాలు వస్తాయి. ఈ సూర్యగమనం నిరంతర కాలచక్ర భ్రమణం" అని వివరించాడు ధౌమ్యుడు.

ఇంద్రుడి భవనంలో అయిదేళ్లుండి దివ్యాస్త్రాలను పొంది అర్జునుడు ఇంద్రరథంలో, మాతలి సారథిగా గంధమాదన పర్వతానికి వచ్చాడు ఇంద్రలోకం నుంచి. అందరూ ఎంతో ఆనందాన్ని పొందినారు అర్జునుడి రాకతో.

ఉదయమే ఇంద్రుడు వచ్చి పాండవులను ఆశీర్వదించినాడు. ఇంద్రుడు వెళ్లాక అర్జునుడు వివరించాడు– ఎలా తాను కిరాతరూపంలో ఉన్న శివుడిని ఎదుర్కొన్నదీ, పరమేశ్వరుడు ప్రసన్నుడై పాశుపతాస్త్రాన్ని ప్రసాదించినదీ; ఇంద్రలోక సందర్శనం, అర్ధ సింహాసనమిచ్చిన ఇంద్రుని ఔదార్యాన్ని, ఇతర దేవతలిచ్చిన దివ్యాస్త్రాలూ, ఊర్వశి శాపం, చిత్రసేనుడి దగ్గర నృత్యగీతాలు అభ్యసించడం –ఇవన్నీ వివరించాడు.

ఇంద్రలోకంలో ఎన్నో సుఖాలు లభ్యమవుతున్నా వాటిని పట్టించుకోకుండా అస్త్రవిద్యలను అభ్యసిస్తుండడంతో ఇంద్రుడు సంతోషించి నివాత కవచులపై యుద్ధం చేసే బాధ్యతను అప్పగించాడు.

# 10) నివాత కవచ యుద్ధపర్వము

## నివాత కవచులతో యుద్ధం

అర్జునుడన్నాడు– “నివాత కవచులనే రాక్షసులు గొప్ప తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి ఒకప్పటి దేవతల నగరాన్ని ఆక్రమించారు. వారిపై మాధవాస్త్రం, వారుణాస్త్రం, శైలాస్త్రం, వజ్రాస్త్రం ప్రయోగించి నివాత కవచుల్ని చంపాను.

ఆ తరువాత కామగమనం గల హిరణ్యపురమనే పట్టణంలో నివసిస్తున్న పౌలోమ, కాలకరాజులను రౌద్రాస్త్రమని పేరుకల పాశుపతాస్త్రాన్ని ప్రయోగించగా రకరకాల జంతువులు, ఆయుధాలు ధరించిన రాక్షసులు, గంధర్వులు, పిశాచాలు జనించి పౌలోమ, కాలకంజులను హతమార్చినారు.

ఆ రాక్షసులను చంపినందుకు దేవేంద్రుడు నాకు దివ్య కవచాన్ని, బంగరు మాలను, దేవదత్త శంఖాన్ని, కిరీటాన్ని, దివ్యవస్త్రాలను ఆభరణాలను ఇచ్చాడు” అని చెప్పాడు అర్జునుడు.

ధర్మరాజు కోరగా అర్జునుడు దేవతలిచ్చిన దివ్యాస్త్రాలను చూపించసాగినాడు. వాటిని ప్రయోగిస్తుంటే లోకాలు అల్లకల్లోలమైనాయి. ప్రాణులు క్షోభించాయి.

దేవతల ప్రేరణతో నారదుడు వచ్చి అర్జునుడితో అన్నాడు– “దివ్యాస్త్రాలను కారణం లేకుండా ప్రయోగించరాదు. ధర్మరాజా, వీటి శక్తిని యుద్ధంలో ప్రత్యక్షంగా చూద్దువుగాని” అని పలుకగా అర్జునుడు ఆ కార్యాన్ని అంతటితో ఆపినాడు.

అర్జునుడు వచ్చాక నాలుగేళ్లు గడిపినారు. అప్పటికి వనవాసంలో పదేళ్లు గడచి పదకొండవ సంవత్సరం నడుస్తున్నది.

గంధమాదన పర్వతానికి ప్రదక్షిణం చేసి, నమస్కరించి ఘటోత్కచుడి సాయంతో దుర్గమ మార్గాలను దాటినారు. లోమశమహర్షి దేవలోకానికి వెళ్లిపోయాడు. ఆర్ష్టిషేణుడు వారినాశీర్వదించినాడు. పాండవులు ఆ మునికి కృతజ్ఞతలు తెలిపి గంధమాదన పర్వతం నుండి, కైలాస పర్వతాన్ని దాటి వృషపర్వుని ఆశ్రమం చేరుకున్నారు. అక్కడి నుంచి విశాలా పట్టణంలోని బదరికాశ్రమానికి వచ్చారు. అక్కడ ఓ నెల రోజులు గడిపి కిరాతరాజైన సుబాహుని దేశానికి వచ్చారు. అక్కడ తమకోసం వేచి ఉన్న ఇంద్రసేనాది సేవకుల్ని తీసుకుని ఘటోత్కచుని పరివారానికి కృతజ్ఞతలు తెలిపారు.

విశాఖ యూపంలో ఒక సంవత్సరం గడిపారు. ఒకరోజున భీముడు ఒక కొండగుహలో భయంకరమైన పాముచే బంధించబడినాడు.

# 11) అజగర పర్వము

## సర్పంగా పడి ఉన్న నహుషుడు

పదివేల ఏనుగుల బలం ఉన్న భీమసేనుడిని ఆ అజగరం అవలీలగా చుట్టివేసి పీడించసాగింది. అతడు నహుష చక్రవర్తి.

నందన వనంలో శివపార్వతులు విహరిస్తూ ఉండగా పార్వతి కల్పవృక్షాన్ని చూసి ‘కుమార్తె’ కావాలని కోరుకున్నది. ఆ వనంలో ఆ క్షణంలో పుట్టింది అశోకసుందరి. హుండుడనే రాక్షసుడు అశోకసుందరిని ఎత్తుకునిపోయి బలాత్కరించబోగా ఆమె తప్పించుకుని తపస్వినిగా మారింది.

ప్రయాగరాజు ప్రతిష్ఠాన రాజధానిగా పాలిస్తున్న చంద్రవంశ రాజు పురూరవుడికి ఊర్వశి వలన కలిగిన పుత్రులు– ఆయువు, అమావసు, వనాయువు, శ్రుతాయువు, శతాయువు, దృఢాయువులు.

ఆయువు స్వర్భానుడనే (రాహువు) రాక్షసుడి పుత్రిక ప్రభను వివాహం చేసుకోగా దత్తాత్రేయుడి వరంతో నహుషుడు జన్మించాడు. హుండుడు ఆ శిశువును అపహరించి చంపమని రాక్షసులను పంపగా వారు ఆ శిశువును దొంగిలించి చంపడానికి మనసురాక వసిష్ఠుని ఆశ్రమం దగ్గర పడవేసారు. వసిష్ఠుడు అతడికి భయం లేనివాడు– న హుషుడు అని పేరుపెట్టినాడు. నహుషుడు వేదవిద్యలు, యుద్ధవిద్యలు నేర్చి హుండుడిని చంపి అశోకసుందరిని వివాహం చేసుకున్నాడు.

వృత్రాసురుడిని చంపి ఇంద్రుడు బ్రహ్మహత్యాదోషానికి గురై తేజోహీనుడైనపుడు నహుషుడికి ఇంద్రపదవి అప్పగించ బడింది. ఇంద్రుడిగా అతడు తేజోవంతుడై అహంకారం పెరిగి శచీదేవిని కాంక్షించాడు. సప్తర్షులు మోసే పల్లకిలో కూర్చుని

సర్ప–సర్ప త్వరగా, త్వరగా శచీదేవి మందిరానికి నడవండి అంటూ అగస్త్యుడి తలను తన్నేసరికి అతడి శక్తులు నశించాయి. అతడిని పాముగా భూలోకంలో పడి ఉండమని అగస్త్యుడు శపించాడు. యుధిష్ఠిరుడు తాకినపుడు అతడికి శాపవిముక్తి కలుగుతుందన్నాడు.

ఆ నహుషుడు సర్పరూపంలో భూమిపై పెక్కుకాలం పడి ఉండి ద్వాపరయుగాంతాన అటుగా వచ్చిన భీముడిని పట్టుకుని బంధించాడు. అప్పుడు అనేక ఉత్పాతాలు, అపశకునాలు కనిపించాయి ధర్మరాజుకు.

ఆశ్రమానికి దక్షిణ దిక్కున మంటలు చెలరేగాయి. నక్క దారుణంగా అరుస్తున్నది. తీతువు తీవ్రంగా అరిచింది. కురిసింది కంకరవాన, వాయువు వీచింది. దక్షిణాన పక్షికూతలు వినబడ్డాయి. నల్లకాకి అరుస్తున్నది. ధర్మజుడి గుండె, ఎడమపాదము అదిరాయి. ధర్మరాజు భీముడు వెళ్లిన మార్గానే వెళ్లేసరికి కొండగుహలో కనిపించాడు ధర్మరాజుకు–

పాముురూపంలో ఉన్న నహుషుడు అన్నాడు– "నా దగ్గరకు వచ్చినవాడు నాకు ఆహారమౌతాడు. ఇప్పుడు ఇతడు, తరువాత నీవు. వేరేదీ కోరను".

ధర్మజుడడిగాడు– "నీవెవరవు?"

పాము అన్నది– "నేను నహుషుడను. నీ పూర్వీకుడిని. ఇతడు నా ఆహారం. వేరేదీ కోరను".

ధర్మజుడన్నాడు– "నీకు ఏమి తెచ్చిస్తే ఇతడిని విడుస్తావు?"

పాము అన్నది– "నా ప్రశ్నలకు జవాబివ్వు, వేరేదీ కోరను"

ధర్మజుడన్నాడు– "ఏమిటి నీ ప్రశ్నలు? అడుగు"

పాము అన్నది– "బ్రాహ్మణుడెవడు?"

ధర్మజుడన్నాడు– "సత్య, దాన, క్షమ, శీలం, అక్రూరత, తపస్సు, దయ ఉంటాయో అతడే బ్రాహ్మణుడు".

పాము అన్నది– "ప్రవర్తన నిర్ధారిస్తుందా బ్రాహ్మణుడిని?"

ధర్మజుడన్నాడు– "సంస్కారము చేసి వేదాధ్యయనము చేయించనంతవరకు ప్రతి వ్యక్తి శూద్రుడే. వేదోక్త సంస్కారము, సత్ప్రవర్తన కలిగినవాడే బ్రాహ్మణుడు. ఏ పని చేస్తే నీకు ఉత్తమ గతి కలుగుతుంది?"

పాము అన్నది– "సత్యము, అహింసలు ఉత్తమ గతులనిస్తాయి"

ధర్మజుడడిగాడు– "దానము, సత్యము వీనిలో ఏది బరువైనది?"

పాము అన్నది– "పని యొక్క ప్రాధాన్యతను బట్టి నిర్ణయించాలి".

ధర్మజుడడిగాడు– "కర్మఫలమేమిటి?"

పాము అన్నది– "మనిషిగా పుట్టినవాడు సత్య, దాన, అహింసలను పాటిస్తే దివ్యుడౌతాడు. విపరీతంగా ప్రవర్తిస్తే తిర్యక్ యోనులలో జన్మిస్తాడు".

ధర్మజుడడిగాడు– "బుద్ధి, మనసు –వీటి పనులేమిటి?"

పాము అన్నది– "ఆత్మకు భోగమోక్షాలను సాధించడం బుద్ధి పని. ఇంద్రియానుభవాల్ని మనసు గ్రహిస్తుంది. వాటిలో మంచీ చెడులను బుద్ధి ప్రకటిస్తుంది.

నీవలన నాకు శాపవిముక్తి కలిగింది" అంటూ పాము నహుషుడిగా మారింది. భీముడికి విముక్తి కలిగింది. దివ్య విమానం రాగా, ధర్మజ భీములను ఆశీర్వదించి నహుషుడు స్వర్గానికి వెళ్లిపోయాడు.

పాండవులు ద్వైతవనాన్నుంచి, మరుభూములు దాటి కామ్యక వనాన్ని చేరుకున్నారు.

కామ్యక వనంలో వారిని సత్యభామ, శ్రీకృష్ణులు సందర్శించారు.

# 12) మార్కండేయ సమస్యా పర్వము

శ్రీకృష్ణుడన్నాడు ద్రౌపదితో- "అమ్మా, నీ పుత్రులు, అభిమన్యుడు ఇప్పుడు ద్వారకలోనే ఉన్నారు. ప్రద్యుమ్నుడి వద్ద వివిధ యుద్ధ విద్యలు నేర్చుకుంటున్నారు. సుభద్ర సంరక్షణలో వారు క్షేమంగా ఉన్నారు".

ధర్మరాజన్నాడు- "కేశవా! పాండవులకు నీవే గతి. కౌంతేయులెప్పుడూ నీ అధీనంలోనే ఉంటారు".

ఆ సమయంలోనే వారిని దర్శించడానికి చిరంజీవి, ధర్మస్వరూపుడు, ఎప్పుడూ 25 సంవత్సరాల యువకుడిగా కనిపించే మార్కండేయ మహర్షి వచ్చాడు. వారు మాట్లాడుతూ ఉన్నపుడే నారదుడు కూడా వచ్చాడు.

మార్కండేయుడు చెబుతున్నాడు-

"తొలుత ప్రజాపతి బ్రహ్మ జన్మించాడు. ప్రాణులను సృష్టించాడు. వాటితో పాటు ధర్మతంత్రాలు ప్రకటించాడు.

ప్రాచీన మానవులు మంచి వ్రతాలు చేసేవారు, సత్యవాదులు, పుణ్యాత్ములు, బ్రహ్మస్వరూపులు. స్వచ్ఛందంగా ప్రయాణించగలవారు, స్వచ్ఛంద మరణం గలవారు. బాధలు, భయాలు, ఉపద్రవాలు లేనివారు. సిద్ధసంకల్పులు. వేల సంవత్సరాలు జీవించేవారు. వేలకొద్దీ పుత్రులను పొందేవారు.

కొంతకాలం తరువాత భూలోకవాసులు కామక్రోధాలకు లొంగి, లోభ మోహ వశులై, మద మాత్సర్యాలతో పాపాత్ములై పరితాపంతో జీవించేవారు. వారి యాగాలు, సంకల్పాలు, జ్ఞానం అన్నీ వ్యర్థమై భూభారం పెరిగింది.

ఆయువు తీరినాక ఈ శరీరాన్ని విడిచి మరో శరీరంలో చేరతాడు పూర్వకర్మల ననుసరించి.

సరైన బ్రాహ్మణుడికి మృత్యుభయం లేదు. హైహయ వంశస్థుడైన బలి వేటకు వెళ్లి బాణాలతో జింకలను కొట్టగా కశ్యపుని సుతుడైన అరిష్టనేమికి బాణాలు తగిలాయి. అతడు చనిపోయాడని దుఃఖిస్తూ కశ్యపుడికి చెబుతూ ఉండగానే అతడు సజీవంగా ఆశ్రమంలో కనిపించాడు.

ఒకసారి వైన్యుడు అశ్వమేధ యాగం చేస్తున్నపుడు అత్రిమహర్షి వెళ్లి రాజును స్తుతించాడు. "రాజా! భూలోకంలో నీవే తొలి రాజువు. ధన్యుడవు. ఐశ్వర్య సంపన్నుడవు"

గౌతముడా మాటలు విని 'అత్రి'ని ఆక్షేపించాడు. గౌతముడు ఇంద్రుడే ప్రజాపతి, రాజు అని భావించాడు. ఇద్దరూ పోట్లాడుకున్నారు.

సనత్కుమారుడు మధ్యవర్తిగా అన్నాడు- "బ్రాహ్మ ధర్మం క్షాత్రధర్మం నిప్పు గాలిలా కలిసి మండాలి. రాజే ధర్మం. రాజే ప్రజాపతి. ఇంద్రుడు, శుక్రుడు, బ్రహ్మ, బృహస్పతి అందరూ రాజే.

ప్రజాపతి, విరాట్టు, సమ్రాట్టు, క్షత్రియుడు, భూపతి, నృపుడు, పురాయోని, యుధాజిత్తు, అభియుడు, ముదితుడు, భవుడు, స్వర్ణేత, సహజిత్తు, బభ్రువు -ఇవి రాజు పేర్లు. రాజే సత్యానికి కారణం".

ఆ విధంగా అత్రి గెలిచాడు. వివాదం ముగిసింది. రాజు అత్రిని సత్కరించాడు.

తార్క్ష్యుడనే మునికి సరస్వతి తెలియజెప్పింది- "పరబ్రహ్మ రహస్యాన్ని తెలుసుకుని శ్రేష్ఠయాగాలను ఆచరించడం ఉత్తమం".

## వైవస్వత మనువు

మార్కండేయుడన్నాడు- "వివస్వంతుడనే సూర్యుని కుమారుడు వైవస్వత మనువు. ఒంటికాలిపై నిలిచి పదివేల సంవత్సరాలు తపస్సు చేసాడు. ఒకరోజున 'చీరిణి' నదీతీరాన తపస్సు చేస్తూ, జలాన్ని దోసిలిలో పడితే ఆ నీళ్లలో చేపపిల్ల కనిపించింది.

ఆ చేపపిల్ల అన్నది- "చిన్న చేపను నేను. నన్ను పెద్దచేపలు మింగుతాయేమో!"

**దుర్బలం బలవంతోహి మత్స్యా మత్స్యం విశేషతః**
**ఆస్వదంతి సదా వృత్తిః విహితానః సనాతనీ** (వన. 187-8)

ఆ మాటలు విని దయామయుడైన వైవస్వత మనువు ఆ చేపపిల్లను కుండలో ఉంచాడు. అది పెరిగి పెద్దదవడంతో దిగుడు బావిలోకి, అక్కడ నుంచి గంగానదిలోకి, అక్కడ నుంచి సముద్రంలోకి మార్చాడు. అప్పుడు ఆ మహామత్స్యం అన్నది–

"మహానుభావా! త్వరలోనే స్థావరజంగాత్మకమైన ఈ భూమి నశించబోతోంది. నీకోసం ఓ గట్టి నావను నిర్మించు. సమస్త బీజాలను తీసుకుని నావలోకెక్కు. నిన్ను జలప్రళయంలో కాపాడతాను".

నావను నిర్మించి దానిలో సర్వబీజాలు ఉంచి అటుగా వచ్చిన కొమ్ముచేపకు నావ తాడు తగిలించాడు. సప్తర్షులు నావనెక్కారు. ఆకాశం, భూమి జలావృతమైనా నావ మునగలేదు. జలప్రళయం తగ్గాక నౌక హిమవత్శిఖరం వద్ద ఆగింది. నావ ఆగినచోట నౌకాబంధనమని పేరువచ్చింది. ఆ తరువాత మనువు తన తపోబలంతో సమస్త ప్రజలనూ సృష్టించాడు" అని చెప్పాడు మార్కండేయుడు.

## వటపత్రశాయి

మార్కండేయుడన్నాడు– "స్వయంభువు, సనాతనుడు, శాశ్వతుడు, అవ్యక్తుడు, అవ్యయుడు, నిర్గుణుడు, పరమసూక్ష్ముడు, గుణస్వరూపుడైన పరమ పురుషుడు ఆద్యంతాలు లేనివాడు. అన్నిటికి ఆయనే కర్త. తనకు ఎవరూ కర్త కారు.

4000 సంవత్సరాలు కృతయుగం– నాలుగు వందల సంవత్సరాలు యుగసంధి, నాలుగు వందల సంవత్సరాలు యుగాంశం. 3000 సంవత్సరాలు త్రేతాయుగం + 300 యుగసంధి + 300 యుగాంశం; 2000 సంవత్సరాలు ద్వాపర + 200 యుగసంధి + 200 యుగాంశం; 1000 సంవత్సరాలు కలియుగం + 100 యుగసంధి + 100 యుగాంశం.

చతుర్యుగం = 4800+3600+2400+1200 = 12000 సంవత్సరాలు.

సూర్యుడు, చంద్రుడు, గురువు పుష్య నక్షత్రంలో ఒకేరాశిలో ఉన్నపుడు కృతయుగం ప్రారంభమవుతుంది.

చతుర్యుగాలు వేయి బ్రహ్మకు పగలు. మరో వేయి చతుర్యుగాలు రాత్రి. ఇది ప్రళయకాలం.

కలియుగాంతంలో వర్ణాలు రూపుమారుస్తాయి. ప్రజలు అసత్యభాషణులవుతారు. మ్లేచ్ఛరాజులు పృథివీ పతులవుతారు. మనుష్యుల శక్తి నశిస్తుంది. అందరూ ఒకరినొకరు అరే, ఒరే అంటారు. రకరకాల ప్రాణాలుద్భవిస్తాయి యుగాంతాన. పదార్థాలు రుచీపచీ కోల్పోతాయి.

స్త్రీలు పొట్టివారవుతారు. అధిక సంతానం. శీలాచారాలు ఉండవు. బూతులు మాట్లాడతారు. అన్నం అమ్ముతారు. వేదాలను అమ్ముతారు. స్త్రీలు శీలాన్ని అమ్ముతారు.

గోవులు పాలను, చెట్లు పండ్లను తక్కువ ఇస్తాయి. బ్రాహ్మణులు భిక్షకోసం అందరినీ పీడిస్తారు. గృహస్థులు పన్ను భారానికి తప్పించుకుని తిరుగుతారు. బ్రాహ్మణులు వ్యాపారాలు చేస్తారు. బ్రహ్మచారులు మద్యపానం చేస్తూ గురుపత్నులను సంగమిస్తారు. ఐహిక సుఖాలపై మక్కువ ఏర్పడ్తుంది. పాషండులెక్కువవుతారు. వర్షాలు కురవవు. హింస ఎక్కువవుతుంది. ధర్మతత్పరుడైనవాడు అల్పాయుష్కుడవుతాడు. దొంగ తూకాలు ఎక్కువవుతాయి. వర్తకులు మోసాలు చేస్తారు. ప్రజలు తీసుకున్న ధనాన్ని చెల్లించరు.

క్రూరజంతువులు దేవాలయాల్లో నివసిస్తాయి. పక్షులు విహారస్థలాల్లోకి ప్రవేశిస్తాయి. స్త్రీలు ఏడెనిమిదేళ్ల వయసులోనే పిల్లల్ని కంటారు. పది పన్నెండేళ్ల వయసు పురుషులకు పిల్లలు పుడతారు. పదహారు సంవత్సరాల వయసులో తల నెరుస్తుంది. వృద్ధులు యువకుల్లా, యువకులు వృద్ధుల్లా ప్రవర్తిస్తారు. వ్యభిచారం ఎక్కువవుతుంది.

యుగాంతంలో దీర్ఘకాలం అనావృష్టి ఏర్పడి జీవజాలం నశిస్తుంది. ఏడుగురు సూర్యులు నదుల, సముద్రాల జలాలు తాగేస్తారు. సంవర్తకాగ్ని భూమిని చీల్చుకుని రసాతలంలో ప్రవేశించి దేవదానవ యక్షులకూ భయాన్ని కలిగిస్తుంది.

భూమి అడుగున ఉన్న నాగలోకంతో పాటు సమస్తలోకాలు భస్మమవుతాయి. ఆకాశంలో మహామేఘాలు విద్యున్మాలలతో ఏనుగుల గుంపుల్లా కానవస్తాయి. భూమి జలప్రవాహంలో మునిగిపోతుంది. పన్నెండేళ్లపాటు ప్రళయ మేఘాలు ధారావాహికంగా వర్షిస్తాయి. సముద్రాలు హద్దులు దాటుతాయి. పర్వతాలు బద్దలవుతాయి. భూమి మునిగిపోతుంది. పెనుగాలుల తాకిడికి మేఘాలు ఛిన్నాభిన్నమవుతాయి. బ్రహ్మదేవుడు ఆ భీకర మారుతాన్ని మింగి నిద్రిస్తాడు. ఏకార్ణవ జలంగా మారిన ఆ జగత్తులో స్థావరజంగమాలు నశించాయి. దేవాసురులు యక్షరాక్షసులు మనుష్యులు లేరు.

మార్కండేయుడన్నాడు– ఒంటరిగా ఉన్న నాకు కనిపించింది ఒక పెద్ద మర్రిచెట్టు. ఆ మర్రిచెట్టు కొమ్మకు ఊయల. ఆ ఊయలలో కూర్చున్నాడొక దివ్యబాలుడు.

అతడు చెప్పినట్లు అతడి నోటిలో ప్రవేశించాను. అతడి పొట్టలో సమస్త పృధివి, అన్ని నదులు, సముద్రం, గగనం, పర్వతాలు, ద్వీపాలు, నదులు, అన్ని వర్గాల ప్రజలు, అన్నిటిని చూసాను. దేవమానవ రాక్షస యక్ష గంధర్వ దైత్య వానర నాగ గరుడ జాతులన్నిటినీ చూసాను. ఎన్ని సంవత్సరాలు తిరిగినా ఆది–అంత్యము కనిపించలేదు. ఆ దేవదేవుని శరణువేడి బయటకు వచ్చాను.

అతడన్నాడు– నీళ్లు నారములు. నీళ్లలో నివసిస్తాను కనుక నేను నారాయణుడిని. ఈ సమస్త విశ్వమూ నేనే. బ్రాహ్మణులు నా ముఖం, క్షత్రియులు నా భుజాలు, వైశ్యులు నా తొడలు, శూద్రులు నా పాదాలు. అన్ని వేదాలూ నాలోనే పుట్టి నాలోనే లయిస్తాయి.

**యదా యదా చ ధర్మస్య గ్లానిర్భవతి సత్తమ**
**అభ్యుత్థానమ ధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్** (వన. 189–27)

శంఖ చక్ర గదాధరుడైన నారాయణుడను నేనే. సహస్ర యుగాంత వేళలో ప్రళయమున్నంత సేపు ప్రాణులను మోహనిద్రలో నుంచి నేను నిద్రిస్తాను. బ్రహ్మ మేలుకునే వరకు వటపత్రశాయినై నేనిక్కడ శయనిస్తాను –అని భగవానుడు పలికాడు –అని వివరించాడు మార్కండేయ మహర్షి.

యుగాంత వేళలో కాలప్రేరణచే 'సంభల' (శంబల) గ్రామంలో విష్ణుయశః కల్కి పేరుతో జన్మించి అతడు ధర్మవిజేత, చక్రవర్తి అవుతాడు. అధర్మపరులను నాశనం చేసి మరల కృతయుగాన్ని స్థాపిస్తాడు –అని వివరించిన మార్కండేయుని ధర్మరాజు అడిగాడు శల, దలుల చరిత్ర గురించి. ఆ మహర్షి చెబుతున్నాడు–

## కప్పల రాణి కథ

ఇక్ష్వాకు వంశంలో పరీక్షిన్మహరాజు వేటకు వెళ్లి ఓ సుందరిని చూసాడు. ఆమె అన్నది– "నాకు నీటిని చూపించరాదు. నీటిలో స్నానం చెయ్యమనరాదు".

రాజు సరేనన్నాడు. పెండ్లి జరిగింది. రాణి కోసం నీళ్లులేని వనాన్ని నిర్మించారు. చక్కటి మంచినీటి బావి ఉన్నది కాని దానిని మూసి ఉంచారు. రాజు ఒకరోజున రాణితో కలిసి ఆ వనానికి వెళ్లాడు. దాహం వేసి దిగుడు బావిలో దిగి అమృత నిర్మలమైన నీళ్లను తాగి పైకి వచ్చి రాణితో అన్నాడు– "వెళ్లి నీళ్లు తాగు". ఆమె వెళ్లింది. నీళ్లు తాగింది. మరల పైకి రాలేదు. రాజు ఆందోళనతో నీళ్లన్నీ తోడించాడు. అడుగున ఒక కప్ప కనబడింది. అది బయటకు రాకుండా మాయమయ్యింది.

దానితో అతడు రాజ్యంలోని కప్పలను చంపించసాగినాడు. కప్పలరాజు మునివేషంలో వచ్చి అడిగితే అన్నాడు– "కప్పలు నా రాణిని తినేసాయి. అందుకే చంపుతున్నాను".

మండూకరాజు అన్నాడు– "నేను కప్పలరాజును. నాపేరు ఆయువు. నీ రాణి నా కుమార్తె సుశోభన. ఆమె చాలా అల్లరిది. ఇంతకుముందు ఎందరో రాజులను మోసం చేసింది".

రాజు అన్నాడు– "కావచ్చు. కాని నావద్ద చక్కగా మెలిగింది"

కప్పలరాజు సుశోభనను మానవకన్యగా మార్చి ఇచ్చాడు పరీక్షిన్మహరాజుకు. కొంతకాలానికి వారికి శలుడు, దలుడు, బలుడు అని ముగ్గురు పిల్లలు పుట్టారు. వారికి యుక్తవయసు వచ్చినాక శలుడికి పట్టాభిషేకం చేసి పరీక్షిత్తు తపస్సు చేయడానికి వనాలకు వెళ్లాడు.

శలుడొకనాడు వేటకు పోయి ఒక జింకను అనుసరించాడు. సారథి అన్నాడు– "దాని వేగాన్ని మన గుర్రాలు అందుకోలేవు. వామదేవముని గుర్రాలకు మాత్రమే అది సాధ్యం".

వామదేవ ముని ఆశ్రమానికి వెళ్లి గుర్రాల్ని తీసుకుని వాటితో గొప్పగా వేటాడి, మునికి గుర్రాల్ని ఇవ్వకుండా వాటిని తన ఇంటికి తీసుకుపోయాడు శలుడు.

వామదేవముని తన శిష్యుడిని పంపాడు. తానే స్వయంగా వెళ్లి అడిగినా ఇవ్వలేదు– "ఆ గుర్రాలు రాజుల దగ్గర ఉండదగినవి. కావాలంటే రెండు ఎద్దులనిస్తాను వాటికి బదులుగా అన్నాడు. లేదా నాలుగు కంచరగాడిదలనిస్తాను కాని గుర్రాలనివ్వను" అన్నాడు రాజు పొగరుగా.

వామదేవుడు నలుగురు రాక్షసులను ఆవాహన చేసి పంపగా వాళ్లు శలుడిని చంపారు. అతడి స్థానంలో దలుడు రాజైనాడు. వామదేవుడు దలుడిని అడిగాడు తన గుర్రాలనిమ్మని. దలుడు ఇవ్వకుండా గొప్ప బాణాన్ని ప్రయోగించాడు వామదేవుని మీదకు. అది వామదేవుడి మహిమతో వెళ్లి దలుడి కుమారుడిని చంపింది. కోపంతో శూలాన్ని విసిరాడు. అది వెళ్లి మహరాణిని చంపింది.

దలుడి భార్య, దలుడు క్షమించమని ప్రార్థించడంతో వామదేవుడు అంగీకరించాడు. రాకుమారుడు, మహరాణి బ్రదికారు. వామదేవుడు తన గుర్రాలను తీసుకుని ఆశ్రమానికి వెళ్లాడు.

దలుడి కుమారుడు బకుడు. అతడు ఇంద్రుడికి ప్రియమిత్రుడైనాడు. అతడంటాడు– "ఇష్టంలేని వారితో కలిసి ఉండడం, ఇష్టులతో వియోగం, చెడ్డవారితో చెలిమి, భార్యాపుత్రులు, దాయాదులు, మిత్రులు నశించడం, పరాధీనంగా బ్రతకడం చాలా కష్టం".

## శిబి గొప్పతనం

యయాతి కుమార్తె మాధవికి నలుగురు రాజుల వల్ల పుట్టినవారు– ప్రతర్దనుడు, వసుమానుడు, శిబి, అష్టకుడు. తల్లి కోరగా వాళ్లు తమ పుణ్యాలలో కొంత దానం చేసి స్వర్గభ్రష్టుడైన తండ్రిని మరల స్వర్గానికి పంపినారు.

ఆ నలుగురు సోదరులు ఒకరోజు రథంలో వెళ్తుంటే నారదుడు కనిపించాడు. త్రిలోక విషయాలను ముచ్చటిస్తూ– "మేము స్వర్గానికి వెళ్లాక మాలో ఎవరు ముందుగా భూలోకం వస్తారు" అని అడిగారు. అంటే ఎవరు తక్కువ పుణ్యం చేసారని తెలుసుకోవడానికి.

తాను చేసిన దానాన్ని తానే చెప్పుకున్న అష్టకుడు ముందుగా, అతడి తరువాత గుర్రాలను దానం చేసి బ్రాహ్మణులను తిట్టిన ప్రవర్దనుడు, ఇస్తానని చెప్పి పుష్పరథాన్ని ఇవ్వడం మరచిన వసుమనుడు, ఆఖరున శిబి (ఆకలిమీద ఉన్న బ్రాహ్మణుడు కోరగా తన కుమారుడిని వండి ఇచ్చి మరోమాట మాట్లాడకుండా, 'నీవే తిను' అంటే తినబోయిన శిబిని బ్రహ్మ ప్రశంసించి అతడి కుమారుడిని బ్రతికించాడు) స్వర్గం నుంచి తిరిగి వస్తారని, తనకన్నా శిబి గొప్పవాడని నారదుడు ప్రశంసించాడు.

ఇంద్రుడు డేగగా, అగ్ని పావురంగా వచ్చినపుడు తన కుడితొడ మాంసాన్ని కోసి తూనికలో వేసి తూచినా పావురమే ఎక్కువ బరువు ఉండడంతో తానే కూర్చున్నవాడు శిబి. అగ్ని వరంతో శిబి కుడితొడ నుండి కపోతరోముడు జన్మించి ఔద్భిదుడిగా పేరు పొందాడు.

## మార్కండేయుని కన్న ముందు పుట్టిన ఇంద్రద్యుమ్నుడు

మునులు అడిగారు మార్కండేయ మహర్షిని– "నీకన్నా ముందు పుట్టిన వారెవరైనా ఉన్నారా?"

మార్కండేయుడన్నాడు– "ఒకరోజున ఇంద్రద్యుమ్నుడనే రాజర్షి తన పుణ్యకాలం పూర్తికాగా స్వర్గం నుంచి భూమి మీదకు వచ్చి 'నీవు నన్ను గుర్తుపట్టావా?' అన్నాడు.

హిమాలయ ప్రాంతంలోని 'ప్రావారకర్ణుడు' అనే గుడ్లగూబ గురించి చెప్పాను. ఇంద్రద్యుమ్నుడు గుర్రంగా మారి నన్నెక్కించుకుని ప్రావారకర్ణుడి దగ్గరకు వెళ్లగా అతడు ఇంద్రద్యుమ్న సరస్సు దగ్గర ఉన్న 'నాడీజంఘుడు' అనే కొంగ పేరు చెప్పినాడు. ముగ్గురూ నాడీజంఘుడి దగ్గరకు వెళ్లగా అతడు 'అకూపారము' అనే తాబేలు గురించి చెప్పాడు.

నాడీజంఘుడు పిలవగా అకూపారము బయటకు వచ్చింది సరస్సు నుంచి. ఆ తాబేలు ఇంద్రద్యుమ్నుడిని చూడగానే ఉద్విగ్నుడై– "ఇంద్రద్యుమ్నుడు దానం ఇచ్చిన గోవుల రాకపోకల వలన ఈ సరస్సు ఏర్పడింది. దీనిలో నేను నివసిస్తున్నాను".

తాబేలు అలా మాట్లాడుతూ ఉండగానే దేవలోకం నుంచి దేవరథం వచ్చింది. ఇంద్రద్యుమ్నుడు మమ్మల్ని మామా స్థానాలలో దించి తాను స్వర్గానికి వెళ్లిపోయాడు".

## నిరర్థక జన్మలు - దానాలు

మార్కండేయుడన్నాడు– "పుత్రహీనుడు, ధర్మభ్రష్టుడు, ఇతరుల ఇంట తిని బ్రతికేవాడు, తనకోసమే వండుకుని తినేవాడు -వీరి జన్మలు వ్యర్థం. ఈ పదహారు దానాలూ నిరర్థకాలు– సన్యాసిగా ఉండి సంసారిగా మారినవాడికి ఇచ్చే దానం; అన్యాయార్జిత ధనదానం, భ్రష్టుడు, దొంగ, గురువు, అసత్యవాది, పాపాత్ముడు, కృతఘ్నుడు, గ్రామపురోహితుడు, వేదవిక్రేత, నీచుడు, శూద్రుడికి వివాహం చేసేవాడు, ప్రౌఢ స్త్రీ భర్త, స్త్రీలు, పాములవాడు, సేవకులకు ఇచ్చిన దానాలు దానాలుగా పరిగణించబడవు".

మార్కండేయుడు చెబుతున్నాడు– "అగ్ని తొలి సంతానం బంగారం; భూమి విష్ణు పత్ని; ఆవులు సూర్యుని పుత్రికలు. బంగారం, భూమి, ఆవులను దానం చేసినవాడు మూడు లోకాలను దానం చేసినవాడవుతాడు. దానమే గొప్పదైన శాశ్వత పుణ్యం.

## ధుంధుమారుని కథ

ఉదంకుడు మరుభూమిలోని తన ఆశ్రమంలో విష్ణువును ఆరాధిస్తూ గొప్ప తపస్సు చేసాడు. విష్ణుమూర్తి ప్రత్యక్షమై యోగవిద్యతో కూడిన సమస్త విద్యలు ప్రసాదించాడు. ధుంధుమారుని వధలో అతడి పాత్రను గురించి చెప్పాడు.

ఇక్ష్వాకు వంశపు బృహదశ్వుని కుమారుడు కువలాశ్వుడు వారి వంశవృక్షమిది→ ఇక్ష్వాకుడు → శశాదుడు → కకుత్‌స్థుడు → అనేనుడు → పృథువు → విష్వగశ్వుడు → అద్రి → యువనాశ్వుడు → శ్రావుడు → శ్రావస్తకుడు → బృహదశ్వుడు → కువలాశ్వుడు.

ఉదంకుడి ఆశ్రమం పక్కన ఇసుక సముద్రమనే ఎడారి ఉంది. అక్కడ మధుకైటభుల కుమారుడు ధుంధుమారుడు ఘోర తపస్సు చేస్తున్నాడు. ఇసుక క్రింద నిద్రిస్తూ అతడు ఏడాదికి ఒక్కసారి గాలి పీల్చుకున్నపుడు భూమి కంపించి ఇసుక తుఫాను వస్తుంది. అగ్నిమంటలు చెలరేగుతాయి.

ఉదంకుడు ఆ విషయాన్ని బృహదశ్వుడికి చెప్పగా వనవాసం వెళ్తున్న బృహదశ్వుడు ఆ పనిని తన కుమారుడు కువలయాశ్వుడికి అప్పజెప్పాడు.

ఉదంకుడన్నాడు కువలయాశ్వుడితో– "పూర్వకాలంలో విష్ణుమూర్తి ఆదిశేషుని శయ్యపై నిద్రిస్తున్నపుడు, విష్ణువు నాభి నుంచి పద్మం, దానిలో బ్రహ్మ జన్మించాడు.

విష్ణువు చెవి గులిమి నుంచి జన్మించిన మధుకైటభులు దివ్యపద్మాన్ని కదిలించగా విష్ణువు మేలుకుని వరం కోరుకొమ్మన్నాడు. వాళ్లన్నారు– "నీవే కోరుకో!"

విష్ణువన్నాడు– "మీరు నాతో యుద్ధం చేసి మరణించండి".

వాళ్లన్నారు– "ఏ ఆవరణాలేని బహిరాకాశంలో మమ్మల్ని చంపు".

విష్ణువు వారిని తన తొడలపై ఉంచి చక్రంతో నరికివేసాడు.

మధుకైటభుల కుమారుడు ఇసుకరాక్షసుడు ధుంధువు. ధుంధువు గొప్ప తపస్సు చేయగా బ్రహ్మ వరమిచ్చాడు– "దేవతలు, దానవులు, యక్షులు, నాగులు, గంధర్వులు, అచ్చరలు వీరిలో ఎవ్వరితోనూ చావకూడదని".

ఆ వర గర్వంతో అతడు ముల్లోకాలను పీడిస్తున్నాడు. ఉదంకుడి సలహాతో కువలాశ్వుడు తన ఇరవై ఒక్కవేల కుమారులతో ధుంధుడితో యుద్ధానికి బయల్దేరాడు.

తన కుమారులతో కువలాశ్వుడు ధుంధుడున్న ప్రాంతానికి నాలుగు వేపులా ఇసుక సముద్రాన్ని తవ్వించాడు. పశ్చిమ దిక్కుకు తలపెట్టి నిద్రపోతున్న ధుంధుడు నిద్రలేచి రాకుమారులందరినీ తన నోటినుండి వెలువడిన అగ్నితో భస్మం చేసాడు.

కువలాశ్వుడు ఆగ్రహించినవాడై విష్ణువును స్మరించి బ్రహ్మాస్త్రంతో ధుంధుడిని దహించి ధుంధుమారుడైనాడు. యుద్ధంలో మిగిలిన కువలాశ్వుని పుత్రులు ముగ్గురు– దృఢాశ్వుడు, కపిలాశ్వుడు, చంద్రాశ్వుడు.

## పతివ్రతా మహాత్మ్యం

మార్కండేయుడిని ధర్మజుడడిగాడు– "పుత్రులకు తల్లిదండ్రుల సేవ, స్త్రీలకు పతిసేవ చాలా శ్రమ సాధ్యాలు

**కుక్షిణా దశ మాసాంశశ్చ గర్భం సంధారయంతి యాః**
**నార్యః కాలేన సంభూయ కి మద్భుత తరం తతః** (వన. 205–10)

పదిమాసాలు పొట్టలో గర్భాన్ని మోసి సరైన సమయంలో స్త్రీలు సంతానం కంటున్నారు. దీనిని మించిన పరమాశ్చర్యమైన కార్యం ఏమున్నది? ఆ సంతానాన్ని ఎంతో మమకారంతో పెంచుతారు. స్త్రీలు ఆచరించాల్సిన ధర్మం గురించి వివరించగలరు"–

మార్కండేయ మహర్షి చెబుతున్నాడు– "పూర్వం కౌశికుడనే బ్రాహ్మణుడు చెట్టుక్రింద కూర్చుని వేద పారాయణం చేస్తుంటే చెట్టుమీద ఉన్న కొంగ అతడిపై రెట్టవేసింది. తీవ్రమైన కోపంతో అతడు ఆ పక్షికి హాని కలగాలని అనుకుంటూ కొంగవేపు చూసేసరికి అది చచ్చి నేలకూలింది. కౌశికుడు బాధపడినాడు.

ఆ తరువాత భిక్షాటనకు వెళ్లి ఒక ఇంటిముందు ఆగి 'భవతీ భిక్షాం దేహీ' అన్నాడు. ఆ ఇల్లాలు 'ఇదుగో వస్తున్నా ఉండు' అన్నది. ఈలోగా ఆమె భర్త వచ్చాడు. తోమిన పాత్రను శుభ్రంగా కడిగి భర్తకు భోజనం వడ్డించింది. అతడు తిన్నాక విశ్రాంతి తీసుకుంటున్నపుడు ఆమెకు బయట భిక్షకై ఎదురుచూస్తున్న బ్రాహ్మణుడు గుర్తుకువచ్చాడు.

కౌశికుడన్నాడు– "నన్ను ఉండమని అన్నావు, ఆలస్యం చేసావు. నీకు బ్రాహ్మణులంటే లెక్కలేనట్లున్నది" అన్నాడు కోపంగా.

ఆమె అన్నది– "విద్వాంసుడా, తప్పు క్షమించు. నా భర్త వచ్చాడు అదే సమయాన. అతనికి సేవచేసి వచ్చేప్పటికి ఆలస్యమయ్యింది".

కౌశికుడన్నాడు– "బ్రాహ్మణుడు నీ భర్తపాటి చెయ్యడా? నీవు నన్ను అవమానిస్తున్నావు. బ్రాహ్మణుల క్రోధం అగ్నిలాంటిది".

ఆమె అన్నది– "నాకు బ్రాహ్మణుల తేజస్సు తెలియును. ఒక మహర్షి సముద్రాన్ని తాగినాడు. వాతాపిని జీర్ణం చేసుకున్నాడు. నీవు చూపుతోనే కొంగను మాడ్చివేసినావు. నీ శక్తి కూడా నాకు తెలుసు. స్వాధ్యాయం, మనోనిగ్రహం, ఋజు ప్రవర్తనం, ఇంద్రియ నిగ్రహం బ్రాహ్మణులకుండే సనాతన ధర్మాలు కదా!

మిథిలాపురంలో ఉండే ధర్మవ్యాధుడిని అడుగు. అతడు ధర్మాన్ని, ధర్మసూక్ష్మాలను నీకు చెబుతాడు" అన్నదా ఇల్లాలు.

కౌశికుడన్నాడు– "అమ్మా, ఈరోజు నాకు మంచిగా లేదు. కాని నీ మాటల వల్ల నాకు మేలు జరిగింది. నీవు ధన్యురాలివి" అని పలికి కౌశికుడు బాగా ఆలోచించి మిథిలానగరం వెళ్లాడు. ధర్మవ్యాధుడు మాంసపు దుకాణంలో పంది మాంసం, గొడ్డు మాంసం అమ్ముతూ కనిపించాడు. లేచి నిలబడి అతడిని స్వాగతించాడు.

## అహింసా పరమోధర్మః

ధర్మవ్యాధుడు ఎంతో ఆదరంతో కౌశికుడిని పలకరించాడు. "మిథిలానగరానికి వెళ్లు!' అని ఆ పతివ్రత చెప్పింది కదా! ఇది మీరు నిలువదగిన స్థలం కాదు" అని అతడిని తన ఇంటికి తీసుకువెళ్లాడు. అతడి ఇల్లు ఎంతో సుందరంగా ఉ ంది.

ధర్మవ్యాధుడన్నాడు– "నేను ఈ వృత్తిలో ఎందుకున్నానని తమరు అనుకుంటున్నారు. ఇది మా వంశ పారంపర్య వృత్తి. నేను నా ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాను. శూద్రునికి సేవ, వైశ్యునికి వ్యవసాయం, క్షత్రియునికి యుద్ధం, బ్రాహ్మణునికి బ్రహ్మచర్యం, తపస్సు, వేదాధ్యయనం, సత్యం ధర్మాలు.

నేను నా తల్లిదండ్రులకు సేవచేస్తున్నాను. నా శక్తిని అనుసరించి దానం చేస్తాను. దేవతలకు, అతిథులకు, సేవకులకు భోజనం పెట్టి మిగిలిన దానితో శరీరాన్ని పోషిస్తాను.

పాపాలకు నివాసస్థానం లోభం. గడ్డితో మూసుకుపోయిన బావుల లాగా ధర్మం ముసుగులో అధర్మాలు కప్పుకుని ఉంటాయి.

యజ్ఞం, తపస్సు, దానం, వేదాధ్యయనం, సత్యం –ఇవి శిష్టుల ఆచారాలు. వేదసారం సత్యం; సత్యసారం ఇంద్రియ నిగ్రహం; ఇంద్రియనిగ్రహసారం త్యాగం.

**కామ లోభ గ్రహాకీర్ణం పంచేంద్రియ జలాం నదీమ్**
**నావం ధృతిమయీం కృత్వా జన్మదుర్గాణి సంతర** (వన. 207-72)

కామం, లోభం అనే మొసళ్లతో నిండి విషయాసక్తి అనే నీళ్లున్న దేహమనే నదిని ధైర్యమనే నావలో జన్మాది కష్టాలను దాటి వెళ్లాలి.

**అహింసా సత్యవచనం సర్వభూత హితం పరమ్**
**అహింసా పరమోధర్మః స చ సత్యే ప్రతిష్ఠితః**
**సత్యే కృత్వా ప్రతిష్ఠాం తు ప్రవర్తంతే ప్రవృత్తయః** (వన. 207-74)

అహింస పరమధర్మం. అయినా, కొద్దోగొప్పో హింస జరుగుతూనే ఉంటుంది. ఆకాశం నుంచి భూమిదాకా ఈలోకం అంతా జీవులతో నిండి ఉన్నది గనుక. ప్రాణులకు మేలు కలిగించేది సత్యం.

దుఃఖరాహిత్యమే సుఖం. సత్యం, అహింస, శమం, దమం, తపస్సుల వల్ల మానవుడు పరబ్రహ్మ పదవిని పొందుతాడు.

## బ్రాహ్మీ విద్య

శబ్ద స్పర్శ రూప రస గంధాలు అయిదు జ్ఞానేంద్రియాలకు విషయాలు. విషయాలపై ఆసక్తి రాగం. విషయం లభించకపోతే వచ్చేది ద్వేషం. విషయం తనకే కావాలని లోభం, దానితో మోహం ఏర్పడ్తుంది. రాగద్వేష లోభ మోహాలు ఆవరించగా ధర్మంపై బుద్ధి నిలవదు.

పంచ భూతాత్మకమైన ఈ చరాచర జగత్తు అంతా బ్రహ్మస్వరూపం.

ఆకాశము వాయువు అగ్ని జలం భూమి పంచ మహాభూతాలు

శబ్దం స్పర్శ రూపం రసం గంధం వాటి గుణాలు. ఆరవతత్త్వం చేతన (మనస్సు), ఏడవది-బుద్ధి, ఎనిమిది-అహంకారం. అయిదు జ్ఞానేంద్రియాలు, పంచప్రాణాలు, సత్త్వరజస్సు తమస్సులు ఇవి అవ్యక్తాలు. 17 తత్త్వాల సమూహం అవ్యక్తం. బుద్ధి గుహలో దాగి ఉండే 24 వ్యక్తావ్యక్త తత్త్వాలు పరబ్రహ్మ స్వరూపాలు (ప్రకృతి, మహత్తు, అహంకారం, మనస్సు –అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, అయిదు తన్మాత్రలు, పంచమహాభూతాలు) శబ్ద స్పర్శ రూప రస గంధములు భూమిలో; శబ్ద స్పర్శ రూపరసములు నీళ్లలో; శబ్ద స్పర్శ రూపములు తేజస్సు (అగ్నిలో); శబ్ద స్పర్శములు వాయువులో; శబ్దమొక్కటి ఆకాశంలో ఉంటాయి. పంచభూతాలలో మొత్తం 15 గుణాలున్నాయి. ఉత్పత్తిలో ఇవి అనులోమ క్రమంలో– ఆకాశం, వాయువు, తేజస్సు, నీరు, భూమిగా; మృత్యువులో ప్రతిలోమక్రమం– భూమి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశంలో కలుస్తాయి.

కంటికి కనబడే స్థూల శరీరం రథం, ఆత్మ (బుద్ధి) సారథి; ఇంద్రియాలు గుర్రాలు; రాగద్వేష లోభ మోహాలు దారులు.

తమస్సు మోహాన్ని, రజస్సు రాగాన్ని, అభిమానాన్ని, సత్త్వగుణం ధీరత్వాన్ని, ఇంద్రియ నిగ్రహాన్ని ఇస్తాయి.

శూద్రుడైనా ఉత్తమ గుణాలతో వైశ్య, క్షత్రియత్వాలను పొందుతాడు. ఋజు ప్రవర్తనతో బ్రాహ్మణత్వం కలుగుతుంది.

**శూద్ర యోనౌ హి జాతస్య సద్గుణాను పతిష్ఠతః**
**వైశ్యత్వం లభతే బ్రహ్మన్ క్షత్రియత్వం తథైవచ**
**ఆర్జవే వర్తమానస్య బ్రాహ్మణ్య మభి జాయతే** (వన. 212-11)

## పంచప్రాణాలు

భూత భవిష్యత్ వర్తమానాలు ప్రాణాన్ని ఆశ్రయించి ఉంటాయి. ప్రాణమే జీవుడు. మెలకువ, జాగ్రదవస్థ; కలలు–స్వప్నావస్థ; ప్రాణ సంచారం ఆగిపోతే ప్రాణి మరణిస్తుంది. ఈ ప్రాణమే ఒక జీవిని వదిలి మరొక జీవిలో ప్రవేశిస్తుంది.

శరీరమంతా సంచరించేది సమాన వాయువు. శిరస్సులో కంఠంలో ఉదానం; మలమూత్రాలను వహించి అపానం, అన్ని కీళ్లలో వ్యాపించినపుడు వ్యానం; నాభి నుంచి గొంతు వరకు ప్రాణం –ఇవి పంచప్రాణాలు.

ప్రాణం, శ్రద్ధ, ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి, ఇంద్రియాలు, మనస్సు, అన్నం, వీర్యం, తపస్సు, మంత్రం, కర్మ, లోకం, నామం –ఇవి షోడశ కళలు (16).

**గుణా గుణ మానా సంగమ్ ఏకకార్యమనంతరమ్**
**ఏతత్ తద్ బ్రహ్మణే వృత్తమ్ ఆహురేకపదం సుఖమ్** (వన. 213–38)

అంతరాత్మతో సాధించబడేది, నిస్సంగమైనది సుఖం. సుఖదుఃఖాలను వదిలినవాడు బ్రహ్మపదాన్ని పొందుతాడు.

ధర్మవ్యాధుడన్నాడు కౌశికునితో– "తల్లిదండ్రుల సేవయే నా తపస్సు. నీకు మేలు కలిగించే విషయం చెబుతాను విను. నీవు నీ తల్లిదండ్రులను ఉపేక్షించావు. వారి అనుమతి తీసుకోకుండానే బయటకు వచ్చావు. వారు గుడ్డివారు అయినారు. ఇంటికి వెళ్లి వారిని ఆదరించు"

కౌశికుడన్నాడు– "నీవు శూద్రుడివి కావు. కాని వ్యాధుడిగా ఉండడంలో ఏదో విశేషముంది".

ధర్మవ్యాధుడన్నాడు– "పూర్వజన్మలో నేను బ్రాహ్మణ కుమారుడిని. ధనుర్వేద పారంగతుడైన రాకుమారుడు నా మిత్రుడు. ఒకసారి వేటకు వెళ్లినపుడు నేను వేసిన బాణం ఒక మునికి తగిలింది. అతడు నన్ను శూద్రజాతిలో వ్యాధుడిగా పుట్టమని శపించాడు. ఇది నా కర్మఫలం".

కౌశికుడన్నాడు– "నీవు జ్ఞానివి. నీకు శుభమగును గాక"

కౌశికుడు ఇంటికి వెళ్లి తన తల్లిదండ్రులకు సేవచేసాడు. ధర్మాచరణలో తన జీవితాన్ని గడిపినాడు.

## అగ్ని - అంగిరసుడు - బృహస్పతి

తొలి తేజస్సు అగ్ని.

తరువాత అతడిని మించిన అగ్నిగా అంగిరసుడు ప్రజ్వరిల్లగా అగ్ని అతడిని తన కుమారుడిగా అంగీకరించాడు. అంగిరసుడి కుమారుడు బృహస్పతి.

అంగిరసుని భార్య సుభ. వీరి పుత్రులు– బృహత్కీర్తి, బృహజ్జ్యోతి, బృహద్బ్రహ్మ, బృహన్మనుడు, బృహన్మంత్రుడు, బృహద్భానుడు, బృహస్పతి.

అంగిరసుని మొదటి కుమార్తె– భానుమతి (దిన దేవత)
రెండవ కుమార్తె – రాగ (రాత్రి దేవత)
మూడవ కుమార్తె – సినీవాలి (చతుర్దశితో కూడిన అమావాస్య)
నాలుగవ కుమార్తె – అర్చిష్మతి (శుద్ధ పూర్ణిమ)
అయిదవ కుమార్తె – హవిష్మతి (పాడ్యమితో కూడిన పూర్ణిమ –రాక)
ఆరవ కుమార్తె – మహిష్మతి (చతుర్దశితో కూడిన పూర్ణిమ –అనుమతి)
ఏడవ కుమార్తె – మహామతి (పాడ్యమితో కూడిన అమావాస్య)
ఎనిమిదవ కుమార్తె – కుహు (కుహు–కుహు)

బృహస్పతి భార్య చాంద్రమసి (తార). వీరికి ఆరుగురు పుత్రులు–

1) శంయువు – మొదటి పుత్రుడు ఆజ్యామతి; ఇతడి భార్య సత్య
శంయువు మొదటి పుత్రుడు భరద్వాజుడు అనే అగ్ని
శంయువు రెండవ పుత్రుడు భరతుడు

భరతుని పుత్రుడు భరతాగ్ని, పుత్రిక భారతి.
భరతాగ్ని పుత్రుడు – పావకుడు
భరద్వాజుడి భార్య వీర – వీరి పుత్రుడు వీరుడు (రథప్రభు, రథధ్వానుడు, కుంభరేతుడు)
వీరుడి భార్య శరయు – వీరి పుత్రుడు సిద్ధి

2) నిశ్చ్యవసుడు (బృహస్పతి రెండవ కుమారుడు) – వాగభిమాన అగ్ని
నిశ్చ్యవసుడి కుమారుడు సత్యుడు (నిష్కృతి) – శబ్దాగ్ని
సత్యుడి కొడుకు స్వనుడు (రోగాగ్ని–కేకలు, అరుపులు)

3) విశ్వజిత్తు (బృహస్పతి మూడవ కొడుకు) – బుద్ధికి చెందిన తేజస్సు

4) విశ్వభుక్కు (బృహస్పతి నాలుగవ కొడుకు) – జీర్ణాగ్ని; ఇతడి భార్య గోమతీనది

5) ఊర్ధ్వబాక్కు (బృహస్పతి అయిదవ కొడుకు) – ఉదానుడు ఊర్ధ్వగతి కలవాడు

6) స్విష్టకృత్తు (బృహస్పతి ఆరవ కొడుకు) – నేతిధార ఉత్తరదిక్కుకు ఉంటుంది.

బృహస్పతి కోపంగా ఉన్నపుడు అతడి శరీరం నుంచి వచ్చిన చెమట అతడి పుత్రిక– స్వాహా–క్రూరురాలు. అన్ని ప్రాణుల్లో ఉంటుంది.

స్వాహా పుత్రుడు – కాముడు (కామాగ్ని)
యుద్ధం చేసే అగ్ని– అమోఘుడు;
మహావాక్కును (పరావాక్కు) వ్యక్తం చేసే అగ్ని ఉక్థం.

## పంచాగ్నులు

1) కశ్యప పుత్రుడు కాశ్యపుడు, 2) వశిష్ఠ పుత్రుడు వాశిష్ఠుడు, 3) ప్రాణపుత్రుడు ప్రాణకుడు, 4) అంగిరసుని పుత్రుడు చ్యవనుడు, 5) త్రివర్చుడు – పంచాగ్నులు.

ఈ అయిదుగురు మహా వ్యాహృతులు అనబడే (భూః భువః స్వః మహః జనః) అయిదు మంత్రాలతో పరమాత్మను ధ్యానం చేసారు. వారి తపస్సు వలన అయిదు రంగుల పురుషుడు ఉద్భవించాడు. అతడే పాంచజన్యుడు. అతడు ఆ అయిదుగురు మహర్షుల వంశానికి మూలం అయినాడు.

పాంచజన్యుడు గొప్ప తపస్సు చేసి దక్షిణాగ్నిని సృజించాడు. శిరస్సు నుంచి 'బృహత్' అనే సామాన్ని, ముఖం నుంచి రథంతరాన్ని సృష్టించాడు. ఇవి ఆయువును హరిస్తాయి. అందుకే 'తర సాహరాలు' అంటారు.

పాంచజన్యుడు– నాభినుంచి శివుడిని; బలం వల్ల ఇంద్రుడిని, ప్రాణం నుంచి వాయువును, అగ్నిని సృష్టించాడు. భుజాల నుంచి ప్రాకృత, వైకృతాలనే అనుదాత్తాలను, మనసును, ఇంద్రియ దేవతలను, పంచ మహాభూతాలను సృజించి – అయిదుగురు పితరుల కోసం అయిదుగురు పుత్రులు– బృహద్రధుని అంశతో ప్రణిధి; కాశ్యపుని అంశతో మహత్తరుడు, చ్యవనుడి అంశతో భానుడు, త్రివర్చుని అంశతో సౌభరుడిని, ప్రాణుని అంశతో అనుదాత్తుడుని జనింపచేసాడు. ఇలా ఇరవై అయిదుగురు పుత్రులు అగ్నులకు అనుకూలమైనవారు.

వీరికి వ్యతిరేకంగా విఘ్నాలను సృజించే పదిహేను మంది ఉత్తరదేవులు – సుభీముడు, అతిభీముడు, భీముడు, భీమబలుడు, అబలుడు అనే వినాయకులు; సుమిత్రుడు, మిత్రవంతుడు, మిత్రజ్ఞుడు, మిత్రవర్ధనుడు, మిత్రధర్ముడు, సురప్రవీరుడు, వీరుడు, సురేశుడు, సువర్చుడు, సురహంత వంటివారిని మూడు దళాలుగా పదిహేనుమందిని విభజించాడు. వీరు అగ్నికి ఇష్టమైన హవిస్సును హరిస్తారు కాబట్టి వీరికి వేదిక బయట వీరి భాగాన్ని వీరికి ఇవ్వాలి.

బృహదుక్థుడు అనే అగ్ని భూమిపై ఉంటాడు.

రథంతరుడు కూడా హవిర్భాగము పొందాడు.

## తపుడు-భానువు

శంయువు కొడుకు ఊర్జుడు, ఊర్జుని కొడుకు భరతాగ్ని. భరతుడికి పుష్టిమతి అనేది మరోపేరు.

పాంచజన్యుడి మరోపేరు తపుడు. ఇంతకుముందు చెప్పిన అగ్నులు 25 మంది, విఘ్నులు (వినాయకులు) 15 మంది కాక పురందరుడు, ఊష్మడు, మనువు, శంభువు, ఆస్యుడు అనబడే మరో అయిదుగురు పుత్రులున్నారు.

బృహద్భానుడు (భానుడు) భార్యలు– సుప్రజ, బృహద్భాస.

భానువు, సుప్రజల పుత్రులు బలదుడు, మన్యుమంతుడు, ధృతిమంతుడు; బృహద్భాస పుత్రులు– ఆగ్రయణుడు, విశ్వదేవుడు, స్తుభుడు.

బృహద్భానుడి మూడవ భార్య నిశ– వీరి సంతానం రోహిణి, సోమ, అగ్ని, వైశ్వానరుడు, విశ్వపతి, సన్నిహితుడు, కపిలుడు, అగ్రణి.

రోహిణి హిరణ్యకశిపుని భార్య.

శుచి, వీతి, వసుమంతుడు, సురభిమంతుడు, ఉత్తరుడు, పథికృత్తు, అగ్నిమంతుడు –వీరు ప్రాయశ్చిత్తాగ్నులు. అగ్నులు (దక్షిణాగ్ని, గార్హపత్యం, ఆహవనీయం) కలిస్తే 'శుచి'కి, అగ్నులు దావాగ్ని కలిస్తే 'వీతి'కి; రజస్వల స్త్రీ అగ్నిని తాకితే వసుమంతుడికి; విలాపాలు వినబడినప్పుడు, కుక్కలు ముట్టినప్పుడు సురభిమంతుడికి, బ్రాహ్మణుడు అనారోగ్యం పాలై అగ్నికార్యం చేయలేకపోతే ఉత్తరుడికి; పురిటింటి అగ్ని అగ్నిహోత్రాగ్నిని స్పర్శిస్తే అగ్నిమంతుడికి ఎనిమిది కుండ పెంకులలో ఆహుతిలివ్వాలి.

జలంలో నివసించే అగ్ని సహాగ్ని. అతడి భార్య ముదిత. వీరి కుమారుడు అద్భుతుడు. గృహంలో ఇతడే గృహాగ్ని. అద్భుతుడి కుమారుడు భరతుడు (నియతుడు).

సహుని పుత్రుడు ఆపుడు.

అప్పటికి ప్రథమాగ్ని బలహీనుడైనాడు. వెళ్లి సముద్రంలో దాక్కున్నాడు. అధర్వుడిని తన స్థానంలో ఉండమన్నాడు.

అధర్వుడు అగ్నిజాడకై గాలించగా చేపలు చెప్పాయి అగ్ని ఉన్న చోటును. అగ్ని అన్నాడు– మీరు ప్రాణులకు ఆహారమవుతారు.

అగ్ని ఆ తరువాత మరింత సన్నబడిపోయాడు. శరీరాన్ని వదిలి ధాతువులుగా మారినాడు. సహుడి నుండి వీర్యము, స్వర్ణము, ఎముకల నుంచి దేవదారు వృక్షం, కఫం నుంచి స్ఫటికం, పైత్యం నుంచి మరకతం, ప్లీహం నుంచి ఇనుము ఏర్పడ్డాయి. గోళ్లు మేఘాలు, నాడులు పగడాలు అయినాయి.

అధర్వుడు సముద్రాన్ని మథించగా పుట్టిన అగ్ని– అంగిరసుడు. నదులన్నీ అగ్ని ఉత్పత్తిస్థానాలైనాయి.

దేవతలకు దానవులకు మధ్య గొప్ప యుద్ధాలు జరిగాయి. సరైన సేనాధిపతి లేక దేవతల సైన్యం ఓడిపోతున్నది. ఒకరోజున ఇంద్రుడికి మానస పర్వతం దగ్గర స్త్రీ ఆర్తనాదం వినిపించింది. ఆ స్త్రీ 'దేవసేన'. ఆమెను 'కేశి' అనే రాక్షసుడు అపహరించాలని ప్రయత్నిస్తుంటే ఆమె ఆర్తనాదం చేసింది.

ఆమె ఇంద్రుడితో అన్నది– "నాపేరు దేవసేన. నా సోదరి దైత్యసేనను కేశి మునుపే అపహరించాడు. ఇప్పుడు నన్ను అపహరించదలుచుకున్నాడు".

ఇంద్రుడు ఆకాశం వేపు చూసాడు. సూర్యుడు చంద్రుడు ఒకేరాశిలో ఉండడం హోమ సంధ్యాసమయంలో రౌద్ర (ఆరుద్ర) ముహూర్తం గమనించాడు. అది దేవాసుర యుద్ధానికి సూచన. సింధునది ఎర్రబడింది. ఆడనక్క సూర్యుడివేపు చూసి అరుస్తున్నది.

## స్కందుడి జననం

ఈ సమయంలో పుట్టే వ్యక్తి దేవసేనకు భర్త అవుతాడు అనుకుని బ్రహ్మతో చెప్పగా అందరూ కలిసి మహర్షుల ఆశ్రమానికి వెళ్లారు. మంత్రాలతో ఆవాహన జరిగినపుడు అద్భుతుడు అనే అగ్ని సూర్యమండలం నుంచి వచ్చి హవ్యవాహనుడై హవ్యాలను దేవతలకు అందజేసాడు. అగ్నిదేవుడి దృష్టి సప్తర్షుల భార్యలపై పడింది. అతడి మనసు చెదిరింది.

ప్రజాపతి దక్షుడి కుమార్తె స్వాహాదేవి అగ్నిని భర్తగా పొందాలనుకుని, అగ్ని కామాగ్నిగా మారడం చూసి మొదట అంగిరసుని భార్య 'శివ'గా, అగ్నితో సంగమించి గరుడపక్షిగా మారి ఆ వీర్యాన్ని శ్వేత పర్వతం దగ్గర్లోని రెల్లుపొదల్లోని ఒక బంగరు కుండలో వదిలింది.

తరువాత ఒక్క అరుంధతి రూపం తప్ప మిగతావారి రూపాలను ధరించి రేతస్సును బంగరుకుండలో వదిలింది. పాడ్యమి (ప్రతిపత్తు)నాడు స్కందితమైన ఆ వీర్యం నుండి స్కందుడు పుట్టినాడు. ఆరు తలలు, 12 చెవులు, 12 కళ్లు, 12 భుజాలు కలవాడతడు. విదియనాడు మెడ పొట్ట వ్యక్తమై తదియనాడు శివుడిగా, నాలుగవ నాడు కాళ్లు, చేతులు ఏర్పడ్డాయి.

అయిదవ రోజున మహేశ్వరుడతడికి మహాధనుస్సు నిచ్చాడు. ధనుస్సును, శక్తిని, కోడిపుంజును, శంఖాన్ని పట్టుకుని ఆడుకున్నాడు. తరువాత లేచి క్రౌంచ పర్వతాన్ని చీల్చివేసాడు. శక్తితో శ్వేతపర్వత శిఖరాన్ని ముక్కలు చేసాడు. శుక్లపక్ష పంచమి ఆ విధంగా పర్వదినమైంది.

ఆరుగురు ఋషుల భార్యల రూపంతో స్వాహాదేవికి, అగ్నికి పుట్టిన వాడిని, విశ్వామిత్రుడు ఆశీర్వదించాడు. అందుకే కుమారస్వామికి విశ్వామిత్రుడు ఇష్టుడైనాడు.

స్వాహా దేవి నేనే ఋషుల భార్యల రూపంతో అగ్నిని కలిసాను అని చెప్పినా వినక వారు తమ భార్యలను వదిలివేసారు. స్వాహాదేవి గరుడపక్షి రూపంలో ఎగిరి వీర్యాన్ని బంగరు పాత్రలో వదిలింది, అది రెల్లువనంలో అన్నది అందరికి తెలిసింది. ఆ బాలుడికి మాతృగణాలు, పార్షదులు రక్షణగా నిలిచాయి. ఇంద్రుడికి భయంవేసి ఆ కుమారుడిపై యుద్ధానికి వెళ్లి వజ్రాయుధంతో కొట్టాడు. ఆ గాయం వలన అతడికి విశాఖుడని పేరు వచ్చింది. గాయం నుంచి వీరపురుషుడు ఉద్భవించాడు. కుమార గ్రహాలు అతడిని భద్రశాఖుడు, కౌసలుడు, మేషముఖుడు అని పిలిచాయి. తపుడు అనే అగ్ని కుమార్తెలు మాతృకలైనారు. కాకి, హలిమ, మాలిని, బృంహత, ఆర్య, పతాల, వైమిత – వీరి పుత్రుడు 'శిశువు' – ఈ ఎనిమిదిమంది 'వీరాష్టకం'; మేషముఖ స్కందునితో కలిని 'వీర నవకం'.

స్కందుని ఆరవ ముఖం మేషముఖం. ఆరవరోజు ఇంద్రుడిని ఓడించాడు స్కందుడు. అందరూ స్కందుడినే ఇంద్రుడిగా ఉండమన్నారు.

స్కందుడన్నాడు– "ఇంద్రుడి పనేమిటి?"

మునులన్నారు– "ఇంద్రుడు సమస్త ప్రాణులకు బలాన్ని, తేజస్సును, సంతతిని, సుఖాన్ని ఇస్తాడు. కోరికలను తీరుస్తాడు. దుష్టులను సంహరిస్తాడు. బలాన్ని తగ్గిస్తాడు. బ్రతుకుతెరువు చూపిస్తాడు. సూర్యుడు లేకుంటే సూర్యుడిగా, చంద్రుడు లేకుంటే చంద్రుడిగా, అగ్ని వాయు భూమి జల స్వరూపాలు ధరిస్తాడు".

స్కందుడన్నాడు– "ఈ కార్యాలన్నీ ఇంద్రుడు సక్రమంగా చేస్తున్నాడు. అతడే ఇంద్రుడు. నాకు ఇంద్ర పదవిపై ఆసక్తిలేదు".

ఇంద్రుడన్నాడు– "నీవు మా సేనాధిపతిగా ఉండు. అది మాకందరికి ఇష్టం".

సమస్త దేవతలతో కూడి ఇంద్రుడు కుమారస్వామిని దేవతల సేనాపతిగా అభిషేకించాడు. పరమేశ్వరుడు అతడిని ఆదరించాడు. అగ్ని రుద్ర స్వరూపుడు గనుక స్కందుడు రుద్రపుత్రుడు, ఈశ్వరుని కుమారుడూ అయినాడు.

స్కందుడు ఆ విధంగా రుద్ర స్వరూపుడైన అగ్నివలన, ఆరుగురు ఋషిపత్నుల రూపధారిణి స్వాహాదేవి వలన రెల్లువనంలో బంగరుపాత్రలో శ్వేత పర్వతంపై జన్మించాడు. ఆ కార్తికేయునికి దేవసేన నిచ్చి వివాహం చేసారు. దేవసేనను షష్ఠి, లక్ష్మి, ఆశ, సుఖప్రద, సినీవాలి, కుహు, సద్వృత్తి, అపరాజిత అని పిలిచారందరూ.

కుమారస్వామి దేవతల సేనాధిపతిగా నియమించబడినపుడు భర్తలచే విడువబడిన ఆరుగురు ఋషిపత్నులు ఆయన వద్దకు వచ్చారు. వారు ఆ ఆరుగురికి పుత్రుడైనాడు.

రోహిణి చెల్లెలు 'అభిజ్యిత్' దేవి తన స్థానం నుంచి పతనమై తపస్సు చేయడానికి వెళ్లగా బ్రహ్మ ధనిష్ఠా నక్షత్రాన్ని ఉగాదిగా కాలగణనం చేయమన్నాడు. అంతకు ముందు రోహిణీ నక్షత్రంతో కాలగణన జరిగేది.

తన ఆరుగురు తల్లులను ఆరు కృత్తికలుగా చేసి స్వాహా ఏడవదిగా, కృత్తికా నక్షత్రమై ఏడు శిరస్సులతో అభిజిత్ స్థానంలో ప్రత్యక్షమైనారు. అందుకే కృత్తికా నక్షత్రానికి గరుడ రూపం వచ్చింది.

కృత్తికలు కార్తికేయుడిని పూర్వ మాతృకల సంతానాన్ని భక్షించే వరాన్ని కోరినారు. స్కందుడన్నాడు- "భక్షించడం తల్లుల ధర్మం కాదు. వారిని మీరు రక్షించి గౌరవాన్ని పొందగలరు. జనులు పదహారు సంవత్సరాల వయసు వచ్చేవరకు వారిని మీరు బాధించండి. మిమ్మల్ని పూజిస్తే రక్షించండి" వారు అప్పుడు గ్రహరూపాలు ధరించారు.

స్కందుడి నుంచి స్కందారుస్మారగ్రహం, వినత నుంచి శకుని గ్రహం, పూతన నుంచి పూతనాగ్రహం, శీతపూతన నుంచి శీతపూతనా గ్రహం, అదితి నుంచి రేవతి (రైవతి) గ్రహం, దితి (ముఖమండిక) నుంచి ముఖమండికా గ్రహం ఇవి పసిపిల్లలను పీడించే మహా గ్రహాలు. పూతన-శిశువులను, శీతపూతన-గర్భాలను, రేవతి బాలకులను, ముఖమండిక పిల్లలను నాశనం చేస్తాయి. ఇవి కుమార గ్రహాలు. కుక్కల తల్లి సరమ పిల్లలను అపహరిస్తుంది. వృక్షాల తల్లి కానుగ చెట్టుపై ఉండి ప్రాణుల్ని కాపాడుతుంది. ఈమె దయగల తల్లి. కొడుకులు కావాలి అనుకునేవారు ఈమెను పూజిస్తారు.

కద్రువ సూక్ష్మరూపంలో గర్భిణీస్త్రీల గర్భంలో ప్రవేశించి శిశువును తినివేయగా పాము పుడుతుంది. గంధర్వులు, అప్సరసల తల్లులు గ్రహాలై గర్భాలను మాయం చేస్తారు.

కుమారస్వామిని పూజించి ఈ గ్రహపీడను నివారించుకోవాలి. మానవుడు మెలకువగా ఉన్నపుడు, నిద్రిస్తున్నపుడు దేవతలను చూస్తే దేవగ్రహం వలన పిచ్చివాడవుతాడు. కూర్చుని ఉన్నపుడు గాని, పడుకుని ఉన్నపుడు గాని పితృదేవతలను చూస్తే పిచ్చి పట్టుంది. సుగంధ ద్రవ్యాలను చూసి పిచ్చివాడైతే అది గంధర్వగ్రహం. ఇలా గ్రహాల వల్ల మనిషి ఉన్మత్తుడు అవుతాడు.

ఆట, తిండి, సంయోగం గ్రహాల లక్షణాలు. డెబ్బై ఏళ్లు నిండే వరకూ గ్రహ బాధలుంటాయి. పరమేశ్వరుని పూజించినవారికి గ్రహబాధలుండవు.

## భద్రవటం వెళ్లి మహిషాసురుని వధించుట

రుద్రుడి వీర్యం అగ్నిలో, సాగరంలో, సూర్య కిరణాలలో, భూమిపై, చెట్లపై పడగా అయిదు గణాలుద్భవించాయి. ధనం కావాలనుకున్న వారు, రోగాలు తగ్గాలనుకునేవారు ఆ అయిదు గణాలను పూజించాలి (జిల్లేడు పూలతో). సంతానం కావాలనుకునేవారు వృక్షాలపై ఉండే 'వృద్ధిక' గణాలను పూజించాలి.

స్కందుడిని చూడడానికి పార్వతీ పరమేశ్వరులు కాలుడు నడుపుతున్న రథంలో రాగా, నర వాహనుడైన కుబేరుడు పుష్పక విమానంలో, ఇంద్రుడు ఐరావతంపై, మృత్యుదేవతతో యముడు, విజయమనే త్రిశూలం, వరుణుడు, ఉత్తమాయుధాలు, దండ కమండలాలు, రుద్రుడు, ఋషులు, దేవతలు, గంధర్వులు, నాగులు, నదులు, సరస్సులు, సముద్రాలు, అప్సరసలు, నక్షత్రాలు, గ్రహాలు, దేవపుత్రులు, అగ్ని, పర్జన్యుడు, ఉమాదేవి పక్కన గౌరి, విద్య, గాంధారి, కేశిని, మిత్ర, సావిత్రి, ఇంద్రాది దేవతల ప్రక్కన నిరుతి, పరమేశ్వర రక్షకుడు పింగళుడు వీరందరితో వెళ్తున్నాడు శివుడు.

శివుడి వెనుక కుమారస్వామి-దేవతల మరుత్స్కంధాలనే ఏడవ వ్యూహాన్ని రక్షిస్తూ ఉండగా-

ఆకాశం మండి, భూమి కంపించి, జగత్తు చీకటిలో మునిగింది. పర్వతాలు, శతఘ్నులు, ప్రాసాలు, ఖడ్గాలు, పరిఘలు, గదలు విసురుతూ దైత్యసేన దేవసేనపై విరుచుకుపడింది. యుద్ధం అతిభయంకరంగా సాగుతున్నపుడు 'మహిషుడు' అనే దైత్యుడు పెద్ద బండనెత్తి దేవతలపైకి విసిరాడు. అతడి ధాటికి తట్టుకోలేక దేవతలు పారిపోతున్నారు.

పరమశివుడు స్మరించగానే కుమారస్వామి వచ్చి భీకరాకారుడైన మహిషాసురునిపై శక్తిని ప్రయోగించి ఆ దైత్యుడి శిరస్సు ఖండించాడు. స్కందుని అనుచరులు రాక్షసులను నిశ్శేషం చేసారు.

మహిషాసురుడిని నిర్జించిన కుమారస్వామిని అందరూ పొగిడారు. ఒక్కరోజులోనే ముల్లోకాలు జయించి అగ్నిపుత్రుడైన స్కందుడు అందరికీ పూజనీయుడైనాడు.

ఆగ్నేయుడు, స్కందుడు, దీప్తకీర్తి, అనామయుడు, ధర్మాత్ముడు, మయూరకేతువు, భూతేశుడు, మహిషాసురమర్దనుడు, కామజిత్తు, కామదుడు, కాంతుడు, సత్యవాక్కు, భువనేశ్వరుడు, శిశువు, శీఘ్రుడు, శుచి, చండుడు, దీప్తవర్ణుడు, శు భానీనుడు, అమోఘ, అనఘ, రౌద్ర, ప్రియ, చంద్రానన, దీప్తశక్తి, ప్రశాంతాత్మ, భద్రకృత్తు, కూటమోహన, షష్ఠీప్రియ, ధర్మాత్మ, పవిత్ర, మాతృవత్సల, కన్యాభర్త, విభక్త, స్వాహేయ, రేవతీసుత, ప్రభువు, నేత, విశాఖ, నైగమేయ, సుదుశ్చర, సువృత, లలిత, ఆకాశచర, బ్రహ్మచారి, శూర, శరణోద్భవ, బాలక్రీడనకప్రియ, విశ్వామిత్రప్రియ, దేవసేనా ప్రియుడని పిలువబడిన కుమారస్వామి అందరి పూజలనందినాడు.

## 13) ద్రౌపదీ సత్యభామా సంవాద పర్వము

సత్యభామ ద్రౌపది ఒకచోట కూర్చుని మాటలాడుకుంటున్నారు. సత్యభామ అడిగింది– "పాండవులు నీకు ఎల్లప్పుడూ వశ్యులైయుంటారు. కారణమేమిటమ్మా? ఏమన్నా మంత్రతంత్రాలు, జప హోమాలు, అంజనాలున్నాయా? ఉంటే చెప్పగలవా! వాటితో నాకు కృష్ణుడు అధీనుడై ఉంటాడు"?

ద్రౌపది నవ్వింది– "నీకు రాకూడని సందేహమిది సత్యా! అతడు అనుమానిస్తే చాలు, మంత్రతంత్రాలు, మూలికలు, వశీకరణ విద్యలు తన భార్య తనపై ప్రయోగిస్తున్నదని– మనసు కుదురు లేకుండా పోతుంది. ఎందరో స్త్రీలు మూలికలు ప్రయోగించడంతో భర్తలు తీవ్ర వ్యాధులకు గురయ్యారు.

ఇంటి బాధ్యతలు దగ్గరుండి చూసుకోవాలి. పతి ఆలోచనల కనుగుణంగా ప్రవర్తించాలి. నా భార్య నన్ను నిండు మనస్సుతో ప్రేమిస్తున్నదని భర్త విశ్వసించాలి.

**నైతాదృశం దైవతమస్తి సత్యే**
**సర్వేషు లోకేషు సదేవకేషు**
**యథా పతిస్తస్య తు సర్వ కామా**
**లభ్యాః ప్రసాదాత్ కుపితశ్చ హన్యాత్** (వన. 234–2)

భార్యకు భర్తవంటి దైవం మరొకరు లేరు. భార్యాభర్తలిరువురు అనుకూలురయితే గృహమే స్వర్గం అవుతుంది".

ద్రౌపదిని మెచ్చుకున్నది సత్యభామ; వనవాసంలో కూడా ఎంతో నిబ్బరంగా ఉన్నందుకు అభినందించింది.

ఉపపాండవులు ద్వారకలో క్షేమంగా ఉన్నారని తెలిపి శ్రీకృష్ణునితో ద్వారకకు వెళ్లింది.

## 14) ఘోషయాత్రా పర్వము

ధృతరాష్ట్రుడికి సంచారులైన బ్రాహ్మణుల వల్ల తెలిసింది– పాండవుల తీర్థయాత్రలు, భీముని సాహసాలు, అర్జునుని దివ్యాస్త్రాలను సంపాదించడాలూ. అరణ్యవాసం పూర్తికావస్తున్నది. దానితో దిగులు పట్టుకున్నది ధృతరాష్ట్రుడికి.

**ధ్రువం ప్రవాస్యత్య సమీరి తోపి**
**ధ్రువం ప్రజాస్యత్యుత్య గర్భిణీ యా**
**ధ్రువం దినాదౌ రజనీ ప్రణాశః**
**తథా క్షపాదౌ చ దిన ప్రణాశః** (వన. 235–25)

గాలి తనంతట తాను ప్రసరిస్తుంది. గర్భవతి నెలలు నిండగానే ప్రసవిస్తుంది. పగలు రాగానే రాత్రి నశిస్తుంది. రాత్రి మొదలు కాగానే పగటి వెలుగు క్షీణిస్తుంది.

అయినా ఈ లోభమెందుకు?

ధృతరాష్ట్రుడనుకుంటున్న మాటలు శకుని విన్నాడు. మిత్రచతుష్టయం చర్చించుకున్నారు. ద్వైతవనంలో ఉన్న పాండవులకు తమ సంపదలను ప్రదర్శించి పాండవులను మరింత దీనస్థితికి నెడదామని ఆలోచించారు.

దుర్యోధనుడన్నాడు– "నా తండ్రి అంగీకరించడు"

కర్ణుడన్నాడు– "ఉపాయం దొరికింది. మన గోవులను చూద్దామన్న నెపంతో ఘోషయాత్ర చేద్దాం!"

శకుని అన్నాడు– "మంచి ఆలోచన. సమంగుడనే గొల్లవాడు 'మన గోవులను లెక్కించాల్సిన సమయం" అన్నాడు.

ధృతరాష్ట్రుడితో అంటే అన్నాడు– "మీరు, పాండవులు ఎదురెదురు పడడం కలహాలకు దారితీస్తుంది. గోగణనకు ఇంకెవరినైనా పంపు".

శకుని అన్నాడు– "మేము పాండవులు ఉన్నవేపు వెళ్లం. ధార్తరాష్ట్రులకు వేటకు వెళ్లాలన్న కోరిక ఉంది. కాని, పాండవులను చూడాలని కాదు. అంతేకాక సత్యవర్తనుడైన ధర్మరాజు షరతులు పూర్తయ్యేవరకు యుద్ధం చెయ్యడు".

ధృతరాష్ట్రుడు ఇష్టం లేకుండానే అనుమతి ఇచ్చాడు. ఎనిమిదివేల రథాలు, ముప్పదివేల ఏనుగులు, తొమ్మిదివేల గుర్రాలు, బండ్లు, దుకాణాలు, గుడారాలు, వణిజులు, వందిమాగధులు, వేటపై ఆసక్తిగలవారు వందలు వేలమంది ద్వైతవనం వేపు బయల్దేరినారు. గోశాలల దగ్గర ఆగి గుడారాలు నిర్మించుకున్నారు, కౌరవులందరికి, కర్ణ, శకునిలకు విడివిడిగా. వందలు వేలుగా ఉన్న గోవులను చూసి ముద్రలు వేయించాడు. దూడలను లెక్కించాడు. గోపాలకులకు బహుమతులిచ్చాడు.

ఆ తరువాత వేటకు వెళ్లారు. ఎన్నో క్రూరమృగాలను చంపినారు. ద్వైతవనపు సరస్సు దగ్గర గుడారాల నేర్పరచమన్నాడు. అదే సమయంలో గంధర్వరాజు తన సేవకులతో అక్కడకు వచ్చి దుర్యోధనుని సైనికులను పారద్రోలాడు. దుర్యోధనుడు కోపించి యుద్ధానికి బయల్దేరాడు. గంధర్వులు ఆయుధాలు చేతబట్టి కౌరవ సైనికులను తీవ్రంగా కొట్టేసరికి అందరూ కకావికలై పారిపోయారు. కర్ణుడు మాత్రం చలించకుండా వందలకొద్దీ గంధర్వులను చావగొట్టినాడు. అతడిని చూసి దుర్యోధనుడు, శకుని, దుశ్శాసన, వికర్ణులు విజృంభించారు.

గంధర్వుల రాజు చిత్రసేనుడు మామూలు యుద్ధం ఆపి మాయాయుద్ధం మొదలెట్టి మాయాస్త్రంతో కౌరవులను మూర్ఛిల్ల చేయగా ఒక్కొక్క కౌరవ సైనికుడు చుట్టూ పదిమంది గంధర్వులు చుట్టుముట్టినారు. కర్ణుడు భీకరంగా పోరాడుతుంటే ఒక్కుమ్మడిగా గంధర్వులు వచ్చి గుర్రాల్ని, రథాన్ని విరగగొట్టేసరికి కర్ణుడు వికర్ణుడి రథంపైకి దూకి వాళ్లను తప్పించుకున్నాడు. చిత్రసేనుడు అతడి సైనికులు దుర్యోధనుని అన్ని దిక్కులా చుట్టుముట్టి బంధించారు. దుశ్శాసనుడు, వివింశతి వాళ్లకు దొరికిపోయారు. కౌరవ సోదరులను, రాజస్త్రీలను బంధించి తీసుకుపోతుంటే కొందరు మంత్రులు అటూ ఇటూ పరిగెత్తి ధర్మరాజు సాద్యస్కమనే యాగం చేస్తున్నచోటుకు వచ్చి లబలబలాడుతూ మొత్తుకున్నారు.

దుర్యోధనుని మంత్రులు ఆ విధంగా ధర్మరాజును అభ్యరిస్తుంటే భీముడన్నాడు-

**మహితా హి ప్రయత్నేన సంనహ్యా గజవాజి భిః**
**అస్మాభిర్యదనుష్ఠేయం గంధర్వైస్తదనుష్ఠితమ్** (వన. 242-14)

"కాగల కార్యాన్ని గంధర్వులే చేసారు. ఏదో చేయాలనుకున్నాడు మరేదో జరిగింది. అధర్మమార్గాన పోయేవారికి పరాభవం తప్పదు" అన్నాడు భీముడు.

"పరుష వాక్యాలకిది సమయం కాదు" అన్నాడు ధర్మరాజు.

"ఇతరులు అవమానిస్తుంటే మనం నూట అయిదుగురం. మనలో మనకు వైరుధ్యమేర్పడితే వారు నూరుగురు మనం అయిదుగురం-

**పరైః పరిభవే ప్రాప్తే వయం పంచోత్తరం శతమ్**
**పరస్పర విరోధే తు వయం పంచ శతం తు తే**

భీమసేనా! శరణాగత రక్షణం క్షత్రియధర్మం!"

భీముడన్నాడు- "పాత జ్ఞాపకాలు నన్ను వదలడం లేదు".

అర్జునుడన్నాడు- "అన్నా, వెళ్లి అతడిని విడిపిద్దాం. సైనికులు తెచ్చిన రథాలనెక్కి భీమార్జున నకుల సహదేవులు గంధర్వులపై దాడికి దిగారు. పోరు ఘోరమైంది. కర్ణుడిపై, దుర్యోధనుడిపై మూకుమ్మడి దాడిచేసి ఓడించినట్లు పాండవులపై అదే తంత్రాన్ని వాడబోయారు. కాని, అర్జునుడి శరవర్షానికి వారి దరిదాపుల్లోకి రాలేకపోయారు.

పాండవులు దివ్యాస్త్రాలను ప్రయోగిస్తుంటే తట్టుకోలేక గంధర్వులు ధార్తరాష్ట్రులను తీసుకుని ఆకాశమార్గాన ఎగిరిపోయారు. అర్జునుడు స్థూణాకర్ణం, ఇంద్రజాలం, సౌరం, ఆగ్నేయం, సౌమ్యం అనే అస్త్రాలతో గంధర్వులను దహించి, వారిని దిగ్బంధనం చేసాడు శర పరంపరతో.

చిత్రసేనుడు ప్రయోగించిన దివ్యాస్త్రాలను అర్జునుడు తిప్పికొట్టాడు. అతడు అంతర్ధాన విద్యను ప్రదర్శిస్తే ఇతడు శబ్దవేధి బాణాలతో చిత్రసేనుడిని గాయపరచాడు. అప్పుడు చిత్రసేనుడు గ్రహించాడు యుద్ధం చేస్తున్నది తన మిత్రుడు, శిష్యుడు అర్జునుడని.

చిత్రసేనుడన్నాడు– "దుర్యోధనుని దురాలోచనను గమనించి నన్ను దేవేంద్రుడు పంపినాడు. వీళ్లు ద్రౌపదిని, మిమ్మల్ని గేలి చెయ్యాలని వచ్చారు. దేవేంద్రుని ఆజ్ఞ ప్రకారం నేను ఇతడిని తీసుకుపోవాల్సిందే!"

అర్జునుడన్నాడు– "మా అన్నగారి దగ్గరకు వెళ్దాం"

యుధిష్ఠిరుడన్నాడు– "గంధర్వరాజా! మా సోదరుడైన దుర్యోధనునికి, బంధుజనానికి ఏ ఆపదా కలిగించలేదు. అది మా అదృష్టం. మమ్మల్ని ఆశీర్వదించండి"

యుధిష్ఠిరుడికి నమస్కరించి గంధర్వులు నిష్క్రమించారు.

బంధవిముక్తుడైన దుర్యోధనుడితో యుధిష్ఠిరుడు ప్రేమగా అన్నాడు–

**మాస్మ తాత పునః కార్షీః ఈదృశం సాహసం క్వచిత్**
**నహి సాహస కర్తారః సుఖమేధంతి భారత** (వన. 246–22)

ఇటువంటి సాహసాలు చేయకు నాయనా! సాహసికులకు సుఖముండదు"

ధర్మజుడికి నమస్కరించి దుర్యోధనుడు ఇంటికి వెళ్లాడు. దారిలో ఒకచోట ఆగి విశ్రాంతి తీసుకుంటుండగా యుద్ధ సమయంలో వికర్ణుడి రథంలో దూరంగా తొలగిపోయిన కర్ణుడు వెనక్కి వచ్చి– "గొప్ప విషయం! కామరూపులైన గంధర్వులను గెలిచావు" అన్నాడు అమాయకంగా. దుర్యోధనుడన్నాడు– "నిజానికి మనం ఓడిపోయాం. వాళ్లు మాయాయుద్ధం చేసి మమ్మల్ని బందీలుగా తీసుకుపోతుంటే భీమార్జున నకుల సహదేవులు వారిని అడ్డగించారు. అర్జునుడు గంధర్వరాజు చిత్రసేనుడు మిత్రులట. దానితో వాళ్లూ వాళ్లూ ఒకటైపోయారు. చిత్రసేనుడు మన ఘోషయాత్రలోని మర్మం చెప్పేసరికి నాకు తల కొట్టేసినట్లయ్యింది. అదీ మన స్త్రీల ముందు అవమానం. పాండవులకు నిత్యశత్రువును నేను. అయినా వాళ్లు నన్ను విడిపించారు. ఈ యుద్ధంలో చనిపోయినా బాగుండేది.

దుశ్శాసనా! నిన్ను యువరాజుగా అభిషేకిస్తున్నాను. కర్ణ శకునుల సాయంతో ఈ విశాల సామ్రాజ్యాన్ని పాలించు" అని పలికి ప్రాయోపవేశానికి సిద్ధపడినాడు దుర్యోధనుడు.

కర్ణుడు చెప్పినా వినలేదు. శకుని చెప్పినా వినలేదు. దుశ్శాసనాదులు పాదాలపై పడి వేడుకున్నా కరగలేదు. స్నాన భోజనాలను వర్జించి, నారబట్టలు ధరించి దర్భాసనాన్ని పరచి నేలపై కూర్చుని ప్రాణత్యాగానికి నిర్ణయించుకున్నాడు.

ఇది తెలిసిన పాతాళవాసులైన దైత్యులు, దానవులు ఆ రాత్రి దుర్యోధనుడిని తమ వద్దకు రప్పించడానికి 'కృత్య' రాక్షసిని పంపారు. దుర్యోధనుడు తమవద్దకు వచ్చినాక అతడికి అనేక విధాల నచ్చచెప్పి 'గెలుపు నీదే' అని బోధపరచి, అతడి మనసును శాంతపరచి, మరల 'కృత్య'తో అదే ప్రదేశానికి పంపినారు.

తెల్లవారినాక దుర్యోధనుడి మనస్సు కాస్త శాంతపడింది. కర్ణుడన్నాడు– "పదమూడవ సంవత్సరం పూర్తికాగానే ఈ పాండవులను తెచ్చి నీ కాళ్లమీద పడవేస్తాను".

ఆ విధంగా శకుని, కర్ణుడు, సోదరులు తనను బ్రతిమలాడడంతో, దుర్యోధనుడు దైత్యుల మాటనూ తలుచుకుని ప్రాయోపవేశాన్ని వీడి, తేలికైన మనసుతో లేచాడు.

హస్తినాపురానికి చేరుకున్నాక భీష్ముడతడిని మందలించాడు. దుర్యోధనుడు అతడి మాటలను తేలికగా తీసుకుని నవ్వి వెళ్లిపోయాడు.

కర్ణుడన్నాడు– "భీష్ముడు అందరిముందు నిన్ను నిందిస్తూ పాండవులను పొగడడం నాకిష్టంలేదు. నాకు అనుమతి ఇవ్వు. పాండవులు నలుగురు గెలుచుకున్న భూమిని నేను నీకోసం ఒంటరిగా గెలుచుకువస్తాను. అంతులేని ధనరాశుల్ని నీ ముందు ఉంచుతాను".

దుర్యోధనుడన్నాడు– "ధన్యుడిని. ఇదే కదా స్నేహం! నా జన్మ సఫలమయ్యింది.

**ధన్యోస్మ్యను గృహీతోస్మి యస్య మే త్వం మహాబలః**
**హితేషు వర్తసే నిత్యం సఫలం జన్మ చాద్యమే** (వన. 253–25)

## కర్ణుని దిగ్విజయ యాత్ర

మేటి విలుకాడైన కర్ణుడు గొప్ప సేనను వెంటబెట్టుకుని వెళ్లి ద్రుపదుడిని ఓడించి అతడి నుంచి, అతడి అనుయాయులైన రాజుల చేత కప్పం కట్టించాడు. భగదత్తుడిని, హిమాలయ ప్రాంతపు రాజుల్ని, నేపాల రాజుల్ని, వంగ, కళింగ, శుండిక, మిథిల, మాగధ, కర్కఖండ, అవశీర, యోధ్య, అరూక్షత్ర, వత్స, కేవల, మృత్తికావతి, మోహన, పత్తన, త్రిపురి, కోసల రాజులను గెలిచాడు. దక్షిణదిక్కున రుక్మితో యుద్ధం చేయగా రుక్మి అతడిని మెచ్చుకుని ఎంతో బంగారాన్నిచ్చాడు. కేరళ, నీల, ఇతర రాజులను ఓడించాడు. శిశుపాలసుతుడిని, అవంతీరాజును ఓడించాడు. వృష్ణి వంశస్థులతో చెలిమి కోరి, పశ్చిమదిక్కున బర్బర యవనులతో కప్పం కట్టించి తూర్పు దేశాల–మ్లేచ్ఛ, ఆటవిక, గిరిజన, భద్ర, రోహితక, గణ రాజ్యాలను గెలిచి నాలుగు దిక్కులు గెలిచిన సంబరంతో హస్తినకు చేరుకుని అశేష ధనరాశులను దుర్యోధనుని పాదాల చెంత ఉంచాడు. దుర్యోధనుడన్నాడు– "కర్ణా! నీవల్లనే నేను సనాధుడనైనాను".

**బహునా చ కిముక్తేన శృణు కర్ణ వచో మమ**
**సనాథోస్మి మహాబాహో త్వయా నాథేన సత్తమ** (వన. 254–26)

తాను తెచ్చిన ధనరాశులను గాంధారీ, ధృతరాష్ట్రుల ముందుంచాడు. ధృతరాష్ట్రుడు ప్రేమపూర్వకంగా కర్ణుని కౌగిలించి విడిచాడు. ఆ రోజునుంచి దుర్యోధన, శకుని, తదితరులు యుద్ధంలో కర్ణుడు తమ శత్రువులైన పాండవులను గెలిచినట్లే భావించారు.

దుర్యోధనుడన్నాడు– "ధర్మరాజు చేసిన రాజసూయ యాగం చూసినాక నాకూ కోరిక కలిగింది".

కర్ణుడన్నాడు– "ఋత్వికులను పిలిచి యాగం చేద్దాం".

ఋత్విక్కులన్నారు– "జీవించి ఉన్న తండ్రి రాజసూయ యాగం చెయ్యకుండా కొడుకు రాజసూయ యాగం చెయ్యరాదు. దానికి సమానమైన క్రతువు ఉన్నది. రాజులు చెల్లించిన కప్పంతో బంగారు నాగలి చేయించి వైష్ణవయాగం చేస్తే అది రాజసూయ యాగంతో సమానమైనది. అడ్డంకులు లేనిది".

దుర్యోధనుడిని అందరూ అభినందించారు. విదురుడు, భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, ధృతరాష్ట్రుడు, గాంధారి ఆనందించారు.

## వైష్ణవ యాగం

దుర్యోధనుని వైష్ణవ యాగానికి తరలిరండని సమస్త రాజులకూ ఆహ్వానాలు వెళ్లాయి. తన వద్దకు వచ్చిన దూతతో ధర్మజుడన్నాడు– "మాకూ రావాలనే ఉన్నది కాని, వనవాస, అజ్ఞాతవాసాలింకా పూర్తికాలేదు కదా!"

భీముడన్నాడు– "అవి పూర్తి అయినాక రోషాగ్నితో వస్తాము"

దూతలు వెళ్లి ఆ విషయాన్ని దుర్యోధనునికి చెప్పారు. వైష్ణవయాగం అద్భుతంగా జరిగింది.

కర్ణుడన్నాడు– "అభినందనలు. వైష్ణవయాగం నిర్విఘ్నంగా జరిగింది. పదమూడు సంవత్సరాలు పూర్తయ్యాక మీరు రాజసూయ యాగం చేసినపుడు మరల ఇదేవిధంగా అభినందిస్తాను".

దుర్యోధనుడన్నాడు– "ఖచ్చితంగా, మీరంతా ఉండగా నేను చేయలేని కార్యమేమి ఉన్నది?"

కర్ణుడన్నాడు– "రాజా! అర్జునుని చంపేవరకు నేను ఎవ్వరి చేతా కాళ్లు కడిగించుకోను. నీటిలో పుట్టిన దేనినీ తినను, ఆసురవ్రతాన్ని చేబడతాను. ఎవరైనా యాచిస్తే 'లేదు' అనను".

ధార్తరాష్ట్రులు హర్షధ్వానాలు చేసారు.

ధర్మరాజుకు కర్ణుని ప్రతిజ్ఞ తెలిసి చింతాక్రాంతుడైనాడు. పాములు, జంతువులు విశేషంగా ఉన్న ద్వైతవనాన్ని వీడిపోవాలన్న ఆలోచన కలిగింది.

ఘోషయాత్ర పరాభవం తరువాత దుర్యోధనుడికి ఎంతో మనశ్శాంతి కలిగిందిప్పుడు. ఆనందంగా ఉంటూ పాలన చేస్తున్నాడు.

ధనం దానం చేసినపుడు, అనుభవించినపుడే సఫలము అవుతుందని సోదరులకు విశేష భోగాలను అనుభవింప జేసాడు. రాజులతో, బ్రాహ్మణులతో, ప్రజలతో సత్సంబంధాల నేర్పరుచుకున్నాడు.

**భ్రాతౄణం చ ప్రియం రాజన్ స చకార పరంతపః**
**నిశ్చిత్య మనసా వీరః దత్త భుక్త ఫలం ధనమ్** (వన. 257-28)

## 15) మృగ స్వప్నోద్భవ పర్వము

ఒకరోజు రాత్రి ధర్మరాజుకు కలలో కన్నీటితో ప్రార్థిస్తున్న మృగాలు కనిపించాయి. అవి అన్నాయి- "భారతా! ద్వైతవనంలో చావగా మిగిలిన మృగాలం మేము. మీరు మీ నివాస స్థలాన్ని మార్చుకోగలరు".

ధర్మజుడు- "అలాగే" అని వాటికి అభయమిచ్చాడు. ఏడాదిపై ఎనిమిది నెలలు ద్వైతవనంలో ఉన్న పాండవులు మరుభూమికి శిరః స్థానంలో ఉండి తృణబిందు సరోవర సమీపంలో ఉన్న కామ్యక వనానికి వెళ్లారు.

## 16) వ్రీహి ద్రౌణిక పర్వము

వనవాసంలో పదకొండేళ్లు గడిచాయి. కామ్యక వనంలో ఉన్న పాండవులను వ్యాసుడు వచ్చి కలిసాడు. దానం చేయడం వలన వచ్చే ఫలితాలను వివరించాడు- "ముద్గలుడనే ముని శిలోంఛవృత్తి చేసి జీవించేవాడు. పొలంలో రైతులు వరి కోసం తీసుకుని వెళ్లిపోయాక చెదిరిపడిన గింజలను ఏరుకోవడానిని ఉంఛవృత్తిగా, కంకులను ఏరుకోవడం 'శిలా' వృత్తిగా భావిస్తారు. పావురం ఒక్కొక్క గింజ ఏరినట్లు ఏరుకుని ద్రోణం నిండుగా ధాన్యాన్ని సంపాదించేవాడు పదిహేను రోజులు కష్టపడి. పక్షంలో ఒక్కరోజు ఆహారం తీసుకునేవాడు. అమావాస్యకు పౌర్ణమికి యజ్ఞాలు చేస్తూ దేవతలకు, అతిథులకు పెట్టగా మిగిలిన అన్నంతో జీవనం గడుపుతూ ఉన్నాడు.

వ్రీహిద్రోణ ధాన్యపు అన్నమే వడ్డించినకొద్దీ వృద్ధిచెంది నూరుగురు అతిథులకు సరిపోయేది. దుర్వాసుడికి ఈ విషయం తెలిసి పిచ్చివాడిలా, బోడితలతో వచ్చి, పరుషవాక్కులు మాట్లాడుతూ ముద్గలుడి వద్దకు వచ్చి ఆకలిగా ఉంది అన్నాడు.

ముద్గలుడు అన్నం పెట్టాడు. దుర్వాస మహర్షి పెట్టింది తినేసి ఇంకా కావాలన్నాడు. మొత్తం తిని మిగిలింది ఒంటికి రాసుకుని ఎలా వచ్చాడో అలానే వెళ్లిపోయాడు. మరల తర్వాత పర్వదినం నాడు వచ్చాడు. ఇంటిలో ఉన్న అన్నమంతా తినేసాడు.

ముద్గలుడు నిరాహారుడై ఉన్నా పోయి ధాన్యం ఏరి పోగుచేస్తున్నాడు. అతడికి కోపం రాలేదు. ఇలా దుర్వాసుడు ఆరుసార్లు వచ్చాడు. అయినా ముద్గలుడు కోపించలేదు.

దుర్వాసుడతడిని ఆశీర్వదించాడు. స్వర్గానికి తీసుకువెళ్లడానికి దేవదూత విమానం తెచ్చాడు.

ముద్గలుడడిగాడు- "స్వర్గంలో ఏముంటుంది? నేనెందుకు వెళ్లాలి?"

దేవదూత అన్నాడు- "నీ పుణ్యఫలం ఉన్నంత వరకు స్వర్గసుఖాలనుభవిస్తావు. మరల నీ కర్మను బట్టి భూలోకం వస్తావు. భూలోకం కర్మభూమి. స్వర్గలోకం ఫలభూమి".

**ఇహాయత్ క్రియతే కర్మ తత్ పరత్రోప భుజ్యతే**
**కర్మ భూరి రియం బ్రహ్మన్ ఫలభూమి రసౌ మతా** (వన. 261-35)

ముద్గలుడన్నాడు- "నాకు స్వర్గమక్కర్లేదు. శోకం, వ్యథ, చలనం లేని చోటుకు వెళ్లాలనేది నా అన్వేషణ".

ఆ తరువాత కూడా ముద్గలుడు శిలాఉంఛ వృత్తితో యథావిధిగా కాలం గడుపుతూ నిందాస్తుతులను, రాయి బంగారంలను సమభావంతో చూస్తూ ధ్యానయోగంతో కాలం గడిపి మోక్ష స్వరూపమైన శాశ్వత పరమసిద్ధిని పొందినాడు"

అని వ్యాసుడు ధర్మరాజుకు ముద్గలుడి వృత్తాంతాన్ని వివరించాడు.

# 17) ద్రౌపదీ హరణ పర్వము

## దుర్వాసుడు - అక్షయపాత్ర

సూర్య భగవానుడిచ్చిన అక్షయపాత్ర సహాయంతో అన్నార్థులై వచ్చిన అతిథులందరికీ షడ్రసోపేతమైన భోజనాన్ని వడ్డిస్తూ ద్రౌపది ఎంతో చక్కగా అతిథి మర్యాదలనందిస్తున్నది.

ఒకరోజున దుర్వాసుడు పదివేల మంది శిష్యులతో హస్తినాపురానికి వచ్చాడు. ముక్కోపి అయిన దుర్వాసమునికి దుర్యోధనుడే స్వయంగా స్వాగతం చెప్పి ఎంతో గౌరవించి పూజలు సలిపి ఘనంగా సత్కరించాడు. హస్తినలో ఉన్నన్నాళ్లూ దుర్యోధనుని రకరకాలుగా పరీక్షించాడు– "ఆకలిగా ఉంది భోజనం పెట్టు" అని ఎక్కడికో పోయి వచ్చేవాడు కాదు. వచ్చినా ఇది బాలేదు అది బాగోలేదు అంటూ తిట్టేవాడు. లేకుంటే "ఈరోజు అన్నం తినను నాకు ఆకలి లేదు" అనేవాడు. బయటకు పోయినవాడు అర్ధరాత్రి వచ్చి "అన్నం పెట్టు" అని బెదిరించేవాడు. అయిన దుర్యోధనుడు చిరాకు పడక ఎంతో ఓపికతో దుర్వాసమునిని సేవించాడు.

దుర్వాసుడు సంతోషించి వరం కోరుకొమ్మన్నాడు. ఇవన్నీ ఇంతకు ముందే మిత్రచతుష్టయం ఆలోచించి ఉన్నారు కనుక– "నన్ను పరీక్షించినట్లే నా సోదరుడు ధర్మరాజునూ పరీక్షించి మా యోగ్యతలను గుర్తించండి" అన్నాడు. ఇటువంటి పరీక్షలు పెట్టడమంటే దుర్వాసుడికి ఇష్టమే కనుక వేళకాని వేళలో పాండవుల వద్దకు తన పదివేల మంది శిష్యులతో వెళ్లి– "ఆకలిగా ఉంది" అన్నాడు.

"మీ ఆహ్నికం పూర్తి చేసుకుని రండి, మునివర్యా!" అన్నాడు ధర్మరాజు. అతడి గుండె లబలబలాడుతున్నది. ద్రౌపదికి ఏం చెయ్యాలో తోచలేదు. అందరి భోజనాలు అయ్యాక అక్షయపాత్రను కడిగి బోర్లించిందామె. ఇప్పుడెలా? ఆమె కృష్ణుని ధ్యానించింది మనసులో. ఆపదను గ్రహించిన కృష్ణుడు పక్కనే ఉన్న రుక్మిణితో కూడా చెప్పకుండా త్వరగా వచ్చాడు.

ద్రౌపది తన అన్నకు నమస్కరించి వచ్చిన ముని గురించి చెప్పింది. శ్రీకృష్ణుడన్నాడు– "అమ్మా! నాకు ఆకలిగా ఉన్నది. అన్నం పెట్టు!". ద్రౌపది కన్నీళ్లు పెట్టుకుంది– "ఎప్పుడూ ఏమీ అడగనివాడివి, అడిగావు. ఇంట్లో అన్నం లేదు. ఆ మునులకేమివడ్డించాలా అని నిన్ను తలచుకున్నాను అన్నా! నీవే అన్నం పెట్టమంటే నేనేమి చెయ్యాలి?" అన్నది దుఃఖిస్తూ ద్రౌపది.

"పోయి అక్షయపాత్ర పట్టుకుని రా, అమ్మా!" అన్నాడు లీలామానుష విగ్రహుడు కృష్ణుడు.

ఆమె వెళ్లి అక్షయపాత్ర తెచ్చింది. పాత్ర అంచుకు అంటుకుని ఉన్న తోటకూర ఆకుముక్కను చూపించి దానిని తిని బ్రేవ్‌మని తేన్చాడు పరమాత్మ.

**ఉపయుజ్యా బ్రవీదే నామ్ అనేన హరిరీశ్వరః**
**విశ్వాత్మా ప్రీయతాం దేవః తుష్టశ్చాస్త్వితి యజ్ఞభుక్** (వన. 263-25)

ధర్మరాజు సహదేవుడిని పంపాడు దుర్వాసమునిని, శిష్యులను తీసుకురమ్మని. అప్పటికే స్నానం చేస్తున్న దుర్వాసుడికి, శిష్యులకు కడుపు నిండినట్లయ్యింది. భుక్తాయాసం ఏర్పడింది. గబగబా స్నానం చేసి బయటపడిన మునికి అసలు సంగతి అర్థమయ్యింది. "వాసుదేవుడు వచ్చినట్లున్నాడు. పాండవులకు రక్ష అతడు. మనం ఇక్కడ నుంచి వెళ్లిపోదాం"

అని పలికి దేవనది నుంచి వేగంగా వెళ్లిపోయారు సహదేవుడు పిలుస్తున్నా వెనక్కి తిరిగి చూడకుండా. పాండవులకు శుభం కలగాలని పలికి శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్లిపోయాడు.

## సైంధవుడు - ద్రౌపదీహరణం

కామ్యకవనంలో తృణబిందు ఆశ్రమంలో పాండవులున్నారు. ఒకరోజున పాండవులు వేటకు వెళ్లిన సమయంలో జయద్రథుడు (సింధుదేశపు రాజు, దుశ్శల భర్త) వివాహేచ్ఛతో శాల్వ దేశానికి పెక్కురు రాజులతో కలిసి వెళ్తున్నాడు. తృణబిందు ఆశ్రమం వద్ద ద్రౌపదిని చూసి మోహపరవశుడై కోటికాస్యుడనే రాజును ఆమెవద్దకు పంపి ఆమె పాండవుల పత్ని ద్రౌపది అని తెలుసుకున్నాడు.

జయద్రధుడు తన ఆరుగురు సోదరులతో కలిసి వెళ్లి తనతో రమ్మన్నాడు– "మేము 17 గుణాలున్న ఉత్తమ వంశంలో పుట్టాము. వ్యవసాయం, వ్యాపారం, దుర్గం, వంతెనలు కట్టడం, ఏనుగులను బంధించడం, అగడ్తలను రక్షించడం, పన్నులు వసూలు చేయడం, నిర్జన ప్రదేశాలను ఏర్పరచడం అనే సంధాన కర్మలు ఎనిమిది, ఆరు గుణాలు– శౌర్యం, తేజస్సు, ధృతి, దయ, దానం, ఐశ్వర్యం, శక్తులు, సిద్ధులు; ఉదయాలు మూడు– ప్రభు, మంత్ర, ఉదయాలు; ఆరు గుణాలలో పాండవుల కన్నా అధికులం. ద్రౌపదీ, ఈ అడవులలో నీలాంటి సౌందర్యవతి అల్పులతో ఉండరాదు. అన్నిటా అధికుడనైన నా భర్యవు కమ్ము".

ద్రౌపది అన్నది– "నీవు నాకు సోదరుడివి. ఈ నీచబుద్ధి మాని, నీ దారిన నీవు పో!"

జయద్రధుడు ఆమెను పట్టుకోబోతే ఆమె నెట్టేసరికి కింద పడ్డాను. లేచి ఆమెను బలవంతాన రథం ఎక్కేలా చేసాడు. ఇంతలో ధౌమ్యుడు వచ్చి అరుస్తూనే ఉన్నాడు.

పాండవులకు అక్కడ ఉత్పాతాలు తోచి కామ్యకవనం వేపు వచ్చారు. ద్రౌపది దాసి ధాత్రేయిక, ఏడుస్తూ అన్నది– "జయద్రధుడు ద్రౌపదిని అపహరించాడు. ధౌమ్యుడు వారి వెనక పరిగెడ్తున్నాడు, ద్రౌపదిని వదిలెయ్యమని మొత్తుకుంటూ"

పాండవులు అతివేగంగా రథాలు వెళ్లిన దారినే తమ రథాల్లో బయల్దేరినారు. జయద్రధుడడిగాడు తమవేపు వస్తున్న రథాలను చూసి వారెవరని ద్రౌపదిని.

"మధురంగా మ్రోగుతున్న నందోపనందకములనే మృదంగములు కల రథమెక్కి వస్తున్నాడు మేలిమి పసుపుఛాయ, సమున్నతమైన ముక్కు, విశాల నేత్రాలు– అతడు యుధిష్ఠిరుడు.

ఏపుగా ఎదిగిన మద్దిమాకులా బాహువులున్నవాడు, కనుబొమలు ముడివేస్తూ పళ్లు కొరుకుతూ రథస్థుడై వస్తున్నవాడు, ఆజానేయములనే గుర్రాలు లాగుతున్న రథము కలవాడు, అతిమానుషములైన పనులు చేసే భీముడు.

అతడు ధనంజయుడు, ధనుర్ధారులలో అగ్రగణ్యుడు –అర్జునుడు.

ఆ అత్యంత సుందరుడు నకులుడు, అడుగో అద్వితీయ వీరుడు సహదేవుడు – ఈరోజు నీకు మూడింది, సిద్ధంగా ఉండు" అన్నది ద్రౌపది.

శిబి, సౌవీర, సింధు సైనికులు ప్రయోగించారు శక్తి, తోమర, నారాచాలు. కోటికాస్యుడు భీముని రథాన్ని చుట్టు ముట్టినాడు. పాండవులను చుట్టుముట్టిన వీరులందరూ కొద్ది నిముషాల్లోనే దారుణంగా దెబ్బలు తిన్నారు. పెళ్లికి పోతున్న వాళ్లకు ఇంకోరకమైన పెళ్లి కామ్యకవనంలో జరిగింది. త్రిగర్తరాజు, క్షేమంకరుడు, మహాముఖుడు, సురధుడు, కోటికాస్యుడు మరణించేసరికి జయద్రధుడు ద్రౌపదిని రథం నుండి దించి అడవిలోకి పారిపోయాడు.

## 18) జయద్రధ విమోక్షణ పర్వము

ద్రౌపది, ధర్మరాజు, ధౌమ్యుడు, నకుల, సహదేవులను ఆశ్రమానికి పంపి భీమార్జునులు జయద్రధుని వెంబడించారు. అర్జునుడు అతడి గుర్రాలను చంపేసరికి జయద్రధుడు వణికిపోయాడు. రథం దిగి ప్రాణభయంతో పరిగెడ్తున్న జయద్రధుడిని భీముడు పట్టుకుని ఎడాపెడా వాయించాడు. చావచితకగొట్టినాడు.

అర్జునుడన్నాడు– "అన్న ధర్మరాజు చెప్పిన మాటలు గుర్తున్నాయి కదా! వీడు మన చెల్లెలు దుశ్శల భర్త. ప్రాణాలతో వదిలేయి".

భీముడన్నాడు– "నీవు, ధర్మరాజు ఒకేరకం. దయాళువులు. కథ మంచి రసపట్టులో ఉన్నపుడు ఆపుతారు"

అని కత్తితో జయద్రధుడి జుట్టును పంచశిఖలుగా కత్తిరించాడు భీముడు. వణుకుతున్న జయద్రధుడితో అన్నాడు– "ఇక నుంచి నీవు సభలలో, జనులముందు 'నేను దాసుడను' అని చెప్పాలి. ప్రమాణం చెయ్యి లేకుంటే ప్రాణ ప్రమాదం జరుగుతుంది" అన్నాడు పిడికిటితో పొడుస్తూ.

"అలాగే!" అని తల ఊపినాడు జయద్రధుడు. అతడిని తీసుకుని యుధిష్ఠిరుడికి, ద్రౌపదికి చూపించారు.

"వీడు పాండవుల దాసుడు" అన్నారు భీమార్జునులు. యుధిష్ఠిరుడు, ద్రౌపది "ఈ దాసుడిని వదిలిపెట్టు" అన్నారు.

జయద్రథుడు అక్కడున్న వారికందరికి దాసుడిలా వందనం చేసాడు. యుధిష్ఠిరుడన్నాడు– "నీవు చేసింది నీచకార్యం. ఇప్పటినుంచైనా ధర్మపరుడిగా జీవించు!"

అవమాన భారంతో వెళ్లిన జయద్రథుడి శివుడి గురించి గొప్ప తపస్సు చేసి– "రథసహితులైన పంచపాండవులను జయించాలి నేను" అని వరం అడిగాడు. శివుడన్నాడు– "అది సాధ్యం కాదు. ఒక్కరోజు మాత్రం నీవు అర్జునుడు తప్ప మిగతా నలుగురు పాండవులను అడ్డగించగలవు".

ఆ వరాన్ని పొంది జయద్రథుడు ఆనందంగా తన ఇంటికి వెళ్లాడు.

## 19) రామోపాఖ్యాన పర్వము

కామ్యకవనంలో మునులందరూ పాండవుల కష్టాలకు సంతాపం తెలుపుతుండగా మార్కండేయ మహామునిని ధర్మరాజు అడిగాడు– "నాలాంటి దురదృష్టవంతుడెవరైనా ఉన్నారా?"

మార్కండేయుడు చెబుతున్నాడు–

**ప్రాప్తమ ప్రతిమం దుఃఖం రామేణ భరతర్షభ**
**రక సా జానకీ తస్య హృతా భార్యా బలీయసా** (వన. 274–1)

"శ్రీరామచంద్రుడు వనవాసం చేస్తున్నపుడు రావణుడు అపహరించాడు శ్రీరాముడి భార్య సీతాదేవిని. శ్రీరాముడు వానరసైన్యం సాయంతో సముద్రంపై వంతెన నిర్మించి లంకకు పోయి రావణుని చంపి సీతను విడిపించుకు తెచ్చుకున్నాడు".

ధర్మరాజడిగాడు– "రామరావణ యుద్ధం ఎలా సంభవించింది?"

మార్కండేయుడు వివరించాడు–

"బ్రహ్మమానస పుత్రుడు పులస్త్యుడు. పులస్త్యుడికి ఇళవిద (దేవవర్ణిని) యందు కుబేరుడు జన్మించాడు. కుబేరుడినే వైశ్రవణుడు అని పిలుస్తారు. ఇతడు రాజరాజు.

పులస్త్యుడి మరోరూపం విశ్రవసుడు. ఇతడికి ముగ్గురు భార్యలు– పుష్పోత్కట, రాక, మాలిని.

పుష్పోత్కట కుమారులు– రావణ, కుంభకర్ణులు.

మాలిని కుమారుడు– విభీషణుడు

రాకకు ఖరుడు కుమారుడు, శూర్పణఖ–కుమార్తె. బ్రహ్మ గురించి తపస్సు చేసి రావణుడు వరం కోరుకున్నాడు– గంధర్వులు, దేవతలు, అసురులు, యక్షులు, రాక్షసులు, సర్పాలు, కిన్నరులు, భూతాలు –వీరెవరి వలనా నాకు పరాజయం ఉండరాదు (మానవులను అతడు చులకనగా భావించాడు).

కుంభకర్ణుడు– చక్కటి నిద్రను కోరుకున్నాడు.

విభీషణుడు– ధర్మబుద్ధిని, అమరత్వాన్ని బ్రహ్మాస్త్రాన్ని వరాలు పొందగానే దశగ్రీవుడైన రావణుడు చేసిన మొదటి పని– కుబేరుడిని లంక నుంచి వెళ్లగొట్టినాడు. పుష్పక విమానం లాక్కున్నాడు. సమస్త లోకాలను భయపెట్టి అరిపించాడు కనుక రావణుడు అనిపించుకున్నాడు.

రావణుడు కామరూపధరుడు, కామబలుడు, కామగమనుడు, కామేచ్ఛ కలిగినవాడు. అతడు దుర్మార్గుడై దేవతలను పీడించసాగినాడు. బ్రహ్మర్షులు, సిద్ధులు, దేవర్షులు అతడి క్రూరత్వాలకు విసిగి బ్రహ్మతో మొరబెట్టుకున్నారు.

బ్రహ్మ అన్నాడు– "విష్ణువు ద్వారపాలకులైన జయ, విజయులు రావణ కుంభకర్ణులుగా జన్మించారు. వీరిని చంపడానికి శ్రీమహావిష్ణువు రాముడిగా అవతరిస్తాడు.

ఇంద్రాది దేవతలు– ఎలుగుబంట్లు, వానరులై జన్మిస్తారు. దుందుభి అనే గంధర్వస్త్రీ 'మంధర' అనే కుబ్జగా జన్మించింది".

అయోధ్యకు ప్రభువైన దశరథ మహారాజుకు ముగ్గురు భార్యలు– కౌసల్య, సుమిత్ర, కైకేయి; కౌసల్య పుత్రుడు రాముడు, కైకేయి పుత్రుడు భరతుడు; సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులు పుత్రులు.

శ్రీరాముడికి యువరాజ పట్టాభిషేకం చెయ్యాలని దశరథుడు తలచినపుడు మంథర తన యజమానురాలు కైకేయికి చెడుతలపు నూరిపోసి దశరథుడు పూర్వంలో ఇచ్చిన వరాన్ని గుర్తు చేసింది.

కైకేయి ఆ వరాన్ని గుర్తు చేయగానే దశరథుడు ఆనందంగా అన్నాడు– "నేను ఆడినమాట తప్పను. కోరుకో!"

కైకేయి అడిగింది– "భరతుడికి రాజ్యం, రాముడికి 14 ఏళ్లు వనవాసం".

దశరథుడు దుఃఖసాగరంలో మునిగిపోయాడు. తండ్రిమాట నిలబెట్టడం కోసం శ్రీరాముడు తన భార్య జానకి (సీతాదేవి)తో వనవాసానికి బయల్దేరినాడు. లక్ష్మణుడు అతడిని అనుసరించాడు.

కుమారుడి గురించి దుఃఖించి దశరథుడు చనిపోయాడు. కైకేయి భరతుని పిలిచి రాజ్యభారం వహించమన్నది. భరతుడు హతాశుడై తల్లిని కోపించి రాముడిని వెదుక్కుంటూ వెళ్లాడు.

శ్రీరాముడన్నాడు– "వెళ్లు! ప్రజలను రక్షించు. నేను తండ్రి మాటలను రక్షిస్తాను".

భరతుడు 'నంది' గ్రామంలో ఉంటూ శ్రీరాముని పాదుకలను గద్దెపై ఉంచి పాలన చేసినాడు.

శ్రీరాముడు శరభంగుని ఆశ్రమం వెళ్లి అక్కడ నుంచి దండకారణ్యం చేరుకున్నారు. గోదావరి తీరంలో నివసించారు. అక్కడ జనస్థానంలో శూర్పణఖ కారణంగా ఖరునితో వైరం తటస్థించింది. ఖరదూషణులను, 14000 మంది రాక్షసులను సంహరించి దండకారణ్యాన్ని ధర్మారణ్యంగా చేసినాడు.

శ్రీరాముడిని కామించి సీతతో గొడవపడిన శూర్పణఖ ముక్కు చెవులు కోసాడు లక్ష్మణుడు. ఆమె ఏడుస్తూ వెళ్లి అన్న రావణుడికి చెప్పింది. "ఎవరు నిన్నిలా చేసింది?" అన్నాడు కోపంగా అతడు.

**కః శూలం తీక్ష్ణమాసాద్య సర్వగాత్రైర్నిషేవతే**
**కః శిరస్యగ్నిమాధాయ విశ్వస్తః స్వపతే సుఖమ్** (వన. 277–49)

"నిన్ను అవమానించినవాడు నన్ను అవమానించినట్లై విరోధం తెచ్చుకున్నాడు". శూర్పణఖ చెప్పింది రాముడు దండకారణ్యానికి తెచ్చిన చిక్కులను, ఖరదూషణాదుల వధను, తనకు పరాభవాన్ని.

రావణుడు ఆకాశమార్గాన గోకర్ణ తీరం చేరి అక్కడ తన పూర్వపు మంత్రి మారీచుడిని కలుసుకున్నాడు.

"మారీచా! నీవు బంగరులేడిగా మారు! సీతను ప్రలోభపెట్టి రాముడిని అడవిలోకి రప్పించు" అన్నాడు రావణుడు.

**రత్నశృంగో మృగో భూత్వా రత్నచిత్ర తనూరుహః**
**ధ్రువం సీతా సమాలక్ష్య త్వాం రామం చోదయిష్యతి** (వన. 278–12)

మారీచుడలాగే చేసాడు. రాముడిని చాలాదూరం రప్పించాడు. రాముడు వేసిన బాణానికి చస్తూ "హా సీతా! హా లక్ష్మణా!" అని కేకపెట్టాడు రాముడి గొంతుతో.

సీత అవమానకరమైన మాటలనేసరికి లక్ష్మణుడు ఆమెను ఆశ్రమంలో ఒంటరిగా వదిలి రాముడున్న వేపు వెళ్లాడు.

బోడితల, భిక్షాపాత్ర, త్రిదండంతో రావణుడు సన్యాసిలా వచ్చి సీతను బలవంతంగా అపహరించి తీసుకుపోతుంటే దశరథుని స్నేహితుడైన అరుణుని కొడుకు, సంపాతి సోదరుడైన జటాయువు అనే గ్రద్ద అతడిని అడ్డగించాడు.

## సీతాపహరణం

జటాయువు రావణుల మధ్య ఘోరయుద్ధం జరిగింది. పోరులో అలసిన జటాయువు రెక్కలను నరికి పడగొట్టి ఆకాశమార్గాన సీతను తీసుకుపోతుంటే ఆమెకు ఒకచోట కొండశిఖరంపై అయిదుగురు వానరులు కనిపించారు. ఆమె నగలను, వస్త్రాన్ని పడవేసిందక్కడ. సీతను అపహరించి తెచ్చి లంకాపురిలో ఉంచాడు రావణుడు.

తనను వెదుకుతూ వస్తున్న లక్ష్మణుడిని చూసి రాముడు నిందించగా, సీత అన్నమాటలు అన్నతో చెప్పాడు లక్ష్మణుడు. ఇద్దరూ వచ్చి ఆశ్రమంలో చూస్తే సీతలేదు. ఆమెను వెదుక్కుంటూ కొద్దిదూరం వెళ్లేసరికి కొన ఊపిరితో ఉన్న జటాయువు కనిపించి రావణుడు దక్షిణదిశకు పోయాడని చెప్పి కన్నుమూసాడు. తమ తండ్రి మిత్రుడైన జటాయువుకు అగ్నిసంస్కారం జరిపించి దక్షిణదిశగా వెళ్తున్నారు రామలక్ష్మణులు.

పొడవైన భుజాలు, వక్షస్థలంలో ఉన్న కళ్లు, పెద్ద పొట్ట దానిలో నోటితో కబంధుడు మహావృక్షంలా వారిని పట్టుకున్నాడు. వాడిని కత్తులతో నరికి చంపగా కబంధుడి శరీరం నుంచి వెలువడినాడు విశ్వవసుడనే గంధర్వుడు. అతడు రామలక్ష్మణులను ఋష్యమూక పర్వతం దగ్గర ఉన్న పంపా సరోవరం దగ్గరకు వెళ్లి సుగ్రీవుడనే వానరరాజు, నలుగురు మంత్రులను కలవమని చెప్పి అదృశ్యమైనాడు.

పంపా సరోవరం దగ్గర రామలక్ష్మణులు కలుసుకున్నారు సుగ్రీవుడిని, అతడి మంత్రులు హనుమంతుడు, మైందుడు, ద్వివిదుడు, ఋక్షరాజు జాంబవంతులను. వారికి దొరికిన సీత వస్త్రాన్ని చూపించారు వాళ్లు. రాముడు ఆనందంతో సుగ్రీవుని వానరరాజుగా అభిషిక్తుని చేసాడు. రాముడి సహాయం పొందిన సుగ్రీవుడు తన సోదరుడైన వాలితో యుద్ధానికి దిగాడు.

## వాలి-సుగ్రీవుల యుద్ధం

తన భార్య తార యుద్ధానికి వెళ్లవద్దంటే ఆమెతో పరుషంగా మాట్లాడి సుగ్రీవుడితో తలపడినాడు వాలి. వాలి, సుగ్రీవులను ప్రత్యేకంగా గుర్తించడానికి సుగ్రీవుని మెడలో పూలమాల వేసాడు హనుమంతుడు. మాల లేని వాలి గుండెల్లోకి సూటిగా దూసుకుపోయేలా బాణం వేసాడు రాముడు. వాలి మరణానంతరం సుగ్రీవుడు రాజ్యాన్ని, తారను పొందినాడు.

వర్షాకాలం రాముడు మాల్యవంత పర్వతగుహలో నాలుగు నెలలు నివసించాడు.

అక్కడ లంకలో అశోకవనం దగ్గర నందనవనం లాంటి భవనంలో సీతను ఉంచి ఆమెకు కాపలాగా క్రూరంగా అంధవికారంగా ఉన్న రాక్షసస్త్రీలను నియోగించాడు రావణుడు. వారు వీలైనప్పుడల్లా సీతను భయపెట్టూనే ఉన్నారు. త్రిజట అనే రాక్షసస్త్రీ ఒక్కతి వైదేహి (సీతను) ఊరడించేది. అవింధ్యుడనే రాక్షసుడు త్రిజటకు రాముని సమాచారమందించాడు.

త్రిజట ఆ రాత్రి తనకు వచ్చిన స్వప్నాన్ని చెప్పింది సీతకు. రావణ కుంభకర్ణుల మరణం, రాముడి విజయం– "అమ్మా, నీకు త్వరలోనే కష్టాలు తీరుతాయి" అన్నది త్రిజట. రావణుడు ఒకరోజున సీత వద్దకు మనోహరరూపంలో వచ్చి తన గొప్పతనాన్ని పొగుడుకుంటుంటే ఆమె అతడికి తనకు మధ్య ఓ గడ్డిపరకను ఉంచి గడ్డిపరకతో మాట్లాడింది– "ఎందుకు నన్ను మరల మరల అవమానిస్తావు? నీ తండ్రి బ్రాహ్మణుడు, ప్రజాపతి లాంటివాడు. నేను మానవకాంతను. పతివ్రతను. నా నుంచి మనసు మార్చుకో! లోకపాలురతో సమానమైనవాడి నంటున్నావు? ఇదేమి ధర్మం? పో!" అన్నదామె. నిష్ఠూరంగా కొన్ని మాటలాడి రావణుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

వాలి మరణించి చాలారోజులయ్యింది. సుగ్రీవుడు రాజభోగాల్లో మునిగి తన కార్యాన్ని నిర్లక్ష్యం చేసాడేమోనని లక్ష్మణుడిని పంపించాడు శ్రీరాముడు. కోపంగా లక్ష్మణుడు రావడానిని చూసి సుగ్రీవుడు భయపడి అన్నాడు– "నేను అన్ని దిక్కులకు వానరులను పంపించాను. నెలరోజుల గడువు పెట్టాను. ఇంకా అయిదు రాత్రులలో గడువు పూర్తవుతుంది" అన్నాడు సుగ్రీవుడు.

అయిదు రాత్రుళ్లు గడిచాయి. మూడు దిక్కులకు వెళ్లినవారు తిరిగి వచ్చారు. దక్షిణదిక్కుకు వెళ్లినవారు రాలేదు. రెండు నెలల కాలం పూర్తికావస్తూ ఉండగా వానరులు కొందరు వచ్చి సుగ్రీవుడితో అన్నారు– "మధువనంలో హనుమంతుడు, ఇతరులు ఆనందిస్తూ కోలాహలంగా ఉన్నారు".

హనుమంతుడు వచ్చి రామలక్ష్మణ సుగ్రీవులను కలిసి శుభవార్త చెప్పాడు– "రామా! మేము దక్షిణ దిక్కుకు వెళ్లి మహాగుహను చూసాము. ఆ గుహలోపల దివ్యభవనం ఉన్నది. అది మయుడి నిర్మితం. దానిలో ప్రభావతి అనే తాపసి తపస్సు చేసుకుంటున్నది. అక్కడ నుంచి సముద్ర తీరానికి వెళ్లి సహ్య మలయ దర్దుర పర్వాతాలను చూసాము. సముద్రాన్ని, దాని వైశాల్యాన్ని చూసాక మాకు నిరాశ కలిగింది. అక్కడ మాకు జటాయువు సోదరుడైన సంపాతి (పూర్వకాలంలో సూర్యుడికి దగ్గరగా ఎగిరి రెక్కలు కాలిపోయి కూలబడినవాడు) కనిపించాడు. అతడికి జటాయువు మరణవార్త చెప్పాము. అతడు మాకు సీతాదేవి జాడ–లంకానగరాన్ని గురించి చెప్పాడు. సముద్రానికి ఆవల త్రికూట పర్వత కందరంలో ఉన్న

లంక గొప్ప నగరమన్నాడు. నేను జలాల్లో ఉండే రాక్షసిని చంపి వంద యోజనాల విస్తీర్ణం ఉండే సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించాను.

అక్కడ అశోకవనంలో దుఃఖితవదనయై సీత కనిపించింది. ఆమెకు నన్ను నేను పరిచయం చేసుకున్నాను. ఆమె అవింధ్యుడి మాటలను చెప్పి మణిని ఇచ్చింది. తమరు ఈనెపుల్లను బ్రహ్మాస్త్రంగా చేసి కాకిపై వదిలి దాని కన్ను పొడిచిన వృత్తాంతాన్ని చెప్పింది. నేను లంకను తగలబెట్టి సముద్రం దాటి వచ్చాను" అన్నాడు హనుమంతుడు.

## రామ రావణ సైనికుల ద్వంద్వయుద్ధం

రాముడు హనుమంతుడిని మెచ్చుకున్నాడు. సుగ్రీవుడు వానరసైన్యాన్ని సిద్ధం చేసాడు. మహాసముద్రంలా వానర సైన్యం లవణ సముద్ర తీరాన్ని చేరుకున్నది. సముద్రం దాటడానికి ఆలోచించిన రాముడు సముద్రుడిపై బాణాలు సంధించాడు. సముద్రుడు ప్రత్యక్షమై- విశ్వకర్మ కుమారుడైన నలుడితో సేతువు నిర్మించమని సలహా ఇచ్చాడు. పది యోజనాల వెడల్పు, వంద యోజనాల పొడవున్న సేతువు నిర్మించారు వానరులు.

అదే సమయంలో రావణుని సోదరుడైన విభీషణుడు తన నలుగురు మంత్రులతో వచ్చి రాముడి పక్షాన చేరినాడు. సుగ్రీవుడు సంశయపడినాడు కాని రాముడు విభీషణుడిని గౌరవించి అతడిని లంకారాజ్యానికి పట్టాభిషిక్తుడిగా చేసాడు. ఒక్కనెలలోనే వానరసైన్యం సముద్రాన్ని దాటి లంక ఉపవనంలో శిబిరాలనేర్పరచుకున్నది. శుక సారణులనే గూఢచారులు వానరసైన్యంలో సంచరిస్తుండగా వారిని విభీషణుడు పట్టుకున్నాడు. వారికి తన సైన్యాన్ని చూపి క్షమించి వదిలివేసాడు రాముడు. వాళ్లు వెళ్లి రావణుడికి రాముడి గురించి, రామసేన గురించి గొప్పగా చెప్పారు. రావణుడు యుద్ధ సన్నాహాలు మొదలుబెట్టాడు.

శ్రీరాముడు వాలి కుమారుడు అంగదుడిని రావణుడి వద్దకు రాయబారిగా పంపినాడు. అంగదుడు చెప్పిన మాటలు విని క్రుద్ధుడై రావణుడు అతడిని బంధించబోతే తప్పించుకుని వచ్చాడు అంగదుడు. యుద్ధం మొదలయ్యింది. వానరసైన్యం లంకానగర ప్రాకారాలను భేదించింది. వానరదాడిని తిప్పికొట్టింది రాక్షస సేన. శుక్రనీతితో రావణుడు, బృహస్పతి నీతితో రాముడు వ్యూహాలను రచించి ఘోరంగా యుద్ధం చేసారు.

విభీషణుడు ప్రహస్తుని చంపాడు. ధూమ్రాక్షుడిని హనుమంతుడు మట్టుబెట్టాడు. దానితో రావణుడు నిద్రపోతున్న కుంభకర్ణుడిని నిద్రలేపాడు. మహా ప్రయత్నంతో నిద్రలేచిన కుంభకర్ణుడు ఆవులిస్తూనే యుద్ధరంగంలోకి వచ్చి వానరులను భుజిస్తూ రామలక్ష్మణుల మీదకు దూసుకురాసాగినాడు. సుగ్రీవుడు అడ్డం రాగా అతడిని అపహరించబోగా లక్ష్మణుడు అతడిని బాణాలతో గాయపరచాడు. అనేక మాయలు ప్రదర్శిస్తూ తనపైకి వస్తున్న కుంభకర్ణుడిని బ్రహ్మాస్త్రం ప్రయోగించి కూల్చివేసాడు లక్ష్మణుడు.

కుంభకర్ణుడు అనుచర సమేతంగా వధించబడ్డాడని తెలిసిన రావణుడు తన పుత్రుడు మేఘనాధుడనే ఇంద్రజిత్తును పంపాడు. ఇంద్రజిత్తు లక్ష్మణుల మధ్య గొప్ప యుద్ధం జరిగింది. సుగ్రీవుడు గొప్ప చెట్టు విసిరి ఇంద్రజిత్తు రథాన్ని నుగ్గునుగ్గు చేసేసరికి, ఇంద్రజిత్తు మాయా యుద్ధం ప్రారంభించాడు. రామలక్ష్మణులను తన బాణాలతో బంధించాడు. మూర్ఛపోయిన రామలక్ష్మణులను విభీషణుడు ప్రజ్ఞాస్త్రంతో మెలకువ తెప్పించాడు. సుగ్రీవుడు విశల్యమనే ఔషధి చేత వారి శరీరంలోని బాణాలను తొలగించాడు.

విభీషణుడు రాముడికి కుబేరుడు గుహ్యకుడి ద్వారా పంపిన దివ్యజలాన్నిచ్చాడు. ఆ నీళ్లతో కళ్లు తుడుచుకునేసరికి అదృశ్యంగా ఉన్న ఇంద్రజిత్తు కనిపించాడు. అప్పుడు లక్ష్మణుడు-ఇంద్రజిత్తుల మధ్య అద్భుత యుద్ధం జరిగింది. ఇంద్రజిత్తు బాణాలను ధ్వంసం చేసి లక్ష్మణుడు ఒక బాణంతో విల్లు పట్టుకున్న బాహువును, రెండవ బాణంతో బాణం పట్టుకున్న బాహువును, మూడవ బాణంతో ఇంద్రజిత్తు శిరస్సును ఖండించాడు. తరువాత రథసారథిని చంపినాడు లక్ష్మణుడు.

కొడుకు లేని రథాన్ని ఈడ్చుకు వచ్చిన గుర్రాలను చూసాడు రావణుడు. కోపంతో, దుఃఖంతో మండిపడుతూ కత్తి పట్టుకుని వచ్చి సీతను చంపబోయాడు. అవింధ్యుడు అతడిని వారించాడు. "లంకాధిపతి నిరాయుధురాలైన స్త్రీని చంపడం తగదు. ఈమె భర్తను చంపితే, ఈమె కూడా చనిపోతుంది" అన్నాడు అవింధ్యుడు.

రావణుడు కాసేపు మామూలు యుద్ధం, కాసేపు మాయాయుద్ధం చేసాడు. రామలక్ష్మణుల రూపాలు ధరించి రామలక్ష్మణులతో యుద్ధం చేసాడు. రాముడు దివ్యాస్త్రాలతో రావణుడి మాయలను పటాపంచలు చేసాడు.

## రామ రావణ యుద్ధం

అదే సమయంలో ఇంద్రుడు తన రథాన్ని మాతలి సారథిగా పంపినాడు. ఆ రథం ఎక్కి శ్రీరాముడు రావణుడి నెదిరించాడు. రామ రావణ యుద్ధం 'నభూతో న భవిష్యతి' అన్న విధంగా జరిగింది.

**అలబ్ధోపమ మన్యత్ర తయోరేవ తథా భవత్**
**స రామాయ మహాఘోరం విససర్జ నిశాచరః** (వన. 290-20)

రావణుడు ప్రయోగించాడు శూలాలు, భుశుండులు, ముసలాలు, గండ్రగొడ్డళ్లు, శక్తులు, శతఘ్నులు, బాణాలు వేలు, లక్షలుగా రాముడిపై.

రాముడు బ్రహ్మాస్త్రాన్ని అభిమంత్రించి రావణుడిపై వదలగా రావణుడు రథం, గుర్రాలు, సారథితో సహా కాలిపోయాడు. చివరికి బూడిద కూడా కనిపించలేదు.

ఆ విధంగా దశగ్రీవుని చంపి లంకను విభీషణుడికి అప్పగించాడు రాముడు. విభీషణుడు అశోకవనం నుంచి సీతను తీసుకువచ్చి రాముని ముందుంచాడు.

రాముడన్నాడు- "వైదేహీ! నీకు విముక్తి కలిగింది, వెళ్లు! నీవు సదాచారిణివైనా, కాకపోయినా కుక్కముట్టిన హవిస్సు లాంటి దానివి. వెళ్లు!"

నరకబడిన అరటిచెట్టులా ఆమె కూలబడింది. రాముడి వద్దకు వెళ్తున్నానని కలిగిన హర్షం క్షణంలో మాసిపోయింది.

బ్రహ్మాది దేవతలు, సప్తర్షులు, దశరథ మహరాజు అక్కడ ప్రత్యక్షమైనారు.

సీత అన్నది- "రాకుమారా! నేను నిన్ను తప్పుపట్టడం లేదు. పంచభూతాలు నా నడతకు సాక్షులు. నేను తప్పు చేస్తే నా ప్రాణాలు పంచభూతాలలో కలిసిపోవును గాక!"

వాయువు, అగ్ని, వరుణుడు, బ్రహ్మ అన్నారు- ఆ మాటలు అశరీరవాణులుగా వినిపించాయి- "రావణుడికి నలకూబరుని శాపం ఉంది. పరస్త్రీని బలవంతంగా అనుభవిస్తే తల నూరు వ్రక్కలవుతుందని. అందుకే అతడు సీతను ప్రసన్నం చేసుకోవాలని చూసాడు. ఆమె తిరస్కరించి ఉత్తమస్త్రీగా నిలబడింది".

దశరథుడన్నాడు- "కుమారా! నా రాజ్యం నీదే! ఏలుకో"

## శ్రీరామ పట్టాభిషేకం

మనసులో ఏ కల్మషమూలేని రాముడు కల్మషరహితయైన సీతను పంచభూతాలు, బ్రహ్మ, వానర రాక్షస సమూహాలు సాక్షిగా పరిగ్రహించాడు. అవింధ్యుడిని, త్రిజటను సత్కరించాడు.

బ్రహ్మదేవుడతడిని వరాలు కోరుకొమ్మనగా- తాను ధర్మము నందు నిలకడగా ఉండాలని, రాక్షసుల చేతులలో మరణించిన వానరులు జీవించాలని కోరుకున్నాడు.

బ్రహ్మదేవుడు తథాస్తు అనగానే మరణించిన వానరులందరూ బ్రతికారు.

సీత ఎంతో సంతోషంతో హనుమంతుని ఆశీర్వదించింది. ఇంద్ర సారథి మాతలి శ్రీరాముని అనుమతితో ఇంద్ర రథాన్ని తీసుకుని స్వర్గలోకానికి వెళ్లిపోయాడు.

పుష్పకవిమానంలో సీతారామలక్ష్మణులు, సుగ్రీవ విభీషణ హనుమంతాదులతో సముద్రం దాటినాడు. తనకు సాయం చేసిన వారందరినీ సత్కరించాడు రాముడు. సుగ్రీవుడు, విభీషణుడు వెంటరాగా కిష్కింధకు చేరుకుని అంగదుడిని యువరాజుగా అభిషేకించాడు.

కిష్కింధ నుంచి అయోధ్య చేరుకుని పొలిమేరలో ఆగి భరతుని వద్దకు హనుమంతుడిని పంపినాడు. హనుమంతుడు తిరిగి వచ్చాక రాముడు నందిగ్రామం వెళ్లి భరత శత్రుఘ్నులను కలుసుకున్నాడు. భరతుడు రాజ్యాన్ని అన్నకు అప్పగించాడు. శ్రవణా నక్షత్రం నాడు శ్రీరామ పట్టాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది.

సుగ్రీవుడు, విభీషణుడు ఎవరి రాజ్యాలకు వాళ్లు వెళ్లిపోయారు. పుష్పక విమానాన్ని కుబేరుడికి పంపించాడు శ్రీరాముడు. గోమతీ నదీ తీరంలో శ్రీరామచంద్రుడు పది అశ్వమేధ యాగాలు చేసాడు.

శ్రీరామచంద్రుడిలాంటివాడే అనేక కష్టాలు పడినాడు. నీవుకూడా చివరకు విజయం సాధిస్తావు" అన్నాడు మార్కండేయుడు.

## 20) పతివ్రతా మాహాత్మ్య పర్వము

మార్కండేయుడన్నాడు– "ఎలాంటి మానవ సహాయం లేకుండానే రాముడు భయంకర పరాక్రముడైన దశగ్రీవుని చంపి వైదేహిని తిరిగి తీసుకుని వచ్చాడు. కోతులు, ఎలుగుబంట్లు, లాంగూలాలు అతడి స్నేహితులు. నీకయితే సోదరులున్నారు, స్నేహితులున్నారు. దుఃఖమెందుకు?"

ధర్మజుడన్నాడు– "నేను నా గురించి బాధపడడం లేదు. ద్రౌపది గురించే నాకున్న దుఃఖం. అక్కడ సభలో, ఇక్కడ అరణ్యంలో– ఆమెకు ఎందుకీ కష్టాలు?

**అస్తి సీమంతినీ కాచిత్ దృష్టపూర్వాపి వా శ్రుతా**
**పతివ్రతా మహాభాగా యథేయం ద్రుపదాత్మజా** (వన. 293-3)

ఆమెలా కష్టాలు పడిన స్త్రీ గురించి కనీసం విన్నారా?" అని అడిగాడు ధర్మరాజు.

మార్కండేయుడన్నాడు– "మద్రదేశంలో ఒకరాజు పేరు అశ్వపతి. రోజూ లక్ష గాయత్రి హోమం చేస్తూ రోజులోని ఆరవభాగంలో మితంగా భోజనం చేస్తూ పద్దెనిమిది సంవత్సరాలు గడపగా 'సావిత్రి' ప్రత్యక్షమై అతడికి పుత్రికా సంతానం వరమిచ్చింది. అతడి పెద్దభార్య గర్భవతియై పండంటి కూతుర్ని కన్నది. ఆమెకు 'సావిత్రి' అని పేరు పెట్టినారు. ఆమె తేజస్సుకు తగిన భర్త కోసం ఆమె వేచి ఉన్నది.

శాల్వదేశంలో ద్యుమత్సేనుడనే రాజు ధీమంతుడే కాని ఏదో కారణం వలన అంధత్వం ప్రాప్తించింది. అతడి పొరుగు రాజు వైరం కారణంగా ద్యుమత్సేనుడి రాజ్యం ఆక్రమించుకున్నాడు. దానితో ద్యుమత్సేనుడు అడవులకు పోయి తపస్సు చేసుకోసాగినాడు. అతడికి సత్యవంతుడనే కొడుకున్నాడు. అతడికి గుర్రాలంటే ఇష్టం. మట్టితో గుర్రాల బొమ్మలు చేసేవాడు. గుర్రాల బొమ్మలు వేస్తుండడం చేత అతడిని చిత్రాశ్వుడనేవారు.

అతడిని ఇష్టపడింది సావిత్రి. "సత్యవంతుడిలో దోషమేమిటంటే నేటి నుండి సంవత్సరం లోపు ఆయువు తీరి మరణిస్తాడతడు" అన్నాడు నారదుడు అశ్వపతి కుమార్తె సావిత్రితో.

### సావిత్రి - సత్యవంతుల వివాహం

సావిత్రి అన్నది– "నేనతడిని వరించాను. నా నిర్ణయం మారదు".

నారదుడన్నాడు– "ఈమె నిశ్చలబుద్ధి కలిగి ఉన్నది. ఇదే మంచిదేమో!"

అశ్వపతి రాజు మేధ్యారణ్యానికి వెళ్లి ద్యుమత్సేనుడిని కలిసి వివాహ ప్రస్తావన తెచ్చాడు. ద్యుమత్సేనుడు తానున్న దుస్థితిని వివరించాడు. ఇద్దరూ అంగీకరించారు. సత్యవంతుడు–సావిత్రిల వివాహం ఎంతో వైభవంగా జరిగింది. సావిత్రిని అత్తవారింట వదిలి అశ్వపతిరాజు వెళ్లిపోయాడు. సావిత్రి ఆశ్రమవాస పద్ధతులనవలంభించి భర్తకు, అత్తమామలకు సేవ చేస్తున్నది.

కాలం వేగంగా గడిచింది. సత్యవంతుడు మరణించాల్సిన రోజు ఇంకా నాలుగు దినాలుండగా త్రిరాత్ర వ్రతాన్ని స్వీకరించి సావిత్రి పూజలు సల్పింది. మూడు రోజులు గడిచాయి. ఆ రోజున సత్యవంతుడు కట్టెలు తెస్తానని అడవికి బయల్దేరినాడు. సావిత్రి అనుసరించిందతడిని. అత్తమామల అనుమతి తీసుకున్నది.

అడవిలో కట్టెలు కొట్టి, పండ్లు తెంపి అలసిపోయి భార్య ఒడిలో తలపెట్టి నిద్రపోతూ సత్యవంతుడన్నాడు– "సావిత్రీ! తలనెప్పిగా ఉన్నది. తలను శూలాలతో గుచ్చుతున్నట్లున్నది. కాసేపు నిదురిస్తాను". ఆ క్షణం రానేవచ్చింది. యముడు రానే వచ్చాడు.

**శ్యామావదాతం రక్తాక్షం పాశహస్తమ్ భయావహమ్**
**స్థితం సత్యవతః పార్శ్వే నిరీక్షంతం తమే వచ** (వన. 297-9)

"నేను యముడను. నీవు పుణ్యురాలివి. అందుకే కనిపిస్తున్నాను" అన్నాడు.

**తతః సత్యవతః కాయాత్ పాశబద్ధం వశం గతమ్**
**అంగుష్ఠమాత్రం పురుషం నిశ్చకర్ష యమో బలాత్** (వన. 297-17)

జీవుడిని పాశంతో బంధించి యముడు దక్షిణం వేపు వెళ్తుంటే సావిత్రి అనుసరించింది.

యముడన్నాడు– "ఋణం తీరిపోయింది, వెళ్లిపో!"

సావిత్రి అన్నది– "నా భర్త వెళ్లిన చోటుకు నేనూ వెళ్తాను. ఇది సనాతన ధర్మం"

యముడన్నాడు– "ఆగిపో! నీ భర్త జీవితం తప్ప ఏదైనా వరాన్ని కోరుకో!"

సావిత్రి అన్నది– "మా మామగారికి చూపు రావాలి"

యముడన్నాడు– "సరే! వెళ్లు. ఇంక నన్ను అనుసరించకు"

సావిత్రి అన్నది– "సజ్జనమైత్రి గొప్పది. వారిని కలవడమే గొప్ప!"

యముడన్నాడు– "మెచ్చాను నిన్ను. నీ భర్త జీవితం తప్ప ఇంకే వరమైనా కోరుకో!"

సావిత్రి అన్నది– "మా మామగారు కోల్పోయిన రాజ్యం ఆయనకు రావాలి"

యముడన్నాడు– "ఇచ్చాను నీకు వరాలు. ఇకనైనా వెళ్లిపో!"

సావిత్రి అన్నది– "ప్రజల్ని నియమంలో ఉంచే యముడా! అనుగ్రహం సత్పురుష లక్షణం"

యముడన్నాడు– "చక్కగా చెప్పావు. ఇంకో వరం కోరుకో! నీ భర్త జీవితం తప్ప"

సావిత్రి అన్నది– "నా తండ్రికి పుత్రులు లేరు. ఆయనకు వందమంది పుత్రులు కలగాలి".

యముడన్నాడు– "తథాస్తు. వెళ్లిపో!"

సావిత్రి అన్నది– "వివస్వతుని కుమారా వైవస్వతా! నీవు మంచివాడివి"

యముడన్నాడు– "నాలుగో వరం కోరుకో! ఎవరూ అనలేదు యముడు మంచివాడని"

సావిత్రి అన్నది– "సత్యవంతుడికీ నూరుగురు పుత్రులు కలగాలి".

యముడన్నాడు– "అలాగే, ఇక నీవు వెళ్లు!"

సావిత్రి అన్నది– "సత్పురుషుల వాక్కు తప్పుకాదు. నీవు సత్పురుషుడవు"

యముడన్నాడు– "ధర్మబద్ధంగా మాట్లాడుతున్నావు. సాటిలేని వరం కోరుకో!"

సావిత్రి అన్నది– "నాకు నూరుగురు కొడుకులు పుడతారన్నావు. నా భర్తను కొనిపోతున్నావు. ఎలా సాధ్యం? నా భర్తను బ్రతికించు!"

యముడన్నాడు– "సావిత్రీ గెలిచావు. నీ భర్త ఇంకా 400 ఏళ్లు బ్రతుకుతాడు. మీకు వందమంది పుత్రులు పుడతారు. నీ తల్లి 'మాలవి'కి వందమంది పుత్రులు జన్మించి మాలవులై గొప్పకీర్తిని పొందెదరు గాక!"

అని ఆశీర్వదించి యముడు తన లోకానికి వెళ్లిపోయాడు. సావిత్రి తన భర్త పడి ఉన్నచోటుకు వచ్చింది. సత్యవంతుడు నిద్రలేచినట్లు లేచి అన్నాడు– "ఆ నల్లటి మనిషి ఏడి?"

సత్యవంతుడిని తీసుకుని సావిత్రి ఆశ్రమానికి వచ్చి వారి రాకకై ఎదురుచూస్తున్న అత్తమామలకు ఆనందాన్ని కలిగించింది. ద్యుమత్సేనుడికి చూపు వచ్చింది. సావిత్రి అరణ్యంలో తనకు యమదర్శనం గురించి చెప్పింది. తెల్లవారే సరికల్లా ద్యుమత్సేనుని మంత్రులు వచ్చి శత్రురాజు మంత్రిచేతుల్లో మరణించాడని, ప్రజలు ద్యుమత్సేనుని కొరకు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ద్యుమత్సేనుడు రాజుగా, సత్యవంతుడు యువరాజుగా అభిషిక్తులైనారు. కాలం గడిచాక సావిత్రికి వందమంది, సావిత్రి తల్లి మాలవికి వందమంది పుత్రులు కలిగారు. ఆ విధంగా సావిత్రి పుట్టింటికి మెట్టినింటికి శోభను తెచ్చింది.

# 21) కుండలాహరణ పర్వము

పన్నెండేళ్ల వనవాసం ముగిసి పదమూడవ సంవత్సరం అజ్ఞాతవాసం ప్రారంభం కాగానే పాండవులకు మేలు చెయ్యాలనే తలంపుతో ఇంద్రుడు కర్ణుడి కవచకుండలాలను యాచిద్దామని బయల్దేరాడు.

కర్ణుడు వ్రతదీక్షలో ఉన్నాడు. బ్రాహ్మణులేది అడిగినా ఇస్తున్నాడు.

సూర్యుడు అతడిని రక్షించదలచి కలలో కనిపించాడు– "ఇంద్రుడు బ్రాహ్మణవేషంలో వచ్చి నీ కవచకుండలాలు అర్థిస్తాడు. ఇవ్వవద్దు. ఇస్తే నీ శక్తి నశించి నష్టపోతావు" అన్నాడు సూర్యుడు.

కర్ణుడన్నాడు– **హితార్థం పాండుపుత్రాణాం కుండలేమే ప్రయాచితమ్**
**తన్మే కీర్తికరం లోకే తస్యా కీర్తిర్భవిష్యతి** (వన. 300–30)

"చచ్చినవాడికి కీర్తి పూలమాల వంటిది. నా మాట విను. ఒకవేళ నీ సహజ కవచకుండలాలు ఇవ్వదలుచుకుంటే, ఇంద్రుడి శక్తి ఆయుధం వాటికి బదులుగా ఇచ్చేట్లు మాట్లాడుకో!" అన్నాడు సూర్యుడు.

సూర్యుడు కర్ణుడికి జన్మరహస్యం చెప్పలేదు. శూరసేనుడి కుమార్తె పృథ కుంతీభోజుడింట పెరిగింది దత్తకుమార్తె కుంతిగా. దుర్వాసముని కుంతీభోజుడిని సందర్శించి ఏడాదిపాటు ఉన్నాడు వారింట్లో. అయితే ఏమి తింటాడో, ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళ్లిపోతాడో అంతా అతడిష్టంగానే ఉండేది. అయినా పృథ విసుగు చెందక అతడిని సేవించింది. దుర్వాసుడు ఆమెకు అధర్వోపనిషత్తు లోని మంత్రాలనుపదేశించి– ఆమె ఎవరిని ఆహ్వానిస్తే ఆ దేవత ఆమెకధీనుడవుతాడని వరమిచ్చి వెళ్లిపోయాడు.

కన్యావస్థయందే ఆమె రజస్వల అయ్యింది. దాని గురించి ఆలోచిస్తూ తూర్పుదిక్కున ఉదయిస్తున్న సూర్యుడిని చూసి మంత్రాన్ని చదివి ఆవాహన చేసింది, మంత్రప్రభావమేమిటో చూద్దామని.

## కర్ణుడికి కీర్తి - పాండవులకు మేలు

యోగశక్తితో సూర్యుడు తనను రెండుగా చేసుకుని ఒకటి గగన మండలంలో ప్రకాశిస్తుండగా రెండవ రూపంతో వచ్చి భయపడుతున్న కుంతిని సమాధాన పరచి, ఆమె కన్యగానే మిగులుతుందని పలికి, నీ కుమారుడు మహా బాహువు, సహజ కవచకుండలధారి అవుతాడు అని తెలిపి ఆమె నాభిని స్పృశించి, యోగరూపంతో కుంతిలో ప్రవేశించాడు.

పదకొండవ నెల శుక్లపక్ష ప్రతిపత్తు నాడు ఆమె గర్భాన్ని (ఆశ్వయుజ మాసం) ధరించింది. ఒక్క దాదికి తప్ప మరెవరికి తెలియకుండా జాగ్రత్త పడింది. నెలలు నిండి రహస్యంగా కొడుకును ప్రసవించింది. ఒక పెట్టెలోపల చక్కగా పక్క పరచి, నీరు లోపలకు రాకుండా మైనం పూసి, శిశువును పడుకోబెట్టి, పెట్టె మూతను బిగించి, ఏడుస్తూ ఆ పెట్టెను వదిలింది అశ్వనదిలో.

ఆ పెట్టె అశ్వనది నుండి చర్మణ్వతి నదిలోకి, దానినుండి యమున లోకి యమున నుండి గంగానదిలోకి చేరి చంపాపురికి దగ్గరగా ఉన్న సూతరాజ్యానికి చేరింది. గంగానదిలో సూర్య నమస్కారాలు చేస్తున్న సూతుడు అతిరథుడు–రాధ దంపతులకు దొరికింది. ఆ పెట్టెను తెరిచి చూసి లోపల బాల సూర్యుడివలె ప్రకాశిస్తున్న పసివాడిని పెంచుకున్నారు వాళ్లు. బంగరు కవచం, బంగరు కుండలాలు సహజంగా ఉన్న పుత్రునికి వసుషేణుడు అని పేరుపెట్టారు. అతడు రాధేయుడుగా పెరుగుతున్నాడని పృథకు తెలిసింది చారుల వలన.

కర్ణుడు ద్రోణుని శిష్యుడిగా ఉన్నపుడు దుర్యోధనుడితో మైత్రి ఏర్పడింది. ద్రోణుడు, కృపుడు, పరశురాముడి వద్ద విద్యలు నేర్చుకున్నాడు కర్ణుడు. అతడెప్పుడూ అర్జునుడితో పోటీపడేవాడు. సహజ కవచకుండలాలున్న కర్ణుని చూసి ధర్మరాజు భయపడేవాడు.

సూర్యుడు హెచ్చరించినట్లే ఇంద్రుడు బ్రాహ్మణరూపంలో వచ్చి కవచకుండలాలను యాచించాడు. కర్ణుడు 'శక్తి'ని ఇమ్మన్నాడు. ఇంద్రుడన్నాడు– "నీకు 'శక్తి' ఒక్కసారే పనిచేస్తుంది". కర్ణుడన్నాడు– "నాకున్నది ఒకే శత్రువు".

కర్ణుడు తన కవచకుండలాలను దేవేంద్రుడికిచ్చాడు. రక్తమోడుస్తున్న కర్ణుడిని ఆశీర్వదించాడు ఇంద్రుడు. కర్ణుడికి కీర్తి, పాండవులకు మేలు కలిగింది ఇంద్రుడు కర్ణుడి కవచకుండలాలు తీసుకుపోవడం వలన.

# 22) ఆరణేయ పర్వము

ఒకరోజున ధర్మరాజు వద్దకు ఒక బ్రాహ్మణుడు వచ్చి తన అరణి, మంధన కాష్ఠాన్ని జింక ఒకటి తన కొమ్ములలో ఇరికించుకుని అడవిలోకి పారిపోయిందని, దానిని తెచ్చి ఇమ్మని అడిగాడు.

పాండవులయిదుగురూ ఆ బ్రాహ్మణుడిని వెంటబెట్టుకుని వెళ్లి అల్లంత దూరంలో కనిపించిన జింకపై కర్ణి, నాలీక, నారాచాలనే బాణాలతో కొట్టారు. అయితే ఆ బాణాలు జింకకు తగలకమునుపే జింక పారిపోయింది. దానిని వెదుకుతూ ఎంతదూరం పోయినా జింక కనిపించలేదు.

ఆకలి దప్పులతో అలమటిస్తూ వారు ఒక మర్రిచెట్టు కింద కూర్చున్నారు.

నకులుడన్నాడు– "ధర్మలోపం చేయకుండానే ధర్మసంకటం వస్తున్నది మనకు".

ధర్మరాజన్నాడు– "మన ప్రారబ్దం ఇది".

భీముడన్నాడు– "ఆనాడే ప్రాతికామిని చంపాల్సింది నేను"

అర్జునుడన్నాడు– "సూతపుత్రుడి మాటలను సహించాను గదా నేను"

సహదేవుడన్నాడు– "పాచికలాట ఆడించిన శకునిని చంపాల్సింది నేను"

యుధిష్ఠిరుడు చెప్పగా నకులుడు చెట్టుపైకెక్కి చూసి దగ్గర్లో జలాశయమున్నట్లున్నదన్నాడు.

నకులుడు చెరువులో దిగి నీళ్లు తాగబోతే యక్షుడన్నాడు– "నా ప్రశ్నలకు సమాధానమివ్వకుండా నీరు త్రాగవద్దు". నకులుడు నీళ్లు త్రాగినాడు. ఒడ్డుకు చేరి పడిపోయాడు.

సహదేవుడు, అర్జునుడు, భీముడు వెళ్లారు. యక్షుడి మాటను లెక్కచేయక నీళ్లు త్రాగి పడిపోయారు.

ఆఖరున ధర్మరాజు వెళ్లాడు. సరోవరం తీరాన పడి ఉన్న సోదరులను చూసాడు. యక్షుడి మాటలను విన్నాడు.

యక్షుడన్నాడు– "నీకెదురుగా ఉన్న కొంగను నేను"

ధర్మరాజన్నాడు– "నీవు కొంగవు కావు, ఎవరో దివ్యపురుషుడవు"

యక్షుడన్నాడు– "అవును నేను యక్షుడినే" అన్నాడు. అతడు తాటిచెట్టంత ఉన్నాడు. కళ్లు వికృతంగా ఉన్నాయి. అగ్నివలె, సూర్యునివలె తేజోవంతుడు. పర్వతమంత ఆకారం, మేఘస్వరం.

"నేనెంత చెప్పినా వినకుండా నీ సోదరులు ఈ సరస్సు నీళ్లు త్రాగారు. అందుకే ప్రాణాలు కోల్పోయారు" అన్నాడు యక్షుడు.

"నీ ప్రశ్నలేమిటి?" అడిగాడు యుధిష్ఠిరుడు.

యక్షుడు అనేక ప్రశ్నలడిగాడు. అది యుధిష్ఠిరునికి మొదటి పరీక్ష.

యక్షుడడిగాడు– "సూర్యుని ఉదయింపజేసేదేది? అతడి చుట్టు తిరిగే వారెవరు? సూర్యుని అస్తమింపజేసేదెవరు? అతడు దేనిలో ప్రతిష్ఠింపబడతాడు?"

యుధిష్ఠిరుడు సమాధానమిచ్చాడు– "సూర్యుడిని ఉదయింపజేసేది బ్రహ్మ; అతడి చుట్టూ తిరిగేవారు దేవతలు; సూర్యుడిని అస్తమింపజేసేది ధర్మం; సూర్యుడు సత్యమందు ప్రతిష్ఠింపబడతాడు"

ఇలా అనేక ధర్మసంబంధమైన ప్రశ్నలు వేసాడు. యుధిష్ఠిరుడు సరిగా సమాధానమిచ్చాడు. యక్షుడన్నాడు– "నీ సోదరులలో ఒక్కరిని బ్రతికిస్తాను. ఎవరు కావాలో కోరుకో!"

ధర్మరాజన్నాడు– "నకులుడిని బ్రతికించు"

యక్షుడన్నాడు– "భీమార్జునులు బలవంతులు. వారిలో ఒకరిని కోరుకోక నకులుడినెందుకు కోరుకున్నావు?"

ధర్మరాజన్నాడు– "నా తండ్రికి ఇద్దరు భార్యలు. కుంతి, మాద్రి. కుంతీదేవి కుమారుడిగా నేను మిగిలాను. మాద్రీ పుత్రుడుగా నకులుడుంటాడు.

**ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః**
**తస్మాద్ ధర్మం న త్యజామి మా నో ధర్మో హతో వధీత్** (వన. 313–128)

ధర్మాన్ని రక్షిస్తే అది మనలను రక్షిస్తుంది".

అప్పుడు యక్షుడు పిలవగానే పాండవులంతా లేచారు. యక్షుడన్నాడు– "నాయనా, యుధిష్ఠిరా! నేను నీ తండ్రిని ధర్ముడిని. యశస్సు, సత్యం, దమం, శౌచం, ఆర్జవం, సిగ్గు, అచంచలత్వం, దానం, తపస్సు, బ్రహ్మచర్యం –ఇవన్నీ నా శరీరాలు. అహింస, సమత, అనృశంస్యం, అమత్సరం –నన్ను చేరే ద్వారాలు. నీవు శమ, దమ, ఉపరతి, తితిక్ష, సమాధానా లందు అనురక్తుడివి. ఆకలి దప్పులు, శోక మోహాలు, జరామృత్యువులను జయించావు. నీకు వరమిస్తాను కోరుకో!" అన్నాడు యమధర్మరాజు.

యుధిష్ఠిరుడన్నాడు– "ఒక బ్రాహ్మణుడి అరణి, మంథన కాష్ఠాన్ని జింక ఎత్తుకుపోయింది. అవి ఇప్పించు".

యమధర్మరాజు అన్నాడు– "నేనే ఎత్తుకుపోయింది. ఇవిగో అరణి, మంథన కాష్ఠాలు. మరొక వరం కోరుకో!"

యుధిఇష్ఠిరుడన్నాడు– "పన్నెండేళ్ల వనవాసం ముగిసింది. పదమూడవ సంవత్సరం అజ్ఞాతవాసం గడపవలసి ఉంది. ఎక్కడా మమ్మల్ని అజ్ఞాతవాస కాలంలో గుర్తించకుండా వరమివ్వు".

యమధర్మరాజు అన్నాడు– "ఈ అజ్ఞాతవాస కాలాన్ని విరాట నగరంలో గడపండి. నా అనుగ్రహం వలన మిమ్మల్ని ఎవరూ గుర్తించరు. మీ మనసులలో ఏ రూపం కావాలని కోరుకుంటే ఆ రూపం మీకు వస్తుంది. మూడవ వరం కోరుకో!"

యుధిష్ఠిరుడన్నాడు– "నేను లోభమోహ క్రోధాలను జయించగలగాలి. నా మనసు దానం, తపస్సు, సత్యం మీద నిలవాలి".

"నీవడిగినట్లే జరుగుతుంది" అని ధర్ముడదృశ్యమైనాడు.

పాండవులు ఆశ్రమానికి తిరిగివచ్చి బ్రాహ్మణుడికి అరణిని, మంథన కాష్ఠాన్నీ ఇచ్చారు.

ధర్మరాజు తనతో ఉన్న వారందరితో కూర్చుని అజ్ఞాతవాస సమాలోచనం చేసాడు.

ధౌమ్యుడన్నాడు– "దేవతలు శత్రువులనణచడానికి అజ్ఞాతంగానే ఉన్నారు.

దేవేంద్రుడు శత్రువులను అణచడానికి నిషధదేశంలో గిరిప్రస్థాశ్రమంలో అజ్ఞాతంగా ఉన్నాడు. విష్ణుదేవుడు హయగ్రీవుడై అదితి గర్భంలో ఉన్నాడు. వామనుడై, త్రివిక్రముడై బలిచక్రవర్తి రాజ్యాన్ని హరించాడు. అగ్ని నీటిలో దాక్కున్నాడు. విష్ణువు వజ్రాయుధపు అంచులో అజ్ఞాతంగా ఉన్నాడు. ఔర్వుడు తల్లి తొడలో అజ్ఞాతంగా ఉన్నాడు. సూర్యుడు భూమిలో అజ్ఞాతంగా ఉన్నాడు. విష్ణువు శ్రీరాముడై దశగ్రీవుని నిర్జించాడు. మహాత్ములెందరో అజ్ఞాతంగా ఉండి శత్రువులను జయించారు. అదేవిధంగా నీవు కూడా గెలుస్తావు" అని ధౌమ్యుడన్నాడు.

భీముడన్నాడు– "వ్యూహం నీది. ఆచరణ మాది". పాండవులతో ఉన్నవారంతా ఎవరి ఇండ్లకు వాళ్లు వెళ్లారు. పంచ పాండవులు, ద్రౌపది, ధౌమ్యుడు క్రోసెడు దూరం నడచి ఆగారు.

**పృథక్శాస్త్ర విదః సర్వే సర్వే మంత్ర విశారదాః**
**సంధి విగ్రహ కాలజ్ఞాః మంత్రాయ సముపావిశన్** (వన. 315–31)

వాళ్లందరూ అన్నీ తెలిసినవారు. మంత్రశాస్త్రములు, సంధి, విగ్రహములు పాటించేవారు.

అజ్ఞాతవాసాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడానికి తగిన ప్రణాళిక రచిస్తున్నారు.

❖❖❖❖❖

# ✤ 4. విరాట పర్వము ✤

1) పాండవ ప్రవేశ పర్వము (12)
2) సమయ పాలన పర్వము (1)
3) కీచక వధ పర్వము (11)
4) గోహరణ పర్వము (45)
5) వైవాహిక పర్వము (3)

## 1) పాండవ ప్రవేశ పర్వము

యుధిష్ఠిరుడన్నాడు– "ధర్మదేవత మనకు చెప్పినట్లు మనం విరాటుడి నగరంలో అజ్ఞాతవాసం గడుపుదాం. అది రమణీయమూ, శుభంకరమూ, సుఖప్రదమూ అయిన ప్రదేశం.

**మత్స్యో విరాటో బలవాన్ అభిరక్తోథ పాండవాన్**
**ధర్మశీలో వదాన్యశ్చ వృద్ధశ్చ సతతం ప్రియః** (విరాట. 1-17)

అక్కడ ఎవరెవరు ఎలా ఉండాలో నిర్ణయించుకుందాం. మనలను ఇతరులెవరూ గుర్తించరని ధర్మదేవత వరమిచ్చాడు కదా"

అర్జునుడన్నాడు– "మనం ఏఏ పనులు చేస్తామో చెప్పండి!"

యుధిష్ఠిరుడన్నాడు– "నేను కంకుభట్టును. ద్విజుడిని, ద్యూత నిపుణుడిని"

భీముడన్నాడు– "నేను వల్లవుడిని, వంటలు చేస్తాను. మల్లయుద్ధ నిపుణుడిని"

అర్జునుడన్నాడు– "నేను బృహన్నలను. పేడినై కన్యలకు నృత్యం నేర్పుతాను"

నకులుడన్నాడు– "నేను గ్రంధికుడిని. అశ్వ సంరక్షణ చేస్తాను"

సహదేవుడన్నాడు– "నేను తంత్రిపాలుడను. గోవులను రక్షిస్తాను".

ద్రౌపది అన్నది– "నేను సైరంధ్రినవుతాను. కేశాలంకరణలో నిపుణురాలిని''.

యుధిష్ఠిరుడన్నాడు– "ఇంతకు ముందు ధర్మరాజు వద్ద పనిచేసామని చెబుదాం. ఒక సంవత్సరం ఆశ్రయ మడుగుదాం విరాట దేశంలో.

ధౌమ్యులవారు ద్రుపదునింట్లో అగ్నిహోత్రాలు రక్షిస్తారు. ఇంద్రసేనాది సేవకులు ద్వారకకు, ద్రౌపదీ పరిచారకులు వంటవారు పాంచాల దేశానికి వెళ్లి అక్కడ వేచి ఉండాలి. పాండవులేమయ్యారో తెలియదని చెప్పాలి".

ధౌమ్యుడు పాండవులకు, ద్రౌపదికి రాజులవద్ద ఎలా మెలగాలో చెప్పాడు.

**నాస్యా నిష్టాని సేవేత నాహితైః సహ సంవదేత్**
**స్వస్థానాన్న వికంపేత స రాజవసతిం వసేత్** (విరాట. 4-27)

"రాజుకు ఇష్టం కాని పనులు చేయరాదు. నేను రాజుకు హితుడను అనుకోరాదు. రాజద్రవ్యం ముట్టుకోరాదు"

ఇటువంటి అనేక విషయాలు చెప్పాడు ధౌమ్యుడు. ఆ తరువాత పాండవులు అగ్నిహోత్రాలకు, బ్రాహ్మణులకు, తాపసులకు, ధౌమ్యునికి ప్రదక్షిణం చేసి ద్రౌపదిని ముందు నిలిపి ఆరుగురే పయనమయ్యారు. (ప్రధానమైన కార్యాలలో స్త్రీలు ముందు నడవాలి. ధర్మకార్యాలలో కుడివేపు, కామ కార్యాలలో ఎడమవేపు, పితృకార్యాలలో ఎడమచేతిననుసరిస్తూ స్త్రీలు నడవాలి).

పాండవులు ద్రౌపది యమునానది కుడి ఒడ్డున నడుస్తూ దశార్ణ దేశానికి ఉత్తరంగా, పాంచాల దేశానికి దక్షిణంగా యకృల్లోమ-శూరసేన దేశాల మధ్యలో పయనిస్తూ మత్స్యదేశం చేరారు. ద్రౌపది అలసిపోయింది. నకుల సహదేవులు అలసిపోయారు. ద్రౌపదిని మోసుకుని అర్జునుడు నడిచాడు. నగర సమీపానికి వచ్చారు పాండవులు. తమ ఆయుధాలను చూస్తే ప్రజలు గుర్తుపడతారని భావించారు.

ఊరి పొలిమేరలో కానవచ్చింది పెద్ద జమ్మిచెట్టు. శ్మశానానికి సమీపంలో, భయంకరంగా, గుబురుగా, ఎత్తైన ప్రదేశంలో ఉంది. పాములూ, క్రూరమృగాలు సంచరిస్తున్నాయక్కడ. వింటినారులు సడలించి ఆయుధాలన్నిటిని మూట కట్టినారు. కత్తులు, అమ్ములపొదులు, చురకత్తులు మూటలో పెట్టారు. నకులుడు చెట్టెక్కి మూటను శవాకారంగా చెట్టుగుబుర్లలో పెట్టాడు. గట్టి తాళ్లతో కట్టి ఒక మృతశరీరాన్ని చెట్టుకు కట్టినారు. ఎదురుపడిన గోపాలకులకు గొర్రెల కాపరులకూ- "ఇది మా వంశాచారం. ఈమె మా తల్లి 180 ఏళ్ల ముసల్ది చనిపోయింది" అని చెప్పేసరికి వాళ్లు భయపడి పారిపోయారు.

ధర్మరాజు తమలో తాము పిల్చుకోవడానికి జయ, జయంత, విజయ, జయత్సేన, జయద్బలుడు అని రహస్య పేర్లు పెట్టాడు.

యుధిష్ఠిరుడు దుర్గాదేవిని మనసారా ప్రార్థించాడు. దేవి ప్రత్యక్షమై పాండవులను, ద్రౌపదిని ఆశీర్వదించింది. ఆమెకు మొక్కినారు అందరూ-

**శరణం భవ మే దుర్గే శరణ్యే భక్త వత్సలే**
**ఏవం స్తుతా హి సా దేవీ దర్శయామాస పాండవమ్** (విరాట. 6-26)

పాండవులు ద్రౌపది ఒక్కరొక్కరుగా రాజ్యసభలోకి వెళ్లాలని నిశ్చయించుకున్నారు.

యుధిష్ఠిరుడు కంకుభట్టు వేషంలో విరాటుడి సభలోకి ప్రవేశించాడు- "నేను ధర్మరాజు స్నేహితుడిని, వ్యాఘ్రపాద గోత్రం, విప్రుడను. పాచికలాడడం వచ్చు. కంకుడు నాపేరు. తమ మైత్రినభిలషించి వచ్చాను"

విరాటుడు అన్నాడు- "నీకు ఏ పదవి కావాలో కోరుకో! నీవు నాకు నచ్చావు".

యుధిష్ఠిరుడన్నాడు- "స్నేహం, ధర్మపాలనం నాకిష్టం. ద్యూతం అభిమాన క్రీడ. అయితే ఛలం (మోసం), బలం, నిహ్నవం (దాపరికం), కలహం - ఇవి ఉండకూడదు".

విరాటుడన్నాడు- "నాకు ఇంకా బాగా నచ్చావు. మనిద్దరి అభిప్రాయాలూ ఒకటే. ఇంతకుముందు ధర్మరాజు దగ్గర పనిచేసానన్నావు. అందుకే నాకు మరింత ఇష్టమైనది నీవంటే. ఆ మహానుభావులు ఎక్కడ ఎన్ని కష్టాలు పడుతున్నారో! నీవు ఉచితాసనాన్ని అలంకరించుము".

కంకుభట్టు కూర్చున్నాడు. వాళ్లు మాట్లాడుకుంటూ ఉండగానే ఒక బలశాలి పప్పు మెదిపే కొయ్యగరిటె (ఖజా), గుండిగలోంచి అన్నాన్ని తోడే కొయ్య హస్తం (దర్వి), ఉక్కుకత్తిని చేతదాల్చి, నల్లటి వస్త్రం ధరించి రాజానుమతితో వచ్చి అన్నాడు- "నేను వల్లవుడిని. ఇంతకుముందు ధర్మరాజు వంటశాలలో పనిచేసాను. మల్లయుద్ధ నిపుణుడిని. ఏనుగులు, సింహాలను మర్దించగల బలమున్నవాడిని. నాలుగవజాతి వాడిని".

విరాట రాజన్నాడు- "ఆహా! నీవు నాకు నచ్చావు. మా వంటవాళ్లకు నాయకుడివై నన్నలరించు".

ద్రౌపది అంతఃపురం వేపు వస్తుంటే మేడమీద నుంచి విరాటరాజు భార్య- కేకయరాజు కుమార్తె సుధేష్ణ చూసింది. ఆమెను అంతఃపురంలోకి పిలిపించి వివరాలడిగింది.

ద్రౌపది అన్నది- "నేను సైరంధ్రిని".

సుధేష్ణ అన్నది- "నీవు ఉత్తమ క్షత్రియ కన్యలా ఉన్నావు".

ద్రౌపది అన్నది- "నాపేరు మాలిని. ఇంతకు ముందు సత్యభామ వద్ద, ద్రౌపది వద్ద పనిచేసాను. కేశాలంకరణ, లేపనాలు, పూలమాలలు చేయడంలో నైపుణ్యం ఉన్నదానిని".

సుధేష్ణ అన్నది- "ఆడవాళ్లే నిన్ను కన్నార్పకుండా చూస్తున్నారు. వృక్షాలే వంగి చూస్తున్నాయి. నా ఇంట్లో పురుషులు మోహపడేట్లున్నావు".

ద్రౌపది అన్నది– "నేను ఎవరికీ అందని దానిని. నన్ను ఎల్లప్పుడూ రక్షించే అయిదుగురు గంధర్వపతులున్నారు. ఇతరులెవరైనా నన్ను కోరితే ఆ రాత్రే మరో శరీరంలో ప్రవేశించాల్సిందే!"

సుధేష్ణ అన్నది– "నీవు ఇక్కడే ఉండవచ్చు. నీకిష్టంలేని ఏ పనీ చేయవద్దు".

ఇంతలో రాజసభలోకి సహదేవుడు గోపాలుడి వేషంలో విరాటరాజును సమీపించి అన్నాడు– "నేను వైశ్యుడిని. నాపేరు అరిష్టనేమి. పాండవుల గోశాలలో ఉండేవాడిని".

విరాటరాజన్నాడు– "నీవు నాకు నచ్చావు. ఇంకా ఏమేం చేస్తావు".

సహదేవుడన్నాడు– "పాండవుల గోవులను రక్షించేవాడిని, లెక్కించేవాడిని. వారు నన్ను తంత్రిపాలుడని పిలిచేవారు. గోవుల వైద్యంలో నిపుణుడిని. తమరు పాండవులను అభిమానిస్తారని విని తమవద్దకు వచ్చాను".

విరాటుడన్నాడు– "నా అదృష్టం. నీవు మరీమరీ నచ్చావు. నా గోగణాలకు అధిపతిగా ఉండు".

కొద్దిసేపట్లోనే సభాసదులందరూ ఆశ్చర్యంగా చూస్తుండగా ఆజానుబాహుడు, స్త్రీల అలంకారాలు, బంగరు గాజులు, పొడవైన కుండలాలు ధరించి గజగమనుడై, కంచుకం ధరించినవాడై, చేతులూపుకుంటూ, పొడుగాటి జుట్టు విరబూసుకుని నపుంసకుడిలా విరాటరాజు ముందుకువచ్చాడు.

విరాటరాజు అన్నాడు– "దైవంలా, గజరాజులా, వీరుడిలా ఉన్నావు. నల్లగా ఉన్నా నవమోహనంగా ఉన్నావు. నీవు పేడివి కావు. నా కుమారులతో కలిసి ఉండు, రాజ్యభారం వహించు".

అర్జునుడన్నాడు– "నేను బృహన్నలను. ఆడపిల్లలకు నృత్య గానాలను నేర్పుతాను. తల్లిదండ్రులు వదిలేసిన కొడుకో కూతురో ఈ బృహన్నల అనుకో! రాజా, నేను నాట్యాచార్యుడిని".

విరాటరాజు అన్నాడు– "నా కుమార్తె ఉత్తరకు నాట్యగురువుగా ఉండు" అని పలికి అతడి నపుంసకత్వము నిజమైనదని స్థిరపరచుకుని అంతఃపురానికి పంపినాడు.

అప్పుడు వచ్చాడు మేఘాల్లోంచి వస్తున్న సూర్యుడిలా నకులుడు. స్ఫురద్రూపి. అతడి చూపులు అక్కడున్న ఉత్తమ అశ్వాలపై వాలుతున్నాయి.

నకులుడన్నాడు– "రాజా, మీకు జయమగుగాక. నేను అశ్వ శిక్షకుడిని. ఇదివరకు ధర్మజుడిని సేవించాను. నన్ను గ్రంధికుడని పిలిచేవారు. దేవేంద్రుని సారథి మాతలిలా, దశరథుని సారథి సుమంత్రునిలా, పరశురాముని సారథి సుమహుని వలె నేను నీ గుర్రాలకు శిక్షణ నివ్వగలవాడను".

విరాటుడన్నాడు– "ఇవ్వాళ నాకన్నీ శుభాలే! ధర్మరాజు వద్ద పనిచేసిన వాళ్లు నాకు సేవకులవుతున్నారు. గ్రంధికుడా, నీవు నాకు నచ్చావు. నా అశ్వములు యావత్తూ నీ రక్షితములై ఉండుగాక!"

ఆ విధంగా పాండవులు, ద్రౌపది మారువేషాలలో విరాటరాజు కొలువులో చేరారు. అప్పుడప్పుడూ కలుస్తూ కష్టసుఖాలు పంచుకునేవారు.

నాలుగవ నెలలో మత్స్యరాజ్యంలో బ్రహ్మోత్సవం జరిగింది. శరత్కాలం కొత్తపంట చేతికి వచ్చింది. ప్రజలు సంతోషంగా ఉన్నారు. పాండవులున్న చోట, ధర్మపరులున్నచోట పాడిపంటలకు లోటుండదు. వేలకొలది మల్లులు అక్కడ క్రీడోత్సవాలలో పాల్గొనడానికి వచ్చారు. రాజుచేత గౌరవింపబడినారు.

## 2) సమయపాలన పర్వము

### జీమూత వధ

మల్లయుద్ధ పోటీలు బహు రసవత్తరంగా సాగుతున్నాయి. వారిలో జీమూతమల్లుడనేవాడు రాజుగారి ఆస్థాన మల్లులనందరినీ ఓడించాడు. విరాటరాజు వల్లవుడికి కబురంపినాడు. ఇద్దరి మల్లుల మధ్య మొదలైంది మల్లయుద్ధం.

నేలపై పడద్రోసి తొక్కడం ప్రమాదం, పైకిలేచి శరీరాన్ని మర్దించడం ఉన్మధనం. పిడికిళ్లు, బాహువులు, వక్షస్థలాలు, కాళ్లు, గోళ్లు, మోకాళ్లు అన్నీ ఆయుధాలుగా కొట్టుకున్నారు. అంతలోనే భీముడు జీమూతమల్లుడిని చేతులతో పైకెత్తి వందసార్లు గాలిలో తిప్పి నేలమీద పడవేసి తొక్కి చంపినాడు.

ఆనందంతో పొంగిన విరాటరాజు వల్లవునకు అంతులేని ధనమిచ్చాడు.

పదినెలలు గడిచాయి.. ద్రౌపది ఎంతో కష్టంగా కాలం గడుపుతున్నది. సంవత్సరం చివరకు వచ్చింది.

ఒకరోజున విరాటరాజు సేనాపతి, మహాబలవంతుడు అయిన కీచకుడు ద్రౌపదిని చూసాడు. కామంతో దహించుకు పోతూ తన సోదరి సుధేష్ణతో ఆ సైరంధ్రి పుట్టుపూర్వోత్తరాలడిగి ద్రౌపది వద్దకు వచ్చి నక్క ఆడసింహాన్ని బుజ్జగిస్తున్నట్లు అన్నాడు–

**కాత్వం కస్యాసి కల్యాణి కుతో వాత్వం వరాననే**
**ప్రాప్తా విరాట నగరం తత్త్వమాచక్ష్వ శోభనే** (విరాట. 14–12)

"ఎవరు నీవు? ఇంత అందంగా ఉన్నావు? ఈ సేవికావృత్తి నీకెందుకు? నాకు రాణివై హాయిగా సుఖించు" అన్నాడు కామాతురుడై కీచకుడు.

ద్రౌపది అన్నది– "నేను హీనజాతి దానిని, సైరంధ్రిని. నీవు కోరదగిన దానిని కాను, సూతపుత్రా, నన్ను ఆశించక వెళ్లిపో!"

కీచకుడన్నాడు– "నా కోరికను తిరస్కరించకు,

**నార్హస్యేవం వరారోహే ప్రత్యాఖ్యాతుం వరాననే**
**మాం మన్మథ సమావిష్టం త్వత్కృతే చారుహాసినీ** (విరాట. 14–40)

ద్రౌపది అన్నది– "నా భర్తలు అదృశ్యరూపులు, గంధర్వులు. నీవు ఇలా ప్రవర్తిస్తే వాళ్లు నిన్ను చంపివేస్తారు, వెళ్లిపో!"

కీచకుడు ద్రౌపదిచే తిరస్కరించబడి విసురుగా వెళ్లి తన అక్క సుధేష్ణతో అన్నాడు– "నీవు ఈ సైరంధ్రిని ఏదో మిషమీద నా ఇంటికి పంపు. లేకపోతే నా ప్రాణాలు నిలవవు".

సుదేష్ణ అన్నది– "ఆమె గురించి మరచిపో. ఆమెను కాంక్షిస్తే నీకు వినాశనం జరుగుతుంది. నీమీద నాకు సోదర ప్రేమ ఉన్నది. కాని, నీ కోరిక వినగానే దుఃఖం కలుగుతున్నది. అయినా విధిని తప్పించలేము. 'సుర' కోసం నేను ఆమెను నీ ఇంటికి పంపుతాను. జరగాల్సింది జరుగుతుంది".

కీచకుడన్నాడు– "జరగాల్సింది అదే! నేనూ దేవుడిని వేడుకుంటాను– సైరంధ్రితో కలుపు లేదా మరణాన్ని ప్రసాదించు అని"

అతడు తన ఇంటికి వెళ్లి ఉత్తమమైన మద్యాలను, పిండి వంటలను సిద్ధం చేయించి తాను సిద్ధంగా ఉన్నాడు.

సుదేష్ణ అన్నది సైరంధ్రితో– "నాకు దాహం వేస్తున్నది. శిరోవేదనగా ఉన్నది. నా తమ్ముడు కీచకుడింటికి వెళ్లి మంచి మదిర తీసుకురా!"

సైరంధ్రి అన్నది– "నన్ను నీచకార్యాలకు నియోగింపరాదంటిని కాదా!"

సుదేష్ణ అన్నది– "నీవు మదిరలు గుర్తించడంలో నిపుణురాలైన సైరంధ్రివి. అతడు నా సోదరుడు; పరాయివాడు కాదు. నీకు ఏ అపాయమూ జరుగదు"

సైరంధ్రియైన ద్రౌపది సూర్యుడిని ఆరాధించింది.

తన ఇంటికి మదిరాపాత్రతో వచ్చిన సైరంధ్రిని చూసి ముచ్చటపడినాడు కీచకుడు.

**–స్వాగతం తే సుకేశాంతే సువ్యుష్టా రజనీ మమ**
**స్వామినీ త్వమను ప్రాప్తా ప్రకురుష్వ మమ ప్రియమ్–**

"రా నాకు రాణివై ఆనందాన్ని, సుఖాన్ని కలిగించు" అన్నాడు కీచకుడు.

ద్రౌపది అన్నది– "మదిర ఇచ్చి పంపించు"

కీచకుడన్నాడు– "వేరేవారితో పంపిస్తానులే!"

అని ఆమెను పట్టుకోబోయాడు. ఆమె విదిలించుకునేసరికి మొదలు నరికిన చెట్టులా నేలమీద కూలబడినాడు. ద్రౌపది పరిగెత్తుకుంటూ రాజసభలోకి పరిగెత్తుకు వచ్చింది. సభికులు, రాజు, కంకుభట్టు ఆందోళనతో చూస్తుండగానే ద్రౌపదిని వెన్నంటి వచ్చిన కీచకుడు ఆమె జుట్టు పట్టుకుని కింద పడేసి తన్నాడు. ఇంతలోనే సూర్యభగవానుడు పంపిన రాక్షసుడు కీచకుడిని బలంగా తోసివేసేసరికి కిందపడి లేచి బిత్తరపోయి చూడసాగినాడు.

ద్రౌపదిని ఆ అవస్థలో చూసిన వల్లవుడు కోపంతో ఊగిపోయాడు. ధర్మజుడు తలదించుకున్నాడు. వల్లవుడైన భీముడు పళ్లు పటపటా కొరికాడు.

**ధూమచ్ఛాయా హ్య భజితాం నేత్రే చోచ్ఛ్రిత పక్ష్మణీ**
**సస్వేదాభ్రు కుటీ చోగ్రా లలాటే సమ వర్తత** (విరాట. 16-15)

అట్లా ఉగ్రంగా ఉన్న భీముడిని ధర్మరాజు వారించాడు. అయినా భీముడు ఓ పండ్లవృక్షం వేపు చూడడం విరాటుడు ధర్మజుడు గమనించారు. కంకుభట్టు అన్నాడు "వంటకట్టెలు కావాలంటే ఎండిన చెట్లు ఆ పక్కన ఉన్నాయి".

ద్రౌపది ఆ మాటలు విని ఆగ్రహంతో దహించుకుపోతూ అన్నది- "ఇది సభ. ఆశ్రిత జనులను రక్షించే రాజున్న సభ. నేనే అపరాధం చేయలేదు కాని ఈ దుర్మార్గుడు జుట్టు పట్టుకుని పడవేసి కాలితో తన్నాడు. అయినా, మీరంతా మౌనంగా ఉన్నారు. నా భర్తలు ఇది సహించరు.

**కీచకోన చ ధర్మజ్ఞః న చ మత్స్యః కథంచన**
**సభాసదోప్య ధర్మజ్ఞాః య ఏనం పర్యుపాసతే** (విరాట. 16-33)

ఇక్కడెవరూ ధర్మం తెలిసినవారు లేరు. ఇది ధర్మసభ కాదు".

ధర్మరాజన్నాడు- "సైరంధ్రీ, ఇప్పుడు రాజ అంతఃపురానికి వెళ్లిపో! నీ పతులు ఇది సమయం కాదనుకుని ఆగి ఉంటారు"

**-ద్వ్యం శినో ద్వాదశాంగస్య చతుర్వింశతి పర్వణః**
**కః షష్ఠిత్రిశతారస్య మాసోనస్యాక్షమీ భవేత్-**

కాలచక్రం పూర్తవడానికి ఒక్కమాసమే తక్కువగా ఉన్నపుడు సహనం మంచిది. సభికుల ముందు శైలూషిలా నటించక అంతఃపురానికి వెళ్లు!" అన్నాడు కంకుభట్టు.

సైరంధ్రి రూపాన ఉన్న ద్రౌపది అన్నది- "అవును, నేను శైలూషిని-నాట్యకత్తెను

**అతీష తేషాం ఘృణినామ్ అర్థేహం ధర్మచారిణీ**
**తస్య తస్యైవ తే పథ్యాః యేషాం జ్యేష్ఠోక్షదేవితా** (విరాట. 16-45)

నా భర్తలలో పెద్దవాడు జూదమాడుతాడు. ఇంకొకడు శైలూషుడు. అందుకే నేనూ శైలూషిని కాక ఇంకేమవుతాను" అని విసురుగా నడుస్తూ సుదేష్ణ భవనానికి వెళ్లిపోయింది.

సుదేష్ణ అడిగింది ఏమీ తెలియని దానిలా- "సైరంధ్రీ ఎందుకు దుఃఖిస్తున్నావు?"

సైరంధ్రి అన్నది- "నీకోసం మదిర తేవడానికి నీ తమ్ముడింటికి వెళ్లాను. వాడు నా వెంటబడినాడు. తప్పించుకుని సభలోకి వెళ్తే అక్కడ వాడు నా జుట్టు లాగి పడవేసి తన్నినాడు. వాడికి చావు మూడింది. నీ తమ్ముడికి జీవశ్రాద్ధం పెట్టించు. కనులారా చూసుకో ఆఖరిసారి. ఈ సూతపుత్రుడికి ఆఖరి ఘడియలు మొదలైనాయి"

క్షత్రియుడైన తండ్రికి బ్రాహ్మణి అయిన తల్లికి పుట్టినవారు ప్రతిలోములైన సూతులు. ద్విజులకు ఉచితమైన పనులు చేసే సూతులను రథకారులంటారు. క్షత్రియులకంటె తక్కువ వైశ్యులకంటె ఎక్కువ వీరు. సూతుల పేరుమీదుగా ఒక రాజ్యం ఏర్పడింది. వీరి అధిపతి కేకయుడు. గొప్ప సారథి. కేకయుడి భార్య మాళవి. వీరి పుత్రులలో కీచకుడతి బలవంతుడు. కేకయుడి రెండవ భార్య కూడా మాళవ కన్య. ఆమెకు 'చిత్ర' అనే కుమార్తె పుట్టింది. ఆమె విరాటుడి పట్టపురాణియై సుదేష్ణగా పేరు తెచ్చుకున్నది.

విరాటుడి పెద్దరాణి కోసల రాజకుమారి సురథ. వారి పుత్రుడు శ్వేతుడు. తండ్రితో కలహించి దూరంగా ఉంటున్నాడు.

సురథ చనిపోయాక విరాటరాజు సుదేష్ణను పెండ్లాడినాడు. సుదేష్ణ విరాటులకు ఉత్తరుడు, ఉత్తర సంతానం.

కాలేయులనే రాక్షసుల అంశలో కీచకులు జన్మించారు. కాలేయుల పెద్దవాడు బాణుడు కీచకుడైనాడు. పదివేల ఏనుగుల బలం కల కీచకుడు అనేక జనపదాల రాజులనోడించాడు. అటువంటి కీచకుడు విరాటుని సేనాధిపతి.

ద్రౌపది ఆ రాత్రి భీముడిని నిద్రలేపి అన్నది-

**తస్మిన్ జీవతి పాపిష్ఠే సేనావాహమే మమద్విషి**
**తత్ కర్మ కృతవానద్య కథం నిద్రాం నిషేవసే** (విరాట. 17-7)

"నన్నవమానించినవాడు బ్రతికే ఉండగా నీకు నిద్రెట్లా పట్టుతున్నదయ్యా?" అని అడిగింది ద్రౌపది.

**అహమే వ హితే కృష్ణే విశ్వాస్యః సర్వకర్మసు**
**అహమాపత్సు చాపిత్వాం మోక్షయామి పునః పునః** (విరాట. 17-20)

"అన్ని ఆపదలలోనూ నిన్ను రక్షించుకుంటున్నాను, అయినా, నన్ను కోపించడం తగునా?" అన్నాడు ప్రేమగా భీముడు.

ద్రౌపది అన్నది- "ధర్మపరుడైన యుధిష్ఠిరుని భర్తగా పొందిన స్త్రీ శోకం లేనిదెలా అవుతుంది? అప్పుడు కౌరవ సభ- ప్రాతికామి దూత- దుర్మార్గుడొక కౌరవ సోదరుడు; ఇప్పుడు విరాటసభ- మీరున్నారక్కడ. దుర్మార్గుడీ కీచకుడు. కథ అదే పునరావృతం అయ్యింది. మధ్యలో వనవాసంలో జయద్రథుడు - అందరికీ నేను లోకువనైనాను. నా భర్తలు వాళ్లను చంపుతారన్న భయముంటే ఈ అవమానం జరిగేనా?

మీరు బ్రతికి ఉండగానే నేను మరొకరికి సేవికనయ్యాను. ప్రతిరోజూ గోశీర్షం, పద్మకాష్ఠం, హరిశ్యామం అనే చందనాలను నూరుతున్నాను. అరచేతులు కాయలు కాస్తున్నాయి.

ద్రుపదరాజు కూతుర్ని; ధృష్టద్యుమ్నుడి చెల్లెలిని, అయోనిజను, అగ్నికుండంలోంచి పుట్టాను. ఏనాడూ నేలమీద కాలుమోపి నడవలేదు. ఇప్పుడు పన్నెండేళ్లు అడవుల్లో, కొండగుట్టలో నడిచాను. సైరంధ్రినై బ్రతుకుతున్నాను. నా బ్రతుకు జూదమై పాచికలాట అయ్యింది.

మత్స్యదేశపు రాజు సమక్షంలోనే, జూదరియైన నా భర్త చూస్తుండగానే కీచకుడు నన్ను అవమానించాడు. అది సహించి నాలాంటి ఏ రాజకుమారి జీవించి ఉండగలదు?

ఎవడైతే వేలాది రాజులు సేవిస్తుండగా, మహర్షుల మధ్య ధర్మచర్చలు చేస్తూ, వేలాదిమందికి దానధర్మాలు చేస్తుండేవాడో అతడు జూదంలో ఓడిపోయి తానే సేవకుడై కుములుతున్నాడు తన వాళ్లతో సహా.

సుదేష్ణ చెలికత్తెలు కూడా నేను నిన్ను చూసినప్పుడుల్లా సంతోషంగా ఉండడాన్ని చూసి, నీమీద నాకు గూఢమైన ప్రేమ ఉన్నదని భావిస్తున్నారు.

దివ్యాస్త్ర సంపన్నుడైన అర్జునుడు పేడియై కన్యలకు నాట్యాలు నేర్పుతున్నాడు. అందగాడైన నకులుడు అశ్వరక్షకుడై, సత్యవిక్రముడు సహదేవుడు గోపాలుడై దుర్దశలపాలైనారు. నేను రాజభవనంలో సైరంధ్రిగా సుదేష్ణాదేవి స్నానానికి కావాల్సిన వస్తువుల సమకూర్చే స్థితిలో ఉన్నాను".

భీముడన్నాడు- "శత్రువులను చంపగలిగిన బలం ధైర్యం ఉండీ మనం దైన్యస్థితిలో ఉన్నాము. కారణం నీకు తెలియనిది కాదు. అందుకే క్రోధాన్ని విడిచిపెట్టు. ధర్మాన్ని ఆచరించు"

భృగుమహర్షి కుమారుడు చ్యవనుడి భార్య సుకన్య తన భర్తను సేవించి తరించలేదా! అశ్వనిదేవతల వలన చ్యవనుడు వృద్ధాప్యం నుంచి యువకుడిగా మారినాడు కాదా! నారాయణి అయిన ఇంద్రసేన ముదుసలి ముద్గలుడిని పెండ్లాడి, అతడు యవ్వనాన్ని సాధించగా సుఖపడలేదా! జనకుని కుమార్తె సీత వనవాసం చేసింది కాదా! అగస్త్యుని భార్య లోపాముద్ర, సత్యవంతుని భార్య సావిత్రి వీరందరూ కష్టాలను భరించి ఆనక సుఖాలను పొందినారు.

**మాదీర్ఘం క్షమ కాలం త్వం మాసమర్ధం చ సమ్మితమ్**
**పూర్ణే త్రయోదశే వర్షే రాజ్ఞాం రాజ్ఞీ భవిష్యసి** (విరాట. 21-17)

ఒక్క పదిహేను రోజులు ఓపికపట్టు. రాణులకు రాణివవుతావు" అని సముదాయించాడు భీముడు.

# 3) కీచక వధ పర్వము

## నర్తనశాల - కీచకవధ

భీముడన్నాడు– "కీచకుడిని చంపడమనేది నిశ్చయమైంది. ఎక్కడ, ఎప్పుడు చంపాలన్నదే సమస్య. కొద్దిరోజుల్లో అజ్ఞాతవాసం సమాప్తి కానున్నది. కాబట్టి ఈ పని గుట్టుచప్పుడు కాకుండా జరగాలి. ఇప్పుడు తెల్లవారవస్తున్నది.

నీవు కీచకుడిని ఈ రాత్రి మొదటిజాములో నర్తనశాలకు వచ్చేట్లు చేయి. అక్కడ ఓ శయ్య ఉంది. ఆ కీచకుడికి చనిపోయిన వాడి తాతముత్తాతల్ని చూపిస్తానక్కడ".

ద్రౌపది తన మందిరానికి వెళ్లిపోయింది.

మరుసటి రోజున కీచకుడు వచ్చాడు. ద్రౌపదితో అన్నాడు– "సభాసదులందరి ముందు నిన్ను కాలితో తన్నాను. ఒక్కడైనా నోరెత్తాడా? ఈ విరాటుడు మత్స్యదేశానికి పేరుకే రాజు. సేనానాయకుడిని, రాజునూ నేనే. పిచ్చిదానా! నన్ను పొందు, సుఖాలు పొందు. రోజుకు వంద బంగారు నాణెములిస్తాను. దాసీజనాల్ని, రథాన్నిస్తాను"

ద్రౌపది అన్నది– "నర్తనశాలకు ఎవరూ చూడకుండా ఒంటరిగా రా. జరగాల్సింది జరుగుతుంది".

కీచకుడింటికి పోయాడు. ఒకపూట వాడికి ఒక నెల గడచినట్లయ్యింది. ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువన్నట్లు అతడు తన శరీరాన్ని కాంతివంతంగా అలంకరించుకున్నాడు.

భీముడికి ద్రౌపది తెలియజేసింది విషయాన్ని. రాత్రి పడగానే భీముడు వెళ్లి నర్తనశాలలోని శయ్యపై పడుకున్నాడు. కీచకుడు సరిగ్గా సంకేత సమయానికి వచ్చి నర్తనశాలలో ప్రవేశించాడు.

శయ్యమీద పడుకున్న భీమునిపై చెయ్యి వేసాడు. కీచకుడు అంటున్నాడు– "నా సమస్త ధనరాశులు నీవే, నా దాసదాసీజనం; అంతఃపురం అంతా నీదే. నీకు తెలుసా, మా ఇంటిలో స్త్రీలు నన్ను పొగుడుతారు నీఅంత అందగాడు లేడని".

భీముడన్నాడు– "నీవు అంతటివాడివే. అయితే ఇటువంటి స్పర్శ ఇంతకు ముందు పొంది ఉండవు. నన్ను ముట్టుకున్నాక ఇంకో స్త్రీ గురించి కూడా ఆలోచించలేవు"

అంటూనే భీముడు లేచి పూలమాలలతో నిండిన కీచకుడి జుట్టు పట్టుకుని గుంజాడు. వాడు వదిలించుకున్నాడు. వాళ్ల పోరాటం ఒక ఆడ ఏనుగు కోసం రెండు మదగజాలు కొట్టుకున్నట్లున్నది. ఒకరినొకరు లాగుతూ, తోస్తూ బలిసిన ఆబోతుల్లా కుమ్ముకుంటూ గోళ్లు, దంతాలతో పెద్దపులులా పోరాడినారు. వారి పద ధాటికి నర్తనశాల కంపించింది.

భీముడు శక్తినంతా కూడదీసుకుని కీచకుడి గుండెమీద అరచేత్తో గుద్దేసరికి వాడు నేలపై కూలి పడ్డాడు. వాడి జుట్టు పట్టుకుని ఈడ్చి, తన్ని, సైరంధ్రి పగకు ప్రతీకారం చేసి చేతుల్తో ఊపిరాడకుండా బంధించి, గిరగిరా తిప్పి, కంఠాన్ని నొక్కి, మెడవిరిచి, నేలపై పడవేసి దొర్లించగా వాడు కళ్లు తేలవేసాడు. ప్రాణాలు కూడా పైకెగిరిపోయాయి. అయినా కోపం తగ్గక వాడి చేతిని మెలిపెట్టి పైకెక్కి కాళ్లను చేతుల్ని తలను మెడను మొండెంలోకి చొప్పించి మాంసం ముద్దగా చేసాడు.

**తం సమ్మథితం సర్వాంగం మాంసపిండోపమం కృతమ్**
**కృష్ణాయాః దర్శయామాస భీమసేనో మహాబలః** (విరాట. 22-83)

ఆ మాంసపు ముద్దను ద్రౌపదికి చూపించి, తాను వంటశాలకు వెళ్లిపోయాడు.

ద్రౌపది అప్పుడు కాపలావారిని పిలిచి గంధర్వులు వచ్చి కీచకుడిని చంపారని చెప్పింది. ఆ వార్త తెలిసి కీచకుడి బంధువులు ఉపకీచకులు వచ్చి– కీచకుడి శవాన్ని చూసారు. అవయవాలన్నీ శరీరంలోకి ముడుచుకుపోయి వాడు నీటిలోంచి బయటకు తీసిపడేసిన తాబేలు వలె ఉన్నాడు. అతడికి దహన సంస్కారాలు చెయ్యాలని ఆ శవాన్ని బయటకు తెస్తుంటే స్తంభం వెనక నిలబడి ఉన్న ద్రౌపది కనిపించింది.

"ఈ దుష్టురాలి వల్లనే మన సోదరుడు మరణించాడు. మన సోదరుడి శవంతోపాటు దీనినీ తగులబెడ్దాం. పరలోకంలో నన్నా కలిసి బతుకుతారు" అని విరాటరాజు అనుమతి తీసుకుని ఊరేగింపుగా బయల్దేరినారు. కీచకుడి శవమున్న బండిపై ద్రౌపదిని త్రాళ్లతో కట్టి శ్మశానానికి వెళ్తున్నారు. ద్రౌపది ఆర్తనాదాలు చేసింది.

**జయో జయంతో విజయః జయత్సేనో జయద్బలః**
**తేమే వాచం విజానంతు సూతపుత్రా నయంతి మామ్** (విరాట. 23-12)

ఆమె ఆర్తనాదాల్ని భీముడు విన్నాడు. ఆ ఊరేగింపు వెళ్తున్నవేపు చూసాడు. వారికన్నా ముందే స్మశానానికి చేరుకుని గంధర్వుడి రూపంలో నిలిచాడు. అతడు పక్కనే పడి ఉన్న తాడిచెట్టు బోదెను పెకలించి భుజాలపై పెట్టుకుని దండధారుడిలా ఉపకీచకులవేపు పరిగెత్తి, పారిపోతున్న నూట అయిదుగురినీ చంపి ద్రౌపదిని విడిపించాడు. నూట ఆరు శవాలకు అంత్యక్రియలు జరిపాడు పాపం విరాటరాజు.

ఆ తరువాత వెళ్లి సుదేష్ణతో అన్నాడు– "ఈ సైరంధ్రిని పంపించివేయి. ఈమెవల్ల మన నగరం వల్లకాడు అవుతున్నది".

సైరంధ్రి సుదేష్ణ మందిరం వేపు వెళ్తూ వంటశాల వద్ద నిలబడి ఉన్న భీముడిని చూసి– "నన్ను కష్టాల నుండి విడిపించిన గంధర్వరాజుకు నమస్కారం" అన్నది.

కాస్త ముందుకు వెళ్లేసరికి నర్తనశాల వద్ద విరాట కన్యల మధ్య బృహన్నల కనిపించాడు.

వాళ్లందరూ ద్రౌపదిని చూసి అన్నారు– "కీచకుడూ, ఉపకీచకులు పాపాత్ములు. కాని బలవంతులు. వారు ఎలా చచ్చారు?" అని ఆసక్తిగా అడిగారు.

ద్రౌపది బృహన్నల వేపు చూస్తూ అన్నది– "నీకేం బృహన్నలా, కన్యాంతఃపురంలో సుఖమయమైన జీవితం. నాలాంటి పనివారు పొందే కష్టాలుండవు కదా. అందుకే నవ్వుతూ ఉన్నావు"

బృహన్నల అన్నాడు– "నాది నీచపుట్టుక. పేడిని. ఏమీ చేయలేని స్థితిలో ఉన్నవాడు ఏమిచేయగలడు?"–

ద్రౌపది రాజకన్యలతో గంధర్వుల యుద్ధం గురించి మాట్లాడుతూ అంతఃపురంలోకి వెళ్లింది. సుదేష్ణ దుఃఖిస్తూ అన్నది– "నీరాక మాకు విపత్తును తెచ్చిపెట్టింది, సైరంధ్రీ! విరాటరాజు నిన్ను ఇక్కడనుంచి పంపివేయమని ఆజ్ఞాపించాడు"

సైరంధ్రి అన్నది– "అమ్మా! ఇంకా కేవలం పదమూడు రోజులే ఉంటానిక్కడ. ఆ తరువాత గంధర్వులు నన్ను తీసుకుని వెళ్తారు. అంతవరకు భరించు. ఆపై నీకు మేలు కలుగుతుంది".

సుదేష్ణ అన్నది– "పూజ్యురాలా! నిన్ను శరణు వేడుకుంటున్నాను. నా భర్తకు, పిల్లలకు ఏ కష్టం కలగకుండా రక్షించు"

## 4) గోహరణ పర్వము

పాండవులను వెదకడానికి వెళ్లిన కౌరవుల గూఢచారులు వచ్చి దుర్యోధనుడిని కలిసారు. "ఏ దేశంలోనూ మాకు పాండవుల ఆచూకీ కనిపించలేదు. కాని విరాటదేశంలో ఒక వింత జరిగింది. విరాటరాజు సేనాధిపతి బావమరిది మహా బలవంతుడైన కీచకుడిని ఒక స్త్రీ నిమిత్తం అయిదుగురు గంధర్వులు చంపివేసారు. కీచకుడితో పాటు ఉపకీచకులూ నూట అయిదు మంది మరణించారు"

దుర్యోధనుడు ఆలోచించాడు– "అజ్ఞాతవాసం దాదాపు పూర్తి కావస్తున్నది. పాండవుల ఆచూకీ తేలలేదు" అనుకుని తన మిత్రబృందంతో ఆలోచించాడు.

కర్ణుడన్నాడు– "మరింత నిపుణులైన గూఢచారులను పంపుదాం".

దుశ్శాసనుడన్నాడు– "వారి సమాధులపై గడ్డి మొలిచి ఉంటుంది".

భీష్ముడన్నాడు– "పాండవులున్న చోట సిరిసంపదలుంటాయి. వాళ్లు నశించరు"

కృపుడన్నాడు– "అన్ని రాజ్యాలకన్నా సుభిక్షమైన రాజ్యమే వారున్నది. సమ్రాట్టు కావాలనుకునే రాజు శత్రువును ఉపేక్షించరాదు. పదమూడేళ్లు పూర్తయ్యాక వాళ్లు వస్తే ఏం చెయ్యాలో కూడా ఆలోచించుకో!"

దుర్యోధనుడన్నాడు– "బలదేవుడు, భీమసేనుడు, శల్యుడు, కీచకుడు సమాన బలులని నేను విన్నాను. కీచకుడిని చంపగలిగినవాడు భీముడొక్కడే, ఎందుకంటే బలరామ, శల్యులిద్దరూ విరాట నగరానికి వెళ్లలేదు. విరాట నగరంలోనే జీమూతమల్లుడు మల్లయుద్ధంలో చంపబడినాడు. విరాట నగరం పాడిపంటలతో సుభిక్షంగా ఉంది. కాబట్టి ఆ దేశంపై

దండయాత్ర చేస్తే కలుగులో ఎలుకలు దొరికినట్లు పాండవులు దొరకవచ్చు. మనం విరాటరాజు గోగణాన్ని వశం చేసుకోవాలి. దానితో పాండవులు మనతో యుద్ధానికి వస్తారు. వారిని గుర్తించి మరల వనవాసం, అజ్ఞాతవాసాలకు పంపవచ్చు. ఒకవేళ వారు లేరనుకో, నన్ను ఇంతకు ముందు ధిక్కరించిన మత్స్యరాజు పొగరణిచి అతడి గోవుల్ని స్వాధీనం చేసుకున్నట్లువుతుంది".

## దక్షిణ గోగ్రహణం

త్రిగర్త దేశాధిపతి సుశర్మ అన్నాడు– "ప్రభూ! పూర్వం మత్స్య, సాల్వ దేశ సైనికులు, కీచక ఉపకీచకులు మాకెన్నో నష్టాలు కలిగించారు. కీచకుడు లేని విరాటదేశంపై దాడిచేయడం, నాకు, కర్ణుడికి, కౌరవ సోదరులకు ఇష్టమైన విషయం".

కర్ణుడన్నాడు– "పాండవులుంటే మంచిదే. లేకున్నా మంచిదే. విరాటుడి గోవుల్ని, ధనరత్నాలను వశపరచుకుందాం".

దుర్యోధనుడన్నాడు దుశ్శాసనునితో– "సోదరా! ముందుగా త్రిగర్తాధిపతి మత్స్యదేశంపై దాడి చేస్తాడు. ఒకరోజు తరువాత కౌరవ సైన్యం రెండోవేపు నుంచి దాడిచేస్తే విరాటుని ఓడించడం సులభం".

సుశర్మ కృష్ణపక్ష సప్తమినాడు ఆగ్నేయం వేపు నుండి విరాట నగరం వేపు దాడి చేసాడు.

మరునాడు అష్టమి తిథిలో ఉత్తరదిక్కు నుంచి కౌరవులు దాడిచేసి వేల గోవులను పట్టుకున్నారు.

త్రిగర్త సైన్యం దాడిచేసి దక్షిణ దిక్కునున్న గోవులను చుట్టుముట్టి గోపాలకులను బంధించేసరికి వాళ్ల నాయకుడు విరాట సభలోకి వచ్చి మొత్తుకున్నాడు. వెంటనే విరాటరాజు సైన్యాన్ని సిద్ధం చేసాడు. విరాటరాజు సోదరులు శతానీకుడు, మదిరాక్షుడు, సేనాపతి సూర్యదత్తుడు, విరాటుని కుమారుడు శంఖుడు యుద్ధానికి బయల్దేరినారు.

కంకుభట్టు అన్నాడు– "రాజా! నేను, వల్లవుడు, గ్రంధికుడు, తంతిపాలుడు యుద్ధవిద్యలు నేర్చినవారమే. మాకూ రథాలు ఇవ్వండి. మీ పరాక్రమం చూసినట్లూ ఉంటుంది, మావంతు సాయం చేసినట్లూ ఉంటుంది".

విరాటుడు వారికి రథాలను, కవచాలను, ఆయుధాలను ఇప్పించాడు. విరాటుడిననుసరించి ఎనిమిదివేల రథికులు, వెయ్యి ఏనుగులు, అరవైవేల అశ్వికులు యుద్ధసన్నద్ధులై వెళ్లారు. వారికి సుశర్మ సైన్యానికి మధ్య ఘోర యుద్ధం జరిగింది.

కేశాకేశి, రథారథి, ద్వైరథేన యుద్ధాలు జరిగాయి. సైన్యపు పదఘట్టనలతో దుమ్ము రేగి ఏమీ కనబడకుండా పోయింది. చీకటిని తొలగిస్తూ చంద్రోదయమయ్యింది.

త్రిగర్త రాజు సుశర్మ తన తమ్ముళ్లను వెంటబెట్టుకుని విరాటుడిని చుట్టుముట్టి, గుర్రాలను, సారథిని చంపి, రథహీనుడైన విరాటరాజును పట్టుకుని తన రథంపై పడవేసుకుని వేగంగా వెళ్లిపోయాడు. రాజు పట్టుబడగానే విరాటుని సైనికులు చెల్లాచెదురైనారు.

**తమున్మథ్య సుశర్మాథ యువతీమివ కాముకః**
**స్యందనం స్వం సమారోప్య ప్రయయౌ శీఘ్రవాహనః** (విరాట. 33–9)

కాముకుడు యువతిని బలాత్కరించి తీసుకుపోతున్నట్లు సుశర్మ విరాటరాజును ఎత్తుకుపోయాడు.

భీముడు చెట్టును పెకలించబోతే యుధిష్ఠిరుడు సైగచేసాడు. నకుల సహదేవులు రథచక్ర రక్షకులుగా రాగా భీముడు రథాన్నెక్కి వేగంగా వెళ్లి సుశర్మ రథాన్ని అందుకున్నాడు. అతడి గుర్రాల్ని చంపినాడు, అంగరక్షకులను చంపి, సారథిని కింద పడవేసినాడు. ఈలోగా విరాటుని సోదరుడు మదిరాక్షుడు వచ్చి సుశర్మపై బాణాలు వేసాడు. దానితో విరాటరాజు సుశర్మ రథంలో పడి ఉన్నవాడు చటుక్కున లేచి సుశర్మ గదతోనే సుశర్మ మీద దాడికి వెళ్లాడు. భీముడు వేగంగా వెళ్లి సుశర్మ జుట్టు పట్టుకుని ఎత్తి నేలమీద పడవేసి ఏడుస్తున్నవాడి తలను మోకాలితో నొక్కి మోచేతితో కొట్టేసరికి మూర్ఛపోయాడు సుశర్మ.

పాండవులు సుశర్మను బంధించి, గోవులను మళ్లించి, సుశర్మను తీసుకువచ్చి ధర్మరాజు ముందు పడవేసాడు. "ఇతడిని వదిలేయి" అన్నాడు ధర్మరాజు. సుశర్మను "వెళ్లి విరాటరాజు ముందు నిలబడి 'నీ దాసుడిని' అని చెప్పు, వదిలేస్తాను ప్రాణాలతో" అన్నాడు భీముడు. సుశర్మ విరాటరాజుకు నమస్కరించి బంధనాలనుంచి విడివడి తన దారిన తాను పోయాడు.

విరాటరాజన్నాడు– "మహానుభావులారా! చచ్చి బతికినవాడిని. మీరే మత్స్యదేశానికి ప్రభువులు"

యుధిష్ఠిరుడన్నాడు– "మీరు శత్రువుల నుంచి విముక్తులయ్యారు. అదే మాకు సంతోషం కలిగించే విషయం. మీ విజయ విషయాన్ని మీరు మన నగరంలో చాటింపు వేయించండి"

## ఉత్తర గోగ్రహణం

సుశర్మ దక్షిణ గోగ్రహణానికి వెళ్లిన మరుసటి రోజున దుర్యోధనుడు తన మంత్రులతో కలిసి ఉత్తర దిక్కుగా వెళ్లి విరాట దేశంపై దండెత్తినాడు. అతడి వెంట భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, కృపుడు, అశ్వత్థామ, శకుని, దుశ్శాసనుడు, వివింశతి, వికర్ణుడు, చిత్రసేనుడు, దుర్ముఖుడు, దుశ్శలుడు మున్నగువారున్నారు.

వీరి చేతికి విరాటునికి చెందిన అరవై వేల గోవులు చిక్కాయి. గోపాలుర నాయకుడు ఏడుస్తూ నగరానికి వచ్చి అక్కడ ఉన్న రాజకుమారుడితో అన్నాడు– "రాజశ్రేష్ఠా! నిండుసభలో విరాటరాజు తమ పరాక్రమాన్ని పొగుడుతూ ఉంటాడు. మన గోవులు అరవై వేల సమూహాన్ని కౌరవులు తోలుకుపోతున్నారు. నీవే మాకు దిక్కు" అన్నాడు గోపాలుడు.

ఉత్తరుడన్నాడు– "రథముంది, బాణాలున్నాయి, ధనుస్సున్నది, ధైర్య సాహసాలున్నాయి. కాని, సారధి లేదు. నా సారథి మునుపు ముప్పది రోజుల యుద్ధంలో చనిపోయాడు. ఇప్పుడు నాకు సారధి కావాలి. సారధి ఉంటే చాలు నాకు. నేను యుద్ధానికి వెళ్లి, భీష్మ, ద్రోణ, కర్ణ, దుర్యోధనాదులను ఓడించి– ఆహా ఇతడు సాక్షాత్తు అర్జునుడా అనేట్లు పరాక్రమం ప్రదర్శించి గోవులను విడిపించి తీసుకువస్తాను. నాకిప్పుడు సారధి కావాలి"

ద్రౌపది అన్నది– "దానికేం భాగ్యం. ఉత్తరకు నాట్యం నేర్పే బృహన్నల కొంతకాలం సారధ్యం చేసాడు. అదీ ఖాండవ వన దహన సమయంలో. అతడి వల్లనే అర్జునుడంత గొప్ప వీరుడైనాడు".

ఉత్తరుడన్నాడు– "నేను వీరుడిని. నా అంతట నేను బృహన్నలను నా రథం తోలమని చెప్పలేను".

ద్రౌపది అన్నది– "నీ సోదరి ఉత్తర చెబుతుందిలే!"

అన్న మాట విని ఉత్తర వెళ్లింది చెంగుచెంగున ఎగురుకుంటూ గురువు వద్దకు. "బృహన్నలా! నీవు నా అన్నకు సారథ్యం చెయ్యాలి. మన గోవులను కౌరవులపహరించి తీసుకుపోతున్నారు. ఎంతో ప్రేమతో అడుగుతున్నాను, నీవు కాదంటే ఇక్కడే చచ్చిపోతాను" అన్నది ముద్దుముద్దుగా. "నీవడగడం నేను కాదనడం ఉండదు, పద!" అన్నాడు బృహన్నల.

బృహన్నలను చూసి ఉత్తరుడన్నాడు– "రావయ్యా రా! ఖాండవ వన దహన సమయంలో నీవు నాకెంతో ఇష్టమైన అర్జునుడికే సారధివి కదా! నా రథాన్ని తోలు"

బృహన్నల అన్నాడు– "పాడటం, నాట్యం, తతం, వితతం, ఘనం, సుషీరం వంటివి నేను చేయగలను కాని యుద్ధరంగం నాదికాదు. నాట్యరంగమంటావా యుద్ధాన్ని అభినయించి చూపగలను గొప్పగా"

ఉత్తరుడు ధరించమని ఇచ్చిన కవచాన్ని తలకిందులుగా తొడుక్కోబోయాడు. నొగమీద వెనక్కి తిరిగి కూర్చున్నాడు. అది చూసి రాకుమార్తెలు కళ్లు పెద్దవి చేసి నవ్వుకున్నారు.

ఉత్తరుడు ఎంతో ఓపికతో బృహన్నలకు కవచం తొడిగి, తాను కూడా కవచం ధరించి రథం నిండా ఆయుధాలు పెట్టించి యుద్ధానికి బయల్దేరాడు.

వాళ్లు బయల్దేరినపుడు ఉత్తర–ఆమె చెలులన్నారు– "బృహన్నలా! శత్రువుల్ని జయించి వచ్చేప్పుడు వారి అందమైన చిన్నచిన్న మెత్తని రంగురంగుల వస్త్రాలను మా బొమ్మల పొత్తిళ్లకు తీసుకురావాలి సుమా!"

బృహన్నల అన్నాడు– "ఉత్తరుడు గెలిస్తే తప్పకుండా తెస్తాను". రథం బయల్దేరింది. నగరం దాటి స్మశానం వేపు పోతున్నది. అల్లంత దూరంలో కౌరవసేనా సముద్రం కానవచ్చింది. దానితో ఉత్తరుడికి వణుకు పుట్టింది.

"బృహన్నలా, యుద్ధమంటే ఏ ఇద్దరో ముగ్గురో ఉంటారు. బెదరగొట్టి రావచ్చు అనుకున్నాను. అటుచూడు! అది సముద్రంలా అంతుపట్టకుండా ఉన్నది. అస్త్రవిద్యలు రానివాడిని. వారినెదుర్కోలేను, రథాన్ని మళ్లించు" అన్నాడు ఉత్తరుడు.

బృహన్నల అన్నాడు– "యుద్ధం చెయ్యకుండా వెళ్తే ఆడవాళ్లు నవ్వుతారు"

ఉత్తరుడన్నాడు– "ఎవరో నవ్వుతారని ఎవరైనా ప్రాణత్యాగం చేస్తారా?"

బృహన్నల అన్నాడు– "శూరులు పారిపోరు. అది క్షత్రియధర్మం కాదు"

ఉత్తరుడు రథం దిగి పరిగెత్తసాగినాడు. అతడి వెనక బృహన్నల కొప్పు విడిపోయింది, పేడినడక – దూరం నుంచి చూస్తున్న కౌరవులు నవ్వుతున్నారు– "గొప్ప రథికుడు, గొప్ప సారథి. పిల్లవాడు, పెద్దవాడు కాని రథికుడు పారిపోతున్నాడు, ఆడ–మగ కాని సారథి అతడి వెంట బడినాడు. అపూర్వ దృశ్యమిది" అనుకుంటున్నారు వాళ్లు.

కొందరు అనుమానించారు రథికుడు ఉత్తరుడు, సారథి అర్జునుడని. ఉత్తరుడి వెంట పరిగెత్తి అర్జునుడు వెనక నుంచి జుట్టు పట్టుకునేసరికి ఉత్తరుడు దీనంగా దీనం ఏడ్చినాడు.

**శృణు యాస్త్వం హి కల్యాణి బృహన్నలే సుమధ్యమే**
**నివర్తయ రథం క్షిప్రం జీవన్ భద్రాణి పశ్యతి–**

"బ్రతికి ఉంటే మానవుడు శుభాల్ని పొందుతాడు. బృహన్నలా, రథం వెనక్కి తిప్పు. నేను యుద్ధం చేయలేను. నీకు నూరు బంగరు నాణేలు, ఎనిమిది వైడూర్యాలు, రథం, పది ఏనుగులిస్తాను".

అంతలా భయపడ్తున్న ఉత్తరుడిని శాంతపరచి రథం పైకెక్కించి జమ్మిచెట్టు వేపు రథాన్ని మళ్లించాడు బృహన్నల.

ఉత్తరుడు, బృహన్నల జమ్మిచెట్టు వేపు వెళ్లడానిని గమనించాడు ద్రోణుడు. అప్పుడు కొన్ని ఉత్పాతాలు కనిపించాయి. వడగళ్లతో కూడిన ఈదురుగాలులూ, కారుమబ్బులూ, ఒరల నుంచి జారిపడుతున్న శస్త్రాలు, తోకచుక్కలు, నక్కల అరుపులు, కన్నీళ్లు విడుస్తున్న గుర్రాలు, గాలి లేకుండా కదులుతున్న ధ్వజాలు – వీటిని చూసి ద్రోణుడు కౌరవులను హెచ్చరించాడు. జననష్టం జరుగబోతోంది. నపుంసక వేషంలో వచ్చింది అర్జునుడే సందేహం లేదు.

ద్రోణుడన్నాడు భీష్ముడితో– "ఇతడు దివ్యాస్త్రాలు సంపాదించి వచ్చాడు. అర్జునుడిని ఎదిరించగల వీరుడెవడు?"

కర్ణుడన్నాడు– "నీవెప్పుడూ మాముందు నీ శిష్యుడి గుణగణాలు పొగుడుతావు. అతగాడు నాలోగాని, దుర్యోధనుడిలో గాని పదహారవ వంతు కూడా చెయ్యడు"

దుర్యోధనుడన్నాడు– "అర్జునుడే అయితే, మరల పన్నెండేళ్ల వనవాసం, ఏడాది అజ్ఞాతవాసం. ఇంకెవడైనా అయితే నా బాణాలతో చస్తాడు"

అందరూ దుర్యోధనుడిని మెచ్చుకున్నారు.

ఇంతలో జమ్మిచెట్టు వద్దకు వెళ్లారు ఉత్తరుడు, బృహన్నల.

బృహన్నల అన్నాడు– "ఉత్తరకుమారా, జమ్మిచెట్టెక్కి అర్జునుడి గాండీవం తీసుకురా!"

ఉత్తరుడన్నాడు– "అది శవం. రాకుమారుడిని నేనెలా ముట్టుకోగలను?"

బృహన్నల అన్నాడు– "అవి ధనుస్సులు. చెట్టెక్కి తాళ్లు విప్పు"

ఉత్తరుడన్నాడు– "చెట్టెక్కాను, తాళ్లు విప్పాను. అమ్మో! ఇవి పాములు"

బృహన్నల అన్నాడు– "వాటిని స్పృశించు. అన్నిపక్కల బంగారంతో చేయబడినది, నూరు బంగరు బొట్లు ఉన్నది గాండీవం. దానిని బ్రహ్మ వెయ్యేళ్లు, ప్రజాపతి 503 సంవత్సరాలు, ఇంద్రుడు 85 ఏళ్లు, సోముడు 500 ఏళ్లు, వరుణుడు 100 ఏళ్లు ధరించారు. ఇప్పుడది అర్జునుడికి చెందింది. అతడి వద్ద 65 ఏళ్లుంటుంది.

బంగరు ఏనుగు బొమ్మలున్న ధనుస్సు భీమసేనుడిది. ఇంద్ర గోపకములున్నది ధర్మజుడి ధనుస్సు; బంగరు సూర్య ప్రతిమలున్నది నకులుడి ధనుస్సు; బంగరు మిడుతలున్నది సహదేవుడి ధనుస్సు. ఈ అమ్ములపొదులు, బాణాలు, కత్తులు పాండవులవి".

ఉత్తరుడడిగాడు– "పాండవులిప్పుడెక్కడున్నారు?"

అర్జునుడన్నాడు– "కంకుభట్టు–ధర్మరాజు; వల్లవుడు–భీమసేనుడు; నేను బృహన్నలను–అర్జునుడిని; గ్రంధికుడు–నకులుడు; తంతిపాలుడు–సహదేవుడు; సైరంధ్రి–ద్రౌపది. ఆమెకోసమే కీచకుడు, ఉపకీచకులు చంపబడినారు".

ఉత్తరుడన్నాడు– "నీకు పది పేర్లున్నాయిగా, అవేమిటి?"

**అర్జునః ఫాల్గునో జిష్ణుః కిరీటి శ్వేతవాహనః**
**భీభత్సు ర్విజయః కృష్ణః సవ్యసాచీ ధనంజయః** (విరాట. 44–9)

ఆ మాటలతో ఉత్తరుడికి భయం పోయింది. వెళ్లి సారధిగా నొగమీద కూర్చున్నాడు. అర్జునుడు రధికుడైనాడు. అర్జునుడన్నాడు– "నేను కౌరవులతో యుద్ధం చేస్తాను. నీ పశువుల్ని జయించి తెస్తాను"

అని పలికి అర్జునుడు రథపు గుర్రాల్ని సరైన స్థానాలలో ఉంచి రథంమీద కూర్చొని అన్ని అస్త్రాల అధిదేవతలను స్మరించాడు. గాండీవానికి అల్లెత్రాడు బిగించి ధనుష్టంకారం చేసాడు. ఆ ధ్వని ఒక కొండకు మరో కొండ ఢీకొన్నప్పుడు వచ్చిన ధ్వనిలా, భూమిని బ్రద్దలు చేసినట్లు, ప్రచండ గాలులు వీచినట్లున్నది. చెట్లు ఊగిపోయాయి. పిడుగులు పడ్డాయను కున్నారు కౌరవులు.

అర్జునుడు తలచుకోగా కపిధ్వజము, అక్షయ తూణీరాలు వచ్చాయి. చేతికి ఉడుము తొడుగు ధరించి అర్జునుడు ధనుస్సు చేతబట్టి తన మహాశంఖాన్ని ఊదినాడు.

శంఖధ్వని, గాండీవపు అల్లెత్రాటి ధ్వని, రథపు ఇరుసు చప్పుళ్లు, అన్నీ కలిసేసరికి మహాధ్వని పుట్టి రథానికి కట్టిన గుర్రాలు నిలిచిపోయాయి. ఉత్తరుడు భయపడి నొగపై చతికిలపడ్డాడు. గుర్రాలను, ఉత్తరుడిని సముదాయించి అర్జునుడు ఉత్తరాభిముఖంగా రథాన్ని పోనిమ్మన్నాడు.

ద్రోణుడన్నాడు– "వచ్చెడువాడు సవ్యసాచి. గోవులను హస్తినవేపు పంపి మనం వ్యూహం పన్ని శత్రువునెదిరిద్దాం"

దుర్యోధనుడన్నాడు– "అతడు అర్జునుడే అయితే ఇంకా యుద్ధం దేనికి. అజ్ఞాతవాస నియమం తప్పినందుకు పాండవులు మరల వనవాస అజ్ఞాతవాసాలు చెయ్యాల్సిందే. మనం యుద్ధం చేస్తున్నది మత్స్య దేశంపై. అతడు వచ్చి ఎదురుపడితే అతడే నియమాన్ని అతిక్రమించినట్లు కదా!"

కర్ణుడన్నాడు– "ఆచార్యుడు మనలను భయపెడుతున్నాడు. అర్జునుడు రాకముందే అతడి గురించి చెప్పి బెదర గొడ్తున్నాడు. ఇటువంటి పండితులు జనం మధ్యలో ఆశ్చర్యకరమైన కథలు చెబుతుంటే వింటానికి బాగుంటాయి. యుద్ధంలో కాదు.

**అద్యాహ మృణ మక్షయ్యం పురావాచా ప్రతిశ్రుతమ్**
**ధార్తరాష్ట్రాయ దాస్యామి నిహత్య సమరేర్జునమ్** (విరాట. 48–10)

ప్రభువుకు నేనిచ్చిన మాట ప్రకారం అర్జునుడిని సంహరించి మరోవిధంగా తీర్చలేని దుర్యోధనుని అప్పు తీర్చివేస్తాను" అన్నాడు కర్ణుడు. "కౌరవులకు గోధనం ముఖ్యమైతే దానిని తీసుకుని వెళ్లవచ్చు. కాదంటే ఇక్కడే రథాలపై నిలిచి నా యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూడవచ్చు".

కృపుడన్నాడు– "రాధేయా! నీ ఆలోచనెప్పుడూ ఇంతే!

రాజకీయ తంత్రాలలో యుద్ధం పాపభూయిష్ఠమైనది. అర్జునుడు సామాన్యుడు కాదు. ఒంటరిగా ఖాండవ వన దహనం చేసాడు. ఒంటరిగానే సుభద్రనపహరించి శ్రీకృష్ణుడితో, యాదవులతో యుద్ధానికి సిద్ధమైనాడు. ఒంటరిగానే ఇంద్రుని వద్ద అయిదేళ్లు అస్త్రవిద్యలనభ్యసించాడు. ఒంటరిగానే గంధర్వరాజు చిత్రసేనుడి నోడించాడు. ఒంటరిగానే నివాత కవచ పౌలోమ కాలఖంజులను చంపినాడు. నీవు ఒంటరిగా సాధించిన పనేమిటి? అర్జునుడితో ఒంటరిగా పోరాడటమంటే కోపించిన పాము నోటిలోని విషపు దంతాలను చూపుడు వ్రేలితో లెక్కించడం, అంకుశం లేకుండా మదపుటేనుగుపై ప్రయాణం చేయడం".

అశ్వత్థామ అన్నాడు– "కర్ణా! మనమింత వరకు గోవులను గెలుచుకోలేదు, హస్తిన చేరలేదు. మత్స్యదేశపు సరిహద్దులు దాటలేదు. నీవుమాత్రం పనికిరాని మాటలు పలుకుతూనే ఉన్నావు. నేను అర్జునుడితో పోరాడను. విరాటరాజు యుద్ధానికి వస్తే వదలను".

భీష్ముడన్నాడు– “ఎవరి ప్రవృత్తికి తగ్గట్టు వాళ్లు ఆలోచించడం సాధారణమే. కర్ణుని మాటలు అందరిలోనూ ఉత్సాహం రగిలించడానికి చెప్పినవి. మనలో మనకు కలహాలు వద్దు”

దుర్యోధనుడన్నాడు– “శాంతమిప్పుడు సరైనది. కర్తవ్యాన్ని తెలపండి”

ద్రోణుడన్నాడు– “అజ్ఞాతవాస కాలం ముగిసింది. అందుకే అర్జునుడు బయటకు వచ్చాడు. సందేహ నివృత్తి చేయగలిగింది భీష్ముడే!”

భీష్ముడన్నాడు– “ప్రతి అయిదు సంవత్సరాలకూ రెండు అధిక మాసాలు వస్తాయి. ఈ లెక్కన పదమూడు సంవత్సరాలపై ఐదు నెలల పండ్రెండు రోజులు ఎక్కువగానే గడిపారు పాండవులు. వాళ్లు మరణాన్నయినా వరిస్తారు కాని అసత్యమాడరు. దుర్యోధనా, నీకిష్టమైనచో సంధి చేసుకోవచ్చు”.

దుర్యోధనుడన్నాడు– “నేను పాండవులకు రాజ్యమివ్వను. యుద్ధమే పితామహా, నా నిర్ణయం”

భీష్ముడన్నాడు– “నీవు సేనలో నాలుగో భాగాన్ని తీసుకుని హస్తినకు బయల్దేరు. మరో నాలుగోవంతు సేన గోవులను తోలుకుని నీ వెనక వస్తుంది. మిగిలిన సగభాగంతో మేము అర్జునుడినెదిరిస్తాము. ఆచార్యా, మీరు మధ్యలో, అశ్వత్థామ ఎడమవేపు, కృపుడు కుడివేపు, కర్ణుడు ముందుంటాడు. నేను సైన్యానికి వెనుకవేపు రక్షణగా ఉంటాను”.

భీష్ముడు సేనలను వజ్రగర్భ, వ్రీహీముఖ, అర్ధచక్రాంత మండల రూపంగా నిలిపి తాను రక్షణగా యుద్ధానికి సిద్ధమైనాడు.

ద్రోణుడన్నాడు– “అది అర్జునుడి రథఘోష, అది రథ పతాక. రథంపైనున్న ఆంజనేయుడు గర్జిస్తున్నాడు”

**రథీ శరీ చారుతలీ నిషంగీ శంఖీ పతాకీ కవచీ కిరీటీ**
**ఖడ్గీ చ ధన్వీ చ విభాతి పార్థః శిఖీ వృత్తః స్రుగ్భిరివాజ్యసిక్తః**

యజ్ఞ సామాగ్రితో కూడి, నేతితో ప్రజ్వలిస్తున్న అగ్నిలా వస్తున్నాడు అర్జునుడు. వస్తూనే కౌరవ వ్యూహాన్ని పసికట్టాడు. దుర్యోధనుని రథకేతనం వేపు రథాన్ని పోనిమ్మన్నాడు.

ద్రోణుడన్నాడు– “అర్జునుడి బాణాలు రెండు నా పాదాల దగ్గర పడ్డాయి. రెండు నా చెవుల ప్రక్కగా దూసుకుపోయాయి. నా పాదాలకు నమస్కరించి, కుశల ప్రశ్నలు వేసాడు బాణాలతో నా శిష్యుడు”

కృపుడంటున్నాడు– “అతడు రారాజు వేపు వెళ్తున్నాడు”. అర్జునుడు వేగంగా దుర్యోధనుని సేనను సమీపించి, ఆ సేనపై పొలంపై మిడతల దండు దాడిచేసినట్లు బాణవర్షం కురిపించాడు.

**ససర్షభాస్తేన నరర్షభేణ వీరారణే వీరతరేణ భగ్నాః**
**చకంపిరే వాతవశేన కాలే ప్రకంపితానీవ మహావనాని** (విరాట. 54–14)

దానితో కౌరవ వీరులు పెనుగాలికి మహా వనాలు కదిలినట్లు కదిలిపోయారు. అర్జునుడు తీవ్ర వేగంతో వెళ్లి శత్రుసేనను పారద్రోలి గోవులను స్వాధీనం చేసుకున్నాడు.

అర్జునుడిని మహోద్రేకంతో ఎదిరించాడు కర్ణుని సోదరుడు సంగ్రామజిత్తు. అర్జునుడి బాణాలకు తల తెగి నేలకూలినాడు. దానితో కర్ణుడు రెచ్చిపోయి బాణవర్షం కురిపించాడు ఉత్తరుడు, అర్జునునిపై. కర్ణుడి యుద్ధ పటిమను చూసి కౌరవులు విజయనాదాలు చేసారు.

దెబ్బతిన్న ఏనుగులా విజృంభించిన అర్జునుడు కర్ణుడి శరీరాన్ని జల్లెడలా గాయపరచేసరికి ఒక ఏనుగుతో ఓడించబడిన ఏనుగులా కర్ణుడు రణరంగం నుంచి పక్కకు తొలిగాడు.

ధాన్యపు కంకులను త్రుంచినట్లు శత్రువుల తలలను తుంచుతూ అర్జునుడు శరవేగంతో కృపుడిని సమీపించాడు. కృపాచార్యుడు గొప్పగా యుద్ధం చేసాడు. కొద్దిసేపట్లోనే అర్జునుని బాణపరంపరకు కృపాచార్యుడు విరథుడై, గాయపడి రణరంగం నుంచి నిష్క్రమించాడు.

అర్జునుడి రథం ద్రోణుడివేపు వెళ్లింది. గురుశిష్యులిద్దరూ కళ్లతోనే పలకరించుకున్నారు. రథం మీదనే నిలిచి ఒకరినొకరు కౌగిలించుకున్నారు. కౌరవులకు భయం వేసింది గురుశిష్యులొక్కటవుతారేమోనని.

అర్జునుడన్నాడు– "తమరు నన్ను ముందుగా కొడితేనే నేను తమరిపై తలపడతాను".

ద్రోణుడు ఇరవై ఒక్క బాణాలు వేసాడు అర్జునుడిపై. వాటినన్నిటినీ అర్జునుడు ఖండించాడు. ఒకరిపై ఒకరు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తూ ఒకరిని మించాలని ఒకరు ప్రయత్నించేసరికి పోరు ఘోరమయ్యింది. "క్షత్రియ ధర్మం ఘోరమైనది. గురువుతో కూడా యుద్ధం చేయవలసి వస్తున్నది అర్జునుడు" అనుకున్నారు యుద్ధం చూస్తున్నవారు.

ఇద్దరూ దివ్యాస్త్రాలు ప్రయోగించారు. వాటిని అణిచివేసారు. యువకుడైన అర్జునుడు గాండీవం, అక్షయ తూణీరాలున్న వాడు గనుక శరవర్షాన్ని కురిపించి ద్రోణుడిని కప్పివేసేసరికి, అశ్వత్థామ అడ్డం వచ్చాడు.

అశ్వత్థామ అర్జునుడు అద్భుతంగా యుద్ధం చేసారు. వారి బాణ సమూహాల వల్ల ఆకాశం చీకటిమయమయ్యింది. వెలుతురు లేదు, గాలి ప్రసరించలేదు. అశ్వత్థామ బాణాలను ఖండించి అర్జునుడు అతడిని వదిలి కర్ణుడివేపు దృష్టిసారించాడు. ఇద్దరి మధ్య మాటలతో మొదలైన యుద్ధం బాణాలు, కత్తులు, శక్తుల ప్రయోగానికి దారితీసాయి.

అదను చూసి అర్జునుడు ప్రయోగించిన గొప్ప బాణం కర్ణుని కవచాన్ని చీల్చి శరీరాన్ని బలంగా తాకేసరికి కర్ణుడు వెన్నుచూపినాడు. ఆ తరువాత దుశ్శాసనుడు, దుస్సహుడు, వివింశతి లాంటి వీరులందరినీ గాయపరచి భీష్ముడిపైకి వెళ్లాడు.

భీష్మార్జునులకు జరిగిన సమరం చూసేవాళ్లకు భయం, గగుర్పాటు కలిగించాయి. దివ్యాస్త్ర పండితులైన వారిద్దరూ బాణాల్ని ప్రయోగిస్తుంటే వారిద్దరిలో ఏ తేడా కనిపించడం లేదు. భీష్ముడు అర్జునుడి వక్షస్థలాన్ని గాయపరచగానే అర్జునుడు ఒకేసారి పది బాణాలు వేసి భీష్ముడిని గట్టిగా కొట్టేసరికి భీష్ముడు నిశ్చేష్టుడై ఉండిపోగా, సారధి అక్కడ నుంచి రథాన్ని దూరంగా తీసుకుపోయాడు.

దుర్యోధనుడది చూసి భల్లమనే బాణాన్ని వదిలి అర్జునుడి నుదుటిని గాయపరచాడు. అదే సమయంలో వికర్ణుడు ఏనుగునెక్కి వచ్చి అర్జునుడిపైకి వస్తుండగా అర్జునుడు ఆ ఏనుగు కుంభస్థలాన్ని లోహబాణంతో చీల్చివేసేసరికి అది నేలకూలింది. వికర్ణుడు ఏనుగు పైనుంచి దూకి వివింశతి రథమెక్కినాడు. అర్జునుడు మరోబాణంతో దుర్యోధనుడి వక్షస్థలంపై కొట్టేసరికి దుర్యోధనుడు పలాయనం చిత్తగించాడు.

అర్జునుడన్నాడు– "దుర్యోధనా! పారిపోవద్దు, నీపేరు దుర్యోధనుడు, నీవేమో పారిపోతున్నావు. ప్రాణాలు రక్షించుకో!" అనేసరికి బుసలుకొడ్తున్న పాములా దుర్యోధనుడు కోపిస్తూ అర్జునుడి వేపు మరలగానే అతడికి రక్షణగా భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, వివింశతి, దుశ్శాసనుడు అన్నివేపుల నుంచి వచ్చి అర్జునుడిని చుట్టుముట్టి బాణవర్షం కురిపిస్తుంటే అతడు వాళ్ల అస్త్రాలను మరలించి కుబేరుడిచ్చిన సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించాడు. కౌరవ వీరులందరూ అచేతనులై పడిపోయారు.

అర్జునుడన్నాడు– "ఉత్తర కుమారా! వెళ్లి ద్రోణ, కృపాచార్యుల తెల్లని వస్త్రాలు, కర్ణుని పసుపు వస్త్రం, అశ్వత్థామ, సుయోధనుల నీలివస్త్రాలు తీసుకునిరా. భీష్ముడి కుడివేపు నుంచి వెళ్లు. ఆయనను తాకకు. భీష్ముడు ప్రతిఘటించగలడు సమ్మోహనాస్త్రాన్ని".

ఉత్తరుడు ఆ వస్త్రాలను ఉత్తరకు బొమ్మపొత్తిళ్లకై తీసుకువచ్చి రథాన్నెక్కినాడు. వెళ్లిపోతున్న అర్జునుడిని భీష్ముడు ప్రతిఘటించగా ఆయనను గాయపరచాడు అర్జునుడు. ఆ రథం కాస్త దూరం పోగానే సమ్మోహనాస్త్రపు దెబ్బ నుంచి తేరుకున్న దుర్యోధనుడు "ఏడీ అర్జునుడు?" అంటూ యుద్ధానికి సిద్ధం కాగా భీష్ముడన్నాడు– "ఈరోజు విజయం అతడిది. మనం ఇంతటితో ఈ కార్యాన్ని ముగిస్తే మంచిది".

అందరూ అంగీకరించారు. అర్జునుడు వెళ్తూ వెళ్తూ భీష్ముడికి, ద్రోణుడికి నమస్కరించి, అశ్వత్థామ, కృపాచార్య, బాహ్లీక, సోమదత్తులకు విచిత్ర శరాలతో వందనం సమర్పించి, గొప్ప బాణంతో దుర్యోధనుని రత్నఖచిత కిరీటాన్ని పడగొట్టి వెళ్లిపోతూ గాండీవపు అల్లెత్రాటిని మోగించి, దేవదత్త శంఖాన్ని పూరించాడు.

"ఉత్తరా! పశువులను మళ్లించు. శత్రువులు ఓడించబడినారు. ఆనందంగా పట్టణంలోకి ప్రవేశించు. మీ తండ్రి గారికి కబురు పంపు– 'కౌరవ సైన్యాన్ని జయించి, గోవులను మళ్లించి తెస్తున్నాను' అని సందేశం పంపు".

ఉత్తరుడదే విధంగా చేసాడు. మరల రధికుడు సారధైనాడు సారధి రధికుడైనాడు. దివ్యాస్త్రాలు చెట్టుపైకి చేరుకున్నాయి.

గోపాలురు ఉత్తరుడి విజయవార్తను తెలపడానికి నగరానికి పరుగు పరుగున వెళ్లారు.

అక్కడ విరాటరాజు దక్షిణ గోగ్రహణంలో పొందిన విజయాన్ని ఆనందిస్తూ నగరానికి చేరుకునేసరికి పిడుగులాంటి వార్త. తన కుమారుడు ఉత్తరుడు ఒక్కడే బృహన్నలను సారధిగా తీసుకుని కౌరవులను ఎదిరించి గోవులను మళ్లించడానికి వెళ్లాడని తెలుసుకున్నాడు. తన సైన్యాన్ని కుమారుడికి రక్షణగా వెళ్లమని ఆజ్ఞాపించాడు.

"వెళ్లండి. నా కుమారుడు జీవించి ఉన్నాడో లేదా తెలుసుకోండి. సారధి బృహన్నల ఎప్పుడో చనిపోయి ఉంటాడు" అన్నాడు విరాటరాజు ఆందోళనగా.

కంకుభట్టు నవ్వుతూ ప్రశాంత వదనంతో అన్నాడు– "బృహన్నల తోడు ఉండగా ఉత్తర కుమారునికే ఆపదా కలుగదు".

ఇంతలో గోపాలకులు వచ్చి విరాటరాజుకు విజయవార్త నందించారు. కురువీరులను గెలిచి ఉత్తర కుమారుడు గోవులను మళ్లించుకుని వస్తున్నాడని.

విరాటరాజు పుత్రోత్సాహంతో పొంగిపోయాడు. మంత్రులతో అన్నాడు– "నా కుమారుడిని అత్యంత కోలాహలంగా నగరంలోకి తీసుకురండి. నగరమంతా ఉత్సవాలు జరపాలి. నా కుమార్తె ఉత్తర ఇతర రాజకుమార్తెలతో కలిసి వెళ్లి ఉత్తర కుమారుడికి స్వాగతం పలకాలి! సైరంధ్రీ! పాచికలు పట్టుకునిరా! కంకా! జూదం మొదలెడదాం!" అన్నాడు విరాటుడు.

కంకుభట్టు అన్నాడు– "జూదరి గొప్ప ఆనందంతో ఉన్నపుడు జూదం ఆడరాదు. అయినా తప్పదంటే ఆడతాను".

విరాటుడన్నాడు– "నాకు స్త్రీలు, గోవులు, సువర్ణం కన్నా జూదమే ఇష్టం. ఈ సంతోష సమయంలో ఆడాల్సిందే!"

కంకుభట్టు అన్నాడు– "రాజసూయ యాగం చేసి సంతోషంగా ఉన్నపుడు ధర్మరాజు జూదమాడి సమస్త రాజ్యం, సంపదలు పోగొట్టుకుని అడవుల పాలైనాడు. జూదం మంచిది కాదు, అయినా తప్పదంటే ఆడతాను".

ఆట మొదలెట్టారు. విరాటరాజు మహానందంగా ఉన్నాడు– "నా కొడుకు ఉత్తరుడు లోకోత్తర వీరుడు కాబట్టి కౌరవుల నోడించాడు".

కంకుభట్టు అన్నాడు– "బృహన్నల సారధిగా ఉన్నపుడు ఏ రథికుడిదైనా గెలుపే. ఓటమి ఉండదు".

విరాటుడికి కోపం వచ్చింది– "నీచ బ్రాహ్మణుడా! నా కుమారుడికి నపుంసకుడికి పోలికేమిటి? పేడిని పొగుడుతున్నావేమిటి?"

కంకుభట్టు అన్నాడు– "బృహన్నల గొప్ప వీరుడు. ఇది సత్యం"

విరాటుడికి కోపం వచ్చింది– "ఇంకెప్పుడూ ఇలాంటి మాటలాడకు" అని పాచికలను ధర్మరాజు ముఖం మీదకు విసిరికొట్టాడు. పాచిక దెబ్బ తగిలి ముక్కు నుండి రక్తం కారబోతుంటే ధర్మరాజు తన ముక్కును అదిమిపెట్టి సైరంధ్రి వేపు చూసాడు. నీటితో నిండిన బంగరు పాత్ర తెచ్చి ఆ రక్తం పాత్రలో పడేట్లు జాగ్రత్తపడింది సైరంధ్రి.

అదే సమయంలో ఉత్తరుడు నగరంలోకి ప్రవేశించాడు. పౌరుల, జానపదుల, స్త్రీల స్వాగతాన్ని అందుకుని తండ్రి వద్దకు వచ్చాడు. బృహన్నల బయట ఆగినాడు. ఉత్తర కుమారుడు వచ్చి తండ్రికి, కంకుభట్టుకు నమస్కరించి, కంకుభట్టు ముక్కునుంచి రక్తం కారడాన్ని గమనించాడు. "ఎవరితడిని గాయపరచింది?" అని అడిగాడు ఉత్తర కుమారుడు ఉద్వేగంతో.

విరాటుడన్నాడు– "నేనే కుమారా! ఇతడు నిన్ను కాదని బృహన్నలను పొగుడుతుంటే పాచికలు విసిరాను"

ఉత్తర కుమారుడన్నాడు– "క్షమించమని అడుగు తండ్రీ! వీరు కోపిస్తే మనం సర్వనాశనమవుతాం"

విరాటుడు వెంటనే గద్దె దిగి యుధిష్ఠిరుని క్షమాపణ కోరినాడు. యుధిష్ఠిరుడన్నాడు– "నీపై నాకు ఇసుమంతైనా కోపం లేదు. నా రక్తం భూమిపై పడితే నీకు, నీ రాజ్యానికి నష్టం కలిగి ఉండేది. ఇప్పుడిక భయం లేదు".

విరాటుడు మరల ఉత్తరుడిని ప్రశంసిస్తుంటే తండ్రిని ఆపి ఉత్తర కుమారుడన్నాడు– “తండ్రీ! యుద్ధం గెలిచింది నేను కాదు. ఓ మహానుభావుడు దివ్యాస్త్రాలతో కౌరవ సేనను ఓడించాడు. మహారథికులు పరాజయాన్ని పొందారతడి చేతిలో. ఈ విజయం అతడిదే!”

## 5) వైవాహిక పర్వము

మహారథుల నుంచి తెచ్చిన వస్త్రాలను బృహన్నల విరాటకన్య ఉత్తరకు ఇచ్చాడు. తరువాత నియమిత సమయం వరకు తమ ప్రతిజ్ఞను పాటించి, మూడవ రోజున స్నానం చేసి రాజోచితమైన దుస్తులు ధరించి, విరాటరాజ సభలోకి ప్రవేశించి రాజుల ఆసనంపై కూర్చున్నారు.

విరాటరాజు వచ్చి తన సింహాసనం మీద కూర్చుని ఉన్న కంకుభట్టును చూసి కోపంతో– “కంకా! నీవు రాజువెప్పుడైనావు?” అన్నాడు.

అర్జునుడన్నాడు– “గుర్తించలేదా విరాటరాజా అతడే ధర్మరాజు. ఈ వల్లవుడే భీముడు. గ్రంథికుడు నకులుడు, తంత్రిపాలుడు సహదేవుడు; నేను బృహన్నలగా ఉన్న అర్జునుడిని. సైరంధ్రియే ద్రౌపది”

**అభ్యాంతు పార్శ్వే కనకోత్తమాంగీ**
**యైషాప్రభా మూర్తిమతీవ గౌరీ**
**నీలోత్పలాభా సురదేవతేవ**
**కృష్ణాస్థితా మూర్తిమతీవ లక్ష్మీః** (విరాట. 71–17)

అని ద్రౌపది గురించి పలికి ఉత్తర కుమారుడు బృహన్నల అర్జునుడిగా మారి యుద్ధమెలా చేసాడో వర్ణిస్తుంటే విరాటరాజు అలా వింటూ ఉండిపోయాడు.

విరాటుడన్నాడు– “ఈ రాజ్యం యుధిష్ఠిరునికి సమర్పించాను. నా కుమార్తెను ధనంజయుడికిస్తాను”.

ధనంజయుడైన అర్జునుడన్నాడు– “రాజా! నేను మీ కుమార్తె, నా శిష్యురాలు ఉత్తరను కోడలిగా స్వీకరిస్తాను”.

ఉత్తర–అభిమన్యుల వివాహానికి యాదవ, కాశీ, శైబ్య, ద్రుపద రాజులు వచ్చారు. శ్రీకృష్ణ, బలరామ, కృతవర్మాదులు, శిఖండి, ధృష్టద్యుమ్నుడు తదితర ప్రముఖులు వచ్చారు. యాదవ, పాంచాల, విరాట దేశాల మధ్య బంధుత్వం, స్నేహం పెరిగాయి. ఎంతో వైభోగంగా ఉత్తరాభిమన్యుల వివాహం జరిగింది.

పాండవులు ఉపప్లవ్యంలో నివసించసాగినారు.

*****

# ❖ 5. ఉద్యోగ పర్వము ❖


1) సేనోద్యోగ పర్వము (19)
2) సంజయయాన పర్వము (13)
3) ప్రజాగర పర్వము (8)
4) సనత్సుజాత పర్వము (6)
5) యానసంధి పర్వము (25)
6) భగవద్యాన పర్వము (79)
7) సైన్య నిర్యాణ పర్వము (9)
8) ఉలూక దూతాగమన పర్వము (5)
9) రథాతి రథ సంఖ్యాన పర్వము (8)
10) అంబోపాఖ్యాన పర్వము (24)


## 1) సేనోద్యోగ పర్వము

ఉత్తరాభిమన్యుల వివాహం అత్యంత వైభవంగా కనులపండుగగా జరిగింది. బంధుమిత్రులైన రాజులందరూ విరాటుని సభలో సమావేశమైనారు. ద్రుపదరాజు పుత్రులు, శ్రీకృష్ణుడి పుత్రులు, ద్రౌపది పుత్రులు, విరాటుని పుత్రులు, పెద్దలు అందరూ ఉన్న ఆ సభ శోభాయమానంగా ఉంది.

శ్రీకృష్ణుడన్నాడు– "పాండవుల అరణ్యవాసం, అజ్ఞాతవాసం ముగిసింది. వారి రాజ్యం వారికి చెందాలి".

బలరాముడన్నాడు– "వినయపూర్వకంగా వెళ్లి, కోపం తెప్పించకుండా మా రాజ్యం మాకిమ్మని అర్థించాలి".

సాత్యకి అన్నాడు– "ఇదెక్కడి విచిత్రం... ద్యూతమే అధర్మం. అధర్మ ద్యూతంలో మాయా పాచికలాట. దానికి పదమూడేళ్లు వనవాసాలు, అజ్ఞాతవాసం చేసివచ్చి ఇప్పుడు అర్థించడమేమిటి? నా రాజ్యం నాది అని కొట్లాడాల్సిందే".

ద్రుపదుడన్నాడు– "దుర్యోధనుడు మాటలకు లొంగే రకం కాదు. అతడికి దుర్నీతి నూరిపోసేందుకు కర్ణ, శకునులున్నారు. ఆచరణలో పెట్టేందుకు దుశ్శాసనాది నూరుగురు సోదరులు, బంధుమిత్రులున్నారు. మనవాళ్లనుకున్న వారందరి దగ్గరకు దూతలను పంపి మన బలమెంతో చూసుకోవాలి ముందుగా".

శ్రీకృష్ణుడన్నాడు– "యాదవులకు ఇరుపక్షాలూ కావలసినవారే. కుంతి మా మేనత్త. సాంబుడి భార్య లక్ష్మణ కారణంగా దుర్యోధనుడు నాకు బావ అయినాడు. అభిమన్యుడి ద్వారా పాండవ యాదవ సంబంధమూ దృఢమైనది.ద్రుపదుడు వయస్సు చేత, జ్ఞానం చేత రాజులందరిలో పెద్దవాడు. ద్రుపదరాజా! నీవు పంపే సందేశం ఏదయినా మాకందరికీ సమ్మతమే"

ద్రుపదుడు తన పురోహితుడిని పిలిచి అన్నాడు–

**భూతానాం ప్రాణినః శ్రేష్ఠాః ప్రాణినాం బుద్ధిజీవినః**
**బుద్ధిమత్సు నరాః శ్రేష్ఠాః నరేష్వపి ద్విజాతయః**

**ద్విజేషు వైద్యాః శ్రేయాంసః వైద్యేషు కృతబుద్ధయః**
**కృతబుద్ధిషు కర్తారః కర్తృషు బ్రహ్మవాదినః** (ఉద్యోగ. 6-1,2)

"మహానుభావా! నీవు కౌరవసభకు వెళ్లి ధృతరాష్ట్రుని, అతని వెంట ఉన్న యోధుల మనసును మార్చగలవు. పుష్య నక్షత్రంతో కూడిన జయముహూర్తంలో బయల్దేరి వెళ్లి కార్యం సాధించు".

### దుర్యోధనుడు - శ్రీకృష్ణుడు - అర్జునుడు

ఆనర్తనగరమనేది ద్వారక అనే పేరుగల కుశస్థలీపురం. బలరాముడి భార్య రేవతీదేవి తండ్రి కకుత్థుడు పాలించిన దేశం. ద్వారకకు ఒకేరోజున చేరుకున్నారు దుర్యోధనుడు, అర్జునుడు యాదవుల సహాయాన్ని పొందడానికి.

తన భవనంలో శ్రీకృష్ణుడు నిద్రపోతున్నాడు. దుర్యోధనుడు ముందుగా వచ్చి గోవిందుడి తల వేపు ఉన్న ఆసనంపై కూర్చున్నాడు. తరువాత వచ్చిన అర్జునుడు శ్రీకృష్ణుని పాదాల వద్ద నిలబడినాడు.

నిద్ర మేల్కొని శ్రీకృష్ణుడు ముందుగా అర్జునుని చూసి కుశల ప్రశ్నలు వేసి, తరువాత దుర్యోధనుడిని గమనించి అతడికి అతిథి మర్యాదలు చేసి అన్నాడు– “మీరు వచ్చిన పని అర్థమయ్యింది. దుర్యోధనా! నీవు ముందు వచ్చావు. నేను అర్జునుడిని ముందు చూసాను. ముందు చిన్నవాడి కోరిక తీర్చడం ధర్మం. నేను ఇద్దరికి సాయం చేయదలుచుకున్నాను, నా శక్తిమేరకు.

నా నారాయణ సేన పదిలక్షలు ఒకపక్క నేనొక పక్క. నేనైతే యుద్ధం చేయను” అన్నాడు కృష్ణుడు. అయినా, అర్జునుడు శ్రీకృష్ణుని కోరుకున్నాడు.

నారాయణసేన దక్కిన దుర్యోధనుడు సంతోషంగా వెళ్లిపోయాడు. అతడు తన గురువైన బలరాముడిని కలిసాడు. బలరాముడు తటస్థంగా ఉంటానన్నాడు. కృతవర్మ అక్షౌహిణి సైన్యాన్నిచ్చి తాను కౌరవ పక్షాన పోరాడతానన్నాడు.

అర్జునుడు శ్రీకృష్ణుడి నడిగాడు– “నాకు రథసారథిగా ఉండు. నేను యుద్ధం చేసి కౌరవులను గెలిచి కీర్తి పొందుతాను”

శ్రీకృష్ణుడు సరే నన్నాడు.

## శల్యుడి మారిన దారి

నకుల సహదేవుల మాతృమూర్తి మాద్రి సోదరుడైన మద్రదేశాధిపతి శల్యుడు. పాండవుల దూతల వలన వారి సందేశాన్ని విని ససైన్యంగా బయల్దేరాడు. గూఢచారుల వలన విషయం తెలిసిన దుర్యోధనుడు శల్యుడికి, శల్య సైన్యానికి దారిపొడుగూతా చక్కటి సౌకర్యాలు ఏర్పరచాడు. దానితో శల్యుడుప్పొంగి, “ఇంత చక్కగా నాకు స్వాగతం పలికిందెవరు?”

అక్కడే ఉన్న దుర్యోధనుడు ముందుకు వచ్చి నమస్కరించాడు. దుర్యోధనుడన్నాడు– “సర్వసైన్యానికి అధ్యక్షుడివి కాదగినవాడివి. నా పక్షాన చేరు”.

శల్యుడన్నాడు– “నీవడిగినట్లే జరుగుతుంది. నేను పాండవుల దగ్గరకు వెళ్లి మాట్లాడి హస్తినకు వస్తాను”

శల్యుడు ఉపప్లవ్యం వెళ్లి పాండవులతో మాట్లాడి అన్నాడు–

**సర్వం జగదిదం తాత విదితంతే పరంతప!**
**దిష్ట్యా కృచ్ఛ్రమిదం రాజన్ పారితం భరతర్షభ–**

“అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తిచేసి కష్టాల నుంచి బయటపడ్డావు. నీకు శుభమగును గాక” అని తనకు దుర్యోధనుడికి మధ్య జరిగిన ఒప్పందాన్ని చెప్పాడు. “నీవేమైనా కోరుకో!” అన్నాడు శల్యుడు.

యుధిష్ఠిరుడన్నాడు– “నీవు చేసినది మంచిపని. నీవు రథసారథిగా గొప్ప నేర్పున్నవాడివని లోకానికి తెలుసు. వాసుదేవుడికి సమానమైన నేర్పున్న నీవు ఒకవేళ కర్ణార్జునుల ద్వంద్వయుద్ధంలో సారథిగా ఉండాల్సివస్తే అర్జునుడికి ప్రమాదం కలుగకుండా, సూతపుత్రునికి ఉత్సాహభంగం చేయగలవు”

శల్యుడు తథాస్తు అన్నాడు.

**సర్వం దుఃఖమిదం వీర సుఖోదర్కం భవిష్యతి**
**నాత్ర మన్యుస్త్వయా కార్యః విధిర్హి బలవత్తరః** (ఉద్యోగ. 8–52)

విధి బలవత్తరమైనది. గొప్పగొప్ప మహాత్ములకే దుఃఖం తప్పలేదు. ఇంద్రుడు కూడా కష్టాలపాలైనాడు.

దేవశ్రేష్ఠుడు, మహాతపస్వి అయిన త్వష్ట ప్రజాపతి ఇంద్రుడి మీద కోపంతో మూడుతలల విశ్వరూపుడనే కొడుకును సృష్టించాడు. అతడు ఇంద్రపదవి కోరి ఘోరతపస్సు చేసాడు. అతడి తపస్సు భంగం చేయడం అప్సరసల వల్ల కాకపోవడంతో ఇంద్రుడతడిని వజ్రాయుధంతో సంహరించాడు. అయినా విశ్వరూపుడి మూడు తలలూ సజీవంగా కనబడడంతో తక్షుడనే విశ్వకర్మను పిలిచి వాటిని నరికించాడు. తెగిన త్రిశిరుడి తలల నుంచి కపింజలములు (నల్ల తిత్తిరి పక్షులు), తిత్తిరములు (బూడిదరంగు తిత్తిరి పక్షులు), కలవింగములు (పిచ్చుకలు–గ్రద్దలు) పక్షులు జన్మించాయి.

దానితో ఇంద్రుడికి బ్రహ్మహత్యా దోషమంటింది. విశ్వరూపుడిని చంపాడని త్వష్టకు కోపం వచ్చింది. అప్పుడు వృత్రుడిని సృష్టించాడు త్వష్ట. అతడు ప్రళయకాల సూర్యునివలె మండుతూ వెళ్లి ఇంద్రుడిని మింగేసాడు.

దేవతలు వృత్రాసురుడిని చంపడానికి జృంభికను సృష్టించారు. దానితో వృత్రుడు ఆవులించాడు. అదే సమయంలో ఇంద్రుడు బయటపడినాడు. అందుకే ప్రాణుల ఆవులింత ప్రాణాలతో ముడిపడి ఉంది.

## నహుషుడు ఇంద్రుడగుట

త్వష్టతో కలిసి వృత్రాసురుడు జగమునంతా ఆక్రమించాడు. ఇంద్రుడు విష్ణుమూర్తి సలహాతో సంధ్యాకాలం, పగలూ రాత్రి కాని సమయంలో, తడిపొడి కాని సముద్రపు నురుగులో విష్ణువు ప్రవేశించగా, వజ్రాయుధంతో కూడిన నురుగును విసిరి వృత్రుడిని చంపివేసాడు.

బ్రహ్మహత్యా పాతకం మరింత పీడించగా అతడు బురదపాములా నీటిలో దాగినాడు. ఇంద్రుడు కానరాకపోవడంతో నహుషుడిని ఇంద్రపదవికి ఎన్నిక చేసారు. అందరి తేజస్సులు గ్రహించి అమిత శక్తివంతుడై, ఒకరోజున నహుషుడు శచీదేవిని చూసి– "ఈమె నా దగ్గరకెందుకు రాలేదు?" అని పక్కనే ఉన్న మునిగణాలనడిగాడు.

వాళ్లన్నారు– "ఆమె ఇంద్రుడి భార్య. నీవు ఆమెను ఆశించరాదు".

నహుషుడన్నాడు– "ఈ ఇంద్రుడు గౌతముడి భార్య అహల్యను పాడుచేసినవాడే కదా. మీరు అప్పుడెందుకు అతగాడికి ఈ నీతివాక్యాలు చెప్పలేదు".

వాళ్లు ఆ మాట శచీదేవికి చెప్పారు. శచీదేవి బృహస్పతి శరణువేడింది. అతడి సలహాతో శచీదేవి నహుషుడిని కొంత గడువు కోరింది. విష్ణుదేవుని సలహాతో దేవతలు అశ్వమేధ యాగం చేయించారు ఇంద్రుడితో. తన పాపాన్ని ఇంద్రుడు చెట్లకు జిగురుగా, సముద్ర జలాలకు నురుగుగా, భూమికి అడుసుగా, పర్వతాలకు గంధకంగా, స్త్రీలకు రజస్సుగా పంచినాడు.

వచ్చి దొంగచాటుగా నహుషుడి వర్చస్సును చూసి భయపడి సరస్సులోని తామరతూడులో దాగినాడు. శచీదేవి వెళ్లి ఉపశ్రుతి దేవత సాయంతో ఇంద్రుడికి నహుషుడి అహంకారం గురించి చెప్పింది.

ఇంద్రుడన్నాడు– "వాడిని నీ భవనంలోకి సప్తర్షులు మోసే పల్లకిలో రమ్మను. వాడి గొయ్యి వాడే తవ్వుకుంటాడు".

శచీదేవి స్వర్గలోకానికి వెళ్లి తన భవనానికి సప్తర్షులు మోసే పల్లకిలో రమ్మని వర్తమానం పంపింది.

నహుషుడు అదేవిధంగా బయల్దేరి వస్తూ త్వరగా, త్వరగా –సర్ప సర్ప– అని తన కాలికి దగ్గరలో ఉన్న అగస్త్యుడిని తన్నాడు. దానితో నహుషుడిలోని దివ్యశక్తులు నశించి తేజస్సు తగ్గింది. అగస్త్యుడు కోపంతో శపించాడు నహుషుడిని– "సర్పానివై భూలోకంలో పెక్కుకాలం పడి ఉండు".

నహుషుడు అజగర సర్పంగా భూమిపై పడిపోయాడు. ఇంద్రుడు మరల తన పదవిని స్వీకరించాడు"

అని శల్యుడు ధర్మరాజుతో అన్నాడు– "ఇంద్రుడు కూడా కష్టాలననుభవించినవాడే. నీకూ కష్టాలు తీరతాయి. నీ రాజ్యం నీకు దక్కుతుంది".

తన మేనల్లుళ్లు నకుల సహదేవులను, భీమార్జున ధర్మరాజులను ఆశీర్వదించి హస్తినాపురి వేపు వెళ్లాడు శల్యమహరాజు.

పాండవుల పక్షాన సాత్యకి, చేదిరాజు ధృష్టకేతువు, జరాసంధుని కుమారుడు జయత్సేనుడు, సహదేవుడు; పాండ్యరాజు, మత్స్యరాజు విరాటుడు, ద్రుపదుడి సేన నిలబడింది.

కౌరవుల పక్షాన భగదత్తుడు, భూరిశ్రవుడు, శల్యుడు, కృతవర్మ (భోజ, అంధక, కుకురులు), జయద్రథుడు (సింధు, సౌవీరులు), కాంభోజ రాజు సుదక్షిణుడు (యవనులు, శకులు), మాహిష్మతి రాజు నీలుడు, అవంతి రాజులు విందానువిందులు, కేకయరాజులైదుగురు, వీరందరికి హస్తినలో చోటు చాలక పంచనదం, కురుజాంగలం, రోహితకారణ్యం, మరుభూమి, అహిచ్ఛత్రం, కాలకూటం, గంగాతీరం, వాటధానం, యామున పర్వతం – ఆ ప్రాంతాలన్నీ కౌరవ సేనతో నిండిపోయాయి.

## 2) సంజయ యాన పర్వము

ద్రుపద పురోహితుడు కౌరవ సభలో ప్రవేశించి సభాసదుల అనుమతితో మాట్లాడుతూ పాండవులకు ఇవ్వవలసిన రాజ్యభాగమిమ్మన్నాడు.

భీష్ముడన్నాడు– "పాండవుల పిత్రార్జితాన్ని పాండవులకివ్వాలి. సంధి అన్ని విధాల మంచిది".

కర్ణుడన్నాడు– "జూద నియమాలు వాళ్లు పూర్తిగా పాటించలేదు. విరాట నగరంలో వారిని మేము గుర్తించాం. వాళ్లంటే భయపడి దుర్యోధనుడు అర్ధరాజ్యం కాదు, పావురాజ్యం కూడా ఇవ్వడు. పాండవులు మళ్లా వనవాసం పన్నెండేళ్లు, అజ్ఞాతవాసం ఏడాది చెయ్యాల్సిందే! లేదు యుద్ధమే కోరుకుంటే అది వాళ్ల ఇష్టం"

భీష్ముడన్నాడు– "చాలా గొప్ప వీరుడివిలే. నిన్న ఉత్తర గోగ్రహణంలో అర్జునుడొక్కడు మన ఆరుగురిని ఓడించాడు. నీవు మాత్రం మాటలలో గెలుస్తున్నావు"

ధృతరాష్ట్రుడన్నాడు– "నేను సంజయుడిని పాండవుల వద్దకు పంపిస్తాను"

అని పలికి ద్రుపద పురోహితుడిని సత్కరించి పంపి, సంజయుడితో అన్నాడు– "సంజయా! నీవు వెళ్లి పాండవులకు చెప్పు– అదృష్టం వలన మీరు మీకు తగిన స్థానానికి చేరుకున్నారు. నా పుత్రులు మొండిగా ఉన్నప్పటికీ, నేను శాంతినే కోరుకుంటున్నానని చెప్పు. వాసుదేవునితోనూ మాట్లాడు!"

సంజయుడు ఉపప్లవ్యం వెళ్లి యుధిష్ఠిరుడితో అన్నాడు– "ధృతరాష్ట్రుడు కోరుకుంటున్నది శాంతి. 'యుద్ధం వద్దు' అని మీతో చెప్పమన్నాడు".

ధర్మజుడన్నాడు– "యుద్ధము' అనేమాట నేను పలుకలేదు. ఇంద్రప్రస్థంలో నా రాజ్యం ఉండునుగాక!"

సంజయుడన్నాడు– "యుద్ధం లేకుండా కౌరవులు మీకు రాజ్యభాగం ఇవ్వకపోవచ్చు. అలా అని మీరు యుద్ధం చేసి శత్రునాశనం చెయ్యడం ధర్మం కాదు. దానికన్నా ఉంఛవృత్తి, వనవాసం మీకు తగినది. అవి అహింసతో కూడినవి".

ధర్మరాజు అన్నాడు– "కర్మలలో ధర్మం శ్రేష్ఠమైనదే. కాని నేను అధర్మంగా నడిచిందెప్పుడు?"

శ్రీకృష్ణుడన్నాడు– "ధృతరాష్ట్రుడు యుద్ధం వద్దు అని చెప్పడానికి నిన్ను పంపినాడు కాని న్యాసంగా ఉన్న పాండవుల రాజ్యభాగం ఇస్తాను అని ఎందుకనడు? అవసరమయితే నేనే వస్తాను హస్తినాపురానికి పాండవులు అంగీకరిస్తే. అంతేకాక తెలుసుకో! సుయోధనుడు క్రోధవృక్షం. కర్ణుడు దాని మొదలు. శకుని దాని కొమ్మలు, దుశ్శాసనుడు దాని పుష్పాలు, ఫలాలు; ధృతరాష్ట్రుడు దానికి మూలం.

ధర్మరాజు ధర్మవృక్షం. అర్జునుడు దాని మొదలు. భీమసేనుడు దాని కొమ్మలు; నకుల సహదేవులు పుష్పాలు, ఫలాలు. నేను, వేదం, బ్రాహ్మణులు దానికి మూలం.

పులి లేని వనం, వనం లేని పులి బ్రతకనట్లే పాండవులు లేని కౌరవులకు బ్రతుకు లేదు".

యుధిష్ఠిరుడన్నాడు– "సంజయా! ధృతరాష్ట్రుడు చెప్పమన్నవన్నీ మాతో చెప్పావు సంతోషం. నీవు వెళ్లి నామాట చెప్పు! ఇంద్రప్రస్థాన్ని నాకు ఇవ్వు లేదా యుద్ధానికి సిద్ధంగా ఉండు. ఈ మాట సుయోధనునితో చెప్పు!

శాంతిని కోరుతున్నాం మేము. అవిస్థలం, వృకస్థలం, మాకంది, వారణావతంతో ఐదవది ఏదో ఒకటి కలిపి మాకు అయిదు గ్రామాలు ఇవ్వు.

**భ్రాతౄణం దేహి పంచానాం పంచగ్రామాన్ సుయోధన**
**శాంతిర్నోస్తు మహాప్రాజ్ఞ జ్ఞాతిభిః సహ సంజయ** (ఉద్యోగ. 31-20)

ధర్మరాజు అన్నాడు– "నేను శాంతికి సమర్థుడిని. అలాగే యుద్ధానికి, ధర్మార్థాల సాధనకూ సమర్థుడనే!"

సంజయుడు హస్తినకు వెళ్లాడు. శుష్కప్రియాలు, శూన్యహస్తాలను చూపించాడు. ధర్మరాజు మెత్తని పులి అన్న విషయాన్ని స్పష్టపరచాడు.

## 3) ప్రజాగర పర్వము

సంజయుడన్నాడు– "మహరాజా! నీవు పుత్రాధీనుడవై పాండవుల రాజ్యాన్ని కోరుకుంటున్నావు. ఇది అధర్మం. నేను రేపు సభలో మిగతా విషయాలు చెబుతాను" అని ధృతరాష్ట్రుడికి చెప్పి వెళ్లిపోయాడు సంజయుడు.

ధృతరాష్ట్రుడు వెంటనే విదురుడిని పిలిపించాడు. అతడు రాగానే అన్నాడు– "విదురా! బుద్ధిశాలి అయిన సంజయుడు నన్ను నిందించి వెళ్లాడు. రేపు సభలో ధర్మజుడు అన్న మాటలు చెబుతాడట. ధర్మరాజు ఏమన్నాడో ఏమో! నాకు నిద్ర పట్టడం లేదు".

విదురుడన్నాడు– మహారాజా! నిద్రపట్టకపోవడానికి ముఖ్య కారణాలు నాలుగు–

**అభియుక్తం బలవతా దుర్బలం హీన సాధనమ్**
**హృతస్వం కామినం చోరమ్ ఆవిశంతి ప్రజాగరాః** (ఉద్యోగ. 33–13)

తనకన్నా బలవంతుడితో వైరమున్న బలహీనుడికి; సొమ్ము పోగొట్టుకున్నవాడికి; కాముకుడికి, దొంగకు నిద్ర పట్టదు.

**ఏకయా ద్వే వినిశ్చిత్య త్రీంశ్చ తుర్భిర్వశే కురు**
**పంచజిత్వా విదిత్వా షట్ సప్త హిత్వా సుఖీభవ–**

ఒకటి–బుద్ధి; రెండు –మంచి, చెడు; మూడు– శత్రువు, మిత్రుడు, తటస్థుడు; నాలుగు– సామ దాన భేద దండోపాయములు; అయిదు– పంచేంద్రియాలు; ఆరు– సంధి, విగ్రహం, యాన, ఆసన, ద్వైదీభావ, సమాశ్రయములు; ఏడు– సప్త వ్యసనములు (స్త్రీ, జూదం, వేట, మద్యపానం, పరుషముగా మాట్లాడుట, కఠినంగా దండించుట, డబ్బును చెడుగా ఖర్చుచేయుట) ఈ విషయాలలో జాగ్రత్తగా ఉన్నవాడు ధన్యుడు.

సత్యం, క్షమ, ధర్మములు వ్యక్తిని, సమాజాన్ని రక్షిస్తాయి.

కామ క్రోధ లోభములు నరక ద్వారములు.

తల్లి తండ్రి గురువు అగ్ని ఆత్మ –ఇవి అయిదు అగ్నులు. వీరిని పూజిస్తే మానవుడు ఈ లోకంలో కీర్తిని పొందుతాడు.

మహారాజా! శాపదగ్ధులైన పాండురాజు కుమారులైదుగురు అడవిలో పుట్టారు. చిన్నతనంలో నీవే పెంచావు. విద్యాబుద్ధులు నీవే నేర్పించావు. నీ ఆజ్ఞను వారు పాటిస్తున్నారు. వారికి తగిన విధంగా రాజ్యమివ్వు. కురు వంశం యుద్ధం బారిన పడకుండా చూడు.

**ధర్మేణ రాజ్యం విందేత ధర్మేణ పరిపాలయేత్**
**ధర్మమూలం శ్రియం ప్రాప్య న జహాతి న హీయతే** (ఉద్యోగ. 34–31)

ధర్మంతో రాజ్యాన్ని పొందాలి, పరిపాలించాలి. కుమారుల పట్ల సమభావాన్ని పాటించు. నీ కీర్తి చిరస్థాయిగా ఉంటుంది. న్యాయం చెప్పేప్పుడు ప్రహ్లాదుడు బంధుత్వాన్ని కూడ చూడలేదు.

## విరోచనుడు - కేశిని - సుధన్వుడు

కేశిని ఎంతో అందమైన కన్య. ఆమెను పొందాలనుకున్నాడు ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు. అయితే ఆమె బ్రాహ్మణుడైన సుధన్వుడిని వరించింది.

విరోచనుడన్నాడు– "మావద్ద ఊడిగం చేసే బ్రాహ్మణుడైన సుధన్వుడు మాకన్నా గొప్పవాడెలా అవుతాడు? నీవు పసివాడివి, నీకు ధర్మం తెలియదు".

సుధన్వుడన్నాడు– "నాకు ధర్మం తెలుసు. మనిద్దరిలో ఎవరు గొప్ప అనేది మీ తండ్రినే అడుగుదాం. మన ప్రాణాలు పందెం"

ఇద్దరూ వెళ్లి ప్రహ్లాదుడినడిగారు– "మాలో ఎవరు గొప్ప?"

ప్రహ్లాదుడన్నాడు– "అంగిరుడు నాకంటే గొప్ప; నీకన్నా సుధన్వుడు గొప్ప"

విరోచనుడన్నాడు– "నేను ఓడిపోయాను. నా ప్రాణాలు నీవి"

సుధన్వుడన్నాడు– "నా పాదాలు కడిగి విముక్తి పొందు"

విరోచనుడట్లా చేసి తన స్వేచ్ఛను కాపాడుకున్నాడు.

విదురుడన్నాడు– "మహారాజా! నీవుకూడా పాండవుల రాజ్యాన్ని పాండవులకిచ్చి కీర్తిని బడయుము".

ధృతరాష్ట్రుడన్నాడు– "పాండవుల గురించి నేనెల్లప్పుడూ మంచినే ఆలోచిస్తాను. కాని సుయోధనుడు రాగానే నా మనసు మారిపోతుంది. పురుష ప్రయత్నం వ్యర్థం. దైవఘటన స్థిరం అనిపిస్తుంది.

# 4) సనత్సుజాత పర్వము

విదురుడు స్మరించగానే సనత్సుజాతుడు ప్రత్యక్షమైనాడు. పరమాత్మ స్వరూపం గురించి ధృతరాష్ట్రుడికి వివరించాడు.

**అంగుష్ఠ మాత్రః పురుషో మహాత్మా**
**న దృశ్యతే సౌహృది సంనివిష్టః**
**అజశ్చరో దివారాత్ర మతంద్రితశ్చ**
**సతం మత్వా కవిరాస్తే ప్రసన్నః** (ఉద్యోగ. 46-27)

పరమాత్మను తెలిసినవాడు కవి, ప్రసన్నుడు, నిష్క్రియుడు.

**అణోరణీయాన్ సమనాః సర్వభూతేషు జాగ్రతి**
**పితరం సర్వభూతేషు పుష్కరే నిహితం విదుః** (ఉద్యోగ. 46-31)

పరమాత్మ అణువుకంటే సూక్ష్మమైనది. అన్ని భూతాలకూ జన్మనిచ్చేది, అందరి హృదయాలలో ఉండేది ఆ పరమాత్మ.

# 5) యాన సంధి పర్వము

కౌరవ సభలోకి ప్రవేశించాడు సంజయుడు. తాను అందరితో ఏమేమి మాట్లాడాడో చెప్పి చివరలో అర్జునుడు చెప్పిన మాటలు యధాతథంగా చెబుతున్నాడు-

"దుర్యోధనా! పాండవులకు మేలు చెయ్యాలని రాజ్యం ఇవ్వకు. యుద్ధం మేలని తోస్తే అదే చెయ్యి. అన్యాయంగా ఆక్రమించిన రాజ్యాన్ని- వినయం, జ్ఞానం, శమం, దమం, శౌర్యం, ధర్మబుద్ధితో ధర్మరాజు వశం చేయగలవు.

లేకుంటే నా దివ్యాస్త్రాలతో ఎవ్వరినీ మిగలనివ్వను. అందరూ చచ్చాకనే శాంతి.

**శాంతిం లప్స్యే పరమోహ్యేష భావః**
**స్థిరో మమ బ్రూహి గావల్గణే తాన్** (ఉద్యోగ. 49-107)

భీష్ముడన్నాడు దుర్యోధనునితో- "పూర్వకాలపు నరనారాయణులే నేటి పార్థ కృష్ణులు. ఒకే తత్త్వం రెండు రూపాలు. ఇద్దరూ కృష్ణులే.

**ఏష నారాయణః కృష్ణః ఫాల్గునశ్చ నరః స్మృతః**
**నారాయణో నరశ్చైవ సత్త్వమేకం ద్విధా కృతమ్** (ఉద్యోగ. 49-20)

నా మాట విను. లేకుంటే కౌరవులందరి మరణానికి కారకుడవుతావు. కర్ణుడు, శకుని, దుశ్శాసనులు నిన్ను అపమార్గాన నడిపిస్తున్నారు".

కర్ణుడన్నాడు- "నాలో ఏ తప్పు చూసి నన్ను నిందిస్తున్నావో తెలియదు. ధృతరాష్ట్ర, దుర్యోధనుల పనులు నేను ఇష్టపూర్వకంగా చేస్తున్నాను. యుద్ధంలో నిలిస్తే పాండవులనందరినీ నేనే చంపగలను".

భీష్ముడన్నాడు ధృతరాష్ట్రుడితో- "నీ కొడుకులకు వచ్చిన కీడు అంతా వీడివల్లనే. మాట్లాడితే పాండవులను చంపుతా అంటాడు. పాండవులలో పదహారో వంతుకు పోలడు వీడు. ఒంటరిగా వీడు చేసిన ఘనకార్యాలేమిటి? ఘోషయాత్రలో తన తమ్ముడిని చంపిన అర్జునుడినేమి చేసాడు? అందర్నీ చావగొట్టి తలపాగాలు కోసుకుపోయాడా అర్జునుడు తలలు కోయకుండా. ఘోషయాత్రలో నీ కొడుకును గంధర్వులెత్తుకుపోతే అప్పుడేం చేస్తున్నాడు వీడు?"

ద్రోణుడన్నాడు- "అర్జునుడు మహా విలుకాడు. అయినా వాళ్లు సంధిమాటలు మాట్లాడుతుంటే మనం యుద్ధం గురించి అనుకోవడం దేనికి?"

ధృతరాష్ట్రుడు భీష్మ ద్రోణుల మాటలను పెద్దగా పట్టించుకోకుండా సంజయుడిని అడుగుతున్నాడు పాండవుల యుద్ధ ప్రయత్నాల గురించి- "సంజయా! ఎంత బలముందని పాండవులు మాతో యుద్ధానికి వస్తున్నారు? పాంచాల, విరాట సైన్యం ఇంతేగా?"

సంజయుడికి కళ్లు తిరిగాయి. మూర్ఛవచ్చి కిందపడ్డాడు. ధృతరాష్ట్రుడన్నాడు– "భీముడంటేనే నాకు భయం. మిగతా వారంతా ఒక ఎత్తు. భీముడొక్కడే ఒక ఎత్తు".

**జాగర్మి రాత్రయః సర్వాః దీర్ఘ ముష్ణం చ నిః శ్వసన్**
**భీతో వృకోదరాత్ తాతసింహాత్ పశురివాపరః** (ఉద్యోగ. 51-3)

అతడి బల పరాక్రమాలు గుర్తుకు వచ్చినప్పుడల్లా నాకు నిద్రపట్టదు.

అర్జునుడు ఏనాడూ ఓడిపోలేదు. అతడికి అండగా శ్రీకృష్ణుడు. ఈ ధర్మరాజు మెల్లగా రాజుకునే నిప్పు.

కౌరవులారా! వారితో యుద్ధం రాకపోవడమే మంచిది. వస్తే కులమంతా నశించిపోతుంది. నిస్సందేహంగా"

దుర్యోధనుడన్నాడు– "మహరాజా! మా గురించి మీరు దుఃఖపడవద్దు. మేమూ బలవంతులమే. ఇదంతా కృష్ణుడి కుట్ర. భూమి అంతా ఇప్పుడు మన వశమయి ఉన్నది. నా సుఖ దుఃఖాలలో పాలు పంచుకునే రాజులంతా ఇక్కడకు రానే వచ్చారు.

నా సేనకు, నా ప్రభావానికి భయపడే వాళ్లు అయిదూళ్లు అడుగుతున్నారు. నీవు భీముడి పేరు చెబుతున్నావు. భయపడుతున్నావు. ఇప్పుడు గదాయుద్ధంలో నాకు సాటిరాగల వారెవరూ లేరు. బలరాముడి శిక్షణలో నేను గదాయుద్ధంలో బలరాముడంతటివాడినయ్యాను.

భీష్మ ద్రోణ కృప అశ్వత్థామల ముందు పాండవులు నిలబడగలరా? కర్ణుడు వీరందరికీ సమానుడు. పరశు రాముడే ఒప్పుకున్నాడా విషయం. కర్ణుడు కోల్పోయిన కవచకుండలాలకు బదులు అతడి దగ్గర ఇంద్రుడిచ్చిన శక్తి ఉంది.

'మేము అర్జునుడినైనా చంపుతాము లేదా అర్జునుడు మమ్మల్ని చంపాలి' అని ప్రతిజ్ఞ చేసిన సంశప్తకులున్నారు.

పాండవులలో గొప్ప వీరులనదగ్గవారెందరు? అంతా కలిపి ఏడుగురు. పంచపాండవులు, ధృష్టద్యుమ్నుడు, సాత్యకి. మనకు భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, కర్ణ, సోమదత్త, బాహ్లిక, భగదతత్త, శల్య, అవంతీ రాజులిద్దరు, సైంధవ, దుశ్శాసన, దుర్ముఖ, దుస్సహ, వివింశతి, భూరిశ్రవ, వికర్ణులు ఇంకా ఎందరో ఉన్నారు.

మనది పదకొండు అక్షౌహిణీల మహాసేన. వారిది ఏడు అక్షౌహిణులు".

**గుణహీనాం పరేషాం చ బహు పశ్యామి భారత**
**గుణోదయం బహుగుణ మాత్మనశ్చ విశాంపతే** (ఉద్యోగ. 55-67)

ధృతరాష్ట్రుడన్నాడు– "నీవన్నది నిజమే, కాని, నేనయితే యుద్ధం కోరుకోవడం లేదు. భీష్ముడు, ద్రోణుడు, బాహ్లికుడు, అశ్వత్థామ, సంజయుడు, సోమదత్తుడు, శల్యుడు, కృపుడు, పురుమిత్రుడు, జయుడు, భూరిశ్రవుడు యుద్ధం కోరుకోవడం లేదు. నీవు కూడా కర్ణుడు, శకుని, దుశ్శాసనుల మాట విని యుద్ధం కావాలంటున్నావు".

దుర్యోధనుడన్నాడు– "నేనూ కర్ణుడూ ఈ యజ్ఞం ప్రారంభించాము

**అహంచ తాత కర్ణశ్చ రణయజ్ఞం వితత్యవై**
**యుధిష్ఠిరం పశుం కృత్వా దీక్షితౌ భరతర్షభ** (ఉద్యోగ. 58-12)

ధర్మరాజు యజ్ఞపశువు. ఈ రణయజ్ఞంలో వేదిక రథం. స్రువం–కత్తి; స్రుక్కు–గద; యాగశాల–కవచం; చాతుర్హోత్రం నా గుర్రాలు నిర్వహిస్తాయి. దర్భలు, సమిధలు–శూరులు; హోమద్రవ్యం–కీర్తి. ఆత్మయజ్ఞంతో యముని అర్చించి విజయలక్ష్మితో మరలివస్తాము.

మేమో, వారో ఈ భూమిని అనుభవించాలి. అంతే!

**యావద్ధి సూచ్యా స్తీ క్ష్ణాయాః విధ్యేదయగ్రేణ మారిష**
**తావదప్య పరిత్యాజ్యం భూమే ర్నః పాండవాన్ ప్రతి**

తండ్రీ! వాడి సూదిమొన మోపినంత భూమి కూడా విడిచిపెట్టను" అని దుర్యోధనుడు తన కృతనిశ్చయాన్ని ప్రకటించాడు.

ధృతరాష్ట్రుడు దుఃఖంలో మునిగిపోయాడు. "వీడు నా చేయిదాటి పోయాడు" అనుకున్నాడు. "నాయనా! పాండవులతో శాంతియే నాకు సదా ఇష్టం. అంతేకాక ఎప్పుడయినా కౌరవులకన్నా పాండవులే బలవంతులు".

దుర్యోధనుడన్నాడు– "పాండవులకే కాదు నాకూ దైవసహాయం ఉన్నది. నేనూ మంత్రబలంతో అగ్నిని చల్లార్చగలను. నీళ్లను స్తంభింపచేస్తాను. పర్వతాలు బద్దలు కాకుండా ఆపుతాను. నా దేశంలో ఈతిబాధలు లేవు. పాములు మరీ విషపూరితాలు కావు. దేవతలు నాకూ అనుకూలంగానే ఉన్నారు. నేను ఆత్మస్తుతి చేసుకోను. నా గురించి నీకు తెలియని విషయాలు కొన్ని చెప్పాను, అంతే!"

కర్ణుడన్నాడు– "అబద్ధం చెప్పి బ్రహాస్త్రం పొందాను నేను పరశురాముడి నుంచి. అయినా నన్ను నా గురువు శపించలేదు. 'చివరి సమయంలో నీకు స్ఫురించదు' అన్నాడు. పాండవులను చంపే బాధ్యత నాదే!"

భీష్ముడన్నాడు– "నీకు బ్రహ్మాస్త్రం చివరి నిముషంలో స్ఫురించదు. శక్తిని శ్రీకృష్ణుడు ముక్కలు చేస్తాడు. నాగాస్త్రమంటావా, అది పని చేసినప్పుడు చూద్దాం. ఒకటి గుర్తుంచుకో! అర్జునుడిని రక్షించేందుకే కృష్ణుడున్నాడక్కడ".

కర్ణుడన్నాడు– "నీవుండగా నేనిక యుద్ధరంగంలో శస్త్రం ముట్టను. భీష్మా! నీవు పడినాకే నా ప్రభావాన్ని రాజులు చూస్తారు" అని సభ విడిచి వెళ్లిపోయాడు.

భీష్ముడు అన్నాడు నవ్వుతూ– "గొప్ప వీరుడు. వెళ్లిపోయాడు. నేను పోయాక వస్తాడట గదా! పరశురాముడితో అసత్యం ఆడినప్పుడే ఇతడి ధర్మమూ, తపస్సూ నశించాయి".

దుర్యోధనుడన్నాడు– "నేనూ, కర్ణుడూ, నా తమ్ముడు దుశ్శాసనుడూ చాలు పాండవులను చంపడానికి. మీరే చూద్దురుగాని".

విదురుడన్నాడు– "బోయవాడొకడు పక్షుల్ని పట్టుకోవడానికి వలపన్నాడు. అవి వలనెత్తుకుని ఆకాశమార్గాన పోతుంటే వాటి దిగువన బోయవాడు నేలపై పరుగెత్తుతున్నాడు. అవి అభిప్రాయభేదంతో వాదులాడుకుంటాయని భావిస్తూ. వాడనుకున్నట్లే అవి పరస్పరం దెప్పుకుంటూ నేలమీద పడ్డాయి. వేటగాడికి చిక్కాయి. జ్ఞాతి విరోధం అటువంటిదే!

కొండ కొమ్మున ఉన్న తేనెపట్టును అందుకోబోయి లోయలో పడి చనిపోయినవాళ్లనూ చూసాను నేను. నీ కుమారుడు కూడా తేనెపట్టును చూస్తున్నాడు, లోయను చూడడం లేదు.

మహారాజా! యుద్ధంలో ఎవరు ఓడినా, నీకే నష్టం" అన్నాడు విదురుడు.

ధృతరాష్ట్రుడన్నాడు– "కుమారా! యుద్ధం వద్దు! నీ దారి మంచిది కాదు".

దుర్యోధనుడికి తండ్రిమాట రుచించలేదు. సభ ముగిసింది. రాజులందరూ వెళ్లిపోయారు. సంజయుడు కోరగా ధృతరాష్ట్రుడు గాంధారీదేవిని, వ్యాసమహర్షిని రప్పించాడు.

సంజయుడన్నాడు– "ఈ జగత్తు అంతా ఒక ఎత్తు, ఆ కృష్ణుడొక ఎత్తు. అతడు సంకల్పిస్తే ఈ ప్రపంచం నాశనమవుతుంది. కాని ఈ ప్రపంచమంతా కూడినా అతడినేమీ చేయలేదు".

**యతస్సత్యం యతోధర్మః యతో హ్రీరార్జవం యతః**
**తతో భవతి గోవిందః యతః కృష్ణ స్తతో జయః** (ఉద్యోగ. 68-9)

ధృతరాష్ట్రుడన్నాడు– "నాయనా! కేశవుడి శరణు పొందుము".

దుర్యోధనుడన్నాడు– "అర్జునుడితో స్నేహం ప్రకటించే కేశవుడిని నేను శరణు వేడను".

ధృతరాష్ట్రుడన్నాడు– "గాంధారీ! నీ పుత్రుడు మంచిమాటలు వినడం లేదు".

గాంధారి అన్నది– "మాకు దుఃఖం పెంచుతున్నావు, కొడుకా! చెడు దారిన పోకు"

వ్యాసుడన్నాడు– "ధృతరాష్ట్రా! కృష్ణుడి గురించి తెలుసుకో! మేలు జరుగుతుంది"

సంజయుడన్నాడు– "అనేక సార్థక నామధేయాలు కలిగిన పురుషోత్తముడతడు

**సత్యే ప్రతిష్ఠితః కృష్ణః సత్యమత్ర ప్రతిష్ఠితమ్**
**సత్యాత్ సత్యం తు గోవిందః తస్మాత్ సత్యోపి నామతః** (ఉద్యోగ. 70-12)

అందుకే అతడు సత్యుడు. ధర్మానికి ఆశ్రయుడు".

ధృతరాష్ట్రుడన్నాడు- "కన్నులున్నవారు అదృష్టవంతులు. వారు జ్ఞాన శరీరంతో ప్రకాశిస్తూ లోకాన్ని వెలిగించే కృష్ణుని చూడగలుగుతున్నారు. ఆ సనాతనుడిని, పురాణపురుషుడిని శరణువేడుతాను".

## 6) భగవద్యాన పర్వము

యుధిష్ఠిరుడన్నాడు- "యుద్ధం చేయాల్సిన అవసరం లేకుండా చేయడానికి మనం ప్రయత్నించాలి. కౌరవుల వేపు భీష్ముడు, ద్రోణుడు, బాహ్లికాది వీరులూ శాంతినే సమర్థిస్తారు. మనం జనార్ధనుని దగ్గరకు వెళ్లి ఆయనను కౌరవసభకు వెళ్లిరమ్మని ప్రార్థిద్దాం!

**న హి వైరాణి శామ్యంతి దీర్ఘకాల ధృతాన్యపి**
**ఆఖ్యాతారశ్చ విద్యంతే పుమాంశ్చేద్ విద్యత్ కులే** (ఉద్యోగ. 72-62)

వైరమనేది ఉపశమించదు. ఏ ఒక్కరో వంశంలో మిగిలినా గతాన్ని గుర్తుచేస్తూ మాట్లాడే ప్రజలు చాలామంది ఉంటారు.

శాంతి విఫలమైతే యుద్ధం అనివార్యమవుతుంది.

**లాంగూల చాలనం క్ష్వేడా ప్రతివాచో వివర్తనమ్**
**దంత దర్శన మారావః తతోయుద్ధం ప్రవర్తతే** (ఉద్యోగ. 72-71)

తోకలూపి, గుర్రుపెట్టి, అరిచి, ఒకదాని చుట్టూ ఒకటి తిరిగి దంతాలు చూపి, మొరిగి, కలియబడ్తాయి కుక్కలు. ఎక్కువ బలమున్నది గెలిచి మాంసాన్ని ఎత్తుకుపోయి తింటుంది. యుద్ధమనేది కుక్కల కొట్లాట.

అందుకే కృష్ణా! సంధి చేయగలిగితే పరస్పర శత్రుత్వం గల కురు-సృంజయ, పాండవ-ధార్తరాష్ట్రులను, సమస్త రాజులను మృత్యుపాశం నుంచి విడిపించగలుగుతాము.

దుర్యోధనుని కారణంగా నీకే ఆపదా రాకూడదు. అటువంటి అనుమానం ఉంటే అటు పోవద్దు".

శ్రీకృష్ణుడన్నాడు- "వాళ్లు దుర్మార్గులు. అయినా సంధి ప్రయత్నం చేస్తాను. నాకు అపకారం తలపెట్టేట్లయితే వారిని బూడిద చేస్తాను".

యుధిష్ఠిరుడన్నాడు- "ఏయే మాటల వల్ల మాకు మేలు జరుగుతుందో ఆయా మాటలనే సుయోధనుడికి చెప్పు.

**యద్ యద్ ధర్మేణ సంయుక్తమ్ ఉపపద్యేద్ధితం వచః**
**తత్ తత్ కేశవ భాషేథాః సాంత్వవాయది వేతరత్** (ఉద్యోగ. 72-93)

మృదువుగానైనా, కఠినంగానైనా సరే హితకరమైన మాటలే మాట్లాడు".

శ్రీకృష్ణుడన్నాడు- "ధర్మరాజా! నీవు శాంతిని కోరుతున్నావు. నేను సంధికి ప్రయత్నిస్తాను. వారి ప్రవర్తనను గమనిస్తాను. యుద్ధానికి వాళ్లు సిద్ధపడితే నీ గెలుపు కోసం మరలి వస్తాను".

భీముడన్నాడు- "దుర్యోధనుడి క్రోధం వంశ నాశనానికి కారణమౌతున్నది. 18 మంది రాజులు బంధు, దాయాది, మిత్రులను నాశనం చేసినవారు- హైహయ-ముదావర్తుడు; నీప-జనమేజయుడు; కృమి-వసువు, తాలజంఘ-బహులుడు; సువీర-అజబిందువు; సురాష్ట్ర-రుషర్ధికుడు, బలీహ-అర్కజుడు; చీన-దౌతమూలకుడు; విదేహ-హయగ్రీవుడు; మహౌజను-వరయువు; సుందర-బాహువు; దీప్తాక్ష-పురూరవుడు, చేది, మత్స్య-సహజుడు; ప్రవీర-వృషధ్వజుడు; చంద్ర, వత్స-ధారణుడు; ముకుట-విగాహనుడు; నందివేగ-శముడు; కురు-దుర్యోధనుడు.

కృష్ణా! మా వలన భరతవంశం నశించరాదు. యుద్ధం వద్దు. నేను, ధర్మజుడు, అర్జునుడు శాంతినే కోరుకుంటున్నాము"

శ్రీకృష్ణుడు నవ్వుతూ అన్నాడు– "అశాంతితో, కోపంతో ఎప్పుడూ మధనపడే భీమసేనుడేనా ఈ శాంతి వచనాలు పలుకుతున్నది?"

భీమసేనుడిలో రోషం పొంగింది– "యుద్ధమే అనివార్యమైతే ఆ భీముడిని చూద్దువుగానిలే, కృష్ణా!"

శ్రీకృష్ణుడన్నాడు– "నీ ఆలోచనలను తెలుసుకోవాలని చనువుతో అన్నాను కాని నీ బలం తెలియక కాదు. అయితే ఒక్క విషయం. శత్రువులతో యుద్ధానికి సిద్ధపడినపుడు గెలిచి తీరుతామని చెప్పటం తగదు, కుదరదు. ఒకవేళ యుద్ధమే సంభవిస్తే నీవు, అర్జునుడే అందరి భారాన్నీ మోయవలసి వస్తుంది".

అర్జునుడన్నాడు– "మాకు ఏది మేలని నీవు భావిస్తే దానినే చేయి"

నకులుడన్నాడు– "సమయోచితమైన పని, మాకు మేలైనదీ చేయగలవు"

సహదేవుడన్నాడు– "ధర్మజుడిది సనాతన ధర్మం. యుద్ధమే కర్తవ్యం"

సాత్యకి అన్నాడు– "యుద్ధమే శరణ్యం. లక్ష్యం సుయోధనుని మరణం!"

ద్రౌపది అన్నది– "ఈ జుట్టును పట్టుకుని దుశ్శాసనుడు సభలోకి ఈడ్చుకువచ్చాడు. ఎవరూ నాకు రక్షణరానప్పుడు 'గోవిందా నన్ను రక్షించు' అని నిన్నే తలుచుకున్నాను. యుద్ధమే నాకు ఇష్టం. వీళ్లందరూ శాంతమూర్తులైతే నా తండ్రి సోదరులు, నా పుత్రులు, అభిమన్యుడు నాకోసం యుద్ధం చేస్తారు".

శ్రీకృష్ణుడన్నాడు– "అమ్మా! కన్నీటిని ఆపుకో! నీ శత్రువుల నాశనం తప్పదు. శత్రువుల నుండి సంపదలను సమకూర్చుకున్న నీ భర్తలను త్వరలోనే చూస్తావు.

## శ్రీకృష్ణుడు హస్తినకు బయల్దేరుట

కార్తీకమాసం రేవతీ నక్షత్రం మైత్ర ముహూర్తంలో శరత్–హేమంతాల సంధికాలంలో శ్రీకృష్ణుడు హస్తినకు రాయబారిగా బయల్దేరినాడు.

శంఖం, చక్రం, గద, అమ్ములపొదులు, శక్తులు, సమస్త ఆయుధాలు రథంపై కెక్కించారు. అర్ధచంద్రుడు, చంద్రుడు, చేపలు, మృగాలు, పక్షులు, పుష్పాల వంటి ఆకృతులతో మణిరత్నాలతో ప్రళయ కాలాగ్నిలా ప్రకాశిస్తున్నది ఆ రథం. పులిచర్మం పరచబడింది ఆ రథానికి. గుర్రాలు శైబ్యం, సుగ్రీవం, మేఘపుష్పం, వలాహకం. రథంపైన గరుడ ధ్వజం. మేఘాలతో దుందుభులతో సమానమైన ధ్వని కలది. కామగమనం గల విమానం లాంటి ఆ రథంపై సాత్యకి శ్రీకృష్ణులు దారుకుడు సారథిగా హస్తినకు బయల్దేరినారు.

శ్రీకృష్ణుడు వస్తున్నాడని తెలియగానే ధృతరాష్ట్రుడు మార్గంలో విశ్రాంతి స్థానముల నేర్పరచినాడు. కానుకగా ఇవ్వడానికి గొప్ప రథాన్ని, రత్నాలను సిద్ధపరచాడు. విడిది గృహంగా దుశ్శాసనుని ఇల్లు సిద్ధం చేయించాడు.

విదురుడన్నాడు– "మహరాజా! శ్రీకృష్ణుడు కానుకలకు లొంగడు. అతడు కోరుకున్న ప్రయోజనాన్ని కానుకగా ఇవ్వు. పాండవుల నుంచి అతడిని వేరు చేయాలనుకునే కోరిక చెల్లదు".

దుర్యోధనుడన్నాడు– "విదురుడు చెప్పింది సత్యం. మనం కూడా అటువంటి పనులు చేయరాదు. అభిమానమున్న క్షత్రియుడు అటువంటి పనులు చేయడు".

భీష్ముడన్నాడు– "పాండవులతో సంధికే ప్రయత్నించాలి"

దుర్యోధనుడన్నాడు– "శ్రీకృష్ణుడు రాగానే అతడిని బంధిస్తాను. అతడిని బంధిస్తే సమస్త భూమండలమూ, రాజులు నాకు విధేయులౌతారు".

ఆ మాటలు వినగానే అందరూ ఖిన్నులయ్యారు.

ధృతరాష్ట్రుడన్నాడు– "ఇదేమి ఆలోచన, కుమారా! శ్రీకృష్ణుడు దూత, మన బంధువు. ప్రియమైనవాడు. మనకు ఎటువంటి అపకారమూ చేసినవాడు కాదు".

భీష్ముడన్నాడు- "నీ కుమారుడు కాలపాశంలో చిక్కుకున్నాడు. ఇతడి మాటలను నేను వినదలుచుకోలేదు" అని వెళ్లిపోయాడు.

వృకస్థలంలో ఆ రాత్రి ఆగిన శ్రీకృష్ణుడు తెల్లవారే హస్తినకు బయల్దేరి హస్తినాపురానికి చేరుకునేసరికి అతడికి ఘన స్వాగతం ఇవ్వబడింది. పౌరులందరూ రాజమార్గంలో నిలిచి అతడిని స్తుతించారు. అందమైన స్త్రీలతో నిండి భూమిపై కదులుతున్నట్లు కనిపించాయి పెద్దపెద్ద మేడలు.

అందరికి నమస్కరించి శ్రీకృష్ణుడు రాజభవనం యొక్క మూడు సింహద్వారాలను దాటి ధృతరాష్ట్రుని భవనంలోకి ప్రవేశించాడు.

ధృతరాష్ట్రుడు, ద్రోణుడు, భీష్ముడు, కృపుడు, సోమదత్తుడు, బాహ్లికుడు మిగతారాజులు శ్రీకృష్ణుడు రాగానే గౌరవ పూర్వకంగా తమతమ ఆసనాలపై నుంచి లేచి నమస్కరించారు. అందరిని పలకరించి తనకు ఏర్పాటు చేసిన ఆసనంపై కూర్చున్నాడు. అందరితోనూ కుశల సమాచారాలు మాట్లాడి సెలవు తీసుకుని విదురుడి నివాసానికి వెళ్లి కుంతీదేవిని పలుకరించాడు. ఆమె అన్నది- "నాకెప్పుడూ దుఃఖమే రాసిపెట్టినట్లున్నది కృష్ణా! చిన్నపిల్లను, చేతిలో బంతి పట్టుకుని ఆడుకుంటున్న దానిని మీ తాత శూరసేనుడు నన్ను కుంతీభోజుడికి దత్తతగా పంపి పృథను కుంతిగా చేసాడు. గొప్పగా సుఖపడిన కాలం తక్కువ. పిల్లల మీద ఆశ పెట్టుకుంటే వాళ్లు వనవాస, అజ్ఞాతవాసాలలో కష్టాలు పడ్డారు. ఇప్పటికీ రాజ్యం వస్తుందో లేదో తెలియదు. నేను ఇతరుల ఆశ్రయంలో జీవిస్తున్నాను. భీమార్జునులతో చెప్పు

**అథో ధనంజయం బ్రూయాః నిత్యోద్యుక్తం వృకోదరమ్**
**యదర్థం క్షత్రియా సూతే తస్య కాలో యమాగతః** (ఉద్యోగ. 90-75)

నా పుత్రులైదుగురికీ చెప్పు, క్షత్రియ ధర్మమాచరించే సమయం ఆసన్నమైనదని.

కృష్ణా! ధర్మభంగం కాకుండా, వంచన లేకుండా కార్యసాధన చెయ్యాలి. అన్నీ తెలిసినవాడివి. సత్యస్వరూపుడివి. శుభమగును గాక!" అని పలికిన కుంతీదేవికి నమస్కరించి శ్రీకృష్ణుడు దుర్యోధనుడి ఇంటికి వెళ్లాడు.

దుర్యోధనుడి ఇంటిలో సమావేశమై ఉన్న కౌరవ సోదరులను, శకుని, కర్ణుడు, ఇతర రాజులు శ్రీకృష్ణుని ఘనంగా స్వాగతించారు. కాసేపు మాటా ముచ్చటా అయినాక దుర్యోధనుడు భోజనానికి ఆహ్వానించగా శ్రీకృష్ణుడు సున్నితంగా తిరస్కరించాడు- "దూతగా వచ్చాను" అన్నాడతడు.

కాసేపు మాట్లాడి అందరికి కృతజ్ఞతలు తెలిపి శ్రీకృష్ణుడు విదురుడి ఇంటికి వెళ్లి భోజనం చేసాడు.

విదురుడన్నాడు- "దుర్యోధనుడు దురాలోచనాపరుడు. వారి మధ్యకు వెళ్లడం వారికి అవకాశమిచ్చినట్లవుతుందేమో!" అలా అనేక విషయాలు మాట్లాడుకున్నారు.

తెల్లవారే శ్రీకృష్ణుడు సంధ్యావందనం, గాయత్రీ మంత్ర జపం, అగ్నికార్యం, సూర్యోపస్థానం చేసాడు. ఆ సమయంలో దుర్యోధనుడు, శకుని వచ్చి శ్రీకృష్ణుని సభకు ఆహ్వానించారు.

సభామందిరానికి రాగానే కర్ణుడు దుర్యోధనుడు ముందు, శ్రీకృష్ణుడు మధ్యలో వెనుక సాత్యకి, కృతవర్మలు నడువగా అందరి హర్షధ్వానాల మధ్య సభలో ప్రవేశించాడు శ్రీకృష్ణుడు.

అనేకమంది మహర్షులు కూడా వచ్చారు సభలోకి. వారికి ఉచితాసనాలనిచ్చారు. శ్రీకృష్ణునికి దగ్గర్లోనే ఉన్న ఆసనంపై కర్ణ దుర్యోధనులు ఒకే ఆసనంపై కూర్చున్నారు. సాత్యకి, కృతవర్మలు శ్రీకృష్ణునికి దగ్గర్లోనే ఆసీనులైనారు.

అందరి కనులూ ఆ నీలమేఘశ్యామునిపైనే ఉన్నాయి. మేఘ గర్జనతో కూడిన స్వరంతో కృష్ణుడన్నాడు-

**కురూణాం పాండవానాం చ శమః స్యాదితి భారత**
**అప్రణాశేన వీరాణామ్ ఏతద్ మాచితుమాగతః** (ఉద్యోగ. 95-3)

"కౌరవ పాండవులలో శాంతి కలిగించడం లక్ష్యంగా నేనిక్కడకు వచ్చాను. యుద్ధంలో సమస్త కురు పాండవులు, రాజులు నశించే అవకాశం ఉంది. ఈ సభలో అందరూ ఆలోచించి సరైన ధర్మం నెలకొల్పగలరు.

**యత్ర ధర్మో హ్య ధర్మేణ సత్యం యత్రా నృతేన చ**
**హన్యతే ప్రేక్షమాణానాం హతాస్తత్ర సభాసదః** (ఉద్యోగ. 95-48)

ధృతరాష్ట్ర మహరాజా! ధర్మం కోసం పాండవులు నీకు సేవ చేయడానికైనా లేదా యుద్ధం చేయడానికైనా సిద్ధంగా ఉన్నారు. పాండవులకు పైతృకమైన రాజ్యభాగాన్ని ఇవ్వగలవు. అది అత్యంత శ్రేయోదాయకం".

## పరశురాముడు చెప్పిన దంబోద్భవుని కథ

వచ్చిన మహర్షులలోని పరశురాముడు లేచి దంబోద్భవుడు నరనారాయణులతో తలపడిన వృత్తాంతాన్ని వివరించాడు. నరుడు కేవలం గడ్డిపోచను ఐషికాస్త్రంగా మలిచి దంబోద్భవుడిని ఓడించాడు. ఆ నరుడి అంశ కలవాడు అర్జునుడు. ఇతడి వద్ద కాకుదీకం, శుకం, నాకం, అక్షిసంతర్జనం, సంతానం, నర్తకం, ఘోరం, ఆస్యమోదకమనే అస్త్రాలున్నాయి. అవి కామ క్రోధ లోభ మోహ మద, మాత్సర్య, అహంకారాలకు ప్రతీకలు. అతడిని ఎదిరించి నిలవడం కష్టం. మీరు సంధి చేసుకోండి. లోకం సుభిక్షంగా ఉంటుంది.

## కణ్వముని చెప్పిన మాతలి కథ

కణ్వముని మాతలి కథ చెప్పినాడు- "ఇంద్రుడి సారథియైన మాతలి తన కుమార్తె కోసం వరుడిని అన్వేషిస్తుండగా నారదముని కలిసాడు. ఇద్దరూ కలిసి వరుణుని రాజ్యం చూసారు. అక్కడ అనేక అద్భుతాలతో పాటు గాండీవాన్ని చూసారు. వజ్రాయుధపు కణుపులకు 'గాండి' అని పేరు. గాండీ మయమైన ధనుస్సు కనుక దీనిపేరు గాండీవమైనది అన్నాడు నారదుడు.

నారదుడు, మాతలి వరుణపురం, దైత్యుల హిరణ్యపురం, గరుడలోకం, రసాతలం ఇలా లోకాల్ని చూసి నాగలోకాన్ని చేరారు. నాగ కుమారులలో ఆర్యకుని పౌత్రుడైన 'సుముఖుడు' నచ్చాడు మాతలికి. మాతలి కుమార్తె గుణకేశి.

ఆర్యకుడన్నాడు- "ఈ సుముఖుడి తండ్రిని గరుత్మంతుడు భక్షించాడు. సుముఖుడిని వచ్చే నెలలో తింటానని చెప్పి వెళ్లిపోయాడు. తెలిసి కూడా నేను ఈ వివాహాన్ని ఎలా అంగీకరించను?"

అందరూ కలిసి దేవేంద్రుని దర్శించారు. విష్ణుమూర్తి అనుమతితో సుముఖుడికి ఆయుష్షును ఇచ్చాడు ఇంద్రుడు. అది తెలిసిన గరుడుడు సుముఖుడిని భక్షించడానికి వచ్చి ఇంద్రుడితో గొడవ పడినాడు.

"నేను విష్ణువును మోస్తున్నాను. అటువంటపుడు నీవు, విష్ణుమూర్తి ఒక నాగకుమారుడికి ఆయుష్షనిస్తారా?" అని మండిపడినాడు.

విష్ణువు అన్నాడు- "గరుత్మంతుడా! నా బరువు నీవు మోయడంలేదయ్యా! నేను నన్ను మోసుకుంటూ నిన్ను మోస్తున్నాను. సరే! నీవు నా ఎడమచేతి బరువును మోయగలిగితే నీ ఆత్మస్తుతి సార్థకమవుతుంది" అని విష్ణువు తన చేతిని గరుడుడి వీపుపై ఉంచాడు. ఆ బరువు మోయలేక గరుత్మంతుడు కలతపడి స్పృహ తప్పినాడు. స్పృహ లేచాక విష్ణుదేవుని శరణువేడినాడు. సుముఖుడికి గుణకేశికి వివాహం జరిగింది.

ఆ విష్ణువు అవతారం కృష్ణుడు. అతడి అభిప్రాయాన్ని గౌరవించాలి" అన్నాడు దుర్యోధనుడితో కణ్వుడు.

దుర్యోధనుడు తన తొడను చరిచి అన్నాడు- "నా మనసు కనుగుణంగా నేను ప్రవర్తిస్తున్నాను. మీ ప్రలాపాలు నిష్ప్రయోజనాలు"

## నారద మహర్షి చెప్పిన మాధవి కథ

నారదుడన్నాడు- "పట్టుదలకు పోవడం వలన ప్రయోజనం ఉండదు. వంశం నిలవాలంటే యుద్ధం జరగరాదు.

గాలవుడనే శిష్యుడు విశ్వామిత్రుడికి గురుదక్షిణ గురించి అడిగితే తెల్లగుర్రాలు ఎనిమిది వందలు, వాటి చెవులు ఒకవేపు నల్లగా ఉన్నవి -తీసుకురమ్మన్నాడు.

గాలవుడి మిత్రుడు గరుత్మంతుడు. గాలవుడిని యయాతి మహరాజు వద్దకు తీసుకువెళ్లాడు సుపర్ణుడైన గరుడుడు. యయాతికి గర్వమెక్కువ. సుపర్ణుడు గాలవుడిని యయాతి వద్దకు తీసుకువెళ్తూ-

- తూర్పుదిక్కు గురించి చెప్పాడు. దేవతల ఐశ్వర్యానికి మూలస్థానం, దేవతలతో ముందుగా నిండిన పూర్వదిక్కు, తొలి దిక్కు.
- సూర్యుడు యజ్ఞం చేసి ఆచార్యుడైన కశ్యపునకు దక్షిణగా ఇచ్చిన దిక్కు దక్షిణ దిక్కు; ధర్మదేవతకు రెండవ ద్వారం. వైతరణీ నది స్థానం; ఆయుర్దాయ నిర్ణయదిక్కు. కాలగణన దిక్కు.
- పశ్చిమదిక్కు – వరుణ స్థానం. సూర్యుడు తన కిరణాలను స్వయంగా ఉపసంహరించుకుంటాడు గనుక ఇది పశ్చిమదిక్కు. ఆదిశేషుని నివాసం విష్ణువు శయన స్థానం. కశ్యప, వాయువుల నివాసం.
- ఉత్తరదిక్కు – ఉత్కృష్ట నిధుల స్థానం. పాపాల నుంచి ఉద్ధరింపగల బలం కారణంగా ఉత్తర దిక్కు అని పేరు. మధ్యమ దిక్కు. నరనారాయణుల బదరికాశ్రమం, కైలాసం, మానస సరోవరం, శివపార్వతుల నివాస స్థానం.

గాలవ, గరుత్మంతులు తూర్పుదిశగా వెళ్లి ఋషభ శిఖరంపై శాండిలి అనే తపస్విని చూసారు. ఆమె తపస్సును అల్పమైనదిగా భావించగానే గరుడుడి రెక్కలు పోయాయి. ఆమె అనుగ్రహంతో మరల రెక్కలు వచ్చాయి.

మరల మిత్రులిద్దరూ కలిసి యయాతి మహరాజు వద్దకు వెళ్లారు. యయాతి అన్నాడు– "నా దగ్గర ఇప్పుడు ధనం లేదు. ఈమె నా కుమార్తె మాధవి. ఈమె వలన నాకు మనవళ్లు కావాలి".

గరుత్మంతుడు వెళ్లిపోయాక గాలవుడు ఆమెను ఇక్ష్వాకు వంశస్తుడైన హర్యశ్వుడి దగ్గర ఒక్క సంవత్సరముంచగా వారికి వసుమానుడు; కాశీరాజు దివోదాసుడి దగ్గర ఒక ఏడాది ఉంచగా ప్రతర్ధనుడిని; ఉశీనర మహరాజు దగ్గర సంవత్సరం పాటు ఉంచగా 'శిబి' జన్మించగా ఒక్కొక్క రాజు రెండువందల గుర్రాల చొప్పున ఆరు వందల గుర్రాలను గాలవుడికి సమర్పించారు. అటువంటి గుర్రాలు మరిన్ని లేవని చింతపడుతూ విశ్వామిత్రుడి వద్దకు వెళ్లి విచారంగా ఆరువందల గుర్రాలనిచ్చాడు. విశ్వామిత్రుడన్నాడు– "ఈ మాధవిని ముందే నా దగ్గరకు తెచ్చి ఉంటే నీవు గుర్రాల గురించి శ్రమ పడాల్సిన అవసరం ఉండేది కాదు. అయినా మిగతా 200 గుర్రాలకు బదులు ఈమె నా వద్ద కూడా ఓ సంవత్సరం ఉంటుంది. నీవు నాకు గురుదక్షిణ ఇచ్చినట్లే". విశ్వామిత్రుడు మాధవిలకు అష్టకుడు జన్మించాడు.

ఆ విధంగా గాలవుడి గురు ఋణం తీరింది. మాధవికి కలిగిన– వసుమానుడు, ప్రతర్ధనుడు, శిబి, అష్టకుడు తర్వాత కాలంలో స్వర్గం నుంచి పతనమైన గర్విష్ఠి యయాతికి తమ పుణ్యాన్నిచ్చి స్వర్గానికి పంపగలిగారు. మాధవి గొప్ప తపస్సు చేసి స్వర్గలోకాన్ని పొందింది. కాబట్టి దుర్యోధనా, నీవు కూడా యయాతిలా అభిమానాన్ని పట్టుకుని వ్రేలాడక సంధి చేసుకో!" అన్నాడు నారదుడు. గర్వం సర్వం చెరుచును.

నారదుడు, విదురుడు, ధృతరాష్ట్రుడు, భీష్ముడు, ద్రోణుడు అందరూ దుర్యోధనుడికి నచ్చచెప్పాలని ప్రయత్నించారు. దుర్యోధనుడన్నాడు శ్రీకృష్ణునితో– "ఈ సభలో నీవు నన్ను దోషిగా చేసి మాట్లాడినావు. ఈ పెద్దలంతా నన్నే నిందిస్తున్నారు. పాండవులకు జూదం ఇష్టం. శకునితో ఆడి ఓడిపోయారు. ఇందులో నా తప్పెక్కడ? అయినా వారి రాజ్యాన్ని వారికిచ్చాము. వాళ్లు మళ్లీ జూదమాడారు. ఓడి అరణ్య అజ్ఞాతవాసాలు చేసారు. వాళ్ళు యుద్ధానికి సిద్ధమైతే మేము తలలు వంచుకుని వాళ్లడిగినట్లు అర్ధరాజ్యమో, అయిదూళ్లో ఇచ్చేయాలా? నేను జీవించి ఉండగా వాడి సూదిమొన మోపినంత భూభాగాన్ని కూడా పాండవులకు వదలను".

**యావద్ధి తీక్ష్ణయా సూచ్యా విధ్యేదగ్రేణ కేశవ**
**తావదప్యపరిత్యాజ్యం భూమేర్నః పాండవాన్ ప్రతి** (ఉద్యోగ. 127–25)
అన్నాడు దుర్యోధనుడు.

శ్రీకృష్ణుడన్నాడు– "శాంతి వలన మీ ఇరుపక్షాలకూ లాభం అని పెద్దలు చెప్పినా వినవు. దీనినేమనాలి?"

దుశ్శాసనుడన్నాడు– "అన్నా! భీష్ముడు, ద్రోణుడూ, మనతండ్రి కలిసి నిన్ను, నన్ను, కర్ణుడిని పాండవుల వశం చేసేట్లున్నారు".

ఆ మాటలతో సుయోధనుడు కోపంతో దిగ్గున లేచి బయల్దేరాడు. అతడి సోదరులు, రాజులు, మంత్రులు అతడిని అనుసరించారు.

శ్రీకృష్ణుడన్నాడు– "ఇటువంటి పరిస్థితి వచ్చినపుడు మేము కంసుడిని నిర్జించి అతడి తండ్రి ఉగ్రసేనుడిని రాజును చేసాం.

ధర్ముడు దైత్య దానవులను బంధించి వరుణుడి దగ్గర బందీలుగా ధర్మపాశాలతో, వరుణ పాశాలతో బంధించినాడు.

ఈ దుష్ట చతుష్టయాన్ని బంధించి పాండవుల వశం చేయండి–

**–త్యజేత్ కులార్థే పురుషం గ్రా మస్యార్థే కులం త్యజేత్**
**గ్రామం జనపదా స్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్–**

వంశం కోసం వ్యక్తిని, గ్రామం కోసం వంశాన్ని, జనపదం కోసం గ్రామాన్నీ, తనకోసం భూ మండలాన్ని అయినా వదిలేయాలి. పాండవులతో సంధి చేసుకుని ధృతరాష్ట్రా! క్షత్రియకుల నాశనాన్ని ఆపు"

## విశ్వరూపం

శ్రీకృష్ణుని మాటలు విని ధృతరాష్ట్రుడు గాంధారిని పిలిపించాడు. విదురుడు వెళ్లి గాంధారిని తీసుకువచ్చాడు. తల్లిదండ్రులు రమ్మంటున్నారని తెలియగానే దుర్యోధనుడు పాములా బుసలు కొడుతూ సభలోకి వచ్చాడు.

గాంధారి అన్నది– "నాయనా! పెద్దల మాటలు విను. వీరందరూ నీ హితవు కోరుతున్నవారే. క్రోధం వద్దు. లోభం వర్జించు"

దుర్యోధనుడు సభ నుంచి వెళ్లిపోయి కర్ణుడు, శకుని, దుశ్శాసనులతో ఆలోచించాడు– "శ్రీకృష్ణుడు మనల్ని బంధించక మునుపే శ్రీకృష్ణుని బంధిద్దాము"

సాత్యకి వారి పన్నాగాన్ని గ్రహించి సభ భయటకు వెళ్లి కృతవర్మను ద్వారం దగ్గర సిద్ధంగా ఉంచి శ్రీకృష్ణునికి సుయోధనాదుల అభిప్రాయాన్ని తెలియజేసినాడు. ధృతరాష్ట్రుడు, విదురుడు కూడా ఈ విషయం విన్నారు.

శ్రీకృష్ణుడన్నాడు– "రాజా! నీ కుమారుడు ఎలా కోరుకుంటే అలా జరగనీ, నేను అనుమతి ఇస్తున్నాను".

విదురుడు వెళ్లి చెప్పగా అయిష్టంగానే దుర్యోధనుడు మరల సభలోకి వచ్చాడు.

ధృతరాష్ట్రుడన్నాడు– "బలవంతంగా శ్రీకృష్ణుని బంధించగలననుకున్నావా?"

విదురుడన్నాడు– "మంటలో పడిన మిడతలౌతారు మీరు"

శ్రీకృష్ణుడన్నాడు– "నేను ఒంటరివాడినని బంధించాలనుకుంటున్నావు కదూ" అని నవ్వుతూ ఉండగానే భూనభోంత రాళాలు దద్దరిల్లాయి. మెరుపులు, అగ్నిజ్వాలలతో సభ కళ్లు మిరుమిట్లు కమ్మేలా ప్రకాశించింది. ఆదిత్యులు, సాధ్యులు, వసువులు, అశ్వినిదేవతలు, మరుత్తులు, ఇంద్రుడు, విశ్వదేవతలు, యక్ష గంధర్వ నాగ రాక్షస గణాలు కనిపించాయి. పంచ పాండవులూ, అంధక, వృష్ణి వంశీయులూ ఆయుధాలతో రౌద్రంగా కనిపించారు. ఈ విశ్వమూర్తి కళ్ల నుండి, ముక్కుల నుండి, చెవుల నుండీ భీకరాగ్ని జ్వాలలు అన్ని దిక్కులకూ వ్యాపించసాగినాయి. రాజులందరూ ఆ వెలుగును భరించలేక కళ్లు మూసుకున్నారు. ద్రోణుడు, భీష్ముడు, విదురుడు, మహర్షులు ఆ దివ్య స్వరూపుని దర్శిస్తున్నారు. ధృతరాష్ట్రుడికి దివ్యదృష్టి నిచ్చాడు శ్రీకృష్ణ భగవానుడు.

**తతః స పురుష వ్యాఘ్రః సంజహార వపుః స్వకమ్**
**తాం దివ్యాయద్భుతాం చిత్రాం బుద్ధిమత్తామరిందమః** (ఉద్యోగ. 131–23)

శ్రీకృష్ణుడు తన దివ్యరూపాన్ని ఉపసంహరించాడు.

సాత్యకి, కృతవర్మలు వెంటరాగా సభ నుంచి నిష్క్రమించాడు. నారదాది మునులు అంతర్ధానమయ్యారు.

ధృతరాష్ట్రుడన్నాడు– "నేను సంధిని కోరుతున్నాను, కాని, నా పుత్రులు వినడం లేదు"

శ్రీకృష్ణుడన్నాడు– "శాంతికి ఒడంబడనివాడై దుర్యోధనుడు సభ నుంచి నిష్క్రమించాడు. ఈ విషయం నేను ధర్మరాజుకు చెబుతాను".

శ్రీకృష్ణుడు సభ నుంచి కుంతీదేవి వద్దకు వెళ్లాడు.

కుంతీదేవి అన్నది– "విదుల అనే క్షత్రియ మహిళ తన కొడుకు సంజయుడు సింధురాజు చేతిలో ఓడిపోయి దిగులుగా ఉండగా అతడిని రెచ్చగొట్టి యుద్ధానికి పురికొల్పింది. అతడన్నాడు–

**ఉదకే భూరియం ధార్యా మర్తవ్యం ప్రవణే మయా**
**యస్య మే భవతీ నేత్రీ భవిష్యద్భూతి దర్శినీ** (ఉద్యోగ. 136-13)

భవిష్యత్సంపదను చూపించి నన్ను నడిపిస్తున్నావు –అని పలికి సంజయుడు మరల సైన్యాన్ని సమకూర్చుకుని సింధురాజును ఓడించి తన రాజ్యాన్ని తాను దక్కించుకున్నాడు.

**జయో నామేతి హాసో యం శ్రోతవ్యో విజగీషుణా**
**మహీం విజయతే క్షిప్రం శ్రుత్వా శత్రూంశ్చ మర్దతి** (ఉద్యోగ. 136-18)

విదుల కథ 'జయం" అన్నది కుంతీదేవి. రాజవనిత పుత్రులను కనేది శత్రువును అంతం చేయడానికే.

ఈ విషయాన్ని నా పుత్రులకు తెలియజేయి అన్నది. శ్రీకృష్ణుడు కుంతీదేవికి నమస్కరించి వెళ్తూ వెళ్తూ, కర్ణుని తన రథంలో ఎక్కించుకుని కాసేపు మాటలాడినాడు.

## శ్రీకృష్ణ - కర్ణ సమావేశం

శ్రీకృష్ణుడన్నాడు– "కర్ణా! నీవు కుంతీదేవికి సూర్యుడి వలన వివాహానికి పూర్వం పుట్టిన వాడివి. కానీనుడివి. నీవు నాతో వస్తే నిన్ను పాండవులు కౌంతేయుడిగా గుర్తిస్తారు. నీవు రాజువవుతావు. ధర్మరాజు యువరాజౌతాడు. మేమందరమూ నిన్ను అనుసరిస్తాము".

కర్ణుడన్నాడు– "కృష్ణా! అంతా నేనెరుగుదును. ధర్మశాస్త్రాలు చెప్పిన దానిని బట్టి నేను కౌంతేయుడను. పాండురాజు పుత్రుడిని. కాని ఇప్పుడు నేను రాధేయుడిని. రాధాదేవి నాకు పాలు పట్టింది. నా మలమూత్రాలు ఎత్తింది. నా పెంపుడు తండ్రి అతిరథుడు నాకు ఉపనయన సంస్కారాలు చేయించాడు. వసుషేణుడని పేరు పెట్టాడు. తన కులకన్యలతో నాకు వివాహం జరిపించాడు. ఇవి నా బంధాలు. వీటిని మించిన బంధం స్నేహబంధం. దుర్యోధనుని స్నేహం నేను పడిన అవమానాలను తొలగించింది. పదమూడేళ్లు నిష్కంటకంగా రాజ్యం అనుభవించాను. అర్జునుడితో ద్వైరథ యుద్ధానికి ఎన్నుకున్నాడు నన్ను. నేను కుంతీదేవి మొదటి కొడుకునని తెలిస్తే ధర్మరాజు రాజ్యం స్వీకరించదు. ఒకవేళ నాకే ఈ రాజ్యం లభిస్తే దానినంతా నేను దుర్యోధనునికే ఇస్తాను.

నాకు తెలుసు కృష్ణా! దుర్యోధనునికి ఆయుధ యజ్ఞం జరుగబోతున్నది. దీనికి నీవే ఉపద్రష్ట. నీవే అధ్వర్యుడూ. గాండీవం స్రుక్కు; వీరుల సాహసం నెయ్యి; అస్త్రాలు మంత్రాలు, అభిమన్యుడు హోత, భీముడు ఉద్గాత. ధర్మరాజు బ్రహ్మ, నకుల సహదేవులు యజ్ఞపశువును చంపుతారు. రథాలు వరుసలు యూపస్తంభాలు. కర్ణి, నాళీకం, నారాచం, వత్సదంతం అనే బాణాలు, తోమరాలు సోమరసం నింపిన పాత్రలు. ధనుస్సులు పవిత్రాలు. కత్తులు కపాలాలు; తలలు పురోడాశాలు; నెత్తురే హవిస్సు. శక్తులు–సమిధలు; గదలు పరిఘలవుతాయి – మహారథుల బాణాలు పరిస్తోమాలు. యజ్ఞదీక్షితుడు దుర్యోధనుడు; అతడి భార్య మహాసైన్యం. ప్రతిప్రస్థాన కర్మ సాత్యకి, పశువధ ఘటోత్కచుడు చేస్తారు. ధృష్టద్యుమ్నుడు ఈ యజ్ఞానికి దక్షిణ. అర్జునుడి చేతిలో నేను చనిపోగా చూసినపుడు ఈ యజ్ఞానికి పునశ్చిత్తి అవుతుంది. దుశ్శాసన వధ 'సూయం'గా, భీష్మ ద్రోణుల మరణం యజ్ఞావసానంగా దుర్యోధనుడి వధతో ఈ యజ్ఞం పూర్తవుతుంది.

కౌరవ కాంతల ఏడుపులు అవబృథస్నానంగా, కురుక్షేత్రంలో మరణించిన వీరులంతా స్వర్గం చేరతారు".

శ్రీకృష్ణుడన్నాడు– "ఇప్పటికి ఏడురోజుల తర్వాత యుద్ధం మొదలౌతుంది.

**సప్తమచ్చాపి దివసాత్ అమావాస్యా భవిష్యతి**
**సంగ్రామో యుజ్యంతాం తస్యాం తామాహుః శుక్ర దేవతామ్** (ఉద్యోగ. 142-18)

కర్ణుడన్నాడు– "ఈ భూమికంతటికి వినాశనం దాపురించింది. దానికి శకుని, నేను, దుశ్శాసనుడు, దుర్యోధనుడు కారణం. ఘోరయుద్ధంలో రక్తపు బురద ఏర్పడ్డుంది.

శనిగ్రహం రోహిణి (ప్రాజపత్య) నక్షత్రాన్ని, అంగారక గ్రహం జ్యేష్ఠా నక్షత్రంలో వక్రగతి పట్టి, మిత్రులను సంహరిస్తూ అనూరాధ నక్షత్రాన్ని చేరుతున్నది. చిత్రా నక్షత్రానికి గ్రహపీడన ఉన్నది. ఉత్పాతాలు సంభవిస్తున్నాయి.

నేనూ, ఈ రాజులూ గాండీవాగ్నిలో ప్రవేశిస్తాం. కృష్ణా! ఇక్కడో, స్వర్గంలోనో నిన్ను కలుస్తాము. సెలవు!" అని కర్ణుడు కృష్ణుని రథం దిగి తన రథమెక్కి వెళ్లిపోయాడు.

శ్రీకృష్ణుడు ఉపప్లవ్యానికి వెళ్లి పాండవులకు తన రాయబారపు విశేషాలు వివరించాడు.

శ్రీకృష్ణుడు వెళ్లిపోయాక కుంతీదేవి చాలాసేపు మథనపడింది.

## కుంతీదేవి - కర్ణుడి సమావేశం

గంగాతీరంలో సూర్యుని జపం చేస్తున్నాడు కర్ణుడు. అతడి నీడలో నిలిచింది కుంతీదేవి. వెనుదిరిగి తల్లిని చూసి నమస్కరించాడు కర్ణుడు.

కర్ణుడు అన్నాడు– "నాపేరు కర్ణుడు. రాధ కొడుకును. అధిరథుడి కుమారుడిని. నీకేమి కావాలమ్మా, అడుగు"

కుంతీదేవి అన్నది– "నీవు కుంతీపుత్రుడివి నాయనా! నా కుమారుడివి. సూర్య వరప్రసాద లబ్ధుడవు"

సూర్యుడన్నాడు– "కుంతీదేవి నిజం చెప్పింది. ఈమె నీ తల్లి"

కర్ణుడన్నాడు– "అమ్మా! నీవు నాకు చేసిన అన్యాయం ఏ శత్రువు కూడా చేయలేదు. ఇన్నాళ్లూ నా జన్మ గురించి దుఃఖించాను. కేవలం వీరత్వంతో ఉన్నతస్థితికి రావడానికి ప్రయత్నించాను. ఇప్పుడు నేను దారి మార్చలేను. దుర్యోధనుడి స్నేహాన్ని వదలను.

అమ్మా! ఎప్పటికీ నీకు అయిదుగురు కొడుకులే!

**నతే జాతు నశిష్యంతి పుత్రాః పంచ యశస్విని**
**నిరర్జునాః స కర్ణావా సార్జునా వా హతేమయి** (ఉద్యోగ. 146–23)

అర్జునుడు దొరికితే చంపకుండా వదలను. మిగతా నలుగురూ దొరికినా చంపను, ప్రాణాలతో వదిలేస్తాను".

"నీకు శుభం–స్వస్తి" అని వెళ్లిపోయింది కుంతీదేవి.

# 7) సైన్య నిర్యాణ పర్వము

పాండవుల పక్షాన ఏడక్షౌహిణీల సేన యుద్ధానికి సిద్ధంగా ఉన్నది. సేనాపతులుగా– ద్రుపదుడు, విరాటుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి, మగధరాజు సహదేవుడు, ధృష్టకేతువు నియమించబడినారు. ప్రధాన సేనాధిపతిగా సహదేవుడు విరాటరాజును, నకులుడు ద్రుపదుడిని, అర్జునుడు ధృష్టద్యుమ్నుడిని, భీముడు శిఖండిని, ధర్మరాజు శ్రీకృష్ణుని సూచించారు.

శ్రీకృష్ణుడు ధృష్టద్యుమ్నుడిని ఎన్నిక చేసాడు. కురుక్షేత్రంలో హిరణ్వతి అనే పవిత్ర నది పక్కన శిబిరాలు వేయించాడు శ్రీకృష్ణుడు.

కౌరవుల పక్షాన 11 అక్షౌహిణీల సేన యుద్ధానికి సిద్ధమైంది. దుర్యోధనుడు భీష్ముడిని ప్రధాన సేనాధిపతిగా ఉండమన్నాడు.

భీష్ముడన్నాడు– "నాకు మీరు, పాండవులు సమానమే! పాండవులు నన్ను చంపకపోతే, నేను రోజుకు పదివేల మందిని చంపుతాను. కర్ణుడు కాని నేను కాని యుద్ధరంగంలో ఉండాలి''.

కర్ణుడన్నాడు– "భీష్ముడు బ్రతికి ఉండగా నేను యుద్ధం చేయను''.

## బలరాముడు - రుక్మి

అక్రూరుడు, గదుడు, సాంబుడు, ఉద్ధవుడు, ప్రద్యుమ్నుడు, చారుదేష్ణుడు మొదలగు వారితో కలిసి బలరాముడు తీర్థయాత్రలకు వెళ్లిపోయాడు.

రుక్మిణీదేవి సోదరుడు రుక్మి వచ్చి అర్జునుడితో అన్నాడు– "నీకు యుద్ధమంటే భయం వేస్తే చెప్పు. నేను కౌరవులను ఓడించి నీ రాజ్యం నీకిప్పిస్తాను".

అర్జునుడన్నాడు– "తప్పకుండా! భయం వేసినపుడు నీ సాయం కోరతాను" అని రుక్మిని పంపించివేయగా రుక్మి వెళ్లి దుర్యోధనుడిని కూడా అదే విధంగా అడిగాడు. "నీ సాయం అక్కర్లేదు" అన్నాడు దుర్యోధనుడు. దానితో రుక్మి తన రాజధాని "భోజకటము" చేరుకున్నాడు.

కౌరవ, పాండవ యుద్ధంలో పాల్గొనని గొప్ప రాజులు బలరాముడు, రుక్మి మాత్రమే.

## 8) ఉలూక దూతాగమన పర్వము

ధృతరాష్ట్రునితో సంజయుడన్నాడు– "నీ ఉపేక్ష చేతనే పాండవులు కౌరవులు యుద్ధానికి దిగి వంశ నాశనం చేస్తున్నారు. దీనికి కేవలం దుర్యోధనుడే కారణం అనరాదు".

కౌరవులు తమ తమ శిబిరాలను ఏర్పాటు చేసుకున్నారు. దుర్యోధనుడు శకుని కుమారుడైన ఉలూకుని పిలిచి అన్నాడు– "నీవు వెళ్లి ధర్మరాజుతో నా మాటగా చెప్పు. ధర్మరాజా! నీవు చేసేది బిడాలవ్రతం. నీవు దొంగపిల్లివి. సమస్త ప్రాణులకూ నీవు అభయదాతవని జనులు అనుకుంటున్నారు. నీవేమో జగత్తును నాశనం చేస్తున్నావు, అధర్మం ప్రకటిస్తున్నావు.

గంగాతీరంలో ఒక పిల్లి వ్రతం చేస్తున్నట్లు పక్షులను నమ్మించి పూజలందుకున్నది. అది చూసి ఎలుకలు అతడిని తమ రక్షకుడిగా ఉండమని ప్రార్థించాయి. పిల్లి అన్నది– 'మీ రక్షణా, నా తపస్సు నెరవేరాలంటే ఒక్కరొక్కరు వచ్చి ఉపదేశాన్ని పొందండి' అన్నది. ఎలుకలు ఆ మాటను నమ్మాయి. ఎలుకలు తగ్గిపోయాయి రోజులు గడిచేసరికి, పిల్లి బలిసింది. నీవు కూడా అంతే! ఎలుకల మధ్య పిల్లి తిరిగినట్లు ధర్మవ్రతం చేస్తూ జ్ఞాతుల మధ్య తిరుగుతున్నావు.

అయిదు గ్రామాలు, అర్ధరాజ్యం –ఇలా నిలకడ లేదు నీకు. యుధిష్ఠిరా! రా యుద్ధానికి! వాసుదేవా! నీవొక షండుడివి. భీమా! నీవొక తిండిపోతువు, అజ్ఞానివి; వంటలు చేసుకుని బ్రతుకు. అర్జునా! నృత్యాలు ఆపి యుద్ధానికిరా! నకుల సహదేవులు, ధృష్టద్యుమ్న, శిఖండి, విరాట ద్రుపదులు నన్ను చంపాలని చూస్తున్నారు కదా! మంచి అవకాశం ఇస్తున్నాను. ఆడదాం మృత్యుక్రీడ! రావచ్చు మీరంతా.

జూదమాడే కంకుభట్టులు, వంటలు చేసే వల్లవుడు, గుర్రాల గ్రంధికుడు, గోవుల తంతిపాలుడు, నపుంసక నాట్యాచార్యుడు అర్జునుడూ వినండి– ఎవరు మిమ్మల్ని ఆ స్థితిలోకి నెట్టింది? నేనే కదా! అంతకు ముందు ఏకచక్రపురంలో భిక్షాన్నం తిని బ్రతికేట్లు చేసిందీ నేనే! నేను క్షాత్రధర్మం మరవలేదు. మీరు మాత్రం అన్ని వర్ణాల పనులు చేసారు. జూదంలో రాజ్యం పోతే ద్రౌపది మిమ్మల్ని రక్షించింది. మీలో నిజమైన పురుషుడు ఆమె! మీ ప్రతిజ్ఞలు తీర్చుకోవాలిగా. ఇది రణరంగమే కదా!"

ఉలూకుడు చెప్పాడు దుర్యోధనుడు చెప్పమన్న ప్రతి మాటనూ.

పాండవులు తమ సమాధానం పంపారు ఉలూకునితో– "రాజా! నేను ఎన్నడూ జ్ఞాతుల వధ కోరుకోను! నీకిచ్చిన ప్రతి అవకాశాన్నీ దుర్వినియోగం చేసావు. నీ మాటలు వినిపించాయి. అర్థం తెలిసింది. నీ యిష్టం ఏదయితే అది జరుగును గాక!" అన్నాడు ధర్మరాజు.

భీముడన్నాడు– "దుశ్శాసనుడి రొమ్ము చీల్చి రక్తం తాగేది నిజమే! నీ తొడలు విరగగొట్టేది నిజమే కాబోతున్నది. నీ తలను కాలితో తంతాను చూస్తూ ఉండు!"

నకులుడన్నాడు– "నీవేది అడిగావో అదే చేస్తాను".

సహదేవుడన్నాడు– "నీవు అనుకునేది జరుగదు"

విరాట ద్రుపదులన్నారు– "మేము సజ్జనులకు దాసులం"

శిఖండి అన్నాడు– "పితామహుడిని పడగొట్టడం నా వంతు"

ధృష్టద్యుమ్నుడన్నాడు– "ద్రోణుడి వధ నా కర్తవ్యం"

అర్జునుడన్నాడు– "తొలిముద్దగా భీష్ముడిని మింగుతాం!"

ఉలూకుడి రాయబారం ముగిసింది. కౌరవసేన యుద్ధానికి సిద్ధమయ్యింది. పాండవసేనలో రోషం చెలరేగింది. వారిలో ఏదో ఒకమూల ఉన్న సంయమనం తొలగిపోయింది.

## 9) రథాతి రథ సంఖ్యాన పర్వము

కౌరవులు– రథికులు, అతిరథ, మహారథులు.

అతిరథుడు– కృతవర్మ, శల్యుడు

ద్విరథుడు– జయద్రధుడు;

అతిరథులకన్నా గొప్పవారు– అశ్వత్థామ, ద్రోణుడు, భగదత్తుడు.

ఉదార రధికులు– దుర్యోధన, దుశ్శాసనాది కౌరవులు, కాంభోజరాజు సుదక్షిణుడు, మాహిష్మతి నగరపు నీలుడు, అవంతీ–విందుడు, అనువిందుడు, త్రిగర్త దేశపు సుశర్మాది అయిదుగురు సోదరులు; లక్ష్మణ కుమారుడు, దుశ్శాసనుని కుమారుడు, దండధారుడు, కోసల–బృహద్బలుడు; కృపుడు, శకుని, బృహద్బలుడు, వృషసేనుడు (కర్ణుని కొడుకు); మధువంశ జలసంధుడు అచలుడు, వృషకుడు.

మహారథులు– పౌరవుడు, సత్యవంతుడు, అలంబుసుడు

అర్థరథుడు– కర్ణుడు (మహారథుడు)

రథిక శ్రేష్ఠుడు– భీష్ముడు.

------

పాండవులు– రథికులు, అతిరథ, మహారథులు

రథికులు– యుధిష్ఠిరుడు, నకులుడు, సహదేవుడు; ఉత్తమౌజుడు, యుధామన్యుడు, శిఖండి; కేకయులు, సుకుమారుడు, కౌశికుడు, నీలుడు, సూర్యదత్తుడు, శంఖుడు, మదిరాశ్వుడు, వ్యాఘ్రదత్త, చంద్రసేనుడు.

భీముడు– ఎనిమిది మంది రథికులకు సమానం.

కాశీరాజు– ఎనిమిది మంది రథికులకు సమానం.

మహారథులు– ఉపపాండవులు, విరాటుడు, ద్రుపదుడు; చేదిరాజు ధృష్టకేతువు; సత్యజిత్తు, జయంతుడు, అమితౌజుడు, అజుడు, భోజుడు, వార్ధక్షేమి, చిత్రాయుధుడు, పాండ్యరాజు, రోచమానుడు. యూధపతి–అభిమన్యుడు, సాత్యకి, ఘటోత్కచుడు.

అతిరథుడు– ధృష్టద్యుమ్నుడు; సత్యజిత్తు, శ్రేణిమంతుడు, వసుదానుడు, పురజిత్తు

అర్థరథుడు– క్షత్రధర్ముడు (ధృష్టద్యుమ్నుని కుమారుడు)

రథికశ్రేష్ఠులు– శ్రీకృష్ణార్జునులు

## 10) అంబోపాఖ్యాన పర్వము

భీష్ముడన్నాడు– "నా ఎదుటపడిన ఇతర రాజుల్నెవరినైనా చంపుతాను కాని పాండవులను చంపను. శిఖండితో యుద్ధం చేయను.

ఎందుకంటే– నా తండ్రి శంతనుడు మరణించాక తమ్ముడు చిత్రాంగదుడు రాజై చిత్రాంగదుడనే గంధర్వుడితో యుద్ధం చేసి చనిపోయాడు. అతడి తరువాత విచిత్రవీర్యుడు రాజైనాడు. అతడికి పెళ్లి చెయ్యాలనుకుని కాశీరాజ కుమార్తెలకు స్వయంవరం జరుగుతుంటే వెళ్లి ఆ ముగ్గురు రాకుమార్తెలను (అంబ, అంబిక, అంబాలిక) అపహరించి తెస్తూ అడ్డుకున్న రాజులందరినీ ఓడించాను.

హస్తినాపురికి వచ్చాక అంబ తాను సాల్వుడిని ప్రేమించానని చెప్పడంతో ఆమెను సగౌరవంగా సాల్వుడి దగ్గరకు పంపి అంబిక, అంబాలికలతో విచిత్రవీర్యుడికి ఘనంగా వివాహం జరిపించాను.

సాల్వుడి దగ్గరకు వెళ్లి తిరస్కరింపబడిన అంబ నాపై క్రోధం వహించి నగరం విడిచి అడవికి వెళ్లగా తాపసులు కనిపించారు. హోత్రవాహనుడనే రాజర్షి అంబ తల్లికి తండ్రి (మాతామహుడు). ఆమెను పరశురాముడి అనుచరుడు అకృతవ్రణుడి సాయంతో పరశురాముడి వద్దకు తీసుకువెళ్లాడు.

అంబ చెప్పిన మాటలు విని పరశురాముడన్నాడు– "దేవవ్రతుడనే భీష్ముడు నా శిష్యుడు" అని పలికి తన శిష్యులతో కలిసి అంబను వెంటపెట్టుకుని కురుక్షేత్రానికి చేరి సరస్వతీ నదీ తీరాన విడిది చేసి నాకు కబురు పంపారు.

పరశురాముడన్నాడు– "భీష్ముడా, నీ వలన ఈమె ధర్మభ్రష్టురాలు, ఉభయభ్రష్టురాలు అయ్యింది. ఈమెను గ్రహించు".

నేనన్నాను– "భార్గవ రామా! అది సాధ్యం కాదు!"

మా ఇరువురి మధ్య ఘోరయుద్ధం జరిగింది. ఇరవై మూడు రోజులు జరిగాక వసువులు నాకు 'ప్రస్వాప' అస్త్రాన్ని గుర్తుచేసారు.

ఇరవై నాలుగవ రోజున పరశురాముడు నాపై శక్తిని ప్రయోగించి గాయపరచాడు. నేను ఆయన నుదుటిని గాయపరచాను. అతడి బాణాలకు నేను నేలపై పడి లేచి మరిన్ని తీవ్రబాణాలు వేయగా అతడు విహ్వాలుడైనాడు. దానితో కుపితుడై పరశురాముడు బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. దానిని ప్రతిఘటించడానికి నేనూ బ్రహ్మాస్త్రం ప్రయోగించాను. రెండిటి దెబ్బకు లోకం అల్లల్లాడింది.

నేను ప్రస్వాపనాస్త్రాన్ని వేద్దామనుకోగానే నారదాది మునులంతా వారించారు. పరశురాముడన్నాడు– "భీష్ముడు నన్ను ఓడించాడు"

దేవతలు, పితృదేవతలు అన్నారు– "ఇది గెలుపోటముల ప్రసక్తి కాదు. లోకాల రక్షణార్థం మీరు యుద్ధం విరమించండి"

నేను పరశురాముడికి నమస్కరించగానే ఆయన కోపం ఎగిరిపోయింది. అతడు అంబను పిలిచి అన్నాడు– "అమ్మాయీ! నీవు చూసావు, అతడే గెలిచాడు, అతడినే ఆశ్రయించు".

అంబ మాట్లాడకుండా వెళ్లిపోయింది. పన్నెండేళ్లపాటు తపస్సు చేసింది. నా మాతృమూర్తి గంగ ఆమెను సముదాయించినా వినలేదు. అంబలోని ఒక భాగం తపస్సు వలన వత్సదేశంలో అంబ నదిగా మారింది. ఆ నది వర్షాకాలంలోనే కనిపిస్తుంది.

బక్కచిక్కిన అర్ధ శరీరంతోనే శివుడి కొరకు తపస్సు చేసి వచ్చేజన్మలో స్త్రీగా పుట్టినా పురుషుడిగా మారే వరాన్ని పొంది, అంబ, గొప్ప చితిని పేర్చి అగ్నిలో దూకుతూ– "భీష్ముని వధ కోసం" అంటూ అగ్ని ప్రవేశం చేసింది.

మరుజన్మలో ఆమె ద్రుపదునింట శిఖండినిగా పుట్టింది. అయినా ద్రుపదరాజు ఆమెను మగపిల్లవాడిగా పెంచాడు. దశార్ణదేశపు రాజు హిరణ్యవర్మ కుమార్తెనిచ్చి వివాహం చేసాడు. శిఖండిని రహస్యం తెలుసుకున్న హిరణ్యవర్మ కుమార్తె తండ్రికి కబురు పంపగా అతడు ద్రుపదుడిపై దండెత్తినాడు.

ఈ కష్టాలన్నిటికీ తానే కారణమని భావించిన శిఖండిని అడవికి పోయి ప్రాణత్యాగం చేయబోతుంటే వనరక్షకుడైన స్థూణాకర్ణుడనే యక్షుడు జాలిపడి తన పుంసత్వాన్ని శిఖండిని కిచ్చి ఆమె స్త్రీత్వాన్ని తాను తీసుకున్నాడు. గడువు లోపల రావాలని హెచ్చరించాడు.

పురుషుడిగా శిఖండి ఇంటికి వెళ్లి తన భార్యను తృప్తిపరచాడు. ఆమె తన తండ్రికి ఆ సంగతి చెప్పింది. దానితో అతడు తన నగరానికి వెళ్లిపోయాడు.

ఈలోగా స్థూణాకర్ణుడిని చూడడానికి వచ్చిన కుబేరుడు అతడిని స్త్రీగా యక్షిణిగానే ఉండిపొమ్మని శాపమిచ్చి, శిఖండి చనిపోయాక స్థూణాకర్ణుడు పుంసత్వాన్ని పొందుతాడని చెప్పి వెళ్లిపోయాడు.

గడువు ముగియగానే శిఖండి వచ్చి స్థూణాకర్ణుడికి తన స్త్రీత్వాన్ని ఇమ్మనగా, శిఖండి సత్ప్రవర్తనకు మెచ్చి స్థూణాకర్ణు డతడిని అభినందించి, కొన్నాళ్లు మగవాడిగా బ్రదుకు అని ఆశీర్వదించాడు.

ఆ విధంగా శిఖండిని ఇప్పుడు శిఖండిగా మారింది. మహారథుడైనాడు శిఖండి. అయితే అతడు ఎదురుపడితే నేను ధనుస్సు పట్టను, బాణం వెయ్యను" అన్నాడు భీష్ముడు.

"పదివేల యోధులు, వేయి రథికులను ప్రతిదినం చంపుతాను"

దుర్యోధనుడడిగాడు– "పాండవ సైన్యాన్ని సంహరించడానికి మీకెన్నిరోజులు పడుతుంది?

భీష్ముడన్నాడు– "ఒక నెల"

ద్రోణుడన్నాడు– "ఒక నెల".

కృపుడన్నాడు– "రెండు నెలలు".

అశ్వత్థామ అన్నాడు– "పది రోజులు"

కర్ణుడన్నాడు– "అయిదు రోజులు"

ఇదే ప్రశ్న యుధిష్ఠిరుడడిగాడు– "కౌరవ సైన్యాన్ని సంహరించడానికి మీకెన్నిరోజులు పడుతుంది?"

అర్జునుడన్నాడు– "శ్రీకృష్ణుడు నా తోడుగా ఉన్నాడు. నా దగ్గర పాశుపతాస్త్రం ఉంది. ముల్లోకాలను, సమస్త చరాచర జీవజాలాన్ని, భూత, వర్తమాన, భవిష్యత్తులను ఒక్క నిమేషమాత్రంలో మట్టుపెడదతాను.

యుద్ధంలో దివ్యాస్త్రాలను అత్యవసర సమయాల్లోనే వాడవలసి ఉంది. సాధారణ ఆయుధాలతోనే ఎక్కువ యుద్ధం చేయాలి".

✤✤✤✤✤

# ✤ 6. భీష్మ పర్వము ✤

| | | | |
|---|---|---|---|
| **1)** | **జంబూఖండ వినిర్మాణ పర్వము (10)** | **3)** | **శ్రీమద్భగవద్గీతా పర్వము (30)** |
| **2)** | **భూమి పర్వము (2)** | **4)** | **భీష్మ వధ పర్వము (80)** |

## 1) జంబూఖండ వినిర్మాణ పర్వము

గ్రామాల్లో అశ్వాలు, యువకులు, రథాలు, ఏనుగులు కనబడడం లేదు. బాలురు, వృద్ధులు మిగిలారు. భూమి అంతా ఖాళీ అయినట్లు కనిపిస్తున్నది.

సమంత పంచకం దగ్గర వీరులు, సర్వ వర్ణాల వారు చేరారు. కొన్ని నియమాలు ఏర్పరుచుకున్నారు.

- ఆరోజు యుద్ధం పూర్తయ్యాక పరస్పరం స్నేహభావాలు ఉండాలి. శత్రుత్వమూ, అనుచిత ప్రవర్తనా ఉండరాదు.
- యుద్ధం చేసేప్పుడు మాటలతో మాటలు; రథితో రథి, ఏనుగు మీద వాడు ఏనుగుమీద వాడితోనే, అశ్వికుడు అశ్వికుడితోనే, పదాతిదళం వాడు పదాతిదళంతోనే యుద్ధం చెయ్యాలి.
- కొట్టేప్పుడు చెప్పి కొట్టాలి. అజాగ్రత్తగా ఉన్నవాడిని, భయపడినవాడిని, వెనుదిరిగి పోతున్నవాడిని కొట్టరాదు.
- ఇతరులతో పోరాడేవాడిని, శరణన్న వాడిని, పారిపోయేవాడిని, శస్త్రాలు అయిపోయినవాడిని, కవచం లేనివాడిని కొట్టరాదు.
- అశ్వసేవ కోసం ఉన్నవారిని, శస్త్రాలు మోసేవారిని, భేరీ శంఖాలు మోసేవారి మీద ఆయుధాలతో కొట్టరాదు.

ఇలా చక్కని నియమాల నేర్పరుచుకున్నారు ఇరు పక్షాలవారు. యుద్ధానికి సిద్ధమైనారు.

వ్యాసుడు ధృతరాష్ట్రుని దర్శించి అన్నాడు– "నీ పుత్రులు ఒకరినొకరు చంపుకోడానికి సిద్ధంగా ఉన్నారు. వారిని యుద్ధంలో చూడాలనుకుంటే నీకు దివ్యదృష్టినిస్తాను"

ధృతరాష్ట్రుడన్నాడు– "అందరూ సుఖంగా ఉన్నపుడు చూడలేదు నేను. చావులను చూడటం నాకిష్టం లేదు. నీ ప్రభావంతో ఈ యుద్ధాన్ని సంపూర్ణంగా వింటాను".

వ్యాసుడన్నాడు– "సంజయుడికి దివ్యదృష్టి కలుగుతుంది. ఏ శస్త్రాలు ఇతడిని నరకలేవు. శ్రమ అనిపించదు. యుద్ధం నుండి జీవంతో బయటపడతాడు. ఇతడు నీకు యుద్ధం జరిగింది జరిగినట్లు చెబుతాడు.

ధృతరాష్ట్రా ఈ యుద్ధం దైవనిర్ణయం. నీవు శోకించకు.

**దిష్టమేతన్నర వ్యాఘ్ర నాభి శోచితు మర్హసి**
**న చైవ శక్యం సంయంతుం యతోధర్మ స్తతో జయః** (భీష్మ. 2–14)

ధర్మం ఎటుంటే అటు జయం కలుగుతుంది.

## గృహగతులు - అరిష్టాలు

గ్రహగతులు మారుతున్నాయి. అరుంధతీ నక్షత్రం ఇప్పుడు వశిష్ఠుడి ముందుకు వచ్చింది. శనిగ్రహం రోహిణీ నక్షత్రాన్ని పీడిస్తున్నది. చంద్రుడి జాడలేదు. రాహువు సూర్యునికి దగ్గరగా పోతున్నాడు. కేతువు చిత్రానక్షత్రాన్ని దాటి 'స్వాతి'ని చేరింది. ఇది కౌరవుల వినాశనానికి సూచన. ధూమకేతు గ్రహం పుష్య నక్షత్రాన్ని ఆక్రమించింది. ఇది సేనలకు అశుభం. అంగారక గ్రహం వక్రగమనంతో మఘా నక్షత్రం మీద నిలిచింది. గురుగ్రహం శ్రవణా నక్షత్రం మీద ఉంది. పుబ్బ నక్షత్రం వద్దకు వెళ్లి పీడిస్తున్నాడు శని.

కేతుగ్రహం జ్యేష్ఠా నక్షత్రం మీద నిలిచింది.

రాహువు చిత్రా-స్వాతి నక్షత్రాల మధ్య నుంచి రోహిణిని, సూర్యచంద్రులను పీడిస్తున్నది. అది ధ్రువానికి ఎడమ వేపున పోతున్నది.

అంగారక (కుజ) గ్రహం మఘా నక్షత్రంలో ఉంటూ బృహస్పతితో కూడిన శ్రవణాన్ని కప్పివేసింది.

ఆవుల పాలు రక్తమోడుస్తున్నాయి. పైర్లకు ఐదేసి వందేసి కంకులు పెరుగుతున్నాయి. అన్నీ ఉత్పాతాలే! సప్తర్షుల కాంతి తరుగుతున్నది. సంవత్సరం దాకా ఒకేరాశిలో ఉండే గురు, శని గ్రహాలు తిర్యగ్వేధ ద్వారా 'విశాఖా' సమీపానికి వచ్చారు.

తిథి క్షయం వల్ల త్రయోదశి రోజున రాహువు సూర్యచంద్రులిద్దరిని మింగివేసింది. ఈ సూర్యచంద్ర గ్రహణం ప్రజా సంహారాన్ని కోరుతున్నది.

రాహు గ్రహం కృత్తికా నక్షత్రాన్ని పీడిస్తున్నది. 27 నక్షత్రాలు, తొమ్మిదేసి చొప్పున మూడు ఛత్రాలలో ఉండి అశ్వపతి, గజపతి, నరపతిగా నక్షత్ర నక్షత్రాలుగా ఉంటాయి. ఈ మూడిటిపైన పాపగ్రహ వేధ ఉంటే అది కుయోగమై ప్రజా నాశనాన్ని తెస్తుంది.

పదమూడవ రోజునే అమావాస్య రావడం, సూర్యచంద్ర గ్రహణాలు ఒకేపక్షం (పదమూడు రోజుల్లోనే)లో రావడం ప్రజా వినాశనం సూచన. ఎక్కడ చూసినా ఉత్పాతాలే" -అన్నాడు వ్యాసుడు.

ధృతరాష్ట్రుడన్నాడు- "యుద్ధంలో మరణించినవాళ్లు వీరస్వర్గాన్ని పొంది పరలోకంలో సుఖిస్తారు"

వ్యాసుడన్నాడు- "ఇక్కడేదీ ఎవరూ శాశ్వతం కాదు. కాలుడు జగాన్ని సృష్టిస్తాడు, సంహరిస్తాడు. జయానికి దైవమే గతి.

**అధ్రువో హి జయోనామ దైవం చాత్ర పరాయణమ్**
**జయవంతో హి సంగ్రామే కృతకృత్యా భవంతి హి** (భీష్మ. 3-85)

యుద్ధంలో జయం పొందినవారే కృతకృత్యులు" అని పలికి సంజయుడికి దివ్యదృష్టినిచ్చి వెళ్లిపోయాడు వ్యాసమహర్షి.

## 2) భూమి పర్వము

సంజయుడు ధృతరాష్ట్రునికి చెబుతున్నాడు- "ఈ భూమిపై అధికారమున్నవానికి స్థావర జంగమాలపై అధికారం లభిస్తుంది. ఇవన్నీ పంచభూతాల స్వరూపాలే. వీటినే 'సమము' లంటారు.

సంజయుడు పంచభూతములు, సుదర్శన ద్వీపం, ఉత్తర కురు, భద్రాశ్వ వర్ష, మాల్యవంత పర్వతం, రమణక, హిరణ్యక వర్షములు, శృంగవత్పర్వతము, ఐరావత పర్వతము గురించి వివరించాడు.

భారత వర్షమందలి నదీ ప్రదేశములను, భారతభూమి మహాత్మ్యమును వర్ణించాడు. యుగధర్మాలను వివరిస్తున్నాడు.

మహరాజా- కృతయుగంలో మానవుల ఆయుః ప్రమాణము 4000 సంవత్సరాలు. వందలు, వేల సంతానం ఉంటుంది. అందరూ తపోధనులే. అందరూ బ్రాహ్మణులే.

త్రేతాయుగంలో ఆయుః ప్రమాణము 3000 ఏళ్లు. ధనుర్ధారులు, యుద్ధవీరులు, చక్రవర్తులు, క్షత్రియుల కాలమిది.

ద్వాపరయుగంలో ఆయుఃప్రమాణము 2000 సంవత్సరాలు. అన్ని వర్ణాల వారు పుడతారు. పరస్పర జయకాంక్ష పెరుగుతుంది.

కలియుగంలో ఇంత అని ఆయుః ప్రమాణము లేదు. అల్పాయుష్కులు. లోభం, అసత్యం ఎక్కువవుతాయి.

ఆ తరువాత సంజయుడు శాక, కుశ, క్రౌంచ, పుష్కరాది ద్వీపాలను వర్ణించాడు. రాహువు పరిమాణం సూర్యచంద్రుల కన్నా పెద్దది అని వివరించాడు.

కొద్దిరోజులు గడిచాయి.

ఒకరోజున సంజయుడు దుఃఖిస్తూ వచ్చి పితామహుడైన భీష్ముడు పడిపోయినట్లు చెప్పాడు.

పరశురాముని జయించినవాడు, కాశీరాజ పుత్రికల స్వయంవరంలో అందరు రాజులను ఒంటిచేత్తో ఓడించినవాడు, మహా పరాక్రమవంతుడు, పదిరోజులు యుద్ధం చేసి కౌరవసేనను రక్షించి, సూర్యుని వలె అస్తమిస్తున్నాడు" అన్నాడు సంజయుడు. పదిరోజుల్లో పదికోట్ల సైనికులను చంపినవాడతడు. శిఖండి వలన నేలకూలినాడు.

ధృతరాష్ట్రుడన్నాడు– "నా తండ్రి ఎలా పడిపోయాడు, అయ్యో!

**కథం కురూణా వృషభః హతో భీష్మః శిఖండినా**
**కథం రథాత్ న్య పతత్ పితామే వాసవోపమః** (భీష్మ. 14–1)

## 3) శ్రీ మద్భగవద్గీతా పర్వము

### యతః కృష్ణ స్తతో జయః

సంజయుడు ధృతరాష్ట్రునితో చెబుతున్నాడు–

దుర్యోధనుడు అన్నాడు దుశ్శాసనునితో– "నేను ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కురుపాండవ యుద్ధం వచ్చిందిప్పుడు. మనం చెయ్యాల్సిందల్లా భీష్ముడి రక్షణ. అతడిని చంపగలవాడు శిఖండి ఒక్కడే. ఎందుకంటే శిఖండితో అతడు యుద్ధం చేయడు. మనం శిఖండిని వధించాలి. అయితే శిఖండికి అర్జునుడు రక్షణ. అర్జునుడి సారథి శ్రీకృష్ణుడు. అర్జున రథపు ఎడమచక్రాన్ని యుధామన్యుడు, కుడిచక్రాన్ని ఉత్తమౌజుడు రక్షిస్తున్నారు. మనం ఈ రక్షణ వలయాన్ని భగ్నపరచాలి.

మనం భీష్ముడిని రక్షిస్తే ఆయన పాండవులను, సోమకులను, సృంజయులను సంహరిస్తాడు.

అదుగో భీష్ముడు– తెల్లని తలపాగ, తెల్లని గుర్రం, తెల్లని కవచం దాల్చి అపుడే ఉదయించిన చంద్రుడిలా ఉన్నాడు. అయిదు నక్షత్రాలుకల 'తాల ధ్వజం' అతడిది.

శకుని, జయద్రధుడు, శల్యుడు, విందుడు, అనువిందుడు, సుదక్షిణుడు, శ్రుతాయుధుడు, జయత్సేనుడు, బృహద్బలుడు, కృతవర్మ – ఒక్కొక్కరు ఒక్కో అక్షౌహిణి సేనకు నాయకులు. పదకొండవ అక్షౌహిణి కౌరవసేన. అది అన్ని సేనల ముందూ నిలిచింది. దాని ముందు సర్వసేనాధిపతి భీష్ముడు నిలిచాడు.

భీష్ముడు యుద్ధం చేస్తున్నాడు కనుక కర్ణుడు కాస్త దూరంగా ఉన్నాడు తన బంధుజనంతో.

అశ్వత్థామ– సింహలాంగూల ధ్వజం; కమండలంతో కూడిన బంగరు వేదిక, ధనుస్సు –ద్రోణుని ధ్వజం; మణిమయమైన నాగచిహ్నం –దుర్యోధన ధ్వజం; వృషభ చిహ్నమైన బంగరు ధ్వజం–కృపుడిది; వరాహచిహ్నమున్న వెండి ధ్వజం–సైంధవుడు; అగ్నిచిహ్నం–కళింగరాజు; కేతుమంతుడు, భగదత్తుడు ఏనుగులనెక్కి వచ్చారు. రథాలకు చక్రరక్షకులు, ఏనుగులకు పాద రక్షకులు– అరవై లక్షలమంది; నఖరాలు, ప్రాసలతో యుద్ధం చేసే పదాతి సైనికులు ధనుస్సులు, డాలులు, కత్తులు చేబట్టి నడుస్తున్నారు.

దుశ్శాసన, దుర్విషహ, దుర్ముఖ, దుస్సహ, వివింశతి, చిత్రసేనుడు, వికర్ణుడు, సత్యవ్రతుడు, పురుమిత్రుడు, జయుడు, భూరిశ్రవుడు, శలుడు ఇరవై వేలమంది రధికులతో భీష్ముని రక్షిస్తున్నారు. పన్నెండు దేశాల వీరులు భీష్ముని రక్షణకై నియోగించ బడినారు.

సంజయుడన్నాడు– "కౌరవుల పదకొండు అక్షౌహిణీల సేనకు ధీటుగా కనిపించడానికి పాండవులు వజ్ర వ్యూహాన్ని పన్నినారు. ధర్మరాజు కౌరవ బలాన్ని చూసి చింతిస్తుంటే అర్జునుడు నారదుడి వాక్యాల్ని గుర్తుచేసాడు. విజయం, వినయం కృష్ణుడి గుణాలు. అతడెక్కడుంటే అక్కడే జయం కలుగుతుంది.

**అనంత తేజా గోవిందః శత్రు పూగేషు నిర్వ్యథః**
**పురుషః సనాతన మయః యతః కృష్ణస్తతో జయః** (భీష్మ. 22–14)

అని పలికి అర్జునుడు దుర్గాస్తుతి చేసి రథం ఎక్కినాడు.

**యత్ర ధర్మో ద్యుతిః కాంతిః యత్ర హ్రీః శ్రీస్తథామతిః**
**యతో ధర్మ స్తతః కృష్ణః యతః కృష్ణస్తతో జయః** (భీష్మ. 23-28)

అర్జునుడు కృష్ణుడితో అన్నాడు- "కృష్ణా! రెండు సేనల మధ్య నా రథాన్ని నిలుపు - దుర్యోధనునికి సహాయం చెయ్యాలని వచ్చిన వారందరిని ఒక్కసారి చూస్తాను".

కృష్ణుడు రథం ఆపినాడు అర్జునుడు అందరినీ చూసాడు.

**ఆచార్యాః పితరః పుత్రాః తథైవ చ పితామహాః**
**మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబంధిన స్తథా** (భీష్మ. 25-34)

"అందరూ బంధువులే! భూమి కోసం వీరినందరినీ చంపాలా నేను? ఈ కౌరవులు ఆతతాయులు అయినా, వీరిని చంపితే దుఃఖమే వస్తుంది కాని సుఖమెలా లభిస్తుంది?

వాళ్ళు నన్నే చంపనీ. అదే నాకు క్షేమం" అని అర్జునుడు ధనుర్బాణాలు విడిచి రథం మధ్యలో చతికిల పడినాడు.

శ్రీకృష్ణుడన్నాడు- "అర్జునా! పిరికితనం కూడదు. హృదయ దౌర్బల్యం విడిచి యుద్ధానికి లెమ్ము.

విషాద యోగాన్ని విడిచి కార్యోన్ముఖుడివి కమ్ము.

**సుఖదుఃఖ సమే కృత్వా లాభా లాభౌ జయా జయౌ**
**తతో యుద్ధాయ యజ్యస్వ నైవం పాపమ వాప్స్యసి** (భీష్మ. 26-38)

స్థితప్రజ్ఞునివై మమత, అహంకారములను విడిచి శాంతిని పొంది బ్రాహ్మీస్థితిలో చరించుము.

**కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్**
**తస్మాత్ సర్వగతం బ్రహ్మనిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్** (భీష్మ. 27-15)

యజ్ఞాలకు మూలం కర్మలు. కర్మలకు మూలం వేదాలు; వేదాలు పరమాత్మ జనితాలు, పరమాత్మ ప్రతిష్ఠితుడై ఉండేది యజ్ఞాలలోనే. యజ్ఞమంటేనే జీవులు చేసే కార్యం. ధర్మాచరణం.

**యదాయదాహి ధర్మస్య గ్లా నిర్భవతి భారత**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజమాహ్యమ్**

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే** (భీష్మ. 28-7,8)

ధర్మానికి హాని కలిగినపుడు ధర్మాన్ని నిలపడానికి ప్రతి యుగంలో నేను అవతరిస్తుంటాను. ఇది గ్రహించి అర్జునా నీ కర్తవ్యాన్ని నిర్వహించు. నిష్కామ కర్మయోగంతో కర్మ ఫలితాలను భగవదర్పితం చేసి, సంశయమనే విషవృక్షాన్ని జ్ఞానమనే ఖడ్గంతో నరికి యుద్ధానికి బయలుదేరుము.

**సర్వకర్మాణి మనసా సన్న్యనాస్తే సుఖం వశీ**
**నవ ద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్** (భీష్మ. 29-13)

చేసిన కార్యానికి ఫలం ఆశిస్తే అది బంధమవుతుంది. ఆ ఫలాన్ని ఆశించనివాడు శాంతిగా ఉంటాడు.

**జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః**
**యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మ కాంచనః** (భీష్మ. 30-8)

సుఖ దుఃఖాలను, మట్టిని బంగారాన్ని, సన్మానావమానాలను ఒకే విధంగా చూసేవాడు యోగి. అతడి మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

**చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోర్జున**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ** (భీష్మ. 31-16)

ఆపదలో ఉన్నవాడు, జిజ్ఞాసి, ధనం కోరేవాడు, జ్ఞాని నన్ను ప్రార్థిస్తారు. అజ్ఞానులు నన్ను గుర్తించలేరు.

**అక్షరం బ్రహ్మ పరమం స్వభావోధ్యాత్మ ముచ్యతే**
**భూత భావోద్భవ కరః విసర్గః కర్మసంజ్ఞితః** (భీష్మ 32-3)

ప్రాణుల శరీరంలో ఉండే ప్రత్యగాత్మ, పరమాత్మలో ఏకం కావడమే మోక్షం. యోగులు దేవయానంలో వెళ్లి పరమగతిని పొంది తిరిగిరారు. మిగిలినవారు కర్మ ఫలాలు అనుభవించి పితృయానంలో వెళ్లి తిరిగి వచ్చి జనన మరణ చక్రంలో పడతారు.

**రాజవిద్యా రాజగుహ్యం పవిత్ర మిద ముత్తమమ్**
**ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్** (భీష్మ. 33-2)

ఇది ఉత్తమ విద్య. నాయందు మనసు లగ్నం చేసి కర్మఫలాన్ని గురించి ఆలోచించకుండా నీ ధర్మం నీవు నిర్వర్తించు.

**యద్ యద్ విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా**
**తత్ తదేవావగచ్ఛ త్వం మమతేజోంశ సంభవమ్** (భీష్మ. 34-41)

ఐశ్వర్యం, కాంతియుక్తం, శక్తి కలిగినదేదైనా నా తేజస్సులోని అంశ జనితమే.

**దివ్య మాలాంబరధరం దివ్యగంధానులేపనమ్**
**సర్వాశ్చర్య మయం దేవమ్ అనంతం విశ్వతో ముఖమ్** (భీష్మ. 35-11)

అనన్య భక్తి ద్వారానే, నా విశ్వరూపం చూడడం సాధ్యపడుతుంది. నిస్సంగుడైన భక్తుడు నన్ను చేరతాడు.

**తుల్యనిందా స్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్**
**అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియోనరః** (భీష్మ. 36-19)

నిందాస్తుతులను సమంగా స్వీకరించేవాడు, మౌని, ఉన్నదానితో సంతృప్తిపడేవాడు, స్థిరబుద్ధి కలవాడు అయిన భక్తుడు నాకు ఇష్టుడు.

**యావత్ సంజాయతే కించిత్ సత్త్వం స్థావర జంగమమ్**
**క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగాత్ తద్ విద్ధి భరతర్షభ** (భీష్మ. 37-26)

చరాచర ప్రకృతి క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగం వలన పుట్టింది. ఒకే సూర్యుడు జగత్తుకంతా వెలుగు నిస్తున్నట్లు ఒకే ఆత్మ ప్రాణులన్నిటిలోనూ ఉండి వెలుగు నిస్తున్నాడు.

**సత్త్వం రజస్తమ ఇతిగుణాః ప్రకృతి సంభవాః**
**నిబధ్నంతి మహాబాహో దేహే దేహి నమవ్యయమ్** (భీష్మ. 38-5)

సత్త్వ, రజో, తమో గుణాలు జీవాత్మను శరీరంలో బంధిస్తాయి. సాత్త్వికులు ఊర్ధ్వలోకాలకు, రాజసికులు మానవ లోకంలో, తామసికులు అధోగతిని తిర్యక్ యోనులందు జన్మనొందుతారు.

**ఊర్ధ్వమూలమధః శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్**
**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేదస వేదవిత్** (భీష్మ. 39-1)

ఈ సంసార వృక్షానికి మూలం పైన, కొమ్మలు క్రిందికి ఉంటాయి. వేదాలు దీని ఆకులు. ఈ వృక్షానికి నాశం లేదు. వైరాగ్యం అనే ఖడ్గంతో దీనిని ఖండించి పరమపదాన్ని అన్వేషించాలి.

**దైవీ సంపద్ విమోక్షాయ నిబంధాయాసురీ మతా**
**మా శుచః సంపదం దైవీమ్ అభిజాతోసి పాండవ** (భీష్మ. 40-5)

దానం, దమం, యజ్ఞం, స్వాధ్యాయం, తపస్సు, అహింస, సత్యం, త్యాగం, శాంతి, సర్వభూత దయ, క్షమ, ధైర్యం, శుచి, అంతఃకరణ శుద్ధి లాంటివి దైవగుణాలు. కాపట్యం, అహంకారం, గర్వం, నిష్ఠురత్వం, అజ్ఞానం ఇవి అసుర లక్షణాలు. కామక్రోధ లోభాలు నరక ద్వారాలు, వీటిని విడిచిపెట్టి దైవగుణాలను పెంపొందించుకున్నవాడు పరమగతిని పొందుతాడు.

**త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావ జా**
**సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు** (భీష్మ. 41-2)

సాత్వికులు దేవతలను, రాజసికులు యక్ష రాక్షసులను, తామసికులు ప్రేత భూతగణాలను పూజిస్తారు. వీరి ఆహార, దానధర్మాది విషయాల్లోనూ తేడా ఉంటుంది.

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా** (భీష్మ. 42-60)

అంతర్యామి అయిన ఈశ్వరుడు ప్రాణులన్నిటిలోనూ ఉన్నాడు. అతడే తన మాయతో వారి కర్మలననుసరించి దేహయంత్రాలను చలింపచేస్తున్నాడు.

**తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత**
**తత్ప్రసాదాత్ పరాంశాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్** (భీష్మ. 42-62)

ఆ పరమేశ్వరుని శరణువేడి పరమశాంతిని పొందుము" అన్నాడు భగవానుడు అర్జునుడితో-

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**
**అహం త్వా సర్వపాపేభ్యః మోక్షయిష్యామి మాశుచః** (భీష్మ 42-66)

అన్ని ధర్మాలు విడిచి నన్ను శరణు పొందు.

ఈ విధంగా శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడిలో తలెత్తిన విషాద యోగాన్ని తొలగించి కార్యోన్ముఖుడిని చేసాడు"

అని సంజయుడు ధృతరాష్ట్రుడితో అన్నాడు- "నా అదృష్టం వలన నేనీ అద్భుతమయిన సంవాదం- పదునెనిమిది మెట్లతో కూడినది విన్నాను 1) విషాదయోగము, 2) సాంఖ్యయోగము, 3) కర్మయోగము, 4) జ్ఞానయోగము, 5) కర్మ సన్న్యాస యోగము, 6) ధ్యాన (ఆత్మసంయమం) యోగము, 7) జ్ఞాన విజ్ఞాన యోగము, 8) అక్షర బ్రహ్మయోగము, 9) రాజవిద్యా రాజగుహ్య యోగము, 10) విభూతి యోగము, 11) విశ్వరూప దర్శన యోగము, 12) భక్తి యోగము, 13) క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము, 14) గుణత్రయ విభాగ యోగము, 15) పురుషోత్తమ యోగము, 16) దైవాసుర సంపద్విభాగ యోగము, 17) శ్రద్ధాత్రయ విభాగ యోగము, 18) మోక్ష సన్న్యాస యోగము-

విషాద యోగం నుంచి అర్జునుడిని యుద్ధధర్మం వేపు మరలించిన భగవంతుని అద్భుత గీతమిది. ఏ సమస్యనైనా పరిష్కరించే గొప్ప మార్గమిది. నేను సంవాదాన్ని విన్నాను. శ్రీకృష్ణుని విశ్వరూపాన్ని దర్శించాను. కృష్ణార్జునులున్న చోట విజయం, అభ్యుదయం, న్యాయం ఉండడం తథ్యం.

**యత్ర యోగేశ్వరః కృష్ణః యత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతి ర్మమ** (భీష్మ. 42-78)

## 4. భీష్మ వధ పర్వము

గీత, గంగ, గాయత్రి, గోవింద అనే నాలుగు గకారాలు హృదయంలో నిలిచిన వాడికి పునర్జన్మ ఉండదు. ఈ గీతలో 620 శ్లోకాలు కేశవుడు, 57 శ్లోకాలు అర్జునుడు, 67 శ్లోకాలు సంజయుడు, ధృతరాష్ట్రుడు 1 శ్లోకం చెప్పాడు. 745 మొత్తం శ్లోకాలు.

శ్రీకృష్ణుని బోధనతో కర్తవ్యోన్ముఖుడైన అర్జునుడు యుద్ధానికి సిద్ధమైనాడు మనసు దిటవు పరచుకుని. ఇంతలో ధర్మరాజు తన కవచం విప్పి ఆయుధాలు రథం మీద పడేసి కాలినడకన బయల్దేరి, భీష్ముడికి అంజలి ఘటించి శత్రు సైన్యం

వేపు బయల్దేరినాడు. భీమార్జున నకుల సహదేవులు ఆందోళన చెందారు. శ్రీకృష్ణుడు ధర్మరాజు అభిప్రాయం గ్రహించి, నవ్వుతూ అన్నాడు– "అతడు గురువుల అనుమతి తీసుకోవాలని వెళ్తున్నాడు".

కౌరవ సైనికులు ధర్మరాజును ఈసడించుకున్నారు. ధర్మరాజు వెనకనే మిగతా సోదరులూ అనుసరించారు. భీష్ముడితో అన్నాడు ధర్మరాజు– "తాతా నన్ను ఆశీర్వదించు"

భీష్ముడన్నాడు– "నా దగ్గరకు వచ్చావు, సంతోషం; లేకుంటే శపించేవాడిని. వరం కోరుకో!"

ధర్మజుడన్నాడు– "అజేయుడివి నీవు. నిన్నెలా జయించగలను?"

భీష్ముడన్నాడు– "నాకు మరణ సమయమింకా రాలేదు. మళ్లీరా!". ధర్మరాజు భీష్మునికి నమస్కరించి ద్రోణుడి వద్దకు వెళ్లాడు.

ధర్మజుడన్నాడు– "నీతో యుద్ధం చేస్తున్నాను, నేనెలా జయం పొందుతాను, ఈ శత్రువులపై? నాకు జయం కలిగేలా ఆశీర్వదించు"

ద్రోణుడన్నాడు– "యుద్ధం చెయ్యి. విజయం కలుగుతుంది నీకు.

**యతో ధర్మ స్తతః కృష్ణం యతః కృష్ణ స్తతో జయః**
**యుద్ధ్య స్వ గచ్ఛ కౌంతేయ పృచ్ఛ మాంకిం బ్రవీమి తే**

ధర్మజుడన్నాడు– "నిన్నెలా గెలువగలను? తమ వధోపాయమేమిటి?"

ద్రోణుడన్నాడు– "అప్రియమైన మాటలు వింటే అస్త్రం, శస్త్రం విడిచి పెడతాను. ఆ సమయంలో నన్ను గెలవవచ్చు"

ద్రోణునికి నమస్కరించి ధర్మజుడు కృపాచార్యుడి వద్దకు వెళ్లాడు. కృపాచార్యుడు సంతోషించాడు– "నీకు జయం కలుగు గాక! నేను అర్థంతో కౌరవుల చేత బంధించబడ్డాను. అర్థం చేసుకో!"

కృపాచార్యునికి నమస్కరించి శల్యుడి వద్దకు వెళ్లాడు ధర్మరాజు. శల్యుడు సంతోషించాడు– "ధర్మం నన్ను కౌరవుల పక్షాన ఉంచింది. అర్థం చేసుకో! వరం అడుగు"

ధర్మరాజన్నాడు– "యుద్ధంలో నీవు కర్ణునికి తేజోవధ చేయాలి". శల్యుడన్నాడు– "నీ కోరిక నెరవేరుతుంది. శుభం"

కృష్ణుడు కర్ణుడివేపు వెళ్లి అన్నాడు– "భీష్ముడి మీద కోపంతో యుద్ధం చెయ్యడం లేదట కదా. భీష్ముడు పడిపోయేంత వరకూ పాండవ పక్షాన పోరాడరాదూ!"

కర్ణుడన్నాడు– "కేశవా! దుర్యోధనుడికి అప్రియం చెయ్యను. దుర్యోధనుని మేలు కోసం ప్రాణాలిస్తాను తెలుసుకో!"

అందరూ తమతమ స్థానాలవేపు మరలినారు.

## యుయుత్సుడు పాండవసేనలో చేరుట

ధర్మరాజు ఉభయ సేనల మధ్యలో నిలిచి అన్నాడు– "నా పక్షాన సహాయం చేయగోరేవారిని ఆహ్వానిస్తున్నాను"

యుయుత్సుడు ముందుకు వచ్చాడు– "నన్ను స్వీకరించు. నీ తరపున నేను కౌరవులతో యుద్ధం చేస్తాను".

ధర్మరాజు అన్నాడు– "నిన్ను స్వీకరిస్తున్నాను. ధృతరాష్ట్రుని వంశపరంపర, పిండోదక క్రియలు చేసే భారం నీమీదనే ఉన్నట్లున్నది"

యుయుత్సుడు వచ్చి పాండవసేనలో కలిసాడు. ధర్మరాజు కవచం తొడుక్కుని రథమెక్కి ఆయుధాలు పట్టుకున్నాడు. వీరులందరూ శంఖాలు పూరించారు.

కౌరవుల సేనకు ముందు భీష్ముడు, పాండవుల సేనకు ముందు భీముడు నడుస్తుంటే రెండు సేనలలో సింహనాదాలు, కిలకిల రావాలు, రంపాలు, కొమ్ముబూరలు, భేరులు, మృదంగాలు, డోళ్లు వాయిద్య ధ్వనులు, గుర్రాల, ఏనుగుల గర్జనలు ప్రతిధ్వనిస్తున్నాయి. భీముడు సింహగర్జన చేస్తూ ముందుకురికాడు. కౌరవ సేన అతడిపై బాణవర్షం కురిపించింది.

# మొదటి రోజు యుద్ధం

**అసీత్ కిలకిలా శబ్దః తల శంఖ రవైః సహ**
**జజ్ఞిరే సింహనాదాశ్చ శూరాణాం ప్రతిగర్జతామ్** (భీష్మ. 45-3)

శూరుల సింహనాదాలతో యుద్ధరంగం ప్రతిధ్వనిస్తోంది. భీష్ముడు, అర్జునుడు ఒకరినొకరు గాయపరచుకున్నారు. సాత్యకి-కృతవర్మలు, అభిమన్యుడు-బృహద్బలుడు, భీమసేనుడు-దుర్యోధనుడు; నకులుడు-దుశ్శాసనుడు, సహదేవుడు-దుర్ముఖుడు; ధర్మరాజు-శల్యుడు; ధృష్టద్యుమ్నుడు-శలుడు; శంఖుడు-భూరిశ్రవుడు; ధృష్టకేతువు-బాహ్లికుడు; ఘటోత్కచుడు-అలంబుసుడు; శిఖండి-అశ్వత్థామ; విరాటుడు-భగదత్తుడు; బృహత్‌క్షత్రుడు-కృపుడు, ద్రుపదుడు-జయద్రధుడు; సుతసోముడు-వికర్ణుడు; చేకితానుడు-సుశర్మ; ప్రతివింధ్యుడు-శకుని; శ్రుతకర్మ-సుదక్షిణుడు; ఇరావంతుడు-శ్రుతాయువు; కుంతిభోజుడు-అనువిందుడు; కుంతిభోజుని కుమారుడు-విందుడు; కేకయరాజ కుమారులైదుగురు-గాంధార రాజకుమారులైదుగురు; చేదిరాజు-ఉలూకుడు; ఇలా అద్భుతమైన ద్వంద్వయుద్ధం భీకరంగా సాగింది.

బంధుత్వాలు మరచారు. స్నేహధర్మాలు మరచారు. గెలుపొక్కటే లక్ష్యం. చంపడమా చావడమా అన్న ఉన్మత్తత. తొడలు విరిగి, కాళ్లూ చేతులు తెగి, ప్రేవులు బయటకు వచ్చి ఆక్రోశిస్తూ, ఏడుస్తూ, నీళ్లకోసం పరితపిస్తూ, చస్తూ బ్రతుకుతూ, తిడుతూ, తిట్టుకుంటూ, భరిస్తూ ఉన్న వీరులతో రణరంగమంతా రక్తసిక్తమయ్యింది.

భీష్ముడిని అభిమన్యుడెదుర్కున్నాడు భయంకరంగా. ముత్తాత మునిమనవడు పోరాటం చూడముచ్చటగానే ఉన్నా బాణాలు ఆశీర్వాదాలు కావు. అవి గాయాల్ని కలిగిస్తాయి. ఆ యుద్ధం అత్యంత భయంకరంగా సాగుతున్నపుడే మద్రరాజు శల్యుడిపైకి, విరాటరాజు కుమారుడు ఉత్తరకుమారుడు ఏనుగునెక్కి దాడిచేసాడు. శల్యుడు దానిని బాణాలతో కొట్టినాడు. ఏనుగు కోపించి శల్యుడి రథాన్ని ఆపి గుర్రాలను చంపింది. శల్యుడు ఆగ్రహంతో ఉత్తరుడి మీదికి శక్తిని విసిరాడు. ఉత్తరుడు ఆ శక్తి దెబ్బకు నేలకూలినాడు. శల్యుడు రథం దూకి ఏనుగు తుండాన్ని నరికినాడు. వందల బాణాలు దానికి తగలగా ఆ ఏనుగూ భీకరంగా అరుస్తూ పడిపోయి మరణించింది. శల్యుడు కృతవర్మ రథమెక్కినాడు.

ఉత్తరుడి సోదరుడు శ్వేతుడు తన సోదరుడి మరణానికి చింతిస్తూ శల్యుడిని చంపాలని దాడికి దిగాడు. శ్వేతుడిని అడ్డుకున్నారు- కోసలరాజు బృహద్బలుడు, మగధరాజు జయత్సేనుడు, శల్యుని కొడుకు రుక్మరథుడు, అవంతి ప్రభువులు విందానువిందులు; కాంభోజరాజు సుదక్షిణుడు సింధురాజు జయద్రధుడు. శ్వేతుడు వారినందరినీ తీవ్రంగా గాయపరచాడు. అది చూసి దుర్యోధనుడు, భీష్ముని ముందుంచుకుని శ్వేతుని రథంపై దాడిచేసి మృత్యుముఖంలో ఉన్న మద్రరాజు శల్యుడిని రక్షించాడు.

భీష్ముడి బాణాలకు శ్వేతుడి సైన్యం చిందరవందర అయ్యింది. శ్వేతుడు పాండవ సేనను కాపాడకపోతే భీష్ముడి విజృంభణకు పాండవసేన నశించేది. శ్వేతుడు భీష్ముడినేమాత్రం లెక్కచేయకుండా ధనుస్సు విరిచాడు, ధ్వజాన్ని పడగొట్టినాడు. భీష్ముడు శ్వేతుడికి దొరికిపోయాడనుకుంటున్నపుడు బాహ్లీక, కృతవర్మ, శల, శల్య, జలసంధ, వికర్ణ, చిత్రసేన, వివింశతి లాంటి యోధులు భీష్ముడికి రక్షణగా నిలిచారు. శ్వేతుడి విజృంభణను చూసి భీష్ముడికి కోపం వచ్చింది.

శ్వేతుడి గుర్రాలను, సారథిని చంపివేసి అతడిని అనేక బాణాలతో కొట్టినాడు భీష్ముడు. విరథుడై నేలమీద నిలబడి శ్వేతుడు భీష్మునిపైకి శక్తిని విసిరాడు. శక్తిని ఖండించగా గదను విసిరాడు. భీష్ముడు నేలపైకి ఉరికే సమయానికే ఆ గద భీష్ముని రథాన్ని ముక్కలు ముక్కలు చేసింది. భీష్ముడు మరొక రథమెక్కినాడు. సాత్యకి, భీముడు, ధృష్టద్యుమ్నుడు, ధృష్టకేతువు, అభిమన్యుడు వేగంగా వచ్చి చేరారు శ్వేతుడిని రక్షించడానికి.

శ్వేతుడిని చంపడానికి నిశ్చయుడై భీష్ముడు రెక్కలు గల బాణాన్ని అభిమంత్రించి బ్రహ్మాస్త్రంగా మార్చి శ్వేతుడిపైకి వదిలాడు. అది శ్వేతుడి కవచాన్ని, హృదయాన్ని భేదించి నేలమీద పడిపోయింది. శ్వేతుడు మరణించాడు.

పాండవులు విమనస్కులై వెనుదిరిగారు.

శ్వేతుడు తన తండ్రి విరాటుడితోనే కలహించినవాడు. గొప్ప వీరుడు. ఒంటరిగా జీవించేవాడు. విరాటుడి సేనాపతిగా ఉన్నా అభిప్రాయభేదాలుండేవి. శ్వేతుడు, ఉత్తరుడు మరణించగానే విరాటుడి మరో కుమారుడు శంఖుడు హవిస్సుతో అగ్ని మండినట్లు మండినాడు. భీష్ముడిపై దాడి చేసాడు. భీష్ముడి నుంచి శంఖుడిని రక్షించాడు అర్జునుడు. పొగలేని నిప్పులా భీష్ముడు రణరంగాన్ని ఆక్రమించాడు. పాండవసేనకు దిక్కుతోచలేదు. సింహం చీల్చిన తెల్లగోవులా వణికిపోయింది పాండవసేన. సూర్యాస్తమయం కాగా పాండవులు మహాయుద్ధం నుంచి తమ సేనలను ఉపసంహరించుకున్నారు.

# రెండవ రోజు యుద్ధం

ధర్మరాజు చింతాక్రాంతుడై మహాశోకంతో శ్రీకృష్ణునితో అన్నాడు– "భీష్ముని భీషణ పరాక్రమాన్ని చూడు. ఎండాకాలంలో చెత్తను దహించే నిప్పులా నా సేనను బాణాలతో దమించాడు. నేను గెలవడం కష్టమే. నేను అరణ్యానికి పోతాను. అదే మేలు. ఈ రాజులను భీష్మరూపమైన మృత్యువుకు అర్పించలేను.

సవ్యసాచి తటస్థంగా ఉన్నాడనిపిస్తున్నది నాకు. భీముడొక్కడే తన శక్తినంతా వినియోగించి యుద్ధం చేస్తున్నది".

శ్రీకృష్ణుడన్నాడు– "ఒక్కరోజులోనే గెలుపు ఓటములు నిశ్చయం కావు. ఓపిక వహించు"

ధర్మరాజన్నాడు ధృష్టద్యుమ్నునితో– "ఈరోజు క్రౌంచారుణ వ్యూహంతో మన సేనలను ఏర్పర్చు. అర్జునుడిని అగ్రభాగంలో నిలుపు".

కౌరవుల ప్రతివ్యూహం పాండవుల ఎగిరే క్రౌంచపక్షిని కూల్చేలా, భీష్ముడిని శిఖండి నుంచి రక్షించేలా రచింపబడింది. నిన్నటి విజయంతో మరింత ఉల్లాసంగా ఉన్నారు కౌరవులు వారి సేనలు.

భీష్మార్జునుల మధ్య ఘోర యుద్ధం జరిగింది. బాణాలు తగిలి పార్థసారథి శ్రీకృష్ణునికి గాయాలై పుష్పించిన కింశుక వృక్షంలా ఉన్నాడతను. మహావీరులైన భీష్మార్జునుల యుద్ధం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఎంత కాలమైనా ఆగకుండా సాగేట్లు ఉన్నదా యుద్ధం. ద్రోణ–ధృష్టద్యుమ్నుల మధ్య యుద్ధం కూడా అంతే భీకరంగా సాగింది. ద్రోణుడు విజృంభించి ధృష్టద్యుమ్నుడిని విరథుడిని చేసాడు. అతడి విల్లును, గదను, కత్తిడాలు విరగగొట్టాడు. భీముడు వచ్చి ద్రోణుని గాయపరచి ధృష్టద్యుమ్నుని తన రథం మీదకు ఎక్కించుకున్నాడు.

కళింగరాజుకు భీమసేనుడికి మధ్య గొప్ప యుద్ధం జరిగింది. శత్రుసేన తనను చుట్టుముట్టినా చలించక భీమసేనుడు కళింగరాజు కొడుకు శక్రదేవుడిని తన గద విసిరి చంపినాడు. కత్తి డాలు చేబట్టి ఏనుగుపైకురికి తొండం మీదుగా పైకెక్కి కళింగరాజు భానుమంతుడిని రెండు ముక్కలుగా నరికివేసాడు. ఏనుగు మెడ నరికి ఏనుగునూ చంపివేసాడు. కేతుమంతుడిని చంపినాడు. నేలపై దూకి ఏనుగులను చంపుతూ పోతున్నాడు భీమసేనుడు. రథాలను నాశనం చేస్తున్నాడు. ఖడ్గం తిప్పుతూ భ్రాంత, ఆవిద్ధ, ఉద్భ్రాంత, ఆప్లుత, ప్రసృత, ప్లుత, సంపాత, సముదీర్ణ రీతులతో ఏనుగులను చంపివేసాడు.

ఇలా శత్రు సైనికులను, గజాశ్వాలనూ సంహరిస్తూ భీమసేనుడు తన సారథి విశోకుడు తెచ్చిన రథమెక్కినాడు. వెళ్లి కళింగ రాజును ఢీకొన్నాడు. పుత్రశోకంతో దుఃఖితుడై ఉన్న కళింగరాజును ఎదుర్కుంటూ రెండువేల మంది కళింగులను మృత్యులోకానికి పంపినాడు.

ధృష్టద్యుమ్నుడు కోవిదార వృక్ష ధ్వజంతో వచ్చి భీముడికి అండగా నిలిచాడు. కళింగసేనను కాలుడిలా చంపుతున్న భీముడిని ఎదుర్కోదలిచి అడ్డువచ్చాడు భీష్ముడు తన సేనతో.

తనపైకి వస్తున్న భీష్ముడిపై భీముడు శక్తిని ప్రయోగించాడు. ఆ శక్తిని ముక్కలు చేసాడు భీష్ముడు. సాత్యకి భీష్ముడి సారథిని పడగొట్టాడు. సారథి లేని గుర్రాలు వేగంగా భీష్ముడి రథాన్ని రణభూమి నుండి పక్కకు లాక్కుపోయాయి.

కళింగరాజు భానుమంతుడు, రాకుమారుడు కేతుమంతుడు, వీరుడు శక్రదేవుడు, కళింగ సైనికులను చంపినాడు భీమసేనుడు.

మొదటిరోజు యుద్ధంలో పాండవుల ప్రియ కుమారుడు అభిమన్యుడి భార్య ఉత్తరకు సోదరులైన ఉత్తరకుమారుడు, శ్వేతుడు మరణించారు. దానికి ప్రతీకారమా అన్నట్లు రెండవరోజు యుద్ధంలో దుర్యోధనుడి భార్య భానుమతి తండ్రి భానుమంతుడు, సోదరులు కేతుమంతుడు, శక్రదేవులను చంపినాడు భీముడు. రెండవరోజు పూర్వాహ్ణం ముగిసింది.

అభిమన్యుడు అర్జునుడు విజృంభించి కౌరవసేనను కకావికలం చేసారు. అభిమన్యుడు లక్ష్మణకుమారుల మధ్య అద్భుత యుద్ధం జరిగింది. లక్ష్మణుడికి సాయంగా దుర్యోధనాదులు, అభిమన్యుడికి సాయంగా అర్జునుడు యుద్ధం చేసారు. అర్జునుడు ఆగ్రహంతో తనకు అడ్డువచ్చిన వారి చేతుల్ని నరికేసాడు. ఈరోజు భీమార్జునులను ఎదరించడం అసాధ్యం –అని భీష్మద్రోణులు సూర్యాస్తమయ సమయానికి సేనలను ఉపసంహరించారు.

# మూడవ రోజు యుద్ధం

కౌరవులది గరుడ వ్యూహం. పాండవులది అర్ధచంద్రాకార వ్యూహం. ఉభయ సేనల మధ్య ఘోర యుద్ధం జరిగింది. ఎక్కడ చూసినా ధ్వజాలు, కార్ముకాలు, తోమరాలు, ప్రాసాలు, గదలు, పరిఘలు, కంపనాలు, శక్తులు, చిత్రకవచాలు, కణపాలు, అంకుశాలు, ఖడ్గాలు, బంగరు రెక్కల బాణాలు, శూలాలు, బొంతలు, కంబళ్లతో రణరంగం పూలమాలలతో అలంకరించబడినట్లు కనిపిస్తోంది.

రక్తంతో నేల తడిచి దుమ్ము అణిగిపోయింది. ఏనుగులు గుర్రాలు చచ్చిపడి ఉన్నాయి. అయినా పరస్పర హననం ఆగలేదు. శత్రురాజులందరూ అర్జునుని చుట్టుముట్టినారు. అర్జునుడు తన బాణాలతో వారినందరినీ నొప్పించాడు. సాత్యకి, అభిమన్యులు గాంధారులనడ్డగించారు. ధర్మరాజు నకుల సహదేవులు ద్రోణుని సేనపై దాడిచేసారు. భీమసేన ఘటోత్కచులు దుర్యోధనుని సేనపై తలపడ్డారు. ఘటోత్కచుని దెబ్బకు దుర్యోధనుడు మూర్ఛపోగా రథసారధి రథాన్ని వేగంగా రణభూమి వెలుపలికి తీసుకుపోయాడు. కౌరవసేన పారిపోయింది.

స్పృహ వచ్చిన దుర్యోధనుడు తన సైన్యాన్ని మరల ఉత్తేజపరచి వేగంగా వచ్చి భీష్ముడిని సమీపించి అన్నాడు– "పితామహా! నీవు, ద్రోణుడు, కృపుడు మిత్రబాంధవ సమేతంగా జీవించి ఉండగానే కౌరవసేన పలాయనం చిత్తగించడం బాగోలేదు. పాండవులపై తమ దయ ఎక్కువగా ఉన్నట్లున్నది. ఈ విషయం ముందే తెలిస్తే, నేను కర్ణుడితో ఆలోచించి కర్తవ్యాన్ని నిర్ణయించి ఉండేవాడిని".

భీష్ముడు నవ్వి అన్నాడు– "రాజా! దేవేంద్రుడే దిగివచ్చినా పాండవులతో గెలవడం అసాధ్యమని ముందే చెప్పాను. నేనా ముసలివాడను. నేను చేయగలిగినదంతా చేస్తాను".

సూర్యుడు పశ్చిమం వేపు ఉన్నాడు. పాండవులు జయంతో కూడిన ఆనందంతో ఉన్నారు. ఆ సమయంలో భీష్ముడు యుద్ధం ప్రారంభించాడు ఉధృతంగా. రథం మీద ఆసనంపై నృత్యం చేస్తున్నట్లున్నది అతడు గుండ్రంగా తిరుగుతూ బాణాలు వేస్తుంటే. ఒక్కడే లక్షలాది వీరులుగా కానవస్తున్నారు. పాండవ సేన అపజయం వేపు అడుగులు వేస్తున్నది.

శ్రీకృష్ణుడన్నాడు– "అర్జునా! పోరాటం ప్రారంభించు". అర్జునుడు భీష్ముడిపై బాణవర్షం కురిపిస్తున్నాడు. శ్రీకృష్ణుడు రథాన్ని మండలాకారంలో నడిపిస్తూ భీష్ముని బాణాలను గురితప్పిస్తున్నాడు. అయినా కృష్ణార్జునుల నిద్దరినీ గాయపరచాడు భీష్ముడు. అంతేకాక పాండవ వీరులందరినీ చంపుతున్నాడు. పాండవ వీరులు పారిపోతుంటే సాత్యకి వారిని ఆపడానికి ప్రయత్నం చేస్తుంటే శ్రీకృష్ణుడన్నాడు– "సాత్యకీ, వెళ్లేవాళ్లను వెళ్లనీ! నేనే రణభూమిలో ఈ భీష్ముని, ద్రోణుని పడగొట్టాలేమో!" అని పలికి సుదర్శన చక్రాన్ని స్మరించాడు కృష్ణుడు. ప్రకాశిస్తున్న చక్రాన్ని చేతబట్టి పొగరెక్కిన ఏనుగును చంపే సింహంలా శ్రీకృష్ణుడు రథం దూకి భీష్ముడి వేపు నడిచాడు.

కౌరవుల గుండెలవిసిపోయాయి.

భీష్ముడు చలించలేదు. శరణాగతిని సూచిస్తూ అన్నాడు– "నీవు నన్ను చంపడం నాకు గౌరవమే!"

అర్జునుడు అది చూసి వేగంగా రథం దూకి కృష్ణుడి రెండు చేతులూ పట్టుకుని ఆపుతున్నా, పెనుగాలి చెట్టును లాక్కుని పోతున్నట్లు కృష్ణుడు అర్జునుడిని లాగివేస్తున్నాడు. పది అడుగుల తర్వాత శ్రీకృష్ణుడిని ఆపి అర్జునుడన్నాడు– "నా కుమారుల మీద, సోదరుల మీద ఒట్టువేసి చెబుతున్నాను. కేశవా! నా కర్తవ్యాన్ని నేను నిర్వహిస్తాను".

ఇద్దరూ రథాన్నెక్కి శంఖాలను పూరించారు. పాండవుల సేనలో కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. అర్జునుడి బాణాలకు కౌరవసేన అతలాకుతలమైంది. ఐంద్రాస్త్రం ప్రయోగించాడు అర్జునుడు. కౌరవుల సేన ఛిన్నాభిన్నమైంది.

నిశారంభాన్ని చూసిన కౌరవ వీరులు యుద్ధాన్ని నిలిపివేసారు. పదివేల రథాలను, ఏడువందల ఏనుగులను, ప్రాచ్య, క్షుద్రక, మాలవులను చంపి అర్జునుడు వీరవిహారం చేసాడు. అర్జునుడంటేనే కౌరవసేన బెదిరిపోయే స్థితికి వచ్చింది.

మూడవ రోజు యుద్ధంలో ఇరుపక్షాలు విజయం పొందాయి.

# నాలుగవ రోజు యుద్ధం

కౌరవుల నాగవ్యూహం పాండవుల క్రౌంచ వ్యూహం.

నాలుగవ రోజున కూడా భీష్మార్జునుల మధ్య అద్భుత యుద్ధం జరిగింది. అంత వీరోచితంగా అర్జునుడి పుత్రుడు అభిమన్యుడు అశ్వత్థామ, భూరిశ్రవ, శల్య, చిత్రసేనులతో యుద్ధం చేసాడు. అర్జునుడు, అభిమన్యుడు శత్రుసేనలతో చుట్టుముట్టబడడాన్ని గమనించి ధృష్టద్యుమ్నుడు గొప్ప సేనతో వారికి సాయం వెళ్లాడు. అతడిని శల్య కుమారుడు అడ్డగించగా ధృష్టద్యుమ్నుడతడిని గదతో తలపై మోది చంపాడు. అది చూసి శల్యుడు ధృష్టద్యుమ్నుని గాయపరచాడు. అభిమన్యుడు శల్యుడి నెదుర్కొన్నాడు. శల్యుడిని కాపాడడానికి దుర్యోధన, వికర్ణ, దుశ్శాసన, వివింశతి, దుర్మర్షణ, దుస్సహ, చిత్రసేన, దుర్ముఖ, సత్యవ్రత, పురుమిత్రులు అభిమన్యుడి నెదిరించారు. అభిమన్యుడికి సాయంగా భీముడు, ధృష్టద్యుమ్నుడు, ఉప పాండవులు, నకుల సహదేవులు నిలిచారు. పోరు ఘోరమైంది. ఇరుపక్షాల యోధులూ గాయపడినారు. శల్యుడు తన మేనల్లుళ్లను బాణాలతో పీడించాడు.

భీముడు కోపించి గదాదండాన్ని చేతబట్టి కదలగా దుర్యోధనుడు క్రుద్ధుడై మాగధ గజసేనను ప్రేరేపించాడు. అది చూసి భీముడు రథం దిగి ఏనుగులను చంపడం మొదలెట్టాడు. ధృష్టద్యుమ్నుడు, అభిమన్యుడు కూడా ఏనుగులను చంపుతుంటే మగధరాజు ఐరావతం లాంటి ఏనుగుతో అభిమన్యుడిపై దాడిచేయగా అభిమన్యుడు ఏనుగును, మగధరాజును చంపివేసాడు. భీముడు గజసేనను చంపుతూ గజసైనికులను గజగజ వణికించాడు. అప్పుడు భీముడిని ఎదుర్కొన్నాడు భీష్ముడు. అయినా చలించక భీముడు యముడి దూతలా వీరవిహారం చేసాడు.

అతడిలానే ఘోరయుద్ధం చేస్తున్న సాత్యకిని భూరిశ్రవుడు ఎదుర్కొన్నాడు. భీముడు తన రథాన్నెక్కి దుర్యోధనుడి కథ ముగించాలని వేగంగా వెళ్లాడు. దుర్యోధనుడి బాణాలకు భీముడు మూర్ఛిల్లినాడు. మూర్ఛ నుండి వెంటనే లేచి దుర్యోధనుడిని, శల్యుడిని గాయపరచాడు. శల్యుడు పారిపోయాడు. కౌరవ సోదరులు పద్నాలుగు మంది భీముడిపై దాడిచేసారు. సేనాపతి, సుషేణుడు, జలసంధుడు, సులోచనుడు, ఉగ్రుడు, భీమరథుడు, భీముడు, వీరబాహువు, అలోలుపుడు, దుర్ముఖుడు, దుష్ప్రధర్షుడు, వివిత్సుడు, వికటుడు, సముడు వీరంతా భీమసేనునిపై దాడిచేసి గాయపరచగా ఆ పదునాలుగు మందినీ చంపేసాడు భీముడు.

భీష్ముడు ఆ సంగతి ప్రకటించగానే భగదత్తుడు వెంటనే మదపుటేనుగు మీద వచ్చి భీమసేనుడి నెదుర్కొన్నాడు. గొప్పదైన కణుపుల బాణంతో భీముడిని కొట్టేసరికి భీముడు సొమ్మసిల్లి జెండా కర్రను ఆసరాగా పట్టుకున్నాడు. అదిచూసి భీమపుత్రుడు ఘటోత్కచుడు మాయాయుద్ధం ప్రారంభించాడు. దిక్పాలకుల ఏనుగులు వచ్చి భగదత్తుడి ఏనుగును ఢీకొన్న భ్రాంతి కలిగింది. ఐరావతం, అంజనం, వామనం, మహాపద్మంలా అవి మెరుస్తున్నాయి. భగదత్తుడి ఏనుగు బాధతో అరుస్తున్నది.

భీష్ముడన్నాడు– "చీకటి పడుతున్నది. ఘటోత్కచుడిని ఇప్పుడు ఎదిరించలేము. నేటికి యుద్ధ విరమణ ప్రకటిద్దాం".

నాలుగవ రోజు యుద్ధంలో పాండవుల వేపు విజయం మొగ్గింది. కౌరవులు 14 మంది, శల కుమారుడు, మగధరాజు మరణించారు.

# అయిదవ రోజు యుద్ధం

నాలుగవ రోజు రాత్రి దుర్యోధనుడు అడిగాడు భీష్ముడిని– "దేనివలన మనకన్నా బలం తక్కువ వాడైన యుధిష్ఠిరుడు ప్రతి క్షణమూ మనలను గెలువగలుగుతున్నాడు?"

భీష్ముడన్నాడు– "రాజా! నీకిదివరకెన్నోసార్లు చెప్పాను. నీవు వినిపించుకోవు. వినిపించుకున్నా పాటించవు. పాండవులతో సంధి చేసుకో. అది మంచిది నీకూ, లోకానికీ. శ్రీకృష్ణుడు పాండవులను రక్షిస్తున్నంత కాలమూ వాళ్లకు అపజయం ఉండదు. అతడు విశ్వమూర్తి"

కౌరవుల మకర వ్యూహం – పాండవవుల శ్యేన వ్యూహం. అయిదవ రోజు భీష్ముడికి భీముడికి మధ్య భీకర సంగ్రామం జరిగింది. అర్జునుడతడికి సహాయంగా వెళ్లాడు. ఉభయ సేనల మధ్య పోరు ఘోరమై రణరంగం పీనుగుల పెంటగా మారింది.

అశ్వత్థామ-అర్జునుల యుద్ధమొక అద్భుత దృశ్యంగా భాసించింది. భీమ-దుర్యోధనులు, అభిమన్య-లక్ష్మణులు ఘోరంగా యుద్ధం చేసి పరస్పరం గాయపరచుకున్నారు.

సాత్యకి కొడుకులు పదిమంది భూరిశ్రవుడి నెదిరించారు. ఆ పదిమందిని భూరిశ్రవుడు చంపడంతో సాత్యకి గర్జిస్తూ భూరిశ్రవుడిపై దూకాడు. వారికి పూర్వ వైరమున్నది. ఇద్దరి మధ్య పోరు ఘోరమై ఇద్దరూ మూర్ఛిల్లారు. భీముడు వచ్చి సాత్యకిని, దుర్యోధనుడు వచ్చి భూరిశ్రవుని రథాల మీద సురక్షిత స్థానాలకు కొనిపోయారు.

ఆగ్రహంతో ఉన్న అర్జునుడు ఆరోజున ఇరవై అయిదు వేలమంది రథికులను సంహరించాడు.

సూర్యాస్తమయం కావడంతో యుద్ధం ఆగింది.

సాత్యకి ఆరోజున తన కుమారులు పదిమందిని నష్టపోయాడు.

## ఆరవ రోజు యుద్ధం

పాండవుల మకర వ్యూహం - కౌరవుల మహాక్రౌంచ వ్యూహం.

సూర్యోదయం కాగానే యుద్ధం మొదలైంది. ఇరుపక్షాల వ్యూహాలూ బ్రద్దలై రెండు సైన్యాలూ కలిసిపోయాయి.

సంజయుడు చెబుతున్నాడు ధృతరాష్ట్రునితో- "ఈ లోకంలో అయినా, పరలోకంలో అయినా ఎవరి కర్మ ఫలితాన్ని వారే అనుభవించాలి.

**ఆత్మనైవ కృతం కర్మ ఆత్మనైవోప భుజ్యతే**
**ఇహ చ ప్రేత్య వా రాజన్ త్వయాప్రాప్తం యథాతథమ్** (భీష్మ. 77-4)

యుద్ధం క్షణక్షణానికి ఘోరమవుతున్నది. భీముడు కౌరవసేన కోటను బద్దలు గొట్టాలని చూస్తున్నాడు. భీష్ముడు దాన్ని రక్షిస్తున్నాడు. తనను బంధించాలని వస్తున్న కౌరవ సేనను చూసి భీముడు రథం దిగి గదను చేతబట్టి సంహారం మొదలెట్టాడు భీముడు. ఖాళీగా ఉన్న భీమరథాన్ని చూసి ధృష్టద్యుమ్నుడు భీముడు వెళ్లిన దారినే తన రథాన్ని పోనిచ్చాడు. దుర్యోధనుని ప్రేరణతో కౌరవ సోదరులు ధృష్టద్యుమ్నుడి నెదుర్కొన్నారు. దానితో అతడు ప్రమోహనాస్త్రాన్ని ప్రయోగించాడు.

అది చూసి ద్రోణుడు వేగంగా అటువచ్చి ప్రజ్ఞాస్త్రాన్ని ప్రయోగించగా కౌరవులు స్పృహలోకి వచ్చారు. యుధిష్ఠిరుని ఆదేశానుసారం అభిమన్యుడు, ధృష్టకేతువు, ఉపపాండవులు, కేకయులైదుగురు -పన్నెండు మంది సూచీముఖ వ్యూహంతో భీమ, ధృష్టద్యుమ్నులున్న వేపు వెళ్లారు.

రెండు వేపులా యుద్ధం ప్రచండంగా సాగింది. భీముడు ఈసారి తన దృష్టిని దుర్యోధనుడిపై కేంద్రీకరించాడు. అనేక బాణాలతో దుర్యోధనుని తీవ్రంగా గాయపరచాడు. అభిమన్యాదులు కౌరవులను విపరీతంగా బాధించారు. సూర్యాస్తమయ సమయానికి భీముడి చేతిలో దెబ్బతిని దుర్యోధనుడు, ధృష్టద్యుమ్నుని ధాటికి గాయపడిన కౌరవులు పరాజయ భారంతో శిబిరాలకు వెళ్లారు.

## ఏడవ రోజు యుద్ధం

దుర్యోధనుడన్నాడు భీష్మునితో- "భీముడు వజ్రతుల్యమైన మకర వ్యూహాన్ని చీల్చి దారుణమైన బాణాలతో నన్ను చంపినంత పనిచేసాడు. నేడు నాకు శాంతి లేదు. నీ అనుగ్రహంతో పాండవులను జయించాలి అనుకున్న నాకు నిరాశ కలుగుతున్నది".

భీష్ముడన్నాడు- "మేము చెబితే వినవు. కాస్త కష్టం కలుగగానే వచ్చి ప్రశ్నిస్తావు. పాండవులను గెలవడం సాధ్యం కాదంటే పెడచెవిన పెడతావు. సరే, నేను నా ప్రాణాలను ఒడ్డి అయినా పాండవులతో పోరాడతాను. ఇదిగో విశల్యకరణి ఔషధం. ఇది నీ గాయాల ప్రభావాన్ని తగ్గిస్తుంది".

కౌరవులు మండల వ్యూహం-పాండవుల వజ్ర వ్యూహం.

అర్జునుడిని అనేకమంది రాజులు చుట్టుముట్టి చావుదెబ్బ తిన్నారు. అభిమన్యుడు చిత్రసేన, వికర్ణ, దుర్మర్షణులతో యుద్ధం చేసాడు. ఘటోత్కచుడు-భగదత్తుడు; అలంబుసుడు-సాత్యకి; భూరిశ్రవుడు-ధృష్టకేతువు; ధర్మరాజు-శ్రుతాయువు;

చేకితానుడు-కృపుడు, భీష్ముడితో పాండవసేన, అర్జునుడితో త్రిగర్త సేన పోరాటానికి దిగాయి. ఐంద్రాస్త్రంతో మరోసారి కౌరవ సేనను కల్లోలపరచాడు అర్జునుడు.

ద్రోణుడు విరాటరాజుతో పోరాటం చేసాడు. తండ్రికి సాయంగా విరాటుని కుమారుడు శంఖుడు వచ్చాడు. ద్రోణుని బాణాల ధాటికి శంఖుడు నేలకూలగా, విరాటరాజు పారిపోయాడు. శిఖండి-అశ్వత్థామల మధ్య ఘోరయుద్ధం జరిగింది. విందానువిందులు ఇరావంతుడిపై దాడి చేసారు. ఇరావంతుడు అర్జునుడు-నాగకన్య ఉలూచిల కుమారుడు. అతడు విందానువిందులను జయించాడు. ఘటోత్కచుడు భగదత్తునితో యుద్ధం చేసాడు.

శరీరంపై వాత పిత్త కఫాలు దాడిచేసినట్లు చిత్రసేనుడు, వికర్ణుడు, దుర్మర్షణుడు అభిమన్యునిపై దాడిచేసారు. అభిమన్యుడు వారిని చావగొట్టి భీముని ప్రతిజ్ఞను తలచుకుని వారిని చంపకుండా వదిలాడు. అర్జునుడిని త్రిగర్త సైనికులు, భీష్ముడిని పాండవ యోధులూ చుట్టుముట్టినారు. ధర్మరాజు శిఖండితో అన్నాడు- "ఇది నీ పరాక్రమానికి తగిన సమయం. భీష్మునిపై దాడి చేయుము". శిఖండి భీష్ముడిపై దాడికి వెళ్తుంటే శల్యుడు భీకరాస్త్రంతో శిఖండిని ఆపబోయాడు. శిఖండి వారుణాస్త్రంతో దానిని పడగొట్టాడు. భీముడు చిత్రసేనుడి రథాన్ని తన గదతో నుగ్గునుగ్గు చేసాడు. చిత్రసేనుడు వికర్ణుడి రథమెక్కినాడు. అప్పుడు యుధిష్ఠిరుడు-భీష్ముల మధ్య యుద్ధం జరిగింది. ధర్మజుడు విరథుడై నకులుడి రథమెక్కినాడు.

ఏడవ రోజు యుద్ధం ఎటూ తేలలేదు.

## ఎనిమిదవ రోజు యుద్ధం

కౌరవుల మహా వ్యూహం - పాండవుల శృంగాటక వ్యూహం.

కౌరవుల మహావ్యూహం తరంగాలతో విరుచుకుపడుతున్న సముద్రంలా ఉండగా, పాండవుల శృంగాటక వ్యూహం నాలుగు వేపులా నాలుగు దారులున్నదిగా భాసిస్తున్నది.

ఆరోజున భీష్ముని దెబ్బకు గాయపడని నరుడు లేడు. ఏనుగులు నేలకూలినాయి. రథాలు ముక్కలు ముక్కలయినాయి. భీముడొక్కడే ఎదురునిలిచి గొప్ప పోరాటం చేసాడు. అడ్డువచ్చిన ధార్తరాష్ట్రుడైన సునాభుని వధించాడు. దానితో కోపించి ఆదిత్యకేతువు, బాహ్వాశి, కుండధారుడు, మహోదరుడు, అపరాజితుడు, పండితకుడు, దుర్జయుడు (విశాలాక్షుడు) భీముని మీదకు విజృంభించగా ఆ ఏడుగురిని చంపాడు భీమసేనుడు. భీముడిని చంపమని సైనికులకు ఆజ్ఞ ఇచ్చి దుర్యోధనుడు భీష్ముడి వద్దకు వెళ్లి విలపించసాగినాడు- "తాతా! భీముడు నా సోదరులను చంపుతున్నాడు. నీవు మధ్యస్థుడివి కాబట్టి ఇలా జరుగుతున్నది".

భీష్ముడన్నాడు మనసు గాయపడగా- "నేను, ద్రోణుడు, గాంధారి, విదురుడు అందరం నీకీ విషయం చెప్పాము. నీవు వినలేదు. పైగా నన్ను, ద్రోణుడిని ఈ యుద్ధంలో నియుక్తుల్ని చేసావు. విను. యుద్ధంలో భీముడు ధృతరాష్ట్ర పుత్రులను ఎవరెవరిని చూస్తాడో వారిని అందరిని సంహరిస్తాడు. ఇది నిజం. వీర స్వర్గమే లక్ష్యంగా చేసుకుని యుద్ధం చేయి. పాండవులను గెలవలేవు".

ఆరోజు మధ్యాహ్న సమయంలో అత్యంత భయంకరమైన యుద్ధం జరిగింది. రక్తపు నదులు ప్రవహించాయి. విరిగిపోయిన రథాలు, తెగిపడిన ధ్వజాలు, ముక్కలు ముక్కలయిన ఆయుధాలు, చామరాలు, గొడుగులు, ఆభరణాలు, భుజకీర్తులు, కుండలాలు గల తలలు, తలపాగాలు, పతాకలు, రథాల ఇరుసులు, పగ్గాలు, నొగలు -వీటన్నిటితో భూమి వసంత ఋతువులో పూలతో ఉన్నట్లు కానవచ్చింది.

శకుని, కృతవర్మలు పాండవసేనపై దాడి చేసారు. ఇరావంతుడు నాగకన్య ఉలూచి కుమారుడు. ఆమెకు నిశ్చయింప బడిన నాగ కుమారుడిని గరుత్మంతుడు వధించాడు. సంతాన రహితంగా ఉన్న ఉలూచి తీర్థయాత్రలో ఉన్న అర్జునుడిని మోహించి, అతడిని నాగలోకానికి తీసుకుపోయి ఓ రాత్రి అతడితో గడిపింది. ఆమెకు ఇరావంతుడు జన్మించాడు. తక్షకుడి కుమారుడైన అశ్వసేనుడు ఉలూచికి బావ వరుస. ఇరావంతుడికి అశ్వసేనుడు బాబాయి అవుతాడు. ఖాండవ వన దహన సమయంలో అర్జునుడి బాణాల వల్ల తక్షకుడి భార్య మరణించింది. అశ్వసేనుడు బతికినాడు. ఆ అశ్వసేనుడు ఇప్పుడు కర్ణుడి నాగాస్త్రంలో భాగమైనాడు. తక్షకుడు తన భార్య మృతికి కారణమైన అర్జునుడిపై పగదీర్చుకోదలుచుకున్నాడు.

అర్జునుడికి–నాగకన్య ఉలూచికి పుట్టిన ఇరావంతుడు మహాయోధుడు. అశ్వసైన్యంతో తండ్రికి సాయం చేయడానికి వచ్చాడు. అతడిని ఎదిరించారు శకుని సోదరులు ఆరుగురు– గజుడు, గవాక్షుడు, వృషభుడు, చర్మవంతుడు, ఆర్జవుడు, శకుడు – అద్భుతమైన ఖడ్గయుద్ధం చేసి ఇరావంతుడు అయిదుగురిని చంపాడు. వృషభుడు తీవ్రగాయాలతో తప్పించుకున్నాడు.

దుర్యోధనుడు కోప పరవశుడై ఇరావంతుడిపైకి అలంబుసుడు (బకుడి మిత్రుడు) అనే రాక్షసుని పంపాడు. ఇద్దరి మధ్య భయంకర యుద్ధం జరిగింది. మామూలు యుద్ధం ముగిసాక మాయాయుద్ధం చేయసాగినారిద్దరూ. ఇరావంతుడు తన తల్లి వంశస్థులైన నాగులు వెంటరాగా అనేక శిరస్సులు కల ఆదిశేషుడిలా అలంబుసుడిని చుట్టుముట్టినాడు. అలంబుసుడు గరుత్మంతుడిలా గ్రద్ద రూపాన సర్పాలను తినివేస్తూ, సొమ్మసిల్లిన ఇరావంతుని శిరస్సును ఖడ్గంతో ఖండించాడు.

ఇరావంతుడు చనిపోగానే ఘటోత్కచుడు సింహనాదం చేస్తూ కాలాంతకుడిలా కౌరవసేన సంహారం మొదలుబెట్టినాడు. దుర్యోధనుడిని చంపడానికి శక్తి ఎత్తగా వంగరాజు అడ్డం వచ్చాడు. శక్తి ఆయుధం తగిలి వంగదేశపు రాజు ఎక్కి ఉన్న ఏనుగు మరణించింది. వంగరాజు తప్పించుకున్నాడు. దుర్యోధనుడు నిశ్చలంగా నిలబడి ఘటోత్కచుని ఎదిరించాడు. అది చూసి కౌరవసైన్యంలోని రథికులంతా ద్రోణుని నాయకత్వాన దుర్యోధనుడికి సాయం వచ్చారు. ఘటోత్కచుడి పరాక్రమం ముందు ఎవరూ నిలవలేకపోయారు. అయినా మరల ప్రయత్నించి అతడిపై శరవర్షం కురిపిస్తుండగా భీముడు తన పుత్రుడికి సాయం చేయడానికి పాండవ వీరులతో అటు వచ్చాడు. రెండు సేనల మధ్య సంకుల సమరం జరిగింది.

కోపించిన దుర్యోధనుడు భీముడిపై తలపడినాడు. ఇద్దరి సేనలు భీకరయుద్ధం చేసాయి. భీముడి బాణాలకు ద్రోణుడు మూర్ఛిల్లినాడు. కౌరవ యోధులు భీముడిని చుట్టుముట్టినారు. భీముడి స్నేహితుడు నీలుడు అశ్వత్థామతో యుద్ధం చేసాడు. నీలుడు గాయపడడం చూసి ఘటోత్కచుడు మాయాయుద్ధం ప్రారంభించి ద్రోణ, దుర్యోధన శల్యుడు ఇత్యాది వీరులు పడిపోతున్న భ్రమను కలిగించేసరికి కౌరవ సైనికులు భీతిచెంది తలోదిక్కుకూ పారిపోయారు.

దుర్యోధనుడు మరల భీష్ముడి వద్దకు వెళ్లి తన గోడును వెల్లబోసుకున్నాడు. భీష్ముడి సలహాతో ఘటోత్కచుడిపై భగదత్తుడిని యుద్ధానికి పంపాడు. భగదత్తుడు సుప్రతీకం అనే ఏనుగునెక్కి పాండవసేనను అల్లకల్లోలపరచాడు. ఆ ఏనుగును దశార్ణరాజు తన ఏనుగుతో ఎదుర్కొన్నాడు. భగదత్తుడి తోమరాలు పధ్నాలుగు తగిలేసరికి బాధతో దశార్ణరాజు ఏనుగు వెనక్కి పరిగెత్తింది. భగదత్తుడు శక్తిని విసరగా ఘటోత్కచుడు దానిని ఆకాశంలోనే పట్టుకుని ముక్కలు చేసాడు. భగదత్తుడి బాణాలకు భీముని రథసారధి విశోకుడు గాయపడినాడు. భీముడు రథం నుంచి దిగి తన గదతో శత్రువులపైకి విజృంభిస్తున్నపుడే కృష్ణార్జునులు అటుగా వచ్చారు. భీముడు చెప్పాడు అర్జునుడికి ఇరావంతుడి మరణం గురించి.

అర్జునుడు తన పుత్రుడి మరణానికి దుఃఖిస్తూ అన్నాడు– "అప్పుడు ధర్మరాజు 'అర్ధరాజ్యమివ్వకపోయినా అయిదూళ్లు చాలు. యుద్ధం వద్దు' అని ఎందుకన్నాడో ఇప్పుడు నాకు అర్థమవుతున్నది. ఈ క్షత్రియ జీవితమే నింద్యం. కాని తప్పదు. పోనీయ్ రథాన్ని"

అర్జునుడిపై కృపుడు, భగదత్తుడు, సుశర్మ దాడిచేసారు. వారితో గొప్పయుద్ధం చేస్తున్నాడు అర్జునుడు.

ఈలోగా ధార్తరాష్ట్రులు భీముడినెదిరించారు. వారిని చూడగానే భీముడు కాలాంతకుడైనాడు. వ్యూఢోరస్కుడు, కుండలి, అనాధృష్టి, కుండభేది, వైరాటుడు, దీర్ఘలోచనుడు, దీర్ఘబాహుడు, సుబాహుడు, కనకధ్వజుడు నేలకూలినారు.

అభిమన్యుడు అంబష్ఠుడిని ఓడించాడు.

రెండు సేనలూ పరస్పర హననంతో నాశనమయ్యాయి. చీకటి పడగా యుద్ధవిరమణ జరిగింది.

ఎనిమిదవ రోజు యుద్ధంలో తొలుత ఏడుగురు ధార్తరాష్ట్రులు, అయిదుగురు శకుని సోదరులు, ఇరావంతుడు, మలివిడతలో తొమ్మిదిమంది ధార్తరాష్ట్రులు మరణించారు.

## తొమ్మిదవ రోజు యుద్ధం

ఆరాత్రి దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు మంత్రులతో కలిసి చర్చించారు. దుర్యోధనుడన్నాడు– "ద్రోణుడు, భీష్ముడు, కృపుడు, శల్యుడు, భూరిశ్రవుడు యుద్ధంలో పాండవులను బాధించడం లేదు. రాధేయా! నీవు యుద్ధ విముఖుడవైనావు. ఇప్పుడు ఏం చేస్తే బాగుంటుంది?"

కర్ణుడన్నాడు– “భీష్ముడు యుద్ధం నుంచి తొలగితే నేను పాండవ, సోమకులను వధిస్తాను. ఒట్టు”

దుర్యోధనుడి కామాట నచ్చింది. వెంటనే కిరీటం, భుజకీర్తులు, మురుగులు ధరించి, మంచిగంధాన్ని శరీరానికి పూనుకుని, స్వచ్ఛమైన వస్త్రం ధరించి, గొప్ప గుర్రాన్నెక్కి పరిజనం, వేత్రహస్తులు వెంటరాగా భీష్ముడిని దర్శించాడు.

భీష్ముడికి మొక్కి అన్నాడు– “దేవదానవులను ఓడించగల నీ సాయంతో పాండవులను జయించగలమన్న ఆశతో మేమున్నాము. నీవు పాండవ పక్షపాతంతో యుద్ధం చేయదలుచుకోకపోతే కర్ణుడు యుద్ధరంగంలోకి రావడానికి అనుజ్ఞ ఇవ్వు”.

భీష్ముడన్నాడు– “ఎందుకు నన్ను పలుకుల ములుకులతో బాధిస్తున్నావు? నీకు సంతోషం కలిగించడానికి యుద్ధాగ్నిలో ప్రాణాలను హోమం చేస్తున్నాను. నీకెన్నోసార్లు చెప్పాను, పాండవులను గెలవలేమని. నీవెన్నోసార్లు ఓడిపోయావు పాండవుల చేతిలో. నిన్ను ఏ కర్ణుడూ రక్షించలేదు. నీ నమ్మకం నేను అజేయుడనని. కాదని నేనే చెబుతున్నా వినవు నీవు.

నీ పరాక్రమమేమిటి? ఇతరులు పాండవులను ఓడిస్తే అది నీ గెలుపెలా అవుతుంది? వెళ్లు, ఓడించు వాళ్లను. నేను శిఖండిని తప్ప సోమకులను, పాంచాలురను ఓడిస్తాను. రేపు నేను చేయబోయే యుద్ధం మహత్తరంగా ఉంటుంది. వెళ్లు నిశ్చింతగా నిద్రపో!” అన్నాడు భీష్ముడు.

దుర్యోధనుడు వెళ్లి దుశ్శాసనుడితో అన్నాడు– “మనవద్ద ఇరవై రెండు రకాల సేనలున్నాయి. వాటినన్నిటిని భీష్ముడి రక్షణకై నియోగించు. మనం భీష్ముడిని రక్షిద్దాం. ఆయన పాండవ సంహారం చేస్తాడు”

కౌరవులు సర్వతోభద్ర వ్యూహం – పాండవుల మండల వ్యూహం.

రెండు సేనలూ యుద్ధనాదాలు చేస్తూ, భేరీలు మ్రోగిస్తూ, భూమి కంపించేలా దూకుతూ యుద్ధం చేస్తుంటే పక్షులు ఘోరంగా కూసినాయి. సూర్యుడు కాంతిహీనుడైనాడు. నక్కలు అరవసాగినాయి.

అలంబుస–అభిమన్యుల మధ్య జరిగిన యుద్ధంలో అలంబుసుడు మాయాయుద్ధం చేస్తుండగా ఉపపాండవులు తమ సోదరుడికి సాయం వచ్చారు. వారినందరిని గాయపరచాడు అలంబుసుడు. అభిమన్యుడి బాణాలకు గాయపడిన అలంబుసుడు మాయాయుద్ధంలో చీకటి సృష్టించగా సూర్యాస్త్రంతో చీకటిని తరిమి అలంబుసుడిని తీవ్రంగా గాయపరచేసరికి ఆ రాక్షసుడు పారిపోయాడు. అప్పుడు భీష్ముడు అభిమన్యుడిపై యుద్ధానికి రాగా, అర్జునుడు తన కుమారుడికి సాయం రాగా భీష్ముడు అర్జునుడినెదుర్కొన్నాడు. ఈలోగా కృపాచార్యుడు అడ్డం వస్తుంటే సాత్యకి అతడిని గాయపరచాడు. సాత్యకి మీదకు అశ్వత్థామ వచ్చాడు. అశ్వత్థామకు సాయంగా ద్రోణుడు, ద్రోణ, సుశర్మలతో అర్జునుడు యుద్ధం చేసాడు. కౌరవులలో అధికులు అర్జునుడిని చుట్టుముట్టగా, భగదత్తుడు, శ్రుతాయువు గజబలంతో భీముడిని ఎదిరించారు.

ఉభయసేనలు సంకుల సమరానికి దిగాయి. రక్తం నదిగా ప్రవహించింది. ఎముకలు రాళ్లుగా, వెంద్రుకలే నాచు, గడ్డిలా, రథాలు గుండాలుగా, బాణాలు సుడులుగా, గుర్రాలు చేపలుగా నదిలో ఉన్నాయి. తెగిపోయిన తలలు శిలలుగా, ఏనుగులు మొసళ్లుగా, కవచాలు శిరస్త్రాణాలు నురుగుగా, ధనుస్సులు అలలుగా, ఖడ్గాలు తాబేళ్లులా, ధ్వజాలు చెట్లలా, పక్షులు హంసల్లా ఉండగా మరణించిన ప్రాణులను వైతరణీ నది ప్రేతరాజపురానికి చేర్చినట్లు ఆ రక్తనది పిరికివారిని యుద్ధభూమి నుంచి దూరంగా నెట్టివేసింది.

అర్జునుడి ధాటికి రణరంగం రక్తపంకిలమయ్యింది. భీష్ముడు పాండవ సైన్యాన్ని కకావికలు చేయగా, సాత్యకి భీష్ముడినెదిరించాడు. పరస్పరం శక్తి ఆయుధాలను విసురుకున్నారు. పాండవులు అన్ని దిక్కుల నుంచి వచ్చి భీష్ముడిని చుట్టుముట్టినారు. భీష్ముడు పరాక్రమించి రథాలు అగ్నిశాలలుగా, ధనుస్సు జ్వాలలుగా, ఖడ్గాలు శక్తులు గదలు సమిధలుగా, బాణాలు నిప్పురవ్వలుగా, భీష్ముడు అగ్నిగా ప్రజ్వరిల్లి పాండవ సైన్యాన్ని దహించసాగినాడు.

చేది, కాశి, కరూష దేశస్థులు పదునాలుగు వేలమంది పరలోకానికి పంపించబడినారు. ధ్వంసమైన రథాలతో, కూలిన రథికులతో, బాణాలు, కవచాలు, పట్టశాలు, గదలు, భిందిపాలాలు, కోడిపీటలు, అమ్ములపొదులు, చక్రశకలాలు, తెగిపోయిన బాహువులు, ధనుస్సులు, ఖడ్గాలు, శిరస్సులు, చేతితొడుగులు, వ్రేలి తొడుగులు, ధ్వజాలు, ధనుస్సులతో యుద్ధభూమి అంతా నిండిపోయింది.

భీష్మార్జునుల యుద్ధం అత్యంత భీకరంగా సాగింది. అయినా అర్జునుడు మృదువుగా యుద్ధం చేయడం, భీష్ముడు ఉగ్రంగా పాండవ రధికులను చంపడం చూసాడు శ్రీకృష్ణుడు. సహించలేక చెన్నకోల ఆయుధంగా సింహంలా గర్జిస్తూ రథం దూకి భీష్ముడి వేపు పరిగెత్తాడు.

పచ్చని పట్టుబట్ట ధరించి, ఇంద్రనీలమణి వలె మెరుస్తూ మెరుపులతో కూడిన మేఘంలా వస్తుంటే భీష్ముడన్నాడు– "దేవదేవా, పుండరీకాక్షా! రా! నీకు నమస్కారం! నీ చేతిలో మరణించినా నాకది మేలే కదా!"

అర్జునుడతడిని అతి బలవంతం మీద ఆపి– "నేను నా పని చేస్తాను" అని పలకగా కోపంగానే మరల రథమెక్కినాడు. అయినా భీష్ముడాగక వారిపైన పాండవసేనపైన బాణవర్షాన్ని కురిపిస్తూ సైనికులను చీమల్ని నలిపినట్లు నలిపివేసాడు. పాండవ సైనికుల అదృష్టమా అన్నట్లు సూర్యాస్తమయమయ్యింది.

## పదవరోజు యుద్ధం

యుధిష్ఠరుడన్నాడు– "ఏనుగు పద్మసరోవరాన్ని ధ్వంసం చేసినట్లు భీష్ముడు నా సైన్యాన్ని నాశనం చేసాడు. ఇతడిని జయించడం కష్టం"

శ్రీకృష్ణుడన్నాడు– "నాకు ఆనతివ్వు. అర్జునుడికి భీష్మవధ ఇష్టం లేకపోతే నేను చంపుతాను. మేమిద్దరం ఒకరినొకరు ప్రాణత్యాగాలు చేయడానికి సిద్ధమే!"

యుధిష్ఠిరుడన్నాడు– "తండ్రిలేని మమ్ములను చిన్నతనంలో ఆయన పెంచాడు. మా తండ్రికి తండ్రి. చాలా ఇష్టమైన వాడు. పోయి అతడినే సలహా అడుగుతాను".

అందరూ కలిసి భీష్ముడి వద్దకు వెళ్లారు. (అంతకు ముందు రెండురోజుల క్రితం దుర్యోధనుడు వెళ్లాడు– నా గెలుపు కోసం నీవు ప్రయత్నించు –అని; ఇప్పుడు ధర్మరాజు వెళ్తున్నాడు– నేను గెలిచే మార్గం తెలియజేయుము అంటూ. ఇద్దరికీ యుద్ధంలో గెలవడం ఇష్టం. తాను బ్రతికి ఉండడం కాదు. నీవు తప్పుకుంటే కర్ణుడు వస్తాడు అంటాడు దుర్యోధనుడు. నీవు తప్పుకుంటే విజయం మాదంటాడు ధర్మజుడు. నీవు బ్రతకడానికి మేం యుద్ధమాపేస్తామని ఎవరూ అనరు. ఈ రాజ్యాన్ని ఇంత గొప్పగా చేసింది తాను. కాని వాళ్లకు రాజ్యం కావాలి. తాను కాదు.)

ధర్మజుడన్నాడు– "తాతా! నిన్ను జయించడానికి తగిన ఉపాయం చెప్పు!"

భీష్ముడన్నాడు– "శిఖండి నా ఎదురుగా ఉంటే నేను బాణాలు వెయ్యను. దానిని అవకాశంగా తీసుకుని అర్జునుడు నన్ను పడగొట్టాలి"

పాండవులు తమ శిబిరాలకు వెళ్లారు. అర్జునుడన్నాడు– "వాసుదేవా! చిన్నప్పుడు ఆయన ఒడిలో ఆడుకున్నాను. ఆయన వస్త్రాలను మలినం చేసాను. నాన్నా! అని పిలిచాను. ఆయన మీద బాణాలనెలా వేయగలను?"

కృష్ణుడన్నాడు– "యుద్ధం క్షత్రియధర్మం. నీ ధర్మం నీవు చేయి".

పదవరోజు యుద్ధం ప్రారంభమయ్యింది. భీష్ముడికి తన వంశీకులపైన తనపైన మమకారం వదిలింది. నిర్లిప్తంగా విల్లు చేబట్టినాడు, మండలాకారంగా తిరుగుతూ మారణాస్త్రాలను ప్రయోగిస్తూ మారణహోమం సృష్టించాడు. శిఖండి సైన్యాన్ని సర్వనాశనం చేసాడు తన బాణవర్షంతో.

శిఖండి భీష్ముడిని గాయపరచినా మాట్లాడడం కూడా ఇష్టం లేనివాడిలా తల తిప్పుకున్నాడు.

శిఖండి అన్నాడు– "నీకీరోజు చావు తప్పదు కాచుకో!"

భీష్ముడన్నాడు– "నీవు శిఖండినివా, శిఖండివా, అది ముందు తెలుసుకో! నీతో ఎలాగూ నేను యుద్ధం చేయను"

యుద్ధం తీవ్రమయ్యింది. శిఖండి బాణాలను ఏమాత్రం లెక్కచెయ్యకుండా భీష్ముడు శత్రుసైన్య సంహారం చేస్తున్నాడు. అర్జునుడు ఆరోజు పెట్రోగిపోయాడు. అర్జునుడు సింహంలా గర్జిస్తూ శత్రువుల మీద బాణాలను ప్రయోగిస్తూ యుద్ధరంగంలో యమునివలె సంచరిస్తుంటే దుఃఖిత మనస్కుడై దుర్యోధనుడు మరల భీష్ముని వద్దకు వచ్చాడు– "పితామహా! నీవే దిక్కు" అన్నాడు.

భీష్ముడు ఒక్కక్షణం ఆలోచించి అన్నాడు– "రోజుకు పదివేల మందిని చంపుతానని మాట ఇచ్చాను నీకు. ఇంతవరకు అలానే చేసాను. ఇవ్వాళ కూడా అలాగే చేస్తాను. నేను హతుడనైనా కావాలి లేదా పాండవులైనా హతులు కావాలి"

అని పలికి భీష్ముడు లక్షమంది పాండవ రథికులను సంహరించాడు. పదివేల ఏనుగులు, పదివేల గుర్రాలు, రెండు లక్షలమంది పదాతులను సంహరించి ప్రళయకాల సూర్యునిలా ప్రకాశించాడు.

అర్జునుడు శిఖండితో అన్నాడు– "నీవు భీష్ముడి మీద బాణాలు వేయి. నేను మరోరథం మీంచి ఆయనను నేలకూలుస్తాను". పాండవులు అందరూ భీష్ముడిని చుట్టుముట్టబోగా ఒక్కొక్క వీరుడిని ఒక్కొక్క కౌరవ యోధుడు అడ్డుకున్నాడు. దుశ్శాసనుడు కొద్దిసేపు అర్జునుడిని నిలువరించగలిగాడు.

ద్రోణుడు అశ్వత్థామతో అన్నాడు– "నాయనా! అర్జునుడు ఈరోజున భీష్మవధకు ప్రయత్నిస్తున్నాడు. నాకు దుశ్శకునాలు కనిపిస్తున్నాయి. నీవు భీష్ముడికి సహాయం వెళ్లు. ధృష్టద్యుమ్న, భీములను ఎదుర్కో. నేను ధర్మరాజును నిలువరిస్తాను"

ఆరోజు భీముడు అత్యద్భుతంగా యుద్ధం చేస్తున్నాడు. సైంధవ, కృప, కృతవర్మలను గాయపరచాడు. అంతలో అర్జునుడు అటు రాగానే కౌరవ వీరులు ఆశలు వదులుకున్నారు.

అర్జునుడు వచ్చీరాగానే సుశర్మ, కృపాచార్య, భగదత్త, సైంధవ, చిత్రసేన, వికర్ణ, కృతవర్మ, దుర్మర్ష, విందానువిందుల్ని గాయపరచాడు. భీమార్జునుల ధాటికి కౌరవ సైన్యం చెల్లాచెదురైంది.

పదిరోజులు యుద్ధం చేసినాక భీష్ముడనుకున్నాడు– "ఇన్నేళ్ల జీవితంలో ఏమి సాధించాను నేను? నా బ్రతుకే వ్యర్థం" అని వైరాగ్యభావాన్ని పొంది, తనకు దాపునే ఉన్న యుధిష్ఠిరుడితో అన్నాడు– "శిఖండిని ముందుంచుకుని యుద్ధం చేయి" అని అనుమతి ఇచ్చాడు.

మరల సంకుల సమరం మొదలయ్యింది. అభిమన్యుడు దుర్యోధనునితో, సాత్యకి అశ్వత్థామతో, ధృష్టకేతువు పౌరవుడితో, చిత్రసేనుడు సుశర్మతో గొప్పగా యుద్ధం చేసారు.

భీష్ముడు సోమకులను సర్వనాశనం చేసాడు. శిఖండి ఆగ్రహంతో భీష్ముడి గుండెలపై కొట్టాడు. భీష్ముడు ప్రతిఘటించ లేదు. దుశ్శాసనుడు భీష్ముడికి రక్షణగా నిలబడి అమోఘమైన యుద్ధం చేసాడు. అయినా అర్జునుడి బాణాలు రాజులందరిని గాయపరుస్తూనే ఉన్నాయి. కౌరవసేనను నాశనం చేస్తూ అర్జునుడు సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నాడు.

భీష్ముడు పాండవుల సేనను ఊచకోత కోయడం ప్రారంభించాడు. విరాటుని ప్రియసోదరుడైన శతానీకుని కూల్చాడు. పాంచాలదేశ సేనల్ని పరిమార్చాడు ప్రతాపవంతుడైన భీష్ముడు. కుపితుడైన అర్జునుడు శిఖండిని ముందుంచుకుని భీష్మునిపైకి వెళ్లి ఆయన ధనుస్సును ముక్కలు చేసాడు.

భీష్ముడికి రక్షణగా ద్రోణుడు, కృతవర్మ, సైంధవుడు, భూరిశ్రవుడు, శలుడు, శల్యుడు భగదత్తుడు రాగా అర్జునుడికి సాయంగా సాత్యకి, భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు, ఘటోత్కచుడు, అభిమన్యుడు పరిగెత్తుకువచ్చారు.

భీష్ముడు 'శక్తి'ని విసిరాడు అర్జునుడిపై. అర్జునుడు దానిని ముక్కలు చేసినాడు. భీష్ముడనుకున్నాడు– "ఇప్పుడు నేను స్వచ్ఛంద మరణాన్ని ఆశ్రయిస్తాను. యుద్ధం నుంచి విరమిస్తాను".

ఆ కొద్ది క్షణాలలోనే అర్జునుడి బాణాలు వందలాదిగా భీష్ముడి శరీరంలోకి దూసుకుపోయాయి.అర్జునుడు విజృంభించి భీష్ముడు చేతిలోకి తీసుకున్న ప్రతి ధనుస్సునూ విరగగొట్టినాడు. పాండవ వీరులు విజృంభించి భీష్ముడి శరీరాన్ని బాణాలతో నింపివేసారు. ఆయన శరీరంలో రెండు అంగుళాల భాగం కూడా బాణాలు తగలని ప్రదేశం లేదు.

అందరూ చూస్తుండగానే సూర్యాస్తమయం కాకముందే తూర్పుదిక్కు శిరస్సు ఉండగా భీష్ముడు రథం మీద నుంచి క్రింద పడ్డాడు. బాణాలే శయ్యగా ఆయన నేలనంటలేదు. సూర్యుడు దక్షిణాయనంలో ఉన్నాడు గనుక శ్వాసక్రియను సరిచేసుకున్నాడు– "ఉత్తరాయణం వచ్చేవరకూ ప్రాణాలను నిలుపుకుంటాను" అనుకున్నాడు.

శరశయ్య మీద పడుకుని ఉన్న భీష్ముడి వద్దకు పాండవులు, కౌరవులు వచ్చి నమస్కరించారు. భీష్ముడన్నాడు– "ఆధారం లేక నా శిరస్సు వేలాడుతున్నది. దీనికి తగిన దిండు పెట్టండి". రాజులు అనేక దిండ్లు తెచ్చారు. భీష్ముడన్నాడు–

"వీరులకు తగిన దిండ్లు కావివి" అని కాస్త దూరంలో బిక్కుబిక్కుమని నిలబడి ఉన్న అర్జునుడితో అన్నాడు భీష్ముడు– "నాయనా, సరైన దిండు ఏర్పరచు".

అర్జునుడు మూడు బాణాలను మంత్రించి భూమిలోకి సరైన ఎత్తులో ఉండేట్లు అమర్చాడు. వాటిపై తల ఆన్చాడు భీష్ముడు. భీష్ముడన్నాడు– "ఇది వీరులకు సరైన శరశయ్య. సూర్యుడు ఉత్తరాయణంలోకి వచ్చేవరకూ నేనీ అంపశయ్య మీదనే ఉంటాను".

దుర్యోధనుడు ఎందరో వైద్యులను పిలిపించాడు. వారిని పంపించివేయమని దుర్యోధనుడితో చెప్పాడు భీష్ముడు. భీష్ముడి చుట్టూ గట్టి భద్రత నేర్పరచారు.

మరుసటిరోజున ఉదయాననే అందరూ వచ్చి భీష్ముడి చుట్టూ నిలిచారు. మంచిగంధపు పొడులు, పేలాలు, పూల మాలికలు ఉంచారు. భీష్ముడన్నాడు– "నాకు దాహంగా ఉన్నది" అందరూ అనేక చల్లటి నీటిపాత్రలు తెచ్చారు స్వచ్ఛమైన జలంతో నిండిన వాటిని.

భీష్ముడు అర్జునుడిని పిలిచాడు. భీష్ముడికి ప్రదక్షిణం చేసి అర్జునుడు పర్జన్యాస్త్రంతో అభిమంత్రించి ఒక బాణాన్ని భీష్ముడికి కుడివేపున భూమిలోకి ప్రయోగించాడు.

చల్లని జలధార భూమిలో నుండి పైకి వచ్చింది. ఆ శీతల జలధారను తాగి భీష్ముడు సంతృప్తి చెందాడు.

భీష్ముడన్నాడు– "దుర్యోధనా! ఇప్పటికైనా యుద్ధం మాని పాండవులకు అర్ధరాజ్యం ఇవ్వు. లేకుంటే సర్వనాశనం తప్పదు".

అందరూ వెళ్లిపోయాక భీష్ముడి దగ్గరకు కర్ణుడు వచ్చాడు. "నేను కర్ణుడిని" అన్నాడు.

కర్ణుడిని ఎంతో ప్రేమతో కౌగిలించుకున్నాడు భీష్ముడు. "నాయనా నీవు సూర్యపుత్రుడివి, కుంతీ కుమారుడివి. నీమీద నాకు ద్వేషం లేదు. కుంతీదేవి కన్యగా ఉన్నపుడు జన్మించావు కనుక నీ బుద్ధి ఇలా అయ్యింది. నీకు పాండవులు సోదరులు. కౌరవ పాండవ వైరం నాతోనే అంతం కావాలనేది నా కోరిక"

కర్ణుడన్నాడు– "నేను సూతుడిగా పెరిగాను, దుర్యోధనుని హితుడిగా సుఖాలననుభవించాను. ఇప్పుడా మార్గం వదలలేను. నీ అనుజ్ఞ పొంది యుద్ధం చేయాలనుకుంటున్నాను. అనుమతివ్వు"

భీష్ముడన్నాడు– "అనుమతిస్తున్నాను. అది క్షత్రియధర్మం"

**అహం త్వామనుజానామి యదిచ్ఛసి తదాప్నుహి**
**క్షత్ర ధర్మ జితాన్లోకాన్ అవాప్స్యసి ధనంజయాత్** (భీష్మ. 122-36)

*****

# ✤ 7. ద్రోణ పర్వము ✤


1) ద్రోణాభిషేక పర్వము (16)
2) సంశప్తక వధ పర్వము (16)
3) అభిమన్యు వధ పర్వము (39)
4) ప్రతిజ్ఞాపర్వము (13)
5) జయద్రధ వధ పర్వము (68)
6) ఘటోత్కచ వధ పర్వము (31)
7) ద్రోణ వధ పర్వము (10
8) నారాయణాస్త్ర మోక్ష పర్వము (10)


## 1) ద్రోణాభిషేక పర్వము

## పదకొండవ రోజు యుద్ధం

భీష్ముడు పడిపోగానే నదిని దాటగోరినవాడు నావను తలుచుకున్నట్లు కౌరవులు కర్ణుని స్మరించారు.

కర్ణుడన్నాడు తన సారథితో– "సూతా! నా బంగారు కవచం, సూర్యునివలె కాంతివంతమైన శిరస్త్రాణాన్ని ఇవ్వు. ధనుస్సును, అగ్నితో, విషంతో సమానమైన బాణాలు తీసుకునిరా. రథంలో పదహారు అమ్ములపొదులను ఉంచు. కత్తులు, శక్తులు, పెద్దపెద్ద గదలు, బంగారు నాళం గల శంఖాన్ని తీసుకునిరా. ఏనుగును కట్టడానికి వాడే బంగారు త్రాడు, కమల చిహ్నాలు గల దివ్యాద్భుత ధ్వజాన్ని రథంపై ఉంచు. తెల్లని మేలిమి గుర్రాలను రథానికి కట్టు. ఈ యుద్ధంలో అర్జునుడినైనా చంపుతాను లేదా వీరస్వర్గాన్ని పొందుతాను".

రథమెక్కి వెళ్లి భీష్ముని ఆశీస్సులు తీసుకున్నాడు కర్ణుడు. కర్ణుడు రావడాన్ని చూసిన కౌరవులు గర్జనలతో, కరతాళ ధ్వనులతో, వివిధ ధనుష్టంకారాలతో అతడిని స్వాగతించారు.

దుర్యోధనుడన్నాడు– "భీష్ముడి తరువాత ఎవరిని సర్వసేనాధిపతిగా చేస్తే బాగుంటుంది, మిత్రమా?"

కర్ణుడన్నాడు– "ద్రోణాచార్యుడు. అతడు సర్వసమర్థుడు".

ద్రోణుడన్నాడు– "నేను సర్వ పాండవులతోనూ పోరాడతాను గాని ధృష్టద్యుమ్నుని చంపలేను. అతడు నన్ను చంపడానికే జన్మించాడు".

ద్రోణుని సేనాపతిగా చేయగానే ఆ ప్రదేశమంతా విజయఘోషలతో మారుమ్రోగింది. సంబరాలు జరిగాయి.

ద్రోణుడన్నాడు ఆనందంతో– "రాజా! ఏ వరం కావాలో కోరుకో!"

దుర్యోధనుడన్నాడు– "యుధిష్ఠిరుని ప్రాణాలతో బంధించి తీసుకునిరండి. అతడితో మరల జూదమాడించి, ఓడించి మరల వనవాసానికి పంపుతాను"

ద్రోణుడన్నాడు– "అర్జునుడిని ధర్మరాజు నుంచి విడదీస్తేనే అది సాధ్యం"

దుర్యోధనుడు అంగీకరించాడు. అర్జునుడిపై యుద్ధాన్ని సంశప్తకులకు అప్పజెప్పాడు. యుద్ధం మొదలయ్యింది. ద్రోణుని బాణాల ధాటికి పాండవ సృంజయులు మాటిమాటికి చెదిరిపోయారు. తన గంధర్వ నగరం లాంటి రథంలో సంచరిస్తూ పాండవసేనను సంహరిస్తుంటే అతడిని నిలువరించలేక పాండవులు వ్యధ చెందారు.

ద్రోణుడు దుర్యోధనుడికిచ్చిన మాట– యుధిష్ఠిరుని ప్రాణాలతో బంధిస్తానన్నది – పాండవుల శిబిరాలకు చేరింది. అర్జునుడన్నాడు– "నేను బ్రతికి ఉండగా ద్రోణాచార్యులు నిన్ను బంధించలేరు. ఇది నిశ్చితం".

అగ్ని గడ్డీగాదాన్ని తగులబెట్టినట్లు ద్రోణుడు పాండవసేనను తన బాణాగ్నితో దహిస్తున్నాడు.

**తస్య విద్యుదివాభ్రేషు చాపం హేమ పరిష్కృతమ్**
**భ్రమ ద్రధాంబుదే చాస్మిన్ దృశ్యతే స్మ పునః పునః**

రథమనే మేఘంలో మెరుస్తున్న విద్యుల్లతలా ద్రోణుని విల్లు మెరుస్తున్నది. శత్రు సేనలను నిర్దయగా చంపుతూ ద్రోణుడు రక్తనదిని ప్రవహింపజేసాడు.

శకుని-సహదేవుడు, భగదత్త-ద్రుపదులు, వివింశతి-భీముడు, శల్యుడు-నకులుడు, కృపుడు-ధృష్టకేతువు, కృతవర్మ-సాత్యకి, కర్ణుడు-విరాటరాజు, భూరిశ్రవుడు-శిఖండి, అలంబుసుడు-ఘటోత్కచుడు, అనువిందుడు-చేకితానుడు, పౌరవుడు-అభిమన్యుడు, పరస్పరం ఘోరంగా పోరాడినారు.

అభిమన్యుడి వీరవిహారంలో పౌరవుడు, జయద్రథుడు, శల్యుడు చిక్కుకుని చావుతప్పి బయటపడినారు. శల్యుడు విసిరిన శక్తి ఆయుధాన్ని పట్టుకుని మరల శల్యుడిపైకి విసిరాడు అభిమన్యుడు. అది శల్యుడి రథసారథిని చంపింది. శల్యుడు కోపంతో అభిమన్యుడిని గదతో కొట్టాలని రథం దూకాడు. శల్యుడి నెదిరించాడు భీమసేనుడు. భీముడు, శల్యుడి మధ్య గొప్ప గదాయుద్ధం జరిగింది. గదలతో కొట్టుకుని ఇద్దరూ నేలకూలగా కృతవర్మ వచ్చి శల్యుడిని తీసుకుపోయాడు. మరుక్షణమే తేరుకున్న భీముడు విజయనాదం చేసాడు.

ద్రోణుడు తన శత్రువులైన పాంచాలుర పని పట్టదలచి వారిపై దాడిచేసి సింహసేన, వ్యాఘ్రదత్తులను చంపి, యుధిష్ఠిరుడి వేపు బయల్దేరాడు. అది గమనించి అర్జునుడు తాను వచ్చేదారిలో రక్తనదిని ప్రవహింపచేస్తూ ధర్మరాజుకు రక్షణగా వచ్చాడు. మహా బాణవర్షంతో ద్రోణసేనను కప్పివేసాడు. సూర్యుడు అస్తమిస్తున్నాడు. చీకటి వ్యాపించి శత్రులెవరో, మిత్రులెవరో తెలియడం లేదు.

కౌరవులు తమ సేనను ఉపసంహరించుకున్నారు. అర్జునుడి శౌర్యాన్ని ప్రశంసిస్తూ పాండవ సేనలు శిబిరానికి చేరుకున్నాయి. ఆరోజు పాంచాల ప్రముఖులు సింహసేన, వ్రాఘ్రదత్తులు ద్రోణుడి చేతిలో మరణించారు.

## 2) సంశప్తక వధ పర్వము

ద్రోణుడన్నాడు దుర్యోధనునితో– "అర్జునుడిని ఏదో ఒక కారణంతో తప్పిస్తేనే యుధిష్ఠిరుడిని పట్టుకోవడం సాధ్యమవుతుంది. ముహూర్తకాలం ధర్మజుడు రణభూమిలో నిలిస్తే చాలు. అతడిని బందీ చేయడం సాధ్యపడుతుంది.

ద్రోణుడి మాట విని సుశర్మ అన్నాడు– "అర్జునుడు మమ్మల్ని అనేకసార్లు పరాభవించాడు. ఈ నేలపై అర్జునుడైనా లేకుండా పోవాలి. లేదా త్రిగర్తులయినా లేకుండా పోవాలి".

సుశర్మ సోదరులైన సత్యరథుడు, సత్యవర్మ, సత్యవ్రతుడు, సత్యేషువు, సత్యకర్మ – ఈ అయిదుగురూ పదివేల రథిక సేనతో అర్జునుడిని నిలువరించే బాధ్యత తీసుకున్నారు.

## పన్నెండవ రోజు యుద్ధం

వీరు కాక త్రిగర్తాధిపతి సుశర్మకు మాలవ, తుండికేర, మావేల్లక, మద్రక, లలిత్థుల సేన ముప్పైవేల రథికులు, అదనంగా జనపదసేన పదివేల రథికులు – అందరూ కలిసి యాభైవేల రథికులు అర్జునుడిపై పగ తీర్చుకోవడానికి సిద్ధమైనారు. "యుద్ధభూమిలో అర్జునుని చంపుతాను లేదా చస్తాను" అని ప్రతిజ్ఞ చేసారు. వాళ్ళు అర్జునుడిని యుద్ధానికి ఆహ్వానించారు. అర్జునుడు అన్న ధర్మరాజు అనుమతి అడిగాడు.

ధర్మరాజు అన్నాడు– "ద్రోణాచార్యుడు నన్ను బంధించాలని ఈ ఎత్తు వేసాడు"

అర్జునుడన్నాడు– "నిన్ను రక్షించేందుకు పాంచాల రాకుమారుడు సత్యజిత్తు ఉన్నాడు. సత్యజిత్తు పడిపోయాడా మీరు రణరంగాన్ని వీడాలి. ద్రోణుడికి దొరకవద్దు. నేను ఈ త్రిగర్తులను చంపి వస్తాను".

అర్జున సంశప్తక యుద్ధం మొదలయ్యింది. అర్జునుడు దేవదత్త శంఖాన్ని ఊదుతూ సంశప్తకులైన సుశర్మ, సురథ, సుధర్మ, సుధన్వ, సుబాహులను సమీపించాడు. ఆ మహావీరులు వేస్తున్న బాణాలను మధ్యలోనే విరిచేస్తూ భల్లాలతో సుధన్వుడి విల్లు విరిచి, గుర్రాలను చంపి శిరస్సు ఖండించాడు. సంశప్తకులు పారిపోసాగినారు. వారిని సుశర్మ సంఘటిత పరచగా వారితో నారాయణసేన కలిసింది. ఆ మహాసేన ఒక్కుమ్మడిగా శ్రీకృష్ణార్జునులను చుట్టుముట్టగా అర్జునుడు శత్రు సమూహాన్ని చంపగల త్వాష్ట్రాస్త్రాన్ని ప్రయోగించాడు. దాని నుండి అనేక అర్జున రూపాలు ప్రభవించగా ఎవరికి వారు తమకు ఎదురుగా ఉన్నది అర్జునుడే అనుకుని ఒకరినొకరు చంపుకున్నారు. అస్త్ర ప్రభావం క్షీణించగా ఆ రథికులు వేసిన శరవర్షంలో అర్జునుడికి కృష్ణుడు, కృష్ణుడికి అర్జునుడు కనిపించలేదు. అప్పుడు వాయువ్యాస్త్రం ప్రయోగించి అర్జునుడు ఆ చీకటి తొలగించాడు.

ఆ విధంగా అర్జునుడు సంశప్తకులతో పోరాడుతున్నపుడు ద్రోణుడు దాడిచేసాడు యుధిష్ఠిరునిపై. కౌరవుల గరుడ వ్యూహం–పాండవుల అర్ధమండలాకార వ్యూహంతో యుద్ధం రసవత్తరంగా సాగుతున్నది.

## పాండవ - కౌరవ సేనలు

ఎలుగుబంటి రంగు ఉన్న గుర్రాలు భీముడివి, వెండిరంగు సాత్యకివి, తెలుపు నలుపు ఎరుపు రంగు గుర్రాలు యుధామన్యుడివి; పావురం రంగు (తెలుపు–నలుపు) ధృష్టద్యుమ్నుడివి; ఎర్రగుర్రాలు–ధృష్టద్యుమ్నుని కుమారుడు క్షత్రధర్ముడివి; తామర రేకుల వంటి రంగు–శిఖండి కొడుకు క్షత్రదేవుడి గుర్రాలు; చిలుక రెక్కల రంగు గుర్రాలు– నకులుడివి; మేఘశ్యామ వర్ణం–ఉత్తమౌజునివి; తిత్తిరి పక్షుల విచిత్రవర్ణం–సహదేవుడి గుర్రాలు; దంతాలరంగు–నల్లటి తోకలు–ధర్మరాజువి; లలామ–హరి లక్షణాలున్న గుర్రాలు–ద్రుపదుడివి; కలిగొట్టు పూలలా తెల్లనివి–విరాటుడివి; పసుపుపచ్చ గుర్రాలు–విరాట రాజకుమారునివి; ఆరుద్ర పురుగు రంగు గల గుర్రాలు–కేకయ సోదరులవి; పచ్చికుండ రంగు గలవి–శిఖండి గుర్రాలు; సారంగిపక్షి రంగు గుర్రాలు–శిశుపాలుడి కుమారుడి గుర్రాలు; కాంభోజ జాతి చిత్రవర్ణ గుర్రాలు–ధృష్టకేతువుకు చెందినవి; కేకయ రాజకుమారుడు సుకుమారుడి గుర్రాలు ఊకపొగ వన్నెగలవి; శిఖండి కొడుకు ఋక్షదేవుడి గుర్రాలు–పద్మవర్ణం; కాశీరాజ కుమారుడి గుర్రాలు–క్రౌంచవర్ణం; ప్రతివింధ్యుని గుర్రాలు–తెల్లటివి, మెడలు నల్లటివి; భీముని కొడుకు శ్రుతసోముడి గుర్రాలు–తెలుపు పసుపు రంగు (మినపపూలు), సోమరసం తీసేరోజు హస్తినలో పుట్టినాడతడు అందుకే శ్రుతసోముడైనాడు. నకులుడి కుమారుడు శతానీకుడి గుర్రాలు వేగిస పూలరంగు; సహదేవుడి కొడుకు శ్రుతకర్మ గుర్రాలు నెమలిమెడ వన్నె గలవి. అర్జునుడి కొడుకు శ్రుతకీర్తి గుర్రాలు పాలపిట్ట వన్నె గలవి. కపిలవర్ణం గల గుర్రాలు అభిమన్యుడివి; కృష్ణార్జునుల కన్నా అభిమన్యుడి శౌర్యం ఒకటిన్నర రెట్లెక్కువంటారు. యుయుత్సుడి గుర్రాలు ఊకపోగరంగువి; సుచిత్రుని కొడుకు సత్యధృతి ఎర్రని గుర్రాల పాదాలు తెల్లరంగులో ఉంటాయి. పట్టురంగు రోమాలు గలవి శ్రేణిమంతుడివి. కాశీరాజు గుర్రాల పృష్ఠభాగం బంగారు వన్నెతో మెరుస్తున్నది. ధృష్టద్యుమ్నుడి గుర్రాలు పావురాలవన్నె గలవి. ప్రభద్రకులు ఆరువేల మంది గుర్రాలు వేర్వేరు రంగులతో అలరారుతున్నవి. చేకితానుని అశ్వాలు పింగళవర్ణం గలవి. కుంతిభోజుడి గుర్రాలు ఇంద్రధనుస్సు రంగులో, రోచమాన రాజు అశ్వాలు తారలతో నిండిన అంతరిక్షంలా కానవస్తున్నాయి. జరాసంధుని కుమారుడు సహదేవుడి గుర్రాలు చిత్రవర్ణాలు, తెల్లటి పాదాలు గలవి. సుదాముడి గుర్రాలు తామరతూడు రంగు గలవి. సింహసేనుడు (పాంచాల రాకుమారుడు) కుందేళ్ల తెలుపు ఎరుపు రంగులు కలిసిన గుర్రాలపై వచ్చాడు. జనమేజయుడనే పాంచాలరాజు గుర్రాలు ఆవపూల రంగు కలవి. దండధారుని గుర్రాలు కాకివెదురు–పద్మకేసరాల వన్నె గలవి. వ్యాఘ్రదత్తుడి గుర్రాలు గాడిదల ఎరుపు, పృష్ఠభాగంలో ఎలుకల వన్నెతో ఉండగా, నల్లటి తలలు విచిత్ర వర్ణం గల అశ్వాలు సుధన్వుడివి. చిత్రాయుధుడి గుర్రాలపై చిత్రమైన మచ్చలున్నాయి. చక్రవాకపక్షి పొట్ట రంగు గుర్రాలు సుక్షత్రుడివి. తెల్ల గుర్రాలు శుక్లుడివి. చంద్రుడిలా తెల్లగా ఉన్న గుర్రాలు చంద్రసేనుడివి. నల్లకలువల రంగు గల అశ్వాలు శైబ్యుడివి. తెలుపు ఎరుపు కలిపి బటాణిపూల రంగు గుర్రాలు రథసేనుడివి. చిలుకరంగు గుర్రాలు నరపాలుడివి. చిత్రాయుధుడి గుర్రాలు కింశుక పుష్పాల రంగులో, నీలుడి గుర్రాలు నల్లని నీలిరంగులో ఉన్నాయి. హేమవర్ణుడి గుర్రాలు తామరరేకు వన్నె గలవి. దండకేతు హయాలు కోడిగుడ్డు రంగు గలవి. అడ్డసరపు పూల వన్నెగల అశ్వాలు పాండ్యరాజువి. వివిధ వర్ణాలు గలవి ఘటోత్కచునివి. యుధిష్ఠిరుని గుర్రాలు బంగారు రంగు గలవి.

యుధిష్ఠిరుని ధ్వజం–స్వర్ణమయం, చంద్రుడు, గ్రహగణాలు దాని చిహ్నం రథంపై నందక, ఉపనందక అనే మృదంగాలు మంద్రంగా మోగుతూనే ఉంటాయి. నకులుని ధ్వజం–పృష్ఠభాగం స్వర్ణమయంగా ఉన్న శరభం. సహదేవుని ధ్వజం– ఘంటలు, పతాకలు, వెండి హంస. ఉపపాండవుల ధ్వజాలు– మేలిమి బంగారంతో చేసిన సారంగపక్షి. ఘటోత్కచుని ధ్వజం– గ్రద్ధ. అతడి గుర్రాలు కామచారులు. ధర్మరాజు దగ్గర మహేంద్రుడిచ్చిన ధనుస్సు, భీమసేనుడి దగ్గర వాయుదేవుడిచ్చిన దివ్య ధనుస్సు, అర్జునుడి దగ్గర గాండీవం, నకులుడి దగ్గర వైష్ణవ ధనుస్సు, సహదేవుడి దగ్గర అశ్విని ధనుస్సు, ఘటోత్కచుని దగ్గర పౌలస్త్య ధనుస్సు; ఉపపాండవుల దగ్గర రుద్ర అగ్ని కుబేర యమ శంకరుల ధనుస్సులున్నాయి. రుద్ర ధనుస్సును బలరాముడు అభిమన్యుడికిచ్చాడు.

కౌరవ పాండవ సేనల మధ్య భీకరమైన ద్వంద్వ యుద్ధం జరిగింది. దుర్మర్షణుడు–భీముడు, సాత్యకి–కృతవర్మ, సైంధవుడు–క్షత్రవర్మ, యుయుత్సుడు–సుబాహువు; శల్యుడు–ధర్మరాజు, ద్రుపదుడు–బాహ్లీకుడు, విందానువిందులు–విరాటుడు ద్వంద్వయుద్ధం చేస్తుండగా నకులుని కుమారుడు శతానీకుడు భూతకర్ణుని వధించాడు. శ్రుతసోముడి నెదుర్కొన్నాడు వివింశతి.

భీమరధుడు శాల్వుడిని చంపినాడు. ప్రతివింధ్యుడు-అశ్వత్థామ, శ్రుతవర్మ-చిత్రసేనుని కుమారుడు, శ్రుతకీర్తి-దుశ్శాసన పుత్రుడు, నరపాలుడు- లక్ష్మణకుమారుడు, శిఖండి-వికర్ణుడు, ఉత్తమౌజుడు-అంగదుడు, కర్ణుడు-కేకయరాజులతో యుద్ధం చేసారు. అంబష్ఠుడు చేదిరాజును చంపేసాడు. భూరిశ్రవుడు మణిమంతుని చంపాడు. పాండ్యునిపై వృషసేనుడు దాడికి దిగినాడు. ఘటోత్కచుడు- అలంబుసుల మధ్య గొప్ప యుద్ధం జరిగింది.

భీమసేనుడు దుర్యోధనుడి గజసేనను చంపుతూ వస్తుంటే దుర్యోధనుడతడిని ఎదుర్కున్నాడు. అంగరాజు దుర్యోధనుడికి అండగా వచ్చాడు. అంగరాజును భల్లంతో భీముడు చంపినాడు. భగదత్తుడి ఏనుగు భీముడిని చంపినంత పనిచేసింది. ఈలోగా దశార్ణరాజు గొప్ప ఏనుగుతో భగదత్తుడి ఏనుగునడ్డగించాడు. భగదత్తుడి ఏనుగు దశార్ణరాజు ఏనుగును, భగదత్తుడు దశార్ణరాజును చంపగా యుధిష్ఠిరుడు ఆ ఏనుగుపై అన్నివేపుల నుంచి దాడిచేసాడు. భగదత్తుడు ఆ ఏనుగును సాత్యకి రథం వేపు నడపగా ప్రమాదాన్ని పసికట్టి రథం దిగి పారిపోయాడు. ఆ ఏనుగు ఆ రథాన్ని తుక్కుతుక్కు చేసింది. దొరికిన వీరుల్ని దొరికినట్లు తొండంతో చుట్టి నేలకేసి కొడుతున్నది. దానిపైన కూర్చుని భగదత్తుడు ఇంకోరకం సంహారం చేస్తున్నాడు. రుచిపర్వుడిని చంపాడు. అదిచూసి అభిమన్యుడు, ఉపపాండవులు యుయుత్సుడు, ఏనుగును శరవర్షంతో ముంచెత్తారు. అది యుయుత్సుడి రథాన్ని ముక్కలు చేయగా యుయుత్సుడు రథం దూకి పరిగెత్తాడు. ఆ ఏనుగు, భగదత్తుడు కలిసి ఆరోజున చేసిన విధ్వంసం అంతా ఇంతా కాదు. పాండవసేన చెల్లాచెదురైంది.

అర్జునుడన్నాడు శ్రీకృష్ణునితో- "భగదత్తుడు తన ఏనుగు సుప్రతీకంతో అల్లకల్లోలం సృష్టిస్తున్నట్లున్నాడు. ఏనుగుపై నుండి యుద్ధం చేసే వీరులలో అతడు ఈ భూమండలంలోనే సాటిలేనివాడు. అటు వెళ్దాం పద!". అర్జునుడు అటు బయల్దేరగానే సంశప్తకులు పధ్నాలుగు వేలమంది అర్జునుడిని యుద్ధానికి ఆహ్వానించి శరవర్షం కురిపించారు. పదివేల మంది త్రిగర్తులు. నాలుగువేలమంది నారాయణసేన. వారి పొగరు విజృంభణను చూసి కృద్ధుడై అర్జునుడు బ్రహ్మాస్త్రం ప్రయోగించి సంశప్తక సేనను సర్వనాశనం చేసాడు.

వెంటనే భగదత్తుడి వేపుకు రథాన్ని మళ్లించాడు శ్రీకృష్ణుడు, పార్థుడి అభ్యర్థనతో. భగదత్తుడి ఏనుగు అర్జునుడి రథంపైకి దూకబోతుండగా తప్పించాడు శ్రీకృష్ణుడు. సమాభాష్య ప్రహర్తవ్య భావనతో ఈసారి భగదత్తుని హెచ్చరించాడు అర్జునుడు. భగదత్తుడు అనేక ఆయుధాలను, బాణాలు ప్రయోగించాడు అర్జునుడిపై. కొన్ని కృష్ణుని గాయపరచాయి.

అర్జునుడు కోపించి సుప్రతీకపు కవచాన్ని చీల్చివేసాడు. భగదత్తుడు అర్జునుడిపై శక్తిని ప్రయోగించాడు. దానిని ఛేదించి భగదత్తుడిని పది బాణాలతో కొట్టగా, భగదత్తుడు తోమరాలను ప్రయోగించి కిరీటి కిరీటాన్ని తొలగదోసి సింహగర్జన చేసాడు. "నీ సమయం దగ్గర పడింది. లోకాన్ని ఆఖరిసారి చూడు భగదత్త రాజా!" అన్నాడు అర్జునుడు.

తాను వేస్తున్న బాణాలను అర్జునుడు సులభంగా విరిచివేస్తున్నాడని తలచి భగదత్తుడు తన చేతిలోని అంకుశాన్ని అభిమంత్రించి వైష్ణవాస్త్రంగా అర్జునుడి గుండెకు గురిచూసి వదిలాడు. శ్రీకృష్ణుడు దానిని అడ్డుకుని తన వక్షస్థలం స్వీకరించేట్లు చేయగా ఆ వైష్ణవాస్త్రం శ్రీకృష్ణునికి వైజయంతీమాలగా మారింది. ఆ మాలిక తామరమొగ్గల శోభతో అద్భుతంగా ప్రకాశించింది.

అర్జునుడన్నాడు- "కృష్ణా! నేను ఆ అస్త్రాన్ని అడ్డుకోగలను కదా! నీవు ఇలా చేయడం తగునా?"

శ్రీకృష్ణుడన్నాడు- "అర్జునా! నా శక్తి నాలుగు భాగాలుగా ఉంటుంది. ఒకటి నరనారాయణ రూపం; రెండోది జగత్సాక్షి; మూడవది మానవలోక రక్షణామూర్తి; నాలుగవది ఏకార్ణవంలో నిద్రిస్తూ ఉంటుంది. నేను నిద్రలేచి భక్తులకు వరాలిచ్చేప్పుడు భూదేవి తన కుమారుడు నరకాసురుని కోసం వైష్ణవాస్త్రం అడిగింది. ఆ అస్త్రం ఇప్పుడు భగదత్తుడి చేతికి వచ్చింది. నా అస్త్రాన్ని నేను స్వీకరించాను. ఇప్పుడు భగదత్తుడు బలహీనుడు. ఇతడిని వధించు".

అర్జునుడి సంశయం తీరింది. ఒక గొప్ప బాణంతో సుప్రతీకపు కుంభస్థలాన్ని చీల్చినాడు. దానితో ఏనుగు గతి తప్పింది. ముందుకాళ్లు పడిపోగా తలవంచి దంతాలను నేలకాన్చి, భీకర స్వరంతో ఆర్తనాదం చేస్తూ ప్రాణాలు విడిచింది. వృద్ధుడయిన భగదత్తుడి నుదుటనున్న పట్టీని చీల్చగా, కనురెప్పలు కిందికి దిగి మూసుకుపోయిన కన్నులతో కళవళపడుతున్న భగదత్తుడి గుండెలోకి దూసుకుపోయేలా బాణాలు వేయగా ప్రాణాలు కోల్పోయిన భగదత్తుడు, పూలతో నిండిన గన్నేరు చెట్టు విరిగి పర్వతం మీదనుంచి క్రింద పడినట్లు నేలగూలినాడు. ఇంద్రుని వలె పరాక్రమవంతుడు, ఇంద్రమిత్రుడు అయిన భగదత్తుడిని ఇంద్రుడి పుత్రుడు సంహరించాడు.

భగదత్తుడిని చంపిన అర్జునుడిపై శకుని సోదరులు వృషక-అచలులు విరుచుకుపడినారు. అర్జునుడి బాణాలకు వృషకుడు విరథుడై అచలుడి రథమెక్కగా ఒకేరథంపైనున్న వృషక-అచలులను ఒకేబాణంతో చంపినాడు అర్జునుడు. సోదరులు మరణించడంతో శోకతప్తుడైన శకుని తన మాయావిద్యలతో అనేక రకాల ఆయుధాలు, జంతువులు శ్రీకృష్ణార్జునుల రథం పైకి పడేట్లు చేసాడు.

కర్రలు, ఇనుపగుళ్లు, రాళ్లు, శతఘ్నులు, శక్తులు, గదలు, పరిఘులు, ఖడ్గాలు, శూలాలు, ముద్గరాలు, పట్టిశాలు, కంపనాలు, ఋష్టులు, నఖరాలు, రోకళ్లు, పరశ్వధాలు, చురకత్తులు, క్షురప్రాలు, నాలీకాలు, వత్సదంతాలు, అస్థి సంధులు, చక్రాలు, బాణాలు, ప్రాసాలు వందల కొలదిగా వచ్చి రథం మీద పడ్డాయి.

గాడిదలు, గేదెలు, ఒంటెలు, వ్యాఘ్రాలు, సింహాలు, సృమరాలు, చిరుతలు, ఎలుగుబంట్లు, కుక్కలు, గ్రద్దలు, పాములు, కోతులు, విచిత్ర రూపాల రాక్షసులు, రకరకాల పక్షులు చాలా కోపించి అర్జునుని మీదకు దూకినారు.

వాటిని నశింపచేస్తుంటే గాఢాంధకారం అలుముకున్నది. దుర్భాషలు వినిపించసాగాయి. అర్జునుడు జ్యోతిర్మయాస్త్రం వేసి చీకటిని పోగొట్టినాడు. భయంకరమైన జలప్రవాహాలు ఆవిర్భవించగా అవి ఇంకిపోవడానికి ఆదిత్యాస్త్రం ప్రయోగించాడు. ఈ విధంగా శకుని చేసిన మాయలన్నిటిని అర్జునుడు తిప్పికొట్టినాడు. దానితో శకుని పారిపోయాడు. అర్జునుడు కౌరవసేనను సంక్షోభపరచాడు.

ద్రోణుడిని పట్టుకోవాలని పాంచాలసేన, ద్రోణుని ఎవరూ పట్టుకోలేరని కౌరవసేన భీకర యుద్ధం చేసాయి. ద్రోణుడున్న ప్రతిచోటా ధృష్టద్యుమ్నుడు ప్రత్యక్షమయ్యాడు. అయినా ద్రోణుడి ధాటికి పాండవసేన తట్టుకోలేకపోయింది. దానికి ప్రతీకారంగా ధృష్టద్యుమ్నుడు కౌరవసేనను గాయపరుస్తూ ద్రోణుడిపై అద్భుతంగా యుద్ధం చేసాడు. పాండవ పక్షాన నీలుడనే రాజు అగ్నిలా కౌరవసేనను దహిస్తుంటే అశ్వత్థామ అతడిని ఎదుర్కొన్నాడు. నీలుడి ధనుస్సును ముక్కలు చేసేసరికి కత్తి, డాలును తీసుకుని అశ్వత్థామను చంపబోయాడు నీలుడు. గొప్ప బాణంతో నీలుడి శిరస్సు ఖండించాడు అశ్వత్థామ.

భీముడు దాడిచేసాడు దుర్యోధన, కర్ణ, అశ్వత్థామ, ద్రోణులపై. భీముడికి రక్షణగా సాత్యకి, నకుల సహదేవులు నిలిచారు. బాహాబాహీ ముష్టాముష్టీగా మారింది యుద్ధం. చాలా దారుణంగా జరిగిన ఆ యుద్ధం ఇరుపక్షాలకు నష్టం కలిగించింది.

పండ్రెండవ రోజు యుద్ధంలో భూతకర్ముడు, శాల్వుడు, భగదత్తుడు, సుప్రతీకమనే ఏనుగు, అంగరాజు, సంశప్తకులు, శకుని సోదరులైన వృషక-అచలులు కౌరవ పక్షాన, దశార్ణరాజు, పాంచాల వీరులు, నీలుడు పాండవ పక్షాన మరణించారు.

## 3) అభిమన్యు వధ పర్వము

దుర్యోధనుడు ఉదయాన వెళ్లి ద్రోణుడితో అన్నాడు- "నిన్న యుధిష్ఠిరుడు తమ దగ్గర్లోనే ఉన్నా అతడిని పట్టుకోలేదు. నాకు వరమైతే ఇచ్చారు కాని పని జరుగలేదు".

ద్రోణుడన్నాడు- కృష్ణార్జునులు యుధిష్ఠిరుని రక్షిస్తున్నంత కాలం ఎవరూ యుధిష్ఠిరుని సమీపించలేరు. అయినా ఈరోజు గొప్ప వ్యూహం పన్నుతున్నాను. మనలో ఎవరో ఒకరు అర్జునుడిని కాస్త దూరంగా తీసుకువెళ్లండి. ఒక గొప్ప మహారథుడు నేలకూలడం ఈరోజు చూస్తారు".

ద్రోణుడు చక్రవ్యూహం పన్నినాడు. దానినే పద్మవ్యూహమంటారు. చక్రం మధ్యభాగంలో దుర్యోధనుడు, ఆకులలా మహావీరులు, ముందుభాగంలో ద్రోణుడు, పక్కనే సైంధవుడు, అశ్వత్థామ, ముప్పదిమంది కౌరవులు, శకుని, భూరిశ్రవుడు యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు.

భీముడు ముందు నిలవగా సాత్యకి, చేకితానుడు, ధృష్టద్యుమ్నుడు, కుంతిభోజుడు, ద్రుపదుడు, అభిమన్యుడు, నకుల సహదేవులు, ఘటోత్కచుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, శిఖండి, విరాటుడు, ఉపపాండవులు, శిశుపాల పుత్రుడు, కేకయ రాకుమారులు, సృంజయులు అందరూ చక్రవ్యూహాన్ని చూసారు.

యుధిష్ఠిరుడన్నాడు- "ఈరోజు ద్రోణుడు గొప్ప వ్యూహం పన్నాడు. అర్జునుడిని సంశప్తకులు ఆహ్వానించారు యుద్ధానికి. మనం ఈ వ్యూహాన్ని ఎలా భేదించాలి?"

అభిమన్యుడన్నాడు- "నాకు భేదించి లోపలకు పోవడం తెలుసు. నిర్గమనం తెలీదు"

యుధిష్ఠిరుడన్నాడు- "మేము నీ వెనకనే ఉంటాము. చక్రవ్యూహానికి నీవు సందుచేస్తే మేము చొచ్చుకుని వస్తాం. అన్ని వేపుల నుంచి నిన్ను రక్షిస్తాం"

## పదమూడవ రోజు యుద్ధం

అభిమన్యుడు రథమెక్కి తన సారథితో ద్రోణుని వేపు రథాన్ని నడిపించమన్నాడు.

రథసారథి అన్నాడు- "నీవు ఎదుర్కోబోయే వీరులు అనుభవం కలవాళ్లు. నీవు పిన్నవాడివి"

అభిమన్యుడన్నాడు- "ఈ సైన్యమొక లెక్కకాదు. అయినా ఇప్పుడు నాకో పని అప్పజెప్పినాడు పెదనాన్న. దాని గురించి ఆలోచిస్తాను కాని, గెలుపోటముల గురించి కాదు. రథాన్ని పోనివ్వు"

గన్నేరు చెట్టు అభిమన్యుని ధ్వజచిహ్నం. కర్ణికార ప్రవరోచ్ఛ్రిత ధ్వజమది. సింహపు పిల్ల ఏనుగుల మీదకు దూకుతున్నట్లు అభిమన్యుడు కౌరవసేనపైకి దాడిచేసాడు. తనను అడ్డగించాలని వస్తున్న వీరుల చేతులు ఖండిస్తున్నాడు, శిరస్సులు ఖండిస్తున్నాడు, రథాల్ని ముక్కలు చేసాడు, గజబలాన్ని అల్లకల్లోలం చేసి చక్రపు ఇరుసు బలహీనంగా ఉన్నచోట చొచ్చుకుపోయాడు శత్రువు ఊహించనంత వేగంగా, ద్రోణుడు చూస్తుండగానే.

సుషేణుడు, దీర్ఘలోచనుడు, కుండభేది అనేవారిని చంపి, కర్ణుడిని, శల్యుడిని గాయపరచాడు. శల్యుడి సోదరుడిని వధించాడు. గిరగిరా తిరుగుతున్న కొరివివలె తిరుగుతూ, మండలాకారంలో ధనుస్సును తిప్పుతూ తనపై బాణవర్షం కురిపిస్తున్న మహావీరులందరినీ గాయపరచాడు అభిమన్యుడు.

ద్రోణుడు అభిమన్యుడి వీరత్వాన్ని ప్రశంసించడం విన్నాడు దుర్యోధనుడు. తన చుట్టూ ఉన్న కర్ణుడు, శకుని, బాహ్లికుడు, దుశ్శాసనుడు, ఇతర వీరులతో అన్నాడు- "ప్రియ శిష్యుడి కొడుకు కదా! మన గురువుగారు ఆ పిల్లవాడిని ఏమీ చేయడం లేదు. వాడేమో అదంతా తన ప్రతాపమనుకుని వీరంగం చేస్తున్నాడు".

దుశ్శాసనుడన్నాడు- "సోదరా! ఈ మూఢ బాలవీరుడిని నేను చంపుతాను. వీడు చస్తే కృష్ణార్జునులు యుద్ధం విరమిస్తారు దుఃఖంతో. దానితో నీ శత్రువుల పీడ వదుల్తుంది" అని సరాసరి వెళ్లి అభిమన్యుడినెదుర్కున్నాడు దుశ్శాసనుడు. రథ యుద్ధ విద్యలో నైపుణ్యమున్న ఇద్దరూ కుడి ఎడమలుగా వలయాలుగా తిరుగుతూ గొప్ప యుద్ధం చేసారు. అభిమన్యుడితో పోరాటం తన మాటలంత తేలిక కాదని త్వరలోనే అర్థమయ్యింది, విల్లు విరిగింది. శరీరం అంతా చెక్కినట్లయ్యింది అభిమన్యుని బాణాలతో దుశ్శాసనునికి.

"నిన్ను చూడడం నా అదృష్టం" అన్నాడు అభిమన్యుడు. "నీవు నా తండ్రులకు చేసిన అవమానాలు, నా తల్లిలాంటి తల్లి ద్రౌపదికి చేసిన దుశ్చేష్టలకు, దుశ్శాసనా, నా ప్రతీకార బాణాలివిగో, అనుభవించు!" అని ఘోరమయిన బాణంతో కొట్టగా అది అతడి మెడ ఎముకను ఛేదించి పుట్టలోకి పాము దూరినట్లు ఆ బాణం ఈకలతో సహా దూరింది. ఇంకా ఇరవై అయిదు బాణాలు వేసి దుశ్శాసనుడి శరీరాన్ని జల్లెడగా చేసాడు అభిమన్య కుమారుడు. దానితో దుశ్శాసనుడు మూర్ఛిల్లి రథం మీద కూలబడినాడు.

అభిమన్యుడి సారథికి అర్థమయ్యింది తన రథికుడి వీరత్వం. పాండవ సైనికులు హర్షధ్వానాలు చేసారు. అదే సమయంలో పాండవ వీరులందరూ అభిమన్యుడి వెంట చక్రవ్యూహంలో చొరబడాలని ప్రయత్నించారు. వారికి పెట్టని కోటలా అడ్డు నిలిచాడు జయద్రథుడనబడే సైంధవుడు.

అభిమన్యుడి చేతిలో దుశ్శాసనుడి పరాభవాన్ని దుశ్శాసనుడి సారథి రథాన్ని దూరంగా తీసుకుపోవడమూ చూసాడు కర్ణుడు. వెళ్లి అభిమన్యుడి నెదిరించాడు. కర్ణుడి ప్రతి బాణానికీ ప్రతిగా బాణం వేసి సమాధానం చెప్పాడు అభిమన్యుడు. కర్ణుడు కూడా ఊహించనంత వేగంగా ఒక్కబాణంతో కర్ణుడి ధనుస్సును విరగగొట్టి నేలమీదకు పడగొట్టేసరికి, కర్ణుడి సోదరుడు కర్ణాభిమన్యుల రథానికి మధ్యలో వచ్చి బాణాలు వేసేసరికి అభిమన్యుడు ఆగ్రహించి గొప్ప బాణంతో కర్ణుడి సోదరుడిని వధించాడు. దుఃఖంతో కర్ణుడు వ్యధచెందుతూ ఉండగానే అతడి గుర్రాలు రథాన్ని పక్కకు లాక్కుపోయాయి. వెదురు పొదలలో వేసిన అగ్నిలా అభిమన్యుడు రగిలిపోతున్నాడు. దావాగ్నిలా చెలరేగిపోతున్నాడు.

అభిమన్యుడిని అనుసరిస్తూ వచ్చిన ధర్మరాజాది వీరులను అడ్డగించాడు- "ఒక్కరోజు నీవు పాండవులను అడ్డుకోగలుగుతావు అర్జునుడు తప్ప" -అని పరమేశ్వరుడిచ్చిన వరాన్ని ఆరోజు వినియోగిస్తున్నాడు జయద్రథుడనే సైంధవుడు. సాత్యకి,

భీముడు, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, ద్రుపదుడు, శిఖండి, కేకయులు, ఉపపాండవులు, యుధిష్ఠిరుడు, నకుల సహదేవులు ఏ ఒక్కరూ సైంధవుడిని ఒక్క అడుగు కదిలించలేకపోయారు. తాము ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయారు. అభిమన్యుడు పాండవులకు చూపిన త్రోవను సైంధవుడు అడ్డుపడి మూసివేసాడు.

అభిమన్యుడి వీరవిహారం చూసి కౌరవసేన ఖంగుతిన్నది. వృషసేనుడు ఎదురు వెళ్లి వెనక్కి మళ్లాడు. వసాతీయుడు పొగరుగా వచ్చి నేలకూలాడు. తనకెదురు వచ్చిన వారినెవ్వరినీ ప్రాణాలతో పోనివ్వలేదు అభిమన్యుడు. సముద్రంలోకి పోయిన నదులైనారు వాళ్లు. తిరిగి రాలేదు. శల్యుడి కుమారుడు రుక్మరథుడు అభిమన్యుడిని బాణాలతో కొట్టేసరికి అతడు కృద్ధుడై తలనరికి చంపివేసాడు నిశిత శరాలతో. దానితో రుక్మరథుని మిత్రులు అభిమన్యుడిపై విరుచుకుపడ్డారు. తీవ్రంగా గాయపడిన అభిమన్యుడు గాంధర్వాస్త్రాన్ని ప్రయోగించి అలాత చక్రంలా తిరుగుతూ ఒకటిగా వందలుగా వేలుగా కనిపిస్తూ శత్రువుల శరీరాల్ని ముక్కలుగా నరికాడు. అది చూసి దుర్యోధనుడు రాగానే అతడిని కొద్ది నిముషాల్లోనే యుద్ధ విముఖుడయ్యేట్లు చేసాడు అభిమన్యుడు. రారాజుకు అర్థమయ్యింది ఈ పిల్లవాడు సామాన్యుడు కాదని. కౌరవ సైన్యం విచ్ఛిన్నమైపోతున్నది.

దానితో ద్రోణుడు, అశ్వత్థామ, బృహద్బలుడు, కృపుడు, దుర్యోధనుడు, కర్ణుడు, కృతవర్మ, శకుని కోపంగా అభిమన్యుడి మీదకు దూకినారు. మహాపర్వతాన్ని మేఘాలు వర్షంతో ముంచినట్లు అభిమన్యుడిని బాణవర్షంలో ముంచారు. ఆ సమయంలో లక్ష్మణ కుమారుడు వచ్చి అభిమన్య కుమారుడిని ఎదుర్కొని గొప్ప బాణాలతో అభిమన్యుడిని కొట్టినాడు. దానితో అభిమన్యుడు కోపించి– "లక్ష్మణా! ఇప్పుడే చూసుకో మీ వాళ్లనందరినీ, లోకాన్నీ! నిన్ను యమలోకానికి పంపుతున్నాను" అంటూ కుబుసం విడిచిన పామువంటి బాణాన్ని అమ్ముల పొదిలోంచి తీసి మెరుపు వేగంతో వదిలాడు. అది వెలుగులు విరజిమ్ముతూ వెళ్లి లక్ష్మణుడి శిరస్సును ఖండించింది. అదిచూసి అక్కడున్న వారందరూ హాహాకారాలు చేసారు. దుర్యోధనుడు క్రుద్ధుడై "ఇతడిని చంపండి" అని ఆజ్ఞాపించాడు.

ద్రోణుడు, కర్ణుడు, కృపుడు, అశ్వత్థామ, బృహద్బలుడు, కృతవర్మ అనే ఆరుగురు రథికులు అభిమన్యుడిని చుట్టుముట్టినారు. ఆ ఆరుగురినీ తీవ్రంగా గాయపరచడమే కాక బృందారకుడనే వీరుడిని చంపాడు అభిమన్యుడు. కోసల రాజు బృహద్బలుడు అభిమన్యుడిపై దాడి చేయగా అతడి సారథిని, గుర్రాలను చంపేసరికి బృహద్బలుడు కత్తీడాలు పట్టుకుని అభిమన్యుడిపై దూకాడు. ఒకే ఒక్కబాణం బృహద్బలుడి గుండెల్లోంచి దూసుకుపోయేలా కొట్టి, అతడిని సంహరించినాడు అభిమన్యుడు.

కాసేపు కర్ణుడు, అభిమన్యుల మధ్య పోరు ఘోరంగా సాగింది. ఇద్దరూ గాయపడి పుష్పించిన మోదుగుచెట్లలా రక్తమోడుస్తూ కానవచ్చారు. కర్ణుడికి సాయంగా ఉన్న అతడి ఆరుగురు మంత్రులను చంపాడు అభిమన్యుడు. మగధరాజ కుమారుడు అశ్వకేతువును చంపాడు. మార్తికావతరాజు భోజుని, దుశ్శాసన కుమారుడిని, శల్యుడిని గాయపరచాడు. శత్రుంజయుడు, చంద్రకేతువు, మేఘవేగుడు, సువర్చుడు, సూర్యభానుడు ఈ అయిదుగురిని చంపేసరికి శకుని అన్నాడు– "మనల్ని అందరినీ వీడు హింసించాడు. మనమందరం వీడిని హింసిద్దాం!"

ద్రోణుడొక్కడే ఒక మహావీరుడి ప్రతాపాన్ని చూసి అతడు శత్రువైనా అభినందించే గుణం కలిగి ఉన్నాడు. ద్రోణుడన్నాడు– "అతడిలో లోపం ధనుస్సు. కవచం అభేద్యం. ఒక్కొక్కరు ఒక్కో పని– ఒకరు సారథిని, ఒకరు గుర్రాలను, ఒకరు ధనుస్సును ఛేదించాలి". కర్ణుడు ధనుస్సును ఖండించాడు; కృతవర్మ గుర్రాలను కూల్చాడు. కృపుడు పార్శ్వరక్షకులను సారథిని చంపాడు. అభిమన్యుడు విరథుడైనాడు.

కత్తిని డాలును తీసుకుని గాలిలోకి ఎగిరాడు. ద్రోణుడు అతడి ఖడ్గాన్ని నరికాడు. కర్ణుడు డాలును ముక్కలు చేసాడు. చక్రాన్ని చేబట్టి అభిమన్యుడు రెండవ శ్రీకృష్ణుడిలా కనిపించాడు. రాజులు ఆ చక్రాన్ని విరగొట్టారు. అభిమన్యుడు గదను చేబట్టి అశ్వత్థామను ఎదిరించాడు. అశ్వత్థామ చక్రరక్షకులను గుర్రాలను చంపాడు గదాయుద్ధంతో అభిమన్యుడు. శత్రువులు వేస్తున్న బాణాలు శరీరంలో గుచ్చుకోగా అతడొక ముళ్లపందిలా కనిపించాడు. అయినా చలించక సుబలుని కొడుకు కాలికేయుడిని, 77 మంది గాంధారులను చంపాడు. దుశ్శాసనుడి పుత్రుడి గుర్రాలను చంపాడు రథాన్ని నాశనం చేసాడు. దుశ్శాసన పుత్రుడూ గదను పట్టుకుని అభిమన్యుడిపైకి లంఘించాడు. పరమశివుడు–అంధకాసురుల్లా ఇద్దరూ యుద్ధం చేసారు. ఒకరినొకరు గదలతో పొడుచుకుని కింద పడిపోయారు. కౌరవుల కీర్తిని పెంపొందించే దుశ్శాసన కుమారుడు ముందు లేచి, పైకి లేస్తున్న అభిమన్యుడి తలపై గదతో కొట్టినాడు. దానితో అభిమన్యుడు ప్రాణహీనుడై నేలకూలినాడు.

కౌరవ సేన పరమానందపడింది. సింహనాదాలు చేసారు వీరులు. ఆరుగురు వీరులు ఒకటై ఒంటరివాడైన అభిమన్యుడిని చంపారు. సైంధవుడిచే అడ్డగించబడిన ధర్మరాజాదులు అల్లంత దూరం నుంచి చూస్తుండగానే అభిమన్యుడు అస్తమించాడు.

**హత్వాదశ సహస్రాణి కౌసల్యం చ మహారథమ్**
**కృష్ణార్జున సమః కార్ష్ణిః శక్రలోకం గతో ధ్రువమ్** (ద్రోణ. 49-38)

"పదివేలమంది వీరులను, కోసల దేశరాజు బృహద్బలుడిని, కౌరవ యువరాజు లక్ష్మణుడిని, శల్యుడి బంధువులను ఇలా అనేకమందిని యుద్ధంలో చంపి కృష్ణార్జున సమానుడైన అభిమన్యుడు వీరస్వర్గమలంకరించాడు" అన్నాడు యుధిష్ఠిరుడు దుఃఖిస్తూ.

రణభూమిలో అభిమన్యుడు యజ్ఞవేదిమీద హవిస్సు లేక తేజోహీనమయిన అగ్నివలె ఉన్నాడు.

అతడు పడి ఉన్న ప్రాంతానికి కాస్త దూరంలో లక్ష్మణ కుమారుడు మరో చల్లారిన జ్వాలలా పడి ఉన్నాడు.

ఒక తండ్రికి తన కుమారుడు చనిపోయిన సంగతింకా తెలియదు.

యుధిష్ఠిరుడు చింతాక్రాంతుడైనాడు. అసమానమైన యుద్ధంలో అస్తమించిన అభిమన్యుడి గురించి అతడు ఆలోచిస్తున్నాడు. అర్జునుడికేమి చెప్పాలిప్పుడు? కృష్ణుడి ముఖమెలా చూడాలి? చక్రవ్యూహ భేదన మాత్రమే తెలిసిన అభిమన్యుడిని ఎందుకు యుద్ధానికి పంపావు అని అడిగితే దానికి ఏం సమాధానమివ్వాలి -అన్న ఆలోచనలు తనను ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా అజాతశత్రువైన ధర్మరాజుకు ఆలోచనలు శత్రువులు కాగా అల్లకల్లోల స్థితిలో ఉన్నాడు.

ఆ సమయంలో వ్యాసమహర్షి వచ్చాడు యుధిష్ఠిరుని వద్దకు. అతడిని ఓదారుస్తూ మృత్యుజనన వృత్తాంతాన్ని చెప్పాడు-

**సమస్త పాప రాశిఘ్నం శృణు కీర్తయతో మమ**
**ధన్యమాఖ్యాన మాయుష్యం శోకఘ్నం పుష్టివర్ధనమ్** (ద్రోణ. 52-23)

అకంపనుడనే రాజుకు హరి అనే కుమారుడున్నాడు. అతడు యుద్ధంలో మరణించాడు. అకంపనుడు దుఃఖంతో బాధపడుతుంటే నారదుడు మృత్యుజనన కథను తెలిపాడు.

## మృత్యుదేవత

బ్రహ్మ తాను సృష్టించిన జగత్తు సంహారం పొందకపోయేసరికి తీవ్రమైన చింత కలిగింది. ఆయనకు కలిగిన క్రోధం వలన అన్ని ఇంద్రియాల నుంచి అగ్ని పుట్టింది. ఆ అగ్ని లోకాల్ని దహిస్తుంటే జటాధారి, రాక్షసాధిపతి, రుద్రుడు, మహాదేవుడు, శంకరుడైన స్థాణుడు బ్రహ్మను వేడుకొనగా బ్రహ్మ క్రోధాగ్నిని ఉపసంహరించుకున్నాడు. దానివలన బ్రహ్మ నుండి ఒక స్త్రీ- ఎరుపు నలుపు రంగులో ఉన్నది; నాలుక, ముఖం, కన్నులు పచ్చగా ఎర్రగా ఉన్నాయి. స్వర్ణాభరణాలను ధరించినదామె జనించింది.

బ్రహ్మ అన్నాడు- "మృత్యువా అన్ని లోకాలను సంహరించు"

ఆమె దుఃఖించింది. ఆ పాపకార్యాలను చేయలేనన్నది. ఆమె కన్నీటిని తన దోసెలిలో పట్టి బ్రహ్మ అన్నాడు- "నీ కన్నీటి బిందువులు వ్యాధులై స్వేదజ, అండజ, ఉద్భిజ, జరాయుజయాల్ని సంహరిస్తాయి. నీకు పాపమంటదు". ఆమె మృత్యుదేవతగా రూపుదిద్దుకున్నది.

వ్యాసుడన్నాడు- "అందుచేత ధర్మరాజా! మృత్యువు బ్రహ్మసృష్టి అని తెలుసుకో. మరణించిన వారికొరకు శోకించకు".

## సువర్ణష్ఠీవి కథ

వ్యాసుడు చెబుతున్నాడు- "శైబ్యుడు అనే రాజు కుమారుడు సృంజయుడు. సృంజయుడి మిత్రులు పర్వతుడు, నారదుడు. అతడింట్లో అతిథులుగా ఉన్నపుడు సృంజయుడి కుమార్తె వచ్చింది. నారదుడు ఆమెను వివాహమాడతానన్నాడు. దానితో నారదుడు పర్వతుడు గొడవ పడ్డారు. "నేను వరించిన అమ్మాయిని నీవు వరించావు. నాకు చెప్పలేదు గనుక కోతి

వవుతావు, నీవు స్వర్గం వెళ్లలేవు" అన్నాడు పర్వతుడు. నారుదుడన్నాడు– "నేను లేకుండా నీవూ స్వర్గానికి వెళ్లవు". ఇద్దరూ అలా శపించుకున్నారు.

సృంజయుడు పుత్రసంతానం లేక బాధపడుతుంటే నారదుడతడిని ఆశీర్వదించాడు. అయితే సృంజయుడు– తనకు జన్మించే పుత్రుడు ఉమ్మినా, వమనం చేసుకున్నా ఆ ద్రవాలు, మలమూత్రాలు బంగారం కావాలని కోరుకున్నాడు. అతడికి వరం అనుగ్రహించబడింది. నారదుడు సృంజయుడి కుమార్తెను వివాహం చేసుకున్న మరుక్షణం అతడికి కోతిరూపం వచ్చింది.

సృంజయుడికి మగపిల్లవాడు పుట్టాడు. అతడి కన్నీళ్లు, ఉమ్మి, వాంతి, మలమూత్రాలు బంగారంగా మారడంతో ఆ పిల్లవాడిని సువర్ణష్ఠీవి అని పిలిచారు. దోపిడి దొంగలు కొందరు ఆ పిల్లవాడిని ఎత్తుకుపోయి నిర్జనారణ్యంలో పొట్ట కోసి చూసారు, బంగరు బాతును కోసినట్లు. లోపల ఏమీ దొరకలేదు సరికదా వారిలో వాళ్లు వాదులాడుకుని ఒకరినొకరు దూషించుకుంటూ కత్తులతో పొడుచుకుని చనిపోయారు.

సృంజయుడు పుత్రుడు చనిపోయాడని దుఃఖిస్తుంటే నారదుడు– మరుత్తుడు, సుహోత్రుడు, పౌరవుడు, శిబి, శ్రీరామచంద్రుడు, భగీరథుడు, దిలీపుడు, మాంధాత, యయాతి, అంబరీషుడు, శశబిందుడు, గయుడు, రంతిదేవుడు, భరతుడు, పృథువు, పరశురాముడు అనే షోడశ మహరాజుల వృత్తాంతాన్ని చెప్పి అన్నాడు– ఆ విధంగా గొప్ప దానధర్మాలు చేసి, మహారాజులుగా పేరుపొందిన వారే ఇప్పుడు లేరు కదా! పుట్టినవారెవరైనా చనిపోవాల్సిందే! దుఃఖాన్ని వీడుమని చెప్పాడు నారదుడు.

అయినా దుఃఖిస్తున్న సృంజయుడిపై జాలిపడి సువర్ణష్ఠీవిని బ్రతికించాడు" అని పలికి వ్యాసుడు– "అభిమన్యుడు వీరస్వర్గం పొందినాడు. దుఃఖాన్ని ఉపశమింపచేసుకో!" అని ధర్మరాజును ఓదార్చి వ్యాసుడు అదృశ్యమైనాడు.

## 4) ప్రతిజ్ఞా పర్వము

సంశప్తకులతో యుద్ధం చేస్తున్న అర్జునుడికి అపశకునాలు తోచి తన మనోవేదనను కృష్ణుడితో పంచుకున్నాడు. సూర్యాస్తమయం కాగానే శిబిరాలకు వచ్చిన కృష్ణార్జునులకు అక్కడ అంతా ఆనందరహితంగా వెలవెలబోతూ ఉండేసరికి అర్జునుడి మనసు చెదిరిపోయింది.

యుధిష్ఠిరుడన్నాడు– "నీవు సంశప్తకులతో యుద్ధానికి వెళ్లగానే అభిమన్యుడు చక్రవ్యూహాన్ని భేదించి లోనికి వెళ్లిపోయాడు. మేము వేగంగా అతడిని అనుసరిస్తున్న క్షణంలోనే శివగర్వ దర్పితుడైన సైంధవుడు మమ్మల్ని అడ్డుకున్నాడు. మేము అడుగు ముందుకు వేయలేకపోయాము. వ్యూహాన్ని భేదించి లోపలకు వెళ్లిన అభిమన్యుడు అనేకమందిని ఓడించాడు. కొందరిని చంపాడు. తనను చుట్టుముట్టిన ఆరుగురు రథికులు– ద్రోణుడు, కృపుడు, కర్ణుడు, అశ్వత్థామ, కోసలరాజు బృహద్బలుడు, కృతవర్మలతో గొప్పగా పోరాడాడు. బృహద్బలుని చంపాడు. చివరకు వీరస్వర్గమలంకరించాడు.

పదమూడవ రోజు యుద్ధంలో అభిమన్యుడి చేతిలో శల్యుడి సోదరుడు, కర్ణుడి సోదరుడు, వసాతీయుడు, శల్యుడి కుమారుడు రుక్మరథుడు, దుర్యోధనుని పుత్రుడు లక్ష్మణకుమారుడు, మగధ రాజకుమారుడు అశ్వకేతువు, శల్యుడి సోదరుడు కాలికేయుడు, కోసలరాజు బృహద్బలుడిని ఇంకా అనేకమంది వీరులను చంపాడు. చివరకు దుశ్శాసనుని కుమారుడి గదా దండపు దెబ్బకు నేలకూలాడు".

అర్జునుడి కోపం తన కుమారుడికి సాయం అందకుండా అడ్డుపడిన జయద్రథుడిపై మళ్లింది– "రేపు జయద్రథుని చంపుతాను. నేను చంపుతానని అతడు ధార్తరాష్ట్రులను విడిచి వెళ్లకుండా ఉండి ఉంటే; నన్ను గాని, శ్రీకృష్ణుడిని గాని, యుధిష్ఠురుడిని గాని శరణుపొందకపోతే రేపు అతడిని చంపుతాను.

జయద్రథుడిని చంపకపోతే పాపకార్యాలు చేసిన వారి లోకాలకు పోతాను. ధర్మదూరులైనవారి దుర్గతి పొందుతాను.

జయద్రథుడు చావకుండానే సూర్యుడు అస్తమిస్తే ఇక్కడే ప్రజ్వరిల్లుతున్న అగ్నిలో ప్రవేశిస్తాను"–

కౌరవ శిబిరాన్ని ఈ వార్త కలచివేసింది. జయద్రథుడు అన్నాడు– "కాముకుడైన ఇంద్రుడి వల్ల పాండురాజు భార్యకు పుట్టిన అర్జునుడు నన్ను ఒక్కడినే చంపుతానని ప్రతిజ్ఞ చేసాడట. మీకు శుభమగును గాక! నేను జీవితం మీది కోరికతో నా రాజధానికి వెళ్తున్నాను".

కౌరవులు, ద్రోణుడు అతడికి నచ్చచెప్పారు. "చావు వస్తే ఆపలేం. వీర మరణం మంచిది" అన్నారు.

**పర్యాయేణ వయసం సర్వే కాలేన బలినా హతాః**
**పరలోకం గమిష్యామః స్వైః స్వైః కర్మభిరన్వితాః** (ద్రోణ. 74-32)

"మనమందరం వంతులవారీగా పరలోకానికి వెళ్లాల్సిందే" అన్నాడు ద్రోణుడు.

అక్కడ పాండవ శిబిరంలో శ్రీకృష్ణుడు అర్జునుడితో అన్నాడు- "ఎవరినీ సంప్రదించకుండానే 'సైంధవుడిని చంపుతా' అని ప్రతిజ్ఞ చేసావు. అది చాలక ప్రతిజ్ఞ విఫలమైతే అగ్నిలో దూకి చస్తానన్నావు. ఈ మహాభారాన్ని ఎత్తుకున్నావు. ఇప్పుడు దాన్నెలా దించాలి?"

అర్జునుడన్నాడు- "నీ దయ ఉంటే అన్నీ సాధ్యమే!

**తవ ప్రసాదాద్ భగవన్ కిమివాస్తి రణే మమ**
**అవి షహ్యం హృషీకేశ కిం జానన్ మాం విగర్హసే!** (ద్రోణ. 76-21)

ఈ మహాభారమైన కార్యం నెరవేరుస్తాను".

సుభద్ర దుఃఖిస్తుంటే ఓదార్చాడు శ్రీకృష్ణుడు. ఒకపక్క పుత్రశోకం, కోడలి దుఃఖం, పైన అర్జునుడి ప్రతిజ్ఞ - తల్లడిల్లిపోతున్న సుభద్రకు ధైర్యం చెప్పి పంపించాడు శ్రీకృష్ణుడు.

అర్జునుడి విజయం కొరకు ఆ రాత్రి శివపూజ చేయించాడు శ్రీకృష్ణుడు. దారుకుని పిలిచి తన రథాన్ని సిద్ధం చేయించాడు.

ఆ రాత్రి అర్జునుడు మగతగా నిద్రపోయాడు. ఆ కలలో అతడు కృష్ణుడితో కలిసి శ్వేత పర్వతానికి వెళ్లి శివుని దర్శించాడు. మరల పాశుపతాస్త్రం లభించింది అర్జునుడికి. శివుని ఆశీస్సులు పొందినాడు.

తెల్లవారింది. యుధిష్ఠిరుడు ముఖ్యులతో సమావేశమైనాడు. అర్జునుడు సాత్యకితో అన్నాడు- "ధర్మరాజును రక్షించే బాధ్యత నీది. నేను వాసుదేవుడు ఉన్నచోట మాకే ఆపదా జరగదు. సైంధవ వధ నాకు పరమలక్ష్యం. ధర్మరాజ సంరక్షణం నీ కర్తవ్యం".

## 5. జయద్రథ వధా పర్వము

## పధ్నాలుగవ రోజు యుద్ధము

జయద్రథా, నీవూ, భూరిశ్రవుడు, కర్ణుడు, అశ్వత్థామ, శల్యుడు, వృషసేనుడు, కృపుడు - లక్ష గుర్రాలు, 60000 రథాలు, 14000 ఏనుగులు, 21000 కాల్బలంతో నాకు ఆరు క్రోసుల దూరంలో ఉండండి.

దుర్మర్షణుడు 15000 ఏనుగులతో సర్వసేనలకు ముందున్నాడు. దుశ్శాసనుడు, వికర్ణుడు సేనకు ముందున్నారు.

చక్ర శకట వ్యూహానికి వెనక పద్మమనే గర్భవ్యూహంలో 'సూచి' ముఖం అనేది మరో గర్భవ్యూహం. సూచిముఖ వ్యూహానికి ముందు కృతవర్మ నిలిచి ఉన్నాడు.

24 క్రోసుల పొడవు, 10 క్రోసుల వెడల్పున్నదా చక్ర శకట వ్యూహం. కృతవర్మ వెనక జలసంధ, దుర్యోధన, కర్ణులున్నారు. సూచీముఖ పార్శ్వభాగంలో జయద్రథుడున్నాడు. శకటవ్యూహం అగ్రభాగంలో ద్రోణుడు. భోజరాజు ద్రోణునికి రక్షకుడు.

యుద్ధం మొదలయ్యింది. పాండవుల శిబిరాలవేపు నుంచి దేవదత్త, పాంచజన్య శంఖారావాలు దిక్కులు పిక్కటిల్లేలా వినిపించాయి.

**యథా మధ్యందినే సూర్యః దుష్ప్రేక్ష్యః ప్రాణిభిః సదా**
**తథా ధనంజయః క్రుద్ధః దుష్ప్రేక్ష్య యుధి శత్రుభిః** (ద్రోణ. 89-27)

ఈరోజున అర్జునుడి ప్రతాపానికి ఎవరూ ఎదురు నిలబడలేకున్నారు. దుశ్శాసనుడు ఉద్రేకంగా గజసేనతో అర్జునుడిని అడ్డగించాడు కాని, అర్జునుడు మండలాకారంలో వింటిని నిలిపి ఆగకుండా బాణాలు వేస్తుంటే ఏనుగులు, అశ్వాలు, కాల్బలం, రథికులు నేలకూలి విగతజీవులవుతున్నారు. కొద్దిసేపట్లోనే దుశ్శాసనుడు భయపడి ద్రోణుని రక్షణలోకి వెళ్లాడు.

ద్రోణుడన్నాడు– "జయద్రథుడిని సమీపించాలంటే నన్ను గెలవాలి నీవు". ఇద్దరి మధ్య యుద్ధం భయంకరంగా సాగింది. సమయం మించిపోకూడదని హెచ్చరిస్తూ కృష్ణుడు రథాన్ని ద్రోణుడికి ప్రదక్షిణం చేస్తూ వెళ్తుంటే ద్రోణుడన్నాడు– "శత్రువును ఓడించకుండానే వెళ్లిపోతున్నావేమిటి?"

అర్జునుడన్నాడు– "నేను మీ శిష్యుడిని. అయినా యుద్ధంలో మిమ్మల్ని ఓడించగల వీరుడెవడున్నాడు?"

కృతవర్మను మూర్ఛిల్లజేసాడు. శ్రుతాయుధుడిని నిరాయుధుడిగా జేసాడు. ఇతడు వరుణుని కుమారుడు. చల్లని నీరుగల మహానది 'పర్ణాశ' అతడి తల్లి. వరుణుడిచ్చిన గదతో అతడు లోకప్రసిద్ధుడైనాడు. అయితే యుద్ధం చేయనివాడిపై గదను ప్రయోగిస్తే అది వెనక్కి వచ్చి విసిరిన వాడినే చంపుతుంది. శ్రుతాయుధువు గదను పైకెత్తి భీకరంగా వచ్చి అందుబాటులో ఉన్న శ్రీకృష్ణుని కొట్టాడు. దానితో కృత్యరాక్షసి యజమానినే కొట్టినట్లు గద వెనక్కి వెళ్లి "శత్రువుల చేతిలో చావడని" వరమున్న శ్రుతాయుధుడినే చంపింది.

తరువాత వంతు కాంభోజరాజు సుదక్షిణుడిది. శక్తి విసిరి అర్జునుడిని గాయపరచాడు సుదక్షిణుడు. క్షణకాలం మూర్ఛిల్లి తేరుకుని గొప్ప బాణంతో రొమ్ము చీల్చి సుదక్షిణుడిని చంపాడు అర్జునుడు. కాంభోజదేశపు కంబళ్లతో శయనించాల్సిన రాజు పెనుగాలికి నేలపై కూలిన కర్ణికార వృక్షంలా చచ్చి పడున్నాడు.

అభీషాహులు, శూరసేనులు, శిబులు, వసాతులు నేలకూలినారు. శ్రుతాయువు, అచ్యుతాయువుల ఆయువు మూడింది. వాళ్ల కుమారులు నియతాయువు, దీర్ఘాయువులు తండ్రుల దారిపట్టారు. మ్లేచ్ఛగణాలు నశించాయి. అంబష్ఠుడు అంతమైనాడు.

అదిచూసి దుర్యోధనుడు వెళ్లి ద్రోణుడితో నిష్ఠూరంగా అన్నాడు–

**యథాశక్తి చ తే బ్రహ్మన్ వర్తయే వృత్తిముత్తమామ్**
**ప్రీణామి చ యథాశక్తి తచ్చ త్వం నావబుధ్యసే**

"ఆచార్యా! తమకు ఉత్తమ జీవికనిచ్చాను. ఎంతో గౌరవించాను. కాని తమరు పాండవులను ఇష్టపడుతున్నారు. ఇంటికి పోతానన్న జయద్రథుడిని మీ మాటల వల్ల ఆపాను. సైంధవుని రక్షించండి!"

ద్రోణుడన్నాడు– "రాజా! నీమీద నాకు కోపం లేదు. నీవు నాకు అశ్వత్థామతో సమానం. నీకు సత్యం చెబుతున్నాను గ్రహించు. కృష్ణుడు సారథులలో మేటి. అతడి అశ్వాలు మేలైనవి. చిన్న సందులోంచి కూడా దూసుకుపోతాడతడు. నేను అంత వేగంగా వెళ్లలేను.

అతడు ఒంటరిగా ఉన్నాడు. నీకు సహాయకులున్నారు. వెళ్లు, పోరాడు. భయపడవద్దు. నీవు జగత్పతివి కదా! పాండవులతో శత్రుత్వం కల్పించుకున్నవాడివి. వెళ్లి అర్జునుడితో పోరాడు!" అన్నాడు ద్రోణుడు.

దుర్యోధనుడన్నాడు– "ఈరోజు అతడు మిమ్మల్నే పక్కకు తొలగదోసి వెళ్లిపోయాడు. ఏది మార్గమిప్పుడు?"

ద్రోణుడన్నాడు– "రాజా! ఈ బంగారు కవచాన్ని నీకు తొడుగుతున్నాను. నిన్ను ఏ యోధుడూ గాయపరచలేడు. వెళ్లు. వెళ్లి అర్జునుడిపై పోరాడు!"

ద్రోణుడు బంగారు కవచం దుర్యోధనుడికి తొడిగి అభిమంత్రించాడు. ఇంద్రుడు వృత్రాసురుడిని చంపినాక అంగిరసుడికి, అంగిరసుడు బృహస్పతికి, బృహస్పతి అగ్నివేశ్యుడికి, అగ్నివేశ్యుడు నాకు ఇచ్చారు ఈ కవచం. ఇది మంత్రం. బ్రహ్మసూత్రంతో దీనిని కడుతున్నాను. నీకు శుభం కలుగు గాక!"

ఆ తరువాత ద్రోణుడికి ధృష్టద్యుమ్నుడికి మధ్య భీకర యుద్ధం జరిగింది. ధృష్టద్యుమ్నుడు కౌరవ సేనను కకావికలు చేసాడు. కౌరవ పాండవ వీరుల మధ్య ఘోరమైన యుద్ధం క్షణక్షణం వృద్ధి చెందింది. ద్రోణుడికి దాదాపుగా చిక్కిన ధృష్టద్యుమ్నుని సకాలంలో వచ్చిన సాత్యకి విడిపించాడు. ద్రోణ సాత్యకుల మధ్య యుద్ధం చుట్టూ చీకటి సృష్టించింది. గమనం, ప్రతిగమనం, ఆక్షేపం, అస్త్ర నివారణం చేస్తూ ఆ ఇరువురూ ఆ ద్వంద్వ యుద్ధాన్ని చూస్తున్న వారిని ఆశ్చర్యంలో ముంచెత్తినారు.

ద్రోణుని వేపు కౌరవ వీరులు, సాత్యకి వేపు పాండవ వీరులు రాగా వారి పదఘట్టనలు బాణాలతో గొప్ప ధూళి చెలరేగింది.

సూర్యుడు అస్తాద్రి వేపు వెళ్తున్నాడు. ధూళిపొరల వల్ల సూర్యుడి వన్నె తగ్గింది. మహావేగంతో సైంధవుడి వేపు వెళ్తున్న అర్జునుడి రథానికి అడ్డువచ్చారు అవంతి సోదరులు– విందానువిందులు. దానితో కోపించిన అర్జునుడు వారి ధనుస్సులను, గుర్రాలను, సారథులను, పార్శ్వ రక్షకులను చంపివేసాడు. క్షురప్రంతో విందుడి తల నరికాడు. అనువిందుడు దుఃఖంతో రథం దూకి గదను చేతబట్టి వచ్చి కృష్ణుడి నుదుట కొట్టినాడు. అదిచూసి అర్జునుడు అనువిందుని కంఠాన్ని, పాదాలను, భుజాలను, శిరస్సును ఖండించేసరికి అనువిందుడు అన్నీ ముక్కలై కిందపడ్డాడు. విందాను విందుల సేనలో విలయం సృష్టించి చెదరగొట్టినాడు అర్జునుడు.

అలసిపోయిన గుర్రాలను గమనించి రథాన్ని ఆపినాడు శ్రీకృష్ణుడు. ఆ రథాన్ని ఎవరూ చేరకుండా అర్జునుడు బాణాలతో బాణగృహం కట్టాడు చుట్టూరా. శ్రీకృష్ణుడు గుర్రాలకు తగిలిన గాయాలను స్పృశించి, బాణపు ములుకులు తీసి వేస్తుంటే అర్జునుడు అస్త్రంతో నేలనుండి నీటిని రప్పించాడు. గుర్రాలు నీరు తాగి కుదుటపడినాయి. ఆహారం తిన్నాయి. స్వస్థత చేకూరింది వాటికి. శత్రు సైనికులు చూస్తూ ఉండగానే ఆగిన రథంలోకి ఎక్కారు రథికుడు, సారథి. రథం వేగంగా ముందుకు కదిలింది కౌరవ వీరులు ఆశాభంగం చెందగా.

కీర్తిమంతులైన కృష్ణార్జునుల రథాన్ని ఎదిరించాడు దుర్యోధనుడు. "మీ బలాన్ని చూపించండి నాపై" అన్నాడు, అంటూనే అర్జునుడిపై అనేక బాణాలు వేసాడు. కృష్ణుడి చేతిలోని కొరడాను విరగగొట్టాడు. అర్జునుడు ప్రతిగా వేసిన బాణాలన్నీ ద్రోణుని కవచాన్ని తొడిగిన దుర్యోధనుడికి తగిలి పడిపోతున్నాయి. "అయితే ఈ కవచ రహస్యం ఇతడికి తెలిసినట్లు లేదు. ఆడవాళ్లు రవిక ధరించినట్లు ఈ మంత్రపూరిత కవచాన్ని తొడిగాడు అంతే!"

అని పలికి మానవస్త్రాన్ని ప్రయోగించాడు అర్జునుడు. దానిని గమనించిన అశ్వత్థామ దూరం నుంచే నిర్వీర్యం చేసాడు. దానితో అర్జునుడు ఉపాయంగా దుర్యోధనుని ధనుస్సును, చేతి తొడుగును, అరచేతుల్ని గాయపరచేసరికి, బాణాలు గోళ్ల అడుగుకు చొచ్చుకుపోయి విపరీతమైన బాధతో దుర్యోధనుడు పారిపోయాడు. శ్రీకృష్ణుడు పాంచజన్యంతో దిక్కులు దద్దరిల్లేలా శంఖారావం చేసాడు. అర్జునుడు గాండీవ వింటినారితో గొప్ప ధ్వనిని సృష్టించాడు.

మరల కృష్ణార్జునులు పాంచజన్య దేవదత్తాలను పూరించేసరికి యుద్ధరంగం వణికింది. అర్జున రథం కౌరవసేనను చీల్చుకుంటూ ముందుకు వెళ్తూనే ఉన్నది. అర్జునుని బాణాలు అశ్వత్థామ, భూరిశ్రవ, శల్య, వృషసేనులను గాయపరుస్తూనే ఉన్నాయి.

అక్కడ ద్రోణుడికి పాండవసేనకు మధ్య గొప్ప యుద్ధం జరిగింది. బృహత్క్షత్రువు, ధృష్టకేతువు, యుధిష్ఠిరుడు ద్రోణునిపై దాడిచేసారు. క్షేమధూర్తి, వీరధన్వుడు ద్రోణుడికి సాయం వచ్చారు.

యుధిష్ఠిరుని బంధించేందుకు ద్రోణుడు బ్రహ్మాస్త్రం వేయగా దానిని బ్రహ్మాస్త్రంతోనే నిరోధించాడు యుధిష్ఠిరుడు. ఇద్దరూ గదలు విసురుకున్నారు. ద్రోణుడు ధర్మరాజు గుర్రాలను చంపాడు, విల్లు విరిచాడు. నిరాయుధుడై చేతులు పైకెత్తి నిలుచున్న ధర్మరాజును చూసి

'హతో రాజా హతో రాజా భారద్వాజేన మారిష'

అని పాండవ సేనలు అరుస్తున్నారు. ద్రోణుడు ధర్మరాజును సమీపిస్తున్న సమయంలో వేగంగా వచ్చి సహదేవుడు తన రథంపై ధర్మరాజును ఎక్కించుకుని వెళ్లిపోయాడు.

కౌరవ పాండవుల మధ్య సంకుల సమరం జరిగింది. కేకయరాజు బృహత్క్షత్రుడు క్షేమధూర్తిని చంపాడు. త్రిగర్తరాజు వీరధన్వుని ధృష్టకేతువు చంపినాడు. సహదేవుడు నిరమిత్రుని చంపాడు. నకులుడు వికర్ణుని ఓడించాడు. సహదేవుని కొడుకు శ్రుతసేనుడు తన సోదరులు తోడురాగా శలుని చంపాడు. అలంబుసుడు భీమసేనుడితో పోరాడి రణరంగాన్ని తన మాయా యుద్ధంతో వ్యాకులపరచాడు. బకుని సోదరుడైన అలంబుసుడు తన మాయలతో భీముడిని నానా బాధలు పెట్టగా క్రోధంతో మండిపడుతూ భీమసేనుడు త్వాష్ట్రాస్త్రం వేసి అలంబుసుడి మాయలు భగ్నం చేయగా వాడు ఓడిపోయి ద్రోణాచార్యుని సేనవేపు పరిగెత్తాడు.

# అలంబుస వధ

అలంబుసుడిని ఘటోత్కచుడెదుర్కొని తీవ్రంగా గాయపరచాడు. యుధిష్ఠిరుడు, భీముడు, నకులుడు, సహదేవుడు, ఉపపాండవులు, ఘటోత్కచుడు అందరూ ఆ రాక్షసుడిని చుట్టుముట్టి బాణవర్షం కురిపించారు. త్వాష్ట్రాస్త్రంతోనే సగం దెబ్బతిన్న అలంబుసుడు మర్త్యధర్మాన్ని పొందినాడు. ఆ సమయంలో ఘటోత్కచుడు అలంబుసుడి రథంపైకి దూకి గరుడుడు పామును పట్టుకుని లాగినట్లు లాగి పైకి లేపి గిరగిరా తిప్పి, నిండు కుండను రాతితో బద్దలు కొట్టినట్లు, నేలకేసి కొట్టాడు. శాలకటంకట పుత్రుడు అలంబుసుడు అలంబుష ఫలం వలె రాలి మరణించాడు.

అర్జున పుత్రుడు ఇరావంతుడిని చంపిన అలంబుసుడిని భీముడి పుత్రుడు ఘటోత్కచుడు చంపాడు.

ఆ తరువాత ద్రోణుడు సాత్యకిల మధ్య గొప్ప యుద్ధం జరిగింది. అనుభవజ్ఞుడైన ఆచార్యుడు సాత్యకిని అల్లల్లాడించాడు, పిల్లవాడు చేతికి చిక్కిన పక్షిని ఆడించినట్లు. అది చూసి యుధిష్ఠిరుడు, కేకయులు, పాంచాలురతో కలిసి సాత్యకిని విడిపించారు. పాంచాలురలో గొప్ప యోధులని పేరుబడ్డ ప్రతి వీరుడిని సంహరిస్తున్నాడు ద్రోణుడు. పాత వైరం సలిపితే పరిణామాలిట్లాగే ఉంటాయేమో! ద్రుపద–ద్రోణుల వైరం తారాస్థాయికి చేరింది.

ద్రోణుడక్కడ సోమకులను సంహరిస్తుంటే అతడిని ఆపగలిగిన వారెవ్వరూ లేకపోయారు. ఈలోగా పాంచజన్య శంఖారావం వినిపించింది. తీవ్రస్థాయిలో ఉంది, కాని, గాండీవ ధనుష్టంకారం వినిపించలేదు. ధర్మరాజు మనసులో సందేహం అర్జునుడికేదైనా అపాయం జరిగిందేమోనని. సాత్యకితో అన్నాడు– “వెంటనే వెళ్లి అర్జునుడికి సహాయం చేయి. ఇది నా మాట!” అన్నాడు ధర్మరాజు.

సాత్యకి అన్నాడు– “నిన్ను సదా రక్షిస్తూ ఉండమని అర్జునుడు నన్ను ఆదేశించి వెళ్లాడు. ద్రోణుని ప్రతిజ్ఞ మనకు తెలుసు. అంతేకాక అర్జునుడి గురించి నీవు చింతపడనవసరం లేదు. కృష్ణార్జునులున్న చోట కార్యవిఘాతమెన్నడూ కలుగదు”

యుధిష్ఠిరుడన్నాడు– “నన్ను భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు రక్షిస్తారు. సాత్యకీ! నీవు వెళ్లి అర్జునుడికి సాయం చేయి”

సాత్యకి అన్నాడు– “రాజా! నీ మాట, ఆదేశాన్ననుసరించి వెళ్తున్నాను. అర్జునుడిని అడ్డుకోవడానికి సంసిద్ధులై ఉన్న హస్తిపక్ష మ్లేచ్ఛసేనను, కర్ణుడి నియంత్రణలో ఉన్న రుక్మరథ వీరులను, ఏనుగుల సేనతో ఉన్న కిరాతులను, దుర్వారణులనే కాంభోజన సైనికులను చంపుతాను” అని పలికి బంగరు కేసరాల మాలలతో శోభించే సింహ చిహ్నం గల ధ్వజమున్న రథమెక్కి సాత్యకి భీమసేనుడితో అన్నాడు– “ధర్మరాజు రక్షణాభారం నీది. సైంధవుడిని అర్జునుడు చంపినాక వచ్చి మిమ్ములను కలుస్తాను” అని పలికి సాత్యకి అర్జునుడి వేపు వెళ్లాడు.

సాత్యకి–ద్రోణులు, కృతవర్మ–భీమసేనుడు, శిఖండి వీరిమధ్య భయంకరంగా యుద్ధం జరిగింది. కృతవర్మ శిఖండిని తీవ్రంగా గాయపరచాడు. పాండవులను పీడించాడు. భీమసేనుడు కూడా తట్టుకోలేకపోతున్న సమయంలో సాత్యకి వెనక్కి వచ్చి కృతవర్మపై దాడి చేసాడు. అతడి గుర్రాలను చంపి కృతవర్మను ఓడించి పారద్రోలినాడు.

త్రిగర్తుల సైన్యం సాత్యకిని చుట్టుముట్టింది. మగధ వీరుడు జలసంధుడు ఏనుగుపై కూర్చుని మేఘంలోని మెరుపులా వచ్చి సాత్యకిని ఎదిరించాడు. సాత్యకి ధనుస్సులను విరిచాడు. వాడి బాణాలతో గాయపరచాడు. క్రుద్ధుడైన సాత్యకి గొప్ప బాణంతో జలసంధుడి భుజాలను నరకగా అవి అయిదు తలల పాముల్లా నేలపై పడ్డాయి. వెంటనే మరో క్షురంతో జలసంధుడి తలను ఖండించాడు సాత్యకి. గాయపడిన ఏనుగు కూడా తన సేననే త్రొక్కుతూ పారిపోయింది.

జలసంధుడు మరణించడం తెలిసి దుర్యోధనుడు, దుర్మర్షణుడు, ద్రోణుడు, వికర్ణుడు, దుర్ముఖుడు అన్ని వేపుల నుంచి సాత్యకిని చుట్టుముట్టి గాయపరచారు. కోపించిన సాత్యకి వెంటవెంటనే బాణాలు ప్రయోగిస్తూ దుర్యోధనుడి ధనుస్సును ఖండించి, గుర్రాలను చంపి, సారథిని పడగొట్టేసరికి దుర్యోధనుడు పారిపోయి చిత్రసేనుడి రథమెక్కినాడు. అదిచూసి కృతవర్మ వేగంగా వచ్చి సాత్యకి నెదుర్కొన్నాడు. తనకు ఎదురులేని ఆ రోజున సాత్యకి కృతవర్మను ఘోరంగా గాయపరచి మోకాళ్ల మీద కూర్చునేట్లు చేసి, సాత్యకి అర్జునుడి వేపు వెళ్తుండగా ద్రోణుడు అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్య పోరు ఘోరంగా సాగింది. ద్రోణుడు శక్తిని విసిరాడు. సాత్యకి సారథి మూర్ఛిల్లగా తానే రథాన్ని నడుపుకుంటూ ద్రోణుని బాణాలను ఎదుర్కొంటూనే ద్రోణుని రథపు గుర్రాలను, సారథిని గాయపరచాడు. దానితో గుర్రాలు బెదిరి రథాన్ని వ్యూహ ద్వారం దగ్గరకు లాక్కుపోయి అక్కడ నిలిచాయి.

సాత్యకి అప్రతిహతుడై వస్తుండగా అతడిని ఎదుర్కొన్నాడు సుదర్శనుడనే రాజు. పోరు గొప్పగా జరిగింది. కాని ఫలితం సుదర్శనుడు తల నరకబడి మరణించాడు. సుదర్శనుడిని చంపి సాత్యకి కాంభోజ, శక, శబర, కిరాత, బర్బరులను, యవనసేనను పారద్రోలినాడు.

సాత్యకిని అడ్డుకున్నారు దుర్యోధనుడు, దుశ్శాసనుడు, చిత్రసేనుడు, వివింశతి, శకుని, దుస్సహుడు, దుర్ధర్షణాదులు. అందరినీ గాయపరచి సాత్యకి దుర్యోధనుడి సారథిని చంపగానే గుర్రాలు రథాన్ని వేరే దిక్కుకు లాక్కుపోయాయి. రాళ్లతో కొడుతూ ఎదిరించిన పర్వతీయులను ఓడించాడు సాత్యకి. దుశ్శాసనాదులు సాత్యకి చేతిలో ఓడి ద్రోణుడి వెనుక చేరారు.

ద్రోణుడన్నాడు దుశ్శాసనునితో– "ఏమిటి దుశ్శాసనా! ఇక్కడ తిరుగుతున్నావు? వస్త్రాలు లాగడం, పాచికలు విసరడం, దంభాలు మాట్లాడడం సభలో పనికివస్తాయి కాని యుద్ధరంగంలో కుదరదులే. మహారథికుడివి, యువరాజువు, నీవే పారిపోతే సైనికులేమనుకుంటారు? సాత్యకితోనే ఓడిపోయి పారిపోతున్నావు కదా అర్జున భీమ నకుల సహదేవులతో యుద్ధమేం చేస్తావు. త్వరగా వెళ్లు. వెళ్లి గాంధారీ గర్భంలో ప్రవేశించు. పారిపోయే నీకు అంతకన్నా సురక్షిత ప్రదేశం లేదు. పోయి పాండవులకు అర్ధరాజ్యం ఇచ్చి సంధి చేసుకోండి. మునుపు భీష్ముడు చెప్పాడు. వినలేదు మీరు. భీముడు నీ నెత్తురు తాగుతానని ప్రతిజ్ఞ చేసాడని విన్నాను. జాగ్రత్తలో ఉండు. పారిపోవడం ఆపి ఆ సాత్యకిని నిరోధించు"

ఆ మాటలు విని కూడా విననట్లు వెళ్లిపోయాడు దుశ్శాసనుడు, సాత్యకి వెళ్లిన వేపు. ద్రోణుడు తన బాణాలతో పాంచాల రాజకుమారులైన వీరకేతువు, చిత్రకేతువు, సుధన్వుడు, చిత్రవర్మ, చిత్రరథులను చంపినాడు. అది చూసి ధృష్టద్యుమ్నుడు దుఃఖభారంతో మనసు క్రుంగిపోగా, ద్రోణుడి నెదుర్కొని తీవ్రంగా గాయపరచేసరికి ద్రోణుడు తన రథంపై కూర్చుని సొమ్మసిల్లినాడు. ద్రోణుని చంపే ఉద్దేశంతో కత్తిని చేబట్టి తన మీదకు దూకుతున్న ధృష్టద్యుమ్నుడిని అప్పుడే తెప్పరిల్లిన ద్రోణుడు జానెడు పొడవు బాణాలతో గాయపరచేసరికి మరల తన రథం మీదకు పోయాడు ధృష్టద్యుమ్నుడు.

ఈలోగా సాత్యకిని సమీపించాడు దుశ్శాసనుడు. సాత్యకిని బాణవర్షంతో ముంచాడు కాని, సాత్యకి తీవ్రంగా స్పందించి దుశ్శాసనుడి పార్శ్వరక్షకులను, సారథిని, గుర్రాలను చంపేసరికి త్రిగర్త సేనాపతి దుశ్శాసనుడిని తన రథం మీదకు ఎక్కించుకుని తీసుకుపోయాడు. భీముడి ప్రతిజ్ఞ గుర్తుకొచ్చి సాత్యకి ఆగాడు కాని లేకుంటే దుశ్శాసనుడి కథ ముగిసేది సాత్యకి చేతుల్లో.

సంకుల సమరం మొదలయ్యింది. కొద్దిసేపు దుర్యోధనుడు అద్భుతంగా యుద్ధం చేసి పాండవ సేనను క్షోభింపచేసాడు. ద్రోణుడు బృహత్క్షత్రుడు బ్రహ్మాస్త్రాలు ప్రయోగించుకున్నారు. చివరకు కేకయ మహారథుడైన బృహత్క్షేత్రుడు ద్రోణుడి బాణాలకు ప్రాణాలు కోల్పోయాడు. చేదిరాజైన ధృష్టకేతువు ద్రోణుడి నెదిరించాడు. ద్రోణుడు ఆకలిగొన్న నెమలి క్షుద్ర పక్షులను భక్షించినట్లు శిశుపాలుని కొడుకు ధృష్టకేతువును, ధృష్టకేతువు పుత్రుడిని చంపివేసాడు. జరాసంధుడి కుమారుడిని చంపాడు. పాంచాల సృంజయ వీరులను, చేదివంశ ప్రముఖులను చంపుతూ పోతుంటే వాళ్లు భీమసేనుడి కోసం, ధృష్టద్యుమ్నుడి కోసం కేకలు పెట్టారు. ద్రోణుడి విజృంభణకు ధృష్టద్యుమ్నుడి కుమారుడు క్షత్రధర్ముడు నేలకూలినాడు. చేకితానుడు విరథుడు కాగా అతడి గుర్రాలు రథాన్ని లాక్కుపోయాయి. ద్రోణుడు–అసీతి పంచకః – ఎనభై అయిదేళ్ల వయసున్నవాడు పదహారేళ్ల యువకుడిలా వీర విహారం చేస్తున్నాడు.

యుధిష్ఠిరుడికి మనశ్శాంతి లేదు. ముందు అర్జునుడి గురించి, ఇప్పుడు అర్జున, సాత్యకి లిరువురి గురించి బాధ పడుతూ భీమసేనుడిని వెళ్లమన్నాడు వాళ్లకు సాయంగా.

భీముడు యుధిష్ఠిరుని రక్షణ బాధ్యతను ధృష్టద్యుమ్నుడికి, ఇతరులకు అప్పగించి అర్జున, సాత్యకిలు వెళ్లినవేపు వెళ్లాడు. మొదట ద్రోణుడు అడ్డు తగిలాడు భీమసేనుడికి. గురుశిష్య భావం తొలగగానే శత్రు క్రోధం ఉద్భవించి భీముడు గదాదండంతో ద్రోణుడి రథాన్ని విరగగొట్టాడు. ద్రోణుడు మరో రథమెక్కినాడు. ఈలోగా దుశ్శాసనుడు భీముడిపైకి శక్తి విసరగా భీముడు దానిని రెండుగా ఖండించి, కుండభేది, సుషేణ, దీర్ఘనేత్రులను, బృందారకుడు, అభయుడు, రౌద్రకర్ముడు, దుర్విమోచనులను చంపినాడు. విందానువిందులు, సువర్మను కూడా యమపురికి పంపి ద్రోణుడి రథాన్ని విరగగొట్టాడు మరోసారి భీముడు. రథం నుండి దూకి రథం తర్వాత శత్రు రథాల్ని ఎనిమిదింటిని విసిరివేసి మరల తన రథమెక్కాడు భీమసేనుడు.

భీముడిని చూసి అర్జునుడు, కృష్ణుడు సింహనాదాలు చేసారు. ధర్మరాజు మనోవ్యథ తీరింది కాని, అప్పుడు అర్జునుడిలో బాధ మొదలయ్యింది ధర్మజుడి రక్షణ గురించి. సాత్యకి కూడా సందేహపడినాడు.

భీమసేనుడి నెదిరించాడు కర్ణుడు కాని గాయపడినాడు, కర్ణుడికి సాయంగా దుశ్శలుడు రాగా దుశ్శలుడిని చంపినాడు భీముడు.

అది చూసి దుర్యోధనుడు కోపంతో కళ్లెర్ర చేసి ద్రోణునితో అన్నాడు– "అర్జునుడు, సాత్యకి, భీముడు తమరిని దాటి వెళ్లి సైంధవుని సమీపిస్తున్నారు. తమరు వ్యూహ ముఖద్వారం వద్ద ఉన్నా వాళ్లు లోపలికి వెళ్లగలిగారు. జరిగినదేదో జరిగిపోయింది. ఇప్పుడేం చేద్దాము?"

ద్రోణుడన్నాడు– "సైంధవ రక్షణ మనం చేయాలి. నీవుకూడా అక్కడకు వెళ్లు. సైంధవ రక్షకులను రక్షించు. ఎప్పుడు నీది నీ ధోరణే. నీవనుకున్నట్లు జరగాలి అనుకుంటావు. తద్భిన్నంగా జరిగితే నెపాన్ని ఇతరులపై నెడతావు. జూదంలో శకుని విసిరిన పాచికలు అసలైన బాణాలు. ఇప్పుడు బాణాలే పాచికలు. నేను ఇక్కడే ఉంటాను. నన్నెదిరించిన వారిని నిలువరిస్తాను. నీవు వెళ్లి సైంధవుడిని రక్షించు".

దుర్యోధనుడు వెళ్తూ యుధామన్య, ఉత్తమౌజులతో యుద్ధం చేసాడు. ఒకరి రథాలనొకరు నుగ్గునుగ్గు చేసుకున్నారు. దుర్యోధనుడు శల్యుని రథమెక్కాడు. యుధామన్య ఉత్తమౌజులు వేరే రథాలెక్కి అర్జునుడిని చేరుకున్నారు.

భీమసేనుడు కర్ణుడి మధ్య మరల యుద్ధం జరిగింది. భీముడు విజృంభించి కర్ణుడిని విరథుడిగా చేసాడు. అతడికి సాయంగా వచ్చిన దుర్జయుడిని చంపినాడు భీముడు. కర్ణుడు మరొక రథమెక్కి భీముడి నెదిరించి ఘోరయుద్ధం చేసి గాయపడి పారిపోయాడు. ఈసారి దుర్మర్షణుడు, దుస్సహుడు, దుర్మదుడు, దుర్ధరుడు, జయుడు నేలకూలినారు భీముడి దెబ్బలకు.

కర్ణుడు పారిపోయాక భీమసేనుడు మరింత విజృంభించి చిత్రుడు, ఉపచిత్రుడు, చిత్రాక్షుడు, చారుచిత్రుడు, శరాసనుడు, చిత్రాయుధుడు, చిత్రవర్మలను చంపివేసాడు. కర్ణుడు వచ్చి మరల భీముడిపై తలపడి ఘోర యుద్ధం చేసాడు.

కర్ణుడికి సాయంగా వెళ్లిన మరో ఏడుగురు కౌరవ సోదరులు– శత్రుంజయ, శత్రుసహ, చిత్రబాణ, అగ్రాయుధ, దృఢ, చిత్రసేన, వికర్ణులను చంపాడు. వికర్ణుడంటే భీముడికిష్టం.

**త్వమాగాః సమరం వీర క్షాత్రధర్మ మనుస్మరన్**
**తతో వినిహతః సంఖ్యే యుద్ధ ధర్మోహి నిష్ఠురః** (ద్రోణ. 137–33)

"నీవు న్యాయం వేపు నిలిచావు. కాని యుద్ధరంగంలో నాకెదురు నిలిచాడు. నా ప్రతిజ్ఞను కాపాడుతూ నిన్ను చంపాను. యుద్ధ ధర్మం చాలా నిష్ఠురమైనది" అన్నాడు తీవ్ర శోకంతో భీమసేనుడు చనిపోయి పడివున్న వికర్ణుడిని చూసి.

భీమ కర్ణుల మధ్య మరల గొప్ప యుద్ధం జరిగింది.

**తావు భౌ నరశార్దూలౌ శార్దూలా వివ దంష్ట్రిణౌ**
**జీమూతావివ చాన్యోన్యం ప్రవవర్షతు రాహవే** (ద్రోణ. 139–15)

రెండు పెద్ద పులుల్లా, రెండు మేఘాల్లా పోరాడారు వాళ్లు. కర్ణుడు పట్టిన ప్రతి ధనుస్సును విరిచాడు భీముడు. పదునెనిమిది ధనుస్సులు విరిగాయి. పంధొమ్మిదవ ధనుస్సుతో పరాక్రమించాడు కర్ణుడు. బాణవృష్టితో భీముడిని కప్పివేసాడు. వాటిని భేదించి భీముడు శక్తిని విసిరాడు. కర్ణుడు ఆ శక్తిని ఖండించి భీముడిని విరథుడిని చేయగా, భీముడు కత్తీ డాలు చేబట్టగా, డాలును ముక్కలు చేసాడు కర్ణుడు. భీముడు ఖడ్గాన్ని విసిరి కర్ణుడి విల్లును నరికాడు. మరో ధనుస్సును తీసుకుని కర్ణుడు భీముడిని మూర్ఛిల్లేలా కొట్టినాడు. భీముడి ఆయుధాలన్నీ అయిపోగా పక్కనే చచ్చి పడి ఉన్న ఏనుగు శవాన్ని కర్ణుని పైకి విసిరాడు. ఏది కనిపిస్తే దానిని విసుర్తూనే ఉన్నాడు. పిడికిటి పోటుతో కర్ణుని చంపగలిగీ, అర్జునుడి ప్రతిజ్ఞ గుర్తుకు వచ్చి చంపలేదు.

కర్ణుడు కూడా కుంతీదేవికిచ్చిన మాటను గుర్తుంచుకుని భీముడిని చంపలేదు కాని– వింటి కొనతో భీముని తాకినాడు. ఆ విల్లు లాక్కుని కర్ణుడి తలపై కొట్టాడు భీముడు.

కర్ణుడు కోపంగా అన్నాడు– "నపుంసకా! మూర్ఖా! తిండిపోతా! నీకెందుకు యుద్ధం? పోయి కందమూల ఫలాలు తింటూ అడవులలో తిరుగు. వంటలు వండు!"

భీముడన్నాడు– "నీవు చాలాసార్లు ఓడిపోయావు. ఇప్పుడేదో ప్రేలుతున్నావు. రా రథం దిగి మల్లయుద్ధానికి, కీచకుడిని చంపినట్లు చంపుతాను"

దానితో కర్ణుడు యుద్ధాన్ని విరమించాడు.

అప్పుడు అర్జునుడు వేగంగా కర్ణునిపైకి వెళ్లాడు. కర్ణుడికి సాయంగా అశ్వత్థామ వచ్చాడు. వారినిద్దరిని తరిమికొట్టాడు అర్జునుడు.

## అలంబుషుడు అనే రాజు

అలంబుషుడు అనే రాజు సాత్యకి చేతిలో మరణించాడు. కౌరవసేనను పారద్రోలుతూ తన దగ్గరకు వచ్చిన సాత్యకిని చూసి అర్జునుడన్నాడు– "ధర్మరాజును రక్షించాల్సిన బాధ్యత సాత్యకిది. మరి అతడు మనవేపు వస్తున్నాడు. సాత్యకి అలసిపోయి ఉన్నాడు. సాత్యకి శత్రువు భూరిశ్రవుడతడి వేపు వెళ్తున్నాడు. సైంధవుడింకా చావలేదు. ఇప్పుడు సాత్యకిని రక్షించాలి. మనపని రెండింతలైంది".

సాత్యకి భూరిశ్రవుల మధ్య గొప్ప యుద్ధం జరిగింది. యుద్ధంలో తన పుత్రులను చంపిన భూరిశ్రవునిపై సాత్యకి విరుచుకుపడ్డాడు. ఇరువురి ధనుస్సులు విరిగాయి. కత్తులు విరిగాయి. మల్లయుద్ధానికి దిగారు. పాద బంధాలు, ఉదర బంధాలు, ఉద్భ్రమణాలు, గత, ప్రత్యాగత, ఆక్షేప, పాతన, ఉత్థాన, సంప్లుతాలతో పోరాడుతున్నారు. మల్లయుద్ధంలోని 32 కళలనూ ప్రదర్శించారు. శ్రీకృష్ణార్జునులు చూస్తూ ఉండగానే భూరిశ్రవుడు సాత్యకిని ఎత్తి నేలమీద పడవేసి లాగుతూ కత్తిని ఒరలోంచి లాగి సాత్యకి జుట్టు పట్టుకుని కాలితో ఛాతీపై తన్నాడు. సాత్యకి తన తల దొరక్కుండా అటు ఇటు తిప్పుతూ ఉన్నాడు. శ్రీకృష్ణుడు చెప్పగా అర్జునుడు గాండీవంపై పదునైన బాణాన్ని ఎక్కుపెట్టి వదిలి భూరిశ్రవుడి చేతిని నరికాడు. కత్తి పట్టిన ఆ చేయి అయిదు తలల పాములా నేలపై పడింది. భూరిశ్రవుడు అర్జునుని నిందించాడు– "నీతో ముఖాముఖీ తలపడని నా చేతిని దూరం నుంచి ఖండించావు. క్షాత్రధర్మం తప్పావు. ఈ శ్రీకృష్ణుడు నిన్నీ పని చేయమని ప్రేరేపించాడు"

అర్జునుడన్నాడు– "సాత్యకి నా ప్రియ శిష్యుడు. నాకు సాయం చెయ్యాలని వస్తే నీవు అడ్డం వచ్చావు. కత్తిపట్టి తల నరకబోతున్నావు. నేను చూస్తూ ఊరుకోనా?"

దానితో భూరిశ్రవుడు రణభూమిలో ప్రాయోపవేశం చేసాడు. అటువంటి స్థితిలో ఉన్న భూరిశ్రవుని సాత్యకి లేచి కత్తితో తల నరికివేసాడు.

సాత్యకి అన్నాడు– "ధర్మం, అధర్మం అని ఏదో ఏదో చెబుతున్నారు. నిన్న అభిమన్యుడిని వీళ్లంతా ధర్మంగానే చంపారా? అయినా ఈ భూరిశ్రవుడి పట్టు నుంచి తప్పించుకోవడానికి నేను పెనుగులాడుతూనే ఉన్నాను. నన్ను జుట్టు పట్టుకు లాగాడు. ఛాతీమీద కాలితో తన్నాడు. ఇవన్నీ మీకు కనిపించలేదా? అర్జునుడు ఇతడి బాహువును ఖండించడం వల్ల నేను కీర్తికి దూరమయ్యాను. దైవ నిర్ణయమిది. నా కుమారుల్ని చంపలేదా ఇతడు? భూరిశ్రవుడు చనిపోవాల్సింది, చనిపోయాడు".

శంతనుడి సోదరుడైన బాహ్లికుడి కుమారుడు సోమదత్తుడు. సోమదత్తుని కుమారుడు భూరిశ్రవుడు. యదువంశంలో జనించిన 'శిని' కుమారుడు సత్యకుడు. సత్యకుని కొడుకు సాత్యకి. శూరసేనుడు–మారిషల కుమారుడు వసుదేవుడు. కుమార్తె కుంతి. దేవకుడి కుమార్తె దేవకీదేవి స్వయంవరంలో వసుదేవుడి తరపున 'శిని' అక్కడి రాజులందరినీ ఓడించాడు. ఆక్షేపించిన సోమదత్తుడిని నేలపై పడగొట్టి, జుట్టు పట్టుకుని కాలితో తన్నాడు. సోమదత్తుడు ఆ తరువాత పరమేశ్వరుని ప్రార్థించి కొడుకు ద్వారా ప్రతీకారం తీర్చుకునే వరం పొందినాడు. అందుకనే సోమదత్తుడి కొడుకు భూరిశ్రవుడు మహాబలుడైన సాత్యకిని కింద పడవేసి జుట్టు పట్టుకుని లాగి ఛాతీపై తన్నగలిగాడు. పాత పగ చల్లారింది కాని భూరిశ్రవుడి మరణం వాస్తవమయ్యింది.

## జయద్రథ వధ

సూర్యాస్తమయ సమయం కావస్తున్నది. దుర్యోధనుడు, కర్ణుడు, వృషసేనుడు, శల్యుడు, అశ్వత్థామ, కృపుడు సైంధవుని రక్షించడానికి సంసిద్ధులై ఉన్నారు. కృష్ణార్జునులకు సాత్యకి, భీమసేనుడు సాయంగా ఉన్నారు.

కర్ణుడు బాణవర్షం కురిపిస్తూ అర్జునుడిని నిలువరించాడు. అర్జునుడు మహోగ్రంగా పోరాడి కర్ణుని విరథుడిగా చేయగా అతడు అశ్వత్థామ రథమెక్కినాడు. వారుణాస్త్రం ప్రయోగించి అర్జునుడు కౌరవులందరినీ కల్లోపరచాడు. అర్జునుడి గాండీవ ధ్వనికి భయపడిన కౌరవసేన చేపలను, మొసళ్లను తనలో నింపుకున్న సముద్రంలా కనిపించింది. మృత్యు క్రీడాస్థలమైంది రణరంగం.

శ్రీకృష్ణుడన్నాడు– "ఇది సూర్యాస్తమయ సమయం, సైంధవుడి తల నేలపై పడకూడదు. అతడి తండ్రి వృద్ధక్షత్రుడు సమంత పంచకానికి వెలుపల ఘోర తపస్సు చేస్తున్నాడు. అతడి ఒడిలో సైంధవుడి తల పడేట్లు బాణాలను ప్రయోగించాలి. ఎవరైతే సైంధవుడి తలను నేలపై పడవేస్తారో అతడి శిరస్సు నూరు ముక్కలవుతుంది".

సూర్యాస్తమయమవుతున్న ఆ సమయంలో అర్జునుడు వజ్రసమ స్పర్శ కలిగిన బాణాన్ని అభిమంత్రించి సైంధవుడి పేరు మీద ప్రయోగించగా, అది సైంధవుడి తలను ఖండించి ఆకాశానికెగిరింది. బాణం తరువాత బాణాల్ని ప్రయోగిస్తూ దివ్యాస్త్రంతో సైంధవుడి తలను వృద్ధక్షత్రుడి ఒడిలో పడేట్లు చేసాడు అర్జునుడు. అతడు లేచి నిలబడగానే సైంధవుడి శిరస్సు నేలపై పడింది. వృద్ధక్షత్రుడి తల నూరు ముక్కలయ్యింది. సైంధవుడి మొండెం అప్పుడు నేలపై పడింది.

అర్జునుడు సింధురాజును చంపగానే కృష్ణుడు ఆ చీకటిని ఉపసంహరించాడు. సూర్యుడింకా ప్రకాశిస్తూనే ఉన్నాడు. అందరికీ అర్థమయ్యింది కృష్ణమాయ.

సైంధవుడు చంపబడగానే కృపాచార్యుడు అర్జునుడి నెదిరించి అతడి బాణాల దెబ్బకు మూర్ఛపోయాడు. రథసారథి రథాన్ని దూరంగా తీసుకుపోయాడు. గురువును చంపానేమో అనుకుని అర్జునుడు దుఃఖించాడు. కర్ణుడు అర్జునుడి మీదకు వస్తున్నపుడు సాత్యకి కర్ణుడి నడ్డగించాడు. దారుకుడు వచ్చి సాత్యకిని కృష్ణుడి రథంలో ఎక్కించుకున్నాడు.

కర్ణుడి నెదిరించి అర్జునుడు సమస్యలలో చిక్కుకోకుండా శ్రీకృష్ణుడు, సాత్యకికి ఆ పనిని వదిలేసి, రథాన్ని యుధిష్ఠిరుడి వద్దకు తీసుకుపోయాడు. వెళ్తూ వెళ్తూ కర్ణుడి రథం దగ్గర ఆగి అన్నాడు అర్జునుడు, భీముడు తనతో చెప్పిన మాటలు– "కర్ణా! ఆత్మశ్లాఘీ! భీమసేనుడిని తిట్టావట! సిగ్గులేనివాడా! మాటిమాటికీ యుద్ధరంగం నుంచి పారిపోయేవాడివి, భీముడు నిన్నెపుడైనా తిట్టాడా, లేదు కదా! నీవు నీ బుద్ధి చూపించుకున్నావు!

సరే, ఈ మాట విను– నీవు ఇంకో అయిదుగురితో కలిసి ఒంటరి అభిమన్యుడిని చంపావు. నేను నీ కుమారుని నీ కళ్లముందే చంపుతాను! చూస్తూ ఉండు!"

అర్జునుడలా ప్రతిజ్ఞ చేసిన సమయంలోనే సూర్యుడు కాంతి తగ్గి అస్త్రాద్రి వేపు వెళ్లిపోయాడు.

సైంధవ వధ అనంతరం తన వద్దకు వచ్చిన కృష్ణార్జునులను చూసి ఎంతో సంతోషించాడు యుధిష్ఠిరుడు. కొద్దిసేపటిలోనే సాత్యకి కర్ణుడిని నిలువరించి, గాయపడి ఉన్న భీముడితో కలిసి ధర్మరాజు వద్దకు వచ్చాడు.

అర్జునుడిని, భీముడిని, సాత్యకిని ప్రేమతో కౌగిలించుకుని, శ్రీకృష్ణుని స్తుతించాడు యుధిష్ఠిరుడు. పాండవులు ఆనందంగా ఉన్నారు.

దుర్యోధనుడు దుఃఖపీడితుడై ద్రోణుని వద్దకు వెళ్లి అన్నాడు– "భీష్ముడితో మొదలై సైంధవుడి వరకు ఎందరో రాజులు నేలకూలినారు. జలసంధుడు, కాంభోజుడు, అలంబుషుడు లాంటి మిత్రులు నాకోసం వచ్చి ప్రాణాలు విడిచారు. భూరిశ్రవుడు, అభీషాహులు, శూరసేనులు, శిబులు, వసాతులు మరణించారు. కర్ణుడొక్కడే పోరాడుతున్నాడు కాని ఈరోజు అతడూ పరాజయం పాలైనాడు. నేనిప్పుడేం చెయ్యాలి?"

ద్రోణుడన్నాడు– "నేను మొదటి నుంచి చెబుతూనే ఉన్నాను, అర్జునుడిని గెలవడం అసాధ్యమని. నీవు వినవు. పైగా వచ్చి వాగ్బాణాలతో నా హృదయాన్ని ఛేదిస్తున్నావు. పగటిపూట నేను పాండవ సృంజయులను సర్వనాశనం చేసాను. ఈ రాత్రి వాళ్లు నాపై దండెత్తవచ్చు".

ద్రోణుడికి నమస్కరించి దుర్యోధనుడు కర్ణుడితో సమావేశమైనాడు– "ఈ ద్రోణుడు అర్జునుడిని ఆపి ఉన్నట్లయితే ఇంత నాశనం జరిగేది కాదు. ఇతడి మీద నమ్మకంతో జయద్రథుడు ఇంటికి పోతానని మొత్తుకున్నా నేను అభయమిచ్చాను

కాపాడతానని. కాని చూడు ఏం జరిగిందో! జయద్రథుడితో పాటు గొప్పగొప్ప రాజులను, నా సోదరులు, నా సైనికులు నశించిపోయారు".

కర్ణుడన్నాడు– "ఆచార్యుని నిందించవద్దు. అతడు శక్తికొద్దీ పోరాడుతూనే ఉన్నాడు. దైవం మనకు అనుకూలంగా లేదు. మన పని మనం చేద్దాం. ఫలితం దైవాధీనం.

## రాత్రి యుద్ధం

సైంధవుని వధతో తీవ్ర దుఃఖానికి లోనైన దుర్యోధనుడు మరణానికి కూడా సిద్ధపడి శత్రుసైన్యంలోకి ప్రవేశించాడు. పాంచాలురను, పాండవులను గాయపరుస్తూ చొచ్చుకుపోతుంటే అతడి ధాటికి పాండవసేన పారిపోసాగింది. దుర్యోధనుడిని ఆపడానికి యుధిష్ఠిరుడు ముందుకు రాగానే అతడిని, అతడి సారధి ఇంద్రసేనుడిని గాయపరచాడు దుర్యోధనుడు నిశిత శరాలతో. దానితో యుధిష్ఠిరుడు చెవిదాకా లాగి విడిచిన బాణంతో గాయపడి మూర్ఛిల్లినాడు దుర్యోధనుడు. కురురాజును రక్షిస్తూ ద్రోణుడు వచ్చి అతడికి అండగా నిలబడినాడు.

సంధ్యాకాలంలో మొదలైన యుద్ధం చీకటిపడినా ఆగలేదు. అంతా ఉన్మాదమే! స్వపరభేదం తెలియడం లేదు. ఆ ప్రదోషకాలంలో ద్రోణుడొక్కడే వేయి ఏనుగులు, పదివేల రథాలను, లక్షలాది, కోట్లాది కాల్బలాన్ని, గుర్రాలను నశింపజేసాడు. ధృష్టద్యుమ్నుని కొడుకులను, శిబిరాజును చంపివేసాడు.

అటు భీమసేనుడు కళింగరాజు పక్కటెముకలు విరిగేలా కొట్టి చంపినాడు. కర్ణుడి సోదరులు ధ్రువుడిని, జయరాతుడిని అరచేత్తో కొట్టి చంపాడు. కర్ణుడు విసిరిన శక్తిని పట్టుకుని కర్ణుడి మీదకే విసిరాడు. ఆ శక్తిని శకుని నూనెబాణంతో ఖండించాడు. భీమసేనుడు తనపై దాడికి దిగిన ధార్తరాష్ట్రులు దుర్మద, దుష్కర్ణులను పిడికిలితో గుద్ది చంపి సింహనాదం చేసాడు.

తన కుమారుడు భూరిశ్రవుడిని సాత్యకి చంపాడని ఆగ్రహంతో ఉన్న సోమదత్తుడు సాత్యకిని బాణాలతో కప్పివేసాడు. ఆ బాణాల నుంచి తప్పించుకుని సాత్యకి కొట్టిన గొప్ప శరాఘాతానికి సోమదత్తుడు మూర్ఛిల్లగా, సారథి రథాన్ని దూరంగా తీసుకువెళ్లాడు.

సాత్యకి మీదకు ద్రోణుడు వస్తుంటే అతడిని పాండవులు, ఉపపాండవులు, విరాటుడు, ద్రుపదుడు అడ్డగగించారు. ద్రోణుని బాణాల ధాటికి పాండవ వీరుల తలలు నేలరాల్తున్నాయి.

సాత్యకి మీదకు అశ్వత్థామ దూసుకుపోతుంటే అశ్వత్థామను ఘటోత్కచుడు నిలువరించాడు. అది పెద్ద రథం. ఉక్కుతో చేసినది. ఎలుగుబంటి చర్మాలు పరచి ఉన్నాయి. పొడవు వెడల్పులు 12000 జానలు. యంత్రాలు, కవచాలు పేర్చి ఉన్నాయి. ఏనుగులులాగానే ఉన్న వాహనాలు. రెక్కలు విప్పి ఎగుర్తున్న గ్రద్ద ధ్వజ చిహ్నం, ఎనిమిది చక్రాల రథం. అక్షౌహిణి సేనతో వచ్చాడా రాక్షసయోధుడు. కోరదంతాలతో ఉగ్రంగా ఉన్నాడు, శంకువుల వంటి చెవులు, ప్రజ్వలించే ముఖం, లోనికిపోయిన పొట్ట, పెద్దగుంట వంటి గొంతు, నోరు తెరచిన యముడిలా వచ్చి సింహగర్జన చేసాడు. అందరూ పారిపోయినా అశ్వత్థామ ఎదుర్కున్నాడా రాక్షస వీరుడిని. వాడి బాణాలతో ఘటోత్కచుని గాయపరచగా, కోపించిన ఘటోత్కచుడు లక్ష ఆకులు, అంచుకు చురకత్తులు ఉన్న చక్రాన్ని విసరగా అశ్వత్థామ దానిని బాణాలతో నెట్టివేయగా, అభాగ్యుని సంకల్పంలా అది నేలపై పడింది. ఘటోత్కచుని కుమారుడు అంజనపర్వుడు అపూర్వ యుద్ధం చేసి అశ్వత్థామ బాణాలకు హతుడైనాడు. ఘటోత్కచుడు పుత్రశోకంతో బాధపడుతూనే అశ్వత్థామపైకి దాడి చేసి నీలమేఘంగా మారి రాళ్లవర్షం కురిపించాడు. వాయువ్యాస్త్రంతో అశ్వత్థామ ఆ మేఘాన్ని పారద్రోలాడు. ఘటోత్కచుడు శంకర నిర్మిత అశనిని విసరగా దానిని పట్టుకుని అశ్వత్థామ ఘటోత్కచుని రథంపైకి విసరగా అంతటి గొప్ప రథమూ అగ్నిదగ్ధమైనది. ఘటోత్కచుడు వెళ్లి ధృష్టద్యుమ్నుని రథమెక్కినాడు. అశ్వత్థామ అక్షౌహిణి రాక్షససేనను అంతమొందించాడు.

సోమదత్తుడు సాత్యకి మరల యుద్ధానికి సిద్ధమైనారు. సోమదత్తుడికి అతడి తండ్రి బాహ్లికుడు, సాత్యకికి భీముడు సాయంగా ఉన్నారు. భీముడి పరిఘ, సాత్యకి బాణం రెండూ ఒకేసారి సోమదత్తుడికి తగిలేసరికి అతడు మూర్ఛపోయాడు. దానితో సోమదత్తుడి తండ్రి, వీరులందరిలోకెల్లా వృద్ధుడు అయిన బాహ్లికుడు భీముని గాయపరచాడు. ఆ దెబ్బకు మూర్ఛపోయి తెప్పరిల్లిన భీముడు గద విసిరి బాహ్లికుని చంపాడు. అదే సమయాన తనను చుట్టుముట్టిన– నాగరధుడు, దృఢరాధుడు,

మహాబాహువు, అయోభుజుడు, దృఢుడు, సుహస్తుడు, విరజుడు, ప్రమాథి, ఉగ్రుడు, అనుయాయి - ధార్తరాష్ట్రులను చంపాడు. వీళ్లనే కాక శకుని సోదరులైన శతచంద్రుడు, గవాక్షుడు, శరభుడు, విభుడు, సుభగుడు, భానుదత్తుడు భీముని బాణాలకు కన్నుమూసారు.

యుధిష్ఠిరుడికి ద్రోణుడికి మధ్య గొప్పయుద్ధం జరిగింది. ద్రోణుడు వేసిన వాయువ్య, వారుణ, యామ్యా, ఆగ్నేయ, త్వాష్ట్ర, సావిత్ర, ఐంద్ర, ప్రాజాపత్య, బ్రహ్మాస్త్రాలకు తగిన అస్త్రాలతో బదులు చెప్పాడు యుధిష్ఠిరుడు. ధర్మరాజును వదిలి ద్రోణుడు పాంచాలురపై దాడికి దిగగా, భీమార్జునులు ద్రోణుని నిలువరించసాగినారు.

దుర్యోధనుడు అన్నాడు కర్ణుడితో- "మిత్రుడా! పోయి కౌరవసేనను రక్షించు"

కర్ణుడన్నాడు- "అర్జునుడిపై శక్తిని ప్రయోగిస్తాను. పాండవులను నేను గెలుస్తాను"

కృపాచార్యుడన్నాడు- "మాటలతో అయితే గెలుస్తావు

**శోభనం శోభనం కర్ణ సనాథః కురుపుంగవః**
**త్వయా నాథేన రాధేయ వచసా యది సిధ్యతి** (ద్రోణ. 158-13)

కర్ణా! మాటలు చాలుగాని కార్యరంగంలోకి దిగు! అర్జునుడు ధనుస్సులో, కర్ణుడు మాటలలో శూరుడు అనిపించుకోరాదు".

కర్ణుడన్నాడు- "గెలుపు దైవాధీనం. నీ నిందలు ఆపు, ద్విజాధమా!"

అశ్వత్థామ అన్నాడు- "సూతాధమా! నీ తల నరుకుతాను".

కృపుడన్నాడు- "అశ్వత్థామా తగవు వద్దు"

కర్ణుడన్నాడు- "ఎందుకు పట్టుకుంటావు, వదిలిపెట్టు!"

దుర్యోధనుడన్నాడు- "ఇది తగవుల కాలం కాదు"

కృపుడన్నాడు- "మేమితడిని క్షమిస్తున్నాము! అరుగో పాండవులు వస్తున్నారు, పోరాడు".

పాండవులు కర్ణుని చూసారు- "అడుగో! కర్ణుడు! అన్ని అనర్థాలకూ మూలమైన ఇతడిని చంపండి!"

కర్ణుడు తన బాణవర్షంతో పాండవ సేనను భయకంపితుల గావించాడు. కర్ణుడు తన మాటను నిలబెట్టుకుని రణరంగాన్ని పీనుగుల పెంట గావించాడు-

అప్పుడు కర్ణుడికి అర్జునుడికి మధ్య గొప్ప యుద్ధం జరిగింది. విరథుడై కర్ణుడు తన రథం దూకి కృపుడి రథమెక్కినాడు. దానితో కౌరవసేన చెల్లాచెదురయ్యింది. దుర్యోధనుడు అందరినీ ఉత్తేజపరుస్తూ అర్జునుడి మీదకు వెళ్తుంటే కృపుడు అన్నాడు అశ్వత్థామతో- "అగ్ని వద్దకు శలభంలా అర్జునుడి మీదకు దుర్యోధనుడు వెళ్తున్నాడు. అతడిని ఆపు!"

అశ్వత్థామ వేగంగా వెళ్లి దుర్యోధనుడిని ఆపి తాను వెళ్లి పోరాటం మొదలుబెట్టాడు. ధృష్టద్యుమ్నుడికి అశ్వత్థామకు మధ్య ఘోరయుద్ధం జరిగింది. భీమార్జునులు విజృంభించగా కౌరవసేన చీకటి, నిద్రల కారణంగా చెదిరిపోయింది.

సాత్యకి సోమదత్తుల మధ్య ద్వంద్వయుద్ధం తీవ్రమై ఇద్దరూ గాయపడి వికసించిన పూలు గల మోదుగ చెట్లవలె ఉన్నారు.

దుర్యోధనుడి ఆజ్ఞతో కాల్బలం ఆయుధాలను వదిలి దీపాలను చేతబట్టారు. రథంలో అయిదేసి దీపాలు, ఏనుగు మీద మూడు దీపాలు, ప్రతి గుర్రం మీద ఒక దీపం ఏర్పాటు చేసుకున్నారు.

దీపాలకాంతులలో తళతళలాడుతున్న పరిఘలు, శక్తులు, ఆయుధాలు ప్రతిబింబించగా మరల మరల దీపాలను సృష్టిస్తున్నాయి.

పాండవుల సేనలో కూడా ఏనుగు మీద ఏడు, రథం మీద పది, గుర్రాల మీద రెండు దీపాలను పెట్టారు.

## దీపాల వెలుగులో యుద్ధం

వేలకొలది దీపాల వెలుగులో కనీవినీ ఎరుగని విధంగా రణభూమి గ్రహాలతో నిండిన ఆకాశంలా కనిపిస్తున్నది. ప్రళయకాలంలో భూమి తగలబడుతున్నట్లు, వర్షఋతు సాయంకాలంలో మిణుగురు పురుగులు చుట్టుముట్టిన చెట్లవలె తళతళ లాడుతున్నాయి.

ద్రోణుని రక్షించడమే కర్తవ్యంగా కౌరవులు, ద్రోణుని సంహరించడమే ధ్యేయంగా పాండవులు పరస్పరం దాడులకు దిగారు. కృతవర్మ విజృంభించి పోరాడగా ధనుస్సు విరిగి, రథం నశించి, కవచం శిథిలమై యుధిష్ఠిరుడు ఓటమిపాలై రణభూమి నుంచి వేగంగా నిష్క్రమించాడు.

సాత్యకి గొప్ప యుద్ధం చేసి భూరి అనే వీరుడిని సంహరించాడు. అశ్వత్థామ ఘటోత్కచుల మధ్య యుద్ధం తారాస్థాయికి చేరింది. అశ్వత్థామ మూర్ఛపోయి తెప్పరిల్లి ఘటోత్కచుడు మూర్ఛిల్లేలా కొట్టాడు. సారథి అతడిని దూరంగా తీసుకుపోయాడు.

దుర్యోధనుడు భీమసేనుడు బాణాలతో కొట్టుకున్నారు. భీముడు విసిరిన గదను ముక్కలు చేసాడు దుర్యోధనుడు. అయితే రెండవ గద దుర్యోధనుడి రథాన్ని నుగ్గునుగ్గు చేసింది. దుర్యోధనుడు తప్పించుకుని నందుడి రథమెక్కాడు.

కర్ణుడు–సహదేవుల మధ్య యుద్ధం ఏకపక్షం కాగా కర్ణుడు సహదేవుని అవమానించి వెంటబడి తరుముతూ– "మాద్రీసుతా! మేటి రథికులతో పోరాటం నీకెందుకయా! పోయి అర్జునుడి పంచలో నిలబడు" అన్నాడు. కర్ణుడి బాణాలకు వాగ్బాణాలకు సహదేవుడికి జీవితంపై విరక్తి కలిగింది.

శల్యుడు విరాటుని గాయపరచి అతడి సోదరుడైన శతానీకుడిని చంపాడు.

అలంబుస రాక్షసుడు ఎనిమిది చక్రాల రథంలో వచ్చి అర్జునుడితో పోరాటం చేసి గాయపడి పారిపోయాడు.

నకులుని కుమారుడు శతానీకుడు చిత్రసేనుడిని ఓడించాడు. కర్ణుని కుమారుడు వృషసేనుడు ద్రుపదుని గాయపరచాడు. ప్రతివింధ్యుడు తన సోదరులతో కలిసి దుశ్శాసనుడితో యుద్ధం చేసాడు. నకులుడు శకునిని ఓడించాడు. కృపుడు శిఖండిని పారద్రోలాడు.

**దీప్యమానాః ప్రదీపాశ్చ రథవారణ వాజిషు**
**అదృశ్యంత మహారాజ మహోల్కా ఇవ ఖాచ్చ్యుతాః** (ద్రోణ. 169-42)

దీపాల కాంతిలో రణరంగం పట్టపగలులా కానవస్తున్నది.

సంకుల సమరం మొదలయ్యింది. సాత్యకి, ధృష్టద్యుమ్నులను చంపాలని కౌరవులు నిశ్చయించుకున్నారు. శకుని రథసేనతో అర్జునుడిపైకి వెళ్లాడు.

ద్రోణుడు ధృష్టద్యుమ్నుడిని ఎదుర్కొన్నాడు. సాత్యకి దుర్యోధనుడిని విరథుడిని చేసాడు.

అర్జునుడు శకుని రథాన్ని ముక్కలు చేసేసరికి అతడు తన కుమారుడు ఉలూకుని రథమెక్కినాడు. కృష్ణార్జునులు, ధృష్టద్యుమ్నుడు, సాత్యకిల పరాక్రమంతో కౌరవ సేనలు పాండవసేనల మధ్య రక్తనది ఏర్పడి యముని పట్టణం వేపు ప్రవహించే వైతరణిలా కానవచ్చింది.

దుర్యోధనుడు కోపంగా వెళ్లి కర్ణ ద్రోణులను హెచ్చరించాడు– "ఈ రాత్రియుద్ధం మీరిద్దరూ ప్రారంభించారు. తగిన రీతిలో యుద్ధం చేయండి!"

దానితో ద్రోణుడు, కర్ణుడు రెచ్చిపోయి ఘోర యుద్ధం చేసేసరికి పాండవసేన పారిపోసాగింది. చేతిలోని కాగడాలను వదిలేసి సైనికులు పారిపోతుంటే పాండవ సైన్యంలో చీకటి కమ్ముకున్నది. కౌరవ సైనికులు కూడా కాగడాలు పారేసారు.

కేవలం నామగోత్రాలను చెప్పుకుంటూ జయకాంక్షులై ఉభయ పక్షాలు యుద్ధం చేసాయి.

కర్ణుడు అత్యంత భయంకరంగా యుద్ధం చేస్తూ ధృష్టద్యుమ్నుని ఓడించాడు. పాంచాల సైన్యాన్ని పరాజితుల్ని గావించాడు.

శ్రీకృష్ణుడన్నాడు– "కర్ణుడి వద్ద ఇంద్రుడిచ్చిన శక్తి ఉన్నది. అర్జునా! నీవిపుడు అతడితో యుద్ధానికి వెళ్లరాదు. రాత్రిపూట రాక్షసులకు శక్తి ఎక్కువ".

అర్జునుడు ఘటోత్కచునితో అన్నాడు– "సాత్యకి తోడుగా రాగా కర్ణుని నిలువరిస్తావని నేను అభిప్రాయపడుతున్నాను"

ఘటోత్కచుడన్నాడు– "కర్ణుని వధింపగోరి వెళ్తున్నాను"

## మరో అలంబుసుడి వధ

దుర్యోధనుడు ఈసారి జటాసురుడి కుమారుడైన అలంబుసుడనే మరో రాక్షసుడిని రాత్రియుద్ధానికి పంపినాడు. ఈ అలంబుసుడు కూడా ఘటోత్కచునితో గొప్ప యుద్ధం చేసాడు. మామూలు యుద్ధం, మాయా యుద్ధం చేసినాక ఘటోత్కచుడు డేగలాగా పైకెగిరి అలంబుసుడిని పట్టుకుని అతడి శిరస్సును ఖండించి రక్తమోడుస్తున్న అతడి తలను దుర్యోధనుడి రథం పైకి విసిరి భయంకరంగా గర్జించాడు.

"ఇదుగో నీ ఆప్తుడు! చచ్చాడు. వీడూ అలంబుసుడే! ఈరోజు ఉదయం బకుడి సోదరుడు చచ్చాడు. వాడూ అలంబుసుడే! ఇకముందు నీకూ, కర్ణుడికి పట్టబోయే గతి ఇదే. నీవు రారాజువు కదా! వట్టి చేతులతో నిన్ను దర్శించరాదని ఈ కానుక ఇచ్చాను. స్వీకరించు!" అంటూ ఘటోత్కచుడు కర్ణుడివేపు వెళ్లాడు.

పెద్ద శరీరం, ఎర్రటి కన్నులు, పొట్ట ఒక గుంటలా, నిటారు వెంట్రుకలు, నల్లటి గడ్డం మీసాలు, మేకుల్లాంటి చెవులు, పెద్ద దవడలు, ముఖం చెవుల దాకా విస్తరించి ఉంటుంది. పదునైన కోరలు. మహా భయంకరుడు. నాలుక, పెదవులు చాలా పొడవైనవి, ఎర్రనివి. లావు ముక్కు, శరీరం నీలవర్ణం, మెడ లోహిత వర్ణం, పర్వతంలా ఉంటాడు. పెద్ద శరీరం, పొడవైన చేతులు, పెద్ద తల.

కంచు కవచం, తోరణం లాంటి కిరీటం, ఎనిమిది చక్రాల రథం, నూరు గుర్రాలు లాగుతూ ఉంటాయి. సమస్త ఆయుధాలు ఆ రథంలో ఉంటాయి. ఎర్రటి తల గలిగిన గ్రద్ద ధ్వజం.

## కర్ణ - ఘటోత్కచుల యుద్ధం

ఆ ఘటోత్కచుడు విక్రమిస్తున్న కర్ణుడిపై యుద్ధానికి వెళ్లాడు. మామూలు శస్త్ర అస్త్రాలతో ఇరువురికి గాయాలయ్యాయి. కర్ణుడు దివ్యాస్త్రం ప్రయోగించగా ఘటోత్కచుడు మహామాయను సృష్టించాడు. అనేక రకాల ఆయుధాలు విపరీతమైన వేగంతో వచ్చిపడ్డాయి కర్ణుడి మీద. ఘటోత్కచుడు విసిరిన చక్రాన్ని, గదను, ఇతర ఆయుధాలను ముక్కలు ముక్కలు చేసాడు కర్ణుడు. కర్ణుడు వేసిన దివ్యాస్త్రాలను వికృత రూపాలతో మింగివేసాడు ఘటోత్కచుడు. కాసేపు మహా శరీరుడిగా, కాసేపు అంగుష్ఠమాత్రుడిగా కనిపించాడు. వివిధ దివ్యాస్త్రాలనూ తట్టుకున్నాడు. మహామాయను సృష్టించి వదిలాడు. అంజలికం అనే బాణంతో కర్ణుడి ధనుస్సు నరికాడు. కర్ణుడు మరో విల్లు తీసుకుని రాక్షస సంహారం మొదలెట్టాడు. ఘటోత్కచుడు విసిరిన అశనిని పట్టుకుని అతడిపైకే విసిరాడు కర్ణుడు. తన మాయ, రథం ధ్వంసం కాగా ఘటోత్కచుడు మాయమైనాడు.

ఇంతలో అలాయుధుడనే రాక్షసుడు హిడింబ, బక, కిమ్మీరుల బంధువు ఘటోత్కచుడిని చంపడానికి వచ్చి దుర్యోధనుడి పక్షాన చేరాడు. రారాజు అనుమతితో అతడు ఘటోత్కచునితో యుద్ధానికి వెళ్లాడు.

## అలాయుధుడి మరణం

అలాయుధుడు కూడా మహాబలవంతుడు. అతడూ ఘటోత్కచుడిలా పర్వత సమానుడు. నాలుగు వందల మూరలు ఎత్తు పొడవున్న రథం, నూరు గుర్రాలు లాగుతున్నాయి. 'నక్కలగుంపు' చిత్రించి ఉన్న పతాక అతడి ధ్వజం, జెండా గద, భుశుండి, ముసలం, నాగలి, ధనుస్సు చేపట్టినాడతడు. నరమాంస భక్షకులైన అతడి సైన్యం రాళ్లే ఆయుధాలుగా పాండవ సేనపై దాడి ప్రారంభించారు.

ఘటోత్కచుడితో పోరాడుతూ అలిసిపోయిన కర్ణుడికి సాయంగా అలాయుధుడు వెళ్లాడు. ఘటోత్కచుడు అదిచూసి కర్ణుడిని వదిలి అలాయుధుడిపై పోరాడసాగినాడు. భీముడు తన పుత్రుడికి సాయంగా వెళ్లాడు. భీముడు గద విసిరాడు. అలాయుధుడు దానిని తిప్పికొట్టినాడు.

కృష్ణుడి సలహాతో ధృష్టద్యుమ్నుడు, శిఖండి, యుధామన్య, ఉత్తమౌజులు, ఉపపాండవులు కర్ణుడిపైకి, నకుల సహదేవులు, సాత్యకి రాక్షస సైన్యంపైకి, అర్జునుడు ద్రోణుని సేనను ఎదుర్కొన్నారు. అలాయుధుడు, భీమసేనుడు కాసేపు

గదాయుద్ధం, ఆ తరువాత మల్లయుద్ధం చేసారు. భీముడి రక్షణకోసం ఘటోత్కచుడు వెళ్లగానే అలాయుధుడు పెద్ద పరిఘతో ఘటోత్కచుని నెత్తిమీద కొట్టాడు. క్షణకాలం మూర్ఛపోయిన ఘటోత్కచుడు తెప్పరిల్లి అగ్నిగోళం వంటి గదను అలాయుధుడిపై విసిరాడు. అది అలాయుధుడి రథాన్ని పిండిపిండి చేసింది.

అలాయుధుడు ఆకాశంలోకి ఎగిరి మాయాయుద్ధం చేసాడు. ఘటోత్కచుడూ మాయను మాయతో నాశనం చేసాడు. అతడు రాళ్లవానను కురిపిస్తే ఇతడు బాణవర్షంతో రాళ్లను పొడిపొడి చేసాడు. వాళ్లిద్దరూ వాలి సుగ్రీవుల్లా కొట్టుకున్నారు. ఆయుధాలు, చెట్లు, రాళ్లు అన్నీ అయ్యాక పదునైన ఖడ్గాలు తీసుకుని ఒకరి జుట్టు ఒకరు పట్టుకున్నారు. ఘటోత్కచుడు మహావేగంగా దూకి అలాయుధుడిని గిరగిరా తిప్పి నేలమీద పడవేసి తల నరికి సింహనాదం చేసాడు. ఆ శిరస్సును అలంబుసుడి తలను విసిరినట్లే దుర్యోధనుడి రథం మీదకు విసిరేసరికి దుర్యోధనుడు వణికిపోయాడు. ఘటోత్కచుడు సింహనాదం చేసాడు. రాక్షససేన పారిపోయింది.

కర్ణుడు తన బాణాలతో ధృష్టద్యుమ్నుని, శిఖండిని వణికించి, ఘటోత్కచుని వేపు వేగంగా వెళ్లాడు. కర్ణ ఘటోత్కచుల మధ్య యుద్ధం రాహువు-సూర్యుల మధ్య యుద్ధంలా కానవచ్చింది. కర్ణుడు దివ్యాస్త్రం ప్రయోగించి ఘటోత్కచుని రథాన్ని నాశనం చేసేసరికి అదృశ్యమైనాడు ఘటోత్కచుడు.

## ఘటోత్కచుని వధించుట

అలాయుధుడిని చంపి సింహనాదం చేస్తూ నాట్యం చేస్తున్న ఘటోత్కచుడినెదుర్కొన్నాడు కర్ణుడు. తన బాణాలతో అన్ని దిక్కులనూ కప్పివేసాడు. మాయమైన ఘటోత్కచుడు ఎటునుంచీ దూకే అవకాశం ఇవ్వడం లేదు. అయినా రాక్షస వీరులు శూలాలు, భుశుండులు, ఇనుప గుండ్లు, శతఘ్నులను వివిధ ఆయుధాలను ప్రయోగిస్తున్నారు. రాళ్లవాన కురిపించి కౌరవసేనను చంపసాగినారు.

ఘటోత్కచుడు వదిలిన చక్రాలు గల శతఘ్ని వచ్చి కర్ణుడి రథాశ్వాలను నాలుగింటిని చంపింది. కర్ణుడు రథం మీద నుంచి దిగి ఆలోచించాడు.

కౌరవ సైనికులు మొరపెట్టున్నారు- "మమ్మల్ని ఈ రాక్షసుడి బారినుంచి రక్షించు. ఈ రాత్రి గడిస్తే చాలు!"

కర్ణుడెంతో ఆలోచించాడు. అర్జునుడిని చంపడానికి దాచిన శక్తిని బయటకు తీసాడు. ప్రయోగించాడు ఘటోత్కచునిపై.

**సా తాం మాయాం భస్మకృత్వా జ్వలంతీ**
**భిత్త్వా గాఢం హృదయం రాక్షసస్య**
**ఊర్ధ్వం యయ్ దీప్యమానా నిశాయాం**
**నక్షత్రాణామంతరాణ్యా వివేశ** (ద్రోణ. 179-57)

ఆ ఇంద్రప్రసాద శక్తి రాక్షసమాయను భస్మం చేసి ఘటోత్కచుని గుండెను చీల్చి రాత్రిపూట వెలుగులు వెదజల్లుతూ పైకి వెళ్లి నక్షత్రాల మధ్యలో ప్రకాశించింది.

ఆ ఘటోత్కచుడు భిన్నదేహుడయి ప్రాణాలు పోగా తలక్రిందులుగా పడ్డాడు. నాలుక బయటకు వచ్చి భయంకరంగా పెద్ద శరీరంతో నేలపై పడేసరికి అతడి దేహం కింద ఒక అక్షౌహిణి సైనికులు నలిగి మరణించారు.

కర్ణుడి పరాక్రమానికి దుర్యోధనుడెంతో సంతోషించాడు. పాండవులు దుఃఖంతో కన్నీరునించారు.

ఒక్క శ్రీకృష్ణుడు మాత్రమే సంతోషంగా సింహనాదం చేసి నాట్యం చేస్తూ అర్జునుని కౌగిలించుకున్నాడు. శ్రీకృష్ణుడన్నాడు-

**దిష్ట్యాపనీత కవచః దిష్ట్యాపహృత కుండలః**
**దిష్ట్యా సా వ్యంసితా శక్తిః అమోఘస్య ఘటోత్కచే** (ద్రోణ. 180-14)

"ఇప్పుడు కర్ణునికి కవచకుండలాలు లేవు. శక్తి ఆయుధమూ లేదు. అతడు యుద్ధంలో హతుడైనట్లే. నీకోసం ఘటోత్కచుడు ప్రాణాలు విడిచాడు. ఇరావంతుడిని చంపిన అలంబుసుడిని చంపిన ఘటోత్కచుని కర్ణుడు చంపాడు.

కర్ణుడినిచంపితేనే ఈ కథ ముగుస్తుంది. ఇంద్రుడికి కవచకుండలాలిచ్చి కర్ణుడు వైకర్తనుడయ్యాడు. ఇప్పుడు ఇంద్రశక్తిని వ్యర్థం చేసి నీకన్నా బలహీనుడైనాడు. కర్ణుడు ధర్మాత్ముడు గనుకే 'వృష' నామంతో ప్రసిద్ధికెక్కినాడు. యుద్ధంలో ఇతడి రథం భూమిలో క్రుంగుతుంది. నేను చేసే సూచననుసరించి నీవు అతడిని చంపాలి.

నీ మేలు కోరి నేను మగధరాజైన జరాసంధుడిని, చేది దేశాధిపతి శిశుపాలుడిని సంహరింపజేసాను. ఏకలవ్యుడి బొటనవ్రేలు పోయింది. ఏకలవ్యుడినీ చంపాను. లేకుంటే వీరంతా కౌరవ పక్షాన చేరేవారు. హిడింబ, కిమ్మీర, బకాదులైన రాక్షసులను, అలాయుధుని, ఘటోత్కచుని చంపించాను. కర్ణుడు చంపకపోతే నేనే ఏదో రోజున అతడిని చంపాల్సి వచ్చేది. ఇతడు యజ్ఞద్వేషి.

ప్రతిరోజూ అర్జునుడిని 'శక్తి'తో చంపాలనే కర్ణుడు రణరంగంలోకి వచ్చేవాడు. యుద్ధం మొదలుబెట్టగానే ఆ విషయం మర్చిపోయేట్లు చేసేవాడిని. సాధ్యమైనంత వరకూ నేను కర్ణుడితో ద్వంద్వయుద్ధాన్ని తీవ్రతరం కానివ్వలేదు".

ధర్మరాజు శిబిరంలో వ్యాసుడు చెబుతున్నాడు– "ఇవ్వాల్టి నుంచి అయిదవరోజున సమస్త భూమండలం నీదవుతుంది. నిత్యం ధర్మపద్ధతిలోనే ఆలోచించు. ధర్మరాజా! యతోధర్మ స్తతోజయః" అని పలికి వ్యాసుడు అంతర్ధానమైనాడు.

**కృష్ణాశ్రయాః కృష్ణబలాః కృష్ణానాథాశ్చ పాండవాః**
**కృష్ణః పరాయణం చైషాం జ్యోతిషామివ చంద్రమాః** (ద్రోణ. 182–24)

పాండవులకు కృష్ణుడే ఆశ్రయం, బలం కూడానూ!

## 7) ద్రోణవధ పర్వము

### చంద్రోదయం

ధర్మరాజు అన్నాడు– "ధృష్టద్యుమ్నా! నీవు, జనమేజయుడు, శిఖండి, యశోధరుడు, నకుల సహదేవులు, ఉప పాండవులు, ద్రుపద విరాటులు, సాత్యకి కేకయులు, ప్రభద్రకులు, అర్జునుడు అందరూ ద్రోణవధను కోరి అన్నివేపుల నుంచి దాడి చేయండి!"

దుర్యోధనుడది గమనించి ద్రోణ రక్షణకై తన సైన్యాన్ని సంసిద్ధపరచాడు. అర్ధరాత్రి సమయం. అలసిపోయిన సైనికులు నిద్రా పరవశులై ఉత్సాహరహితులైనారు. రథాల మీద కొందరు, ఏనుగుల మీద కొందరు, గుర్రాల మీద పడి కొందరు నిద్రపోతున్నారు. ఎవరు ఎవరిని చంపుతున్నారో ఎవరికీ తెలియడం లేదు.

అర్జునుడది చూసి పెద్దగా అరిచినట్లు పలికాడు– "మీకు అందరికి ఇష్టమైతే ఈ యుద్ధభూమిలోనే కాసేపు నిద్రపొండి. సైనికులారా! చంద్రోదయం అయిన తరువాత మరల యుద్ధం చేయవచ్చు".

ఇరుపక్షాల సైన్యాలూ యుద్ధం విరమించాయి.

**తత్ తథా నిద్రయా భగ్నమ్ అబోధం ప్రాస్వపద్ భృశమ్**
**కుశలైః శిల్పిభిర్న్యస్తం పటే చిత్రమివాద్భుతమ్** (ద్రోణ. 184–44)

గుర్రాలు, ఏనుగులు, యోధులు అందరూ ఒళ్లు తెలియకుండా గాఢనిద్రలో మునిగిపోగా ఆ సైన్యం నేర్పరులైన చిత్రకారులతో చిత్రపటం మీద చిత్రించిన చిత్రం వలె కానవచ్చింది.

తరువాత రెండు గడియలలో చంద్రుడు ఉదయించాడు. లోకం అంతా వెన్నెలతో నిండిపోయింది.

**యథా చంద్రోదయోద్ధూతః క్షుభితః సాగరో భవత్**
**తథా చంద్రోదయోద్ధూతః స బభూవ బలార్ణవః** (ద్రోణ. 184–55)

మరల యుద్ధం ప్రారంభమయ్యింది.

దుర్యోధనుడన్నాడు ద్రోణునితో– "దివ్యాస్త్రాలన్నీ నీకు అధీనాలు. అయినా నీవు పాండవులను ఉపేక్షిస్తున్నావు".

ద్రోణుడన్నాడు– "వృద్ధుడనై ఉన్నా యథాశక్తి పోరాడుతున్నాను. సర్వ శస్త్రాస్త్రాల పరిజ్ఞానం ఉన్న నేను వాటిని అస్త్ర పరిజ్ఞానం లేని వీరిని చంపాలంటావు నీవు. సరే, పాంచాలురునందరినీ సంహరించాకే కవచాన్ని విడుస్తాను.

నీవు చాలాసార్లు సభలో అన్నావు కదా– 'నేను, కర్ణుడు, దుశ్శాసనుడు ఒకటయి పాండవులను చంపేస్తాము' అని. నీవు ఆ పని మీద ఉండు. దానాలు చేసావు, బాగా చదువుకున్నావు. సంపదలు అనుభవించావు. దేవ, ఋషి, పితృఋణాలు తీర్చావు. భయపడక అర్జునుడితో యుద్ధం చేయి" అన్నాడు ద్రోణుడు.

చంద్రుడి వెన్నెలలో మొదలైన యుద్ధం తెల్లవారేప్పటికి ఉధృతమైంది. రెండు భాగాలుగా విడిపోయి వస్తున్న కౌరవ సేనను చూసి అర్జునుడు రథాన్ని ద్రోణుడి ఎడమవేపు ఉండేట్లు చూడమన్నాడు.

భీముడన్నాడు– "అర్జునా! క్షత్రియస్త్రీ వీర సంతానాన్ని ఎందుకు కంటుందో దానికి తగిన సమయం వచ్చింది. పరాక్రమించి సత్యశ్రీ ధర్మ యశస్సుల ఋణం నుంచి విముక్తుడివికా!"

అర్జునుడు కౌరవసేనలోకి దూసుకుపోయాడు. తనను ఎదిరించిన వారిని బాణవర్షంతో గాయపరచి ముందుకు పోతున్నాడు. రణరంగంలో దుమ్ము ఎక్కువై అంతా అంధకారమయమయ్యింది.

యుద్ధంలో ద్రోణుడు దుర్జయుడై పాంచాల సేనను పీడించసాగినాడు. విరాట ద్రుపదులు, ద్రుపదుడి మనవళ్లు ముగ్గురు, పాంచాలురు ద్రోణుడి నెదుర్కొన్నారు. ద్రుపదుడి మనమళ్లను చంపాడు ద్రోణుడు. బ్రహ్మాస్త్రం ప్రయోగించి వేయిమంది పాంచాల వీరులనూ, రెండువేల ఏనుగులనూ చంపినాడు. ఆ తరువాత జరిగిన భయంకర యుద్ధంలో విరాటుని, ద్రుపదుడిని చంపాడు ద్రోణుడు. ధృష్టద్యుమ్నుడిని ఉత్సాహపరుస్తూ భీముడు ద్రోణుని సమీపించాడు. సంకుల సమరం జరిగింది ఆ సూర్యోదయ సమయంలో. వీరులందరూ సంధ్యావందనం చేసారు.

## పదిహేనవ రోజు యుద్ధం

రక్తనదులు, మాంసపు బురదతో రణరంగం భయంకరంగా కానవచ్చింది. రథం పోయే త్రోవ కానరావడం లేదు. దానికి తోడు పొడినేలల నుంచి లేస్తున్న దుమ్ము. కాసేపు చీకటి. మరల దుమ్ము అణిగాక శస్త్రాస్త్రాల మెరుపులు.

నకులుడు దుర్యోధనుల మధ్య గొప్ప యుద్ధం జరిగింది. దుర్యోధనుడు వెనుదిరిగాడు. సహదేవుడు దుశ్శాసనుడి సారథిని చంపేసరికి గుర్రాలు అతడి రథాన్ని లాక్కుపోతుంటే వాటిని అదుపులో తీసుకున్నాడు దుశ్శాసనుడు. ఈలోగా బాణవర్షం కురిపించాడు సహదేవుడు.

కర్ణుడటు వస్తుండగా భీముడతడి నెదుర్కున్నాడు. భీముడు గద విసిరితే ఆ గదనే భీముడి మీదికి విసిరాడు కర్ణుడు. ఇంకో గద విసిరి ఆ గదను ధ్వంసం చేసాడు. మరో గద విసిర్తే దానిని మరల భీముడి రథం పైకి విసరగా భీముడి సారధి మూర్ఛపోయాడు. భీముడిని విరథుడిగా చేయగా భీముడు నకులుడి రథం ఎక్కాడు.

ద్రోణార్జునుల మధ్య గొప్ప యుద్ధం జరిగింది. ఇద్దరూ దివ్యాస్త్రాలను వేసి నిర్వీర్యం చేసారు. రుద్రుడు తనను రెండు భాగాలుగా చేసుకుని ఈ గురుశిష్యులుగా మారి యుద్ధం చేస్తున్నాడనిపించేలా వాళ్ళు యుద్ధం చేసారు.

దుర్యోధనుడు సాత్యకి మిత్రులు. తమ స్నేహాన్ని గుర్తు తెచ్చుకుంటూ యుద్ధాన్ని నిందిస్తూ దుర్యోధనుడన్నాడు–

**ధిక్ క్రోధం ధిక్ సఖే లోభం ధిక్ మోహం ధిగమర్షితమ్**
**ధిక్ అస్తు క్షాత్ర మాచారం ధిక్ అస్తు బలమౌరసమ్** (ద్రోణ. 189–23)

"క్రోధ లోభ మోహాల్లా క్షత్రియ కృత్యం నిందింపదగినది. స్నేహం అంతరించింది యుద్ధరంగంలో".

సాత్యకి అన్నాడు– "ఆ రోజులు పోయాయి కదా!"

**క్వ సాక్రీడా గతాస్మాకం భల్వే వై శినిపుంగవ**
**క్వ చ యుద్ధ మిదం భూయః కాలో హి దురతిక్రమః** (ద్రోణ. 189–29)

ఇరువురి మధ్య ఘోర యుద్ధం జరిగింది. వారి మధ్యకు వస్తున్న కర్ణుడిని అడ్డగించాడు భీమసేనుడు. ద్రోణుడు భీకరంగా యుద్ధం చేసాడు ధృష్టద్యుమ్నునితో.

కృష్ణుడన్నాడు– "ద్రోణుడు అస్త్ర సన్యాసం చేస్తేనే గాని ఆతడిని వధించలేరెవ్వరూ! అశ్వత్థామ మరణించాడని తెలిస్తే అతడు ధనుస్సు పడేస్తాడు. ఎవరన్నా చెప్పాలి ఈ మాట ఆయనతో".

అర్జునుడు ఒప్పుకోలేదు. ధర్మరాజు చాలా కష్టంతో సరేనన్నాడు. భీముడు తమ సైన్యంలోని మాలవరాజు ఇంద్రవర్మ ఏనుగు- అశ్వత్థామ అనే పేరుగల దానిని చంపి, ద్రోణుడి వేపు వెళ్లి- "అశ్వత్థామ హతః" అన్నాడు.

ఆ మాట వినగానే ద్రోణుడు వ్యాకులత చెందినాడు. పాంచాలుర ఇరవై వేల రథాలను ధ్వంసం చేసి పొగలేని అగ్నిజ్వాలలా మండుతూ మత్స్య, సంజయ వీరులను చంపుతూనే ఉన్నాడు. అతడి ముందు మహర్షులు ప్రత్యక్షమైనారు- "బ్రాహ్మణ ధర్మాన్ని మరచి క్షాత్రధర్మాన్ని ఎన్నుకున్నావు. ఈలోకంతో పని పూర్తయ్యింది. బ్రహ్మాస్త్రం వేసి అస్త్రజ్ఞానం లేని వారిని చంపావు. ఆయుధాన్ని వదిలేయి" అన్నారు మహర్షులు, సికతులు, పృశ్నులు, గర్గులు, వాలఖిల్యులు, భృగువులు, అంగిరసులు. సూక్ష్మరూపులై వచ్చారు వాళ్లు.

"అశ్వత్థామ చనిపోయాడా?" అని అడిగాడు యుధిష్ఠిరుడిని.

శ్రీకృష్ణుడన్నాడు- "ద్రోణుడింకా సగంరోజు యుద్ధం చేస్తే నీ సేన సర్వనాశనమవుతుంది. ఇప్పుడు సత్యం కంటె అబద్ధం శ్రేష్ఠమయినది".

భీముడన్నాడు- "నేను అశ్వత్థామ అనే ఏనుగును చంపాను. నీవు అసత్యమాడకు. 'అశ్వత్థామ హతః కుంజరః' అను"

ధర్మరాజు వెళ్లాడు ద్రోణుడి వేపు. అన్నాడు స్పష్టంగా, అస్పష్టంగా

**అశ్వత్థామా హత ఇతి శబ్ద ముచ్చైశ్చ చార హ**
**అవ్యక్తమబ్రవీద్ రాజన్ హతః కుంజరః ఇత్యుత** (ద్రోణ. 190-55)

అశ్వత్థామ హతుడని పెద్దగా, హతమయ్యింది ఏనుగు -అని మెల్లగా అన్నాడు.

## ద్రోణ వధ

దానితో భూమికి నాలుగు అంగుళాల ఎత్తులో నడిచే యుధిష్ఠిరుడి రథం నేలకు తాకింది. అది అసత్య ప్రభావం.

వికల మనస్కుడైన ద్రోణుని చూసాడు ధృష్టద్యుమ్నుడు. అగ్నివలె మండుతున్న బాణాన్ని సంధించి ద్రోణుడిపై వదిలాడు. ద్రోణుడది చూసాడు. దివ్యాస్త్రాలు గుర్తుకు రాలేదు.

నాలుగు పగళ్లు ఒక రాత్రి గడిచాయి. పగలు మూడు జాములు గడిచాయి. బాణాలు అయిపోయాయి. దివ్యాస్త్రాలు ప్రసన్నం కాలేదు. అంగిరసం అనే ధనుస్సు తీసుకుని ఉన్న అస్త్రాలతో యుద్ధం చేసాడు.

ధృష్టద్యుమ్నుడు విజృంభించి తన గుర్రాలను ద్రోణుడి గుర్రాలలో కలిపాడు. ద్రోణుడు ఆగ్రహంతో ధృష్టద్యుమ్నుడి రథపు నొగను, చక్రాలను, రథ బంధాలను నాశనం చేసాడు. దానితో కోపించిన ధృష్టద్యుమ్నుడు గద విసిరాడు. ఆ గదను ద్రోణుడు ధ్వంసం చేసాడు. ఖడ్గాన్ని, డాలును తీసుకుని ఆచార్యుడి రథంపైకి దూకాడు ధృష్టద్యుమ్నుడు. ఇరవై ఒక్కరీతులుగా ఖడ్గ చలనం చేసాడు. ఖడ్గాన్ని డాలును ముక్కలు చేసాడు ద్రోణుడు, తన దగ్గర ఉన్న జానెడు పొడవుండే వైతస్తికాలు అనే బాణాలతో.

ఇంతలో సాత్యకి వచ్చి ధృష్టద్యుమ్నుడిని రక్షించాడు. అటు పాండవసేనలు ఇటు కౌరవ సేనలు ఘోరయుద్ధం చేస్తుండగా ద్రోణుడి అస్త్రాలు ప్రజ్వలించాయి, రథాలు ధ్వనించాయి. గుర్రాలు కన్నీళ్లు విడుస్తున్నాయి. ద్రోణుడి ఎడమకన్ను, ఎడమ భుజం అదిరాయి. మహర్షుల మాటలు వినబడినాయి. సర్వక్షత్రియ నాశం కోసం బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు ద్రోణుడు.

భీముడన్నాడు- "ఎవరి కోసం యుద్ధం చేస్తున్నావు?"

ద్రోణుడన్నాడు- "కర్ణా, కృపాచార్యా, దుర్యోధనా! నేను శస్త్రాలను వదిలివేస్తున్నాను".

శస్త్రాలు వదలి రథం మీద కూర్చుని, సర్వప్రాణులకు అభయమిచ్చి యోగనిష్ఠుడైనాడు ద్రోణుడు. అది చూసి ధృష్టద్యుమ్నుడు ధనుస్సును వదలి ఖడ్గం తీసుకుని ద్రోణుడి రథంపైకెక్కినాడు.

ద్రోణుడు యోగసమాధిలో జ్యోతిః స్వరూపుడై విష్ణువును ధ్యానిస్తూ, ఓంకార జపం చేస్తూ ద్రోణ భాస్కరుడిలా వెలుగొందగా రెప్పపాటు కాలంలో ఆ జ్యోతి అంతర్ధానమయ్యింది. ఆ జ్యోతిని అర్జునుడు, కృపుడు, సంజయుడు, యుధిష్ఠిరుడు, శ్రీకృష్ణుడు మాత్రమే చూడగలిగారు.

ప్రాణం పోయి ఏమీ పలుకని ఆ ద్రోణుడి జుట్టు పట్టుకుని ఖడ్గంతో ధృష్టద్యుమ్నుడు ద్రోణుని శిరస్సును ఖండించి సింహనాదం చేసాడు. చంపవద్దు, చంపవద్దు అంటున్న వారి మాటలు వ్యర్థమైనాయి. ద్రోణుని శరీరం రథం మీద నుంచి నేలపై పడింది. ద్రోణుడి శిరస్సును కౌరవుల వేపు విసిరాడు ధృష్టద్యుమ్నుడు.

ఉలూకుడు, దుశ్శాసనుడు, వృషసేనుడు, సుశర్మ లాంటి వీరులందరూ రణరంగాన్ని వీడి పారిపోయారు. అశ్వత్థామకు శిఖండి మొదలైన ప్రభద్రకులతో, పాంచాలురతో, కేకయులతో యుద్ధం జరిగింది. అతడు బయటపడి దుర్యోధనుని చేరి– "ఎందుకు కౌరవసేన పారిపోతున్నద"ని అడిగాడు. అశ్వత్థామకు ఆ దుర్వార్త చెప్పలేకపోయాడు దుర్యోధనుడు. అప్పుడు కృపాచార్యుడు నెమ్మదిగా ద్రోణవధ వృత్తాంతం చెప్పాడు అశ్వత్థామకు.

**ఆకర్ణ పలితః శామః వయసాశీతి పంచకః**
**రణే పర్య చరద్ ద్రోణః వృద్ధః షోడశ వర్షవత్** (ద్రోణ. 193-43)

"ఎనభై అయిదేళ్ల వయసులో పదహారేళ్ల పడుచువాడిలా యుద్ధం చేసి, యుధిష్ఠిరుడి 'అశ్వత్థామ హతః కుంజరః' మాటలతో మనస్సు వికలం కాగా ధనుస్సు పారేసి యోగనిద్రలో ప్రాణాలు వదిలిన నీ తండ్రిని ధృష్టద్యుమ్నుడు కత్తితో తల నరికి చంపినాడు" అన్నాడు కృపాచార్యుడు కన్నీళ్లు నిండిన కళ్లతో.

ఆ మాటలు వినగానే ధృష్టద్యుమ్నుడు తోక త్రొక్కిన త్రాచుపాములా తీవ్రంగా కోపించాడు.

## నారాయణాస్త్రమును ప్రయోగించిన అశ్వత్థామ

అశ్వత్థామ అన్నాడు రోషంగా– "నా తండ్రి అస్త్ర సన్యాసానికి కారణం ఆ ధర్మరాజు పలికిన అసత్యం. నా తండ్రి జుట్టు పట్టుకుని శిరస్సు ఖండించినది ఆ ధృష్టద్యుమ్నుడు చేసిన పాపకార్యం. దానిని పుత్రుడనై ఇంకా సహిస్తూ ఉండడ మనేది మహా నింద్యం.

నేనిప్పుడు దివ్యాస్త్రాన్ని, ఎవ్వరూ కనీవిని ఎరుగని నారాయణాస్త్రాన్ని ప్రయోగించి ఆ పాంచాల, పాండవులను సర్వనాశనం చేస్తాను" అంటూ సింహనాదం చేసాడు.

అది విన్న అర్జునుడన్నాడు– "పుట్టినప్పుడే అశ్వంలా ఏడ్చిన అశ్వత్థామ స్వరం అది. ధనుర్విద్యా విశారదుడైనా, నిరుపేదగా ఉన్న తండ్రి తన కుమారుడికి కాసిని పాలు కొనివ్వలేని స్థితిలో వెళ్లి తన తండ్రి వద్దనే చదువుకున్న సహాధ్యాయి ద్రుపదుడిని ధనసాయమడిగి అవమానించబడినాడు. తరువాత తన శిష్యుడితోనే ద్రుపదుడిని ఓడించి ఉత్తర పాంచాల రాజ్యాన్ని తన కొడుకుకిచ్చిన ద్రోణుని కుమారుడు అశ్వత్థామ సింహనాదం అది.

అయిదు రోజులు అద్భుత యుద్ధం చేసి ఒక్క చిన్ని అసత్యంతో ధనుస్సు విడిచిన ఆచార్యుడి పుత్రుడి ప్రతిజ్ఞాస్వరం ఇది.

అందరికీ ఆచార్యుడైన ద్రోణుని జుట్టు పట్టుకుని శిరస్సు ఖండించినందుకు ధృష్టద్యుమ్నుడిని వధించాలని అరుస్తున్న గొంతుక ధ్వని అది".

## ధృష్టద్యుమ్న - సాత్యకి సంవాదం

భీమసేనుడన్నాడు– "ధర్మ పన్నాలు వల్లిస్తున్నావా, అర్జునా? మనం యుద్ధంలో దిగింది ఎందుకు? యుద్ధరంగంలో మనతో యుద్ధం చేస్తున్నవాడు శత్రువే కదా! అతడు బ్రహ్మాస్త్రం వేసి అమాయకులను చంపవచ్చా?బ్రాహ్మణుడై ఉండి క్షాత్రధర్మంతో పాంచాల రాజ్యాన్ని పొందవచ్చా! సభలో ద్రౌపదికి అవమానం జరుగుతుంటే గొంతెత్తిన స్వరమేనా అది? మనలను ఎద్దు, ఎద్దు అని అవమానిస్తుంటే ఆపిన స్వరమేనా అది? అభిమన్యుడిని మూకుమ్మడిగా సంహరిస్తుంటే వద్దని పలికిన స్వరమేనా అది? అప్పుడు వాళ్లుధర్మాన్ని ఆచరించి గొంతెత్తలేదు. ఇప్పుడు నీవు ఆ స్వరాన్ని మెచ్చుకుని మమ్మల్ని అసత్యమాడామని అసహ్యించుకుంటున్నావు" అన్నాడు భీముడు.

ధృష్టద్యుమ్నుడన్నాడు– "ద్రోణుడు స్వధర్మ దూరుడు. అతడు క్షత్రియులను చంపుతుంటే ఊరుకోవాలా? నేను అగ్నినుంచి పుట్టిందే ద్రోణుడిని చంపడానికి. ఆయన యుద్ధంలో ఎవరిని చంపాడు? నా తండ్రి ద్రుపదుడిని చంపలేదా? నా సోదరులను చంపలేదా? విరాట మహరాజును చంపిందీ ఈ రాత్రే కాదా? నీవు సైంధవుడి శిరస్సును పడవేయలేదా? నీ తండ్రి మిత్రుడైన భగదత్తుని నీవు చంపలేదా? భీష్ముని, నిన్ను ఒడిలో పెట్టుకుని పెంచిన పితామహుడిని అంపశయ్యపై పడుకోబెట్టింది నీవు కాదా? మచ్చిక పడిన ఏనుగు తనమీద ఎక్కేవాళ్లకు తన శరీరాన్ని మెట్లుగా చేసినట్లు నేను మీకు అవనతుడనయ్యింది నా సోదరి ద్రౌపదితో మీకు వివాహమయ్యింది గనుక.

మాకూ ద్రోణాచార్యునికీ ఉన్న శత్రుత్వం లోక విదితం. యుధిష్ఠిరుడు అసత్యవాది కాదు. నేను అధార్మికుడనూ కాదు. శిష్యద్రోహి, పాపాత్ముడు, నా తండ్రిని చంపినవాడు హతుడయ్యాడు. ఇప్పుడు అశ్వత్థామ తన తండ్రిని చంపిన నన్ను చంపుతానని అరుస్తున్నాడు. అరవనీ! ఆ సమయం వచ్చినప్పుడు చూద్దాం!"

ధృష్టద్యుమ్నుడి మాటలు విన్న సాత్యకికి కోపం వచ్చింది– "ధృష్టద్యుమ్నా! గురువును జుట్టు పట్టుకుని చంపావు. ఇది నీచకార్యం కాదా? నీ నాలుక నూరు చీలికలు కాదేమి? నీ తల నూరు వ్రక్కలు కాదేమి? నీ సోదరుడు శిఖండి భీష్ముని పతనానికి కారణం. నీవు బ్రహ్మహత్య చేసావు, నీ ముఖం చూడరాదు. ఈ గదతో నీ ముఖం పగలగొడతాను".

ధృష్టద్యుమ్నుడన్నాడు– "సాత్యకీ! నీవు చెప్పడం, నేను వినడం చాలా గొప్పగా ఉంది. అవునూ! భూరిశ్రవుడి జుట్టు పట్టుకుని తలనరికిందెవరు? నేను ద్రోణుడితో యుద్ధం చేస్తూ అతడిని సంహరించాను. నీవు చావబోతుంటే ఇందాక నీతులు పలికిన అర్జునుడు బాణం వేసి భూరిశ్రవుడి భుజం ఖండిస్తే బ్రతికావు నీవు. అప్పుడు కదా నీవు ఆతడిని చంపింది. నాకు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంటే నీకే పాపం చుట్టుకోవాలి? సాత్యకీ! కౌరవులు అధర్మపరులు. వారికి సాయం చేస్తున్నవారు, వారి పక్షాన యుద్ధం చేస్తున్నవారూ అధర్మానికి చేయూతనిస్తున్నట్లే. పోయి వాళ్లతో యుద్ధం చేయి. నన్నేం కొడతావు గదతో?"

సాత్యకి ధృష్టద్యుమ్నుని మీద దూకబోతుంటే భీముడు, సహదేవుడు ఎంతో ప్రయత్నం మీద ఆపగలిగారు. శ్రీకృష్ణుడు, యుధిష్ఠిరుడు వచ్చి ఇద్దరిని శాంతపరచారు. ఇంతలో అశ్వత్థామ నారాయణాస్త్రాన్ని ప్రయోగించగా వెలుగుతున్న సర్పాల్లా అనేక బాణాలు వేలకొలది ఆవిర్భవించాయి. సూర్యకిరణాల్లా బాణాలు, జ్వలిస్తున్న ఇనుపగుండ్లు, శతఘ్నులు, ములుకులు, అనేక ఆయుధాలు ఆకాశంలోంచీ పడుతూ పాండవసేనను దహిస్తుంటే అర్జునుడు మధ్యస్థుడిలా ఉండడం చూసి యుధిష్ఠిరుడు అన్నాడు– "ధృష్టద్యుమ్నా! నీవు పాంచాల సేనతో పారిపో! సాత్యకీ, వృష్ణి, అంధక సేనలతో నీవు నీ రాజ్యానికి వెళ్లు! యుద్ధం వద్దు! నేను అగ్నిప్రవేశం చేస్తున్నాను".

శ్రీకృష్ణుడు ధర్మరాజును శాంతపరచి అన్నాడు– "ఇది నారాయణాస్త్ర ప్రభావం. యోధులారా! మీరు త్వరగా మీ శస్త్రాస్త్రాలను క్రింద పడవేయండి. గుర్రాలు, ఏనుగుల మీద నుంచి క్రిందకు దిగండి. నిరాయుధులైన వారిని ఈ అస్త్రం సంహరించదు. దోసిలొగ్గి నమస్కరించండి. మీరు క్షేమంగా ఉంటారు. మానసికంగా కూడా యుద్ధం చేయాలనుకోరాదు".

వెంటనే ఈ విషయం పాండవసేనలో వ్యాపించి అందరూ ఆయుధాలు పడవేసారు. గుర్రాలు, ఏనుగులు దిగినారు. నారాయణాస్త్రాన్ని శరణు వేడినారు.

అయితే భీముడు గద పైకెత్తి ఆ అస్త్రాన్ని ఎదిరించ రథం ఎక్కి అశ్వత్థామ నెదుర్కున్నాడు. అశ్వత్థామ నారాయణాస్త్రాన్ని భీముడి వేపు మళ్లించగా అది భీముని చుట్టుముడుతున్న సమయంలోనే అర్జునుడు వారుణాస్త్రం వేసి భీముడిని కప్పి తాను గాండీవాన్ని అస్త్రాలను కిందపెట్టి నారాయణాస్త్రాన్ని శరణువేడినాడు.

కృష్ణార్జునులు త్వరగా పరిగెత్తి భీముడిని రథం నుంచి లాగి, శస్త్రాస్త్రాలను కింద పడవేసారు. కృష్ణుడు కోపంగా భీముడిని చూసేసరికి పరిస్థితి అర్థమై అతడు చెప్పినట్లు చేసాడు భీమసేనుడు. నారాయణాస్త్రం శాంతించింది.

అశ్వత్థామకు అర్థమయ్యింది, నారాయణుడు పాండవసేనను కాపాడుతున్నాడు. మరోసారి ప్రయోగించడానికి వీలులేనిదా అస్త్రం.

దుర్యోధనుడన్నాడు– "అలా అయితే మిగతా దివ్యాస్త్రాలను ప్రయోగించు. ఆ గురు హంతకులు బ్రతికి ఉండరాదు".

అశ్వత్థామ వెంటనే వెళ్లి ధృష్టద్యుమ్నుడిని గాయపరచాడు. ధృష్టద్యుమ్నుడికి సాత్యకి సాయంగా వచ్చాడు. సాత్యకిని ఎదిరించారు దుర్యోధన, కృప, కర్ణులు. సాత్యకి బాణాలకు అశ్వత్థామ విరథుడైనాడు. అయినా వేరే రథమెక్కి ధృష్టద్యుమ్నుడిని గాయపరచాడు అశ్వత్థామ. మాళవరాజు సుదర్శనుడిని, పౌరవుడిని, చేది యువరాజును చంపినాడు అశ్వత్థామ.

అది చూసి భీమసేనుడు అశ్వత్థామను ఎదుర్కొని బాణాలతో తీవ్రంగా కొట్టేసరికి అశ్వత్థామ మూర్ఛిల్లి, క్షణకాలం లోనే తెప్పరిల్లి భీముడి మీద శరవర్షం కురిపించాడు. భీముడి రథసారథి బాణాలు తగిలి మూర్ఛిల్లడంతో గుర్రాలు త్వరగా పరుగులు తీసాయి. అశ్వత్థామ సంతోషంతో శంఖనాదం చేసాడు.

అతడికి శ్రీకృష్ణుడి మీద కోపం వచ్చింది. అందుకని ఆగ్నేయాస్త్రం ప్రయోగించాడు. ఆ అస్త్రం నుంచి జనించిన వేడిమికి లోకాలు దహించుకుపోసాగాయి. రథాలు కాలిపోతున్నాయి. పాండవసేన హాహాకారాలు చేసింది. ఒక అక్షౌహిణి సేన నాశనమయ్యింది. అప్పుడు అర్జునుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించగా ఆగ్నేయాస్త్రం చల్లారింది.

కృష్ణార్జునులు చిన్న దెబ్బ తగలకుండా వచ్చేసరికి అశ్వత్థామ నిరుత్సాహపడినాడు. ధనుస్సు వదిలి, రథం మీద నుంచి దూకి– "సర్వమిదం మిథ్యా" అంటూ యుద్ధరంగం నుంచి పరిగెత్తి వెళ్లి వ్యాసుడితో మొరబెట్టుకున్నాడు.

వ్యాసుడన్నాడు– "కృష్ణార్జునులు నరనారాయణులు రుద్రుడైన శంకరుని భక్తులు. నీవూ రుద్రుని భక్తుడివే. వారు శంకరుని శివలింగ రూపంగా ఆరాధించారు. నీవు ప్రతిమా రూపంలో అర్చించావు. అంతేకాక నరనారాయణులు దైవకార్యం మీద ఈ యుద్ధం చేస్తున్నారు. వారు అజేయులు!"

అశ్వత్థామ శంకరుడికి నమస్కరించి యుద్ధ విరమణ చేసాడు. వ్యాసమహర్షి వెళ్లి పాండవులను కలిసాడు.

అర్జునుడడిగాడు– నేను యుద్ధరంగంలో బాణాలు వేస్తూ శత్రువులను సంహరిస్తుంటే నా ముందు అగ్నివలె ప్రకాశిస్తున్న దివ్యపురుషుడు కనిపించాడు, అతడెవరు?"

వ్యాసుడన్నాడు– "అతడే శంకరుడు, శివుడు, రుద్రుడు, అతడికి నమస్కరించు"

**నమోస్తు బహు రూపాయ నమోస్తు బహుధన్వినే**
**నమోస్తు స్థాణవే నిత్యం నమస్త స్మై తపస్వినే** (ద్రోణ. 202–46)

❖❖❖❖❖

# ✣ 8. కర్ణ పర్వము ✣

**(ఉప పర్వాలు లేవు. 96 అధ్యాయాలున్నాయి)**

## పదహారవ రోజు యుద్ధం

మహావీరుడైన ద్రోణాచార్యుడు చనిపోగానే దుర్యోధనుడు తన మంత్రులతో సమావేశమైనాడు. అశ్వత్థామ అన్నాడు– "రాజు తాను అనుకున్నది సాధించాలంటే నాలుగు ఉపాయాలున్నాయి– 1) రాగం (రాజభక్తి), 2) యోగం (సాధన సంపత్తి), 3) దక్షత (ఉత్సాహం, బలం), 4) నీతి – ఈ నాలుగూ దైవాధీనాలు.

ఇవన్నీ ఉన్నవాడు కర్ణుడు. ఇతడిని సర్వసేనాధిపతిగా అభిషిక్తుడిని చేస్తే నీకు కార్యసిద్ధి కలుగుతుంది".

అశ్వత్థామ మాటలతో దుర్యోధనుడికి జయాశ కలిగింది. కర్ణుడిని సర్వసైన్యాధిపతిగా అభిషేకించాడు.

**సైనాపత్యే తు రాధేయమ్ అభిషిచ్య సుతస్తవ**
**అమన్యత తదాత్మానం కృతార్థం కాలచోదితః** (కర్ణ. 10–54)

కర్ణుడు కౌరవ సైన్యాన్ని యుద్ధానికి సిద్ధం చేసాడు.

కౌరవుల మకర వ్యూహం–పాండవుల అర్ధచంద్రాకార వ్యూహం.

కౌరవుల మకర వ్యూహానికి ముందుభాగంలో కర్ణుడు, కనుల వద్ద శకుని, ఉలూకుడు; శిరోభాగంలో అశ్వత్థామ, మెడ భాగంలో కౌరవ సోదరులు, వ్యూహమధ్యంలో దుర్యోధన మహరాజు నిలిచారు. ఎడమకాలి వద్ద కృతవర్మ, నారాయణసేన, అతడి వెనక శల్యుడు; కుడికాలి వద్ద కృపాచార్యుడు, అతడి వెనక సుశేషణుడు; తోక వద్ద చిత్ర, చిత్రసేనులున్నారు.

పాండవుల అర్ధచంద్రాకార వ్యూహంలో ఎడమవేపు భీమసేనుడు, దక్షిణం వేపు ధృష్టద్యుమ్నుడు, మధ్యలో యుధిష్ఠిరుడు, అర్జునుడు; ధర్మరాజు వెనుక నకుల సహదేవులు, యుధామన్యువు, ఉత్తమౌజుడు అర్జున రథ చక్ర రక్షితులుగా ఉన్నారు.

ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉపపాండవులు, ప్రభద్రకులు, సాత్యకి, చేకితానుడు, పాండ్యులు, చోళులు, కేరళులు, చేది, పాంచాల, కేకయ, కారూష, కోసల, కాంచి, మాగధ సైనికులు కౌరవసేనపై తలపడినారు.

ఏనుగునెక్కిన భీమసేనుడిని, మరో ఏనుగుపై వచ్చిన క్షేమధూర్తి ఎదుర్కున్నాడు. ఇరువురి మధ్య భీకరయుద్ధం జరిగింది. తోమరాలు విసురుకున్నారు. బాణాలతో గాయపరచుకున్నారు. శక్తులు, క్షురప్రాలు ప్రయోగించారు. భీమసేనుడి ఏనుగును బాణాలతో గాయపరచిన క్షేమధూర్తిని గదతో కొట్టి చంపినాడు భీమసేనుడు. అతడి ఏనుగునూ వధించినాడు.

కర్ణుడిని నకులుడు అడ్డుకున్నాడు. అశ్వత్థామను భీమసేనుడు, కేకయరాజులైన విందానువిందులను సాత్యకి ఎదిరించారు. సాత్యకిని విందానువిందులు తీవ్రంగా గాయపరచారు. అనువిందుడిని చంపిన సాత్యకిపై విందుడు బాణవర్షం కురిపించాడు. ఇద్దరి రథాలు ధ్వంసమైనాయి. కత్తీడాలు పుచ్చుకుని ఇద్దరూ గొప్ప యుద్ధం చేసారు. అత్యంత వేగంతో ఖడ్గాన్ని తిప్పి సాత్యకి విందుడి శరీరాన్ని రెండుగా ఖండించి చంపి వెళ్లి యుధామన్యుని రథమెక్కినాడు.

శ్రుతకర్మ అభిసారరాజు చిత్రసేనుడిని చంపాడు.

ప్రతివింధ్యుడు చిత్రుడిని తోమరం విసిరి చంపాడు. అశ్వత్థామ–భీమసేనులు పరస్పరం గాయపరచుకుని మూర్ఛిల్లారు. అర్జునుడు సంశప్తకులతో పోరాడి వారి రథాలను ఛిన్నాభిన్నం చేసాడు. అప్పుడు అశ్వత్థామ ఆహ్వానించాడు అర్జునుడిని యుద్ధానికి రమ్మని. పోరు ఘోరమైంది.

అశ్వత్థామ యుద్ధంలో అధికుడవుతూ, అర్జునుడు తగ్గుతుంటే కృష్ణుడన్నాడు– "ఉపేక్షవద్దు". దానితో అర్జునుడు వెంటనే అశ్వత్థామ బాణాలకు రెండురెట్లుగా జవాబిచ్చాడు. ఇద్దరి మధ్య చాలాసేపు యుద్ధం జరిగింది.

కృష్ణుడన్నాడు– "ఇంకెంతసేపు? చికిత్స చేయని రోగంలా ఇతడు ఇంకా కష్టాలు కలిగించాలా?"

దానితో అర్జునుడు అత్యంత వేగంగా బాణాలు వేసి ద్రోణపుత్రుడి శరీరాన్ని చీల్చి, గుర్రాల పగ్గాలను తెంపి, వాటిని గాయపరచేసరికి అవి రథాన్ని చాలాదూరం లాక్కుపోయాయి.

అర్జునుడు ఆ తరువాత దండధారుడనే మగధ యోధుడిపై యుద్ధం చేసాడు. అతడు ఏనుగునెక్కి వచ్చి పాండవసేనను నిర్జిస్తుంటే అర్జునుడు దండధారుడిని, అతడి ఏనుగును సంహరించాడు. ఆ తరువాత సంశప్తక సేనను సర్వనాశనం చేసాడు. కృష్ణుడు ప్రశంసించాడు అనితరసాధ్యమైన అతడి యుద్ధాన్ని చూసి.

ఏ రాజూ తనతో సమానుడు కాదు అని భావించే పాండ్యరాజు కర్ణుడి సేనను ధ్వంసం చేస్తున్నాడు. అతడిని యుద్ధానికి ఆహ్వానించాడు అశ్వత్థామ. ఇద్దరి మధ్య భీకరమైన పోరు జరిగింది. ఉన్ముఖి, అభిముఖి, తిర్యక్, మంద, గోమూత్రిక, ధ్రువ, స్ఖలిత, యమకాక్రాంత, క్రుష్ట, అతిక్రుష్ట గతులతో బాణాలు వేసుకున్నారు. అశ్వత్థామ అత్యంత వేగంగా బాణాలు వేస్తూ ఎనిమిదేసి ఎద్దులు కట్టిన ఎనిమిది బండ్ల నిండుగా ఉన్న ఆయుధాలను ఆ పగటిపూట ఎనిమిదవ భాగం సమయంలోనే శత్రువులపై ప్రయోగించాడు. అశ్వత్థామ వేసిన బాణాలను పాండ్యుడు వాయువ్యాస్త్రంతో చెదరగొట్టాడు. అతడిని చంపే అవకాశం వచ్చినా అశ్వత్థామ సంహరించలేదు. అయితే పాండ్యరాజు మలయధ్వజుడు తనకు దగ్గరగా వచ్చిన ఏనుగునెక్కి తోమరాన్ని విసిరాడు అశ్వత్థామపై. అది అశ్వత్థామ కిరీటాన్ని పడవేసింది. కోపించిన అశ్వత్థామ పదునాలుగు బాణాలతో ఏనుగు కాళ్లను, తుండాన్ని, పాండ్యరాజు సేవకులను, పాండ్యరాజు భుజాలను కొట్టాడు. ఉత్తమ బాణాలతో ఏనుగును ఆరుముక్కలుగా, పాండ్యరాజును నాలుగు ముక్కలుగా నరికి, యజ్ఞంలో పదిమంది దేవతలకు హవిస్సులను సమర్పించినట్లు, యుద్ధ యజ్ఞం చేసినాడు.

ఒకప్రక్క కర్ణుడు పాండవ పాంచాలుర సేనను వేగంగా సంహరిస్తున్నాడు. ఉభయ పక్షాల మధ్య యుద్ధంలో మొదలు నరికిన మంచిగంధపు చెట్లలా నేలకూలుతున్నారు వీరులు.

సహదేవుడు పుండ్రరాజును ఓడించాడు.

నకులుడు అంగరాజపుత్రుడిని ఏనుగుతో సహా చంపాడు.

సహదేవుడు దుశ్శాసనుని ఓడించి మూర్ఛిల్లేట్టు చేసాడు. కర్ణుడి చేతిలో నకులుడు పరాజయం పొందగా పారిపోతున్న నకులుని వెంబడించి మెడలో ఎక్కుపెట్టిన ధనుస్సు వేసి ఆక్షేపించాడు– "నీకన్నా బలవంతులైన వారితో యుద్ధం చేయకు. ఇంటికిపో లేకుంటే కృష్ణార్జునుల వెనక దాక్కో!" అన్నాడు కర్ణుడు. నకులుడు తలవంచుకుని వెళ్లి యుధిష్ఠిరుడి రథమెక్కాడు. కుండలో పాములా బుసకొడుతున్నాడు.

శకుని కుమారుడు ఉలూకుడు యుయుత్సుడిని ఓడించాడు. ఉపపాండవులనందరిని జయించి సింహనాదం చేసాడు శకుని.

కృపాచార్యుడు నిలువరించాడు ధృష్టద్యుమ్నుడిని. కృతవర్మ ఓడించాడు శిఖండిని. అర్జునుడు సంశప్తకులతో యుద్ధం చేస్తున్నాడు. సత్యసేనుడు, చంద్రదేవుడు, మిత్రదేవుడు, శ్రుతంజయుడు, సౌశ్రుతి, చిత్రసేనుడు, మిత్రవర్మ ఈ ఏడుగురూ సుశర్మ పుత్రులు. శ్రుతంజయుడిని, సత్యసేనుడిని మిత్రదేవుడిని చంపి ఐంద్రాస్త్రం ప్రయోగించి సంశప్తకులను సర్వనాశనం చేసాడు అర్జునుడు.

యుధిష్ఠిరుడు–దుర్యోధనుల మధ్య భీకర యుద్ధం జరిగింది. చివరకు యుధిష్ఠిరుడిదే పైచేయి అయ్యింది. రెండు గడియల పాటు చూడముచ్చటగా జరిగిన యుద్ధం ఆ తరువాత పిచ్చివాళ్ల కొట్లాటలా మారింది. రెండు పక్షాలవారూ ఏ పద్ధతీలేని యుద్ధం చేసారు. కర్ణుడు పాంచాలురను, అర్జునుడు త్రిగర్తులను చంపాడు. సూర్యుడు అపరాహ్ణంలోకి ప్రవేశించేప్పటికి మహానాశం జరిగింది. సాత్యకి కర్ణుల మధ్య సమరం తీవ్రస్థాయికి చేరింది. పాండవ వీరులందరూ కలిసి కర్ణుడిని పీడించారు. కర్ణుడు వీరోచితంగా పోరాడగా పాండవసేన వెనుదిరిగింది. అర్జునుడు కౌరవసేనను పీడించాడు. కర్ణుడి అస్త్రాలను తిప్పికొట్టినాడు.

సూర్యాస్తమయ సమయానికి ఇరుపక్షాలు రాత్రియుద్ధం చేయడానికి భయపడి తమతమ శిబిరాలకు వెళ్లారు. పాండవులదే పైచేయిలా కనిపించిందారోజు. కౌరవులలో అంతర్మథనం మొదలయ్యింది.

పదిహేడవ రోజు ఉదయం కర్ణుడు వెళ్లి దుర్యోధనునితో అన్నాడు– "నిన్న నాకు అర్జునుడికి మధ్య ద్వంద్వయుద్ధం జరగనే లేదు. ఈరోజు అతడినైనా సంహరిస్తాను లేదా అతడైనా నన్ను సంహరిస్తాడు. నా దగ్గర విజయం అనే ధనుస్సు గాండీవంతో సరిసమానమైనది, పరశురాముడు ఇచ్చినది ఉన్నది. దివ్యాస్త్రాలున్నాయి. లేనిదల్లా సరైన సారథి. అతడి సారథి శ్రీకృష్ణుడు. రథం అగ్నిదేవుడిచ్చినది, రథాశ్వాలు వేగవంతాలు. జెండామీద ఉండే వానరుడు, కపిధ్వజం దివ్యమైనది. సారథ్యంలో శల్యుడు శ్రీకృష్ణుడికి సమానుడు. అర్జునుడికి అక్షయతూణీరమున్నది. ఉత్తమమైన బాణసముదాయం బండ్లమీద నాకు దగ్గరలో ఉండాలి. గొప్ప గుర్రాలను పూన్చిన రథాలు నాకందుబాటులో ఉండాలి. బాహుబలంలో శల్యుడు, విలువిద్యలో నేను సాటిలేనివాళ్లం.

అశ్వహృదయం తెలిసినవారిలో అతడు అగ్రగణ్యుడు. అతడు సారథిగా ఉండి, రథాశ్వాలు, బాణాల బండ్లు నాకందుబాటులోకి వస్తే మనదే పైచేయి అవుతుంది" అన్నాడు కర్ణుడు.

దుర్యోధనుడు సవినయంగా వెళ్లి మద్రరాజును అడిగాడు కర్ణుడికి సారథిగా ఉండమని– "కౌరవ పక్షానికి భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, కర్ణుడు, కృతవర్మ, శకుని, అశ్వత్థామ, నీవు, నేను – తొమ్మిదిమందిమి బలం. ఇప్పుడు నీవు, కర్ణుడు కలిసి యుద్ధం చేస్తే మనం గెలుస్తామని నా ఆశ!

**పార్థస్య సమరే కృష్ణః యథా భీషుగ్రహో వరః**

**తథా త్వమపి కర్ణస్య రథే భీషుగ్రహో భవ** (కర్ణ. 32–19)

నీవు కర్ణుడికి రథసారథిగా ఉంటే మిమ్మల్ని కృష్ణార్జునులు కూడా జయించలేరు" అన్నాడు దుర్యోధనుడు.

ఎంతో ప్రయత్నం మీద తన కోపాన్ని నిగ్రహించుకుంటూ మద్రభూపతి శల్యుడన్నాడు– "గాంధారీ కుమారా! నీవు నన్ను అవమానిస్తున్నావు. నాకు కర్ణుడు సమానుడు కాడు. అతడికి నేను సారథిని కాలేను. కావాలంటే నాకు ఎక్కువభాగం కేటాయించు. దానిని గెలిచి నేనే ఇంటికి వెళ్తాను.

బ్రాహ్మణ క్షత్రియులకు సూతులు సేవకులు. నేను రాజర్షి కులంలో పుట్టి మూర్ధాభిషిక్తుడైన రాజును. లోకప్రసిద్ధ మహారథుడను. సూతుడికి నేను సూతుడిగా ఉండను. నాకు సెలవివ్వు వెళ్తాను" అని లేచి వెళ్లబోతుంటే దుర్యోధనుడతడిని ఆపి అన్నాడు–

"రాజా! కర్ణుడు నీకంటే గొప్పవాడు కాదు. నీవు శత్రువులకు శల్యము (ముల్లు) లాంటివాడివి కనుక శల్యుడవయినావు. అంతేకాక అశ్వహృదయ జ్ఞానంలో, బలంలో, రథసారథ్యంలో నీవు శ్రీకృష్ణుడికన్నా చాలా గొప్పవాడివని ఈలోకం, మేము అనుకుంటున్నాము".

శల్యుడన్నాడు– "ఇంతమంది రాజన్యుల మధ్య నీవు నన్ను శ్రీకృష్ణుడి కన్నా గొప్పవాడిగా గుర్తించావు. నాకు సంతోషంగా ఉన్నది. నీవడిగినట్లు నేను కర్ణుడికి సారథిగా ఉంటాను. అయితే ఒక షరతు! నేను నా ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా ఇతడు సహించాలి"

దుర్యోధనుడన్నాడు– "అది అంగీకారమే! మద్రేశ్వరా! త్రిపురాసురులను సంహరించేప్పుడు ఈశ్వరుడికి ఎవరు రథసారథిగా ఉండాలా అని దేవతలు తర్జనభర్జనలు పడుతున్నపుడు సాక్షాత్తూ బ్రహ్మసారథిగా ఉండి ఆ గొప్ప కార్యాన్ని నెరవేర్చాడు.

ఈ కర్ణుడు సూతులచే పెంచబడినాడు. సహజ కవచకుండలాలతో పుట్టినవాడు. భార్గవరాముని శిష్యుడితడు.

ఈశ్వరుడికి బ్రహ్మలా, అర్జునుడికి శ్రీకృష్ణుడిలా నీవు ఓ శల్య మహరాజా! కర్ణుడికి సారథివై కీర్తినొందుము".

## పదిహేడవ రోజు యుద్ధం

శల్యుడు సారథిగా, కర్ణుడు రథికుడిగా బయల్దేరినారు.

కర్ణుడన్నాడు– "పాండవ నాశనం నా పదునైన బాణాలతో చేస్తాను"

శల్యుడన్నాడు– "సర్వాస్త్ర పరిజ్ఞానం గలవారు, వారిని నీవు గెలవలేవు"

కర్ణుడన్నాడు– "ఈరోజు పాండవులు కాదు మృత్యువు ఎదురుపడితే మృత్యుదేవతను కూడా చంపుతాను"

శల్యుడన్నాడు– "చాల్లే గొప్పలు! ఇంతకుముందు జయించావు, ఇప్పుడూ జయిస్తావు. యుద్ధరంగం నుంచి పారిపోకుండా ఉంటే చాలు"

కర్ణుడన్నాడు– "పాండవులెక్కడ ఉన్నారో చెప్పినవారికి కానుకలిస్తాను"

శల్యుడన్నాడు– "ఎందుకు? వేరే దిక్కుకు పోదామనా? అయినా ఏ కానుకలు ఇవ్వకుండానే వాళ్లు కనిపిస్తారులే! అయినా నక్క సింహాలను చంపినట్లు నేను వినలేదు"

కర్ణుడన్నాడు– **"అర్జునే గాండీవం కృష్ణే చక్రం తార్క్ష్య కపిధ్వజౌ, భీరూణాం త్రాస జననం శల్య హర్షకరం మమ** – వాళ్లను చూసి పిరికివాళ్లు భయపడతారు. నేను కాదు. మద్రదేశపు నీచ లక్షణాలన్నీ నీలో ఉన్నాయి! అందుకే నన్నింత ఈసడిస్తున్నావు. ఇంకోసారి ఇలా మాట్లాడితే గదతో నీ తల పిండి చేసివేస్తాను.

శల్యుడన్నాడు– "నేను రాజపుత్రుడిని. నీవెవడివో నీకే తెలీదు. ఒకప్పుడు వైశ్యుడి ఇంట్లో ఎంగిలి మెతుకులు తిని బ్రతికే కాకి మానస సరోవరంలో విహరించే హంసలతో నేను 101 గతులతో ఎగరగలను, నాతో పోటీకి రమ్మన్నది. హంంస అన్నది– నాకు ఒకే గమనం తెలుసు. అయినా పోటీ వద్దులే!

కాకి ఊరుకోలేదు. దాని పోరు పడలేక హంస ఒప్పుకున్నది. పోటీ మొదలయ్యింది. రకరకాల విన్యాసాలు చేస్తూ త్వరగానే అలసిపోయింది కాకి. హంస ఏ అలసటా లేకుండా ఎగుర్తూనే ఉన్నది. రెండు గడియల్లోనే అలసిపోయిన కాకి నీళ్లలో పడింది. జాలిపడిన హంస దానిని ఒడ్డుకు చేర్చింది. కాబట్టి కర్ణా! కాస్త జాగ్రత్త!"

కర్ణుడన్నాడు– "పరశురాముని శాపం, బ్రాహ్మణుని శాపం నన్ను బాధిస్తున్నాయి, అయినా, నేను అర్జునుడిని చంపుతానీవేళ. నా అస్త్ర మంత్రాలు నాకు స్ఫురించకపోవచ్చు, నా రథచక్రం భూమిలో క్రుంగిపోవచ్చు. కాని నేను ఈరోజు అర్జునుడిని వదలను. నీ దృష్టిలో నేను కాకిని, అర్జునుడు హంస కావచ్చు. నేనది పట్టించుకోను. అసత్యవాది మాటలను లెక్కచేయను".

శల్యుడన్నాడు– "అవును, గొప్పవాడివి నీవు. గొప్ప పుటక నీది"

కర్ణుడన్నాడు– "నా పుట్టుకకేమిలే! నీ బాహ్లిక, మద్రదేశాల గురించి అందరికి తెలిసిందే. శతద్రు, విపాశ, ఐరావతి, చంద్రభాగ, వితస్త, సింధు నదులు ప్రవహించే 'ఆరట్ట' ప్రాంతంలో వాహీకుల గురించి, వారి స్త్రీల గురించి గొప్ప కథలు ప్రచారంలో ఉన్నాయి. ప్రస్థలం, గాంధారం, ఆరట్టం, ఖశం, వసాతి, సింధు, సౌవీర దేశాలు నింద్యమైనవి. అక్కడ ద్విజుడు దాసుడవుతాడు. దాసుడు ద్విజుడవుతాడు. జారిణుల పుత్రులు వారి ఆస్తులకు మేనల్లుళ్లు వారసులవుతారు. వాహీకులు ప్రతి పనీ వ్యతిరేకంగా చేస్తారు. మద్ర దేశీయులకు అదీ తెలియదు. సర్వదేశాలకు మద్ర దేశీయులు 'చెడు' లాంటి వారు. తెలుసుకుని మాట్లాడు నీవు".

శల్యుడన్నాడు– "నీ అంగదేశం సంగతేమిటి? రోగగ్రస్తుల్ని వదలివేస్తారు. భార్యాపుత్రులను అమ్ముకుంటారు కాదా! ఎదుటివారి తప్పుల్ని చెప్పడంలో అందరూ నేర్పరులే!

**సర్వత్ర సంతి రాజానః స్వం స్వం ధర్మమనువ్రతాః**
**దుర్మనుష్యాన్ నిగృహ్ణంతి సంతి సర్వత్ర ధార్మికాః** (కర్ణ. 45-45)

తమతమ ధర్మాల్ని అనుసరించే రాజులంతటా ఉంటారు".

దుర్యోధనుడన్నాడు– "మీ వాదులాట తరువాత! పదండి ముందుకు"

శల్యుడు సారథిగా కర్ణుడు రథికుడుగా రావడం చూసిన కౌరవసేన హర్షధ్వానాలు చేసింది. అందరూ మిక్కిలి ఉత్సాహంతో ముందుకు సాగారు. కౌరవ సేనాధిపతిని ఓడించడం ధ్యేయంగా పాండవసేన కదిలింది. కృష్ణార్జునుల రథం బయల్దేరింది.

శల్యుడన్నాడు– "అదుగో కృష్ణార్జునుల రథం. నీ కానుకలు వద్దులే!"

కర్ణుడన్నాడు– "అదుగో సంశప్తకులు వస్తున్నారు. వాళ్లకు మూడింది".

అర్జునుడు సంశప్తకులను, కర్ణుడు పాంచాల, చేది, సృంజయులను ఎదుర్కొని గొప్ప యుద్ధం చేసారు. కొద్దిసేపట్లోనే సంకుల సమరం మొదలయ్యింది. వైకర్తనుడైన కర్ణుడు భానుదేవుడు, చిత్రసేనుడు, సేనాబిందువు, తపనుడు, శూరసేనుడు అనే అయిదుగురు పాంచాల వీరులను చంపినాడు.

కర్ణుడి రథ చక్ర రక్షకులు అతడి కుమారులైన సుషేణ, సత్యసేనులు. కర్ణుడి వెనకభాగాన్ని పెద్దకొడుకు వృషసేనుడు రక్షిస్తున్నారు. ఇంకో పుత్రుడు భానుసేనుడు వారికండగా ఉండగా భీముడు క్షురప్రం అనే బాణంతో భానుసేనుడిని చంపినాడు. తమను చుట్టుముట్టిన పాండవ వీరులను కలతబెడుతూ కర్ణుడు చేసిన యుద్ధం అద్భుతంగా కనిపించింది.

**నహ్యేద దానం దదృశుః సంద ధానం చ సాయకాన్**
**విముంచంతం చ సంరంభాత్ అపస్యంత హతా నరీన్** (కర్ణ. 48-58)

కర్ణుడు ఎప్పుడు బాణాలు తీస్తున్నాడో, ఎప్పుడు వింటికి సంధిస్తున్నాడో, ఎప్పుడు విడుస్తున్నాడో కనబడడం లేదు కాని, హతులైన శత్రువులు మాత్రం కనిపిస్తున్నారు. తనమీద వేసిన బాణాలకు మూడురెట్లు బాణాల్ని వేసి మూడు వందల మంది చేది రథికుల్ని చంపాడు.

## ధర్మరాజు నవమానించిన కర్ణుడు

కర్ణుడలా పాండవసేనను చీల్చివేస్తూ యుధిష్ఠిరుని సమీపించాడు. తన నెదిరించిన ద్రావిడ నిషాద జాతులవారిని చంపుతూ పాంచాల కేకయ వీరుల నెదుర్కొన్నాడు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం, ఆ తరువాత బాణయుద్ధంతో ఇద్దరూ గాయపడ్డారు. యుధిష్ఠిరుడి దెబ్బకు కర్ణుడు రథం మీదనే మూర్ఛిల్లాడు. వెంటనే లేచి ధర్మరాజు చక్రరక్షకులైన చంద్రదేవుని, దండధారుని చంపినాడు. ధర్మరాజుకు రక్షణగా పాండవ వీరులంతా వచ్చి నిలిచారు. దానితో కర్ణుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి తనను చుట్టుముట్టిన వారిని చెల్లాచెదరు చేసాడు. సాత్యకి విసిరిన శక్తిని ముక్కలు చేసి, పదునైన బాణాలతో ధర్మరాజును పీడించాడు. దానితో ధర్మజుడు యుద్ధ విముఖుడై యుద్ధభూమి నుండి తొలిగిపోతుంటే ఆయనను పట్టుకోవాలని వెంటబడినాడు.

శల్యుడన్నాడు- "పొరపాటు చేయకు. ఆయనను పట్టుకున్నావా క్రోధాగ్నితో నిన్ను బూడిద చేస్తాడు"

కర్ణుడన్నాడు- "యుధిష్ఠిరా! క్షత్రియ ధర్మతత్పరా! పారిపోతున్నావేమిటి? నీకు యుద్ధమెందుకు? యజ్ఞాలు చేసుకో! బ్రాహ్మణత్వం సిద్ధిస్తుంది".

తలవంచుకుని యుధిష్ఠిరుడు వెళ్లిపోయాడు. పాండవసేన వెంటబడి చంపుతున్నది కౌరవసేన. దానితో యుధిష్ఠిరుడి ఆజ్ఞతో భీమసేనాదులు కౌరవ సైన్యాన్ని చంపసాగినారు. రెండు పక్షాల మధ్య ఘోర యుద్ధం జరిగింది.

**కచాక చి యుద్ధమాసీద్ దంతాదంతి నఖానఖి**
**ముష్టియుద్ధం నియుద్ధం చ దేహ పాప్మా సునాశనమ్** (కర్ణ. 49-80)

సైనికులు బాహాబాహి, కచాకచి, దంతాదంతి, నఖానఖి, ముష్టాముష్టీ యుద్ధం చేసి పరస్పరం చంపుకున్నారు. రణరంగం పీనుగుల పెంట అయ్యింది. రక్తనది ప్రవహించింది.

ధర్మరాజును శిబిరానికి పంపి భీముడి వేపు బయల్దేరాడు కర్ణుడు. కర్ణుడిని చంపాలన్న కోరికతో భీముడు ఉగ్రంగా వస్తున్నాడతడి వేపు.

ఇద్దరూ నిశితమైన కణుపుల బాణాలతో గాయపరచుకున్నారు. కర్ణుడు ఇరవై అయిదు బాణాలతో భీముడిని కొట్టాడు. కోపించిన భీముడు గొప్ప బాణంతో కర్ణుడిని కొట్టగా కర్ణుడు మూర్ఛిల్లి రథం వెనక కూలబడ్డాడు. భీమసేనుడు అతడిని సమీపించి నాలుక కోయడానికి ఉద్యమించగా శల్యుడతడిని బ్రతిమలాడినాడు- "అర్జునుడి ప్రతిజ్ఞను నెరవేర్చుకోనీ! నీకు మేలు జరుగుతుంది"

భీమసేనుడన్నాడు- "ఇతడు ద్రౌపదిని, మమ్మల్ని అన్న మాటలకు ఇతడి నాలుక కోయాలనుకున్నాను. కాని, నీవు చెప్పిన అర్థవంతమైన మాటలను చేదుమందుగా స్వీకరిస్తున్నాను" అని పలికి భీముడు వెళ్లగా, శల్యుడు రథాన్ని కాస్త దూరంగా తీసుకుపోయాడు.

భీముడి చేతిలో కర్ణుడు సంకటస్థితిలో పడగా దుర్యోధనుడు తన సోదరులను పంపాడు కర్ణుడి రక్షణార్థం. ఇరవై మంది ధృతరాష్ట్ర సుతులు భీముడిని చుట్టుముట్టినారు. వివిత్సుడు, వికటుడు, సముడు, క్రాధుడు, నందుడు, ఉపనందుడు భీముడి బాణాలకు హతులైనారు.

భీముడికి కర్ణుడికి మధ్య మరల ఘోర యుద్ధం జరిగింది. రెండు సేనల మధ్య సంకుల సమరం జరగడంతో రణభూమి పిశాచాలు తాండవించే ప్రేతభూమిగా మారింది.

**శీర్షపాషాణ సంఛన్నాః కేశశైవల శాద్వలాః**
**అస్థిమీన సమాకీర్ణాః ధనుః శరగ దోడుపాః**

**మాంస శోణిత పంకిన్యః ఘోరరూపాః సుదారుణాః**
**నదీః ప్రవర్తయామాసుః శోణితౌఘ వివర్ధినీః** (కర్ణ. 52-31,32)

ఆ రక్తనదిలో, మాంస పంకిలంలో నృత్యం చేస్తున్నాయి భూత ప్రేత పిశాచ గణాలు, కాకులు, గ్రద్దలు, కొంగలు.

## సంశప్తకులను చంపిన అర్జునుడు

అక్కడ సంశప్తకుల మధ్యలో చిక్కుకున్నది శ్రీకృష్ణార్జునుల రథం. వాళ్లు గుర్రాలను, రథ చక్రాలను, కాడిని, పోలును పట్టుకుని కదలనీకుండా చేసి సింహనాదాలు చేసారు. కొందరు కృష్ణుని భుజాలు పట్టుకున్నారు. కొందరు అర్జునుడిని పట్టుకుంటే వాళ్లను విదిల్చికొట్టాడు. పాంచజన్య దేవదత్తాలను పూరించి వాళ్లను భయకంపితులను చేసి నాగాస్త్రం ప్రయోగించి వారి కాళ్లను బంధించాడు అర్జునుడు. అలా నిశ్చేష్టులై నిలబడిన సంశప్తకులను అర్జునుడు వధిస్తుంటే సుశర్మ వేగంగా గరుడాస్త్రాన్ని వేసాడు. దానితో పాములు పారిపోయాయి. సుశర్మ వెంటనే గట్టి బాణంతో అర్జునుడిని కొట్టేసరికి బాధతో అర్జునుడు కూర్చున్నాడు. దానితో 'అర్జునుడు హతుడయ్యాడని' కౌరవసేన సంతోషంగా కేకలు పెట్టింది. మరుక్షణం అర్జునుడు లేచి ఐంద్రాస్త్రం ప్రయోగించగా వేల బాణాలు ఆవిర్భవించి సంశప్తకులను నారాయణ సేనను నాశనం చేసింది. పదివేల మందిని సంశప్తకులను చంపగా వారిలో ఇక మిగిలింది పధ్నాలుగు వేల కాల్బలం, పదివేల రథాలు, మూడువేల ఏనుగులు.

కృతవర్మ, కృపుడు, అశ్వత్థామ, కర్ణుడు, ఉలూకుడు, శకుని, దుర్యోధనుడు తమసేనతో రెండు గడియలపాటు పాండవ సేనలో భీభత్సం సృష్టించారు. కృపాచార్యుడు శిఖండిని ఓడించి సుకేతువును చంపాడు. ధృష్టద్యుమ్నుడు కౌరవసేనను పీడించాడు. ఉపపాండవులను, ధర్మరాజును అశ్వత్థామ దారుణంగా బాధించాడు. దుర్యోధనుడు అత్యద్భుతంగా యుద్ధం చేసి నకుల సహదేవులను గాయపరచాడు. ధృష్టద్యుమ్నుడు వాళ్లను రక్షించి దుర్యోధనుడిని దెబ్బకొట్టాడు. కర్ణుడు దుర్యోధనుడికి సాయంగా వచ్చి ఎనిమిది మంది పాంచాలురను, అనేకమంది చేదిదేశ వీరులను చంపివేసాడు. పేరు పెట్టి పిలిచిమరీ కర్ణుడు చంపేసాడు పాంచాల, సృంజయ మహావీరులందరినీ- అగ్నిలా దహిస్తూ కర్ణుడు.

పాండవసేన మధ్యలో కర్ణుని 'హస్తికక్ష్య' చిహ్నం గల జెండాను చూసిన అర్జునుడు సంశప్తకులను వదిలి కౌరవసేనను చంపుకుంటూ రావడం చూసి దుర్యోధనుడు సంశప్తకులను రెచ్చగొట్టినాడు. వాళ్లు మరల అర్జున రథాన్ని సర్పాల్లా చుట్టుకోగా అర్జునుడు అమితవేగంగా శరవర్షం కురిపించి దొరికిన వాళ్లను దొరికినట్లు వధించాడు.

అది చూసి అశ్వత్థామ కృష్ణార్జునులపై దాడి చేసాడు. అర్జునుడు తగ్గడం, అశ్వత్థామ విజృంభించడం చూసి కృష్ణుడు హెచ్చరించేసరికి వత్సదంతం అనే బాణంతో అశ్వత్థామ మెడ ఎముక మీద కొట్టేసరికి అతడు మూర్ఛిల్లగా సారథి రథాన్ని వేరే దిక్కుకు తీసుకుపోయాడు.

అశ్వత్థామ మూర్ఛ నుంచి లేచి ప్రతిజ్ఞ చేసాడు- "ధృష్టద్యుమ్నుని చంపకుండా కవచం విడువను. అతడిని భీముడైనా, అర్జునుడైనా, ఇంకెవరు రక్షిస్తున్నా అతడినీ చంపుతాను" అంటూ భారత సైన్యంలో రణోత్సాహం కలిగించి పాండవ సేనలో కలకలం సృష్టించాడు అశ్వత్థామ.

కర్ణుడు, అశ్వత్థామ వీరవిహారం చేస్తుంటే పాండవసేన ఛిన్నాభిన్నమైంది. శ్రీకృష్ణుడది గమనించి అర్జునుడికి చెప్పగా అతడు ఘోర యుద్ధం చేసి కౌరవ సైన్యాన్ని చంపసాగినాడు. కర్ణుడు-సాత్యకి, అశ్వత్థామ-ధృష్టద్యుమ్నుల మధ్య యుద్ధం అత్యంత భయంకరంగా సాగింది. కృష్ణుడి ప్రేరణతో అర్జునుడు గొప్ప బాణాలు వేసి ధృష్టద్యుమ్నుడిని రథం నుంచి లాగబోతున్న అశ్వత్థామను నిలువరించాడు. సహదేవుడు వచ్చి ధృష్టద్యుమ్నుడిని తన రథంలో తీసుకుపోయాడు. అశ్వత్థామ కోపంతో అర్జునుడిని గాయపరచాడు. కుపితుడైన అర్జునుడు కాలదండ రూపమైన బాణాన్ని అశ్వత్థామ మెడ దగ్గర తగిలేట్లు కొట్టేసరికి అశ్వత్థామ మూర్ఛిల్లినాడు. సారథి అశ్వత్థామ రథాన్ని తప్పించాడు.

అది చూసి కర్ణుడు తన విజయమనే ధనుస్సును టంకరింపజేసి కౌరవ సేనలో హర్షధ్వానాలు కలిగించాడు.

శ్రీకృష్ణుడన్నాడు– "ఇది కర్ణ వధా సమయం. లేకుంటే ధర్మరాజు కౌరవ వ్యూహంలో చిక్కుకుంటాడు"

అర్జునుడు సంశప్తకులను, భీముడు కౌరవసేనను చెదరగొడుతూ ఉండగానే దుర్యోధనుడు వేగంగా వచ్చి యుధిష్ఠిరునిపై దాడి చేసాడు. వెంటనే నకుల సహదేవులు, ధృష్టద్యుమ్నుడు పెద్ద సేనతో అతడికి సాయం వెళ్లారు. దుర్యోధనుడు గాయపడడం చూసి కర్ణుడు వచ్చి తన మిత్రుడిని కాపాడి యుధిష్ఠిరుని, ధృష్టద్యుమ్నుడిని హింసించాడు.

## పరాభవ భారంతో ధర్మజుడు

కర్ణుడి చేత తీవ్రంగా పీడించబడి ధర్మరాజు రథంలో కూర్చుండి "రథాన్ని తోలమని" సారథిని ఆదేశించాడు. అతడిని పట్టుకోవడానికి కౌరవసేన వెంటబడింది. కేకయ వీరులు కౌరవసేనను అడ్డగించారు కాని నిలువలేకపోయారు.

బాణాలతో శరీరం గాయపడగా నకుల సహదేవుల మధ్యలో ధర్మజుడు తన శిబిరం వేపు వెళ్తుంటే కర్ణుడు మూడు బాణాలు వేసి ధర్మజుని గాయపరచాడు. నకులుడు, సహదేవుడు కర్ణునిపై యుద్ధానికి దిగారు. కర్ణుడు వారినీ గాయపరచాడు.

శల్యుడన్నాడు– "వారినెందుకయ్యా హింసిస్తావు. నీవు పోరాడాల్సింది అర్జునుడితో గదా! యుధిష్ఠిరుడిని చంపితే అర్జునుడు మనలనందరినీ చంపుతాడు. అర్జునుడిని చంపితే వీళ్లనందరినీ చంపినట్లే గదా!" అని శల్యుడు కొద్దిగా రాధేయుడి మనసు మార్చాడు. అప్పుడు భీముడి మనసు మార్చి నాలుక కోయనీయకుండా కర్ణుని కాపాడిన శల్యుడు ఇప్పుడు కర్ణుడి మనసు మార్చి యుధిష్ఠిర, నకుల, సహదేవులను రక్షించాడు.

నకుల సహదేవులతో కలిసి శిబిరానికి వెళ్లి యుధిష్ఠిరుడు ఒంటికి గుచ్చుకున్న బాణాలను తొలగించాడు. మనసులో కర్ణుడు నాటిన బాణాలు బాధపెడ్తుండగా, నకుల సహదేవులను భీముడికి సాయంగా పంపాడు.

ధర్మరాజును, నకుల సహదేవులను విడిచిపెట్టి కర్ణుడు పాంచాలురపైకి యుద్ధానికి వెళ్లాడు. అర్జునుడు అశ్వత్థామతో యుద్ధం చేసి అతడి ఐంద్రాస్త్రాన్ని వమ్ముచేసి తీవ్రంగా గాయపరిచి గుర్రాల పగ్గాలను తెంచేసరికి అవి రథాన్ని వేరే దిక్కుకు లాక్కుపోయాయి.

దుర్యోధనుడు సూచించగానే కర్ణుడు పాంచాల సేనపై విరుచుకుపడినాడు. విజయమనే ధనుస్సు చేబట్టి భార్గవాస్త్రాన్ని ప్రయోగించగానే దానినుంచి వెలువడిన లక్షల, కోట్ల బాణాలు పాండవ సేనను కప్పివేసాయి. పాంచాల సేనను దహిస్తూ కర్ణుడు పొగలేని నిప్పులా చెలరేగినాడు.

అర్జునుడన్నాడు– "భార్గవాస్త్రంతో విజృంభించిన కర్ణుని మనమిప్పుడు ఎదుర్కోలేము. అతడు నన్ను ఎదుర్కోవడానికే మాటిమాటికి నావేపే చూస్తున్నాడు. ఇప్పుడతడిని ఎదిరించుట మంచిది కాదేమో!

**జీవన్ ప్రాప్నోతి పురుషః సంఖ్యే జయ పరాజయౌ**
**మృతస్య తు హృషికేశ భంగ ఏవ కుతో జయః** (కర్ణ. 65-64)

బ్రతికి ఉంటే జయమో, పరాజయమో పొందవచ్చు. మరణిస్తే భంగపాటే కాని గెలుపు ఎలా దక్కుతుంది?" అన్నాడు అర్జునుడు.

కృష్ణుడన్నాడు– "కర్ణుడు యుధిష్ఠిరుని బాగా గాయపరచాడు. ఆయనను అనునయించి ఆపై కర్ణుని చంపవచ్చు".

ఇద్దరూ సేననంతా కలయజూసారు. యుధిష్ఠిరుని జాడ కానరాక శిబిరాలవేపు వెళ్లారు.

వారిని చూడగానే ఆనందంతో లేచి కూర్చున్నాడు ధర్మరాజు– "కర్ణుడిని సంహరించారా! అతడొక విషసర్పం. ధార్తరాష్ట్రుల సంపద, రక్షణ కవచం అతడే. మీరు గాయపడలేదు. క్షేమంగా వచ్చారు. కర్ణుడినెలా చంపగలిగారు?

కర్ణుడు నన్ను వెంటాడి మరీ మాటలతో పరాభవించాడు. ఈ అవమానాన్ని భరించలేకపోతున్నాను.

**త్రయోదశాహం వర్షాణి యస్మాద్ భీతో ధనంజయ**
**నస్మ నిద్రాం లభేరాత్రౌ న చాహని సుఖం క్వచిత్** (కర్ణ. 66-15)

పదమూడు సంవత్సరాల పాటు కర్ణుడంటేనే భయపడుతూ బ్రదికాను. రాత్రిపూట నిద్రకాని, పగటిపూట సుఖం

కానీ పొందలేకపోయాను.

లోకమంతా నాకు కర్ణప్రాయమైంది. భీష్మ ద్రోణ కృపుల వల్ల కలగని అవమానం నాకు ఇతడి వల్ల కలిగింది. ఇక జీవితమెందుకు? రాజ్యమెందుకు? ఎలా చంపగలిగావతడిని?"

ఇలా ఏకధాటిగా మాట్లాడుతున్న యుధిష్ఠిరునితో అర్జునుడన్నాడు– "ఈరోజు అశ్వత్థామ నన్ను పూర్తిగా నిలువరించాడు. అతడిని ఓడించి పంపేసరికి కర్ణుడు ఏభైమంది రథికులతో నావేపు వస్తున్నాడు. ప్రభద్రకులు అతడిని అడ్డుకున్నారు. మిమ్మల్ని కర్ణుడు గాయపరచాడేమోనని భయపడి ఇటు వచ్చాము".

కర్ణుడు క్షేమంగా ఉన్నాడనేసరికి ధర్మరాజు కోపంతో ఊగిపోయాడు– "అక్కడ భీముడు ఒంటరిగా యుద్ధం చేస్తున్నాడు. నీవేమో కర్ణుడికి భయపడి పారిపోయి వచ్చావు. ద్వైతవనంలో ప్రతిజ్ఞ చేసావు కదా! ఒకే రథంతో వెళ్లి కర్ణుడిని చంపుతానని? ఏమయ్యిందా ప్రతిజ్ఞ? నీ మాట నమ్మి మేము యుద్ధానికి సిద్ధమయ్యాయి.

నీ రథాన్ని విశ్వకర్మ చేసాడు. నీ రథంపై కపిధ్వజమున్నది. నీ రథాన్ని కృష్ణుడు నడుపుతున్నాడు. నీకు తాటిచెట్టంత ధనుస్సు గాండీవం ఉంది, అక్షయ తూణీరాలున్నాయి, దివ్యాస్త్రాలున్నాయి ఎందుకు, ఏం చేసుకోవడానికి? నీ ధనుస్సును కృష్ణుడికిచ్చి, నీవు రథం నడుపు. లేకుంటే ఇంకెవరికన్నా ఇచ్చేయి ఆ గాండీవాన్ని! ఎందుకు పుట్టావు కుంతి కడుపులో! అయిదవ నెలలోనే కుంతిగర్భం నుండి పడిపోయి ఉండాల్సింది. లేక ఆమె గర్భంలో పడకపోయినా బాగుండేది. ఇలా రణభూమి నుంచి పారిపోయి రావాల్సిన స్థితి ఉండేది కాదు.

**ధిగ్గాండీవం ధిక్ చ తే బాహువీర్యమ్**
**అసంఖ్యేయాన్ బాణ గణాంశ్చ ధిక్ తే**
**ధిక్ తే కేతుం కేసరిణః సుతస్య**
**కృశానుదత్తం చ రథం చ ధిక్ తే!** (కర్ణ. 68–30)

నీ గాండీవం, నీ బాణాలు, నీ బాహుబలం, నీ కపిధ్వజం, రథం ఛీఛీ, అన్నీ దండగ!" అన్నాడు యుధిష్ఠిరుడు.

## అర్జునుడి కోపం

యుధిష్ఠిరుడిలా అనగానే అర్జునుడు కత్తిదూసాడు. అది చూసి కృష్ణుడన్నాడు– "ఇక్కడెవరూ శత్రువులు లేరే! కత్తి దూస్తావెందుకు?"

అర్జునుడన్నాడు– "గాండీవాన్ని ఇతరులకిమ్మనేవారిని చంపుతాననేది నా ప్రతిజ్ఞ!"

కృష్ణుడన్నాడు– "మీ ప్రతిజ్ఞలతోనే పెద్ద చిక్కు వస్తున్నది"

అర్జునుడన్నాడు– "భీముడు కూడా తననెవరైనా గడ్డాలు, మీసాలు లేనివాడు అంటే చంపేస్తాడు. ఇప్పుడు నా సమస్య గాండీవం ఇమ్మన్న అన్నను చంపాలా లేక ప్రతిజ్ఞాభంగం చేసి అసత్యవాదిని కావాలా?"

కృష్ణుడన్నాడు– "అహింస పరమధర్మం. అయినా పెద్దన్నను చంపడమేమిటి? ప్రాణ, విత్తమాన భంగమందు అసత్యమాడినా తప్పులేదన్నది ధర్మసూక్ష్మం. పూర్వం బలాకుడు హింస చేసాడు, గుడ్డి మృగాన్ని చంపినా అది మహా క్రూరమృగం కాబట్టి దానిని చంపడం అహింస క్రిందకే వచ్చింది. అలాగే కౌశికుడనేవాడు దొంగలకు జనులు దాక్కున్న చోటు చెప్పాడు. ఆ దోపిడీ దొంగలు జనుల్ని చంపి సొత్తు దోచుకున్నారు. అతడు సత్యం చెప్పి హింసకు కారణమై పాపి అయినాడు"

అర్జునుడన్నాడు– "నా ప్రతిజ్ఞ సత్యం కావాలి. ధర్మజుడు, నేను ప్రాణాలతో నిలవాలి. నీవే తరుణోపాయం ఆలోచించు"

కృష్ణుడన్నాడు– "గౌరవార్హుడు అవమానాన్ని పొందితే చచ్చినవాడి క్రింద లెక్క! నీవిప్పుడు ధర్మరాజును స్వల్పంగా అవమానించు– 'నీవు' అని పిలుపు!"

అర్జునుడన్నాడు ధర్మరాజుతో– "నీవు జూదరివై మమ్మల్ని కష్టాలపాలు చేసావు. పైపెచ్చు నీవు క్రూర వాక్యాలతో మమ్ములను నిందిస్తున్నావు" అని పలికి అర్జునుడు కత్తిదూసి "నన్ను నేను చంపుకుంటాను" అన్నాడు.

కృష్ణుడన్నాడు– "మరల ఇంకో ప్రతిజ్ఞ! చాలుచాలు. మరింత పెద్ద పాపం ఆత్మహత్య. నిన్ను నీవు పొగుడుకో! అది ఆత్మహత్యతో సమానం"

అర్జునుడన్నాడు– "నేను శివుడికన్నా గొప్పవాడిని. క్షణకాలంలో ఈ చరాచర జగత్తును సంహరించగలను. నా వల్లనే రాజసూయం దిగ్విజయమైంది. ఈరోజు కర్ణుని తల్లి పుత్రహీనురాలవుతుంది లేదా కుంతి తన కుమారుడిని కోల్పోతుంది. కర్ణుని చంపకుండా నేను కవచం వీడను" అన్నాడు అర్జునుడు.

ధర్మజుడన్నాడు– "నేను జూదరిని, పిరికివాడిని, నేను అరణ్యానికి పోతాను. ఇన్ని మాటలు పడ్డాక నేను జీవించడం అనవసరం"

కృష్ణుడన్నాడు– "గాండీవి ప్రతిజ్ఞ నెరవేరడానికి నేను ఈ రకంగా సలహా ఇచ్చాను. అందుకే నిన్ను అవమానించి చంపినంత పనిచేసాడు. సత్య సంరక్షణ, అహింస కోసం ఇలా మాట్లాడాడు. అతడిని క్షమించు. ఈ రోజు కర్ణుడు మరణించినట్లే!

**ఖడ్గ జిహ్వాం ధనురాస్యం శరదంష్ట్రం తరస్వినమ్**
**దృప్తం పురుష శార్దూలం జహి కర్ణం ధనంజయ** (కర్ణ. 72-38)

ఖడ్గమే నాలుక, విల్లు నోరు, బాణాలు దంతాలుగా పొగరుతో వేగంగా దూసుకుపోయే కర్ణుడనే పెద్దపులిని చంపు, అర్జునా! ఇప్పుడు కౌరవసైన్యంలో అయిదుగురు మహారథులున్నారు– అశ్వత్థామ, కృతవర్మ, కర్ణుడు, శల్యుడు, కృపుడు. వీరిని చంపి రాజ్యాన్ని ధర్మరాజుకు అందించు" అన్నాడు శ్రీకృష్ణుడు.

కృష్ణార్జునులు యుద్ధరంగంలోకి ప్రవేశించారు. అక్కడ యుద్ధం భీకరంగా సాగుతున్నది. కృపుడు–శిఖండి, దుర్యోధనుడు–సాత్యకి, శ్రుతశ్రవుడు–అశ్వత్థామ, యుధామన్యుడు–చిత్రసేనుడు, ఉత్తమౌజుడు–సుషేణుడు, సహదేవుడు–శకుని, శతానీకుడు–వృషసేనుడు, నకులుడు–కృతవర్మ; ధృష్టద్యుమ్నుడు–కర్ణుడు ఘోరంగా యుద్ధం చేస్తున్నారు.

ఉత్తమౌజుడు కర్ణుడి కొడుకు సుషేణుడిని చంపాడు. కృపుడిని గాయపరచాడు. శిఖండి కృపుడిని కొట్టకుండా వదిలేసాడు. భీముడి మనసు వ్యాకులపడింది. ధర్మరాజు, అర్జునుల క్షేమం గురించి పరితపిస్తుంటే అతడి సారథి విశోకుడన్నాడు– "అదిగో గాండీవ ధనుష్టంకారం, అదిగో కపిధ్వజం! అది కృష్ణార్జునుల రథం. కౌంతేయా! మనశ్శాంతితో ఉండుము, శుభమస్తు!"

తనకు అడ్డు వచ్చిన వారినందరిని చంపుతూ అర్జునుడు భీకరంగా యుద్ధం చేస్తున్నాడు. దుర్యోధనుడు తన యోధులతో "భీముని చంపండి" అని ఆదేశించాడు. రాజులందరూ తమ పూర్తి బలాలతో భీమసేనుడిని చుట్టుముట్టినారు.

భీముడి విజృంభణకు కౌరవసేన దారుణంగా గాయపడింది. రణరంగం మధ్యలో వైతరణిలా రక్తనది ప్రవహించింది. అంతటి బలశాలియైన భీమసేనుడిని శకుని ఎదిరించాడు. తన గాంధార సైన్యంతో వచ్చి బాణవర్షంతో భీముని కప్పివేసాడు. వాటిని తిప్పికొట్టి భీమసేనుడు భల్లాలతో రథాశ్వాలను చంపి శకునిని విరథుడిని చేయగా దుర్యోధనుడు వచ్చి అతడిని రథంపై తీసుకునిపోయాడు.

కర్ణుడు పాంచాలసేనను పరిమార్చ సాగినాడు. దానితో యుద్ధ విముఖమైన పాండవసేనను చూసి దుర్యోధనుడు ఉల్లాసంగా విజయభేరీలు మ్రోగింపజేసాడు. మరల మహాసంగ్రామం జరిగింది.

శల్యుడన్నాడు– "అదుగో అర్జున రథం! అప్పుడు ఇంద్రుడిచ్చిన శక్తితో ఘటోత్కచుని చంపావు. ఇప్పుడు అర్జునుడిని చంపు!"

కర్ణుడన్నాడు– "శల్యా! ఇప్పుడు నీవు నాకు నచ్చిన మాట చెప్పావు. ఈరోజు కృష్ణార్జునులను చంపకుండా వెనుదిరగను".

శల్యుడన్నాడు– "విజయుడు అజేయుడు. కృష్ణుడి రక్షణలో ఉన్నాడు"

కర్ణుడన్నాడు– "వాళ్లిద్దరూ గొప్పవారే! మనం తక్కువేమీ కాదు. వారు నన్ను పడగొట్టాలి లేదా నేను వాళ్లను పడగొడతాను"

అప్పుడు సంకుల సమరం జరిగింది. కర్ణుడు పరాక్రమించి పాండవ వీరులందరినీ పీడించాడు. పాంచాల రాజకుమారులను చంపుతూ పోతుంటే కృష్ణుడు అర్జునుడి రథాన్ని కర్ణుడి వేపు నడిపాడు. అతడికి రక్షణగా భీముడు వస్తూ శత్రు నాశనం చేస్తున్నాడు.

ఉత్తమౌజుడు, యుధామన్యుడు, జనమేజయుడు, శిఖండి, ధృష్టద్యుమ్నుడు పంచేంద్రియాల్లా కర్ణుని బాధించగా అతడు జితేంద్రియుడై వారి ప్రయత్నాలను నిష్ఫలం చేసాడు.

ఈలోగా ప్రాణాలను పణం పెట్టి జూదమాడుతున్నవారిలా దుశ్శాసనుడు భీముడు భీకరంగా పోరు చేసారు. రెండు మదపుటేనుగుల్లా, శంబరాసురుడు ఇంద్రుడిలా తీవ్రంగా కొట్టుకున్నారు.

భీముడన్నాడు– "నేను తీసుకున్న ఋణం వడ్డీతో చెల్లిస్తాను తీసుకో!"

దుశ్శాసనుడన్నాడు– "నీ పాట్లన్నీ గుర్తున్నాయి నాకు. లక్క ఇల్లు, సభాపర్వం, అరణ్యపర్వం అన్నీ గుర్తున్నాయి. పాపాత్మురాలైన మీ తల్లిలా మీరూ ప్రవర్తించారు. ద్రౌపది వరించింది ఒక్కరినే. మీరు ఆమెను అయిదుగురికి భార్యగా చేసుకున్నారు. శకుని మిమ్మల్ని నిండు కొలువులో దాసులుగా చేయడమూ గుర్తున్నది. మీరు అడుక్కోవడమూ గుర్తున్నది".

భీముడికి కోపం వచ్చి దుశ్శాసనుడి వింటిని, ధ్వజాన్ని నరికాడు. ఒక బాణంతో అతడి నుదుటి మీద కొట్టి సారథిని చంపాడు. దుశ్శాసనుడు స్వయంగా రథాన్ని నడుపుతూ భీమసేనుడిపై బాణవర్షం కురిపించాడు. గొప్ప బాణంతో భీముడు మూర్ఛిల్లేలా కొట్టాడు. ఒక్కక్షణం ప్రాణాలు పోయినట్లు పడిపోయిన భీమసేనుడు చేతులు చాచి రథాన్ని పట్టుకుని మరల చైతన్యాన్ని పొంది సింహనాదం చేసాడు. దుశ్శాసనుడు మరింతగా పరాక్రమించాడు.

## దుశ్శాసన వధ

దానితో క్రుద్ధుడైన భీమసేనుడు గదను చేపట్టగా, దుశ్శాసనుడు శక్తిని విసిరాడు. భీముడు గదను విసిరాడు. అది శక్తిని ముక్కలు చేసి దుశ్శాసనుడిని నలభై మూరలు వెనక్కి నెట్టింది. అతడు వణుకుతూ పడిపోయాడు. కవచం, ఆభరణాలు, వస్త్రాలు, మాలలు ధ్వంసమయ్యాయి. బాధతో కొట్టుకుంటున్నాడు దుశ్శాసనుడు.

అలా దుశ్శాసనుని పడగొట్టి సింహనాదం చేసిన భీముడు వేగంగా రథం మీదనుంచి దూకినాడు. భీమసేనుడి మనోయవనికపై తాము అంతకు ముందు పడిన కష్టాలు దృశ్యమాలికలా కనిపిస్తున్నాయి. దుశ్శాసనుడు ద్రౌపది జుట్టు పట్టుకుని లాగడం, వస్త్రాపహరణం చేయ ప్రయత్నించడం, పరుషంగా మాట్లాడడం, అందర్నీ తలుచుకుని నేయి పోసిన అగ్నిలా మండిపడుతూ– "యోధులారా! పాపి అయిన దుశ్శాసనుని చంపబోతున్నాను. కాపాడుకోండి!" అన్నాడు.

కర్ణుడు, దుర్యోధనుడు నిశ్చేష్టులై చూస్తూ ఉండగానే పదునైన కత్తిని ఎత్తి వణుకుతున్న దుశ్శాసనుడి మెడ నరికాడు.

"దురాత్మా! నన్ను ఎద్దు, ఎద్దు అన్నావు; ద్రౌపది జుట్టు పట్టుకున్నావు ఏ చేత్తో, ఆమె చీర లాగావు, ఏ చేత్తో చెప్పు!"

దుశ్శాసనుడు చావుదెబ్బ తిని కూడా రోషంగా అన్నాడు– "ఇదిగో ఈ చేత్తోనే! గోవులను దానం చేసినదీ చేయి, శత్రువులను చంపినదీ చేయి, మీరు చూస్తుండగానే ద్రౌపది జుట్టు లాగిందీ చేయి"

భీముడన్నాడు– "మరి ఈ చేయి నీకెందుకింకా?" అంటూ ఆ చేతిని విరిచేసాడు. దుశ్శాసనుని కొట్టి రొమ్ముపై దూకి వక్షస్థలాన్ని చీల్చి వెచ్చటి నెత్తురు దోసిటపట్టి త్రాగ సాగినాడు. లేవడానికి ప్రయత్నిస్తున్న దుశ్శాసనుడి తల నరికాడు.

"మాతృస్తన్యం కన్నా, మధువు కన్నా, నేయి కన్నా, ద్రాక్షరసం కన్నా, మంచినీటి కన్నా, పాలకన్నా, వెన్నకన్నా, లోకంలోని గొప్ప సుధామధుర పదార్థాల కన్నా ఇప్పుడు నేను త్రాగిన రక్తమే రుచిగా ఉన్నది. ఓరి దుర్మార్గుడా! మృత్యువు నిన్ను కాపాడినాడు" అని నెత్తురు తాగుతూ ఉన్మత్త నృత్యం చేస్తుంటే చూస్తున్న వాళ్ల చేతుల్లోంచి శస్త్రాలు జారి పడిపోయాయి. భయంతో వణుకుతూ కళ్లు మూసుకున్నారు. "ఇతడు మనిషి కాడు" అంటూ పారిపోసాగినారు.

మరల దోసిట నిండా రక్తం నింపి– "పురుషాధమా! ఇది నీ కంఠం నుంచి కారిన నెత్తురు. దీనిని తాగుతున్నాను. అనవేరా! 'ఎద్దు, ఎద్దు' అని – చేసావుగా నీ సోదరుల మధ్యలో నిలబడి నృత్యం! ఇప్పుడు నేనంటున్నాను– ఎద్దు, ఎద్దు అని. మేము చేస్తున్నాము నృత్యం.

విషాన్ని తినిపించి, ప్రమాణకోటి తీర్థంలో త్రోసి, భోజనంలో విషాన్ని కలిపి, జూదంతో రాజ్యాన్ని అపహరించి, ద్రౌపది జుట్టుపట్టి, వస్త్రాపహరణం చేసి, వనవాస అజ్ఞాత వాసాల్లోనూ చిక్కులు పెట్టి, మీరేమో సుఖంగా పడుకున్నారిక్కడ.

ఇప్పుడు నెరవేరింది నా మొదటి ప్రతిజ్ఞ. ఇక్కడే నేను రెండవ యజ్ఞ పశువైన దుర్యోధనుడిని చంపి బలి ఇస్తాను. ఆ దురాత్ముని శిరస్సును కాలితో తన్ని శాంతిని పొందుతాను" అని భీకరంగా గర్జించాడు భీమసేనుడు రక్తసిక్తమైన దేహంతో, దోసిట్లో గడ్డకడుతున్న దుశ్శాసనుడి రక్తాన్ని చూస్తూ.

దుశ్శాసనుడిని అలా చంపిన భీమసేనుడిని వధించాలని ధార్తరాష్ట్రులు పదిమంది– నిషంగి, కవచి, పాశి, దండధారుడు, ధనుర్గ్రహుడు, ఆలోలుపుడు, శలుడు, సంధుడు, వాతవేగుడు, సువర్చసుడు – భీముడిపై దాడి చేయగా వారినందరినీ వధించాడతడు కోపించిన మృత్యువులా.

శల్యుడన్నాడు కర్ణుడితో– "ఇంత భీకరంగా భీముడు ప్రవర్తిస్తాడని ఎవరూ ఊహించలేదు. భయాన్ని వీడు. నీవే ఇప్పుడు కౌరవులకు దిక్కు. దుర్యోధనుడు భారమంతా నీపైనే ఉంచాడు. అదుగో వృషసేనుడు పాండవులపై దాడి చేస్తున్నాడు. నీ కుమారుడిని కాపాడుకో!"

వృషసేనుడు–నకులుడు గొప్ప యుద్ధం చేసారు. వృషసేనుడి బాణాలకు నకులుడి వనాయుదేశపు గుర్రాలు నశించాయి. అప్పుడు ఖడ్గయుద్ధంలో నిపుణుడైన నకులుడు కత్తి–డాలు చేతబట్టి తనకు అడ్డువచ్చిన వారినందరినీ నరుకుతూ పోయాడు. రెండువేల మందిని చంపి, వృషసేనుడినీ గాయపరచాడు. వృషసేనుడు గొప్ప బాణాలతో నకులుడిని కొట్టగా అతడు భీముని రథమెక్కాడు. అటుగా వచ్చిన అర్జునుడిని చూసి నకులుడన్నాడు– "ఆ వృషసేనుడిని చంపు".

అర్జునుడు తన వేపు రావడం చూసిన వృషసేనుడు వేగంగా బాణాలు వదిలి అర్జునుడిని, శతానీకుడిని, నకులుడిని, భీముడిని, కృష్ణుడిని గాయపరచాడు.

కర్ణుడు చూస్తూ ఉండగానే అర్జునుడు అంతవరకు అరివీర భయంకరంగా యుద్ధం చేస్తున్న వృషసేనుడిని బాణాలతో ఆక్రమించాడు– "కర్ణా! మీరు ఆరుగురు అతిరథులు కలిసి ఒంటరివాడైన నా కుమారుడు అభిమన్యుడిని చంపినారు. ఇప్పుడు నీవు చూస్తూ ఉండగా నేను నీ పెద్ద కుమారుడిని చంపుతున్నాను. చేతనైతే రక్షించుకో!" అని అత్యంత వేగంగా పది బాణాలు వదిలి వృషసేనుడి ధనుస్సును, భుజాలను, శిరస్సును ఖండించాడు.

కర్ణుడు పుత్రశోకంతో కుములుతూనే అర్జునుడి నెదిరించాడు.

కర్ణార్జునులిద్దరూ రథికశ్రేష్ఠులు. రథస్థులు, మహాధనుస్సులు ధరించినవారు. దివ్యాస్త్ర సంపన్నులు, కవచ ధారులు. దైవాంశ సంభూతులు. ద్వంద్వ యుద్ధం ప్రారంభించారు.

ఇద్దరివీ తెల్లగుర్రాలే, ఇద్దరివీ గొప్ప రథాలే, ఇరువురి సారథులూ గొప్పవారే!

కర్ణుడికి రక్షణగా కౌరవులు, అర్జునుడికి రక్షణగా పాండవులూ నిలిచారు యుద్ధ సన్నద్ధులై. అలనాటి జూదంలో సభ్యులే నేడు ప్రేక్షకులు. కర్ణుడి ప్రాణాలు, అర్జునుడి ప్రాణాలు పందెం. ఆకాశం కర్ణుని పక్షాన, భూమి అర్జునుడి పక్షాన నిలిచాయి. గిరులు, సాగరాలు, జీవనదులు, వృక్షాలు ఓషధులు అర్జునుడి వేపు; అసురుసులు, యూయధానులు, గుహ్యకులు కర్ణుడి వేపు నిలిచారు.

ఇద్దరూ ఒకే తల్లి బిడ్డలని ఒకరికి తెలుసు, ఇంకొకరికి తెలియదు. పుణ్యలోకాలు అర్జునుడి వేపు, మలిన గంధాలు కర్ణుడి వేపు నిలిచాయి. దేవతలు అర్జునుడి వేపు, అసురులు కర్ణుడి పక్షం. దేవతలు బ్రహ్మ ఈ యుద్ధం గురించి చర్చించారు. విజయుడిదే విజయంగా నిర్ణయించబడింది.

**యస్య చక్రే స్వయం విష్ణుః సారథ్యం జగతః ప్రభుః**
**మనస్వీ బలవాన్ శూరః కృతాస్త్రోథ తపోధనః** (కర్ణ. 87–74)

జగత్ప్రభువే అర్జునుడికి సారథి. అక్కడే జయం ఉంటుంది.

ద్వైరథ యుద్ధమనే జూదం మొదలయ్యింది. ధ్వజాలు, గుర్రాలు, సారథులు ఒకరినొకరు తీవ్రంగా చూసుకున్నారు.

కర్ణుడన్నాడు– "శల్యా! అర్జునుడు నన్ను చంపితే నీవేం చేస్తావు?"

శల్యుడన్నాడు– "వాళ్లిద్దరిని నేను చంపుతాను"

అర్జునుడన్నాడు– "కృష్ణా! కర్ణుడు నన్ను చంపితే నీవేం చేస్తావు?"

కృష్ణుడన్నాడు– "కర్ణుడు నిన్ను చంపలేడు. చంపి బ్రతకలేడు"

ఇద్దరు రథికులు యుద్ధం ప్రారంభించారు. బాణాలతో చీకటిని కలుగజేసి ఆ చీకటిలో సూర్యచంద్రుల్లా వెలుగొందినారు.

ఆ మహా సంగ్రామం అంత భయంకరంగా సాగుతుండగా అశ్వత్థామ దుర్యోధనుడితో అన్నాడు– "దుర్యోధనా! జరిగిన నష్టం చాలు. పాండవులతో సంధి చేసుకో! నేను, కృపాచార్యుడు అవధ్యులం. నేను నివారిస్తే అర్జునుడు శాంతిస్తాడు. కృష్ణుడు కూడా శత్రుత్వాన్ని కోరుకోడు. యుధిష్ఠిరుడు ప్రాణిహితాన్ని అభిలషిస్తాడు. ధృతరాష్ట్రుడు గాంధారి సంధికి అంగీకరిస్తారు. నీవు, ధర్మరాజు ఎవరి రాజ్యం వాళ్లు తీసుకుని సుఖంగా జీవించవచ్చు.

**రక్ష దుర్యోధనాత్మానామ్ ఆత్మా సర్వస్య భాజనమ్**
**జీవనే యత్నమాతిష్ఠ జీవన్ భద్రాణి పశ్యతి** (కర్ణ. 88–24)

దుర్యోధనా! నిన్ను నీవు రక్షించుకో! బ్రతికి ఉంటే శుభములు బడయవచ్చు"

దుర్యోధనుడన్నాడు– "భీముడిప్పుడే దుశ్శాసనుడినెలా చంపాడో చూసావు. భీముడికి భయపడి నేను సంధి చేసుకుంటున్నానని జనులనుకోవడం నాకిష్టం లేదు. అర్జునుడు అలసిపోయి ఉన్నాడు. కర్ణుడతడిని చంపుతాడు. గురుపుత్రా! సంధి ప్రసక్తి లేదు. యుద్ధమే నిశ్చయం!"

## కర్ణార్జునుల యుద్ధం

ఆ ఇద్దరు రథికులు యుద్ధం చేస్తుంటే అన్నివేపుల నుంచి కోలాహలం చెలరేగింది.

"అర్జునా! కర్ణుని చంపు. అతడి తలను, దుర్యోధనుని రాజ్యాశను ఖండించు. ఆలస్యం చేయకు" అంటున్నారు పాండవ వీరులు.

"కర్ణా! అర్జునుని చంపు. పాండవులు మరల దీర్ఘకాలం వనవాసానికెళ్లాలి" అంటున్నారు కౌరవ యోధులు.

అర్జునుడు గాండీవాన్ని సవరించి నారాచాలు, నాళీకాలు, వరాహ కర్ణాలు, క్షురాలు, అంజలికాలు, అర్ధచంద్ర బాణాలు వేయగా అవి కర్ణరథంలో ప్రవేశించి రాత్రివేళ పక్షులు చెట్టుమీద వ్రాలినట్లున్నాయి.

కర్ణుడు తనవేపు వచ్చిన బాణాలను వచ్చినట్లు ఖండిస్తున్నాడు. అర్జునుడు ఆగ్నేయాస్త్రం వేస్తే కర్ణుడు వారుణాస్త్రంతో దానిని చల్లార్చాడు. అర్జునుడు వజ్రాస్త్రం వేయగా కర్ణుడు భార్గవాస్త్రం వేసి దానిని నిర్వీర్యం చేసాడు. అనేక బాణాలతో పాంచాల, పాండవ వీరులను గాయపరచాడు.

కర్ణుడి విజృంభణను చూసి కృష్ణుడు హెచ్చరించగా అర్జునుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించగా, కర్ణుడు దానిని భంగపరచాడు. అదిచూసి అర్జునుడు, భీముడు సలహా విని బంగరు రెక్కలు కల పదివేల బాణాలను ప్రయోగించి కౌరవ సేనను ధ్వంసం చేసాడు. కర్ణుడు ఆగ్రహంతో అర్జునుడిని, కృష్ణుడిని, భీముడిని బాణాలతో గాయపరచాడు. అర్జునుడు మహాస్త్రం ప్రయోగించి చీకట్లు కల్పించి శల్యుడిని, కర్ణుడిని గాయపరచాడు. కర్ణుడు కోపంతో తక్షక పుత్రుడైన అశ్వసేనుని పక్షానికి చెందిన అయిదు సర్పాలను వదలగా కృష్ణుడి కవచాన్ని భేదించి మరల కర్ణుడి వద్దకు వెళ్తుంటే అర్జునుడు వాటిని ముక్కలు చేసాడు. అనేక బాణాలు వేసి కర్ణుడికి రక్షణగా ఉన్న రెండువేల మంది సైనికులను చంపివేసాడు. అర్జునాస్త్రం కౌరవులను దహిస్తుండగా కర్ణుడు నాగాస్త్రాన్ని స్మరించాడు. తక్షకుని కుమారుడు, ఖాండవ వన దహన సమయంలో అర్జునుడి బాణాల వల్ల తల్లిని కోల్పోయినవాడు సర్పముఖ బాణరూపంగా ఉన్నాడు. యోగబలంతో అశ్వసేనుడు ఆ బాణంలో ఉన్నాడని కర్ణుడికి కూడా తెలియదు. కర్ణుడు సర్పముఖ బాణాన్ని ధనుస్సుకు సంధించేసరికి దేవేంద్రుడు కూడా కలవర పడిపోయాడు.

శల్యుడన్నాడు– "సరిగా గురిచూడు. ఇది శత్రువు మెడలో గ్రుచ్చుకోదు"

కర్ణుడన్నాడు– "కర్ణుడెప్పుడూ రెండుసార్లు బాణం సంధించడు" అని పలికి "అర్జునా చచ్చావు!" అని నాగాస్త్రాన్ని వదిలాడు.

కృష్ణుడది చూసి విలాసంగా, వేగంగా తన రథాన్ని కాలితో కొద్దిగా నేలలోకి అదిమాడు. రథాశ్వాలు మోకాళ్లపై నిలిచాయి. కర్ణుడు విడిచిన సర్పముఖ బాణం అర్జునుడి మెడలో తగలడానికి బదులు అది కిరీటం పడగొట్టింది.

అర్జునుడు తొట్రుపడకుండా తన తెల్లటి వస్త్రంతో జుట్టు ముడివేసుకుని యుద్ధానికి సిద్ధమైనాడు. అశ్వసేనుడు వెంటనే కర్ణుడి వద్దకు వెళ్లి మరోసారి నాగాస్త్రాన్ని విడువమని పలుకగా కర్ణుడన్నాడు– "ఒకే అస్త్రాన్ని రెండుమార్లు ప్రయోగించ

లేను". దానితో అశ్వసేనుడు స్వయంగా అర్జునుడి వేపు వస్తుండగా, కృష్ణుడి సలహా విని అర్జునుడు అశ్వసేనుడనే సర్పాన్ని ఆరు బాణాలతో ఖండించాడు. క్రుంగిన రథం మరల యథాస్థానానికి వచ్చింది.

కర్ణార్జునులిద్దరూ విష సర్పాల్లాంటి బాణాలు వేసుకుని పరస్పరం గాయపరచుకున్నారు. అర్జునుడు అత్యంత వేగంగా కర్ణుడి కవచాన్ని చీల్చివేసాడు. యమదండ, అగ్నిదండం వంటి బాణాలతో కర్ణుని గాయపరచాడు. దానితో రక్తమోడుస్తూ కర్ణుడు అశోకాలు, మోదుగులు, బూరుగుచెట్లు, చందన వనాలున్న పర్వతంలా, గోగుచెట్లు నిండినట్లు కర్ణుడు ప్రకాశించాడు. ఎర్రని కిరణాలతో, ఎర్రని బింబంతో అస్తాద్రి వేపు వెళ్తున్న సూర్యబింబంలా ప్రకాశించాడు.

**కాలో హ్యా ద్య శ్యో నృప విప్ర కోపాత్**
**నిదర్శయన్ కర్ణ వధం బ్రువాణః**
**భూమిస్తు చక్రం గ్రస తీత్య వోచత్**
**కర్ణస్య తస్మిన్ వధకాల ఆగతే** (కర్ణ. 90-81)

పరశురాముడిచ్చిన అస్త్రం మనసులోంచి తొలగిపోయింది. రథపు ఎడమచక్రం భూమిలో క్రుంగింది. కర్ణవధకు కాలం ఆసన్నమైంది. కర్ణుడు బ్రహ్మాస్త్రాన్ని, అర్జునుడు ఐంద్రాస్త్రాన్ని వేసారు. రెండూ నిర్వీర్యమైనాయి. అర్జునుడు బ్రహ్మాస్త్రాన్ని వేసాడు. దానిని వారిస్తూనే కర్ణుడు అర్జునుడి గాండీవపు అల్లెత్రాళ్లను తెంపుతూనే ఉన్నాడు. అర్జునుడు బిగిస్తూనే ఉన్నాడు. కర్ణుడు గొప్ప బాణాలతో అర్జునుడిని పీడించాడు.

అర్జునుడు లోహమయమైన భీకరాస్త్రాన్ని కర్ణుడిపై ప్రయోగించబోయినప్పుడే కర్ణుడి రథం క్రుంగింది. కర్ణుడు వేగంగా రథం దిగి తన భుజాలతో రథాన్ని లేవనెత్తాలని ప్రయత్నించగా భూమి నాలుగంగుళాలు లేచింది కానీ రథం భూమినే క్రుంగి ఉన్నది.

కర్ణుడన్నాడు– "అర్జునా! ముహూర్తకాలం ఆగు. రథాన్ని పైకి లేపుతాను"

కృష్ణుడన్నాడు– "నీవు ఆగమంటే కాలం ఆగదు. నీవు లేపితే రథచక్రం లేవదు. నీ ముహూర్తం నిర్ణయమైపోయింది"

కర్ణుడన్నాడు– "పాండవా! నాకు నీవన్నా కృష్ణుడన్నా భయం లేదు. నీవు రథంపై ఉన్నావు. నేను నేలపై ఉన్నాను"

కృష్ణుడన్నాడు– "నీవేనాడూ నేలపై లేవు. ఎప్పుడూ నింగిలోనే విహరించావు. ధర్మరాజుతో పాచికలాడించావు, ద్రౌపదిని సభలోకి రప్పించావు, వనవాసం పూర్తయినా రాజ్యమివ్వలేదు, భీముడికి విషాన్నం పెట్టారు, లక్కఇల్లు తగలబెట్టారు, అప్పుడు ధర్మం గుర్తుకు రాలేదా? ద్రౌపదిని మరొక భర్తను కోరుకో –అన్నపుడు ధర్మం గుర్తుకు రాలేదా? బాలుడైన అభిమన్యుడిని చంపినపుడు ధర్మం గుర్తుకు రాలేదా?"

కర్ణుడేమీ మాట్లాడలేకపోయాడు. రథమెక్కాడు.

అర్జునుడిలో రోషం ప్రవేశించింది.

కర్ణుడు వింటిని చేబట్టి విషసర్పాల్లాంటి బాణాలు, దివ్యాస్త్రాలు ప్రయోగిస్తున్నాడు. వాటిని నిలువరిస్తున్నాడు అర్జునుడు. ఈసారి కర్ణుడు వేసిన బాణం అర్జునుడి రొమ్ముపై దిగబడింది. అర్జునుడి చేతిలోని గాండీవం చేజారినట్లయ్యింది.

ఆ కాస్త సమయంలోనే కర్ణుడు రథం దిగి రథాన్ని పైకి లేపబోయినాడు.

కృష్ణుడన్నాడు– "అతడు మరల రథమెక్కరాదు"

అర్జునుడు యమదండం వంటి అంజలికమనే బాణాన్ని చేతబట్టి గాండీవంపై సంధించి "ఈ బాణం బలసంపన్నుడైన కర్ణుని చంపును గాక!" అని వదిలాడు. ఆ బాణం కర్ణుడి శిరస్సును ఖండించి నేలపై పడింది. రక్తధారలు జిమ్ముతూ మొండెం కూడా క్రిందపడింది. కాసేపు హాహాకారాలు. ఆ తరువాత అంతా నిశ్శబ్దం.

**దైవం ధ్రువం పార్థవశాత్ ప్రవృత్తం**
**యత్ పాండవాన్ పాతి హినస్తి చాస్మాన్** (కర్ణ. 92-12)

దైవం అర్జునుడికి అనుకూలంగా ఉన్నది. కర్ణుడి మానవ ప్రయత్నం కుప్పకూలింది.

శల్యుడన్నాడు– "కర్ణార్జునుల పోరు వంటి యుద్ధం ఎప్పుడూ జరగలేదు. కృష్ణార్జునులను, నీ శత్రువులను దాదాపుగా ఓడించిన కర్ణుడు దైవమనుకూలించక నేలకూలినాడు"

**నైతాదృశం భారత యుద్ధ మాసీద్**
**యథాతు కర్ణార్జున యోర్బభూవ**
**గ్రస్తౌ హి కర్ణేన సమేత్య కృష్ణౌ**
**అన్యే చ సర్వే తవ శత్రవో యే** (కర్ణ. 92-11)

**కృష్ణసారథి మాయాంతం దృష్ట్వా శ్వేతహయం రథమ్**
**అర్జునం చాపి యోద్ధారం త్వదీయాః ప్రాద్రవన్ భయాత్** (కర్ణ. 93-33)

కృష్ణుడి సారథ్యంలో అర్జునుడు రథికుడిగా వస్తుంటే కౌరవ సైనికులు భయంతో పారిపోయారు. దుర్యోధనుడు ఆపుతున్నా ఎవరూ ఆగలేదు.

శోక వ్యాకులమైన మనస్సుతో దుర్యోధనుడు కూడా "అయ్యో కర్ణా!" అని విలపిస్తూ చైతన్యహీనుడైనాడు.

**హా కర్ణ హా కర్ణ ఇతి బ్రువాణమ్**
**ఆర్తం విసంజ్ఞం భృశమశ్రు నేత్రమ్** (కర్ణ. 94-24)

కర్ణుడు చనిపోగానే కౌరవులకు జీవితాల మీదా, రాజ్యాల మీదా, భార్యల మీదా, ధనాల మీద కూడా నిరాశ కలిగింది.

**హతే కర్ణే మహారాజ నిరాశాః కురవో భవన్**
**జీవితే ష్వపి రాజ్యేషు దారేషు చ ధనేషు చ** (కర్ణ. 95-16)

పాండవ శిబిరంలో హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. కృష్ణార్జునులు యుధిష్ఠిరుని దర్శించారు. వారిని ప్రేమతో కౌగిలించుకున్నాడు ధర్మరాజు.

కృష్ణుడన్నాడు– "వీర వినాశకమై రోమాంచక హేతువైన ఈ యుద్ధం నుంచి బయటపడ్డారు పాండవులందరూ.

**హతో వైకర్తనో రాజన్ సూతపుత్రో మహారథః**
**దిష్ట్యాజయసి రాజేంద్ర దిష్ట్యావర్ధసి భారత** (కర్ణ. 96-20)

రాజా! మహారథుడు, సూర్యసుతుడు అయిన కర్ణుడు మరణించాడు. నీ శత్రువు ఒళ్లంతా బాణాలతో నేలమీద పడి ఉన్నాడు".

యుధిష్ఠిరుడన్నాడు– "నీవల్లనే మనం గెలిచాము. నేను రణరంగంలో పడి ఉన్న కర్ణుడిని చూడాలి". అందరూ వెళ్లారక్కడకు.

**యథా కదంబ కుసుమం కేసరైః సర్వతో వృతమ్**
**చితం శరశతైః కర్ణం ధర్మరాజో దదర్శసః** (కర్ణ. 96-37)

అన్ని వేపులా కేసరాలతో ఆవరింపబడిన కదంబ పుష్పంలా వందలకొలది బాణాలతో నిండి ఉన్న కర్ణుని దేహాన్ని చూసాడు ధర్మరాజు. పుత్ర సహితంగా చచ్చి పడిఉన్న కర్ణుడిని చూసాడు.

"గోవిందా! నీ దయవల్ల నేను ఈరోజు ఈ నేలకు రాజయ్యాను. పదమూడు సంవత్సరాలు నిద్ర పట్టని నాకు ఈ రాత్రి సుఖంగా నిద్రిస్తాను".

-----

సంజయుడు చెప్పిన కర్ణవధా వృత్తాంతాన్ని వినగానే ధృతరాష్ట్రుడు వేరు తెగిన చెట్టువలె నిశ్చేష్టుడై నేలపై పడ్డాడు. గాంధారిదేవి కూడా పడిపోయి ఏవేవో మాట్లాడసాగింది. విదురుడు, సంజయుడు వారినిద్దరిని ఊరడించారు.

❖❖❖❖❖

# ✤ 9. శల్య పర్వము ✤

1) శల్యాభిషేక పర్వము (28)
2) హ్రద ప్రవేశ పర్వము (1)
3) గదా పర్వము (36)

## 1) శల్యాభిషేక పర్వము

కర్ణుడు చనిపోయేసరికి దుర్యోధనుడు శోకసాగరంలో మునిగిపోయాడు.

**హా కర్ణ హా కర్ణ ఇతిశోచమానః పునః పునః**
**కృచ్ఛ్రాత్ స్వ శిబిరం ప్రాప్తః హతశేషేర్నృపైః సహ** (శల్య. 1-5)

"హా కర్ణ! హా కర్ణ!" అని పలుమార్లు శోకిస్తూ అతికష్టంతో తన శిబిరం చేరాడు.

కృపాచార్యుడు చెప్పాడు పాండవులతో సంధి చేసుకొమ్మని, అంగీకరించలేదు దుర్యోధనుడు.

యుద్ధమే శరణ్యమని పలికి రెండు యోజనాల దూరం పోయి సరస్వతీ నదిలో స్నాన జలపానాలు చేసారు. గురుపుత్రుడైన అశ్వత్థామను సలహా అడిగాడు దుర్యోధనుడు- సేనాపతిగా ఎవరినైనా సూచించమని.

**అయంకులేన రూపేణ తేజసా యశసా శ్రియా**
**సర్వైర్గుణైః సముదితః శల్యో నోస్తు చమూపతిః** (శల్య. 6-19)

అశ్వత్థామ అన్నాడు- "శల్యుడు సేనాధిపతిగా అన్ని విధాల అర్హుడు".

శల్యుడిని సేనాధిపతిగా అభిషిక్తుని చేసారు. కౌరవ సైన్యం సింహనాదం చేసింది. మంగళవాద్యాలు మ్రోగాయి.

శల్యుడు తనకిచ్చిన గౌరవానికి ఉప్పొంగిపోయాడు.

**ద్రోణ భీష్మావతి విభో సూతపుత్రం చ సంయుగే**
**విచరిష్యే రణే యుధ్యన్ ప్రియార్థం తవ కౌరవ** (శల్య. 7-20)

"దుర్యోధనా! నీ సంతోషం కోసం నేను భీష్మ ద్రోణ కర్ణులను మించి యుద్ధం చేస్తాను" అన్నాడు శల్యుడు.

మద్రదేశాధిపతి శల్యుడు కౌరవసేనాధిపతిగా నియమితుడయ్యాడని తెలియగానే యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుని సలహా అడిగాడు.

కృష్ణుడన్నాడు- "నా మామ' అని ఆయనపై దయచూపకు-

**ద్రోణ భీష్మార్ణవం తీర్త్వా కర్ణపాతాల సంభవమ్**
**మానిమజ్జ స్వ సగణఃశల్యమాసాద్య గోష్పదమ్** (శల్య. 7-40)

భీష్మ, ద్రోణ, కర్ణులనే మహా సాగారాలను దాటి ఇప్పుడు నీవు, నీ పరివారం శల్యుడనే గోష్పాదంలో మునిగిపోవద్దు"

## పద్ధెనిమిదవ రోజు యుద్ధం

కృపాచార్య, కృతవర్మ, అశ్వత్థామ, శల్య, శకునిలు దుర్యోధనునితో సమావేశమై ఒక నియమం చేసుకున్నారు- "మనలో ఏ ఒక్కడూ ఏ విధంగానూ ఒంటరిగా పాండవులతో యుద్ధం చేయరాదు. అలా చేసినవాడు పంచ మహాపాతకాలు, ఉప పాతకాలు పొందుతాడు".

కౌరవుల సర్వతోభద్ర వ్యూహం-

ఆ రోజున కౌరవుల పక్షంలో 11000 రథాలు, 10700 ఏనుగులు, 200000 గుర్రాలు, 3 కోట్ల పదాతిసేన మిగిలింది.

పాండవుల వద్ద 6000 రథాలు, 6000 ఏనుగులు, 10000 గుర్రాలు, 2 కోట్ల పదాతిసేన మిగిలింది.

రెండు పక్షాల మధ్య సంకుల సమరం మొదలైంది. భీమార్జున నకుల సహదేవులు పోరు ఘోరంగా చేసి రణరంగాన్ని పీనుగుల పెంటగా మార్చారు. పాండవ వీరుల ప్రతాపాగ్నికి తాళలేక కౌరవసేన పారిపోయింది. శల్యుడు క్రోధవశుడై పాండవసేనను అడ్డుకునేసరికి మరల కౌరవసేన పుంజుకున్నది.

నకులుడు కర్ణుడి కుమారుడైన చిత్రసేనుడిని చంపాడు. ఆ తరువాత మరో ఇద్దరు కర్ణుడి పుత్రులు సత్యసేనుడు, సుషేణుడు కూడా నకులుడి బాణాలు తగిలి మరణించారు.

ఎన్నో ఉత్పాతాలు అపశకునాల మధ్య ఇరుపక్షాల నడుమ భీకర పోరు జరిగింది. శల్యుడు ధర్మరాజుపై శరవర్షం కురిపించాడు. కౌరవులు ఏకీకృతమై పాండవసేనను ముట్టడించారు. శల్యుడి విజృంభణకు ప్రభద్రకులు, సోమకులు అనేకురు నేలకొరిగారు.

**భ్రమరాణామివ వ్రాతాః శలభానా మివ వ్రజాః**
**హ్రాదిన్య ఇవ మేఘేభ్యః శల్యస్య న్యపతన్ శరాః** (శల్య. 11-25)

వేగంగా బాణాలు వేస్తూ శల్యుడు ప్రళయకాల యమునివలె శత్రువులను కప్పేసాడు.

భీముడు, నకుల సహదేవులు, ఉపపాండవులు శల్యుడిని చుట్టుముట్టినారు. శల్యుడికి సాయంగా ఉలూకుడు, శకుని, అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యులు వచ్చారు.

భీముడు గదాయుధం ధరించి కృతవర్మ గుర్రాలను చంపాడు. శల్యుడి పుత్రుడిని సహదేవుడు సంహరించాడు. శల్యుడు సోమక పాండవ వీరులను సంహరించడం చూసి భీముడు అతడి గుర్రాలను, సారథిని చంపేసరికి శల్యుడు వెనక్కి తగ్గాడు.

తర్వాత భీముడు, శల్యుడు గదాయుద్ధం ప్రారంభించారు. గదకు గద తగిలి నిప్పులవాన కురిసింది. ఇద్దరూ ఒకరినొకరు కొట్టుకున్నారు. తీవ్రంగా దెబ్బలు తగిలి ఇద్దరూ నేలపై పడ్డారు. కృపాచార్యుడు వచ్చి శల్యుడిని తీసుకుపోయాడు. భీముడు మూర్ఛలేచి శల్యుడికోసం వెదికాడు.

దుర్యోధనుడు చేకితానుడిని చంపాడు. సంశప్తకులు మూడువేల మంది అర్జునుడితో పోరాడినారు. ఇరుపక్షాల సేనల మధ్య ఘోర యుద్ధం జరిగింది. శల్యుడు విజృంభించి ధర్మరాజును, నకుల సహదేవులను గాయపరచాడు. తన బాణాలతో పాండవులను కల్లోలపరచాడు.

సంశప్తకుల బాణవర్షంలో కృష్ణార్జునుల రథం మునిగిపోయింది. రథం నొగ, చక్రాలు, కాడి, పగ్గాలు, కాడికర్ర, కోడుపీట అన్నీ బాణాలతో నిండిపోయాయి. వెంటనే అర్జునుడు గొప్పగొప్ప బాణాలతో సంశప్తకులను కమ్మివేసాడు.

శత్రు తాపకుడైన అర్జునుడిని అశ్వత్థామ ఎదిరించి ముసలం, పరిఘ, బాణాలు ప్రయోగించాడు. వాటినన్నిటినీ అర్జునుడు తిప్పికొట్టాడు. ఆ తరువాత పాంచాల మహారథుడైన సురథుడికి అశ్వత్థామకు మధ్య గొప్ప యుద్ధం జరిగింది. వజ్రం లాంటి బాణంతో అశ్వత్థామ సురథుడి హృదయాన్ని చీల్చి చంపివేసాడు.

దుర్యోధనుడు-ధృష్టద్యుమ్నునితో, శల్యుడు-నకుల సహదేవులతో భయంకర యుద్ధం చేసారు. నకుల సహదేవులకు భీముడు, యుధిష్ఠిరుడు సాయం వచ్చారు. పాండవులందరూ కలిసినా శల్యుడిని ఎదుర్కోలేకపోయినారు.

ధర్మరాజు తన సోదరులు, శ్రీకృష్ణుడు, సాత్యకిలను పిలిచి అన్నాడు- "మీరంతా మీ పనిని నిర్వర్తించారు. నా పాలు భాగంగా శల్యుడు మిగిలాడు. అతడో, నేనో ఈరోజు తేల్చివేస్తాను.

నా రథానికి ముందు భీముడు, వెనుక అర్జునుడు, సాత్యకి నా రథ దక్షిణ చక్రాన్ని, ధృష్టద్యుమ్నుడు ఎడమ చక్రాన్ని రక్షించాలి"

**ఏవ మభ్యధికః శల్యాద్ భవిష్యామి మహామృధే**
**ఏవ ముక్తాస్తథా చక్రుః తదారాజ్ఞ ప్రియై షిణః** (శల్య. 26-16)

ఈ ఏర్పాటుతో నేను శల్యుని మించిపోతానన్నాడు యుధిష్ఠిరుడు.

మృదుస్వభావి, జితేంద్రియుడైన యుధిష్ఠిరుడు కఠోరుడవడం అందరికి ఆశ్చర్యం కలిగించింది. యుధిష్ఠిరుడి రణోత్సాహంలో శల్యుడు మొదటిదెబ్బ తిన్నాడు. మరో రథమెక్కి ధర్మరాజు నెదిరించాడు. ఇద్దరి మధ్య యుద్ధం మరింత తీవ్రమైంది. యుధిష్ఠిరుడి అశ్వాలను చంపాడు, సారథిని పడవేసాడు శల్యుడు. శల్యుడి ప్రతాపం చూసి ధర్మరాజు వ్యధ చెందాడు. ఈలోగా భీముడు శల్యుడి సారథిని గుర్రాలను చంపాడు. విరథుడైన శల్యుడు కత్తీడాలు తీసుకుని రథం నుండి దూకాడు. భీముడు అతడి డాలును, కత్తిని ఖండించాడు. శల్యుడు యుధిష్ఠిరుడి రథంపైకి దూకడానికి సాహసించాడు. తనపైకి దూకుతున్న శల్యుడిపై దేదీప్యమానమైన శక్తిని ప్రయోగించి- "పాపీ! నీవు చంపబడినట్లే" అని గర్జించాడు. ఆ ఆయుధం శల్యుడి వక్షస్థలాన్ని చీల్చి చంపింది. విగతజీవుడై శల్యుడు యుధిష్ఠిరుడి రథం మీద నుంచి కిందపడ్డాడు.

అప్పుడు గొప్ప ధనుస్సు తీసుకుని ధర్మరాజు శల్యుడి సేనపై బాణవర్షం కురిపించాడు. తన నెదిరించిన శల్యుడి సోదరుడి శిరస్సును ఖండించాడు. పుణ్యం నశిస్తే స్వర్గం నుండి భూమిపై పడే జీవుడి వలె అతడి శిరస్సు కుండలాలతో సహా రథం నుండి క్రిందపడింది. పారిపోతున్న కౌరవసేనను సాత్యకి వెంబడించాడు. శల్యుడి అనుచరులు యుధిష్ఠిరుని చుట్టుముట్టగా పాండవులు, ఉపపాండవులు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, అతడికి రక్షణావలయంగా ఏర్పడ్డారు. వారి నెదిరించిన మద్ర సైనికులు కొద్దిసేపటిలోనే చావుదెబ్బ తిని పలాయనం చిత్తగించారు.

**నానా శస్త్ర సమాయుక్తాః నానా కుండల ధారిణీః**
**నానాజాత్యా హతాస్తత్ర నానా దేశ సమాగతాః** (శల్య. 19-52)

నానా దేశాల వీరులూ పాండవులను చుట్టుముట్టారు. ఆరోజున 21000 మందిని చంపాడు భీముడు. ఆ తరువాత దుర్యోధనుడి భద్రగజమైన ఐరావతం లాంటి ఏనుగునెక్కి పాండవుల మీద దాడిచేసిన శాల్వుడు ధృష్టద్యుమ్నుడి రథాన్ని తుత్తునియలు చేసాడు. ఆ ఏనుగు రథాన్ని, సారథితో సహా ఎత్తి నేలకేసి కొట్టింది. ధృష్టద్యుమ్నుడు ముందే రథం మీద నుంచి దూకి ప్రాణాలతో బయటపడ్డాడు. శిఖండి, సాత్యకి అది చూసి మదగజంపై బాణవర్షం కురిపించారు. ధృష్టద్యుమ్నుడు గొప్ప గద తీసుకుని ఏనుగు కుంభస్థలం బ్రద్దలుగొటాడు. అది కింద పడుతున్న సమయంలోనే సాత్యకి పదునైన భల్లంతో శాల్వుడి శిరస్సును ఖండించాడు.

సాత్యకి కృతవర్మల ద్వైరథ యుద్ధంలో సాత్యకిదే పైచేయి అయ్యింది. విరథుడైన కృతవర్మను చూసి కృపాచార్యుడు వేగంగా వచ్చి తన రథంపై తీసుకుపోయాడు.

రెండు సేనల మధ్య సంకుల సమరం జరిగింది. ఏ హద్దులూ లేకుండా యోధులు గొప్ప యుద్ధం చేసారు. ఆతతాయులైన కౌరవులలోని ఏడువందల మందిని పాండవ వీరులు చంపారు.

ఆ తరువాత మరల సంకుల సమరం జరిగింది. గాంధార సైనికులను ఉత్సాహపరుస్తూ శకుని పాండవులపై దాడిచేసాడు. ప్రాసాలు, కత్తులతో, బాణాలతో కూడిన ఆ యుద్ధం వినాశకరమై ఏ హద్దులూ లేకుండా సాగిపోయింది.

అర్జునుడన్నాడు కృష్ణునితో- "యుద్ధం మొదలై పదునెనిమిది దినాలు అయ్యాయి. విధి విచిత్రం చూడు

**సముద్ర కల్పం చ బలం ధార్తరాష్ట్రస్య మాధవ**
**అస్మానాసాద్య సంజాతం గోష్పదోపమయచ్యుత** (శల్య. 24-19)

సముద్రమంత కౌరవసేన మనతో పోరాడి గోవు పాదమంత చిన్న మడుగయ్యింది. ఈ దుర్యోధనుడు ఇప్పటికీ పోరాటమాపడు. ఇతడు చూస్తుండగానే ఈ దుర్బల సేననూ హతమారుస్తాను"

అంటూనే అర్జునుడు కౌరవసేన మీద విరుచుకుపడి అనేక రూపాలు, ఆకారాలు గల బాణాలతో కౌరవసేనను సంహరించాడు. కొద్దోగొప్పో ఎదురుతిరిగిన కౌరవ వీరుల్ని భీమసేన నకుల సహదేవులు చంపేసారు. కౌరవ గజసేనను ధృష్టద్యుమ్నుడు నాశనం చేసాడు.

ధృష్టద్యుమ్నుడి దాడి నుంచి తప్పించుకున్నవాళ్లు సాత్యకి రథసేన చేతికి చిక్కి చచ్చారు.

అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ దుర్యోధనుని వెదుక్కుంటూ శకుని ఉన్న చోటుకు వెళ్లారు.

చావగా మిగిలిన కౌరవ సోదరులందరూ భీమునిపై పడి చంపాలనుకున్నారు- దుర్మర్షణుడు, శ్రుతాంతుడు, జైత్రుడు, భూరిబలుడు, రవి, జయత్సేనుడు, సుజాతుడు, దుర్విషహుడు, దుర్విమోచనుడు, దుష్ప్రధర్షుడు, శ్రుతపర్వుడు - ఈ పదకొండు మందిని భీముడు చంపివేసాడు. అయిదు వందల మంది మహారథులను, 700 గజసేనను, లక్షమంది సైనికులను, 800 గుర్రాలను చంపాడు భీముడు.

ఇక మిగిలిందల్లా దుర్యోధనుడు, సుదర్శనుడు మాత్రమే. సాత్యకికి బందీగా చిక్కాడు సంజయుడు.

అర్జునుడు త్రిగర్తులలో మిగిలినవారిని చంపదలుచుకున్నాడు. తీవ్రమైన శరాలతో సత్యకర్మ, సత్యేషువును చంపి సుశర్మను బాణవర్షంతో ముంచేసాడు. యమదండం వంటి బాణంతో సుశర్మను చంపి, అతడి కుమారులు నలభై అయిదు మందినీ నశింపజేసాడు.

భీముడు క్షురప్రంతో దుర్యోధన సోదరుడైన సుదర్శనుడిని చంపివేసాడు. ఇక మిగిలింది దుర్యోధనుడు, శకుని - దుష్టచతుష్టయంలో ఆఖరి పావులు. లేదా రాజు, మంత్రి.

సహదేవుడు శకునిల మధ్య తీవ్ర యుద్ధం జరిగింది. శకుని-ఉలూకులు భీమసేన-నకుల సహదేవులతో భీకరంగా పోరాడినారు. సహదేవుడు తనమీదకు దూసుకువచ్చిన ఉలూకుని భల్లంతో ఖండించాడు.

తన కొడుకు చనిపోవడం కళ్లారా చూసిన శకుని విదురుని మాటలను గుర్తు తెచ్చుకుంటూ కొద్దిక్షణాలు పశ్చాత్తాప పడినాడు. వెంటనే కర్తవ్యం గుర్తుతెచ్చుకుని సహదేవుని చంపాలని బాణాలు వేసినాడు. సహదేవుడు శకుని వింటిని విరగగొట్టగా, అతడిపై కత్తిని విసిరాడు శకుని. ఆ కత్తిని రెండు ముక్కలు చేసాడు సహదేవుడు. గదను విసిరాడు శకుని, అది వ్యర్థం కాగా, శక్తిని విసిరాడు, దానినీ ముక్కలు చేసాడు సహదేవుడు. పెద్ద వింటిని తీసుకుని గద్ద ఈకలుగల బాణాలను సంధించి శకునిని తీవ్రంగా గాయపరచి అన్నాడు- "పాచికలు విసిరి పరమానందపడ్డావు కదా! నేను విసుర్తున్నా క్షురమనే పాచిక!" అని పలికి లోహమయమైన భల్లంతో శకుని తలను శరీరం నుండి పడగొట్టాడు. కౌరవుల అవినీతికి మూలమైన ఆ తల కిందపడింది. నెత్తుట తడిసిన శకుని శవం ఘోరంగా విలవిలలాడింది. తండ్రీ కొడుకులైన శకుని ఉలూకులను చంపిన సహదేవుని అందరూ అభినందించారు.

కర్ణుడి తల భారతమయ్యింది.

శకుని తల పాచికల భారతమయ్యింది.

## 2) హ్రద ప్రవేశ పర్వము

పదకొండు అక్షౌహిణీల సేనలో మిగిలిన వారిని పాండవ సైనికులు వధించారు. వేలకొలది రాజులలో మిగిలింది దుర్యోధనుడొక్కడే. కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ ఎటు వెళ్లారో కనిపించలేదు.

పాండవ మహాబలంలో మిగిలినది రెండువేల రథాలు, 700 ఏనుగులు, 5000 గుర్రాలు, 10000 మంది సైనికులు. వారి నాయకుడు ధృష్టద్యుమ్నుడు.

సంజయుడు చెబుతున్నాడు ధృతరాష్ట్రునితో-

**ఏకాదశ చమూభర్తా పుత్రో దుర్యోధన స్తవ**
**గదామాదాయ తేజస్వీ పదాతిః ప్రస్థితో హ్రదమ్** (శల్య. 29-27)

"పదకొండు అక్షౌహిణీల సైన్యానికి ప్రభువు నీ కుమారుడు దుర్యోధనుడు పద్దెనిమిది రోజుల జూదంలో అన్నీ పోగొట్టుకుని గదను చేతబట్టి నిర్వికారంగా నడుచుకుంటూ మడుగువేపు వెళ్లాడు".

సంజయుడు చెబుతున్నాడు- "ఈ సంజయుడు బ్రతికి ఉన్నా లేకున్నా ఏ ప్రయోజనమూ లేదు. అతడలా అనగానే సాత్యకి కత్తి ఎత్తి నన్ను చంపబోయాడు. నా అదృష్టంకొద్దీ వ్యాసమహర్షి వచ్చి నన్ను విడిపించాడు.

నేను ఓ క్రోసెడు దూరం వచ్చాను. అక్కడ తీవ్రంగా గాయపడి ఒంటరిగా ఉన్న దుర్యోధనుడు కనబడినాడు.

మా ఇద్దరి కళ్లనిండా నీళ్లు. సరిగా మాట్లాడలేకపోయాను నేను. ఇంద్ర సమానుడైన అతడు అలా నిలిచి ఉండడాన్ని చూసి నాకు దుఃఖమాగలేదు. విధి ఎంత బలీయమో కదా!

దుర్యోధనుడన్నాడు– "నీవు వెళ్లి నా తండ్రికి నేను మడుగులో దాగి ఉన్నానని తెలియజేయి" అని పలికి మడుగులో ప్రవేశించి తన మాయతో నీటిని స్తంభింపజేసాడు.

అదే సమయంలో అక్కడకు వచ్చారు కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ. నేను దుర్యోధనుడు మడుగులో ప్రవేశించిన విషయం చెప్పాను. మేము నలుగురం కౌరవ శిబిరాల వేపు వెళ్లి అక్కడ ఉన్న శిబిర రక్షకులతో రాజకాంతలను నగరానికి పంపివేసాము.

యుయుత్సుడు వెళ్లి యుధిష్ఠిరుడి అనుమతి తీసుకుని వెళ్లి రాజకాంతలకు అంతఃపురంలో రక్షణ ఏర్పాట్లను కావించినాడు.

విదురుడన్నాడు యుయుత్సుడితో– "నాయనా! ఇకనుంచి ధృతరాష్ట్ర మహరాజుకు నీవు ఊతకర్రవు. ఈరోజు విశ్రాంతి తీసుకుని, రేపు యుధిష్ఠిరుని కలువు"

## 3) గదా పర్వము

పాండవుల విజయనాదాలు, సింహగర్జనలు విని కౌరవ శిబిర రక్షకులు పారిపోయారు. శిబిరాలు నిర్మానుష్యమైనాయి. కృపుడు, కృతవర్మ, అశ్వత్థామలు సంజయుడితో కలిసి మడుగు వద్దకు వచ్చారు.

నీటిలో నిదురిస్తున్న దుర్యోధనునికి వినబడేలా అన్నాడు– "దుర్యోధనా! నీవుకూడా పాండవసేన నంతటినీ సంహరించావు. మాతో కలిసి ధర్మరాజుతో పోరాడు. గెలిచి రాజ్యాన్ని పొందు లేదా వీరస్వర్గాన్ని పొందు"

దుర్యోధనుడన్నాడు– "ఒక రాత్రి విశ్రమించి, రేపు మీతో కలిసి శత్రువులతో పోరాడుతాను".

అశ్వత్థామ అన్నాడు– "సర్వ పాంచాలురను చంపేవరకు కవచం వీడను. రాజా! నా మాట విను"

ఈలోగా బోయవాళ్లు కొందరు మడుగులో నీళ్లు త్రాగడానికి వచ్చి దుర్యోధనుడు మడుగులో ఉన్నాడని గ్రహించారు. యుధిష్ఠిరుడికి ఈ విషయం చెబితే అంతులేని ధనమిస్తాడని– వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటూ పాండవ శిబిరం వేపు వెళ్లి భీమసేనుడికి వార్త నందజేసారు. భీముడు వారికి కోరినంత ధనమిచ్చి పంపివేసి– యుధిష్ఠిరునికి ఆ విషయం చెప్పాడు.

అప్పటి వరకు చింతాక్రాంతుడైన యుధిష్ఠిరుడు ఆనందపడి, కృష్ణుని, సోదరులను వెంటబెట్టుకుని ద్వైపాయన మడుగు వద్దకు వెళ్లాడు. వారితో పాటు పాండవ వీరులందరూ ఉన్నారు. పాండవులు వచ్చేప్పటికే కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ అక్కడ నుండి వెళ్లిపోయారు.

ఆ మడుగును చూసి ధర్మరాజు అన్నాడు– "జలస్తంభన విద్యతో దుర్యోధనుడు నీటి అడుగున పడుకుని ఉన్నాడు"

వసుదేవుడన్నాడు– "మాయతో మాయను జయించాలి.

**మాయావిన ఇమాం మాయాం మాయయా జ హి భారత**
**మాయావీ మాయయా వధ్యః సత్యమేతద్ యుధిష్ఠిర** (శల్య. 31-6)

బలి, హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు, వృత్రుడు, రావణుడు, తారకుడు, విప్రచిత్తి, వాతాపి–ఇల్వలుడు, త్రిశిరుడు, సుందోపసుందులు –వీరందరూ వివిధ వ్యూహాల వల్లనే చంపబడ్డారు. నీ వ్యూహం నీవే పన్ను!"

ధర్మరాజు అన్నాడు దుర్యోధనుడితో– "సుయోధనా! శూరుడివైన నీవు నీళ్లలో దాగి ఉండడం ఉచితం కాదు. వచ్చి మమ్మల్ని ఓడించి ఈ రాజ్యాన్ని పాలించు. లేదా చచ్చి నేలపై నిదురించు. అంతేగాని ఈ నీళ్లలో శయనమెందుకు?"

దుర్యోధనుడన్నాడు– "కాసేపు విశ్రమించదలుచుకున్నాను. మీరూ విశ్రమించండి. తర్వాత పోరాడుకుందాం!"

యుధిష్ఠిరుడన్నాడు– "మేము బాగానే శ్రమించాము, విశ్రమించాము. నీవు వచ్చి యుద్ధం చేస్తేనే ఇరుపక్షాలకు దొరుకుతుంది విశ్రాంతి. రా!"

దుర్యోధనుడన్నాడు– "నావాళ్లెవరూ లేరు. ఈ రాజ్యం నీదే! పాలించుకో! నేను అరణ్యానికి పోతాను. నేనిస్తున్నాను నీకే రాజ్యం"

యుధిష్ఠిరుడన్నాడు– "నీవిచ్చిన దానరాజ్యం నాకెందుకు ఇప్పుడు? రాజువే కానివాడివి నీవు రాజ్యమెలా ఇవ్వగలవు! శాంతి కోసం, సంధి చేసుకొమ్మంటే సూదిమొన మోపినంత భూమి కూడా ఇవ్వనన్నవాడివి నీవు. ఈ రాజ్యాన్ని మొత్తంగా ఎలా ఇవ్వగలవు?"

దుర్యోధనుడన్నాడు– "నేను ఒంటరిని, రథహీనుడను, శస్త్రహీనుడను. మీరు ఒక్కొక్కరుగా నాతో యుద్ధం చేస్తే మీ అంతు చూస్తాను".

యుధిష్ఠిరుడన్నాడు– "ఇది క్షత్రధర్మపు మాట. నీకు కావాల్సిన కవచం, శస్త్రం తీసుకో! మాలో నీకిష్టమైన వాడిని ఎన్నుకో! పోరాడు. ఒక్కరిని చంపినా రాజ్యం నీదే! చనిపోయావా వీరస్వర్గమూ నీదే!"

దుర్యోధనుడన్నాడు– "నాతో గదాయుద్ధం చేయగలిగినవాడు పోరాడవచ్చు. ఎన్నో రథ యుద్ధాలు విచిత్రంగా, అద్భుతంగా జరిగాయి. ఈరోజు అత్యద్భుతమైన గదాయుద్ధం జరుగును గాక!

**వృత్తాని రథయుద్ధాని విచిత్రాణి పదే పదే**
**ఇదమేకం గదాయుద్ధం భవత్వద్యాద్భుతం మహత్** (శల్య. 32–29)

నాకే తడబాటూ లేదు. మీరంటే భయమూ లేదు"

అంటూ దుర్యోధనుడు పాండవుల పరుష వాక్కులను సహించలేక నీటి మడుగు నుంచి గదాదండాన్ని ధరించి శూలపాణియైన రుద్రునిలా బయటకు వచ్చాడు.

యుధిష్ఠిరుడన్నాడు– "ఇవిగో కవచాలు, శిరస్త్రాణాలు, నీకేం కావాలో తీసుకో!"

దుర్యోధనుడు బంగరు కవచాన్ని తొడుక్కున్నాడు. స్వర్ణ శిరస్త్రాణాన్ని ధరించాడు. "ఎవరు వస్తారో రండి. గదా యుద్ధంలో నాతో సమానుడైన వాడే లేడు" అన్నాడు సుయోధనుడు గంభీరంగా.

కాస్త దూరంలో ఉన్న వాసుదేవుడు మెల్లగా యుధిష్ఠిరుడితో అన్నాడు– "రాజా! ఏమిటా తొందరపాటు? ఇతడు భీముడిని చంపాలని గత 13 సంవత్సరాలుగా ఉక్కుమనిషి బొమ్మతో గదాయుద్ధం అభ్యాసం చేస్తున్నాడు. మరల జూదం ప్రారంభమయ్యింది. మాకు కష్టాలు మొదలయ్యాయి. శాశ్వత వనవాసం కోసమో, భిక్షాటన కోసమో పుట్టినట్లున్నారు మీరు"

భీమసేనుడన్నాడు– "యదునందనా! బాధపడవద్దు! నా గద దుర్యోధనుని గదకన్నా ఒకటిన్నర రెట్లు బరువు. నేను అతడితో పోరాడి గెలువగలను"

అని యుధిష్ఠిరుడితో తన నిర్ణయాన్ని చెప్పి దుర్యోధనుడిని గదా యుద్ధానికి ఆహ్వానించాడు భీమసేనుడు.

భీముడన్నాడు– "కులనాశకుడివి నీవు. అధముడివి. నిన్ను చంపుతాను ఈరోజు గదాయుద్ధంలో!"

దుర్యోధనుడన్నాడు– "శరత్కాల మేఘంలా వ్యర్థంగా గర్జించకు. నీకున్న బలమంతా ఈరోజు యుద్ధంలో ప్రదర్శించు"

## బలరాముడి రాక

భీమసేన–దుర్యోధనుల గదాయుద్ధం ప్రారంభం కానున్నది. అది విని హలాయుధుడైన బలరాముడు అక్కడకు వచ్చాడు. బలరాముని అందరూ గౌరవించి పూజించారు.

బలరాముడన్నాడు– "నేను తీర్థయాత్రలకు వెళ్లి నలభై రెండురోజులయ్యింది. పుష్య నక్షత్రంలో వెళ్లి శ్రవణ నక్షత్రంలో వచ్చాను. చంద్రుని క్షయను తగ్గించిన ప్రభాసతీర్థం, త్రితుడి ఉదపాన తీర్థం, సరస్వతీనది అదృశ్యమైన వినాశన తీర్థం, అప్సరసల సుభూమిక తీర్థం, గర్గస్రోతస్సు, సప్త సారస్వత తీర్థం (సుప్రభ, కాంచనాక్షి, విశాల, మనోరమ, సరస్వతి, ఓఘవతి, సురేణువు, విమలోదక – సరస్వతి పేరుతో ఉన్న ఏడు నదులు) మంకణక వృత్తాంతం, ఔశనస (కపాలమోచన)

తీర్థం (శుక్రుడు నీతిశాస్త్రం వ్రాసిన ప్రదేశం), ఆర్‌ష్టిషేణుని ఆశ్రమం-విశ్వామిత్రుడు తపస్సు చేసిన చోటు, అవాకీర్ణ తీర్థం, వసిష్ఠాపవాహం, అరుణతీర్థం (స్కందుడు తారకుని సంహరించిన ప్రాంతం), వరుణాభిషేక తీర్థం, అగ్ని తీర్థం (జమ్మిచెట్టులో అగ్ని దాగిన ప్రాంతం), కుబేర తీర్థం, బదరపాచన తీర్థం (భరద్వాజుని పుత్రిక శుతావతి తపస్సు చేసిన ప్రదేశం); ఇంద్రతీర్థం, ఆదిత్య తీర్థం (జైగీషవ్యముని-అసిత దేవలులు మోక్షం పొందిన ప్రాంతం), సోమతీర్థం (దధీచి-అలంబుసల కుమారుడు సారస్వతుడు వేద ప్రవచనం చేసిన చోటు), వృద్ధకన్యా తీర్థం, సమంత పంచక తీర్థమున్న కురుక్షేత్రం సందర్శించాను అన్నాడు బలరాముడు.

తరంతుక, అరుంతక, రామకుండ, మచక్రుక కుండాల మధ్య ఉన్న భూభాగం కురుక్షేత్రం. అక్కడకు వచ్చిన బలరాముడితో నారదముని భీమ-దుర్యోధనుల యుద్ధం గురించి చెప్పగా తనతో వచ్చిన వారిని ద్వారకకు పంపి బలరాముడు తన రథంలో అక్కడకు వచ్చాడు.

కురుక్షేత్రంలో మరణించినవారికి పుణ్యగతులు లభిస్తాయని బలరాముడు పలుకగా అందరూ ద్వైపాయన మడుగును వదిలి కురుక్షేత్రానికి చేరుకున్నారు.

## భీమ దుర్యోధన గదాయుద్ధం

యుద్ధమండలం మధ్యలో నిలిచిన ఆ సోదరులిద్దరూ సూర్య చంద్రుల వలె విరాజిల్లారు. కోపించిన మదపుటేనుగుల్లా కళ్లతోనే దహిస్తున్నట్లు పరస్పరం చూసుకుంటున్నారు.

**సృక్కిణీ సంలిహన్ రాజన్ క్రోధరక్తే క్షణః శ్వసన్**
**తతో దుర్యోధనో రాజన్ గదా మాదాయ వీర్యవాన్**

**భీమసేన మభిప్రేక్ష్య గజో గజ మివాహ్వయత్**
**అద్రిసార మయీం భీమః తథై వాదాయ వీర్యవాన్** (శల్య. 56-24,25)

ఒకరినొకరు చూపులతోనే యుద్ధానికి ఆహ్వానించుకున్నారు. పరుష వచనాలతో బాధించుకున్నారు.

భీముడన్నాడు- "ఎన్నో దుష్కార్యాలు చేసిన నిన్నీవేళ చంపుతాను!"

దుర్యోధనుడన్నాడు- "ఇన్ని మాటలెందుకు, ఆ పనేదో చెయ్యి, చూద్దాం!"

కొమ్ములుగల ఆబోతుల్లా ఒకరిమీద ఒకరు దాడికి వచ్చారు. పిడుగులు పడిన ధ్వనులు వచ్చాయి వారి గదలు ఢీకొనేసరికి. గదల దెబ్బలు తగిలి ఇద్దరూ పుష్పించిన కింశుక వృక్షాల్లా కనిపించారు. గదలు ఒకదానికొకటి తగిలినప్పుడు నిప్పురవ్వలు ఎగిసిపడి మిణుగురు పురుగుల్లా ఎగిరాయి.

ముహూర్త కాలం విశ్రమించి మరల యుద్ధానికి దిగారు. వేగంగా ముందుకు దూకడం, ఎదుటివాడిని పడగొట్టడం, నిలవడం, పోరాడడం, చుట్టూ తిరగడం, శత్రువును ఆపడం, జారిపోవడం, గంతులు వేయడం, ముందుకు దూకి కొట్టడం, వెనకగా చేరి కొట్టడం ఇలా వివిధ రీతుల్లో మండలాకృతిలో సంచరిస్తూ ఎదుటివాడు తప్పు చేస్తే చావుదెబ్బ కొట్టాలని ప్రయత్నం చేస్తూన్నారు. దుర్యోధనుడు దక్షిణ దిక్కున, భీమసేనుడు ఉత్తరదిక్కున నిలిచారు.

ఇద్దరూ గదలు గిరగిరా తిప్పుతూ కొట్టుకుంటున్నారు. దుర్యోధనుడు విచిత్ర రీతులతో సంచరిస్తూ భీముని పడగొట్టాలని ప్రయత్నిస్తున్నాడు. రివ్వున తిరిగి భీముడి తలపై కొట్టినా చలించలేదు భీముడు. భీముడు విసిరిన గదను వ్యర్థం చేసాడు దుర్యోధనుడు. మాటిమాటికీ ఎగురుతూ వచ్చి భీముడి రొమ్ముపై కొట్టేసరికి కింకర్తవ్యతా మూఢుడైన భీమునిపై విజృంభించాడు దుర్యోధనుడు.

వెంటనే తేరుకుని దుర్యోధనుని పక్కటెముకల మీద కొట్టేసరికి మోకాళ్లమీద కూర్చున్నాడు దుర్యోధనుడు మతితప్పి. సృంజయులు సింహనాదాలు చేసారు. దానితో కోపించి దుర్యోధనుడు భీముడి నుదుటిపై గదతో కొట్టాడు. తిరుగు దెబ్బ కొట్టేసరికి దుర్యోధనుడు నేలపై పడ్డాడు. మళ్లీ లేచి భీముడిని గట్టి దెబ్బ కొట్టేసరికి భీముడి కవచం బ్రద్దలయ్యింది.

దుర్యోధనుడి విజృంభణను చూసాడు వాసుదేవుడు. "భీముడు బలంలో మిన్న, దుర్యోధనుడు అభ్యాసంలో మిన్న. ధర్మబద్ధంగా పోరాడితే భీముడు గెలవలేడు. ధర్మరాజు భీముడి ప్రాణాలు పణంగా పెట్టి జూదమాడుతున్నాడు. ఒక్కడిని

గెలిచినా గెలిచినట్లే అని – విజయాన్ని సంశయాస్పదంగా మార్చాడు. ఇప్పుడు శుక్రనీతిని పాటించక తప్పదు. యుద్ధం నుండి పారిపోయి తిరిగి వచ్చిన శత్రువు జీవితంపై ఆశ లేకుండా మొండిగా యుద్ధం చేస్తాడు. ఇతడిని అన్యాయ మార్గంలోనే చంపాలి. అర్థమయ్యిందా, అర్జునా!"

వాసుదేవుడి మాటలు విని అర్జునుడు భీమసేనుడు చూస్తుండగా కుడితొడ కొట్టాడు. భీమసేనుడికి అర్థమయ్యింది. శత్రుత్వాన్ని ముగించాలన్న కోరికతో ఇద్దరూ పోరాడుతున్నారు. పాము మాంసం కోసం పోట్లాడే గరుడపక్షుల్లా, బురదలో దిగి కొట్టుకుంటున్న దున్నపోతుల్లా, వ్యాఘ్రాల్లా, సింహాల్లా కొట్టుకుంటూ ఎర్రగా రక్తం కారుతూ పుష్పించిన మోదుగ చెట్లలా కనిపిస్తున్నారు.

భీముడు బలంగా విసిరిన గద వ్యర్థమయ్యింది. దుర్యోధనుడు కొట్టిన దెబ్బ గట్టిగా తగిలి భీముడికి మూర్ఛ వచ్చినంత పనయ్యింది. అది గమనించక దుర్యోధనుడు మరో దెబ్బ కొట్టకుండా గాలిలోకి ఎగరగానే భీముడు గద విసిరాడు దుర్యోధనుని తొడల మీదకు. ఆగద వజ్రంలా పడి దుర్యోధనుడికి ఊరుభంగం చేసింది. దుర్యోధనుడు ఆ దెబ్బకు మొదలు విరిగిన చెట్టులా నేలపై పడిపోయాడు. అతడు నేల కూలగానే పిడుగులు పడ్డాయి, పెనుగాలి వీచింది, ధూళివర్షం కురిసింది, పెద్ద తోకచుక్క రాలింది, నెత్తుటి వాన కురిసింది.

భీమసేనుడు దుర్యోధనుని సమీపించి అన్నాడు– "గతంలో కొలువులో నన్ను ఎద్దు ఎద్దు అన్నావుగా, ద్రౌపదిని తొడపై కూర్చోమని సంజ్ఞ చేసావుగా? ఏ తొడపై ఇప్పుడు చెప్పు" అంటూ దుర్యోధనుని కిరీటాన్ని, తలను ఎడమకాలితో తన్నాడు.

యుధిష్ఠిరుడన్నాడు– "శత్రు ఋణం తీర్చుకున్నావు, ప్రతిజ్ఞ పూర్తి చేసావు. ఇక ఊరుకో! అతడి తలను తన్నకు" అని పలికి దుర్యోధనుడి వద్దకు వెళ్లి బాష్పగద్గద కంఠంతో అన్నాడు–

**"తాతమన్యుర్నతే కార్యః నాత్మా శోచ్యస్త్వయా తథా**
**నూనం పూర్వకృతం కర్మ సుఘోరమను భూయతే!**

పురాకృతమైన ఘోరకర్మల ఫలితం అనుభవించవలసిందే! ఒకరకంగా నీదే మంచిస్థితి. చనిపోయి స్వర్గానికి వెళ్తావు. మేము బ్రతికుండి బంధుమిత్రులు లేని నరకంలో దుఃఖాన్ని పొందుతాం"

దుర్యోధనుడిని తొడలు విరగగొట్టి కూల్చడాన్ని వారిరువురికి గదాయుద్ధంలో గురువైన బలరాముడు సహించలేక పోయాడు. బలరాముడికి ప్రియశిష్యుడు దుర్యోధనుడు. తన కళ్లముందే దుర్యోధనుడి తొడలు విరగడం చూసి కోపిస్తూ– "ఇది దుర్యోధనుని పడగొట్టడం కాదు, నన్ను పడగొట్టినట్లు. గదాయుద్ధంలో నాభికి దిగువ కొట్టకూడదని తెలిసి కొట్టాడు భీముడు. ఇతడి పొగరణుస్తాను" అంటూ నాగలి పట్టి భీముడి మీదకు వెళ్తున్న బలరాముడిని ఆపాడు కృష్ణుడు.

"అన్నా! ఏ విషయాన్నైనా అప్పటి పరిస్థితి గురించేకాక నేపథ్యాన్ని బట్టి కూడా విశ్లేషించాల్సి ఉంటుంది ధర్మాధర్మ నిర్ణయం చేసేప్పుడు. ఆనాడు నిండు సభలో చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చాడు భీముడు. కలియుగం వస్తున్నది. ధర్మసూక్ష్మతలు ఇలానే ఉంటాయి. అభిమన్యుడిని చంపించింది దుర్యోధనుడు కాదా. పదమూడు సంవత్సరాలు అరణ్య అజ్ఞాత వాసాలు చేస్తూ భీముడు తన ప్రతిజ్ఞనెలా నెరవేర్చుకోవాలీ అని ఆలోచిస్తుంటే, దుర్యోధనుడు ఆ పదమూడేళ్లూ సుఖాలననుభవిస్తూ గదాయుద్ధం అభ్యాసం చేసాడు.

అయినా వేగంగా పైకెగిరి తనను చంపబోతున్న సమయంలో గదను విసిరాడు భీముడు ఆత్మరక్షణార్థం. అప్పుడు దుర్యోధనుడు గాలిలో ఉన్నాడు, బరిలోనూ లేడు, నిలిచీలేడు. గద భీముడి చేతిలోనూ లేదు. అయినా పదమూడేళ్ల ప్రతిజ్ఞ నెరవేరింది. అంతే!"

బలరాముడన్నాడు– "భీముడు కపటయోధుడిగా, దుర్యోధనుడు ఋజుమార్గంలో పోరాడిన యోధుడిగా ప్రసిద్ధికెక్కుతారు" అని పలికి ద్వారకకు వెళ్లిపోయాడు బలరాముడు.

యుధిష్ఠిరుడన్నాడు– "అదృష్టం కొద్ది గెలిచావు భీమసేనా! తల్లి ఋణం, కోప ఋణం తీర్చుకున్నావు.

**గతో వైరస్య నిధనం హతః రాజా సుయోధనః**
**కృష్ణస్య మతమాస్థాయ విజితేయం వసుంధరా** (శల్య. 61–47)

వైరం చచ్చిపోయింది. దుర్యోధనుడు పడిపోయాడు. కృష్ణుని సాయంతో వసుంధరను గెలుచుకున్నాం" అన్నాడు ధర్మరాజు.

కృష్ణుడన్నాడు– "భీమసేనా! రణభూమిలో అత్యంత నిపుణుడైన దుర్యోధనుని పడగొట్టావు. శత్రుత్వాన్ని అంతం చేసావు. ఇతడిప్పుడు ఎండిన కట్టెవంటివాడు. పరుష వచనాలతో నలగగొట్టడమెందుకు? వెళదాం పదండి"

దుర్యోధనుడు ఆ మాటలు వినగానే అసహనానికి గురై లేచి, రెండు చేతులను నేలపై మోపి పిర్రల మీద కూర్చుని, తోక తెగిన పాములా బుసలు కొడుతూ అన్నాడు– "కంసుని దాసుని కొడుకువు నీవు. గదాయుద్ధంలో అధర్మంగా పడగొట్టారు నన్ను. అయినా సిగ్గులేదు. నీ కపటోపాయాలతోనే భీష్ముడు, ద్రోణుడు, భూరిశ్రవుడు, కర్ణుడు, చివరకు నేను ఓడిపోయాము".

## ఇంతమంచి ముగింపు మరెవరికి దక్కుతుంది?

కృష్ణుడన్నాడు– "నీవు మారవు. నేను వచ్చి యాచించాను పాండవులకు అర్ధరాజ్యమివ్వమని, ఇవ్వలేదు. నీకవసరం వచ్చినపుడు నా ఇంటికి వచ్చావు. నారాయణిసేనను పొందావు. నీ ఇంటికి వస్తే బంధించబోయావు! నాది అధర్మ మార్గమా? ద్రౌపదికి అవమానం, మాయాజూదం అధర్మ మార్గాలు కావా? తీవ్ర లోభానికి, అసూయకు లొంగిపోయి చేయదగని పనులు చేసావు. ఫలితాన్ని అనుభవించు"

దుర్యోధనుడన్నాడు– "చదువుకున్నాను, దాన ధర్మాలు చేసాను, సాగరాలతో సహా భూమిని పాలించాను. శత్రువుల తలలపై నిలిచాను. ఇంతమంచి ముగింపు మరెవరికి దక్కుతుంది?

క్షత్రియులు ఆశించే వీరస్వర్గం నాకు దక్కుతున్నది. ఇంత మంచి ముగింపు మరెవరికి దక్కుతుంది?

దేవోచిత భోగాలు, ఉత్తమైశ్వర్యం పొందాను. జీవితాన్ని గొప్పగా అనుభవించాను. ఇంతమంచి ముగింపు మరెవరికి దక్కుతుంది.

'ప్రాప్తం కోను స్వంతతరోమయా!'

భీముడు నా తలపై కాలుపెట్టి తన్నినందుకు బాధలేదు. కాసేపట్లో కాకులో, డేగలో, గ్రద్దలో నా తలమీద కాలు పెడతాయి"

కృష్ణుడన్నాడు– "యుద్ధంలో వివిధోపాయాలు, కపట నీతులు పనికి వస్తాయి. దేవతలు ఈ దారినే అనుసరించి రాక్షసులపై గెలిచారు.

**కృతా కృత్యాశ్చ సా యాహ్నే నివాసం రోచయామహే**
**సాశ్వ నాగరథాః సర్వే విశ్రమామో నరాధిపః** (శల్య. 61–69)

రాజులారా! మీరు గెలిచారు. మీ పని పూర్తయ్యింది. విశ్రాంతి తీసుకోండి!".

కృష్ణుడు పాంచజన్యాన్ని పూరించాడు. అర్జునుడు దేవదత్తాన్ని, యుధిష్ఠిరుడు అనంత విజయాన్ని, వృకోదరుడు పౌండ్రాన్ని నకులుడు సుఘోషాన్ని, సహదేవుడు మణిపుష్పకాన్ని, ధృష్టద్యుమ్నుడు జైత్రాన్ని, సాత్యకి నందివర్ధనాన్ని పూరించారు. ఆ మహా శంఖనాదాలతో ఆకాశం నిండిపోయింది. భూమి కంపించింది.

**తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానక గోముఖాః**
**పాండుసైన్యే ష్వ వాద్యంత స శబ్దస్తు ములోభవత్** (శల్య. 61–71)

పాండవులు కౌరవ శిబిరాల దగ్గరకు వెళ్లేసరికి అవి నిర్మానుష్యంగా కానవచ్చాయి. రథాల నుండి దిగారు పాండవులు.

కృష్ణుడన్నాడు– "అర్జునా! గాండీవాన్ని, అక్షయ తూణీరాలను దించు, నీవు కూడా దిగు. తరువాత నేను దిగుతాను".

కృష్ణుడు దిగగానే రథం ధ్వజం మీది వానరుడు అదృశ్యమైనాడు. రథం అగ్ని అంటుకుని మండసాగింది. గుర్రాలతో సహా కాలి బూడిదైపోయింది. కృష్ణుడన్నాడు– "అగ్ని సంభూత రథం వివిధాస్త్రాల తాకిడితో ఎప్పుడో దహించబడింది. నీ పని పూర్తయ్యింది కనుక ఇప్పుడది దగ్ధమయ్యింది. ధర్మరాజా! నేను ఉపప్లవ్యానికి వచ్చినపుడు– 'ఆపద వేళలో రక్షించాలి' అన్నావు. నేను మాట ఇచ్చాను. నిలబెట్టుకున్నాను"

యుధిష్ఠిరుడన్నాడు– "వ్యాసమహర్షి నాతో అన్నాడు–

**"యతో ధ స్తతః కృష్ణః యతః కృష్ణ స్తతో జయః"**

ఆ తరువాత పాండవ వీరులు దుర్యోధనుని శిబిరంలోకి ప్రవేశించి ధనాన్ని, రత్నాలను, కోశాగారాన్ని అదుపులోకి తీసుకున్నారు. వెండి, బంగారం, మణులు, ముత్యాలు, నగలు, కంబళ్లు, మృగచర్మాలు అనేకం దొరికాయి.

వాసుదేవుడన్నాడు– "శుభం కోసం ఈరోజు మనం శిబిరం వెలుపలే నివసించాలి"

అందరూ ఓఘవతీ నదీ తీరంలో ఆ రాత్రి వసించారు.

యుధిష్టిరుడన్నాడు– "వాసుదేవా! నీవు హస్తినకు వెళ్లి క్రోధంతో మండుతున్న గాంధారిని శాంతపరచు"

శ్రీకృష్ణుడు హస్తినకు వెళ్లేసరికి గాంధారి, ధృతరాష్ట్రుల వద్ద వ్యాస మహర్షి ఉన్నాడు. అందరికి పాదాభివందనం చేసి కృష్ణుడన్నాడు– "ధృతరాష్ట్రా! నీకు కాల మహిమ గురించి నేను చెప్పనక్కర్లేదు. నేను, నీవు, వ్యాస మహర్షి, గాంధారీదేవి ఈ యుద్ధం జరగకుండా ఉండడానికి ఎవరి ప్రయత్నాలు వాళ్లు చేసాం, కుదర్లేదు సంధి, యుద్ధం అనివార్యమై ఈ దుస్థితి సంభవించింది.

ఇక నీ కులమూ వంశమూ పాండవుల ద్వారానే కొనసాగాలి. నీవు కాని, గాంధారి కాని వారికి కీడు కలగాలని కోరుకోవద్దు.

అమ్మా గాంధారీ! నీవే అన్నావు ధర్మమున్న చోటే గెలుపు ఉంటుందని. క్రోధం వహించకు"

గాంధారి అన్నది– "నీవన్నది నిజమే కృష్ణా! ఇప్పుడు మా అందరికీ పాండవులతో కలిసి నీవే దిక్కు కావాలి"

ఆ విధంగా ధృతరాష్ట్ర, గాంధారీలను అనునయించి, వ్యాసునికి నమస్కరించి, అశ్వత్థామ చేయబోతున్న విషమ కార్యాన్ని గ్రహించి హస్తిన నుంచి బయల్దేరి వెళ్లి పాండవులను కలుసుకున్నాడు కృష్ణుడు.

పాండవులు వెళ్లిపోయాక యుద్ధభూమిలో పడి ఉన్న దుర్యోధనుని చూసేందుకు కృతవర్మ, కృపాచార్య, అశ్వత్థామలు వచ్చారు. ఆ దుస్థితిలో ఉన్న రారాజును చూసి వాళ్ల కడుపు తరుక్కుపోయింది. అశ్వత్థామ దుఃఖిస్తూ గద్గదిక స్వరంతో అన్నాడు–

"రాజా! ఆ వెల్ల గొడుగేది? ఆ చామరాలేవి? ఆ మహాసేన ఏది? ఏ కారణంతో ఏ కార్యం జరుగుతుందో చెప్పలేము కదా!"

దుర్యోధనుడన్నాడు– "ఇంత మంచి ముగింపు మరెవరికి దక్కుతుంది. 'కో ను స్వంతతరోమయా?' మీరు ఆ పాండవులను నమ్మవద్దు. వాళ్లు మెత్తటి పులులు. మీరు నా మరణానికి దుఃఖించవద్దు. 'దైవం తు దురతి క్రమమ్' దైవాన్ని అతిక్రమించడం కష్టం".

అశ్వత్థామలో క్రోధం పెరిగింది. ప్రళయకాలాగ్నిలా మండిపడ్డాడు– "ఆ క్షుద్రులు క్రూరమైన చేష్టతో నా తండ్రిని చంపారు. అప్పుడు కలిగిన బాధకన్నా, రాజా, నిన్ను అధర్మమార్గంలో నేలకూల్చినది నన్ను మరింత బాధిస్తున్నది. నేను ఒట్టువేసి చెబుతున్నాను. ఈరోజు ఏ ఉపాయంతోనైనా సరే సర్వ పాంచాలురనూ యమ సదనానికి పంపుతాను. నీవు నన్ను అనుమతించు, మహరాజా!"

కృపాచార్యుడు జలపూర్ణ కలశం తీసుకురాగా దుర్యోధనుడు అశ్వత్థామను సేనాపతిగా అభిషేకించాడు.

**సోభిషిక్తో మహారాజ పరిష్వజ్య నృపోత్తమమ్**
**ప్రయయౌ సింహనాదేన దిశః సర్వా వినాదయాన్** (శల్య. 65-44)

అభిషిక్తుడైన అశ్వత్థామ దుర్యోధనుని కౌగిలించుకుని సింహనాదం చేస్తూ వెళ్లాడు. కృపాచార్యుడు, కృతవర్మ అతడిననుసరించారు.

రాత్రి చీకటి లోకాన్ని ఆవరించ సౌప్తిక కాలం ఆసన్నమయ్యింది.

*****

# ❖ 10. సౌప్తిక పర్వము ❖

1) సౌప్తిక పర్వము (9)
2) ఐషీక పర్వము (9)

## 1) సౌప్తిక పర్వము

అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ కలిసి దక్షిణ దిక్కుగా భయంకరమైన అడవిలోకి వెళ్లి ఓ మర్రిచెట్టు క్రింద విశ్రమించారు. సర్వ జగత్తుకు రాత్రి అయ్యింది.

యుద్ధంలో శారీరకంగా, మానసికంగా అలసిపోయి కృతవర్మ, కృపాచార్యులు నిద్రపోయారు. అశ్వత్థామకు నిద్ర పట్టలేదు. అతడలా చూస్తూ ఉండగా ఆ మర్రిచెట్టుపై నిద్రిస్తున్న కాకులనేకం కనిపించాయి. కాకులన్నీ హాయిగా నిద్రిస్తుండగా రివ్వున వచ్చి వాలిందొక గుడ్లగూబ.

**మహాస్వనం మహాకాయం హర్యక్షం బభ్రు పింగలమ్**
**సుదీర్ఘ ఘోణా నఖ రం సుపర్ణమివ వేగితమ్** (సౌప్తిక. 1-38)

ఆ ఉలూకం నెమ్మదిగా మర్రిచెట్టు కొమ్మలపై హాయిగా నిద్రిస్తున్న కాకుల్ని చప్పుడు కాకుండా చంపింది. కొన్నిటి రెక్కలు విరిచింది. తలలు కొరికింది. కొన్నిటి కాళ్లు విరగగొట్టింది. అది చూసాడు అశ్వత్థామ

**ఉపదేశః కృతో నేన పక్షిణా మమ సంయుగే**
**శత్రూణాం క్షపణే యుక్తః ప్రాప్తః కాలశ్చమే తతః** (సౌప్తిక. 1-45)

"ఈ గుడ్లగూబ నాకు గురువై యుద్ధనీతిని ఉపదేశించింది. ఈ నీతిని అనుసరించి రాత్రిపూట నిద్రపోతున్న పాండవులను చంపుతాను" అని నిశ్చయించాడు అశ్వత్థామ.

**ఇత్యేవం నిశ్చయం చక్రే సుప్తానాం నిశిమారణే**
**పాండూనాం సహ పంచాలైః ద్రోణపుత్రః ప్రతాపవాన్** (సౌప్తిక. 1-55)

అలా నిశ్చయించుకుని కృపుడు, కృతవర్మలను నిద్రలేపి తన నిర్ణయాన్ని తెలిపాడు అశ్వత్థామ.

కృపాచార్యుడన్నాడు తన చెల్లెలి కొడుకు అశ్వత్థామతో- "మనమే పని చేయాలన్నా పురుష ప్రయత్నం, దైవనిర్ణయం అవసరం. లేదా పెద్దవారి సలహా అడగాలి. మనం వెళ్లి ధృతరాష్ట్ర, గాంధారిదేవిలను అడుగుదాం!"

అశ్వత్థామ అన్నాడు- "బ్రాహ్మణుడిగా పుట్టిన నేను క్షాత్రధర్మాన్ని అనుసరిస్తున్నాను. వాళ్లు నా తండ్రిని అన్యాయంగా చంపారు. వాళ్లను అన్యాయ మార్గంలోనే వధిస్తాను"

కృపాచార్యుడన్నాడు- "ఈ రాత్రి కాస్త విశ్రమించు. తెల్లవారగానే మేమిద్దరం నిన్ను అనుసరిస్తాము"

అశ్వత్థామ అన్నాడు- "నేను విశ్రమించలేను. నాకు నిద్రరాదు. ప్రతీకారేచ్ఛ నన్ను దహించి వేస్తున్నది. నేను ఈ రాత్రి శత్రుసంహారం చేసినాకే సుఖంగా నిద్రిస్తాను"

కృపాచార్యుడన్నాడు- "సర్వాస్త్ర పండితులలో నీవు శ్రేష్ఠుడివని ప్రసిద్ధి. నీవు ఈ నిందింపబడే పని చేయడం తెల్లని వస్త్రంపై ఎర్రని మరక అవుతుంది"

అశ్వత్థామ అన్నాడు- "పాండవులెప్పుడో ఈ ధర్మసేతువును ముక్కలు చేసారు. నా తండ్రిని చంపిన వారిని నేను ఈరాత్రి చంపుతాను. ఫలితంగా నేను కీటకాన్నయి పుట్టినా ఫరవాలేదు"

కృతవర్మ, కృపాచార్యుడు అన్నారు- "సుఖదుఃఖాలలో మేమూ భాగస్వాములమే! మేమూ నీతో వస్తున్నాము"

మూడు అగ్నుల్లా ఆ ముగ్గురూ జనమంతా నిదురిస్తున్న శిబిరం దగ్గరకు వెళ్లారు.

శిబిరం ద్వారం వద్ద అశ్వత్థామకు ఒక భీకర పురుషుడు కనిపించాడు. అశ్వత్థామ మహదేవుని ప్రార్థించి శరణు కోరినాడు. శివుడు ప్రత్యక్షమై అతడికి గొప్ప ఖడ్గాన్ని ఇచ్చినాడు.

అశ్వత్థామ శిబిరంలోకి ప్రవేశించాడు. శిబిర ద్వారం వద్ద కృతవర్మ, కృపుడు నిలిచారు.

నిద్రిస్తున్న ధృష్టద్యుమ్నుని కాలితో తన్ని నిద్ర లేపి జుట్టు పట్టుకుని లాగి నేలపై పడవేసి కాలితో మెడ తొక్కి చంపాడు. తరువాత ధృష్టద్యుమ్నుని అనుచరులను, ఉత్తమౌజుని, యుధామన్యుడిని, తన నెదిరించిన వారినందరినీ చంపాడు. శత్రువుల నెత్తుటితో తడిచి అశ్వత్థామ ఎర్రబడి భయంకరంగా కానవచ్చాడు. సైనికులతడిని ఓ రాక్షసుడిగా భావించి నిశ్చేష్టులైనారు.ఆ కోలాహలం విని ఉపపాండవులు ధనుస్సులు చేబూని ధృష్టద్యుమ్నుడిపై బాణవర్షం కురిపించారు. ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శతానీకుడు, శ్రుతకర్మ, శ్రుతకీర్తి అయిదుగురూ అశ్వత్థామ కత్తికి బలైనారు.

ఆ తరువాత శిఖండిని చంపాడు. అతడికి తోడు వచ్చిన ప్రభద్రకులను యమ సదనానికి పంపాడు. అప్పుడు పాండవులకు కనబడింది కాలరాత్రి. కన్నులు ముఖం ఎర్రగా ఉన్నది. ఎర్రని మాలలు చందనాన్ని వస్త్రాలను దాల్చి ఉన్నది. పాశాలు చేబట్టి మనుషులను, గుర్రాలను, ఏనుగులను బంధించి తన సఖులతో కలిసి లాక్కుపోతున్నది.

కురు పాండవ సేనల మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి యోధులందరూ ఆ కాలరాత్రిని కలలో దర్శిస్తూనే ఉన్నారు. ఆ శిబిరాలలో ఉన్న వారందరినీ అశ్వత్థామ వధించాడు. ఆ రాత్రి చీకటి యుద్ధంలో నిద్రమత్తులో లేచిన సైనికులు ఎదుటివాడిని శత్రువనుకుని పొడిచి చంపుతున్నారు. లోపల అశ్వత్థామ, బయట కృతవర్మ, కృపుడు వీరవిహారం చేస్తూ అందరినీ చంపేసారు.

అందరినీ చంపి నిశ్శబ్దంగా వాళ్లు దుర్యోధనుడు పడి ఉన్న చోటుకు వచ్చారు.

అక్కడ దుర్యోధనుడు తొడలు విరిగి పడి ఉన్నాడు. కష్టం మీద ఊపిరి తీస్తున్నాడు. నోటి నుండి నెత్తురు కారుతున్నది. భీకరంగా కనిపిస్తున్న క్రూరజంతువులు, కుక్కలు ఆయనను తినబోతూ నాలుగు వేపులా దగ్గరగా నిలిచి ఉన్నాయి. ఎంతో కష్టం మీద వాటిని వారిస్తూ దుర్యోధనుడు తీవ్రవేదనతో నేలపై పొర్లుతున్నాడు.

ఆ ముగ్గురూ అగ్నుల్లా అతడి చుట్టూ నిలవగా మూడు అగ్నులూ చుట్టి ఉన్న వేదికలా కానవచ్చాడు సుయోధనుడు. అతడి నోటినుంచి కారుతున్న రక్తాన్ని తుడిచి అశ్వత్థామ అన్నాడు– "దుర్యోధనా! నీ చెవుల కింపైన ఈ మాటను విను, ద్రౌపది కొడుకులను చంపేసాను. ధృష్టద్యుమ్నుడిని, శిఖండిని చంపేసాను. సమస్త పాంచాలురనూ సైనికులతో సహా చంపేసాము. మహారాజా! హాయిగా కన్నుమూయి"

మనసుకు నచ్చిన మాటలు వినగానే దుర్యోధనుడు చైతన్యాన్ని పొంది అన్నాడు– "ఈరోజు కృప, కృతవర్మలతో నీవు చేసిన పని భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు కూడా నాకు చేయలేదు. మీకు మేలు కలుగుతుంది. స్వర్గంలో కలుసుకుందాం!" అని ప్రాణాలు విడిచాడు దుర్యోధనుడు.

మాటిమాటికీ దుర్యోధనుని వేపు చూస్తూ వాళ్లు తమ రథాలనెక్కి వెళ్లిపోయారు.

– నేను నగరానికి పరిగెత్తుకు వచ్చాను" అన్నాడు సంజయుడు.

## 2) ఐషీక పర్వము

ధృష్టద్యుమ్నుని రథసారథి ధర్మరాజును కలిసి ఆ రాత్రి జరిగిన మారణ హోమం గురించి చెప్పాడు– "అర్ధరాత్రి కృపుడు, కృతవర్మలతో కలిసి అశ్వత్థామ ధృష్టద్యుమ్న, శిఖండి, యుధామన్యుడు, ఉత్తమౌజులతో బాటు ఉపపాండవులందరినీ చంపాడు. నేనొక్కడినే ప్రాణాలతో బయటపడ్డాను"

యుధిష్ఠిరుడా మాట వినగానే వ్యాకులచిత్తుడై పడిపోతుంటే భీమార్జునులు నకుల సహదేవులు పట్టుకున్నారు. యుధిష్ఠిరుడన్నాడు– "మనం గెలిచి ఓడిపోయాం. జీవలోకంలోని మనుష్యులకు ఏమరుపాటును మించిన మృత్యువు లేదు. అందుకే మనకీ అనర్థం" అని పలికి దుఃఖిస్తూ ద్రౌపదిని తీసుకురమ్మని నకులుడిని పంపి తాను మిత్రులు బంధువులతో కలిసి రణభూమికి వెళ్లాడు. అక్కడ అశ్వత్థామ కత్తి దెబ్బలకు ముక్కలుగా పడి ఉన్న తన కుమారులను, చచ్చి పడిఉన్న ధృష్టద్యుమ్న, శిఖండి, యుధామన్య, ఉత్తమౌజులను చూసాడు.

ఇంతలో నకులుడు, ద్రౌపది అక్కడకు వచ్చారు. చనిపోయి పడిఉన్న తన పుత్రులను చూసి కుప్పకూలింది ద్రౌపది.

తరువాత తెప్పరిల్లి తనను అనునయిస్తున్న భీముడితో అన్నది– "పాపకర్ముడైన అశ్వత్థామ నిద్రిస్తున్న నా కుమారులను చంపాడని విన్నాను. వాడి ప్రాణాలను అపహరించకపోతే నేనిక్కడే ప్రాణత్యాగం చేస్తాను" అన్నదామె క్రోధంతో రగిలిపోతూ. "వాడిని చంపి గుర్తుగా వాడి శిరోభూషణాన్ని తీసుకురా! భీమసేనా! పార్థా! లేకుంటే నా మనసు నెమ్మదించదు"

భీముడు వెంటనే రథమెక్కి నకులుడు సారథిగా అశ్వత్థామ వెళ్లిన రథచిహ్నాలను అనుసరిస్తూ వెళ్లిపోయాడు.

కృష్ణుడన్నాడు– "అశ్వత్థామ క్రోధుడై ఉన్నాడు. అతడు దివ్యాస్త్ర సంపన్నుడు. నాకు ఒకప్పుడు బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ఇచ్చి సుదర్శన చక్రం తీసుకోవాలనుకుని దానిని ఎత్తలేక విరమించుకున్నాడు. అతడి కోరిక నన్ను పూజించి, నాతోనే యుద్ధం చెయ్యాలని. బ్రహ్మాస్త్రాన్ని మించిన బ్రహ్మశిరోనామకాస్త్రం అతడి వద్ద ఉన్నది. మనం భీముడికి అండగా ఉండాలి" అని పలికి తన రథంలో అర్జునుడిని, ధర్మరాజును ఎక్కించుకుని భీముడి వెనక బయల్దేరినాడు.

గంగాతీరంలో వ్యాసాది మహర్షులున్న చోట ఒంటికి నేయి పూసుకుని, దర్భ చీరలు ధరించి, ఒళ్లంతా దుమ్ము కొట్టుకుని ఉండగా కూర్చున్న అశ్వత్థామ కనిపించాడు భీమార్జున ధర్మజ కృష్ణులకు.

వారిని చూడగానే క్షణం ఆలోచించకుండా ఎడమచేత్తో ఒక గడ్డిపరకను పట్టుకుని అభిమంత్రించి బ్రహ్మాస్త్రాన్ని (బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని) ప్రయోగించాడు అశ్వత్థామ.

**సతద్ దివ్యమదీనాత్మా పరమాస్త్రమ చింతయత్**
**జగ్రాహ చ స చ ఐషీకాం ద్రౌణిః సవ్యేన పాణినా** (సౌప్తిక 13–19)

గడ్డిపరకను బ్రహాస్త్రంగా మార్చి ద్రోణపుత్రుడు ప్రయోగించడం చూసిన కృష్ణుడు అర్జునుడితో అన్నాడు– "నీవు వెంటనే బ్రహ్మాస్త్రం ప్రయోగించు"

అశ్వత్థామ "అపాండవీయం కావించు" అని బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

అర్జునుడు– "అశ్వత్థామకు, తనకు, సమస్త సోదరులకు శుభం కలగాలని, శత్రువుల బ్రహ్మాస్త్రాన్ని శాంతింప చేయాలని" బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

అశ్వత్థామ–అర్జునులను బ్రహ్మాస్త్రాలను శాంతింపజేయాలని వ్యాసుడు, నారదుడు సంకల్పించారు. వారి విజ్ఞప్తిపై బ్రహ్మాస్త్రాన్ని ఉపసంహరించాడు అర్జునుడు. అలా బ్రహ్మాస్త్రాన్ని ఉపసంహరింపజేయగలిగింది అర్జునుడొక్కడే. అశ్వత్థామ అంగీకరించలేదు.

అశ్వత్థామ అన్నాడు– "గడ్డిపరకతో మంత్రించబడిన ఈ ఐషికాస్త్రం పాండవేయుల గర్భంలోని శిశువులపై పడుతుంది"

కృష్ణుడన్నాడు– "ఈ అస్త్రం అమోఘమైనదే. కాని ఉత్తర గర్భస్థ శిశువు మరణించి బయటపడతాడు. కాని దీర్ఘాయువును పొందుతాడు"

వ్యాసుడన్నాడు– "నీ సహజ మణిని పాండవులకు ఇచ్చివేయి. నీకు కష్టకాలం వస్తున్నది"

కృష్ణుడన్నాడు– "బ్రహ్మాస్త్రాన్ని దుర్వినియోగం చేసావు నీవు. మూడువేల సంవత్సరాల వరకు ఈ నేలపై తిరుగుతూనే ఉండు. ఎక్కడా నీకు స్థిరనివాసం లభించకుండును గాక! నెత్తుటి దుర్గంధంతో, సర్వవ్యాధులతో దుర్గమారణ్యాలలో తిరుగు. ఉత్తరకు జన్మించబోయే కుమారుడు పరీక్షిత్తుగా అరవై ఏళ్ల రాజ్యపాలన చేస్తాడు. కృపుడి ద్వారా ధనుర్విద్య నేర్చుకుంటాడు. ఆ శిశువును నేను బ్రతికిస్తాను"

వ్యాసుడన్నాడు– "నీకు జనావాసం లేదు. అశ్వత్థామా! నీవు నిద్రపోతున్నవారిని చంపావు. తల్లి గర్భంలో సురక్షితంగా ఉండే శిశువులను నీ బ్రహ్మాస్త్రపు అగ్నితో చంపావు. పో! అరణ్యాలలో తిరుగు. జనం మధ్య ఉండే అర్హత లేదు నీకు"

అశ్వత్థామ అన్నాడు– "ఇదిగో నా చూడామణి. దీనిని ధరిస్తే ఆయుధాల వలన, వ్యాధుల వలన, ఆకలి వలన, దేవదానవ నాగుల వలన, దొంగలు, రాక్షసుల వలన భయం ఉండదు. నేనూ వ్యాసమహర్షితోనే ఉంటాను. ఆయనా భూమిపైనే ఉంటాడు" అని పలికి అశ్వత్థామ అరణ్యానికి వెళ్లిపోయాడు.

పాండవులు వ్యాస, నారద మహర్షులకు నమస్కరించి ద్రౌపది వద్దకు వచ్చారు. ధర్మరాజు అనుమతితో భీముడు ఆ శిరోమణిని ద్రౌపదికిచ్చి అన్నాడు– "అశ్వత్థామ కీర్తి పడిపోయింది. ఆ రకంగా చంపబడినాడతడు. జీవితం మిగిలింది. మణిని పీకేశాం. ఆయుధం భువిపై పడింది"

ద్రౌపది ఆ మణిని ధర్మరాజుకిచ్చింది. దానిని శిరస్సున ధరించి చంద్రునితో కూడిన పర్వతంలా శోభిల్లాడతడు.

కృష్ణుడన్నాడు– "మహాదేవుని అనుగ్రహ ప్రాప్తుడైన అశ్వత్థామ, అతడిచ్చిన ఖడ్గంతో పాంచాలురను, నీ పుత్రులను చంపగలిగాడు. ఇది విధి లిఖితం. అనంతర కార్యక్రమానికి ఉపక్రమించు. యుద్ధం ముగిసింది"

**న తన్మనసి కర్తవ్యం న చ తద్ ద్రౌణినా కృతమ్**
**మహాదేవ ప్రసాదేన కురు కార్యమనంతరమ్** (సౌప్తిక. 18–26)

❖❖❖❖❖

# ❖ 11. స్త్రీ పర్వము ❖

1) జల ప్రదానిక పర్వము (15)
2) స్త్రీ విలాప పర్వము (10)
3) శ్రాద్ధ పర్వము (2)

## 1) జలప్రదానిక పర్వము

తన నూరుగురు కొడుకులు చనిపోగా కొమ్మలు విరిగిన చెట్టువలె ఉన్నాడు ధృతరాష్ట్రుడు, ధృతరాష్ట్రుడన్నాడు–

**హత పుత్రో హతామాత్యః హత సర్వ సుహృజ్జనః**
**దుఃఖం నూనం భవిష్యామి విచరన్ పృథివీ మిమామ్** (స్త్రీ. 1–10)

"అందరూ చనిపోయారు. రెక్కలు తెగిన పక్షిలాంటి వాడిని ఇంకా బ్రతకడమెందుకు నేను?"

సంజయుడన్నాడు– "పద్దెనిమిది రోజుల్లో అంతా తలక్రిందులయ్యింది. ఇప్పుడు శోకించడం వల్ల లాభం ఉండదు"

విదురుడన్నాడు– "సర్వ ప్రాణులకు పరాగతి ఇదే!

**సర్వేక్షయాంతా నిచయాః పతనాంతాః సముచ్ఛ్రయాః**
**సంయోగా విప్రయోగాంతాః మరణాంతంచ జీవితమ్** (స్త్రీ. 2–3)

కూడబెట్టిన వాటికి నాశమే ముగింపు. ఎగిసిపాటుకు పతనం, సంయోగాలకు వియోగం, జీవితానికి మరణమే ముగింపు. కాలం సమీపిస్తే అంతే!

**కాలం కర్షతి భూతాని సర్వాణి వివిధాన్యుత**
**న కాలస్య ప్రియః కశ్చిత్ నద్వేష్యః కురుసత్తమ** (స్త్రీ. 2–8)

కాలానికి ఎవ్వడు ప్రియమైనవాడు కాదు. ఎవ్వడూ ద్వేషించదగినవాడూ కాదు. తనకు తానే బంధువు. తనకు తాను శత్రువు. తనకు తానే సాక్షి; మంచి పని చేసినా చెడ్డపనిచేసినా!"

**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః**
**ఆత్మైవ హ్యాత్మనః సాక్షీ కృతస్యాప కృతస్య చ** (స్త్రీ. 2–35)

విదురుడన్నాడు– "మానవుల శరీరాలు గృహాలవంటివి. అవి అశాశ్వతాలు. ఆత్మ ఒక్కటే శాశ్వతం. వస్త్రాలలానే ప్రాణులు శరీరాల్ని సమయాన్ని బట్టి స్వీకరిస్తారు, విడిచిపెడతారు.

ఇతరులను మూర్ఖులంటూ తనను తాను గమనించుకోడు మానవుడు. ఇతరుల దోషాలను అధిక్షేపిస్తాడు కాని తనను తాను అదుపు చేసుకోడు.

ఒక మహారణ్యంలో ప్రయాణిస్తున్న బ్రాహ్మణుడొకడు క్రూరమృగాల్ని చూసి అవి చుట్టుముట్టగా పరిగెడ్తున్నాడు. అక్కడ అన్నివేపులా వ్యాపించిన వలను చూసాడు. ఒక కాంత దానిని పట్టుకుని ఉన్నది. ఆ వనంలో నింగినంటే చెట్లు, అయిదు తలల పాములు ఉన్నాయి. వనమధ్యంలో ఒక బావి ఉంది. దానిపై గడ్డి పెరిగింది. అది చూడక ఆ బ్రాహ్మణుడు ఆ బావిలో తలకిందులుగా పడ్డాడు. లతలకు చిక్కుకుని తొడిమతో చెట్టును పట్టుకున్న పనసపండులా వేలాడుతున్నాడు. బావి మధ్యలో అతడికి పెద్ద పాము కనిపించింది. బావి గట్టు దగ్గర ఆరు ముఖాలు పండ్రెండు కాళ్ళు, తెల్లగా నల్లగా ఉన్న ఏనుగు నిలబడి ఉన్నది. బ్రాహ్మణుడు వ్రేలాడబడిన కొమ్మకు వివిధ రూపాలైన తేనెటీగలు తేనె పట్టు చుట్టూ మూగి ఉన్నాయి. తేనెను తాగుతూ ఉన్న బ్రాహ్మణుడికి ఎంత తాగినా తృప్తి లేదు. నల్లని తెల్లని ఎలుకలు ఆ చెట్టును కొరుకుతున్నాయి.

వనంలో పాములు, భయంకరమైన కాంత, బావిలో కింద పాము, బావి గట్టుపై ఏనుగు, చెట్టును కొరుకుతున్న ఎలుకలు, మధువు మీద ఆశ, తేనెటీగల వల్ల భయం – ఇదే జీవితం.

అడవి-మహా సంసారం, పాములు-రోగాలు; స్త్రీ-వార్ధక్యం, బావి-జీవి శరీరం; బావి అడుగున ఉన్నది-కాలసర్పం; బావి మధ్యలో పెరిగిన తీగ-జీవితాశ; దానికే ఆ బ్రాహ్మణుడు వ్రేలాడుతున్నాడు; ఆరు ముఖాల ఏనుగు- సంవత్సరం; ముఖాలు-ఋతువులు; పాదాలు-పన్నెండు నెలలు; ఎలుకలు-రాత్రింబవళ్లు; తేనెటీగలు-కోరికలు; తేనె-కోరికల రసాలు; ఈ సంసార చక్రాన్ని భేదించగలిగింది వైరాగ్యమొక్కటే!" -అన్నాడు విదురుడు.

విదురుడు చెబుతున్నాడు- "ప్రాణుల శరీరం రథం. సత్త్వం సారధి; ఇంద్రియాలు గుర్రాలు; మనస్సు పగ్గాలు; ఇంద్రియాల వెంట పరుగెత్తేవాడు సంసార చక్రంలో చక్రంలా పరిభ్రమిస్తూ ఉంటాడు"

ధృతరాష్ట్రుడన్నాడు- "దుఃఖం నా శరీరాన్ని దహిస్తున్నది. ప్రాణాలు విడిచిపెట్టడం తప్ప నాకు వేరే మార్గం లేదు"

వ్యాసుడన్నాడు- "ఈ యుద్ధం దైవకార్యం. రాజా! నీ కుమారుడు లోక సంహారం కోసం కలి అంశలో పుట్టాడు. శకుని ద్వాపరాంశ కలవాడు. నేను, నారదుడు, భీష్ముడు, ద్రోణుడు, కృపుడు ఎన్నోసార్లు మీకు చెప్పాము పాండవులకు అర్థరాజ్యమివ్వమని. ఇవ్వకపోగా వాళ్లు పడరాని పాట్లు పడేలా చేసారు, అవమానించారు. విధిని మరలించలేము. కాబట్టి పాండవుల మీద దయతో జీవించు"

విదురుడన్నాడు- "అందరం అక్కడకు వెళ్లాల్సిన వాళ్లమే. ఎవరి కాలం వస్తే అతడు ముందుగా వెళ్తాడు. దానికై శోకమెందుకు? నీవు నీ కర్తవ్యం నిర్వహించు"

ధృతరాష్ట్రుడు కాస్త స్థిమితపడి రణభూమికి బయల్దేరాడు. గాంధారీదేవి భర్త ఆదేశంతో కుంతితో ఇతర స్త్రీలతో కలిసి రణభూమికి బయల్దేరింది. ఏనాడూ అంతఃపురాల్ని వదిలి వెళ్లని స్త్రీలు నేడు దుఃఖ వదనాలతో రణభూమికి వెళ్తున్నారు.

దారిలో వారికి కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ కనిపించారు. ఆ అర్ధరాత్రి ఉపపాండవులను, ధృష్టద్యుమ్నుడిని, శిఖండిని, పాంచాలురను చంపి వాళ్లు పారిపోతున్నారు. ఆ విషయం చెప్పి ధృతరాష్ట్రుని అనుమతి పొంది ముగ్గురూ మూడు దిక్కులకు పోయారు.

ఆ తరువాత అశ్వత్థామ 'అపాండవం' అని బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. ధర్మజ భీమార్జునులు, కృష్ణుడు, నకుల సహదేవులు, వ్యాస, నారదుల సలహాను పాటించి అతడి చూడామణిని తీసుకుని తమ శిబిరాలకు వెళ్లిపోయారు.

ధర్మరాజుకు తెలిసింది ధృతరాష్ట్రుడు రాచస్త్రీలతో కలిసి రణభూమికి బయల్దేరాడని. తను కూడా సోదరులు, కృష్ణుడు, సాత్యకి, యుయుత్సుడు, ద్రౌపది, ఇతర స్త్రీలు వెంటరాగా అందరూ రణభూమిని చేరుకున్నారు.

యుధిష్ఠిరుని చూడగానే కౌరవ కాంతలు ఘొల్లున ఏడ్చారు- "అందరిని చంపి నీవేం మూటకట్టుకున్నావు? నీ ధర్మజ్ఞత్వం ఏమైపోయింది? నీకు మాత్రం ఎవరు మిగిలారు?"

వారినందరిని దాటి ధర్మరాజాదులు ధృతరాష్ట్రుని సమీపించి నమస్కరించినారు. ధృతరాష్ట్రుడు ధర్మరాజును అనిష్టంగానే కౌగిలించుకున్నాడు. భీముడి కోసం అగ్నిలా ఎదురుచూస్తున్నాడు. ధృతరాష్ట్రుడి సంకల్పాన్ని గ్రహించిన కృష్ణుడు భీముని పక్కకు నెట్టి తాను సిద్ధంగా ఉంచిన భీముడి లోహ ప్రతిమను ధృతరాష్ట్రుని ముందుంచాడు.

## ధృతరాష్ట్ర కౌగిలి

పదివేల ఏనుగుల బలం కలిగిన ధృతరాష్ట్ర మహరాజు ఆ లోహ భీమ ప్రతిమను గట్టిగా కౌగిలించుకుని తన శక్తికొద్దీ ముక్కలు చేయగా ఆయన రొమ్ము నలిగి రక్తం కారింది. నోటి నుండి రక్తం కారి, శరీరం తడుస్తూ నేలపై పడి- "అయ్యో, భీమా!" అని ఆక్రోశించాడు.

కృష్ణుడన్నాడు- "ధృతరాష్ట్రా! నీవు శోకించనవసరం లేదు. నీవు భీమసేనుని చంపలేదు. భీముని లోహప్రతిమను బాగానే బద్దలుకొట్టావు. పుత్రశోకంతో తపిస్తూ ధర్మం మరచావు. భీముని చంపినా నీ పుత్రులు మరలిరారు. నీ తప్పు వల్లనే వినాశనం జరిగింది. నీ పుత్రుడి అసూయా ద్వేషాలవల్ల అనర్థం జరిగింది. శాంతి వహించు"

ధృతరాష్ట్రుడన్నాడు- "పుత్రశోకం నా విచక్షణను తొలగించింది. ఇక ప్రీతి, హితాభిలాష నాకు పాండవుల మీదనే!"

పాండవులను శపించాలనుకున్న గాంధారిని వ్యాసుడు శాంతపరచాడు- "నీ కుమారుడు దుర్యోధనుడు యుద్ధం జరిగిన పద్ధెనిమిది రోజులూ నీ ఆశీస్సులు కోరేవాడు ప్రతి ఉదయము. నీవు ఆశీర్వదించేదానివి- 'ధర్మమున్న వేపు గెలుపుంటుంది' అని. నీ మాటలు సత్యవచనాలు".

గాంధారి అన్నది– "పుత్రులు పరస్పరం కలహించుకుని చనిపోయారన్న దానికన్నా, భీముడు దుశ్శాసనుడి రొమ్ము చీల్చి రక్తం త్రాగడం, దుర్యోధనుడి తొడలు విరగగొట్టడం –నన్ను బాధిస్తూ ఉన్నాయి. అవి నా కోపాన్ని పెంచాయి"

భీముడన్నాడు– "భయంతో, ఆత్మరక్షణకై నేనట్లు చేసాను. నీ పుత్రుడిని ధర్మయుద్ధంలో గెలవడం సాధ్యం కాదు. దుశ్శాసనుడి రొమ్ము చీల్చి రక్తం తాగలేదు. పెదాలకంటించి నన్ను చుట్టుముట్టిన వారిని భయపెట్టాను. అంతేకాక నా ప్రతిజ్ఞలు నెరవేర్చుకోవడానికి అలా ప్రయత్నించాను".

గాంధారి అన్నది– "నీకెంత కోపమున్నా నా కొడుకులందరినీ చంపాలా? తప్పు చేయనివాడు ఒక్కడూ నీకు కనిపించలేదా ఆ నూరుగురిలో! ఏడీ ఆ యుధిష్ఠిరుడు?"

యుధిష్ఠిరుడన్నాడు– "అమ్మా! నేనే ఆ పాపిని! నన్ను శపించు"

గాంధారి ఏమీ అనలేదు. యుధిష్ఠిరుడు ఆమె పాదాలపై పడబోయాడు. ఆమె పాదాలను స్పృశించబోయిన ధర్మజుడి చేతి వ్రేళ్ల కొనలపై ఆమె కళ్లకు కట్టుకున్న గంతలో నుండి ఆమె దృష్టి పడగా ధర్మరాజు గోళ్లు నల్లబడిపోయాయి.

ఆమెకు నమస్కరించి పాండవులు కుంతీదేవి దగ్గరకు వెళ్లి ఆమెకు నమస్కరించారు. ద్రౌపదిని చూసి కుంతీదేవి విలపించింది. ఆ ఇద్దరూ దుఃఖిస్తుంటే గాంధారి అన్నది– "నాదీ, నీదీ, మనదీ ఒకే స్థితి. మనలను ఎవరు అనునయిస్తారు. నా దోషం వల్లనే గొప్ప వంశం నశించిపోయింది.

**'మమైవ హ్యపరాధేన కులమగ్ర్యం వినాశితమ్"**

## 2) స్త్రీ విలాప పర్వము

వ్యాస మహర్షి కరుణతో గాంధారికి రణభూమి అంతా కనిపించసాగింది. ఆమె నిలబడిన చోటు నుంచే దూరంగా ఉన్న వీరుల శవాలు, దృశ్యాలు దివ్యదృష్టి వలన కనబడుతున్నాయి. రుద్రుని క్రీడాస్థలంలా ఉన్న ఆ రణభూమిలోకి వచ్చిన రాచకాంతలు వాహనాల నుండి దిగి అక్కడి దృశ్యాలను చూసి సొమ్మసిల్లి పడిపోయారు. చాలా దయనీయ దశలో వారున్నారు. దుఃఖంతో మనస్సులు దెబ్బతిన్న ఆ స్త్రీల విలాపాలతో అన్నివైపులు ప్రతిధ్వనిస్తున్నాయి.

గాంధారి కృష్ణుని పిలిచి కౌరవుల వినాశనాన్ని పరికిస్తూ అన్నది– "మాధవా! పుండరీకాక్షా! నా కోడళ్లను చూడు. భర్తలను కోల్పోయి జుట్టు విరబోసుకుని క్రౌంచపక్షుల్లా విలపిస్తున్నారు చూడు. వారు తమ భర్తల గుణగణాలను తలుచుకుని వెదుక్కుంటూ వారి శవాల వేపు ఎలా పరిగెడుతున్నారో చూడు"

నెత్తుట తడిసిన గ్రద్దలు, కాకులు వారిని లాగుతున్నాయి. కుక్కలు, నక్కలు పీక్కుతింటున్నాయి చూడు. శత్రువులు చంపిన తమ సోదరులను, తండ్రులను, కొడుకులను, భర్తలను చూసి చేతులతో తమ తలలను బాదుకుంటున్నారు. అప్పుడామెకు కనిపించాడు దుర్యోధనుడు.

**దుర్యోధనం హతం దృష్ట్వా గాంధారీ శోక కర్శితా**
**సహసా న్యపతద్ భూమ్ ఛిన్నేవ కదలీ వనే** (స్త్రీ. 17-1)

మరణించిన దుర్యోధనుని చూసి విరిగిన అరటిచెట్టులా కూలబడిందామె. ''అయ్యో నాయనా! ప్రతిరోజూ నాకు నమస్కరించి దాయాదుల పోరులో జయం కలగాలని దీవించు అమ్మా! అనేవాడివి. ధర్మమెటు ఉంటే అటే గెలుపు 'యతో ధర్మస్తతో జయః' అనే దానిని నేను. నాయనా! ఇప్పుడు నేను నీ తండ్రి గురించి శోకిస్తున్నాను. కుమారా! పదకొండు అక్షౌహిణీల సైన్యాన్ని నీ క్షేమం కొరకు రప్పించుకోగలిగిన వాడివి కటిక నేలపై పవ్వళించి ఉన్నావు. కృష్ణా! చూడు, నా కుమారుడు చనిపోయి నేలపై పడి ఉన్నాడు.

అదుగో నా కోడలు, లక్ష్మణ కుమారుని తల్లి జుట్టు విరబోసుకుని దుఃఖిస్తున్నదక్కడ. ఆమె తన భర్త కోసం, తన కుమారుని కోసం దుఃఖిస్తున్నది. ఆ తపస్విని భర్త ముఖాన్ని, కుమారుడి ముఖాన్ని తడుముతున్నది.

నా వందమంది కుమారులను చూడు కృష్ణా! దాదాపు అందరినీ భీమసేనుడే గదాదండంతో రణభూమిలో సంహరించాడు. నా కోడళ్లు చూడు ఉన్మత్తతకు లోనై ఎలా తిరుగుతున్నారో– బెగ్గురు పక్షుల్లా రోదిస్తూ పడి ఉన్నారు నా కోడళ్లు చూడు. ఆమెను చూడు! శరీరం నుంచి వేరుపడిన తన బంధువు తలను పట్టుకుని మొండెం ఎక్కడ ఉన్నదా అని వెదుకుతున్నది.

ఇతడు దుశ్శాసనుడు. భీముడి చేత రొమ్ము చీల్చబడి అచేతనుడై ఉన్నాడు. 'పాండవులతో సంధి చేసుకో' అని ఎంత చెప్పినా నా కుమారులు వినలేదు. ఫలితం ఇది.

ఇది వికర్ణుడి శవం. వింటిని పట్టిపట్టి చేతిపై పెద్ద కాయకాచింది. గ్రద్దలు దానిని తినాలని ప్రయత్నిస్తున్నాయి. దుర్ముఖుడి ముఖాన్ని సగం తినేసాయి క్రూరజంతువులు, సప్తమినాటి చంద్రుడిలా ఉన్నదతడి ముఖం. ఇతడు చిత్రసేనుడు. అతడు వివింశతి, సుందరస్త్రీలతో సేవింపబడేవాడు. ఇప్పుడతడిని గ్రద్దలు కాకులు సేవిస్తున్నాయి. ఇతడు దుస్సహుడు. ఇంకా ప్రకాశం తగ్గనివాడు.

అతడు అభిమన్యుడు. చనిపోయినా కాంతి తగ్గనివాడు. ఆమె ఉత్తర. తన భర్త చేతిని స్పృశిస్తూ శోకిస్తున్నది. అభిమన్యుడు ఇంకా బ్రతికే ఉన్నాడని భ్రమిస్తూ మాట్లాడుతున్నది. ఈ లోకంలో నాతో నీ సహవాసం ఆరు నెలలకే పరిమితమయ్యింది –అంటున్నదామె.

ఉత్తరుడు, అభిమన్యుడు, సుదక్షిణుడు, లక్ష్మణుడు వీళ్లందరూ బాలకులు. లేత ప్రాయంలోనే కన్నుమూసారు.

అతడు కర్ణుడు. పదమూడు సంవత్సరాలు యుధిష్ఠిరునికి నిద్రపట్టకుండా చేసినవాడు. అతడి భార్యలు విలపిస్తున్నారు చూడు. ఆమె వృషసేనుని తల్లి. తన కుమారుడిని, తన భర్తను చూసి విలపిస్తున్నది.

అవంతి రాజు శవాన్ని నక్కలు, తెల్లడేగలు, క్రూరజంతువులు అటూ ఇటూ లాగుతున్నాయి. బాహ్లికుడు బల్లెం దెబ్బతిని ఉన్నాడు. జయద్రథుని తలలేని శరీరాన్ని నక్కలు గ్రద్దలు తింటున్నాయి. అదుగో నా కూతురు దుశ్శల. కృష్ణా! కూతురు విధవ అయ్యింది. కోడళ్లు భర్తలను పోగొట్టుకున్నారు. ఇంతకుమించిన దుఃఖం నాకు మరేముంటుంది.

అతడు శల్యుడు. అతడి నాలుకను పక్షులు తింటున్నాయి. అతడు భగదత్త నరపాలుడు. గజాంకుశాన్ని చేతబట్టి పడి ఉన్నాడు. భీష్ముడు అంపశయ్యపై శయనించి ఉన్నాడు. అదుగో అందరికి గురువు ద్రోణుడు. తలతెగి పడిఉన్నా విల్లు పట్టుకున్న పిడికిలి విడిపోకుండా ఉన్నది. ఆయన భార్య కృపి దీనంగా కూర్చుని ఉన్నది. ద్రోణుని అంత్యక్రియలకు అన్నీ సిద్ధం చేస్తున్నారు.

ఇతడు సోమదత్తుని కొడుకు భూరిశ్రవుడు. తెగిన చేతిని పక్షులు పొడుస్తూ లాగుతున్నాయి. అతడి భార్య అంటున్నది– ఈ చేయి శూరులను సంహరించినది. ఈ చేయి మా మొలసూలును లాగేది. ఈ చేయిని ఖండించాడు అర్జునుడు వాసుదేవుని సమక్షంలోనే! అర్జునుడు ఎలా చెప్పుకోగలడీ విషయాన్ని?

అడుగో మేనల్లుడి చేతిలో చనిపోయిన మేనమామ శకుని. సహదేవుడు తన మేనమామను, బావ ఉలూకుడిని చంపాడు. శకుని పక్షిలా జూదమాడి పాండవులను ఓడించాడు. అటువంటి శకునిని పక్షులు పీక్కుతింటున్నాయి.

ఇతడు కాంభోజరాజు సుదక్షిణుడు. చచ్చి దుమ్ములో పడి ఉన్నాడు. అతడి భార్య దీనాతిదీనంగా ఏడుస్తున్నది. అక్కడ పడి ఉన్నది కళింగరాజు, ఇతడు మగధరాజు జయత్సేనుడు. అతడు కోసల దేశాధిపతి. ఈ రాజుల భార్యల దీనాలాపాలకు గుండెలు తరుక్కుపోతున్నాయి. ధృష్టద్యుమ్న కుమారులు, కేకయ సోదరులు, ద్రుపదుడు, ధృష్టకేతువు, ధృష్టకేతువు కుమారుడు, అవంతీ దేశపు విందుడు, అనువిందుడు అందరూ రణభూమిలో చచ్చిపడి ఉన్నారు. కాల వైపరీత్యాన్ని చూడు.

కృష్ణా! నీవు రాయబారానికి వచ్చి విఫలుడివై ఉపప్లవ్యానికి వెళ్లినప్పుడే నా కుమారులు చనిపోయారు.

## గాంధారి శాపం

అని కృష్ణుడితో అంటూనే ఉద్వేగభరితయై గాంధారి మూర్ఛపోయింది. క్రోధం పెరగగా కృష్ణుడితో అంటున్నది– "నీవు ఇరుపక్షాలను ఒప్పించగల సమర్థుడివి. కాని కురువంశస్థుల నాశనాన్ని కోరుకున్నావు. కాబట్టి తగిన ఫలాన్ని అనుభవించు–

నేటి నుంచి 36 సంవత్సరాలు గడచిన తరువాత నీవు కూడా దాయాదులను, అమాత్యులను, పుత్రులను కోల్పోయి, వనచరుడివై దిక్కుమొక్కు లేనివాడివై, ఎవ్వరికి తెలియకుండా, ఎవ్వరి చేతా గుర్తింపబడకుండా హీనమార్గంలో చస్తావు.

ఈ భారత స్త్రీలవలె నీ భార్యలు కూడా కొడుకులను, బంధుమిత్రులను పోగొట్టుకుని శవాలపై పడి ఏడుస్తారు" శపించింది గాంధారి.

ఆ ఘోరమైన మాట విని కొద్దిగా నవ్వుతూ కృష్ణుడన్నాడు– "ఇదిలా జరుగుతుందని నాకు తెలుసు. నిర్ణయమైన దానినే నీవు చెప్పావు. వృష్ణి వంశస్థుల మరణం దైవికమే. వారిని ఎవరూ చంపలేరు. చంపగలిగింది నేనే. యాదవులు తమను తాము చంపుకుని నశిస్తారు" అన్నాడు శ్రీకృష్ణుడు.

## 3) శ్రాద్ధ పర్వము

కృష్ణుడన్నాడు– "గాంధారీ! లే! లే! మనసులో శోకం వద్దు. నీ తప్పులేదా ఈ పాపంలో! కళ్లుండీ ప్రపంచాన్ని చూడలేదు నీవు. కొడుకులు తప్పు చేస్తున్నా ఆపలేదు నీవు.

బ్రాహ్మణస్త్రీ తపస్సు కోసం, ఆవు బరువును మోయడం కోసం, గుర్రం పరుగెత్తడం కోసం, శూద్రకాంత దాస్యం కోసం, వైశ్యస్త్రీ పశుపాలన కోసం, నీలాంటి రాజకుమారి పోరాడి చావడం కోసం పిల్లల్ని కంటుంది. నీవెందుకు కన్నావో నీకు తెలియదా!"

గాంధారి మౌనంగా ఉండిపోయింది.

ధృతరాష్ట్రుడు ధర్మరాజునడిగాడు– "యుద్ధంలో చనిపోయినవారెందరు?"

ధర్మరాజన్నాడు– "166 కోట్ల 20 వేలమంది. 24165 మంది జాడ తెలియలేదు".

ధృతరాష్ట్రుడు సలహా ఇవ్వగా ధర్మజుడు ఆదేశించాడు. విదురుడు, సంజయుడు, సుధర్ముడు, ధౌమ్యుడు, ఇంద్రసేనాది సేవకులు గంధపు చెక్కలు, అగరుకట్టె, ప్రాని పసుపు కట్టెలను, నేతిని, నూనెను, గంధాలను, పట్టుబట్టలను సమకూర్చారు. కట్టెలు, విరిగిపోయిన రథాల ముక్కలు, ఆయుధాలను ప్రోగుచేసి చితుల నేర్పరచారు.

వేల సంఖ్యలో ఉన్న మహరాజులు, రాజులు, వీరులందరిని నేతిధారలతో ప్రజ్వలిస్తున్న మంటలలో దహించారు. పితృమేధాలను, సామగానాన్ని చేసారు. సామమంత్రాలు, ఋక్కులు పఠించారు.

అనాథలుగా పడి ఉన్న శవాలను వేలరాసులుగా ప్రోగుచేసి అందరికి దహన క్రియలను కావించాడు విదురుడు.

యుధిష్ఠిరాదులందరూ  గంగానది చేరుకుని పెద్దలకు బంధుమిత్రులకు సోదరులకు మనుమలకు అందరికి తిలోదకాలు సమర్పించారు. కురుకాంతలు తమ భర్తలకు జలాలనర్పించారు.

శోకంతో కృశించి ఉన్న కుంతీదేవి ఏడుస్తూ తన కుమారులతో ఇలా అన్నది– "పాండవులారా! మహావీరుడు, మేటి విలుకాడు, రథికులకే రథికుడు, దానవీరుడు, సూతపుత్రుడని, రాధేయుడని మీరు భావిస్తున్న కర్ణుడు– అతడు మీకన్నా ముందు సూర్యుని వలన నాకు పుట్టినవాడు. మీ అన్న. సహజ కవచకుండలాలు కలిగి దివాకర సమ ప్రభ కలిగినవాడు".

ఆ మాటలు వినగానే పాండవులు మరింత దీనులయ్యారు. యుధిష్ఠిరుడు దీర్ఘంగా నిట్టూరుస్తూ అన్నాడు– "అమ్మా! నీవు ఈ రహస్యాన్ని దాచిపెట్టి మమ్ములను చంపావు. ఈ విషయం ముందే తెలిసి ఉంటే ఈ ఘోర సంగ్రామం జరిగేది కాదు.

గాంధారిదేవి తన కుమారుడిని ఉపేక్షించి యుద్ధానికి కారణమైంది.

కుంతీదేవి తన కుమారుడి రహస్యాన్ని దాచి యుద్ధానికి కారణమైంది. పాపినైన నేను ఈ విషయం తెలియక గొప్పవాడైన నా అన్నను చంపాను. అతడు శత్రువనుకుని పదమూడేళ్లు నిద్రపోకుండా భయంతో గడిపాను. అతడు సోదరుడని తెలిసాక జీవితాంతం నిద్రపోకుండా దుఃఖంతో గడుపుతాను".

**పాపే నా సౌ మయా శ్రేష్ఠః భ్రాతా జ్ఞాతిర్నిపాతితః**
**అతో మనసి యద్ గుహ్యం స్త్రీణాం తన్న భవిష్యతి** (స్త్రీ. 27-29)

✣✣✣✣✣

# ✤ 12. శాంతి పర్వము ✤

1) రాజధర్మానుశాసన పర్వము (130)
2) ఆపద్ధర్మ పర్వము (43)
3) మోక్షధర్మ పర్వము (192)

## 1) రాజధర్మానుశాసన పర్వము

పాండవులు నెలరోజుల పాటు శౌచకర్మలు నిర్వహిస్తూ హస్తినాపురం వెలుపలనే ఉన్నారు. వ్యాసుడు, నారదుడు, దేవలుడు, కణ్వుడు వారి శిష్యులు అందరూ కూర్చున్నపుడు యుధిష్ఠిరుడన్నాడు నారద మహర్షితో– "మహర్షీ! గెలిచానన్న మాటే గానీ ప్రతిరోజూ నన్ను ఏదో ఒక దుఃఖం క్షోభపెడ్తూనే ఉన్నది. అభిమన్యుడు, ఉపపాండవులు చనిపోవడం వల్ల నా విజయం విజయంలానే లేదు. పదెనెనిమిది అక్షౌహిణిల సైన్యం, 166 కోట్ల ప్రజలు నేను–దుర్యోధనుడు లోభంతో ప్రవర్తించడం వల్ల మరణించారు. వీటన్నిటికన్నా నన్ను బాధిస్తున్న విషయం కర్ణుడు కుంతీ కుమారుడని, నా సోదరుడని తెలియడం. ఈ విషయం సూర్యుడికి తెలుసు, కుంతికి తెలుసు, వ్యాసుడికి తెలుసు, కృష్ణుడికి తెలుసు, పరశురాముడికి తెలుసు, భీష్ముడికి తెలుసు, చివరికి కర్ణుడికీ తెలిసింది. కానీ, నాకు, భీముడికి, అర్జునుడికి, నకుల సహదేవులకు తెలియదు.

మా తల్లి కుంతీదేవి అడిగినా కర్ణుడు దుర్యోధనుని స్నేహం విడవనన్నాడు. కృష్ణ సహితుడైన అర్జునుడిని జయించి తరువాత ధర్మరాజుతో సంధి చేసుకుంటానన్నాడు. అర్జునుడిని తప్ప మిగతా నలుగురిని చంపనని – పాండవులెప్పటికీ అయిదుగురే –అన్నవాడతడు. అతడు నా అన్న అని తెలిసినప్పటినుంచి నా దుఃఖానికి అంతులేదు. కౌరవ సభలో అతడి కటువైన మాటలు బాధ కలిగించినప్పటికి, కర్ణుని పాదాలు మా తల్లి కుంతీదేవి పాదాల్లా ఉండడం నాకాశ్చర్యమనిపించేది" అన్నాడు ధర్మరాజు.

నారదుడన్నాడు– "అతడు మహావీరుడు. కాని దురదృష్టం అతడిని పుట్టినప్పటి నుంచి వెంటాడింది.

పరశురాముడి వద్ద తాను భార్గవ గోత్రీకుడనని అబద్ధం చెప్పి ప్రియశిష్యుడైనాడు. ఒకనాడు తెలియక ఒక బ్రాహ్మణుడి హోమధేనువును చంపి అతడి శాపానికి గురైనాడు– 'నీవు ఎవరిని చంపడానికి, ఓడించడానికి ఈ ధనుర్విద్యను అభ్యసిస్తున్నావో, అతడితో జరిగే యుద్ధంలో నీ రథం క్రుంగుతుంది' అని శాపమిచ్చాడు బ్రాహ్మణుడు; 'నీ శత్రువు నిన్ను అలాగే చంపుతాడు' అన్నాడతడు కరుణారహితుడై.

కొన్నాళ్ల తరువాత కర్ణుడి ఒడిలో తలవాల్చి పరశురాముడు నిద్రపోతుండగా 'దంశుడనే' రాక్షసుడు క్రిమిరూపం దాల్చి కర్ణుడి తొడను కొరుకుతుంటే రక్తం ధారగా ప్రవహించి భార్గవుడికి అంటగా అతడు ఉలిక్కిపడి లేచి, అలర్కమనే పురుగును తన చూపులతో చంపాడు. అప్పుడు అంతరిక్షంలో దంశ రాక్షసుడు కనిపించి భృగువు తనకిచ్చిన శాపాన్ని తెలిపి వెళ్లిపోయాడు. పరశురాముడు సంశయపడి కర్ణుడిని నిలదీయగా కర్ణుడు తాను సూతపుత్రుడనని చెప్పాడు. బ్రహ్మాస్త్రం గురించి నా దగ్గర అసత్య మార్గాన శిష్యుడివై అస్త్రాన్ని పొందావు. నీవు సమానుడితో యుద్ధం చేసేప్పుడు బ్రహ్మాస్త్రం గుర్తురాదు. కాని నీతో సమానుడైన క్షత్రియుడు భూమి మీదే పుట్టడు" అన్నాడు పరశురాముడు.

కళింగ రాజైన చిత్రాంగదుని నగరం శ్రీమద్రాజపురంలో స్వయంవరం జరుగుతుంటే అందరి రాజులతో పాటు దుర్యోధనుడు కర్ణుడితో సహా వెళ్లాడు. రాజకన్య తనను దాటిపోవడం సహించలేని దుర్యోధనుడు ఆమెను రథమెక్కించి తీసుకునిపోయాడు. కర్ణుడు తమను ఎదిరించిన ప్రతి రాజును ఓడించాడు. ఆ విధంగా కర్ణుడు దుర్యోధనుడికి మరింత హితుడైనాడు.

కర్ణుడి బలాన్ని పరీక్షించగోరి జరాసంధుడొకసారి కర్ణుడితో ద్వైరథ యుద్ధం చేసాడు. ఇద్దరి మధ్య గొప్ప యుద్ధం జరుగగా 'ప్రీతోస్మి' అని పలికి జరాసంధుడు అతడికి మాలినీ నగరాన్ని ఇచ్చాడు. దుర్యోధనుడిచ్చిన అంగ రాజ్యానికి, చంపారణ్యానికి కర్ణుడు రాజయ్యాడు.

ఇంద్రుడు కవచకుండలాలడిగితే ఇచ్చాడు కర్ణుడు. ఆ విధంగా బ్రాహ్మణ శాపం, పరశురాముని శాపం, కుంతికిచ్చిన వరం, ఇంద్రుడి మాయ, కర్ణుడు అర్ధరథుడని భీష్ముడన్న మాట, శల్యుడి సారథ్యం, కృష్ణుడి నీతి – వీటన్నిటిచేత కర్ణుడు చంపబడినాడు" –అని చెప్పాడు నారదుడు.

నారదుడి మాటలను విని ధర్మరాజు శోకంలో మునిగిపోయాడు.

**శశాప చ మహాతేజాః సర్వలోకేషు యోషితః**
**న గుహ్యం ధారయిష్యంతీ త్యేవం దుఃఖ సమన్వితః** (శాంతి. 6–11)

"అన్ని లోకాల్లోని స్త్రీలకు రహస్యాలను దాచే శక్తి లేకుండా పోవునుగాక!" అని ధర్మరాజు శాపమిచ్చాడు.

సంతాపం, శోకం నిండిన మనసుతో తనకు రాజ్యమక్కరలేదని, వనములకు పోతానన్నాడు ధర్మరాజు.

**ధనంజయ కృతం పాపం కల్యాణేనోపహన్యతే**
**ఖ్యాపనేనాను తాపేన దానేన తపసాపి వా** (శాంతి. 7–36)

"చేసిన పాపం చెప్పుకుంటే పోతుంది. పరితాపం చెందినా, దానం చేసినా, తపస్సు చేసినా పోతుంది.

నేను పాపం చేసాను రాజ్యము, సంపద కోసం. వీటిని విడిచి నేను బంధవిముక్తి పొంది, శోకం, మమకారం లేకుండా ఎక్కడికైనా వెళ్లిపోతాను".

అర్జునుడన్నాడు– "ఒకప్పుడు నహుషుడు– 'మునులకు దారిద్ర్యం రాజ్యం కంటే గొప్పది' అన్నాడు. తాను రాజ్యాన్ని కోల్పోయాక– 'ఛీ! ఈ దారిద్ర్యం చాలా కష్టమైనది' అన్నాడు.

ధనం ఉన్నవాడికి మిత్రులు, బంధువులుంటారు. ధనం ఉన్నవాడే మగవాడు. వాడే పండితుడు.

**ధర్మః కామశ్చ స్వర్గశ్చ హర్షః క్రోధః శ్రుతం దమః**
**అర్థా దేతాని సర్వాణి ప్రవర్తంతే నరాధిప** (శాంతి. 8–21)

ధనం, గోవులు, సేవకులు, అతిథులు లేనివాడు, కృశించినవాడు ఒకటే. శరీరం కృశింప చేసుకోగానే సరిపోదు.

ఐశ్వర్య రూపమైన మార్గం శాశ్వతం –ఇది దాశరథము అనే పది రథాలు (పత్ని, యజమానుడు, పశువు, వేదత్రయి, నలుగురు ఋత్విక్కులు) వెళ్లే మార్గం.

## భీమార్జున నకుల సహదేవులు ద్రౌపది-ధర్మరాజు సంవాదం

యుధిష్ఠిరుడన్నాడు– "రథ చక్రం వలె ఈ సంసార చక్రం తిప్పబడుతోంది. ఈ పాంచభౌతికమైన శరీరం కోసం, రాగమోహాలకు లోనై నేనింత పాపం చేసాను. జనన మరణాలతో జరావ్యాధులతో వేదనలతో కూడినదీ సంసారం".

**జన్మ మృత్యు జరావ్యాధి వేదనాభిరభి ద్రుతమ్**
**అపారమివ చా స్వస్థం సంసారం త్యజతః సుఖమ్** (శాంతి. 9–33)

భీముడన్నాడు– "నీ బుద్ధి మాకు మొదట్లోనే తెలిస్తే అసలు ఆయుధమే పట్టేవాళ్లం కాదు. ఎవరినీ చంపేవాళ్లము కాదు.

సన్యాసిగా అడవుల్లో తిరిగితే స్వర్గం వస్తుందంటావు కాని అడవుల్లో మృగాలు, పందులు, పక్షులూ స్వర్గం పొందడం లేదు కదా. పర్వతాలు నిత్య బ్రహ్మచారులు. అందుకే కర్మ చేయాలి మనం"

అర్జునుడన్నాడు– "గృహస్థాశ్రమం గొప్పదని ఒకప్పుడు ఇంద్రుడు బంగరు పక్షిరూపంలో ఇల్లు వీడి వెళ్లిన సంపన్న బ్రహ్మచారులకు చెప్పాడు. ఉదయమూ సాయంకాలమూ ప్రతిరోజూ అతిథులకు, దేవతలకు, పితృదేవతలకు, తనవారికి విభజించి పెట్టి మిగిలిన అన్నం తినేవారిని విఘసాశులు అంటారు. గృహస్థులు ఆ రకంగా స్వర్గాన్ని పొందవచ్చు. దానికి సన్యాసి కానక్కర్లేదు".

నకులుడన్నాడు- "కుటుంబ వ్యవస్థ గొప్పది. గృహస్థాశ్రమంలోనే కామమూ, స్వర్గమూ ఉన్నాయి. లేదా మంచి యజ్ఞాలు చేయి. ప్రజలను రక్షించు. రాజు పొరబడితే ప్రజలను దొంగలు దోచుకుంటారు.

**రాజః ప్రమాదదోషేణ దస్యుభిః పరిముష్యతామ్**
**అశరణ్యః ప్రజానాం యః స రాజా కలిరుచ్యతే** (శాంతి. 12-29)

ప్రజలను రక్షించని రాజునే 'కలిపురుషుడు' అంటారు".

సహదేవుడన్నాడు- "సంపదలను విడిచినా కోరికలు చావకపోతే అది సన్యాస జీవనం కాదు. దానికన్నా గృహస్థాశ్రమం గొప్పది. అంతేకాక బ్రహ్మము, మృత్యువు కనబడకుండా ఉండి పంచభూతాలను కలహించుకునేట్లు చేస్తాయి.

**ద్వ్యక్షరస్తు భవేన్మృత్యుః త్ర్యక్షరం బ్రహ్మ శాశ్వతమ్**
**మమేతి చ భవేన్మృత్యుః నమమేతి చ శాశ్వతమ్** (శాంతి. 13-4)

రెండక్షరాలు మమ (నాది) అనేది మృత్యువు. నమమ అనే మూడక్షరాలు శాశ్వత బ్రహ్మము. చరాచరాలతో నిండిన ఈ భూమినంతా సంపాదించి కూడా సరిగా అనుభవించని రాజు యొక్క జీవితం వ్యర్థం.

ద్రౌపది అన్నది- "ఈ వనవాస దుఃఖం మనకు భవిష్యత్తులో సుఖం కలిగిస్తుందని చెప్పినవాడివి ఇపుడెలా మా మనసులను హింసిస్తున్నావు? సర్వ ప్రాణుల మీద మైత్రి, దానము, అధ్యయనము, తపస్సు బ్రాహ్మణ ధర్మాలు. దుర్జనులను శిక్షించి, సుజనులను రక్షించడం, యుద్ధంలో పారిపోకపోవడం – రాజధర్మాలు. నీకీ రాజ్యం లభించింది బ్రాహ్మణ ధర్మాల వల్ల కాదు. దండనీతితో జయించిన రాజ్యాన్ని వెనకటి మాంధాత, అంబరీష చక్రవర్తులు పరిపాలించారు. నేను లోకంలో స్త్రీలలో అందరికంటె అధమురాలనయ్యాను. పుత్ర సమానులచే అవమానించబడ్డాను. అయినా నాకు జీవితాశ ఉంది. నీవుకూడా ప్రజలందరినీ రక్షించు. మనసు పాడుచేసుకోకు. దండనీతితో రాజ్యాన్ని పాలించు".

అర్జునుడన్నాడు- "భూమిపై ధర్మాన్ని, అర్థాన్ని రక్షించడానికి బ్రహ్మ ఈ దండం ఏర్పాటు చేసాడు. దండనీతి లేకుంటే మర్యాదలు, హద్దులు తెగిపోతాయి. పనులన్నీ ధనానికి, ధనం దండానికి వశమై ఉన్నవి"

భీముడన్నాడు- "జరిగిపోయిన శారీరక మానసిక దుఃఖాలను తలచుకుని ఏడ్చేవానికి ఒక దుఃఖం చేత మరో దుఃఖం కలుగుతుంది. ద్రోణ భీష్ములతో చేసిన యుద్ధం వంటిదే నీవు నీ మనసుతో చెయ్యాలి. నీలో పాపభీతి ఉంటే అశ్వమేధం చెయ్యి. మేమున్నాం"

యుధిష్ఠిరుడన్నాడు- "లోకంలో బంధనం అనేది ఆకర్షణ, ఐహికమైన కర్మ మరో ఆకర్షణ. ఈ రెండు పాపాల నుంచి విముక్తుడైతేనే పరమపదం లభిస్తుంది. జనకుడన్నాడు- "నాకు అంతులేని ధనమున్నది. కాని లేనట్లే. మిథిలా నగరం కాలిపోతున్నది కాని, నా ధనం కొద్దిగా కూడా కాలడం లేదు. దృశ్యాన్ని చక్కగా చూడగలినవాడే కన్నులున్నవాడు. అదే బుద్ధి"

అర్జునుడన్నాడు- "జనకుడు గృహస్థాశ్రమం విడిచి సన్న్యాస జీవితం గడపాలనుకున్నాడు. అప్పుడతడి భార్య అన్నది- 'రాజుగా నీవు అన్ని ప్రాణుల దాహార్తిని తీర్చే జలాశయానివి. ఎన్నో పక్షులకు జంతువులకు ఆహారాన్ని, ఆశ్రయాన్ని ఇచ్చిన ఫలవృక్షానివి'. ఇప్పుడు నీవు సర్వసంగ పరిత్యాగివైతే మంచి చేస్తున్నట్లా? చెడు చేస్తున్నట్లా? సన్న్యాసులు కూడా ఏర్పడేది గృహస్థుల నుంచే గదా!"

ధర్మరాజు అన్నాడు- "తత్త్వం తెలిసినవాడు తపస్సుతో వైరాగ్యం పొందుతాడు. బుద్ధిబలంతో మహత్త్వం, పరబ్రహ్మం పొందుతాడు, త్యాగంతో సుఖం పొందుతాడు.

దేవస్థానుడనే ముని అన్నాడు- "నాలుగు మెట్లున్న నిచ్చెనలో బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం మెట్లు. ఋషులకు స్వాధ్యాయమే యజ్ఞం. మరికొందరికి జ్ఞానమే యజ్ఞం.

**సంతోషో వై స్వర్గ తమః సంతోషః పరమం సుఖమ్**
**తుష్టేర్న కించిత్పరతః సా సమ్యక్ప్రతి తిష్ఠతి** (శాంతి. 21-2)

సంతోషమే స్వర్గం, సంతోషమే సుఖం; తృప్తికంటే గొప్పదేదీ లేదు. ప్రాణులకు ద్రోహం చేయకుండా ఉండేవి- ధర్మం, సత్యం, దానం, దయ, దమం (ఇంద్రియ నిగ్రహం), తన భార్యయందే సంతానం పొందడం, మృదుత్వం, లజ్జ, చపలత్వం లేకపోవడం - ఇటువంటి ప్రవర్తన ధర్మం అని స్వాయంభువ మనువు చెప్పాడు".

అర్జునుడన్నాడు- "ఇంద్రుడు కశ్యప బ్రాహ్మణుడి పుత్రుడు. కర్మచేత క్షత్రియుడైనాడు. ఒక్కొక్క గణానికి 90 మంది ఉన్న తొమ్మిది గణాలను పాపవర్తనులైనారని తన జ్ఞాతులనే చంపివేసాడు. దాని వల్లనే అతడు ఇంద్రుడయ్యాడు".

## శంఖలిఖితుల కథ

వ్యాసుడన్నాడు- "పాము ఎలుకలను మ్రింగివేసినట్లు విరోధింపని రాజును, ఇల్లు-ఊరు వదలని బ్రాహ్మణుని భూమి మింగివేస్తుంది. ప్రచేతసుని కుమారుడు దక్షుడు, రాజర్షి అయిన సుద్యుమ్నుడు చక్కగా దండం ధరించినందువల్ల పరమసిద్ధిని పొందారు. శంఖలిఖితులనే అన్నదమ్ములు బాహుదానది ఒడ్డున వేర్వేరు ఆశ్రమాలలో నివసిస్తూ ఉన్నారు. ఒకనాడు శంఖుని ఆశ్రమానికి వచ్చాడు లిఖితుడు. ఆ సమయంలో ఆశ్రమంలో శంఖుడు లేడు. చెట్లకు బాగా మగ్గిన పండ్లు కనబడగా రాల్చుకుని తిన్నాడు లిఖితుడు. పండ్లు తింటున్న తమ్ముడిని చూసి శంఖుడు కోపంతో అన్నాడు- 'ఇది దొంగతనం. వెళ్లి రాజు దగ్గర దండన తీసుకో!'

లిఖితుడు రాజైన సుద్యుమ్నుని వద్దకు వెళ్లి తాను చేసిన దొంగతనం చెప్పి శిక్ష విధించమన్నాడు. 'నీవు దోషరహితుడవు' అన్నాడు రాజు. లిఖితుడు ఒప్పుకోలేదు. అప్పుడు సుద్యుమ్నుడు దొంగతనం చేసినందుకు లిఖితుడి చేతులు నరికించాడు.

ఆశ్రమానికి వచ్చిన లిఖితుడిని శంఖుడన్నాడు- 'మన వంశం పవిత్రమైనది. వెళ్లి బాహుదానదిలో దేవతలకు, పితృదేవతలకు తర్పణాలు విడువు'. లిఖితుడు వెళ్లి నదిలో మునగగానే అతడికి చేతులు వచ్చాయి. ఆ నది బాహువులిచ్చిన బాహుదానదిగా ప్రసిద్ధికెక్కింది.

శంఖుడన్నాడు- 'నీకు దండన విధించి ఆ రాజు పవిత్రుడయ్యాడు. నీవూ పితృదేవతలతో పాటు పవిత్రుడవయ్యావు'

క్షత్రియధర్మం దండమే కాని సన్యాసం కాదు" అన్నాడు వ్యాసుడు.

"నీ సోదరులు వనవాసం చేసేప్పుడు చాలా కోరికలు కోరుకున్నారు. వాటిని తీర్చుకోనీ. నహుషుని కుమారుడు యయాతిలా నీవు భూమిని పాలించు. తమ్ముళ్లతో కలిసి ధర్మం, అర్థం, కామ పురుషార్థాలు అనుభవించి ఆ తరువాత వానప్రస్థానికి వెళ్లవచ్చు.

హయగ్రీవుడనే రాజర్షి అనేక యుద్ధాలు చేసాడు. శత్రువులనందరినీ చంపాడు. ఒకసారి దోపిడి దొంగలకు చిక్కగా వాళ్లు అతడిని ఆయుధాలతో చీల్చి చంపారు. అయినా అతడు ప్రజలను రక్షించాడు, ఎన్నో యజ్ఞాలు చేసాడు, చక్కగా రాజ్యపాలన చేసాడు గనుక స్వర్గలోకంలో ఆనందిస్తున్నాడు- వాజిగ్రీవో మోదతే దేవలోకే"

యుధిష్ఠిరుడన్నాడు- "భర్తలను, పుత్రులను పోగొట్టుకుని దుఃఖంతో స్త్రీలందరూ ఏడుస్తూ ఉంటే మహర్షీ నేను శాంతిని పొందలేకున్నాను".

## ధర్మరాజును అనునయించిన వ్యాసుడు

వ్యాసుడన్నాడు-

**న కర్మణ లభ్యతే చింతయావా**
**నా పృష్టి దాతా పురుష స్య కశ్చిత్**
**పర్యాయ యోగాద్విహితం విధాత్రా**
**కాలేన సర్వం లభతే మనుష్యః** (శాంతి. 25-5)

"మానవుడికి దాత ఎవడూ లేడు. విధి విధానం వల్ల కాలానుసారంగా తాను పొందాల్సింది పొందుతాడు. దుఃఖాలతో దుఃఖాలు, సుఖాలతో సుఖాలు పెరుగుతాయి. సుఖదుఃఖాలు మూఢుని చలింపజేస్తాయి. ఈ శరీరం నాది కాదు. ఈ భూమి నాది, అందరిదీ అని భావించేవాడు సుఖంగా బ్రతుకుతాడు.

**దుఃఖమే వాస్తి న సుఖం తస్మాత్తదుపలభ్యతే**
**తృష్ణార్తి ప్రభవం దుఃఖం దుఃఖార్తి ప్రభవం సుఖమ్** (శాంతి. 25-22)

దుఃఖమే ఉంది, సుఖం లేదు. తృష్ణ వల్ల దుఃఖం, దుఃఖనాశనం వలన సుఖం కలుగుతుంది. సుఖదుఃఖాలు, కలిమిలేములు, లాభనష్టాలు, చావుబతుకులు ఇవి ఒకదాని తరువాత ఒకటి అందుతూనే ఉంటాయి. అందుచేత ధీరుడు పొంగిపోనక్కర్లేదు. దుఃఖం వలన క్రుంగిపోనక్కర్లేదు".

యుధిష్ఠిరుడన్నాడు- 'ధనం, రాజ్యం, సంపదలు దుఃఖాన్ని తెస్తాయి. సంతోషమే పరమ సుఖం, స్వర్గం; సంతుష్టిని మించినదేదీ లేదు. మనసా, కర్మణా, వాచా ఎవ్వరైతే ఎవరికీ హాని కలిగించడో అతడు పరబ్రహ్మమౌతాడు. ధనం కాంక్షించేవాడు దానిని విడిచిపెట్టలేడు. లభించిన ధనాన్ని దానం చెయ్యాలి. అలా అని అపాత్ర దానం చెయ్యరాదు. దానధర్మాలెలా ఉన్నా ఈ యుద్ధం వల్ల నాకు మనశ్శాంతి లేకుండా పోయింది.

ఎవరి ఒళ్లో అయితే ఆడుకున్నానో ఆ పితామహుడినే శిఖండిని అడ్డం పెట్టి చంపించాను. ఎవరి వద్ద విద్యలు నేర్చుకున్నానో ఆ గురువును ఏనుగును అడ్డం పెట్టుకుని అసత్యమాడాను. ఎవరినయితే పదమూడేళ్లపాటు నిద్రపోనివ్వని శత్రువుగా భావించానో ఆ కర్ణుడిని రథం క్రుంగినపుడు చంపించాను. లోభంతోనే అభిమన్యుడిని చక్రవ్యూహంలోకి పంపించాను. సమస్త రాజలోకాన్ని చంపించాను. గురు హంతకుడిని, వంశ హంతకుడిని, జన హంతకుడినైన నేను ప్రాయోపవేశం చేస్తాను. ప్రాణాలను శుష్కింపచేసుకుంటాను. అన్నం నీరు ముట్టను" అన్నాడు బంధు శోకంతో విలవిలలాడిపోతూ ధర్మరాజు.

వ్యాసుడన్నాడు- "పుట్టిన జీవులు మరణిస్తాయి. కలయికలు ఎడబాటుకు కారణమవుతాయి. జనన మరణాలతో జీవులు నీటి బుడగల్లా పుట్టి నశిస్తాయి.సంపదలు వినాశంతో, అభివృద్ధులు పతనాలతో జీవితం మరణంతో ముగుస్తుంది.

**సంయోగా విప్రయోగాంతాః జాతానాం ప్రాణినాం ధ్రువమ్**
**బుద్బుదా ఇవ తోయేషు భవంతి న భవంతి చ** (శాంతి. 28-29)

ఒకసారి జనకుడు అశ్మకుని అడిగాడు- 'బంధువులు ధనం లభించినపుడు, పోయినపుడు ఎలా ప్రవర్తించాలి?'. అశ్మకుడన్నాడు- 'రోగం, అగ్ని, జలం, ఆయుధం, ఆకలి, ఆపదలు, విషం, జ్వరం, మరణం, పతనం ఇవన్ని అదృష్టజనకాలు. కొందరు వాటిని దాటి ముక్తులు కాగలరు.

**మాతాపితృ సహస్రాణి పుత్ర దార శతాని చ**
**సంసారేష్వనుభూతాని కస్యతే కస్య వా వయమ్** (శాంతి. 28-38)

ఎన్నో జన్మలు, ఎన్నో కలయికలు, ఎన్నో వియోగాలు, వారెవరు? మనమెవరం? ఎవరూ ఎవరికి ఏమీ కారు.

ఈ సంసారం అనిత్యం, మిత్రులు బంధువులు దారిలో కలిసినవారే. అన్నీ తెలుసును అనుకున్నవారు ఏమీ తెలియదని తెలుసుకుంటారు. వైద్యులకూ రోగాలు వస్తాయి. వాళ్లూ మరణాన్ని దాటలేరు. పోయిన కాలం తిరిగిరాదు' అన్నాడు అశ్మకుడు.

జనకుడు మనశ్శాంతిని పొందాడు. అదేవిధంగా ధర్మరాజా! శోకాన్ని విడిచిపెట్టు! క్షత్రధర్మంతో విజయాన్ని సాధించావు. నీవు పొందిన సంపదలను అనుభవించు"

మనశ్శాంతి లేక దిగులుతో ఉన్న ధర్మరాజాదులను చూసి శ్రీకృష్ణుడన్నాడు- "ఈ జీవితం కలవంటిది.

**స్వప్నలబ్ధా యథా లాభాః వితథాః ప్రతిబోధనే**
**ఏవం తే క్షత్రియా రాజన్ యే వ్యతీతా మహారణే** (శాంతి. 29-9)

కలలో చూసినవన్నీ మెలకువ రాగానే మాయమైనట్లు, మహాయుద్ధంలో మరణించినవారు మరల రారు కదా! మరుత్తుడు, సుహోత్రుడు, అంగరాజైన బృహద్రథుడు, ఉశీనరుని పుత్రుడు శిబి, శకుంతలా దుష్యంతుల పుత్రుడు భరతుడు, దశరథ కుమారుడు శ్రీరామచంద్రుడు, ఆకాశగంగను నేలకు తెచ్చిన భగీరథుడు, మహాత్ముడైన దిలీపుడు, యువనాశ్వుని పుత్రుడు మాంధాత, నహుషుని కుమారుడు యయాతి, నాభాగుని కొడుకు అంబరీషుడు, చిత్రరథుని కొడుకు శశబిందుడు, అమూర్తరయసుని పుత్రుడు గయుడు, సంకృతి కుమారుడు రంతిదేవుడు, అరవై వేలమంది పుత్రులున్న సగరుడు, వేనుని

కొడుకు పృథువు –వీరందరూ షోడశ మహా చక్రవర్తులు. వీరు ఇప్పుడెక్కడున్నారు? పుత్రశోకంతో దుఃఖిస్తున్న సృంజయుడికి నారదుడు చెప్పిన షోడశ మహారాజుల వృత్తాంతమిది" అన్నాడు శ్రీకృష్ణుడు.

యుధిష్ఠిరుడడిగాడు– "సృంజయుడికి పుత్రశోకం ఎలా కలిగింది?''

## సువర్ణష్ఠీవి కథ

శ్రీకృష్ణుడు చెబుతున్నాడు– "నారదుడు, పర్వతుడు మేనమామ, మేనల్లుళ్లు. దేవలోకం నుంచి వచ్చి మానవలోకంలో సంచరిస్తున్నారు. వారిద్దరూ ఒక నియమం ఏర్పరచుకున్నారు. శుభమయినా, అశుభమయినా మనోభావాలు ఒకరితో ఒకరు పంచుకోవాలి. అలా కాకపోతే శాపం అనుభవించాలి" అనుకున్నారు.

ఇద్దరూ శ్వేతుని పుత్రుడైన సృంజయుని వద్దకు వెళ్లి అతడి ఆతిథ్యాన్ని పొందారు. ఆయన కుమార్తె సుకుమారి. ఆమెను మునుల శుశ్రూషకు నియోగించాడు సృంజయుడు.

నారదుడు ఆమెను మోహించాడు. ఆ విషయాన్ని పర్వతుడికి చెప్పలేదు. ఆ విషయం పర్వతుడు గ్రహించి, తమ నియమాన్ని భంగం చేసినందుకు నారదుడిని శపించాడు– 'సుకుమారి నీ భార్య అవుతుంది. పాణిగ్రహణం చేయగానే నీకు కోతిరూపం వస్తుంది'. నారదుడన్నాడు– 'నీకు స్వర్గలోకం వెళ్లే శక్తి నశించును గాక!' ఇద్దరూ తలో దారిన వెళ్లిపోయారు.

సుకుమారిని పాణిగ్రహణం చేయగానే నారదుడికి కోతిరూపం వచ్చింది. అతడి రూపం అంతే అనుకుని ఆమె అతడితో ప్రేమభావంతో చరిస్తున్నది.

పర్వతుడు భూలోకమంతా సంచరిస్తూ ఒకరోజున మరల నారదుడిని కలిసాడు. 'నేను స్వర్గలోకం వెళ్లడానికి అనుమతించు' అన్నాడు పర్వతుడు.

ఇద్దరి మనస్పర్థలు పోయాయి. పరస్పరం శాపాలు తొలగించుకున్నారు. నారదుడి కోతిరూపం పోయింది.

ఇంటికి వచ్చేసరికి సుకుమారి నారదుడిని పరపురుషుడనుకున్నది. పర్వతుడు శాపవృత్తాంతాన్ని వివరించాక ఆమె ఆనందించి తన భర్తను అంగీకరించింది. నారదుడు ఇంటికి వెళ్లాడు సుఖంగా".

ధర్మరాజు అడిగాడు నారదుడిని సంజయుడి పుత్రశోకం గురించి. నారదుడు చెబుతున్నాడు–

"సృంజయుడిని వరం కోరుకొమ్మంటే అతడన్నాడు– 'నాకు పుత్రుడు జన్మించాలి. అయితే ఆ పుత్రుడు ఏది కక్కినా, ఉమ్మినా, మలమూత్రాలు పోసినా, చెమట కారినా అది బంగారం కావాలి' అని కోరుకున్నాడు.

పర్వతుడన్నాడు– 'నీ కోరిక తీరుతుంది కాని అతడు ఆయుష్మంతుడు కాడు'.

సృంజయుడు దుఃఖిస్తుంటే నేనన్నాను– 'విచారించకు నేనున్నాను. సృంజయుడికి మగపిల్లవాడు పుట్టాడు. అతడు కక్కిందంతా బంగారం కావడంతో అతడికి సువర్ణష్ఠీవి అని పేరు వచ్చింది. సృంజయుడు గొప్ప ధనవంతుడయ్యాడు సువర్ణష్ఠీవి కక్కిన బంగారం వల్ల. అతడి మలమూత్రాదులు బంగారమయ్యేవి. దానితో సృంజయుడి నగరమంతా బంగారుమయ మయ్యింది. ఇంద్రుడు అసూయ చెందాడు సృంజయుడు చేస్తున్న యజ్ఞ యాగాదులు, దానధర్మాలను చూసి. ఒకసారి దొంగలు ఎత్తుకుపోయి సువర్ణష్ఠీవి పొట్ట కోసి చంపివేసారు. వాళ్లూ చచ్చిపోయారు. నారదుడు సువర్ణష్ఠీవిని బ్రతికించాడు. ఇంకోసారి ఇంద్రుడు పంపిన వజ్రాయుధం పెద్దపులిగా మారి సువర్ణష్ఠీవిని చంపింది. పుత్రశోకంతో కుములుతున్న సృంజయుడికి షోడశరాజుల కథలను చెప్పి శాంతపరచాను. తరువాత అతడిపై నాకున్న అభిమానం వల్ల సువర్ణష్ఠీవిని ఇంద్రుడి అనుమతితో బ్రతికించాను. సువర్ణష్ఠీవి పూర్ణాయుష్మంతుడై పదకొండు వందల సంవత్సరాలు రాజ్యమేలినాడు" అన్నాడు నారదుడు– "తండ్రి తాతల రాజ్యాన్ని పొందినావు. మహా యజ్ఞాలు చేసి మనశ్శాంతిని, మనోసిద్ధిని పొందు"–

వ్యాసుడన్నాడు– "ప్రజారక్షణ రాజధర్మం.

**ప్రజానాం పాలనం ధర్మః రాజ్ఞాం రాజీవలోచన**
**ధర్మః ప్రమాణం లోకస్య నిత్యం ధర్మానువర్తినః**

లోకానికి ధర్మమే ప్రమాణం. ఆయా కర్మలకు ప్రాయశ్చిత్తాలు ఉన్నాయి. ప్రాయశ్చిత్తాలు చేయి, ప్రాణత్యాగం కాదు.

చేసేది పాపమని తెలిసీ, పాపకృత్యాన్ని కొనసాగిస్తూ, పూర్తిచేసిన వాడికి పాపం చెందుతుంది. నీవు స్వచ్ఛమైన మనసు కలవాడివి. ఇతరుల దోషం వలన ఈ యుద్ధపాపం నీకు వచ్చింది. ఇష్టం లేకుండానే ఈ పని చేసి ఇప్పుడు బాధపడుతున్నావు.

ఇటువంటి యుద్ధాలు జరిగి తీవ్ర జననష్టం కలిగినపుడు దానికి ప్రాయశ్చిత్తంగా అశ్వమేధయాగం నిర్ణయించబడింది. ఇంద్రుడు నూరు యజ్ఞాలు చేసి శతక్రతుడై రాక్షసులను చంపిన పాపాలను పోగొట్టుకున్నాడు. నీవూ అశ్వమేధ యాగం చేసి పాప రహితుడవై వర్ధిల్లు.

అనేక పాపాలకు అనేక ప్రాయశ్చిత్తాలు చెప్పబడినాయి. భక్ష్యాభక్ష్య పాత్రాపాత్ర వివేకంతో ఉండాలి.

ధర్మం పూర్తిగా వినాలనుకుంటే కురుపితామహుడైన భీష్ముని దగ్గరకు వెళ్లు. అతడు అన్ని ధర్మాలు తెలిసినవాడు".

వాసుదేవుడన్నాడు– "అందరికీ ప్రీతి కలిగించేలా ప్రవర్తించు. శోకాన్ని వదిలి కర్తవ్యాన్ని ఆచరించు"

## ధర్మజుడి నగర ప్రవేశం

ఆ విధంగా వ్యాస, నారద, వాసుదేవ, సోదర ప్రేరితుడై మనస్సున శాంతిని పొందిన యుధిష్ఠిరుడు నగర ప్రవేశానికి సిద్ధమైనాడు.

శుభ్రమైన కంబళీలు పరచిన రథమునెక్కాడు ధర్మరాజు. ఆ రథానికి పదహారు తెల్లని ఎద్దులను పూన్చారు. దేవతా పూజ, బ్రాహ్మణపూజ చేసి అందరి ఆశీర్వాదాలు తీసుకుని, ధృతరాష్ట్రుని ముందుంచుకుని తన నగరంలోకి ప్రవేశించాడు ధర్మరాజు. భీముడు పగ్గాలు పట్టుకున్నాడు. తెల్లగొడుగు పట్టుకున్నాడు అర్జునుడు. తెల్లని వింజామరలు పట్టారు నకుల సహదేవులు. ఆ అయిదుగురు పంచభూతాలవలె విలసిల్లినారు. వారి వెనుక తెల్లని రథమెక్కి యుయుత్సుడు, బంగరు రథంలో శ్రీకృష్ణుడు, సాత్యకి అనుసరించారు. ధర్మరాజు రథానికి ముందు నరయానమని మనుషులు లాగే రథంలో ధృతరాష్ట్రుడు, గాంధారి కూర్చున్నారు. కుంతీదేవి, ద్రౌపది మొదలైన కురువంశ స్త్రీలు విదురుడు తమ ముందు రాగా వివిధ వాహనాలలో బయలుదేరారు.

వారి వెనుక ఏనుగులు, రథాలు, పదాతిదళాలు, అశ్వికులు అనుసరించారు. వైతాళికులు, సూతులు, మాగధులూ స్తోత్ర పాఠకులు స్తోత్రాలు చేస్తుండగా హస్తినలోకి యుధిష్ఠిరుడు ప్రవేశించాడు.

నగరమంతా గొప్పగా అలంకరించబడి వినూత్న శోభలతో వెలుగొందుతున్నది. తెల్లని పూలమాలలు, పతాకలతో, ధూపాలు, సువాసనలతో, వివిధ పుష్పాలతో, పూర్ణకుంభాలతో, రాజవీధులు, నగరం అపురూప శోభతో తొణికిసలాడుతున్నవి.

పాండవుల నగర ప్రవేశాన్ని చూస్తున్న ప్రజలతో నగరం చంద్రోదయ సమయంలో పొంగే సముద్రంలా ఉప్పొంగి పోయ్యింది. పాండవులను చూస్తూ ప్రశంసిస్తున్న స్త్రీలతో, ఆబాలగోపాలంతో రాజమార్గంలోని ఇళ్లన్నీ నిండిపోయాయి. వాళ్లు ద్రౌపదీదేవిని ప్రశంసిస్తున్నారు– "నీవలెనే గౌతమ మహర్షి వంశంలో పుట్టిన 'జటిల' మహర్షులకు సేవచేసేది. నీ వ్రతదీక్ష, సేవాకర్మలు అమోఘమైనవి".

అందరి ఆశీర్వాదాల మధ్య రథం నుండి దిగినాడు ధర్మరాజు. బ్రాహ్మణులందరూ వేదమంత్రాలతో ఆశీర్వదించారు. రాజమందిర ద్వారం నుంచి అభ్యంతర మందిరంలోకి వెళ్లారు అందరూ. దుందుభి, శంఖ ధ్వనులు జయజయనాదాలు మనోహరంగా వినిపించాయి.

## చార్వాక వధ

ఆ ధ్వనులు ఆగగానే కపట బ్రాహ్మణ రూపంలో ఉన్న చార్వాకుడనే రాక్షసుడు అన్నాడు–

**కిం తేన స్యాద్ధి కౌంతేయ కృత్వేమం జ్ఞాతి సంక్షయమ్**
**ఘాత యిత్వా గురూంశ్చైవ మృతం శ్రేయోన జీవితమ్** (శాంతి. 38–27)

"చుట్టాలను గురువులను చంపిన నీవు బ్రతకడం కంటే చావడం మంచిది"

ఆ కపట బ్రాహ్మణుడు చార్వాకుడనే రాక్షసుడు దుర్యోధనుని మిత్రుడు. భిక్షుకుని రూపంలో ఉన్నాడు. రుద్రాక్షలు, పిలక ధరించిన త్రిదండి. సిగ్గులేని పొగరుబోతు.

యుధిష్ఠిరుని అందరి ముందూ అభిశంసించాలనుకున్నాడు. "ఇది మా విప్రులందరి మాట. వారి తరపున నేను మాట్లాడుతున్నాను"

అతడి మాటలు వినగానే ధర్మరాజు తెల్లబోయాడు. విప్రులందరూ నిశ్చేష్టులయ్యారు. యుధిష్ఠిరుడన్నాడు–

**ప్రసీదంతు భవంతో మే ప్రణత స్యాభి యాచతః**
**ప్రత్యాసన్నవ్యసనినం న మాం ధిక్కర్తు మర్హథ** (శాంతి. 38–30)

"విప్రులారా! నన్ను అనుగ్రహించండి! దుఃఖితులై ఉన్న నా సోదరుల కోసమే ఈ రాజ్యభారం వహిస్తున్నాను" అన్నాడు ధర్మరాజు.

విప్రులంతా తేరుకుని అన్నారు– "రాజా! ఇది మా మాట కాదు! నీకు శుభం కలుగుగాక!"

అప్పుడు వారంతా క్రోధంతో హుంకరించేసరికి ఆ రాక్షసుడు హతుడయ్యాడు. ఇంద్రుడి వజ్రాయుధానికి మాడిన చెట్టులా అతడు నేలకూలినాడు.

**తతస్తే బ్రాహ్మణాః సర్వే హుంకారైః క్రోధమూర్ఛితాః**
**నిర్భర్త్సయంతః శుచయః నిజఘ్నుః పాపరాక్షసమ్** (శాంతి. 38–35)

అలా చార్వాకుని నశింపచేసి విప్రులంతా రాజ సత్కారాన్ని పొంది, రాజును ఆశీర్వదించి వెళ్లిపోయారు. ధర్మరాజు కూడా సుహృత్ జనులతో కలిసి సంతోషాన్ని పొందినాడు.

## ధర్మజుని పట్టాభిషేకం

కాంతులీనే బంగరు సింహాసనం మీద సంతోషంగా తూర్పుముఖంగా కూర్చున్నాడు ధర్మజుడు. అతడికెదురుగా సాత్యకి, వాసుదేవులు; ధర్మరాజు ఇరుపక్కలా భీమార్జునులు; తెల్లని దంతపు సింహాసనంపై కుంతీదేవి ఆమెకు ఇరుపక్కలా నకుల సహదేవులు, సుధర్ముడు, విదురుడు, ధౌమ్యుడు, ధృతరాష్ట్రుడు, యుయుత్సుడు, సంజయుడు, గాంధారి ధృతరాష్ట్రుని దగ్గర కూర్చున్నారు.

సింహాసనం మీద కూర్చున్న ధర్మరాజు తెల్లని పువ్వులను, స్వస్తికములను, అక్షతలను, భూమిని, మణిని, బంగారాన్ని, వెండిని స్పృశించాడు.

ప్రజలు చాలా వస్తువులు తెచ్చి ధర్మరాజును సందర్శించారు.

పుట్టమట్టి, బంగారం, వివిధ రత్నాలు, అభిషేకం చేసే కలశం, బంగారం, వెండి, రాగి, మట్టితో చేసిన పూర్ణకుంభాలు, పువ్వులు, పేలాలు, దర్భలు, ఆవుపాలు, జమ్మి–పిప్పల–మోదుగ సమిధలు, తేనె, నెయ్యి, మేడి కర్రతో చేసిన స్రువము, స్రుక్కు, బంగారం పొదిగిన శంఖమూ సిద్ధపరచారు.

ఈశాన్య మూల పెరిగిన వేదికపై సర్వతోభద్రమనే ఆసనం మీద ధర్మరాజును, ద్రౌపదిని కూర్చుండబెట్టాడు ధౌమ్యుడు. హోమం చేసాడు.

కృష్ణుడు పూజించబడిన శంఖంతో ధర్మరాజును అభిషేకించాడు. ధృతరాష్ట్రుడు, ప్రజలు ధర్మరాజును అభిషేకించి ఆశీర్వదించారు.

సుజనుల చేత పూజింపబడుతూ ధర్మరాజు మహారాజ్యాన్ని పొందినాడు.

యుధిష్ఠిరుడన్నాడు– "నాకు నా తండ్రి ధృతరాష్ట్రుడే పరమదైవం. ఈ భూమి అంతా అతడిదే! అందరూ అతడి ఆజ్ఞ పాటించాలి"

యుధిష్ఠిరుడు– రాజనీతి విషయాలు చూడడానికి విదురుని, ఆదాయ వ్యయాలు ఆలోచించడానికి సంజయుని, సైనికుల పర్యవేక్షణ, వేతన నిర్వహణకు నకులుని, శత్రుసేనలను అడ్డుకోవడానికి, దుష్ట సంహారానికి అర్జునుని, దైవ కార్య నిర్వహణకు ధౌమ్యుని, తనకు అంగరక్షకుడిగా సహదేవుని, ధృతరాష్ట్రుని బాధ్యతను యుయుత్సునికి అప్పగించాడు.

జ్ఞాతులందరికి శ్రాద్ధక్రియలు ఘనంగా వేదోక్తంగా నిర్వహించాడు.

శ్రీకృష్ణుని వంద నామాలతో స్తుతించి అర్చించాడు.

**విశ్వకర్మన్నమస్తేస్తు విశ్వాత్మన్విశ్వ సంభవ**
**విష్ణో జిష్ణో హరే కృష్ణ వైకుంఠ పురుషోత్తమ** (శాంతి. 43-5)

కృష్ణుడు అత్యంత ప్రీతితో ధర్మరాజును అభినందించాడు.

ధృతరాష్ట్రుడి అనుమతి తీసుకుని దుర్యోధనుడి గృహాన్ని భీముడికి, దుశ్శాసనుడి గృహాన్ని అర్జునుడికి, దుర్మర్షణుడి భవనాన్ని నకులుడికి, దుర్ముఖుని ఇంటిని సహదేవునికి, మిగతా వారికి వారివారి గృహాలనిచ్చాడు.

శ్రీకృష్ణుడు, సాత్యకి అర్జునుడి భవనంలో అతిథులుగా ఉన్నారు. మరుసటి రోజు ఉదయం ధర్మరాజు అర్జునుని భవనానికి వెళ్లాడు శ్రీకృష్ణుని దర్శించడానికి.

ధ్యాననిమగ్నుడై ఉన్న శ్రీకృష్ణుడు ధ్యానసమాధి నుంచి బయటకు వచ్చి యుధిష్ఠిరుడితో అన్నాడు– "భీష్ముడు నన్ను తలచుకున్నాడు. అంపశయ్య మీద ఆ మహాత్ముడు ఆరిపోయే దీపంలా ఉన్నాడు. వ్యాస మహర్షి నీతో అన్నట్లు భీష్ముడి వద్ద రాజనీతిని గ్రహించు. నాతో వచ్చి ఆ మహాత్ముడిని దర్శించు".

దారిలో శ్రీకృష్ణుడు ధర్మరాజుకు పరశురాముడి గురించి చెప్పాడు– "జహ్ను మహర్షి కొడుకు అజుడు. అజుని కుమారుడు బలాకాశ్వుడు. అతడి కొడుకు కుశికుడు. కుశికుడి కుమారుడు గాధి. గాధి కుమార్తె సత్యవతి. భృగు పుత్రుడైన ఋచీకుడు సత్యవతిని పెండ్లాడాడు.

సత్యవతికి, ఆమె తల్లికి సంతానం కోసం రెండు చరువులను ఇచ్చాడు ఋచీకుడు. పొరబాటున సత్యవతి తన తల్లికివ్వాల్సిన చరువును తాను, తన చరువును తల్లికి ఇచ్చింది (ప్రసాదాన్ని చరువు అంటారు).

ఋచీకుడన్నాడు– "నీకు క్షత్రియుడు, నీ తల్లికి బ్రహ్మతేజం గలవాడు పుడతాడు. సత్యవతి దుఃఖిస్తుంటే మన కుమారుడు బ్రాహ్మణుడు, మనమడు క్షత్రియులౌతారు".

సత్యవతి తల్లికి విశ్వామిత్రుడు జన్మించాడు. సత్యవతికి జమదగ్ని పుట్టినాడు. జమదగ్ని-రేణుకల కుమారుడు పరశురాముడు.

పరశురాముడికి హైహయవంశపు కార్తవీర్యార్జునుడికి కలహం కాగా పరశురాముడు కార్తవీర్యార్జునుడిని చంపాడు. కార్తవీర్యుని కుమారులు జమదగ్నిని చంపారు. దానితో కోపించిన పరశురాముడు 21 మార్లు దండెత్తి క్షత్రియవంశ నాశనం చేసి వారి రక్తంతో ఈ మడుగులు నింపినాడు. వీటిని రామహ్రదాలు అంటారు.

భూమిని గెలిచి సమస్త భూమిని కశ్యపునికి దానము ఇచ్చాడు పరశురాముడు. కొద్దోగొప్పో మిగిలిన శత్రువులను చంపుతాడేమోనని పరశురాముడిని దక్షిణ సముద్ర తీరానికి పంపాడు కశ్యపుడు. సముద్రుడు పరశురాముని కోసం శూర్పారక దేశంను నిర్మించాడు. అదే అపరాంతక భూమి. కశ్యపుడికి భూమినివ్వడం వలన భూమి 'కాశ్యపి' అయ్యింది.

రాజులేక జీవలోకం అరాజకమై భూమి క్రుంగింది. క్రుంగిన భూమిని కశ్యపుడు తన తొడపై నిలిపాడు. అందుకని భూమికి ఉర్వి (ఊరువు మీద నిలిచిన భూమి) అనే పేరు వచ్చింది. పరశురాముడు చంపగా మిగిలిన కొందరు రాజులు వీళ్లు. విదూరథుని పుత్రుడిని ఎలుగుబంట్లు రక్షించాయి. పరాశరుడు రక్షించిన సౌదాసుని జ్ఞాతి పేరు సర్వకర్ముడు. అడవిలో ఆవులతో పాటు పెరిగినవాడు శిబి పుత్రుడు గోపతి. ప్రతర్దనుని కొడుకు వత్సుడు గోశాలలో పెరిగాడు. గౌతముడు దివిరథుని పుత్రుడిని రక్షించాడు; బృహద్రథుడిని కోతులు రక్షించాయి; మరుత్తుని కుమారులను సముద్రుడు రక్షించాడు. కొందరు శిల్పకారుల, సువర్ణకారుల ఇళ్లలో పెరిగారు. ఆ క్షత్రియ కుమారులందరిని తెచ్చి కశ్యపుడు రాజులుగా అభిషేకించాడు. ఇప్పుడున్న రాజులందరూ ఆ క్షత్రియ పుత్రుల వారసులు".

ధర్మరాజాదులతో కలిసి శ్రీకృష్ణుడు భీష్ముని దర్శించాడు. తాను తలుచుకోగానే తన వద్దకు వచ్చిన శ్రీకృష్ణుని చూసి సంతోషంతో భీష్ముడు స్తవరాజంతో స్తుతించాడు.

**యధా విష్ణుమయం సత్యం యధా విష్ణుమయం జగత్**
**యధా విష్ణుమయం సర్వం పాప్మామే నశ్యతాం తధా** (శాంతి. 47-97)

తనను స్తుతించిన భీష్ముడితో అన్నాడు కృష్ణుడు- "భీష్మా! నీ జీవితం ఇంకా 25 రోజులు మిగిలి ఉంది. నీవు వెళ్లిపోతే జ్ఞానాలు నశిస్తాయి. జ్ఞాతిశోకంతో ధర్మరాజు వివశుడై ఉన్నాడు. సత్యదీక్ష కలిగిన అతడు శోకంలో మునిగి తరుణోపాయం కోసం నీ వద్దకు వచ్చాడు. తన వల్లనే నీవు అంపశయ్యపై ఉన్నావని తలుస్తూ అతడు నీ ఎదుట పడడానికి భయపడుతున్నాడు. అతడికి ధర్మార్థాలతోనూ, యోగంతో కూడిన సత్యమార్గాన్ని ఉపదేశించు" అన్నాడు శ్రీకృష్ణుడు భీష్ముడితో.

శ్రీకృష్ణుడన్నాడు- "గాంగేయా! నీకు అలసట, మూర్ఛ, ఆకలిదప్పులు, జ్వరం నిన్నంటవు. నీకు నేను దివ్యదృష్టిని ఇస్తున్నాను".

మహర్షులు, ధర్మరాజాదులు భీష్ముని అర్చించి ఆరోజుకు ఎవరిళ్లకు వాళ్లు వెళ్లారు.

మరుసటిరోజు ఉదయం భీష్ముని వద్దకు వచ్చారు. భీష్ముడన్నాడు- "నీ కరుణ వల్ల నాలో అలసట, దాహం, మోహం, శ్రమ, గ్లాని, రోగాలు పూర్తిగా వెళ్లిపోయాయి. జ్ఞానచక్షువు తెరుచుకున్నది.

**యచ్ఛ భూతం భవిష్యచ్చ భవచ్చ పరమద్యుతే**
**తత్సర్వ మనుపశ్యామి పాణౌ షలమివార్పితమ్** (శాంతి. 54-17)

భూత వర్తమాన భవిష్యత్తులు చక్కగా కనిపిస్తున్నాయి. ధర్మరాజు నన్ను ప్రశ్నించును గాక! నీ కీర్తి శాశ్వతంగా నిలవాలని శ్రీకృష్ణుడు నాకిచ్చిన అవకాశం ఫలవంతమగును గాక!"

యుధిష్ఠిరుడడిగాడు- "పితామహా! రాజధర్మములను వివరించుము"

భీష్ముడన్నాడు- "రాజ్యం కాంక్షించేవారికి ప్రజారక్షణను మించిన సనాతన ధర్మం వేరే లేదు.

**తద్రాజ్యే రాజ్యకామానాం నాన్యో ధర్మః సనాతనః**
**ఋతే రక్షాంతు విస్పష్టాం రక్ష్యాలోకస్య ధారిణీ** (శాంతి. 57-42)

ప్రజా రక్షణయే లోకానికి పట్టుగొమ్మ.

ఉత్థానం (ప్రయత్నం) రాజధర్మాలకు మూలం.

ఆదిలో రాజ్యమూ లేదు, రాజూ లేడు. దండం లేదు, దండించేవాడు లేడు. ధర్మమే ప్రజలను రక్షించేది. ప్రజలు ధర్మాన్ని రక్షించేవారు.

కాలం గడిచేసరికి దుఃఖం పెరిగి మోహం, లోభం, కామం, రాగం పెరిగి అకార్యాలతో లోకం అల్లకల్లోలమయ్యింది. దేవతలు బ్రహ్మను ప్రార్థించారు.

బ్రహ్మ లక్ష అధ్యాయాల నీతిశాస్త్రం రచించి దానిలో త్రివర్గమైన ధర్మం, అర్థం, కామం గురించి చెప్పాడు, నాల్గవది మోక్షం. మోక్షాన్నిచ్చే మరో త్రివర్గం- సత్త్వం, రజస్సు, తమస్సు.

దండం వల్ల పుట్టిన త్రివర్గం- స్థానం, వృద్ధి, క్షయం.

నీతివల్ల పుట్టిన షడ్వర్గం- ఆత్మ, దేశం, కాలం, ఉపాయం, కార్యం, సహాయకులు.

నీతిశాస్త్రంలోని విద్యలు- త్రయి, అన్వీక్షకి, వార్త, దండనీతి.

అయిదు ఉపాయాలు- సామ, దాన, భేద, దండ, ఉపేక్ష.

దండం రెండు విధాలు- ప్రకాశం, అప్రకాశం.

ప్రకాశ బలాలు- రధ గజ తురగ కాల్బల విష్టి నౌకా చార దేశిక బలాలు

వ్యసనాలు పది- వేట, జూదం, మద్యపానం, స్త్రీలోలత్వం (ఆ నాలుగూ కామజాలు, కామం వల్ల కలుగుతాయి); వాక్పారుష్యం, కఠోర దండన, శరీరపీడన, పనికిమాలిన వాడికి ఇవ్వడం, ధనం నిష్ప్రయోజనంగా ఖర్చు చేయడం (క్రోధం వల్ల వచ్చేవి క్రోధజాలు).

ఆ విధంగా బ్రహ్మ యుద్ధ ఉపాయాలు, రక్షణా పద్ధతులు, చికిత్సా విధానాలు, సమస్తం లక్ష అధ్యాయాల 'దండనీతి'గా రచించగా, మొదట శంకరుడు గ్రహించి, సంగ్రహించి 10,000 అధ్యాయాల వైశాలాక్షంగా వ్రాసాడు. వైశాలాక్షాన్ని ఇంద్రుడు 5000 అధ్యాయాల 'బాహుదంతకం'గా సంక్షేపించాడు. శుక్రుడు దానిని 1000 అధ్యాయాల 'శుక్రనీతి'గా సంగ్రహం చేసాడు.

మానవులకొక అధిపతిని నిర్ణయించి నారాయణుడు విరజుడనే మానసపుత్రుడిని సృజించాడు. విరజుడు అతడి పుత్రుడు కీర్తిమంతుడు, అతడి కొడుకు కర్దముడు అందరూ తపస్సుకే ఇష్టపడ్డారు. కర్దముడి కుమారుడు అనంగుడు దండనీతి విశారదుడైనాడు.

మృత్యువు కుమార్తె సునీథ. ఆమె కుమారుడు వేనుడు. వేనుడిని మహర్షులు చంపి కుడి తొడను మధించగ నిషాదుడు పుట్టాడు. అతడి వంశస్థులు నిషాదులు, మ్లేచ్ఛులు.

వేనుడి కుడిచేతి నుంచి వైన్యుడు (పృథువు జన్మించాడు. అతడు భూమి, పర్వతాలను లేవనెత్తినాడు. ఎత్తుపల్లాలను సర్దినాడు. అందుకే భూమి 'పృథ్వి' అయ్యింది. పృథు మహరాజు తపస్సు చేయగా విష్ణువు అతడిలో ప్రవేశించాడు. దానితో దేవతలు కూడా పృథు చక్రవర్తికి నమస్కరించారు.

విష్ణువు నుదుటి నుంచి పుట్టిన బంగరు కమలంలో లక్ష్మీదేవి జన్మించి ధర్మానికి పత్ని అయ్యింది. ధర్మం వల్ల లక్ష్మికి అర్థం పుట్టింది. పృథువు రాజ్యంలో ధర్మం, అర్థం, లక్ష్మి పుట్టాయి. పుణ్యాత్ముడు దివి నుండి భువికి దిగివచ్చినవాడు దండనీతిలో పండితుడవుతాడు. విష్ణు మహిమతో కూడి 'రాజు' అవుతాడు. అందుకే దేవతలు, రాజులు సమానులంటారు.

బ్రాహ్మణుడికి స్వాధ్యాయం, క్షత్రియునకు ప్రజారక్షణ, వైశ్యునకు గోరక్షణ, శూద్రునకు శుశ్రూష (పై వర్ణాలకు) ముఖ్య ధర్మాలు. అందరికి ఉండాల్సినవి దశవర్గాలు- ధైర్యం, ఓర్పు, ఇంద్రియ నిగ్రహం, పరధనం ఆశించకపోవడం, ఆచారం, మనోనిగ్రహం, జ్ఞానం, విద్యార్జన, సత్యవచనం, కోపాన్ని విడనాడడం.

రాజధర్మం అనేది నావ. ధర్మమనేది సముద్రం. సత్త్వగుణం దానిని నడిపించే బలం. ధర్మశాస్త్రం దాని లంగరు లేదా కట్టుత్రాడు. త్యాగమనే గాలి ప్రేరణతో అది వేగంగా వెడ్తుంది, రాజును తరింపచేస్తుంది.

మానవులు వనాల్లోనూ, ఆశ్రమాల్లోనూ ఉండి సాధించే ఫలితం కన్నా వందరెట్ల ఫలితాన్ని రాజు ప్రజారక్షణ ధర్మం పాటించి పొందుతాడు.

రాజులేని కాలంలో ప్రజలు ఒకరినొకరు చేపల్లా- చిన్న చేపను పెద్దచేప మ్రింగినట్లు మ్రింగివేసారు. అందుకని అందరూ బ్రహ్మను అడిగారు- 'రాజు'ను ఇమ్మని. మనువు ఒప్పుకోలేదు. ప్రజలప్పుడు- ఏబది పశువులకు ఒకటి, బంగారంలో కూడా ఏబది వంతు, ధాన్యంలో పదోభాగం, వివాహానికి సిద్ధంగా ఉన్న కన్యలలో ఒక దానిని, ధర్మఫలంలో నాలుగవ భాగాన్ని ఇస్తామన్నారు. అతడు రాజయ్యాడు.

**రాజా భోజో విరాట్సామ్రాట్ క్షత్రియో భూపతిర్నృపః**
**య ఏభిః స్తూయతే శబ్దైః కస్తం నార్చితు మర్హతి** (శాంతి. 68-54)

భోజుడు, విరాట్టు, సమ్రాట్టు, క్షత్రియుడు, నృపతి, భూపతి ఈ పదాలతో పిలువబడుతూ రాజు ప్రజారక్షణ చేస్తాడు. ఈ విషయాన్ని వసుమానుడికి అంగిరసుడు చెప్పాడు.

ప్రజల నుండి ఆరవభాగం మాత్రమే పన్ను గ్రహించాలి. దానిని ప్రజల రక్షణ కోసమే వినియోగించాలి.

మత్తులు, ఉన్మత్తులు, దస్యులు, తస్కరులు, ప్రతారకులు, శఠులు, లంపటులు, జూదరులు, కృత్రిమ లేఖకులు, లంచగొండులు వీరిని దండించాలి.

రాజు ఏడింటిని రక్షించుకోవాలి- తాను, మంత్రులు, కోశాగారం, దండం, మిత్రులు, జానపదులు, పురం.

షాడ్గుణ్యం (సంధి, దండయాత్ర, వైరం, ద్వైధీభావం, ఇతర రాజులతో స్నేహం, యాత్రను ప్రకటించడం); త్రివర్గం- క్షయం, స్థానం, వృద్ధి. త్రివర్గపరమం- ధర్మం, అర్థం, కామం - ఇవి తెలిసిన రాజు చిరకాలం భూమిని పాలిస్తాడు.

**షట్ పంచ చ వినిర్జిత్య దశ చాష్టౌ చ భూపతిః**
**త్రివర్గైర్దశ భిర్యుక్తః సురైరపి న జీయతే** (శాంతి. 69-74)

షడ్వర్గాలు (కామ క్రోధ లోభ మద మోహ మాత్సర్యాలు); పంచవర్గం (పంచేంద్రియాలు); దశ దోషాలు (వేట, జూదం, పగటి నిద్ర, పరనింద, స్త్రీలోలత్వం, మద్యం, నాట్యం, గానం, వాదిత్రం, వ్యర్థంగా తిరగడం) -వీటిని జయించి, దశవర్గ జ్ఞానం కలిగిన రాజు అజేయుడు.

పురూరవుడు-వాయువు సంవాదం ప్రకారం బ్రహ్మ ముఖం నుంచి పుట్టిన బ్రాహ్మణుడు ధర్మాన్ని రక్షించడానికి, భుజాల నుంచి పుట్టిన క్షత్రియుడు ప్రజా సంరక్షణకు, తొడల నుంచి పుట్టిన వైశ్యుడు మూడు వర్ణాల పోషణకు, పాదాల నుంచి పుట్టిన శూద్రుడు మూడు వర్ణాల పరిచర్యకు నియమించబడినారు.

ఈ భూమి బ్రాహ్మణునిది. పతిలేని స్త్రీ దేవరుని చేసుకున్నట్లు భూమి క్షత్రియుని భూపతిగా చేసుకుంటుంది.

ఐల కశ్యపుల సంవాదం ప్రకారం బ్రాహ్మణ క్షత్రియులు పరస్పరం కలహించుకుంటే క్షత్రియుని రాజ్యం ఛిన్నాభిన్న మవుతుంది. వీరిద్దరూ పరస్పర ఆధారితులు.

రాజుకు ఇతరులందరికీ రాజపురోహితుడు స్వామి. రాష్ట్రం యొక్క యోగక్షేమాలు రాజు అధీనంలో ఉండగా, రాజు యొక్క యోగక్షేమాలు పురోహితుని అధీనంలో ఉంటాయి. క్షత్రియ ధర్మాన్ని ఆచరించి వసిష్ఠుడు పురోహితుడిగా పాలించిన ముచుకుందుడు కుబేరుని నిగ్రహించగలిగాడు.

కేకయ మహరాజును బంధించి ఓ రాక్షసుడు అన్నాడు- "గో బ్రాహ్మణులను ప్రజలను రక్షించే రాజును రాక్షసులే ఏమీ చెయ్యలేరు".

రాజులకు మిత్రులు- సహోర్దుడు, భజమానుడు, సహజుడు, కృత్రిముడు, అయిదవవాడు ధర్మాత్ముడు.

ఆపదలు రెండు రకాలు- బాహ్యము, అభ్యంతరము. అవి స్వయంకృతాలు కావచ్చు అన్యకృతాలు కావచ్చు. కొన్నిటిని మెత్తగా హృదయాన్ని చీల్చే, ఇనుముతో చేయని శస్త్రంతో నచ్చనివారి నాలుకలను పీకి, తరువాత నోరు మూసి, ప్రేమను ప్రకటించాలి. శక్తికొద్ది అన్నం పెట్టడం, కష్టాలు సహించడం (తితీక్ష), ఆర్జవం, మన్నన -ఇవి ఇనుముతో చేయని మెత్తని కత్తులు.

రాజధనాన్ని వృద్ధి చేసేవాడిని ఆదరించాలి, అపహరించే వాడిని శిక్షించాలి. కోసల రాజ్యానికి రాజు క్షేమదర్శి. అతడి దగ్గరకు కాలకవృక్షీయముని ఒక కాకిని పంజరంలో పెట్టి ఇచ్చి- ఇది దొంగల గురించి చెబుతుంది. ముఖ్యంగా కోశాగారాన్ని దొంగిలించేవారిని -అన్నాడు.

ఆ రాత్రే కొందరు కాకిని చంపేసారు. కాలకవృక్షీయుడు రాజును కలిసి అన్నాడు- ఆ కాకిలో ఏ గొప్పతనమూ లేదు. అది మామూలు కాకి. దానిని చంపినవారు కోశాగారపు దొంగలు. వారిని ఒక్కరొక్కరిని విడదీసి చంపు. నీ కోశాగారం సమృద్ధిగా ఉంటుంది.

రాజు అట్లాగే చేసాడు. కాలకవృక్షీయుడి సలహాలు పాటిస్తూ రాజ్యాన్ని సుభిక్షంగా పాలించాడు క్షేమదర్శి.

బృహస్పతి ఇంద్రుడితో అన్నాడు- "దండనీతితో వ్యవహరించేప్పుడు మాటలు మృదువుగా ఉండాలి. ముఖం ప్రసన్నంగా ఉండాలి".

రాజు విద్యావంతులైన బ్రాహ్మణులు నలుగురు, ఆయుధ విద్యలలో ఆరితేరిన క్షత్రియులు ఎనిమిదిమంది, ధనవంతులైన వైశ్యులు ఇరవై ఒక్కరు, వినయం, శ్రద్ధ కల శూద్రులు ముగ్గురుని మంత్రులుగా నియమించుకోవాలి. శు శ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహ, అపోహ, విజ్ఞానం, తత్త్వజ్ఞానం అనే ఎనిమిది గుణాలు కల సూతుడు పౌరాణికుడిగా ఉండాలి. రాజు మంత్రాలోచనను ఎనమండుగురు (నలుగురు బ్రాహ్మణులు, ముగ్గురు శూద్రులు, సూతుడు) మంత్రులతోనే చెయ్యాలి.

రాజు ఇతరులకు నమ్మకం కలిగేట్లు ప్రవర్తించాలి. తాను ఎవ్వరినీ నమ్మరాదు. కన్నకొడుకులను కూడా!

దుర్గాలు ఆరువిధాలు- ధన్వ, మహి, గిరి, మనుష్య, జల, వన. ధన్వదుర్గం అంటే భూదుర్గం -అన్ని వసతులతో ఉండాలి.

గ్రామాలకు గ్రామికుడు, పది గ్రామాలకు దశపాలుడు, ఇరవై గ్రామాలకు వింశతుడు, నూరు గ్రామాలకు శతాధ్యక్షుడు, వేయి గ్రామాలకు సహస్రపాలుడు; వారిని మంత్రి, రాజు పర్యవేక్షించాలి.

రాజు కోశమును వృద్ధిపరచుకోవాలి. జలగ లాగా మృదువుగా ధనం పీల్చాలి, సూదిపళ్లతో చుంచు కొరికినట్లు, ఆడుపులి తన పిల్లలను నోట కరుచుకున్నట్లు మృదువుగా వ్యవహరించాలి.

## ఉతథ్య గీత

మాంధాతతో ఉతథ్యుడన్నాడు- ధర్మం పత్ని అర్థం. అధర్మం ఆచరిస్తే లక్ష్మి తొలగిపోతుంది. బలి అధర్మంగా ప్రవర్తించగానే సిరి దేవేంద్రుని చేరింది. ధర్మం కోసమే రాజు ఉన్నాడు. ఎవనిలో ధర్మం విరాజిల్లుతుందో అతడే రాజు. ధర్మాన్ని కనబడకుండా చేసేవాడు వృషలుడు. వృషః అంటే భగవానుడయిన ధర్ముడు. కనపడకుండా ధర్మం ఆచరిస్తాడు. అర్థ కామాల కన్నా ధర్మం మేలైనది. ధర్మాత్ముడు ఇహపర లోకాల్లో సుఖిస్తాడు.

## వామదేవ గీత

వసుమనుడనే రాజుకు వామదేవుడనే మహర్షి చెబుతున్నాడు- ధర్మాన్నే అనుసరించు, ధర్మాన్ని మించినది ఏదీ లేదు. ధర్మాన్ని ఆచరించిన రాజులు ఈ భూమిని జయిస్తారు.

**మరణాంతమిదం సర్వం నేహకించిదనామయమ్**
**తస్మాద్ధర్మే స్థితో రాజా ప్రజా ధర్మేణ పాలయేత్** (శాంతి. 93-23)

ఈ జగత్తులో సర్వం నశించిపోయేదే. ఇక్కడ రోగం లేనిది కాని, శాశ్వతమైనది కాని ఏదీలేదు. కనుక రాజు ధర్మపరుడై ధర్మబద్ధంగా ప్రజలను పరిపాలించాలి.

యుద్ధం వల్ల కలిగే విజయం అధమం.

నహుష పుత్రుడైన యయాతి ప్రభువు మానవుల కోసం చెప్పిన 'రాజోపనిషత్' సారాంశమది.

తన కర్తవ్యాన్ని పూర్తి చేసిన తరువాతనే సుఖాలను అనుభవించే రాజును ఇతరులు పరాభవించరు.

## విజిగీషమాణ వృత్తము

ఒక రాజు ఇంకో రాజును జయించాలనుకున్నప్పుడు వర్తమానం పంపాలి. కప్పం కట్టండి లేదా యుద్ధానికి సిద్ధం కండి. అదీ ధర్మబద్ధంగానే. ధర్మబద్ధంగా చేసే యుద్ధంలో పాటించాల్సిన నియమాలను పాటించాలి. అది అందరూ ఒప్పుకునే విజయమవుతుంది -అని స్వయంభువ మనువు చెప్పాడు.

విషం పూసిన ఆయుధాలు వాడరాదు. ప్రాణం లేని వానిని చంపరాదు. సంతాన హీనుని చంపరాదు. ఆయుధం విరిగిపోయిన వానిని, వాహనాలు చెడిపోయినవానిని, గాయపడిన వానిని చంపరాదు. తనను ఆశ్రయం కోరిన వానిని చంపరాదు. అధర్మంగా గెలిచిన రాజు తనను తాను నాశనం చేసుకుంటాడు. శరణాగత రక్షణం ఆవశ్యకం. పరాజితుడైన వాడికి ఏడాది అవకాశం ఇవ్వాలి. అపహరించిన కన్యను, ధనాన్ని ఏడాది తరువాత స్వంతదారులు అడిగితే పంపాలి.

ప్రతర్ధనుడు గెలిచి ధనాన్ని, ఔషధులను తెచ్చుకున్నాడు.

నాభాగుడు గెలిచి సంపదలను దానమిచ్చినాడు.

దివోదాసు గెలిచి అగ్నిహోత్రాన్ని, హవిస్సును, భోజనాన్ని తెచ్చుకోవడంతో తిరస్కృతుడైనాడు.

మంచం పట్టి మరణించడం క్షత్రియునికి అధర్మం. పాపులను శిక్షించడం, సజ్జన సాధువులను రక్షించడం, యజ్ఞాలు దానాలు చేయడం ద్వారా రాజులు పాప విముక్తులౌతారు.

## ఇంద్ర-అంబరీష సంవాదం

అంబరీషుడు స్వర్గలోకానికి వెళ్లినపుడు తనకన్న ఉచ్ఛస్థితిలో ఉన్న తన మంత్రి సుదేవుడిని చూసి కారణమడిగాడు ఇంద్రుడిని.

ఇంద్రుడన్నాడు- నీవు దేవతలకు మేలు చేయగోరి అశ్వమేధ యాగం చేయగోరినపుడు నీ యాగాన్ని ఆపడానికి ముగ్గురు రాక్షసులు వచ్చి నీ నగరాన్ని చుట్టుముట్టితే సుదేవుడిని పంపావు రాక్షసులను జయించకుండా తిరిగి రావద్దని. అది నీ మంత్రులిచ్చిన చెడు సలహా. అయితే సుదేవుడు రణరంగానికి వెళ్లి రాక్షస సైన్యాన్ని చూసి వారిని జయించడం అసాధ్యమని గ్రహించి రుద్రుని ప్రార్థించి బలిగా తన తల నరుక్కోబోగా, రుద్రుడు కరుణించి దివ్యరథాన్ని, అస్త్రాలను ఇచ్చి -ఎట్టి పరిస్థితుల్లో రథం విడిచి కాలు నేలమీద మోపకు- అన్నాడు. సుదేవుడు రాక్షసులందరినీ చంపాడు. వియముడనే రాక్షసుడు బాహుయుద్ధానికి రమ్మన్నాడు. రుద్రుడి సలహా మరచి సుదేవుడు నేలపై దిగి వియముడితో యుద్ధం చేయగా ఇద్దరూ చనిపోయారు. సంగ్రామ యజ్ఞం చేసి ప్రాణాలు అర్పించిన సుదేవుడు ఉన్నత స్వర్గానికి అర్హుడైనాడు.

## సేనానీతి

చైత్రంలో గాని, మార్గశీర్షంలో గాని పూర్ణిమా తిథినాడు యుద్ధానికి బయల్దేరడం శుభప్రదం. వాయువు వీచే దిక్కు నుండి, సూర్యుడున్న దిక్కు నుండి, శుక్రుడున్న దిక్కు నుండి జయం లభిస్తుంది. శుక్రుడికన్న సూర్యుడు, సూర్యుని కన్న వాయువు బలమైనవి.

బురద, రాళ్లు లేక సమతలంగా ఉన్న చోటున యుద్ధం చెయ్యాలి. వానలేని రోజుల్లో రథాలు, గుర్రాలసేన; వానాకాలంలో కాల్బలం, గజసేన బాగా యుద్ధం చేయగలవు.

విభిన్న దేశ యోధులను బట్టి, వారి సేనలను బట్టి యుద్ధరంగపు స్థితిగతులను బట్టి యుద్ధవ్యూహం నిర్ణయించుకోవాలి.

సామ దాన భేద దండోపాయాలలో ఆఖరిది దండోపాయం. ఇది ఇరుపక్షాలలో నష్టం తెస్తుంది.

శత్రువును జయించి, ఆ తరువాత క్షమించే రాజుకు కీర్తి పెరుగుతుంది. క్షమ సత్పురుషుల లక్షణం.

శత్రువును బాధించి దుర్బలునిగా చేసి ఆపై క్షమించడం మంచిదని శంబరాసురుని అభిప్రాయం.

**మార్దవం దండ ఆలస్యం ప్రమాదశ్చ సురోత్తమ**
**మాయాః సువితాః శక్ర సాయదంత్య విచక్షణమ్** (శాంతి. 103-24)

శత్రువులు పన్నే మాయలు పట్టించుకోకుండా ఏమరుపాటుతో ఉండే రాజు చిక్కుల్లో పడతాడు -అని బృహస్పతి ఇంద్రుడితో అన్నాడు.

కోసల రాజైన క్షేమదర్శి, విదేహరాజుతో యుద్ధంలో ఓడి రాజ్యాన్ని పోగొట్టుకుని తన తండ్రి స్నేహితుడైన రాజర్షి కాలకవృక్షీయుని వద్దకు వెళ్లాడు. కాలకవృక్షీయుని సలహా విని విదేహరాజు క్షేమదర్శిని ఆదరించాడు. అతడి గుణగణాలు, వినయం నచ్చటంతో తన కుమార్తెనిచ్చి పెళ్లిచేసాడు. ఇరు దేశాల సుఖశాంతులతో వర్ధిల్లాయి. ఓడిపోయినంత మాత్రాన రాజు ధైర్యాన్ని కోల్పోక రాజు క్షాత్రధర్మంతోనే జీవించాలి.

తల్లిదండ్రులను, గురువును పూజించాలి. ఆదుకోవాలి. తల్లిదండ్రులను ఆదుకోనివాడు భ్రూణహత్య చేసినవాడితో సమానం. మిత్రద్రోహి, కృతఘ్నుడు, స్త్రీహత్య చేసినవాడు, గురు హంతకుడు -ఈ నలుగురికి ప్రాయశ్చిత్తం లేదు.

**యస్మిన్యథా వర్తతే యో మనుష్యః**
**తస్మింస్తథా వర్తితవ్యం స ధర్మః**
**మాయాచారో మాయయా బాధితవ్యః**
**సాధ్వాచారః సాధునా ప్రత్యుపేయః** (శాంతి. 109-30)

ఒక వ్యక్తి ఎవరిపట్ల ఎలా ప్రవర్తిస్తాడో అతడి పట్ల అలా ప్రవర్తించడమే ధర్మం. మాయకు మాయ, మంచితనానికి మంచితనం మేలైనది.

దుర్గాణ్యతి తరంతితే (దుర్గాతి తరణము)– జీవులు తాము పడే బాధలను దాటడానికి, దుఃఖ నివారణకు కొన్ని మార్గాలున్నాయి. ఆశ్రమ నియమాలను పాటించడం, ఇంద్రియ నిగ్రహం, నియమబద్ధమైన నడవడిక, అహింసా ప్రవర్తనులు, సత్యశీలురు, స్వాధ్యాయనులు, తల్లిదండ్రులను సేవించేవారు, మనసా వాచా కర్మణా పాపం చేయనివారు, ప్రజారక్షణ చేసే రాజులు, మంచిపనులు చేసేవారు, క్రోధాన్ని దూరంగా ఉంచేవారు, నారాయణుని యందు భక్తిభావంతో మెలిగేవారు దుఃఖం నుంచి బయటపడతారు.

## పులి-నక్క (వ్యాఘ్ర-గోమాయు సంవాదం)

పురిక అనే పట్టణాన్ని పాలించిన పౌరికుడను రాజు అనేక హింసాత్మకమైన దుష్టకార్యాలు చేసి ఆయువు తీరినాక నక్కగా పుట్టాడు. పూర్వజన్మ జ్ఞానం ఉండడంతో హింసను మాని, చెట్ల నుండి రాలిన పళ్లను తింటూ వ్రతం చేస్తున్నాడు. స్మశానంలో జీవిస్తున్నాడు. మిగతా నక్కలు గొడవ పెట్టాయి– నీవు నక్కవు. నీ జాతి ఆచారాలు పాటించు. ఈ వైరాగ్యం వదులు.

నక్క అన్నది– సదాచారాలతోనే కులం కీర్తి పెరుగుతుంది. కర్మ ప్రధానం. ఎక్కడ ఉంటున్నామనేది ముఖ్యం కాదు.

నక్క గురించి విని ఆ అడవిలోని మృగరాజైన వ్యాఘ్రం అతడిని మంత్రిగా చేసుకోవాలనుకున్నది. నక్క అన్నది– రాజు దగ్గర పదవి ఇతరులలో అసూయను కలిగిస్తుంది. నేను చెప్పే హితోక్తులను వినాలి. తొందరపడి దండనలు విధించవద్దు–

మంత్రిగా నక్క అనేక మంచిపనులు చేసేసరికి పూర్వపు సేవకులకు కంటగింపుగా మారింది. వారి స్వార్థపు పనులకు అడ్డుతగలడంతో నక్కను తొలగించాలనుకుని అవి మృగరాజుకు తెచ్చిన మాంసాన్ని నక్క ఇంటిలో దాచాయి. మృగరాజు పంపిన సైనికులకు ఆహారం నక్క ఇంటిలో దొరికింది.

నక్కను వధించమని మృగరాజు ఆజ్ఞాపించగా, రాజమాత తన కుమారుడిని వారించింది. కాస్త నింపాదిగా శోధించగా అసలు దొంగలు దొరికారు. మృగరాజు పశ్చాత్తాపపడి నక్కను ఎన్నో విధాల సత్కరించింది. అయినా నక్క మృగరాజును విడిచి అడవికి పోయి ప్రాయోపవేశం చేసి శరీరాన్ని విడిచి స్వర్గాన్ని పొందింది.

**దుఃఖేన శ్లిష్యతే భిన్నం శ్లిష్టం దుఃఖేన భిద్యతే**
**భిన్నా శ్లిష్టా తు యా ప్రీతిః నసా స్నేహేన వర్తతే** (శాంతి. 111-85)

భిన్నమైన ప్రేమబంధం అతికష్టం మీద అతుక్కుంటుంది. విడిపోవడం కూడా కష్టమే. విడిపోతూ కలుస్తూ ఉండే ప్రేమలో స్నేహమెక్కడుంటుంది? –అన్నది మృగరాజుతో నక్క అడవికి వెళ్లిపోతూ.

## ఒంటె మెడ కథ

యుధిష్ఠిరుడడిగాడు– “రాజు సుఖంగా ఉండే మార్గమేది?”

భీష్ముడన్నాడు– “సత్యయుగంలో ఓ పెద్ద ఒంటె ఉండేది. అది గొప్ప తపస్సు చేస్తే బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకొమ్మంటే– నా మెడ నేను కోరుకున్నంత పొడవు కావాలి –అని కోరుకున్నది.

మెడ పొడుగ్గా ఉంది కనుక అది ఉన్న చోటునుంచి కదలకుండా దూర దూరంగా ఉన్న చెట్లను తింటూ సోమరిగా ఉండగా ఒకరోజున పెద్ద గాలివాన వచ్చింది. దానితో ఒంటె తన తల, మెడను ఒక గుహలో పెట్టింది. ఆ గుహలో ఆకలితో ఉన్న నక్కలు ఒంటె మెడను కొరికి తినడం మొదలెట్టాయి. ఒంటె మెడను లాక్కోబోయేసరికే మెడనరం కొరికాయి నక్కలు. రక్తం కారి చనిపోయింది ఒంటె. సోమరితనం ఒంటెకు అపాయం తెచ్చిపెట్టింది. అందుచేత ధర్మరాజా పనులు చేసేప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

**బుద్ధి శ్రేష్ఠాని కర్మాణి బాహుమధ్యాని భారత**
**తాని జంఘా జఘన్యాని భారప్రత్య వరాణిచ** (శాంతి. 112-18)

బుద్ధితో ఆలోచించి చేసే పనులు ఉత్తమమైనవి.

రాజు చక్కని మంత్రాంగంతో మంచిపనులు చేస్తూ ప్రజారక్షణకు పాటుపడితే ప్రజలూ సుఖిస్తారు, రాజూ సుఖిస్తాడు.

## సరిత్సాగర సంవాదం

భీష్ముడు చెబుతున్నాడు– ఒకరోజున సముద్రుడు నదులనడిగాడు– మీ ప్రవాహ వేగానికి పెద్దపెద్ద చెట్లు కూలి పోతున్నాయి. కాని వేతస వృక్షమైన ప్రబ్బలిచెట్టు అంత బలహీనంగా ఉన్నా తట్టుకోగలుగుతున్నదెలా?

గంగానది అన్నది– తలవంచని చెట్లు పెల్లగించబడతాయి. ప్రబ్బలి చెట్టు నదీ వేగానికి తలవంచి, వేగం తగ్గాక నిలబడుతుంది.

రాజు కూడా తన బలం తాను తెలుసుకుని మెలగాలి.

కొందరు నేర్పుగా మెత్తని సూటిపోటి మాటలతో ఇతరులను నిందిస్తారు. అటువంటి వాడిని ఉపేక్షించాలి.

**టిట్టిభం తముపేక్షేత వాశమానమి వాతురమ్**
**లోకవిద్వేష మాపన్నః నిష్ఫలం ప్రతిపద్యతే** (శాంతి. 114–4)

ఇతరులను నిందిస్తూ అతడు తనను తాను పొగుడుకుంటాడు. వాడు మానవ శరీరంలో ఉండే తోడేలు, పిచ్చికుక్క లాంటివాడు. వాడిని త్యజించడం మంచిది.

రాజు తన సహాయకులుగా విశ్వాసపాత్రులైన కులీనులను ఎన్నుకోవాలి. లేకుంటే ఋషి దగ్గర పెరిగిన కుక్క వ్యవహారమవుతుంది.

## ఋషి శ్వాన సంవాదం

తన దగ్గర ఎంతోకాలంగా ఉంటున్న కుక్కపై మమకారం ఏర్పడింది మునికి. ఒకరోజు దానిని ఓ చిరుతపులి చూసి దానిని పట్టుకోబోయేసరికి అది భయపడి ముని శరణుజొచ్చింది. ముని కరుణతో కుక్కను చిరుతపులిగా చేసాడు. ఈ భీకరమైన చిరుతపులిని చూసి ఆ చిరుత పారిపోయింది. అప్పటి నుంచి చిరుతపులిగా మారిన కుక్క అడవిలో నిర్భయంగా తిరుగుతున్నది. ఓరోజు పెద్దపులి ఒకటి ఈ చిరుతపులిని వెంబడిస్తే ముని దీనిని పెద్దపులిగా మార్చాడు. ఈసారి ఈ పెద్దపులిని మదగజం తరిమింది. ముని ఈ పెద్దపులిని మహా మదగజంగా మార్చాడు. మదగజంగా తిరుగుతున్నపుడు దానిని సింహం చూసి గర్జించింది. ముని ఈ మదగజాన్ని సింహంగా మార్చాడు. ఈ సింహాన్ని ఎనిమిది కాళ్ల శరభం చూసింది. ముని ఈ సింహాన్ని శరభంగా మార్చాడు. కుక్క నుంచి శరభంగా మారిన కుక్క అనుకున్నది– 'ఈ ముని దయామయుడు. రేపింకెవరినైనా నన్ను మించిన గరుత్మంతుడిగా చేస్తే నా శరభత్వానికి కీడు వస్తుంది. ఈ మునిని చంపేస్తా!' అనుకుని మునివేపు వస్తుండగా దాని ఆలోచనను గమనించి ముని దానిని కుక్కగా మార్చేసాడు.

రాజు కూడా తనకు విశ్వాసపాత్రులైన వారిని, శూరులు, ప్రాజ్ఞులు, పండితులు, కులీనులు అయినవారిని తనకు సహాయకులుగా, సేవకులుగా నియమించుకుంటే భూమినంతటిని జయించడానికి సాధ్యమవుతుంది.

**యథా క్రమేణ పుష్పేభ్యః చినోతి మధు షట్ పదః**
**తథా ద్రవ్యము పాదాయ రాజా కుర్వీత సంచయమ్** (శాంతి. 120–34)

తుమ్మెద తేనెను సంగ్రహించినట్లు రాజు ప్రజల నుంచి ధనాన్ని సేకరించాలి.

## దండనీతి (మనువు చెప్పిన ప్రాగ్వచనం)

**దండోహి భగవాన్విష్ణుః దండో నారాయణః ప్రభుః**
**శశ్వద్రూపం మహద్బిభ్రన్ మహాన్పురుష ఉచ్యతే** (శాంతి. 121–23)

దండం నారాయణ స్వరూపం. దండనీతి బ్రహ్మకుమార్తె. ఈమెకు లక్ష్మి, వృత్తి, సరస్వతి, జగద్ధాత్రి అనే పేర్లున్నాయి. అగ్నివలె తేజోరూపం, నల్లకలువ నలుపు, నాలుగు దంతాలు, నాలుగు భుజాలు, ఎనిమిది పాదాలు, అనేక నయనాలు, శంకువులా చెవులు, నిక్కపొడుచుకున్న రోమాలు, శిరసుపై జటలు, రెండు నాలుకలు, ముఖం రాగిరంగు, వ్యాఘ్రచర్మ శరీరం, కత్తి విల్లు గద శక్తి త్రిశూలం ముద్గరం బాణం ముసలం పరశువు చక్రం పాశం దండం ఋష్టితోమరం –ఇంకా అనేక ఆయుధాలు. వీటన్నిటిలోనూ దండం ఉంటుంది.

న్యాయమూర్తి పేరున 'భర్తృప్రత్యాయ' లక్షణంగా, వేద ప్రతిపాదిత దోషాలను ఆచరించేవారిపై 'వేదప్రత్యయ' లక్షణంగా, కులాచారాలను భంగపరచేవారిపై 'మౌలం'గా దండనీతి మూడు విధాలుగా వ్యవహరించబడుతుంది.

## దండోత్పత్తి క్షత్రియులకు పరంపరాగతమగుట

అంగదేశపు రాజు వసుహోముడు ముంజపృష్ఠ తీర్థానికి వెళ్లాడు. పరశురాముడు తన జటలను ముడి వేసుకున్న ప్రాంతమది. అక్కడకు మాంధాత వచ్చి దండోత్పత్తి విషయం గురించి వసుహోముడినడిగాడు.

బ్రహ్మ తలమీద ఉన్న గర్భం 'తుమ్ము' వలన క్రిందపడగా దానిలో పుట్టినవాడు క్షుపుడు. బ్రహ్మకు అతడు ఋత్విజుడైనాడు. యజ్ఞం ప్రధానమైన కాలంలో దండం ఆవశ్యకత తగ్గింది. తరువాత కాలంలో విశృంఖలత్వం వ్యాపించగా బ్రహ్మ, విష్ణువుల కోరికపై శంకరుడు 'దండ' రూపాన్ని ధరించాడు. ఆయా సమూహాలకు రాజులనేర్పాటు చేసాడు. ఇంద్రుడు దేవతలకు, యముడు పితరులకు, కుబేరుడు ధనానికి, మేరువు పర్వతాలకు, సముద్రుడు నదులకు, వరుణుడు జలాలకు, మృత్యువు ప్రాణాలకు, అగ్నిదేవుడు తేజస్సుకు అధిపతులయ్యారు. మహాదేవుడు రుద్రులకు, వసిష్ఠుడు విప్రులకు, జాతవేదుడు వసువులకు, భాస్కరుడు తేజస్సులకు, చంద్రుడు తారలకు, అంశుమంతుడు లతలకు, కుమారస్కందుడు భూతాలకు, కాలుడు సుఖదుఃఖ మృత్యువుకు, క్షుపుడు ప్రజలకు, సమస్త ధర్మధరులకు అధిపతి అయ్యారు.

దండరూపంలో ఉన్న తనను మహాదేవుడు విష్ణువుకిచ్చాడు. విష్ణువు అంగిరసుడికి, అంగిరసుడు ఇంద్ర మరీచులకు, మరీచి భృగువుకు, భృగువు ఋషులకు, ఋషులు లోకపాలురకు, లోకపాలురు క్షుపుడికి, క్షుపుడు మనువైన శ్రాద్ధదేవుడికి, మనువు తన పుత్రులకు అప్పగించారు. కాబట్టి ధర్మానుసారంగా న్యాయాన్యాయాలను విచారించాకే దండాన్ని వినియోగించాలి.

–అని వసుహోముడు మాంధాత మహరాజుకు చెప్పాడు.

**ప్రజా జాగర్తిలోకేస్మిన్ దండో జాగర్తి తాసు చ**
**సర్వం సంక్షిపతే దండః పితామహ సమప్రభః** (శాంతి. 122-51)

అందరిని వారివారి హద్దులలో ఉంచుతుంది దండం" అని భీష్ముడు ధర్మరాజుతో 'దండం' ప్రాముఖ్యతను వివరించాడు.

ధర్మరాజు అడిగాడు భీష్మ పితామహుడిని–

**ధర్మార్థ కామాః కిం మూలాః త్రయాణాం ప్రభవశ్చకః**
**అనోన్యం చానుషజ్జంతే వర్తంతే చ పృధక్పృధక్** (శాంతి. 123-2)

"ధర్మార్థ కామాలకు కారణమేమిటి? ఇవి కలిసి, విడివిడిగా ఎందుకు ఉంటాయి?" అడిగాడు ధర్మరాజు

భీష్ముడన్నాడు– "కాలం, కారణం, కర్మానుష్ఠానం వలన ధర్మ అర్థ కామాలు కలిసి కనిపిస్తాయి.

కొమందక ఋషి అంగరిష్ఠుడనే మహరాజుకు చెప్పిన విషయమిది. ధర్మ అర్థాలను విడిచి కేవలం కామాన్నే సేవించేవాడు బుద్ధి నాశాన్ని పొందుతాడు. మోహం ప్రజ్ఞను నాశనం చేస్తుంది. మనసును ధర్మాచరణలో నిలిపిన రాజు విజయుడవుతాడు.

ఒకరోజున దుర్యోధనుడు చింతిస్తూ తండ్రి ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్లి అన్నాడు– పాండవేయుల సంపదను చూసి నేను నిరంతరం శోకిస్తున్నాను.

ధృతరాష్ట్రుడన్నాడు– శీలంతోనే ముల్లోకాలను జయించవచ్చు. మాంధాత ఒక్కరోజులో, జనమేజయుడు మూడు రోజుల్లో, నాభాగుడు ఏడురోజుల్లో రాజ్యాన్ని పొందారు. వారి సద్గుణ, శీల సంపదలకు భూమి తనంతట తాను వారి వద్దకు వచ్చింది.

ఇంద్రుడు ప్రహ్లాదుడి చేతిలో ఓడిపోయి బృహస్పతిని కారణమడిగాడు. బృహస్పతి అతడిని శుక్రుడి వద్దకు పంపాడు. శుక్రుడు దండనీతిని బోధించాడు. బ్రాహ్మణ వేషంలో ఇంద్రుడు ప్రహ్లాదుడి వద్దకు వెళ్లి వరం అర్థించాడు. 'ఏం కావాలి' అని ప్రహ్లాదుడడుగగా నీ 'శీలం' కావాలని కోరుకున్నాడతడు. 'అలాగే' అన్నాడు ప్రహ్లాదుడు.

చూస్తూ ఉండగానే ఒక తేజస్సు ప్రహ్లాదుని శరీరం నుండి వెడలి బ్రాహ్మణుడిని చేరింది. అది శీలం. ఆ తరువాత ధర్మం, సత్యం, సదాచారం ఒక్కటొక్కటిగా ప్రహ్లాదుని విడిచిపోయాయి. సదాచారం తరువాత బలం, ఆఖరున సంపద అతడిని విడిచి వెళ్లిపోయాయి.

ధృతరాష్ట్రుడన్నాడు దుర్యోధనునితో– అందుకే శీలం గొప్పది.

**అద్రోహః సర్వభూతేషు కర్మణా మనసాగిరా**
**అనుగ్రహశ్చ దానం చ శీలమ్ తత్ప్రశస్యతే** (శాంతి. 124–66)

త్రికరణశుద్ధిగా ఎవరికీ ద్రోహం చేయకపోవడం, దయ కలిగి ఉండడం, దానాలు చేయడం 'శీలం' అవుతుంది.

## ఋషభ గీత

హైహయ వంశానికి చెందిన సుమిత్రుడనే రాజర్షి వేటకు వెళ్లి ఒక లేడిని గాయపరచి పారిపోతున్న దాని వెంట పడినాడు. అది అతడిని ఆటపట్టిస్తున్నట్లు ఆగి, పరిగెత్తుతూ మహారణ్యంలో దూరింది. సుమిత్రుడు అక్కడ ఓ తాపసి ఆశ్రమం చేరగా ఋషులతడికి ఆతిథ్యం ఇచ్చారు.

అతడన్నాడు– హిమాలయ పర్వతం, అగాధ సముద్రం ఆశకు సాటిరావు. అంతులేని ఆకాశం వంటి ఈ 'ఆశ' లేడిరూపంలో ఇక్కడకు తెచ్చింది నన్ను.

ఋషభ మహర్షి అన్నాడు– నేను తీర్థాటన చేస్తూ నరనారాయణాశ్రమం దగ్గర 'తనువు' అనే ముని ఆశ్రమం చేరుకున్నాను. అతడి శరీరం చిటికెన వ్రేలంత సన్నగా ఉన్నది. అతడు మామూలు మనుషులకు ఎనిమిది రెట్లు పొడవుగా ఉన్నాడు. అతడు మాతో మాట్లాడుతూ ఉండగానే భూరిద్యుమ్నుని తండ్రి వీరద్యుమ్నుడు తన కుమారుడు మహారణ్యంలో తప్పిపోయాడని దుఃఖిస్తూ 'తనువు' పాదాలపై పడినాడు. ఆ ముని కరుణ, తపః ప్రభావంతో ఆ రాకుమారుడిని రప్పించాడు.

నీకు దొరికేదైతే దొరికేది కదా! –అని ఋషభుడు చెప్పిన మాటలు విని సుమిత్రుడు మృగం మీద ఆశను వదిలి దానిని మృగతృష్ణగా అర్థం చేసుకుని మనశ్శాంతిని పొంది ఇంటికి వెళ్లాడు.

## యమ గౌతమ సంవాదం

గొప్ప తపస్సు చేస్తున్న గౌతముడితో యముడు చెప్పాడు– తపస్సు, శౌచం, సత్య ధర్మాల యందు ప్రీతి, తల్లిదండ్రులను పూజించడం, యజ్ఞ యాగాదులను చేయడం ఉత్తమలోకాల నిస్తుంది.

**తపః శౌచవతా నిత్యం సత్య ధర్మరతే న చ**
**మాతా పిత్రో రహ రహః పూజనం కార్యమంజసా** (శాంతి. 130–10)

# 2) ఆపద్ధర్మ పర్వము

## కాయవ్యోపాఖ్యానం

ఆపత్కాలంలో రాజు ప్రజలు పరస్పరం రక్షించుకోవాలి. రాజుకు రాజ్య రక్షణతో సమానమైన ధర్మం లేదు.

శంఖమంటే నుదుటి ఎముక. శంఖలిఖితమనగా నుదుటి రాత. దానిని నమ్మేవారు కొందరు.

వేద విహితం, స్మృతి సమ్మతం, సజ్జన సేవితం, తన హృదయరంజకం (తనకు ప్రియమైనది) అనే గుణాలతో కూడిన ధర్మాన్ని చెప్పేవాడు ధర్మవేత్త.

ధనము, బలము ఒకదాని నొకటి రక్షిస్తాయి. కాయవ్యుడనే ఎరుకలవాడు అత్యంత నీతిపరుడు. అతడిని దస్యులందరూ అర్థించి తమ నాయకుడిగా ఉండమన్నారు. అతడన్నాడు– నేను చెప్పినట్లు చేస్తానని ప్రమాణం చెయ్యాలి. స్త్రీని, భయపడ్డ వారిని, పసివానిని, తాపసిని, యుద్ధం చేయనివాడిని చంపరాదు. స్త్రీలను బలాత్కరించవద్దు. శుభకార్యాలకు ఆటంకం కలిగించవద్దు. – దొంగలను కూడా అతడు ధర్మపద్ధతిలో నడిపి అతడు తనకు తనవారికి గొప్ప సిద్ధిని కలిగించాడు.

## శాకులోపాఖ్యానము - మూడు చేపల కథ

భీష్ముడు చెబుతున్నాడు యుధిష్ఠిరునితో–

ప్రతి పనికి కొన్ని సంకటాలు వస్తాయి. అవి రాకమునుపే వాటి నివారణకు ఉపాయం ఆలోచించేవాడు అనాగత విధాత. ప్రాప్తకాలంలో జ్ఞానాన్ని వినియోగించేవాడు ప్రత్యుత్పన్నమతి. ఆలస్యం చేసి అప్పుడు బాధపడేవాడు దీర్ఘసూత్రుడు.

ఒక చెరువులో మూడు చేపలు ఉండేవి. ఒకటి ముందుచూపు గలది. రెండవది ప్రాప్తకాలజ్ఞత కలది. మూడవది అక్కర్లేని ఆలస్యం చేసేది.

ఎండాకాలం రాగానే బెస్తవాళ్లు చెరువులో నీరు తోడి పారబోస్తుంటే దీర్ఘదర్శి అయిన మొదటి చేప తన మిత్రులకు చెప్పి వాళ్లు రానంటే తాను నీటి జాలు వెంట వేరే చెరువుకు వెళ్లిపోయింది.

జాలరులు వలవేసినపుడు ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు వలలో చిక్కుకున్నారు. ప్రాప్తకాలజ్ఞుడు త్రాటిని నోటకరుచుకుని జాలరి నీళ్లలో కడుగుతున్నపుడు నీటి జాలులో జారి పెద్ద మడుగుకు వెళ్లింది. దీర్ఘసూత్రుడనే చేప గట్టిగా కదుల్తుంటే జాలరి దానిని రాతితో కొట్టి చంపివేసాడు"

–అని భీష్ముడు మూడు చేపలైన దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుల కథను ధర్మరాజుకు చెప్పాడు.

**అనాగత విధాతా చ ప్రత్యుత్పన్న మతిశ్చ యః**
**ద్వావేవ సుఖమేధేతే దీర్ఘ సూత్రో వినశ్యతి** (శాంతి. 137–20)

ముందు జాగ్రత్త కలవాడు, సమయస్ఫూర్తి కలవాడు విజయాన్ని సాధిస్తారు. తెగని ఆలోచనతో మెదలకుండా ఉన్నవాడు నశిస్తాడు.

## మార్జాల మూషిక సంవాదం

"శత్రువులు చుట్టుముట్టిన రాజు ఎలా బయటపడాలి" –అని అడిగాడు ధర్మరాజు.

భీష్ముడు చెబుతున్నాడు– "శత్రువు, మిత్రుడు అనేవి పదాలు. ఆయా పనులలోని లాభనష్టాలు, హెచ్చుతగ్గుల కారణంగా శత్రువు మిత్రుడవుతాడు. మిత్రుడు శత్రువవుతాడు.

**అమిత్రో మిత్ర తాం యాతి మిత్రం చాపి ప్రదుష్యతి**
**సామర్థ్య యోగాత్కార్యాణామ్ అనిత్యావై సదాగతిః** (శాంతి. 138–13)

ఎవరు మిత్రుడు, ఎవరు శత్రువు –అనేది ఆ సమయంలోనే తెలుస్తుంది.

ఒక కారడవిలో ఉన్న పెద్ద మర్రిచెట్టు మొదట్లో నూరు కన్నాలున్న కలుగులో ఎలుక, మర్రికొమ్మలపై ఉన్న పక్షులను తింటూ మర్రితొర్రలో లోమశుడనే పిల్లి ఉండేవి. ఒకరోజు వేటగాడు వల పన్నగా దానిలో పిల్లి చిక్కుకుంది. సంతోషించిన పలితుడనే ఎలుక భయం లేకుండా తిరుగుతూ ఉండగానే 'హరిణం' అనే ముంగిస ఎలుక వాసన గ్రహించి వచ్చింది. దానిని గమనించింది ఎలుక. ఇంతలో కొమ్మలపై వాలింది చంద్రకం అనే గుడ్లగూబ.

అన్నివేపులా శత్రువులే. నేలమీదికి వెళ్తే ముంగిస, ఇక్కడే ఉంటే గుడ్లగూబ, వల తెంచుకుంటే పిల్లి మింగేస్తుంది. ఇప్పుడు ఆజన్మ శత్రువు పక్కనే ఉండి దానితో సంధి ఏర్పరచుకోవాలని తలచి మెత్తని మాటలతో పిల్లితో అన్నది– ఈ ముంగిస, గుడ్లగూబ నన్ను తినాలని పొంచి ఉన్నారు. నిన్ను చూసి వాళ్లు ఆగారు. నీతో ఏడు మాటలు మాట్లాడాను, నీవు నా స్నేహితుడివిప్పుడు.

ఆ ముంగిస, గుడ్లగూబ వెళ్లిపోయేవరకు నాకు ఆశ్రయమివ్వు. నేను నిన్ను రక్షిస్తాను, ఇప్పుడు నీవు నన్ను రక్షిస్తే –అన్నది పలితుడనే ఎలుక.

పిల్లి ఒప్పుకున్నది. కాసేపు చూసి చూసి పిల్లి–ఎలుకల మైత్రికి ఆశ్చర్యపడి ముంగిస, గుడ్లగూబ ఎగిరిపోయాయి.

ఎలుక నెమ్మదిగా వల త్రాళ్లను కొరుకుతుంటే పిల్లి అన్నది– తొందరగా కొరుకు, వేటగాడు వస్తే నాకు ప్రమాదం.

ఎలుక అన్నది– అకాల కర్మకు ప్రయోజనం ఉండదు. తగిన కాలంలో చేసిన పనికి ఫలితం సిద్ధిస్తుంది. బోయవాడు కనపడగానే నేను నిన్ను విడిపిస్తాను. నీవు చెట్టుపైకి పారిపోతావు. నేను కలుగులో దూరతాను. లేకుంటే జన్మ శత్రువువైన నీవు మోహపడవచ్చు.

తెల్లవారినాక బోయవాడు దగ్గరకు రాగానే ఎలుక ఆఖరి తాడును కొరికి చెట్టు దూకి కలుగులోకి పోయింది. పిల్లి వల తెంపుకుని చెట్టెక్కి దాక్కుంది. బోయవాడు నిరాశతో వల తీసుకుని ఇంటిదారి పట్టాడు.

పిల్లి అన్నది కలుగులో ఉన్న ఎలుకతో– ముంగిస లేదు, గుడ్లగూబ లేదు, బోయవాడు లేదు. మిత్రమా! నన్ను సందేహించ తగునా?

ఎలుక అన్నది– మన మైత్రి తత్కాల స్వార్థంతో కూడినది.

**న విశ్వసేద విశ్వస్తే విశ్వస్తే నాతి విశ్వసేత్**
**విశ్వాసాద్భయముత్పన్నప్ అపి మూలాని కృంతతి** (శాంతి. 138–144)

నమ్మరాని వారిని నమ్మరాదు. నమ్మదగినవారిని మితిమీరి నమ్మకూడదు.

**ఆత్మరక్షణ తంత్రాణాం సుపరీక్షిత కారిణామ్**
**ఆపదో నోప పద్యంతే పురుషాణాం స్వదోషజాః** (శాంతి. 138–181)

ఆలోచించి పనులు చేయడం, ఆత్మరక్షణ నేర్పు కలవారికి ఆపదలు రావు. ఇతరులకు నమ్మకం కలిగించాలి, కాని ఇతరులను నమ్మరాదు –అన్నాడు పలితుడనే ఎలుక వేరేచోటుకు వెళ్లిపోతూ. రోమశుడనే పిల్లి కూడా తన దారిన తాను పోయింది, ఎవరినీ నమ్మరాదనుకుంటూ.

## బ్రహ్మదత్త - గోరువంక

ధర్మరాజు అడిగాడు– "ఎవరినీ నమ్మకుండా రాజు పాలన ఎలా చేస్తాడు?".

భీష్ముడు చెబుతున్నాడు– "కాంపిల్య నగరపు రాజు బ్రహ్మదత్తుని అంతఃపురంలో 'పూజని' అనే గోరువంక ఉండేది. ఆమె గుడ్డు నుంచి పిల్ల బయటకు వచ్చిన రోజునే మహరాణి కూడా ప్రసవించి కొడుకును కన్నది. పూజని సముద్ర తీరానికి పోయి ప్రతిరోజూ రెండు పండ్లను తెచ్చి తన పిల్లకొకటి, రాజు కొడుకుకు ఒకటి ఇచ్చేది.

రాజు కొడుకు కొంచెం పెద్దవాడయ్యాక గోరువంక పిల్లతో ఆడుకుంటున్నాడు. ఒకరోజు ఆ పిల్లవాడు ఒంటరిగా ఉన్నపుడు ఆ గోరువంక పిల్లను చంపి, దాది ఒడిలోకి చేరాడు. అప్పుడే వచ్చింది రెండు పండ్లను తీసుకుని పూజని. అతడు చేసిన దుష్ట పనిని చూసింది. దుఃఖిస్తూ అన్నది– క్షత్రియులకు స్నేహం లేదు, ప్రేమ లేదు. ఇది పాపం. తనతో పుట్టి పెరిగిన వాడిని చంపడం, తనతో కలిసి భోజనం చేసిన వానిని చంపడం, శరణు కోరి వచ్చిన వారిని చంపడం –ఇవి మూడు రకాల పాతకాలు

–అని పలికి పూజని బ్రహ్మదత్తుడు చూస్తుండగానే రాకుమారుడి కళ్లు పొడిచి, గుడ్డివాడిని చేసింది.

**ఇచ్ఛయేహ కృతం పాపం సద్యస్తం చోపసర్పతి**
**కృతం ప్రతికృతం యేషాం న నశ్యతి శుభాశుభమ్** (శాంతి. 139–21)

పాపానికి ప్రతిక్రియ చేసాను. నాకు పాపమంటదు.

బ్రహ్మదత్తుడన్నాడు– పూజనీ! జరిగిందేదో జరిగిపోయింది. నీవు ఇక్కడే ఉండవచ్చు.

గోరువంక పూజని అన్నది– పరస్పరం శత్రుత్వాన్ని పెంచుకుంటూ పోతే అది వారి పుత్రపౌత్రులను కూడా పీడిస్తుంది. మన స్నేహం ఇక్కడితో ముగియడం ఉత్తమం.

బ్రహ్మదత్తుడన్నాడు– మనమధ్య వైరమేమీ లేదు కదా!

పూజని అన్నది– వైరం అయిదు కారణాల వల్ల కలుగుతుంది– స్త్రీ, ఇల్లు (భూమి), మాట, జాతిగత వైరం, ఏదయినా అపరాధం. వైరమేర్పడిన తరువాత మిత్రుడినైనా నమ్మరాదు. నేను పుత్రశోకంతో నీ కుమారునికి అపకారం చేసాను. అలాగే నీవు నన్ను చంపుతావు.

విశ్వాసమే (నమ్మకమే) దుఃఖహేతువు. చెడ్డ భార్య, చెడ్డ కొడుకు, చెడ్డ రాజు, చెడ్డ మిత్రుడు, చెడ్డ బంధువులను, చెడిన ప్రదేశాన్ని విడనాడాలి.

**కుపుత్రే నాస్తి విశ్వాసః కుభార్యాయాం కుతోరతిః**
**కురాజ్యే నిర్వృతిర్నాస్తి కుదేశే నాస్తి జీవికా** (శాంతి. 139-94)

చెడ్డవానితో స్నేహం ఎప్పుడూ అస్థిరమే. మన స్నేహం ఇక్కడితో ముగియడం ఉత్తమం

అని పలికి గోరువంక బ్రహ్మదత్తుని వద్ద వీడ్కోలు తీసుకుని తనకిష్టమైన చోటుకు వెళ్లిపోయింది.

## కణికోపదేశం

ఆపత్కాలంలో రాజు ప్రవర్తించాల్సిన తీరు గురించి శత్రుంజయుడనే రాజుకు కణిక ముని ఈ విధంగా చెప్పాడు- రాజు ఎప్పుడూ శిక్షించడానికి సిద్ధంగా ఉండాలి. ప్రజారక్షణ-దుష్టశిక్షణ అతడి కర్తవ్యం.

**సుమంత్రితం సువిక్రాంతం సుయుద్ధం సుపలాయితమ్**
**ఆపదాస్పదకాలే తు కుర్వీత న విచారయేత్** (శాంతి. 140-12)

ఆలోచించాలి, పరాక్రమించాలి, దీటుగా యుద్ధం చేయాలి, అవసరమైతే పారిపోవాలి. ఆపద కాలంలో ఏది వీలైతే అది చేయాలి. శత్రువును నమ్మరాదు. కాలం మనవేపు తిరిగేవరకు శత్రువును భుజాలపై మోయాలి. కాలం అనుకూలించగానే కుండను రాతిమీద కొట్టి బద్దలు చేసినట్లు నేలకు వేసి కొట్టవచ్చు. సుఖపడే సమయం వచ్చినప్పుడు సుఖపడాలి. రాబోయే సుఖాల మీద ఆశ మంచిది కాదు. పరీక్షించకుండా ఎవ్వరినీ నమ్మరాదు.

**గృధ్ర దృష్టిర్బకాలీనః శ్వ చేష్టః సింహ విక్రమః**
**అనుద్విగ్నః కాకశంకీ భుజంగ చరితం చరేత్** (శాంతి. 140-62)

గ్రద్దలా చూస్తూ, కొంగలా లక్ష్యంపై దృష్టి సారిస్తూ, కుక్కలా మెలకువగా ఉంటూ, సింహంలా విక్రమిస్తూ, కాకిలా ఎప్పుడూ అనుమానిస్తూ, అదను చూసి పుట్టలో ప్రవేశించే పాములా శత్రువులను ఆక్రమించాలి.

ఋణశేషం, అగ్నిశేషం, శత్రుశేషం ఉంచరాదు. మార్దవంతో శత్రువును చంపవచ్చు. కోమలత్వమే కాఠిన్యాన్ని మించిన కాఠిన్యం.

ఈ 'కణిక నీతి'ని పాటించి శత్రుంజయుడనే రాజు సముజ్జ్వల రాజ్యసంపదను అనుభవించాడు.

## విశ్వామిత్రుడు కుక్క మాంసం తినుట

త్రేతా ద్వాపరయుగ సంధికాలంలో పండ్రెండేళ్లు ఘోరమైన అనావృష్టి కలిగింది. జనులు, పశువులు నశించిపోయారు. ఎక్కడ చూసినా ఎముకల పోగులు. ఆ సమయంలో తినదగనివి తినదగినవి అనే భేదం లేకుండా పోయింది.

విశ్వామిత్రుడు ఆకలితో మలమలమాడిపోతూ చండాలుర వాటికలో నడుస్తూ కళ్లు తిరిగి పడిపోయాడు. కాస్త దూరంలో చండాలుని ఇంటిలో అప్పుడే కత్తితో నరకబడిన కుక్క తొడమాంసం ముక్కను చూసాడు.

"ప్రాణరక్షణకు ముందుగా హీనుల ఇంట దొంగతనం ప్రయత్నించాలి. దొరకకపోతే సమానుని ఇంట, అక్కడా ఏమీ దొరక్కపోతే ధార్మికుని ఇంట దొంగతనం చెయ్యాలి. యాచిస్తే ఈ కరువు కాలంలో ఇవ్వకపోవచ్చు. అర్ధరాత్రి దొంగతనం చేస్తాను" అనుకుని అర్ధరాత్రి చండాలుని ఇంట ప్రవేశించి కుక్కమాంసం దొంగిలించబోయాడు. చండాలుడు నిద్రలేచి అన్నాడు- "ఎవరదీ? నిద్రిస్తున్న చండాల వాటికలో దొంగతనం చేస్తున్నది?"

"నేను విశ్వామిత్రుడను. ఆకలితో ప్రాణాలు పోయేట్లున్నవి. తప్పనిసరై ఈ పని చేస్తున్నాను" అన్నాడు విశ్వామిత్రుడు నీరసంగా.

"నీవు ఎవరివైనా కావచ్చు. కాని కుక్కమాంసం తినడమెందుకు? మీరు పంచనఖ ప్రాణులను తినవచ్చు" అన్నాడు శ్వపచుడు.

"నాకు కుక్క, జింక సమానమే! శరీరాన్ని కాపాడడానికి ఈ పని చేస్తున్నాను" అన్నాడు విశ్వామిత్రుడు.

చండాలుడన్నాడు– "అభక్ష్య భక్షణం, సురాపానం, దొంగతనం ఇవి గర్హనీయాలు. సరే తీసుకువెళ్లు!"

జీవితాన్ని నిలుపుకోదలచి విశ్వామిత్రుడు దానిని ఇంటికి తీసుకువెళ్లి భార్యతో కలిసి తినబోయి ముందుగా అగ్నిస్థాపన చేసి అగ్నిని, ఇంద్రుని, ఇతర దేవతలను ఆవాహన చేసాడు. ఇంద్రుడు సంతుష్టుడై వానలు కురిపించాడు.

**విశ్వామిత్రో పి భగవాన్ తపసా దగ్ధ కిల్బిషః**
**కాలేన మహతా సిద్ధిమ్ అవాప పరమాద్భుతమ్** (శాంతి. 141–98)

విశ్వామిత్రుడు కాలిన కుక్కమాంసమనే హవిస్సును తినకముందే దేవతలను పితరులను సంతోషపెట్టాడు.

మనిషి ఎప్పుడూ బ్రతకడానికే ప్రయత్నం చెయ్యాలి. బ్రతికి ఉన్నప్పుడే మనిషికి పుణ్యప్రాప్తి, సుఖానుభవం కలుగుతాయి.

కేవలం తార్కిక బుద్ధి లేదా కేవలం శాస్త్ర వచనాలతో ధర్మ నిర్ణయం కుదరదు. రెండిటి సహకారంతోనే ధర్మనిర్ణయం చెయ్యాలి అనేది బృహస్పతి మతం. శాస్త్రం వ్యర్థమనే వాదన అజ్ఞానమని శుక్రాచార్యుడు రాక్షసులతో అన్నాడు.

## పావురము - బోయవాడు

ముచుకుందునకు పరశురాముడు చెప్పిన కథ ఇది. భూలోక యముడిలా కానవస్తున్న బోయవాడు, కాకివలె నల్లని శరీరం, ఎర్రటి కళ్లు, పెద్ద పిక్కలు, చిన్న పాదాలు, పెద్ద ముఖం, పెద్ద దవడలు కలవాడు; బంధుమిత్రులు లేనివాడు, క్రూరప్రవృత్తి గలవాడు కావడంతో అందరూ విడిచిపెట్టారు. నిత్యమూ వల పన్నడం, పక్షుల్ని పట్టుకోవడం, చంపడం, లేదా పట్టణంలో అమ్మడం. ఆ వృత్తిలోనే బ్రతుకుతున్నాడతడు.

ఒకరోజున అతడు పక్షులను పట్టి బుట్టలో వేసుకుని అడవిలో సంచరిస్తుండగా పెద్ద తుఫాను వచ్చింది. పక్షులు నేలకూలినాయి. జంతువులు ఎక్కడెక్కడో దాక్కున్నాయి. చలి తీవ్రమయ్యింది. కాలిబాటలన్నీ నీళ్లమడుగులైనాయి. చలికి వణుకుతూ నేలమీద పడి ఉన్న పావురం కనిపిస్తే దానిని బుట్టలో వేసుకున్నాడు. అంతలో కాస్త ఎత్తైన ప్రదేశం మీద ఓ పెద్ద చెట్టు కనిపించింది. ఆకాశం నిర్మలమై గాలి వాన ఆగిపోయింది. చీకటి అలుముకున్నది. ఆ రాత్రి చెట్టుకింద ఆకులు పరచుకుని పడుకున్నాడతడు.

ఆ చెట్టు మీద పావురం ఒకటి తన భార్య ఇంకా ఇంటికి రాలేదని దుఃఖిస్తూ ఉన్నది.

**న గృహం గృహమిత్యాహుః గృహిణీ గృహముచ్యతే**
**గృహంతు గృహిణీ హీనమ్ అరణ్య సదృశం మతమ్** (శాంతి. 144–6)

"ఇల్లంటే ఇల్లు కాదు. గృహిణియే ఇల్లు. ఇల్లాలు లేని ఇల్లు అరణ్యంతో సమానం.

**నాస్తి భార్యా సమో బంధుః నాస్తి భార్యా సమాగతిః**
**నాస్తి భార్యా సమోలోకే సహాయో ధర్మ సంగ్రహే**

భార్యవంటి బంధువు లేదు. భార్య వంటి దారిలేదు. భార్య వంటి సహాయకుడూ లోకంలో లేరు".

ఆ మాటలు బోయవాడి బుట్టలో ఉన్న భార్య విన్నది– "పెనిమిటీ! ఈ బోయవాడు మన అతిథి. మన ఇంటి వద్ద ఆకలితో మాడుతూ శయనించి ఉన్నాడు. చలికి వణుకుతున్నాడు. ఈ అతిథిని ఆదరించు".

భార్య మాటలు వినగానే భర్త ఆనందించాడు.

బోయవాడితో అన్నాడు– "అతిథీ నీకేం కావాలి?"

బోయవాడన్నాడు– "చలి తీవ్రంగా ఉన్నది"

కపోతం వెంటనే దూరంగా ఉన్న గ్రామంలోని కమ్మరి ఇంటికి పోయి నిప్పు తెచ్చి ఎండుటాకులు, పుల్లలపై వేసింది. రెక్కలను ఆడించి మంట రాజేసింది. ఆ బోయవాడు చలికాగినాడు.

కపోతుడు అడిగాడు– “అతిథీ నీకేం కావాలి?”

బోయవాడు అన్నాడు– “ఆకలి దంచేస్తున్నది”

పావురం అనుకున్నది– “ఏ రోజుకారోజు బ్రతికేవాళ్లం. కూడబెట్టినదేమీ లేదు” అని ఓ క్షణం ఆలోచించి అగ్నిచుట్టూ ప్రదక్షిణం చేసి మంటలో దూకింది.

అది చూడగానే అంతటి క్రూరుడూ చలించిపోయాడు. వెంటనే తన బుట్టలోని పక్షుల్ని వదిలేసాడు. తన భర్త అగ్నిలో పడిపోవడాన్ని బుట్ట రంధ్రాల్లోంచి చూసిన కపోతి ఎంతో దుఃఖించింది. తన భర్తను స్మరిస్తూ మంటలో దూకింది.

బోయవాడు ఆ కపోత దంపతుల త్యాగాన్ని, అతిథి మర్యాదను చూసి విరాగియై అడవిలో ప్రజ్వరిల్లిన దావాగ్నిలో ప్రవేశించాడు కల్మషం లేని మనస్సుతో. బోయవాడు అగ్నిదగ్ధుడై పునీతుడైనాడు.

## ఇంద్రోతుడు - జనమేజయుడు (తెలియక చేసిన పాపం)

జనమేజయుడనే రాజు మహా పరాక్రమవంతుడు. బుద్ధిపూర్వకంగా చేయని బ్రహ్మహత్యా పాతకం అతడికి చుట్టుకున్నది. దానితో పురోహితులు, బ్రాహ్మణులు అతడికి దూరమయ్యారు. ప్రజలు పరిత్యజించారు. దానితో అతడు అరణ్యాలకు వెళ్లి తపస్సు చేయాలనుకుని ఇంద్రోతుడనే ముని వద్దకు వెళ్లాడు. అతడు జనమేజయుడిని ఆదరించలేదు.

జనమేజయుడన్నాడు– “నేను తెలిసి ఈ పని చేయలేదు. అయినా పశ్చాత్తాపపడుతున్నాను”.

ఇంద్రోతుడన్నాడు– “యజ్ఞం, దానం, దయ, వేదాలు, సత్యం అనే అయిదూ, మంచి తపస్సు ఇవి పవిత్రమైనవి. తీర్థాలలో వేదాధ్యయనం చేస్తూ సన్యాసివికా. పుణ్యకార్యాలు చేసి పవిత్రుడివికా. యజ్ఞం చేయి” అని పలికి జనమేజయుడితో అశ్వమేధయాగం చేయించాడు ఇంద్రోతముని. ఆ విధంగా బ్రహ్మహత్యా పాతకం పోగొట్టుకుని పూర్ణచంద్రుడు ఆకాశంలో ప్రవేశించినట్లు జనమేజయుడు తన రాజ్యంలోకి ప్రవేశించి అందరి మన్ననలను పొందినాడు.

## గ్రద్ద - నక్క (గృధ్ర-గోమాయు సంవాదం)

నైమిశారణ్యం వద్ద ఒక బ్రాహ్మణుడికి లేకలేక ఒక కుమారుడు జన్మించాడు. అతడు బాలగ్రహ బాధితుడై మరణించాడు. బంధువులు ఆ బాలుడిని స్మశానం వద్దకు తీసుకువచ్చి దుఃఖిస్తున్నారు. వాళ్ల ఏడుపులు విని గ్రద్ద ఒకటి అన్నది–

**–సంపశ్యత జగత్సర్వం సుఖదుఃఖై రధిష్ఠితమ్**
**సంయోగో విప్రయోగశ్చ పర్యాయేణోపలభ్యతే–**

ఈ మృత బాలుడిని వదిలిపొండి. ఈ జగత్తంతా సుఖ దుఃఖమయం. సంయోగ వియోగ సంసార చక్రం. ఇంకాసేపుంటే భూత ప్రేత గణాలు వస్తాయి. మీకు ప్రమాదం. వెళ్లండి. మీ మంచికోరి చెబుతున్నాను”. గ్రద్ద మాటలు విని అందరూ ఆ బాలుడి శవాన్ని అక్కడే వదిలి బయల్దేరారు.

ఈలోగా కాకి రెక్కలరంగు కలిగిన నక్క అటుగా వచ్చి అన్నది– “మూఢులారా! ఇంకా సూర్యాస్తమయం కాలేదు. ఈ పసివాని కోసం కాసేపు కన్నీరు కార్చండి. మీ ఆర్తనాదాలు విని ఎవరో ఒక దేవుడి మనసు కరిగి ఇతడిని బతికిస్తాడేమో” అన్నది నక్క

బంధువులందరూ మరల బాలుడి శవం చుట్టూ చేరి శోకాలు, దేవతా ప్రార్థనలు మొదలుబెట్టారు.

గ్రద్ద అన్నది– “ఏడిస్తే పోయిన బాలుడు తిరిగివస్తాడా! కాలుడు అందరి యెడల సమదర్శనుడు. మీ ఇళ్లకు పొండి!”

నక్క అన్నది– “సూర్యుడు అస్తమించేదాక ప్రార్థనలు చేయండి. ఇతడు బ్రతికితే సంతోషించేది మీరే కదా!”

గ్రద్ద అన్నది– “నేను పుట్టి ఇప్పటికి వెయ్యి సంవత్సరాలయ్యింది. మరణించి జీవించినవారిని నేను చూడలేదు”.

నక్క అన్నది– “రాముడు శంబూకుడిని చంపగానే బ్రాహ్మణ బాలుడు బ్రతికాడు కాదా! శ్వేతుడనే రాజపుత్రుడూ బ్రతికాడు”

గ్రద్ద అన్నది– “ఎంత పిచ్చివాళ్లు మీరు? మీకు తెలిసినవాళ్లలో చనిపోయిన వారెవరైనా బ్రతికారా? అనవసరపు ఆశలెందుకు?”

నక్క అన్నది– “కనీసం చీకటి పడేవరకు ఈ అందమైన బాలుడి ముఖం చూస్తూ ఇతడి జ్ఞాపకాలను వల్లె వేయొచ్చు కదా!”

వెలుగుంటే గ్రద్ద నక్కనెదిరించి ఆ బాలుడి శవాన్ని ఎత్తుకుపోగలదు. చీకటి పడితే గ్రద్ద ఎగిరిపోతుంది కనుక నిశాసంచారి నక్క బాలుడి శవాన్ని తినగలుగుతుంది.

నక్క, గ్రద్ద వారివారి స్వార్థం కోసం శాస్త్ర వాక్యాలను తమకు అనుగుణంగా వ్యాఖ్యానిస్తున్నాయి.

పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఆ బాలుడిని బ్రతికించి నూరేళ్ల ఆయుస్సునిచ్చాడు. నక్క, గ్రద్దలకు ఆకలి పోయే వరమిచ్చాడు. అందరూ పరమేశ్వరునికి మొక్కి ఎవరి దారిన వారు వెళ్లారు.

**అనిర్వేదేన దీర్ఘేణ నిశ్చయేన ధ్రువేణ చ**
**దేవదేవ ప్రసాదాచ్చ క్షిప్రం ఫలమవాప్యతే** (శాంతి. 153–116)

## వాయువు - బూరుగు చెట్టు (బలవంతుడు-బలహీనుడు)

హిమవత్పర్వతం మీద గొప్ప బూరుగుచెట్టు అనేక పక్షుల జంతువులకు ఆశ్రయమై ఉండేది. నారదుడు దానిని చూసి మెచ్చుకున్నాడు.

**అహోను రమణీయ స్త్వమ్ అహో చాపి మనోహరః**
**ప్రియామహే త్వయానిత్యం తరు ప్రవర శాల్మలే** (శాంతి. 154–10)

“ఎంతో మనోహరంగా ఉన్న నిన్ను చూస్తే ప్రీతి కలుగుతున్నది. ఎంతో బలవంతుడైన వాయువు నీకు మిత్రుడై ఉంటాడు. అందుకే నీవు సురక్షితంగా ఏపుగా పెరుగుతున్నావు” –అన్నాడు నారదుడు.

శాల్మలి అన్నది– “వాయువు నా మిత్రుడు కాదు, బంధువు కాదు. పరమేష్ఠి కూడా నాకు ఆప్తుడు కాదు. ఎన్నోసార్లు వాయువు పర్వతాలనే కంపింపజేస్తూ వచ్చినా నేను అడ్డుకున్నాను. నా తేజస్సు, బలం వాయువుకన్నా భయంకరమైనవి.

నారదుడు అన్నాడు– “ఇంద్రుడు, యముడు, కుబేరుడు, వరుణుడు –వీరందరికన్నా వాయువు బలమైనవాడు కదా! శక్తిని, జీవనాన్ని ఇచ్చే వాయువును గర్వంతో తూలనాడినావు. క్రోధాది దుర్గుణాలకు నెలవు అయినావు, ఇది మంచిది కాదు”.

నారదుడు వెళ్లి వాయుదేవుడికి చెప్పాడు. అతడు బూరుగుచెట్టుతో అన్నాడు– “సృష్టి సమయంలో బ్రహ్మ నీ నీడలో విశ్రాంతి తీసుకున్నాడని నీమీద నాకు గౌరవం. నీకు గర్వం పెరిగింది”

బూరుగు చెట్టు అన్నది– “నా బలం నాకు తెలవడం గర్వం కాదు”

వాయువు అన్నాడు– “రేపు సిద్ధంగా ఉండు, బలాబలాలు చూపించుకుందాం!”

ఆ రాత్రి శాల్మలి ఆలోచించుకున్నది– “నిజంగా తాను వాగుడుకాయలా మాట్లాడింది, వాయుదేవుడే బలవంతుడు” అనుకుని తన కొమ్మలను శాఖలను తానే విరగగొట్టుకుని మోడులా మారింది.

మరునాడు వాయుదేవుడు వచ్చి అన్నాడు– “నేనేమీ చేయకుండానే నీవు మోడువైనావు. బలవంతుడితో వైరం ఇటువంటిదే!

**వైరం న కుర్వీత నరః దుర్బుద్ధిర్బుద్ధి జీవినా**
**బుద్ధిర్బుద్ధిమతో యాతి తృణేష్వివ హుతాశనః** (శాంతి. 157–11)

బుద్ధిమంతుడి తెలివి గడ్డిపోచలను అగ్ని కాల్చినట్లు బుద్ధిహీనులను దహించివేస్తుంది”.

## అజ్ఞానం, దమం, తపస్సు, సత్యం

భీష్ముడన్నాడు– "రాగం, ద్వేషం, మోహం, సంతోషం, శోకం, అభిమానం, కామం, క్రోధం, పొగరు, కునికిపాటు, సోమరితనం, కోరిక, ద్వేషం, సంతాపం, ఈర్ష్య, పాపకార్యాలు –ఇవి అజ్ఞానాన్ని పెంచుతాయి.

**తస్యా జ్ఞానాధి లోభోహి లోభాదజ్ఞాన మేవచ**
**సర్వదోషా స్తథాలోభాత్ తస్మాల్లోభం విసర్జయేత్** (శాంతి. 159–12)

అజ్ఞానం వల్ల లోభం, లోభం వల్ల అజ్ఞానం కలుగుతాయి. లోభాన్ని నాశనం చేయడం వల్లనే జనకుడు, యువనాశ్వుడు, వృషాదర్భి, ప్రసేనజిత్తు ఇతర రాజులు స్వర్గానికి వెళ్లారు.

దమం (ఇంద్రియ నిగ్రహం) వలన కార్యసిద్ధి కలుగుతుంది. తేజస్సు పెరుగుతుంది. పరమపదం లభిస్తుంది.

క్షమ, ధీరత, అహింస, సమత్వం, సత్యం, ఋజుప్రవర్తన, ఇంద్రియ జయం, మృదుత్వం, సిగ్గు, స్థిరత్వం, ఔదార్యం, కోపం లేకపోవడం, సంతోషం, చక్కని మాటలు చెప్పే అలవాటు, ఏ ప్రాణికి కష్టాలు కలిగించకపోవడం, ఇతరుల తప్పులను వెదకక పోవడం అనే సద్గుణాలు కలగడమే 'దమం'.

ఇంద్రియ నిగ్రహంలో ఉన్న లోపం క్షమాగుణం. క్షమాగుణం కలవాడిని లోకులు అశక్తుడిగా భావిస్తారు. ఆ దోషమే మహాగుణం. క్షమతో సహనం ప్రాప్తిస్తుంది.

**సర్వమే తత్తపోమూలం కవయః పరిచక్షతే**
**న హ్యా తప్త తపా మూఢః క్రియాఫల మవాప్నుతే** (శాంతి. 161–1)

ఈ సమస్త జగత్తు తపో మూలం. సర్వసాధనలకు తపస్సే మూలం. అహింస, సత్యం, దానం, దమం –వీటిని మించిన తపస్సు, ఉపవాసం లేవు.

**సత్యం సత్సు సదా ధర్మః సత్యం ధర్మః సనాతనః**
**సత్యమేవ నమస్యే త సత్యం హి పరమా గతిః** (శాంతి. 162–4)

సత్యం, సమత, ఇంద్రియ నిగ్రహం, మాత్సర్యం లేకపోవడం, క్షమ, లజ్జ, సహనం, అసూయ లేకపోవడం, త్యాగం, ధ్యానం, శ్రేష్ఠమైన ఆచరణ, స్థిరధైర్యం, అహింస –ఈ పదమూడు సత్య స్వరూపాలు. వేయి అశ్వమేధ యజ్ఞ ఫలాలకన్నా సత్యవచన ఫలమే ఎక్కువ.

## కామ క్రోధాదులైన పదమూడు దోషములు

కామం, క్రోధం, శోకం, మోహం, మదం, లోభం, మాత్సర్యం, ఈర్ష్య, నింద, దోషదృష్టి, అసూయ, దైన్యం, శాస్త్ర విరుద్ధ కార్యం చేయాలనే కోరిక, ఇతరులను చంపాలనే కోరిక ఇవన్నీ ప్రాణులకు శత్రువులు. వీటివల్లనే దుఃఖం, పాపాలు కలుగుతాయి.

విరక్తితో కామం, క్షమతో క్రోధం, జ్ఞానం వల్ల శోకం, వైరాగ్యం వల్ల మోహం, ఉత్తమ పురుష సాంగత్యం వల్ల మాత్సర్యం, బుద్ధివలన ఈర్ష్య, మహాత్ముల దర్శనం వలన నింద, దయ వలన అసూయ, ధర్మం వలన దైన్యం, తత్త్వజ్ఞానం, అభ్యాసం వలన ఇతర దోషాలు నశిస్తాయి.

నానావిధ దోషాలు కలిగి పాపాలు చేసేవాడు నృశంసుడు. నానావిధ పాపాలకు నానా రకాల ప్రాయశ్చిత్తాలు సూచించబడినాయి.

పరిహాసం, స్త్రీ విషయం, ప్రాణరక్షణ, గురుహితం, వివాహ సందర్భాలలో అసత్యం పాపం కాదు.

మద్యపానం, బ్రహ్మహత్య, గురుస్త్రీ గమనాలకు ప్రాయశ్చిత్తం లేదు.

## ఖడ్గోత్పత్తి - మహాత్మ్యం

నకులుడు అడిగాడు భీష్ముడిని– "ఖడ్గ సృష్టి ఎలా జరిగింది?"

భీష్ముడు చెబుతున్నాడు– "ఈ ప్రపంచమంతా నీటితో నిండి ఏకార్ణవంగా ఉన్నపుడు బ్రహ్మ జన్మించి ఆయన వాయువు, అగ్ని, సూర్యుడు, ఆకాశాన్ని, భూమిని, రాక్షస సముదాయాన్ని సృష్టించాడు. చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు, కాలాన్ని, మానసపుత్రులను సృజించాడు. ప్రచేతసులను, దక్షుడిని, బ్రహ్మర్షులను, దేవతలను, దేవగణాలను జన్మింపచేసాడు. క్రమేపి దేవ దైత్యగణాలకు వైరం జనించింది. అప్పుడు బ్రహ్మదేవుడు యజ్ఞం చేయగా భయంకరాకారం 'అసి' జన్మించింది. దానికి 'ఖడ్గ' రూపం ఇచ్చాడు బ్రహ్మ. బ్రహ్మ దానిని రుద్రునికిచ్చాడు. అతడు చతుర్భుజుడై అగ్నిజ్వాలలు కక్కుతున్న కత్తిని అనేక విన్యాసాలతో దానవ దైత్య సంహారం చేసాడు. ఆ తరువాత ఆ ఖడ్గాన్ని విష్ణుదేవుడికిచ్చాడు రుద్రుడు. విష్ణువు మరీచికి, మరీచి మహర్షులకు, మహర్షులు ఇంద్రుడికి, ఇంద్రుడు దిక్పాలురకు, దిక్పాలకులు మనువుకు, మనువు క్షుపునికి, క్షుపుడు → ఇక్ష్వాకుడు → పురూరవుడు → ఆయువు → నహుషుడు → యయాతి → పూరువు → అమూర్తరయుడు → భూమిశయనుడు → భరతుడు → ఐలబిలుడు → ధుంధుమారుడు → కాంభోజుడు → ముచుకుందుడు → మరుత్తు → రైవతుడు → యువనాశ్వుడు → రఘువు → హరిణాశ్వుడు → శునకుడు → ఉశీనరుడు → భోజుడు → శిబి → ప్రతర్ధనుడు → అష్టకుడు → పృషదశ్వుడు → భరద్వాజుడు → ద్రోణుడు → కృపుడు → నకులుడు.

కృపాచార్యుడి నుండి నీకు లభించింది 'అసి' అనే ఈ ఖడ్గరాజం. దీనికి కృత్తిక నక్షత్రం, అగ్నిదేవత, గోత్రం రోహిణి, గురువు రుద్రుడు. దీనికి ఎనిమిది పేర్లు– అశి, విశసనం, ఖడ్గం, తీక్ష్ణ ధారం, దురాసనం, శ్రీగర్భం, విజయం, ధర్మపాలం అనేవి ఎనిమిది పేర్లు.

ఆయుధాలలో మొదట ఉత్పన్నమయ్యింది ఖడ్గం.

పృథువు మొదటి ధనుస్సును సృష్టించాడు.

## షడ్జగీత (విధి నిర్ణయం బలవత్తరం)

ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, విదురుడు –ఈ ఆరుగురూ చర్చించిన ధర్మ అర్థ కామ విషయాల విశేషమే షడ్జగీత.

విదురుడన్నాడు– "తపస్సు, శాస్త్ర పరిశీలన, త్యాగం, శ్రద్ధ, యజ్ఞం, క్షమ, మనశ్శుద్ధి, దయ, సత్యం, ఇంద్రియ నిగ్రహం అనేవి ఆత్మసంపదలు. ధర్మానికి అర్థానికి ఇవే మూలం.

**ధర్మేణై వర్ష యాస్తీర్ణాః ధర్మే లోకాః ప్రతిష్ఠితాః**
**ధర్మేణ దేవావవృధుః ధర్మేచ అర్థః సమాహితః**

లోకాలన్నీ ధర్మంలోనే ప్రతిష్ఠితాలు. ధర్మం మీదనే అర్థం నిలుస్తుంది. ధర్మం ఉత్తమం, అర్థం మధ్యమం, కామం అధమం.

ఇది కర్మభూమి. ధన ప్రాప్తితో ధర్మకామాలు సిద్ధిస్తాయి.

యుధిష్ఠిరుడన్నాడు– "ఆసక్తికలవానికి ముక్తి కలుగదు.

**భూతాని సర్వాణి విధిర్నియుంక్తే**
**విధిర్ బలీయానితి విత్త సర్వే** (శాంతి. 167–47)

విధి బలవత్తరమైనది. విధి నియోగించిన పని జీవి చేస్తాడు.

## కృతఘ్నోపాఖ్యానం (నాడీజంఘుడి కథ)

గౌతముడనే మధ్యదేశపు బ్రాహ్మణుడు ఉత్తర దిక్కున ఉన్న మ్లేచ్ఛదేశానికి వెళ్లాడు. అక్కడ ఓ ధనవంతుడైన బందిపోటు దొంగ వద్ద ఆశ్రయం పొంది, కాలక్రమేపీ వేటగాడై, అక్కడి స్త్రీని వివాహమాడినాడు. జంతుహింస చేస్తూ, మాంసాహారిగా కాలం గడుపుతున్నాడు. కొన్నేళ్ల తరువాత ఆ గ్రామానికి వచ్చిన మరో బ్రాహ్మణుడు ఇతడిని చూసి ఆశ్చర్యపోయి హితం చెప్పి వెళ్లిపోయాడు.

ఒకరోజున గౌతముడు సముద్ర వ్యాపారులతో కలిసి సముద్ర తీరానికి వెళ్లినపుడు ఓ మదించిన ఏనుగు ఆ గుంపును ఎదుర్కొని చాలామందిని చంపివేసింది. దానిని తప్పించుకుని అడవిలోకి పారిపోయిన గౌతముడు ఒక మర్రిచెట్టు వద్దకు చేరినాడు. సూర్యాస్తమయమయ్యింది.

ఆ సమయంలో నాడీజంఘుడనే కొంగ ఆ మర్రిచెట్టును చేరింది. అతడు బ్రహ్మదేవుని మిత్రుడు. కశ్యపుని కుమారుడు. 'రాజధర్ముడు' అనే పేరుతో ప్రఖ్యాతి గాంచినాడు. తన ఇంటికి అతిధిగా వచ్చిన 'గౌతముడి'ని ఆ రాజధర్ముడు ఆదరించి, చేపలతో విందు చేసాడు, సుఖంగా నిద్రపోవడానికి శయ్య నేర్పరచి, అతడితో స్నేహధర్మం నెరపి గౌతముడు ద్రవ్య సంపాదనకై తిరుగుతున్నాడని తెలిసి అతడిని తన మిత్రుడైన విరూపాక్షుడనే రాక్షసరాజు వద్దకు పంపాడు.

విరూపాక్షుడికి ఈ దారితప్పిన బ్రాహ్మణుడు నచ్చకపోయినప్పటికీ అనేక ధన సంపదలనిచ్చి పంపాడు. అతడు వాటిని మోసుకుంటూ మర్రిచెట్టు వద్దకు వచ్చేప్పటికి అలసిపోయాడు. రాజధర్ముడతడిని ఆదరించి భోజనాన్ని పెట్టి తన రెక్కలతో విసిరాడు గౌతముడు నిద్రపోతుంటే. కాసేపటికి తానూ నిద్రపోయాడు. మెలకువ వచ్చిన గౌతముడు అనుకున్నాడు- "రేపు ఉదయం ఇంటికి వెళ్లడానికి చాలాదూరం నడవాలి. ఈ కొంగ బాగా బలిసి ఉంది. దీనిని చంపి ఆ మాంసాన్ని దారిలో తింటాను". వెంటనే కొంగను చంపి ఈకలు పీకి, మాంసాన్ని కాల్చి ఎముకలు అక్కడ పడవేసి తన ధనపు సంచి మోసుకుంటూ ఇంటిదారి పట్టినాడు.

ప్రతిరోజూ ఉదయమే తన ఇంటికి వచ్చే రాజధర్ముడు రెండు రోజులు రాకపోయేసరికి అనుమానం వచ్చిన విరూపాక్షుడు తన రాక్షస భటులను రాజధర్ముడి నివాసానికి పంపాడు. అక్కడ వాళ్లకు కొంగ ఈకలు, ఎముకలు కనిపించాయి. విరూపాక్షుని కుమారుడు వేగంగా తన వాళ్లతో వెళ్లి గౌతముడిని పట్టుకున్నారు.

విరూపాక్షుడన్నాడు- "వీడు పాపకర్ముడు. వీడిని వధించి తినండి".

రాక్షసులన్నారు- "ఈ పాపిని మేం తినలేం" అని దస్యులకిచ్చారు. వాళ్లు గౌతముడిని చంపి కుక్కలకు వేసారు. కుక్కలు కూడా అతడి మాంసాన్ని ముట్టలేదు.

**మిత్రద్రోహీ నృశంసచ్చ కృతఘ్నశ్చ నరాధమః**
**క్రవ్యా దైః కృమిభిశ్చైవ న భుజ్యంతే హి తాదృశాః**

"కృతఘ్నుడి మాంసాన్ని కుక్కలు, క్రిములు కూడా ముట్టవు" అన్నారందరూ.

విరూపాక్షుడు ఒక చితిని సిద్ధం చేసి దానిపై బక శ్రేష్ఠుని అవశేషాలను ఉంచి దగ్ధం చేసి అంత్యక్రియలు నిర్వహించాడు. అదే సమయంలో దక్షకన్య సురభి నోటినుంచి పాలతో కూడిన నురుగు జారి చితిపై పడింది. దానివలన రాజధర్ముడు బ్రతికినాడు. బ్రహ్మ శాపమిచ్చాడొకసారి రాజధర్ముడి పొరపాటుకు. దానివలన గౌతముడి చేతిలో చనిపోయి మరల బ్రహ్మ దయ వలన బ్రదికాడు రాజధర్ముడు.

రాజధర్ముడు కోరడంతో బ్రహ్మ మరల గౌతముడిని బ్రదికించాడు. అతడు తన ఇంటికి పోయాడు. రాజధర్ముడి ఆశీస్సులను గ్రహించాడు కాని మిత్రద్రోహిగా మిగిలిపోయాడు.

**మిత్రద్రోహో న కర్తవ్యః పురుషేణ విశేషతః**
**మిత్రధ్రుక్ నరకం ఘోరం అనంతం ప్రతిపద్యతే** (శాంతి. 173-21)

## 3) మోక్షధర్మ పర్వము

### సేనాజిత్తు - బ్రాహ్మణుడు

సేనాజిత్తు పుత్రశోకంతో బాధపడుతున్నపుడు ఒక బ్రాహ్మణుడు ఆయనతో అన్నాడు-

**యధాకాష్ఠం చ కాష్ఠం చ సమేయాతం మహోదధౌ**
**సమేత్య చ వ్యపే యాతాం త ద్వద్భూత సమాగమః** (శాంతి. 174-15)

సముద్రంలో కట్టెల్లా జీవులు ఒకరినొకరు కలుస్తారు, విడిపోతారు.

సంసార తృష్ణల వలన దుఃఖం కలుగుతుంది. దుఃఖ వినాశమే సుఖం. సుఖ దుఃఖాలు చక్రంలా వస్తూ పోతుంటాయి.

ఒక ఆవు ఉన్నది. అది దూడదా? గోపాలునిదా? దాని యజమానిదా? దానిని దొంగిలించిన చోరునిదా? నిజానికి దాని పాలను ఎవరు త్రాగితే వారిదే గోవు అనేది వాస్తవం.

**సుఖం వాయది వా దుఃఖం ప్రియంవాయది వాప్రియమ్**
**ప్రాప్తం ప్రాప్తముపాసీత హృదయేనా పరాజితః** (శాంతి. 174-39)

సుఖమయినా, దుఃఖమయినా ప్రాప్తమైన దానిని పరిగ్రహించాలి. దుఃఖాలు వేలు, భయాలు వందలు అన్నీ మూఢునికే, పండితుడవి పట్టించుకోడు. మమతలు పెంచుకున్నవాడు పరితాపం చెందుతాడు.

తాబేలు సర్వావయవాలను తనలో ముడుచుకున్నట్లు మానవుడు కోరికలను త్యజించినపుడు పరమాత్మ దర్శనం కలుగుతుంది.

## పింగళ గీత (కామాన్ని వర్జించడం)

వేశ్య అయిన పింగళ ప్రియుని కోసం ఎదురుచూస్తున్నది. అతడు రాలేదు. నేను నా ప్రియుడు ఎప్పుడూ దగ్గర దగ్గరనే ఉన్నాం. కాని నేనేనాడూ ఆయనను గుర్తించలేదు.

ఒకే స్తంభం నవద్వారాలు కలిగిన ఈ శరీర గృహాన్ని నేటి నుండి మూసివేస్తాను. నన్నిపుడెవ్వరూ కామం పేరిట మోసం చేయలేరు. ఆశ లేనివాడు సుఖంగా నిద్రిస్తాడు. నైరాశ్యమే పరమసుఖం -అలా అనుకున్న ఆమెకు సుఖంగా నిద్ర పట్టింది.

**సుఖం నిరాశః స్వపితి నైరాశ్యం పరమం సుఖమ్**
**ఆశామనాశాం కృత్వా హి సుఖం స్వపితి పింగలా** (శాంతి. 174-62)

## తండ్రీ కొడుకుల సంవాదం

తండ్రి అడిగాడు- లోకమెలా నశిస్తోంది? దీనిని చుట్టుముట్టుతున్నదేది?

కొడుకు అన్నాడు- మృత్యువు లోకాన్ని నశింపచేస్తుంది. అది ఒక్క క్షణం కూడా ఆగదు. ఆయువు తరిగిపోతూ ఉంటుంది. అందుకని మంచి పనులను నేడే చేయాలి. రేపటి పని నేడే చేయాలి.

**కోహి జానాతి కస్యాద్య మృత్యు కాలో భవిష్యతి**
**అబుద్ధ ఏవాక్రమతే మీనాన్మీన గ్రహో యథా** (శాంతి. 175-15)

ఎవరికి మృత్యుకాలమో ఎవరికీ తెలియదు. మత్స్యకారుడు చేపను పట్టినట్లు మృత్యువు జీవిని కబళించి వేస్తుంది.

శరీరంలోనే మృత్యువూ, అమృతమూ ఉంటాయి. మోహం వలన మృత్యువును, సత్యం వలన అమృతాన్ని పొందుతారు.

**నాస్తి విద్యాసమం చక్షుః నాస్తి సత్యసమం తపః**
**నాస్తి రాగ సమం దుఃఖం నాస్తి త్యాగ సమం సుఖం** (శాంతి. 175-35)

అన్నాడు కుమారుడు తండ్రితో- పరమాత్మను అన్వేషించు, ముక్తిని పొందు.

## శంపాక గీత (ఏమీలేకపోవడంలో ఉన్న సుఖం)

శంపాకుడనే ముని అన్నాడు- "ఏమీ లేకపోవడమంత సుఖమైనది ఇంకేమీ లేదు. దారిద్ర్యాన్ని, రాజ్యాన్ని త్రాసులో వేసి తూచినపుడు దారిద్ర్యమే సుఖమనిపించింది.

రాజు ధనికుడే కాని ఎప్పుడూ ఉద్విగ్నుడు, మృత్యు సన్నిధిలో ఉంటాడు. రూపం, ధనం, కులంపై అభిమానమున్నవాడి మనసు ఏకాగ్రతను కోల్పోతుంది. వాటిమీద మమకారం దుఃఖాలను తెచ్చిపెడుతుంది.

త్యాగం లేకపోతే సుఖం లేదు. పరలోకం లేదు. నిద్ర పట్టదు.

**నాత్యక్త్వా సుఖమాప్నోతి నాత్యక్త్వా విందతే పరమ్**
**నాత్యక్త్వా చా భయః శేతే త్యక్త్వా సర్వం సుఖీభవ** (శాంతి. 177-22)

అన్నిటిని విడనాడినవాడు సుఖంగా ఉంటాడు.

## మంకి గీత (ధనాశతో దెబ్బతిన్నవాడికి సుఖప్రాప్తి)

భీష్ముడన్నాడు యుధిష్ఠిరుడితో- "మంకి అనేవాడు ధనాన్ని సంపాదించాలని అనేక ప్రయత్నాలు చేసి భంగపడ్డాడు. చివరకు మిగిలిన ధనంతో రెండు కోడెదూడలను కలిపి కట్టి నాగలి దున్నటం నేర్పుతున్నాడు. అవి గ్రామం వెలుపల చెంగుచెంగున దూకుతూ, పరిగెడ్తూ దారిలో అడ్డంగా పడుకున్న ఒంటె మీదుగా దూకబోయాయి.

ఒంటె కోపంతో లేచి పరిగెత్తేసరికి దానికి ఇరువేపులా పడిన లేగదూడలు తాడు బిగుతై ఉరివేసినట్లు కాగా అవి రెండూ చనిపోయాయి. అదిచూసి మంకి దుఃఖితుడై అన్నాడు- దీనిలో నా పురుష ప్రయత్నమెక్కడ? అంతా దైవికమే!

సుఖాన్ని కోరుకున్నాను, ధనాన్ని కోరుకున్నాను. మిగిలింది నిర్వేదం. అయినా కోరికల అంతు చూసినవాడెవడు?

రుచికరమైన గంగాజలం వలె ధనం తృష్ణను పెంచుతుంది. కామము, లోభము, తృష్ణ, కృపణత్వము నన్ను విడిచి వెళ్తే నాకు శుభకరం. కామక్రోధ లోభ మోహ మద మత్సర్య మమతలనే సప్త శత్రువులను విడనాడి సుఖంగా ఉంటాను -అనుకున్నాడు మంకి.

ప్రశాంతతకు కారణాలు- సర్వ సమభావన, నిరర్థక శ్రమ లేకుండుట, సత్యవాక్యం, నిర్వేదం, కర్మలపై అనాసక్తి" -అన్నాడు భీష్ముడు.

## బోధ్యగీత (ప్రశాంతతకు మార్గాలు)

నహుషుడి కుమారుడితో బోధ్యముని అన్నాడు- "నేనెవ్వరికీ ఏదీ ఉపదేశించను. నేను పొందిన ఉపదేశ లక్షణాలను చెబుతాను- పింగళ, కురరం, సర్పం, అరణ్యంలో సారంగాన్వేషణం, బాణాలను తయారు చేసేవారు, కుమారి -నాకు ఆరుగురు గురువులు వీళ్లు.

పింగళ- ఆశను నిరాశగా మార్చుకుని సుఖంగా నిద్రిస్తున్నది.

క్రౌంచపక్షి (కురరం)- మాంసపు ముక్కను విడిచిపెట్టిన క్రౌంచపక్షిని ఇతర పక్షులు వెంటాడి బాధించడం మానేసాయి. అప్పుడది సుఖంగా ఉన్నది.

సర్పం- ఇల్లు కట్టే బాధలు లేవు. ఇతరులు కట్టిన ఇంటిలో సుఖంగా ఉంటుంది.

సారంగం (చాతకపక్షి)- ఎవరికీ ద్రోహం చేయకుండా మునుల్లా బ్రతకడం

బాణాలు చేసేవారు- వారికి పనిపై ధ్యాస. దానిలోనే ఆనందం.

కుమారి- ఒంటరిగా తిరుగుతుంది. కలహాలంటవు ఆమెకు.

## ప్రహ్లాద - అజగర సంవాదం (ఉత్తమ గతికి మార్గాలు)

ప్రహ్లాదుడితో అజగరముని అన్నాడు- ప్రాణుల ఉత్పత్తి, వృద్ధి, క్షయం, వినాశం అన్నీ పరమాత్మ నుండే కలుగుతాయి. కాబట్టి నాకు ఆనందమూ లేదు, దుఃఖమూ లేదు.

**-స్వభావా దేవ సందృశ్యాః వర్తమానాః ప్రవృత్తయః**
**స్వభావ నిరతాః సర్వాః పరితుష్యేన్న కేనచిత్-**

ప్రాణులలోని ప్రవృత్తులన్నీ స్వభావం నుంచి జనించినవే. కలయికలు విడిపోవడానికి, కూడబెట్టినవి నశించడానికే అని గ్రహించిన నేను వేటికొరకూ ఆరాటపడను.

దొరికిన దానితో సంతృప్తిగా బ్రతుకుతాను. నేను అజగర వ్రతం పాటిస్తున్నాను. భయ రాగ ద్వేష లోభ మోహాలను విడనాడినాను. ఫలభోజ్య భక్ష్య పేయాల విషయాలలో నియమం లేదు. ఇది కావాలి, అది కావాలి అని కోరను. కోరికలను

చంపుకున్నాను. అంతా దైవాధీనంగా భావిస్తాను. దమ నియమ వ్రత సత్య శౌచాలతో ధృతి, మతి బుద్ధులతో పవిత్రుడనై మనస్సును నియంత్రిస్తూ అజగర వ్రతాన్ని పాటిస్తున్నాను –అన్నాడు అజగర ముని.

## కాశ్యపుడు - నక్క (కాశ్యప-సృగాల సంవాదం)

భీష్ముడన్నాడు– "మనిషి ఆధారపడాల్సింది బుద్ధిమీద. బాంధవులు, కర్మ, ధనం కన్నా ప్రజ్ఞ గొప్పది.

ఒకప్పుడు వైశ్యుడొకడు ధనమదంతో కాశ్యపుని బండిని ఢీకొట్టి పడగొట్టాడు. కాశ్యపుడనుకున్నాడు– ధనం ఉందనేగా వాడి పొగరు. దరిద్రుడు బ్రతకడం అనవసరం –అనుకుంటున్నపుడు ఇంద్రుడు నక్క రూపంలో వచ్చి ఇలా అన్నాడు– అన్ని జన్మలలో మానవజన్మ దుర్లభం. అందులోనూ బ్రాహ్మణ జన్మ నీది. ఎందుకు చావును కోరుకుంటున్నావు? సాంసారిక లాభాలన్నీ అహంకారం రూపాలు. నాకూ మనుషుల్లాగా రెండు చేతులుంటే బాగుండును అనిపిస్తుంది. నీవు నక్కవు కావు, కీటకానివి కావు, ఎలుకవు, పాయువు, కప్పవూ కావు. పాపిష్ఠి జన్మగల ఏ ప్రాణివీ కావు. మరి నీకెందుకీ దుఃఖం. తృష్ణ పెరిగినకొద్దీ ప్రజ్వలిస్తూనే ఉంటుంది. ఆ అగ్ని నీటితో ఆరదు.

అన్నిటినీ శంకిస్తూ, నాస్తికుడనై, మూర్ఖుడనై, నన్ను నేను పండితునిగా భావించుకుంటూ ఉండేవాడిని. దాని ఫలితమే ఈ నక్కజన్మ. ఎప్పటికైనా మనుషజన్మను పొందుతానో లేదో –అన్నదా నక్క

కాశ్యపుడికి అప్పటికి దుఃఖం తొలిగింది. నక్కలో శచీపతి అయిన దేవేంద్రుడిని జ్ఞానచక్షువుతో దర్శించాడు. ఆయన అనుమతితో, ఆశీస్సులతో ఇంటికి మరలాడు.

భీష్ముడన్నాడు– దానాలు, యాగాలు, తపస్సు, గురు శుశ్రూషలు చేయడం వలన పాపాలు తొలగి మనోరథాలు సిద్ధిస్తాయి.

## భృగు - భరద్వాజ సంవాదం (సృష్టి-ప్రాణ సృష్టి)

భృగు మహర్షి చెబుతున్నాడు భరద్వాజునితో–

సనాతనుడు, విశ్వమూర్తి, విశ్వాంతరాత్మ, కూటస్థుడు, అక్షరుడు, అవ్యక్తుడు, నిర్లేపుడు, వ్యాపకుడు, ప్రభువు, ప్రకృతిపరుడు, ఇంద్రియాతీతుడు అయిన నారాయణుడు సృష్టి చేయగోరి తనలో సహస్రాంశయైన మానసపురుషుడిని పుట్టించాడు. అతడే బ్రహ్మ.

అవ్యక్తం → మహత్తు → అహంకారం → ఆకాశం → నీరు → అగ్ని → గాలి → భూమి;

దివ్య పద్మవేదికగా బ్రహ్మ జన్మించాడు. అతడే అహంకారం సర్వభూతాత్మ. సర్వభూత సృష్టికర్త. ఆయనే పంచభూతాలు. కొండలు ఆయన ఎముకలు. భూమి మేధస్సు, మాంసం, సముద్రాలు ఆయన నెత్తురు. ఆకాశం ఆయన ఉదరం. గాలి ఆయన నిశ్వాసం. అగ్ని ఆయన తేజస్సు; నదులు రక్తనాళాలు. అగ్నిసోములైన సూర్యచంద్రులు ఆయన కళ్లు. ఆకాశం ఉపరిభాగం ఆయన తల, నేల పాదాలు, దిక్కులు భుజాలు –ఇతడే అనంతుడు.

ఆకాశం నుండి నీరు పుట్టింది. నీటి నుంచి వాయువు, నీరు–వాయువుల సంఘర్షణలో అగ్ని; అగ్ని, గాలి, నీరు కలిసి భూమి ఏర్పడ్డాయి. భూమి నుండే సమస్తం ఉద్భవిస్తుంది.

ప్రాణుల శరీరం పాంచభౌతికం. వాటి చేష్ట–వాయువు, తొర్ర–ఆకాశం, వేడి–అగ్ని, ద్రవం–జలం, అస్థిమాంసాదులు–పృథ్వి; చెవి, ముక్కు, నాలుక, చర్మం, కన్ను –పంచేంద్రియాలు.

స్థావర ప్రాణులైన చెట్లకు సుఖదుఃఖాలుంటాయి. చెట్లు కూడా నీటిని వ్రేళ్లతో నీటిని పీల్చుకుంటాయి. అవికూడా పాంచభౌతికాలే.

జంగమ ప్రాణులైన జీవులకు–

– చర్మం, మాంసం, ఎముకలు, మజ్జ, స్నాయువు – పృథివీ మయం
– తేజస్సు, క్రోధం, నేత్రం, వేడి, జఠరాగ్ని – అగ్ని
– చెవి, ముక్కు, ముఖం, హృదయం, ఉదరం – ఆకాశం

– శ్లేష్మం, పిత్తం, స్వేదం, వస, నెత్తురు –జలం
– ప్రాణ, వ్యాన, అపాన, ఉదాన, సమాన –వాయువు

గంధం, స్పర్శ, రస, రూప, శబ్దం –గుణాలు.

గంధం– ఇష్టం, అనిష్టం, మధురం, కటువు, నిర్హారి, సంహతం, స్నిగ్ధం, రూక్షం, విశదం అని తొమ్మిది రకాలు.

రసం– మధురం, లవణం, తిక్తం, కషాయం, ఆమ్లం, కటువు –ఆరు రకాలు

రూపం– హ్రస్వం, దీర్ఘం, స్థూలం, చతురస్రం, వృత్తం, శుక్లం, కృష్ణం, ఎరుపు, పసుపు, నీలారుణం, కఠినం, నునుపు, అల్పం, పిచ్ఛిలం (జారుడు), మృదువు, దారుణం (16 భేదాలు)

వాయువు– స్పర్శ, శబ్దం

స్పర్శ– ఉష్ణం, శీతం, సుఖం, దుఃఖం, స్నిగ్ధం, విశదం, ఖరం, కఠినం, మృదువు, రూక్షం, లఘువు, గురువు (12 రకాలు)

శబ్దం– షడ్జం, ఋషభం, గాంధారం, మధ్యమం, ధైవతం, పంచమం, నిషాదం (7 రకాలు)

ప్రాణంతో కూడి ఉన్న ఆత్మయే జీవుడు. ఆత్మ కపాల స్థానంలో నిలిచి శరీరాన్ని రక్షిస్తుంది. ప్రాణం కపాలంలోనూ అగ్నిలోనూ ఉండి శరీరమంతా ప్రసరిస్తుంది.

ప్రాణం సమాన వాయువుగా హృదయంలో ఉంటుంది. అపాన వాయువు మలమూత్రాలను ఆశ్రయించి పైనుండి క్రిందకు పోతుంది. ప్రయత్నంలో, పనిలో, బలంలో ప్రవర్తించేది 'ఉదానం'. శ్వాసకు, శబ్దాలకు ఉదానం ఆధారం. శరీరమంతా ఉండి ముఖ్యంగా సంధి స్థానాల్లో ఉన్నది వ్యానం.

శరీర ధాతువులలోని అగ్నిని సమానవాయువు కదుపుతుంది. ప్రాణాపానాల మధ్య ఉన్న జఠరాగ్ని ఆహారాన్ని జీర్ణింపచేస్తుంది. నాభికి క్రింద జీర్ణమైన ఆహారం, నాభికి పైన జీర్ణం కాని ఆహారం ఉంటాయి.

ముఖం నుండి గుదం వరకు సాగుతున్న మహా ప్రవాహం– యోగమార్గం. యోగులు దాని ద్వారానే పరమపదం పొందుతారు.

శరీరం పంచభూతాలుగా విడిపోవడం దేహనాశనం. దేహం నశించినా జీవుడు నశించడు. జీవాత్మ మరొక దేహంలో ప్రవేశిస్తుంది.

**చిత్త స్య హి ప్రసాదేన, హిత్వా కర్మ శుభా శుభమ్**
**ప్రసన్నాత్మాత్మని స్థిత్వా సుఖమానంత్య మశ్నుతే** (శాంతి. 187–30)

నిర్మాలాంతః కరుడై, అన్ని బంధాలను తెంచుకున్నవాడు ఆత్మస్వరూపుడై అనంతమైన ఆనందాన్ని పొందుతాడు.

## వర్ణ భేదం

వర్ణభేదమెలా ఏర్పడింది? అని భరద్వాజుడడుగగా భృగువన్నాడు– తొలుత వర్ణ భేదం లేదు. తొలుత అంతా బ్రాహ్మణమే. ఆ తరువాత కర్మభేదాల్ని బట్టి వర్ణభేదమేర్పడింది.

బ్రాహ్మణులకు తెలుపు, క్షత్రియులకు ఎరుపు, వైశ్యులకు పసుపు, శూద్రులకు నలుపు వర్ణాలను నియమించాడు బ్రహ్మ.

సృష్టి ఆరంభంలో బ్రహ్మ బ్రాహ్మణులను, ప్రజాపతులను సృష్టించాడు. ఆ తరువాత సత్యం, ధర్మం, తపస్సు, వేదం, ఆచారం, శౌచాన్ని, దేవ దానవ గంధర్వ దైత్య అసుర సర్ప యక్ష రాక్షస నాగ పిశాచ మనుష్యులను సృష్టించాడు.

బ్రాహ్మణ్యాన్ని ఇష్టపడిన వారు బ్రాహ్మణులుగా ఉన్నారు. సాహసాన్ని ఇష్టపడినవారు క్షత్రియులైనవారు (రక్త వర్ణపు రంగు), గోవులను వ్యవసాయాన్ని ఆశ్రయించిన బ్రాహ్మణులు పసుపు వన్నె వైశ్యులైనారు. సదాచారాన్ని వీడి హింసతో సర్వ కర్మలూ చేస్తున్నవారు శూద్రులైనారు.

జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని కోల్పోయి స్వేచ్ఛాచార వ్యవహారాలు కలిగి సృష్టిని పరబ్రహ్మ స్వరూపంగా గ్రహించలేనివారు పిశాచ, రాక్షస, ప్రేత గణాలలో జన్మిస్తారు. ఆదిదేవుడైన బ్రహ్మ మనసు నుంచి ఉద్భవించింది ఈ మానసీ సృష్టి. అది అక్షయం, అవ్యయం, ధర్మరూపం కూడా!

- సత్యము, దానము, ద్రోహచింతా రాహిత్యము, క్రౌర్యం లేకపోవడం, బిడియం, తపస్సు, దయ కలిగిన వేదాధ్యాయి బ్రాహ్మణుడు.
- వేదాధ్యయనం, ప్రజారక్షణ, పన్నులు వసూలు చేయుట, దానధర్మాలు చేయుట -క్షత్రియ లక్షణం.
- వేదాధ్యయనం, వ్యాపారం, పశుపాలన, వ్యవసాయం -వైశ్యుడు
- వేదాధ్యయనం లేకుండా, సర్వకర్మలు చేసేవాడు శూద్రుడు.

బ్రాహ్మణ లక్షణాలు ఏడూ ఉన్నవాడు బ్రాహ్మణుడు. అవి లేనివాడు శూద్రుడు.

**సత్యం బ్రహ్మ తపః సత్యం సత్యం విసృజతే ప్రజాః**
**సత్యేన ధార్యతే లోకః స్వర్గం సత్యేన గచ్ఛతి** (శాంతి. 190-1)

సత్యం వలననే మనిషి స్వర్గం చేరగలుగుతాడు.

స్వర్గం కాంతిమయం. నరకం చీకటి కొట్టు. భూమిపై చీకటి వెలుగులుంటాయి. స్వర్గంలో నిత్యమూ సుఖమే. నరకం దుఃఖమయం. భూమిపై సుఖదుఃఖాలుంటాయి.

**పృధివీ సర్వభూతానాం జనిత్రీ తద్విధాః స్త్రియః**
**పుమాన్ ప్రజాపతిస్తత్ర శుక్రం తేజోమయం విదుః** (శాంతి. 190-15)

సర్వ ప్రాణులకు కన్నతల్లి పృథ్వి. స్త్రీలు కూడా భూమి వంటివారు. పురుషుడు బ్రహ్మ సమానుదు; శుక్రం తేజస్స్వరూపం.

అగ్నిహోత్రం, స్వాధ్యాయం, దానం, తపస్సు పుణ్య కార్యాలు. అగ్నిహోత్రం వల్ల పాపం శమిస్తుంది. స్వాధ్యాయం వల్ల శాంతి; దానం వల్ల భోగాలు; తపస్సు వలన స్వర్గం లభిస్తాయి.

## కర్మభూమి

ఇది కర్మభూమి. చేసిన కర్మల వలన శుభాశుభాలు సిద్ధిస్తాయి.

**కర్మభూమిరియం లోకే ఇహ కృత్వా శుభాశుభమ్**
**శుభైః శుభమవాప్నోతి తథా శుభ మధాన్యథా** (శాంతి. 192-19)

ఆచార విధులు పాటించాలి. నిత్యమూ సూర్యోపాసన చెయ్యాలి. అన్నాన్ని, భక్ష్యాలను నిందించరాదు. చేతులు ఆరకముందే భోజనం నుండి లేవాలి. తడికాళ్లతో నిద్రించరాదు.

ప్రాతఃకాలం, సాయంకాలం రెండుసార్లు మాత్రమే భోజనం చెయ్యాలి. పరదారాభిగమనం చేయరాదు. సంస్కరింపబడని మాంసాన్ని కాని, శ్రాద్ధ శేషమైన మాంసాన్ని తినరాదు. గురువులను, తల్లిదండ్రులను సేవించాలి.

స్త్రీని నగ్నంగా చూడరాదు. ఋతుకాలంలోనే భార్యతో ఏకాంత ప్రదేశంలో సంగమించాలి.

అతిథులను గౌరవించాలి. పెద్దలను ఏకవచనంతో గాని పేరుతో గాని పిలువరాదు. తీర్థాలలో ఉత్తమమైనది హృదయం. హృదయమే పవిత్ర స్థానం. పెద్దలు పాటించినదే శ్రేష్ఠమైన ఆచారం.

పాపి కప్పిపుచ్చిన పాపం పాపాన్నే పెంచుతుంది. ధర్మం ధర్మాన్ని పెంచుతుంది.

**పాపే నాపి హితం పాపం పాపమేవాను వర్తతే**
**ధార్మికేణ కృతో ధర్మం ధర్మమేవాను వర్తతే** (శాంతి. 193-28)

సర్వ ప్రాణులు మనఃపూర్వకంగా చేసినదే ధర్మం. ధర్మమే మానవులకు బీజం. ధర్మమే దేవతలకు అమృతం.

## ఆధ్యాత్మ జ్ఞానం

పంచ మహాభూతాలు– ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి. శబ్దం, చెవి, సర్వ రంధ్రాలు –ఆకాశం వలన; స్పర్శ, చేష్ట, చర్మం –వాయువు వలన; రూపము, కన్ను పాకము –అగ్నివలన; రసమూ, ఆర్ద్రత, నాలుక –జలం వలన; వాసన, ముక్కు, శరీరము –భూమి వలన ఏర్పడతాయి; మనసు–ఆరవభూతం; బుద్ధి–ఏడవది. క్షేత్రజ్ఞుడు–ఎనిమిదవ వాడు (సాక్షీమాత్రుడు).

సత్త్వ రజో తమో గుణాలు ఇంద్రియాలను ఆశ్రయించి ఉంటాయి. సత్త్వగుణం వలన సుఖానుభూతి; రజోగుణం వలన దుఃఖానుభూతి; తమోగుణం వలన మోహానుభూతి ఏర్పడ్తాయి. బుద్ధి గుణాలను సృష్టిస్తుంది. క్షేత్రజ్ఞుడు కేవలం సాక్షి. ఇద్దరూ ఒకే చోట ఉన్నా వాళ్లు వేరువేరు. చేప నీటిలో ఉన్నట్లు.

బుద్ధి సారథి; మనసు కళ్లెం; ఇంద్రియాలు అశ్వాలు; మనసును కొద్దికొద్దిగా ధ్యానం వేపు మళ్లించి ఇంద్రియాలనే అశ్వాలకు కళ్లెం వేసినపుడు మనశ్శాంతి లభిస్తుంది.

## జాపకోపాఖ్యానం

మానవుడికి బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలు తెలుపబడినవి.

ఆధ్యాత్మ జ్ఞాన సాధనకు సాంఖ్య, ధ్యాన, క్రియా మార్గాలు చెప్పబడినాయి. పరబ్రహ్మనే ధ్యానం చేస్తూ మనస్సమాధిలో ఉండే జపం చేసేవాడు జాపకుడు.

సాంఖ్యంలో జపానికి చోటు లేదు.

సత్యము, అగ్నిహోత్రము, ఏకాంత సేవనము, ధ్యానము, తపస్సు, దమము, సహనము, అసూయ లేకుండుట, మితాహారం, శమము, విషయ సంకోచము, మితభాషణము –ప్రవృత్తిమార్గ యజ్ఞం.

నివృత్తి మార్గం– వ్యక్తం, అవ్యక్తం, అనాశ్రయం –మూడు రకాలు.

ధ్యానమార్గంలో పరమాత్మను దర్శించినవానికి పునర్జన్మ లేదు.

## ఇక్ష్వాకు మహరాజు-యముడు-బ్రాహ్మణుడు-కాలుడు

పిప్పలాదుని కుమారుడు, కౌశిక వంశం వాడైన ఆ బ్రాహ్మణుడు చేస్తున్న జపానికి గాయత్రి సంతసించి ప్రత్యక్షమై 'నేను ప్రీతి చెందాను' అన్నది. నాకు మనస్సమాధి వర్ధిల్లే వరమిమ్మన్నాడు. అతడు జపాన్ని కొనసాగించగా ధర్ముడు ప్రత్యక్షమై స్వర్గలోకాన్నిచ్చానన్నాడు. అతడు అంగీకరించలేదు. స్వర్గసుఖాలు నాకు అక్కర్లేదన్నాడు. శరీరంతో స్వర్గం వెళ్తానన్నాడు. అప్పుడు కాలుడు, మృత్యువు, యముడు ముగ్గురూ అతడి దగ్గరకు వచ్చారు. అదే సమయంలో తీర్థయాత్రలు చేస్తూ ఇక్ష్వాకు మహరాజు అక్కడకు వచ్చాడు.

ఇక్ష్వాకు రాజన్నాడు– నేను నీకు ధనమిస్తాను, కోరుకో!

బ్రాహ్మణుడన్నాడు– నేను దానం తీసుకోను. నా తపశ్శక్తితో నీకేం కావాలో అది ఇస్తాను.

రాజన్నాడు– నీ జపఫలం ఇవ్వు.

బ్రాహ్మణుడన్నాడు– నా జపఫలమేమిటో నాకు తెలియదు, తీసుకో!

రాజన్నాడు– తెలియని ఫలం నాకు వద్దు, నీవే ఉంచుకో!

బ్రాహ్మణుడన్నాడు– నేనిచ్చిన జపఫలం తీసుకోకపోతే ధర్మభ్రష్టుడవవుతావు. నీవు అసత్యమాడినట్లవుతుంది.

ధర్ముడన్నాడు– దానఫలాన్ని బ్రాహ్మణుడు, సత్యఫలాన్ని రాజు స్వీకరించండి.

స్వర్గమన్నది– ఇద్దరూ స్వర్గానికి రావచ్చు.

రాజు అన్నాడు– నాకు స్వర్గం అవసరం లేదు.

బ్రాహ్మణుడన్నాడు– నేను నివృత్తి మార్గంలో ఉన్నాను. జపఫలం నీకిచ్చాను.

రాజు అన్నాడు– సరే పుణ్యఫలం ఇద్దరం అనుభవిద్దాము.

అప్పుడు అక్కడకు వికృత వేషధారులైన ఇద్దరు పురుషులు వచ్చారు. వాళ్లు పోట్లాడుకుంటూ తమ తగవు తీర్చమన్నారు రాజును.

విరూపుడనే రెండవవాడన్నాడు– నేను నీకు ఋణపడి ఉన్నాను.

వికృతుడనే మొదటివాడన్నాడు– నేను సత్యం చెబుతున్నాను, నీవు నాకు ఋణపడలేదు.

రెండవవాడన్నాడు– గోదాన ఫలం ఋణపడి ఉన్నాను.

మొదటివాడన్నాడు– ఇతడు నాకు ఋణపడి లేదు.

రెండవవాడన్నాడు– వికృతుడు నాకు రెండు గోవులను దానం చేసిన గోదానఫలం ఇచ్చాడు. నేను ఒక్క ఆవును దానం చేసిన గోదానఫలమే అతడికి ఇచ్చింది ముందుగా. కాబట్టి నేను ఋణపడి ఉన్నాను.

బ్రాహ్మణుడన్నాడు– రాజా! నా జపఫలం స్వీకరించు.

రాజు అన్నాడు– మన ఇద్దరి పుణ్యాలను కలిపి చెరిసగం అనుభవిద్దాం. ఆ మేరకు నేనిచ్చే దానాన్ని కూడా స్వీకరించు. విరూప వికృతులూ అలాగే పంచుకొనుట న్యాయం.

దేవతలన్నారు– కాలుడు, ధర్ముడు, మృత్యువు, విరూప వికృతులు (కామ క్రోధులు) మిమ్మల్ని పరీక్షించారు. మీరిద్దరూ పుణ్యలోకాలను పొందుతారు.

సద్యోముక్తి, క్రమముక్తి, లోకాంతర ప్రాప్తి ఇవి జాపకులకు లభించే లోకాలు.

బ్రాహ్మణుడు యోగ మార్గాన బ్రహరంధ్రాన్ని భేదించుకుని జ్యోతిర్మయమైన జ్వాలగా, లొడితెడు పురుషుడిగా స్వర్గలోకాన్ని చేరుకున్నాడు. ఇక్ష్వాకురాజు కూడా అదేవిధంగా స్వర్గాన్ని చేరుకున్నాడు.

**తతః స్వాగతమిత్యా తత్తేజః ప్రపితామహః**
**ప్రాదేశమాత్రం పురుషం ప్రత్యుద్గమ్య విశాంపతే** (శాంతి. 200–22)

## మను - బృహస్పతి సంవాదం

బృహస్పతి అడుగగా మనువు చెబుతున్నాడు– జగతు పుట్టింది ఒక సర్వోత్కృష్ట తాత్త్విక పదార్థం నుంచి. అది అవ్యక్తం, అద్వితీయం. దానికి శబ్దస్పర్శ రూప రస గంధాలు లేవు. అది స్త్రీకాదు, పురుషుడు కాదు, నపుంసకమూ కాదు. సత్తు కాదు, అసత్తు కాదు. ఆ పరమాత్మ అక్షరం– నాశనం లేనిది. బ్రహ్మవేత్తలు మాత్రమే చూడగలిగినదది.

అక్షర పరబ్రహ్మం నుండి ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృధివి; పృధివి నుండి జగత్తు ఉద్భవిస్తాయి. శరీరాన్ని వీడిన ప్రాణులు జలంలో, జలం నుండి అగ్నిలో, అగ్ని నుండి వాయువులో, వాయువు నుండి ఆకాశంలో లయిస్తారు. మరల ఆకాశం నుండి అదే క్రమంలో వెనుకకు వచ్చి జన్మిస్తారు.

జ్ఞానులు ఆకాశం నుండి మోక్ష స్వరూపమైన పరమాత్మలో లీనమవుతారు. తన కర్మననుసరించి నూతన శరీరాన్ని ధరించిన జీవుడు తాను చేసిన శుభాశుభ కర్మల ఫలితాన్ని ఈ శరీరంతో అనుభవిస్తాడు.

పృధివి కంటె జలం, జలం కన్నా అగ్ని, అగ్నికన్నా వాయువు, వాయువు కన్నా ఆకాశం, ఆకాశం కన్నా మనసు, మనస్సు కంటే బుద్ధి, బుద్ధి కన్నా కాలం, కాలం కన్నా పరమాత్మ విష్ణువు గొప్పవాడు. ఈ జగత్తు అంతా విష్ణుమయం.

## సర్వభూతోత్పత్తి

పురుషోత్తముడైన విష్ణువు పంచ మహాభూతాలను సృష్టించాడు. భూమిని సృష్టించాక నీటిలో నివాసమేర్పరచుకుని (నారములు–నీరు) నారాయణుడైనాడు. ముందు సంకర్షణుడిని సృష్టించాడు. సంకర్షణుడి నాభిలో పద్మం, పద్మంలో బ్రహ్మ పుట్టాడు. తరువాత తమోగుణంతో మధువు జన్మించాడు. అతడిని సంహరించి పురుషోత్తముడు మధుసూదనుడైనాడు.

బ్రహ్మ ఏడుగురు మానస పుత్రులను (మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు) సృష్టించాడు. మరీచి నుంచి కశ్యప ప్రజాపతి; బ్రహ్మ బొటనవ్రేలి నుంచి దక్షుడు పుట్టారు. ప్రజాపతి దక్షుడి పదముగ్గురు కూతుళ్లు కశ్యప ప్రజాపతి వారిని వివాహం చేసుకున్నాడు.

మరో పదిమందిని ధర్ముడు పెళ్లిచేసుకోగా వసువులు, రుద్రులు, విశ్వదేవులు, సాధ్యులు, మరుత్తులు జన్మించారు.

మరో 27 మందిని చంద్రుడు వివాహం చేసుకున్నాడు. దితికి దైత్యులు, అదితికి ఆదిత్యులు జన్మించారు. దనువు దానవులను కన్నది.

విష్ణువు ముఖం నుంచి బ్రాహ్మణులు, భుజాల నుంచి క్షత్రియులు, తొడల నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు జన్మించారు. సర్వభూత నాయకుడిగా బ్రహ్మ, మాతృగణాలకు విరూపాక్షుడు, పితృదేవతలకు యముడిని, యక్షులకు కుబేరుడిని, జలాలకు వరుణుడిని, దేవతలకు ఇంద్రుడిని నాయకులుగా నియమించాడు.

మొదట్లో మృత్యువు లేదు. మిధున కర్మ లేదు. కృతయుగంలో సంకల్పం వలన సంతానం కలిగేవారు. త్రేతాయుగంలో సంస్పర్శ వలన సంతానం పుట్టేవారు. ద్వాపరంలో మిధున కర్మ ఏర్పడింది. కలియుగంలోనూ మిధున కర్మ ఉన్నది.

కేశవుడు భూతపతి. జ్ఞానులకు పరమగతి.

## దిశా స్వస్తికము

స్వయంభువు బ్రహ్మ; ఆయన పుత్రులు– మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు.

అత్రి వంశంలో పుట్టిన ప్రాచీన బర్హికి పదిమంది పుత్రులు ప్రాచేతసులు. వారి కుమారుడు ప్రజాపతి దక్షుడు. అతడి మరోపేరు 'క'.

మరీచి పుత్రుడు కశ్యపుడు– అతడి మరోపేరు అరిష్టనేమి.

అత్రి పుత్రుడు– సోముడు; శశిబిందుడనేవానికి పదివేల మంది భార్యలు. వారికి ఒక్కొక్కరికి వెయ్యిమంది పుత్రులు. ప్రజోత్పత్తి ఇతడి వల్లనే జరిగిందంటారు. భగుడు, అంశముడు, ఆర్యముడు, మిత్రుడు, వరుణుడు, సవిత, ధాత, వివస్వంతుడు, త్వష్ట, పూష, ఇంద్రుడు, విష్ణువు –ఆదిత్యులు.

వివస్వంతుడే మార్తాండుడు. అతడి పుత్రులు– నాసత్యుడు, దస్రుడు. వీరే అశ్వినీ దేవతలు; ఏకాదశ రుద్రులు– అజైకపాదుడు, అహర్బుధ్న్యుడు, విరూపాక్షుడు, రైవతుడు, హరుడు, బహురూపుడు, సావిత్రుడు, త్ర్యంబకుడు, పినాకి, శీలాన్ని బట్టి సిద్ధులు, పరువాన్ని బట్టి సాధ్యులు పుట్టారు. దేవతల గణం– ఋభువులు, మరుత్తులయ్యారు.ఆదిత్యులు– క్షత్రియులు; మరుత్తులు–వైశ్యులు. అంగిరసులు బ్రాహ్మణులు; అశ్వినులు–శూద్రులు.

యవక్రీతుడు, రైభ్యుడు, అర్వావసువు, పరావసువు, ఔశిజుడు, కక్షివంతుడు, బలుడు, కణ్వుడు, బర్హిషదుడు సప్తర్షులు – తూర్పుదిక్కున ఉంటారు.

ఉన్మచ విముచ, ప్రముచ, ఇధ్మవాహుడు, దృఢవ్రతుడు, స్వస్త్యాత్రేయుడు, అగస్త్యుడు –దక్షిణ దిక్కున; ఉషంగ, కవచ, ధౌమ్య, పరివ్యాధ, ఏకత, ద్విత, త్రితుడు, సారస్వతుడు –పశ్చిమ దిక్కున; ఆత్రేయ, వశిష్ఠ, కశ్యప, గౌతమ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్నులు –ఉత్తరదిక్కున ఉంటారు. వీరంతా సాక్షీభూతులు.

## అంతర్భూమి విక్రీడనం (అనుస్మృతి)

నారదుడు అడిగితే విష్ణువు ఉపదేశించిన మంత్రాలు–

**"ఓం నమో భగవతే వాసుదేవాయ"**
**"ఓం నమో నారాయణాయ"**

అనే మంత్రాలను జపిస్తూ అనుస్మృతిలోనివి మననం చేస్తూ ఉండడం అనుస్మృతి.

**ఓం నమో భగవతే తస్మై దేహినాం పరమాత్మనే**
**నారాయణాయ భక్తానామ్ ఏకనిష్ఠాయ శాశ్వతే** (శాంతి. 209-30)

వరాహ రూపంలో రాక్షసులను సంహరించాడు విష్ణుదేవుడు.

**ఏ తస్మిన్నంతరే విష్ణుః వారాహం రూపమాస్థితః**
**ఉదతిష్ఠన్మహాబాహో స్తూయమానో మహర్షిభిః** (శాంతి. 209-30)

## వార్ష్ణేయాధ్యాత్మ కథనం

దీపం నుండి వేలకొద్దీ ఇతర దీపాలు ప్రభవించినట్లు ప్రకృతి అనంతమైన పదార్థాలను సృష్టిస్తుంది కాని క్షీణించిపోదు.

అవ్యక్తం → బుద్ధి → అహంకారం → పంచభూతాలు – ఈ ఎనిమిది మూల ప్రకృతులు; అయిదు జ్ఞానేంద్రియాలు (చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు), అయిదు కర్మేంద్రియాలు (పాదాలు, పాయువు, ఉపస్థ, చేతులు, వాక్కు), అయిదు విషయాలు (శబ్ద స్పర్శ రూప రస గంధాలు), మనస్సు – 16 వికృతులు (తత్త్వాలు).

**నవద్వారం పురం పుణ్యమ్ ఏతైర్భావైః సమన్వితమ్**
**వ్యాప్య శేతే మహానాత్మా తస్మాత్పురుష ఉచ్చతే** (శాంతి. 210-37)

ఎనిమిది మూల ప్రకృతులు, 16 వికృతులతో కూడిన 24 పదార్థాలు, తొమ్మిది ద్వారాలు గల పురంలో శయనించేవాడు పురుషుడు. ఇతడు జీవాత్మ 25వ వాడు; 26వ వాడు పరమాత్మ. జీవాత్మ-పరమాత్మ అభేద భేదాల వల్ల సాంఖ్య తత్త్వాలు-25; యోగ తత్త్వాలు-26.

చిన్న రావిగింజలో దాగి ఉన్న మహావృక్షంలా అవ్యక్తం నుంచి పుట్టిన జగత్తు వ్యక్తమై కనిపిస్తుంది. అయస్కాంతం చేత ఇనుము ఆకర్షింపబడినట్లు ఇతర గుణాలు శరీరం వేపు ఆకర్షింపబడతాయి. నువ్వులను గానుగలో వేసి తెలికలవాడు నూనెను తీసినట్లు జగత్తు భోగాల గానుగ అనే సంసార చక్రంలో తిప్పబడుతున్నది. జ్ఞానమనే అగ్నిలో వేగిన జీవులు తిరిగి ఈ లోకంలో పుట్టవు. నిష్కామ కర్మ ద్వారా ముక్తిని పొందుతాయి.

స్త్రీలు ప్రకృతి క్షేత్రభూతమయినవారు. పురుషులు క్షేత్రజ్ఞులు. రాగమోహాలతో వారు మనసును దారి తప్పిస్తారు.

పరమాత్మ, దృశ్యవర్గం, ప్రకృతి, పురుషుడు వీటి గురించి తెలుసుకున్నవాడు జ్ఞాని. ప్రవృత్తి పునరావృత్తిని, నివృత్తి పరమగతిని కలిగిస్తాయి.

జగత్తు అంతా తృష్ణతో బంధింపబడి చక్రంలా తిరుగుతున్నది. తామరతూడులోని దారాలు తూడు అంతటా వ్యాపించి ఉన్నట్లు తృష్ణా తంతువు దేహమంతటా వ్యాపించి ఉంటుంది. విష్ణు స్వరూపాన్ని మనసులో నిలుపుకుని ఈ తృష్ణా తంతువులను తెంపివేయడం ద్వారా పరమానందభరితమైన పరమపదాన్ని పొందుతారు జ్ఞానులు.

## పాఖండ ఖండనం

మిథిలా నగరానికి జనక వంశం వాడైన జనదేవ రాజు పాలిస్తూ ఉన్నపుడు- పంచశిఖుడనే మహర్షి చెప్పిన విషయాలు జాగ్రత్తగా విన్నాడు-

**యథార్ణవ గతాః నద్యః వ్యక్తీర్జహతి నామ చ**
**నదాశ్చ తా నియచ్ఛంతి తాదృశః సత్త్వ సంక్షయః** (శాంతి. 219-42)

నదీ నదాలు సముద్రంలో కలిసి తమ పేర్లను వ్యక్తిత్వాన్ని కోల్పోనట్లు జీవాత్మలు పరమాత్మలో లీనమవుతాయి.

పంచశిఖుడి మాటలను అర్థం చేసుకున్న జనదేవుడు అనుకున్నాడు- మిథిలా నగరం మండుతున్నా నాకేమీ దుఃఖం కలుగదు.

భగవంతుడతడిని పరీక్షింపదలచి మిథిలా నగరాన్ని అగ్నితో దహించివేసాడు. రాజు ఏమాత్రం చలించలేదు.

"నావద్ద ఆత్మజ్ఞానమనే అనంత ధనమున్నది"-

**అనంతంబతమే విత్తం భావ్యం మే నాస్తి కించన**
**మిథిలాయాం ప్రదీప్తాయాం నమే కించన దహ్యతే** (శాంతి. 219-50)

-"మిథిల తగలడుతున్నా నాకు బాధగా అనిపించడం లేదు".

పంచశిఖుడు శ్రీహరిని వేడి మిథిలను యధాపూర్వకంగా చేసాడు. విష్ణుమూర్తి జనదేవుడికి ప్రత్యక్షమై అతడిని ఆశీర్వదించినాడు.

## శ్వేతకేతు - సువర్చల

దేవలుడి కుమార్తె సువర్చల. ఆమె యుక్తవయస్కురాలయ్యింది. తండ్రితో అన్నది- "అంధుడై కూడా కళ్లున్నవాడికి నన్ను ఇవ్వు". ఆమె అందచందాలను చూసి మునులు, ముని పుత్రులు వచ్చారు కాని ఆమెకు సరైన సమాధానం ఇవ్వలేదు.

ఉద్దాలకుని కుమారుడు శ్వేతకేతువు వచ్చి సువర్చలతో అన్నాడు- "పరమాత్మ చక్షువుతో నేను ఆత్మజ్ఞానపు లోకం చూస్తున్నాను. నాకు ఈ కళ్లున్నాయి కాని అంధుడనే. లోకదృష్టితో నిత్య నైమిత్తికాది కర్మలను చేస్తున్నాను. ఆత్మదృష్టితో అన్నింటా నిర్లిప్తుడను".

శ్వేతకేతువుకు సువర్చలకు వివాహం జరిగింది. వారిద్దరు ఆత్మజ్ఞానం కలిగినవారు. సర్వ ప్రాణులలోనూ పరమాత్మ జీవాత్మగా ఉంటాడని తెలిసినవారు. హాయిగా చాలాకాలం జీవించి పరమగతిని పొందారు.

## దమ ప్రశంస

నిగ్రహం తేజస్సును పెంచుతుంది. నిగ్రహం గలవాడు పాపరహితుడు నిర్భయుడిగా మహాపదాన్ని పొందుతాడు.

**సుఖః దాంతః ప్రస్వపితి సుఖం చ ప్రతిబుధ్యతే**
**సుఖం లోకే విపర్యేతి మనశ్చాస్య ప్రసీదతి** (శాంతి. 220-5)

నిగ్రహవంతుడు సుఖంగా నిద్రిస్తాడు. సమస్త ప్రాణులకు పూజనీయుడవుతాడు. తన పుణ్యకర్మల మహాఫలాన్ని పొందుతాడు.

## అమృత ప్రాశనికము

తన కుటుంబ సభ్యులు, సేవకులు, అతిధులు భుజించిన తరువాత తాను తినేవాడు అమృతభోజనుడు. దేవతలు, పితరులు, తల్లిదండ్రులు, భృత్యులు, అతిధులు భోజనం చేయగా మిగిలిన దానినే భుజించేవాడు విఘశాసనుడు; భృత్యశేషం-విఘసం; యజ్ఞ శేషం-అమృతం.

## ప్రహ్లాదుడు - ఇంద్రుడు

విభాండకుడు, ఇతర మునులు సమావేశమై ఉన్నపుడు సనత్కుమారుడన్నాడు- పరమాత్మ సర్వ యుగవ్యాపి, ప్రపంచం కన్న భిన్నమైనవాడు, తానే ధ్యాత, తానే ద్రష్ట, తానే విచారకుడు, కనిపించే వస్తువులను గ్రహించేది తానే. సమస్త లోక స్రష్ట, అనంతుడు పరమాత్మ.

ఇంద్రుడొకసారి ప్రహ్లాదుడితో అన్నాడు- పదవిని కోల్పోయావు, పాశాలతో బంధింపబడ్డావు. స్థానభ్రష్టుడవయ్యావు. సంపదను కోల్పోయావు. శత్రువులకు వశమయ్యావు. అయినా దుఃఖించవు, ఎలా?

ప్రహ్లాదుడన్నాడు- ప్రాణులు అనిత్యాలని ఎరుగుదును. ఇదంతా నశించేదే కాబట్టి దేని గురించీ శోకించను. ప్రకృతి మీద కాని, ప్రకృతి వికారాల మీద కాని నాకు రాగద్వేషాలు లేవు. నాకు శత్రువులూ లేరు, ఆత్మీయులూ లేరు. నాకు ఏ కోరికలూ లేవు.

ఋజుత్వం, జాగరూకత, ప్రసన్నత, చిత్తస్థైర్యం, వృద్ధసేవ వలన నేను శాంతిగా జీవిస్తున్నాను -అన్నాడు ఇంద్రుడితో ప్రహ్లాదుడు.

## బలి - ఇంద్రుడు

బ్రహ్మనడిగాడు ఇంద్రుడు– బలి నివాసమెక్కడ?

బ్రహ్మ అన్నాడు– శూన్యమైన ఏ ఇంటిలో ఒంటెగాని, ఆవు గాని, అశ్వం గాని, గాడిద గాని ఉంటుందో అదే బలి నివాసం.

ఇంద్రుడన్నాడు– అతడిని చంపేయవచ్చా?

బ్రహ్మ అన్నాడు– చంపరాదు. కావాలంటే నీ సందేహాల నివృత్తి చేసుకో.

ఇంద్రుడికి ఒక శూన్యగృహంలో గాడిద రూపంలో ఉన్న బలి చక్రవర్తి కనిపించాడు, పొట్టు తింటూ–

ఇంద్రుడన్నాడు– ఒకప్పుడు అంగరంగ వైభోగంగా వెలిగినవాడివి, ఇప్పుడు గాడిదవై పొట్టు తింటున్నావా?

బలి అన్నాడు– ఈ లోకంలో అన్నీ అనిత్యాలే. నా పతనాన్ని గురించి నాకు చింతలేదు. సర్వ ప్రాణులకూ కాలమే గతి. అప్పుడు నా ప్రభుత్వమున్నపుడు నీవు దైన్యస్థితి నొంది, వామనుడు త్రివిక్రముడు కాగా ఉద్ధరించబడినావు కాదా!

ఇంద్రుడన్నాడు– నీ నుంచి నిష్క్రమిస్తున్న ఆ దివ్యమూర్తి ఎవరు?

ఆమె అన్నది– నేను శ్రీని, దుస్సహ, విధితని, భూతి, లక్ష్మి నా పేర్లు.

ఇంద్రుడన్నాడు– విరోచనుని కుమారుడు, ప్రహ్లాదుడి మనమడైన బలిని వీడి ఎందుకు వెళ్తున్నావు?

ఆమె అన్నది– సత్యం, దానం, వ్రతం, తపస్సు, పరాక్రమం, ధర్మం ఉన్నచోట నేనుంటాను. బలి వాటిని కోల్పోయాడు. అందుకే వెళ్లిపోతున్నాను.

ఇంద్రుడన్నాడు– నీవు నాలుగు భాగాలుగా ఉండు. ఒక పాదాన్ని భూమిపై, రెండవ దానిని జలాలపై, మూడవ పాదాన్ని అగ్నిపై, నాలుగవ పాదాన్ని సజ్జనులపై ఉంచు. వారే నిన్ను భరించగల సమర్థులు.

బలి చక్రవర్తి అన్నాడు– సూర్యుడు పశ్చిమానికి వెళ్లకుండా మధ్యాహ్న వేళలలో నిలిచినప్పుడు దేవాసుర సంగ్రామం జరుగుతుంది. అప్పుడు నిన్ను నేను ఓడిస్తాను.

ఇంద్రుడన్నాడు– బ్రహ్మ నిన్ను చంపవద్దన్నాడు. లేకుంటే వజ్రాయుధాన్ని ప్రయోగించేవాడిని.

బలి అన్నాడు– కాలం, విధి అన్నీ నిర్ణయిస్తాయి. నీ కనుకూలమయినది నీవు చేయి–

–అని పలికి బలి దక్షిణ దిక్కుకు, ఇంద్రుడు ఉత్తర దిక్కుకు వెళ్లిపోయారు.

## ఇంద్రుడు - నముచి

నముచి రాజ్యాన్ని కోల్పోయి దీనస్థితిలో ఉన్నపుడు ఇంద్రుడడిగాడు– ఈ స్థితిలో దుఃఖపడుతున్నావా, లేదా?

నముచి అన్నాడు– ఈ ప్రపంచమంతా నశించేదే. శోకం వలన రూపం, సంపద, ఆయుస్సు నశిస్తాయి. ధర్మం కూడా క్షీణించే శోకాన్ని త్యజించి పరమాత్మను నమ్ముతాను నేను. పరమాత్మ ప్రేరణ ఎలా ఉంటే అలా పనిచేస్తూ ఉంటాను నేను.

**–యథా యథాస్య ప్రాప్తవ్యం ప్రాప్నోత్యేవ తథా తథా**
**భవితవ్యం యథాయచ్చ భవత్యేవ తథా తథా–**

ఏది ఎలా లభించవలసి ఉంటే అది అలా లాభిస్తుంది. మనిషి ప్రారబ్ధాన్ని బట్టి పొందవలసిందే పొందుతాడు. చేరవలసిన చోటుకే చేరతాడు. దుఃఖమైనా సుఖమైనా పొందవలసినదే పొందుతాడు. ఇదంతా తెలిసి మోహానికి లోను కానివాడే ఉత్తముడు.

## బలి - ఇంద్రుడు

బలి అన్నాడు- వజ్రాయుధం ఎత్తి నన్ను సంహరించాలనుకున్నావు. ఇప్పుడు ఇది నీ కాలం. కాలమే నాకు చెడ్డరోజులు కల్పించింది. కాలం వలననే నన్ను నీవు గెలిచావు. కాలం వలననే నన్ను నీవు ఓడించావు. నడిపించేది, చంపేదీ కాలమే!

**బహూనీంద్ర సహస్రాణి దైవతానాం యుగే యుగే**
**అభతీతాని కాలేన కాలోహి దురతి క్రమః** (శాంతి. 227-41)

యుగయుగంలో వేలాది ఇంద్రులు కాలంలో కలిసిపోయారు. కాలాన్ని అతిక్రమించడం కష్టం. కాలం శక్తివంతమైనది.

## శ్రీ - శక్రుడు (లక్ష్మి - ఇంద్రుడు)

నారదుడు, ఇంద్రుడు గంగా స్నానం చేసి వస్తుంటే వారికి దివ్యకాంతల సమూహం మధ్య కాంతులీనుతూ లక్ష్మీదేవి వారిని సమీపించి అన్నది-

నేను పద్మాలయను, పద్మ, లక్ష్మి, శ్రీ, సంపద, శ్రద్ధ, మేధ, సంనతి, విజితి, స్థితి, ధృతి, సిద్ధి, కాంతి, స్వాహా, స్వధా, సంస్తుతి, నియతి, స్మృతిని నేను.

దైత్యులు ధర్మాన్ని పాటించినంతకాలం నేను వారితో ఉన్నాను. తొలుత దైత్యదానవులు దానం, అధ్యయనం, అతిథి పూజ, సత్యధర్మాలతో ఉండేవారు. నిద్ర, ఆలస్యం, అసంతృప్తి, అసూయ, అవివేకం, అనాసక్తి, విషాదం, కోరిక వారిలో ఉండేవి కావు. అప్పుడు నేను వారిలో యుగాలపాటు నివసించాను.

కాలం గడచినకొద్దీ వారిలో మార్పు వచ్చింది. ధర్మకార్యాలు మానేసి హింసా ప్రవృత్తిలో మెలుగుతున్నారు. అట్టిచోట నేనుండలేను.

నేనున్న చోటునే ఏడుగురు లక్ష్ములు ఉంటారు- ఆశ, శ్రద్ధ, ధృతి, శాంతి, విజితి, సన్నతి, క్షమ. ఈ ఏడుగురికి ముందు నిలుస్తుంది వృత్తి (జయలక్ష్మి).

ఆ దివ్యమూర్తి పలుకులు విన్న ఇంద్రుడు ఆమెను దేవతలలో ఉండమని ప్రార్థించాడు. ఆమె అంగీకరించింది. ఇంద్రుడి పాలన దివ్యంగా సాగింది.

**న జాత్వ కాలే కుసుమం కుతః ఫలః**
**పపాత వృక్షాత్ పవనేరి తాదపి**
**రసప్రదాః కామదుఘాశ్చ ధేనవః**
**న దారుణా వాగ్ విచచార కస్య చిత్** (శాంతి. 228-94)

ఇంద్రుడి ధర్మపాలనలో ముల్లోకాలు సుఖ సంతోషాలతో నిండాయి.

## జైగీషవ్య - అసిత దేవతల సంవాదం

ధర్మరాజు భీష్ముడిని అడిగాడు-

**కిం శీలః కిం సమాచారః కిం విద్యః కిం పరాక్రమః**
**ప్రాప్నోతి బ్రహ్మణః స్థానం యత్పరం ప్రకృతేర్ధ్రువమ్** (శాంతి. 229-1)

మానవుడు ఏ స్వభావంతో, ఏ నడవడితో, ఏ చదువుతో, ఏ పరాక్రమంతో ప్రకృతిని దాటి శాశ్వతమైన బ్రహ్మ పదాన్ని పొందగలడు?

భీష్ముడు చెబుతున్నాడు- జైగీషవ్యుడనే ముని అసిత దేవలుడితో అన్నాడు- ప్రశంసా నిందలను సమానంగా భావించేవాడు, కీడు చేసినా మేలు కోరేవాడు, క్రోధాన్ని జయించినవాడు, అవమాన-సమ్మానాలను ఒకే రీతిగా చూసేవాడు, దొరకని దానికి బాధపడక, దాటిపోయిన దానికై శోకించనివాడు, సర్వకర్మలను పరిత్యజించి జితేంద్రియుడైనవాడు బ్రహ్మపదాన్ని పొందుతాడు.

**నిందా ప్రశంసే చాత్మర్థం న వదంతి పరస్యయే**
**న చ నిందా ప్రశంసాభ్యాం విక్రియంతే కదాచన** (శాంతి. 229-14)

## వాసుదేవ - ఉగ్రసేన సంవాదం

అందరికీ ఇష్టుడై, అందరినీ ఆనందింపజేస్తూ, సమస్త గుణాలతో కూడిన మానవుడు ఎవరు? -అని ధర్మరాజు అడుగగా భీష్ముడు- ఉగ్రసేన, వాసుదేవుల మధ్య జరిగిన సంభాషణ గురించి చెప్పాడు-

నారదుడు నిరహంకారి. ఆధ్యాత్మ తత్త్వవేత్త, సహనశీలి, సమర్థుడు, జితేంద్రియుడు, ఋజు వర్తనుడు, సత్యవాది, ఈర్ష్యా రహితుడు, ఆదరణీయుడు, పవిత్రుడు.

**లోకస్య వివిధం చిత్తం ప్రేక్షతే చాప్య కుత్సయన్**
**సంసర్గ విద్యాకుశలః తస్మాత్సర్వత్ర పూజితః** (శాంతి. 230-19)

ఏ శాస్త్రాన్నీ నిందించనివాడు, కాలాన్ని వృథా చేయడు, ఇతరుల కళ్యాణ కార్యాల్లో నియుక్తుడు - అందువలన అంతటా పూజింపబడుతున్నాడు.

## శుకుడు - వ్యాసుడు

వ్యాసుడు చెబుతున్నాడు శుకుడితో 'కాలం' గురించి- 15 నిమేషాలు (కనురెప్పపాటు) 1 కాష్ఠ; 30 కాష్ఠలు- 1 కల, 30 కలలు ముహూర్తం; 30 ముహూర్తాలు ఒకరోజు. ముప్పది రోజులు - 1 నెల; 12 నెలలు ఒక సంవత్సరం. ఉత్తరాయనం దక్షిణాయనం కలిస్తే ఒక సంవత్సరం.

మానవ గణనలోని ఒక నెల పితరులకు ఒక రోజు. శుక్లపక్షం వారికి కర్మకాలం; కృష్ణపక్షం-నిద్రాకాలం (రాత్రి).

మానవ గణనలోని ఒక సంవత్సరం దేవతలకు ఒకరోజు. ఉత్తరాయనం వారికి పగలు, దక్షిణాయనం రాత్రి.

కృతయుగం (దేవగణన)-4800 (400+4000+400) - సంధ్యాంశాలతో కలిపి; త్రేతాయుగం 3600 (300+3000+300) సంవత్సరాలు; ద్వాపర యుగం - 2400 (200+2000+200); కలియుగం-1200 (100+1000 +100) (సంధ్య+యుగం+సంధ్యాంశం)

కృతయుగంలో ఆయుర్దాయం 400 దేవ సంవత్సరాలు, త్రేతాయుగంలో 300, ద్వాపరంలో, కలియుగంలో చాలా తగ్గుతుంది. కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో ధర్మం; ద్వాపరయుగంలో యజ్ఞం; కలియుగంలో దానం గొప్పవి.

12,000 సంవత్సరాలు చాతుర్యుగం; వేయి చతుర్యుగాలు బ్రహ్మకు ఒక పగలు; వేయి చతుర్యుగాలు- ఒక బ్రహ్మరాత్రి. దినారంభంలో విశ్వసృష్టి - రాత్రి ప్రళయకాలం - నిద్రా సమయం - అవ్యక్తం - మహత్తు - మనస్సు - సప్తర్షులు - మనస్సు → ఆకాశం → వాయువు → అగ్ని → జలం → భూమి.

దశేంద్రియాలు, పంచ మహాభూతాలు, మనసు- 16 తత్త్వాలకు ఆశ్రయమైనది శరీరం. శరీరం ఏర్పడినాక ప్రారబ్ద కర్మతోపాటు సూక్ష్మభూతాలు దానిలో ప్రవేశిస్తాయి.

కాలమే ప్రాణులకు సంయమ నియమాలను కలిగిస్తుంది. కాలమే వాటి ఉత్పత్తికి స్థానం.

## ప్రళయం

ప్రళయకాలంలో పైనుండి సూర్యుడూ, క్రింది నుండి ఏడు అగ్నిజ్వాలలు విశ్వాన్ని దహిస్తాయి. పృధివిలోని చరాచర భూతాలు దహించబడి భూమి తాబేలు వీపులా కానవస్తుంది. భూమి గంధహీనమై జలంలో కలిసిపోతుంది. జలం అగ్నిలో, అగ్ని వాయువులో, వాయువు ప్రచండమైన ఆకాశంలో కలుస్తుంది. వ్యక్తమైన మనస్సు, అవ్యక్తమైన మహత్తు బ్రహ్మ మనస్సులో లయమవుతాయి. ఇది బ్రహ్మ ప్రళయం. చంద్రుడు మనస్సును కబళిస్తాడు. చంద్రుడిని సంకల్పం, సంకల్పాన్ని బుద్ధి మింగుతాయి. కాలం విజ్ఞానాన్ని, బలం కాలాన్ని, బలాన్ని మహాకాలం, మహాకాలాన్ని పరబ్రహ్మ తమ అధీనంలోకి తెచ్చుకుంటాయి. మరల అవ్యక్త పరబ్రహ్మలో సృష్టి విస్తార విలయాలు జరుగుతాయి.

## బ్రాహ్మణ కర్తవ్యము - దాన మహిమ

బ్రాహ్మణుడు సంతానాన్ని పొంది పితృఋణాన్ని, శ్రోత్రియుడై ఋషి ఋణాన్ని, యజమానియై దేవ ఋణాన్ని తీర్చుకోవాలి. తపస్సు, స్వాధ్యాయం, యాగాలు, దానాల వల్ల అతడి కీర్తి వర్ధిల్లుతుంది.

ఎందరో మహరాజులు, శిష్టులు బ్రాహ్మణులకు దానాలు చేసి ఉత్తమ గతులను పొందినారు. సత్యసంధుడు, రంతిదేవుడు, శిబి, ఇంద్రదమనుడు, ప్రతర్ధనుడు, దేవావృధుడు, అంబరీషుడు, జనమేజయుడు, యువనాశ్వుడు, నిమి, పరశురాముడు, గయుడు, మరుత్తుడు, బ్రహ్మదత్తుడు, మిత్రసహుడు, సహస్రజిత్తు, శతద్యుమ్నుడు, ద్యుతిమంతుడు, లోమపాదుడు, మదిరాశ్వుడు, ప్రసేనజిత్తు -వీరందరూ దాన ధర్మాలు చేసి కీర్తి గడించారు.

**తేషాం ప్రతిష్ఠితా కీర్తిః యావత్ స్థాస్యతి మేదినీ**
**దానయజ్ఞ ప్రజాసర్గైః ఏతేహి దివమాప్నువన్** (శాంతి. 234-38)

భూమి ఉన్నంత కాలం వారి కీర్తి స్థిరంగా ఉంటుంది. దానాలు, యజ్ఞాలు, సంతానోత్పాదనం వలన వీరు స్వర్గానికి చేరారు.

బ్రాహ్మణుడు వేదోక్తమైన త్రయీవిద్య (అ-ఉ-మ) ఓంకార సంబంధమైన ప్రణవ విద్యను అధ్యయనం చెయ్యాలి. షట్కర్మలు: యజన-యాజన, అధ్యయన-అధ్యాపన, దాన-ప్రతిగ్రహాలు నిర్వర్తించాలి. పంచ మహాయజ్ఞాలు- దేవ, పితృ, భూత, మనుష్య, బ్రహ్మ యజ్ఞాలు చేసి ఋణం తీర్చుకోవాలి.

**ఉపపన్నం హి యత్ప్రాజ్ఞః నిస్తరేన్నేతరో జనః**
**దూరతో గుణదోషౌ హి ప్రాజ్ఞః సర్వత్ర పశ్యతి** (శాంతి. 235-19)

గుణ దోషాలు ముందుగానే చూడగల ప్రాజ్ఞుడు కాలనదిని దాటుతాడు.

## ధ్యాన-యోగ-సాంఖ్య నిరూపణం

ద్వాదశ యోగాలు- దేశం, కర్మ, అనురాగం, అర్థం, ఉపాయం, అపాయం, నిశ్చయం, చక్షువు, ఆహారం, సంహారం, మనస్సు, దర్శనం - యోగి వీటి సాయంతో ధ్యానాన్ని అభ్యసించాలి. ఈ యోగమొక అందమైన రథం. దీనిపై ఆసనం-ధర్మం, బిడియమే ఆవరణ; ఉపాయాపాలు-నొగళ్లు; ప్రాణవాయువు-కాడి; బుద్ధి-ఆయువు; జీవుడు-బంధనం; చైతన్యమే కిరీటం; సదాచారం-రథనేమి; నేత్రం, చర్మం, నాసిక, చెవులు-వాహనాలు; ప్రజ్ఞ-నాభి; సర్వశాస్త్రాలు-కొరడా; జ్ఞానం-సారధి; జీవుడు-రధికుడు; శ్రద్ధాదమాలు-రక్షకులు; త్యాగం వెన్నంటి నడిచే ఈ రథం ధ్యానమార్గాన నడుస్తుంది.

సాధకుడు వాక్కును నియంత్రించి నేల, నీరు, నిప్పు, వాయు, నింగి, బుద్ధి, అహంకార రూపాలైన సప్త ధారణలను గంధ రస రూప స్పర్శ శబ్ద, అహంవృత్తి, నిశ్చయాలతో సంధించి సప్త ధారణలపై అధికారాన్ని పొంది ధ్యానం ద్వారా బ్రహ్మపదాన్ని పొందగలడు.

స్థూల దేహంపై అభిమానాన్ని వీడిన యోగికి సూక్ష్మరూపాలు దర్శనమిస్తాయి. ప్రారంభంలో పృధివి-ఒక మంచు తెరలా, తరువాత జలంలా, అగ్నిలా, వాయువులా, నీలాకాశంలా - అసమానమైన శక్తిని పొందుతాడు యోగి. పంచభూతాలు వశమైనాక అహంకారం, బుద్ధిపై నియంత్రణను సాధించి యోగి వ్యక్తం నుంచి అవ్యక్తంలోకి వెళ్లి కలిసిపోతాడు.

సాంఖ్యతత్త్వాలు-మూల ప్రకృతి, మహత్తు, అహంకారం, మనస్సు, అయిదు పంచ తన్మాత్రలు, అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, పంచ మహాభూతాలు, పురుషుడు (25).

యోగతత్త్వాలు- పంచ మహాభూతాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచ తన్మాత్రలు, మనస్సు, అహంకారం, మూల ప్రకృతి, పురుషుడు (25) - 26 పరమాత్మ.

పుట్టుట, పెరుగుట, శిథిలమగుట, మరణించుట -ఈ నాలుగు లక్షణాలు కలది వ్యక్తం; అవ్యక్తం- రెండు విధాలు- జీవాత్మ, పరమాత్మ. వ్యక్తాన్ని క్షేత్రమని (సత్త్వం), అవ్యక్తాన్ని క్షేత్రజ్ఞుడని అంటారు. విషయ విముక్తుడైన జీవుడు నివృత్తి పొందితే మోక్షం లభించడానిని సాంఖ్యపద్ధతిగా భావిస్తారు.

యోగం వలన లభించిన సంపదలను దాటినవాడు ముక్తుడు.

ప్రజ్ఞ (బుద్ధి) అర్థాన్ని, శుభాలను ఇస్తుంది. పెద్ద, చిన్న భేదాలు బుద్ధి వలన ఏర్పడినవే. ప్రాణులకు విద్యయే ఉత్తమ గతి. ప్రాణులు– జరాయుజ, అండాయుజ, ఉద్భిజ, స్వేదజాలు.

ప్రాణులు– స్థావరాలు, జంగమాలు; జంగమాలలో రెండు కాళ్ల జంతువులు– పక్షులు, మానవులు; చాలా కాళ్లున్నవి– ఇతర జంతువులు. రెండుకాళ్ల ప్రాణులు– పార్థివాలు (మనుష్యులు), అపార్థివాలు (పక్షులు). పార్థివాలలో ధర్మమెరిగిన ప్రాణులు, వారిలో వేదజ్ఞులు, వేదజ్ఞులలో ప్రవక్తలు, ప్రవక్తలలో అనాత్మజ్ఞులకన్నా ఆత్మజ్ఞులు శ్రేష్ఠులు. ధర్మం ప్రవృత్తి, నివృత్తి అని రెండు విధాలు. రెంటిని తెలిసినవాడు సర్వజ్ఞుడు. శబ్ద బ్రహ్మ (వేదం) నిష్ణాతుడై పరబ్రహ్మ జ్ఞానమున్నవాడే బ్రాహ్మణుడు.

జీవాత్మ–పరమాత్మల గురించి తెలిసినవారు జ్ఞానులు. వారే ద్విజులు. వారు జన్మ, కర్మ, మృత్యువును అధిగమించి చతుర్విధ ప్రాణులకూ అధీశ్వరులౌతారు.

**ఆద్యంతే నిధనం చైవ కర్మ చాతీత్య సర్వశః**
**చతుర్విధ స్య భూతస్య సర్వస్యేశాః స్వయంభువః** (శాంతి. 237–25)

## జ్ఞాన సాధన - జ్ఞాన మహిమ

విద్య, తపస్సు, సర్వసంగ పరిత్యాగం, ఇంద్రియ నిగ్రహములున్నవాడు సిద్ధిని పొందుతాడు. పరమాత్మను కంటితో చూడలేము. మనస్సనే దీపంతో పరమాత్మ ప్రకాశిస్తాడు. ఆత్మ తనయందున్నట్లే అందరిలోనూ ఉన్నదని ఎరుక కలిగినవాడు అమృతత్వాన్ని పొందుతాడు. ఆకాశంలో పక్షిజాడలు, నీటిలో చేప జాడలు కనిపించనట్లే జ్ఞానుల గమనం ఎవ్వరికీ అంతుపట్టదు.

**కాలః పచతి భూతాని సర్వాణ్యే వాత్మనాత్మని**
**యస్మింస్తు పచ్యతే కాలః తం వేదేహ న కశ్చన** (శాంతి. 239–25)

కాలం సమస్త ప్రాణులను తనలో పక్వం చేసుకుంటుంది.

సూక్ష్మమయిన పరమాత్మ కన్నా సూక్ష్మమైనది లేదు. స్థూలతరమైనదీ లేదు.

**తదే వాణోరణుతరం తన్మహద్భ్యో మహత్తరమ్**
**తదం తః సర్వభూతానాం ధ్రువం తిష్ఠన్న దృశ్యతే** (శాంతి. 239–30)

ఆత్మకు రెండు స్థితులుంటాయి– క్షరము, అక్షరము. జీవులలో ఉండేది జీవాత్మ; ఇది పరమాత్మ అంశ – దీనిని 'హంస' అంటారు.

హంస ఎగిరి పరమాత్మలో కలవడం ముక్తి. యోగి ఇంద్రియాలను నిశ్చలంగా నిలిపి పరమాత్మ అనుభవాన్ని పొందుతాడు. ఆ పరమాత్మ అజుడు, పురాతనుడు, అజరుడు, సనాతనుడు, నిత్యముక్తుడు, అణువుకన్నా అణువు, పెద్దవాటికన్నా పెద్ద.

కర్మ ప్రాణిని బంధిస్తుంది; జ్ఞానం విముక్తినిస్తుంది.

**బ్రహ్మచారీ గృహస్థశ్చ వానప్రస్థో థ భిక్షుకః**
**యథోక్త చారిణః సర్వే గచ్ఛంతి పరమాంగతిమ్** (శాంతి. 242–13)

బ్రహ్మచారి అయినా, గృహస్థుడైనా, వానప్రస్థుడైనా, సన్యాసి అయినా తనకు నిర్దేశించిన ధర్మాలను పాటిస్తే పరమగతిని పొందుతాడు.

## నాలుగు ఆశ్రమాలు

ఆయుస్సులో మొదటి భాగం– బ్రహ్మచారి; రెండవభాగం– గార్హపత్యం (గృహస్థ); మూడవ భాగం– వానప్రస్థం (అరణ్యవాసం); నాలుగవ భాగం– సన్యాసం.

త్రిగుణాలు- సత్త్వ రజ తమో గుణాలు.

సత్త్వ గుణం - హర్షం, ప్రేమ, ఆనందం, సమత్వం, ప్రశాంత చిత్తత

రజోగుణం- అభిమానం, అసత్యభాషణం, లోభం, మోహం, అసహనం.

తమో గుణం- మోహం, అసావధానత, నిద్ర, అలసత్వం, అజ్ఞానం.

నిష్కామ భావనలతో కర్మలను అనుష్ఠానం చేస్తే పురాకృతాలైన శుభాశుభ కర్మలను కూడా అది నశింపచేస్తుంది. పొగలేని నిప్పులా ప్రకాశించే ఆ పరమాత్మను జ్ఞానదీపంతో చూడవచ్చు.

**సర్వాత్మానామ్ మహాత్మానం విధూమ మివ పావకమ్**
**తం పశ్యంతి మహాత్మానః బ్రాహ్మణాయే మనీషిణః** (శాంతి. 250-7)

ఆ పరమాత్మను చూడదలుచుకున్నవాడు కామబంధన ముక్తుడు కావాలి.

**తపసోప నిషత్త్యాగం త్యాగస్యోపనిషత్ సుఖమ్**
**సుఖస్యోపనిషత్స్వర్గం స్వర్గస్యో పనిషత్ శమః** (శాంతి. 250-12)

తపస్సారం త్యాగం; త్యాగ సారం సుఖం; సుఖ సారం స్వర్గం, స్వర్గ సారం శాంతి.

**కారణం పరమం ప్రాప్య అతిక్రాంతస్య కార్యతామ్**
**పునరావర్తనం నాస్తి సంప్రాప్తస్య పరం పదమ్** (శాంతి. 250-24)

పరబ్రహ్మను పొందిన జ్ఞానికి పునర్జన్మ ఉండదు.

కోరిక అనబడే కామవృక్షాన్ని సమత అనే ఉత్తమ ఖడ్గంతో నరికివేస్తాడు జ్ఞాని.

## మృత్యుదేవత

అకంపనుడనే రాజు యుద్ధంలో, ఎంతో వీరుడైన తన కుమారుడు హరిని కోల్పోయాడు. తాను శత్రువులకు చిక్కాడు. ఆ సమయంలో అటువచ్చిన నారదుడు అకంపనుడి పుత్రశోకం తగ్గించడానికి మృత్యుదేవత గురించి చెప్పాడు- సృష్టికాలంలో జనసంఖ్య బాగా పెరిగి మూడు లోకాలూ స్తంభించగా బ్రహ్మలో క్రోధం పెరిగి లోకాలు తగలబడుతుంటే స్థాణుడు (పరమేశ్వరుడు) బ్రహ్మను శాంతపరచాడు. స్థాణుడి కోరికపై బ్రహ్మ జనన మరణ వ్యవస్థను ఏర్పాటు చేసాడు. అప్పుడు బ్రహ్మ నుండి వెలువడింది ఓ స్త్రీమూర్తి; నల్లని, ఎర్రని వస్త్రాలను ధరించి ఉన్నది. కళ్లు పైన లోన ఎర్రగా ఉన్నాయి.

**కృష్ణ రక్తాంబరధరా కృష్ణ నేత్ర తలాంతరా**
**దివ్యకుండల సంపన్నా దివ్యాభరణ భూషితా** (శాంతి. 257-16)

బ్రహ్మ ఆమెను 'మృత్యూ' అని పిలిచి ప్రాణ సంహారం చేయమన్నాడు. ఆమె దుఃఖించగా ఆమె కన్నీటిని దోసిలిలో పట్టి బ్రహ్మ వాటిని వ్యాధులుగా మార్చాడు. ఆమెతో అన్నాడు- నీవు సమవర్తివి. నీకే పాపం అంటదు. వారివారి పూర్వజన్మల ననుసరించి అవి వారిని పీడిస్తాయి.

నారదుడన్నాడు అకంపనుడితో- రాజా! నీ కుమారుడి గురించి శోకించకు. అతడు వీరస్వర్గాన్ని పొంది ఆనందంగా ఉన్నాడు.

## ధానధర్మ స్వరూప నిర్ణయం

వేదాలు, స్మృతులు, సదాచారం, అర్థం -ఇవి ధర్మ లక్షణాలు. అన్నిటిలోకి సత్యభాషణం శ్రేయస్కరం.

**సత్యస్య వచనం సాధు న సత్యా ద్విద్యతే పరమ్**
**సత్యేన విధృతం సర్వం సర్వం సత్యే ప్రతిష్ఠితమ్** (శాంతి. 259-10)

తన విషయంలో ఇతరులు చేయకూడదు అనుకున్న దానిని ఇతరుల విషయంలో తాను కూడా చేయరాదు. అందరితో ధర్మబద్ధంగా, ప్రేమపూర్వకంగా ప్రవర్తించడమే ధర్మం.

## జాజలి - తులాధారుడు

జాజలి మహా తపస్వి. స్థాణువులా నిలబడి తపస్సు చేస్తుంటే ఆయన తలపై పక్షులు గూడు కట్టుకున్నాయి. గుడ్లు పెట్టాయి, పిల్లల్ని పొదిగాయి. పిల్లలు పెరిగాయి. పొద్దున్నే పిట్టలెగిరిపోయి, సాయంకాలానికి మరలా వచ్చేవి. ఒకసారి వారం రాలేదు. ఆ తరువాత కొన్నాళ్లకు ఎగిరిపోయిన పక్షులు నెల గడిచినా రాలేదు. అప్పుడతడు నదికి పోయి స్నాన మాచరించి, సంధ్యావందనమాచరించి, అగ్నిని సంతృప్తుని చేసి, ఉదయ సూర్యుని ఉపాసించాడు. ఆ తరువాత తన తలపై పక్షులు పుట్టి పెరిగి వదలి వెళ్లిన విషయాన్ని గుర్తు తెచ్చుకుని చప్పట్లు చరుస్తూ– "నేను ధర్మాన్ని సాధించాను" అన్నాడు.

అంతరిక్షం నుంచి ఇలా వినిపించింది– "వారణాసిలో ఉన్న తులాధారుడు నీకన్నా గొప్ప ధర్మపరుడు. కాని అతడెప్పుడూ నీలా మాట్లాడలేదు".

జాజలి వారణాసి నగరానికి వెళ్లి తులాధారుడిని చూసాడు. జాజలిని చూస్తూనే తులాధరుడు అతడిని స్వాగతించి అన్నాడు– "ఆకాశవాణి పలుకులు విని అమర్షానికి లోనై ఇటు వచ్చావు, ద్విజోత్తమా, నీకై నేనేమి చేయగలను?"

జాజలి అడిగాడు– "వాణిజా! సర్వరసాలను, సర్వ గంధాలను, వనస్పతులను, ఓషధులను విక్రయిస్తూ కూడా ఈ ధర్మబుద్ధిని ఎలా సాధించావు?"

తులాధారుడన్నాడు– "నేను సర్వభూత హితాన్ని కోరుతాను. రాగద్వేషాలు లేవు. అహింసా ధర్మాన్ని పాటిస్తాను. ఇప్పుడు బ్రాహ్మణులు జంతుహింస లేని స్వయజ్ఞాన్ని వీడి యజ్ఞ పశువులను బలి ఇచ్చే క్షత్రియ యజ్ఞాన్ని చేపట్టినారు. సాత్త్వికులు హింసలేని యజ్ఞాలనే చేస్తారు. వారికి స్వర్గాభిలాష ఉండదు. బ్రహ్మపదాన్ని పొందుతారు వాళ్లు అహింసతో ఉన్న యజ్ఞాలు చేసి. కావాలంటే నీ తలపై గూడుకట్టుకున్న పక్షుల నడుగు. నీవు పిలిస్తే అవి వస్తాయి".

ఆ పక్షులు వచ్చి అన్నాయి– "అహింసతో చేసిన కర్మ ఇహపర లోకాలలో ఉత్తమ ఫలాన్ని ఇస్తుంది"

**అహింసాది కృతం కర్మ ఇహ చైవ పరత్ర చ**
**శ్రద్ధాం నిహంతి వై బ్రహ్మన్ సాహతా హంతి తం నరమ్** (శాంతి. 264-6)

## విచఖ్ను నరపాలుడు - అహింసా ప్రశంస

యజ్ఞవాటికలో గొంతు తెగి ఉన్న ఒక ఎద్దును చూసి అక్కడ ఉన్న గోవులన్నీ ఆర్తనాదం చేస్తుంటే విన్నాడు విచఖ్ను నరపాలుడు. అతడు హింసను నిషేధించాడు అప్పటి నుంచి.

సుర, చేపలు, మధువు, మాంసం, కల్లు, పులగం –ఇటువంటి పదార్థాలనన్నిటిని ధూర్తులు యజ్ఞాలలో ప్రవేశబెట్టారు. ఇది వేద విధి కాదు. పాయసం, పూలు ఇటువంటి వాటితోనే విష్ణు యజనం చేయాలి.

## గౌతముడు - చిరకారి

గౌతముడి పుత్రుడు చిరకారి. ఏ పని అయినా అతడు ధర్మాధర్మాలను ఆలోచించి చేస్తాడు. కాకపోతే పని కాస్త ఆలస్యమవుతుంది. అందుకే అతడిని 'చిరకారి' అన్నారు. ఒకరోజున గౌతముడికి తన భార్యపై కోపం వచ్చింది. "ఆమెను సంహరించు" అని చిరకారితో అని కోపంగా బయటకు వెళ్లిపోయాడు. చిరకారి ధర్మసంకటంలో ఇరుక్కున్నాడు.

పితృవాక్య పాలన ఉత్తమ ధర్మం. మాతృరక్షణ స్వధర్మం. రెండూ ధర్మాలే! తండ్రి– ధర్మం, స్వర్గం, తపస్సు; తల్లి– స్వాంతన, దిక్కు, అరణి, రక్షణ. ఇలా ఆలోచిస్తూనే ఉన్నాడు చిరకారి.

అక్కడ గౌతముడు ఆలోచనలో పడ్డాడు. ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి ఆతిధ్యమడిగాడు. తానే స్వయంగా ఆదరించి– "నేను నీ అధీనంలో ఉన్నాను" అన్నాడు ఇంద్రుడితో. ఇంద్రుడు మోసగించాడు తన భార్యను. ఆమెను చంపడం న్యాయమా? – అనుకుంటూ ఇంటికి వచ్చాడు.

చిరకారి వచ్చి ఆయుధాన్ని కిందపడేసి తండ్రి పాదాలకు నమస్కరించాడు. గౌతముడన్నాడు– "నీ ఆలోచన వల్ల ఆలస్యం జరిగింది. దానివల్ల మేలు జరిగింది. నీవు ఉత్తముడివి".

**బంధూనాం సుహృదాం చైవ భృత్యా నాం స్త్రీ జనస్య చ**
**అవ్యక్తేష్వ పరాధేషు చిరకారీ ప్రశస్యతే** (శాంతి. 266-71)

## ద్యుమత్సేనుడు - సత్యవంతుడు (రాజదండన)

ద్యుమత్సేనుడనే రాజు కుమారుడు సత్యవంతుడు. రాజదండం ధరించి ద్యుమత్సేనుడు కొందరికి మరణదండన విధించాడు. సత్యవంతుడు తండ్రితో అన్నాడు– "ప్రాణి వధ అధర్మం కాదా? మళ్లీ మళ్లీ తప్పు చేస్తే తీవ్ర దండన విధించ వచ్చునేమో!

**గరీయాంసో గరీయాంసమ్ అపరాధే పునః పునః**
**తదా విసర్గ మర్హంతి న యథా ప్రథమే తథా** (శాంతి. 267-16)

మొదటి తప్పుకు పెద్ద శిక్ష వేయరాదేమో!"

ద్యుమత్సేనుడన్నాడు– "ధర్మోల్లంఘనం చేసిన వారిని శిక్షించకపోతే వారు మరింత పెట్రోగిపోతారు".

కృతయుగ కాలంలో : 'ధిక్' అని అసహ్యించుకోవడమే పెద్ద శిక్ష.

త్రేతాయుగంలో : వాగ్దండం – నిందించేవారు మాటలతో.

ద్వాపర యుగంలో : అర్థదండం – ఆస్తిని వశం చేసుకునేవారు.

కలియుగంలో : వధ దండం – చంపడం, అంగవైకల్యం కలిగించడం.

కలియుగంలో రాజు యొక్క దుష్ప్రవర్తనతోనూ, కాల ప్రభావంతోనూ ధర్మంలో పదహారవ భాగమే మిగుల్తుంది. వ్యక్తి యొక్క వయస్సు, శక్తి, కాలం –వీటిని బట్టి దండించాలి. అహింసాత్మక దండనతో మారని వ్యక్తికి మాత్రమే హింసాత్మక దండం ప్రయోగించాలి.

## స్యూమరశ్మి - కపిలుడు

నహుషుడనే రాజు తన ఇంటికి అతిథిగా వచ్చిన 'త్వష్ట' కోసం గోవును ఆలంభనం చేయబోతుంటే కపిలుడు అది చూసి– హా వేదమా! అన్నాడు. నీ వలన గోవు ప్రాణాలకు ముప్పు వచ్చింది కదా అన్న ధోరణిలో.

స్యూమరశ్మి అనే మహర్షి గోవులో ప్రవేశించి అన్నాడు– వేదాలు ప్రమాణమా అన్న సందేహం కలిగితే ఇతర ధర్మ శాస్త్రాలను ఎలా అంగీకరిస్తారు. వేదాలు పరమేశ్వరుని నిశ్వాస కదా!

కపిలుడన్నాడు– నేను వేదాలను నిందించడం లేదు. 'హింస' వద్దంటున్నాను.

స్యూమరశ్మి అన్నాడు– గొర్రె, గుర్రం, మేక, గోవు, పక్షులు, ఓషధులు, సస్యాలు –ఇవి ప్రాణానికి అన్నం కదా. వీటిలోని పురుషుడు కూడా యజ్ఞాంగమే అయినపుడు 'హింస' లేకుండా యజ్ఞమెలా? ఓషధులు, పశువులు, వృక్షాలు, లతలు, నెయ్యి, పాలు, పెరుగు, హవిస్సు, భూమి, దిక్కులు, శ్రద్ధ, కాలం అనే పన్నెండు ద్రవ్యాలు; ఋక్కులు, యజస్సులు, సామలు, యజమాని, గార్హపత్యాగ్ని ఇవి 17 యజ్ఞాంగాలు. వీటిని యజ్ఞంలో నిష్కామ కార్యంగా వినియోగించవచ్చుని శ్రుతులు చెబుతున్నాయి కదా –అన్నాడు స్యూమరశ్మి.

కపిలుడన్నాడు– నాలుగు ఆశ్రమాలను శ్రుతులు చెప్పింది పరమాత్మను చేరే మార్గాలని. భూతదయ, క్షమ, శాంతి, అహింస, సత్యం, ఆర్జవం, అద్రోహం, అభిమాన రాహిత్యం, లజ్జ, తితిక్ష, శమం –ఇవి పరబ్రహ్మ ప్రాప్తికి మార్గాలు.

**సమాప్తం త్యాగ ఇత్యేవ సర్వవేదేషు నిష్ఠితమ్**
**సంతోష ఇత్యనుగతమ్ అపవర్గే ప్రతిష్ఠితమ్** (శాంతి. 270-45)

త్యాగం వల్లనే పరబ్రహ్మ సాక్షాత్కారం కలిగి ఆనందం, మోక్షం లభిస్తాయి.

## కుండధారోపాఖ్యానం (ధనమా-ధర్మమా!)

ధనం కోసం ఓ బ్రాహ్మణుడు దేవతలను ఆరాధించాడు. విఫలుడై, కుండధారుడనే మేఘం దేవతల అనుచరుడు తనకు సమీపంలో ఉన్నాడని గ్రహించి అతడిని పూజించాడు.

కుందధారుడు వెళ్లి యక్షులకు రాజైన మణిభద్రుని పూజించి బ్రాహ్మణుడికి ధనం అనుగ్రహించమన్నాడు. అయితే కుండధారుడు ధనం కన్నా గొప్పదైన ధర్మాన్ని బ్రాహ్మణుడికి ఇమ్మని అడిగాడు. ధర్మాన్ని పొందిన బ్రాహ్మణుడు ధార్మికుడై అడవికి పోయి తపస్సు చేయగా అతడికి దివ్యదృష్టి లభించింది.

దానితో అతడు ధన లోభులై, రాజ్యలోభులై పాపాలు చేసి నరకంలో పడి ఉన్న రాజులను చూసాడు. వారి చుట్టూ కామ, క్రోధ, లోభ, భయం, మదం, నిద్ర, బడలిక, సోమరితనం పరివేష్ఠించి ఉండడం చూసాడు. అతడికి ధనం మీద ఆసక్తి నశించింది. అతడికి అర్థమయ్యింది- ధనంలో సుఖం యొక్క అంశ మాత్రమే ఉందని.

**సుప్రసన్నా హితే దేవాః యత్తే ధర్మే రతా మతిః**
**ధనే సుఖకలా కాచిత్ ధర్మేతు పరమం సుఖమ్** (శాంతి. 271-56)

ధర్మంలోనే పరమ సుఖమున్నదని గ్రహించాడతడు.

## అహింస

సత్యుడనే బ్రాహ్మణుడు పుష్కరధారిణి అనే భార్యతో ఆశ్రమ జీవనం సాగిస్తున్నాడు. అతడు హింసాత్మకమైన యజ్ఞం చేయాలని సంకల్పించినప్పుడు ఆమె వ్యతిరేకించింది. మృగహింసతో యజ్ఞం చేయాలనుకున్నపుడు అతడి తపోఫలం నశించిపోయింది. అప్పుడతడు అర్థం చేసుకున్నాడు అహింస వలన యజ్ఞఫలాన్ని పొందవచ్చునని.

**అహింసా సకలో ధర్మః హింసా ధర్మ స్తథాహితః**
**సత్యంతే హం ప్రవక్ష్యామి యోధర్మః సత్యవాదినామ్** (శాంతి. 272-20)

## చతుః ప్రాశ్నికము

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను అనుభవించాలని ఇచ్ఛ కలిగినవాడు కపటంగా వాటిని పొందాలని ప్రయత్నిస్తే పాపం కలుగుతుంది. సద్గుణాలతో ప్రవర్తించేవాడు ధర్మబుద్ధితో ధనం పొందుతాడు. లోకమంతా నశించేదే అని అర్థమైన వాడికి నిర్వేదం కలుగుతుంది. ఇంద్రియ నిగ్రహం, వైరాగ్యాలతో మోక్షం పొందుతాడు. పాపం, ధర్మం, నిర్వేదం, మోక్షం -ఇవి నాలుగూ అర్థమవడం ఆత్మజ్ఞానం.

## మోక్షానికి దారి

అమూఢతా, అనాసంగం, కామక్రోధ వివర్జనం, దైన్య రాహిత్యం, అహంకార రాహిత్యం, నిర్భయత్వం, త్రికరణ నియంత్రణ, సిద్ధులను కోరకపోవడం, గృహంలో స్థిరంగా ఉండకపోవడం -ఇవి ముక్తికి నిర్మలమూ, ప్రసన్నము అయిన మార్గాన్ని దర్శింపచేస్తాయి.

**అమూఢత్వ మసంగిత్వం కామక్రోధ వివర్జనమ్**
**అదైన్యమను దీర్ణత్వమ్ అనుద్వేగో వ్యవస్థితిః** (శాంతి. 274-18)

## నారదుడు - అసితదేవలుడు (పుణ్య పాప కర్మవిధి)

అసిత దేవలుడు నారదుడితో చెబుతున్నాడు-

కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, చిత్తం, మనస్సు, బుద్ధి, ప్రాణం, సత్త్వ, రజో తమోగుణాలు ఇవి 17 గుణాలు; జీవాత్మ-18, మహత్తు-19, జఠరాగ్ని-20.

పాడైన ఇంటిని వదిలి మరో ఇంట్లో జేరినట్లు జీవాత్మ ఒక దేహాన్ని వదలి మరో దేహాన్ని ఆశ్రయిస్తుంది. జీవుడు కొత్తగా పుట్టడు, కొత్తగా చావడు.

**పుణ్య పాపమయం దేహం క్షపయన్కర్మ సంక్షయాత్**
**క్షీణదేహః పునర్దేహీ బ్రహ్మత్వముపగచ్ఛతి** (శాంతి. 275-38)

పుణ్య పాపాలతో ఏర్పడిన శరీరం కర్మనాశనం కాగానే నశిస్తుంది. పుణ్య పాపాలను క్షీణింప చేసుకునే సాధనం జ్ఞానం. బ్రహ్మభావం పొందడం పరమగతి.

## మాండవ్యుడు - జనకుడు (తృష్ణానాశం)

మాండవ్యుడితో జనకుడన్నాడు– ఈ లోకంలో నాది అనబడే వస్తువేదీ లేదు. మిథిలా నగరం తగలబడుతున్నా నాదేదీ తగలబడడం లేదు. కామ సుఖం కాని, స్వర్గ సుఖం కాని తృష్ణా క్షయం వలన కలిగే సుఖంలో పదహారో వంతుకు కూడా సమానం కావు. కాలాన్ని బట్టి ఆవుకొమ్ము పెరుగుతున్నట్టే ఆశకూడా పెరుగుతూ ఉంటుంది.

నాది అనుకున్న వస్తువు చిన్నదయినా అది నశిస్తే మనకు పరితాపం కలిగిస్తుంది. ఆశ లేదా తృష్ణ ప్రాణాంతకమైన రోగం. దానిని విడిచిన వారికి సుఖం కలుగుతుంది.

**చారిత్ర మాత్మనః పశ్యన్ చంద్రశుద్ధ మనామయమ్**
**ధర్మాత్మా లభతే కీర్తిం ప్రేత్య చేహ యథా సుఖమ్** (శాంతి. 276–13)

ఎవరైతే తన ప్రవర్తనను చంద్రుడి వలె పరిశుద్ధంగా దోష రహితంగా నిలుపుకుంటాడో అతడు ఇహ పర లోకాల్లో సుఖాన్ని, కీర్తిని పొందుతాడు.

## పితా పుత్ర సంవాదం (నిష్కామ కర్మ)

పుత్రుడన్నాడు– ఈలోకం మృత్యువు చేత బాధింపబడుతోంది. ముసలితనం చేత చుట్టుముట్టబడింది. మృత్యువు ఒక్కక్షణం కూడా ఆగదు. ఇంకిపోయే నీటిలో ఉన్న చేప లాగా ఎవడు సుఖం పొందుతాడు? అందుకనే రేపటి పని ఈరోజే చెయ్యాలి. కాలం చాలా గొప్పది. దానిని అతిక్రమించరాదు.

**నాస్తి విద్యా సమం చక్షుః నాస్తి విద్యా సమం ఫలమ్**
**నాస్తి రాగ సమం దుఃఖం నాస్తి త్యాగ సమం సుఖమ్** (శాంతి. 277–36)

నిష్కామ కార్యాచరణను మించిన ధనం లేదు –అని కొడుకు తన తండ్రికి బోధపరచాడు.

## హారీత గీత (సమబుద్ధి)

లాభ నష్టాలను సమంగా చూడాలి. భోగాలపై ఆపేక్ష ఉండరాదు. ఇతరుల దోషాల నెంచరాదు. ప్రాణి హింస కూడదు. ఇతరులు నిందించినా సహించాలి. ప్రాణం నిలుపుకోవడానికి మాత్రమే భుజించాలి. అన్నాన్ని నిందించరాదు. అజ్ఞాత ప్రదేశంలో ఉంటూ భగవత్ ధ్యానం చెయ్యాలి. సన్యాసి అయిన తపస్వి వాక్కు, మనసు, క్రోధం, హింస, ఉదరం, ఉపస్థల తీవ్రతను సహించాలి. ప్రశంసను, నిందను ఒకేరకంగా గ్రహించాలి.

వానప్రస్థులతోనూ, గృహస్థులతోనూ కలిసి ఉండరాదు. దొరికింది తినాలి. కోరిన భోజనం దొరికినా సంతోషం పొందరాదు.

**విజానతాం మోక్ష ఏషశ్రమః స్యాద విజానతామ్**
**మోక్షయాన మిదం కృత్స్నం విదుషాం హరితో బ్రవీత్** (శాంతి. 278–21)

సర్వ ప్రాణులకూ అభయమిచ్చి ఇల్లు వదలి బయటపడిన వానికి ప్రకాశవంతమైన లోకాలు లభిస్తాయి. మోక్షం పొందుతాడు.

## వృత్రగీత (నారాయణుని మహాత్మ్యం)

యుద్ధంలో ఓడిపోయి ఐశ్వర్య భ్రష్టుడై శత్రువుల మధ్యలో ఉన్న వృత్రుడిని చూసి శుక్రాచార్యుడన్నాడు– పరాజయం పొందినందుకు ఏ వ్యథా లేదు కదా!

వృత్రుడన్నాడు– నేను పూర్వకాలం ఘోర తపస్సు చేసి మూడు లోకాలను జయించాను. నేను చేసిన కొన్ని కర్మల వలన ఆ ఐశ్వర్యాన్ని పోగొట్టుకున్నాను. ఆ యుద్ధ సమయంలో నాకు ఇంద్రుడికి సాయం చేయడానికి వచ్చిన నారాయణుడు నాకు కనిపించాడు. నాకు కర్మఫలితం తెలుసుకోవాలనిపించింది.

అప్పుడు అటువచ్చిన సనత్కుమారుడు అన్నాడు– ఆద్యంతాలు లేని నారాయణుడు చరాచర ప్రాణులను సృష్టిస్తాడు. పదకొండు ఇంద్రియాలలోని వైకారిక రూపం అతడే. ప్రాణుల వర్ణాలు ఆరు రకాలు– కృష్ణ, ధూమ్ర, నీల, రక్త, పసుపుపచ్చ, తెలుపు; రక్తవర్ణం వారు ఎక్కువ బాధలు పడతారు. తెలుపు వర్ణం వారు సుఖిస్తారు. పసుపుపచ్చ వర్ణం కాంతిని సుఖాన్ని కలిగిస్తుంది. కృష్ణ, ధూమ్ర, నీలి వర్ణం వారికి మధ్యమ సుఖాలు లభిస్తాయి.

సాధకుడు నిత్యమూ శుద్ధ మనస్సుతో విశుద్ధమైన పరమగతిని ధ్యానిస్తే ఆ గతి అతనికి తప్పక లభిస్తుంది. తరువాత బ్రహ్మపదాన్ని పొందుతాడు.

సనత్కుమారుని ఉపదేశం విన్న వృత్రుడు ఆత్మను పరమాత్మతో అనుసంధానం చేసి ముక్తిని పొందినాడు.

## వృత్రాసుర వధ

వృత్రుడు 500 యోజనాల ఎత్తు, 300 యోజనాల లావూ ఉన్నాడు. అతడి భయంకర రూపం చూసి దేవతలు భయపడ్డారు. శంకరుడి శరణు జొచ్చారు. అప్పుడు శంకరుని తేజస్సు శివజ్వరమై వృత్రాసురుని ఆవరించింది. విష్ణువు ఇంద్రుని వజ్రాయుధంలో ప్రవేశించాడు.

శివజ్వరం వృత్రుడిని ఆవరించగా అతడు పెద్దగా ఆవులించాడు. అదే సమయంలో వజ్రాయుధంతో వృత్రుడిని ఇంద్రుడు సంహరించాడు.

అప్పుడు వృత్రుని శరీరం నుండి ఘోరంగా, భయంకరంగా ఉన్న బ్రహ్మహత్యా పాతకం రాక్షసి రూపంలో బయటకు వచ్చి– జుట్టు విరబోసుకుని ఉన్నదామె, నల్లని కోరలు, నలుపు పసుపు రంగులతో వికృతంగా ఉన్నది. పుర్రెల మాల, నెత్తుటితో తడిసిన బట్టలు ధరించి ఇంద్రుడిని వెదుకుతుంటే ఆమె అతడికి అతుక్కుపోయే సరికి తేజస్సు క్షీణించిన ఇంద్రుడు పారిపోయి తామరతూడులో దాక్కున్నాడు.

బ్రహ్మ చెప్పగా ఇంద్రుడు బ్రహ్మహత్యా పాతకంలో నాలుగవ వంతు చొప్పున అగ్నికి; ఓషధులు, చెట్లకు; అప్సరసలకు; జలాలకు పంచినాడు. వాటికి విముక్తి మార్గాలను నిర్దేశించాడు.

యజ్ఞ కార్యాలలో అగ్నిలో ఓషధులు, ఫలరసాలు హోమం చెయ్యనివారికి; వృక్షాదులను, ఓషధులను పర్వదినాలలో ఛేదించేవారికి; రజస్వల స్త్రీలతో సంగమించేవారికి, జలాలలో శ్లేష్మం, మలమూత్రాలు విసర్జించే వారికి ఈ బ్రహ్మహత్యా పాతకం సంక్రమిస్తుంది.

బ్రహ్మ అనుజ్ఞతో ఇంద్రుడు అశ్వమేధ యాగం చేసి బ్రహ్మహత్య నుండి విముక్తి పొంది పరిశుద్ధుడయ్యాడు.

వృత్రుడి రక్తం నుండి పుట్టగొడుగులు మొలిచాయి. వాటిని ద్విజాతులు, మహర్షులు భుజించరు.

## దక్షయజ్ఞ భంగం - జ్వరోత్పత్తి

సుమేరు పర్వతానికి త్రిలోకపూజితమైన జ్యోతిష్కమనే శిఖరం ఉండేది. దానిపై మహాదేవుడు నివసించేవాడు. దక్ష ప్రజాపతి యజ్ఞం చేస్తూ పూర్వ నిశ్చయ విధానం వలన యజ్ఞాలలో భాగం లేని శివుని ఆహ్వానించలేదు.

దానిని అవమానంగా భావించిన సతీదేవి దుఃఖపడగా శివుని అనుచరులు దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసారు. యజ్ఞం లేడిరూపంలో పారిపోయింది. ఆ సమయంలో రుద్రుడైన శివుడి నుదుటి నుంచి స్వేదబిందువు నేలపై పడింది. దానిలోంచి పొట్టిగా ఉండి, ఎర్రని కళ్లు కపిలగడ్డంతో ఉన్న భయంకర రూపుడు, ఒంటినిండా రోమాలతో డేగలా గుడ్లగూబలా ఉన్నాడు. నల్లని, ఎర్రని వస్త్రాలు ధరించాడు. అతడే జ్వరమనే పేరుతో ప్రసిద్ధి పొందినాడు.

అతడి ఉధృతిని భరించలేని దేవతలు, బ్రహ్మతో సహా వెళ్లి శంకరుని శరణువేడి యజ్ఞంలో భాగాన్ని కల్పించారు. సర్వ ప్రాణుల హితం కొరకు జ్వరాన్ని భాగాలుగా విభజించారు.

జ్వరం– ఏనుగులకు తలనెప్పి, పర్వతాలకు రాళ్లు పగలడం, నీటికి నాచు, పాముకు కుబుసం, ఆవులకు గిట్టల వ్యాధి, భూమికి చవిటినేల, పశువులకు చూపు మందగించడం, గుర్రాలకు కంఠరోగం, నెమలికి పింఛం ఊడడం, కోకిలలకు నేత్రరోగం, గొర్రెలకు పిత్తభేదం, చిలుకలకు ఎక్కిళ్లు, శార్దూలాలకు శ్రమ, మనుష్యులకు జ్వరమే జ్వరంగా వస్తుంది.

శివజ్వరం రావడంతో వృత్రుడు ఆవులించాడు. అప్పుడు వజ్రాయుధంతో ఇంద్రుడు వృత్రుడిని సంహరించాడు. వృత్రుడిని చంపడం వల్లనే ఇంద్రుడికి బ్రహ్మహత్యా పాతకం సంక్రమించింది.

## వీరభద్రుడు

దక్షయజ్ఞానికి శివుని ఆహ్వానించలేదని ఉమాదేవికి కోపం వచ్చింది. అది శివుని ఆగ్రహానికి కారణమై అతడు రుద్రుడైనాడు. అతడి నోటి నుంచి పుట్టిన భయంకరుడు వీరభద్రుడు. ఉమారూపంతో పుట్టిన భద్రకాళి, దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేయగా దక్షుడు అశక్తుడై వీరభద్రుడు సూచించగా శివుని శరణు వేడినాడు.

**ప్రసీద మమ భద్రంతే భవ భావగతస్య మే**
**త్వయి మే హృదయం దేవత్వయి బుద్ధిర్మనస్త్వయి** (శాంతి. 284-180)

లోకపతి అయిన శంకరుడు ప్రజాపతిని ఊరడించి అంతర్థానమైనాడు. దక్షుడు శంకరుడిని ప్రార్థించిన శంకర స్తోత్రం అన్ని స్తవాలలోనూ విశిష్టమైనది. శంకరుడు ప్రకటించిన పాశుపతమనే శుభంకర వ్రతఫలం దక్షుడికి దక్కింది.

## ఆధ్యాత్మ జ్ఞానం

ఈత నేర్చినవారు లోతైన నదిలో నుండి ఈదుకుని బయటపడినట్లు ఆత్మజ్ఞానం కలవారు సంసార సాగరం తరిస్తారు.

**నైవ తామ్యంతి విద్వాంసః ప్లవంతః పారమం భసః**
**ఆధ్యాత్మ విదుషో ధీరాః జ్ఞానంతు పరమం ప్లవః** (శాంతి. 285-44)

వారికి ఆధ్యాత్మ జ్ఞానమే పడవలా ఉపయోగపడుతుంది.

## నారదుడు - సమంగుడు (సమబుద్ధి)

నారదునితో సమంగుడన్నాడు- అర్థము, కామము విడిచి శోక సంతాపాలు లేకుండా తృష్ణా మోహాలకు దూరంగా ఈ భూమిపై సంచరిస్తుంటాను. అమృతం తాగిన వానికి మృత్యు భయం ఉండదు. నాకూ అధర్మలోభాల వల్ల భయం లేదు. శోకం, భయం, ఉద్రేకాలను పొందను. నేను అన్నిటితో సమభావంతో జీవిస్తాను.

## శ్రేయోవాచికము

ఈశ్వరారాధనం, పెద్దలను సేవించడం, శాస్త్ర శ్రవణం సార్వకాలీనమైన శ్రేయస్సును కలిగిస్తాయి. మూర్ఖుడు ఆత్మస్తుతి చేసుకుంటూ ప్రకాశించాలని తపిస్తాడు. విద్వాంసుడు గుహలో నివసించినా స్వయం ప్రకాశకుడై వెలుగుతాడు. ధర్మయుక్తంగా పాలన జరిగే చోట నివసించడం శుభాలనిస్తుంది.

**యధా శీలా హి రాజానః సర్వాన్విషయ వాసినః**
**శ్రేయసా యోజయత్యాశు శ్రేయసి ప్రత్యుపస్థితే** (శాంతి. 287-57)

రాజులు ఎటువంటి శీలంతో ఉంటారో ప్రజలూ అదే శీలంతో ఉంటారు. శ్రేయస్సు సమకూరితే ప్రజలు కూడా ఆ శ్రేయస్సును సమకూర్చుతారు.

## సగరుడు - అరిష్టనేమి (ముక్తుడు)

సగరుడు అడుగగా అరిష్టనేమి చెబుతున్నాడు- ఈ లోకంలో ఎవరికెవరు? అని ఆలోచించి మనసును మోక్షం మీద నిలుపుకోవాలి. జనన మరణ రహస్యాలను తెలిసినవాడు ముక్తుడు. సుఖ దుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు, రాగద్వేషాలు, భయోద్వేగాలను సమదృష్టితో చూసేవాడు ముక్తుడు.

**రక్త మూత్ర పురీషాణాం దోషాణాం సంచయం స్తథా**
**శరీరం దోష బహులం దృష్ట్వా చైవ విముచ్యతే** (శాంతి. 288-38)

శరీరం పలు దోషాలతో నిండి ఉన్నదని, రక్తం, మలం, మూత్రాలతో ఉన్నదనీ తెలిసినవాడు ముక్తిని పొందుతాడు. ఈ లోకంలో సంపదలు దుర్లభాలని, కష్టాలు సులభాలని, కుటుంబంలో దుఃఖమే కలుగుతుందనీ తెలిసినవాడు ముక్తుడవుతాడు –అని అరిష్టనేమి చెప్పగా సగరుడు తన ప్రజలను మైత్రి, కరుణ, ప్రేమలతో చక్కగా పరిపాలించాడు.

## ఉశనుడు శుక్రుడగుట

భృగువు ఆశ్రమంలో అసురులు దాక్కుని భృగుపత్ని శరణు పొందినారు. విష్ణువు తన చక్రాయుధంతో భృగుపత్ని శిరస్సు ఖండించాడు. దానితో అసురులు ఆమె కుమారుడైన ఉశనుడి శరణుజొచ్చారు. దేవతల వల్ల తన తల్లి వధ జరిగిందన్న కోపంతో అతడు అసుర గురువైనాడు. అంతేకాక తన యోగబలంతో కుబేరుని ధనం అపహరించాడు. కుబేరుడు ఆ విషయాన్ని మహదేవుడికి విన్నవించాడు. ఇది తెలిసి ఉశనుడు మహదేవుడి శూలాగ్రంపై నిలిచి శివుని ధ్యానించాడు. మహదేవుడి చేతిలోని ధనుస్సు వంగి 'పినాకమనే' ధనుస్సుగా మారింది. ఉశనుడు మహదేవుడి చేతి నుంచి నోటిలోకి, నోటి నుంచి కడుపులోకి వెళ్లి పరమేశ్వరుని దయతో మూత్ర ద్వారం నుంచి బయటకు శుక్రుడి (వీర్యం)గా వచ్చాడు. శివ పార్వతుల దయతో ప్రాణాలతో బయటపడి మరల యధారూపాన్ని పొందినాడు.

## పరాశర గీత (శ్రేయస్సాధన)

పరాశరుడు చెబుతున్నాడు జనకుడితో– స్వధర్మాచరణ ఇహపరలోకాల్లో శ్రేయస్సును కలిగిస్తుంది. అన్నీ తినే బ్రాహ్మణుడు, పిరికివాడైన క్షత్రియుడు, ధనసంపాదన చెయ్యని వైశ్యుడు, పని బద్ధకించే శూద్రుడు, మంచి గుణాలు లేని పండితుడు, సదాచారాలు పాటించని ఉత్తమ వంశ పురుషుడు, చెడునడత గల స్త్రీ, అసత్యవాది, విషయాసక్తుడైన యోగి, తనకోసమే ఆహారాన్ని సంపాదించుకునేవాడు, మూర్ఖుడైన వక్త, రాజులేని రాజ్యం, ఇంద్రియ నిగ్రహం లేక ప్రజలను చక్కగా పాలించని రాజు వీరందరూ నింద్యులవుతారు.

మంచిపనులు చేసినవారు శ్రేయస్సును పొందుతారు.

**ఆయుర్న సులభం లబ్ధ్వా నావకర్షే ద్విశాంపతే**
**ఉత్కర్షార్థం ప్రయతేత నరః పుణ్యేన కర్మణా** (శాంతి. 291-3)

దుర్లభమైన ఆయుస్సును పొందిన వ్యక్తి ఆత్మను పతితం చేయరాదు. పుణ్యకర్మలు చేసి ఆత్మోన్నతికై పాటుపడాలి.

రంతిదేవుడు కాయలు పండ్లు దుంపలు ఆకులతో మునులను అర్చించాడు, శైబ్యుడు, ఋచీకుని పుత్రుడు, ఉశనుడు (శుక్రుడు), అసితుడు, దేవలుడు, నారదుడు, పర్వతుడు, కక్షీవంతుడు, పరశురాముడు, తాండ్యుడు, వసిష్ఠుడు, జమదగ్ని, విశ్వామిత్రుడు, అత్రి, భరద్వాజుడు, హరిశ్మశ్రుడు, కుండధారుడు, శ్రుతశ్రవుడు అనే మహర్షులందరూ ఋక్కులతో విష్ణుదేవుని స్తుతి చేసి సిద్ధపురుషులైనారు. అగ్ని కార్యాలు చేస్తూ తల్లిదండ్రులను పెద్దలను గౌరవించి పూజించేవాడు ఉత్తమ గతులను పొందుతాడు.

ఇంద్రియ జయంతో బ్రాహ్మణుడు, రణ విజయంతో రాజు, న్యాయార్జిత ధనంతో వైశ్యుడు, సేవాకార్యంలో నేర్పు చూపుతూ శూద్రుడు ప్రకాశిస్తారు.

మానవ జన్మ సాటిలేనిది. పుణ్యకర్మలు చేసి జన్మను సార్థక పరచుకోవాలి. తాను చేసిన తపస్సు, యోగ్యునికి చేసిన దానము ఎప్పుడూ నశించవు.

**నా ధర్మః శ్లిష్యతే ప్రాజ్ఞం పయః పుష్కర వర్ణవత్**
**అప్రాజ్ఞమధికం పాపం శ్లిష్యతే జతుకాష్ఠవత్** (శాంతి. 298-7)

తామరాకును నీరు అంటని రీతిగా జ్ఞానిని ధర్మమంటదు. లక్కకర్రకు అంటుకున్నట్లు అజ్ఞానిని పాపం అంటుకుంటుంది.

సనాతన సంప్రదాయం మీద ధర్మసేతువు చెడిపోదు. నువ్వులు పువ్వులు కలిపినప్పుడు పూల సువాసనను నువ్వులు స్వీకరిస్తాయి. అలాగే వ్యక్తులు సత్పురుషుల సాంగత్యంతో మంచివాళ్లవుతారు.

## హంసగీత (సత్యప్రశస్తి)

ప్రజాపతి హంసరూపంలో సాధ్యులను కలుసుకున్నాడు. వాళ్లు అడిగారు– సర్వశ్రేష్ఠమైన వస్తువు ఏది? ఏది ఆచరిస్తే జీవుడు బంధాల నుంచి విముక్తుడు అవుతాడు అని–

హంస రూపంలోని ప్రజాపతి చెబుతున్నాడు–

**వేదస్యోపనిషత్సత్యం సత్యస్యో పనిషద్దమః**
**దమస్యోపనిషన్మోక్షః ఏతత్ సర్వాను శాసనమ్** (శాంతి. 299–13)

వేదాధ్యయ సారం సత్యం; సత్య సారం ఇంద్రియ నిగ్రహం (దమం); ఇంద్రియ నిగ్రహం ఫలం మోక్షం.

మూత్రేంద్రియం, పొట్ట, నాలుగు చేతులు, మాట అనే నాలుగు ద్వారాలు సురక్షితంగా ఉన్నవాడు ధర్మజ్ఞుడు. సత్యం, దమం, ఋజు ప్రవర్తన, దయ, ధైర్యం, క్షమ, స్వాధ్యాయి, ఇతరుల వస్తువులను తీసుకోనివాడు, ఏకాంత సేవలో ఉండేవాడు ఊర్ధ్వగతిని పొందుతాడు.

వ్యర్థంగా మాట్లాడడం కన్నా మౌనం, సత్య భాషణం, ఇతరులకు సంతృప్తికరంగా మాట్లాడడం, ధర్మసమ్మతంగా పలకడం ముఖ్యమైనవి.

వేదశాస్త్రాల అధ్యయనం దేవత్వం. ఉత్తమ వ్రతాలను ఆచరించడం సాధుత్వం. ఇతరులను నిందించడం చెడ్డతనం, మరణించడం మనుష్యత్వం.

## యోగం - సాంఖ్యం

యోగులు ప్రత్యక్ష ప్రమాణాన్ని, సాంఖ్యులు శాస్త్ర ప్రమాణాన్ని నమ్ముతారు. అంతః బాహ్యశౌచం, తపస్సు, భూతదయ, వ్రతానుష్ఠానం మొదలైనవి రెండిటిలోనూ సమానమే.

జీవితంలో చాలాకాలం రోజుకు ఒకేమారు నివ్వరిధాన్యపు జావ తాగుతాడు యోగి. లేదా నీళ్లు కలిపిన పాలను రోజుకు ఒకమారు, ఆ విధంగా కొన్నాళ్లు, పదిహేను రోజులకోసారి కొన్నాళ్లు, నెలకోసారి కొన్నాళ్లు, సంవత్సరానికోసారి అలా అతడు ఆహారాన్ని త్యజిస్తాడు. యోగసిద్ధిని సంపాదించాక అతడు నారాయణ స్వరూపుడౌతాడు.

## ఆత్మజ్ఞానం (పది నుంచి ఒకటి వరకు)

1. జ్ఞానం, వైరాగ్యం, స్వామిభావం, ఆత్మరక్షణ, తపస్సు, సత్యం, క్షమ, ధైర్యం, స్వచ్ఛత, ఆత్మజ్ఞానం, అధిష్ఠానమై ఉండడం (10) సాత్విక గుణాలు.
2. అసంతోషం, పశ్చాత్తాపం, శోకం, లోభం, అసహనం, అణచివేసే లక్షణం, కామం, క్రోధం, ఈర్ష్య (9) –రజోగుణ లక్షణాలు.
3. అవివేకం, మోహం, కల, నిద్ర, అభిమానం, విషాదం, దుఃఖం, పొరబాట్లు (8) – తమో లక్షణాలు
4. మహత్తు, అహంకారం, శబ్ద, స్పర్శ, రస, రూప, గంధ తన్మాత్రలు (7) –బుద్ధి గుణాలు
5. చెవులు, చర్మం, కన్నులు, నాలుక, ముక్కు మనస్సు (6) –మనోగుణాలు
6. ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, పృథ్వి – పంచ మహాభూతాలు (5) – ఆకాశ లక్షణాలు.
7. సంశయం, నిశ్చయం, గర్వం, స్మరణం (4) – బుద్ధి గుణాలు
8. అప్రతిపత్తి, విప్రతిపత్తి, విపరీత ప్రతిపత్తి (3) – శరీర గుణాలు
9. ప్రవృత్తి, దుఃఖం (2) –రజోగుణాలు
10. ప్రకాశం (1) –సత్త్వగుణం

ఉత్తములు– సహనంతో కోపాన్ని, కోరికలను త్యజించి కామాన్ని, సత్త్వగుణ సేవనతో నిద్రను, పొరపాట్లను చేయకుండా భయాన్ని, అల్పాహారాన్ని స్వీకరిస్తూ శ్వాసదోషాన్ని పోగొట్టుకుంటారు.

## వసిష్ఠుడు - కరాళజనకుడు (క్షర-అక్షర తత్త్వం)

కరాళజనకుడికి వసిష్ఠుడు చెబుతున్నాడు– హిరణ్యగర్భ బ్రహ్మనే విశ్వాత్మ, ఏకాక్షరం, విశ్వరూపుడు అంటారు.

1. నిరాకారం నుంచి సాకార రూపంగా వ్యక్తమయ్యేది మూల ప్రకృతి – విద్యాసర్గం
2. మహత్తు, అహంకారం – అవిద్యా సర్గం
3. అహంకారం నుంచి కలిగే సూక్ష్మభూతసృష్టి మూడవ సర్గం.
4. సత్త్వ, రజో, తమోగుణాల నుంచి కలిగే నాలుగోది – వైకృత సర్గం
   (పంచ మహాభూతాలు – శబ్దస్పర్శరూప రస గంధాలు)
5. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు – భౌతిక సర్గం

24 తత్త్వాలున్నది శరీరం. పరమాత్మ 25వ తత్త్వం (నిరాకారుడు).

మహత్తు, మనో, బుద్ధి, చిత్తం, అహంకారం (అంతఃకరణ చతుష్టయం) జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలు–15 కళలు, 16వ కళ ప్రాణం.

## ప్రకృతి - పురుషుడు

స్త్రీ పురుషుల కలయిక వల్ల పిండం ఏర్పడుతుంది. ఎముకలు, మూలుగు, సన్నని నరాలు తండ్రి నుంచి; చర్మం, రక్తమాంసాలు తల్లి వలన ఏర్పడ్తాయి.

ఎల్లప్పుడూ ఏకరూపంలో ఉండే పరమాత్మ –అక్షరుడు.

నానారూప ప్రాకృత ప్రపంచం నశించేది –క్షరం.

✤ **యోగం :** ధ్యానాన్ని రెండు రకాలుగా– మనస్సును ఏకాగ్రం చేయడం ద్వారా, ప్రాణాయామం ద్వారా (సగుణ, నిర్గుణ భేదాలు) చేస్తారు.

యోగి సమస్త ఇంద్రియాలను, బుద్ధితో మనస్సును స్థిరం చేసి, రాయిలాగా నిలకడగా, ఎండిన కర్రలా కదలకుండా, పర్వతంలా యోగయుక్తుడై ఉంటాడు.

✤ **సాంఖ్యం :** మూల ప్రకృతి (అవ్యక్తం), మహత్తు (వ్యక్తం), అహంకారం, అయిదు సూక్ష్మతత్త్వాలు తన్మాత్రలు (8).

అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, అయిదు స్థూల భూతాలు, మనస్సు (16 వికారాలు) – ఇవి 24 తత్త్వాలు. అనులోమ క్రమంలో ఉత్పత్తి, విలోమ క్రమంలో ఉపసంహారం జరుగుతుంది.

25వ తత్త్వం– అధిష్ఠాత (క్షేత్రజ్ఞుడు, పురుషుడు), అవ్యక్తం (క్షేత్రం, సత్త్వం, బుద్ధి, శాసనం).

సృష్టి ప్రళయం అనే ధర్మాలు కార్యాలుగా గల అవ్యక్తం – అవిద్య 24 తత్త్వాలకు అతీతమైన పరమాత్మ జ్ఞానం విద్య.

24 తత్త్వాలు + జీవాత్మను 25 తత్త్వాలుగా లెక్కించి కొందరు పరమాత్మను 26వ తత్త్వంగా భావిస్తారు.

## వసుమనుడు - మహర్షి (స్వధర్మాచరణ)

మహర్షి అన్నాడు వసుమనునితో– అందరూ స్వధర్మాన్ని ఆచరించాలి. దేశం కాలం పాత్రం కర్మ విశేషాలను పరిశీలిస్తే ఒకే కర్మ భిన్న భిన్న మనుష్యులకు ధర్మమూ, అధర్మము అవుతుంది.

**మానసం సర్వభూతేషు వర్తతే వై శుభాశుభమ్**
**అశుభేభ్యః సదాక్షిప్య శుభేష్వే వావతారయేత్** (శాంతి. 309–19)

చెడు ఆలోచనలు వదలి మంచి ఆలోచనలతో ప్రవర్తించాలి. స్వధర్మానుసారం నీకు ఆసక్తి ఉన్న కర్మ చేయగలవు.

స్తిమిత మనస్కుడు కాని మహాభిషుడు స్వర్గం నుంచి నేలపై పడినాడు. యయాతి అన్ని పుణ్యాలు నశించినా ధృతి బలంతో ఉత్తమ లోకానికి చేరాడు.

## యాజ్ఞవల్క్యుడు - జనకుడు (సాంఖ్య మతానుసారము)

జనకుడితో యాజ్ఞవల్క్య ముని చెబుతున్నాడు- అవ్యక్తం (మూల ప్రకృతి) మహత్తు, అహంకారం, ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి ఎనిమిది ప్రకృతులు. వాటి మార్పులు (వికారాలు)- శ్రోత్రం, త్వక్కు, నేత్రాలు, జిహ్వ, నాసిక, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధం, వాక్కు, హస్తాలు, పాదాలు, పాయువు, మేఢ్రం (15); పదహారవది మనస్సు - మొత్తం 24 తత్త్వాలు.

**సర్గములు-**

1) అవ్యక్త స్థితి నుంచి మహత్తు -ప్రాకృత సృష్టి

2) మహత్తు నుంచి అహంకారం - బుద్ధ్యాత్మక సృష్టి

3) అహంకారం నుంచి మనస్సు - అహంకారిక సృష్టి

4) మనస్సు నుంచి సూక్ష్మభూత సృష్టి - మానసిక సృష్టి

5) శబ్ద స్పర్శరూప రస గంధ సృష్టి - భౌతిక సృష్టి

6) శ్రోత్రం, చర్మం, నేత్రాలు, జిహ్వ, ఘ్రాణం - బహుచింతాత్మక సృష్టి

7) వాక్కు, హస్తాలు, పాదాలు, పాయువు, మేఢ్రం - ఐంద్రియ సృష్టి

8) ప్రాణం, సమానం, వ్యానం, ఉదానం, అపానం - ఆర్జవక ప్రాణ సృష్టి

9) వ్యానం, ఉదానం, అపానం (నవమ సృష్టి) - ఆర్జవక సృష్టి

యాజ్ఞవల్క్యుడు జనకుడితో సృష్టి, ప్రళయం, ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవికాలను, సత్త్వరజస్తమో గుణాలను, సాత్త్విక రజస్తమో గుణాల వల్ల కలిగే గతులను ప్రకృతి పురుషుల వివేకమును, యోగశాస్త్ర మహాత్మ్యాన్ని వర్ణించాడు.

**ప్రాణోత్క్రమణ స్థానాలు:** ప్రాణం పాదాల నుంచి పోతే విష్ణులోకానికి; పిక్కలు-వసులోకం; మోకాళ్లు-సాధ్యలోకం; మలద్వారం-మిత్రదేవతాలోకం; కుడిఎడమలు-మరుత్తుల లోకం; నాభి, రెండు భుజాలు-ఇంద్రలోకం; వక్షస్థలం-రుద్రలోకం; మెడ- నరముని శ్రేష్ఠస్థానం; ముఖం- విశ్వదేవతలు; చెవులు-దిక్పాలకలోకం; ముక్కు-వాయులోకం; కళ్లు-అగ్నిలోకం; కనుబొమలు-అశ్వినీదేవతల లోకం; నుదురు-పితృదేవతల లోకం; శిరస్సు-బ్రహ్మలోకం.

అరుంధతి నక్షత్రం, ధ్రువుని నక్షత్రాన్ని చూడలేనివారు, పూర్ణ చంద్రబింబం, అగ్నిజ్వాల ఎడమవేపు ఖండితమైనట్లు కనిపిస్తే ఒక సంవత్సరం మాత్రమే జీవిస్తారు. ఎదుటివారి కనుపాపల్లో తన ప్రతిబింబం చూడలేకపోయినా అంతే!

తేజస్సు తగ్గిపోయిన వారికి ఆరు నెలల్లోనే మృతి. నల్లటివాడు పాలిపోయినా, దేవతలను నిందిస్తున్నా ఆరు నెలల్లోనే మరణిస్తాడు. సూర్య చంద్రబింబాలలో సాలెగూటిలోలా రంధ్రాలు కనిపించినా, దేవాలయంలో కూర్చున్నపుడు శవపు దుర్వాసన అనిపించినా వారం రోజుల్లో చనిపోతాడు.

ముక్కు చెవులు వికారంగా అయినా, కళ్లు దంతాల రంగు మారినా, స్మృతి ఎక్కువగా తప్పిపోతున్నా, శరీరం చల్లబడిపోతున్నా, అకస్మాత్తుగా ఎడమ కంటి నుండి నీరు కారుతున్నా, తలలో నుంచి ఆవిరి వస్తున్నా -అవన్నీ వెంటనే వచ్చే మృత్యు సూచకాలు.

ఆత్మతత్త్వ జ్ఞానాన్ని పొందిన యోగి అంతరాత్మను పరమాత్మలో లగ్నం చేసి, మృత్యువును జయిస్తాడు.

యాజ్ఞవల్క్యుడన్నాడు- జీవాత్మ-పరమాత్మ ఒకటే అని కొందరు; వేర్వేరు అని కొందరు చెబుతారు.

ప్రకృతి జడం కాబట్టి 25వ తత్త్వమైన జీవాత్మ ప్రకృతిని తెలుసుకుంటుంది కాని ప్రకృతి జీవాత్మ (పురుషుడు)ను తెలుసుకోలేదు. జీవాత్మ మెలకువ మొదలైన అవస్థలలో అన్నీ చూస్తాడు కాని సుషుప్తి, సమాధి స్థితులలో ఏమీ చూడలేదు. 26వ తత్త్వమైన పరమాత్మ జీవాత్మను, ప్రకృతిని చూస్తూ ఉంటాడు.

## పంచశిఖుడు - జనకుడు (జరా మరణాలు)

పంచశిఖ మహర్షి జనకుడితో చెప్పాడు– ఈ లోకంలో పూర్వం ఎవరూ ఎవరితో కలిసి ఉండలేదు. భార్యాభర్తలు బంధువులు మార్గమధ్యంలో కలుస్తారు, విడిపోతారు.

**జరా మృత్యూ హి భూతానాం ఖాదితారౌ వృకావివ**
**బలినాం దుర్బలానాం చ హ్రస్వానాం మహతామపి** (శాంతి. 319–12)

ఎవరినైనా సరే మరణం పెద్దపులిలా మింగి వేస్తుంది.

## ధర్మధ్వజుడు (జనకుడు) - సులభ (యోగిని)

సన్యాసం యొక్క సమ్యక్ జ్ఞానాన్ని పొందిన మిథిలానగర ప్రభువు ధర్మధ్వజుడనే జనక వంశపు రాజు దగ్గరకు సులభ అనే యోగిని సుందర రూపంలో వచ్చింది.

జనకుడన్నాడు– ఏ కారణం వలన నా రాజ్యంలో, నా నగరంలో ప్రవేశించావు? ఎవరి సాన్నిహిత్యం వలన నా హృదయంలో ప్రవేశించావు?

రాజులకు ఐశ్వర్యం, వేదవేత్తలకు వేదం, స్త్రీలకు రూపం యౌవనం సౌభాగ్యం అనేవి బలం. నీవు ఎందుకు వచ్చావిక్కడికి?

సులభ అన్నది మధురంగా– మనసును, బుద్ధిని పాడుచేసే 18 గుణాలు కలిగి యుక్తియుక్తమై అర్థవంతమైన పద సమూహాన్ని వాక్యం అంటారు. ఆ వాక్యంలో సూక్ష్మత్వం, సాంఖ్యం, క్రమం, నిర్ణయం, ప్రయోజనం అనే అయిదు రకాల అర్థాలు ఉండాలి.

నీవు ఎవరివి, ఎవరి దానివి, ఎక్కడి దానివి అని అడిగావు– నీలో నీ ఆత్మను చూసినట్లు, నీ ఆత్మతో ఇతరులలో ఉండే ఆత్మను ఎందుకు చూడలేవు?

సమస్త భూమండలాన్ని పాలించే రాజు కూడా ఒక నగరంలో, ఒక భవనంలో, ఒక గదిలో, ఒక శయ్యపై నిద్రిస్తాడు. అన్ని విషయాలలోనూ అతడు పరతంత్రుడే కదా! నీవు సప్తాంగాలను ఉత్సాహ, ప్రభు, మంత్రి శక్తులతో దశాంగ రాజ్యాన్ని ఏలుతూ సన్యాసివెలా అవుతావు?

త్రిదండినైన నాకు నా శరీరం మీదనే అభిమానం లేదు. ఇతరుల శరీరంపై నాకేమి అభిమానం? నిన్ను కనీసం స్పృశించలేదు. నీ హృదయంలోకి నేనెలా ప్రవేశిస్తాను? నేను ప్రధానుడనే రాజర్షి కుమార్తె సులభను. అఖండ బ్రహ్మచారిణిని. నా పూర్వీకులు ఇంద్రుడి సాయంతో ద్రోణం, శతశృంగం, చక్రద్వారం అనే పర్వతాలను యజ్ఞకుండాల కట్టడంలో ఇటుకలుగా వాడినారు.

నేనీ రాత్రి నీ శరీరంలో ఉండి రేపు ఉదయమే వెళ్తాను. నీ జీవాత్మ, నా జీవాత్మ ఒక్కటే అని భావించిన నాకు నీ శరీరమే నా గృహం.

మాటలతో కసరత్తు చేయకుండా శాంతమైన పరబ్రహ్మలో నిమగ్నుడైన వ్యక్తి ముక్తిని పొందుతాడు.

నీ బుద్ధి మోక్షధర్మంలో లగ్నమైనది. నా పరీక్షలో నీవు నెగ్గావు.

**యథా శూన్యే పురాగారే భిక్షురేకాం నిశాం వసేత్**
**తథాహం త్వచ్ఛరీరే స్మిన్ ఇమాం వత్స్యామి శర్వరీమ్** (శాంతి. 320–191)

మిథిలాధిపా! నీవిచ్చిన ఆతిథ్యం గొప్పది. నీ మాటలు నన్ను ఆలోచింపజేసాయి. ఇప్పుడు నేను హాయిగా నీ శరీరం అనే అందమైన గృహంలో నిద్రించి రేపు ఉదయమే ఇక్కడ నుంచి వెళ్తాను –అన్నది సులభ అనే యోగిని.

## వ్యాసుడు - శుకుడు

వ్యాసుడు తన కుమారుడైన శుకుడితో అన్నాడు– కుమారా! నీటిబుడగ వంటి దేహంలో జీవుడు పక్షివలె ఉన్నాడు. నీవెందుకు పరాకుగా ఉన్నావు? రోజులు దొర్లిపోతున్నాయి. ఆయువు తరిగిపోతున్నది. మిత్రబాంధవుల బంధాలు శాశ్వతం కాదు. రాజువల్ల, దొంగల వల్ల అపహరింపబడనిది, చనిపోయినా జీవుని వదలిపోనిది అయిన ధర్మం అనే ధనాన్ని ఆర్జించు.

**మాతా పితృ సహస్రాణి పుత్రదార శతానిచ**
**అనాగతాన్య తీతాని కస్యతే కస్యవావయమ్** (శాంతి. 321–85)

తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు వీరిలో ఎవరెవరు? మనం ఎవరి వారం? కాలం అనే వంటవాడు సర్వజీవులను వండుతున్నాడు. సూర్యుడు అగ్ని రేయింబవళ్లు అతడికి వంట చెరకు. ఋతువుల్ని గరిటెలుగా చేసుకుని జీవుల్ని అటూ ఇటూ తిరిగవేస్తుంటాడు.

ఎవరికీ ఏమీ ఇవ్వని ధనం వల్లనూ, శత్రువును బంధించని బలం వల్లనూ, ధర్మాన్ని ఆచరించని విద్యవల్లనూ, ఇంద్రియాలను జయించలేని మనస్సు వల్లనూ ఏమీ ప్రయోజనం లేదు.

తండ్రి మాటలు విన్న శుకుడు మోక్షప్రాప్తికై వెళ్లిపోయాడు.

## శుక మహర్షి వృత్తాంతం

పూర్వకాలంలో పరమేశ్వరుడు పార్వతీదేవితో కలిసి మనోహరమైన గన్నేరు వనంలో, భయంకరమైన భూతగణాలు వెంటరాగా, విహరిస్తున్నాడు. అక్కడ కృష్ణద్వైపాయన వ్యాసుడు పుత్రకాంక్షతో తపస్సు చేస్తున్నాడు.

శివుడు అతడిని అనుగ్రహించి– "పంచభూతాల వలె పరమ పవిత్రుడు, మహాత్ముడైన కుమారుడు నీవు కోరుకున్నట్లు జన్మించి ముల్లోకాల్లోనూ మహా యశస్వి అవుతాడు" అని వరమిచ్చాడు.

ఒకరోజున వ్యాసుడు అరణిని మధిస్తూ ఘృతాచి అనే అప్సరసను చూసి కామమోహితుడైనాడు. ఆ అప్సరస అతడి మోహాన్ని గమనించి చిలుకరూపంలో అతడి వద్దకు వచ్చింది. ఆ మహర్షికి వీర్య పతనమై అరణిపై పడినా అతడు అరణిని మధిస్తూనే ఉన్నాడు. అరణితో శుక్ర మధనం జరిగి 'శుకుడు' జన్మించాడు. గంగాదేవి వచ్చి శుకుడికి స్నానం చేయించింది. ఆకాశం నుంచి దండమూ, కృష్ణజింక చర్మము వచ్చిపడ్డాయి. గంధర్వులు గానం చేసారు. అప్సరసలు నాట్యం చేసారు. విశ్వావసువు, నారదుడు, తుంబురుడు, హాహా, హూహూ అనే గంధర్వులు మంగళగీతాలు పాడారు. ఇంద్రాదిదేవతలు ఆశీర్వదించారు. జగత్తు పరమానందభరితమయ్యింది. పార్వతీ పరమేశ్వరులా కుమారుడికి ఉపనయనం చేసారు. దేవేంద్రుడు కమండలాన్ని, దివ్య వస్త్రాలను ఇచ్చాడు. పక్షులతడికి ప్రదక్షిణం చేసాయి. సమస్త వేదాలు తండ్రికి వచ్చినట్లే కరతలామలక మయ్యాయి. బృహస్పతి వద్ద సర్వ శాస్త్రాలు అధ్యయనం చేసి లోకగురువైనాడు శుకుడు.

శుకుడికి బ్రహ్మచర్యం, గృహస్థ, వానప్రస్థ ఆశ్రమాలపై ఆసక్తి లేదు. యోగ శాస్త్రాన్ని, సాంఖ్య శాస్త్రాన్ని అధ్యయనం చేసి తండ్రి వ్యాసుడి సలహాతో మిథిలానగరం వెళ్లి జనక మహరాజును కలుసుకున్నాడు. రాజభవనంలోని సంపదలు, అందాల కన్యలు, వారకాంతలు అతడిని చలింపచేయలేదు. జనకుడన్నాడు– మహాత్మా!–

**న బంధుష్వనుబంధస్తే న భయేష్వస్తితే భయమ్**
**పశ్యామి త్వాం మహాభాగ తుల్యలోష్టాశ్మ కాంచనమ్** (శాంతి. 326–49)

సుఖ దుఃఖాలు, ఇంద్రియ విషయాలు వీటిపై ఆసక్తి లేనివాడివి, మట్టిబెడ్డ–బంగారాన్ని ఒకే దృష్టితో చూస్తున్నావు. నీవు సరైన మార్గంలోనే ఉన్నావు.–

జనకుడి మాటలు విని శుకుడు ఉత్తర దిక్కుగా ప్రయాణించి హిమవత్పర్వతానికి చేరుకున్నాడు. నారదాది మునులు, సిద్ధులు, సాధ్యులు గరుత్మంతుడు సంచరించే ప్రదేశమది. శ్రీకృష్ణుడు పుత్ర ప్రాప్తికై అక్కడ తపస్సు చేసాడు. కుమారస్వామి అక్కడ బలంగా తన 'శక్తి' అనే ఆయుధాన్ని పాతాడు. 'నాకన్నా పరాక్రమవంతుడు ఎవరైనా తీయవచ్చు' అన్నాడు. అక్కడే

శంకరుడు తపస్సు చేసాడు. అది ఆదిత్యగిరి. ఆ పర్వతానికి తూర్పుదిక్కున ఏకాంత ప్రదేశంలో వ్యాసమహర్షి తన శిష్యులైన సుమంతుడు, జైమిని, పైలుడు, వైశంపాయనుడు అనే నలుగురికి వేదాధ్యాపనం చేస్తున్నాడు.

శుకుడు తండ్రి వద్దకు వచ్చి జనక మహారాజుతో తనకు జరిగిన సంవాదాన్ని చెప్పాడు. వ్యాసుడు తన శిష్యులకు, పుత్రుడికి వేదాధ్యాపనం చేసాడు. విద్యాభ్యాసం అయ్యాక శిష్యులు వెళ్లిపోతూ గురువును వరమడిగారు– "మా అయిదుగురిలోనే వేదాలు ప్రతిష్ఠితాలు కావాలి".

వ్యాసుడన్నాడు– "మీరు ఈ వేదాధ్యాపనాన్ని విస్తరింపజేయండి.

**శ్రావయేచ్చతురో వర్ణాన్ కృత్వా బ్రాహ్మణ మగ్రతః**
**వేదస్యాధ్యాయనం హీదం తచ్చ కార్యం మహత్స్మృతమ్** (శాంతి. 327–49)

బ్రాహ్మణుని ముందుంచుకుని నాలుగు వర్ణాల వారికి ఉపదేశం చెయ్యాలి. ధర్మ సంప్రదాయాన్ని అతిక్రమించి ప్రశ్నించేవాడు, అధర్మపూర్వకంగా సమాధానం చెప్పేవాడికి మృత్యువు కలుగు గాక! లేకపోతే పరస్పరం ద్వేషించుకుంటారు.

ఈ స్వాధ్యాయ విధానాన్ని లోకమంతా వ్యాపింపచేయగలరు".

శిష్యులు వెళ్లిపోయాక వ్యాసుడు, శుకుడు వేద పారాయణం చేయసాగినారు. ఆ సమయంలో సముద్ర వాయువుతో ప్రేరితమైన వాయువు మహావేగంతో వీచసాగింది.

శుకుడి కోరికపై వ్యాసుడు వాయువుల గురించి చెబుతున్నాడు– భూమ్యాకాశాలలో భూతరూప సాధ్యగణాలు అదృశ్యరూపంలో ఉంటాయి. వారి పుత్రుడు సమానుడు, సమానుని పుత్రుడు ఉదానుడు, ఉదానుని పుత్రుడు వ్యానుడు, వ్యానుడి పుత్రుడు అపానుడు, అపానుడి పుత్రుడు ప్రాణుడు. ప్రాణుడు సర్వప్రాణులను సజీవంగా ఉంచుతాడు.

మేఘాలను, వడగండ్లను అటు ఇటు తిప్పేది 'ప్రవాహం' అనే మొదటి వాయువు; మెరుపులు పుట్టిస్తూ ధ్వనిచేసేది 'ఆవహం' – ద్వితీయ వాయువు; చంద్ర సూర్యాది గ్రహాలకు ఉదయాన్ని కలిగించేది ఉద్వహం (మానవ శరీరంలో ఉదానం) – ఇది మేఘాలను జలపూర్ణం చేస్తుంది, సముద్రాలలోని నీటిని ఆవిరిగా పైకి తీసుకునిపోతుంది (తృతీయ వాయువు); నాలుగో వాయువు సంవహం (వేణువులా ధ్వనిస్తుంది గనుక 'నదం') మేఘాలను గుంపుగా చేసి నీటిని వర్షిస్తుంది. దేవతల విమానాలను దహిస్తుంది (సంవహం); అయిదో వాయువు 'వివహం' – చెట్లను పెల్లగించే పెనుగాలి. ప్రళయకాల వలాహక మేఘాలను కలుగజేసే వాయువిది. భయంకర ఉత్పాతాలకు హేతువు. అత్యంత వేగవంతమై, మేఘాలను తనతో తీసుకు పోతుంది. ఆరోది 'పరివహం' ఆకాశంలో జలాన్ని ప్రవహింపజేస్తుంది. ఆకాశగంగలా ప్రవహిస్తుంది. చంద్రుని పోషిస్తుంది. భూమిని ప్రకాశింపజేస్తుంది. ఒకే కిరణం గలదిలా కనిపిస్తుంది. ఏడవ వాయువు పేరు 'పరావహం' – అంత్యకాలంలో ప్రాణుల ప్రాణాలను శరీరంలోంచి బయటకు లాగి మృత్యువు యముడి వెంట నడిపిస్తుంది. ఆత్మానుసంధానం చేసేవారికి అమృతత్వాన్నిస్తుంది. సర్వశ్రేష్ఠమైనది.

ఈ సప్త మరుద్గణాలు దితి సంతానం. ఇప్పుడు వీచిన సముద్ర వాయువు విష్ణుదేవుని నిశ్వాసం. ఈ సమయంలో బ్రహ్మవేత్తలు వేదాధ్యయనం చేయరు. ఎందుకంటే వేదాలు కూడా భగవంతుని నిశ్వాసాలే కదా! రెండూ కలత చెందకుండా వేదాధ్యయనం ఆపుతారు ఆ సమయంలో.

ఆ తరువాత వ్యాసుడు తన కుమారుడైన శుకుని మోక్షప్రాప్తికై సాధన చేయమన్నాడు.

**యదా సర్వం పరిత్యజ్య గంతవ్య మవశేనతే**
**అనర్థే కిం ప్రసక్తస్త్వం స్వమర్థం నానుతిష్ఠసి** (శాంతి. 329–33)

సమస్తాన్ని వదిలిపెట్టి నీవు ఇక్కడి నుంచి వెళ్లిపోవాల్సిందే! ఈ జగత్తుపై ఆసక్తి ఎందుకు?

**శోకస్థాన సహస్రాణి భయస్థాన శతాని చ**
**దివసే దివసే మూఢమ్ ఆవిశంతి న పండితమ్** (శాంతి. 330–2)

వేలకొలది శోక కారణాలు, వందల కొలది భయకారణాలు ప్రతిరోజూ మూఢునికి కలుగుతాయి. కాని, పండితునికి కలుగవు. అన్ని సంపాదనలకు నాశమే తుది అవుతుంది. ఎంత పైకిపోతే అంత పతనమవుతుంది. సంయోగాలన్నీ వియోగాలతో, జీవితం మరణంతో అంతమవుతాయి.

**సర్వే క్షయాంతా నిచయాః పతనాంతాః సముచ్ఛ్రయాః**
**సంయోగా విప్రయోగాంతాః మరణాంతం హి జీవితమ్** (శాంతి. 330-20)

నారదుడన్నాడు శుకుడితో- సర్వప్రాణులూ సుఖ దుఃఖాలనే ద్వంద్వాలలో తిరుగుతుంటారు. పరబ్రహ్మ వాటికి భిన్నమైనది.

**త్యజ ధర్మమధర్మం చ ఉభే సత్యానృతే త్యజ**
**ఉభే సత్యానృతే త్యక్త్వా యేన త్యజసి తం త్యజ** (శాంతి. 331-44)

ధర్మాధర్మాలను, సత్యాసత్యాలను త్యజించు. దేనితో వాటిని త్యాగం చేస్తున్నావో దానిని కూడా త్యజించు.

శుకుడనుకున్నాడు- నా ఆత్మకు శాంతిని కలిగించేది, నాశరహితం, అక్షయమైన చోటుకు వెళ్తాను.

శుకుడు తండ్రికి ప్రదక్షిణం చేసి వెళ్లడానికి అనుమతి కోరాడు. తండ్రిని విడిచి కైలాసపర్వత శిఖరాన్ని చేరి చదునైన ప్రాంతంలో కూర్చున్నాడు. యోగస్థుడై మోక్ష మార్గాన ఆకాశంలోకి ఎగిరాడు. అగ్నితో, సూర్యునితో సమానంగా వెలుగుతున్న శుకుడిని చూసి గంధర్వులు, అప్సరసలు, సిద్ధులు, మహర్షులు ఆశ్చర్యపడినారు. మలయ పర్వతంపై ఊర్వశి, పూర్వచిత్తి ఇలా అనుకున్నారు- "తండ్రికి ప్రేమ పాత్రుడైన ఈ పుత్రుడిని విడిచి తండ్రి ఎలా ఉండగలుగుతున్నాడు?" అప్పుడు శుకుడు అంతరిక్షాన్ని, సమస్త పర్వతాలను, వనాలు, సరస్సులు, నదులతో కూడిన భూమి వేపు చూసాడు- "నా తండ్రి ఇటువస్తే నా బదులు మీరు సమాధానమివ్వండి". అప్పుడు అధిష్ఠాన దేవతలు "అలాగే"నని సమాధానమిచ్చారు.

ఇంకా ముందుకు వెళ్లిన శుకుడి వేగానికి, రజతమయ హిమవత్పర్వత శిఖరం, స్వర్ణమయ మేరు శిఖరం కలిసి ఉన్నవి, రెండుగా చీలిపోయి కనిపించాయి. అతడు ఇంకా పైకి వెళ్లి ఆకాశగంగలో జలకాలాడుతూ ఉన్న దిగంబర అప్సరసలను దాటి వెళ్లాడు. వారు అతడిని చూసినా వస్త్ర ధారణ చెయ్యలేదు.

పుత్రుడు ఉత్క్రమణం చేస్తున్నాడని ఎరిగిన వ్యాసుడు అతడిని అనుసరించాడు. చీలిన రెండు శిఖరాలను చూసాడు. "శుకా!" అని పెద్ద స్వరంతో దుఃఖించాడు.

శుకుడు 'భోః' (ఓం) అని సమాధానమిచ్చాడు.

చరాచర జగత్తు భోః (ఓం) అని ప్రతిధ్వనించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొండ కొమ్ముల దగ్గర గాని కేకవేస్తే చరాచర ప్రాణులు ప్రతిధ్వనిగా శుకుని వలెనే సమాధానమిస్తాయి.

శుకుడు అప్పటికే అంతర్ధానమై పరమపదాన్ని చేరుకున్నాడు. వ్యాస మహర్షి తన కుమారుడి గురించి ఆలోచిస్తూ పర్వత శిఖరంపై కూర్చున్నాడు. మందాకినీ తీరంలో నగ్నంగా జలకాలాడుతున్న అప్సరసలు తొందర తొందరగా వస్త్రాలు ధరించారు. కొందరు పొదల చాటుకు వెళ్లారు. వ్యాసుడు తన పుత్రుడి ముక్తస్థితిని తెలుసుకుని ఆనందించాడు. తన ఆసక్తికి సిగ్గుపడ్డాడు.

శంకరుడు వ్యాసుడితో అన్నాడు- నీవు కోరిన కుమారుడు పంచభూతాలతో సమానమైనవాడు నీకు లభించాడు. ఉత్తమ గతిని పొందాడు. దుఃఖించకు. నా వరప్రభావంతో నీవు నీ పుత్రుని లాంటి ఛాయను ఎప్పుడూ చూస్తుంటావు. ఆ ఛాయ నీకు అన్నివేపులా కనిపిస్తుంది. నీకు దూరం కాదు.

**యావత్ స్థాస్యంతి గిరయః యావత్ స్థాస్యంతి సాగరాః**
**తావత్తవాక్షయా కీర్తిః సపుత్రస్య భవిష్యతి** (శాంతి. 333-37)

ఈ లోకంలో పర్వతాలు, సాగరాలు ఉన్నంత కాలం వ్యాస, శుకుల కీర్తి శాశ్వతంగా ఉంటుంది.

## నారాయణీయము (ఏ దేవుడిని పూజించాలి?)

భీష్ముడు చెబుతున్నాడు యుధిష్ఠిరునితో తనకు తన తండ్రి శంతనుడు చెప్పిన విషయాన్ని-

**నారాయణోహి విశ్వాత్మా చతుర్మూర్తిః సనాతనః**
**ధర్మాత్మజః సంబభూవ పితైవం మే భభాషత** (శాంతి. 334-8)

శ్రీమన్నారాయణుడు సర్వజగతికి ఆత్మ. సనాతనుడైన దైవం. ఒకప్పుడు ధర్మదేవతకు పుత్రరూపంలో అవతరించాడు.

కృతయుగంలో– నరుడు, నారాయణుడు, హరి, కృష్ణుడు అనే రూపంలో ధర్మదేవతకు పుత్రులుగా జన్మించాడు విష్ణువు. నారదుడు ఒకరోజున నారాయణ మునిని దర్శించి విష్ణు దర్శన ప్రాప్తి కోరగా ఆయన శ్వేతద్వీపం వెళ్లమన్నాడు.

నారదుడు మేరు పర్వత శిఖరం చేరి వాయువ్య దిక్కుకు చూడగా పాల సముద్రపు ఉత్తరభాగంలో ఉన్న శ్వేతద్వీపం కనిపించింది. అక్కడ సర్వ పాపరహితులు, ధవళ వర్ణులు, వజ్రాస్థి నిర్మితులు, దివ్యాంగాలు కలవారు, నాలుగు చేతులు, అరికాళ్లలో పద్మాల రేఖలు, వీరి నోటిలో 60 తెల్లటి పండ్లు, ఎనిమిది కొరుకుడు పండ్లు ఉంటాయి. వీళ్లు ముక్త పురుషులు.

సప్తర్షులు, మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు (చిత్రశిఖండులు), బ్రహ్మతో కలిసి ఓంకారయుతమై లక్షశ్లోకాలు గల తంత్ర–స్మృతి–ఆగమ భాగాలున్న శాస్త్రాన్ని నిర్మించారు. ఈ శాస్త్రాన్ని ఉపరిచర వసువు అధ్యయనం చేసి మానవలోకంలో విస్తృతంగా వ్యాపింపజేసాడు.

బృహత్తు, బ్రహ్మ, మహత్తు గుణాలు కలవాడు బృహస్పతి. ఆయన శిష్యుడు ఇంద్రుని మిత్రుడైన ఉపరిచర వసువు. అతడు చిత్రశిఖండ నిర్మిత తంత్రశాస్త్రాన్ని అధ్యయనం చేసి అశ్వమేధ యాగం చేసాడు. ఎలాంటి పశువధ జరుగలేదు. హయగ్రీవుడిగా శ్రీమన్నారాయణుడు పురోడాశాన్ని అదృశ్యంగా గ్రహించాడు.

హోత్రగా ఉన్న బృహస్పతికి కోపం వచ్చింది. యజ్ఞభాగాన్ని అదృశ్యంగా స్వీకరించరాదు. ఇతర దేవతలు స్వయంగా వచ్చారు. విష్ణువెందుకు అదృశ్య రూపంలో హవిస్సు స్వీకరించాలి?

సదస్యులైన ఏకత, ద్విత, త్రితులన్నారు– శ్రీమన్నారాయణుడు ఎవరికీ కనిపించడు. మేము ఆయన దర్శనానికి వెళ్లినప్పుడు మాకు శ్వేతద్వీపవాసులు కనిపించారు. వాళ్లు సహస్ర సూర్య ప్రభాసమానుడైన దేవుని పూజిస్తున్నారు. ఆ దివ్య కాంతిని మేము చూడలేక కళ్లు మూసుకున్నాము. అతడు స్వయంగా వస్తే మీ నేత్రాలు ఆ కాంతిని భరించలేవు –అని పలికారు వాళ్లు.

ఉపరిచర వసువును దేవతలు, ఋషులు అడిగారు– యజ్ఞాన్ని 'అజ–మేకపోతు'తో చెయ్యాలా లేక అన్నంతో చెయ్యాలా అని అడిగారు. దేవతలకు యజ్ఞ పశువుతో హోమం చేయడం ఇష్టం. ఋషులకు ధాన్యంతో యజ్ఞం చేయడం ఇష్టం. వసువు తాను యజ్ఞం ధాన్యంతో చేసినా పైకిమాత్రం 'అజ' అంటే మేకపోతు అనే చెప్పాడు.

ఋషులన్నారు– నీవు దేవతల పక్షం వహించావు. 'అజ' అంటే అన్నం అని తెలిసి కూడా. నేటి నుంచి నీకు ఆకాశ గమనశక్తి నశిస్తుంది. పాతాళంలో పడతావు.

దేవతలు పాతాళంలో పడిన వసువుకు వసుధార లభించే వరమిచ్చారు. దానివల్ల శ్రమ కలుగదు. ఆకలిదప్పులు ఉండవు. వసువు విష్వక్సేన పూజ చేస్తూ– 'నమో నారాయణాయ' మంత్రాన్ని జపిస్తూ పంచకాలాలలో, పంచ యజ్ఞాలతో శ్రీహరిని ఆరాధించాడు వసువు.

విష్ణువు గరుడుని పంపి వసువుకు ఆకాశగమన శక్తిని ఇవ్వగా అతడు ఉపరిచర వసువైనాడు. తరువాత బ్రహ్మలోకం చేరుకున్నాడు.

నారదుడు భగవద్దర్శన కాంక్షతో రెండు వందల పేర్లతో శ్రీమన్నారాయణుని స్తుతించాడు. నమస్తే దేవదేవేశ అని మొదలుబెట్టి బ్రహ్మణ్యదేవ భక్తోహం త్వాం దిదృక్షుః ఏకాంత దర్శనాయ నమో నమః –అని ప్రార్థించాడు. అప్పుడు విశ్వరూప ధారియైన భగవంతుడు ఆయనకు దర్శనం అనుగ్రహించాడు.

ఆ స్వామి నిర్మలంగా విలక్షణంగా చంద్రునికన్నా అధిక కాంతితో ఉన్నాడు. కొంత అగ్నిలా, కొంత నక్షత్రాల్లా, కొంత చిలుకపచ్చలా, స్ఫటికంలా, కాటుక కొండలా, బంగారంలా, చివురు మొలకలా, తెల్లగా, బంగరు రంగులో, వైడూర్య మణిలా, నీలవర్ణంలో, ఇంద్రనీలంలా, నెమలి కంఠ వర్ణంలా, ముత్యాల సరంలా భగవానుడు అనేక రంగులలో కనిపించాడు. సహస్ర నయనుడు, సహస్ర బాహుడు, సహస్ర శిరస్కుడు, సహస్రపాదుడు, సహస్రోదరుడు, సహస్ర బాహుడు, అపూర్వ కాంతి సంపన్నుడు. అక్కడక్కడా అవ్యక్తుడు. ఒక నోటితో ఓంకార పూర్వక గాయత్రీ మంత్రాన్ని, ఇతర ముఖాలతో వేదాలను, అరణ్యకాలను జపిస్తున్నాడు. చేతులలో యజ్ఞవేది, కమండలం ఉన్నాయి. మణులు, పాదుకలు, దర్భలు, కృష్ణాజినం, దండం, ప్రజ్వలించే అగ్ని ఉన్నాయి.

నారదుడు ఆ దివ్యమంగళ మూర్తిని దర్శించి ధన్యత నొందినాడు. నారాయణుడన్నాడు- ఈ సంపూర్ణ జగత్తుకు ఆధారమైన భూమి జలంలో, జలం అగ్నిలో, అగ్ని వాయువులో, వాయువు ఆకాశంలో, ఆకాశం మనస్సులో, మనస్సు అవ్యక్త ప్రకృతిలో, ప్రకృతి పురుషునిలో లీనమవుతుంది.

పంచభూతాలు శరీరం కాగా చేతన దానిలో ప్రవేశిస్తుంది. ఆ జీవుడు శరీరంలో ప్రవేశించడం పుట్టుక. అతడే శేషుడు లేక సంకర్షణుడు. సమస్త ప్రాణులను లయం చేసేది, సమస్త ప్రాణుల మనోరూపుడే ప్రద్యుమ్నుడు. ప్రద్యుమ్నుడి నుండి అహంకారం ఉత్పన్నమై కారణమూ-మహత్తు-కార్యము అవుతాడు. దాని నుండి చరాచర జగత్తు పుడుతుంది - అదే అనిరుద్ధుడు, ఈశానుడు-అనిరుద్ధుడు-వ్యక్త ప్రపంచం.

క్షేత్రజ్ఞ స్వరూపుడు, నిర్గుణరూపుడు- వాసుదేవుడు; జీవాత్మ సంకర్షణుడు; మనోమయుడు ప్రద్యుమ్నుడు, వ్యక్త ప్రపంచం అనిరుద్ధుడు. సమస్త కర్మల నుండి విరమించడం పరమ నివృత్తి.

అనిరుద్ధుడి నుంచి బ్రహ్మ, బ్రహ్మ నుంచి చరాచర భూతసృష్టి. నా అవతారాలు-

**మత్స్యః కూర్మో వరాహశ్చ నరసింహశ్చ వామనః**
**రామో రామశ్చ రామశ్చ కృష్ణః కల్కి చ తే దశ**

హంస, కూర్మ, మత్స్య, వరాహ, నారసింహ, రామ దశరథరామ, కృష్ణ, కల్కి భగవానుని అవతారములు.

బ్రహ్మమానస పుత్రులు-సప్తర్షులు- మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు; సనుడు, సనత్సుజాతుడు, సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, కపిలుడు, సనాతనుడు -వీరుకూడా బ్రహ్మమానస పుత్రులే.

బ్రహ్మ నుదుటి నుంచి పుట్టినవాడు రుద్రుడు. సమస్త ప్రాణుల రక్షకుడు. వేదాలు, యజ్ఞాలు, తపస్సు, దమం, సత్యం, అహింస ఉన్న చోట ఉంటారు దేవతలు. అనిరుద్ధరూపంలో హయగ్రీవుడు బ్రహ్మకు దర్శనం ఇచ్చాడు.

**ఏష చైతత్పరం బ్రహ్మజ్ఞేయో విజ్ఞాన చక్షుషా**
**ఏవమే తత్పురా దృష్టం మయావై జ్ఞాన చక్షుషా** (శాంతి. 346-108)

అదే పరబ్రహ్మ స్వరూపం.

## బ్రాహ్మణ ప్రశస్తి

బ్రహ్మదేవుని వలన అందరి కంటె ముందు పుట్టినవారు బ్రాహ్మణులు. వీళ్లు దేవతలు, అసురులకంటె శ్రేష్ఠులు.

అహల్యను బలాత్కరించి ఇంద్రుడు ఎర్రని మీసాలు, గడ్డం కలవాడైనాడు.

విశ్వామిత్రుడి శాపంతో ఇంద్రుడు మేషవృషణుడైనాడు.

చ్యవనుడు వజ్రాయుధమెత్తిన ఇంద్రుడి చేతిని స్తంభింపచేసాడు. దానితో ఇంద్రుడు అశ్వినీదేవతలకు యజ్ఞభాగం ఇచ్చాడు.

దక్షుడి క్రోధం వలన శివుడు ముక్కంటి (విరూపాక్షుడు) అయినాడు.

శుక్రుడి కోపం వలన పుట్టిన సర్పాలు శివుడి మెడను కరవగా నీలకంఠుడైనాడు. నారాయణుడు శివుని కంఠాన్ని పట్టుకున్నాడు స్వయంభువ మన్వంతరంలో. అందుకే నీలంగా మారింది శివుడి కంఠభాగం. పాల సముద్ర మంథన సమయంలో వాసుకి విషాన్ని మింగి గరళ కంఠుడైనాడు శివుడు.

బృహస్పతి శాపం వలన జలాశయాల్లో మొసళ్లు, తాబేళ్లు, చేపలున్నాయి.

త్వష్ట కుమారుడు విశ్వరూపుడు త్రిశిరుడు కాగా అతడి మూడు తలలను ఇంద్రుడు వజ్రాయుధంతో ఖండించాడు. కోపించిన త్వష్ట వృత్రాసురుడిని సృజించగా ఇంద్రుడు వజ్రాయుధంతోనే వృత్రుడిని చంపాడు. వజ్రాయుధం దధీచి వెన్నెముకతో తయారు చేయబడింది.

విశ్వరూపుడు, వృత్రుడు వీరిద్దరిని ఇంద్రుడు చంపగా బ్రహ్మ హత్యాపాతకం రెండింతలై ఇంద్రుడి వెంట పడేసరికి ఇంద్రుడు పదవీభ్రష్టుడై తామరతూడులో దాక్కున్నాడు. నహుషుడికి ఇంద్ర పదవి దక్కింది. నహుషుడి దృష్టి శచీదేవిపై పడినపుడు, ఆమె ఉపశృతి సాయంతో ఇంద్రుడి జాడ కనుక్కుని అతడి సలహాతో నహుషుడిని– తన భవనానికి సప్తర్షుల పల్లకిలో రమ్మన్నది. నహుషుడు సప్తర్షులు మోస్తున్న పల్లకిలో వస్తూ త్వరగా త్వరగా పదమని అగస్త్య మహర్షిని కాలితో తన్నగా శక్తులు నశించిన నహుషుడిని అజగర సర్పమై భూమిపై పడి ఉండమని అగస్త్యుడు శపించాడు. ద్వాపరాంతాన యుధిష్ఠిరుని వలన శాపవిముక్తి అవుతుందని అనుగ్రహించాడు అగస్త్య మహాముని. ఇంద్రుడు అశ్వమేధ యాగం చేసి, తన బ్రహ్మహత్యా పాతకాన్ని అగ్ని, స్త్రీలు, చెట్లు, సముద్ర జలాలకిచ్చి విముక్తుడై మరల ఇంద్రపదవి నధిష్ఠించాడు.

భారద్వాజుడు ఆకాశగంగలో ఆచమనం చేస్తున్నపుడు వామనుడు త్రివిక్రముడై ముల్లోకాలను మూడు పాదాలతో కొలుస్తున్నపుడు, నీళ్లతో కొట్టాడు భారద్వాజుడు. అవి విష్ణువు వక్షస్థలంలో తగిలి మచ్చ ఏర్పడింది.

భృగు మహర్షి శాపం వల్ల అగ్ని సర్వభక్షకుడైనాడు.

అదితికి బుధుడిచ్చిన శాపం వలన ఆమె రెండో గర్భంలో వివస్వంతుడు మృతి చెందిన అండంగా పుట్టి మార్తాండుడైనాడు.

దక్షుడు తాను కనిన అరవైమంది పుత్రికలలో పదముగ్గురిని కశ్యపునికి, పదిమందిని ధర్మునికి, పదిమందిని మనువుకు; 27 మందిని చంద్రునికి ఇచ్చి వివాహం చేసాడు. ఆ 27 మంది నక్షత్రాలు. చంద్రుడు రోహిణితో ఎక్కువ ప్రేమతో ఉంటున్నాడని తారలు చెప్పగా వారి తండ్రి దక్షుడు చంద్రుడిని క్షయరోగంతో బాధపడమని శపించాడు. చంద్రుడు మహర్షులు చెప్పినట్లు హిరణ్యతీర్థంలో స్నానం చేసి దివ్యప్రభాసితుడైనాడు. ఆ తీర్థానికి ప్రభాసతీర్థమని పేరు వచ్చింది.

చంద్రుడిలో కుందేలు ఆకారం కనిపిస్తూ ఉంటుంది.

స్థూలశిరుడి తపస్సు, శాపం వలన మొక్కలు కొద్దికాలంలో మాత్రమే పూలు పూస్తాయి.

శ్రీమన్నారాయణుడి శాపం వలన సముద్రం నిశ్చలమై, ఉప్పగా మారింది. బడబాముఖుడనే మహర్షిగా శ్రీహరి బడబాగ్నిగా సముద్ర జలాలను తాగుతూ వాటిని మధురంగా మారుస్తాడు.

భృగు మహర్షి ఉమాదేవిని పెండ్లాడాలనుకున్నపుడు హిమవంతుడు ఆమెను రుద్రునికి నిశ్చయించినట్లు చెప్పాడు. దానితో భృగువు "హిమవత్పర్వతం రత్నభాండాగారం కాకుండును గాక!" –అని శపించాడు.

## హరిగీత - భగవన్నామ వ్యుత్పత్తి

హృషికేశుడు– జగత్తుకు హర్షాన్ని కలిగించే అగ్ని సోములు సూర్యచంద్రులు. హర్షప్రదులు కావడం వలన 'హృషీ' అంటారు వారిని. వారే భగవంతుని కేశాలు (కిరణాలు). అందుకే భగవానుడు హృషీకేశుడు (సూర్యచంద్ర కిరణ ప్రకాశికుడు). హరితవర్ణ శరీరుడు (శ్యామ) హరి; ప్రాణసారం ధామం (పరంధాముడు), ఋతం అంటే సత్యం– భగవానుడు ఋతధాముడు. గోవిందుడు (గాం విందతి ఇతి గోవిందః) – వరాహరూపంలో జలాల్లో మునిగి ఉన్న భూమిని ఉద్ధరించినవాడు. శిపివిష్ట– యాస్కుడు భగవానుని రోమరహిత సర్వ వ్యాపకునిగా స్తుతించాడు. ఇంతకు ముందు పుట్టనివాడు, ఇకముందు జన్మించనివాడు– అజుడు; భగవానుడే సత్యం, సత్త్వం; కృష్ణలోహం (ఇనుము)లా నల్లగా ఉండడం వల్ల కృష్ణుడు. భూమిని జలంతో, ఆకారాన్ని వాయువుతో వాయువును తేజస్సుతో కలిపినవాడు– వైకుంఠుడు. పరమ శాంతిమయ బ్రహ్మం నుంచి చ్యుతుడు కానివాడు– అచ్యుతుడు. పృథివి ఆకాశాలను ధరించినవాడు– ఉత్పత్తి స్థితి లయకారణుడు– అధోక్షజుడు; వాత పిత్త కఫ కారకుడు– త్రిధాతువు; వృష అంటే ధర్మం, కపి–వరాహం, శ్రేష్ఠం– కశ్యప ప్రజాపతి భగవానుడిని 'వృషాకపి' అని పిలిచాడు. శుచిశ్రు వుడు, అనాది–అమధ్య–అనంతుడు, ఏకశృంగుడు (వరాహవతారం); త్రికకుత్ (మూడు మూపురాలు– వరాహావతరం); చేతన ప్రదాత– విరించనుడు; కపిలుడు, హిరణ్యగర్భుడు, వేదరూపుడు; రుద్రుడి శూలం తగిలి వక్షస్థలంలో ఏర్పడిన మచ్చవలన శ్రీవత్సుడు.

–అటువంటి నారాయణుని నారదుడు దర్శించాడు. ఆ తరువాత వచ్చి నర నారాయణుల ఆశ్రమంలో అనేక సంవత్సరాల కాలం తపస్సు చేసాడు. ఈ నారాయణీయము –హరిగీతగా ప్రసిద్ధికెక్కింది.

## హయగ్రీవుడు

బ్రహ్మ శ్రీహరిని స్తుతిస్తున్నాడు– దేవా! వేదాలు నీ హృదయం. సాంఖ్యయోగనిధీ నీకు నమస్సులు. వ్యక్త జగత్తును, అవ్యక్త మహత్తును సృజించేవాడా! స్వయంభువుడవైన నీ దయవలన కలిగినవాడను నేను.

బ్రహ్మ చెబుతున్నాడు– నా మొదటి జన్మ మానస జన్మ. రెండవది తమ నేత్రాల నుండి జన్మించాను; మూడవది– వాక్కు (వాచికం); నాలుగవది– చెవుల నుండి; అయిదవది ముక్కు నుండి; ఆరవది– బ్రహ్మాండం; ఏడవజన్మ పద్మం నుంచి.

ప్రభూ! నాకు నేత్రాలైన వేదాలను దానవులపహరించారు. అప్పుడు భగవంతుడు 'హయగ్రీవ' రూపం దాల్చినాడు. జలాల్లో ప్రవేశించి రసాతలం వెళ్లి సామగానం చేయగా, విని మధుకైటభ రాక్షసులు వేదాన్ని కలపాశంతో బంధించి– సామగాన ధ్వని వేపు వెళ్లారు. హయగ్రీవుడు వేదాలను తీసుకువచ్చి బ్రహ్మకిచ్చి తొలిరూపం ధరించాడు.

సర్పశయనుడైన శ్రీహరిని చూసి మధుకైటభులు అతడితో యుద్ధం చేయగా చక్రాయుధంతో వారిని నరికి చంపినాడు. ఇది హయగ్రీవావతారంగా పురాణ ప్రసిద్ధమైంది.

**నారాయణ పరం సత్యమ్ ఋతం నారాయణాత్మకమ్**
**నారాయణ పరో ధర్మః పునరావృతి దుర్లభః** (శాంతి. 347–82)

సత్య, ఋత, ధర్మ స్వరూపుడు నారాయణుడు. పునర్జన్మ లేకుండా చేసే నివృత్తి ధర్మానికి అంతిమ లక్ష్యం నారాయణుడే.

## సాత్వత ధర్మం

భగవానుని ముక్కు నుండి అయిదవ జన్మను పొందిన బ్రహ్మకు శ్రీమన్నారాయణుడు బోధించినదీ సాత్వత ధర్మం. బ్రహ్మ నుంచి సనత్కుమారుడు అతడి నుంచి వీరణ ప్రజాపతి, అతడి నుంచి రైభ్యుడు, రైభ్యుడి నుంచి కుక్షికి చేరిన ధర్మం అంతర్ధానమయ్యింది.

ఆరవది– బ్రహ్మాండ జన్మలో నారాయణుని ముఖం నుంచి బ్రహ్మకు, బ్రహ్మ నుంచి బర్హిషదులకు, వారి నుంచి జ్యేష్ఠుడనే బ్రాహ్మణుడికి, అతడి నుంచి అవికంపనుడికి చేరి 'హరి' ధర్మంగా వ్యాపించి అంతర్ధానమయ్యింది.

## అపాంతరతముడు

ఏడవ జన్మంలో విష్ణువు నాభి నుంచి పద్మంలో జన్మించాడు బ్రహ్మ. నారాయణుడి నుంచి బ్రహ్మకు, బ్రహ్మ నుంచి దక్ష ప్రజాపతికి, దక్షుడి నుంచి అతడి జ్యేష్ఠ కుమారుడికి, అతడి నుంచి వివస్వంతుడికి, అతడి నుంచి ఇక్ష్వాకుడికి అతడి నుంచి సర్వవ్యాపితమయ్యింది. కల్పాంతంలో సాత్వత ధర్మం (హరిగీత) నారాయణీయంగా మరల నారాయణుని చేరుతుంది.

భీష్ముడన్నాడు యుధిష్ఠిరాది పాండవులతో అనేక మంది మహర్షుల సమ్ముఖాన– ధర్మసూక్ష్మాలు దుష్కరమైనవి. నీవు ప్రజాపాలకుడివి. జగత్తు సృష్టి స్థితి లయాలకు కారణభూతుడైన శ్రీకృష్ణ పరమాత్మను భక్తితో సేవించు.

ఏడవ కల్పం ఆరంభంలో తన నాభి నుంచి ఆవిర్భవించిన పద్మ సంభూతుడైన బ్రహ్మతో శ్రీహరి అన్నాడు– నానా విధాలైన ప్రజాసృష్టి చేసి లోకాలను నింపు. బ్రహ్మ అలాగే చేసాడు. అయితే కాలం గడచినకొద్దీ భూభారం ఎక్కువైంది దుష్ప్రవర్తన గలవాళ్లతో. అందుకని వివిధ అవతారాలను దాల్చి భూభారాన్ని తగ్గించాడు శ్రీమన్నారాయణుడు. ఆవిధంగా ఆదిశేషుడిగా భూభారాన్ని మోస్తున్న భగవానుడు తన లీలావతారాలతో రాక్షస సంహారం చేసి భారాన్ని తగ్గించాలనుకున్నాడు. శ్రీహరి భోః (ఓం) అనే వాక్కును ఉచ్చరించాడు. వాక్కు వలన సారస్వతుడు లేదా అపాంతరతముడు జన్మించాడు.

అతడు స్వాయంభువ మన్వంతరంలో భగవంతుని ఆజ్ఞానుసారం వేదవిభాగం చేసాడు.

భగవానుడన్నాడు– వైవస్వత మన్వంతరంలో నీ వలన పుట్టిన వంశంలో భరత వంశం కురు పాండవుల మధ్య నీ ప్రమేయం లేకుండానే యుద్ధం జరుగుతుంది. ఆ కాలంలో కూడా నీవు వేద విభజన చేస్తావు. పరాశర మహర్షి నీ తండ్రి. శుకుడు నీ కుమారుడు. ఆ విధంగా వేదవ్యాసుడు జన్మించి వేద విభజన చేసాడు, పంచమ వేదంగా మహాభారతాన్ని,

అష్టాదశ పురాణాలను రచించాడు. అపాంతరత ముని వేదాచార్యుడు, ప్రాచీన గర్భుడని పిలుస్తారు. అతడే కృష్ణద్వైపాయన వ్యాసుడిగా– 'లక్షశ్లోకి' మహాభారత కర్త.

## ఉంఛ వృత్తి

ఇంద్రుడొకసారి నారద మహర్షిని అడిగాడు– మీరు ముల్లోకాల్లోనూ సంచరిస్తూ చూసిన అద్భుత విషయమేమిటి? నారుదుడు ఇంద్రుడికి చెప్పిన కథను భీష్ముడు ధర్మరాజుకు చెబుతున్నాడు– గంగానదికి దక్షిణ తీరంలోని 'మహాపద్మపురం'లో సౌమ్యుడైన సోమవంశపు బ్రాహ్మణుడుండేవాడు. అతడి ఇంటికి ఓ అతిథి వచ్చి– సంసారమనే సముద్రపు ఒడ్డుకు చేరడానికి ధర్మమయిన పడవ గురించి –చెబుతున్నాడు.

మాంధాత యజ్ఞం చేసిన గోమతీ నదీ తీరంలో, నైమిశారణ్యంలో నాగపురంలోని నాగరాజు గొప్ప ధర్మాత్ముడు. అతడి పేరు పద్మనాభుడు. పద్ముడనే పేరుతో ప్రఖ్యాతి గాంచాడు. సర్వశాస్త్ర విశారదుడు. యజ్ఞాలు దానాలు చేస్తాడు. సర్వ భూతదయ కలవాడు. అతడు ధర్మసూక్ష్మాలెరిగినవాడు –అని అతిథి చెప్పగా సంతోషించాడు విప్రుడు.

అతిథి వెళ్లిపోయిన కొన్నాళ్లకు విప్రుడు నాగరాజు పద్ముడింటికి వెళ్లాడు. అప్పుడు పద్ముడింటిలో లేడు. అతడి భార్య అన్నది– "నా భర్త సూర్యుని రథం లాగే పగ్గమై తన విధి నిర్వహించడానికి వెళ్లి పదిహేను రోజులయ్యింది. మరో పదిహేను రోజుల్లో వచ్చాక మిమ్మల్ని దర్శిస్తాడు. మీకింకేమి కావాలన్నా అడగండి!" –అన్నదామె సవినయంగా.

విప్రుడన్నాడు– "నేను మహావనంలో పద్ముడి గురించి వేచి ఉంటాను. దయచేసి అతడు తిరిగి వచ్చాక నేను అతడి దర్శనార్థం వచ్చినట్లు తెలియజేయండి."

అతడు వనంలో మితాహారంతో తపస్సు చేయసాగినాడు. నాగరాజు భార్య, అతడి బంధుమిత్రులు అతడున్న చోటుకు వెళ్లి అతడిని తామిచ్చే కందమూలాలు ఫలాలు స్వీకరించమని కోరినారు.

అతడన్నాడు– "మీ మాటలు నాకు ఆహారం లాంటివి. నాగరాజు ఇంకో ఎనిమిది రోజుల్లో వస్తాడు కదా. అతడి రాక కోసమే నేనీ వ్రతం చేస్తున్నాను. ఎనిమిది రాత్రులు గడచినా అతడు రాకపోతే అప్పుడు ఆహారం తీసుకుంటాను".

వాళ్లందరూ నిరాశగానే ఇళ్లకు వెళ్లారు. నాగరాజు తన విధులు పూర్తి చేసుకుని ఎనిమిదవ రోజున ఇంటికి వచ్చాడు. నాగపత్ని చెప్పింది– "మీకోసం ఓ విప్రుడు వచ్చి పదిహేను రోజులయ్యింది. మీ దర్శనం కోసం కఠోర వ్రతం చేస్తున్నాడతడు" అన్నదామె. "మీరు వెళ్లి అతడికి కనిపించండి!"

నాగరాజు అన్నాడు– "సూర్య రథానికి పగ్గాలమైన మమ్మల్ని తన వద్దకు రమ్మనేవాడెవడు?"

తన భర్త క్రోధాన్ని గమనించి నాగపత్ని అన్నది– "అతడు నీ దర్శనం తప్ప మరేమీ కోరలేదు. కోపం వద్దు. మౌనం వల్ల జ్ఞానం, దానం వల్ల కీర్తి, సత్యం వలన వాగ్మిత్వం కలుగుతాయి".

**మౌనే జ్ఞాన ఫలావాప్తిః దానేన చ యశో మహత్**
**వాగ్మిత్వం సత్య వాక్యేన పరత్ర చ మహీయతే** (శాంతి. 360-10)

నాగరాజు అన్నాడు– "నీ మాటలతో నేను శాంతిని పొందాను. రోషం వలన నాగులే ఎక్కువ అపనిందలకు గురవుతున్నారు. నీ వలన నేను రక్షింపబడినాను. నీవు నా భార్య కావడం నా అదృష్టం. నేను అతడి దగ్గరకు వెళ్తున్నాను"

విప్రుడన్నాడు– "నా పేరు ధర్మారణ్యుడు. తమరిని ఒక ప్రశ్న అడగాలని మేఘం కోసం వ్యవసాయదారుడు నిరీక్షిస్తున్నట్లు తమకొరకు ఎదురుచూస్తున్నాను.

ఏకచక్ర రథమైన సూర్యుడి రథాన్ని లాగడానికి తమరు వంతులవారీగా వెళ్తారు కదా! తమరు చూసిన అత్యంత ఆశ్చర్యకరమైన సంఘటన ఏదన్నా ఉంటే చెప్పగలరా!" అన్నాడు ధర్మారణ్యుడు.

నాగరాజు చెబుతున్నాడు– "భగవంతుడైన సూర్యుడు ఎన్నో ఆశ్చర్యాలకు నిలయం. మహాబలుడైన వాయువు సూర్యుని నుండి వెలువడే కిరణాలను ఆశ్రయించుకుని ఆకాశమంతటా విస్తరిస్తాడు, వాయువును జలంగా మారుస్తాడు,

లోకాలనన్నిటినీ సమీక్షిస్తాడు, నాలుగు నెలలు నీటిని వర్షంగా కురిపించి ఎనిమిది నెలలు పైకి లాగుతాడు. ఇంతకంటె ఆశ్చర్యమేముంటుంది? కిమాశ్చర్య మతః పరమ్!

సూర్యుని తేజస్సులోనే పరమాత్మ ఉంటాడు. బీజాలన్నీ పుడతాయి అక్కడ నుంచే. పృథివి ప్రాణిమయమవుతుంది అతడి వల్లనే- కిమాశ్చర్య మతః పరమ్!

వీటన్నిటినీ మించిన ఆశ్చర్యకరమైన విషయం ఒకటి నేను చూసాను. ఒకప్పుడు మధ్యాహ్న సమయంలో సూర్యుడు లోకాలన్నిటినీ తపింపజేస్తున్నపుడు రెండవ సూర్యునిలా ప్రకాశిస్తూ ఇంకో పురుషుడు కనిపించాడు. అతడెవరని మేము ఆశ్చర్యపడుతుంటే సూర్యుడన్నాడు- అతడు అగ్నీకాదు, అసురుడూ కాదు, పన్నగుడూ కాదు. ఉంఛవృత్తితో సిద్ధి పొందిన ముని. పరంధాముని పొందాడతడు.

కందమూలాలు, ఫలాలు తింటూ, నీటినీ, వాయువును తీసుకుంటూ ఏకాగ్రచిత్తంతో శంకరుని స్తుతించాడు. ఉంఛవృత్తితో, శిలవృత్తితో లభించినదే తినేవాడు. సర్వభూత హితాన్ని చేసేవాడు. ఉత్తమ లోకాలు పొంది సూర్యునితో కలిసి భూ ప్రదక్షిణం చేస్తున్నాడు" అన్నాడు పద్మడనే నాగరాజు.

ధర్మారణ్యుడనే విప్రుడన్నాడు- "నాగరాజా! నీకు శుభమస్తు. నేను వెళ్లివస్తాను"

నాగరాజు అన్నాడు- "అతిథిగా వచ్చారు. చెట్టుక్రింద కూర్చుని లేచి వెళ్లిపోయే బాటసారిలా మొగం చూపించి వెళ్లడం తగదు".

ధర్మారణ్యుడన్నాడు- "పుణ్య సంపాదన విషయంలో నాకు సందేహం ఉండేది. ఇపుడది లేదు. నా కోరిక తీరడానికి ఉంఛవ్రతం చేస్తాను. మీకు శుభమగును గాక!"

అని పలికి నాగరాజు వద్ద అనుమతి తీసుకుని ధర్మారణ్యుడు చ్యవన మహర్షి వద్దకు వెళ్లి దీక్షను స్వీకరించి జీవితమంతా ఉంఛవృత్తితో గడిపి ఉత్తమలోకాలకు చేరాడు.

భీష్ముడన్నాడు ధర్మరాజుతో-

**యదయం పరమో ధర్మః యన్మా పృచ్ఛసి భారత**
**ఆసీద్ధీరో హ్యనాకాంక్షీ ధర్మార్థకరణే నృప** (శాంతి. 365-8)

ధర్మరాజా! నీవు నన్నడిగిన ధర్మం ఇదే. ధర్మారణ్యుడు ఏ కోరికా లేకుండా ధర్మార్థ కార్యాలు ఆచరించాడు.

✣✣✣✣✣

# ✤ 13. అనుశాసన పర్వము ✤

1) దాన ధర్మ పర్వము (166)

2) భీష్మ స్వర్గారోహణ పర్వము (2)

## 1) దాన ధర్మ పర్వము

ధర్మరాజు అంటున్నాడు భీష్ముడితో– "పితామహా! శాంతిని పొందడానికి అనేక ఉపాయాలు చెప్పావు. కాని ఇది స్వయంకృతాపరాధం వలన పొందిన దుస్థితి కాదా! దుర్యోధనుడు చనిపోయి అదృష్టవంతుడైనాడు. నేను బ్రతికి ఉండి మనశ్శాంతి లేకుండా దురదృష్టవంతుడనైనాను"

భీష్ముడన్నాడు– "నీవు అస్వతంత్రుడవు. నీ కర్మలకు నిన్ను నీవు కారణంగా భావిస్తున్నావు. అందుకే నీకు మనశ్శాంతి లేదు. ఈ ప్రాచీనేతిహాసం విను–

### గౌతమి-లుబ్దక-వ్యాళ-మృత్యు-కాల సంవాదం

గౌతమి అనే ఒంటరి వృద్ధురాలి కుమారుడు పాము కరచి చైతన్యాన్ని కోల్పోయాడు. అర్జునకుడనే బోయవాడు ఆ పామును బంధించి గౌతమి దగ్గరకు తెచ్చి అన్నాడు– "నీ కుమారుడిని చంపిన ఈ పామును నిప్పులో పడవేయనా? కత్తితో ముక్కలుగా నరకనా?"

గౌతమి అన్నది– "దీనిని చంపినా నా కొడుకు బ్రదుకడు. ఈ పామును చంపించిన పాపం నాకెందుకు? దీనిని వదిలేయి".

అర్జునకుడన్నాడు– "ఈరోజు నీ కుమారుడు మరణించాడు. రేపు ఇంకెవరినో కాటు వేస్తుంది. ఇంతకు ముందు ఎంతమందిని చంపిందో! దీనిని చంపివేస్తాను. అనుజ్ఞ యివ్వు"

పాము అన్నది– "ఇందులో నా తప్పేమున్నది? మృత్యువు నన్ను ప్రేరేపించింది. మృత్యువు ఆదేశంతోనే నేను కాటు వేసాను. కోపంతోనో, కోరికతోనో కాదు. లుబ్దకా! అది పాపం అయితే ఆ పాపం మృత్యువుది. నేను మృత్యువు చేతి ఆయుధాన్ని మాత్రమే!"

అర్జునకుడన్నాడు– "అవునా! నిన్ను నా కత్తితో నరికి చంపుతాను. అప్పుడు ఆ పాపం నా కత్తిదవుతుంది. సిద్ధంగా ఉండు".

మృత్యువు అన్నది– "నేను కాలానికి లోబడి పామును ప్రేరేపించాను. కాబట్టి ఆ పాపానికి పాము, నేను బాధ్యులం కాము. సర్వమూ కాల స్వరూపం. ఈ పాపం కాలానిది"

కాలుడన్నాడు– "ఈ బాలుడు చేసిన కర్మ ఇతడి మరణానికి కారణం. నేను, పాము, మృత్యువు బాధ్యులు కారు. మనమందరం కర్మాధీనులమే!"

గౌతమి అన్నది– "పాము, మృత్యువు, కాలం ఈ బాలుడి మృతికి కారణం కాదు. బాలుడు తన కర్మ వలనే మరణించాడు". ఆ తరువాత బోయవాడు పామును విడిచిపెట్టాడు. ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు.

### సుదర్శనోపాఖ్యానం (మృత్యువును జయించడం)

భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుకు– మనువు కుమారుడు ఇక్ష్వాకుడు. అతడికి నూరుగురు పుత్రులు. పదవవాడు దశాశ్వుడు. అతడి కొడుకు మదిరాశ్వుడు. అతడి కొడుకు ద్యుతిమంతుడు. ద్యుతిమంతుడి కొడుకు సువీరుడు. ఇతడి పుత్రుడు దుర్జయుడు; దుర్జయుని కొడుకు దుర్యోధనుడు. ఇతడిని దేవనది నర్మద ప్రేమించి భార్యగా 'సుదర్శన' అనే కుమార్తెను కన్నది. అంత అందమైన స్త్రీ అంతకు ముందు పుట్టలేదు.

ఆమెను ప్రేమించిన అగ్ని బ్రాహ్మణుడి రూపంలో వచ్చి ఆమెతో వివాహం చేయమన్నాడు. సవర్ణుడు కాదని రాజు అంగీకరించలేదు. అగ్నికి కోపం వచ్చింది. రాజు చేస్తున్న యజ్ఞం నుంచి నిష్క్రమించాడు అగ్ని. దానితో హోమాగ్నులు చల్లారిపోయాయి. బ్రాహ్మణులు అగ్ని ప్రేమను గ్రహించి రాజుకు చెప్పారు.

అగ్నికి సుదర్శనకు వివాహమయ్యింది. వారి పుత్రుడు సుదర్శనుడు.

ఆరోజుల్లో నృగుని తాతగారైన ఓఘవంతుడనే రాజుకు ఓఘవతి, ఓఘరథుడు సంతానం. ఓఘవతిని సుదర్శనుడికిచ్చి వివాహం చేసారు. వాళ్లు కురుక్షేత్రంలో నివసించారు. సుదర్శనుడు– "గృహస్థుడనై ఉంటూ మృత్యువును జయిస్తాను" అని శపథం చేసాడు. అతడు తన భార్య ఓఘవతితో అన్నాడు– "ఎన్నడూ అతిథులను తిరస్కరించకు. అతిథి మర్యాదలలో లోటు రానియ్యకు" (ఆ కాలంలో యజమానురాలు ఇంటికి వచ్చిన అతిథి కోరితే అతడితో శయ్యనలంకరించేది).

ఒకరోజున సుదర్శనుడు సమిధల కోసం అడవికి వెళ్లిన సమయంలో వారింటికి అతిథి వచ్చాడు. వేదోక్త పద్ధతిలో అతడిని సత్కరించిందామె. ఆమెను కోరుకున్నాడా అతిథి. వారు లోన ఉన్నారు. సుదర్శనుడు వచ్చి– "ఎవరు లోపల?" అన్నాడు. అతిథి అన్నాడు– "అతిథి ధర్మం నిర్వహించబడే ముందు అడ్డురాకు"

సుదర్శనుడు తన ప్రతిజ్ఞ తప్పలేదు. మృత్యువు సుదర్శనుడిని సమీపించలేకపోయింది. ధర్ముడు తలుపు తీసి అన్నాడు– "నేను నిన్ను పరీక్షించాలని అతిథి రూపంతో వచ్చాను. నీ భార్య పతివ్రత" అని ఆ దంపతులను ఆశీర్వదించి– "ఈమెలోని సగభాగం నదిగా మారుతుంది. మిగతా సగభాగం నీకు భార్యగా ఉంటుంది" అని పలికి అదృశ్యమైనాడు.

## విశ్వామిత్రుడు (బ్రాహ్మణత్వం)

భీష్ముడు చెబుతున్నాడు– విశ్వామిత్రుడు అమిత శక్తిశాలి. వసిష్ఠుడి నూరుగురు పుత్రులను నశింపజేసాడు. కోపంతో యాతుధానులను, రాక్షసులను సృష్టించాడు. బ్రహ్మర్షులైన కుశిక వంశానికి, కౌశికీ నదికి కర్త. హరిశ్చంద్రుని క్రతువులో యజ్ఞపశువైన శునశ్శేపుని విడిపించి తన కుమారుడిగా చేసుకున్నాడు. తన కుమారులు తన మాట వినలేదని యాభై మందిని చండాలురుగా బ్రదకమని శపించాడు. త్రిశంకునికి స్వర్గార్హత కలిగించాడు. రంభను శిలగా మార్చాడు. విశ్వామిత్రుడి కోపానికి భయపడి బంధాలతో వసిష్ఠుడు నదిలో మునిగాడు. ఆ నదిలో బంధాలు తెగి బయటపడినాడు. అది విపాశ నదిగా ప్రసిద్ధికెక్కింది. ధ్రువ నక్షత్రానికి బ్రహ్మర్షులకు మధ్య ఉత్తర దిక్కున ప్రకాశిస్తుంటాడు విశ్వామిత్రుడు.

ఆజమీఢుని కుమారుడు జహ్నువనే మహరాజు. గంగ ఆతడి కుమార్తెగా జాహ్నవి అయ్యింది. జహ్నువు కుమారుడు సింధుద్వీపుడు. అతడి కుమారుడు బలాకాశ్వుడు (వల్లభుడు). ఇతడి కుమారుడు కుశికుడు. కుశికుని కుమారుడు గాధి. గాధి కుమార్తె సత్యవతి. సత్యవతి భర్త ఋచీకుడు (చంద్రకిరణ ప్రకాశం, వాయువేగం, ఒకవేపు చెవి నల్లగా ఉండే వెయ్యి గుర్రాలు గంగానది నుంచి కన్యాకుబ్జం దగ్గర వరుణుడి వరంతో పొంది ఋచీకుడు వాటిని గాధికి ఇచ్చాడు. అశ్వాలు లభించిన చోటు అశ్వతీర్థంగా ప్రసిద్ధికెక్కింది).

ఋచీకుడు తన భార్యకు, ఆమె తల్లి (గాధి భార్య)కి సంతానం కొరకు యజ్ఞం చేసి రెండు చరువులు (ప్రసాదాల) నిచ్చి అన్నాడు– "ఇది నీ కొరకు చేసిన చరువు. బ్రాహ్మణ సంతానాన్నిస్తుంది. దీనిని తిని మేడిచెట్టును కౌగిలించుకో; అలాగే నీ తల్లి క్షత్రియ చరువును తిని అశ్వత్థ వృక్షాన్ని కౌగిలించుకోవాలి" అన్నాడు.

అయితే తల్లి మాటలతో తరువు, చరువులు మారగా అది తెలిసిన ఋచీకుడన్నాడు– "నీకు క్షత్రియుడు పుడతాడు. నీ తల్లికి బ్రాహ్మణుడు జన్మిస్తాడు". దానితో సత్యవతి కాళ్లావేళ్లాపడగా "నీకు బ్రాహ్మణుడు జన్మిస్తాడు కానీ నీ మనమడు క్షత్రియ ధర్మంతో మెలుగుతాడు" అన్నాడు. ఆ విధంగా తరువులు, చరువులు తారుమారు కావడంతో గాధి భార్యకు క్షత్రియుల కుటుంబంలో విశ్వామిత్రుడు జన్మించాడు. సత్యవతి–ఋచీకులకు జమదగ్ని జన్మించాడు. జమదగ్ని రేణుకను వివాహమాడగా వారికి పరశురాముడు జన్మించాడు.

విశ్వామిత్రుడు క్షత్రియుడైనా గొప్ప తపస్సు చేసి బ్రాహ్మణత్వాన్ని పొందినాడు. బ్రాహ్మణవంశ కర్త అయినాడు.

## ఇంద్రుడు-చిలుక (దయ)

కాశీరాజు రాజ్యంలో ఒక బోయవాడు అడవికి వెళ్లి లేడిని చంపాలని విషబాణం వదిలాడు. అది గురితప్పి ఒక ఫలపుష్ప భరితమైన పెద్ద చెట్టుకు గుచ్చుకున్నది. కొద్దిరోజుల్లోనే ఆ చెట్టుకున్న ఆకులు, పండ్లు రాలిపోయాయి. చెట్టు ఎండిపోయింది.

చిరకాలం నుంచి ఆ చెట్టు తొర్రలో ఉన్న చిలుక ఆ చెట్టును వీడకుండా, ఆ చెట్టులానే చిక్కిపోసాగింది. ఇంద్రుడు అది చూసి ఆశ్చర్యపడి కారణమేమిటని చిలుకనడిగాడు– చిలుక జవాబిచ్చింది– "నేను ఈ చెట్టు ఆశ్రయంలోనే పుట్టి పెరిగాను. ఇప్పుడిది ఎండిపోయిందని వదిలి వెళ్లలేను.

**అనుక్రోశో హి సాధూనాం మహద్ధర్మస్య లక్షణమ్**
**అనుక్రోశశ్చ సాధూనాం సదా ప్రీతిం ప్రయచ్ఛతి** (అనుశాసనిక 5–24)

సజ్జనులు దయను చూపిస్తారు. అది ఆనందాన్నిస్తుంది".

ఇంద్రుడు సంతోషించి చిలుకను వరం కోరుకోమ్మన్నాడు. "చెట్టు జీవించాలని" కోరుకున్నదా చిలుక.

అమృతాన్ని చిలుకరించి ఆ చెట్టును బ్రతికించాడు ఇంద్రుడు. తన దయాగుణంతో చేసిన కర్మఫలితంగా చిలుక మరణానంతరం ఇంద్రలోకాన్ని పొందింది.

## పురుషార్థ ప్రభావం

బ్రహ్మ చెబుతున్నాడు వసిష్ఠుడితో– పురుష ప్రయత్నం క్షేత్రం – దైవం బీజం. క్షేత్ర బీజాలతో సస్యసమృద్ధి ఉంటుంది. బీజం లేకుండా ఏదీ మొలవదు. బీజం లేకపోతే ఫలముండదు. గింజ నుండే గింజ పుడుతుంది.

పని చేసినవాడు అది మంచిపని అయినా, చెడ్డపని అయినా ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. తనకు తాను బంధువు, తనకు తానే శత్రువు. కర్మను చేయడంలో కాని చేయకపోవడంలో కాని తనకు తానే సాక్షి.

యయాతి పుణ్యక్షయంతో స్వర్గభ్రష్టుడై కూతురి బిడ్డల పుణ్యకర్మలతో స్వర్గానికి వెళ్లాడు; ఐలుడు బ్రాహ్మణాశీర్వాదంతో స్వర్గానికి వెళ్లాడు. సౌదాసుడు అశ్వమేధాది యాగాలు చేసినా శక్తిముని శాపంచే కల్మాషపాదుడనే రాక్షసుడయ్యాడు. ఋషి పుత్రులైన అశ్వత్థామ, పరశురాముడు గొప్ప ధనుర్ధారులు, స్వర్గప్రాప్తి లేదు వారికి. వసువు ఒక్క అసత్య వచనంతో (అజ) పాతాళానికి నెట్టివేయబడినాడు. బలిచక్రవర్తి విష్ణుమూర్తి వలన పాతాళవాసి అయినాడు. జనమేజయుడు అనే రాజు బ్రాహ్మణ స్త్రీలను వధించి కూడా స్వర్గానికి వెళ్లాడు. వైశంపాయుడనే బ్రహ్మర్షి బ్రాహ్మణుని చంపాడు, బాలవధ చేసాడు కాని స్వర్గానికి వెళ్లగలిగాడు. నృగుడు మిధ్యా గోదానం చేసి ఊసరవెల్లిగా జన్మించాడు. ధుంధుమారుడు స్వర్గాన్ని కాదని గిరివ్రజంలో నిద్రించాడు.

పురుషార్థంతో కూడిన దైవబలం వర్ధిల్లుతుంది. తండ్రిని తృప్తిపరిస్తే బ్రహ్మను, తల్లి సంతోషపడితే భూదేవిని, గురువును ఆదరిస్తే పరమాత్మను పూజించినట్లే. ఈ మూడింటిని ఆచరించినవాడు సర్వధర్మాలను ఆదరించినవాడవుతాడు.

## నక్క - కోతి (మాట ఇచ్చి తప్పడం)

సజ్జనుల (బ్రాహ్మణుల)కు మాట ఇచ్చి తప్పినవాడు నక్కగా పుడతాడు. సజ్జనుల (బ్రాహ్మణుల) సొమ్ము దొంగతనం చేసినవాడు కోతిగా జన్మిస్తాడు.

**ఏ తద్ధి పరమం తేజః బ్రాహ్మణ స్నేహ దృశ్యతే**
**సహస్ర కిరణస్యేవ సవితుర్ధరణీ తలే** (అనుశాసనిక. 9–24)

## శూద్రముని - విప్ర గురువు

దయామయుడైన శూద్రుడొకడు మునులుండే ఆశ్రమవాటిక దగ్గర అనేక సంవత్సరాలు గొప్ప తపస్సు చేసాడు. ఒక ముని ద్వారా పితృకార్యం చేసి ఉపదేశం పొందాడు. చివరకు తపస్సు చేస్తూనే చనిపోయాడు. ఆ తపోఫలం వల్ల శూద్రముని గొప్ప రాజుగా జన్మించాడు. ముని అతడికి పురోహితుడైనాడు.

పూర్వజన్మ జ్ఞానమున్న రాజు తన పురోహితుడిని చూసినప్పుడల్లా నవ్వి మౌనంగా ఉండేవాడు. కారణమడిగితే రాజు అన్నాడు– క్రితం జన్మలో నీవు మునివి, నేను శూద్రుడను. ఈ జన్మలో నేను రాజును నీవు పురోహితుడివి. కాలం మారింది.

తగని వారికి ఉపదేశిస్తే గురువు కష్టాలపాలవుతాడు.

## శ్రీ-రుక్మిణీ సంవాదం

శ్రీ అన్నది– సౌభాగ్యవంతుడు, భయరహితుడు, సమర్థుడు, క్రోధరహితుడు, దైవభక్తుడు, కృతజ్ఞుడు, జితేంద్రియుడు, కర్మతత్పరుడైన నరుని దగ్గర నివసిస్తాను. సద్గుణాలు కలిగి దేవబ్రాహ్మణ సేవ చేస్తూ ఇంటిని, పాత్రలను శుభ్రంగా ఉంచుకుంటూ గోవులను, ధాన్యాన్ని రక్షించే స్త్రీల దగ్గర నివసిస్తాను.

**ప్రకీర్ణ భాండా మనవేక్ష్య కారిణీం సదాచభర్తుః ప్రతికూల వాదినీమ్**
**పరస్య వేశ్మాభిరతామలజ్జా మేవం విధాంతాం పరివర్జయామి** (అనుశాసనిక. 11–11)

## వత్సనాభుడు-కృతజ్ఞుడు; భంగాస్వనోపాఖ్యానం-కృతఘ్నుడు

వత్సనాభుడనే బ్రహర్షి తపస్సు చేస్తుంటే పెద్ద జడివాన కురిసింది. అతడి చుట్టూ పెరిగిన పుట్టపై పిడుగు పడింది. ఏడురోజులు వానపడినా అతడు చలించలేదు. ఇంద్రుడు వర్షం ఆపలేదు. ధర్ముడికి జాలి కలిగి దున్నపోతు రూపంలో ముని ఉన్న పుట్టపైన పైకప్పులా నిలబడ్డాడు. ఇంద్రుడు వర్షాన్ని ఉపసంహరించినాక ముని బయటకు వచ్చి చూసాడు. దున్నపోతు తనను కాపాడిందని అర్థమై ఎలా కృతజ్ఞత చెప్పాలో అర్థంకాక ప్రాయోపవేశం చేయబోగా ధర్ముడు ప్రత్యక్షమై అతడిని ఆశీర్వదించాడు.

ఇంద్రుడు భంగాస్వనుడనే రాజుకు ఎంతో సాయం చేసాడు. ఆ తరువాత భంగాస్వనుడు అగ్నిష్టుతమనే యజ్ఞం చేసాడు. అది ప్రాయశ్చిత్తానికి, పుత్రకామనకు చేసేది. దానిలో ఇంద్రునికి ప్రాముఖ్యం లేదు. ఇంద్రుడికి కోపం వచ్చింది అతడి కృతఘ్నతపై. భంగాస్వనుడు వేటకి వెళ్లినపుడు దాహం కాగా సరస్సులోని నీటిని తాగి స్త్రీగా మారిపోయాడు. అతడు రాజ్యానికి వెళ్లి తన నూరుగురు కుమారులకు రాజ్యం ఇచ్చి తాను అడవులకు వెళ్లి తపస్సు చేసుకోసాగినాడు. అక్కడ తపోవనంలో ఒక తాపసి ఆమెను ఇష్టపడ్డాడు. వారికి నూరుగురు కుమారులు కలిగారు. భంగాస్విని అన్నది వారితో– నేను పురుషుడిగా ఉన్నపుడు నాకు నూరుగురు కొడుకులున్నారు. ఇప్పుడు స్త్రీగా నూరుగురిని మిమ్మల్ని కన్నాను. మీరు రెండు నూర్లమంది చక్కగా కలిసిమెలసి ఉండండి –అన్నది. వాళ్లు ఎంతో సఖ్యంగా ఉంటున్నారు.

ఇంద్రుడు వారి మధ్య భేదభావం సృష్టించగా రెండు వర్గాలూ పోట్లాడుకుని రెండు వందలమందీ చనిపోయారు. భంగాస్విని ఏడుస్తుంటే ఇంద్రుడు బ్రాహ్మణుడి వేషంలో వచ్చి అన్నాడు– నీవు నాకిష్టంలేని యాగం చేసావు. అందుకే నీకీ దురదృష్టం కలిగింది అన్నాడు. “నన్ను క్షమించమని” భంగాస్విని ప్రార్థించగా ఇంద్రుడన్నాడు– నీకో వరమిస్తాను, నీ కుమారులలో ఎవరిని బ్రదికించను. నీవు మగవాడిగా ఉన్నపుడు పుట్టినవారా లేక నీవు స్త్రీగా ఉన్నపుడు పుట్టినవారా?

భంగాస్విని అన్నది– తల్లి ప్రేమ గొప్పది. అది స్నేహపూరితమైనది. స్త్రీగా ఉన్నపుడు కలిగిన సంతానాన్ని బ్రతికించు.

ఇంద్రుడు సంతోషించి రెండు వందలమందిని బ్రదికించి ఆమెను భంగాస్వనుడిగా మారుస్తానంటే వద్దన్నది భంగాస్విని.

**స్త్రియాః పురుష సంయోగే ప్రీతిరభ్యధికా సదా**
**ఏ తస్మాత్ కారణాచ్ఛక్ర స్త్రీత్వ మేవ వృణోమ్యహమ్** (అనుశాసనిక. 12–52)

ఆ విధంగా భంగాస్విని స్త్రీ రూపంలోనే ఉండిపోయింది.

## సుపర్ణుడు - విష్ణుదేవుడు

భీష్ముడన్నాడు ధర్మరాజుతో– శరీరంతో మూడు పనులు (హత్య, దొంగతనం, పరదారాగమనం), వాక్కుతో నాలుగు పనులు (అసత్ ప్రలాపం, పరుష వచనం, చాడీలు చెప్పడం, అసత్యమాడడం) విడనాడాలి. మనస్సుతో మూడు పనులు – పరుల సొమ్మునపహరించే ఆలోచన లేకుండుట, సర్వప్రాణులపై స్నేహదృష్టి, కర్తలకు ఫలముంటుందన్న విశ్వాసం –ఇవి పాటించాలి.

దేవ దానవ యుద్ధంలో నారాయణుడు గరుడుని వీపుపై ఎక్కి రాక్షసులను సంహరించి అంతర్ధానమైనాడు. అప్పుడు దేవతలు గరుడుని అడిగారు– నారాయణుని స్వరూపమెట్టిదని.

సుపర్ణుడైన గరుడుడు చెప్పాడు– "నా తల్లి వినత దాస్య విముక్తి కోసం నేను దేవతలను ఓడించి అమృతాన్ని అపహరించినపుడు అశరీరవాణి పలికింది– 'సుపర్ణా! నాకు వాహనంగా ఉండు'. నేను అంగీకరించాను. ఆ విషయం నా తండ్రి కశ్యపుడికి చెబితే అతడన్నాడు– 'వైనతేయా! అదృష్టవంతుడివి. నారాయణునితో మాట్లాడావు'.

ఆ తరువాత నారాయణుడు నాకు ప్రత్యక్షమైనాడు విశ్వరూపుడై. ఆ తరువాత నారాయణాశ్రమానికి, ఆ తరువాత ఒక అద్భుత సరోవరంలోకి వెళ్లి ఆ దివ్యలోకంలో పరమాత్మను స్తుతించాను.

**పాహిమాం దేవదేవేశ కోప్యజోసి సనాతన**
**ఏవం గతోసి శరణం శరణ్యం బ్రహ్మ యోనినామ్** (అనుశాసనిక. 13– )

అప్పుడు నారాయణుడు నాకు దివ్యరూపంలో ప్రత్యక్షమై అన్నాడు– జగద్ధితం కోరి నేను నాలుగు భాగాలుగా ఉంటాను– ఒకటి నిర్గుణమూర్తి (వాసుదేవుడు); రెండవది (సంకర్షణుడు)– చరాచర భూత సమూహాన్ని సృష్టిస్తుంది; మూడవది (ప్రద్యుమ్నుడు)– స్థావరజంగమాత్మక జగత్తును సంహరిస్తుంది; నాలుగవది (అనిరుద్ధుడు)– ఆత్మనిష్ఠ– అసుర శక్తులను మాయా మోహితులను చేస్తుంది. ఆ నాలుగవ మూర్తిని నేనే.

**మాయా సర్వమిదం వ్యాప్తం మయి సర్వం ప్రతిష్ఠితమ్**
**అహం సర్వ జగద్బీజం సర్వత్ర గతిరవ్యయః** (అనుశాసనిక 13– )

నిశ్చిత బుద్ధిగల పురుషులు పరమాత్మ తత్త్వాన్ని గ్రహించి పరమగతిని పొందుతారు".

## మేఘవాహన పర్వాఖ్యానము

భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుతో–

**యుగే యుగే తు కృష్ణేన తోషితోవై మహేశ్వరః**
**భక్త్యా పరమయాచైవ ప్రీతశ్చైవ మహాత్మనః** (అనుశాసనిక. 14–13)

మహాత్ముడైన శ్రీకృష్ణుని భక్తికి శివుడు ప్రసన్నుడైనాడు. జాంబవతి కోరగా ఆమెకు అత్యుత్తమ సంతానం కోసం శ్రీకృష్ణుడు హిమవత్పర్వతానికి చేరుకున్నాడు.

**సర్వమే తన్మహా బాహో దివ్యభావ సమన్వితమ్**
**ప్రసాదాద్ దేవదేవస్య ఈశ్వరస్య మహాత్మనః** (అనుశాసనిక. 14–367)

ఈశ్వరుని అనుగ్రహం వలన ఇక్కడ అంతా దివ్యభావంతో కూడి ఉన్నది. అటువంటి అద్భుత ప్రదేశంలో తపస్సు చేసి శ్రీకృష్ణుడు శంకరుడి కరుణను పొందాడు.

ధర్మం మీద దృఢ బుద్ధిని, యుద్ధంలో శత్రుసంహారం చేయగలగడానిని, ఘనకీర్తిని, పరమబలాన్ని, యోగ ప్రియత్వాన్ని, నీ సాన్నిధ్యాన్ని, పదివేల మంది కొడుకులను కోరుకున్నాడు శ్రీకృష్ణుడు.

అదేవిధంగా ఉపమన్యువు, తండి అనే ఋషులు శంకరుని ప్రార్థించారు.

**నాస్తి శర్వ సమో దేవః నాస్తి శర్వ సమా గతిః**
**నాస్తి శర్వ సమోదానే నాస్తి శర్వ సమో రణే** (అనుశాసనిక. 15–11)

**దేహకృద్ దేహభృద్ దేహీ దేహభుగ్దేహినాం గతిః**
**ప్రాణకృత్ ప్రాణభృత్ ప్రాణీ ప్రాణదః ప్రాణినాం గతిః** (అనుశాసనిక. 16–31)

ఉపమన్యువు శివ సహస్రనామ స్తోత్రాన్ని శ్రీకృష్ణునికి చెప్పాడు–

**స్థిరః స్థాణుః ప్రభుర్భీమః ప్రవరో వరదో వరః**
**సర్వాత్మా సర్వ విఖ్యాతః సర్వః సర్వ కరోభవః** (అనుశాసనిక. 17–31)

**ఏతద్ధి పరమం బ్రహ్మ పరం బ్రహ్మాధి గచ్ఛతి**
**ఋషయశ్చైవ దేవాశ్చ స్తువం త్యేతేన తత్పరమ్** (అనుశాసనిక. 17–158)

## అష్టావక్రుడు - వృద్ధకన్య

అష్టావక్రుడు మహాతపస్వి. అతడు వదాన్యుని కుమార్తె సుప్రభను చూసి మనసు పడి వివాహమాడాలనుకున్నాడు.

వదాన్యుడన్నాడు– నీవు కుబేరుని నగరాన్ని దాటి, హిమవత్పర్వతాన్ని దాటి కైలాసగిరి వెళ్లు. అక్కడ మహా పార్శ్వమనే పర్వతముంటుంది. అక్కడ ఋతువులు, కాలరాత్రి, దివ్య మానుష భావాలు అన్నీ ఆకృతి ధరించి మహాదేవుని సేవిస్తుంటాయి. దానిని దాటి మనోహరంగా ఉన్న వన ప్రాంతానికి వెళ్లు. నీకక్కడ ఓ వృద్ధస్త్రీ కనిపిస్తుంది. ఆమెను చూసి మరలి వచ్చాక నీవు నా కుమార్తెను పెండ్లి చేసుకోగలవు–

అష్టావక్రుడు బయల్దేరి అలకాపురి చేరుకున్నాడు. కుబేరుడతడికి మంచి ఆతిథ్యమిచ్చాడు. అప్సరసలు నృత్యం చేసారు. గంధర్వులు గొప్పగా గానం చేసారు. అక్కడ ఓ సంవత్సర కాలం ఉండి కైలాస, మందర పర్వతాలు దాటి, శంకరుడు కిరాతరూపంలో సంచరించిన స్థానానికి ప్రదక్షిణం చేసి నమస్కరించాడు. అక్కడ నుంచి వన ప్రాంతానికి వెళ్లి దివ్యాశ్రమం చూసాడు. అక్కడ అతడికి అందాలరాశులు స్వాగతం పలికారు. లోపల సర్వాభరణ భూషితురాలైన వృద్ధురాలు అతడిని సవినయంగా ఆహ్వానించింది.

ఆ రాత్రి ఆమె చలితో వణికిపోతూ అతడి పక్కన చేరింది. అష్టావక్రుడు చలించలేదు. అనేక రకాలుగా అతడిని ప్రేరేపించ చూసింది. ఆమెను చూసి అతడికి రూపవైరాగ్యమేర్పడింది. మరుసటి రోజున ఆమె అతడిని స్వయంగా స్నానం చేయించి, తైలమర్ధన చేసింది. నిద్రపోయాడతడు. లేచాక అత్యంత రుచికరమైన భోజనం పెట్టింది. ఆ రాత్రి మరల అతడి పక్కన చేరింది. నేను స్వతంత్రురాలిని. నన్ను స్వీకరించు. నీకు పాపమంటదు –అన్నదామె.

**పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే**
**పుత్రాశ్చ స్థావిరే కాలే నాస్తి స్త్రీణాం స్వతంత్రతా** (అనుశాసనిక. 20–21)

అష్టావక్రుడన్నాడు– ఇంతకు ముందు వృద్ధురాలిలా కనిపించావు. ఇప్పుడు అత్యంత సుందరంగా ఉన్నావు. రూపాన్ని ఎలా మార్చుకోగలుగుతున్నావు –అడిగాడు అష్టావక్రుడు ఏమాత్రం చలించనివాడై.

ఆ స్త్రీ అన్నది– అష్టావక్రా! నీవు సుప్రభకు సరైన జోడీవి. ఆమెను పెండ్లాడి చక్కటి పుత్రుడిని పొందెదవు గాక!

అష్టావక్రుడు ఆమె ఆశీస్సులు పొంది ఇంటికి చేరుకుని సుప్రభను పెండ్లాడి తన ఆశ్రమంలో ఆనందంగా జీవించాడు.

## వివిధ ధర్మ ప్రశ్నలు

కృత, త్రేతా, ద్వాపర యోగాల తరువాత వచ్చేది కలియుగం. దీనికే 'నందికం' అని పేరు. ధర్మం ఒంటికాలిపై నడుస్తుంది. అల్పాయుష్కులు, మందబుద్ధులు పుడతారు. ప్రాణశక్తి తగ్గుతుంది. ధనముండదు. ధర్మాచారాలకు దూరమౌతారు. మంగళ కార్యక్రమాలలో కన్యలను నియోగిస్తారు. వారిలో లక్ష్మి నిత్య నివాసం చేస్తుంది కనుక.

**నిత్యం నివసతే లక్ష్మీః కన్యకాసు ప్రతిష్ఠితా**
**శోభనా శుభ యోగ్యా చ పూజ్యా మంగల కర్మసు** (అనుశాసనిక. 22)

– మద్య మాంసాలను విడనాడడం బ్రహ్మచర్యం కన్నా గొప్పది. వేదోక్తమైన కర్మ ఉత్తమ ధర్మం; ఇంద్రియనిగ్రహం శమం.

– ఉదయం పూట అర్థాన్ని, ఆపై ధర్మాన్ని, ఆపై కామాన్ని సేవించాలి. కాని కామంలో తగుల్కొనరాదు.

**అక్రోధనా ధర్మపరాః సత్య నిత్యా దమే రతాః**
**తాదృశాః సాధవో విప్రాః తేభ్యో దత్తమ్ మహాఫలమ్** (అనుశాసనిక. 22–33)

క్రోధరహితులు, ధర్మాసక్తులు, సత్యవాదులు, ఇంద్రియ నిగ్రహం గల సాధువులకు ఇచ్చిన దానం మహా ఫలప్రద మవుతుంది.

## స్వర్గ నరక గామి వర్ణనం

ప్రొద్దున్నే దేవ సంబంధ దానాలు, మధ్యాహ్నం పితృదేవతల సంబంధ దానాలు చెయ్యాలి. వేళ పాటింపక చేసే దానాలు రాక్షసులకు చెందుతాయి. ఎవరైనా దాటి వెళ్లినా, రుచి చూసినా, గొడవపడి తయారు చేసినా రాక్షస భాగమవుతుంది. రజస్వల చూసినా, కుక్క ముట్టినా, వెంద్రుకలు, కీటకాలు పడినా అది రాక్షస భాగమవుతుంది.

వివిధ వర్ణాల వారికి వివిధ రకాల కర్మలు నిశ్చయించబడినాయి. దినంలో మొదటి మూడు ముహూర్తాలు– ప్రాతఃకాలం; తర్వాత మూడు సంగవం; తరువాత మధ్యాహ్నం; ఆ తరువాత అపరాహ్ణం; తరువాత సాయంకాలం. ప్రాతః కాలంలో జపధ్యానాదులు, శుభ వ్రతాలు; సంగవ కాలంలో లౌకిక కర్మలు; మధ్యాహ్న కాలంలో స్నాన సంధ్యాదులు; అపరాహ్ణంలో పితృకార్యాలు చెయ్యాలి.

ఉపనయన వేళలో బ్రాహ్మణునికి ముంజె త్రాడు, క్షత్రియునికి అల్లెత్రాడు, వైశ్యునికి గడ్డిత్రాడు ధరింపజేయాలి. ద్విజులకు పాలాశ, క్షత్రియునికి అశ్వత్థ; వైశ్యునికి ఔదుంబర దండం వాడాలి. ఈ విధంగా శాస్త్ర విధిలో చెప్పినట్లు కర్మలు ఆచరించాలి.

## బ్రహ్మఘ్నం

భిక్ష వేస్తానని పిలిచి లేదనేవాడు, బ్రాహ్మణ వృత్తిని దుర్బుద్ధితో అపహరించినవాడు, ఆవుల మంద నీరు త్రాగబోతుంటే తరిమివేసేవాడు, శ్రుతులను దూషించేవాడు, అందమైన కుమార్తెను సరైన వరునికి ఇవ్వనివాడు, వికలాంగుల ధనం అపహరించినవాడు, ఆశ్రమం, వనం, గ్రామం, నగరాలకు నిప్పటించేవాడు బ్రహ్మఘాతి. అతడు బ్రహ్మహత్యా పాతకంతో సమానమైన పాపాన్ని పొందుతాడు.

## తీర్థ మహాత్మ్యములు

భీష్ముడు ధర్మరాజాదులకు ఒకప్పుడు అంగిరసుడు గౌతమ మునికి చెప్పిన తీర్థదర్శన, తీర్థస్నాన, తీర్థ శ్రవణ విషయాలను, వాటి ధర్మఫలాన్ని చెబుతున్నాడు.

చంద్రభాగ, వితస్త, సింధు నదీస్నానం, పుష్కర ప్రభాస, నైమిశారణ్య, సాగరోదక, దేవిక, ఇంద్రమార్గ, స్వర్ణబిందువు తీర్థాలలో స్నానం ఎంతో పుణ్యాన్నిస్తుంది. గంగానదీ తీర్థాలు, శరస్తంబం, కుశస్తంబం, ద్రోణ, శర్మ పదం జలపాతాలు, గోదావరీ నదీ తీర్థాలు, గంగా యమున సంగమ ప్రాంతాలు, గయ, కలవింక, కరివీరపుర, ఊర్వశి లౌహిత్య తీర్థాలు, నర్మద బాహుదానదీ తీర్థాలు, ప్రభాస, ఉజ్జానక, కుల్య, పిండారక, బ్రహ్మసరస్సు తీర్థాలలో కాలోదక, నందికుండం, ఉత్తర మానస తీర్థాలు, హిమగిరిని దర్శించినవారి అఘమర్షణం, పాపనివారణం జరుగుతుంది.

## గంగా మాహాత్మ్య వర్ణన

గాంగేయుడు చెబుతున్నాడు– గంగానది ప్రవహించే దేశాలు శ్రేష్ఠం.

ఏ ప్రాణి శరీరం గంగాజలంతో తడుస్తుందో, మరణానంతరం ఏ ప్రాణి ఎముకలు గంగలో కలుపబడతాయో ఆ ప్రాణి స్వర్గం కన్న తక్కువ స్థితిని పొందదు.

స్వర్గంలోని దేవతలలో సూర్యునివలె, పితరులలో చంద్రుని వలె, మనుష్యులలో రాజువలె నదులలో గంగ శ్రేష్ఠం.

నిర్మలమైన మూడు మార్గాలలో మూడు లోకాలను శోభింపజేసిన గంగానదీ జలాన్ని త్రాగినవాడు కృతకృత్యుడవుతాడు.

## ఇంద్ర-మతంగ సంవాదం

బ్రాహ్మణ స్త్రీకి క్షురకుడికి పుట్టిన మతంగుడు, గాడిద గాడిదపిల్లను కొట్టగా అది పల్కిన రోషపూరిత వచనాల ద్వారా తాను వర్ణ సంకరం వల్ల పుట్టినట్లు గ్రహించాడు.

ఎంతకాలం ఎంత నిష్ఠగా తపస్సు చేసినా బ్రాహ్మణేతరులు బ్రాహ్మణత్వం పొందలేరని ఇంద్రుడు మతంగుడితో చెప్పాడు. మతంగుడు చండదేవుడై బ్రహ్మలోకానికి వెళ్లాడు.

## వీతహవ్యుడు

బ్రాహ్మణత్వాన్ని పొందిన క్షత్రియులు విశ్వామిత్రుడు, వీతహవ్యుడు.

మనువు కుమారుడు శర్యాతి. ఆయన వంశంలోని వత్సరాజుకు ఇద్దరు కుమారులు హైహయుడు, తాళజంఘుడు. హైహయునికి (వీతహవ్యుడు) పదిమంది భార్యలు, నూరుగురు కుమారులు.

కాశీ ప్రాంతానికి రాజు హర్యశ్వుడు. ఇతడు దివోదాసునకు తాత. వీతహవ్యుని కొడుకులు గంగా యమునల మధ్య ప్రాంతంలో యుద్ధంలో హర్యశ్వుని చంపారు. హర్యశ్వుని కొడుకు సుదేవుడు. వీతహవ్యుని కొడుకులు వచ్చి హర్యశ్వుని కొడుకు సుదేవుడిని పడగొట్టారు. సుదేవుని కొడుకు దివోదాసుడు. ఇతడిపైకి హైహయులు దాడిచేసారు. అతడికి సాయం చేయడానికి బృహస్పతి పెద్దకొడుకు భరద్వాజుడు గొప్ప యాగం చేసాడు. ఆ యాగ ఫలితంగా దివోదాసునికి ప్రతర్ధనుడనే కొడుకు పుట్టాడు. పదమూడేళ్లకే వేదాలు, ధనుర్వేదం పుక్కిటపట్టిన ప్రతర్ధనుడు వీతహవ్యుని పుత్రులపై యుద్ధానికి వెళ్లాడు. ప్రతర్ధనుడు వీతహవ్యుని కుమారులందరినీ సంహరించి వీతహవ్యుడిని వెంటాడగా అతడు భృగు మహర్షి వద్ద ఆశ్రయం పొందాడు.

ప్రతర్ధనుడిని చూసి భృగువు అన్నాడు– నా ఆశ్రమంలో క్షత్రియులెవరూ లేరు.

ప్రతర్ధనుడన్నాడు– అది నాకు చాలు. మా వంశాన్ని సర్వనాశనం చేసిన వాళ్లు వర్ణం మార్చుకున్నారు, శుభం.

భృగువు మాటతో వీతహవ్యుడు బ్రహ్మర్షిత్వాన్ని, బ్రాహ్మణత్వాన్ని పొందినాడు. వీతహవ్యుని కుమారుడు గృత్సమదుడు. బ్రహ్మర్షి ఇంద్రుడిలా ఉన్నాడని దైత్యులతనిని బంధించారొకసారి. గృత్సమదుని కుమారుడు సుచేతుడు, సుచేతుని కుమారుడు వర్చుడు; వర్చుని కుమారుడు విహవుడు → వితత్యుడు → సత్యుడు → సంతుడు → శ్రువుడు → తముడు → ప్రకాశుడు → వాగింద్రుడు → ప్రమతి; ప్రమతి–ఘృతాచిల పుత్రుడు రురుడు; రురుడు–ప్రమద్వరల పుత్రుడు శునకుడు; శునకుని పుత్రుడు శౌనకుడు. వీరందరూ బ్రాహ్మణులే.

## కృష్ణుడు - నారదుడు (పూజనీయులు)

నారదుడన్నాడు– తపోధనులు, వేదవేత్తలు, దేవతలను, పితృదేవతలను, తల్లిదండ్రులను, గురువులను పూజించేవారు పూజనీయులు. సర్వభూతదయ గలవారు, సత్యం, అహింస, ధర్మప్రవర్తకులు పూజనీయులు. బ్రహ్మచర్యాన్ని పాటించేవారు అగ్నిహోత్ర సహితులు, వేదాధ్యాయనులు, సర్వ ప్రాణులను ఆత్మస్వరూపంగా పూజించేవారు పూజనీయులు.

## శ్యేన - కపోత సంవాదం (శిబి చక్రవర్తి)

డేగ వెంటాడుతుండగా ఓ అందమైన పావురం వచ్చి వృషదర్భ మహరాజును శరణు వేడింది. డేగ వచ్చి అన్నది– ఇది నాకు ఆహారంగా విధింపబడింది. నేను ఆకలిదప్పులతో ఉన్నాను. ఈ పావురాన్ని నాకు వదిలిపెట్టు.

వృషదర్భ రాజన్నాడు– నీకు ఎద్దును కాని, పందిని కాని, జింకను కాని, దున్నపోతును కాని ఇస్తాను దీనికి బదులు. అంతేకాని శరణాగతుని విడువను.

డేగ అన్నది– అంతగా నీకు పావురంపై ప్రేమ ఉంటే నీ తొడమాంసం ఇవ్వు. పావురం బరువు ఎంత ఉంటే అంత!

వృషదర్భరాజు తూనిక తెప్పించి పావురాన్ని ఒకపక్క ఉంచి తన తొడమాంసం కోసి వేసాడు. ఎంత వేసినా పావురం బరువుకు సమానం కావడం లేదు. చివరకు అతడే వెళ్లి త్రాసులో కూర్చున్నాడు, రక్తమోడుస్తూ.

ఇంద్రుడు, అగ్ని డేగ–పావురాలుగా ప్రత్యక్షమై అతడి గాయాన్ని మాన్పి ఆశీర్వదించారు.

**భక్తానామనుర్తా నామాశ్రితానాం చ రక్షితా**
**దయావాన్ సర్వభూతేషు పరత్ర సుఖమేధతే** (అనుశాసనిక. 32–35)

భక్తులను, అనురక్తులను, ఆశ్రితులను రక్షించాలి. సర్వప్రాణులపై దయ కలిగి ఉండాలి. రాజు సదాచారియై ప్రవర్తిస్తే తాను పొందలేనిదేదీ ఉండదు.

## ఇంద్రుడు - శంబరుడు

భీష్ముడు చెప్పాడు ధర్మరాజుతో- బ్రాహ్మణులను పరాభవించినందుకు అసురులు నీటిలో నివసించాల్సి వచ్చింది. బ్రాహ్మణుల అనుగ్రహంతో దేవతలు స్వర్గంలో నివసిస్తున్నారు. శంబరాసురుడు భూసురులను పూజించి సాటివారిపై ఆధిపత్యాన్ని పొందినాడు.

## పంచచూడ - నారదుడు

పంచచూడ అప్సరస. ఆమె నారదుడితో అన్నది-

**కులీనా రూపవత్యశ్చ నాథవత్యశ్చ యోషితః**
**మర్యాదాసు న తిష్ఠంతి సదోషః స్త్రీషు నారద** (అనుశాసనిక. 38-11)

స్త్రీలు హద్దులో ఉండరు. చంచల స్వభావులు. ఎవరి శాసనాన్ని సహించరు. యముడు, వాయువు, మృత్యువు, పాతాళం, బడబాగ్ని, కత్తివాదర, విషం, పాము, అగ్ని -ఇవన్నీ కలిసి ఒకటి; స్త్రీ ఒక్కతే ఒకటి!

శంబర, నముచి, బలి, కుంభీనసుని మాయలు అన్నీ యువతులకు తెలుసు. పురుషులు నవ్వుతుంటే వీరు హేళన చేస్తారు. ఏడుస్తుంటే మరీ ఏడిపిస్తారు. అవసరపడితే ఇష్టంలేని వ్యక్తిని కూడా ప్రియవచనాలతో స్వంతం చేసికొంటారు.

**హసంతం ప్రహసంత్యేతాః రుదంతం ప్రరుదంతి చ**
**అప్రియం ప్రియవాక్యై శ్చ గృహ్ణతే కాలయోగతః** (అనుశాసనిక. 39-7)

## దేవశర్మ - రుచి - విపులుడు

దేవశర్మ భార్య రుచి. రుచి మీద ఇంద్రుడి చూపు పడింది. ఆమెను రక్షించడానికి తన శిష్యుడిని ఆశ్రమంలో ఉంచి దేవశర్మ యజ్ఞానికి బయల్దేరాడు.

విపులుడు ఎంతగానో ఆలోచించి రుచి శరీరంలోకి నీడలా ప్రవేశించి ఉన్నాడు. ఇంద్రుడు వచ్చి రుచి శరీరంలోని విపులుడిని చూసి భయపడి ఇంద్రుడు అంతర్ధానమైనాడు. విపులుడు యజ్ఞశర్మ రాగానే ఆ విషయాన్ని తెలియజేసాడు.

తరువాత విపులుడిలో గర్వం పెరిగింది. రుచి యొక్క సోదరి వివాహం సందర్భంగా వెళ్దామని అందరూ అనుకున్నపుడు ఆకాశమార్గాన సంచరిస్తున్న దేవకన్య దగ్గరున్న పూలు నేలపై పడినాయి. వాటిని విపులుడు గురుపత్నికిచ్చాడు. రుచి సోదరి అంగరాజు చిత్రరథుని భార్య ప్రభావతి. తనకు అటువంటి పూలు కావాలని కోరింది. విపులుడు వెళ్లి ఆశ్రమం దగ్గర ఉన్న పూలను తీసుకుని వస్తుండగా ఇద్దరు అపరిచితులు పోట్లాడుకుంటూ- మనలో అసత్యమాడిన వాడికి విపులుడు పరలోకంలో పొందే గతి పడుతుంది -అని శపించుకున్నారు.

తానేతప్పు చేసాడో తెలీక ఇంకాస్త ముందుకు వెళ్లాడు. అక్కడ ఆరుగురు పాచికలాడుతూ మనలో ఎవరైనా తప్పుగా ఆడితే- అతడికి విపులుడికి పరలోకంలో పట్టే గతి పడుతుంది -అనుకుంటున్నారు.

విపులుడు ఎంతో బాధతో అంగదేశానికి వెళ్లి రుచికి, ప్రభావతికి దివ్యసుమాలనిచ్చి గురువు దేవశర్మ వద్దకు వెళ్లి తన గోడు వెల్లబోసుకున్నాడు.

దేవశర్మ అన్నాడు- నీవు నా భార్యను ఇంద్రుడి నుంచి రక్షించావు. నీ మనస్సులో దోషం లేదు. ఇంద్రుడు నీవు నా భార్యను ఆలింగనం చేసుకోవడం చూసాడు కాని నీవు ఆమెను కూతురిలా ప్రేమతో ఆలింగనం చేసుకున్నట్లు ఉండడానిని గమనించలేదు. అందుకే నీకు దోషమంటలేదు.

స్త్రీలు పతివ్రతలైతే సౌభాగ్యవతులు కాగలరు. ఆదరాన్ని పొంది జగన్మాతలు కాగలరు. వనాలతో, కాననాలతో భూమండలాన్ని నిలుపగలరు.

**రక్షితా చ త్వయా పుత్ర మమ చాపి నివేదితా**
**అహం తే ప్రీతిమాం స్తాత స్వస్థః స్వర్గం గమిష్యసి**

నాయనా! నీపై నేను ప్రసన్నుడనైనాను. నీవు సుఖంగా ఉండి స్వర్గానికి వెళ్లగలవు -అన్నాడు దేవశర్మ తన శిష్యుడైన విపులునితో. ఇద్దరు అపరిచితులు-అహోరాత్రులు; పాచికలాడుతున్న ఆరుగురు ఋతువులు.

**కుర్వాణం నరం కర్మ పాపం రహసి సర్వదా**
**పశ్యంతి ఋతవశ్చాపి తథా దిన నిశ్యేపుత** (అనుశాసనిక. 43-7)

నరుని పాపాలను అహోరాత్రులు, ఋతువులు చూస్తూనే ఉంటాయి.

## వివాహ ధర్మాలు - స్త్రీ ప్రశంస

| | |
|---|---|
| గుణవంతుడైన వరునికి కన్యాదానం చేయడం | - బ్రహ్మ వివాహం |
| ధనాదులతో వరుని పక్షాన్ని సంతృప్తి పరచడం | - ప్రాజాపత్య వివాహం |
| కన్య, వరుడు ఒకరికొకరు నచ్చడం | - గాంధర్వ వివాహం |
| కన్యను కొని తీసుకుని వెళ్లడం | - అసుర వివాహం |
| కన్య సోదరులను చంపి, కన్యను ఎత్తుకుపోవడం | - రాక్షస వివాహం |

మొదటి మూడు ధర్మబద్ధాలు.

కన్య తల్లికి సపిండం కారాదు. తండ్రికి సగోత్రం కారాదు. ఋతుమతి అయినాక మూడేళ్లు తనవాళ్లు పెండ్లి చేస్తారని చూడాలి. నాలుగవ సంవత్సరం నుంచి స్వయంగా సంపాదించుకోవచ్చు. సప్తపదిలోని ఏడవ అడుగు పడినప్పుడే పాణిగ్రహణ మంత్రాలు నిశ్చితాలవుతాయి. జలపూర్వకంగా కన్యాదానం చేసినప్పుడే పాణిగ్రహీత భర్త అవుతాడు.

తల్లివేపు నుంచి వరకట్నంగా వచ్చినదంతా పుత్రికల భాగమే. మగపిల్లలూ లేని తండ్రి ఆస్తికి దౌహిత్రుడే వారసుడు. దౌహిత్రుడే తండ్రికి పితామహునికి పిండప్రదానం చేస్తాడు. కుమారుడికి దౌహిత్రుడికి తేడా లేదు.

**పూజ్యా లాలయి తవ్యాశ్చ స్త్రియో నిత్యం జనాధిప**
**స్త్రియో యత్ర చ పూజ్యంతే రమంతే తత్ర దేవతాః** (అనుశాసనిక. 46-4)

స్త్రీలు పూజింపబడినచోట దేవతలు సంచరిస్తారు.

**పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే**
**పుత్రాశ్చ స్థావిరే భావే నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి** (అనుశాసనిక. 46-14)

కౌమారంలో తండ్రి, యౌవనంలో భర్త, వార్ధక్యంలో పుత్రులు రక్షిస్తారు. స్త్రీకి స్వాతంత్ర్యమక్కర్లేదు.

**శ్రియ ఏతాః స్త్రియో నామ సత్కార్యా భూతి మిచ్ఛతా**
**పాలితా నిగృహీతా చ శ్రీః స్త్రీ భవతి భారత** (అనుశాసనిక. 46-15)

స్త్రీలంటే శ్రీలు. ఐశ్వర్యాన్ని కోరేవాడు వీరిని సత్కరించాలి. వశం చేసుకుని పాలిస్తే స్త్రీ ఐశ్వర్యప్రదాయినిగా, శ్రీగా నిలుస్తుంది. కూతురు కూడా కొడుకు వంటిదే.

## వర్ణసంకరం

భీష్ముడు ధర్మరాజుతో ఆస్తి పంపకాలు, హక్కుల గురించి వివరించాడు. వర్ణసంకరం వలన అంబష్ఠులు, పారశవులు, ఉగ్రులు, సూతులు, వైదేహకులు, చాండాలురు, మాగధులు, నిషాదులు, అయోగవులు ఇలా వర్ణ సంకరం వలన అనేక కులాలు పుట్టాయి.

భర్త వీర్యం వలన పుట్టినవాడు అనంతరజుడు. రెండవవాడు నిరుక్తజుడు, మూడవవాడు ప్రసృతజుడు. భర్త పతితుడై తన భార్యతోనే కన్నకొడుకు నాలుగవవాడు. దత్తుడు, క్రీతుడు, అధ్యూఢజుడు; గర్భవతిని పెండ్లాడగా పుట్టినవాడు-కానీనుడు; ఆరుగురు అపధ్వంసజులు (బ్రాహ్మణునికి క్షత్రియ, వైశ్య, శూద్ర స్త్రీలందు పుట్టినవారు, క్షత్రియునికి వైశ్య, శూద్ర స్త్రీలందు; వైశ్యునికి శూద్రస్త్రీ యందు పుట్టినవారు-అనులోమ); అపసదులు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య స్త్రీలకు

శూద్రుని ద్వారా పుట్టినవారు– చాండాల, వ్రాత్య, వైద్య; బ్రాహ్మణ క్షత్రియ కాంతలకు వైశ్యుని ద్వారా పుట్టిన మాగధ, వామకులు; బ్రాహ్మణ స్త్రీకి క్షత్రియుని ద్వారా పుట్టిన సూతుడు–(ప్రతిలోమ) ఈ ఇరవై మంది పుత్రులు.

తల్లిదండ్రులు వదిలేసిన పిల్లవాడు పోషిస్తున్నవాడి కులాన్ని పొందుతాడు. క్షేత్రజ్ఞుడు, అపసదుడు, ఆధ్యూడుడు కూడా తన పుత్రులుగానే సంస్కారాలు జరిపించాలి.

## చ్యవనుడు (గోవు-బ్రాహ్మణుడు సమానం)

చ్యవనుడు నీటిలో ఉండి తపస్సు చేస్తుంటే జాలరులు వలవేసి చేపలతో పట్టి లాగారు. అతడు బయటపడగానే వాళ్లు భయపడి నహుషుడికి విన్నవించారు. నహుషుని పురోహితుడు సత్యవ్రతుడు. చేపలతోపాటు తనను కూడా కొనుక్కుని ఆ ధనాన్ని జాలరులకిమ్మన్నాడు చ్యవనుడు. వేయి నాణేల దగ్గర మొదలై, నహుషుడి రాజ్యమంతా ఇస్తానన్నా అది తనకు సరైన వెల కాదన్నాడు చ్యవనుడు.

గవిజాతుడనే ముని అన్నాడు– బ్రాహ్మణులు, గోవులు ఒకే జాతికి చెందిన రెండు భాగాలు. బ్రాహ్మణులలో మంత్రాలు, గోవులలో హవిస్సు ఉన్నది. చ్యవనుడు ఒప్పుకున్నాడు. మంచి ఆవును జాలరులకిచ్చి చ్యవనుని విడిపించాడు.

**గావః స్వర్గస్య సోపానం గావః స్వర్గే పి పూజితాః**
**గావః కామదుహో దేవ్యః నాన్యత్ కించిత్ పరం స్మృతమ్** (అనుశాసనిక. 51–32)

గోవులే స్వర్గానికి సోపానం. గోవులు పాలిచ్చే దేవతలు.

## చ్యవనుడు - కుశికుడు

రాజైన కుశికుని కుమారుడు గాధి. గాధి పుత్రుడు విశ్వామిత్రుడు. ఋచీకముని కుమారుడు జమదగ్ని. జమదగ్ని పుత్రుడు పరశురాముడు.

రాజైన విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కావాలని తపించి సాధించాడు. బ్రాహ్మణుడైన పరశురాముడు క్షత్రియ ధర్మాన్ని పాటించి క్షత్రియ సంహారం చేసాడు.

చ్యవనుడు ఈ విషయాన్ని ముందుగానే గ్రహించి కుశికుని రాజ్యానికి వచ్చాడు. కుశికుడు, అతడి రాణి చ్యవనమునికి గొప్పగా సేవలు చేసారు. ఇరవై ఒక్కరోజులు రాజదంపతులు నిద్రాహారాలు లేకుండా చ్యవనుడిని సేవించారు. వాళ్లు చూస్తూ ఉండగానే చ్యవనుడు అంతర్ధానమైనాడు. రాజదంపతులు అన్నిచోట్లా వెదికి అంతఃపురంలోకి వచ్చి చూస్తే అతిధి గదిలోనే నిద్రపోతూ కనిపించాడు చ్యవనుడు. మరల ఇరవై ఒక్కరోజులకు లేచి స్నానం చేస్తానన్నాడు. స్నానం చేసి భోజనం చేస్తానంటే అన్నిరకాల ఆహార పానీయాలను సిద్ధం చేసాడు రాజు. వాటన్నిటిపై వస్త్రం కప్పి వాటిని తగలబెట్టాడు చ్యవనుడు. వెంటనే అదృశ్యమైనాడు చ్యవనుడు. అలా ప్రతిరోజూ చేస్తూ ఒకరోజున రథం మీద బయటకు వెళ్దామన్నాడు. కాస్తదూరం పోయాక అశ్వాల్ని తీసివేసి రాజు ఒకపక్క రాణి ఒకపక్క ఉండి రథాన్ని లాగమన్నాడు. రాజదంపతులు లాగుతుంటే చ్యవనుడు రథం మీద కూర్చుని బెత్తంతో కొడుతూ అదిలిస్తున్నాడు. చ్యవనుడు నిర్వికారంగా రాజు ధనాన్ని మొత్తం దారిలో పంచిపెట్టాడు. యాభై రోజులుగా నిరాహారంగా ఉన్న రాజదంపతులు ఎంతో శ్రమతో రథాన్ని లాగుతూ ఉన్నారు. ప్రజలు అది చూసి హాహాకారాలు చేసారు. చ్యవనుడు సంతృప్తిచెంది రథం దిగి రాజదంపతులను స్పృశించగానే వారి ఆకలిదప్పులు తగ్గాయి. గాయాలు మాయమైనాయి. తనను అరణ్యంలో వదిలి రాజధానికి వెళ్లమన్నాడు చ్యవనుడు. మరుసటి రోజు అక్కడికే రమ్మన్నాడని రాజదంపతులు వెళ్లేసరికి అక్కడ వనవాటికలో అద్భుత భవనం, సహస్ర మణిస్తంభ శోభితంగా కనిపించింది. గంధర్వలోకంలా కనిపించిన ఆ ప్రదేశం మరల మామూలు వనంలా నిశ్శబ్దమయ్యింది.

చ్యవనుడన్నాడు– వర్ణ సంకరం కాకుండా నిన్ను సమూలంగా నాశనం చేద్దామని వచ్చాను నేను. మీ దంపతుల అపురూప సేవానిరతికి ముగ్ధుడనయ్యాను. కొంతకాలం తరువాత క్షత్రియులకు భృగువంశ మునులకు భేదాలేర్పడి, క్షత్రియులు భృగువంశస్థులందరిని గర్భస్థ శిశువుల వరకు చంపేస్తారు. ఔర్వుడు జన్మించాక వంశం నిలబడుతుంది. అతడు మహాగ్నిగా బడబాగ్నిగా తన కోపాన్ని సముద్రంలో శమింపచేస్తాడు. అతడి కుమారుడు ఋచీకుడు. ధనుర్వేద పండితుడు. ఋచీక–సత్యవతిల కుమారుడు జమదగ్ని. సత్యవతి నీ వంశానికి చెందిన కన్య. జమదగ్ని కుమారుడు పరశురాముడు. ఆ విధంగా భృగువంశీయులకు కుశిక వంశస్థుల మధ్య వియ్యమేర్పడ్తుంది –అన్నాడు చ్యవనుడు. భృగువంశంలో పరశు రాముడు, కుశిక వంశంలో విశ్వామిత్రుడు జన్మించారు.

## తపస్సులు - దాన ఫలితాలు

భీష్ముడు ధర్మరాజుతో చెబుతున్నాడు– అహింసకు ఫలం మంచి రూపం; మౌనదీక్షకు ఫలం ఉత్తమ జన్మ. పండ్లు ఫలాలు కందమూలాలు తింటే రాజ్యప్రాప్తి; ఆకులు తిని బ్రతికితే స్వర్గప్రాప్తి; దానంతో ధనం; గురు శుశ్రూషతో విద్య, నిత్య శ్రాద్ధంతో సంతానప్రాప్తి ఫలితాలు.

ఇలా వివిధ దానాలకు వివిధ ఫలాలుంటాయి. చెరువులు తవ్వించిన వాడు, చెట్లు నాటినవాడు, యాగాలను అనుష్ఠించినవాడు, సత్యవాది స్వర్గలోకాన్ని పొందుతారు.

సర్వప్రాణులకూ అభయదానం, కష్టాలలో ఉన్నవానిపై అనుగ్రహం, యాచకునికి అభీష్టవస్తు దానం, దప్పికగొన్న వానికి నీరివ్వడం ఉత్తమ దానం. సువర్ణ, గోదాన, భూదానములు పాప నిర్మూలనాలు.

యజ్ఞ దాన బ్రాహ్మణాదులను రక్షించుట రాజు కర్తవ్యం. అన్ని దానాల్లో భూదానం గొప్పది. నరులకు అన్నమే ప్రాణం. అన్నదానం ప్రశంసనీయమైనది. నక్షత్రాలను బట్టి వివిధ వస్తువులను దానం చెయ్యాలి. అన్నదాన, తిలదాన, భూదాన, గోదాన, సువర్ణ దానములు ప్రశస్తమైనవి.

**అన్నదానం ప్రధానం హి కౌంతేయ పరిచక్షతే**
**అన్నస్య హి ప్రదానేన రంతిదేవో దివం గతః** (అనుశాసనిక. 66–56)

అన్నదానం గొప్పది. రంతిదేవుడు అన్నదానంతోనే స్వర్గానికి వెళ్లాడు.

## నృగోపాఖ్యానం

నృగ మహరాజు అసంఖ్యాకంగా గోదానం చేసాడు. అతడు అంతకుముందు దానం చేసిన గోవులలో ఒకటి వచ్చి వేరే మందను చేరింది. దానిని వేరే బ్రాహ్మణునకు దానం చేసాడు నృగుడు తెలియక. ఆ ఇరువురి బ్రాహ్మణులు అదే గోవు కావాలన్నారు. మొదటివాడు వేరే గోవులను ఇస్తానన్నా తీసుకోకుండా వెళ్లిపోయాడు. ఆ స్వల్ప పాపం వల్ల నృగుడు పెద్ద ఊసరవెల్లిగా ద్వారకావతిలోని బావిలో పడ్డాడు. శ్రీకృష్ణుని స్పర్శతో నృగుడు తన రూపాన్ని పొంది స్వర్గానికి వెళ్లిపోయాడు.

## యమధర్మరాజు - నాచికేతుడు

ఉద్దాలకుడు తన కుమారుడు నాచికేతుడితో అన్నాడు– "నదీతీరంలో సమిధలు, దర్భలు, పూలు, కలశం, ఇతర సామాగ్రి ఉంచాను. వాటిని తీసుకునిరా!". నాచికేతుడు వెళ్లి వచ్చి– "నది పొంగి అవి కొట్టుకుని పోయాయి" అన్నాడు.

ఇంకిక్కడేం నిలబడతావు. పో యముడి దగ్గరకు" అన్నాడు ఉద్దాలకుడు. వెంటనే ప్రాణాలు పోగా నాచికేతుడు నేలపై పడినాడు. తన కుమారుని గురించి శోకిస్తూ ఉండగా ఉద్దాలకుడి కంటి నుండి వెలువడిన అశ్రువులు తాకి నిద్రనుంచి లేచినట్లు నాచికేతుడు నిద్రలేచాడు. అతడి శరీరం దివ్య సుగంధాలను వెదజల్లుతున్నది.

ఉద్దాలకుడు ఆశ్చర్యపడి చూస్తూ ఉండగా నాచికేతుడు అన్నాడు– "యముడు స్వయంగా నాకు తన లోకంలోని పాల నదులు, నేతి పర్వతాలు, నిర్మల జలాల్ని చూపించాడు. గోదాన మహాత్మ్యాన్ని వివరించాడు. గోవులు దొరకనప్పుడు నెయ్యి, తిలలు (నువ్వులు) దానం చేయవచ్చు. స్వీకర్త యోగ్యత కాలం, గో స్థితి, దానవిధిని బట్టి గోదానం చెయ్యాలి. గోదానం మహాదానం".

## సత్యవాక్య ప్రశస్తి

వేయి అశ్వమేధాలు, ఒక్క సత్యవాక్యాన్ని త్రాసులో పెట్టి తూస్తే సత్యం వేపే త్రాసు మొగ్గు చూపిస్తుంది.

**సత్యేన సూర్య స్తపతి సత్యేనాగ్నిః ప్రదీప్యతే**
**సత్యేన మరుతో వాంతి సర్వం సత్యే ప్రతిష్ఠితమ్** (అనుశాసనిక. 75–30)

అంతా సత్యం మీదనే ప్రతిష్ఠితమై ఉన్నది. సత్యమే పరమ ధర్మం.

## కపిల గోవులు

ప్రజాపతి అమృతాన్ని తాగినపుడు అతడి నోటి నుండి దివ్య పరిమళం వెలువడి 'సురభి' అనే గోవుగా మారింది. ఆ సురభి పుత్రికలు గోవులు. ఒకసారి శివుడు నేలపై నిలిచి ఉండగా తల్లి పాలు తాగుతున్న దూడ నోటినుంచి నురుగు గాలిలో ఎగిరి ఆయన తలపై పడింది. ఆయన కోపించి నుదుటి కంటితో దహిస్తున్నట్లు ఆ దూడవేపు చూసాడు. ఆ వేడికి గోవులలో నానా వర్ణాలు ఏర్పడ్డాయి. కొన్ని చంద్రుడి దగ్గరకు పారిపోయాయి. అవి అమృతం లాంటి పాలనిస్తాయి. ప్రజాపతి వచ్చి శివుడిని శాంతపరచి అనేక గోవులతో పాటు ఒక ఎద్దును బహుకరించాడు. శివుడికి ఆ ఎద్దు 'నంది'గా వాహనం, ధ్వజం అయ్యింది. శివుడిని దేవతలు పశుపతిని చేసారు. ఈశ్వరుడు వృషభాంకుడైనాడు. కపిల గోవులు మహా తేజస్సు కలవి. గోదానంలో కపిల గోదానం గొప్పది.

వంద గోవులున్నవాడు పది గోవులను, పది గోవులున్నవాడు ఒక గోవును దానం చెయ్యాలి.

దైత్యులను విడిచి శ్రీ ఆవుపేడలో చేరింది. ఆవు పేడ అప్పటి నుంచి శుభకరమయ్యింది.

వృషభ వాహనుడైన శివుని తేజస్సు లోక సంహారమవుతుందని భావించి దేవతలు ప్రార్థించగా శివుడు ఊర్ధ్వ రేతస్కుడైనాడు. ఉమాదేవి కోపించి– నాకు సంతానం లేకుండా చేసిన దేవతలకు సంతాన ప్రాప్తి లేకుండా ఉండుగాక! అని శాపమిచ్చింది. శివుడి తేజస్సులో కొంత అగ్నిలో పడింది. అగ్ని దానిని భరించలేక నీటిలో దాగి ఉంటే 'కప్ప' దేవతలకు అగ్ని ఆచూకి చెప్పింది. అగ్ని కప్పను శపించాడు– నీకు రుచి తెలియకుండును గాక! అని. దేవతలన్నారు– కప్పలకు రకరకాల శబ్దాలు చేసే శక్తి వస్తుంది.

అగ్ని వెళ్లి అశ్వత్థ వృక్షంలో దాక్కున్నాడు– 'ఏనుగు' ఆ విషయాన్ని దేవతలకు చెప్పగా అగ్ని ఏనుగును– నీ నాలుక వెనక్కి తిరిగి ఉండుగాక! అని శపించాడు. దేవతలన్నారు– ఏనుగుల నాలుక వెనక్కి తిరిగి ఉన్నా అన్ని ఆహారాలను తీసుకోగలుగుతాయి.

అగ్ని, అశ్వత్థ వృక్షం నుంచి శమీవృక్షంలో ప్రవేశించాడు. అది చూసిన 'చిలుక' దేవతలకు చెప్పింది. అగ్ని అన్నాడు– మీ నాలుక మాటలు సరిగా పలుకగుండుగాక! దేవతలన్నారు– నాలుక తిరగబడినా నీ వాక్కు మధురమే!

అందుకే శమీవృక్షపు ఎండుపుల్లల్లో అగ్ని ఉంటుంది. అవి అరణిగా అగ్నిమథనానికి పనికివస్తాయి.

అగ్ని తనలోని శివ తేజస్సును గంగలో విడిచాడు. గంగ దానిని మేరు పర్వతంపై విడిచింది. అందుకే మేరు పర్వతం బంగరు పర్వతంలా ప్రకాశిస్తుంది. మేరు పర్వతం నుంచి జాలువారిన శివతేజస్సు పర్వతాలు, నదులు, సెలయేళ్ల వేపు బాలుడి రూపంలో పరుగులు తీసింది.

హిరణ్యుడనే బంగరు బాలుడిని భరించిన అగ్ని హిరణ్యకేతుడై బంగరు రంగు జ్వాలలతో వెలుగొందినాడు. భూమి 'వసుమతి' అయ్యింది. రెల్లుపొదలలో నిలిచిన శివతేజస్సు గర్భమై పెరిగి బాలుడైనాడు. జారిన వీర్యం నుంచి పుట్టాడు గనుక 'స్కందుడు', కృత్తికలు ఆరుగురు పెంచారు గనుక 'కార్తికేయుడు', గుహలో నివసించాడు గనుక గుహుడయ్యాడు. బంగారంలో జాంబూనదం, రత్నాలలో జాతరూపం సువర్ణం. అది అగ్ని స్వరూపం, ఈశ్వర స్వరూపం, ప్రజాపతి స్వరూపం.

ప్రజాపతి వీర్యం నుంచి పుట్టింది సత్త్వగుణం, ఉత్తమ తేజస్సు. భృక్కు (అగ్నిజ్వాల) నుంచి పుట్టినవాడు భృగువు. అంగారం (నిప్పు) నుంచి పుట్టినవాడు అంగిరుడు. అంగారానికి ఆశ్రయమైన స్వల్ప జ్వాల నుంచి పుట్టినవాడు కవి. అగ్ని మరీచుల నుంచి పుట్టినవాడు మారీచుడు. ఈయనే కశ్యపుడు; దర్భల నుంచి పుట్టినవారు వాలఖిల్యులు. అత్రైవ దర్భల నుంచి పుట్టినవాడు అత్రి. బూడిద నుంచి పుట్టినవారు వైఖానసులు. అగ్ని అశువుల నుంచి జన్మించినవారు అశ్వినులు.

అగ్ని ఇంద్రియాల నుంచి ప్రజాపతులు, రోమకూపాల నుంచి ఋషులు, చెమట నుంచి ఛందస్సు, బలం నుంచి మనస్సు పుట్టాయి. అగ్ని తేజస్సు లోహితం. లోహితం నుంచి సువర్ణం పుట్టింది.

- భృగువుకు ఏడుగురు కొడుకులు– చ్యవనుడు, వజ్రశీర్షుడు, శుచి, ఔర్వుడు, శుక్రుడు, వరుణుడు, సవనుడు.
- అంగిరునికి ఎనిమిదిమంది కొడుకులు– బృహస్పతి, ఉతథ్యుడు, పయస్యుడు, శాంతి, ఘోరుడు, విరూపుడు, సంవర్తుడు, సుధన్వుడు.
  వీరికి వారణులని పేరు. అగ్ని వంశస్థులు.

- కవికి ఎనిమిది మంది కొడుకులు– కవి, కావ్యుడు, ధృష్ణుడు, శుక్రుడు, భృగువు, విరజుడు, కాశి, ఉగ్రుడు (వారణులు).

రెల్లువనంలో జన్మించిన కార్తికేయుడు దేవ సేనాపతిగా నియమింపబడి, దేవతలను బాధిస్తున్న తారకాసురుడిని చంపాడు. నిత్య కౌమారుడై కుమారస్వామి అయినాడు.

## పితృగీత

భీష్ముడు ధర్మరాజుకు వివిధ తిథుల్లో దానం చేస్తే వచ్చే ఫలాన్ని, పితృగీతను వివరించాడు–

దక్షిణాయనంలో ఆశ్వయుజ మాసంలో కృష్ణపక్షం – మఘ నక్షత్రం త్రయోదశి నాడు నేతితో కలిసిన పాయసాన్న దానం పితరులకు ఉత్తమ గతులనిస్తుంది.

మఘా నక్షత్రంలో ఏనుగు నీడలో నిలిచి పాయసంతో గాని, పటికబెల్లంతో గాని శ్రాద్ధం పెడితే పితృదేవతలకు సంతోషం.

గయకు వెళ్లి అక్షయవటం దగ్గర శ్రాద్ధం పెట్టడం శుభస్కరం.

పితృక్షయ తిథిలో జలం, మూలం, ఫలం, ఫలరసం, అన్నం ఇటువంటి వాటిని తేనెతో కలిపి ఇస్తే అది పితరులకు శాశ్వత తృప్తిని కలిగిస్తుంది.

## శ్రాద్ధ ఫలాలు - శ్రాద్ధ భోక్తలు

యముడు శశబిందువునకు విభిన్న నక్షత్రాలలో చేసిన శ్రాద్ధాలకు ఫలాలను, శ్రాద్ధభోక్తలకు ఉండాల్సిన లక్షణాలను చెప్పాడు. నిమికి అత్రిముని శ్రాద్ధములో త్యజించాల్సిన వస్తువుల గురించి వివరించాడు.

నెలలో సగం గడచిన తర్వాత కృష్ణపక్షంలో అమావాస్య నాడు నావపై నిలిచి పితరులకు జలాంజలిని సమర్పిస్తే పుష్టి ఆయస్సు బలం సంపద కలుగుతాయి.

## బిసస్తైన్యోపాఖ్యానము

భీష్ముడు చెబుతున్నాడు ధర్మరాజుతో– కేవలం ఉదయం, సాయంకాలం భుజిస్తూ మధ్యకాలంలో ఏమీ తిననివాడు –నిత్యోపవాసి; ఋతుకాలంలో మాత్రమే భార్యతో సంగమించేవాడు బ్రహ్మచారి; నిత్యమూ దానశీలుడైనవాడు ఋతవాది. వ్యర్థంగా మాంసం తిననివాడు 'అమాంసాసి', సదాదానం చేసేవాడు పవిత్రుడు. పగటిపూట నిదురించనివాడు జాగరూకుడు.

అందరూ భుజించాక భుజించేవాడు, యజ్ఞానంతరం తినేవాడు అమృతాశి, దేవతలకు, పితరులకు, అతిథులకు పెట్టినాక తినేవాడు విఘసాశి;

వృషదర్భి రాజుకు సప్తర్షుల మధ్య జరిగిన సంవాదమిది– ఒకప్పుడు కశ్యపుడు, అత్రి, వసిష్ఠుడు, భరద్వాజుడు, గౌతముడు, విశ్వామిత్రుడు, జమదగ్ని, అరుంధతి –వీరందరి దాసి గండ, ఆమెభర్త పశుసఖుడు తపస్సు చేస్తూ లోకమంతా తిరుగుతున్నారు, తీవ్రమైన అనావృష్టి ఉన్న సమయంలో. శిబి కొడుకు శైబ్యుడు యజ్ఞం చేసి తన కుమారుడిని ఋత్విక్కులకు దక్షిణగా ఇచ్చివేసాడు. అల్పాయుష్కుడైన ఆ బ్రాహ్మణ కుమారుడు చనిపోయాడు. ఆకలితో అలమటిస్తున్న మహర్షులు ఆ శవాన్ని తినదలుచుకున్నారు.

వృషాదర్భి మహరాజు వారిని వారించాడు. అయితే వాళ్లు అతడిని యాచించదలుచుకోలేదు. గ్రామాలనిస్తానంటే తీసుకోలేదు. పండ్లు ఇచ్చాడు వాటిలో బంగారాన్ని నింపి. వాళ్లు తీసుకోలేదు. రాజుకు కోపం వచ్చింది. మహాయజ్ఞం చేయగా కాలరాత్రిలా కృత్య జన్మించింది. ఆ రాక్షసికి యాతుధాని అని పేరుపెట్టాడు రాజు.

వెళ్లి సప్తర్షులను, అరుంధతిని, దాసిని, దాసి భర్త పేర్లను మనసులో నిలుపుకుని, వారిని నాశనం చెయ్యి –అన్నాడు వృషాదర్భి రాజు ఆ యాతుధాని రాక్షసితో.

ఆకలితో బాధపడుతూ సప్తర్షుల బృందం చేరుకున్నది ఓ సరోవరం వద్దకు. దానిని యాతుధాని రాక్షసి కాపలా కాస్తున్నది. ఆ సరోవరంలోని తామరతూండ్లు తిని ఆకలి బాధ నుంచి బయటపడాలనుకున్నారు సప్తర్షులు.

యాతుధాని అన్నది– నేనీ సరోవర రక్షకురాలిని. మీరు మీ పేరుచెప్పి ఒక్కరొక్కరుగా వెళ్లి తామరతూళ్లు తెచ్చుకోండి.

అత్రి అన్నాడు– నాపేరు అరాత్రి.

వసిష్ఠుడన్నాడు– నాపేరు వరిష్ఠుడు

కశ్యపుడన్నాడు– నాపేరు కాశ్యుడు

భరద్వాజుడన్నాడు– నేను అన్నీ భరించే ద్విజుడను

గౌతముడన్నాడు– నేను గోదముడను

విశ్వామిత్రుడన్నాడు– నేను విశ్వదేవులకు మిత్రుడను

జమదగ్ని అన్నాడు– నేను జగత్తు అగ్ని నుంచి పుట్టినవాడిని

అరుంధతి అన్నది– నేను అన్నిటిని ధరిస్తాను, భర్త సమీపంలో ఉంటాను.

గండ అన్నది– నాకు ఎత్తైన చెక్కిలి (గండభాగం) ఉన్నది

పశుసఖుడన్నాడు– నేను పశువులకు మిత్రుడను.

అందరూ తమ పేర్లకు వ్యాఖ్యానాలు చెప్పి సరస్సులో దిగి తామరతూండ్లు సేకరిస్తున్నారు. ఇంతలో ఇంకోవ్యక్తి వచ్చాడు.

శునస్సఖుడన్నాడు– నేను పశుసఖుడి మిత్రుడిని.

యాతుధాని అన్నది– నీవు వెళ్లడానికి వీలు లేదు. శునస్సఖుడన్నాడు– ఈ బ్రహ్మదండం దెబ్బతిని నీవు మిగిల్తే సరే! అని బ్రహ్మదండం యాతుధాని నెత్తిపై తాకించేసరికి ఆ రాక్షసి బూడిదైపోయింది. శునస్సఖుడు ఆ ప్రక్కనే కూర్చున్నాడు. సరస్సులో దిగిన వారందరూ సరస్సు నుంచి బయటకు వచ్చి సేకరించిన తామరతూండ్లను కట్టలు కట్టి జలతర్పణలు చేస్తున్నారు. అందరూ ఒడ్డుకు చేరుకునేసరికి తామరతూండ్ల కట్టలు కనిపించలేదు. ఆకలితో అలసిపోయిన వాళ్లు శపథాలు చేస్తున్నారు– తామరతూండ్లు దొంగిలించినది నేనే అయితే–

అత్రి– కాలితో గోవును తన్నిన పాపాన్ని పొందుతాను

వసిష్ఠుడు– శరణాగతుని చంపిన పాపాన్ని పొందుతాను

కశ్యపుడు– అబద్ధపు సాక్ష్యం చెప్పిన పాపాన్ని పొందుతాను

భరద్వాజుడు– ధర్మహీనుడు, క్రూరుడి పాపాన్ని పొందుతాను

విశ్వామిత్రుడు– సంపదతో అహంకరించేవాడి పాపాన్ని పొందుతాను

జమదగ్ని– అందరితో గొడవపడేవాడి పాపాన్ని పొందుతాను

గౌతముడు– అగ్నులను పరిత్యజించేవాడి పాపాన్ని పొందుతాను

అరుంధతి– భర్తకు మనః భేదాన్ని కలిగించే స్త్రీ పాపాన్ని పొందుతాను

గండ– అసత్యవాదిని, బంధువిరోధిని పాపాన్ని పొందుతాను

పశుసఖుడు– మరుజన్మలోనూ సేవకుల ఇంటిలో పుట్టే పాపాన్ని పొందుతాను

శునస్సఖుడు– కన్యాదానం చేస్తాను, స్నాతకుడినవుతాను

ఋషులన్నారు– శునస్సఖా, నీవే దొంగతనం చేసావు.

శునస్సఖుడన్నాడు– ఈ యాతుధాని వృషాదర్భి రాజు ప్రయోగించిన కృత్య. ఈమెను నశింపజేసాను. నేను ఇంద్రుడిని –అని పలికి వారిని తనతో ఇంద్రలోకానికి తీసుకువెళ్లాడు.

ఇటువంటిదే ఇంద్ర–అగస్త్య, భృగు, వసిష్ఠ, కశ్యప, గౌతమ, అంగిరస, ధుంధుమార, పూరువు, దిలీపుడు, శుక్రుడు, జమదగ్ని, శిబి, యయాతి, నహుషుడు, అంబరీషుడు, నారదుడు, నాభాగుడు, కవి, విశ్వామిత్రుడు, పర్వతుడు, భరద్వాజుడు, అష్టకుడు, గాలవుడు, అరుంధతి, వాలఖిల్యులు, శునస్సఖుడు, సురభిల సంవాదంగా చెప్పబడింది.

## గొడుగు - చెప్పులు (జమదగ్ని-సూర్య సంవాదం)

ధనుర్విద్యా వేత్త అయిన జమదగ్ని బాణాలు వేస్తుంటే రేణుక తెస్తూ ఉండేది. జ్యేష్ఠమాసం మిట్ట మధ్యాహ్నం ఆమె ఇసుకలో నడవగా అరిపాదాలు తల కాలి బాధపడిందామె. అది చూసి జమదగ్ని దివ్య బాణాలను వింటికి సంధించి సూర్యుడిపై ప్రయోగించబోయాడు.

మధ్యాహ్న కాలంలో అరనిముషం స్థిరంగా ఉండే సూర్యుడిని కొట్టదలుచుకున్నాడు జమదగ్ని. అప్పుడు సూర్యుడు గొడుగు, చెప్పులను ఇచ్చి అతడిని శాంతపరచాడు. అప్పటి నుంచి అవి లోకంలో బహుళ ప్రచారమయ్యాయి.

గొడుగు, చెప్పులను దానం చేయడం పుణ్యాన్నిస్తుంది.

## వర్ణ ధర్మములు

బ్రాహ్మణులకు- స్వాధ్యాయము, తపస్సు; క్షత్రియులకు- ప్రజారక్షణ, పరిపాలన; వైశ్యులకు- ధన సంపాదన, ఆతిథ్యం; శూద్రులకు- శుశ్రూష, సేవ ధర్మాలు.

**శుభకర్మ సమాచారః శుభ మేవాప్నుతే ఫలమ్**
**తథా శుభ సమాచారః హ్య శుభం సమవాప్నుతే** (అనుశాసనిక. 96- )

## చెట్లు పూలు ధూపం దీపం

పిల్లలు లేనివారికి చెట్లే పిల్లలు.

ప్రాణులు రెండు రకాలు- స్థావరాలు (అచరాలు), జంగమాలు (చరాలు).

స్థావరాలు- ఆరు రకాలు- చెట్లు, పొదలు, లతలు, వల్లులు, వెదురు పోక వంటి త్వక్సారాలు, త్రణజాతులు-పైర్లు.

గృహస్థుడు స్వాధ్యాయంతో ఋషులను, నిత్య యజ్ఞాలతో దేవతలను, నిత్యాతిథ్యంతో మానవులను సంతృప్తి పరచాలి.

అగ్నిలో వైశ్వదేవాన్ని, అగ్ని సోములకు, విశ్వదేవులకు, ధన్వంతరికి, ప్రజాపతికి ఆహూతుల నివ్వాలి.

దక్షిణ దిక్కులో యమునికి, పశ్చిమాన వరుణునికి, ఉత్తరాన చంద్రునికి (సోమునికి), మధ్యభాగంలో ప్రజాపతికి, ఈశాన్యంలో ధన్వంతరికి, తూర్పుదిక్కున ఇంద్రునికి బలి సమర్పించాలి. విశ్వదేవులకు ఆకాశంలో, నిశాచరులకు భూతాలకు రాత్రివేళలో బలిని సమర్పించాలి.

## సువర్ణుడు-మనువు (శుక్రుడు-బలి సంవాదం)

ముందు తపస్సు పుట్టింది. మధ్యలో లతలు, ఓషధులు పుట్టాయి. తరువాత ధర్మం పుట్టింది.

ముళ్లులేని చెట్లకు పూసే తెల్లని పూలు- పద్మం, తులసి, జాజి -ఇవి దేవతలకు ఇష్టమైనవి; నీటిలో పుట్టేవి తామరలు, కలువలు- గంధర్వులకు, నాగులకు, యక్షులకు ఇష్టం. ముళ్లు ఎక్కువగా ఉండి ఎర్రగా, నల్లగా ఉండేవి భూత ప్రేతాలకు; అభిచార కర్మలలో ఎర్రని పూలు, ముళ్లు గల ఓషధులను వాడాలి.

ధూమాలు మూడు రకాలు- బంక, చెక్కముక్కలు, కృత్రిమాలు. బంకతో చేసిన వాటిలో గుగ్గులు, చెక్కముక్కలను కాల్చేవాటిలో అగరు దేవతలకిష్టం.

దీపదానం వల్ల నరుడి కళ్లు కాంతివంతమవుతాయి. పవిత్ర దీపదానం ఐశ్వర్యపదం.

**యస్మా దూర్ధ్వగమేతత్ తు తమ సశ్చైవ భేషజమ్**
**తస్మా దూర్ధ్వగ తేర్దాతా భవేదత్రేతి నిశ్చయః** (అనుశాసనిక. 98-48)

## నహుషుడు - ఇంద్రుడు

**ఏవం ధూప ప్రదానం చ దీపదానం చ సాధవః**
**ప్రయచ్ఛంతి నమస్కారైః యుక్తమాత్మ గుణావహమ్** (అనుశాసనిక. 100-8)

ధూపదీప ప్రదానాలతో, యజ్ఞకర్మలతో నహుషుడు దేదీప్యమానంగా వర్ధిల్లాడు. ఇంద్రుడు వృత్రాసురుని సంహరించి బ్రహ్మహత్యా పాతకం వలన ఇంద్ర పదవిని వదలి తామరతూడులో దాక్కున్నపుడు మహర్షులందరూ నహుషుడికి ఇంద్ర పదవినిచ్చి తమ శక్తులనూ ఇచ్చారు. దానితో అహంకారపూరితుడై నహుషుడు సప్తర్షులను తన పల్లకీ మోయమన్నాడు. ఆ సమయంలో అగస్త్యుడి అనుమతితో భృగువు అగస్త్యుడి జటాజూటంలో ప్రవేశించాడు. పల్లకీలో శచీదేవి భవనానికి వెళ్తూ త్వరగా నడవమని నహుషుడు అగస్త్యుని ఎడమకాలితో తలపై తన్నగా అది అగస్త్యుని తలలో ఉన్న భృగువుకు తగిలింది. అగస్త్యుడేమీ అనలేదు కాని భృగువు నహుషుడిని శపించాడు- "పాముపై నేలపై పడు". యుధిష్ఠిరుడనే రాజు నీకు శాపవిముక్తి నిచ్చేవరకు అలానే పడి ఉండు. నహుషుడు ధర్మరాజుచే శాప విముక్తినొంది దీప దానాది కర్మలతో సిద్ధిని పొందాడు.

## హస్తి కూటము

భీష్ముడు చెబుతున్నాడు- బ్రాహ్మణుల ధనాన్ని అపహరించరాదు. గౌతముడనే ముని ఒక ఏనుగుపిల్లను ఎంతో ప్రేమగా పెంచాడు. దానిని ధృతరాష్ట్రుడి రూపంలో ఇంద్రుడపహరించాడు. దానితో లోకాపవాదం రాగా ఏనుగును గౌతముడికిచ్చి ఆశీర్వదించాడు.

బ్రహ్మ భగీరథ సంవాదంలో బ్రహ్మ చెప్పాడు- ఉపవాసానికి మించిన తపస్సు లేదని.

## ఆయుష్యాఖ్యానము

మానవుడు సదాచారంతోనే ఆయుష్షను పొందుతాడు. సంపదలు, కీర్తి సదాచారం వల్లనే లభిస్తాయి.

ఎవరిమీదా అపవాదులు వేయరాదు. పరుషంగా మాట్లాడరాదు.

**కర్ణినావీక నారాచాన్ నిర్హరంతి శరీరతః**
**వాక్ శల్యస్తు న నిర్హర్తుం శక్యో హృదిశయోహిసః** (అనుశాసనిక. 104-34)

శరీరంలో గ్రుచ్చుకున్న బాణాలను తొలగించవచ్చు కాని, మనసులో గ్రుచ్చుకున్న బాణాలను తీయలేము.

శుచి శుభ్రతలు పాటించాలి. ఉత్తర, పశ్చిమాలలో తలపెట్టి నిద్రించరాదు. నీటిలో మలమూత్ర విసర్జన చేయరాదు.

యముడన్నాడు- ఎంగిలి నోటితో పరుగెత్తినా, అధ్యయనం చేసినా వారి ఆయుస్సును, వారి సంతతిని హరిస్తాను. అనధ్యయన సమయంలో అధ్యయనం చేయవద్దు. అలా చేస్తే వేదజ్ఞానం నశిస్తుంది. ఆయుస్సు క్షీణిస్తుంది.

దీర్ఘకాలం జీవించదలుచుకున్నవాడు- బ్రాహ్మణుడు, పాము, క్షత్రియుడు కృశించినా అవమానింపరాదు. ఈ ముగ్గురూ విషపూరితులు.

స్త్రీలపై ఈర్ష్యపడరాదు. సర్వవిధాలా భార్యను రక్షించాలి. ఈర్ష్య ఆయుస్సును పోగొడ్తుంది. ఆచారం వలన ధర్మం, ధర్మం వలన ఆయుస్సు పెరుగుతుంది.

**దశాచార్యానుపాధ్యాయః ఉపాధ్యాయాన్ పితాదశ**
**దశచైవ పితౄన్ మాతా సర్వాం వా పృధివీ మపి**
**గౌరవేణాభి భవతి నాస్తి మాతృ సమో గురుః** (అనుశాసనిక. 105-15)

పదిమంది ఆచార్యుల కన్నా ఉపాధ్యాయుడు, పదిమంది ఉపాధ్యాయుల కన్నా తండ్రి, తండ్రికన్నా పదిరెట్లు తల్లి గొప్ప. తల్లి తన గౌరవంతో భూమి సమస్తాన్నీ కాదనగలదు. కనుక తల్లిని మించిన గురువు లేదు.

తండ్రి చనిపోతే పెద్ద అన్నను తండ్రిగా గౌరవించాలి. పెద్దక్క తల్లితో సమానం. చిన్నతనంలో పాలిచ్చిన దాదులు తల్లితో సమానం.

**నాస్తి వేదాత్ పరం శాస్త్రం నాస్తి మాతృసమో గురుః**
**న ధర్మాత్ పరమో లాభః తపో నానశనాత్ పరమ్** (అనుశాసనిక. 106-65)

## ఉపవాస ఫలాలు

ఉపవాస ఫలాల్లో పురుషులు ఉత్తమ లోకాలు పొందడం గురించి వర్ణించబడింది. అప్సరసలతో ఆనందంగా జీవించడం గురించి చెప్పబడింది. ఉపవాసం నిష్ఠగా చేసేవారు, వారు చేసిన వ్రతాలను బట్టి అగ్నిష్టోమ, అతిరాత్రి, వాజపేయ, ద్వాదశాహ, అశ్వమేధ, సర్వమేధ, దేవసత్ర, మహామేధ, సోమయాగ ఫలితాలను పొందుతారు.

## మానస - పార్థివ తీర్థాల ఫలితాలు

శరీరంలోని విభిన్న భాగాలు పవిత్రాలు అయినట్లే పృధివిలోని భిన్న భిన్న భాగాలు అక్కడి నీరు పుణ్యప్రదాలు. తీర్థ సంకీర్తనం, తీర్థస్నానం, పితృతర్పణాలతో వారు తమ పాపాలను తీర్థాలలోనే విడిచి సుఖంగా స్వర్గానికి వెళ్తారు.

శౌచం నాలుగు రకాలు– ఆచార, మనస్సు, తీర్థ, జ్ఞాన శౌచాలు. జ్ఞానశౌచం అన్నిటికన్నా శ్రేష్ఠం.

**మనసా చ ప్రదీప్తేన బ్రహ్మజ్ఞాన జలేన చ**
**స్నాతి యో మానసే తీర్థే తత్స్నానం తత్వదర్శినః** (అనుశాసనిక. 108–13)

ప్రజ్వలించే మనసుతో బ్రహ్మజ్ఞానమనే జలంలో మానస తీర్థంలో స్నానమాడడం నిజమైన స్నానం.

## విష్ణు ద్వాదశకం

మాఘ మాసం, పుష్య ద్వాదశి, మాఘ ద్వాదశి, చైత్ర ద్వాదశి, వైశాఖ ద్వాదశి, జ్యేష్ఠ ద్వాదశి, ఆషాఢ ద్వాదశి, శ్రావణ ద్వాదశి, భాద్రపద ద్వాదశి, ఆశ్వయుజ ద్వాదశి, కార్తిక ద్వాదశి – విష్ణుదేవుని పూజకు పవిత్ర దినాలు.

మార్గశీర్ష మాస శుక్ల పాడ్యమి నాడు చంద్రుడు మూలా నక్షత్రంతో కలిసినపుడు చంద్రవ్రతం చేసి పాదంలో మూలా నక్షత్రాన్ని, పిక్కలలో రోహిణిని, తొడ ఎముకలలో అశ్వినిని, తొడలలో పూర్వాషాఢ ఉత్తరాషాఢ, గుహ్యేంద్రియంపై పుబ్బ ఉత్తర; కటిపై కృత్తిక; నాభిలో పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర; నేత్రమండలంపై రేవతి; వెనుక ధనిష్ఠ, అనూరాధ, ఉత్తర; బాహువులలో విశాఖ; చేతిలో హస్త; వేళ్లలో పునర్వసు; గోళ్లలో ఆశ్లేష; మెడపై జ్యేష్ఠ; చెవులలో శ్రావణ; ముఖంలో పుష్యమి; దంతాలు–పెదవులపై స్వాతి; నవ్వులో శతభిష; నాసికపై మఖ; కంటిలో మృగశిర; నుదుట అనూరాధ; శిరస్సుపై భరణి; వెంట్రుకలలో ఆర్ద్రను ప్రతిష్ఠించి ప్రతిరోజూ అర్చించి ముగింపులో వేదపండితులకు ఘృతదానం చెయ్యాలి. అటువంటి వారు పూర్ణచంద్రునిలా సౌందర్యవంతుడవుతాడు, జ్ఞాని అవుతాడు.

## పాపాలు - పుట్టుకలు

- ద్విజుడు పతితుల నుంచి దానాలు స్వీకరిస్తే– గాడిదగా 15 ఏళ్లు, ఎద్దుగా ఏడేళ్లు, బ్రహ్మరాక్షసుడిగా మూడు నెలలు గడిపి బ్రాహ్మణుడై పుడతాడు.
- పతితునితో యాగాలు చేయిస్తే కీటకంగా 15 ఏళ్లు, గాడిదగా 5 ఏళ్లు, పందిగా 5 ఏళ్లు, కోడిగా 5 ఏళ్లు, నక్కగా 5 ఏళ్లు, కుక్కగా 1 ఏడు బ్రతికి మరల మనిషిగా పుడతాడు.
- గురువు పట్ల అపరాధం చేసినవాడు– కుక్కగా, రాక్షసుడిగా, గాడిదగా, ప్రేతరూపంగా బాధలుపడి మరల బ్రాహ్మణుడిగా పుడతాడు.
- గురుపత్నితో సమాగమాన్ని మనసా కోరినా– కుక్కగా మూడేళ్లు, కీటకంగా ఏడాది బ్రతికి మరల బ్రాహ్మణుడై పుడతాడు.
- గురువు శిష్యుడిని నిష్కారణంగా అవమానిస్తే క్రూరజంతువై పుడతాడు.
- తండ్రిని, తల్లిని అవమానించినవాడు గాడిదగా 10 ఏళ్లు, మొసలిగా ఏడాది బ్రతికి తరువాత మనిషిగా పుడతాడు.
- తల్లిదండ్రులు, గురువు కోపానికి గురైనవాడు– గాడిదగా పది నెలలు, కుక్కగా 14 నెలలు, పిల్లిగా 7 నెలలు జీవించి మనిషిగా పుడతాడు.
- తల్లిదండ్రులను తిట్టినవాడు మైనాపక్షిగా, కొట్టినవాడు తాబేలుగా 10 ఏళ్లు, ముళ్లపందిగా మూడేళ్లు, పాముగా ఆర్నెల్లు గడిపి మానవుడై పుడతాడు.

- రాజు పెట్టేది తింటూ రాజద్రోహం చేసేవాడు కోతిగా 10 ఏళ్లు, ఎలుకగా అయిదేళ్లు, కుక్కగా ఆరునెలలు గడిపి మనిషిగా పుడతాడు.
- తన దగ్గర దాచిన ఇతరుల ధనాన్ని అపహరించినవాడు వంద జన్మలెత్తి చివరకు కీటకంగా 15 ఏళ్లు బ్రతికి, తరువాత మనిషిగా పుడతాడు.
- అసూయపరుడు జింకగా, నమ్మకద్రోహి చేపగా ఎనిమిదేళ్లు, జింకగా నాలుగు మాసాలు, మేకగా ఏడాది, కీటకంగా కొన్నాళ్లు, ఆనక మనిషిగా పుడతాడు.
- సస్యాలను (ధాన్యాలు) అపహరించినవాడు ఎలుకగా జీవించి, చచ్చి పందిగా పుట్టి వెంటనే చస్తాడు, కుక్కగా అయిదేళ్లు గడిపి ఆపై మానవుడిగా పుడతాడు.
- ఇతరుల భార్యతో సంగమించినవాడు తోడేలుగా 5 ఏళ్లు, కుక్కగా అయిదేళ్లు గడిపి తరువాత మానవ జన్మ ఎత్తుతాడు.
- సోదరుని భార్యను బలాత్కరించినవాడు మగ కోయిలగా ఏడాది బతుకుతాడు.
- మిత్రుని భార్యను, గురుపత్నిని, రాజపత్నిని బలాత్కరించినవాడు పందిగా 5 ఏళ్లు, తోడేలుగా పదేళ్లు, పిల్లిగా అయిదేళ్లు, కోడిగా పదేళ్లు, చీమగా 3 నెలలు, కీటకంగా ఒక నెల, క్రిమిగా 14 నెలలు గడిపి మరల మానవ జన్మనెత్తుతాడు.
- యజ్ఞానికి, వివాహానికి, దానానికి అడ్డం వచ్చినవాడు 15 ఏళ్లు క్రిమిగా తరువాత మానవుడవుతాడు.
- కూతురుని ఒకరికిస్తానని మరొకరికి ఇచ్చినవాడు క్రిమిగా 13 ఏళ్లు గడిపి తరువాత మానవుడిగా పుడతాడు.
- బలి సమర్పణ చేయకుండా భుజిస్తే వందేళ్లు కాకిగా బ్రతికి కోడిగా, పాముగా నెలరోజులు బ్రతికి మరల మనిషిగా పుడతాడు.
- పెద్దన్నను అవమానిస్తే క్రౌంచపక్షిగా పుడతాడు. ఏడాది అలా బ్రతికి ఈలపురుగై మరణించి మనిషిగా పుడతాడు.
- శూద్రుడు బ్రాహ్మణస్త్రీతో సంగమిస్తే క్రిమిగా, పందిగా, కుక్కగా, ఎలుకగా, క్రిమిగా, తాబేలుగా, చివరకు మనిషిగా పుడతాడు.
- పాలు, పెరుగును దొంగిలించినవాడు కొంగగా, చేపలను దొంగిలిస్తే కారంకవ పక్షిగా, తేనెను దొంగిలిస్తే దోమగా పుడతాడు. పళ్లు, అప్పాలు దొంగిలిస్తే చీమగా, అనుములు, బొబ్బర్లు దొంగిలిస్తే హలగోలకం అనే క్రిమిగా పుడతాడు. పాయసాన్ని దొంగిలిస్తే తిత్తిరిపక్షిగా, పిండి రొట్టెను దొంగిలిస్తే గుడ్లగూబగా, ఇనుమును దొంగిలిస్తే కాకిగా, కంచు దొంగిలిస్తే హారీతపక్షిగా, వెండి దొంగిలిస్తే పావురంగా, బంగారం దొంగిలిస్తే క్రిమిగా, ఉన్నిబట్టలు దొంగిలిస్తే ఊసరవెల్లిగా, పట్టుబట్టలు దొంగిలిస్తే వల్లంకిపిట్టగా, నాజూకు వస్త్రాలు దొంగిలిస్తే చిలుకగా, ఉత్తరీయాలు దొంగిలిస్తే హంసగా, నూలు బట్టలు దొంగిలిస్తే క్రౌంచపక్షిగా, గొర్రెబొచ్చు కంబళ్లు దొంగిలిస్తే కుందేలుగా, రంగురంగుల బట్టలు దొంగిలిస్తే నెమలిగా పుడతాడు. గంధాలను, సువాసన ద్రవ్యాలను దొంగిలిస్తే చుంచెలుకగా 15 ఏళ్లు జీవిస్తాడు. నూనెను అపహరిస్తే బొద్దింకగా పుడతాడు.
- నిరాయుధుని చంపితే గాడిదగా పుడతాడు, రెండేళ్లు బ్రతికి ఆయుధంతో చస్తాడు. జంతువుగా పుట్టి ఆయుధంతో చచ్చి చేపగా పుట్టి వలలో చిక్కుకుని చచ్చి పదేళ్లు క్రూరజంతువుగా, అయిదేళ్లు పులిగా బ్రతికి చచ్చి మరల మానవ జన్మ ఎత్తుతాడు.
- స్త్రీని చంపినవాడు యమలోక కష్టాలు, ఇరవై కష్టజన్మలు పొందుతాడు. ఇరవై ఏళ్లు క్రిమిగా బ్రతికి మరల మానవ జన్మ ఎత్తుతాడు.
- భోజనాన్ని అపహరిస్తే ఈగగా పుట్టి పాపం నశించాక మనిషి అవుతాడు. నువ్వుల పిండి ఆహారం దొంగిలిస్తే ఎలుకగా పుడతాడు, నేతిని దొంగిలిస్తే కాకమద్గువుగా, చేపలను మాంసాన్ని దొంగిలిస్తే కాకిగా, ఉప్పు దొంగిలిస్తే చిరికాకిగా పుడతాడు.

ఇతరులు తన వద్ద దాచిన దానిని దొంగిలిస్తే చేపగా పుట్టి మానవజన్మనెత్తినా ఆయుస్సు తగ్గుతుంది.

స్త్రీలు కూడా పాపపు పనులు చేస్తే అటువంటి పాపాత్ములకే భార్యలవుతారు.

## అన్నదాన మహిమ - అహింసా ప్రశంస

అన్నదానం గొప్పది. అహింస, వైదిక కర్మాచరణం, ధ్యానం, ఇంద్రియ నిగ్రహం, తపస్సు, గురు శుశ్రూష శ్రేయస్కర మైనవి. హింస, మాంసభక్షణ త్యజించాలి.

**అహింసా పరమో ధర్మః తథాహింసా పరం తపః**
**అహింసా పరం సత్యం యతో ధర్మః ప్రవర్తతే** (అనుశాసనిక. 115-23)

అహింస పరమ ధర్మం. మద్య మాంసాలను పరిత్యజించడం యాగంతో సమానం. మాంసం తినేవారి కోసమే పశుహింస జరుగుతున్నది. పరమాంసంతో తన మాంసాన్ని పెంచుకోవాలనుకునేవాని కన్నా క్షుద్రుడు, క్రూరుడైన నరుడూ లేడు.

**మాం స భక్షయతే యస్మాద్ భక్షయిష్యే తమప్యహమ్**
**ఏ తన్మాంసస్య మాంసత్వమ్ అనుబుద్ధ్యస్వ భారత** (అనుశాసనిక. 116-25)

నన్ను తాను తింటున్నాడు కాబట్టి నేను కూడా అతనిని తింటాను. 'మాం సః' అని భావించబట్టే మాంసానికి మాంసత్వం సిద్ధించింది.

**అహింసా పరమో ధర్మః తథాహింసా పరోదమః**
**అహింసా పరమం దానమ్ అహింసా పరమం తపః**

**అహింసా పరమో యజ్ఞః తథా హింసా పరం ఫలమ్**
**అహింసా పరమం మిత్రమ్ అహింసా పరమం సుఖమ్** (అనుశాసనిక. 116-28, 29)

## వ్యాసుడు - కీటకం

వ్యాసుడు ఒకరోజున రథాలు, బళ్లు పోయే బాటలో ప్రాణభయంతో అటూ ఇటూ పరిగెదుతున్న కీటకాన్ని చూసాడు. దానితో అన్నాడు- "దేనికి భయపడుతున్నావు నీవు? ఈ కీటకజన్మ కన్నా మరణం మేలు కదా!"

కీటకమన్నది- "ప్రతి జన్మలోనూ సుఖమంటుంది. అందుకే బ్రతుకదలుచుకున్నాను. గతంలో నేను మనుష్యుడను. ధనవంతుడను. ధనాన్ని వడ్డీకిచ్చి చెల్లించని వారిని పీడించేవాడిని. ఇతరుల ధనాన్ని అపహరించేవాడిని".

వ్యాసుడన్నాడు- "నీకు ధర్మబుద్ధి ఉన్నది. నీవు మానవ జన్మనెత్తినాక నాకు కనిపించు". వ్యాసుడు వెళ్లిపోయాడు.

కీటకం ఆయువు పూర్తయ్యిందేమో అటుగా వస్తున్న బండి చక్రం కిందపడి మరణించింది. అది క్రమంగా ముండ్లపంది, ఉడుము, పంది, మృగం, పక్షి, చండాలుడు, శూద్రుడు, వైశ్యుడుగా జన్మించి చివరకు క్షత్రియ జన్మనెత్తి వ్యాసుడిని దర్శించింది.

క్షత్రియ కీటుడన్నాడు వ్యాసుడితో- "తమ అనుగ్రహం వల్ల నేను రాజపుత్రుడినయ్యాను".

వ్యాసుడన్నాడు- "గత జన్మలలో చేసిన పాపమింకా ఉన్నది. దానిని పోగొట్టుకో!"

ఆ క్షత్రియుడు ధర్మాచరణతో తన పాపాలను పోగొట్టుకున్నాడు. గొప్ప తపస్సు చేసి మరుజన్మలో బ్రాహ్మణుడై, ఆ తరువాత బ్రహ్మలోకాన్ని పొందినాడు.

## వ్యాసుడు-మైత్రేయుడు

వ్యాసుడు మైత్రేయుడితో అన్నాడు- అతిథిని గౌరవించడం (అతిచ్ఛందం), అతిథిని మాటలతో సత్కరించడం (అతివాదం) వలన మనసుకు ఉల్లాసం కలిగింది.

మనుషులు ఉత్తమ వ్రతాలను పాటించడానికి మూడే మార్గాలు- ద్రోహం చేయకపోవడం, దానం చేయడం, సత్యం పలకడం.

యజ్ఞం, దానం, తపస్సు చేసేవాళ్లు పుణ్యులు. ఇతర ప్రాణులకు ద్రోహం చేసేవారు పాపకర్ములు.

తపస్సు, పాండిత్యం, ఉత్తమ జన్మ బ్రాహణత్వానికి కారణాలు. నీటితో శరీరం మీద మురికి పోయినట్లు, అగ్నిజ్వాలలతో చీకటి తొలగినట్లు దానంతో తపస్సుతో పాపం నశిస్తుంది.

## శాండిలి - సుమన సంవాదం

కేకయ రాజపుత్రి సుమనతో శాండిలి అన్నది– "భార్యగా నేను నా విద్యుక్త ధర్మాలను నిర్వహించాను. దేవతలు, పితృదేవతలు, తల్లిదండ్రులు, అత్తమామలు, గురువులను సేవిస్తాను. చాడీలు చెప్పను. ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటాను. పిల్లలను చక్కగా పెంచాను. దానివలన నాకు స్వర్గలోకవాసం కలిగింది.

**నాయాసయామి భర్తారం కుటుంబార్థే పి సర్వదా**
**గుప్తగుహ్యా సదాచాస్మి సుసమ్మృష్ట నివేశనా** (అనుశాసిన 123–19)

కుటుంబ పోషణకై భర్తనెప్పుడూ ఇబ్బంది పెట్టలేదు. ఇంటిగుట్టు కాపాడుతాను. ఇల్లు వాకిలి శుభ్రంగా ఉంచాను" అన్నది శాండిలి.

## హరిణకృశకాఖ్యానము

ఒక రాక్షసుడికి అడవిలో బ్రాహ్మణుడు ఒంటరిగా దొరికాడు. అతడిని పట్టుకుని తినదలచాడు రాక్షసుడు.

బ్రాహ్మణుడన్నాడు– "నన్నేమైనా అడిగి ఆ తరువాత తిను".

రాక్షసుడన్నాడు– "కేనాస్మి హరిణః కృశః? ఎందువల్ల నేను కృశించి పాలిపోతున్నాను"

బ్రాహ్మణుడన్నాడు– "నీవు ఆత్మీయులకు దూరమైనావు, నీకన్నా తక్కువ వారు కూడా నీకన్నా గొప్పవారైనారు. నీవు మంచివాడివి. అపమార్గాలలో తిరుగుతున్న జనులను చూసి చింతపడుతున్నావు. నీకన్నా గొప్పవాడు నీ భార్యను లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తున్నాడని తెలుసుకున్నావు. అందుకనే నీవు కృశించి పాలిపోయావు– తేనాసి హరిణః కృశః"

రాక్షసుడన్నాడు– "నీవు జ్ఞానివి. నాకు మిత్రుడిగా ఉండు. నీకు నాకు శుభమవుతుంది"

## మూడు పిండాలు - శ్రాద్ధ కర్మ

– నీటితో కలిసిన పిండం చంద్రుని తృప్తి పరుస్తుంది. చంద్రుడు దేవతలను, పితరులను తృప్తిపరుస్తాడు.
– మధ్యమ పిండాన్ని శ్రాద్ధకర్త భార్య తింటుంది. దానివల్ల ఆమెకు, పుత్రులను కోరుకునేవారికి కోరిన కోరికలు సిద్ధిస్తాయి.
– అగ్నిలో పడవేసిన పిండంతో పితరులు ప్రసన్నులై కోరిన కోరికలు తీరుస్తారు.

ఒంటరికి మర్రి ఊడ కషాయాన్ని పూసుకున్నా, పెద్ద ఆవాలనూనె పూసుకున్నా, అరవై రోజుల పంటబియ్యంతో పాయసాన్ని చేసి తాగినా పాపవిముక్తి లభిస్తుంది.

భాద్రపద మాసం కృష్ణపక్షం మాఘ నక్షత్రయుక్త త్రయోదశి నాడు కుతప కాలం (మధ్యాహ్నం) ఏనుగు నీడలో పితరులకు పరమాన్నాన్ని నివేదిస్తే 13 ఏళ్లు మహాశ్రాద్ధాన్ని నిర్వహించినట్లే.

## దాన ప్రాముఖ్యత

గోవులను పూజించాలి. బహులా, సమంగా, ఆకుతోభయా, క్షేమా, సఖా, భూయసీ –అని దూడలతో సహా స్తుతించాలి.

పుష్యమాసం శుక్లపక్షం రోహిణీ నక్షత్రం వచ్చిన నాటి రాత్రి స్నానం చేసి పరిశుద్ధుడై ఏకవస్త్రధారణ చేసి శూన్య ప్రదేశంలో పడుకుని చంద్ర కిరణాలను సేవించాలి. అది మహాయజ్ఞ ఫలాన్నిస్తుంది.

లోమశుడు చెప్పినది– ప్రతినెలలో ద్వాదశి నాడు, పూర్ణిమ నాడు నేతిని, బియ్యాన్ని దానం చెయ్యాలి. తిలపాత్ర దానం గొప్పది.

అరుంధతి చెప్పినది– గోవులను పూజించి వాటిపై పవిత్ర జలాల్ని చల్లి వాటి కొమ్ములపై నిలిచిన నీటిని తలపై జల్లుకోవాలి. చిత్రగుప్తుడు చెప్పినట్లు– చెప్పులు, గొడుగు, కపిల గోవును దానం చెయ్యాలి. జలదానం, దీపదానం పుణ్యాన్నిస్తాయిఇ.

ప్రమధులన్నారు– మాంసం తినని వారిని మేము వేధించం. నిత్యాగ్ని హోత్రులను మేము ముట్టుకోము.

దిగ్గజాలన్నాయి– కార్తీకమాసం, కృష్ణపక్షం, ఆశ్లేషా నక్షత్ర అష్టమినాడు దిగ్గజాలకు పొంగలి నివేదిస్తే జలసంపన్ను లవుతారు.

మహదేవుడన్నాడు– నెలరోజుల పాటు గోవులకు ఆహారాన్ని అందిస్తూ, తాను ఏకభుక్తంగా ఉన్నవాడు ఐశ్వర్యవంతు డౌతాడు.

స్కందుడన్నాడు– పున్నమినాడు చంద్రోదయ సమయంలో రాగిపాత్రలో, తేనె కలిపిన పక్వాన్నాని చంద్రుడికి సమర్పించండి. రూప గుణ సంపన్నులౌతారు.

భీష్ముడు యుధిష్ఠిరునికి భోజ్య, అభోజ్య పదార్థాలను, ప్రాయశ్చిత్తాలను చెప్పాడు. అనేకమంది రాజులు దానం చేసి ఉత్తమ లోకాలను పొందడం వివరించాడు. శిబి, ప్రతర్ధనుడు, రంతిదేవుడు, దేవావృధుడు, అంబరీషుడు, కర్ణుడు, వృషాదర్భి, నిమి, పరశురాముడు, వసిష్ఠుడు, రాముడు, కక్షసేనుడు, మరుత్తుడు, బ్రహ్మదత్తుడు, మిత్రసహుడు, సుద్యుమ్నుడు, సహస్రచిత్త్యుడు, శతద్యుమ్నుడు, సుమన్యుడు, ద్యుతిమంతుడు, మదిరాశ్వుడు, లోమపాదుడు, భగీరథుడు మరెందరో దాన ధర్మాలు చేసి గొప్ప రాజులుగా ప్రసిద్ధికెక్కినారు.

పంచ దానములు– ధర్మ, అర్థ, భయ, కామ, కారుణ్య దానములు. ఇవి పుణ్యాన్ని కీర్తిని పెంపొందింపజేస్తాయి.

## శ్రీకృష్ణుడు - ఋషులు - ఉమామహేశ్వర సంవాదం

పుత్ర సంతానం కోసం పన్నెండేళ్ల వ్రతం చేస్తున్న శ్రీకృష్ణుని నోటి నుంచి వైష్ణవ తేజస్సు వెలువడి ప్రళయకాలాగ్నిగా వెళ్లి పర్వతాన్ని దహించి మరల శ్రీకృష్ణుని చేరుకోవడం చూసిన ఋషులు ఆశ్చర్యపోయినారు.

నారదుడు చెబుతున్నాడు– ఉమామహేశ్వరులు హిమగిరిలో విహరిస్తూ ఉండగా ఉమాదేవి మనోహరంగా నవ్వుతూ మహదేవుని కనులను తన కోమల హస్తాలతో మూసింది. ప్రపంచమంతా అంధకారమయం కాగా శివుడి లలాటనేత్రం తెరుచుకుని ప్రళయాగ్ని జనించి హిమవద్గిరిని దహించింది. తన తండ్రికి వచ్చిన విపత్తును చూసి ఆమె దుఃఖించగా పరమేశ్వరుడు హిమవద్గిరికి యధారూపును కలిగించాడు.

ఉమాదేవి అడిగింది– స్వామీ! నీ తూర్పు ముఖం చంద్రునిలా, ఉత్తర, పశ్చిమ ముఖాలు నిర్మలంగా ఉన్నా, దక్షిణ ముఖమెందుకు భయంకరంగా ఉంది? నీ కపిల జటలు పైకిలేచి ఉన్నాయెందుకు? నీ కంఠం నల్లగా ఉండడానికి కారణమేమిటి? నీ చేతిలో ఆ పినాక ధనుస్సెందుకు? నీవు నిత్యమూ జటాధారివై, బ్రహ్మచారివై ఎందుకు ఉంటున్నావు?

భగవానుడన్నాడు– పూర్వం బ్రహ్మ, విశ్వకర్మ రత్నాలలోని సారాన్ని సంగ్రహించి నువ్వుగింజ పరిమాణాలకు కుదించి 'తిలోత్తమ' అనే అప్సరసను సృష్టించారు. ఆమె నాకు ప్రదక్షిణం చేస్తుండగా నేను నాలుగు దిక్కులకూ చూడగా నాకు నాలుగు ముఖాలేర్పడినాయి. దక్షిణ ముఖం ప్రాణ సంహారిణి.

ఇంద్రుడి వజ్రం తగిలి ఒకసారి, క్షీరసముద్ర మథనం సమయంలో విషాన్ని స్వీకరించి గొంతులో నిలుపుకోగా నా గొంతు నల్లబడి నీలకంఠుడినయ్యాను.

కణ్వుడనే మహర్షి తపస్సు చేస్తున్నపుడు అతడి శిరస్సు మీద పుట్ట ఏర్పడి వెదురు మొలిచి గొప్పగా పెరిగింది. ఆ వెదురుతో బ్రహ్మ మూడు ధనుస్సులు చేసి పినాకమును నాకు, శారంగాన్ని విష్ణువుకు, గాండీవాన్ని సోమునికి ఇచ్చాడు.

కపిల గోవు దూడ తాగే నురుగు నామీద పడినపుడు నేను కోపించగా బ్రహ్మ నన్ను శాంతపరచి 'ఎద్దు' నిచ్చి నన్ను పశుపతిని చేసాడు. అప్పటి నుంచి నాకు ఎద్దు వాహనంగా, ధ్వజంగా ఉండింది.

శ్మశానానికి మించిన పవిత్ర స్థలమెక్కడున్నది? నా భూతగణాలు నివసించే చోటునే నేనుంటాను.

విష్ణువు యందు సౌమ్యతత్త్వం, నాయందు అగ్నితత్త్వం ప్రతిష్ఠింపబడి ఉన్నాయి. రౌద్రాకారం, శూల పట్టిశాయుధాలతో నేను లోకహితం చేస్తాను.

ఋషులన్నారు- శంకరా! సర్వేశా! నమస్కారం!

**నమః సోమాయ దేవాయ నమస్తుభ్యం చతుర్ముఖ**
**నమో భూతపతే శంభో జహ్నుకన్యాంబు శేఖర**

**నమస్త్రి శూలహస్తాయ పన్నగాభరణాయ చ**
**నమోస్తు విషమాక్షాయ దక్షయజ్ఞ ప్రదాహక**

**నమోస్తు బహు నేత్రాయ లోక రక్షణ తత్పర**
**అహో దేవస్య మహాత్మ్యమ్ అహో దేవస్య వై కృపా** (అనుశాసనిక. 141- )

ఉమాదేవికి పరమేశ్వరుడు వర్ణాశ్రమ ధర్మాలను, కర్మ ప్రాధాన్యతను, శుభాశుభ కర్మలను, స్వర్గ నరకాది ప్రాప్తి కారణాలను, రాజధర్మాలను, యోధుల ధర్మాలను, రణ యజ్ఞాన్ని, త్రివర్గ ఆచార వ్యవహారాలను (విద్య, వార్త, సేవ, శిల్పకళ, నాట్యం -మానవులు జీవించడానికి మార్గాలు), కర్మ ఫలాలను, రోగ కారణాలను, ఆయుస్సును, ప్రాణుల భేదాలను, పూర్వజన్మ స్మృతిని, దైవ-మానవ కార్యాలను, పునర్జన్మ కారణాలను, యమలోక నరక యాతనలను, (రౌరవ, మహారౌరవ, కంటకావనం, అగ్నికుండం, పంచకష్టం -అయిదు నరకాలు), వివిధ దాన ధర్మాలనూ (దాత, దేయవస్తువు, దానయోగ్యుడు, దాన ప్రయత్నం, దేశం, కాలం -ఈ ఆరు దాన సంపచ్చుద్ధులు); పుణ్యకర్మ ఫలించే ఏడు రూపాలు (బుద్ధి, ఆయువు, ఆరోగ్యం, బలం, భాగ్యం, శాస్త్రం), శ్రాద్ధ విధానాలు, శుభాశుభగతులు, మరణ భేదాలు, మోక్షం గొప్పతనం, జ్ఞాన ప్రాప్తి, వైరాగ్యం వీటి గురించి వివరించాడు.

24 తత్త్వాల మూల ప్రకృతి + 25వ తత్త్వం పురుషుడి గురించి వివరించే సాంఖ్య జ్ఞానాన్ని, పరమాత్మ స్వరూపాన్ని, మనస్సును నిశ్చలంగా ఉంచే యోగవిద్యను - కామ క్రోధ భయ స్వప్న స్నేహ, అమితంగా తినడం, వికల మనస్కత, వ్యాధి, బద్ధకం, దురాశ అని పది దోషాలను నివారించడం, అణిమ, మహిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం, గరిమ, లఘిమ అనే యోగ గుణాలను (అష్ట సిద్ధులు) సాధించే యోగవిద్య గురించి, శివ సాయుజ్యం, విష్ణు సాయుజ్యాలను పరమేశ్వరుడు ఉమాదేవికి బోధించాడు.

పాశుపతులు (భస్మాన్ని అలంకరించుకునేవారు), లింగ పూజ చేసేవారు పొందే పుణ్యగతులను వివరించాడు.

ఉమాదేవి పతివ్రతా ధర్మాన్ని తెలిపింది.

**పతిర్హిదేవో నారీణాం పతిర్బంధుః పతిర్గతిః**
**పత్యా సమా గతిర్నాస్తి దైవతం వా యథాపతిః** (అనుశాసనిక. 146-55)

స్త్రీలకు భర్తయే దైవం, బంధువు, గతి; స్త్రీకి స్వర్గంతో సమానం భర్త అనుగ్రహం.

## శ్రీకృష్ణ మహాత్మ్యము

ఈశ్వరుడన్నాడు-

**పరమాత్మా హృషీకేశః సర్వ వ్యాపీ మహేశ్వరః**
**న తస్మాత్ పరమం భూతం త్రిషులోకేషు కించన** (అనుశాసనిక. 147-8)

ఆ పరమాత్మ కన్నా గొప్ప వ్యక్తి ముల్లోకాల్లోనూ లేదు. బలరామ శ్రీకృష్ణులుగా అవతరించిన దివ్యపురుషులు వీరు.

శ్రీకృష్ణుడు ఆ విధంగా పరమశివుని పూజించి రుక్మిణీదేవికి ప్రద్యుమ్నుడిని కన్నాడు. అతడే కాముడు.

## శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము

భీష్ముడన్నాడు ధర్మరాజుతో– మహావిష్ణువు యొక్క సహస్రనామాలివి –అని వాటిని వివరించాడు.

**యని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః**
**ఋషి భిః పరిగీతాని తాని వక్ష్యామి భూతయే** (అనుశాసనిక. 149–13)

**విశ్వం విష్ణుర్వ షట్ కారః భూత భవ్య భవత్ప్రభుః**
**భూత కృద్ భూత భృత్ భావః భూతాత్మా భూత భావనః** (అనుశాసనిక. 149–14)

**శంఖ భృన్నందకీ చక్ర శారంగధన్వా గదాధరః**
**రథాంగపాణి రక్షోభ్యః సర్వ ప్రహరణాయుధః** (అనుశాసనిక. 149–120)

**ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః**
**నామ్నాం సహస్రం దివ్యానామ్ అశేషేణ ప్రకీర్తితమ్** (అనుశాసనిక. 149–121)

ఈ సహస్రనామ స్తోత్రం శ్రేయస్సును, సుఖాలను కలిగిస్తుంది.

## జపమంత్రాలు - గాయత్రీ జప ఫలము

శివ సహస్రనామం, విష్ణు సహస్రనామం, ఏకాదశ రుద్రులు (అజైకపాద, అహిర్బుధ్న్య, పినాకి, అపరాజిత, ఋత, పితృరూప, త్ర్యంబక, మహేశ్వర, వృషాకపి, శంభు, హవన, ఈశ్వరుడు), ద్వాదశాదిత్యులు (అంశ, భగ, మిత్ర, వరుణ, జలేశ్వర, ధాత, ఆర్యమ, జయంత, భాస్కర, త్వష్ట, పూష, ఇంద్ర, విష్ణువు), అష్ట వసువులు (ధర, ధృవ, సోమ, సావిత్రుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యేషుడు, ప్రభాసుడు); అశ్వినీ దేవతలు (నాసత్యులు, దస్రులు), మార్తాండుని కుమారులు– నాసికోద్భవులు, దిక్పాలకులు, ఋత్విజులను, భూమిని మోసేవారు (ధర్ముడు, కాముడు, కాలుడు, వసువు, వాసుకి, అనంతుడు, కపిలుడు), దివ్య మునులు (పరశురాముడు, వ్యాసుడు, అశ్వత్థామ, లోమశుడు) ఇంకా ప్రసిద్ధులైనవారిని, భరతాది రాజులను ప్రార్థించాలి.

**ఏతే పాంతి వర్షంతి భాంతి వాంతి సృజంతిచ**
**ఏతే వినాయకాః శ్రేష్ఠా దక్షాః శాంతా జితేంద్రియాః** (అనుశాసనిక. 150–57)

వీరందరూ లోకాన్ని రక్షిస్తారు.

ఉత్తమమయిన గాయత్రీ మంత్రాన్ని జపించాలి.

**యాన పాత్రే చ యానే చ ప్రవాసే రాజవేశ్మని**
**పరాం సిద్ధి మవాప్నోతి సావిత్రీం హ్యుత్తమాం పఠన్**

**ఓం భూర్భువ స్వః**
**తత్స వితుర్వరేణ్యం**
**భర్గో దేవస్య ధీమహి**
**ధియోయోనః ప్రచోదయాత్**

ఎక్కడ ఉన్నా ఈ సావిత్రీ (గాయత్రీ) మంత్ర పఠనం వలన సిద్ధి కలుగుతుంది.

## బ్రాహ్మణ ప్రశంస

భీష్ముడన్నాడు– బ్రాహ్మణులు పూజ్యులు నమస్కరింప దగినవారు. వాళ్లు లోకాలను ధర్మంతో నిలబెడతారు.

**బ్రాహ్మనాః సర్వలోకానాం మహాంతో ధర్మసే తవః**
**ధన త్యాగాభి రామాశ్చ వాక్సంయమరతాశ్చయే** (అనుశాసనిక. 151–4)

## కార్తవీర్యార్జునుడు - వాయుదేవత

హైహయ వంశస్థుడైన కార్తవీర్యార్జునుడు మాహిష్మతీ పురానికి ప్రభువు. సాగరమే వస్త్రంగా కలిగిన భూమండలాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. అతడు దత్తాత్రేయ మహర్షిని చిరకాలం ఆరాధించి నాలుగు వరాలు పొందాడు– యుద్ధరంగంలో వేయి బాహువులున్నవాడిగా కనబడాలి. సమస్త భూమండలాన్ని జయించాలి. గెలిచిన భూమిని సక్రమంగా పాలించాలి. దారి తప్పినపుడు నన్ను మరల సన్మార్గంలోకి మళ్లించాలి.

ఆ తరువాత అతడిలో అహంకారం పెరిగింది– "నేటి వరకు బ్రాహ్మణ ప్రధానంగా ఉన్న లోకాన్ని క్షత్రియ ప్రధానంగా చేస్తాను" అన్నాడు.

వాయుదేవత అన్నాడు– "కశ్యపుడు, అంగిరసుడు, గౌతముడు, కపిలుడు, ఔర్వుడు, దత్తాత్రేయుడు, అగ్ని, బ్రహ్మ, ఉతథ్యుడు, అగస్త్యుడు, వసిష్ఠుడు, అత్రి, చ్యవనుడు –వీరంతా ఇంద్రుడు, వరుణుడు లాంటి దేవతల అహంకారాన్ని తగ్గించారు. స్వర్గమాక్రమించిన కపులను పారద్రోలారు".

కార్తవీర్యార్జునుడు వాయుదేవత మాటలు విని శాంతం వహించాడు. కాని తన అహంకారం వలన భృగు వంశీయులతో గొడవపడి పరశురాముడి చేతిలో దారుణంగా సంహరించబడినాడు.

## కృష్ణుని మహిమ

**యత్ ప్రశస్తం చలోకేషు పుణ్యం యచ్చ శుభాశుభమ్**
**తత్ సర్వం కేశవో చింత్యః విపరీత మతః పరమ్** (అనుశాసనిక. 158–45)

కేశవుడే నారాయణుడు. పరముడు. నాశరహితుడు. జగత్తుకు ఆది మధ్య అంతములతడే! పరమాత్మయే శ్రీకృష్ణుడు.

## దుర్వాసుడు - శ్రీకృష్ణుడు

శ్రీకృష్ణుడన్నాడు ధర్మరాజుతో– ఒకప్పుడు హరిత పింగల వర్ణుడై నారబట్ట మారేడు దండాన్ని ధరించి, పొడుగు గడ్డాలు, చిక్కిన శరీరం గల దుర్వాసముని పొడుగైన వారిలో పొడుగరి. అన్ని లోకాల్లో సంచరించగలిగినవాడు. అతడు నాలుగు దారుల కూడలిలో నిలబడి– 'నాకు కోపమెక్కువ. చిన్న పొరపాటు జరిగినా శపిస్తాను. నన్ను సహనంతో భరించి ఆతిథ్యమిచ్చేవారెవరు? –అని అడిగేవాడు. అతడు ఏ నియమాలూ పాటించడు. వేలమంది తినే తిండి ఒక్కడే తినగలడు. ఒక్కోసారి చాలా తక్కువ తింటాడు. ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళ్తాడో ఎవరికీ తెలియదు. హఠాత్తుగా నవ్వుతాడు, ఎందుకో తెలియదు ఏడుస్తాడు. తానున్న విడిది గృహాన్ని కాల్చేస్తాడు.

ఒకరోజున నాతో పాయసాన్నం చేయించమన్నాడు. తాగగలిగినంత తాగి నా వంటికి రాసుకోమన్నాడు. తన వంటికి పూయమన్నాడు. పక్కనే ఉన్న రుక్మిణీదేవినీ పూసుకోమన్నాడు. రథమెక్కి రుక్మిణిని లాగమన్నాడు. రథం లాగుతున్న రుక్మిణిని బెత్తంతో కొట్టాడు. రథం రాజవీధిలో నడుస్తున్నది. దుర్వాసుడు రుక్మిణిని కొడుతున్నాడు, అదిలిస్తున్నాడు.

యాదవులది చూసి– కాలసర్ప విషం భయంకరం. దానికన్నా ద్విజుడు ఉగ్రుడు. బ్రాహ్మణ సర్పంచే కాటు వేయబడితే చికిత్స లేదు. అనుకుంటున్నారు జనులు.

దారి మధ్యలో గుంటలో రథం దిగబడింది. తిట్టుకుంటూ రథం దిగి వెళ్లిపోయాడు. నేనూ అతడి వెంట పరిగెత్తి శాంతపరచాను.

దుర్వాసుడన్నాడు– "గోవిందా! నీ శరీరమంతా పాయసం పూసుకున్నావు కాని ఎడమ పాదానికి పాయసం అంటలేదు. అది బలహీన స్థానమవుతుంది. అమ్మా రుక్మిణీ! నీ అంత కాంతివంతమైన, శ్రేష్ఠురాలైన స్త్రీ ప్రపంచంలోనే ఉండదు" –అని ఆశీర్వదించి వెళ్లిపోయాడు. మా ఇరువురి దేహాలు మరింత కాంతివంతమైనాయి –అన్నాడు కృష్ణుడు.

## శంకర స్తుతి - దేవతా ప్రార్థన

శ్రీకృష్ణుడు శంకరుని స్తుతించాడు–

**మహేశ్వరశ్చ లోకానాం మహతామీశ్వరశ్చ సః**
**బహు భిర్వి విధై రూపైః విశ్వం వ్యాప్త మిదం జగత్** (అనుశాసనిక. 162–29)

శంకరుడే లోకాలకు ప్రభువు. అతడు మనలకు శుభములనిచ్చు గాక!

భీష్ముడన్నాడు ధర్మరాజుతో– నాయనా, ధర్మాచరణ పాటించు.

**అహింసా సత్య మక్రోధః దానమే తచ్చతుష్టయమ్**
**అజాత శత్రో సేవస్వ ధర్మ ఏష సనాతనః** (అనుశాసనిక. 162–23)

అహింస, సత్యం, క్రోధ రాహిత్యం, దానం అనే నాలుగు సనాతన ధర్మములను చక్కగా ఆచరించు.

**మానసం సర్వభూతానాం ధర్మమాహుర్మనీషణః**
**తస్మాత్ సర్వాణి భూతాని ధర్మమేవ సమాసతే** (అనుశాసనిక. 162-61)

ధర్మమే సమస్త ప్రాణులకు హృదయం. ధర్మాన్ని ప్రచారం చేసుకోరాదు. అలా చేసినవారు ధర్మాన్ని వ్యాపారంగా మారుస్తారు.

యుధిష్ఠిరుడన్నాడు- అదృష్టవంతుడు వందల బాణాలు తగిలినా బ్రతుకుతాడు. కాలం మూడినవాడు గడ్డిపరక తగిలినా చస్తాడు.

భీష్ముడన్నాడు- అవును. అందుకే దైవబలం గొప్పది. దానం చేసినవాడు భోగి అవుతాడు. వృద్ధుల్ని సేవిస్తే మేధావిగా మారతాడు. హింసను వదిలితే దీర్ఘాయువు పొందుతాడు. కాలమే మానవులకు నిగ్రహాన్ని అనుగ్రహాన్ని ఇస్తుంది. కాలం బుద్ధిలో ప్రకాశించడం వలన ధర్మ, అధర్మ ప్రవృత్తులు కలుగుతాయి.

ధర్మరాజా! దేవతలను దేవర్షులను రాజర్షులను ప్రార్థించు-

"విఘ్నాలు రారాదు, పాపమంటకూడదు, నాకు నిత్యమూ జయమే లభించాలి. ఉత్తమగతులు లభించాలి"

**మా విఘ్నం మా చ మే పాపం మా చమే పరిపంథినః**
**ధ్రువో జయోమే నిత్యః స్యాత్ పరత్ర చ శుభాగతిః** (అనుశాసనిక. 165-62)

## భీష్మ నిర్యాణము

ధర్మరాజు ప్రశాంతచిత్తుడై భీష్ముడి అనుమతి తీసుకుని హస్తిన చేరుకున్నాడు. ధర్మజుడు హస్తినాపురంలో యాభై రోజులున్నాడు. మాఘ మాసం శుక్లపక్షం మూడవ భాగం వచ్చింది. అష్టమి నాడు రోహిణీ నక్షత్రం మధ్యాహ్న సమయం, సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించినప్పుడు భీష్ముడు స్థిరమైన మనసుతో ఆత్మను ఆత్మయందు సమాహితం చేసాడు.

ఆత్మను క్రమాన్ననుసరించి అనుసంధానం చెయ్యటం ప్రారంభించాడు. క్రమ మార్గంలో నిరోధించబడిన ప్రాణాలు ఊర్ధ్వ మార్గంలో ప్రయాణించాయి. ఏయే శరీర భాగాల నుంచి ప్రాణాలను ఉపసంహరించాడో ఆ శరీర భాగాలు శల్యవిముక్తాలయ్యాయి. అందరూ చూస్తుండగానే భీష్ముడు సమస్త శల్యాల నుంచి విముక్తుడయ్యాడు. అన్ని శరీర భాగాల నుండి చక్కగా నిరోధించబడిన భీష్ముని ప్రాణాలు శిరస్సును చీల్చికొని స్వర్గానికి ఎగిరిపోయాయి. భీష్ముని శిరః ప్రదేశం నుండి గొప్ప ఉల్కలా పెద్ద వెలుగు ఆకాశంలో కనిపించి అంతర్ధానమైంది. ఆ విధంగా భీష్ముడు కాలానికి వశమయ్యాడు.

పాండవులు, యుయుత్సుడు చితిని ఏర్పరచారు. భీష్ముని పట్టుబట్టలతో పూలమాలలతో కప్పినారు. యుయుత్సుడు ఛత్రాన్ని, భీమార్జునులు చామరాలను, మాద్రీ పుత్రులు తలపాగాలను ధరింపజేసారు. శాస్త్ర ప్రకారం పితృయజ్ఞాన్ని నిర్వర్తించారు. అగ్నిలో హోమద్రవ్యాలను ఆహుతి చేసారు. సామవేత్తలు సామగానం చేసారు. గంధపు చెక్కల చితిలో, కాలాగురు వంటి ద్రవ్యాలతో రకరకాల గంధ ద్రవ్యాలతో గాంగేయుని కప్పివేసి చితికి నిప్పంటించారు. ధృతరాష్ట్రాదులందరూ మండుతున్న చితికి ప్రదక్షిణాలు చేసారు.

గంగానదిలో స్నానం చేసి వారంతా బయటకు రాగానే మానవి రూపంతో వచ్చి గంగ దుఃఖించింది. శ్రీకృష్ణుడు వ్యాసుడు ఆమెను అనునయించారు.

**న శక్తః సంయుగే హంతుం సాక్షాదపి శతక్రతుః**
**స్వచ్ఛంద తస్తవ సుతః గతః స్వర్గం శుభాననే** (అనుశాసనిక. 168-34)

*****

# ✦ 14. అశ్వమేధిక పర్వము ✦

1) అశ్వమేధ పర్వము (15)
2) అనుగీతా పర్వము (77)

## 1) అశ్వమేధ పర్వము

భీష్మ నిర్యాణం తరువాత మరల యుధిష్ఠిరుడు మనసు వ్యాకులత చెందగా తపోవనానికి పోవాలనుకున్నాడు. శ్రీకృష్ణుడు, వ్యాస మహర్షి అతడిని ఓదార్చారు. వ్యాసుడన్నాడు– "యజ్ఞాల వల్లనే దేవతలు అధికులైనారు. కార్యనిష్ఠులై దానవులను ఓడించారు. అందుచేత నీవు రాజసూయ, అశ్వమేధ, నరమేధ, సర్వమేధాల్లో నీకు నచ్చిన యాగం చేసి నీ మనసును కలవరపరుస్తున్న అశాంతి నుంచి విముక్తుడివికా!"

యుధిష్ఠిరుడన్నాడు– "నాకు అశ్వమేధ యాగం చెయ్యాలని ఉన్నది. అయితే ఆ యాగంలో ఇవ్వాల్సిన దానధర్మాలకు సరిపడా ధనం లేదు. ప్రజలపై పన్నులు వేయలేను. హస్తినాపుర కోశాగారంలో పెద్దగా ధనం లేదు. ఈ యజ్ఞంలో సమస్త భూమండలాన్ని దానం చెయ్యాలి. ఇది సాధ్యమా?"

కృష్ణ ద్వైపాయనుడన్నాడు– "హిమవత్పర్వత ప్రాంతంలో మరుత్తుడి యజ్ఞంలో దానం తీసుకున్న బ్రాహ్మణులు మిగులు బంగారాన్నంతా ఒకచోటున దాచి– 'ఎవరికి దొరికితే వారికి' అని నిక్షేపం చేసారు".–

## సంవర్త - మరుత్తీయం

కృతయుగంలోని ఒక మనువు పుత్రుడు ప్రసంధి. ప్రసంధి → క్షుపుడు → వింశుడు → వివింశుడు → ఖనీనేత్రుడు → సువర్చసుడు (చేతిని శంఖంలా చేసి ఊది కరంధముడైనాడు) → అవిక్షితుడు → మరుత్తుడు.

మరుత్తుడు తనకు పోటీ వస్తున్నాడని భావించి ఇంద్రుడు బృహస్పతిని పిలిచి మరుత్తుడు చేసే యాగానికి పురోహితుడిగా ఉండవద్దు అని చెప్పాడు. బృహస్పతి అన్నాడు– నేనిప్పటి నుంచి మర్త్యుడు చేసే ఏ యాగానికి స్రువం పట్టుకోను –అని శపథం చేసాడు.

మరుత్తుడు మహాయజ్ఞం చేయ సంకల్పించి వచ్చి బృహస్పతిని తనతో యజ్ఞం చేయించమన్నాడు. బృహస్పతి అంగీకరించలేదు. మరుత్తుడు నిరాశతో వెనుదిరిగినపుడు దారిలో నారదుడు సలహా ఇచ్చాడు సంవర్తుడితో చేయించమని.

"సంవర్తుడు దిగంబరుడై వారణాసిలో తపస్సు చేసుకుంటున్నాడు. అతడు ఒకచోట నిలకడగా ఉండడు. పిచ్చివాడిలా ప్రవర్తిస్తాడు. శవాలను చూడగానే పారిపోతాడు" –నారుదుడు చెప్పి ఆ లక్షణాలను బట్టి మరుత్తుడు సంవర్తుని గుర్తుపట్టి అతడిని తాను చేయబోయే యాగానికి నిర్వాహకుడిగా ఉండమని ప్రార్థించాడు. "బృహస్పతి ఒప్పుకోలేదు. నారదుడు మీపేరు సూచించాడు" –అన్నాడు మరుత్తుడు.

సంవర్తుడన్నాడు– "ఇంద్రుడికి కోపం వస్తుంది. బృహస్పతి బాధపడతాడు. మధ్యలో నన్ను విస్మరిస్తే నీవు శాపగ్రస్తుడ వవుతావు".

మరుత్తుడన్నాడు– "ఈ యాగానికి సర్వం మీరే!"

యజ్ఞం మొదలయ్యింది. అటువంటి గొప్ప యజ్ఞాన్ని అంతవరకూ ఎవ్వరూ చెయ్యలేదు.

దానితో ఇంద్రుడు బృహస్పతి ఆలోచించి అగ్నిని మరుత్తుడి వద్దకు రాయబారిగా పంపారు.

మరుత్తుడన్నాడు– "మహేంద్రునితో యజ్ఞం చేయించిన బృహస్పతి నాలాంటి మర్త్యుడితో యాగం చేయించడం పద్ధతి కాదు. నా యజ్ఞాన్ని సంవర్తుడే జరిపిస్తాడు, అది ధర్మం"

మరో అగ్నిలా ప్రజ్వరిల్లుతున్న సంవర్తుని చూసి అగ్ని భయపడి ఇంద్రుడి వద్దకు వెళ్లి ఆ విషయం చెప్పాడు. ఇంద్రుడు వజ్రాయుధమెత్తి మరుత్తునిపై ప్రయోగించబోగా సంవర్తుడు స్తంభిని విద్యతో దేవేంద్రుని చేతిని స్తంభింపజేసాడు.

మరుత్తుడి కోరికతో సంవర్తుడు ఇంద్రుడితో సహా సర్వదేవతలను ఆవాహన చేసాడు. ఇంద్రుడి స్తంభించిన చేతిని మామూలుగా చేయడంతో సంతోషించిన ఇంద్రుడన్నాడు- "ఈ సంవర్తుడు బృహస్పతి సోదరుడు. నీపై అసూయ చెంది నేనే బృహస్పతిని యాగకర్తగా వద్దన్నాను".

సంవర్తుడు యజ్ఞాన్ని నిర్విఘ్నంగా ముగించాడు. మరుత్తుడు దానం చేసిన బంగారాన్ని తీసుకుపోగలిగినంత తీసుకుపోగా మిగిలిన దాన్నంతా ఒకచోట చేర్చి ధనాగారం నిర్మించి దానిలో నిక్షేపించారు బ్రాహ్మణులు.

వ్యాసుడన్నాడు- "ధర్మరాజా! నీవు ఆ ధనాన్ని తెచ్చి అశ్వమేధ యాగాన్ని చెయ్యి. నీకు శుభం కలుగుతుంది".

శ్రీకృష్ణుడన్నాడు- "ధర్మరాజా! నీ శరీరంలోనే నీ శత్రువు ఉన్నాడన్న విషయం తెలుసుకోవెందుకు? ఒకప్పుడు ఇంద్రుడు-వృత్రాసురుల మధ్య ఘోర యుద్ధం జరిగింది. వృత్రాసురుడు భూమిని ఆక్రమించి భూగంధాన్ని అపహరించడంతో భూమిపై దుర్గంధం వ్యాపించింది. దానితో కోపించిన ఇంద్రుడు వజ్రాయుధంతో వృత్రుడిని కొట్టగా వృత్రుడు జలంలో ప్రవేశించి రసాన్ని అపహరించాడు. ఇంద్రుడు మరల కొట్టేసరికి అగ్నిలో ప్రవేశించి రూపాన్ని, ఆ తరువాత వాయువులో ప్రవేశించి స్పర్శను అపహరించి, ఆకాశంలో ప్రవేశించి శబ్దాన్ని అపహరించి తానే ఆకాశమైనాడు. ఇంద్రుడు మరల కొట్టగా ఇంద్రుడిలో ప్రవేశించి వివేకాన్ని అపహరించాడు.

అప్పుడు వసిష్ఠుడు రథంతర అనే సామమంత్రంతో ఇంద్రుని మేల్కొల్పగా ఇంద్రుడు వజ్రాయుధంతో ఆఖరి దెబ్బ కొట్టగా వృత్రుడు మరణించాడు.

ధర్మరాజా! నీవిప్పుడు మనోవ్యాధితో, సంశయంతో బాధపడుతున్నావు. మమ (నాది) అనేది మృత్యువు. న మమ (నాది కాదు) అనేది బ్రహ్మప్రాప్తికి కారణం. మమకారం మృత్యువు. దాని త్యాగం సనాతనమయిన అమృతత్వం.

మరణించిన బంధువుల గురించి మాటిమాటికి వ్యధ చెందుతున్నావు. నీవు మహా యజ్ఞాన్ని చేసి నీకు మనశ్శాంతిని కలిగించుకో".

శ్రీకృష్ణుడు, వ్యాసుడు ఆ విధంగా ధర్మరాజుకు అనేక ధర్మోపదేశాలు చేయగా మనశ్శాంతి నొంది, ధర్మరాజు హస్తినాపురంలో ప్రవేశించి ప్రజారంజకంగా రాజ్యాన్ని పాలించాడు.

**స్వర్గలోకోపమో లోకః తదా తస్మిన్ ప్రశాసతి**
**బభూవ సుఖమే కాయ తద్విశిష్టతరం పరమ్** (అశ్వమేధ. 14- )

ధర్మరాజు పాలనలో లోకమంతా స్వర్గలోక తుల్యమైంది.

## శ్రీకృష్ణుడు - అర్జునుడు

ఎంతో ఆప్యాయంగా కలిసిమెలిసి ఉన్నారు శ్రీకృష్ణార్జునులు. ఇంద్రప్రస్థంలోని మయసభలో కొన్నాళ్లున్నప్పుడు అర్జునుడు అన్నాడు- "మహాయుద్ధ సమయంలో నీవు నాకు గీతోపదేశం చేసావు. ఆ విషయాలు మళ్లీ వినాలని వున్నది".

శ్రీకృష్ణుడన్నాడు- "నరుడివి కదా! ఎప్పటికప్పుడు మరచిపోతావు. పరమాత్మ తత్త్వాన్ని బోధించాను నీకప్పుడు.

**పునః పునశ్చ మరణం జన్మ చైవ పునః పునః**
**ఆహారా వివిధా భుక్తాః పీతా నానా విధాః స్తనాః** (అశ్వమేధ. 16-32)

ఒక సిద్ధుడన్నాడు- ఎన్నోసార్లు పుట్టాను, ఎన్నోసార్లు మరణించాను. నానా విధాలైన ఆహార పదార్థాలు తిన్నాను. ఎందరో తల్లుల పాలు తాగాను. ఈ జన్మలో సిద్ధుడనయ్యాను.

# 2. అనుగీతా పర్వము

సిద్ధుడు చెబుతున్నాడు కాశ్యపుడికి– మనుష్యుడు శుభకర్మలు చేస్తే శుభ ఫలితాలను పొందుతాడు. వాత పిత్తాది దోషాలు ప్రకోపించడం చేత ప్రాణాంతక వ్యాధులను ఆహ్వానిస్తాడు. మర్మస్థానాలు శిథిలమైతే మరణాన్ని పొందుతాడు.

తత్త్వజ్ఞుడైన జీవుడు తనను తాను శరీరానికి భిన్నంగా చూస్తాడు. శరీరంలో ఉండి కూడా దానిని వదిలి ఆత్మ సాక్షాత్కారాన్ని పొందుతాడు. పరమాత్మను దర్శించి ఉత్తమగతిని పొందుతాడు.

## బ్రహ్మగీత

పంచ ప్రాణాలు (ప్రాణ, వ్యాన, సమాన, ఉపాన, అపానము) ప్రజ్వరిల్లేలా చేసిన వైశ్వానరాగ్నికి ఏడు నాలుకలు (ముక్కు, నాలుక, కన్నులు, చర్మం, చెవి, మనస్సు, బుద్ధి; ఆ అగ్నికి ఏడు సమిధలు (గంధ, రూప, రస, శబ్ద, స్పర్శ, మననం, బుద్ధి ద్వారా వివేకం), ఏడుగురు ఋత్విక్కులు (వాసన చూసేవాడు, తినేవాడు, చూసేవాడు, స్పృశించేవాడు, వినేవాడు, మననం చేసేవాడు, తెలుసుకునేవాడు; ఏడు హవిస్సులు– వాసన చూడదగినది, త్రాగదగినది, చూడదగినది, తాకదగినది, వినదగినది, మననం చేయదగినది, తెలుసుకోదగినది; ఏడు మూలాలు (భూమి, ఆకాశం, గాలి, అగ్ని, నీరు, మనసు, బుద్ధి) – వీటి నుంచి గంధం, రసం, రూపం, స్పర్శ, శబ్దం, సంశయం, బుద్ధి జనించడం – సప్తవిధ జన్మ.

జ్ఞాత, జ్ఞేయం, జ్ఞానం అనే ఆహుతి త్రయంతో సమస్తలోకం పరిపూర్ణమై ఉంది. ఈ లోకాలలో ఆత్మజ్యోతి ప్రకాశిస్తుంది.

## దశహోత్ర విధానం - బ్రాహ్మణ గీత

చెవి, చర్మం, కన్నులు, నాలుక, ముక్కు, కాళ్లు, చేతులు, ఉపస్థ, మూత్రద్వారం, గుదం –పది హోతలు శబ్ద స్పర్శ రూప రస గంధ వాక్కు క్రియ గతి వీర్యం మూత్ర విసర్జన మలవిసర్జన –పది హవిస్సులు.

దిక్కులు, వాయువు, సూర్యుడు, చంద్రుడు, భూమి, అగ్ని, విష్ణువు, ఇంద్రుడు, ప్రజాపతి, మిత్రుడు –పది అగ్నులు.

చిత్తమే స్రువం; జ్ఞానమే ధనం;

దశేంద్రియాలనే హోతలు, దశ దేవతలనే అగ్నులు, దశ విషయాలనే హవిస్సులు, సమిధలను హోమం చేస్తున్నారు.

దశ హోత్ర విధానం, సప్తహోత్ర విధానం, పంచహోత్ర విధానం ఇవి పంచ ప్రాణాలు కలిసి పనిచేసే విధానాన్ని తెలియజేస్తాయి.

శ్రోతలు గురువు చేసే ఉపదేశం వింటారు, కాని, భిన్నభిన్నంగా గ్రహిస్తారు. ప్రశ్న వేసే శిష్యునికి అంతర్యామిని మించిన వేరే గురువు లేడు.

**శృణోత్యయం ప్రోచ్యమానం గృహ్ణాతి చ యథాతథమ్**
**పృచ్ఛాతస్తదతో భూయః గురురన్యోన విద్యతే** (అశ్వమేధ. 7-12)

మనిషి తన ప్రవృత్తిని బట్టి దృశ్యాన్ని వేరువేరుగా గ్రహిస్తాడు. వేరువేరుగా ప్రవర్తిస్తాడు.

వ్రతాలను కర్మకాండ వదిలి కేవలం బ్రహ్మభావంతో ఉండేవాడు బ్రహ్మరూపుడవుతాడు. ఇదే సూక్ష్మ బ్రహ్మచర్యం.

పరబ్రహ్మ వనంలో ఏడు పెద్దచెట్లు; వాటి ఫలాలు ఏడు. అతిథులు ఏడుగురు; ఆశ్రమాలు ఏడు, సమాధులు ఏడు; దీక్షలు ఏడు. కొన్ని చెట్లు అయిదు రంగుల పండ్లను, కొన్ని రెండు రంగుల పండ్లను ఇస్తాయి. అక్కడ ఒకే అగ్ని ఉన్నది. జీవుడు శుద్ధచిత్తుడైన బ్రాహ్మణుడు. అయిదు ఇంద్రియాలు సమిధలు. వాటి వల్ల కలిగే మోక్షం ఏడు విధాలు. గుణాలు ఏడుగురు అతిథులు. యశస్సు, ప్రభ, ఐశ్వర్యం, విజయం, సిద్ధి, తేజస్సు, విజయం అనే ఏడు జ్యోతులు ఆత్మరూపి అయిన సూర్యుని అనుసరిస్తాయి.

**అహింసా సర్వధర్మాణామ్ ఇతి వృద్ధానుశాసనమ్**
**యదా హింస్రం భవేత్ కర్మ తత్ కార్యమతి విద్మహే** (అశ్వమేధ. 28-16)

అహింస పరమ ధర్మం. సర్వభూతదయ గొప్పది.

ఆశ్రమంలోని ధేనువును దొంగిలించాలని హైహయులు ప్రయత్నించగా కార్తవీర్యార్జునునికి పరశురాముడికి మధ్య గొడవ జరిగింది. కార్తవీర్యార్జునుడిని పరశురాముడు చంపగా, కార్తవీర్యార్జునుడి కుమారులు జమదగ్నిని చంపారు. దానితో ఆగ్రహోదగ్రుడైన పరశురాముడు ఇరవై ఒక్కమార్లు దండెత్తి క్షత్రియులనందరిని చంపాడు. కొందరు పారిపోయి వేర్వేరు చోట్ల తలదాల్చుకున్నారు. వాళ్లు కర్మలు చేయక శూద్రులైనారు. క్షత్రియకాంతలు బ్రాహ్మణులతో కలిసి పిల్లలను కనగా వారిని కూడా పరశురాముడే సంహరించాడు.

ఋచీకాది మహర్షులు అతడిని వారించడానికి ప్రయత్నాలు చేసారు. సఫలం కాలేదు. అలర్కుడనే రాజర్షి మనస్సును, ఇంద్రియాలను చంపడానికి ధ్యానయోగాన్ని అవలంభించాడు -అని చెప్పగా పరశురాముడు ఘోర తపస్సు చేసి శాంతి నొందినాడు.

అంబరీష మహరాజు తన అంతశ్శత్రువులను ఓడించదలుచుకుని వాటి స్వరూపం తెలుసుకున్నాడు. సాత్విక గుణాలు- హర్షం, ప్రీతి, ఆనందం; రాజసగుణాలు- తృష్ణ, క్రోధం, ద్వేషం; తామస గుణాలు- అలసట, ఆలస్యం, మోహం.

లోభం వలన తృష్ణ పెరిగి రాజస, తామస గుణాలు పెరుగుతాయని గ్రహించి అంబరీషుడు లోభాన్ని అణచివేసి కీర్తిమంతుడైనాడు.

జనక మహరాజు ఒకరోజున ఓ బ్రాహ్మణుడిపై కోపంతో "నా రాజ్యం వదిలి పో!" అన్నాడు. ఆ బ్రాహ్మణుడు శాంతంగా- "నీ రాజ్యపు సరిహద్దులు చెప్పు, వెళ్లిపోతాను" అనగా, జనకుడు ఆలోచించి- "నిజానికి నాకు రాజ్యమే లేదు, ఒక దృక్కోణంలో ఈ భూమండలమంతా నాదే. ఇంకో దృక్కోణంలో ఈ నేల నాదికాదు. ఏ వస్తువూ నాది కాదు. నన్ను క్షమించు" అన్నాడు జనకుడు. ఆ బ్రాహ్మణుడు ధర్మదేవతగా కనిపించి అన్నాడు- "నిన్ను పరీక్షించడానికిలా వచ్చాను. ఈ ప్రపంచంలో సత్త్వగుణం అనే నేమిని చుట్టుకుని ఉండేది, ఎప్పుడూ వెనుకకు తిరగని బ్రహ్మప్రాప్తి రూపమైన చక్రాన్ని తిప్పేవాడివి నీవు ఒక్కడివే".

మనసు, బుద్ధిల మధ్య జరిగిన సంవాదాన్ని శ్రీకృష్ణుడు అర్జునుడికి ఆ విధంగా అనేక ఉపాఖ్యానాలతో వివరించాడు.

## గురుశిష్య సంవాదం

శ్రీకృష్ణుడు అర్జునుడితో చెబుతున్నాడు- గురువు తన శిష్యుడికి చెప్పినట్లు- ఈ దేహం ఒక వృక్షం. దీని బీజం- అజ్ఞానం, బుద్ధి-బోదె, అహంకారం-శాఖలు, ఇంద్రియాలు-తొర్రలు; పంచ మహాభూతాలు-విశేషావయవాలు; భూతాల విశేష భేదాలు-కొమ్మలు; సంకల్పాలు-ఆకులు; కర్మలు-పూలు; సుఖ దుఃఖాలు-పండ్లు; ఈ వృక్షాన్ని జ్ఞానమనే ఖడ్గంతో ఖండించేవాడు జనన మరణ విముక్తుడవుతాడు.

నాలుగు ఆశ్రమాలు- బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసం. ఇరవై నాలుగు తత్త్వాలు- అవ్యక్త ప్రకృతి, మహత్తు, అహంకారం, దశేంద్రియాలు, మనస్సు, పంచ మహాభూతాలు, పంచ విశేష గుణాలు; జీవాత్మ ఇరవై అయిదవది.

సత్త్వ, రజో, తమో గుణాలు, దేహధారుల జన్మలు, జలం-స్థలం-ఆకాశం ప్రాణులకు స్థానాలు; అండజ, ఉద్భిజ, స్వేదజ, జరాయుజాలు; తపస్సు, పుణ్య కర్మానుష్ఠానం గురించి వివరించాడు.

**ఏకధా బహుధా చైవ వికుర్వాణ స్తతస్తతః**
**ధ్రువం పశ్యతి రూపాణి దీపాద్ దీపశతం యథా** (అశ్వమేధ. 43-60)

ఒక్క దీపం నుంచి అనేక దీపాలు వెలిగినట్లు పరమాత్మ నుంచి అనేక జీవాత్మలు ప్రభవిస్తాయి.

**సర్వే క్షయాంతా నిచయాః పతనాంతాః సముచ్ఛ్రయాః**
**సంయోగాశ్చ వియోగాంతాః మరణాంతం చ జీవితమ్** (అశ్వమేధ. 44-19)

శ్రీకృష్ణుడు అనుగీతను ముగిస్తూ అర్జునుడితో అన్నాడు-

**ప్రసాదే చైవ సత్త్వస్య ప్రసాదం సమవాప్నుయాత్**
**లక్షణం హి ప్రసాదస్య యథా స్యాత్ స్వప్న దర్శనమ్** (అశ్వమేధ. 51-36)

అంతః కరణం స్వచ్ఛమైనవానికి ప్రసన్నత కలుగుతుంది. చిత్తశుద్ధి ప్రసన్నతా లక్షణం.

**సమేన సర్వ భూతేషు నిః స్పృహేణ నిరాశిషా**
**శర్యా గతిరియం గంతుః సర్వత్ర సమదర్శినా**

సర్వభూతాలపై సమభావం, లోభం, కోరిక లేకపోవడం, అంతటా సమదృష్టి గల జ్ఞాని ఉత్తమగతి పొందుతాడు.

అని పలికి శ్రీకృష్ణుడు- అర్జునుడితో కలిసి హస్తినకు వెళ్లి ధర్మరాజాదుల వద్ద సెలవు తీసుకుని సాత్యకితో ద్వారకకు బయల్దేరాడు.

## ఉత్తంకోపాఖ్యానం

శ్రీకృష్ణుడు వెళ్తుంటే అర్జునుడు పలుమార్లు శ్రీకృష్ణుని కౌగిలించుకున్నాడు. తరువాత కనిపించినంత మేర కన్నులార్పకుండా ఆయనను పలుమార్లు చూసాడు.

**పునః పునశ్చ వార్ష్ణేయం పర్యష్వజత ఫాల్గునః**
**ఆచక్షు ర్విషయాచ్చైవం స దదర్శ పునః పునః** (అశ్వమేధ. 53-2)

వారిద్దరి మైత్రి అటువంటిది. నరనారాయణులు వాళ్లు.

దారిలో ఉత్తంక మహర్షి ఆశ్రమం వద్ద ఆగి, కుశల సమాచారాలు కనుక్కున్నాడు. ఉత్తంకుడన్నాడు- "నీ ప్రయత్నం వలన కౌరవ పాండవుల మధ్య ఐక్యత కలుగుతుందని భావించాను. కాని అలా జరగలేదు. నీవు సమర్థుడివి అయికూడా మిథ్యాచారాన్ని అనుసరించి కురు వంశీయుల నాశనాన్ని అనుమతించావు. నిన్ను శపిస్తున్నాను" -అన్నాడు ఉదంకుడు.

శ్రీకృష్ణుడన్నాడు- "నన్ను శపించి నీ తపస్సు నష్టపరచుకోకు. నా జన్మ రహస్యాన్ని, విశ్వరూపాన్ని అర్థం చేసుకో!"

శ్రీకృష్ణుని విశ్వరూపాన్ని అర్థం చేసుకున్న ఉత్తంకుడు పరమాశ్చర్యాన్ని పొంది సాగిలపడి మొక్కినాడు.

**విశ్వకర్మన్ నమస్తేస్తు విశ్వాత్మన్ విశ్వసంభవ**
**పద్భ్యాంతే పృథివీ వ్యాప్తా శిరసా చావృతం నభః** (అశ్వమేధ. 55-7)

"దేవా నన్ను కరుణించు! నీ పూర్వ రూపంలోకి రా!" -అన్నాడు ఉత్తంకుడు.

కృష్ణుడు వరం కోరుకొమ్మంటే- "మరుభూములలో ప్రాణులకు ఇష్టమైన జలం ఉండేలా చూడు" -అన్నాడు ఉత్తంక ముని.

"నీకు జలం కావలసినపుడు నన్ను స్మరించు" అని శ్రీకృష్ణుడు ఆ మునిని ఆశీర్వదించి ద్వారక వేపు వెళ్లిపోయాడు.

ఉత్తంకుడు మరుభూమిలో తిరుగుతున్నపుడు దాహం వేసి శ్రీకృష్ణుని స్మరించాడు. అతడికి తనవేపు వస్తున్న చండాలుడు కనిపించాడు. ఒళ్లంతా బురదకొట్టుకుని, కుక్కల సమూహం చుట్టుముట్టి రాగా, దిగంబరుడతడు. నడుముకు ఖడ్గం, వీపుకు ధనుర్బాణాలున్నాయి, భయంకరంగా ఉన్నాడు. అతడి పాదాల కింద జలధార ఉన్నది.

ఉత్తంకుడు ఆ జలధారను స్వీకరించలేదు. శ్రీకృష్ణుడు ఉత్తంకుని మనసులో ప్రత్యక్షమై- "ఇంద్రుడు స్వయంగా అమృతం తెచ్చి ఇస్తుంటే స్వీకరించలేదు నీవు. నన్ను శపించాలనుకున్నావు. అయినా, మహర్షీ నీవు మరుభూముల్లో ఉన్నపుడు నన్ను స్మరించగానే అక్కడ గొప్ప వర్షమేఘాలు ఏర్పడి చక్కటి వర్షధారలు కురుస్తాయి. ఆ మేఘాలు ఉత్తంక మేఘాలుగా ప్రసిద్ధికెక్కుతాయి" అన్నాడు శ్రీకృష్ణుడు.

ఉత్తంకుడు గౌతమ ముని శిష్యుడు. అతడంటే గురువుకు ఇష్టం. అందుచేత ఎన్నో ఏళ్లు గురువు దగ్గరే ఉన్నాడు. ఒకరోజున అడవికి వెళ్లి ఎండుకట్టెలు నెత్తిమీద మోసి తెచ్చి మోపును కింద పడేసేసరికి దానిపై తెల్ల వెంట్రుకలు కనిపించి దుఃఖభరితుడైనాడు. అతడు వెక్కివెక్కి ఏడుస్తుంటే పడిన కన్నీళ్లను గురుపుత్రి తండ్రి ఆజ్ఞతో దోసిలిలో పట్టి ఆ వేడిని భరించలేకపోయింది.

గురువు, గురుపత్ని అహల్య అతడిని ఆశీర్వదించి నవ యువకుడిగా చేసి కన్యాదానం చేసారు. ఉదంకుడు గురుదక్షిణ ఇస్తానని పదేపదే అడగడంతో గురుపత్ని- పౌష్య మహాదేవి కుండలాల నడిగింది. పౌష్య మహాదేవి సౌదాసుడి

భార్య. అతడు వసిష్ఠుడి కుమారుడైన శక్తి శాపంతో రాక్షసుడై కల్మాషపాదుడిగా నరమాంస భక్షకుడై ఉన్నాడు. మరల వచ్చి ఆహారాన్నవుతానని రాక్షసుడికి మాట ఇచ్చి పౌష్య మహాదేవి దయతో ఇచ్చిన కుండలాలను తీసుకుని వస్తూ దారిలో ఉదంకుడు కుండలాలను మారేడు చెట్టుకొమ్మకు కట్టి కాయలు కొడుతుంటే కుండలాల మూట కిందపడింది. అవకాశం కోసం ఎదురుచూస్తున్న నాగరాజు తక్షకుడు కుండలాలను ఎత్తుకుపోయాడు. అతడిని వెంటాడి ఇంద్రుడు వజ్రాయుధపు శక్తిని కర్రలో ప్రవేశపెట్టగా దానితో తవ్వుకుంటూ నాగలోకం చేరాడు.

అద్భుతమైన ఆ నాగలోకంలో తక్షకుడినెలా పట్టుకోవాలో తెలీక దుఃఖిస్తున్నపుడు అగ్ని అశ్వరూపంలో వచ్చి తన వెనుక భాగంలో గాలి ఊదమన్నాడు. అలా ఊదగానే గుర్రపు రోమాల నుండి ముక్కు నుండి ఇతర రంధ్రాల నుండి అగ్నిజ్వాలలు, పొగలు రాగా తక్షకుడు భయపడి ఉదంకుడికి కుండలాలనిచ్చాడు.

అదే గుర్రంపై ఉదంకుడు గౌతముడి ఆశ్రమానికి చేరుకున్నాక అగ్నిఅశ్వం అదృశ్యమైంది. గౌతమముని భార్య కుండలాలు ధరించి తన వ్రతం పూర్తి చేసుకున్నది. వాటిని మరల తీసుకువెళ్లి పౌష్య మహాదేవికి అప్పగించి సౌదాసుడనే కల్మాషపాదుడి వద్దకు వెళ్లాడు ఉత్తంకుడు. గౌతముడి, ఉత్తంకుడి తపో ప్రభావంతో, వసిష్ఠుని అనుగ్రహంతో శాప విముక్తుడైనాడు సౌదాసుడు.

## శ్రీకృష్ణుని ద్వారకా ప్రవేశం

సాత్యకితో కలిసి శ్రీకృష్ణుడు ద్వారకా నగరానికి చేరుకున్నాడు. భోజులు, అంధకులు, వృష్ణులు అందరూ ఎంతో సంతోషంగా అతడిని స్వాగతించారు.

అందరి సమక్షంలో వసుదేవుడి కోరికపై శ్రీకృష్ణుడు మహాభారత యుద్ధాన్ని సంక్షిప్తంగా వర్ణించి చెప్పాడు. చివర్లో అభిమన్యుడి మృతిని గురించి చెప్పగా అందరూ శోకభరితులయ్యారు.

## హస్తినలో ధర్మరాజు అశ్వమేధ యాగం గురించి ఆలోచించుట

హిమవత్పర్వత ప్రాంతానికి వెళ్లి శంకరుని ప్రార్థించి మరుత్తుడి నిధిని తెచ్చి అశ్వమేధ యాగం చెయ్యాలని ధర్మరాజు నిశ్చయించాడు.

**కృత్వాతు పాండవాః సర్వే రత్నాపహరణ నిశ్చయమ్**
**సేనామాజ్ఞాపయా మాసుః నక్షత్రే హని చ ధ్రువే** (అశ్వమేధ. 63-18)

ఉత్తర, ఉత్తరాషాడ, ఉత్తరాభాద్ర, రోహిణీ నక్షత్రాలు ధ్రువ సంజ్ఞకాలు, ఆ ఆదివారాన్ని ధ్రువం అంటారు. ఉత్తర-ఆదివారం కలిసిన దినం అమృతసిద్ధి యోగం. పాండవులు ఆరోజున ప్రయాణం మొదలుబెట్టారు.

## ద్రవ్యానయనోపక్రమం

మరుత్తుని నిధి ఉన్న చోటుకు చేరుకుని శంకరునికి పూజ చేసారు. రుద్ర గణాలను, కుబేరుని అర్చించారు. శుభ ముహూర్తాన నిధులకై తవ్వించారు. దొరికిన నిధులను అరవై వేల ఒంటెలు, కోటి ఇరవై లక్షల గుర్రాలు, లక్ష ఏనుగులు, లక్ష రథాలు, లక్ష బండ్లు, లక్ష ఆడ ఏనుగులు, అసంఖ్యాకమైన గాడిదలు, మనుషులు - 16,08,24,000 బారువుల బంగారాన్ని మోసుకుని రాగా హస్తినకు బయల్దేరారు. (8 బారువులు = 77 కిలోగ్రాములు (170 పౌండ్లు).

## పరీక్షిత్తు జన్మించుట

అశ్వమేధ యజ్ఞ సమయం సమీపించడంతో శ్రీకృష్ణుడు, ప్రద్యుమ్నుడు, సాత్యకి, చారుదేష్ణుడు, సాంబుడు, గదుడు, కృతవర్మ, నిశరుడు, ఉత్మకుడు, బలరాముడు, సుభద్ర హస్తినకు వచ్చారు. వారు వచ్చిన కొద్దిరోజులకే ఉత్తరకు పరీక్షిత్తు పుట్టాడు. అశ్వత్థామ బ్రహ్మాస్త్ర ప్రభావంతో మృత శిశువుగా జన్మించాడు. మొదట వినబడిన హర్షధ్వానాలు, మరు నిముషంలోనే హాహాకారాలుగా మారాయి. అంతఃపురం శోకసముద్రమైంది.

శ్రీకృష్ణుడు, సాత్యకి వేగంగా అటు వెళ్లారు. కుంతీదేవి, ద్రౌపది, సుభద్ర రోదిస్తున్నారు. కుంతీదేవి అన్నది- "నీ మేనల్లుడు అభిమన్యుని కొడుకు మృతశిశువై పుట్టాడు. వీడిని బ్రతికించు!

**యదుప్రవీర యోయంతే స్వస్త్రీయ స్యాత్మ జః ప్రభో**
**అశ్వత్థామ్నా హతో జాతః తముజ్జీవయ కేశవ** (అశ్వమేధ. 66-16)

ప్రభూ, ఈ మృత శిశువును బ్రదికించు!"

సుభద్ర దుఃఖిస్తూ అన్నది- "అన్నా వీడిని బ్రతికించు.

**సంజీవ యైనం దుర్ధర్షమృతం త్వమభిమన్యుజమ్**
**సదృశాక్షసుతం వీర సస్యం వర్షన్నివాంబుదః** (అశ్వమేధ. 67-15)

ఎండిన పైరును వర్షం రక్షించినట్లు అన్నా, నీ మేనల్లుడి పుత్రుడిని రక్షించి మన వంశాన్ని నిలబెట్టు"

ఉత్తర విలపిస్తూ అన్నది- "నా పిల్లవాడిని ఒడిలో పెట్టుకుని నీకు నమస్కరిద్దామనుకునే దాన్ని నా భర్తతో వచ్చి. యుద్ధంలో అతడు వెళ్ళిపోయాడు. గర్భంలో పెరిగి ఇతడు వెళ్ళిపోయాడు.

**వార్‌ష్ణేయ మధుహన్ వీర శిరసా త్వాం ప్రసాదయే**
**ద్రోణపుత్రా స్త్ర నిర్దగ్ధం జీవయైనం మమాత్మజమ్** (అశ్వమేధ. 68-13)

అశ్వత్థామ అస్త్రంతో దగ్ధుడైన నా పుత్రుని బ్రదికించు".

శ్రీకృష్ణుడన్నాడు- "బ్రతికిస్తానమ్మా, నా మేనల్లుడి పుత్రుడిని పాండవ, పాంచాల, యదు వంశాల కీర్తిని నిలబెట్టేవాడిని. పుత్రా! జీవించు" అంటూ బ్రహ్మాస్త్ర ప్రభావాన్ని ఉపసంహరింపజేసాడు శ్రీకృష్ణుడు.

**యథా సత్యం చ ధర్మశ్చ మయి నిత్యం ప్రతిష్ఠితౌ**
**తథా మృతః శిశురయం జీవతాదభిమన్యుజః** (అశ్వమేధ. 69-22)

నెమ్మదిగా ఆ బాలునిలో చేతన కలిగింది. అంతఃపురం ఆనందంతో వెలిగిపోయింది. హస్తినాపురం హర్షధ్వానాలతో పొంగిపోయింది.

**పరిక్షీణే కులే యస్మాత్ జాతోయ మభిమన్యు జః**
**పరీక్షిదితి నామాస్య భవిత్విత్య బ్రవీత్ తథా** (అశ్వమేధ. 70-11)

కౌరవ వంశం క్షీణిస్తుంటే ఈ అభిమన్యుని కుమారుడు జన్మించాడు గనుక ఈ పిల్లవానికి 'పరీక్షిత్తు' అనే పేరు కలుగుతుందని శ్రీకృష్ణుడు నామకరణం చేసాడు.

పరీక్షిత్తు పుట్టిన నెలరోజులకు పాండవులు సమృద్ధిగా రత్నాలు, బంగారం తీసుకుని హస్తినాపురానికి వచ్చారు.

వ్యాస శ్రీకృష్ణులు ధర్మరాజును అశ్వమేధ యాగం చేయమని అనుమతి ఇచ్చారు. చైత్ర పూర్ణిమ నాడు యజ్ఞదీక్ష ప్రారంభమవుతుంది. యజ్ఞ సామాగ్రిని సిద్ధం చేసారు.

యజ్ఞాశ్వాన్ని రక్షించే బాధ్యత అర్జునుడికప్పగించారు. వ్యాస మహర్షి స్వయంగా అశ్వాన్ని శాస్త్ర విధిననుసరించి వదిలాడు. అశ్వం మొదట ఉత్తర దిక్కుకు వెళ్ళింది.

**స హి వీరః ప్రయాస్యన్ వై ధర్మరాజేన వారితః**
**హ త బాంధవా న తే పార్థ హంతవ్యాః పార్థివా ఇతి** (అశ్వమేధ. 74-7)

బంధువులు మరణించి ఉన్నవారిని చంపవద్దు- అని ధర్మరాజు చెప్పడంతో అర్జునుడు తన నెదిరించిన వారిని మంచిమాటలతో యుద్ధానికి రాకుండా వారిస్తున్నాడు.

త్రిగర్తులు వెనుదిరగలేదు. దానితో కేతువర్మ లాంటి యోధులు పదునెనిమిది మంది అర్జునుని బాణాలకు నేలకూలారు. పారిపోయిన వారు కొందరు. శరణు కోరినవారు కొందరు; త్రిగర్తులు లొంగిపోయారు.

భగదత్తుని పుత్రుడు వజ్రదత్తుడు ఏనుగునెక్కి వచ్చి అర్జునుడితో యుద్ధం చేసి ఓడిపోయాడు. అతడికి ఆహ్వాన పత్రికను ఇచ్చి అర్జునుడు సింధుదేశానికి వెళ్ళాడు. సౌంధవులతడిని అడ్డగించారు. అర్జునుడు వారినందరిని ఓడించాడు.

సైంధవుడి భార్య దుశ్శల తన మనవడిని తీసుకుని అర్జునుడి శరణువేడి అన్నది– “నీవు యుద్ధానికి వచ్చావని వినగానే నా కుమారుడు సురథుడు మరణించాడు. అన్నా! నీవే శరణు. కాపాడు!”

అర్జునుడన్నాడు– “అమ్మా! నీవు మా సోదరివి. యుద్ధానికి రాలేదు నేను! అశ్వమేధ యాగానికి రా! తల్లీ!”

## అర్జున - బభ్రువాహన యుద్ధం

మణిపురాధిపతి, తన కుమారుడు బభ్రువాహనుడు తనను ఎంతో ఆదరంగా ఆహ్వానిస్తే అంగీకరించలేదు అర్జునుడు. ఇద్దరి మధ్యా గొప్ప యుద్ధం జరిగింది. తన కుమారుడి యుద్ధ కౌశల్యాన్ని చూసి గర్వపడుతూనే యుద్ధం చేసాడు అర్జునుడు. పోరు ఘోరమై మామూలు బాణాల స్థాయి నుంచి దివ్యాస్త్రాల పోరుకు చేరింది. బభ్రువాహనుని బాణపు దెబ్బకు అర్జునుడు నేలకూలినాడు. అర్జునుడి బాణాలకు తీవ్రగాయాలైన బభ్రువాహనుడు మూర్ఛపోయినాడు.

చిత్రాంగదకు ఈ విషయం తెలిసి శోకిస్తూ యుద్ధభూమికి వెళ్లింది, నాగకన్య ఉలూపితో కలిసి. ఈలోగా బభ్రువాహనుడు మూర్ఛ నుంచి లేచి తండ్రి మృతుడై పడి ఉండడం చూసి తీవ్ర మనస్తాపానికి గురైనాడు.

నాగకన్య ఉలూపి అన్నది– “బభ్రువాహనా! అర్జునుడు చనిపోలేదు. చిత్రాంగదా ఊరడిల్లు. కుమారా! ఈ నాగమణిని అర్జునుడి హృదయంపై ఉంచు”.

నాగమణి ప్రభావంతో అర్జునుడు నిద్రనుంచి లేచినట్లు లేచాడు. ఉలూపి అన్నది– “భీష్ముడిని శిఖండిని అడ్డుపెట్టుకుని అర్జునుడు చంపినందుకు వసువులు కోపంగా ఉన్నారు. వారిని శాంతింపచేయగా– పుత్రుడి చేతిలో నేలకూలితే అర్జునుడికి మా శాపమంటదు. మరల బ్రతుకుతాడు –అన్నారు. ‘ఆత్మా పుత్ర వైనామసి’ అర్జునా! నీవు నీచేత ఓడిపోయావు”

అర్జునుడన్నాడు– “ఉలూచి! మన కొడుకు ఇరావంతుడినే యుద్ధరంగంలో అర్పించిన వీరమాతవు. నీవేది చేసినా అది మా మంచికే!”

ఇద్దరు వీరమాతలు, వీరపుత్రుని వద్ద అనుమతి తీసుకుని అర్జునుడు యాగాశ్వాన్ని తీసుకుని మగధ వేపు ప్రయాణం సాగించాడు. జరాసంధుని మనమడు, సహదేవుని కుమారుడు మేఘసంధి క్షత్రియ భావంతో యాగాశ్వాన్ని అడ్డగించి యుద్ధం చేసి పరాజితుడై అర్జునుడికి లొంగిపోయాడు. అతడికి ఆహ్వానమందించాడు అర్జునుడు.

అశ్వమేధాశ్వం వంగ, పుండ్ర, కోసల దేశాలకు వెళ్లింది. అక్కడ నుంచి దక్షిణ దిక్కుగా చేది దేశంలోని శుక్తిమతి (మాహిష్మతి) పట్టణాన్ని చేరింది. శిశుపాలుని కుమారుడు శరభుడు క్షత్రియ ధర్మంగా యుద్ధం చేసి ఆ తరువాత యాగాశ్వాన్ని పూజించాడు. ఆ తరువాత కాశి, అంగ, కిరాత, తంగణ, చిత్రాంగదుడు పాలించే దశార్ణ దేశాన్ని, ఏకలవ్యుని పుత్రుడు పాలిస్తున్న నిషాద దేశాన్ని, ద్రవిడ, ఆంధ్ర, రౌద్ర, మాహిషక, కోలాచల రాజులను జయించి సురాష్ట్ర, గోకర్ణ, ప్రభాస ప్రాంతాలను దాటి ద్వారక చేరి, అక్కడి నుంచి గాంధార దేశం వెళ్లాడు. అక్కడ శకుని కుమారుడు అర్జునుడితో యుద్ధం చేసి అనేకమంది వీరులను కోల్పోయాడు. శకుని భార్య తన కుమారునికి నచ్చచెప్పి యుద్ధం ఆపింది. వారికి ఆహ్వానమిచ్చి అర్జునుడు హస్తినాపురం వేపు బయల్దేరాడు. మాఘ పూర్ణిమ నాటికి హస్తినకు చేరింది యజ్ఞాశ్వం. చైత్ర పూర్ణిమ నాడు అశ్వమేధ యాగం ప్రారంభం కానున్నది.

యుధిష్ఠిరుడన్నాడు శ్రీకృష్ణునితో– “అందరికన్నా అర్జునుడు ఎక్కువ కష్టాలు పడుతున్నాడు. అతడి శరీరంలో అనిష్టకరమైన లక్షణమేదైనా ఉన్నదా?”

**సతాభ్యాం పురుషవ్యాఘ్రే నిత్య మధ్వ సువర్తతే**
**ఋతే పురుష సింహస్య పిండికే స్యాధికే యతః** (అశ్వమేధ. 87–8)

“అతడి పిక్కలు లావుగా ఉంటాయి. అందుకే కష్టాలు పడుతున్నాడు”. ఆ మాటలు విని ద్రౌపది కృష్ణుడి వేపు ఈర్ష్యగా చూసింది. నిజానికి కృష్ణుడు అర్జునుడు ఒకే రూపులో ఉంటారు.

ఇంతలో అర్జునుడు హస్తినకు వచ్చాడన్న వార్త రావడంతో అందరూ వెళ్లి అతడికి స్వాగతం పలికారు.

అదే సమయంలో బభ్రువాహనుడు తన తల్లులు చిత్రాంగద, నాగకన్య ఉలూచితో వచ్చి అందరి ఆదరాభిమానాలకు నోచుకున్నాడు.

వ్యాసుడన్నాడు– "నీవు జ్ఞాతులను వధించడం వలన వచ్చిన పాపాన్ని పోగొట్టుకుంటావు".

**పవిత్రం పరమం చైతత్పావనం చైతదుత్తమమ్**
**యదాశ్వమేధావభృథం ప్రాప్స్యసే కురునందన** (అశ్వమేధ. 88–16)

అశ్వమేధ యాగం మహాద్భుతంగా, నిర్విఘ్నంగా, భూమండలంలోని రాజులందరి సమక్షంలో, మహర్షుల ఆశీస్సులతో నిర్విఘ్నంగా జరిగింది. బ్రాహ్మణులకు వేయికోట్ల బంగారు నాణేలను, వ్యాసుడికి భూమండలాన్ని సమర్పించాడు ధర్మరాజు.

వ్యాసుడన్నాడు– "ఈ భూమిని నీవు తీసుకుని వీరందరికి బంగారమివ్వు". యుధిష్ఠిరుడట్లాగే చేసాడు. మామూలు కన్నా మూడురెట్లు అధికంగా దానాలు చేసాడు.

**న కరిష్యతి తల్లోకే కశ్చిదన్యో నరాధిపః**
**యత్కృతం కురురాజేన మరుత్తస్యాను కుర్వతా** (అశ్వమేధ. 89–20)

మరుత్తుడిని అనుకరిస్తూ యుధిష్ఠిరుడు చేసినంత గొప్పగా యజ్ఞం, మహాదానం ఈ లోకంలో ఇంకే రాజు చెయ్యలేదు అనుకున్నారు అక్కడకు వచ్చినవాళ్లు.

## నకులోపాఖ్యానం

మహాయాగం సంతృప్తికరంగా పూర్తయ్యింది. అయితే ముగింపు సందర్భంలో యజ్ఞవాటికలోకి నల్లని కనులు కలిగి శరీరంలో ఒకవేపు బంగారమైన ముంగిస వచ్చి ఉరుములా గర్జించి మానవభాషలో అన్నది–

**సక్తుప్రస్థేన వో నాయం యజ్ఞ స్తుల్యో నరాధిపాః**
**ఉంఛ వృత్తేర్వ దాన్యస్య కురుక్షేత్ర నివాసినః** (అశ్వమేధ. 90–7)

"కురుక్షేత్రంలో ఉంఛవృత్తి చేస్తూ ఉండే సక్తుప్రస్థుని దానంతో మీ యజ్ఞం సమానం కాదు" –అన్నది ముంగిస.

సక్తుప్రస్థుడు ఉంఛవృత్తితో– పొలాల్లో పడిన ధాన్యపు గింజలను పావురంలా ఏరి తీసుకుని వచ్చి తన కుటుంబాన్ని పోషించేవాడు. కొన్నాళ్లక్రితం కరువు కాలం రాగా మూడు రోజులకోసారి భోజనం చేయడం కూడా కష్టమైంది.

ఒకరోజున అతడికి సేరు ధాన్యం లభించింది. దానిని పిండి చేసి కుటుంబంలోని నలుగురూ పంచుకున్నారు. ఆకలితో నకనకలాడుతూ తినడానికి సిద్ధమౌతున్నపుడు ఓ అతిథి వచ్చాడు. అతడిని పూజించి సక్తుప్రస్థుడు తన వంతు పిండిని పెట్టాడు. అది తిని అతిథి ఇంకా ఆకలి తీరలేదన్నాడు. అప్పుడు అతడి భార్య తనవంతు పిండిని అతిథికి ఇచ్చింది. ఆ తరువాత కొడుకు తన భాగం ఇచ్చాడు. ఆఖరున కోడలు కూడా తన భాగాన్ని అతిథికి ఇచ్చింది.

అతిథి సంతోషించి అన్నాడు– నేను ధర్మదేవతను. నీవు న్యాయంగా సంపాదించి, యథాశక్తిగా చేసిన ఈ పవిత్ర దానం అత్యంత శ్రేష్ఠమైనది. మీరు నలుగురు దేవయానానికి స్వర్గానికి అర్హులు –అని ఆశీర్వదించి అంతర్థానమైనాడు. వారు నలుగురూ దివ్యవిమానంలో స్వర్గానికి వెళ్లారు.

వారింటి కలుగులో ఉన్న నేను అదంతా చూసాను. ఆ సత్తుపిండి గాలికి ఎగిరి నా మెడమీద, శరీరంపై కుడివేపు పడగా ఆ భాగమంతా బంగారుమయమయ్యింది. ఆ తరువాత నేను అనేక యజ్ఞవాటికలకు వెళ్లి యజ్ఞ జలాలతో నా శరీరం రెండవవేపు కూడా బంగరుమయమవుతుందేమోనని తిరిగాను. ఇక్కడ యజ్ఞవాటికలో కూడా తచ్చాడాను. కాని, నా ఎడమవేపు బంగారంగా మారలేదు. అందుకే నేను సక్తుప్రస్థుడి శేరు సత్తుపిండి దానంతో ఈ అశ్వమేధయాగంలోని మహాదానాలు సమానం కావు అన్నాను" అన్నది ముంగిస.

**అద్రోహః సర్వభూతేషు సంతోషః శీలమార్జవమ్**
**తపో దమశ్చ సత్యం చ ప్రదానం చేతి సమ్మితమ్** (అశ్వమేధ. 90–119)

ఆ ముంగిస ఎవరో కాదు ధర్ముడే. జమదగ్ని పితృశ్రాద్ధం కోసం సిద్ధం చేసిన పాలకుండను తొలగదోసాడు ధర్ముడు ముంగిస రూపంలో. భృగువంశస్థులు సహజంగా కోప స్వభావులు. కాని జమదగ్ని సహనం కలవాడు. అతడిని పరీక్షించి ధర్ముడు ఓడిపోయాడు. పితృదేవతలు అతడిని ముంగిసగా ఉండమని, యుధిష్ఠిరుడి యజ్ఞాన్ని ఆక్షేపించినపుడు శాప విముక్తి కలుగుతుందన్నారు.

తన కుమారుడు ధర్మరాజు చేసిన యాగాన్నే ఆక్షేపించి ధర్ముడు ముంగిస రూపం నుంచి విముక్తుడైనాడు.

యజ్ఞంలో హింస వద్దని ఋషులు, మహర్షులు, చేయవచ్చని దేవతలు అభిప్రాయబడినారు. వసువు 'అజ'-ధాన్యం అనే పదాన్ని 'మేక'గా చెబుతూ యజ్ఞాల్లో హింస చేయడానికి అవకాశం కల్పించాడు. అందువలన అతడు రసాతలానికి నెట్టివేయబడి తరువాత పుణ్యఫలంతో భూమిపై విహరిస్తూ ఉపరిచర వసువైనాడు. ఉపరిచర వసువు-గిరికల కుమారుడు మత్స్యరాజు, కుమార్తె మత్స్యగంధి (సత్యవతి). సత్యవతి పరాశరుల కుమారుడు వ్యాసుడు. సత్యవతీ-శంతనుల కుమారులు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు. విచిత్రవీర్యుని భార్యలు అంబిక, అంబాలిక – వీరికి వ్యాసుడి వలన కలిగినవారు ధృతరాష్ట్రుడు, పాండురాజు. ధృతరాష్ట్రుడి సంతానం కౌరవులు, పాండురాజు సంతానం పాండవులు. ఈ మహాభారతం వీరి కథ.

అగస్త్యుడు కూడా పన్నెండు సంవత్సరాల యజ్ఞం చేస్తున్నపుడు ఇంద్రుడు వర్షాలు కురిపించలేదు. తరువాత అగస్త్యుడి తపోబలాన్ని గ్రహించి కోరినంత వర్షాన్ని కురిపించాడు.

అశ్వమేధ యాగం గొప్పగా జరిగింది. శ్రీకృష్ణుడన్నాడు ధర్మరాజుతో- ప్రతి విషయాన్నీ ఎవరో ఒకరు ఆక్షేపిస్తూనే ఉంటారు. దాని గురించి ఆలోచించరాదు. ధర్మాచరణ అత్యంత క్లిష్టమైన వ్యవహారం.

**ధర్మాదర్థశ్చ కామశ్చ ధర్మాద్ భోగాః సుఖానిచ**
**ధర్మా దైశ్వర్య మే వ్యాగ్ర్యం ధర్మాత్ స్వర్గ గతిః పరా** (అశ్వమేధ. 92- )

ధర్మాచరణం చేతనే ఉత్తమ స్వర్గం లభిస్తుంది.

శ్రీకృష్ణుడు చతుర్వర్ణముల కర్మ ఫలితాలను, ధర్మవృద్ధికి, పాపక్షయానికి ఉపాయాలు, దాన ధర్మాలు, గాయత్రీ జపం, పాపపుణ్యాలు, యమలోకం, జలాన్నదానములు, అతిథి సత్కారాలు, భూదాన, తిలదానాలు, దాన మహిమలు, పంచ మహా యజ్ఞములు (తర్పణం- ఋషియజ్ఞం, స్వాధ్యాయం-బ్రహ్మయజ్ఞం; అన్నదానం-భూతయజ్ఞం; అతిథి సత్కారం-నృయజ్ఞం; శ్రాద్ధాదులు-పితృయజ్ఞం), దేవతల కొరకు చేసే హోమం- హుతం; దానం ఇచ్చిన వస్తువు ఆహుతం; బ్రాహ్మణ భోజనం-ప్రహుతం; ప్రాణాలకు హోమంలో అర్పించిన గ్రాసాలు- ప్రాశితం; గోవులకు ఇచ్చే ఆహారం- బలిదానం (ఇవి పాకయజ్ఞాలు)., కపిల గోదాన మహాత్మ్యములు, నరక స్వర్గ ప్రాపకాలు, ధర్మశౌచ లక్షణములు, భోజన విధులు, ఆపద్ధర్మాలు, అగ్నిహోత్ర విధులు, చాంద్రాయణ వ్రత విధులు, ద్వాదశీ వ్రత మహాత్మ్యము, విషువయోగ సమయంలో గ్రహణ సమయంలో దానములు, దాన మహిమలు; ఆశ్వత్థ మహిమ, భగవద్భకులు, గోపిప్పల వృక్ష మహిమలు -ఇవన్నీ వివరించాడు యుధిష్ఠిరునికి శ్రీకృష్ణ పరమాత్మ.

ఇది వైష్ణవ ధర్మపర్వంగా పేరుపొందింది.

**యుధిష్ఠిరస్తు ధర్మాత్మా హృదికృత్వా జనార్ధనమ్**
**తద్ భక్త స్తన్మనా యుక్తః తద్యాజీ తత్పరో భవత్** (అశ్వమేధ. 92- )

ధర్మాత్ముడైన ధర్మరాజు శ్రీకృష్ణుని తన హృదయంలో నిలుపుకుని పూజించినాడు. మానసిక శాంతిని పొందినాడు.

❖❖❖❖❖

# ✣ 15. ఆశ్రమవాసిక పర్వము ✣


1) ఆశ్రమవాస పర్వము (28)

2) పుత్రదర్శన పర్వము (8)

3) నారదాగమన పర్వము (3)


## 1) ఆశ్రమవాస పర్వము

ధృతరాష్ట్రుని ముందుంచుకుని ధర్మరాజు రాజ్యపాలన ఎంతో సమర్థవంతంగా పదిహేను సంవత్సరాలు చేసాడు. కుంతి, ద్రౌపది, సుభద్ర ఇతర స్త్రీలు గాంధారిని ఎంతో గౌరవభావంతో చూసేవారు.

విదురుడు, సంజయుడు, యుయుత్సుడు, కృపుడు, వ్యాసుడు ధృతరాష్ట్రునికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేవారు. ఆరాలికులు (ఆకుకూరలు వండేవారు), సూపకారులు (పప్పుకూరలు చేసేవారు), రాగ ఖాండవికులు (పానీయాలు చేసేవారు) ధృతరాష్ట్రుని సేవకై ఉండేవారు.

కౌరవులు బ్రతికి ఉన్నపుడు ధృతరాష్ట్రుడు ఎటువంటి భోగాలనుభవించాడో అటువంటి సుఖాలన్నీ అందుబాటులో ఉండేట్లు చూసాడు ధర్మరాజు. పాండవ సోదరులు అన్నను అనుసరించేవారు.

భీముడు మాత్రం ధృతరాష్ట్ర కౌగిలిని మరచిపోలేదు. అవకాశం దొరికినప్పుడల్లా అవమానించాలని చూసేవాడు. పైకి కనిపించని అప్రియాలు చేసేవాడు.

**అంధస్య నృపతేః పుత్రాః మయా పరిఘ బాహునా**
**నీతా లోకమముం సర్వే నానా శస్త్రాస్త్ర యోధినః** (ఆశ్రమవాస. 3-7)

గ్రుడ్డివాడి కొడుకుల్ని ఈ భుజాలతోనే గుద్దిగుద్ది చంపాను -ఇట్లా అంటూ ఉండేవాడు భీముడు. ఆ మాటలు ధృతరాష్ట్రునికి, గాంధారికి హృదయ శల్యాలై గుచ్చుకునేవి. చూస్తుండగానే పదిహేనేళ్లు గడచిపోయాయి. ఒకరోజున ధృతరాష్ట్రుడు ధర్మరాజును పిలిచి తన మిత్రులున్నపుడు అన్నాడు-

**ఉచితం నః కులే తాత సర్వేషాం భరతర్షభ**
**పుత్రే ష్వైశ్వర్య మాధాయ వయసోంతే వనం నృప** (ఆశ్రమవాస. 3-38)

నాయనా, ధర్మరాజా! కొన్నాళ్లు వానప్రస్థ జీవితం గడపాలని నిశ్చయించుకున్నాను, అనుమతివ్వు.-

ధర్మజుడన్నాడు- వద్దు తండ్రీ, ఇక్కడే ఉండిపో!

**నాహం రాజా భవాన్ రాజా భవతః పరవానహమ్**
**కథం గురుం త్వాం ధర్మజ్ఞమ్ అనుజ్ఞాతు మిహోత్సహే** (ఆశ్రమవాస. 3-49)

నేను రాజును కాదు, నీవే రాజువు. నిన్ను వానప్రస్థానికెలా అనుమతించగలను?

వ్యాసుడన్నాడు- ధృతరాష్ట్రుడి కోరిక యుక్తియుక్తమే. ఇది ప్రాచీన రాజర్షుల బాట. అనుమతివ్వు.

గాంధారి అన్నది- కుమారా! అనుమతివ్వు.

ధర్మరాజు అనుమతి ఇచ్చాడు. ధృతరాష్ట్రుని కోరికపై ప్రజల సమావేశం ఏర్పాటు చేయగా ధృతరాష్ట్రుడు ప్రజల అనుమతిని కోరినాడు తాను వానప్రస్థానికి వెళ్లడానికి. ప్రజల తరపున 'సాంబుడు' మాట్లాడినాడు- ధర్మజుడు నీ పేరుమీద పాలన చేస్తున్నాడు. మేమంతా సుఖంగా ఉన్నాము. గతం గడచిపోయింది.

**దైవంతత్ తు విజానీమః యన్నశక్యం ప్రబాధితుమ్**
**దైవం పురుష కారేణ న శక్యమపి బాధితమ్** (ఆశ్రమవాస. 10-28)

పురుష ప్రయత్నంతో దైవ ఘటనను తప్పించలేము. యుధిష్ఠిరుని విషయమై నీ మనస్సులోని దుఃఖాన్ని తొలగించుకుని ధర్మబద్ధ కార్యాలను అనుష్ఠించు. మేము నిన్ను వానప్రస్థానికి అనుమతిస్తున్నాము.

ప్రజలు ధృతరాష్ట్రుని ఆశీర్వదించి వెళ్లిపోయారు.

రాబోయే కార్తీక పూర్ణిమ నాడు వనవాసానికి వెళ్లాలని నిశ్చయించుకుని ధృతరాష్ట్రుడు తన వాళ్లకు శ్రాద్ధం పెట్ట నిశ్చయించుకుని విదురుని ద్వారా ధర్మరాజుకు కబురు పంపాడు.

భీముడు తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు– కొడుకులు బ్రతికున్నపుడు మనల్ని లక్కఇంటిలో కాల్చి మనం చచ్చామని శ్రాద్ధాలు పెట్టారు వీళ్లు. వనవాసం మనల్ని పంపి సుఖంగా బ్రతికారు వీళ్లు. ఇప్పుడు వనవాసం పోతాను, నావాళ్లకు శ్రాద్ధం పెడతా ధనం కావాలంటాడు, ప్రజల్ని సమావేశపరచాడు గొప్ప బుద్ధితో.

ఈ ధర్మజులైన సోదరులకు అదంతా ధర్మమేననిపిస్తుంది. మనం వనవాసంలో నానా కష్టాలు పడుతుంటే ఈ మహానుభావుడు మనల్ని పెదనాన్నలా చూసాడా? –అన్నాడు క్రోధంతో భీముడు.

యుధిష్ఠిరుడు 'ఊరుకో!' అని గదమాయించాడు భీముడిని. అర్జునుడు భీముడిని శాంతపరచాడు. ఎంత ధనం కావాలన్నా తన ఇంటినుంచి తీసుకొమ్మన్నాడు.

అదే విషయాన్ని విదురుడు వివరించాడు ధృతరాష్ట్రుడికి. మృతులందరికీ పేరుపేరున శ్రాద్ధాలు, దానాలు చేసారు. ఆ విధంగా ధృతరాష్ట్రుడు పుత్ర పౌత్రుల ఋణం తీర్చుకున్నాడు.

## గాంధారీ ధృతరాష్ట్రుల వనగమనం

అందరి రోదనలు, దుఃఖ ప్రకటనల మధ్య గాంధారి, ధృతరాష్ట్రులు వానప్రస్థానికి బయల్దేరారు. విదురుడు, సంజయుడు వారిననుసరించారు. ధృతరాష్ట్రుడు కృపాచార్యుడిని, యుయుత్సుడిని ధర్మరాజుకు అప్పగించాడు.

వర్ధమాన ద్వారం గుండా హస్తినాపురపు బయటకు వచ్చారు. అప్పుడు కుంతీదేవి సహదేవుడిని ధర్మరాజుకు అప్పజెప్పి ధర్మరాజుతో అన్నది– నాయనా! ఇతడిని జాగ్రత్తగా రక్షించు. నీ అన్న కర్ణుడిని మరచిపోకు. నేను గాంధారితో కలిసి తాపసినై శేషజీవితాన్ని గడుపుతాను.

పాండవులు హతాశులయ్యారు. ఎన్ని విధాలుగా నచ్చచెప్పినా కుంతీదేవి తన పట్టు వీడలేదు.

**–నాహం రాజ్యఫలం పుత్రాః కామయే పుత్ర నిర్జితమ్**
**పతిలోకానహం పుణ్యాన్ కామయే తపసా విభో–**

పుత్రులు గెలిచిన రాజ్యఫలాన్ని నేను కోరడం లేదు. నా తపస్సుతో సాధించే పుణ్య ప్రదాలైన భర్తృలోకాలను కోరుకుంటున్నాను అన్నది కుంతీదేవి.

ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, విదురుడు, సంజయుడు గంగా తీరాన్ని చేరి ఆ రాత్రి అక్కడ విడిది చేసారు.

## శతయూపాశ్రమం

గంగాతీరం నుంచి కురుక్షేత్రానికి చేరి అక్కడ శతయూపాశ్రమం దగ్గర నివసించసాగినారు. ఆ శతయూపుడు ఒకప్పుడు కేకయ దేశ రాజు.

నారదుడు ఒకనాడు శతయూపుడితో అన్నాడు– ధృతరాష్ట్రుడు కేవలం మూడు సంవత్సరాలు వానప్రస్థాశ్రమంలో ఉంటాడు.

**తత్రాహ మిదమశ్రౌషం శక్రస్య వదతః స్వయమ్**
**వర్షాణి త్రీణి శిష్టాని రాజ్ఞో స్య పరమాయుషః** (ఆశ్రమవాస. 20–32)

ధృతరాష్ట్రుని శరీరంలోని మాంసం ఎండిపోయింది. జటాజినాలను ధరించి, నారచీరలతో దేహాన్ని కప్పుకుని మోహాన్ని విడనాడి తపస్సు చేయసాగినాడు. విదురుడు, సంజయుడు కూడా గొప్ప తపస్సు చేస్తున్నారు.

ఆ కురుక్షేత్ర ప్రాంతంలో తపోదీక్షాపరులైన మునులెందరో గొప్ప తపస్సు చేసారు. శతయూపుని పితామహుడు సహస్రచిత్యుడు, భగదత్తుని పితామహుడు శైలాలయుడు, పృషధ్రుడు, పురుకుత్సుడు, శశలోముడు లాంటి రాజర్షులు ఈ ప్రాంతంలోనే తపస్సు చేసారు.

కొన్నాళ్ల తరువాత ధర్మరాజాదులు తమ రాణులతో కలిసి శతయూపాశ్రమానికి వచ్చారు. నగరం వెలుపల అయిదు రోజులు గడిపి యమునను దాటి కురుక్షేత్రంలో ప్రవేశించారు. యమునా నదికి స్నానానికి వెళ్లి వస్తున్న ధృతరాష్ట్ర, గాంధారి, కుంతీదేవిల పాదాలపై పడి నమస్కరించారు పాండవులు.

సంజయుడు వచ్చినవారినందరినీ అక్కడ ఉన్న తాపసులకు పరిచయం చేసాడు. ధర్మజ భీమ అర్జున నకుల సహదేవులను, ద్రౌపది, సుభద్ర, ఉలూపి, చిత్రాంగద, వృకోదర, నకుల, సహదేవుల భార్యలను పరిచయం చేసాడు సంజయుడు.

## విదుర నిర్యాణం

అక్కడ విదురుడు కనిపించలేదు. ధర్మరాజు అలా అడుగుతున్నపుడూ దూరంగా విదురుడు దిగంబరుడై శరీరమంతా మకిలిపట్టి, ధూళి నిండి ఉన్నాడు. ఆశ్రమం వేపు వచ్చినట్లే వచ్చి వెనుదిరిగి పోతుండగా ధర్మరాజు విదురుని అనుసరించాడు పరిగెత్తుతూ. అరణ్యంలో పోయిపోయి ఒక నిర్జన ప్రాంతంలో చెట్టును ఆసరాగా చేసుకుని నిలిచాడు విదురుడు. ధర్మరాజు అతడిని చూసి ఆ దివ్యరూపానికి ఆశ్చర్యపడుతూ నిలబడినాడు. విదురుడు తన దృష్టిని ధర్మరాజు దృష్టితో కలిపి ఏకాగ్రతతో నిలిచి ప్రాణాలలో ప్రాణాన్ని, ఇంద్రియాలలో ఇంద్రియాన్ని లీనం చేసాడు. తేజస్సుతో ప్రజ్వలిస్తూ యుధిష్ఠిరుని శరీరంలో ప్రవేశించాడు. ధర్మరాజుకెదురుగా విదురుని శరీరం అచేతనంగా చెట్టునానుకుని ఉండిపోయింది.

అక్కడే ఆ శరీరానికి దహన సంస్కారాలు చేయాలనుకున్నపుడు అశరీరవాణి పలికింది. సన్యాసికి దహన సంస్కారాలు తగదు. అతడు సాంతానిక లోకాలు పొందుతాడు.

ధర్మరాజు ఆశ్రమానికి వెళ్లి ధృతరాష్ట్రాదులకు ఆ సంగతి చెప్పాడు. వ్యాసుడన్నాడు– ధర్ముడే విదురుడు. విదురుడే యుధిష్ఠిరుడు. మహాయోగ బలంతో విదురుడు యుధిష్ఠిరునిలో లీనమైనాడు.

**యోహి ధర్మః స విదురః విదురో యః స పాండవః**
**స ఏష రాజన్ దృశ్యసే పాండవః ప్రేష్యవత్ స్థితః** (ఆశ్రమవాస. 28–21)

# 2) పుత్ర దర్శన పర్వము

గాంధారీదేవి అడిగింది– చనిపోయిన పుత్రులను తలచుకుంటూ నాకూ, ఈ మహరాజుకూ హస్తినలో 15 ఏళ్లు, ఇక్కడ సంవత్సరం పదహారేళ్లు గడిచాయి. కానీ శాంతి లేదు. లోకాంతరగతులైన వారినందరినీ మాకు చూపగలవా?

కుంతీదేవి మనసులో కర్ణుడు మెదిలాడు. తన వల్ల అతడు పడిన కష్టాలు, మనోవేదనను అర్థం చేసుకున్నదామె. కన్నీళ్లు బొట్లుబొట్లుగా రాలినాయి.

ఆమె మనోవేదనను వ్యాసుడు గ్రహించాడు. ఆమెతో అన్నాడు– నీ తప్పేమీ లేదు తల్లీ! దేవతలు ఐశ్వర్య సంపన్నులు. వారు సంకల్పంతో, మాటతో, దృష్టితో, స్పర్శతో, సమాగమంతో –ఇలా అయిదు రకాలుగా పిల్లలను కనగలరు. దేవధర్మం కారణంగా మానవధర్మం దూషితం కాదు.

**సర్వం బలవతాం పథ్యం సర్వం బలవతాం శుచి**
**సర్వం బలవతాం ధర్మః సర్వం బలవతాం స్వకమ్** (ఆశ్రమవాస. 30–24)

బలవంతులకు ఏదైనా ధర్మమే, ఏదైనా స్వకీయమే.

## ప్రియసంగమోత్సవం

వ్యాసుడన్నాడు– మీరంతా గంగా తీరానికి బయల్దేరండి. అక్కడ యుద్ధంలో మరణించిన వారినందరినీ చూడగలరు. సూర్యుడు అస్తాద్రిని చేరుకున్నాడు. అందరూ స్నానాలు చేసి సంధ్యానుష్ఠానాలు పూర్తి చేసారు. వ్యాస మహర్షి పవిత్ర గంగా జలంలో స్నానం చేసి అందరినీ పిలిచాడు. యుద్ధంలో మృతిచెందిన వారినందరినీ ఆహ్వానించాడు మంత్రోచ్చారణ చేస్తూ. అప్పుడు గంగా జలంలో భీకర శబ్దం వినవచ్చింది.

భీష్ముడు, ద్రోణుడు, విరాటుడు, ద్రుపదుడు, ఘటోత్కచుడు, అభిమన్యుడు, కర్ణుడు, దుర్యోధనుడు, శకుని, దుశ్శాసనాది కౌరవులు, జరాసంధ సుతుడు, భగదత్తుడు, జలసంధుడు, భూరిశ్రవుడు, శలుడు, శల్యుడు, వృషసేనుడు, బాహ్లికుడు, సోమదత్తుడు, లక్ష్మణుడు, శిఖండి, శిఖండి పుత్రులు, ధృష్టద్యుమ్నుడు, అతడి పుత్రులు, ధృష్టకేతువు, అచలుడు, వృషకుడు, అలాయుధుడు, చేకితానుడు ఇలా రాజులందరూ తమతమ సేనలతో కనిపించారు.

వీరిలో శత్రుత్వం కాని, అహంకారం కాని, కోపం కాని, మాత్సర్యం కాని లేవు. గంధర్వులు వారి కీర్తిని గానం చేస్తున్నారు. అప్సరసల మధ్య వాళ్లు నిలిచి ఉన్నారు.

గాంధారి దివ్యజ్ఞానాన్ని పొంది వారినందరిని చూసింది. ధృతరాష్ట్రుడు వ్యాసుడిచ్చిన దివ్యదృష్టితో అందరినీ చూసాడు. ఆశ్రమంలోని మునులు, ధర్మరాజాదులు అందరూ వాళ్లవాళ్లను అందరినీ చూస్తున్నారు. వచ్చినవారు, నది నుంచి వచ్చినవారు ఒకరినొకరు కలుసుకున్నారు. వారిలో భయం, శోకం, కీర్తి–అపకీర్తి, అనాసక్తి, బెదురు ఏమీలేవు. స్త్రీలు తండ్రులతో, సోదరులతో, పుత్రులతో, భర్తలతో కలిసి పరమానందాన్ని పొందారు. ఆ వీరులు, ఆ కాంతలు ఒకరాత్రి విహరించి వీడ్కోలు తీసుకుని వెళ్లిపోయారు.

వ్యాసుడు తన మహత్తును ఉపసంహరించగానే అందరూ అదృశ్యమైనారు.

వ్యాసుడన్నాడు– తమ భర్తలతో పాటు వెళ్లదలచినవారు గంగానదిలో మునగండి.

**తాః శీలగుణ సంపన్నాః విమానస్థా గతక్లమాః**
**సర్వాః సర్వ గుణోపేతాః స్వస్థానం ప్రతిపేదిరే** (ఆశ్రమవాస. 33–24)

స్త్రీలు అలా తమ భర్తలతో వెళ్లిపోయారు.

## జనమేజయుడు తన తండ్రి పరీక్షిత్తుని దర్శించుట

వైశంపాయనుడు చెబుతున్నాడు– ధృతరాష్ట్రుడు తన కుమారులను అంతవరకు చూడలేదు. వ్యాసుడిచ్చిన దివ్యదృష్టితో అందరిని చూడగలిగాడు. అదేవిధంగా వ్యాసుని అనుగ్రహంతో జనమేజయుడు తన తండ్రి పరీక్షిత్తును చూసాడు. శమీకమునిని, శృంగిని కూడా చూసాడు.

ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, వ్యాసుడి అనుమతి తీసుకుని, మహర్షుల ఆశీస్సులనంది యుధిష్ఠిరుడు నెల రోజుల తరువాత హస్తినకు వచ్చాడు.

# 3) నారదాగమన పర్వము

ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి వానప్రస్థం స్వీకరించి మూడేండ్లు గడిచాయి. ప్రియసంగమోత్సవం గడిచి రెండేండ్లయ్యింది. మొత్తం మూడేళ్లు వానప్రస్థాశ్రమంలో ఉన్నారు వాళ్లు. ఒకరోజున నారదుడు వచ్చి ధర్మరాజుతో చెప్పాడు–

మీరు ధృతరాష్ట్రుని శతయూపాశ్రమంలో దర్శించి హస్తినకు వచ్చినాక ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, సంజయులు కురుక్షేత్రం నుండి గంగా ద్వారానికి వెళ్లారు. అక్కడ గొప్ప తపస్సు చేసాడు ధృతరాష్ట్రుడు.

నోటిలో చిన్నరాయి ఉంచుకుని గాలినే భోంచేస్తూ తపస్సు చేసాడు. గాంధారి నీటినే ఆహారంగా స్వీకరించేది. కుంతి నెలకోసారి భుజించేది. సంజయుడు మూడు రోజులకోసారి భుజించేవాడు.

ఒకరోజున అరణ్యంలో దావాగ్ని చెలరేగింది. అది క్రమేపీ వారిని చుట్టుముట్టింది. ధృతరాష్ట్రుడు అన్నాడు సంజయుడితో– అగ్ని ముట్టని చోటును చూసుకుని నీవు వెళ్లు. మేము ఇక్కడ అగ్నిలో కలిసి ఉత్తమగతిని పొందుతాము –అని పలికి తూర్పు ముఖంగా గాంధారీ, కుంతీలతో కలిసి కూర్చున్నాడు. వారు ఇంద్రియాలను నిరోధించి కట్టెలా ఉండి పోయారు. అగ్ని వారిని చుట్టుముట్టింది. ఆ అగ్నిలో వారు త్రేతాగ్నుల్లా మండుతూ కలిసిపోయారు.

సంజయుడు గంగాతీరాన ఉన్న తాపసులతో, నాతో ఈ విషయం చెప్పి తాను హిమగిరికి వెళ్లిపోయాడు.

నారదుడన్నాడు– ధృతరాష్ట్రుడు తానే స్వయంగా అగ్నులను పరిత్యజించాడు. ఆ అగ్నుల వల్లనే దావాగ్ని పుట్టింది.

యుధిష్ఠిరుడు శౌచం కోసం దశాహాదులను నిర్వర్తించి పన్నెండవ రోజున శ్రాద్ధ కర్మలను జరిపించాడు. శాస్త్రవిధి నెరిగినవారిని గంగా ద్వారానికి పంపగా వారు అగ్నిలో దహింపబడిన ఆ ముగ్గురి ఎముకలను అర్చించి గంగలో కలిపారు.

ధృతరాష్ట్రుడు నగరంలో 15 సంవత్సరాలు, వానప్రస్థ వనవాసంలో మూడేళ్లు గడిపాడు.

**యుధిష్ఠిరస్తు నృపతిః నాతిప్రీత మనాస్తదా**
**ధారయామాస తద్ రాజ్యం నిహత జ్ఞాతి బాంధవ** (ఆశ్రమవాస. 39–27)

యుధిష్ఠిరుడు బంధువులను దాయాదులను కోల్పోయి ఆ దుఃఖం మనసును కలచివేస్తుండగా పెద్దగా ప్రీతి లేకుండానే రాజ్యపాలన చేస్తున్నాడు.

✤✤✤✤✤

# ✧ 16. మౌసల పర్వము ✧

## ముసలోత్పత్తి

ముప్పది ఆరు సంవత్సరాలు గడిచాయి కురుక్షేత్ర మహా సంగ్రామం సంభవించి. అప్పుడు యుధిష్ఠిరునికి అనేక ఉత్పాతాలు కనిపించసాగినాయి.

ఉరుములు మెరుపులతో ప్రచండ గాలులు వీస్తున్నాయి. పక్షులు అపసవ్యంగా, వలయాకారంలో ఎగుర్తున్నాయి. దిక్కులు మంచుతో నిండినాయి. తోకచుక్కలు, ఉల్కలు రాలుతున్నాయి. సూర్యచంద్రుల చుట్టూ మూడురంగులు నల్లగా, బూడిదరంగు, ఎర్రరంగుతో భయంకరంగా కనిపిస్తున్నాయి.

ద్వారకను చూడడానికి విశ్వామిత్రుడు, కణ్వుడు, నారదుడు రాగా వృష్ణి వంశస్థులు కొందరు సాంబుడిని స్త్రీగా అలంకరించి మునులతో అన్నారు– "మునులారా! ఈమె బభ్రుని భార్య. ఈమె కడుపున ఎవరు పుడతారు?"

మునులకు కోపం వచ్చింది– "ఈమె కాదు. వీడు. వీడి కడుపున ముసలం పుడుతుంది. సాంబుడి కడుపున పుట్టిన ముసలం యాదవ కులాన్ని నాశనం చేస్తుంది. బలరాముడు శరీరాన్ని విడిచి పోతాడు. కృష్ణుడిని 'జర' అనే బోయవాడు చంపుతాడు" అని శపించారు.

మరుసటి రోజున సాంబుడు ముసలాన్ని కన్నాడు. ముసలాన్ని పొడిపొడిగా నూరించి దానిని సముద్రంలో కలిపారు. ద్వారకలో మదిరను నిషేధించారు.

శ్రీకృష్ణుడన్నాడు మిత్ర బాంధవులతో– "త్రయోదశి–అమావాస్యలు కలిసాయి. రాహువు మరల చతుర్ధశిని అమావాస్యగా చేసాడు. మహాభారత యుద్ధకాలం లాంటి సమయం వచ్చింది. ఇది మనకు వినాశకాలం.

**ఏవం పశ్యన్ హృషీకేశః సంప్రాప్తం కాలపర్యయమ్**
**త్రయోదశ్యామమావాస్యాం తాన్ దృష్ట్వా ప్రాబ్రవీదిదమ్**

**చతుర్దశీ పంచదశీ కృతేయం రాహుణా పునః**
**ప్రాప్తేవై భారతే యుద్ధే ప్రాప్తా చాద్య క్షయామనః** (మౌసల. 2–18,19)

గాంధారీ శాపం, మునుల శాపం మనలను చుట్టుముడుతున్నాయి. అందరం తీర్థయాత్రకై సముద్రతీరానికి పోదాం!"

## యాదవుల పరస్పర సంహారం

ద్వారకలో కాలుడు సంచరిస్తున్నాడు. రాత్రివేళ స్త్రీలకు కలల్లో నల్లటి స్త్రీ వారి సౌభాగ్యాలను అపహరించి వికటాట్టహాసం చేస్తూ కనిపించింది.

సుదర్శన చక్రం, దివ్యరథం, నాలుగు గుర్రాలు, ధ్వజాలు వెళ్లిపోయాయి సముద్ర జలాలపై తేలుతూ.

యాదవులు విచ్చలవిడిగా తాగి తింటున్నారు. శ్రీకృష్ణుడి ఎదురుగానే కృతవర్మ, బలరాముడు, యుయుధానుడు, గదుడు, బభ్రుడు మదిర తాగసాగారు. కృతవర్మను సాత్యకి పరిహసించసాగినాడు– "హార్దిక్యా – నిదురపోయే వాళ్లను చంపే సింహమా! గొప్ప వీరుడివి"

కృతవర్మ అన్నాడు– "అర్జునుడు బాణం వేసి భూరిశ్రవుడి చెయ్యి నరకకపోతే అప్పుడే నిద్రపోయేవాడివి. అనవసరంగా బ్రతికావు. బ్రతికి ప్రాయోపవేశం చేసినవాడి తల నరికావు. నీవూ గొప్ప వీరుడివే!"

సాత్యకి అన్నాడు– "స్యమంతక మణి కోసం నీవు సత్రాజిత్తును చంపావు. మహావీరుడివి!"

తండ్రి మాటెత్తగానే సత్యభామ దుఃఖించింది. సాత్యకి వేగంగా లేచి కృతవర్మ తల నరికివేసాడు. దానితో ఒకరినొకరు తిట్టుకుంటూ చంపుకోవడం మొదలెట్టారు. కత్తులు, గిన్నెలు, పాత్రలు ఏది దొరికితే దానితో కొట్టుకున్నారు. పరకాలనే

తుంగగడ్డిని పీకి కొట్టుకున్నారు. దానిలో ముసలపు పొడి చేరి అది వజ్రసమానమై దెబ్బతిన్నవాడిని చంపసాగింది. తుంగగడ్డి ముసలమై, రోకళ్లలా మారగా భీకరంగా కొట్టుకున్నారు అంధకులు, భోజులు, శిని వంశీయులు, వృష్ణి వంశస్థులు. మునుల శాపం మృత్యురూపం దాల్చింది. సాంబుడు, చారుదేష్ణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు మరణించగా చూసి కృష్ణుడు కోపానికి లోనై మిగిలిన యాదవులను చంపివేసాడు.

మిగిలింది బభ్రుడు, దారుకుడు, కృష్ణుడు. దారుకుని హస్తినకు పంపాడు శ్రీకృష్ణుడు అర్జునుడిని తీసుకురమ్మని. బభ్రుడిని స్త్రీలను రక్షించడానికి పంపాడు. బభ్రుడు వెళ్తుండగానే ఎవరో బోయవాడు వేసిన బాణం ముసలంలా మారి బభ్రుడిని చంపింది.

బలరాముడిని సముద్రతీరంలో ఉండమని చెప్పి శ్రీకృష్ణుడు స్త్రీలను తీసుకువెళ్లి వసుదేవుడికప్పగించాడు. తాను వెంటనే బలరాముడున్న చోటుకు వచ్చాడు.

సమీప అరణ్యంలో బలరాముడు యోగ సమాధిలో ఉన్నాడు. అతడి ముఖం నుంచి పెద్ద పాము బయటకు వచ్చి సముద్రం వేపు వెళ్లిపోయింది. వేయి తలలు, పెద్ద శరీరం, ఎర్రటి ముఖం. అతడిని సాగరుడు, నదులు, సర్పాలు స్వాగతించాయి.

## శ్రీకృష్ణ నిర్యాణం

సకలార్థ తత్త్వవేత్త అయిన శ్రీకృష్ణుడు దేహాన్ని వదలడానికి నిశ్చయించుకున్నాడు. ఇంద్రియాలను, వాక్కును, మనసును నిరోధించి మహాయోగాన్ని పొంది శయనించాడు.

'జరా' అనే పేరుగల బోయవాడు కృష్ణుడి అరిపాదాన్ని జింక అనుకుని ముసలపు ములికి ఉన్న బాణంతో కొట్టాడు. వెళ్లి చూసేసరికి అక్కడ శ్రీకృష్ణుడు కనిపించాడా బోయవాడికి. బోయవాడిని ఓదార్చి శ్రీకృష్ణుడు దివ్యలోకాలకు వెళ్లాడు.

## అర్జునుడు ద్వారకకు వచ్చుట

దారుకుడు వెళ్లి అర్జునుడిని తీసుకుని వేగంగా ద్వారకకు వచ్చాడు. వసుదేవుడు జీవితం మీద విరక్తి చెంది ఉన్నాడు. ప్రాయోపవేశానికి నిశ్చయించుకున్నాడు.

అర్జునుడన్నాడు– "కృష్ణుడు లేని ఈ భూమిని నేనూహించలేను. ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులు, ద్రౌపది, నేను మేము ఆరుగురం ఒకే మనస్సు కలవాళ్లం. నాకు అర్థమవుతున్నది పరలోక గమన సమయం వచ్చిందని".

అర్జునుడు ద్వారకానగరంలోని ముఖ్యులను పిలిచి అన్నాడు– "నేటి నుంచి ఏడవ రోజున ఉదయం సూర్యుడు ఉదయించేసరికి ద్వారకా నగరాన్ని వీడి వెళ్లిపోవాలి. సముద్రం పొంగి ద్వారకను ముంచెత్తనున్నది".

అందరూ వివిధ ఏర్పాట్లు చేయసాగినారు.

ఆ రాత్రి అర్జునుడు కృష్ణుని భవనంలోనే ఉన్నాడు. తెల్లవారే అంతఃపుర కాంతల రోదనలతో మేల్కొన్నాడు. అప్పటికే వసుదేవుడు కాలం చేసాడు. రాణులు దుఃఖిస్తున్నారు. అంత్యక్రియలు చేయించాడు అర్జునుడు. వసుదేవుడితో పాటు దేవకి, భద్ర, రోహిణి, మదిర వీళ్లంతా సహగమనం చేసారు.

ఆ తరువాత సముద్ర తీరంలో చనిపోయి పడి ఉన్న యాదవులందరికీ దహన సంస్కారాలు చేయించాడు.

బలరామ కృష్ణులిద్దరిని వెదుకుతూ వెళ్లి వారి శరీరాలను కనుగొని దహన సంస్కారాలు నిర్వర్తించాడు.

**తతః శరీరే రామస్య వాసుదేవస్య ఛో భయోః**
**అన్విష్య దాహయామాను పురుషై రాప్త కారిభిః** (మౌసల. 7–31)

అందరికీ ప్రేత కార్యాలు జరిపించి, ఏడవ రోజు ఉదయాననే యాదవుల స్త్రీలను, ద్వారకా ప్రజలను తీసుకుని హస్తిన వేపు బయల్దేరారు.

వారు వెళ్లిపోగానే సాగరుడు ద్వారకను ముంచివేసాడు. అర్జునుడు ఆ భూమిని వీడినంత మేర సాగరుడు నీటితో ముంచివేసాడు.

**యద్ యద్ధి పురుష వ్యాఘ్రః భూమేస్తస్యా వ్యముంచత**
**తత్ తత్ సంప్లావయామాస సలిలేన స సాగరః** (మౌసల. 7-41)

అర్జునుడు సమస్త జనంతో పంచనదీ దేశాన్ని చేరి అక్కడ విడిది చేసాడు. అక్కడ ఉన్న అభీరులు వేలకొలదిగా వచ్చి వారిపై దాడి చేసారు. అర్జునుడు వారిని వారించబోయాడు. గాండీవాన్ని ఎక్కుపెట్టి బాణాలు వేయబోయాడు. కష్టతరమైంది. దివ్యాస్త్రాలు స్ఫురించలేదు. అక్షయ తూణీరంలో బాణాలు లేవు.

అర్జునుడు చూస్తూ ఉండగానే దొంగలు స్త్రీలను ఎత్తుకుపోయారు. అర్జునునుడు శ్రీకృష్ణ, బలరాముల రాణులను, మిగతా స్త్రీలను కొంతమందిని రక్షించగలిగాడు. అతడితో వచ్చిన యాదవ సైనికులు కొందరు స్త్రీలను, పిల్లలను కాపాడినారు.

కృతవర్మ కుమారుడికి భోజవంశస్తులకు మార్తికావ్రతమనే నగరాన్ని ఇచ్చాడు అర్జునుడు. మిగతా వారితో ఇంద్రప్రస్థం చేరుకున్నాడు. సాత్యకి పుత్రుడైన యౌయుధానుని సరస్వతీ నదీ తీరాన విడిది చేయించాడు.

అనిరుద్ధుడి కుమారుడైన వజ్రునికి ఇంద్రప్రస్థం ఇచ్చాడు.

శ్రీకృష్ణుని భార్యలైన రుక్మిణి, గాంధార రాకుమారి, శైబ్య, హైమవతి, జాంబవతి అగ్నిప్రవేశం చేసారు. సత్యభామ మిగిలిన రాణులు తపస్సు చేయడానికి అరణ్యం వెళ్లిపోయారు.

వికల మనస్కుడై అర్జునుడు వ్యాసుని సందర్శించాడు. అర్జునుడన్నాడు- "నా వివిధాస్త్రాలు నశించిపోయాయి. గాండీవం స్పందించలేదు. అక్షయతూణీరం నశించింది. నేను సాధారణ నరుడినై నిస్సహాయుడిగా నిలబడి చూస్తూ ఉండిపోయాను".

వ్యాసుడన్నాడు- "యదు వంశీయులు దైవసంభూతులు. దేవదేవునితో వచ్చారు, కలిసి వెళ్లిపోయారు. అష్టావక్రుని చూసి నవ్విన యాదవకాంతలు అభీరులనే దొంగలపాలైనారు. అర్జునా! బుద్ధి, తేజస్సు, జ్ఞానం పుట్టవలసిన సమయంలో పుడతాయి. విపరీత సమయంలో నశించిపోతాయి. అన్నిటికీ కాలమే మూలం.

**కాలమూల మిదం సర్వం జగద్బీజం ధనంజయ,**
**కాల ఏవ సమాదత్తే పునరేవ యదృచ్ఛయా!** (మౌసల. 8-33)

సర్వజగత్తును సృష్టిస్తుంది, ఉపసంహరిస్తుంది కాలం".

*****

# ✤ 17. మహాప్రస్థానిక పర్వము ✤

అర్జునుడు వృష్ణివంశ వినాశనాన్ని చెప్పగా విని యుధిష్ఠిరుడన్నాడు-

**కాలః పచతి భూతాని సర్వాణ్యేవ మహామతే**
**కాల పాశ మహం మన్యే త్వమపి ద్రష్టు మర్హసి** (మహాప్రస్థానిక. 1-3)

"అర్జునా! నేను కాలపాశానికి లోబడబోతున్నాను" అన్నాడు.

ద్రౌపది, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు ఆమోదించారు. యుధిష్ఠిరుడు యుయుత్సునికి రాజ్య బాధ్యతనప్పగించాడు. సుభద్రను పిలిచి అన్నాడు- "అమ్మా! నీ మనవడు పరీక్షిత్తు హస్తినాపురానికి రాజైనాడు. ఇంద్రప్రస్థంలో యాదవరాజైన వజ్రుని నీవు రక్షించాలి"

హస్తినాపుర ప్రజల సమావేశ మేర్పరచి పరీక్షిత్తును రాజుగా పరిచయం చేసాడు. అగ్నులను నీటిలో విడిచిపెట్టి పాండవులు ద్రౌపది వానప్రస్థానికి బయల్దేరినారు. వారిని అనుసరించింది ఓ కుక్క.

**యుధిష్ఠిర మతం జ్ఞాత్వా వృష్ణి క్షయ మవేక్ష్య చ**
**భ్రాతరః పంచ కృష్ణా చ షష్ఠీ శ్వా చైవ సప్తమః**

పాండవులైదుగురు, ద్రౌపది, ఓ కుక్క నగరాన్ని విడిచి తూర్పుదిక్కుగా బయల్దేరారు.

నగర వాసులందరూ వెనక్కి తిరిగారు. నాగకన్య ఉలూపి గంగలో ప్రవేశించింది. చిత్రాంగద మణిపూర నగరానికి వెళ్లిపోయింది.

ముందు యుధిష్ఠిరుడు తరువాత భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు వెనక ద్రౌపది వారి వెనుక కుక్క నడుస్తున్నారు.

సముద్ర తీరాన్ని చేరాక అగ్నిదేవుని హెచ్చరిక విని అర్జునుడు గాండీవాన్ని, అక్షయ తూణీరాలను నీటిలోకి విసిరాడు. ఆ తరువాత దక్షిణాభిముఖులై, లవణ సముద్రపు ఉత్తర తీరంపై నైర్ృతి మూలగా వెళ్లి పడమటి వేపుకు తిరిగి సముద్రంలో మునిగిన ద్వారకాపురిని చూసి అక్కడ నుంచి వెనక్కి తిరిగి భూప్రదక్షిణ చేయదలచి ఉత్తర దిక్కుగా నడిచి హిమాలయ పర్వతాలు చేరుకున్నారు.

**తం చాప్యతి క్రమంతస్తే దదృశుర్వాలు కార్ణవమ్**
**అవైక్షంత మహాశైలం మేరుం శిఖరిణాం వరమ్** (మహాప్రస్థానిక. 2-2)

యోగధర్మంలో నిలిచి వారందరూ వేగంగా నడుస్తుండగా యోగభ్రష్టయై ద్రౌపది నేలకూలింది. భీముడడిగాడు, "ఎందుకు?"

ధర్మరాజన్నాడు- "ఈమెకు అర్జునుడిపై పక్షపాతమెక్కువ!".

ఈసారి సహదేవుడు పడిపోయాడు. భీముడడిగాడు- "ఎందుకు?"

ధర్మరాజన్నాడు- "తాను అందగాడిననే అహంకారం ఇతడికెక్కువ!"

అర్జునుడు పడిపోయాడు. భీముడడిగాడు- "ఎందుకు?"

ధర్మరాజన్నాడు- "ఒక్కరోజులో శత్రువులను చంపుతానన్నాడు. చంపలేదు"

భీముడు పడిపోతూ అన్నాడు- "ఎందుకు?"

ధర్మరాజన్నాడు- "నీకు తిండి యావ, ప్రగల్భాలు ఎక్కువ!"

ధర్మరాజు ముందుకు వెళ్తూనే ఉన్నాడు, కుక్క మౌనంగా అనుసరిస్తున్నది. ఇంద్రుడి విమానం వచ్చింది. ఇంద్రుడన్నాడు- "యుధిష్ఠిరా! రథం ఎక్కు"

ధర్మరాజన్నాడు– "నా సోదరులు, ద్రౌపది, కుక్క రాకుండా నేను రాను"

ఇంద్రుడన్నాడు– "వాళ్లెప్పుడో స్వర్గలోకం వెళ్లిపోయారు"

ధర్మరాజన్నాడు– "సరే, కుక్క నేను వస్తాం!"

ఇంద్రుడన్నాడు– "అన్నిటిని వదిలి వచ్చావు, కుక్కను విడిచి రథం ఎక్కు"

ధర్మరాజన్నాడు– "అన్నిటిని విడిచినా నాతో వచ్చింది కుక్క, అది లేకుండా నేను రాను".

కుక్క రూపంలో ఉన్న ధర్ముడన్నాడు– "ద్వైతవనంలో మాద్రీపుత్రుడైన నకులుడిని బ్రతికించమని పలికి మొదటి పరీక్ష నెగ్గావు. ఇప్పుడు నిన్ను అనుసరించి వచ్చిన కుక్క రాకుండా స్వర్గానికి రానని పలికి రెండో పరీక్ష నెగ్గావు. అందువలన నీకు నీ శరీరంతోనే అక్షయలోక ప్రాప్తి లభించింది".

అప్పుడు దివ్య రథమెక్కి ధర్మరాజు స్వర్గానికి చేరుకున్నాడు. దారిలో అనేక దేవలోకాలను చూసాడు. ఇంద్రునితో అన్నాడు ధర్మరాజు–

**శుభం వాయది పాపం భ్రాతౄణాం స్థాన మద్య మే**
**తదేవ ప్రాప్తుమిచ్ఛామి లోకానన్యాన్న కామయే** (మహాప్రస్థానిక. 3-31)

"శుభమైనా, అశుభమైనా నా సోదరులు పొందే స్థానమేదో అదే నాకు చాలు. నా భార్య ద్రౌపది ఉన్నచోటుకే నేను వెళ్తాను. ఇతర లోకాలు నాకు ఇష్టం లేదు" అన్నాడు ధర్మరాజు.

❖❖❖❖❖

# ✦ 18. స్వర్గారోహణ పర్వము ✦

**స్వర్గం త్రివిష్టపం ప్రాప్య ధర్మరాజో యుధిష్ఠిరః**
**దుర్యోధనం శ్రియా జుష్టం దదర్శాసీనమాసనే** (స్వర్గారోహన. 1-4)

స్వర్గాన్ని సశరీరంగా చేరిన ధర్మరాజు సింహాసనంపై వెలిగిపోతున్న దుర్యోధనుని చూసాడు. ఆయన వీరశోభతో సూర్యుడిలా దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు.

అది చూసి అసహ్యంతో వెంటనే వెనుదిరిగాడు. నేను దుర్యోధనునితో కలిసి ఈ లోకాలను పొందాలనుకోవడం లేదు. ఇతడి వల్లనే బలపూర్వకంగా మేమెందరినో చంపాల్సి వచ్చింది".

నారదుడన్నాడు నవ్వుతూ– "స్వర్గంలో శత్రుత్వముండదు. అతడు వీరుడు. వీరస్వర్గం పొందాడు. మీ పాత పగలు, వాటి కారణాలు వీటినిక్కడ ఆలోచించరాదు".

ధర్మజుడన్నాడు– "అయితే, నా సోదరులు, ద్రౌపది ఉన్నచోటు ఏది? నా సోదరుడు కర్ణుడెక్కడున్నాడు, నా తరపున పోరాడి వీర స్వర్గం పొందిన ధృష్టద్యుమ్నుడు, సాత్యకి వీరెక్కడ? అసంఖ్యాక రాజులెక్కడ? అభిమన్యుడెక్కడ? ఉపపాండవులెక్కడ?"

## యుధిష్ఠిర నరక దర్శనము

ధర్మరాజన్నాడు– "నా సోదరులను, ద్రౌపదిని, నా మిత్ర బాంధవ రాజులను, నా సైనికులున్న చోటుకు నన్ను తీసుకుని వెళ్లండి!"

దేవతలన్నారు– "తమరడిగిన చోటుకు తీసుకువెళ్తాం, అనుసరించండి!"

ముందు దేవదూత, అతడి వెనక ధర్మరాజు పాపకర్ములు వెళ్లే అశుభ మార్గాన, దుర్గమం, దుర్గంధం, గాడాంధకారంగా ఉన్న బాటపై నడుస్తున్నారు. దారినిండా నాచు, వెంద్రుకలు, గడ్డి, దుర్గంధమై రక్త మాంసాలతో జారుతున్నది. ఎముకలు, వెంద్రుకలు, క్రిములు, కీటకాలు, అక్కడక్కడా మంటలు. ఇనుప ముక్కు కల కాకులు, గ్రద్దలు వలయాకారంలో ఎగుర్తున్నాయి. సూదుల వంటి ముఖాలు, పర్వతాకారాల ప్రేతాలు అంతటా తిరుగుతున్నాయి. అక్కడక్కడా శవాలు, నెత్తురు, మేధస్సు కారుతూ – కొన్నిటి చేతులు, తొడలు, భుజాలు తెగి పడి ఉన్నాయి. కొన్నిటి పాదాలు, పొట్ట తెగి ఉన్నాయి. వేడి నీటి నది ప్రవహిస్తున్నది, అసిపత్ర వనంలో కత్తి అంచులా పదునైనవి, సూదిమొనలా ఆకులున్న చెట్లున్నాయి. వేడిగా కాలే ఇసుక పరుపులు, కాలుతున్న ఇనుప రాళ్లు, ఇనుప బాణల్లలో మరుగుతున్న నూనె; ముళ్ల బూరుగుచెట్లు, నరకయాతనలు పడుతున్న పాపులు –ఇవన్నీ చూసాడు ధర్మరాజు.

"నా సోదరులెక్కడ?" అడిగాడు ధర్మరాజు.

"ఇంతవరకే మీకు అనుమతి ఉంది, వెనక్కి వెళ్దాం" అన్నాడు దేవదూత.

ధర్మరాజు వెనక్కి మరలగానే అన్నివేపుల నుండి దీనారవాలు వినిపించాయి.

**భోభో ధర్మజ రాజర్షే పుణ్యాభిజన పాండవ**
**అనుగ్రహార్థ మస్మాకం తిష్ఠ తావన్ముహూర్తకమ్** (స్వర్గారోహణ. 2-32)

"ఓ ధర్మజా! మాపై అనుగ్రహంతో ఇక్కడే ముహూర్తకాలం ఉండు. నీవు రాగానే ఇక్కడ పవిత్రమైన గాలి వీస్తున్నది. సుగంధం వ్యాపించింది. మాకు సుఖంగా ఉన్నది".

"అయ్యో, ఎంత కష్టం!" అంటూ ధర్మరాజు ఆగిపోయాడు.

"మీరెవరు? ఇక్కడెందుకున్నారు?" అని అడిగాడు.

"రాజా! నేను కర్ణుడిని, నేను భీముడిని, నేను అర్జునుడిని, నేను నకులుడిని, నేను సహదేవుడిని, నేను ద్రౌపదిని, నేను ధృష్టద్యుమ్నుడిని, మేము ద్రౌపది కొడుకులం" అన్న మాటలు దీనంగా ప్రతిధ్వనించాయక్కడ.

ధర్మరాజుకు కోపం వచ్చింది. దేవదూతతో అన్నాడు– "నీవు ఎవరి తరఫున వచ్చావో అక్కడకు వెళ్లి విన్నవించు. నేను అక్కడకు రావడం లేదు. నేను ఇక్కడే ఉంటాను. నా సోదరులకు, నా వాళ్లకు సుఖం కలిగించేందుకు నేనిక్కడే ఉంటాను"

దేవదూత వెళ్లి ఇంద్రుడికి మాట చెప్పాడు. దేవతలంతా అక్కడకు వచ్చేసరికి ఆ ప్రాంతమంతా వెలుగుతో నిండిపోయింది. పాపాత్ముల యాతనలు, దీనారవాలు, వైతరణీ నది, బూరుగు చెట్లు, లోహకుంభాలు, కాలుతున్న ఇనుప రాళ్లు, మొత్తం నరకం అదృశ్యమైపోయింది. అంతా చల్లని గాలి, సుఖావహంగా ఉంది.

## యుధిష్ఠిర తను త్యాగము

ఇంద్రుడన్నాడు– "నీవు కోపగించవద్దు. రాజులందరూ నరకాన్ని చూడవలసిందే. శుభాలు, అశుభాలు, విడివిడిగా రాసులై ఉంటాయి. ముందు సుకృత ఫలాలనుభవిస్తే ఆ తరువాత దుష్కృత ఫలాలనుభవించాలి. పాపాలు ఎక్కువ చేసినవాడు ముందు స్వర్గ సుఖాలనుభవిస్తాడు. అశ్వత్థామ విషయంలో నీవు ద్రోణునికి ఏదో నెపంతో అసత్యం చెప్పావు. అందుకే నీకు నరక సందర్శనం కలిగింది.

భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపది, మిగిలినవారు వారు చేసిన దుష్కర్మలకు నరక బాధలనుభవించి స్వర్గానికి వస్తారు. అదుగో కర్ణుడు తన దానవీరశూరత్వాలకు తగిన సుఖాల్ని అనుభవిస్తున్నాడు.

ఇది పవిత్రమైన దేవనది– ఆకాశగంగ. దీనిలో స్నానం చేసి పుణ్యలోకాలను చేరుము. ఇక్కడ స్నానం చేస్తే నీ మానుష భావం తొలగిపోతుంది. శోకం దూరమవుతుంది. ఆయాసం అదృశ్యమై, శత్రుత్వం విడిచి వెళ్తుంది" అన్నాడు దేవేంద్రుడు.

ధర్ముడన్నాడు– "కుమారా! మూడో పరీక్షలోనూ నెగ్గావు. ద్వైతవనంలో యక్ష ప్రశ్నల సమయంలో కొంగరూపాన; హిమవత్పర్వత శిఖరాన కుక్క రూపాన, ఇప్పుడు ధర్మరూపాన నిన్ను పరీక్షించాను. నీ సోదరుల, బంధువుల కోసం నరక లోకంలోనే నిలవదలచినావు. నీవు పవిత్రుడవు. పాప విముక్తుడివై సుఖించు"

యుధిష్ఠిరుడు గంగలో మునిగి దివ్య రూపాన్ని ధరించాడు. ఆకాశగంగలో మునిగినందువల్ల శత్రుత్వం, సంతాపం నశించాయి.

స్వర్గంలో అతడు గోవిందుడిని, అర్జున, భీమ, నకుల, సహదేవులను, ద్రౌపదిని, కర్ణుడిని చూసాడు. మిగతా మిత్రులను, బంధువులను, రాజులను చూసాడు.

జనమేజయుడడిగాడు వైశంపాయనుడిని– "భీష్మాదులు ఏమైనారు?"

వైశంపాయనుడు వ్యాసుడి అనుమతితో చెబుతున్నాడు– "భీష్ముడు–వసువులలో కలిసాడు; ద్రోణుడు–బృహస్పతితో; కృతవర్మ–మరుద్గణాలలో, ప్రద్యుమ్నుడు–సనత్కుమారుడిలో; విరాట ద్రుపదులు, ఇతర రాజులు విశ్వదేవతలలో లీనమయ్యారు.

ధృతరాష్ట్రుడు–గాంధారి కుబేర లోకంలో, పాండురాజు–కుంతి, మాద్రిలు మహేంద్ర భవనంలో ఉన్నారు. అభిమన్యుడు చంద్రుడి వర్చస్సులో, కర్ణుడు–సూర్యుడిలో, శకుని ద్వాపరుడిలో, ధృష్టద్యుమ్నుడు–అగ్నిలో; ధృతరాష్ట్రుని కుమారులు రాక్షసాంశన జన్మించినవారు విముక్తులై స్వర్గలోకంలోకి వెళ్లారు. యుధిష్ఠిరుడు–ధర్మునిలో; బలరాముడు–ఆదిశేషుడిలో; వాసుదేవుడు–నారాయణునిలో ప్రవేశించారు. వాసుదేవుడికి పదహారు వేలమంది భార్యలు సరస్వతీ నదిలో మునిగి అప్సరసలై వాసుదేవుని సేవకై నిలిచారు. ఘటోత్కచాదులు దేవతాలోకాలకు, యక్షలోకాలకు వెళ్లారు.

వీరంతా కారణజన్ములు. వీరు మరల తమ మూల స్వరూపాలను పొందినారు".

* * * * *

యజ్ఞకర్మల మధ్యలో మహాభారతాన్ని విని జనమేజయుడు బ్రాహ్మణులు, సదస్యులు ఎంతో ఆశ్చర్యానికి గురయ్యారు. జనమేజయుని యాజకులు సర్పయాగ కర్మను ముగించారు. సర్పాలను విడిపించి ఆస్తీకుడు ఎంతో ఆనందాన్ని పొందాడు.

సర్పయాగం ముగిసాక జనమేజయుడు తక్షశిల నుండి హస్తినాపురానికి వచ్చాడు. ఎంతో ప్రజారంజకంగా పాలన చేసాడు.

# మహాభారత మహాత్మ్యము

**భరతానాం మహజ్జన్మ తస్మాద్ భారత ముచ్యతే**
**మహత్త్వాద్ భారవత్త్వావచ్చ మహభారత ముచ్చతే**
**నిరుక్తమస్య యో వేద సర్వ పాపైః ప్రముచ్యతే** (స్వర్గారోహణ. 5-45)

భరత వంశీయుల చరిత్రను చెబుతుంది కనుక ఇది భారతం. భారవత్వ (లక్ష శ్లోకాల) గ్రంథం కనుక భారతం. అష్టాదశ పురాణాలు, సర్వ ధర్మశాస్త్రాలు, వేదాలు ఒకపక్క భారతమొక్కటే మరోపక్క ఉంచితే భారతం వాటితో సరితూగుతుంది.

కృష్ణద్వైపాయనుడు ఈ భారతాన్ని మూడు సంవత్సరాలలో వ్రాసాడు.

**ధర్మేచ అర్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న కుత్రచిత్**

ధర్మార్థ కామ మోక్షాలకు సంబంధించింది భారతంలో ఉన్నదే ఇతరత్రా ఉంటుంది. ఇక్కడ లేనిది ఎక్కడా ఉండదు.

**జయే నామేతిహాసో యంశ్రోతవవ్యో మోక్షమిచ్ఛతా**
**బ్రాహ్మణేన చ రాజ్ఞా చ గర్భిణ్యా చైవ యోషితా** (స్వర్గారోహణ. 5-50, 51)

**స్వర్గ కామో లభేత్ స్వర్గం జయకామోలభేజ్జయమ్**
**గర్భిణీ లభతే పుత్రం కన్యాం వా బాహు భాగినీమ్**

స్వర్గం కావాలనుకున్నవారికి స్వర్గం, జయం కోరిన వారికి జయం సిద్ధిస్తాయి. గర్భవతికి పుత్రుడు పుడతాడు. కన్య మహా భాగ్యశాలి అవుతుంది.

కృష్ణద్వైపాయన వ్యాసుడు ముందు అరవై లక్షల శ్లోకాలతో మహాభారతం వ్రాసాడు. 30 లక్షల శ్లోకాలు దేవలోకంలో, 15 లక్షల శ్లోకాలు పితృలోకంలో, 14 లక్షల శ్లోకాలు యక్షలోకంలో, 1 లక్ష శ్లోకాలు మానవలోకంలో ప్రచారంలోకి వచ్చాయి. దేవతలకు నారదుడు; పితరులకు అసితదేవలుడు; యక్ష, రాక్షసులకు శుకుడు; మానవులకు వైశంపాయనుడు దీనిని చెప్పారు.

పూజ్యుడైన సముద్రుడూ, హిమవత్పర్వతమూ, భారతమూ రత్న నిధులు. ఈ భారతం అసామాన్యమైనది. పుణ్యప్రదం, పాపహరం, శుభకరం, పవిత్రం.

**భారతం సర్వశాస్త్రాణామ్ ఉత్తమం భరతర్షభ**
**భారతాత్ ప్రాప్యతే మోక్షః తత్త్వమేతత్ బ్రవీమితే**

ఈ మహాభారతం ఒక నిర్మలమైన పద్మం. వ్యాస మహర్షి వాణి అనే సరస్సులో పుట్టింది. గీతార్థం అనే సుగంధాన్ని వ్యాపింపజేస్తున్నది. నానావిధ ఆఖ్యానాలనే కేసరాలున్నాయి. హరికథలనే సూర్య కిరణాలతో ఈ పద్మం వికసిస్తుంది. సజ్జనులనే తుమ్మెదలు దీనిని నిరంతరం ఆస్వాదిస్తారు. ఇది కలికాలం అనే మాలిన్యాన్ని వెళ్లగొడ్తుంది.

పదునెనిమిది పురాణాలు వ్రాసిన వ్యాసుని సింహనాదం ఇది. ధర్మ, అర్థ, మోక్షశాస్త్రం భారతం.

**భారతం శృణుయాన్నిత్యం భారతం పరికీర్తయేత్**
**భారతం భవనే యస్య తస్య హస్తగతో జయః**
**భారతం పరమం పుణ్యం భారతే వివిధాః కథాః**
**భారతం సేవ్యతే దేవైః భారతం పరమం పదమ్**

*****

**ధర్మేచ అర్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్**

✣✣✣✣✣

**(వ్యాస మహాభారతమ్ – గీతాప్రెస్ (గోరఖ్‌పూర్) ప్రతిననుసరించి వ్రాయబడింది)**

# సంస్కృత భారతం - తెలుగు భారతం

"వ్యాసో నారాయణో హరిః" సాక్షాత్తు విష్ణుకల్పుడైన వ్యాసుడి రచన యుద్ధభారతం "జయమ్"గా శిష్యులకు (సుమంతుడు, జైమిని, పైలుడు, వైశంపాయనుడు), తన కుమారుడు శుకుడికి వినిపించాడు.

| | | |
|---|---|---|
| సంక్షిప్త మహాభారతం | - | 150 శ్లోకాలు |
| ఉపాఖ్యానాలు లేనిది | - | 24000 శ్లోకాలు |
| శిష్యులకు ఇచ్చినది | - | 60,000 శ్లోకాలు |
| ఉపాఖ్యానాలతో కూడినది | - | 1,00,000 శ్లోకాలు (వైశంపాయనుడు) |
| శుకుడు-గంధర్వలోకంలో | - | 14 లక్షల శ్లోకాలు |
| దేవలుడు- పితృలోకంలో | - | 15 లక్షల శ్లోకాలు |
| నారదుడు- దేవలోకంలో | - | 30 లక్షల శ్లోకాలు |

ఉన్న వివిధ భారతాలను ప్రచారం చేసారు. జైమిని విని వ్రాసిన భారతం జైమిని భారతంగా ప్రసిద్ధికెక్కింది. వైశంపాయనుడు సర్పయాగ సమయంలో చెప్పిన లక్ష శ్లోకి భారతాన్ని వ్యాస శిష్యుడు రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవస సూతుడు నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంగా శౌనకాది మునులకు వినిపించాడు. ఇది సంస్కృత భారతంలో వ్రాయబడిన విషయం.

యుద్ధ భారతం 'జయమ్' లోకి కృష్ణుని ప్రాధాన్యంను పెంచే ఘట్టాలు కొన్ని అద్భుత ఘట్టాలుగా కానవస్తాయి- ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టంలో అనంతంగా వస్త్రాలు కృష్ణుని లీలతో రావడం, అక్షయపాత్ర-దుర్వాసుడి ఘట్టం, రాయబారంలో విశ్వరూపం, భగవద్గీత, భీష్ముడి కృష్ణభక్తి, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామాది కౌరవ వీరులతడిని, అర్జునుడిని నరనారాయణ అవతారాలుగా అంగీకరించడం వాస్తవ గాథలో కొన్ని అద్భుతాలను చొప్పించినట్లు కనిపిస్తుంది. విష్ణు సహస్రనామం, సాంఖ్య-యోగ సిద్ధాంతాలు, సుపర్ణుడు, నారదుడు, శ్వేతద్వీప వృత్తాంతం ఇవన్నీ వాసుదేవ-సంకర్షణ-ప్రద్యుమ్న-అనిరుద్ధ వ్యూహాల్ని ప్రజలలో వ్యాప్తి చేయడానికి ఆనాటి పండితులు, పౌరాణికులు, సూతులు చేసిన కృషి. ఎనిమిది వందల సంవత్సరాల కాలరేఖలో మహాభారత స్రోతస్వినిలోకి అనేక ఉపనదులు, ఏర్లు వచ్చి కలిసాయి (400 B.C. - 400 A.D.)

శైవ మతం, హరిహరనాథ తత్త్వ భావనలు వ్యాప్తి పొందుతున్న క్రమంలో శివుడు-పరమేశ్వరుడవడం, కార్తికేయుడి కథ మహాభారతంలో చేరినట్లు గమనించవచ్చును. సుపర్ణోపాఖ్యానం అదొక ప్రత్యేకమైన ఉపనది. అలాగే రామాయణం, భీముడు-హనుమంతుడి సంవాద ఘట్టాలు - ఉపనదులే.

ఈ ఎనిమిది వందల ఏళ్ల కాలంలో సమాజంలో జరిగిన మార్పులే స్మృతులు లేదా న్యాయ నిబంధనలు, కట్టుబాట్లుగా మారాయి. తొలిలో అందరూ బ్రాహ్మణులే అన్నది, వారి నుంచి క్షత్రియ జననం, వైశ్యుల ఆవశ్యకతతో వర్ణాలు ఏర్పడడం, ఆర్యులతో ఓడిపోయిన వారు దాసులు, దస్యులుగా, స్థానిక ప్రజలు, వృత్తి పనివారు కులాలుగా నాలుగవ వర్ణం, వర్ణ సంకరం వలన అయిదవ వర్ణం - అంటరాని జాతులు ఉద్భవించడం మనకు స్పష్టంగా కానవస్తుంది. వివిధ వర్ణాల ప్రజల విధులు స్పష్టంగా చెప్పబడ్డాయి.

బ్రాహ్మణులు-ధర్మాచరణ, క్షత్రియులు-ధర్మ, వర్ణ రక్షణ, వైశ్యులు- గో, ధన సంరక్షణ, వృద్ధి - వీళ్లు ముగ్గురూ ద్విజులు. పై మూడు వర్ణాలకు సేవాధర్మంగా జీవించాల్సిన వారు శూద్రులైనారు.

దుస్తులు, శుచీశుభ్రతలు, భాష, ఆహార వ్యవహారాలు దేవతలను ఉన్నత స్థానంలో, మానవులను మధ్య స్థానంలో, రాక్షసులను అధమ స్థానంలో ఉంచాయి. అందరికీ శాపాల భయం, వరాల ప్రాప్తిపై ఇష్టం ఉండేది.

సమాజమెప్పుడూ తనలోని వారిని రక్షించుకోవడానికి నియమ నిబంధనలను, న్యాయ పద్ధతులను, శిక్షలను క్రోడీకరించుకుంటుంది. కాలగమనంలో మార్పులు, చేర్పులు జరుగుతూనే ఉంటాయి. ప్రతి తరంలోనూ అత్యుత్తమ భావనలను, అసమాన శక్తులను ప్రదర్శించినవారిని దివ్యులుగా పరిగణించడం ప్రతి సమాజంలోనూ కానవస్తుంది. ఆ వీరుల, ధర్మపరుల శౌర్య, త్యాగాలు ప్రాక్కథలై జనుల మనస్సులో రకరకాలుగా రూపొందుకుంటాయి. అద్భుత సాహిత్యానికి మూలాధారాలవుతాయి.

**భారతంలో స్పష్టంగా కనిపించే భావనలు-**

1) బ్రాహ్మణాధిక్యత – జన్మతః బ్రాహ్మణుడైనవాడే బ్రాహ్మణుడని పలికినా కాలం గడిచినకొద్దీ, సద్గుణాలున్న ప్రతి వ్యక్తీ బ్రాహ్మణుడు కావచ్చని అంగీకరించారు.

2) క్షత్రియులకు రెండవ స్థానమిచ్చి, వారు బ్రాహ్మణాధిక్యతను సవాలు చేసినప్పుడల్లా తమ ఆధిక్యతను చెప్పే కార్యాలను ప్రశంసించడం, గుర్తు చేయడం, భయపెట్టడం.

వైశ్యులను తమ రెండు వర్ణాలకన్నా తక్కువగా, శూద్రులను దాదాపు మనుషులు కాదన్నట్లు చూడడం, వర్ణ సంకరంలో కూడా వివిధ స్థాయిలను నిర్ణయించి వారిలో వారు పోట్లాడుకునే పద్ధతిని స్థిరపరచడం.

3) స్త్రీలపై అనుమానం, తక్కువ చూపు, స్త్రీల స్వేచ్ఛకు పరిమితులు విధించడం. దేవ వేశ్యల కోసం జీవితకాలం తపస్సులు చేసేవారే, స్త్రీలను, మామూలు స్త్రీలలో వేశ్యావర్గాన్ని అతి చులకనగా చూసేవారు.

పెండ్లి కాకుండా పరపురుషునితో చరించడం పాపం. ఈ లోకాపవాదానికి స్త్రీలు భయపడిపోయేవాళ్లు. నీవు నాతో కలిసినా నీ కన్యాత్వం చెడదు –అనిపించుకునేవాళ్లు.

మునులు తమ రహస్య కార్యాలకు వీర్యపతనం అని పేరు పెట్టి, వీర్యం వలన పుత్రులు పుట్టారని చెప్పుకునేవారు. అప్సరసలను చూడగానే ఇంద్రియ స్ఖలనం జరిగితే అదేదో తప్పు జరిగి తమ తపోఫలం నశించిందని బాధపడేవారు.

మునులకు, రాజులకు తమ భార్యలపై ఉన్నంత అనుమానం ఏ ఇతర నాగ, రాక్షస, యక్ష, గంధర్వ జాతుల్లోనూ కనబడదు. సప్తర్షులలో ఆరుగురు తమ భార్యలను అనుమానించి వదిలేస్తే వాళ్లు కృత్తికలైనారు. నలుడు దమయంతిని, రాముడు సీతను అనుమానించి పంచభూతాలు సాక్ష్యం చెబితేనే నమ్మారు లోకాపవాద భీతితో. భార్యలకన్నా వాళ్లకు లోకం, ధర్మం గొప్పవి.

చాలా వివాహాలు– ముఖ్యంగా మునులవి, రాజులవి– ముసలి మొగుడు–పడుచు పెండ్లాం రీతిలో ఉండేవి. అందుకే మగవాళ్లను అనుమాన పిశాచం వెంటబడి వేధిస్తూనే ఉండగా పంచభూతాలో, ఆకాశవాణో సాక్ష్యం పలికితేనే కాస్త మగ మహరాజులు శాంతించేవారు.

మునులకు తమ శిష్యులెక్కడ గురుపత్నులను లొంగదీసుకుంటారో అన్న భయం ఎక్కువ ఉండేది. అందుకనే గురుపత్నీ సంగమం మహాపాపం –అన్న నిబంధన గట్టిగా అనేకసార్లు చెప్పబడింది భారతంలో.

ఆడపిల్ల రజస్వల కాగానే ప్రతినెలా ముఖ్యమైనదిగా భావించబడేది. అప్పటికే పెండ్లయిన కన్యతో భర్త సంగమించక పోవడం భ్రూణహత్యతో సమానంగా భావించేవారు. పెండ్లి కాకముందు సంతానాన్ని కనడం అది పెద్ద తప్పు. పెండ్లి అయినాక సంతానాన్ని కనకపోతే అది పెద్ద లోపంగా భావించబడేది.

ఇంటికి వచ్చిన అతిధికి యజమానురాలి సేవ ఎంతో ముఖ్యం ఆ కాలంలో. దేవర న్యాయం (సోదరుడి భార్యతో కలవడం) సమాజం అంగీకరించింది చానాళ్లు. క్షత్రియులు యుద్ధంలో మరణించినా, సంతాన హీనులైనా వారి భార్యలతో పురోహితులు లేదా మునులు, సద్బ్రాహ్మణులుసంగమించి సంతానం కనేవారు.

యయాతి తన కుమార్తె మాధవిని గాలవుడనే మునికి ఇవ్వగా అతడు గురుదక్షిణ చెల్లించేందుకు ఆమెను రెండు వందల గుర్రాలకు ఒక్కో రాజు వద్ద ఒక్కో సంవత్సరం ఉంచి ముగ్గురు రాజులకు పుత్ర సంతానాన్ని, తనకు 600 గుర్రాలను సంపాదించుకున్నాడు. మిగతా 200 గుర్రాలు దొరకక తన గురువైన విశ్వామిత్రుడికి మాధవిని ఇవ్వగా విశ్వామిత్రుడికి అష్టకుడనే కొడుకును కన్నదామె ఒక సంవత్సరం అతడితో ఉండి. విశ్వామిత్రుడన్నాడు– "మొదటే ఈమెను నా దగ్గరకి తీసుకుని వచ్చి ఉంటే 800 గుర్రాల గురుదక్షిణ ఇచ్చినట్లు భావించేవాడిని".

మునులకు అప్సరసలకు పుట్టిన సంతానం అనాధలయ్యేవారు. మునులు తపోవనానికి, అప్సరసలు ఆకాశానికి వెళ్లిపోయేవారు. అనాధ శిశువులను పక్షులో, మునులో (శకుంతల), రాజులో (కృప, కృపి) కాపాడి పెంచేవారు. సతీ సహగమనం గొప్ప ఆచారమైనా సడలింపులు వచ్చాయి.

కాలంలో వచ్చిన మార్పులు ఆచారాలుగా, విధులుగా చెప్పబడిన ధర్మాలు, ఆశ్రమాలు, మరణానంతర క్రియలు, పాప పుణ్య ఫలితాలు ఇవన్నీ శాంతిపర్వం, అనుశాసనిక పర్వంలో చెప్పబడినాయి. కొన్ని భారతాలలో విరాట, అనుశాసనిక పర్వాలు లేవు. కొన్నిటిలో ఉపాఖ్యానాలు లేవు. కొన్ని యుద్ధషట్కంతో ముగుస్తాయి. కొన్నిటికి హరివంశం (ఖిల పర్వం) కలిసింది. ఇలా అనేక రకాలుగా వివిధ భారతాలున్నాయి.

తెలుగు మహాభారతం (కవిత్రయ శ్రీమదాంధ్ర మహాభారతం) 1053–1353 A.D. మధ్యకాలంలో వ్రాయబడింది.

## తెలుగు మహాభారతంలో లేని ఘట్టాలు:

- వ్యాస–వినాయక ఘట్టం, వ్యాస ఘట్టాలు
- జరాసంధ వధ–రెల్లు పరకను శ్రీకృష్ణుడు చీల్చడం
- ద్రౌపదీ వస్త్రాపహరణంలో శ్రీకృష్ణుడి పాత్ర
- వనవాసంలో దుర్వాసుడు–అక్షయపాత్ర
- విరాటుని కొలువులోకి వెళ్లేముందు దుర్గాస్తుతి చేస్తాడు ధర్మరాజు.
- అజ్ఞాతవాస కాలంలో విరాటుని కొలువులోకి పాండవులు మారువేషాలలో వరుసగా– కంకుభట్టు, వల్లవుడు, సైరంధ్రి (అంతఃపురంలోకి), తంత్రీపాలుడు, బృహన్నల, నకులుడు –ప్రవేశిస్తారు సంస్కృత భారతంలో; తెలుగు భారతంలో– ధర్మజ భీమ అర్జున నకుల సహదేవులు ఆఖరున ద్రౌపది వచ్చినట్లు వ్రాయబడింది.
- జీమూతమల్లుడిని భీముడు వధించినట్లు స్పష్టంగా వ్రాయబడింది సంస్కృత భారతంలో. తెలుగు భారతంలో– ఓడించినట్లు వ్రాసారు.
- దక్షిణ గోగ్రహణం సప్తమినాడు, ఉత్తర గోగ్రహణం అష్టమినాడు జరిగినట్లు సంస్కృత భారతంలో (అష్టమి, నవమి నాడు జరిగినట్లు తెలుగు భారతంలో) వ్రాయబడి ఉన్నది.
- విరాటుడు విసిరిన పాచికలు ముఖానికి తగిలి ధర్మరాజు ముక్కు వెంబడి రక్తం కారగా ద్రౌపది ఆ రక్తాన్ని నీటిపాత్రలో పట్టుతుంది. (నుదుటికి గాయం కాగా తన చెంగుతో ఒత్తి పట్టిందని తెలుగు భారతంలో వ్రాసారు).
- పాండవులడిగిన అయిదూళ్లు– అవిస్థలం, వృకస్థలం, మాకంది, వారణావతం, ఇంకేదైనా ఊరు. (తెలుగులో అవి కుశస్థలం, వృకస్థలం, వాసంతి, వారణావతం, ఇంకొకటిగా మారాయి).
- కృష్ణుడు దుర్యోధనుడికి లక్ష నారాయణ సేననిచ్చాడు (తెలుగు భారతంలో అది పదివేలకు తగ్గింది).
- భీష్మపర్వంలోని భగవద్గీత – తెలుగు పద్యాలలో సంక్షిప్తీకరించబడింది.
- విరాటుడి మొదటి కుమారుడు శ్వేతుడి మరణం తెలుగు భారతంలో లేదు.
- స్త్రీ పర్వంలో ధృతరాష్ట్రుడు ధర్మరాజు నడుగుతాడు– మొత్తం ఎంతమంది చనిపోయారని. ధర్మరాజు చెబుతాడు– 166 కోట్ల 20 లక్షల మంది చనిపోయారు. 24,165 మంది జాడ తెలియడం లేదు –అని. (తెలుగు భారతంలో– ఆ సంఖ్య 76 కోట్ల ఇరవై వేలమందిగా, ఇతరులు 24320 మందిగా మొత్తం 76,00,44,320 – మృతుల సంఖ్య).

ఇలా కొన్ని తేడాలు కనిపిస్తాయి. తెలుగు భారతంలో విరాట పర్వంలోని పద్యాలు పరమాద్భుతంగా ఉంటాయి. తిక్కన నాటకీయ శైలి అతిలోకంగా, అపురూపంగా ఉంటుంది. నన్నయ, తిక్కన, ఎర్రాప్రెగ్గడలు శ్రీ మదాంధ్ర మహాభారతాన్ని అపూర్వ రీతిలో అనుసృజించారు.

తెలుగు భారతంలో అక్కడక్కడా వచ్చే ఖాళీలు, సందేహాలు సంస్కృత భారతంలో తీర్చబడతాయి. రెండింటిని చదివిన వాళ్లు ధన్యులు.

**భారతం పరమం పుణ్యం భారతే వివిధాః కథాః**
**భారతం సేవ్యతే దేవైః భారతం పరమం పదమ్**

❖❖❖❖❖



# శ్రీ ప్రసాద మహాభారతము
# విశేష వ్యాఖ్యానము

## విషయ సూచిక


1. యది హాస్తి తదన్యత్ర యన్నే హాస్తి న తత్ క్వచిత్ .......... 781
2. ఋగ్వేదం నుంచి అయిదో వేదం వరకూ ఆ తరువాత-.... 782
3. సహదేవుడి నవ్వు ............................................. 786
4. ఎంతమంది చనిపోయారు మహాభారత యుద్ధంలో? ....... 787
5. కాలగణనం ..................................................... 789
6. మహాభారత రచనాకాలం...................................... 791
7. మహాభారతం - మానవుల వలసలు ........................ 794
8. ఇలియాడ్‌కు మహాభారతానికి ఉన్న పోలికలు................ 800
9. పంచతంత్రంలోని మూడు చేపల కథ మహాభారతంలో..... 803
10. 'గీత'లెన్ని? ................................................... 803
11. ధర్మరాజును ఆక్షేపించిన చార్వాకుడు, ముంగిస ........... 804
12. భారతంలో కుక్క............................................. 804
13. ధర్మరాజును మూడుసార్లు పరీక్షించిన యమధర్మరాజు .... 805
14. దూర తీరాలు ................................................ 805
15. అయిదూళ్లు - సూదిమొన.................................. 806
16. అస్త్రం - శస్త్రం ................................................ 806
17. ఎవరి శంఖము వారు ఊదుట ............................. 806
18. మేరు - అరారత్ - ఒలింపస్ పర్వతాలు ................. 806
19. జలప్రళయం.................................................. 807
20. మహాభారత కావ్యం - ఇతర కావ్యాలు.................... 808
21. వైదిక - గ్రీకు - రోమన్ దేవతలు .......................... 808
22. ఎవరికోసం ఈ భారతం? ..................................... 810
23. భారతమొక పారిజాత వృక్షం ................................ 810
24. యుద్ధ వ్యూహాలు ............................................. 812
25. బ్రహ్మ.......................................................... 812
26. ప్రజాపతులు .................................................. 812
27. మనువులు .................................................... 814
28. అవతారాలు - ఏకవింశతి అవతారాలు .................... 815
29. సూర్యవంశం.................................................. 816
30. చంద్రవంశం.................................................. 816
31. యదువంశం.................................................... 817
32. కొన్ని విశేషాలు ............................................. 819
33. పురాణాలు .................................................... 820
34. ఇతిహాసాలు.................................................. 820
35. వైవస్వత మన్వంతరం - ముఖ్య సంఘటనలు ............. 821
36. పదిమంది గ్రీకు వీరులు - భారత వీరుల పోలికలు ...... 824
37. భారతంలో సైన్సు ........................................... 827
38. భారతంలో లేని భారత కథలు ............................. 833
39. స్త్రీల స్వేచ్ఛపై పరిమితులు................................ 840
40. ప్రతిజ్ఞలు, వరాలు, శాపాలూ... ............................ 840
41. కుండక - గోలకులు......................................... 842
42. రామరావణ యుద్ధం - కౌరవ పాండవ యుద్ధం.......... 842
43. భారత, భాగవతాలను ఎవరు వ్రాసారు? ఎవరు చెప్పారు?... 843
44. నదులు - మానవుల ప్రేమగాథలు ......................... 843
45. అష్ట వసువులు - మిడియా పుత్రులు ...................... 844
46. కౌరవ - పాండవ - నాగ - రాక్షస - దేవ బాంధవ్యాలు 844
47. కౌరవులు - పాండవులు - కొన్ని విశేషాలు ............... 846
48. కర్ణుడి భార్యలెందరు? ఎవరు?............................. 847
49. భారత యుద్ధంలో ఎవరు ఎవరిని చంపారు? ............. 848
50. వననిధి లాంటి సేన గోష్పాదమంత చిన్నది యయ్యెన్ .... 849
51. అతిరథ, మహారథ, అర్ధరథులు ............................ 850
52. మహా యుద్ధాలు............................................. 851

53. మహాభారతం ........ 851
54. అప్సరసలు (Nymphs) ........ 852
55. స్త్రీలు – కాలరేఖ ........ 852
56. తండ్రి పోలికలు (Father's Syndrome) ........ 852
57. స్వయంవరాలు – పర్యవసానాలు ........ 852
58. ఇలియాడ్, ఒడిస్సీ / భారత-రామాయణాలు ........ 853
59. నూరుగురు కౌరవులు – తాబేలు శాపం ........ 854
60. ఉపరిచర వసువు – యాదవులు ........ 854
61. ఉపరిచర వసువు – అశ్వమేధ యాగం ........ 855
62. అక్రూరుడు – శ్రీకృష్ణుడు ........ 856
63. కంసుడెవరు? ........ 856
64. యాదవులు ........ 857
65. యాదవ రాజ్యములు ........ 858
66. సైన్సు – పురాణం ........ 858
67. అనేక భారత కావ్యాలు – శ్లోక సంఖ్యలు ........ 859
68. ఇండోనేషియా భారతంలోని కొన్ని విశేషాలు ........ 860
69. జైమిని భారతం ........ 862
70. రాజ్మనామా (Razmnama) - Book of War ........ 863
71. కన్నడ భారతం ........ 863
72. భిల్ల భారతం ........ 863
73 బెంగాలి భారతం ........ 864
74. ఒరియా భారతం ........ 864
75. స్నేహధర్మం-శత్రుభావం ........ 864
76. స్త్రీ – నలుగురు భర్తలు ........ 864
77. ప్రమీలార్జునీయం అను అర్జున-అయిలి ప్రేమగాథ ........ 865
78. ద్రౌపది – సుభద్ర ........ 865
79. కృష్ణార్జున యుద్ధం ........ 865
80. నర – నారాయణులు ........ 865
81. ద్వారావతి – ద్వారక ........ 866
82. శచీదేవి – ద్రౌపది ........ 867
83. ధర్ముడు-యక్షుడు-హంస లేక కొంగ-మూడు పరీక్షలు... 867
84. భారత పరమార్థం – భారత సావిత్రి ........ 868
85. భారతంలోని పాత్రలు – వైవిధ్య విశేషాలు ........ 868
86. మహాభారతం వలన ప్రసిద్ధికెక్కిన నుడికారాలు, పలుకుబడులు 907
87. మహాభారతం – ఛందో విషయాలు ........ 907
88. భారత కథ ........ 913
89. హిందూ – గ్రీకు – రోమన్ దేవతలు ........ 918
90. భారతం – మరో దృక్కోణం ........ 919
91. మన్వంతరాలు – మనువులు ........ 923
92. మనువులు – వారి సంతానం ........ 925
93. చంద్రవంశం ........ 930
94. చంద్రగుప్త మౌర్యుడి కాలం నుంచి వెనక్కి కాలరేఖపై .... 932
95. హిందూ దేవతలు – రూపురేఖలు ........ 935
96. కాలరేఖ (సంవత్సరాలలో) ........ 938
97. భారతదేశం – లిపులు ........ 941
98. హిందూ మతం ........ 943
99. వర్ణ సంకరం ........ 947
100. విష్ణువుకు ఇష్టమైన పూలు ........ 948
101. యమలోక నరకయాతనలు ........ 948
102. గ్రీకుల నదీ దేవతలు ........ 949
103. స్నేహాలు, బాంధవ్యాలు, శత్రుత్వాలు ........ 951
104. బైబిల్ – కాలరేఖ ........ 954
105. కాల గణనం ........ 955
106. మరో ప్రపంచం ........ 955
107. నేటి యుద్ధాల నీడలు – గత యుద్ధాల జాడలు ........ 957
108. ఎవరు నీవు? ఎక్కడ నుంచి వచ్చావు? ........ 962
109. భాషా పరిణామం ........ 965
110. లిపి ........ 966
111. ఆది దంపతులు ........ 966
112. Out of India ........ 966
113. వ్యాస విరచిత భారతంలోని కొన్ని విశేషాలు-ఊహాగానాలు 967
114. మహాభారత గ్రంథంలో విమర్శలకు దారితీసే అంశాలు 969
115. ప్రజాపతి – Progenitor ........ 969
116. సృష్టి పరిణామ క్రమం (సంవత్సరాలలో) ........ 971



# ✤ విశేష వ్యాఖ్యానము ✤

## 1. యది హాస్తి తదన్యత్ర యన్నే హాస్తి న తత్ క్వచిత్

**ధర్మేచ అర్థేచ కామే చ మోక్షేచ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్-**

ధర్మార్థ కామ మోక్షాలకు సంబంధించి భారతంలో ఉన్న విషయాలు ఇంకెక్కడైనా ఉండవచ్చు కాని, దీనిలో లేని విషయం మరెక్కడా ఉండదు. ఇది క్రీస్తుశకం 2024వ సంవత్సరం. ఈ కళ్లతో భారతాన్ని ఎలా చదవాలి, ఎలా చూడాలి, ఎలా అర్థం చేసుకోవాలి? అనే ప్రశ్నతో మొదలైన జిజ్ఞాస ఇప్పుడీ పుస్తకరూపం దాల్చింది. వ్యాసుడి 'జయం' కావ్యాన్ని నారదుడు దేవలోకంలో, దేవలుడు పితృలోకంలో, సుమంతుడు గరుడ గంధర్వ లోకంలో, శుకుడు సర్పలోకంలో, వైశంపాయనుడు మానవలోకంలో చెప్పటం ద్వారా అన్ని లోకాల్లోనూ వ్యాప్తి చెందింది. వైశంపాయనుడు ఈ మహాభారత కథను జనమేజయుడికి చెప్పగా రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు అనే సూతుడు విన్నాడు. (సూతుడు- రథసారథి లేదా కథకుడు; అతిరథుడు, సంజయుడు, దారుకుడు, మాతలి -వీళ్లందరూ పేరొందిన రథసారథులు. కృష్ణుడు, శల్యుడు, ఉత్తరుడు, ఇలాంటి వారు ఆపద్ధర్మ సారథులు. కీచకులు కూడా సూతులని పిలవబడినారు). ఉగ్రశ్రవసుడు తాను విన్న భారత కథకు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు చేర్చి నైమిశారణ్యంలో శౌనకాది మునులకు సత్రయాగ సమయాన చెప్పినాడు.

శ్రీకృష్ణ నిర్యాణం క్రీస్తుపూర్వం 3,102లో జరిగిందని దానికి 36 సంవత్సరాలకు పూర్వం అంటే 3138లో పద్దెనిమిది రోజుల పాటు, అమావాస్య నాడు మొదలై పద్దెనిమిది అక్షౌహిణీల సైన్యం నశించిపోగా మిగిలింది పంచపాండవులు, శ్రీకృష్ణుడు, సాత్యకి, యుయుత్సుడు, కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ మాత్రమే. ఈ మహాభారత యుద్ధం క్రీస్తుపూర్వం 1328వ సంవత్సరంలో జరిగిందని శ్రీ వేదవ్యాస్ గారు కొన్ని ఋజువులు చూపించారు. సముద్రగర్భంలో మునిగిన ద్వారక అవశేషాలు మహాభారత యుద్ధం కల్పన కాదు వాస్తవమని నమ్మేవారికి గొప్ప ఆధారాన్నిచ్చాయి.

వేదవ్యాస విరచిత సంస్కృత మహాభారతంలో ప్రధాన పర్వాలు 18; ఉపపర్వాలు 100 (హరివంశం, భవిష్యపర్వంలతో కూడి), లక్ష శ్లోకాలతో విరాజిల్లగా, కవిత్రయమైన నన్నయ, తిక్కన, ఎర్రనల ఆంధ్రభారతం 18 పర్వాలు, 63 ఆశ్వాసాలు, 21507 గద్య పద్యాలతో అందరి మన్ననలను పొందింది. 3093 పద్య గద్యాలతో శాంతిపర్వం పెద్దదిగా, 79 గద్య పద్యాలతో మహాప్రస్థానిక పర్వం చిన్నదిగా ఉన్నాయి.

నన్నయభట్టు (1022-1063) తూర్పు చాళుక్యరాజైన రాజరాజనరేంద్రుని ఆస్థానంలో ఉంటూ 1053-1061 (క్రీస్తుశకం) కాలంలో ఆది, సభాపర్వములు, అరణ్య పర్వములో కొంతభాగము వ్రాసినాడు. తిక్కనామాత్యుడు (1205-1288) నెల్లూరు మనుమసిద్ధి రాజుకు మంత్రిగా ఉంటూ, కాకతీయ గణపతిదేవుడి కాలంలో కాకతీయుల సాయంతో మనుమసిద్ధి పోగొట్టుకున్న రాజ్యం పొందేలా చేసాడు. విరాటపర్వం నుంచి మొత్తం 15 పర్వాలు పూర్తి చేసాడు. ప్రొలయ వేమారెడ్డి (1325-1353) కాలంలో ఉన్న ఎర్రాప్రెగ్గడ నన్నయభట్టు అసంపూర్తిగా వదిలినది, తిక్కన పూర్తి చేయనిది అయిన అరణ్యపర్వ శేషాన్ని తెనిగించాడు.

తిరుమల తిరుపతి దేవస్థానం కవిత్రయ విరచిత మహాభారతాన్ని వ్యాఖ్యాన సహితంగా ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు ప్రధాన సంపాదకులుగా 2005లో 15 సంపుటాలుగా మహాభారతాన్ని ప్రచురించింది.

దాదాపు 70 భాషలలోకి అనువదించబడిన వ్యాసభారతం ప్రపంచ ఇతిహాసాలలో అతిపెద్ద కావ్యంగా కీర్తించబడింది. లక్ష శ్లోకాలతో, పదునెనిమిది లక్షల పదాలతో, రామాయణానికి నాలుగురెట్లున్న మహాభారతం అయిదవ వేదంగా ప్రసిద్ధికెక్కింది.

1919లో మొదలై 1259 వ్రాత ప్రతులను పరిశీలించి చేసిన నలభై ఏడేళ్ల కృషి ఫలితంగా 1966లో 89,000 శ్లోకాలతో 13,000 పేజీలు, 19 సంపుటాలుగా అధికారిక మహాభారతం వెలువడింది- సుక్తాంకర్, బెల్వాల్కర్, యస్.కె. డే, దండేకర్ల సంపాదకత్వంలో (మహాభారత- పూనా ఎడిషన్).

అరవిందుడు 1890-1940 మధ్యకాలంలో రురుడు-ప్రియంవదల ప్రేమ-మృత్యువు, పురూరవ-ఊర్వశిల ప్రణయగాథ ఊర్వశి, సత్యవంతుడు-సావిత్రిల కథ సావిత్రిని ఆంగ్ల భాషలో వ్రాసినాడు.

అక్బర్ చక్రవర్తి (1556-1605) అల్-బదయూని, ఫైజి నేతృత్వంలో రాజ్‌మనామా-యుద్ధచరిత్రగా పర్షియన్ భాషలోకి చిత్రాలతో సహా వ్రాయించాడు మహాభారతాన్ని.

తమిళంలో పెరుందేవనార్ (9వ శతాబ్దం) భారత వెంబగా భారతాన్ని, విల్లి పుతురార్ (14వ శతాబ్దం) భారతాన్ని తమిళంలోకి అనువదించినారు. తెలుగు కవిత్రయం 200 సంవత్సరాల కాలవ్యవధిలో ఆంధ్ర మహాభారతాన్ని అనువదించారు. నారాయణప్ప (కుమార వ్యాసుడు) కన్నడంలోకి భారతాన్ని అనువాదం చేసినాడు.

భిల్లుల దృష్టికోణంలో ప్రాచుర్యంలో ఉన్న భిలి భారతంలో నాగులదే పైచేయిగా కనిపిస్తుంది, పాండవులు పరాజితులైనట్లుగా.

పదహారవ శతాబ్దంలో కవీంద్ర పరమేశ్వర్, శ్రీ సంజయ్‌లు భారతాన్ని బెంగాలీ భాషలోకి అనువదించారు.

ఇంగ్లీషులోకి- కిసారి మోహన్ గంగూలి (1883-1896), ఎం.ఎన్. దత్, రొమేష్ చందర్ చత్ (1898), పి. లాల్ (2005-2010), శ్రీపాద దామోదర్ సత్వాలెకర్- శ్రుతిశీలశర్మ, బిబేక్ దేబ్‌రాయ్, J.A.B. Van Buitenen - James L. Fitzgerald, etal, రమేష్ మీనన్, విలియం బక్, ఆర్.కె. నారాయణ్, సి. రాజగోపాలచారి, కమలా సుబ్రమణియం, కె.ఎం. మున్షి, కృష్ణధర్మ, రమేష్ దత్, భరద్వాజ శర్మ, John D. Smith, Raron Maas లు అనువాదం చేసారు.

తమిళంలో వీధి నాటకాలుగా తెరైకుట్టు, కట్టైకుట్టు ద్రౌపది కష్టాల ఆధారంగా వ్రాయబడినవి.

ఇండొనేషియాలో - జావా - కకావిన్ భారతయుద్ధం - ధర్మ వంగ్యప్రభువు (990-1016) కాలంలో వ్రాయబడింది. 'కావి' శైలిలో బాలి ద్వీపంలో మహాభారతం ప్రాచుర్యంలో ఉన్నది.

మహాభారతం వ్రాతప్రతులలో Pune Manuscript (భండార్కర్ ఓరియంట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్నది) - నేపాల రాజ గ్రంథాలయంలో ఉన్న Nepal Royal Copy (14వ శతాబ్దం) శారద లిపిలో వ్రాయబడిన వ్రాతప్రతులు ముఖ్యమైనవి.

మహాభారత వ్యాఖ్యాన గ్రంథాలలో దేవబోధుని జ్ఞానదీపిక క్రీస్తుశకం 13వ శతాబ్దం నాటిది. నీలకంఠుడి భావదీపం క్రీస్తుశకం 1700 నాటిది. వ్యాసుడి భారతాన్ని అనితరసాధ్యంగా ఆంధ్రీకరించి, అనుసృజన చేసిన కవిత్రయం క్రీస్తుశకం 1050-1350 నాటికే ప్రసిద్ధికెక్కినారు. అందుకే శ్రీమదాంధ్ర మహాభారతం అంత గొప్పది, అద్వితీయమైనది కూడా.

## 2. ఋగ్వేదం నుంచి అయిదో వేదం వరకూ ఆ తరువాత-

**ధర్మేచ అర్థేచ కామే చ మోక్షేచ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్-**

భారతంలో ప్రసిద్ధికెక్కిన వాక్యమిది. వ్యాసమహర్షి చెప్పినది. ఇది జ్ఞానం. ఋషులకు సంబంధించిన జ్ఞానం ఆర్ష జ్ఞానము. వేదం. వేదమనేది సత్యవాక్యమూహమైన జ్ఞానం. 'మంత్ర బ్రాహ్మణ యోర్వేద నామధేయమ్ వేదమ్'- అన్నాడు ఆపస్తంభుడు. శ్రుతి, అనుశ్రవం, త్రయి, ఆమ్నాయం, సమామ్నాయం, ఛందం, స్వాధ్యాయం, ఆగమం, నిగమం ఇలా తొమ్మిది పేర్లున్నాయి వేదానికి.

వేదజ్ఞానానికి కాలనిర్ణయం కుదరదు. ఆవిర్భవిస్తూ, అంతర్ధానాన్ని పొందుతూ నిత్యనూతన శబ్దరాశిని పొందుతుంది వేదం - కాలంతో పాటు ప్రవహిస్తూ. స్రోతస్విని, అమృత శ్లోకస్విని. సరస్వతి నది లాంటిది.

'ఋచ్యతే స్తూయతే దేవతలూ యయాసా ఋక్' - ఋక్ అనగా స్తుతి. పాదబంధంతో, వృత్తబంధంతో ఉండి అర్థయుక్తమైన మంత్రం- 'ఋక్' అనబడుతుంది.

మంత్రాః మననాత్ అని యాస్కుడు, విహితార్థాభి ధాయకః మంత్రః అని కొందరు మంత్రాల కర్థం చెప్పినారు. వేదమంత్రాల్లో ఉండే అచ్చులకు ఉచ్చారణను బట్టి మూడు రకాల స్వరాలుంటాయి- ఉదాత్త, అనుదాత్త, స్వరితాలు. అక్షరానికి పైన నిలువుగీత ఉంటే స్వరితం; కింద అడ్డగీత అనుదాత్తం; ఏ గీతాలేనిది ఉదాత్తం.

సూక్తము లేదా సూక్తి అంటే మంచి మాట. అవి నాలుగు రకాలు ఋషి, దేవత, ఛందస్సు, అర్థ సూక్తములు వశిష్ఠుడు (104), భరద్వాజుడు (59), విశ్వామిత్రుడు (46), వామదేవుడు (46), గృత్సమదుడు (39), దీర్ఘతముడు (25), అగస్త్యుడు (24), గోతముడు (21) - ఇంకా ఎంతోమంది మునులు రచించారు వేదసూక్తాలు.

దేవతా సూక్తాలు – దేవతలను వర్ణిస్తాయి. ముఖ్య దేవతలు ఇంద్రుడు, అగ్ని, సోముడు, అశ్వినీ దేవతలు, మరుత్తులు, వరుణుడు, ఉషస్సు, సూర్యుడు, సవిత, పూషుడు, విష్ణువు, బృహస్పతి, రుద్రుడు, యముడు, ద్యావాపృథువులు.

ప్రేతాత్మల సామ్రాజ్యానికి అధిపతి యముడు. అగ్ని సంస్కారం పొందిన జీవుడిని పెద్దపెద్ద ముక్కులు, నాలుగు కళ్లు కల రెండు కుక్కలు (నరకలోకపు జాగిలాలు) యమలోకానికి చేరుస్తాయి. యముని తల్లిదండ్రులు శరణ్య–వివస్వంతులు. యముడి వార్తాహరుడు గుడ్లగూబ (ఉలూకము). మహాభారత యుద్ధం ముందు ఉలూకుడి రాయబారమొక సంకేతం. యముడు కుక్కగా తన కుమారుడిని అనుసరించడం స్వర్గారోహణ ఘట్టం.

అశ్విని దేవతలకు చాలాకాలం హవిర్భాగాలు ఉండేవి కాదు. వీరు స్వర్గలోక వైద్యులు. చ్యవన మహర్షికి యవ్వనాన్నిచ్చి అతడి సాయం పొందారు. దానితో అప్పటివరకు వారిని చిన్నచూపు చూసిన ఇంద్రుడు స్వయంగా అంగీకరించి వారికీ యజ్ఞభాగం అందేట్లు చూసిన విషయం మహాభారతంలో చెప్పబడింది.

ఛందస్సు అనే పదం ఛద్–ఆహ్లాదం అనే ధాతువు నుంచి వచ్చింది. ఛందస్సు అంటే మనసుకు ఆహ్లాదం కలిగించే వాక్యాల సమూహం. వేద పురుషునికి ఛందస్సు పాదాలు.

మహర్షులు తాము దర్శించిన ఒకే ఒక సత్పదార్థం పరబ్రహ్మను 'సుపర్ణమనే' పక్షి రూపంలో దర్శించారు. అందుకే భగవానుడికి వాహనంగా, ఆత్మగా, యజ్ఞవాటికకు రూపంగా సుపర్ణుడైన గరుత్మంతుడిని దర్శిస్తారు మునులు. పర్షియన్ల కాలంలో 'సుముర్గ్' అని పరమాత్మను పిలిచేవారు ద్రష్టలు. జీవుల దేహంలో పురుషుడిగా, హంసగా, పౌరుడిగా (సర్వాసు పూర్షు పురిశయః) ఉన్న పరమాత్మ ప్రభావాన్ని తెలిపేవి యజ్ఞాలు.

ఋతతత్త్వం విశ్వమానవ కళ్యాణానికి సంబంధించినది. వేదంలో ఋతం జరాతుష్ట్ర విరచిత అసురవేదం అవెస్తాలో 'ఆశ'గా పేర్కొనబడింది. 1) యజ్ఞప్రక్రియ (సత్యం, జలం, రాశిచక్రం), 2) విశ్వక్రమం, 3) నైతిక క్రమం – ఈ మూడిటి సక్రమ ధర్మం ఋతం. లోకంలో ఋతాన్ని నడిపేది వరుణుడు, ఆదిత్యులు.

వేదవ్యాసుని ద్వారా ఋగ్వేదాన్ని మొదట అధ్యయనం చేసినవాడు పీల కుమారుడు పైలుడు. యుధిష్ఠిరుడు రాజసూయం చేసినప్పుడు వ్యాసుడితడిని రాజసూయ యాగ హోతగా– "పైలో హోతా వసోః పుత్రో ధౌమ్యేన సహితో భవత్"– నియమించాడు.

పైలుడు ఋగ్వేదాన్ని ఇంద్రప్రమతికి బాష్కలునికి ఉపదేశించగా, ఇంద్రప్రమతి బోధించాడు మండూకేయునికి, మండూకేయుడు సత్యశ్రవునికి, సత్యశ్రవుడు సత్యశ్రీకి, సత్యశ్రీ శౌకల్యుడు, శాకపూణి, భారద్వాజులకు; శాకల్యుడు– ముద్గల, గాలవ, గ్వాలీయ, వాత్స్య, శైశిరులకు బోధించారు. బభ్రుడనే పేరుగల గాలవుడు పాంచాల దేశంలో ఋగ్వేదాన్ని ప్రచారం చేసాడు. మహాభారతంలో గాలవుని ప్రసక్తి అనేకసార్లు వస్తుంది.

వేదవ్యాసుడు ఒక కుప్పగా ఉన్న వేదరాశిని ఋక్కులు, యజస్సులు, సామలుగా, అధర్వ మంత్రాలుగా విడదీసి వేర్వేరుగా కూర్చినాడు. ఈ కూర్చడానిని 'సంధానం' అని, కూర్పును సంహిత అని అంటారు. వీటిలో పైలుడికి ఋగ్వేదం, వైశంపాయనుడికి యజుర్వేదం, జైమినికి సామవేదం, సుమంతుడికి అధర్వణ వేదాన్ని ఉపదేశం చేసాడు వేదవ్యాస మహర్షి.

దేవపూజకు దేవతలకు హవిస్సులను సమర్పించడానికి ఉపయోగించే మంత్రమే యజుస్సు. చందో బంధమే కాని గానానికి అనుకూలంగా ఉండదు. ఋగ్వేదం సింధునదీ తీరంలో ఏర్పడింది. యజుర్వేదం మనువు చేత బ్రహ్మావర్తమని ప్రశంసించబడిన కురుక్షేత్రంలో సరస్వతి, దృషద్వతి నదుల దగ్గర మొదలై యమున వరకు వ్యాపించింది.

ఋగ్వేదానికి ఉపవేదం ఆయుర్వేదం. యజుర్వేదానికి ఉపవేదం ధనుర్వేదం.

మత కర్మకాండలకు పనికి వచ్చేది యజ్ఞం.యజ్ఞమే బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, సకల దేవతలు. యజ్ఞవేదిక దేవేంద్రుని స్వారాజ్యపీఠం. అగ్నికి బంగరు సింహాసనం, సోమునికి విలాస భవనం. వరుణునికి విశ్రాంతి స్థానం. దేవగణాలకు దివ్యక్షేత్రం. కర్మరులకు స్వర్గ సోపానం– యజ్ఞం.

రావి, జువ్వి కర్రలతో రాపిడి చేసి అగ్నిని పుట్టించే సాధనం అరణి. అగ్ని మూడురకాలు దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని, ఆహవనీయాగ్ని. నెయ్యి, పాలు, పెరుగు, సోమరసం, వప గుండెకాయకు దగ్గరగా ఉండే చర్మపుముక్క హవిస్సులు.

అగ్నిష్టోమం, జ్యోతిష్టోమం, వాజపేయం, పౌండరీకం, రాజసూయం, వైష్ణవం, అశ్వమేధం ప్రసిద్ధ యాగాలు. దీర్ఘకాలం  చేసేవి సత్రయాగాలు.

పురోడాశం అంటే చలిమిడి, పాయసం లాంటివి; సోమపానం (తిప్పతీగ, కాడ చెముడు) సోమలత రసం; సోమపానం చేసే యజమానిని సోమపీథి అంటారు. పశ్వాలంభనం –అంటే కొమ్ములు మొలవని మేకపిల్లను – యూప స్తంభం అనే కొయ్యకు కట్టి మంత్రాలు చదువుతూ వధించి ఆయా భాగాలను ముఖ్యంగా 'వప'ను అగ్నిలో వేల్చడం .

యజ్ఞం చేసిన వ్యక్తి సోమయాజి (దీక్షితులు, చయనులు, వాజపేయ యాజి, మహావ్రతయాజి ఇతర పేర్లు).

యజ్ఞ నిర్వహణకు హోత (ఋగ్వేద పండితుడు), అధ్వర్యుడు (యజుర్వేద పండితుడు) ఉద్గాత (సామవేద గాయకుడు), బ్రహ్మ (అధర్వ వేద నిపుణుడు); మూడు వేదాలు తెలిసి మిగిలిన ముగ్గురు చేసే దోషాలేవైనా ఉంటే పరిహరించగలిగి ఉండాలి బ్రహ్మ.

యజుర్వేదంలో కృష్ణ, శుక్ల యజుస్సంహితలు రెండు భాగాలు. రెండు యజ్ఞ యాగాదులు నిర్వహించడానికే తోడ్పడినా శుక్ల యజుస్సంహితలో బ్రాహ్మణ భాగాలు కలిసి ఉండక విశదమవుతాయి.

సామమంటే గానం. "గీతిషు సామాఖ్యా" –అన్నాడు జైమిని. రాగయుక్తంగా ఉండే ఋక్కులే సామసూక్తులు. సామవేదానికి ఉపవేదం గాంధర్వవేదం – నృత్యగీత వాద్యాలు (తౌర్యత్రికం), సప్తస్వరాలు, మూడు గ్రామాలు, 21 మూర్ఛనలను, 49 తానాలను ప్రతిపాదిస్తుంది గాంధర్వవేదం.

ఋక్కును సామంగా గానం చేసేప్పుడు 1) ప్రస్తావం, 2) ఉద్గీథం, 3) ప్రతిహారం, 4) ఉపద్రవం, 5) నిధనం అనే లక్షణాలుండేట్లు చూసుకుంటారు.

అధర్వ వేదం మంత్రతంత్ర సిద్ధమైనది. ఇహ లోక సుఖాలకు పనికి వచ్చేవి కనుక వేదాలలో చేరడానికి చాలాకాలం పట్టింది. మొదట్లో ఋక్, యజుర్, సామ వేదాలు వేదత్రయీగా ఉండేవి. ఆ తరువాత బ్రహ్మ అనుమతితో నాలుగవ వేదంగా అంగీకరించబడింది అధర్వవేదం.

అధర్వ వేదానికి ఉపవేదం–అర్థవేదం. దీని ననుసరించి రాజకీయ, అర్థ, కృషి, వాణిజ్య తంత్రాలను సమాజ నిర్మాణాన్ని ప్రతిపాదించే–బృహస్పతి అర్థశాస్త్రం, శుక్రాచార్యుని శుక్రనీతి, చాణక్యుని అర్థశాస్త్రం రచింపబడినాయి.

వేదంలోని మంత్రాలనే కాక అక్షరాలను కూడా లెక్కకట్టినారు.శౌనక మహర్షి లెక్క ప్రకారం ఋగ్వేదంలో ఋక్కులు 10,580, శబ్దాలు 1,53,826, అక్షరాలు– 4,32,000 (కలియుగంలోని సంవత్సరాలు– 4,32,000).

ఋక్–అంటే స్తుతి; యజుస్సు అంటే గద్యం – గద్యాత్మక్ యజుః లేదా అనియతాక్షరావసానో యజుః అని యజుస్సు నిర్వచింపబడినది. సా అంటే ఋక్కు, ఆమ– అంటే గానం; ఋక్కులను గానం చేసేది సామవేదం. శ్రీకృష్ణునికి అంగీరస మహర్షి సామవేదాన్ని గానం చేయడం నేర్పగా శ్రీకృష్ణుడు మురళిపై 1875 మంత్రాలు గానం చేసాడంటారు. అధర్వవేదం– ఐహిక ఫలాలనిస్తుంది.

ఇతి హ అస – ఇతిహాస – ఈవిధంగా జరిగిందట –అని చెప్పే కావ్యాలు ఇతిహాసాలు.

ఋగ్వేదపు ప్రాచీన గణాలు అయిదు– ద్రుహ్యు, అను, యదు, తుర్వశ, పురు – సంచారజాతులైన వీళ్లు సప్తసింధు ప్రాంతంలో కొంతకాలమున్నారు. పశువులు, గుర్రాలున్న ఆర్యుల బృందాలను గ్రామాలు అనేవారు. విశ్ అంటే ప్రజలు. ప్రజలతో కూడినది– విశ్వము. గ్రామానికి పెద్ద గ్రామణి. గోవులను రక్షిస్తాడు కనుక గ్రామణి 'గోపుడై'నాడు. గోవుల కోసం గణాల మధ్య జరిగే యుద్ధం గవిష్ఠి. గణపెద్దను రాజన్, సామ్రాట్, స్వరాట్, శాన, ఈశాన, భూపతి, ఏలిక అనేవారు. సభ, సమితి, విధాత అనేవి పాలనా సంస్థలు.

మలివేద కాలం నాటికి ఇనుము వాడకం పెరిగింది. ఋగ్వేదపు చివరి మండలంలోని పురుష సూక్తం ప్రకారం విరాట్పురుషుని శిరస్సు నుంచి బ్రాహ్మణులు, భుజాల నుంచి క్షత్రియులు, తొడల నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు జన్మించారన్న సూక్తులు ప్రచారంలోకి వచ్చాయి. అందరూ బ్రాహ్మణులే అన్న భావం నశించి వర్ణాలు ఏర్పడినాయి. విశ్– వైశ్యులైనారు. అదనపు ఉత్పత్తిని గోగణాలు, వ్యవసాయం ద్వారా సాధించి వాటిని భూసురులైన బ్రాహ్మణులకు, భూభర్తలైన క్షత్రియులకు ఇస్తే వాళ్లు దేవతలను సంతృప్తి పరచే యజ్ఞాలను, రక్షణను కల్పించేవారు. వీళ్లందరికి సేవలు చేయడానికి

వృత్తిపనివారు, యుద్ధంలో ఓడిపోయిన వాళ్లు సేవకులుగా, బానిసలుగా నాలుగవ వర్ణమైన శూద్రులైనారు. మిగతా పై మూడువర్ణాలకు మారు మాట్లాడకుండా సేవ చేయడం శూద్రుల ధర్మమై, వర్ణ సంకరం కాకుండా చూడాల్సిన బాధ్యత రాజుకు–క్షత్రియులకు అప్పగించబడింది. వర్ణ సంకరం అనులోమ, విలోమాలుగా ఉండి అయిదవ జాతిని, అంతరాని జాతిని సృజించింది వర్ణవ్యవస్థ. ఎవడు బ్రాహ్మణుడు? అనే చర్చ భారత కావ్యమంతటా జరుగుతూనే ఉన్నది.

భూమి అంతా బ్రాహ్మణులదని, దాని రక్షణభారం మాత్రమే క్షత్రియులకు అప్పగించబడిందని చెబుతూ రాజులు లేదా క్షత్రియుల సంహారం చేసి; పరశురాముడు, క్షత్రియుల మధ్య యుద్ధం జరిగి అందరూ చనిపోయాక మిగిలిన రాజుతో అశ్వమేధ యాగమో ఇంకొకటో చేయించి దానధర్మాల పేరిట రాజ్యాన్ని, ధనాన్ని గ్రహించి, మరల రాజుతోనే భూమిని సరసమైన ధరకు కొనుక్కునేట్లు చేసి ఆ ధనాన్ని ఆనందంగా స్వీకరించేవారు బ్రాహ్మణులు. వ్యాసప్రోక్త మహాభారతమంతటా, ప్రక్షిప్తాలలోనూ, ఆఖ్యానాలలోనూ అంతర్లీనంగా కనిపించే విషయం బ్రాహ్మణాధిక్యత, బ్రాహ్మణులు క్షత్రియులకు మధ్య ఉండాల్సిన స్నేహ సంబంధాలు, క్షత్రియులు యుద్ధంలో చనిపోయినపుడు, ఆపత్కాలాల్లో బ్రాహ్మణ గురువులతో మునులతో సంబంధమేర్పరచుకుని క్షత్రియ స్త్రీలు సంతానం పొందవచ్చు –అన్నదే కానవస్తుంది. ధృతరాష్ట్రుడికి వైశ్యభార్యకు పుట్టిన యుయుత్సుడు రాజ్యరక్షకుడవుతాడు కాని రాజు కాడు, పరీక్షిత్తు రాజవుతాడు. మహాభారత యుద్ధం ముగిసి, ధర్మరాజు మహాప్రస్థానానికి వెళ్లాలని నిశ్చయించుకున్నాక అర్జునుడి కుమారుడైన అభిమన్యుడి కుమారుడు పరీక్షిత్తు హస్తినాపురానికి రాజు కాగా, శ్రీకృష్ణుని మరణానంతరం అతడి మనవడు అనిరుద్ధుడి కుమారుడైన వజ్రుడు ఇంద్రప్రస్థానానికి రాజైనాడు అర్జునుడి ఆశీస్సులతో. ఆ విధంగా కురు యాదవ వంశాలు ధరిత్రి నేలినాయి.

దేవతలు, మునులు లేక బ్రాహ్మణులు, రాక్షసులు ఉన్నకాలంలో కృతయుగాంతాన దేవ దానవయుద్ధం జరిగింది. దేవతలప్పటికే ఉన్నత స్థానాన్ని అందుకోగా మానవులకు, రాక్షసులకు మధ్య యుద్ధం, త్రేతాయుగాంతాన రామరావణ యుద్ధం సంభవించింది. రాక్షసులు కేవలం ఘటోత్కచ, అలంబుసుల అనుచరులకు పరిమితం కాగా ద్వాపర యుగాంతాన భారత యుద్ధం జరిగింది మానవులైన కౌరవ పాండవుల మధ్య. కలియుగాంతాన యుద్ధం ధనికులు–పేదల మధ్యనో తెలుపు–నలుపుల మధ్యనో జరగవచ్చునని విజ్ఞుల అభిప్రాయం.

వర్ణ వ్యవస్థలోని పేర్లు తీసివేసి ప్రస్తుత ప్రపంచంలోని మనుషుల్ని వర్ణరహితంగా విభజించినా– నాలుగు గుంపులు కానవస్తారు. 1) బుర్రతో పనిచేసే మేధావులు, 2) భుజ, ధన బలంతో విజృంభించే రాజకీయ నాయకులు, అధికారులు, 3) ఊరువుల బలంతో ఊరేగే వ్యాపారస్తులు, 4) పై ముగ్గురికి రోజువారీ, నెలవారీ జీతంతో నోరు మూసుకుని పనిచేసే ఉద్యోగులు. వీళ్లు కాక ఒకప్పుడు ఎవరి లెక్కల్లోనూ లేని, ఎవరూ లెక్కించని మహిళలు, అయిదోవర్గం వారు, మరల వాళ్లలోనూ కానవచ్చే మేధావులు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు– అదే విభజన, అదే భజన; అందుకే జయం, భారతమై, మహాభారతమై, జనమేజయమై కాలాన్ని బట్టి వేదజ్ఞానం విస్తరించినట్లు, ఆనాటి భారతంలో జరిగిన సంఘటనలూ ఇప్పుడూ పునరావృతం కావడం మనం గమనిస్తున్నాము.

పేర్లు మారవచ్చు, ఊర్లు మారవచ్చు, వర్ణాలు మారవచ్చు కాని మనుషులు సమానంగా ఉండడానికి అంగీకరించరేమో. వాళ్లు ఒంటరిగా ఉన్నపుడు సమానత్వం గురించి ఆలోచించి, సమూహంగా మారగానే మేధావులు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, ఉద్యోగులుగా విడిపోవడమో, విడగొట్టబడడమో చేయబడతారు. దీనికి కారణం ఆనాడూ ఈనాడూ మేధావులేనన్నది అందరికీ తెలిసినా అప్పటికే కాలచక్రపు చట్రంలో బిగింపబడి ఉండడంతో ఎవరి ధర్మం వాళ్లు, ఎవరి కర్మ వాళ్లు చేస్తూ మహాప్రస్థానానికి చేరుకుంటారు. అన్నీ తెలిసినవాడు అంతకుముందే కాలికి బాణం ములికి తగిలి కాలం చేస్తాడు.

భవిష్యత్తు తెలియని ద్రౌపది లాంటి స్త్రీలు, భవిష్యత్తు తెలిసిన అయిదవ వర్గపు సహదేవులు, నలిగిపోయిన నాలుగవ వర్గపు నకులులు ముందే పడిపోతారు. నరుడు కూలిపోతాడు భీముడికన్నా ముందే. భీముడు పడిపోయాక అశ్వత్థామలు సృజించిన అణుశిఖరం ఎక్కిన ధర్మరాజు ఇంకా తనను వదలిపెట్టకుండా, చనిపోకుండా వచ్చిన కుక్కను చూసి ఆశ్చర్యపడతాడు. కుక్క అంటుంది– నేను నీ బుద్ధిని; నీవు మెత్తని పులివి –అని ప్రత్యక్షమవుతుంది యమధర్మరాజుగా. రథమో, విమానమో తెచ్చిన ఇంద్రుడితో కలిసి అందరూ వెళ్తారు స్వర్గానికి– అందుకే వ్యాసుడప్పుడే చెప్పినాడు– "ధర్మేచ అర్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ – యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తిన తత్ క్వచిత్" – ధర్మార్థ కామ మోక్షాలనే పురుషార్థాలకు సంబంధించిన విషయాలు ఇంకెక్కడైనా ఉండవచ్చును కాని, దీనిలో లేని విషయం మరెక్కడా ఉండదు. ఆ విధంగా తన కథను విశ్వకథగా రూపొందించినవాడు వ్యాసమహర్షి.

అతడి 'జయం', వైశంపాయనుడి భారతంగా, ఉగ్రశ్రవసుడి మహాభారతంగా రూపొందింది. ఇంకా మార్పులు చేర్పులు చెందుతూ సజీవనదిగా ప్రవహిస్తూనే ఉన్నది, ఉంటుంది.

# 3. సహదేవుడి నవ్వు

–"నీవును దప్పక నేడాదిగా ముప్పదారగునేడైన యద్దినమున నరయ దిక్కెవ్వరును లేని యగ్గలంపు కుత్సితంపు దెరంగున కూలు వాడవు. మీ వధూజనములు నేడ్చువారు పతుల సతుల బంధుల బనవి పనవి"– సరిగా ముప్పదారేళ్ల పూర్తయిన రోజున నీవు కూడా కృష్ణా, దిక్కెవ్వరూ లేని క్రూరమైన చావు చస్తావు, నీ వధూజనములు కూడా నా కోడళ్లలా విలపిస్తారు భర్తలను, కొడుకులను, బంధువులను తలచుకుని కుమిలి కుమిలి. గాంధారీ శాపం ఆ అడవిలో ప్రతిధ్వనిస్తుంటే అర్జునుడు అల్లంత దూరంలో పడివున్న అనాథ శవాన్ని చూసాడు. అంతటి వీరుడి చేతిలోని గాండీవం నేలకు జారింది. దుఃఖంతో కనులు కన్నీటితో నిండి ఉండగా ఆ మహాపురుషుడి ఎడమపాదంపై ఉన్న గాయాన్ని చూసాడు అర్జునుడు. కృష్ణుడి శరీరానికి అంత్యక్రియలు జరిపాక, వెదకగా ఇంకాస్త దూరంలో బలరాముడి పార్థివ దేహం కనిపించింది. దానికి అగ్ని సంస్కారాలు చేసాడు వెంటనే, ఎందుకంటే మరుసటి రోజు ఉదయానికల్లా ద్వారకను ముంచివేయబోతున్నది సముద్రం.

ద్వారకా వాసులను వెంటబెట్టుకుని తెల్లవారకమునుపే బయల్దేరినాడు అర్జునుడు. తెల్లవారి వెలుగులో ద్వారక మునిగి పోవడం చూసాడు. అక్కడ నుంచి బరువెక్కిన గుండెతో పంచవటము చేరుకుని అక్కడ విడిది చేసారు. ఆయుధాలను చేబట్టి ఉన్నది ఒక్క అర్జునుడే అని గమనించిన అభీర కిరాతులు యాదవజన సమూహంపై దాడిచేసి ధనరాశులతోపాటు అనేకమంది స్త్రీలను ఎత్తుకునిపోతుంటే వారిని ఆపడానికి ప్రయత్నించిన అర్జునుడికి ఏ మంత్రమూ గుర్తుకు రాలేదు, అస్త్రమూ పనిచేయలేదు. అక్షయ తూణీరాల్లో బాణాలూ అయిపోయినాయి. తన అశక్తతను కాలం అడ్డం తిరిగిందని సరిపెట్టుకుని చాలా కష్టం మీద శ్రీకృష్ణుని అష్టమహిషులను, బలరాముడి భార్యలను, కొంతమంది యాదవాంగనలను కాపాడగలిగినాడు.

కృతవర్మ కొడుకుకు మృత్తికావతపురాన్ని, సాత్యకి కొడుకుకు సరస్వతీ నగరాన్ని ఇచ్చి, అనిరుద్ధుడి కొడుకైన వజ్రుడిని ఇంద్రప్రస్థానికి రాజుగా చేసి, కాస్త మనశ్శాంతిని పొందినాడు అర్జునుడు. అప్పుడు చెప్పినాడు బలరామ శ్రీకృష్ణుల నిర్యాణము, వారికి తాను అగ్ని సంస్కారము చేసిన విషయాలను అంతఃపుర స్త్రీలకు. దానితో రుక్మిణి, జాంబవతి అగ్నిలో ప్రవేశించారు. సత్యభామ ఇంకా కొందరు స్త్రీలు అడవికి పోయి తపస్సు చేయడానికి నిశ్చయించుకున్నారు.

అర్జునుడు హస్తినాపురానికి వచ్చి ఈ విషయాన్ని, తన ఓటమిని, వ్యాకులతను ధర్మరాజుకు చెప్పాడు. దానితో ధర్మరాజు కూడా ఆలోచించి భీమ, నకుల, సహదేవులు, ద్రౌపదితో చర్చించి యుయుత్సుడిని రాజ్య పరిరక్షకుడిగా, పరీక్షిత్తుని రాజుగా, కృపాచార్యుని రాజగురువుగా, ధౌమ్యుడిని పురోహితుడిగా నియమించి సమస్త రాజ్యభారాన్ని పరీక్షిత్తును కాపాడుకునే భారాన్ని సుభద్రకు అప్పగించాడు. ధర్మరాజన్నాడు– "మనం వెళ్లేముందు మన నిర్ణయాన్ని హస్తినాపురం ప్రజలకు తెలియజేద్దాం" అని పట్టణ గ్రామ ప్రజలను పిలిపించి వారికి పరీక్షిన్మహరాజును పరిచయం చేసి తన నిర్ణయాన్ని చెబుతున్నాడు ధర్మరాజు.

వచ్చినవాళ్లు అక్కడ ఉన్న పీఠాలు, కుర్చీలపై కూర్చోవడానికి, అనువైన చోటు కోసం తగాదా పడడాన్ని సహదేవుడు గమనించి ధర్మరాజుతో అన్నాడు– "అన్నా! పీఠం కోసం హస్తినాపురంలో ప్రజలు అప్పుడే తగవులు పడుతున్నారు చూడు! కలియుగ ప్రభావమేనా ప్రజలలో ఓర్పు తగ్గడం, గద్దెలపై ఆసక్తి పెరగడానికి కారణం?". ధర్మరాజు అన్నాడు కాస్త నవ్వుముఖంతో– "ఇక మన జీవితాలు చాలు".

సహదేవుడికి నవ్వాగలేదు పీఠాల కోసం కొట్లాడుకుంటున్న వాళ్లను చూస్తుంటే.

ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపది – ఒక్కరొక్కరే రాజభవనం ప్రధాన ద్వారం దాటి వీధిలోకి ప్రవేశించారు. ఆ ఆరుగురి కన్నా ముందే వచ్చి ద్వారం దగ్గర ఉన్నది ఓ కుక్క. వారికన్నా ముందు వచ్చి వారితో వెళుతున్నది. పాండవులు హస్తినాపురం పొలిమేర దాటినారు. ధర్మరాజు అనుమతితో ప్రజలు అందరూ వెళ్లిపోయారు. కుక్క వారితోనే వస్తున్నది. సహదేవుడు వెనక్కి తిరిగి చూసాడు. అతడికెందుకో మరల నవ్వు వచ్చింది. హస్తినలో పీఠాల కోసం తగవులు పడుతున్నవారి దృశ్యం గుర్తుకువచ్చి నవ్వుతూనే ఉన్నాడు.

# 4. ఎంతమంది చనిపోయారు మహాభారత యుద్ధంలో?

ధృతరాష్ట్రుడు అడిగాడు ధర్మరాజును– "నీకు మన రెండు సైన్యాలలోని జనుల సంఖ్య తెలుసును. యుద్ధంలో ఎంతమంది చనిపోయారో గుర్తుంటే చెప్పుము".

ధర్మరాజు అన్నాడు– "ప్రసిద్ధులు, ఉన్నత వర్గాలవారు డెబ్బది ఆరుకోట్ల ఇరవై వేలమంది, ఇతరజనం ఇరవై నాలుగు వేల మూడువందల ఇరవైమంది. మొత్తం 76,00,44,320 మంది (స్త్రీ పర్వం – ద్వితీయాశ్వాసం – 168). సంస్కృత భారతం–స్త్రీపర్వంలో– మృతుల సంఖ్య 166,00,20,000 గా చెప్పబడింది. 24,165 మంది జాడ తెలియలేదు.

**అక్షౌహిణి =**

| | | | | |
|---|---|---|---|---|
| పత్తి | = | ఏనుగు 1, రథం 1, అశ్వికులు 3, కాల్బలం 5 = 10 వీరులు | | |
| సేనాముఖ | = | 3 × పత్తి | = | 30 వీరులు |
| గుల్మ | = | 3 × సేనాముఖ | = | 90 |
| గణ | = | 3 × గుల్మ | = | 270 |
| వాహిని | = | 3 × గణ | = | 810 |
| పృతన | = | 3 × వాహిని | = | 2,430 |
| చము | = | 3 × పృతన | = | 7,290 |
| అనీకిని | = | 3 × చము | = | 21,870 |
| అక్షౌహిణి | = | 10 × అనీకిని | = | 2,18,700 |

| | | |
|---|---|---|
| **పాండవ సైన్యం** | **=** | 7 × 2,18,700 = 15,30,900 |
| **కౌరవ సైన్యం** | **=** | 11 × 2,18,700 = 24,05,700 |
| **మొత్తం సైన్యం** | **=** | 18 × 2,18,700 = 39,36,600 |

| | |
|---|---|
| **రథం** | రథికుడు, సారథి<br>ఇద్దరు చక్ర రక్షకులు<br>ఇద్దరు అశ్వరక్షకులు |
| **ఏనుగు** | వీరుడు (శక్తి/త్రిశూలధారి<br>అంకుశధారులు ఇద్దరు<br>చురకత్తులతో ఇద్దరు<br>ధనుర్ధారులు ఇద్దరు |
| | –సం. ఉద్యోగ. ***155–15,16*** |
| సేవకులు, ఆయుధాలు మోసుకువచ్చేవాళ్లు, భేరీభాంకారాలు మ్రోగించేవాళ్లు, యక్ష రాక్షస సైన్యాలు – ఇతరులు | |

**మొత్తం:** రథాలు–3,93,660, ఏనుగులు–3,93,660, గుర్రాలు–11,80,980, కాల్బలం–19,68,300

| | | |
|---|---|---|
| 18 అక్షౌహిణీలు | = | ఏకము |
| 8 × ఏకము | = | కోటి |
| 8 × కోటి | = | శంఖము |
| 8 × శంఖము | = | కుముదము |
| 8 × కుముదము | = | పద్మము |
| 8 × పద్మము | = | నాడి |
| 8 × నాడి | = | సముద్రము |
| 8 × సముద్రము | = | వెల్లువ |

36691,71,39,200 = వెల్లువ

70 వెల్లువల సైన్యానికి = 25684239,97,44,000

నీలుడు అధిపతి = నీలము = ఇది సుగ్రీవుడి సైన్యం

రాముడికి సహాయంగా వచ్చినవారు.

పదిమందికి (పత్తి) నాయకుడు – పత్తి పాలుడు; ముప్పది మందికి సేనాముఖి; తొంభైమందికి–నాయకుడు, 270 మందికి– గణనాయకుడు, 810 మందికి– వాహినీపతి; 2430 మందికి– పృతనాధిపతి; 7290 మందికి– సేనాపతి; 21870 మందికి– అనీకాధిపతి; 218700 మందికి– మహాసేనాపతి. పాండవుల ఏడక్షౌహిణీలకు సర్వసైన్యాధిపతి– ధృష్టద్యుమ్నుడు; కౌరవుల 11 అక్షౌహిణీలకు సర్వసైన్యాధిపతి– భీష్మాచార్యుడు.

వననిధిలా సముద్రమంత కౌరవసైన్యం గోష్పాదమంతగా ఆ తరువాత పూర్తిగా నశించేసరికి– భీష్ముడు (పదిరోజుల యుద్ధం), ద్రోణుడు (అయిదు రోజులు = నాలుగు రోజులు పగళ్లు + నాలుగవ రోజు రాత్రి; అయిదవ రోజు ఇరవై

గడియలు); కర్ణుడు (రెండు రోజులు), శల్యుడు (సగం దినం); దుర్యోధన-భీముల గదాయుద్ధం (అర్ధరోజు), అశ్వత్థామ (పద్దెనిమిదవ రోజు అర్ధరాత్రి) - అయిదుగురు కౌరవ సైన్యానికి సర్వసైన్యాధిపతులుగా ఉన్నారు.

భీష్ముడు పదకొండు అక్షౌహిణీల సైన్యానికి సర్వసైన్యాధిపతిగా ఉండగా అశ్వత్థామ సైన్యాధిపతిగా అయ్యేరోజున ఉన్నది కేవలం ఆరుగురు- తొడలు విరిగి కూలబడి ఉన్న దుర్యోధనుడు, కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ, అంపశయ్య మీద భీష్ముడు, వార్తలు చేరవేసే సంజయుడు.

**ఏ పక్షానా చేరనివారు :** కౌరవ పాండవ సంగ్రామంలో ఏ పక్షానా పోరాడనివారు - బలరాముడు, రుక్మి.

**యుద్ధం ముగిసాక మిగిలినవారు :** పాండవుల పక్షాన- శ్రీకృష్ణుడు, పంచపాండవులు, సాత్యకి, యుయుత్సుడు; కౌరవుల పక్షాన: కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ (పదకొండు మంది), సంజయుడు.

భీష్ముడు యుద్ధం ముగిసినాక 58 రాత్రులు గడిచాక ఉత్తరాయణ ప్రారంభ దినాన అంపశయ్యపై చనిపోయినాడు. కర్ణుడి కుమారుడు వృషకేతు కూడా సజీవుడే. యుద్ధం ముగిసాక ధృతరాష్ట్రుడు పాండవులతో కలిసి 15 ఏళ్ళు, ఆశ్రమవాసంలో మూడేళ్లు మొత్తం 18 ఏళ్లు జీవించాడు. పాండవులు మరో 18 ఏళ్లు బ్రతికారు.

కురుపాండవ యోధుల వయస్సులు - యుద్ధకాలానికి (ఒక లెక్క ప్రకారం)

భీష్ముడు (191), కృపుడు (150), ధర్మరాజు (91), భీముడు (90), శ్రీకృష్ణుడు (89),
అర్జునుడు (89), నకులుడు (88), సహదేవుడు (88), యుయుత్సుడు (90) దుర్యోధనుడు (90).

శ్రీకృష్ణుడు 125 సంవత్సరాల 8 నెలల 7 రోజులు జీవించాడు.

18 ఫిబ్రవరి 3102 (క్రీస్తుపూర్వం) నిర్యాణదినం.

**ఇంకో లెక్క :**

కౌరవులు, పాండవులు, వారి సంతానం, వయస్సుల గురించి భారతంలో ఎక్కడా స్పష్టంగా చెప్పబడలేదు. (అందుకే అనేక ఊహాగానాలు).

కర్ణుడు వయసులో పెద్దవాడు ధర్మరాజు కన్నా 12 సంవత్సరాల, ఎనిమిది నెలలు. మాఘమాసం తొలి దినాన జన్మించాడు. ధర్మరాజు, భీముడి కన్నా ఒక సంవత్సరం 19 రోజులు పెద్దవాడు. భీముడు పుట్టిన ఒకరోజు తరువాత జన్మించాడు దుర్యోధనుడు. ఆ తరువాత రోజుకొకరు చొప్పున 99 మంది కౌరవులు, ఆఖరున దుస్సల అనే ఆడపిల్ల జన్మించారు. రెండు సంవత్సరాలు తల్లి గర్భంలో, రెండు సంవత్సరాలు నేతికుండలో పెరిగినవారు దుర్యోధనుడు, 99 కౌరవులు, దుస్సల.

భీముడికన్నా ఒక సంవత్సరం నాలుగు నెలల ఇరవై ఒక్కరోజులు చిన్నవాడు అర్జునుడు ఉత్తరఫల్గునిలో పుట్టి ఫల్గునుడిగా పిలువబడినాడు.

నకుల సహదేవులు కవలలు - మాద్రీ పుత్రులు - అర్జునుడి కన్నా ఒక సంవత్సరం పదిరోజులు చిన్నవాళ్లు.

**హస్తినాపురం వచ్చేప్పటికి పాండవుల వయసు :** ధర్మరాజు 16, భీముడు 15, అర్జునుడు 14, నకుల సహదేవులు 13 ఏళ్లు నిండాయి. ద్రోణుడి వద్ద శిష్యరికం 12 ఏళ్లు - అస్త్రవిద్యా ప్రదర్శన. ధర్మరాజుకు యువరాజు పట్టాభిషేకం నాటికి ధర్మరాజుకు 25 ఏళ్లు. హస్తినాపురం, లాక్షాగృహం (వారణావతం), అరణ్యవాసం, ఏకచక్రపురం, పాంచాలనగరం (ద్రౌపదీ పరిణయం) - ఏడాది చొప్పున నాలుగేళ్లు. ధర్మరాజుకు 33 ఏళ్ల వయసులో మరల హస్తినాపురం చేరుకున్నారు. ఇంద్రప్రస్థం రాజధానిగా పదమూడేళ్లున్నారు. (అర్జునుడు ఈ సమయంలోనే పన్నెండేళ్లు తీర్థయాత్రలకు వెళ్లినాడు).

ధర్మరాజుకు 46 ఏళ్ల వయసున్నపుడు రాజసూయయాగం, ఆ తరువాత మాయాద్యూతం జరిగాయి. 12 ఏళ్ల వనవాసం, ఏడాది అజ్ఞాతవాసం పూర్తయ్యేసరికి ధర్మరాజు వయస్సు 59 సంవత్సరాలు; అరవైయ్యవ ఏట కురుక్షేత్ర యుద్ధం, ఆ తరువాత 36 సంవత్సరాలు పాలించి 92-93వ ఏట మహాప్రస్థానానికి వెళ్లినాడు.

పరీక్షిత్తు అరవై ఏళ్లు పాలించాడు హస్తినాపురాన్ని. అతడి తరువాత జనమేజయుడు అధికారంలోకి వచ్చాడు.

**కౌరవ-పాండవులు, వారి భార్యలు :**

కర్ణుడు-వృషాలి, సుప్రియ; దుర్యోధనుడు-భానుమతి (కళింగ), శ్రావణి (కాంభోజ); దుశ్శాసనుడు-చంద్రముఖి (కాశి); వికర్ణుడు-ఇందుమతి (కాశి); ధర్మరాజు-ద్రౌపది, దేవిక; భీముడు- ద్రౌపది, హిడింబి, వలంధర; అర్జునుడు-ద్రౌపది, సుభద్ర, ఉలూచి, చిత్రాంగద; నకులుడు-ద్రౌపది, కరేణుమతి; సహదేవుడు-ద్రౌపది, విజయ; బలరాముడు-రేవతి;

శ్రీకృష్ణుడు- రుక్మిణి, నాగ్నజితి, కాళింది, జాంబవతి, మిత్రవింద, సత్యభామ, భద్ర, లక్ష్మణ, పదహారువేల వందమంది కన్యలు (నరకాసురుడి చెరలో ఉన్నవాళ్లు). అభిమన్యుడు-ఉత్తర; పరీక్షిత్తు-మద్రవతి; జనమేజయుడు-వపుస్తమ; ధృతరాష్ట్రుడు-గాంధారి, సుగంధ (యుయుత్సుడి తల్లి), వీరుకాక మరో వందమంది భార్యలు; పాండురాజు-కుంతి, మాద్రి; విచిత్రవీర్యుడు-అంబిక, అంబాలిక.

## 5. కాలగణనం

కాలమనేది అనంత ప్రవాహం. కాలపు రూపులు కాలుడు, కాలభైరవుడు, కాళి, మహాకాళుడు. కాలుడు మృత్యుస్వరూపం.

శైవులకు కాలుడు కాలభైరవుడు దండపాణి; వజ్రయాన బౌద్ధులకు అతడు బోధిసత్త్వ మంజుశ్రీ ఉగ్రరూపం (హెరూక, వజ్రభైరవ, యమాంతక అతడి పేర్లు).

భీరు-భయంకరుడు - భయానికి ఆవల ఉండేవాడు. శివుని శిరోజము నేలపై విసిరికొట్టగా జన్మించినవాడు, బ్రహ్మ అయిదవ శిరస్సును ఖండించి కపాలహస్తుడైన కాలభైరవుడు . శక్తిపీఠ రక్షకుడు . కాలభైరవుడి వాహనం కుక్క

**అష్ట భైరవులు:** అసితంగ, రురు, చండ, క్రోధ, ఉన్మత్త, కాపాల, భీషణ, సంహార భైరవులు.

తమిళదేశంలో ఎనిమిది దిక్కులను కాపాడే గ్రామదేవత కాలభైరవుడు - వైరవార్.

**సూర్య సిద్ధాంతము ననుసరించి-**

| | | |
|---|---|---|
| 100 తృటి | = | 1 తత్పర |
| 30 తత్పర | = | 1 నిమేష |
| 18 నిమేష | = | 1 కాష్ఠ |
| 30 కాష్ఠ | = | 1 కళ |
| 30 కళ | = | 1 ఘటిక (ఘడియ) |
| 2 ఘటిక | = | 1 ముహూర్త |
| 30 ముహూర్త | = | 1 అహోరాత్రం |

**వేద నిర్వచనాలు :**

పరమాణువు అతి స్వల్పకాల వ్యవధి.
2 పరమాణువులు = 1 అణువు
3 అణువులు = 1 త్రసరేణువు
3 త్రసరేణువులు = 1 తృటి
100 తృటి = 1 వేధ
3 వేధ = 1 లవ
3 లవ = 1 నిమేషము (రెప్పపాటు)
3 నిమేషములు = 1 క్షణము
5 క్షణములు = 1 కాష్ఠ
15 కాష్ఠ = 1 లఘు
15 లఘు = 1 దండ (నాడిక) (ఘడియ)
2 దండ = 1 ముహూర్తం (48 నిముషాలు)
30 ముహూర్తములు = 1 అహోరాత్రం
30 అహోరాత్రములు = 1 మాసము (నెల)
2 మాసములు = 1 ఋతువు
3 ఋతువులు = 1 ఆయనం
2 ఆయనాలు = 1 సంవత్సరం.

**పగలు - అయిదు భాగాలు**
1) ప్రాతఃకాలం
2) సంగవం
3) మధ్యాహ్నం
4) అపరాహ్ణం
5) సాయంకాలం

**చంద్రమాన కాలం :**

తిథి = ఒకరోజు (19–26 గంటలు
15 తిథులు = 1 పక్షము
2 పక్షములు = 1 మాసము
2 మాసములు = 1 ఋతువు
3 ఋతువులు = 1 ఆయనము
2 ఆయనములు = 1 సంవత్సరం.

ఘటి (ఘడియ) = 24 నిముషములు
యామం (ఏడున్నర ఘడియలు) = 3 గంటలు
అహోరాత్రం (8 యామాలు) = 24 గంటలు–ఒకరోజు
మానవులకు 1 సంవత్సరం (360 రోజులు) – దేవతలకు ఒకరోజు

| **మానవ సంవత్సరాలు** | **యుగం** | **దేవ సంవత్సరాలు** |
|---|---|---|
| 432000 | – కలియుగం – | 1200 |
| 864000 | – ద్వాపరయుగం – | 2400 |
| 1296000 | – త్రేతాయుగం – | 3600 |
| 1728000 | – కృతయుగం – | 4800 |
| 4320000 | – మహాయుగం – | 12000 |

1000 మహాయుగాలు – 1 కల్పం (బ్రహ్మకు ఒక పగలు).
14 మన్వంతరాలు – 1 కల్పం
306720000 – మన్వంతరం – 852000

తృటి = అన్నిటికన్నా చిన్న కాలం.

| | | |
|---|---|---|
| 60 తృటి | = | 1 రేణు |
| 60 రేణు | = | 1 లవ |
| 60 లవ | = | 1 లిక్షక |
| 60 లిక్షక | = | 1 లిప్త / విపల |
| 10 లిప్త | = | 1 ప్రాణ |
| 60 లిప్త | = | 1 విఘటి / పల / వినాడి |
| 60 విఘటి | = | 1 ఘటి / దండ / నాడి |
| 2 ఘటి | = | 1 ముహూర్త |

30 ముహూర్త = 1 నక్షత్ర అహోరాత్రం.

**మనువులు :** 1) స్వయంభువు, 2) స్వారోచిషు, 3) ఉత్తమ, 4) తామస, 5) రైవత, 6) చాక్షుష, 7) వైవస్వత, 8) సావర్ణి, 9) దక్షసావర్ణి, 10) బ్రహ్మసావర్ణి, 11) ధర్మసావర్ణి, 12) రుద్రసావర్ణి, 13) దేవ సావర్ణి, 14) ఇంద్రసావర్ణి.

కల్పము – బ్రహ్మకు పగలు / రాత్రి
మన్వంతరము – మనువుకు పగలు / రాత్రి
బ్రహ్మకాలం = 100 బ్రహ్మ సంవత్సరాలు : 311.04 ట్రిలియన్లు
యన్ సంవత్సరాలు (మహాకల్పం)
మహాకల్పం తరువాత మహాప్రళయం అంతేకాలం ఉంటుంది.

**ప్రళయం–నాలుగు విధాలు**
1) నిత్య
2) నైమిత్తిక
3) అత్యంతిక
4) ప్రాకృతిక

**కల్పం :** 4.32 బిలియన్ సంవత్సరాలు – బ్రహ్మకు పగలు
4.32 బిలియన్ సంవత్సరాలు – బ్రహ్మకు రాత్రి.

ప్రకృతి = సృష్టికాలం; ప్రళయం = సంహార కాలం.

**ప్రస్తుత బ్రహ్మవయస్సు :** 155.72 ట్రిలియన్ సంవత్సరాలు

ద్వితీయ పరార్థం = 51st Year of 100

ప్రథమ మాస = 1st Monthy of 12

శ్వేతవరాహ కల్ప = 1st Kalpa of 30

ఏడవ మన్వంతర = 7th Manu of 14

ఇరవై ఎనిమిదవ చాతుర్యుగ = 28th of 71 చాతుర్యుగ

కలియుగ = 1 of 4

**శ్రీకృష్ణ నిర్యాణము :** క్రీస్తుపూర్వం 3102 – ఫిబ్రవరి అర్ధరాత్రి 17/18 నాడు జరిగిందని అంచనా.
3102 + 2824 = 5126 సంవత్సరాల క్రితం
కృష్ణుడు చనిపోయిన క్షణానే కలియుగం భూలోకంలో ప్రారంభమయ్యింది.

## 6. మహాభారత రచనాకాలం

వ్యాసప్రోక్తంగా చెప్పబడుతున్న 'జయ' కావ్యం క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దం నుంచి క్రీస్తుశకం మూడవ శతాబ్దం మధ్యకాలంలో కూర్పులు చేర్పులతో లక్ష శ్లోకాల మహాభారతంగా రూపొందిందని పరిశీలకుల అభిప్రాయం.

8800 శ్లోకాల జయం వ్యాసుడి మూల రచనగా, జనమేజయుడికి వైశంపాయనుడు చెప్పినది 24,000 శ్లోకాల భారతంగా, నైమిశారణ్యంలో ఉగ్రశ్రవ సూతి సత్రయాగం సందర్భంగా అనేక ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలతో చెప్పింది లక్షశ్లోకాల మహాభారతం (2,00,000 వాక్యాలు, 18 లక్షల పదాలు) విస్తృతినొంది పురుషార్థములను ప్రవచించే గొప్ప గ్రంథమైనది. పంచమవేదంగా ప్రసిద్ధికెక్కింది.

వేదవ్యాసుడు చెబుతుంటే గణేశుడు తన విరిగిన దంతంతో ఆగకుండా భారతాన్ని వ్రాసాడని, గణేశుడికే అర్థంకాని ఘట్టాలున్నా ఆగలేదని అంటారు. అందుకే అర్థంకాని విషయాలను "వ్యాసఘట్టాలు" అని పిలుస్తారు. ఈ కథ మనకు సంశోధిత మహాభారతం (పూనా)లో కాని కవిత్రయ భారతంలో కాని కనిపించదు. గూఢమైన అర్థం ఉండేటట్లు ముడులతో వ్రాయడం గ్రంథగ్రంధి పద్ధతి. భారతంలో 8800 ఇటువంటి శ్లోకాలున్నాయి.

పురాతత్త్వ శాస్త్రజ్ఞుల అంచనా క్రీస్తుపూర్వం 1300–800 కాలం మధ్యలోనే ఆగింది. చాలామంది భారతాన్ని కల్పిత గాధగా విశ్వసిస్తున్నారు. కవికి తెలిసిన స్థలాలను, విషయాలను కల్పితకథలో కలిపాడు అనేది కొందరి వాదన.

డెబ్బది ఆరుకోట్ల మంది కురుక్షేత్ర యుద్ధంలో చనిపోయారన్న మాట ఎవరూ విశ్వసించలేనంత అతిశయోక్తిగా ఉండడం దీనికి కారణం కావచ్చు. సంస్కృత భారతంలో ఈ సంఖ్య 166 కోట్ల ఇరవై వేలు.

సద్యోగర్భాలు, పుట్టగానే పెరిగి పెద్దవయసు రావడాలు, వీర్య స్ఖలనాలు, కుంభసంభవాలు, తల్లి అవసరం లేకుండా పుట్టే మునులు, ఆకాశ గమనాలు, విమానాలు, అస్త్రాలు, దివ్యాస్త్రాలు, దివ్యదృష్టి, విశ్వరూపాలు ఇవన్నీ కవికి కథాగమనానికి తోడ్పడే అంశాలుగా కానరావడం భారతం, భారతంలోని పాత్రలు కల్పితాలనడానికి ఆధారాలుగా చూపుతారు. ఒక దేవ కార్యానికి పుట్టిన వ్యక్తులు, అస్త్రశస్త్ర వాహనాలు ఆ పని ముగియగానే అదృశ్యమవుతాయి.

ఒక అభూతకల్పనను సమర్థించడానికి మరిన్ని అభూత కల్పనలను సృజించడం కానవస్తుంది చాలాచోట్ల. సంపర్ణో పాఖ్యానంలోని కథ నమ్మశక్యం కానంత అద్భుతంగా ఉంటుంది. ఎన్నో అతిలోక సాహసాలు వర్ణించబడినాయి.

దేవతలు, మానవులు, యక్షులు, గంధర్వులు, రాక్షసులు, కిన్నెరలు, కింపురుషులు వీళ్లందరి ప్రజాపతి కశ్యపుడని తెలుస్తుంది. కవి చాతుర్యం, కథనా విధానం మనల్ని 'ఔరా' అనేట్లు చేస్తుంది.

రామాయణ, మహాభారతాలు రెండిటిలో ప్రధానాంశం దుష్టశిక్షణ. సీతాపహరణం కారణంగా రామ రావణ యుద్ధం, ద్రౌపదీ వస్త్రాపహరణం కారణంగా కౌరవ పాండవ యుద్ధం జరగడం కావ్య ప్రధానాంశాలు.

కొంతమంది విమర్శకులు వ్యాస మహాభారతానికి హోమర్ ఇలియాడ్, ఒడిస్సిలకు మధ్య సారూప్య, సామీప్యాలను పరిశోధించారు.

## వ్యాసుడు - హోమర్

ఋగ్వేదంలో ఏడవ మండలం వ్రాసిన వశిష్ఠుడు సప్తర్షులలో (భృగు, వశిష్ఠ, అంగీరస, అత్రి, పులస్త్య, పులహుడు, క్రతువులు) ఒకడు. వశిష్ఠుడి కుమారుడు శక్తి. శక్తి కుమారుడు పరాశరుడు. పరాశరుడు ఒకరోజున యమునా నదిలో పడవ నడిపే మత్స్యగంధిని చూసి ఆమెను యోజనగంధిగా మార్చి ఆమెతో యమునా నదీ మధ్య ద్వీపంలో సంగమించగా, సద్యోగర్భాన వ్యాసుడు జన్మించాడు. నల్లగా ఉన్నాడు కాబట్టి కృష్ణుడని, ద్వీపంలో జన్మించాడు కాబట్టి ద్వైపాయనుడని పేర్లు వచ్చాయతడికి. వ్యాస – అనే పదానికర్థం విభజించడం లేదా సంకలనం చేయడం. వేదాలను విభజించి ఒక క్రమపద్ధతిలో ఉంచాడు గనుక కృష్ణద్వైపాయనుడు వేదవ్యాసుడైనాడు. మత్స్యగంధి గంధవతిగా, సత్యవతిగా వివాహం చేసుకుంటుంది శంతన మహరాజును, తన కుమారులకే రాజ్యాధికారం దక్కాలనే షరతుతో. అంతకుముందే గంగాదేవికి శంతనుడికి పుట్టిన కొడుకు దేవరాతుడు తండ్రికి పెళ్లి చేసేందుకు అనువుగా తాను వివాహం చేసుకోనని, రాజ్యాధికారం చేబట్టనని పలికి భీష్ముడైనాడు. సత్యవతి–శంతనులకు కలిగిన చిత్రాంగదుడు, చిత్రాంగదుడనే గంధర్వుడితో యుద్ధం చేసి మరణించగా, రెండవ కుమారుడు విచిత్రవీర్యుడికి భీష్ముడు కాశీ రాజకుమార్తెలైన అంబిక, అంబాలికలతో వివాహం చేస్తాడు. సంతానం లేకుండానే విచిత్రవీర్యుడు కన్నుమూయగా నియోగ పద్ధతిలో వ్యాసుడు అంబికకు ధృతరాష్ట్రుడిని, అంబాలికకు పాండురాజును, దాసికి విదురుడు జన్మించడానికి కారణమవుతాడు (దేవర న్యాయం).

ధృతరాష్ట్రుడి పుత్రులు కౌరవులు, పాండురాజు పుత్రులు పాండవులకు మధ్య జరిగిన యుద్ధమే భారత యుద్ధం. దానిని వివరించే కథ మహాభారతం.

మహాభారతం చారిత్రక సత్యమా లేక కవి కల్పనా అన్న చర్చలు జరిగినట్లే పాశ్చాత్య సాహిత్యంలో ఆదికావ్యాలైన ఇలియాడ్ (Iliad), ఒడెస్సీ (Odyssey)లు హోమర్ రచనపై చర్చలు జరిగాయి.

'వ్యాసుడు' అనేది కవుల పరంపరగా భావించినట్లే 'హోమర్' అనే పదం కూడా కవుల వంశపారంపర్య నామమని విమర్శకుల అభిప్రాయం. మనం యవన రాజ్యంగా పేర్కొనే ఆసియామైనర్‌లోని స్మిర్నా (Smyrna) లేదా కియాస్ (Chios) ద్వీపంలో హోమర్ జన్మించాడు. ఇతడు కూడా ద్వైపాయనుడే. ఇతడి నిజనామం మెలెసిజెనిస్ (Melisgenes). మెలిస్ నదీ ప్రాంతంలో పుట్టాడు. వ్యాసుడు యమునా నదీ ద్వీపంలో పుట్టాడు. కియాస్ ద్వీపంలో హోమర్ వారసులు వంశపారంపర్య గాయకులు (Bardic guild) వాళ్లు రాజసభల్లో, ఉత్సవాల్లో, దైవపూజల్లో సంచార గాయకులుగా (Wandering ministrel)గా వ్యవహరించేవారు.

హోమర్ (Homeros = Hostage, surety - he who accompanies; he who is forced to follow) అంటే బందీ, అనుసరించి వెళ్లవలసినవాడు, అంధుడు. క్రీస్తుపూర్వం 850–800 కాలపువాడిగా హోమర్‌ను చరిత్రకారులు పేర్కొంటున్నారు.

మహాభారత యుద్ధకాలంపై ఉన్న సందేహాల్లానే ట్రోజన్ యుద్ధం (ఇలియాడ్) వాస్తవమా లేక కల్పనా అన్న సందేహాలకు జవాబు పురావస్తు శాఖ తవ్వకాలలో దొరికింది. ట్రాయ్ వద్ద జరిపిన తవ్వకాలలో తొమ్మిది పొరలుండగా 7a పొరలో యుద్ధం వల్ల నగర విధ్వంసమైన ఆనవాళ్లు కనిపించాయి. క్రీస్తుపూర్వం 1194–1184 ప్రాంతంలో పదేళ్లపాటు జరిగిన యుద్ధంలో ట్రాయ్ నగరం సర్వనాశనమైంది.

ఆ కథనం అనేక వందల సంవత్సరాల కవిగాయకులచే పాడబడి గ్రీకు ఆల్ఫాబెట్‌ను కనుక్కున్నాడని పేరుబడిన హోమర్ దానిని గ్రంథస్థం చేసాడు.

15,693 లైన్లున్న ఇలియాడ్, 12109 లైన్లున్న ఒడిస్సి, ఎపిక్‌సైకిల్‌లో కొంతభాగం, హోమర్ స్తోత్రాలు, కప్ప–ఎలుక యుద్ధం (బాట్రకొమయొమాఖియా), మార్గైట్స్, ఒయుఖేలియా ముట్టడి, ఫొకాయిస్ గ్రంథాలు హోమర్ రచనలుగా చెప్పబడుతున్నాయి. క్రీస్తుపూర్వం 3వ శతాబ్ది నాటికే హోమర్‌కు దేవాలయాలు నిర్మించి ఆరాధించినారు. వ్యాసుడిని వ్యాసపూర్ణిమ రోజున ఆరాధించినట్లు.

ఇక్కడ మనం మితాన్ని (Mitanni) నాగరికత గురించి ప్రస్తావించుకోవాలి. క్రీస్తుపూర్వం 1600–1260 మధ్యకాలంలో ఉత్తర సిరియా, ప్రస్తుత టర్కీ ప్రాంతంలో, మహాభారతంలో ప్రస్తావించబడిన పేర్లలాంటి పేర్లు కలిగిన రాజులు ఆ ప్రాంతాన్ని పాలించారు. హిట్టైట్ల తరువాత వచ్చిన మితాన్ని రాజులను అస్సిరియనులు ఓడించారు. ఈ మితాన్ని ప్రజలలో ఎక్కువమంది హర్రియన్లు (Hurrians) – ఆర్యన్లు కావచ్చు కాకపోవచ్చు.

1479–1425 BCలో 'మితాన్ని' ప్రజలకు ఈజిప్టు ఫారో మూడవ 'ధుత్‌మోసు'కు మధ్య యుద్ధం జరిగిందన్న విషయం శాసనాలపై చెక్కబడింది.

మైతా– అంటే మిథా–కలపడం. మైతాన్ని అనగా సంయుక్త రాష్ట్రం. సంస్కృతంలో మెథాతి అంటే కలిపేవాడు. మితాన్ని రాజుల పేర్లు– అర్తసుమార–ఋతాన్ని తలిచేవాడు; బిరిదశ్వ–అశ్వ ప్రియుడు; ప్రియమజ్ద–ప్రియమేధ–మేధావి, సిత్రరత–చిత్రరథుడు, ఇందరుద–ఇంద్రసహాయుడు; శతివాజ, సుబంద; తుషరత్త–దశరథ –ఇవన్నీ ఆనాటి రాజుల పేర్లు. అశ్వశిక్షణలో వీళ్లు ఏక, తేర, పంజ, సత్త, న, వర్తనం, అనే పదాలను విరివిగా వాడేవారు. మిత్రావరుణులు వారి దేవుళ్లు.

షాల్మనెసర్ అనే అస్సిరియా ప్రభువు మితాన్నిలను ఓడించి 14,400 మంది ఖైదీల కళ్లు పొడిపించి అంధులను కావించాడు.

మితాన్నిల నాటికి సంస్కృతం ప్రాచుర్యంలో ఉందంటే వాళ్లలో రాజులు కొందరు భరతభూమి నుంచి టర్కీ–సిరియా ప్రాంతాలకు వెళ్లారా? అస్సిరియన్లు అసురులుగా వ్యవహరించబడినారా? అమొరైట్లు అమరులా?

సుమేరు నాగరికత (5000-1475 BC) - (మేరు పర్వత ప్రాంతమిదేనా?) – సుమేరియన్లు తమ దేశాన్ని కెంగిర్ - Country of the Noble Lords; వారి భాషను ఎమెగి (Emegi) అని పిలిచేవారు. వాళ్లని వాళ్లు 'నల్లతలకాయల మనుషులు' – కృష్ణ శిరస్సుల వాళ్లు సల్మత్ ఖక్కడి అని పిలుచుకునేవాళ్లు. పురోహితుడు ఎంశి (Ensi), ప్రభువు–లుగాల్ (లుగల్ – గలు అనే తమిళపదంలా ఉంటుంది). వీళ్ల పట్టణాలు– ఎరిదు, లరకు, సిప్పరు, సురుప్పక్, ఉరుకు, కిష్, ఊర్, నిప్పూరు, లగష్, గిర్సు, ఉమ్మ, అక్షక్, అక్కడ్, ఇసిన్, లార్సా, దిల్బత్, బొర్సిప్ప, ఇష్నున్న, నగర్ (ఊరు, నగరం).

ప్రతి గ్రామానికి, పట్టణానికి ఓ అధిదేవత ఉండేది. లంకకు లంఖిణి, ఓరుగల్లుకు 'కాకతి' దేవత రక్షక దేవతలుగా ఉన్నట్లు.

ఆర్యులకు సోమరసంలా సుమేరియన్లు ధాన్యాలతో చేసిన బీరు తాగేవారు.

సుమేరియన్లను అక్కడియన్లు ఓడించారు. అక్కడియన్లు బలపడుతున్న కాలంలో బాబిలోనియాను అక్కడియన్ల దేశమని పిలిచేవారు. బాబెలిమ్ అంటే దేవుని వాకిలి (Gate of the Gods). బాలెరు అని పిలిచారు పాలి, సంస్కృత భాషల్లో బాబిలోన్ పట్టణానికి వంద ద్వారాలు–వంద వాకిళ్లు ఉన్నాయని హెరొడొటస్ వ్రాసినాడు. వీటిలో షమాష్ (సూర్యుడు), ఇస్తార్, మార్దుక్, అదాద్, ఎన్‌లిల్, జబాబా, యురేష్ వాకిళ్లు ప్రధానమైనవి (ద్వారావతికి వంద ద్వారాలుండేవి).

సింధు నాగరికత ప్రాంతపు ప్రజలకు అక్కడ పరిస్థితులు తారుమారవడంతో కొందరు కొంకణ తీరానికి వచ్చారని చెబుతారు. అదేవిధంగా సముద్రమార్గంలో కొందరు సుమేరియా దక్షిణ ప్రాంతం నుంచి కొంకణ తీరానికి వచ్చారని పరిశోధకు లంటున్నారు. ఇప్పటికీ సుమేరియన్ ప్రాంతపు భూముల కొలతల పదాలు గోవా ప్రాంతంలో వాడబడతున్నాయి. పరశురాముడు తన గొడ్డలి విసరగా సముద్రం వెనక్కి వెళ్లిందని, అందుకే గోవా సముద్రతీరం పరశువు అంచు రూపంలో ఉంటుందని స్థానిక విశ్వాసం. కొంకణ తీరం నీలికన్యలకు, నల్లని పురుషులకు ప్రసిద్ధి. కేరళను పరశురామ క్షేత్రం అంటారు.

ఇప్పటి సిరియా, టర్కీ ప్రాంతాల్లోనే అమొరైట్లు, అస్సిరియన్లు (అమరులు, అసురులు) ఉండేవారా? అస్సిరియన్ల ప్రాభవం తగ్గాక మరల 'మితాన్ని' ప్రజల వైభవం పెరిగిందా? వారిని మరల అసురులు ఓడించారా?

సుమేరియన్లు – 4100–1750 (క్రీస్తుపూర్వం); అక్కడియన్లు – 2334–2218 (క్రీస్తుపూర్వం); అమొరైట్లు (బాబిలోనియన్లు) – 1894–594 (క్రీస్తుపూర్వం); అస్సిరియన్లు – 2600–609 (క్రీస్తుపూర్వం); మితాన్ని – 1550–1260 (క్రీస్తుపూర్వం)

సుమేరియా ప్రాంతంలోని అరారత్ పర్వతమే మేరు పర్వతమా? ఇక్కడే ఆగిందా నోవా పడవ? టర్కీలోని అత్యంత ఎత్తైన ప్రాంతం అరారత్ పర్వతం. కకాసస్ పర్వతశ్రేణిలో ఒకభాగం. టర్కీలో దీనిని అగ్రదాగ్ (దుఃఖ పర్వతం) అని పిలుస్తారు. కుర్దులు దీనిని ఉగ్రపర్వతం అంటారు. ఇది జ్వాలాముఖి. గిరిదాక్– గిరి పర్వతం – దాక్స్ అంటే కొండ. స్థానికులు అరారత్ పర్వతాన్ని మాసిస్, సిస్ కవల పర్వతాలంటారు. బైబిల్ ప్రకారం– నోవా పడవ (Noah's ark) అక్కడ ఆగిందని – 1920 వరకు ఆర్మీనియాకు చెందిన అరారత్ ఇప్పుడు టర్కీ ప్రాంతమైనది.

ఇండియాలోని మేరు పర్వతం గురించి– నేటి ఉత్తరాఖండ్‌లో గర్వాల్ హిమాలయ శ్రేణుల్లో మేరు శిఖరం ఉన్నది. ఇది Meru Peak. జలప్రళయంలో వైవస్వత మనువు నౌక ఆగిన స్థలం– నౌకాబంధనం–నావ బంధనం.

మేరు పర్వతంను పామీరు ప్రాంతంగా పరిశోధకులు గుర్తించారు. ఈ పామీరు పీఠభూమి 25095 అడుగుల ఎత్తులో (సముద్ర మట్టానికి) ఉండి తజకిస్తాన్, కిర్గిస్తాన్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, చైనా దేశాలలో భాగమైనది. ప్రపంచపు పైకప్పు – Roof of the world లో భాగం (పామీర్, హిమాలయ, టిబెట్, హిందూకుష్, టియాన్‌షాన్, అల్తాయి పర్వతాలు – Roof of the world). అయిదు శిఖరాలున్నది మేరు పర్వతం. బుద్ధగయలోని మహాబోధి దేవాలయం, కంబోడియాలోని అంగకర్ వాట్ దేవాలయం, థాయ్‌లాండ్‌లోని వత్ చైనత్తనరమ్ బుద్ధగుడి, బాంకాక్‌లోని వత్ అరుణ్ బుద్ధుని దేవాలయం, మయన్మార్‌లోని మండాలే పగోడా, బాలి ద్వీపంలో పురు ఉలున్ దాను బ్రతున్; ఉత్తరప్రదేశ్‌లోని జంబుద్వీపం–జైనుల దేవాలయం పంచ శిఖర మేరుపర్వత నమూనాతో నిర్మించబడినాయి. మేరు అంటే వెన్నెముక, అక్షం లేదా నాభి. ఈ పర్వతానికి దక్షిణంగా ఉన్నది భరతఖండం. **సుమేరు పృథ్వి మధ్యే, శ్రుయతే దృశ్యతే న తు** – భూమికి మధ్యలో ఉన్నదని చెప్పబడినా అది అక్కడ కానరాదు –అని నరపతి జయాచార్యుడు వ్రాసినాడు.

## 7. మహాభారతం - మానవుల వలసలు

మానవుడు నిత్యసంచారి. ఒకచోట స్థిరంగా ఉండడమనేది అతడి సహజ లక్షణం కాదు. పసిపిల్లవాడు కూడా ఒక్కసారి బోర్లాపడ్డాక పాకడం నేర్చుకుని నెమ్మదిగా బులిబులి అడుగులు వేస్తూ, పడుతూ లేస్తూ, ఇక ఆ తరువాత పట్టుకుని ఆపుదామన్నా ఆగడు. అటుఇటు వెళ్లిపోతూనే ఉంటాడు. ఊయలలోనో, ఊయలతొట్టిలోనో గదిలోనో, ఇంటిలోనో బంధించి చూద్దామను కుంటాము. కాని, రెక్కలు కాస్త బలంగా ఏర్పడగానే ఎవరినీ లెక్క చేయకుండా కాళ్లు తీసుకెళ్లగలిగినంత దూరం, మనసు అనుమతించినంత దూరం వెళ్లిపోతూనే ఉంటాడు.

1.75 మిలియన్ సంవత్సరాల క్రితం Homoerectus ద్విపాద జంతువై 'Out of Africa' ఆఫ్రికా ఖండం ఊయల నుండి నడక మొదలెట్టాడు. 1,50,000 సంవత్సరాల క్రితం Homosapiens - తెలివిగల మనిషి – ఆఫ్రికా అంతా వ్యాప్తి చెందినాడు. వీరిలో కొంతమంది లక్ష సంవత్సరాల క్రితం (2,70,000–70,000) ఆసియాలో ప్రవేశించారు. కొందరు ఉన్నచోటే ఉండిపోగా కొందరు కాళ్లకు బలపాలు కట్టుకున్నట్లు ఆహారాన్ని వెదుక్కుంటూ సముద్ర తీరాల వెంబడే, అరణ్యమార్గాల వెంబడే అనుకూల ప్రదేశాలు చేరుకోవడం కొందరు స్థిరనివాసులుగా, కొందరు సంచారులుగా మరల ప్రయాణం. క్రీస్తుపూర్వం 40,000 నాటికి ఆస్ట్రేలియా, ఆసియా, యూరప్, క్రీస్తుపూర్వం 20000–15000 నాటికి అమెరికా ఖండాలకు, 30000–15000 మధ్యకాలంలో మరల వెనక్కి (Eurasion Back migrations) ఆఫ్రికాకు (Back to Africa), ఈ విధంగా 2000 సంవత్సరాల క్రితం వరకు పసిఫిక్ దీవులకు ఇలా నిరంతరం అటూ, ఇటూ వలసలు పోతూనే ఉన్నాడు మానవుడు.

జన్యు పరీక్షలు ఋజువు చేస్తున్నాయి 1700–1300 క్రీస్తుపూర్వం Late Harappan Phase లో ఇండో ఆర్యన్ వలసలు సప్తసింధు ప్రాంతం నుంచి గంగా యమునల వేపు సాగాయని, క్రీస్తుపూర్వం 180 నుంచి మధ్య ఆసియా నుంచి భారత ఉపఖండంలోకి ఇండోగ్రీకులు, ఇండో స్కిథియన్లు, పార్థియనులు, కుషాణులు వలస వచ్చారని తెలుస్తుంది.

నాగరికతా ఊయలలు నైలునది (ఈజిప్టు), సింధునది (7000 BC - 600 BC), సుమేరియన్ (టైగ్రిస్–యూఫరేటిస్ నదుల మధ్య 6000–1750 BC), మినోవన్ (2000–1450 BC), మైసినియన్ (1900–1100 BC), గాంధార (1500 BC - 500 CE), ఒల్మెక్ (1200–400), గ్రీకు (1000–338), పెరు–ఛావిన్ (900–200 BC) ఉరార్తు–అరారత్ (ఆర్మీనియా–టర్కీ– 900–590 BC) మొదలైనవి.

వీటిలో మెసపొటామియా (Mesopotamia- రెండు నదుల మధ్య టైగ్రిస్–యూఫరెటిస్ నదులు) ప్రస్తుత ఇరాక్, కువాయిట్, సిరియా ప్రాంతం – నాగరికతకు పుట్టినిల్లు. బాబిలోన్, అషుర్, అక్కడ్ నగరాలు ప్రసిద్ధమైనవి Code of Hammurabi - కోణాకార లిపులు (Cuneiform), 60 – సంఖ్యాగణనం, క్యాలెండర్ ఇవన్నీ ఈ ప్రాంతంలో ఆవిర్భవించినవే. 3500–323 BC వరకు ఇక్కడి నాగరికత ప్రపంచానికి ప్రామాణికమైనది.

పిరమిడ్లతో ప్రపంచ ఖ్యాతి పొందిన ఈజిప్టు నాగరికత 3100 BC నుంచి నైలునదీ తీరాన గొప్పగా వెలుగొందింది. క్యూబిట్ (ముందుచెయ్యి పొడుగు) లెక్కలు 24 గంటల దినం, 365 రోజుల సంవత్సరాన్ని, పాపిరస్ కాగితాన్ని తయారుచేసుకున్న ఈ నాగరికత 332 BCలో గ్రీకువీరుడు అలెగ్జాండర్ దండయాత్రలో ముగిసింది.

వేదాలు, ఉపనిషత్తులు లాంటి ధార్మిక ఆలోచనలకు ప్రసిద్ధికెక్కిన ప్రాంతంలో సింధునదీ నాగరికత సరస్వతీనది ఇంకి పోవడంతో 1700 BC లో పతనమయ్యింది. స్థానిక ప్రజలు గంగా యమునా ప్రాంతానికి వలసపోయినారు. వెనక్కి మళ్లిన కొందరు మితాన్ని నాగరికతకు చెందినవాళ్లు కావచ్చు.

సుమేరియన్ నాగరికతలో సంపదల కోసం నిరంతర యుద్ధాలు, ఈజిప్షియన్ నాగరికతలో మృతుల కోసం బృహత్ నిర్మాణాలు, పిరమిడ్లు; ఉండగా సింధు-గంగా-యమునా నాగరికతలో పూర్వజన్మ కర్మఫలితాలు, మోక్షం గురించిన ఆలోచనలు ఉండడం విశేషం.

చైనా నాగరికత పచ్చనది-యాంగ్‌ట్సి నదుల మధ్య పరిఢవిల్లింది. చైనా గోడ ప్రపంచ ప్రఖ్యాతమైన నిర్మాణం. క్రీస్తుపూర్వం మూడువేల సంవత్సరాల నుంచి గొప్ప నాగరికత కలిగిన ప్రాంతమిది.

క్రీస్తుపూర్వం 1200 నాటికే- ఛావిన్, పరక, నజ్కా, హువరి, మోచా, ఇంకా నాగరికతలకు పేరు గాంచినది కొలంబియా, చిలీ ప్రాంతాలు. 1532 క్రీస్తుశకం ప్రాన్సిస్కో డిజారో దండయాత్రతో ఒక నాగరికత దాదాపుగా అంతరించింది. జపొటెక్, మాయా, టొల్టెక్, అజ్టెక్‌ల ప్రాంతం (మధ్య అమెరికా) పలు నాగరికతలతో విలసిల్లింది.

## సుమేరియన్-సింధు-గంగా-యమునా నాగరికత

టైగ్రిస్-యూఫరేటిస్ నదుల నుంచి గంగా యమునా నదుల మధ్య ప్రాంతంలో గత పదివేల ఏళ్లుగా ప్రకాశించిన నాగరికత ముఖ్యంగా 3000 BC నుంచి 300 AD వరకు జరిగిన యుద్ధాలు-శాంతి, భాష-లిపులు, ఆక్రమణ-రక్షణ వ్యూహాలు, సంపదలు-దారిద్ర్యాలు, సుఖ-దుఃఖాల చరిత్ర మహాభారత కథలో ఘట్టాలైనాయి.

మొదటి దశలో ఈజిప్టు, మెసపొటేమియా ప్రజలకు ప్రధాన దేవతలు సూర్యుడు, చంద్రుడు. రా, షామాష్, రవి, సూర్యుడు; చంద్రుడు స్త్రీరూప దేవుడు లేదా దేవత. జరాతుష్టుడి కాలానికి అగ్ని ప్రధాన దేవతగా మారినాడు. నక్షత్ర గణనాలు, క్యాలెండర్లు నిర్మాణం జరిగాక పండితులు జోస్యాలమీద, గ్రహణాల మీద, తోకచుక్కల మీద ఆసక్తి చూపసాగినారు. పెద్దపెద్ద యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు ప్రాక్కథలై మౌఖిక ప్రచారంతో అనేక మార్పులు చేర్పులతో ఉత్సవాలలో, రాజసభలలో, యాగాల వద్ద కవిగాయకులు పాడగా ప్రజలు ఆనందించేవారు. లిపులు ఏర్పడినాక కథలు కావ్యాలై గ్రంథస్థం చేయబడినాయి. మరణాన్ని జయించాలనే కోరిక మిక్కుటం కాగా సుమేరియన్-బాబిలోనియన్ ప్రాంతంలో తొలి ఇతిహాసం గిల్గామేష్ చరిత్ర మట్టిబిళ్లలపై కోణాకార లిపిలో వ్రాయబడింది.

ప్రస్తుత టర్కీ, సిరియా, ఇరాక్, ఇరాన్, ఈజిప్టు, హరప్పా, మొహంజదారో ప్రాంతాలలో ప్రజలు నదీ ప్రాంతాలలో స్థిరనివాస మేర్పరచుకుని తమలో ఒకరిని నాయకుడిగా గణనాయకుడిగా ఎన్నుకునేవారు.

చెకొస్లొవేకియా ప్రాంతంలో బ్రెక్లావ్ జిల్లాలో 25000 సంవత్సరాల నాటి తొలి గ్రామాన్ని కనుగొన్నారు పరిశోధకులు. Dolmi Vistonica; జెరికొ (20,000), సటల్‌హుయక్-టర్కీ (10,000) ఇవి తొలి గ్రామాలు.

గ్రామాలు పట్టణాలుగా అభివృద్ధి చెందినాయి. ప్రతి గ్రామానికి గ్రామదేవత, పట్టణానికి/నగరానికి నగర దేవత రక్షక దేవతలుగా ఉండేవారు. గ్రామాలకు గ్రామాలకు, నగరాలకు నగరాలకు మధ్య నిత్య ఘర్షణలు జరుగుతూ ఉండేవి. గ్రామ దేవతలకు, నగర దేవతలను అర్చించేందుకు అనేక వస్తువులు, న్యాయసూత్రాలు వ్రాసిన మట్టిబిళ్లలు లేదా పవిత్ర వస్తువులు ఉండేవి (వాటిని 'మి' అని పిలిచేవారు). ఒక గ్రామం లేదా నగరం మరొక దానిపై విజయం సాధించినపుడు ఓడిపోయిన దేవత పూజామందిరాన్ని కూల్చివేసి గెలిచిన దేవత న్యాయాన్ని, ధర్మాన్ని, ఆధిపత్యాన్ని ప్రకటించేవారు. గణనాయకుడు లేదా నగర ప్రభువు కుటుంబీకులే దేవతల పూజాగృహాలకు రక్షకులుగా, పూజారులుగా ఉండేవారు. వారే కులదేవతలు, గ్రామదేవతలు, నగర దేవతలుగా పూజింపబడేవారు.

## గిల్గామేష్ చరిత్ర

ప్రపంచపు తొలి ఇతిహాసంగా భావించబడుతున్న గిల్గామేష్ చరిత్ర 1600-1155 BC లో వ్రాయబడింది. క్రీస్తుపూర్వం 2800-2500 ప్రాంతంలో ఉరుక్‌ను పాలించినాడు గిల్గామేష్. గిల్గామేష్ పుట్టినపుడు అతడు తన తాతగారిని పదవీభ్రష్టుడిని చేస్తాడని జోస్యం చెప్పబడగా ఉరుక్ ప్రభువు తన కుమార్తె ప్రసవించగానే ఆ శిశువును కోటపై నుంచి కిందకు విసిరివేసాడు. గరుడపక్షి ఆ శిశువును కాపాడి ఒక తోటమాలి దగ్గర వదిలిపెట్టగా ఆ తోటమాలి ఈ శిశువును పెంచి పెద్దచేసాడు. సగం దేవతాంశ, సగం మానవాంశ కలిగిన గిల్గామేష్ ఉరుక్ నగర ప్రభువై ఆడమగా తేడా లేకుండా యువతీయువకులను అనుభవిస్తుంటే దేవతలు అతడి పొగరు అణచడానికి 'ఎంకిదు' అనే అనాగరిక మానవుడిని సృష్టించారు. అతడు గిల్గామేష్‌కు సరిఉజ్జీ. అతడు జంతువులాగే పరిగెత్తేవాడు, గడ్డి, పళ్లు, ఫలాలు తిని జంతువులాగే ప్రవర్తించేవాడు. వంటినిండా రోమాలు. అతడిని మచ్చిక చేయడానికి గిల్గామేష్ 'వేశ్య'ను పంపుతాడు (ఋష్యశృంగుడి కథ). ఆమె అతడిని

వశపరచుకుని గిల్గామేష్ వద్దకు తీసుకువస్తుంది వేషభాషలలో కొంత మార్పును తెచ్చి. గిల్గామేష్–ఎంకిడుల మధ్య గొప్ప యుద్ధం జరుగుతుంది. ఫలితం సమానంగా ఉండేసరికి ఇద్దరూ మిత్రులయ్యారు

గిల్గామేష్–ఎంకిడు ఇద్దరూ దేవదారు అరణ్యంలోని హుంబాబా అనే రాక్షసుడిని చంపి విజయోత్సాహంతో ఇంటికి వచ్చారు. ఇస్తార్ దేవత ఇష్టపడుతుంది గిల్గామేష్‌ను.

అప్పటికే ఇస్తార్ దేవత ఇనాన్నాగా తుమ్ముజ్ (దముజ్)ను వివాహం చేసుకుని అతడిని నరకానికి పంపిందని ఎత్తిపొడిచి గిల్గామేష్ ఆమె ప్రేమను తిరస్కరించాడు. ఆమె తన తండ్రి 'అను', తల్లి 'అనటమ్' దేవతలకు చెప్పి స్వర్గలోకపు వృషభాన్ని తెచ్చి గిల్గామేష్‌పై ఉసికొలుపుతుంది. ఇద్దరు మిత్రులు గిల్గామేష్–ఎంకిడులు ఆ వృషభాన్ని చంపగా, వారిని ఇస్తార్ దేవత శాపనార్థాలు పెడుతుంటే ఎంకిడు ఎద్దు కుడితొడ పెరికి ఆమెపై విసిరాడు. దానితో ఆమె శాపాగ్నికి గురై ఎంకిడు జబ్బుపడి మరణించాడు.

తన స్నేహితుడు చనిపోయాక గిల్గామేష్ మృత్యువును జయించాలన్న కోరికతో జలప్రళయంలో బతికి బయటపడిన ఉత్నాపిస్తిమ్‌ను వెదుకుతూ దిల్మన్ (బహరైన్) ద్వీపం వేపు వెళ్లి ఊర్షనాభి అనేవాడి పడవలో ఉత్నాపిస్తిమ్ దంపతులున్న చోటుకు చేరుకున్నాడు.

ఉత్నాపిస్తిమ్ అన్నాడు– యూఫ్రటిస్ నది పక్కన ఉన్న షుర్రుపక్ (Shurrupak) నగరంలో దేవతలు సమావేశమై –"మానవుల సంఖ్య పెరిగి చేస్తున్న అల్లరితో దేవతలకు నిద్ర కరవైంది. మానవులను నాశనం చెయ్యాలని" ఆలోచించి ఎన్‌లిల్ (అనిలుడు), ఆదాద్ (తుఫాను దేవుడు–వరుణుడు) ఈఆ (ఇంద్రుడు) కలిసి ఆలోచించారు. 'ఈఆ' దేవుడు నాకు కలలో కనిపించి రెల్లుగడ్డి ఇంటిని పీకి పడవను తయారుచేసి, పొడుగు, వెడల్పులు సమానంగా ఉండేట్లు, దానిలో సమస్త జీవాలను, గింజలను ఉంచమని ఆదేశించాడు. నూట ఇరవై క్యూబిట్ల పొడవు వెడల్పు ఎత్తున్న పడవలో నా వాళ్లతో కలిసి పడవనెక్కాను. ఆరు రోజులు, ఆరు రాత్రుళ్లు, తుఫాను వర్షం భీకరంగా కురిసింది. ఆ తరువాత పడవ 'నిసిర్' పర్వత శిఖరం వద్ద ఆగింది. పావురం, స్వాలో, కాకులను పంపగా పావురం, స్వాలో తిరిగి వచ్చాయి. కాకి రాలేదు. అది వెళ్లిన దిక్కుకు వెళ్లి దేవతలకు ధూప దీప నైవేద్యాలు అర్పించాను. అందరు దేవతలు తమతమ భాగాలు గ్రహించారు. ఆఖరున వచ్చిన ఎన్‌లిల్ దేవుడు నన్ను ఆశీర్వదించి ఈ దీవిలో ఉంచినాడు.

నీవు నన్ను వెదుక్కుంటూ వచ్చావు మంచిదే కాని నీవు మరలా ఇక్కడికి రాలేవు. నీ తిరుగు ప్రయాణంలో నీకు దివ్య యవ్వనలత లభిస్తుంది. దానికి గులాబిలాంటి పూలుంటాయి. జాగ్రత్త! దానిని నేలపై ఉంచకు. ఊర్షనాబీ– నీవు ఈ ద్వీపానికి తిరిగి రాలేవు, ఇతడితో వెళ్లిపో! –అన్నాడు ఉత్నాపిస్తిమ్.

ఊర్షనాభి తన పడవలో గిల్గామేష్‌ను తీసుకువెళ్తున్నపుడు సముద్రపు అడుగున యవ్వనలత తెల్లని గులాబీ పూలతో, అతిలోక పరిమళాలతో ఉన్నది కనిపించగా దానిని తీసుకువచ్చాడు గిల్గామేష్.

సముద్రతీరానికి చేరుకుని ఉరుక్ నగరం వేపు ప్రయాణం సాగించినారు గిల్గామేష్, ఊర్షనాబిలు. రాత్రి పడింది. అక్కడ వారికి ఓ దిగుడుబావి కనిపించింది. దానిలో దిగి చల్లని నీళ్లు తాగుతున్నపుడు ఓ మహాసర్పం యవ్వనలత పూలవాసనను పసిగట్టి వేగంగా వచ్చి గిల్గామేష్ భుజం మీద నుంచి నేలకు తగిలిన లతను ఎత్తుకుపోయి వాళ్లు నిశ్చేష్టులై చూస్తూ ఉండగానే మింగివేసింది. వెనువెంటనే దానికి పాతచర్మం (కుబుసం) పోయి కొత్త చర్మం వచ్చి యవ్వనంతో కళకళలాడింది (ఉదంకుడి కథ).

గిల్గామేష్ అన్నాడు– 'ఇంత శ్రమించినా నేను యవ్వనలతను కాపాడుకోలేకపోయాను, మరణాన్ని జయించలేకపోయాను. మనకు ప్రాప్తమింతే!' ఇరువురూ ఉరుక్ నగరాన్ని చేరుకున్నారు. గిల్గామేష్ అన్నాడు– 'ఊర్షనాబీ చూడు ఈ కోట నిర్మాణాన్ని. కాల్చిన ఇటుకలతో సప్తజ్ఞానులు దీనికి పునాదిరాళ్లు వేసినారు. మూడవ వంతు నగరం, మూడవ వంతు ఉద్యానవనాలు, మూడవవంతు పొలాలు – అదుగో ఇస్తార్ దేవత ఆలయం – ఈ కథ మృణ్మయ ఫలకాలపై చెక్కబడి శాశ్వత స్థితిని పొందునుగాక!

## ఇనాన్నా - ఎంహెదువన్నా

ప్రాచీన సుమేరియన్ దేవతలలో యుఫ్రెటియస్ భూమాత హన్నహన్న – కాలరేఖలో సుమేరియన్ల కాలానికి ఇస్తార్‌గా మారింది. క్రీస్తుపూర్వం 4000–3000 కాలానికీ ఇనాన్నా దేవత ఉరుక్ పట్టణంలో పూజింపబడుతూ ఉండేది.

ప్రేమ, సౌందర్యం, శృంగారం, కోరిక, ప్రత్యుత్పత్తి యుద్ధం, రాజకీయాలకు అధిష్ఠాన దేవత ఇనాన్నా. ఆమె నిన్-అన్-అక్ = స్వర్గలోకపు రాణి. ఇనాన్నా సోదరి ఎరెష్కిగల్ పాతాళలోకపు రాణి. ఎరెష్కిగల్ భర్త స్వర్గలోకపు వృషభం. ఆ ఎద్దును (గుగలన్నా) గిల్గామేష్-ఎంకిడులు చంపినాక తన సోదరిని పరామర్శించడానికి ఇనాన్నా దేవత పాతాళలోకం వెళ్తుంది. అక్కడ పరామర్శ కాస్తా పోరాటమై అక్కాచెల్లెళ్లు కొట్లాడుకోగా పాతాళలోకపు న్యాయమూర్తులు ఏడుగురు ఆమెకు కారాగార శిక్ష విధించారు. ఎంకి దేవుడి దయతో పాతాళం నుంచి బయటపడి భూలోకం వచ్చేసరికి ఇనాన్నా భర్త దమ్ముజ్ (తమ్ముజ్) హాయిగా సింహాసనంపై కూర్చుని ఈమెను పట్టించుకోడు. తమ్ముజ్ సోదరి అన్నకు సహాయంగా ఉంటుంది. దానితో ఆగ్రహించిన ఇనాన్నా తనకు పాతాళ న్యాయమూర్తులు విధించిన శిక్షను తమ్ముజ్‌కు, అతడి సోదరికి చెరో ఆర్నెల్లు ప్రతి సంవత్సరం పాతాళంలో ఉండేట్లు మార్చి తాను శిక్షను తప్పించుకుంటుంది. తమ్ముజ్ పశుపాలకుడు. అతడు భూమిపై ఉన్న ఆర్నెల్లు ప్రకృతి జీవసంపదతో తొణికిసలాడ్తుంది. అతడు పాతాళంలో ఉన్నపుడు ఋతువులు మారి భూమి అంతా మంచుతో కప్పబడి ఉంటుంది. ఇనాన్నా దేవత కాలరేఖలో ఇస్తార్, అస్తార్తె, అఫ్రొదితి, అయినినా, దయానా పేర్లతో పిలవబడింది. ఇనాన్నాను శుక్రగ్రహం (Venus)గా, ఉదయ సాయం తారగా, మీన రాశిగా గుర్తించారు. తమ్ముజ్‌ను మేషరాశిగా పేర్కొన్నారు ఆనాటి జ్యోతిష్కులు.

ఇనాన్నా దేవత పూజారిణి ఎంహెదువన్నా (Enheduanna) ప్రపంచపు తొలి కవయిత్రి. క్రీస్తు పూర్వం 2500 కాలంలో ఈమె వ్రాసిన సుమేరియన్ దేవాలయ స్తోత్రాలు సప్త సోత్రావళి ఇనాన్నా దేవతనుద్దేశించినవి. ఈమె అక్కడియన్ ప్రభువు సర్గాన్ (Sargon) కుమార్తె.

ఇనాన్నా తండ్రి ఎంకి (జ్ఞానదేవత) లేదా చంద్రుడు నాన్న (Nanna); ఇనాన్నా సోదరుడు ఉటు/షహాష్/సూర్యుడు (Shamash).

సర్గాన్ ప్రభువు (2334-2279 BC) అక్కడియన్లకు నాయకుడు. (సర్రు-ప్రభువు; కినమ్-King-అంగీకారం.) సర్గాన్ కొడుకు మణిష్తుషు; ఇతడి కుమారుడు నరమ్‌సిన్ (Naram-sin).

నరమ్‌సిన్‌కు తలవంచారు సుమేరియన్ పాలకులు లుగల్ షుంగల్‌లు. దానితో నరమ్‌సిన్ నాలుగు దిక్కులను జయించిన చక్రవర్తి అయినాడు.

సుమేరియన్ల కాలపు యుద్ధాలు, వీరుల గాథలు ప్రాక్కథలై మౌఖిక వాఙ్మయాలుగా, తరువాత గ్రంథస్థాలైనాయి.

## సుమేరియన్ నాగరికత (5500-1475 BC)

| | | |
|---|---|---|
| తొలి లిపికాలం (Proto Writing) | - | 4000-2500 BC |
| అక్కడియన్లు | - | 2334 - 2218 BC |
| అమొరైట్లు (బాబిలోనియన్లు) | - | 1894 - 594 BC |
| అస్సిరియన్లు | - | 2600 - 609 BC |
| మితాన్ని | - | 1550 - 1260 BC |

ఈ నాగరికతలన్నిటిలో ఇండో యూరొపియన్ భాషల మూలపదాలు కానవస్తాయి. ముఖ్యంగా మితాన్ని రాజుల కాలంలో సంస్కృత భాషాపదాలు చాలా ఎక్కువగా వాడబడినాయి. బహుశా వీళ్లు వెనక్కి వలస వెళ్లిన ఆర్యులు కావచ్చును (Migration back). క్రీస్తుపూర్వం 1500 కాలంలో ఈశాన్య ఇరాన్ ప్రాంతంలో ప్రజలు అగ్ని ఆరాధకులైనారు. ఇప్పటి ఆఫ్ఘనిస్తాన్‌లోని బాల్కి ప్రాంతం లేదా ఈశాన్య ఇరాన్‌లో జన్మించిన జరాతుష్ట్రుడు ఆనాటి బహు దేవతారాధనను వ్యతిరేకించినాడు. పూజారులను, చిల్లర ప్రభువులను నిరసిస్తూ ఏకేశ్వరోపాసనను సూచించి అగ్నిమతాన్ని ప్రవేశబెట్టినాడు. అతడి వైదిక వ్యతిరేక భావన, సోమరస పాన నిరసన దేవతలను శత్రువులుగా భావించడం అతడికి శత్రువులను తెచ్చిపెట్టింది.

Proto Indo Europeans (6400-3500 BC) తొలి ఇండో యూరొపియన్లు పాంటిక్ కాస్పియన్ పచ్చిక మైదానాల మీదుగా బల్గేరియా, రొమేనియా, మొల్దొవా, ఉక్రెయిన్, ఉత్తర కకాసస్-దక్షిణ రష్యా, దిగువ వోల్గా ప్రాంతాలను దాటి పశ్చిమ కజకిస్తాన్ పచ్చికబీళ్లను దాటి యూరేసియా అంతా విస్తరించారు. ఈ సమయంలోనే లాటిన్, సంస్కృత పదాల ఆవిర్భావం, పశువుల పెంపకం, గుర్రాలు, కుక్కలు, పెంపుడు జంతువుల పోషణ, నాగలి (Plough), నీటి సరఫరా వ్యవస్థ, చక్రం, బళ్లు, ఆకాశదేవర (ద్యుస్ పితరుడు-జూపిటర్), మౌఖిక వీరగాథలు (Oral Heroic Poetry), పితృస్వామ్యం, సూర్యవంశం ఇటువంటివన్నీ బలపడినాయి. దీనిని Sintashta Culture గా పేర్కొన్నారు.

2000–1150 BC - Andronovo culture - కాలానికి ఇండొ–ఇరానియన్ భాషలు అభివృద్ధి చెందినాయి. ప్రపంచపు పైకప్పుగా పేర్కొనబడిన పామీరు, టియాన్ షాన్ (కిర్గిస్తాను), కొప్పెట్‌దాగ్ (తుర్కమనిస్తాను) ప్రాంతాల్లోకి ఆర్యులు ప్రవేశించారు. సంచార గ్రామాలు, తాత్కాలిక గ్రామాలు, చిన్నచిన్న దుర్గాలు, దేవదారు, శంకు, బూరుగుచెట్ల కర్రలతో కట్టిన ఇళ్లు, సోమరసం (Kannabis) పశుపోషణ, గుర్రాలు, గొర్రెలు, మేకలు, ఒంటెలు, కుండలు, రాగి, కంచు లోహ పాత్రలు, పనిముట్లు, యుద్ధతంత్రాలు, నిపుణులైన పనివాళ్లు, దీర్ఘచతురస్రాకార శవపేటికలలో ఖననాలు (కుర్గాను–తుములి) వ్యాప్తిలోకి వచ్చాయి. శకులు, సర్మాతియనులు, అలనులు ఈజాతి ప్రజలు.

ఇంద్రుడిని అధినాయకుడిగా అంగీకరించి– బహుదేవతారాధన చేసే ఆర్యులకు వేదాలు ప్రామాణికం కాగా, వారిని వ్యతిరేకించిన జరాతుష్ట్రుడు, అతడి 'గాథ'లు బోధనలున్న అవెస్తా (అసురవేదం) ప్రామాణికమై పేరు తెచ్చుకున్నాయి. రథాలు విస్తృతంగా వాడకంలోకి వచ్చాయి. (విమల) స్వచ్ఛమైన తార, వృద్ధ ఒంటె, ఉగ్ర నక్షత్రం, ఒంటెల కాపరిగా పేరుపొంది స్పితామా కుటుంబానికి చెందినవాడైన జరాతుష్ట్రుడు బాబిలోన్ నదీతీరాన నివసించేవాడు. ముప్పై ఏళ్ల వయసులో ఏకాత్మ ఉపాసకుడై దేవుడు ఒక్కడే అని నమ్మినాడు. అతడి అనుచరులను అజర – The followers of the wise lord - అని పిలిచేవారు. జరాతుష్ట్రుడికి అప్పుడప్పుడు దివ్యదర్శనాలు కలుగుతూ ఉండేవి (Amesha Spenta). ఆ దివ్యభావ మెరుపులు 'గాథ', అవెస్తాలలో పొందుపరచబడినాయి. 'నీకు మంచిది కానిది ఇతరులకు చేయడానిని నీ మంచితనం అంగీకరించదు – నీకు నచ్చని దానిని ఇతరులకు చేయకు' అనేది స్వర్ణసూత్రం. నీకిష్టమైన దానిని ఎన్నుకునే స్వేచ్ఛ (స్వేచ్ఛా నిర్ణయం, Free will) భగవంతుడు నీకిచ్చాడు – ఈ బోధనలు ఆనాటి ప్రభువు విష్తస్పాకు నచ్చి అతడు జరాతుష్ట్రుని శిష్యుడైనాడు. జరాతుష్ట్రుని రచనలలో ముఖ్యమైనవి – యస్నా హప్తంఘైతి, గాథలు, స్తోత్రాలు. ఆర్మీనియాలో, అఖిమినడ్ సామ్రాజ్యంలో జొరాస్ట్రియన్ (ఫార్సి) మతం బాగా అభివృద్ధి చెందింది. దేవతలను వ్యతిరేకించడం, తుర్యసులతో తగాదాలు అతడికి శత్రువులను తెచ్చిపెట్టినాయి. (ఇరానియన్ల వివస్వంతుడి కుమారుడు– జమ్‌షిద్–జంషెడ్–యముడు).

ఆక్సస్ నదికి ఉత్తరాన ఆర్యనులు, తురియన్లు, సైరిమాలు, సైనసులు, దహులు ఉండేవాళ్లు

అవెస్తాలోని ముఖ్య పదాలు ఇలా ఉన్నాయి. అహురా (అసుర) మజ్ద – భగవానుడు, జీవితానికి జ్ఞానానికి ప్రభువు అహు–జీవితం; అహుమ్ బిస్–గురువు, దేవుడు; అర్యనవేజ–ఆర్యభూమి, ఆర్యదేశం; అజయతి–భౌతిక జీవనం అకుమాన–దుష్ట మనసు; వొహుమాన–సద్బుద్ధి. అమృతత్–అమృతత్వం; అమెషస్పెంత–అంశస్పందన–దివ్యశక్తులు, అనగ్రమైన్యు–దుష్టభూతం; స్పెంత మన్యు–దివ్య భూతం; అరమైతి–భక్తి, ప్రేమ; ఆశ–ఋతం, సత్యం, న్యాయం, విశ్వ ప్రకారం ఆశవహిస్త–అత్యున్నత ధర్మం; అశువాన్–ధర్మపరుడు; అస్పశిహ–నల్లగుర్రం; అసుర– సత్య, న్యాయ దేవతలు; అశ్వినులు–దేవతలకు మధు విద్యను తెచ్చి ఇచ్చిన ఇద్దరు అశ్వికులు; అతర్–పవిత్రాగ్ని; అతష్ అదరణ్–విజయాగ్ని; అతష్ దద్గా–గృహాగ్ని; అతష్‌ఖొరె–సూర్యుడు; బవొధ–బుద్ధి; బర్యమ్–చిదుగులు; ఎరెషి–ఋషి, ఫరిస్తా–దేవదూత; దివొ–దివ్వె; ద్రిఘు–నిరుపేద, ఫ్రావషి–రక్షకదేవదూత; గొష్ ఉర్వ–భూమి, హవొమా–సోమ; యస్న–పూజావిధానం, కరపాణి–సహపూజారి; కుస్తి–జంధ్యం; మైర్య–యువకులు; మజ్ద–జ్ఞానం, మంత్ర–మంత్రాక్షరాలు, స్పెంత–పవిత్రమైనది, ఉష్త–బ్రహ్మానందం; విశ్–పట్టణం; జెంద్–అవెస్తాపై వ్యాఖ్యానం; జవొతారు–పురోహితుడు, అర్మతి–మంచి ఆలోచన.

జరాతుష్ట్రుడికి 77 ఏళ్ల వయసులో అతడు అగ్ని దేవాలయంలో పూజలు చేస్తున్నపుడు అతడిని తుర్ దేశపు వ్యక్తి తలనరికి చంపినాడు.

## ఇండో ఆర్యన్ల తిరుగు వలసలు

కుర్గన్ అనే టర్కీ పదానికి అర్థం తుములస్ లేదా మట్టిదిబ్బ. ఖనన ప్రదేశం. ఈ కుర్గన్ సిద్ధాంత ప్రకారం ఇండో ఆర్యన్ల వలసలు అలలు అలలుగా జరిగాయి.

డేవిడ్ ఆంథొని (2007)లో The Horse, the wheel and language లో కూడా ఇండో ఆర్యన్ల వలసల గురించి ప్రస్తావించాడు.

సింటాష్టా (Sintashta Culture 2050-1900 BC); ఆంద్రొనొవొ (Andronovo Culture 2000-1450 BC), బాక్ట్రియా (2250-1750 BC) ఆ తరువాత 2000–1600 BC కాలంలో ఇండో ఆర్యన్లు ఆర్యన్ల నుంచి విడిపోయారు.

కొందరు లెవాంటె (Levante) వేపు వెళ్లారు. వాళ్లు మితాన్ని (Mitanni) ప్రభువులు. కొందరు ఉత్తర భారతదేశం వేపు వచ్చారు (Vedic People - 1500 BC). కొందరు చైనావేపు వెళ్లారు (Wusun).

## ఋగ్వేద నదులు - దశరాజ యుద్ధం - వైదిక ప్రజలు

సింధు, తృష్టమ (గిల్గిత్), సుసర్తు, అనితభ, రస, మెహత్ను; శ్వేత, కుభ (కాబూల్), క్రుము (కుర్రుమ్), సువాస్తు (స్వాత్), గోమతి (గోమల్), సరయు (సర్జు–హరి), కుశవ (కునార్), యవ్యవతి (జోబ్), సుసోమ (శోణ), అర్జికియ (తావి), వితస్త (జీలం), అసిక్ని (చెనాబ్), పరుస్ని (రవి), విపాస్ (బియాస్), శతుద్రి (సట్లెజ్), మరుద్వృద (మహువర్దవాన్), సరస్వతి, దృశద్వతి, అస్మన్వతి (అస్సన్), యమున, అంశుమతి, గంగ –ఇవి ఋగ్వేద నదులు.

**దశరాజ యుద్ధం –** ఋగ్వేదంలోని ఏడవ మండలంలో ప్రస్తావించబడింది. పంజాబ్ ప్రాంతంలోని రవి నది – పరుస్ని తీరాన త్రత్సు–భారత వంశపు రాజైన సుదాసుడు, అతడి పురోహితుడు వశిష్ఠుడు ఒక పక్షాన, పది రాజులు– పురు, యదు (యక్షు), మత్స్య, ద్రుహ్యా, పక్త, భలన, అలిన, (విషానిని), అను, వైకర్ణ, శివ తెగల రాజుల మధ్య, విశ్వామిత్రుడు వీరికి పురోహితుడిగా యుద్ధం జరిగింది. అటుపక్క అరవైమంది ఇటుపక్క 6666 మంది, అయితే ఇంద్రుడి దయవలన వాగు పొంగి 6666 మంది కొట్టుకుపోగా అతిసులభంగా విజయం సుదాసుడికి చిక్కింది.

త్రత్సు–భరతులు విపాస (బియాస్), శతుద్రి (సట్లెజ్) నదులను దాటి పరుస్ని (రావి) నది వద్ద పది తెగల కూటమిని ఇంద్రుడి దయతో ఓడించారు. ఆ విధంగా సుదాసుడు సరస్వతీ నదీ ప్రాంతాన్ని తన అదుపులోకి తీసుకుని అశ్వమేధయాగం చేసాడు. భరత తెగ ఆధిక్యం మిగతా తెగలపై కొనసాగింది.

భారత యుద్ధంలో ఈ దశరాజ యుద్ధపు ఛాయలు కానవస్తాయి.

తొలి వేదకాలంలో ఆర్యులు సప్త సింధూ ప్రాంతానికే పరిమితమైనారు. తరువాత యమునా నది వరకు విస్తరించారు. మలివేద కాలం నాటికి గంగానదీ ప్రాంతానికి చేరుకున్నారు. తొలి దశలో జనం గుంపును గణం అనేవారు. గణ నాయకుడిని ప్రజలు నియమించుకునేవారు. చిన్ని గ్రామం పేరు విశ్; ప్రపంచం, విశ్వం. మొదట్లో వేదాలు మూడే, వర్ణాలు మూడే. బానిసల అవసరం ఎక్కువయ్యేసరికి స్థానిక పరాజితులను శూద్రులుగా చేసినారు. బ్రాహ్మణ క్షత్రియుల ప్రాధాన్యం, వైశ్యవర్గం పశుపోషణకు వ్యాపారానికి పరిమితం చేయబడింది. ఈ ముగ్గురూ ద్విజులు. సేవకులైన శూద్రులకు ఉన్న ఏకైక విధి పై మూడు వర్ణాలకు సేవ చేయడం. ఒకప్పుడు స్త్రీలకున్న స్వేచ్ఛ క్రమేపీ తగ్గుతూ వచ్చి వాళ్లు ఒక సంపదగా మారిపోయారు. పతివ్రతా ధర్మాలు, కన్యాత్వం, శీలసంపదకు ప్రాధాన్యత పెరిగింది. భూమి అంతా బ్రాహ్మణులది, క్షత్రియులు దాని రక్షకులు. వైశ్యులు భూమి నుంచి సంపదను సృష్టించి బ్రాహ్మణ, క్షత్రియులకివ్వాలి. శూద్రులు అగ్రవర్ణాలకు సేవ చెయ్యాలి. వర్ణ సంకరం వలన పుట్టినవారు అంటరానివారైనారు.

ఋగ్వేద కాలం నాడు స్త్రీలకున్న స్వేచ్ఛ, వికాసం భారత యుద్ధకాలం నాటికి పూర్తిగా తెరచాటుకు పోయింది. "నన్నోడి తన్నోడెనా, తన్నోడి నన్నోడెనా" అన్న ద్రౌపది నిండు సభలో ఆర్తనాదం చేసినా సమాధానం సరిగా దొరకలేదు.

ఆర్య ప్రజల ఆలోచనలు వేదరాశిగా పోగుపడగా వశిష్ఠుని మనవడు పరాశరుని కుమారుడు వ్యాసుడు వేదాలను విభజించి వేదవ్యాసుడై అందరికీ వేదార్థం తెలియడానికి అయిదవ వేదంగా "జయం" అన్న పేరుతో తన వంశగాథను కావ్యంగా మలిచాడు.

## గ్రీకు - లాటిన్ తెగలు

ప్రొటొ ఇండొ యూరొపియన్ ప్రజలలో కొందరు అనటోలియా, బాక్ట్రియా ప్రాంతాలకు అలలు అలలుగా వలస వెళ్లారు. 1800 BC నాటికి మైసినియన్ నాగరికత ఏర్పడింది. 1100–900 BC మధ్యకాలంలో వలసలు రావడం, పోవడంగా అనేకసార్లు జరిగి కొత్త తెగలు ఏర్పడడం, తీర ప్రాంతాలు, దీవులలో నివాసాలు ఏర్పరుచుకోవడంతో ఐవొలియన్లు, డొరియన్లు, అయోనియన్లు అక్కడ స్థిరపడినారు. వారిలో మనకు పరిచయం ఉన్న తెగ ముఖ్యంగా అయోనియన్లు (Ionians). వీరినే మనం యవనులని పిలుస్తాము. యవనుల మూల పురుషుడు అయాన్ (Ion). యురిపిడిస్ అయాన్ కథను గొప్ప నాటకంగా వ్రాసినాడు.

సూర్యుడు క్రెయూసా అనే కన్యను బలాత్కరించగా ఆమె తనకు పుట్టిన కుమారుడిని బలాత్కారం జరిగిన గుహలోనే ఓ ఊయల బుట్టలో ఉంచి వదిలివేస్తుంది. ఆ శిశువును హెర్మెస్ దేవుడు ఏథెన్సు నుంచి తీసుకువెళ్లి డెల్ఫిలోని సూర్యదేవాలయం దగ్గర వదిలివేసాడు. ఆ దేవాలయంలోనే పెరిగిన అయాన్ అని పిలువబడిన ఆ పిల్లవాడు తన తల్లి క్రెయూసాను, సవతితండ్రి క్జుథస్‌లను కలిసి ఏథెన్స్ వెళ్లి ఆ తరువాత ఏథెన్సుకు ప్రభువుగా యవనులకు మూలపురుషుడవుతాడు. ఈ కథ కర్ణుడి జన్మవృత్తాంతాన్ని పోలి ఉంటుంది.

## భారత రామాయణాలు - ఇలియాడ్, ఒడెస్సీలు

క్రీస్తుపూర్వం 1194–1184 ప్రాంతంలో ట్రాయ్ నగర విధ్వంసానికి కారణమైన Trojan War - అఖియనులు (Achaean Greeks) - ట్రాయ్ నగరవాసులకు మధ్య జరిగింది. పది సంవత్సరాలు సాగిన ట్రాయ్ నగర ముట్టడిలో పదవరోజు సంవత్సరాంతాన జరిగిన నాలుగు రోజుల, రెండు రాత్రుళ్ల యుద్ధాన్ని హోమర్ (900–600 BC మధ్యకాలంలో) "ఇలియాడ్"గా వ్రాసినాడు. ఒడిస్సీ కావ్యం – ట్రాయ్ పతనానంతరం ఒడిస్యూస్ అనే వీరుడు తన స్వదేశానికి (ఇథాకా) రావడానికి పడిన కష్టాలను వివరిస్తుంది.

యురిపిడిస్ నాటకం Helen-హెలెన్ మెనెలాస్ ప్రయాణాన్ని, ఈజిప్టు తీరంలో హెలెన్‌తో కలయికను వివరిస్తుంది.

ఈ ఇలియాడ్, ఒడిస్సీ, అయాన్, హెలెన్ గ్రంథాలలోని అనేక ఘట్టాలు మహాభారతం, రామాయణంలోని ఘట్టాలను పోలి ఉండడం గమనార్హం.

## ట్రోజన్ యుద్ధం

ముగ్గురు దేవతలు హెరా, అఫ్రొదితి, ఎథెనాల మధ్య గొడవను సృష్టించింది తగాదాల తల్లి ఎరిస్. 'బంగరు ఏపిల్' పండుపై 'అతిలోక సుందరికి' అని వ్రాసి వారి మధ్యకు విసిరింది దానిని. దేవేంద్రుడు ఆ గొడవను తీర్చేందుకు 'పారిస్' అనే ట్రోజన్ యువరాజు గొర్రెలను సంరక్షిస్తూ ఉన్నపుడు అతడి దగ్గరకు పంపినాడు ఆ ముగ్గురమ్మలనూ.

దేవేంద్రుడి భార్య 'హెరా' అన్నది పారిస్‌తో– "నీకు అనంతమైన శక్తినిస్తాను నన్ను గెలిపిస్తే!"

దేవేంద్రుడి కుమార్తె 'ఎథెనా' అన్నది– "నన్ను విజయురాలిని చేస్తే నీకు అద్భుత జ్ఞానాన్నిస్తాను".

ప్రేమదేవత అఫ్రొదితి అన్నది– "నన్ను గెలిపించు, జగదేకసుందరి హెలెన్‌ను నీకిస్తాను!"

హెలెన్ పేరు చెప్పగానే పారిస్ తన నిర్ణయాన్ని తెలిపి– "అందరికన్నా అందగత్తె అఫ్రొదితి మీ ముగ్గురిలో!" అని Judgement of Paris ప్రకటించాడు. దానితో హెరా, ఎథెనాలకు కోపం వచ్చింది.

పారిస్ ఓ రోజున స్పార్టాను దర్శించి మెనెలాస్ లేని సమయంలో హెలెన్‌ను తీసుకుని ట్రాయ్ నగరానికి ఉడాయించాడు. దానితో గ్రీకులకు ట్రోజన్లకు మధ్య యుద్ధం జరిగింది. వేయి నౌకలలో గ్రీకులు సముద్ర ప్రయాణం చేసి వెళ్లి ట్రాయ్ నగరాన్ని ముట్టడించారు. పదేళ్లు సాగిన ఆ ముట్టడి చిత్రవిచిత్రమైన మలుపులు తిరిగి గ్రీకుల గెలుపుతో ముగుస్తుంది. ట్రాయ్ నగరం అగ్ని జ్వాలల్లో కాలి నేలమట్టమయ్యింది.

# 8. ఇలియాడ్‌కు మహాభారతానికి ఉన్న పోలికలు

## భూభారం తగ్గించడం

1) జ్యూస్ (దేవేంద్రుడు), భూభారాన్ని తగ్గించడానికి ట్రోజన్ యుద్ధాన్ని సాకుగా తీసుకుంటాడు. న్యాయదేవత థెమిస్ అతడికి తోడ్పడుతుంది. భారత యుద్ధమూ అంతే!

2) **ఎడమపాదం–చీలమండ:** పెలియస్–థెటిస్‌ల కుమారుడు ఎఖిల్లిస్ (Achilles)ను అతడి తల్లి థెటిస్ స్టిక్స్ నదీ నీళ్లలో ముంచి లేవనెత్తుతుంది. అతడి శరీరమంతా వజ్రమంత దృఢమవుతుంది కాని ఆమె ఎడమ చీలమండను, పాదాన్ని పట్టుకున్న చోట నీళ్లలో తడవదు.

**ఇటువంటిదే ఇంకో కథ–** ఎఖిల్లిస్ శరీరాన్ని వజ్రతుల్యం చేయడానికి థెటిస్ అతడి శరీరాన్ని ప్రతిరాత్రి హోమాగ్నిలో కాల్చి, పైన అమృతాన్ని (Ambrosia) పూస్తుంది. ఎడమ పాదం, చీలమండను పట్టుకున్న ప్రాంతానికి అమృతం అంటదు. అందుకని ఎఖిల్లిస్ ఎడమపాదం, చీలమండ అతడి శరీరంలో బలహీనమైనవి. విలువిద్యలో నేర్పరి అయిన పారిస్ స్తంభం చాటున దాక్కుని ఎఖిల్లిస్ చీలమండకు తగిలేలా బాణంతో గాయపరుస్తాడు. దానివలన ఎఖిల్లిస్ మరణిస్తాడు (Achilles Heel).

మహాభారతంలో దుర్వాసుడు తన దేహానికి శ్రీకృష్ణుడితో పాయసం పూయించుకుంటాడు. మహర్షి ఎడమ పాదానికి కృష్ణుడు పాయసాన్ని వ్రాయలేదు. దుర్వాసుడన్నాడు– "కృష్ణా! నా శరీరమంతట భక్తితో పరమాన్నం ప్రామినావు. కాని ఎడమ పాదానికి అరికాలులో పూయలేదు. కనుక నీకు పాదతలంలో హాని కలుగుతుంది –అపాయంబు అరికాలిలో నీకును అవిలంఘ్యంబై" (అనుశాసనిక పర్వం, పంచమాశ్వాసం–377)

ఇటువంటి కథనే దుర్యోధనుడి విషయంలో చెబుతారు. తల్లి గాంధారి ఆశీస్సులకై దుర్యోధనుడు భారత యుద్ధం 18వ రోజున స్నానం చేసి నగ్నంగా వెళ్తుంటే కృష్ణుడు ఎగతాళి చేయగా తొడలను అరటి ఆకుతో కప్పుకుని వెళ్లగా గాంధారి తన కళ్లకున్న కట్లు విప్పి తన దృష్టిని మంత్రపూరితంగా అతడిపై ప్రసరింప చేస్తుంది. వెంటనే మరల తన కనులను కప్పుకోగా శరీరమంతా వజ్రసన్నిభమైనా, తొడలు బలహీనం కావడంతో, గదాయుద్ధంలో భీముడి గద దెబ్బకు తొడలు విరిగి నేలకూలాడు దుర్యోధనుడు. (సౌప్తిక పర్వం-377).

3. డయొమెడిస్, ఒడెస్సిస్‌లు అర్ధరాత్రి వెళ్లి డొలాన్ అనే గూఢచారిని, రీసస్ రాజును, అతడి సైనికులు థ్రాసియన్లను పన్నెండు మందిని చంపి రెండు తెల్లటి గుర్రాలను తీసుకుని సురక్షితంగా తమ పక్షానికి చేరినాడు.

అశ్వత్థామ తన మిత్రులు కృతవర్మ, కృపాచార్యుడితో కలిసి అర్ధరాత్రి పాండవ శిబిరానికి వెళ్లి ధృష్టద్యుమ్న, శిఖండి ప్రభృతులను, ద్రుపద పుత్రులను, ఉపపాండవులను, అడ్డువచ్చిన ప్రతి ఒక్కరినీ ఘోరంగా వధించాడు. (సౌప్తిక పర్వం-ప్రథమాశ్వాసము)

4. **వీరుల పోరాటాలు :** ట్రోజన్ యుద్ధంలో విలువిద్యకు విలువలేదు. ముఖాముఖి కత్తీడాలు బల్లెం యుద్ధానికే గౌరవం. అందుకే పారిస్ గొప్ప వీరుడైనా విలుకాడు కాబట్టి అతడిని పిరికివాడుగానే భావించేవారు.

పాట్రొక్లస్ యుద్ధం అభిమన్యుడిని, మెనెలాస్ వీర విహారం భీముడిని, అఖిల్లిస్ పరాక్రమం అర్జునుడిని గుర్తుచేస్తాయి. అఖిల్లిస్ కవచం లాంటిది అర్జునుడి గాండీవం, కర్ణుడి సహజ కవచకుండలాలు.

5. **మృతాత్మల దర్శనం :** ఈ ఘట్టం ఎంతో అద్భుతమైనది. హోమర్ వ్రాసిన ఒడెస్సీలో ఒడెస్సిస్, కిర్కె (సిర్సె) మంత్రగత్తె సాయంతో మృతులను చూసి వారితో సంభాషిస్తాడు. ఎల్పెనార్, టిరెసియాస్, ఒడెసిస్ తల్లి, ఆగమెమ్నాన్, ఎఖిల్లిస్, టాంటాలస్, సిసిఫస్‌లు ఇంకా ఎందరివో ఆత్మలు కనిపించి మాట్లాడతాయి.

## వర్జిల్ వ్రాసిన ఈనీడ్ (Aeneid) లో

కథానాయకుడు ఈనియస్ మంత్రగత్తె సిబిల్ డిఫొబి సాయంతో పాతాళలోకానికి వెళ్లాడు. ఇద్దరూ కొసిటస్ మడుగులు, స్టిక్స్ నది చిత్తడినేలలు, కారన్ పడవ, మృతాత్మలను చూసారు. నరకలోక జాగిలం సెర్‌బెరస్ కనిపించిందతడికి అక్కడ. డిడొ, డిఫోబస్, నరకలోకం, నరకలోకపు శిక్షలు, ఎలిషియన్ వనాలు, ఇంకా ఎందరో వీరులు, ఈనియస్ తండ్రి ఏంఖైసిస్ కనిపించారు.

దాదాపు ఇదేవిధంగా మృతాత్మల దర్శనం మహాభారతంలో వ్రాయబడింది. వ్యాసమహర్షి తన మంత్రశక్తితో ధృతరాష్ట్రాదులకు భారత రణ మృతులను గంగానదిలోకి రావించి చూపించినాడు. ఆ ప్రియ సంగమోత్సవ కథ అతిలోకమైనది. (ఆశ్రమవాస పర్వము-ద్వితీయాశ్వాసము).

స్వర్గారోహణ పర్వంలో ధర్మరాజు నరకలోకాన్ని, వైతరణి నదిని, శిక్షలు పొందుతున్నవారి స్వరాలను వింటాడు. స్వర్గ సుఖాలు పొందుతున్న వారిని చూస్తాడు. అతడి మనసు అనేక సంశయాలతో నిండిపోతుంది.

## ఎంకిడు-ఋష్యశృంగుడు

గిల్గామేష్ చరిత్రలో చెప్పబడిన ఎంకిడు అడవి జంతువులాంటి వాడు. అతడిని పట్టి బంధించడానికి గిల్గామేష్ వేశ్యను పంపి ఎంకిడుని ఉరుక్ నగరానికి రప్పిస్తాడు. (ఋష్యశృంగుడి భార్య శాంత శ్రీరాముడి సోదరి).

రామాయణ మహాభారతాల్లో చెప్పబడిన విభాండకుని కుమారుడైన ఋష్యశృంగుడిని అదే పద్ధతిలో రప్పిస్తాడు అంగదేశపు రాజు రోమపాదుడు.

## గిల్గామేష్ యవ్వనలత - ఉదంకుడి కుండలాలు

జలప్రళయంలో బతికి చిరంజీవిగా ఉన్న ఉత్నాపిస్తిమ్‌ను కలిసి గిల్గామేష్, సముద్రమధ్యంలో నీటి అడుగున ఉన్న యవ్వనలతను తీసుకుని తీరానికి చేరి ఉరుక్ నగరానికి వచ్చే దారిలో, దాహం తీర్చుకోడానికి దిగుడుబావిలో దిగినప్పుడు ఓ పాము యవ్వనలతను దొంగిలిస్తుంది.

మహాభారతంలో కూడా ఉదంకుడు పౌష్య మహాదేవి కుండలాలను తీసుకుని వస్తున్నపుడు దారిలో ఓ పాము (తక్షకుడు) వాటిని దొంగిలించి పాతాళలోకానికి పారిపోతుంది (ఆదిపర్వము-ప్రథమాశ్వాసము).

## అయాన్ - కర్ణుడు

యురిపిడిస్ (414–412 BC)లో వ్రాసిన సుఖాంత నాటకం అయాన్ (Ion). క్రెయూసా–ఏథెన్స్ రాణి. ఆమె కన్యగా ఉన్నపుడు అపోలొ–సూర్యుడు ఆమెను బలాత్కారం చేయగా అయాన్ జన్మిస్తాడు. నవజాత శిశువును బుట్టలో ఉంచి తాను బలాత్కారం చేయబడిన గుహలోనే ఉంచగా దేవతల వార్తాహరుడు హెర్మెస్ ఆ శిశువును ఏథెన్స్ నుంచి తీసుకువెళ్లి డెల్ఫిలోని సూర్య దేవాలయపు మెట్లవద్ద ఉంచుతాడు. అతడు తరువాత కాలంలో తన తల్లిని, సవతి తండ్రిని కలిసి, ఏథెన్స్‌కు రాజై యవనులకు మూలపురుషుడవుతాడు.

ఈ కథ కర్ణుని జన్మవృత్తాంతంలా ఉంటుంది. కర్ణుడు కూడా సూర్యుడి వలన కుంతికి పుట్టి సూతుడి ఇంట్లో రాధేయుడిగా పెరుగుతాడు. మహాభారతంలో అత్యంత విశిష్టమైన పాత్ర కర్ణుడిది (కర్ణుడి తల భారతం అనేది ఉవాచ).

## మాయా హెలెన్-ఛాయా సీత

యురిపిడిస్ (412 BC)లో “హెలెన్” అనే నాటకం వ్రాసినాడు. నిజమైన హెలెన్ పారిస్‌తో ట్రాయ్ వెళ్లలేదని, హెరాదేవత సృష్టించిన మాయారూపం (Eidolon) పారిస్‌తో వెళ్లిందని, అసలు హెలెన్ ఈజిప్టు ప్రభువు ప్రొటియస్ రక్షణలో ఉన్నదని, ప్రొటియస్ చనిపోయాక అతడి కుమారుడు థియొక్లెమెనస్ హెలెన్‌ను పెళ్లి చేసుకోవాలనుకున్నపుడు, హెలెన్ భర్త మెనెలాస్ మాయా హెలెన్‌తో ఈజిప్టు తీరానికి చేరుకుంటాడు. మాయా హెలెన్ మాయమైపోతుంది. థియొక్లెమెనస్ నుంచి యుక్తితో తప్పించుకుని మెనెలాస్, హెలెన్‌లు స్పార్టా చేరుకున్నారు.

కూర్మ పురాణం, బ్రహ్మవైవర్త పురాణం, ఆధ్యాత్మ రామాయణం (బ్రహ్మాండపురాణం), తులసీదాస్ రామచరిత మానసంలో ‘ఛాయాసీత’ గురించి పేర్కొనబడినది. రావణుడు సీతను అపహరించబోతున్నపుడు అగ్నిదేవుడు, ఛాయాసీతను అతడికిచ్చి అసలు సీతను తనలో దాచి రావణసంహారం అనంతరం– అగ్ని పరీక్ష సమయాన అసలు సీతను రాముడికి అప్పగించాడనేది కథనం. ఇది వాల్మీకి రామాయణంలో లేదు కాని, దేవీభాగవతం అద్భుత రామాయణం, ఒరియా రామాయణాలలో, రామలీలలలో కానవస్తుంది.

రాక్షస మాయలలో అలంబుసుడు, ఘటోత్కచుడు, ఇంద్రజిత్ (మేఘనాథుడు) మాయారూపాలను సృజించి శత్రువులను భ్రమింపచేయడంలో సిద్ధహస్తులు.

## హెలెన్ - సీత

మెనెలాస్ ట్రాయ్ యుద్ధం చేసాడు హెలెన్ కోసం. రాముడు రామరావణ యుద్ధం చేసాడు సీతకోసం.

జ్యూస్ దేవుడి ఆయుధం మెరుపులు, ఇంద్రుడి వజ్రాయుధం మెరుపులు కురిపిస్తుంది. ఫిన్లాండ్‌లో Vassar hammer - వస్సర అంటే సుత్తి, వజ్రంలా కఠినమైనది. ‘ఓడిన్’ (Odin) దేవుడి Odin hammer వజ్రాయుధమంత గట్టిది.

హిందూ దేవతలకు గ్రీకు దేవతలకు పోలికలు చాలా కానవస్తాయి.

ఇలియాడ్, ఒడెస్సి, ఈనీడ్, అయాన్, హెలెన్ లాంటి కావ్యాలు, నాటకాలలోని కొన్ని విషయాలు మహాభారతం కథనంలోని ఘట్టాలను గుర్తుకు తెస్తాయి.

## ట్రోజన్ వుమెన్ - స్త్రీపర్వం

యురిపిడిస్ వ్రాయగా 415 BC లో ప్రదర్శించబడిన Trojan Women నాటిక అత్యంత కీర్తిని గడిచింది. అప్పటి వరకు రాజభోగాలననుభవించిన ట్రాయ్ నగరపు అంతఃపుర స్త్రీలు సంపదలుగా, బానిసలుగా చూడబడుతూ తమవారిని చంపిన వారి ఆస్తులుగా మారి పంపకాలలో ఎవరికి చెంది ఏ కష్టాలు పడాల్సివస్తుందో అన్న ఆందోళనతో పరితపిస్తున్నవారి మానసిక ఆందోళనను ప్రతిబింబించే అద్భుత నాటకం Trojan Women - హెకుబా రాణి కాసాండ్రా, ఆండ్రొమాఖి, హెలెన్‌ల ఆర్తనాదాలు మన మనసును కలచివేస్తాయి.

స్త్రీపర్వంలో గాంధారీదేవి దివ్యదృష్టితో రణరంగంలో నేలకూలిన వారిని చూస్తూ, వారిని ఆ పార్థివ దేహాల పక్కన విలపిస్తున్న తన కోడళ్లను, బంధువులను చూస్తూ శ్రీకృష్ణుడితో చెప్పే సన్నివేశం స్త్రీపర్వంగా మహాభారతంలో రూపుదిద్దుకున్నది.

## ఎఖిల్లిస్ కవచం - కర్ణుడి సహజ కవచకుండలాలు

పెలియస్ రాజు, సముద్రకన్య (Nereid) థెటిస్‌ల కుమారుడు ఎఖిల్లిస్ (అఖిల్లిస్). తన బాల్యస్నేహితుడు పాట్రొక్లస్‌తో కలిసి ఎఖిల్లిస్ సెంటార్ చిరాన్ (Centaur Chiron) వద్ద అన్ని యుద్ధవిద్యలు నేర్చుకుంటారు. తల్లి థెటిస్ ఆ పసివాడి ఎడమకాలి చీలమండ దగ్గర పట్టుకుని ‘స్టిక్స్’ నదిలో ముంచి లేపగా, అతడి శరీరం వజ్రసన్నిభమై, ఒక్క చీలమండ

దగ్గర బలహీనంగా ఉంటుంది. అది Achilles heel గా ప్రసిద్ధికెక్కింది. ట్రోజన్ యుద్ధంలో ఆగమెమ్నాన్‌పై ఓ యువతి విషయంలో తగాదా వచ్చి యుద్ధానికి దూరంగా ఉండి, పాట్రోక్లస్ చనిపోయాక అప్పుడు రణరంగంలోకి వచ్చి వీరవిహారం చేస్తాడు ఎఖిల్లిస్.

భీష్ముడు తనను అర్ధరథుడన్నాడని కర్ణుడు కూడా భీష్ముడు యుద్ధం చేసిన పదిరోజులూ రణరంగంలోకి రాడు. భీష్ముడు అంపశయ్యపైకి చేరినాక కర్ణుడు యుద్ధరంగంలోకి దిగుతాడు. ఎఖిల్లిస్ కవచం ఎంత ప్రసిద్ధిపొందిందో, కర్ణుడి సహజ కవచ కుండలాలు అంతే ప్రసిద్ధికెక్కినాయి. దేవేంద్రుడే స్వయంగా బ్రాహ్మణుడి వేషంలో వచ్చి ఆ కవచకుండలాలను కర్ణుడి నుంచి దానంగా గ్రహించాడు.

పారిస్ స్తంభం చాటునుంచి వేసిన బాణం ఎఖిల్లిస్ ఎడమకాలి చీలమండకు తగిలి ఎఖిల్లిస్ నేలకూలినాడు.

నేలలో దిగబడిన రథచక్రాన్ని పైకి లేవనెత్తుతూ ఉన్నపుడు, అర్జునుడు వేసిన బాణాలకు నేలకూలాడు కర్ణుడు. రాముడు వాలిని చంపినదీ చాటు నుంచే కదా!

### మిడాస్-సువర్ణ ష్ఠీవి

ఫ్రిజియా రాజు పేరు మిదాసు (మిడాస్, మైదాసు). అతడు దేనిని ముట్టుకుంటే అది బంగారమయ్యేలా వరం పొందినాడు. ఇతడి తండ్రి గోర్డియాస్. తల్లి సైబిలి. ఏది ముట్టుకున్నా బంగారమై తిండి, నీళ్లు కూడా బంగారమయ్యేసరికి భయభ్రాంతుడవుతున్న క్షణంలోనే అతడి కుమార్తె 'నాన్నా' అంటూ పరిగెత్తుకువచ్చింది. ఎంతో ప్రేమగా 'రా, అమ్మా!' అంటూ ఎత్తుకునేసరికి ఆమె కూడా బంగారమయ్యింది. దానితో మిదాస్ దేవతలను ప్రార్థించి వరాన్ని వెనక్కి ఇచ్చేసాడు.

భారతంలో సృంజయుడనేవాడు సంతానార్థం గొప్ప తపస్సు చేసాడు. నారదమహర్షి అతడితో అన్నాడు- "నీకెటువంటి కుమారుడు కావాలి?". సృంజయుడు- "నాకు పుట్టబోయే కుమారుడి ఉమ్మి, వమనం, మలమూత్రాదులు బంగారం కావాలి" అన్నాడు.

సృంజయుడికి సువర్ణష్ఠీవి అనే కుమారుడు జన్మించాడు. అతడి విసర్జనాలన్నీ బంగారం కావడంతో కొద్దికాలంలోనే సృంజయుడి సంపదలు దేవేంద్రుడిని మించిపోయాయి. కొందరు దొంగలు అది విని సువర్ణష్ఠీవిని ఎత్తుకుపోయి అడవిలో బంగారు బాతు పొట్టకోసి చూసినట్లు కోసి చూసి ఏమీ కానరాక ఆ బాలుడి శవాన్ని అక్కడే వదిలేసి తమలో తాము కొట్టుకుచచ్చారు. నారదుడతడిని బ్రతికించాడు. ఈసారి ఇంద్రుడు పంపిన వజ్రాయుధం పులిరూపంలో అతడిని వెంబడించి చంపింది. నారదుడతడిని మరల బ్రతికించి దీర్ఘాయువునిచ్చాడు (శాంతి పర్వము-ప్రథమాశ్వాసము).

గ్రీకు కథలో మిదాసు పట్టుకున్నదల్లా బంగారమయ్యింది; భారత కథలో సువర్ణష్ఠీవి విడిచిందల్లా బంగారమయ్యింది.

## 9. పంచతంత్రంలోని మూడు చేపల కథ మహాభారతంలో

పంచతంత్రంలోని మిత్రభేదంలో మూడు చేపల కథ ఉన్నది. ఆ చేపల పేర్లు అనంగత విధాత, ప్రత్యుత్పన్నమతి, యధాభవిష్యుడు.

మహాభారతంలోని మూడు చేపల పేర్లు దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు (శాంతి పర్వం-తృతీయాశ్వాసం). అనాగత విధాత-దీర్ఘదర్శిగా, ప్రత్యుత్పన్నమతి-ప్రాప్తకాలజ్ఞుడిగా, యదాభవిష్యుడు-దీర్ఘసూత్రుడిగా చెప్పబడినారు.

శాంతి పర్వంలోని అనేక కథలు, శిఖండి పురుషరూపం పొందిన కథల ప్రతిధ్వనులు పంచతంత్ర కథల్లో, అరేబియన్ నైట్స్ కథల్లో వినిపిస్తాయి.

## 10. 'గీత'లెన్ని?

హిందూ ధర్మశాస్త్రాలన్నిటిలోనూ దాదాపు 60 గీతలున్నాయి. భారతంలోనే 20 గీతలున్నాయని అంటారు. భగవద్గీత అన్నిటికన్నా ప్రసిద్ధమైనది. భగవద్గీతలో 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు (1-ధృతరాష్ట్రుడు; 40-సంజయుడు; 84-అర్జునుడు; 575-శ్రీకృష్ణుడు చెప్పినవి). (భారత భగవద్గీతలో 745 శ్లోకాలున్నాయి).

కపిల, భిక్షు, అష్టావక్ర గీత, అవధూత గీత, భిక్షుగీత, భ్రమర, శృతి, అయిల, వ్యాస, యమ, పృథ్వి, పితృ, అగస్త్య, బోధ్యగీత, బ్రహ్మగీత, దేవిగీత, గణేశ గీత, గోపికా గీత, గురుగీత, హనుమద్గీత, అంబరీష గీత, గోపికా గీత, ఉద్ధవగీత,

(వామదేవ గీత, ఉతథ్య, ఋషభ, షడ్జ, శంపాక, మంకి, వృత్ర, పరాశర, అశ్మక, సేనాజిత, విశఘ్ను, పిత్రు, బ్రహ్మ, అను, బ్రాహ్మణ, హరి, హారీత, హంస, భృగు, శ్రీభగవద్గీతలు- భారతంలోనివి). ఇవికాక పాండవ, నారద, గురు, యాజ్ఞవల్క్య, గర్భ, జీవన్ముక్త, జ్ఞాన, వసిష్ఠ, అర్జున, సిద్ధాంత, కర్మ, మోక్ష, పంచరత్న, సన్యాస, కబీర, కృష్ణ, ప్రణవ, రిభు, వాల్మీకి, నారాయణ, పంచదశ గీతలు మొదలైన గీతలు ప్రాచుర్యంలోకి వచ్చాయి.

## 11. ధర్మరాజును ఆక్షేపించిన చార్వాకుడు, ముంగిస

చార్వాకుడనే వాడు బ్రాహ్మణ సమూహంలో ఉన్నాడు. అతడు దుర్యోధనుని మిత్రుడు. ధర్మరాజ పట్టాభిషేక సంరంభాలు ఉధృతంగా సాగుతున్నాయి. శ్రీకృష్ణుడు, సోదరులు బంధుమిత్రులు అందరూ సిద్ధంగా ఉన్నారు.

చార్వాకుడన్నాడు- "ఇతడెటువంటి రాజు? తండ్రి, సోదరుడు, కొడుకు, గురువు, తాత అని చూడకుండా అందరినీ చంపి ఏం సుఖపడదామనుకుంటున్నాడు? ఎలా రాజ్యం చేస్తాడు?"

కంగారుపడ్డాడు ధర్మరాజు, కంగారు పడినారు మిత్ర బంధువులు, కంగారు పడినారు బ్రాహ్మణులు.

బ్రాహ్మణులు మంత్రవేత్తలు, రాక్షసాంశ కలిగిన చార్వాకునివేపు తీవ్రంగా చూసారు. వారి కోపాగ్నులు, హుంకారాలకు చార్వాకుడు పెద్ద పిడుగు పడి నేలకూలిన వృక్షంలా చచ్చి నేలపై పడినాడు (శాంతిపర్వము-ప్రథమాశ్వాసము-361-368).

అశ్వమేధయాగం దిగ్విజయంగా ముగిసింది. ధర్మరాజును అందరూ అభినందించారు. అతడిపై తేనె సొనలు జాలువారే పూలవాన కురిసింది. అదే సమయాన - ఒక్క బిలంబు నుండి వెల్వడి యొక్క నకులంబు (ముంగిస) బ్రాహ్మణుల మధ్యకు వచ్చి అన్నది- "ఈ యాగమేమంత గొప్పది? వీసమంత కూడా సక్తుప్రస్థుడి మహాధర్మాన్ని పోలదు. అతడింటిలో నీళ్లతడి, పేలపిండి తగిలి నా తల, శరీరంలో సగభాగం బంగారుమయమయ్యాయి. నేను ఈ అశ్వమేధ యాగం జరిగినన్నాళ్ళూ యాగశాలలో తిరుగుతూనే ఉన్నాను, నా దేహం పూర్తిగా బంగారం అవుతుందేమోనని. ఏం మారలేదు!".

ధర్ముడు పితృదేవతల శాపంతో ముంగిసగా మారి, అందరూ పొగిడిన దానిని ఆక్షేపించినపుడు మరల ధర్ముడిగా మారతాడని చెప్పబడినాడు. ఆ విధంగా ధర్ముడు ధర్మజుడి అశ్వమేధయాగాన్ని ఆక్షేపించి నిజరూపాన్ని పొంది, ధర్మజుడిని ఆశీర్వదించి వెళ్లిపోయినాడు (విశేషమేమిటంటే ధర్ముడి అంశతో పుట్టినవాడే ధర్మరాజు).

## 12. భారతంలో కుక్క

1) జనమేజయుడి యాగశాల దగ్గర సారమేయుడనే కుక్కను జనమేజయుడి సోదరులు కొట్టగా ఆ కుక్క తల్లి సరమ (దేవతాశునకం) జనమే జయుడిని తీవ్రంగా అభిశంసిస్తుంది. (ఆదిపర్వం-ప్రథమాశ్వాసం).

2) కుక్క నీచమైన బుద్ధికలది అని చెప్పే కథలో ఒక ముని దగ్గర ఉన్న కుక్క పులిని చూసి భయపడగా దయగల ముని దానిని బెబ్బులిగా, ఆ తరువాత సింహంగా, ఆ తరువాత శరభంగా మారుస్తాడు. మహాశరభంగా మారిన ఆ కుక్క ఆ మునినే చంపి తినాలనుకుంటుంది, తనకన్న గొప్ప జంతువును ముని సృష్టించకుండా. దాని బుద్ధి తెలిసిన ముని దానిని మునుపటి కుక్కగా మార్చివేస్తాడు, కనకపు సింహాసనాన కూర్చోబెట్టినా కుక్కబుద్ధి మారదన్న ధోరణిలో. (శాంతిపర్వం-తృతీయాశ్వాసం).

3) విశ్వామిత్రుడు ఆకలికి తట్టుకోలేక చండాలుడి ఇంటివద్ద వేలాడబడేసి ఉన్న శునక మాంసఖండాన్ని దొంగిలించబోయి పట్టుబడిన ఘట్టం- విశ్వామిత్ర-చండాల సంవాదం - కుక్క మృగములలో కెల్ల కుత్సితంబు -అని చండాలుడు చెప్పినా బతికి ఉంటే అన్ని పాపాలు పోగొట్టుకుంటాను అని పలికి విశ్వామిత్రుడు కుక్కమాంసం తింటాడు, చండాలుడు దయతో ఇవ్వగా (శాంతిపర్వం- తృతీయాశ్వాసం).

4) మహా ప్రస్థానానికి సిద్ధమైన పాండవులు, ద్రౌపదితో వారికన్నా ముందే వచ్చి అంతఃపుర వాకిలి బయట నిలబడిన సారమేయుడు-కుక్క వారిని అనుసరిస్తూ వెళ్లింది. దారిలో ద్రౌపది, సహదేవుడు, నకులుడు, అర్జునుడు, భీముడు, ఒక్కొక్కరుగా పడిపోయారు. చివరకు మిగిలింది ధర్మరాజు, కుక్క. ఇంద్రుడు వచ్చాడు- "బొందితో స్వర్గానికి అర్హుడవైనావు. రా, దివ్యరథం అధిరోహించు! నీ సోదరులు, పాంచాలి ఇప్పటికే స్వర్గంలో ఉన్నారు"

మెత్తని పులి ధర్మరాజన్నాడు- "నన్ను ఇక్కడవరకు అనుసరించిన కుక్క నాతో రాకపోతే నేనూ రాను"

ఇంద్రుడన్నాడు- "కుక్కలకు స్వర్గ ప్రవేశార్హత లేదు".

ధర్మజుడన్నాడు- "అయితే నాకా స్వర్గం అక్కర్లేదు".

కుక్క మాయమై అక్కడ యమధర్మరాజు కనిపించాడు- "నీవు గెలిచావు ధర్మజా! నేను ధర్మాన్ని, కుక్కరూపంలో వచ్చాను. నిన్ను పరీక్షించడానికి".

ఈ విధంగా మహాభారతం- "ఇదేమి ధర్మం? నా కుమారుడిని అన్యాయంగా కొట్టారు?" అని ప్రశ్నించిన కుక్క సరమతో మొదలై, తన కుమారుడిని కుక్కరూపంలో అనుసరించిన యమధర్మరాజుతో ముగుస్తుంది.

## 13. ధర్మరాజును మూడుసార్లు పరీక్షించిన యమధర్మరాజు

1) ద్వైతవనంలో అరణి విషయకంగా సరస్సు దగ్గర 'కొంగ'గా యక్షప్రశ్నలు వేసిన ఘట్టం.

2) మేరు పర్వత సమీపంలో మహాప్రస్థాన ఘట్టంలో 'కుక్క'గా అనుసరించిన ఘట్టం.

3) యమధర్మరాజుగా ఇంద్రుడితో కలిసి మాయా నిర్మిత స్వర్గ నరకాలను, స్వర్గ సుఖాలనుభవిస్తున్న దుర్యోధనుడిని, నరక యాతనలనుభవిస్తున్న సోదరులు, ద్రౌపది స్వరాలను విని తాను కూడా నరకంలోనే ఉండిపోవడానికి నిశ్చయించుకున్నపుడు.

ధర్మరాజును ఈ విధంగా మూడుసార్లు పరీక్షించినాడు యమధర్మరాజు. మూడు పరీక్షలలోనూ గెలుపు సాధించిన కుమారుడిని చూసి పుత్రోత్సాహంతో పొంగిపోయినాడు యమధర్మరాజు. అదేవిధంగా 'ముంగిస' రూపంలో వచ్చి అశ్వమేధ యాగాన్ని అధిక్షేపించాడు.

## 14. దూర తీరాలు

| | | |
|---|---|---|
| హస్తినాపురం - (మీరట్-ఉత్తరప్రదేశ్) | - న్యూఢిల్లీకి 115 కిలోమీటర్లు | |
| కురుక్షేత్రం - హర్యానా | - 170 కిలోమీటర్లు హస్తినకు | |
| ఇంద్రప్రస్థం - న్యూఢిల్లీ | - 115 కిలోమీటర్లు హస్తినకు | |
| మధుర - ఉత్తరప్రదేశ్ - ఆగ్రాకు 50, | - ఢిల్లీకి 150 కిలోమీటర్లు | - హస్తినాపురానికి 254 కిలోమీటర్లు |
| బృందావనం - ఉత్తరప్రదేశ్ - మధురకు | - 15 కిలోమీటర్లు. | |
| ద్వారక - గుజరాత్ - మధురకు | - 1350 కిలోమీటర్లు | |
| న్యూఢిల్లి - ద్వారక | - 1387 కిలోమీటర్లు | |
| శతశృంగం - వంద శిఖరాల కొండ - హిమాలయ పర్వతపాదాలు | | |
| ఏకచక్రపురం - పశ్చిమబెంగాల్ | - ఢిల్లీకి 1500 కిలోమీటర్లు | |
| పాంచాల - బరెల్లి - ఉత్తరప్రదేశ్ | - ఢిల్లీకి 300 కిలోమీటర్లు | |
| కామ్యకవనం - హర్యానా | - ఢిల్లీకి 1900 కిలోమీటర్లు | |
| ద్వైతవనం - జునాగఢ్, గుజరాత్ | - ఢిల్లీకి 1263 కిలోమీటర్లు | |
| అంగదేశం - భగల్పూర్, బీహార్ | - ఢిల్లీకి 1570 కిలోమీటర్లు | |
| పాండ్య - తమిళనాడు - మధురై | - ఢిల్లీకి 2650 కిలోమీటర్లు | |
| మగధ - బీహార్ - పాట్నా నుండి ఢిల్లీ | - 1055 కిలోమీటర్లు | |
| కోసల - అయోధ్య-సాకేతపురం | - ఢిల్లీకి 1326 కిలోమీటర్లు | |
| అవంతి - మధ్యప్రదేశ్-ఉజ్జయిని, అవంతి | - ఢిల్లీకి 775 కిలోమీటర్లు | |
| వత్స - కౌశాంబి-ఉత్తరప్రదేశ్ | - ఢిల్లీకి 33 కిలోమీటర్లు | |
| విరాట - రాజస్థాన్-జైపూర్ | - ఢిల్లీకి 310 కిలోమీటర్లు | |
| ఉపప్లావ్యం - రాజస్థాన్ | - ఢిల్లీకి 300 కిలోమీటర్లు | |
| ప్రాగ్జ్యోతిషపురం - అస్సాం - గౌహతి | - ఢిల్లీకి 1900 కిలోమీటర్లు | |

## 15. అయిదూళ్లు - సూదిమొన

ఇంద్రప్రస్థం (ఢిల్లి), స్వర్ణప్రస్థం (సొనిపేట), పానప్రస్థం (పానిపట్), వ్యాఘ్రప్రస్థం (బాఘ్‌పట్), తిలప్రస్థం (తిల్పత్) – పాండవులడిగిన అయిదూళ్లు. సూదిమొనంత భూమి కూడా ఇవ్వనన్నాడు సుయోధనుడు.

కుశస్థల, వృకస్థల, మకండి, వారణావ్రత, ఇంకో గ్రామం ఏదైనా ఇమ్మన్నాడు ధర్మరాజు సంజయుడితో.

## 16. అస్త్రం - శస్త్రం

చేతితో పట్టుకుని ఉండేది శస్త్రం – చేతిని విడిచి వెళ్లేది అస్త్రం;

మంత్రపూరితమైనది మంత్రాస్త్రం–దివ్యాస్త్రం

1) **బ్రహ్మాస్త్రం :** దీనిని ప్రయోగిస్తే పెద్ద అగ్నిగోళం పుడుతుంది. మెరుపులు జ్వాజ్వల్యమానంగా మెరుస్తాయి. చెట్లు, కొండలు, సముద్రాలు జంతువులు సంక్షుభితమవుతాయి. మంచు ప్రవాహాలు కరుగుతాయి, ఆకాశం నల్లబడుతుంది. పర్వతాలు దద్దరిల్లి, భూమి కంపిస్తుంది. వ్యక్తిని వ్యక్తులనుద్దేశించి ప్రయోగిస్తే ఆ వ్యక్తిని నాశనం చేస్తుంది. ఆ అస్త్రం ప్రయోగించబడిన చోట దానిని మరల బ్రహాస్త్రంతోనే మరలించకపోతే పన్నెండు సంవత్సరాలు ఆ ప్రాంతంలో వర్షం కురవదు.

2) **బ్రహ్మశిరోనామకాస్త్రం :** బ్రహ్మాస్త్రం కన్నా నాలుగింతలు శక్తివంతమైనది. నాలుగు శిరసుల బ్రహ్మను అస్త్రంతో స్మరించి ప్రయోగిస్తారు. అశ్వత్థామ "అపాండవం బయ్యేదు గాక!" అని ప్రయోగించాడు.

3) **బ్రహ్మదండం :** ఆత్మరక్షణాస్త్రం, బ్రహ్మాస్త్రం నుంచి కాపాడుతుంది.

4) **నారాయణాస్త్రం :** ప్రయోగించినపుడు ఏకాదశ రుద్రులు, అనంతంగా చక్రాలు, గదలు, బాణాలు వెలువడతాయి. నారాయణుడిని స్మరించి, ఆయుధాలు కిందపడేసి, నేలపై నిలబడినవారిని నారాయణాస్త్రం గాయపరచదు.

5) **పాశుపతాస్త్రం :** అన్నిటిని సంహరించి, అందరినీ ఓడించే అస్త్రం.

6) ఇంద్రాస్త్రం, 7) ఆగ్నేయాస్త్రం, 8) వరుణాస్త్రం, 9) పర్వతాస్త్రం, 10) మోహనాస్త్రం, 11) ప్రజాస్త్రం, 12) వాయువ్యాస్త్రం, 13) నాగాస్త్రం, 14) మానవాస్త్రం, 15) భార్గవాస్త్రం – ఇవి దివ్యాస్త్రాలు.

గాండీవం, పినాకం, సారంగం మూడు ధనుస్సులను ఒకే వెదురు కర్రను మూడు భాగాలు చేసి నిర్మించారు. సారంగ ధనుస్సుకు మరోపేరు కోదండం. గాండీవధారి అర్జునుడు; సారంగపాణి విష్ణువు, కోదండరాముడు; పినాకపాణి శివుడు.

## 17. ఎవరి శంఖము వారు ఊదుట

1) శ్రీకృష్ణుడు–పాంచజన్యము, 2) అర్జునుడు–దేవదత్తము, 3) ధర్మరాజు–అనంత విజయము,
4) భీముడు–పౌండ్రము, 5) నకులుడు–సుఘోషము, 6) సహదేవుడు–మణిపుష్పకము

## 18. మేరు - అరారత్ - ఒలింపస్ పర్వతాలు

కాశ్మీరుకు ఉన్న వాయువ్యాన ఉన్న పామీరు ప్రాంతాన్ని మేరు, సుమేరు ప్రాంతంగా, దేవభూమిగా, భువన మధ్యగా భావిస్తారు. అయిదు శిఖరాల పర్వతమైన మేరు పర్వతం మామూలు దృక్కులకు కానరాదు. దీనిని భూమి అక్షంగా, దేవతల నివాస స్థలంగా, మామూలు నేత్రాలకు కానరానిదిగా విజ్ఞులు భావిస్తారు. ఎత్తు 25,000 అడుగులు.

ఒకప్పుడు ఆర్మీనియాలో, ఇప్పుడు టర్కీలో నిద్రాణస్థితిలో ఉన్న జ్వాలాముఖి–అగ్నిపర్వతం మాసిస్, అగ్రిదగి, అరారత్ పర్వతం (16854 అడుగులు) Great Ararat, Little Ararat గా రెండు శిఖరాలున్న ఈ పర్వతం వద్ద Noah's Ark ఆగిందనేది బైబిల్ మాట. అర్జనవర్త, ఉరార్త, శోక పర్వతం – అగిర్ దాగి, ఉగ్రగిరి, మాసిస్, అరారత్ పేర్లు.

గ్రీకు దేశంలోని ఎత్తైన పర్వతం ఒలింపస్ (Olympus) గ్రీకు దేవతలు ఇక్కడ ఉంటారు. Mytikas దీని అత్యున్నత శిఖరం (9800 అడుగులు). Olympus - Pure foot - పవిత్ర పాదం. ఇలియాడ్‌లో దీనిని స్వర్గద్వారంగా పేర్కొన్నారు. ఒలింపస్ పర్వతపు ఉత్తర పాదం వద్ద Nine Muses నవ కళామతల్లులు – Pieria వద్ద నివసిస్తారు.

# 19. జలప్రళయం

అక్కడియన్ సృష్టి క్రమంను వర్ణించే ఇతిహాసం– అత్ర–హాసిస్ (Atra-Hasis). మట్టి పలకలపై వ్రాయబడిన ఈ కథ హమ్మురబి మునిమనవడు అమ్మి–సదుఖ (1646–1626) క్రీస్తుపూర్వం నాటిది.

అత్రహాసిస్ (అత్యంత జ్ఞాని) షురుప్పక్ పట్టణ ప్రభువు. అతడు ఈ కథలో నాయకుడు.

దేవతలు అను (ఆకాశదేవర), ఎన్‌లిల్ (వాయుదేవుడు–భూదేవర), ఎంకి (సముద్రదేవర)లు చిల్లరదేవుళ్లకు భూమిపై నదుల, కాలువల నిర్వహణ బాధ్యత నప్పగించగా నలభై ఏళ్లు శ్రమించి వాళ్లు ఎదురుతిరిగారు. అందుకని దయామయుడైన ఎంకి దేవుడు మామి (భూదేవత)తో మాట్లాడి మట్టితో బొమ్మలను చేసి గెష్తు–యి అనే జ్ఞానదేవతను చంపి అతడి రక్తమాంసాలతో మట్టిబొమ్మలకు ఆకారం తెప్పించగా దేవతలంతా ఆ బొమ్మలపై ఉమ్మివేసారు. పదినెలలకు ఆ బొమ్మలున్న కుండ పగిలి మానవులు వెలువడినారు.

మానవులు కదా దేవతల పనితట్టల్ని (Labour baskets) మోస్తూ చిల్లరదేవతలకు శ్రమ తగ్గించారు. కాని, వాళ్ల జనాభా విపరీతంగా పెరిగి, వాళ్ల గొడవకు దేవతలకు తలనెప్పి రాగా కఠిన హృదయుడైన ఎన్‌లిల్–కరువు కాటకాలతో మానవ జనాభాను తగ్గించే ప్రయత్నం చేసాడు. అయినా వీళ్ల గొడవ తగ్గకపోవడంతో జలప్రళయాన్ని సృష్టించాడు ఎంకి దేవుడి సాయంతో.

అయినా ఎంకి దేవుడు దయగలవాడు కనుక అత్రాహాసిస్ ప్రభువుకు రెండతస్థుల నౌకను నిర్మించమని సలహా ఇచ్చాడు. నౌకను నిర్మించి తాను, తన కుటుంబం, జీవాలతో లోపల సురక్షితంగా అత్రాహాసిస్ ఉండగా ఏడురోజులపాటు భీకర వర్షం కురిసి వరదలు రాగా నౌకలో ఉన్న అత్రాహాసిస్ రక్షింపబడినాడు.

ఇదే కథ గిల్గామేష్ చరిత్రలో–ఉత్నపిస్తిమ్‌గా, బాబిలోనియన్ కథలో జియుసుద్రుడిగా, శతపథ బ్రాహ్మణం, మత్స్యపురాణం, మహాభారతంలో వైవస్వత మనువుగా, అగ్ని, వరాహ, గరుడ, శివ, పద్మ, స్కంద, బ్రహ్మ వైవర్త పురాణాలలోనూ ప్రస్తావించబడింది జలప్రళయం.

బైబిల్‌లో Noah's Ark కథ (Genesis 6-9) జలప్రళయాన్ని ఇదే రీతిలో వర్ణిస్తుంది.

అత్రాహాసిస్, ఉత్నపిస్తిమ్, జియుసుద్రుడు, వైవస్వత మనువు (శ్రాద్ధదేవుడు), నోవాగా జలప్రళయంలో బ్రదికి బయటపడ్డ వారి గాథలు అమరత్వం కోసం మానవుడి తపనను గుర్తుచేస్తాయి.

## అమృతం కోసం (శాశ్వత జీవనం) మానవుని తపస్సు

గిల్గామేష్ మృత్యువును జయించాలని ఉత్నాపిస్తిమ్‌ను కలిసినాక యవ్వనలతను సాధిస్తాడు కాని దానిని పాము ఎత్తుకుపోతుంది.

అమృతం పంపకాలలో మోహినీ చేసిన మాయతో ఆగ్రహించిన దానవులు దేవతలతో యుద్ధానికి దిగారు. తన తల్లి వినత దాస్యాన్ని మాన్పడానికి స్వర్గలోకం వెళ్లి అమృతభాండం తెస్తాడు సుపర్ణుడు. అది నాగులకు దక్కకుండా వెంటనే ఇంద్రుడు తీసుకుపోతాడు. బొందితో స్వర్గానికి పోవాలన్న కోరికను కొందరు రాజులు, మహర్షులు నెరవేర్చుకోగలిగారు. నహుషుడు, త్రిశంకుడు తమతమ ప్రయత్నాలు చేసారు. ధర్మరాజు సశరీరంగా వెళ్లినా ఆకాశగంగలో స్నానం చేసి దివ్యదేహాన్ని పొందుతాడు. యముడితో వాదించి తన భర్త సత్యవంతుడి ప్రాణాల్ని తెచ్చుకున్నది సావిత్రి. తన భార్య ప్రమద్వరకు తన ఆయుస్సులో సగం ధారపోసి పాముకాటుతో మరణించిన ఆమెను బ్రతికించుకున్నాడు రురుడు. కచ దేవయాని కథ–మృత సంజీవని విద్యను కచుడు సంపాదించడం అమృతత్వం కోసమే.

అర్జునుడు ఇంద్ర తనయుడు కాబట్టి స్వర్గానికి వెళ్లి తిరిగి వచ్చాడు. తన కొడుకు బభ్రువాహనుడి చేతిలో ప్రాణాలు కోల్పోయినా, భార్య ఉలూచి మహిమతో మరల బ్రదికాడు. కాని ఆమె భారతయుద్ధంలో చనిపోయిన తన కుమారుడు ఇరావంతుడిని బతికించుకోలేకపోయింది. శ్రీకృష్ణుడు బ్రతికించిన మృతశిశువు పరీక్షిత్తు కాలం గడిచాక మహారాజై తక్షక కాటుతో మరణించాడు. ఎందరినో బ్రతికించిన శ్రీకృష్ణుడు కాలసర్పం కాటుకు కన్నుమూసినాడు.

దేహం శాశ్వతం కాదు, ఆత్మ శాశ్వతమైనది ని ప్రబోధిస్తూ పురుషార్థములైన ధర్మ అర్థ కామ మోక్షాలకు అతీతమైన ముక్తిని సాధించే రహస్యాలను వివరించడానికి వ్రాయబడింది భారతం. అందుకే 'జయం'లో ఇలా పేర్కొనబడింది.

**ధర్మేచ అర్థేచ కామే చ మోక్షేచ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్–**

# 20. మహాభారత కావ్యం - ఇతర కావ్యాలు

| భాష | ఇతిహాసం | లైన్లు | రచయిత | కాలం |
|---|---|---|---|---|
| సుమేరియన్ | గిల్గామేష్ చరిత్ర | 3600 | – | 13–10 శతాబ్దాలు BC |
| సంస్కృతం | మహాభారతం | 200000 | వ్యాసుడు | 400 BC - 400 CE |
| సంస్కృతం | రామాయణం | 48000 | వాల్మీకి | 700 BC |
| గ్రీకు | ఇలియాడ్ | 15693 | హోమర్ | 800 BC |
| గ్రీకు | ఒడిస్సి | 12109 | హోమర్ | 800 BC |
| లాటిన్ | ఈనీడ్ | 9896 | వర్జిల్ | 29 - 19 BC |
| పర్షియన్ | షానామా | 100000 | ఫిరదౌసి | 977 - 1010 CE |
| ఇటాలియన్ | డివైన్ కామెడి | 14233 | డాంటీ | 1308 - 1321 AD |
| ఇంగ్లీషు | పారడైజ్ లాస్ట్ | 10000 | జాన్ మిల్టన్ | 1667 AD |
| తమిళం | శిలప్పదికారం | 5731 | ఇల్లంగో అదిగళ్ | 500 - 600 AD |
| తమిళం | మణిమేఖల | 4861 | శాత్తనార్ | 500 - 600 AD |
| తెలుగు | మహాభారతం | 80000 | కవిత్రయం | 1054 - 1353 AD |

సంస్కృత భాగవతంలో 12 స్కంధాలు, 335 అధ్యాయాలు, 14264 శ్లోకాలు (16259–18000), 1320 ఉవాచలు ఉండగా బమ్మెర పోతనామాత్య విరచిత (1370–1450 క్రీ.శ.), శ్రీ మహాభాగవతంలో 12 స్కంధాలు, 9005 గద్య పద్యాలున్నాయి. (శిధిల భాగవతాన్ని పూరించినవారు బొప్పరాజు గంగన (5వ స్కంధం); ఏర్చూరి సింగన (6వ స్కంధం); వెలిగందల నారయ (11, 12 స్కంధాలు).

సంస్కృత భాష (1500 BC) తొలివేద కాలం నాటికి కాస్త స్థిరరూపాన్ని దాల్చినా మార్పులు పొందుతూనే ఉన్నది. ప్రత్యేకమైన లిపి లేకపోవడంతో బ్రాహి, శారద, సిద్ధ లిపులలో, ప్రస్తుతం దేవనాగరి లిపిలో వ్రాయబడుతున్నది. వేదకాలపు సంస్కృతం, పాత అవెస్తన్, మైసినియన్ గ్రీక్ భాషను పోలి ఉండడం గమనార్హం. సంస్కృతం విరామ, హలంత, హసంత భాష.

అజంతా భాష అయిన తెలుగు పంపన కాలం నాటికే (940 CE) ఒక నిర్దిష్ట రూపాన్ని, లిపిని సంతరించుకున్నది. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళంతో సహా 26 భాషలు ద్రావిడ భాషాకుటుంబానికి చెందినవి. కవిత్రయం (నన్నయ, తిక్క, ఎర్రన) 1054–1353 CE మధ్యకాలంలో సంస్కృత భారతాన్ని శ్రీమదాంధ్ర మహాభారతంగా తెలుగులోకి అనువదించినారు.

# 21. వైదిక - గ్రీకు - రోమన్ దేవతలు

| హిందూ | గ్రీకు | రోమన్ |
|---|---|---|
| ద్యు–పితరుడు (ఇంద్రుడు) | జ్యూస్ | జూపిటర్ |
| శచీదేవి | హెరా | జునో |
| యమధర్మరాజు | పొజిడాన్ | నెప్ట్యూన్ |
| రుద్రుడు | ఏరిస్ | మార్స్ |
| సరస్వతి | ఎథెనా | మినర్వా |
| భూమి | డిమాతర్ | సిరెస్ |
| సూర్యుడు–ఆదిత్యుడు | అపొలో | అపొలో |
| చంద్రిక | ఆర్టెమిస్ | డయానా |
| రతీదేవి | అఫ్రోదితి | వీనస్ |
| మయుడు–విశ్వకర్మ | హెఫాయిస్టాస్ | వల్కన్ |
| నారదుడు | హెర్మెస్ | మెర్క్యురి |
| బలరాముడు | డయొనైసస్ | బాకస్ |

హెస్టియా-వెస్టా-గృహదేవత; హేడ్స్-ప్లూటో-యముడు, పెర్సిఫోని-ప్రొసర్పినా-యమి; హెకాతె-హెకాతె-భూతగణదేవత, ముగ్గురు ఎరినైస్ - ముగ్గురు ఫ్యురీస్ - కాలదేవతలు; హెలియాస్-సాల్-సూర్యుడు; గెయియా-టెర్రా-నేల, రియా-ఓప్స్-అదితి; థెమిస్-థెమిస్-ఆచారదేవత, లెటొ-లటొనా-మాతృత్వదేవత; పాన్-ఫౌనాస్-వనదేవత; ఇలిథియా-లూసినా-శిశు జనన దేవత; ఎరాస్-క్యుపిడ్-మన్మధుడు; ఆంపిట్రైటి-సలాసియా-సముద్రదేవత; హెరాక్లిస్-హెర్క్యులస్-హరి; ఆస్క్లెపియాస్-అస్కులెపియాస్- ధన్వంతరి; తొమ్మిది మ్యూజెస్-మ్యూజెస్-ఆనంద దేవతలు; ముగ్గురు హొరాలు-సీజన్లు-మూడు ఋతువులు.

**హిందూ దేవతలు :**

**వేదకాలం :** ఇంద్ర, అగ్ని, సోమ, సవితృ, విష్ణు, రుద్ర, ప్రజాపతి, ఉషస్సు, పృధ్వి, అదితి, సరస్వతి, వాక్కు నిర్రుతి, రాత్రి, అరణ్యని, దినసాన, రక, పురంధి, పరేంది, భారతి, మహి, శ్రీ-లక్ష్మి.

అందరూ అసురులుగానే పుట్టినా కొందరు దేవతలవుతారు.

33 దేవతలు = ఒక్కో లోకానికి 11 మంది. ద్వాదశాదిత్యులు (12); ఏకాదశ రుద్రులు (11); అష్ట వసువులు (8); అశ్వినీదేవతలు (2) = మొత్తం 33.

**త్రిమూర్తులు :** బ్రహ్మ, విష్ణువు, శివుడు

**ముగ్గురమ్మలు :** సరస్వతి, లక్ష్మి, పార్వతి

**పది అవతారాలు (విష్ణువు) :** మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, శ్రీరామ, కృష్ణ, బుద్ధుడు, కల్కి.

గణేశ, కార్తికేయ, హనుమాన్, సూర్యుడు ఇతర దేవతలు.

**ఇంకో సిద్ధాంతం ప్రకారం 33 దేవతలు-** ప్రజాపతి, ఇంద్రుడు, అష్ట వసువులు, ద్వాదశాదిత్యులు, ఏకాదశ రుద్రులు.

అదితి, అగ్ని, అర్ధనారీశ్వర, అయ్యప్ప, బలరామ, బ్రహ్మ, బృహస్పతి, చండి, దుర్గ, గణేశ, హరిహర, ఇంద్ర, జగన్నాధ, కాళి, కల్కి, కృష్ణ, కుబేర, కూర్మ, లక్ష్మి, లోకపాల, మత్స్య, మిత్ర, నరసింహ, నటరాజ, పరశురామ, పార్వతి, ప్రజాపతి, రామ, సప్తమాతృక, సరస్వతి, షష్ఠి, శివ, స్కంద, సూర్య, త్రిమూర్తి, వామన, వరాహ, వరుణ, వాసుదేవ, విష్ణు, విశ్వకర్మ, యమ - ఇంకా ఎందరో దేవతలు.

**దేవతలు :** ముప్పైమూడు కోట్లు లేదా ముప్పది ముగ్గురు లేదా ముగ్గురు లేదా ఒక్కడు.

**హిందూ మతంలో ముఖ్యదేవతలుగా-** గణేశుడు, శివుడు, కృష్ణుడు, రాముడు, హనుమంతుడు, విష్ణువు, లక్ష్మి, దుర్గ, కాళి, సరస్వతి, అయ్యప్ప పూజలందుకుంటున్నారు.

**షడ్వింశతి తత్వం :** పంచభూతాలు, వాటి గుణాలు, అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, మనసు, బుద్ధి, అహంకారం, మహత్తు - కలిగినది 24 తత్వాల వికార ప్రకృతి. 25వ తత్వం పురుషుడు లేదా జీవాత్మ (పంచ వింశతి); పరమాత్మ 26వ తత్వం. ఇది సాంఖ్యయోగ పద్ధతిలో చెప్పబడింది.

**ప్రళయాలు (నాలుగు రకాలు) :**

**1) నిత్య -** ప్రతిదినమూ జీవితంలో సంభవించే తీవ్ర నష్టాలు, కష్టాలు

**2) నైమిత్తిక (బ్రహ్మ) -** బ్రహ్మరాత్రి - 14 మన్వంతరాలు దాటిన నాటి రాత్రి పధ్నాలుగు లోకాలు ధ్వంసమవుతాయి మహా ప్రళయంలో. సత్య, తప, జన, మహర్లోకాలు మిగుల్తాయి బ్రహ్మప్రళయంలో.

**3) ప్రాకృత-** బ్రహ్మ జీవితకాలం 100 బ్రహ్మ సంవత్సరాలు. పాత బ్రహ్మ నశించి ప్రకృతి పురుషుల కలయికతో కొత్త బ్రహ్మ జన్మిస్తాడు.

**4) ఆత్యంతిక-** సంపూర్ణ లయస్థితి - జీవన్ముక్తి (కైవల్య మోక్షం).

# 22. ఎవరికోసం ఈ భారతం?

కవులు ద్రష్టలు. ఆ కాలంలోని సమస్యలకు పరిష్కారాలను వెదుకుతూ త్రికాలాల్లోకి తొంగిచూసి తమకున్న జ్ఞాన పరిధిలో దివ్యావేశాన్ని పొంది మంచీ చెడుల మధ్య యుద్ధాన్ని తగిన పాత్రల మధ్య సృష్టించి కావ్య రసపోషణ కొరకు నవరసాల్ని తగుపాళ్లలో కూర్చి, సమయోచిత సంభాషణలతో జీవన నాటకాన్ని రక్తికట్టించ చూస్తారు.

ఎందరో కవులు, కవిగాయకులు యదార్థ సంఘటనలకు కాస్త అలంకారాలను, అతిశయోక్తులను, అతిలోక శక్తులను జోడించి వారు ఎదుర్కొన్న సమస్యలకు పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తారు. శీతాకాలపు నెగళ్ల వద్ద, గుడుల దగ్గర ఉత్సవాలలో, కుటుంబ గ్రామ పండుగలలో యుద్ధ ఘట్టాలు రక్తాన్ని పొంగింపజేస్తాయి, నీతిబోధలు నిద్రను తీసుకువస్తాయి. కుల గాథలు గౌరవ మీసాలను మెలితిప్పుతాయి.

యుద్ధరంగంలో గీతోపదేశం విన్నా నరుడికి గుర్తుండేది చాలా తక్కువ. నారాయణుడు పక్కనే ఉన్నపుడు అద్భుత కార్యాలు చేసి, అంతా తన గొప్ప అనుకుని, అతడు నిష్క్రమించగానే శక్తిహీనుడవుతాడు నరుడు. విశ్వరూపాలు, దివ్య దృష్టులు, దివ్యశక్తులు, దివ్యాస్త్రాలు అన్నీ నరుడిని విడిచి వెళ్లిపోగా, అప్పటి వరకు దంభాలు పలికినవాడు మహాప్రస్థానం మధ్యలోనే నేలకూలతాడు.

భారతంలో చెప్పబడినవీ, ప్రస్తుత భారతదేశంలో చెరపడానికి ఎంత ప్రయత్నించినా చెరగని గీతల్లా వర్ణ కులవ్యవస్థ, ఉచ్ఛ నీచ భావనలు, అణగదొక్కబడిన మనుషులు, స్త్రీలు వీరి కోసం కొత్త గీతను నారాయణుడు నరుడికి చెప్పాల్సి ఉంది. ఆ వర్ణభాషను మానేసి ప్రస్తుత మానవుల తీరుతెన్నులను పరిశీలించినప్పుడు కూడా ఈ వ్యవస్థలోనూ 1) మేధావి వర్గం, 2) అధికార, రాజకీయ బల వర్గం, 3) వ్యాపార వర్గం, 4) ఉద్యోగ వర్గం – వీరుకాక మిశ్రమ వర్గాలు కానవస్తూనే ఉన్నాయి మారుపేర్లతో.

మేధావి వర్గం గమనిస్తూనే ఉంటుంది, తమకంటే దిగువనే ఉండాల్సిన రాజకీయ నాయకులు, అధికారులు తమను శాసించడం. అది నచ్చదు. అందుకని వారిలో వారిమధ్య తగాదా బెట్టి ఇరవై ఒక్కసార్లు దండెత్తి కార్యవీర్యార్జునులను నిర్మూలనం చేసి మరల మేధావుల నుంచే రెండో వర్గాన్ని పుట్టిస్తారు. అందుకోసం మేధావుల నాయకుడు అనేక అవతారాలనెత్తుతాడు. రెండో వర్గానికి యుద్ధం, జూదం, శాంతి, అన్వేషణ ముఖ్య ధర్మాలై ఎప్పుడూ కొట్టుకుచస్తుంటారు రాజ్యోపశాఖలుగా. మూడో వర్గమైన వ్యాపారస్తులు, రైతులు పై రెండు వర్గాలకు ఆర్థికపుష్టిని కలిగిస్తూ వారిలో కొంతమంది గోడమీది పిల్లులై, కొందరు రాజ్యపు ఆర్థిక నిర్మాతలై ధనార్జనలో మునిగి ఉంటారు. నాలుగవ వర్గం పుట్టిందే సేవ చేయడానికి గనుక ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంకాలం అయిదు గంటల వరకు పనిచేసీ చేయక, వీలైతే అధిక సమయం పనిచేసి, చేసి, చేస్తూనే బ్రతికి చచ్చిపోతారు. వీళ్లనే పనికిరాని వాళ్లు పనిలేనివాళ్లు, పనికిమాలిన వాళ్లుగా పై మూడు వర్గాలు పనిచేయించుకుంటాయి.

ఈ నాలుగు వర్గాలలోనేకాక అయిదోవర్గం, స్త్రీవర్గంలో కూడా మరల నాలుగు విభాగాలు ఉండడమే సహజమని మనకు భారతాన్ని, జీవితాన్ని చదివినప్పుడు అర్థమవుతుంది.

మేధావులు తమలో తాము– 'ఎవరు మేధావి?' అని పశ్నించుకుంటూనే తమ రక్షణ కోసం తమను తాము భూలోకపు దేవతలుగా ప్రతిష్ఠించుకోవడానికి వ్రాసిన గ్రంథం భారతం. ప్రతి నరుడికీ, జీవితాశయం నారాయణుడి – సాయుజ్య, సామీప్య, సాలోక్య, సారూప్య స్థితిని పొందడమే గనుక ఈ పుస్తకం ప్రతి నరుడికి కరదీపికగా ఉపయోగ పడుతుంది.

**అథాతో బ్రహ్మ జిజ్ఞాసా!**

# 23. భారతమొక పారిజాత వృక్షం

జయం, భారతం, మహాభారతం, పంచమవేదం, కార్ష్ణ వేదం, వాసుదేవ తత్త్వకోశం, పాండవ విజయం మొదలైన పేర్లతో చిరస్థాయినొందిన మహేతిహాసం మహాభారత కావ్యం.

చంద్రవంశానికి చెందిన భరత వంశీయుల కథ ఇది. మొదట నుండి చివరి దాకా సాగే కథ ఆఖ్యానంగా, అనుబంధ కథలు ఆఖ్యానకాలుగా, ఉపాఖ్యానాలుగా ఉన్న మహాభారత వృక్షానికి పూల సువాసనలు ధర్మార్థ కామ

మోక్షాలు. చెట్లు ఇచ్చే నీడ వేద సారాంశము. నర నారాయణ గుణ కీర్తన పరమార్థమే పరమఫలం. మానవ దైవ బలాలను వివరించేది, దేవుడే మానవుడిగా, నారాయణుడిగా, కృష్ణుడిగా అంతరించి నరుడికి విజయసాధనలో తొద్పడే విశిష్ట భావ వివరణం మహాభారతం.

**అమితాఖ్యానక శాఖల బొలిచి వేదార్థమల చ్ఛాయమై**
**సుమహద్వర్గ చతుష్క, పుష్ప వితతిన్ శోభిల్లి కృష్ణార్జునో**
**త్తమ నానాగుణ కీర్తనాథ ఫలమై, ద్వైపాయనోద్యాన జా**
**త మహాభారత పారిజాత మమరున్ ధాత్రీసుర ప్రార్థ్యమై**

(ఆదిపర్వం-ప్రథమాశ్వాసం-32)

మహాభారత యుద్ధం క్రీస్తుపూర్వం 1328లో జరిగిందని పరిశోధకుల అభిప్రాయం. దాదాపు అదే సమయంలో (1194-1184 BC) ప్రాంతంలో ట్రోజన్ యుద్ధం (Trojan War) జరిగిందని పురాతత్త్వ శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

వాల్మీకి వ్రాసిన రామాయణం, వ్యాసుడు రచించిన జయ భారతం, హోమర్ వ్రాసిన ఇలియాడ్, ఒడిస్సీ కావ్యాలలో అనేక సంఘటనలు ఒకదానిని ఒకటి పోలి ఉండడం గమనార్హం.

'జయ' కావ్యాన్ని వ్యాసుడు రచించగా దానిని ప్రచారం చేసినవారు వైశంపాయన, పైల, సుమంత, జైమినులు. వైశంపాయనుడు తన వ్యాఖ్యానంతో జయ కావ్యాన్ని భారతంగా పాండవుల మునిమనవడు, అభిమన్యుడి మనవడు, పరీక్షిత్తు కుమారుడు అయిన జనమేజయుడికి వినిపించగా ఉగ్రశ్రవసుడు దానిని విన్నవాడై ఆ కథకు అనేక ఉపాఖ్యానాలను జోడించి మహాభారతంగా నిడివి పెంచినాడు.

మహాభారత కాలం నాటి గృహస్థాశ్రమ ధర్మం క్షీణించి మ్లేచ్ఛుల దండయాత్ర, అలెగ్జాండర్ (327-325 BC), జైన బౌద్ధ మతాల వ్యాప్తితో సన్యాసాశ్రమానికి ప్రాధాన్యత పెరిగింది. కాలరేఖలో వాటిపై వ్యాముఖ్యం పెరిగి గుప్తుల కాలం నాటికి వైదికధర్మం పునరుద్ధరించబడినా, శైవ వైష్ణవ శక్తి మతాల ఆలోచనలు పెరిగి వైదిక దేవతల స్థానంలో త్రిమూర్తులు, విష్ణువు, శివుడు, శక్తి ఆరాధనలు జోరందుకున్నవి. వాటితో పాటు సాహిత్యమూ అనేక పురాణాల రూపాన్ని పొంది బహురూప దేవతలు, బహువిధ భక్తులు, శాఖలు, వీరులు, అనుయాయులు ఏర్పడినారు.

18 పర్వాల మహాభారతం (సంస్కృత) ఉపపర్వాలతో నూరు పర్వాల గ్రంథమై, లక్ష శ్లోకిగా పేరుపొందింది. కవిత్రయ విరచిత ఆంధ్ర మహాభారతంలో 18 పర్వాలు 63 ఆశ్వాసాలు, పద్యగద్యాలు 21,507 ఉన్నాయి.

క్రీస్తుశకం 1054-1061 ప్రాంతంలో నన్నయ భట్టారకుడు ఆది సభాపర్వాలను అరణ్యపర్వంలో నాలుగో ఆశ్వాసంలో కొంతభాగం వ్రాసినాక కన్నుమూసినాడు. తిక్కన సోమయాజి (1205-1288) విరాటపర్వం మొదలుకుని 15 పర్వాలు తెనిగించాడు. ఎఱ్ఱాప్రెగ్గడ (1325-1353) అరణ్య పర్వంలో శేష పర్వాన్ని నన్నయశైలిలో ప్రారంభించి తిక్కన శైలితో ముగించి ఇరువురి మధ్య వారధిగా నిలిచాడు.

వేంగి దేశపాలకుడు, చాళుక్యరాజు విమలాదిత్యుని కుమారుడు రాజరాజనరేంద్రుడి (1019-1061 CE) ఆస్థాన కవి నన్నయభట్టారకుడు. ఆ రాజ్యానికి రాజధాని రాజమహేంద్రవరం (రాజమండ్రి). ఆదికవి, శబ్దశాసనుడు, వాగనుశాసనుడుగా ప్రసిద్ధికెక్కినాడు నన్నయభట్టారకుడు.

విక్రమసింహపురి (నెల్లూరు)ని పాలించిన మనుమసిద్ధి ప్రభువుకు మంత్రిగా పనిచేసిన తిక్కన సోమయాజి (1205-1288 CE) కవిబ్రహ్మ, ఉభయకవి మిత్రుడిగా పేరుపొందినాడు. తిక్కనది సంభాషణాత్మక, నాటకశైలి.

నన్నయ అసంపూర్ణంగా వదిలిన అరణ్యపర్వ శేషాన్ని పూర్తి చేసినది ఎఱ్ఱాప్రెగ్గడ. శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడిగా పేరుపొందిన ఎఱ్ఱన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవి (1325-1353). ఇద్దరి శైలులను అనుకరిస్తూ అరణ్యపర్వ శేషభాగాన్ని అనితరసాధ్యంగా ఆంధ్రీకరణ చేసాడు ఎఱ్ఱన. మహాభారతం ఒక మహాకథ. గొప్ప కథనం.

ఏ యది హృద్యము అపూర్వం బేయది, ఎద్దాని వినిన నెరుక సమగ్రంబై యుండును, అఘనిబర్హణ మెయ్యది, అక్కథయు వినగ నిష్టము మాకున్ అని ఆదిపర్వంలో అడిగినపుడు ఉగ్రశ్రవసుడు శౌనకాది మునులకు మహాభారత కథను – నిశ్చయముగ స్థిరంబుగ మతి సంగతమగునట్లు ఆ మహాత్ములకు అతివిశదము కాగ ఈ మహాకథను చెప్పాడు. (స్వర్గారోహణ పర్వాంతం వరకు).

# 24. యుద్ధ వ్యూహాలు

| | కౌరవ | పాండవ |
|---|---|---|
| **భీష్మ** | 1) మానవ (సర్వతోముఖిదండ) | అచల (వజ్ర) |
| | 2) గరుడ | క్రౌంచ (ఎగుర్తున్న కొంగ) |
| | 3) గరుడ | అర్ధచంద్రకార |
| | 4) మండల | శృంగాటక |
| | 5) మకర | శ్యేన |
| | 6) క్రౌంచ | మకర |
| | 7) మండల | వజ్ర |
| | 8) కూర్మ (ఊర్మి) | శృంగాటక (కొమ్ము) (ఊర్మి=సముద్ర తరంగం)/త్రిశూల |
| | 9) సర్వతోభద్ర | మండల (నక్షత్ర) |
| | 10) అసుర | దైవ |
| **ద్రోణ** | 11) శకట | క్రౌంచ |
| | 12) గరుడ | అర్ధమండలాకార (అర్ధచంద్రాకార) |
| | 13) పద్మ (చక్ర) | – |
| | 14) శకట పద్మ సూచీముఖ | (ఖడ్గ/సర్ప) |
| **రాత్రియుద్ధం** | 15) పద్మ | వజ్ర |
| **కర్ణ** | 16) మకర | అర్ధచంద్ర |
| | 17) మకర (సూర్య) | అర్ధచంద్ర (బృహస్పతి) |
| **శల్య** | 18) సర్వతోభద్ర | త్రిభుజ (క్రౌంచ) |

**అర్ధరాత్రి అశ్వత్థామ–**

# 25. బ్రహ్మ

**బ్రహ్మ–** స్వర్ణ మేనిఛాయ, నాలుగు శిరస్సులు, హంస వాహనం, చతుర్భుజుడు. వేదములు, జపమాల, స్రువస్రుక్ గరిటె, కమండలం నాలుగు చేతులలో ధరించినవాడు, జటాముకుట మండితుడు, స్వర్ణకిరీటధారి, అభయముద్ర; భార్య– సరస్వతి (వాక్కు). రాజస్థాన్–పుష్కర్‌లో బ్రహ్మ దేవాలయం ప్రసిద్ధమైనది. జావా–ఇండొనేషియా–యోగ్యకర్త–ప్రంబనన్ త్రిదేవాలయంలో బ్రహ్మ, విష్ణు, శివుల దేవాలయాలున్నాయి. థాయ్‌లాండ్–బ్యాంకాక్‌లో బ్రహ్మను 'ఫ్రాప్రామ్' అని పిలుస్తారు. బర్మాదేశం– బ్రహ్మదేశం. చైనాలో సిమియన్‌షెన్ (చతుర్ముఖుడు) Tshangs Pa గా టిబెటన్లు, బొంటె అని జపాన్, బ్యాంచెన్ అని కొరియాలో బ్రహ్మను పూజిస్తారు.

త్రిమూర్తులలో ఒకడు, సృష్టికర్త, వేద రచయిత. స్వయంభువుగా హిరణ్యగర్భుడు; విరించి, ప్రజాపతి.

# 26. ప్రజాపతులు (23)

ప్రజలను సృష్టించేవారు. జీవులకు అధిపతి. ఇండో–యూరొపియన్ల Protogonos - First born, బ్రహ్మాండం (Cosmic egg) నుంచి మొట్టమొదట పుట్టినవాడు. బ్రహ్మ కూడా ప్రజాపతిగా మహాభారతంలో చెప్పబడింది.

1) అంగిరసుడు, 2) అత్రి, 3) పులస్త్యుడు, 4) పులహుడు, 5) క్రతువు, 6) కర్దముడు, 7) విక్రీతుడు, 8) శేషుడు, 9) సంశ్రయుడు, 10) స్థాణుడు, 11) ప్రచేతసుడు, 12) దక్షుడు, 13) వివస్వనుడు, 14) అరిష్ఠనేమి, 15) మరీచి, 16) భృగు, 17) వశిష్ఠుడు, 18) హేతి, 19) ప్రహేతి, 20) అధర్ముడు, 21) ధర్ముడు, 22) స్వాయంభవ మనువు, 23) కశ్యపుడు.

మహాభారతంలో పేర్కొనబడిన ప్రజాపతులు–21. రామాయణంలో 16 మంది ప్రజాపతులుగా పేర్కొనబడినారు.

**అత్రి:** బ్రహ్మమానస పుత్రుడు; ఋగ్వేదంలో అయిదవ మండల రచయిత. అనసూయ ఇతడి భార్య. త్రిమూర్తులను పసిపిల్లలుగా చేసిన అనసూయకు బ్రహ్మ అంశతో చంద్రుడు, విష్ణువు అంశతో దత్తాత్రేయుడు, శివుడి అంశతో దుర్వాసుడు జన్మించారు. దుర్వాసుడి భార్య అజాముఖి (మేక ముఖం). దుర్వాసుడు–అజాముఖి సంతానం– వాతాపి–ఇల్వలుడు.

బృహస్పతి భార్య తార. అత్రి కుమారుడు చంద్రుల కలయిక వలన పుట్టినవాడు బుధుడు. బుధుడు–ఇల ల కుమారుడు పురూరవుడు (సుద్యుమ్నుడనే రాజు శాపవశాత్తు 'ఇల'గా మారి బుధుడి వలన పురూరవుడి తల్లి అవుతాడు (ఇల–ఇడా = వాగ్దేవత).

**పులస్త్యుడు :** పులస్త్యబ్రహ్మ భార్య మానిని. వీరి కుమారుడు విశ్రవసుడు. విశ్రవసుడికి ముగ్గురు భార్యలు– ఇళబిళ (ఇలావిద, దేవవర్ణిని), కైకసి, రాక. ఇళబిళ కుమారుడు కుబేరుడు. కైకసి కుమారులు రావణ, కుంభకర్ణ, విభీషణులు; కుమార్తె శూర్పణఖ; రాక– కుమారుడు ఖరుడు.

రావణుడి భార్య మండోదరి. వీరి సంతానం మేఘనాధుడు (ఇంద్రజిత్తు), అతికాయుడు, అక్షకుమారుడు; రావణుడి మరో భార్య ధాన్యమాలిని.

కుంభకర్ణుడి భార్య వజ్రమాల. వీరిపుత్రులు కుంభ నికుంభులు.

విభీషణుడి భార్య సరమ. వీరికి ఏడుగురు కుమార్తెలు (త్రిజట).

కైకసి తండ్రి సుమాలి, తల్లి తాటకి; సోదరులు మారీచ సుబాహులు.

(పులస్త్యబ్రహ్మ విష్ణు పురాణాన్ని పరాశరుడికి చెప్పినాడు. హర్యానాలోని ఖైతాల్‌జిల్లా థెపాలర్ మట్టిదిబ్బలు పులస్త్యుడి ఉనికిని తెలియజేస్తున్నాయి. సింహళంలోని పులస్త నగరిలో పరాక్రమబాహు పాలించిన– పొలొనరువ ప్రాంతంలో పులస్త్యుడి శిలావిగ్రహమున్నది.)

**పులహుడు:** సప్తర్షులలో ఒకడు, ప్రజాపతి. కింపురుషుల తండ్రి. భార్యలు– క్షమ, గతి. సంతానం– కర్దమ, కనకపీత, ఉర్వరివత, పీవరి, కర్మశ్రేష్ఠ, వరీయాంసు, సహిష్ణు, కింపురుషులు.

కర్దముడు కూడా ప్రజాపతి. కర్దముడి భార్య దేవహూతి. వీరి సంతానం– కపిల, అనసూయ, అరుంధతి, గతి, హవిర్భువు, కళ, ఖ్యాతి, క్రియ, శాంతి, శ్రాద్ధ; విమాన సృష్టికర్త కర్దముడు.

కపిలుడు సాంఖ్య సిద్ధాంత కర్త. కపిలుడి భార్య ధృతి. విష్ణుమూర్తి అంశతో జన్మించినవాడు.

స్వయంభువ మనువు శతరూపల కుమార్తె– దేవహూతి; మరీచి భార్య కళ. అత్రి భార్య అనసూయ; వశిష్ఠుడి భార్య అరుంధతి. అంగీరసుడి భార్య ఖ్యాతి; పులస్త్యుడి భార్య హవిర్భువు; పులహుడి భార్య గతి, క్రతువు భార్య క్రియ; భృగువు భార్య పులోమ (శాంతి), అధర్వణుడి భార్య– హింస (శ్రాద్ధ).

**క్రతువు :** బ్రహ్మమానస పుత్రుడు, సప్తర్షులలో ఒకడు; భార్య క్రియ. సంతానం 60,000 వాలఖిల్యులు.

**కర్దముడు :** పులహ బ్రహ్మ కుమారుడు కర్దముడు. కర్దముడి భార్య దేవహూతి. వీరి కుమారుడు కపిలుడు. కపిలుడి భార్య ధృతి. కపిలుడి కుమారుడు గృత్సపతి.

**స్థాణుడు :** ప్రజాపతి. ఇతడి సంతానం– మృగవాను, నిర్రృతి, అహర్బుధ్న్య, పినాకి, అజైకపత, సర్ప, దహన, ఈశ్వర, కపాలి, భార్గ, స్థాణులు.

**దక్షుడు :** దక్ష ప్రజాపతి భార్యలు– ప్రసూతి, అసిక్ని. దక్ష–ప్రసూతిల సంతానం– స్వాహా, ఖ్యాతి, సతి, స్మృతి. మొత్తం 24 మంది. సతి భర్త శివుడు. దక్ష–అస్నీక్నిల సంతానం– 5000 హర్యశ్వులు; 1000 శబలాశ్వులు. 60 మంది కుమార్తెలు. పదిమందిని ధర్ముడికి, పదముగ్గురుని అదితి, దితి మొదలైనవారిని కశ్యపునికి; 27 నక్షత్రాలను చంద్రుడికి, నలుగురిని అరిష్టనేమికి, ఇద్దరిని బహుపుత్రుడికి, ఇద్దరిని అంగిరసుడికి, ఇద్దరిని కృశాశ్వుడికి ఇచ్చి వివాహం చేసాడు.

**మరీచి :** ప్రజాపతి; భార్యలు– కళ, ఊర్ణ, సంభూతి, ధర్మవ్రత. మరీచి–కళల కుమారుడు కశ్యపుడు.

**కశ్యపుడు :** సప్తర్షులలో ఒకడు. భార్యలు (13) (దక్షప్రజాపతి కుమార్తెలు)– అదితి, దితి, దను, అరిష్ట, సురస, సురభి, వినత, కద్రువ, తామ్ర, క్రోధవశ, ఇర, యామిని, కష్ఠ–తిమి, పతంగి, సరమ, విశ్వ, ముని.

కశ్యపుడు–అదితిల సంతానం– ఏకాదశ రుద్రులు, అష్టవసువులు, ద్వాదశాదిత్యులు (ధాత, ఆర్యమాన, మిత్ర, శక్ర, వరుణ, అంశ, భగ, వివస్వాన, పూష, సవిత, త్వష్ట, విష్ణు).

**ఏకాదశ రుద్రులు–** అజైకపాత, అహిర్బధ్న్య, విరూపాక్ష, సురేశ్వర, జయంత, బహురూప, అపరాజిత, సావిత్ర, త్ర్యంబక, వైవస్వత, హర.

**అష్టవసువులు:** ధర, ధ్రువ, సోమ, అహస, అనిల, అనల, ప్రత్యూష, ప్రభాస.

**కశ్యపుడు–దితిల సంతానం:** శూరపద్మ, సింహవక్త్ర (విభూతి), వజ్రాంగ (వరాంగి), గోముఖ, హిరణ్యాక్ష, హిరణ్యకశిపు, సింహిక, అజాముఖి; శూరపద్మ→దనుకోప→అగ్నిముఖ→వజ్రబాహు→హిరణ్య. సింహవక్త్ర పుత్రుడు మహాశూరుడు; వజ్రాంగుని కొడుకు తారకుడు. హిరణ్యాక్షుడు→శంబరుడు→శకుని→ద్విమూర్ధన→శంకు→అశ్వ. హిరణ్యకశిపు→అనుహ్లాద, హ్లాద, సంహ్లాద, ప్రహ్లాద, శిబి, భాష్కల. ప్రహ్లాదుడు→విరోచనుడు→బలి→బాణుడు→ 4 కోట్ల నివాత కవచులు. సింహిక (విప్రచిత్తి) కొడుకులు రాహువు, కేతువు.

**కశ్యపుడు–దనుల సంతానం :** మయుడు; మయుడి భార్యలు హేమ, మధుర; హేమ కొడుకు మాయావి; మాయావి కొడుకు దుందుభి. మధుర కుమార్తె– మండోదరి (రావణుడి భార్య).

కశ్యపుడు–కాలక : కాలకేయులు.

కశ్యపుడు–తామ్ర – పుత్రికలు (క్రౌంచి–గుడ్లగూబలు); భాసి–భాసులు; శ్యేని–గ్రద్ధలు; ధృతరాష్ట్రి–హంసలు; శుకి→నత→వినత→గరుడుడు, అరుణుడు→సంపాతి, జటాయువు.

**కశ్యప–క్రోధవశ :** మృగి (జంతువులు), మృగమంద (ఎలుగుబంట్లు, సృమర, చమరములు); హరి (సింహాలు, వానరాలు); భద్రమత→ఇరావతి→ఐరావతి; మాతంగి (ఏనుగులు); శార్దూలి (సింహాలు, చిరుతలు); శ్వేత (అష్టదిగ్గజాలు); సురభి→రోహిణి, గంధర్వి; రోహిణికి పశువులు; గంధర్వికి గుర్రాలు; సురస–సర్పాలు, కద్రువ–పాకే జంతువులు, పాములు.

**స్వయంభువ మనువు :** ప్రజాపతి; స్వయంభువుని భార్య శతరూప. పుత్రులు– ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు; పుత్రికలు– ఆకుతి, ప్రసూతి, దేవహూతి. ఆకూతి భర్త రుచి; ప్రసూతి భర్త దక్షుడు; దేహహూతి భర్త కర్దముడు.

**శతరూప :** బ్రహ్మచే సృష్టింపబడిన తొలి స్త్రీరూపం. తొలి మానవుడైన మనువును (స్వయంభువుడు) వివాహమాడగా మానవులు జన్మించారు. వీరి కుమారుడు– ప్రియవ్రతుడు (భార్య బర్హిష్మతి) – కుమారుడు ఉత్తానపాదుడు.

ఉత్తానపాదుడు– భార్యలు సునీతి, సురుచి. సునీతి కుమారుడు ధ్రువుడు; సురుచి కుమారుడు ఉత్తముడు.

**వశిష్ఠుడు :** ప్రజాపతి, సప్తర్షులలో ఒకడు. ఋగ్వేదం 7వ మండల కర్త. వశిష్ఠ, విశ్వామిత్రుల వైరం ఎంతో ప్రసిద్ధమైనది. రఘువంశ రాజు ఆస్థాన పురోహితుడు వశిష్ఠుడు.

వశిష్ఠుడి భార్య అరుంధతి. అరుంధతి కర్ధముని తొమ్మిదిమంది కుమార్తెలలో ఒకరు. పరాశరుడీమె మనవడు. మునిమనమడు వ్యాసుడు.

## 27. మనువులు

మనువు పాలనాకాలం మన్వంతరం. 30,84,48,000 సంవత్సరాలు ఒక బ్రహ్మదినములో 14 మన్వంతరాలు, 15 మన్వంతర రాత్రులు. ఒక మన్వంతరంలో 71 మహాయుగాలు ఉంటాయి. ప్రస్తుతం వైవస్వత మనంతరం 28వ మహాయుగం, కలియుగంలో ఉన్నాం. 1) స్వాయంభువ, 2) స్వారోచిష, 3) ఉత్తమ, 4) తామస, 5) రైవత, 6) చాక్షుష, 7) వైవస్వత, 8) సూర్యసావర్ణి, 9) దక్ష సావర్ణి, 10) బ్రహ్మసావర్ణి, 11) ధర్మసావర్ణి, 12) భద్రసావర్ణి, 13) దేవసావర్ణి, 14) ఇంద్రసావర్ణి. మనకు 360 రోజులు దేవతలకు ఒకరోజు; మన 360 సంవత్సరాలు వారికి 1 దివ్య సంవత్సరం; 12000 దివ్య సంవత్సరాలు దివ్యయుగం. (మహాయుగం = 43,20,000 మానవ సంవత్సరాలు=చాతుర్యగం). 1000 దివ్యయుగాలు ఒక పగలు. (బ్రహ్మ పగలు=కల్పం లేదా సర్గం). మరో 1000 దివ్యయుగాలు ఒక రాత్రి. బ్రహ్మరాత్రి = ప్రళయం. 360 దివారాత్రాలు బ్రహ్మ సంవత్సరం; 100 బ్రహ్మ సంవత్సరాలు బ్రహ్మ ఆయుఃకాలం. = 311040,00,00,000 (311.04 ట్రిలియన్ సంవత్సరాలు).

### భగవంతుని అవతారాలు-మన్వంతరాలు

1) స్వాయంభువ- కపిలుడు, యజ్ఞుడు, నరసింహ, వరాహ
2) స్వారోచిష- విభువు
3) ఉత్తమ - సత్యసేనుడు
4) తామస - హరి (గజేంద్రమోక్షం)
5) రైవత - వైకుంఠుడు
6) చాక్షుష - అజితుడు, కూర్మావతారం, మోహినీరూపం
7) వైవస్వత - వామన, మీన, పరశురామ, రామ, బలరామ, కృష్ణ, కల్కి
8) సూర్యసావర్ణి - సార్వభౌముడు
9) దక్షసావర్ణి - ఋషభుడు
10) బ్రహ్మసావర్ణి - ఇంద్రుడు
11) ధర్మసావర్ణి - ధర్మసేతువు
12) రుద్రసావర్ణి - సత్యతాపసుడు
13) దేవసావర్ణి - దైవహోత్రుడు
14) ఇంద్రసావర్ణి - బృహద్భానుడు

ప్రతి మన్వంతరంలోనూ సప్తర్షులు, ఇంద్రుడు, దేవతలు మారుతూ ఉంటారు. భగవంతుని అవతారాలు మారుతూ ఉంటాయి.

## 28. అవతారాలు - ఏకవింశతి అవతారాలు

1) బ్రహ్మావతారము-కౌమారుడు, 2) యజ్ఞ వరాహ అవతారం, 3) నారదావతారం (పాంచరాత్రము), 4) నరనారాయణా వతారం, 5) కపిలావతారం (సాంఖ్యయోగం), 6) దత్తాత్రేయుడు (అన్వీక్షకి), 7) యజ్ఞుడు, 8) ఋషభుడు (ఉరుక్రముడు), 9) పృథు, 10) మత్స్య (చాక్షుష), 11) కూర్మ (క్షీరసాగర మథనం), 12 ధన్వంతరి, 13) మోహినీ, 14) వరాహ, 15) నృసింహ, 16) వామన, 17) పరశురామ, 18) వ్యాస, 19) రామ, 20) బలరామ, కృష్ణ, 21) కల్కి, 22) బుద్ధ?

### భగవంతుని లీలావతారములు

1) వరాహవతారం-భూసముద్ధరణం; 2) యజ్ఞావతారం-లోకపీడాపహరణం; 3) కపిల-బ్రహ్మవిద్య-సాంఖ్యవిద్య; 4) దత్తాత్రేయ-మహిమానిరూపణం; 5) సనకాద్యవతారం-బ్రహ్మవిద్యోద్ధరణం; 6) నరనారాయణ-కామవిజయం; 7) ధ్రువ-ధ్రువపదారోహం; 8) పృథు-అన్న సమృద్ధి; 9) ఋషభ-పరమహంసమార్గం; 10) హయగ్రీవ-వేదజననం; 11) మత్స్య-వేద సంగ్రహం; 12) కూర్మ- మందర ధారణం; 13) ఆదిమూల-గజేంద్ర రక్షణం, 14) వామన- బలిరాజయశో రక్షణం; 15) హంస-భాగవతయోగోపదేశం; 16) మనువు-మనువంశ ప్రతిష్ఠాపనం; 17) పరశురామ-దుష్టరాజభంజనం; 18) రామ-రాక్షస సంహారం; 19) కృష్ణ-లోక కళ్యాణం; 20) వ్యాస-వేద విభజనం; 21) బుద్ధ- పాషండ ధర్మప్రచారం; 22) కల్కి-ధర్మ సంస్థాపనం.

అవతారం-దిగుట, పైనుండి క్రిందకు వచ్చుట.

**యదా యదాహి ధర్మస్య గ్లా నిర్భవతి భారత**
**అభ్యుత్థాన మ ధర్యస్య తదాత్మానాం సృజామ్యహమ్**
**పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయ చ దుష్కృతామ్**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే.**

మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, మోహినీ, కల్క్యావతారములు దశావతారములని కొందరి అభిప్రాయం. మత్స్య పురాణం ప్రకారం- ధర్మ, నారసింహ, వామనావతారములు సంభూత్సవతారములు; దత్తాత్రేయ, మాంధాతృ, పరశురామ, రామ, వేదవ్యాస, బుద్ధ, కల్కి అవతారాలు- మానుషావతారములు.

వేదకాలంలో అవతార ప్రసక్తి లేదు. అయితే ఇంద్రుడికి ఇచ్ఛారూపం ధరించే శక్తి ఉండినది. విష్ణువు, దేవి (శక్తి) అవతారాలు హిందూ మతంలో ప్రముఖంగా, గణేశ, శివుని అవతారాలు అరుదుగా కానవస్తాయి.

## అఖండ భారతం

52 మిలియన్ సంవత్సరాల క్రితం ఇండియా పెంకు వెళ్ళి యూరప్ పెంకుకు తగలగా 1500 మైళ్ల పొడుగు హిమాలయ పర్వతాలేర్పడినాయి. క్రీస్తుపూర్వం 500 సంవత్సరాల క్రితం మగధరాజ్యం ఉచ్ఛస్థితిలో ఉన్నపుడు వర్తకులతో పాటు హిందూ, బౌద్ధ మతాలు ఆగ్నేయాసియా, వియత్నాం, కొరియా, చైనా, జపాన్, ఫిలిప్పీన్స్ ప్రాంతాలకు వ్యాపించాయి. క్రీస్తుశకం 400–800 ప్రాంతంలో రామాయణ మహాభారతాలు మనుస్మృతి, వర్ణ వ్యవస్థ ఆ దేశాల్లోనూ విస్తరించింది. South East Asia - Sovanna Phoum - సువర్ణ భూమి సువర్ణ ద్వీపాల పేరుతో, బంగాళాఖాతం చోళ సరస్సుగా, శ్రీవిజయ సామ్రాజ్యాలు; శివ, విష్ణు, బ్రహ్మ దేవాలయాలు, దేవరాజ ప్రభు విధానం, సంస్కృత భాష వాడకం ఈ ఆగ్నేయాసియా దేశాల్లో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

ఫునాన్, ఛెన్లా, లంకా శుక, చంపా, కంబూజ (ఖ్మెర్‌మోన్), సుఖొథాయి, శలకనగర, తరుమనగర, కళింగ, మలయు, శ్రీవిజయ (700–1300 AD), తాంబ్రలింగ, మౌతారం, కదిరి, సింఘసరి, తుజపహిత, గలుహ, సుంద – ఇవన్నీ ఆనాటి హిందూ మత రాజ్యాలు.

కపీశ సామ్రాజ్యం కాబూల్–జబూల్‌గా విడివడిన జబులిస్తాన్, జున్ బ్లిస్ (సూర్యుని ఆరాధించే) హిందూకుష్ ప్రాంతం. కాబుల్ లోయ, ఆఫ్ఘనిస్తాన్ బాల్కి ప్రాంతం, సువర్ణభూమి, సరయు, సుమేరు, ఆయుత్తయ– అయోధ్య సింగపురం, ఇంద్రగిరి హిలిరి, రచ్చపురి, నఖసి తమ్మరాత్ జయపుర, జయవిజయ పర్వతాలు, పుత్రజయ ప్రభుత్వం (మలేసియా) ఇవన్నీ ఇప్పటికీ హిందూ ధర్మ, సాంస్కృతిక ప్రభావాన్ని తెలుపుతున్నాయి.

# 29. సూర్యవంశం

వివస్వంతుడు (సూర్యుడు)– వివస్వంతుడి కుమారుడు వైవస్వతుడు. వైవస్వత మనువు– సత్యవ్రత, నాభి (Noah) – ఇక్ష్వాకుడు (ఒక్కాక–బౌద్ధ), రిషభనాథ (జైన) → వికుక్షి (శశాద, కుక్షి) → బాణ (శకుని) → కుకుత్థ (పురంజయ, అనారణ్య) → అనీన → పృథు → విస్తరస్వ (విశ్వగంధ) → చంద్ర యువనాశ్వ → యువనాశ్వ → శ్రావస్త → బృహదాశ్వ → కువలయాశ్వ (ధుంధుమార) → దృఢశ్వ (కపిలాశ్వ, భద్రాశ్వ) → ప్రమోద → హర్యాశ్వ (యయాతి కుమార్తె మాధవిని వివాహమాడినవాడు) → నికుంభ → బహరాంశ్వ → గిరితాశ్వ → అమితాశ్వ → కృశాశ్వ → ప్రసేనజిత్తు → యువనాశ్వ → మాంధాత చక్రవర్తి → పురుకుత్స, ముచుకుంద → అంబరీష చక్రవర్తి → త్రసదస్యు → సంభృత → అనారణ్య → ప్రిషదశ్వ → హర్యశ్వ → హస్త్య → సుమన → త్రిధన్వ → త్రయ్యారుణి → త్రిశంకు (సత్యవ్రత → హరిశ్చంద్ర → రోహితాస్వ → హరిత → చంచు (చంద్రవంశ దుష్యంతుని సమకాలీనుడు) → చాక్షు (భరతుని సమకాలికుడు) → విజయ → బ్రహుక → ప్రతాపేంద్ర → బృక్కు → సుసంధి → బహుక → వృక → అసిత → సగర (చక్రవర్తి) → అంశుమంత (అసమంజసుని కుమారుడు) → దిలీప → భగీరథ → సుహోత్ర → శృతి → కకుత్స → రఘు → నాభాగ → అంబరీష → సింధుద్వీప → ఆయుతాయు → ప్రతాయు → ఋతుపర్ణ → సర్వకామ → సుదాస → కల్మాషపాద → అశ్మక → మూలక → దశరథ → అనారణ్య → విశ్వంసహ (హస్తి సమకాలీనుడు) → నిధన → అనిమిత్ర → మూలిక → (దులిద) → ఖట్వాంగ → రఘు → అజ → దశరథ → శ్రీరామ →

శ్రీరాముని పుత్రులు లవ–ఉత్తర కోసల; కుశ–దక్షిణ కోసల రాజ్యాలకు; భరతుని పుత్రులు– తక్ష–తక్షశిల; పుష్కర–పుష్కలావతి (పెషావర్); లక్ష్మణుని పుత్రులు– అంగద–కరుపాద దేశానికి, చంద్రకేతు– మల్లదేశానికి; శతృఘ్నుని కుమారులు– సుబాహు–మధుపురికి, శత్రుఘాతి–విదిషా నగరానికి ప్రభువులైనారు. కుశుడి వంశస్థుడైన సూర్యవంశపు ఆఖరిరాజు బృహద్బలుని భారతయుద్ధంలో అభిమన్యుడు చంపినాడు.

బృహద్బలుడి తాత నగ్నజిత్తు (సత్రాజిత్తు) సత్యభామ తండ్రి. నగ్నజిత్తు కుమారుడు తక్షకుడు; తక్షకుడి కొడుకు బృహద్బలుడు. కుశుడి తరువాత 50వ సూర్యవంశపు రాజు.

# 30. చంద్రవంశం

బ్రహ్మ → బ్రహ్మర్షి అత్రి → చంద్రుడు → బుధుడు → పురూరవుడు → ఆయు → నహుష → యయాతి →

యయాతి–దేవయాని కుమారులు యదువు, తుర్వసుడు.

యయాతి–శర్మిష్ఠ కుమారులు– ద్రుహ్యు, అనుద్రుహ్యు, పూరువు.

పూరువు → జనమేజయ → ప్రాచీన్వన్ (సూర్యవంశ మూలకుని సమకాలికుడు) → ప్రవీర → మనస్యు → రిషేయు → మతినార → చారుపాద → సుదయు → బహుగవ → సన్యాతి → అహంయాతి → సార్వభౌమ → జయత్సేన → అరాచీన → అరిహణ → మహాభౌమ → ఆయుతానీయ → అక్రోధన → దేవాతిధి → అరిహణ → రిక్ష → మతినార → రంతినావ → తంసు → ఇల్లిన → దుష్యంత → భరత → భూమన్యు → సుహోత → అజామీఢ → రిక్ష → సంవరణ → కురు → అనాస్వన → పరీక్షిత్తు → జనమేజయ → ధృతరాష్ట్ర → బృహద్క్షత్ర → హస్తి → వికుంతన → అజామీడ → రిషి → సంవర్ణ → కురు (కురు, మగధ రాజ్యాల స్థాపకుడు).

కురు రాజుకు ఇద్దరు భార్యలు– శుభాంగి, వాహిని. శుభాంగి కుమారుడు విదురధ; వాహిని కుమారులు– అశ్వవతుడు, అభిష్యత్, చిత్రరధుడు, ముని, జనమేజయుడు. కురుప్రభువు పేరుమీద కురుజాంగాల – కురుక్షేత్రం ఏర్పడినాయి.

కురు → అనస్వన → భీమసేన → ప్రతిశ్రవస → ప్రతీప → శంతనుడు.

శంతనుడు– గంగల కుమారుడు భీష్ముడు (గాంగేయుడు).

శంతనుడు–సత్యవతిల కుమారులు– చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు.

పరాశరుడు–మత్స్యగంధి (సత్యవతి) కుమారుడు– వ్యాసుడు.

విచిత్రవీర్యుడి భార్యలు అంబిక, అంబాలిక.

నియోగ పద్ధతిన: వ్యాసుడు–అంబిక → ధృతరాష్ట్రుడు; వ్యాసుడు–అంబాలిక→ పాండురాజు; వ్యాసుడు–పరిశ్రమ → విదురుడు.

ధృతరాష్ట్రుడు–గాంధారి → నూరుగురు కౌరవులు, దుశ్శల.

పాండురాజు–కుంతి (నియోగ పద్ధతి); మాద్రి (నియోగ పద్ధతి).

ధర్ముడు–కుంతి → ధర్మరాజు; వాయుదేవుడు–కుంతి → భీముడు; ఇంద్రుడు–కుంతి → అర్జునుడు; అశ్విని దేవతలు–మాద్రి → నకుల సహదేవులు.

ధృతరాష్ట్రుడు–వైశ్యపత్ని → యుయుత్సుడు.

వివాహ పూర్వం కుంతీదేవి–సూర్యుడు → కర్ణుడు.

కర్ణుడి పెంపుడు తల్లిదండ్రులు– రాధ–అతిరధుడు (సూతుడు). అందువల్ల కర్ణుడు సూతపుత్రుడైనాడు.

## 31. యదువంశం

యయాతి + దేవయాని → యదువు, తుర్వసుడు

యయాతి + శర్మిష్ఠ → ద్రుహ్యుడు, అనుద్రుహ్యుడు, పూరుడు.

తండ్రికి తన యవ్వనాన్నిచ్చి పూరుడు రాజ్యార్హత సంపాదించుకున్నాడు. యాదవ, తుర్వస, ద్రుహ్య, అనుద్రుహ్యులు తండ్రి వారసత్వ ఆస్థి హక్కు కోల్పోయినారు తండ్రికి తమ యవ్వనాన్ని ఇవ్వ నిరాకరించి.

యయాతి 100 రాజసూయాలు, 100 అశ్వమేధాలు, 100 వాజపేయాలు, 1000 అతిరాత్రాలు, 1000 పుండరీక యాగాలు, అసంఖ్యాక అగ్నిస్తోమాలు, చాతుర్మాసవ్రతాలు చేసాడు. శమీ శాఖను విసిరితే పడినంత దూరంలో ప్రతిచోటా యజ్ఞం చేసి బంగారం, గోవులను బ్రాహ్మణులకు దానం చేసినాడు.

యయాతి తండ్రి నహుషుడు ఇంద్ర పదవి నధిష్ఠించినవాడు అగస్త్యుడి శాపంతో అజగరమై (పెద్ద కొండచిలువ) ధర్మరాజు వలన శాప విముక్తి పొందినాడు.

యయాతి స్వర్గభ్రష్టుడై అంతరిక్షంలో తారల మధ్య వెలుగుతున్నాడు తన కుమార్తె మాధవి కుమారుల మధ్యన (అష్టక, వసుమంత, ప్రతర్ధన, శిబి).

యదువు వలన యాదవులు; తుర్వసుల వలన యవనులు, ద్రుహ్యుడి వలన– త్విప్ర (త్రిపుర వంశం), అనుద్రుహ్యుడి వలన మ్లేచ్ఛులు, తుషార, ఉశీనర, శిబి, మద్ర, కేకయులు; పూరుడి వలన భరత, కురు వంశస్థులు జన్మించినారు.

ఆధునిక వ్యవహారంలో– పెద్దల లాభం కోసం పిల్లలు మనఃస్ఫూర్తిగా చేసే కార్యాన్ని యయాతి ప్రవర్తన (Yayati Syndrome) అని పిలుస్తున్నారు.

యయాతి → యదువు → సహస్రజిత్తు → శతజిత్తు → హేహయ → ధర్మ → నేత్ర → కుంతి → మహిష్మతి → భద్రసేన → దుర్మద → ధనిక → కృతవీర్య → కార్యవీర్యార్జునుడు.

కార్యవీర్యార్జునుడు అతడి కుమారులు పరశురాముడి చేతిలో నశించారు. బతికి బయటపడింది– జయధ్వజుడు, శూరసేనుడు, వృషణుడు, మధువు, ఊర్జితుడు అనే అయిదుగురు పుత్రులు మాత్రమే. జయధ్వజుడు → తాళజంఘుడు → వీతిహోత్రుడు ఆదిగా నూరుగురు. మధువు → వృక్ణుడు → వృష్ణి ఆదిగా నూరుగురు.

వీరి వలన యాదవులకు మాధవులు, వృష్ణులన్న పేరు వచ్చింది.

యదు పుత్రుడైన క్రోష్టువు వంశంలో శశిబిందుడు, ఉశనుడు, జ్యామఖుడు, విదర్భుడు పేరు పొందినవారు. (జ్యామఖుడి భార్య శైబ్య). విదర్భుడి వంశంలో చేది నుంచి చైద్యులు; మహాభోజుడి నుంచి భోజులు జన్మించారు. క్రోష్టువు వంశంలోని సాత్త్వతుడికి ఏడుగురు కొడుకులు– భజమానుడు, భజి, దివ్యుడు, వృష్టి, దేవావృధుడు, నందకుడు, మహాభోజుడు.

వృష్టి → యుధాజిత్తు → అనమిత్రుడు → నిమ్నుడు → సత్రజిత్తు, ప్రసేనుడు.

అనమిత్రుడు → శిని → సత్యక → యుయుధానుడు (సాత్యకి).

అనమిత్రుడు → పృశ్ని → శ్వఫల్కుడు → అక్రూరుడు –వీళ్లందరూ వృష్ణి వంశస్థులైనారు.

విదర్భుడు → రోమపాదుడు → అంధకుడు → అంధకవంశం. అంధక వంశంలో ఆహుకునికి దేవకుడు, ఉగ్రసేనుడు జన్మించారు. దేవకునికి నలుగురు మగపిల్లలు, ఏడుగురు ఆడపిల్లలు – ధృత, శాంతి, ఉపదేవ, శ్రీదేవ, దేవరక్షిత, సహదేవ, దేవకిలు జన్మించారు.

ఈ ఏడుగురిని వసుదేవుడు వివాహం చేసుకున్నాడు.

దేవకీదేవి స్వయంవర సమయంలోనే శిని, సోమదత్తుల జగడం భారతయుద్ధంలో శైనేయుడైన సాత్యకి, భూరిశ్రవసుడి (బాహ్లికుడి మనుమడు, సోమదత్తుని కొడుకు) మధ్య సమరమై కృష్ణుడు ప్రోత్సహించగా అర్జునుడు బాణం వేసి భూరిశ్రవసుడి చేయి నరికి సాత్యకిని రక్షించగా, సాత్యకి చంపినాడు భూరిశ్రవసుడిని.

ఉగ్రసేనుడి కొడుకు కంసుడు. కంసుడి భార్యలు మగధరాజు జరాసంధుని పుత్రికలు (ఆస్తి, ప్రాప్తి).

సాత్త్వతుడు → భజమానుడు → విదూరథుడు → శిని → భోజుడు → హృదికుడు → దేవమీఢుడు, శతధనువు, కృతవర్మ.

దేవమీఢుడు (శూరుడు) – ఇతని కుమారుడు వసుదేవుడు; ఇతడు కాక శూరుడు–మారిష నాగకన్యలకు ఇంకో తొమ్మిదిమంది కొడుకులు; పృథ అనే కుమార్తె కాక మరో నలుగురు కుమార్తెలు జన్మించారు (శ్రుతదేవ, శ్రుతకీర్తి, శ్రుతశ్రవస, రాజాధిదేవి). పృథను శూరుడు కుంతీభోజునికి దత్తతనిచ్చాడు. ఈమె 'కుంతి' దుర్వాసుడి వరంతో కానీనుడైన కర్ణుడిని, నియోగాన ధర్మజ, భీమ, అర్జునులకు జన్మనిచ్చింది.

వసుదేవుడు–రోహిణిల కుమారుడు బలరాముడు, కుమార్తె సుభద్ర. వసుదేవుడు–దేవకిల కుమారుడు శ్రీకృష్ణుడు.

శ్రుతదేవి–కరూశదేశపు వృద్ధశర్మ → దంతవక్త్రుడు

శ్రుతకీర్తి–కేకయరాజు → ప్రతర్ధనుడు

రాజాధిదేవి–జయత్సేనుడు → విందానువిందులు.

శ్రుతశ్రవస–చేది రాజు దమఘోషుడు → శిశుపాలుడు.

ఉపరిచర వసువు–గిరికల పుత్రుడు బృహద్రథుడు. ఇతడి కుమారుడు జరాసంధుడు; జరాసంధుని కుమారుడు సహదేవుడు. జరాసంధుని సోదరి శశిరేఖ. శశిరేఖ భర్త ధృష్టద్యుమ్నుడు.

ఉపరిచర వసువు–అద్రిక అప్సరస → మత్స్యరాజు, మత్స్యగంధి (సత్యవతి).

వీరందరి కథలు, వ్యవహారాలు, పరాక్రమాలు, మరణాలు – రామాయణ, భారత, భాగవతాలైనాయి.

# 32. కొన్ని విశేషాలు

**సప్తద్వీపాలు:** జంబూ, ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, శాక, పుష్కర.

**షోడశ వర్షాలు:** ఇలావృత, రమ్యక, హిరణ్య, కురు, హరి, కింపురుష, భారత, కేతుమాల, భద్రాశ్వ, పురోజవ, మనోజవ, వేపమాన, ధూమ్రానీక, చిత్రరథ, బహురూప, విశ్వచార.

**సప్త సముద్రాలు:** క్షార, ఇక్షు, సుర, ఘృత, క్షీర, దధి, ఉదక

**ఆధునిక ఆలోచన** (కుందూరి ఈశ్వరదత్తు)

1) జంబూద్వీపం (ఆసియా); క్షారసముద్రం (Indian Ocean)
2) ప్లక్ష (ఆసియా మైనర్, ఇక్షు (Red-Black Sea)
3) శాల్మలి (ఆఫ్రికా); సుర (Mediterranean)
4) కుశ (యూరప్); ఘృత (Arctic)
5) క్రౌంచ (ఉత్తర అమెరికా); దధి (Atlantic)
6) శాక (దక్షిణ అమెరికా); క్షీర (Pacific)
7) పుష్కర (ఆస్ట్రేలియా); జల (Antarctica).

**సప్త కుల పర్వతాలు :** హిమాలయ, హేమకూటము, నిషధము, మేరువు, నీలగిరి, శ్వేతాచలము, శృంగవంతము.

**నవ వర్షములు :** ఇలావృత, భద్రాశ్వ, కేతుమాల, హరి, కింపురుష, రమ్యక, హిరణ్మయ, కురు, భారత.

**భరత వర్షము-నవ ఖండములు:** ఇంద్ర, కేతుమంత, తామ్రవర్ణ, గభస్తిమంత, నాగ, సౌమ్య, గాంధర్వ, వారుణ, కుమారిక.

**పంచ కన్యలు :** అహల్య, ద్రౌపది, కుంతి, తార, మండోదరి.

**పంచ గంగలు :** గంగ, గౌతమి, కృష్ణ, పినాకిని, కావేరి.

**పంచ గవ్యములు:** మజ్జిగ, పాలు, నెయ్యి, గోమూత్ర, గోమయము.

**పంచ తీర్థములు:** కురుక్షేత్ర, గయ, గంగ, ప్రభాస, పుష్కర.

**పంచ దేవతలు:** గణేశ, గౌరి, ఆదిత్య, రుద్ర, కేశవ.

**పంచ నదులు:** శతద్రు (సట్లెజ్), బిపాస (బియాస్), ఇరావతి (పరుస్ని) (రావి), చంద్రభాగ (చెనాబ్), వితస్త (జీలం).

**పంచవటి:** రావి, మర్రి, బిల్వ, ఆమ్లక (ఉసిరి), అశోక/మామిడి-ఉదుంబర (అత్తి), వేప, జమ్మి (శమీ) (ఇవి పంచవటి వృక్షములు.

**పంచపాండవులు :** ధర్మజ, భీమ, అర్జున, నకుల, సహదేవులు.

**పంచ పితలు :** కన్నతండ్రి, భయం పోగొట్టేవాడు, పిల్లనిచ్చిన మామ, గురువు, ఉద్యోగమిచ్చినవాడు.

**పంచ అటవీ వృక్షాలు:** మర్రి, రావి, వెలగ, అశోక, ఆమ్ల (అడవి ఉసిరి).

**పంచ మకారాలు :** మద్యం, మాంసం, మత్స్యం, ముద్ర, మైథునం

**పంచ ధాన్యాలు :** ధాన్యం, చిక్కుళ్లు, బార్లి, నువ్వులు, బఠాణిలు

**పంచ అమృతాలు :** పాలు, మజ్జిగ, నెయ్యి, తేనె, పంచదార

**పంచ ఇంద్రియాలు:** ముక్కు, చెవి, కన్ను, చర్మ, నాలుక (జ్ఞాన); వాక్కు, కర, చరణ, గుద, జననేంద్రియాలు (కర్మేంద్రియాలు)

**పంచ ద్రవ్యములు:** పరిమళ, పుష్ప, ధూప, దీప, నైవేద్యములు

**షడంగములు:** శిక్ష (ఉచ్ఛరణ), ఛందస్సు, వ్యాకరణం, నిరుక్త (ఉత్పత్తి), కల్ప (ఆచార సూచనలు); జ్యోతిషం.

**షట్ శాస్త్రములు :** న్యాయ, సాంఖ్య, యోగ, వైశేషిక, పూర్వ-ఉత్తర మీమాంసలు

**షడ్రుచులు :** తీపి, పులుపు, వగరు, చేదు, ఉప్పు, కారం

**అరిషడ్వర్గాలు :** కామ క్రోధ లోభ మద మోహ మత్సర్యములు

**వైవస్వత మన్వంతర సప్త ఋషులు :** అత్రి, వశిష్ఠ, కశ్యప, గౌతమ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని.

**సప్త జిహ్వాలు:** కాళి, కరాళి, మనోజవ, సులోహిత, సుధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వనిరూపిణి.

**అష్ట కాళికలు :** మంగళ, సర్వమంగళ, విమల, కాళి, రాత్రి కాళిక, వికట, కామాక్ష్య, భవాని.

**అష్టదిక్పాలకులు:** ఇంద్ర, అగ్ని, యమ, నిరుతి, వరుణ, వాయు, కుబేర, ఈశానుడు.

**అష్ట మహాసర్పములు:** అనంత, వాసుకి, పద్మ, మహాపద్మ, తక్షక, కులిర, కర్కోటక, శంఖ

**అష్ట దుర్గ :** మంగళ, విజయ, భద్ర, జయంతి, అపరాజిత, నందిని, నర్సింగి, కౌమారి

**అష్టశివులు :** శర్వ, భవ, రుద్ర, ఉగ్ర, భీమ, పశుపతి, మహదేవ, ఈశాన.

**అష్ట విధ వివాహాలు:** ప్రాజాపత్య, బ్రహ్మ, దేవ, ఋషి, గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచిక.

**నవ దుర్గలు:** దుర్గ, శైలపుత్రి, చంద్రఘంట, స్కందమాత, కాళరాత్రి, చండిక, కూష్మాండి, కాత్యాయని, మహాగౌరి.

**నవ రసములు:** హాస్య శృంగార అద్భుత వీర శాంత కరుణ రౌద్ర భయానక భీభత్స

**నవ ద్వారములు:** రెండు కళ్లు, రెండు చెవులు, రెండు ముక్కు రంధ్రములు, నోరు, గుదం, జననేంద్రియాలు.

**వేదాంగ కర్తలు–** సాంఖ్య (కపిల), యోగ (పతంజలి), వైశేషిక (కణాద), న్యాయ (గౌతమ), మీమాంస (జైమిని), వేదాంత (వ్యాస).

## 33. పురాణాలు

ప్రాచీన గాథలు, పురాగాథలు–పురాణాలు; హిందూ, జైన మతాలలో ప్రఖ్యాతంగా కానవస్తాయి. 18 ముఖ్య పురాణాలు, 18 ఉప పురాణాలు – 4,00,000 శ్లోకాలు; పురాణాలు–స్మృతులు; గ్రీకుల Paro; అవెస్తన్–పరొ, ఇంగ్లీషు–Fore; ప్రొటొ–ఇండొ–యూరిపియన్– పర్, ప్రి;

పురాణాలు అయిదవ వేదాలని బృహదారణ్యక ఉపనిషత్‌లో చెప్పబడి ఉన్నది. పురాణ రచనాకాలం (250 AD - 1000 AD).

**మహాపురాణాలు (18) :** విష్ణు, నారదీయ, భాగవత, గరుడ, పద్మ, వరాహ, బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, మార్కండేయ, భవిష్య, వామన, మత్స్య, కూర్మ, లింగ, శివ/వాయు, స్కంద, అగ్ని.

**ఉప పురాణాలు (18):** సనత్కుమార, నరసింహ, నారద, శివ, దుర్వాస, కపిల, వామన, భార్గవ, వరుణ, కాళిక, సాంబ, నంది, సూర్య, హంస, పరాశర, వశిష్ఠ, గణేశ, ముద్గల.

**పురాణ లక్షణాలు:** సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరము, వంశానుచరితం; ఉతయ, ఈశాను కథ, నిరోధ, ముక్తి, ఆశ్రయం.

## 34. ఇతిహాసాలు

గతకాలపు సంఘటనలను తెలిపేవి– ఇతిహాస–ఇలా జరిగింది – So indeed it was.

జల ప్రళయం తరువాత మిగిలింది వైవస్వత మనువు, అతడి కుమారులు–కుమార్తె (ఇల).

వివస్వనుడు (సూర్యుడు), శరణ్య (సంజ్ఞ)ల కుమారుడు వైవస్వత మనువు. వైవస్వతుడు–శ్రాద్ధల కుమారులు–ఇక్ష్వాకుడు, ధృష్ట, నరిశ్యంత, దిష్ట, నృగ, కరూశ, శర్యాతి, నాభాగ, ప్రాంశు, పృశధ్ర; కుమార్తె 'ఇల'. సుదుమ్నుడు 'ఇల'గా మారి చంద్రుడు–తారల కుమారుడు బుధుడితో పురూరవుడికి జన్మనిచ్చాడు. పురూరవుడి భార్య ఊర్వశి. వీరి పుత్రులు–ఆయు, అమవాసు, వనాయు, శ్రుతాయు, శతాయు, దృఢాయు చంద్రవంశజులైనారు.

వైవస్వతుడు–శ్రాద్ధల పెద్దకొడుకు ఇక్ష్వాకుడితో సూర్యవంశం (కోసల–అయోధ్య); చిన్నకొడుకు నిమి (విదేహ–మిథిల); నిమి కొడుకు మిథి (జనకుడు) మిథిలా నగరాన్ని స్థాపించాడు.

చంద్రవంశం–గంగా యమున సంగమస్థానాన– ప్రతిష్ఠాన (ప్రయాగ వద్ద) – పురూరవుడితో ప్రారంభమయ్యింది దాదాపు అదే సమయాన. అమావాసు కన్యాకుబ్జాన్ని, ఆయువు కుమారుడు క్షతవృద్ధుడు కాశి (వారనాసి), ఆయువు పెద్ద కుమారుడు నహుషుడు ఇంద్రుడైనాడు. నహుషుడి కుమారుడు యయాతి– ఇతడి కుమారులు దేవయాని వలన యదు, తుర్వసులు; శర్మిష్ఠ వలన ద్రుహ్య, అనుద్రుహ్య, పూరుడు జన్మించారు.

(బైబిల్‌లో Curse of Ham కథ యయాతి శాపంలానే ఉంటుంది. జలప్రళయం తరువాత నోవా (Noah) వ్యవసాయం చేస్తూ ద్రాక్షవనాన్ని పెంచినాడు. ఒకరోజున ద్రాక్షరసం తాగి నిద్రపోయాడు. నోవా కుమారులు షెమ్, హామ్, జఫెత్;

హామ్ అసంకల్పితంగా తండ్రి గుడారంలోకి తొంగిచూడగా నగ్నంగా ఉన్న నోవా కనిపించాడు. ఆ విషయాన్ని షెమ్, జఫెత్‌లకు చెప్పి నవ్వినాడు హామ్. తండ్రి వేపు చూడకుండా జఫెత్ సాయంతో ఓ వస్త్రాన్ని కప్పి నగ్నత్వాన్ని మరుగుపరచాడు షెమ్.

నోవాకు తెలిసింది ఈ విషయం. షెమ్‌ను ఆశీర్వదించి కానాన్లు (హామ్ వంశీయులు) నీకు బానిసలవుదురుగాక అన్నాడు. నీ వంశస్థులు షెమ్ వంశస్థులకు బానిసలవుతారు అని శపించాడు హామ్‌ను. జఫెత్‌ను నీ వంశస్థులు షెమ్‌తో సరిసమానంగా స్వేచ్ఛగా చరిస్తారు -అన్నాడు నోవా.

షెమ్ వారసులు– ఇజ్రాయెలీలు (సెమైట్లు)

హామ్ వారసులు – కాననైట్లు (హామైట్లు) (కానాన్ దేశం–పాలస్తీనా)

జఫెత్ వారసులు – జఫెటైట్లు

**Table of Nations (700-500 BC):**

1) **షెమ్ వారసులు :** (Y క్రోమోజోం – హాప్లోగ్రూపు IJ - అబ్రహాం → అరబ్బులు, ఇజ్రాయెలీయులు; ఉత్తర దక్షిణ అమెరికా, తూర్పు పర్షియా, ఇండియా వాసులు; యూరప్ వాసులు.

2) **హామ్ వారసులు :** ఆఫ్రికా వాసులు– కుష్, ఈజిప్టు, పుట్, కానన్ ప్రజలు. మిస్రాయిమ్.

3) **జఫెత్ వారసులు :** గ్రీకులు, యవనులు.

జెనెసిస్ 10:6–7లో హామ్ కుమారులు– కుశ్, మిజ్రాయిమ్, ఫుత్, కెనాన్, (అరేబియా, ఈజిప్టు, కానాన్ ప్రాంతాలు); కుశుడి కుమారులు– సెబ, హవిల, సవత, రామ, సవేత, రామా కొడుకులు సేవ, దెదాన్‌లు (వాళ్ల రాజ్యాలు–సినిరె, హిందికి, సమరె, లుబె, జింగె, జెమర్‌గాడ్–మెజాగ్–మారెటినాస్ రాజ్యం)

జెనెసిస్ 10; 2–5లో జఫెత్ వారసులుగా– గోమర్, మగాగ్, మదాయి, జావన్, తువల్, మెషక్, తిరాస్ (వీరి దేశాలు– ఆఫ్రికా, జర్మనీ, మెడియా, మాసిడోనియా, బిధ్నియా, మోసియా) గోమర్ కొడుకులు అష్కనాజ్, రిఫాత్, తొగర్మ (వీరి రాజ్యాలు ఆసియా, పార్థియా, బర్బరుల దేశాలు; జావన్ కొడుకులు– ఎలిషా, తర్షిష్, కితిమ్, దొడానిన్ (వీళ్ల రాజ్యాలు ఎలిస్, టార్సస్, డార్డానియా).

జెనెసిస్ 10:22–28లో– షెమ్ వారసులుగా– ఎలాం, అషుర్, ఆర్ఫాషాడ్, ఆరామ్; ఆరామ్ పుత్రులు– ఉజ్, హుల్, గెతెర్, మాష్; ఆర్ఫాషాడ్ → షేలా → ఎబెర్ (హీబ్రూ); ఎబెర్ కొడుకులు పెలెగ్, జొక్తాన్‌లు. జొక్తాన్ కుమారుడు అల్మోదాద్ (భూమిని తాళ్లతో కొలిచాడు). షెలెప్ (నదుల్లోని నీళ్లు తోడినాడు); జొక్తాన్ పుత్రులు పన్నెండుమంది).

యయాతి తనకు యవ్వనమివ్వనందుకు యదువు, తుర్వసుడు, ద్రుహ్యుడు, అనుద్రుహ్యులకు రాజ్యార్హతను తొలగించి వయసులో చిన్నవాడైన పూరునకు పట్టాభిషేకం చేసినాడు దీనిని Curse of Yayati గా Yayati Syndrome గా పరిశోధకులు పేర్కొంటున్నారు. హిందూ ధర్మంలో ప్రాముఖ్యత పెద్దలకే. తండ్రి నగ్నత్వాన్ని చూసినందుకు హామ్ రాజ్యార్హతను కోల్పోయాడు; తండ్రికి యవ్వనాన్ని ఇవ్వనందుకు యదువు రాజ్యార్హతను కోల్పోయాడు.

ప్రాక్కథలన్నింటిలోనూ ఏదో ఒకచోట పోలికలు కానవస్తాయి. ఆనాటి భౌగోళిక జ్ఞానం రచయితల పరిజ్ఞానాన్ని, కాలాన్ని బట్టి ఇతిహాసాల్లో చేర్చబడతాయి ప్రక్షిప్తాలుగా.

# 35. వైవస్వత మన్వంతరం - ముఖ్య సంఘటనలు

## సత్యయుగం (కృతయుగం)

1) **జల ప్రళయం**

2) **మీనావతారం**

3) **వైవస్వత మనువు–సూర్య, చంద్ర వంశములు,**

4) **ఇక్ష్వాకులు, పురూరవులు;**

ఆయువు–నహుషుడు; క్షత్ర వృద్ధ–కాశీరాజ్యం
యయాతి– అతడి కుమారులు (యదు, తుర్వస, ద్రుహ్యు, అనుద్రుహ్యు, పూరుడు)

సహస్రజిత్తు (హైహయ) శశబిందు (చక్రవర్తి)

యువనాశ్వ → మాంధాత→ పురుకుత్స, ముచుకుంద

ముచుకుందుడి మాహిష్మతీ నగర స్థాపన 'నర్మదా' నది ఒడ్డున.

ద్రుహ్యులు-గాంధార దేశం- వారసులు-మ్లేచ్ఛులు.

5) ఉశీనరుడు, శిబి- యౌధేయ, అంబష్ఠ, నవరాష్ట్ర, క్రిమీల, శిబి, వృషదర్భ, మద్రక, కైకయ, సౌవీర (పంజాబ్ ప్రాంతం).

తితిక్షుడు- అంగ, వంగ, కళింగ, సుహయ, పుండ్ర రాజ్యాలు.

6) హైహయ - కృతవీర్యుడు → కార్తవీర్యార్జునుడు. హైహయ-భార్గవుల కలహం; ఔర్యుడి జననం; గాధి, విశ్వామిత్ర, పరశురాముడు.

7) సూర్యవంశంలో- త్రయ్యారుణి, సత్యవ్రత (త్రిశంకు), విశిష్ఠ విశ్వామిత్ర వైరం, హరిశ్చంద్ర శునశ్శేపుడు, విశ్వామిత్రుడి శాపంతో దస్యులైన అతడి పుత్రులు కొందరు ఆంధ్ర, ముతిబ, పుళింద రాజ్యాలు స్థాపించడం,

8) పరశురామ-కార్తవీర్యార్జున యుద్ధం. క్షత్రియ కుల నాశనం.

9) **సగరుని యజ్ఞం :** అయోధ్య సింహాసనంపై సగరుని మనుమడు అంశుమంతుని పట్టాభిషేకం.

## త్రేతాయుగం

1) భగీరథ ప్రయత్నం- గంగావతరణం
2) ఋతుపర్ణ - నలోపాఖ్యానం (నిషాదుల రాజు నలుడు)
3) శకుంతల-దుష్యంతుల కథ; భరతుడు చక్రవర్తి.
4) హస్తి ప్రభువు హస్తినాపురాన్ని నిర్మించడం
5) భరత సామ్రాజ్యం 1) పౌరవ, 2) పాంచాల దేశాలుగా విభజన
6) దివోదాసుడి చరితం (దశరథుడి భార్య సుమిత్ర సోదరుడు, సుదాసుడి తండ్రి దివోదాసుడు - శంబరుడిపై యుద్ధం చేసినాడు.
7) రఘు, అజ, దశరథ, రామ
8) రామ రావణ యుద్ధం.

## ద్వాపరయుగం

1) యాదవులు అంధక, వృష్ణి వంశస్థులుగా (ఉగ్రసేనుడు-అంధక)
వసుదేవుడు (వృష్ణి).
2) దశరాజ యుద్ధం
3) పాంచాలుర ప్రాభవం
4) బృహద్రధ, జరాసంధులు
5) కంసుడు తన తండ్రి ఉగ్రసేనుడిని చెరసాలలో బంధించుట.
6) కంస వధ, జరాసంధుడి దండయాత్రలు (మధురపై)
7) ద్వారకకు యాదవుల వలస (అంధక, వృష్ణి)
8) రుక్మిణి-కృష్ణుల వివాహం
9) కృష్ణ-పాండవుల మైత్రి
10) శంతనుడు-హస్తినకు రాజగుట; భీష్మ ప్రతిజ్ఞ; ధృతరాష్ట్ర, పాండురాజు, విదురుడు. కౌరవ పాండవ జననం.
11) మహాభారత యుద్ధం.
12) శ్రీకృష్ణ నిర్యాణం

## కలియుగం

1) పాండవుల మహా ప్రస్థానం, స్వర్గారోహణం
2) పరీక్షత్తు పాలన; తక్షక విషంతో మరణం.
3) జనమేజయుని సర్పయాగం
4) పరీక్షిత్తు ఆరవ తరంలో నిచాక్షుడు హస్తిన నుంచి రాజధానిని వత్సదేశపు కౌశాంబికి మార్చడం.
5) ఉదయన-వాసవదత్తల కథ
6) మగధ - బింబిసార-అజాతశత్రు
7) మగధ - మహా పద్మనందుడు (క్షత్రియ నాశకుడు; రెండవ పరశురాముడు)
8) మౌర్య సామ్రాజ్య స్థాపన.

అలెగ్జాండర్-పురుషోత్తముడి మధ్య జరిగిన యుద్ధంలో (వితస్త) జీలం నది (Hydaspes) ఒడ్డున మే-326 BC లో అలెగ్జాండర్ గెలిచాడు. అయితే అక్కడ నుంచి అడుగు ముందుకు పడలేదు. నందరాజు ఉగ్రసేనుడు 2 లక్షల కాల్బలం, 20,000 అశ్వికసైన్యం, 3000 ఏనుగులు, 2000 నాలుగు గుర్రాల రథాలతో ఎదురు చూస్తున్నాడని గ్రీకు సైనికులకు వర్తమానమందింది. ఇక చాలు ఇంటికి పోదాం అని మొండికేసేసరికి వెనక్కి తిరిగాడు అలెగ్జాండర్. అలెగ్జాండర్ మరణం తరువాత హిందూ దేశం వేపు భాగం సెల్యుకస్ నికెటర్‌కు వచ్చింది. (పురుషోత్తముడు పురు వంశం వాడు. అంభి-అబిసారుడు కాశ్మీర ప్రాంతపు నాగవంశపు రాజు).

నంద సామ్రాజ్యాన్ని కూలద్రోసి చంద్రగుప్త మౌర్యుడు, చాణక్యుడి సాయంతో రాజైనాడు (322-298 BC). సెల్యుకస్-చంద్రగుప్తుల మధ్య శాంతి ఒప్పందం జరిగింది. తన కుమార్తె బెరినైస్ (Berenice)ను, అరకోసియా (కాందహార్), గెడ్రొసియా (బెలుచిస్తాన్) పరొపమిసదె (గాంధార) రాజ్యాలను చంద్రగుప్తుడికిచ్చి 500 ఏనుగులను తీసుకున్నాడు సెల్యుకస్. మెగస్తనీస్‌ను రాయబారిగా పంపినాడు.

హిందువులు ఈ గ్రీకువీరులను యవనులని పిలిచారు. గ్రీకు ప్రజలలో డొరియన్లు, ఐయొలియన్లు, ఎఖియన్లు, యవనులు ముఖ్యమైన నాలుగు తెగలు. ఆసియా మైనర్- అనటోలియా పశ్చిమ తీరాన- ఇజ్మిర్-ప్రాంతానికి దక్షిణంగా, ప్రస్తుతం అనటోలియా, టర్కీలో ఉన్నదీ యవనుల దేశం. యవనులు అపోలో (సూర్యుడు) భక్తులు. క్రీస్తుపూర్వం 11వ శతాబ్దంలో అక్కడ స్థిరపడినారు. మిలావతం లేదా మిలెటస్ అయోనియాలో ముఖ్య పట్టణాలు.

జరాసంధుని మిత్రుడు కాలయవనుడు ఈ ప్రాంతం వాడు.

యురిపిడిస్ (414-412 BC)లో వ్రాసిన నాటకం Ion లో- ఏథెన్స్‌రాణి క్రియూసా పెళ్లి కాకమునుపు అపోలో (సూర్య) దేవుడు బలాత్కరించగా గర్భవతియై మగశిశువును కని బలాత్కారం జరిగిన గుహలోనే ఓ ఊయలబుట్టలో పెట్టి వదిలివేస్తుంది. అపోలో పంపగా హెర్మెస్ దేవుడు ఆ శిశువును డెల్ఫిలోని అపోలొ దేవాలయం మెట్ల దగ్గర వదిలి వెళ్తాడు. అపోలో దేవాలయంలోనే పెరిగి అతడు తన తల్లి క్రియూసాను, సవతి తండ్రి క్జుథస్‌ను కలవడం తరువాత ఏథెన్స్‌కు రాజై యవనుల మూలపురుషుడవడం ఈ నాటక కథాసారాశం.

అయాన్ కథ కుంతి-సూర్యుడు-కర్ణుడి కథలానే ఉంటుంది.

యురిపిడిస్ వ్రాసిన మరో నాటిక- బాక్కిలో డయొనైసిస్ శాపం వలన కాడ్మస్ ప్రభువు, అతడి భార్య నహుషుడిలా పెద్ద సర్పాలుగా భూలోకంలో జీవించి తరువాత పుణ్యలోకాలకు చేరుకుంటారు. ఈ కథలో డయొనైసస్-జ్యూస్ దేవుడి తొడలోంచి పుడతాడు ఔర్వుడు, ఊర్వశిలా.

ట్రోజన్ వుమెన్ (Trojan Women) అనే మరో నాటిక స్త్రీ పర్వంలా ఉంటుంది. ట్రాయ్ నగరం నేలమట్టమైనాక ట్రాయ్‌రాణి హెకుబా మరికొందరు బందీలైన స్త్రీలతో తమ భవిష్యత్తు గురించి, యుద్ధంలో మృతిచెందిన వీరులను తలచుకుంటూ దుఃఖిస్తుంది.

హెలెన్ నాటికలో మాయాహెలెన్ కథ మాయాసీత కథకు దగ్గరగా ఉంటుంది. పారిస్‌తో అసలు హెలెన్ వెళ్లలేదని, మిథ్యారూపం వెళ్లిందని వ్రాసినట్లు కొన్ని రామాయణాలలో రావణుడు మాయాసీతను తీసుకువెళ్లాడని (వేదవతి), అసలు సీతను అగ్నిదేవుడు దాచి, అగ్నిపరీక్ష సమయంలో శ్రీరాముడికి అప్పగించాడనేది వ్రాసినారు.

మృతుల లోకం సందర్శన హోమర్ ఒడిస్సీలో, వర్జిల్ ఈనీడ్‌లో ఉన్న విధంగానే ఆశ్రమవాస పర్వంలో వ్యాసుడు ధర్మరాజాదులకు గంగానదిలో మృతులను చూపిస్తాడు (ప్రియసంగమోత్సవం).

గ్రీకుల హెఫాస్టస్ (విశ్వకర్మ) ఎథెనా దేవతను బలాత్కారం చేయబోతే ఆమె తీవ్రంగా ప్రతిఘటించగా అతడి వీర్యం చింది ఆమె తొడలపై పడుతుంది. అసహ్యంతో ఆమె వీర్యాన్ని దూది (ఎరిక్)తో తుడిచి నేలపై పడవేస్తుంది. (థొనస్–విసిరి వేయడం). ఆమె వెళ్లిపోతూ గమనిస్తుంది ఆ వీర్యం నుంచి శిశువు–ఎరిక్ థోనస్ (Erichthonius) పుట్టడానిని. ఆ పిల్లవాడిని చిన్న బుట్టలో ఉంచి పెంచుతుంది. ఎప్పటికీ కన్యగా ఉండే ఎథెనా లోకాపవాద భయానికి, ఆ బుట్టను సెక్రాప్స్ (Cecrops) రాజు కుమార్తెలు హెర్సె, అగ్లారస్, పంద్రోసస్‌లకు ఇచ్చి బుట్టను తెరవవద్దని చెబుతుంది ఎథెనా దేవత. కుతూహలం ఆపుకోలేక బుట్ట తెరచి, లోపల సగం సర్పం, సగం మానవ రూపంలో ఉన్న పిల్లవాడిని చూసి ఉన్మాదులై ఎక్రొపొలిస్ కొండశిఖరం మీద నుంచి దూకి మరణిస్తారు– హెర్సె, అగ్లారస్‌లు.

ఎరిక్‌థొనియస్ పెద్దవాడై ఆంఫిక్తియాన్‌ను ఓడించి ఏథెన్స్‌కు రాజవుతాడు. తండ్రి హెఫాస్టస్‌లా కుంటివాడు కనుక ఇతడు నాలుగు గుర్రాల రథాన్ని (Quadriga) కనుగొన్నాడని, గొప్ప రథికుడిగా పేరొంది జ్యూస్ ఇంద్రుడిని మెప్పించాడని Auriga నక్షత్రరాశిగా మరణానంతరం మారినాడని ఐతిహ్యం.

భారతంలోని ద్రోణుడు, ద్రుపదుడు, కృపుడు, కృపి, మత్స్యరాజు, సత్యవతిలా ఎరిక్‌థొనస్ కూడా వీర్యసంభవుడే.

## 36. పదిమంది గ్రీకు వీరులు - భారత వీరుల పోలికలు

**1) అయాన్–కర్ణుడు (Ion - Karna) :** అయాన్–యవనుల మూలపురుషుడు; సూర్యపుత్రుడు, క్రెయూసాను సూర్యుడు బలాత్కారం చేయగా పుట్టి అనాధగా పెరిగి తరువాత ఏథెన్స్‌కు రాజైనాడు. యవనుల మూలపురుషుడు. కర్ణుడు–దుర్వాసముని వరంతో కన్య కుంతికి సూర్యుడి వలన జన్మించినవాడు. సూతపుత్రుడిగా, రాధేయుడై పెరిగి అంగరాజై, తన సోదరుడు అర్జునుడి చేతిలో మరణించిన దురదృష్టవంతుడు.

**2) ఎఖిల్లిస్–దుర్యోధనుడు, కృష్ణుడు (Achilles-Duryodhana, Krishna) :** మహావీరుడైన ఎఖిల్లిస్‌ను శిశువుగా ఉన్నప్పుడే తల్లి థెటిస్ (సముద్రకన్య) స్టిక్స్ నదిలో ముంచుతుంది మంత్రాలు చదువుతూ. ఎడమ చీలమండ దగ్గర పట్టుకుని ముంచడంతో ఆ భాగం నీటితో తడవదు. దానితో అది బలహీనం–Achilles Heel - కాగా పారిస్ బాణం దెబ్బకు ఎఖిల్లిస్ నేలకూలతాడు.

తన కుమారుడి శరీరాన్ని వజ్రసన్నిభం చెయ్యాలని ఓ పుణ్యముహూర్తాన గాంధారి దుర్యోధనుడిని నగ్నంగా తన గదిలోకి రమ్మంటుంది ఆశీర్వదించేందుకు. కృష్ణుడు నగ్నంగా వెళ్తున్న దుర్యోధనుడిని చూసి నవ్వేసరికి అతడు సిగ్గుపడి తొడలకు అరిటాకు కప్పుకుని తల్లివద్దకు వెళ్తాడు. గాంధారి తన కళ్లకు కట్టిన గంతలు విప్పి చూసింది ఆశీర్వదిస్తూ కుమారుడిని. దానితో తొడల భాగం తప్ప మిగతా శరీరమంతా వజ్రసమానమవుతుంది. భీముడతడి తొడలు విరగగొట్టి ఓడించడానికి అవకాశం చిక్కింది.

దుర్వాసుడు ఓరోజున హడావుడిగా వచ్చి శ్రీకృష్ణుడిని రుక్మిణీదేవితో పాయసం వండించుకుని తినగలిగినంత తిని మిగతాది తన వంటికి పూయమంటాడు. ఎంతో భక్తితో శ్రీకృష్ణుడు, రుక్మిణీదేవిలు అతడు చెప్పినట్లు చేస్తారు. ఆ తరువాత దుర్వాసుడు అంటాడు– నా శరీరానికంతా పాయసం వ్రాసారు కాని ఎడమపాదాన్ని పట్టుకుని ఉన్నారేమో దానికి వ్రాయలేదు. అమ్మా రుక్మిణీ– నీ సౌందర్యం మరింత ప్రకాశిస్తుంది; కృష్ణా– నా ఎడమ పాదానికి, బొటనవ్రేలికి పాయసమంటలేదు. జాగ్రత్త. అక్కడే ముసలపు ఆఖరి ములుకు గుచ్చుకుంటుంది– బోయవాడి బాణం దెబ్బ అక్కడే తగిలి కృష్ణుడు కన్నుమూసాడు. కలికాలం ప్రారంభమవుతుంది.

**3) డయొమెడిస్–అశ్వత్థామ (Diomedes-Aswathama) :** ట్రోజన్లు విజృంభించి గ్రీకులను తరిమికొడ్తూ నౌకలను తగలబెట్టారు. దానితో గ్రీకుల శిబిరంలో కలకలం మొదలయ్యింది. ట్రోజన్ల రహస్యాలను కనుక్కోవాలని డయొమైడిస్ (Diomedes), ఒడిస్యూస్ (Odysseus)లు అర్ధరాత్రి బయల్దేరారు. దారిలో ఎదురైన డొలాన్ అనేవాడిని చంపి రహస్యాలను రాబట్టి ఎథెనా దేవతను ప్రార్థించి రీసస్ అనే రాజు శిబిరంలోకి ప్రవేశించి డయొమెడిస్ రాజు అనుచరులను పన్నెండుమందిని, రాజును చంపగా, ఆ ప్రభువు రథాన్ని పేరుగాంచిన గుర్రాల్ని తీసుకుని ఇద్దరూ రథమెక్కి సురక్షితంగా గ్రీకు శిబిరానికి చేరుకున్నారు.

ఇది సౌప్తిక పర్వంలో అశ్వత్థామ కృతవర్మ, కృపాచార్యుడితో కలిసి అర్ధరాత్రి పాండవ శిబిరానికి వెళ్లి శివుడిని ప్రార్థించి ఖడ్గాన్ని పొంది, ధృష్టద్యుమ్న, శిఖండిని, ఉప పాండవులను చంపి సురక్షితంగా వెనిక్కి వచ్చి ఆ సంగతి దుర్యోధనుడికి చెప్పగా మనశ్శాంతితో అతడు కన్నుమూస్తాడు.

**4) ఒడిస్యూస్–నలుడు (Odysseus - Nala) :** పదేళ్ల ట్రోజన్ యుద్ధం తరువాత మరో పదేళ్లు నానాకష్టాలు పడి ఇంటికి చేరుకుంటాడు ఒడిస్యూస్. అప్పటికే అతడి భార్య పెనెలొపి (Penelope)ని స్థానిక వీరులు తమలో ఒక్కరిని వివాహం చేసుకొమ్మని నిర్బంధిస్తుంటారు. మారువేషంలో ఒడిస్యూస్ బిచ్చగాడిలా ఆ వీరుల వద్దకు వచ్చి– 12 గొడ్డలి తల రంధ్రాలగుండా దూసుకుపోయేట్లు బాణం వేసి (రాముడు సాలవృక్షాలను ఛేదించినట్లు), తన కుమారుడు టెలిమాకస్, మరో అనుచరుడి సాయంతో ఆ దుర్మార్గులను చంపి పెనెలొపికి తనను ఒడిస్యూస్‌గా ఎరుకపరుస్తాడు.

నలుడు మారువేషంలో దమయంతి రెండవ వివాహానికి హాజరు కావడంలా ఈ ఘట్టం మనకు ఒడిస్యూస్ వృత్తాంతాన్ని గుర్తు చేస్తుంది.

**5) ఎఖిల్లిస్–కర్ణుడు (Achilles - Karna) :** ఎఖిల్లిస్ కవచం ఎంతో ప్రసిద్ధమైనది. తల్లి థెటిస్ స్వయంగా వెళ్లి హెఫాస్టిస్‌తో తయారుచేయించి తనయుడికిస్తుంది. అంతకుముందు ఆగమెమ్నాన్‌తో గొడవపడి యుద్ధానికి దూరంగా ఉంటాడు ఎఖిల్లిస్. తన ప్రియమిత్రుడు పాట్రొక్లస్‌ను హెక్టార్ చంపినాక, ఆగమెమ్నాన్ బ్రతిమలాడినాక యుద్ధానికి దిగి హెక్టార్‌ను ఘోరంగా చంపుతాడు ఎఖిల్లిస్.

కర్ణుడు భీష్మాచార్యుడితో గొడవపడి భీష్ముడు అంపశయ్యపై పడినాక మాత్రమే యుద్ధానికి దిగుతాడు. కర్ణుడి సహజ కవచకుండలాలను దేవేంద్రుడు కోరగా దానమిస్తాడు.

పారిస్ గోడ పక్కన దాక్కుని బాణం వేసి ఎఖిల్లిస్ చీలమండను గాయపరచినట్లే, అరయంగా ఆర్గురి చేత దెబ్బతిన్న కర్ణుడు రథం క్రుంగినపుడు రథచక్రాన్ని పైకి లేవనెత్తుతుంటే కృష్ణుని ప్రోత్సాహంతో అర్జునుడు కర్ణుడిని గాయపరచి చంపుతాడు (చెట్టు చాటు నుండి రాముడు వాలిని బాణం వేసి చంపుతాడు).

**6) హెర్క్యులస్ – కృష్ణుడు (Hercules-Krishna) :** ప్రఖ్యాత వీరుడు హెర్క్యులస్ చేసిన పన్నెండు పనులు (Twelve labours) – గ్రీకు సాహిత్యంలో ప్రసిద్ధికెక్కినాయి. అలెగ్జాండర్ నాయకత్వాన గ్రీకు సైనికులు హిందూదేశానికి దండెత్తి వచ్చినపుడు స్థానిక ప్రజలు పూజిస్తున్న కృష్ణుడిని అతడి గాథలను విని 'హరి–కులస్' ఇక్కడ కూడా ప్రసిద్ధుడే హోమర్ ఇలియాడ్‌లోని వీరుల కథ ఇక్కడా ఉన్నది అనుకున్నారు భాగవత గాథలను విని.

హెర్క్యులస్‌ను హరి (కృష్ణుడు)గా భావించారు వాళ్లు.

**7) డిడాలస్–ఇకారస్ / సంపాతి–జటాయువు (Daedalus - Icarus / Sampathi-Jatayu) :** మినొటార్ ఉండే నేలమాళిగను తయారుచేసిన డిడాలస్ తాను, తన కుమారుడు నిర్బంధంలోంచి బయటపడడానికి మైనంతో రెక్కలను అతికించి వాటిని తొడుక్కుని ఎగిరిపోయారు. యువకుడు కాబట్టి ఇకారస్ తండ్రి వద్దంటున్నా వినకుండా పైకెగిరే సరికి సూర్యుడి కిరణాల వేడికి మైనం కరిగి రెక్కలు రాలిపోయి సముద్రంలో పడి చనిపోయాడు ఇకారస్.

సూర్యుడి సారథి కదా తమ తండ్రి అనుకుని అరుణుడి (అనూరుడు) కుమారులు సంపాతి, జటాయువు అనే గరుడపక్షులు ఆకాశంలోకి ఎగిరారు. జటాయువు వారిస్తున్నా వినకుండా సంపాతి మరింత ఎత్తుకు ఎగిరి రెక్కలు కాలి ఋష్యమూక పర్వతం వద్ద నేలపై పడినాడు. సీతనెత్తుకుని పోతున్న రావణుడిని అడ్డగించి జటాయువు రెక్కలు ఖండించబడి, అటుగా వచ్చిన రామలక్ష్మణులకు ఆ విషయం చెప్పి కన్నుమూసాడు. సంపాతి వానరులకు రావణుడు ఉండే లంకకు దారి చూపిస్తాడు.

పెగాసస్ గుర్రాన్నెక్కి బెల్లెరొఫాన్ రాక్షసి మృగాలనెన్నిటినో చంపి కీర్తిగడించి అహంకారమెక్కువై బాగా పైకెగిరి సూర్యకిరణ తాకిడికి కాలి నేలపై కూలి పక్షవాతాన్ని పొంది బాధలు పడినాడు.

**8) ఆర్ఫ్యూస్ – యురిడైసి (Orpheus - Eurydice) - రురుడు–ప్రమద్వర (Ruru - Pramadvara) :** ఆర్ఫ్యూస్ అనే అద్భుత గాయకుడు యురిడైసిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులకే ఆమె పాము కరచి మరణించింది. ఆమెను వెదుకుతూ పాతాళలోకం వెళ్లి హేడ్స్ (Hades) ధర్మరాజు మనసు కరిగించేలా పాట పాడినాడు. హేడ్స్ అన్నాడు– "భూలోకం వెళ్లేవరకు వెనక్కి తిరిగి చూడకు". ఆర్ఫ్యూస్ వెనక్కి తిరిగి చూడకుండా నరకలోకపు గుహను దాటి భూమిపై అడుగుబెట్టాడు వెలుగులోకి. యురిడైసి తనతోపాటు వచ్చిందనుకున్నాడు. ఆమె ఇంకా భూలోకంలోకి

అడుగుపెట్టలేదు. ఏడడుగులు వేస్తే చాలు. కాని ఇతడు వెనక్కి తిరిగి చూసాడు. ఆమె అలా వెనక్కి వెనక్కి వెళ్లి అదృశ్యమయ్యింది. ఆర్‌ఫ్యూజ్ దుఃఖానికి అంతులేదు. దుఃఖిస్తూ ఉండగా కొందరు ఉన్మాదులైన స్త్రీలు అతడిని చంపివేసి నదిలో పారవేసారు. వీరి కథ దుఃఖాంతమైనది.

రురుడు ప్రేమించాడు ప్రమద్వరను. వివాహానికి కొద్దిరోజుల ముందు ఆమె పాముకాటుతో మరణించింది. తన ఆయుస్సులో సగమిచ్చి ఆమెను బ్రతికించుకున్నాడు రురుడు.

తన భర్త సత్యవంతుడి ప్రాణాలను యమధర్మరాజు కొనిపోతుంటే అతడివెంట వెళ్లి ధర్మసూక్ష్మాలు మాట్లాడి తన భర్తను బ్రతికించుకున్నది సావిత్రి. ఈ రెండు కథలూ సుఖాంతమైనాయి.

**9) డయోనైసిస్ - ఔర్వుడు (Dionysus - Ourva):** సెమెలి-జ్యూస్‌ల కలయికతో సెమిలి గర్భాన్ని దాల్చింది. దేవతల రాణి హెరాకు దేవేంద్రుడు జ్యూస్ చేసిన పని నచ్చలేదు. పిడుగులు కురిపించి ఆమెను భస్మం చేస్తుంటే, జ్యూస్ దేవుడు సెమెలి గర్భంలోని శిశువును తన తొడలో ఉంచి కాపాడి, తరువాత వెలికితీసినాడు. అతడే డయొనైసిస్. మానవులకు ద్రాక్షమొక్కను, ద్రాక్షసారాయిని పరిచయం చేసినాడు. హిందూదేశపు సరిహద్దులలో డయొనైసస్-బాకస్‌గా కొత్త జాతరలను ప్రవేశపెట్టి, మెయినీడ్లనే భక్తురాళ్లను తయారు చేసుకున్నాడు. థెబెస్ వచ్చి అక్కడి రాజకుటుంబీకులను తన మతంలోకి మార్చినాడు. అది పెంథెయూస్ ప్రభువుకు నచ్చలేదు. కాడ్మస్ భార్య హార్మోనియా; అగావె సోదరీమణులు-ఆటొనొయి, అగావే, ఇనొ- వీళ్లు కూడా డయొనైసస్ భక్తులవుతారు. సెమెలి వీళ్ల సోదరి. సెమెలి ఎవరో మానవుడితో తప్పు చేయడం వలన ఆ పాపానికి పిడుగుపడి చనిపోయిందని దూషించారు అగావె, ఆటొనియి, ఇనొలు. డయొనైసస్ నునమ్మలేదు - దేవుని పుత్రుడిగా. దానికి ప్రతీకారమే ఇది. పెంథెయూస్ తల్లి అగావె. కాడ్మస్-హార్మోనియాల కుమార్తె.

డయొనైసస్ మారువేషంలో ఉండగా పెంథెయూస్ అతడిని బంధిస్తాడు. తరువాత డయొనైసస్ (బాకస్)తో కలిసి ఇద్దరూ అడవిలో పూనకాలతో ఉన్మాదంగా తిరుగుతున్న భక్తురాళ్లను చూసారు. అక్కడ మధువు మత్తులో, ఉన్మాదంలో ఉన్న పెంథెయూస్ తల్లి అగావె, ఆమె చెల్లెళ్లు పెంథెయూస్‌ను సింహంగా భ్రమించి వట్టి చేతుల్తో పట్టి కాళ్లూ చేతులూ ఊడలాగి తలనరికి చంపినారు.

డయొనైసస్ థెబెస్‌కు రాజై, కాడ్మస్‌ను అతడి భార్యను పాములుగా పడి ఉండమని శపించాడు. అగావె, ఆటొనొయి, ఇనొలకు దేశ బహిష్కార శిక్ష విధించాడు.

ఔర్వుడిని కూడా అతడి తల్లి అరుషి హైహయుల బారి నుంచి కాపాడడానికి తొడలో గర్భాన్ని పెంచుతుంది. ఔర్వుడై అతడు శత్రువులను జయిస్తాడు. ఔర్వుడి కుమారుడు ఋచీకుడు. ఋచీకుడి కుమారుడు జమదగ్ని, జమదగ్ని కుమారుడు పరశురాముడు. ఔర్వుడి కోపాగ్ని బడబానలమై గుఱ్ఱపుముఖంతో సముద్రంలో జ్వలిస్తూ నీటిని తాగుతూ ఉంటుంది. (Pacific ring of fire).

నర నారాయణుల తపస్సును భంగపరచాలని ఇంద్రుడు రంభాది అప్సరసలను, మన్మథుడిని, రతీదేవిని పంపినా చలించలేదు నర నారాయణులు. నారాయణ ముని తన తొడపై ఒక చక్కని పుష్పాన్ని ఉంచి తొడను చరవగానే ఆ ఊరువు నుంచి పుట్టింది అతిలోకసుందరి ఊర్వశి. ఆమెను ఇంద్రుడికే బహుమతిగా ఇచ్చారు నరనారాయణులు.

ఆ తరువాత అర్జునుడిగా నరుడు ఇంద్రలోకం వెళ్లినపుడు ఊర్వశి అతడిని మోహించి ఆహ్వానిస్తుంది. అర్జునుడు తిరస్కరించగా పేడివైపొమ్మని శపిస్తుంది. ఆ శాపం అర్జునుడికి అజ్ఞాతవాసంలో బృహన్నలగా మారేందుకు సహాయమయ్యింది.

**10) ప్రొటిసిలాస్ - బర్బరీకుడు/అరవణన్ (Protesilaus - Barbareeka / Aravanan) :** థెస్సాలె బలాల నాయకుడు ప్రొటిసిలాస్. ఎవరైతే గ్రీకు పడవల నుంచి ట్రాయ్ తీరంలో మొదటగా అడుగు పెడతారో అతడు తొలిబలి అవుతాడని. అది తెలిసిన ఒడిస్యూస్ తన నౌక తీరాన్ని చేరగానే తానేముందు దూకినట్లు చప్పుడు చేసి నటిస్తాడు. ఎవరో తనకన్నా ముందుగానే తీరాన దిగారనుకుని ప్రొటిసిలాస్ నౌక నుంచి దూకాడు. ట్రోజన్ వీరులు వేసిన బాణాలు తగిలి తొలి బలిగా ప్రొటిసిలాస్, నలుగురు ట్రోజన్ వీరులను చంపి మరణించాడు హెక్టార్ చేతిలో.

ప్రొటిసిలాస్ భార్య లావొడామియా (Laodamia) దేవతలను ప్రార్థించగా పాతాళం నుంచి ప్రొటిసిలాస్‌ను తెచ్చి మూడు గంటలసేపు ఆమెతో ముచ్చటించడానికి అనుమతి ఇస్తారు. తరువాత అతడిని పాతాళలోకం తీసుకుపోతారు. దుఃఖితురాలైన ఆమె తన భర్త రూపాన కంచు విగ్రహాన్ని చేయించి నిద్రాహారాలు లేకుండా శోకిస్తుంటే ఆమె తండ్రి అకాస్తస్ ఆ విగ్రహాన్ని ముక్కలు చేసి అగ్నిలో పడవేసాడు. లావొడామియా ఆ మంటల్లో దూకి తానూ భస్మమైపోతుంది.

భారతంలో లేనిది కథలుగా ప్రచారంలో ఉన్నవి రెండు కథలు– భీముని పుత్రుడు ఘటోత్కచుని కుమారుడు బర్బరీకుడు. శ్రీకృష్ణుని అభ్యర్థనతో అతడు పాండవ విజయం కోసం తొలి బలిగా తనను తాను సమర్పించుకున్నాడు. అతడి ఖండిత శిరస్సు కొండపైన ఉండి 18 రోజుల యుద్ధాన్ని చూసి న్యాయనిర్ణయం చేసింది. విజయానికి కారణం భీముడు, అర్జునుడు ఇంకే వీరుడూ కాదని– శ్రీకృష్ణుడు, రుద్రుడి రూపంలో కాళికామాత అని.

ఇంకో కథలో– తమిళనాట – ద్రౌపదీ భక్తులు భావించేది– అర్జునుడు–నాగకన్య ఉలూచిల కుమారుడు ఇరావంతుడు. ఇతడిని ఇరవణన్–అరవణీగా పిలుస్తారు. శ్రీకృష్ణుడు అతడిని పాండవులకు విజయం కోసం తొలిబలిగా ఒప్పిస్తాడు. అరవణన్ దానికి సమ్మతించి శ్రీకృష్ణుడిని మోహినీ అవతారంలో తనతో ఆ రాత్రి గడపమని కోరగా కృష్ణుడు అంగీకరిస్తాడు. మరుసటి రోజు తెల్లవారే అరవణ్ తన శిరస్సు నరుక్కుని దుర్గాదేవికి సమర్పించినాడు.

కూవగం చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా నపుంసకులు లేదా హిజ్రాలు తమను తాము మోహినులుగా అరవణిలుగా భావించి దేవాలయంలో అరవణన్‌ను భర్తగా భావించి మంగళసూత్రాలు కట్టుకుంటారు. మరుసటి రోజున వాటిని తెంపి తాము విధవలమైనట్లు శోకిస్తారు.

తమిళనాడు కాళ్లకురిచి జిల్లా, ఉలుందూరిపేట తాలుకాలో కూవగం గ్రామంలో 18 రోజుల పండుగ తమిళ చైత్ర మాసంలో (ఏప్రిల్/మే) వైభవంగా జరుగుతుంది. ఇక్కడ అరవణ్‌ను కూతండవార్‌గా పూజిస్తారు.

బర్బరీకుడిని నేపాల్‌లో 'ఆకాశభైరవ'గా, రాజస్థాన్‌లో ఖటుశ్యామ్‌జీగా, గుజరాత్‌లో 'బలియదేవ'గా కొలుస్తారు.

**11) టాంటాలస్ – శిబి చక్రవర్తి :** జ్యూస్ దేవుని పుత్రుడైన టాంటాలస్ గర్విష్ఠి. అతడి తల్లి పోలుతొ (Poluto). ఇతడు తన కుమారుడు 'పెలాప్స్'ను చంపి దేవతలకు వంటకంగా వడ్డించాడు. దేవతలు దానిని గ్రహించి అతడికి శాశ్వత నరకలోక శిక్ష విధించారు.

శిబిని దేవతలు కోరగా అతడు తన కుమారుడిని వండి వడ్డించాడు. వాళ్లు తినకుండా శిబినే తినమన్నారు. నిర్వికారంగా అతడు తినబోతే బ్రహ్మ అతడి కుమారుడిని బ్రతికించాడు (వనపర్వం).

## 37. భారతంలో సైన్సు

**1) నేతికుండల్లోంచి పిల్లలు :** తనకన్నా ముందే కుంతీదేవి ధర్మరాజును కన్నదన్న దుఃఖంతో గాంధారి తన కడుపుపై మోదుకోగా మాంసపు గడ్డ బయటపడింది. వేదవ్యాసుడు దానిని ముక్కలుగా చేసి నేతికుండలలో భద్రపరచి శీతల జలములతో సంరక్షించగా రెండేళ్ల తరువాత రోజుకొక్కరు చొప్పున దుర్యోధనుడు, 99 మంది కౌరవులు ఆఖరి రోజున దుశ్శల జన్మించారు.

వినతి, కద్రువల అండములు కూడా నేతికుండలలో భద్రపరచారు. కద్రువకు నూరు సర్పాలు జనించాయి. వినత కూడా దుఃఖంతో తనకు పుట్టిన ఒక గుడ్డును పగలగొట్టగా సగం దేహం మాత్రమే పూర్తిగా తయారై నాభినుంచి దిగువ బలహీనంగా ఉన్న అనూరుడు జన్మించి తన తల్లిని సవతికి దాసివి కమ్మని, నీ రెండో పుత్రుడు నీకు దాస్యవిముక్తి కలుగజేస్తాడని శపించాడు. రెండవ పుత్రుడు గరుడుడు నేతికుండ నుంచి 500 ఏళ్లకు జన్మించాడు.

Test Tube Baby - In vitro Fertilization - ఇప్పుడు సర్వసాధారణమైన ఈ నవీన పద్ధతి మొదట్లో ఎన్నో విమర్శలకు గురైంది. సంతానలేమితో బాధపడుతున్న వారికి Assisted Reproductive Technology ద్వారా, అద్దె తల్లుల ద్వారా సంతానం కలిగేలా చేయడం ఈ పద్ధతి ముఖ్య ఉద్దేశం.

జులై 1978లో మొట్టమొదటి Test Tube Baby - Louise Brown – Dr. Kershaw's Cottage Hospital - Royton, Oldham, England లో లూయిస్ బ్రౌన్ జన్మించింది. Robert G. Edwards కు 2010లో Nobel Prize in Medicine / Physiology లభించింది. (Patrick Steptoe, Jean Purdy Physiologist, Embryologist అప్పటికే చనిపోయారు కనుక వారికి నోబుల్ ప్రైజు ఇవ్వలేదు. వారు రాబర్ట్ ఎడ్వర్డ్‌తో కలిసి పనిచేసారు.)

సరిగా 67 రోజుల తరువాత డాక్టర్ సుభాష్ ముఖోపాధ్యాయ్ (హజరిబాఘ్ డాక్టర్, 1967లో Reproductive Technologyలో ఎడింబరొ యూనివర్సిటీ నుంచి Ph.D. చేసిన సైంటిస్ట్) 3 అక్టోబర్ 1978 నాడు ఇండియాలో తొలి టెస్ట్‌ట్యూబ్ బేబీ– In vitro fertilisation పద్ధతిలో– 'దుర్గ' జన్మకు కారకుడైనాడు. ఆనాటి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, సైంటిఫిక్ కమిటీ తీవ్రంగా నిందించడం, అతడిని ఇంటర్నేషనల్ కాన్ఫరెన్‌లలో పాల్గొనకుండా నిషేధించడంతో తీవ్ర మానసిక వేదనకు గురై 19 జూన్ 1981 నాడు కలకత్తాలో ఆత్మహత్య చేసుకున్నాడు.

అయిదువేల సంవత్సరాలుగా ఈ దేశంలో ప్రజలు ఆదరించిన, ఆచరించిన పద్ధతిని, నవీన పద్ధతులలో ఓ వైద్యుడు, సైంటిస్టు ప్రయోగాత్మకంగా చేసి విజయం సాధిస్తే మెచ్చుకోవడానికి బదులు తీవ్రంగా నిరసించింది ఆనాటి సైంటిఫిక్ కమిటి. రాబర్ట్ ఎడ్వర్డ్‌కు నోబెల్ ప్రైజు దక్కింది. సుభాష్ ముఖోపాధ్యాయ్‌కు మానసిక ఆందోళన, ఆత్మహత్య లభించాయి.

'దుర్గ'గా జన్మించిన కానుప్రియ అగర్వాల్ తన 25వ పుట్టిన రోజున Test Tube Baby నని సగర్వంగా ప్రకటించి సుభాష్ ముఖోపాధ్యాయ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నది. ఈ వైద్యుడి (డాక్టర్ సుభాష్) జీవితాన్ని తపన్‌సిన్హా – "ఏక్ డాక్టర్ కి మౌత్" పేరిట చలనచిత్రంగా రూపొందించాడు.

ఇండియాలో మొదటి Test Tube Baby సృష్టికర్తగా అంగీకరించబడిన T.S. Anand Kumar (ICMR/IRR Director) ప్రథమ స్థానాన్ని సుభాష్ ముఖోపాధ్యాయ్‌కు ఇచ్చి ఆ విషయాన్ని బహిరంగంగా ప్రకటించాడు. ఆనంద్‌కుమార్ సృష్టి-రెండవ టెస్ట్‌ట్యూబ్ బేబి–హర్షవర్ధన్‌రెడ్డి బూరి 16 ఆగష్టు 1986 నాడు జన్మించినాడు. ఆనంద్‌కుమార్ కృషి వలన సుభాష్ ముఖోపాధ్యాయ్‌కు మరణానంతర కీర్తి లభించింది. ప్రపంచంలోని 1100 మెడికల్ సైంటిస్ట్‌లలో ఒకడిగా గౌరవం దక్కింది.

## 2) Sperm Children

**వీర్యపుత్రులు :** వీర్యకణాన్ని, అండాన్ని పెట్రిడిష్‌లో ఫలదీకరణం చేసి తల్లి గర్భంలో, అద్దెతల్లి గర్భంలోనో ఉంచడం వలన సంతానం కలిగేలా చేయడం ఇప్పుడు సర్వసాధారణమైంది.

భారతకాలంలో మునుల, రాజుల వీర్యాన్ని అత్యంత శక్తివంతమైన ఇంద్రియంగా భావించి దానిని (ద్రోణం, ఘటం) నేతికుండలలో భద్రపరచేవారు. అలా పుట్టినవారు ద్రోణుడు, ద్రుపదుడు, కృపుడు, కృపి, అగస్త్యుడు, గ్రీకుల ఎరిక్తొనస్ (Erichthonius). ఆధునిక సైన్స్‌లో ఇంకా స్పెర్మటోజోవా ద్వారా సంతానం కలిగించే పద్ధతి రాలేదు. కాని, మూల కణాలు (Stem Cells) నుంచి ఇంద్రియకణాన్ని తయారు చేయగలిగారు (Stem Cells to Spermatozoa).

## 3) Sperm Sorting - Sex Selection

స్మెర్మటోజోవాలలో X-స్పెర్మటోజోవా, Y-స్పెర్మటోజోవా ఉంటాయి. అండకణంలోని X, X-స్పెర్మటోజోవా కలిస్తే XX-ఆడపిల్ల; అండకణంలోని X, Y-స్పెర్మటోజోవా కలిస్తే XY-మగపిల్లవాడు జన్మిస్తాడు. Flow Cytometry ద్వారా ఇంద్రియంలోని X, Y స్పెర్మటోజోవాలను విడదీసి ఆడపిల్ల, లేదా మగపిల్లవాడిని పొందవచ్చు.

భారతకాలంలో పుంసవన పద్ధతులలో కొన్ని ఆయుర్వేద మూలికలు, ఆహార నియమాలతో స్త్రీ జననేంద్రియాలలో pH మార్చడం ద్వారా సహజ పద్ధతిలో Sperm Sorting చేసేవారు.

పుంసవన క్రియలో శుభముహూర్తాన– గర్భవతి కావాలనుకున్న స్త్రీతో మజ్జిగ, పాలు, నేయితో చేసిన పరమాన్నాన్ని తినిపిస్తారు.

ఇంకో పద్ధతిలో– వేదమంత్రాల మధ్య హోమగుండం దగ్గర– కుడి నాసారంధ్రంలో అరటి ఆకు రసాన్ని చుక్కలుగా వేస్తే కొడుకు, ఎడమ నాసారంధ్రంలో వేస్తే ఆడపిల్ల పుడుతుందని విశ్వసిస్తారు.

మూడవ లేదా నాలుగవ నెల గర్భిణీగా ఉన్నపుడు, శిశువు కదలికలు తల్లికి తెలుస్తున్నపుడు మగపిల్లవాడు కావాలంటే అరటి ఆకు రసాన్ని కుడి నాసారంధ్రంలో, ఆడపిల్ల కావాలంటే ఎడమ నాసారంధ్రంలో భర్త చేత భార్య ముక్కులో పోయిస్తారు.

**శుశ్రుతుడి విధానం:**

1) మర్రి చిగుళ్ళను పొడిచేసి ఆవుపాలలో కలిపి నాలుగు చుక్కలు కుడి నాసారంధ్రంలో వేస్తే మగపిల్లవాడు, ఎడమ నాసారంధ్రంలో వేస్తే ఆడపిల్ల పుడుతుంది. పుష్యమీ నక్షత్రం మంచిది. ద్రవాన్ని ముక్కులో వేసినపుడు ఉమ్మకూడదు.
2) పుష్యమీ నక్షత్రం రోజున అన్నం ఉడుకుతున్నపుడు ఆవిరి పీల్చడం.
3) పలాస ఆకుపాలతో కలిపి తాగడం.
4) పుత్రమంజరి, విష్ణుక్రాంత వేళ్లు, ఈశ్వరలింగి గింజలపొడిని గర్భిణి సమయంలో ఎనిమిది రోజులు సేవిస్తే మగపిల్లలు పుడతారు.
5) మర్రిచిగుళ్లు, ధనియ మస (Kidney Beans), సర్షప (Yellow Mustard) పొడిని పెరుగుతో కలిపి, పుష్యమీ నక్షత్రాన ముక్కులో వేయాలి.
6) బహిష్టు ఉన్న రోజు నుంచి 4–6–8–10–12 దినాల్లో కలిస్తే మగపిల్లవాడు,
5–7–9–11 దినాల్లో కలిస్తే ఆడపిల్ల పుడుతుంది.

నెలతప్పిన రోజు నుంచి మూడవ నెల వరకు క్రమం తప్పకుండా పుష్యమి నక్షత్రం రోజున ముక్కులో వేయాలి. ముక్కులో చుక్కలు వేసాక ఎడమవేపు తిరిగి పడుకోవాలి కనీసం అర్థగంట.

పాయసాన్నం మంచిది గర్భిణీ సమయాల్లో. రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు పుత్రకామేష్ఠి యాగం వలన జన్మించారు. పాయసాన్నం ఇవ్వబడింది కౌసల్య సుమిత్ర కైకేయిలకు.

## 4) Transfer of Youth, Immortality
## యవ్వన మార్పిడి, అమృతత్వ సాధన

1) **యవ్వన మార్పిడి-** యయాతికి అతడి కుమారుడు పూరుడు తన యవ్వనాన్నిచ్చి, తండ్రి వృద్ధాప్యాన్ని తీసుకున్నాడు. కొన్నేళ్ల తరువాత మరల ఎవరి వయస్సును వాళ్లు తీసుకున్నారు.

2) పాము కాటుతో మరణించిన ప్రమద్వరను తన ఆయుర్దాయంలో సగమిచ్చి రురుడు ప్రమద్వరను బ్రతికించి పెళ్లి చేసుకున్నాడు.

3) యముడి అనుగ్రహంతో తన భర్త సత్యవంతుడిని బ్రతికించుకున్నది సావిత్రి. మార్కండేయుడు శివుడి వరంతో బ్రతికినాడు.

## 5) Transfer of Sex or Exchange

1) సుద్యుమ్నుడనే రాజు – పార్వతీ పరమేశ్వర రక్షితమైన సరస్సులో మునిగే సరికి 'ఇల' అనే ఆడపిల్లగా మారతాడు. 'ఇల' తారాచంద్రుల కుమారుడు బుధుడిని వివాహం చేసుకోగా పురూరవుడు జన్మించాడు. చంద్రవంశం ప్రారంభ మయ్యింది.

2) నారదుడు విష్ణుమాయతో స్త్రీగా మారి రాజును వివాహం చేసుకుని అనేకమంది పుత్రులను కంటాడు. యుద్ధంలో వారందరూ మరణించగా దుఃఖిస్తూ మేలుకుని అంతా విష్ణుమాయగా తెలిసి ఊరట నొందుతాడు.

3) పాంచాలరాజుకు శిఖండినిగా పుట్టి తరువాత స్థూలకర్ణుడనే యక్షుడికి తన స్త్రీరూపాన్నిచ్చి, అతడి పురుషరూపాన్ని గ్రహించి శిఖండిగా మారుతుంది. శిఖండిగా మగవాడై తన భార్యను సంతృప్తి చెందించి సంతానాన్ని పొందుతాడు. శిఖండి చనిపోయాక స్థూలకర్ణుడు తన పురుషత్వాన్ని తిరిగి పొందుతాడు.

4) ఊర్వశి శాపంతో అర్జునుడు బృహన్నల–పేడిగా మారి అజ్ఞాతవాసం తరువాత మరల స్వస్వరూపాన్ని పొందినాడు.

5) భంగాస్వనుడనే రాజు అడవిలో వేటకేగి సరస్సులో స్నానం చేసి వచ్చేసరికి స్త్రీగా మారి భంగాస్వినిగా ఓ ముని వలన వందమంది పుత్రులను కన్నాడు. మగవాడిగా ఉన్నపుడు అతడికి వందమంది పుత్రులున్నారు. ఇంద్రుడు ఆ, ఈ పుత్రుల మధ్య వైరం సృష్టించగా ఇరుపక్షాలు కొట్టుకుని మరణించారు. ఇంద్రుడు ప్రత్యక్షమై– ఎవర్ని బ్రతికించను? అనగా– తాను స్త్రీగా ఉన్నపుడు పుట్టిన పిల్లలను బ్రతికించు–ఎందుకంటే తల్లిప్రేమ గొప్పది అన్నది భంగాస్విని. ఇంద్రుడు అందరిని బ్రతికించి, భంగాస్వినిని మగవాడి చేస్తానంటే వద్దని– స్త్రీకి రతిసౌఖ్యమెక్కువ అని పలికి స్త్రీగానే ఉండిపోయాడు భంగాస్వినిగా. (అనుశాసనిక పర్వం–ప్రథమాశ్వాసం).

## 6) Body Smell
## సహజగంధం – మత్స్యగంధి → యోజనగంధి

ఉపరిచర వసువు వివాహం చేసుకున్నాడు కోలాహల పర్వతం, శుక్తిమతి నదుల కుమార్తె గిరికను. ఒకరోజు వేటకు వెళ్లి అక్కడ తన భార్యను తలచుకున్నపుడు వీర్య స్ఖలనమయ్యింది. దానిని ఒక ఆకుదొప్పలో పెట్టి పెంపుడు డేగ మెడకు కట్టి ఇంటికి పంపగా దారిలో ఇంకో డేగ దానిని తన్నుకుపోవాలని ప్రయత్నించినపుడు ఆకుదొప్ప దిగువన ఉన్న నదిలో పడగా ఆ వీర్యపు చుక్కలను చేపరూపంలో ఉన్న శాపగ్రస్త అద్రిక అప్సరస మింగి గర్భం దాల్చింది. జాలరులకు చిక్కిన ఆ చేప పొట్ట కోసిచూస్తే ఇద్దరు శిశువులు కనిపించారు. మగశిశువు మత్స్యరాజైనాడు. ఆడశిశువు మత్స్యగంధిగా దాశరాజు దగ్గర పెరిగి యమునానదిలో పడవ నడుపుతూ ఉండేది.

ఆమె శరీరం చేపల వాసన వేసేది. పరాశరమహర్షి ఆమెను యోజనగంధిగా మార్చాడు చేపలకంపు పోగొట్టి. వారిద్దరికి పుట్టినవాడు వ్యాసుడు (ఆదిపర్వం–తృతీయాశ్వాసం).

నవీన శాస్త్ర పరిశోధనల వలన ABCC-II అనే జన్యువు చంకల నుంచి వచ్చే వాసనను, చెవిలో గులిమి (Wax) వాసనను నిర్ణయిస్తుంది. ఫ్లావిన్ కంటెయినింగ్ మోనో ఆక్సిజనేజ్-3 ఎంజైమ్ లోపంతో మూత్రం, చెమట, ఊపిరిలో ట్రైమిథైల్ ఎమైన్ ఉండడం వలన చేపకంపు వస్తుంది. ఎక్కువగా చెమటపోసే శరీర భాగాల వద్ద బాక్టీరియా వృద్ధి చెందగా మేక ఉచ్చకంపు, గొర్రెలకంపు కొడ్తుంది. ఫెరొమోన్‌లలో వచ్చే మార్పులు- హిస్టోకంపాటబిలిటి కాంప్లెక్స్- Human Leucocytic Antigen - లలో వైవిధ్యం శరీర సుగంధాన్ని, కంపును నిర్ణయిస్తాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

పార్వతీదేవి శిరోజాల సహజగంధం, మత్స్యగంధి చేపల వాసన పోయి సుగంధ యోజనగంధిగా మారడం ఇవన్నీ నిజమేనని ఇప్పుడు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. Smell Dating- తనకు నచ్చిన పరిమళంగల వారితో యువతీ యువకులు కలిసి తిరగడానికి వీలుగా Dating App లు వచ్చాయిప్పుడు.

## 7) Self willed Death / Longevity
## స్వేచ్ఛా మృత్యువు - ఇచ్ఛామరణం - భీష్ముడు

తనకు రాజ్యం వద్దని, తానిక వివాహం చేసుకోనని భీష్మప్రతిజ్ఞ చేసి శంతనుడి కుమారుడైన దేవవ్రతుడు భీష్ముడైనాడు.

దానికి సంతోషించిన శంతనుడు తన కుమారుడికి స్వేచ్ఛామరణ వరమును ఇచ్చాడు. యోగశాస్త్రం ప్రకారం స్వాధిష్ఠాన చక్రాన్ని కుండలినీయోగంతో మేల్కొల్పిన వాడికి ఇచ్ఛామృత్యు సిద్ధి లభిస్తుంది. అమరనాథ గుహలలో వివేకానందుడికి ఆ శక్తి లభించింది, శివుని దర్శనంతో, అని విశ్వసిస్తారు. నలభయ్యవ ఏడు రాకుండానే చనిపోతానన్నాడతడు.

మహాత్మ శిశిర్‌కుమార్, పండిత దీనబంధు వేదాంతరత్న అనే యోగులు ఇచ్ఛామరణాన్ని సాధించారు.

హనుమంతుడికి అష్టసిద్ధులు, ఇచ్ఛామరణ శక్తి ఉన్నాయి. అతడు చిరంజీవి.

ఆధునిక శాస్త్రజ్ఞులు క్రోమోజోముల్లోని టెలొమియర్ (Telomere)ను సంరక్షించడం ద్వారా ఆయుర్ధాయాన్ని పొడిగించవచ్చునని భావిస్తున్నారు.

చిరకాల జీవనం (Longevity)ను నియంత్రించే పది జన్యు స్థానాలను శాస్త్రజ్ఞులు కనుక్కున్నారు. ఇన్సులిన్/ ఐ.జి.యఫ్. Insulin/IGF-I, mTor, AMP actvating protein, Sirtuin - సిగ్నల్ ప్రొటీన్లు – Autophagy-స్వయంభక్షకత్వం– న్యూక్లియోలస్, లైసోజోములు, X-క్రోమోజోము, ఇవన్నీ మానవ జీవన ఆయుర్ధాయాన్ని నియంత్రిస్తాయని శాస్త్రజ్ఞులంటున్నారు.

వేలాది ఏళ్లు బ్రతికినట్లు చెప్పబడుతున్న సుమేరియన్ ప్రభువులు, కృతయుగ, త్రేతాయుగ రాజులు, జెనెసిస్‌లో ప్రాచీనులు, పర్షియన్ ప్రభువులు, భారత వీరులు, మెథుసెలా (Methuselah) (969 సంవత్సరాలు)లా ఎక్కువ ఏళ్లు బ్రదికినవారు. అనేక వృక్షాలు (Ginkgo Biloba), తాబేళ్లు, జెల్లీ చేపలు – 5073 సంవత్సరాల వయస్సున్న Pinus longaeva చెట్టు, కాలిఫోర్నియాలోని పైన్ చెట్టు 4855 సంవత్సరాల వయసుండి 'మెథుసెలా'గా పిలువబడుతున్నది. నత్తలు, సొరచేపలు; 250 మిలియన్ సంవత్సరాల వయసున్న Bacillus permians బాక్టీరియా ఇవన్నీ చిరకాలం జీవించిన జీవులు.

జీన్ ఎడిటింగ్ CRISPR-Cas 9తో జంతువుల ఆయుర్దాయం పెంచవచ్చని శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

చైనా, జపాన్ నాగరికతలలో చిరాయువు కోసం ఎన్నో ప్రయోగాలు జరిగాయి.

ప్రస్తుత కాలంలో జియాన్నె కాల్మెంట్ (Jeanne Calment) వయసు 122½ (మహిళ); జిరొమాన్ కిముర (Jiromon Kimura) 116 సంవత్సరాలు – వీరు ఎక్కువ వయసున్న మానవులు.

జెనెసిస్ 6:3లో మానవుల వయస్సు 120 ఏళ్లకు నిర్ణయించబడింది. గ్రహగణన ప్రకారం- హిందూ శాస్త్రాల్లో కూడా మానవుల ఆయుర్ధాయం- 120 ఏళ్లు వస్తుంది. కలియుగ ప్రారంభంలో మానవుల వయసు- 120 ఏళ్లు, తరువాత క్రమేపీ తగ్గుతూ వస్తుంది.

రాముడు అయోధ్యను 11,000 ఏళ్లు పాలించాడు. దశరథుడు 60,000 ఏళ్లు జీవించాడు. భగీరథుడు 3,60,000 సంవత్సరాలు బ్రతికాడు.

**జీర్ణవాహిక :** ముఖం (నోరు) నుంచి గుదం వరకు ఉండే మహానదీ ప్రవాహం-యోగమార్గం. యోగులు దాని ద్వారానే పరమపదం పొందుతారు. నవీన శాస్త్ర పరిశోధనలు కూడా ఈ ప్రవాహ నియంత్రణ వలన వ్యాధులను నివారించవచ్చని తెలుపుతున్నాయి.

శ్రీకృష్ణుడు 125 సంవత్సరాల ఎనిమిది నెలలు జీవించాడు. అశ్వత్థామ (6000 ఏళ్లకుపైగా), దేవరహబాబా (900), త్రిలింగస్వామి (280), లోకనాథ బ్రహ్మచారి (160), శివపురిబాబా (137) సంవత్సరాలు జీవించారు. బౌద్ధుల- విపస్సి లక్ష సంవత్సరాలు; తనహంకార లక్ష సంవత్సరాలు జీవించారు. ఇబ్రహీం (169), సారా (127), నోవా (950), అల్ హబాషి (674), అల్ మహది (1154), అల్ మహది ఇంకా జీవించి ఉన్నాడు. జైనుల నేమినాథ (10000) మిగతా తీర్థంకరులు లక్షలాది ఏళ్లు జీవించారు. చైనీయులు Fuxi (197), Zuoci (300), పాంగు (800), Yellow Emperor (113), యావొ (118), షున్ (110) ఏళ్లు బ్రదికారు. గ్రీకుల టిరెసియాస్ (600), నెస్టర్ (300) ఏళ్లు జీవించారు.

ఎక్కువ కాలం బ్రదకడానిని- Methuselah Syndrome గా వ్యవహరిస్తున్నారు (Longevity).

కృతయుగంలో లక్షలాది ఏళ్లు, త్రేతాయుగంలో వేలాది ఏళ్లు, ద్వాపరంలో వందలాది ఏళ్లు, కలియుగంలో పది నుంచి నూరేళ్లు మానవులు జీవిస్తారు. రెండు షష్ఠిపూర్తుల కాలం (2×60=120) మానవ ఆయుర్దాయం.

వింశోత్తరి అంటే 120 ఏళ్లు. Ketu (కేతు-7), Venus (శుక్ర-20), Sun (రవి-6), Moon (చంద్ర-10), Mars (అంగారక-7), Rahu (రాహు-18), Jupiter (గురు-16), Saturn (శని-19), Mercury (బుధ-17). వింశోత్తర దశ- సూర్యమాన సంవత్సరం = 365.25 దినములు. సూర్యోదయం నుంచి మరుసటి రోజు సూర్యోదయం వరకు 60 ఘటిక (ఘడియలు); ఒక్కో ఘటిక- 24 నిముషాలు; 30 దినములు ఒక నెల; 360 రోజులు- 1 సంవత్సరం. 27 నక్షత్రాలు= ఒక్కొక్కటి 13 డిగ్రీల 20 నిముషాలు, ఒక్కో నక్షత్రానికి నాలుగు పాదాలు. మొత్తం ($27×13^0$ 20'= 360 డిగ్రీలు).

## 8) Air Ship - Vimana
### విమానము - కొలువబడినది

**పుష్పకవిమానం-** ఏడంతస్థులు, ఎంతమందికైనా సరిపోయే స్థలం, వాయువేగ మనోవేగాలు కలది. ఒకప్పుడు కుబేరుడి రథం, తరువాత దానిని లాక్కున్నాడు రావణుడు. శ్రీరాముడు దానిని విభీషణుడికిచ్చినాడు.

సమరాంగణ సూత్రధార అనే గ్రంథంలో విమానాల గురించి పేర్కొన్నారు.

మహర్షి భరద్వాజుడు వ్రాసిన వైమానిక శాస్త్రంలో 3000 శ్లోకాలున్నాయి. అయితే బెంగుళూరు-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్- 1974లో దానిలో వ్రాసిన విషయాలు విమానాలు తయారు చేసేందుకు పనికిరావని తేల్చింది.

అయ్యవజి (అనే పూలవిమానం) అయ్యవైకుందర్‌ను వైకుంఠానికి తీసుకువెళ్తుంది. సంత్ తుకారాంను పుష్పక విమానం స్వర్గానికి తీసుకువెళ్తుంది.

Erich Von Daniken వ్రాసిన Chariots of the Gods? అనే పుస్తకం 70 మిలియన్ కాపీలు అమ్ముడుబోయింది.

## 9) Weapons - Divine Sastra
### ఆయుధాలు-దివ్యాస్త్రాలు

**శస్త్రము-** చేతినంటి ఉండేవి.

**అస్త్రము-** చేతినుంచి విడువబడేవి.

**దివ్యాస్త్రాలు-** మంత్రపూరితమైనవి. మంత్రాధిదేవతను స్మరించి గడ్డిపరకనైనా దివ్యాస్త్రంగా ప్రయోగించవచ్చు. ప్రతి దివ్యాస్త్రానికి- అస్త్ర అధిదేవత, ప్రయోగోపసంహారాలు, మంత్రాలు అస్త్రాన్ని నిర్వీర్యం చేసే మరో అస్త్రం ఉంటాయి.

1) **బ్రహ్మశిరోనామకాస్త్ర -** బ్రహ్మాస్త్రానికి నాలుగురెట్లు శక్తివంతమైనది. దీనివలన అణువిస్ఫోటనం జరిగి నేల, తల్లులు వంధ్యలవుతారు. అస్త్రంతో విశేషం ఏమిటంటే అవి ఎవరిని ఉద్దేశించి ప్రయోగిస్తే వారిమీదనే ఆ దుష్ఫలితాలుంటాయి. 'అపాండవంబయ్యెడు' అని అశ్వత్థామ ప్రయోగించగా పాండవ వధూజనములందరూ వంధ్యలైనారు. దీనికి ప్రతిగా విరుగుడు కూడా బ్రహ్మశిరోనామకాస్త్రమే.

2) **బ్రహ్మాస్త్రం :** దీనికి విరుగుడు బ్రహ్మాస్త్రం. ఉపసంహారం తెలియకపోతే ప్రళయం సంభవిస్తుంది.

3) **బ్రహ్మదండం :** అన్ని అస్త్రాలను మింగివేస్తుంది.

4) **పాశుపతాస్త్రం :** ముల్లోకాలను దహించివేస్తుంది. అనేక రకాల పశువులు, పక్షులు, భూతగణాలు వెలువడుతాయి దీనినుంచి. మంత్రించి ప్రయోగించిన దానిని బట్టి నిర్దేశించిన పనిని పూర్తిచేస్తుంది. సైంధవుడి తలను వృద్ధక్షత్రుడి ఒళ్లో పడేట్లు చేసింది ఈ అస్త్రం అర్జునుడు ప్రయోగించినపుడు. నివాత కవచులనే రాక్షసులు భస్మం చేసింది. వనవాస సమయంలో శివుడిని మెప్పించి అర్జునుడు పొందినాడు పాశుపతాన్ని. ఈ అస్త్రం ఉందనే మొత్తం

కౌరవులందరినీ ఒక్కక్షణంలో భస్మం చేస్తానన్నవాడు, ఆ పని చేయనందుకు ధర్మరాజు దృష్టిలో పలుచబడినాడు. మహాప్రస్థానిక సమయంలో అర్జునుడు పడిపోవడానికి అదే కారణమని ధర్మజుడు చెప్పాడు.

**5)** **ఆగ్నేయాస్త్రం :** అగ్నిని సృష్టిస్తుంది. బృహస్పతి నుంచి అగ్నివేశుడికి అతడి నుంచి ద్రోణుడికి, ద్రోణుడి నుంచి అర్జునుడికి ఇతర శిష్యులకు చేరింది ఈ ఆగ్నేయాస్త్ర రహస్యం.

**6)** **వారుణాస్త్రం :** ఆగ్నేయాస్త్ర ప్రభావాన్ని వారుణాస్త్రం జలంతో చల్లార్చవచ్చు.

**7)** **వాయువ్యాస్త్రం :** పెనుగాలులు, ధూళిమేఘాలను సృష్టిస్తుంది.

**8)** **పర్జన్యాస్త్రం :** మేఘాలను సృష్టించి చీకటిని కలుగజేస్తుంది.

**9)** **నాగపాశం :** అరుబుడనేవాడు నిర్మించాడు.

**10)** **గరుడాస్త్రం :** నాగపాశం నుంచి బంధవిముక్తులను చేస్తుంది.

**11)** **ఇంద్రాస్త్రం:** ఒకే బాణం నుంచి అనేక బాణాలు, ఆయుధాలు వస్తాయి.

**12)** **నారాయణాస్త్రం :** దీనిని ప్రయోగించినపుడు ఆయుధాలు వదిలి నేలపై నిలబడిన వారిని ఏమీ చేయదు. లేకుంటే దహించివేస్తుంది.

**13)** **ప్రమోహనాస్త్రం :** వివశుల్ని చేస్తుంది.

**14)** **ప్రజ్ఞాస్త్రం :** తెలివి తెప్పిస్తుంది వివశులైనవారిని.

**15)** **వజ్రాయుధం :** ఇంద్రుడి ఆయుధం. పిడుగులను కురిపిస్తుంది.

**16)** **శక్తి :** ఇంద్రుడికిచ్చిన శక్తి మహా శక్తివంతమైనది. శత్రువును చంపి వెనక్కి వస్తుంది.

త్వష్ట, అంతర్ధాన అస్త్ర, అసురాస్త్ర, గంధర్వాస్త్ర, భార్గవాస్త్ర, పర్వతాస్త్ర, మానవాస్త్ర (శత్రువును చంపకుండా దూరంగా విసిరివేస్తుంది. రాముడు మారీచుడిపైన ప్రయోగించినది). ఇలా అనేక అస్త్రాలున్నాయి. ఇవి కొన్ని స్వల్పకాలం మాత్రమే ప్రభావం చూపుతాయి. బ్రహ్మాస్త్రం లాంటివి శాశ్వత ప్రభావాన్ని కలుగజేస్తాయి. చాలామంది మునులు వీటిని ప్రత్యేకమైన పద్ధతులలో తయారుచేసి తమ పేర్లు పెట్టి వాటిని వాడే విధానం శిష్యులకు నేర్పేవారు. బాణానికి విషసర్పాన్ని కట్టి వదిలితే అది నాగాస్త్రం. ప్రయోగించాక మంటలనో, వర్షాన్నో, ఒక బాణంలోంచి అనేక బాణాలనో వెలువరించేట్లు వాటిని తయారు చేస్తారు. మత్తు కలిగించే మందున్నది సమ్మోహనాస్త్రం. ఇవన్నీ తాత్కాలికంగా తమ ప్రభావాన్ని చూపుతాయి.

**మామూలు శాస్త్రాలు:** పట్టాకత్తి, శక్తి, ముద్గరం, భుసుండి, కొడవలి, అసి-ఖడ్గం, దండం, రిస్తి, అంకుశం, తోమరం, అస్ని, పరిఘ, ముసలం, కంపనం, కరణి, వరాహకర్ణ, భిండిపాలం, శిలీముఖం, విపాతం, భల్లాలు, ఈటెలు, గదలు, బడితెలు, రాళ్లు, వొడిసెలలు, అనేక రకాల కత్తులు.

## 10. Child Learing - Speaking from Womb (Pre Natal Memory)

1) అభిమన్యుడు పద్మవ్యూహ భేదనం నేర్చుకున్నాడు సుభద్ర గర్భంలో ఉన్నపుడు అర్జునుడి నుంచి. నిర్గమనం తెలియకుండా శ్రీకృష్ణుడు అడ్డుపడ్డాడనేది జనశ్రుతి.

2) అష్టావక్రుడు తండ్రి విద్యాబోధనను తల్లి గర్భంలో ఉన్నపుడు అధిక్షేపించినందుకు తండ్రి శాపానికి గుర్రై అష్టవంకరలతో పుట్టాడు.

3) ఉతథ్యుడి భార్య మమత గర్భిణిగా ఉన్నపుడు బృహస్పతి ఆమెను పొందగోరితే గర్భస్థ శిశువైన దీర్ఘతమసుడు అధిక్షేపించగా బృహస్పతి శాపంతో పుట్టుగుడ్డిగా జన్మిస్తాడు. తల్లి గర్భంలోనే వేదవేదాంగాలు నేర్చుకున్నాడతడు.

నవీన పరిశోధనల ప్రకారం- గర్భస్థ శిశువు 24 వారాల వయసు నిండగానే తల్లి గొంతును గుర్తుపడుతుందని, భాష, ఆహారం, ఉద్వేగాల గురించి అర్థం చేసుకుంటుందని భావిస్తున్నారు.

**11) మధుకైటభులు :** విష్ణుమూర్తి చెవి గులిమి- భూమిపై పెంకులా ఉండగా (మధు-తేనెచుక్క కైటభ-కఠినశిల) దానిని విష్ణువు సుదర్శన చక్రంతో 12 ముక్కలు చేసాడు. అవి 12 Seismic Plates గా వేర్వేరు ఖండాలైనాయి.

12) మొక్కలకు సుఖ సంతోషాలుంటాయని శాంతి పర్వంలో- భృగు భరద్వాజ సంవాదంలో పేర్కొనబడింది. జగదీశ చంద్రబోస్ పరిశోధనలు దానిని ఋజువు చేసాయి.

# 38. భారతంలో లేని భారత కథలు

## బర్బరీకుడి బాణాలు (HLA Markers)

**బర్బరీకుడు :** భీముడు-హిడింబల పుత్రుడు ఘటోత్కచుడు. ఘటోత్కచుడు-మౌర్వీల కుమారుడు బర్బరీకుడు. తల్లి అతడికి ధనుర్విద్య నేర్పింది. అష్టదేవులతడి భక్తికి మెచ్చి మూడు బాణాలనిచ్చారు. అందుకే అతడు త్రిశరుడు. నీలిగుర్రం, మూడు బాణాలు, ధనుస్సుతో, ఓడిపోతున్న పక్షాలకు సాయం చేస్తాడతడు.

భీష్ముడికి 20 రోజులు, ద్రోణుడికి 25 రోజులు, కర్ణుడికి 24 రోజులు, అర్జునుడికి 28 రోజులు పట్టే యుద్ధాన్ని బర్బరీకుడు మూడు బాణాలతో పూర్తిచేయగలడు. మొదటి బాణం శత్రుపక్షంలోని యోధులపై గుర్తు పెడుతుంది. రెండవ బాణం ఎవరినన్నా తాను రక్షించదలుచుకుంటే వారిపై ఉన్న గుర్తుల్ని చెరిపివేస్తుంది. మూడవ బాణం వెళ్లి మొదటి బాణం పెట్టిన గుర్తులున్న వారిని చంపివేస్తుంది. మారువేషంలో ఉన్న కృష్ణుడన్నాడు "ఋజువు చెయ్యి చూద్దాం!". బర్బరీకుడు- ఎదురుగా ఉన్న రావిచెట్టును చూపించి "దీని ఆకులన్నిటినీ రాలగొడతాను చూడు" అని వింటికి బాణాన్ని సంధించి కనులు మూసుకుని మంత్రం ధ్యానిస్తున్నాడు. కృష్ణుడు ఒక రావి ఆకును కోసి తన ఎడమపాదం కింద ఉంచి ఏమీ ఎరుగనట్లు నిలబడినాడు.

బర్బరీకుడు బాణం ప్రయోగించాడు. అది వెళ్లి అన్ని రావి ఆకులపై గుర్తుపెట్టి వచ్చి శ్రీకృష్ణుడి ఎడమ పాదంపైన ఆగింది. బర్బరీకుడన్నాడు- "తమరెవరో మహాపురుషులు, లేకుంటే నా బాణం మీ పాదాన్ని గాయపరచి దాని కింద ఉన్న ఆకుకు గుర్తుపెట్టేది". కృష్ణుడు నవ్వి నిజరూపంలో ప్రత్యక్షమై అన్నాడు- "త్వరలో పాండవ-కౌరవ సంగ్రామం జరగబోతుంది. దానికి తొలిబలి కావాలి. నేను కాని, అర్జునుడు కాని, భీముడు కాని, మా అంతవీరుడు కాని దానికి అర్హులం. కాని..."

బర్బరీకుడికి అర్థమయ్యింది. కృష్ణుడు తనను తొలి బలి కమ్మంటున్నాడని. బర్బరీకుడన్నాడు- "నేనే స్వయంగా యుద్ధంలో పాల్గొనాలనుకున్నాను. కుదిరేట్లు లేదు కనుక నా ఖండిత శిరస్సు సజీవంగా మహాభారత యుద్ధం పూర్తిగా చూసేలా వరమనుగ్రహించు". కృష్ణుడు ఒప్పుకున్నాడు. ఫాల్గుణ మాసం మంగళవారం శుక్లపక్ష ద్వాదశినాడు బర్బరీకుడు తన శిరస్సు నరుక్కుని తొలి బలియైనాడు పాండవ విజయం కోసం.

యుద్ధం ముగిసింది. భీమార్జునులు తమ వల్లనే గెలుపు సాధ్యమయ్యిందనుకుని బర్బరీకుడి ఖండిత శిరస్సును న్యాయమడిగారు. ఎవరు గొప్ప వీరుడెవరు?

బర్బరీకుడి ఖండిత శిరస్సు నవ్వింది... "ఎక్కడ చూసినా నారాయణుని సుదర్శన చక్రం, రుద్రుని స్వరూపంతో శ్రీకృష్ణుని వీరవిహారం... " అన్నాడతడు.

బర్బరీకుడు ఖటుశ్యామ్‌జీగా (రాజస్థాన్), బలియదేవ (గుజరాత్), తీన్‌బాణధార, లాఖ్‌దాతారి, నీలాశ్వుడు, ఖటునరేష్, శ్యామ్ ప్యారే, కలియుగ అవతారె, మోరేబాధి ధరకుడు, శ్యామ్ బాబా, బారిష్ కా దేవత, యాలంబర, సవభక్కుదేవ, వాంగిదేవ, హాతుదేవ, అజుదేవగా పూలజందుకుంటున్నాడు.

బర్బరీకుడి మూడు బాణాల్లా- NK Cells (Natural Killer Cells - Large granular Lymphocytes) వైరస్ ఇన్‌ఫెక్షన్ వచ్చిన మూడు రోజుల్లో వైరస్‌తో ఇన్‌ఫెక్ట్ అయిన కణాల్ని నశింపచేస్తాయి. Cytotoxic T Cells గుర్తించగలవు Self - Non self కణాలను హ్యూమన్ ల్యూకోసైటిక్ ఏంటిజన్ మార్కర్ల ద్వారా (HLA). లింపోసైట్లు స్వ-పర కణాల్ని గుర్తించి పరాయి కణాల్ని, వైరస్‌లను చంపివేస్తాయి.

ఏదైనా వైరస్, బాక్టీరియా లేదా ఇతర జీవి మన శరీరంలో ప్రవేశించినపుడు లింఫోసైట్లు వాటిని HLA సాయంతో అవి తమకు చెందినవా, లేక అపాయం చేసేవి తమవి కానివా Markers ద్వారా గుర్తిస్తాయి. తమవి కానివాటిని మొదటి మూడు రోజుల్లో NK Cells తర్వాత B-Lymphocytes పంపిన Antibodies, తరువాత Cytotoxic T Cells బర్బరీకుడి మూడు బాణాల్లా శత్రువులను చంపివేస్తాయి.

## Super Natural Powers (అతీంద్రియ శక్తులు)

దివ్యదృష్టి, విశ్వరూపం, ఆకాశ గమనం, అష్టసిద్ధులు, కామరూపం, అనేక తలలు, చేతులు, సగం మానవ సగం జంతురూపాలు; మృతులలోక దర్శనం, అనంత ఐశ్వర్య నిధులు, వెయ్యి ఏనుగుల బలం లాంటి అతిలోక శక్తుల్ని, అక్షౌహిణీల సైన్యం, అర్బుద, పద్మ, శంఖ, మహాశంఖం లాంటి సంఖ్యల్ని అలంకార భావనలతో చూడాలి.

## వ్యాసుడు చెబుతుంటే గణేశుడు వ్రాసాడు / వ్యాస ఘట్టాలు / గ్రంథ ముడులు

ఈ కథ కవిత్రయ భారతంలో లేదు. వేదవ్యాసుడు మహాభారత కథను ఆలోచించి, బ్రహ్మను ప్రార్థించగా బ్రహ్మ గణేశుడి సాయం తీసుకొమ్మని సలహా ఇచ్చాడు. వ్యాసుడు గణేశుని తనకు వ్రాయసకాడిగా ఉండమని కోరగా గణేశు డన్నాడు– "ఎక్కడా ఆగకుండా చెబుతూపోవాలి!". వ్యాసుడన్నాడు– "ఆగకుండా వ్రాస్తూపోవాలి, అర్థం చేసుకుంటూ మరీనూ". అలాగే అనుకున్నారిద్దరూ. వ్యాసుడు చెబుతున్నాడు అనర్గళంగా. తన విరిగిన దంతంతో తాళపత్రాలపై వ్రాసుకుంటూ పోతున్నాడు గణేశుడు. కొన్ని కొన్ని శ్లోకాలు అర్థం చేసుకోవడానికి గణేశుడికే కాస్త సమయం పట్టేది. ఆ ఘట్టాలను వ్యాస ఘట్టాలు అంటారు. కొరుకుడు పడనివి క్లిష్ట రచనలను వ్యాస ఘట్టాలని పిలుస్తారు. ఆ సమయంలో వ్యాసుడికి కాస్త ఆలోచించడానికి తీరిక చిక్కేది. అది ఉభయతారకం అయ్యింది. వ్యాస ఘట్టాల శ్లోకాలు– 8800.

## అక్షయపాత్ర - దుర్వాసుడి పాత్ర

పాండవులు వనవాసానికి వెళ్లారు. వారి వెంబడి అనేకమంది విప్రులు, వారితోపాటు అడవికి వచ్చారు. సూర్యుడిని పూజిస్తే పాండవులకు అక్షయపాత్రనిచ్చాడు సూర్యభగవానుడు. అయితే అందరి భోజనాలు అయినాక ద్రౌపది ఆ పాత్రను కడిగి శుభ్రం చేసిన తరువాత ఏ ఆహారమూ రాదు దాని నుంచి.

ఆ విషయం తెలిసిన దుర్యోధనాదులు దుర్వాసమునికి విశేష సత్కారాలు చేయగా అతడు సంతృప్తుడైనాక అతడిని పాండవుల వేపు మరలించారు. దుర్వాసుడు తన అసంఖ్యాకులైన శిష్యులతో పాండవులున్న చోటుకు వచ్చేసరికి కాలాతీత మయ్యింది. అప్పటికే ద్రౌపది అందరికంటె ఆఖరున తానూ భుజించి అక్షయపాత్రను కడిగి బోర్లించింది.

పాండవులకేమి చెయ్యాలో తోచలేదు. దుర్వాసుల బృందాన్ని స్నానం చేసిరమ్మని పంపి ఆపద్బాంధవుడైన శ్రీకృష్ణుని ప్రార్థించారు. శ్రీకృష్ణుడు వచ్చి తనకూ ఆకలిగా ఉందన్నాడు. ద్రౌపది కళ్లనీళ్లు పెట్టుకున్నది– "అన్నా! దుర్వాసుడికి అతడి శిష్య బృందానికి ఎలా అన్నం తెచ్చి పెట్టాలో అర్థంకాక నిన్ను తలచుకున్నాము. నీకూ ఆకలి వేస్తే నేనెక్కడి నుంచి తేను" అని దుఃఖపడిందామె.

"వెళ్లి, అక్షయపాత్ర పట్టుకుని రా!" అన్నాడు కృష్ణుడు. దానిలో కనిపించింది విష్ణుమాయలా ఒకే ఒక అన్నపు మెతుకు. పాండవులు ద్రౌపది ఆశ్చర్యంగా చూస్తూ ఉండగానే ఆ అన్నపు మెతుకు నోట్లో వేసుకుని– "హమ్మయ్య! నా కడుపు నిండింది!" అని బ్రేవ్‌మని తేల్చి పొట్ట నిమురుకున్నాడు ఆర్తత్రాణ పరాయణుడు. అక్కడ స్నానం చేసి బయల్దేరిన మునికి, శిష్యులకు కడుపునిండి, భుక్తాయాసం మొదలైంది. ఏ చెట్టుకింద నీడ ఉంటే అక్కడ కూర్చుని, పడి నిద్రపోవడం మొదలెట్టారు శిష్యులు. దుర్వాసుడు గ్రహించాడు ఇదంతా కృష్ణ పరమాత్మ వ్యవహారమని. క్షమించమని ప్రార్థించి, తమకోసం వచ్చిన పాండవులను ఆశీర్వదించి తమ తపోవనానికి వెళ్లిపోయినాడు.

## ద్రౌపది మాన సంరక్షణ - ఒకప్పుడు చేసిన సాయం

భారతంలో నలుగురు ప్రసిద్ధులైన కృష్ణులున్నారు. 1) శ్రీకృష్ణ పరమాత్మ, 2) అర్జునుడు, 3) కృష్ణ ద్వైపాయన వ్యాసుడు, 4) కృష్ణ ద్రౌపది. నలుగురూ నల్లనివారు, చల్లనివారు.

ఒకరోజున కృష్ణుడు పాండవుల వద్దకు వచ్చినపుడు అనేక ఫలాలు వడ్డించారతడికి ఆత్మీయంగా. ద్రౌపది అతడితో కబుర్లు చెబుతూ ఉండగా, ఏదో ఫలాన్ని కోస్తున్న కృష్ణుడికి వేలు తెగి రక్తం కారసాగింది. వెంటనే ద్రౌపది తన చీర చెంగు చింపి అతడి వేలుకు కట్టుకట్టింది. కృష్ణుడామెను ఎంతగానో శ్లాఘించాడు. అందుకే కృష్ణుడు ద్రౌపదిని తన సోదరి సుభద్ర అంత ఆత్మీయంగా చూసుకుంటాడు.

రాజసూయ యాగం ముగిసింది. మయసభలో దుర్యోధనుడు భంగపడినాడు. తనను చూసి ద్రౌపది నవ్విందన్న బాధ అతడికి నిద్ర పట్టకుండా చేయగా శకుని ఆలోచనతో మాయాజూదమాడి పాండవులను, వారి ధన సంపదలను గెల్చుకున్నాడు. ఆఖరి పందెంగా ద్రౌపదినొడ్డి ఆమెనూ ఓడిపోయాడు ధర్మరాజు. ప్రాతికామిని పంపి ద్రౌపదిని తీసుకురమ్మంటే– "తానోడి నన్నోడెనా, నన్నోడి తానోడెనా?" అని ప్రశ్నించింది ద్రౌపది. ఆమెనే వచ్చి సభనడగమంటే వచ్చింది ద్రౌపది. "ఆమెను లాక్కురా!" అని దుశ్శాసనుడిని పంపాడు దుర్యోధనుడు. ద్రౌపది గాంధారి వెనక దాక్కుంది.

"బానిసలు... వీళ్ళకింకా రాచదుస్తులెందుకు?" అని దుర్యోధనుడనగానే, పాండవులు తమ ఆభరణాలు, తలపాగాలు తీసి కిందబెట్టారు. పాంచాలి జుట్టు పట్టి లాక్కువచ్చాడు దుశ్శాసనుడు.

"అన్నా! నేను ఏకవస్త్రను" అన్నది ద్రౌపది.

"ఏకవస్త్రవో! వస్త్ర హీనురాలివో మాకేమి?" అంటూ దుశ్శాసనుడు ఆమె చీర పట్టుకుని లాగడం మొదలెట్టాడు. లాగుతూనే ఉన్నాడు, లాగి లాగి ఆ వస్త్రాల గుట్టమీద కూలబడినాడు. ద్రౌపది దేహం మీద వస్త్రం చెక్కుచెదరలేదు. ద్రౌపది తన అన్నను ధ్యానించడం ఆపలేదు.

"ఓడిపోయినవాళ్లతో ఏమి కాపురం చేస్తావు బంధకీ? ఓటమి ఎరుగనివాడితో సుఖపడు" అన్నాడు కర్ణుడు. దుర్యోధనుడు తన ఎడమతొడను చూపించాడు వచ్చి కూర్చో అని. భీముడు ప్రతిజ్ఞ చేసాడు. కురువృద్ధుల్... ధారుణి రాజ్య సంపదల్....

చీరకొంగు చిన్నగా చింపి వేలికి కట్టు కట్టిందానాడు కృష్ణ అనే ద్రౌపది; నిండు సభలో అనంతంగా చీరలను పంపి ఆమె మానరక్షణకు నడుం కట్టినాడు ఆమె అన్న శ్రీకృష్ణుడు.

## పంచ భీమ ప్రహసనం

ఒక కథనం ప్రకారం జరాసంధ, బక, కీచక, దుర్యోధన, భీములు ఒకేరోజున ఒకే నక్షత్రంలో జన్మించారు. వీరిలో ఎవరైతే ముందుగా ఒకరిని చంపుతారో అతడే మిగతా ముగ్గురినీ చంపగలుగుతాడు.

భీముడు ఏకచక్రపుర నివాసిగా ఉన్నపుడు బకుడిని, రాజసూయ యాగానికి ముందు జరాసంధుడిని, అజ్ఞాతవాస సమయాన కీచకుడిని, కురుక్షేత్ర యుద్ధంలో ఆఖరిరోజున దుర్యోధనుడిని చంపినాడు.

## ద్రౌపది ఎవరు? ఎందుకామెకు అయిదుగురు భర్తలు?

యజ్ఞంలో పుట్టిన యాజ్ఞసేని ద్రౌపది. అయోనిజ. ద్రుపద మహరాజు పుత్రిక. తొలి జన్మలో మౌద్గల్యుడు అనే ముని భార్య ఇంద్రసేన. మౌద్గల్యుడు అయిదు శరీరాలతో ఆమెతో విహరించాడు. రెండవ జన్మలో ఆమె కాశీరాజ పుత్రి. శివుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మంటే పతి, పతి, పతి, పతి, పతి అని అయిదుసార్లు పలికింది. అయిదుసార్లు శివుడు అలాగే, అలాగే, అలాగే, అలాగే, అలాగే అన్నాడు. ఆ తరువాత ఇంద్రుడిని పంచేంద్రియ రూపులుగా ధర్ముడు, వాయువు, ఇంద్రుడు, అశ్వనీదేవతలుగా –ఒక గుహలో ఆమెకు చూపించాడు.

ఆ పంచేంద్రులలో ధర్ముడు, వాయువు, ఇంద్రుడి అంశలతో కుంతీదేవికి ధర్మజుడు, భీముడు, అర్జునుడు జన్మించారు. మాద్రికి అశ్వినీదేవతల వలన నకులుడు, సహదేవుడు పుట్టినారు. ఈ పంచ పాండవులు ద్రౌపదికి భర్తలైనారు.

## శశిరేఖా పరిణయం – మాయా శశిరేఖ

తన ప్రియ శిష్యుడు దుర్యోధనుడికి తన చెల్లెలు సుభద్రనిచ్చి వివాహం చేద్దామనుకుంటే ఆమె అర్జునుడిని ఇష్టపడింది. మాయా యతి వేషంలో వచ్చిన అర్జునుడు శ్రీకృష్ణుని చాకచక్యంతో సుభద్రను తీసుకుపోతే యాదవులడ్డగించారు. వారిని గెలిచాడు అర్జునుడు.

దుర్యోధనుడి కుమార్తె లక్ష్మణను కృష్ణుడు–జాంబవతిల కుమారుడు సాంబుడు అపహరించి తీసుకురాబోయినప్పుడు, దుర్యోధనుడతడిని బందీగావించాడు. బలరాముడు కోపంతో మహాకాయుడై హస్తినాపురాన్ని నాగలితో పెల్లగించబోగా దారికి వచ్చిన దుర్యోధనుడు సాంబుడిని, లక్ష్మణను వదిలిపెట్టినాడు.

తన కుమార్తె శశిరేఖను దుర్యోధన సార్వభౌముడి పుత్రుడు లక్ష్మణ కుమారుడికి ఇచ్చి వివాహం చెయ్యాలని సంకల్పించాడు బలరాముడు. ఘటోత్కచుడు మాయా శశిరేఖగా, శ్రీకృష్ణుడు నిజం శశిరేఖతో అభిమన్యుడికి, మాయా శశిరేఖతో లక్ష్మణ కుమారుడికి వేర్వేరు మంటపాలలో వివాహం జరిగేట్లు చూస్తాడు. పాపం! మాయా శశిరేఖతో లక్ష్మణ కుమారుడి వివాహం నవ్వులపాలవుతుంది మాయా బజార్లో. ఈ కథ భారతంలో లేదు.

ఇంకో శశిరేఖ జరాసంధుడి సోదరి. ఈమె భర్త ధృష్టద్యుమ్నుడు.

## యాదవకులంలో ముసలం పుట్టింది

దుర్వాస, వశిష్ఠ, విశ్వామిత్ర, నారదాది ఋషులు ద్వారకా నగరానికి వచ్చారు శ్రీకృష్ణునితో ముచ్చటించేందుకు. యాదవ యువకులు వీరిని చూసారు. మునులను ఆటపట్టించదలుచుకుని సాంబుడికి ఆడవేషం వేసి– "మునులారా,

ఈమె గర్భవతి. రేపోమాపో ప్రసవిస్తుంది. పుట్టేది ఆడపిల్లా, మగపిల్లవాడో చెప్పగలరా!" అన్నారు. దుర్వాసుడికి కోపం వచ్చింది. అతడన్నాడు– "మూర్ఖులారా! వీడు సాంబుడని మాకు తెలుసు. వీడికి రేపు యాదవ వంశ వినాశనకరమైన ముసలం పుడుతుంది, పొండి!" అని శపించి కృష్ణుడిని కలవకుండానే వెళ్లిపోయారు.

మరుసటి రోజున సాంబుడి కడుపులోంచి బయటపడింది ముసలం. కృష్ణుడి సలహాతో దానిని పొడిపొడిగా చేసి సముద్రంలో కలిపారు యాదవులు. అప్పటికంతా సద్దుమణిగింది. కొద్దిరోజులకు ఆ ముసలం పొడి తీరాన ఉన్న రెల్లుతుంగలో చేరింది.

మహాభారత యుద్ధం ముగిసింది. గాంధారి తన పుత్రులందరూ మరణించడంతో యుద్ధాన్ని ఆపగలిగిన శక్తి ఉండీ ఆపనందుకు శ్రీకృష్ణుడిని శపించింది– "నాకు జరిగినట్లే నీ వంశమూ సర్వనాశనమవుతుంది సరిగ్గా 36 ఏళ్ల తరువాత. యాదవులు పరస్పర కలహంతో చస్తారు. ద్వారక నీటిలో మునిగిపోతుంది. నీవు దిక్కులేని చావు చస్తావు!".

కృష్ణుడన్నాడు– "నీవు కొత్తగా శపించిందేమీ లేదు. అనవసరంగా నన్ను శపించి నీ పతివ్రతా శక్తి అంతా వృధా చేసుకున్నావు. అమ్మా! శాంతించు! యాదవులకు ఇప్పటికే ముని శాపం ఉన్నది. మా అవతార నిష్క్రమణకు అదే మంచి ముహూర్తం!"

36 ఏళ్లు గడిచాయి. యాదవులంతా సముద్ర తీరాన పండుగ చేసుకుంటూ విధి ప్రేరితులై ముసలం చేరిన తుంగ గడ్డితో కొట్టుకుని చచ్చారు. బలరాముడు యోగ సమాధిలో ఆదిశేషుడిలో కలిసిపోయాడు. శ్రీకృష్ణుడు ఒంటరిగా అడవికి వెళ్లి ఓ చెట్టుకింద ధ్యాననిమగ్నుడై ఉన్నాడు.

జర అనే వేటగాడికి చేప కడుపులో ఇనుప ములికి దొరికింది. దానిని తన బాణానికి అమర్చి వేటకు బయల్దేరినాడు. అతడు క్రితం జన్మలో వాలి. శ్రీరాముడితో చెట్టు చాటునుంచి బాణం వేయగా చంపబడినవాడు. ఈ జన్మలో బోయవాడైనాడు.

అతడికి దూరంగా ఏదో జింకలా కదులుతున్నట్లు కనిపించింది. చెట్టు చాటున దాక్కున్నాడు, ఆ జింకను భయపెట్ట కూడదని. గురిచూసి బాణం వేసాడు జింక చెవి వేపు. అటువేపు నుంచి భయంకరమైన ఆక్రందన వినవచ్చింది. పరుగు పరుగున వెళ్లి చూసాడు. నీలమేఘశ్యాముడు, అతడి ఎడమ పాదానికి గుచ్చుకున్న బాణం. విలవిలలాడిపోతున్నాడతడు.

"నన్ను క్షమించు దేవా!" అని వేడుకున్నాడు జర అనే ఆ వేటగాడు. బాణాన్ని లాగి రక్తాన్ని తుడిచాడు. శ్రీకృష్ణుడు నవ్వినాడు. ఆ నవ్వులో త్రేతాయుగపు వాలి వధ దృశ్యరూపంగా కానవచ్చింది. "నీ తప్పేమీ లేదు! వెళ్లిపో" అన్నాడు అతడిని ఊరడించి. "పూర్వజన్మ కర్మఫలం, ముసలపు ములికి, మునిశాపం, గాంధారి కోపం అన్నీ నీ బాణంగా నన్ను తాకినాయి" అని అతడిని పంపివేసి తనువు చాలించాడు జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణ పరమాత్మ.

## కురుక్షేత్ర యుద్ధంలో చనిపోయిందెంతమంది?

స్త్రీపర్వము ద్వితీయాశ్వాసంలో– ధృతరాష్ట్రుడడిగినాడు ధర్మరాజును. ధర్మరాజన్నాడు– "76 కోట్ల 20 వేలమంది వీరులు, ఉన్నత వంశస్థులు; 24320 మంది ఇతరులు. మరో లెక్క– 166,00,20,000. వీరుగాక 24,165 మంది జాడ తెలియలేదు (సంస్కృత భారతము).

## దుర్యోధన - కర్ణుల స్నేహం

రారాజు కావాల్సిన సూర్యపుత్రుడు రారాజుకు స్నేహితుడైనాడు. దుర్యోధనుడు ఏనాడూ అతడిని సూతపుత్రుడిగా పిలువలేదు. అంగరాజును చేసి గౌరవించాడు, ఆప్తమిత్రుడిగా మెలిగాడు. అంతఃపురంలోకి కూడా ప్రవేశముండినది నిరభ్యంతరంగా.

ఒకరోజున కర్ణుడు పాచికలాట ఆడుతున్నాడు దుర్యోధనుడి సతీమణి భానుమతితో. ఆట చాలా ఉత్కంఠతతో సాగుతున్నది. కర్ణుడు గెలుస్తున్నాడు. భానుమతి ఓడిపోయేట్లున్నది. ఈలోగా దుర్యోధనుడు గదిలోకి రావడం చూసి ఆమె నిలబడింది. అనాలోచితంగా, అసంకల్పితంగా, ఆమె చెయ్యి పట్టుకుని ఆపబోయినాడు కర్ణుడు. చేయి తగిలి భానుమతి నడుముకున్న ముత్యాలహారం తెగి ముత్యాలు జలజలా రాలిపడినాయి. అప్పుడు చూసాడు కర్ణుడు తన వెనక నిలబడి నవ్వుతూ, "మిత్రమా! ముత్యాలు ఏరి హారంగా గుచ్చమంటావా!" అన్నాడు నిష్కల్మష హృదయంతో. కర్ణుడు నవ్వినాడు సూర్యకాంతులతో, భానుమతి నవ్వింది, భాను ప్రకాశంతో.

ఆఖరిక్షణం వరకు కర్ణుడి మీదనే ఆశ పెట్టుకున్నాడు దుర్యోధనుడు. అత్యద్భుతంగా యుద్ధం చేసి కర్ణుడస్తమించాక నిర్లిప్తుడై తనను తాను సంబాళించుకున్నాడు రారాజు. తరువాత తెలిసింది రారాజుకు కర్ణుడు సూర్యపుత్రుడు, కుంతీ కుమారుడని. కర్ణుడు తన స్నేహితుడైనందుకు మరింత గర్వపడినాడు.

కర్ణుడు కూడా తాను సూతపుత్రుడు కాదు సూర్యపుత్రుడని తెలిసినా, కృష్ణుడు, తల్లి కుంతి చెప్పినా, పాండవుల పక్షాన చేరితే రాజయ్యే అవకాశం వచ్చినా రాధేయుడిగానే మిగిలాడు. దుర్యోధనుడి కోసమే పోరాడి దానవీరశూర కర్ణుడై మరణించాడు రాధేయుడు.

## కర్ణుడు - కృష్ణుడు

అర్జునుడి బాణాలతో గాయపడి అంతిమ క్షణాల్లో ఉన్నాడు కర్ణుడు. రాధేయుడిని నేలకూల్చానన్న సంతోషంతో అర్జునుడు కాస్త గర్వంగా భుజాలెగరేసాడు. కృష్ణుడది చూసి నవ్వుకున్నాడు. నరుడంతే! కష్టకాలంలో దీనంగా పడి ఏడుస్తాడు. గెలవంగానే తనను మించినవాడు లేడనుకుంటాడు.

నెమ్మదిగా కర్ణుడిని సమీపించాడు బ్రాహ్మణ వేషంలో– "అయ్యో! దానకర్ణ! నిన్ను కాస్త ధనం యాచించాలని వచ్చాను. నీవేమో ఇలా ఉన్నావు. నా ప్రారబ్ధమంతేనేమో వస్తాను" అన్నాడు వెళ్లిపోబోతూ.

కర్ణుడు వెంటనే పక్కనే పడి ఉన్న బాణంతో తన నోటిలోని బంగారు పన్ను పెకలించి, బాధతో "అమ్మా" అని కృష్ణుడికివ్వబోయాడు ఆ బంగరు దంతాన్ని. "వద్దు, రక్తంతో తడిచి ఉన్నదది. నాకు వద్దు" అన్నాడు కృష్ణుడు.

కర్ణుడు విల్లు బాణాలందుకుని మేఘం వేపు గురి పెట్టినాడు. వాన చినుకులు పడి బంగరు దంతం మేలిమి బంగారంలా తళతళలాడింది. కర్ణుడికి తన ఎదురుగా దివ్యమంగళ స్వరూపుడైన శ్రీకృష్ణుడు కానవచ్చాడు. దేవదేవుని చూసి ఆనందపరవశుడైనాడు కర్ణుడు. సూర్యతేజంతో ప్రకాశించాడు ఆఖరిసారిగా కర్ణుడు. అతడి దివ్యకాంతి వెళ్లి అస్తమిస్తున్న సూర్యునిలో లీనమయ్యింది.

అర్జునుడి కర్థమయ్యింది కర్ణుడి గొప్పతనం. కృష్ణుడి చేతిలోని బంగరు పన్ను మరింతగా మిలమిలా మెరిసింది.

## పద్ధెనిమిది అక్షౌహిణీల సేనకు అన్నం వండి పెట్టిందెవరు?

మహాభారత యుద్ధంలో ఏ పక్షానా పాల్గొనని వారు ఇద్దరు. 1) బలరాముడు, 2) రుక్మి (రుక్మిణి సోదరుడు). మూడవవాడు ఉడుపి మహరాజు. కృష్ణుడితో మాట్లాడి 18 రోజులు అందరికీ కావాల్సినంత ఆహారాన్ని అందించాడతడు తన బృందంతో. అప్పటి నుంచి ఉడుపి (ఉడిపి) ప్రాంతవాసులు ఆహారాన్ని అందించే భోజనశాలలు నిర్వహిస్తున్నారు దేశమంతటా.

"అందరికి సరిగా సరిపోయేట్లు మీరెలా వండగలుగుతారు?" అని అడిగితే ఉడిపి ప్రభువన్నాడు– "ప్రతిరాత్రి శ్రీకృష్ణుడికి ఉడకబెట్టిన వేరుశనగ గింజలు (పల్లీలు) వంద ఒక పళ్లెంలో పెట్టి ఇస్తాను. అతడు తిన్నాక మిగిలిన వాటిని మరల లెక్కబెడ్తాను. శ్రీకృష్ణుడు పది తింటే మరుసటి రోజు పదివేలమంది చనిపోతారన్నమాట. ఇరవై తింటే ఇరవై వేలమంది చనిపోతారు. అంతమందికి తగ్గించి వండిస్తాను" అన్నాడు ఉడిపి ప్రభువు.

## దుర్యోధనుడి మూడు ప్రశ్నలు - కృష్ణుడి జవాబులు

భీముడి గద దెబ్బకు తొడలు విరిగి నేలపై పడి ఉన్నాడు దుర్యోధనుడు. మగతగా కళ్లు మూసుకున్నాడు కాని అతడి కుడిచేయి రెండువేళ్లను మడిచి మధ్య మూడు వేళ్లను చూపిస్తూ ఏదో సంజ్ఞ చేస్తున్నట్లున్నది. ఎవరికీ అర్థం కాలేదు దాని అర్థం.

కృష్ణుడు వెళ్లి అన్నాడు– "నీవనుకుంటున్నావు హస్తినాపురం చుట్టూ కోట కట్టి ఉంటే సురక్షితంగా ఉండి ఉండేవాడినని కదూ!" అవునన్నట్లుగా దుర్యోధనుడు చూపుడు వేలు మడిచాడు.

నీవు కోట కట్టిఉంటే నేను నకులుడిని రథంపై పంపేవాడిని నీ కోట ధ్వంసం చేయడానికి. అతడు వర్షం చినుకుకు చినుకుకు మధ్య రథం నడుపగలడు తెలుసు కదా!" దుర్యోధనుడు అవునని తలాడించాడు.

"నీ రెండవ ప్రశ్న– విదురుడు యుద్ధానికి కౌరవ పక్షాన దిగితే నేనేం చేస్తానని కదా? అప్పుడు నేనే యుద్ధం చేసేవాడిని" అన్నాడు కృష్ణుడు. దుర్యోధనుడు మధ్యవేలు మడిచాడు. ఇంక మిగిలింది అనామిక వేలు. కృష్ణుడన్నాడు– "నీ మూడవ ప్రశ్న– "అశ్వత్థామను సర్వసైన్యాధిపతిగా చేస్తే ఏం చేస్తావని కదా? ధర్మజుడికి కోపం తెప్పించి– అలుగుటయే ఎరుంగని అజాతశత్రువే అలిగిననాడు– యావత్ కౌరవలోకాన్ని భస్మం చేసి ఉండేవాడిని. అయినా ఈ రాత్రి నీ నిర్ణయం అదేలే!" అన్నాడు కృష్ణుడు.

శ్రీకృష్ణుడు అన్నట్లుగానే ఆ రాత్రి దుర్యోధనుడు అశ్వత్థామను అయిదవ కౌరవ సైన్యాధిపతిగా నియమించాడు. అశ్వత్థామ అర్ధరాత్రి, కృపాచార్యుడు కృతవర్మలతో కలిసి వెళ్లి పాండవ శిబిరంపై దాడిచేసి తన తండ్రి ద్రోణుడి తల నరికిన ధృష్టద్యుమ్నుడిని గొంతు నొక్కి, అల్లెత్రాడు బిగించి ఘోరంగా చంపాడు. మిగతా పాంచాల వీరులను, శిఖండిని, ఉపపాండవులను చంపి సురక్షితంగా తిరిగి వచ్చి దుర్యోధనుడికా శుభవార్త చెప్పాడు.

దుర్యోధనుడన్నాడు– "భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు చెయ్యని పనిని నీవు చేసావు. నేను క్రోధం తగ్గగా, మనశ్శాంతితో కన్ను మూస్తున్నాను" అని ప్రాణాలు వదిలాడు. దుఃఖభారంతో అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మలు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

## దుర్యోధనుడు దానం చేసిన అయిదు బంగరు బాణాలు

భీష్ముడితో అన్నాడు దుర్యోధనుడు– "పరశురాముడినే ఓడించిన వాడివని నమ్మి సర్వసైన్యాధిపతిగా చేస్తే తొమ్మిది రోజులు గడిచాయి పాండవులలో ఏ ఒక్కరూ పట్టుబడలేదు, చావలేదు. నీ స్థానంలో కర్ణుడున్నా బాగుండేది!" అన్నాడు నిష్ఠూరంగా.

భీష్ముడికి ఆవేశం వచ్చింది– "ఇవిగో అయిదు బంగరు బాణాలు– అయిదుగురు పాండవులను రేపు ఉదయం వీటితో చంపుతాను" అన్నాడు.

"రేపు ఉదయమే, పితామహా! వీటిని తమకిచ్చి కర్తవ్యం గుర్తుచేస్తాను. లేకుంటే ఆ కృష్ణుడు ఈ బాణాలను నీ దగ్గర్నుంచి తీసుకుపోతాడు" అని అయిదు బాణాలను తీసుకువెళ్లాడు తన శిబిరంలోకి దుర్యోధనుడు. కాస్త స్థిమితంగా కూర్చున్నాడో లేదో దుర్యోధనుడి దగ్గరకు వచ్చాడు అర్జునుడు– "దుర్యోధనా! నీవు నాకు ఓ వరం ఇచ్చావు ఆనాడు గంధర్వుల నుంచి నిన్ను కాపాడినపుడు. గుర్తుందా?" అన్నాడు అర్జునుడు. "నీవే నిజమైన క్షత్రియుడవైతే నేను వరమడుగుతాను దానమివ్వు!". దుర్యోధనుడు అవాక్కైనాడు. తేరుకుని అడిగాడు "ఏం కావాలి నీకు? కృష్ణుడు పంపినాడా?" అవునన్నాడు అర్జునుడు. "నీకిప్పుడు భీష్ముడిచ్చిన అయిదు బంగరు బాణాలివ్వు"మన్నాడు అర్జునుడు. క్షత్రియుడు ఆడిన మాట తప్పడు కనుక అయిదు బంగరు బాణాలను అర్జునుడికిచ్చాడు దుర్యోధనుడు. మరుసటి రోజు యుద్ధంలో శిఖండిని ముందు పెట్టుకుని అర్జునుడు ఒక బంగరు బాణంతో భీష్ముడి వింటి నారిని తెంపి, శిఖండి బాణాలు వేస్తున్నట్లుగా, భీష్ముడిని గాయపరచి నేలకూల్చినాడు. భీష్ముడు అడగగా తలదిండుగా మూడు బంగరు బాణాలను నేలలోకి దింపాడు. ఆఖరి బంగరు బాణంతో పాతాళగంగను పైకి తెచ్చి భీష్ముడి దాహాన్ని తీర్చినాడు. పాండవులను చంపడానికి భీష్ముడు తెచ్చిన బంగరు బాణాలు చివరకు భీష్ముడికే ఉపయోగపడినాయి. అదీ శ్రీకృష్ణుడి చాకచక్యం.

## సహదేవుడి కాలజ్ఞానం

పాండురాజు ముని శాపభయాన్ని ఓ క్షణం పక్కనపెట్టి కామాతురతతో మాద్రిని సంభోగించి మరణశయ్యపై ఉన్నాడు. పుత్రులను పిలిచి అన్నాడు– "నేను చనిపోతున్నాను. చితిపై దహనమైనపుడు కపాలమోక్షం జరిగి నా మెదడు కొన్ని ముక్కలై బయటపడుతుంది. తలా ఒక ముక్క తినండి. నా జ్ఞానం, తెలివి, చాకచక్యం మీకందుతుంది" అని పలికి చనిపోయాడు. దహన క్రియల సమయంలో మాద్రి సహగమనం చేసింది. కాసేపటికి పాండురాజు కపాలం పగిలి మెదడు ముక్కలు బయటపడినాయి. ధర్మజ, భీమార్జునులు వాటిని స్పృశించలేదు.వాళ్లతో పాటు నకులుడూ వెళ్లిపోయాడు. సహదేవుడు తనవేపు పడిన ముక్కను కొరికాడు. దానితో అతడికి భూత భవిష్యత్ వర్తమాన జ్ఞానం కలిగింది.

స్వతహాగా మితభాషి అయిన సహదేవుడు ఎవరైనా అడిగితేనే భవిష్యత్తు రహస్యాలు చెప్పేవాడు. శకుని సలహాతో దుర్యోధనుడు సంప్రదించాడు సహదేవుడిని యుద్ధ ముహూర్తం కోసం. కృష్ణుడప్పటికే అమావాస్య దినాన్ని మంచిరోజుగా నిర్ణయించాడు. అదే విషయాన్ని దుర్యోధనుడికి చెప్పాడు సహదేవుడు.

మహాప్రస్థానం ప్రారంభమయ్యింది. ద్రౌపది అందరికన్నా ముందు నేలకూలింది. ఆ తరువాత సహదేవుడు నేలపై పడినాడు. ధర్మరాజన్నాడు– "ఇతడు తనకంటే ప్రాజ్ఞుడు లేడని తలుస్తాడు హృదయంలో"

## ద్రౌపదికి ఎవరంటే ఇష్టం?

ద్రౌపది అగ్నిసంభూత. స్వేచ్ఛాజీవితం కోరుకున్న స్త్రీ. అయోనిజ. మహాబలవంతురాలు. అత్యంత సౌందర్యవతి. ఆమెను చూసిన ప్రతి ఒక్క వీరుడూ సమ్మోహితులైనారు. ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, దుర్యోధనుడు, సైంధవుడు, కీచకుడు, కర్ణుడితో సహా–

పాండవులు వనవాసం చేస్తున్న కాలమది. వాళ్లు అడవిలో తిరుగుతూ ఉంటే అక్కడో దివ్య జంబూవృక్షం కానవచ్చింది. దానికి ఒకే ఒక జాంబూఫలమున్నది. ఆ పండు తినాలనే కోరికతో ద్రౌపది కోసింది ఆ ఫలాన్ని. వెంటనే ఆకాశవాణి పలికింది చెట్టు పలికినట్లు- "ఓ యువతీ! ఇది మహిమాన్వితమైన జాంబూవృక్షం. పన్నెండేళ్లకోసారి కాయ కాస్తుంది. పన్నెండేళ్లపాటు చెట్టుకు వేలాడి ఉంటుంది. పన్నెండేళ్ల నుంచి తపస్సు చేస్తున్న ఆ మహాఋషి అడుగో, అతడు తపస్సు నుంచి లేచి ఆ ఫలాన్ని తింటాడు. నీ స్పర్శతో ఆ ఫలాన్ని అపవిత్రం చేసావు. నీవలన అతడు ఆకలితో చనిపోతాడు. ఆ పాపం నీకంటుతుంది".

ద్రౌపది తన భర్తలను పిలిచి ఆ పండు మరల చెట్టుకు అతుక్కునేట్లు చేయమన్నది. వాళ్లు ప్రయత్నించి విఫలులైనారు.

ఆకాశవాణి అన్నది- "నీ పతివ్రతా శక్తితో దానిని చెట్టుకంటేట్లు చేయగలవు!"

ద్రౌపది అన్నది- "ఈ పంచపాండవులలో ఏడాది కొకరు నా భర్త నేను అతడికి ఆ ఏడాది విధేయురాలినే!"

ఆకాశవాణి అన్నది- "నీవు నిజం చెప్పి ఉంటే ఈ ఫలం దానంతటకదే చెట్టుకు అతుక్కునేది! సత్యం వచించు ద్రౌపదీ!"

ద్రౌపది అన్నది- "కృష్ణుడంటే ఇష్టం నాకు. అయితే అన్నగా!"

ఆకాశవాణి అన్నది- "నీవింకెవరినో ప్రేమిస్తున్నావు, ఎవరతడు?"

ద్రౌపది అన్నది చివరకు- "కర్ణుడు. అతడే నా భర్త అయ్యుంటే నాకు నిండుసభలో అవమానం అయ్యేది కాదు. ఈ వనవాస కష్టాలుండేవి కావు".

మరుక్షణం ఆ జాంబూఫలం వెళ్లి చెట్టుకతుక్కున్నది. పాండవులు తలదించుకున్నారు. అందుకే వాళ్లకు కర్ణుడంటే అంత కోపం. అతడి చావుకు ఎదురుచూసాడు ధర్మరాజు, అతడిని చంపినాడు అర్జునుడు.

(మహారాష్ట్రలో జానపదులు విశ్వసించే నాటక కథ ఇది. జంబు ఆఖ్యానంగా ప్రసిద్ధికెక్కింది. భిల్లుల మహాభారతంలో ద్రౌపది దేవతగా కీర్తించబడింది. తమిళ మహాభారతంలో ఆమె వీరపాంచాలి. ఆమె భూదేవి. ప్రతియుగంలో విష్ణువుకు ఆమెకు ఉన్న బంధుత్వం మారుతుంది. ఒకయుగంలో ఆమె రేణుక. విష్ణువు పరశురాముడు (కొడుకు), ఇంకో యుగంలో ఆమె సీత; విష్ణువు శ్రీరామచంద్రుడు (భర్త). మరో యుగంలో ఆమె ద్రౌపది (కృష్ణ), విష్ణువు కృష్ణుడు (సోదరుడు).

పాండవులు పంచ ఇంద్రులుగా ఉన్నపుడు ఆమె శచీదేవి. తనను తాను రక్షించుకోగలిగిన శక్తి ఉన్న ద్రౌపదిని బలాత్కారం చేయబోయిన జయద్రథుడు (సైంధవుడు) ఆమె నెట్టగా నేలమీద పడినాడు; దుశ్శాసనుడు ఆమె వస్త్రాన్ని గుంజలేక గుడ్లు తేలవేసి కూలినాడు. కీచకుడూ కింద పడినాడు. అన్న కృష్ణుడు చెల్లెలు కృష్ణకిచ్చిన మనోధైర్యమో, మహిమ అని పేర్కొన్నా అవి ఆ శక్తి స్వరూపిణి స్వంతబలమే అన్నది అర్థమవుతుంది.

పన్నెండేళ్ల వనవాస ఫలమే జాంబూఫలమా! ఆ మునీశ్వరుడు కృష్ణుడా? కావచ్చు, కాకపోవచ్చు - పాండవుల కర్థమయ్యింది తమ బలహీనత. అందుకే శ్రీకృష్ణుడు రాయబార సమయాన ఆఖరి అస్త్రం ప్రయోగించాడు- "కర్ణా! నీవు సూర్యపుత్రుడివి. పాండవులు నీ సోదరులు. వారి పక్షాన చేరి రాజువై సర్వసుఖములు బడయవచ్చును. పాంచాలి కూడా నీకు భార్య అవుతుంది"

కర్ణుడు లొంగలేదు. అందుకే- "కర్ణుడు లేని భారతం లేదు" అని పెద్దలంటారు. "కర్ణుడి తల భారతం".

ఈ భారతం నలుగురు కృష్ణుల కథ.

ఒక కృష్ణుడు నారాయణుడు. ఒక కృష్ణుడు నరుడు. నారాయణుడు చెప్పగా నరుడు చేసాడు. ఒక కృష్ణ కథ నడిపించింది. ఆ కథను అత్యద్భుతంగా గ్రంథస్థం చేసినవాడు కృష్ణద్వైపాయన వ్యాసుడు.

## ఎవరి వలన ఈ భారతయుద్ధం జరిగింది?

కౌరవ పాండవ కలహం మహాభారత యుద్ధంగా పరిణమించి క్షత్రియ నాశనం సంభవించింది. మరి ఈ యుద్ధానికి కారణమేమిటి?

1) భీష్మ ప్రతిజ్ఞ- "వివాహం చేసుకోను, రాజుగా సత్యవతి వంశమే ఉంటుంది".

2) ధృతరాష్ట్రుడి ఉపేక్ష, పుత్ర ప్రేమ - దుర్యోధనుడి మాటను కాదనలేని బలహీనత.

3) గాంధారి అలక- కళ్లకు గంతలు కట్టుకుని వాస్తవాన్ని కావాలని చూడకపోవడం.

4) భీష్ముడిపై అంబకున్న పగ. (శిఖండి/శిఖండిని జన్మ)

5) ద్రుపద–ద్రోణుల వైరం (ధృష్టద్యుమ్న, ద్రౌపది, శిఖండిల పుట్టుక)

6) దుర్యోధనుడి మాత్సర్యం (పాండవులపై) (మయసభలో అవమానం).

7) శకుని ప్రతీకారం (కౌరవులపై) – గాంధారుల అసలు కోపం కౌరవులపైననే.

8) ధర్మజుని ద్యూతాభిలాష (జూదంపై మక్కువ).

9) ద్రౌపది సౌందర్యం (ద్రౌపది వస్త్రాపహరణ అవమాన భారం)

10) భీముడి ప్రతిజ్ఞ, ద్రౌపది ఆగ్రహం

11) కర్ణుని అసూయ (అర్జునుడి విలువిద్యపై)

12) సాత్యకి–సోమదత్తుల పూర్వీకుల వైరం (దేవకి స్వయంవరం నాటిది)

13) వ్యాసుడి మౌనం– కర్ణుడి పుట్టుక గురించి.

14) అశ్వత్థామ క్షాత్ర ధర్మానుచరణం – ఆగ్రహం.

15) కుంతీదేవి మౌనం (కర్ణుడి జననం గురించి)

16) భూభారం తగ్గించడానికి శ్రీకృష్ణుని కార్యాచరణం.

## 39. స్త్రీల స్వేచ్ఛపై పరిమితులు

**మనుస్మృతి–** స్త్రీల రక్షణ ముఖ్య ఉద్దేశంగా మనువు వారిని పురుషులపై ఆధారపడేవారిగా నిర్ణయించాడు. వేదకాలంలో స్త్రీలు పురుషులతో సమానంగా విద్యల నభ్యసించేవారు. యజ్ఞాలలో ముఖ్యపాత్ర వహించేవారు. గార్గి లాంటివారు శాస్త్ర చర్చలలో పాల్గొనేవారు. తమకు నచ్చిన పురుషుడితో కలిసి తిరిగేవారు. నిర్బంధాన్ని అంగీకరించేవారు కారు.

ఆశ్రమ ధర్మాలేర్పడినాక గృహస్థుడు తన ఇంటికి వచ్చిన అతిథికి భార్యను సమర్పించడమనే ఆచారముండేది. (ఉతథ్యుడు–మమత–బృహస్పతి–దీర్ఘతముడి కథ). శ్వేతకేతు ఆ ఆచారాన్ని మాన్పించాడు. (తన తల్లిని ఓ వృద్ధ బ్రాహ్మణుడు అతిథిగా వచ్చి కోరుకున్నాడని తెలిసి).

యయాతి కుమార్తె మాధవి ఏడాదికొక్కరి దగ్గర చొప్పున నలుగురికి భార్యగా ఉండి నలుగురికి కొడుకులను కన్నది.

అష్టవిధ వివాహాల పేరు చెప్పి ఏదో ఒక వివాహం పేర పురుషులు స్త్రీలను లొంగదీసుకుని తమ కోరిక తీర్చుకునేవారు. (శకుంతల–దుష్యంతుల కథ).

అప్సరసలు తమకు నచ్చినవారితో నయానా భయానో కలిసి పిల్లల్ని కని అనాథలుగా వదిలేసి వెళ్లిపోయేవారు. కన్యల పిల్లలు కానీనులయ్యారు. పన్నెండు రకాల సంతానాన్ని ఆమోదించాయి స్మృతులు. ఇంద్రుడు ఎవరి దగ్గరకు పంపిస్తే వారి దగ్గరకు వెళ్లాలి అప్సరసలు.

కృతయుగంలోని స్వేచ్ఛ, త్రేతాయుగం నాటి పతివ్రతాధర్మం, ద్వాపరయుగం నాటికి పురుషుని సంపదగా స్త్రీల పరిస్థితి దిగజారింది. "నేను స్త్రీనా, సంపదనా? ధర్మవిజితనా–అధర్మ విజితనా?" అని ద్రౌపది ప్రశ్నిస్తే జవాబు చెప్పాల్సిన నిండుసభ మౌనంగా ఉండిపోయింది. సతీ సహగమనాలకు ప్రాముఖ్యత ఉండింది.

స్త్రీల దేహ హక్కులపై అంక్షలు, పరిమితులు విధించిన స్మృతులకు తోడైంది ధర్మజుడి శాపం– "అంగనా జనముకు రహస్యమును దాచేశక్తి పోవునుగాక!" ఆ విధంగా దేహపు హక్కులతో పాటు వాక్కుకు కూడ అంక్షలేర్పడినాయి.

## 40. ప్రతిజ్ఞలు, వరాలు, శాపాలూ...

**ప్రతిజ్ఞలు :–**

**1) భీష్మ ప్రతిజ్ఞ–** ఆజన్మ బ్రహ్మచారిగా ఉండడం, రాజ్యమాశించకపోవడం.

**2) భీముడి ప్రతిజ్ఞలు–** దుశ్శాసనుడి రొమ్ము చీల్చి రక్తం తాగడం, దుర్యోధనుడి తొడలు విరగగొట్టడం (ప్రతిజ్ఞ చేసి ఉంటే ఆ సత్యవాక్య పాలనకోసం అధర్మాన్ని చేయవచ్చు తన ధర్మంగా).

**3) ద్రౌపది ప్రతిజ్ఞ–** దుశ్శాసనుడంటిన కొప్పును ముడివేసుకోనని.

**4) అర్జునుడి ప్రతిజ్ఞ–** సైంధవ వధ,

**5) కర్ణుని ప్రతిజ్ఞ–** పాండవులను చంపినాకే కాళ్లగోళ్లు కత్తిరించుకుంటా.

**వరాలు :** అందరికీ వరాలిచ్చే సామర్థ్యముంది. భీష్మడికి అతడి తండ్రి శంతనుడు ఇచ్ఛామృత్యువు వరమిచ్చాడు. భక్తితో ప్రార్థిస్తే దేవతలు, మునులు భారతంలో ఇచ్చిన వరాలసంఖ్యాకం. దివ్యాస్త్రాలు, అక్షయపాత్ర, ధనుస్సులు, శంఖాలు, అన్నీ వరప్రసాదాలే. పుత్రుల జననాలు, దీర్ఘాయుస్సు, మరణం లేకుండా పొందే వరాలు, వాళ్లను చంపడానికి దేవుడెత్తే అవతారాలు అనేకం, అద్భుతం, అమోఘం.

**శాపాలు :** దుర్వాసుడు వరాలిచ్చాడు, శాపాలు ఇచ్చాడు. కన్య కుంతికి ఇచ్చిన వరం సూర్యపుత్రుడు కర్ణునికి శాపమైంది. ధర్మజ, భీమ, అర్జున, నకుల సహదేవుల జననానికి కారణమైంది. దుర్వాసుడి శాపం వలన ఇంద్రుడికి పదవీ భ్రష్టత్వం సంభవించింది, సరస్వతి భూలోకంలో నదిగా పుట్టింది, రుక్మిణికి శ్రీకృష్ణునితో ఎడబాటు కలిగింది, శకుంతలను దుష్యంతుడు మరిచిపోయాడు, భానుమతిని నికుంభుడు ఎత్తుకుపోయాడు, స్వంత భార్య కుండలిని ధూళిగా మారింది.

దుర్వాసుడిచ్చిన మరో వరం వలన శ్రీకృష్ణుడి దేహం వజ్రసన్నిభమై, అర్జునుని రథసారథిగా ఉన్నా ఏ బాణపు దెబ్బ బాధించలేదు. అయితే ఎడమపాదం బలహీనంగా ఉండింది. దుర్వాసుడు, మునులు ఇచ్చిన శాపంతో యాదవ వంశ వినాశనమైంది. ఆ శాపానికి తోడు గాంధారి శాపం శ్రీకృష్ణుని దిక్కులేని చావు చచ్చేట్లు చేసింది.

మాండవ్యుడి శాపంతో దుర్యోధనుడి తొడలు విరిగే పరిస్థితి ఏర్పడి దానికి భీముడి ప్రతిజ్ఞ, శ్రీకృష్ణుడి చతురత తోడయ్యాయి. అష్ట వసువులు వశిష్ఠుడి శాపంతో భూమిపై జన్మించారు. వారలో ప్రభాసుడు భీష్ముడైనాడు.

ధర్మరాజు స్త్రీలకు ఇచ్చిన శాపం ప్రత్యేకమైనది. మామూలుగా శాపాలు ఒక వ్యక్తినుద్దేశించి ఇవ్వబడతాయి. కుంతీదేవి కర్ణుని జన్మరహస్యం దాచిందని భావించి ధర్మరాజు స్త్రీలకు రహస్యాన్ని దాచే శక్తి లేకుండా పోవును గాక! అని యావత్ స్త్రీజాతిని శపించాడు.

అష్టావక్రుడికి తండ్రి ఇచ్చిన శాపం, కర్ణుడికి పరశురాముడు, భూదేవి, బ్రాహ్మణుడు ఇచ్చిన శాపాలు, రావణుడికి– నలకూబర, నంది, అనార్ణయుడు, కైకేయి, వేదవతి, మాయ, శూర్పణఖల శాపాలు తగిలాయి. సాంబుడిని శపించింది విశ్వామిత్రుడనేది ఒక ఐతిహ్యం (ముసలం).

ద్రౌపది తనకు హస్తినాపురంలో జరిగిన అవమానానికి ప్రతీకారంగా– హస్తినలో ఏ స్త్రీ ఉన్నతస్థితిని పొందకుండును గాక అని శపించింది. (నేను ఆ ప్రతిజ్ఞను భంగం చేస్తానన్నది సినీనటి హేమమాలిని).

గాంధారి శపించింది– గాంధార రాజ్యంలో ఏనాడూ శాంతి ఉండదు. అరాజకమే రాజ్యమేలుతుందని.

అలాగే భృగుమహర్షి విష్ణుమూర్తికిచ్చిన శాపం, సనక సనందాదులు విష్ణుమూర్తి ద్వారపాలకులైన జయవిజయుల కిచ్చిన శాపం, గౌతముడు ఇంద్రుడికిచ్చిన శాపం (సహస్ర యోని, సహస్రాక్షుడు – వళ్లంతా కళ్లు కలవాడిగా); కచ దేవయానుల పరస్పర శాపాలు; కిందముడనే ముని పాండురాజుకిచ్చిన శాపం; వృద్ధక్షత్రుడి శాపం; రాముడికి వాలి భార్య తార ఇచ్చిన శాపం; కృష్ణుడు అశ్వత్థామకిచ్చిన శాపం ప్రసిద్ధమైనవి–

"అపాండవమని పాండవ స్త్రీలకు శాశ్వత వంధ్యాత్వాన్నిచ్చావు అశ్వత్థామా! నేను బ్రతిమలాడినా అహంకారంతో కనీసం ఒక్కరిని కూడా వదల్లేదు. నేను బ్రతికిస్తాను ఉత్తర గర్భంలోని శిశువును. మృతుడైన వాడిని కూడా పరీక్షించి ఊపిరి పోస్తాను. అతడు పరీక్షిత్తుగా నీ కనులముందరే పెరిగి మహరాజుగా ఖ్యాతినొందుతాడు.

నీవు చేసిన దుష్కారాలకు అర్ధరాత్రి చేసిన మారణహోమానికి నిన్ను శపిస్తున్నాను. నీవు చిరంజీవివి కదా, కాని ప్రతిక్షణం నీ శరీరంపై గాయాలు సలుపుతుండగా, రక్తం, చీము కారుతూ, ఈగలు, పురుగులు మూగుతుండగా అందరితో అసహ్యించుకోబడి, దారుణమైన బాధపడుతూ ఎప్పుడు చావు వస్తుందా అని ఎదురుచూస్తూ చివరకు నేను కల్కినై అవతారమెత్తి వచ్చేంత వరకు నాకోసం ఎదురుచూస్తూంటావు. పో సూర్యకాంతుడివై బ్రదుకు!"

# 41. కుండక - గోలకులు

కౌరవులు, పాండవులు ఎంచక్కా కలిసిమెలిసి ఆడుకుంటున్నారు. భీముడు పదిమంది కౌరవ సోదరులను ఒక్క తోపుతో పడవేస్తున్నాడు. దుర్యోధన దుశ్శాసనాదులు గుంపులుగా పోయి అతడి కాళ్లకు తాళ్లు కట్టి నీళ్లలో పడవేస్తే క్షణాల్లో తాళ్లు తెంపుకువచ్చి పకపకా నవ్వుతుంటే ఉక్రోషం వచ్చి దుశ్శాసనుడన్నాడు– “నీ బలం నీది కాదురా కుండకా!” అన్నాడు. మిగతా కౌరవులు కుండకా, కుండకా అని పాండవులను హేళన చేసారు అందరూ ఒక్కుమ్మడిగా...

పాండవులకు కళ్లనీళ్లు తిరిగాయి– సహదేవుడు తెలివిగలవాడు– అన్నాడు– “అన్నలారా, మనం కుండకులమైతే వాళ్లు గోలకులు” అన్నాడు. వెంటనే భీముడు దుర్యోధనాదుల్ని “గోలకా, గోలకా ఆపండిరా మీ కేక!” అనేసరికి అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు.

“కుండక” అంటే భర్త ఉండగానే వేరే పురుషుడి వలన పుట్టినవాళ్లు. “గోలక” అంటే మొదటి భర్త చనిపోయాక రెండో భర్త వలన పుట్టినవాళ్లు.

కౌరవులు వెంటనే ఇంటికి పోయారు. దుర్యోధనుడడిగాడు విదురుని– “మా అమ్మకు మా తండ్రి ధృతరాష్ట్రుడితో రెండో వివాహమా? నిజం చెప్పండి”

విదురుడన్నాడు– “మీ తల్లి గాంధారికి కుజదోషం (మాంగ్లిక దోషము) ఉన్నది. ఆమెను వివాహం చేసుకున్న వారికి ప్రాణగండం ఉంది. దానిని తప్పించడానికి ముందు ఓ మేకపోతుతో వివాహం చేసి దానిని చంపివేసారు. తరువాత ధృతరాష్ట్రుడికిచ్చి పెండ్లి చేసారు. అంతేకాక అందాల కన్య అయిన గాంధారికి గుడ్డివాడైన ధృతరాష్ట్రుడితో వివాహం మొదట్లో ఇష్టం లేదు. అయితే భీష్ముడి బలంతో, కౌరవ సామ్రాజ్యంతో పోల్చుకుంటే గాంధార రాజ్యం చాలా బలహీనమైనది. సామంతరాజైన సుబలుడు భయపడి ఆ వివాహానికి ఒప్పుకున్నాడు. కొందరంటారు గాంధారికి ఈ వివాహం ఇష్టంలేకనే కళ్లకు గంతలు కట్టుకున్నదని”.

దుర్యోధనుడికి కోపం వచ్చింది. తాము పాండవులతో మాట పడడానికి కారణం గాంధార రాజు సుబలుడు తన కుమార్తె గాంధారికి మేకపోతునిచ్చి పెళ్లి చేయడం. వెంటనే కౌరవులు ససైన్యంగా వెళ్లి గాంధారరాజును అతడి పుత్రులు నూరుగురిని బంధించి తెచ్చి హస్తినాపుర కారాగారంలో పడవేసారు. తండ్రితో సహా మిగతా సోదరులందరూ మరణించగా ఆఖరివాడు, మేనమామ ‘శకుని’ మిగిలినాడు కొన ఊపిరితో. తండ్రి చేతి మణికట్టు ఎముకలను పాచికలుగా తాను కోరుకున్న సంఖ్య పడేట్లుగా అభిమంత్రించాడు. మాయలు మాయా మంత్రాంగాలలో నేర్పరి అయిన శకుని ఎదురు చూస్తున్నాడు సరైన అవకాశం కొరకు.

కౌరవులు మరచిపోయారు గాంధారరాజును, అతడి పుత్రుల్ని కారాగారంలో పడవేసిన సంగతిని భీముడిని తిట్టి తిట్లు తినేవరకూ. ఎంతైనా తల్లికి తోబుట్టువులని తాత అని, జాలి తలచి కారాగారం వెళ్లి చూసేసరికి కనిపించాడు కొన ఊపిరితో శకుని. అతడిని విడిపించి కాస్త దయతో ఆదరించారు. కౌరవులు అనుకున్నారు– వీడు ఒక్కడు మనల్ని ఏం చేయగలడులే అని. కాలం చెబుతుంది ‘శకుని’ ఏమి చేయగలడో!

కొద్దికాలంలోనే శకుని కౌరవులకు మేనమామగా, వారిలో ఒకడిగా కలిసిపోయాడు. దుష్టచతుష్టయంలో భాగమైనాడు. తన ప్రాణాలు పోయినా ఫరవాలేదు, గాంధారులు నూరుగురిని చంపిన కౌరవులు నూరుగురిని చంపడానికి తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నాడు శకుని.

కౌరవ పాండవుల మధ్య మండుతున్న వైరాగ్నిలో మరింత ద్వేషపు ఆజ్యాన్ని పోస్తూ వచ్చాడు. ఆ అగ్నిని ఆరిపోకుండా చూసి భారతయుద్ధంలో కౌరవులు పాండవుల చేతిలో ఓడిపోవడం ఖాయమైనాక సహదేవుడి ఖడ్గానికి బలియైనాడు శకుని.

# 42. రామరావణ యుద్ధం - కౌరవ పాండవ యుద్ధం

రాక్షసులేమీ అనాగరికులు కాదు. యక్ష రాక్షసులు ఒకప్పుడు జనధన రక్షకులు. యక్షులకు నాయకుడైన కుబేరుడు రాక్షసులైన రావణాదులకు సవతి సోదరుడు. క్రమేపీ దస్యులు, దానవులు, అసురులు, దైత్యులు అనే పదాలన్నీ రాక్షసులకు పర్యాయ పదాలైనాయి. సురలకు వ్యతిరేకులు అసురులు. ఆర్యులచే ఓడింపబడినవారు దస్యులు. దితి సంతానం దైత్యులు. ‘దన’ పుత్రులు దానవులు.

అందరూ కశ్యప ప్రజాపతి సంతానమే. అదితి పుత్రులు ఆదిత్యులు; ఇంద్రుడు. సవతి సోదరుల తగాదాలు, ఆస్థి, లోకాల పంపకాలు మహాయుద్ధాలైనాయి. ఇంద్రుడు, ఉపేంద్రుడు అదితి సంతానమే. ఇంద్రుడి భార్య శచీదేవి రాక్షసకన్య పౌలోమి, వారి కుమార్తె జయంతి రాక్షస గురువు శుక్రుడి భార్య. వీరి కుమార్తె దేవయాని.

రామ రావణ యుద్ధంలో వానర సైన్యం, ఋక్ష (ఎలుగుబంట్లు) సైన్యం పాల్గొన్నది. మానవులు రామలక్ష్మణులిద్దరే. కృతయుగ-త్రేతాయుగ సంధికాలంలో దేవదానవ యుద్ధం, త్రేతాయుగపు ఆఖరున త్రేతా ద్వాపర సంధికాలంలో జరిగింది రామ రావణ యుద్ధం. ద్వాపర-కలియుగ సంధికాలంలో మహాభారత యుద్ధం జరిగి అంతులేని ప్రాణనష్టంతో భూభారం తగ్గింది.

భారతయుద్ధంలో వానరులు, ఎలుగుబంట్లు పాల్గొనలేదు. నాగకులం నుంచి ఇరావంతుడు, నాగాస్త్రంగా అశ్వసేనుడు, నిషాదుల నుంచి ఏకలవ్యుని బంధువులు (కౌరవ పక్షాన), భీముడు వనవాసంలో చంపిన బక, జటాసుర, కిమ్మీరుల బంధుమిత్రులు, అలంబుసుడు కౌరవ పక్షాన, భీముడి పుత్రుడైన ఘటోత్కచుడి తరపు రాక్షసులు పాండవ పక్షాన యుద్ధంలో పాల్గొన్నారు. ఇంద్రుడి మిత్రుడైన తక్షకుడు తన వాళ్లతో ఖాండవవనంలో నివసించేవాడు. అగ్నికి అజీర్తి అనే నెపంతో ఖాండవ వనాన్ని దహించడానికి జరిగిన అనేక ప్రయత్నాలను ఇంద్రుడు మేఘాలను పంపి తిప్పికొట్టినాడు. చివరకు అగ్నిదేవుడు నరనారాయణ అంశలతో జన్మించిన పార్థుడు, కృష్ణుడు – వీరికి గొప్ప ఆయుధాలనిచ్చి, ఖాండవ వన దహనం పూర్తిగావించాడు. ఖాండవ వనం రక్షించడానికి తక్షకుడి కోసం సాక్షాత్తూ ఇంద్రుడే రంగంలోకి దిగినా ప్రయోజనం లేకపోయింది. తల్లిని రక్షించాలని తక్షకుడి పుత్రుడు అశ్వసేనుడు ప్రయత్నించినా అర్జునుడి బాణాలకు నేలకూలింది ఆమె. బతికి బయటపడిన అశ్వసేనుడు అర్జునుడిని చంపేందుకు నాగాస్త్రంలో భాగమై కర్ణుడి పంచన చేరినాడు. శ్రీకృష్ణుడి చాకచక్యంతో నాగాస్త్రం గురి తప్పింది. తన వెంటబడిన అశ్వసేనుడిని చంపినాడు అర్జునుడు. అర్జునుడి మనమడు పరీక్షిత్తును కాటువేసి చంపి పగ తీర్చుకున్నాడు తక్షకుడు. తక్షకుడిని చంపడానికి సర్పయాగం చేసినాడు జనమేజయుడు.

భారత యుద్ధం సమయానికి వానరులు, ఋక్షులు నశించిపోయినారు. రాక్షసుల సంఖ్య తగ్గింది. మానవులలో మొదటి క్షత్రియ సంహారం బ్రాహ్మణుడైన పరశురాముడు చేసినాడు. రెండవ క్షత్రియ సంహారం రెండు కుటుంబాల మధ్య దాయాది మాత్సర్యంతో మొదలై 18 అక్షౌహిణీల సైన్యం, 76 కోట్ల జననష్టంతో ముగుస్తున్నది (166 కోట్లు?).

## 43. భారత, భాగవతాలను ఎవరు వ్రాసారు? ఎవరు చెప్పారు?

వేదవ్యాసుడు చెప్పగా గణేశుడు వ్రాసినది 'జయం'. విన్నవారు జైమిని, వైశంపాయనుడు, శుకుడు, నారదుడు, దేవలుడు, సుమంతుడు. వివిధ లోకాలకు విస్తరింపజేసినవారు– నారదుడు దేవలోకానికి, పితృలోకానికి దేవలుడు, గరుడ గంధర్వ యక్ష రాక్షస లోకాలకు శుకుడు, సర్పలోకానికి సుమంతుడు; మానవ లోకానికి వైశంపాయనుడు. జైమిని తన శైలిలో జైమిని భారతం వ్రాసినాడు.

వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పింది భారతం. విన్నవారిలో వ్యాసుని శిష్యుడు రోమహర్షణుడు ఉన్నాడు. అతడి కుమారుడు ఉగ్రశ్రవస సూతుడు (సూతుడు– క్షత్రియ పురుషుడికి బ్రాహ్మణ కన్యకు పుట్టినవాడు. వీరు సాధారణంగా రథ సారథ్యం, పురాణ పఠనం చేస్తారు.)

రోమహర్షణుడు తన కుమారుడు ఉగ్రశ్రవసుడికి చెప్పిన భారత కథను నైమిశారణ్యంలో సత్రయాగ సమయాన శౌనకాది మునులకు వినిపించాడు ఉగ్రశ్రవసుడు. అది మహాభారతం.

పరీక్షిన్మహారాజు శృంగి శాపానికి గురై ఒంటిస్తంభపు మేడలో ఉన్నపుడు శుకమహర్షి ఏడురోజుల పాటు పరీక్షిత్తుకు చెప్పిన కథ వ్యాసుడు వ్రాసిన భాగవతం.

## 44. నదులు - మానవుల ప్రేమగాథలు

1) కోలాహల పర్వతం శుక్తిమతీ నదిల ప్రేమఫలం గిరిక. గిరిక–ఉపరిచర వసువులకు వివాహమైనాక, ఉపరిచర వసువు వీర్యంతో అద్రిక అనే అప్సరస గర్భవతియై ఆమె పొట్టలో పెరిగినవారు మత్స్యరాజు, మత్స్యగంధి.

2) గంగానది–శంతనుడు; అష్టవసువులు గంగానదికి వశిష్ఠుని శాపవశాన జన్మించారు. ఏడుగురిని నీళ్లలో పడవేసింది. ఎనిమిదో వసువైన ప్రభాసుడు గంగాపుత్రుడిగా జన్మించగా శంతనుడు అడ్డుకున్నాడు. ఆ పుత్రుడే గాంగేయుడు.

పరాశరుడనే ముని దయవలన వ్యాసుడికి జన్మనిచ్చి మత్స్యగంధి యోజనగంధియైన సత్యవతి అయ్యింది. శంతనుడు ఇష్టపడినాడు సత్యవతిని. తండ్రికోసం రాజ్యాన్ని త్యాగం చేసాడు, బ్రహ్మచారిగా బతుకుతానని భీష్మప్రతిజ్ఞ చేసినాడు గాంగేయుడు. (వశిష్ఠుడి కొడుకు శక్తి; శక్తి కొడుకు పరాశరుడు). వశిష్ఠుడి శాపం వల్లనే వసువులు గంగా గర్భాన పుట్టినారు.

సత్యవతికి పరాశరుడి వలన వ్యాసుడు, శంతనుడి వలన చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు పుట్టినారు. విచిత్రవీర్యుడి భార్యలు అంబిక అంబాలికలు. చిత్రాంగదుడు పెళ్లికాకుండానే చనిపోయాడు. విచిత్రవీర్యుడు పెళ్లి అయినాక చనిపోయాడు సంతానం లేకుండానే. కురువంశం ఆగిపోయే పరిస్థితిలో, భీష్ముడు ఒప్పుకోకపోవడంతో దేవర న్యాయంతో వ్యాసుడితో నియోగం చేయించింది అంబిక, అంబాలికలకు సత్యవతి. అంబికకు ధృతరాష్ట్రుడు, అంబాలికకు పాండురాజు, అంబిక దాసి పరిశ్రమకు విదురుడు పుట్టినారు వ్యాసుడి వలన.

సత్యవతి కథలాంటిదే కుంతి కథ. శూరసేనుడి కుమార్తె కుంతీభోజుడి దగ్గర పెరిగింది. దుర్వాసుడిచ్చిన మంత్ర ప్రభావంతో సూర్యుడినారాధించి కర్ణుడిని కన్నది కన్యగానే (సత్యవతి వ్యాసుడిని కన్నట్లు). ఆ తరువాత పాండురాజుతో సంతానం కలుగక భర్త నియోగంతోనే ధర్ముడి వలన ధర్మరాజును, వాయుదేవుడి వలన భీముడిని, ఇంద్రుడి వలన అర్జునుడికి జన్మనిచ్చింది. పాండురాజుకు వేట వ్యసనం, ధర్మరాజుకు ద్యూతవ్యసనం.

గాంధార రాజు సుబలుడికి నూరుగురు కొడుకులున్నట్లే అతడి కుమార్తె గాంధారికీ నూరుగురు పుత్రులు, ఒక కుమార్తె జన్మించారు. వీళ్లు వాళ్ల వంశ నాశనానికి, వాళ్లు వీళ్ల వంశ నాశనానికి కారకులైనారు మిత్రుత్వం, బంధుత్వం నటిస్తూనే.

3) సూర్యుని కూతురు తపతి. సంవరణుడిని వివాహం చేసుకోగా జన్మించినవాడు కురుడు. కౌరవ వంశమూలపురుషుడు.

4) మతినారుడు–సరస్వతీ నదిల పుత్రుడు త్రసుడు.

5) శ్రీకృష్ణుడు యమునా నదీరూపమైన 'కాళింది'ని వివాహం చేసుకున్నాడు.

## 45. అష్ట వసువులు - మిడియా పుత్రులు

గంగానది తన పిల్లలను తానే నదిలో పారవేసిన కథలాంటిది గ్రీకుల మెడియారాణి కథ. మంత్రగత్తె, హెకాటె పూజారిణి మెడియా. మెడియా అనే మాటకు అర్థం తంత్రనైపుణ్యం (Schemer). Colchis ప్రభువు Aeetes కుమార్తె. ఆర్గొనాట్ జేసన్ (Jason)కు సాయం చేస్తుంది– బంగరు ఉన్ని తేవడంలో (Golden Fleece). తన సోదరుడిని చంపి మరీ జేసన్ పారిపోవడానికి వీలు కల్పించి, అతడితో పాటు కోరింత్ (Corinth) వచ్చి జేసన్‌ను వివాహం చేసుకుంటుంది. జేసన్ కొరింథ్ యువరాణి క్రియూసాను వివాహమాడగానే అతడి వలన కలిగిన పిల్లలను చంపివేసి అక్కడ నుంచి పారిపోతుంది తన తాత Helios (సూర్యుడు) పంపిన స్వర్ణరథంలో. అక్కడ ఎగియస్‌ను వివాహమాడి మెడస్‌కు జన్మనిస్తుంది. ఈలోగా ఎగియస్ కుమారుడు థెస్యూస్ (Theseus) తండ్రిని వెదుక్కుంటూ వస్తాడు. అతడిని విషప్రయోగంతో చంపబోయి విఫలం చెంది స్వర్ణరథంలో తన పుత్రుడితో ఆసియా పారిపోయి మెడెస్ తెగకు కారణమైతుంది మెడియా.

మెడియా తన పుత్రులను తన భర్తపై కోపం వలన చంపుతుంది. గంగ తన పుత్రులకు విముక్తినిచ్చి వసువులుగా మారేందుకు నీటిలో పడవేస్తుంది.

## 46. కౌరవ - పాండవ - నాగ - రాక్షస - దేవ బాంధవ్యాలు

**1) నాగ వంశము–నాగుల రాజ్యం :** యమునానది చుట్టుపక్కల ప్రాంతాలన్ని ఒకప్పుడు నాగులతో నిండి ఉండేవి. దేవతలతో ఓడిపోయినవాళ్లు చనిపోగా, సఖ్యంగా ఉన్నవాళ్లు చావు తప్పించుకున్నారు. తల్లి కద్రువ శాపంతో తనయులు అనేకురు జనమేజయుని సర్పయాగంలో మృతి చెందారు. దానికి తోడు వినత కుమారుడి గరుడజాతి వీరిని ఏరి పారేసింది.

అనంతుడు, ఆదిశేషుడిగా విష్ణువుకు శయ్యగా మారినాడు. వేయి పడగలతో భూమిని మోస్తున్నాడు.

వాసుకి క్షీరసాగర మథనంలో తరిత్రాడై తరువాత పరమేశ్వరుని కంఠాభరణమైనాడు.

నాగుల తెగలలో తక్షక, కౌరవ్య, ధృతరాష్ట్ర, నాగ, ఉరగ, పన్నగ తెగలు ముఖ్యమైనవి. వీరిలో ప్రసిద్ధికెక్కిన నాగులు– 1) తక్షకుడు కద్రువ–కశ్యప సంతానం. ఎగిరే పాములుగా ప్రసిద్ధి. హిందూ బౌద్ధమతాలలో పేర్కొనబడినారు. ఎనిమిది డ్రాగన్ ప్రభువులలో చైనా, జపాన్ పురాణాలలో తక్షకుడి ప్రస్తావన ఉన్నది. నంద (రాజు), ఉపనంద, శకర, వాసుకి, బలవాన్, అనవతప, ఉత్పలులు తక్షక వంశ ముఖ్య నాగులు.

ఇంద్రుడికి మిత్రుడైన తక్షకుడు కురుక్షేత్ర–ఖాండవ వన (ఢిల్లీ) ప్రాంతంలో ఉండేవారు. ఇక్షుమతీ నది పక్కన వీరి నివాసం. తక్షకుడి కుమారుడు అశ్వసేనుడు; తక్షకుని సోదరుడు శ్రుతసేనుడు (కామ్యక వనానికి నాలుగవ రాజు).

ఖాండవ వన దహన సమయంలో తక్షకుడి భార్యను అర్జునుడు చంపినాడు. తక్షకుడా సమయంలో కురుక్షేత్రంలో ఉన్నాడు. తల్లిని తీసుకుని ఎగిరిపోతున్న అశ్వసేనుడిపై వదిలిన అర్జునుడి బాణాలు ఆమెకు తగిలి నేలకూలిందామె. అశ్వసేనుడు తప్పించుకుని కర్ణుని చెంత చేరి నాగాస్త్రమైనాడు. నాగాస్త్రం విఫలమై అశ్వసేనుడు మహాసర్పంగా అర్జునుడి వెంట పడినపుడు అర్జునుడు అశ్వసేనుడిని చంపినాడు.

ఇంద్రుడు ఖాండవ వనాన్ని కాపాడడానికి ప్రయత్నించినా అర్జునుడు, కృష్ణుడు అంగీకరించలేదు. తక్షకుడు తగు సమయానికై వేచి అర్జునుని మనమడు, అభిమన్యుని కుమారుడైన పరీక్షిత్తును కాటువేసి చంపి పగ తీర్చుకున్నాడు.

పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు సర్పయాగం చేసి నాగవంశ నిర్మూలనం చేసినా ఇంద్రుడి రక్షణలో ఉన్న తక్షకుడు ఆస్తీకముని (వాసుకి చెల్లెలు జరత్కారువు కుమారుడు) వలన బతికినాడు. సర్పయాగం అంతటితో ముగిసింది. (ఆస్తీకముని తల్లి జరత్కారువు, తండ్రి జరత్కారుడు. తల్లి మరో పేరు మానస. ఈమెను విషహారిణి దేవతగా, నాగదేవతగా బీహార్, బెంగాల్, జార్ఖండ్, అస్సాం, ఉత్తరాఖండ్ ప్రాంతాలలో పూజిస్తారు. ఈమె ఆదిశేషుడు, వాసుకి చెల్లెలు).

సుదాసుడి భార్య మదయంతి కుండలాలను గురుపత్ని అహల్యకు ఇవ్వడానికి తీసుకువెళ్తున్న ఉదంకుడి నుంచి అపహరించినాడు తక్షకుడు. అది మనసులో ఉంచుకుని సర్పయాగం చేయమని జనమేజయుని ప్రోత్సహించాడు ఉదంకుడు.

**2) నహుషుడు :** వృత్రాసురుని సంహరించి బ్రహ్మహత్యా పాతకానికి గురైనాడు ఇంద్రుడు. మునులు నహుషుని చేసారు ఇంద్రుడిగా, అనేక శక్తులనిచ్చి. అశ్వమేధ యాగం చేసి శాపవిముక్తుడైన ఇంద్రుడు మహా తేజస్సుతో వెలుగొందుతున్న నహుషుని చూసి వెళ్ళి మానస సరోవరంలోని తామరతూడులో దాక్కున్నాడు. నహుషుడు ఆజ్ఞాపించాడు శచీదేవిని తన వద్దకు రమ్మని. ఆమె ఇంద్రుడెక్కడున్నా కనుగొని అతడి సలహాతో నహుషుడిని తన వద్దకు సప్తర్షులు మోసే పల్లకిలో రమ్మని కోరింది. అతడు ఆ పల్లకిలో వస్తూ త్వరగా త్వరగా సర్ప–సర్ప అంటూ తన కాలితో అగస్త్యుడిని తన్నేసరికి నహుషుడి శక్తి, తేజస్సు నశించాయి. అగస్త్యుడి శాపంతో అతడు అజగరమై (సర్పం) భూమిమీద పడి, చానాళ్ళు బ్రతికి, భీముడిని పట్టుకున్నపుడు, ధర్మరాజుకు తన కథ చెప్పి శాపవిముక్తుడై మరల స్వర్గలోకానికి వెళ్ళి ఇంద్రుడి మిత్రుడైనాడు. భూలోకంలో ఉన్నపుడు నాగుల రాజుగా బ్రతికాడు. (హస్తినాపురానికి మరోపేరు నాగపురం. హస్తి–నాగ, ఏనుగు). నహుషుడి కుమారుడు యయాతి.

**3) ఆర్యకుడు:** కుంతి తండ్రి శూరసేనుడి తాత ఆర్యకుడు. బాలభీముడిని కౌరవులు విషం పెట్టి ప్రమాణకోటి అనే స్థలంలో గంగానదిలో పడవేసినపుడు అతడిని నాగులు 'వాసుకి' భవనానికి తీసుకురాగా, విషహరణం చేసి అతడిని ఆదరించి పంపినాడు. ఆర్యకుడి కుమారుడు చికురుడు. గరుత్మంతుడి చేతిలో మరణించాడు. చికురుని కొడుకు సుముఖుడు. ఇంద్రుని రథసారథి 'మాతలి' కుమార్తె గుణకేశినిచ్చి సుముఖునికి పెండ్లి చేసాడు నారదుడు మధ్యవర్తిగా.

**4) నాగకన్య ఉలూచి :** అర్జునుడి భార్య, ఇరావంతుని తల్లి.

**5) కర్కోటకుడు :** నలుని కాటువేసి వికార రూపం వచ్చేలా చేసినవాడు. సాయం చేసినవారికి కీడు చేసిన వారిని కర్కోటకుడు అంటారు. నిజానికి కర్కోటకుడు నలుడికి ఉపకారం చేసాడు.

**6) కాళీయుడు :** శ్రీకృష్ణుని బాల్యక్రీడలలో కాళీయమర్దనమొకటి. యమునా నది మడుగు ప్రాంతం నుంచి కాళియ నాగుల్ని వెళ్లగొట్టడం ఈ కథావృత్తాంతం.

**పిశాచులు :** ప్రేత మాంస భక్షకులుగా పేరుపడిన వారు పిశాచులు. వారి భాష పైశాచిక భాష. కశ్యప–క్రోధవసలు వీరి తల్లిదండ్రులు. భూత, బేతాళాలు ప్రేతవర్గములు. కామరూపులు. కాశ్మీర్‌లోని దర్దిక్ తెగవారు పిశాచులుగా, దర్దిక్ భాష పైశాచిగా గుర్తించబడింది. కశ్యప మీర్ (కశ్యప సరస్సు) కాశ్మీర్‌గా మారిందని ఒక కథనం.

**యక్షులు :** జల, వృక్ష, వన, ఎడారి, నిధుల దేవతలు, రక్షకులు. యక్షిణి స్త్రీల అందాలు హిందు, బౌద్ధ, జైన మతాలలో ప్రసిద్ధం. యక్షులను యుద్ధవీరులుగా, పొట్టివారు (dwarf)గా శిల్పాలలో చెక్కేవారు. కుబేరుడు వీరి రాజు ఇతడి వాహనం ముంగిస లేదా నరుడు. రావణుని సవతి సోదరుడు కుబేరుడు.

**రాక్షసులు :** భూమి మీద నివసిస్తారు కాని అతీంద్రియ శక్తులున్నవారు. వేదకర్మలను నిరసిస్తారు. నరమాంస భక్షకులు. కపాల పాత్రలతో మానవ రక్తం తాగుతారు. కామరూపులు, మాయలు నేర్చినవారు. గాలిలోకి ఎగిరి ఆకాశంలో మాయారూపులై ఉండగలరు. రాక్షసులలో రావణుడిలా క్రూరులు, విభీషణుడిలా మంచివారూ ఉన్నారు. రాక్షసులు, మానవుల మధ్య వివాహాది సంబంధాలుండేవి. (భీముడు హిడింబను పెండ్లాడగా ఘటోత్కచుడు జన్మించాడు). బకాసుర, కిర్మీర, జటాసురులు భీముడి చేతిలో మరణించారు. ఇద్దరు అలంబుసులు, అలాయుధుడు కౌరవుల తరఫున యుద్ధం చేసి ఘటోత్కచుడి చేతిలో కన్నుమూసినారు.

**దానవులు :** కశ్యప ప్రజాపతి దనువుల సంతానం. 'దన' దానము ఇవ్వడం. సత్యయుగంలో దేవతలు దానవులను స్వర్గం నుంచి తరిమివేసారు. వింధ్యారణ్య ప్రాంతాలలో అప్పటి నుంచి ఉంటున్నారు, అసురులలో వీరొక తెగ. దైత్యులు, దానవులు ఒకే రూపంలో ఉంటారు.

వృత్రుడు దానవుడై నీళ్లను తన అధీనంలో ఉంచుకుంటున్నాడని ఇంద్రుడు అతడిని చంపి ఆనకట్టలు ధ్వంసం చేసి జలాలకు విముక్తి కల్పించాడు. (సంచార జీవనులకు–స్థిర నివాసులకు మధ్య జరిగిన యుద్ధం. సత్తు–అసత్తు, క్రమపద్ధతి–గందరగోళానికి మధ్య జరిగిన యుద్ధంలో గందరగోళ సంచారులే గెలిచారు).

దేవతల శిల్పి విశ్వకర్మ, రాక్షసుల శిల్పి మయబ్రహ్మ. మయుడు మండోదరి తండ్రి, రావణుని మామగారు. ఖాండవ వన దహన సమయంలో అక్కడే ఉన్నాడు. అర్జునుడతడిని రక్షించాడు. దానికి కృతజ్ఞతగా మయసభను నిర్మించి ఇచ్చాడు మయుడు. దుర్వాసుడి వరం కుంతికి శాపమైనట్లు, కృతజ్ఞతతో మయుడు నిర్మించి ఇచ్చిన మయసభ దుర్యోధనుని మత్సరానికి కారణమయ్యింది. లంకను, త్రిపురాలను నిర్మించినవాడూ మయశిల్పి.

దైత్యులు : దితి కుమారులు దైత్యులు. కశ్యపుడు–దితి పుత్రులు హిరణ్యాక్ష, హిరణ్యకశిపు, మహాబలి, హోలిక, అంధక, ప్రహ్లాద, సింహిక, విరోచన, దేవాంబ, బాణాసుర, ఉష. రాహు, వజ్రాంగ, తారకాసుర, త్రిపురాసుర, శంబరాసురులు దైత్యులు.

బాణాసురుని కుమార్తె ఉష, శ్రీకృష్ణుని మనమడు అనిరుద్ధుని భార్య. వారి పుత్రుడు వజ్రుడు. ఇంద్రప్రస్థానికి రాజైనాడు.

## 47. కౌరవులు - పాండవులు - కొన్ని విశేషాలు

ధృతరాష్ట్రుడు పుట్టుగుడ్డి. ఎంత చక్రవర్తి అయినా నాలాంటి అందగత్తెను గుడ్డివాడికిచ్చి చేస్తారా అని కోపం వచ్చి గాంధారి "ఈ ప్రపంచాన్నిక చూడను" అని తానూ కళ్లకు గంతలు కట్టుకున్నది. వీరిద్దరి పుత్రుడు దుర్యోధనుడు. తండ్రి కళ్లు లేక చూడలేడు. తల్లి కళ్లుండీ చూడదలుచుకోలేదు. వారి పుత్రుడు కళ్లతో చూస్తూనే అంధుడిగా ప్రవర్తించాడు, ఏం జరుగుతుందో తెలిసీ. ధృతరాష్ట్రుడి ఉపేక్ష, గాంధారి అపేక్ష దుర్యోధనుడికి చివరకు నాశనాన్ని తెచ్చిపెట్టాయి.

పాండురాజు పుట్టుకతోనే పాలిపోయి పుట్టినాడు. మహావీరుడు. అన్ని రాజ్యాలను జయించి హస్తినను గొప్ప రాజ్యంగా తీర్చిదిద్దాడు. అంతులేని ధనాన్ని అన్నకిచ్చాడు. అంధుడైనందువల్ల అన్న ధృతరాష్ట్రుడికి, దాసీపుత్రుడైనందువల్ల తమ్ముడు విదురుడికి రాజ్యార్హత లేనందువల్ల తానే రాజైనా, అన్నను గద్దెపై కూర్చోబెట్టి గౌరవించాడు. ఆ తరువాత అతడికి ఎంతో ఇష్టమూ, వ్యసనమైన వేటకు అడవికి వెళ్లాడు తన భార్యలు కుంతీ, మాద్రిలతో కలిసి. జింక రూపంలో సంభోగ సుఖమానందిస్తున్న కిందముని జంటను చంపి శాపగ్రస్తుడై, రాజ్యాన్ని అన్నకప్పగించి మునిగా మారినాడు. నియోగ పద్ధతిలో కుంతికి ధర్ముడి వలన ధర్మరాజును, వాయుదేవుడి వలన భీముడిని, ఇంద్రుడి వలన అర్జునుడిని, మాద్రికి అశ్వనీ దేవతల వలన నకుల సహదేవులను సంతానంగా పొందినాడు.

ధృతరాష్ట్రుడి అంధత్వం దుర్యోధనుడికి మానసికంగా సంక్రమించినట్లు, పాండురాజు వేట వ్యసనం ధర్మరాజుకు ద్యూతవ్యసనంగా వచ్చింది (పెంపకం వల్ల కావచ్చు).

దుర్యోధనుడి భార్య భానుమతి. కళింగ దేశపు రాజు చిత్రాంగదుడి కుమార్తె. ఆమె స్వయంవరానికి అనేకమంది రాజులు వచ్చారు- శిశుపాలుడు, జరాసంధుడు, భీష్మకుడు, రుక్మి, వక్ర, కపోతరోమనుడు, నీల, శృంగ, అశోకుడు, శతధన్వుడు, దుర్యోధనుడు, కర్ణుడు.

వరమాల చేతబట్టుకుని కళింగ రాచకన్య, తన చెలికత్తె వరులను గురించి వివరిస్తుండగా మెరుపుతీగెలా ముందుకు సాగి ఒక్కొక్కరిని చూస్తూ దుర్యోధనుడి వద్ద ఆగి మరల ముందుకు వెళ్లిపోసాగింది. అభిమానధనుడైన సుయోధనుడు వెంటనే ఆమెను చేయి పట్టుకుని తన రథం వద్దకు తీసుకువెళ్లి- "నన్ను ఓడించగలిగినవాడు ఈమెను తీసుకువెళ్లవచ్చు" అన్నాడు (తన పితామహుడు భీష్ముడు కాశీ రాజకుమార్తెలు అంబ, అంబిక, అంబాలికలను అలాగే తీసుకువచ్చాడు కదా). కర్ణుడన్నాడు- "ప్రభూ! నేను వీళ్లను ఓడిస్తాను" అని పలికి అద్భుతంగా పోరాడి అందరినీ ఓడించాడు కర్ణుడు.

భానుమతి దుర్యోధనుడిని తన భర్తగా అంగీకరించింది. కర్ణుడు భానుమతి చెలికత్తె సుప్రియను వివాహమాడినాడు. దుర్యోధనుడు-కర్ణుల మధ్య మైత్రీబంధం ఎంత గాఢమైనదంటే కర్ణుడికి అంతఃపురంలోకి ప్రవేశముండేది. భానుమతితో ఒకరోజున పాచికలాడుతూ ఉన్నపుడు కర్ణుడు గెలుస్తున్నాడు, భానుమతి ఓడిపోతున్నది. ఈలోగా దుర్యోధనుడు అటుగా రావడం గమనించి భానుమతి నిలబడింది. ఓడిపోతున్నది కాబట్టి వెళ్లిపోతున్నదనుకుని కర్ణుడు అసంకల్పితంగా ఆమె చేయి పట్టుకోబోయినాడు, అతడి చేయి తగిలి ఆమె నడుముకున్న ముత్యాలహారం తెగి ముత్యాలు నేలపై జలజలా రాలాయి. దుర్యోధనుడన్నాడు నవ్వుతూ నిష్కల్మషంగా- "మిత్రమా! ముత్యాలు ఏరి హారంగా కూర్చనా!" అంత గంభీరమైన వాతావరణం వారి ముగ్గురి కల్మషం లేని నవ్వులతో కాంతివంతమైనది.

ఇండొనేషియాలోని భారత కథ ప్రకారం- భానుమతి అర్జునుడిని వివాహమాడాలనుకున్నది, కాని, తండ్రి మాట ప్రకారం దుర్యోధనుడిని వివాహమాడింది. భానుమతి తండ్రి శల్యుడు. మద్రదేశాధిపతి. నకుల సహదేవులకు మేనమామ. మాద్రిదేవి సోదరుడు. అందుకే భరతయుద్ధంలో శల్యుడు దుర్యోధనుని పక్షాన పోరాడినాడు.

దుర్యోధనుడి మరో భార్య మయూరి- భానుమతి సోదరి. ఇరువురిని స్వయంవరంలో కర్ణుని సాయంతో దుర్యోధనుడు గెలుచుకున్నాడనేది ఐతిహ్యం.

పాండవులలో సహదేవుడంటే ఇష్టం దుర్యోధనుడికి. గొప్ప జ్యోతిష్కుడైన సహదేవుడిని అతడు యుద్ధం ముందు సంప్రదించాడు శకుని సలహాతో. ఆయుర్వేదంలో అత్యంత ప్రతిభావంతులైన వైద్యులు వాళ్లు అశ్వినీదేవుల అంశతో జన్మించిన వారు కనుక. ఇంద్రుడు బ్రాహ్మణరూపంలో వచ్చి కర్ణుని కవచకుండలాలు తీసుకువెళ్లినప్పుడు- కర్ణుడి శరీరం రక్తం కారుతూండగా అతడు అచేతనుడైనాడు. పెంపుడు తల్లి రాధ, కర్ణుడి కన్నతల్లిని కలిసి సాయమడిగింది. నకుల సహదేవులతో తన కొడుకు వైద్యం చేయించమని అడగగా వాళ్లు అడిగారు తల్లిని- కర్ణుడు తమ అన్న అర్జునుడిని చంపడానికి ప్రతిజ్ఞ పూనాడు. ఇతడినెందుకు బతికించాలి? అయినా వైద్యుడి ధర్మంగా సహదేవుడు చేసిన వైద్యంతో కర్ణుడు కోలుకున్నాడు.

అందుకే 14వ రోజు యుద్ధంలో సహదేవుడు తన చేతిలో ఓడిపోయినా కర్ణుడతడిని చంపలేదు.

మాయా పాచికలతో జూదమాడించి తమను అడవుల పాలు చేసిన శకునిని వెంబడించి మరీ చంపినాడు సహదేవుడు.

## 48. కర్ణుడి భార్యలెందరు? ఎవరు?

కర్ణుని భార్యల పేర్లు భారతంలో చెప్పబడలేదు. ఇవి నవీన రచయితలు పెట్టిన పేర్లు.

వృషాలి - కర్ణుని బాల్య స్నేహితురాలు (రాధేయ-రంజిత్ దేశాయ్)

సుప్రియ - భానుమతి చెలికత్తె (శివాజి సావంత్-మరాఠి నవల 'మృత్యుంజయ')

పద్మావతి - అసావరి చెలికత్తె (కశిదాసి మహాభారతం - బెంగాళి)

పొన్నురువి - కళింగ యువరాణి (కర్ణమోక్షం - తమిళ-పుకలెంతిప్పులవర్)

మహాభారతంలో కర్ణుని భార్యల ప్రస్తావన లేదు. వృషసేన, సత్యసేన, సుషేణ, శత్రుంజయ, ద్విపాత, బాణసేన, సుశర్మ, ప్రసేన, వృషకేతులు కర్ణుని పుత్రులు.

చిత్రసేన, సత్యసేన, సుషేణులను నకులుడు, వృషసేనుడిని అర్జునుడు చంపినారు.

భారతయుద్ధంలో- కర్ణుడి ఆఖరి కుమారుడు వృషకేతు బ్రతికాడు. అంగరాజ్యానికి రాజుగా ధర్మరాజుచే నియమించబడినాడు.

## 49. భారత యుద్ధంలో ఎవరు ఎవరిని చంపారు?

**ధర్మరాజు-** శల్యుడు, మద్రసేనుడు (18వ రోజు)

**భీముడు-** శక్రదేవ, సత్య, సత్యదేవ (కళింగరాజులు-2వ రోజు); వికర్ణాది కౌరవులు ముప్పైమంది, బాహ్లికుడు (14వ రోజు), అశ్వత్థామ అనే ఏనుగును చంపినాడు (15వ రోజు); కర్ణుని కొడుకు బాణసేనుడు, దుశ్శాసనుడు (16వరోజు); దుర్యోధనుడు (18వ రోజు).

**అర్జునుడు-** భీష్ముడు (10వ రోజు); భగదత్తుడు, సుప్రతీకమనే ఏనుగు (12వ రోజు), సైంధవుడు, సుదక్షిణుడు (కాంభోజ) (14వ రోజు), కర్ణుడు (17వ రోజు), సుశర్మ (18వ రోజు).

**నకులుడు-** చిత్రసేన, సత్యసేన, సుషేణ (కర్ణుని కొడుకులు) (18వ రోజు).

**సహదేవుడు-** ఉలూకుడు, శకుని (18వ రోజు) శల్య పుత్రుడు రుక్మరథుడు.

**ధృష్టద్యుమ్నుడు-** ద్రోణుడు (15వ రోజు)

**సాత్యకి-** భూరిశ్రవసుడు, సోమదత్తుడు (14వ రోజు)

**అభిమన్యుడు-** లక్ష్మణకుమారుడు, బృహద్బలుడు, అశ్వకేతు, రుక్మరథుడు, అశ్మకపుత్రుడు, శల్యుని సోదరులు, జయత్సేనుని కుమారుడు, మార్తికవతుడు (13వ రోజు)

**ఘటోత్కచుడు-** అలంబుసుడు, అలాయుధుడు (14వ రోజు)

**భీష్ముడు-** పదిరోజుల యుద్ధం పదివేల రథికులు

**ద్రోణుడు-** విరాటుడు, ద్రుపదుడు (15వ రోజు)

**కర్ణుడు-** ఘటోత్కచుడు (14వ రోజు)

**శల్యుడు-** ఉత్తర కుమారుడు (1వ రోజు)

**అశ్వత్థామ-** అంజనపర్వుడు (ఘటోత్కచుని పుత్రుడు) (14వ రోజు); మలయధ్వజుడు (పాండ్యరాజు) (16వ రోజు), ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉపపాండవులు, యుధామన్యు, ఉత్తమౌజుడు (18వ రోజు రాత్రి)

**అలంబుసుడు-** ఇరావంతుడు (అర్జునుని కుమారుడు) (8వ రోజు)

**దుర్యోధనుడు-** రాక్షసులు, కుంతిభోజుని కుమారుడు (8వ రోజు); చేకితానుడు (18వ రోజు)

**ద్రుమసేనుడు-** అభిమన్యుడు (13వ రోజు). (దుశ్శాసనుని కుమారుడు ద్రుమసేనుడు)

**శకుని-** సహదేవుడు (జరాసంధుని కుమారుడు)

**అభిమన్యుని చుట్టుముట్టి గాయపరచినవారు-** ద్రోణుడు, కర్ణుడు, కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ, శకుని, ద్రుమసేనుడు (దుశ్శాసనుని కుమారుడు). ఈ ద్రుమసేనుడు ద్రౌపదీ పుత్రుడి చేతిలో మరణించాడు.

భారతయుద్ధం ముగిసిన 36 సంవత్సరాలకు పరస్పర కలహంతో కృతవర్మను సాత్యకి చంపాడు. సాత్యకిని కృతవర్మ బంధువులు చంపినారు.

# 50. వననిధి లాంటి సేన గోష్పాదమంత చిన్నది యయ్యెన్

యుద్ధం మొదటి రోజున కౌరవుల పక్షాన 11 అక్షౌహిణీల సేన; పాండవుల పక్షాన 7 అక్షౌహిణీల సేన కురుక్షేత్రంలో మోహరించాయి.

**అక్షౌహిణి =** 21,870 ఏనుగులు + 21,870 రథాలు + 65,610 అశ్వాలు + 1,09,350 కాల్బలం = **2,18,700**

| | | |
|---|---|---|
| **11 అక్షౌహిణీలు** | **=** | **24,05,700** |
| **7 అక్షౌహిణీలు** | **=** | **15,30,900** |
| **18 అక్షౌహిణీలు** | **=** | **39,36,600** |

| **కౌరవ పక్షాన** | **చంపినవారు** |
|---|---|
| 1) భగదత్తుడు - ప్రాగ్జ్యోతిషపురం | అర్జునుడు - 12వ రోజు |
| 2) శల్యుడు - మద్ర | ధర్మరాజు - 18వ రోజు |
| 3) భూరిశ్రవసుడు-బాహ్లిక | సాత్యకి - 14వ రోజు |
| 4) కృతవర్మ - యాదవ | సాత్యకి - 36 ఏళ్ల తరువాత |
| 5) జయద్రథ - సింధు | అర్జునుడు - 14వ రోజు |
| 6) సుదక్షిణ - కాంభోజ | అర్జునుడు - 14వ రోజు |
| 7) కర్ణ - అంగ | అర్జునుడు - 17వ రోజు |
| 8) కాళింగ - కళింగ | భీముడు - 2వ రోజు |
| 9) శకుని - గాంధార | సహదేవుడు - 18వ రోజు |
| 10) సుశర్మ - త్రిగర్త | అర్జునుడు - 18వ రోజు |
| 11) దుర్యోధనుడు - కురు | భీముడు - 18వ రోజు |

| **పాండవ పక్షాన** | **చంపినవారు** |
|---|---|
| 1) కుంతిభోజ - కుంతి | అశ్వత్థామ - 14వ రోజు |
| 2) మలయధ్వజ - పాండ్య | అశ్వత్థామ - 16వ రోజు |
| 3) ధృష్టకేతు - చేది | ద్రోణుడు - 14వ రోజు |
| 4) సహదేవ - మగధ | శకుని - 14వ రోజు |
| 5) ద్రుపద - పాంచాల | ద్రోణుడు - 15వ రోజు |
| 6) విరాట - మత్స్య | ద్రోణుడు - 15వ రోజు |
| 7) ఘటోత్కచుడు - రాక్షస | కర్ణుడు - 14వ రోజు |

**ఒక్కొక్క రథానికి-**
- రథికుడు, సారథి
- ఇద్దరు చక్ర రక్షకులు
- ఇద్దరు అశ్వరక్షకులు

**మొత్తం ఆరుగురు**

**ఒక్కొక్క ఏనుగుకు-**
- వీరుడు (శక్తి/త్రిశూలధారి
- అంకుశధారులు ఇద్దరు
- చురకత్తులతో ఇద్దరు
- ధనుర్ధారులు ఇద్దరు

**మొత్తం ఏడుగురు**

**-సం. ఉద్యోగ. *155-15,16***

**రథానికి ఆరుగురు చొప్పున**
21,870 × 6 × 18 = 23,61,960

**ఏనుగుకు ఏడుగురు చొప్పున**
21,870 × 7 × 18 = 27,55,620

**గుర్రానికొక్కడు చొప్పున-**
65,610 × 1 × 18= 11,80,980

**కాల్బలం =** 1,09,350×18= 19,68,300

**మొత్తం - 82,66,860 మంది**

**పదునెనిమిదో రోజు ఉదయానికి మిగిలినవారు** (శల్యపర్వం-ప్రథమాశ్వాసం) :

**కౌరవుల పక్షాన -** 11,000 రథాలు, 10,700 ఏనుగులు, 2,00,000 గుర్రాలు, 3 కోట్ల కాల్బలం

**పాండవుల పక్షాన -** 6,000 రథాలు, 3,000 ఏనుగులు, 1,00,000 గుర్రాలు, కోటి కాల్బలం.

**18వ రోజు మధ్యాహ్ననికి-**

**కౌరవ సేన-** 200 రథాలు, 500 గుర్రాలు, 2000 కాల్బలం

**పాండవ సేన-** 2000 రథాలు, 7000 ఏనుగులు, 500 గుర్రాలు, 10000 కాల్బలం

**18వ రోజు సూర్యాస్తమయ సమయానికి**

**కౌరవ సేన-** దుర్యోధనుడు, అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ, సంజయుడు

**పాండవ సేన-** ధృష్టద్యుమ్న, శిఖండి, ఉపపాండవులు, పాండవులు, సాత్యకి, శ్రీకృష్ణుడు, యయుధానుడు, ఔత్తమౌజుడు, యుయుత్సుడు.

**19వ రోజు ఉదయం - ఇరుపక్షాల మిగిలినవారు 11 మంది (సంజయుడితో 12 మంది)**
కౌరవ సేన- అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ
పాండవసేన- పాండవులు, శ్రీకృష్ణుడు, సాత్యకి, యుయుత్సుడు.

### యుయుత్సుడు పాండవ పక్షాన ఎప్పుడు చేరినాడు?

కురుక్షేత్ర యుద్ధ ప్రారంభ దినాన ధర్మజుడు రెండు సేనల మధ్య నిలబడి- "నేను చేస్తున్నది ధర్మయుద్ధం. కాదని భావించేవారు ఎవరైనా నా పక్షాన ఉంటే వెళ్లిపోవచ్చు" అన్నాడు పాండవసేన వేపు చూసి. ఆ తరువాత కౌరవసేన వేపు చూసి "నేను చేసేది ధర్మయుద్ధమని భావిస్తే నా పక్షాన చేరవచ్చు" అనగా పాండవసేన నుంచి ఎవరూ వెళ్లలేదు. కౌరవ సేన నుంచి యుయుత్సుడు (ధృతరాష్ట్రుడికి వైశ్యపత్ని వలన పుట్టినవాడు) వచ్చి పాండవ సేనలో కలిసినాడు.

మహాప్రస్థాన సమయంలో ధర్మరాజు యుయుత్సుడిని రాజ్య సంరక్షకుడిగా, పరీక్షిత్తును హస్తినాపురి రాజుగా నియమించాడు.

## 51. అతిరథ, మహారథ, అర్ధరథులు

**అర్ధరథుడు** – ఒకేసారి 2500 మందితో పోరాడ గలిగినవాడు.
**రథి** – ఒకేసారి 5000 మందితో పోరాడగలిగినవాడు.
**అతిరథి** – 12 మంది రథులు లేదా 60,000 మందితో పోరాడగలడు.
**మహారథి** – 12 మంది అతిరథులు లేదా 7,20,000 మందితో పోరాడగలడు.
**అతి మహారథి** – 12 మంది మహారథులతో పోరాడగలడు (8,64,000)
**మహా మహారథి** – 24 మంది అతిమహారథులతో పాడగలడు (20,73,60,000)

**రథులు–** కౌరవులు, శకుని, యుధిష్ఠిర, నకుల, సహదేవ, విరాట, ఉత్తర, ధృష్టకేతు, జయద్రధ, శిఖండి, ఉపపాండవులు

**అతిరథులు–** లవ, జరాసంధ, కుశ, కృతవర్మ, భీమ, శల్య, భూరిశ్రవస, ద్రుపద, అకంపన, విభీషణ, ఘటోత్కచ, జాంబవంత, సత్యకి, కుంతీభోజ, దేవాంతక, నరాంతక, మహిరావణ, కీచక, రుక్మి, సుశర్మ, బాహ్లిక, బృహద్బల, పుష్కల, సాంబ, ప్రద్యుమ్న.

**మహారథులు–** అభిమన్య, వాలి, బభ్రువాహన, అలంబుస, అంగద, అశ్వత్థామ, అతికాయ, భీష్మ, ద్రోణ, కృప, కుంభకర్ణ, అర్జున, సుగ్రీవ, రావణ, భగదత్త, నరకాసుర, ఘటోత్కచ, ఇరావణ, లక్ష్మణ, బలరామ, త్రిశిర, ప్రహస్త, భరత, శత్రుఘ్నులు

**అతి మహారథులు–** రామ, కృష్ణ, పరశురామ, ఇంద్రజిత్తు, హనుమంతుడు, విశాంశలు- వీరభద్ర, కాలభైరవుడు; విష్ణువు అవతారాలు.

**మహా మహారథులు–** బ్రహ్మ, విష్ణు, శివ, శక్తి, అయ్యప్ప, కార్తికేయ, వినయకుడు.

**భారత యుద్ధంలో అతిరథ మహారథులు:**

**కౌరవులు పక్షాన–**

**రథులు–** సుదక్షిణ, శకుని, లక్ష్మణ, దుర్జయ, కౌరవులు, జయద్రధుడు (ఇద్దరు రథులు), దుర్యోధనుడు (అష్టరథుడు)

**అతిరథులు–** కృతవర్మ, సుశర్మ, శల్య, భూరశ్ర, బృహద్బల (ఆరుగురు అతిరథులు), కృప (అయిదుగురు అతిరథులు)

**మహారథులు–** భగదత్త, అశ్వత్థామ (ఇద్దరు మహారథులు) ద్రోణ (ముగ్గురు మహారథులు); భీష్మ (నలుగురు మహారథులు)
కర్ణుడు అర్ధరథుడిగా భావించబడినాడు శాపాలవల్ల.
కాని అతడు 12 మహారథులకు సమానమైనవాడు.

**పాండవుల పక్షాన-** **రథులు-** ఉత్తమౌజ, శిఖండి, ఉపపాండవులు, ధృష్టకేతు, నకుల సహదేవులు, యుధిష్ఠిర, మత్స్యరాజు- విరాటుడు.

**అతిరథులు-** భీమ (8 అతిరధులు), సాత్యకి (6 అతిరధులు) ధృష్టధ్యుమ్న, కుంతిభోజ, ద్రుపదుడు ఘటోత్కచుడు- రాత్రిపూట మహారథికి సమానుడు.

**మహారథులు-** అభిమన్య (4 మహారథులు); అర్జునుడు

**అతి మహారథులు-** పరశురాముడు, కృష్ణుడు.

# 52. మహా యుద్ధాలు

**ఇంద్ర-వృత్రాసుర యుద్ధం** - ఇంద్రుడి విజయం - నదులు, గోవులు, ఉషస్సు విముక్తి.

వరాహకల్పంలో 12 యుద్ధాలు (బ్రహ్మాండ పురాణం)

1) నరసింహ - హిరణ్యకశిపు
2) వామన - మహాబలి
3) వరాహ - హిరణ్యాక్ష
4) సముద్ర మంధనం
5) తారక మాయా యుద్ధం (సోమ-బృహస్పతి)
6) ఆది బక యుద్ధం (వశిష్ఠ-విశ్వామిత్ర)
7) త్రిపురాసుర యుద్ధం (త్రిపురాసురుడు-శివుడు)
8) అంధక యుద్ధం (అంధక-శివుడు)
9) ధ్వజ యుద్ధం (విప్రచిత్తు - ఇంద్ర
10) వృత్రాసుర యుద్ధం (వృత్ర-ఇంద్ర)
11) హాలహల అసుర యుద్ధం (హాలాహలులు- శివ, విష్ణువు)
12) కోలాహల యుద్ధం (కోలాహలుడు-సుబ్రహ్మణ్యుడు).

**భారత కథలు - కృష్ణ యజుర్వేదం**

1) చంద్రుడి కృష్ణ-శుక్ల పక్షాలు
2) ఇంద్రుడి బ్రహ్మహత్యా పాతకం పంపకాలు
3) వాక్కు-మనసు కలహం -ఎవరు గొప్ప?
4) అగ్నిదేవుడి దాగుడుమూతలు
5) సుపర్ణోపాఖ్యానము - గాయత్రి
6) త్రిపురాసుర సంహారం

**భారత కథలు - తైత్తిరీయం**

1) నముచి-ఇంద్రుడు (ఫేనము ఆయుధం)

# 53. మహాభారతం

వేదవ్యాసుని సంస్కృత మహాభారతంలో 18 పర్వములు, లక్ష శ్లోకాలున్నాయి. కవిత్రయ మదాంధ్ర మహాభారతంలో 18 పర్వాలు, 63 ఆశ్వాసాలు, 21507 పద్య గద్యములున్నాయి. ఈ ప్రసాద మహాభారతంలో 18 పర్వాలు, 63 ఆశ్వాసాలు, 1200 పేజీలు, 4800 నాలుగు పాదాల వచన పద్యాలున్నాయి.

'ఇలా జరిగింది' - అని చెప్పడం ఇతిహాసం - It happend this way - ఇతిహాసం పురావృతం-

ఇది రెండు రకాలు- పరిక్రియ, పురాకల్పం. వీటిలో నిందా, ప్రశంసా, పరకృతి, పురాకల్పాలనే నాలుగు విధాలు.

ఇతిహాసమనేది పరంపరగా చెప్పబడే కథ.

ఆఖ్యానమనేది పూర్వవృత్త కథనం, ప్రత్యుత్తరం, చిన్న కథ.

స్వయంగా చూసిన దానిని చెప్పిన కథనం (స్వయం దృష్టార్థ కథనం)

ఉపాఖ్యానం- ఇతరులు చెప్పిన దానిని విని చెప్పే కథ

వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పిన కథను విని ఉగ్రశ్రవస సూతుడు నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంగా చెప్పిన భారతకథలో పూర్వాపర సంబంధం, కార్యకారణ సంబంధం, కర్మఫల సంబంధం, పూర్వ వృత్తాంత కథనాలు, ప్రధాన కథా తాత్పర్య వ్యంజకాలు ఉన్నాయని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు పేర్కొన్నారు.

కవిత్రయ మహాభారతాన్ని అందరికీ అర్థమయ్యేట్లుగా వ్రాస్తూ, ఇతర నాగరికతలలోని కథలకు భారతకథలకు గల పోలికలను, శ్రీమదాంధ్ర మహాభారతంలోని అత్యంత ప్రసిద్ధికెక్కిన పద్యాలను ఉటంకిస్తూ, విపుల వ్యాఖ్యానాలు, విశేషాలను కావ్యపు ముగింపులో ఇవ్వడం వచన పద్యశైలిలో సాగే ఈ ప్రసాద మహాభారత విశేషం.

## 54. అప్సరసలు (Nymphs)

హిందు పురాణాలలో అప్సరసలున్నట్లె గ్రీకు, రోమన్ల పురాణాలలో Nymphs - కన్యలున్నారు. వాళ్లు వివిధ రకాలు.

1) Meliae - మెలియె – Ash tree nymphs - వనకన్యలు
2) Dryads - డ్రయాడ్స్ – Oak tree nymphs - దేవదారు వృక్షకన్యలు
3) Naiads - నైయాడ్స్ – Water nymphs - జలకన్యలు
4) Nereids - నిరిడ్స్ – Sea nymphs - సముద్ర కన్యలు
5) Oreads - ఒరియాడ్స్ – Mountain nymphs - గిరికన్యలు

## 55. స్త్రీలు - కాలరేఖ

**కృతయుగం –** బ్రహ్మావాదినులు – జ్ఞానంపై అధిపత్యం.
**త్రేతాయుగం –** ఇష్టకామినులు – స్వేచ్ఛగా జీవించడం
**ద్వాపరయుగం –** అర్థాంగినులు – పురుషుల సంపద
**కలియుగం –** పరాధీనులు – ఆశ్రిత జనులు

## 56. తండ్రి పోలికలు - Father's Syndrome

1) సూర్యుడు– సహజ కవచకుండలాలు – కర్ణుడు, వాలి
2) ఇంద్రుడు– పరాక్రమం, కాముకత్వం – అర్జునుడు, సుగ్రీవుడు
3) వాయుదేవుడు– మహా బలశాలురు – హనుమంతుడు, భీముడు
4) ధర్ముడు – ధర్మం, నీతులు, సమవర్తిత్వం – ధర్మరాజు, విదురుడు
5) అశ్వని దేవతలు – వైద్యం, ఖడ్గవిద్య, జ్యోతిషం – నకుల, సహదేవులు
6) ధృతరాష్ట్రుడు–గాంధారి–అంధత్వం – దుర్యోధనుడు
7) పాండురాజు– వేట వ్యసనం – ధర్మరాజు (జూదం)
8) ద్రోణుడు – బ్రాహ్మణ–క్షాత్రధర్మం – అశ్వత్థామ
9) అర్జునుడు – విలువిద్య, వీరత్వం – అభిమన్యుడు
10) నహుషుడు – గర్వం, స్వర్గభ్రష్టత్వం – యయాతి

## 57. స్వయంవరాలు - పర్యవసానాలు

వరుడు – వధువు – పోటీ – పర్యవసానం

**1) సీత :** శివుని విల్లు ఎక్కుపెట్టడం – రామ రావణ యుద్ధం.
**2) అంబ, అంబిక, అంబాలిక :** అంబ–భీష్ముడి వైరం
**3) దేవకి :** సోమదత్త–సాత్యకి వైరం
**4) దమయంతి :** నల–దమయంతి వియోగం, రెండవ స్వయంవరం
**5) రుక్మిణి :** శిశుపాల–శ్రీకృష్ణ వైరం
**6) ద్రౌపది :** మత్స్యయంత్ర భేదనం – కురుక్షేత్ర యుద్ధం
**7) భానుమతి :** కళింగ–పాండవ వైరం
**8) లక్ష్మణ :** కౌరవ–యాదవ వైరం

# 58. ఇలియాడ్, ఒడిస్సీ / భారత-రామాయణాలు

**1) హెలెన్ (Helen) :** స్వయంవర సమయంలో గ్రీకు వీరులు చేసుకున్న ఒప్పందం (హెలెన్‌ను ఎవరు వివాహం చేసుకున్నా అతడితో మిగతా అందరూ సఖ్యంగా ఉండాలి. ఆమెకు, అతడికి ఏ కష్టం వచ్చినా అందరూ కలిసి సహాయం చెయ్యాలి) గ్రీకుల తెగలలోని అందరూ, హెలెన్‌ను ఎత్తుకుపోయిన పారిస్‌ను ఓడించి ఆమెను తీసుకురావడానికి ట్రాయ్ నగరంపై దండెత్తినారు. పదేళ్ల సాగిన ఆ యుద్ధంలో అనేక ఉత్కంఠభరితమైన మలుపుల తరువాత ట్రాయ్ వీరులు ఓడిపోగా ట్రాయ్ నగరం నేలమట్టమవుతుంది. గ్రీకులు గెలుస్తారు.

పురాతత్వ శాస్త్రజ్ఞుల తవ్వకాలు–పరిశోధనల వలన క్రీస్తుపూర్వం 1530 ప్రాంతంలో జరిగినట్లు చెప్పబడుతున్న Trojan War ఇతివృత్తంగా హోమర్ (Homer) వ్రాసిన ఇలియాడ్ (Iliad), ఒడిస్సీ (Odyssey) గ్రంథాలు బహుళ ప్రచారంలోకి వచ్చాయి.

ఇలియాడ్, ఒడిస్సీలకు, ఇతర గ్రీకు పురాణాలకు హిందూ ఇతిహాసాలు రామాయణ, భారత గాథలకు ఉన్న అనేక పోలికలు, వైరుధ్యాలు చదువరులకు ఆసక్తి కలిగిస్తాయి.

1) హెలెన్‌ను పారిస్ అపహరించుట – సీతను రావణుడు అపహరించి లంకకు తీసుకుపోవుట.

2) మాయా హెలెన్ – మాయాసీత పోలికలు

3) ట్రోజన్ స్త్రీల విలాపం – స్త్రీ పర్వం

4) డయొమెడెస్ అర్ధరాత్రి దాడి – సౌప్తిక పర్వం

5) మృతుల సందర్శనం (ఒడిస్సి) – ప్రియసంగమోత్సవం

6) ఎఖిల్లిస్ చీలమండ (Achilles Heel) – దుర్యోధనుడి తొడలు, కృష్ణుని ఎడమపాదం

7) ఎఖిల్లిస్ కవచం (Shield) - కర్ణుడి సహజ కవచకుండలాలు

8) ప్రొటిసిలాస్ మరణం – ఇరవణన్ / బర్బరీకుడి కథ

9) కాడ్మస్ సర్పంగా మారడం – నహుషుడు సర్పంగా మారడం

10) డయొనైసస్ జ్యూస్ దేవుడి ఊరు జననం – ఔర్వుడు, ఊర్వశిల జనన కథలు

11) ఇఫిజీనియా బలి – ఇరావంతుడి బలి

12) పెనెలొపి రెండో పెళ్లి – దమయంతి రెండో స్వయంవరం

13) ఒడిస్యూస్ వేసిన బాణం 12 గొడ్డలి రంధ్రాల్లోంచి పోతుంది –
శ్రీరాముడు వేసిన బాణం 7 సాల వృక్షాలను ఛేదించి వెనక్కి వస్తుంది.

14) పాట్రొక్లస్ మరణం – అభిమన్యుడి మరణం

15) హెక్టార్‌ను చంపిన ఎఖిల్లిస్ – కర్ణుని చంపిన అర్జునుడు

16) మాయాగుర్రం (Trojan Horse) - అశ్వత్థామ అనే ఏనుగు

17) యుద్ధంలో పాల్గొన్న దేవతలు – యుద్ధం గురించి చర్చించిన దేవతలు.

18) హోమర్ పుట్టింది నదీ ద్వీపంలో – వ్యాసుడు పుట్టింది యమునా నదీ ద్వీపంలో.

# 59. నూరుగురు కౌరవులు - తాబేలు శాపం

1) దుర్యోధనుడు
2) దుశ్శాసనుడు
3) దుస్సహుడు
4) దుశ్శలుడు
5) జలసంధుడు
6) సముడు
7) సహుడు
8) విందుడు
9) అనువిందుడు
10) దుర్ధర్షుడు
11) సుబాహుడు
12) దుష్ప్రదర్షణుడు
13) దుర్మర్షణుడు
14) దుర్ముఖుడు
15) దుష్కర్ణుడు
16) కర్ణుడు
17) వివింశతి
18) వికర్ణుడు
19) శలుడు
20) సత్త్వుడు
21) సులోచనుడు
22) చిత్రుడు
23) ఉపచిత్రుడు
24) చిత్రాక్షుడు
25) చిత్రచాపుడు
26) దుర్మదుడు
27) దుర్విగాహుడు
28) వివిత్సుడు
29) వికటననుడు
30) ఊర్ణనాభుడు
31) సునాభుడు
32) నంద
33) ఉపనంద
34) చిత్రబాణ
35) చిత్రవర్మ
36) సువర్మ
37) దుర్విరోచన
38) అయోబాహు
39) చిత్రాంగ
40) చిత్రకుండల
41) భీమవేగ
42) భీమబల
43) బలాకి
44) బలవర్ధన
45) ఉగ్రాయుధ
46) సుషేణ
47) కుండోధర
48) మహోదర
49) చిత్రాయుధ
50) నిషంగి
51) పాశి
52) వృందారక
53) దృఢవర్మ
54) దృఢక్షత్ర
55) సోమకీర్తి
56) అనూదార
57) దృఢసంధ
58) జరసంధ
59) సత్యసంధ
60) సదస్వాక్కు
61) ఉగ్రశ్రవ
62) ఉగ్రసేన
63) సేనాని
64) దుష్పరాజయుడు
65) అపరాజితుడు
66) పండితక
67) విశాలాక్ష
68) దురాధర
69) దృఢహస్త
70) సుహస్త
71) వాతవేగ
72) సువచుడు
73) ఆదిత్యకేతువు
74) బహ్వాశి
75) నాగదత్తు
76) అగ్రయాయి
77) కవచి
78) క్రధన
79) దండి
80) దండధారుడు
82) ధనుర్గ్రహుడు
83) ఉగ్రుడు
84) భీమరథ
85) వీరబాహు
86) ఆలోలుప
87) అభయ
88) రౌద్రకర్మ
89) దృఢరథుడు
90) అనాధృష్యుడు
91) కుండభేది
92) విరావి
93) ప్రమథుడు
94) ప్రమాధి
95) దీర్ఘరోముడు
96) దీర్ఘబాహువు
97) వ్యూఢోరువు
98) కనకధ్వజ
99) కుండాశి
100) మహాబాహు
100) విరజుడు
101) దుశ్శల

(దుర్యోధనుడి తరువాత దుశ్శాసనుడికి ముందు ధృతరాష్ట్రునికి-వైశ్యపత్నికి యుయుత్సుడు జన్మించాడు)

గాంధారి ఒకరోజున తెలియక ఒక రాతిపై కూర్చున్నది. ఆమె బరువుకు ఆ రాతి కింద ఉన్న నూరు తాబేలు గుడ్లు పగిలిపోయాయి. తాబేలు శపించింది గాంధారిని– "ఏదో రోజు తెలిసి వస్తుంది నీకూ నా దుఃఖం".

# 60. ఉపరిచర వసువు - యాదవులు

ఉపరిచర వసువు అతడి భార్య గిరికల కుమారుడు బృహద్రథుడు. ఇతడు కాశీరాజ కుమార్తెలిరువురిని వివాహం చేసుకోగా జరాసంధుడు, శశిరేఖ పుట్టినారు. శశిరేఖ ధృష్టద్యుమ్నుని వివాహం చేసుకున్నది.

ఉపరిచర వసువు వీర్యంతో అద్రికకు పుట్టినవారు మత్స్యరాజు, మత్స్యగంధి (సత్యవతి).

సత్యవతికి బృహద్రథుడు సోదరుడి వరుస. విచిత్రవీర్యుడు, చిత్రాంగదులు జరాసంధుడికి సోదరులవుతారు. శశిరేఖను పెండ్లి చేసుకున్న ధృష్టద్యుమ్నుడు జరాసంధుడికి బావ. ద్రౌపదికి బావ జరాసంధుడు, జరాసంధుడికి పాండవులు సోదరులవుతారు. జరాసంధుడికి శ్రీకృష్ణుడు బావ వరుస. శ్రీకృష్ణుడికి శిశుపాలుడు, దంతవక్త్రుడు బావమరదులు.

దేవకి దేవి స్వయంవరంలో గొడవలు పడినవారు బాహ్లికుని కుమారుడు సోమదత్తుడు, శిని. శిని కొడుకు సత్యకుడు, సత్యకుడి కొడుకు సాత్యకి. వసుదేవుడికి సాయంగా వచ్చాడు శిని. సోమదత్తుడితో జగడమయ్యింది. ఆ వైరం ఇరుపక్షాలకు ప్రాణాంతకమయ్యింది.

సత్యవతి భర్త శంతనుడు. శంతనుడి సోదరుడు బాహ్లికుడు. బాహ్లికుడి కొడుకు సోమదత్తుడు, సోమదత్తుడి కొడుకు భూరిశ్రవుడు.

దేవకీదేవి సవతి అన్న కంసుడు. ఇతడు ఉగ్రసేనుని కొడుకు. తండ్రిని కారాగారంలో పడవేసి, దేవకీ వసుదేవులను గృహనిర్బంధంలో ఉంచాడు. మేనల్లుడు శ్రీకృష్ణుని చేతిలో మరణించాడు. జరాసంధుడి కుమార్తెలు కంసుడి భార్యలు. కంసునిచంపిన కృష్ణుడిపై పగబట్టిన జరాసంధుడు 17 సార్లు మధురపై దండెత్తగా 18వ సారి దండయాత్ర సమయంలో మధురానగర వాసుల్ని ద్వారకకు పంపినాడు శ్రీకృష్ణుడు.

రాజసూయ యాగ సమయంలో– అప్పటికే చుట్టుపక్కల రాజులందరిని ఓడించి బందీలుగా చేసిన జరాసంధుడిని భీముడి చేత చంపించి తమ పీడను వదుల్చుకున్నాడు శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణునికి మేనమామ వరుస అక్రూరుడు. స్వఫల్క, నందినిల కుమారుడు. నందిని కాశీరాజు కుమార్తె. కంసుడు మధురా నగరానికి రాజు. అక్రూరుడు కోశాధిపతి. సత్రాజిత్తు అనే యాదవుడు నిఘ్న, ప్రసేనుల కుమారుడు. సూర్యవర ప్రసాదితుడై శమంతకమణిని పొందినాడు. అది రోజుకు 77 కిలోల బంగారాన్ని (ఎనిమిది బారువులు) ఇస్తుంది.

నాలుగు బియ్యంగింజలెత్తు – ఒక గుంజ
అయిదు గుంజలు – ఒక పణ
ఎనిమి పణములు – ఒక కర్స
నాలుగు కర్సలు – ఒక పల
100 పలములు – ఒక తులము
20 తులములు – ఒక బారువు
3700 బియ్యంగింజలు – ఒక ఔన్సు
ఒక రోజుకు శ్యమంతకమణి ఇచ్చే బంగారం = 170 పౌండ్లు (77 కి.గ్రా.)

సత్రాజిత్తు ఆ మణిని మెడలో వేసుకుని వస్తుంటే అందరూ అతడిని సూర్యుడిగా భావించారు.

శ్రీకృష్ణుడన్నాడు– "అటువంటి మణి రాజు ఉగ్రసేనుడి వద్ద ఉంటే ఉంచిది" అన్నాడు. సత్రాజిత్తు ఒప్పుకోలేదు. సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడనేవాడు వేటకు వెళ్తూ ఆ మణిని కంఠహారంగా ధరించి వెళ్తుంటే సింహమొకటి అతడిని చంపింది. ఆ సింహాన్ని చంపి జాంబవంతుడనే రామాయణకాలపు ఋక్షవీరుడు శ్యమంతకమణిని తీసుకువెళ్లి తన కుమార్తె జాంబవతికి ఆటవస్తువుగా ఇచ్చినాడు.

ప్రసేనుడెంతటికి రాకపోవడంతో సత్రాజిత్తు అతడిని కృష్ణుడే చంపి శ్యమంతకమణి అపహరించాడని గొడవ చేసాడు. అందరూ కలిసి అడవికి వెళ్లగా అక్కడ ప్రసేనుడి శవం, కాస్తదూరంలో చచ్చిపడి ఉన్న సింహం కనిపించాయి. అడుగు జాడల్ని వెదుకుతూ శ్రీకృష్ణుడు ఓ గుహలోకి వెళ్లి అక్కడ జాంబవంతుడితో 28 రోజులు రేత్రింబవళ్లు యుద్ధం చేసాక, శ్రీకృష్ణుడే శ్రీరాముడని తెలిసాక జాంబవంతుడు శ్యమంతకమణితో పాటు జాంబవతిని శ్రీకృష్ణునికిచ్చినాడు.

కృష్ణుడు ఆ మణిని సత్రాజిత్తుకివ్వగా అతడు పశ్చాత్తాపం చెంది మణితోపాటు కన్యామణి, తన కుమార్తె సత్యభామను ఇచ్చాడు. కన్యామణిని పరిగ్రహించి మణిని సత్రాజిత్తుకిచ్చినాడు శ్రీకృష్ణుడు.

## 61. ఉపరిచర వసువు - అశ్వమేధ యాగం

ఉపరిచర వసువు కృతి ప్రభువు కుమారుడు. చేది దేశపు రాజు. ఇంద్రుడి మిత్రుడు. విష్ణుభక్తుడు. తపస్సంపన్నతతో విమానంలో విహరించేవాడు. ఇతడు అశ్వమేధయాగం చేసినాడు కాని ఏ జంతువునూ బలి ఇవ్వకుండా పూలు ఫలములు పత్రములతో దిగ్విజయంగా యజ్ఞం చేసి విష్ణువుకు హవిర్భాగము నిచ్చాడు.

అయితే దేవతలు, మునుల మధ్య వాగ్వాదం జరిగినపుడు 'అజ' అనే పదాన్ని మేకగా నిర్ణయించి యజ్ఞాల్లో జంతువధ చేయవచ్చు అని దేవతలకు మద్ధతు పలకడంతో మునులు అతడిని భూమిపై జీవించమని శాపమిచ్చినారు.

అతడు తన విమానంలో తిరుగుతూ– కోలాహల కొండకు శుక్తిమతి నదికి పుట్టిన గిరికను వివాహమాడి బృహద్రథ, ప్రత్యాగ్రహ, కుశంబు, మావెళ్ల, యదునాభులకు; అద్రిక అనే అప్సరస ద్వారా మత్స్యరాజుకు, మత్స్యగంధికి (సత్యవతి)కి తండ్రి అయినాడు.

బైబిల్‌లో కెయిన్ (Cain), ఎబెల్ (Abel)లు ఆదాము–అవ్వల సంతానం. కేన్ కాస్త నిర్లక్ష్యంగా ధాన్యాలు, ఫలాలు సమర్పించాడు, ఎబెల్ మంచి గొర్రెను మనస్ఫూర్తిగా సమర్పించగా దేవుడు దానిని స్వీకరించాడు. కెయిన్ అసూయతో ఎబెల్‌ను చంపి మొదటి హంతకుడైనాడు.

## 62. అక్రూరుడు - శ్రీకృష్ణుడు

కంసుడు పంపగా శ్రీకృష్ణుని మధురా నగరానికి తీసుకుపోవడానికి వచ్చిన అక్రూరుడు బలరామకృష్ణులను ధనుర్యాగానికి తీసుకుపోతుంటే గోపికాస్త్రీలందరూ అక్రూరుడిని క్రూరుడిగా నిందిస్తారు.

దారిలో శ్రీకృష్ణుడి విశ్వరూపాన్ని చూసి తరించిన అక్రూరుడు, స్వతహాగా విష్ణుభక్తుడు కావడంతో, తాను కంసుని పంపున వచ్చినది ప్రేమతో కాదని, అక్కడ కృష్ణుని చంపడానికి కంసుడు వ్యూహం పన్నినాడని వివరించాడు.

కంసవధ తరువాత కొన్నాళ్లకు శ్రీకృష్ణుడి సత్యభామల వివాహం, ఆ తరువాత పాండవులు లాక్షాగృహ దహనంలో మరణించారని తెలిసి బలరామకృష్ణులు ద్వారక నుంచి హస్తినాపురానికి వెళ్లారు. కృతవర్మ, అక్రూర, శతధన్వులు శ్యమంతకమణిపై ఆశతో సత్రాజిత్తును చంపి మణిని అపహరించారు. (ఈ ముగ్గురుకీ సత్యభామపై, మణిపై ఆశ ఉండింది).

శతధన్వుడు సత్రాజిత్తును చంపి ఆ మణిని అక్రూరుడికిచ్చాడు దాచమని. సత్యభామ దుఃఖిస్తూ హస్తినాపురానికి వెళ్లి బలరామకృష్ణులకు చెప్పగా వారు వెళ్లి శతధన్వుడిని వేటాడి మిథిలానగరం పొలిమేరలో చంపినారు. అతడి శరీరంపై ఎక్కడా శ్యమంతకమణి జాడలేదు. ఆమాట బలరాముడికి చెప్పాడు కృష్ణుడు. నీవే ఆ మణిని తీసి ఉంటావని నిందించి బలరాముడు శ్రీకృష్ణునితో తెగతెంపులు చేసుకుని మిథిలలో ఉండిపోయాడు అక్కడ రాజుకు అతిథిగా. ఆ సమయంలోనే బలరాముడు గదాయుద్ధం నేర్పినాడు దుర్యోధనునికి. మూడేళ్ల తరువాత బలరాముడు ద్వారకకు మరలి వచ్చాడు.

నిజం తెలిసింది. శతధన్వుడు దొంగతనం చేసి దానిని అక్రూరుడికిస్తే అతడు 'కాశి' నగరం వెళ్లాడని. పిలిపించారు, వచ్చి అందరి ముందు తప్పు ఒప్పుకున్నాడు అక్రూరుడు. శ్రీకృష్ణుడన్నాడు– "శ్యమంతకమణి గొప్ప నిధి. గొప్ప నిధులతో పాటు మరణాలు అనుబంధంగా ఉంటాయి. నేను ముందే హెచ్చరించాను అది రాజు ఉగ్రసేనుడి వద్ద ఉంటే మంచిదని. సత్రాజిత్తు వినలేదు, ప్రసేనుడు వినలేదు, శతధన్వుడు వినలేదు – ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. అక్రూరా, ఈ మణిని నీ దగ్గర ఉంచుకో, నీవు ద్వారకలోనే ఉండిపోవాలి. ఆ మణి వలన వచ్చే బంగారం యాదవులందరికి ఉపయోగపడునుగాక!".

ఆ తరువాత అక్రూరుడు, కృష్ణుడు పంపగా వెళ్లి ధృతరాష్ట్రుని, కుంతీదేవిని కలిసాడు. ధృతరాష్ట్రుడు తన పుత్రుల అభిప్రాయాలవేపు మొగ్గు చూపించాడు. ఆ విషయాన్ని అక్రూరుడు కృష్ణుడికి తెలియజేసినాడు.

శ్రీకృష్ణ నిర్యాణం తరువాత అర్జునుడు యాదవులను వెంట బెట్టుకుని బయల్దేరాడు. ద్వారక సముద్రంలో మునిగి పోయింది. దారిలో కిరాతకులు వారిని దోచుకున్నారు. మిగిలిన వారితో అర్జునుడు ఇంద్రప్రస్థం చేరుకుని అనిరుద్ధుడి కుమారుడు వజ్రుడికి ఇంద్రప్రస్థాన్నిచ్చాడు. అక్రూరుడి వారసులు ఇంద్రప్రస్థంలో ఉండడానికి ఇష్టపడక వారికి ఇష్టమైన చోటుకు వెళ్లిపోయారు.

## 63. కంసుడెవరు?

భోజులకు చెందినవాడు భోజపతి కంసుడు. తండ్రి ఉగ్రసేనుడు. తల్లి పద్మావతి.

కంసుడు కాలనేమి అనే రాక్షసుడి అంశలో పుట్టినాడు. పద్మపురాణం ప్రకారం ద్రమిళుడనే గంధర్వుడు ఉగ్రసేనుడి రూపంలో పద్మావతితో కలవగా కంసుడు జన్మించాడు. మహాబలవంతుడైన కంసుడు మగధ రాజైన జరాసంధుడు మధురపై దండెత్తినపుడు ఒక్కడే జరాసంధుడి సైన్యాన్ని చిందర వందర చేయడంతో జరాసంధుడు మెచ్చుకుని కంసుడికి తన కుమార్తెలు ఆస్తి, ప్రాప్తిలనిచ్చి వివాహం చేసినాడు. జరాసంధుడి సాయంతో తండ్రి ఉగ్రసేనుడిని బంధించి కాళింది నదిలో పారవేయమని ఆజ్ఞాపించి తరువాత మనసు మార్చుకుని ఆజన్మ ఖైదుశిక్ష విధించాడు.

దేవకి వివాహం సమయంలో ఆకాశవాణి అతడిని హెచ్చరిస్తుంది దేవకి అష్టమగర్భం నిన్ను హతమారుస్తుందని. దానితో అప్పటి వరకు ఎంతో ప్రేమతో చూసుకున్న దేవకి-వసుదేవుల్ని గృహనిర్బంధంలో ఉంచి వారికి వరుసగా పుట్టిన ఆరుగురు శిశువులను చంపివేసాడు. ఏడవ గర్భాన్ని యోగమాయ రోహిణి గర్భంలోకి మార్చింది.

# 64. యాదవులు

**I) హైహయులు- 5 తెగలు:** 1) వీతిహోత్ర, 2) శర్యాత, 3) భోజ, 4) అవంతి, 5) తుండీకర. వీరందరిని తాళజంఘులు అని పిలిచేవారు.

కర్కోటక నాగును ఓడించి కార్యవీర్యార్జునుడు మాహిష్మతి పట్టణాన్ని కైవసం చేసుకున్నాడు. తాళజంఘుడి పెద్దకొడుకు వీతిహోత్రుడు. హైహయులు యదువు పెద్ద కుమారుడు సహస్రజిత్తు వంశీయులు. మిగతావారు ఆఖరి పుత్రుడు క్రోష్టుడి వంశస్థులు.

**II) చక్రవర్తి శశబిందుడి వారసులు :** శశిబిందులు.

**III) చేది (చైద్యులు) :** క్రోష్టుడి వంశీకుడైన విదర్భుని మనమడు కైశికుని పుత్రుడు 'చిది'. చిది వంశస్థులు చైద్యులైనారు. చిది కుమారుడు దామఘోషుడు. ఇతడి పుత్రుడు శిశుపాలుడు.

**IV) వైదర్భులు :** విదర్భుని తండ్రి జ్యామఘుడు. ఈ వంశంలో పేరు గాంచినవాడు భీష్మకుడు. ఇతడు రుక్మిణి, రుక్మిల తండ్రి. దక్షిణాపథ రాజులు.

**V) సాత్వతులు :** మధురానగర పాలకులు. మధు వంశీయులు. సాత్వతుని కుమారుడు భీముడు శ్రీరాముడి సమకాలికుడు. భీముడి కొడుకు అంధకుడు. అంధకులు, వృష్ణులు, కుకురులు, భోజులు, శూరసేనులు సాత్వతుని వంశస్థులు.

మహాభారత యుద్ధంలో అంధక, భోజక, కుకుర, వృష్ణిలు కృతవర్మ నాయకత్వంలో పాల్గొన్నారు. సాత్వతుడి కుమారుడు మహాభోజుడి వంశస్థులు భోజులు. కుకురుడి (ఆహుకుడు) కుమారులు ఉగ్రసేన, దేవకులు. ఉగ్రసేనుడికి 9 మంది కొడుకులు, అయిదుగురు పుత్రికలు. దేవకుడికి నలుగురు కొడుకులు, ఏడుగురు కుమార్తెలు. దేవకుడి కుమార్తె దేవకి. ఉగ్రసేనుడి కొడుకు కంసుడు.

వృష్ణి వంశస్థులు శైనేయులు.

వృష్ణి → అనామిత్రుడు → శిని → సత్యక → యుయుధాన (సాత్యకి) → అసంగ → యుగంధర.

అక్రూరుడు వృష్ణి వంశస్థుడు. శ్యమంతకమణి ఇతడి దగ్గరే ఉండింది. అక్రూరుడి కొడుకులు దేవవంత, ఉపదేవ.

కృతవర్మ - అంధక వంశం వాడు లేదా భోజవంశం వాడు.

సాత్యకి - శైనేయుడు (వృష్ణి వంశం వాడు)

అక్రూరుడు - వృష్ణి వంశంవాడు

బలరామకృష్ణులు - వృష్ణి వంశస్థులు

వసుదేవుడు, గోకులపు నందుడు మిత్రులు, బంధువులు. దేవకి గర్భంలోని పిండాన్ని రోహిణి గర్భంలోకి మార్చగా పుట్టినవాడు. సంకర్షణ బలరాముడు.

దేవకికి పుట్టిన మగ శిశువును గోకులపు యశోద ఆడశిశువుతో మార్చగా గోకులంలో పెరిగాడు శ్రీకృష్ణుడు.

యశోద భర్త నందుడు. వ్రజ ప్రాంతపు రాజైన పర్జన్యుడి కుమారుడు.

యదువు 74 తరాల తరువాత రాజు వృష్ణి. వృష్ణి కుమారుడు దేవామీఢుడు. అతడి భార్య నాగకన్య మదీష. వీరి పుత్రుడు శూరసేనుడు. శూరసేనుడి భార్య నాగవంశస్థురాలైన మారీష - వీరి కొడుకు వసుదేవుడు, కుమార్తె కుంతి. వృష్ణి కుమారుడు దేవామీఢుడి మరో భార్య వెస్పర్ణ. వీరి పుత్రుడు పర్జన్యుడు. పర్జన్యుడు-వరియాసిల కుమారుడు నందుడు. నందుడు-యశోదల కుమార్తె యోగమాయ. శూరసేనుడి తల్లి మదీష తండ్రి ఆర్యకుడు. కౌరవులు నదిలో పడవేసిన బాల భీముడిని ఆదరించిన నాగ వంశస్థుడు.

ఒక తల్లి గర్భంలోని పిండాన్ని మరొక తల్లి గర్భంలోకి మార్చడమనే ప్రక్రియ ఆ కాలంలో ఉందనేది మనకు తెలుస్తున్నది. ఈ సంకర్షణ విధానంగా పుట్టినవాడు బలరాముడు సంకర్షణుడిగా పిలువబడినాడు.

దేవకి పుత్రుడిని యశోద వద్ద ఉంచి, యశోద పుత్రుడు దేవకి వద్ద ఉంచే కార్యక్రమంలో యమునానది చీలి వసుదేవుడికి దారి ఇచ్చింది. మధురా నగరం యావత్తూ గాఢనిద్రలో మునిగింది.

తెల్లవారే శిశువు ఏడ్పు విని విషయం కంసుడికి తెలిసి అష్టమగర్భాన్ని చంపాలని అట్టహాసంగా కత్తిదూసి వచ్చి కంసుడు శిశువు రెండు కాళ్లు పట్టుకుని నేలపైకి విసిరికొట్టినాడు. ఆ శిశువు గాలిలోకి ఎగిరి కంసుడిని హెచ్చరించింది– "నిన్ను చంపేవాడు వేరేచోట పెరుగుతున్నాడు జాగ్రత్త!" అని అదృశ్యమైనది యోగమాయ.

మధురా నగరంలో చుట్టుపక్కల పుట్టిన మగశిశువులనందరిని చంపి రమ్మని కంసుడు తన సోదరి 'పూతన'ను పంపాడు. ఆ పూతన విషం పూసిన రొమ్ముల పాలతోపాటు ప్రాణాలు పీల్చినాడు శ్రీకృష్ణుడు.

(ఇటువంటిదే Massacre of the Innocents. Horod the great. హెరొదు ప్రభువు బెత్లెహాం చుట్టుపక్కల రెండేళ్ల లోపున్న మగశిశువుల్ని చంపమని ఆజ్ఞాపించాడు. (క్రీస్తు పుట్టుక తనకు ప్రమాదమని భావించి). ఇదేవిధంగా ఈజిప్టు ఫారో ఆజ్ఞతో హీబ్రూ పిల్లలు చంపబడినారు – మోసెస్ పుట్టుక ప్రమాదకరమని జ్యోతిష్కులు చెప్పగా).

అనేక హత్యాప్రయత్నాలు, రాసలీలలు దాటి కృష్ణుడు మధురానగరంలో కంసుడిని చంపి ఉగ్రసేనుడిని మధురకు రాజుగా చేసినాడు. తన అల్లుడైన కంసుడిని చంపినందుకు, ఆగ్రహించిన జరాసంధుడు మధురపై 17 సార్లు దండెత్తినాడు. అన్నిసార్లు ఓడిపోయినా మరల మరల వస్తున్న జరాసంధుడి దండయాత్రల నుంచి ప్రశాంతత కోసం శ్రీకృష్ణుడు ద్వారకా నగరిని నిర్మించి యాదవులను అక్కడికి పంపించినాడు.

18వ దండయాత్రలో కూడా కృష్ణుడు దొరకలేదు. రాజసూయ యాగానికి ముందు భీమార్జునులతో మగధకు వెళ్లి గిరివ్రజంలో జరాసంధుని భీముడి చేత చంపించాడు కృష్ణుడు. బందీలుగా ఉన్న రాజులనందరినీ విడిపించి జరాసంధుడి కుమారుడు సహదేవుడిని మగధ రాజుగా పట్టాభిషక్తుడిని గావించాడు. పాండవుల రాజసూయ యాగంలో జరాసంధుడి మిత్రుడైన శిశుపాలుడిని, తరువాత ద్వారకకు వెళ్లేదారిలో దంతవక్త్రుని చంపినాడు శ్రీకృష్ణుడు.

## 65. యాదవ రాజ్యములు

1) చేది (ఝాన్సి జిల్లా – ఉత్తరప్రదేశ్)
2) శూరసేన (వ్రజ/మధుర – ఉత్తరప్రదేశ్)
3) దశార్ణ (చేది దేశానికి దక్షిణ ప్రాంతం)
4) కరూశ (దశార్ణ దేశానికి తూర్పు ప్రాంతం)
5) కుంతి (అవంతికి ఉత్తరాన)
6) అవంతి (ఉజ్జయిని జిల్లా – మధ్యప్రదేశ్)
7) మాళవ (అవంతికి పశ్చిమాన)
8) గోపరాష్ట్ర (దక్షిణ రాజస్థాన్)
9) హేహయ (నర్మదా లోయ – మహేశ్వర పట్టణ ప్రాంతం – మధ్యప్రదేశ్)
10) సౌరాష్ట్ర (దక్షిణ గుజరాత్)
11) ద్వారక (గుజరాత్ సముద్రతీరం) (అనార్త రాజ్యం)
12) విదర్భ (ఈశాన్య మహారాష్ట్ర)

## 66. సైన్సు - పురాణం

<u>సైన్సు</u>–

1) విశ్వం మొదలైంది – Big Bang Theory – 13700 మిలియన్ సంవత్సరాలు.
2) భూమి (Earth Planet) - 4600 మిలియన్ సంవత్సరాలు
3) జీవం (Life - Prokaryocytes) - 3600 మిలియన్ సంవత్సరాలు
4) రాక్షసి బల్లులు (Dinosaurs) 230–65 మిలియన్ సంవత్సరాలు
5) మానవజాతి (Homosapiens) 2,00,000 సంవత్సరాలు

**పురాణ జ్ఞానం :** కలియుగ ప్రారంభం 3102 BC ఫిబ్రవరి 18
ద్వితీయ పరార్థ శ్వేత వరాహకల్ప ప్రథమ మాస ప్రథమకల్ప ఏడవ మన్వంతరం
28వ చతుర్యుగ కలియుగం–
51వ సంవత్సరం బ్రహ్మకు (వయస్సు 100 సంవత్సరాలు)
1వ నెల 12 నెలలో
1వ దినం (కల్పం) శ్వేతవరాహ కల్పం – 30 దినములలో
7వ మన్వంతరం (వైవస్వత) 14వ మన్వంతరాలలో
28వ చతుర్యుగం 71 చతుర్యుగాలలో
4వ యుగం (కలియుగం). నాలుగు యుగాలలో.

బ్రహ్మ వయసు (100 బ్రహ్మ సంవత్సరాలు) = 311.04 ట్రిలియన్ సంవత్సరాలు = మహాకల్ప.
ప్రస్తుత బ్రహ్మ వయస్సు = 155.521972944 ట్రిలియన్ సంవత్సరాలు.

## 67. అనేక భారత కావ్యాలు - శ్లోక సంఖ్యలు

**నీలకంఠ – 95826; కుంభకోణం–98545; భండార్కర్–94246**

1) **సంస్కృత (75000 – 100000 శ్లోకాలు)** – ఉత్తరదేశ, దాక్షిణాత్య ప్రతులు.

బొంబాయి, బెంగాల్, కుంభకోణం, P.P. శాస్త్రి (దాక్షిణాత్య), పూనా ఎడిషన్లు (Bori Edition) (Bhandarkar Oriental Research Institute) వీటిలో ముఖ్యమైనది Bombay Edition - నీలకంఠ చతుర్ధరుడి వ్యాఖ్యతో కూడినది (17వ శతాబ్దం).

1259 వ్రాత ప్రతులను పరిశీలించాక Bori ఎడిషన్ వచ్చింది. సంక్షిప్తం చేయనివి– 1) వివేక్ దిబ్రాయ్, 2) M.N. దత్, 3) కిషోర్ మోహన్ గంగూలి, 4) చికాగొ ప్రెస్ – చికాగొ యూనివర్సిటీ, 5) Clay Sanskrit Library, 6) రమేష్ మీనన్.

2) **బెంగాలి –** కాళీ ప్రసన్న

3) **హిందీ –** గీతాప్రెస్

4) **Bori ఎడిషన్ (హిందీ)** – S.D. సత్వేల్కర్

5) **350 పేజీల మహాభారతాలు** – సి. రాజగోపాలాచారి, జయమ్

6) **అస్సామీస్ –** రామ సరస్వతి (16వ శతాబ్దం)

7) **బెంగాలి –** కవి సంజయ్ (16వ శతాబ్దం), కాశీరాం దాస్ (1650)
మహాభారత – రాజశేఖర్ బాసు (1943)

8) **కన్నడ –** భారతం పట్టు – అయ్యనిప్పల్ల అసన్ – వ్యాఖ్యాత పి.కె. నారాయణ పిళ్లై; భరతమాల–నిరాణత్ శంకర పణిక్కర్ – వాఖ్యాత డాక్టర్ పొన్నార సరస్వతి; భారతం–నిర్ణాత్ రామపనిక్కర్ (15వ శతాబ్దం); చెరుస్సెరి భారతం – చెరుస్సెరి నంబూద్రి (15వ శతాబ్దం), శ్రీమమాభారతం కిల్లిప్పాత్తు – తుంచత్తు రామానుజన్ ఎజుత్తాచన్ (16వ శతాబ్దం); కుమార వ్యాసుడి (నారాయణప్ప 1419–1446); భారతం – కర్నాట భారత కథామంజరి (దశపర్వ భారతం).

9) **మరాఠి –** ముక్తేశ్వర్ (1660); మోరొపంత్ (1749)

10) **ఒరియా –** సరళాదాస (15వ శతాబ్దం)

11) **తమిళం –** పెరుందేవనార్ (8వ శతాబ్దం); విల్లు పుతురార్ భారతం (14వ శతాబ్దం).

12) **తెలుగు –** కవిత్రయ భారతం (1100 – 1400 AD)

13) **ఇతర భారతాలు :** భీల్ భారతం (భీల్ తెగ); తరుబర్క నాచ్ (దనగౌర తరు–నేపాల్); ఇండొనేషియన్ మహాభారత; జైన మహాభారతం; గోండు (చత్తీస్‌ఘర్) మహాభారతం.

**14)** **ఆధునిక రచనలు :** రమేష్ మీనన్; జయ-దేవదత్త పట్నాయక్; Illustrated Maha Bharata; The Difficulty of Being Good - Gurucharan Das; Maha Bharata - Kamala Subramaniyam; Maha Bharata Unravelled - Ami Ganatra; The Palace of Illusions - Chitra Banerjee; Mrityunjaya - Shivaji Savant; Yuganta - Iravati Karve; Vrubhanga - Bhasa; Rashmi Rathi 8 Kurukshetra (R.S. Dinakar).

**15)** **Mahabharata** - Amar Chitra Katha
Sonkshipta Mahabharata - D. Smith - Penguin

**16)** **పర్షియన్ -** రాజ్మనామా (అక్బర్ ఆజ్ఞతో)

## మహాభారతంలో మరల మరల కొద్ది మార్పులతో వచ్చే ఘట్టాలు

1) ఉదంకోపాఖ్యానం, 2) షోడశ మహరాజుల చరిత్ర, 3) పరశురామ చరిత్రం,
4) సాంఖ్య, యోగ సిద్ధాంతాలు, 5) తీర్థయాత్రలు-మహాత్మ్యాలు, 6) సువర్ణష్ఠీవి కథ.

# 68. ఇండోనేషియా భారతంలోని కొన్ని విశేషాలు

1) భీష్మడిని ప్రేమించిన అంబ అతడిని మరణం తరువాతనైనా చేరుకోవాలని పరితపిస్తూ అతడి మరణాన్ని వేగవంతం చేస్తుంది, భీష్మడికి స్వేచ్ఛామృత్యువు ఉన్నది కనుక.

2) శిఖండిని అర్జునుడిని వివాహం చేసుకుంటుంది.

3) భానుమతికి అర్జునుడంటే ప్రేమ. దుర్యోధనుడిని తండ్రి ఆజ్ఞ ప్రకారం పెళ్లి చేసుకుంటుంది (స్వయంవరంలో కర్ణుడి సాయంతో భానుమతిని ఆమె సోదరిని దుర్యోధనుడు ఎత్తుకుని వస్తాడు హస్తినాపురికి).

4) గాంధారి పాండురాజును ప్రేమిస్తుంది కాని అంధుడైన ధృతరాష్ట్రుడిని వివాహం చేసుకోవాల్సి వస్తుంది భీష్మడి వలన. అందుకే భీష్మడిపై కోపంతో గాంధారి కళ్లకు గంతలు కట్టుకుంటుంది తన నిరసన తెలియజేయడానికి. ఇండోనేషియన్ గాంధారి దుష్టమహిళ. పాండవుల రక్తం కళ్ల చూడాలనుకున్నదామె.

5) కుంతి సూర్యుడి వలన గర్భవతి కాగా అతడిని తన చెవిగుండా ప్రసవిస్తుంది. కర్ణము నుంచి బయట పడినాడు కనుక కర్ణుడైనాడు. పుకారు చెవులకు తెలుస్తుంది కనుక కావచ్చును.

6) విదురుని కుమారుడు సంజయుడు. కుమార్తెలు పద్మశారి నకులుడిని, పద్మావతి సహదేవుడిని వివాహం చేసుకుంటారు. అందుకే విదురుడు పాండవ పక్షపాతి.

(**వాయాంగ్ కులిత్-** చర్మపు ఛాయ లేదా నీడ. తోలుబొమ్మలాట, కీలుబొమ్మలు (గొలెక్). తోలుబొమ్మలు (కులిత్) లేదా నటులతో (ఒరంగ్) ప్రదర్శితమయ్యే రూపకాలలో తోలుబొమ్మల నాడించే కళాకారుడిని 'దలాంగ్' అని పిలుస్తారు. తమిళ, ఆంధ్ర దేశంలో ఇది తోలుబొమ్మలాటగా, తొగలుగొంబయి ఆట్ట (కర్ణాటక), తొలుపవ కూట్టు (కేరళ)లో ప్రసిద్ధికెక్కింది. రూపోపజీవనులు ఈ కళాకారులు.)

**7)** **శంతనుడు-సత్యవతి-పరాశర-వ్యాసుడు :**

ఈ కథలో సత్యవతి మత్స్యగంధిని దుర్గంధిగా మత్స్యరాజును విరాటరాజు దుర్గంధనుడిగా పిలుస్తారు. పరాశరుడు దుర్గంధిని పెళ్లి చేసుకోగా వారికి అయిదుగురు పిల్లలు పుడతారు. నలుగురు సోదరులు విరాటరాజు కొలువులో పనిచేస్తారు. కుమార్తె రక్తవతి విరాటరాజును పెళ్లి చేసుకుంటుంది. పరాశర-సత్యవతులు విరాటరాజు భవనంలో నివసించగా వారికి కృష్ణ ద్వైపాయనుడు జన్మించాడు.

నారదుడు చెప్పినాక పరాశరుడు, కృష్ణ ద్వైపాయనుడు శతశృంగం వెళ్లిపోతారు. సత్యవతి శంతనుడిని వివాహం చేసుకుంటుంది. వీరి పుత్రులు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు. శంతనుడు పంపగా భీష్మడు వెళ్లి అంబ, అంబిక, అంబాలిక (కాశీరాజు కుమార్తెలు)లను తెస్తాడు. అంబ అంతకుముందు సాల్వుడిని ప్రేమించినా భీష్మడి వీరత్వం చూసాక ఇతడిని ప్రేమిస్తుంది. అంబను సాల్వుడి దగ్గరకు పంపించడానికి ఎంత ప్రయత్నించినా ఒప్పుకోదు.

విల్లుకు బాణం సంధించి ఆమెను బెదిరించబోగా పొరపాటున బాణం వెళ్లి అంబకు తగిలి భీష్ముడి చేతులలోనే ఆమె కన్నుమూసింది. పశ్చాత్తాపంతో భీష్ముడి మనసు కరిగి అతడికీ అంబపై ప్రేమ కలుగుతుంది.

చెరుస్సెరి భారతంలో కూడా అంబ, భీష్ముని ప్రేమించి వ్యాసుడి సలహా అడుగుతుంది.

8) **కుంతి :** శూరసేనుడి కుమార్తె కుంతిభోజుడింట పెరుగుతుంది. ఒక సంవత్సరం పాటు దుర్వాసమునికి సేవలు చేస్తుంది కన్యగా ఉన్న కుంతి. తొలి రజస్వల కాగానే దుర్వాసుడి మంత్రాన్ని పరీక్షించగా సూర్యుడి వలన ఆమె గర్భవతి అయి చెవి (కర్ణము) ద్వారా పుత్రుడిని కంటుంది. అందుకే అతడు కర్ణుడని పిలువబడినాడు. (ఇటువంటి కథ 'భీల్' భారతం, కేరళ చెరుస్సూరి భారతంలో ఉన్నది).

పుంతదేవొ (ధర్మరాజు), బ్రాతసేన (భీముడు), పర్మాది (అర్జునుడు) పాండురాజుకు దేవతల అంశలతో పుట్టారు.

9) **లక్క ఇల్లు :** లాక్షాగృహ దహన సమయంలో పాండవులు, కౌరవులు వారణావతంలోనే ఉంటారు. పాండవులున్న ఇంటికి శకుని, కర్ణుడు నిప్పంటిస్తారు. నారదుడి వలన విషయం తెలిసి పాండవులు తెల్ల ఉడుత-గరంగన్ దారి చూపగా సొరంగ మార్గాన అడవికి పోతారు (కేరళ భారతం పట్టులో కూడా ఈ కథ ఉన్నది).

10) **యుధిష్ఠిరుడు :** పుంతదేవొ, గుణ తలిక్రమ ఇతడి పేర్లు. కృష్ణుడితడిని సామియాజి అని పిలుస్తాడు. ఇతడి వద్ద వంశ పారంపర్యంగా వచ్చిన జముస్ కలిమసద, ఇల్మసెజతి అనే పవిత్ర వస్తువులున్నాయి. ధర్మరాజుకు కోపం వస్తే పెద్ద తెల్లటి భూతంలా ఉబ్బిపోతాడు.

మోలిమో అనే భూతం ఆవేశించడంతో అతడు కౌరవులు, శకుని జూదానికి ఆహ్వానించినపుడు కాదనలేకపోతాడు.

వనమార్త అడవిలో ధర్మరాజు ఓ పెద్ద రాక్షసుడిని ఓడించి చెవిపోగులు గెలుస్తాడు.

ధర్మరాజుకు ఇద్దరు భార్యలు- ద్రుపది, దేవి కుంతులవిలాతి. ధర్మరాజు-ద్రుపదిల కుమారుడు పంచవాల భారతయుద్ధం తరువాత హస్తినకు రాజవుతాడు.

11) **భీముడు :** ఆర్య బ్రతసేన, వాయు తనయ, దండం వచన, కుసుమవలిగీత, బొందం ఏకసజనందు, సత్రియజొడిపతి. ఆధ్యాత్మిక జ్ఞానం, సత్యదీక్ష కలవాడు. మానవభాష (Ngoko) మాట్లాడతాడు. చాలా అరుదుగా దేవభాష (క్రొమొఇంగిల్)లో సంభాషిస్తాడు. సాదాసీదా మనిషి. ద్రౌపది కాక ముగ్గురు భార్యలు.

నాగగిని (నాగ కుమార్తె), దేవి ఉరంగ ఆయు భార్యలు. నాగగిని వలన అనంతరెజ జన్మిస్తాడు. ఇతడు మహావీరుడు. అయితే ఇతడు ఎవరి అడుగుజాడను తాకితే అతడు మరణించాల్సిందే. కృష్ణుడికి తెలుసు ఇతడు బలరాముడితో పోరాడాలి భారత యుద్ధంలో. బలరాముడు ఇతడిని గెలవలేడు. అందుకని అనంత రెజను మాయోపాయంతో అనంతరెజ అడుగు జాడలోనే నడిచేట్లు చేసి చనిపోయేట్లు చేస్తాడు. (బర్బరీకుడి కథలా).

దేవి ఉరంగ ఆయు సముద్రుడి కుమార్తె. వీరి పుత్రుడు అనంతసేనుడు. ఇతడు దేవుళ్లను అడుగుతాడు తన తండ్రులు గెలవాలంటే ఏం చెయ్యాలని. నీవు భూతంగా మారి వాళ్లను రక్షించాలి -అన్నారు వాళ్లు. ప్రాణత్యాగం చేసి భూతంగా మారినాడు అనంతసేనుడు. తరువాత చిన్నచిన్నగా, సూక్ష్మరూపుడై స్వర్గం చేరుకుంటాడు.

అరుంబి వలన ఘటోత్కచుడు జన్మిస్తాడు.

అనంతరేజ కొడుకు దనుర్విండ పరీక్షిత్తుకు మంత్రి అవుతాడు.

శశికిరణ (ఘటోత్కచుడు అర్జునుడి కుమార్తె 'పరిగ్రీవ'కు జన్మించినవాడు) పరీక్షిత్తుకు సేనాధిపతి అవుతాడు.

12) **అర్జునుడు-పర్మాది;**

రుక్మిణి కృష్ణుల వివాహ సమయంలో కౌరవులతో కలిసి కృష్ణుడిపై యుద్ధం చేస్తాడు.

ఇతడికి అనేకమంది భార్యలు:- ద్రౌపది, దేవి జిమాంబాంగ్, సుభద్ర, శిఖండిని, లారసతి, సుప్రభ (నివాతకవచుడిని ఓడించినపుడు ఇంద్రుడు అతిలోకసుందరి సుప్రభను అర్జునుడికిచ్చి పెళ్లి చేస్తాడు), ద్రెసనాల, విలుతమ, భానుమతి, పలూపి (ఉలూపి) మరో రిషికన్య.

బాతారగురు (ఇంద్రుడు) కిలాతవర్ణుడిగా అర్జునుడితో యుద్ధం చేసి పాశుపతాస్త్రం ఇస్తాడు (కిరాతార్జునీయంలానే). ఏడు రోజులు స్వర్గాన్ని పాలిస్తాడు అర్జునుడు.

భానుమతి అర్జునుడిని ప్రేమిస్తుంది కాని దుర్యోధనుడిని వివాహం చేసుకోవాల్సి వస్తుంది. దుర్యోధనుడు చనిపోయాక అర్జునుడిని పెళ్లాడ్తుంది కాని అశ్వత్థామ ఆమెను చంపివేస్తాడు.

పల్గునాది (ఏకలవ్యుడు) ద్రోణుడి వద్దకు వచ్చి విలువిద్య నేర్పమంటే తన ఉద్యోగం పోతుందని ఒప్పుకోడు ద్రోణుడు. అతడు ద్రోణుడిని గురువుగా భావించి సాధన చేసి గొప్ప విలుకాడవుతాడు. గురుదక్షిణగా ద్రోణుడు పల్గునాది వంశ పారంపర్య 'రానింగ్ అంపాల్' వస్తువు నడుగుతాడు. తనను శిష్యుడిగా చేర్చుకున్నాడని పల్గునాది ఆ పవిత్ర వస్తువు నివ్వగా బలహీనుడైన పల్గునాదిని చంపివేస్తాడు ద్రోణుడు. అతడు ద్రుష్టద్యుమ్నుడిగా పుట్టి పగతీర్చుకుంటాడు. అతడి గుర్తుగా ద్రోణుడు అర్జునుడికి ఫల్గునుడు అని పేరు పెడతాడు. పల్గునాది భార్య దేవి అంగరైని. అర్జునుడి ప్రేమను తిరస్కరిస్తుంది. భర్త చనిపోయినాక కూడా.

అర్జునుని కుమారులు- ద్రెసనాల కొడుకు విసంగ్గెనుడు భారత యుద్ధం ముందు అదృశ్యమైనాడు; విలుతమ కొడుకు విలుగంగ, సుభద్ర కొడుకు అభిమన్యుడు. ఇతడికి దేవి ఉత్తరి వలన పరీక్షిత్తు జన్మిస్తాడు. కృష్ణుడి కుమార్తె సీతిసుందరి (శశిరేఖ) ఘటోత్కచుని సాయంతో అభిమన్యుడిని పెండ్లాడ్తుంది. శశిరేఖ కోసం వాళ్లు దుర్యోధనుడి కుమారుడు లక్కున్‌తో పోరాడతారు.

ఉలూపి కొడుకు బంబంగ్ ఇరవన్; ఇతడు కృష్ణుడి కుమార్తె తితిసారిని పెళ్లాడినాడు. ఈ వివాహానికి సీతిసుందరి సాయం చేస్తుంది.

లారసతి కుమారుడు బంబంగ్ సుమిత్ర.

రిషికన్య కొడుకు ప్రియంబద. ఇతడు, శిఖండి కలిసి నివాతకవచుడి కుమార్తె ముస్తకవేణి దొంగిలించిన పాండవుల వంశపారంపర్య వస్తువైన 'కలిమసద'ను తీసుకువస్తారు. ఆ తరువాత ప్రియంవద- ముస్తకవేణిల వివాహమవుతుంది.

ప్రెగివ, ప్రెగివతిలు అర్జునుడి కుమార్తెలు. వీరిని ఘటోత్కచుడు పెండ్లాడతాడు.

కుంతవిజయ (శక్తి-ఏకాఘ్ని) అనే బాణాన్ని అర్జునుడిని చంపడానికి కర్ణుడు దాచి ఉంచుతాడు.

బాతారగురు కుంత విజయాన్ని అర్జునుడికివ్వాలని వచ్చినపుడు అర్జునుడు కర్ణుడు ఒక్కలానే కనిపిస్తారు కాబట్టి పొరపాటున ముందు కర్ణుడికిచ్చి తప్పు తెలుసుకుంటాడు. అర్జునుడు, కర్ణుడు ఒకరి నుంచి ఒకరు లాక్కోబోతే కర్ణుడి చేతికి బాణం దొరుకుతుంది. అర్జునుడి చేతిలో దాని అమ్ములపొది మిగుల్తుంది. ఆ 'కుంతవిజయ' బాణంతో కర్ణుడు ఘటోత్కచుడిని చంపుతాడు.

బాతారగురు ప్రత్యక్షమైనపుడు అర్జునుడు పాండవుల రక్షణను కోరతాడు కాని పాండవపుత్రుల గురించి అడగడు. అందుకే పాండవుల పుత్రులు వీరమరణం పొందుతారు.

అర్జున, కర్ణులు రూపురేఖల్లో ఒకేరకంగా ఉంటారు. కనుక స్వయంవర సమయంలో ద్రౌపది కర్ణుని చూసి అతడే అర్జునుడనుకుని ప్రేమగా చూస్తుంది. (చెరుస్సెరి భారతంలో కూడా ఇలానే చెప్పబడింది).

13) కంసుడు బలరామ (కక్రసన), కృష్ణులను కోడిపందేలకు పిలుస్తాడు, అక్కడ చంపాలనే ఉద్దేశంతో. బలరామకృష్ణులతో పాటు భీముడు, అర్జునుడు వెళ్తారు. భీముడు సురత్రిమంత్రుడిని (చాణూరుడు), అర్జునుడు కంసుడిని చంపుతారు.

## 69. జైమిని భారతం

కురుక్షేత్ర యుద్ధాన్ని ఆసాంతం చూసినవారెవరు?

1) ఇరవణన్ లేదా బర్బరీకుడి ఖండిత శిరస్సు.
2) కపిధ్వజం పైనుంచి కపిరాజు (హనుమంతుడు)
3) దేవతలు
4) నాలుగు పక్షులు- ఇది జైమిని భారతం.

వ్యాసుడు చెప్పిన 'జయం' కథను విన్నాడు వ్యాసుడి శిష్యుడు జైమిని. అనేక సందేహాలు వచ్చాయి. వ్యాసుడు అందుబాటులో లేడు. మార్కండేయ మహర్షి నడిగాడు జైమిని. ఆ సమయాన మార్కండేయుడు మౌనవ్రతంలో ఉన్నాడు. అతడి శిష్యులు చెప్పారు– కురుక్షేత్ర యుద్ధం ప్రారంభమైనపుడు ఓ పక్షి ఎగుర్తూ యుద్ధరంగాన్ని దాటిపోతున్నపుడు బాణం తగిలి క్రిందపడి చనిపోయేముందు నాలుగు గుడ్లు పెట్టింది ఇసుకలో. ఓ యుద్ధపు ఏనుగు మెడలో గంట తెగి ఆ గుడ్లమీద పడి వాటిని కప్పగా వాటినుంచి నాలుగు పక్షులు జనించాయి. అవి కురుక్షేత్రంలోనే పుట్టాయి కనుక ఆ గంట క్రిందనే ఉండేవి. నాలుగు దిక్కులకు ఎగిరి యుద్ధాన్ని చూసాయి.

మార్కండేయుడి శిష్యుల మాటలు విని జైమిని ఆ పక్షులనడిగాడు తనకు వచ్చిన సందేహాలను ప్రశ్నలుగా. అవి తాము చూసిన విషయాలు చెప్పాయి.

జైమిని పూర్వమీమాంస కర్త (కర్మమీమాంస). జైమిని సూత్రాలు వ్రాసినాడు. జైమిని భారతంలో ఇప్పుడు లభ్యమవుతున్నది అశ్వమేధ పర్వం మాత్రమే. మరో రచన సహస్రముఖ రావణ చరితం (సీతా విజయం); జైమిని భారతం (కన్నడ) లక్ష్మీస;

## 70. రాజ్మనామా (Razmnama) - Book of War

క్రీస్తుశకం 1574లో అక్బర్ పాదుషా ఫతేపూర్ సిక్రి (కొత్త రాజధాని)లో మక్తబ్‌ఖానా (House of Translation) ఏర్పాటు చేసి రాజతరంగిణి, రామాయణం, మహాభారతం గ్రంథాలను పర్షియన్ భాషలోకి అనువదించమని ఆజ్ఞలు జారీ చేసినాడు.

రజ్మ్ (పర్షియన్)–యుద్ధం; నామా (కథ). హిందూ పండితులు చెబుతుంటే ముస్లిం పండితుడు నఖిబ్ ఖాన్ పర్షియన్ భాషలోకి అనువాదం చేసి చెప్పగా ఫయాజ్ దానిని వచనం, కవిత్వంలోకి మార్చి వ్రాసేవాడు.

**ముస్లిం పండితులు :** నఖిబ్ ఖాన్ – ఫయాజ్

**హిందూ పండితులు:** దేవమిశ్ర, శతావధాన, మధుసూదన మిశ్రా, చతుర్భుజ, శాక్యభవన (హిందీ)

నఖీబ్‌ఖాన్ – పర్షియన్ అనువాదం (ఏడాదిన్నర సమయం)

షేక్ అబ్దుల్ ఫయాజి – కవిత్వీకరణ

మొదటి ప్రతి (1584–1586) – 170 పెయింటింగ్స్

రెండవ ప్రతి (1598–1599) – 161 పెయింటింగ్స్

## 71. కన్నడ భారతం

కుమార వ్యాస కలం పేరుతో నారాయణప్ప (1419–1446) కర్నాట భారత కథామంజరిగా దశ పర్వ మహాభారత (గడుగిన భారత)గా బహమని శత్పది ఛందస్సులో వ్రాసినాడు. దుర్యోధన–భీమ గదాయుద్ధంతో ముగుస్తుందీ కావ్యం. అద్భుతమైన వర్ణనలు, అలంకారాలతో అత్యంత ప్రసిద్ధికెక్కింది.

లక్ష్మీస (Lakshmisa) జైమినీ భారతాన్ని కన్నడంలోకి అనువదించాడు (15వ శతాబ్దం). ఉపమాలోల, నాదలోల ఇతడి బిరుదులు. వర్ధకశత్పది ఛందస్సులో అశ్వమేధ పర్వాన్ని వ్రాసి పేరుపొందినాడు.

## 72. భిల్ల భారతం

దుర్గ, శక్తి స్వరూపిణి పక్షిరూపంలో ఎగుర్తున్నపుడు సప్తర్షుల త్రిశూలానికి గుచ్చుకునగా దాని ఎముకల నుంచి గాంధారి, రక్తమాంసాల నుంచి కుంతి జన్మించారు.

ఒక రాత్రి పాండవులు కుంతీదేవి అడవిదున్నను అధిరోహించి వస్తుంటే ఇంద్రాది దేవతలు ఆమెకు మొక్కడానిని గమనించి ఆమెను శక్తిస్వరూపిణిగా గ్రహించారు.

పాండవులు అరటితోటలో ఓ పెద్ద అరటి చెట్టు బోదెలో అయిదుగురూ ఒకేసారి ద్రౌపదిని చూసారు. అందుకే ఆమె అయిదుగురికి భార్య అయ్యింది. ద్రౌపదిని కూడా వాళ్లు వ్యాఘ్రవాహినిగా వస్తుంటే దేవతలు మొక్కడం గమనించారు.

ఇంద్రుడి భార్య శచి తనను సప్తర్షులు కామదృక్కులతో చూసినా ఇంద్రుడు వారిని మందలించలేదని వెళ్లి అభిమన్యుడిని పెండ్లాడుతుంది.

ఒకరోజున పాండవులు ఒక సరస్సులో నీళ్లు తాగడానికి వెళ్తే జలయోగిని అనే జలకన్య తనను వివాహం చేసుకున్న వారికే ఆ నీళ్లు తాగే అర్హత ఉంటుందంటుంది. పెద్దవాళ్లు నలుగురు ఆమె మాట వినకుండా నీళ్లు తాగి పడిపోతారు. సహదేవుడు ఆమెను వివాహం చేసుకున్నాక అందరూ బ్రతుకుతారు.

అర్జునుడు నాగలోకం వెళ్లినపుడు పాములు కరిచి చనిపోతాడు. నాగరాణి అతడిని ప్రేమించి తండ్రి అమృతాన్ని ఇవ్వనంటే ఆత్మహత్య చేసుకోబోతుంది. దానితో అతడు అమృతాన్ని ఇచ్చి అర్జునుడిని బ్రతికించి ఇద్దరికి వివాహం చేస్తాడు.

వాసుకి సర్పరాజుతో ద్రౌపది కొన్నాళ్లు కాలం గడుపుతుంది. ఆ తరువాత అతడిని వదిలివేస్తుంది.

కృష్ణుడు రాధల మధ్య వివాదం వియోగమై, మరల కృష్ణుడు గాజులమ్మేవాడి రూపంలో ఆమెను గెలుచుకుంటాడు.

భిల్లు తెగలలోని స్త్రీల స్వేచ్ఛకు ఈ కథలు అద్దం పడతాయి.

## 73 బెంగాలి భారతం

కవి సంజయ వ్రాసిన బెంగాలీ భారతంలో చిత్రాంగదుడు క్షయవ్యాధిగ్రస్థుడై మరణిస్తాడు. విచిత్రవీర్యుడు భీష్ముడి భవనానికి వెళ్లినపుడు భీష్ముడి పెంపుడు ఏనుగు తొక్కగా మరణించాడు. ఆ సమయంలో భీష్ముడు లేడు. విచిత్రవీర్యుడిని అటుగా రావద్దని హెచ్చరించినా వినలేదతడు.

## 74. ఒరియా భారతం

సరళాదాస్ వ్రాసిన ఒరియా భారతంలో కుంతీదేవి అప్పుడే ప్రసవించిన భీముడి నెత్తుకుని నడుస్తుంటే పులి ఆమెపై దూకబోతుంటే ఆమె శిశువును జారవిడవగా గట్టిరాయిపై పడగా ఆ రాయి ముక్కలయ్యింది. శిశువు కాలు తగిలి బాధతో పులి అరుస్తూ పారిపోయింది. ముక్కలైన శిలలు స్థానిక దేవతలుగా పూజలనందుకుంటున్నవి.

ఒరియా భారతంలో ఇంకో ముఖ్యమైన ఘట్టం- వనవాస కాలంలో అర్జునుడిని పరీక్షించేందుకు శ్రీకృష్ణుడు నవకుంజర అనే రాక్షసుడు- ఏనుగు, గుర్రం, ఎద్దు, పులి, గుర్రం, నెమలి, కోడిపుంజు, మనిషి, పాములా తొమ్మిది లక్షణాలున్న జంతువుగా వచ్చి అర్జునుడిని భయపెట్టబోగా ఆ రాక్షసుడి చేతిలోని వివిధ ఆయుధాలతోపాటు పద్మాన్ని చూసి కృష్ణుడిని గుర్తుపట్టినాడు అర్జునుడు. దేవుడే తనకు అండగా ఉన్నపుడు దైవ సృష్టిలోని ఏ రాక్షస జంతువు గురించి భయపడనక్కర్లేదు కదా!

## 75. స్నేహధర్మం-శత్రుభావం

1) **దుర్యోధనుడు-కర్ణుడు :** ఒకరి గొప్పతనాన్ని ఒకరు గుర్తించడం. "వాడొకడే నాకోసం పోరాడేది" అన్నాడు దుర్యోధనుడు.

2) **అర్జునుడు-కృష్ణుడు :** నరనారాయణులు-గత జన్మ బంధం. స్నేహితులు, బంధువులు; మానవ-దైవ శక్తుల రూపాలు.

3) **కృష్ణుడు-సుదాముడు :** అతడు ధనికుడు ఇతడు కుచేలుడు. స్నేహితుడు అడగకుండానే తనకున్న సంపదలను ఇచ్చినాడు.

4) **ద్రుపదుడు-ద్రోణుడు :** సహాధ్యాయులు; పరిచయస్తులు. తరువాత కాలంలో విరోధులు
"కొద్దికాలం అతడు నాతోపాటు చదువుకున్నాడు, నాకు సమానుడు కానివాడు నాకు స్నేహితుడు కాలేదు" అన్నాడు ద్రుపదుడు.
"నా తండ్రి శిష్యుడు, సహాధ్యాయి" - స్నేహితుడు కదా సాయం చేస్తాడనుకున్నాడు ద్రోణుడు.

5) **దుర్యోధనుడు-సాత్యకి :** గొప్ప స్నేహితులు.

## 76. స్త్రీ - నలుగురు భర్తలు

మొదటి భర్త - చంద్రుడు; రెండవ భర్త - విశ్వవసు-గంధర్వుడు
మూడవ భర్త - అగ్ని; నాలుగవ భర్త - మానవ భర్త

ద్రౌపది అయిదుగురు భర్తలను కలిగి ఉన్నది గనుక శాస్త్రపు పరిమితి దాటింది. అందుకే ఆమె బంధకి అయ్యింది. కుంతీదేవికి పాండురాజు, ధర్ముడు, వాయుదేవుడు, ఇంద్రుడు నలుగురి వరకు శాస్త్ర సమ్మతమే. మొదటి భర్త సూర్యుడి గురించి చెప్పలేకపోయిందందుకే.

**తొలిరాత్రి హక్కు**

Droit du Seigneur (Right of the Lord), Jus Prima Noetis; Prima noeta

ఒకప్పుడు ఈ హక్కు రాజులకు, పూజారులకు ఉండేది.

# 77. ప్రమీలార్జునీయం అను అర్జున-అయిలి ప్రేమగాథ

దక్షిణాపథపు మధురానగరి రాణి అయిలి (ప్రమీల). ఆమెను యుద్ధంలో ఓడించగలిగినవాడెవడూ లేదు. అర్జునుడు ఆమెను ప్రేమించాడు. కాని ఆమె పురుషద్వేషిణి. శ్రీకృష్ణుడి సాయంతో అర్జునుడు పాముగా మారి అంతఃపురంలోకి ప్రవేశించి ఆమె మెడలో తాళి కట్టినాడు. తెల్లవారే అల్లి తన మెడలో మంగళసూత్రం చూసుకుని దానిని తెంచడానికి ప్రయత్నిస్తే అది తెగదు. కట్టినవాడు అర్జునుడని తెలిసి హస్తినపై దండెత్తుతుంది ఆమె తన స్త్రీ సైన్యంతో. అందరూ ఓడిపోతారు అర్జునుడితో సహా. అయితే సహదేవుడి ఉపాయం వలన ఆమె బంధించబడుతుంది. విముక్తికి ఒకటే మార్గం. అర్జునుడిని వివాహం చేసుకోవడం. వివాహమైన వెంటనే ఆమె మధురై నగరానికి వెళ్లిపోతుంది. అర్జునుడి వలన తనకు పుట్టిన కుమారుడిని తండ్రిపై పగ తీర్చుకునేందుకు శిక్షణనిస్తుంది.

# 78. ద్రౌపది - సుభద్ర

ఇంద్రప్రస్థానికి రాణి, అయిదుగురు పాండవులకు ఉమ్మడి భార్య, ఇంకో స్త్రీని రాణిగా రానిస్తుందా? సుభద్ర అర్జునులు అందుకే భయపడినారు. యాదవ సేనను ఓడించడమంత సులభం కాదు యాజ్ఞసేనిని ఒప్పించడం. శ్రీకృష్ణుని సలహాతో గోపికాస్త్రీ వేషంలో ప్రాధేయపడింది సుభద్ర. "నేను నా భర్తతో లేచిపోయివచ్చాను. నీ ఆశ్రయం కావాలి" –అన్నది సుభద్ర. ద్రౌపది అన్నది– "నిన్ను నా చెల్లెలులా చూసుకుంటాను ఉండిపో!"

సుభద్ర అన్నది– నేను నీ చెల్లెలినే! కృష్ణుడి సోదరిని, సుభద్రను. అర్జునుడిని ప్రేమించి నా అన్న బలరాముడిని ఎదిరించి వచ్చాను చిన్నన్న శ్రీకృష్ణుడి సలహాతో. ఒక కృష్ణుడు సలహా ఇచ్చాడు, ఇంకో కృష్ణుడు లేపుకు వచ్చాడు. ఇంకో కృష్ణ ఆశ్రయమిచ్చింది. అలా వాళ్ల మధ్య సఖ్యత ఏర్పడింది.

బలరాముడు సుభద్రను దుర్యోధనుడికిచ్చి పెళ్లి చేద్దామనుకున్నాడు అన్నమాటతో సుభద్రను అంగీకరించింది ద్రౌపది. అంతేకాక ద్రౌపది సోదరి శిఖండిని కూడా అర్జునుడిని ప్రేమించింది.

తమిళ భారత కథలో ద్రౌపది శక్తిస్వరూపిణి, వీరపాంచాలి. ఆమె నిరంకుశంగా ఉండి పాండవుల ఇతర భార్యలను ఇంద్రప్రస్థంలో ఉండనివ్వలేదు. ఆమె ముఖ్య చెలికత్తె ఆమె అంతఃపుర రక్షకుడైన ముత్తల్ రవుత్తన్ కుమార్తె. అతడు చిన్న రాజ్యానికి రాజు అతడి కుమార్తె యుధిష్ఠిరుని భార్య అయినప్పటికి అతడు ద్రౌపదిని దేవతగా భావించి ఆమెకు నమ్మకస్తుడైన సేవకుడిగా ఉండిపోయాడు.

# 79. కృష్ణార్జున యుద్ధం

గయుడనే గంధర్వరాజు విమానంలో పోతూ తాంబూలం నమిలి ఉమ్మివేసాడు. అది దిగువన సూర్యుని ఆరాధిస్తున్న శ్రీకృష్ణుని దోసిలిలో పడింది. అతడి తల నరుకుతానని ప్రతిజ్ఞ చేసి బయల్దేరాడు శ్రీకృష్ణుడు.

గత్యంతరం లేని గయుడు ఇంద్రప్రస్థం చేరుకుని సుభద్రార్జునుల శరణు కోరినాడు. అర్జునుడు అభయమిచ్చినాడు శరణాగతి పరమధర్మం కనుక, గయుడి శత్రువు శ్రీకృష్ణుడని తెలియక. తెలిసేప్పటికి ఆలస్యమయ్యింది.

ఇద్దరి మధ్య యుద్ధం మొదలై ముల్లోకాలు గజగజ వణికాయి. దేవతలు సంధి కుదిర్చారు. గయుడి తల నరికాడు శ్రీకృష్ణుడు. బ్రహ్మ గయుడిని బ్రతికించాడు. ఇద్దరి ప్రతిజ్ఞలు నెరవేరినాయి.

ఈ కథ కర్ణాటక యక్షగానంలోది. 17వ శతాబ్దంలో హలేమక్కి రామ దీనిని వ్రాసినాడు.

# 80. నర - నారాయణులు

అర్జునుడన్నాడు– "గొప్ప విలుకాడైన శ్రీరాముడు సముద్రం మీద అంత కష్టపడి రామసేతువు కట్టి గాని లంకను చేరుకోలేకపోయాడు. నేనైతే బాణాలతో కట్టి సునాయాసంగా లంకకు చేరుకునేవాడిని. నేను కట్టిన బాణాల వంతెన మీదగా ఇంద్రుడి తెల్ల ఏనుగు ఐరావతం నేలకు దిగివచ్చింది".

బ్రాహ్మణవేషంలో ఉన్న హనుమంతుడన్నాడు– "కోతుల బరువును బాణాల వంతెన మోయగలిగేది కాదు. కావాలంటే నీవు ఆ నది మీద వంతెన కట్టిచూడు" అని వెళ్లిపోయాడు.

అర్జునుడు బాణాలతో వంతెన నిర్మించాడు. ఓ పండుముసలి కోతి వచ్చి వంతెన మీద నిలబడగానే అది విరిగి పోయింది. అర్జునుడు ఎన్ని గొప్ప బాణాలు వేసి వంతెన నిర్మించినా కోతి గెంతులకు వంతెనలు విరిగిపోతున్నాయి.

కోతి అన్నది– "రాళ్లయినా, బాణాలయినా వాటిని నిలిపి ఉంచినది రామనామం. ఈసారి రామనామం జపిస్తూ బాణాలు వేసి వంతెన నిర్మించు".

అర్జునుడదే విధంగా చేసినాడు. ఈసారి వంతెన విరగలేదు. వచ్చినవాడు హనుమంతుడని అర్థమయ్యింది అర్జునుడికి.

ఒక బ్రాహ్మణుడు ఎంతో దుఃఖిస్తూ అర్జునుడి వద్దకు వచ్చి అన్నాడు– "నా భార్య ప్రసవించగానే ఎవడో మాయావి ఎత్తుకుపోతున్నాడు ప్రతిసారీ. నేనెన్ని మంత్రాలు పఠించినా, పూజలు చేసినా ప్రయోజనం లేకపోతున్నది".

అర్జునుడన్నాడు– "నేను నా బాణాలతో చీమ చొరరానంత కట్టుదిట్టంగా నీ ఇంటిని కప్పివేసి బయట నేను కాపలా ఉంటాను. నా విధిలో విఫలం చెందితే అగ్నిప్రవేశం చేస్తాను".

బ్రాహ్మణుడి భార్యకు నెప్పులు మొదలయ్యాయి. పండంటి మగశిశువును కన్నది. అందరూ సంతోషపడ్తున్న సమయంలోనే ఆ శిశువు అదృశ్యమైనాడు.

అర్జునుడు అగ్నిప్రవేశం చేయబోతున్నపుడు కృష్ణుడు వారించి రథమెక్కమన్నాడు. సుదర్శన చక్రం వారి రథం ముందు కాంతులీనుతూ వెలుగుతున్నది. పాలకడలి మధ్యలో వారికి కనిపించాడు ఆదిశేష సర్ప శయ్యపై పవ్వళించి ఉన్న శ్రీవిష్ణుమూర్తి. పక్కనే కనిపించారు బ్రాహ్మణుని కుమారులు. విష్ణుమూర్తి అన్నాడు– "మీరిద్దరూ నా అంశతో జన్మించిన నర నారాయణులు. కృష్ణుడు జ్ఞానం, అర్జునుడు కర్మ. జ్ఞాన, కర్మ యోగాల కలయిక ముక్తిమార్గం. అదే విజయ పథం" అని పలికి అదృశ్యమైనాడు దేవదేవుడు.

బ్రాహ్మణుని కుమారులందరిని తీసుకువచ్చి అప్పగించారు కృష్ణార్జునులు.

జనశ్రుతి ప్రకారం అర్జునుడికి చనుమొన ఒక్కటే ఉన్నది. శ్రీకృష్ణుడికి లేవు. అవి పురుషుడిలోని స్త్రీతత్వానికి గుర్తు. అర్జునుడు ఇతర పురుషులకంటె అధికుడు. కృష్ణుడు పూర్ణ పురుషుడు.

నర నారాయణులు తపస్సు చేసిన బదరికాశ్రమ ప్రాంతమే బద్రినాథ్.

## 81. ద్వారావతి - ద్వారక

అనేక వాకిళ్లు లేక ద్వారాలు ఉన్న నగరం ద్వారావతి. అనార్త సామ్రాజ్యాన్ని ఒకప్పుడు రేవతి తండ్రి కకుద్మడు పాలించేవాడు. తన కుమార్తెకు తగిన భర్త గురించి సలహా అడుగుదామని బ్రహ్మలోకం వెళ్లేసరికి అక్కడ గంధర్వులు గానం చేస్తున్నారు. గానసభ ముగిసాక బ్రహ్మకు తాను వచ్చిన పని చెప్పగా బ్రహ్మ అన్నాడు– బ్రహ్మలోకపు భూలోకపు కాలములలో తేడా వల్ల నీవిక్కడ గడిపిన కొద్ది సమయంలోనే భూలోకంలో 27 చతుర్యుగాలు గడిచిపోయాయి. నీ కాలపు జనులందరూ మరణించారు. ఇప్పుడు భూలోకంలో విష్ణువు– ఆదిశేషుడు కృష్ణుడు, బలరామ రూపాల్లో మానవులుగా పుట్టి ఉన్నారు. నీ కుమార్తెను బలరాముడికిచ్చి వివాహం కావించమన్నాడు. కకుద్మడు, రేవతి భూమిపైకి వచ్చేసరికి ప్రదేశం, జనాల్లో చాలా మార్పులు కానవచ్చాయి. జనులు పొట్టిగా ఉన్నారు. వేషభాషలు మారాయి.

తనకంటె పొడుగు, లావుగా ఉన్న రేవతిపై బలరాముడు తన హలాయుధాన్ని (నాగలి) ఉంచగానే ఆమె ఇప్పటి కాలానికి అనుగుణంగా తగ్గిపోయింది. బలరామ రేవతిలకు వివాహం చేసి కకుద్మడు బ్రహ్మలోకం వెళ్లిపోయాడు.

రేవతి అమ్మతల్లి దేవత. విధ్వంసక రూపిణి. దీర్ఘజిహ్వుడనే రాక్షసుడిని స్కంధుడి అభ్యర్థనపై శలవృకి అనే తోడేలుగా మారి రాక్షస మూకను చెండాడగా వాళ్లు పారిపోయి మానవ స్త్రీల గర్భాలలో దాక్కున్నారు. ఆ రాక్షస మూకను చంపి వేసింది రేవతి జటాహారిణి రూపంతో మానవ స్త్రీల గర్భాలలోనే.

దేవీ భాగవతంలో ఆమె షష్ఠిదేవిగా, ప్రకృతికి మరో రూపంగా భావించబడింది.

బలభద్ర మహాత్మ్యంలో ఆమె నాగలక్ష్మిగా ఆదిశేషునికి భార్యగా చెప్పబడినది.

ద్వారావతి 'సప్తపురి'లలో ఒకటి. 1) అయోధ్య, 2) మధుర, 3) హరిద్వార్ (గయ), 4) వారణాసి (కాశి), 5) కంచి, 6) ఉజ్జయిని (అవంతిక), 7) ద్వారక (ద్వారావతి).

అనేక వనాలు, స్వచ్ఛమైన నీటి సరస్సులు, ఇందీవర, అంభోజ, కల్హార, కుముద, ఉత్పలాది కలువలు, పద్మాలతో ఉన్న సరోవరాలు, 9,00,000 రాజభవనాలు, మరకతమణులతో అలంకరించబడిన స్ఫటిక వెండి గోపురాలున్నవి. మణులు తాపడం చేసిన గోడలు, స్తంభాలతో ఉన్నవా భవనాలు.

ద్వారావతి ఒకప్పుడు రైవతకుడనే రాజు క్రీడావనం. పాండవులు అజ్ఞాతవాసానికి విరాటుడి కొలువుకు వెళ్లగా అతడి రథసారథి ఇంద్రసేనుడు ఇతరులు ద్వారకలోనే ఏడాది పాటు ఉన్నారు.

నృగమహరాజు తొండగా పడి ఉండగా కృష్ణుడి వలన అతడు శాపవిముక్తుడైనాడు.

దుర్యోధనుడు, అర్జునుడు కురుక్షేత్ర యుద్ధం ముందు కృష్ణుని కలిసారు.

శ్రీకృష్ణ నిర్యాణానంతరం అర్జునుడు కనులారా చూసినాడు ద్వారకా పట్టణాన్ని సముద్రం ముంచివేయడం.

1988-90 వరకు జరిగిన పరిశోధనలలో 1500 BC లో ద్వారక సముద్రంలో మునిగిపోయినట్లు నిర్ధారించారు.

దేవభూమి ద్వారక జిల్లా-గుజరాత్‌లో ద్వారక ఉన్నది.

## 82. శచీదేవి - ద్రౌపది

పులోముడనే రాక్షసుడి కుమార్తె శచీదేవి. దేవరాణి. ఇంద్రుడి భార్య. వీరి కుమార్తె జయంతి. రాక్షసుల గురువైన శుక్రాచార్యుడు జయంతి భర్త. శుక్రాచార్యుడు జయంతిల కుమార్తె దేవయాని. దేవయాని మొదట దేవతల గురువు బృహస్పతి కుమారుడిని ప్రేమించి విఫలురాలైనది. తరువాత తాత్కాలిక ఇంద్రుడైన నహుషుడి కుమారుడు యయాతిని వివాహం చేసుకోగా ఆమెకు యదువు, తుర్వసులు జన్మించారు. యదు వంశంలో జన్మించారు శ్రీకృష్ణ బలరాములు.

యయాతి ప్రేమించిన యువతి శర్మిష్ఠ. ఈమె రాక్షసరాజు వృషపర్వుని కుమార్తె. వృషపర్వుని ఆస్థాన గురువు శుక్రాచార్యుడు. శర్మిష్ఠ, దేవయానిల మధ్య చీరల గొడవలో శర్మిష్ఠ, దేవయానిని బావిలో పడవేసింది. అటుగా వెళ్తున్న యయాతి ఆమెను రక్షించాడు. దేవయాని కోపం చల్లార్చడానికి వృషపర్వుడు శర్మిష్ఠను ఆమె దాసిగా చేసినాడు. యయాతి దేవయానిని పెండ్లాడినా శర్మిష్ఠను ప్రేమించాడు. శర్మిష్ఠకు ద్రుహ్యుడు, అనుద్రుహ్యుడు, పూరుడు జన్మించారు.

శుక్రాచార్యుడి శాపంతో యయాతికి అకాల వృద్ధాప్యం వచ్చింది. మిగతా కుమారులు ఇవ్వకున్నా ఆఖరి కుమారుడు పూరువు తన యవ్వనాన్ని తండ్రికిచ్చి అతడి వృద్ధాప్యాన్ని తాను తీసుకున్నాడు. ఆ విధంగా ఆఖరి కుమారుడు పూరువుకు రాజ్యార్హత లభించి, పెద్దకొడుకు యదువుకు రాజ్యార్హత పోయింది. పూరువు వంశీయులు కౌరవ పాండవులు.

ఇంద్రుడి భార్య శచీదేవి సప్త మాతృకలలో ఒకరు. పౌలోమి, దేవరాణి, ఇంద్రాణి, చారుధర, శక్రాణి, అయిందిరి, మహేంద్రాణి ఆమె పేర్లు. శచి అంటే దివ్య సుకుమారి, వాక్‌శక్తి; ఈమె సంతానం- జయంతుడు, రుషభుడు, మిధూష, జయంతి, దేవసేన (షష్ఠి). దేవసేన భర్త కార్తికేయుడు.

పంచ ఇంద్రుల అంశలో పుట్టినవారు ధర్మజ, భీమ, అర్జున, నకుల, సహదేవులు. అందుకే అయిదుగురికీ భర్తగా ద్రౌపది అవతరించింది శచీదేవి అంశలో. పంచేంద్రియ శక్తి ఆమె. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు చేసే తప్పొప్పుల్ని భరించింది. అందుకే ఆమె అయోనిజ; వీర పాంచాలి.

## 83. ధర్ముడు-యక్షుడు-హంస లేక కొంగ-మూడు పరీక్షలు

హంసకు క్షీర-నీర న్యాయం తెలుసు. హంస సరస్వతి వాహనం. ధర్ముడు యక్షకొంగ రూపంలో తన కుమారుడి ధర్మశీలతను పరీక్షించాడు. ఇది మొదటి పరీక్ష. ఎవరిని బతికించాలి అని అడిగితే మాద్రి కొడుకు నకులుడిని బతికించమని పలికి ధర్మరాజు, యక్షప్రశ్నల సమయాన పరీక్షలలో ఉత్తీర్ణుడైనాడు.

రెండవసారి ధర్ముడు కుక్కరూపంలో ధర్మరాజుననుసరించాడు. నాతోపాటు వచ్చిన కుక్క రాకుండా నేను స్వర్గానికి రానని అక్కడ రెండో పరీక్షలో విజయుడైనాడు.

మూడవసారి తన సోదరులంతా నరక బాధలు పడుతూ ఉంటే తానూ అక్కడే ఉంటానని పలికి మూడవసారి, ఆఖరి పరీక్షలో ఉత్తీర్ణుడై దివ్యుడైనాడు ధర్మరాజు. ధర్మో రక్షతి రక్షః

ధర్మం ప్రతి మనిషిని పరీక్షిస్తుంది. ఏ రూపంలో అనేది ధర్మానికే తెలుసు. నరుడికి తెలియదు.

# 84. భారత పరమార్థం - భారత సావిత్రి

మాతా పితృ సహస్రాణి పుత్రదార శతానిచ
సంసారేష్వనుభూతాని యాంతి యాస్యంతి చాపరే

హర్ష-శోక స్థాన సహస్రాణి భయస్థాన శతాని చ
దివసే దివసే మూఢమ్ ఆవిశంతి న పండితమ్

ఊర్ధ్వ బాహుర్విరౌమ్యేషః న చ కశ్చిచ్ఛృణోతి మే
ధర్మాదర్థశ్చ కామశ్చ స కిమర్థం న సేవ్యతే

న జాతు కామాద్ న భయాద్ న లోభాత్
ధర్మం త్య జేత్ జీవితస్యాపి హే తోః

ధర్మో నిత్యః సుఖదుఃఖే త్వనిత్యే
జీవో నిత్యః హేతురస్య త్వనిత్యః

# 85. భారతంలోని పాత్రలు - వైవిధ్య విశేషాలు

## 1) కృష్ణ ద్వైపాయన వ్యాసుడు :

నల్లగా ఉన్నాడు కనుక కృష్ణుడు
ద్వీపంలో పుట్టినవాడు ద్వైపాయనుడు
వేద విభజన చేసినవాడు వ్యాసుడు.

మిత్రావరుణులకు ఊర్వశిని చూడగా రేతః పతనమైతే నేతికుండలో భద్రపరచగా పుట్టినవాడు వశిష్ఠుడు. సప్తర్షులలో ఒకడు. వశిష్ఠుడి భార్య అరుంధతి. సూర్యకిరణాలచే తడపబడినది. వశిష్ఠుడు- అత్యున్నతమైనవాడు, భాగ్యశాలి. ఇతడికి మూడు జన్మలు- మొదటి జన్మలో బ్రహ్మమానస పుత్రుడు- దక్షయజ్ఞంలో చనిపోగా బ్రహ్మ బ్రతికిస్తాడు. రెండవ జన్మలో నిమి, వశిష్ఠుడు పరస్పర శాపాలతో మరణిస్తారు. బ్రహ్మ వశిష్ఠుడిని మిత్రావరుణల వీర్యంలో నిక్షిప్తం చేయగా ఊర్వశిని చూసినపుడు ఆ వీర్యం పతనమై, దానిని కలశంలో భద్రపరచగా మూడోసారి జన్మించాడు వశిష్ఠుడు.

భరత తెగకు గురువుగా ఉండి సుదాసుడనే రాజుకు సలహాలనిస్తూ దశరాజ యుద్ధంలో త్రత్సు-భరతుల గెలుపుకు కారణమైనాడు. విశ్వామిత్రుడితో అతడికి ఎడతెగని వైరం ఏర్పడింది. వశిష్ఠుడు-అరుంధతిలకు శక్తితో పాటు నూరుగురు కొడుకులు. శక్తి భార్య అదృశ్యంతి.

సుదాసుడి కొడుకు సౌదాసుడు. శక్తికి సౌదాసుడికి మధ్య గొడవై శక్తి అతడిని రాక్షసుడివి కమ్మని శపించాడు. “నేను రాక్షసుడినైతే ముందుగా నిన్నే తింటాను” అని సౌదాసుడు కల్మాషపాదుడై శక్తితో పాటు వశిష్ఠుడి కొడుకులందరినీ తినివేసాడు. వశిష్ఠుడి దుఃఖానికి అంతులేదు. అనేకసార్లు ఆత్మహత్యా ప్రయత్నాలు చేసినా ఫలించవు.

ఈలోగా పన్నెండేళ్ల శాపం తొలిగి కల్మాషపాదుడు మరల సౌదాసుడై అశ్వమేధ యాగం చేసాడు. ఇతడు రాక్షసుడిగా ఉన్నపుడు బ్రాహ్మణ జంట సంభోగిస్తున్నపుడు భక్షించబోగా వాళ్లు శాపమిచ్చారు. నీవు నీ భార్యతో సంభోగించినపుడు మరణిస్తావని. (ఇటువంటి శాపమే పాండురాజుకు కిందముడనే ముని ఇస్తాడు తరువాత కాలంలో). అందుచేత అప్పటి ఆచారం ప్రకారం గురువైన వశిష్ఠుడు కల్మాషపాదుడి భార్య (మదయంతి)తో కలవగా పన్నెండేళ్ళు గర్భవతిగా ఉన్నదామె. చివరకు అశ్మక (చలువరాతి కత్తి)తో కడుపు కోయగా బయటపడినాడు అశ్మకుడు.

ఈ కల్మాషపాదుడు - మదయంతుల దగ్గరకే కుండలాల కోసం ఉదంకముని వచ్చాడు. ఈ ఉదంకుడు గౌతముడు-అహల్యల శిష్యుడు. పౌష్య మహాదేవియైన మదయంతి అరువిచ్చిన కుండలాలను తక్షకుడు ఎత్తుకుపోవడం, వాటిని నాగలోకం వెళ్లి ఉదంకుడు మరల తెచ్చుకుని ఆ కోపంతో జనమేజయుడిని సర్పయాగానికి పురికొల్పడం- ఆ సమయంలో వైశంపాయన మహర్షి (వ్యాసుని శిష్యుడు) వ్యాసుడు చెప్పిన భారత కథను జనమేజయుడికి చెప్పినపుడు దానిని విన్న ఉగ్రశ్రవసుడు ఆ కథను నైమిశారణ్యంలో మునులకు చెప్పగా- వ్యాసుడి ‘జయం’, వైశంపాయనుడి భారతంగా, ఉగ్రశ్రవసుడి ‘మహాభారతం’గా విస్తృతి నొంది ఆఖ్యాన, ఉపాఖ్యానాలతో వ్యాసోద్యానవన పారిజాత వృక్షమై విలసిల్లింది.

వశిష్ఠుడి కుమారుడు శక్తి. శక్తి భార్య అదృశ్యంతి. వశిష్ఠుడు ఆత్మహత్యా ప్రయత్నాలు మానడానికి కారణం తన కోడలు అదృశ్యంతి గర్భవతిగా ఉన్నదని తెలియడం. ఆమెకు జన్మించాడు పరాశరుడు. తాత వశిష్ఠుడి ఆత్మహత్యా ప్రయత్నాలను ఆపగలిగినాడు కనుక పరాశరుడైనాడు.

పరాశరుడు జ్యోతిశ్శాస్త్రం వ్రాసిన తొలి రచయిత. వ్యవసాయం, ఆయుర్వేద విషయాలపై గ్రంథాలు వ్రాసినాడు. పరాశర స్మృతి, పరాశర హోర, పరాశర కృషి, పరాశర వృక్షాయుర్వేద ఇతడి రచనలు. కొన్ని ఋగ్వేద మంత్రాలు వ్రాసినాడు.

పరాశరుడు ఒకరోజున యమునా నదిపై పడవ నడుపుతున్న దాశరాజు కుమార్తె మత్స్యగంధిని చూసినాడు. ఉపరిచర వసువు వీర్యాన్ని అద్రిక అనే అప్సరస చేపరూపంలో ఉండి మింగగా ఆమె కడుపులో ఇద్దరు పిల్లలు పెరిగారు. జాలరులు ఆ చేపను పట్టుకొని కోయగా బయటపడిన పిల్లల్లో మగపిల్లవాడు మత్స్యరాజైనాడు. ఆడపిల్ల మత్స్యగంధిని దాశరాజు పెంచినాడు. పరాశరుడు–మత్స్యగంధిని కూడగా యమునాద్వీపంలో వ్యాసుడు పుట్టినాడు.

మత్స్యగంధి పరాశరుడి వరంతో యోజనగంధి యోజనగంధి సత్యవతిగా, కన్యగానే ఉండి – శంతనుడిని వివాహ మాడింది. శంతనుడికి అంతకుముందు గంగ వలన పుట్టిన దేవవ్రతుడనే కుమారుడున్నాడు. శంతనుడు–సత్యవతిల సంతానానికే రాజ్యార్హత కల్పించడానికి – తాను రాజ్యాన్ని ఆశించబోనని, బ్రహ్మచారిగానే ఉంటానని శపథం చేసి భీష్ముడైనాడు.

శంతనుడు–సత్యవతిలకు ఇద్దరు కుమారులు జన్మించారు. చిత్రాంగదుడు వీరుడు. చిత్రాంగదుడనే గంధర్వుడితో యుద్ధం చేసి మరణించాడు. విచిత్రవీర్యుడు కాస్త బలహీనుడు. భీష్ముడు కాశీరాజ కుమార్తెల స్వయంవరానికి వెళ్లి అక్కడున్న రాజులనందరిని ఓడించి అంబ అంబిక అంబాలికలను ఎత్తుకు వచ్చాడు. అంబ తాను అంతకుముందే సాల్వుడిని ప్రేమించాననడంతో ఆమెను సగౌరవంగా సాల్వుడి దగ్గరకు పంపించాడు భీష్ముడు.

విచిత్రవీర్యుడికి అంబిక, అంబాలికలనిచ్చి వివాహం చేసాడు భీష్ముడు. కొద్దికాలంలోనే విచిత్రవీర్యుడు కన్ను మూసినాడు. సత్యవతి ఎంత పోరినా భీష్ముడు పెళ్లి చేసుకోనన్నాడు. దానితో సత్యవతి తన తొలి పుత్రుడు వ్యాసుడిని ఆదేశించింది తన కోడళ్లతో సంబంధం పెట్టుకుని 'దేవర' న్యాయంతో వంశాన్ని నిలపమని.

నల్లగా అందవికారంగా, బవిరిగడ్డం, మీసాలతో ఉన్న వ్యాసుడిని చూసి కళ్లు మూసుకున్న అంబికకు పుట్టు అంధుడిగా ధృతరాష్ట్రుడు పుట్టినాడు.

ఈసారి అంబాలిక వద్దకు వెళ్లాడు వ్యాసుడు. అతడిని చూసి భయంతో పాలిపోయిందామె. ఆమెకు పాండురాజు పుట్టాడు. మరల వ్యాసుడిని అంబిక వద్దకు పంపగా ఆమె తనదాసి పరిశ్రమకు తన దుస్తులు తొడిగి శయ్యపై ఉంచింది. పరిశ్రమ భక్తిశ్రద్ధలతో వ్యాసుని సేవించగా మాండవ్యముని శాపం వలన ధర్ముడు ఆమె గర్భం నుంచి విదురుడై జన్మించాడు.

భీష్ముడు తన సామంతుడైన గాంధారరాజు కుమార్తె పుత్రశతం కోసం తపస్సు చేసిందని తెలుసుకుని ఆమెను ధృతరాష్ట్రుడికిచ్చి వివాహం చేసినాడు. భర్తమీద ప్రేమతోనో, సత్యవతి, భీష్ముల మీద కోపం వల్లనో గాంధారి– నా భర్త చూడని లోకాన్ని నేను చూడను అని –కనులకు గంతలు కట్టుకున్నది.

అంధుడు కావడం వలన ధృతరాష్ట్రుడు, దాసీ కుమారుడు కావడం వలన విదురుడు రాజ్యార్హత కోల్పోయారు. పాండురాజు గొప్పవీరుడు, అన్న అంటే భక్తి. వివిధ రాజ్యాలను జయించి అశేష ధనరాశులను తెచ్చి సోదరునకిచ్చి అతడిని రాజుగా గౌరవించాడు తానే రాజైనప్పటికీ. పాండురాజుకు వేట ఓ వ్యసనం. ఇద్దరు భార్యలు కుంతి, మాద్రిలతో కలిసి వేటకు వెళ్లి కిందముడనే ముని తన భార్యతో జింకల రూపంలో సంగమిస్తుండగా బాణాలతో చంపినాడు. చనిపోయే ముందు ఆ ముని– "నీవుకూడా నీ భార్యతో సంగమిస్తే చస్తావని" శపించాడు. దానితో పాండురాజుకు జీవితం మీద విరక్తి కలిగి శతశృంగమనే ప్రదేశానికి పోయి తపస్సు చేయసాగినాడు. పుత్రులు లేకుండా పున్నామ నరకం దాటలేననుకున్నవాడై భార్యలకు నియోగ పద్ధతిలో సంతానం కలిగేలా చేసుకొమ్మని అర్థించాడు. (కుంతిదేవి కన్యగా ఉన్నపుడు, దుర్వాసుడిచ్చిన వరంతో సూర్యుడి వలన కర్ణుడికి జన్మనిచ్చింది. అతడు రాధ–అతిరథుల పెంపుడు కొడుకుగా పెరుగుతున్నాడు.)

భర్త నియోగంతో కుంతి ధర్ముడిని ఆహ్వానించి ధర్మరాజును కన్నది. ఆ విషయం తెలిసి గాంధారికి, రెండేళ్లైనా తనకు ప్రసవం కావడం లేదు, ఈలోగా కుంతికి ధర్మరాజు పుట్టాడని తెలిసి అసూయావేశాలతో కడుపుపై కొట్టుకోగా పిండం బయటపడింది. వ్యాసుడు దానిని 101 ముక్కలుగా నేతికుండలలో భద్రపరచాడు.

ఈలోగా కుంతి వాయుదేవుడి వలన భీముడిని కన్నది. భీముడు పుట్టిన కొద్ది గంటల తరువాత నేతికుండ నుంచి జన్మించాడు దుర్యోధనుడు. ఆ తరువాత రోజుకొక్కరు చొప్పున 99 మంది కౌరవులు జన్మించారు దుశ్శాసనుడితో సహా. ఆఖరున పుట్టింది ఆడపిల్ల దుశ్శల.

ఈసారి ఇంద్రుడిని ఆహ్వానించి అర్జునుడికి జన్మనిచ్చింది కుంతీదేవి. మాద్రి తనకు కూడా పిల్లలు కావాలనడంతో మంత్రముపదేశించింది కుంతి. ఆ మంత్రప్రభావంతో మాద్రి అశ్వినీదేవతల నారాధించి కవలలను కన్నది. వారు నకుల సహదేవులు.

అక్కడ మధురానగరంలో శూరసేనుడికి నాగకన్య మరీష వలన వసుదేవుడు, పృథ జన్మించారు. పృథ కుంతీభోజుడి వద్ద పెరిగి కుంతిగా పాండురాజును వివాహం చేసుకున్నది. వసుదేవుడు దేవకి, రోహిణిలను వివాహమాడగా రోహిణి వలన బలరాముడు, సుభద్ర; దేవకిదేవి వలన శ్రీకృష్ణుడు జన్మించారు.

కౌరవ పాండవ యాదవ వంశాల చరిత్ర భారతమైనది. ఈ కథను 'జయం'గా వ్రాసినాడు వ్యాసుడు. 'జయహో', 'జయజయ జయహే' అని మనం నిత్యం జాగరూకులమై ఉంటున్నాము ధర్మార్థ కామ మోక్షాలను పరిరక్షించుకుంటూ.

**కొన్ని గమనించాల్సిన సాంకేతిక అంశాలు:**

- సంభోగ సమయంలో స్త్రీ మానసిక స్థితి పుట్టబోయే శిశువులపై ప్రభావం చూపడం– ధృతరాష్ట్ర, పాండురాజు, విదురుల పుట్టుకలు.
- పిండాన్ని ముక్కలు చేసి నేతికుండలలో భద్రపరచడం – దుర్యోధనాది కౌరవుల జననం (Test Tube Baby).
- పిండాన్ని మరో తల్లి గర్భంలోకి మార్చడం (సంకర్షణ–Surrogacy). దేవకి పిండాన్ని రోహిణి గర్భంలోకి మార్చగా బలరాముడి జననం. అందుకే అతడు సంకర్షణుడైనాడు.
- అండం అవసరం లేకుండా వీర్యాన్ని మింగినా, నేతికుండల్లో భద్రపరచినా శిశువుల జననం – మత్స్యగంధి, మత్స్యరాజు, కృపుడు, కృపి, వశిష్ఠుడు, ద్రోణుడు, ద్రుపదుడు, కార్తికేయుడు వీరి జననాలు – వీర్యపుత్రులు.
- పొట్టను చీల్చి శిశువును బయటకు తీయడం (Caeserean section). మదయంతి కడుపును తానే కోసుకున్నది లేదా వశిష్ఠుడు కోసినాడు చలువరాతి కత్తితో–అశ్మక– అందుకే అలా పుట్టినవాడు అశ్మకుడైనాడు. ఇతడు శ్రీరాముని పూర్వీకుడు.
- మత్స్యగంధి వాసనకు కారణం Trimethyl amine గా శాస్త్రజ్ఞులు గుర్తించారు.
- విమానాలు; తల్లి గర్భంలో ఉన్నప్పుడే శాస్త్రాలు, పద్మవ్యూహ భేదనాలు నేర్చుకోవడాలు ఈ భారతంలో చెప్పబడినాయి.

కొందరు విమర్శకులు భారత కథ కల్పితమని ప్రసిద్ధిపొందిన నగరాలు, రాజ్యాల పేర్లు చేర్చడంతో కాలం గడిచిన కొద్దీ అవి వాస్తవాలని ప్రజలు నమ్మి ఉంటారని అంటున్నారు. మహాభారత యుద్ధం క్రీస్తుపూర్వం 1300 ప్రాంతంలో జరిగి ఉండవచ్చునని, భారత కథానిర్మాణం క్రీస్తుపూర్వం 400 సంవత్సరాల నుంచి క్రీస్తుశకం 300 మధ్యకాలంలో జరిగిందని వారి ఉద్దేశం.

చదువు, విద్యలు, వేదాలు బ్రిటిషువారి పరిపాలన వరకు కేవలం కొన్ని కులాలకే పరిమితమై ఉండేవి. కాని జానపద గాథలు మౌఖికంగా అన్ని కులాల్లోనూ తెగల్లోనూ సుపరిచితాలే. స్థానిక ఆచారాల కనుగుణంగా వారు కథలను చెప్పుకునేవారు. అవన్నీ భారత కథా కథనాలలో వైరుధ్యాలకు కారణాలు కావచ్చును.

వ్యాసుడు గొప్ప రచయిత కావచ్చును కాని, ఆనాటి పరిస్థితులలో ఏఏ దేశాలు ఎక్కడున్నాయి, ఏఏ నదులు, సరస్సులు, వివిధ రకాల తెగలు, ఫలపుష్ప వనాలు, జంతు పశుపక్ష్యాదులు, తెగల అంతఃకలహాలు యుద్ధరీతులు ఇవన్నీ ఊహిస్తూ వీటిని అందరికీ అర్థమయ్యేలా చెప్పగలగడం చదువరులను ఆశ్చర్యచకితులను చేస్తుంది.

వ్యాస భారతంలోని ప్రధాన కథకు, ఆఖ్యానాలకు గ్రీకు రచయిత హోమర్ వ్రాసిన ఇలియాడ్, ఒడిస్సీ కావ్యాలలోని సంఘటనలకు, పాత్రలకు పోలికలు ఉండడం గమనార్హం.

భారతంలో అనేక పాత్రలు, సంఘటనలు నాటకీయంగా వచ్చి పోతుంటాయి తమ అవసరం తీరగానే. అతీతశక్తులు, విచిత్ర జననాలు, విశ్వరూపాలు, దివ్యాస్త్రాలు, దేవ రాక్షసాంశలతో జన్మించినవారు, కామరూపాలు, కామగమనాలు ఇవన్నీ కథాగమనానికి, ఉత్కంఠత కలిగించడానికి విస్తారంగా వాడబడినాయి.

ఉదంకుడో, వైశంపాయనుడో, వ్యాసుడో చెప్పేంత వరకు తమ పూర్వీకుల మరణం, జీవితాల గురించి పరీక్షిత్తు, జనమేజయులకు తెలియకపోవడం విచిత్రం.

కథను నడిపించడానికి వ్యాసుడు, నారదుడు, మార్కండేయుడు లాంటి పాత్రలు వచ్చి సలహా ఇచ్చి అదృశ్యమవుతాయి. కథలోని పాత్రలూ అంతే ఒక తరం వచ్చాక పాతతరం అడవులలో తపస్సు చేసుకోవడానికి నిష్క్రమిస్తాయి. దివ్యాయుధాలు అదృశ్యమవుతాయి. యాదవ తెగల్లాంటివి సామూహికంగా అంతర్ధానమవుతాయి.

"ఏదీ మిగలదు, ఎవరూ మిగలరు" –అన్నదాని నుంచి అమృతత్వ సాధనకై మానవుడు చేసిన కృషి, శాశ్వతత్వాన్ని పొందడానికి చేసే ప్రయత్నాలు ఇలా కథారూపాల్ని దాల్చి 'జయం'గా రూపుదిద్దుకున్నది, మహర్షి వేదవ్యాసుడి చేతిలో.

**"మృత్యోర్మా అమృతంగమయ"**

వ్యాసుడికి జాబాలి ముని కుమార్తె 'వాటిక' వలన శుకుడు జన్మించాడు. (ఘృతాచి అప్సరస చిలుక (శుక) రూపంలో రాగా ఇంద్రియ స్ఖలనమై అరణిపై పడి శుకుడు జన్మించాడు).

(సృజన, విభజన, శాస్త్రీయ దృక్పథం, వివేచన, జ్ఞానం కలిసిన కవి, రచయిత ప్రకృతి – Vyasa Complex)

**2) శంతనుడు :** ఇతరులకు సంతోషాన్ని అధికం చేసేవాడు. ప్రతీపుని కుమారుడు. ప్రతీపుడి భార్య సునంద. వీరికి దేవాపి. బాహ్లికుడు, శంతనుడు పుత్రులు. ఆనాటి ఆచారం ప్రకారం– కుష్టువ్యాధి గ్రస్తుడైన దేవాపికి రాజ్యార్హత లభించదు. బాహ్లికుడు తన తండ్రి రాజ్యాన్ని వదిలి తల్లి సోదరుడి ఇంట్లో పెరగడంతో ఆఖరివాడైన శంతనుడు హస్తినకు రాజైనాడు.

శంతనుడికి గంగ వలన అష్ట వసువులు పుత్రులుగా జన్మించారు. మొదటి ఏడుగురిని పుట్టిన వారిని పుట్టినట్లు నదిలో పడవేసింది గంగ. వశిష్ఠుని గోవును దొంగిలించి శాపానికి గురైనవారు ఈ వసువులు. ప్రభాసుడనే వసువు ఈ ధేనువును తన భార్య కోరగా దొంగిలించి వశిష్ఠుని శాపాన ఎక్కువకాలం భూమిపై ఉండవలసి రావడంతో గంగా శంతనుల పుత్రుడై గాంగేయుడిగా జన్మిస్తాడు.

గాంగేయుడు తన తండ్రికి సత్యవతికి వివాహం చేయడానికి ఆమె విధించిన షరతుల ప్రకారం– సత్యవతి సంతానానికే రాజ్యం దక్కేందుకు – రాజ్యార్హత వద్దని, బ్రహ్మచారిగా ఉంటానని భీష్మ ప్రతిజ్ఞ చేసి అప్పటి వరకు దేవవ్రతుడిగా పిలువబడినవాడు భీష్ముడైనాడు.

తండ్రి కోసం కొడుకులు చేసే త్యాగం (పెద్దవాళ్లకోసం పిల్లలు చేసే త్యాగం)– ధర్మం ఇప్పుడు యయాతి భావన (Yayati Complex)గా పిలువబడుతున్నది.

చేసిన ప్రతిజ్ఞను ఎట్టి పరిస్థితిలోనూ మార్చుకోకపోవడం Bhishma Complex - Bhishma Syndrome గా అనవచ్చు.

శంతనుడి సోదరుడైన బాహ్లికుడు కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్న అందరికన్నా వయసులో పెద్దవాడు. బాహ్లికుడి కుమారుడు సోమదత్తుడు, కుమార్తె పౌరవి.

పౌరవి వసుదేవుడి భార్యలలో ఒకరు. వసుదేవుడు దేవకిదేవిల పుత్రుడు శ్రీకృష్ణుడు.

బాహ్లికుడి కుమారుడు సోమదత్తుడు. సోమదత్తుడి కొడుకు భూరిశ్రవసుడు.

దేవకిదేవి స్వయంవరంలో వసుదేవుడికి సాయంగా వచ్చినాడు శిని. ఆ స్వయంవరానికి వెళ్లిన సోమదత్తుడితో ఘర్షణ కాగా సోమదత్తుడిని జుట్టు పట్టుకుని నేలపై పడవేసి కొట్టినాడు శిని. ఆ కోపం సోమదత్తుడిలో ఉన్నది. శిని కుమారుడు సత్యకుడు, సత్యకుడి కుమారుడు సాత్యకి.

శంతనుడు–సత్యవతిల పుత్రులు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు. శంతనుడు, చిత్రాంగదుడు చనిపోయాక, విచిత్రవీర్యుడు రాజైనాడు. అతడు కొద్దికాలంలోనే చనిపోగా నియోగ పద్ధతిలో సత్యవతి ఆదేశించగా వ్యాసుడి వలన అంబికకు ధృతరాష్ట్రుడు, అంబాలికకు పాండురాజు, అంబిక దాసికి విదురుడు జన్మించారు.

పాండురాజుకు రాజ్యార్హత లభించింది. కిందముడి శాపంతో అతడు తపోజీవనం గడపగా అధికారం ధృతరాష్ట్రుడికి లభించింది. పాండురాజు మరణానంతరం పాండవులు హస్తినకు చేరుకున్నారు. అంధుడైన ధృతరాష్ట్రుడికే అధికారం దక్కింది. అయినా ధర్మజుడు వయసులో పెద్దవాడు గనుక అతడే యువరాజైనాడు.

కన్యాగర్భంలో జన్మించి కానీనుడైన కుంతీ–సూర్యుల పుత్రుడు కర్ణుడు రాధేయుడై సూతపుత్రుడిగా పెరుగుతున్నాడు.

సమస్త సంపదలను, రాజ్యాన్ని ధృతరాష్ట్రుడికిచ్చి శతశృంగంలో తపస్సు చేసుకుంటూ తన వలన కాక నియోగ పద్ధతిలో కుంతికి పుట్టిన వారికి రాజ్యంలో వాటా ఎందుకివ్వాలనేది దుర్యోధనుడి ప్రశ్న.

యుద్ధం 14వ రోజున అలసిపోయి ఉన్న సాత్యకికి బాహ్లికుడి మనమడు భూరిశ్రవసుడికి మధ్య భీకర యుద్ధం జరిగింది. సాత్యకిని నేలమీద పడవేసి, భూరిశ్రవసుడు చేయి పైకెత్తినాడు, కత్తితో పొడవడానికి. శ్రీకృష్ణుని అభ్యర్ధనతో అర్జునుడు భూరిశ్రవసుడి చేయి నరికినాడు బాణం వేసి. నిశ్చేష్టుడైన భూరిశ్రవసుడిని, తేరుకున్న సాత్యకి చంపివేసాడు.

14వ రోజు రాత్రి యుద్ధంలో సోమదత్తుడిని చంపాడు సాత్యకి; బాహ్లికుడిని చంపినాడు భీముడు సాత్యకి సాయంతో.

36 ఏళ్ల తరువాత ఈ విషయం యాదవుల మధ్య గొడవకు దారితీయగా సాత్యకి కృతవర్మను చంపినాడు. కృతవర్మ బంధువుల చేతిలో సాత్యకి చనిపోయినాడు.

నియోగ పద్ధతిలో పుట్టినా తాము పాండవులమే కనుక, కౌరవుల తండ్రి ధృతరాష్ట్రుడు అంధుడైనా, రాజ్యాన్ని సంపదలను విస్తరింపచేసింది తమ తండ్రి పాండురాజు కనుక తమకు తమ వాటా కావాలని అడిగారు పాండవులు. అందుకే మొత్తం రాజ్యాన్ని కాకుండా అర్ధరాజ్యానికి, అదీ కుదరకపోతే అయిదూళ్లిస్తే చాలన్నాడు ధర్మరాజు.

ఆ హక్కు మీకు లేదు వాడి సూదిమొన మోపినంత భూమి కూడా ఇవ్వనన్నాడు దుర్యోధనుడు.

ఎత్తుకు పైఎత్తులు మొదలైనాయి. శంతనుడి ఆస్థి మరల శ్యమంత పంచకం క్షత్రియుల రక్తంతో నిండడానికి కారణమైంది.

అప్పుడెప్పుడో రాజ్యార్హత కోల్పోయిన యదు వంశస్థులు పూరుడి వంశస్థులైన కౌరవ పాండవుల నుంచి తమ వాటా దక్కించుకోవడానికి బలరామకృష్ణుల రూపంలో చేసిన వివాహ ప్రయత్నాలు సఫలీకృతమై చివరకు పాండవుల అర్జునుడు, యాదవుల సుభద్రకు జన్మించిన అభిమన్యుడు, మత్స్యగంధి (సత్యవతి) సోదరుడైన విరాటరాజు కుమార్తె ఉత్తరలకు జన్మించిన పరీక్షిత్తు హస్తినకు రాజు కాగా శంతన-సత్యవతిల కురువంశం; శ్రీకృష్ణ నిర్యాణం తరువాత అనిరుద్ధుడి కుమారుడైన వజ్రనాభుడిని ఇంద్రప్రస్థానికి రాజుగా చేయగా యాదవ వంశం చరిత్రలో నిలబడినాయి.

పరీక్షిత్తు భార్య ఉత్తర కుమారుడి పుత్రిక మద్రవతి. వీరి కుమారుడు జనమేజయుడు.

జనమే జయుని కుమారుడు శతానీకుడు

శతానీకుని కుమారుడు అశ్వమేధ దత్తుడు

అశ్వమేధ దత్తుని కుమారుడు నిచాక్షుడు (క్రీస్తుపూర్వం 9వ శతాబ్దం)

నిచాక్షుడు హస్తినాపురపు ఆఖరి రాజు. గంగానది వరదల్లో హస్తినాపురం కొట్టుకుపోగా నిచాక్షుడు కౌశాంబి నగరంలో స్థిరపడి వత్స వంశానికి మూల పురుషుడైనాడు.

తన సుఖం కోసం కుమారుడి త్యాగాన్ని అంగీకరించడం Santana Syndrome.

## 3) సత్యవతి :

చేపరూపంలో ఉన్న అప్సరస అద్రిక కడుపులో మత్స్యరాజుతో పాటు జన్మించి దాశరాజు వద్ద పెరిగింది. యమునా నదిలో పడవను నడుపుతూ మత్స్యగంధిగా చేపల కంపు కొట్టేది.

పరాశర మహర్షి వలన ఆమె వ్యాసుడికి జన్మనిచ్చింది. పరాశరుడి వరంతో చేపలకంపు పోయి యోజనగంధి సత్యవతిగా శంతనుడిని వివాహం చేసుకుని చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడికి జన్మనిచ్చింది. తన వారసులే హస్తినకు రాజులుగా తరతరాలు ఉండాలనేది ఆమె పట్టుదల. తన సోదరుడి కుమార్తె ఉత్తర పాండవుల వారసుడైన పరీక్షిత్తుకు జన్మనివ్వడంతో ఆమె వంశం ఉత్తర ద్వారా, జనమేజయుడు ఉత్తర కుమారుడి కుమార్తె మద్రవతిని వివాహం చేసుకోవడం వలన సాత్యవతేయులే హస్తినాపురికి వారసులైనారు.

పరాశరుడు+సత్యవతి → వ్యాసుడు+అంబాలిక → పాండురాజు. ఇక్కడ తెగిపోయిన వంశవృక్షం పాండురాజుకు నియోగ పద్ధతిలో కుంతి-ఇంద్రుల కుమారుడు అర్జునుడు కుమారుడు కాగా - అర్జునుడు+సుభద్రలకు పుట్టిన అభిమన్యుడు మత్స్యదేశపు రాజు విరాటుని పుత్రిక ఉత్తరను చేసుకున్నాక మరల సత్యవతి వంశీకులకు అధికారం దక్కింది.

తన పుత్రులకే అధికారం దక్కాలనే మనస్తత్వం- Satyavathi Complex.

**4) భీష్ముడు :** గంగ-శంతనుల కుమారుడు. హస్తినాపుర యువరాజు. తండ్రి కోసం రాజ్యాన్ని, వివాహాన్ని త్యాగం చేసి బ్రహ్మచారిగా మిగిలినవాడు. మొండి పట్టుదల, స్త్రీలపై యుద్ధం చేయనన్న నియమం. స్త్రీ పేరున్నా ఒకప్పుడు స్త్రీగా ఉండి ఇప్పుడు పురుషుడైనా స్త్రీ వేషధారణలో ఉన్నా తొలగిపోతానన్నవాడు భీష్ముడు. ఇది Bhishma Complex. ఇతడు స్త్రీలతో సూటిగా మాట్లాడలేదు. చూస్తే లొంగిపోతానేమోనన్న భయమో లేక - ఎంతవారైనా కాంతాదాసులే అన్న మాట కావచ్చు అతడికున్న ఏకైక బలం, బలహీనతను తెలియజేస్తుంది. అందుకే శిఖండి అంటాడు- ఇంతకీ నీవు సాధించిందేమిటి? నీ పురుషత్వం వలన ఎవరికి ప్రయోజనం? నీకూ, స్త్రీకి తేడా ఏముంది? ఆ మాటకొస్తే నేను ఒకప్పుడు ఆడపిల్లను. ఇప్పుడు పురుషుడినై సంతానం పొందాను. నీవు అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ పూజకు పనికిరాని పురుషుడివి. మొండి ప్రతిజ్ఞలు, హస్తినపై పూర్తి అధికారమున్నా దానిని వినియోగించనివాడు. డోలాయమాన స్థితి, నిర్లిప్తత Bhishma Complex.

**5) అంబ :** కాశీరాజ కుమార్తె. ఈమె చెల్లెళ్లు అంబిక, అంబాలిక. సాల్వుడిని ప్రేమించింది. తండ్రి ఒప్పుకున్నాడు. అప్పుడు వచ్చాడు భీష్ముడు. గొప్ప వీరుడు. గంగా పుత్రుడు. సాల్వుడితో సహా అందరినీ ఓడించి రథం మీద ముగ్గురు కన్యలను తీసుకుని హస్తినకు వచ్చాడు.

ఆ కాలంలో తండ్రిని, అన్నను యుద్ధంలో చంపిన వాడినైనా వివాహం చేసుకునేవారు ఆడపిల్లలు. వారికి తమ కుమారుడు అంతకన్నా గొప్పవాడు కావాలనేది కోరిక. శక్తివంతుడైనా, తపస్సంపన్నుడైన వాడి పొందుతో కలిగే కుమారుడు కావాలి. శృంగారమనేది ముఖ్యం కాదు. అందుకే శత్రు వీరులను, మునులను అంగీకరించేవారు సంతానోత్పత్తికి. అది అధర్మం కాదు. అయితే కన్యాగర్భం లోకాపవాదం తెస్తుందని దానిని వ్యతిరేకించేవారు. తిరిగినా కన్యాత్వం చెడకూడదు అనే నిబంధనో, వరమో కోరేవారు.

అంబ మనసు లోలకంలా ఊగింది. చివరకు సాల్వుడిపై మొగ్గి భీష్ముడి అనుమతితో సాల్వుడి దగ్గరకు వెళ్లింది. అతడన్నాడు- "నీవిప్పుడు భీష్ముడి సంపదవు. అతడు వదిలేసింది నాకక్కర్లేదు".

అంబ పరిస్థితి- "రెంటికి చెడిన రేవడి" అయ్యింది. మరల భీష్ముడి దగ్గరకు వెళ్లింది ప్రేమతో పునీతమైన మనస్సుతో. ఎక్కడో అల్లకల్లోలమయ్యింది కాసింత భీష్ముడి మనస్సు? తెలియదు, ఆమెను వెళ్లిపొమ్మన్నాడు. అతడే కావాలని తపస్సు చేసిందామె. పరశురాముడిని తీసుకువచ్చి ఘోరయుద్ధం చేయించింది. లొంగలేదు భీష్ముడు. చివరకు చచ్చి సాధిస్తానని పలికి అగ్నిలో దూకి ద్రుపదుడింట శిఖండినిగా పుట్టింది. ఆమెను మగపిల్లవాడు శిఖండిగా పెంచినాడు ద్రుపదుడు. వివాహం చేసినాడు దశార్ణరాజు హిరణ్యవర్మ కుమార్తెతో. ఆమె తనభర్త మగవాడు కాదని తల్లిదండ్రులకు చెబితే అతడు ద్రుపదుడిపై దండయాత్ర చేసినాడు. నిరాశతో శిఖండిని అడవికి వెళ్లి ఆత్మహత్య చేసుకోబోతుంటే యక్షుడు స్థూలకర్ణుడనేవాడు ఆమెకు తన పురుషత్వాన్నిచ్చాడు జాలిపడి; తాను స్త్రీ అయినాడు.

ఇప్పుడామె శిఖండి. ఇంటికి వెళ్లి భార్యను సుఖపెట్టగా కథ అప్పటికి సుఖాంతమైనది. యక్షుల రాజైన కుబేరుడు "శిఖండి చనిపోయేంత వరకు- స్థూలకర్ణుడు స్త్రీరూపంలోనే ఉండును గాక!" -అన్నాడు.

కురుక్షేత్ర యుద్ధంలో పదవరోజు 'శిఖండి'ని చూసి బాణాలు వేయలేదు భీష్ముడు. శిఖండి వెనుక ఉన్న అర్జునుడు వీలు చూసుకుని భీష్ముని విల్లు విరగగొట్టి కఠిన బాణాలతో నేలకూల్చినాడు. చూసేవారికి శిఖండి బాణాలు వేస్తున్నట్లు కనిపించింది. ఆ రకంగా అంబ, శిఖండినిగా తన పాత్ర నిర్వహించింది తాను ప్రేమించిన లేదా ద్వేషించిన భీష్ముడి పరాజయానికి.

మరి పుత్రులు లేని భీష్ముడికి స్వర్గమెలా లభిస్తుంది? కురుక్షేత్రంలో మరణించిన ప్రతివారికి స్వర్గప్రాప్తి ఉంది కనుక అతడూ స్వర్గలోక నివాసానికి అర్హత పొందినాడు.

కురుక్షేత్ర యుద్ధం 18వ రోజు అర్ధరాత్రి అశ్వత్థామ ధృష్టద్యుమ్న, ఉపపాండవులు, పాంచాలురతో పాటు శిఖండినీ చంపివేసాడు.

అక్కడ యక్షుడు మరల పురుషుడైనాడు.

భీష్ముడు ఉత్తరాయణ ప్రారంభంలో దివికేగినాడు. అక్కడ అతడి రాక కోసం ఎదురుచూస్తున్నది అంబ ద్వేషమనేది లేని ప్రేమలోకంలో. ప్రేమ-ద్వేషాల ద్వైదీభావ మానసిక స్థితి- Amba Complex.

**6) బాహ్లికుడు :** శంతనుడి అన్న, దేవాపికి తమ్ముడు, కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్న వారందరిలో వయోవృద్ధుడు. భరత వంశీయుల మధ్య యుద్ధాన్ని వ్యతిరేకించినవాడు. ఇతడి కుమారుడు సోమదత్తుడు. మనవడు భూరిశ్రవసుడు. 14వ రోజు యుద్ధంలో– సాత్యకి, భూరిశ్రవసుల ద్వంద్వ యుద్ధంలో అర్జునుడి సాయంతో సాత్యకి భూరిశ్రవసుడిని చంపాడు అధర్మంగా. అదే రాత్రి సోమదత్తుడిని చంపాడు సాత్యకి; బాహ్లికుడిని సాత్యకి సాయంతో చంపాడు భీముడు. ప్రస్తుత కాలంలో ఇమడలేకపోవడం Bahlika Complex.

**7) ధృతరాష్ట్రుడు :** తల్లి అంబిక, తండ్రి వాసుడు. నియోగ పద్ధతిలో దేవరుడైన వ్యాసుడు (దేవరుడు–భర్త సోదరుడు) సత్యవతీ దేవి ఆదేశంతో అంబికా సమాగమానికి రాగా, ఏవేవో ఊహించుకున్న అంబిక, అకస్మాత్తుగా కానవచ్చిన నల్లనివాడు, గచ్చకాయ రంగు శిరోజాలు జటాజూటంగా, బవిరిగడ్డంతో, అంత ఎత్తు, లావుగా ఉన్నవాడు అంతఃపుర శోభన మందిరంలో కనిపించేసరికి నచ్చక కళ్లు మూసుకుంది ఆమె. అతగాడు తాను వచ్చిన పని పూర్తిచేసి వెళ్లిపోతూ తన తల్లి సత్యవతికి చెప్పాడు. నీ కోడలు అంబిక అంధుడికి జన్మనిస్తుంది. కాని అతడు వెయ్యి ఏనుగుల బలం కలవాడు. ధృతరాష్ట్రుడు. అంధుడైనా అన్ని విద్యలూ నేర్చుకున్నాడు. అంధుడు రాజు కాలేడు కనుక పాండురాజు రాజ్యం చేస్తూ, సోదరుడైన ధృతరాష్ట్రుడినే గద్దెపై కూర్చోనిచ్చాడు. అనేక రాజ్యాలు జయించి సంపదలను అన్నకివ్వగా అతడనేక అశ్వమేధ యాగాలు చేసాడు. దక్షిణాత్య ప్రతులలో ధృతరాష్ట్రుడే పట్టాభిషిక్తుడైనట్లు వ్రాయబడి ఉన్నా అది వాస్తవం కాకపోవచ్చు. పాండురాజు కిందముడి శాపంతో ప్రాపంచిక సుఖాలకు విరక్తి చెంది రాజ్యభారాన్ని ధృతరాష్ట్రుడికిచ్చాడు. అలా ధృతరాష్ట్రుడు హస్తినాపురానికి రాజైనాడు.

గాంధారిని వివాహం చేసుకుని పుత్రశతానికి, దుస్సలకు తండ్రియైనాడు. తాను అంధుడైనా తన పుత్రులు అంధులు కాదు. తమ్ముడు అడవులకు పోయాడు. ఇప్పుడు హస్తిన తనది, తన కుమారులది అన్న భావం అతడిలో గట్టిగా నాటుకున్నది. ఆ సమయంలో వచ్చింది వార్త. నియోగ పద్ధతిలో కుంతీదేవి ధర్ముడి వలన ధర్మరాజుకు జన్మనిచ్చిందని. హస్తినలో, గాంధారి, ధృతరాష్ట్రుల మనసులో కల్లోలం మొదలయ్యింది. ఆ అసుయా దుఃఖాలను భరించలేక గాంధారి రెండేళ్ల నుంచి మోస్తున్న గర్భంపై మోదుకోగా పిండం బయటపడింది పెద్ద మాంసఖండంలా.

వ్యాసుడు వచ్చాడు– ఆమెను కోప్పడి ఆ మాంసపు ముద్దను 101 ముక్కలు చేసి నేతి కుండలలో ఉంచి భద్రపరచారు శీతల జలాలను జల్లుతూ.

ఈలోగా వాయుదేవుడి వలన భీముడిని కన్నది కుంతీదేవి.

భీముడు జన్మించిన కొద్ది గంటలకు హస్తినలో అనేక ఉత్పాతాల మధ్య మొదటి నేతి కుండ నుంచి పుట్టినాడు దుర్యోధనుడు. ఆ తరువాత రోజుకొక్కరు చొప్పున దుశ్శాసనాదులు 99 మంది, ఆఖరున ఆడపిల్ల దుశ్శల జన్మించారు.

శతశృంగంలో ఇంద్రుడి వలన కుంతీదేవికి జన్మించాడు అర్జునుడు. అశ్వని దేవతల వలన మాద్రికి పుట్టినారు కవలలు నకుల సహదేవులు.

గాంధారి, కుంతీదేవిలలో తొలుత గర్భం ధరించింది గాంధారి. తొలుత సంతానాన్ని కన్నది కుంతి. అందుకనే ధర్మరాజు యువరాజైనాడు. మరి నా పరిస్థితి ఏమిటని నిలదీసాడు ధృతరాష్ట్రుని దుర్యోధనుడు.

కుమారుడిపై ఆపేక్ష, అనంతమైన ప్రేమ, పాండవులపై ఉపేక్ష ధృతరాష్ట్రుడికి ఉండడంతో గాంధారి చెప్పినా వినకుండా ధృతరాష్ట్రుడు తన కుమారుడు దుర్యోధనుడు ఏదంటే అది చేసి కురుక్షేత్ర యుద్ధానికి ఒక ప్రధాన కారణమైనాడు.

పాండవులు గెలిచారు. దుశ్శాసుడి రొమ్ము చీల్చి రక్తం తాగినాడు, దుర్యోధనుడి తొడలు విరగగొట్టి నేలకూల్చినాడు భీముడు. అందుకే అతడిని తన కౌగిలిలో నలిపి చంపివేద్దామనుకున్నాడు, పైకి నవ్వుతూ పిలుస్తూనే ప్రేమగా. అదే ధృతరాష్ట్ర కౌగిలి శ్రీకృష్ణుని చాకచక్యంతో ఆ కౌగిలిలోకి భీముడి విగ్రహాన్నుంచగా అది ముక్కలైంది. భీముడికి ప్రాణగండం తప్పింది.

అందుకే ధర్మరాజు ఎంత ప్రేమగా చూసుకున్నా భీముడి సూటిపోటి మాటలు తగుల్తూనే ఉన్నాయి గాంధారీ ధృతరాష్ట్రులకు. చివరకు వాళ్లు ఆశ్రమవాసాన్ని కోరుకున్నారు. వారితోపాటు విదురుడు, సంజయుడు, కుంతీదేవి కూడా వెళ్లారు. కొన్నాళ్లకు దావాగ్నిలో ఆహుతైనారు గాంధారి, కుంతీ, ధృతరాష్ట్రులు.

Dhritarashtra Complex - పుత్ర ప్రేమ, తనయుడిలోని తప్పులను కానరాకుండా చేయడం.

**8) పాండురాజు :** తన శయన మందిరంలో ఉన్నది అంబాలిక. వ్యాసుడు వచ్చాడు నియోగానికై. అక్క అంబిక చెప్పిన దానికన్నా భయంకరంగా ఉన్నాడా ముని. కాశీరాజ కుమార్తెలలో చిన్నది, విచిత్రవీర్యుడితో సుఖాలననుభవించినది. ఈ నల్లని భీకరాకారుడైన మునిని మందిరంలో చూడగానే, అతడితో పడుకోవాలనే సంగతి గ్రహించగానే వణుకుతూ, పండుటాకులా పాలిపోయిందా చిగురుటాకువంటి సుదతి. వ్యాసుడు తనపని తాను చేసుకుపోయాడు నిర్లిప్తంగా. ఆ తరువాత తల్లి సత్యవతికి చెప్పినాడు అంబాలికకు పుట్టబోయే పిల్లవాడు మహావీరుడే కాని పాలిపోయినట్లుంటాడు. పాండురాజుగా నామకరణం చేయమన్నాడు.

"మూడోసారి ముచ్చటగా నాకోసం ప్రయత్నం చేయి కుమారా! నేను కోడలు అంబికతో మాట్లాడతాను" అన్నది సత్యవతి. వెళ్లి మాట్లాడింది అంబికతో. తల ఊపింది సరేనని అంబిక. అత్తగారు వెళ్లిపోగానే మరల ఆమెకు వ్యాసుడి రూపం గుర్తుకు వచ్చి భయం వేసింది. తన పరిచారిక పరిశ్రమకు తన దుస్తులు తొడిగి తన శయ్యపై ఉంచింది.

వ్యాసుడు వచ్చాడు. అన్నీ తెలిసినవాడే కదా, తాను వచ్చిన పని పూర్తిచేసాడు. తరువాత వెళ్లి తల్లి సత్యవతితో చెప్పాడు- "ఈమె నాతో చాలా అనుకూలంగా సమభోగాన్ని అనుభవించింది. ఈమెకు ధర్మతత్పరుడు, నీతికోవిదుడు, జ్ఞాని జన్మిస్తాడు" అన్నాడు.

"ఈమె అంటున్నావు, ఈమె అంబికే కదా?" అడిగింది సత్యవతి. వ్యాసుడన్నాడు- "కాదు, ఈమె అంబిక దాసి పరిశ్రమ. ఈమెకు పుట్టేవాడు విదురుడు" అని పలికి వెళ్లిపోయాడు వ్యాసుడు.

పాండురాజు అనేక రాజ్యాలు జయించి అశేష ధనరాశులను తన అన్నకు ఇచ్చాడు. తానే హస్తినాపురికి రాజైనా ధృతరాష్ట్రుడినే రాజుగా గౌరవించాడు. కిందముని శాపం తరువాత అన్ని సంపదలను అన్నకిచ్చేసి తన భార్యలు కుంతీ, మాద్రిలతో శతశృంగానికి వెళ్లిపోయాడు. ఓ లెక్క ప్రకారం ఇప్పుడు అతడికి హస్తినతో సంబంధం లేదు. ఇతడి పూర్వీకులు శంతనుడి సోదరులు దేవాపి వ్యాధి వలన, బాహ్లీకుడు మేనమామ ఇంటి వద్ద పెరగడం వలన రాజ్యార్హత కోల్పోయినారు. ఇప్పుడు శతశృంగంలో పుట్టిన పాండవులకు రాజ్యార్హత ఉన్నట్లా లేనట్లా?

ముని శాపం మరచి మాద్రితో సంభోగించి ప్రాణాలు కోల్పోయాడు పాండురాజు. మాద్రి సహగమనం చేసింది. పాండవులు, కుంతీదేవి హస్తినకు వచ్చారు. స్వాగతించబడినారు. కృపాచార్యుడు, ద్రోణాచార్యుల వద్ద విద్యల నభ్యసించారు.

పుత్రుల కోసం తాను బ్రతికి ఉండగానే తన భార్యలను పర పురుషులతో సంబంధానికి ప్రోత్సహించినాడు పాండురాజు. ఇది Pandu Complex. (తన లాభం భార్య ద్వారా పొందాలనుకోవడం).

**9) విదురుడు :** తల్లి అంబికాదాసి పరిశ్రమ, తండ్రి వ్యాసుడు. ఒక కథనం ప్రకారం మాండవ్యముని శాపంతో యమధర్మరాజు శూద్ర యోనిలో విదురుడిగా జన్మిస్తాడు. ధర్మరాజులోనూ విదురుడిలోనూ ఉన్నది ధర్ముడి అంశలే. విదురుడు చనిపోయే క్షణంలో అతడిలోని వెలుగు ధర్మరాజును చేరుతుంది.

విదురుడి జ్ఞానమంటే అందరికీ గౌరవం. విదురుడంటే లోకువ. ధృతరాష్ట్రుడి పుత్రులు అతడిని పట్టించుకునేవారు కాదు.

ధృతరాష్ట్రుడికి విదుర నీతులు వినడం ఇష్టం. నిద్ర రానప్పుడల్లా విదురుడిని పిలిచి మరలా చెప్పు అంటూనే ఉంటాడు, విదురుడు చెబుతూనే ఉంటాడు.

విదురుడి భార్య సులభ. అనాసవ, అనుకేతులు వీరి పుత్రులు.

విదురుడికి కుంతీదేవికి ఉన్న సాన్నిహిత్యం కొన్ని భారత రచనలలో కానవస్తుంది.

విదురుడు కూరలో కరివేపాకు, ఆటలో అరటిపండు లాంటివాడు. అందరికీ అతడు అవసరమే. అతడికి సాయం వచ్చేవారు అరుదు. పాండవులకు అతడంటే గౌరవం. అందుకే అతడు దూతగా వచ్చి ద్యూతానికి ధృతరాష్ట్రుడు రమ్మంటున్నాడు అనగానే ధర్మరాజు వచ్చాడు.

తన తండ్రి సోదరుడని తెలిసి కూడా దుర్యోధనుడు- విదురుడిని వెళ్లి ద్రౌపదిని తీసుకురమ్మంటే విదురుడు తిరస్కరించగా ప్రాతికామిని పంపినాడు దుర్యోధనుడు.

విదురుడు పాండవ పక్షపాతి. ధృతరాష్ట్రుడికి కోపం వచ్చింది విదురుడు పదేపదే దుర్యోధనుడిని వదిలేసి కౌరవ కులాన్ని ఉద్ధరించమంటుంటే. "నీ సలహాలు నాకు చాలు పో!" అనగానే విదురుడు వెళ్లిపోయాడు వనవాసంలో ఉన్న

పాండవుల వద్దకు. మరల వెంటనే సంజయుడిని పంపి పిలిపించుకున్నాడు ధృతరాష్ట్రుడు. అంధుడైన ధృతరాష్ట్రుడికి కళ్లు, చెవులు సంజయ, విదురులు.

కురుక్షేత్ర యుద్ధం ముగిసాక ధర్మరాజు పాలన మొదలయ్యింది. భీముడి సూటిపోటి మాటలు పడలేక గాంధారి–ధృతరాష్ట్రులు ఆశ్రమ వాసానికి పోతామన్నపుడు వారితోపాటు కుంతీదేవి, సంజయ, విదురులు వారిననుసరించారు.

అక్కడకు వెళ్లిన ధర్మరాజుకు విదురుడు కనిపించాడు అవధూతగా. విదురుడు చనిపోగానే అతడిలోని వెలుగు ధర్మరాజును చేరుకున్నది.

Vidura Complex - తానెన్ని నీతులు చెప్పినా ఎదుటివాళ్లు వింటారే గాని ఆచరించరని తెలిసీ అడిగితే చెప్పకుండా ఉండలేకపోవడం. (తాను దాసీపుత్రుడినన్న న్యూనతాభావన ఒక్కోసారి అతడిని అధోముఖుడిని చేస్తుంది).

**10) ద్రోణుడు :** దేవతల గురువు బృహస్పతి. బ్రహ్మ లేదా అగ్ని కుమారుడు అంగీరసుడు. అంగీరసుడి భార్యలు సురూప, స్మృతి. అంగీరసుడు రెండవ అగ్నిగా స్మృతి, స్వాధలకు భర్త అయినాడు. సప్త జిహ్వికలు, బృహస్పతి, ఉతథ్యుడు, సంవర్తనుడు అంగీరసుడి సంతానం.

బృహస్పతి భార్య తార. తారకు చంద్రుడి వలన బుధుడు; బృహస్పతి వలన కచుడు జన్మించారు. ఉతథ్యుడు–మమతల కుమారుడు భరద్వాజుడు. ప్రవర ఋషుల్లో మూడవవాడు భరద్వాజుడు (అంగీరస, బృహస్పతి, భరద్వాజ). ధనుర్ వేదాన్ని వ్రాసినాడు. పిండోత్పత్తికి వీర్యము స్త్రీ రక్తంతో కలవాలనేది అతడి సిద్ధాంతం – అదీ సరైన ఋతుచక్ర సమయంలో. భరద్వాజుడి నీతిశాస్త్రం, స్మృతి, పాంచరాత్ర, గృహ సూత్రాలు ప్రసిద్ధమైనవి. భరద్వాజుడి భార్య క్షత్రియ కన్య సుశీల. వీరి పుత్రుడు– భూమన్యుడు.

భరద్వాజుడు–ఘృతాచి అప్సరసల స్నేహంతో భరద్వాజుడి వీర్యం పతనం కాగా దానిని కుండలో ఉంచితే ద్రోణుడు పుట్టినాడు (కలశ సంభవుడు).

ద్రోణుడు ధనుర్విద్యలో అనేక మెలకువలు తెలిసినవాడు. అగ్నివేశుడి వద్ద, తండ్రి భరద్వాజుడి వద్ద ధనుర్వేదాన్ని నేర్చుకుని అనేక అస్త్రాలను రూపొందించాడు. పరశురాముడి శిష్యుడిగా అనేక దివ్యాస్త్రాలను పొందినాడు.

ద్రోణుడి భార్య కృపాచార్యుడి చెల్లెలు కృపి. వీరు కూడా వీర్యసంభవులే. శరద్వంతుడనే గౌతముని ముని మనమడు ధనుర్విద్యలో అభిలాష కలవాడు ఇంద్రుడు పంపిన 'జనపది' అనే అప్సరసను చూసి వీర్యస్ఖలనం కాగా వీర్యం పడింది రెల్లువనంలో. దానిలో పుట్టారు కృపుడు, కృపి. శంతనుడు వారిని పెంచినాడు.

ద్రోణుడు ద్రుపదుడు సహాధ్యాయులు. భరద్వాజుడి వద్ద అనేక విద్యలు నేర్చుకున్నారు. ద్రుపదుడు రాజైనాక ద్రోణుడు సహాయం కోరగా అవమానించాడు ద్రుపదుడు. ద్రోణుడు కౌరవ పాండవులకు గురువై గురుదక్షిణగా ద్రుపదుడిని సజీవంగా బంధించి తెమ్మని కోరినాడు. కౌరవులు విఫలులైనపుడు భీమార్జునులు వెళ్లారు. అర్జునుడు ద్రుపదుడిని ఓడించి తెచ్చి ద్రోణుడి కాళ్ల ముందు పడవేసినాడు. ద్రుపదుడి రాజ్యంలో కొంత తీసుకుని ప్రాణాలతో వదిలి వేసినాడు ద్రోణుడు. అశ్వత్థామకు పాలకోసం అడిగితే సాయం చెయ్యని ద్రుపదుడిని ఓడించి రాజ్యాన్ని గెలిచాడు ద్రోణుడు.

ద్రోణుడిపై పగ పెంచుకుని ద్రుపదుడు గొప్ప యజ్ఞం చేసి ధృష్టద్యుమ్నుడు, ద్రౌపదిలను సంతానంగా పొందినాడు. వీరుకాక శంఖుడు, శిఖండిని ద్రుపదుని సంతానం. ద్రౌపదిని అర్జునుడికిచ్చి వివాహం చేసి అతడితోనే ద్రోణుడిని ఓడించాలనేది ద్రుపదుడి సంకల్పం.

ద్రౌపది పాండవులకు భార్య అయ్యింది. రాజసూయ యాగం అసూయ యాగంగా మారి, మయసభ ద్యూతసభకు దారితీసి పాండవులకు ఓటమి, ద్రౌపదికి నిండు సభలో వస్త్రాపహరణ ప్రయత్నం, అవమానం, ప్రతిజ్ఞలు, మరల అర్ధరాజ్య ప్రాప్తి; అనుద్యూతం, వనవాసం, అజ్ఞాతవాసం, రాయబారాల విఫలం చివరకు కురుక్షేత్ర యుద్ధానికి దారితీసాయి.

గురువును చంపలేని శిష్యుడు; శిష్యుని చంపలేని గురువుల మధ్య పోరాటం. అయితే గురుపుత్రుడు అశ్వత్థామ తొలుదొల్త పాండవ పక్షపాతి. తండ్రిని అధర్మంగా వధించారని అతడే పాండవ వంశ నాశనానికి కారణమైనాడు.

ద్రోణుడు తన ప్రియశిష్యుడు అర్జునుడి కోసం ఏకలవ్యుడనే నిషాదరాజు పుత్రుడికి శిష్యత్వం నిరాకరించడమే కాక ఏకలవ్యుడి బొటనవ్రేలును దక్షిణగా తీసుకుని అర్జునుడికి పోటీ లేకుండా చేసినాడు. అర్జునుడికి అనేక దివ్యాస్త్రాలనిచ్చాడు.

నకులుడికి 'అసి' అనే ఖడ్గాన్నిచ్చాడు.

అగ్నివేశుడి నుంచి పొందిన బ్రహ్మశిరోనామకాస్త్రాలను కుమారుడు అశ్వత్థామకు, అర్జునుడికి ఇచ్చాడు.

కురుక్షేత్ర యుద్ధంలో 11వ రోజున కౌరవ సేనాధిపతిగా నియమింపబడినాడు. ధర్మజుని బంధించడమే ధ్యేయంగా సాగిన యుద్ధంలో విఫలుడై, అభిమన్యుని మరణానికి కారకుడై అర్జునుడి కోపానికి గురైనాడు.

15వ రోజున విరాట ద్రుపదులను చంపి, భీముడు, ధర్మరాజు "అశ్వత్థామ హతః కుంజరః" అని పలుకగా అస్త్రసన్యాసం చేసి యోగసమాధిలో ప్రాణం విడువగా, ధృష్టద్యుమ్నుడు ద్రోణుడి తల నరికినాడు.

**ద్రోణుడిలోని లోపాలు-**

- బ్రాహ్మణ ధర్మాన్ని మరచి క్షత్రియ ధర్మానికి ప్రాధాన్యత నివ్వడం;
- ఇరుపక్షాలకూ గురువై యుద్ధంలో తటస్థంగా ఉండడానికి బదులు కౌరవ పక్షాన పోరాడడం.
- ధర్మరాజును సజీవంగా బంధించి తెస్తే మరల జూదమాడించి మరల వనవాసం, అజ్ఞాతవాసం చేయిస్తానని దుర్యోధనుడు స్పష్టంగా చెప్పినా అది అధర్మమని తెలిసీ ధర్మజుని బంధించడానికి ప్రయత్నించడం.
- యుద్ధ నియమాలను రూపొందించిన తానే లక్ష్మణ కుమారుని మరణానంతరం, అభిమన్యుడిని ఒంటరివాడిని చేసి అందరూ కలిసి చంపడం.
- తన కుమారుడు అశ్వత్థామ కోసం ద్రుపదుడి రాజ్యాన్ని గెలవడం. అతడికి క్షత్రియ విద్యలను నేర్పి రాకుమారుడిలా, దొరలా పెంచడం – ఇవన్నీ అతడిలోని లోపాలు.

దుర్యోధనుడిపై ఉన్న స్వామిభక్తి కన్నా, ద్రుపదుడితో అతడికున్న వైరం ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకున్నది. దుర్యోధనాదులను వాళ్ల మానానికి వాళ్లను వదిలేసి తాను పాంచాలురపై పగతీర్చుకోవడంపై దృష్టి నిలిపాడు.

తనకున్న అధికారాన్ని పాత పగలు తీర్చుకోవడానికి వాడే మనోస్థితిని Drona Complex అంటారు.

**11) ద్రుపదుడు :** పృషతుడు లేదా సోమకుడి కుమారుడైన ద్రుపదుడి జననమూ విచిత్రమే. ఇతడి తండ్రి మేనకను చూసినపుడు రేతఃపతనం కాగా రేతస్సును తన పాదాలతో కప్పిపెట్టినాడు. అది శిశువై ద్రుపదుడైనాడు. ద్రుపదుడూ తనలా వీర్యపుత్రుడు, కలశజుడైన ద్రోణుడికి సహాధ్యాయి. ద్రోణుడి తండ్రి భరద్వాజుడి వద్ద ధనుర్విద్యాది విద్యలు నేర్చుకున్నాడు ద్రుపదుడు. ఆ తరువాత పాంచాల రాజ్యానికి రాజైన ద్రుపదుడు ద్రోణుడిని నిర్లక్ష్యంగా చూసాడు. స్నేహితులైన వారు కటిక శత్రువులుగా మారినారు. వారిరువురి మధ్య వైరం ద్రోణుడి గురుదక్షిణ– ద్రుపదుని ఓటమి, రాజ్యనష్టం, హోమాగ్నిలో ధృష్టద్యుమ్న, ద్రౌపదిల జననం; ద్రౌపదీ స్వయంవరం, వివాహం; కురుక్షేత్ర యుద్ధం వరకు తీసుకువచ్చింది. ధృష్టద్యుమ్నుడికి కూడా ద్రోణుడు గురువే. అయినా ద్రోణ వధకై జన్మించిన ధృష్టద్యుమ్నుడు ఆ లక్ష్యంతోనే పెరిగి, పాండవపక్ష సర్వసైన్యాధిపతి యైనాడు.

కురుక్షేత్ర యుద్ధం 15వ రోజున ద్రోణుడికి ద్రుపదుడికి మధ్య ఖడ్గయుద్ధం జరిగి ద్రుపదుడు మరణించాడు. ద్రోణుడు కన్నీళ్లు పెట్టుకున్నాడు స్నేహం అలా ముగిసినందుకు. అదే రోజున అశ్వత్థామ చనిపోయాడని ధర్మరాజు అర్ధసత్యం చెప్పగా యోగ సమాధిలో ప్రాణం విడిచిన ద్రోణుని శిరచ్ఛేదం చేసాడు ధృష్టద్యుమ్నుడు.

18వ రోజు అర్ధరాత్రి, అందరూ నిద్రిస్తున్న సమయంలో పాండవ శిబిరంలో ప్రవేశించిన అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని మెడకు అల్లెతాడు బిగించి ఊపిరాడకుండా చేసి పశువును చంపినట్లు చంపినాడు. ద్రుపదుని పుత్రులు అర్జునుని రథచక్ర రక్షకులైన యుధామన్యుడు, ఉత్తమౌజుడు, ఉపపాండవులు, శిఖండిలను చంపి తండ్రి హత్యకు ప్రతీకారం తీర్చుకున్నాడు అశ్వత్థామ.

అహంకారానికి, ఆరని పగకు ఉదాహరణ Drupada Complex.

**12) కృపాచార్యుడు :** గౌతమ ముని వంశీకుడైన శరద్వంతుడికి విలువిద్యపై ఆసక్తి ఎక్కువ. అతడి విలువిద్యలో నైపుణ్యానికి దేవేంద్రుడే ఆశ్చర్యపడి అతడి మనసు మళ్లించడానికి 'జనపది' అనే అప్సరసను పంపినాడు. దానితో అతడి మనసు చలించగా రెల్లుపొదలలో వీర్యపతనమై అది రెండు భాగాలు కాగా ఇద్దరు పిల్లలు జన్మించారు. మగపిల్లవాడు కృపుడు, ఆడపిల్ల కృపి.

శంతనుడు వారిద్దరిని పెంచినాడు. శంతనుడి కృపకు నోచుకున్నారు కనుక కృప, కృపిగా పేరుగాంచారు వాళ్లు. విషయం తెలిసిన శరద్వంతుడు తన కుమారుడికి ధనుర్విద్య నేర్పినాడు.

పాండవ, కౌరవ, వృష్ణి, యాదవులకు ధనుర్విద్య నేర్పినాడు కృపుడు. కృపితో ద్రోణుడికి వివాహమై అశ్వత్థామ జన్మించాడు.

కురుక్షేత్ర యుద్ధంలో కౌరవ పక్షాన యుద్ధం చేసినాడు. 18వ రోజున దుర్యోధనుడికి పాండవులతో సంధి చేసుకొమ్మని సలహా ఇచ్చినాడు. 18వ రోజు అర్ధరాత్రి అశ్వత్థామ, కృతవర్మలతో కలిసి యుద్ధంలో మిగిలిన పాండవ సైన్యాన్ని హతమార్చినాడు.

ధృతరాష్ట్రుడు ఆశ్రమవాసానికి వెళ్లాక కృపుడు హస్తినలోనే ఉండిపోయాడు. పాండవులు మహా ప్రస్థానానికి పోతున్నపుడు కృపాచార్యుని పరీక్షిత్తుకు ఆచార్యునిగా నియమించారు.

చిరంజీవులలో ఒకడు కృపాచార్యుడు (అశ్వత్థామ, బలి, వ్యాస, హనుమంతుడు, విభీషణుడు, మార్కండేయుడు, పరశురాముడు మిగిలినవారు). కురుక్షేత్ర యుద్ధం ముగిసాక కౌరవుల పక్షాన మిగిలిన ముగ్గురు–కృతవర్మ, అశ్వత్థామ, కృపాచార్యుడు. రాబోయే మన్వంతరంలో సప్తర్షులలో ఒకడిగా కృపాచార్యుడుంటాడు.

రాజభక్తి, నెమ్మదితనం, అసూయ లేకపోవడం Kripa Complex.

**13) గాంధారి :** గాంధార రాజ్యపు సుబల, సుధర్మల పుత్రిక గాంధారి. శకుని సోదరి. దేవీ 'మాతి' అంశలో పుట్టినదీమె. ఆమెకు నూరుగురు పుత్రులు పుడతారని శివుడి వరమున్నది. అందుకే ఆమెను భీష్ముడు ఎన్నిక చేసాడు ధృతరాష్ట్రుడికి భార్యగా.

భర్త చూడని లోకాన్ని చూడబోనని కళ్లకు గంతలు కట్టుకున్నది గాంధారి. అది భర్తమీద ప్రేమ, పతిభక్తి వలన అని కొందరు, భీష్ముడిపై, పెళ్లికుదిర్చిన పెద్దలపై కోపంతో అని కొందరు అభిప్రాయబడుతున్నారు.

అంధుడైన పెద్దకొడుకుకు రాజ్యార్హత లేకపోవడంతో అది పాండురాజుకు దక్కింది. పాండురాజు భార్యలు కుంతి, మాద్రి. రాజ్యాన్ని వృద్ధిచేసినవాడు పాండురాజు. కిందముడనే ముని శాపంతో తపోదీక్ష నవలంబించాడు రాజ్యాన్ని, తన సంపదలను అన్నకిచ్చేసి పాండురాజు శృతశృంగానికి వెళ్లిపోయాడు కుంతి, మాద్రిలతో.

ధృతరాష్ట్రుడు రాజైనాడు. గాంధారి గర్భవతి అయ్యింది. రెండేళ్లయినా ప్రసవం కాలేదు. ఈలోపునే శతశృంగంలో కుంతీదేవి నియోగపద్ధతిలో ధర్ముడి అనుగ్రహాన ధర్మరాజును కన్నది.

ఆ విషయం విన్న గాంధారి అసూయతో తన కడుపుపై కొట్టుకోగా బయటపడిన మాంసపు ముద్దను, వ్యాసుడు 101 భాగాలుగా చేసి 101 నేతికుండలలో భద్రపరచగా కౌరవులు, దుశ్శల జన్మించారు. వీరికన్నా ముందుగానే కుంతీదేవికి వాయుదేవుడి అనుగ్రహంతో భీముడు జన్మించాడు. ఆ తరువాత కుంతికి అర్జునుడు, మాద్రికి నకుల సహదేవులు పుట్టినారు. పాండురాజు మరణానంతరం హస్తినకు వచ్చిన పాండవులను, కుంతీదేవిని ఎంతో ప్రేమతో ఆదరించారు. కాలం గడచి కౌరవులు పాండవులు వయసులో పెరుగుతున్నకొద్దీ బంధుత్వాలకు బదులు వైషమ్యాలు పెరిగాయి. కౌరవులకు శకుని, కర్ణుని తోడ్పాటు లభించింది. ధృతరాష్ట్రుడు కూడా పుత్రప్రేమకు వశుడై పాండవులను నిర్లక్ష్యం చేయడం మొదలెట్టినాడు. ధర్మరాజును యువరాజుగా చేసాడు. కాని ఆ తరువాత సంఘటనలు ద్రౌపదిని నిండు సభలో అవమానించేంత వరకు వచ్చాయి. గాంధారి విన్నది భీముడి ప్రతిజ్ఞను– యుద్ధంలో తొడలు విరగగొట్టి చంపుతాను దుర్యోధనుడిని –అన్న మాటలను, 'ధారుణి రాజ్యసంపదల'–

కుమారుడిని ఆ ఆపద నుంచి తప్పించడానికి తన గదిలోకి నగ్నంగా రమ్మన్నది. కనులకు కట్టిన గంతలను విప్పి దుర్యోధనుడిని చూసి ఆ శక్తితో అతడి దేహాన్ని వజ్రకాయం చేద్దామని. అయితే శ్రీకృష్ణుడు, పాండవులు ఆటపట్టించారు నగ్నంగా వెళ్తున్న దుర్యోధనుడిని. దానితో అతడు తొడలకు అరటి ఆకులు కప్పుకుని తల్లి మందిరంలో ప్రవేశించాడు. గాంధారి కళ్లగంతలు విప్పి ఒకసారి తన కుమారుడిని చూసి మరల కట్టుకున్నది. దానితో దుర్యోధనుడి ఊరుభాగం బలహీనంగా ఉండిపోయింది.

దుర్యోధనుడు జన్మించినపుడు, ద్రౌపదిని అవమానించినపుడు, యుద్ధ ముహూర్తం నిశ్చయించినపుడు హస్తినలో కనిపించిన ఉత్పాతాలను గమనించి గాంధారి హితవు చెప్పింది. చివరకు ధర్మమే గెలుస్తుందని పలికింది.

ధర్మమే గెలిచింది, పాండవులే గెలిచారు. గాంధారి అడిగింది– “ధర్మమే గెలిచింది కావచ్చు మరి దుశ్శాసనుడి రొమ్ము చీల్చి రక్తం తాగడం ఏ ధర్మం? దుర్యోధనుడి తొడలు విరగగొట్టడం ఏమి ధర్మం కృష్ణా! ఈ అధర్మాన్ని ఎందుకు ఆపలేదు? నీవు కూడా నా కొడుకుల్లా దిక్కుమొక్కు లేని చావు చస్తావు, నీ వంశమూ సర్వనాశనమవుతుంది” అని శపించింది శ్రీకృష్ణుడిని.

శ్రీకృష్ణుడన్నాడు– “అమ్మా! యాదవ కులానికి ఇంతకు ముందే ముని శాపం ఉన్నది. నీవు అనవసరంగా నీ శక్తిని వృధా చేసుకున్నావు. నీ కుమారుడిని కాస్త నియంత్రించి ఉంటే ఈ అరిష్టం జరిగేది కాదు కదా!” అని సముదాయించాడు గాంధారిని ప్రశాంతంగా శ్రీకృష్ణుడు– “నీవు నీ కనులకు కట్టిన గంతలను తీసివేసి నీ పుత్రుల దుశ్చర్యలను చూసి ఉంటే నీకే అర్థమయ్యేది ఎందుకీ యుద్ధం జరిగిందో, తప్పెవరిదో!”. గాంధారి మారు మాట్లాడలేదు.

ఆ తరువాత కొన్నాళ్లకు ఆశ్రమవాసానికి వెళ్లిపోయారు గాంధారి, ధృతరాష్ట్రుడు, కుంతీదేవి, విదురుడు, సంజయుడు. ఆ తరువాత కార్చిచ్చులో పడి కాలిపోయారు గాంధారి, ధృతరాష్ట్రుడు, కుంతీదేవి. సంజయుడు తప్పించుకుని హిమాలయాల వేపు వెళ్లాడని ఓ కథనం. విదురుడు అంతకుముందే అవధూతగా ప్రాణం విడిచాడు. అతడి నుంచి వెలువడిన కాంతిపుంజం ధర్మజుడిలో లీనమయ్యింది.

కళ్లుండీ, గంతలు కట్టుకుని ఎదుటి విషయాలను, ప్రపంచాన్ని చూడదలుచుకోకపోవడం, అసూయ గాంధారి లక్షణాలు– Gandhari Syndrome.

**14) కుంతీదేవి :** యాదవ రాజైన శూరసేనుడు, నాగకన్య మారిషల పదిహేను మంది సంతానంలో సముద్ర విజయుడు, వసుదేవుడు, ‘పృధ’ ముఖ్యులు. పృధను శూరసేనుడు తన మిత్రుడు కుంతీభోజునకు పెంపకానికివ్వగా ‘కుంతి’గా పిలువబడింది.

యాదవ, నాగ లక్షణాలతో విలక్షణంగా పెరిగినది కుంతీకన్య. దుర్వాసమునికి శుశ్రూషలు చేసి దివ్యులను ఆకర్షించే మంత్రాన్ని వరంగా పొందింది. కన్యా కుతుహలంతో సూర్యుడిని ఆరాధించి కర్ణుడిని కని లోకాపవాదానికి భయపడి అతడిని పెట్టెలో ఉంచి అశ్వనదిలో పడవేయగా అది చర్మణ్వతిలోకి, ఆ తరువాత యమున చివరకు గంగానదిలో అతిరథుడనే సూతుడికి దొరికింది. అతడి భార్య రాధ. ఆ దంపతులు ఈ బాలుడిని వసుసేనుడని పిలిచారు.

కుంతీదేవి ఆ తరువాత పాండురాజును వివాహం చేసుకోగా మునిశాపంతో అతడు భార్యాసమాగమం చేయలేని స్థితిలో నియోగ పద్ధతిన, దుర్వాసుడి మంత్రాన్ని జపించి ధర్మ, అనిల, శక్రుల వలన ధర్మజ, భీమ, అర్జునులకు జన్మనిచ్చింది. మాద్రి అదే మంత్ర ప్రభావంతో అశ్వనీ దేవతల నారాధించి కవలలు నకుల, సహదేవులను కన్నది.

యుధిష్ఠిరుడు– యుద్ధంలో స్థిరంగా ఉండేవాడు.

భీముడు– భీతి గొలిపేవాడు.

అర్జునుడు– తెల్లనివాడు (కీర్తి వలన)

నకులుడు– ముంగిస రంగు దేహమున్నవాడు

సహదేవుడు– తోటి దేవుడు (దేవతల సాటివాడు)

కర్ణుడు– కర్ణములు (చెవులకు) సహజ కుండలములున్నవాడు.

లాక్షాగృహ దహనం తరువాత కుమారులతో అడవిలో నివసించింది. హిడింబాసురుడి వధ అనంతరం హిడింబను కోడలిగా గౌరవించింది. అయినా తన కుమారులు రాక్షస భావనలకు, అరణ్యానికి పరిమితం కాకుండా ఏకచక్రపురం వేపు వెళ్లేట్లు చూసింది. అక్కడ ద్రౌపదీ స్వయంవరంలో ఆమె పుత్రులు పాల్గొన్నారు బ్రాహ్మణుల వేషంలో. ద్రౌపదిని గెలుచుకు వచ్చిన అర్జునుడు– “అమ్మా, నీకో కానుక తెచ్చాను” అన్నాడు. “అయిదుగురూ ఉపయోగించుకోండి!” అన్నదామె. వచ్చింది కోడలని తెలిసాక పాండవులను కోపించింది స్త్రీని కానుకగా, భిక్షగా పలికినందుకు.

మాయాద్యూతంలో కొడుకులు ఓడిపోయాక వనవాసం వెళ్తున్నపుడు ఆమె హస్తినలో ఉండిపోయింది తనను దేవతగా కొలిచే విదురుడింట్లో.

కర్ణుడు తన కొడుకేనని తెలిసికూడా ఆ మాట బయటకు రానివ్వలేదు.

అరణ్యవాస, అజ్ఞాతవాసం ముగిసాయి. ద్రుపదుడి పురోహితుడు, సంజయుడి రాయబారాలు ముగిసాయి. శ్రీకృష్ణుడు రాయబారిగా వచ్చి సంధి ప్రయత్నాలు చేసి విఫలమయినాడు. వెళ్లేప్పుడు కుంతి అన్నది– "క్షత్రియోచితంగా రాజ్యాన్ని సంపాదించుకోమను క్షత్రియులైన నా పుత్రులను".

కర్ణుడి వద్దకు వెళ్లి చెప్పింది– "నీవు రాధేయుడివి కాదు. కుంతీ పుత్రుడివి, సూర్యపుత్రుడివి. కౌరవ పక్షాన్ని వీడి పాండవులతో కలిసి రాజ్యాన్నేలుము".

కర్ణుడన్నాడు– "అమ్మా! నేను స్నేహబంధానికి కట్టుబడి ఉన్నాను. పాండవులెప్పుడూ అయిదుగురే! నీవడిగావు గనుక అర్జునుడు తప్ప మిగతా నలుగురూ నాకు దొరికినా ప్రాణాలతో వదిలేస్తాను. ఈ విధంగా కన్నతల్లి ఋణాన్ని తీర్చుకుంటున్నాను".

కుంతి అంగీకరించి కుమారుడిని ఆశీర్వదించి వెళ్లిపోయింది. ఆమెకు తెలుసు అర్జునుడికి అండగా కృష్ణుడు ఉన్నాడని. లోకాపవాద భయంతో అప్పుడు కర్ణుడిని పుట్టగానే వదిలేసింది. ఇప్పుడు ధర్మవిదిత పుత్రుల కోసం కన్యాపుత్రుడిని కర్మకు వదిలేసింది.

కుంతి వెళ్లి ధర్మరాజుతో కర్ణుడు తన పుత్రుడని ఒక్కమాట చెబితే కురుక్షేత్ర యుద్ధం జరిగేది కాదు. ఆమె చెప్పదు, అన్నిటినీ చూసే జగచ్చక్షువు సూర్యుడూ చెప్పడు. నిజం తెలిసినాక కర్ణుడు కూడా తాను సూర్యపుత్రుడనని చెప్పుకోలేదు.

పుట్టినప్పుడు, గిట్టేటప్పుడూ ఎవరికీ అక్కర్లేనివాడై, సూర్యపుత్రుడు, సూతపుత్రుడిగా తన స్వంత తమ్ముడి బాణాలకు నేలకూలి మరణించాడు కర్ణుడు.

అసలు విషయం తెలిసింది యుద్ధం ముగిసాక ధర్మరాజుకు మృతులకు పిండ ప్రదానాలు చేసేప్పుడు కుంతీదేవి చెప్పగా, ఆమె మాటలు విని నిశ్చేష్టుడై ధర్మరాజు– "అంగనాజనములకు రహస్య రక్షణాశక్తి ఇకముందు లేకుండును గాక!" అని శపించాడు.

ధర్మరాజుకు పట్టాభిషేకమయ్యింది. కొన్నాళ్ల తరువాత ధృతరాష్ట్రుడు తపోవనానికి వెళ్లదలుచుకున్నపుడు గాంధారి, విదుర, సంజయులతో తానూ వెళ్లింది కుంతీదేవి. కొంతకాలం తరువాత అక్కడ చెలరేగిన కార్చిచ్చులో ప్రాణాలు కోల్పోయినారు గాంధారి, కుంతీదేవి, ధృతరాష్ట్రులు.

లోకాపవాదానికి భయపడి కన్నకొడుకు జీవితాన్ని దుర్భరం చేసిన తల్లి మనఃస్థితి– Kunti Complex.

**15) కర్ణుడు :** వసుసేనుడు, అంగరాజు, రాధేయుడు. కర్ణుడు లేని భారతం లేదన్న ఖ్యాతి బడసినవాడు. ఒకే ముఖం రెండు పార్శ్వాలు కలవాడు. ఒకటి సూర్యవదనం; రెండోది సూతముఖం. కన్నతల్లి, తండ్రి వదిలేస్తే రాధ–అతిరథుల వద్ద పెరిగాడు. సూర్యప్రతాపం అతడిని విజృంభింపచేయగా సూత విధేయత అతడిని కుంచింపజేస్తుంది.

అనర్గళంగా మాట్లాడి ఇతరులకు తన శక్తిసామర్థ్యాల గురించి విశ్వాసం కలుగజేస్తున్నపుడు రవితేజంతో అలరారుతాడు. ఎవరన్నా– "సూతపుత్రా! నీకెందుకీ ఆర్భాటం" అనగానే జావకారిపోతాడు. అడుగడుగునా సూతకులం వలన శూద్రుడిగా చూడబడినవాడు కర్ణుడు. ఆనాటి అగ్రవర్ణాలైన బ్రాహ్మణులు, క్షత్రియులచే అనుక్షణం అవమానించ బడినవాడు. పుట్టుక అతడికి క్షాత్రవ్యాన్నిస్తే, పెంపకం అతడికి విధేయతను నేర్పింది. అతడి గొప్పతనాన్ని గుర్తించి ఓ మనిషిగా గౌరవించినవాడు సుయోధనుడొక్కడే!

అప్పటి వరకు పాండవులలో భీముడొక్కడిని వధిస్తే హస్తినాపురం మొత్తం తనదవుతుందనుకున్న దుర్యోధనుడికి అర్జునుడి విలువిద్యా నైపుణ్యం, దివ్యాస్త్ర సంపన్నత కంటగింపయ్యింది. అటువంటి అర్జునుడిని కుమారాస్త్ర ప్రదర్శన సందర్భంగా బహిరంగంగా సవాలు విసిరి తన ప్రతిభను ప్రదర్శించాడు కర్ణుడు. దుర్యోధనుడు అంత చక్కటి అవకాశం వదులుకోకుండా కర్ణుడికి మైత్రీ హస్తాన్నిచ్చి అంగరాజును చేసాడు. అప్పటి నుంచి వారి స్నేహం అద్వితీయంగా, నిర్దోషంగా, స్వచ్ఛంగా సాగింది. "మీరెవ్వరూ అక్కర్లేదు నాకు కర్ణుడున్నాడు చాలు" అనగలిగాడు దుర్యోధనుడు.

కర్ణుడు ఎన్నిసార్లు అర్జునునితో ఓడిపోయినా ఓటములను లెక్కించలేదు దుర్యోధనుడు. "ఇతడొక్కడే కాస్త వొళ్లు దాచుకోకుండా నాకోసం యుద్ధం చేస్తాడు" అంటాడు.

తన కుమారుడు అంగరాజ్యాభిషిక్తుడు కాగానే ఆనందం పట్టలేక అతిరథుడు పరుగు పరుగున వచ్చి కర్ణుడిని కౌగిలించుకుంటాడు. అదిచూసి భీముడు ఎగతాళి చేస్తాడు– "నీవు సూతపుత్రుడివా! సరె సరే! పోయి రథం నడుపుకో! నీకు

రాకుమారులతో పోటీ ఎందుకు? పైగా నీకు అంగరాజ్యం - పురోడాశంబు కుక్కకర్హమగునె - దేవతలకర్పించాల్సిన ప్రసాదాన్ని కుక్కముట్టుకున్నట్లు". అయినా, దుర్యోధనుడు ఆ మాటల్ని పట్టించుకోలేదు.

దుర్యోధనుడి ప్రతి ఆలోచనను కర్ణుడు బలపరచాడు. ఆలోచనలో కర్ణుడి పాత్ర లేదు. దానిని ఎలా ఆచరణలో పెట్టాలనేదే అతడి తాపత్రయం. దుష్టచతుష్టయంలో ఒకడిగా మారి యుద్ధం వేపే ఎప్పుడూ మొగ్గు చూపేవాడు. కురువృద్ధులు, ధృతరాష్ట్రుడు ఎంత తగ్గించాలని చూసినా తగ్గేవాడు కాదు.

మాయాద్యూత సమయంలో పాండవులు ఓడిపోయి, ద్రౌపదిని ఓడిపోయినప్పుడు ఆమెను ప్రాతికామి తీసుకువస్తాడు దుర్యోధనుని ఆజ్ఞతో- "ఈమె ఇప్పుడు మా అందరి ఇళ్లు తుడవాలి" అంటాడు దుర్యోధనుడు తను మయసభలో పొందిన అవమానాన్ని గుర్తు తెచ్చుకుంటూ. పాండవులు తమ తలపాగాలు కిరీటాలు కింద పెడతారు. దుశ్శాసనుడు ద్రౌపది చీరలు లాగిలాగి కూలబడతాడు. దుశ్శాసనుడి రొమ్ము చీల్చి రక్తం తాగుతానని ప్రతిజ్ఞ చేస్తాడు భీమసేనుడు.

కర్ణుడంటారు- "ఈ ఓడిపోయి తలలు దించుకున్నవాళ్లతో ఏమి సుఖపడతావు? ఓటమి ఎరుగని వీరుడిని ఎన్నుకో!" అని దుర్యోధనుడి వేపు చూపిస్తాడు. దుర్యోధనుడు సంజ్ఞ చేస్తాడు ద్రౌపదికి, వచ్చి తన తొడలపై కూర్చోమని. భీముడు మరల ప్రతిజ్ఞ చేస్తాడు- "యుద్ధంలో నీ తొడలు విరగగొడతానని".

ఈ గొడవంతా విని ధృతరాష్ట్రుడు పాండవులకు స్వేచ్ఛను, రాజ్యాన్నిస్తాడు. అనుద్యూతంలో ధర్మరాజు ఓడిపోగా పన్నెండేళ్ల వనవాసం ఏడాది అజ్ఞాతవాసం చెయ్యాల్సి వస్తుంది.

ఘోషయాత్ర, గోగ్రహణ సమయాల్లో అర్జునుడి చేతిలో చిత్తుగా ఓడిపోయినా కర్ణుడు పట్టించుకోడు. యుద్ధంలో జయాపజయాలు మామూలే అంటాడు. మరల పాండవులతో యుద్ధానికి సై అంటాడు.

**కర్ణుడికి తన లోపాలు తెలుసు-**

1) తాను సూతపుత్రుడనన్నది.

2) పరశురాముడి వద్ద నేర్చుకున్న విద్యలు, సంపాదించిన అస్త్రాలు సమయానికి పనికిరావని.

3) బ్రాహ్మణ శాపం తన రథాన్ని క్రుంగదీస్తుందని.

4) తన కవచ కుండలాలను ఇంద్రుడు తీసుకుపోగా తన శక్తి తగ్గిందని.

5) తన దగ్గర ఇప్పుడు ఇంద్రుడిచ్చిన 'శక్తి', నాగాస్త్రం ఉన్నాయి. పరశురాముడిచ్చిన విజయమనే ధనుస్సున్నది. అయితే ఈ దివ్యాస్త్రాలు, మంత్రాలు సమయానికి గుర్తుకు వస్తాయా?

యుద్ధానికి ముందు కర్ణుడిని శక్తిని తగ్గించే ప్రయత్నాలు జరిగాయి.

1) బ్రాహ్మణవేషంలో వచ్చిన ఇంద్రుడు కర్ణుడి కవచకుండలాలను దానంగా గైకొని, ఒక్కసారి మాత్రమే పనికివచ్చే 'శక్తి' అనే దివ్య ఆయుధాన్నిచ్చి వెళ్లాడు. (తన పుత్రుడైన అర్జునుడిని రక్షించుకోవడానికి).

2) కవచకుండలాలు కత్తితో కోసి ఇవ్వగా గాయపడిన దేహాన్ని బాగుచేసుకున్నాడు కర్ణుడు సహదేవుడి వైద్యంతో.

3) శ్రీకృష్ణుడి రాయబారం, దుర్యోధనుడి కుట్ర విఫలం కాగా శ్రీకృష్ణుడు రహస్యంగా వచ్చి కర్ణుడి జన్మరహస్యం గురించి వివరించాడు. ఆ తరువాత కన్నతల్లి కుంతీదేవి వచ్చి పుత్రభిక్ష పెట్టమంటుంది. కన్నతల్లి వచ్చింది తనపై ప్రేమతో కాదని, తన ఇతర పుత్రుల క్షేమం కోసం అని గ్రహించిన కర్ణుడంటాడు- "అమ్మా! ఎప్పటికీ పాండవులైదుగురే! అర్జునుడు తప్ప మిగతా నలుగురూ దొరికినా ప్రాణాలతో వదిలేస్తాను". కుంతీదేవి అతడిని ఆశీర్వదించి వెళ్లిపోయింది.

4) శ్రీకృష్ణుడుండగా అర్జునుడిని ఎవ్వరూ చంపలేదన్నది అందరికీ తెలిసినా, తన దివవ్యాస్త్రాలు శక్తి, నాగాస్త్రాలపై కర్ణుడికి నమ్మకమెక్కువ. అయితే యుద్ధరంగంలో అవి పనికి రాకుండా కృష్ణుడు తన ప్రయత్నాలు తాను చేసాడు.

5) భీష్ముడు పాండవ పక్షపాతి. కర్ణుడిని అర్థరథుడని ప్రకటించి తాను బతికున్నంత వరకు యుద్ధరంగం వేపు రాకుండా చూసాడు. ఇద్దరూ ఉండి ఉంటే కౌరవులకు విజయావకాశాలు పెరిగేవి. కర్ణుడి జన్మరహస్యం తెలిసీ, తెలియనట్లున్నవాడు భీష్ముడు.

భీష్ముడి యుద్ధం వలన పాండవులకే అపాయమూ జరగలేదు. పైపెచ్చు తొమ్మిదిరోజులు గడిచాయి. దానితో దుర్యోధనుడు వెళ్లి సవినయంగా అన్నాడు భీష్ముడితో- "తమరు స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తే నేనూ, కర్ణుడూ మా పాట్లేవో

మేము పడతాం!". ఆ మాటలు శూలాలై తాకగా భీష్ముడు గొప్ప యుద్ధం చేసి, తాను చెప్పినట్లు అర్జునుడు శిఖండిని ముందు పెట్టుకుని రాగా అస్త్రసన్యాసం చేసి అర్జునుడి బాణాలతో అంపశయ్య నలంకరిస్తాడు.

భీష్ముడి ఆశీస్సులను గైకొని కర్ణుడు, పదకొండవ రోజున ద్రోణుడు సర్వసేనాధిపతి కాగా యుద్ధరంగంలో ప్రవేశిస్తాడు. ఇప్పుడందరి లక్ష్యం ధర్మరాజును సజీవంగా బంధించి దుర్యోధనుడికి అప్పగించడం. అప్పుడు మరల శకునితో జూదమాడించి, ఓడించి మరల పన్నెండేళ్ల వనవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసం - ఇది దుర్యోధనుడి ఆలోచన.

పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడిని వీరాధివీరులందరూ కలిసి చుట్టుముట్టి చంపుతారు. దానికి ప్రతిగా సైంధవ వధ చేసినాడు అర్జునుడు. 14వ రోజు రాత్రి ఘటోత్కచుడిని చంపడానికి శక్తి ఆయుధాన్ని వాడినాడు కర్ణుడు. 15వ రోజు ద్రోణుడు మరణించాడు. పదహారవ రోజున కర్ణుడు సర్వసైన్యాధిపతి అయినాడు. కర్ణుడి వీరవిహారానికి పాండవసేన కకావికలమయ్యింది. పదిహేడవ రోజున దుర్యోధనుడి విజ్ఞప్తితో శల్యుడు కర్ణునికి రథసారథి అయినాడు. శల్య సారథ్యాన్ని అధిగమించి గొప్ప యుద్ధం చేసినాడు కర్ణుడు. నాగాస్త్రం విఫలమయ్యింది కృష్ణుడి చాకచక్యంతో. రథం కృంగి, అస్త్రాలు, మంత్రాలు గుర్తురాక, నిరాయుధుడై ఉన్న కర్ణుడి శిరస్సు ఖండించాడు అర్జునుడు, అభిమన్యుడి వధకు ప్రతీకారంగా. సూర్యుడితో పాటు సూర్యపుత్రుడు కర్ణుడూ అస్తమించాడు.

కర్ణుడి మరణానంతరం మెచ్చుకున్నాడు శల్యుడు– ఇటువంటి యుద్ధాన్ని తానెప్పుడూ చూడలేదని. కర్ణునికి జేజేలు పలికాడు.

సూర్యుడు వెలుగుకు ప్రతీక. ఇంద్రుడు మేఘాలకు, వర్షానికి, ఉరుములు, మెరుపులు, పిడుగులకు చిహ్నం. వేద సాంప్రదాయంలో ఇంద్రుడు సూర్యరథాన్ని, చక్రాన్ని బలహీనపరుస్తాడు, మేఘాలతో కమ్మి చీకటిని సృష్టిస్తాడు.

వీరి మధ్య ఉన్న వైరం వీరి అంశలతో పుట్టిన వారిలోనూ కానవస్తుంది. రామాయణంలో 'వాలి' ఇంద్రుడి పుత్రుడు. సుగ్రీవుడు సూర్యపుత్రుడు. సూర్యవంశస్థుడైన రాముడి సాయంతో సుగ్రీవుడు వాలితో యుద్ధం చేయగా రామబాణంతో వాలి నేలకూలినాడు.

భారతంలో కర్ణుడు సూర్యపుత్రుడు. అర్జునుడు ఇంద్రుడి పుత్రుడు. ఇద్దరి తల్లి కుంతీదేవి. అర్జునుడు తాను ఇంద్ర పుత్రుడని చెప్పుకున్నాడు. కౌరవులు ఘోషయాత్రకు వస్తున్నపుడు వారినడ్డగించడానికి ఇంద్రుడు చిత్రసేనుడిని పంపినాడు. స్వర్గానికి ఆహ్వానించి అర్ధ సింహాసనమిచ్చాడు. ఇంద్రప్రస్థ నగరాన్ని నిర్మించి ఇచ్చాడు. కొడుకును రక్షించడానికి బ్రాహ్మణరూపంలో వెళ్లి కర్ణుడి కవచకుండలాలు గ్రహించాడు. ఒక్కసారి మాత్రమే పనిచేస్తుందన్న షరతుతో 'శక్తి' అనే దివ్యాయుధాన్నిచ్చాడు కర్ణుడికి.

సూర్యుడు మాత్రం ముందస్తు హెచ్చరిక చేసాడు కర్ణుడికి. కుంతీదేవి కర్ణుడితో 'నీవు నా కుమారుడివి' అని చెప్పినపుడు అది నిజం అని పలికాడు. అంతే.

సూర్యుడి రథం మబ్బులో కుంగినట్లు, సూర్యపుత్రుడు కర్ణుడి రథం భూమిలో కుంగినపుడు ఇంద్రపుత్రుడు అర్జునుడు అతడిని నేలకూల్చినాడు.

కర్ణుడి వరకు కన్నతల్లి పృథ సూర్యుడికి రాత్రిలాంటిది. పెంపుడు తల్లి రాధ పగలు లాంటిది.

(సూతుడు–క్షత్రియుడికి బ్రాహ్మణ వనితకు పుట్టినవాడు. వర్ణ సంకరం వలన కలిగిన వీరు రథసారథులుగా, పురాణ వ్యాఖ్యాతలుగా జీవనం గడుపుతారు. శల్యుడు సూతుడిని శూద్ర సమానంగా చూసినాడు).

జన్మతః క్షత్రియుడు– ఎవరికీ తలవంచని మనస్తత్వం. పెంపకంలో సూతుడు– తలవంచి బ్రతకడం తప్పనిసరి. ఈ రెండు లక్షణాలు కర్ణుడిలో కనిపిస్తాయి. వాచాలత్వం, ఆత్మస్తుతి, పరనింద, అసహనం, అసూయ ఇతడిలో చెడు లక్షణాలు. మచ్చలేని స్నేహం, దానగుణం, వీరత్వం, ప్రభు భక్తి ఇతడి మంచి లక్షణాలు.

వచ్చిన ప్రతి అవకాశం అతడిని మరింత అథోగతికి నెట్టింది. తాను బ్రాహ్మణ కుమారుడనని పరశురాముడి దగ్గర విలువిద్య నభ్యసించి భార్గవాస్త్రం, విజయధనుస్సు పొందినాడు. రాక్షస పురుగు తొడను తొలవగా గురువుకు నిద్రాభంగమై నిజం చెప్పమంటే అప్పుడు తాను బ్రాహ్మణుడిని కానని చెప్పడంతో క్షత్రియ ద్వేషి పరశురాముడు ఆగ్రహం చెంది నేను నేర్పిన విద్యలేవీ నీకు సమయానికి గుర్తురావని శపించాడు. తరువాత శాపాన్ని ఉపసంహరించుకున్నాడని కర్ణుడు దుర్యోధనునితో చెప్పాడు. విలువిద్య అభ్యాసం చేస్తున్నపుడు కర్ణుడి బాణం తగిలి హోమధేనువు మరణించడంతో బ్రాహ్మణుడు శపించాడు

కర్ణుడిని– “ఎవరిని చంపాలని లేదా ఓడించాలని నీవింత అభ్యాసం చేస్తున్నావో అది సరైన సమయంలో నిరుపయోగమగును గాక!” ఎవరో బ్రాహ్మణుడి నూనె నేలపై ఒలికితే మట్టిని పిండి నూనెను తీసాడు కర్ణుడు.

“భూదేవి శపించింది నీ రథం క్రుంగుతుందని. ఇంద్రుడు వచ్చి కవచకుండలాలు తీసుకుపోయాడు. ఇలా నీచేత, నాచేత, అనయంగా ఆరుగురి చేత కర్ణుడు నేలకూలినాడు సుమా” అన్నాడు కృష్ణుడు అర్జునుడితో.

కర్ణుడు చనిపోయాడని తెలిసేంత వరకూ ధర్మరాజు ఆందోళనతో సరిగా నిద్రపోలేదు. అజాతశత్రువైన ధర్మరాజుకు పదమూడేళ్లు నిద్రపట్టకుండా చేసింది కర్ణుడి శౌర్యం. కర్ణుడు చనిపోయాడన్నాక ధర్మరాజన్నాడు– “సకల ధరణి వలయ సామ్రాజ్యమునకు నేడేను భర్తనైతి”; యుద్ధరంగానికి వెళ్లి అచేతనంగా పడి ఉన్న కర్ణుడి శిరస్సును చూసి సంతృప్తిగా నిట్టూర్చినాడు ధర్మరాజు.

దుర్యోధనుడు వెలవెలబోయి శల్యుడు చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకుని కర్ణా! కర్ణా! అని శోకిస్తూ తన శిబిరం వేపు వెళ్లినాడు. కాని శిబిరంలోకి ప్రవేశించలేదు. కృపాచార్యుడు సంధిచేసుకొమ్మని చెప్పినా వినలేదు. రెండామడల దూరంలో ఉన్న సరస్వతీ నదీ సమీపాన విడిది చేసినాడు రారాజు. కర్ణుడు అస్తమించగానే దుర్యోధనుడిలోని ఆశా సూర్యుడూ అస్తమించాడు.

ప్రజ్ఞ ఉండీ వర్ణమేఘం కమ్మి వెలుగు తగ్గినవాడు, హస్తినాపుర చక్రవర్తి కావాల్సినవాడు కానీనుడై జన్మించి ఆ అర్హత పోగొట్టుకున్నవాడు; సూతుడింట్లో పెంచబడి వీరులతో సూటిపోటి మాటలు పడినవాడు, దానవీరశూర కర్ణుడై, కవచ కుండలాలను అపాత్రదానం చేసి చావును కొనితెచ్చుకున్నవాడు, జన్మరహస్యం తెలిసినాక కూడా స్నేహధర్మపు మాటను జవదాటనివాడు అయిన కర్ణుని మనస్థితిని Karna Syndrome లేదా Frustration Complex అంటున్నారు.

**16) దుర్యోధనుడు :** యుద్ధంలో జయించశక్యం కానివాడు, అభిమానధనుడు, హస్తినాపురానికి తానే అసలైన వారసుడని నమ్మినవాడు, శతసోదర పరివేష్టితుడు, రారాజుగా పేరెన్నికగన్నవాడు సుయోధనుడు.

శతశృంగం నుంచి పాండవులు తమ తండ్రి మరణానంతరం హస్తినకు వచ్చి పెదతండ్రి ధృతరాష్ట్రుడి సంరక్షణలో ఉన్నారు. కౌరవులు పాండవులు అందరూ కృప, ద్రోణాచార్యుల వద్ద విద్యలు నేర్చుకుంటున్నారు. పాండవులైదుగురే అయినా భీముడి బలం వలన కౌరవులు నూరుగురినీ కట్టకట్టి పడేస్తుండడంతో దుర్యోధనుడిలో అసూయా ద్వేషాలు రోజురోజుకూ ఎక్కువ కాసాగినాయి. భీముడిని చంపేస్తే మిగతా పాండవుల్ని వధించడం పెద్ద సమస్య కాదనుకుని దుర్యోధనుడు భీముడికి విషాహారం పెట్టాడు, కాళ్లూ చేతులు కట్టి నదిలో పడవేయించాడు, పాములచేత కరిపించాడు. అన్నీ తట్టుకుని మరింత బలవంతుడైనాడు భీముడు.

కుమారాస్త్రవిద్యా ప్రదర్శన రోజున అర్జునుడి విలువిద్యా నైపుణ్యం చూసాక దుర్యోధనుడిలో కొత్త భయం మొదలయ్యింది. భీముడిని గదా యుద్ధంలో తాను నిర్జించగలడు; మరి అర్జునుడినెవరు గెలుస్తారు? అప్పుడు కనిపించాడు కర్ణుడు బహిరంగంగా అర్జునుడిని సవాలు చేస్తూ. వెంటనే దుర్యోధనుడు తన స్నేహహస్తాన్ని చాచి కర్ణుడిని తన మిత్రుడిగా చేసుకున్నాడు, అతడికి అంగరాజ్యాన్నిచ్చాడు.

కర్ణుడు కూడా కళింగ రాకుమారి స్వయంవరంలో ఇతర రాజులనోడించి దుర్యోధనుడికి సాయపడినాడు భానుమతిని హస్తినకు తీసుకురావడంలో. కర్ణ, దుర్యోధనులు ఆప్తమిత్రులైనారు. దుర్యోధనుడికి మేనమామ (గాంధారి సోదరుడు) శకుని సలహాలు నచ్చేవి. సోదరుడు దుశ్శాసనుడు అన్న ఆజ్ఞను పాలించడమే తక్షణ కర్తవ్యంగా మెలిగేవాడు. దానితో దుర్యోధనుడి ఆలోచన, కర్ణుడి ఆచారణ, శకుని సలహా, దుశ్శాసనుడి విధేయత కలిసి దుష్టచతుష్టయం ఏర్పడింది.

భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, యుయుత్సుడు, కృపుల సలహాతో తన తండ్రి ధృతరాష్ట్రుడు ధర్మరాజును యువరాజుగా ప్రకటించడంతో కలవరం పుట్టింది. దానితో వారిని వారణావతానికి పంపి లాక్షాగృహంలో ఉంచి నిప్పటించగా విదురుడి హెచ్చరికతో పాండవులు సొరంగ మార్గాన అడవిలోకి తప్పించుకున్నారు. హిడింబుడిని చంపి హిడింబను పెళ్లి చేసుకున్నాడు భీముడు. ఏకచక్రపురం వెళ్లారు. బకాసురుడిని చంపినాడు భీముడు. ఆ తరువాత పాంచాల రాజ్యం కాంపిల్య నగరానికి ద్రౌపదీ స్వయంవరానికి వస్తూ అంగారపర్ణుడనే గంధర్వరాజును ఓడించి, అతడితో స్నేహం చేసుకున్నాడు అర్జునుడు.

బ్రాహ్మణుల వేషంలో ఉండి మత్స్యయంత్రాన్ని కొట్టి ద్రౌపదిని గెల్చుకున్నాడు అర్జునుడు. పాండవులైదుగురికి భార్య అయ్యింది ద్రౌపది. ద్రుపదుడింటిలో రాజభోగాలననుభవిస్తూ సుఖంగా ఉన్నారు పాండవులు. విషయం తెలిసిన

ధృతరాష్ట్రుడు పాండవులను పిలిపించి అర్ధరాజ్యమిచ్చాడు. ఇంద్రప్రస్థం రాజధానిగా పాండవులు హాయిగా ఉన్నారు. ఖాండవ వన దహనంలో అర్జునుడికి మరిన్ని ఆయుధాలు, రథం లభించాయి. శ్రీకృష్ణునితో స్నేహం గట్టిపడింది. జరాసంధుడి వధ తరువాత రాజసూయ యాగం చేసాడు ధర్మరాజు. ఆ వైభవం చూసి దుర్యోధనుడికి కన్నుకుట్టింది. ధృతరాష్ట్రుడిని ఒప్పించి ద్యూతసభా నిర్మాణం చేసి పాండవులను ద్యూతానికి పిలిపించాడు. మాయాద్యూతంలో శకుని ధర్మరాజును ఓడించాడు. సకల సంపదలు, సోదరులు, పుత్రులు, ద్రౌపది అన్నీ దుర్యోధనుడి పరమైనాయి. ద్రౌపదిని నిండుసభకు పిలిపించి వస్త్రాపహరణం చేయబోయినారు. భీముడి ప్రతిజ్ఞలతో సభ దద్దరిల్లింది. పెద్దల మాట విని పాండవులు పోగొట్టుకున్నవన్నీ మరల ఇచ్చివేసాడు ధృతరాష్ట్రుడు. అనుద్యూతంలో శకుని గెలిచాడు. పాండవులు పన్నెండేళ్ల వనవాసం, ఏడాది అజ్ఞాతవాసం చేయవలసి వచ్చింది.

వనవాస సమయంలో పాండవులను మట్టుపెట్టడానికి ఎన్నో విఫల ప్రయత్నాలు చేసాడు దుర్యోధనుడు. భీముడు రాక్షసులను చంపుతున్నాడు. అర్జునుడు దివ్యాస్త్రాలను పొందుతున్నాడు.

ఘోషయాత్రలో, గోగ్రహణంలో కూడా ఓటమి రుచి చూసినా దుర్యోధనుడు తగ్గలేదు. "వాడి సూదిమొన మోపినంత భూమి కూడా ఇవ్వన"ని మొండికేయడంతో, రాయబారాలు, అయిదూళ్ల బేరాలు విఫలమై కురుక్షేత్ర యుద్ధం మొదలయ్యింది.

పదకొండు అక్షౌహిణిల సైన్యం దుర్యోధనుడు, భీష్మ, ద్రోణ, కృప, కర్ణ, శకుని శతసోదరులతో గెలుపు తనదేనన్న విశ్వాసంతో యుద్ధరంగాన అడుగుబెట్టినాడు అనేక ఉత్పాతాల మధ్య.

ఏడక్షౌహిణీల సైన్యం పాండవులది. విరాట, ద్రుపదులు, పాండ్యరాజు, ఘటోత్కచుడి రాక్షససేన పాండవుల బలం. అయితే శ్రీకృష్ణుడు వారికి అండగా ఉన్నాడు. శిఖండి, ధృష్టద్యుమ్నులనే విరుగుడులున్నాయి వారి దగ్గర భీష్మ, ద్రోణుల నోడించేందుకు.

దుర్యోధనుడికి కృష్ణుడి దివ్యశక్తులపై పెద్ద నమ్మకం లేదు. కృష్ణుడొక మంత్రగాడు, ఇంద్రజాలికుడు అనుకున్నాడు. మానవ బలాన్ని నమ్ముకున్న వ్యక్తి దుర్యోధనుడు. కలి అంశతో జన్మించినవాడు.

పదిరోజులు యుద్ధంచేసి పాండవులకు ఏ కీడూ చేయకుండా పదివేలమంది రధికులను చంపి అంపశయ్య నెక్కినాడు భీష్ముడు.

అయిదు రోజులు యుద్ధం చేసి యుధిష్ఠిరుడిని బంధించకుండానే యోగసమాధిలో ప్రాణాలు విడిచి, ధృష్టద్యుమ్నుడితో తలనరకబడి మరణించాడు ద్రోణుడు.

రెండు రోజులు అద్భుత యుద్ధం చేసి తనను హేళన చేసినవారి నోళ్లు మూయించి, రథం నేలలో కుంగినపుడు, అర్జునుడి బాణాలతో తానూ నేలపైకి కుంగినాడు కర్ణుడు.

అర్ధరోజు యుద్ధంచేసి అస్తమించాడు శల్యుడు. గదాయుద్ధంలో భీముడి దెబ్బకు తొడలు విరిగి నేలకూలినాడు దుర్యోధనుడు.

తన కళ్లముందే తాను కట్టుకున్న గొప్ప ఆశామేడ కూలిపోవడం చూసాడు దుర్యోధనుడు. తొంభైతొమ్మిది మంది సోదరులు మరణించారు. కొడుకు చనిపోయాడు, తమ్ముడి రొమ్ము చీల్చి రక్తం తాగినాడు శత్రువు. ప్రాణమిత్రుడి ప్రాణాలు తీసినాడు ఇంకో శత్రువు. మంత్రాంగం చేసిన మేనమామ చచ్చినాడు. తొడలు విరిగి నిస్సహాయంగా నేలపై పడి ఉన్నాడు దుర్యోధనుడు.

ఆరోజు అర్ధరాత్రి అశ్వత్థామ సైన్యాధిపతి అయినాడు. గొప్ప వననిధి లాంటి కౌరవసైన్యం గోష్పాదమంతై ఇప్పుడు కేవలం ముగ్గురు వీరులకు పరిమితమైంది. తండ్రి ద్రోణుడి హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలన్న క్రోధంతో ఉన్న అశ్వత్థామ తనవెంట కృపాచార్యుడు, కృతవర్మలు రాగా అర్ధరాత్రి పాండవ శిబిరంపై నిద్రిస్తున్న కాకులపై ఉలూకపక్షి (గుడ్లగూబ) దాడి చేసినట్లు దాడిచేసి ధృష్టద్యుమ్నుడిని, పాంచాలురను, శిఖండిని, ఉపపాండవులను, సైన్యాన్ని చంపి విజయవంతంగా దుర్యోధనుడికి ఆ వార్త చెప్పినాడు. తాను నమ్మిన భీష్మ, ద్రోణ, కర్ణ, శల్యులు చెయ్యలేని పనిని అశ్వత్థామ చేయడంతో సంతృప్తిగా కన్నుమూసినాడు దుర్యోధనుడు.

కలి అంశతో పుట్టిన దుర్యోధనుడు కలికాలపు మనుషుల మానసిక స్థితికి ప్రతిబింబం. స్వార్థబుద్ధి, ఇతరుల సంపదలను అధర్మ మార్గాన కైవసం చేసుకోవడం, భూ ఆక్రమణ బుద్ధి, పెద్దల మాటను లక్ష్యపెట్టకపోవడం, స్త్రీలపై దౌర్జన్యం, కుటిలోపాయాలు, మొండితనం, ఆడంబర ప్రదర్శన దుర్యోధనుడి లక్షణాలు.

తాను నమ్మిన దానిని ఆచరించడం, స్నేహధర్మం, తన వాళ్లకు ఎంతైనా సాయం చేయడం, అభిమానం, నిరంతర ఆశావాదం ఇతడి మంచి లక్షణాలు.

కలికాలపు మానవుడి మానసిక స్థితి Duryodhana Complex.

గాంధారి గర్భంలో రెండేళ్లు, నేతికుండల్లో రెండేళ్లుండి గర్భశకలం పిండంగా, శిశువుగా మారి నేతికుండ నుంచి బయటపడినాడు ప్రపంచంలోనే ప్రసిద్ధికెక్కిన తొలి Test Tube Baby. నవీన పద్ధతిలో టెస్ట్‌ట్యూబ్‌లో పెరిగినాక తల్లి గర్భంలోకి చేరుస్తారు. దుర్యోధనాదులు తల్లిగర్భంలో రెండేళ్లు పెరిగి తరువాత నేతికుండల్లోకి మార్చబడినారు. అందుకే దుర్యోధనుడిలో నెయ్యం–స్నేహం పాలెక్కువ. సగం మానవ గుణాలు, సగం నిర్లిప్తతతో కూడిన రాక్షస గుణాలు కనిపిస్తాయి దుర్యోధనుడిలో.

దుర్యోధనాది కౌరవులందరిదీ ఒకేమాట ఎందుకంటే అందరూ ఒకే మాంసపు ముద్దలోని భాగాలు గనుక.

పంచపాండవులవి వాళ్ల తండ్రుల గుణాలననుసరించి విభిన్న ప్రకృతులు... సంయమనంతో ధర్మరాజు, భీకరమైన పెనుగాలిలా భీముడు, సరస శృంగార వీరత్వంతో అర్జునుడు, వైద్యం–జ్యోతిష నైపుణ్యాలతో నకుల సహదేవులు ప్రసిద్ధికెక్కినారు.

**17) దుశ్శాసనుడు :** గాంధారి–ధృతరాష్ట్రుల సంతానంలో రెండవవాడు. అన్నమాట జవదాటనివాడు. అసూయ, గుంపు మనస్తత్వం ఇతడి లక్షణాలు. కురుక్షేత్ర యుద్ధంలో తొలిబాణం వేసినవాడు దుశ్శాసనుడు (సుశ్శాసనుడు) నియమాలకు లొంగనివాడు.

తొలిరోజు యుద్ధంలో నకులుడు, యుధిష్ఠిరుడి చేతిలో ఓడిపోయాడు. రెండవరోజు యుద్ధంలో నకులుడితో కత్తి యుద్ధం చేసి మరణపు అంచు వరకు వెళ్లి బ్రతికాడు. పదవ రోజు శిఖండిని గాయపరచాడు. పదమూడవ రోజు అభిమన్యుడిని చుట్టుముట్టి తీవ్రంగా గాయపరచినవాడిలో దుశ్శాసనుడున్నాడు. అలసిపోయిన అభిమన్యుడిని గదాయుద్ధంలో నేలకూల్చినాడు దుశ్శాసనుని కొడుకు ద్రుమసేనుడు.

పదహారవ రోజున భీముడతడిని అతిక్రూరంగా చంపి రొమ్ము చీల్చి రక్తం తాగినాడు. కురుక్షేత్ర యుద్ధం మొత్తంలో అత్యంత భయంకరమైన దృశ్యం– దుశ్శాసనుడి చావు.

స్వంత ఆలోచన లేకుండా, Yes Boss అంటూ గుంపు మనస్తత్వంతో పెట్రేగిపోవడం Dussasana Complex.

**18) శకుని :** గాంధారిదేవి సోదరుడు. సుబలుడి కుమారుడు. మాయా మంత్రాలలో మేటి. వక్రబుద్ధి.

కౌరవ పాండవులు ఆడుకుంటున్నారు చిన్ననాటి రోజుల్లో. భీముడు ఒక్కడే పది పదిహేను మంది కౌరవులను పట్టి పడదోస్తున్నాడు. వాళ్లు గుంపుగా వచ్చి భీముడిని చికాకు పెడుతున్నారు. ఒరే కుండకా (తండ్రి ఉండగానే వేరే తండ్రికి పుట్టినవాడు) అని ఎగతాళి చేసారు కౌరవులు. పాండవులు వెంటనే ప్రతిస్పందించారు– పొండిరా గోలకులారా! (గోలక అంటే విధవరాలికి మారు మనువులో పుట్టినవాళ్లు). అంతవరకు కౌరవులకు ఈ సంగతి తెలియదు. వెళ్లి పెద్దలను అడిగితే చెప్పారు– గాంధారికి కుజదోషం ఉంది. అందుచేత ఆమెకు మేకతో వివాహం చేసి దానిని చంపేసారు. ఆ దోషం తొలిగాక ఆమెను ధృతరాష్ట్రుడికిచ్చి వివాహం చేసారు –అని.

దుర్యోధనుడికి కోపం వచ్చి తన సోదరులతో కలిసి గాంధార రాజ్యంపై దండెత్తి గాంధారరాజు సుబలుడిని, అతడి నూరుగురు పుత్రులను బంధించి కారాగారంలో పడవేసినాడు. కొన్నాళ్ల తరువాత వెళ్లి చూస్తే శకుని ఒక్కడే బ్రతికి ఉన్నాడు. అతడిని విడుదల చేసారు జాలితో కౌరవులు.

అప్పటికే 'శకుని' కౌరవుల అంతు చూసేందుకు ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు. తండ్రి చేతి ఎముకల నుంచి పాచికలను (Knuckle Bones) తయారుచేసినాడు. కౌరవులతో మంచిగా ఉంటూ వాళ్లను నాశనం చెయ్యాలనేది అతడి సంకల్పం. కౌరవ పాండవుల మధ్య చిచ్చు రేపెట్టినాడు. కౌరవులను సర్వనాశనం చేసినాడు. కృష్ణుడినే కలవరపరచేంత కుయుక్తులు పన్నేవాడు. శకుని కుమారుడు ఉలూకుడు (దుర్యోధనుడు పంపగా పాండవుల వద్దకు వెళ్ళిన ఆఖరి రాయబారి).

శకుని అనేది ఓ పెద్దపక్షి. శకుని కూడా శకునపక్షిలా ప్రవర్తించాడు. అతడి మాయా పాచికలు పక్షులై పాండవుల గౌరవ ప్రతిష్ఠలను హరించాయి.

18వ రోజు యుద్ధంలో సహదేవుడు సంహరించాడు ఉలూకుడు, శకునిలను.

తియ్యగా మాట్లాడుతూ నమ్మకస్థుడిలా ప్రవర్తించి తానున్న పక్షాన్ని సర్వనాశనం చేసే లక్షణం– Sakuni Complex.

**19) వికర్ణుడు :** ఇతడు కౌరవులలో ధర్మం వేపు మొగ్గు చూపేవాడు. ఇతడొక్కడే ద్రౌపదిని పరాభవిస్తున్నపుడు తన సోదరులను ఆక్షేపించాడు. పెద్ద చెవులు కలవాడు లేక చెవులు లేనివాడు. అంటే విని అర్థం చేసుకుని మాట్లాడేవాడు లేదా ఇతరుల మాటల ప్రభావం లేకుండా స్వబుద్ధితో మాట్లాడేవాడు.

ద్రౌపది అడిగింది సభను– "ధర్మరాజు నన్నోడి తానోడెనా? తానోడి నన్నోడెనా? – నేను ధర్మవిజితనా? అధర్మ విజితనా" అని; సభ మాట్లాడలేదు. వికర్ణుడన్నాడు– "ఎవరైనా సభలోని పెద్దలముందు ఒక ప్రశ్న లేవనెత్తినపుడు సభ దానికి స్పందించాలి కదా! ముందు ద్రౌపది ప్రశ్నకు సమాధానమియ్యండి. లేకుంటే అది కురువంశానికే అరిష్టాన్ని తెస్తుంది" అన్నాడు. "చిన్నవాడివి, నీవు మాట్లాడకు" అని అతడిని ఆపారు.

మహావీరుడైన వికర్ణుడు అనేకసార్లు పాండవ పక్షపు వీరులను నిలువరించాడు. పదమూడవ రోజు యుద్ధం నాడు పద్మవ్యూహంలో భీముడిని అడ్డుకున్నాడు వికర్ణుడు. భీముడన్నాడు– "నీవు ధర్మపక్షపాతివి. ఆరోజున నీ సోదరుడినే అధిక్షేపించావు. దారి తొలుగు వికర్ణా!"

వికర్ణుడన్నాడు– "ఆరోజు నా విధి నేను నిర్వర్తించాను ఓ సభికుడిగా! ఈరోజు దుర్యోధనుడి సోదరుడిగా, వీరుడిగా నా విధి నేను నిర్వర్తిస్తున్నాను".

తప్పలేదు భీముడికి. తప్పులేదు వికర్ణుడిది. భీముడి బాణం లక్ష్యం తప్పలేదు. వికర్ణుడు నేలకూలినాడు. భీముడు కన్నీళ్లు పెట్టుకుని అన్నాడు–

**"త్వమాగాః సమరం వీరక్షాత్రధర్మ మనుస్మరన్**
**తతోవిని హతః సంఖ్యే యుద్ధ ధర్మోహినిష్ఠురః"** (ద్రోణ. 137–33)

వీరుడా! నీవు క్షత్రియధర్మంతో యుద్ధానికి వచ్చావు. అందుచేతనే నేను నిన్ను చంపవలసి వచ్చింది. యుద్ధ ధర్మం చాలా నిష్ఠురమైనది.

**20) యుయుత్సుడు :** ధృతరాష్ట్రుడికి వైశ్యపత్ని (సుగధ) వలన జన్మించినవాడు. యుయుత్సుడంటే యుద్ధం మీద ఉత్సుకత చూపించేవాడు. కౌరవ సోదరులతో తక్కువగా చూడబడేవాడేమో, ఇతడు పాండవ పక్షపాతిగా ఉండేవాడు. భీముడికి విషాన్నం తినబెట్టబోయినపుడు ఆ విషయాన్ని భీముడికి తెలియజేసినాడు. కౌరవుల దుశ్చర్యలకు వ్యతిరేకంగా ఉండేవాడు.

యుద్ధ ప్రారంభంలో ధర్మరాజు ప్రకటించాడు– "తాను చేస్తున్నది ధర్మయుద్ధమని తలచేవాళ్లు ఎదుటి పక్షంలో ఉన్నా తన వేపు రావచ్చు, కాదనేవాళ్లు వెళ్లిపోవచ్చు" అని. పాండవ పక్షం నుంచి ఎవరూ వెళ్లలేదు. కౌరవ పక్షం నుంచి యుయుత్సుడు వచ్చి ధర్మరాజు పక్షంలో చేరినాడు.

భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, వికర్ణులకు పాండవ పక్షపాతమున్నా వాళ్లు కౌరవుల తరపునే యుద్ధం చేసినారు.

రామాయణంలో విభీషణుడిలా, భారతంలో యుయుత్సుడు ధర్మం, న్యాయం ఉన్న పక్షం వేపు నిలిచి పోరాడినాడు.

యుద్ధానంతరం కౌరవస్త్రీలను యుద్ధరంగం నుంచి హస్తినకు తరలించాడు యుయుత్సుడు. పాండవులు పరీక్షిత్తును హస్తినకు రాజుగా, యుయుత్సుడిని రాజ్య సంరక్షకుడిగా నియమించి మహాప్రస్థానానికి వెళ్లిపోయారు.

**21) యుధిష్ఠిరుడు :** యుద్ధంలో స్థిరంగా నిలబడేవాడు. కురుక్షేత్ర యుద్ధంలో, ధర్మయుద్ధంలో స్థిరంగా నిలబడినాడితడు. క్షత్రియోచితమని జూదం, యుద్ధం రెండూ చేసాడు. మెత్తని పులి. పట్టిన పట్టు విడవడు.

ఇతడు బల్లెం విసిర్తే రాతిగోడ లోంచి దూసుకుపోతుందని, ధర్మదీక్ష వలన ధర్మజుని రథం భూమికి నాలుగు అంగుళాల ఎత్తున నేలకు తగలకుండా నడుస్తుందని ప్రతీతి. ధర్మరాజు బల్లెం పేరు శక్తి.

పాండురాజుకు వేట వ్యసనమున్నట్లు, ధర్మరాజుకు జూదం వ్యసనం. ఈ విషయం తెలిసిన దుర్యోధనుడు చక్కటి ప్రణాళిక రచించి అమలు చేసాడు. రక్తపాత రహిత యుద్ధం అది. "నన్ను బలవంతాన ఈ ద్యూతక్రీడలో పాల్గొనేలా చేస్తున్నారు. ఇది నాకు ఏమాత్రం ఇష్టంలేదు" అంటూనే అన్నీ కోల్పోయాడు తనతో సహా ధర్మరాజు. ద్రౌపది మనోనిబ్బరం వలన పూర్వస్థితి వచ్చినా అనుద్యూతంలో ఓడిపోయి పన్నెండేళ్ల వనవాసం, ఏడాది అజ్ఞాతవాసం ముగించాడు దిగ్విజయంగా.

వనవాసంలో యక్షప్రశ్నలకు సమాధానాలు చెప్పి తొలి పరీక్షలో నెగ్గినాడు. తీర్థయాత్రలు చేసాడు, అజ్ఞాతవాసంలో కంకభట్టుగా కాలక్షేప జూదమాడినాడు విరాటుడితో. ఉత్తర గోగ్రహణాన్ని ఆపింది బృహన్నల, ఉత్తరుడు కాదు అని విరాట రాజుతో తగవుకు దిగి రాజు విసిరిన పాచిక తగిలి రక్తమోడ్చినాడు.

ఆ రక్తం నేలపై పడకుండా సైరంధ్రిగా అక్కడ ఉన్న ద్రౌపది, తన చీరకొంగుతో గాయాన్ని అదిమిపెట్టగా ధర్మరాజు అన్నాడు–

**–యదిహ్యేతత్ పతేద్ భూమ్ రుధిరం మమ న స్తతః**
**సరాష్ట్రస్త్వం మహరాజ విశ్యేధా న సంశయః–**

నా రక్తం నేలమీద పడినట్లయితే నీ రాజ్యంతో సహా నీవూ నశించిపోయేవాడివి. ఇందులో సందేహం ఏమీలేదు.

కురుక్షేత్ర యుద్ధం మొదలయ్యింది.

స్వర్ణరథం, బంగరు చంద్రబింబం, దానిచుట్టూ గ్రహాలు పరివేష్టించి ఉన్న పతాక, రెండు పెద్ద ఢంకాలు, రథానికి అటువేపొకటి, ఇటువేపొకటి– నంద, ఉపనంద అనేవి ఉన్న రథంలో వచ్చి యుద్ధరంగం మధ్యలో రథాన్నాపి ధర్మరాజు ప్రకటించాడు–

**అథ సైన్యస్య మధ్యే తు ప్రాక్రోశత్ పాండవాగ్రజః**
**యోస్మాన్ వృణోతి తమహం వరయే సాహ్యకారణాత్** (భీష్మ. 43-94)

నా పక్షాన నిలబడి యుద్ధం చేయదలుచుకున్నవాళ్లు రావచ్చు అని ప్రకటించగా యుయుత్సుడు ముందుకు వచ్చాడు.

**ఏహ్యేహి సర్వేయోత్స్యామః తవ భ్రాతౄన పండితాన్**
**యుయుత్సో వాసుదేవశ్చ వయంచ బ్రూమ సర్వశః** (భీష్మ. 43-97)

యుయుత్సుడిని ఆహ్వానించాడు ధర్మరాజు.

ధర్మరాజును ఏదో ఒకరకంగా బంధించాలనేది దుర్యోధనుడి ఆలోచన. ఆ బాధ్యతను ద్రోణుడిపై పెట్టాడు. ద్రోణుడన్నాడు– "అర్జునుడు చుట్టుపక్కల లేకుండా చూడు".

13వ రోజున అభిమన్యుడు మృతి చెందాడు.

14వ రోజున అర్జునుడు సైంధవుడిని వెదుకుతున్న సమయంలో యుధిష్ఠిర ద్రోణుల మధ్య గొప్ప యుద్ధం జరిగింది. బల్లెపు యుద్ధంలో ద్రోణుడు ఓడిపోతున్న సమయంలో అశ్వత్థామ వచ్చి రక్షించాడు.

అదే రోజున యుధిష్ఠిర, దుర్యోధనుల మధ్య పోరాటం వీరోచితంగా సాగి ఒకరినొకరు తీవ్రంగా గాయపరచుకున్నారు.

15వ రోజున ద్రోణుని చంపడానికి ఒకే మార్గం దొరికింది పాండవులకు. భీముడు అశ్వత్థామ అనే ఏనుగుని చంపి ద్రోణుడి సమీపంగా వెళ్తూ– "అశ్వత్థామ హతః" అన్నాడు. భీముడి మాట కాబట్టి ద్రోణుడంత కలవరం చెందలేదు. అప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో అన్నాడు– "నీవిప్పుడు 'అశ్వత్థామ హతః' అని గట్టిగా, 'కుంజరః' అని నెమ్మదిగా అను. మేము సమయానికి యుద్ధబాకాలు, ఢంకాలు మోగిస్తాము. అప్పుడు నీవు అసత్యమాడినట్లు కాదు".

ఇష్టం లేకున్నా ద్రోణుడి సమీపానికి వెళ్లి ధర్మరాజు "అశ్వత్థామ హతః" అనగానే పెద్దగా యుద్ధవాద్యాలు మోగినాయి. "కుంజరః" అని ధర్మరాజు వెళ్లిపోయాడు యథాలాపంగా తన రథంపై. అయితే అలా అర్ధసత్యం పలికినందుకు ధర్మజుడి రథం నేలపై నడవడం మొదలెట్టింది.

ద్రోణుడు నిశ్చేష్టుడై, యోగ సమాధిలోకి వెళ్లి ప్రాణాలు పరిత్యజించాడు. ఆ స్థితిలో ఉన్న ద్రోణుడి తల నరికాడు ధృష్టద్యుమ్నుడు, తన తండ్రి ద్రుపదుని చంపినందుకు ప్రతీకారంగా.

16వ రోజున దుర్యోధనుడు పారిపోయేలా యుద్ధం చేసాడు ధర్మరాజు. 17వ రోజున దుర్యోధనుడిని బాగా గాయపరచాడు ధర్మరాజు. కర్ణుడు వచ్చి అతడిని రక్షించాడు.

18వ రోజున శల్యుడిని, అతడి సోదరుడు మద్రసేనుడిని చంపినాడు ధర్మరాజు. ఆనాడు ధర్మరాజు పోరాడిన తీరు అనన్యసామాన్యమైనది.

ఆ సాయంకాలం దుర్యోధనుని తొడలు విరగగొట్టినాడు గదాయుద్ధంలో భీముడు.

ఆరోజు అర్ధరాత్రి అశ్వత్థామ తన తండ్రి తల నరికిన ధృష్టద్యుమ్నుడిని, పాంచాలురను, శిఖండిని, ఉపపాండవులను చంపి పగ తీర్చుకున్నాడు.

పిండ ప్రదానం నాడు తెలిసింది కుంతీదేవి చెప్పగా ధర్మజునికి కర్ణుడు పాండవులకు సోదరుడని. దానితో మనస్తాపం చెంది ధర్మరాజు శపించాడు– "స్త్రీలు ఇక రహస్యాలను దాచుకోలేకుందురు గాక!" అని.

యుద్ధానంతరం అశ్వమేధ యాగం చేసాడు. హస్తినాపురాన్ని 36 సంవత్సరాలు పాలించాడు. శ్రీకృష్ణ నిర్యాణానంతరం అభిమన్యుడు–ఉత్తరల కుమారుడైన పరీక్షిత్తుకు పట్టంకట్టి మహాప్రస్థానానికి వెళ్లినాడు.

ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపది వారిని అనుసరిస్తూ ఒక కుక్క. ముందుకు వెళ్తున్న కొద్దీ ద్రౌపది, సహదేవుడు, నకులుడు, అర్జునుడు, భీముడు వరుసగా పడిపోయారు. ద్రౌపది–అర్జునుడిపై ఎక్కువ ప్రేమ చూపించడం వల్ల; సహదేవుడు–తనను తాను ప్రాజ్ఞుడిగా భావించడం వలన, నకులుడు తాను గొప్ప అందగాడిగా తలచడం వలన, అర్జునుడు ఒక్కరోజులో కురుక్షేత్ర యుద్ధాన్ని ముగిస్తానని పలికి అలా చేయలేకపోవడం వలన; భీముడు తన తిండిపోతుతనం వలన నేలకూలారని ధర్మరాజు అన్నాడు.

శిఖరాగ్రం చేరేసరికి మిగిలింది ధర్మరాజు, కుక్క. ఇంద్రుడు దివ్య విమానం తీసుకువచ్చాడు. ధర్మరాజును రమ్మన్నాడు. కుక్క రాకుంటే తాను రానన్నాడు ధర్మరాజు. కుక్కలకు స్వర్గంలో చోటులేదు అన్నాడు ఇంద్రుడు. మంచిది నేను రాను –అన్నాడు ధర్మరాజు. కుక్క అదృశ్యమై ధర్ముడు కనిపించి అన్నాడు– రెండో పరీక్ష నెగ్గావు. వెళ్దాం స్వర్గలోకానికి. అందరూ స్వర్గలోకం వెళ్లారు.

అక్కడ ధర్మరాజుకు స్వర్గ సుఖాలనుభవిస్తూ దుర్యోధనుడు కనిపించాడు. నరకబాధలు పడుతూ తన సోదరులు పెడుతున్న కేకలు వినిపించాయి. బాధలు పడుతున్న తన సోదరులతోనే ఉంటాను. స్వర్గం నాకక్కర్లేదు అన్నాడు ధర్మరాజు. ధర్ముడన్నాడు– మూడో పరీక్ష నెగ్గావు. నీకు దివ్యుడవయ్యే అర్హత లభించింది.

దేవగంగలో స్నానం చేసి దివ్యుడైనాడు ధర్మరాజు.

ధర్మాన్ని ఆచరించే మెత్తటి పులి ధర్మరాజు. తాను ధర్మమనుకున్నది చేసాడు. సత్యవాది. అవసరార్థం అర్ధసత్యం పలికినందుకు నరకలోకంలో కొంతసేపు ఉండాల్సివచ్చింది.

కాలానుగుణంగా ధర్మప్రవర్తకులై ఎదుటివారిని నొప్పించక తానొవ్వక సత్యం మాట్లాడుతూ చేపట్టిన పని పూర్తిచేసే మనస్తత్వం Dharmaja Complex.

**22) భీముడు :** వెయ్యి ఏనుగుల బలం కలవాడు, వృకోదరుడు, వాయుపుత్రుడుగా పేరుపొందిన భీముడు కోపించి యుద్ధం చేస్తున్నపుడు ఇంద్రుడు కూడా వెనుకంజ వెయ్యాల్సిందే.

పాండవులందరి తిండి ఒక్కడే తినగలిగినంత ఆకలి. కౌరవులందరిని కట్టగట్టి మరీ పడేస్తూ ఉండేవాడు. అంతటి బలశాలి దుర్యోధనుడికి కంటగింపుగా మారినాడు. భీముడిని చంపడానికి చేసిన అన్ని ప్రయత్నాలు విఫలం కాగా లాక్షాగృహ దహనం సమయంలో సొరంగమార్గంలో తన తల్లిని, నలుగురు సోదరులను ఎత్తుకుని అడవిలో చాలాదూరం వచ్చి ఓ చెట్టుకింద వారిని దించాడు.

అది హిడింబవనం. అక్కడ హిడింబుడిని చంపి అతడి సోదరి హిడింబిని పెళ్లి చేసుకున్నాడు. వారికి జన్మించాడు ఘటోత్కచుడు. కామ్యక వనానికి రాజుగా అయిదేళ్లున్నాడు. అక్కడ నుంచి ఏకచక్రపురం వెళ్లారు. బకాసురుడిని సంహరించాడు భీముడక్కడ. ద్రౌపదీ స్వయంవరం జరుగుతుందని తెలిసి కాంపిల్యనగరం చేరుకున్నారు పాండవులు. మత్స్యయంత్ర భేదనం చేసి ద్రౌపదిని గెలుచుకున్నాడు అర్జునుడు. తల్లి కుంతీదేవి మాట ప్రకారం అయిదుగురూ ద్రౌపదిని వివాహమాడినారు.

రాజసూయ యాగ సమయాన తూర్పుదేశాలను జయించాడు భీముడు. ఆ రాజ్యాలు ఏనుగులకు ప్రసిద్ధి. యుద్ధపు టేనుగు భీమసేనుడు. శ్రీకృష్ణుని ఆలోచన ననుసరించి మగధ వెళ్లి జరాసంధుని వధించాడు భీముడు తన వెంట కృష్ణార్జునులు రాగా. బందీలుగా ఉన్న 100 మంది రాజులను విడిపించాడు. జరాసంధుని చంపగా నూరు రాజ్యాలు పాండవుల అధికార పరిధిలోకి వచ్చాయి. ఆ విధంగా ధర్మరాజు చక్రవర్తి–సామ్రాట్టు అయినాడు.

మాయాద్యూతం తరువాత పన్నెండేళ్ల వనవాస కాలంలో బకాసురుడి సోదరుడు కిర్మీరుని వధించాడు. సౌగంధిక పుష్పం కోసం వెళ్లి క్రోధవసులనే రాక్షసులను ఓడించి మణిమంతుడనే యక్షుడిని చంపినాడు.

దారిలో వాయుపుత్రుడైన హనుమంతుని కలుసుకున్నాడు. వృద్ధ వానరుడిగా దర్శనమిచ్చిన కోతి తోకను ఎత్తలేక భీముడు అతడిని హనుమంతుడిగా గ్రహించి ప్రార్థించగా అతడు నిజరూపంలో కనిపించినాడు. అన్నదమ్ములిద్దరూ ఆనంద భరితులైనారు.

బదరీకాశ్రమంలో ఉన్నపుడు జటాసురుడనే రాక్షసుడిని చంపి యుధిష్ఠిరుడు, నకుల సహదేవులు, ద్రౌపదిని రక్షించాడు భీముడు.

అజ్ఞాతవాస సమయంలో వలలుడు (వల్లభుడు) అనే వంటవాడిగా విరాటుడి కొలువులో చేరినాడు. జీమూతమల్లుడిని ఓడించాడు. ద్రౌపదిని పరాభవించిన కీచకుడిని పరిమార్చి, అతడి సోదరులను చంపివేసాడు భీముడు గంధర్వరూపంలో జయంతుడిగా.

దక్షిణ గోగ్రహణంలో సుశర్మను బందీని చేసి విరాటరాజును కాపాడినాడు. అజ్ఞాతవాసం ముగిసింది. రాయబారాలు విఫలమై కురుక్షేత్ర సంగ్రామం మొదలయ్యింది. భీముడి రథసారథి-విశోకుడు. భీముడి శంఖం-పౌండ్రం, భీముడి ధ్వజం-వెండి సింహపు ప్రతిమకు వైడూర్యాలు కళ్లుగా అమర్చబడి ఉన్నాయి. నల్లటి ఎలుగుబంట్లు లేదా నల్లటి దుప్పిలా కానవచ్చే గుర్రాలు అతడి రథాన్ని లాగుతాయి. భీముడి దగ్గర హనుమంతుడిచ్చిన గద (మామూలు లక్ష గదలకు సమానమైనది) ఉన్నది.

యుద్ధం రెండవ రోజున భీముడు కళింగరాజు కుమారుడు శక్రదేవుడిని చంపినాడు. ఏకలవ్యుడి కుమారుడు కేతుమతుడిని గాయపరచినాడు. దుర్యోధనుడిని ఓడించినాడు.

14వ రోజున ద్రోణుని ఓడించాడు. అనేక ఏనుగుల్ని చంపి విలయతాండవం చేసాడు. కర్ణుని ఓడించాడు. దుర్యోధనుడి సోదరులు ఏడుగురిని వికర్ణుడితో సహా నేలకూల్చి వికర్ణుడిని చంపినందుకు కన్నీళ్లు పెట్టుకున్నాడు యుద్ధ ధర్మం చాలా నిష్ఠురమైనది -అంటూ.

14వ రోజున 31 మంది కౌరవులను చంపాడు భీముడు. ఆరోజు రాత్రి కురువృద్ధుడైన బాహ్లికుడిని వధించాడు.

15వ రోజు కర్ణుడు ఇంద్రుడిచ్చిన 'శక్తి' ఆయుధంతో భీముని కొడుకు ఘటోత్కచుని చంపినాడు. భీముడు అశ్వత్థామ అనే ఏనుగును చంపి అశ్వత్థామ హతః అని ద్రోణుడితో పలికాడు. అదేమాట ధర్మరాజు ద్రోణుడితో చెప్పగా ద్రోణుడు యోగసమాధిలో ప్రాణాలు విడవగా, ధృష్టద్యుమ్నుడు గురువు ద్రోణుని తల నరికినాడు.

16వ రోజు భీముని పరాక్రమం ముందు వీరులందరూ చిన్నబోయినారు. అశ్వత్థామ ప్రయోగించిన నారాయణాస్త్రానికి కూడా ఎదురు తిరగగా కృష్ణుడితడిని కాపాడినాడు.

తన కొడుకు ఘటోత్కచుడిని కర్ణుడు చంపినందుకు ప్రతీకారంగా కర్ణుని కుమారుడు బాణసేనుడిని కర్ణుడి కళ్ల ముందే చంపినాడు భీమసేనుడు. కర్ణార్జునుల యుద్ధం లోకభయంకరంగా సాగడానిని హనుమంతుడు, దేవతలు వీక్షించారు.

దుర్యోధనుడు చూస్తూ ఉండగానే దుశ్శాసనుడిని నేలపై పడవేసి రొమ్ముచీల్చి చంపి వేడి రక్తం తాగినాడు భీముడు. ఆ రక్తంతో ద్రౌపది శిరోజాలను తడిపినాడు. భారత యుద్ధం మొత్తంలో భయంకరమైన హేయమైన దృశ్యం ఇది.

17వ రోజున అర్జునుడి అస్త్రాలకు కర్ణుడు చనిపోయాడు.

18వ రోజున ధర్మరాజు చేతిలో శల్యుడు మరణించాడు.

దుర్యోధనుడు వెళ్లి మడుగులో దాక్కున్నాడు. అతడిని బయటకు రప్పించి, గదాయుద్ధంలో దుర్యోధనుడు గాలిలోకి ఎగిరినపుడు గద విసిరి తొడలు విరగగొట్టినాడు భీముడు. ఆ గదాయుద్ధాన్ని చూస్తున్న బలరాముడి భీముడిని అధిక్షేపించగా శ్రీకృష్ణుడు అతడిని శాంతపరచాడు.

ఆ అర్ధరాత్రి నిద్రిస్తున్న ఉపపాండవులు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, పాంచాలురను అశ్వత్థామ చంపివేసాడు. ఆ వార్త విని దుర్యోధనుడు సంతృప్తిగా కన్నుమూసినాడు.

మరుసటిరోజు ఉదయం భీమార్జునులు వెళ్లి అశ్వత్థామను బంధించబోగా అతడు 'అపాండవము' కావించుమని పలికి బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు. దానిని బ్రహ్మశిరోనామకాస్త్రంతో అడ్డుకున్నాడు అర్జునుడు. ఆ రెండు అస్త్రాల తాకిడికి ముల్లోకాలు కంపించగా మహర్షుల కోరికపై అర్జునుడు ఉపసంహరించాడు. అందువలన అశ్వత్థామ

అస్త్రప్రభావం వలన పాండవ స్త్రీల గర్భాలు విచ్ఛిన్నమయ్యాయి. వారికి సంతానప్రాప్తి లేకుండా పోయింది. ఒక్క ఉత్తర గర్భాన ఉన్న శిశువు జన్మించి మృత శిశువుగా ఉండగా కృష్ణుడు బ్రతికించాడు. అతడే పరీక్షిత్తు. భావి భారత సామ్రాజ్యానికి చక్రవర్తి.

యుద్ధం తరువాత ధృతరాష్ట్రుడిని సందర్శించడానికి పాండవులు వెళ్లినపుడు భీముడి పేరు వినగానే ఆనందం నటిస్తూ కౌగిలిలోకి తీసుకోబోగా కృష్ణుడు వారించి, సిద్ధంగా ఉంచిన భీముడి ఉక్కు విగ్రహాన్ని ధృతరాష్ట్రుడి వద్ద నిలబెట్టినాడు. "నాయనా భీమా! బాగున్నావా" అంటూనే తన వెయ్యి ఏనుగుల బలంతో ఆ విగ్రహాన్ని కౌగిలించుకుని, నొక్కి చూర్ణం చూర్ణం చేసి దొంగ ఏడుపు ఏడుస్తుంటే కృష్ణుడన్నాడు– "తమరి 'ధృతరాష్ట్ర కౌగిలి' బలం తెలిసే నేను భీముడిని తప్పించాను. ఇప్పటికైనా క్రోధం వీడి శాంతం వహించు. మాయాద్యూతానికి, వనవాసానికి, యుద్ధానికి అనుమతించింది నీవే కదా. ఇప్పుడీ దౌర్భాగ్యస్థితికీ నీవే కారణం గుర్తించు" అని పలికాడు కృష్ణుడు.

అశ్వమేధ యాగం ముగిసింది. 36 సంవత్సరాలు హస్తినాపురపు సర్వసైన్యాధిపతిగా భీముడు తన బాధ్యతలు నిర్వహించినాడు.

మహా ప్రస్థాన సమయంలో భీముడు పడిపోతున్నపుడు ధర్మరాజన్నాడు– "తిండిపోతుతనం, యుద్ధోన్మాదం, గర్వం, ఆత్మ ప్రశంస నీ పతనానికి కారణం".

భీముడికి దక్కాల్సినంత గౌరవం దక్కలేదనేది విమర్శకుల అభిప్రాయం. మొరటు ప్రవర్తన, పామరుడిలా తిని తిరగడం, మొండితనం ఇవన్నీ జానపదులకు నచ్చే గుణాలు. పండితులకు నచ్చనివాడు భీముడు. అతడికి రావాల్సిన కీర్తిని అర్జునుడికి బదలాయించారనేది ఓ విమర్శ. ఏమైనా భీముడు భీముడే!

మొరటు తనం, సాహసం, గజబలం, ఎవ్వరిని లెక్కచెయ్యకపోవడం, తిండిపోతు తనం, యుద్ధోన్మాదం Bhima's Complex.

**అంతత్ర భీమం దదృశుః సమంతాద్**
**దౌః శాసనం తద్ రుధిరం పి బంతమ్**
**సర్వే పలాయం త భయాభి పన్నాః**
**న వై మనుష్యో యమితి బ్రువాణాః** (కర్ణ. 83–35)

**23) అర్జునుడు :** ఇంద్రుడి వలన కుంతీదేవికి జన్మించినవాడు అర్జునుడు. ఇతడి పది పేర్లున్నాయి.

ధనంజయుడు – స్వర్ణము, సంపదలను గెలిచినవాడు.

గుడాకేశుడు – నిద్రను జయించినవాడు, అధిక రోమములు కలవాడు.

విజయుడు – ఓటమి ఎరుగనివాడు

సవ్యసాచి – రెండు చేతులతోను యుద్ధం చేయగలిగినవాడు

శ్వేతవాహనుడు – తెల్లటి గుర్రాల రథమున్నవాడు

అనఘుడు – దోష రహితుడు

బీభత్సుడు – భీకర యుద్ధం, నిర్దోషంగా చేయువాడు

కిరీటి – ఇంద్రుడిచ్చిన కిరీటము ధరించినవాడు

జిష్ణుడు – శత్రు నాశకుడు

ఫల్గునుడు – ఉత్తర ఫాల్గుని నక్షత్రమందు జన్మించినవాడు

మహాబాహు – ఆజానుబాహుడు

గాండీవి – గాండీవమనే విల్లు ధరించినవాడు

కృష్ణుడు – నల్లనివాడు

ఇవికాక పాండవ మధ్యమ, పాండుపుత్ర, కౌంతేయ, బృహన్నల ఇతరపేర్లు.

అర్జున అనే పదం ప్రొటొ–ఇండొ–యూరోపియన్ కాలంలో మెరిసే వస్తువునకు, లోహానికి ప్రత్యామ్నాయ పదం.

అర్జునుడంటే తెల్లగా వెండిలా కాక నల్లగా లోహంలా మెరిసేవాడని చెప్పుకోవచ్చు. (Argentum=Silver) మూలకాల పట్టిక (Periodic Table)లో 47వ సంఖ్య వెండిది.

నర నారాయణులలో నరుడు అర్జునుడిగా, నారాయణుడు కృష్ణుడిగా జన్మించారని పురాణాలు చెబుతున్నది.

**అర్జునుడి సాహసాలు–**

1) కుమారాస్త్ర ప్రదర్శనలో విలువిద్యా పాటవాన్ని ప్రదర్శించడం
2) గురుదక్షిణగా ద్రుపదుడిని బంధించి తెచ్చుట.
3) అంగారపర్ణుడనే గంధర్వుడిని ఓడించి స్నేహితుడిగా అంగీకరించడం.
4) మత్స్యయంత్రాన్ని భేదించి ద్రౌపదిని గెలుచుకోవడం.
5) తీర్థయాత్రలకు పోయి ఉలూపి, చిత్రాంగద, సుభద్రలను వివాహమాడడం.
6) ఖాండవ వన దహనం, గాండీవాన్ని, స్వర్ణరథాన్ని పొందుట
7) కిరాతుడి వేషంలో ఉన్న శివునితో యుద్ధం చేసి, శివుడి అనుగ్రహంతో పాశుపతాస్త్రమును పొందుట.
8) ఇంద్రుడి ఆహ్వానంతో స్వర్గలోకానికి వెళ్లి వివిధాస్త్రములను పొందినాడు. ఇంద్రునితో పాటు అర్ధ సింహాసనాన్ని అధిష్ఠించినాడు.
9) ఊర్వశి వలచి రాగా వద్దని– "పేడివై పొమ్మన్న" శాపం పొందినాడు.
10) అజ్ఞాతవాసంలో విరాటుని కొలువులో బృహన్నల రూపంతో ఉత్తరకు నాట్యం నేర్పాడు.
11) ఉత్తర గోగ్రహణంలో కౌరవులపై విజయం.
12) అర్జునుడు తన కుమారుడు అభిమన్యుడికి ఉత్తరతో వివాహం చేయడం.
13) భగవద్గీత, విశ్వరూప దర్శనం
14) కురుక్షేత్ర యుద్ధం

- పదవ రోజున శిఖండిని ముందుంచుకుని భీష్ముని ఓడించి శరతల్పగతుని చేసాడు. భీష్ముడి కోరికపై తలగడగా మూడు బాణాలను నాటినాడు. పితామహుడికి దాహం వేస్తుంటే అస్త్ర ప్రయోగంతో భూగర్భ జలాన్ని పైకి తెప్పించి భీష్ముడి దాహం తీర్చినాడు.
- 12వ రోజున భగదత్తుడిని, అతడి ఏనుగు సుప్రతీకాన్ని చంపినాడు.
- 13వ రోజున అభిమన్యుడు మరణించగా
  14వ రోజున రెండు అక్షౌహిణీల కౌరవ సైన్యాన్ని సైంధవుడిని చంపినాడు.
- 14వ రోజున కాంబోజరాజు సుదక్షిణుడిని అతడి సైన్యాన్ని ఇంద్రాస్త్రంతో చంపినాడు.
- 17వ రోజున కర్ణవధ
- 18వ రోజున సుశర్మను చంపినాడు.

15) అశ్వమేధ యాగమప్పుడు అశ్వరక్షకుడిగా మణిపూర దేశంలో తన కుమారుడు బభ్రువాహనుడితో జరిగిన యుద్ధంలో ప్రాణాలు కోల్పోయి, నాగకన్య ఉలూచి తెచ్చిన నాగమణి ప్రభావంతో సజీవుడైనాడు.
16) 36 సంవత్సరాలు గడిచాయి ధర్మరాజు అధికారంలోకి వచ్చి. మునిశాపం, గాంధారి శాపం ఫలించి యాదవులు ఒకరినొకరు కొట్టుకుని మరణించారు. ముందుగా సాత్యకి కృతవర్మను చంపాడు. ఆ తరువాత అంతా సర్వనాశనం. సాత్యకి, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, సాంబుడు ఇలా అందరూ చనిపోయారు. బలరాముడు ప్రాయోపవేశం చేయగా అతడి ఆత్మ ఆదిశేష సర్పమై సముద్రంలో కలిసిపోయింది. శ్రీకృష్ణుడి పాదాన్ని జింక చెవిగా భావించి వేటగాడు వేసిన బాణం శ్రీకృష్ణుని గాయపరచింది. వేటగాడిని క్షమించి కృష్ణుడు అవతారం చాలించాడు. కృష్ణుడు పంపగా దారుకుడు (సారథి) వెళ్లి అర్జునుడిని తీసుకువచ్చాడు. కృష్ణుడికి, బలరాముడికి అంత్యక్రియలు నిర్వర్తించి ద్వారకా పట్టణాన్ని ఖాళీ చేయించాడు అర్జునుడు. తెల్లవారగానే సముద్రం పొంగి ద్వారకావతి నగరం సముద్రంలో మునిగిపోయింది.

అర్జునుడొక్కడే రక్షకుడిగా ఉన్న యాదవ సమూహాన్ని కిరాతులు ముట్టడించి స్త్రీలను సంపదలను దోచుకున్నారు. అర్జునుడికి దివ్యాస్త్రాలు గుర్తుకు రాలేదు. అతడి వీరత్వం కొరగానిదయ్యింది. కృష్ణుడి అష్ట భార్యలను, బలరాముడి భార్యలను పిల్లలను మరికొంతమంది స్త్రీలను రక్షించి అర్జునుడు ఇంద్రప్రస్థానికి చేరుకున్నాడు అవమానభారంతో. అనిరుద్ధుడి కొడుకు వజ్రనాభుడిని ఇంద్రప్రస్థానికి రాజుగా చేసాడు.

17) మహాప్రస్థాన సమయం వచ్చింది. పరీక్షిత్తును హస్తినకు ప్రభువుగా వజ్రనాభుడిని ఇంద్రప్రస్థానానికి రాజుగా, కృపాచార్యుడిని పరీక్షిత్తుకు ఆచార్యుడిగా, యుయుత్సుడిని రాజ్య సంరక్షకుడిగా సుభద్రను రాజమాతగా నియమించి పాండవులు మహాప్రస్థానానికి బయల్దేరినారు. ద్రౌపది, సహదేవుడు, నకులుడు తరువాత అర్జునుడు పడిపోయారు. ధర్మరాజన్నాడు భీముడితో– "ఒక్కరోజులో యుద్ధం ముగిస్తానని ప్రగల్భాలు పలికినాడితడు".

వీరత్వం, కాస్త ఆడతనం, మృదుత్వం, గురుభక్తి, దైవభక్తి, కొంచెం తొందరపాటు, ప్రతిజ్ఞలు చేసి దేవుడి మీద భారం వెయ్యడం. చెప్పింది విని మరచిపోవడం –ఇవన్నీ నరుడి లక్షణాలు– Arjuna Complex.

నారములు అంటే నీళ్లు. నారాయణుడైన విష్ణుమూర్తి నివాసస్థానం నీళ్లు. నరుడికి జీవనాధారం నీళ్లు. నారాయణుడి అండలేని నరుడి ఉనికి లేదు. నరుడు లేకుంటే నారాయణుడి గురించి ఎవరికీ తెలియదు.

నరుడికి ఎప్పటికప్పుడు భగవద్గీతను బోధిస్తూనే ఉండాలి. లేకుంటే ఎప్పటికప్పుడు గీతను, దేవుడిని మరచిపోయి మరల వెదుక్కుంటూ ఉంటాడు. నారాయణుడూ ఊరుకోడు ఏదోరకంగా గుర్తుచేసి కర్తవ్యోన్ముఖుడిని చేస్తాడు.

నారాయణుడు తోడున్నంత వరకు అర్జునుడికి అన్ని అస్త్రాలు పని చేసాయి. ప్రయోగ ఉపసంహార మంత్రాలు, అధిష్ఠాన దేవతలు గుర్తుంటారు. భౌతిక రూపం నరుడు. నరుడి ఆత్మ విశ్వరూపం నారాయణుడు. ఆ విశ్వరూపాన్ని దర్శించేందుకు నరుడికి మామూలు కన్నులు చాలవు. దివ్యదృష్టి అవసరం.

**యత్ర యోగేశ్వరః కృష్ణః యత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మ తిర్మమ** (భీష్మ. 42-78)

**24) నకులుడు :** పాండురాజు రెండవ భార్య మాద్రి కుమారులు నకులుడు, సహదేవుడు. వీరు కవలలు. అశ్వని దేవతల వలన మాద్రికి జన్మించినవారు.

నకులుడు ఆయుర్వేదంలో, ఖడ్గచాలనంలో, గుర్రాల పెంపకంలో నేర్పరి. దామగ్రంథి పేరుతో విరాటుని కొలువులో అశ్వ శిక్షకుడిగా పనిచేసాడు అజ్ఞాతవాస సమయాన.

నకులము అంటే ముంగిస. నకులుడంటే ముంగిస వర్ణపు ఛాయ కలిగినవాడు. బహుసుందరుడు. ఇతడికి ద్రౌపది వలన శతానీకుడు, కరేణుమతి (శిశుపాలుడి కుమార్తె) వలన నిరామిత్రుడు జన్మించారు.

ఉపపాండవులలో అత్యంత సాహసికుడు శతానీకుడు. వ్యూహ ప్రణాళికలో దిట్ట. కౌరవ సైన్యాన్ని కకావికలు చేసినాడు. 18వ రోజు రాత్రి నిద్రిస్తున్న శతానీకుడిని అశ్వత్థామ చంపివేసాడు, తక్కిన ఉపపాండవులు ధృష్టద్యుమ్నుడు, శిఖండి, పాంచాల కుమారులతో సహా.

యుద్ధానంతరం ఉత్తర మద్ర దేశానికి నకులుడు రాజైనాడు. అతడి తదనంతరం నిరామిత్రుడు ఉత్తర మద్ర దేశాన్ని పాలించాడు.

నకులుడి చిన్నతనంలోనే పాండురాజు చనిపోయాడు. తల్లి మాద్రి సహగమనం చేసింది. సవతి తల్లి కుంతీదేవి వారినెంతో ప్రేమగా పెంచింది.

కృపాచార్యుడు, ద్రోణాచార్యుడు అతడికి యుద్ధవిద్యలు నేర్పినారు. నకులుడు ఖడ్గవిద్యా ప్రవీణుడు. ద్రోణుడతడికి 'అసి' అనే దివ్యఖడ్గాన్నిచ్చాడు.

నకులుడెంత గొప్పగా రథం నడుపుతాడంటే– వాన చినుకుకు చినుకుకు మధ్య రథం నడపగలిగినంత నేర్పరి అతడు.

రాజసూయ యాగ సమయంలో పశ్చిమదిక్కు రాజ్యాలను జయించి అశేష ధనరాశులను తెచ్చాడు నకులుడు.

అజ్ఞాతవాస సమయంలో దామగ్రంధి, జయత్సేనుడు అతడి పేర్లు. నకులుడి రథ పతాకపై బంగరు రంగు నడుము ఉన్న ఎర్రటి జింక ఉంటుంది. ఒక అక్షౌహిణి సేనకు అధిపతి నకులుడు. యుద్ధం మొదటిరోజున దుశ్శాసనుడిని ఓడించి వదిలిపెట్టాడు.

11వ రోజున శల్యుడిని ఓడించాడు

14వ రోజున శకునిని ఓడించాడు

15వ రోజున దుర్యోధనునితో, 16వ రోజున కర్ణునితో ఓడిపోయాడు. 18వ రోజున కర్ణుడి కుమారులు చిత్రసేన, సత్యసేన, సుషేణులను చంపినాడు.

మహాప్రస్థాన సమయంలో నకులుడు పడిపోవడానికి కారణం– కురువంశంలో అందరికన్నా అందగాడినన్న గర్వం ఉండటం –అన్నాడు ధర్మరాజు.

అందం అతడి ఆధిక్యతాభావం– Nakula's Superiority Complex.

**25) సహదేవుడు :** పాండురాజు రెండవ భార్య మాద్రికి అశ్వనీ దేవతల వలన నకుల సహదేవులు కవలలుగా జన్మించారు. సహదేవుడు పాండవులందరిలోకీ చిన్నవాడు. పాండురాజు, మాద్రిల మరణానంతరం కుంతీదేవి నకుల సహదేవులను ఎంతో ప్రేమగా పెంచింది. కుంతీదేవి ముద్దుల కొడుకు సహదేవుడు.

పాండురాజు చనిపోయినాక దహన సమయంలో బయటపడిన మెదడును రుచి చూడగా అతడికి భవిష్యత్ జ్ఞానం వచ్చిందని కొందరు; పాండురాజు కాలి చిటికినవేలు కొరకడం వల్ల అతడికి భవిష్యత్ జ్ఞానం వచ్చిందని కొందరు కథలుగా చెప్పుకునేవారు. పాండురాజు ఆ విషయాన్ని కొడుకులందరితో చెప్పినా నరమాంస భక్షణ అవుతుందని వారు దానిని అంగీకరించలేదు. సహదేవుడు కూడా అలా కొరికి వదిలేసాడని జానపదులంటారు. పాండురాజు దేహభాగాన్ని కొరికి ఓ చీమ చిన్ని ముక్కను మోసుకుపోతుండగా సహదేవుడు ఆ ముక్కను మింగాడని కొందరంటారు.

నకులుడు, సహదేవుడు కవలలైనప్పటికీ – సూర్యోదయ సమయాన నకులుడు, సూర్యాస్తమయ సమయాన సహదేవుడు జన్మించారు.

సహదేవుడి భార్యలిద్దరు. ద్రౌపది వలన శ్రుతసేనుడు, విజయ (ద్యుతిమంతుడనే మద్రరాజు కుమార్తె) వలన సుహోత్రుడు జన్మించారు.

సహదేవుడు పరశువు ప్రయోగం, ఖడ్గవిద్యలలో నేర్పరి. నీతిశాస్త్రం, జ్యోతిషశాస్త్రం, ఆయుర్వేదం, ధనుర్విద్యలు నేర్చుకున్నాడు.

రాజసూయ యాగ సమయంలో దక్షిణ దిక్కున ఉన్న రాజ్యాలను జయించాడు సహదేవుడు.

విరాటుడి వద్ద అజ్ఞాతవాస సమయంలో తంత్రిపాలుడిగా పశువుల కాపరులకు అధిపతిగా వ్యవహరించాడు. దక్షిణ గోగ్రహణంలో సుశర్మ తోలుకుపోబోయిన 60,000 గోవులను ధర్మజ భీమ నకుల సహదేవులు రక్షించారు, సుశర్మను బందీగా తెచ్చి విరాటుని ముందు పడవేసినారు.

తన సహజ కవచకుండలాలను ఇంద్రుడికిచ్చి రక్తసిక్త దేహంతో పడి ఉన్న రాధేయుడిని బతికించుకోవాలని పెంపుడు తల్లి రాధ కుంతీదేవిని బతిమలాడుతుంది, నకుల సహదేవులతో తన కుమారుడికి వైద్యం చేయించమని. కవలలకు అర్థం కాలేదు ఎందుకు తమ తల్లి కుంతీదేవి తమ శత్రువు, అర్జునుడిని చంపడానికి కంకణం కట్టుకున్నవాడిని బ్రతికించమని బ్రతిమలాడుతున్నదో. సహదేవుడు తయారు చేసి ఇచ్చిన లేపనం వంటికి రాసి, కషాయం తాగించినాక కర్ణుడు కోలుకున్నాడు. ధృతరాష్ట్రుడికీ విషయం తెలిసి సహదేవుడిని అభినందించినాడు.

దుర్యోధనుడు కూడా సహదేవుడి జ్యోతిష్యాన్ని విశ్వసించేవాడు. తనకు అవసరమైనపుడు సలహాలు తీసుకునేవాడు.

సహదేవుడి రథధ్వజంపై వెండి హంస గుర్తు ఉంటుంది. అతడి శంఖం పేరు మణిపుష్పకం. అతడి ధనుస్సు– అశ్వని; యుద్ధం 18వ రోజున సహదేవుడు శకునిని, అతడి పుత్రుడు ఉలూకుడిని చంపి తన ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నాడు.

ద్రౌపది వలన కలిగిన కుమారుడు శ్రుతసేనుడిని అశ్వత్థామ 18వ రోజు రాత్రి చంపినాడు.

సహదేవుడు మహాప్రస్థానానికి నిష్క్రమించినాక సుహోత్రుడు దక్షిణ మద్ర దేశానికి పాలకుడైనాడు.

మహాప్రస్థాన మార్గంలో సహదేవుడు పడిపోవడానికి కారణం– తనంత ప్రాజ్ఞుడు లేడని అనుకోవడం– అని ధర్మరాజు అన్నాడు.

ముందుచూపు, లోకజ్ఞానం ఉన్నా గుంభనగా ఉండే తెలివిగలవాడి మనస్తత్వం– Sahadeva Complex.

**26) ద్రౌపది :** అగ్నిసంభూత, అయోనిజ, అసమాన సౌందర్యవతి కృష్ణ, పాంచాలి, యాజ్ఞసేని పేర్లతో ప్రసిద్ధికెక్కిన ద్రౌపది అనేక చోట్ల దేవతగా పూజించబడుతున్నది. పంచకన్యలలో ద్రౌపది ఒకరు. (ద్రౌపది, అహల్య, కుంతి, తార, మండోదరి – పంచకన్యలు). ఈమె తల్లిదండ్రులు పృషతి, ద్రుపదుడు.

కుంతి వచనం ప్రకారం పాండవులయిదుగురికి భార్య అయినది. ధర్మరాజుకు ప్రతివింధ్యుడిని, భీముడికి శ్రుతసోముడిని, అర్జునుడికి శ్రుతకర్మను, నకులుడికి శతానీకుడిని, సహదేవుడికి శ్రుతసేనుడిని కన్నది ద్రౌపది.

విరాటుని కొలువులో సైరంధ్రిగా మాలిని పేరుతో అజ్ఞాతవాసం గడిపింది. ద్రౌపది జన్మనామం కృష్ణ. పర్మతి, నిత్య యవ్వని, మహాభారతి, అగ్నిసుత, కళ్యాణి, పంచవల్లభ, పాండు షర్మిల ఆమె ఇతర పేర్లు.

ద్రోణుడిపై పగతీర్చుకోవడం కోసం, తనను ఓడించిన అర్జునుడితోనే ద్రోణుడిని ఓడించాలనుకుని చేసిన యజ్ఞపు అగ్నిలో పుట్టినవారు ధృష్టద్యుమ్నుడు, ద్రౌపది.

లక్క ఇల్లు తగలబడినపుడు, ఆ వార్త తెలిసి అందరిలానే ద్రుపదుడూ పాండవులు చనిపోయారని భావించాడు. తన పురోహితుడు ఇచ్చిన ధైర్యంతో ద్రౌపదీ స్వయంవరాన్ని ప్రకటించగా మత్స్య యంత్రాన్ని ఛేదించిన బ్రాహ్మణరూప అర్జునుడి మెడలో వరమాల వేసింది ద్రౌపది. కుంతీదేవి మాటతో అయిదుగురు పాండవులకు భార్య అయ్యింది.

ఆమె అపురూప సౌందర్యం అనేక కష్టాలను తెచ్చిపెట్టిందామెకు.

**కుమారీ చాపి పాంచాలీ వేది మాధ్యాత్ సముద్ధతా**
**సుభగా దర్శనీయాంగీ స్వసితాయత లోచనా–**
**శ్యామా పద్మపలాశాక్షీ నీల కుంచిత మూర్ధ జా**
**తామ్రతుంగ నఖీ సుభ్రూః చారుపీన పయోధరా**
**మానుషం విగ్రహం కృత్వా సాక్షాదమరవర్ణినీ**
**నీలోత్పల సమోగంధః యస్యాః క్రోశాత్ ప్రధావతి–** (ఆది. 166–44,45,46)

ఇంద్రప్రస్థ మహారాణిగా, రాజసూయ యాగంలో తన పాత్ర పోషించింది. మయసభను దర్శించి తడబడి నీటిమడుగులో పడిన అభిమానధనుడైన సుయోధనుడు, ద్రౌపది ఆమె చెలికత్తెలు, పాండవులు, తన భంగపాటును చూసి నవ్వినారని భావించి అవమాన భారంతో కృంగిపోయి, హస్తినలో ద్యూతసభను నిర్మింపజేసి శకునిచేత ధర్మరాజును మాయాద్యూతంలో ఓడించి పాండవులను తనకు బానిసలుగా చేసుకున్నాడు.

ఆ సమయంలో నిండు సభలోకి ఏకవస్త్ర అయిన ద్రౌపదిని దుశ్శాసనుడు ఆమె వలువలు ఊడదీయడానికి ప్రయత్నించాడు. జుట్టు పట్టుకు లాగినాడు. కర్ణుడు ఎగతాళి చేసాడు. దుర్యోధనుడు ఆమెను తన తొడపై కూర్చోమని సంజ్ఞ చేసాడు. భీముడు ప్రతిజ్ఞలు చేసాడు– దుశ్శాసనుడి రొమ్ము చీల్చి అతడి రక్తం తాగి, ఆ రక్తంతో ద్రౌపది కురులను కడుగుతానని; దుర్యోధనుడి తొడలు విరగగొడతానని. చివరకు ధృతరాష్ట్రుడు విదురుడి సలహా విని గాంధారి అంగీకారంతో పాండవుల హక్కులు పునరుద్ధరించాడు. అయితే అనుద్యూతంలో ధర్మరాజు మరల ఓడిపోగా పన్నెండేళ్ల వనవాసం, ఏడాది అజ్ఞాతవాసం చేయవలసి వచ్చింది.

మహాభారతంలో లేనిది, ఇతర నాటకాలలో చొప్పించబడినది– మయసభలో దుర్యోధనుడి భంగపాటును చూసి ద్రౌపది తన చెలికత్తెలతో పాటు నవ్విందని– 'అంధస్య పుత్ర అంధః' అని అన్నదని. ఆ అవమాన భారమే మాయాద్యూతానికి కురుక్షేత్ర యుద్ధానికి దారితీసిందన్నది ప్రజలలో బాగా ప్రచారమయ్యింది (గుడ్డిరాజు కొడుకు గుడ్డివాడు).

వనవాస సమయంలో సూర్య ప్రసాదిత అక్షయపాత్రతో అందరి ఆకలి తీర్చింది. దుర్వాసుడి పరీక్ష నెగ్గింది. కామ్యక వనంలో జయద్రథుడి (సైంధవుడు–దుశ్శల భర్త) అపహరణకు గురై భర్తల చేత విడిపించబడింది. అజ్ఞాత వాస కాలంలో సైరంధ్రిగా మాలిని పేరుతో విరాటరాజు భార్య సుధేష్ణ అంతఃపురంలో ఉన్నపుడు కీచకుడి కంటబడింది. కీచకుడి వలన విరాట సభలో అవమానించబడింది.

అయితే ఆమెను అవమానించ చూసిన దుశ్శాసనుడు ఆమె చీరను లాగలేక కింద పడ్డాడు. జయద్రథుడు ఆమె బలంగా నెట్టేసరికి బోర్లాపడి లేచాడు. కీచకుడూ ఆమె వదిలించే సరికి కిందపడినాడు. అంతటి బలవంతురాలామె.

భీముడు జయంతుడనే గంధర్వుడిగా కీచకుడిని, అతడి సోదరులను మట్టుబెట్టినాడు.

యుద్ధ సమయంలో పాండవ స్త్రీలందరూ ఉపప్లావ్యంలో ఉన్నారు. పదహారవ రోజున భీమసేనుడు దుశ్శాసనుడిని చంపి రొమ్ము చీల్చి రక్తాన్ని తాగినాడు. రక్తం అంటిన చేతులతో ద్రౌపది కురులను కడిగి, ఆమె జుట్టు ముడివేసాడన్న విషయం బహుళ ప్రచారంలోకి వచ్చింది. అదే విషయాన్ని భట్టనారాయణుడు 'వేణీ సంహారం' అనే నాటకంలో వ్రాసినాడు. 18వ రోజున భీమ–దుర్యోధన గదాయుద్ధంలో దుర్యోధనుడి తొడలు విరగగొట్టి భీముడు తన రెండో ప్రతిజ్ఞ నెరవేర్చినాడు.

18వ రోజు అర్ధరాత్రి అశ్వత్థామ, పాండవ శిబిరంపై దండెత్తి ధృష్టద్యుమ్ను, శిఖండి, పాంచాల కుమారులతో పాటు ఉపపాండవులను హతమార్చినాడు. ఉపపాండవుల వయస్సు గురించి వ్యాసుడు ప్రస్తావించలేదు.

మరుసటి రోజున భీమార్జునులు అశ్వత్థామను బంధించి అతడి శిరోరత్నాన్ని తెచ్చి ద్రౌపదికిచ్చి ఆమెను శాంత పరచారు. ఆ శిరోరత్నాన్ని ఆమె ధర్మరాజుకిచ్చింది. తన పుత్రులను చంపిన అశ్వత్థామను క్షమించి వదిలివేసింది.

శచీదేవిగా, శ్రీ అంశగా, వీర పాంచాలిగా, ద్రౌపదీ అమ్మగా, గ్రామదేవతగా ప్రసిద్ధికెక్కింది. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో, ఇతర దేశాలలో (సింగపూర్, శ్రీలంక) దాదాపు 400 దేవాలయాలున్నాయి ఆమె ప్రధాన దేవతగా. కోనార్లు, వన్నియార్లు, ముదలియార్లు, పిళ్లైలు, పల్లియుల కులదేవత ద్రౌపది. ఆది పరాశక్తి అవతారం. బెంగుళూరులోని తిగరపేట ధర్మరాయస్వామి–ద్రౌపది దేవాలయం చాలా ప్రసిద్ధికెక్కిన ద్రౌపది గుడి. భక్తులు పండుగల సందర్భాలలో నిప్పులపై నడుస్తారు (Fire Walking).

కొన్ని జానపద గాథల్లో ద్రౌపదికి ధర్మరాజు వలన సుధన, భీముడి వలన సంయుక్త; అర్జునుడి వలన ప్రగతి–ప్రగ్య కవలలు; నకులుడి వలన పృథ; సహదేవుడి వలన సుమిత్ర అనే ఆడపిల్లలు కలిగారని చెప్పబడింది.

మహాప్రస్థాన సమయంలో అందరికన్నా ముందు పడిపోయింది. తన భర్తలలో అర్జునుడంటే ఆమెకు ఎక్కువ ఇష్టం. ఆమె ఇలా పడిపోవడానికి కారణం –అంటాడు ధర్మరాజు

అసమాన సౌందర్యం, బహుభర్తృత్వం, రాజసం, వీరత్వం, ప్రతీకారేచ్ఛ ఉన్న స్వేచ్ఛా మానసిక స్థితి Draupadi Complex.

**27) సుభద్ర :** సౌభాగ్యవతి, అదృష్టజాతకురాలు సుభద్ర. హరివంశంలో ఆమె పేరు చిత్ర. ఏకనాంశ అనే దేవత పేరుతో పూజింపబడింది. పూరి జగన్నాధ దేవాలయంలో బలభద్ర, జగన్నాధ, సుభద్రలకు పూజలు జరుగుతాయి. రథాలు ఊరేగించబడతాయి ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా.

అర్జునుడు తీర్థయాత్ర కాలంలో ఉలూచి, చిత్రాంగదలను వివాహం చేసుకుని ఇరావంతుడు, బభ్రువాహనులకు జన్మనిచ్చినవాడై వారిని తల్లుల దగ్గర వదిలి ద్వారకకు చేరుకుంటాడు యతి వేషంలో. శ్రీకృష్ణ బలరాముల సోదరి సుభద్ర అంటే అతడికిష్టం. ఆ సంగతి కృష్ణుడికి తెలుసు. అయితే బలరాముడు సుభద్రను దుర్యోధనుడికిచ్చి వివాహం చేద్దామనుకున్నాడు. శ్రీకృష్ణుని సాయంతో అర్జునుడు సుభద్రను లేవదీసుకుపోయి ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ఇంద్రుడు, శచీదేవి, శ్రీకృష్ణుడు, అతడి భార్యలు ఆ వివాహాన్ని ఘనంగా జరిపించారు.

ఈ కథ పలురకాలుగా చెప్పబడింది. 1) వసుదేవుడు–రోహిణిల సంతానం బలరాముడు, సుభద్రలు. శ్రీకృష్ణుడు దేవకీదేవి కుమారుడు. కాబట్టి అన్న బలరాముడికి సుభద్రను తనకిష్టం వచ్చినవారికి కట్టబెట్టే అవకాశం ఉన్నది. అందుకని శ్రీకృష్ణుడు సుభద్రను తీసుకుపోయి వివాహం చేసుకొమ్మని అర్జునుడికి సలహా ఇస్తాడు. యుధిష్ఠిరుడికి లేఖద్వారా విషయాన్ని తెలియజేసి, అతడి అనుమతితో సుభద్రను అపహరించి తీసుకుపోతున్నపుడు యాదవ, వృష్ణి, అంధకులు అతడిని ఆపే ప్రయత్నం చేసి విఫలులౌతారు. కృష్ణుడు వారిని శాంతపరచి సుభద్ర–అర్జునుల వివాహం వైదిక పద్ధతిలో ఘనంగా అందరి సమక్షాన జరిపిస్తాడు. (చతుర్ధర భండార్కర్ ఎడిషన్లు–మహాభారతం).

2) దాక్షిణాత్య ప్రతులలో– ప్రభాస తీరానికి చేరిన అర్జునుడికి, గదుడనే యాదవుడితో పరిచయమేర్పడింది. సుభద్ర సౌందర్యం గురించి గదుడు చెప్పగా అర్జునుడికి సుభద్రపై ఆసక్తి కలిగింది. ఆమెను చూడడానికి యతి వేషంలో ద్వారక వెళ్లాలనుకుంటాడు అర్జునుడు, యాదవులకు యతి భక్తి ఎక్కువని తెలిసి. ప్రభాసతీర్థంలో అర్జునుడు ఉన్నాడని

తెలిసి శ్రీకృష్ణుడు వచ్చి అర్జునుడిని కలుస్తాడు. అతడిని తీసుకువచ్చి రైవతక పర్వతంలోని గుహలో ఉంచుతాడు. అది రైవతక పర్వత పూజా సమయం. యాదవులు అందరూ కొండకు పూజ చేసినపుడు కనిపించిన అర్జునుడిని ద్వారకకు ఆహ్వానిస్తాడు బలరాముడు. సుభద్రను యతికి పరిచర్యలు చేసేందుకు నియోగిస్తాడు. అప్పటికే గదుడు, కృష్ణుడి వలన అర్జునుడి గురించి విన్న సుభద్ర అర్జునుడిపై ఇష్టపడి 'మాయాయతి'ని అడుగుతుంది– "అర్జునుడిని ఎక్కడైనా చూసారా మీరు, అతను తీర్థయాత్రలు చేస్తున్నాడట!".

తానే అర్జునుడని చెప్పి ఆమెను తీసుకుని ఇంద్రప్రస్థానికి ఉడాయిస్తాడు అర్జునుడు. ఇంద్రుడు, శచీదేవి, శ్రీకృష్ణుడి ఆశీస్సులతో సుభద్రార్జునుల వివాహం ఘనంగా జరిగింది.

సుభద్రార్జునుల కుమారుడు అభిమన్యుడు. మహావీరుడు. 13వ రోజు పద్మవ్యూహంలో (చక్రవ్యూహం) చిక్కుబడి అనేకమంది కౌరవ వీరులు ఒక్కుమ్మడిగా దాడిచేయగా కన్నుమూసినాడు.

అభిమన్యుడు–ఉత్తరల కుమారుడు పరీక్షిత్తు.

3) భాగవతం ప్రకారం– బలరాముడు తన ప్రియశిష్యుడైన దుర్యోధనుడితో సుభద్రకు వివాహం చెయ్యాలని సంకల్పించాడు. అర్జునుడు–సుభద్రలు పరస్పరం ఇష్టపడడం వల్ల ఆమె అర్జునుడితో లేచిపోతుంది. బలరాముడు యుద్ధం ప్రకటిస్తాడు అర్జునుడిపై. కృష్ణుడు శాంతపరుస్తాడు. సుభద్రార్జునుల వివాహం ఘనంగా జరుగుతుంది ద్వారకలో.

వివాహానంతరం గోపస్త్రీ వేషంలో వెళ్లి ఇంద్రప్రస్థంలో ద్రౌపది ఆశ్రయాన్ని పొందినాక తాను సుభద్రనని వెల్లడిస్తుంది. పాండవుల ఇతర భార్యలను ఇంద్రప్రస్థంలో ఉండడానికి అంగీకరించని ద్రౌపది, సుభద్ర విషయంలో కాస్త తగ్గుతుంది.

కురుక్షేత్ర యుద్ధానంతరం ధర్మరాజు పట్టాభిషిక్తుడౌతాడు. అశ్వమేధ యాగానికి ముందు ఉత్తర ప్రసవించి మృత శిశువుకు జన్మనిస్తుంది. (అశ్వత్థామ బ్రహ్మశిరోనామకాస్త్రం– 'అపాండవం' మంత్రయుక్తమై ప్రయోగించగా). శ్రీకృష్ణుడు ఆ మృతశిశువును పరీక్షించి ప్రాణం పోసినాడు గనుక అతడిని 'పరీక్షిత్తు' అని పిలిచారు. అశ్వమేధయాగం, ధర్మరాజు పట్టాభిషేకం అయినాక 36 సంవత్సరాలు ధర్మరాజు హస్తినను పాలించాడు.

మహా ప్రస్థానానికి వెళ్తున్న సమయంలో– పరీక్షిత్తును హస్తినకు రాజుగా, అనిరుద్ధుడి కుమారుడు వజ్రుడిని ఇంద్ర ప్రస్థానికి రాజుగా, సుభద్రను రాజమాతగా బాధ్యతలను అప్పగించారు పాండవులు.

యోగమాయ అవతారంగా సుభద్ర చెప్పబడింది. బ్రహ్మ, గర్గ పురాణాలలో సుభద్రను శతరూపగా, అర్జునుడిని స్వయంభువ మనువుగా పేర్కొన్నారు. నారాయణునికి సోదరి, నరుడికి భార్య సుభద్ర.

సోదరుల గారాల సోదరి మనస్తత్వం – Subhadra Complex.

**28) బలరాముడు :** వసుదేవుడు–రోహిణిల కుమారుడు. దేవకిదేవి గర్భాన పెరిగిన పిండాన్ని, యోగమాయ రోహిణి గర్భానికి మార్చింది. ఆ విధంగా రోహిణికి సంకర్షణుడై (గర్భాకర్షణ) జన్మించాడు బలరాముడు. హలాయుధుడు, హలధారుడిగా రైతులకు ప్రతీక. బలదేవుడు, బలభద్రుడిగా అపార బలానికి సూచితుడు. ఆదిశేషుడి అవతారంగా భావించ బడినాడు. రామావతారంలో లక్ష్మణుడిగా, పరంధాముడికి సోదరుడిగా, కృష్ణావతారంలో బలరాముడిగా పరంధాముని అన్నగా ఆదిశేషుడు జన్మించినాడని పురాణ కథనం. కొన్నికొన్ని రచనలలో బలరాముడే విష్ణుమూర్తి అవతారంగా చెప్పబడినాడు.

క్రీస్తుపూర్వం 185–170 నాటి ఇండో–గ్రీకు ప్రభువు అగథొక్లిస్ ముద్రించిన నాణేలపై బలరామ–కృష్ణుల చిత్రాలున్నాయి.

గోకులంలో నంద–యశోదల వద్ద పెరిగినారు బలరామకృష్ణులు. బాల్యంలో ధేనుకాసురుడిని వధించాడు. తరువాత మధురా నగరంలో బలరాముడు ప్రలంబుడు, ముష్టికుడు, కంసుడి సేనాధిపతి కాలవక్రుడిని చంపగా, కృష్ణుడు చాణూరుడిని, కంసుడిని వధించాడు. కంసుడి తండ్రి ఉగ్రసేనుడిని మధురకు రాజుగా చేసినారు.

ఆ తరువాత ఉజ్జయినికి వెళ్లి సాందీపని వద్ద శుశ్రూష చేసి విద్యలనభ్యసించారు బలరామకృష్ణులు.

బలరాముడి భార్య అనర్తాదేశపు ప్రభువు కుకుద్మిని కుమార్తె రేవతి. వీరి సంతానం నిషాద, ఉల్ముక, శశిరేఖలు (వత్సల).

తన నాగలితో యమునను దారిమళ్లించి మధురా నగరం దగ్గరలో ప్రవహించేట్లు చేసాడు. కౌరవులు సాంబుడిని బందీగా చేసినప్పుడు హస్తినాపురాన్ని నాగలితో పట్టి పునాదులతో సహా లేవనెత్తి గంగలో కలపబోయినాడు.

కురుక్షేత్ర యుద్ధ సమయంలో తటస్థంగా ఉండదలచి తీర్థయాత్రకు వెళ్లినవాడు యుద్ధం 18వ రోజు భీమ-దుర్యోధనుల గదాయుద్ధం చూడడానికి వచ్చాడు. గురువు బలరాముడుండగా తనదే విజయమని శిష్యుడు దుర్యోధనుడు ఆశించినా కృష్ణుడి సంజ్ఞలతో దుర్యోధనుడి తొడలు విరగగొట్టి ఓడించాడు భీముడు. కోపించిన బలరాముడిని శాంతిపజేసాడు కృష్ణుడు, అది భీముడి ప్రతిజ్ఞాపాలనగా వివరిస్తూ.

బలరామ శ్రీకృష్ణులు ఆదర్శ సోదరులుగా కనిపించినా ఇద్దరి మధ్య అనేకసార్లు అభిప్రాయ భేదాలు వచ్చినాయి. శ్రీకృష్ణుడి చాకచక్యం ముందు బలరాముడు తగ్గిపోవాల్సి వచ్చేది.

1) శ్యమంతకమణిని పొందినాడు సత్రాజిత్తు సూర్యుడి నారాధించి. అది రోజుకు ఎనిమిది బారువుల (77 కిలోగ్రాముల) బంగారాన్నిస్తుంది. సూర్యసమాన కాంతులతో ప్రకాశిస్తుంది. వంశక్షేమం, రాజ్యక్షేమం కోరి శ్రీకృష్ణుడు సలహా ఇచ్చాడు సత్రాజిత్తుకు- ఆ మణిని రాజు ఉగ్రసేనుడి వద్ద ఉంచమని. సత్రాజిత్తు అంగీకరించలేదు.

సత్రాజిత్తు సోదరుడు ప్రసేనుడు ఆ మణిని మెడలో వేసుకుని వేటకు వెళ్తే అతడిని ఓ సింహం చంపింది. ఆ సింహాన్ని చంపి జాంబవంతుడు ఆ మణిని తన కుమార్తె జాంబవతికి ఆటవస్తువుగా ఇచ్చాడు.

ప్రసేనుడిని కృష్ణుడే చంపాడని పుకారు వ్యాపించడంతో యాదవ వీరులను తీసుకుని ప్రసేనుడిని వెదుకుతూ వెళ్లగా వారికి ప్రసేనుడి శవం, ప్రసేనుడిని చంపిన సింహం శవం కనిపించాయి. రక్తపు మరకలు, అడుగుజాడలు ఒక గుహలోకి దారితీయగా శ్రీకృష్ణుడొక్కడే గుహలోకి ప్రవేశించాడు. 28 రోజులు జరిగిన ఘోరయుద్ధంలో అలసిపోయినాడు జాంబవంతుడు. శ్రీకృష్ణుని తన దేవుడైన శ్రీరాముడిగా గుర్తించి శ్యమంతకమణితో పాటు కుమార్తెమణి- జాంబవతిని శ్రీకృష్ణునికిచ్చి శరణు వేడినాడు. (పద్మపురాణం 249 అధ్యాయం).

ద్వారకకు జాంబవతి, శ్యమంతకమణిని తీసుకుని వచ్చి అందరి సమక్షంలో 'మణి'ని సత్రాజిత్తుకు ఇచ్చి తనపై పడిన అపవాదును తొలగించుకున్నాడు శ్రీకృష్ణుడు.

పశ్చాత్తాపంతో సత్రాజిత్తు శ్రీకృష్ణునికి తన కుమార్తె సత్యభామను ఇచ్చి వివాహం చేసి, శ్యమంతకమణిని ఇవ్వబోగా భామామణిని స్వీకరించి, శ్యమంతకమణిని తిరస్కరించాడు కృష్ణుడు.

సత్యభామను వివాహం చేసుకుందామని ఆశపడినవాళ్లు కృతవర్మ, అక్రూరుడు, శతధన్వుడు. ఈ ముగ్గురూ ఆశాభంగం చెందినవారై కుట్రచేసి సత్రాజిత్తును చంపి మణిని దొంగిలించారు. ఆ సమయంలో హస్తినాపురంలో ఉన్న బలరామకృష్ణులకు సత్రాజిత్తు వధ గురించి చెప్పింది సత్యభామ దుఃఖంతో కుమిలిపోతూ. శతధన్వుడు పారిపోయాడు మణిని అక్రూరుడికిచ్చి. బలరామకృష్ణులు శతధన్వుడిని వెంటాడి మిథిలానగరం చేరుకున్నారు. శ్రీకృష్ణుడు శతధన్వుడిని చంపి అతడి దుస్తులను శోధించగా శ్యమంతకమణి కనిపించలేదు. ఆ విషయాన్ని బలరాముడికి చెబితే అతడూ నమ్మక, సోదరుడైన కృష్ణుడిని నిందించి మిథిలలో ఉండిపోయాడు మూడేళ్లు. ఆ సమయంలోనే అతడు దుర్యోధనుడికి గదా యుద్ధంలోని మెళకువలు నేర్పినాడు.

బభ్రువు, ఉగ్రసేనాది యాదవులు నచ్చచెప్పినాక ద్వారకకు తిరిగి వచ్చాడు బలరాముడు.

కాశీకి పారిపోయిన అక్రూరుడు, శ్రీకృష్ణుని ఆజ్ఞతో ద్వారకకు వచ్చి తన దగ్గర మణి ఉన్న విషయాన్ని తెలియజేసినాడు. ఆ మణిని అక్రూరుడి దగ్గరే ఉండనిచ్చాడు శ్రీకృష్ణుడు ఈ తలనెప్పి పడలేక.

శ్యమంతకమణి-ఎర్రటి కెంపు (Ruby), పద్మరాగమణి.

2) బలరాముడు తన సోదరి సుభద్రను దుర్యోధనుడి కిచ్చి వివాహం చెయ్యాలనుకుంటే కృష్ణుడు ఆమెను తన మిత్రుడు అర్జునుడితో పెళ్లి చేసినాడు; వారిరువురూ ప్రేమించుకున్నారని బలరాముడిని ఒప్పించినాడు.

3) బలరాముడు-రేవతిల కుమార్తె శశిరేఖను ఘటోత్కచుడి సాయంతో అర్జునుడి కొడుకు అభిమన్యుడికిచ్చి పెండ్లి చేసాడు కృష్ణుడు. దుర్యోధనుడి కుమారుడు లక్ష్మణ కుమారుడితో శశిరేఖకు వివాహం చేద్దామనుకున్నాడు బలరాముడు. దానినీ పడనివ్వలేదు శ్రీకృష్ణుడు.

4) అయినా, శ్రీకృష్ణ-జాంబవతిల కుమారుడు సాంబుడు, దుర్యోధన-భానుమతిల పుత్రిక లక్ష్మణను స్వయంవర సమయాన ఎత్తుకుపోవడానికి ప్రయత్నించి బందీగా చిక్కినపుడు బలరాముడు హస్తినకు వెళ్లి బతిమలాడినా వినలేదు

దుర్యోధనుడు. దానితో కోపించిన బలరాముడు భీకరాకారుడై తన నాగలితో హస్తినను గంగలో కలపాలని ప్రయత్నించినపుడు దారికి వచ్చిన దుర్యోధనుడు సాంబ-లక్ష్మణల వివాహానికి అంగీకరించినాడు.

5) కురుక్షేత్ర యుద్ధ సమయంలో బలరాముడు తటస్థత వహించాడు. శ్రీకృష్ణుడు పాండవ పక్షాన పార్థసారథిగా ఉన్నాడు. శ్యమంతకమణిపై సత్యభామపై ఆశపడి విఫలుడైన కృతవర్మ దుర్యోధనుడు అడగగానే కౌరవ పక్షంలో చేరినాడు.

6) భీమసేన-దుర్యోధన గదాయుద్ధంలో- భీముడు యుద్ధ నియమాలనతిక్రమించి దుర్యోధనుడిని నాభికి దిగువన తొడలపై గదతో కొట్టి ఎముకలు విరగగొట్టి నేలకూల్చాడన్న కోపంతో భీముడిని దండించబోయినాడు. బలరాముడు. శ్రీకృష్ణుడు బలరాముడిని శాంతపరచాడు.

బలరాముడు భోళామనిషి. కల్లు తాగడం ఇష్టం. మహా బలవంతుడు. గదాయుద్ధంలో ఆరితేరినవాడు.

శ్రీకృష్ణుడి భార్య రుక్మిణి సోదరుడు రుక్మి. ఇతడు చాలా గర్విష్ఠి. కురుక్షేత్ర యుద్ధ ప్రారంభ సమయంలో అర్జునుడి వద్దకు వచ్చి అన్నాడు- "నేను పరశురాముడి శిష్యుడిని. నా వద్ద విజయమనే ధనుస్సు, దివ్యాస్త్రాలున్నాయి. నీకు యుద్ధమంటే భయమైతే చెప్పు, నేను వెళ్లి కౌరవులనోడిస్తాను" అన్నాడు. అర్జునుడన్నాడు- "నాకు యుద్ధమంటే భయంలేదు. నేను నిన్ను సహాయమడగలేదు. ఒకవేళ నాకు భయం వేస్తే అప్పుడడుగుతానులే, వెళ్లిరా!" అని పంపించివేసాడు సగౌరవంగా.

అప్పుడు రుక్మి సరాసరి దుర్యోధనుడి దగ్గరకు వెళ్లి అదేవిధంగా- "నీకు యుద్ధమంటే భయమైతే నేను పాండవులతో యుద్ధం చేస్తాను, సరేనా?" అన్నాడు.

అసలే మానధనుడైన సుయోధనుడు అతడిని వెంటనే- "నీ సాయం వద్దు, నాకవసరం లేదు" అని వెళ్లిపొమ్మన్నాడు.

రుక్మి అనుకున్నాడు- "వీళ్లు మూర్ఖులు. ఉచితంగా సాయం చేస్తానంటే వద్దంటున్నారు. వీళ్లచావు వీళ్లే చస్తారు" అనుకుని విదర్భకు వెళ్లిపోయాడు.

శ్రీకృష్ణుడు-రుక్మిణిల కుమారుడు ప్రద్యుమ్నుడు. రుక్మి కుమార్తె రుక్మావతిని ప్రద్యుమ్నుడికిచ్చి వివాహం చేసారు. వీరి కుమారుడు అనిరుద్ధుడు. అనిరుద్ధుడు బాణాసురుని కుమార్తె ఉషను వివాహం చేసుకోగా వజ్రుడు (వజ్రనాభుడు) జన్మించాడు.

అనిరుద్ధుడి మొదటి భార్య రోచన. ఈమె రుక్మి మనమరాలు. అనిరుద్ధుడు-రోచనల వివాహం తరువాత రుక్మి-బలరాములు జూదమాడినారు. సుహృద్ద్యూతం కాస్తా గొడవగా పరిణమించింది. బలరాముడిని, యాదవులను, యదువంశాన్ని తిట్టిపోసాడు రుక్మి. బలరాముడు కోపంతో ఉన్మత్తుడై రుక్మిని చంపినాడు.

యాదవకులంలో ముసలం పుట్టాక విరక్తి చెంది అడవికి పోయి ప్రాయోపవేశంతో దేహం త్యాగం చేసినాడు.

కులాభిమానం, బలం, వీటికి తోడు కల్లుతాగడం, జూద వ్యసనాలు తోడుకాగా తోకతొక్కిన పాములాంటి వ్యక్తిత్వం Balarama Complex.

**29) అభిమన్యుడు, పరీక్షిత్తు, జనమేజయుడు :** బలరాముడు, శ్రీకృష్ణుడి సోదరి సుభద్ర. అభిమన్యుడు-మహావీరుడు, ఆత్మగౌరవం కలవాడు, యుద్ధ భయంకరుడు. సుభద్రార్జునుల కుమారుడు. శ్రీకృష్ణుని మేనల్లుడు.

ఒకనాడు దేవతల సభలో దుష్టశిక్షణార్థం సోముడి (చంద్రుడి) కుమారుడైన 'వర్చస్సు'ను మానవరూపంలో పుట్టవలసిందిగా దేవతలు కోరినారు. పదహారు కళల పూర్ణచంద్రుడు దేవతలను బ్రతిమలాడినాడు- "పదహారేళ్లు రాగానే మరల అతడు నా వద్దకు వచ్చేయాలని". దేవతలు అంగీకరించారు. అతడే అభిమన్యుడిగా జన్మించాడు.

తల్లి గర్భంలో ఉండగానే తండ్రి చెబుతున్న యుద్ధ తంత్రాలను విన్నాడు. ఒకరోజున పద్మవ్యూహం గురించి అర్జునుడు చెబుతున్నపుడు వింటూ నిద్రపోయింది సుభద్ర. అయితే గర్భస్థ శిశువైన అభిమన్యుడు ఊ కొడుతూ వింటున్నాడు. పద్మవ్యూహం (చక్రవ్యూహం)లోకి ఎలా వెళ్లాలో చెప్పడం పూర్తయ్యింది. ఎలా బయటకు రావాలో చెప్పబోతున్నపుడు తలుపు తట్టినట్లై అర్జునుడు బయటకు వెళ్లి శ్రీకృష్ణుని చూసి, ఇద్దరూ మాట్లాడుకుంటూ వెళ్లిపోయారు. అభిమన్యుడికి పద్మవ్యూహ భేదనం తెలిసింది. లోపలికి వెళ్లగలడు కాని, బయటకు రాలేడు ఎవరి సాయమూ లేకుండా. పాండవులు వనవాసానికి వెళ్లాక అభిమన్యుడు ద్వారకలోనో ఉండి బలరామకృష్ణులు, ప్రద్యుమ్నుడి వద్ద యుద్ధ విద్యలు నేర్చుకున్నాడు. పాండవుల అజ్ఞాతవాసం పూర్తైనాక అభిమన్యుడికి విరాటరాజు కుమార్తె 'ఉత్తర'నిచ్చి వివాహం చేసారు.

దుర్యోధనుడి మొండి వైఖరి వలన యుద్ధం తప్పనిసరై ఇరుపక్షాలు కురుక్షేత్రంలో మోహరించాయి. 13వ రోజు యుద్ధంలో అభిమన్యుడిని చుట్టుముట్టి చంపారు. అనేకమంది కురువీరులు, అతడి వీరవిహారాన్ని తట్టుకోలేక.

అప్పటికే ఉత్తర గర్భవతిగా ఉన్నది. అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మ శిరోనామకాస్త్ర ప్రభావాన మృతశిశువు జన్మించగా, కృష్ణుడతడిని పరీక్షించి బ్రతికించినాడు. ఆ విధంగా అతడికి పరీక్షిత్తు అనే పేరు వచ్చింది.

పాండవులు మహాప్రస్థానానికి వెళ్తూ పరీక్షిత్తును హస్తినాపురానికి రాజుగా అభిషిక్తుని చేసారు. 60 సంవత్సరాలు పాలించాడు పరీక్షిన్మహరాజు. పరీక్షిత్తు భార్య మద్రావతి. వీరికి నలుగురు సంతానం– జనమేజయుడు, భీమసేనుడు, ఉగ్రసేనుడు, శ్రుతసేనుడు. వీరు నలుగురూ అశ్వమేధ యాగాలు చేసినారు.

శృంగి అనే ముని శాపంతో తక్షకుడి కాటుకు బలై కన్నుమూసినాడు పరీక్షిత్తు. ఆ విషయం తెలిసిన పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు ఆగ్రహపరవశుడై తన తండ్రిని చంపిన తక్షక నాగును, సమూలంగా చంపనెంచి సర్పయాగం ప్రారంభించాడు.

జనమేజయుడి భార్య వపుష్టమ; వారి కుమారులు– శతానీకుడు, శంకుకర్ణుడు.

ఆస్తీకుడి చొరవతో సర్పయాగం ఆగింది. నాగజాతి కొంత బతికి బట్టకట్టింది. శ్రావణ శుక్లపక్ష పంచమి నాడు.

ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి జిల్లాలో ఢిల్లీకి 270 కిలోమీటర్ల దూరంలో– పర్వామ్–పరీక్షిత్‌గఢ్‌లోని పరీక్షిత్తు సరస్సు వద్ద సర్పయాగం జరిగిందని స్థానికులు నమ్ముతారు. అక్కడున్న పాములు మనుష్యులకు హాని చేయవు అని జనుల విశ్వాసం. సర్పయాగం తక్షశిలలో జరిగిందని సంస్కృత భారతంలో ఉన్నది.

జనమేజయుడి తరువాత అతడి మనవడు శతానీకుని కుమారుడు అశ్వమేధదత్తు హస్తినకు రాజైనాడు. అతడి కుమారుడు అధిసిమకృష్ణుడు. అతడి కుమారుడు 'నిచక్షువు'. కాలంలో హస్తినాపురం గంగానది వరదలో మునిగిపోగా రాజధానిని కౌశాంబికి మార్చినాడు. వత్స వంశం ప్రారంభమైంది. భాసుడి నాటకం– స్వప్న వాసవదత్తలోని నాయకుడు ఉదయనుడు భరత వంశానికి చెందినవాడు.

**30) శ్రీకృష్ణుడు :** జగత్ శిశువు, జగద్గురువు, జగత్‌పాలకుడు, జగదోద్ధారకుడు, జగన్నాధుడుగా పేరుపొందిన శ్రీకృష్ణుడు నమ్మినవారికి నయనానందకరుడు. నమ్మనివారికి నయన జ్వలితుడు. బాలుడిగా కృష్ణలీలలు, ప్రేమికుడిగా రాసక్రీడలు, వీరుడిగా యుద్ధక్రీడలు, రాజకీయ చతురుడిగా రాయబారాలు, పార్థసారథిగా రథగమన చాతుర్యాలు, అర్ధరాత్రి కారాగారం లాంటి గృహ నిర్బంధంలో పుట్టి, రాత్రికి రాత్రి గోకులం చేరి గోపాలకుడిగా పెరిగి, గొప్పవీరుడు, రాజకీయ దురంధరుడై, తన వంశ వినాశనాన్ని కళ్లారాచూసి అడవిలో దిక్కూమొక్కు లేని చావును అనుభవించినాడు.

పట్టమహిషులు ఎనిమిదిమంది, ఒక్కొక్కరికి పదేసిమంది సంతానం.

1) రుక్మిణి – ప్రద్యుమ్నుడు, చారుమతి, ఇంకా తొమ్మిదిమంది పుత్రులు.
2) జాంబవతి – సాంబ, సుమిత్ర, ఇంకా ఎనిమిదిమంది పుత్రులు
3) సత్యభామ – భానుడు, ఇంకా తొమ్మిదిమంది పుత్రులు.
4) కాళింది – శ్రుతుడు, ఇంకా తొమ్మిదిమంది పుత్రులు.
5) మిత్రవింద – వృకుడు, ఇంకా తొమ్మిదిమంది పుత్రులు
6) నగ్నజితి – వీరుడు, ఇంకా తొమ్మిదిమంది సంతానం
7) భద్ర (కేకయి) – సంగ్రామజిత్తు, ఇంకా తొమ్మిదిమంది పుత్రులు
8) మద్ర (లక్ష్మణ) – ప్రఘోషుడు, ఇంకా తొమ్మిదిమంది పుత్రులు.

1) రుక్మిణి – విదర్భ దేశపు భీష్మకుడి కుమార్తె; రుక్మి సోదరి.
2) జాంబవతి – జాంబవంతుని పెంపుడు పుత్రిక
3) సత్యభామ – సత్రాజిత్తు కుమార్తె
4) కాళింది – యమునా నది మానవస్త్రీ రూపం
5) మిత్రవింద – స్వయంవరంలో గెలుచుకున్నాడు కృష్ణుడు
6) నగ్నజితి – కోసల రాజు కుమార్తె, స్వయంవరంలో గెలుచుకున్నాడు.

7) భద్ర - కుంతి చెల్లెలి కుమార్తె - స్వయంవరంలో గెలుచుకున్నాడు

8) మద్ర - చారుహాసిని, స్వయంవరంలో తీసుకురాబడింది.

**కృష్ణుడు - రాక్షసులతో వియ్యాలు-కయ్యాలు :**

దేవామీడుడు అనే యాదవ రాజు పుత్రులు శూరసేనుడు, పర్జన్యుడు; పర్జన్యుడికి అయిదుగురు కుమారులు. వారిలో శ్రీకృష్ణుని పెంపుడు తండ్రి నందుడు ఒకడు.

శూరసేనుడు నాగకన్య మారిషను వివాహం చేసుకోగా వారికి వసుదేవుడు, పృథ. ఇంకా 13 మంది పుత్రులు కలిగారు. శూరసేనుడు పృథను కుంతీభోజుడికి దత్తత ఇచ్చాడు. అప్పటి నుండి ఆమె 'కుంతి' పేరుతో పిలవబడింది.

వసుదేవుడికి 13 మంది భార్యలు-వారి సంతానం:

1) దేవకిదేవి - (బలరాముడు), శ్రీకృష్ణుడు

2) రోహిణి - బలరాముడు, సుభద్ర, శరణ, సుత

3) వృకాదేవి - అవగహ, నందక

4) మదిర, 5) వైశాఖి, 6) భద్ర, 7) సునాయ, 8) సహదేవ, 9) శాంతిదేవ,

10) శ్రీదేవ, 11) దేవరక్షిత, 12) ఉపదేవి, 13) బదర్వ.

శ్రీకృష్ణ-రుక్మిణి దేవిల కుమారుడు- ప్రద్యుమ్నుడు. ప్రద్యుమ్నుడి భార్య మాయావతి. పదిరోజుల వయసున్న ప్రద్యుమ్నుడిని శంబరుడనే రాక్షసుడు ఎత్తుకుపోయి సముద్రంలో పడవేసినాడు. అతడిని చేప మింగింది. ఆ చేపను జాలరులు పట్టుకుని శంబరుడికిచ్చారు. శంబరుడి వంటవాళ్లు చేపను కోయగా బయటపడిన బాలుడిని మాయావతికిచ్చారు. ఆమె పూర్వజన్మలో రతీదేవి. ప్రద్యుమ్నుడు మన్మథుడు. ప్రద్యుమ్నుడు యుక్తవయస్కుడై శంబరుడిని వధించి మాయావతితో ద్వారకకు వచ్చాడు ఆకాశమార్గాన. రుక్మిణి తన కుమారుడిని కోడలిని సాదరంగా ఆహ్వానించింది.

అతిలోక సుందరుడైన ప్రద్యుమ్నుడిని చూసి రుక్మి కుమార్తె రుక్మావతి అతడిని వరించింది. ప్రద్యుమ్నుడి మరో భార్య ప్రభావతి.

ముక్కంటి కోపాగ్నిలో భస్మమైన మన్మధుడిని బ్రతికించమని శివుని వేడుకున్నది రతీదేవి. శివుడి అనుగ్రహంతో జన్మించాడు మన్మధుడు ప్రద్యుమ్నుడిగా శ్రీకృష్ణుడు-రుక్మిణిదేవికి. రతీదేవి మాయావతి పేరుతో శంబరుడనే రాక్షసుడి వంట ఇంటిని పర్యవేక్షించే సేవకురాలిగా కాలం గడుపుతూ చేప కడుపులో దొరికిన ప్రద్యుమ్నుడిని పెంచి పెద్దజేసి అతడికి గత జన్మవృత్తాంతాన్ని గుర్తు చేసింది. అనేక మాయావిద్యలు, అస్త్రవిద్యలు నేర్పి, అతడు శంభుడిని వధించాక ఇరువురూ కలిసి ద్వారకకు వచ్చినారు.

ప్రద్యుమ్నుడు-రుక్మావతిల కుమారుడు అనిరుద్ధుడు. అనిరుద్ధుడు బాణాసురుని కుమార్తె ఉషను, రుక్మి మనవరాలు రోచనను పెళ్లి చేసుకున్నాడు.

అనిరుద్ధుడు-రోచనల కుమారుడు వజ్రనాభుడు. యదుకుల నాశనం తరువాత ఇంద్రప్రస్థానికి రాజైనాడు.

**కౌరవ పాండవులు - బలరామ శ్రీకృష్ణులు :**

దుర్యోధనుడికి సుభద్రనిచ్చి వివాహం చేద్దామనుకుని విఫలుడైనాడు బలరాముడు. తరువాత కాలంలో దుర్యోధనుడి కుమారుడు లక్ష్మణ కుమారుడికి తన కుమార్తె శశిరేఖనిచ్చి పెళ్లి చెయ్యాలనుకుంటే అదీ కుదర్లేదు. శ్రీకృష్ణుని కుమారుడు సాంబుడు దుర్యోధనుని కుమార్తె లక్ష్మణను ఎత్తుకు రావడానికి ప్రయత్నించినపుడు కౌరవులతో జగడం జరిగింది.

అంతేకాక, శ్రీకృష్ణుడు స్వయంవరాలలో గెలుచుకున్న లేదా ఎత్తుకువచ్చిన కన్యామణుల వల్ల కూడా శత్రువు లేర్పడినారు.

**1) రుక్మిణి :** రుక్మిణిని ఆమె సోదరుడు రుక్మి చేదిదేశపు యువరాజు శిశుపాలుడికిచ్చి వివాహం చేద్దామనుకున్నాడు. స్వయంవర సమయంలో ఆమె ఆహ్వానాన్ని అందుకుని వచ్చిన శ్రీకృష్ణుడు రుక్మిణిని ఎత్తుకువచ్చాడు. దానితో శిశుపాలుడు, జరాసంధుడు, రుక్మి కృష్ణుడికి శత్రువులైనారు.

**2) సత్యభామ :** శ్యమంతకమణిని సూర్యుడి నుంచి పొందిన సత్రాజిత్తు కుమార్తె. ఆమెను పెండ్లి చేసుకోవాలని కృతవర్మ, అక్రూరుడు, శతధన్వుడు ముగ్గురూ ఆశించారు. అయితే సత్రాజిత్తు శ్రీకృష్ణునికిచ్చి పెళ్లి చేసాడు సత్యభామను. దానితో వాళ్లు శ్రీకృష్ణుడికి శత్రువులైనారు. శతధన్వుడిని చంపాడు కృష్ణుడు. కృతవర్మను క్షమించాడు కాని అతడు దుర్యోధనుడి పక్షాన చేరాడు. అక్రూరుడిని శ్యమంతకమణిని ఉంచుకొమ్మన్నాడు కాని వెనకటి మిత్రుత్వం లేదు.

**3) మిత్రవింద :** ఈమె మరోపేరు సుదత్త. ఈమె తండ్రి జయసేనుడు అవంతి ప్రభువు, తల్లి రాజాధిదేవి (వసుదేవుడు, పృథ (కుంతి)ల సోదరి). మిత్రవింద సోదరుడు విందుడు, అనువిందుడు. వీరిద్దరూ దుర్యోధనుడి స్నేహితులు. వీరికి మిత్రవిందను పాండవులకు మిత్రుడు చుట్టమైన కృష్ణుడికివ్వడం ఇష్టంలేదు. మిత్రవింద కోరికపై దుర్యోధనాదులు చూస్తుండగానే ఆమెను తీసుకుపోయినాడు కృష్ణుడు ఆమె స్వయంవరం రోజున. ఇదీ రుక్మిణీ కళ్యాణం లాంటిదే. అలా దుర్యోధనుడు మిత్రవిందను కృష్ణుడికి కోల్పోయాడు.

**4) నగ్నజితి :** కోసలరాజు నగ్నజిత్తు కుమార్తె. ఈమె మరోపేరు సత్య. ఆమెను గెలుచుకోవాలంటే నగ్నజిత్తు ఎద్దులు ఏడింటిని లొంగదీసుకోవాలి. శ్రీకృష్ణుడు ఏడు రూపాల్లో ఏడు ఎద్దుల ముక్కులకు తాడుదూర్చి వాటిని లొంగదీసి నగ్నజితిని వివాహమాడినాడు. ఎదిరించిన ఇతర వీరులను, రాజులను అర్జునుడు పారద్రోలినాడు.

**5) భద్ర :** కైకయ రాజు ధృష్టకేతుడి కుమార్తె భద్ర. ధృష్టకేతుడి భార్య శ్రుతకీర్తి (వసుదేవుడు, కుంతీదేవి సోదరి) స్వయంవరంలో భద్ర వరించింది శ్రీకృష్ణుని.

**6) లక్ష్మణ :** ఈమె వివాహంలో ధనుర్విద్యా ప్రదర్శన జరిగింది. జరాసంధుడు, దుర్యోధనుడు, భీముడు, అర్జునుడు, కృష్ణుడు ఇతరులు పాల్గొన్నారు. జరాసంధుడు, దుర్యోధనుడు లక్ష్యం సాధించలేదు. భీముడు విల్లు ఎక్కుపెట్టలేదు. అర్జునుడు గురి తప్పించాడు శ్రీకృష్ణుని కోసం. శ్రీకృష్ణుడు గురి తప్పకుండా లక్ష్యాన్ని సాధించి లక్ష్మణను గెలుచుకున్నాడు.

**7) జాంబవతి :** జాంబవతుడిచే ఇవ్వబడింది.

**8) కాళింది :** యమునానది స్త్రీరూపంలో కృష్ణుడిని వరించింది.

చంద్రగుప్త మౌర్యుడి (350–295 BC) ఆస్థానంలో గ్రీకుల రాయబారిగా సెల్యూకస్ నికటార్ నియమించిన మెగస్తనీస్ తన 'ఇండికా' పుస్తకంలో ఇండియాలోని శూరసేనులనే తెగవాళ్లు హెరాక్లిస్ (హరికృష్ణ)ను పూజిస్తారు. వాళ్ల పట్టణాలు మెథొర (మధుర), క్లిసొబొర (కృష్ణపురం), జొబారెస్ (జమున–యమున) నది ఒడ్డున ఉన్నాయని వ్రాసినాడు.

వృష్ణి వంశస్థుల వాసుదేవుడు, యాదవ–అభీరుల కృష్ణుడు కలిసి వాసుదేవ–కృష్ణు దయ్యాడని ఒకవాదన. 180 BC నాటి ఇండొ–గ్రీకు ప్రభువు ముద్రించిన నాణేనాలపై ఒకపక్క సంకర్షణ బలరామ, మరోపక్క వాసుదేవ–కృష్ణుడి చిత్రాలున్నాయి.

Heliodorus Pillar - హిలియొడొరస్ స్తంభం (113 BC) బెస్ నగర్–విదిష–మధ్యప్రదేశ్‌లో బయటపడింది. అది గరుడధ్వజం. బ్రాహ్మిలిపిలో దానిపై దేవదేవుడు వాసుదేవుడికి అంకితం అని వ్రాయబడి ఉన్నది.

యదువు కుమారులు నలుగురు– 1) సహస్రజిత్తు, 2) క్రోష్ఠ, 3) నల, 4) రిపుడు.

1) సహస్రజిత్తు → హైహయులలో ముఖ్యుడు, కార్యవీర్యార్జునుడు.

2) క్రోష్ఠుడి వంశంలోని సాత్వతుడికి ఏడుగురు పుత్రులు– భాజమాన, భాజి, దివ్య, వృష్ణి, దేవప్రీత, అంధక, మహాభోజులు.

- మహాభోజుని వంశం వారు భోజులైనారు.
- భాజమానుడు → విదురథ → శిని → భోజ → హృదికుడు.

  హృదికుడి కుమారులు– దేవామీఢుడు, శతధన్వుడు, కృతవర్మ.

  దేవామీఢుని కుమారుడు శూరసేనుడు. శూరసేనుడు నాగకన్య మారిషను వివాహం చేసుకోగా వసుదేవుడు, పృథ జన్మించారు. పృథను కుంతీభోజుడికి దత్తత నివ్వగా ఆమె 'కుంతి' అని పిలువబడింది.

- వృష్టి → యుధాజిత్తు → అనామిత్రుడు →
  అనామిత్రుడు → నిమ్మ → సత్రాజిత్తు, ప్రసేనుడు
  అనామిత్రుడు → శిని → సత్యక → సాత్యకి
  అనామిత్రుడు → పృశ్ని → స్వఫల్క → అక్రూరుడు

- నందక (అంధక) → కుకురుడు → వృష్టి → ఏడవ తరంలో ఆహుకుడు
  ఆహుకునికి ఇద్దరు కుమారులు దేవకుడు, ఉగ్రసేనుడు.
  ఉగ్రసేనుడి కుమారుడు కంసుడు.
  దేవకునికి ఏడుగురు కుమార్తెలు– ధృతి, శాంతి, ఉపదేవి, శ్రీదేవి, దేవరక్షితి, సహదేవి, దేవకిదేవి.
  ఈ ఏడుగురిని శూరసేనుడు కుమారుడు వసుదేవుడికిచ్చి వివాహం చేసాడు దేవకుడు.
- పృథ (కుంతీదేవి) సోదరి శ్రుతదేవి కుమారుడు దంతవక్త్రుడు
- పృథ (కుంతీదేవి) మరో సోదరి శ్రుతశుభ కుమారుడు శిశుపాలుడు.

## శ్రీకృష్ణుని జీవితంలో ముఖ్య ఘట్టాలు :

1) కారాగారంలో జననం – రోహిణి నక్షత్రం, శ్రావణ బహుళ అష్టమి అర్ధరాత్రి – మధురా నగరపు కారాగారంలో పుట్టినాడు శ్రీకృష్ణుడు. అదే సమయంలో యశోదకు జన్మించింది గోకులంలో యోగమాయ. శిశువుల మార్పిడి చేసాడు వసుదేవుడు. యోగమాయను చంపబోగా ఆమె ఆకాశంలో దివ్యరూపాన ప్రత్యక్షమై– "నిన్ను చంపేవాడు వేరొకచోట పెరుగుతున్నాడు" అని అదృశ్యమయ్యింది.
2) కంసుడు పంపగా 'పూతన' బయల్దేరింది అందమైన 'దాయి'గా అప్పుడే పుట్టిన పసికందులకు తన రొమ్ముల విషపు పాలు తాగించి చంపుతూ, నందుడి గ్రామం చేరుకుంది. పాలతో పాటు ఆమె ప్రాణాలు తాగినాడు చల్లనయ్య నల్లనయ్య.
3) శకటాసురుడు, తృణావర్తుడు కృష్ణుడిని చంపబోయి చచ్చారు.
4) ముద్దుగొలిపే చిన్నికృష్ణుడు వెన్నదొంగ – మఖన్‌చోర్‌గా గోపస్త్రీలను ఏడిపిస్తున్నాడు. వాళ్లు యశోదకు మూకుమ్మడిగా పోయి చెప్పారు చిన్నవాడి అల్లరిని.
5) తమ్ముడు మట్టి తింటున్నాడని బలరాముడు తల్లితో చెప్పగా, ఆమెకు తన నోటిలో బ్రహ్మాండాన్ని విశ్వాన్ని చూపించి ఆశ్చర్యపరచాడు– 'కలయో, విష్ణుమాయయో!'
6) అతడి అల్లరి భరించలేక యశోద కృష్ణుడి నడుముకు తాడుకట్టి, రోలుకు బంధించింది. దాన్ని లాక్కువెళ్లి తోటలోని రెండు మద్దిచెట్లను కూల్చి నలకూబర, మణిగ్రీవులనే యక్షులకు శాపవిమోచన మొనర్చినాడు.
7) బృహత్రాణ గ్రామం నుంచి బృందావనానికి వచ్చి స్థిరపడినారు ఉపనంద, నందులు.
8) పొగరుబోతు గిత్తరూపంలో వచ్చిన వత్సుడిని, కొంగ రూపంలో వచ్చి మింగబోయిన బకుడిని చంపాడు కృష్ణుడు.
9) బకుడి సోదరుడు అఘుడు మహాసర్పమై కొండగుహలా నోరు తెరచి మింగబోగా, చంపినాడు తాను అంతకంటే ఎక్కువ పెరిగి పాముకు ఊపిరాడకుండా చేసి.
10) బలరాముడు తాటితోపులో ధేనుకాసురుడనే గాడిదను చంపాడు, కృష్ణుడు మిగతా గాడిదలను చావగొట్టినాడు.
11) కాళీయమర్దనం – చేసి ఆ మడుగును ఖాళీ చేయించాడు. కాళీయ నాగుల్ని యమునానది తీరం నుంచి సముద్రతీరం వేపు పంపివేసాడు.

(కురుక్షేత్ర–ఖాండవ వనం తక్షక నాగులది, నర్మదానది ప్రాంతం. మాహిష్మతి నగరం కర్కోటక నాగులది, కాళింది మడుగు ప్రాంతం కాళియ నాగులది. ఈ మూడు ఆక్రమించుకోబడినాయి భరత తెగల వారితో).

రాజ్యాధికారం కోసం, జ్యోతిషాలను నమ్మి చిన్నపిల్లలను చంపిన ఘట్టాలు చరిత్రలో ఉన్నాయి.

**1) హెరాద్ (Herod the Great) :** బెత్లెహేమ్‌లో రెండేళ్లలోపు పిల్లల్ని చంపమని ఆజ్ఞ జారీచేసాడు. Massacre of the Innocents గా ఈ ఘటన పేరుపొందింది (మాథ్యు 2-16). చనిపోయిన పిల్లల సంఖ్య 14 నుంచి 1,44,000గా వేర్వేరు కథనాలు చెబుతున్నాయి. జీసస్‌ను రక్షించుకోవడానికి జోసెఫ్, మేరీలు బెత్లెహేమ్ నుంచి ఈజిప్టు వెళ్లిపోయారు.

2) ఈజిప్టు ప్రభువు ఫారో ఆజ్ఞ జారీచేసాడు మంత్రసానులకు షిఫ్రా, పువా (పూతన) – "మీరు కానుపు చేసే హీబ్రూ తల్లులకు పుట్టిన శిశువు మగపిల్లవాడైతే చంపండి. ఆడపిల్ల అయితే బతకనివ్వండి" (ఎక్సొడస్ 1–22). హీబ్రూల మగపిల్లలను నైలునదిలో ముంచి చంపమని ఆజ్ఞలు జారీచేసాడు ఫారో.

మూసా (Moses) తల్లి తనకు పుట్టిన నవజాత శిశువును పొత్తిళ్లలో ఉంచి పెట్టెలోపెట్టి నదిలో విడువగా, ఆ పెట్టె ఫారో కుమార్తె వద్దకు చేరగా ఆమె ఆ శిశువును ఈజిప్టుల బాలుడిగా పెంచింది. (Moses - Pulled out from water; మూసా అంటే నీళ్ల నుంచి బయటకు లాగబడినవాడు. కర్ణుడు కూడా అంతే వసుసేనుడు–సహజ కవచకుండలాలనే సౌభాగ్యంతో జన్మించినవాడు.

12) గోపికావస్త్రాల అపహరణం

13) గోవర్ధనగిరి నెత్తడం, ఇంద్రుడితో యుద్ధం.
ఏడేళ్ల వయస్సు (7 సంవత్సరాల 2 నెలల 10 రోజులు) వచ్చేసరికే ఈ పనులన్నీ చేసాడు కృష్ణుడు.
**ఏడేండ్ల బాలుడెక్కడ, క్రీడం గరి తమ్మియెత్తు క్రియ నందరముం**
**జూడ గిరి యెత్తుటెక్కడ, వేడుక నొక చేత నేడు వెరగౌ గాదె!** (భాగవతం దశమపర్వం–932)

14) రాసక్రీడ

15) సుదర్శనుడనే విద్యాధరుడిని, శంఖచూడుడనే యక్షుడిని, అరిష్టుడనే వృషభ రాక్షసుడిని చంపినాడు.

16) కంసుడు పంపగా అక్రూరుడు వచ్చి ఆహ్వానించాడు బలరామకృష్ణులను ధనుర్యాగానికి.

17) వ్యోముడు, కేశి అనే రాక్షసులను చంపినాడు కృష్ణుడు.

18) అక్రూరుడు బృందావనానికి వచ్చాడు. బలరామకృష్ణులను మధురకు రథంలో తీసుకువెళ్తూ దారిలో యమునలో స్నానం చేసినపుడు అతడికి కృష్ణుడు కనిపించాడు విశ్వ పురుషుడిగా.

19) మధురానగరంలో కంసుడి బట్టలు తెస్తూ బలరామకృష్ణులను గొల్లలని అవమానించిన రజకుడిని శిక్షించాడు. రాజోచితమైన వస్త్రాలు ధరించి, తమకు పూలను, సుగంధ ద్రవ్యాలనిచ్చిన సుదాముడు అనేవాడిని సత్కరించారు. గూనిదైన కుబ్జ వికారాన్ని పోగొట్టి అందాలకన్యగా మార్చినాడు కృష్ణుడు. ధనుస్సులున్న గృహానికి వెళ్లి మహాధనుస్సును విరగగొట్టినాడు.

కువలయాపీడమనే ఏనుగును చావగొట్టినాడు. చాణూరుడనే మల్లుడిని కృష్ణుడు, ముష్టికుడిని బలరాముడు మట్టికరిపించి చంపినారు. కంసుని జుట్టు పట్టుకుని లాగి సింహాసనం పైనుంచి కింద పడవేసి చంపినాడు కృష్ణుడు.

కారాగారం నుంచి తల్లిదండ్రులైన దేవకీ వసుదేవులను, కంసుడి తండ్రి ఉగ్రసేనుడిని విడిపించాడు. ఉగ్రసేనుడిని మధురకు రాజుగా చేసినాడు. కంసుడి భయంతో మధురను విడిచి వెళ్లిన యదు, వృష్ణి, భోజ, మరు, దశార్ణ, కుకురు, అంధక తెగలకు మరల మధురలో స్థానం కల్పించాడు కృష్ణుడు.

20) కాశీ నగరంలో సాందీపని ఆచార్యుడి వద్ద వేదవేదాంగాలు, ధనుర్వేదం తంత్ర, న్యాయ, తర్క వేదాంతాలు నేర్చుకున్నారు బలరామకృష్ణులు. 64 శాస్త్రాలు 64 రోజుల్లో నేర్చుకున్నాడు కృష్ణుడు.

ప్రభాస తీర్థానికి వెళ్లి 'పాంచజని' అనే రాక్షసుడిని సంహరించి (గురు పుత్రుడిని అపహరించినవాడు), అక్కడ గురుపుత్రుడు కానరాక యమలోకపు రాజధాని– 'సంయమిని' నగరానికి వెళ్లి యముడి వద్ద ఉన్న గురుపుత్రుడిని సజీవంగా తెచ్చి గురుఋణం తీర్చుకున్నారు బలరామకృష్ణులు.

22) మధురా నగరం వచ్చి ఉద్ధవుడితో క్షేమ సమాచారాలు పంపినాడు గోపికలకు శ్రీకృష్ణుడు. తరవాత కుబ్జ కోరికను మన్నించాడు. అక్రూరుడిని హస్తినాపురికి పంపి కుంతీదేవి, పాండవుల కుశలాన్ని కనుక్కున్నాడు. ధృతరాష్ట్రునికి సందేశం పంపినాడు పాండవులకు వారి భాగాన్ని వారికిమ్మని. పుత్ర ప్రేమతో మరింత అంధుడైన ధృతరాష్ట్రుడు ఆ సంభాషణను పక్కదారి పట్టించాడు.

23) కంసుని చంపినందుకు దుఃఖితులైన కంసుడి భార్యలు అస్తి, ప్రాప్తి తమ తండ్రి జరాసంధుడి దగ్గరకు వెళ్లి మొర పెట్టుకున్నారు. 23 అక్షౌహిణీల సైన్యంతో జరాసంధుడు మధురపై దండెత్తినాడు. ఓడిపోయి మూర్ఛిల్లి అవమానభారంతో తన నగరం గిరివ్రజానికి పోయినాడు. అయినా పట్టు వదలక మొత్తం 17 సార్లు మధురపై దండెత్తినాడు. ప్రయోజనం లేకపోయింది.

నారదుడు ప్రేరేపింపగా కాలయవనుడు మూడుకోట్ల సైన్యంతో మధురను ముట్టడించాడు. అప్పటికే విసిగిపోయిన కృష్ణుడు సముద్ర తీరాన ద్వారావతి నగరాన్ని నిర్మించి అక్కడకు యాదవులను పంపి ఒంటరిగా కాలయవనుడి నెదుర్కొని, అతడిని కవ్విస్తూ ముచుకుందుడు (మాంధాత కుమారుడు– దీర్ఘ నిద్రలో ఉన్న అతడిని ఎవరైనా నిద్రలేపితే, వాడు భస్మమైపోతాడు) ఉన్న గుహలోకి తీసుకువెళ్లాడు. నిద్రపోతున్న ముచుకుందుడిని లేపగా అతడు కళ్లు తెరచి చూడగానే భస్మమైపోయాడు కాలయవనుడు. అతడి సైన్యం చెల్లా చెదురైంది.

18వ సారి మధురపై దండెత్తినాడు మగధరాజు జరాసంధుడు. ఉన్న కొద్దిమందిని ద్వారక వేపు పంపి బలరామకృష్ణులు మధురా నగరాన్ని విడిచి జరాసంధుడు చూస్తుండగానే అడవుల వేపు పరిగెత్తారు. శ్రీకృష్ణుడిని 'రణ చోర'–యుద్ధం చేయకుండా పారిపోతున్నవాడా అంటూ అడవికి నిప్పు పెట్టాడు జరాసంధుడు. ప్రవర్ధన కొండ చుట్టుపక్కల ప్రాంతమంతా భస్మయ్యింది. జరాసంధుడు గెలిచినాననుకుని వెనక్కి మరలినాడు. పంచ భీములలో ఒకడైన అతడిని చంపడానికి కాలం కలిసి రావాలి భీముడి రూపంలో.

24) **రుక్మిణీ కళ్యాణం :** విదర్భ దేశం, కుండిన నగరంలోని భీష్మకుడనే రాజు కుమార్తె రుక్మిణి. ఆమెకు కృష్ణుడంటే ప్రేమ. అయితే ఆమె సోదరుడు రుక్మి ఆమెను శిశుపాలుడికిచ్చి వివాహం చేయాలనుకున్నాడు. రుక్మిణి అగ్నిద్యోతనుడనే బ్రాహ్మణుడిని కృష్ణుడి దగ్గరకు పంపి తన మనోరథాన్ని వెల్లడించింది. స్వయంవరానికి జరాసంధుడు, శిశుపాలుడు, దంతవక్త్రుడు ఇంకా ఎందరో రాజులు వచ్చారు. గౌరీపూజకు గుడికి వచ్చిన రుక్మిణిని మెరుపులా వచ్చి తన రథంపైకి ఎక్కించుకుని వెళ్లిపోయాడు శ్రీకృష్ణుడు. వెంబడించిన శిశుపాలుడిని ఓడించి, రుక్మి మీసాలు, శిరోజాలు సగం సగం గొరిగి చంపకుండా వదిలి పెట్టాడు.

"బతికియుండిన భార్యగలదు" అని పలికిన జరాసంధుడి మాటలు విని శిశుపాలుడు ఇంటికి పోయాడు.

"తలయును మూతియు గొరుగుడు, తల దరుగుట కంటె తుచ్ఛతరము" అని బలరాముడన్నాడు కృష్ణునితో 'రుక్మి' అవస్థను చూసి.

శ్రీకృష్ణుడు రుక్మిణి నోదార్చి ద్వారకలో వైభవంగా వివాహం చేసుకున్నాడు.

25) ప్రద్యుమ్నుడిని ఎత్తుకుపోయిన శంబరుడు. రుక్మిణి–కృష్ణుల కుమారుడు ప్రద్యుమ్నుడిని పదిరోజుల వయసున్నవాడిని పొత్తిళ్లలోనే ఎత్తుకునిపోయి సముద్రంలో పడవేసాడు శంబరుడు. ఆ పసివాడిని చేప మింగింది. వలలో పడిన చేపను జాలరులు పట్టి శంబరుని వంట ఇంటి పర్యవేక్షణను చూస్తున్న మాయావతికిచ్చారు జాలరులు. చేపపొట్ట కోయగా కడుపులో మగపిల్లవాడు కనిపించాడు (అద్రిక చేపకడుపులో మత్స్యరాజు, మత్స్యగంధి ఉన్నట్లు). ఆ పిల్లవాడిని పెంచి పెద్ద చేసి మాయా విద్యలు, అస్త్రశస్త్ర విద్యలు నేర్పింది మాయావతి (గతజన్మలో రతీదేవి). ఆ యుక్త వయసు వచ్చిన ప్రద్యుమ్నుడికి అసలు విషయం చెప్పగా శంబరుడిని చంపాడు ప్రద్యుమ్నుడు. ప్రద్యుమ్నుడు, మాయావతి ఆకాశ మార్గాన చేరుకున్నారు ద్వారకకు. రుక్మిణి, కృష్ణులు ఎంతో ఆనందించారు.

26) **శ్యమంతకమణి–** రోజుకు ఎనిమిది బారువుల (77 కిలోగ్రాముల) బంగారాన్నిచ్చే శ్యమంతకమణిని సూర్యవర ప్రసాదంగా పొందినాడు సత్రజిత్తు. అతడి సోదరుడు ప్రసేనుడు. ఎర్రటికెంపు అత్యంత కాంతితో ప్రకాశిస్తున్న దానిని ప్రసేనుడు మెడలో తగిలించుకుని వేటకు వెళ్తే రక్తం కారుతున్న మాంసఖండమనుకుని ఓ సింహం అతడిని చంపింది. సింహాన్ని చంపి జాంబవంతుడు ఆ మణిని తన పెంపుడు కుమార్తె జాంబవతికి ఇచ్చాడు ఆడుకోవడానికి.

అపవాదు కృష్ణుడిపై పడింది, అంతకుముందు కృష్ణుడన్నాడు ఆ మణిని రాజు ఉగ్రసేనుడి రక్షణలో ఉంచమని అన్నందుకు. అందరూ కలిసి వెదుకుతూ వెళ్లారు. ప్రసేనుడు, సింహం శవాలు కనిపించాయి. గుహలోకి వెళ్లాడు అడుగుజాడల ననుసరిస్తూ కృష్ణుడు. పన్నెండు రోజులయినా రాకపోయేసరికి కృష్ణుడితో వచ్చిన వాళ్లు వెనక్కి పోయి ద్వారకలో ఈ సంగతి చెప్పారు. సత్రాజిత్తుతో సహా అందరూ దుఃఖిస్తున్నారు. 28 రోజులు హోరాహోరీ యుద్ధం జరిగాక అలసిపోయాడు జాంబవంతుడు. అతడికర్థమయ్యింది "ఆనాడు శ్రీరామప్రభువుతో యుద్ధం చేయాలని

ఉందని అడిగితే వచ్చే జన్మలో కృష్ణుడినై పుట్టి యుద్ధం చేస్తానని ఇచ్చిన మాట". ఆనందపరవశుడై జాంబవంతుడు ప్రభువును స్తుతించి, శ్యమంతకమణితో పాటు కన్యామణి జాంబవతిని శ్రీకృష్ణుడికిచ్చినాడు. (రామాయణ కాలంలో వాలి కూడా గుహలోకి వెళ్ళి మాయావితో యుద్ధం చేసినాడు)

ద్వారకలో అందరూ శోకిస్తూ కర్మకాండలు చేద్దామనుకున్నపుడు కన్యామణి, శ్యమంతకమణులతో వచ్చాడు శ్రీకృష్ణుడు. అపవాదు తొలిగింది. పశ్చాత్తాపంతో సత్రాజిత్తు శ్రీకృష్ణునికి తన కుమార్తె సత్యభామను ఇచ్చి వివాహం చేసి శ్యమంతక మణిని ఇచ్చాడు వరకట్నంగా. ఈసారి కన్యామణిని తీసుకుని శ్యమంతకమణిని సత్రాజిత్తుకే ఇచ్చినాడు శ్రీకృష్ణుడు.

సత్యభామను పెళ్లాడాలనుకున్న కృతవర్మ, అక్రూరుడు, శతధన్వులకు ఆశాభంగం కలిగింది. కన్యామణితో పాటు శ్యమంతకమణి దక్కించుకోవచ్చు అనుకున్నవారికి కన్యామణి మహావీరుడైన కృష్ణుడికి దక్కింది. కనీసం శ్యమంతక మణిని దొంగిలిస్తే జీవితాలు సుఖంగా గడుస్తాయనుకుని ఓ రాత్రి సత్రాజిత్తును చంపి మణిని దొంగిలించి పారిపోయారు. కృతవర్మ ద్వారకలో ఉండిపోయాడు. ఆ సమయంలో బలరామకృష్ణులు హస్తినాపురంలో ఉన్నారు. సత్యభామ తన తండ్రి మరణం గురించి చెప్పగానే బలరామకృష్ణులు శతధన్వ, అక్రూరుల కోసం గాలించారు. మిథిలానగరం పొలిమేరలో శతధన్వుడిని చంపినాడు కృష్ణుడు. మణి దొరకలేదు. ఆ మాట బలరాముడు నమ్మలేదు. కృష్ణుడిని అనుమానించి మనిద్దరి మధ్య ఏ బంధమూ లేదని పలికి తాను మిథిలలో జనకుడి వద్ద ఉండిపోయాడు. ఆ మూడేళ్ల కాలంలో దుర్యోధనుడికి గదాయుద్ధంలో మెలకువలు నేర్పినాడు. బభ్రువు, ఉగ్రసేనాది యాదవులు నచ్చచెప్పినాక ద్వారకకు వచ్చాడు మూడేళ్ల తరువాత బలరాముడు.

నిజం తెలిసింది. శ్యమంతకమణి అక్రూరుడి వద్ద ఉన్నదని. ద్వారకకు రమ్మని ఆదేశాలు పంపగా కాశీ నుంచి వచ్చాడు అక్రూరుడు ద్వారకకు. మణిని అతడి వద్దనే ఉంచినాడు శ్రీకృష్ణుడు. బలరాముడు పశ్చాత్తాపం చెందినాడు తాను తన తమ్ముడినే శంకించినందుకు.

27) లాక్షాగృహ దహనం, హిడింబ వధ, హిడింబితో భీముడి వివాహం, ఘటోత్కచుడి జననం, ఆ తరువాత పాండవులు కుంతీదేవి ఏకచక్రపురం వెళ్లారు. బకుడిని సంహరించాడు భీముడు. అక్కడ నుంచి కాంపిల్య నగరం-ద్రుపదుడి రాజ్యం చేరుకున్నారు. మత్స్యయంత్ర భేదనం చేసి ద్రౌపదిని గెలుచుకున్నాడు అర్జునుడు. తల్లి కుంతి మాటతో అయిదుగురు పాండవులకు ఇల్లాలయ్యింది ద్రౌపది. ద్రౌపదీ స్వయంవరంలో మత్స్యయంత్ర భేదనం తరువాత పాండవులను కలిసారు బలరామకృష్ణులు. ఆ తరువాత పాండవులకు అర్ధరాజ్యం దక్కింది. ఇంద్రప్రస్థం రాజధానిగా నిర్ణయమైనది. శ్రీకృష్ణుడు, సాత్యకి వచ్చి పాండవులను కలిసారు ఇంద్రప్రస్థంలో.

28) **ఖాండవ వన దహనం :**

- అర్జునుడికి గాండీవం, అక్షయ తూణీరం దివ్యరథం (నాలుగు తెల్లటి గుర్రాలు) ఇచ్చాడు అగ్నిదేవుడు.
- కార్చిచ్చు నుంచి కాపాడినందుకు మయుడు ఆ తరువాత మయసభను నిర్మించి ఇచ్చాడు పాండవులకు.
- కార్చిచ్చు నుంచి బయటపడబోయిన తక్షకుడి కుమారుడు అశ్వసేనుడు అర్జునుడి బాణాల నుంచి తప్పించుకోగలిగినాడు కాని అతడి తల్లి చనిపోయింది. ఆ పగతో అతడు కర్ణుని నాగాస్త్రమై అర్జునుడిని కురుక్షేత్ర యుద్ధంలో చంపబోయి విఫలుడై అర్జునుడి బాణాలతో మరణించాడు.
- అయిదు పక్షులు బతికాయి (ఋషి మందపాలుడి భార్య జరిత, పిల్లలు- జరితారి, సరిసృక్క స్తంభమిత్ర, ద్రోణ). (హర్యానాలోని ఛప్పదేశ్వర మహదేవ మందిర ప్రాంతం, ఖండ గ్రామం, ఖర్కోద, సోనిపేట జిల్లా - హర్యానా ప్రాంతాన్ని ఖాండవ వనంగా గుర్తించారు. యమునా నదికి పశ్చిమంగా ఉన్న ఈ ప్రాంతం ఒకప్పుడు తక్షక నాగ వంశీయులది).

29) కాళింది, మిత్రవింద, నగ్నజితి, భద్ర, లక్షణలతో శ్రీకృష్ణుని వివాహం.

30) సత్యభామా కృష్ణులు గరుత్మంతునిపై ఎక్కి వెళ్లి మురాసురుడిని నరకాసురుడిని సంహరించి భగదత్తుని ప్రాగ్జ్యోతిషపురానికి రాజుగా చేయుట. (గౌహతి-అస్సాం).

31) బాణాసురుడి కుమార్తె ఉషతో కృష్ణుని మనమడు, ప్రద్యుమ్న-రుక్మావతిల కుమారుడు అనిరుద్ధుని వివాహం. శివుడికి-కృష్ణుడికి మధ్య యుద్ధం.

32) పెద్ద తొండగా (ఊసరవెల్లి) పడి ఉన్న నృగ మహరాజుకు శాప విమోచనం కలిగించిన శ్రీకృష్ణుడు.

33) కరూశ ప్రభువు పౌండ్రక వాసుదేవుడిని చంపిన శ్రీకృష్ణుడు. అతడికి సాయంగా వచ్చిన కాశీరాజు తల నరికాడు. కాశీరాజు కుమారుడు సుదక్షిణుడు అభిచారహోమం చేసి మహాకృత్య అనే రాక్షసిని సృష్టించగా ఆ రాక్షసి ద్వారకను మంటలలో తగలబెట్టబోగా శ్రీకృష్ణుడు సుదర్శన చక్రాన్ని ప్రయోగించాడు. దానితో భీతి చెందిన మహాకృత్య కాశీకి పోయి కాశీ నగరాన్ని, సుదక్షిణుడిని, హోమం చేస్తున్న ఋత్విజులను భస్మం చేసి నశించింది.

34) ద్వివిదుడనే వానరుడిని చంపినాడు బలరాముడు.

35) శ్రీకృష్ణుడి అంతఃపుర వైభవాన్ని కీర్తించిన నారదుడు.

36) ఇంద్ర ప్రస్థాన్ని చేరుకున్న శ్రీకృష్ణుడు

37) జరాసంధ వధ.

38) **రాజసూయ యాగం - శిశుపాల వధ :**

రాజసూయ యాగ సమాప్తి - దారిలో దంతవక్త్రుని వధ.

(శిశుపాల దంతవక్త్రులు - సనక సనందనాదులచే శపించబడిన వైకుంఠ ద్వారపాలకులు. మొదటి జన్మలో హిరణ్యాక్ష-హిరణ్యకశిపులుగా, రెండవ జన్మలో రావణ-కుంభకర్ణులుగా; మూడవ జన్మలో శిశుపాల-దంతవక్త్రులుగా జన్మించారు. వారిని చంపడానికి విష్ణుమూర్తి వరాహ, నరసింహ, శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాలనెత్తవలసి వచ్చింది.)

39) మయసభలో భంగపడిన దుర్యోధనుడు

40) కుచేల-కృష్ణుల స్నేహం

41) సుభద్రార్జునుల వివాహం

42) బ్రాహ్మణుడి మృతశిశువులను బ్రతికించి తెచ్చిన శ్రీకృష్ణుడు.

43) పాండవుల వనవాసం పూర్తి, అజ్ఞాతవాసం.

44) శ్రీకృష్ణ రాయబారం

45) కురుక్షేత్ర యుద్ధం- పాండవ వృక్షపు పెద్దకొమ్మలైన పాండవులను రక్షించిన శ్రీకృష్ణుడు చిన్ని కొమ్మలను కాపాడలేదు. ఆఖరి రెమ్మ 'పరీక్షిత్తు'కు మాత్రం ప్రాణం పోసినాడు.

46) మునుల శాపం, గాంధారి శాపం

47) యాదవ కుల నాశనం

48) శ్రీకృష్ణ నిర్యాణం

49) ద్వారకా నగరం సముద్రంలో మునిగిపోవుట

50) పాండవుల మహాప్రస్థానం, స్వర్గారోహణ పర్వం

**సకల గుణాతీతు సర్వజ్ఞు సర్వేశు నఖిల లోకాధారు నాదిదేవు**
**పరమ దయారసోద్భాసి తుద్రిద శాభివందిత పాదాబ్జు వనధిశయను**
**నాశ్రితమందారు నాద్యంత శూన్యుని వేదాంత వేద్యుని విశ్వమయుని**
**గౌస్తుభ శ్రీవత్స కమనీయ వక్షుని శంఖచక్ర గదాసి శారంగధరుని**

**శోభనాకారు బీతాంబరాఅభి రామ**
**రత్న విరాజిత మకుట విభ్రజమాను**
**బుండరీకాక్షు మహనీయ పుణ్యదేహు**
**దలతు నుతియింతు దేవకీ తనయు నెపుడు.**

❖❖❖❖❖

## 86. మహాభారతం వలన ప్రసిద్ధికెక్కిన నుడికారాలు, పలుకుబడులు

1) భీష్మ ప్రతిజ్ఞ
2) ధృతరాష్ట్ర కౌగిలి
3) దుష్టచతుష్టయం
4) మాయాద్యూతం
5) శల్య సారథ్యం
6) సైంధవుడిలా అడ్డుపడడం
7) ద్రౌపదీ వస్త్రాపహరణం
8) అభిమన్యుడి పద్మవ్యూహ జ్ఞానం
9) ధర్మరాజు మెత్తటి పులి
10) మాయాయతి (అర్జునుడు)
11) రాయబారాలు
12) గాంధారి శాపం
13) ఏకలవ్యుడి బొటనవ్రేలు (గురుదక్షిణ)
14) యాదవ కుల ముసలం
15) నలభీమ పాకం
16) కీచక, సైంధవులు–
17) బకాసురుడి తిండి
18) చక్రం అడ్డువేయడం (సైంధవ వధ)
19) శిశుపాలుడి నూరు తప్పులు
20) దుర్వాసుడి కోపం

ఇవికాక సావిత్రి యముడి సంవాదం, గాంధారి కళ్లకు గంతలు, బృహన్నల రూపం, కర్ణుడి దానవీరశూర గుణాలు, ఊరుభంగం, మహాప్రస్థానం, నకులుడు రథం నడిపేతీరు, అందం; సహదేవుడి జ్ఞానం; మయసభ, దుశ్శాసనుడి దుష్కృత్యం. పాండవుల సంపాదన కౌరవుల పిండాకూళ్లకు సరిపోయింది; ఇటువంటివన్నీ జనుల సంభాషణలలో అలంకారాలై నిత్య నూతనంగా ప్రకాశిస్తున్నాయి.

రామాయణంలోని ప్రతి పాత్ర పేరుకు తగ్గట్టుగా ఉండగా, భారతంలోని ప్రతి పాత్ర పైకి ఒకరకంగా కనిపిస్తూ లోపల మరోరకంగా ఆలోచిస్తూ ఉంటాయి.

స్వచ్ఛమైన ప్రాగ్రూపాలు (Archetypes) రామాయణ పాత్రలు

మిశ్రమ వ్యక్తిత్వ రూపాలు – భారతంలోని పాత్రలు.

నిత్య జీవితంలో మనకు తారసపడేవాళ్లు, మనమూ, నీవూ, నేనూ, భారతంలోని ఏదో ఒక పాత్రలానో, మిశ్రమ వ్యక్తిగానో కానవస్తాము. మనకు ఎదురయ్యే ప్రతి సంఘటనా, ప్రపంచంలో సంభవిస్తున్న ప్రతి ఘటనా దానికి సారూప్యం మనకు మహాభారతంలో కానవస్తుంది అందుకే–

**ధర్మేచ అర్థేచ కామే చ మోక్షేచ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్–**

## 87. మహాభారతం - ఛందో విషయాలు

### I

ఛందస్సు – మనసుకు ఆహ్లాదం కలిగిస్తుంది.

క్రీస్తుపూర్వం రెండవ సహస్రాబ్ది నాటికే వేదాలలో ఛందస్సు కానవస్తుంది. 900–700 BC నాటికి బ్రాహ్మణాలలో ఛందోరీతులు పేర్కొనబడినాయి.

ఛందోరీతులు 15లో 7 ముఖ్యమైనవి. వాటిలో మూడిటిని సర్వసాధారణంగా వాడతారు. సంస్కృత ఛందస్సుపై వ్యాఖ్యాన గ్రంథాలు 150 పైన ఉన్నాయి, దాదాపు 850 వృత్తరీతుల్ని పేర్కొన్నాయి. పింగళ సూత్రాలు (600-200 BC) అత్యంత ప్రాచీనమైన సంస్కృత ఛందోసూత్రాలు. జయదేవ ఛందస్సు (600 AD), జనశ్రేయి ఛందస్సు, రత్నమంజూష పెరెన్నికగన్న ఛందోభాష్యాలు. కర్ణాటక పండితుడు హలాయుధుడు క్రీస్తుశకం పదవ శతాబ్దివాడు, శాస్త్ర కావ్య, కవి రహస్యములను వ్రాసిన ఛందో పండితుడు. పదకొండవ శతాబ్దంలో యాదవ ప్రకాశ, 12వ శతాబ్దంలో భాస్కరాచార్య, జయకృతి, గంగదాసులు ముఖ్యులు.

శ్లోక (Stanza), పాదము (Feet), కాలం (మాత్ర) ఛందస్సులో భాగములు. ఛందోరీతులు 'వృత్తాలుగా' చెప్పబడినాయి. 1) సమవృత్త, 2) అర్థ సమవృత్త, 3) విషమ వృత్త.

సమవృత్తంలో 26 సంయుక్తాక్షరాలు (Syllables) కన్నా తక్కువ ఉంటాయి.

వృత్తాల మరోరకం విభజన 1) అక్షర, 2) వర్ణ, 3) మాత్ర.

సంస్కృత వృత్తాలకు, గ్రీకు, లాటిన్ వృత్తాలకు పోలికలు అయాంబిక్ (Iambic) పాదాలు (eight syllables)లో గమనించవచ్చు. గాయత్రి మంత్రం దీనికి ఉదాహరణ.

**గాయత్రేణ ప్రతి మిమితే అర్కమ్**
**అర్కేణ సామత్రైష్టుభేన వాకమ్**
**వాకేన వాకమ్ ద్విపాద చతుష్పాద**
**అక్షరేణ మిమతే సప్త వాణీః**

**న గాయత్ర్యాః పరం మంత్రం – న మాతుః పరదైవతమ్**

**ఓం భూర్భువ స్వః**
**తత్స వితుర్వరేణ్యం**
**భర్గో దేవస్య ధీమహి**
**ధియోయోనః ప్రచోదయాత్**

గాయత్రితో పాటను కొలిచి, పాటతో మంత్రాన్ని చదివి త్రిష్టుభంగా, రెండు లేదా నాలుగు పాదాల నడిచి ఏడు గొంతులతో అక్షరదేవతను కొలుస్తారు.

ఏడు గొంతులు బృహస్పతివి. అవి సప్త విహంగాలు.

1) గాయత్రి – 3 పాదాలు × ఎనిమిది అక్షరాలు – ఋగ్వేద ఛందస్సు

2) ఉష్ణి – 28 అక్షరాలు; 2 పాదాలు × 8 అక్షరాలు
1 పాదం × 12 అక్షరాలు – ఋగ్వేద ఛందస్సు

3) అనుష్టుప్ – 32 అక్షరాలు : 4 పాదాలు × 8 అక్షరాలు – భగవద్గీత
మహాభారతం, రామాయణం, పురాణాలు, గ్రంథాలు ఎక్కువగా వాడే ఛందస్సు

4) బృహతి – 36 అక్షరాలు : 4 పాదాలు × 9 అక్షరాలు – ఋగ్వేదం (అరుదు)
లేదా 2×8 + 1 × 12 + 1×8

5) పంక్తి – 40 అక్షరాలు : 4×10 – ఋగ్వేదం (అరుదు)

6) త్రిస్టుభ్ – 44 అక్షరాలు : 4×11 – కావ్యాలు
తరచుగా వాడేది – రెండవ స్థానం

7) జగతి – 48 అక్షరాలు : 4×12 – కావ్యాలు, ఋగ్వేదం
తరచుగా వాడేది – మూడవ స్థానం

**ఇవికాక అక్షర ఛందస్సులు–** అతి జగతి (4×13), శక్వారి (4×14), అతిశక్వారి (4×15), అస్తి (4×16), అత్యాస్తి (4×17), ధృతి (4×18), అతిధృతి (4×19), కృతి (4×20) మొదలైనవి.

మాత్ర వృత్తాలు: ఆర్య, ఉద్గీత, ఉపగీతి, గీతి, ఆర్యగీతి.

సాంఖ్య కారిక, ఆర్యభట్ట, కాళిదాస కృతులు, ఆర్య ఛందస్సులో వ్రాయబడినాయి.

మిశ్రమ రీతులు– వైతాళీయ, మాత్ర సమాక, గీత్యార్య.

కిరాతార్జునీయం, నైషధచరిత్ర, వైతాళీయ ఛందస్సులో వ్రాయబడినాయి.

సంస్కృత మహాభారతంలో 95 శాతం శ్లోకాలు అనుష్టుప్‌లో వ్రాయబడినాయి. మిగతావి త్రిస్టుభ్‌లో అరుదుగా మిగతా ఛందస్సులు కానవస్తాయి.

కర్ణాటక ప్రాంతానికి చెందిన పింగళుడు గణిత శాస్త్రజ్ఞుడు. ఈశ్వరుడు పార్వతికి ఛందస్సు బోధిస్తుండగా పింగళుడు విని ఛందో శాస్త్రమును వ్రాసాడని పురాణాలు చెబుతున్నాయి. అగ్నిపురాణం, భారతీయ నాట్యశాస్త్రంలోని 15వ అధ్యాయం, బృహత్ సంహిత – వీటిలో ఛందస్సు గురించి వివరించబడింది.

తెలుగు ఛందస్సుకు మూలం సంస్కృత ఛందస్సు. ఒక లిప్తకాలం తీసుకునే అక్షరం లఘువు; రెండు లిప్తల కాలం తీసుకునేది గురువు. ద్విత్వాక్షరం (సంయుక్తాక్షరం ముందున్న అక్షరం గురువవుతుంది. అక్షరాల గుంపు లేదా సమూహం గణం.

**ద్వయ అక్షర గణాలు :** లల; లగ (వ); గల (హ), గగ

**త్రయక్షర గణాలు :** య, మ, త, ర, జ, భ, న, స

**ఉపగణములు:** సూర్య (2) – న,హ
– ఇంద్ర (6) – నల, నగ, సల, భ, ర, త
– చంద్ర (14) – భల, భగ, తల, తగ, మల, నల, నగ, నవ, సహ, సవ, సగగ, నహ, రగ, నల

**వృత్తములు (22) :** చంపక, ఉత్పల, శార్దూల, మత్తేభ, తరళం, తరలం, తరలి, మాలిని, మానిని, మత్తకోకిల, ఇంద్ర వజ్రము, ఉపేంద్ర వజ్రము, కవిరాజ విరాజితము, తోటకము, పంచ చామరము, మహాస్రగ్ధర, భుజంగ ప్రయాతము, మంగళ మహశ్రీ, లయగ్రాహి, లయవిభాతి, వన మయూరము, స్రగ్ధర.

**జాతులు :** కందం, ద్విపద, తరువోజ, ఉత్సాహము, అక్కరలు (మహాక్కర, మధ్యాక్కర, మధురాక్కర, అల్పాక్కర, అంతరాక్కర)

**ఉపజాతులు :** తేటగీతి, ఆటవెలది, సీసము.

## II

కవిత్రయ మహాభారతంలో 21,507 గద్య పద్యములున్నాయి.

విపుల శబ్దశాసనుడు, వివిధ పురాణ విజ్ఞాన నిరతుడు, లోకజ్ఞుడు, ఉభయ భాషా కావ్యరచనా శోభితుడు, సత్ర్పతిభాభియోగ్యుడు, ఋషి వంటి రెండవ వాల్మీకి అయిన నన్నయ భట్టారకుడు విజ్ఞాన భాస్కరుడైన వ్యాసమహర్షి ప్రోక్తమైన లక్షశ్లోక మహాభారతమును (వైశంపాయన, ఉగ్రశ్రవసులచే విస్తరించబడిన 'జయ' కావ్యాన్ని) తెలుగు భాషలోకి తెచ్చేందుకు సంకల్పించాడు.

నన్నయ భట్టారకుడు ఆంధ్ర మహాభారతాన్ని (1054–61) ఆది, సభా, అరణ్య పర్వంలోని నాలుగో అశ్వాసంలో 141 పద్యం వరకు వ్రాసి దివగంతుడైనాడు. 14వ శతాబ్దంలో ఎర్రాప్రెగ్గడ అరణ్యపర్వ శేషాన్ని పూర్తిచేసినాడు. 13వ శతాబ్దంలో తిక్కనామాత్యుడు విరాటపర్వం నుంచి స్వర్గారోహణ పర్వం వరకు పదిహేను పర్వాలు రచించినాడు.

శ్రీమదాంధ్ర మహాభారతంలో మొత్తం గద్యపద్యాల సంఖ్య 21,507. నన్నయ వ్రాసినవి– ఆది (2084), సభా (618), అరణ్యపర్వంలో (1298) నాలుగో అశ్వాసం 141 పద్యం వరకు మొత్తం 4000 గద్య పద్యాలు వ్రాసినాడు. నన్నయ వ్రాసిన మొదటి పద్యం శ్రీమదాంధ్ర మహాభారతంలో 'శ్రీవాణీ గిరిజాశ్చిరాయ' (ఆది. 1–1) శార్దూల విక్రీడితం. చివరి పద్యం– అరణ్య పర్వం నాలుగో అశ్వాసంలో 141వ పద్యం 'శారద రాత్రులు జ్జ్వలించె' – ఉత్పలమాల.

వచనం (1490), కందం (1217), సీసం – ఆటవెలదితో కూడినవి (225), సీసం– తేటగీతితో కూడినవి (26); ఆటవెలది (198), తేటగీతి (183); ఉత్పలమాల (184); చంపకమాల (240); మత్తేభము (63), శార్దూలం (19); మధ్యాక్కర (39); తరువోజ (11); తరలం (25), మత్తకోకిల (22), మాలిని (7); ఉత్సాహం (4); వసంత తిలకం (3), లయగ్రాహి (3), పృథ్వీవృత్తం (3); మహాస్రగ్ధర, మానిని, ప్రథ్వితిలకం, కవిరాజ విరాజితం, స్వాగతము–రెండేసి; మధురాక్కర, తోటకము, ద్రుతవిలంబితము, వనమయూరం, స్రగ్ధర, పద్మకము, అంబురుహము, రథోద్ధతము, మణిభూషణం, దండకం, ఒక్కొక్కటి ఉన్నాయి.

ఆశ్వాస ప్రారంభ పద్యాలు– ఆదిపర్వం–మొదటి పద్యం ఒక్కటే శార్దూల విక్రీడితం. మిగతా ఆశ్వాస ప్రారంభ పద్యాలన్నీ కందములే.

ఆశ్వాసాంత పద్యాలు– ఆదిపర్వము– 1. తోటకము, 2. వసంత తిలకము, 3. మత్తకోకిల, 4. ద్రుత విలంబితము, 5. వనమయూరం, 6) మాలిని, 7. స్వాగతము, 8. మత్తకోకిల; సభాపర్వము– 1. అంబురుహవృత్తము, 2. ఉత్సాహము, 3; అరణ్యపర్వము– 1. ఉత్సాహము, 2. పృథ్వీవృత్తము, 3. వసంత తిలకము.

అరణ్యపర్వ శేషభాగాన్ని పూరించినవాడు- శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడైన ఎఱ్ఱాప్రెగ్గడ. ఇతడు శివ పదాబ్జ సంతత ధ్యాన సంసక్తచిత్తుడు, రామాయణం, అరణ్య పర్వశేషం, హరివంశం, నృసింహ పురాణం వ్రాసి ధన్యుడైనవాడు.

మనసునుప్పొంగించే ప్రసాద గుణము, ప్రసన్న కథా కలితార్థయుక్తి, ఏకవాక్య కథాసంవిధాన రమణీయంగా కవిత్వాన్ని వ్రాసిన నన్నయ నందుకుని, మనసును ద్రవింపచేసే మధుర పదాలతో మాధుర్య గుణాన్ని ప్రవహింపచేస్తూ నన్నయ కవిత్వానికి, తిక్కన కవిత్వానికి మధ్య సహజసిద్ధమైన వంతెనలా తన కవిత్వాన్ని భాసింపజేసాడు ఎఱ్ఱాప్రెగ్గడ.

అరణ్యపర్వంలో నాలుగో అశ్వాసంలో 142వ పద్యం- 'స్ఫురదరుణాంశు రాగరుచి' - చంపకమాలతో మొదలవుతుంది ఎఱ్ఱాప్రెగ్గడ రచన. అరణ్యపర్వం సప్తమాశ్వాసం 472వ పద్యం చివరి పద్యం (తరలము)- "అమిత వైభవ! లోభమోహమదాది దుర్లభ"

ఎఱ్ఱాప్రెగ్గడ 1595 గద్య పద్యాలు వ్రాసినాడు. వచనం (496), కందము (413), సీసము-ఆటవెలది (62), సీసము-తేటగీతి (40); ఆటవెలది (91), తేటగీతి (109), ఉత్పలమాల (126), చంపకమాల (135), మత్తేభం (69), శార్దూలం (18), మత్తకోకిల (13), తరలము (8), తరువోజ, మహాస్రగ్ధర, స్రగ్ధర, ఉత్సాహము, మధురాక్కర - రెండేసి; మధ్యాక్కర, మాలిని, స్రగ్విణి, వనమయూరము, లయగ్రాహి ఒక్కొక్కటి చొప్పున రచించాడు.

ఆశ్వాస ప్రారంభ పద్యాలు-కందములు.

ఆశ్వాసాంత పద్యములు- 4. మాలిని, 5. స్రగ్విణి, 6. వనమయూరము, 7. తరలము

నన్నయ, ఎఱ్ఱన పద్యాలను పరిశీలిస్తే కొన్ని విశేషాలు కానవస్తాయి. సంస్కృత సమాసాలు, ప్రౌఢ భాష నన్నయ నిధులు; తేట తెలుగు మధురభాష ఎఱ్ఱన సొత్తు. తనకున్న కొద్ది అవకాశంలోనే ఎన్నో వృత్తాలు చొప్పించాడు ఎఱ్ఱన. నన్నయ సీసపద్యాలను, ఆటవెలదులను ఎక్కువ వాడితే, తేటగీతులను విరివిగా వాడినాడు ఎఱ్ఱన.

నన్నయ మూడు పర్వాలలో 19 శార్దూల విక్రీడితాలు వ్రాయగా ఎఱ్ఱన అరణ్యపర్వ శేషంలోనే 20 శార్దూలాలు వ్రాసినాడు.

నన్నయ మధ్యాక్కరలు ప్రసిద్ధికెక్కినవి. 39 మధ్యాక్కరలు, మధురాక్కరలు ఒకటి వ్రాసినాడు నన్నయ. ఎఱ్ఱన రెండు మధురాక్కరలు రచించాడు.

నవీన పరాశరసూనుడు (అభినవ వ్యాసుడు), ఉభయ కవిమిత్రుడు తెలుగు భారతాన్ని మహాకవిత్వ దీక్షావిధిగా స్వీకరించి, ప్రబంధ మండలిగా భావించి, హరిహరనాథ తత్వాన్ని భాసింపజేసి, నాటకీయతను నవరసభరితంగా తీర్చిదిద్ది, అద్భుత శిల్పపు తెనుగుతోటలో శబ్ద సంతానాన్ని చక్కగా నడిపించినవాడు తిక్కన సోమయాజి (క్రీస్తుశకం 1205-1288), నిర్వచనోత్తర రామాయణం, హరిహరాద్వైత దర్శనం, ఆంధ్ర మహాభారత రచనం ఈ మూడు ఘట్టాలు తిక్కన జీవితంలో గొప్ప మైలురాళ్లు.

తెలుగు-సంస్కృతమున చతురుడు, సకలాగమార్థతత్త్వ విచారోదారుడు, అనితర గమ్య వాఙ్మయ మహార్ణవ వర్తన కర్ణధారుడు కవిలోక చాతక వ్రజ నవ జలద స్తనిత భాషణ ప్రకరుడు అయిన తిక్కనామాత్యుడు విరాట పర్వం నుంచి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలను రచించాడు.

తిక్కన వ్రాసిన గద్య పద్యాల సంఖ్య 15911.

శ్రీమదాంధ్ర మహాభారతంలో అతడు వ్రాసిన మొదటి పద్యం- 'శ్రీయన గౌరి నాబరగు చెల్వకు జిత్తము పల్లవింప' (విరాట. 1-1) ఉత్పలమాల.

ఆశ్వాస ప్రారంభ పద్యాలలో పైన పేర్కొన్న పద్యమొక్కటే ఉత్పలమాల; మిగతావన్నీ కందములే.

ఆశ్వాసాంత పద్యాలన్నీ 'మాలిని' ఛందస్సులో వ్రాయబడినాయి.

విరాట పర్వంలో- మాలిని (5), స్రగ్ధర (1); ఉద్యోగపర్వంలో- మాలిని (4), స్రగ్ధర (1); భీష్మ పర్వంలో- మాలిని (3); ద్రోణపర్వంలో- మాలిని (5); కర్ణ పర్వంలో- మాలిని (3); శల్యపర్వంలో- మాలిని (2); సౌప్తికపర్వంలో-

స్రగ్ధర (6), మహాస్రగ్ధర (14), మాలిని (2); స్త్రీ పర్వంలో– అనేక ఛందోరీతులను ప్రదర్శించినాడు (36) – తరలము (5), వసంత తిలకము (1); మత్తకోకిల (7), ఇంద్రవజ్రం (1), తరువోజ (4), తోటకము (2), ఉత్సాహము (8), కవిరాజ విరాజితం (4), దోధకము (2), మంజుభాషిణి (1); ఉపజాతి (1), తోదకము (1), భుజంగ ప్రయాతము (2), మానిని (3), మణిమాల (1), స్వాగతం (1), నర్కుటం (2), బంధురం (1), ద్రుతవిలంబితం (1), శుద్ధవిరాటి (1), లయవిభాతి (2), ఉపేంద్రవజ్రము (1), స్రగ్విణి (1), ప్రణవం (1), జలదం (జలధర) (2), మేదిని (1), క్రౌంచపదం (1), అంబురుహం (1), శిఖరిణి (1), మందాక్రాంతం (1), మణిగణనికరము (1), లయగ్రాహి (4), మంగళ మహాశ్రీ (1), సరసిజం (1), భాస్కర విలసితం (1), మాలిని (2).

శాంతిపర్వంలో– మాలిని (6), మహాస్రగ్ధర (1), స్రగ్ధర (1); అనుశాసనిక పర్వంలో– మాలిని (5), తరువోజ (1); అశ్వమేధ పర్వంలో– మాలిని (4); ఆశ్రమవాస పర్వంలో– మాలిని (2); మౌసల పర్వంలో– మాలిని (1); మహాప్రస్థానిక పర్వంలో– మాలిని (1); స్వర్గారోహణ పర్వంలో– మహాస్రగ్ధర (1), మాలిని (1).

✣✣✣✣✣

## కందం–

కందపద్యంలో నాలుగు మాత్రల గణాలు మాత్రమే ఉంటాయి. **(గగ, భ, జ, స, నల)**

1,3 పాదాలలో గణాల సంఖ్య = 3

2,4 పాదాలలో గణాల సంఖ్య = 5

1,3 పాదాలలో 1,3 గణాలు **జ** గణం కారాదు.

2,4 పాదాలలో 2,4 గణాలు **జ** గణం కారాదు.

2,4 పాదాల్లో మూడో గణం (యతికి ముందు వచ్చేది) **జ** కాని, **నల** కానీ అయి ఉండాలి.

2,4 పాదాలలో చివరి అక్షరం గురువు, అంటే చివరి గణం **గగ** లేదా **స** అయి ఉండాలి.

పద్యం లఘువుతో మొదలైతే అన్ని పాదాలు లఘువుతోనే మొదలవ్వాలి. గురువుతో మొదలైతే అన్నీ గురువుతోనే మొదలుకావాలి.

**యతి:** 2,4 పాదాలలో మొదటి అక్షరానికీ నాలుగవ గణం మొదటి అక్షరానికి యతిమైత్రి కుదరాలి.

**ప్రాస:** ప్రాస పాటించాలి, ప్రాస యతి చెల్లదు.

## తేటగీతి–

**"సూర్యుడొక్కరుండు సురరాజులిద్దరు దినకరద్వయంబు తేటగీతి"** –అప్పకవీయము

- ✣ పాదాలు : 4
- ✣ ప్రతిపాదంలోనూ ఒక **సూర్యగణం** + రెండు **ఇంద్ర గణాలు** + రెండు సూర్యగణాలు ఉంటాయి.

**యతి–** ఒకటో గణం మొదటి అక్షరానికి నాలుగో గణంలో మొదటి అక్షరం **యతి**. **ప్రాసయతి** చెల్లును. ప్రాసయతి చెల్లించిన పద్యాన్ని **అంతరాక్కరగా** పిలుస్తారు. అయితే అన్ని అంతరాక్కరలు తేటగీతులు కావు. ప్రాస నియమం లేదు.

## ఆటవెలది–

ఆ. **ఇనగణ త్రయంబు నింద్ర ద్వయంబును హంస పంచకంబు ఆటవెలది.**

- ✣ ఇందు నాలుగు పాదములుంటాయి. 1,3 పాదాలు మొదట 3 సూర్య గణాలు తరువాత 2 ఇంద్ర గణాలు కలిగి ఉంటాయి. 2,4 పాదాలు 5 సూర్య గణాలు ఉంటాయి.
- ✣ ప్రతి పాదములో నాల్గవ గణం మొదటి అక్షరం **యతి**. **ప్రాసయతి** చెల్లును.
- ✣ **ప్రాస** నియమం లేదు. ప్రాయయతి చెల్లును.

## సీసము-

**నల నగ సల భ ర త ల లో**
**పల నాతిటి మీఁద రెండుఁ బద్మాప్త గణం**
**బులఁ దగి నాలుగు పదములఁ**
**జెలువగు నొక గీతి తోడ సీసము కృష్ణా!**

- ✤ పాదముల సంఖ్య : 4
- ✤ ఈ పద్యంలో, నాలుగు పెద్ద పాదాలు ఉంటాయి. ఆ నాలుగు పెద్ద పాదాలనూ... మళ్ళీ నాలుగు పెద్ద పాదాలుగా, నాలుగు చిన్న పదాలుగా విడగొట్టి రాస్తారు.
- ✤ ప్రతి పాదంలోనూ 6 ఇంద్ర గణాలు + 2 సూర్య గణాలు కలిపి మొత్తం ఎనిమిది గణాలు ఉంటాయి.
- ✤ ఈ పద్యాలు పెద్దవి కావడం చేత ప్రతి పాదాన్నీ రెండు భాగాలుగా చూపుతారు.
- ✤ ఈ నాలుగు పాదాలకూ చివర **ఆటవెలది** కానీ, **తేటగీతి** గానీ ఉండవలెను, ఇది తప్పనిసరి.
- ✤ ఒకటో పాదం.... ఇంద్ర - ఇంద్ర - ఇంద్ర - ఇంద్ర - పెద్ద పాదం
- ✤ రెండో పాదం... ఇంద్ర - ఇంద్ర - సూర్య - సూర్య - చిన్న పాదం.
- ✤ మూడు నాలుగూ... ఐదూ ఆరు... ఏడు ఎనిమిది... పదాలు వరుసగా ఉంటాయి. ఇలాగే...
- ✤ ప్రతి చిన్న పాదంలోని మొదటి గణం మొదటి అక్షరానికీ... మూడవ గణం మొదటి అక్షరానికి యతి చెల్లాలి. ప్రాస యతి కూడా చెల్లుతుంది. ఈ పద్యానికి ప్రాస నియమము లేదు.
  - యతి-1వ గణంలో మొదటి అక్షరానికి 3వ గణంలో మొదటి అక్షరంతోనూ, 5వ గణంలో మొదటి అక్షరానికి 7వ గణంలో మొదటి అక్షరంతోనూ మైత్రి కుదరాలి.
- ✤ ప్రాసయతి ఉండవచ్చు.
  - అంటే పై సూత్రంలో చెప్పిన గణాలలో మొదటి అక్షరాలకు యతి మైత్రి బదులు రెండో అక్షరాలు ప్రాస నియమం పాటిస్తే చాలు - అంటే ఒకే అక్షరం అయి ఉండాలి (ఏ గుణింతమైనా సరే). ప్రాస నియమం లేదు.

## చంపకమాల

- ✤ **పాదాలు:** 4 పాదాలు కలవు- ప్రతి పాదంలోనూ అక్షరముల సంఖ్య = 21
- ✤ ప్రతి పాదంలోని గణాలు: **న, జ, భ, జ, జ, జ, ర**
- ✤ **యతి:** ప్రతిపాదంలోనూ 1వ అక్షరముకు 11వ అక్షరముకు యతిమైత్రి చెందుతుంది.
  **ప్రాస:** పాటించవలెను, ప్రాస యతి చెల్లదు.

## ఉత్పలమాల

- ✤ **పాదాలు:** నాలుగు; ప్రతి పాదంలోనూ అక్షరాల సంఖ్య: 20
- ✤ ప్రతి పాదంలోని గణాలు: **భ, ర, న, భ, భ, ర, వ**
- ✤ **యతి స్థానం :** ప్రతి పాదంలోనూ 10వ అక్షరము; **ప్రాస నియమం:** పాటించవలెను, ప్రాయ యతి చెల్లదు.

## శార్దూలము-

- ✤ **పాదాలు:** నాలుగు; ప్రతి పాదంలోనూ అక్షరముల సంఖ్య = 19
- ✤ ప్రతి పాదంలోని గణాలు: **మ, స, జ, స, త, త, గ**
- ✤ **యతి:** ప్రతి పాదంలోనూ 13వ అక్షరము; **ప్రాస:** పాటించవలెను, ప్రాస యతి చెల్లదు.

## మత్తేభము

- ✤ **పాదాలు:** నాలుగు; ప్రతి పాదంలోనూ అక్షరాల సంఖ్య = 20
- ✤ ప్రతి పాదంలోని గణాలు: **స, భ, ర, న, మ, య, వ**
- ✤ **యతి:** ప్రతి పాదంలోనూ 14వ అక్షరము; **ప్రాస:** పాటించవలెను, ప్రాస యతి చెల్లదు.

## III

శ్రీ ప్రసాద మహాభారతం, కవిత్రయ మహాభారతాన్ని అనుసరించి వచన పద్యాలలో రచింపబడినది. ఒక్కొక్క శీర్షిక కింద నాలుగు పాదాలున్న నాలుగు వచన పద్యాలు, అధోపీఠికలో కవిత్రయ భారతంలోని ప్రఖ్యాత పద్యాలు, సంస్కృత భారత శ్లోకాలు, అవసరమైన చోట శాస్త్రీయ విషయాలు ఉంటాయి.

1200 పేజీలు, 4800 వచన పద్యాలు, 19200 లైన్ల భారత రచన ఇది. 18 పర్వాలు, ఆదిపంచకం, యుద్ధషట్కం, శాంతి సప్తకం, సంస్కృత భారతం, విశేష వ్యాఖ్యానం అనే అయిదు భాగాలుగా, రెండు సంపుటాలలో వెలువడుతున్నది ఈ అయిదవ వేదమనే శ్రీప్రసాద మహాభారతం.

**"నారాయణం నమస్కృత్య, నరం చైవ నరోత్తమమ్**
**దేవీం సరస్వతీ వ్యాసం, తతో జయ ముదీర యేత్"**

# 88. భారత కథ

## I

వాళ్ళు సప్త సింధు మైదానంలో యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. సుదాసుడు, అతడి పురోహితుడు వశిష్ఠుడి అనుచరులు 666 మంది. త్రత్సు–భరత తెగవాళ్లు వీళ్లు. ఇంద్రుడు అధిదేవత. పరుస్ని (రవి) నది రవి కిరణాలలో మెరుస్తున్నది. అటుపక్క పదిమంది రాజుల సంయుక్తసేన. పురు, యదు, మత్స్య, ద్రుహ్య, పంక్తు, భలాన, అలీన, అను, భృగు, పర్ణి తెగలవారు 6666 మంది. ఈ సంయుక్త సేనకు పురోహితుడు విశ్వామిత్రుడు.

గెలుపు ఏకపక్షమే అనుకున్నారు దశరాజులు. దైవం తమవేపు ఉందనుకున్నాడు సుదాసుడు. ఇతడు దివోదాసుడి కుమారుడు. దివోదాసు దశరథుడి భార్య సుమిత్ర సోదరుడు. భీమరథుడనే రాజు కుమారుడు. ధన్వంతరి మనవడు.

ఇరు సైన్యాల మధ్య వెడల్పైన వాగు ఉన్నది. వృత్రాసురుడిని చంపిన ఇంద్రుడు వశిష్ఠుడికి సలహా ఇచ్చాడు– సైనికులు సంఖ్యలో తక్కువ ఉన్నపుడు ఉపాయంతో గెలవాలి. ఎప్పుడైతే శత్రుసైనికులు వాగు మధ్యలోని దీవిలోకి చేరుకుంటారో అప్పుడు పరుస్నీ నదికి వాగుకు మధ్య ఉన్న కట్టను తెగగొట్టాలి. వశిష్ఠుడు మంత్రాలు చదువుతూ దేవతలను ప్రార్థిస్తూ ఉండగా, ఆనకట్ట తెగగొట్టారు, సుదాసుడి అనుచరులు. క్షణాల్లో విజయావకాశాలు తారుమారైనాయి. 6666 మంది శత్రు సైనికులు నీటి పాలైనారు. కొద్ది నష్టంతో భరత తెగదే విజయం. సింధు నది నుంచి యమునా నది వరకు భరత వంశీయుల సుదాసుడి వశమయ్యింది. సరస్వతీ నది చుట్టుపక్కల, కురుక్షేత్ర ప్రాంతం భరతుల ఏలుబడిలోకి వచ్చింది. రెండో యుద్ధం యమునానది ఒడ్డున భిదాముడి అజ, షిగ్రు, యదు (యక్ష) తెగలు ఓడిపోయారు.

సుదాసుడికి తూర్పు, ఉత్తరం, పడమట దిక్కుల రాజ్యాలు వశమైనాయి. దక్షిణాన ఖాండవ వనంలో మయ వంశపు రాక్షసులు, తక్షక వంశపు నాగులు ఉన్నారు. కీకటులున్నారు ఆ చుట్టుపక్కల. సుదాసుడి పుత్రుడు సౌదాసుడికి వశిష్ఠపుత్రుడు శక్తితో గొడవ కాగా అతడిని పదవి నుంచి తొలగించి రాక్షసులలోకి తరిమివేసారు వశిష్ఠుడి పుత్రులు శక్తి మిగతా 99 మంది. దానితో ఆ నూరుగురిని చంపివేసాడు కల్మాషపాదుడనే రాక్షసుడిగా మారిన సౌదాసుడు. వశిష్ఠుడి దుఃఖానికి అంతులేదు. ఎన్నో ఆత్మహత్యా ప్రయత్నాలు చేసినాడు.

వశిష్ఠుడి భార్య అరుంధతి. వీరి కుమారుడు శక్తి. శక్తి కుమారుడు పరాశరుడు.

సౌదాసుడి భార్య పౌష్యమహాదేవి అని పేరుగల మదయంతి. ఆమె వద్ద గొప్ప శక్తి తేజస్సు కలిగిన చెవితమ్మెలు (కుండలాలు) ఉన్నాయి. వాటిని అపహరించాలని నాగులు ప్రయత్నించేవారు. చాలామంది రాజపత్నులు, ముని పత్నులు ఆ కుండలాలు ధరించాలని ముచ్చటపడేవారు.

ఆ మునిపత్నులలో ఒకరు గౌతమ ముని భార్య అహల్య. వీరి శిష్యుడు ఉదంకుడు. గౌతముడి దగ్గర తలవెంద్రుకలు తెల్లబడేంత వరకూ గురు శుశ్రూష చేసి మొత్తుకుంటుంటే, దయతలచి కుమార్తెనిచ్చి వివాహం చేసాడు గౌతముడు. కృతజ్ఞతతో గురుదక్షిణ ఏం కావాలో అడగమని పోరుబెట్టగా విసిగి గురుపత్ని అహల్య– వెళ్లి పౌష్యమహాదేవి కుండలములు తీసుకురమ్మన్నది. నానా కష్టాలు పడి కుండలాలు తెస్తుంటే తక్షకుడెత్తుకుపోయాడు వాటిని. అతడిని తరుముకుంటూ నాగలోకం పోయి ఇంద్రుడు, అగ్ని దేవతల సాయంతో నాగులను భయపెట్టగా తక్షకుడిచ్చిన కుండలాలు తీసుకుని గురుపత్ని కిచ్చాడు. వ్రతం ముగిసింది. పౌష్య మహారాణికి కుండలాలిచ్చాడు. కల్మాషపాదుడి శాపం పోగొట్టినాడు. అయితే రాక్షసుడిగా

ఉన్నపుడు కల్మాషపాదుడు బ్రాహ్మణ జంటను తినేసాడు. చస్తూ వాళ్లిచ్చిన శాపమేమిటంటే– "నీవు నీ భార్యతో కలిస్తే చస్తావు" అని.

దానితో వశిష్ఠుడు మదయంతిని ఆశీర్వదించగా ఆమె గర్భవతి అయ్యింది. పన్నెండేళ్లయినా ప్రసవం కాలేదు. చివరకు వశిష్ఠుని సాయంతో చలువరాయి (అశ్మక కత్తి)తో కడుపు కోసుకుని అశ్మకునికి జన్మనిచ్చింది మదయంతి. అశ్మకుని రాజ్యం ఇప్పటి తెలంగాణా, మహారాష్ట్ర. రాజధాని పౌండన్యపుర– బోధన్.

అశ్మకుని కుమారుడు మూలకుడు. పరశురాముడు క్షత్రియులందరిని చంపినపుడు మూలకుడు రక్షింపబడినాడు. ఇతడు అనేక వంశాలకు మూలపురుషుడై మూలకుడని పిలువబడినాడు. ఇతడి రాజధాని ప్రతిష్ఠానపురం (నేటి పైఠాన్). మనువు కుమార్తె ఇల సుద్యుమ్నుడిగా మారినపుడు సుప్రతిష్ఠానపురం రాజధానిని నిర్మించాడు. తరువాత కాలంలో ఇది శాతవాహనుల రాజధానిగా పేరు తెచ్చుకున్నది. గోదావరి నది ఒడ్డున ఉన్న గొప్ప పట్టణమిది.

మూలకుడి తరువాత పదవ తరంలో దశరథుడు, అతడికి శ్రీరామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు జన్మించారు.

వశిష్ఠుడు పుత్రశోకంతో అనేకసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించి విఫలుడైనాడు. ఇంతలో అతడికి తెలిసింది శక్తి భార్య అదృశ్యంతి గర్భవతి అని. ఆమెకు జన్మించాడు పరాశరుడు. అతడికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ పుత్రశోకాన్ని తగ్గించుకో గలిగినాడు వశిష్ఠుడు.

పరాశరుడికి తెలిసింది తన తండ్రిని, పినతండ్రులను రాక్షసులు తినేసారని. దానితో అతడు రాక్షస మేధం మొదలుబెట్టాడు. రాక్షసలోకం దాదాపు నాశనమవుతున్నపుడు వశిష్ఠుడతడిని శాంతపరచి రాక్షసయాగాన్ని ఆపు జేయించాడు.

తరువాత పరాశరుడు యమునా నదీ ద్వీపంలో మత్స్యగంధితో కాలం గడపగా ఆమెకు వ్యాసుడు జన్మించాడు. కన్యకు పుట్టిన వ్యాసుడు కానీనుడు. నల్లగా ఉన్నాడు, ద్వీపంలో పుట్టినాడు కనుక 'కృష్ణ ద్వైపాయనుడు'గా పిలువబడినాడు. కానీనుడిగా తాను పడిన కష్టాలు కర్ణుడి పాత్రలో వ్యాసమహర్షి నిక్షిప్తం చేసాడనిపిస్తుంది.

తరువాత కాలంలో మత్స్యగంధి సత్యవతిగా శంతనుడిని పెళ్లాడి చిత్రాంగద, విచిత్రవీర్యులకు జన్మనిచ్చింది. శంతనుడికి గంగకు జన్మించిన దేవరాతుడు తన తండ్రికోసం రాజ్యాన్ని, వివాహాన్ని కాదని బ్రహ్మచారిగా మిగిలి భీష్ముడైనాడు. చిత్రాంగదుడి మరణానంతరం, విచిత్రవీర్యుడికి కాశీరాజ కుమార్తెలు అంబిక, అంబాలికలతో వివాహమై, కొన్నాళ్లకు విచిత్రవీర్యుడు చనిపోయినాడు.

నియోగ పద్ధతిలో, సత్యవతి ఆజ్ఞను పాటించి వ్యాసుడు అంబికతో ధృతరాష్ట్రునికి, అంబాలికతో పాండురాజును, అంబిక దాసి పరిశ్రమతో విదురుడికి  జన్మనిచ్చాడు.

ధృతరాష్ట్రుడు పుట్టుగుడ్డివాడు, అతడి భార్య గాంధారి. భర్త చూడని లోకాన్ని తానూ చూడదలుచుకోక కళ్లకు గంతలు కట్టుకున్నది. పాండురాజు మహావీరుడు. అన్నను గౌరవిస్తూ హస్తిన రాజ్యాన్ని ఎంతో గొప్పగా విస్తరింపజేసాడు. వేట అతడికి వ్యసనం. వేటకు వెళ్లి జింకల జంట (కిందమ ముని+అతడి భార్య)ను చంపి శాపం పొందినాడు– "భార్యతో సమాగమిస్తే ప్రాణాలు కోల్పోతావ"ని.

చరిత్ర పునరావృతమయ్యింది.

పాండురాజుకు ఇద్దరు భార్యలు– కుంతి, మాద్రి. కుంతికి కన్యగా ఉన్నపుడు సూర్యుడి వలన కర్ణుడు పుట్టినాడు, కానీనుడిగా. పుట్టిన శిశువును పెట్టెలో పెట్టి నదిలో వదిలేసింది కుంతి. ఆ శిశువు అతిరథుడు–రాధ దంపతులకు దొరకగా వారతడిని వసుసేనుడు, కర్ణుడు అన్న పేర్లతో అల్లారుముద్దుగా పెంచినారు.

పాండురాజు నియోగించగా కుంతి–దుర్వాసుడు ఇచ్చిన మంత్రంతో ధర్ముడి వలన ధర్మరాజుకు జన్మనిచ్చింది. ఆ విషయం తెలిసి అప్పటికె రెండేళ్లుగా గర్భవతి అయినా ప్రసవం కాకపోవడంతో అసూయతో తన పొట్టమీద కొట్టుకునే సరికి రక్తపు, మాంసపు ముద్ద బయటపడింది. దానిని వ్యాసుడు 101 ముక్కలు చేసి నేతికుండలలో భద్రపరచాడు. రెండేళ్లు గడిచాయి.

ఈలోగా వాయుదేవుడిని ఆహ్వానించి భీముడిని కన్నది కుంతీదేవి. కొద్ది గంటల వ్యవధిలో అదేరోజున నేతికుండ నుంచి దుర్యోధనుడు అనేక ఉత్పాతాల మధ్య జన్మించాడు. ఆ తరువాత రోజుకొక్కరు చొప్పున 99 మంది కౌరవులు ఆఖరున కుమార్తె దుశ్శల జన్మించారు.

ఆ తరువాత ఇంద్రుడి వలన కుంతీదేవికి అర్జునుడు జన్మించాడు. అదే మంత్ర ప్రభావంతో మాద్రికి అశ్వనీ దేవతల వరంతో నకుల సహదేవులు జన్మించారు.

అంధుడైన ధృతరాష్ట్రుడికి విదురుడు, సంజయుడు రెండు కళ్లుగా ఉన్నారు.

విరక్తుడైన పాండురాజు శతశృంగంలో ఓ రోజున మునిశాపం మరచిపోయి, కామాతురుడై మాద్రిని బలవంతం చేసి కాలం చేసినాడు. మాద్రి సహగమనం చేసింది.

కుంతీదేవి తన కుమారులు– పాండవులతో హస్తినాపురానికి చేరుకున్నది. వారిని ఎంతో సంతోషంగా ఆహ్వానించారు భీష్ముడు, ధృతరాష్ట్రుడు, గాంధారి, దుర్యోధనాది కౌరవులు, దుశ్శల.

కుంతీదేవి అసలు పేరు పృథ. ఆమె కుంతీభోజుడి వద్ద పెరిగింది. జన్మనిచ్చిన తల్లిదండ్రులు శూరసేనుడు–మారిష నాగకన్య. సోదరుడు వసుదేవుడు.

వసుదేవుడు దేవకీదేవిని స్వయంవరంలో గెలుచుకొని వివాహం చేసుకున్నాడు. వసుదేవుడి భార్యలలో రోహిణి, దేవకి ముఖ్యులు.

దేవకి తండ్రి ఉగ్రసేనుడు. సవతి సోదరుడు కంసుడు. దేవకిదేవి ఏడవ గర్భాన్ని యోగమాయ రోహిణి గర్భంలో ప్రవేశపెట్టగా రోహిణికి సంకర్షణుడిగా బలరాముడు పుట్టినాడు. దేవకీదేవి అష్టమగర్భంలో జన్మించాడు శ్రీకృష్ణుడు.

శంతనుడికి రెల్లువనంలో దొరికారు కవలపిల్లలు వారిని కృపతో దగ్గరకు తీసి పెంచినాడు. వారు కృపుడు, కృపి. కృపి భర్త ద్రోణుడు. వీరి సంతానం అశ్వత్థామ.

పేదరికంతో బాధపడుతూ ద్రోణుడు తన తండ్రి భరద్వాజుడి వద్ద చదువుకున్న సహాధ్యాయి ద్రుపదుడనే పాంచాల రాజును సాయమడిగితే అతడు ద్రోణుడిని అవమానించి వెళ్లగొట్టినాడు. అది ద్రుపద ద్రోణుల వైరంగా మారింది.

బంధుత్వాలు, స్నేహాలతో హాయిగా బ్రతకాల్సిన కౌరవులు, పాండవులు, యాదవులు, పాంచాలురు, భారద్వాజులు అసూయా ద్వేషాలతో యుద్ధానికి దిగడం, అది కురుక్షేత్ర యుద్ధంగా పరిణమించి కోట్లాదిమంది వీరుల మరణానికి దారితీయడం వ్యాస విరచిత మహాభారత సారాంశం.

## II

ఈ కథ వేంగీ దేశాధిపతి రాజరాజనరేంద్రుని మనసుపై చెరగని ముద్ర వేసింది. వ్యాసుడు తన కుటుంబ గాథను విశ్వగాథగా మలచిన తీరు రాజరాజ ప్రభువును ఆకట్టుకున్నది. తన కుటుంబ గాథ అటువంటిదే కదా.

శక్తివర్మ (999–1011 AD) కుమారుడు విమలాదిత్యుడు. అతడికిద్దరు భార్యలు. చోళరాజ పుత్రిక, శివభక్తురాలు 'కుందవ'దేవి కుమారుడు రాజరాజనరేంద్రుడు. విమలాదిత్యుడి రెండవ భార్య తెలుగు చోళ యువరాణి 'మేళవ' కుమారుడు– విజయాదిత్యుడు. రాజరాజనరేంద్రుడు ఆగష్టు 22, 1022 నాడు బెజవాడలో పట్టాభిషిక్తుడైనాడు. 1031లో రాజ్యం విజయాదిత్యుడి పరమైంది. 1035లో రాజరాజు గెలుచుకుని రాజధానిని రాజమండ్రికి మార్చినాడు. 1044లో మరల విజయాదిత్యుడు గెలిచినాడు. 1047లో రాజరాజు తన రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు. 1054–1061 ప్రాంతంలో నన్నయ భట్టారకుడు, ప్రభువు ఆజ్ఞతో సంస్కృత మహాభారతాన్ని ఆంధ్రీకరించినాడు.

వ్యాసుడికి గణేశుడు సాయం చేసినట్లు నన్నయకు నారాయణభట్టు సాయం చేసినాడు. మహాభారతంలో ఆది, సభా పర్వములు, అరణ్య పర్వంలో 141 పద్యములు రచించినాడు నన్నయ భట్టారకుడు.

తిక్కన సోమయాజి (1205–1288) నెల్లూరును పాలించిన తెలుగు చోళుడు రెండవ మనుమసిద్ధి ప్రభువుకు నమ్మకస్తుడైన మంత్రి. రాజ్యాన్ని కోల్పోయిన మనుమసిద్ధికి కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడితో మాట్లాడి తిక్కనామాత్యుడు మనుమసిద్ధికి నెల్లూరు సింహాసనం దక్కేట్లు చేసినాడు (1248). హరిహరనాథుడికి తన రచనను అంకితమిచ్చిన తిక్కన మహాకవి ఉభయ కవిమిత్రుడు. విరాటపర్వం నుంచి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలను అద్భుతంగా తెనిగించాడు తిక్కనార్యుడు. 1260 ప్రాంతంలో మనుమసిద్ధి–కాటమరాజుల మధ్య యుద్ధంలో తిక్కన బంధువు ఖడ్గతిక్కన చనిపోయాడు. 1263లో మనుమసిద్ధి (విజయగండగోపాల) మరణించాడు. (అప్పటికే పాండ్య ప్రభువులు నెల్లూరు వరకు ఆక్రమించారు.)

అరణ్య పర్వ శేషాన్ని పూరించినాడు ఎఱ్ఱాప్రెగ్గడ. ఇతడు ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవి. శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడిగా పేరు పొందిన ఎఱ్ఱాప్రెగ్గడ (128-1364) నృసింహ పురాణ కర్త. కాకతీయ సామ్రాజ్యం 1323లో పతనమయ్యింది. కాకతీయ సేనానులలో ఒకడైన ప్రోలయ వేమారెడ్డి అద్దంకి రాజధానిగా కందుకూరు మొదలు గోదావరి తీరం వరకు పాలించాడు. నన్నయ భట్టారకుని శబ్దరీతికి, తిక్కనామాత్యుని అర్థరీతికి మధ్య వంతెనగా నన్నయ శైలితో మొదలై తిక్కన శైలితో కలిసిపోతుంది ఎర్రన అనువాదం చేసిన అరణ్యపర్వ శేషభాగం.

('భీమన' అను కవి భారతం వ్రాసి నన్నయ భట్టారకునికి చూపించి లోపాలు సరిదిద్ది రాజు ప్రాపకం కలిగించమని అడిగాడని, ఆ గ్రంథం అత్యుత్తమంగా ఉండడంతో నన్నయ అసూయతో దానిని గోదావరిలో పడవేసాడని; భీమన శాపంతో నన్నయ అకాల మరణం పొందాడని ఒక కథనం).

అందుకే ఎవరూ అరణ్య పర్వ శేషాన్ని పూరించలేదని, తిక్కన కూడా ఆ భాగాన్ని అంటుకోలేదని జనశ్రుతి. ఈ కథనాలు నమ్మశక్యంగా లేకున్నా ఆసక్తికరంగా ఉన్నాయి కదా.

## III

అసలు రహస్యమంతా 'భయం'లో ఉన్నది. Fear is the key. తాను సృష్టించిన జీవులు తనను తినడానికి వస్తుంటే సృష్టికర్త బ్రహ్మ కూడా భయపడిపోయాడు. Fight or Flight reaction లో మృత్యువును సృష్టించాడు. మృత్యువు కూడా భయపడింది జీవులను నిర్దాక్షిణ్యంగా చంపాలి అని సృష్టికర్త ఆజ్ఞాపించగా. అందుకే ఆమె కన్నీళ్లను వ్యాధులు, వృద్ధాప్యంగా మార్చినాడు బ్రహ్మ.

తమకంటే బలమైన ప్రతిశక్తి గురించి భయపడి జీవులు వాటి అనుగ్రహం కోసం ఆరాటపడినాయి. జీవులలో ఉన్నతమైన మానవుడు భయానికి కారణాలు వెదికినాడు. తొలినాళ్లలో ప్రతిది చెట్టు పుట్టా రాయి రప్పా పక్షి జంతువు ప్రతి దాంట్లో తనను రక్షించే రక్షకుడిని చూసాడు. రక్షకులు దేవుళ్లు అయినారు. చీకటంటే భయంతో సూర్యుడిని రా, షామాష్, రవి, ఆదిత్యుడు ఇలా అనేక పేర్లతో పూజించసాగినారు. సూర్యుడిని ఆవరించి ఓడించే వర్షమేఘాలు వరుణుడై, మిత్రా-వరుణుల సూర్యుడు-వానదేవుడు ప్రధాన దేవతలైనారు.

ఎండలు దారుణంగా కాల్చే ఎడారి ప్రజలకు రాత్రి దీపం చంద్రికగా, వెన్నెలగా, చంద్రుడిగా సెదదీర్చి దేవత అయ్యింది. వాళ్లకు సూర్యుడంటే భయం. చంద్రుడిని ఇనాన్నా, ఇస్తార్, అస్తార్తె, సెలెనె, ల్యూనా, మూన్ లాంటి పేర్లతో పూజించారు.

మొదట్లో అందరికీ అగ్ని అంటే భయంగా ఉండేది. కార్చిచ్చును చూసి కళవళ పడినవారు అగ్నివలన ఉపయోగాలు తెలిసాక హోమాగ్నిగా రక్షించుకున్నారు. అరణిగా దాచుకున్నారు. అగ్నిని తమకు దేవతలకు మధ్య సంధానకర్తగా పూజించారు. అగ్నితో సాన్నిహిత్యం పెరిగాక స్థిర నివాసాలు ఏర్పడినాక అగ్ని పురోహితుడైనాడు, ప్రధాన దేవతగా మారినాడు. 'అగ్నిమీళే పురోహితం' అంటూ శ్లోకాలు, వేదాలు వ్రాసుకున్నారు; అగ్ని ఆరాధకులు తొలి మతమైనారు.

గణనాయకులకు, వారి అనుయాయులకు అగ్ని ప్రాభవం నచ్చలేదు. 'ఇందు' ప్రాణాధారమైన నీటిని సంరక్షించే ఇంద్రుడంటే గౌరవమున్న వాళ్లు, అగ్నిని చల్లార్చగలిగిన ఇంద్రుడిని ప్రధాన దేవతగా చేసారు. యజ్ఞాలు చేసారు. నూరు యాగాలు చేసినవాడు ఇంద్రుడయ్యాడు.

ఇంద్రుడిని, అతడిని సమర్థించేవాళ్ళు దేవతలయ్యారు. సభలు, భవనాలు, లోకాలు ఏర్పడినాయి. అమృతాన్ని సంపాదించి అమరులు, సురలు అయ్యారు దేవతలు. వారికి వ్యతిరేక వర్గం అసురులు, రాక్షసులు, దైత్యులు, దానవులు.

ఇంద్రుడిని వ్యతిరేకించి అతడి సోదరుడు ఉపేంద్రుడు తన అనుయాయులను ఎక్కువ చేసుకున్నాడు. ఒక్క దేవుడు త్రిమూర్తులుగా, 33 దేవతలుగా, 33 కోట్ల దేవతలుగా విస్తరించాడు.

కాలరేఖలో మానవుని నడక వేదజ్ఞానమయ్యింది. మానవుల విభజన దేవతలు, మునులు, రాక్షస, యక్ష, గంధర్వ, అప్సరస, సిద్ధ, సాధ్య, చారణ, విద్యాధర, భూత, ప్రేత పిశాచ గణాలను సృష్టించింది.

మంచి-చెడుల మధ్య ఘర్షణ ప్రాక్కథలు, ఇతిహాసాలు, పురాణ గాథలై శ్రుతులు, స్మృతులు ఏర్పడినాయి. నిప్పు, చక్రం, లోహం, అక్షరం, మానవజాతి పురోగమనానికి నిచ్చెన మెట్లయినాయి- నేనెవరిని? ఎక్కడ నుంచి వచ్చాను? ఇక్కడెందుకు ఉన్నాను? ఎక్కడికి పోతాను? మృత్యువంటే ఏమిటి? - ఈ ప్రశ్నలతో వేదాంత భావనలు మొదలయ్యాయి.

సంపదలు, స్థిరనివాసం, వ్యవసాయం బానిసల అవసరాన్ని తెచ్చింది. యుద్ధాలు మొదలై విజేత రాజైనాడు. ఓడినవారు దాసులు, దస్యులైనారు. తొలినాళ్లలో మానవులంతా ఒకటే అయినా కాలం గడిచినకొద్దీ విభజన మొదలయ్యింది. మొదటి తరం అందరు మనుషులూ బ్రాహ్మణులే. భూమి వారిది. వారు నాయకుడిని ఎన్నుకుని సమాజరక్షణకు నియమించి కొన్ని ప్రత్యేకమైన శక్తులను, అధికారులను ఇచ్చారు. యజ్ఞాలు చేయించి రాజు దగ్గర పోగుపడిన సంపదలను, భూమిని జనులకు (బ్రాహ్మణులకు) పంపకాలు చేసేవాడు.

ఆ విధంగా బ్రాహ్మణులకు-క్షత్రియులకు మధ్య విడదీయరాని, విడదీయలేని బంధం ఏర్పడింది. బ్రాహ్మణులు హోమాగ్నులను రక్షిస్తూ, పోగుబడిన వేద, వేదాంగ, విద్యలను అభ్యసిస్తుంటే, క్షత్రియులు వారికి రక్షణ కల్పిస్తుంటే వారికి కావాల్సిన ధనాన్ని, గోవులను పెంపొందించే బాధ్యతను చూసేందుకు వారిలో కొందరిని వైశ్యులుగా ఎన్నిక చేసారు. ఈ ముగ్గురూ ద్విజులైనారు.

ఈ మూడు వర్ణాలకు సేవ చేసేందుకు యుద్ధాలలో ఓడిన ప్రజలు దాసులైనారు. శూద్రులైనారు. వృత్తిపనులలో నేర్పరులైన వీళ్లకు విద్యార్హత లేకుండాపోయింది. సేవాభావమొక్కటే వీరి ధర్మమయ్యింది. విద్య లేదు, హక్కులు లేవు. వంశ పారంపర్య వృత్తులు నిర్వహిస్తూ శిల్పులుగా నేర్పున్నా నిర్లక్ష్యం చేయబడినారు శూద్రులు.

ఈ చాతుర్వర్ణ వ్యవస్థను కాపాడడం క్షత్రియ ధర్మమైంది. వర్ణవ్యవస్థ సంకరం కాకుండా తీవ్ర చర్యలు, నిబంధనలు ఏర్పరచారు. వర్ణ సంకరానికి పాల్పడ్డవారిని వివిధ పేర్లతో సమాజ బహిష్కరణ చేసి అయిదవ కులాల్ని, అంటరాని వారిని తయారు చేసారు.

అప్సరసలుగా, బ్రహ్మవాదినులుగా పూర్తి స్వతంత్రత ఉన్న స్త్రీలు, పితృస్వామ్య వ్యవస్థలో మగవాడి సంపదగా మారినారు. వివాహ వ్యవస్థ బలమైనాక పెండ్లి కాకుండా పిల్లల్ని కనడం నిందార్హమైంది. స్త్రీల స్వేచ్ఛకు పరిమితులు వచ్చాయి. మనుస్మృతి, శ్వేతకేతు నియమం, దీర్ఘతముడి అంక్ష, ధర్మరాజు శాపం స్త్రీల కట్టుబాట్లలోకి వచ్చాయి. స్త్రీకి నలుగురు భర్తలు ఉండవచ్చునన్నారు- చంద్రుడు, గంధర్వుడు, అగ్ని ఆమె మనసును ఎప్పుడో దోచుకున్నారు. ఆమె దేహానికి భర్త మానవుడు. అయిదవ భర్త ఉంటే ఆమె బంధకి అవుతుంది. అందుకే కుంతీదేవి సూర్యుడితో కర్ణుడికి జన్మనిచ్చిన విషయం గోప్యంగా ఉంచింది. (పాండురాజు, ధర్ముడు, వాయువు, ఇంద్రుడు నలుగురు భర్తలు. మొదటి భర్త సూర్యుడి గురించి దాచి ఉంచాల్సి వచ్చింది). ద్రౌపది కొందరి దృష్టిలో బంధకిగా మారింది అయిదుగురు భర్తల వలన.

తొలిజాతుల కలహాలు దేవాసుర యుద్ధాలుగా, మానవులు-రాక్షసుల మధ్య యుద్ధం రామరావణ యుద్ధంగా, మానవ తెగల మధ్య యుద్ధం దశరాజ యుద్ధంగా ప్రసిద్ధికెక్కినాయి. రాక్షసులు, నాగులను యాగాల పేరుతో దాదాపుగా నిర్మూలనం చేసాక హస్తినాపురమనే భూమికోసం అన్నదమ్ములైన కౌరవ పాండవులు కొట్లాడుకోవడం జయమై, భారతమై మహాభారత కావ్యమైనది.

కృష్ణ ద్వైపాయన ముని వృషభాభిహిత మహాభారత బద్ధ నిరూపితంబైన కావ్యాన్ని, కవిత్రయం 21,507 గద్య పద్యాలతో తెలుగు భాషలోకి 63 అశ్వాసాలు, 18 పర్వాలుగా అనువదించినారు. ఆ మహాకావ్యాన్ని అనుసరిస్తూ 1200 పేజీల గ్రంథంగా ఒక్కొక్క పేజీలో నాలుగు, నాలుగు పాదాల వచన పద్యాలతో, సాఫీగా, సరళంగా వ్రాయబడిందీ శ్రీ ప్రసాద మహాభారతం.



# 89. హిందూ - గ్రీకు - రోమన్ దేవతలు

| హిందూ దేవతలు | గ్రీకు దేవతలు | రోమన్ దేవతలు |
|---|---|---|
| ద్యుపితరుడు / ఇంద్రుడు | జ్యూస్ (Zeus) | జూపిటర్ (Jupiter) |
| శచీదేవి | హెరా (Hera) | జునో (Juno) |
| సూర్యుడు (రవి) | అపోలో (Apollo) | అపోలో (Apollo) |
| కార్తికేయుడు | ఏరిస్ (Ares) | మార్స్ (Mars) |
| బ్రహ్మ | యురేనస్ (Uranus) | యురేనస్ (Uranus) |
| యమధర్మరాజు | హేడ్స్ (Hades) | ప్లూటో (Pluto) |
| విశ్వకర్మ / త్వష్ట | హెఫాస్టిస్ (Hephaestus) | వల్కన్ (Vulcan) |
| బుధుడు | హెర్మేస్ (Hermes) | మెర్క్యురి (Mercury) |
| అశ్వనీ దేవతలు | కాస్టర్–పొల్లక్స్ (Castor-Pollux) | కాస్టర్–పాలిడ్యూసెస్ |
| అరుణ (ఉష) | ఇవస్ (Eos) | అరొరా (Aurora) |
| కామ / మన్మధుడు | ఎరాస్ (Eros) | క్యుపిడ్ (Cupid) |
| రతీదేవి | అఫ్రొదితి (Aphrodite) | వీనస్ (Venus) |
| దుర్గ / రేవంత | ఆర్టెమిస్ (Artemis) | డయానా (Diana) |
| సరస్వతి / వాణి | ఎథెనా (Athena) | మినర్వా (Minerva) |
| కాలుడు / శని | క్రొనస్ (Cronus) | శాటరన్ (Saturn) |
| ధాన్యలక్ష్మి / నేలతల్లి | డిమితర్ (Demeter) | సిరెస్ (Ceres) |
| బలదేవుడు | డయొనైసస్ (Dionysus) | బాకస్ (Bacchus) |
| పెద్దమ్మ / కలహమాత | ఎరిస్ (Eris) | డిస్కార్డియా (Discordia) |
| భూమాత | గెయియా (Gaia) | టెర్రా (Terra) |
| హరి–కృష్ణుడు | హెరాక్లిస్ (Heracles) | హెర్క్యులస్ (Hercules) |
| పాతాళదేవత | పెర్సిఫొని (Persiphone) | ప్రొసర్పిని (Proserpini) |
| వరుణుడు | పొజిడాన్ (Poseidon) | నెప్ట్యూన్ (Neptune) |
| అదితి | రియా (Rhea) | ఓప్స్ (Ops) |
| యోగిని | హెస్టియా (Hestia) | వెస్టా (Vesta) |

# 90. భారతం - మరో దృక్కోణం

ఏడు పొరలు (భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, అహంకారం, మహత్తు) ఉన్న బ్రహ్మాండంలో వసించువాడు విరాట్పురుషుడు (విశ్వరూపుడు, మహాపురుషుడు).

1) పాదాలు – పాతాళం
2) కాలి మడమ – రసాతలం (పృష్ణి, పాదుకామూలం, ఉపష్ణి)
3) చీలమండలు – మహాతలం (గుల్ఫము, ఘుటిక, చరణగ్రంధి)
4) కాళ్లు – తలాతలం
5) మోకాళ్లు – సుతల (జాను, కూర్పర)
6) క్రింది తొడ – వితల (జంఘ)
7) పై తొడ – అతల (ఊరువు, స్తుక)
8) ఒడి – భూలోక
9) నాభి – భువర్లోక
10) రొమ్ము – స్వర్గలోక
11) గొంతు – మహర్లోక
12) నోరు – జనలోక
13) నుదురు – తపోలోక
14) శిరస్సు – సత్యలోక

ఇంద్రుడు ఇతర కిరణ దేవతలు – చేతులు; దిక్కులు–చెవులు; అశ్వని కుమారులు–ముక్కు; అగ్ని–నోరు; అంతరిక్షం–సూర్యచంద్రులు– కళ్లు, దృష్టి, పగలు–రాత్రి – కనురెప్పలు వెంద్రుకలు; వేదాలు–బ్రహ్మరంధ్రములు; విరాట్పురుషుడి చిరునవ్వు–మాయ; క్రీగంటి చూపు–సృష్టి; క్రింది పెదవి–లజ్జ; పై పెదవి–లోభం; ప్రజాపతి–జననాంగం; సముద్రాలు–పొట్ట; పర్వతాలు–ఎముకలు; నదులు–రక్తనాళాలు; చెట్లు–శిరోజాలు, వెంద్రుకలు; వాయువు–ఊపిరి.

విరాట్పురుషుడి కదలిక – కాలం; ప్రకృతి అతడి హృదయం; చంద్రుడు–మనసు; మహత్తు అతడి చిత్తం; రుద్రుడతడి అహంకారము; అసురులతడి బలం. గంధర్వ, విద్యాధర, చారణ, అప్సరసలతడి సంగీతపు శృతిలయలు; పక్షులతడి చిత్రకళ; జంతువులతడి గోళ్లు; బ్రాహ్మణులతడి నోరు; క్షత్రియులతడి చేతులు; వైశ్యులతడి తొడలు; శూద్రులతడి పాదాలు; దేవతలతడి హవిర్భాగాలు; యజ్ఞమతడి కర్మ.

ఇది స్థూల శరీరం (Macro Cosm).

**ఊహాలోకం :** (యోజనము = ఎనిమిది మైళ్లు) (క్రోసు– రెండు మైళ్లు)

– పాతాళ లోకాలు–7 (భూమి లోపల పొరలు)– అథోలోకాలు

– భూమి, భువర్, స్వర్గ, మహర్, జన, తపో, సత్యలోకములు – ఇవి ఏడు పొరలు – ఊర్ధ్వ లోకాలు

– భూమి పైన పొరలు : భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, అహంకారం, మహత్తు.

వీటినన్నిటిని కప్పినది ప్రకృతి. ప్రకృతిలో చరించేది విరాట్పురుషుడు. సూక్ష్మ శరీరుడై జీవాత్మగా జీవియందు చేరినపుడు–

కాల (Time flow) – త్రిగుణాలు (సత్త్వ, రజో, తమో)
కర్మ – పూర్వకర్మ ఫలితం – అదృష్టం
స్వభావం – ప్రకృతి ఉద్భవం

మహత్తు అనే తత్త్వం నుంచి అహంకారము (నేను అనే తత్త్వం) ఏర్పడి సాత్త్విక (వైకారిక) గుణం జ్ఞానశక్తిగా; రాజస గుణం నుంచి – పది ఇంద్రియాలు (క్రియాశక్తి); తమోగుణం–ద్రవ్యశక్తి నుంచి పంచభూతాలు ఏర్పడతాయి.

మహత్తు
↓
అహంకారం

- సత్త్వ
  - మనసు
  - ఇంద్రియ జ్ఞానం
- రజో (క్రియా)
  ↓
  దశ ఇంద్రియాలు
- తామస (ద్రవ్య)
  ↓
  ఆకాశ, వాయు, అగ్ని, నీరు, నేల

## భగవానుని లీలావతారములు

**1) వరాహ :** భూమిని సముద్రం నుంచి పైకి లేపుట – హిరణ్యాక్ష వధ

**2) యజ్ఞ :** రుచి–ఆకుతిల కుమారుడు – త్రిలోక భయ నివారణుడు

**3) కపిల :** కర్దమ–దేవహూతిల కుమారుడు – సాంఖ్యయోగ ప్రవక్త

**4) దత్తాత్రేయ :** అత్రి–అనసూయల కుమారుడు – యోగ సిద్ధాంత ప్రవక్త

**5) కుమారులు :** సనత్, సనకస, సనంద, సనాతనులు – ఆత్మవిద్య

**6) నర–నారాయణులు :** ధర్మ–మూర్తిల పుత్రులు – మహాయోగులు

**7) ధ్రువుడు :** ధ్రువలోకం, నక్షత్రం

**8) పృధువు :** భూమి నుంచి ఓషధులను పిండినాడు (పృధ్వి)

**9) ఋషభుడు :** నాభి–సుదేవిల పుత్రుడు– పరమహంస

**10) హయగ్రీవ :** వేద రక్షకుడు

**11) మత్స్య :** జలప్రళయంలో మీనావతారం (వైవస్వత మన్వంతరం) – హిరణ్యాక్షుని సంహారం

**12) కూర్మ :** పాలసముద్ర మధనం

**13) నృసింహ :** నరసింహావతారం–హిరణ్యకశిపు సంహారం

**14) హరి :** గజేంద్ర మోక్షం

**15) వామన :** త్రివిక్రమావతారం

**16) హంస :** భక్తియోగం

**17) ధన్వంతరి :** వైద్య నారాయణుడు

**18) పరశురామ :** క్షత్రియ సంహారం

**19) శ్రీరాముడు :** రావణ సంహారం (రావణ, కుంభకర్ణ సంహారం)

**20) బలరామ–కృష్ణులు :** కురుక్షేత్ర యుద్ధం (శిశుపాల, దంతవక్త్ర సంహారం)

**21) వ్యాస :** వేద విభజనం

**ప్రళయములు :**

**1) నిత్య (కాల)** – దైనందిన కష్టనష్టములు

**2) ద్రవ్య (నైమిత్తిక)** – కల్పాంతపు సంకర్షణాగ్ని

**3) గుణ (ప్రాకృత)** – త్రిగుణ నాశనం

**నాలుగవది** – ఆత్యంతిక ప్రళయం

**విరాట్పురుష రూపాలు :**

1) మహత్తు, తత్త్వముల మూలకర్త – ప్రథమ రూపం–మూలపురుషుడు

2) బ్రహ్మాండ వాసి – ద్వితీయ–విరాట్పురుషుడు–అవతారం

3) సమస్త జీవులందుండేవాడు – తృతీయ–బ్రహ్మ, విష్ణు, మహేశ్వర

**సృష్టి**
- కారణ– మూలకాల కలయిక – చరాచర జీవనోత్పత్తి
- కార్య – జీవుల ఉత్పత్తి – విడివిడిగా

**పురాణం :** గుహాహితమ్ గహ్వరేష్ఠమ్ పురాణమ్

**1) సర్గము :** మూలక, భూత, విరాట పురుషోత్పత్తి
**2) విసర్గము :** బ్రహ్మ సృష్టి – జీవుల జననం
**3) స్థాన :** జీవుల స్థాన నిర్ణయం
**4) పోషణ :** జీవుల పోషణం
**5) మన్వంతరం :** మనువుల నియామకం
**6) ఉతి :** జీవుల కోరికలు
**7) ఈశానుక్తం :** అవతార గాథలు
**8) నిరోధ :** హరి నిద్ర, ప్రళయం
**9) ముక్తి :** బ్రహ్మైక్యం (వ్యక్తిగత)
**10) ఆశ్రయం :** పరబ్రహ్మ విలీనం

**ప్రాణాలు :**
పంచ ప్రాణములు (ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన)
6) నాగ, 7) కూర్మ, 8) కృకర, 9) దేవదత్త, 10) ధనంజయ

**ఆత్మ విభాగములు:** 1) ఆధ్యాత్మ, 2) అధిభూత, 3) అధిదైవ

| ఆధ్యాత్మ | అధిభూత | అధిదైవ |
|---|---|---|
| నాలుక | రస | వరుణ |
| నాసిక | గంధ | అశ్విని కుమారులు |
| కన్నులు | రూప | ఆదిత్య |
| చర్మ | స్పర్శ | వాయు |
| చెవి | శబ్ద | దిక్కులు (దిక్పాలకులు) |
| త్వక్కు పైపొర | మంట | ఓషధులు (వనదేవతలు) |
| ఉపస్థ | ప్రత్యుత్పత్తి | ప్రజాపతి |
| పాయు | విసర్జనం | మిత్ర |
| చేతులు | పనులు | ఇంద్రుడు |
| పాదాలు | నడక | విష్ణు |
| బుద్ధి | బోధన | బ్రహ్మ |
| మనసు | సంకల్ప, వికల్పములు | చంద్రుడు |
| అహంకారము | 'నేను' అనే ఆలోచన | రుద్రుడు |
| చిత్తము | ఆలోచన | బ్రహ్మ |

**బ్రహ్మ సృష్టి:**

**I. ప్రాకృత – తత్త్వ సృష్టి**

**1) మహత్ =** త్రిగుణాల ప్రభావం – సత్త్వ, రజో, తమో గుణాలు
**2) అహంకారం =** ద్రవ్య + జ్ఞాన + క్రియా శక్తులు
**3) తన్మాత్రలు =** ద్రవ్యశక్తి ఫలితాలు
**4) ఇంద్రియాలు =** జ్ఞాన, క్రియాశక్తుల ఫలితాలు
**5) వైకారిక =** దైవశక్తులు, మనస్సు సృష్టి
**6) తమస్సు సృష్టి –** అయిదు రెట్ల సృష్టి

**II. వైకృత - సృష్టి**

**7) ఊర్ధ్వ స్రోత (స్థావరాలు) –** ఆహారాన్ని పైకి పీల్చుకునేవి
- వనస్పతి – పూలు లేనివి
- ఔషధి – ఫలాలు రాగానే నశించేవి
- లతలు – పైకి ప్రాకేవి
- త్వక్షర – త్వక్కు నుంచి పెరిగేవి – వెదురు లాంటివి
- విరుద్ధ – నేలమీద ప్రాకేవి
- ద్రుమ – పూలు పూసే మొక్కలు

**8) తిర్యక్ స్రోత –** ఆహారాన్ని నేలకు సమాంతరంగా, ఏటవాలుగా తీసుకునేవి.

**1. నేలపై నివసించేవి (27)**
- **గిట్టలు చీలినవి–** ఆవు, మేక, బర్రె, కృష్ణజింక, ఒంటె, అడవిపంది, రురుజింక, గవయ అనే ఎద్దు
- **గిట్టలు చీలనివి–** గాడిద, గుర్రం, కంచరగాడిద, గౌరజింక, శరభ, చామరం
- **అయిదుగోళ్ల జంతువులు–** కుక్క, నక్క, తోడేలు, పులి, పిల్లి, కుందేలు, ముళ్లపంది, సింహం, కోతి, ఏనుగు, తాబేలు, మకరం

**2. నీటి జంతువులు, పక్షులు (1)**

**9) అర్వాక్ స్రోత –** ఆహారాన్ని దిగువకు పంపేవి – మానవులు.

**III. ప్రాకృత - వైకృత**

**10) కుమారులు –** సనక సనంద సనత్కుమార సనాతనులు

**IV. వైకృత (9)**
- విబుధ
- పిత్ర
- అసుర
- గంధర్వ, అప్సర
- సిద్ధ, చారణ, విద్యాధరులు
- యక్ష, రాక్షసులు
- భూత, ప్రేత, పిశాచాలు
- కిన్నర, కింపురుష, అశ్వముఖాదులు

**సృష్టి = ప్రకృతి + పురుషుడు**

**ప్రకృతి - 24 తత్త్వాలు**

5 మహాభూతాలు – నేల, నీరు, నిప్పు, గాలి, నింగి

5 తన్మాత్రలు – వాసన, రుచి, రూపం, స్పర్శ, శబ్దం

5 జ్ఞానేంద్రియాలు – చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు

5 కర్మేంద్రియాలు– కాళ్లు, చేతులు, వాక్కు, ఉపస్థ, పాయువు

4 అంతఃకరణాలు– మనసు, బుద్ధి, చిత్త, అహంకారం

**కాలం - 25వది** (పురుష శక్తి)

(మనసు–అనిరుద్ధ; బుద్ధి–ప్రద్యుమ్న; అహంకార–సంకర్షణ; చిత్త–వాసుదేవ)

# 91. మన్వంతరాలు - మనువులు

**1. స్వయంభువుడు :** మొదటి మనువు. బ్రహ్మమానసపుత్రుడు. ఇతడికి ముగ్గురు కుమార్తెలు– దేహహూతి, ఆకుతి, ప్రసూతి. స్వయంభువ మనువు భార్య శతరూప.

దేవహూతి + కర్దమ → తొమ్మిదిమంది కుమార్తెలు, కపిలుడు

ప్రసూతి + దక్ష → ఖ్యాతి, అనసూయ, మరెందరో కుమార్తెలు

ఆకూతి + రుచి → దక్షిణ కుమార్తె, యజ్ఞుడు కుమారుడు

స్వయంభువుడి దేశం బ్రహ్మావర్తం (సరస్వతి, దృశద్వతి నదుల మధ్య ప్రాంతం). విష్ణువు వరాహరూపంలో ఒడలు విదిలించుకున్నపుడు పెద్ద వెంట్రుకలు రాలి బర్హిష్మతి నగరం, చిన్ని వెంట్రుకలతో కుశ, కశ గరిక (గడ్డి) ఏర్పడినాయి. బర్హిష్మతి నగరం స్వయంభువుడి రాజధాని. ఇతడి కుమారులు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు.

సునంద నది వద్ద రాక్షసులు స్వయంభువ, శతరూపలపై దాడి చేయగా యజ్ఞుడు, ఇతర దేవతలు వారిని పారద్రోలినారు.

యజ్ఞుడు + దక్షిణ → 12 దేవుళ్ళు (యమ)– తోష, ప్రతోష, సంతోష, భద్ర, శాంతి, ఇదస్పతి, ఇధ్మ, కవి, విభు, స్వహ్న, సుదేవ, రోచన. వీరిని తుషితులని పిలుస్తారు. తరువాత యజ్ఞుడు ఇంద్రుడైనాడు. యజ్ఞుడు విష్ణువు అవతారం. వీరభద్రుడు యజ్ఞుడి శిరస్సు నరికాడు దక్షుడి హోమవాటికలో. ఆ తల మృగశిరా నక్షత్రమైనదని లింగపురాణంలో చెప్పబడింది.

స్వయంభువ మన్వంతరంలో విష్ణుస్వరూపం– యజ్ఞుడు.

**సప్తర్షులు–** మరీచి, అత్రి, అంగిరసుడు, పులహ, క్రతు, పులస్త్య, వశిష్ఠుడు.

**2. స్వారోచిష మనువు :** ఇతడు అగ్ని పుత్రుడు. ఇతడి పుత్రులు ద్యుమత, సుషేణ, రోచిస్మతులు. వస్త్రాలను కనుగొన్నవాడు స్వారోచిషుడు. శివుడి మూడవ కంటినుంచి పుట్టిన దేవలుడు వస్త్రాలను మానవజాతి కోసం తయారు చేసినాడు. తుషితులకు, గ్రహాలకు ఇంద్రుడైనాడు రోచనుడు.

వేదశిరుడి భార్య తుషిత. వీరి కుమారుడు విభుడు. విష్ణువు స్వారోచిష మన్వంతరంలో విభుడిగా జన్మించి బ్రహ్మచారిగా ఉండి 88,000 దృఢవతులకు ఇంద్రియ నిగ్రహాన్ని బోధించాడు.

**సప్తర్షులు:** ఊర్జస్తంభ, అగ్ని, ప్రాణ, దంతి, ఋషభ, నిశ్చర, చర్వరివణుడు.

**3. ఉత్తమ మనువు :** ఇతడు ప్రియవతుని కుమారుడు. ఉత్తముడి కుమారులు పావన, సృంజయ, యజ్ఞహోత్రులు. ఈ మన్వంతరంలో వశిష్ఠుని కుమారులు ఏడుగురు. ప్రమదుడితో పాటు మహర్షులైనారు. సత్య, దేవశ్రుత, భద్రులు దేవతలు. సత్యజిత్తు ఇంద్రుడు.

ధర్ముడు–సునృతిల కుమారుడు సత్యసేనుడు విష్ణువు అవతారం. సత్యసేనుడు, ఇంద్రుడు సత్యజిత్తుతో కలిసి రాక్షస సంహారం చేసాడు.

**సప్తర్షులు:** కౌకుంది, కురుంది, దళయ, శంఖ, ప్రవహిత, మిత, సమ్మిత.

**4. తామ (తాపస) మనువు :** ఉత్తముడి సోదరుడు తామసుడు. ఇతడికి పదిమంది కుమారులు– వీరిలో పృధు, ఖ్యాతి, నర, కేతులు ముఖ్యులు. సత్యకులు, హరి, విరజులు దేవతలు. జ్యోతిర్ధాముడు వంటివారు ఏడుగురు మహాఋషులు. త్రిశిఖుడు ఇంద్రుడు.

హరిమేధుడు–హరిణిల కుమారుడు 'హరి' విష్ణువు అవతారం.

**సప్తర్షులు:** జ్యోతిర్ధామ, పృధు, కావ్య, చైత్ర, అగ్ని, వనక, పీవరులు

**5. రైవత మనువు :** తామసుడి కవల సోదరుడు రైవతుడు. రైవతుడి కుమారులు అర్జున, బలి, వింధ్యుడు మొదలైనవారు. భూతరాయలు దేవతలు.

విష్ణువు అవతారం– వైకుంఠుడు (ఇతడే రైవతుడు).

**సప్తర్షులు:** హిరణ్యయ రోమ, వేదశ్రీ, ఊర్ధబాహు, వేదబాహు, సుధామ, పర్జన్య, మహాముని.

**6. చాక్షుష మనువు :** చక్షువు కుమారుడు చాక్షుషుడు. చాక్షుషుడి కుమారులు పురు, పురుష, సుద్యుమ్నులు. ఇంద్రుడు– మంత్రద్రుముడు; దేవతలు– అప్యశులు.

చాక్షుషుడి కుమార్తె జ్యోతిష్మతి తరువాత జన్మలో రేవతిగా జన్మించి బలరాముడిని వివాహం చేసుకున్నది.

విష్ణువు అవతారం అజితుడు (అజితుడే చాక్షుషుడు).

**సప్తర్షులు:** సుమేధ, విరజ, హవిష్మత్, ఉత్తమ, మధు, అభినామ, సహిష్ణు.

**7. వైవస్వత మనువు :** ప్రస్తుత మన్వంతరాధిపతి. ఇతడు వివస్వంతుని (సూర్యుని) కుమారుడు. వైవస్వతుడు, శ్రాద్ధదేవుడు, సత్యవ్రతుడు ఇతడి పేర్లు. ఇతడికి 'శ్రాద్ధ' వలన పదిమంది కుమారులు కలిగారు. ఇక్ష్వాక, నాభాగ, దృష్ట, శర్యాతి, నరిష్యంత, దిష్ట, కరూశ, ప్రశధ్ర, వసుమాన్ (ప్రాంశు). ఇల ఇతడి కుమార్తె. ఇల ఒకనెల స్త్రీగా, ఒకనెల పురుషుడిగా (సుద్యుమ్నుడు) ఉంటుంది.

ఆదిత్య, వసు, రుద్ర, విశ్వదేవ, మారుత, అశ్విని కుమార, రిభులు ఈ మన్వంతరంలో దేవగణాలు.

పురందరుడు– ఇంద్రుడు. విష్ణుమూర్తి– మత్స్యావతారం.

**సప్తర్షులు:** జమదగ్ని, కశ్యపుడు, అత్రి, వశిష్ఠుడు, గౌతముడు, అగస్త్యుడు, భరద్వాజుడు.

**8. సూర్యసావర్ణి మనువు :** సూర్యుడు–ఛాయల కుమారుడు. శ్రాద్ధదేవుని సవతి సోదరుడు. సూర్యసావర్ణి కుమారులు నిర్మోకుడు మొదలైనవారు. దేవతలు–సుతపులు; ఇంద్రుడు– విరోచనుడు.

దేవగుహ్యుని కుమారుడైన సార్వభౌముడు విష్ణుమూర్తి అవతారం.

**సప్తర్షులు:** దీప్తిమంతుడు, గాలవుడు, పరశురాముడు, కృపుడు, అశ్వత్థామ, వ్యాసుడు, ఋష్యశృంగుడు

**9. దక్షసావర్ణి :** (రైభ్యుడు, ధర్మ, భౌత్య ఇతడి పేర్లు) వరుణుడి కుమారుడు దక్షసావర్ణి. ఇతడి కుమారులలో భూతకేతు ముఖ్యుడు. మరీచి గర్భులు దేవతలు. అద్భుతుడు ఇంద్రుడు.

ఆయుష్మాన్–అంబుధరల పుత్రుడు 'వృషభుడు' (ఋషభుడు) విష్ణుమూర్తి అవతారం.

**సప్తర్షులు:** సావన, ద్యుతిమంత, భవ్య, వసు, మేధాతిది, జ్యోతిష్మంత, సత్య.

**10. బ్రహ్మసావర్ణి మనువు :** ఇతడు కార్తికేయుని కుమారుడు ఉపశ్లోకుని కుమారుడు. బ్రహ్మసావర్ణి కుమారులలో భూరిసేనుడు ప్రసిద్ధుడు. దేవతలు– సువాసనులు. ఇంద్రుడు– శంభుడు.

విశ్వరాస్తుడు–విశుచిల కుమారుడు 'విష్వక్సేనుడు' విష్ణు అవతారం.

**సప్తర్షులు:** హవిష్మాన్, సుకృతి, సత్య, అరుమ్మూర్తి, నాభాగ, అప్రతిమౌజ, సత్యకేతుడు.

**11. ధర్మసావర్ణి మనువు :** సత్యయుగపు పుత్రుడు. పుత్రులలో సత్యధర్ముడు గొప్పవాడు; విహంగములు– దేవతలు; ఇంద్రుడు–వైధృతుడు.

వైధృత–ఆర్యకల పుత్రుడు 'ధర్మసేతు' విష్ణుమూర్తి అవతారం.

**సప్తర్షులు:** నిశ్చర, అగ్నితేజ, వపుష్మ, విష్ణు, అరుణి, హవిష్మ, అనఘుడు.

**12. రుద్రసావర్ణి మనువు :** శివ, పార్వతుల కుమారుడు. దేవవనుడు ఇతడి కుమారులలో ప్రసిద్ధుడు. హరితులు–దేవతలు; రితధాముడు–ఇంద్రుడు; సత్యసాహ–సునృతిల కుమారుడు 'సుధాముడు' విష్ణువు అవతారం.

**సప్తర్షులు:** తపస్వి, సుతరు, తపోమూర్తి, తపోరతి, తపోధృతి, తపోద్యుతి, తపోధనుడు.

**13. దేవసావర్ణి (రౌచ్యుడు) మనువు :** ఇతడి కుమారులలో ప్రసిద్ధుడు చిత్రసేనుడు. దేవతలు– సుకర్ములు; దివాస్పతి– ఇంద్రుడు; దేవహోత్ర–బృహతిల కుమారుడు 'యోగీశ్వరుడు' విష్ణువు అవతారం.

**సప్తర్షులు:** నిర్మోహ, తత్త్వదర్శన, నిష్ప్రకంప, నిరుత్సుక, ధృతిమత్, అవ్యయ, సుతరు.

**14. ఇంద్రసావర్ణి మనువు :** ఇతడి పుత్రులలో ముఖ్యమైనవారు– ఉరు, గంభీర; దేవతలు–పవిత్రులు; ఇంద్రుడు–శుచి; సత్రాయణ–వితానల కుమారుడు బృహద్భానువు 'బృహద్భానువు' విష్ణుమూర్తి అవతారం.

**సప్తర్షులు:** అగ్నిబాహు, శుచి, శుక్ర, మగధ, గృధ్ర, యుక్త, అజిత.

# 92. మనువులు - వారి సంతానం

## 1. స్వయంభువుడు

1) **స్వయంభువు –** భార్య శతరూప; వీరి సంతానం ప్రియవ్రత, ఉత్తానపాద, ఆకుతి, దేవహూతి, ప్రసూతి.

2) **దేవహూతి –** భర్త కర్దముడు = వీరి సంతానం – వారి భర్తలు-భార్యలు

- కపిలుడు
- కళ + మరీచి
- అనసూయ + అత్రి
- శ్రాద్ధ + అంగీరస
- హవిర్భు + పులస్త్య
- గతి + పులహ
- క్రియ + క్రతు
- ఖ్యాతి + భృగు
- అరుంధతి + వశిష్ఠ
- స్వాథి + అధర్వణ

3) **ఆకూతి + రుచి మహర్షి :** వీరి కుమారుడు యజ్ఞ, కుమార్తె దక్షిణ
యజ్ఞ + దక్షిణ ల సంతానం: తోష, ప్రతోష, సంతోష, భద్ర, సాథ్వి, ఇధంపతి, ఇధ్మ, కవి, విభు, అగ్ని, సుదీవ, రోచన

4) **కళ + మరీచి :** వీరి సంతానం కశ్యపుడు, పూర్ణిమ
పూర్ణిమ సంతానం – విరజ, విస్వగ, దేవకుల్య

5) **అత్రి + అనసూయ :** అనసూయకు త్రిమూర్తుల వలన కలిగినవారు– దత్తాత్రేయుడు (విష్ణు అంశ); దుర్వాసుడు (రుద్రాంశ); సోముడు (బ్రహ్మ అంశ) (చంద్రుడు)

6) **అంగీరసుడు + శ్రద్ధ :** వీరి సంతానం– సినీవాలి, కుహు, రాక, అనుమతి, ఉతథ్య, బృహస్పతి.

7) **పులస్త్య + హవిర్భు :** వీరి కుమారుడు విశ్రావసుడు
విశ్రావసుడికి ఇద్దరు భార్యలు– ఇళబిళ వలన కుబేరుడు, కేకసి వలన రావణ, కుంభకర్ణ, విభీషణులు జన్మించారు. పులస్త్య+హవిర్భుల మరో కుమారుడు అగస్త్యుడు.

8) **పులహ + గతి :** కర్మశ్రేష్ఠ, వారియుడు, సహిష్ణులు వీరి సంతానం

9) **క్రతు + క్రియ :** 60,000 మంది వాలఖిల్యులు

10) **వశిష్ఠ + అరుంధతి (ఊర్జ) :** వీరి సంతానం చిత్రకేతు, సురోచిష, విరజ, మిత్ర, ఉల్బొ, వసుబౌధాయన, ద్యుమణ

11) **అధర్వణ + చిత్తి** = దధ్యఙుడు

12) **భృగు + ఖ్యాతి** = ధాత, విధాత, శ్రీ, కవి
ధాత + ఆయతి = మృకండుడు; మృకండుని పుత్రుడు మార్కండేయుడు
విధాత + నియతి = ప్రాణుడు. ఇతడి పుత్రుడు వేదశిరసుడు

13) **దక్షుడు + ప్రసూతి** = 16 శక్తి రూపాలు వీరి సంతానం.
వీరిలో పదముగ్గురుని ధర్ముడికిచ్చినారు. ధర్ముడికి వారి వలన కలిగిన సంతానం.

ధర్ముడు+శ్రాద్ధ = శ్రుత; మైత్రి–ప్రసాద; దయకు అభయ; శాంతికి సుఖ; తుష్టికి హర్ష; పుస్తికి గర్వ; క్రియకు యోగ; ఉన్నతికి దర్ప; బుద్ధికి అర్ధ; మేధకు స్మృతి; తితీక్షకు క్షేమ; లజ్జకు వినయ; మూర్తికి నరుడు (మానవత); నారాయణుడు (దైవత్వం) సంతానం.

– దక్షుడు + ప్రసూతిల కుమార్తె 'స్వాహా' అగ్నిని పెళ్లాడగా పావక, పావమాన, శుచి అగ్నులు జన్మించారు. వీరికి 45 రకాల అగ్నులుద్భవించాయి.

– దక్షుడు + ప్రసూతిల కుమార్తె స్వాధ–పితృదేవతలకు వయున, ధరణి సంతానం
దక్షుడు + ప్రసూతిల కుమార్తె 'సతి' శివుడిని వివాహమాడింది.

14) **అధర్మ + మిధ్యల** సంతానం దంబ, మాయలు; అధర్మ+లోభకు శతత; అధర్మ+క్రోధలకు హింస; అధర్మ+కాలిలకు దురుక్తి; అధర్మ+మృత్యువులకు భీతి; అధర్మ+నిరయలకు యాతనలు జనించారు.

## నరకలోకములు - 21

1) తామిస్ర, 2) అంధతామిస్ర, 3) రౌరవ, 4) మహారౌరవ, 5) కుంభీపాక, 6) కాలమూత్ర, 7) అసిపత్రవన, 8) సూకరముఖ, 9) అంధకూప, 10) క్రిమిభోజన, 11) శమదంశ, 12) తప్త-సుర్మి, 13) వజ్రకంటక శాల్మలి, 14) వైతరణి, 15) పుయోధ, 16) ప్రాణరోధ, 17) విసాశన, 18) లాలాభక్ష, 19) సారమేయదాన, 20) అదీచి, 21) ఆయపాన.

**మరో 7 నరకాలు :**
1) క్షార కర్దమ, 2) రక్షోగణ భోజన, 3) శూలప్రోత, 4) దండశుక,
5) ఆవత నిరోధన, 6) పర్యావర్తన, 7) సూచీముఖ

## అష్టవసువులు

ధర్మ + వసు = ఎనిమిది మంది వసువులు. వారి భార్యలు, వారి సంతానం-

1) ద్రోణ + అభిమతి = హర్ష, శోక

2) ప్రాణ + ఊర్జస్వతి = సాహస, ఆయువు, పురోజవ

3) ధ్రువ + ధరణి = వివిధ పట్టణాలు

4) అర్క + వాసన = తార్స (కోరిక) మొదలగువారు

5) అగ్ని + వశోర్ధర = స్కంద, ద్రవీణక మొదలైనవారు

6) దోష + సర్వారి (రాత్రి) = శింశుమార

7) వాస్తు + అంగీరస విశ్వకర్మ- చాక్షుష మనువు-విశ్వదేవతలు

8) విభావసు (ప్రభాసుడు) + ఉషవ్యస్త, రోచిస్సు, ఆతప (వెలుతురు)
ఆతప - పంచాయామం; ఇరవై నాలుగు గంటలలో 8 యామాలుంటాయి.

## దక్ష ప్రజాపతి

**దక్షుడు + అసీక్ని** = హర్యాశ్వులు పదివేల మంది - తాపసులు
= శబలాశ్వులు వేయిమంది - ముక్తిమార్గం.

(హర్యాశ్వులు, శబలాశ్వులు నారదుడి బోధనతో తపస్సులు చేసి ముక్తినందినారు. వాళ్ల ప్రవర్తనకు నారదుడే కారణమని దక్షుడు నారదుడిని శపించినాడు- "ముల్లోకాలు సంచరిస్తూ అవిశ్రాంతంగా కాలం గడుపు"

= దక్షుడికి అరవైమంది కుమార్తెలు జన్మించారు.
పదిమందిని ధర్ముడికి; 13 మందిని కశ్యపుడికి; 27గురిని చంద్రుడికి;
నలుగురిని తార్క్ష్యుడికి; భూత, అంగీరస, కృశాశ్వులకు ఇద్దరి చొప్పున ఇచ్చినాడు.

## కశ్యప ప్రజాపతి - పదమూడు మంది భార్యలు

1) తిమి - తిమింగలము, జలచరాలు

2) సరమ - అడవి జంతువులు, పులులు, సింహాలు...

3) సురభి - చీలిన గిట్టలున్న జంతువులు - గోవులు, మేకలు

4) తామ్ర - రాబందులు

5) ముని - అప్సరసలు

6) క్రోధవశ - సర్పములు-దందశూక...

7) ఇల - మొక్కలు

8) సురస – రాక్షసులు

9) అరిష్ట – గంధర్వులు

10) కాస్థ – గిట్టలు చీలని జంతువులు

11) దను – దానవులు (61 మంది)

12) అదితి – ఆదిత్యులు

13) దితి – దైత్యులు.

**దానవులు (కశ్యప+దను సంతానం) (61) :** ఈ అరవై ఒక్క మందిలో ముఖ్యులు= ద్విముర్ధుడు, శంబరుడు, అరిష్ట, హయగ్రీవ, విభావసు, అయోముఖ, శంకుశిర, స్వర్భాను, కపిల, పులోమ, వృషపర్వ, ఏకచక్ర, అనుతాపక, ధూమ్రకేశ, విరూపాక్ష, విప్రచిత్తి, దుర్జయుడు, వైశ్వానరుడు.

స్వర్భానువు కుమార్తె సుప్రభ, నముచి భార్య

వృషపర్వుడి కుమార్తె శర్మిష్ఠ, యయాతి భార్య

వైశ్వానరుడికి నలుగురు కుమార్తెలు – ఉపదానవి, హయశిర, పులోమ, కాలక

పులోమ సంతానం : పౌలోములు

కాలక సంతానం : కాలకేయులు / అరవై వేలమంది

విప్రచిత్తి + సింహిక = రాహువు, కేతువులు

**అదితి పుత్రులు :**

**12 ఆదిత్యులు–** వివస్వత, ఆర్యమన్, పూష, త్వష్ట్ర, సవితర్, భగ, ధాత, విధాత, వరుణ, మిత్ర, ఇంద్ర, విష్ణు.

1) వివస్వత + సంజ్ఞ → శ్రాద్ధదేవ, యమ, యమి
→ అశ్వనీ దేవతలు
వివస్వత + ఛాయ → శని, సావర్ణి, తపతి

2) ఆర్యమన్ + మాతృక → కర్శని తెగ (మానవులు వీరి రూపంలో ఉండేట్లు బ్రహ్మ మలచినాడు)

3) పూష – పిల్లలు లేరు

4) త్వష్ట్ర + రచన → విశ్వరూపుడు

5) సవితర్ + పృశ్ని → సావిత్రి (గాయత్రి), వ్యాహృతులు, వేదత్రయి
→ మహాయజ్ఞాలు, అగ్నిహోత్రాలు

6) భగ + సిద్ధి → మహిమ, విభు, ప్రభు, ఆశీస్సు

7) ధాత + కుహు → సాయంకాలం
ధాత + సినీవాలి → నెలపొడుపు
ధాత + రాక → పూర్ణామాస
ధాత + అనుమతి → ప్రాతఃకాలం

8) విధాత + క్రియ → పురిష్యాగ్ని = పంచాగ్ని

9) వరుణ + కర్శని → భృగువు, (వాల్మికి?)
మిత్రా+వరుణ+ఊర్వశి → అగస్త్య, వశిష్ఠ

10) మిత్ర + రేవతి → ఉత్సర్గ, అరిష్ట, పిప్పల

11) ఇంద్ర + పౌలోమి → జయంత, రిషభ, మిధూష

12) వామన (విష్ణు) + కీర్తి → బృహత్‌శ్లోక.

## దైత్యులు

కశ్యప + దితి

- హిరణ్యకశిపు + లీలావతి
  - సంహ్లాద + గతి → పాంచజన్య
  - అనుహ్లాద + సూర్య → బాస్కల, మహిష
  - హ్లాద + ధమని → వాతాపి, ఇల్వల
  - ప్రహ్లాద + ద్రార్వి → విరోచన → బలి+ఆసన → బాణ + 99 పుత్రులు
  - సింహిక + విప్రచిత్తి → రాహువు
- హిరణ్యాక్ష + భాను
- 49 మరుత్తులు

## మన్వంతరాలు

1) స్వయంభువ – జననం

2) స్వారోచిష – కాంతి

3) ఉత్తమ – సత్యం

4) తామస – శరణాగత రక్షణం – గజేంద్రమోక్షం

5) రైవత – వైకుంఠం

6) చాక్షుష – నేత్రం – పాలసముద్ర మథనం, కూర్మావతారం

7) వైవస్వత – వివస్వతాదిత్యుని కుమారుడు శ్రాద్ధదేవుడు – ప్రస్తుత మన్వంతరం

8) సావర్ణి, 9) దక్షసావర్ణి, 10) బ్రహ్మ సావర్ణి, 11) ధర్మసావర్ణి, 12) రుద్ర సావర్ణి, 13) దేవసావర్ణి, 14) ఇంద్ర సావర్ణి

## వైవస్వత మన్వంతరం - సూర్యవంశం

వైవస్వత మనువు + శ్రాద్ధ = వీరి సంతానం

పదిమంది కొడుకులు, ఒక కూతురు – ఇల

1) **ఇక్ష్వాకుడు –** మనువు తుమ్మినపుడు అతడి ముక్కు నుంచి పుట్టినవాడు ఇక్ష్వాకుడు. అతడికి నూరుగురు కుమారులు.

2) **నృగుడు –** ఓఘవతి, ఓఘవతుడు ఇతడి వంశస్థులు, శాపవశాత్తు 'తొండ'గా మారి శ్రీకృష్ణుని స్పర్శతో శాప విమోచనము నొందినాడు.

3) **శర్యాతి –** శర్యాతి కుమార్తె సుకన్య – చ్యవనమునిని పెండ్లాడింది.

4) **దిష్ట –**

5) **దృష్ట –** క్షత్రియులై పుట్టి బ్రాహ్మణులుగా జీవించారు.

6) **కరూశ –** నీతివంతులైన ఉత్తర దేశ రాజులు

7) **నరిశ్యంత –** అగ్నివేశుడు ఇతడి వంశం వాడు

8) **ప్రసధ్ర –** పులిని చంపబోయి గోవును చంపినాడు.

9) **నభగుడు –** వైశ్యుడైనాడు, అవీక్షిత్తు, మరుత్తుడు ఇతడి వంశీకులు. మరుత్తుడు దాచిన ధనంతో ధర్మరాజు అశ్వమేధ యాగం చేసాడు.

10) **కవి –** అవివాహితుడు, జ్ఞాని

**– నాభాగుడి** వంశస్థుడైన మరుత్తుడి వంశంలో జనించిన తృణబిందుడికి అలంబుస అనే అప్సరసకు నలుగురు సంతానం.

విశాలుడు– వైశాలి నగర స్థాపకుడు

శూన్యబంధు

ధూమ్రకేతు

ఇలబిళ + విశ్రావసుడు → కుబేరుడు

**– శర్యాతి**

- కుమార్తె – సుకన్య + చ్యవన మహర్షి
- ఉత్తాన బర్హి
- అనార్త → రేవత (కుశస్థలి నగర నిర్మాత) → కకుద్ముడు → రేవతి
  రేవతిని బలరాముడికిచ్చి వివాహం చేసినాడు కకుద్ముడు
- ధూరిసేన

– నభగుడి కుమారుడు నాభాగుడు; నాభాగుని కుమారుడు అంబరీషుడు.

అంబరీషుడు–దుర్వాసుడి కథ అంబరీషోపాఖ్యానం.

**ఇక్ష్వాకుడు –** నూరుగురు కుమారులు– వికుక్షి, నిమి ప్రముఖులు.

– వికుక్షి (శశాదుడు) – పురంజయుడు (కకుత్సుడు, ఇంద్రవాహనుడు)

→ అనీనుడు → పృధువు → విశ్వగంధుడు → చంద్రుడు → యువనాశ్వుడు

→ శ్రావస్తుడు (శ్రావస్తి నగర నిర్మాత) → బృహదాశ్వుడు →

→ కువలయాశ్వుడు (ధుఃధుమారుడు) → దృఢాశ్వ, కపిలాశ్వ, భద్రాశ్వ → దృఢాశ్వ → హర్యాశ్వ → నికుంభ → బహుళాశ్వ

→ కృశాశ్వ → సేనాజిత్ → యువనాశ్వ → మాంధాత

మాంధాత → పురుకుత్స → త్రసదస్య → అనారణ్య

→ హర్యాశ్వ → ప్రరుణ → త్రిబంధన → సత్యవ్రత (త్రిశంకుడు)

మాంధాత → అంబరీష → యౌవనాశ్వ → హారీత

మాంధాత → ముచుకుందుడు (కృష్ణుడి చాకచక్యం వలన కాలయవనుడిని భస్మం చేసినాడు)

→ చంప (చంపానగర నిర్మాత) → సుదేవ → విజయ → భరూక

→ వృక → బాహుక → సగరుడు

సగరుడికి ఇద్దరు భార్యలు. సుమతి వలన 60,000 మంది పుత్రులు జన్మించారు; కేశిని వలన అసమంజసుడు పుట్టినాడు.

అసమంజసుడు → అంశుమంతుడు → దిలీపుడు →

భగీరథుడు → శ్రుత → నాభ → సింధుద్వీప → ఆయుతాయు

→ ఋతుపర్ణుడు (నలుడి స్నేహితుడు) → సర్వకాముడు → సుదాసుడు

→ సౌదాసుడు (మిత్రసహుడు, కల్మాషపాదుడు).

సౌదాసుడు + మదయంతి (వశిష్ఠుని వలన) → అశ్మకుడు → మూలకుడు → దశరధుడు → ఇళవిళ → విశ్వసహుడు → ఖట్వాంగుడు → దీర్ఘబాహుడు → రఘు → అజ → దశరథుడు → శ్రీరామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు.

శ్రీరాముడు → లవ, కుశులు

లక్ష్మణుడు → అంగద, చంద్రకేతు

భరతుడు → తక్ష, పుష్కలుడు

శత్రుఘ్నుడు → సుబాహు, శ్రుతసేనుడు

శ్రీరాముడు → కుశుడు → నిషాద → నాభ → పుండరీక → క్షేమధన్వ → దేవనీక → అనీహ → పారియాత్ర → బల → వజ్రనాభ → శంఖణ → విధృతి → హిరణ్యనాభ → పుష్ప → ధ్రువసంధి → సుదర్శన → అగ్నివర్ణ → శీఘ్రు → మరు (యోగి-కలియుగాంతాన సూర్యవంశాన్ని పునరుద్ధరిస్తాడు.) → ప్రసుశ్రుత → సంధి → అమర్శన → మటాస్వతు → విశ్వబాహు →

→ ప్రసేనజిత్తు → తక్షక → బృహద్బలుడు (అభిమన్యుడి చేతిలో మరణించాడు) →

→ బృహద్రధుడు → ఇరవై ఆరు తరాలు → సుమిత్రుడు (ఇక్ష్వాకు వంశపు ఆఖరిరాజు)

ఇక్ష్వాకుడి రెండవ కుమారుడు నిమి.

నిమి, వశిష్ఠుల మధ్య వివాదం ఇద్దరినీ విదేహులను చేసింది. 'నిమి' సకల జీవుల కనురెప్పలపై నిలిచి కనురెప్పపాటు కాలంగా మారినాడు. వశిష్ఠుడు విదేహుడై మిత్రావరుణుల- ఊర్వశి సాన్నిహిత్యంలో మరల జన్మించాడు. విదేహుడైన నిమి దేహం నుంచి మధించగా పుట్టినవాడు జనకుడు (వైదేహుడు). మధించగా పుట్టినాడు కనుక మిధిలుడైనాడు. ఇతడి నగరం మిధిల (ఇప్పటి తిర్హత్ పట్టణం).

నిమి → జనక → ఉదవసుడు → నందివర్ధనుడు → సుకేతు → దేవరాతుడు → బృహద్రధుడు → మహావీర్యుడు → సుధృతి → దృష్టకేతు → హర్యాశ్వుడు → మరు → ప్రతీపుడు → కృతరధుడు → దేవామీఢుడు → విధృతి → మహాధృతి → కీర్తిరధుడు → మహారోముడు → స్వర్ణరోముడు → హ్రస్వరోముడు → సిరధ్వజుడు

సిరధ్వజ జనకుడికి నాగేటి చాలులో సీత దొరికింది.

→ సిరధ్వజ జనకుడు → కుశధ్వజుడు → ధర్మధ్వజుడు → కృతధ్వజుడు → కేశిధ్వజుడు → 26 తరాలు → కృతి

మిథల ప్రభువులు ఆత్మవిద్యకు ప్రసిద్ధికెక్కినారు. 'మిథిల తగలబడుతున్నా నాకంటదు' అనేది జనకుడి ఉవాచ.

## 93. చంద్రవంశం

అత్రి + అనసూయలకు బ్రహ్మ అంశతో పుట్టినవాడు చంద్రుడు. బ్రహ్మ, విష్ణు మహేశ్వరులను పసిపాపలుగా చేసి ఆడించిందా మహాతల్లి. పతివ్రత అనసూయ. బ్రహ్మ అంశతో చంద్రుడు (సోముడు); విష్ణు అంశతో దత్తాత్రేయుడు, శివుడి అంశతో దుర్వాసుడు జన్మించారు.

అంగీరసుడు + శ్రద్ధ ల సంతానం - సినివాలి, కుహు, రాక, అనుమతి, ఉతధ్యుడు, బృహస్పతి.

బృహస్పతి దేవతల గురువు. ఉతధ్యుడి భార్య మమత. మమత గర్భిణిగా ఉన్నపుడు గర్భస్థశిశువు, బృహస్పతిని ఆక్షేపించగా బృహస్పతి శాపంతో దీర్ఘతముడు పుట్టుగుడ్డిగా జన్మించాడు. బృహస్పతి భార్య తార. బృహస్పతి శిష్యుడు చంద్రుడు. చంద్రుడు తార ప్రేమలో పడి ఆకాశవీధిలో సంచరించారు. బ్రహ్మ చెప్పగా చంద్రుడు తారను బృహస్పతి వద్దకు పంపినాడు. తారకు జన్మించాడు బుధుడు.

వైవస్వత మనువు, శ్రాద్ధల కుమార్తె ఇల. వైవస్వతుడు (శ్రాద్ధదేవుడు) మగపిల్లవాడు కావాలని, శ్రాద్ధ ఆడపిల్ల కావాలని కోరుకున్నారు. ఇల (ఇడా-వాగ్దేవి) ఆడపిల్లగా పుట్టింది. మనువు కోపించేసరికి వశిష్ఠుడు దేవతలను ప్రార్థించగా ఇల కాస్తా సుద్యుమ్నుడిగా మారింది. ఒకరోజున సుద్యుమ్నుడు, శివుడి 'సుకుమార' అనే రెల్లు వనంలోకి వెళ్లి సరస్సులో మునిగి లేచేసరికి ఆడపిల్లగా మారిపోయాడు తన సైనికులతో సహా. ఇలను బుధుడు వివాహం చేసుకోగా పురూరవుడు జన్మించాడు.

ఒక నెల మగవాడిగా, ఒక నెల స్త్రీగా ఉండేట్లు శివుడు వరమిచ్చాడు ఇలకు (సుద్యుమ్నుడికి). సుద్యుమ్నుడికి ముగ్గురు కుమారులు- ఉత్కళ, గయ, విమల

**పురూరవుడు-** ఇతడు అప్సరస ఊర్వశిని ప్రేమించాడు. వీరికి ఆయు, శ్రుతాయు, సత్యాయువు, రాయువు, విజయుడు, జయుడు జన్మించారు.

విజయుడు → భీముడు → కాంచన → హోత్రక → జహ్నువు

జహ్నువు (గంగను పుక్కిటపట్టి చెవుల నుంచి వదలగా ఆమె జాహ్నవి అయ్యింది)
→ పురు → బాలక → అజక → కుశ

కుశుడికి కుశాంబుడు, ధుర్తర్యుడు, వసు, కుశనాభులు పుత్రులు

కుశాంబుడి పుత్రుడు గాధి; గాధి కుమార్తె సత్యవతి
సత్యవతి భర్త ఋచీకుడు – వీరి పుత్రుడు జమదగ్ని
సత్యవతి సోదరుడు విశ్వామిత్రుడు.

జమదగ్ని భార్య రేణుక – వీరి పుత్రులు పరశురాముడు మొదలగువారు

విశ్వామిత్రుడి సంతానం – మధుచ్ఛందాది నూరుగురు, దేవరాతుడు (పెంపుడు కుమారుడు), మాధవి ద్వారా అష్టకుడు

**– ఆయువు** (పురూరవుడు + ఊర్వశిల కుమారుడు)

ఆయువు పుత్రులు– నహుషుడు, క్షత్రవృద్ధుడు, రాజి, రంభుడు, అనీనసుడు

క్షత్రవృద్ధుడి పుత్రుడు సుహోత్రుడు. సుహోత్రుడికి ముగ్గురు కొడుకులు కశ్య, కుశ, గృత్సమదుడు

– కశ్యుడి వంశంలో ధన్వంతరి ఆయుర్వేద వైద్యపిత; ప్రతర్ధనుడు, అలర్కుడు, నీతిహోత్రులు ప్రసిద్ధికెక్కినవారు.

– రాజి, తన పుత్రులతో స్వర్గాన్ని కొంతకాలం పాలించి కోల్పోయినాడు.

**– నహుషుడు** (పురూరవుడు + ఊర్వశిల కుమారుడు)

నహుషుడి సంతానం – యతి, యయాతి, శర్యాతి, ఆయతి, వియతి, కృతి.

యయాతికి దేవయాని వలన యదు, తుర్వసులు; శర్మిష్ఠ వలన ద్రుహ్యుడు, అనుద్రుహ్యుడు, పూరుడు జన్మించారు.

పూరుడికి రాజ్యార్హత లభించింది. అతడి వంశంలోని 13వ తరం వాడు రైభ్యుడు. రైభ్యుడి కుమారుడు దుష్యంతుడు (శకుంతల భర్త). దుష్యంతుడి కుమారుడు భరతుడు. భరతుడి పెంపుడు కొడుకు భరద్వాజుడు (మమత, బృహస్పతిల కుమారుడు) – వితథుడు ఇతడి మరోపేరు.

మమత–ఉతథ్యుల కుమారుడు దీర్ఘతముడు.

భరతుడు → భరద్వాజుడు → మన్యుడు
మన్యుడికి – బృహత్క్షత్రుడు, జయుడు, మహావీరుడు, నరుడు, గర్గుడు పుత్రులు. గర్గుడి మనమడు గార్గ్యుడు.
నరుడి మనమడు రంతిదేవుడు గొప్ప దాత.
బృహత్క్షత్రుడి కుమారుడు హస్తి (హస్తినాపుర నిర్మాత)
హస్తి కుమారులు– అజామీఢ, ద్విమీఢ, పురుమీఢులు.

– అజామీఢుని కుమారుడు బృహదీశుడి వంశంలో బ్రహ్మదత్తుడు, విశ్వక్సేనుడు యోగులు.

– అజామీఢుని మరో కుమారుడు నీలుడి వంశం వారు పాంచాలురు. పాంచాలురు– ముద్గల, యవినార, బృహదీశ్వ, కాంపిల్య, సృంజయుడు

ముద్గలుడి సంతానం – దివోదాసుడు, అహల్య.

♦ అహల్య + గౌతముడు → శతానందుడు → సత్యధాత్రి (ధనుర్వేదం)
→ శరద్వంతుడు + ఊర్వశి → కృప, కృపి

♦ దివోదాసుడు → మిత్రాయు → చ్యవన + సుకన్య → సుదాసు
→ సహదేవ → సోమక → జంతు, పృషత, 98 పుత్రులు.

♦ పృషతుడు → ద్రుపదుడు → ద్రౌపది, ధృష్టద్యుమ్నుడు, శంఖుడు, శిఖండిని.

– అజామీఢుని మరో కుమారుడు రక్షుడు

రక్ష → సంవరణ + తపతి → కురు
కురు → పరీక్షిత్తు, సుధనుడు, జుహ్ను, నిషాద
సుధనుడు → సుహోత్ర → చ్యవన → కీర్తి → ఉపరిచర వసువు →
→ బృహద్రథుడు → జరాసంధుడు → సహదేవుడు
జహ్ను → సురథ → విదురథ → సార్వభౌమ → జయత్సేన →
→ రధిక → ఆయుతాయువు → క్రోధన → దేవాతిథి → రక్ష →

→ భీమసేన → ప్రతీప.

ప్రతీపుడికి ముగ్గురు కుమారులు - బాహ్లిక, దేవాపి, శంతనుడు
- బాహ్లిక → సోమదత్త → భూరిశ్రవసుడు
- దేవాపి → సన్యాసం
- శంతనుడు → రాజు

శంతనుడు + సత్యవతి → చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు.

## 94. చంద్రగుప్త మౌర్యుడి కాలం నుంచి వెనక్కి కాలరేఖపై

మౌర్య చంద్రగుప్తుడి (350-295 B.C.) ఆస్థానంలో గ్రీకు సెల్యుకస్ నికెటర్ రాయబారిగా ఉన్న మెగస్తనీస్ వ్రాసిన దాని ప్రకారం చంద్రగుప్తుడి సైన్యంలో 30,000 అశ్వికులు, 9,000 ఏనుగులు, 6,00,000 కాల్బలం ఉండింది.

అతడి కంటె ముందు మగధ సామ్రాజ్యాన్ని పాలించిన నందుల సైన్యంలో- 8,000 రథాలు, 6,000 ఏనుగులు, 80,000 అశ్వికులు, 2,00,000 కాల్బలం ఉండింది.

అదే కాలంలో పంజాబ్ ప్రాంతాన్ని పాలించిన పోరస్ పురుషోత్తముడు (పురు వంశానికి చెందినవాడు)- 200 ఏనుగులు, 2000 అశ్వికులు, 50000 సైనికులతో అలెగ్జాండర్‌పై యుద్ధం చేసి ఓటమి పాలైనాడు. ఆ యుద్ధంలో అలెగ్జాండర్‌కు సాయం చేసినవాడు కాశ్మీర ప్రాంతపు అభిసారుడు-అంభి (నాగవంశపు రాజు).

ఈ యుద్ధం Battle of Hydaspes - జీలం యుద్ధంగా పేరు తెచ్చుకున్నది. అలెగ్జాండర్ తరపున 40,000 కాల్బలం, 5,000-7,000 అశ్వికదళం, స్థానిక వీరులు పాల్గొనగా, పురుషోత్తముడి తరపున 20,000-50,000 కాల్బలం, 2,000-4,000 అశ్వికదళం, 85-200 ఏనుగులు, 1,000 రథాలు యుద్ధంలో పాల్గొన్నాయి.

అలెగ్జాండర్ పక్షాన 1,000 లోపు ప్రాణనష్టం సంభవించగా పురుషోత్తముడి సైన్యం 20,000 మందికి పైగా నష్టపోయి ఓడిపోయింది. పురుషోత్తముడు ఓడిపోయినా అలెగ్జాండర్ మెప్పును దక్కించుకున్నాడు. కాని, ఆ తరువాత అలెగ్జాండర్ మరణానంతరం యుడెమస్-323 BCలో పోరస్ (పురుషోత్తముడు)ను చంపివేసాడు.

యుడెమిస్‌ను ఏంటిగోనస్ చంపినాడు. ఏంటిగోనస్ Battle of Ipsus లో గాయపడి మరణించాడు. కాసాండర్, లైసిమాఖస్, సెల్యుకస్ నికెటార్‌లకు అధికారం చిక్కింది.

సెల్యుకస్ నికెటార్‌ను చంద్రగుప్తుడు ఓడించాడు. సంధి ఒప్పందం ప్రకారం చంద్రగుప్తుడికి తన కుమార్తె బెర్నైసి (Bernice)ని, కొంత రాజ్యాన్ని ఇచ్చి 500 యుద్ధపు ఏనుగులు తీసుకున్నాడు సెల్యుకస్. ఆ ఏనుగులే ఇప్సస్ యుద్ధంలో సెల్యుకస్ కూటమి విజయానికి తోడ్పడినాయి.

చంద్రగుప్త మౌర్యుడు తన జీవిత చరమాంకంలో జైన మతాన్ని అవలంబించాడు.
అశోకుడు- 268-232 BC (పాలనాకాలం)
అలెగ్జాండర్ - 356-323 BC
గౌతమబుద్ధుడు - 563-483 BC or 480-400 BC
మహావీర జైనుడు - 599-527 BC or 499-427 BC

### కాలరేఖ

సింధులోయ నాగరికత - 3300 - 2700 - 1900 B.C.
అలెగ్జాండర్ దండయాత్ర - 327 BC
చంద్రగుప్త మౌర్యుడు - 322-298 B.C.
శుంగ (181-71 BC) కణ్వ (71-27 BC), శాతవాహన (235-100 BC)
ఇండో గ్రీకులు- పార్థియన్లు (180 BC - 45 AD); శకులు (90 BC - 150 AD)
కుషాణులు (78 AD)

సంగం కాలం (300 BC - 300 AD) - చోళ, చేర, పాండ్యులు
గుప్తుల కాలం (300 AD - 800 AD) స్వర్ణయుగం (319-550 AD)

మధ్యయుగం (700 – 1857 AD)-

- ప్రతీహార–పాల–రాష్ట్రకూటులు (800–1200 AD)
- గజని (1000–1027), ఘోరి (1175–1206)
- విజయనగర, బహమనీలు
- ఢిల్లీ సుల్తానేట్ (1206–1526 AD)
- మొఘలులు (1526–1857 AD)
- బ్రిటిషు పాలన (1857–1947 AD)

### క్రీస్తుపూర్వం 14వ శతాబ్దం – దశరాజ యుద్ధం

త్రత్సు భరత తెగ వాళ్లు సుదాసుడు రాజుగా, వశిష్ఠుడు పురోహితుడిగా, అలిన, అను, భృగు, భలన, దశ, దృహ్యు, మత్స్య, పురు; పర్ణి సంయుక్త కూటమి, విశ్వామిత్రుడు పురోహితుడిగా ఉన్న వారిపై విజయాన్ని సాధించగా భరత తెగ కురుక్షేత్రంలో స్థిరపడింది.

## మహాభారత యుద్ధం - వాస్తవం / కల్పితం

1) మహా పద్మనందుడు మగధ సామ్రాజ్యాధిపతి అయిన సంవత్సరం 382 BC. అప్పటికి 1050 సంవత్సరాలకు పూర్వం పరీక్షిత్తు జన్మించాడు. వీరి మధ్య 26 తరాలు గడిచాయి. ఈ లెక్క ప్రకారం భారత యుద్ధం క్రీస్తుపూర్వం 1430 ప్రాంతంలో జరిగి ఉంటుంది.

2) ఉపేందర్ సింగ్ – 1000 BC

3) అస్కొ పర్పొలా (ఫిన్లాండ్) 750–350 BC (ఇరాన్ నుంచి వలస వచ్చారు ఆర్యులు)

4) వేదవీర్ ఆర్య – 3162 BC

5) బి.ఎన్. ఆచార్ – 3067 BC (ప్లానెటొరియమ్ సాఫ్ట్‌వేర్)

6) Dieter Koch - 1198 BC (Planetorium Software)

7) K.L. దఫ్తారి – 1197 BC

8) V.S. దూబె – 950 BC.

9) B.B. Lal - 836 BC (Painted Greyware)

10) John Keay - 950 B.C.

11) Aihole Inscription - 3137 BC.

మహాభారతంలో పాత్రల తీరుతెన్నులు, సద్యోగర్భాలు, విశ్వరూపాలు, అతీంద్రియ శక్తులు, దివ్యాస్త్రాలు, సైన్యపు సంఖ్యలు ఊహాతీతంగా ఉండడంతో కొందరు మహాభారతాన్ని వ్యాస కల్పిత గాథగా, లేదా చిన్న సంఘటనను అతిశయోక్తులతో నింపిన కథగా భావిస్తున్నారు.

## భారతాన్ని ఎవరు ఎప్పుడు వ్రాసినారు?

1) పురాతన సంస్కృత రచన (200 BC - కుషాణుల కాలం)

2) పాణిని అష్టాధ్యాయ సూత్రాలలో పేర్కొనబడింది (400 BC)

3) అలెగ్జాండర్ దండయాత్ర కాలానికి– స్థానికులైన శూరసేనులు హెరాక్లిస్ (హరిక్రిష్ణుడి)ను ఆరాధిస్తున్నారని గ్రీకు సైనికులు భావించారు. (అలెగ్జాండర్ 356–323 BC)

4) గ్రీకు రచయిత Dio Chrysostom - నివేదిక (40–120 AD)లో హిందువులు ఇలియాడ్‌ను గానం చేస్తున్నారు అని వ్రాసాడు.

5) కాళిదాసు (400–500 AD - అభిజ్ఞాన శాకుంతలం)
భాసుడు (200–300 AD) ఊరుభంగం – ఈ కథలు భారతం నుంచి గ్రహింపబడినవి.

**ఒక వాదన :**

8800 శ్లోకాల – జయమ్ – వ్యాసుడు ⎤
24,000 శ్లోకాల – భారతమ్ – వైశంపాయనుడు ⎦ వ్యాసుడు
100000 శ్లోకాల – మహాభారతమ్ – ఉగ్రశ్రవసూతుడు

వ్యాసుడు లాంటి రచయిత శ్లోకాలు చెబుతుండగా, గణేశుడి వంటి వ్రాయసకాడు వ్రాస్తూ పోతూ ఉంటే 8800 శ్లోకాలు చెప్పడానికి, వ్రాయడానికి మూడు సంవత్సరాలు పట్టిందంటే నమ్మబుద్ధి కాదు.

అయితే కార్‌ష్ణ వేదంగా శ్రీకృష్ణుడిని భగవానుడిగా నిరూపించే భారతంలోకి శైవ ప్రాధాన్యతను తేవడానికి చొప్పించిన ఘట్టాలు చదువరులకు స్పష్టంగా కానవస్తూనే ఉంటాయి.

- వ్యాసుడు మహాభారతం వ్రాసిన ప్రదేశం 'వ్యాస గుహ'గా చెప్పబడుతున్నది. బదరీనాథ్ దగ్గర 'మన' గ్రామం దాపుల హిమాలయ పర్వతంలోని ఒక గుహ. దాని పక్కనే ఉన్న గుహ గణేశగుహ
- వైశంపాయనుడు – సర్పయాగ సమయంలో తక్షశిలలో జనమేజయుడికి 'భారతము' కథను వినిపించాడు. హస్తినాపురానికి, తక్షశిలకు మధ్య దూరం 700 కిలోమీటర్లు.
- నైమిశారణ్యం – హస్తినాపురం నుంచి 400 కిలోమీటర్లు ఉగ్రశ్రవసుడు మహాభారతాన్ని శౌనకాది మునులకు వినిపించిన ప్రదేశం. గోమతీనదీ తీరాన, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో – లక్నోకు 94 కిలోమీటర్ల దూరాన సీతాపూర్ జిల్లాలో ఉన్నది.

**తక్షశిల** (తరగబడిన శిల – City of Cut Stone)
1000 BC నుంచి 500 AD వరకు ఉన్న పట్టణం.

- శ్రీరాముడి సోదరుడు భరతుని కుమారుడు తక్షుడి నగరం.
- ఫాహియాన్ (337–422 AD) - ఈ ప్రాంతాన్ని తల తరిగిన ప్రాంతం అని పిలిచాడు. తక్షశిల లోయ దగ్గర ఉన్న పర్వత శ్రేణి–మార్గాల–గొంతు కోసిన ప్రాంతం.
- శతపథ బ్రాహ్మణం (700 BC) - ఉద్దాలక అరుణి, శ్వేతకేతులు విద్య నేర్చుకున్న ప్రాంతమిది.
- తక్షశిలలో ఆచార్యుడు– పాణిని–అష్టాధ్యాయి – సంస్కృత వ్యాకరణ రచయిత (500–400 BC) – భారతాన్ని తన రచనలో ప్రస్తావించాడు.
- జనమేజయుడి సర్పయాగ స్థలం – వైశంపాయనుడు జనమేజయుడికి భారత గాథా శ్రవణం చేసింది తక్షశిలలోనే. అక్కడ విన్న వారిలో రోమహర్షణుడు అతడి కుమారుడు ఉగ్రశ్రవసుడు ఉన్నారు.
- భరతుడు (శ్రీరాముని సోదరుడు) – తక్షశిల పక్కనే ఇంకో కుమారుడు పుష్కలుడి కోసం నిర్మించిన నగరం – పుష్కలావతి.
- బుద్ధ జాతక కథలలో ప్రస్తావించబడింది.
- జైనుల విశ్వాసం ప్రకారం రిషభుడు తక్షశిలను దర్శించాడు.
- 900 BC నాటికి తక్షశిల, పుష్కలావతి నగరాలు బాగా అభివృద్ధి చెందినాయి.
- అలెగ్జాండర్ దండయాత్ర సమయానికి అంభి (Omphis) ఈ నగరాన్ని పాలిస్తున్నాడు.
- అలెగ్జాండర్ తరువాత సెల్యుకస్‌కు, అతడిని చంద్రగుప్తుడు ఓడించినాక అది మౌర్య సామ్రాజ్యంలో భాగమైనది.
- తక్షశిల విశ్వవిద్యాలయం ఆనాటి ప్రపంచంలో అత్యున్నత విశ్వవిద్యాలయం.మగధ సామ్రాజ్యపు రాజధానికి తక్షశిల–పుష్కలావతిలకు మధ్య రాచమార్గం ఉండినది.

# 95. హిందూ దేవతలు - రూపురేఖలు

**తొలి దేవతలు –** దేవ, దేవి – దివ్యరూపులు

అతిలోక, అతీంద్రియ శక్తులు – అసురులు

మంచి అసురులు వరుణుడి నాయకత్వాన, దుష్టులైన అసురులు (దానవులు) వృత్రుడి నాయకత్వాన కలహించారు.

తొలి కాలంలో అగ్ని, ఇంద్రుడు కూడా అసురులే.

సురులకు వ్యతిరేకులు అసురులు

యక్షులు – ప్రకృతి భూతాలు, నిధులకు కాపలా ఉంటారు.

రాక్షసులు – రక్షకులు, లోకాతీత శక్తులు కలవారు, నరమాంస భక్షకులు, నిశాచరులు, క్రవ్యాదులు.

భూతాలు– గతకాలపు జీవులు, ఆత్మలు

**ఋగ్వేద దేవతలు** – ఇంద్ర, అగ్ని, సోమ, సవిత్ర, విష్ణు, రుద్ర, ప్రజాపతి – దేవుళ్లు
– ఉషస్సు, పృధ్వి, అదితి, సరస్వతి, వాక్కు, రాత్రి, నిఋతి, అరణ్యాని
– దింశన, రాక, పురంధి, పరేంది, భారతి, మహి, శ్రీ

- ఒకడే దేవుడు
- ముగ్గురు దేవతలు – త్రిమూర్తులు – బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు
- 33 దేవతలు
  - అష్టవసువులు – ద్యౌ (ఆకాశం); పృధ్వి (భూమి), వాయు, అగ్ని, నక్షత్ర, వరుణ (జల), సూర్య, చంద్రులు
  - ద్వాదశాదిత్యులు – విష్ణు, ఆర్యమాన్, ఇంద్ర (శక్ర), త్వష్ట, వరుణ, భగ, సవిత్ర, వివశ్వత, అంశ, మిత్ర, పూషాన్, దక్ష (నెలకొక్కరు)
  - ఏకాదశ రుద్రులు – అజ, ఏకపాద, అహర్బుధాన్య, త్వష్ట, రుద్ర, హర, శంభు, త్రయంబక, అపరాజిత ఈశాన, త్రిభువన
  - అశ్వనీ కుమారులు
- 33 కోట్ల దేవతలు – దేవగణాలు

హిందువులకు ద్వాదశాదిత్యులున్నట్లే గ్రీకులకు కూడా పాతతరం దేవతలు (Titans), కొత్తతరం దేవతలున్నారు. హిందువుల మేరు పర్వతంలాంటిదే గ్రీకుల ఓలింపస్ పర్వతం.

## గ్రీకు దేవతలు

**ఆది దంపతులు–** యురేనస్ + గెయియా (నింగి+నేల; ద్యా పృధ్వి)

ఆరుగురు కుమారులు– ఓసియానస్, కొయియుస్, క్రియస్, హైపరియాన్, అయాపెటస్, క్రోనస్ (వీరు టైటాన్లు),

ఆరుగురు కుమార్తెలు– థెయియా, రియా, థెమిస్, ఫొయిబి టెథిస్, నిమొసిని (టైటానిడ్లు)

**రెండవ తరం దంపతులు –** క్రొనస్ (కాలం) + రియా (నేలతల్లి)

వీరి పుత్రులు ఒలింపియన్లు (Olympic gods)

జ్యూస్, హెరా, పొజిడాన్, డిమితర్, అపోలొ, ఆర్టెమిస్, ఏర్స్, ఎథెనా, హెఫాస్టస్, అఫ్రొదితి, హెర్మెస్, హెస్టియా. హెస్టియా (గృహాగ్ని దేవత) స్థానాన్ని డయొనైసిస్ (ద్రాక్ష మధు దేవత) తీసుకున్నాడు.

హిందూ పురాణాల ప్రకారం – ప్రతి ఒక్కరూ అసురుడిగానే జన్మిస్తాడు. బహిర్ముఖులై, భౌతిక సుఖలాలసులై సంపదల కోసం నిత్యం శ్రమించడం అసుర లక్షణం.

అంతర్ముఖులై జ్ఞాన సంపాదన, సన్మార్గంలో చరించడం దైవత్వం వేపు నడిపిస్తాయి.

తొలి రోజులలో దేవతలను మూర్తి, ప్రతిమలతో పూజించేవారు. 33 దేవతలు లోకానికి పదకొండు మంది చొప్పున ముల్లోకాల్లో 33 మంది ఉన్నారని విశ్వసించారు. యజుర్వేదంలో భక్త కోటులున్నట్లే దేవతలు కూడా ముప్పది మూడు కోట్లున్నారని వ్యాఖ్యానించారు.

గుప్తుల కాలం నాటికి (క్రీస్తుశకం నాలుగవ శతాబ్దం) దేవీ దేవతలను 'మూర్తి' రూపంలో పూజలు, అర్చనలు చేయడం ప్రారంభమై గుడులు, గోపురాలు వెలిసాయి. షోడశోపచారాలు, ధూపదీప నైవేద్యాలు ఆచారాలైనాయి.

వాటిని వర్ణించే పురాణ, ఆగమ శాస్త్రాలు, సంహితలు, శిల్ప శాస్త్రాలు, స్థల పురాణాలు ఆవిర్భవించాయి.

మైత్రాయణీయ ఉపనిషత్తులో (క్రీస్తుపూర్వం తొలి సహస్రాబ్ది చివరి కాలం) త్రిమూర్తితత్వం వివరించబడింది తొలిసారిగా.

విష్ణువు, శివుడు, బ్రహ్మ, గణేశుడు, కార్తికేయుడు, పార్వతి, లక్ష్మి, సరస్వతి, దుర్గ, కాళి, మరియమ్మ, హరిహర, అర్ధనారీశ్వర, హనుమాన్, దేవతలు భారతదేశంలో ప్రముఖ దేవతలైనారు.

## పంచ భూతములు + తత్త్వములు

**అగ్ని–** దేవతల నోరు, హవ్యవాహనుడు, సర్వ భక్షకుడు, పావకుడు, సప్తజిహ్వ, వహ్ని, అనలుడు, హుతాశనుడు, చిత్రభాను, జ్వలన, వైశ్వానరుడు, విభావసు, ధూమకేతు, శిఖి, పింగేశ, ప్లవంగ, భూరితేజ, హిరణ్యకృత, రుద్రగర్వ.

## 36 తత్త్వములు

– పంచ భూతములు – పృధ్వి, జల, తేజస్సు, వాయు, ఆకాశం

– పంచ తన్మాత్రలు – గంధ, రస, రూప, స్పర్శ, శబ్దం

– పంచ కర్మేంద్రియములు – పాయు, ఉపస్థ, పాద, పాణి, వాక్కు

– పంచ జ్ఞానేంద్రియములు– ఘ్రాణ, రసన, చాక్షు, త్వక్, శ్రోతములు

– నాలుగు తత్త్వములు (అంతఃకరణములు) – ప్రకృతి, బుద్ధి, అహంకార, మనస్సు

ఈ ఇరవై నాలుగు ఆత్మ తత్త్వములు.

– ఇరవై అయిదవది – పురుషుడు (జీవాత్మ)

– అయిదు కంచుకాలు (వస్త్రాలు, తెరలు).

 – కాల – కాలం
 – విద్య – పరిమిత జ్ఞానం
 – రాగ – కోరిక
 – నియతి – కారణం
 – కళ – పరిమితి

– మాయ – దివ్యాత్వాన్ని మరుగుపరచే తెర.

– ఈశ్వరుడు – ఆత్మదర్శనం

– సదాశివుడు – శివ–శక్తి దర్శనం (క్రియా+జ్ఞానశక్తి)

– శక్తి – బిందుతత్త్వం

– శివ – నాదతత్త్వం

పంచ కృత్యములు (సృష్టి–స్థితి–లయం–మాయ–కరుణ)

పరమశివుడు – 36వ తత్త్వం

కాశ్మీరి శైవం – పరమశివుడి నుంచి జీవుడిని చేరడానికి 36 తత్త్వాల మెట్లున్న నిచ్చెనను ప్రబోధిస్తుంది. (లీల, దివ్యలీల).

## పంచ భూతములు

| భూతం | శరీరభాగం | అంగుళి | దేవి | లక్షణం | జ్ఞానేంద్రియ |
|---|---|---|---|---|---|
| **ఆకాశం** | జీవుడు | మధ్యవ్రేలు | భూమి | శబ్దం | చెవులు |
| **వాయువు** | ప్రాణము | చూపుడు వ్రేలు | అల–లహరి | స్పర్శ | చర్మం (త్వక్) |
| **అగ్ని** | వేడిమి | బొటన వ్రేలు | స్వాహా | రూప | కళ్లు |
| **జలం** | నీరు, ద్రవాలు, రక్తం | చిన్న వ్రేలు | వారుణి | రస | నాలుక |
| **భూమి** | మాంసం, ఎముకలు అవయవాలు | అనామిక | ఆకాశం–వరాహా | గంధ | ముక్కు |

వాయు (ప్రాణ) దోషం వలన వాతం; అగ్ని–జలం తేజస్సు మార్పుల వలన పైత్యం; జలం–పృథ్వి–ఓజస్సు మార్పుతో కఫం వస్తాయి.

## షట్చక్రాలు - పంచభూతాలు

మూలాధార చక్రం – పృథ్వి – నిలకడ, ఆధారం
స్వాధిష్ఠాన చక్రం – జలశక్తి – ఆనందం, ఆరోగ్యం
మణిపూర చక్రం – అగ్ని – శక్తి, తెలివితేటలు
అనాహత చక్రం – వాయు – కరుణ, ఆప్యాయత
విశుద్ధ చక్రం – ఆకాశ – నమ్మకం, సృజన
అజ్ఞ చక్రం – ఆకాశ – జ్ఞానం, భవిష్యద్దర్శనం
సహస్రార చక్రం – ఆకాశ – ముక్తి, ఏకత్వం

## పంచభూతములు - వాస్తు; రుచులు

తూర్పు – ఆకాశ తత్త్వం – అభివృద్ధి, సంపదలకు ద్వారం
పడమర – వాయు తత్త్వం – కదలిక, ఆనందం
దక్షిణం – అగ్ని తత్త్వం – అధికారం, నమ్మకం, కీర్తి
ఉత్తరం – జలతత్త్వం – ఆధ్యాత్మికం, ఆలోచనలు
మధ్య భాగం – భూతత్త్వం – స్థిరత్వం, శాంతిభద్రత

జల + నేల (మధురం); నేల + అగ్ని (పులుపు), జల + అగ్ని (ఉప్పు), వాయు + అగ్ని (చేదు); ఆకాశ + వాయు (కారం); వాయు + నేల (కషాయం) (మధుర, ఆమ్ల, లవణ, కటు, తిక్త, కషాయ రుచులు)

## గుడులు - గోపురాలు

గొబ్లెకి తెపె (Gobekli Tepe) దక్షిణ టర్కీలో– 11600 సంవత్సరాల క్రితం నిర్మించిన దేవాలయం ఉన్నది. అప్పటికింకా లిపి, చక్రం కనుగొనబడలేదు.

1479 BC నాటి హాట్సెప్ షట్ (మహిళా ఫారో) సూర్య దేవాలయం (Amon - Ra) నిర్మించింది ఈజిప్టులో (Deir el-Bahari-Egypt).

5000 ఏళ్ల క్రితమే శాలిస్ బరీ – ఇంగ్లండ్‌లో స్టోన్‌హెంజ్, మాల్టాలోని హగార్ క్విమ్ (3700 BC), గగాంటిజా (మాల్టా) ఉర్‌లోని జిగ్గురాట్ (2000 BC), క్రెటెలోని Knossos Palace (2000-1900 BC), ఈజిప్టులోని Temple of Luxor, Karnak (1400-1000 BC); సొలొమాన్ దేవాలయం; ఎల్లోరా లోని కైలాస దేవాలయం; నాదీశ్వర దేవాలయం పురాతనమైనవి.

ఇండియాలో అధికారికంగా ప్రకటించబడిన దేవాలయాలు 6,48,907;

**పాంచరాత్రములు–** 1) అభిగమ్న–ఉదయ ప్రార్థనలు, సేవలు; 2) ఉపాదాన– కైంకర్యములు తెచ్చుట; 3) పూజ; 4) స్వాధ్యాయ – దైనందిన అభ్యాసం; 5) యోగ, ధ్యానం.

వాసుదేవ–జ్ఞాన; సంకర్షణ–బల; ప్రద్యుమ్న–ఐశ్వర్య, అనిరుద్ధ–శక్తి (ఇవి వ్యూహాలు).

## భారతం - కృష్ణ భక్తి

ద్వాదశాదిత్యులలో ఒకరైన విష్ణువులో కృష్ణుడిని విలీనం చేయడం అనే ప్రక్రియ దశలవారీ జరిగిందనేది పండితుల అభిప్రాయం.

భారత రచన 400 BC - 400 AD మధ్యకాలంలో జరిగి ఉంటుందనే వారి ప్రకారం జయం కథను కార్ష్ణ వేదంగా వ్యాసుని శిష్యులు చేసారని అభిప్రాయపడుతున్నారు.

వృష్ణి త్రయం – మధురకు 170 కిలోమీటర్ల దూరంలో గ్వాలియర్‌కు 50 కిలోమీటర్ల దూరంలో 'మోహన' పట్టణం దగ్గర పార్వతి నది కుడివేపు త్రికుల అనే చోట ఉన్న రాతి గోడలపై 300–200 BC కాలం నాటి కుడ్యచిత్రాలు– సంకర్షణ, వాసుదేవ–కృష్ణ, ఏకనాంశ (యోగమాయ)ను సూచించే బొమ్మలను కనుగొన్నారు.

అగాథొక్లిస్ (బాక్ట్రియా) నాణెములు (190–180 BC) హిలియొడొరస్ గరుడధ్వజ స్తంభంపై శిలాక్షరాలు (110 BC) హతిబాద ఘోషుండి శిలాక్షరాలు (100 BC) ఇవన్నీ వాసుదేవ కృష్ణుడిపై ప్రజల ఆరాధనను తెలుపుతున్నాయి.

స్థానికులు జరిపే వీర పూజలలోని వీరులు మధురా ప్రాంతంలో పంచవృష్ణి వీరులుగా పేరుపొందారు. 1) సంకర్షణుడు, 2) వాసుదేవ కృష్ణుడు, 3) ప్రద్యుమ్నుడు, 4) సాంబుడు, 5) అనిరుద్ధుడు.

## 96. కాలరేఖ (సంవత్సరాలలో)
### (315000 నుంచి 3200 B.C. వరకు)

315000 – మొరాకొలో హొమొసెపియన్స్ (తెలివిగల మానవుడు)
270000 – Y క్రోమోజోమ్ ఏడమ్
230000 – Terre Anata - తొలి ఇల్లు లాంటి నిర్మాణం
230000 – 150000 – మైటొఖాండ్రియల్ ఈవ్
210000 – గ్రీసు దేశంలో మానవుడి రాక
200000 – దోమలు, నల్లులు లేకుండా గడ్డిపరుపు నిర్మాణం
170000 – తొలి దుస్తులు
130000 – క్రెటెకు తొలి పడవ ప్రయాణం
120000 – ఎముకలు, గవ్వలు, ఆభరణాలు, అలంకారాలు
100000 – అర్ధచంద్రాకార పునాదులు, రాళ్లతో
75000 – టోబా జ్వాలాముఖి విస్ఫోటనం (మానవ జనాభా 15000)
70000 – గుహలలో కుడ్య చిత్రాలు – దక్షిణాఫ్రికా
50000 – సూది తయారి (డెనైసొవన్లు)
45000 – యూరప్‌లోకి హొమోసెపియన్ల తొలి వలస
42000 – భూ అయస్కాంత క్షేత్రం వ్యతిరేకదిశకు మారింది

42000 – వేణువుల నిర్మాణం (జర్మనీ)
40000 – నియాండెర్తల్స్ అదృశ్యం
31000 – వంటగది, కుంపటి (మధ్య యూరపు)
30000 – భింబెట్కా గుహలలో కుడ్య చిత్రాలు– ఇండియా
28000 – తొలి తాళ్లు, కుండలు
25000 – రాక్షసబల్లుల ఎముకలు, రాళ్లతో ఇళ్లున్న ఊరు (మొరావియా – చెకొస్లొవేకియా)
25000 – సైబీరియా మీదుగా అమెరికా ఖండంలోకి
23000 – పెంపుడు కుక్కలు
20000 – కుండల వాడుక (చైనా)
14000 – తొలి యుద్ధం (నటుఫియన్ నాగరికత – ఈజిప్టు)
13000 – గొర్రెల పెంపకం
12000 – తగ్గి మళ్లీ వచ్చిన మంచుయుగం
12000 – ఈజిప్టులో అగ్నిపర్వత విస్ఫోటనం (నైలునది కుదింపు)
9600 BC - (11600) చలి తగ్గి, వేడి పెరిగింది
9600 BC – జెరికొ – జొర్డాన్ లోయ – పాలస్తీనా
9400 BC – పందుల పెంపకం
9000 BC – సముద్ర మట్టం పెరిగింది (25 అడుగుల ఎత్తు)
8900 BC – కర్ర పెండలం (Cassavva) తొలి పంట
8800 BC – బిబ్లాస్ – లెబనాన్
8500 BC – పశువుల పెంపకం
8000 BC – మేకల పెంపకం
8000 BC – రకరకాల జంతువుల అంతర్ధానం (Quaternary extinct)
8000 – 7000 BC ఇరాక్‌లో గోధుమ, బార్లీ పంటలు – నాగలి ప్రత్యక్షం
7500 BC – సటల్ హుయుక్ – టర్కీ–అనటొలియా–గ్రామం
7500 BC – పిల్లి పెంపుడు జంతువుగా
7200 BC – అమ్మాన్–జోర్డాన్‌లో మానవుల స్థిర నివాసం
7000 BC – యూరొపియన్ రైతులు, వేటగాళ్లు సంచారం
7000 BC – పాపువా న్యూగినిలో వ్యవసాయం. అరటి, చెరకు, చిలగడదుంపలు, కాసొవెర్రి, గుడ్లు
మెహ్రఘర్‌లో వ్యవసాయం (బెలుచిస్తాన్)
6000–3000 BC - చైనాలో తొలి వ్రాత, లిపి
5500 BC – సెర్బియాలో రాగి కరిగించడం
4500 BC – బల్గేరియాలో బంగారం నిల్వలు
4000 BC – ఇరాక్–మధ్యధరా సముద్రం వద్ద నాగరికత
గుర్రాల మచ్చిక, కోళ్లపెంపకం, కుమ్మరి చక్రం
3700 BC – ఉక్రెయిన్‌లో మూడంతస్థుల భవనాలు
3500 BC – ఉరుక్ యుగం సుమేరియాలో
ఈజిప్టు మమ్మీలు, ఇండస్ లిపి,
సింధులోయ నాగరికత

3200 BC – ప్రొటొ ఇండొ యూరొపియన్ భాష
సుమెరియన్ కోణాకృతి లిపి – చరిత్ర ప్రారంభం

1800 BC – Linear-A, Cypro Minoan Script
మైసీనియన్ గ్రీకు (1450 BC), ఒరాకిల్ బోన్స్ (1200 BC) చైనా;
అల్ఫాబెటిక్–ఫొనిషియా (1000 BC)

ప్రపంచపు తొలి నాగరికతలు– సుమేరియన్, ఈజిప్టు, సింధులోయ, ఎర్లిగాంగ్ నాగరికత, పసుపునదీ ప్రాంతం, కారల్ సుపి – మధ్య అమెరికా.

ఉరుక్, జెమెదెత్ నాసర్ – సుమేరియన్ ప్రాంతపు ప్రాచీన జనావాసాల దగ్గర తొలి లిపుల జాడలు లభించాయి. సుమేరియన్లు వారి దేశాన్ని కెన్‌గిరీ – ఉన్నత ప్రభువుల దేశంగా వారి భాష ఎమెగిర్‌గా పిలుచుకునేవారు. తమను తాము కృష్ణ శిరస్సులు–నల్ల తలల ప్రభువులుగా (సగ్గిగ్గలు) (సల్మత్ ఖఖ్ఖదులు). వీరి భాష ప్రొటొ–ఇండొ యూరొపియన్ భాషలకు భిన్నమైనది.

మంచుయుగం తరువాత (10000–5000 BC) ఉబైదీ, ఉరుక్, జెమెదెత్ నాసర్, తొలి రాజ్యపాలన కాలం 2900–2800 BC; ఎరిడు, దుముజి, లరక్, సెప్పర్, షురుప్పక్ (2900 BC) – ఈ కాలంలో జలప్రళయం సంభవించింది. జియుశుద్రుడు (శ్రాద్ధదేవుడు, అత్రహాసిస్, ఉత్నాపిస్తిమ్, నోవా) సుమేరు ప్రాంతానికి ప్రభువు ఆ కాలంలో.

2800 – 2600 BC – గిల్గామేష్

2334 – 2154 BC – అక్కడియన్లు

1736 – 1475 BC – బాబిలోనియన్లు

దేవతల వాకిలిగా పేరున్న బాబిలోన్ నగరం క్రీస్తుపూర్వం 1894 నుంచి క్రీస్తుశకం 1000 వరకు సుమెరియన్, అక్కడియన్, అమొరైట్లు, కస్సైట్లు, అస్సిరియన్లు, కాల్డియన్లు (చాల్డియన్లు), అఖిమినిడ్లు, హెల్లెనిస్టు గ్రీకులు, పార్థియన్లు, సస్సానియన్లు, ముస్లిం కాలిఫేట్లతో పాలింపబడింది. బాబిలోనియన్ దేవతలు – ఎన్‌లిల్, ఎంకి, ఇనాన్నా, నాబు, నన్నసువెన్, నిస్బూర్‌సాగ్, ఉటు.

కస్సైట్లు 1595 – 1155 BC; మితాన్ని (1550–1260 BC) – వీరికి ఇండొ యూరొపియన్ల పేర్లున్నాయి.

బాబిలోన్‌ను కురుదునియా (కర్దునియా) అని పిలిచారు. ఇదే సమయంలో ఈజిప్టును హిక్సాస్ (Hyksos) (1650 – 1550 BC) పాలించారు? (ఇక్ష్వాకులు).

కస్సైట్లను ఎలమైట్లు (1500–500 BC) ఓడించారు. ఎలమైట్లకు సింధులోయ ప్రజలకు మధ్య వర్తక సంబంధాలుండేవి. సింధులోయ ముద్రికలు, కార్నెలియన్ ఆభరణాలు హరప్పా నాగరికతకు చెందినవి ఎలమైట్ల సుసా (Susa) తవ్వకాలలో లభించాయి.

అస్సిరియన్ సామ్రాజ్య ప్రాభవం 1305 BC నుండి 609 BC వరకు సాగింది. సెన్నా ఛెరిబ్ (705–681 BC), అషురబనిపాల్ (669–631 BC) ప్రసిద్ధులైన ప్రభువులు.

ఇరాక్‌లోని ఉర్–కస్దిమ్ (బస్రా) నుంచి బయల్దేరి అబ్రహామ్ టర్కీలోని 'హరాన్' ప్రాంతంలో అయిదేళ్లుండి అక్కడ నుంచి కానాన్ (పాలస్తీనా)లోని షెచ్‌మ్ చేరుకున్నాడు. అతడితో పాటు అతడి భార్య సారా, తన సోదరుడు హరాన్ కుమారుడు లాట్, గొర్రెలమంద, గొర్రెల కాపరులు ఉన్నారు. తరువాత కాలంలో అబ్రహాంకు ఇస్మాయెల్, ఇసాక్‌లు జన్మించారు. ఇసాక్‌కు ఇసావు, జాకబ్‌లు కవలపిల్లలు. జాకబ్ (ఇజ్రాయెల్‌గా పిలవబడినాడు)కు పన్నెండు మంది పిల్లలు. వీరిలో జోసెఫ్ ఈజిప్టులో ఉన్నత పదవి పొంది తన తండ్రిని, సోదరులను ఈజిప్టుకు ఆహ్వానించాడు. ముప్పై ఏళ్లు గడిచాయి. అబ్రహాం వారసులైన ఈ కుటుంబాల ఉన్నతిని చూసి ఫారో వారిని కట్టుబానిసలుగా మార్చినాడు. 430 ఏళ్లు ఇజ్రాయెల్ వారసులు ఈజిప్టులో ఉన్నారు. ఒక్క కుటుంబం ఈజిప్టు నుంచి బయటపడేసరికి ఆరు లక్షల మంది ఉన్న సముద్రంలా బయల్దేరింది.

నలభై ఏళ్లు ఎడారిలో తిరిగి, తిరిగి మోసెస్ మరణానంతరం జాషువా నాయకత్వంలో కానాన్ చేరుకున్నారు. కెనాన్ (దిగువ భూములు); అరామ్ (ఎగువ భూములు), కెనాహు అంటే ఊదారంగు. నత్తల నుంచి తయారు చేసేవాళ్లు. ఇది ఫొనిషియా– ఖర్జూర, రక్తవర్ణం – 1800 BCలో ఫొనిషియాను పాలించిన రాజు పేరు అభిషేము, 969–936 BC

వరకు పాలించిన రాజు హిరాము. 831-785 BC వరకు పాలించిన రాజు పిగ్మాలియన్. తొలి అక్షరమాల ఫొనిషియాలో తయారయ్యింది. పిగ్మాలియాన్ సోదరి డిడొ. బుర్సా, కార్థేజిని నిర్మించింది.

పాలస్తీనా-పలాస్తు-ఫిలిస్తినియన్లున్న ప్రాంతం, అబ్రహాంకు దేవుడిచ్చిన దేశంగా ఇజ్రాయెల్‌ల పరమైంది. 12 తెగల ఇజ్రాయెలీలలో 10 తెగలు అదృశ్యం కాగా మిగిలిన రెండు తెగలు వారి వారసులు ప్రపంచ యుద్ధాల తరువాత మరల పాలస్తీనాలో భూములు కొనుక్కుని తమ రాజ్యాన్ని స్థాపించుకున్నారు ఇజ్రాయెల్‌గా.

## ప్రొటో-ఇండో-ఇరానియన్లు - ఇండో-ఆర్యన్లు

సింటాష్టా నాగరికత (2100 - 1800 BC)

ఆండ్రోనొవా నాగరికత (1800-1400 BC)

అరల్ సముద్ర ప్రాంతం - కజకస్తాన్, తుర్కమనిస్తాన్, ఉజ్బెకిస్తాన్ ప్రాంతాలు. ఇరానియన్ల నుంచి విడిపోయి కొందరు అక్కడే ఉండిపోయారు, కొందరు వెనక్కి మళ్లినారు మితాన్ని నాగరికతగా, కస్సైట్లుగా, హిక్సాస్‌గా. కొందరు సింధు మైదానంలో స్థిరపడినారు. త్రత్సుభరతులు, యయాతి వంశస్థులైన ద్రుహ్యు, పూరు, తుర్, యక్ష (యదు) దశరాజ యుద్ధంలో సప్త సింధు దేశాల నుంచి నడక సరస్వతి, యమునా నది వేపు సాగింది. వీరిలో కొందరు సూర్య వంశస్థులై గంగానది దాటి సరయూ నది వద్ద అయోధ్య నగరాన్ని స్థాపించుకున్నారు.

చంద్ర వంశీయులు కురు పాంచాలు తెగలుగా తరువాత అనేక రాజ్యాలుగా విడిపోయారు.

హస్తి ప్రభువు హస్తినాపురాన్ని నిర్మించగా ఆనాటి రాజకీయాలకు హస్తినాపురం కేంద్ర బిందువైనది.

## 97. భారతదేశం - లిపులు

### సంస్కృత భాష-

వేద సంస్కృతం - 1500-600

క్లాసికల్ సంస్కృతం - 700 BC - 1350 CE

మౌఖికంగా ప్రచారంలో ఉన్న సంస్కృతం అపౌరుషేయంగా, శ్రుత సాహిత్యంతో ఉండి క్రీస్తుపూర్వం 100 BC నాటికి బ్రాహ్మిలిపిలో వ్రాయబడింది.

ఇతిహాస (రామాయణ, మహాభారతములు)

పురాణ సంస్కృతం (400-300 BC) క్లాసికల్ సంస్కృత శైలిలో వ్రాయబడినవి. ప్రాచీన గ్రీకుభాషా సాహిత్యం, అవెస్తన్ 'గాథ'లు, ఇలియాడ్-హోమర్ రచన ఋగ్వేదపు స్తోత్రాలను పోలి ఉండడం గమనార్హం. సంస్కరించబడిన భాషగా, ప్రాకృతాది పూర్వభాషల నుంచి పుట్టినట్లు భావించవచ్చు.

వేద సంస్కృతం - 1500-500 BC

మైసినియన్ గ్రీకు - 1450 BC

ప్రాచీన గ్రీకు - 750-400 BC

హిట్టైట్లు - 1750-1200 BC

శతం (వంద) - Centum భాషలుగా - సెల్టిక్, ఇటాలిక్, వెనెటిక్, హెల్లెనిక్, ఫ్రిజియన్, జర్మానిక్, అనటొలిక్, టొకారియన్, అల్బెనియన్, థ్రాసియన్, ఆర్మేనియన్, స్లావిక్, బాల్టిక్, ఇరానియన్, నూరిస్తాని, ఇండిక్ భాషలలో ఉన్న పోలికల వల్ల ఇవన్నీ ప్రొటొ ఇండొ యూరొపియన్ భాషావృక్షానికి చెందినవిగా చెప్పబడ్తున్నాయి.

ఉరల్-కాస్పియన్-నల్ల సముద్ర తీరాల నుంచి ఇరాన్ దాటి ఇండియా వేపు అశ్వారూఢులై, రథాలపై, పశువులను తోలుకుంటూ సప్తసింధు మైదానం వేపు అలలు అలలుగా వలసలు అటూ యిటూ పోతున్నకాలంలో భాషలు విడివడినాయని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం.

పాణిని (600-400 BC) అష్టాధ్యాయి, పతంజలి మహాభాష్యం, కాత్యాయనుని వ్యాఖ్యానాలు సంస్కృత భాషను క్లాసికల్ సంస్కృతంగా తీర్చిదిద్దాయి. పాణిని తన సంస్కృత వ్యాకరణాన్ని ఉత్తర బ్రాహ్మిలిపిలో వ్రాసి ఉంటాడు. నగరి లిపి

(600 CE) ఆ తరువాత కాలంలో వచ్చింది. పాణిని తన కన్న ముందు– అపిసాలి, కశ్యప, గార్గ్య, గాలవ, చక్రవర్మణ, భరద్వాజ, శాకతాయన, శాకల్య, సేనక, స్ఫోతాయన వైయాకరణుల గురించి వ్రాసినాడు. పాణిని కాలం నాటికి సంస్కృతం ఏ లిపిలో వ్రాయబడిందో ఇదమిత్థంగా తెలియరావడం లేదు.

ప్రాకృత భాషలు– అపభ్రంశ, అర్ధమాగధి, ద్రమిళి, ఏలు, గాంధారి, కామరూపి, మాగధి, మహారాష్ట్రి, పైశాచి, పాలి, శూరసేని, ఖాస.

నాటక ప్రాకృత భాషలుగా– శూరసేని, మాగధి, మహరాష్ట్ర ప్రాకృతిలను వాడేవారు. మిగతావి ప్రాచ్య, బాహ్లిక, దక్షిణాత్య, శకారి, చండాలి, శబరి, అభీరి, ద్రమిళి, ఒఢ్రి; వనచరులు ద్రమిళిలో, నాయిక ఆమె చెలికత్తెలు శూరసేనిలో, దొంగలు, దుర్మార్గులు అవంతి ప్రాకృతంతో మాట్లాడేట్లు నాటకాలలో నియమం ఉండేది. అశోకుని శాసనాలు, శిలాక్షరాలు ప్రాకృతంలో ఉన్నాయి. దెరవాడ బుద్ధ సాహిత్యం 'పాలి' భాషలో వ్రాయబడింది.

హాలుడి గాధా సత్తశతి, ఆనందవర్ధనుడి – అయిదు బాణాల దేవుడు, సర్వశేనుడి హరి విజయం ప్రాకృత భాషలో వ్రాయబడినాయి. 'బృహత్కథ' పైశాచి భాషలో వ్రాసినాడు గుణాఢ్యుడు.

13వ శతాబ్దం వరకు భారతీయ ప్రధాన భాషగా ఉన్న సంస్కృతం. ముస్లిముల దండయాత్రలు, పాలనలో క్రమేపీ నిర్లక్ష్యం చేయబడింది. పర్షియన్, అరబిక్, ఉర్దు భాషల ప్రాముఖ్యత పెరిగింది.

వ్యాసుడు చెప్పగా గణేశుడు వ్రాసిన మహాభారతం చానాళ్లు మౌఖికంగా ప్రచారంలో ఉన్నది. వైశంపాయనుడు, ఆ గాధను సర్పయాగ సమయంలో జనమేజయుడికి వినిపించాడు. దానిని విన్న ఉగ్రశ్రవసుడు సత్రయాగ సమయంలో శౌనకాది మునులకు వినిపించాడు.

మహాభారతపు ప్రాచీన ప్రతి ఖరోష్ఠి లేదా బ్రాహ్మి లిపిలో వ్రాయబడిందని పరిశోధకుల భావన.

సిద్ధార్థ బుద్ధుడు 64 లిపులు నేర్చుకున్నాడని 'లలిత విస్తారం'లో వ్రాయబడి ఉన్నది.

### వ్రాత విధానాలు – Writing Systems

Logosyllabary - అర్థమిచ్చే పదం – చైనీస్

Syllabary - అక్షరం / సంయుక్తాక్షరం – కానా

Abjad (హల్లులు) – అరబిక్

Alphabet – అక్షరమాల – లాటిన్

Abugida – హల్లు తరువాత అచ్చు; హల్లుతో కూడిన అచ్చు – దేవనాగరి

Featural System – కొరియన్ హంగుల్

## II

96 మిలియన్ల ప్రజలు మాట్లాడే భాష తెలుగు భాష. "ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్"గా, "దేశ భాషలందు తెలుగు లెస్స" గా పేరు పొందింది. ఆరు క్లాసికల్ భాషలలో ఒకటిగా, 22 షెడ్యూల్డ్ భాషలలో ఒకటిగా భారత ప్రభుత్వంచే గుర్తించబడింది. ప్రపంచంలో ఎక్కువమంది మాట్లాడే భాషలలో 14వ స్థానం తెలుగుది.

ప్రొటొ ద్రవిడియన్ భాషల నుంచి క్రీస్తుపూర్వం 1000 నాటికి విడివడింది తెలుగు. అవధాన ప్రక్రియ తెలుగు భాషకు ప్రత్యేకం.

తెన్– అంటే దక్షిణం. భట్టిప్రోలు శాసనం (400–100 BC) – అమరావతి స్తంభంపై ఉన్న 'నాగబు' అనే శిల్పకారుడి పేరు (200 BC) తెలుగు భాష ప్రాచీనతను సూచిస్తున్నాయి.

పూర్తి తెలుగులో వ్రాయబడిన శాసనం 575 CE లోది కడప రేనాటి చోళ ప్రభువు ధనంజయుడు వేయించినదిగా భావిస్తున్నారు.

సంస్కృత, ప్రాకృత భాషా ప్రభావమున్న తెలుగును రాజసభలలో సాహిత్యంలో వాడేవారు.

నన్నయ మహాభారతాన్ని గ్రాంధిక భాషలో వ్రాసినాడు. జనసామాన్య భాషకు దూరంగా ఉన్న తెలుగు భాష అది.

కన్నడ అక్షరమాల నుంచి విడివడిన పూర్తి తెలుగు భాషలో తిక్కన మహాభారతాన్ని– విరాట పర్వం నుంచి స్వర్గారోహణ పర్వం వరకు వ్రాసినాడు.

తత్సమ తద్భవ పదాలతో తెలుగులో దాదాపుగా 80 శాతం సంస్కృత పదాలు సంస్కృతాన్ని తెలుగు భాష మింగిన రీతిలో కానవస్తాయి (David Shulman). (ఇప్పుడు ఇంగ్లీషును మింగుతున్నట్లు).

అద్దంకి కవిత (900 CE), మల్లియరేచన - కవిజనాశ్రయం (పూర్వ నన్నయ ఛందస్సు-940 CE), ఆదికవి పంప - జైనేంద్రపురాణం (941 CE), నన్నయ మహాభారతం (చంపూ శైలి-11వ శతాబ్దం), తిక్కన (1205-1288), ఎర్రాప్రెగ్గడ (14వ శతాబ్దం), మారన, కేతన, మల్లన, సుమతీ శతకం వ్రాసిన బద్దెన భూపాలుడు, పాల్కురికి సోమనాధుడు (బసవ పురాణం), గోన బుద్ధారెడ్డి (రంగనాథ రామాయణం), అష్టదిగ్గజములు, పోతన, శ్రీనాథుడు, ఇలా ఎందరో కవులు నాటి నుంచి నేటి వరకు తెలుగు భాషను పరిపుష్ఠం గావించారు.

## III

'జయమ్' వ్యాస ప్రోక్తమైన భారతం కార్ష్ణ వేదంగా మారింది, వాసుదేవ కృష్ణతత్వాన్ని ఎప్పుడు స్వీకరించిందో, పరిశోధనలలో తేల్చవలసి ఉంది. భండార్కర్ ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్ వారు 50 సంవత్సరాల పాటు, 1259 వ్రాత ప్రతులను పరిశీలించి - 18 పర్వాలు, 89000 శ్లోకాలున్న క్రిటికల్ ఎడిషన్‌ను సెప్టెంబర్ 22, 1966లో ఆనాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చేతుల మీదుగా విడుదల చేసారు.

భారతదేశంలో అప్పటికే ప్రచారంలో ఉన్న కథలో కథలో కథ పద్ధతి (Frametales) - పంచతంత్ర కథలు, హితోపదేశం, విక్రమ-భేతాళ కథలు, రామాయణ, మహాభారత రచనలలో వాడబడింది.

ఈజిప్ట (మాటకారి రైతు, ఓడ ధ్వంసమై తీరానికి చేరిన నావికుడి కథలు), పర్షియన్ (1001 రాత్రుళ్ల (అరేబియన్) కథలు), డెకామెరాన్, కాంటర్‌బరీ కథలు ఈ Frametales పద్ధతిలోనే వ్రాయబడినాయి.

వ్యాసుడు వ్రాసిన భారతాన్ని తొలుదొల్త తక్షశిలలో సర్పయాగ సమయాన వైశంపాయనుడు జనమేజయుడికి వినిపించాడు. దానిని ఉగ్రశ్రవసుడు సత్రయాగమప్పుడు శౌనకాది మునులకు నైమిశారణ్యంలో వినిపించాడు.

మౌఖిక స్థితి నుంచి ఖరోష్ఠి లేదా బ్రాహ్మి లిపిలో గ్రంథస్థమైన మహాభారతం వ్రాతప్రతులు ఆశ్రమాలలో, రాజాస్థానాలలో తాళపత్రాలపై వ్రాయబడి అనేక ప్రతులుగా వర్తకులు, మత ప్రచారకుల ద్వారా తూర్పు దేశాలకు చేరుకున్నాయి.

సిల్కుదారిలో కిజిల్ గుహలలో (షిన్ జియాంగ్-చైనా) లభించిన వ్రాతప్రతులు వెయ్యి తాళపత్ర గ్రంథాలు (80-230 CE)లో కుషాణ కాలం నాటి బ్రాహ్మిలిపిలో వ్రాయబడినవి, గుప్తుల కాలం మొదటిభాగం నాటివి లభ్యమైనాయి. బౌద్ధ గ్రంథాలు, అర్ధశాస్త్రం, మనుస్మృతి, న్యాయవైశేషిక, తర్కశాస్త్ర వ్యాఖ్యానంలతో పాటు మహాభారతం లభ్యమయ్యింది. దీనిలో అనుశాసనిక పర్వం, విరాట పర్వం లేకపోవడం గమనార్హం. వీటిని మారిట్జ్ స్పిట్జర్ (Maris Spitzer) బృందం 1927-28లో పరిశీలించింది.

## 98. హిందూ మతం

సింధు లోయ నాగరికత (1750 BC)

వేదకాలం (1750-500 BC)

నగరీకరణ (600-200 BC)

క్లాసికల్ పిరియడ్ (200 BC - 1200 CE)

- ప్రి క్లాసికల్ (200-300 CE)
- గుప్తుల స్వర్ణయుగం (320-650 CE)
- లేట్ క్లాసికల్ (650-1200 CE)

మధ్యయుగం - (1200-1500 CE)

సింధులోయ నాగరికతా కాలంలో పశుపతి, శివ, రుద్రులకు చెందినవిగా భావించే ముద్రికలు లభ్యమైనాయి. అందుకే శివుడిని ఆదిదేవుడిగా భావించి ఉండవచ్చు.

వేదకాలం దేవతలు- ద్యుపితరుడు, ద్యా-పృధ్వి, ఇంద్రుడు

అగ్ని, ఉషస్సు, సూర్య, అప్పు-జలాలు, మిత్రా-వరుణులు, ఆర్యమన్, భగ వీరు ఋగ్వేద దేవతలు.

ఋతం (విశ్వ క్రమణిక), సత్యం ఆధారంగా సమాజ ప్రవర్తన నిర్దేశించబడింది. ధర్మం, న్యాయం, ఆశ (అవెస్తా) నైతిక ప్రవర్తన కోసం ఉద్దేశించబడినాయి.

వేదకాలం తరువాత అందరూ బ్రాహ్మణులే అన్న బ్రాహ్మణీయ మతం ధర్మసూత్రాలు, ధర్మశాస్త్రాలు రూపొందించింది. స్థిరనివాసం వలన పోగుపడుతున్న సంపదలు, పెరుగుతున్న జనాభా రక్షణకు, హింసను అదుపులో ఉంచడానికి గణనాయకులకు రాజు అవసరం ఏర్పడింది. కుటుంబ వ్యవస్థలో పెద్దలను గౌరవించేవారు. ఊరికి గ్రామపెద్ద, నగరానికి ప్రభువును ఎన్నుకున్నా తొలగించే హక్కు కూడా ఉండేది. ఇంద్ర పదవి ఇచ్చి నహుషుడిని గౌరవించారు, తప్పు చేసాక తొలగించారు. అలా రెండవ వర్గం బ్రాహ్మణ సంపదలైన భూమి, జ్ఞానం రక్షణకు తమలో భుజబలుల్ని క్షత్రియులుగా నియమించుకుని వారికి యుద్ధ విద్యలలో తర్ఫీదునిచ్చారు.

కాలంతో పాటు వంశపారంపర్య హక్కులు, ఇతర సంపదలు బాధ్యతలు పెరగగా పశుపోషణ, వ్యాపారాలు చూసుకోవడానికి తెలివి, బలం తక్కువగా ఉన్నవారికి ఆ బాధ్యతలప్పగించి వారిని వైశ్యులుగా పిలిచారు. ఈ విధంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు - ద్విజులు-గా త్రివర్ణాలేర్పడినాయి.

బ్రాహ్మణులు అగ్నిహోత్రాలు, విద్యలను వృద్ధి చేస్తుంటే, క్షత్రియులు రక్షణ భారం తీసుకునగా, వైశ్యులు ఇరు వర్గాలకు కావల్సిన సంపదల సృష్టికర్తలైనారు. ఈ మూడు వర్ణాలకు సేవ చేయడానికి దస్యులు-ఓడింపబడిన ప్రజలు శూద్రులైనారు. సేవాధర్మం వీరి వృత్తి (సంపదలను సృష్టించేవారు వాస్తవానికి వీళ్లే).

వర్ణములు నాలుగైనాక వర్ణ సంకరం సాధారణం కావడంతో దానిని ఆపడానికి తీవ్ర నిబంధనలు అమలు పరచారు. శూద్రులలోని వృత్తిపరమైన శాఖలు కులాలైనాయి. శూద్రులతో ద్విజుల సంకరం వలన పుట్టినవారిని అయిదవ వర్ణంగా ఊరినుంచి వెలివేసారు.

శూద్రులకు, నిమ్నకులాలకు విద్యార్హత లేకుండా జాగ్రత్త పడినారు. క్షత్రియధర్మం వర్ణసంకరం కాకుండా చూడడమైనది. ఎప్పుడైనా క్షత్రియులు బ్రాహ్మణులకు ఎదురుతిరిగినా, నిర్లక్ష్యం చేసినా పరశురాముడి మార్గమో, శ్రీరాముడి మార్గమో, భారత యుద్ధ మార్గాన్నో అవలంబించి క్షత్రియులను తమ దారిలోకి తెచ్చుకునేవారు బ్రాహ్మణులు. ఈ విషయాలు మహాభారతంలో స్పష్టంగా పేర్కొనబడినాయి.

రెండు సభలు (మయసభ, ద్యూత సభ), రెండు యాగాలు (రాజసూయ, అశ్వమేధ), రెండు నిండు సభలో అవమానాలు (ద్రౌపది వస్త్రాపహరణం, కీచకుడి దౌష్ట్యం), రెండు ప్రతిజ్ఞలు (భీష్మ, భీమ), రెండు పక్షాలు (కౌరవ, పాండవులు), రెండు వ్యూహాలు (శకుని, కృష్ణుడు), రెండు స్నేహాలు (దుర్యోధన-కర్ణులు, కృష్ణార్జునులు), రెండు శత్రుత్వాలు (ద్రుపద-ద్రోణులు, సోమదత్త-సాత్యకి), ఇద్దరు పంచభర్తృకలు (కుంతి, ద్రౌపది), ఇద్దరు అంధులు (ధృతరాష్ట్రుడు-గాంధారి), ఇద్దరు నీతిపరులు (విదురుడు-సంజయుడు), ఇద్దరు తటస్థులు (బలరాముడు, రుక్మి), ఇద్దరు కురువృద్ధులు (భీష్ముడు, బాహ్లికుడు), ఇద్దరు ధనుర్విద్యాచార్యులు (ద్రోణుడు, కృపుడు), ఇద్దరు సారధులు (కృష్ణుడు, శల్యుడు), కవలలు (నకుల, సహదేవులు) - ఇలా ఎందరో ద్వయాలై మహాభారత యుద్ధ గమనాన్ని శాసించారు.

ఉపనిషత్కాలం నాటికి గృహస్థులైన యజమానులకు, సన్యాసులైన శ్రామణులకు మధ్య విభేదాలేర్పడినాయి.

బౌద్ధ, జైన మతాలు ప్రజలలో వ్యాప్తి చెందాయి. యుద్ధపు హింసను, కన్నీళ్లను, దుఃఖాన్ని అనుభవించిన వారికి అహింసా మతాలైన బౌద్ధ, జైన మతాలెంతో ఊరటనిచ్చాయి. 535 BC లో అఖిమినిడ్లు-పర్షియా నుంచి వచ్చి సింధు లోయపై దండెత్తినారు. అదే దారి అనేక విదేశాలు హిందూ దేశంపై దాడిచేయడానికి ఉపయోగపడింది. ఎక్కువ దాడులు ధనతృష్ణతో, కొద్ది దాడులు జ్ఞానతృష్ణతో కూడినవి. అలెగ్జాండర్ దండయాత్ర తరువాత ఏర్పడిన మౌర్య సామ్రాజ్యం (322-185 BC)లో అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించాక బ్రాహ్మణమతం క్షీణదశలోకి వచ్చింది.

200-100 CE ప్రాంతం 'స్మృతి' కాలం. శివుడు, విష్ణువు, ఇంద్రుడు, ఉపేంద్రుడు ప్రముఖ దేవతలైనారు. రామాయణ, మహాభారత గ్రంథాలు వ్రాయబడి విస్తృతినొందినాయి. భగవద్గీత హిందూ చింతనకు పరాకాష్ఠ.

సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, పూర్వ మీమాంస, వేదాంతంలు వ్రాయబడినాయి.

వైష్ణవ ధర్మం ప్రాచుర్యంలోకి రావడం ప్రారంభమైనది. 320-650 CE ప్రాంతంలో గుప్తులు, పల్లవుల కాలంలో హిందూమతం ఉచ్ఛస్థితికి చేరుకున్నది. ఉత్తర మీమాంస, అద్వైతం, యోగ, దైవభావనల మిశ్రమంగా 'స్మార్త' సిద్ధాంతం బహుళ వ్యాప్తికి నోచుకోగా, రామాయణ, మహాభారత, పురాణ గ్రంథాలు దేశమంతటా ప్రచారంలోకి వచ్చాయి.

క్రీస్తుశకం తొలి శతాబ్దంలోనే నావికా వ్యాపారస్తులతో పాటు బౌద్ధ, హిందూ మత ధర్మాలు, సాహిత్యం తూర్పు దేశాలలో వ్యాపించింది. బర్మా, సియామ్, కంబోడియా, వియత్నాం, చైనా, జపాన్ దేశాలలో హిందూ దేశపు మతాలు వ్యాప్తి చెందాయి. పాలి, సంస్కృత భాషలు స్థానిక భాషలతో కలిసాయి.

మలయా (లంగ్కాశుక), సుమత్రా (శ్రీవిజయన్ సామ్రాజ్యం), ఫునాన్-కంబోడియా (ఖ్మెర్), వియత్నాం-చంపా,, బాలి, ఫిలిప్పీన్స్ వరకు హిందూ ధర్మం విస్తరించింది.

క్రీస్తుశకం 600–1250 ప్రాంతంలో ప్రభువులు దైవాంశ సంభూతులైనారు.

భక్తి ఉద్యమం మొదలై సామాన్య ప్రజలు తమతమ దైవాలను ఎన్నిక చేసుకున్నారు. శైవులు, వైష్ణవులు, మంత్ర తంత్రాలు, శాక్తేయులు ఇలా ప్రజలు విభిన్న శాఖలైనారు. బౌద్ధ జైన మతాలు క్షీణించాయి. పురాణాలు, స్థానిక పురాణాలు రూపుదిద్దుకున్నాయి.

తులసీదాస్, కబీర్, మీరాబాయి, చైతన్య మహాప్రభు, ఆళ్వారులు (వైష్ణవ), నయనార్లు (శైవులు) తమతమ భక్తి భావనలను వృద్ధిచేసారు. కర్ణాటకలో 12వ శతాబ్దంలో బసవన్న వీరశైవాన్ని బోధించగా శైవ భక్తులైన లింగాయతుల తెగ ఆవిర్భవించింది.

గౌడపాదుడి అద్వైత వేదాంతం (600–700 CE), శంకరుడి అద్వైత భావన (800 CE), 'మాయ' ప్రతిపాదన, మండనమిశ్రుడు, విద్యారణ్యుడు హిందూమత పునరుజ్జీవానికి తోడ్పడినారు. రామానుజ, మధ్వాచార్య, చైతన్యులు భక్తిని వేదాంతాన్ని మిశ్రితం చేసి బోధనలు కొనసాగించారు.

ఉత్తర భారతదేశంపై గజనీ దండయాత్రలు మొదలైనాయి. దక్షిణాపథాన్ని చోళులు పాలిస్తున్నారు.

మహాజన పదాలనుంచి మగధ సామ్రాజ్యం, అలెగ్జాండర్ దండయాత్ర, మౌర్య చంద్రగుప్తుడు–బిందుసారుడు–అశోకుడు–బౌద్ధమత వ్యాప్తి, సంగం కాలం, శుంగ, కణ్వ, శాతవాహన, కుషాణుల తరువాత గుప్తుల స్వర్ణయుగం, వాకాటక, కామరూప, పల్లవ, కాదంబ, హర్ష సామ్రాజ్యాలు హిందూ దేశాన్ని పాలించాయి.

హర్షుడి సామ్రాజ్య కాలం నుంచి ఢిల్లీ సుల్తానేట్ ప్రాభవం వరకు మధ్యయుగం (600–1200 CE)

ఉత్తర భారతంలో గుజరాత ప్రతీహార్–పాల–రాష్ట్రకూటుల త్రికోణ కలహాల మధ్య ముస్లిముల గెలుపు అనివార్యమయ్యింది.

అయిదవ శతాబ్దం నాటికి యజ్ఞ యాగాదుల శ్రౌత సంప్రదాయం వెనుకంజ వేసింది. బౌద్ధ జైన ధర్మాలు రాజధర్మాలై వృద్ధి చెంది క్షీణదశకు చేరుకున్నాయి. శైవ, వైష్ణవ, శక్తి భావనలు ప్రజలలో వ్యాపించాయి.

దక్షిణా పథంలో చోళుల ప్రాభవం పెరిగింది (848–1279) నాలుగు వందల సంవత్సరాల పాటు దక్షిణ భారత దేశ ప్రజల జీవన విధానాలను నియంత్రించింది చోళుల పాలన.

చోళులకు చాళుక్యులకు మధ్య కలహాలు, వివాహాలు సర్వ సాధారణం. రాజరాజచోళుని కుమార్తె 'కుందవై'ని తూర్పు చాళుక్యుల యువరాజు వేంగి పాలకుడు విమలాదిత్యుడు వివాహం చేసుకున్నాడు. పశ్చిమ చాళుక్యులకు అది గిట్టలేదు. యుద్ధంలో రాజాధిరాజు చనిపోయాడు.

విమలాదిత్యుడు–కుందవై ల కుమారుడు రాజరాజనరేంద్రుడు (1022–1061). రాజరాజనరేంద్రుడి భార్య 'అమంగదేవి' – మొదటి రాజేంద్రచోళుడి కుమార్తె. విమలాదిత్యుడి రెండవ భార్య తెలుగు చోళ యువరాణి మేళవ. ఈమె పుత్రుడు విజయాదిత్యుడు. రాజరాజనరేంద్రుడు–విజయాదిత్యుడి మధ్య రాజ్య పంపకాలలో యుద్ధాలు జరిగేవి. 1047 నాటికి రాజరాజనరేంద్రుడు తన రాజ్యాన్ని సుస్థిరపరచుకున్నాడు.

రాజరాజనరేంద్రుడి అస్థాన కవి నన్నయ భట్టారకుడు, మనుమసిద్ధి మంత్రి–తిక్కనామాత్యుడు, ప్రోలయ వేమారెడ్డి మంత్రి ఎర్రాపెగ్గడలు వ్యాసుడు రచించిన సంస్కృత మహాభారతాన్ని తెలుగులోకి శ్రీమదాంధ్ర మహాభారతంగా అనువాదం చేసినారు. అప్పటికి శైవమతం భారతదేశంలో ఉచ్ఛస్థితిలో ఉన్నది. శైవభావనలు, రూపాలు కృష్ణవేదమైన మహాభారతంలో చేరుకున్నాయి.

యుద్ధ భారతమైన పాండవ 'జయమ్' విష్ణురూప కృష్ణుని కార్ష్ణ వేదంగా, భారతమై, మహాభారతమై, శివుని గాథలు ఉపాఖ్యానాలుగా స్వీకరించి, తెలుగులో తిక్కన కాలంలో హరిహరనాథ తత్త్వాన్ని స్వీకరించింది.


గొర్రెలను మేపుకుంటూ గొర్రెలకాపరుల నాయకుడు ఇరార్–ఉర్ (కాల్దిమ్–చాల్దియన్లు) నుంచి, టర్కీ హరాన్ మీదుగా కానాన్ చేరి, ఈజిప్టుకు వలసపోయి, మూకుమ్మడి వలసగా ఎడారిలో తిరిగి తిరిగి నలభై ఏళ్లకు తనది కాని తన దేశమైన కానాన్ పాలస్తీనాలో రాజ్యమేర్పరచుకోగా ఆ అగ్నిమంటలు ఇప్పటికీ ప్రజ్వలిస్తూనే ఉన్నాయి. అది దైవ నిర్దేశమని వారి నమ్మకం.

ఉరల్ పర్వతాల నుంచి, కశ్యప సముద్ర (కాస్పియన్) తీరం నుంచి పచ్చిక మైదానాల మీదుగా, ఇరాన్‌ను దాటి సప్త సింధూ మైదానంలో పశువుల కాపర్లుగా, గుర్రాలు, రథాల మీద వచ్చి, దశరాజ యుద్ధంతో యమునా నదిని చేరి, సరస్వతి, దృశద్వతి నదుల మధ్య బ్రహ్మావర్తాన్ని, వింధ్య పర్వతాల వరకు ఆర్యావర్తాన్ని ఏర్పరచుకుని స్థానిక రాక్షస, నాగ

తెగలను నిర్మూలించి వేద, బ్రాహ్మణ సంస్కృతిని ప్రతిబింబించే రామాయణ, మహాభారత పురాణాల్ని నిర్మించుకున్నారు కశ్యపుని వారసులు. కాశ్మీరు నుంచి, సింధు, గంగా, యమునా, నర్మద, తపతి నదులకు, భూమికి భర్తలై రాజ్యాలేలినారు. సరస్వతీ నది ఇంకిపోయింది. ఈ చరిత్రలన్నిటినీ వివరిస్తుంది మహాభారతం.

ప్రపంచ చరిత్రను వ్రాసింది గొర్రెల కాపరులు (అబ్రహాం మతాలు), గోవుల కాపరులు (వేద, ఇతిహాస రచయితలు). గొర్రెల కాపరుల నుంచి మానవ కాపరులు జన్మించి తమ మతాల్ని స్థాపించారు. గోవుల కాపరుల నుంచి మానవ ధర్మ కాపరులు జన్మించి దేవుళ్లు దేవతలైనారు. శుభం భూయాత్.

## భారత దేశం - లిపులు



# 99. వర్ణ సంకరం

## పౌరులు

| | | |
|---|---|---|
| **బ్రాహ్మణుడు** | బ్రాహ్మణ స్త్రీ | - బ్రాహ్మణ |
| | క్షత్రియ స్త్రీ | - బ్రాహ్మణ |
| | వైశ్య స్త్రీ | - శూద్రుడు (అంబష్ఠుడు) |
| | శూద్ర స్త్రీ | - శూద్రుడు (పారశవుడు) |
| **క్షత్రియుడు** | క్షత్రియ స్త్రీ | - క్షత్రియుడు |
| | వైశ్య స్త్రీ | - క్షత్రియుడు (మాహిష్యుడు) అంతఃపుర రక్షకుడు |
| | శూద్ర స్త్రీ | - శూద్రుడు (ఉగ్రుడు) |
| **వైశ్యుడు** | వైశ్య స్త్రీ | - వైశ్యుడు |
| | శూద్ర స్త్రీ | - శూద్రుడు (కరణుడు) |
| **శూద్రుడు** | — శూద్ర స్త్రీ | శూద్రుడు |

## బహిష్కృతులు

| | | |
|---|---|---|
| **బ్రాహ్మణ స్త్రీ** | క్షత్రియుడు | - సూతుడు, సారధి (కీచకుడి లాంటివారు రాజులైనారు) |
| | వైశ్యుడు | - వైదేహికుడు, వైదేహి |
| | శూద్రుడు | - చండాలుడు (తలారి), చండాలిక |
| **క్షత్రియ స్త్రీ** | వైశ్యుడు | - వంది, మాగధుడు, మాగధి |
| | శూద్రుడు | - నిషాదుడు (చేపల వృత్తి), నిషాద స్త్రీ |
| **వైశ్య స్త్రీ** | — శూద్రుడు | - అయోగవుడు (వడ్రంగి), అయోగవి |
| **వైదేహి** | చండాలుడు | - పాండు సౌపాకుడు (వెదురు బుట్టలల్లువాడు) |
| | నిషాదుడు | - ఆహిండకుడు |
| **మాగధి** | అయోగవుడు | - పక్షుల వేటగాడు |
| | వైదేహికుడు | - మద్య విక్రేత |
| | నిషాదుడు | - మద్గురుడు (నావ నడిపేవాడు) |
| | చండాలుడు | - శ్వపాదకుడు (శవ భక్షకుడు) |
| **అయోగవి** | వైదేహికుడు | - గారడివాడు |
| | నిషాదుడు | - మద్రనాభుడు (గాడిదల బండి తోలేవాడు) |
| | చండాలుడు | - పుల్కసుడు (పశు భక్షకుడు) |
| **నిషాద స్త్రీ** | వైదేహికుడు | - క్షుద్రుడు, కారావరుడు (చర్మకారుడు) |
| | చండాలుడు | - అంతేవసాయి (సర్వ బహిష్కృతుడు) |

# 100. విష్ణువుకు ఇష్టమైన పూలు

కుముదం, కరవీరం, చణకం, సంపెంగ, మల్లె, జాజి, నంద్యావర్తం, నందికం, పలాశ పుష్పాలు-పత్రాలు, గరిక, భృంగకం, వనమాల, కలువ, పద్మం, శతదళం, సహస్రపత్రం, పుండరీకం, తులసీదళం, లింగమల్లెపూవు, సౌవర్ణం.

## పూజకు పనికిరాని పూలు

కింకిణి, మునిపుష్పం, ధుర్దూరం, పాటలం, అతిముక్తకం, పున్నాగం, నక్తమాలికం, యౌధికం, క్షీరికాపుష్పం, నిర్గుండి, లాంగలి, జప, కర్ణికారం, అశోకం, శాల్మలి, కుకుభం, కోవిదారం, వైభీతకం, కరంటకం, కల్పకం, కాలకం, అంకోలం, గిరికర్ణిక, నీలిరంగు పూలు ఒకే రేకుగల పూలు, జిల్లేడు, వేప పూలు.

## శివుడికి ఇష్టమైన పూలు

మోదుగ, మారేడు, రాజవృక్ష పూలమాలలు, జిల్లేడు పూలు

## పది రకాల కపిల గోవులు

స్వర్ణ కపిల, గౌరపింగళ, రక్త పింగాక్షి, గళపింగళ, బభ్రువర్ణాభ, శ్వేత పింగళ, రక్తపింగళ, ఖుర పింగళ, పాటల, పుచ్ఛ పింగళ.

# 101. యమలోక నరకయాతనలు

దక్షిణ దిక్కున యముడి సదనం ఉన్నది. విచిత్రంగా, రమణీయంగా అందంగా, భయంకరంగా, ప్రేత సముదాయాలు, యమ దూతలతో నిండి ఉంటుంది. కర్మలను బట్టి ప్రాణుల్ని ఉత్తమ, మధ్యమ, అధములుగా నిర్ణయిస్తారు యముడు, యమభటులు.

**ధార్మికులు-ఉత్తములు :** వీరు స్వర్గ సుఖాలనుభవిస్తారు

**మధ్యములు :** తిరిగి మానవలోకంలో పుడతారు.

**అధములు :** తిర్యగ్ యోనులలో పుడతారు నరకబాధలు పడినాక. (జంతువులు, పక్షులు, కీటకాలు)

**పరలోకానికి పోయే దారులు - 3**

1) **రమణీయం -** చాలా అందంగా, సౌఖ్యంగా ఉంటుంది.

2) **నిరాబాధం -** మన ఊరి దారుల్లా ఉంటుంది.

3) **దుర్దర్శం -** చీకటి, దుర్గంధం, రాళ్లు, కుక్కలు, క్రిమికీటకాలుంటాయి.

నరకలోకపు జాగిలాలు 2 - సర్వర, శ్యామ

అధములు దుర్దర్శం దారిలో పాశబద్ధులై వస్తారు. వాళ్ల శిరస్సులపై సంయమిని శిలలు పడతాయి. వాళ్ల ముఖాల్ని కంకవలి పక్షులు పొడిచి తింటూంటాయి. అసిపత్ర వనంలో కత్తుల తోటలో భయంకరమైన కుక్కలు కరుస్తాయి పాపులను. అక్కడ ప్రవహించే నది వైతరణి. దానిలో రక్తం కలిసిన మూత్రం ఎర్రగా ప్రవహిస్తుంటుంది. అధముల్ని యమభటులు ఆ నదిలో ముంచుతారు. ముళ్లబూరుగు చెట్ల నెక్కిస్తారు. గానుగల్లో నలగగొడతారు. నిప్పుల్లో కాలుస్తారు. రంపంతో కోస్తారు. కూరల్ని తరిగినట్లు తరిగి కుంభీపాక నరకంలో వండుతారు. శూలాలతో సూదులతో గుచ్చుతారు. పాపాలను బట్టి శిక్షలుంటాయి. శిక్షలనుభవించాక పరిశుద్ధులై బయటపడతారు.

**నరకాలు అయిదు రకాలు :**

1) **రౌరవం -** పాపులను పురుగులు భక్షిస్తాయి. మలగంధంతో నిండి ఉంటుంది.

2) **మహారౌరవం**
3) **కంటకావనం**
4) **అగ్నికుండం**
5) **పంచకష్టం**

(2-5) దారుణమైన నరకాలు

## వైతరణీ నది లాంటి గ్రీకుల నరకలోకపు నదులు

**గ్రీకుల నరకంలోని నదులు – అయిదు :** 1) లెథె (Lethe) – మరపునది; 2) ఎఖెరాన్ (Acheron) దుఃఖనది; 3) కొసిటస్ (Cocytus) - రోదనల నది; 4) ఫ్లెగ్‌థాను – అగ్ని నది. 5) స్టిక్స్ (Styx) - వణికించే శీతల నది. (భూమి నుంచి నరకాన్ని వేరు చేస్తుంది.) దీనిలో 'Charon' పేరు గల పడవ సరంగు పడవ నడుపుతాడు.

## గతజన్మ పాపాలు - ఈ జన్మ జీవితాలు

| | |
|---|---|
| నిత్యం మాంసం తినేవాడు | – గద్ద, కాకి |
| మద్యపాన ప్రియుడు | – పంది |
| తినకూడని పదార్థాలు తినేవాడు | – కాకి |
| అపవాదులు, కొండెములు చెప్పేవాడు | – కోడి |
| మూర్ఖుడు | – మృగజాతి |
| హింసాపరుడు | – క్రిమి, కీటక జాతి |
| ఎక్కువ అభిమానం కలవాడు | – గాడిద |
| పరదారలననుభవించినవాడు | – ఎలుక |
| కృతఘ్నుడు, మిత్ర ఘాతకుడు | – నక్క, తోడేలు |
| కృతఘ్నుడు, పుత్ర ఘాతకుడు | – స్థావరుడు (చెట్టు, చేమ) |

## నరకలోకపు జాగిలాలు (Hel Hounds)

**గ్రీసు** – సెర్బెరస్ (Cerberus) – మూడు తలలు, సర్పపు (డ్రాగన్) తోక ఉన్న కుక్క.

**బెల్జియం** – Oude Rode Ogen - Old Red Eyes - Beast of Flanders

**నార్డిక్** – గర్మ్ (Garmr) (తోడేలు లేక కుక్క)

**స్పెయిన్** – డిప్ (Dip) in Catalonia; ఉర్కొ (Urco in galicia)

**ఇంగ్లండ్** – Black Dog; Hel Hound, Black Shuck (Norfolk)

**వెల్ష్** – కుననన్

**చైనా** – హువొదొవు (Huodou)

**ఇండియా** – మహాకన్హా (జాతక కథలు); హిందూ – సర్వర (ఉదయం), శ్యామ (సాయంకాలం), చీకటి వేళలు

**జపాన్** – యొకాయి (Yokai)

**ఈజిప్టు** – అమ్మిత్ (Ammit)

**మధ్య అమెరికా** – కడెజొ (White one good) (Black one bad)

# 102. గ్రీకుల నదీ దేవతలు (Potamoi)

గ్రీకుల నదీ దేవతల పేరు పొటొమాయి (Potamoi). ఓసియానస్, అతడి భార్య టెథిస్ (Oceanus-Tethys)లకు మూడు వేలమంది నదులు కుమారులుగా జన్మించారు. మనిషి తల ఉన్న ఎద్దు, లేదా ఎద్దు తల మనిషి – చేప లేదా పాము పోలుసులున్న శరీరం నాభికి దిగువన; లేదా నీళ్లు జాలువారుతున్న పాత్ర పక్కనే శయనించి ఉన్న మనిషి రూపం.

మెసపొటామియా (Mesopotamia)- టైగ్రిస్–యూఫరేటిస్ నదుల మధ్య ప్రాంతం.

**ప్రముఖ నదులు–నదీ దేవతలు :** ఎఖియోలస్, ఆల్ఫ్యూస్, అసోపస్, ఇనాకస్, నైలస్, పెన్యూస్, స్కమాండర్.

నదీ దేవతలకు సోదరులు ఓసియానిడ్లు (Oceanids); నదీ దేవతల సంతానం నయయిడ్లు (Naiads). వీళ్లు జలకన్యలు (అప్సరసలు).

గ్రీకుల నదీ దేవతలు మగవాళ్లు. హిందువుల నదీ దేవతలు స్త్రీలు.

# చతురంగ బలాలు - ఆయుధాలు

| | | |
|---|---|---|
| 1) | సానుకర్ష | – రథభాగాలను సరిచేసుకునే కొయ్య |
| 2) | అమ్ములపొది | – తూణీరము-రథంపైన ఉండేది |
| | ఉపాసంగము | – గుర్రాలు, ఏనుగులు మోసేవి |
| | నిషంగము | – కాల్బంటులు మోసేవి. |
| 3) | తోమరం | – చేతితో విసిరే ములుకున్న ఈటె, కర్ర |
| 4) | ఋష్టి | – బరువైన కొయ్య, వంకరగా ఉండి విసరడానికి వీలైనది. |
| 5) | పరిచ్ఛదములు | – కప్పుకునే కంబళ్లు |
| 6) | కచగ్రహ విక్షేపములు | – జిగురు రాసి ఉన్న కర్రలు (జుట్టుకు అంటుకుంటాయి) |
| 7) | సతైల గుడ వాలుకలు | – నూనె, బెల్లం, ఇసుక (వేడి చేసినవి) |
| 8) | సర్జరస | – సాంబ్రాణి వంటి పొడి |
| 9) | భిండి పాలములు | – పెద్ద ఇనుప గుదియలు |
| 10) | మధూచ్ఛిష్టము | – తేనెపట్టులోని మైనంను వేడిచేసి శత్రువులపై విసుర్తారు. |
| 11) | సకాండ దండకాలు | – ముల్లు గర్రలు |
| 12) | దాత్రము | – కొడవళ్లు |
| 13) | వాసీవృక్ష దనాన్వితలు | – లోపల ఆయుధాలు దాచిఉన్న కర్ర |
| 14) | తైలక్షౌమాని | – నూనె వస్త్రాలు (కాల్చి బూడిదను గాయాలకు అద్దుతారు). |

**రథం –** సహాయకులు, నాలుగు గుర్రాల రథానికి ఇద్దరు గుర్రాలకు రక్షకులు; ఇద్దరు చక్రాలకు రక్షకులు; రథంపైన సారథి, వీరుడు. ఒక్కో రథానికి ఆరుగు.

**గజసైన్యం –** ఏనుగుకు ఇద్దరు అంకుశధారులు; ఇద్దరు ధనుర్ధారులు; ఇద్దరు చురకత్తులు ధరించినవారు; మరొకడు శక్తి అనే త్రిశూలం ధరించినవాడు – ఏడుగురు.

**అక్షౌహిణి = 21,870 రథాలు; 21,870 ఏనుగులు, 65,610 గుర్రాలు; 1,09,350 కాల్బలం.**

**18 అక్షౌహిణీలు = 18×21870 = 393660 రథాలు**

| | | | |
|---|---|---|---|
| రథాలు = రథానికి ఆరుగురు | = 3,93,660 × 6 | = | 23,61,960 |
| ఏనుగులు = ఏనుగుకు ఏడురుగు | = 3,93,660 × 7 | = | 27,55,620 |
| అశ్వికులు | = 65,610 × 18 | = | 11,80,980 |
| కాల్బలం | = 1,09,350 × 18 | = | 19,68,300 |
| | **18 అక్షౌహిణీల సేన** | **=** | **82,66,860** |

**సంజయుడు :** ధృతరాష్ట్రుడికి నమ్మినబంటు. సూతుడు. రథసారధి. కళ్లులేని ధృతరాష్ట్రుడికి కళ్లు అతడు. విదురుడి నుంచి పరలోక ధర్మాన్ని, సంజయుడి నుంచి ఇహలోక వాస్తవాల్ని తెలుసుకునేవాడు ధృతరాష్ట్రుడు.

కురుక్షేత్ర యుద్ధానికి ముందు పాండవులు యుద్ధ సన్నద్ధులయ్యారని తెలిసి ధృతరాష్ట్రుడు సంజయుడిని రాయబారిగా పంపినాడు – యుద్ధాన్ని ఆపడానికి లేదా వాయిదా వేయడానికి, అంతేకాని పాండవుల అర్ధరాజ్యం వారికి ఇవ్వడానికి కాదు. మాటకారి అయిన సంజయుడు అర్ధరాజ్యం నుంచి అయిదూళ్లకు దించాడు ధర్మరాజును.

'వాడి సూదిమొన మోపినంత భూమి కూడా ఇవ్వనని తేల్చి చెప్పినాడు రారాజు, రాయబారిగా వచ్చిన శ్రీకృష్ణుడిని బంధించబోయి భంగపడినాడు. శ్రీకృష్ణుడి విశ్వరూపం, విదురుడి నీతివాక్యం, సంజయుడి వార్తా వ్యాఖ్యానం ధృతరాష్ట్రుడి పుత్రప్రేమ ముందు తాత్కాలిక ప్రభావ కిరణాలై మలిగిపోయాయి.

వ్యాసుడు దివ్యదృష్టినిచ్చాడు సంజయుడికి యుద్ధ వార్తలను ధృతరాష్ట్రాదులకు ఎప్పటికప్పుడు చెప్పడానికి. అయితే మహాభారతంలో ఈ విధంగా చెప్పబడింది– యుద్ధరంగం నుంచి హస్తినాపురానికి వచ్చిన సంజయుడు తన యుద్ధ నివేదికను భీష్ముడి మరణంతో ప్రారంభించి కర్ణుడి అస్తమయం వరకు చెప్పి మరల యుద్ధరంగానికి వెళ్లాడు.

శల్య వధానంతరం సాత్యకి, ధృష్టద్యుమ్నులకు చిక్కి వ్యాసుడి దయతో బ్రతికి హస్తినాపురం వేపు వస్తుంటే దారిలో మడుగు వద్ద అతడికి దుర్యోధనుడు ఒంటరిగా కనిపించాడు. అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యుల అర్ధరాత్రి మారణకాండను, దుర్యోధనుడి మృతిని ఆ మరుసటి రోజు ఉదయం నివేదించాడు ధృతరాష్ట్రాదులకు సంజయుడు.

సంజయుడు యుద్ధంలో సూతుడిగా, వీరుడిగా తన ధర్మం నెరవేరుస్తూనే, వ్యాసుడిచ్చిన దివ్యదృష్టితో యుద్ధరంగంలో జరిగిన ప్రతి విషయాన్ని చూసి, విని, సవిస్తరంగా ధృతరాష్ట్రుడికి తెలియజేసినాడు.

కురుక్షేత్ర యుద్ధం ముగిసాక పదిహేను సంవత్సరాలు హస్తినలో, మూడు సంవత్సరాలు ఆశ్రమవాసం గడిపాడు ధృతరాష్ట్రునికి నమ్మినబంటుగా. అవధూతగా విదురుడు అస్తమించాక, ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, సంజయుడు తాము వదిలేసిన అగ్నులు కార్చిచ్చును రేపగా ఆ అగ్నిజ్వాలల్లో చిక్కుకున్నారు. ధృతరాష్ట్ర, గాంధారి, కుంతీదేవి ఆ అగ్నిజ్వాలల్లో లీనమైనారు. సంజయుడు వారి ఆదేశానుసారం అగ్ని జ్వాలల నుంచి తప్పించుకుని హిమాలయ ప్రాంతం వేపు వెళ్లిపోయాడని మహాభారతంలో చెప్పబడింది.

# 103. స్నేహాలు, బాంధవ్యాలు, శత్రుత్వాలు

## స్నేహం – కృష్ణార్జునులు, దుర్యోధన–కర్ణులు :

కృష్ణార్జునుల స్నేహం నర నారాయణ మైత్రి. సుయోధన–కర్ణులది స్నేహమే అయినా కర్ణుడు తన స్థానాన్ని తెలుసుకుని మెలిగేవాడు. స్నేహానికి ప్రాణమిచ్చిన ఘనత కర్ణునిది.

కృష్ణార్జునుల స్నేహం కృష్ణ (ద్రౌపది)కి కూడా ఈర్ష్యను కలిగించింది. బలిష్ఠంగా మొరటుగా ఉండే వాళ్లకన్నా కాస్త లాలిత్యం, ఆడతనం ఉన్న మగవాళ్లంటేనే ఆడవాళ్లకు ఇష్టమేమో. కృష్ణుడికి, అర్జునుడికి ఉన్నన్ని ప్రేమగాథలు ఇంకెవ్వరికీ ఉండకపోవడం దీనికి ఉదాహరణ. రాముడు ఏకపత్నీవ్రతుడు కాబట్టి సరిపోయింది కాని లేకుంటే మునులు, మునిపత్నులు అతడి అందానికి సమ్మోహితులై తరువాతి జన్మలో గోపికలై జన్మించారంటారు. వారికి అస్ఖలిత బ్రహ్మచారి ప్రియుడైనాడు. వేణుగానంతో రాసలీలలతో వేరేలోకానికి తీసుకుపోయినాడు.

గ్రీకుల కథలో ఎఖిల్లిస్ (Achilles) – పాట్రొక్లస్ (Patroclus)ల స్నేహం కూడా ఇంత దృఢంగా ఉంటుంది.

కృష్ణుడిది మోహినీ రూపం. తమిళనాడు–కూవగంలో గొప్ప ఉత్సవం జరుగుతుంది చైత్రమాసంలో. ఆ ఉత్సవంలో అనేకమంది హిజ్రాలు (Transgenders) అర్జునుడు–నాగకన్య ఉలూచిల కుమారుడు ఇరావంతుడిని (ఇరవణన్–అరవణన్–నాగకుమారుడు) పూజిస్తారు. తమను తాము కృష్ణావతారమైన మోహినిగా, ఇరవణన్‌ను తమ భర్తగా భావించి మంగళసూత్రాలు కట్టుకుని వివాహం చేసుకుంటారు. మహాభారత యుద్ధ సమయంలో మహావీరుడైన ఇరావంతుడు గనుక యుద్ధంలో పాల్గొంటే కౌరవులను మొత్తం అతడే నిర్జించగలడు కనుక పాండవుల ప్రతిజ్ఞలు నెరవేరవని భావించిన శ్రీకృష్ణుడు ఇరావంతుడిని భారతయుద్ధంలో తొలిబలిగా ఒప్పిస్తాడు. ఇరవణన్ ఒక కోరిక కోరినాడు. తనకు వివాహం కాలేదు కనుక శ్రీకృష్ణుడు మోహినీ రూపంలో తనను వివాహమాడి, ఆ రాత్రి తనతో గడిపితే, తాను తొలిబలిగా చనిపోవడానికి సిద్ధమే నంటాడు. అంతేకాక తన ఖండిత శిరస్సు ఆ 18 రోజులూ జీవించి ఉండి మహాభారత యుద్ధాన్ని ఆసాంతం చూడాలని కోరుకుంటాడు. శ్రీకృష్ణుడు ఒప్పుకుంటాడు.

ఇదే కథను ఉత్తరభారత ప్రాంతంలో భీముని మనమడు, ఘటోత్కచుని కుమారుడు బర్బరీకుడి పేరు మీద ఖట్‌శ్యామ్‌జీ, ఖండిత శిరస్సు దేవుడు, ఆకాశదేవర, మూడు బాణాల వీరుడు ఇలా అనేక పేర్లతో ప్రసిద్ధికెక్కినది. (బర్బరీకుడి వద్ద మూడు బాణాలున్నాయి– ఒకటి ప్రయోగిస్తే అది శత్రువులనందరిపై 'గుర్తు' ఉంచుతుంది. రెండవ బాణం ప్రయోగించి మనకు ఇష్టమైనవారి పైనుంచి గుర్తును తొలగించవచ్చు. మూడవ బాణం వెళ్లి ఆ 'గుర్తు' ఉన్న వారినందరిని చంపుతుంది.)

(మన శరీరంలో HLA Marker, NK Cells ఈ రకంగానే పనిజేస్తాయని శాస్త్రజ్ఞుల అభిప్రాయం)

అర్జునుడిలోనూ (నరుడు కదా) కొన్ని స్త్రీ లక్షణాలున్నాయి. ఆజానుబాహుడతడు అయితే 'పిక్కలు కాస్త ఎత్తు' అన్నాడు శ్రీకృష్ణుడు. ద్రౌపది కాస్త ఈర్ష్యగా చూసిందని భారతం – అశ్వమేధ పర్వం 87వ అధ్యాయంలో వ్రాయబడింది.

అర్జునుడికి ఊర్వశి శాపం, అజ్ఞాతవాసంలో బృహన్నల వేషం భీభత్సుడిలోని మరో కోణాన్ని తెలియజేస్తాయి.

దుర్యోధన కర్ణుల స్నేహం కూడా మల్లెపూవంత స్వచ్ఛమైనది. భీముడితోనే గొడవ అనుకుంటే అర్జునుడు అనేక దివ్యాయుధాలు సంపాదించి కౌరవుల నిద్రలేని రాత్రులకు కారణమవుతున్న సమయంలో, ఆ నిరాశా చీకట్లను తొలగించే సూర్యుడిలా వచ్చాడు కర్ణుడు. ఎక్కడో దుర్యోధనుడికి అనుమానం ఇతడు క్షత్రియ పుత్రుడేనని. కుమారాస్త్ర విద్యా ప్రదర్శనంలో ముడిపడిన స్నేహబంధం కర్ణుడి ఆఖరిశ్వాస వరకు చెక్కుచెదరలేదు.

కళింగ రాకుమారి భానుమతి స్వయంవరంలో అస్త్రవిద్యా ప్రదర్శనతోనే అందరినీ ఓడించినాడు కర్ణుడు. తన మిత్రుడు ఒకప్పటి భీష్ముడిలా కన్యనపహరించుకుని హస్తినకు పోతుంటే ఎదిరించిన రాజులను ఓడించినాడు.

దుర్యోధనుడి అంతఃపురంలోకి వెళ్లగల చనువు అతడికున్నది. భానుమతితో కలిసి పాచికలాడేవాడు. దుర్యోధనుని ఆలోచనలను ఎలా కార్యరూపంలోకి తేవాలా -అన్నదే అతడి తపన. మిత్ర చతుష్టయంలో తానూ ఒకడై జనులతో దుష్ట చతుష్టయంలో ఒకడైనాడు. పదమూడేళ్లు ధర్మరాజుకు నిద్రపట్టని శిరోవేదన, హృదయపు ములికి అయినాడు.

జన్మరహస్యం తెలిసినా, సాక్షాత్తు శ్రీకృష్ణుడు, కన్నతల్లి అడిగినా స్నేహమార్గం తప్పనివాడు. పాండవులెప్పటికీ అయిదుగురే అని పలికి తన సోదరుడు, శత్రువు అర్జునుడి బాణాలతోనే తల కోల్పోయినవాడు కర్ణుడు.

ఏనాడూ అభిమానాన్ని కోల్పోనివాడు, దీనతను ప్రదర్శించని సుయోధనుడు, కర్ణుడు మరణించాడని తెలియగానే కర్ణ, కర్ణ అని వలవల ఏడుస్తూ శిబిరం వేపు బయల్దేరినాడు. అందుకే 'కర్ణుడి తల' భారతమైంది.

కృష్ణుడి సామర్థ్యం, పరమాత్మ స్వరూపం తెలిసినా వెనక్కి రాలేనంత దూరం స్నేహమార్గంలో వెళ్లిన కర్ణుడు, సూతపుత్రుడిగా పెరిగిన సూర్యపుత్రుడు సూర్యాస్తమయ సమయానికి అస్తమించాడు.

## భీష్ముడు–అర్జునుడు :

వీరి మధ్య బాంధవ్యం అత్యంత గొప్పది. తాతామనవళ్లైన వీరు అత్యంత సన్నిహితంగా మెలిగారు. తండ్రి లేని అర్జునుడిని ఎంతో గారాబంగా చూసేవాడు పితామహుడు. యుద్ధరంగంలోకి రాగానే తాతను, గురువును, బంధువులను చూసి విల్లు పారవేసినాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు భగవద్గీతతో పాటు విశ్వరూపం చూపిస్తే కాని కుదుటపడలేదతడి మనస్సు.

పాశుపతాస్త్రం నా వద్ద ఉన్నది, ఒక్క నిముషంలో కురుక్షేత్ర యుద్ధం ముగిస్తానని అన్న ధర్మరాజుతో అన్నవాడు ధైర్యము నశించి జావగారిపోయినాడు. భీష్మ ద్రోణులున్నంత కాలమూ అతడి యుద్ధం అన్యమనస్కంగానే గడిచింది. తప్పనిసరి పరిస్థితుల్లో శిఖండి నెదురుపెట్టుకుని తాతను అంపశయ్య పాలు చేసి కన్నీళ్లు పెట్టుకుని దూరంగా నిలబడినాడు బిక్కుబిక్కుమంటూ.

పితామహుడికి తెలుసు మనమడి దుఃఖం. అతిక్రమించలేనిది కాలపు నడక. మార్చలేనిది విధివ్రాత. స్వచ్ఛంద మరణ వరమున్న భీష్ముడు తన చావు రహస్యాన్ని, సమయాన్ని ధర్మరాజుకు చెప్పి తానే అవకాశమిచ్చినాడు అర్జునుడికి. అంపశయ్యపై పడి దిండుకోసం అడిగి అర్జునుడితోనే మూడు బాణాలు వేయించి తలదిండుగా అమర్చుకున్నాడు, దాహం వేస్తే అర్జునుడితో బాణంతోనే భూగర్భ జలాన్ని పైకి తెప్పించి, తాగి, దప్పిక తీర్చుకుని అభినందించాడు, అనునయించాడు, ఆశీర్వదించాడు అర్జునుడిని.

పాండవ పక్షపాతి అన్న పేరున్న భీష్ముడు, కౌరవ సేనకు సర్వసైన్యాధిపతియై, శ్రీకృష్ణుడనే దేవుడి సాయమున్న పాండవులని గెలవలేమని చెప్పినా మానవ బలాన్ని నమ్ముకున్న దుర్యోధనుడిని సమాధానపరచలేక పదిరోజుల యుద్ధం, పదివేల రథికుల ప్రాణహరణం తరువాత తాను తలవంచి, అంపశయ్యపై పడి ఉత్తరాయణ పుణ్యకాలం కోసం ఎదురు చూసినాడు భీష్ముడు.

## ద్రోణుడు–అర్జునుడు :

వీరి గురుశిష్య సంబంధం జగత్ప్రసిద్ధం. మొదట్లో స్వంత కుమారుడైన అశ్వత్థామపై ఎక్కువ శ్రద్ధ చూపినప్పటికీ అర్జునుడి ఆసక్తి, నిరంతర అభ్యసనశీలత, వినయ విధేయతలు, క్షాత్రధర్మం, దృష్టి కేంద్రీకరణ, లక్ష్యశుద్ధి ఇవన్నీ గురువైన ద్రోణునికి నచ్చి మాట ఇచ్చాడు అర్జునునికి– ప్రపంచంలోనే మేటి విలుకాడిగా చేస్తానని.

ఆదిలోనే అడ్డువచ్చిన ఏకలవ్యుడి కుడిచేతి బొటనవ్రేలు గురుదక్షిణగా తీసుకుని తన ప్రతిష్ఠకు మచ్చ వచ్చినా సహించాడు. దానితో ఏకలవ్యుడి బంధుమిత్రులు పాండవులకు వ్యతిరేకులై కౌరవ పక్షాన చేరినారు.

తన సహాధ్యాయి అయినా తనను లక్ష్యపెట్టక అవమానించి పంపిన పాంచాలరాజు ద్రుపదుడిని పట్టి బంధించి తెచ్చి తన ముందు పడవెయ్యడం గురుదక్షిణగా కోరినాడు ద్రుపదుడు. అర్జునుడు ఆ పని చేసి గురువు మెప్పును పొందినాడు.

ద్రుపదుడు ఆ అవమానాన్ని మనసులో ఉంచుకుని ద్రోణుడిపై పగ తీర్చుకోవడం కోసమే యజ్ఞం చేసి హోమాగ్ని నుండి కృష్ణను, ధృష్టద్యుమ్నుడిని పొంది ద్రౌపదిని పాండవులకు భార్యగా (మత్స్య యంత్రాన్ని భేదించినవాడు అర్జునుడు), ధృష్టద్యుమ్నుడిని పాండవ సేనాధిపతిగా చేసినా చివరకు ఒకప్పటి తన మిత్రుడు ఇప్పటి శత్రువు ద్రోణుడి చేతిలో మరణించాడు. అతడిని చంపి కన్నీళ్లు పెట్టుకున్నాడు ద్రోణుడు "కాలమెంత కఠినమైనది" అనుకుంటూ.

అశ్వత్థామ హతః కుంజరః మాటలు ధర్మరాజు చెప్పగా విన్నాడు ద్రోణుడు. ధర్మరాజును సజీవంగా బంధించనందుకు దుర్యోధనుడి ఎత్తిపొడుపులు విన్నాడు. అభిమన్య, సైంధవ, ఘటోత్కచ వధలను చూసాడు. అర్జునుడి అసహాయతను గమనించాడు. ఇకచాలు యుద్ధం, జీవితం అనుకుని అస్త్రసన్యాసం చేసి ప్రాయోపవేశ స్థితిలో ప్రాణాలు విడువగా, అటుగా వచ్చిన ధృష్టద్యుమ్నుడతని తల నరికినాడు. దానికి ఆగ్రహించిన అశ్వత్థామ యుద్ధం 18వ రోజు అర్ధరాత్రి నిద్రిస్తున్న ధృష్టద్యుమ్నుడిని నిద్రలేపి గొంతుకు అల్లెతాడు బిగించి చంపాడు. యుద్ధంలో మిగిలిన పాంచాలురనందరినీ, శిఖండిని, ఉపపాండవులను చంపి పగతీర్చుకున్నాడు అశ్వత్థామ.

### ద్రుపదుడు – ద్రోణుడు :

ఇద్దరూ తండ్రుల వీర్యం నుంచి కలశాల్లో పుట్టినవారే. ద్రోణంలో పుట్టి ద్రోణుడు, పాదాల వద్ద వీర్యం పడి మట్టిలో కప్పెట్టగా ద్రుపదుడు జన్మించారు. ద్రోణుడి తండ్రి భరద్వాజుడి దగ్గర చదువుకున్నారు. అప్పుడు మంచి స్నేహితులు. తరువాత ద్రుపదుడు పాంచాల రాజైనాడు. ద్రోణుడు ధనుర్వేదాచార్యుడై నిరుపేద అయినాడు. ద్రోణుడి భార్య కృపాచార్యుడి చెల్లెలు కృపి. వీళ్లు కూడా వీర్య సంభవులే. శంతనుడికి దొరికి అతడి కృపతో పెంచబడినారు. సోదరి కృపిని ద్రోణుడికిచ్చి పెళ్లి చేయగా వారికి జన్మించినాడు అశ్వత్థామ.

అశ్వత్థామకు తాగించడానికి పాలు కూడా లేని పరిస్థితి ద్రోణుడిది. గంపెడాశతో ద్రుపదుడి దగ్గరకు వెళితే పేద బ్రాహ్మణుడితో రాజుకు స్నేహమేమిటి – పొమ్మని అవమానించాడు ద్రుపదుడు. ఆ తరువాత ద్రోణుడు కౌరవ పాండవులకు గురువైనాడు. గురుదక్షిణలో భాగంగా ద్రుపదుడి ఓటమితో పాటు ఉత్తర పాంచాల రాజ్యం ద్రోణుడికి దక్కింది. దానిపై అధికారం అశ్వత్థామకు లభించి 'దొర' అయినాడు అశ్వత్థామ.

మొదట్లో అశ్వత్థామ పాండవ పక్షపాతి తన తండ్రిలా. తన తండ్రి మరణానంతరం అతడు పాండవులకు బద్ధ శత్రువైనాడు. ఆఖరి సేనాధిపతిగా అశ్వత్థామ ధృష్టద్యుమ్నుడిని, శిఖండిని, పాంచాలురను, ఉప పాండవులను చంపి ఆఖరి క్షణాల్లో ఉన్న దుర్యోధనునికి కలిగించాడెంతో సంతృప్తి, ఆనందం.

ద్రౌపది, ధృష్టద్యుమ్నులతో ద్రోణునిపై విజయాన్ని, శిఖండిని/శిఖండితో భీష్ముడిపై విజయాన్ని పాండవుల కందించిన ద్రుపదుడు తన సహాధ్యాయి ద్రోణుడి చేతిలో మరణించాడు. ద్రోణుడి కుమారుడు అశ్వత్థామ ధృష్టద్యుమ్నుడిని, శిఖండిని, పాంచాలురను, ఉపపాండవులను చంపి ఆ తరువాత బ్రహ్మశిరోనామకాస్త్రం ప్రయోగించి 'అపాండవం' చేసినా శ్రీకృష్ణుని కరుణతో పాండవులు, ఉత్తర గర్భస్థశిశువు పరీక్షితు బ్రతికినారు.

కృష్ణార్జునులు, సుయోధన–కర్ణుల స్నేహం ఎంత ప్రమోదకరమైనదో, గొప్పదో, వికటించిన ద్రుపద–ద్రోణుల స్నేహం అంత ప్రమాదకరమై వంశ నాశనకరమైనది.

## ఉప పాండవుల వయసెంత?

మహాభారతంలో స్పష్టంగా చెప్పబడని విషయాలలో ఇదొకటి. పాండవులు, కౌరవులు, వారి కుమారుల వయసు నిర్ధారించడానికి సరైన ఆధారాలు లభించవు. అభిమన్యుడు పదహారేళ్లు జీవించాడని మాత్రం తెలుస్తుంది, అతడు చంద్రుడి కుమారుడైన వర్చస్సు అంశతో పుట్టాడనే విషయం వలన. ఉపపాండవులు ఒక్కొక్క ఏడాది తేడాతో జన్మించారు.

# 104. బైబిల్ - కాలరేఖ

| | | |
|---|---|---|
| 4000+ BC | - | ఆదాం-అవ్వల సృష్టి |
| 2400 - 2300 | - | జల ప్రళయం<br>నోవా పడవ |
| 2165 BC | - | అబ్రహాం జననం |
| 2090 | - | దైవ ఒప్పందం |
| 2100-1900 | - | జాబ్ |
| 1898 | - | జోసెఫ్ అమ్మకం |
| 1876 | - | జాకబ్ (ఇజ్రాయెల్)<br>ఈజిప్టు వచ్చుట |
| 1446 | - | 430 ఏళ్లు ఈజిప్టులో ఉండి<br>మూకుమ్మడి వలస (Exodus) |
| 1406 | - | మోసెస్ మరణం |
| | - | జాషువా |
| | - | న్యాయమూర్తులు<br>299 ఏళ్లు |
| | - | రూత్ |
| 1120 | - | శామ్యూల్ |
| 1051 | - | సాల్ |
| 1011 | - | డేవిడ్ |
| 971 | - | సొలొమాన్ |
| 760 | - | జోనా |
| 739-600 | - | ఈసయ్య |
| 722 | - | అస్సిరియన్ల దండయాత్ర |
| 622-576 | - | జెరెమియా |
| 605 | - | బాబిలోనియన్ల కైవసం -<br>జూదా 70 ఏళ్ల ప్రవాసం |
| 483-473 | - | ఎస్తెర్ |
| 331 | - | అలెగ్జాండర్ |
| 165 | - | జూదా మకాబియస్ |
| 63 | - | రోమన్లు |
| 37 | - | హెరాద్ |
| 4 | - | క్రీస్తు జననం |
| AD 30-33 | - | శిలువ |

| | | |
|---|---|---|
| 3138 BC | - | మహాభారత యుద్ధం<br>శ్రీకృష్ణ నిర్యాణం |
| 3102 BC | - | కలియుగ ప్రారంభం |
| | - | ద్వారక మునిగిపోవుట |
| | - | పరీక్షిత్తు మరణం |
| | - | తక్షశిలలో జనమేజయుడి<br>సర్పయాగం |

పురుషోత్తముడు (పురువంశం)
అభిసారెస్ (అంభి) (నాగవంశం)
(తక్షశిల ప్రభువు)

# 105. కాల గణనం

**వర్షం :** తొలినాళ్లలో సంవత్సరాన్ని వర్షాకాలం ప్రారంభ దినం నుంచి లెక్కవేసేవారు. రెండు వర్షాకాలాల మధ్యకాలం వర్షం-సంవత్సరం.

**పండిత వేదవీర్ ఆర్య గణన ననుసరించి-**

టోబా జ్వాలాముఖి విస్ఫోటనం - 72000 BC
హిందూ దేశంలో వ్యవసాయం - 16000 BC
తొలి వేదకాలం - 16000-14500 BC

**వేదకాలం (14500 - 10500 BC)**

- జలప్రళయం-మత్స్యావతారం - 11200 BC
- సరస్వతీ నది అదృశ్యం - 10950 B.C.
- సరస్వతీ నది పశ్చిమ దిక్కు ప్రవాహం (10000 BC)

**మలివేద కాలం (10500-6777 BC)**

- ద్వారావతి సముద్రంలో లీనమగుట (9300 BC)
- అవెస్తా, అసురవేదం (7000 BC)
- 28వ కృతయుగాంతం (6778 BC)

**28వ త్రేతాయుగ ప్రారంభం (6777 BC)**

- రామాయణకాలం (5677-5577 BC)
- శ్రీరామ జన్మదినం (3-2-5674 BC)

**28వ ద్వాపర యుగం (5577-3106 BC)**

- ధర్మజుని రాజసూయ యాగం (3188 BC)
- మహాభారత యుద్ధం (3176 BC)

**28వ కలియుగం (3162 / 3102 BC)**

**లతాదేవుని సూర్యసిద్ధాంతము ననుసరించి-**

శ్రీకృష్ణ నిర్యాణం - 3102 BC
ద్వారక మునుగుట - 3102 BC
సరస్వతి-దృశద్వతి నదుల అదృశ్యం - 3000 BC

# 106. మరో ప్రపంచం

అట్లాంటిస్‌లో నివసించిన ఎవెనార్ (Evenor) కుమార్తె క్లిటొ (Cleito). ఆమె కుమారుడు అట్లాస్ (Atlas). ఇతడి తండ్రి పొజిడాన్ (Poseidon). ఏథెన్స్ రక్షక దేవత ఎథెనా (Athena) ఓడించింది పొజిడాన్‌ను.

ప్లాటో వ్రాసిన దాని ప్రకారం 10200 BC లో అట్లాంటిస్ సముద్రంలో మునిగిపోయింది.

ఈజిప్టు మనువు-Menes- 5867 BC నాటివాడు. అతడికి ముందు సప్తదేవతలు వేలాది సంవత్సరాలు పాలించినారు.

సుమేరియా ప్రాంతంలో పదిమంది రాజులు దేవతల కాలంలో, 135 మంది దేవతలు అనంతర కాలంలో సుమేరియా ప్రాంతాన్ని పాలించారు. సుమేరు పర్వతం, అసురులు, అమరులు, మితాన్నిలు ఈ ప్రాంతం వారే.

తొలి దేవాసుర యుద్ధాలు అస్సిరియా ప్రాంతంలో జరిగి ఉంటాయి. కాస్పియన్ (కశ్యప); కృష్ణ సముద్రం (Black Sea) మధ్య ప్రాంతంలో తొలి నాగరికతా ఘర్షణలు సంభవించి, ఆ తరువాత దేవాసుర యుద్ధాలు మధ్యధరా ప్రాంతంలో ఉర్, ఉరుక్, నిప్పుర్, లగాష్ ప్రాంతాలలో జరిగినవి మౌఖిక గాథలై ప్రచారాన్ని పొంది ఉంటాయి.

మొదటి జరాతుష్ట్రుడు 7200 BC, రెండవ జరాతుష్ట్రుడు 1300–1210 BC నాటివారు. అహురమజ్ద కుమారుడు గయొమర్తుడు అతడి వంశం వాళ్లు మొదటి జరాతుష్ట్రుడికి ముందు 3070 సంవత్సరాలు పాలించారని చెప్పబడింది.

ఈజిప్టు ప్రాంతంలో సూర్యుడిని (రా–రవి), ఉరుక్ ప్రాంతంలో చంద్రుడిని (Nanna-నన్న–ఇనాన్న) పర్షియా ప్రాంతంలో అగ్నిని ఆరాధించారు.

'అగ్నిమీళే పురోహితం' అన్న స్తోత్రంతో ప్రారంభమవుతుంది ఋగ్వేదం.

ఇద్దరు జరాతుష్ట్రుల (వృద్ధ మునుల) మధ్య ఆరువేల సంవత్సరాల కాలం గడిచింది. అనేక తెగలు ఉరుక్ (ఇరాక్) పర్షియా (ఇరాన్) సింధూ నదుల మధ్య అభివృద్ధి చెందసాగినాయి.

వాటిలో ఒక తెగకు (త్రస్యు–భరత) వశిష్ఠుడు పురోహితుడు. ఇంద్రుడు అధిదేవత. అగ్ని ప్రాబల్యం తగ్గి ఇంద్రుడి ప్రాబల్యం పెరిగి కొట్లాటలు జరిగాయి. జరాతుష్ట్రుని అనుయాయులకు ఇంద్రుడు అసురుడు; ఇంద్రుని అనుయాయులకు– వాళ్లు అసురులు. వారి గ్రంథం అవెస్తా–అసురవేదం. వీళ్లు అంగిరసుడిని దుష్టాగ్ని అన్నారు. దేవతలు అంగీరసుడిని తొలి అగ్ని స్థానంలో అగ్నిగా నియమించారు. వేల సంవత్సరాల యుద్ధాలలో కొందరు వెనక్కిపోయి మితాన్ని ప్రభువులైనారు. కొందరు ఆర్యనులైనారు. కొందరు ఆర్యులు తెగలు తెగలుగా సప్త సింధూ మైదానం చేరుకున్నారు.

దాదాపు అదే సమయంలో (2000–1800 BC) కాలంలో మరో విశేషం జరిగింది. అది ఉర్ ప్రాంతపు అబిరాముడు (అబ్రాం) యూఫ్రటిస్ నది వెంబడే ప్రస్తుత టర్కీ ప్రాంతంలోని హర్రాన్ వేపు వెళ్తున్నాడు. తమ పూర్వీకుల దేవుడు ఆజ్ఞాపించినట్లు చంద్రుని ఆరాధకులు ఉర్ కస్డిమ్ నగరాన్ని వదిలి తెరా, సారా, లాట్ అబ్రామ్‌లు హరాను చేరుకున్నారు. అక్కడ నుంచి ఈజిప్టుకు, ఈజిప్టు నుంచి కానాన్ (పాలస్తీనాకు) వీరి ప్రయాణం ఉద్దేశించబడింది.

హరాన్ చుట్టుపక్కల మిత్తాని రాజ్యం ఉండేది. వాళ్ల ప్రభువుల పేర్లు సంస్కృత పేర్లు. 1600–1300 BC ప్రాంతంలో వీరు హిట్టైట్లు, అస్సిరియన్లు, ఈజిప్టు ఫారోలతో యుద్ధాలు చేసారు. మైత్ర, కీర్త, శుత్తర్ణ, పరత్తర్ణ, పర్యతతర, శౌశతర, శైతర్ణ, అర్తతమ, అర్తశుమార, తుశరత్త, శత్తివజ, శతతుర మొదలైనవి వీరి పేర్లు.

అబ్రాం గురించి మితాన్నిల గురించి తరువాత మాట్లాడుకుందాం. ఇప్పుడు సప్త సింధుమైదానంలో జరిగిన దశరాజ యుద్ధం గురించి. ఇది ఋగ్వేదం ఏడవ మండలంలో ప్రస్తావించబడింది. క్రీస్తుపూర్వం 1400లో జరిగిందనేది చరిత్రకారుల అభిప్రాయం.

కురుక్షేత్రానికి పశ్చిమాన పరుస్ని (రావి) నది దగ్గర ఒక వాగు దగ్గర సుదాసుడు–వశిష్ఠుడు–తృత్సుభరతులు అతితక్కువ మంది వీరులతో ఒక పక్షంగా, అలీన, అను, భృగు, భలన, దాస, ద్రుహ్య (గాంధారీలు), మత్స్య, పురు, పర్ణి (యయాతి పుత్రులు?) మరోపక్షంగా (పదిమంది రాజులు 6666 మంది వీరుల కూటమిగా) యుద్ధం చేయగా తృత్సు భరతులు గెలిచారు. ప్రాణనష్టం 6666 మంది. వాగు పొంగి నీళ్లలో కొట్టుకుపోయారు. (ఇంద్రుడు బహుశా ఆనకట్ట తెగగొట్టమని సలహా ఇచ్చినట్టున్నాడు వశిష్ఠ–సుదాసులకు).

దీనిని బట్టి భరత వంశీయులు సింధునది ఆవల వేపు నుంచి వచ్చి సరస్వతి, దృశస్వతి నదుల మధ్య బ్రహ్మావర్తాన్ని ఏర్పాటు చేసి, ఆనక దానిని నర్మద–తపతి–వింధ్యల వరకు విస్తరింపచేసారు. అగస్త్య మహర్షి వింధ్యను దాటి దక్షిణ దేశాన్ని చేరినాడు. అరణ్యాలలో నిండి ఉన్న రాక్షసులను నిర్జించేందుకు రాముడి రాక అవసరమై త్రేతాయుగాంతాన రామ రావణ యుద్ధం జరిగింది.

మహాభారత కథను చదువుతూ ఉన్నపుడు మనకు దేవతలు హిమాలయ పర్వత ప్రాంతాలలో ఎత్తైన చోట్ల, శివుడి (రుద్రుడి) సేవకులు కైలాస శిఖరం వద్ద, అతడికి చేరువలో కుబేరుని యక్షులు, ఆ చుట్టుపక్కల వనాల్లో సంఖ్య తగ్గిన రాక్షసులు, సరస్సుల వద్ద అప్సరసలు, నిధులకు వనాలకు రక్షకులుగా గంధర్వులు, యమునా నది చుట్టుపక్కల ఖాండవ వనం, కురుక్షేత్రం, మహిష్మతి, కాళింది మడుగుల వద్ద తక్షక, కర్కోటక కాళీయ నాగులు ఉండడం మనం గమనిస్తాము. వీరికి మానవులకు మధ్య వివాహ, స్నేహ సంబంధాలుండేవి.

ద్వాపర యుగాంతానికి త్రేతాయుగపు సూర్య వంశస్థుల ప్రాభవం తగ్గి, చంద్రవంశపు కౌరవ పాండవులు, యాదవుల ప్రాముఖ్యత పెరిగింది. కౌరవులు–పాండవుల మధ్య యుద్ధం కురుక్షేత్ర యుద్ధమై మహాభారతమైనది.

# 107. నేటి యుద్ధాల నీడలు - గత యుద్ధాల జాడలు

బైబిల్ ప్రకారం– ఆదాం నుంచి నోవా వరకు 1656 సంవత్సరాలు, నోవా–జలప్రళయం నుంచి అబ్రహాం ఉర్ కస్దిమ్–కార్దియాను వదిలి వెళ్లేప్పటికి 422 సంవత్సరాల పదిరోజులు (జలప్రళయం ఒక సంవత్సరం పదిరోజులుండింది); అబ్రహాం 'ఉర్' నుంచి బయల్దేరి ఈజిప్టు, కానాన్ (పాలస్తీనా) చేరుకోవడం – ఇసాక్ – జాకబ్ (ఇజ్రాయేల్) – ఈజిప్టులో 220 ఏళ్లున్నాడు జాకబ్.

ఈజిప్టు నుంచి ఇజ్రాయెలీల వలస - Exodus - నుంచి తొలి దేవాలయం నిర్మాణం – 480 సంవత్సరాలు); అప్పటి నుంచి బాబిలోన్‌చే ఆక్రమణ – 419 సంవత్సరాలు; అప్పటి నుంచి క్రీస్తు జననం వరకు 483 సంవత్సరాలు.

ఆదాము – సెత్ – ఇనాష్ – కెనాన్ – మహలాలెల్ – జారెద్ – ఇనాక్ – మెథుసాలె – లామెక్ – నోవా

**నోవా–** జలప్రళయంలో బ్రతికినవాడు నోవా (మనువు) అనవచ్చు. నోవాకు ముగ్గురు కుమారులు షెమ్, హామ్, జఫెత్

**షెమ్–** వంశస్థులు – సెమైట్లు (ఈలమ్, అషుర్, అర్ఫాక్జాడ్, లుడ్, ఆరమ్) (పశ్చిమ ఆసియా ప్రజలు)
– అర్ఫాక్జాద్ వంశంలో జన్మించాడు అబ్రహాం.

**హామ్–** (నల్లగా, కాలిపోయిన, వేడిగా) – తండ్రి నోవా నగ్నత్వాన్ని చూసినందు వలన అతడి వంశీకులు బానిసలుగా బ్రదకాలని శపించబడినాడు.

– హామ్ కుమారులు– కుష్, మిజ్రయెమ్, ఫుత్, కానాన్. కానాన్ దిగువ ప్రాంతం, ఊదారంగు నేల (Land of Purple) ఫొనిషియా. (ఫిలిస్తినులు–పాలస్తీనియా ప్రజలు)

– సిడొనియన్లు, హిట్టైట్లు, జెబుసైట్లు, అమొరైట్లు, గిర్గాషైట్లు, హివైట్లు, అర్కైట్లు, సినైట్లు, అర్వాడైట్లు, జెమరైట్లు, హమథైట్లు.

(ఈ హిట్టైట్లు 1300 BC కాలంలో మితాన్నిలను ఓడించారు.)

**జఫెత్–** నోవా మూడవ కుమారుడు– యూరోపియన్లకు, చైనీయులకు మూలపురుషుడని వ్రాసుకున్నారు.
– జఫెత్ కుమారులు– గొమర్, మగాగ్, మదయి, జవన్, తుబయి, మెషెక్, తిరస్.
జఫెత్ –అంటే అందగాడు.

నోవా ద్రాక్షారసం తాగి తన శిబిరంలో నగ్నంగా పడి ఉన్నాడు. హామ్ ఆ దృశ్యాన్ని చూసి నవ్వుతూ, ఎగతాళిగా షెమ్, జఫెత్‌లకు చెప్పగా, షెమ్, తన తండ్రివేపు చూడకుండా జఫెత్ సాయంతో తండ్రి నగ్నదేహంపై వస్త్రాన్ని కప్పినాడు. ఆ విషయం తెలిసినాక నోవా– హామ్‌ను తరతరాలుగా షెమ్‌కు సేవకులుగా బ్రదకమన్నాడు. జఫెత్ ఐశ్వర్యం ఇనుమడించాలని ఆశీర్వదించినాడు.

(ఇది యయాతి కథను గుర్తుకు తెస్తుంది. యయాతి శర్మిష్ఠల రహస్య సంబంధం తెలిసిన దేవయాని తన తండ్రి శుక్రాచార్యుడికి ఫిర్యాదు చేసింది. 'వృద్ధుడివి కమ్ము' అని శుక్రుడు శపించాడు యయాతిని. తన కుమారులు ఎవరైనా తమ యవ్వనాన్ని తండ్రికివ్వవచ్చు– అయితే దేవయాని కొడుకులు యదు, తుర్వసులు తండ్రిని అధిక్షేపించి రాజ్యార్హత కోల్పోయారు. శర్మిష్ఠ పుత్రులలో అనుద్రుహ్యుడి వంశీకులు యవ్వనంలోనే మరణిస్తారని, ద్రుహ్యుడి వంశీకులు జలమయ ప్రదేశాలకు, దీవులకు రాజులవుతారని, తుర్వసులు కిరాతులకు రాజులవుతారని శపించాడు యయాతి. తండ్రికి తన యవ్వనాన్నిచ్చిన శర్మిష్ఠ ఆఖరి కుమారుడు 'పూరువు'కు రాజ్యార్హత దక్కింది.)

## Table of Nations (రాజ్యాల పట్టిక)

**షెమ్–** అరబ్బులు, ఇజ్రాయెలీలు, (ఉత్తర, దక్షిణ అమెరికాలోని ఇండియన్లు, తూర్పు పర్షియా, ఇండియా ప్రజలు. షెమ్ వంశస్థుడు జొక్తాన్ ద్వారా)

**హామ్–** కుష్, ఈజిప్టు, ఫుత్, కానానైట్లు (పాలస్తినా)

**జఫెత్–** యవనులు, గ్రీకులు

రాబర్ట్ విల్కిన్‌సన్ అనే చరిత్రకారుడు బైబిల్ పరిజ్ఞానాన్ని చరిత్రకన్వయించి నోవా కుమారుడైన షెమ్ కుమారుడైన జొక్తన్ వంశీకులుగా ఇండియా చుట్టుపక్కల దేశాల ప్రజలను పేర్కొన్నాడు– హవిలా–టిబెట్; షెబా–దక్కన్; ఒబిల్–చైనా, జొబాబ్–మంగొలియా; అబిమెల్–ఇండొ చైనా; దిక్ల–జపాన్, ఒఫిక్–ఇండొనేషియా (మలుకు దీవులు).

జలప్రళయం తరువాత ప్రజలు మరల ప్రపంచమంతటా నిండారు అని చెప్పడానికి ప్రతి నాగరికత ఒక వివరణ ఇస్తుంది.

(హిందూ ఆలోచనలో ప్రజాపతులున్నారు. కశ్యప ప్రజాపతికి అనేక మంది భార్యలు. వారి ద్వారా స్థావర, జంగమ జీవజాలం ఉద్భవించింది. మాతృమూర్తి ఎవరైతే వారి సంతానం వాళ్లు– చెట్లు, పక్షులు, జంతువులు, దైత్యులు, ఆదిత్యులు ఇలా. ఇది మన పురాణకర్తలకు నచ్చిన పద్ధతి).

నోవా నుంచి పదవ తరం వాడు అబ్రహాం. ఉర్ (ఇరాక్‌లో) జన్మించాడు. అతడు, తండ్రి తెరా, భార్య సారా, తండ్రి సోదరుడి కుమారుడు లాట్‌లతో కలిసి హరాన్ (టర్కీ)లో అయిదేళ్లున్నాడు. తెరా అక్కడే చనిపోయాడు. దేవుడు పిలుస్తుండగా 'హరాన్' వదిలి అబ్రహాం కానాన్ (పాలస్తీనా)లోని షెచెమ్ (Schechem) చేరుకున్నాడు. కానాన్‌లో కరువు రావడంతో ఈజిప్టుకు వెళ్లాడు.

'సారా' కోసం తనను ఈజిప్టు ప్రభువు చంపుతాడేమోనని భయపడి ఆమె తన సోదరి అని చెబుతాడు అబ్రహాం. ఫారో ఆమెను తన ఇంటికి తీసుకుపోగా అనేక ఉత్పాతాలు వచ్చేసరికి ఆమెను అబ్రహాం దగ్గరకు పంపివేసి వారిని ఈజిప్టు నుంచి పంపివేసాడు ఫారో.


అప్పటికే అబ్రాం, లాట్‌ల గొర్రెలమందలు ఇబ్బడిముబ్బడిగా పెరిగి గొర్రెల కాపరుల మధ్య తగాదాలు మొదలైనాయి. దానితో లాట్ ఎడమవేపు కోరుకుని తూర్పుగా జోర్డాన్ లోయవేపు వెళ్లాడు. అబ్రాం కుడివేపు దక్షిణంగా హెబ్రాన్ చేరుకున్నాడు. లాట్ వెళ్లి వెళ్లి సొడొమ్, గొమొర్ర పట్టణాల వద్ద స్థిరపడినాడు. దురదృష్టవశాత్తు ఎలమైట్ ప్రభువు ఆ పట్టణాలపై దండెత్తి పొలిమేరలో ఉన్న 'లాట్'ను బంధించి అతడి సంపదలను స్వాధీనం చేసుకున్నాడు.

అబ్రామ్‌కు ఈ సంగతి తెలిసి 318 మంది సేవకుల దళాన్ని పంపి 'సిద్దిమ్' యుద్ధంలో ఎలమైట్ సైన్యాన్ని ఓడించి, ఎలమైట్ రాజు 'ఛెదర్‌లావొమర్'ను చంపి 'లాట్'ను విడిపించారు. సోడోమ్ ప్రభువు స్వయంగా వచ్చి అబ్రామ్‌తో సంధి చేసుకున్నాడు.

(ఈ కథ ఘోషయాత్రలో గంధర్వుల నుంచి దుర్యోధనుడిని అర్జునుడు విడిపించిన కథను పోలి ఉంటుంది.)

ఈ సమయంలోనే సారా తన ఈజిప్టు బానిస 'హగార్'ను తన భర్తకివ్వగా వారికి 'ఇస్మాయెల్' జన్మించాడు. ఇతడు ఇస్మాయిలైట్ల మూలపురుషుడు.

**అబ్రహాం (భార్యలు ముగ్గురు)**




అబ్రహాం + హగార్ → ఇస్మాయెల్

ఇస్మాయెల్ కుమారులు – నెబైయత్, కెదార్ (కెదారైట్లు–ఖురేషి తెగ – ప్రవక్త మహమ్మదు జన్మించాడు), అద్బిల్, మిబ్సమ్, దుమాహ్, మస్సా, హదాద్, తెమా, జెతుర్, నఫిష్, కెదెమా; కుమార్తె–మహలత్ (బసెమత్).

పదమూడేళ్ల తరువాత 99 ఏళ్ల వయసున్న 'అబ్రహమ్'కు 90 ఏళ్ల 'సారా'కు ఇసాక్ జన్మిస్తాడని, అబ్రహాంను అనేక దేశాలకు తండ్రిని చేస్తానని వాగ్దానం చేసాడు దేవుడు. సున్నతి–Circumcission-ఆ ఒడంబడికకు గుర్తు అయినది. దేవుడి ఆనతితో తాను, తన కుటుంబం, సేవకులలోని మగవాళ్లకు, ఇస్మాయెల్‌కు 'సున్నతి' చేయించాడు అబ్రహాం.

తప్పు చేసిన సొడొమ్, గొమొర్రలు దేవుడి ఆగ్రహానికి గురై భస్మమైనాయి. లాట్ భార్య వెనక్కి తిరిగి చూసి ఉప్పుశిలగా మారింది.

అబ్రహాం నూరవ ఏట జన్మించాడు ఇసాక్. ఆ బాలుడికి ఎనిమిదవ రోజు సున్నతి చేసారు.

హగార్, ఇస్మాయెల్‌లు బహిష్కరించబడినారు 'సారా' ఆజ్ఞతో.

ఇసాక్‌ను దేవుడికి బలి ఇవ్వబోగా దేవుడు ఆపి తుప్పల్లో చిక్కుకున్న గొర్రెపొట్టేలును బలిగా అంగీకరించాడు.

(ఉపరిచర వసువు 'అజ' మేకను యజ్ఞంలో బలి ఇవ్వవచ్చు –అన్నాడు).

ఇసాక్ భార్య రెబెక్కా– వీరికి ఇద్దరు కుమారులు ఇసావు, జాకబ్. కవలలు. ఇసావు ముందు పుట్టాడు, జాకబ్ అతడి చీలమండను పట్టుకుని తరువాత వచ్చాడు.

ఇసాక్‌కు ఇసావు (Esau) అంటే ఇష్టం. రెబెక్కాకు జాకబ్ (Jacob, Yakob) అంటే ఇష్టం.

జాకబ్ (Jacob) అంటే he grasps the heel అని అర్థం. మోసం చేసే స్వభావమున్నదని అర్థం. తల్లి కడుపులోనే ఇద్దరూ కొట్టుకునేవారు. ముందు పుట్టినాడు కనుక తల్లిదండ్రుల ఆస్తికి హక్కుదారుడైనాడు ఇసావు. అయితే ఒకరోజున బాగా ఆకలిమీద ఉన్న ఇసావుకు ఎర్రటి జావ ఇచ్చి జన్మహక్కు– Birth Right` be korah - ను తీసేసుకున్నాడు జాకబ్.

అంతేకాక కవలలు పుట్టినప్పుడు ముందు పుట్టినవాడు దారిచూపేవాడిగా (Pilot), వెనక వచ్చేవాడు హక్కుదారుడు, లేదా అధికారిగా నిర్ణయించారు. దానితో తన హక్కును కోల్పోయినాడు ఇసావు.

ధృతరాష్ట్రుడు అంధత్వం వలన, విదురుడు దాసీపుత్రుడు కావడం వలన రాజ్యాధికారం కోల్పోగా మధ్యలో పుట్టిన పాండురాజుకు గద్దె దక్కింది. గాంధారి ముందే గర్భవతి అయినా ముందు ధర్మరాజు పుట్టడంతో యువరాజు పదవి ధర్మరాజుకు దక్కింది. అందుకే రెండేళ్ళు తల్లిగర్భంలో, రెండేళ్లు నేతికుండలో శకలంగా పెరిగి భీముడి కన్నా కొన్ని గంటలు వెనక పుట్టినవాడు– నాతండ్రి అంధుడు కావచ్చు కాని, నేను కాదు –అని తానే రారాజుగా ప్రకటించుకున్నాడు. వాళ్ల తండ్రి, అదీ కన్నతండ్రి కాదు, పాండురాజు తన హక్కుల్ని అన్నకు వదిలి శతశృంగం పోయినాడు. అక్కడ నియోగ పద్ధతిలో పుట్టారు పాండవులు. అక్కడే పెరిగారు కొన్నాళ్లు. ఇప్పుడు వారికి హస్తినలో వాటా ఎక్కడిది? –అని అడిగాడు దుర్యోధనుడు.

ఆస్తి పంపకాలు అంత తేలిక కాదు. స్త్రీ ఒక సంపదగా మారినాక– "తానోడి నన్నోడెనా, నన్నోడి తన్నోడెనా?" అని నిండు సభలో ప్రశ్నించాల్సి వచ్చింది ద్రౌపది.

దాసీ పుత్రుల గొడవ అబ్రహాం, జోసెఫ్‌ల కాలంలో కూడా ఉన్నది.

అబ్రహాం కుమారుడు ఇసాక్, ఇసాక్ కుమారుడు జాకబ్. జాకబ్‌కు నలుగురు భార్యలు, పన్నెండుమంది కొడుకులు, ఒక కుమార్తె దినా (Dinah). దేవదూతతో కుస్తీపట్టి జాకబ్– ఇజ్రాయెల్‌గా పేరు తెచ్చుకున్నాడు. (శివుడితో మల్లయుద్ధం చేసి అర్జునుడు పాశుపతాస్త్రం పొందినట్లుగా)

లియా (Leah) - రూబెన్, సిమియన్, లెవి, జూదా

రాఛెల్ దాసి బిల్హా – డాన్, నఫ్తాలి

లియా దాసి జిల్ఫా – గాద్, అషర్

లియా – ఇసాచర్, జబులున్స్ దినా

రాఛెల్ – జోసెఫ్, బెంజామిన్

1) జాకబ్ కాలంలో కానాన్ ప్రాంతంలో కరువు రాగా ఈజిప్టుకు వెళ్లి అక్కడ తన కుమారుడైన జోసెఫ్ ఆదరణలో స్థిరపడినాడు జాకబ్ తన కుటుంబ సభ్యులు, సేవకులతో. 30 ఏళ్ల తరువాత– ఫారో ఆజ్ఞలతో జాకొబైట్లు (ఇజ్రాయెలీలందరు) కట్టుబానిసలై వెట్టిచాకిరీ చేయసాగినారు. 430 ఏళ్లకు మోసెస్ (Moses) నాయకత్వంలో ఈజిప్టు నుంచి మూకుమ్మడి వలస (Exodus)గా బయటపడినారు. 40 ఏళ్లు ఎడారిలో తిరిగి తిరిగి చివరకు జాషువా కాలంలో కానాన్‌లోకి ప్రవేశించి ఇజ్రాయెల్‌లు రాజ్యాన్ని స్థాపించుకున్నారు.

2) బాబిలోన్ ప్రభువైన నెబుఛాద్‌నెజ్జర్ జెరూసలెంపై దండెత్తి 10,000 మంది ఇజ్రాయెలీలను రాజ్య బహిష్కారం చేసాడు. మొదటి సొలొమాన్ దేవాలయ ధ్వంసం చేసాడు (586 BC). యూదుల లెక్క ప్రకారం 422 BCలో ఈ సంఘటన జరిగింది.

3) పర్షియా/మెడియా ఆక్రమణ (372–348 BC) – పర్షియా ప్రభువు మొదటి దరియస్, సైరస్‌లు యూదులకు అనుకూలంగానే ఉన్నారు. అహస్యూరియస్ వ్యతిరేకించాడు.

4) గ్రీకులు (371–140 BC) – అలెగ్జాండర్, సెల్యూకస్‌ల పాలన తర్వాత వచ్చిన నాల్గవ ఏంటియోకస్ యూదులను చిత్రవధ చేసాడు. మక్కబీస్ అనే యూదు యోధుల దళాలు అతడి సైన్యాన్ని ఓడించి ఇజ్రాయెల్‌ను విముక్తం చేసాయి.

5) రోమ్ (69 CE) – యూదులు ఈ కాలానికి ఫరసీయులు, సద్యుసియులు, సికారి, జిలట్‌లను నాలుగు వర్గాలుగా విడిపోయారు. నీరో చక్రవర్తి పంపగా జనరల్ వెస్పాసియన్ తన కుమారుడు టిటస్ (Titus)తో 60,000 సైన్యంతో వచ్చి రెండవ సోలోమాన్ దేవాలయాన్ని నేలమట్టం చేసాడు. యూదులను బహిష్కరించాడు.

1096లో తొలి పవిత్రయుద్ధం (Crusade), 1190లో ఇంగ్లండ్‌లో యూదుల మూకుమ్మడి హత్య (మూడవ పవిత్ర యుద్ధం), 1648లో Gezirat tach utat - మారణకాండ; 1918లో రష్యా విప్లవం సమయంలో 60,000 మంది యూదుల హత్య; హోలోకాస్ట్ సమయంలో 6 మిలియన్ల యూదుల హత్య – వీటన్నిటిని తట్టుకుని యూదులు నిలబడినారు.

క్రీస్తుశకం 1880 నుంచి యూదులు పాలస్తీనాలో భూములు కొనుక్కోవడం మొదలెట్టినారు. 1930 నాటికల్లా Jezreel Valley, Bay of Haifa ను కొనుక్కున్నారు. Sursock Purchases గా ఇవి పేరు గాంచినాయి. 14 మే 1948 నాడు యూదుల రాజ్యంగా Israel Declaration of Independence తీర్మానం చేసారు.

15 మే 1948 నాడు అయిదు అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌పై దాడిచేసాయి. అది తొలి అరబ్–ఇజ్రాయెల్ యుద్ధం. ఏడు లక్షలమంది పాలస్తీనా అరబ్బులను ఇజ్రాయెల్ నుంచి పంపివేసారు.

1967 Sixday War లో West Bank Gaza Strip, Sinai Peninsula, Syrian Golan Heights ఇజ్రాయెల్ వశమైనాయి.

1973 Yom Kippur War సమయంలో ఇజ్రాయెల్‌కు ఈజిప్టు, జోర్డాన్‌లకు మధ్య శాంతి ఒప్పందాలు జరిగాయి.

2023 నాటికి కోటి జనాభాతో, Longest military occupation in modern history గా, 29వ Longest economy గా మారిన ఇజ్రాయెల్‌పై 7 అక్టోబర్ 2023 నాడు హమాస్ Harakat al-Muqawamah al-Islamiyya - Islamic Nesistance Movement దాడి చేసింది. ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల్ని ప్రారంభించింది. మరో కురుక్షేత్ర యుద్ధం మొదలయ్యింది. (ఇరాక్–ఉర్ నగరంలో పుట్టిన అబ్రహం పాలస్తీనాలో వలస దేశాన్ని ఏర్పరచుకున్నాడు.)

అన్నదమ్ముల పిల్లలే కదా వాళ్లూ వీళ్లూ. మాకు దేవుడు ఇచ్చిన రాజ్యమని వాళ్లు, మా దేవుడిచ్చిన నేల మాదని వీళ్లు మరల మారణ హోమానికి తెగబడ్డారు. పేర్లలో కూడా కౌరవులు, పాండవులు, యాదవుల పేర్లకు పోలికలు కనబడుతున్నాయి (అమెరికా). శ్యాముడు యాదవుడే కదా. (మధుర నుంచి వలసవెళ్లి ద్వారకలో రాజ్యాన్ని ఏర్పరచుకున్నాడు శ్రీకృష్ణుడు).

వ్యూహాలు, అస్త్ర శస్త్రాలు పేర్లు మారినా తీర్లు మారలేదు. ఆగ్నేయ, వారుణ, బ్రహ్మాస్త్రాలు, సొరంగాల, గుహల యుద్ధాలు షరా మామూలే. సంజయ, అల్‌జజీరా, బిబిసి వగైరా ఛానల్సు, అంధ నాయకులు, అన్నీ అవే. రథాలు, గుర్రాలు, ఏనుగులు, కాల్బలం యాంత్రిక రూపాల్లో కానవస్తున్నాయి. అశ్వత్థామలు అర్ధరాత్రి మొదలెట్టిన ఆఖరి యుద్ధాన్ని, అర్జునుడు, కృష్ణుడు, భీముడు ఆపడానికి వెళ్తున్నారు రథాలపై. కథనంలో మార్పుందేమో కాని కథ అదే!

ఉక్రెయిన్, తైవాన్, ఆక్రమిత కాశ్మీరు ఇంకా అనేకచోట్ల ఉత్పాతాలు కానవస్తున్నాయి. ఎప్పుడో బ్రహ్మశిరోనామ కాస్త్రాలు వినువీధిలో విస్ఫోటనం చెందగా 'అమానవః' అనో 'అజీవః' అనో మంత్రం నాలుగు దిక్కులా ప్రతిధ్వనిస్తుందేమో!

ప్రవక్తలు ఆకాశంలో నిలబడి కన్నీళ్లతో చూస్తున్నారు ఈ గడుగ్గాయి మానవుల వేపు.

**ధర్మేచ అర్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్.**

అప్పుడు అక్కడ జరిగిందే ఇప్పుడు ఇక్కడ జరుగుతున్నది.

| | | సంస్కృత మహాభారతము | కవిత్రయ మహాభారతము | శ్రీ ప్రసాద మహాభారతము |
|---|---|---|---|---|
| | పర్వం–ఉప పర్వాలు | అధ్యాయాలు – శ్లోకాలు | ఆశ్వాసములు– గద్య పద్యములు | ఆశ్వాసములు– గద్య శీర్షికలు |
| 1. | ఆది | 18 – 9,984 | 8 – 2084 | 8 – 108 |
| 2. | సభా | 9 – 4,311 | 2 – 618 | 2 – 35 |
| 3. | అరణ్య | 16 – 13,664 | 7 – 2894 | 7 – 176 |
| 4. | విరాట | 4 – 3,500 | 5 – 1624 | 5 – 95 |
| 5. | ఉద్యోగ | 11 – 6,998 | 4 – 1562 | 4 – 80 |
| 6. | భీష్మ | 5 – 5,884 | 3 – 1171 | 3 – 80 |
| 7. | ద్రోణ | 8 – 10,919 | 5 – 1860 | 5 – 88 |
| 8. | కర్ణ | 1 – 4,900 | 3 – 1124 | 3 – 56 |
| 9. | శల్య | 4 – 3,220 | 2 – 827 | 2 – 38 |
| 10. | సౌప్తిక | 3 – 2,870 | 2 – 376 | 2 – 20 |
| 11. | స్త్రీ | 5 – 1,775 | 2 – 376 | 2 – 23 |
| 12. | శాంతి | 4– 14,525 | 6 – 3093 | 6 – 170 |
| 13. | అనుశాసనిక | 2 – 12,000 | 5 – 2148 | 5 – 102 |
| 14. | అశ్వమేధ | 2 – 4,420 | 4 – 976 | 4 – 57 |
| 15. | ఆశ్రమవాస | 3 – 1,106 | 2 – 362 | 2 – 23 |
| 16. | మౌసల | 1 – 300 | 1 – 226 | 1 – 22 |
| 17. | మహా ప్రస్థానిక | 1 – 120 | 1 – 79 | 1 – 8 |
| 18. | స్వర్గారోహణ | 1 – 200 | 1 – 97 | 1 – 19 |
| | హరివంశ భవిష్య | 2 – 000 | | |
| | | 100 – 100,000 | 63 – 21507 | 63 – 1200 |

(కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము – ఆదిపర్వము – పర్వ సంగ్రహము నుంచి) –నన్నయ భట్టారకుడు (1-1-35-65)

# 108. ఎవరు నీవు? ఎక్కడ నుంచి వచ్చావు?

**నాస దాసీన్నో సదాసీత్తదానీం నాసీద్రజో నో వ్యోమాపరోయత్**
**కిమా వరీవః కుహకస్య శర్మన్నంభః కిమాసీద్గహనం గ భీరమ్**

"అన్నీ తెలిసిన ఆ బ్రహ్మకు ఈ సంగతి తెలుసు. ఏమో, తెలియకపోవచ్చు కూడా!" -అని ఋగ్వేదం దశమ మండలం- నాసదీయసూక్తంలో ఈ భావన వ్యక్తపరచబడింది.

శ్రీమహావిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య అద్యబ్రాహ్మణః ద్వితీయ పరార్థే శ్వేత వరాహకల్పే వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమ పాదే జంబూద్వీపే భారతవర్షే భరత ఖండే మేరోః దక్షిణదిగ్భాగే శ్రీశైలస్య.... అంటూ ఉన్న ప్రాంతాన్ని, కుల గోత్ర నామాలు, కాల సమయాలు చెబుతూ పలకరించుకునేవాళ్లు - మహా సంకల్పం చెప్పుకుంటూ. అది ఆనాటి పద్ధతి.

ప్రపంచంలో ఇన్ని దేశాలున్నాయి, ఇన్ని కోట్లమంది జనం ఉన్నారు, వీరి పూర్వీకులెవరు, ఈ చరాచర జగత్తును సృష్టించిందెవరు? ఇది స్వయంభువా? లేక సృష్టింపబడిందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు అనేకమంది జ్ఞానులు అనేక రకాలుగా చెప్పుకుంటూ వచ్చారు. వీటిలో ముఖ్యమైనవి.

1) భారతం, పురాణాలు - మనువు నుంచి యయాతి నుంచి వంశావళి

2) Table of Nations - Bible (నోవా నుంచి నవీన మానవులు)

3) Human Migration - ఆఫ్రికా నుంచి మానవుడి వలస

## I

పురాణాలు, భారతంలో చెప్పబడిన దాని ప్రకారం- ఈ సప్తమ మన్వంతరమైన వైవస్వంత మన్వంతరంలో- సూర్యుడి (వివస్వంతుడు) కుమారుడు వైవస్వత మనువు. అతడి భార్య శ్రాద్ధ. వీరి కుమారులు ఇక్ష్వాకు, ధృష్ట, నరిష్యంత, దిష్ట, నృగ, కరూశ, శర్యాతి, నాభాగ, ప్రాంశు, పృషధ్ర; కుమార్తె ఇల.

ఇల ఒక నెలపాటు ఆడపిల్లగా, ఒకనెల మగపిల్లవాడు సుద్యుమ్నుడిగా ఉంటుంది. 'ఇల'గా ఉన్నపుడు ఆమె చంద్రుడి కుమారుడు బుధుడిని వివాహం చేసుకోగా వారికి పురూరవుడు జన్మించాడు. పురూరవుడు-ఊర్వశిల పుత్రులు ఆయు, అమావాసు, వనాయు, శ్రుతాయు, శతాయు, దృఢాయు.

ఆయువు-ప్రభ (రాక్షసరాజు స్వర్భాను కుమార్తె)ల పుత్రుడు నహుషుడు. నహుషుడు-విరజల కుమారులు యతి, యయాతి, సంయాతి, ఆయతి, వియతి, కృతి.

యయాతికి దేవయాని వలన యదువు, తుర్వసుడు; శర్మిష్ఠ వలన అనుద్రుహ్యు, ద్రుహ్యు, పూరువులు జన్మించారు. యయాతి-దేవయానిల కుమార్తె మాధవి. యదువు నుంచి యదు వంశం; తుర్వసుడి నుంచి యవనులు; దృహ్యుడి నుంచి త్రిపుర వంశం, అనుద్రుహ్యుడి నుంచి మ్లేచ్ఛులు (తుషారులు), పూరువు వారసుల నుంచి కురు వంశస్థులు జన్మించారు. ఇది చంద్రవంశం.

**యయాతి శాపం:** యయాతి భార్య దేవయాని తండ్రి శుక్రాచార్యుడి శాపంతో అకాల వృద్ధాప్యానికి గురైన యయాతి తన కుమారులను పిలిచి వారి యవ్వనాన్ని తనకిచ్చి తన వృద్ధాప్యాన్ని స్వీకరించమని అడిగాడు. యదువు, తుర్వసుడు, అనుద్రుహ్యుడు, ద్రుహ్యుడు అంగీకరించలేదు. ఆఖరివాడైన పూరువు అంగీకరించాడు. పూరువుకు రాజ్యాధికారం లభించింది.

**సూర్యవంశం :** బ్రహ్మమానస పుత్రుడైన మరీచి సప్తర్షులలో ఒకడు. మరీచి-కళ ల కుమారుడు కశ్యపుడు. కాశ్మీరులో స్థిరపడిన కశ్యపుడు ప్రజాపతిగా జీవజాతుల్ని సృజించాడు. కశ్యపుడు-అదితిల కుమారుడు వివస్వంతుడు (సూర్యుడు). వివస్వంతుడి భార్య సంజ్ఞ (శరణ్య, సంధ్య, సంజన, సువర్చల, రండాలు, శౌరి -ఆమె ఇతర పేర్లు) ఈమె విశ్వకర్మ త్వష్ట కుమార్తె. వీరి కుమారులు- యమ, యమి, అశ్వినులు, రేవంతుడు (రైవతుడు), శ్రాద్ధదేవ మనువు.

శ్రాద్ధదేవుడనే వైవస్వత మనువు కుమారుడు ఇక్ష్వాకుడికి నూరుగురు కుమారులు. వీరిలో వికుక్షి, నిమి ముఖ్యులు.

జలప్రళయం తరువాత వైవస్వత మనువు సరయూ నది ఒడ్డున అయోధ్యను నిర్మించాడు.

ఈ సూర్యవంశంలో ముఖ్యులు మాంధాత, ముచుకుందుడు, అంబరీషుడు, భరతుడు, బాహుబలి, హరిశ్చంద్రుడు, దిలీపుడు, సగరుడు, రఘు మహరాజు, శ్రీరాముడు, ప్రసేనదుడు.

బౌద్ధ వాఙ్మయం ప్రకారం– శుద్ధోదనుడు, గౌతమబుద్ధుడు, రాహులుడు సూర్యవంశం వారు.

జైన సాహిత్యంలో– ఇక్ష్వాకుడే తొలి తీర్థంకరుడైన రిషభనాథుడు. ఇప్పటికి 21 తీర్థంకరులు జన్మించారు.

ఈ విధంగా పురాణ ప్రపంచంలోని సూర్య, చంద్ర ఆరాధకులు ప్రథమాగ్ని అగ్నిదేవుడు, ద్వితీయాగ్ని అంగీరసుడి వంశస్థులైన అగ్ని ఆరాధకులు. సప్తర్షుల వంశాలకు చెందినవారు.

## II

అబ్రహామీయ మతాలైన హీబ్రూ, క్రైస్తవ, ముస్లిమ్ మతాలకు మతగ్రంథాలు వరుసగా టోరా, బైబిల్, ఖురాన్‌లు.

ఆదాం నుంచి పదవ తరం వాడైన నోవా, నోవా (Noah) కుమారులు హామ్, షెమ్, జపెత్ (Ham, Shem, Zaphet).

షెమ్ (Shem)– సెమైట్లు (అరబ్బులు, యూదులు, అక్కడియన్లు, ఫొనిషియన్లు).

హామ్ (Ham)– హమైట్లు (బెర్బరులు, కుషైట్లు, ఈజిప్టువాసులు, ఆఫ్రికా ప్రజలు).

జఫెత్ (Japhet)– White People (ఇండొ–యూరొపియన్లు, చైనీయులు, యూరోపియన్లు).

యయాతి శాపం వంటిదే నోవా శాపం. జలప్రళయం తరువాత నోవా ద్రాక్షతోటను పెంచాడు. ద్రాక్షరసం తాగి 'నోవా' నిద్రపోతుంటే అతడి శరీరంపైన అంగీ తొలగి నగ్నంగా, ఒళ్లెరగకుండా పడి ఉన్నాడు. అతడి ఆఖరి కుమారుడు 'హామ్' అది చూసి బయటకు వచ్చి పగలబడి నవ్వుతూ తన సోదరులతో చెప్పాడు. షెమ్ వెంటనే ఒక వస్త్రాన్ని తెచ్చి జఫెత్‌ను రెండో చివర పట్టుకొమ్మని చెప్పి తండ్రివేపు చూడకుండా వెనక్కి నడుస్తూ వెళ్లి తండ్రిపై కప్పి నగ్నత్వాన్ని మరుగు పరచాడు. ఆ తరువాత నిద్ర నుంచి మేలుకున్న నోవా తన కుమారుడైన 'హామ్'ను శపించాడు– "హామ్! తప్పు చేసావు నీవు. దానివలన నీ కుమారుడు కానాన్, అతడి వంశస్థులు తరతరాలుగా 'షెమ్' వంశీకులకు బానిసలు, సేవకులౌదురు గాక!

షెమ్! నీవు ఉన్నతుడివి. కానాన్ నీకు సేవకుడగును గాక! జఫెత్! నీవు, నీ అన్నను అనుసరించి ధన్యుడవైనావు. నీ వారసులు షెమ్ వారసులతో పాటు దినదినాభివృద్ధి చెందెదరు గాక!" (జెనెసిస్ 9:20–27)

Table of Nations - The Generations of Noah (Origines Gentium) (Hebrew Bible-Genesis10:9)

**1) షెమ్ వారసులు–** అరబ్బులు, ఇజ్రాయెలీలు, ఉత్తర దక్షిణ అమెరికా వాసులు, తూర్పు పర్షియన్లు, ఇండియా ప్రజలు (జోక్తాన్ సంతానం).

**2) హామ్ వారసులు–** కుష్, ఈజిప్టు, పుట్, కానాన్, ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఆదిమ ప్రజలు.

**3) జఫెత్ వారసులు–** గ్రీకులు, యవనులు, యూరప్ వాసులు.

షెమ్ పుత్రులు– ఎలమ్ (Elam), అషర్ (Asshur), అర్ఫాక్షద్ (Arpachshad), లుద్ (Lud), అరామ్ (Aram).

అరామ్ పుత్రులు– ఉజ్ (Uz), హల్ (Hul), గెథెర్ (Gethar), మాష్ (Mash).

అర్ఫాక్షద్ కుమారుడు షెలా (Shelah); షెలా కొడుకు ఎబెర్ (Eber) (ఎబెర్–హీబ్రూ); ఎబుర్ పుత్రులు– పెలెగ్ (పెలెగ్ కాలంలో భూ విభజన జరిగింది); జొక్తాన్ (Peleg, Joktan).

జొక్తాన్ కుమారులు– అల్మోదాద్, షెలెఫ్, హజర్‌మవెత్, జెరా, హదొరమ్, ఉజల్, దిక్లా, ఒబల్, అబిమెల్, షెబా, ఒఫిర్, హవిలా, జొబాబ్. తూర్పుదేశ పాలకులు వీళ్లు. షెమ్ 600 సంవత్సరాలు జీవించాడు. షెమ్ అంటే కీర్తి, పేరు ప్రఖ్యాతులు (name/fame).

హామ్ (Ham)కు నలుగురు కుమారులు– కానాన్ (Cannan) –కాననైట్లు; మిజ్రయిమ్ (Mizraim)-ఈజిప్టు ప్రజలు; కుష్ (Cush)– కుషయిట్లు; ఫుట్ (Phut)–లిబియన్లు. హామ్ అనేది కాలినపుడు ఏర్పడే నలుపు రంగు. 'Curse of Ham' ను ఆధారంగా చేసుకుని నల్లవారిని తెల్లవారు బానిసలుగా చేసుకోవడం దైవసమ్మతంగా భావించారు ఆ రోజుల్లో.

జఫెత్ (Japheth) కు ఏడుగురు కుమారులు– గోమర్, మగాగ్, మదాయి, జావన్, తుబాల్, మెషక్, తిరస్; వీరందరూ యూరప్ దేశాలకు రాజులైనారు.

గోమర్ కుమారులు– అష్కెనాజ్ , రిఫత్, తొగార్మా.

జావన్ కుమారులు– ఎలిషా, తర్షిష్, కిట్టిమ్, దొడానిమ్

మగాగ్ కుమారులు– ఎలిచానఫ్, లుబాల్

మదాయి కుమారులు– ఎఖాన్, జీలో, ఛజొని, లాట్

తుబాల్ కుమారులు– అరిఫి, కెసెద్, తారి.

మెషక్ కుమారులు– డిడాన్, జరాన్, శెబాష్ని

తిరస్ కుమారులు– బెనిబ్, గెరా, లుపిరియన్, గిలక్.

వీళ్లు కకాసస్ సముద్రతీరం చుట్టుపక్కల నివసించేవాళ్లు–కకేషియన్లు. ప్రొటొ–ఇండొ–యూరొపియన్లు– ప్రొటొ ఇబెరియన్లు వీరు అని కొందరు శాస్త్రజ్ఞులు విశ్వసించారు. (జెనెసిస్ 9:27) (Book of Jasher-1625).

## III

మానవుడు వలసజీవి. ఉన్నచోట ఉండలేడు. చిన్నపిల్లవాడు కూడా నిలబడి అడుగులు వేయడం మొదలెట్టగానే బులిబులి అడుగులు వేస్తూ, పడుతూ లేస్తూ నడక మొదలెడతాడు. ఆహారం, నిద్ర, మైథునాలు, సుఖాన్వేషణలలో, భయం ఉత్సుకత, ఉద్రేకం ప్రేరేపించగా దూరతీరాలకు చేరే ప్రయత్నం చేస్తుంటాడు.

432 కోట్ల సంవత్సరాల క్రితం (4.32 బిలియన్ సంవత్సరాలు) మొదలైన జీవ ప్రపంచం (RNA World) నుంచి DNA World, మొక్కలు, జంతువులుగా, జంతువులు–ఉభయచరాలుగా, సరీసృపాలుగా, క్షీరదాలుగా (Amphibions, Reptiles, Mammals); క్షీరదాలలో ప్రైమేట్లు– 2 కోట్ల సంవత్సరాల క్రితం హొమినిన్స్‌గా పరిణామం చెందాయి.

అవి మానవుడిగా రూపు చెందుకోవడానికి ఏడు దశలున్నాయనేది నవీన శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

1) డ్రయొపిథికస్, 2) రామాపిథికస్ (శివాపిథికస్), 3) ఆస్ట్రాలొపిథికస్, 4) హోమొహాబిలస్ (Able man), 5) హోమొ ఎరక్టస్ (Upright man), 6) హోమొసపియన్స్ నియాండెర్తల్స్ (New human), 7) హోమొసపియన్ సపియన్స్ (Wise man).

ఈ తెలివిగల మానవుడు రెండు లక్షల సంవత్సరాల క్రితం ఆవిర్భవించాడు. ఇతడికి, ఇతడి దగ్గర బంధువు చింపాంజీ మధ్య DNA సారూప్యత 95–99%. New man (నియాండెర్తల్)కు, Wiseman (Sapiens)కు మధ్య సారూప్యత (DNA) 99 శాతం. మానవులలోనూ, నియాండెర్తల్ మానవులలోనూ $FOXP_2$ gene- Control of speech - ఒకేరకంగా ఉంటుంది.

2,70,000 సంవత్సరాల క్రితం Y-Chromosomal Adam - ఇప్పుడున్న మగవాళ్లకు ఆద్యుడు జన్మించాడని, 2,30,000 – 1,50,000 సంవత్సరాల మధ్య mt-DNA Hapolgroup-L (mitochondrial Eve) ఇప్పుడున్న ఆడవాళ్లకు, మగవాళ్లకు తల్లి జన్మించిందని ఆంథ్రొపాలజిస్టులు– మానవ పరిణామ శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

1,50,000 సంవత్సరాల క్రితమే ఆఫ్రికా అంతా తెలివిగల మనుషుల (Homo Sapiens) వలసలతో నిండిపోయింది. (Peopling of Afrca) అప్పట్లో సహారా ఎడారి నందనవనంలా, నీటి ప్రవాహాలతో ఉండేది. వాతావరణంలో వచ్చిన మార్పులతో సహారా ప్రాంతం ఎడారిగా మారడం, జనసాంద్రత పెరుగుతూ ఉండడంతో సముద్ర తీరాల వెంబడి, నదుల ఒడ్లపైన వలసలు మొదలయ్యాయి. 1,00,000 – 75,000 సంవత్సరాల మధ్యకాలం నాటికి రాళ్లను ఆయుధాలుగా వాడడం, నిప్పు వినియోగం, దుస్తుల వాడకం తెలిసిన Wiseman పడవలు, బల్లకట్లు నిర్మించడం నేర్చుకున్నాడు. దక్షిణ ఆఫ్రికా నుంచి తూర్పు ఆఫ్రికాకు వలసలు ప్రారంభమై తీరం వెంబడే నడకలు మొదలయ్యాయి.

1) Northern Route - నైలు లోయ, సినాయి పర్వత ప్రాంతాల మీదుగా
2) Southern Route - Bab-el-Mandeb అఖాతం గుండా.

Out of Africa – ఇది అనేక దశలుగా జరిగింది. దక్షిణమార్గం– Horn of Africa గా పేరు పొందిన సొమాలియా ద్వీపకల్పం (Peninsula), ఇథియోపియా, ఎరిత్రియా, సొమాలియా, జిబౌతి నుంచి సముద్ర తీరం వెంబడే పశ్చిమ ఆసియా, ఇండియా, ఆగ్నేయ ఆసియా, న్యూగినీ, ఆస్ట్రేలియా, ఓసియేనియా ప్రాంతాలకు 70,000–50,000 సంవత్సరాల నాటికి ప్రజలు వలసపోయారనేది పరిశోధకుల అభిప్రాయం.

తొలి వలసలు–Homo Erectus - 20 లక్షల సంవత్సరాల క్రితమే ఆఫ్రికా నుంచి వలస వెళ్లి ఆసియా, యూరప్‌లలో విస్తరించి నియాండెర్తల్స్, డెనిసోవన్లుగా ఆ తరువాత హోమోసపియన్లుగా పరిణామం చెందారు.

75,000 సంవత్సరాల క్రితం Toba explosion సమయంలో మానవ జనాభా లక్ష నుంచి వెయ్యికి చేరుకుని దాదాపు అంతరించబోయి మరల బ్రతికిందని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. పదిలక్షలు–ఎనిమిది లక్షల సంవత్సరాల మధ్య కాలంలో కూడా ఇటువంటి విపత్కర పరిస్థితి ఏర్పడిందని ఓ అంచనా.

50,000 – 25,000 సంవత్సరాల క్రితం నవీన ప్రవర్తన Behavioural Modernity తో మానవజాతి గొప్ప ముందడుగు Great leap forward వేసింది.

65,000 – 50,000 మధ్యకాలంలో చేతితో విసరగలిగిన ఆయుధాలు, చేప కొక్కేలు, సూదులు, పోర్సిలిన్, 35,000–30,000 సంవత్సరాలప్పుడు ఎముకల వేణువులు (సంగీతంపై ఆసక్తి), వీనస్ ప్రతిమలు ఇవన్నీ Great leap forward గా చెప్పబడినాయి.

20,000–10,000 సంవత్సరాల మధ్యకాలంలో యూరేషియన్ ప్రజల చర్మపు రంగు తెల్లబడడం (KITLG, ASIP జన్యువులు); ఇటలీ, కకాసస్ ప్రాంతాలలో నీలికళ్లు (HERCZ), ఉత్తర ఆసియా, ఆర్కిటిక్ ప్రాంతాలలో లావుపాటి మనుషులు, ఇలా వాతావరణాన్ని బట్టి మనుషుల ఆకారం, రంగు, రూపురేఖలలో మార్పులు వచ్చాయి.

12,000 సంవత్సరాల నుంచి వ్యవసాయం, పశువుల పెంపకంపై మానవజాతి ఆధారపడడం ప్రారంభమై పరిణామం వందరెట్లు వేగంగా సాగింది. కొత్త వాతావరణం, కొత్త వ్యాధులు, జన్యువులలో కొత్త మార్పులు వేగవంతమైనాయి.

## 109. భాషా పరిణామం

35 లక్షల సంవత్సరాల క్రితమే చింపాంజీలు పదిరకాల కేకలతో తోటివారిని శత్రువుల గురించి హెచ్చరించేవని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. 60,000–50,000 సంవత్సరాల క్రితం ఆఫ్రికా నుంచి వలస వచ్చిన మానవజాతి సంజ్ఞలతో, కేకలతో సంభాషించుకునేవారు. 4000–3500 B.C. నాటికి సుమేరియన్ భాష కోణాకృతి లిపులు వాడుకలోకి వచ్చాయి. ప్రపంచంలో తొలిభాషగా సుమేరియన్ భాష గుర్తింపు పొందింది. సుమేరియన్ (3100–1700 BC.); హుర్రియన్ (2100 BC.); పలాయిక్ హట్టుసా (1600 BC.); ఈజిప్షియన్ (2700 BC); అక్కడియన్ (2500 BC.); ఎలమైట్ (2500 BC.); హిట్టైట్ (1700 BC.); మైసినియన్ గ్రీకు (1450 BC.) –ఇవి మృత భాషలు.

సంస్కృతం దాదాపు మృతభాషగా మారినా మరల జీవాన్ని పొందింది. సంస్కృతం (1500 BC.), గ్రీకు (1450 BC.), కాప్టిక్ ఈజిప్షియన్ (200 BC.), హీబ్రూ (1000 BC.), చైనీస్ (1250 BC.), అరామిక్ (1100 BC.), అరబిక్ (800 BC.), పర్షియన్ (ఫార్సి) (500 BC.), తమిళం (3300 BC.); ఐరిష్ గాలిక్ (500 AD.) ఇవి సజీవ భాషలు.

ప్రపంచంలో 7168 సజీవ భాషలున్నాయి. ఇండియాలో 122 ప్రధాన భాషలు, 1599 ఇతర భాషలున్నాయి. రాజ్యాంగం గుర్తించినవి 23 ప్రధాన భాషలు. దక్షిణాది భాషలు– తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం; ఉత్తరాది భాషలు– పాత ఇండొ–ఆర్యన్ (1500-600 BC.), మధ్య ఇండొ–ఆర్యన్ (600 BC. - 1000 AD.); కొత్త ఇండొ–ఆర్యన్ (1000-1300 CE); ఈశాన్య భారతంలో– Sino-Tibetan, మణిపురి భాషలు; గజనీ కాలంలో ఇండియాలోకి వచ్చిన పర్షియన్ భాష; సంస్కృతం, అరబిక్, పర్షియన్ భాషలు కలిసిన హిందుస్తానీ, ఉర్దూ భాషలు; బెంగాలి, మరాఠి, గుజరాతి, పంజాబి, కాశ్మీరి, మార్వారి, సింధి, అస్సామి, మైథిలి, ఒరియా భాషలు ప్రధానమైనవి.

ఈ విధంగా భారతదేశంలో 1) ఇండొ–యూరొపియన్ భాషా కుటుంబం (104.5 కోట్లు); 2) ద్రావిడ భాషా కుటుంబం (దక్షిణాది భాషలు)– 26 కోట్లు; 3) ఆస్ట్రో ఆసియాటిక్ (1 కోటి) ఖాసి, ముండా, భూమిజ, సంతాల్; 4) సినొ– టిబెటన్ మణిపురి, బొడొ; 5) తాయ్–కడాయ్–అస్సామ్ (అహోమ్), కామరూపి; 6) అండమాన్ ద్వీప భాషలు– అకా–జెరు, జంగిల్.

# 110. లిపి

Script, Writing, Alphabet, లేఖ, రేఖ, వ్రాత.

బౌద్ధ గ్రంథమైన లలిత విస్తారంలో- బుద్ధుడు 64 లిపులను నేర్చుకున్నాడని చెప్పబడింది. జైన గ్రంథాలలో లిపులు '18'గా పేర్కొన్నారు. బ్రాహ్మి, ఖరోష్ఠి, యవన ముఖ్యమైనవి.

వేద సంస్కృతం (1500-500 BC.), క్లాసికల్ సంస్కృతం (700 BC - 1350 CE) కాలం నాటివిగా భాషా శాస్త్రజ్ఞులు నిర్ధారిస్తున్నారు.

సంస్కృతాన్ని మొదట సరస్వతీ లిపిలో, తరువాత బ్రాహ్మీలిపిలో ప్రస్తుతం పరిణామం చెందిన దేవనాగరి లిపిలో వ్రాస్తున్నారు. ప్రపంచంలోని 876 భాషలకు సంస్కృతం ఉపజీవ్యం -అనేది కొందరి అభిప్రాయం.

ఆధునిక శాస్త్రాలకు గణితశాస్త్రం ఎలాంటిదో, ప్రపంచ భాషలకు సంస్కృతం అటువంటిదని Max Muller పండితుడి అభిప్రాయం.

## భారతదేశ ప్రజలు

1) Ancestral North Indians (ANI)

2) Ancestral South Indians (ASI)

ఉత్తర దేశపు ప్రజలు- మధ్య ఆసియా, కకేషియా, యూరొపియన్ సమూహాలకు చెందినవారు. దక్షిణాది ప్రజలు- కేవలం ఈ దేశానికి చెందినవారు. వారిలో ఇతర దేశాల జన్యు మిశ్రమం లేదు. రెండు ప్రాంతాల ప్రజల మధ్య 4200-1900 సంవత్సరాల మధ్యకాలంలో సంబంధ బాంధవ్యాలతో మిశ్రమ గుంపులు ఏర్పడినాయి. దక్షిణాది ప్రజలు- అండమాన్ దీవుల ప్రజలకు దూరపు బంధువులు.

# 111. ఆది దంపతులు

1) Y-Chromosome Adam - ఆద్మీ-ఆదిమానవుడు Y-క్రోమోజోమల్ మోస్ట్ రీసెంట్ కామన్ ఏన్‌సెస్టర్- YMRCA ప్రస్తుత మగవాళ్ల పిత-ఆది పితరుడు Y-AOO (1,60,000-3,00,000) క్రితం ఇతడు జన్మించాడు (ఆఫ్రికాలో).

2) Mitochondrial Eve - LO - ఈమె ఇప్పుడున్న మగవాళ్లకు, ఆడవాళ్లకు మాతృమూర్తి. Matrilineal most recent common Ancestor (MRCA). వీటిలో Sub groups- L, M, N, R.

L - ఆఫ్రికా (L0, L1, L2, L3, L4, L5, L6, L7)

M - ఆసియా, అమెరికా

N - ఆస్ట్రేలియా, అమెరికా, ఆసియా

R - యూరప్, ఉత్తర ఆఫ్రికా, పసిఫిక్ దీవులు, ఆసియా, అమెరికా.

Y-Chromosome Adam (AO) జన్మస్థానం- కేమరూన్, మధ్య వాయువ్య ఆఫ్రికా ప్రాంతంలో; Mitochondrial Eve (LO) దక్షిణ ఆఫ్రికా, తూర్పు ఆఫ్రికా ప్రాంతంలో పరిణామం చెందినట్లు భావిస్తున్నారు.

# 112. Out of India

65,000 సంవత్సరాల క్రితం Homosapiens Sapiens-wiseman తొలిసారిగా భారతదేశంలో అడుగుపెట్టాడనేది పరిశోధకుల అభిప్రాయం. తీర ప్రాంతాల మీదుగా వాళ్లు ఇండొనేషియా, ఆస్ట్రేలియా వరకు విస్తరించారు.

మొదట్లో భారతదేశమంతా నెగ్రిటోలు, ద్రవిడులుండేవారు. జలప్రళయం నాటి శ్రాద్ధదేవుడు-వైవస్వత మనువు ద్రవిడ రాజుగా పేర్కొనబడినాడు.

ఆర్యులు స్థానికులే అని వాదించేవారు ఆర్యుల జన్మస్థానం భారతదేశమే అని, భారత దేశం నుంచి వెనక్కి వలస వెళ్లినవారు ప్రపంచమంతా విస్తరించారని, సంస్కృతమే దాదాపు 876 భాషలకు తల్లి వంటిదని వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ మధ్య జరిగిన జన్యు పరీక్షలలో భారతదేశంలోని బ్రాహ్మణులు యూరప్ వాసులు, కకేషియన్లకు మధ్య జన్యుదూరం తక్కువని నిర్ధారణ అయ్యింది. దానితో అగ్రవర్ణాలు (బ్రాహ్మణ, క్షత్రియులు) ముఖ్యంగా బ్రాహ్మణులు ఈ దేశ మూలవాసులు కాదని వాదన ప్రారంభమయ్యింది. వాస్తవానికి ఎవరూ ఏ దేశంలోనూ మూలవాసులు కాదు. అందరూ వలస జీవులే.

## 113. వ్యాస విరచిత భారతంలోని కొన్ని విశేషాలు - ఊహాగానాలు

బ్రహ్మ ఆయుర్దాయం నూరేళ్లు. మొదటి 50 సంవత్సరాలు పద్మకల్పం, రెండవ 50 సంవత్సరాలు శ్వేత వరాహకల్పం. ప్రస్తుతం ద్వితీయపరార్థం (శ్వేత వరాహకల్పం)– 51వ సంవత్సరం, మొదటి నెల, మొదటి రోజు, ఏడవ మన్వంతరం, 28వ చతుర్యుగంలో, కలియుగం– ప్రస్తుత బ్రహ్మవయస్సు– 155 ట్రిలియన్ సంవత్సరాలు. (155,521,972,949,125 సంవత్సరాలు).

ఇంకా 155,518,027,050,875 సంవత్సరాల ఆయుర్ధాయం ఉన్నది బ్రహ్మకు. అప్పుడు ఈ బ్రహ్మ నశించి మరో బ్రహ్మ ఆవిర్భవిస్తాడు.

బ్రహ్మకు పగలు (12 గంటలు)– మన లెక్కలో 4.32 బిలియన్ మానవ సంవత్సరాలు (కల్పం).

432,00,00,000 = 14 మనువుల పరిపాలనా కాలం

ఒక్కో మనువు పరిపాలనా కాలం = 30,85,71,429 సంవత్సరాలు

గడచిన మన్వంతరాలు– 1) స్వయంభువ, 2) స్వారోచిష, 3) ఉత్తమ, 4) తామస, 5) రైవత, 6) చాక్షుష.

ప్రస్తుత మన్వంతరం– ఏడవది– వైవస్వత మన్వంతరం. ఇంకా గడవాల్సినవి– 8) సావర్ణి, 9) దక్షసావర్ణి, 10) బ్రహ్మసావర్ణి, 11) ధర్మసావర్ణి, 12) రుద్రసావర్ణి, 13) దేవసావర్ణి, 14) ఇంద్రసావర్ణి.

వైవస్వత మన్వంతరంలో 27 చతుర్యుగాలు గడిచాయి.

27×43,20,000 = 11,66,40,000

28వ చతుర్యుగంలో 17,28,000+12,96,000+8,64,000+3,102+2,024 = 38,93,126

11,66,40,000 + 38,93,126 = 12,05,33,126

6 మన్వంతరాలు (185,14,28,574) + వైవస్వత (12,05,33,126)

= 197,19,61,700 (1.97 బిలియన్ సంవత్సరాలు) (ప్రస్తుతం సృష్టి మొదలై గడచిన కాలం)

నవీన శాస్త్రం ప్రకారం– Great oxidation event తరువాత తొలి Eukaryocytes ఆవిర్భావం ప్రారంభమయ్యింది. స్వయంభువు+శతరూప ల పరిపాలనా కాలం– 308 మిలియన్ సంవత్సరాలు గడిచేసరికి– స్వారోచిష మన్వంతరం ఇలా ఆరు మన్వంతరాలు గడిచి సప్తమ మన్వంతరం వచ్చేసరికి జీవ పరిణామం– మొక్కలు–జంతువులుగా, జంతువులు వెన్నెముక లేనివి, వెన్నెముక కల జంతువులుగా; వెన్నెముక కల జంతువులు– ఉభయచరాలు (Amphibians), సరీసృపాలు (Reptiles), పక్షులు (Birds), క్షీరదాలు (Mammols)గా పరిణామం చెందాయి.

వైవస్వత మన్వంతరం ప్రారంభమై 12 కోట్ల సంవత్సరాలయ్యింది. ప్రైమేట్ల కాలం– వానరాలు, తోకలేని కోతులు మానవుడిగా పరిణామం చెందుతున్న కాలం.

28వ చతుర్యుగంలో అంటే 39 లక్షల సంవత్సరాల క్రితం కృతయుగం ప్రారంభమయ్యింది. హోమోఎరక్టస్– నియాండెర్తల్స్, డెనిసోవన్లు సంచరిస్తున్నారు. 21 లక్షల సంవత్సరాల క్రితం త్రేతాయుగం మొదలయ్యింది. కృతయుగం–త్రేతాయుగం సంధికాలంలో దేవాసుర యుద్ధంలో దైత్య దానవులు నశించారు.

త్రేతాయుగం 12,96,000 సంవత్సరాలు. త్రేతాయుగ–ద్వాపర సంధికాలంలో రామరావణ యుద్ధం జరిగింది. ఇప్పటికి పదిలక్షల సంవత్సరాల పూర్వం జరిగిన యుద్ధమది. మానవులు తక్కువ సంఖ్యలో, వానరాలు అధిక సంఖ్యలో ఉన్న కాలమది.

ద్వాపరయుగం 8,69,126 సంవత్సరాల క్రితం మొదలయ్యింది. మూడు లక్షల పదిహేను సంవత్సరాల క్రితం Homosapiens - తెలివిగల మానవుడు ఆవిర్భవించాడు. 2,70,000 సంవత్సరాల క్రితం Y-Chromosomal Adam లేదా ఆద్మీ (ఆది మానవుడు), 2,30,000 సంవత్సరాల క్రితం Mitochondriel Eve – ఔరత్–అవ్వ (ప్రస్తుతం ఉన్న మానవుల తల్లిదండ్రులు) జన్మించారని ఓ అంచనా.

2,10,000 సంవత్సరాల క్రితం గ్రీసు దేశంలో నవీన మానవుని అవశేషాలు, 1,70,000 సంవత్సరాలకల్లా దుస్తుల వాడకం, 1,50,000 సంవత్సరాల నాటికి Peopling of Africa, 1,20,000–90,000 సంవత్సరాల మధ్యకాలంలో సహారా నీటి వనరులతో నిండి ఉండగా, ఆ తరువాత ఎడారిగా విస్తరించడం 1,20,000 – 75,000 సంవత్సరాలప్పుడు మానవుడి వలసలు అలలు అలలుగా ప్రారంభమైనాయి. 75,000 సంవత్సరాలప్పుడు సుమత్రా–ఇండోనేషియాలో టోబా జ్వాలాముఖి విస్ఫోటనం చెందగా వెయ్యేళ్ల పాటు భారత ఉపఖండంలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మానవ జనాభా లక్ష నుంచి వెయ్యికి చేరుకుని మరల వృద్ధి చెందిందంటారు పరిశోధకులు.

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, బనగానపల్లి వద్ద జుర్రేరు నదీ ప్రాంతంలో ప్రజలు ఈ Toba Explosion తట్టుకుని బ్రతికారని శిలాజాలను పరిశోధించినవారు చెబుతున్నారు. పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఈ ప్రాంతం వాడవడం ఓ విశేషం. యాదృచ్ఛికం కావచ్చు. ఆ టోబా అగ్నిపర్వత విస్ఫోటనం వల్ల భారత ఉపఖండం మీద 15 సెంటిమీటర్ల బూడిద పేరుకున్నది. 1000 నుంచి 10000 సంతానోత్పత్తి చేయగలిగిన జంటలు క్రమేపీ ప్రపంచమంతా 65000 సంవత్సరాల క్రితం వలసపోయి విస్తరించారంటారు. భారత ఉపఖండంలోనే నలుగురు మైటొకాండ్రియల్ 'ఈవ్' (Eve)లు నాలుగు దిక్కులకు తమ గుంపుతో వెళ్లి ఉంటారనేది ఓ అభిప్రాయం.

తమిళనాడు, తిరుచిరాపల్లి జిల్లా, కల్లమేడు గ్రామానికి ఈశాన్యంగా కల్లమేడు గుట్టల వద్ద (1978) ఏడు కోట్ల సంవత్సరాల నాటి డినొసార్ శిలాజాలను కనుగొన్నారు (యాదగిరి–అయ్యసామి). దానికి 'బృహత్ కాయోసారస్' అని పేరు పెట్టారు. దాని కాలి ఎముక (Tibia) రెండు మీటర్లు (6.6 అడుగులు) పొడుగున్నది. దాని ఉజ్జాయింపు ఎత్తు 145 అడుగులు, బరువు 175–220 టన్నులు (రెండు లక్షల కిలోగ్రాములు) ఈ రాకాసి బల్లి– బైబిల్‌లో చెప్పబడిన బెహెమోత్ (Behemoth), లెవియాథాన్ (Leviathan) Great Beast ల లాంటిది. పెద్ద తిమింగిలమంత పెద్దది. దీనితో మనం మన ఇంటి గోడలపై పాకే బల్లితో, తోటలో పరిగెత్తే తొండలతో పోల్చి చూస్తే ఏడుకోట్ల సంవత్సరాలప్పుడు జంతువులు ఎంత పరిమాణంలో ఉండేవో తెలుస్తుంది.

12 కోట్ల సంవత్సరాల క్రితం వైవస్వత మన్వంతరం మొదలయ్యింది కనుక ఈ రాక్షసి బల్లులున్నదీ ఈ మన్వంతరం లోనే.

ప్రతి చతుర్యుగ కాలంలో దేవతలు–దైత్యులు, రామ రావణులు, కౌరవ–పాండవులు జన్మిస్తూనే ఉంటారనేది అందుకేనేమో! హనుమంతుడు రాముడి ఉంగరాన్ని వెదుక్కుంటూ పాతాళ లోకానికి వెళ్లి యమధర్మరాజును అడిగాడు– "నా రాముడి ఉంగరం ఇవ్వు". యమధర్మరాజు, ఒక బుట్టలో ఉన్న ఉంగరాలను చూపించి "ప్రతి త్రేతాయుగంలోనూ ఒక రాముడుంటాడు. నీ రాముడి ఉంగరాన్ని నీవే గుర్తుపట్టి తీసుకువెళ్లు. అయితే ఒక్కమాట, నిన్ను రాముడు ఇక్కడికి పంపించిందే అవతార సమాప్తి కోసం. నీవు భూలోకం వెళ్లేసరికి ద్వాపరయుగం ఉంటుంది. నీ రాముడు కృష్ణావతారంలో ఉంటాడు".

హనుమంతుడికి భగవంతుడి లీల అర్థమై మరల భూలోకం వచ్చి గంధమాదన పర్వతం దగ్గర అరటితోటలో నివసిస్తున్నాడు.

ద్రౌపది పంపగా భీమసేనుడు సౌగంధిక పుష్పాల కోసం అటువచ్చి దారికడ్డంగా తోకను పెట్టి పడుకున్న ముదుసలి కోతిని చూసాడు. తోకను లేపలేక చదికిలపడి కోతిని తన సోదరుడు వాయుపుత్రుడు హనుమంతుడిగా గ్రహించి శరణు వేడినాడు. త్రేతాయుగం నాటి దివ్యరూపాన్ని (సముద్ర లంఘనం నాటి రూపం) చూపమంటే వద్దన్నా వినక, భీముడు ఎంతో బ్రతిమలాడగా– ఆనాటి రూపంలో తక్కువ వంతుకే గుండె ఠారెత్తి –"చాలు మహాప్రభో! ఈ దివ్యరూపం ఉపసంహరించు"మని కోరగా యధారూపాన్ని దాల్చినాడు హనుమంతుడు.

ఇటువంటిదే అనార్తదేశపు ప్రభువు కకుద్మి రేవతి తండ్రి. రేవతి వివాహ విషయమై బ్రహ్మలోకం వెళ్లాడు కకుద్మి. అక్కడ గంధర్వ గానసభ జరుగుతుంటే కొద్దిసేపు ఆగి, సభ ముగిసాక బ్రహ్మతో తాను వచ్చిన పని గురించి చెప్పాడు. బ్రహ్మ అన్నాడు కకుద్మి, రేవతిలతో– "ఇప్పటికే భూలోకంలో 27 చతుర్యుగాలు గడిచిపోయాయి (11,66,40,000 సంవత్సరాలు).

మీరు భూలోకం తిరిగి వెళ్లేసరికి అక్కడి మనుష్యులు చాలా పొట్టిగా, బలహీనంగా ఉంటారు. రేవతికి తగ్గ వరుడు బలరాముడు. అతడు ఆదిశేషుడి అంశలో జన్మించినవాడు. విష్ణుమూర్తి అవతారమైన శ్రీకృష్ణుని సోదరుడు" అన్నాడు బ్రహ్మ.

బ్రహ్మ ఆశీస్సులనంది కకుద్మి, రేవతి బలరాముడి వద్దకు వచ్చారు. బలరాముడు తన నాగలితో రేవతిని తాకగానే ఆమె బలరాముడికి ఈడూ, జోడు ఉన్న యువతిగా మారగా ఆమెను వివాహం చేసుకున్నాడు బలరాముడు.

(బ్రహ్మలోకంలో 1 సెకండు= మానవలోకపు 1 లక్ష సంవత్సరాలు)

## 114. మహాభారత గ్రంథంలో విమర్శలకు దారితీసే అంశాలు

1) బ్రాహ్మణులను భూసురులుగా చిత్రించి మిగతా వర్ణాల వారిని హీనంగా చూడడం. బ్రాహ్మణులకు-క్షత్రియులకు ఉన్నవలసిన సంబంధాలను బ్రాహ్మణాధిక్యతతో వివరించడం. వైశ్యులను, వారికన్నా హీనంగా శూద్రులను, వారికన్నా హీనంగా శూద్రులతో వర్ణసంకరం చెందినవారిని సమాజ బహిష్కారం చేసి, ఈ చాతుర్వర్ణ వ్యవస్థను రక్షించడమే క్షత్రియధర్మంగా పేర్కొనడం; విద్య ద్విజులకే చెందుతుందని భావించడం -ఇవి ఈనాటి ప్రజలకు మింగుడుపడనివి, గర్హించే విషయాలు.

2) స్త్రీలను అణగదొక్కే స్మృతులు, న్యాయాలను ప్రవచించడం, స్త్రీల స్వేచ్ఛను విశృంఖలతగా పరిగణించడం, ఎంత కట్టుదిట్టాలలో ఉంచినా వారిని అదుపులో పెట్టలేమని భావించడం, సతీసహగమనాన్ని ప్రోత్సహించడం -అటువంటి భావనలకు ప్రాధాన్యతనివ్వడం వలన మహాభారతం తీవ్ర విమర్శలకు గురవుతున్నది.

మారుతున్న కాలం, విలువలతో పాటు మారని ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే పురుషార్థాల విలువను ఈ కాలపు ప్రజలు అంగీకరించకపోవడం సహజమే.

ఇప్పటికైనా అన్నివర్గాల ప్రజలకూ సమానత్వాన్ని, స్వేచ్ఛను, న్యాయాన్ని ప్రసాదించే సూత్రాలను ప్రతిపాదిస్తూ, ఆధిపత్య భావనలు, కులాల ఉచ్ఛ నీచ స్థాయిలను తొలగించే స్మృతులను చేర్చే పంధొమ్మిదవ పర్వాన్ని లేదా శాంతి, అనుశాసనిక పర్వాల్లో కొత్త కథలను చేర్చడం ద్వారా మహాభారతాన్ని భారత ప్రజలకు ప్రామాణిక గ్రంథంగా చేయవచ్చునేమో? అప్పుడు-

**ధర్మేచ అర్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్**

అన్న వాక్కు సత్యమవుతుంది.

## 115. ప్రజాపతి - Progenitor

Gene- గణ- అంటే ఇల్లు.

గ్రీకు-Gens కు అర్థం - ఒకే ఇంటిపేరు, ఒకే కుల దేవత ఉన్న గణం.

ఇటాలియన్లు (ఇటాలస్), లిడియన్లు (లిడస్), ఫొనిషియన్లు (ఫీనిక్స్), సిసిలియన్లు (సికులస్), పెలాసిజియన్లు (పెలాస్గస్), డొరియను (డోరస్), అయివొలియన్లు (అయివొలస్), హెల్లెన్లు (హెలెన్).

ఆర్మీనియన్లకు Hayk the great, అరబ్బులు-యూదులకు అబ్రహాం, టిబెటన్లకు న్యాత్రి ట్జిన్‌పొ, చైనీయులకు నువా (Nuwa) దేవత, బాలి ప్రజలకు- వయు రయు, సింహళీయులకు విజయ్ యువరాజు, ఆస్ట్రేలియా ఆదిమ ప్రజలకు పురుగాగ్- వరముమరుంగుండి, భారత దేశ ప్రజలకు (హిందువులకు) ఋషులు ప్రజాపతులు. ఋషుల పేర్లు గోత్రనామాలైనాయి. తమని తాము పరిచయం చేసుకునేప్పుడు 'ప్రవర' గోత్రం, తల్లి లేదా తండ్రి పేరు, తన పేరు చెప్పుకుని పరిచయం చేసుకునేవారు.

ప్రస్తుత జన్యు పరిశోధనలలో ప్రస్తుత మగవాళ్లకు మూలపురుషుడు Y- most recent common Ancestor (Y-MRCA)ను Y-Chromosomal Adam గా, స్త్రీలకు మూలస్త్రీ- Mitochondrial Eve గా పిలుస్తున్నారు. Adam ను A-0; Eve ను L-0 సాంకేతిక సంజ్ఞలు అనుసంధించి వాళ్ల నుంచి ప్రస్తుతమున్న మగ, ఆడవాళ్లు ఎంత వైవిధ్యంగా ఉన్నారు, ఎలా వలస వెళ్లారో తెలుసుకునే పరిశోధనలను ముమ్మరం చేసారు.

## Y - క్రోమోజోమల్ ఆదాము (ఆదమ్)

హోమో ఎరక్టస్ → హోమో హీడెల్ బెర్గెన్సిస్ → నియాండెర్తల్స్, డెనిసొవన్లు → హోమోసపియన్లు.

Y క్రోమోజోము నిర్వీర్యం కావడం వలన నియాండెర్తల్స్ డెనిసొవన్లు అంతరించి ఉంటారనేది ఓ సిద్ధాంతం (Adam's curse - A future without men -అనే పుస్తకాన్ని ఆక్స్‌ఫర్డ్ హ్యూమన్ జెనెటిక్స్ ప్రొఫెసర్ Bryan Sykes 2003లో వ్రాసాడు. 2003లోనే డాక్టర్ లంకా శివరామప్రసాద్ 'జీనోమ్' అనే పుస్తకంలో మగవాళ్లు పుట్టకపోతే ఏమవుతుంది– అన్న విషయాన్ని చర్చించాడు. బ్రియాన్ సైకెస్ అభిప్రాయం ప్రకారం Y క్రోమోజోమ్ నిర్వీర్యమైపోతూ ఉండడం వలన Sperm Count తగ్గిపోతూ వస్తూ, 5000 తరాల తరువాత (125000 సంవత్సరాలు) మగవాళ్లు అంతరిస్తారని వ్రాసాడు. ప్రసాద్ వ్రాసిన జీనోమ్‌లో 2003 నుంచే మగపిల్లలు పుట్టడం ఆగిపోతుంది.

పరిశోధకుల అభిప్రాయం ప్రకారం– మానవులలోని Estrogen Receptor 120–60 కోట్ల సంవత్సరాలు ప్రాచీనమైనది Androgen Receptor కన్నా.

## మైటోఖాండ్రియల్ ఈవ్ (ఔరత్)

అంతేకాక నియాండెర్తల్ మగవాళ్లు–హోమోసపియన్ ఆడవాళ్లకు పుట్టిన సంతానంలో నియాండెర్తల్ మైటోఖాండ్రియల్ DNA లేకపోవడం గమనార్హం (ఇంద్రియ కణాలలోని శుక్ర–Spermatozoa (Sperma-Seed) మైటోఖాండ్రియల్ DNA ఉండదు, ఉన్నా అతి స్వల్పం. అదే Ovum (అండం)లో 1,00,000 – 6,00,000 మైటోఖాండ్రియా ఉంటాయి). అందుకే మైటోఖాండ్రియల్ DNA Lineage ను ఈవ్ వంశవృక్షం L-0 తో మొదలుబెట్టారు. మైటోఖాండ్రియల్ DNAలో 3500 సంవత్సరాలకు ఒక Nucleotide లో మ్యుటేషన్ (ఉత్పరివర్తనం) చెందుతుంది.

అదే విధంగా Y-MRCA (Y-క్రోమోజోమల్ Adamను A-0 గా వ్యవహరించారు. ఇతడు 1,60,000–3,00,000 సంవత్సరాలనాటి వాడుగా; మైటోఖాండ్రియల్ Eve వయస్సు 1,55,000 సంవత్సరాలుగా భావిస్తున్నారు.

## ఇండియా ఉపఖండంలో మగవాళ్లు

A-0 ఆఫ్రికా– CT (ఆఫ్రికా) – C (Coastal India), E (Middle East), F (Middle East), G-ఇరాన్, ఇండస్‌వాలీ, H (Hindu - Indian marker), I, J, K, L, M, N, O, P, Q, R, S, T ఇవన్నీ హాప్లో సబ్‌గ్రూపులు. ఇండియాలో ప్రజలు R, Q1, R2, L, J2, H, O-M 175 శాఖలకు చెందినవారు.

## ఇండియా ఉపఖండంలో ఆడవాళ్లు

L-0 to L 1-5 (ఆఫ్రికా); M (ఇండియా, ఆసియా, అమెరికా), N (ఆస్ట్రేలియా, అమెరికా), R (యూరప్, ఆఫ్రికా, ఆసియా). ఇండియాలో M, N, R శాఖలకు చెందినవారు.

వంశవృక్షాన్ని చెప్పే సంస్థలు వచ్చాయి. My Heritage, Living DNA, GED Match లాంటివి వాటిలో కొన్ని. Genealogy Software Programs- Family Tree Maker, Legacy family tree, Swedish Programme Genney - అనేవి తండ్రివేపు (Y-Chromosome), తల్లి వేపు (mt DNA) వంశ వృక్షాల్ని ఆరాతీసి చెబుతాయి.

వెనక్కి వెదుక్కుంటూ పోతే అందరూ ఆ తల్లి, ఆ తండ్రి సంతానం అని తెలుస్తుంది. తెలిసినా, తెలియకపోయినా ఒకరిపై ఒకరి ఆధిపత్యాన్ని, ఉచ్ఛనీచ భావనలను తొలగి అందరూ సమానులే అన్న భావన ఏర్పడినపుడు కురుక్షేత్ర యుద్ధాలు ఆగిపోయి సర్వమానవ సౌభ్రాతృత్వంతో ఎల్లెడలా శాంతిభద్రతలు విలసిల్లుతాయి.

**సర్వే చ సుఖిన స్సంతు, సర్వే సంతు నిరామయాః**
**సర్వే భద్రాణి పశ్యంతు మాకశ్చిత్ దుఃఖ భాగ్ భావేత్**

❖❖❖❖❖

# 116. సృష్టి పరిణామ క్రమం (సంవత్సరాలలో)


| కాలం (సంవత్సరాలు) | జీవ పరిణామం |
|---|---|
| 4.3 - 4.1 బిలియన్ | తొలి జీవకణాలు RNA World |
| 4.0 - 3.8 బిలియన్ | ప్రొకార్యోసైట్లు - DNA World |
| 3.5 బిలియన్ | నీలి ఆల్గె, ఆక్సిజన్, Cyano Bacteria |
| 2.5 - 2.2 బిలియన్ | Great Oxidation event |
| 2.2 - 1.8 బిలియన్ | Eukaryocytes |
| 1.2 బిలియన్ | Sexual Reproduction |
| 1.2 - 0.8 బిలియన్ | Choanoflagellata |
| 800 - 500 మిలియన్ | Sponges to Sea Cucumbers, acorn worms) |
| 540 - 410 మిలియన్ | కార్డేటా, చేపలు, సీలాకాంద్ |
| 390 - 300 మిలియన్ | టెట్రాపోడా, ఆంఫిబియన్లు, బల్లులు |
| 300 - 90 మిలియన్ | బల్లులు, Reptiles, సౌరాప్సిడా, సినాప్సిడా |
| 90 - 20 మిలియన్ | Primates, వానరాలు, Monkeys, apes |
| 20 - 25 మిలియన్ | హొమినిడ్స్ |
| 2.5 - 2.0 మిలియన్ | హోమినిన్స్ - ఆస్ట్రాలొపిథికస్ |
| 1.9 - 0.8 మిలియన్ | హోమొ ఎరక్టస్ |
| 0.8 - 0.3 మిలియన్ | నియాండెర్తల్, డెనిసొవన్ |
| 3,15,000 సంవత్సరాలు | Homosapiens |
| 2,70,000 సంవత్సరాలు | Y Chromosamal Adam |
| 2,30,000 - 1,50,000 సం॥రాలు | mt-DNA Haplogroup - L (Mitochondrial Eve) |
| 2,10,000 సంవత్సరాలు | Modern Human in Greece |
| 1,70,000 సంవత్సరాలు | దుస్తుల వాడకం |
| 1,50,000 సంవత్సరాలు | Peopling of Africa |
| 1,20,000-90,000 సంవత్సరాలు | సహారా వనం - Fertile Sahara |
| 1,20,000-75,000 సంవత్సరాలు | దక్షిణ ఆఫ్రికా నుంచి తూర్పు ఆఫ్రికాకు వలస |
| 1,00,000 సంవత్సరాలు | మానవ నిర్మిత కట్టడాలు- తొలిదశ |
| 80,000 - 70,000 సంవత్సరాలు | Non Africans and Sub Sahara Africans |
| 75,000 సంవత్సరాలు | Toba - జ్వాలాముఖి విస్ఫోటనం (మానవ జనాభా 15,000) |

చింపాంజీలకు మనుషులకు 95-99% DNA ఒకే విధమైనది. కాగా, నియాండెర్తల్స్‌కు మనుషులకు మధ్య DNA సారూప్యత 99 శాతం. మానవులలో, నియాండెర్తల్స్‌లో Fox P2 gene- Control of Speech ఉండడం విశేషం.


**మానవ పరిణామ దశలు-**

1) డ్రయొ పిథికస్ (Dryo pithecus)
2) రామా పిథికస్ (Rama pithecus or Siva pithecus)
3) ఆస్ట్రాలొ పిథికస్ (Australo pithecus)
4) హోమొ హాబిలస్ (Homo Habilus - Able man)
5) హోమొ ఎరక్టస్ (Homo Erectus - Upright man)
6) హోమొసపియన్స్ నియాండెర్తలెన్సిస్ (New human)
7) హోమొ సపియన్ (Homo Sapiens - Wiseman)


# ఉపరిచర వసువు


గిరిక
(కోలాహల + శుక్తిమతిల పుత్రిక)
+
ఉపరిచర వసువు
+
అద్రిక
(అప్సరస)
బృహద్రధుదు
+
కాశీరాజ పుత్రికలు
జరాసంధుడు
పరాశరుడు
మత్స్యగంధి
(సత్యవతి)
శంతనుడు
గంగ
మత్స్యరాజు
భీష్ముడు
వసువు
విరాటుడు +
సుధేష్ణ
ఉత్తర
ఉత్తరుడు
వ్యాసుడు
నియోగపద్ధతి
చిత్రాంగదుడు
అంబిక
+
విచిత్రవీర్యుడు
+
అంబాలిక
అంబిక దాసి
పరిశ్రమ
విదురుడు
సుఖద
+
ధృతరాష్ట్రుడు
+
గాంధారి
మాద్రి
+
పాండురాజు
+
కుంతి
యుయుత్సుడు
దుర్యోధనుడ
దుశ్శాసనాది
కౌరవులు
దుశ్శల
నియోగ
పద్ధతి
నియోగ
పద్ధతి
అశ్వని
దేవతలు
నకులుడు
సహదేవుడు
ధర్ముడు
వాయువు
ఇంద్రుడు
ధర్మరాజు
భీముడు
అర్జునుడు
అభిమన్యుడు
పరీక్షిత్తు
జనమేజయుడు


# జయద్రథుడు (సైంధవుడు)





# యాదవులు




# యయాతి



యయాతి
అనుద్రుహ్యుడు
+ + +
సభానర
చాక్షు
పరోక్ష
కాలనర
సృంజయ
జనమేజయ
మహాశిల
మహామానస
ఉశానర
తితిక్షు
ఋషద్రధ
హేమ
బలి
+
సుధేష్ణ
దీర్ఘతమస ముని
అంగ
వంగ
కళింగ
సుహమ
పుండ్ర
ఆంధ్ర
అంగ
ఖణాపన
ద్విరధ
ధర్మరధ
చిత్రరధ (రోమపాద)
(శాంత పెంపుడు తండ్రి
దశరథుడు
దశరథుడు
రామ, లక్ష్మణ,
భరత, శత్రుఘ్నులు
శాంత
+
ఋష్యశృంగుడు
చతురంగ
ప్రథులాక్ష
బృహద్రధ
బ్రహన్మానస
జయద్రధ
విజయ
ధృతి
ధార్తవ్రత
శతకర్మ
అతిరధ
కర్ణ
వృషసేన





మానవుని తొలి వలసలు (Early migrations)




ఆఫ్రికా నుంచి ఆవలి తీరాలకు (Out of africa)




మైటొఖాండ్రియల్ DNA – ఈవ్ (ఔరత్) వలస
(Migration route of Human mtDNA haplogroups)





Y-DNA ఆదామ్ (ఆద్మీ) వలస
(World Map of Y-DNA Haplogroups)




**2600 ఏళ్ల కాలం నాటి తూర్పు దేశాల ప్రపంచం**





**మహా జనపదాలు (Mahajanapadas c. 500 BCE)**




బ్రాహ్మీ లిపి పయనం **(Brahmic script travel from India)**





మహాభారత కాలం నాటి భారత దేశము




అర్జునుడి తీర్థయాత్ర

(Major Travel Narratives of Mahabharata : Exmples
Arjuna's pilgrimage circling Bharatavarsh from Indraprasta to Dwaraka
Arjuna's return from Dwaraka to Indraprasta taking Subhadra)




ఇండో-యూరోపియన్ల వలస మార్గాలు **(Indo-European expansions)**

# భారత సావిత్రి

- మాతా పితృ సహస్రాణి పుత్ర దార శతాని చ
  సంసారేష్వను భూతాని యాంతి యాస్యంతి చాపరే

- హర్ష-శోక స్థాన సహస్రాణి భయస్థాన శతాని చ
  దివసే దివసే మూఢమ్ ఆవిశంతి న పండితమ్-

- ఊర్ధ బాహుర్విరౌమ్యేష న చ కశ్చి చ్ఛృణోతి మే
  ధర్మా దర్థశ్చ కామశ్చ స కిమర్థం న సేవ్య తే-

- న జాతు కామాన్న భయాన్న లోభాద్ ధర్మం త్యజే జ్జీవితస్యాపి హే తోః
  నిత్యో ధర్మః సుఖదుఃఖే త్వనిత్యే జీవో నిత్యో హేతురస్య త్వ నిత్యః

---

- ఇమాం భారత సావిత్రీం ప్రాతరుత్థాయ యః పఠేత్
  స భారత ఫలం ప్రాప్య పరం బ్రహ్మాధి గచ్ఛతి

---

- పారాశర్య వచస్సరోజ మమలం గీతార్థ గంధోత్కటం
  నానాఖ్యానక కేసరం హరికథా సంబోధనాబోధితమ్
  లోకే సజ్జన షట్పదై రహ రహః పేపీయమానం ముదా
  భూయాత్ భారత పంకజం కలిమల ప్రధ్వంసి నః శ్రేయసే

- త్రి భిర్వర్షైరిదం పూర్ణం కృష్ణ ద్వైపాయనః ప్రభుః
  అఖిలం భారతం చేదం చకార భగవాన్ మునిః
  ధర్మేచ అర్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ
  యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్

# ఆధారిత గ్రంథాలు
## (Bibliography)


1) ఆంధ్ర మహాభారతము - తెలుగు విశ్వవిద్యాలయము
2) కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - తిరుమల తిరుపతి దేవస్థానములు (2020)
3) శ్రీ మహాభారతము (గీతా ప్రెస్, గోరఖ్‌పూర్)
4) The Illustrated Mahabharata (DK. Penguin Random House)
5) David Anthony - The Horse, The Wheel and Language (2007)
6) David Reich - Who we are and How we got here (2018)
7) Complete guide to the Bible (Reader's Digest)
8) The Reader's Digest Bible (Illustrated Edition)
9) J.P. Mittal - History of Ancient India
10) Vedveer Arya - The Chronology of Ancient India
11) Jijith Nadumuri Ravi - Rivers of Rgveda
12) Burjor Avari - India: The Ancient Past
13) John Hawkins - The Story of Religion
14) Devdutt Pattnaik - Jayam
15) Wikipedia



## Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S. GENERAL SURGERY
M.Ch. CARDIOTHORACIC SURGERY
Fellow in VASCULAR SURGERY
Post graduate Diplomate in Human Rights
Post graduate Diplomate in Television Production
Cell animation Specialist- Heart Animation Academy
Computer Animation Specialist- Pentafour- Chennai
Web Engineer and Web Designer- Web City- Hyderabad
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

## I. తెలుగు కవిత్వం – Poetry (Telugu)

1. ఆల్కెమీ – Alchemy (2002)
2. వానమబ్బుల కాంతిఖడ్గం
   Vaana Mabbula Kanthi Khadgam (2003)
3. టీకప్పులో తుఫాన్ – Tea Kappulo Toofan (2004)
4. తంగేటి జున్ను – Tangeti Junnu (2008)
5. కుయ్యో–మొఱ్రో శతకం – Kuyyo – Morro Satakam (2014)
6. భైరవ శతకం – Bhairava Satakam (2014)
7. కర్కాటకం – Karakatakam (Cancer) (2015)
8. ఒక సరస్సు–అనేక హంసలు
   Oka Sarassu – Aneka Hamsalu (2015)
9. మరణశాసనం – Marana Saasanam (2015)
10. శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం
    Sri Lalitha Sahasranama Stotram (2016)
11. కుంకుమ భరిణె – Kumkum Bharine (2019)
12. కోవిడ్–19 ప్యారడీలు – Covid-19 Parodies (2020)
13. మహావాక్యం – Mahavaakyam (2021)
14. గాయపడిన జింక పిలుపు – Gayapadina Jinka Pilupu (2022)
15. తెలంగాణ – Telangana (2023)
16. అనంత చిత్రకవితా స్రోతస్విని – An Endless Stream of Poetry (2023)
17. హైకూలు – Haiku (2023)

## II. Poetry (English)

1. How to be happy (Philosophy) (2002)
2. In Search of Truth (Novel) (2005)
3. Shades (2005)
4. The Twilight Zone (2008)
5. Soundarya Lahari
   Sankaracharya's Soundarya Lahari (2012)
6. Potana's Bhagavatam (2013)
7. Modern Bhagavadgita (2015)
8. The Guerdon of Poesy (2016)
9. A New Vigilance Whistle! (2016)
10. The Pendulum Clock (2017)
11. How to Cook a Delicious Poem (2017)
12. Windows and Apples (2017)
13. The Haste Land (2017)
14. Bees Need No Invitation When Flowers Bloom... (2017)
15. Journey to Manasa Sarovar (2017)
16. My Poem is My Birth Certificate (2017)
17. Prima ballerina- Roberta di Lara (2018)
18. The Casket of Vermilion-
    The legend of Sammakka- Sarakka (2018)
19. The Making of Mahatma
    (Collector's Edition) (2019)
20. An Epic of Kashmir (2019)
21. The Songs of Annamayya (2019)
22. Penning with Penguins (Antarctica) (2019)
23. Trident (Love, War and Peace) along with
    Maria Miraglia, Ayubkhawar (2020)
24. Poetravelogue (2020)
25. Wow- Supercalifragilisticexpialidocious (2020)
26. The Lost Songs of a Lone Traveler! (2020)
27. Yuddhopanishad (The Upanishad of War) (2020)
28. The Legend of Lady Yang Guifei- China (2020)
29. Tjukurpa- (Australian aboriginal stories- poetry)
    Dream Time - Every When) (2020)
30. Che Guevara (2021)
31. Coffee - Poems (2021)
32. The Tortured Artist (2021)
33. Apoorvam - Limericks (2022)
34. Poetravelogue - Jordan (2023)

## III. కథలు–నవలలు–వ్యాసాలు (తెలుగు) - Stories, Novels, Essays... (Telugu)

1. సత్యాన్వేషణలో – నవల – In Search of Truth (Novel) (2002)
2. జీనోమ్ – నవల – Genome (Biotechnology Novel) (2003)
3. సంఖ్యాశాస్త్రం – Sankhya Sastram (Numerology) (2003)
4. డాక్టర్ జయదేవ్ కార్టూన్లు – Dr. Jayadev Cartoons (2003)
5. స్వప్నశాస్త్రం–1 – Swapna Sastram (Dreams-1) (2004)
6. అక్షరార్చన – Akshararchana (philosophical essays) (2013)
7. దీప నిర్వాణ గంధం (మృత్యువు) – Deepa Nirvana Gandham (Death) (2013)
8. కత్తి అంచుపై – నాయిర్ కథలు Katti Anchupai (Noir Stories) (2013)
9. ప్రపంచ ప్రసిద్ధ కథలు – World Famous Stories (2014)
10. ఛుప్ కె ఛుప్ కె – స్త్రీల వ్యాధుల కథలు (Woman Diseases) (2018)
11. స్వప్నశాస్త్రం–2 –కలలు–పీడకలలు Kalalu-PeedaKalalu (Dreams-2) (2018)
12. కథలు–కవితలు - Kathalu – Kavitalu (2018)

13. కోవిడ్-19 - నవల COVID-19 - Biotechnology Novel (2020)
14. వైరసులు-వాక్సీనులు - నవల VIRUSES – VACCINES (2020)
15. అయిదో అశ్వికుడు - నవల - The fifth horseman (2020
16. కరోనా కత్తిఅంచుపై - నాయిర్ కథలు (Noir Stories) (2021)
17. డాక్టర్ విక్రమార్క-కరోనా బేతాళ కథలు (Corona Stories) (2021)
18. ప్రపంచ రాజకీయ సింహాసన ద్వాత్రింశిక - 32 కథలు (2021)
19. ప్రపంచతంత్ర కథలు - Prapanchatanthra Kathalu (2022)
20. పంచతంత్ర కథలు - Panchatanthra Kathalu (2022)
21. 1001 అరేబియన్ రాత్రుల కథలు-1 (1001 Arabian Nights-1) (2022)
22. 1001 అరేబియన్ రాత్రుల కథలు-2 (1001 Arabian Nights-2) (2022)
23. 1001 అరేబియన్ రాత్రుల కథలు-3 (1001 Arabian Nights-3) (2023)
24. 1001 అరేబియన్ రాత్రుల కథలు-4 (1001 Arabian Nights-4) (2023)
25. 1001 అరేబియన్ రాత్రుల కథలు-5 (1001 Arabian Nights-5) (2023)
26. 1001 అరేబియన్ రాత్రుల కథలు-6 (1001 Arabian Nights-6) (2023)

## IV. అనువాదాలు - ఇంగ్లీషు నుంచి తెలుగులోకి Classics (English to Telugu)

### గ్రీకు సాహిత్యం (Greek Literature)
1. ఇలియాడ్ - Iliad (Homer) (2011)
2. ఒడిస్సీ - Odyssey (Homer) (2011)
3. ఎపిక్ సైకిల్ - Epic Cycle (Homer) (2011)
4. Three Greek Tragedies
   (ఎడిపస్ రెక్స్, ఏంటిగోని, ది ట్రోజన్ విమెన్) (2014)
5. శాఫో కవిత్వం - The Poems of Sappho (2017)
6. ఇది విలువైనది - The Axion Esti (Odysseus Elytis) (2017)
7. సెంచరీ ఆఫ్ లవ్ - Century of Love (Roula Pollard) (2017)

### లాటిన్ సాహిత్యం (Latin Literature)
1. ఈనీడ్-వర్జిల్ - Aeneid (Virgil) (2012)
2. డివైన్ కామెడీ - డాంటే - Divine Comedy (Dante) (2012)

### జర్మన్ సాహిత్యం (German Literature)
1. ఆత్మను అమ్మిన మానవుడు - Faust - Goethe (2014)
2. కాలి నడకన ఆర్కాడియాకు - Barefoot to Arcadia - Aprilia Zank (2018)
3. రిల్కె కవిత్వం - Rilke Poetry (2023)

### నార్డిక్ సాహిత్యం (Nordic Literature)
1. పెద్దవ్వ చెప్పిన కథలు - Poetic Eddas (2020)

### సుమేరియన్ సాహిత్యం (Sumerian Literature)
1. ఇనాన్నా - Inanna (2018)
2. గిల్గామేష్ చరిత్ర - The Epic of Gilgamesh (2019)

### అమెరికన్ సాహిత్యం (American Literature)
1. ఛార్లెస్ బుకొవ్‌స్కీ - Charles Bukowski Poetry (2023)

### ఫ్రెంచి సాహిత్యం (French Literature)
1. ఫ్రెంచి కవిత్వం - French Poetry
2. కంటక పుష్పాలు - Le Flures du Mal-- Charles Baudelaire
3. రూసో ఆత్మకథ - Confessions (Jean-Jacques Rousseau) (2023)

### పర్షియన్ సాహిత్యం (Persian Literature)
1. మస్నవి-1 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi (2015)
2. పక్షుల సభ - ఫరీదుద్దీన్ అత్తర్ - Birds Conference - Attar (2015)
3. జరాతుష్ట్రుడి గాథలు - Zoroster- Gathas (2016)
4. మస్నవి-2-6 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi 2-6 (2016)
5. మధుశాల - రుబాయిలు - Omar Khayyam (2016)

### లాటిన్ అమెరికన్ సాహిత్యం (Latin American Literature)
1. లాటిన్ అమెరికన్ కవిత్వం - Latin American Poetry - Part-1 (2022)
2. లాటిన్ అమెరికన్ కవిత్వం - Latin American Poetry - Part-2 (2022)
3. లాటిన్ అమెరికన్ కవిత్వం - Latin American Poetry - Part-3 (2022)
4. లాటిన్ అమెరికన్ కవిత్వం - Latin American Poetry - Part-4 (2023)
5. లాటిన్ అమెరికన్ కవిత్వం - Latin American Poetry - Part-5 (2023)
6. లాటిన్ అమెరికన్ కవిత్వం - Latin American Poetry - Part-6 (2023)
7. లాటిన్ అమెరికన్ కవిత్వం - Latin American Poetry - Part-7 (2023)
8. లాటిన్ అమెరికన్ కవిత్వం - Latin American Poetry - Part-8 (2023)

### రష్యన్ సాహిత్యం (Russian Literature)
1. రసధుని - Russian Poetry (2015)

### మెక్సికన్ సాహిత్యం (Mexican Literature)
1. మెక్సికన్ సాహిత్యం - Mexican Poetry (2017)

### స్పానిష్ సాహిత్యం (Spanish Literature)
1. పాబ్లో నెరుడా కవిత్వం - Pablo Neruda Poetry (2017/2019)
2. లోర్కా "ప్రేమ-మృత్యువు" - Frederick Garcia Lorca's "Love-Death" (2017)
3. స్పానిష్ కవిత్వం - Spanish Poetry (2022)
4. స్పానిష్ స్వర్ణయుగ కవిత్వం - Spanish Golden Age Poetry (2022)

### టర్కీ సాహిత్యం (Turkey Literature)
1. టర్కీ కవిత్వం - దివాన్ కవిత్వం - Turkish Poetry (2022)
2. బోనులో సింహం - నజీమ్ హిక్మెత్ - Nazim Hikmet Poetry (2022)
3. దేహరహితంగా - Leyla Isik Poetry (2022)
4. నజీమ్ హిక్‌మెత్ కవిత్వం - ఏడు భాషలలో (2023)

### తమిళ సాహిత్యం (Tamil Literature)
1. తమిళ సరస్వతి అందెల రవళి - Sangam Poetry (2013)
2. శిలప్పదికారం - Silappadikaram - Illango Adigal (2015)
3. మణిమేఖల - Manimekhala - Sattanar (2015)

### కాశ్మీరీ సాహిత్యం (Kashmir Literature)
1. లల్లాదేవి వాక్కులు - Lal Ded - Vakhs (2019)

### హిందీ సాహిత్యం (Hindi Literature)
1. మధుశాల - Madhusala- Harivams Roy Bachchan (2016)

### ఉర్దూ సాహిత్యం (Urdu Literature)
1. గాలిబ్ గీతమాలిక - Ghalib Ghazals (2022)

### పోలెండ్ సాహిత్యం (Poland Literature)
1. పోలెండ్ కవిత్వం - Ten Color Rainbow -
   The Poems from Poland (Bilingual) (2018)
2. తొలి వాన కురిసిన తరువాత.... Jak Ziemia Po PierwszymDeszezu (2018)
3. క్షణాలు - Moments - AlicjaKubreska (2018)
4. అంతరించిన దీపాల ప్రపంచం
   The World of Extinct Lamps - Izabela Zubko (2018)

5. పవిత్ర త్రిమూర్తిత్వం – Izabela Zubko - The Holy Trinity (2019)
6. హైకూ కవితలు – Krzysztof Kokot - Around the Haiku (2019)
7. జీవిత రహస్యాలు – Juliusz Erazm Bolek - The Secrets of Life- A Calendar in verse (2019)
8. అయిదవ ఋతువు – Agnieszka Jarzebowska - The Fifth Season (2019)
9. నీలి నిరీక్షణ – Bozena Helena Mazur-Nowak's - Blue Longing (2019)
10. సంచార గాయని – I am a Troubadour - Renata Cygan (2019)
11. సూర్యుడిలా స్పష్టంగా – Jasne Jack Stonce (2019)
12. (కాదు) నా కవిత Alicja Kuberska's (Not) My Poem (Telugu) (2021)
13. మంచు కురిసిన తరువాత – Alicja Kuberska (2022)
14. నా జీవితపు పదముద్రలు – Bozena Helena Mazur-Nowak (2023)

## జపాన్ సాహిత్యం (Japan Literature)

1. జపనీయుల కవిత్వం – Japanese Poetry (2022)
2. జపనీయుల కవిత్వం–2 – Japanese Poetry-2 (2022)

## చైనా సాహిత్యం (China Literature)

1. మూడు రంగుల కుంచె – China Classical Poetry (2019)
2. యాంగ్ గ్యుఫీ కథ – The Legend of Lady Yang Guifei (2020)

## తైవాన్ సాహిత్యం (Taiwan Literature)

1. తైవాన్ ఆడపడుచు – Tayouan Pai Pai- Yaw-Chin Fang (2018)

## ఈజిప్ట్ సాహిత్యం (Egypt Literature)

1. పరమాత్మునిలో ఐక్యమవుదాం Lets be one in The One - George Onsy (2018)
2. ప్రాచీన ఈజిప్ట్ గాథలు – Ancient Egypt Stories (2021)

## ఫిలిప్పీన్స్ సాహిత్యం (Philippines Literature)

1. పదివేల పంక్తులు – Ten Thousand Lines - Edwin Cordevilla (2017)
2. ఈడెన్ పూల వికాసం – Eden Blooms- Eden S. Trinidad (2019)
3. ఫిలిప్పీన్స్ జానపద గాథలు – Philippines Folk Tales (2023)

## ఆస్ట్రేలియా సాహిత్యం (Australia Literature)

1. చిరుగాలి నా ప్రేమికుడు – The Wind My Lover- Ade C. Manila (2018)
2. నా లోపలి నిశ్శబ్దం – The Inner Quiet - Deepa Chandran Ram (2019)

## ఘనా సాహిత్యం (Ghana Literature)

1. జీవితానికి అసలైన అర్థం The Real Meaning of Life - Dr. Rashid Pelpuo (2018)

## మొరాకో సాహిత్యం (Morocco Literature)

1. దీర్ఘ రెక్కల శ్వాస – The Long-Winged Breath- Oulaya Drissiel Bouzadi (2019)

## లెబనాన్ సాహిత్యం (Lebanon Literature)

1. నాజీనామన్ కవిత్వం – Naji Naaman Poetry (2019)

## బ్రూనై సాహిత్యం (Brunei Literature)

1. సున్నిత హస్తాలు – Smooth Hands- Sosonjan A. Khan (2018)

## మలేషియా సాహిత్యం (Malaysia Literature)

1. ఆణిముత్యాలు – Pearls of Wisdom- Pramila Khadun (2018)

## కెనడా సాహిత్యం (Canada Literature)

1. అలలపై స్వారీ – Riding the Tide- Ashok Bhargava (2018)

## ఇటాలియన్ సాహిత్యం (Italian Literature)

1. గులాబీ మేఘాల గ్రహాలోకం – The Planet of Pink Clouds - Sergio Camellini (2019)
2. నాట్యం చేసే గాలులు – Dancing Winds- Maria Miraglia (2018)
3. రంగురంగుల సీతాకోకచిలుకలు – (Maria Miraglia) (2022)

## నేపాల్ సాహిత్యం (Nepal Literature)

1. సూర్యరశ్మి – Sun Shower- Krishna Prasai (2021)

## పాకిస్తాన్ సాహిత్యం (Pakistan Literature)

1. స్వర సమ్మేళనం – Symphony and Other Poems - Ayub Khawar (2021)

## ఆంగ్ల సాహిత్యం (English Literature)

1. పారడైస్ లాస్ట్ & పారడైస్ రిగెయిన్డ్ (Paradise Lost & Paradise Regained) John Milton (2012)
2. తీర్థయాత్రికుని ప్రగతి – Pilgrim's Progress - John Bunyan (2012)
3. క్రీస్తు అద్భుత గీతాలు (ChristuAdbhutaGeethalu) (2013)
4. విలియం బ్లేక్ కవిత్వం – William Blake Poetry (2014)
5. టి.ఎస్. ఎలియట్ కవిత్వం – T.S. Eliot Poetry (2014)
6. నాందేవ్ ధసాల్ కవిత్వం – NamdeoDhasal Poetry (2014)
7. డబ్బు మనిషి – DabbuManishi (Money Poetry) (2014)
8. శాంతియుద్ధం – Santi Yuddham (War-Peace) (2014)
9. జలపాతం – Jalapatam (Eighteen English Poets) (2015)
10. క్రీస్తు నడిచిన దారిలో (The Path of Christ) (2015)
11. జీవితం – Emily Dickinson Poetry - Part I (2016)
12. ప్రేమ – Emily Dickinson Poetry - Part II (2016)
13. ప్రకృతి – Emily Dickinson Poetry - Part III (2016)
14. కాలము – శాశ్వతత్వము – Emily Dickinson Poetry - Part IV (2016)
15. ఒంటరి జాగిలం – Emily Dickinson Poetry - Part V (2016)
16. శతరూప - Sataroopa- A.K. Khanna (2016)
17. సౌగంధిక – Sougandhika (Master Poems in English-1) (2017)
18. తూర్పు–పడమర (Master Poems in English-2) (2017)
19. ప్రేమ కురిసిన వేళలో... (Master Poems in English-3) (2017)
20. వాళ్ళు ముగ్గురూ (Master Poems in English-4) (2017)
21. అలనాటి కొత్తగాలి (Master Poems in English-5) (2017)
22. మంచు తుఫాన్ (Master Poems in English-6) (2017)
23. ఎండా–వానా (Master Poems in English-7) (2017)
24. పిల్లనగ్రోవి పిలుపు (Master Poems in English-8) (2017)
25. దివ్య వస్త్రాల కోసం(Master Poems in English-11) (2017)
26. మధుశాల – Rubaiyat- Edward Fitzgerald (2018)
27. అల్లంత దూరాన ఆ పాట వినవచ్చె (Master Poems in English-9) (2018)
28. నాలుగు దిక్కులు (Master Poems in English-10) (2018)
29. ఒక మధుశాల (Master Poems in English-12) (2018)
30. మార్మిక నావికుడు - The Mystic Mariner- Madan Gandhi (2018)
31. జ్వాలలతో పోరాటం - Fighting the Flames- Dr. Jernail S. Anand (2018)
32. వాసుదేవ్ చక్రవర్తి కవిత్వం - Basudeb Chakraborti Poetry (2019)
33. అలింద సంగీతం - Chamber Music - James Joyce (2021)
34. వెన్నెల అలలు - Rippling Moonbeams- Lily Swarn (2022)

## V. Translations (From Telugu to English)

1. The Great Battle (Suprasanna)
   సాంపరాయం – కోవెల సుప్రసన్నాచార్య కవిత్వం
2. The Tree of Fire (Anumandla Bhoomaiah)
   అగ్నివృక్షం – భూమయ్య కవిత్వం
3. The Poems of Kuppam (Seeta Ram)
   కుప్పం కవితలు – సీతారామ్ కవిత్వం
4. We Need a Language (Sudhakar)
   మాకూ ఒక భాష కావాలి – తుల్లిమల్లి విల్సన్ సుధాకర్
5. The Broken Grammar (Sudhakar)
   దళిత వ్యాకరణం – తుల్లిమల్లి విల్సన్ సుధాకర్
6. The Voice of Telangana (Madiraju Ranga Rao)
   తెలంగాణా స్వరం – మాదిరాజు రంగారావు
7. Fire and Snow (Rama Chandramouli)
   రామా చంద్రమౌళి కవిత్వం
8. This is no Streaking (Stories - K.K. Menon)
   కె.కె. మీనన్ కథలు
9. The Pool of Blood (Naveen)
   రక్త కాసారం – అంపశయ్య నవీన్ నవల
10. Varavara Rao Poetry – వరవరరావు కవిత్వం
11. The Enraged Voice- Ravi Maruth
    కోపోద్రిక్త స్వరం – రవి మారుత్ కవిత్వం
12. To Whomsoever it may concern -Prasen
    ఎవరికీ వర్తిస్తే వారికి – ప్రసేన్ కవిత్వం
13. Bouquet of Telugu Songs and Poems
    ప్రసిద్ధ తెలుగు పద్యాలు, పాటలు
14. Ravi Maruth Poetry - 8 Languages

## VII. Books translated into Multiple Languages

**1. The Casket of Vermilion- English - Dr. Lanka Siva Rama Prasad**

i. Telugu - Dr. Lanka Siva Rama Prasad
ii. Telugu - పాతూరి రఘురామయ్య, సుప్రసన్నాచార్య
iii. Urdu - JawaidNaseem
iv. Punjabi - Prof. Joginder Singh Jogi
v. Malayalam - Sarala Ram Kamal
vi. Marathi - Narayana Mudgalkar, Neelima Mudgalkar
vii. German - Sabine Stiglmayr, Aprilia Zank
viii. Polish - Alicja Kubreska
ix. Philippines - Eden.S. Trinidad
x. Chinese - Tian yu
xi. Polish - Alicja Kubreska

**2. Trident -** English, Telugu, Italian, Urdu

**3. The Legend of Lady Yang Guifei** - English, Telugu, Malayalam, Mandarin

## VIII. New Books

1. LSR@200 Books 2. యురిపిడిస్ నాటికలు 3. తెలంగాణ 4. శ్రీ ప్రసాద మహాభారతము

## He won many awards nationally and internationally - He is the recipient of

1. T.S. Eliot award- 2017,
2. Global poet Award - CANADA-WIN - 2017,
3. Life time achievement Award - Ghana- 2017,
4. Kibatek medal -Turkey - 2017
5. Rauel international Award - 2017
6. Poet Laureate Award - Delhi - 2017
7. SahitiRajahamsa award - Vizag - 2017
8. Poet Laureate-Kazakhstan - 2017
9. Pentasi-B Life Time Achievement Award-2017
10. Naji Naaman Poet Laureate Award - Lebanon -2018
11. Poet Laureate Award - China - 2019
12. Sophy Chen - Award - China - 2019
13. Master of Metaphor and Trans Creative Surgery- 2019
14. Nazim Hikmet Award-2023 - Turkey
15. **GUNTURU SESHENDRA SARMA Lifetime Achievement Award-2023**
16. **ORUGALLU SAHITHI KEERTI PATAKA Puraskaram - Sahiti Bandhu Brundham, Warangal - 2023**

He was the host, sponsor of World poetree Festival- 2017 under the banner of Pentasi-B India World Poetry Festival. Attended many International Poetry Festivals in India and abroad- China, Morocco, Ghana, Singapore, Australia, Greece, Poland, Italy, and Philippines as guest of honor.

More than hundred books are available in his free website-

**www.anuvaadham.com**
**www.prosetry.in**

# శ్రీ
# ప్రసాద
# మహాభారతము

**రెండవ భాగం : శాంతి సప్తకము, వ్యాస మహాభారతము, విశేష వ్యాఖ్యానము**



-: శాంతి సప్తకము :-

12. శాంతి పర్వము, 13. అనుశాసనిక పర్వము
14. అశ్వమేధ పర్వము, 15. ఆశ్రమవాస పర్వము, 16. మౌసల పర్వము
17. మహాప్రస్థానిక పర్వము 18. స్వర్గారోహణ పర్వము

వ్యాస మహాభారతము, విశేష వ్యాఖ్యానము

**డా॥ లంకా శివరామప్రసాద్**